**ISLAMIC HISTORY**
**(Islam Charitra-Telugu)**

# ఇస్లాం చరిత్ర

రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, H.No. 16-2-867/A/4,
జీవన్‌యార్ జంగ్ కాలనీ, సయీదాబాద్,
హైదరాబాద్-59, ఫోన్: 91-9441515414

వెల......................రూ. 250/-లు



Name of the Title: Islam Charitra (Telugu) (Islamic History)

Written by : **Abul Irfan** Hyderabad-59

All rights reserved with: Islamic Resource Centre

First Edition: 1000 Copies (7/2013)

Published by: Islamic Resource Centre
H.No. 16-2-867/A/4, Jeevanyar
Jung Colony, Sayeedabad,
Hyderabad-59, Ph: 9441515414

Type set by: Alifain, I.R.C. Graphics
Hyderabad-59, Ph: 9441515414

Printed at : H.S. Offset Printers
714, Chandni Mahal, Daryaganj
New Delhi-2, Ph: 23244240

Price: Rs. 250/-

## ఈ రచనకు ఆధార గ్రంథాలు

(1) తారీఖె ఇస్లాం (ఉర్దూ)....................మౌలానా అక్బర్‌షా నజీబాదాది

(2) తారీఖె ఇస్లాం (ఉర్దూ).....................డాక్టర్ హమీదుద్దీన్, యం.ఎ.

(3) తారీఖె ఖుల్ఫా (ఉర్దూ)....................ముహమ్మద్ మున్షా తాబష్ ఖుసూరి

(4) సిద్దీఖ్ అక్బర్ (ఉర్దూ).................మౌలానా సయీద్ అహ్మద్ అక్బరాబది

(5) అల్ ఫారూఖ్ (ఉర్దూ).....................అల్లామా షిబ్లీ నోమాని

(6) ఖిలాఫత్–వ–ములూకియత్.............మౌలానా అబుల్‌ఆలా మౌదూదీ

(7) తజ్దీదె అహ్యాయెదీన్........................మౌలానా అబుల్‌ఆలా మౌదూదీ

(8) అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం......................మౌలానా అబుల్‌ఆలా మౌదూదీ

(9) సీరతె సహాబా (ఉర్దూ)...................అబూజావీద్ ఇఖ్బాల్ అహ్మద్ ఖాస్మి

(10) రోషన్ సితారె (ఉర్దూ).............మౌలాన ముహమ్మద్ యూసుఫ్ ఇస్లాహి

(11) అయినాయె తారీఖ్ (ఉర్దూ)............మౌలానా అఫ్జల్ హుసైన్

## గుణపాఠం గ్రహించేవారే బుద్ధిమంతులు

"బుద్ధీజ్ఞానం కలవారికి వీరి చారిత్రక గాథలలో ఎంతో గుణపాఠం ఉంది. ఈ విషయం పుక్కిటిపురాణం కాదు (ఈ చెవిన విని ఆ చెవిన వదిలేయడానికి). ఇది గతగ్రంథాలను ధృవీకరిస్తున్న (అంతిమ దైవ) గ్రంథం. ప్రతి విషయాన్నీ విపులీకరించి చెప్పే దివ్యవాణి. విశ్వసించేవారికి ఇదొక హితోపదేశం, కారుణ్యప్రదాయిని." (దివ్యఖుర్ఆన్-12:111)



بسم الله الرحمن الرحيم

# ముందు మాట

ఏ చరిత్రలోనైనా మంచివిషయాలతో పాటు చెడువిషయాలు కూడా ఉండవచ్చు. బుద్ధిమంతులు ఎల్లప్పుడూ మంచినే కాంక్షిస్తారు. కనుక చరిత్ర నుండి మంచిని గ్రహించి గుణపాఠం నేర్చుకునేవారే ధన్యులు. ముఖ్యంగా ఖుర్ఆన్‌లో మనిషికి గుణపాఠం గరిపే ఎన్నో చారిత్రక సత్యాలు ఉన్నాయి. అందుకే బుద్ధిమంతుల కోసం ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

"బుద్ధీజ్ఞానం కలవారికి వీరి చారిత్రక గాథలలో ఎంతో గుణపాఠం ఉంది. ఈ విషయం పుక్కిటిపురాణం కాదు (ఈచెవిన విని ఆచెవిన వదిలేయడానికి). ఇది గత గ్రంథాలను ధృవీకరిస్తున్న (అంతిమ దైవ)గ్రంథం. ప్రతి విషయాన్నీ విపులీకరించి చెప్పే దివ్యవాణి. విశ్వసించేవారికి ఇదొక హితోపదేశం, కారుణ్యప్రదాయిని." (12:111)

"పూర్వం మేము ఎన్ని జాతుల్ని నిర్మూలించామో వీరికి తెలియదా? ఆ జాతులు తమతమ కాలాల్లో ఎంతో వైభవోపేతంగా వెలిగాయి. వారికి మేము ప్రపంచంలో మీకు ప్రసాదించనటువంటి గొప్ప సామ్రాజ్యాలు ప్రసాదించాం. వారి కోసం ఆకాశం నుండి పుష్కలంగా వర్షం కురిపించాం. నేలపై ఎన్నో నదులు ప్రవహింపజేశాం. (కాని వారు మా పట్ల కృతఘ్నులైపోయారు.) చివరికి మేము వారు చేసిన పాపాలకు వారిని సమూలంగా తుడిచిపెట్టాం. వారి స్థానంలో ఇతర జాతులను తెచ్చిపెట్టాం." (6:5-6)

ఇస్లాం చరిత్ర పేరుతో మీ ముందున్న ఈ గ్రంథంలో ఖుర్ఆన్‌లోని చారిత్రక విశేషాలతో పాటు, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ మహనీయుని (స) సంక్షిప్త జీవిత చరిత్ర, ఆ తరువాత ఖలీఫాల పాలనాకాలాల్లో సంభవించిన అనేక సంఘటనలను కూడా పేర్కొనడం జరిగింది. ఇందులో దైవప్రవక్త (స) జీవిత చరిత్రను సంక్షిప్తంగా వ్రాయడానికి కారణం ఇదివరకే ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్ నుండి "మహనీయ ముహమ్మద్ ఆదర్శజీవితం" పేరుతో విపులమైన గ్రంథం వెలువడటమే.

ఖుర్ఆన్‌లోని చారిత్రక సంఘటనలు, మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శ జీవిత విశేషాల తరువాత శ్రేయస్కర ఖలీఫాల (ఖుల్ఫాయె రాషిదీన్) పాలనాకాలాల్లో సంభవించిన అనేక సంఘటనల్లో హృదయచక్షువులతో వీక్షించేవారికి ఎన్నో గుణపాఠాలు ఉన్నాయి. ఆనాటి ముస్లింలు అనేక దేశాల్లో విజయాలపై విజయాలు సాధించడానికి, దైవసందేశ విస్తరణ కార్యకలాపాల ద్వారా లక్షలాది ముస్లిమేతరుల హృదయాల్ని చూరగొనడానికి మూలకారణం ఖుర్ఆన్, హదీసుల ద్వారా వారికి అబ్బిన అత్యున్నతమైన సత్ప్రవర్తన, నీతినడవడికలే. ఇవే ఆనాటి ముస్లింల విజయరహస్యాలు.

కాని ఈనాటి ముస్లింలు అత్యున్నత సత్ప్రవర్తన, నీతినడవడికల సృజనకు కారణమయ్యే ఖుర్ఆన్ హదీసుల్లోని ముఖ్యవిషయాల్ని వదలి అంతగా ప్రాముఖ్యం లేని విషయాల ఊబిలో దిగబడి, అంతర్విభేదాలతో సతమతమవుతూ చరిత్ర నుండి

గుణపాఠం నేర్చుకోము అనే స్థాయికి దిగజారిపోయారు. తత్ఫలితంగా ఈనాడు వారి పరిస్థితి యావత్ ప్రపంచంలో ఎంతో దయనీయంగా మారిపోయింది. ఇస్లాంవ్యతిరేక శక్తులు కుట్రలు, కుయుక్తులతో ఇస్లాంధర్మాన్ని, ఇస్లాం ప్రకారం ఆచరిస్తున్న ముస్లిం లను కించపరచడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాయి.

"మీ మీద ఏ ఆపద వచ్చిపడినా అది మీ చేజేతులా తెచ్చిపెట్టుకున్నదే అవుతుంది. మీరు చేస్తున్న అనేక పొరపాట్లను ఆయన ఇట్టే క్షమించి వదలిపెడ్తున్నాడు." (దివ్య ఖుర్ఆన్-42:30)

"పూర్వం మేము వీరికంటే ఎంతో శక్తిసామర్థ్యాలున్న అనేక జాతుల్ని హతమార్చాం. వారు ప్రపంచదేశాలు గాలించారు. మరి రక్షణ కోసం ఎక్కడైనా ఆశ్రయం లభించిందా? బుద్ధిజ్ఞానాలు ఉండి, శ్రద్ధగా ఆలకించే ప్రతివ్యక్తికీ ఇందులో గుణపాఠం ఉంది." (ఖుర్ఆన్-50:36,37)

"ఏ జాతి అయినా తన ఆచరణ తీరు మార్చుకోనంత వరకూ దేవుడు ఆ జాతికి ప్రసాదించిన మహాభాగ్యాన్ని ఎన్నటికీ మార్చివేయడు. ఇది దేవుని సంప్రదాయం." (ఖుర్ఆన్-8:53); "ఏజాతయినా తననుతాను సంస్కరించుకో నంతవరకూ దేవుడు దాని పరిస్థితి మార్చడు." (ఖుర్ఆన్-13:11)

శ్రేయస్కర ఖలీఫాల పాలనాకాలాలు ముగిసిన తరువాత ముస్లిం సముదాయంపై అనేక కష్టాల కండగండ్లు విరుచుకు పడ్డాయి. దుర్మార్గులు, దుష్టులు సృష్టించిన అపార్థాలు, అపోహల కారణంగా ముస్లింలు అంతర్విభేదాలకు, అంతఃకలహాలకు గురయి పోయారు. ఈ అపార్థాల సెగ అమాయకులకు, సహృదయులకు కూడా తాకడంతో పరిస్థితులు క్రమంగా విషమిస్తూపోయాయి.

కాకపోతే మధ్యకాలంలో ముస్లింలు కొన్నేండ్లు అనేక రంగాల్లో ప్రగతి సాధించి నప్పటికీ ఆ ప్రగతిసౌధం బలహీనమైన పునాదులపై నిర్మించబడటంవల్ల అది అనతి కాలంలోనే కుప్పకూలిపోయింది. ఆనాటి నుండి నేటివరకూ ముస్లిం సముదాయం పూర్తిగా కోలుకోలేక పోయింది. పైగా దాని పరిస్థితి మరింత దిగజారుతూనే పోతోంది. దానిక్కారణం తన గతచరిత్ర నుండి గుణపాఠం నేర్చుకోవడానికి ప్రయత్నించకపోవడమే నంటే అతిశయోక్తి కాదు. ఆ గుణపాఠం నేర్చుకునేవారి కోసమే ఇప్పుడీ గ్రంథం వెలువడింది. "ఇస్లాంచరిత్ర" పేరుతో మొదటిసారిగా తెలుగులో వెలువడుతున్న ఈ గ్రంథాన్ని పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను.

హైదరాబాద్-2 అబుల్ ఇర్ఫాన్
**తేది: 22-4-13** రచయిత



# విషయసూచిక


| | |
|---|---|
| 1. సృష్టి ప్రారంభదశ | 01 |
| 2. మానవసృష్టి మహోత్కృష్ట జీవిగా | 03 |
| (1) దివి నుండి భువికి | 04 |
| (2) ఆదం సంతానంలో అంతఃకలహం | 06 |
| 3. ఇద్రీస్ (అలైహి) | 08 |
| 4. నూహ్ (అలైహి) | 09 |
| 5. ఇబ్రాహీం, ఇస్మాయీల్ (అలైహి) | 10 |
| (1) సత్యసందర్శనం, ధర్మప్రచారం | 11 |
| (2) అగ్ని పరీక్ష | 11 |
| (3) విశ్వనాయకత్వం, సంతానం | 13 |
| (4) బలిదానం, కాబానిర్మాణం | 14 |
| 6. లూత్ (అలైహి) | 15 |
| (1) దైవదూతల రాక | 15 |
| (2) దైవశిక్ష, మృతసముద్రం | 16 |
| 7. ఇస్హాఖ్, యాఖూబ్, యూసుఫ్ (అలైహి) | 17 |
| (1) సవతి సోదరుల కుట్ర | 18 |
| (2) ఈజిప్టులో అజీజ్ మంత్రి ఇంట | 18 |
| (3) కారాగారంలో ధర్మప్రచారం | 20 |
| (4) ఈజిప్టు రాజ్యాధినేతగా | 22 |
| 8. హూద్ (అలైహి) | 27 |
| 9. షుఐబ్ (అలైహి) | 28 |
| 10. సాలెహ్ (అలైహి) | 29 |
| 11. మూసా, హారూన్ (అలైహి) | 30 |
| (1) పుట్టుక, పోషణ, నేరారోపణ | 31 |
| (2) మద్యన్‌లో పెళ్ళి, తొలి దివ్యావిష్కృతి | 32 |
| (3) సందేశప్రచారం, ఫిరౌన్‌తో భేటి | 35 |
| (4) మంత్రజాలం, మాంత్రికుల విశ్వాసప్రకటన | 36 |
| (5) అనుచరులు, ప్రకృతివిపత్తులు | 38 |
| (6) ఖారూన్ ధనగర్వం | 40 |
| (7) ఒక విశ్వాసి ఉపదేశం | 41 |
| (8) ఫిరౌన్ పర్యవసానం | 42 |
| (9) ఇస్రాయీలీలకు హితబోధ | 43 |

(10) ఇస్రాయీలీలపై దేవుని అనుగ్రహాలు 44
(11) తూర్‌కొండపై తౌరాత్ స్వీకరణ 44
(12) హారూన్ (అలైహి) పర్యవేక్షణలో ఇస్రాయీలీలు 45
(13) యూదుల తలబిరుసుతనం 46
(14) గోయజ్ఞం, సబ్బత్ నియమం 47
(15) యుద్ధనిరాకరణ 48
(16) జ్ఞానార్జన పయనం, ఖిజర్ (అలైహి) మహిమలు 49
12. యూదుల పుట్టుపూర్వోత్తరాలు 51
13. దావూద్ (అలైహి) 53
(1) దేవుని వరాలు, న్యాయమైన తీర్పు 54
14. సులైమాన్ (అలైహి) 55
15. సబాజాతి ప్రజలు 58
16. ఇల్యాస్ (అలైహి) 59
17. అయ్యూబ్ (అలైహి) 61
18. యూనుస్ (అలైహి) 62
19. జకరియ్యా (అలైహి) 62
20. మర్యం (అలైహి) 63
21. యహ్యా (అలైహి) 65
22. ఈసా మసీహ్ (అలైహి) 66
(1) క్రైస్తవుల నమ్మకాలు 68
23. లుఖ్మాన్ (అలైహి) 70
24. జుల్ఖర్‌నైన్ (అలైహి), యాజూజ్-మాజూజ్ 71
25. ఉజైర్ (అలైహి) 72
26. ముగ్గురు ప్రవక్తలు, ఒక విశ్వాసి 72
27. గుహవాసులు 73
28. తోటయజమానులు 75
29. అగడ్త బాధితులు 76
30. మహాప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్ర 77
(1) బాల ముహమ్మద్ (స) జీవితం 78
(2) యువ ముహమ్మద్ (స) జీవితం 80
(3) దైవప్రవక్తగా ముహమ్మద్ (స) 83
(4) ప్రచారపర్వం ప్రారంభం 86
(5) భయప్రలోభాలు 90



(6) అనుచరులపై అవిశ్వాసుల ఆగడాలు 94
(7) కొందరు ముస్లింల అబిసీనియా వలస 96
(8) హమ్జా, ఉమర్ (రజి)ల ఇస్లాం స్వీకరణ 98
(9) సంఘబహిష్కరణ, తాయఫ్ పర్యటన 102
(10) గగన పర్యటన (మేరాజ్) 105
(11) ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య చిచ్చు 108
(12) మదీనా వలస, హత్యాప్రయత్నం 111
(13) ప్రవక్త (స) కోసం గాలింపు 113
(14) యూదులు, కపటుల ఆగడాలు 117
(15) సమర సన్నాహాలు 119
(16) యుద్ధఖైదీల సమస్య 122
(17) వితంతు ఆదరణ, యూదుల బహిష్కరణ 125
(18) ఉహుద్‌కొండల్లో సమరజ్వాలలు 127
(19) బనీనజీర్ యూదుల బహిష్కరణ 130
(20) దూమతుల్ జందల్ దండయాత్ర 133
(21) కందకం యుద్ధం 135
(22) బనీఖురైజా యూదుల దుర్గతి 140
(23) హుదైబియా పయనం, హజ్‌యాత్ర 143
(24) రిజ్వాన్ శపథం, హుదైబియా శాంతిఒప్పందం 147
(25) హుదైబియా ఒడంబడిక పరిణామాలు 152
(26) ఖైబర్ దండయాత్ర 155
(27) ప్రప్రథం కాబా (ఉమ్రా)యాత్ర, దాని ప్రభావం 157
(28) ఖురైషీయుల పశ్చాత్తాపం, సత్యం రాకతో అసత్యం నిష్క్రమణ 161
(29) సాధారణ క్షమాభిక్ష 165
(30) తబూక్ దండయాత్ర 168
(31) ప్రప్రథమ హజ్ (కాబా)యాత్ర, అసత్యప్రవక్తలు 171
(32) నజ్రాన్ క్రైస్తవులతో చర్చలు 174
(33) వీడ్కోలు కాబాయాత్ర, అనారోగ్య పరిస్థితి 175
(34) పరలోక ప్రస్థానం 180
(35) ప్రవక్త వారసుడి ఎంపికలో తర్జనభర్జనలు 182
31. సన్మార్గ ప్రాతినిధ్యం (ఖిలాఫతె రాషిదా) 184
(1) తొలిఖలీఫాతో ప్రవక్త వారసుల విభేదం 186
(2) అబూబకర్ (రజి) ఘనతాఔన్నత్యాలు 189

(3) ప్రజాసేవ కార్యకలాపాలు 190
(4) అబూబకర్ (రజి) ఖిలాఫత్ పాలన 192
(5) రోమన్లపై ఉసామా (రజి) సైన్యం విజయం 194
(6) మతభ్రష్టులపై సైనికచర్య 196
(7) అసత్యప్రవక్త తులైహా పర్వ్యవసానం 198
(8) అసత్యప్రవక్తలు సజాహ్, ముసైలమా 200
(9) ఇతర ప్రాంతాల మతభ్రష్టులపై దాడులు 205
(10) కరువుకాలంలో అపూర్వ ధనత్యాగం 208
(11) ఈరాన్, ఇరాఖ్‌ల వైపు పురోగమనం 209
(12) ఎర్మూక్‌లో సైనికసమీకరణ, అజ్నాదీన్ యుద్ధం 215
(13) అబూబకర్ (రజి) నిర్యాణం, రాజకీయవారసుడి ఎంపిక 219

32. ఉమర్ (రజి) ఖిలాఫత్ పాలన 222
(1) ఉమర్ (రజి) ఘనతా ఔన్నత్యాలు 222
(2) డెమాస్కస్, బీరుత్, హమస్‌లలో విజయకేతనం 224
(3) బాక్బియా, బవీబ్ యుద్ధాలు 228
(4) ఈరాన్ పాలకుల దగ్గరకు ముస్లింల రాయభారం 231
(5) ఖాదిసియా యుద్ధం 235
(6) మదాయెన్‌లో విజయకేతనం 239
(7) 'ఉబులా'లో విజయం, బస్రా పట్టణ స్థాపనం 242
(8) ఎర్మూక్ యుద్ధం 244
(9) బైతిల్‌మఖ్దిస్‌లో విజయపతాకం 250
(10) సర్వసేనాని ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఉద్వాసన 254
(11) ఈరాన్ సేనాని హుర్ముజాన్ ఇస్లాంస్వీకరణ 255
(12) అహ్వాజ్‌లో విజయకేతనం 259
(13) ప్లేగువ్యాధి, కరవుకాటకాలతో జనం విలవిల 261
(14) నిహావంద్ యుద్ధం 264
(15) ఈజిప్టు, అలెగ్జాండరియాలలో విజయకేతనం 266
(16) ఈరాన్‌పై సాధారణ దండయాత్రలు 269
(17) విషాదసంఘటన, నిర్యాణం 271
(18) ఫారూఖీ సంస్కరణలు 274
◆ పాలనా వ్యవస్థ 275
◆ భూసంస్కరణలు 276
◆ ప్రభుత్వ ధనాగారం (బైతుల్‌మాల్) 278





◆ న్యాయవ్యవస్థ 279
(19) ఇస్లాం సందేశ విస్తరణ 281
(20) ఉమర్ (రజి) నైతిక జీవనసరళి 283
◆ రాత్రివేళ గస్తీలో 283
◆ పర్యటనల్లో ప్రజాసమస్యలపై ప్రత్యేకదృష్టి 286
◆ భావప్రకటనా స్వేచ్ఛ 292
◆ చట్టం అందరికీ సమానమే 293
◆ జిమ్మీల పట్ల సత్ప్రవర్తన 296
◆ మూఢనమ్మకాల ఖండన 298
◆ ఆర్థికపరిస్థితి, నిరాడంబరత 300
◆ బాధ్యతా భావం, దైవభీతి 301
◆ నిగర్వి 303
◆ విశ్వాసుల నాయకుడు బిరుదుకాదు 304
◆ సూటిపోటి మాటలు, సహనం 304
◆ బంధుప్రీతికి ఆమడ దూరం 305
◆ ప్రజాసేవ 307
◆ ధర్మావగాహన 308
(21) ఇతరత్రా సంఘటనలు 312
(22) ఆయన అభిమతానికి అనుగుణంగా దివ్యావిష్కృతి 314
(23) ఉమర్ ఫారూఖ్ (రజి) సంస్కరణలు 318
(24 ఉమర్ ఫారూఖ్ (రజి) హితోక్తులు 319

32. ఉస్మాన్ ఖిలాఫత్ పాలన 320
(1) ఉస్మాన్ (రజి) ఘనతా ఔన్నత్యాలు 320
(2) అరాచకం, హత్య గురించిన భవిష్యవాణి 321
(3) ఖలీఫా ఎన్నిక 321
(4) ఉస్మానీ దర్బారులో మొదటి దావా 324
(5) పదవుల ఉద్వాసన, కొత్త నియామకాలు 325
(6) ఆఫ్రికాలో విజయకేతనం 327
(7) సైప్రస్, రోడిస్‌లలో విజయకేతనం 329
(8) ఈరాన్‌లో హోదాలమార్పుతో పార్శీల తిరుగుబాటు 330
(9) ఖలీఫా హజ్‌లో జరిగిన సంఘటనలు 331
(10) వలీద్ బిన్ ఉఖ్బా ఉద్వాసన 332
(11) అబూజర్ గిఫ్ఫారీ (రజి) విచిత్రవాదన 333

(12) దైవప్రవక్త రాజముద్ర, ఖుర్‌ఆన్ కూర్పు 334
(13) ఈరాన్ పరిస్థితి, చక్రవర్తి యజ్దగిర్ద్ హత్య 335
(14) అరాచక ఆప్తమిత్రులు 336
(15) సబాయీ అరాచకం ఆరంభం 337
(16) ఖలీఫాపై తిరుగుబాటు ప్రారంభం 340
(17) సబాయీదుండగులకు ఊతమిచ్చిన మర్వాన్ పాత్ర 344
(18) ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య, కొత్తఖలీఫా ఎన్నిక 345
(19) ఉస్మాన్ (రజి) పాలన ఒక్క చూపులో 348
33. అలి (రజి) ఖిలాఫత్ పాలన 351
(1) అలి (రజి) ఘనతా ఔన్నత్యాలు 351
(2) నివురుగప్పిన నిప్పు 354
(3) సిరియా గవర్నర్ తిరుగుబాటు 356
(4) ఉష్ట్ర యుద్ధం (జంగెజమల్) 358
(5) సిప్ఫిన్, నహ్రెవాన్ యుద్ధాలు-మతవిభేదాలకు నాంది 361
(6) అలి (రజి) వర్గంలో అనాసక్తత, అంతర్విభేదాలు 367
(7) ముస్లిం రాజ్యాధినేతల హత్యకు కుట్ర 368
(8) అలి (రజి) భార్యాపిల్లలు, ఆయన హితోక్తులు 371
(9) అలి (రజి) న్యాయదృక్పథం 372
35. హసన్ (రజి) ఖిలాఫత్ పాలన 372
(1) హసన్ (రజి) ఘనతా ఔన్నత్యాలు 373
(2) ఆదిలోనే అనైక్యత 373
(3) సంధి ద్వారానే శాంతి సాధ్యం 374
36. అమీర్ ముఆవియా (రజి) పరిపాలన 376
(1) ముఆవియా (రజి) పుట్టుపూర్వోత్తరాలు 377
(2) ముఆవియా (రజి) ఘనతా ఔన్నత్యాలు 378
(3) ముఆవియా (రజి) పరిపాలన ప్రారంభ పరిస్థితి 378
(4) ముఆవియా (రజి) రాజకీయవారసుడిగా యజీద్ 381
(5) సయీద్ బిన్ జైద్, అబూహురైరా (రజి) 382
(6) హింసాదౌర్జన్యాల ప్రారంభం 385
(7) మృత్యుముఖంలో అమీర్ ముఆవియా (రజి) 387
37. యజీద్ పాలనా తీరు 391
(1) ముస్లిం బిన్ అఖీల్ హత్య 392
(2) ఇమామ్ హుసైన్ (రజి) హత్య 394



(3) మక్కా, మదీనాలలో యజీద్ సైన్యం ఘాతుకాలు 398
(4) యజీద్‌పాలనలో విదేశీప్రాంతాల్లో విజయకేతనాలు 400
38. ఇస్లాం సామ్రాజ్యం ముక్కచెక్కల దిశగా 401
(1) మర్వాన్ పర్యవసానం 402
(2) ముఖ్తార్ అరాచకాలు 403
(3) అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ 405
(4) ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) పర్యవసానం 406
39. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఖిలాఫత్ 408
(1) ఇబ్నెజుబైర్ ఘనతా ఔన్నత్యాలు 408
(2) రాజ్యపరిధిలో ఒడిదుడుకులు 409
(3) ధర్మాత్ముడా, దౌర్జన్యపరుడా? 409
(4) కాబా పునర్నిర్మాణం, విధ్వంసం 410
(5) సంక్షేమరాజ్యం సమాప్తం 414
(6) అల్పసంఖ్యాకులే మోక్షానికి అర్హులు 414
40. అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ 416
41. వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ పాలన 418
(1) హజ్జాజ్ బిన్ యూసుఫ్ దౌర్జన్యాలు 418
(2) ఖతీబా విజయాలు 419
(3) ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) 421
(4) తారిఖ్ బిన్ జియాద్-స్పెయిన్ 432
(5) వలీద్ ప్రజాసంక్షేమ కార్యాలు 435
42. సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన 436
(1) తుర్కిస్తాన్ విజేత ఖతీబా బిన్ ముస్లిం హత్య 436
(2) సింధ్ విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం హత్య 436
(3) స్పెయిన్ విజేత మూసా బిన్ నసీర్ పర్యవసానం 440
(4) మస్లిమా బిన్ అబ్దుల్‌మలిక్ 441
(5) రాజకీయ వారసుడి ఎన్నిక 442
43. ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) ఖిలాఫత్ 443
(1) పరిపాలన ప్రారంభకాలం 444
(2) రాజర్షిగా మారిన రారాజు 445
(3) బంధువులే రాంబందువులైన వేళ 447
(4) మరణానంతర సంఘటనలు 448
(5) పరిపాలనా తీరుపై సంక్షిప్త సమీక్ష 449

44. యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన 450
(1) ముస్లింల శక్తికి మూలకారణం 451
(2) అబ్దుర్రహ్మాన్ బిన్ జహ్హాక్ పర్యవసానం 451
45. హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన 452
(1)ఖడ్గంతో ఇస్లాంవిస్తరణ కాదు, క్రూరుల అణచివేత 453
(2) సింధ్ రాష్ట్రం పరిస్థితి 454
(3) ఫ్రాన్స్‌లో ముస్లింల పురోగమనం 454
(4) ఆఫ్రికా పరిణామాలు 455
(5) జైద్ బిన్ అలి బిన్ హుసైన్ దండయాత్ర 456
(6) బనూఅబ్బాసీల రాజకీయ కార్యకలాపాలు 457
46. వలీద్ బిన్ యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన 458
47. యజీద్ బిన్ వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన 460
48. మర్వాన్ బిన్ ముహమ్మద్ బిన్ మర్వాన్ పాలన 460
(1) అల్వీయులపై అబ్బాసీల ముందంజ 461
(2) అబూముస్లిం ఖురాసాని 462
(3) మర్వాన్ మరణం 464
49. అబుల్ అబ్బాస్ సఫా పరిపాలన 466
(1) పైకంతో ప్రత్యర్థులనోళ్ళు మూయించిన వైనం 466
(2) అనుమానితుల అంతం 466
(3) అరబీ భాషా దురభిమానం 467
(4) జాతీయ దురభిమానం 468
(5) పరాకాష్ఠకు చేరిన ప్రతీకారం 468
(6) మోసిల్ ప్రజల సామూహిక హత్యలు 469
(7) ఉపకారికి నపకారం 470
50. అబూజాఫర్ మన్సూర్ పరిపాలన 472
(1) అబూముస్లిం హత్య 473
(2) వివిధ ప్రాంతాల్లో తిరుగుబాటులు 474
(3) మదీనాలో ముహమ్మద్ నఫ్స్‌జకియా తిరుగుబాటు 475
(4) ఖురాసాన్‌లో ఇబ్రాహీం తిరుగుబాటు 476
(5) ఖిలాఫత్ ముఖానికి ఆధ్యాత్మిక ముసుగు 477
(6) బగ్దాద్ నిర్మాణం 478
(7) ఖిలాఫత్ వారసత్వం, మన్సూర్ మరణం 478
(8) మన్సూర్ స్వభావం, గుణగణాలు 480



(9) మన్సూర్ న్యాయవైఖరి 480
51. ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) 482
(1) పూర్వపరాలు 482
(2) విద్యాభ్యాసం, ఫిఖ్హ్కూర్పు 484
(3) ఇమామ్ ధర్మపరాయణత 485
(4) ఇమామ్ ఆలోచనా దృక్పథం 486
(5) మన్సూర్ పాలనార్హతను ప్రశ్నించిన ఇమామ్ 489
(6) నాయకత్వం (ఇమామత్) ధర్మాధర్మాలు 490
52. మెహ్దీ బిన్ మన్సూర్ పరిపాలన 492
(1) జందఖీల (చార్వాకుల) తిరుగుబాటు 492
(2) ప్రధాన మంత్రిత్వశాఖ 492
(3) ప్రజాసంక్షేమ కార్యాలు 494
(4) న్యాయం, సమానత్వం 495
(5) మహ్దీ మరణం, రాజకీయ వారసత్వం 495
53. హారూన్ రషీద్ పరిపాలన 496
(1) బర్మకీ వంశం పుట్టుపూర్వోత్తరాలు 497
(2) అంతర్గత దాడులు 498
(3) విదేశీశక్తులపై దాడులు 499
(4) యహ్యా(బర్మకి) కుటుంబంలో ఖిలాఫత్ అధికారాలు 499
(5) ఫజల్ బిన్ రబీ, బర్మకీసంతతి మధ్య ప్రతీకారజ్వాలలు 501
(6) అలి బిన్ ఈసా, బర్మకీల పరస్పర వ్యతిరేక ఫిర్యాదులు 501
(7) బర్మకీల దుర్గతి 502
(8) హారూన్ మీద దుష్ప్రచారం 504
(9) రోమన్ల ఒప్పందం ఉల్లంఘన 506
(10) హారూన్ మరణం, అతని ఘనతాఔన్నత్యాలు 507
(11) విద్యాకళల అభివృద్ధి 508
54. అమీన్ రషీద్ పరిపాలన 510
55. మామూన్ రషీద్ పరిపాలన 512
56. మోతసిమ్ బిల్లా పరిపాలన 515
57. వాసిఖ్ బిల్లా పరిపాలన 520
58. ముతవక్కిల్ పరిపాలన 522
59. పతనదిశగా బనూఅబ్బాసీ ఖిలాఫత్ 525
♦ ఉబైదుల్లా మెహ్దీ, అబూతాహెర్ ఖర్మతీ 529

♦ బోవియావైల్ని వంశపాలన 531

♦ సల్జూఖియా వంశపాలన 535

60. చంగీజ్‌ఖాన్-జలాలుద్దీన్ ఖవారిజమ్ 542

61. బగ్దాద్ వినాశం 560

62. స్పెయిన్‌లో ముస్లింల పాలన 565

(1) అమీర్ అబ్దుల్అజీజ్ పరిపాలన 565

(2) అమీర్ అయ్యూబ్ బిన్ హబీబ్ పరిపాలన 565

(3) హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ సఖఫీ పరిపాలన 566

(4) సమహ్ బిన్ మాలిక్ పరిపాలన 566

(5) అంతఃకలహాలు 567

(6) అబ్దుర్రహ్మాన్ బిన్ ముఆవియా పరిపాలన 567

(7) హిషామ్ బిన్ అబ్దుర్రహ్మాన్ పరిపాలన 571

(8) హకమ్ బిన్ హిషామ్ పరిపాలన 573

(9) అబ్దుర్రహ్మాన్ సాని పరిపాలన 575

(10) ముహమ్మద్ బిన్ అబ్దుర్రహ్మాన్ పరిపాలన 577

(11) మంజర్ బిన్ ముహమ్మద్ పరిపాలన 578

(12) అబ్దుల్లా బిన్ ముహమ్మద్ పరిపాలన 578

(13) అబ్దుర్రహ్మాన్ సాలిస్ పరిపాలన 579

(14) హకమ్ బిన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ పరిపాలన 583

(15) హిషామ్‌సాని బిన్ హకమ్‌సాని పాలన 585

(16) పతనదిశగా ముస్లింల పాలన 587

(17) మోహిదీన్ పరిపాలన 589

(18) వినాశం వైపుకు గర్నాతా 598

63. ఈజిప్టులో ఉబైదీ(న్)ల పరిపాలన 602

♦ బైతిల్‌మఖ్దిస్‌పై క్రైస్తవుల ఆక్రమణ 604

64. సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి పాలన 606

65. ఉస్మానియా వంశపాలన 613

(1) సుల్తాన్ ఉస్మాన్‌ఖాన్ 614

(2) సుల్తాన్ అర్ఖాన్ 616

(3) సుల్తాన్ మురాద్‌ఖాన్ అవ్వల్ 616

(4) సుల్తాన్ బాయజీద్ యల్దరమ్ 617

(5) సుల్తాన్ ముహమ్మద్ ఖాన్ అవ్వల్ 621

(6) సుల్తాన్ మురాద్‌ఖాన్ సాని 621





(7) సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సాని 624

(8) అన్నదమ్ముల మధ్య అంతర్యుద్ధాలు 630

(9) సుల్తాన్ సలీం ఉస్మాని 632

66. భారత్‌లో ఇస్లాం ప్రవేశం 638

67. సుల్తాన్ మహ్మూద్ గజ్నవీ 639

68. ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మలై) 641

69. సుల్తాన్ ముహమ్మద్ గోరి 643

♦ సుల్తాన్ ఖుత్బుద్దీన్ ఐబక్ 644

70. సుల్తాన్ షమ్సుద్దీన్ అల్తమష్ 645

71. సుల్తాన్ నాసిరుద్దీన్ 647

72. సుల్తాన్ బాల్బన్ 649

73. అలావుద్దీన్‌ఖిల్జీ-ఖాజీ ముగీసుద్దీన్ 650

74. సుల్తాన్ గియాసుద్దీన్ తుగ్లఖ్ పాలన 652

75. సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ పాలన 653

76. సుల్తాన్ ఫిరోజ్ తుగ్లఖ్ పాలన 655

77. తైమూర్‌లంక్ విధ్వంసకాండ 656

78. సయ్యిద్ వంశం పాలన 658

79. లోదీవంశం పాలన 659

80. దక్షిణభారత్ రాజ్యాల పరిస్థితి 661

81. మహ్దియా ఉద్యమం 663

82. మొగల్‌రాజ్య స్థాపకుడు బాబర్ 665

83. హుమాయూన్ చక్రవర్తి 669

84. షేర్‌షా చక్రవర్తి 670

85. అక్బర్ చక్రవర్తి 675

86. జహాంగీర్ చక్రవర్తి 681

87. షాజహాన్ చక్రవర్తి 685

88. ఔరంగజేబ్ చక్రవర్తి 687

89. పతనదిశగా మొగల్‌పాలన 698

90. మైసూర్‌పులి టీపూసుల్తాన్ 700

*కరుణామయుడు, కృపాసాగరుడయిన దేవుని పేరుతో ప్రారంభం*

# ఇస్లాం చరిత్ర

సృష్టి ఆరంభం నుండే ఇస్లాం చరిత్ర ప్రారంభమయింది. యావత్తు విశ్వవ్యవస్థ, అందులోని సమస్త సృష్టిరాసులు సృష్టికర్త, సర్వశక్తిమంతుడు, విశ్వసామ్రాట్టు అయిన దేవుని ఆజ్ఞలకు బద్ధులయి తమతమ విధులు నిర్వహిస్తున్నాయి.

అంటే భూమ్యాకాశాలు, సూర్యచంద్రులు, గ్రహాలు, నక్షత్రాలు సమస్తం ఇస్లాం పరిధిలో ఉండి దేవునికి విధేయత చూపుతున్నాయన్న మాట. ఇస్లాం అంటే శాంతి, సమర్పణ, విధేయత, ఆజ్ఞాపాలన అని అర్థాలున్నాయి.

"ఆయనే (పరాత్పరుడు, పరమోన్నతుడైన) అల్లాహ్. భూమ్యాకాశాల్లోని అణువణువూ తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ఆయనకే సాష్టాంగపడుతోంది. ఉదయం, సాయంత్రం సమస్త వస్తువుల ఛాయలు కూడా ఆయనకే మోకరిల్లుతున్నాయి." (ఖుర్ఆన్–13:15)

సూర్యచంద్రనక్షత్రాలన్నీ తమకు నిర్దేశించిన ప్రకృతిచట్టాలకు కట్టుబడిఉంటూ దేవునికి విధేయత చూపుతున్నాయి. యావత్భూమండలంలోని రోదసీవస్తువులన్నీ తమతమ నిర్ణీత కక్ష్యల్లో, నిర్దేశిత వేగాలతో సంచరిస్తున్నాయి. వాటిలో ఏ ఒక్కటీ దైవశాసనాన్ని ధిక్కరించి ఇష్టానుసారం మెలగడం లేదు. సూర్యుడు, సముద్రం, గాలి,మేఘాలు కూడా దైవచట్టం ప్రకారమే పనిచేస్తూ వృక్షజాతికి, జీవరాసులకు కావలసిన వర్షం, శీతోష్ణస్థితులు సమకూర్చుతున్నాయి. అలాగే జంతువులు, పక్షులు, జలచరాలు కూడా దేవుడు నిర్దేశించిన ఆజ్ఞల ప్రకారమే మనుగడ సాగిస్తున్నాయి. అంటే ఇవన్నీ ఇస్లాం పరిధిలో ఉన్నాయి.

## 1. సృష్టి ప్రారంభదశ

ఈ విశ్వం, అందులోని సృష్టిరాసులు ఉనికిలోకి వచ్చిన ప్రారంభ దశను గురించి సైన్సు ఇప్పటికీ కచ్చితమయిన నిర్ణయానికి రాలేకపోయింది. బిగ్‌బ్యాంగ్ ప్రేలుడుతో విశ్వం ఉనికిలోకి వచ్చినప్పుడు అది తీవ్రమైన ఉష్ణోగ్రతతో ఉండేదని, తర్వాత అది క్రమంగా చల్లారేకొద్దీ అందులో జీవరాసుల పుట్టుక ఏకకణ జీవులతో ప్రారంభమైందని, ఇలా పరిణామంచెందుతూ అవి ప్రస్తుత దశకు చేరుకున్నాయని డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం చెబుతోంది. ఆ సిద్ధాంతం ప్రకారమే మానవుడు కోతిదశ నుండి క్రమంగా పరిణామం చెందుతూ ఇప్పటి రూపానికి మారాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఖుర్ఆన్ ఈ పరిణామ ప్రక్రియకు భిన్నంగా ప్రస్తుత మానవుడు సృష్టి ప్రారంభంలో కూడా ఇలాగే ఉండేవాడని చెబుతోంది. సృష్టికర్త ఆది మానవుడయిన ఆదం (అలై)ను, ఆయన భార్య హవ్వా (అలై)ను దివి నుండి ఏకంగా భువిపైకి పంపాడు. వారిద్దరి నుండే మొత్తం మానవసంతతి ఉద్భవించింది; ప్రళయం దాకా ఉద్భవిస్తుంది.

"దేవుడు ఆకాశం వైపు దృష్టిసారించాడు. అప్పుడు ఆకాశం పూర్తిగా పొగ రూపంలో ఉండింది. (ఆ పొగను కూడా దేవుడే సృష్టించాడు.) ఆయన భూమ్యాకాశాల్ని ఉద్దేశించి



"మీకు ఇష్టమున్నా లేకపోయినా ఉనికిలోకి రండి" అన్నాడు. దానికి అవి "మేము వినమ్రులయి వచ్చేశాం" అన్నాయి." (ఖుర్ఆన్–41:11)

"అప్పుడు ఆయన రెండురోజుల్లో ఏడు ఆకాశాలు నిర్మించాడు. ప్రతి ఆకాశానికి తత్సంబంధిత నియమావళి నిర్దేశించాడు. భూలోక సమీపంలోని ఆకాశాన్ని మేము (నక్షత్ర) దీపాలతో అలంకరించాం. దాన్ని అన్నివిధాలా సురక్షితంగా ఉంచాం. ఇదంతా మహా శక్తిమంతుడు, అపార వివేకవంతుడైన దేవుడు రూపొందించిన పథకం." (ఖు–41:12)

"ఆయనే భూమి (దొర్లిపోకుండా దాని) మీద పర్వతాలు పాతిపెట్టాడు. అందులో అనేక శుభాలు ఉంచాడు. అంతేకాదు, ఆహారం అర్థించే సమస్త ప్రాణికోటికి అవసరమైన మేరకు లెక్క ప్రకారం దానిపై ఆహారసామగ్రి కూడా ఏర్పాటు చేశాడు. ఈ పనులన్నీ నాలుగు రోజుల్లో పూర్తయ్యాయి." (ఖుర్ఆన్–41:10)

మొదట పొగరూపంలో ఉన్న విశ్వం గ్రహాలుగా, నక్షత్రాలుగా, ఇతర మరెన్నో రోదసీవస్తువులుగా మారడానికి రెండురోజులు పట్టింది. ఈ రెండురోజుల నిర్మాణ ప్రక్రియలో భూమి కూడా చేరిఉంది. ఆ తర్వాత భూమిపై (మరికొన్ని ఇతర గ్రహాలపై కూడా) నీరు, గాలి, వృక్షజాతి, జీవరాసి వగైరా ఏర్పడటానికి మరోనాలుగు రోజులు పట్టింది. ఇక్కడ 9,10 సూక్తులలో దేవుడు భూమండల నిర్మాణానికి రెండురోజులు పట్టిందని, దానిపై ఆహారం తదితర ఏర్పాట్లు జరగడానికి నాలుగు రోజులు పట్టిందని అన్నాడు. ఈవిధంగా భూమి జీవరాసికి నివాసయోగ్యం కావడానికి మొత్తం ఆరుదినాలు పట్టింది. ఈ ఆరు దినాలలోనే మొత్తం విశ్వవ్యవస్థ ఏర్పడింది.

11,12 సూక్తులలో దేవుడు విశ్వనిర్మాణానికి ముందున్న పరిస్థితిని ప్రస్తావిస్తూ, అప్పుడు ఈ విశ్వం పొగరూపంలో ఉండేదని అన్నాడు. నేటి సైన్స్ భాషలో దీన్ని నీహారిక (Nebula) అంటారు. కోట్ల సంవత్సరాల క్రితం ఒకచోట గుమిగూడివున్న ఈ విశ్వపదార్థంలో పెద్దప్రేలుడు (బిగ్‌బ్యాంగ్) సంభవించి ముక్కలైపోయిందని, అవి క్రమంగా విస్తరించి లక్షలాది సంవత్సరాల తర్వాత నేటి గ్రహాలుగా, నక్షత్రాలుగా రూపొందాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖుర్ఆన్‌లో దేవుడు పొగ రూపంలో ఉన్న భూమ్యాకాశాల్ని ఉద్దేశించి ఉనికిలోకి రండని ఆజ్ఞాపించాడు. ఆతర్వాత ఆయన రెండు రోజుల్లో ఏడు ఆకాశాలు నిర్మించాడు. ఇందులో భూమి కూడా చేరివుంది.

ఈవిధంగా దేవుడు భూమ్యాకాశాలను ఆరు దినాలలో సృష్టించాడని ఖుర్ఆన్ చెబుతోంది. ఈ దినాలు మనం ప్రమాణంగా తీసుకునే దినాలు కానవసరంలేదు. ఖుర్ఆన్‌లో ఒకచోట ఒకరోజు మీరు లెక్కించే వెయ్యేండ్లకు సమానమని, మరోచోట ఒకరోజు యాభైవేల ఏండ్లకు సమానమని ఉంది. ఖుర్ఆన్ సైన్స్‌ని గురించి చెప్పే గ్రంథం కాదు. తన అవతరణ కాలంనాటి మానవులకు అర్థమయ్యేలా సంక్షిప్తంగా దేవుని అసాధారణ శక్తిసామర్థ్యాల ప్రస్తావనల ద్వారా ఆయన ఏకత్వాన్ని చాటిచెప్పే దైవగ్రంథం. ఆ దృష్టితోనే దాన్ని అధ్యయనం చేస్తే విషయం అర్థమవుతుంది.

"ఆయనే భూమ్యాకాశాల్ని ఆరు రోజుల్లో సృష్టించాడు. తర్వాత ఆయన అధికార సింహాసనం అధిష్ఠించి యావత్తు విశ్వవ్యవస్థను నిర్వహిస్తున్నాడు." (ఖుర్ఆన్–10:3)

దేవుడు భూమ్యాకాశాలను ఆరు రోజుల్లో సృష్టించి, ఆ తర్వాత అధికార సింహాసనం అధిష్టించాడంటే, విశ్వనిర్వహణ కార్యాలను వదలి విశ్రాంతి తీసుకున్నాడని అర్థం కాదు. సృష్టి నిర్మాణం తరువాత ఆయన విశ్వంలోని యావత్తు చరాచరాలను, సృష్టిరాసులను పర్యవేక్షిస్తున్నాడని, పోషిస్తున్నాడని, పాలిస్తున్నాడని అర్థం.

# 2. మానవసృష్టి మహోత్కృష్టజీవిగా

"నీ ప్రభువు దైవదూతలతో 'భూలోకంలో నేనొక ఖలీఫా* (దైవప్రతినిధి)ని నియమించబోతున్నా'నని అన్నప్పుడు దైవదూతలు ఏమన్నారో తెలుసా? 'ఏమిటీ! మీరు ప్రపంచవ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, రక్తపాతానికి వడిగట్టేవాడ్ని భూలోకంలో నియమించబోతున్నారా? మేము మిమ్మల్ని అనుక్షణం స్థుతిస్తూ, మీ పవిత్రతను స్థుతిస్తూనే వున్నాంకదా?' అన్నారు. దానికి దేవుడు 'మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసు' అన్నాడు." (ఖు-2:30)

"ఆ తర్వాత ఆయన ఆదంకు సమస్త వస్తువుల పేర్లు తెలియజేశాడు. ఆపై వాటిని దైవదూతల ముందు ప్రవేశపెట్టి 'మీ అభిప్రాయం సరైనదయితే కాస్త ఈ వస్తువుల పేర్లేమిటో చెప్పండి' అనడిగాడు. 'మీరు పరిశుద్ధులు, మీరు మాకు తెలియజేసినంత మేరకే మాకు తెలుసు. దానికి మించి ఒక్క విషయం కూడా మాకు తెలియదు. వాస్తవానికి మీరే అన్నీ తెలిసినవారు, వివేకవంతులు' అన్నారు దైవదూతలు." (ఖుర్ఆన్-2:31-32)

"ఆ తర్వాత దేవుడు ఆదంతో 'ఈ వస్తువుల పేర్లేమిటో వారికి చెప్పు' అన్నాడు. ఆదం వాటి పేర్లన్నీ చెప్పాడు. అప్పుడు దేవుడు దైవదూతలతో ఇలా అన్నాడు: 'భూమ్యాకాశాల్లో గుప్తంగా వున్న సమస్తవిషయాలు నాకు తెలుసని నేను ముందే మీతో అనలేదా? మీరు పైకి వెలిబుచ్చే విషయాలు, లోన దాచే విషయాలు సైతం నాకు తెలుసు.' ఆతర్వాత మేము ఆదంకు గౌరవసూచకంగా అభివాదం చెయ్యండని దైవదూతలను ఆదేశించాం.**అప్పుడు ఇబ్లీసు తప్ప అందరూ అభివాదం చేశారు. ఇబ్లీసు తనేదో గొప్ప వాణ్ణన్న అహంకారంతో విర్రవీగుతూ, తిరస్కరించి అవిధేయుడై పోయాడు." (ఖుర్ఆన్-2:33,34)

*ఇక్కడ ఖలీఫా అనే పదం ప్రపంచంలో మానవుని నిజస్థానం, అతని జీవితలక్ష్యం ఏమిటో తెలియజేస్తోంది. ఈ ప్రపంచంలో మానవుడు దేవునిప్రతినిధిగా, దేవుడు పంపిన ఆజ్ఞల్ని పాటిస్తూ ఆయనకు పూర్తి విధేయుడై జీవించాలి. జీవితంలోని ప్రతి రంగం ఆయన ఆదేశాలనే పాటించాలి. అంతేగాని, మానవుడు స్వయంగా యజమాని అయి, ఇష్టారాజ్యంగా విశృంఖలజీవితం గడపడానికి వీల్లేదు. ఖలీఫా అనే పదాన్ని మన దేశంలో బ్రిటిష్‌పాలకుల కోసం వాడిన వైస్రాయ్ అనే ఇంగ్లీషు పదంతో పోల్చవచ్చు.

**దీన్నిబట్టి విశ్వవ్యవహారాలు నిర్వహించడానికి నియుక్తులైన యావత్తు దైవదూతలపై మానవునికి దేవుడు ఆధిక్యత ప్రసాదించాడు. అంటే మానవుడ్ని యావత్ సృష్టిలో ఉత్కృష్టజీవిగా, ఖలీఫాగా చేసి ప్రపంచంలో అతను చేసే ప్రతిపనిలో దైవదూతలు అతనికి సహకరించాలని ఆదేశించాడన్నమాట. మానవునికి ప్రసాదించబడిన ఈ ఆధిక్యత, ఉత్కృష్టతల కారణంగానే అతనికి గౌరవసూచకంగా అభివాదం చేయాలని దైవదూతలను, జిన్నుల (భూతాల)ను ఆజ్ఞాపించడం జరిగింది.



"అప్పుడు విశ్వప్రభువు 'ఇబ్లీస్! ఏమయింది నీకు? నేను నా స్వహస్తాలతో సృజించిన మానవునికి అభివాదం చేయనీయకుండా నిన్నే విషయం నిరోధించింది? నువ్వు స్వతహాగా గొప్పవాడయి పోయావా? లేక నువ్వసలు ఏదైనా అగ్రస్థాయి ప్రముఖుల కోవకు చెందిన వాడవని అనుకుంటున్నావా?' అని అడిగాడు. 'నేను అతని కన్నా శ్రేష్ఠుడ్ని. మీరు నన్ను అగ్నితో సృజించారు. అతడ్ని మట్టితో సృజించారు' అన్నాడు ఇబ్లీస్."(ఖుర్ఆన్-38:75,76)

"అలాగానా! అయితే నీవిక్కడ్నుంచి దిగిపో. ఇక్కడ గర్వంతో విర్రవీగడానికి నీకెలాంటి హక్కులేదు. వెళ్ళిపో ఇక్కడ్నుంచి. నీవు (మాఆదేశాన్ని ధిక్కరించి) పరమ నీచుడవై పోయావు' అన్నాం మేము. 'అయితే (దేవా!) మానవులు మళ్ళీ బ్రతికించబడేవరకు నాకు గడువునివ్వు' అన్నాడు (ఇబ్లీసు). 'అలాగే ఇస్తున్నాం వెళ్ళు' అన్నాం (మేము)." (ఖుర్ఆన్-7:13-15)

"ప్రభూ! నీవు నన్ను ఏవిధంగా దారి తప్పించావో అదేవిధంగా నేను భూలోకంలో మానవులకు ఎన్నో మనోహరమైన వస్తువుల్ని చూపి వారిని దారి తప్పిస్తాను." (15:39) "ఓరి నీచుడా! శాపగ్రస్తుడవై ఇక్కడ్నుంచి వెళ్ళిపో. (విను,) నీతో సహా నిన్ను అనుసరించే వారందర్నీ నరకంలోకి విసరివేస్తాను' అన్నాడు దేవుడు." (ఖుర్ఆన్-7:18)

"నా దగ్గరకు చేరుకోవడానికి ఇదే రుజుమార్గం. (ఈమార్గంలో నడిచే) నా (ప్రియ) దాసులపై నీ అధికారం చెల్లదు. నీ అధికారం నిన్ననుసరించే భ్రష్టుల మీదనే చెల్లుతుంది. వారందరికీ నరకమే (గతి, ఇది) మావాగ్దానం' అన్నాడు దేవుడు."(ఖుర్ఆన్-15:41-43)

## (1) దివి నుండి భువికి

"ఆతర్వాత మేము ఆదంకు ఇలా చెప్పాము: 'నీవు, నీభార్య స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు కోరుకున్నదల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే అదిగో...! ఆ చెట్టు దరిదాపులకు మాత్రం వెళ్ళకండి. వెళ్తే మీరు కూడ దుర్మార్గులై పోతారు." (ఖుర్ఆన్-2:35)

"ఆదం! ఇతను నీకు, నీభార్యకు (బద్ధ)విరోధి. ఇతను మీరిద్దర్నీ స్వర్గం నుండి బయటికి తీయడం, దానివల్ల మీరు కష్టాలలో పడిపోవడం జరగకూడదు సుమా! ఇక్కడ మీకు కావలసిన సౌకార్యాలన్నీ ఉన్నాయి. ఎలాంటి ఆకలి బాధగాని, కట్టుబట్టల కొరతగాని ఉండదు. అలాగే ఇక్కడ దప్పికగాని, ఎండబాధగాని ఉండదు." (ఖు-20:117-119)

"కాని షైతాన్ అతడ్ని మభ్యపెట్టాడు. వాడతని దగ్గరకు వెళ్ళి 'ఆదం! నేను నీకు శాశ్వత జీవితం, ఎన్నటికీ పతనంకాని రాజ్యాధికారం ప్రసాదించే కల్పవృక్షాన్ని చూపనా?' అన్నాడు. చివరికి వారిద్దరూ (వాడి టక్కరిమాటలకు మోసపోయి) ఆ చెట్టు పండ్లు తిన్నారు. దాంతో వారి మర్మావయవాలు ఒకరి ముందు ఒకరివి బహిర్గతమై పోయాయి. అప్పుడు వారిద్దరూ స్వర్గవృక్షాల ఆకులతో తమ శరీరాలు కప్పుకోసాగారు. (ఇలా) ఆదం తన ప్రభువు (మాట) జవదాటి సన్మార్గం తప్పిపోయాడు."* (ఖుర్ఆన్-20:120,121)

*2:36,7:20-22 సూక్తులలో ఆదం (అలై), ఆయన భార్య హవ్వా (అలై) ఇద్దర్నీ షైతాన్ మోసగించినట్లుంది. అయితే ఇక్కడ ఆదం (అలై)ని షైతాన్ మభ్యపెట్టినట్లు స్పష్టంగా ఉంది. అంతేకాదు, (121సూక్తిలో) ఆదం తన ప్రభువాజ్ఞ జవదాటినట్లు కూడా పేర్కొనబడింది.

“షైతాన్ (వారుభయుల్ని నిషేధిత వృక్షం గురించి లేనిపోని ఆశలు కల్పించి) వారిని పూర్వస్థితి నుండి దిగజార్చి స్వర్గసౌఖ్యాలకు దూరంచేశాడు. అప్పుడు మేము వారితో ‘మీరంతా ఇక్కడ్నుంచి దిగిపోండి. మీరు ఒకరికొకరు శత్రువులు. ఒక నిర్ణీతకాలం వరకు మీరు భూలోకంలో జీవితం గడపవలసివుంది’ అన్నాము.” (ఖుర్‌ఆన్–2:36)

“తర్వాత ఆదం తన ప్రభువు నుండి కొన్నిమాటలు గ్రహించి, పశ్చాత్తాపంతో క్షమాపణ వేడుకున్నాడు. దాన్ని అతని ప్రభువు స్వీకరించాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు. మేమిలా అన్నాం: ‘మీరంతా ఇక్కడ్నుంచి దిగిపోండి. నా దగ్గర్నుండి మీ దగ్గరకు ఏదైనా మార్గదర్శకత్వం వస్తే దాన్ని అనుసరించాలి. దాన్ని అనుసరించేవారికి ఎలాంటి భయంగాని, దుఃఖంగాని ఉండదు. నా మార్గదర్శకత్వాన్ని నిరాకరించి, నా సూక్తుల్ని ధిక్కరించేవారు నరకానికి పోతారు. అక్కడే వారు (నానా యాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడివుంటారు.” (ఖుర్‌ఆన్–2:37–39)

ఈవిధంగా దేవుడు తొలి మానవుడు ఆదంని సృష్టించిన తరువాత అంతకు ముందే సృష్టించబడిన దైవదూతలను, జిన్నులను సమావేశపరచి ఆదం ముందు మోకరిల్లమని ఆజ్ఞాపించాడు. ఈ ఆజ్ఞను శిరసావహిస్తూ సభికులందరూ ఆదం (అలై) ముందు మోకరిల్లారు. ఇస్లాం వాస్తవికత తెలిసినందువల్లనే అగ్నికంటే కూడా విలువైన జ్యోతితో సృజించబడిన దైవదూతలు సైతం దైవాజ్ఞకు బద్ధులై మట్టితో సృజించబడిన ఆదం (అలై) ముందు మోకరిల్లారు. కాని ఇబ్లీస్ దైవాజ్ఞను ధిక్కరించి ఇస్లాం పరిధి నుండి బయటికిపోయాడు.

మానవుల్లాగే మంచి లేక చెడు అవలంబించే స్వేచ్ఛ పొందిన మరొకజాతి కూడా ఈ లోకంలో ఉంది. అదే జిన్‌జాతి. జిన్నులు (భూతాలు) అగ్నిజ్వాలతో సృష్టించబడి మానవులకు కనపడకుండా ఉంటారు. వారు మానవుల్ని చూడగలుగుతారు, కాని మానవులు వారిని చూడలేరు. మౌలానా షబ్బీర్‌అహ్మద్ ఉస్మానీ (రహ్మ) గారి వ్యాఖ్యానం ప్రకారం, జిన్నులు మానవుని పుట్టుకకు ముందు కొన్నివేల ఏండ్ల నుండి భూలోకంలో మనుగడ సాగిస్తుండేవారు. అప్పుడు వారు ఆకాశం పైకి కూడా పోతుండేవారు. అయితే భూలోకంలో రక్తపాతం, హింసాదౌర్జన్యాలు జరపడంలో హద్దుమీరిపోవడంతో దేవుని ఆజ్ఞతో దైవదూతలు అనేకమంది జిన్నుల్ని సంహరించారు. మిగిలినవారు కొండల్లోకి, అడవుల్లోకి పారిపోయారు.

---

*అయితే క్రైస్తవులు హవ్వా (అలై)యే ఆదం (అలై)కు నిషిద్ధఫలం తినిపించినట్లు ప్రచారం చేశారు. 11వ శతాబ్దంలో బిషప్ మార్బత్ “స్త్రీయే మన ప్రథమపితకు నిషిద్ధఫలం తిన్పించింద”ని పేర్కొన్నాడు. టెర్‌టూలియన్ అనే మరో పండితుడు స్త్రీ జాతినే కించపరుస్తూ “స్త్రీ నరకానికి ద్వారం, అన్ని చెడుగులకు తల్లి, తాను స్త్రీ అయినందుకు ఆమె సిగ్గుపడాలి” అన్నాడు. ఈభావనే పూర్వం క్రైస్తవజగత్తులో స్త్రీజాతిని అధమశ్రేణికి దిగజార్చింది. వారి హక్కులను అన్యాయంగా కాలరాయడం జరిగింది.*

*ఖుర్‌ఆన్ షైతాన్‌మోసానికి గురయినది ఆదం (అలైహి) అని పేర్కొన్నప్పటికీ, స్త్రీ పురుషుల మధ్య వివక్ష చూపుతూ పురుషుడ్ని నిందించలేదు. ఇక్కడ స్త్రీ అయినా, పురుషుడైనా గమనార్హమైన విషయం మానవుడి వల్ల పొరపాటు జరిగిందన్నదే.*



ఈ జిన్నుల్లో ఇబ్లీస్ గొప్ప భక్తుడిగా, పండితుడిగా పేరు తెచ్చుకున్నాడు. అంచేత అతనీ సామూహిక సంహారానికి గురికాకుండా దైవదూతలతో కలసిఉండసాగాడు. అత్యధికమంది జిన్నులు హతమార్చబడిన తర్వాత ఇబ్లీస్ తన భక్తిపరాయణత, పాండిత్యాలను చూసుకొని ఇక భూలోకంలో తానొక్కడే గొప్పవాణ్ణని, తనను దేవుడు ఖలీఫాగా నియమించి ఇక్కడ పెత్తనం చెలాయించే అధికారం ఇస్తాడని భావించాడు. కాని దేవుడు ఆదం(మానవుడి)ని ఖలీఫాగా నియమించానని ప్రకటించడంతో అతను నిరాశచెందాడు. అసూయతో మండిపోతూ ఆదంకు బద్ధశత్రువైపోయాడు. తాను మట్టికన్నా విలువైన అగ్నితో సృజించబడ్డానని చెబుతూ వర్ణద్వేషంతో, జాత్యహంకారంతో విర్రవీగుతూ దైవాజ్ఞను ధిక్కరించాడు. ఫలితంగా అతను శాశ్వతంగా శాపగ్రస్తుడైపోయాడు.

## (2) ఆదం సంతానంలో అంతఃకలహం

“ముహమ్మద్! వీరికి ఆదం కొడుకులిద్దరి గాథ విన్పించు. వారిద్దరు (ఒక పశువుని) బలిచ్చారు. వారిలో ఒకని బలి మాత్రమే స్వీకరించబడింది. రెండోవాని బలి స్వీకరించబడలేదు. దాంతో అతను (చిర్రెత్తిపోయి) ‘నేను నిన్ను చంపేస్తాను’ అన్నాడు.”

“దానికి రెండోవాడు ఇలా అన్నాడు: ‘దేవుడు భయభక్తులు కలవారి మొక్కుబడినే స్వీకరిస్తాడు. నీవు నన్ను చంపడానికి చెయ్యెత్తితే నేను మాత్రం నిన్ను చంపడానికి చెయ్యెత్తను. నేను సర్వలోక ప్రభువయిన దేవునికి భయపడుతున్నాను. నా పాపం, నీ పాపం అంతా నువ్వే మూటకట్టుకొని నరకంలోకి పోయిపడు. అదే దుర్మార్గులకు తగిన ప్రతిఫలం. నేను కోరేది కూడా అదే.” (ఖుర్‌ఆన్–5:27–29)

“చివరికి అతని (దుష్ట) మనస్సు అతని సోదరుడ్ని వధించడానికి ప్రేరేపించింది. అతను తన సోదరుడ్ని హతమార్చివేశాడు. ఈ విధంగా అతను నష్టపోయినవారిలో చేరిపోయాడు. ఆతర్వాత దేవుడు ఓ కాకిని పంపాడు. ఆ కాకి అతనికి అతని సోదరుడి శవాన్ని ఎలా పూడ్చిపెట్టాలో చూపడానికి నేలను త్రవ్వడం ప్రారంభించింది. అది చూసి అతను ‘అయ్యయ్యో! నా సోదరుడి శవాన్ని ఎలా పూడ్చిపెట్టాలో తెలియలేదే! నాకు ఆ కాకికున్నంత జ్ఞానం కూడా లేకపోయిందే!!’ అని బాధపడ్డాడు. ఆ తరువాత అతను తాను చేసిన పనికి ఎంతో పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు.” (ఖుర్‌ఆన్–5:30,31)

షైతాన్ చేసిన మోసంవల్ల ఆదిదంపతులైన ఆదం, హవ్వా (అలైహి)లు దివి నుండి భువికి దిగవలసివచ్చింది. ఆనాటి నుంచి నేటి వరకూ పుట్టిన మానవులంతా వారిద్దరి సంతతే. మానవులు పుట్టకముందే వారిఆత్మల చేత దేవుడిలా ప్రమాణం చేయించాడు:

“నీ ప్రభువు ఆదంసంతతి వీపుల నుండి వారి భావితరాల్ని తీసి ప్రమాణం చేయించిన సందర్భం. అప్పుడు మేము వారిని సాక్షులుగా పెడుతూ ‘నేను మీ ప్రభువుని కానా’ అని అడిగాం. దానికి వారు ‘మీరే మాప్రభువు. అందుకు మేమే సాక్షులం’ అన్నారు. మేమిలా చేయడానిక్కారణం, ప్రళయదినాన మీరు ‘మాకీ విషయం తెలియద’ని చెప్పవచ్చు. లేదా ‘బహుదైవారాధన మాకు పూర్వం మా తాతముత్తాతలు ప్రారంభించారు. మేము ఆతర్వాత వారి సంతతి నుండి పుట్టాము. అలాంటప్పుడు దుర్జనులు చేసిన ఈ తప్పుకు

మమ్మల్ని పట్టుకుంటారా?' అని చెప్పవచ్చు. వారు సన్మార్గం వైపు మరలుతారన్న ఉద్దేశ్యంతో మేమిలా మా సూక్తులు విడమరచి తెలుపుతున్నాం." (ఖుర్ఆన్-7:172-174)

ఈ సత్యాన్ని మానవులకు గుర్తుచేసి వారిని సంస్కరించడానికి ఆదిమానవుడు ఆదం (అలైహి) నుండి ముహమ్మద్ (స) వరకు 1,24,000 మంది దైవప్రవక్తలు వచ్చి పోయారు. అయినా మానవుల్లో అత్యధికమంది సృష్టికర్త నిర్దేశించిన రుజుమార్గం, సనాతన ధర్మం అయిన ఇస్లాం (దైవవిధేయతా) పరిధిలోకి రాలేకపోతున్నారు.

ఆదిమానవుడు ప్రస్తుత మానవరూపంలో ఉన్నా ప్రారంభంలో చాలా పొడగరి అని తెలుస్తోంది. "(ఆదిమానవుడు) ఆదంను సృష్టించినప్పుడు ఆయన అరవై బారలు (180 అడుగులు) ఎత్తుండేవాడు. తరువాత క్రమంగా తగ్గిపోతూ ఇప్పటి (ఆరడుగల) ఎత్తుకు వచ్చాడు" అని దైవప్రవక్త (స) తెలిపారు. (బుఖారి)

ప్రారంభంలో మానవుని వయస్సు కూడా వేల సంవత్సరాలలో ఉండేదని కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది. నూహ్ ప్రవక్త (అలైహి) గురించి "అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాలు గడిపాడు" అని ఖుర్ఆన్ (29:14)లో ఉంది. నూహ్ (అలైహి) దైవప్రవక్త అయిన నాటినుండి తుఫాన్ సంఘటన సంభవించేవరకు తన జాతిప్రజల మధ్య 950 ఏండ్లు గడిపారని, దీన్నిబట్టి నూహ్ (అలైహి) వయస్సు వేయి సంవత్సరాలకు పైనే ఉండవచ్చని ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు.

ఇబ్నెజౌజీ (రహ్మలై) ఉల్లేఖనం ప్రకారం ఈసాప్రవక్త (అలైహి) తన అనుచరుల కోరికపై దైవాన్ని ప్రార్థించగా ఒక కపాలం ఇలా అంటుంది: "ఒకప్పుడు నేనీ ప్రాంతం చక్రవర్తిని. వెయ్యేండ్లు జీవించాను; వేయిమంది సంతానం కన్నాను; వేయి పట్టణాలు జయించాను; వేయి సైన్యాలను ఓడించాను; వేయిమంది రాజుల్ని చంపాను. చివరికి ఈ విజేత మృత్యు కుహరంలోకి వెళ్ళాడు...."

వహబ్ బిన్ మునబ్బా (రహ్మలై) ఉల్లేఖనం ప్రకారం ఈసాప్రవక్త (అలైహి) తన అనుచరుల కోరికపై నూహ్ప్రవక్త (అలైహి) కుమారుడు సామ్ సమాధి దగ్గర నిలబడి "దేవుని ఆజ్ఞతో సజీవి అయి, లే" అన్నారు. సామ్ లేచి ఈసా (అలైహి) ప్రశ్నకు సమాధానమిస్తూ "నేను నాలుగు వేల సంవత్సరాలు జీవించాను...." అన్నాడు.

ఇలా అతిప్రాచీన యుగంలో మానవులు వేలాది సంవత్సరాలు జీవించినట్లు తెలుస్తోంది. ('మౌత్కా ఝట్కా' అనే గ్రంథంలో 320, 321 పేజీలు చూడండి.)

పై హదీసులన్నిటిని బట్టి సృష్టి ప్రారంభంలో ఉండిన మానవులు అత్యంత దీర్ఘాయుష్కులని, దీర్ఘకాయులని స్పష్టంగా తెలుస్తోంది. అదే విధంగా ఇతర జీవరాసులు, వృక్షజాతులు వగైరా కూడా ఉండవచ్చునేమో! వాస్తవం దేవునికే తెలియాలి. ఆనాటి నుంచి మానవుని ఎత్తు, వయస్సు క్రమంగా తగ్గిపోతూ నేడు సగటున అరడుగులకు, తొంభయి, వంద సంవత్సరాలకు దిగిపోయాయి.

ఖుర్ఆన్ కథనం ప్రకారం ప్రతియుగంలో, ప్రతిజాతిలో దైవప్రవక్తలు ప్రభవించారు. అత్యధిక దైవప్రవక్తలు భౌగోళికంగా ప్రపంచానికి కేంద్రస్థాయి ప్రాంతాలైన ఈజిప్టు,



ఇరాఖ్, పాలస్తీనా, అరేబియా దేశాలలో ప్రభవించారు. దైవప్రవక్తలలో కొందరిపై దివి నుండి దైవగ్రంథాలు అవతరించాయి. జబ్బూర్, తౌరాత్, ఇంజీల్ వగైరా ఈ కోవకు చెందినవే. (ఇప్పుడివి బైబిల్గా రూపాంతరం చెందివున్నాయి.) ఖుర్ఆన్లో ప్రస్తావించ బడని మతగ్రంథాలు కూడా ప్రారంభకాలంలో దైవప్రోక్తగ్రంథాలే అయివుండవచ్చు. కాదని ఖండించడానికి ఆస్కారమేదీ కన్పించదు.

యావన్మంది దైవప్రవక్తలు ప్రజలకు బోధించిన సారాంశం ఒక్కటే. సృష్టికర్త, స్వామి, సర్వేశ్వరుడు, ప్రభువు, పోషకుడు, పర్యవేక్షకుడు, ఆపద్బాంధవుడు, ఆపదల మొక్కుల వాడు, ఆదిమధ్యాంత రహితుడైన దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడు. ఆయన తప్ప మరోఆరాధ్యుడు లేడు; సమస్తజీవనరంగాల్లో ఆయన ఆజ్ఞల్నే శిరసావహించాలి; ఆయన దైవత్వంలో, గుణగణాల్లో, శక్తిసామర్థ్యాలలో ఇతరుల్ని భాగస్వాములుగా చేయకూడదు. ఈ ప్రపంచం ఓ ప్రయాణమజిలి, పరీక్షావేదిక, తాత్కాలికాశ్రయం. మరణానంతరం ప్రతి మనిషీ తన కర్మలకు దైవన్యాయస్థానంలో లెక్క చెప్పవలసివుంటుంది. కర్మవిచారణ తర్వాత స్వర్గం లేదా నరకం రూపంలో అతనికి శాశ్వత ప్రతిఫలం లభిస్తుంది.

మానవులకు రుజుమార్గం తెలియజేయడానికి వచ్చిన 1,24,000 మంది దైవప్రవక్త లలో 25 మంది ప్రవక్తలను గురించి మాత్రమే ఖుర్ఆన్లో ప్రస్తావించడం జరిగింది. ఆ 25 మందిలో కూడా కొందరు ప్రవక్తలను గురించి చాలా సంక్షిప్తంగా, మరికొందరు ప్రవక్తలను గురించి కాస్తంత వివరంగా తెలియజేయబడింది. ఆది మానవుడు ఆదం (అలైహి)ను తొట్టతొలి దైవప్రవక్తగా పేర్కొనడం జరిగింది. ఆ తర్వాత నూహ్, ఇబ్రాహీం, లూత్, యూసుఫ్, హూద్, షుఐబ్, సాలిహ్, మూసా, దావూద్, సులైమాన్, యహ్యా, ఈసా (అలై) ప్రవక్తలను గురించి కొంచెం వివరంగా ప్రస్తావించింది.

# 3. ఇద్రీస్ (అలైహి)

"ఈ గ్రంథంలో ఇద్రీస్ని గురించి ప్రస్తావించు. అతను సత్యసంధుడు, దైవప్రవక్త. అతడ్ని మేము ఉన్నత స్థాయికి చేర్చాము." (19:56,57); "ఇస్మాయీల్, ఇద్రీస్, జుల్కిఫ్ల్ లను గురించి: వీరంతా ఎంతో సహనశీలురు. వీరికి మేము మా కారుణ్యఛాయలో చోటిచ్చాం. వీరంతా సజ్జనులు." (ఖుర్ఆన్-21:85,86)

కొందరు ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం ఈయన నూహ్ప్రవక్త (అలై)కు పూర్వం వచ్చిన దైవప్రవక్త అని తెలుస్తోంది. బైబిల్ పాతనిబంధనం, ఆదికాండం 21-24 సూక్తు లలో 'హనోకు' పేరుతో ప్రస్తావించబడిన వ్యక్తి ఇద్రీస్ ప్రవక్తేనని ముస్లిం పండితుల అభిప్రాయం. "హనోకు మూడువందల ఏండ్లు దేవునితో నడిచెనని....తరువాత దేవుడ తనిని తీసికొని పోయెను గనుక అతడు లేకపోయెన"ని బైబిల్ చెబుతోంది.

యూద మతగ్రంథం 'తల్మూద్'లో హనోక్ ప్రజలకు దూరంగా నిష్ఠాగరిష్ఠుడై ఏకాంత జీవితం గడుపుతుంటే, ఒక దైవప్రవక్త వచ్చి ఏకాంత కుహరం నుండి బయటికి వచ్చి ప్రజలకు సన్మార్గం చూపమని ఉపదేశించాడని, దాంతో ఆయన ప్రజలను అనేక చోట్ల సమీకరించి సద్బోధ చేశాడని, ప్రజలు ఆయనకు విధేయులై పోయారని వుంది. ఆయన

మానవుల్ని 353 ఏండ్లు పాలించాడని, ఎంతో న్యాయవంతంగా పాలించాడని, ఆయన పాలనలో దేవుడు ధరణిపై తన కారుణ్యానుగ్రహాలు కురిపించాడని కూడా తల్మూద్ వివరించింది. అయితే ఆయన చివరికి తీవ్రమైన ఓ సుడిగాలి ద్వారా అగ్నిరథమెక్కి, గుర్రాలతో సహా ఆకాశంలోకి అధిరోహించాడని ఓ కట్టుకథ కూడా ప్రచారంలో ఉంది.

## 4. నూహ్ (అలైహి)

"మేము నూహ్(ప్రవక్త)ను అతని జాతిప్రజల వద్దకు పంపి, వారిపై వ్యధాభరిత శిక్ష వచ్చిపడక ముందే వారిని హెచ్చరించాలని ఆదేశించాం. అతను (తన జాతిప్రజల వద్ద కెళ్ళి) ఇలా అన్నాడు: 'నాజాతి ప్రజలారా! నేను మిమ్మల్ని స్పష్టంగా హెచ్చరించడానికి వచ్చినవాణ్ణి. కనుక దేవుణ్ణి ఆరాధించండి. ఆయనకు భయపడండి. నాకు విధేయత చూపండి. (అప్పుడు) దేవుడు మీపాపాలు మన్నించి ఒక నిర్ణీతకాలం వరకు మిమ్మల్ని క్షేమంగా ఉండనిస్తాడు. దేవుడు నిర్ణయించిన (శిక్షా) సమయం వచ్చినప్పుడు దాన్నెవరూ ఆపలేరు. ఈ విషయం మీరు అర్థం చేసుకుంటే బాగుంటుంది!" (ఖుర్ఆన్-71:1-4)

ఈవిధంగా నూహ్ ప్రవక్త (అలైహి) వందలాది సంవత్సరాలు ప్రజలకు హితబోధ చేసినా కొందరు తప్ప ఎవరూ దైవధర్మాన్ని విశ్వసించలేదు. ఆయన కుమారుల్లో కూడా ఒకతను విశ్వసించలేదు.

"చివరికి నూహ్ ఇలా ప్రార్థించాడు: 'ప్రభూ! ఈ తిరస్కారులలో ఏ ఒక్కడ్నీ భూమండలంపై సజీవంగా వదలిపెట్టకు. నీవు గనక వీరిని వదిలేస్తే వీరు నీ దాసుల్ని దారి తప్పిస్తారు. వీరి సంతతి నుండి పుట్టే ప్రతివ్యక్తీ దుర్మార్గుడిగా, కరుడుగట్టిన తిరస్కారిగా మారుతాడు. ప్రభూ! నన్నూ, నా తల్లిదండ్రుల్నీ, నాఇంట్లో విశ్వాసిగా ప్రవేశించిన ప్రతి మనిషినీ, విశ్వసించిన యావత్తు స్త్రీ పురుషుల్నీ క్షమించు. దుర్మార్గులకు మాత్రం వినాశంలో తప్ప మరెందులోనూ వృద్ధి కలిగించకు." (ఖుర్ఆన్-71:26-28)

"నూహ్‌కు దివ్యావిష్కృతి ద్వారా ఇలా సూచించబడింది: 'నీ జాతిలో విశ్వసించ వలసినవారంతా విశ్వసించారు. ఇక కొత్తగా విశ్వసించేవారెవరూ లేరు. కనుక వారి అకృత్యాలను గురించి నీవు బాధపడకు ఇప్పుడు మా పర్యవేక్షణలో మా ప్రోత్సాహంతో ఒక ఓడ తయారుచేసుకో. అయితే దుర్మార్గుల్ని గురించి నాదగ్గర సిఫారసు చేయకూడదు. వారంతా ఇప్పుడు మునిగిపోనున్నారు." (ఖుర్ఆన్-11:36,37)

"అప్పుడు మేమిలా సూచించాము: 'మా పర్యవేక్షణలో మాసూచన ప్రకారం ఒక ఓడ నిర్మించుకో. మా ఆజ్ఞతో కుంపటి పొంగిపొర్లగానే ప్రాణులలో ప్రతి జాతికి చెందిన ఒక్కొక్క జంటను తీసుకొని ఓడలోకి ఎక్కు. నీ భార్యాపిల్లల్ని కూడా వెంటబెట్టుకో. అయితే (శిక్షకు గురైపోతారని) ముందే మేము నిర్ణయించిన వారిని ఓడలో ఎక్కించుకో వద్దు. దుర్మార్గుల్ని గురించి నాదగ్గర ఏమీ మాట్లాడకూడదు. వారిప్పుడు మునిగి పోనున్నారు. నీవు నీ సహచరులతో పాటు ఓడలోకి ఎక్కిన తర్వాత 'మమ్మల్ని దుర్మార్గుల బారినుండి కాపాడిన దేవునికి కృతజ్ఞతలు' అని చెప్పు. 'ప్రభూ! నన్ను శుభప్రదేశంలో దించు. నీవెంతో మంచి చోటు ప్రసాదించేవాడవు' అనికూడా వేడుకో." (ఖుర్ఆన్-23:27-29)



"చివరికి మాఆజ్ఞ రానేవచ్చింది. (మహోపద్రవం) కుంపటి పొంగిపొరలింది. అప్పుడు మేమిలా ఆదేశించాం: 'ప్రతి జాతికి చెందిన ప్రాణులలో ఒక్కొక్క జతను నౌకలోకి తీసుకో. అలాగే ఎవరెవరిని గురించి నీకు ముందే తెలియజేశామో వారిని వదలి (మిగిలిన) నీ కుటుంబసభ్యుల్ని, (ఇతర) విశ్వాసుల్ని కూడా నౌకలో ఎక్కించుకో."

"నూహ్‌తో పాటు విశ్వాసులు కొద్దిమందే ఉన్నారు. నూహ్ (తన అనుచరులతో) 'దేవుని పేరు స్మరించి ఓడలోకి ఎక్కండి. అది నడవడం, ఆగిపోవడం అన్నీ (దేవుని చేతిలో ఉన్నాయి). నాప్రభువు గొప్పక్షమాశీలి, అమిత దయామయుడు' అని అన్నాడు. ఓడ వారిని తీసుకొని ముందుకు సాగింది. కొండల్లాంటి సముద్రకెరటాలు ఎగిసి పడుతున్నాయి. నూహ్ దూరానవున్న తన కుమారుడ్ని పిలిచి 'బాబూ! (ఇటు వచ్చేయి.) మాతోపాటు ఓడలోకి ఎక్కు. అవిశ్వాసులతో కలసిఉండకు' అని అన్నాడు." (ఖుర్ఆన్-11:40-42)

"దానికి అతను 'ఇదిగో చూడు, నేనిప్పుడు ఓకొండ ఎక్కుతాను. అది నన్ను నీటి నుండి కాపాడుతుంది' అన్నాడు. 'దేవుడు కరుణిస్తే తప్ప ఈరోజు ఆయన ఆజ్ఞ (శిక్ష) నుండి ఏశక్తీ కాపాడలేదు' అన్నాడు నూహ్. అంతలో వారిద్దరి మధ్య ఓ (పెద్ద) కెరటం వచ్చింది. దాంతో అతను కూడా మునిగిపోయేవారిలో చేరిపోయాడు." (ఖుర్ఆన్-11:43)

"భూమండలమా! నీ నీటినంతటినీ మింగెయ్యి. ఆకాశమా! ఇక ఆగిపో' అని ఆజ్ఞ అయింది. అప్పుడు నీరంతా నేలలోకి ఇంకిపోయింది. జరగవలసింది జరిగిపోయింది. ఓడ జూదీ పర్వతం మీద నిలిచిపోయింది. దాంతో 'దుర్మార్గుల పీడ విరగడైపోయింద'ని ప్రకటన వెలువడింది..." (ఖుర్ఆన్-ఖుర్ఆన్-11:45)

ఆర్మేనియా నుండి కుర్దిస్థాన్ వరకు వ్యాపించివున్న అరారాత్ అనే పర్వతశ్రేణుల్లో "జూదీ" పేరుతో నేటికీ ఒక పర్వతం ఉంది. అరిస్టాటిల్ అనుచరుడు ఎబడినస్ కూడా దీనిపై నూహ్(ప్రవక్త) ఓడ దిగిన విషయాన్ని ధృవీకరించాడు. ఇరాఖ్‌లో అనేకమంది ప్రజలు దీని శిథిలాలకు చెందిన ముక్కలు భద్రపరచుకొని వాటిని అరగదీసి రోగులకు మందుగా వాడుతున్నారని అతను తన చరిత్రగ్రంథంలో రాసినట్లు తెలుస్తోంది.

"నూహ్ వారి మధ్య యాభయి తక్కువ వేయి సంవత్సరాలు గడిపాడు. చివరికి వారు దుర్మార్గంలో పడివున్న స్థితిలో వారి పైకి (భయంకరమైన) తుఫాను వచ్చిపడింది. ఆ తర్వాత మేము నూహ్‌ని, (అతనితోపాటు) ఓడలో ఎక్కినవారిని రక్షించాం. దీన్ని మేము ప్రపంచ మానవులకు ఒక సూచనగా, ఒక గుణపాఠంగా చేసిఉంచాం." (ఖుర్ఆన్-29:14,15)

## 5. ఇబ్రాహీం, ఇస్మాయీల్ (అలైహి)

"ఇబ్రాహీం (యావత్ సమాజానికి) గొప్ప నాయకుడు. దేవుని పట్ల పూర్తి విధేయతతో కూడిన అంకితభావంగల భక్తుడు. అతను ఏనాడూ దైవేతరశక్తుల్ని ఆరాధించినవాడు కాదు. దేవుడు చేసిన మహోపకారాలపట్ల ఆయనకు సదా కృతజ్ఞుడై ఉండేవాడు. దేవుడు అతడ్ని ఎన్నుకొని రుజుమార్గం చూపాడు. ప్రపంచంలో అతనికి మంచిని ప్రసాదించాడు. పరలోకంలో అతను తప్పక సజ్జనులలో పరిగణించబడతాడు." (ఖుర్ఆన్-16:120-122)

# (1) సత్యసందర్శనం, ధర్మప్రచారం

"ఒకరోజు అతనిపై చీకటి కమ్ముకోగానే అతనొక నక్షత్రం చూసి 'ఇతను నా ప్రభువు' అన్నాడు. కాని ఆ నక్షత్రం అస్తమించగానే 'ఇలాంటి అస్తమించేవాటిని నేను ప్రేమించను' అన్నాడు. తర్వాత చంద్రుడు ప్రకాశిస్తూ కన్పించగానే 'ఇతనే నాప్రభువు' అన్నాడు. చంద్రుడు కూడా అస్తమించడంతో '(ఇతనూ నాప్రభువు కాదు.) నాప్రభువు నాకు మార్గం చూపకపోతే నేను మార్గభ్రష్టుణ్ణయిపోతాను' అన్నాడు." (ఖుర్ఆన్-6:74-77)

"ఆతర్వాత (మరునాడుదయం) సూర్యుడు దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించాడు, అప్పుడు ఇబ్రాహీం 'ఇతనే నాప్రభువు, అందరికంటే గొప్పప్రభువు' అన్నాడు. అయితే సూర్యుడు కూడా అస్తమించడంతో (అతనికి జ్ఞానోదయం అయింది.) అతను తన జాతితో 'నాజాతి ప్రజలారా! మీరు దేవునికి సాటికల్పిస్తున్న మిథ్యాదైవాలతో నేను విసిగిపోయాను. నేనిప్పుడు పూర్తి ఏకాగ్రతతో భూమ్యాకాశాల్ని సృష్టించినవాని వైపుకు మరలాను. నేను ఏమాత్రం బహుదైవారాధకుడ్ని కాను' అని అన్నాడు." (ఖుర్ఆన్-6:78,79)

"అతనిలా అన్నాడు: 'మీరు దేవుడ్ని మాత్రమే ఆరాధించండి. ఆయనకే భయపడండి. విషయం తెలుసుకుంటే ఇందులోనే మీ శ్రేయస్సుంది. మీరు దేవుడ్ని వదలి పూజిస్తున్న వస్తువులు విగ్రహాలు మాత్రమే. (ఇలా) మీరు ఒక అసత్యాన్ని కల్పించుకున్నారు. దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న ఈ విగ్రహాలు మీకు ఎలాంటి ఉపాధి ఇవ్వలేవు. కనుక మీరు దేవుని సన్నిధిలో ఉపాధి గురించి అర్థించండి. ఆయన్నే ఆరాధించండి, ఆయనకే కృతజ్ఞతలు తెలుపుకోండి. చివరికి మీరు ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉంది. మీరు నా మాటలు తిరస్కరిస్తే మీకు పూర్వం కూడా అనేక జాతులు తిరస్కరించాయి. (దైవ)సందేశాన్ని స్పష్టంగా అందజేయడం తప్ప దైవప్రవక్తపై మరెలాంటి బాధ్యత లేదు." (ఖుర్ఆన్-29:16-18)

ఇలా సాగింది ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ధర్మప్రచారం. ఆయన హేతుబద్ధంగా ఎన్నో విషయాలు విశదీకరించారు. కాని ఆయన జాతిప్రజలకు సత్యం చెవులకెక్క లేదు.

# (2) అగ్నిపరీక్ష

"అంతకు పూర్వం మేము ఇబ్రాహీంకు విచక్షణాజ్ఞానం ప్రసాదించాము. అతడ్ని గురించి మాకు బాగా తెలుసు. అతను తన తండ్రిని, తనజాతి ప్రజల్ని ఉపదేశిస్తూ, 'మీరంతగా అభిమానిస్తున్న ఈవిగ్రహాల సంగతేమిటీ?' అనడిగాడు." (ఖు-21:51,52)

"మా తాతముత్తాతలు వీటిని పూజిస్తుండేవారు. అంచేత మేమూ వీటిని పూజిస్తున్నాం' అన్నారు వారు." (21:53); "అయితే మీరు దారితప్పారు; మీ తాతముత్తాతలు అంతకన్నా ఘోరంగా దారితప్పారు' అన్నాడు ఇబ్రాహీం." (ఖుర్ఆన్-21:54)

"నువ్వు మాముందు నీ అసలు భావాలు వ్యక్తపరుస్తున్నావా లేక పరిహాసమాడు తున్నావా?' అడిగారు వారు." (21:55); "కాదు, నిజంగానే (చెబుతున్నాను). భూమ్యా కాశాల ప్రభువే మీప్రభువు. ఆయనే వాటిని సృష్టించాడు. అందుకు నేను మీముందు సాక్ష్యమిస్తున్నాను. దైవసాక్షి! మీరు లేనప్పుడు నేను తప్పక మీవిగ్రహాల సంగతేమిటో తేల్చుకుంటాను' అన్నాడతను." (ఖుర్ఆన్-21:56,57)



"తర్వాత అతను నక్షత్రాల వైపు చూసి 'నాకు వంట్లో బాగాలేదు' అన్నాడు. అందువల్ల వారతడ్ని వదలి (జాతరకు) వెళ్ళిపోయారు. వారలా పోగానే ఇబ్రాహీం వారి దేవతల గుళ్ళోకి జొరబడి 'మీరు (ప్రసాదం) తినరేమిటీ? ఏమైంది మీకు కనీసం మాట్లాడనైనా మాట్లాడరు?' అన్నాడు. తర్వాత అతను ఆ విగ్రహాలపై విరుచుకుపడి కుడిచేత్తో వాటిని గట్టిగా బాది విరగ్గొట్టాడు." (37:88-93); "వాటిలో పెద్దవిగ్రహాన్ని మాత్రం వదలిపెట్టాడు, వారు (విచారించడానికి తనవైపు) మరలుతారన్న ఉద్దేశ్యంతో." (ఖుర్ఆన్-21:58)

"జనం (జాతర నుంచి తిరిగొచ్చి చూసి) 'మన దైవాలకు ఈదుస్థితి కలిగించిం దెవరో, చూస్తే పరమదుర్మార్గుడిలా ఉన్నాడు' అన్నారు. 'మేము ఇబ్రాహీం అనే యువకుడు వాటిని గురించి ప్రస్తావిస్తుంటే విన్నాం' అన్నారు (కొందరు)." (ఖుర్ఆన్-21:59.60)

"అయితే అతడ్ని పట్టి తీసుకురండి జనం ముందుకు, అందరూ (అతని సంగతి) చూస్తారు' అన్నారు వారు. (ఇబ్రాహీం వచ్చిన తరువాత) 'ఇబ్రాహీం! నువ్వేనా మా దేవతల పట్ల ఇలా ప్రవర్తించింది?' అని అడిగారు వారు. 'అసలు ఇదంతా వాటి నాయకుడే చేసి ఉంటాడు, అడిగి చూడండి మాట్లడితే' అన్నాడు ఇబ్రాహీం." (ఖుర్ఆన్-21:61-63)

"ఈమాట వినగానే వారు తమ అంతరాత్మల వైపుకు మరలి "నిజంగా మనం చాలా దుర్మార్గులం' అనుకున్నారు స్వగతంలో. కాని ఆ తరువాత వారి బుద్ధి వక్రీకరించింది. అందువల్ల 'ఇవి మాట్లాడలేవని నీకు తెలుసు కదా?' అన్నారు వారు. 'అలాంటప్పుడు మీరు (నిజ)దేవుడ్ని వదలి మీకెలాంటి లాభంగాని, నష్టంగాని కలిగించలేని ఈ మిథ్యాదైవాలను ఎందుకు పూజిస్తున్నారు? ఛీ! (నిజ)దేవుడ్ని వదలి మీరు పూజిస్తున్న మీ మిథ్యాదైవాలు పాడుగాను!! మీకు కాస్తయినా బుద్ధీ-జ్ఞానం లేదా?' అని అన్నాడు ఇబ్రాహీం." (ఖుర్ఆన్-21:64-68)

"అప్పుడు వారు పరస్పరం సంప్రదించుకొని 'అతని కోసం ఓ అగ్నిగుండం తయారు చేసి మండే ఆ అగ్నిగుండంలో అతడ్ని విసిరిపడేద్దాం' అని నిర్ణయించుకున్నారు." (37:97); "మీరేదైనా చేయాలనుకుంటే ఇతడ్ని కాల్చివేయండి, మీ దేవతల్ని కాపాడు కోండి' అన్నారు వారు. (ఇలా ఇబ్రాహీంని అగ్నిగుండంలోకి విసరివేశారు. అప్పుడు) మేము 'అగ్నీ! ఇబ్రాహీం కోసం శాంతించు, చల్లబడిపో' అని ఆదేశించాం." (ఖుర్ఆన్-21:69,70)

'ఉర్' ఇబ్రాహీం (అలై) పుట్టిపెరిగిన పట్టణం. ఇది ఆనాటి నమ్రూద్ రాజు పాలించిన (ప్రస్తుత ఇరాఖ్) రాజ్యానికి రాజధానిగా ఉండేది. సర్ లియోనార్డ్వూలి రాసిన "అబ్రహాం"(లండన్) అనే గ్రంథం ప్రకారం ఈ పట్టణంలోని ఓ ఎత్తయిన కొండపై నన్నార్ అనే దేవతా విగ్రహం ఉండేది. ఇది మొత్తం దేశంలో కెల్లా పెద్ద దేవాలయం. ఇక్కడ అనేకమంది పూజారులు, దేవదాసీలు ఉండేవారు. కాని ఈ దేవాలయంలో దేవుని పేరుతో, మతం పేరుతో విచ్చలవిడిగా పచ్చి వ్యభిచారం సాగుతుండేది.

"ఇబ్రాహీంతో అతని ప్రభువు విషయంలో వాదనకు దిగిన వ్యక్తి గురించి నీవు ఆలో చించావా? దేవుడు అతనికి రాజ్యాధికారం ప్రసాదించాడు. అంచేత అతను (అధికార గర్వంతో విర్రవీగుతూ దేవుని విషయంలో వాదనకు దిగాడు.)"

"ఎవరి అధీనంలో జీవన్మరణాలున్నాయో ఆయనే నా ప్రభువు' అని ఇబ్రాహీం అన్నప్పుడు, 'చావు బ్రతుకులు నా అధీనంలో కూడా ఉన్నాయ'ని అన్నాడతను. 'అయితే దేవుడు సూర్యుణ్ణి తూర్పునుండి ఉదయింపజేస్తున్నాడు కదా, నీవు అతణ్ణి పడమర నుండి ఉదయింపజెయ్యి చూద్దాం' అనడిగాడు ఇబ్రాహీం. దానికా తిరస్కారి సమాధానం ఇవ్వలేక తెల్లమొహం వేశాడు. దేవుడు దుర్మార్గులకు ఎన్నటికీ సన్మార్గం చూపడు."(ఖుర్ఆన్-2:258)

## (3) విశ్వనాయకత్వం, సంతానం

"ఇబ్రాహీంప్రభువు కొన్ని విషయాల్లో ఇబ్రాహీంని పరీక్షించగా అందులో అతను కృతార్థుడయ్యాడు. అప్పుడు దేవుడు అతనితో 'నేను నిన్ను యావత్తు మానవజాతికి నాయకుడిగా నియమించబోతున్నాను' అన్నాడు. దానికతను 'ప్రభూ! మరి నా సంతానంలో కూడా (ఎవరికైనా ప్రపంచ నాయకత్వం ప్రసాదిస్తావా)?' అని అడిగాడు. దానికి దేవుడు 'మాఈ వాగ్దానం దుర్మార్గులకు వర్తించదు' అన్నాడు." (ఖుర్ఆన్-2:124)

"పోతే ఇబ్రాహీం దగ్గరకు మా దూతలు (సంతాన)శుభవార్త తీసికెళ్ళి 'మీకు శాంతీ శ్రేయాలు కల్గుగాక!' అన్నారు. దానికి ఇబ్రాహీం 'మీక్కూడా శాంతి కల్గుగాక!' అన్నాడు. ఆ తర్వాత కాస్సేపటికి ఇబ్రాహీం ఆవుదూడను కాల్చి తెచ్చాడు. కాని వారి చేతులు భోజనం మీదికి పోవడంలేదు. దాంతో అనుమానం కలిగి అతను లోలోన భయపడసాగాడు. వారు 'భయపడకు...' (11:69,70); 'మేమొక నేరజాతి దగ్గరకు పంపబడ్డాము. ఒక్క లూత్ కుటుంబానికి మాత్రమే మినహాయింపు ఉంది. వారిని మేము కాపాడుతాం. అయితే అతని భార్యను మాత్రం కాపాడము. ఆమె వెనుక ఉండిపోయేవారిలో చేరిపోతుందని మేము ముందుగానే నిర్ణయించాం' (అన్నారు దైవదూతలు)." (ఖుర్ఆన్-15:58-60)

"(ఆతర్వాత) ఇబ్రాహీం (ప్రజలతో) 'నేను నాప్రభువు (ఆదేశం) వైపు వెళ్తున్నాను. ఆయనే నాకు మార్గదర్శనం చేస్తాడు' అన్నాడు. 'ప్రభూ! నాకొక సద్గుణ సంపన్నుడైన కుమారుణ్ణి ప్రసాదించు' అని దేవుణ్ణి వేడుకున్నాడు. మేమతనికి సహనశీలుడైన ఒక పిల్లవాడు (ఇస్మాయీల్) కలుగుతాడని శుభవార్త తెలిపాము." (ఖుర్ఆన్-37:99-101)

"ఇబ్రాహీం ఇలా వేడుకున్నాడు: 'ప్రభూ! ఈ (మక్కా) నగరాన్ని శాంతి నగరంగా చెయ్యి. నన్నూ, నా సంతానాన్ని విగ్రహారాధన నుండి కాపాడు. ప్రభూ! ఈవిగ్రహాలు అనేకమందిని దారి తప్పించాయి. (నా సంతానాన్ని కూడా దారితప్పించే ప్రమాదముంది. కనుక వారిలో) నా విధానాన్ని అనుసరించేవారు నా వారవుతారు. నా విధానానికి వ్యతిరేకంగా నడిచేవారికి (నీవే దిక్కు.) నీవు క్షమించేవాడవు, కరుణించేవాడవు." (ఖుర్ఆన్-14:35,36)

"ప్రభూ! నేను నాసంతానాన్ని ఎలాంటి చెట్టూ-పుట్టా లేని ఎడారిప్రాంతంలో నీ ప్రతిష్ఠాలయం దగ్గరకు తీసుకొచ్చి వశింపజేశాను, (భవిష్యత్తులో) వీరిక్కడ ప్రార్థనావ్యవస్థ నెలకొల్పుతారన్న ఆశతో. కనుక వీరిపట్ల నీవు ప్రజల హృదయాల్లో ఆసక్తి అభిమానాలు కలిగించు. వీరికి తినడానికి పండ్లు ఫలాలు ప్రసాదించు, బహుశా అందుకు కృతజ్ఞులై ఉంటారు. ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదీ అంతా నీకు తెలుసు. దేవునికి భూమ్యాకాశాల్లో ఏదీ కనుమరుగుగా లేదు." (ఖుర్ఆన్-14:37,38)



"ఈ వృద్ధాప్యంలో నాకు ఇస్మాయీల్, ఇస్హాఖ్‌ల వంటి సంతానాన్ని ప్రసాదించిన దేవునికి కృతజ్ఞతలు. నాప్రభువు తప్పక (నా)మొరాలకిస్తాడు. ప్రభూ! నన్ను ప్రార్థనావ్యవస్థ నెలకొల్పేవానిగా చెయ్యి. నాసంతానాన్ని కూడా. ప్రభూ! నావిజ్ఞప్తి స్వీకరించు. నా తల్లి దండ్రుల్ని, యావత్తు విశ్వాసుల్ని కర్మవిచారణరోజు క్షమించు." (ఖుర్ఆన్-14:39-41)

## (4) బలిదానం, కాబానిర్మాణం

"ఇబ్రాహీం దేవుణ్ణి ప్రార్థిస్తూ 'ప్రభూ! ఈ పట్టణాన్ని శాంతినగరంగా చెయ్యి. ఇక్కడ నివసించే ప్రజల్లో దైవాన్ని, పరలోకాన్ని విశ్వసించేవారికి తినేందుకు అన్ని విధాల పండ్లు ఫలాలు ప్రసాదించు' అన్నాడు. దానికి దేవుడు '(ఈ మూన్నాళ్ళ ప్రపంచంలో) నేను విశ్వసించనివారి క్కూడా ఎంతోకొంత ఉపాధినిస్తాను. అయితే ఆతర్వాత వారిని నరకాగ్ని వైపు ఈడుస్తాను. అది అత్యంత ఘోరమైన ప్రదేశం' అని అన్నాడు." (ఖుర్ఆన్-2:126)

"ఆ బాలుడు అతనితో పాటు పరుగెత్తే వయస్సుకు చేరుకున్న తరువాత (ఓరోజు) ఇబ్రాహీం అతనితో 'బాబూ! నేను నిన్ను బలిస్తున్నట్లు కలగన్నాను. దీనిపై నీ అభిప్రాయం ఏమిటో చెప్పు' అన్నాడు. దానికి ఆ బాలుడు (ఏమాత్రం కంగారుపడకుండా) 'నాన్నా! మీకు దేన్ని గురించి ఆజ్ఞ ఇవ్వబడిందో దాన్ని నెరవేర్చండి. దైవచిత్తమయితే మీరు నన్ను సహనశీలిగా చూస్తారు' అని అన్నాడు." (ఖుర్ఆన్-37:102)

"ఇలా వారిద్దరూ (మాఆజ్ఞ) శిరసావహించారు. ఆ తర్వాత ఇబ్రాహీం తన కుమారుణ్ణి బోర్లాపడవేశాడు (బలిచేయడానికి). అప్పుడు మేము 'ఇబ్రాహీం! నీవు కలను నిజంచేసి చూపావు. సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తుంటాము. నిజంగా ఇది నీకొక స్పష్టమైన పరీక్ష. (అందులో నీవు నెగ్గావు)' అని అన్నాము." (ఖుర్ఆన్-37:103-106)

"మేము పరిహారం క్రింద ఒక పెద్ద బలిదానం ఇచ్చి ఆ బాలుణ్ణి కాపాడాము. అతని కీర్తిప్రతిష్ఠల్ని తరువాతి తరాలలో శాశ్వతంగా వదలిపెట్టాము. ఇబ్రాహీంకు శాంతి కలుగు గాక! సజ్జనులకు మేము ఇలాంటి ప్రతిఫలమే ప్రసాదిస్తాం." (ఖుర్ఆన్-37:107-110)

"ఇబ్రాహీం, ఇస్మాయీల్ ఇద్దరూ దైవగృహానికి పునాదులు తీసి గోడలు నిర్మిస్తూ ఇలా వేడుకున్నారు: 'ప్రభూ! మాఈ సేవ స్వీకరించు. నీవే (అందరి మొరలు) ఆలకించేవాడవు, సర్వం తెలిసినవాడవు. ప్రభూ! మాఇద్దర్నీ నీకు విధేయులయిన దాసులుగా చెయ్యి. మా సంతతి నుండి నీకు విధేయులైవుండే ఒక జాతిని ఆవిర్భవింపజేయి. నిన్ను ఆరాధించే పద్ధతేమిటో మాకు తెలియజేయి. మా పొరపాట్లు మన్నించు. నిస్సందేహంగా నీవు మన్నించేవాడవు, కరుణించేవాడవు. ప్రభూ! ఆ జాతిప్రజలకు నీ సూక్తులు విన్పించే, నీ గ్రంథజ్ఞానాన్ని, వివేకాన్ని నేర్పి వారి జీవితాలను సంస్కరించే ఒక ప్రవక్తను ఆ జాతిలో పుట్టించు. నీవు ఎంతో శక్తిమంతుడవు, వివేకవంతుడవు." (ఖుర్ఆన్-2:127-129)

"ఈ గ్రంథంలో ఇస్మాయీల్ గాథ ప్రస్తావించు. అతను మంచి వాగ్దానపాలకుడు, సందేశహరుడైన దైవప్రవక్త. తన కుటుంబ సభ్యులకు నమాజ్, జకాత్ విధుల్ని గురించి ఆజ్ఞాపిస్తుండే వాడు. అతను తనప్రభువు దృష్టిలో ఆమోదయోగ్యుడయిన మనిషి." (ఖుర్ఆన్-19:54,55)

# 6. లూత్ (అలైహి)

"మేము లూత్‌ని ప్రవక్తగా నియమించి (అతని జాతి వద్దకు) పంపాము. అతను తన జాతిప్రజలతో అన్న మాటలు గుర్తుకుతెచ్చుకో, 'మీరెలాంటి అశ్లీలచేష్టలకు పాల్పడు తున్నారు! మీకుపూర్వం ప్రపంచంలో ఎవరూ చేయనటువంటి సిగ్గుమాలిన పని చేస్తు న్నారే!! మీరు కోర్కెల్ని తీర్చుకోవడానికి స్త్రీలనువదలి పురుషుల వెంటపడ్డారా? మీరసలు హద్దుమీరిపోయారు' (7:80,81); దారిదోపిడీలు (కూడా) చేస్తున్నారు. నిండుసభల్లో (సిగ్గువిడిచి ఈ) పాడుపని చేస్తున్నారే!' అని అన్నాడతను." (ఖుర్‌ఆన్-29:29)

"దానికి వారు 'నీవు చెప్పేది నిజమైతే (మాపైకి) దైవశిక్ష తీసుకురా' అన్నారు. అంతకు మించి వారిదగ్గర ఎలాంటి సమాధానంలేదు." (29:29); "లూత్! నీవీ మాటలు మానుకో కపోతే నిన్ను మాపట్నం నుంచి వెళ్ళగొడ్తాం' అంటూ వారు బెదిరించారు. దానికి లూత్ 'మీచేష్టలు నాకు రోత పుట్టిస్తున్నాయి...ప్రభూ! నన్ను, నా కుటుంబసభ్యుల్ని వీరి దుర్నడత, దుర్గుణాల బారినుండి కాపాడు' అన్నాడు." (ఖుర్‌ఆన్-26:167-169)

"అతని జాతిప్రజలు 'గెంటేయండి వీరిని మన ఊళ్ళో నుంచి. పేద్ద పవిత్రులట!' అన్నారు. అంతకుమించి ఎలాంటి జవాబు ఇవ్వలేకపోయారు." (ఖుర్‌ఆన్-7:82)

## (1) దైవదూతలరాక

"మా దూతలు లూత్ దగ్గరికి చేరుకున్నారు. వారిని చూసి అతను చాలా ఆందోళన పడసాగాడు. అతని హృదయం కుంచించుకుపోయింది. 'ఈరోజు పెద్ద ఆపదే వచ్చిపడింది' అన్నాడతను." (ఖుర్‌ఆన్-11:77)

"కాదు, మేము వీరు అనుమానిస్తున్న విషయాన్ని తీసుకొచ్చాము. మేము నీతో నిజమే చెబుతున్నాము. మేము నీ దగ్గరకు సత్యం తీసుకొచ్చాము. కనుక నీవిప్పుడు కొంతరాత్రి గడిచిన తరువాత నీ కుటుంబసభ్యుల్ని తీసుకొని ఇక్కడ్నుంచి బయలుదేరి (వేరేచోటికి) వెళ్ళు. నీవు వారి వెనకాల నడు. (జాగ్రత్త!) మీలో ఏఒక్కరూ వెనక్కి తిరిగి చూడకూడదు. మిమ్మల్ని ఎటు వెళ్ళమని ఆజ్ఞాపిస్తే అటువైపే నేరుగా నడవాలి' అన్నారు దైవదూతలు. (ఇలా) తెల్లవారేటప్పటికి (ఆ పట్టణంలో ఉండే) వారిని సమూలంగా తుడిచిపెడ్తామన్న మా నిర్ణయాన్ని అతనికి ముందే తెలియజేశాము." (ఖుర్‌ఆన్-15:63-66)

"అంతలో పట్టణవాసులు సంతోషంతో గంతులేస్తూ వచ్చారు. లూత్ (కంగారు పడుతూ) 'సోదరులారా! వీరు నా అతిథులు. నన్ను నవ్వులపాలు చేయకండి. దేవునికి భయపడండి. నా పరువు మంటగలపకండి' అని బ్రతిమాలాడు." (15:67-69); "వారు మొదటినుంచీ అశ్లీలచేష్టలకు అలవాటుపడ్డారు. లూత్ (వారికి నచ్చజెప్తూ) 'సోదరులారా! (ఈపని మీకు తగదు.) కావాలంటే నాయీ కుమార్తెలున్నారు చూడండి. వీరు మీకోసం పరిశుద్ధ స్త్రీలు. దేవునికి భయపడండి. నా అతిథుల విషయంలో నన్ను అవమానపర్చకండి. ఏమిటీ! మీలో మంచివాడు ఒక్కడూ లేడా?' అని అన్నాడు." (ఖుర్‌ఆన్-11:78)

"నీకు తెలుసుకదా, నీ కుమార్తెలతో మాకు పనిలేదని. మాకు కావలసిందేమిటో కూడా నీకు తెలుసు' అన్నారు వారు. 'అయ్యయ్యో! నాకు మిమ్మల్ని అదుపులోఉంచే శక్తి ఉంటే



బాగుండు! లేదా ఆశ్రయం పొందడానికి ఏదైనా దృఢమైన కోట దొరికినా బాగుండు' అన్నాడు లూత్." (11:79,80); "లూత్! నువ్వీ మాటలు గనక మానుకోకపోతే మేము నిన్ను మా పట్నం నుంచి వెళ్ళగొడ్తాం"అని వారు బెదిరించారు. 'మీ చేష్టలు నాకు రోత పుట్టిస్తున్నాయి ...ప్రభూ! నన్ను, నా కుటుంబ సభ్యుల్ని వీరి దుర్నడత,దుర్గుణాల బారినుండి కాపాడు' అన్నాడు లూత్." (ఖుర్‌ఆన్-26:167-169)

"అప్పుడు దైవదూతలు ఇలా అన్నారు: 'లూత్! మేము నీ ప్రభువు పంపిన దూతలం. వీరు నిన్నేమీ చేయలేరు. కొంత రాత్రి గడిచిన తరువాత నీ కుటుంబాన్ని తీసుకొని ఇక్కడ్నుంచి బయలుదేరి (వేరే చోటికి) వెళ్ళు. జాగ్రత్త! మీలో ఏఒక్కరూ వెనక్కి తిరిగి చూడకూడదు. అయితే నీభార్య మాత్రం (నీవెంట రాకూడదు). వారి మీద సంభవించేదే నీభార్య మీద కూడా సంభవిస్తుంది. వారి వినాశకాలం నిర్ణయమైపోయింది. (రేపు) ఉదయమే. ఇక ఎంతో సమయం లేదు." (ఖుర్‌ఆన్-11:81)

"లూత్ ముందుగానే తనజాతిని మాపట్టు గురించి హెచ్చరించాడు. కాని వారు మా హెచ్చరికల్ని ఉత్తుత్తి హెచ్చరికలుగా భావించి త్రోసిపుచ్చారు. వారతడ్ని తన అతిథుల్ని కాపాడుకోనివ్వకుండా అడ్డుతగలడానికి ప్రయత్నించారు. చివరికి మేము "ఇక నాశిక్ష, నా హెచ్చరికల పర్యవసానం చవిచూడం"దంటూ వారి కళ్ళు పోగొట్టాము."(ఖు-54:36,37)

(ఆ దుర్మార్గులు అందమైన యువకుల్ని చూస్తే వదలిపెట్టేవారుకాదు. లూత్ (అలై) ఇంటికి యువకుల రూపాల్లో వచ్చిన దైవదూతల్ని చెరచడానికి వచ్చినప్పుడు ఆయన వారికి నచ్చజెప్పడానికి ఎంతగానో ప్రయత్నించారు. కాని ఆ తుచ్ఛులు వినకుండా ఇంట్లోకి జొరబడి ఆ యువకుల్ని తీసికెళ్ళడానికి ప్రయత్నించారు. అప్పుడు వారి కళ్ళు పోయాయి. దాంతో వారు తమ దురుద్దేశ్యం మానుకొని వెళ్ళిపోయారు.)

## (2) దైవశిక్ష, మృతసముద్రం

"చివరికి (మరునాడు) సూర్యుడు ఉదయించీ ఉదయించగానే భయంకరమైన విస్ఫోటం వారిమీద విరుచుకుపడింది. మేమా పట్టణాన్ని అమాంతం ఎత్తి కుదిపేశాము. వారి మీద కాలిన మట్టిరాళ్ళ వర్షం కురిపించాము. ఈ సంఘటనలో యోచించేవారికి గొప్ప సూచనలున్నాయి." (ఖుర్‌ఆన్-15:75)

ఒకప్పుడు ఈ ప్రాంతం పచ్చని పొలాలతో, దట్టమైన తోటలతో కళకళ లాడుతూ గుళ్ళుగోపురాలతో అప్పటి నాగరికతను ప్రతిబింబింపజేస్తుండేది. కాని ఈనాడది భయం కరమైన ఓపెద్ద జలాశయం. అదే ఇస్రాయీల్, జోర్డాన్‌ల మధ్య ఉన్న మృతసముద్రం.

ఐదువేల సంవత్సరాల క్రితం మృతసముద్రం అనేది ప్రపంచంలోనే లేదంటారు శాస్త్రవేత్తలు. వారిమాటల ప్రకారం ఐదువేల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఓ పెద్ద భూకంపం వచ్చింది. తీవ్రమైన దాని ప్రకంపనాలకు భూపొరల్లో ఉన్న పెట్రోలు, అస్ఫాల్ట్, విషవాయువులు, ఇతర ఖనిజాలు ఒక్కసారిగా పైకి వెదజల్లబడ్డాయి. నీళ్ళు కూడా పొంగివచ్చాయి. ఇలా పెట్రోలు, విషవాయువులు, ఇతర ఖనిజాలతో కలసిపోయిన ఈ నీరే మృతసముద్రంగా పేరుపడింది.

ఈ సముద్రంలో చేపలు, మొసళ్ళు లేవు. విషఖనిజాలు పెల్లుబికిరావడం వల్ల దాని చుట్టుప్రక్కల ప్రాంతాలు కూడా నిరుపయోగమయ్యాయి. జోర్డాన్‌కు చెందిన అల్‌కరూక్ పట్నంలోని ఏదైనా ఎత్తు ప్రదేశం ఎక్కిచూస్తే, మృతసముద్రానికి దక్షిణదిక్కు వైపున్న ప్రాంతం అక్కడక్కడ నల్లని పిచ్చిచెట్లతో, బండరాళ్ళతో ఎంతో భయోత్పాతం కలిగిస్తుంది. ఇక్కడ ఒక విధమైన నల్లని ఈగలు కన్పిస్తాయి. ఇవి మనిషికి కుట్టితే కాల్చిన ఇనుపకడ్డీ అంటినట్లు శరీరం మంటెక్కిపోతుంది. ఈ సముద్రంలో నీటి సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల ఇందులో మనిషి మునగడు.

లూత్ ప్రవక్త (అలైహి)ను తిరస్కరించడం వల్ల విశ్వప్రభువు నుండి లూత్‌జాతి ప్రజలపై విరుచుకుపడిన భయంకర శిక్ష ఇది. ఈ శిక్షకు ఇతర కారణాలేమిటో కూడా ఖుర్‌ఆన్ వివరించింది. ఆ ప్రజలు లైంగికతృప్తి కోసం స్త్రీలను వదలి పురుషుల వెంటపడ్డారు. (26:165,166; 7:81). అసహజమైన, పరమ అసహ్యాకరమైన ఈ చేష్టలతో పాటు వారిలో మరో రెండు చెడులు కూడా చోటుచేసుకున్నాయి. వారు దారులుకొడ్తూ బాటసారుల్ని దోచుకునేవారు. తమ సమావేశాల్లో పూర్తిగా సిగ్గువిడిచి తోటి సభికుల ముందే వ్యభిచారం చేసేవారు. (29:29)

హజ్రత్ లూత్ (అలైహి) వారిలో దైవభీతి కలిగించి వారి అవినీతి, అశ్లీల చేష్టలను అరికట్టేందుకు ఎంతో ప్రయత్నించారు. కాని కొందరు తప్ప ఎవరూ దారికి రాలేదు. అప్పుడు దేవుడు హజ్రత్ లూత్‌ని, ఆయన అనుచరుల్ని వేరేచోటికి తరలించి ఆ ప్రదేశంపై శిక్ష దించాడు. బ్రహ్మాండమైన ప్రేలుడుతో భూమి బ్రద్దలైపోయి తీవ్రమైన పెనుగాలులతో కూడిన రాళ్ళవర్షం కురిసింది. అదే సమయంలో భూప్రకంపనాల వల్ల ఎక్కడికక్కడ పగుళ్ళు ఏర్పడి, విషపదార్థాలతో కూడిన వేడినీరు ఒక్కసారిగా పెకి ఎగ జిమ్మడంతో మొత్తం పట్టణం క్షణాల్లో పెద్ద శ్మశానంగా మారిపోయింది. ఈ సముద్రం పరిసరాల్లో ఇప్పటికీ ఆ పట్టణం అవశేషాలుగా గోడ శిథిలాలు, కుండ పెంకులు, ఎముకలు మనకు కన్పిస్తాయి. బుద్ధిమంతులకు ఇందులో గుణపాఠం ఉంది.

# 7. ఇస్‌హాఖ్, యాఖూబ్, యూసుఫ్ (అలైహి)

"యూసుఫ్ (తన స్వప్నం గురించి ప్రస్తావిస్తూ) మాట్లాడిన సందర్భం: అప్పుడతను తన తండ్రితో 'నాన్నా! నేనొక కలగన్నాను. అందులో పదకొండు నక్షత్రాలు, సూర్యుడు, చంద్రుడు నాకు సాష్టాంగప్రణామం చేస్తున్నట్లు కన్పించాయి' అన్నాడు."

"అయితే బాబూ! ఈ కల గురించి నీ అన్నల దగ్గర ప్రస్తావించకు. అలా చేస్తే వారు నీకు వ్యతిరేకంగా ఏదైనా కుట్ర పన్నవచ్చు. షైతాన్ మానవుని బహిరంగ శత్రువు. సరే, (నీవు కలగన్నట్లు) ఆవిధంగానే జరుగుతుంది. నీ ప్రభువు (ఓ మహాకార్యం కోసం) నిన్ను ఎంచుకున్నాడు. అందుకు ఆయన నీకు విషయ లోతుపాతుల్ని తరచిచూడగల విశేషజ్ఞానం ప్రసాదిస్తాడు. గతంలో మన పెద్దలయిన ఇబ్రాహీం, ఇస్‌హాఖ్‌లకు నీ ప్రభువు ఎలా మహాభాగ్యాలు అనుగ్రహించాడో అలాగే ఇప్పుడు నీకూ, యాఖూబ్ సంతానానికి కూడా మహాభాగ్యాలు అనుగ్రహిస్తాడు. నీ ప్రభువు సర్వజ్ఞాని, మహా వివేకవంతుడు' అన్నాడు యాఖూబ్." (ఖుర్‌ఆన్–12:4,5,6)



## (1) సవతి సోదరుల కుట్ర

"అప్పుడతని సోదరులు పరస్పరం ఇలా కూడబలుక్కున్నారు: 'మనమంతా ఒక జట్టుగా ఉన్నా (ఏం లాభం?) మన తండ్రికి మనమీద కంటే యూసుఫ్ మీద, అతని తమ్ముడి మీదనే ఎక్కువ మమకారం ఉంది. అసలు మన నాన్నకు మతి భ్రమించింది. పదండి, యూసుఫ్‌ని చంపివేద్దాం, లేదా ఎక్కడైనా తీసికెళ్ళి పారేద్దాం గుట్టుచప్పుడుకాకుండా. అప్పుడే మీతండ్రి మీవైపు మరలుతాడు. ఈపని కాస్తా ముగిశాక మనం (ఏమీఎరగనట్టు) మంచి వాళ్ళుగా కన్పించాలి.' ఈమాటలు విని వారిలో ఒకడిలా అన్నాడు: 'యూసుఫ్‌ని చంపవద్దు. దానికిబదులు అతడ్ని పిలిచికెళ్ళి ఏదైనా పాడుబడ్డబావిలో పడవేద్దాం. అటుగా బాటసారులు ఎవరైనా వస్తే, వారే అతడ్ని బయటికి లాగి తీసికెళ్తారు." (ఖుర్‌ఆన్–12:8,9,10)

"ఈవిధంగా తీర్మానించుకున్న తర్వాత వారు తమ తండ్రి దగ్గరకెళ్ళి ఇలా అన్నారు: 'నాన్నా! మీరు యూసుఫ్ విషయంలో మమ్మల్ని నమ్మరేమిటీ? నిజంగా మేము అతని శ్రేయోభిలాషులమని చెబుతున్నాంగా! రేపు మావెంట పంపండి అతడ్ని. అవీ ఇవీ బొక్కి కాస్సేపు హాయిగా ఆడుకుంటాడు. అతడ్ని భద్రంగా చూసుకోవడానికి మేము దగ్గరే ఉంటాం కదా!' (అయినా యాఖూబ్‌కు వారి మీద నమ్మకం కుదరలేదు.) 'మీరితడ్ని తీసికెళ్ళడం నాకు చాలా బాధగా ఉంది. మీరు మీపనిలో పడి అజాగ్రత్తగా ఉంటే వీడ్ని ఏ తోడేలో తినేస్తుందేమోనని నాకు భయంగా ఉంది' అన్నాడతను. 'మేమంతా కలసి జట్టుగా దగ్గరున్నప్పటికీ అతడ్ని తోడేలు తినేస్తుందంటే ఇక మేము ఎందుకూ పనికిరాని దద్దమ్మలన్న మాట' అన్నారు వారు." (ఖుర్‌ఆన్–12:11–14)

"ఇలా వారు పట్టుబట్టి అతడ్ని తమవెంట తీసికెళ్ళారు. వారతడ్ని పాడుబడ్డ బావిలో పడవేయాలని ముందే నిర్ణయించుకున్నారు. కనుక మేమతనికి దివ్యావిష్కృతి ద్వారా (ధైర్యం చెబుతూ) 'వీరికి తమ చేష్టల పర్యవసానం ఏమిటో బొత్తిగా తెలియదు. నీవు వారికి వారి నిర్వాకం గురించి ఎత్తిచూపే రోజొకటి తప్పక వస్తుంద'ని తెలియజేశాం."

"ఆరోజు సాయంత్రం వారు లబోదిబోమంటూ తమ తండ్రి దగ్గరికొచ్చి ఇలా అన్నారు: 'నాన్నా! మేము పరుగుపందెంలో ఉండి, యూసుఫ్‌ని మా సామాను దగ్గర (కాపలా కోసం) వదలిపెట్టాం. అంతలో ఎక్కడ్నుంచో ఒక తోడేలు వచ్చి అతడ్ని చీల్చి తినేసింది. ఔను నాన్నా! మేము నిజంచెప్పినా మీరు మామాటలు నమ్మేటట్లు లేరు.' వారు యూసుఫ్ చొక్కా మీద బూటకపు నెత్తుటి మరకలు పూసి తీసుకొచ్చారు. యాఖూబ్ వారి మాటలు విని 'కాదు, మీరేదో కథఅల్లి చెబుతున్నారు. సరే కానివ్వండి. నేను దీన్ని మౌనంగా భరిస్తాను. మీరల్లిన ఈ కట్టుకథ చిక్కుముడి నుంచి బయటపడాలంటే దేవుని సహాయమే అర్థించాలి' అని అన్నాడు." (ఖుర్‌ఆన్–12:15–18)

## (2) ఈజిప్టులో అజీజ్ మంత్రి ఇంట

"అటు కొందరు బాటసారులు వచ్చారు. వారు తమ నీటి నౌకర్‌ని నీళ్ళ కోసం పంపించారు. నీటి నౌకరు బావిలో చేద వదలగానే 'ఎంత అదృష్టం! ఇక్కడ ఒక అబ్బాయి దొరికాడు (మనకు)' అన్నాడు సంతోషంతో బిగ్గరగా. (తరువాత) యూసుఫ్‌ని వారు

వ్యాపారసామగ్రిగా భావించి దాచుకున్నారు. వారు చేస్తున్నదేమిటో దేవునికి తెలుసు. చివరికి వారు కొన్నికాసుల కోసం అతడ్ని అతిస్వల్ప ధరకు అమ్మివేశారు. అతని ధర విషయంలో వారు పెద్దగా ఆశలు పెట్టుకోలేదు." (ఖుర్ఆన్–12:19,20)

"ఈజిప్టులో అతడ్ని కొన్న వ్యక్తి (ఇంటికెళ్ళి) తన భార్యతో 'ఈ అబ్బాయిని మనం బాగా చూసుకోవాలి. ఇతను మనకు (భవిష్యత్తులో) ఉపయోగపడవచ్చు. లేదా మనం ఇతడ్ని కొడుకుగానైనా చేసుకుందాం' అన్నాడు. ఇలా మేము యూసుఫ్‌కు (ఆ) దేశంలో స్థిరపడే పరిస్థితి కల్పించి, అతనికి వ్యవహారదక్షత గురించిన శిక్షణ ఏర్పాటు చేశాం. దేవుడు తాను తలచిన పని చేసితీరుతాడు. కాని చాలామంది ఈవిషయం గ్రహించరు. యూసుఫ్ యుక్త వయస్సుకు చేరుకున్నాక మేమతనికి నిర్ణయశక్తిని, (విశేష) జ్ఞానాన్ని ప్రసాదించాం. ఇలా మేము సహృదయులకు ప్రతిఫలం అనుగ్రహిస్తాం." (ఖుర్ఆన్–12:21,22)

"అతను నివసిస్తున్న ఇంట్లో ఆ ఇంటావిడ అతడ్ని మరులుగొల్పుతూ తనవైపు ఆకట్టుకోవడానికి ప్రయత్నించసాగింది. ఓరోజు ఆమె తలుపులు మూసేసి 'రా, వచ్చేయి' అన్నది. దానికి యూసుఫ్ 'అపచారం! అపచారం!! నేను దేవుని శరణు కోరుతున్నాను. నాప్రభువు నాకు మంచిస్థితి కల్పించాడు. (నేనీ పాపకార్యానికి ఎలా పాల్పడగలను?) అలాంటి దుర్మార్గులు ఎన్నటికీ సఫలం కాలేరు' అన్నాడు." (ఖుర్ఆన్–12:23)

"అయినప్పటికీ ఆమె తీవ్రమైన కోరికతో అతని వైపు రాసాగింది. యూసుఫ్ తన ప్రభువు చూపిన హేతువు చూడకపోతే అతను కూడా తీవ్రమైన కోరికతో ఆమె వైపు కదిలేవాడు. మేమతడ్ని చెడుకు, అశ్లీలానికి దూరంగా ఉంచదలిచాం. అందువల్ల అతనా చేష్టకు వడిగట్టలేదు. అతను మేము ప్రత్యేకంగా ఎంచుకున్న దాసుడు." (ఖుర్ఆన్–12:24)

"చివరికి యూసుఫ్, అతని వెనుక ఆ స్త్రీ ఇద్దరూ పరుగిడుతూ తలుపు దగ్గరకు చేరుకున్నారు. ఆమె యూసుఫ్ వెనకాల పడి అతని చొక్కా (లాగి)చింపేసింది. అంతలో తలుపు దగ్గర వారిద్దరూ (హఠాత్తుగా) ఆమె భర్త కంటపడ్డారు. ఆమె తన భర్తను చూడగానే 'దుష్టసంకల్పంతో నీఇల్లాలి వెంటపడే వాడికి శిక్ష ఏమిటీ? అలాంటివాడ్ని జైల్లో పడవేయడమో లేక కఠిన యాతనలకు గురిచేయడమో తప్ప మరే శిక్ష కాగల్గుతుంది?' అని అన్నది (తానేపాపం ఎరగనట్టు నటిస్తూ)." (ఖుర్ఆన్–12:25)

"దానికి యూసుఫ్ 'అసలు ఈమే నన్ను వలలో వేసుకోవడానికి ప్రయత్నించింది' అన్నాడు. అప్పుడు ఆ స్త్రీకుటుంబ సభ్యులలో ఒకతను (మధ్యవర్తిగా) ముందుకు వచ్చి– 'యూసుఫ్ చొక్కా గనక ముందు భాగం చినిగివుంటే ఈమె చెప్పేది నిజం, అతను చెప్పేది అబద్ధం. ఒకవేళ అతని చొక్కా వెనుకభాగం చినిగివుంటే మాత్రం ఈమె చెప్పేది అబద్ధం. అతను చెప్పేది నిజం అవుతుంది' అని తీర్పిచ్చాడు." (ఖుర్ఆన్–12:26)

"ఆమె భర్త చూస్తే యూసుఫ్ చొక్కా వెనుక భాగమే చినిగి ఉంది. దాంతో అతను (మండిపడుతూ) 'ఇవన్నీ మీ ఆడవాళ్ళ పన్నాగాలు. నిజంగా మీ పన్నాగాలు చాలా భయం కరంగా ఉంటాయి. యూసుఫ్! ఈ విషయాన్ని నీవింతటితో మరచిపో. ఇక నీసంగతి– నువ్వే అసలు దోషివి. సరే చేసిన తప్పుకు క్షమాపణ(యినా) చెప్పుకో' అన్నాడు."



"(ఈవార్త స్త్రీలలో కార్చిచ్చులా వ్యాపించిపోయింది.) నగరంలోని (గొప్పింటి) స్త్రీలు ఈ విషయమై పరస్పరం చర్చించుకుంటూ '(మన) మంత్రిగారి భార్య తన బానిస కుర్రోడి వెంట పడిందట! (పాపం) మోహావేశం ఆమెను అదుపుతప్పేలా చేసింది. కాని మన దృష్టిలో మటుకు ఆవిడ పెద్ద తప్పే చేస్తోంది' అని చెప్పుకోసాగారు. (ఖుర్ఆన్–12:27–30)

"ఈ టక్కరిమాటలు (ఆనోటా ఈనోటా ప్రాకి) చివరికి ఆ స్త్రీ చెవిలో కూడా పడ్డాయి. ఆమె వారిని పిలిపించి ఆనుడుదిండ్లతో ఒక సమావేశం ఏర్పాటు చేసింది. విందులో (పండ్లు పలహారాలతో పాటు) ప్రతిఒక్కరి ముందు ఓ కత్తి కూడా ఉంచింది. (వారు తిందామని సరిగ్గా పండ్లు కోస్తున్న సమయంలో) ఆమె యూసుఫ్‌ని వారి ముందుకు రమ్మని సైగ చేసింది. (యూసుఫ్ పక్క గదినుంచి హఠాత్తుగా వారి ముందుకు వచ్చి నిలబడ్డాడు.) అతనిపై దృష్టి పడగానే ఆస్త్రీలు (అతని అసాధారణ సౌందర్యానికి) మంత్రముగ్ధులైపోయారు. ఆస్థితిలో వారు (ఆశ్చర్యపోతూ) తమనుతాము మరచిపోయి చేతులు కోసుకున్నారు. 'దేవ దేవ! (ఏమి సౌందర్యం!) ఇతను మానవుడు కాదు, మహోత్కృష్టుడైన ఏ దైవదూతో అయి వుంటాడు' అన్నారు అప్రయత్నంగా." (ఖుర్ఆన్–12:31)

"వెంటనే మంత్రిభార్య ఇలా అన్నది: 'చూశారుగా! నా గురించి మీరు ఏవేవో చెప్పు కున్నారు. ఆవ్యక్తి ఇతనే. నేను నిజంగానే ఇతడ్ని నావైపు తిప్పుకోవడానికి ప్రయత్నించాను. కాని తప్పించుకొని బయటపడ్డాడు. (ఏమైనా సరే) ఇతను నామాట వినకపోతే మాత్రం జైలు పాలయి ఘోర అవమానం చవిచూడవలసి వస్తుంది." (ఖుర్ఆన్–12:32)

"అప్పుడు యూసుఫ్ (దైవాన్ని తలచుకుంటూ) "ప్రభూ! వీరు నానుండి కోరుతున్న దానికంటే నాకు జైలుశిక్షే ఇష్టం. నీవు నన్ను వీరి పన్నాగాల నుండి తప్పించకపోతే నేను వీరి వలలో చిక్కుకొని మూఢుల్లో చేరిపోయే ప్రమాదముంది' అని వేడుకున్నాడు. అప్పుడతని ప్రభువు అతని మొరాలకించి అతడ్ని ఆ స్త్రీల కుట్రల నుండి కాపాడాడు. ఆయనే మొరలను ఆలకించేవాడు, సమస్తం ఎరిగినవాడు. (ఖుర్ఆన్–12:33,34)

## (3) కారాగారంలో ధర్మప్రచారం

"వారు (యూసుఫ్ ఎలాంటి సచ్ఛీలుడో, తమస్త్రీలు ఎలాంటి దుర్నడత కలవారో వాటికి సంబంధించిన) స్పష్టమైన నిదర్శనాలు చూశారు. అయినా వారతడ్ని కొంతకాలం జైల్లో ఉంచాలన్న నిర్ణయానికే వచ్చారు. (అలా యూసుఫ్ జైలు పాలయ్యాడు.) జైల్లో అతనితో పాటు మరో ఇద్దరు బానిసలు కూడా చేరారు. ఓరోజు వారిద్దరిలో ఒకడు 'నేను రాత్రి సారాయి పిండుతున్నట్లు కలగన్నాను' అన్నాడు. రెండోవాడు 'నేనూ కలగన్నాను. ఆ కలలో నా తలమీద కొన్ని రొట్టెలున్నాయి. వాటిని పక్షులు తినసాగాయి' అన్నాడు. ఆ తరువాత వారిద్దరు (యూసుఫ్‌ని ఉద్దేశించి) 'చూస్తే మీరు ధర్మాత్ములుగా కన్పిస్తున్నారు. కాస్త మా కలల గూఢార్థం ఏమిటో చెప్పండి' అని అడిగారు." (ఖుర్ఆన్–12:35,36)

"మీకిక్కడ లభించే భోజనం రాకముందే నేను మీ కలలగూఢార్థం చెబుతాను. ఇది నాకు నాప్రభువు నేర్పినవిద్య. నేను దేవుడ్ని, పరలోకాన్ని నమ్మనివారి పద్ధతులు వదలి మన పెద్దలైన ఇబ్రాహీం, ఇస్‌హాఖ్, యాఖూబ్‌ల మార్గం అనుసరిస్తున్నాను. దేవునికి ఇతరుల్ని

సాటి కల్పించడం నావిధానం కాదు. (మనల్ని ఇతరులకు దాసులుగా చేయలేదంటే) ఇది నిజంగా మనపై, యావత్తు మానవాళిపై దేవుని అనుగ్రహమే. కాని చాలామంది (దేవునికి) కృతజ్ఞత చూపడం లేదు' అన్నాడు యూసుఫ్." (ఖుర్ఆన్-12:37,38)

"నా సహఖైదీలారా! కాస్త ఆలోచించండి. మనకు చాలామంది (చిల్లర)దేవుళ్ళు ఉండటం మంచిదా లేక అందరిపై అధికృత కలిగివున్న ఒక్క అల్లాహ్ ఉండటం మంచిదా? ఆయన్ని వదలి మీరు ఏఏ దైవాలను ఆరాధిస్తున్నారో అవన్నీ మీరు, మీ తాతముత్తాతలు పెట్టుకున్న కొన్ని పేర్లు (అభూతకల్పనలు) మాత్రమే. వాటికోసం దేవుడు ఎలాంటి ప్రమాణం పంపలేదు. పాలానాధికారం దేవునికి తప్ప మరెవ్వరికీ లేదు. ఆయన తనను తప్ప మరెవరినీ ఆరాధించకూడదని శాసించాడు. ఇదే సరైన జీవనమార్గం. కాని చాలా మంది (ఈ యదార్థం) గ్రహించడం లేదు. (ఖుర్ఆన్-12:39.40)

"నా సోదర ఖైదీలారా! ఇప్పుడు మీకలల గూఢార్థం చెబుతా వినండి. మీలో ఒకడు తన ప్రభువుకు (అంటే ఈజిప్టు చక్రవర్తికి) సారాయి తాగిస్తాడు. రెండోవాడ్ని ఉరికంబం ఎక్కిస్తారు. పక్షులు అతని తలను పొడిచిపొడిచి తింటాయి. (అంతే) మీరడిగిన ప్రశ్నలకు సమాధానాలు లభించాయి.' ఆ తరువాత యూసుఫ్ వారిద్దరిలో జైలు నుంచి విడుదల కాబోతున్నాడని తెలిసిన వ్యక్తితో 'నీ ప్రభువు (ఈజిప్టు చక్రవర్తి) దగ్గర నా గురించి కాస్త ప్రస్తావించు' అన్నాడు. కాని షైతాన్ అతడ్ని మరపింపజేశాడు. అతనా విషయం తన ప్రభువు దగ్గర ప్రస్తావించడం మరచిపోయాడు. దాంతో యూసుఫ్ అనేక సంవత్సరాలు జైల్లోనే ఉండిపోవలసి వచ్చింది." (ఖుర్ఆన్-12:41,42)

"ఒకరోజు చక్రవర్తి (తన సభాసదులతో) ఇలా అన్నాడు: "రాత్రి నేనొక కలగన్నాను. అందులో ఏడు బలిసిన ఆవులను ఏడు బక్కచిక్కిన ఆవులు తినేస్తున్నాయి. అలాగే ధాన్యసంబంధమైన ఏడు పచ్చటి వెన్నులు, ఏడు ఎండిన వెన్నులున్నాయి. కనుక సభా సదులారా! మీకు స్వప్నభావం తెలిస్తే నా స్వప్నంలోని గూఢార్థం ఏమిటో చెప్పండి." దానికి సభాసదులు "ఇవి పీడకలలకు సంబంధించిన విషయాలు. ఇలాంటి కలల గూఢార్థం మాకు తెలియదు" అని సమాధానమిచ్చారు." (ఖుర్ఆన్-12:43,44)

"అప్పుడా ఇద్దరు ఖైదీలలో విడుదలయిన వ్యక్తికి చాలా కాలం తర్వాత (యూసుఫ్) సంగతి గుర్తుకొచ్చింది. అతను సభను ఉద్దేశించి 'నేను మీకు దాని గూఢార్థం చెబుతా. నన్ను కాస్త జైలు దగ్గరకు వెళ్ళడానికి అనుమతించండి' అన్నాడు. (రాజు అనుమతి లభించిన తరువాత) అతను వెళ్ళి 'యూసుఫ్! సత్యం మూర్తీభవించిన మహానుభావా!! నాకీ కల గురించిన గూఢార్థం ఏమిటో చెప్పు. ఏడు బలిసిన ఆవులను ఏడు బక్కచిక్కిన ఆవులు తినేస్తున్నాయి. ఏడు పచ్చటి వెన్నులు, ఏడు ఎండిన వెన్నులు ఉన్నాయి. దీనర్థం ఏమిటో చెబితే నేను వెళ్ళి వారికి తెలియజేస్తాను. దానివల్ల వారు నిన్ను (నీ విలువను) గుర్తించ వచ్చు' అని అన్నాడు." (ఖుర్ఆన్-12:45,46)

"అప్పుడు యూసుఫ్ (ఇలా అన్నాడు: 'మీరు ఏడేండ్లపాటు నిరంతరాయంగా వ్యవసాయం చేస్తారు. ఆ కాలంలో పండే పంటలో కొంత పంటను మీరు తిండికోసం



వాడుకొని మిగతా పంటను వాటి వెన్నులలోనే ఉంచండి. ఆతర్వాత మరో ఏడేండ్లపాటు (కరువుకాటకాలతో) పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది. ఆ స్థితిలో మీరు కూడబెట్టు కున్న ధాన్యం (హాయిగా) తినవచ్చు. ఒకవేళ ఏదైనా మిగిలితే మీరు భద్రపరుచుకున్నదే మిగులుతుంది. ఆతర్వాత పుష్కలంగా వర్షాలు కురిసే సంవత్సరం వస్తుంది. ఆ ఏడు ప్రజలు (పాలు, పండ్లరసం) బాగా పిండుతారు." (ఖుర్ఆన్-12:47,48,49)

"చక్రవర్తి ఈ కల గూఢార్థం విన్న తరువాత అతడ్ని తన దగ్గరకు తీసుకురమ్మని ఆదేశించాడు. కాని రాజదూత యూసుఫ్ దగ్గరకు వెళ్తే అతనిలా అన్నాడు: 'ముందు నీవు నీ ప్రభువు దగ్గరికెళ్ళి చేతులు కోసుకున్న స్త్రీల సంగతేమిటో కాస్త అడిగిరా. నా ప్రభువుకు మాత్రం ఆ జిత్తులమారి స్త్రీల సంగతి బాగా తెలుసు.' (ఖుర్ఆన్-12:50)

"చక్రవర్తి ఈ మాటలు విని (ఆ స్త్రీలను పిలిపించాడు.) వారితో 'మీరు యూసుఫ్ని మరులు గొల్పడానికి ప్రయత్నించినప్పుడు మీ అనుభవం ఏమిటి?' అనడిగాడు. దానికి ఆ స్త్రీలంతా 'దేవ దేవ! అతనిలో మేము చెడుకు సంబంధించిన ఛాయ కూడా చూడలేదు' అని ముక్తకంఠంతో పలికారు. అప్పుడు మంత్రిభార్య (ముందుకొచ్చి) 'ఇప్పుడు నిజం బయటపడింది. అతడ్ని వలలో వేసుకోవడానికి ప్రయత్నించినదాన్ని నేనే. అతను మాత్రం సచ్ఛీలుడే. అందులో ఎలాంటి సందేహం లేదు' అని చెప్పింది." (ఖుర్ఆన్-12:51)

"యూసుఫ్ (రాజదూత ద్వారా ఈ వృత్తాంతం విని) ఇలా అన్నాడు: 'ఈ ప్రశ్న అడగ డంలో నా ఉద్దేశ్యం ఒక్కటే. మంత్రిగారు ఇంట్లో లేనప్పుడు నేనాయనకు నమ్మకద్రోహం తలపెట్టలేదని ఆయనకు తెలియాలి. అసలా స్త్రీలే నమ్మకద్రోహానికి పాల్పడ్డారు. వారి కుట్రలను దేవుడు ఏమాత్రం సాగనివ్వడని వారూ తెలుసుకోవాలి. నేను నా ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోవడం లేదు. నా ప్రభువు కారుణ్యభాగ్యం లభిస్తే తప్ప మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపుకే పురిగొల్పుతుంది." (ఖుర్ఆన్-12:52,53)

## (4) ఈజిప్టు రాజ్యాధినేతగా

"చక్రవర్తి (రాజదూతను ఆదేశిస్తూ) 'అతడ్ని నా దగ్గరకు పిలుచుకు రా. నేనతడ్ని (ఆంతరంగికకార్యదర్శిగా) నాకోసం ప్రత్యేకించుకుంటాను' అన్నాడు. (రాజదూత వెళ్ళి యూసుఫ్ని పిలుచుకొచ్చాడు.) అతనితో చక్రవర్తి మాట్లాడిన తర్వాత 'ఇప్పుడు మీకు మాదగ్గర హోదా, గౌరవప్రతిష్ఠలున్నాయి. మీ నిజాయితీపై మాకు నమ్మకముంది' అన్నాడు. 'అయితే దేశ ఒనరులన్నీ నాకప్పగించండి. నేను వాటిని కాపాడుతాను. నాదగ్గర తగిన జ్ఞానసంపత్తి కూడా ఉంది' అన్నాడు యూసుఫ్. ఇలా మేమా దేశంలో యూసుఫ్ పాలన కోసం దారి సుగమం చేశాం. అతనిప్పుడు సర్వాధికారి. ఆ దేశంలో అతను తాను కోరుకున్న చోటల్లా స్థావరం ఏర్పరుచుకోగలడు. మేము తలచుకున్నవారికి మా కారుణ్యభాగ్యం ప్రసాదిస్తాం." (ఖుర్ఆన్-12:54-56)

"(ఆ తరువాత కొన్నాళ్ళకు) యూసుఫ్ సోదరులు ఈజిప్టు దేశానికి వచ్చారు. వారు (తమ కార్యసిద్ధి కోసం) అతని దగ్గరకు వెళ్ళారు. అతను వారిని వెంటనే గుర్తుపట్టాడు. వారు మాత్రం అతడ్ని గుర్తుపట్టలేక పోయారు." (ఖుర్ఆన్-12:58)

"వారికోసం యూసుఫ్ వారిసామగ్రి ఏర్పాటుచేయించిన తర్వాత, వారిని సాగ నంపుతూ '(మరోసారి వస్తే) మీ మారుసోదరుడ్ని నా దగ్గరకు తీసుకురండి. చూశారు కదా, నేనెంత న్యాయంగా (ధాన్యం) కొలిచి ఇచ్చానో, ఎంత మంచి ఆతిథ్యం ఇచ్చానో? మీరు గనక అతడ్ని తీసుకురాకపోతే మాత్రం మీకు నాదగ్గర ఎలాంటి ధాన్యం లభించదు. అదీగాక మీరు నా దరిదాపులక్కూడా రాలేరు' అని అన్నాడు. 'సరే, మా ప్రయత్నం మేము చేస్తాము. మా నాన్నగారు అతడ్ని పంపడానికి ఒప్పుకుంటే మేము తప్పకుండా తీసు కొస్తాము' అన్నారు వారు." (ఖుర్ఆన్-12:59,60,61)

"యూసుఫ్ తన సేవకుల్ని పిలిచి 'వారు ధాన్యం తీసుకొని మనకిచ్చిన ధనాన్ని రహస్యంగా వారిసామగ్రి ఉన్న గోతంలో పెట్టేయండి' అని సూచించాడు. ఇలా చేయడానికి కారణం వారు ఇంటికి వెళ్ళి, ధాన్యం తీసుకొని తమకిచ్చిన ధనాన్ని గుర్తుపడ్తారని, దాంతో వారు మళ్ళీ (ఈజిప్టుకు) రావచ్చని యూసుఫ్ ఆశించాడు." (ఖుర్ఆన్-12:62)

"యూసుఫ్ సోదరులు (స్వదేశంలో)తమతండ్రి దగ్గరికెళ్ళి 'నాన్నా! ఇకముందు వారు మనకు ధాన్యం ఇవ్వమని చెప్పేశారు. అంచేత మీరు మా తమ్ముడ్ని మావెంట పంపితే మేము ధాన్యం తీసుకొస్తాం. అతడ్ని మేము భద్రంగా చూసుకుంటాం' అని అన్నారు. 'ఇతని విషయంలో నేను మిమ్మల్ని ఎలా నమ్మాలి? ఇంతకు ముందు ఇతని అన్న విషయంలో నమ్మినట్లు నమ్మాల్నా? దేవుడు మాత్రమే మంచి రక్షకుడు. ఆయన అందరికన్నా ఎంతో కరుణామయుడు కూడా' అన్నాడు వారి తండ్రి." (ఖుర్ఆన్-12:63,64)

"ఆ తరువాత వారు తమ సామగ్రి గోతాలు విప్పిచూశారు. అందులో ఉన్న ధనం చూసి, తమ ధనాన్ని తిరిగి ఇచ్చివేసినట్లు కనుగొన్నారు. దాన్ని చూడగానే వారు (ఎంతో సంబరపడిపోతూ) 'నాన్నా! ఇదిగో చూడండి! మా (మూల)ధనం కూడా మాకు తిరిగి చ్చారు. ఇంతకంటే మనకేం కావాలి!! ఈసారి మేము మళ్ళీపోయి మన కుటుంబానికి (సరిపడ్డ) ధాన్యం తెస్తాం. మా తమ్ముడ్ని కూడా జాగ్రత్తగా చూసుకుంటాం. అదనంగా మేము మరొక ఒంటె (మోసే) ధాన్యాన్ని కూడా తెచ్చుకోగలం. అదనంగా అంత ధాన్యం మనకు సులభంగా లభిస్తుంది' అని అన్నారు." (ఖుర్ఆన్-12:65)

"మీరు తప్పకుండా (సురక్షితంగా) నా దగ్గరకు తిరిగి తీసుకొస్తామని దేవుని మీద ప్రమాణం చేయనంతవరకు నేను ఇతడ్ని మీవెంట పంపను. దురదృష్టవశాత్తు మీరెక్కడైనా చిక్కుకుంటే, అది వేరే విషయం' అన్నాడు వారి తండ్రి. దాంతో వారంతా దేవుని మీద ప్రమాణంచేసి వాగ్దానం చేశారు. అప్పుడతను "(గుర్తుంచుకోండి) మనం చెప్పుకున్న ఈ విషయానికి దేవుడే సాక్షి' అన్నాడు." (ఖుర్ఆన్-12:66)

"ఆ తర్వాత అతనిలా ఉపదేశించాడు: 'బిడ్డలారా! ఈజిప్టు రాజధానిలో ఒకద్వారం గుండా కాకుండా విభిన్నద్వారాల గుండా ప్రవేశించండి. అయితే విధినిర్ణయం (ఎలా ఉందోగాని దాని) నుంచి నేను మిమ్మల్ని కాపాడలేను. (యావత్ విశ్వంలో) దేవుని ఆజ్ఞ తప్ప మరెవరి ఆజ్ఞా పనిచేయదు. ఆయన్నే నేను నమ్ముకున్నాను. నమ్ముకోవలసిన వారు ఆయన్నే నమ్ముకోవాలి." (ఖుర్ఆన్-12:67)



"తండ్రి ఉపదేశం ప్రకారమే వారు (ఈజిప్టు వెళ్ళి) విభిన్నద్వారాల గుండా నగరంలో ప్రవేశించారు. అయితే (ముందుజాగ్రత్త కోసం) అతను సూచించిన యుక్తి విధినిర్ణయం ముందు ఎందుకూ పనికిరాకుండా పోయింది. కాకపోతే యాఖూబ్ తన హృదయంలో మెదలుతున్న సంకోభం దూరం చేసుకోవడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఏమైనా అతను గొప్ప జ్ఞానసంపన్నుడు. మేమతనికి విశేషజ్ఞానం ప్రసాదించాం. కాని చాలామంది (ఈ యదార్థం) గ్రహించరు." (ఖుర్ఆన్-12:68)

"వారు యూసుఫ్ దగ్గరికి చేరుకున్నారు. యూసుఫ్ వారిలో తన (సొంత)తమ్ముడ్ని చాటుగా తన దగ్గరకు పిలిపించుకొని 'నేను నీ(తప్పిపోయిన) అన్నయ్యను. ఇప్పుడు నీవు వారి చేష్టలను గురించి బాధపడనవసరం లేదు' అని ధైర్యం చెప్పాడు." (ఖుర్ఆన్-12:69)

"ఆ తర్వాత యూసుఫ్ వారికోసం (ధాన్యం, తదితర) సామగ్రి ఏర్పాట్లు చేయించాడు. ఆ సమయంలో అతను తన గిన్నె నొకదాన్ని తన తమ్ముడి సామాను ఉన్న గోతంలో పెట్టిం చాడు రహస్యంగా. కాస్సేపటికి అరిచేవాడొకడు (రాజభటుడు) హఠాత్తుగా 'బాటసారులారా! (ఆగండి) మీరు దొంగలు' అని అరిచాడు. వారు వెనక్కి తిరిగి 'మీ వస్తువు ఏదైనా పోయిందా?' అని అడిగారు. 'రాజుగారి గిన్నె ఒకటి మాకు కన్పించడం లేదు' అన్నారు రాజోద్యోగులు. 'దాన్ని తెచ్చిచ్చేవానికి ఒక ఒంటె (మోసే) బహుమానం ఇస్తాం. అలా ఇప్పించే బాధ్యత నాది' (అన్నాడు ప్రధాన రాజోద్యోగి)." (ఖుర్ఆన్-12:70,71,72)

"దైవసాక్షి! మేమీ దేశంలో అలజడి సృష్టించడానికి రాలేదు. మేము దొంగతనాలు చేసేవాళ్ళం కాము. ఈసంగతి మీక్కూడా బాగాతెలుసు' అన్నారు వారన్నదమ్ములు. 'సరే, మీమాట అబద్ధమని తేలితే దొంగకు శిక్షేమిటి?' రాజోద్యోగులు అడిగారు. '(పోయిన) వస్తువు ఎవరి సామగ్రిలో దొరుకుతుందో అతడ్ని శిక్షగా మీదగ్గర (బానిసగా) పెట్టుకోండి. అలాంటి దుర్మార్గులకు మారాజ్యంలో విధించే శిక్ష ఇదే' అన్నారు వారు." (ఖు:12:73-75)

"అప్పుడు యూసుఫ్ తన తమ్ముడి సామగ్రి సంచి వెతకడానికి ముందుగా వారి సామగ్రిసంచులు వెతికాడు. తరువాత తమ్ముడి సంచి వెతికి అందులో నుంచి పోయిన వస్తువుని బయటికి తీశాడు. ఈ విధంగా మేము మా యుక్తితో యూసుఫ్‌కు సహాయం చేశాము. రాజధర్మం ప్రకారం తన తమ్ముడ్ని పట్టుకోవడం యూసుఫ్ (వంటి దైవభక్తుని)కి శోభించదు. ఒకవేళ ఆ విధంగా జరగాలని దేవుడు నిర్ణయిస్తే అది వేరే విషయం. మేము తలచుకున్న వారికి వారిస్థాయి, అంతస్తులను ఉన్నతం చేస్తాం. జ్ఞానసంపత్తిలో అందరినీ మించిన ఒక (అద్భుత) జ్ఞానసంపన్నుడు ఉన్నాడు." (ఖుర్ఆన్-12:76)

"అప్పుడు యూసుఫ్ సవతిసోదరులు (ఆ వస్తువు తమ మారుతమ్ముడి సంచి నుండి బయల్పడటం చూసి) 'ఇతను దొంగతనానికి పాల్పడ్డాడంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ఇంతకుముందు ఇతని అన్న కూడా ఇలాగే దొంగతనానికి ఒడిగట్టాడు' అని అన్నారు. ఈ మాట విని యూసుఫ్ వస్తున్న కోపాన్ని లోలోనే దిగమింగాడు. వాస్తవం బయటపెట్టకుండా 'మీరెంత చెడ్డవాళ్ళు! (నాముందే) నాపై ఈ అపనింద మోపుతున్నారా? దాని నిజానిజాలేమిటో దేవునికి బాగా తెలుసు' అని (మెల్లగా) అన్నాడు." (ఖుర్ఆన్-12:77)

"రాజ్యాధిపతీ! అతని తండ్రి చాలా వృద్ధుడైపోయాడు. అంచేత మీరు అతనికి బదులు మాలో ఒకడ్ని ఉంచుకోండి. చూస్తే మీరు చాలా పరోపకారిలా, దయామయుడిలా కన్పిస్తు న్నారు' అన్నారు వారు. '(అలాంటి అక్రమపద్ధతి నుండి) మేము దేవుని శరణుకోరుతున్నాం. ఎవరి దగ్గర మావస్తువు దొరికిందో అతడ్ని వదలి మరొకడ్ని ఎలా ఉంచుకుంటాం? అలా చేస్తే మేము దుర్మార్గుల్లో చేరినట్లవుతుంది' అన్నాడు యూసుఫ్." (ఖుర్ఆన్–12:78,79)

"దాంతో వారు నిరాశచెంది ఒక మూలకు వెళ్ళి పరస్పరం సంప్రదించుకోసాగారు. అప్పుడు వారిలో అందరికంటే పెద్దవాడు తన అభిప్రాయం ఇలా వెలిబుచ్చాడు: 'మీ తండ్రి మీచేత దేవునిపేరుతో ప్రమాణం చేయించిన సంగతి మీకు తెలిసిందే. ఇంతకుపూర్వం యూసుఫ్ విషయంలో మీరు చేసిన దౌర్జన్యాలు కూడా గుర్తుండే ఉంటాయి. నేను మాత్రం నాతండ్రి అనుమతి ఇవ్వనంతవరకు ఇక్కడ్నుంచి రానేరాను. లేదా నా విషయంలో దేవుడే ఏదైనా పరిష్కారం చేయాలి. ఆయన అందరికంటే మిన్నగా పరిష్కారం చేసేవాడు. కాబట్టి మీరు వెళ్ళిపోయి మీ నాన్నగారికి ఇలా చెప్పండి: 'నాన్నగారూ! మీ (ముద్దుల)కొడుకు దొంగ తనం చేశాడు. మేము మాత్రం అతను దొంగతనం చేస్తుండగా చూడలేదు. మేము చెబుతున్నదే మాకు తెలిసిన సంగతి. అగోచర విషయాల్ని మేము గమనించలేము కదా! కావాలంటే మేము వెళ్ళొచ్చిన నగరంలోని ప్రజల్ని, మాతోపాటు వచ్చిన బాటసారుల్ని అడిగి చూడండి. మేము చెబుతున్నది ముమ్మాటికీ నిజం." (ఖుర్ఆన్–12:80,81,82)

"(ఆతర్వాత వారు స్వదేశానికి తిరిగెళ్ళి తమ తండ్రికి జరిగిన వృత్తాంతం వివరిం చారు.) అది విని యాఖూబ్ (తీవ్ర మనస్తాపానికి గురై) ఇలా అన్నాడు: 'కాదు, (అసలు సంగతి అదికాదు.) మళ్ళీ మీరేదో కథ అల్లి చెబుతున్నారు. సరే కానివ్వండి. దీన్ని కూడా నేను మౌనంగా భరిస్తాను. దేవుడు వారందర్నీ నా దగ్గరకు తీసుకురావచ్చు. అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఆయన సర్వం ఎరిగినవాడు, మహాయుక్తిపరుడు.' ఇలా చెప్పి అతను వారి వైపు నుండి ముఖం తిప్పుకొని 'అయ్యో యూసుఫ్!' అంటూ బాధపడసాగాడు. (పాపం!) అతను లోలోనే కుమిలిపోతూ క్రుంగిపోసాగాడు. దానివల్ల అతని కళ్ళు జీవకళ కోల్పోయి పాలిపోయాయి." (ఖుర్ఆన్–12:83,84)

"కొడుకులు (అతని పరిస్థితి చూసి) 'అయ్యో దేవా! మీరు ఇలాగే ఎప్పుడూ యూసుఫ్‌నే తలచుకుంటూ బాధపడుతుంటే జబ్బుపడతారు. లేదా (ఆ జబ్బుతో చివరికి) ప్రాణాలు కూడా కోల్పోవచ్చు' అన్నారు. 'నేను నాబాధ గురించి దేవునితో తప్ప ఎవరితోనూ చెప్పు కోవడం లేదు. దేవుడ్ని గురించి నాకు తెలిసినంత మీకు తెలియదు. నాయనలారా! వెళ్ళి యూసుఫ్ గురించి, అతని తమ్ముడ్ని గురించి ఆరాతీయండి. దేవుని కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. దేవుని కారుణ్యంపట్ల అవిశ్వాసులు మాత్రమే నిరాశచెందుతారు' అన్నాడు యాఖూబ్. (ఖుర్ఆన్–12:85,86,87)

"వారు మళ్ళీ (ఈజిప్టులో ఉన్న) యూసుఫ్ దగ్గరకు వెళ్ళి 'రాజ్యాధిపతీ! మేమూ, మా భార్యాపిల్లలు పెద్ద ఆపదలో చిక్కుకున్నాం. మా దగ్గర పెట్టుబడి తక్కువగా ఉంది. (ఈసారి కూడా) మాకు ధాన్యం పూర్తిగా ఇప్పించండి. (దయచేసి) దానం చేయండి. దానం చేసేవారికి దేవుడు మంచిప్రతిఫలం ప్రసాదిస్తాడు' అని ప్రాధేయపడ్డారు." (ఖుర్ఆన్–12:88)



"యూసుఫ్ (ఇక ఉండబట్టలేక) 'మీరు అజ్ఞానాంధకారంలో పడి యూసుఫ్ పట్ల, అతని తమ్ముడి పట్ల ఎలా ప్రవర్తించారో మీకేమైనా గుర్తుందా?' అని అడిగాడు. (89)

"ఈ మాట విని వారు ఉలిక్కిపడి 'ఏమిటీ! నువ్వు యూసుఫ్‌వా!?' అన్నారు. 'ఔను నేను యూసుఫ్‌నే. ఇతను నా తమ్ముడు. దేవుడు మాకెంతో మేలుచేశాడు. పాపకార్యాలకు దూరంగాఉంటూ, (కష్టకాలంలో) సహనం వహించే సజ్జనులకు దేవుని వద్ద అన్యాయం జరగదు. వారి ప్రతిఫలం ఎన్నటికీ వృథాపోదు' అన్నాడు యూసుఫ్. 'దైవసాక్షి! దేవుడు మీకు మాకంటే ఎక్కువ ఔన్నత్యం ప్రసాదించాడు. మేము నిజంగా పాపాత్ములం' అన్నారు వారు. (ఖుర్ఆన్–12:90,91)

"ఈరోజు మీ గురించి ఎలాంటి ఆరోపణలు, ఆక్షేపణలు లేవు. దేవుడు మిమ్మల్ని క్షమించుగాక! ఆయన ఎంతో దయామయుడు. ఇక వెళ్ళండి. ఇదిగో నాచొక్కా తీసికెళ్ళి నాతండ్రి ముఖంపై వేయండి. ఆయనకు చూపు తిరిగొస్తుంది. మీ భార్యాపిల్లలు మొత్తం కుటుంబాన్ని నాదగ్గరకు పిలుచుకురండి' అన్నాడు యూసుఫ్." (ఖుర్ఆన్–12:92,93)

"బాటసారుల బృందం (ఈజిప్టు నుంచి) బయలుదేరింది. అప్పుడు (కనాన్‌లో ఉన్న) వారితండ్రి (అనిర్వచనీయమైన ఉత్సాహం వెలిబుచ్చుతూ) 'నాకు యూసుఫ్‌కు సంబంధించిన సువాసన ఏదో వస్తున్నట్లనిపిస్తోంది. నేను ముసలితనంలో మతిభ్రమించి ఇలా అంటున్నా నని మీరనుకోవచ్చు. (కాని ఇది నిజం)' అన్నాడు." (ఖుర్ఆన్–12:94)

"అయ్యో దేవా! మీరింకా అదే పిచ్చిలో ఉన్నారు' అన్నారతని కుటుంబసభ్యులు. ఆ తర్వాత కొన్నాళ్ళకు శుభవార్తాహరుడు వచ్చాడు. రాగానే యూసుఫ్‌చొక్కా తీసి యాఖూబ్ ముఖంపై వేశాడు. అంతే మరుక్షణమే యాఖూబ్‌కు చూపు వచ్చింది. అప్పుడతను (సంతోషిస్తూ) 'నేను చెప్పలేదూ, (యూసుఫ్ దగ్గర్నుంచి సువాసన వస్తోందని)? మీకు తెలియని విషయాలెన్నో దేవుని తరపున నాకు తెలుసు' అన్నాడు. 'నాన్నగారూ! మేము నిజంగా పాపాత్ములం. మా పాపాల మన్నింపు కోసం దేవుడ్ని ప్రార్థించండి' అన్నారు వారన్నదమ్ములంతా ముక్తకంఠంతో." (ఖుర్ఆన్–12:95,96,97)

"మీ క్షమాపణ కోసం నేను నాప్రభువు సన్నిధిలో (తప్పకుండా) వేడుకుంటాను. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు' అన్నాడు యాఖూబ్. ఆ తరువాత (కొన్నాళ్ళకు) వారంతా (ఈజిప్టులో) యూసుఫ్ దగ్గరకు చేరుకున్నారు. అప్పుడు యూసుఫ్ తన తల్లిదండ్రుల్ని (ఘనంగా స్వాగతించాడు.) దగ్గర కూర్చోబెట్టుకొని (అన్నదమ్ములు, ఇతర బంధువులతో) 'పదండి, నగరంలో ప్రవేశించండి. దైవం కోరితే (ఇకనుంచి) మీరంతా శాంతీసుఖాలతో జీవితం గడుపుతారు' అని చెప్పాడు." (ఖుర్ఆన్–12:98,99)

"(ఇలా ఆబాలగోపాలం వెంటరాగా ఆనందోత్సాహాలతో వారు నగరంలో ప్రవేశిం చారు.) తర్వాత యూసుఫ్ తల్లిదండ్రుల్ని సింహాసనంపై తనపక్కన కూర్చోబెట్టుకున్నాడు. అప్పుడు అందరూ అప్రయత్నంగా అతనికి గౌరవసూచకంగా అభివాదం చేశారు."

"నాన్నా! నేనా రోజు చూసిన కలలోని గూఢార్థం ఇదే. నాప్రభువు దాన్ని (ఈరోజు) ఇలా నిజంచేసి చూపాడు. ఆయన తన అనుగ్రహంతో నన్ను జైలు నుంచి విడుదల

చేయించాడు. అంతేకాదు, మిమ్మల్నందర్నీ ఎడారిప్రాంతం నుండి తీసుకొచ్చి నాతో కలిపాడు. అంతకు ముందు షైతాన్ నాకు, నాసోదరులకు మధ్య కలహం సృష్టించాడు. (దేవుడు దాన్ని తిప్పికొట్టాడు.) వాస్తవం ఏమిటంటే నా ప్రభువు ఇతరులెవరూ గ్రహించ లేని అద్భుతమైన యుక్తులతో తన పథకాన్ని అమలుపరుస్తాడు. ఆయన సమస్తం ఎరిగినవాడు, మహా వివేకవంతుడు." (ఖుర్ఆన్–12:100)

## 8. హూద్ (అలైహి)

"మేము ఆద్‌జాతి వద్దకు వారిసోదరుడు హూద్ (అలై)ని పంపాము. అతను వారిని సంబోధిస్తూ 'నాజాతిప్రజలారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయనతప్ప మీకు మరో ఆరాధ్య దైవం లేదు. మీరు ఇప్పుడైనా తప్పుడు వైఖరి నుండి బయటపడరా?" అన్నాడు. కాని అతని జాతినాయకులు ఈమాటలు నమ్మడానికి నిరాకరిస్తూ "నీవు వట్టి వెర్రివాడిలా కన్పిస్తున్నావు నీవసలు అబద్ధాలరాయుడవని మాఉద్దేశం' అన్నారు." (ఖుర్ఆన్–7:65,66)

ఇలా సాగింది హూద్ ప్రవక్త (అలై) ధర్మప్రచారం. కాని విగ్రహారాధకులైన ఆ జాతి ప్రజలు సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరించారు.

"ఆద్ (నాయకులు) న్యాయం, ధర్మం ఏదీలేకుండా దేశంలో పెద్ద మొనగాళ్ళయి పోయారు. పైగా 'మాకంటే బలవంతులెవరున్నార?'ని పలకసాగారు. వారిని సృష్టించిన దేవుడు వారికంటే బలాఢ్యుడన్న సంగతి వారికి కాస్తయినా తట్టలేదా? వారు మా సూక్తులు, సూచనలు తిరస్కరిస్తూనే పోయారు." (41:15); "(హూద్‌ప్రవక్త) ఇసుకకొండల నేలయిన 'అహ్‌ఖాఫ్'లో తనజాతి ప్రజలను ఒక ఉపద్రవం గురించి హెచ్చరించాడు– ఇలా హెచ్చ రించేవారు గతంలో, ఆ తరువాత కూడా వచ్చిపోయారు– 'దేవుడ్ని తప్ప మరెవరినీ ఆరాధించకండి. నేను మీ విషయంలో ఒక భయంకర దినాన సంభవించే (ప్రళయదిన) ఉపద్రవం గురించి భయపడుతున్నాను' అన్నాడతను." (ఖుర్ఆన్–46:21)

"దానికి అతని జాతిప్రజలు ('మమ్మల్ని మా దేవతల నుండి దూరం చేయడానికి వచ్చావా? సరే, నీవు సత్యవంతుడవైతే, మమ్మల్ని బెదరగొడ్తున్న ఆ ఉపద్రవం ఏమిటో తీసుకురా చూద్దాం' అన్నారు. 'ఆ సంగతి దేవునికే తెలుసు. నేను నాకిచ్చి పంపిన సందేశం మాత్రమే మీకు అందజేస్తున్నాను. కాని మీరు చాలా అజ్ఞానం, మూఢత్వాలతో ప్రవర్తిస్తున్నట్లు అన్పిస్తోంది నాకు' అన్నాడు వారి సోదరుడు." (ఖుర్ఆన్–46:22,23)

"(ఓరోజు) ఆ విపత్తు మేఘాల రూపంలో తమ లోయల వైపు రావడం చూసి 'ఈ మేఘాలు మనకెంతో ప్రయోజనం కలిగిస్తాయి' అన్నారు వారు (సంబరపడిపోతూ)... 'కాదు, ఇది మీరు లోగడ తొందరపెట్టిన ఉపద్రవం. ఇదొక పెనుతుఫాన్, ఘోరమైన ఆపద మోసుకొస్తోంది. అది తన ప్రభువాజ్ఞతో సర్వనాశనం చేస్తుంది.' చివరికి ఆ ఉపద్రవం వారిపై విరుచుకుపడి, వారి నివాసస్థలాలు తప్ప పూర్తిగా తుడిచిపెట్టింది. ఇలా మేము పాపాత్ములకు ప్రతిఫలమిస్తున్నాం." (ఖుర్ఆన్–46:24,25)

"ఆద్ ప్రజలు ఒక భయంకరమైన తుఫాను దెబ్బకు నాశనమయ్యారు. దేవుడు దాన్ని వరుసగా ఏడురాత్రుళ్ళు, ఎనిమిదిపగళ్ళు వారిపై పడవేశాడు. (అప్పుడు నీవక్కడ ఉండి



వుంటే) వారక్కడ ఖర్జూరపుమొదళ్ళు పడినట్లు నిర్జీవంగా పడివుండటం నీకు కన్పించేది. చూడు, వారిలో ఎవడైనా ప్రాణాలతో బయటపడ్డాడా? (ఖుర్ఆన్–69:6-8)

ఆద్‌జాతి అరేబియాకు చెందిన అతిపురాతన జాతి. నూహ్ ప్రవక్త (అలైహి), ఆయన అనుచరుల సంతతుల నుండి ఆవిర్భవించింది. క్రీస్తుపూర్వం 1800-2000 మధ్య కాలంలో ఈ జాతి మహా వైభవంగా మనుగడ సాగించినట్లు తెలుస్తోంది. దేవుడు ఈ జాతిప్రజలకు అన్నివిధాల భోగభాగ్యాలు ప్రసాదించాడు. అయితే వీరు నూహ్ (అలై) బోధనలను విస్మరించి క్రమంగా విగ్రహారాధనకు లోనయ్యారు. అందువల్ల దేవుడు వారి మార్గదర్శనం కోసం హూద్‌ప్రవక్త (అలైహి)ను ప్రభవింపజేశాడు. కాని వారాయన్ని తిరస్కరించి నాశనమయ్యారు. కొందరు మాత్రమే విశ్వసించారు. దక్షిణ అరేబియాలోని యమన్, యమామాల మధ్య వున్న 'అహ్‌ఖాఫ్' ప్రాంతం వీరి జన్మస్థలం.

క్రీ.శ.1837లో జేమ్స్. ఆర్. వేల్స్టడ్ అనే ఆంగ్లేయ నౌకాధికారికి 'హిసిన్ గురాద్' కనుమలో ఓ పురాతన శిలాశాసనం దొరికింది. ఇది క్రీ.పూ.1800 నాటిదని తెలుస్తోంది. పురావస్తుశాస్త్ర నిపుణులు ఈ శిలాశాసనంలోని వ్రాతకు ఈ విధంగా అర్థం చెప్పారు: "మేమీ కోటలో ఓ సుదీర్ఘ కాలం ఎలాంటి దుస్థితి, ఇబ్బందులు లేకుండా ఎంతో సుఖంగా జీవించాము. మా కాల్వలు ఎల్లప్పుడూ నదీ జలాలతో నిండి వుండేవి......మా పాలకులు ఎలాంటి చెడు తలంపులకు తావిచ్చేవారు కాదు. చెడులు, కల్లోలాల పట్ల కఠినంగా వ్యవహరించేవారు. వారు మమ్మల్ని హూద్ ప్రవక్త తెచ్చిన ధర్మశాస్త్రం ప్రకారం ధర్మయుక్తంగా పరిపాలిస్తుండేవారు. మంచి తీర్పులు ఒక పుస్తకంలో నమోదు అవు తుండేవి. మేము దేవుని మహిమల్ని, మరణానంతరం తిరిగి బ్రతికించబడే విషయాన్ని నమ్మేవాళ్ళం" (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ రెండవభాగం నుండి సేకరణ)

## 9. షుఐబ్ (అలైహి)

"మేము మద్యన్‌ప్రజల వద్దకు వారిసోదరుడు షుఐబ్‌ను పంపాము. అతను తన జాతి ప్రజలతో ఇలా అన్నాడు: 'నా జాతిప్రజలారా! దేవుడ్ని ఆరాధించండి. ఆయన తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. మీ దగ్గరకు మీప్రభువు నుండి స్పష్టమైన నిదర్శనం వచ్చింది కనుక మీరు తూనికలు, కొలతలు పూర్తిగా పాటించండి. ప్రజలకు రావలసిన సరుకు తగ్గించి ఇవ్వకండి. ధరణిలో శాంతీసామరస్యాలు ఏర్పడ్డాక అరాచకం సృష్టించకండి. మీరు విశ్వాసులైతే (విషయం గ్రహించండి), అందులోనే మీ శ్రేయస్సు ఉంది." (ఖుర్ఆన్–7:85)

"(జీవితంలోని) ప్రతి మార్గంలో అడ్డుగోడలై కూర్చోకండి. అలా ప్రజలను బెదరగొట్టి 'విశ్వసించేవారిని' దైవమార్గంలోకి రాకుండా నిరోధించకండి. ఆ మార్గాన్ని చెడగొట్టే చేష్ట లకు వడిగట్టకండి. మీరు అల్పసంఖ్యాకులుగా ఉన్నరోజులు గుర్తుకుతెచ్చుకోండి. ఆ తర్వాత దేవుడు మీ జనాభా పెంచాడు. లోకంలో దుర్మార్గులకు ఎలాంటి గతి పట్టిందో కళ్ళుతెరచి చూడండి. మీలో కొందరు నేను తెచ్చిన బోధనలు నమ్ముతున్నారు, కొందరు నమ్మడంలేదు. కనుక మనల్ని గురించి దేవుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో కాస్త ఓపికపట్టి చూడండి, ఆయనే అందరికంటే మంచి నిర్ణయం తీసుకునేవాడు." (ఖుర్ఆన్–7:86,87)

“దానికి వారిలా అన్నారు: ‘షుఐబ్! మా తాతముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను ఆరాధించడం మేము మానుకోవాలా? మా ధనాన్ని మా ఇష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టుకునే అధికారం లేదా మాకు? ఇదేనా నీప్రార్థన నీకు నేర్పుతున్నది? (మాఅందరిలో) సాధుస్వభావి, సన్మార్గగామివి నువ్వొక్కడివే మిగిలావు కాబోలు!’ (ఖుర్ఆన్–11:87)

“అతని జాతినాయకులు అధికార గర్వంతో విర్రవీగుతూ ‘షుఐబ్! నీవు, నిన్ను విశ్వసించినవారు (మర్యాదగా) మా మతంలోకి తిరిగి వచ్చేయండి. లేదంటారా, మిమ్మల్నందర్నీ మేము మాపట్నం నుంచి గెంటివేస్తాం.’ అన్నారు.” (7:88); “అతని జాతిలో సత్యాన్ని తిరస్కరించిన నాయకులు (ఒకరోజు సమావేశమయి) ‘మనం గనక షుఐబ్‌ని అనుసరిస్తే నాశనమైపోతాం’ అని చెప్పుకున్నారు.” (ఖుర్ఆన్–7:90)

“చివరికి మాఆజ్ఞ వచ్చేసింది. అప్పుడు మేము మా అనుగ్రహంతో షుఐబ్‌ని, అతనితో పాటు విశ్వసించినవారిని రక్షించాం. అన్యాయం, అక్రమాలకు పాల్పడిన దుర్మార్గులపై అతి తీవ్రమైన విస్ఫోటం విరుచుకుపడింది. దాంతో వారు తమ ఇండ్లలోనే పడి సర్వనాశనమయ్యారు. అసలు వారక్కడ ఎన్నడూ నివసించనే లేదన్నట్లు తెల్లవారుజామున ఎలాంటి చలనంలేకుండా నిస్తేజంగా పడి ఉండిపోయారు.” (ఖుర్ఆన్–11:94,95)

**మద్యన్‌జాతి** :- మద్యన్ అనేది పూర్వం అరేబియాలో ఒక ప్రాంతం పేరు. ఈ ప్రాంతంలో నివసించిన జాతినే మద్యన్‌జాతి అంటారు. ఇబ్రాహీం ప్రవక్త (అలైహి)కు ఆయన మూడవభార్య ఖతూరా ద్వారా పుట్టిన ‘మిద్యాన్’ అనే కుమారుని సంతతే మద్యన్ జాతి ప్రజలుగా ప్రసిద్ధిచెందారు. అయితే వారు అయిదారు వందల ఏండ్లలో క్రమంగా బహుదైవారాధనా జాతులతో ప్రభావితులైనందున వారిలోనూ బహుదైవారాధన వ్యాపించింది. దాంతో దగా, దోపిడి, దొంగతనాలు వంటి నైతికరుగ్మతలు వారిలో చోటు చేసుకున్నాయి. అంచేత వారిని సంస్కరించడానికి దేవుడు ‘షుఐబ్’ (అలైహి)ను ప్రవక్తగా నియమించి పంపాడు. కాని ఆజాతి ఆయన్ని తిరస్కరించి నాశనమయింది.

## 10. సాలిహ్ (అలైహి)

“మేము సమూద్ జాతిప్రజల దగ్గరకు వారి సోదరుడు సాలిహ్‌ను పంపాము. అతనిలా అన్నాడు: ‘నా జాతిప్రజలారా! ఏకైక దేవుడ్ని (మాత్రమే) ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే మిమ్మల్ని నేల నుండి పుట్టించి ఇక్కడ మీకు వసతి సౌకర్యం కల్పించాడు. కనుక మీరు ఆయన్నే క్షమాపణ కోరుకోండి. ఆయన వైపు మరలండి. నా ప్రభువు (మానవులకు) అతి సమీపంలోనే ఉన్నాడు. ఆయనే (మన) మొరలను ఆలకించేవాడు.” (ఖుర్ఆన్–11:61)

“దానికి వారిలా అన్నారు: ‘సాలిహ్! గతంలో నీవు మామధ్య ఎంతో మంచివాడివిగా ఉన్నావు. నీమీద మేము ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. (ఇప్పుడేమయింది నీకు?) మా తాతముత్తాతల కాలం నుండి వస్తున్న ఈ దైవాలను పూజించుకోనీయకుండా మమ్మల్ని వారిస్తున్నావు? నీవు బోధిస్తున్న విషయం పట్ల మాకు చాలా అనుమానంగా ఉంది. అది మమ్మల్ని తీవ్రమైన సందిగ్ధంలో పడవేసింది.” (ఖుర్ఆన్–11:62)



“...ఆద్‌జాతి తర్వాత మీ ప్రభువు ఆ జాతికి మిమ్మల్ని వారసులుగా చేసిన విషయం జ్ఞాపకం తెచ్చుకోండి. ఆయన మీకు ఎంతో ఔన్నత్యం ప్రసాదించాడు. తద్వారా ఈనాడు మీరు చదునైన మైదానాల్లో అద్భుతమైన మేడలు కడ్తున్నారు. కొండలు చెక్కి ఇండ్లు నిర్మిస్తున్నారు. కనుక దేవుని అనుగ్రహాలు విస్మరించకండి. ధరణిలో అరాచకం, అలజడులు సృష్టించకండి.” (7:74); “...ఈ తోటలు, కాలువలు, పచ్చటి పొలాలు, పండ్లతో నిండిన ఈ ఎడారివనాల మధ్య మిమ్మల్ని హాయిగా ఎల్లకాలం ఉండనివ్వడం జరుగుతుందని భావిస్తున్నారా? పైగా మీరు కొండల్ని తొలచి బడాయికోసం పెద్దపెద్ద కట్టడాలు నిర్మిస్తున్నారే! కాస్త దేవునికి భయపడండి...” (ఖుర్ఆన్–26:145–150)

“ఆ పట్టణంలో తొమ్మిదిమంది ముఠానాయకులు ఉన్నారు. వారు దేశంలో అలజడులు రేపుతుంటారు. (సమాజ)సంస్కరణకు సంబంధించి ఒక్క పనీ చేయరు. (ఒకరోజు) వారు పరస్పరం కూడబలుక్కుంటూ ఇలా అన్నారు: ‘మనం సాలిహ్‌ని, అతని కుటుంబ సభ్యుల్ని ఓ రాత్రివేళ చంపేస్తామని దేవుని పేరుతో ప్రమాణం చేద్దాం. ఆ తరువాత అతని సంరక్షకునితో ‘అతని కుటుంబహత్య సమయంలో మేమక్కడ లేనేలేం, మేము నిజమే చెబుతున్నాం’ అని అందాము.” (ఖుర్ఆన్–27:48,49)

“ఈవిధంగా వారొక పన్నాగం పన్నారు. ఇటు మేము కూడా వారికి తెలియకుండా ఓ పన్నాగం పన్నాము. ఇకచూడు, వారి పన్నాగం పర్యవసానం ఏమైందో. (27:50); మేము వారికోసం ఒంటెను పరీక్షగాచేసి పంపుతున్నాం. వారికెలాంటి గతి పడ్తుందో కాస్త ఓపిక పట్టిచూడు. వారికి, ఒంటెకు మధ్య నీళ్ళు విభజించబడతాయని, ప్రతిఒక్కరూ తమవంతు వచ్చేరోజు మాత్రమే నీటిని వాడుకోవాలని చెప్పు. చివరికి వారు తమ మనిషి ఒకడ్ని పురిగొల్పారు. అతను ఒంటెను పట్టుకొని చంపేశాడు.” (ఖుర్ఆన్–54:27–29)

“(ఈవిధంగా) వారు తలబిరుసుతో తమ ప్రభువాజ్ఞ ఉల్లంఘించి ఒంటెను చంపేశారు. పైగా ‘సాలిహ్! నీవు మమ్మల్ని బెదరగొడ్తున్న ఆ శిక్ష ఏమిటో ఇక తీసుకురా చూద్దాం. నీవు నిజంగా దైవప్రవక్తవైతే ఈపని చేసి చూపు’ అని సవాలు విసిరారు. చివరికి ఆసాంతం ఊపేసే మహోపద్రవం వారిపై వచ్చిపడింది. దాంతో వారు తమ ఇండ్లలో బోర్లాపడి ఊపిరివిడిచారు. సాలిహ్ ఈ భయానకదృశ్యం చూసి “నాజాతి ప్రజలారా! నేను మీకు నాప్రభువు సందేశం అందజేశాను. మీశ్రేయస్సు కోరి ఎంతో నచ్చజెప్పాను. కాని నేనేం చేయగలను? మీరు మీ శ్రేయోభిలాషినే ప్రేమించలేకపోయారు” అని చెబుతూ అక్కడ్నుంచి (బాధాతప్త హృదయంతో) వెళ్ళిపోయాడు.” (ఖుర్ఆన్–7:77–79)

## 11. మూసా, హారూన్ (అలైహి)

హజ్రత్ మూసా (అలైహి) క్రీ.పూ. 13వ శతాబ్దం ప్రారంభకాలంలో ఇస్రాయీల్‌సంతతి ప్రజల్ని సంస్కరించడానికి ప్రభవించిన దైవప్రవక్త. ఈయన బైబిల్ కథనం ప్రకారం యాఖూబ్ ప్రవక్త (అలై) కుమారుడు లావీ సంతతికి చెందినవారు. తండ్రి పేరు ఇమ్రామ్ అని బైబిల్‌లో ఉంది. ఖుర్ఆన్ దీన్ని ఇమ్రాన్ అని పేర్కొన్నది. ఇస్రాయీల్ సంతతిలో ఒకతను పుట్టి, ఫిరౌన్ చక్రవర్తిని, అతని రాజ్యాన్ని అంతమొందిస్తాడని జ్యోతిష్కులు

చెప్పడంతో ఫిరౌన్‌చక్రవర్తి ఇస్రాయీల్ ప్రజల్లో పుట్టే ఆడపిల్లల్ని వదిలేసి, వారి మగపిల్లల్ని సంహరింపజేయ నారంభించాడు.

అందువల్ల మూసా పుట్టిన కొన్నాళ్ళకే ఆయన తల్లి ఆయన్ని ఓ గంపలో పెట్టి నదిలో వదలిపెట్టింది. ఫిరౌన్ భార్య ఆ గంపలోని ముద్దులొలికే పసిబిడ్డను చూసి ముచ్చటపడింది. భర్తను ఒప్పించి ఆ పిల్లవాడ్ని నీటిలో నుంచి తీసి పెంచుకోసాగింది. ఆ పిల్లవాడికి మూసా అని పేరుపెట్టారు. మూసా అంటే నీళ్ళలో నుంచి తీయబడిన లేక కాపాడబడినవాడని అర్థం. మూసాకు ముందు హారూన్, ఆయనకు ముందు ఒక బాలిక పుట్టారు. మూసాప్రవక్త గాథ వివిధ అధ్యాయాల్లో ఎంతో వివరంగా ఉంది.

## (1) పుట్టుక, పోషణ, నేరారోపణ

“ఫిరౌన్ ధరణిలో తలెత్తి అహంకారంతో విర్రవీగుతున్నాడు. అతను తన దేశపౌరుల్ని (విభిన్న) వర్గాలుగా విభజించాడు. వాటిలో ఒక వర్గాన్ని అతినీచంగా చూస్తున్నాడు. ఆ వర్గంలో ఆడపిల్లలను మాత్రమే జీవించిఉండేలా వదలి, మగపిల్లలను చంపుతున్నాడు. ఈవిధంగా అతను పరమ దుర్మార్గుడై పోయాడు. కనుక ప్రపంచంలో అణచివేయబడిన ఈ (దళిత)జనాన్ని కనికరించాలని మేము నిర్ణయించుకున్నాము. వారికి (ప్రపంచ) నాయకత్వం ప్రసాదించి, వారిని (భూమికి) వారసులుగా చేయాలని సంకల్పించాం. వారికి ప్రపంచంలో పాలనాధికారం ఇవ్వాలని భావించాము. అంతేకాకుండా వారిద్వారా మరోవైపు ఫిరౌన్, హామాన్‌లకు, వారి సైన్యాలకు వారు భయపడుతున్నదానిని చూపాలని కూడా మేము నిశ్చయించాం.” (ఖుర్ఆన్–28:4,5,6)

“మేము మూసా తల్లికి దివ్యావిష్కృతి ద్వారా ఇలా సూచించాము: ‘నీవు మూసాకు పాలు త్రాగిస్తూ ఉండు. అతని ప్రాణానికి ముప్పు వాటిల్లే సూచనలు కన్పిస్తే అతడ్ని నదిలో వదలిపెట్టు. నువ్వేమీ భయపడకు, దిగులుపడకు. ఆ తరువాత మేమతడ్ని తిరిగి నీ దగ్గరికే చేర్చుతాం. అతడ్ని మేము దైవప్రవక్తగా చేస్తాం.” (ఖుర్ఆన్–28:7)

“చివరికి ఫిరౌన్ కుటుంబీకులు అతడ్ని (నది నుండి) తీసేసుకున్నారు, అతను తమకు విరోధిగా, దుఃఖదాయిగా కావాలని! ఫిరౌన్, హామాన్, వారి మనుషులు చాలా తప్పు చేశారు. ఫిరౌన్‌తో అతని భార్య ఇలా అన్నది: ‘ఈ పిల్లవాడు మన కంటిచలువ. ఇతడ్ని చంపకండి. ఇతడు మనకు ప్రయోజనకారి కావచ్చు లేదా మనం ఇతడ్ని కొడుకుగానైనా చేసుకుందాం.’ (దీని పర్యవసానం ఏమిటో) వారికి తెలియదు.” (ఖుర్ఆన్–28:8,9)

“అటు మూసా మాతృమూర్తి హృదయం తల్లడిల్లిపోసాగింది. మేమామెకు ధైర్యం కలిగించకపోతే, ఆమె ఈ రహస్యాన్ని బట్టబయలు చేసివుండేది. ఆమె విశ్వాసులలో చేరాలన్న ఉద్దేశ్యంతో కూడా ఇలా చేశాం. ఆమె పిల్లవాడి అక్కతో ‘నువ్వితని వెనకాలగా నడచివెళ్ళు’ అని చెప్పింది. ఆ బాలిక తనను గురించి (శత్రువులకు) ఎలాంటి అనుమానం రాకుండా దూరం నుంచి అతడ్ని గమనిస్తూ నడిచింది.” (ఖుర్ఆన్–28:10,11)

“మేము ముందుగానే పిల్లవాడికి పాలుపట్టే స్త్రీల పాలిండ్లను నిషేధించాం. (అందువల్ల పిల్లవాడు ఏస్త్రీ దగ్గరా పాలు త్రాగడానికి సిద్ధంకాలేదు.) అప్పుడా బాలిక వారితో ‘ఈ



పిల్లవాడి పోషణభారం వహించేవారెవరో, వారిల్లెక్కడో నేను మీకు తెలుపనా? వారు బాబుని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటారు కూడా’ అని అన్నది.” (ఖుర్ఆన్–28:12)

“ఇలా మేము మూసాను తిరిగి అతని తల్లి దగ్గరకు చేర్చాం, ఆమె కళ్ళు చల్లబడాలని, దిగులు పడకూడదని. అదీగాక దేవునివాగ్దానం నిజమైన వాగ్దానమని ఆమె తెలుసుకోవాలని కూడా మేమిలా చేశాం. కాని చాలామందికి ఈ సంగతి తెలియదు. మూసా యౌవనదశకు చేరి పరిపూర్ణ వికాసం చెందిన తర్వాత మేమతనికి జ్ఞానం, వివేకం ప్రసాదించాం. ఇలా మేము సత్పురుషులకు (తగిన)బహుమానం అందజేస్తాం.” (ఖుర్ఆన్–28:13,14)

“(ఓరోజు) నగరవాసులు ఏమరుపాటులో ఉన్నప్పుడు మూసా నగరంలో ప్రవేశించాడు. అతను ఒకచోట ఇద్దరు పోట్లాడుకోవడం చూశాడు. వారిలో ఒకడు తనజాతికి చెందినవాడే. రెండోవాడు అతని విరోధిజాతికి చెందినవాడు. మూసాజాతికి చెందినవాడు విరోధి జాతివాడికి వ్యతిరేకంగా తనకు సహాయం చేయవలసిందిగా మూసాను పిలిచాడు. అప్పుడు మూసా వచ్చి ఒక్క పిడిగుద్దుతో అతడ్ని కడతేర్చాడు. (ఈ హఠాత్పరిణామానికి) మూసా (కంగారుపడుతూ) ‘ఇది షైతాన్ చర్య. షైతాన్ (మానవులకు) బద్ధవిరోధి; పెడదారి పట్టించే పరమదుర్మార్గుడు’ అన్నాడు. తరువాత ‘ప్రభూ! నేను నాఆత్మకు అన్యాయం చేసుకున్నాను. నన్ను క్షమించు’ అని వేడుకున్నాడు. దేవుడు అతడ్ని క్షమించాడు. ఆయన గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు.” (ఖుర్ఆన్–28:15,16)

“ఆ తరువాత మూసా ‘ప్రభూ! నీవు నాకెంతో మేలు చేశావు. ఇకముందు ఎప్పుడూ నేను నేరస్థులకు సహాయపడను’ అని ప్రతిజ్ఞ చేశాడు.” (ఖుర్ఆన్–28:17)

“మరునాడుదయం మూసా భయపడుతూ, ప్రమాద సూచనలు పసిగడ్తూ నగరంలో ప్రవేశించాడు. అకస్మాత్తుగా ఒకచోట నిన్న తనను సహాయం కోసం పిలిచినవాడే ఈ రోజు కూడా తనను పిలుస్తూ కన్పించాడు. అప్పుడు మూసా అతనితో ‘నీవు పెద్ద దుర్మార్గుడిలా (జగడాలమారిగా) కన్పిస్తున్నావే!’ అన్నాడు. ఆ తర్వాత మూసా తన విరోధి జాతికి చెందిన వాడిపై దాడి చేయబోయాడు. వెంటనే రెండోవాడు గగ్గోలుపెడుతూ “మూసా నిన్న నీవు ఒక మనిషిని చంపావు. అలాగే ఈరోజు నన్ను చంపడానికి సిద్ధమయ్యావా? నువ్వీ దేశంలో క్రూరుడుగా ఉండదలిచావా? సంస్కరణ కార్యాలు చేయడం ఇష్టంలేదా?’ అని అడిగాడు.” (ఖుర్ఆన్–28:18,19)

“కాస్సేపటికి నగరం అగ్రభాగం నుండి ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చి ‘మూసా! ఉన్నతాధికారులు నిన్ను చంపే విషయమై చర్చలు జరుపుతున్నారు. నువ్వు (తొందరగా ఎటయినా) పారిపో. నేను నీ శ్రేయాభిలాషిని, చెబుతున్నా’ అన్నాడు. ఈ సంగతి వినగానే మూసా భయపడి నగరం నుంచి మెల్లిగా జారుకున్నాడు. అప్పుడతను ‘ప్రభూ! నన్ను దుర్మార్గుల బారినుండి కాపాడు’ అని ప్రార్థించాడు. (ఖుర్ఆన్–28:20,21)

## (2) మద్యన్‌లో పెళ్ళి, తొలిదివ్యావిష్కృతి

“మూసా (ఈజిప్టు నుంచి బయలుదేరి) మద్యన్ దారి పట్టాడు. ఆ సమయంలో ‘నా ప్రభువు నన్ను సరైన దారిలో నడిపిస్తాడని ఆశిస్తున్నాను’ అన్నాడతను. (ఖుర్ఆన్–28:22)

“ఆవిధంగా అతను మద్యన్ ప్రాంతంలోని ఒక బావి దగ్గరకు చేరుకున్నాడు. అక్కడ అనేకమంది తమ పశువులకు నీళ్ళు త్రాగిస్తూ కన్పించారు. వారికి కొంచెం ఎడంగా ఇద్దరు స్త్రీలు తమ పశువుల్ని ఆపుకొని (నీటికోసం నిరీక్షిస్తూ) నిలబడి ఉన్నారు. మూసా ఆ స్త్రీలను ఉద్దేశించి ‘మీ బాధేమిటీ?’ అని అడిగాడు. దానికి వారు ‘ఈ కాపరులు తమ పశువుల్ని తోలుకెళ్ళనంతవరకు మేము మా పశువులకు నీళ్ళు త్రాగించలేం. మా నాన్నగారు చాలా ముసలివారయి పోయారు’ అన్నారు. ఈ సంగతి విని మూసా ఆ స్త్రీల పశువులకు నీళ్ళు తాగించాడు. ఆ తరువాత ఓ చోట నీడపట్టున కూర్చొని ‘ప్రభూ! నీవు నాకు ఎలాంటి శ్రేయస్సు పంపినా అది నాకు ఎంతో అవసరం’ అన్నాడు.” (ఖుర్ఆన్–28:23,24)

“కాస్సేపటికి ఆ ఇద్దరిలో ఒక స్త్రీ సిగ్గుపడుతూ నడచి అతని దగ్గరకొచ్చింది. ఆమె అతనితో “మిమ్మల్ని మానాన్నగారు పిలుస్తున్నారు. మీరు మా పశువులకు నీరు తాగించి చేసిన మేలుకు అయన మీకు ప్రతిఫలం ఇవ్వడానికి పిలుస్తున్నారు” అని అన్నది. మూసా ఆ వృద్ధుని దగ్గరికెళ్ళి తన గాథంతా వివరించాడు. అది విని అతను ‘భయపడకు. ఇప్పుడు నీవా దుర్మార్గుల బారినుండి బయటపడ్డావు’ అన్నాడు. ఆ ఇద్దరు స్త్రీలలో ఒకామె తన తండ్రితో ‘నాన్నా! ఇతడ్ని మనం సేవకునిగా పెట్టుకుందాం. బలిష్ఠుడు, నిజాయితీపరుడైన వాడే మనకు మంచి సేవకుడు’ అని అన్నది. (ఖుర్ఆన్–28:25,26)

“ఆమె తండ్రి (మూసాతో) ఇలా అన్నాడు: ‘నేను నా కుమార్తెలిద్దరిలో ఒకామెను నీకిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. అయితే నీవు నాదగ్గర ఎనిమిదేండ్లు సేవకునిగా పని చేయాలి. పదేండ్లు చేస్తే (ఇంకా మంచిది.) అది నీఇష్టం. నేను నీమీద వత్తిడి చేయ దలచుకోలేదు. దేవుడు తలిస్తే నీవు నన్ను మంచివాడిగా చూస్తావు.’ మూసా ఇలా అన్నాడు: ‘ఈ వ్యవహారం మీకూ, నాకూ మధ్య జరిగింది. ఈ రెండు గడువుల్లో ఏదో ఒకదాన్ని నేను పూర్తి చేస్తాను. ఆ తర్వాత నామీద మరెలాంటి భారం వేయకూడదు. మనం చేసుకుంటున్న ఈ ఒప్పందానికి దేవుడే సాక్షి.” (ఖుర్ఆన్–28:27,28)

“నిర్ణీతకాలం ముగిశాక మూసా తన కుటుంబం తీసుకొని బయలుదేరాడు. దారిలో తూర్‌కొండ వైపున అతనికి ఓ అగ్ని(మంట) కన్పించింది. అప్పుడతను తన గృహస్థులతో ‘ఆగండి, నాకేదో నిప్పు కన్పిస్తోంది. నేను వెళ్ళి ఏదైనా సమాచారం తెస్తాను. (28:29) అక్కడ (మనకు) దారి చూపేవారు ఎవరైనా దొరకవచ్చు’ (20:10) లేదా మీరు చలి కాచుకో వడానికి ఓ నిప్పు కొరివినైనా తెస్తాను’ అని అన్నాడు.” (ఖుర్ఆన్–28:29)

“మూసా అక్కడకు చేరుకోగానే లోయ కుడి వైపున్న పవిత్రస్థలంలోని ఓ చెట్టు నుండి ఇలా ఓ (అదృశ్య)వాణి విన్పించింది: ‘మూసా! నేనే దేవుడ్ని. సర్వలోక ప్రభువుని’ (28:30); ‘ఈ అగ్నిలో ఉన్నవాడు శుభకరుడు, ఈ అగ్ని పరిసరాల్లో ఉన్నవాడు కూడా శుభకరుడే. సర్వలోక ప్రభువైన దేవుడు పరిశుద్ధుడు.” (ఖుర్ఆన్–27:8)

“మూసా! నేనే నీ ప్రభువును. చెప్పులు విడిచిపెట్టు. నీవిప్పుడు పవిత్రమైన తువా (లోయ)లో ఉన్నావు. నేను నిన్ను (ఓ మహాకార్యం కోసం) ఎన్నుకున్నాను. నీకు అందజేస్తున్న విషయాన్ని శ్రద్ధగా విను. నేనే దేవుడ్ని. నేను తప్ప మరోఆరాధ్యుడు లేడు. కనుక నీవు నన్నే ఆరాధించు. నన్ను స్మరించడానికి నమాజ్ స్థాపించు.” (ఖుర్ఆన్–20:12–14)



“ప్రళయం తప్పకుండా రానున్నది. ప్రతి మానవుడూ తన కృషికి తగిన ప్రతిఫలం పొందడానికి నేను దాని సమయాన్ని రహస్యంగా ఉంచదలిచాను. కనుక ప్రళయదినాన్ని నమ్మకుండా మనోవాంఛలకు బానిసలైపోయేవారి విషయంలో దాన్ని గురించిన ఆలోచన నిన్ను (మా సందేశప్రచారం నుండి) నిరోధించకూడదు సుమా! అలా జరిగితే నీవు నాశనమై పోతావు. సరే, మూసా! నీ చేతిలో ఉన్నదేమిటీ?” (ఖుర్ఆన్–20:15–17)

“దానికి మూసా ‘ఇది నా చేతికర్ర. దీన్ని నేను ఊతగా చేసుకొని నడుస్తాను. దీంతో నా మేకల కోసం చెట్లనుండి ఆకులు రాల్చుతా. దీంతో నేనింకా ఎన్నోపనులు చేస్తాను’ అన్నాడు. ‘మూసా! దాన్ని క్రింద పడవెయ్యి’ అన్నాడు దేవుడు. మూసా దాన్ని క్రింద పడవేశాడు. అంతే, అది ఎకాఎకిన పాముగా మారి (మెలికలు తిరుగుతూ) పరుగెత్త సాగింది. (20:18–20); దాన్ని చూడగానే అతను (భయపడి) పరుగు లంకించుకున్నాడు. వెనక్కి తిరిగైనా చూడలేదు. (ఖుర్ఆన్–28:31)

“మూసా! భయపడకు, వచ్చేయి. నీకెలాంటి ప్రమాదం ఉండదు.” (28:31); “దాన్ని పట్టుకో. భయపడకు. మేము దాన్ని తిరిగి పూర్వస్థితికి మార్చుతాం.” (20:21) “నీ చేతిని కాస్త చొక్కా క్రింద చంకలో పెట్టి తీసేయి. అది నీకెటువంటి బాధ కల్గించకుండా ప్రకాశిస్తూ బయటికి వస్తుంది. భయం పోగొట్టుకోవడానికి నీ (కుడి)భుజం అదుముకో. ఇవిరెండు ఫిరౌన్, అతని సభాసదుల ముందు ప్రదర్శించడానికి నీప్రభువు తరఫున ఇవ్వబడిన మహిమలు. వారుచాలా దుర్మార్గులైపోయారు’ అన్నాడు దేవుడు.” (ఖుర్ఆన్–28:32)

“అప్పుడు మూసా ఇలా అన్నాడు: ‘ప్రభూ! నేను వారి మనిషినొకడ్ని చంపిఉన్నాను. అంచేత వారు నన్ను చంపేస్తారేమోనని భయపడుతున్నాను.” (28:33); “ప్రభూ! నాకు మనోస్థయిర్యం ప్రసాదించు. నా పనులు సులభంగా నెరవేరేలా చెయ్యి. ప్రజలు నా మాట గ్రహించడానికి నాకు మంచి వాక్పటిమ ప్రసాదించు. నాకు సహాయంగా నా కుటుంబంలో ఒకరిని మంత్రిగా నియమించు. నాసోదరుడు హారూన్ ద్వారా నాకు బలం చేకూర్చు. అతడ్ని నా పనిలో భాగస్వామిగా చెయ్యి. మేమిద్దరం నీ పవిత్రతను ఘనంగా కొనియా డుతాం. నీ గురించి విస్తృతంగా ప్రచారంచేస్తాం. నీవు ఎల్లప్పుడూ మమ్మల్ని కనిపెట్టుకొని ఉంటున్నావు’ అన్నాడు మూసా.” (ఖుర్ఆన్–20:25–35)

“మూసా! నీవు కోరినవన్నీ ఇచ్చాం. మేము నీకు మరోసారి మేలు చేశాం. (నీ బాల్యంసంగతి) గుర్తుకుతెచ్చుకో. మేము నీతల్లికి ప్రత్యేక సూచన చేశాం. దివ్యావిష్కృతి ద్వారా మాత్రమే ఇలాంటి సూచన చేయడం వీలవుతుంది. (మేమిలా సూచించాం:) ‘ఈ పిల్లవాడ్ని ఒక పెట్టెలో పెట్టి నదిలో వదలిపెట్టు. నది దాన్ని ఒడ్డుకు చేర్చుతుంది. నాకూ, ఈ పిల్లవాడికి విరోధి అయినవాడు దాన్ని తీసుకుంటాడు.”

“నేను నావైపు నుండి నీ మీద మమతా మమకారాలు ఆవరింపజేశాను. నీవు నా పర్యవేక్షణలో పోషించబడేలా ప్రత్యేక ఏర్పాటు చేశాను. నీ సోదరి (ఫిరౌన్ దగ్గరకు) వెళ్ళిన సంగతి కూడా జ్ఞాపకం తెచ్చుకో. ఆమె (ఫిరౌన్ దగ్గరకు) వెళ్ళి ‘నేనీ పిల్లవాడ్ని బాగా పోషించేవారెవరో మీకు చూపనా?’ అన్నది. ఈవిధంగా మేము నిన్ను మళ్ళీ నీతల్లి దగ్గరకు చేర్చాం. ఆమె సంతోషించాలని, దిగులు చెందకూడదని ఇలా చేశాము.”

"(మరో సంఘటన) 'నీవొక వ్యక్తిని చంపావు. మేము నిన్ను ఆ ఇరకాటం నుండి బయటపడేశాం. ఎన్నో సార్లు నిన్ను పరీక్షకు గురిచేశాము. నీవు మద్యన్(జాతి) ప్రజల్లో అనేక సంవత్సరాలు గడిపావు. ఇప్పుడు తగిన సమయానికి వచ్చావు. మూసా! నేను నిన్ను నాపని కోసం యోగ్యుడిగా చేశాను. ఇక నీవు, నీ సోదరుడు నా(ఈ) నిదర్శనాలు తీసుకొని వెళ్ళండి. గుర్తుంచుకోండి, ఎట్టి పరిస్థితిలోనూ నన్ను స్మరించడంలో అలసత్వం చేయ కూడదు. మీరిద్దరు ఇప్పుడు ఫిరౌన్ దగ్గరకు వెళ్ళండి. అతను గర్విష్ఠుడై హద్దుమీరి పోయాడు. అతనితో మృదువుగా మాట్లాడండి. దానివల్ల అతను (మా) హితవులు పాటించ వచ్చు, లేదా (మా శిక్షకు) భయపడవచ్చు' అన్నాడు దేవుడు." (20:36-44)

## (3) సందేశప్రచారం, ఫిరౌన్‌తో భేటి

"ప్రభూ! అతను మాపై దౌర్జన్యం చేస్తాడేమోనని లేదా తిరగబడతాడేమోనని భయంగా ఉంది' అన్నారు వారిద్దరూ." (20:45); "దానికి దేవుడిలా అన్నాడు: 'భయపడకండి. నేను మీకు తోడుగా ఉన్నాను; సమస్తం వింటున్నాను చూస్తున్నాను." (20:46); అతని కిలా చెప్పు: 'నీవు పవిత్రజీవితం గడపడానికి సిద్ధంగా ఉన్నావా? నేను నీకు నీ ప్రభువు మార్గం చూపుతాను. దానివల్ల నీలో (దైవ)భీతి ఏర్పడవచ్చు." (ఖుర్ఆన్-79:18,19)

"మేము నీప్రభువు తరఫున వచ్చిన దూతలం, ఇస్రాయీల్ సంతతిని మావెంట రావ డానికి వదలిపెట్టు. వారిని వేధించకు. మేము నీదగ్గరకు నీప్రభువు నిదర్శనాలు తీసు కొచ్చాం. సన్మార్గం అవలంబించేవారికి శాంతి కలుగుగాక! సత్యాన్ని తిరస్కరించి ముఖం తిప్పుకునేవారికి శిక్ష ఉందని మాకు వహీ ద్వారా తెలియజేయబడింది" (20:47,48)

"మూసా ఇలా అన్నాడు: 'ఫిరౌన్! నేను విశ్వప్రభువు వైపున వచ్చిన ప్రవక్తను. నేను దేవుని పేరుతో ఏది మాట్లాడినా సత్యమే మాట్లాడటం నా విధ్యుక్త ధర్మం. నేను మీ దగ్గరికి మీ ప్రభువు నుండి స్పష్టమైన నిదర్శనం తీసుకొచ్చాను. కనుక నీవు ఇస్రాయీల్ సంతతి ప్రజలను నా వెంట పంపించు." (ఖుర్ఆన్-7:104,105)

"ఫిరౌన్ (ఈమాటలు విని) 'అయితే మూసా! మరి మీరిద్దరి ప్రభువు ఎవరంటా?' అని అడిగాడు." (20:49); "ప్రతివస్తువునూ తగినవిధంగా సృష్టించి, దానికి ఒక (నిర్దిష్ట)మార్గం చూపినవాడే మా ప్రభువు' అన్నాడు మూసా." (20:50); "అయితే ఇంతకుపూర్వం గతించిన తరాల సంగతేమిటీ?' అడిగాడు ఫిరౌన్." (20:51); "వారి సంగతేమిటో నా ప్రభువు దగ్గర ఓ గ్రంథంలో నమోదై సురక్షితంగా ఉంది. నాప్రభువు ఎలాంటి పొరపాటు చేయడు, మరచిపోడు' అన్నాడు మూసా." (ఖుర్ఆన్-20:52)

"ఫిరౌన్ (ఎత్తిపొడుస్తూ) "మేము నిన్ను పసితనంలో పెంచలేదా? నీవు నీజీవితాన్ని అనేక సంవత్సరాలు మా దగ్గర గడిపావు. తర్వాత ఏదో చేసి వెళ్ళిపోయావు. (మేము చేసిన మేళ్ళన్నీ మరచి చివరికి మాకే ఎసరు పెట్టడానికి వచ్చావన్నమాట!) నిజంగా నీవు చాలా కృతఘ్నుడివి' అని అన్నాడు." (ఖుర్ఆన్-26:15-19)

"ఆనాడు నేనా పని అజ్ఞానాంధకారంలో ఉండి తెలియక చేశాను. తరువాత మీకు భయపడి పారిపోయాను. ఆ తరువాత నా ప్రభువు నాకు జ్ఞానకాంతి ప్రసాదించి నన్ను



ప్రవక్తల జాబితాలో చేర్చాడు. ఇక నీవు నన్ను ఎత్తిపొడుస్తున్న మేలు సంగతికొస్తే, (అందులో విశేషం ఏమీ లేదు.) నీవు (నా జాతికి చెందిన) ఇస్రాయీల్ సంతతిని కట్టుబానిసలుగా చేసుకున్నావు' అని సమాధానమిచ్చాడు మూసా." (ఖుర్ఆన్-26:20-22)

"సరే, నువ్వేదో సర్వలోక ప్రభువంటున్నావు, ఎవరా సర్వలోక ప్రభువు? ఏమిటా కథ?' అడిగాడు ఫిరౌన్." (26:23);"నీవు విశ్వసించే వాడివయితే విను. ఆయన భూమ్యా కాశాలకు, వాటిమధ్య ఉన్న సమస్త సృష్టిరాసులకు ప్రభువు' అన్నాడు మూసా." (26:24); "వింటున్నారా (ఈయనగారి వింతమాటలు)?' అన్నాడు ఫిరౌన్ తన చుట్టూ ఉన్న మందీ మార్బలంతో." (26:25); "ఆయన మీకూ ప్రభువే, మీకు పూర్వం గతించిన మీ తాత ముత్తాతలకూ ప్రభువే' అన్నాడు మూసా." (ఖుర్ఆన్-26:26)

"(చూశారా!) మీ వద్దకు పంపబడిన ఈ ప్రవక్తమహాశయులు గారిని, చూస్తే మహా తలతిక్క మనిషిలా కన్పిస్తున్నాడు' అన్నాడు ఫిరౌన్ (సభాసదుల్ని ఉద్దేశించి)." (26:27); "మీరు విజ్ఞతా వివేచనలు కలవారయితే (వినండి), ఆయన ప్రాక్పశ్చిమాలకు, వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువే' అన్నాడు మూసా." (26:28); "(ఇక చాలించు.) నీవు నన్ను తప్ప మరొకడ్ని దైవంగా అంగీకరించావంటే (జాగ్రత్త!) నిన్నుకూడా జైళ్ళలో పడి మగ్గుతున్నవారి దగ్గరకు చేరుస్తా (తెలుసా?)' అన్నాడు ఫిరౌన్ (బెదిరిస్తూ)." (ఖుర్ఆన్-26:29)

## (4) మంత్రజాలం, మాంత్రికుల విశ్వాసప్రకటన

"ఒకవేళ నేను నీముందు (నా దౌత్యానికి నిదర్శనంగా) ఒక స్పష్టమైన వస్తువుని ప్రదర్శిస్తే (నమ్ముతావా)?' అడిగాడు మూసా." (26:30); "(ముందు) అదేమిటో చూపు నీవు సత్యవంతుడవైతే' అన్నాడు ఫిరౌన్." (26:31); "(అప్పుడు)మూసా తన చేతికర్ర క్రింద పడవేశాడు. అది ఒక్కసారిగా నిజమైన సర్పంగా మారిపోయింది. ఆ తర్వాత అతను తన చేతిని చంకలో పెట్టి అదిమి బయటికి తీశాడు. అది ప్రేక్షకుల ముందు దేదీప్యమానంగా వెలిగిపోసాగింది." (ఖుర్ఆన్-26:32,33)

"ఫిరౌన్ తన చుట్టూ ఉన్న ఉన్నతాధికారుల్ని ఉద్దేశించి 'ఇతను నిజంగా ఆరితేరిన గొప్పమాంత్రికుడు. తన మంత్రబలంతో మిమ్మల్ని మీరాజ్యం నుండి వెళ్ళగొట్టాలని భావిస్తు న్నాడు. ఇలాంటి పరిస్థితిలో ఏంచేయాలో మీరే చెప్పండి' అన్నాడు."(26:34,35); "అతడ్ని, అతని సోదరుడ్ని ఆపి, వివిధపట్టణాలకు రాజభటుల్ని పంపండి. వారు కాకలుతీరిన మాంత్రికుల్ని మీదగ్గరకు పిలుచుకొస్తారు' అన్నారు వారు." (ఖుర్ఆన్-26:36,37)

"మూసా! నీ మంత్రశక్తితో మమ్మల్ని మా దేశం నుండి వెళ్ళగొట్టడానికి వచ్చావా మాదగ్గరికి? అలాగైతే మేము కూడా నీకు పోటీగా అలాంటి మంత్రశక్తినే తీసుకొస్తాము. ఈ పోటీ ఎప్పుడు ఎక్కడ జరగాలో నిర్ణయించుకో. మేమీ మాట నుండి వెనక్కి మరలము. నీవు కూడా మరలకూడదు. రా! బహిరంగ మైదానంలోకి (మా) ముందుకు రా!' అని సవాలు విసిరాడు ఫిరౌన్." (ఖుర్ఆన్-20:57,58)

"అయితే జాతర దినాన పెట్టుకుందాం. పొద్దెక్కిన తరువాత జనం గుమికూడాలి' అన్నాడు మూసా." (ఖుర్ఆన్-20:59)

“తర్వాత ఫిరౌన్ వెళ్ళి రకరకాల పన్నాగాలు పన్నాడు. జనాన్ని సమీకరించి ‘నేనే మీకు అందరికంటే పెద్ద ప్రభువుని’ అన్నాడు.” (ఖుర్ఆన్-79:23,24);

“ఒకరోజు నిర్ణీత సమయాన ప్రముఖ మాంత్రికుల్ని పిలిపించడం జరిగింది. ఆ సందర్భంగా ‘మీరు సభాస్థలికి వస్తున్నారా? అయితే మాంత్రికులు గెలిస్తే మనం (మన) మాంత్రికుల మతంలోనే ఉండిపోవచ్చు. (లేకుంటే మనకిక్కడ పుట్టగతులుండవు)’ అని జనంలో విస్తృతప్రచారం జరిగింది.” (ఖుర్ఆన్-26:38-40)

“మాంత్రికులు రంగంలోకి దిగి, “మేము గెలిస్తే మాకేమైనా బహుమానం దొరుకుతుందా?’ అని అడిగారు ఫిరౌన్‌ని. ‘తప్పకుండా, అప్పుడు మీరు మా సన్నిహితుల్లో చేరిపోతారు’ అన్నాడు ఫిరౌన్.” (ఖుర్ఆన్-26:41,42)

“మూసా (పాలకవర్గాన్ని ఉద్దేశించి) ‘దౌర్భాగ్యులారా! దేవునిపై అసత్యాలు మోపకండి. అలాచేస్తే ఒక మహోపద్రవం ద్వారా ఆయన మిమ్మల్ని సర్వనాశనం చేస్తాడు. అబద్ధం ఎవడు కల్పించినా వాడికి రోజులు మూడినట్లే’ అని హెచ్చరించాడు.” (ఖుర్ఆన్-20:60,61)

“ఈ మాటలు వినగానే వారిలో (పోటీ గురించి) భేదాభిప్రాయాలు పొడసూపాయి. వారు పరస్పరం రహస్యసమాలోచనలు జరుపుకున్నారు. చివరికి వారిలో కొందరు ఇలా అన్నారు: ‘వీరిద్దరు మాంత్రికులు మాత్రమే, వారు తమ మంత్రబలంతో మిమ్మల్ని మీ దేశం నుండి వెళ్లగొట్టాలని, మీ మతాన్ని, మీ ఉదాత్తసంస్కృతిని, తుడిచిపెట్టాలని భావిస్తున్నారు. కనుక ఈరోజు మీ శక్తియుక్తులన్నీ సమీకరించుకొని, సేనావాహినిగా బరిలోకి దిగండి. గుర్తుంచుకోండి, ఈరోజు ఎవరిది పైచేయి అవుతుందో వారిదే గెలుపు.’

“మాంత్రికులు (ప్రత్యర్థిని సంబోధిస్తూ) ‘మూసా! ముందు నువ్వు పడవేస్తావా లేక మమ్మల్ని పడవేయమంటావా?’ అనడిగారు.” (20:62-65) “కాదు, మీరే పడవేయండి’ అన్నాడు మూసా. (మాంత్రికులు తమ తాళ్ళు నేలమీద పడవేశారు.) మరుక్షణమే వారి త్రాళ్ళు, కర్రలు వారి మంత్రబలంతో మూసాకళ్ళకు (పాములుగా మారి) పరుగెత్తుతున్నట్లు కన్పించాయి. వాటిని చూసి అతను మనసులో భయపడ్డాడు.” (ఖుర్ఆన్-20:66,67)

“అప్పుడు మేము ‘మూసా! భయపడకు. నీవే గెలుస్తావు. నీచేతిలో ఉన్నదాన్ని క్రింద పడెయ్యి. ఇప్పుడే అది వారి అభూతకల్పనలన్నిటినీ తృటిలో మింగేస్తుంది. వీరు చేసినదంతా మంత్రజాలం మాత్రమే. మాంత్రికులు ఎంత అట్టహాసంగా వచ్చినా ఎన్నటికీ విజయం సాధించలేరు’ అని అన్నాము.” (20:68,69)

“మూసా ఇలా అన్నాడు: ‘మీరు పడవేసింది మంత్రజాలం మాత్రమే. చూడండి ఇప్పుడు దేవుడు దాన్ని ఎలా విచ్ఛిన్నం చేస్తాడో. ఆయన దుర్మార్గుల పనిని నెరవేరనీయడు. దురాత్ములకు ఎంత వెగటుకలిగినా దేవుడు తన నిదర్శనాలతో సత్యాన్ని సత్యంగా నిరూపించితీరుతాడు.” (ఖుర్ఆన్-10:81,82)

“సరిగ్గాఅదే సమయంలో మేము మూసాకు, అతనికర్ర క్రిందపడవేయమని చెప్పాం. అతనలా (కర్ర) క్రింద పడవేశాడో లేదో తృటిలో అది విజృంభించి, వారి అభూత కల్పనలన్నిటినీ చకచకా స్వాహాచేస్తూ పోయింది.” (ఖుర్ఆన్-7:117)



“ఈవిధంగా సత్యం సత్యంగా రుజువయింది. వారు కల్పించినవన్నీ అసత్యమని తేలిపోయింది. ఫిరౌన్, అతని అనుయాయులు ఈ పోటీలో ఘోరంగా పరాజితులయి పరాభవం పాలయ్యారు. మాంత్రికులు ఈ అద్భుత మహిమ చూసి అప్రయత్నంగా సాష్టాంగపడి ‘మేము సర్వలోక ప్రభువును విశ్వసించాం. మూసా, హారూన్‌లు విశ్వసించిన ప్రభువును మేమూ విశ్వసించాం’ అని బిగ్గరగా అన్నారు. (ఖుర్ఆన్-7:118-122)

“ఫిరౌన్ (మండిపడుతూ) ఇలా అన్నాడు: “ఏమిటీ, నేను అనుమతివ్వక ముందే మీరితడ్ని విశ్వసిస్తారా? ఇదంతా ఈపట్నం నుంచి ఇక్కడిపౌరుల్ని వెళ్ళగొట్టడానికి మీరంతా కలసి పన్నిన పన్నాగం.” (7:123); “ఇతను తప్పక మీకు మంత్రవిద్య నేర్పిన గురువై ఉంటాడు. సరే కానివ్వండి, (నా తడాఖా ఏమిటో) ఇప్పుడే మీకు తెలిసిపోతుంది.” (26:49); “నేనిప్పుడే మీ కాళ్ళు చేతులు పరస్పరం వ్యతిరేక దిశలో నరికించి మిమ్మల్ని ఖర్జూరపు చెట్లమొదళ్ళ మీద ఉరితీయిస్తాను.” (ఖుర్ఆన్-20:71)

“పరవాలేదు. మేము ఎటూ మా ప్రభువు దగ్గరికి పోవాల్సినవాళ్ళమే. మేము అందరికంటేముందు విశ్వసించాం. అంచేత మాప్రభువు మాపాపాలు క్షమిస్తాడని మాకు నమ్మకముంది.” (26:50,51); “మమ్మల్ని పుట్టించిన సృష్టికర్త సాక్షి! మా ముందుకు స్పష్టమైన నిదర్శనాలు వచ్చిన తర్వాత (సత్యాన్ని విశ్వసించకుండా) నీకు ప్రాధాన్యం ఇవ్వడం మా వల్ల కాదు. నీవు చేయదలచుకున్నదేమిటో చేసుకో. నీవు మహాఐతే ఇహలోకజీవితంలో మాత్రమే ఏదైనా చేస్తావు. మేము మాప్రభువును విశ్వసించాం. ఆయన మా తప్పులు మన్నిస్తాడు. నీవత్తిడి వల్ల మేము ప్రయోగించిన ఈ మంత్రజాలాన్ని క్షమిస్తాడు. దేవుడే శ్రేష్ఠుడు, శాశ్వతంగా ఉండేవాడు’ అన్నారు మాంత్రికులు నిర్భయంగా.” (ఖురాన్-20:72,73)

“ఫిరౌన్‌జాతి నాయకులు ఫిరౌన్‌ని మరింత ఎగదోస్తూ ‘మీరు మూసాను, అతని జాతివాళ్ళను దేశంలో అరాచకం సృష్టించడానికి అలాగే వదలిపెడ్తారా? వారు మిమ్మల్ని, మీ దైవాలను ఆరాధించడం మానేస్తే మీరు చూస్తూ ఊరుకుంటారా?’ అని అడిగారు. దానికి ఫిరౌన్ ‘నేను వారి కొడుకుల్ని హతమార్చి, వారి కూతుళ్ళను మాత్రమే బ్రతకనిస్తాను. వారి మీద మాకు పూర్తి అధికారం ఉంది’ అని చెప్పాడు.” (ఖుర్ఆన్-7:127)

“మూసా తనజాతిని ఓదార్చుతూ ‘దైవసహాయం వేడుకోండి. సహనం వహించండి. ఈ భూమి దేవునిది. దేవుడు తన దాసులలో తాను కోరినవారిని దానికి వారసులుగా చేస్తాడు. దేవుని పట్ల భయభక్తులతో మసలుకునేవారిదే అంతిమ విజయం’ అన్నాడు. అప్పుడతని జాతిప్రజలు ‘నీవు రాక ముందుకూడా మేము పీడించబడుతుండే వాళ్ళం. ఇప్పుడు నీవు వచ్చిన తర్వాత కూడా పీడించబడుతున్నాం’ అన్నారు. మూసా (వారికి ధైర్యం చెబుతూ) ‘మీప్రభువు త్వరలోనే మీశత్రువుల్ని తుదముట్టించి వారిస్థానంలో మిమ్మల్ని పుడమిపై (తన) ప్రతినిధులుగా నియమిస్తాడు. అప్పుడు మీరెలా నడుచుకుంటారో చూస్తాడు’ అని అన్నాడు.” (ఖుర్ఆన్-7:128,129)

## (5) అనుచరులు, ప్రకృతివిపత్తులు

“మూసా తన జాతిప్రజల్ని ఉద్దేశించి ‘ప్రజలారా! మీరు నిజంగా దేవుడ్ని విశ్వసిస్తే ఆయన మీదే భారం వేయండి. మీరు (చిత్తశుద్ధి కలిగిన) ముస్లింలు (దైవవిధేయులు)

అయితే (నా హితవులు పాటించండి).' దానికి వారు సమాధానమిస్తూ 'మేము దేవుని మీదే భారంవేశాం. దేవా! మమ్మల్ని దుర్మార్గుల కోసం పరీక్షగా చేయకు. నీ కారుణ్య కటాక్షాలతో మమ్మల్ని అవిశ్వాసుల బారి నుండి రక్షించు' అని అన్నారు." (ఖుర్ఆన్-10:84-86)

"మేము మూసాని, అతని సోదరుడ్ని ప్రేరేపిస్తూ 'మీ జాతిప్రజల కోసం ఈజిప్టులో కొన్ని ఇండ్లు సిద్ధం చేసుకోండి. వాటిని ఆరాధనా దిశగా చేసుకొని (సామూహిక) ప్రార్థనా వ్యవస్థ నెలకొల్పండి. విశ్వాసులకు శుభవార్త విన్పించండి' అని అన్నాము." (10:87); "మూసా ఇలా ప్రార్థించాడు: 'ప్రభూ! నీవు ఫిరౌన్‌కు, అతని అధికారులకు ఐహిక జీవితంలో ఐశ్వర్యం, సకలసాధనసంపత్తులు ఇచ్చావు. ప్రభూ! ప్రజల్ని నీమార్గంలోకి రాకుండా నిరోధించడానికా ఇచ్చింది? ప్రభూ! వారి సిరిసంపదలు నాశనం చెయ్యి. దుర్భర శిక్ష చూడ నంతవరకు (సత్యాన్ని) విశ్వసించనీయకుండా వారి హృదయ కవాటాలు మూసెయ్యి.' దానికి దేవుడు జవాబిస్తూ 'మీఇద్దరి వేడుకోలు స్వీకరించబడింది. (ధర్మంలో) స్థిరంగా ఉండండి. మూఢుల మార్గం అనుసరించకండి' అన్నాడు." (ఖుర్ఆన్-10:88,89)

"ఫిరౌనీయులలో (సత్యం పట్ల) స్పృహ రావడానికి మేము కొన్నేళ్ళ పాటు వారిని దుర్భిక్షానికి, పంటల కొరతకు గురిచేశాం. (అయినా వారిలో మార్పు రాలేదు.) మంచి రోజులు వచ్చినప్పుడు తామందుకు అర్హులమని అంటారు; దుర్దినాలు దాపురించినప్పుడు మూసాని, అతని అనుచరుల్ని దుశ్శకునాలుగా పరిగణిస్తారు. వారి దుశ్శకునం దేవుని చేతిలో ఉంది. కాని వారిలో చాలామంది ఆ సంగతి గ్రహించడం లేదు. వారు మూసాతో 'నీవు మాపై మంత్రతంత్రాలు ప్రయోగిస్తూ మాముందు ఎన్ని చమత్కారాలు ప్రదర్శించినా మేము నిన్ను ఎన్నటికీ విశ్వసించం' అని తెగేసి చెప్పారు." (ఖుర్ఆన్-7:130-132)

"చివరికి మేము వారిపైకి తుఫాను పంపించాము; మిడతల దండును వదిలాము; పేలు, పురుగుల్ని పంపాము; కప్పలను వదిలాము; నెత్తుటి వర్షం కురిపించాము. ఈ మహిమలన్నిటినీ మేము విడివిడిగా చేసి చూపాము. కాని వారు తిరస్కారం, తల బిరుసుతనాలనే ప్రదర్శించారు. వారసలు పరమ దుర్మార్గులు. ఏదైనా ఆపద వస్తే వారు మూసా దగ్గరికెళ్ళి ఇలా బ్రతిమాలుతారు: 'మూసా! నీకు నీప్రభువు నుండి లభించిన (ప్రవక్త)పదవి సహాయంతో ఈఆపద నుండి మమ్మల్ని గట్టెక్కించమని దేవుడ్ని ప్రార్థించు. ఈసారి నీవు మానుండి ఈ ఆపదను తొలిగిస్తే మేము నీమాట విని ఇస్రాయీల్ సంతతిని నీవెంట పంపుతాం.' అయితే వారిపై విరుచుకుపడనున్న శిక్షను మేము కొంతకాలం తొలగించగానే వారు ఆడినమాట తప్పేవారు." (ఖుర్ఆన్-7:134,135)

(మూసాప్రవక్త ద్వారా దేవుడు ఈ నిదర్శనాలు ఫిరౌన్‌కు చూపాడు: (1) మొట్ట మొదట మూసాకు, మాంత్రికులకు మధ్యజరిగిన పోటిలో మాంత్రికులు ఓడిపోయి ఆయన్ని దైవప్రవక్తగా విశ్వసించారు. (2) తరువాత మూసా చేసిన భవిష్యత్ ప్రకటన ప్రకారం ఈజిప్టులో తీవ్రమైన కరువు వచ్చింది. ఆయన చేసిన దుఆ (వేడుకోలు) వల్లనే అది తొలగిపోయింది. (3) మూసా ప్రకటన ప్రకారం దేశమంతటా పెనుతుఫాను వచ్చి అనేక ఊళ్ళు, పంటపొలాలు నాశనమయ్యాయి. ఆయన ప్రార్థన వల్లనే ఈ ఉపద్రవం కూడా తొలగిపోయింది. (4) మూసా ప్రకటనతో భయంకరమైన మిడతల దండు వచ్చింది. మళ్ళీ ఆయన చేసిన ప్రార్థనతోనే ఈ విపత్తు కూడా దూరమయింది. (5) మూసా ప్రకటనతో దేశమంతటా పేలు, ధాన్యపు పురుగులు ప్రబలిపోయాయి. జనం తీవ్ర ఆందోళన చెందారు. గోదాముల్లోని ధాన్యం నాశనమైపోయింది. ఈ ఆపద కూడా ఆయన ప్రార్థన వల్లనే తొలగిపోయింది. (6) మూసా హెచ్చరికతో దేశం నలుమూలలా భయంకరమైన కప్పలబెడద వచ్చిపడింది. ఈ బెడద కూడా ఆయన ప్రార్థన వల్లనే తొలగిపోయింది. (7) మూసా ప్రకటనతో దేశంలో నెత్తుటి విపత్తు వచ్చింది. నదులు, చెరువులు, బావులు, కుంటల్లోని నీరంతా రక్తమయమైపోయింది. చేపలు చచ్చి పోయాయి. వారం రోజులదాకా జనం మంచినీటి కోసం కటకటలాడి పోయారు.)



## (6) ఖారూన్ ధనగర్వం

"ఖారూన్ అనేవాడు మూసాజాతికి చెందిన వ్యక్తి. అయితే అతను తన జాతికి వ్యతిరే కంగా వ్యవహరిస్తూ విద్రోహిగా మారాడు. మేమతనికి అపార సిరిసంపదలు, నిక్షేపాలు ప్రసాదించాము. వాటికి సంబంధించిన తాళపు చెవుల్ని బలిష్ఠులైన కొందరు వ్యక్తుల సమూహం అతికష్టం మీద పైకెత్త గలుగుతుంది."

"ఓసారి అతని జాతిప్రజలు అతనితో ఇలా అన్నారు: 'మిడిసిపడకు. మిడిసిపడేవారిని దేవుడు ప్రేమించడు. దేవుడు నీకు ప్రసాదించిన ఐశ్వర్యంతో పరలోకగృహం నిర్మించుకో వడానికి ప్రయత్నించు. ప్రపంచం నుండి కూడా నీభాగం (పరలోకానికి తీసికెళ్ళడం) మరచి పోకు. దేవుడు నీకు మేలు చేసినట్లు నీవు కూడా (ప్రజలకు) మేలు చెయ్యి. ధరణిలో కలహాలు, సృష్టించకు. దేవుడు కలహకారుల్ని ప్రేమించడు." (ఖుర్ఆన్-28:76,77)

"ఈ మాటలు విని అతడు (మరింత నీల్గుతూ) 'ఇదంతా నాకు నా జ్ఞానం, తెలివి తేటల వల్ల లభించింది' అన్నాడు. దేవుడు పూర్వం ఇతనికంటే ఎక్కువ శక్తిసామర్థ్యాలు, మందీమార్బలం కలవారిని నాశనం చేశాడు. ఈసంగతి అతనికి తెలియదా? (ఖు:28:78)

"ఓరోజు అతను పూర్తి ఠీవి-దర్పాలతో తనజాతి ప్రజల ముందుకొచ్చాడు. అప్పుడు ఐహిక వ్యామోహపరులు కొందరు అతడ్ని చూసి 'ఖారూన్‌కు లభించిన సిరిసంపదలు మనకూ లభించివుంటే బావుండు! ఖారూన్ అదృష్టవంతుడు' అన్నారు. అయితే (దైవిక) జ్ఞానం కలవారు (వారి ఆలోచనాధోరణిని విమర్శిస్తూ) 'మీ వైఖరి చాలా విచారకరం. విశ్వసించి సత్కార్యాలు చేసేవారికి దేవుని (దగ్గరున్న) ప్రతిఫలం ఎంతో శ్రేష్ఠమైనది. సహనం వహించేవారికే ఈ మహాభాగ్యం లభిస్తుంది' అన్నారు. చివరికి మేము ఖారూన్‌ని, అతని ఇంటిని (హఠాత్తుగా) భూమిలోకి దిగబడిపోయేలా చేశాము. అప్పుడు దేవునికి వ్యతిరేకంగా అతడ్ని ఆదుకునే వారెవరూ లేకపోయారు. అతను కూడా తననుతాను కాపాడుకోలేక పోయాడు." (ఖుర్ఆన్-28:79,80,81)

"నిన్నటిరోజు అతని హోదా అంతస్తులు చూసి అలాంటివి తమకూ కావాలని కోరు కున్నవారు ఇప్పుడు విచారం వెలిబుచ్చుతూ ఇలా అన్నారు: 'మనం ఒక విషయం మరచి పోయాం. దేవుడు ఎవరికి పుష్కలంగా ఉపాధి ఇవ్వదలచుకుంటాడో వారికే పుష్కలంగా ఉపాధి లభిస్తుంది. ఆయన మరెవరికి పరిమితంగా ఉపాధి ఇవ్వాలని భావిస్తాడో వారికి

పరిమితంగానే లభిస్తుంది. దేవుడు మనల్ని అనుగ్రహించి ఉండకపోతే ఆయన మనల్ని కూడా భూమిలోకి అణగద్రొక్కేవాడు. అయ్యో! అవిశ్వాసులు సాఫల్యం చెందరన్న సంగతి (అప్పుడు) మనకు కొంచెం కూడా గుర్తుకు రాలేదే!" (ఖుర్ఆన్–28:82)

## (7) ఒక విశ్వాసి ఉపదేశం

"మూసా మా తరఫున సత్యం(తో కూడిన అనేక మహిమలు) వారి ముందుకు తీసుకు వచ్చాడు. (దాంతో చాలామంది ఇస్రాయీలీలు మూసాకు అనుచరులైపోసాగారు. కాని ఆ దుర్మార్గులకు మాత్రం కనువిప్పు కలగలేదు.) వారు (మూసా అనుచరుల్లో భయోత్పాతం సృష్టించేందుకు) 'సత్యాన్ని విశ్వసించి అతనితో కలసి పోయినవారి మగపిల్లలను హత మార్చండి. వారి ఆడపిల్లల్ని మాత్రమే సజీవంగా వదలిపెట్టండి' అన్నారు. కాని సత్య తిరస్కారుల పాచికలేవీ పారలేదు." (ఖుర్ఆన్–40:25)

"ఓరోజు ఫిరౌన్ తన సభాసదులతో 'నన్ను వదలండి, నేను మూసాను చంపితీరుతా. అతను తన ప్రభువును మొరపెట్టుకోనివ్వండి (చూద్దాం). ఇతని ధోరణి చూస్తుంటే ఇతను మీ మతాన్ని, మీ జీవనవ్యవస్థను మార్చివేస్తాడని నాకు అనుమానంగా ఉంది. లేదా ఇతను దేశంలో అరాచకాన్నయినా సృష్టించవచ్చు' అని అన్నాడు. మూసా (ఈ బెదిరింపుల్ని ఖాతరు చేయకుండా) 'తీర్పుదినాన్ని నమ్మని ప్రతి గర్విష్ఠి నుండి నేను నాప్రభువు, మీ ప్రభువయిన దేవుని శరణుపొందాను' అన్నాడు." (ఖుర్ఆన్–40:26,27)

"ఆ సందర్భంలో ఫిరౌన్‌వంశానికి చెందిన ఒక విశ్వాసి తన విశ్వాసాన్ని బహిర్గతం చేయకుండా ఇలా అన్నాడు: 'మీరు ఒక మనిషిని తన ప్రభువు దేవుడేనని అన్నంత మాత్రాన చంపుతారా? అతను మీ ప్రభువు నుండి మీ వద్దకు సాక్ష్యాధారాలు తెచ్చాడు. ఒకవేళ అతను చెప్పేది అబద్ధమైతే అతని అబద్ధం అతనికే చుట్టుకుంటుంది. అలాగాక అతను చెప్పేది, చూపించేది నిజమే అయితే, అతను హెచ్చరిస్తున్న భయంకర దుష్పరిణామాలలో కొన్నయినా మీపై వచ్చిపడటం ఖాయం. అబద్ధాలకోరుకు, హద్దుమీరి ప్రవర్తించేవాడికి దేవుడు ఎన్నటికీ సన్మార్గబుద్ధి ప్రసాదించడు. నా జాతిప్రజలారా! ఈరోజు మీకు సామ్రాజ్య వైభవం ఉంది. దేశంలో మీ ఆధిక్యత, అధికారాలే చెలామణిఅవుతున్నాయి. కాని (ఏ క్షణంలోనైనా హఠాత్తుగా) మనపై దైవశిక్ష విరుచుకుపడితే మనకెవరు సహాయం చేస్తారు?"

ఫిరౌన్ (అతని మాటలు పట్టించుకోకుండా) 'నేను మాత్రం నాకు సమంజసమని తోచిన సలహా మీకిస్తున్నాను. నేను మిమ్మల్ని సరైన దారినే నడిపిస్తున్నాను' అన్నాడు.

దానికా విశ్వాసి ఇలా అన్నాడు: 'సోదరులారా! గత జాతులకు దాపురించిన దుర్దినాలు వంటివి మీక్కూడా దాపురిస్తాయేమోనని నాకు భయంగా ఉంది. గతంలో నూహ్‌జాతికి, ఆద్‌జాతికి, సమూద్‌జాతికి, ఆతర్వాత కూడా అనేక జాతులకు దుర్దినాలు దాపురించాయి. దేవుడు తన దాసులకు అన్యాయం చేయాలనుకోడు." (ఖుర్ఆన్–40:28–31)

"ఫిరౌన్ (మరింత తలబిరుసుతో మాట్లాడుతూ) "హామాన్! నాకోసం ఒక ఎత్తయిన గోపురం కట్టించు. నేను (దానిమీదెక్కి) ఆకాశమార్గాలకు చేరుకొని అక్కడ మూసా ఆరాధించే దేవుడు ఉన్నాడో లేడో తొంగిచూస్తా. నాకైతే ఇతను పచ్చి అబద్ధాలకోరులా కన్పడుతున్నాడు'



అని అన్నాడు. ఈవిధంగా ఫిరౌన్‌కు అతని దుష్కార్యాలన్నీ మనోహరమైనవిగా చేయబడ్డాయి. అతడు సన్మార్గం అవలంబించకుండా నిరోధించబడ్డాడు. ఫిరౌన్ పన్నిన దుష్టపన్నాగాలన్నీ (అతని) వినాశానికే దారితీశాయి." (ఖుర్ఆన్–40:36.37)

"విశ్వాసుల విషయంలో దేవుడు ఫిరౌన్ భార్య (ఆసియా) గాథను దృష్టాంతంగా పేర్కొంటున్నాడు. ఆమె (దైవాన్ని ప్రార్థిస్తూ) 'ప్రభూ! నాకోసం నీదగ్గర స్వర్గంలో ఒక గృహం నిర్మించు. నన్ను ఫిరౌన్ బారినుండి, అతని (దుష్ట)కర్మల (కీడు)నుండి కాపాడు. (ఈ) దుర్మార్గపు జాతి నుండి నాకు విముక్తి కలిగించు' అని అన్నది." (ఖుర్ఆన్–66:11)

## (8) ఫిరౌన్ పర్యవసానం

"వారి దగ్గరకు సౌశీల్యుడైన దైవప్రవక్త (మూసా) వచ్చి ఇలాఅన్నాడు: 'దేవుని దాసుల్ని నాకప్పగించండి. నేను మీకోసం వచ్చిన నిజాయితీపరుడైన దైవప్రవక్తను. దేవుని పట్ల తిరుగుబాటువైఖరి అవలంబించకండి. నేను మీముందు గట్టినిదర్శనాలు చూపుతాను. మీరు నామీద చేసేదాడి నుండి నేను నాకూమీకూ ప్రభువైన దేవుని శరణుపొందాను. మీరు నామాట ఒప్పుకోకపోతే, నామీద చేయిచేసుకోకండి.' చివరికతను వీరు నేరస్థులని (తనను, తన అనుచరుల్ని కాపాడమని) తన ప్రభువుని ప్రార్థించాడు." (ఖుర్ఆన్–44:17–22)

"ఇప్పుడిక రాత్రికిరాత్రి నా దాసుల్ని తీసుకొని బయలుదేరు. వారికోసం సముద్రంలో నిర్జలమైన దారి ఏర్పరచుకో. మిమ్మల్ని ఎవరూ వెంబడిస్తారన్న భయముండదు. మరె లాంటి భయంకూడా ఉండదు' అని మేము మూసాకు సూచించాం." (ఖుర్ఆన్–20:77)

"(ఈసంగతి తెలిసి) ఫిరౌన్ (సైనిక సమీకరణ కోసం) రాజభటుల్ని పిలిచి 'వీరు కొద్ది మంది మాకు ఆగ్రహం తెప్పించారు. మనం అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్న సాయుధ బలగం' అని చెప్పి పంపించాడు." (26:53–56); (ఓరోజు) ఉదయాన్నే ఫిరౌనీయులు వారిని వెంబడించడానికి బయలుదేరారు. (ఒకచోట) రెండుపక్షాలు ఒకదానికొకటి తారసపడగానే మూసా అనుచరులు (భయపడిపోతూ) 'మేమిక పట్టుబడి పోయాం' అని కేకలు పెట్టారు." (ఖుర్ఆన్–26:60,61)

"కాదు (అలా జరగదు). నాతోపాటు నా ప్రభువున్నాడు. ఆయన తప్పకుండా నాకు దారి చూపుతాడు' అన్నాడు మూసా. మేమప్పుడు మూసాకు దివ్యావిష్కృతి ద్వారా 'నీ చేతి కర్రతో సముద్రం మీద ఓ దెబ్బ వెయ్యి' అని ఆదేశించాం. (మూసా అలా చేయగానే) సముద్రం ఒక్కసారిగా చీలిపోయింది. చీలిన ప్రతి భాగం ఎత్తయిన కొండలా తయారైంది. ఆ (చీలికల మధ్య) ఏర్పడిన ఖాళీస్థలంలోనే మేము రెండో పక్షాన్ని కూడా దగ్గరగా తీసుకు వచ్చాం. తర్వాత మేము మూసాను, అతని వెంటనున్న వారందర్నీ రక్షించాం. మిగతావారిని ముంచివేశాం. (26:62–66); ఫిరౌన్ మునిగిపోతూ 'నేను ఇస్రాయీలీలు విశ్వసించిన దేవుడ్ని విశ్వసించాను. ఆయన తప్ప మరో దేవుడు లేడు. నేనిప్పుడు దైవవిధేయుల్లో చేరిపోయాను' అని అన్నాడు." (ఖుర్ఆన్–10:90)

"ఇప్పుడా నీవు విశ్వసించేది? ఇంతకుపూర్వం నీవు అవిధేయుడవయి దుర్మార్గపు పనులు చేస్తుండేవాడివి. ఇప్పుడు నీవు భావితరాలకు గుణపాఠంగా మిగిలిపోవడానికి నీశవాన్ని

మాత్రమే మేము కాపాడుతాం' (అని సమాధానమివ్వబడింది). చాలామంది మా నిదర్శనాల విషయంలో అజాగ్రత్త, ఏమరుపాటులకు లోనైవున్నారు. (ఖుర్ఆన్–10:91,92)

3000 ఏళ్ళ క్రితంనాటి ఫిరౌన్‌శవం ఈనాటికీ సురక్షితంగా ఉంది. క్రీ.శ. 1907లో సర్‌గ్రాఫ్టన్ ఎలైట్ స్మిత్ ఆ శవాన్ని పరీక్షిస్తే, దానిపై ఉప్పుపొర పేరుకుపోయిఉంది. ప్రస్తుతం ఈ శవం (మమ్మి) ఈజిప్టులోని జాతీయ పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది.

ప్రాచీన ఈజిప్టు చక్రవర్తుల్ని ఫిరౌన్‌లు అంటారు. వీరిలో అనేక వంశాలుండేవి. మూసా ప్రవక్త (అలై)కు పూర్వంనుండి ఫిరౌన్‌ల వంశం 'రామ్సెస్-1'తో ప్రారంభమైంది. అతని కుమారుడు 'సెతి' 2వ ఫిరౌన్‌గా ప్రసిద్ధిచెందాడు. సెతి కుమారుడు 'రామ్సెస్-2'. ఇతని కాలంలోనే మూసాప్రవక్త (అలై) జన్మించారు. ఇతని పోషణలోనే పెరిగి పెద్దవార య్యారు. క్రీ.శ.1886లో పురావస్తుశాఖ చేపట్టిన త్రవ్వకాల్లో ఒక పిరమిడ్ నుండి ఓ శవం బయల్పడింది. దానిపై వున్న వస్త్రాలు తీసిచూస్తే శరీరానికి చుట్టబడిన ఆఖరి వస్త్రంపై "రామ్సెస్-2" అని రాయబడిఉంది. ఇతని పరిపాలనాకాలం క్రీ.పూ. 1304లో ప్రారంభమై ఉంటుందని పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం. రామ్సెస్-2 చనిపోయిన తర్వాత అతని కొడుకు "మిన్ఫతాహ్" అధికారంలోకి వచ్చాడు. ఇతనే మూసాప్రవక్త అందజేసిన దైవసందేశాన్ని తిరస్కరించి, ఎర్రసముద్రంలో మునిగి చనిపోయిన ఫిరౌన్ చక్రవర్తి. (ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ రెలీజియన్, భాగం-5)

## (9) ఇస్రాయీలీలకు హితబోధ

"ఆతర్వాత మేము వారి స్థానంలో అణచివేతకు గురైన బలహీనవర్గం ప్రజల్ని తెచ్చి పెట్టాము. తూర్పు నుండి పడమర వరకు మేము ఎన్నోశుభాలు కల్గించిన భూభాగానికి వారిని వారసులుగా చేశాం. ఈవిధంగా ఇస్రాయిల్ సంతతివారి విషయంలో నీప్రభువు చేసిన వాగ్దానం నెరవేరింది. కారణం వారు సహనం వహించడమే." (ఖుర్ఆన్–7:137)

(ఇస్రాయిల్ అంటే దైవదాసుడని అర్థం. ఇది యాఖూబ్‌ప్రవక్త (అలై)కు దేవుడిచ్చిన బిరుదు. ఈయన తండ్రి ఇస్‌హాఖ్, తాత ఇబ్రాహీం (అలైహి) కూడా దైవప్రవక్తలే.)

"ఇస్రాయిల్ సంతతివారిని మేము సముద్రం దాటించి ఆవలకు చేర్చాము. అక్కడ నుండి వారు మరోచోటికి ప్రయాణం సాగించారు. దారిలో వారికి విగ్రహాలు పట్టుకొని కూర్చున్న ఒక జాతి తారసపడింది. అప్పుడు వారు 'మూసా! వారు పూజిస్తున్న దైవం లాంటిది మాక్కూడా ఏదైనా దైవాన్ని చేసివ్వు' అన్నారు. దానికి మూసా 'మీరు మరీ మూఢుల్లా మాట్లాడుతున్నారు. వారు అవలంబించిన ఆరాధన నాశనమవుతుంది. వారు చేస్తున్నది పనికిమాలిన పని' అన్నాడు. ఇంకా 'దేవుడు మిమ్మల్ని యావత్తు మానవాళిపై ఔన్నత్యం ప్రసాదించాడు. అలాంటి దేవుడ్ని వదలి నేను మీకోసం వేరే (మిథ్యా)దైవాన్ని వెదకిపెట్టాలా?' అన్నాడతను." (ఖుర్ఆన్–7:138–140)

"మీకు దేవుడు చేసిన ఉపకారాలు జ్ఞాపకం తెచ్చుకోండి. మీకు తీవ్రయాతనలు పెట్టుండిన ఫిరౌనీయుల బారినుండి ఆయన మిమ్మల్ని కాపాడాడు. వారు మీ కొడుకుల్ని చంపుతూ మీ కూతుళ్ళను మాత్రమే సజీవంగా ఉండనిచ్చేవారు. అది మీకు మీ ప్రభువు



వైపున కఠిన పరీక్షాకాలం. మరొక విషయం కూడా జ్ఞాపకం తెచ్చుకోండి. కృతజ్ఞులైవుంటే మీకు మరిన్ని వరాలు అనుగ్రహిస్తానని, కృతఘ్నులైపోతే తన శిక్ష చాలా కఠినంగా ఉంటుందని మీ ప్రభువు మిమ్మల్ని హెచ్చరించాడు." (ఖుర్ఆన్–14:6,7)

## (10) ఇస్రాయీలీలపై దేవుని అనుగ్రహాలు

"మూసా జాతిలో సత్యానికి అనుగుణంగా (ప్రజలకు) మార్గం చూపిస్తూ, సత్యం ప్రాదిపదిక పైన్నే న్యాయం, నిర్ణయాలు చేసే వర్గం కూడా ఒకటుంది. మేమా జాతిని పన్నెండు కుటుంబాలుగా విభజించి శాశ్వత వర్గాలుగా రూపొందించాము. మూసాను అతని జాతి ప్రజలు నీరు కావాలని అడిగితే, మేము ఒక చట్టుబండపై తన చేతికర్రతో కొట్టమని అతడ్ని ఆదేశించాం. (అప్పుడు మూసా తన చేతికర్రతో చట్టు బండపై కొట్టగానే) ఆ చట్టుబండ నుండి ఒక్కసారిగా పన్నెండుఊటలు పెల్లుబికాయి. ప్రతివర్గం తన త్రాగునీటి స్థలాన్ని గుర్తించింది. మేము వారిపై (ఎండనుండి కాపాడుకోవడానికి) మేఘచ్ఛాయ కల్పించాం. వారికి (ఆహారంగా) మన్న, సల్వాలను అవతరింపజేశాం. 'మేము మీకు ప్రసాదించిన ఈ పరిశుద్ధపదార్థాలు తినండి' (అనిచెప్పాం). (ఖుర్ఆన్–7:159,160)

*(మన్న అంటే ఒక విధమైన ఖాద్యవస్తువు. ఇది ఆకాశం నుండి మంచులా కురిసి నేల మీద పేరుకుంటుంది. సల్వా అంటే ఓ రకమైన పక్షులు. ఇవి గాలిలో ఎగురుతూ సులభంగా దొరికేవి. ఇవి రెండూ యూదులకు నలభైఏండ్ల పాటు ప్రసాదించబడ్డాయి.)*

"(కాని ఆ తరువాత కొన్నాళ్ళకే) మీరు (కష్టపడకుండా లభిస్తున్న ఎంతో శ్రేష్ఠమయిన ఆహారం పట్ల అసంతృప్తిచెంది) మూసాతో ఇలా అన్నారు: 'మూసా! మేమిక ఒకే విధమైన ఈ తిండితింటూ వుండలేము. మాకోసం నేల నుండి ఉత్పత్తిఅయ్యే కూరగాయలు, దోసకాయలు, వెల్లుల్లి, గోధుమలు, పప్పుధాన్యాలు, ఉల్లిపాయలు మొదలైన ఆహార పదార్థాలు పండింపజేయమని నీ ప్రభువును ప్రార్థించు." (2:61)

"దానికి మూసా ఇలా అన్నాడు: 'ఎంతో శ్రేష్ఠమైన పదార్థాలు వుండగా వాటిని వదలి హీనమైన పదార్థాలు కోరుతున్నారా! అలాగయితే ఏదైనా జనావాసంలోకి పదండి. అక్కడ మీరు కోరిన వస్తువులు దొరుకుతాయి." (2:61); "అయితే క్షమాభిక్ష కోరుతూ, సాష్టాంగ పడుతూ పట్టణప్రధానద్వారం గుండా ప్రశించాలి. అప్పుడే మేము మీ పొరపాట్లు క్షమిస్తాం. సదాచార సంపన్నులకు మరింత భాగ్యం అనుగ్రహిస్తాము.' కాని ఆ దుర్మార్గులు మేము ఆదేశించిన విషయాన్ని మార్చివేశారు. అప్పుడు మేము వారి విద్రోహచర్యలకు శిక్షగా ఆకాశం నుండి వారిపై ఆపద తెచ్చిపడవేశాం. (ఖుర్ఆన్–7:161,162)

## (11) తూర్‌కొండపై తౌరాత్ స్వీకరణ

"మేము ముప్ఫయి రోజుల గడువుకోసం మూసాను పిలిపించాం. తరువాత ఈ గడువును పదిరోజులు పొడిగించాం. ఇలా అతని ప్రభువు నిర్ణయించిన గడువు నలభై రోజులయింది. మూసా బయలుదేరే ముందు తన సోదరునితో 'నేను వెళ్ళిన తర్వాత నీవు నా తరఫున మన జాతిప్రజలకు నాయకత్వం వహించి సరైన రీతిలో పనిచేస్తూ ఉండాలి. విచ్ఛిన్నకారుల త్రోవ నడవకు' అని అన్నాడు." (ఖుర్ఆన్–7:142)

ఆ తర్వాత మూసా మా నిర్ణీత సమయానికి (కొండ దగ్గరకు) చేరుకున్నప్పుడు అతని ప్రభువు అతనితో ప్రత్యక్షసంభాషణ జరిపాడు. (అప్పుడు) మూసా తన ప్రభువును వేడుకుంటూ 'ప్రభూ! నా కళ్ళకు శక్తి ప్రసాదించి నీ దర్శనభాగ్యం కలిగించు' అన్నాడు. దానికి దేవుడు 'నీవు నన్ను (ఇహలోకంలో) చూడలేవు. సరే, ఈకొండ వైపు కాస్త దృష్టి సారించు. అది తన స్థానంలో యధాతథంగా ఉంటే నీవు నన్ను చూడగలవు' అన్నాడు.

ఆ తరువాత అతని ప్రభువు తన దివ్యతేజస్సును ఆ కొండపై ప్రసరింపజేయగానే అది మరుక్షణం తునాతునకలైపోయింది. దాంతో మూసా స్పృహతప్పి పడిపోయాడు. కాస్సేపటికి స్పృహ రాగా 'ప్రభూ! నీవు ఎంతో పరిశుద్ధుడవు. జరిగిన పొరపాటుకు పశ్చాత్తాపపడుతూ నిన్ను క్షమాపణ వేడుకుంటున్నాను. (నన్ను క్షమించు.) అందరికంటే ముందు నేనే నిన్ను విశ్వసిస్తున్నాను' అని ప్రార్థించాడు మూసా. (ఖుర్‌ఆన్-7:143)

"అప్పుడు దేవుడు 'మూసా! నేను నీకు ప్రవక్త పదవినిచ్చాను. నీతో ప్రత్యక్ష సంభాషణ జరిపాను. ఇలా నీకు యావత్‌మానవాళిపై ప్రాధాన్యతనిచ్చాను. కనుక నేను ప్రసాదించేదాన్ని స్వీకరించి నాకు కృతజ్ఞుడవైఉండు' అని ఉపదేశించాడు." (ఖుర్‌ఆన్-7:144)

"ఆ తరువాత మేము జీవిత సమస్త రంగాలకు సంబంధించిన హితవులు, ప్రతి విషయానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలు (రాతి)పలకలపై రాసి మూసాకు ప్రసాదించాము. ఆ సందర్భంలో మేము ఇలా ఉపదేశించాము: 'ఈ హితోక్తులను దృఢంగా పట్టుకొని ఉండాలి. ఇందులోని విషయాలను (మార్చకుండా) సక్రమరీతిలో అనుసరించమని నీ జాతిప్రజలను ఆదేశించు...'" (ఖుర్‌ఆన్-7:145)

## (12) హరూన్ (అలైహి) పర్యవేక్షణలో ఇస్రాయీలీలు

"సరే, నీవెనుక (నీవిక్కడికి వచ్చిన తర్వాత) మేము నీజాతిని పరీక్షకు గురిచేశాం. సామిరీ (అనేవాడు) వాళ్ళను పెడదారి పట్టించాడు' అన్నాడు దేవుడు. మూసా ఈమాట విని ఎంతో ఆగ్రహం, విచారంతో కూడిన భావోద్రేకాలతో తనజాతి దగ్గరకు తిరిగొచ్చాడు. వచ్చీరాగానే 'నాజాతి ప్రజలారా! మీ ప్రభువు మీకు మంచివాగ్దానాలు చేయలేదా? అది మీకు ఆలస్యమైనట్లు అన్పించిందా? లేక నాకు మీరు చేసిన వాగ్దానభంగానికి మీరే మీ ప్రభువు ఆగ్రహాన్ని ఆహ్వానించదలిచారా?' అని అడిగాడు. (ఖుర్‌ఆన్-20:85,86)

"మా అంతట మేము వాగ్దానభంగం చేయలేదు. అసలేం జరిగిందంటే మేము నగల బరువు మోయలేక చస్తున్నాం. అంచేత వాటిని కాస్తా తీసిపారేశాం, అంతే' అన్నారు వారు. ఆ తర్వాత సామిరీ తన పాత్ర నిర్వహించాడు. అతను వారికోసం ఒక ఆవుదూడ విగ్రహం తయారుచేశాడు. ఆ విగ్రహంలో నుంచి దూడ అరుపులాంటి ధ్వని వినవస్తుండేది. జనం (ఆశ్చర్యం చూసి) 'ఇదే మన దైవం. మూసా దైవం కూడా ఇదే. మూసా దీన్ని మరచి పోయాడు' అని అరిచారు..." (ఖుర్‌ఆన్-20:87-89)

"హారూన్ (మూసా రాకకు) ముందే (నచ్చజెబుతూ) 'సోదరులారా! దీని ద్వారా మీరు పరీక్షకు గురయ్యారు. మీ ప్రభువు కరుణామయుడే. కనుక మీరు నన్ను అనుసరించండి. నామాట వినండి' అన్నాడు. కాని వారు (అతని మాటలు పెడచెవిన పెడ్తూ) 'మూసా తిరిగి



రానంతవరకు మేము దీన్నే పూజిస్తుంటాం' అని చెప్పేశారు." (ఖుర్‌ఆన్-20:90,91)

అటునుండి మూసా విచారం, ఆగ్రహం కలగలిపిన భావోద్రేకాలతో తన జాతి ప్రజల దగ్గరకు తిరిగొచ్చాడు. వచ్చీరాగానే "నేను వెళ్ళిన తరువాత మీరు చాలా దుర్మార్గానికి పాల్పడ్డారు. మీప్రభువాజ్ఞ కోసం ఎదురుచూసేటంత ఓపిక కూడా లేకపోయిందా మీకు?" అని విరుచుకుపడ్డాడు. (ఆ కోపంలో) అతను (తౌరాత్) రాతి పలకలను విసిరిపారేశాడు; సోదరుడి తల (వెంట్రుకలు) పట్టి లాగాడు. (7:150); "హారూన్! వీరు మార్గ భ్రష్టులైపో తుంటే చూసి వారిని వారించకుండా ఏ విషయం నిన్ను అడ్డుకుంది? నీవు నాఆదేశం ఎందుకు ఉల్లంఘించావు?" అని అడిగాడు మూసా. (20:92,93)

"దానికి హారూన్ ఇలా అన్నాడు: 'నా తల్లికుమారుడా! నా గడ్డాన్ని, తలవెంట్రుకల్ని పట్టిలాగకు. నేను ఇస్రాయీల్ సంతతిలో చీలికలు తెచ్చిపెట్టానని, నీమాట ఖాతరు చేయ లేదని అంటావేమోనని భయపడ్డా. (దేవుని దయవల్ల అలా అనలేదు)" (20:93,94); "నాతల్లి కుమారుడా! వీరు నన్ను బలహీనుడిగా భావించి నానోరు నొక్కేశారు. ఇంకాస్తయితే నన్ను చంపేసేవారే...' 'ఈ మాటలు విని మూసా (కొంచెం మెత్తబడ్డాడు.) 'ప్రభూ! నన్ను, నా సోదరుడ్ని క్షమించు. మమ్మల్నిద్దర్నీ నీ కారుణ్యాశ్రయంలో చోటివ్వు. నీవు అందరికంటే గొప్ప కరుణామయుడవు' అని దైవాన్ని వేడుకున్నాడు. (ఖుర్‌ఆన్-7:150,151)

"సామిరీ! ఇక నీ సంగతేమిటీ?' అడిగాడు మూసా. 'నేను ప్రజలకు కనపడని ఒక (విచిత్ర) వస్తువుని చూశాను. నేను సందేశహరుని అడుగుజాడల నుంచి ఓ పిడికెడు (మట్టి) తీసుకొని (విగ్రహంలో) పోశాను. అలా చేయాలని నా మనస్సుకు అన్పించింది' అని అన్నాడు సామిరి. "సరే వెళ్ళు (ఇక్కడ్నుంచి). ఇకనుండి నీవు జీవితాంతం 'నన్ను తాకకండి' అని చెబుతూ తిరుగుతుంటావు. నీకోసం వాగ్దాన సమయమొకటి నిర్ణయమైఉంది. అది ఎట్టి పరిస్థితిలోనూ తప్పిపోదు. చూడు, ఇప్పుడు నీ ఇష్టదేవత గతి ఏమౌతుందో! దీన్ని మేము కాల్చి, ముక్కలు ముక్కలుగా చేసి సముద్రంలో విసిరిపారేస్తాము... ప్రజలారా! మీ దేవుడు అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు..." (ఖుర్‌ఆన్-20:96-98)

"చివరికి మూసా కోపం చల్లారింది. అప్పుడతను (రాతి) పలకలను ఎత్తి చేతుల్లోకి తీసుకున్నాడు. వాటిపై తమ ప్రభువుకు భయపడేవారి కోసం మార్గదర్శనం, కారుణ్యం ఉన్నాయని వ్రాయబడి ఉంది." (ఖుర్‌ఆన్-7:154)

సామిరి అనేది అతని అసలుపేరు కాదు. ఇది అతని తెగ లేదా సంతతి లేదా స్వస్థలానికి సంబంధించిన పేరయి ఉంటుంది. బైబిల్ ప్రకారం ఈ వ్యక్తి అసలుపేరు హారూన్. మూసా (అలై) సోదరుని పేరు కూడా హారూనే అయినందున యూదులు సామిరి చేసిన నిర్వాకాన్ని పొరపాటునో లేక కావాలనో హారూన్ (అలై)కు అంటగట్టారు.

## (13) యూదుల తలబిరుసుతనం

"మేము నిర్ణయించిన సమయానికి రావడానికి అతను తనజాతి ప్రజల్లో డెబ్భై మందిని ఎన్నుకున్నాడు. (వారు తూర్‌కొండ దగ్గరకు చేరుకున్నారు. అప్పుడు)-(7:155); మీరు మూసాతో 'మేము మాకళ్ళతో దేవుడ్ని ప్రత్యక్షంగా చూడనంతవరకు నీ మాటలు నమ్మం"

అన్నారు. అప్పుడు మీరు చూస్తుండగానే ఓ భయంకరమైన పిడుగు మీపై పడింది. దాంతో మీరంతా మృత్యువాత పడ్డారు. అయితే మేము చేసినమేలుకు మాపట్ల కృతజ్ఞులై ఉంటారని మిమ్మల్ని మళ్ళీ బ్రతికించాము." (ఖుర్ఆన్-2:55,56)

"అప్పుడు మూసా ఇలా ప్రార్థించాడు: 'స్వామీ! నీవు కోరివుంటే నన్ను, వీరిని ఎప్పుడో చంపేవాడివి. కాని (ఇప్పుడు) మాలోకొందరు బుద్ధిహీనులు చేసిన ఈపనికి మమ్మల్నందర్నీ చంపుతావా? ఇది నీవు పెట్టిన పరీక్షే. దీనిద్వారా నీవు తలచిన విధంగా కొందరిని దారి తప్పిస్తావు; మరికొందరికి సన్మార్గబుద్ధి ప్రసాదిస్తావు. నీవే మా రక్షకుడివి. మమ్మల్ని క్షమించు, కనికరించు. నీవే అందరికంటే గొప్పక్షమాశీలివి. మాకు ఇహలోకంలోనూ, పర లోకంలోనూ మేలు రాసిపెట్టు. మేము నీవైపు మరిలాము. (ఇక నీవే మాకు దిక్కు).'

దానికి (విశ్వప్రభువు ఇలా) అన్నాడు: 'శిక్ష విషయంలో నేను తలచుకున్న వారిని శిక్షిస్తాను. కాని నా కారుణ్యం యావత్తు సృష్టిని ఆవరించిఉంది. అలాగే దుష్కార్యాలు మానేసి, నా సూక్తులు విశ్వసించి (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ విధి నెరవేర్చేవారికి మాత్రమే నేను మేలు రాసిపెడ్తాను." (ఖుర్ఆన్-7:155,156)

## (14) గోయజ్ఞం, సబ్బత్ నియమం

యూదులు తమ నిర్వాకంపట్ల పశ్చాత్తాపంచెందినప్పటికీ ఈ పాపానికి నిష్కృతిగా గోపూజకు పాల్పడినవారిని గోపూజ జోలికిపోనివారు వధించాలని మూసా(అలైహి) ఆదేశించారు (2:54). దాని ప్రకారం గోభక్తులందర్నీ వధించడం జరిగింది. ఇలా డెబ్భైవేల మంది గోభక్తులు హతమైనట్లు తెలుస్తోంది. (ఇబ్నెకసీర్, ఫతహుల్ ఖదీర్).

బహుదైవారాధకుల నుండి యూదులకు సంక్రమించిన గోభక్తి జాడ్యం ఓ పట్టాన వారిని వదల్లేదు... అందువల్ల దేవుడు వారి చేతులతోనే గోవుని వధింపజేయాలని భావించాడు కాబోలు, ఆ సందర్భం వచ్చింది. యూదుల్లో వారసులులేని ఒక ధనికుడు ఉండేవాడు. అతని సోదరుని కుమారుడు అతని ధనాన్ని కాజేసే ఉద్దేశ్యంతో ఓ రోజు రాత్రి అతడ్ని చంపి, శవాన్ని ఇతరుల ఇంటి ముందు పడవేశాడు. అంచేత యూదులు హంతకుడు ఎవరో నిర్థారించుకోలేక పరస్పరం ఆరోపణలు చేసుకోసాగారు. చివరికి ఈ వ్యవహారం మూసా (అలైహి) దృష్టికి వచ్చింది. ఆయన, 'ఒక ఆవుని చంపి దాని మాంసపు ముక్కనొక దానితో హతుని దేహమ్మీద చరిస్తే అతను బ్రతికి తనను హత్యచేసిన వారెవరో చెబుతాడ'ని అన్నారు. (ఫతహుల్ ఖదీర్).

"మీకీ సంఘటన కూడా గుర్తుండి ఉంటుంది: మీరొక వ్యక్తిని చంపి, ఆ విషయంలో పరస్పరం పోట్లాడుకుంటూ హత్యానిందను ఒకరి మీద మరొకరు రుద్దడానికి ప్రయత్నించారు. కాని మీరు దాచుతున్న విషయాన్ని దేవుడు బట్టబయలు చేయదలిచాడు. ఆవు మృతకళేబరంలోని కొంతభాగంతో హతుని భౌతికకాయంపై చరచండని మేము ఆజ్ఞాపించాం. మేమా సందర్భంలో 'ఈవిధంగా దేవుడు మృతుల్ని (పునరుత్థాన దినాన) తిరిగి బ్రతికిస్తాడు. మీరు విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన తన మహిమల్ని ఇలా చూపిస్తాడు" అన్నాము వారితో." (ఖుర్ఆన్-2:72,73)



అయితే అంతటి గొప్పమహిమ చూసినా మీలో ఎలాంటిమార్పు రాలేదు. పైగా మీ హృదయాలు పాషాణాల్లా కఠినమైపోయాయి. కాదు, అంతకంటే కూడా కఠినమయి పోయాయి. పాషాణాలలో కొన్నిటి నుంచి నీటిఊటలు ఉబికి వస్తాయి. మరికొన్ని పగిలి పోయి వాటి నుంచి కూడా నీళ్ళు వస్తాయి. ఇంకా కొన్ని రాళ్ళయితే దైవభీతితో కంపించి క్రింద పడిపోతాయి..." (2:74)

"మీ మీద తూర్పర్వతం ఎత్తిపట్టి మీచేత ప్రమాణం చేయించిన సందర్భం గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడు మేమిలా ఆదేశించాం: 'మేము మీకిచ్చిన గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. అందులోని ఆజ్ఞల్ని, హితవుల్ని గుర్తుంచుకోండి. అలాచేస్తే మీరు భయభక్తుల జీవితం గడుపుతారు.' (దీన్ని మీరు అంగీకరించారు.) కాని తరువాత మీరా ప్రమాణం ఉల్లంఘించారు. (దాన్ని కూడా దేవుడు ఉపేక్షించాడు.) మీపై దేవుని కరుణాకటాక్షాలే గనక లేనట్లయితే మీరు (ఎప్పుడో) నాశనమయి పోయేవారు." (ఖుర్ఆన్-2:63,64)

"కాస్త వారిని సముద్రతీరాన వున్న పట్టణం గురించి అడుగు. ఆ పట్టణప్రజలు శనివార నియమాన్ని ఉల్లంఘిస్తుండేవారు. శనివారం రోజే చేపలు సముద్రపు ఉపరితలంపై వారిముందుకు వస్తుండేవి. శనివారం తప్ప మరే దినాలలోనూ పైకి వచ్చేవి కావు. వారి దుశ్చర్యల్ని బట్టబయలుచేయడానికే మేమిలా వారికి పరీక్షపెట్టాం." (7:163); "శనివారం నియమం ఉల్లంఘించినవారి సంగతి మీకు తెలిసిందే. మేము వారిని 'కోతులుగా మారి తుచ్ఛమైన బ్రతుకు బ్రతకండ"ని శపించాము." (ఖుర్ఆన్-2:65,66)

(శనివారంనాడు ఎలాంటి ప్రాపంచిక పనులు చేపట్టకుండా, చివరికి వంటపని సైతం చేయకుండా పూర్తిసెలవు తీసుకొని దైవారాధనలో గడపాలని దేవుడు యూదులకు ఒక నియమం విధించాడు. దీన్ని ఉల్లంఘిస్తే దైవాగ్రహానికి గురవుతారని హెచ్చరించాడు. అయితే శనివారంరోజే చేపలు సముద్రపుఉపరితలంపై తీరాన వారి ముందుకు వస్తుండేవి. అంచేత వారు ఒకరోజు ముందు సముద్రతీరాన గుంటలు త్రవ్వి నీటితో నింపిపెట్టేవారు. శనివారంరోజు ఆ గుంటల్లోకి చేపలు వచ్చాక వాటిని పట్టుకునేవారు. ఇలా వారు శనివారం నియమం ఉల్లంఘించి దైవాగ్రహానికి గురయ్యారు.)

## (15) యుద్ధనిరాకరణ

"మూసా (అ) తన జాతిప్రజలకు చేసిన హితబోధ గుర్తుకుతెచ్చుకో. అతను వారితో ఇలా అన్నాడు: 'నా జాతిప్రజలారా! మీకు దేవుడు చేసిన మేళ్ళు జ్ఞాపకం తెచ్చుకోండి. ఆయన మీలో ఒక ప్రవక్తను ప్రభవింపజేసి, మిమ్మల్ని రాజ్యాధినేతలుగా చేశాడు. ఆయన మీకు ప్రపంచంలో ఏజాతికీ ప్రసాదించనిదాన్ని (వైభవోన్నతుల్ని) ప్రసాదించాడు. కనుక సోదరులారా! దేవుడు మీకు రాసిపెట్టిన ఈ పవిత్రభూభాగం (పాలస్తీనా)లో ప్రవేశించండి. వెనక్కి మరలకండి. అలాచేస్తే మీరు ఘోరంగా నష్టపోతారు." (ఖుర్ఆన్-5:20,21)

"దానికి వారిలా సమాధానమిచ్చారు: 'మూసా! అక్కడ భయంకరమైన మనుషులున్నారు. వారా ప్రాంతం నుండి వెళ్ళిపోనంత వరకూ మేమక్కడికి ఎట్టి పరిస్థితిలోనూ వెళ్ళం. వారక్కడ్నుంచి వెళ్ళిపోతే మేము పోవడానికి సిద్ధమే." (ఖుర్ఆన్-5:22)

"అలా భయపడిన వారిలోనే దైవానుగ్రహం పొందిన ఇద్దరు వ్యక్తులున్నారు. వారు కల్పించుకొని 'ఆ భయంకరుల్ని ఎదుర్కోవడానికి మీరు ప్రధానద్వారం గుండా ప్రవేశిం చండి. మీరు లోపలికి ప్రవేశిస్తేచాలు, విజయం మిమ్మల్ని వరించినట్లే. మీరు విశ్వాసులే అయితే దేవునిపై భారంవేసి ముందుకు సాగండి' అని అన్నారు. కాని 'మూసా! వారక్కడ ఉన్నంతవరకు మేము ఎన్నటికీ వెళ్ళం. కావాలంటే నీవు, నీప్రభువు ఇద్దరూ వెళ్ళి (వారితో) తలపడండి. మేము మాత్రం ఇక్కడే ఉండిపోతాం' అన్నారు వారు." (ఖుర్ఆన్–5:23,24)

"అప్పుడు మూసా (అలై) దేవుణ్ని ప్రార్థిస్తూ 'ప్రభూ! నా చేతిలో ఏమీ లేదు. నాపై, నా సోదరునిపై మాత్రమే నాకు అధికారం ఉంది. అందువల్ల దేవా! మమ్మల్నిద్దరినీ ఈ దుర్మార్గుల నుండి వేరుచెయ్యి' అని అన్నాడు. దానికి దేవుడు 'సరే, వారికీ దేశాన్ని నలభై ఏండ్లపాటు నిషేధించాను. ఇక వారు ప్రపంచంలో ఏ ఒక్కచోటా నిలువనీడ దొరక్క కాళ్ళుకొట్టుకుంటూ తిరుగుతారు. ఈ దుర్మార్గుల దుస్థితిపట్ల నీవు ఏమాత్రం విచారపడకు' అని చెప్పాడు." (ఖుర్ఆన్–5:25,26)

## (16) జ్ఞానార్జన పయనం, ఖిజర్ మహిమలు

"(వారికి మూసా గాథ విన్పించు.) అప్పుడు మూసా తన సేవకునితో 'రెండు నదుల సంగమానికి చేరుకోనంత వరకూ నేనీ ప్రయాణం ముగించను. అప్పటిదాకా నేను ఓ సుదీర్ఘకాలం పాటు ఇలా నడుస్తూనే ఉంటాను' అన్నాడు. చివరికి వారు ఆ నదీసంగమానికి చేరుకున్నారు. అయితే వారు తమ చేప సంగతి మరచిపోయారు. అది (వారి దగ్గర్నుంచి) జారి నదిలో ఈదుకుంటూ పారిపోయింది." (ఖుర్ఆన్–18:60,61)

"మూసా అక్కడ్నుంచి ముందుకు కొద్దిదూరం నడిచాక తన సేవకునితో 'ఇక తీసుకురా మా భోజనం. మేమీ ప్రయాణంలో చాలా అలసిపోయాం' అన్నాడు. అప్పుడు సేవకుడు (ఇలా అన్నాడు:) 'అది సరేగాని, అసలు ఏం జరిగిందో చూశారా? మనం ఆ చట్టుబండ దగ్గర కూర్చున్నామా...అప్పుడు నాకు చేప సంగతే గుర్తుకురాలేదు. షైతాన్ నన్ను ఏమరు పాటుకు గురిచేశాడు. నేనా సంగతి మీకు చెప్పడం మరచిపోయాను. చేప భలే విచిత్రంగా నదిలోకి దూకి పారిపోయింది." (ఖుర్ఆన్–18:62,63)

"మూసా (ఈమాట విని) '(అయ్యయ్యో!) దాన్ని గురించే కదరా బాబూ! నా అన్వేషణ, (పదపద)' అన్నాడు. అలా వారిద్దరు తమ అడుగుజాడల్లో నడుచుకుంటూ వెనక్కివెళ్ళారు. అక్కడ మాదాసులలో ఒక ((ప్రత్యేక)దాసుణ్ని చూశారు. మేమా దాసునికి మా కారుణ్యభాగ్యం ప్రసాదించాం. మా దగ్గర్నుండి విశేషజ్ఞానం నేర్పాము." (ఖుర్ఆన్–8:64,65)

"మూసా అతనితో 'మీకు (దేవుడు) నేర్పిన దివ్యజ్ఞానం నాక్కూడా నేర్పుతారా? దాని కోసం నేను మీదగ్గర శిష్యరికం చేయవచ్చా?' అని అడిగాడు. దానికా దాసుడు 'మీరు నాదగ్గర సహనంగా ఉండలేరు. అయినా మీకు తెలియని విషయాల్ని గురించి మీరెలా సహనం వహించగలరు?' అన్నాడు." (ఖుర్ఆన్–18:66,67,68)

"దైవచిత్తమయితే మీరు నన్ను సహనశీలిగా చూడగలరు. నేను ఏ విషయంలోనూ మీకు వ్యతిరేకంగా వ్యవహరించను' అన్నాడు మూసా. 'సరే, మీరు నావెంట రాదలచుకుంటే ఏ



విషయమైనా నేను మీకు చెప్పనంత వరకు దాన్ని గురించి మీరు నన్నడగ వద్దు' అన్నాడు ఆ దాసుడు." (ఖుర్ఆన్–18:69,70)

"(ఇలా మాట్లాడుకున్న తర్వాత) వాళ్ళిద్దరూ అక్కడ్నుంచి బయలుదేరారు. (కొంత దూరం నడిచి) చివరికి ఒక పడవ ఎక్కారు. (కాస్సేపటికి) అతను పడవలో అడుగున రంధ్రం వేశాడు. అది చూసి మూసా 'ఏమిటీ మీరు ఇందులో రంధ్రం వేశారు? పడవలోని వారందర్నీ ముంచదలిచారా? చాలాఘోరమైన పని చేశారు' అన్నాడు. 'నేను చెప్పలేదా, నీవు నాతోపాటు సహనంగా ఉండలేవని" అన్నాడతను. 'మరచిపోయాను. మతిమరుపు గురించి నన్ను పట్టుకోకండి. (దయచేసి) నా విషయంలో కఠినంగా వ్యవహరించకండి' అన్నాడు మూసా." (ఖుర్ఆన్–18:71,72,73)

"వాళ్ళిద్దరు తిరిగి ప్రయాణం సాగించారు. కొంతదూరం పోయాక వారికొక అబ్బాయి కన్పించాడు. అప్పుడావ్యక్తి (ముందుకుపోయి) ఆ పిల్లవాణ్ని హతమార్చివేశాడు. 'మీరు ఏపాపం ఎరగని ఒక అమాయకుణ్ని దారుణంగా చంపేశారు! పాపం అతను ఎవర్నీ హత్య చేయలేదే!! మీరు చాలా చెడ్డపని చేశారు' అన్నాడు మూసా. 'నేను చెప్పలేదూ నీవు నాతో పాటు సహనంగా ఉండలేవని?' అన్నాడతను. '(పొరపాటయింది.) ఇకముందు నేనేదైనా మీకు ఎదురుచెప్తే నన్ను మీతోపాటు ఉంచకండి. ఇప్పుడు మాత్రం నావైపున మీకు సాకు దొరికింది' అన్నాడు మూసా." (ఖుర్ఆన్–18:74,75,76)

"అక్కడ్నుంచి వారు ముందుకుసాగి ఓ ఊరికి చేరుకున్నారు. ఆ ఊరిప్రజల్ని భోజనంపెట్టమని అడిగారు. కాని వారు వారిద్దరికి ఆతిథ్యమివ్వడానికి నిరాకరించారు. తరువాత వారా ఊళ్ళో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఒక గోడ చూశారు. అప్పుడా వ్యక్తి వెంటనే ఆ గోడకు మరమ్మత్తు చేశాడు. మూసా (ఉండబట్టలేక) 'మీరు కావాలనుకుంటే ఈ పనికి ప్రతిఫలం అడిగి తీసుకోవచ్చు కదా?' అన్నాడు. 'ఇకచాలు, నాతో నీ శిష్యరికం ముగిసింది. ఇప్పుడు నీవు సహనం వహించలేక పోయిన వ్యవహారాలను గురించి వాస్తవం ఏమిటో చెబుతా విను:" (ఖుర్ఆన్–18:77,78)

"పడవ సంగతి: ఆ పడవ కొందరు పేదవాళ్ళది. వారు జీవనోపాధి కోసం నదిలో ఆ పడవ నడుపుకుంటున్నారు. నది ఆవల బలవంతంగా పడవలను స్వాధీనం చేసుకునే ఒక రాజున్నాడు. (అతను మంచి పడవలను మాత్రమే స్వాధీనం చేసుకుంటాడు.) అందువల్ల నేనా పడవకు ఏదైనా లోపం కలిగించాలనుకున్నాను." (ఖుర్ఆన్–18:79)

"పోతే బాలుడి సంగతి. ఆబాలుడి తల్లిదండ్రులు విశ్వాసులైన దైవభక్తులు. అయితే ఆ బాలుడు (పెద్దవాడై) తన తిరస్కారం తలబిరుసుతనాలతో వారిని వేధిస్తాడని మేము భయపడ్డాం. అంచేత వారి ప్రభువు గుణగణాలలో, దయాభిమానలలో ఆ బాలుడికన్నా మంచి సంతానం వారికి ప్రసాదించాలని మేము కోరుకున్నాం." (ఖుర్ఆన్–18:80,81)

"ఇక గోడ వ్యవహారం గురించి చెప్పాలంటే, ఆగోడ ఆఊళ్ళో వుండే ఇద్దరు అనాథ బాలలది. దాని క్రింద ఆ పిల్లలకోసం ఒక నిధి పాతిపెట్టబడి ఉంది. వారి తండ్రి చాలా పుణ్యాత్ముడు. అందువల్ల ఈ పిల్లలిద్దరూ పెద్దవారయిన తరువాత ఆ గోడ క్రింద ఉన్న తమ నిధిని తీసుకోవాలని నీ ప్రభువు నిర్ణయించాడు."

"ఇదంతా నీ ప్రభువు కారుణ్యకటాక్షాల ఫలితమేగాని, నాఅంతట నేనేదీ చేయలేదు. నీవు సహించలేకపోయిన విషయాల వెనక ఉన్న మర్మహేతువు ఇదే." (ఖుర్ఆన్-18:82)

ఖిజర్(అలై) మూసా (అలై) సమక్షంలో ఒక పడవకు రంధ్రం వేసి నష్టం కల్గించడం; తమకు ఆతిథ్యమివ్వడానికి నిరాకరించిన ఊళ్ళో పడిపోయిన గోడను రిపేర్ చేయడం; ఏ పాపమెరగని ఓ బాలుడ్ని హతమార్చడం జరిగాయి. కాని మూసా (అలై)కు ఇవన్నీ అర్థంగాక ప్రతిసారీ అసహనాన్ని వెలిబుచ్చుతారు. చివరికి ఇవన్నీ తాను దైవాజ్ఞతోనే చేశానని ఖిజర్(అలై) చెబుతారు. దీన్నిబట్టి ఖిజర్(అలై) మానవమాత్రుడు కాదని, మానవ రూపంలో వచ్చిన దైవదూతయి ఉంటారని కొందరు ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు.

## 12. యూదుల పుట్టుపూర్వోత్తరాలు

యాఖూబ్ ప్రవక్త (అలైహి) నాల్గవ కుమారుడు యహూదా సంతతినే యూదులు అంటారు. ఖుర్ఆన్ వీరిని యాఖూబ్ (అలైహి) బిరుదయిన ఇస్రాయీల్ పేరుతో "ఇస్రాయీల్ సంతతి ప్రజలారా!" అని సంబోధించింది. కాని వీరు యహూదా సంతతికి చెందిన వారయినందున తమనుతాము యూదులని పేరు పెట్టుకున్నారు.

ఇస్రాయీల్ అనేది యాఖూబ్ ప్రవక్త (అలైహి)కు దేవుడు ప్రసాదించిన బిరుదు. హజ్రత్ యాఖూబ్ (అలై) ఇస్‌హాఖ్ ప్రవక్త (అలై) కుమారుడు, ఇబ్రాహీం ప్రవక్త (అలై) మనుమడు. యాఖూబ్‌సంతతినే బనీఇస్రాయీల్ (ఇస్రాయీల్‌సంతతి) అని అంటారు.

ఇస్రాయీల్ అంటే "అబ్దుల్లా" (దైవదాసుడు) అని అర్థం. అయితే యూదులు తమ స్వయంకృత మతవిశ్వాసాలకు అనుగుణంగా దీని భావాన్ని కూడా మార్చివేశారు. యూదుల మతవిశ్వాసం ప్రకారం వారి మూలపురుషుడైన యాఖూబ్ (అలైహి) ఓరోజు రాత్రంతా దేవునితో కుస్తీపడ్తూ మల్లయుద్ధం చేశారు. దేవుడు యాఖూబ్‌తో తెల్లవారేదాకా తలపడినప్పటికీ ఆయన్ని ఓడించలేక పోయాడట! చివరికి దేవుడు "ఇక నన్ను వెళ్ళిపోనివ్వు" అనంటే "నీవు నాకు శుభం ప్రసాదించనంతవరకు నేను నిన్ను వదలిపెట్టను" అని యాఖూబ్ (అలైహి) అన్నారు. అప్పుడు దేవుడు "నీ పేరేమిటి?" అని అడిగితే, "నా పేరు యాఖూబ్" అని ఆయన అన్నారు. "అయితే ఇకముందు నీ పేరు యాఖూబ్ కాదు, ఇస్రాయీల్ అవుతుంది. ఎందుకంటే నీవు దేవునితో, ప్రజలతో తలపడి విజయం సాధించావు" అని దేవుడు చెప్పాడట!!

'జివిష్ పబ్లికేషన్ సొసైటీ ఆఫ్ అమెరికా'చే 1954లో ప్రచురించబడిన "ది హోలి స్క్రిప్చర్" అనే గ్రంథంలో ఈ వివరాలు చూడవచ్చు. బైబిల్‌లో కూడా ఈ కథ ఉంది. యూదుల మతగ్రంథం అథఃసూచికలో ఇస్రాయీల్ అంటే "దేవునితో తలపడేవాడు" అని అర్థముంది. 'సైక్లోపీడియా ఆఫ్ బిబ్లికల్ లిటరేచర్' అనే గ్రంథంలో క్రైస్తవ పండితులు ఇస్రాయీల్ అంటే "దేవునితో మల్లయుద్ధం చేసేవాడ"ని నిర్వచించారు.

ఇలాంటి మతవిశ్వాసాలు కలిగివుండటం వల్లనే యూదులు తమ మనోవాంఛలకు వ్యతిరేకమైన బోధనలు తెచ్చిన దైవప్రవక్తల్ని తిరస్కరించడమే గాక వారిలో కొందరిని సంహరించారు కూడా. పైగా తాము చేసిన ఈ నిర్వాకాన్ని కప్పిపుచ్చుకుండా కాలర్



ఎగరేసి మరీ "మేము దైవప్రవక్త, మర్యం కుమారుడైన ఈసా మసీహ్‌ని హతమార్చాం" అని కూడా చెప్పుకున్నారు. (ఖుర్ఆన్-4:158). ఇలాంటి స్వభావంగల జాతిప్రజలు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)ను, పైగా తమ జాతిలో గాకుండా తాము నిరక్షర కుక్షులని తెగిడే అరబ్బులలో ప్రభవించిన దైవప్రవక్తను ఎలా విశ్వసిస్తారు?

పూర్వం యూదుల్లో గొప్ప దైవభక్తులు, సజ్జనులు, మహాపురుషులు ఉద్భవించినప్పటికీ వారిలో అత్యధికులు దుర్మార్గులు, కలహకారులు, హంతకులు, సత్యావరోధకులు, జాత్యహంకారులు, అక్రమార్జనాపరులు, అబద్ధీకులుగానే చరిత్రకెక్కారు.

క్రీస్తు శకానికి దాదాపు 2000 సంవత్సరాల పూర్వం సిరియా, పాలస్తీనాలకు చెందిన కొందరు అరబ్బులు అంతర్గత కలహాలకు గురయివున్న ఈజిప్టు ప్రజలను సులభంగా ఓడించి ఈజిప్టును ఆక్రమించుకొని అక్కడ రాజ్యమేలడం ప్రారంభించారు. వీరిని "హిక్సాస్" రాజులు అంటారు. క్రీ.పూ.19వ శతాబ్దాంతంలో యూసుఫ్ ప్రవక్త (అలైహి) తన దైవిక శక్తిసామర్థ్యాలతో ఈజిప్టు సింహాసనం అధిరోహించిన తర్వాత ఆయన పాలస్తీనా నుండి తన తల్లిదండ్రులు, అన్నదమ్ములతో సహా మొత్తం కుటుంబసభ్యుల్ని ఈజిప్టుకు పిలిపించుకున్నారు. ఇలా యూదులు ఈజిప్టులో ప్రవేశించారు. ఈజిప్టు విదేశీ పాలకవర్గం ప్రజలు కూడా యూదుల్ని విదేశీయులుగా పరిగణించకుండా సంతోషంగా తమలో కలుపుకున్నారు. ఆ తర్వాత అనతి కాలంలోనే యూదులు తమ ఉనికిని పటిష్ఠపరచుకొని పాలకవర్గంలో కలసిపోయారు. ఆ విధంగా వారు పాలకవర్గంతో కలసి దాదాపు 400 సంవత్సరాలపాటు ఈజిప్టును పాలించి ఎంతో ప్రగతి సాధించారు.

అయితే ఆ తరువాత ఈజిప్టులో ఓ గొప్ప జాతీయఉద్యమం ప్రారంభమై హిక్సాస్ రాజు అధికార పీఠాన్ని పడగొట్టింది. హిక్సాస్ వర్గానికి చెందిన రెండున్నర లక్షల మంది ప్రజల్ని దేశం నుండి వెళ్ళగొట్టడం జరిగింది. జాత్యహంకారంగల ఖబత్ సంతతికి చెందిన వంశం అధికారంలోకి వచ్చి హిక్సాస్ రాజుల సంస్కృతి, స్మారక చిహ్నాలన్నిటిని సర్వనాశనం చేసింది. తర్వాత ఖబత్ రాజులు హింసాదౌర్జన్యాలతో యూదుల్ని క్రమంగా కట్టుబానిసలుగా మార్చి వారిచేత వెట్టిచాకిరి చేయించుకోవడం ప్రారంభించారు. చివరికి మూసా ప్రవక్త (అలై) ప్రభవించడం, వారిని ఆ బానిసత్వం వెట్టిచాకిరీల నుండి విముక్తి కలిగించి పాలస్తీనాకు తీసికెళ్ళడం జరిగాయి. (2:49, 7:104-133, 20:77-81)

**తాలూత్, జాలూత్** : సుమారు మూడువేల సంవత్సరాల క్రితం యూదుల రాజ్యంపై శత్రు దాడులు అధికమైనప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కోగల నాయకుని అన్వేషణ మొదలైంది. ఆ రోజుల్లో సమూయేల్ ప్రవక్త (అలైహి) వారికి నాయకునిగా ఉండేవారు. కాని అప్పటికి ఆయన బాగా వృద్ధుడయిపోయారు. అంచేత యూద పెద్దలు తమకొక రాజుని నియమిస్తే అతని నాయకత్వాన తాము దైవమార్గంలో యుద్ధం చేస్తామని అంటారు. అయితే దైవప్రవక్త (అలై) వారికోసం తాలూత్ అనే ఓ ఆజానుబాహుడ్ని నాయకునిగా నియమించి పంపుతారు. చివరికి యుద్ధంలో శత్రుపక్షం రాజయిన జాలూత్‌ని ఓ నూనూగు మీసాల నవయుకుడు సంహరిస్తాడు. ఆ నవ యువకుడు మరెవరో కాదు, భావి దైవప్రవక్త హజ్రత్ దావూదే (అలై).

# 13. దావూద్ (అలైహి)

"మూసా(నిర్యాణం) తర్వాత ఇస్రాయీల్ సంతతి నాయకులకు ఎదురైన పరిస్థితుల్ని గురించి నీకు తెలుసా? వారు (అప్పటి) తమప్రవక్త దగ్గరకెళ్ళి 'మేము దైవమార్గంలో యుద్ధం చేయడానికి వీలుగా మాకు సారథ్యం వహించేందుకు ఒక రాజును నియమించు' అని విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త '(సరే, అలాగే నియమిస్తా.) కాని తీరా మిమ్మల్ని యుద్ధం చేయమని ఆదేశిస్తే మీరు నిరాకరిస్తారేమో!' అన్నాడు."

"అదేలా! మమ్మల్ని మాఇండ్ల నుండి వెళ్ళగొట్టారు. మా పిల్లాజెల్లలను మాకు దక్కకుండా చేశారు. అలాంటప్పుడు మేము దైవమార్గంలో యుద్ధం ఎందుకు చేయం?' అన్నారు వారు..." (ఖుర్ఆన్-2:246)

"(సరే,) దైవప్రవక్త (వారి కోరికను మన్నించి) 'దేవుడు మీకు తాలూత్‌ని రాజుగా నియమించాడు' అని తెలియజేశాడు. అది విని వారు (ధనగర్వంతో విర్రవీగుతూ) "రాచరికం చేయడానికి మేమే ఎక్కువ అర్హులం, హక్కుదారులం గాని, అతనెలా అవుతాడు? అతను ఏమంత స్థితిపరుడు కూడా కాదే?' అన్నారు. అప్పుడు దైవప్రవక్త ఇలా అన్నాడు: 'దేవుడు మీకు బదులు అతడ్నే (ఈ పనికోసం) ఎంచుకున్నాడు. ఆయన అతనికి (కార్యసాధనకు కావలసిన) బుద్ధిబలాన్ని, కండబలాన్ని కూడా పుష్కలంగా ప్రసాదించాడు. దేవుడు తాను తలచుకున్న వారికి రాజ్యాధికారం ప్రసాదిస్తాడు. ఆయన విశాలదృష్టి కలవాడు, సర్వం తెలిసినవాడు." (ఖుర్ఆన్-2:247)

"దైవప్రవక్త (మరింత వివరంగా తెలియజేస్తూ) ఇలా అన్నాడు: 'దేవుడు మీపై అతడ్ని రాజుగా నియమించడానికి నిదర్శనంగా (లోగడ మీరు కోల్పోయిన పవిత్ర) పేటిక మీకు తిరిగి లభిస్తుంది. అందులో మీ ప్రభువు వైపున మీకు శాంతీసంతృప్తులు కలిగించే సామగ్రి ఉంది. అందులో మూసా, హారూన్ కుటుంబీకులు వదలివెళ్ళిన పవిత్ర అవశేషాలు కూడా ఉన్నాయి.ఆ పేటికను ప్రస్తుతం దైవదూతలు కాపాడుతున్నారు. మీరు నిజంగా విశ్వసించిన వారైతే (దీన్ని నమ్మండి) మీకిది గొప్ప నిదర్శనం." (ఖుర్ఆన్-2:248)

"ఆ తరువాత తాలూత్ సైన్యం తీసుకొని యుద్ధానికి బయలుదేరుతూ వారితో ఇలా అన్నాడు: "దేవుడు (దారిలో) ఒక నది ద్వారా మిమ్మల్ని పరీక్షించబోతున్నాడు. ఆ నదిలో నీరు త్రాగేవాడు నావాడు కాదు; త్రాగనివాడే నావాడు. అయితే (ప్రాణం కాపాడుకోవడానికి) దోసిలితో కొంచెం నీళ్ళు త్రాగితే పర్వాలేదు.' కాని (తీరా నది దగ్గరకు చేరుకోగానే) కొందరుతప్ప అందరూ (కడుపారా) త్రాగారు."

"ఆతర్వాత తాలూత్, విశ్వాసులైన అతని సహచరులు నది దాటి ఆవలకు చేరుకున్నప్పుడు వారిలో చాలామంది 'ఈరోజు జాలూత్‌ని, అతని సైన్యాన్ని ఎదుర్కొనేశక్తి మాలో లేదు' అన్నారు. అయితే ఒకరోజు దేవునికి ముఖం చూపించవలసిఉందని నమ్ముతున్న వారు మాత్రం (భయపడకుండా) 'గతంలో కొద్ది సంఖ్యలో వున్న సైన్యం కూడా దైవానుగ్రహంతో అత్యధిక సంఖ్యలో వున్న (శత్రు)సైన్యాన్ని మట్టి కరిపించింది. దేవుడు స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడేవారికే అండగా ఉంటాడు' అన్నారు." (ఖుర్ఆన్-2:249)



"వారు యుద్ధమైదానంలో జాలూత్‌కు, అతని సైనికులకు ఎదురుగా వచ్చినప్పుడు 'ప్రభూ! మాకు సహనం, స్థైర్యం ప్రసాదించు. (యుద్ధంలో) మా కాళ్ళకు నిలకడ చేకూర్చి అవిశ్వాసులపై మాకు విజయం ప్రసాదించు' అని వేడుకున్నారు. (2:250) "అప్పుడు వారు దేవుని అనుగ్రహంతో జాలూత్ సైన్యాన్ని చిత్తుగా ఓడించారు. జాలూత్‌ని దావూద్ వధించాడు. (ఆతర్వాత) దేవుడు దావూద్‌కు రాజ్యాధికారం, బుద్ధికౌశల్యం ప్రసాదించాడు. ఇంకా కావలసినవన్నీ అతనికి నేర్పాడు. ఈవిధంగా దేవుడు కొందరిద్వారా కొందరిని నిర్మూలించకపోతే ప్రపంచం అరాచకం, అల్లకల్లోలాలతో నిండిపోతుంది. (ఖుర్ఆన్-2:251)

## (1) దేవునివరాలు, న్యాయమైన తీర్పు

"దావూద్ చాలా బలవంతుడు, పరాక్రమశాలి. ప్రతి విషయంలోనూ అతను దేవుని (ధర్మం) వైపు మరలేవాడు. మేము కొండలను అతని అదుపులో ఉంచాము. అవి ఉదయం, సాయంత్రం అతనితో పాటు (దైవనామం) జపిస్తూ ఉంటాయి. పక్షులు కూడా (అతని) దగ్గరకు చేరుతాయి. సమస్తం అతనితో పాటు దైవస్తోత్రంలో లీనమై పోతాయి. మేమతని సామ్రాజ్యాన్ని పటిష్ఠపరిచాము. అతనికి వివేకం, వ్యవహార దక్షతలు కూడా ప్రసాదించాం."

"గోడెక్కి అతని రాజమందిరంలో చొరబడినవారి జగడం గురించి నీకు తెలుసా? అలా వారు అక్రమంగా చొరబడి తన దగ్గరకు రావడంచూసి దావూద్ భయపడ్డాడు. అప్పుడు వారిలో ఒకడిలా అన్నాడు: 'భయపడకండి. మేమిద్దరం ఒక వ్యాజ్యానికి సంబంధించిన వాది, ప్రతివాదులం. మాలో ఒకడు రెండోవాడిపై అన్యాయానికి పాల్పడ్డాడు. మీరు మా ఇద్దర్ని గురించి న్యాయంగా తీర్పుచేయండి. అన్యాయం చేయకండి. మాకు సరైన మార్గం చూపండి. ఇతను నా సోదరుడు. ఇతని దగ్గర తొంభై తొమ్మిది గొర్రెలున్నాయి. నాదగ్గర ఒకే గొర్రె ఉంది. ఆ ఒక్కదాన్ని కూడా తనకివ్వమని అంటున్నాడితను. ఇతను మాటలతో (వాదించి) నన్ను లోబరచుకున్నాడు." (ఖుర్ఆన్-38:17-23)

"దావూద్ ఇలా చెప్పాడు: 'ఇతను తన గొర్రెల్లో నీ గొర్రెను కూడా కలుపుకుంటాను ఇవ్వమని అడిగి, నిజంగా నీకు చాలా అన్యాయం చేశాడు. కలసిమెలసి పనిచేసేవాళ్ళు సాధారణంగా ఒకరికొకరు అన్యాయానికి పాల్పడతారు. కాని సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవారు అలా చేయరు. అలాంటి నిజాయితీపరులు (లోకంలో) బహు కొద్దిమంది మాత్రమేఉంటారు.' ఇలా చెబుతూ దావూద్ తనను మేము పరీక్షిస్తున్నామని గ్రహించాడు. వెంటనే అతను తన ప్రభువుని క్షమాపణ కోరుకున్నాడు. ఆ తర్వాత నేలమీద సాగిలపడి (మావైపు) మరలాడు. అప్పుడు మేమతని పొరపాట్లు క్షమించాం." (ఖుర్ఆన్-38:24,25)

"మీ ప్రయోజనం కోసం మేమతనికి యుద్ధకవచాలు తయారు చేసే విధానం నేర్పాము. వాటితో మీరు ఒకరి దాడి నుండి మరొకరు కాపాడుకుంటారు. (21:80); దావూద్ కోసం మేము ఇనుమును మెతకగా చేసి దాంతో కవచాలు తయారుచేయాలని, వాటి కైవారాలు లెక్కప్రకారం ఉంచాలని ఆదేశించాం." (ఖుర్ఆన్-34:11)

**లోహయుగం** క్రీ.పూ.1200-1000 సంవత్సరాల మధ్య కాలంలో ప్రారంభమైనట్లు చరిత్రకారులు నిర్ధారించారు. అదే దావూద్ (అలై) దైవప్రవక్తగా ప్రభవించిన కాలం.

ఖుర్‌ఆన్ సూక్తుల్ని బట్టి దేవుడు ఆయనకు ఇనుప ఖనిజం నుండి స్వచ్ఛమైన ఇనుము, ఉక్కు తీసే విధానాన్ని నేర్పాడని తెలుస్తోంది. సిరియా, ఆసియా మైనర్లలోని హిట్‌జాతి క్రీ.పూ.1200-1000 మధ్యకాలంలో ఉచ్ఛస్థితిలో ఉండటానికి కారణం ఆ జాతి ప్రజలు ఇనుమును కరగబెట్టి ఆయుధాలు తయారుచేసే ఓ అతిక్లిష్టమైన పద్ధతి కనుగొనడమే. అయితే ఇలా తయారయ్యే ఆయుధాలు ఎంతో ఖరీదైనవిగా ఉండేవి. అంచేత ఇవి జనసామాన్యానికి అందుబాటులో ఉండేవికావు. పైగా ఆ జాతివాళ్ళు ఈ పద్ధతిని అతి రహస్యంగా ఉంచేవారు.

అయినా కొంతకాలానికి ఈ రహస్యాన్ని పాలస్తీనా, తూర్పు జోర్డాన్ ప్రజలు తెలుసుకున్నారు. ఆ తర్వాత ముడిఖనిజం నుండి ఇనుము తీసే సులువైన పద్ధతులు కనుగొనబడ్డాయి. దక్షిణ పాలస్తీనాలోని అదూమ్ అనే చోట అపారమైన ఇనుప ఖనిజ నిక్షేపాలు బయల్పడ్డాయి. పురావస్తు పరిశోధనవారి త్రవ్వకాలలో కొన్నిచోట్ల పూర్వకాలం నాటి ఇనుపబట్టీల అవశేషాలు కూడా బయటపడ్డాయి. వీటిని పరిశీలించిన తరువాత దావూద్, సులైమాన్ ప్రవక్తల కాలంలోనే ఈనాటి బ్లాస్ట్ ఫర్నెస్ విధానం అమలులో ఉండేదని తెలిసింది. (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ నుండి.)

# 14. సులైమాన్ (అలైహి)

"సులైమాన్, దావూద్ (ప్రవక్త)కు వారసుడయ్యాడు..." (27:16); "సులైమాన్ కోసం మేము గాలిని అదుపులో ఉంచాం. తద్వారా అతను ఉదయం ఒక నెలరోజుల్లో నడిచే దూరాన్ని, సాయంత్రం ఒక నెలరోజుల్లో నడిచే దూరాన్ని నడుస్తాడు. అతని కోసం మేము కరిగిన రాగితో కూడిన నదిని ప్రవహింపజేశాం. పెద్దపెద్ద భూతాలను అతని అధీనంలో ఉంచాం. అవి తమ ప్రభువాజ్ఞతో అతని ముందు (కట్టుబానిసల్లా) పనిచేసేవి. వాటిలో ఏదైనా మా ఆజ్ఞను నిరాకరిస్తే మేము దానికి భగభగ మండే అగ్నిని చవిచూపించేవాళ్ళము. అతని కోసం ఆ భూతాలు కోరిన వస్తువు తయారుచేసేవి, ఆకాశహర్మ్యాలు, రకరకాల బొమ్మలు, కోనేరుల్లాంటి విశాలమైన కంచాలు, ఒకచోట స్థిరంగా ఉండే పెద్దపెద్ద వంటపాత్రలు తయారుచేసేవి." (ఖుర్‌ఆన్–34:12)

"సులైమాన్‌ని కూడా మేము పరీక్షకు గురిచేశాము. అతని సింహాసనం మీద ఒక మొండెం తెచ్చి పడేశాం. సులైమాన్ (దాని మర్మం గ్రహించి) తన నిర్ణయాన్ని మార్చు కున్నాడు. 'ప్రభూ! నన్ను క్షమించు. నా తరువాత మరెవ్వరికీ శోభించనటువంటి గొప్ప సామ్రాజ్యం ప్రసాదించు నాకు. నిస్సందేహంగా నీవే దాతవు, అనుగ్రహమూర్తివి' అని మమ్మల్ని వేడుకున్నాడు. అప్పుడు మేము గాలిని అతని అదుపులో ఉంచాము. ఆ గాలి అతని ఆజ్ఞతో అతను కోరుకున్న వైపు మెల్లిగా వీస్తుంది." (ఖుర్‌ఆన్–38:34–36)

"ఓరోజు సాయంత్రం సులైమాన్ ముందు మేలుజాతి చలాకీ గుఱ్ఱాలు కొన్ని తీసుకు రాబడ్డాయి. "నాప్రభువు స్మరణ కారణంగానే నేనీ అశ్వసంపదను అభిమానిస్తున్నాను' అన్నాడతను. తర్వాత ఆ గుఱ్ఱాలు కనుమరుగైపోయాయి. (సులైమాన్ సేవకుల్ని పిలిచి) 'వాటిని మరోసారి నాదగ్గరకు తీసుకురండి' (అన్నాడు). (గుఱ్ఱాలు వచ్చిన తర్వాత) అతను (ప్రేమగా) వాటి మెడలు, కాళ్ళు నిమిరాడు. (ఖుర్‌ఆన్–38:31–33)



"సులైమాన్ కోసం మానవులు, భూతాలు, పక్షుల సైన్యాలు సమకూర్చబడ్డాయి. అవన్నీ క్రమశిక్షణలో ఉంచబడుతుండేవి. (ఓసారి అతను వారితో ప్రయాణం చేస్తూ) చివరికి వారంతా ఓ చీమలలోయలోకి ప్రవేశించారు. అప్పుడు ఓ చీమ (వారినిచూసి) "చీమల్లారా! (తొందరగా) మీరు మీపుట్టల్లోకి దూరండి. లేకుంటే సులైమాన్, అతని సైనికులు తమకు తెలియకుండానే మనల్ని తొక్కి నలిపేస్తారు" అన్నది. దాని మాటలు విని సులైమాన్ చిరునవ్వు నవ్వాడు. (తరువాత మాపట్ల కృతజ్ఞతా భావంతో) 'ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేలుకు నేను ఎల్లప్పుడూ నీకు కృతజ్ఞుణ్ణయి ఉంటూ, నీకు నచ్చిన సత్కార్యాలు ఆచరించేలా నన్ను అదుపులో పెట్టు. దయతో నన్ను నీ పుణ్యదాసుల జాబితాలో చేర్చు' అని ప్రార్థించాడు." (ఖుర్‌ఆన్–27:17,18,19)

## (1) వడ్రంగిపిట్ట సందేశం, సబారాణితో భేటి

"సులైమాన్ పక్షుల స్థితిగతులు సమీక్షిస్తూ 'ఏమిటీ, ఫలానా వడ్రంగిపిట్ట కన్పించడం లేదూ? ఎక్కడికైనా పోయిందా? అది నా దగ్గరకొచ్చి సరైన కారణం చెప్పాలి. లేకుంటే నేను దాన్ని కఠినంగా శిక్షిస్తాను లేదా కోసివేస్తాను' అన్నాడు." (ఖుర్‌ఆన్–27:20,21)

"ఆతర్వాత కాస్సేపటికి ఆ పక్షి వచ్చి 'నేను మీకు తెలియని ఓ విషయం గురించి వార్త తెచ్చాను. సబా(రాజ్యం) గురించి నమ్మకమైన సమాచారం తెచ్చాను. నేనక్కడ ఓ స్త్రీని చూశాను. ఆమె ఆ జాతికి రాణిగా పాలన చేస్తోంది. ఆమెకు అన్నిరకాల సంపదలు ప్రసాదించబడ్డాయి. ఆమె సింహాసనం ఎంతో అద్భుతంగా ఉంది. కాని ఆమె, ఆమెజాతి ప్రజలు దేవుడ్ని వదలి సూర్యుడి ముందు సాష్టాంగపడుతున్నారు' అని చెప్పింది. 'సరే. నీవు నిజం చెప్పావో లేక అబద్ధాలమారివో మేము ఇప్పుడే కనుక్కుంటాం. నాయీ లేఖ తీసికెళ్ళి వారిముందు పడవెయ్యి. తరువాత పక్కకు వెళ్ళి దీనిపై వారి ప్రతిస్పందన ఏమిటో చూడు' అన్నాడు సులైమాన్." (ఖుర్‌ఆన్–27:27,28)

"(దాని ప్రకారం వడ్రంగిపిట్ట లేఖ తీసికెళ్ళి సబారాణి ముందు విసిరింది.) సబా రాణి (దాన్ని చదివి) ఇలా అన్నది: 'సభాసదులారా! నా దగ్గరకు అతి ముఖ్యమైన ఒక ఉత్తరం విసిరేయబడింది. ఇది సులైమాన్ దగ్గర్నుండి వచ్చింది. కరుణామయుడు, కృపాసాగరుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభించబడింది. ఇందులో. 'నాపట్ల తిరుగుబాటు వైఖరికి పాల్పడ కుండా తక్షణమే విధేయురాలివై నావద్దకు వచ్చెయ్యి' అని ఉంది.' ఆమె (లేఖ సారాంశం చెప్పి) 'ప్రజానాయకులారా! ఈ వ్యవహారంలో నాకేదైనా సలహా ఇవ్వండి. ఏ విషయంలోనూ నేను మిమ్మల్ని సంప్రదించకుండా నిర్ణయం తీసుకోను' అన్నది. దానికి వారు 'మేము శక్తిమంతులం, గొప్ప సమరయోధులం. ఏం నిర్ణయం తీసుకోవాలో మీరే ఆలోచించి ఆజ్ఞాపించండి' అన్నారు." (ఖుర్‌ఆన్–27:29–33)

"రాజులు ఏదైనా రాజ్యంలో జొరబడితే దాన్ని సర్వనాశనం చేస్తారు. ఆ రాజ్యంలోని గౌరవనీయుల్ని పరాభవం చేస్తారు. వారు (మనల్ని) ఇలాగే చేస్తారు. అందువల్ల నేను వారి దగ్గరకు ఒక కానుక పంపిస్తాను. దానికి మన రాయబారి ఏం సమాధానం తీసుకొస్తాడో చూద్దాం' అన్నది రాణి." (ఖుర్‌ఆన్–27:34,35)

“రాయబారి సులైమాన్ దగ్గరకు చేరుకున్నాడు. (ఆయనకు కానుక సమర్పించాడు.) అప్పుడు సులైమాన్ ఇలాఅన్నాడు: ‘మీరు నాకు సిరిసంపదలతో సహాయం చేయదలచుకున్నారా? దేవుడు మీకిచ్చిన దానికంటే ఎంతోఎక్కువ నాకు ప్రసాదించాడు. మీ కానుక మీకే చెల్లు. నిన్ను పంపినవారి దగ్గరకు తిరిగివెళ్ళిపో. మేము వారిపైకి బ్రహ్మాండమైన సైన్యం తెస్తాం. వారెట్టి పరిస్థితిలోనూ దీన్ని ఎదిరించలేరు. మేము వారిని అక్కడ్నుంచి పరాభవంపాల్జేసి వెళ్ళగొడ్తాం. వారిక తుచ్ఛులుగా ఉండిపోతారు. ‘సభాసదులారా! వారు లొంగిపోయి నాదగ్గరకు రాకముందే ఆమె సింహాసనాన్ని నాదగ్గరకు మీలో ఎవరు తీసుకు రాగలుగుతారు?’ అనడిగాడు సులైమాన్.” (ఖుర్ఆన్-27:36,37,38)

“దానికి జిన్నుల (భూతాల)లో ఒక దృఢకాయుడు లేచి ‘మీరు మీస్థానం నుండి లేవకముందే నేను దాన్ని మీముందు తెచ్చిపెడ్తాను. నాకాశక్తి ఉంది. పైగా నేను నమ్మకస్తుడ్ని కూడా’ అన్నాడు. అయితే (విశేష) గ్రంథజ్ఞానం కలిగిన ఒకతను అందుకొని ‘మీరు కళ్ళుమూసి తెరిచేలోగానే నేను దాన్ని తీసుకొస్తాను’ అన్నాడు. అనడం ఏమిటి, మరుక్షణమే ఆ సింహాసనం సులైమాన్ ముందు ప్రత్యక్షమయింది. సులైమాన్ దాన్ని చూసి “ఇది నా ప్రభువు అనుగ్రహం. నేను కృతజ్ఞత చూపుతానా లేక అవిశ్వాసవైఖరితో కృతఘ్నుడ్నైపోతానా అని నన్ను పరీక్షించడానికే ఆయన ఇలా చేశాడు. ఎవరైనా కృతజ్ఞత చూపుతున్నాడంటే అది అతనికే లాభదాయకమవుతుంది. కృతఘ్నుడైపోతే (అతనికే చేటు). నాప్రభువు నిరపేక్షాపరుడు దేన్నీ ఖాతరుచేయని వాడు...’ అని అన్నాడు.” (ఖుర్ఆన్-27:39,40)

“ఆతర్వాత సులైమాన్ ‘ఆమె సింహాసనాన్ని తీసికెళ్ళి ఆమె ముందుపెట్టండి. (దీన్ని చూసి) ఆమె సరైన నిర్ణయానికి వస్తుందో లేక మార్గవిహీనుల్లోనే పడిఉంటుందో చూద్దాం’ అన్నాడు. సబారాణి వచ్చాక ‘నీ సింహాసనం ఇలాగే ఉంటుందా?’ అని అడిగాడతను. దానికామె ‘ఇది అచ్చం అలాగే ఉంది. మేము ముందే (మీ సామర్థ్యం) తెలుసుకున్నాం. మేము పూర్తిగా విధేయులయ్యాం’ అన్నది.” (ఖుర్ఆన్-27:41,42)

“ఆమె అవిశ్వాసజాతికి చెందిన స్త్రీ. అంచేత ఆమె నిజదేవుడ్ని వదలి మిథ్యాదైవాల్ని పూజిస్తుండేది. ఈ అలవాటే ఆమెను (సత్యాన్ని విశ్వసించనీయకుండా) నిరోధించింది. రాజమహల్‌లో ప్రవేశించమని ఆమెకు చెప్పాడు. (ప్రవేశించగానే) ఆమెకు అక్కడ ఒక నీటికొలను ఉన్నట్లు కన్పించింది. అందువల్ల ఆమె అందులోకి దిగి నడవడానికి తన ముంగాళ్ళమీది వస్త్రం పైకెత్తి పట్టుకుంది. అప్పుడు సులైమాన్ ‘ఇది గాజుతో నిర్మించిన నున్నటి నేల’ అన్నాడు. దాంతో ఆమె (సత్యాన్ని గ్రహించి) ‘ప్రభూ! నేను ఆత్మద్రోహానికి పాల్పడ్డాను. ఇప్పుడు నేను సులైమాన్‌తో పాటు సర్వలోక ప్రభువుకు విధేయురాలినయి (ముస్లింనయి) పోయాను’ అని అరిచింది.” (ఖుర్ఆన్-27:43,44)

“మేము సులైమాన్ విషయంలో మృత్యు ఆదేశం జారీ చేసినప్పుడు, సులైమాన్ చేతికర్రకు పట్టిన చెదవల్ల తప్ప మరేవిషయం ద్వారా అతనిమరణవార్త భూతాలకు తెలియలేదు. ఇలా (చేతికర్రకు చెదపట్టి) సులైమాన్ (భౌతికకాయం) నేలకొరిగిపోగానే భూతాలకు ఈసంగతి తెలిసిపోయింది. ఒకవేళ ఆ భూతాలకు అతీంద్రియజ్ఞానముంటే ఈ విధంగా అవి అవమానకరమైన యాతనలో చిక్కుకొని ఉండేవికావు.” (ఖుర్ఆన్-34:14)



# 15. సబాజాతి ప్రజలు

“సబాజాతి ప్రజలకు వారి నివాసగృహాలలోనే ఒక సూచన ఉంది. కుడిఎడమల వైపు రెండు తోటలున్నాయి. మీ ప్రభువు ప్రసాదించిన ఉపాధిని అనుభవిస్తూ, ఆయన పట్ల కృతజ్ఞులై ఉండండి. (ఇక్కడ భోగభాగ్యాలతో నిండిన) మంచిరాజ్యం ఉంది. (అక్కడ) మిమ్మల్ని మన్నించే ప్రభువున్నాడు.” (ఖుర్ఆన్-34:15)

“కాని వారు (మానుండి) ముఖం తిప్పుకున్నారు. చివరికి మేము ఆనకట్టలు తెగిపోయిన వరదను వారిపైకి పంపాము. వారి (వినాశం) తర్వాత మేము పూర్వం ఉండిన (మధురఫలాలతో నిండిన) తోటల స్థానంలోనే, చేదుపండ్లు పండే మరోరెండు తోటలు సృజించాం. కాకపోతే ఆ తోటలలో అక్కడక్కడ కొన్ని రేగుచెట్లు, వెదురుచెట్లు మాత్రం ఉన్నాయి. ఇదీ మేము సత్యతిరస్కారానికి వారికిచ్చిన ప్రతిఫలం. కృతఘ్నులైనవారికి తప్ప మరెవరికీ మేము ఇలాంటి ప్రతిఫలం ఇవ్వము.” (ఖుర్ఆన్-34:16,17)

“వారికి, మేము శుభాలు చేకూర్చిన పట్టణాల మధ్య స్పష్టంగా కన్పించే పట్టణాలు నెలకొల్పాం. ఆ పట్టణాల మధ్య సులువైన మజిలీలు ఏర్పరచాం. (కనుక) మీరు నిశ్చింతగా రేయింబవళ్ళు ఆ రహదారులలో తిరగండి. కాని వారు ‘ప్రభూ! మా ప్రయాణ మజిలీలు సుదీర్ఘం చేయి’ అన్నారు. వారు తమకుతాము అన్యాయం చేసుకున్నారు. చివరికి మేము వారిని చెల్లాచెదరు చేసి చరిత్రగర్భంలో కలిపేశాం. కృతజ్ఞులు, సహనశీలురకు ఈ ఉదంతంలో గొప్ప సూచనలు ఉన్నాయి.” (ఖుర్ఆన్-34:18,19)

క్రీ.పూ. 965-926 మధ్యకాలంలో అంటే సులైమాన్ ప్రవక్త (అలైహి) కాలంలో సబాదేశం రాణితో పాటు ఆ దేశప్రజలు అత్యధికమంది సూర్యారాధన, విగ్రహపూజలను వదలి ఇస్లాం స్వీకరించినట్లు తెలుస్తోంది. ఆ తరువాత కొన్నేళ్ళకు క్రమంగా ఆ జాతిలో మళ్ళీ విగ్రహారాధన చోటు చేసుకుంది. క్రీ.పూ. 650 నుండి 115 వరకు సబాజాతి ఉచ్ఛస్థితిలో ఉండింది. ఆకాలంలో వారు వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో ఎంతో పురోభివృద్ధి సాధించి యావత్తు జాతుల్లో గొప్ప ధనికజాతిగా ప్రసిద్ధిచెందారు. వర్షాకాలంలో కొండలపై నుండి ప్రవహించే వరదనీటికి అనేక చోట్ల ఆనకట్టలు నిర్మించి పెద్ద జలాశయం తయారు చేసుకున్నారు. ఆ జలాశయం నుండి కాలువలు తీసి తోటలకు, పంట భూములకు మళ్ళించి మొత్తం దేశాన్ని సస్యశ్యామలం చేశారు.

అలాగే వారు భూ, సముద్ర మార్గాల ద్వారా సరుకులు ఎగుమతి దిగుమతులు చేసుకుంటూ వ్యాపారరంగాన్ని ఎంతో వృద్ధిచేశారు. తమ రాజ్యంలో భౌగోళికంగా ఎంతో కీలకప్రదేశాలు ఉండటంవల్ల వారివ్యాపారం దాదాపు వెయ్యేండ్లపాటు మూడుపువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లింది. ఆకాలంలో వారు వెండి బంగారాలతో చేయబడిన పాత్రలు ఉపయోగించేవారు. గోడలకు, కప్పులకు సైతం వెండి బంగారు నగిషీలుండేవి.

సబాజాతి ప్రజల ఆర్థికాభివృద్ధి, విలాస జీవిత గాథలు విని రోమన్లు, గ్రీకులు కూడా ఈర్ష్య పడేవారు. వారు వంటచెరుకుగా గంధపు కలప, దాల్చిన చెక్కలను ఉపయోగించేవారు. కొండలను తొలచి పెద్దపెద్ద మేడలు నిర్మించారు. మానవ చరిత్ర

లోనే మొట్టమొదట సనా పట్టణంలోని ఒక ఎత్తయిన కొండ ప్రదేశంలో 20 అంతస్తుల భవనం నిర్మించారు. అందులో ప్రతి అంతస్తూ 36 అడుగుల ఎత్తుండేది. ఈ రాజ భవనం అనేక శతాబ్దాల వరకు ఖ్యాతిగాంచింది.

ఈ సుఖాలు, భోగభాగ్యాలు వారిపై దైవానుగ్రహం ఉన్నంత కాలం కొనసాగాయి. కాని చివరికి వారి ఐశ్వర్యం, ప్రాపంచిక వ్యామోహాలు వారి హృదయాల నుండి దైవభీతిని దూరంచేశాయి. ఈవిధంగా వారిలో దేవుని పట్ల కృతఘ్నత, ధిక్కార ధోరణులు హద్దుమీరిపోవడంతో దైవాగ్రహం విరుచుకుపడింది. పొరుగురాజ్యాల నుండి తట్టుకోలేని దాడులు ప్రారంభమయ్యాయి. చివరికి క్రీ.శ. 45లో భయంకరమైన తుఫాను, వరదలు వచ్చి జలాశయానికి పెద్ద గండ్లు పడ్డాయి. దాంతో తోటలు, పంటభూములు వరద ముంపుకు గురయి సర్వనాశనమయ్యాయి.

## 16. ఇల్యాస్ (అలైహి)

"ఇల్యాస్ కూడా దైవప్రవక్తే. అతను తనజాతికి హితోపదేశం చేస్తూ 'మీరు (దేవునికి) భయపడరా? ఎంతో మంచి సృష్టికర్తను వదలి బాల్ (విగ్రహం)ను ప్రార్థిస్తున్నారా? మీకు, మీ తాతముత్తాతలకు ఆ దేవుడే కదా ప్రభువు?' అని అన్నాడు." (ఖురాన్-37:123-126)

ఇల్యాస్ (అలైహి) యూదులకు సన్మార్గం చూపడానికి ప్రభవించిన దైవప్రవక్త. ఖుర్ఆన్‌లో రెండు చోట్ల (6:85,37:123) మాత్రమే ఈయన ప్రస్తావన వచ్చింది. కాని వివరాలు లేవు. చరిత్రకారుల పరిశోధన ప్రకారం ఈయన క్రీ.పూ. 875-850 మధ్య కాలంలో జీవించి ఉన్నట్లు తెలుస్తోంది. బైబిల్‌లో ఈయన పేరు ఏలియా అని వుంది.

బైబిల్ కథనం ప్రకారం సులైమాన్ ప్రవక్త (అలై) చనిపోయిన తరువాత ఆయన కొడుకు రహుబామ్ అయోగ్యత వల్ల యూదుల సామ్రాజ్యం రెండు ముక్కలయింది. జెరూసలేంతో పాటు దక్షిణపాలస్తీనా భూభాగం ఒక రాజ్యంగా ఏర్పడితే, ఉత్తర పాలస్తీనాభూభాగం ఇస్రాయీల్ పేరుతో మరోరాజ్యంగా ఏర్పడింది. ఈ రెండు రాజ్యాలు నైతికంగా, ధార్మికంగా క్రమేణా దిగజారిపోయాయి. ముఖ్యంగా ఇస్రాయీల్‌రాజు బహుదైవారాధకురాలైన సైదా (లెబనాన్‌రాజు కుమార్తె)ను వివాహమాడిన తర్వాత అతని రాజ్యం మరింత దిగజారిపోయింది. విగ్రహారాధన ఎక్కువైపోయింది. ప్రజలు 'బాల్' విగ్రహాన్ని ఆరాధించడం, దాని పేరుతో జంతుబలులు ఇవ్వడం ప్రారంభించారు.

ఆ కాలంలోనే హజ్రత్ ఇల్యాస్ (అలై) దైవప్రవక్తగా ప్రభవించి విగ్రహారాధనకు, ఇతర చెడులకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. ఇస్రాయీల్ రాజును తీవ్రంగా హెచ్చరిస్తూ "నీ పాపాల మూలంగా ఇప్పుడు ఇస్రాయీల్ దేశంలో వర్షం కురవదు. కనీసం మంచు కూడా కురవదు" అని శపించారు ఆయన. ఈ శాపం ఫలితంగా మూడున్నర సంవత్సరాల దాకా వర్షం కురవలేదు. అప్పుడు ఇస్రాయీల్ రాజు దిగివచ్చి ఈ దుస్థితి నుండి కాపాడమని ఇల్యాస్ ప్రవక్త (అలై)ను ప్రాధేయపడ్డాడు.

అయితే హజ్రత్ ఇల్యాస్ (అలైహి) బాల్ దేవత, విశ్వప్రభువయిన యెహోవాలలో ఎవరు నిజదేవుడో నిరూపించడానికి బహిరంగ జనసమూహాన్ని ఏర్పాటు చేయించారు.



ఈ ప్రదర్శనలో 850 మంది బాల్ దేవత పూజారులు పాల్గొన్నారు. బాల్ దేవత పేరుతో దాని పూజారులు, విశ్వప్రభువు పేరుతో ఇల్యాస్ ప్రవక్త (అలైహి) జంతుబలి ఇవ్వాలని, ఈ రెండు బలులలో ఆకాశం నుండి దైవాగ్ని వచ్చి ఎవరి బలిదానాన్ని భస్మీపటలం చేసి స్వీకరిస్తుందో వారు గెలిచినట్లని నిర్ణయమయింది.

చివరికీ పోటీలో బాల్‌పూజారులు ఓడిపోయారు. ఆకాశం నుండి వచ్చిన దైవాగ్ని ఇల్యాస్ (అలై) సమర్పించిన పశువునే కాల్చివేసింది. ఇలా విశ్వప్రభువైన యెహోవాయే నిజదేవుడని, ఆరాధ్యనీయుడని ఇస్రాయీల్ ప్రజలందరి ముందు రుజువయింది. నిర్ణీత షరతుల్లో ఓడినవారిని హతమార్చాలని కూడా ఉంది. దాని ప్రకారం బాల్‌దేవత పూజారు లందర్నీ హతమార్చడం జరిగింది. ఆ తర్వాత ఇల్యాస్ (అలై) వర్షం కోసం దైవాన్ని ప్రార్థించారు. దాంతో ఇస్రాయీల్ రాజ్యమంతటా విస్తారంగా వర్షం కురిసింది.

కాని ఇంతటి గొప్ప మహత్యం చూసినప్పటికీ ఇస్రాయీల్‌రాజు బహుదైవారాధకు రాలైన తన భార్య వల నుండి బయటపడలేక పోయాడు. పైగా అతని భార్య ఈ మహిమ చూసిన తర్వాత ఇల్యాస్ (అలై)కు బద్ధశత్రువయి పోయింది. బాల్ పూజారులు ఎలా చంపబడ్డారో ఇల్యాస్‌ని కూడా అలా చంపడం జరుగుతుందని ఆమె ప్రమాణం చేసి మరీ ప్రకటించింది. దాంతో ఇల్యాస్ (అలై) ఇక ఇస్రాయీల్ రాజ్యంలో ఉండటం వల్ల ప్రయోజనం లేదని భావించి, అక్కడ్నుంచి వేరే చోటికి తరలిపోయారు.

ఆ కాలంలోనే యూదసామ్రాజ్యం రాజు ఇస్రాయీల్ రాజు కుమార్తెను వివాహ మాడాడు. ఆమెద్వారా యూదరాజ్యంలో కూడా బహుదైవారాధన వ్యాపించింది. అంచేత ఇల్యాస్ (అలై) అక్కడ కూడా ధర్మప్రచారం చేసి ప్రజలను ఏకేశ్వరోపాసన వైపు మరలించడానికి కృషి చేశారు. ఆయన యూద రాజుక్కూడా హితోపదేశం చేశారు. కాని యూదరాజుకు ప్రవక్త హితవులు చెవికెక్కలేదు. చివరికి ఇల్యాస్ (అలై) అతడ్ని తీవ్రంగా శపించారు. ఈ శాపం ఫలితంగా మొదట యూదరాజ్యంపై శత్రుసైన్యాలు దాడులు చేసి సర్వనాశనం చేశాయి. వారతని భార్యల్ని కూడా బంధించి తీసికెళ్ళారు. ఆ తరువాత యూదరాజు భయంకరమయిన అజీర్ణవ్యాధితో చనిపోతాడు.

ఈ సంఘటన జరిగిన కొన్నేళ్ళ తరువాత ఇల్యాస్ (అలైహి) మళ్ళీ ఇస్రాయీల్ రాజ్యానికి వెళ్ళి ధర్మప్రచారం చేస్తారు. ఆ తరువాత వచ్చిన ఇస్రాయీల్ రాజుక్కూడా హితోపదేశం చేస్తారు. కాని ఆ రాజవంశంలో పేరుకుపోయిన చెడులు ఏమాత్రం తొలగి పోలేదు. దాంతో ఆ వంశాన్ని కూడా శపించడం, అది సర్వనాశనమైపోవడం జరిగాయి. ఆ తరువాత దేవుడు ఆయన్ని తన దగ్గరికి పిలుచుకున్నాడు.

యూదులు ఇల్యాస్ (అలై)ని ఆయన జీవించి ఉన్నప్పుడు ఎంతగా వేధించారో, ఆ తరువాత ఆయన్ని అంతగా అభిమానించడం మొదలెట్టారు. వారు ఇల్యాస్ (అలై)ని మూసా (అలై) కంటే గొప్పప్రవక్తగా భావించారు. అంతేకాదు, దేవుడు ఆయన్ని ఓ సుడిగాలి ద్వారా సజీవంగా, సశరీరంగా ఆకాశంలోకి ఎత్తుకున్నాడని, తరువాత ఆయన మళ్ళీ భూలోకానికి తిరిగివస్తారని కూడా వారు నమ్ముతున్నారు.

(మౌలానా మౌదూదీ గారి తఫ్హీముల్ ఖుర్ఆన్ ఆధారంగా.)

**ఎజ్రా (ఉజైర్)**:- యూదులు ఈయన్ని తమ మతాన్ని సంస్కరించిన గొప్ప సంస్కర్తగా చెప్పుకుంటారు. ఉజైర్ (అలై) కాలం దాదాపు క్రీ.పూ. 450 అని పరిశోధకులు నిర్ధారించారు. యూద మతఉల్లేఖనాల ప్రకారం సులైమాన్ ప్రవక్త (అలై) చనిపోయిన తర్వాత యూదులు శత్రుదాడులతో కకావికలమైపోయారు. తౌరాత్ ప్రపంచం నుండే కనుమరుగై పోయింది. చివరికి వారి మాతృభాష హెబ్రూ కూడా వారికి అపరిచితమై పోయింది. అలాంటి గడ్డుకాలంలో ఉజైర్ (అలై) తౌరాత్ బోధనలను ఏరి కూర్చి, వారి ధర్మశాస్త్రాన్ని సంస్కరించారు. అంచేత యూదులు ఆయన్ని అమితంగా గౌరవిస్తారు. అయితే కొంతకాలానికి ఈ గౌరవప్రపత్తులు హద్దుమీరిపోయి యూదుల్లో ఒక వర్గం ఆయన్ని దేవుని కుమారుడని పలికే వరకు పోయింది. (9:30 సూక్తి చూడండి.)

# 17. అయ్యూబ్ (అలైహి)

“అయ్యూబ్ గాధ కూడా గుర్తుకుతెచ్చుకో. అతను (వ్యాధిగ్రస్త స్థితిలో ఉండి) “(ప్రభూ!) నేను జబ్బుపడ్డాను. నీవు అందరికంటే గొప్ప దయామయుడవు.’ అని ఎలుగెత్తి మొర పెట్టుకున్నాడు.” (21:83)

“...అతను తన ప్రభువుని ప్రార్థిస్తూ ‘షైతాన్ నన్ను తీవ్ర బాధకు, యాతనలకు గురిచేశాడ’ని అన్నాడు. (అప్పుడు మేము) ‘నీ కాళ్ళతో నేలమీద తట్టు. ఈ చన్నీళ్ళు స్నానం చేయడానికి, త్రాగడానికి నీకిస్తున్నాం’ (అన్నాం). మేమతనికి అతని బంధువర్గాన్ని తిరిగి రప్పించి ఇచ్చాం. వారితోపాటు అంతే మరికొందరిని కూడా ఇచ్చాం. ఇదంతా మావైపున అనుగ్రహంగా ప్రసాదించాం. విజ్ఞత, వివేచనలు కలవారికి గుణపాఠంగా మేమీ వృత్తాంతం పేర్కొంటున్నాం.” (ఖుర్ఆన్-38:41-43)

“(అతనితో) ‘ఈనెల కట్ట తీసుకొని కొట్టు, ప్రమాణాన్ని భంగపరచకు’ అన్నాము. మేమతడ్ని సహనశీలిగా, మంచి దాసునిగా, తన ప్రభువు వైపుకు మాటిమాటికి మరలే వానిగా గుర్తించాము.” (ఖుర్ఆన్-38:44)

(హజ్రత్ అయ్యూబ్ (అలైహి) దైవప్రవక్త. దేవుడు ఆయన్ని ఓ భయంకర వ్యాధి కలిగించి పరీక్షించదలిచాడు. అనేక సంవత్సరాలపాటు ఈ వ్యాధితో ఆయన బాధపడి నట్లు తెలుస్తోంది. దానివల్ల ఆయన సిరిసంపదలూ పోయాయి; సేవకులూ విడిచి పెట్టారు. బంధుమిత్రులు కూడా దూరమైపోయారు. ఒక్కభార్య మాత్రమే ఆయనకు సేవచేస్తూ కనిపెట్టుకొని ఉండేది. వ్యాధి సందర్భంగా తనకు సపర్యలు చేయడంలో బహుశా ఏదైనా లోపం చూసి, కోపంతో అయ్యూబ్ (అలై) తన భార్యకు వంద కొరడా దెబ్బలు కొడ్తానని ప్రమాణం చేసివుంటారు.

చివరికి ఆయన స్వస్థత చేకూర్చమని చేసిన ప్రార్థనను దేవుడు ఆలకించి ఆయనకు స్వస్థత చేకూర్చాడు. స్వస్థత చేకూరిన తరువాత ఆయన తన ప్రమాణాన్ని నెరవేర్చుకో వలసిన సమయం వచ్చినప్పుడు ఈ సూక్తిలో పేర్కొనబడినట్లు వంద కొరడా దెబ్బలకు బదులు వంద ఈనలు గల ఓ ఈనలకట్ట తీసుకొని భార్యను ఒకసారి కొట్టవలసిందిగా దేవుడు ఆయన్ని ఆదేశించాడు.)



# 18. యూనుస్ (అలైహి)

“మత్స్యబాధితుడి సంగతి జ్ఞాపకంతెచ్చుకో. అతను కోపం వచ్చి వెళ్ళిపోయాడు. మేము తనను నిలదీయబోమని భావించాడు.(21:87); (మత్స్యబాధితుడైన) యూనుస్ కూడా దైవప్రవక్తే. అతనొక నిండునావ వైపు పరుగెత్తాడు. అక్కడ ఇతర ప్రయాణీకుల పేర్లతో పాటు అతనిపేరు కూడా కలిపి చీటీవేయడం జరిగింది. ఈ చీటీలో అతను దెబ్బతిన్నాడు. చివరికి అతడ్ని ఒక చేప మింగేసింది. అతను (తనను తాను నిందించుకుంటూ) నిందితుడై పోయాడు.” (37:139-142); “అతను (చేప కడుపులోని) గాఢాంధకారంలో ‘నీవు తప్ప మరోఆరాధ్యుడు లేడు. నీవు పరిశుద్ధుడవు. నేను నిజంగా దుర్మార్గుణ్ణయ్యాను’ అని మొరపెట్టుకున్నాడు. మేమతని మొరాలకించి అతడ్ని బాధ,పరితాపాల నుండి విముక్తి కలిగించాం.” (ఖుర్ఆన్-21:87,88)

“అప్పుడతను దైవాన్ని స్మరించి ఉండకపోతే పునరుత్థానదినం దాకా ఆచేప కడుపులోనే ఉండిపోయేవాడు. చివరికి మేమతడ్ని వ్యాధిగ్రస్త స్థితిలో ఇసుక మైదానంలో విసిరేశాం. అతని నీడ కోసం అక్కడ ఒక తీగచెట్టు మొలిపించాం. తర్వాత అతడ్ని మేము లక్షమంది లేక అంతకు పైగాఉన్న ప్రజల దగ్గరికి పంపాము. వారు సత్యాన్ని విశ్వసించారు. కనుక మేము ఓ నిర్ణీతకాలం దాకా వారిని వదలిపెట్టాం.” (ఖుర్ఆన్-37:143-148)

యూనుస్-అలై వెళ్ళిపోయాక ఆయన హెచ్చరిక ప్రకారం ప్రకృతివిపత్తు రూపంలో దైవశిక్ష వచ్చిపడే సూచనలు కన్పించాయి. దాంతో ప్రజలు భయపడి యూనుస్ (అలై) కోసం అన్వేషించారు. కాని ఆయన ఎక్కడా కన్పించలేదు. చివరికి వారు తమ పిల్లా పాపలు, పశువులతోసహా పట్నం వెలుపలికెళ్లి పశ్చాత్తాపంతో దైవాన్ని వేడుకున్నారు. దేవుడు వారిని కనికరించి ప్రకృతివిపత్తు నుండి కాపాడాడు. ఆ తర్వాత యూనుస్ పట్నానికి తిరిగిరావడం, వారు సత్యాన్ని స్వీకరించి ముస్లిములై పోవడం జరిగింది.

యూనుస్‌జాతి ప్రస్తుత ఇరాఖ్‌కు చెందిన అసీరియా జాతి ప్రజలు. అయితే ఇస్రాయీల్‌సంతతికి చెందిన యూనుస్ ప్రవక్త (అలైహి)ను దేవుడు అసీరియా ప్రజలకు సన్మార్గం చూపేందుకు పంపినందున వారు యూనుస్ జాతి ప్రజలుగా ఖుర్ఆన్‌లో ప్రసిద్ధిచెందారు. ఈ జాతి క్రీ.పూ. 860-784 మధ్య కాలంలో ఉండేదని తెలుస్తోంది.

# 19. జకరియ్యా (అలైహి)

“ఇది నీప్రభువు తనదాసుడు జకరియ్యాపై చిలికించిన కరుణామృతానికి సంబం ధించిన ప్రస్తావన. అతను ఏకాంతంలో తనప్రభువును వేడుకున్నప్పటి విషయం. (19:2,3); (కొన్నాళ్ళకు) దేవుడు జకరియ్యాను మర్యంకు సంరక్షకునిగా నియమించాడు. జకరియ్యా ఆమె ప్రార్థనాగదిలోకి ప్రవేశించినప్పుడల్లా అక్కడ ఆహారపదార్థాలు ప్రత్యక్షమై ఉండేవి. అదిచూసి (ఓరోజు)‘మర్యం! నీకీ ఆహారం ఎక్కడ్నుంచి వస్తోంది?’ అని అడిగాడు అతను (ఆశ్చర్యంగా). దానికామె ‘దేవుని దగ్గర్నుంచి. ఆయన తాను తలచుకున్న వారికి ఇతోధికంగా ఆహారం ప్రసాదిస్తాడు’ అని సమాధానమిచ్చింది. (ఖుర్ఆన్-3:36,37)

"అప్పుడు జకరియ్యా తన ప్రభువును వేడుకుంటూ 'ప్రభూ! నీ సన్నిధి నుండి నాకు ఉత్తమ సంతానం ప్రసాదించు. నిస్సందేహంగా నీవే మొరాలకించేవాడివి' అన్నాడు. అతనలా ప్రార్థనగదిలో నిలబడి ప్రార్థనచేస్తుండగానే దైవదూతలు వచ్చి అతడ్ని పిలిచారు: 'జకరియ్యా! దేవుడు నీకు యహ్యా (పుడతాడని) శుభవార్త తెలియజేస్తున్నాడు. అతను దేవుని నుండి వెలువడే ఒక వాణి (ఈసాప్రవక్త)ని ధృవపరుస్తాడు. పైగా అతను నాయకత్వపు లక్షణాలతో భాసిల్లుతూ ఎంతో నిగ్రహశక్తి కలవాడై ఉంటాడు; దైవప్రవక్త అవుతాడు; సజ్జనులలో పరిగణించబడతాడు' అని చెప్పారు వారు." (ఖుర్‌ఆన్–3:38,39)

"అప్పుడు జకరియ్యా 'ప్రభూ! నాకు పిల్లవాడు ఎలా పుడ్తాడు? నేను ముసలివాణ్ణయ్యాను. నాభార్య గొడ్రాలు!!' అన్నాడు. 'అలాగే ఇది జరుగుతుంది. దేవుడు తాను తలచిన పని చేసితీరుతాడు' అని సమాధానం వచ్చింది. 'అయితే ప్రభూ! ఈ విషయంలో నాకేదైనా సూచన నిర్ణయించు' అన్నాడు జకరియ్యా. 'నీవు మూడు రోజులదాకా సైగలతో తప్ప ప్రజలతో మాట్లాడలేవు. నీవు నీప్రభువును వీలైనంత ఎక్కువగా స్మరిస్తూఉండు. ఉదయం, సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడుతుండు" అన్నారు (దూతలు)." (ఖు:3:40,41)

జకరియ్యా(అలైహి) ఈసా, యహ్యా ప్రవక్తలకు పూర్వం వుండిన దైవప్రవక్త. హారూన్ ప్రవక్త (అలై) సంతతికి చెందిన ఇరవై నాలుగు కుటుంబాలు 'బైతిల్ మఖ్దిస్'కు వంతుల వారిగా సేవచేసేవారు. ఆ కుటుంబాల్లో అబ్యా కుటుంబానికి నాయకుడైన జకరియ్యా తన వంతు వచ్చినప్పుడల్లా ఈ సేవలో నిమగ్నులయ్యేవారు. ఈసాప్రవక్త (అలైహి) మాతృమూర్తి హజ్రత్ మర్యం (అలైహి) ఈయన సంరక్షణలోనే ఇవ్వబడ్డారు.

అయితే నైతిక, సామాజిక సంస్కరణల కోసం జకరియ్యా (అలై) చేసిన హితోపదేశాల్ని యూదులు సహించలేక ఆయన్ని అన్యాయంగా చంపివేశారు. స్వయంగా యూదమతగ్రంథం తల్మూద్ ప్రకారం బఖ్త్ నస్సర్ అనే రాజు బైతిల్‌మఖ్దిస్ (జెరూసలేం)పై విజయం సాధించిన తర్వాత యూదుల ఆరాధనాలయం (అఖ్సా)లో ప్రవేశించి పరిశీలిస్తుంటే వధ్యశిల సమీపంలో ఒకచోట గోడమీద అతనికి బాణం తగిలిన గుర్తు కన్పించింది. ఇదేమిటని అడిగితే "ఇక్కడ మేము జకరియ్యా ప్రవక్తను సంహరించాము. ఆయన మాలోని చెడుగుల్ని చూసి మమ్మల్ని విమర్శిస్తూ వుండేవారు. చివరికి మేము ఈ విమర్శల్ని, నిందల్ని సహించలేక ఆయన్ని చంపివేశాం" అని అన్నారు యూదులు.

# 20. మర్యం (అలైహి)

"ఇమ్రాన్ (వంశపు) స్త్రీ దేవుడ్ని ఇలా వేడుకుంది: 'ప్రభూ! నా గర్భంలోఉన్న శిశువును నీకు అంకితం చేస్తున్నాను. ప్రాపంచిక వ్యవహారాలకు ఈ శిశువును దూరంగా ఉంచుతాను. నానుండి దీన్ని స్వీకరించు. నీవే (అందరి మొరలు) ఆలకించేవాడవు..." (ఖుర్‌ఆన్–3:35)

"ఆమె ఆడపిల్లను కన్న తర్వాత 'ప్రభూ! (నేను మగ పిల్లవాడనుకుంటే) ఆడపిల్ల పుట్టిందే!' అన్నది. ఆమె కన్నదేమిటో దేవునికి బాగాతెలుసు. మగపిల్లవాడు ఆడపిల్ల వంటివాడు కాలేడు. 'నేనీ పాపకు మర్యం అని పేరుపెట్టాను. ఈమెను, ఈమె సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారిన పడకుండా నీరక్షణలో ఇస్తున్నాను' అన్నది ఆమె."



ఆ తర్వాత దేవుడు ఆ అమ్మాయిని సంతోషంగా స్వీకరించి, చక్కగా పెంచి పోషించాడు. (కొన్నాళ్ళకు) జకరియ్యాను ఆమెకు సంరక్షకునిగా నియమించాడు. జకరియ్యా ఆమె ప్రార్థనాగదిలోకి ప్రవేశించినప్పుడల్లా అక్కడ ఆహారపదార్థాలు ప్రత్యక్షమై ఉండేవి. అది చూసి (ఓరోజు) "మర్యం! నీకీ ఆహారం ఎక్కడ్నుంచి వస్తోంది?" అని అడిగాడు అతను (ఆశ్చర్యంగా). దానికామె "దేవుని దగ్గర్నుంచి. ఆయన తాను తలచుకున్న వారికి ఇతోధికంగా ఆహారం ప్రసాదిస్తాడు" అని సమాధానమిచ్చింది. (3:36,37)

ఆ తరువాత దైవదూతలు మర్యంతో "మర్యం! దేవుడు నిన్ను (ఓ ముఖ్యమైన పని కోసం) ఎన్నుకున్నాడు. నిన్ను పరిశుద్ధపరిచాడు. యావత్ప్రపంచ మహిళలలో నీకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి తన సేవ కోసం నియమించాడు. కనుక మర్యం! నీవిక నీ ప్రభువుకు విధేయురాలివై ఉండు. ఆయన సన్నిధిలో సాష్టాంగపడుతూఉండు. మోకరిల్లేవారితో పాటు నీవూ మోకరిల్లి ధ్యానం చేస్తూవుండు" అని అన్నారు. (3:42,43)

ముహమ్మద్ (స)! ఈ గ్రంథంలో మర్యం వృత్తాంతం ప్రస్తావించు. ఆమె ప్రజల నుండి వేరయి, తూర్పు వైపున ఏకాంత కుహరంలోకి వెళ్ళి తెరవేసుకొని కూర్చున్నది. అప్పుడు మేము ఆమె దగ్గరికి మా ఆత్మ (దైవదూత)ను పంపాము. అతను పరిపూర్ణ మానవాకారంలో ఆమె ముందు ప్రత్యక్షమయ్యాడు. (19:16,17)

మర్యం (అతడ్ని చూడగానే) "నేను నీబారి నుండి కరుణామయుని శరణుకోరుతున్నాను. నీవు దేవునికి భయపడే వాడివైతే (నాదగ్గరకు రాకు)" అన్నది. (19:18); "నేను నీ ప్రభువు దగ్గర్నుండి వచ్చిన దూతను. నీకొక పరిశుద్ధ బాలుడ్ని ఇచ్చే ఉద్దేశ్యంతో పంపబడ్డాను" అన్నాడతను. (ఖుర్‌ఆన్–19:19)

"ఏమిటీ, నాకు కొడుకు ఎలా కలుగుతాడు? నన్ను ఏ మానవుడూ తాకనైనా తాకలేదే! నేను శీలంలేని స్త్రీని కూడా కాదే!!' అన్నది మర్యం (కంగారుపడుతూ). 'అలాగే కలుగుతాడు. నీ ప్రభువే ఇలా సెలవిస్తున్నాడు: 'ఇలా చేయడం నాకు చాలా తేలిక. ఈ బాలుడ్ని మేము ప్రజల కోసం ఒక సూచనగా చేయాలని, మా వైపున కారుణ్యమూర్తిగా రూపొందించాలని నిర్ణయించాము. అందుకే ఇలా చేయబోతున్నాం. ఈ పని జరిగి తీరవలసిఉంది' అన్నాడు దైవదూత. (ఖుర్‌ఆన్–19:20,21)

మర్యం ఆబాలుడికి సంబంధించిన గర్భం దాల్చింది. ఆమె గర్భస్థపిండం తీసుకొని దూరాన ఉన్న ఓ స్థలానికి చేరుకుంది. ప్రసవవేదన ఆమెను ఒక ఖర్జూరపుచెట్టు క్రిందికి చేర్చింది. ఆమె (లోలోన బాధపడుతూ) "అయ్యో! (ఏమిటి నాకీ పరీక్ష) నేనీ ప్రసవానికి ముందే చనిపోయి నామరూపాల్లేకుండా పోతే బాగుండు!!" అన్నది. (19:22,23)

అప్పుడు దైవదూత ఆమె క్రింది వైపు నుండి పిలుస్తూ ఇలా అన్నాడు: "మర్యం! విచారించకు. నీ ప్రభువు నీ క్రింద ఒక మంచినీటి ఊట సృష్టించాడు. ఈ చెట్టుమొదలు పట్టుకొని ఊపు, నీ ముందు తాజా ఖర్జూరపండ్లు రాలిపడ్తాయి. వీటిని తింటూ, త్రాగుతూ హాయిగా ఉండు. మనుషులు ఎవరైనా కన్పిస్తే 'నేను కరుణామయుని కోసం ఉపవాసం ఉంటానని మొక్కుకున్నాను, అంచేత నేనీరోజు ఎవరితోనూ మాట్లాడను' అనిచెప్పెయ్యి." (ఖుర్‌ఆన్–19:24-26)

"ఆ తర్వాత ఆమె ఆ పిల్లవాడ్ని తీసుకొని తన జాతిప్రజల దగ్గరకు వెళ్ళింది. ప్రజలు (ఆమెను చూడగానే) 'మర్యం! నీవు చాలా ఘోరమైనపాపం చేశావు. హారూన్ (సంతతి) సోదరీ! నీతండ్రి చెడ్డవాడు కాదు. నీతల్లి కూడా శీలంచెడిన స్త్రీ కాదే! (నువ్విలా ఎందుకు తయారయ్యావు?)' అని అడిగారు. మర్యం (నోటితో సమాధానమివ్వకుండా ఒడిలో ఉన్న) పిల్లవాడి వైపు చూపింది. ప్రజలు (ఆశ్చర్యపోతూ) "మేమీ చంటిపిల్లవాడితో ఎలా మాట్లాడు తాం?' అన్నారు." (ఖుర్ఆన్-19:27,28,29)

"(వెంటనే) ఆ పిల్లవాడు ఇలా మాట్లాడటం మొదలెట్టాడు: 'నేను దేవుని దాసుడ్ని. ఆయన నాకు దివ్యగ్రంథం ప్రసాదించాడు. ప్రవక్తగా నియమించాడు. నేను ఎక్కడున్నా నన్ను శుభప్రదమైనవాణ్ణిగా చేశాడు. నేను బ్రతికున్నంతకాలం నమాజ్, జకాత్ విధులు పాటిస్తుండాలని ఆదేశించాడు. నాతల్లి పట్ల నేను విధేయతకలవాడ్నిగా చేశాడు. ఆయన నన్ను దుర్మార్గుడిగా, దౌర్భాగ్యుడిగా చేయలేదు. నేను పుట్టినప్పుడు, చనిపోయేటప్పుడు, తిరిగి బ్రతికించి లేపబడేటప్పుడు నాపై శాంతి అవతరించు గాక!" (ఖుర్ఆన్-19:30-33)

## 21. యహ్యా (అలైహి)

"యహ్యా! దైవగ్రంథాన్ని దృఢంగా పట్టుకో'- మేమతనికి బాల్యంలోనే విజ్ఞత, వివేకాలు ప్రసాదించాం. మావద్ద నుండి వాత్సల్యం, పరిశుద్ధతలు కూడా అనుగ్రహించాము. అతను గొప్ప దైవభీతిపరుడు; తల్లిదండ్రుల పట్ల వినయవిధేయతలు కలవాడు. అహంకారం, తలబిరుసుతనాలు మచ్చుకైనా లేనివాడు. అతను పుట్టినరోజున, చనిపోయేరోజున, తిరిగిబ్రతికించి లేపబడేరోజున అతనికి శాంతి కలుగుగాక!" (ఖుర్ఆన్-19:12-15)

యహ్యా(యూహన్న) జకరియ్యా ప్రవక్త(అలై) కుమారుడు. ఈయన కూడా యూదుల కోసం దైవప్రవక్తగా నియమించబడ్డారు. యహ్యా (అలై), ఈసా (అలై)లు ఒకేకాలంలో ప్రభవించిన దైవప్రవక్తలు. యూదులు ఎంతోకాలం నుంచి నిరీక్షిస్తుండిన ముగ్గురు ప్రవక్తలలో యహ్యా (అలై) లేనందున ఆయన్ని వారు తిరస్కరించారు.

యహ్యా (అలైహి)ను బైబిల్‌లో యూహన్న అని, "జాన్ దిబాప్టిస్ట్" అని పేర్కొన్నారు. బైబిల్ ప్రకారం ఆయన యూదరాజు హేరోద్ రాజ్యంలో ధర్మప్రచారం ప్రారంభించిన రోజుల్లో హేరోద్ రాజు, అతని ప్రజలు (యూదులు) రోమ్ నాగరికతకు ప్రభావితులయి అశ్లీలకూపంలో కూరుకుపోయారు. స్వయంగా రాజు తన సోదరుడు ఫిలిప్ భార్యను తన ఇంట ఉంచుకున్నాడు. అది ధర్మసమ్మతం కాదని విమర్శించినందుకు యహ్యా (అలైహి)ని బంధించి చెరసాలలో వేయించాడు. అతనాయన్ని చంపాలనుకున్నా ప్రజల్లో ఆయనకున్న గౌరవాభిమానాలు చూసి ఏమీ చేయలేక పోయాడు. అయితే అతని ఉంపుడుగత్తె (ఫిలిప్ భార్య) యహ్యా మీద కక్ష కట్టింది. అశ్లీలానికి వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన ప్రచారోద్యమం వల్ల తాను ప్రజలదృష్టిలో అవమానం పాలుకావలసి వస్తుందని తలచి ఆమె అవకాశం కోసం ఎదురుచూడసాగింది.

చివరికి హేరోద్‌రాజు జన్మదినోత్సవం సందర్భంలో ఆమె కూతురు బాగా నాట్య మాడి అతడ్ని మెప్పించింది. రాజు సంతోషించి నీకేం కావాలో కోరుకో అన్నాడు. ఆమె



తన తల్లి నడిగి చెబుతానన్నది. ఆమె తల్లి దీన్ని సువర్ణవకాశంగా భావించి, యూహన్న శిరస్సును పళ్లెంలో పెట్టివ్వమనిఅడుగు అన్నది. హేరోద్ ఈమాట విని కాస్త బాధపడినా ప్రేయసికుమార్తె కోరికను కాదనలేకపోయాడు. అతను వెంటనే చెరసాల నుండి యహ్యా శిరస్సు నరికి తెప్పించాడు. దాన్ని పళ్ళెంలో పెట్టి ఆ నాట్యగత్తెకు ఇచ్చాడు.

(మత్తయి సువార్త 14వ అధ్యాయం, లూకా సువార్త 3వ అధ్యాయం, మార్కు సువార్త 6వ అధ్యాయం చూడండి.)

## 22. ఈసా మసీహ్ (అలైహి)

"దేవుడు ఈసాను తన ప్రవక్తగా నియమించి ఇస్రాయీల్ సంతతి దగ్గరకు పంపిస్తాడు. (అతను వారితో ఇలా అంటాడు:) 'నేను మీ ప్రభువు నుండి మీకోసం కొన్ని సూచనలు (నిదర్శనాలు) తెచ్చాను. ఇప్పుడు మీముందు మట్టితో పక్షి ఆకారంగల బొమ్మ చేసి అందులో గాలి ఊదుతాను. అది దైవాజ్ఞతో సజీవపక్షిగా మారుతుంది. నేను దేవుని ఆజ్ఞతో పుట్టు గుడ్డిని, కుష్ఠురోగిని నయంచేస్తాను; మృతుల్ని కూడా బ్రతికిస్తాను. మీరు ఏమేమి తింటారో, మీఇండ్లలో ఏమేమి నిలువచేసి ఉంచుతారో అంతా మీకు తెలియజేస్తాను. మీరు విశ్వసించేవారైతే వీటిలో మీకోసం గొప్ప నిదర్శనాలున్నాయి." (ఖుర్ఆన్-3:49)

"నాకు పూర్వం అవతరించిన తౌరాత్ గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. గతంలో మీకు నిషేధించబడిన కొన్ని వస్తువుల్ని ధర్మసమ్మతం చేయడానిక్కూడా వచ్చాను. నేను మీ దగ్గరికి మీ ప్రభువుకు సంబంధించిన స్పష్టమైన నిదర్శనాలు తెచ్చాను. కనుక అల్లాహ్‌కు భయపడండి. నన్ను అనుసరించండి. అల్లాహ్ నాకూ ప్రభువే, మీకూ ప్రభువే. అందువల్ల ఆయన్ని మాత్రమే ఆరాధించండి. ఇదే సరైన మార్గం." (ఖుర్ఆన్-3:50,51)

"ఈసా స్పష్టమైన నిదర్శనాలతో వచ్చి (ప్రజలకు) ఇలా బోధించాడు: 'నేను మీ దగ్గరకు వివేకం తెచ్చాను. మీరు విభేదించుకుంటున్న కొన్ని విషయాల్లోని నిజానిజాలు ఏమిటో మీముందు వెల్లడించడానికే మీ దగ్గరికొచ్చాను. కనుక మీరు దేవునికి భయ పడండి. నాకు విధేయత చూపండి. నిజానికి దేవుడే నా ప్రభువు, మీ ప్రభువు కూడా. ఆయన్నే మీరు ఆరాధించండి. ఇదే సన్మార్గం." (ఖుర్ఆన్-43:63,64)

"ఈసా వారిలో అవిధేయత, అవిశ్వాసాల ధోరణి చూసి 'దైవమార్గంలో నాకు తోడుగా నిల్చేవారు ఎవరైనా ఉన్నారా మీలో?' అనడిగాడు. దానికి హవారీలు (శిష్యులు) ఇలా అన్నారు: 'మేము దేవుని (మార్గంలో మీకు తోడుగా నిలిచే) సహాయకులం. మేము దేవుడ్ని విశ్వసిస్తున్నాము. ఆయనకు విధేయులైపోయాము. దీనికి మీరే సాక్షి. ప్రభూ! నీవు అవత రింపజేసిన దాన్ని విశ్వసిస్తున్నాం. నీ సందేశహరుడ్ని అనుసరించడానిక్కూడా మేము సిద్ధంగా ఉన్నాం. మాపేర్లు (సత్య)సాక్షుల జాబితాలో వ్రాయి." (ఖుర్ఆన్-3:52,53)

"ఆ తరువాత జరిగిన మరో సంఘటన- హవారీలు ఓసారి తమ ప్రవక్తతో 'మర్యం కుమారుడవైన ఈసా! మా ముందు నీ ప్రభువు ఆకాశం నుండి వడ్డించిన విస్తరి నొకదాన్ని దించగలడా?' అని అడిగారు. దానికి ఈసా (అలైహి) 'మీరు విశ్వసించిన వారైతే దేవునికి భయపడండి' అని అన్నాడు. (ఖుర్ఆన్-5:111,112)

"మేము విస్తరిలోనివి తిని అవి మా హృదయాలకు తృప్తి కలిగించాలని మాత్రమే మేము కోరుతున్నాము. ఈవిధంగా నీవు చెప్పినదంతా యదార్థమని తెలుసుకొని అందుకు సాక్షులుగా ఉంటాము' అన్నారు మళ్ళీ వారు." (ఖుర్ఆన్–5:113)

"అప్పుడు మర్యం కుమారుడు ఈసా ఇలా ప్రార్థించాడు: 'దేవా! మా ప్రభువా!! మా ముందు వడ్డించిన విస్తరి ఒకదాన్ని ఆకాశం నుండి దించు. ఇది మాకూ, మా పూర్వీకులకూ, రాబోయేతరాలకూ పండుగరోజవుతుంది. నీతరఫున ఓ నిదర్శనంగా ఉంటుంది. మాకు ఆహారం ప్రసాదించు. నీవే అందరికన్నా మంచి అన్నదాతవు. దానికి దేవుడిలా అన్నాడు: 'సరే, నేను దాన్ని మీ ముందు దించుతాను. అయితే ఆ తర్వాత మీలో ఎవడైనా అవిశ్వాసవైఖరి అవలంబిస్తే మాత్రం నేనతనికి ప్రపంచంలో ఎవరికీ విధించనటువంటి ఘోరమైన శిక్ష విధిస్తాను." (ఖుర్ఆన్–5:114,115)

"ఈసా (ఇస్రాయీలీలతో) 'నా తరువాత మరో ప్రవక్త రానున్నాడని మీకు శుభవార్త అందజేస్తున్నాను. అతనిపేరు 'అహ్మద్' అవుతుంది' అని అన్నాడు." (ఖుర్ఆన్–61:6)

ఇక్కడ ఈసా (అలైహి) తన తర్వాత రాబోయే ప్రవక్త పేరు 'అహ్మద్' అని స్పష్టంగా తెలియజేశారు. అంతిమదైవప్రవక్త ముహమ్మద్ (స)కు 'అహ్మద్' అనే మరోపేరు కూడా ఉందన్న సంగతి జగద్విదితం. ఈసా (అలై) తన తర్వాత 'అహ్మద్' అనే ప్రవక్త రానున్నాడని పేరుపెట్టి ప్రకటించారంటే ఆయనపై అవతరించిన ఇన్జీల్‌లో ఈపేరు తప్పక ఉండివుంటుంది. ఈ గ్రంథం రెండువేల సంవత్సరాల క్రితం ఆనాడు పాలస్తీనా ప్రజలు మాట్లాడుకునే 'సిరియక్' భాషలో అవతరించి వుండవచ్చని తెలుస్తోంది. హెబ్రూభాష దానికి రెండు మూడు వందల ఏండ్లకు పూర్వమే అంతరించిపోయింది. ఈనాటి బైబిల్ ఈసా (అలైహి), ఆయన అనుచరుల నిష్క్రమణ తర్వాత క్రీ.శ. 80-120 మధ్యకాలంలో వ్రాయబడింది. అప్పుడు ఈసా బోధనలను సేకరించడానికి వెళ్ళిన క్రైస్తవపండితులు, వాటిని సిరియక్‌భాష మాట్లాడే క్రైస్తవప్రజల నోట విని గ్రీకుభాషలో వ్రాసుకున్నారు.

అయితే ఆనాడు గ్రీకుభాషలో వ్రాయబడిన బైబిల్ అసలు ప్రతి కూడా ఈనాడు లేకుండా పోయింది. దాని అనువాదాలు, ఆ అనువాదాల అనువాదాలు మాత్రమే ఇప్పుడున్నాయి. అవి కూడా ఎన్నో మార్పులకు, చేర్పులకు గురయిపోయాయి. పైగా ప్రస్తుత బైబిల్‌లో ఈసా (అలై) నిష్క్రమణ తర్వాత జరిగిన సంఘటనలు, ఆయన అనుచరులని చెప్పబడేవారి మాటలు కూడా చోటు చేసుకున్నాయి. ఇన్జీల్ అనువాదం సైతం ఇంతగా మార్పులకు, చేర్పులకు గురికావడం వల్లనే దేవుడు తన వాణిని తిరిగి ఖుర్ఆన్ రూపంలో అవతరింపజేశాడు.

"సత్యతిరస్కారులు (ఈసాను చంపడానికి) ఒక యుక్తి పన్నారు. దేవుడు (ఈసాను కాపాడేందుకు) మరోయుక్తి పన్నాడు. దేవుడు అందరికన్నా గొప్ప యుక్తిపరుడు. అప్పుడు దేవుడిలా అన్నాడు: 'ఈసా! నేనిప్పుడు నిన్ను నాదగ్గరికి రప్పించుకుంటాను. నా వైపునకు ఎత్తుకుంటాను. నిన్ను ధిక్కరించినవారి నుండి (తీసి) నిన్ను పావనం చేస్తాను. నిన్ను తిరస్కరించినవారిపై నిన్ను అనుసరించినవారికి ప్రళయం వరకు ఆధిక్యతనిస్తాను." (ఖుర్ఆన్–3:54,55)



## (1) క్రైస్తవుల నమ్మకాలు

"వారు మసీహ్‌ని చంపలేదు; దేవుడు ఆయన్ని తన వైపు ఎత్తుకున్నాడు." (4:158). దీన్నిబట్టి ఈసాప్రవక్త (అలైహి)ను యూదులు సిలువపై చంపలేదని, ఆయన్ని పోలిన వేరే వ్యక్తిని చంపిఉంటారని తెలుస్తోంది. స్ట్రావుస్ అనే క్రైస్తవ పండితుడు "ఎ న్యూలైఫ్ ఆఫ్ క్రైస్ట్" అనే గ్రంథంలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "ఏసుక్రీస్తు అసలు సిలువ పైన్నే ఎక్కించబడలేదని, ఏసుకు బదులు సైమన్ అనే వ్యక్తి సిలువపై ఎక్కించబడ్డాడని" పేర్కొన్నట్లు ముహమ్మద్ ఖాసింఖాన్ తన వ్యాఖ్యానసహిత ఖుర్ఆన్ అనువాదంలో తెలియజేశారు. అంతేకాదు, ఈ సూక్తిని బట్టి ఈసాప్రవక్త సహజ మరణం కూడా పొందలేదని, దేవుడు ఆయన్ని సజీవంగా, సశరీరంగా తన వైపుకు ఎత్తుకున్నాడని తెలుస్తోంది.

ఈయన ఇస్రాయిల్‌సంతతి ప్రజల మార్గదర్శనం కోసం వచ్చిన దైవప్రవక్త (అలై). హజ్రత్ మర్యం(అలై) కుమారుడు. ఈయనపై ఇన్జీల్‌గ్రంథం అవతరించింది. యూదులు ముగ్గురు దైవప్రవక్తల కోసం ఎదురుచూస్తున్న కాలంలో యహ్యా ప్రవక్త (అలై) వారి ముందుకొచ్చారు. వారప్పుడు "నీవు మసీహ్ (క్రీస్తు)వా? ఏలియా (ఇల్యాస్)వా? లేక ఆ ప్రవక్త (ముహమ్మద్)వా?"అని అడిగి "ఆ ముగ్గురిలో నీవు ఎవరూ కానప్పుడు బాప్తిజం ఎందుకు చేయిస్తున్నావు?" అని అడిగారు (బైబిల్ కొత్తనిబంధన, యోహాన్ సువార్త. 1:19-26 చూడండి). అయితే తాము ఎదురుచూస్తున్న ముగ్గురిలో ఒకరైన ఈసా (మసీహ్) రకరకాల మహిమలు చూపుతూ దైవసందేశం అందజేయడానికి వస్తే, వారాయన్ని మాంత్రికుడని తిరస్కరించారు. (ఖుర్ఆన్-3:48-51 సూక్తులు చూడండి). బలహీనవర్గాలకు చెందిన కొందరు యూదేతరులు (పండితుల అభిప్రాయం ప్రకారం-రజకులు) ఈసా ప్రవక్త (అలై) ను విశ్వసించి ముస్లిములై పోయారు. (ఖుర్ఆన్ /3:52-53 సూక్తులు చూడండి).

దైవప్రవక్తలు విగ్రహారాధన, బహుదైవారాధనలకు వ్యతిరేకంగా ప్రజల్ని ఏకేశ్వరోపాసన వైపు పిలువడమే గాక వారిలో చోటుచేసుకున్న నైతిక, సామాజిక రుగ్మతలను కూడా ఎండగట్టేవారు. ఈసాప్రవక్త (అలై) కూడా ఈపనే చేశారు. నైతిక, సామాజిక రుగ్మతలలో పీకలదాకా కూరుకుపోయిన యూదులు ఇలాంటి బోధనలను సహించక పోవడమే గాకుండా ఆయనకు బద్ధ శత్రువులైపోయారు. ఈసా(అలై) దేవుని మహత్తుతో అసాధారణ రీతిలో మర్యం (అలై)కు జన్మించిన వైనం పట్ల దాదాపు ముప్ఫైయేండ్ల వరకు పల్లెత్తు మాట కూడా అనని యూదులు, దైవాజ్ఞతో హితోపదేశాలు అవతరించనారంభించగానే ఆయనపై, ఆయన మాతృమూర్తిపై ఘోరమైన అపనిందలు మోపారు. (ఖుర్ఆన్/4:156 సూక్తి చూడండి.)

ఆ తరువాత ఆ మహనీయుడ్ని చంపడానికి రకరకాల కుట్రలు పన్నారు. ఆనాడు సిరియా రాజ్యపరిధిలో ఒక భూభాగంగా వుండిన పాలస్తీనా రోమ్‌చక్రవర్తి పాలనలో వుండేది. రోమ్‌చక్రవర్తి, ఆయన జాతీయులంతా ఆనాడు బహుదైవారాధకులుగా వుండేవారు. అయితే యూదులు తమ జాతికి చెందిన ఈసాప్రవక్త (అలై)ను తమ మార్గం నుండి తొలగించుకోవడానికి రోమ్ చక్రవర్తికి లేనిపోని మాటలు కల్పించి చెప్పారు.

పిలాతిస్ న్యాయస్థానం నుండి అసత్యసాక్షుల్ని తెచ్చి ఈ వ్యవహారాన్ని అతని ముందుంచారు. పుణ్యపురుషుడైన ఈసా (అలై)కు మరణశిక్ష విధించడం రోమ్ చక్రవర్తికి ఏ మాత్రం ఇష్టంలేదు. అందువల్ల అతను మొదట దీన్ని వ్యతిరేకించాడు. కాని నక్కజిత్తుల యూదులు తమ నిర్ణయాన్ని అమలుజరపకపోతే దేశంలో అంతర్యుద్ధం జరుగుతుందని బెదరించారు. అందువల్ల రోమ్‌చక్రవర్తి వారి వత్తిడికి లొంగిపోయాడు.

రోమ్ న్యాయాధిపతి యూదుల్ని సంబోధిస్తూ "మేము మీ కోరికపై ఈసా (అలై)కు మరణశిక్ష విధిస్తున్నాం కాని, ఏపాపం ఎరగని ఈ మానవోత్తముడి హత్యాబాధ్యత మాపై ఎంతమాత్రం లేదు" అని అన్నాడు. ఆ తరువాత అతను నిండుసభలో నీళ్ళు తెప్పించి చేతులు కడుక్కొని ఈసా (అలై) వధకు సంబంధించిన అనుమతి పత్రం యూదులకు ఇచ్చివేశాడు. వెంటనే యూదులు కొందరు రోమ్‌సైనికుల్ని వెంటబెట్టుకొని హజ్రత్ ఈసా (అలై) విడిదిచేసిన తాత్కాలిక ఆశ్రమంలోకి జొరబడ్డారు.

అయితే వారు లోపల జొరబడక ముందే ఈసా (అలై) దేవుడ్ని ప్రార్థించడం, దేవుడు ఆయన్ని సశరీరంగా పైకి ఎత్తుకోవడం జరిగిపోయాయి. తర్వాత ఆ ఆశ్రమంలో జొరబడిన వారిలో సైమన్ అనే ఒక వ్యక్తికి దేవుడు ఈసా (అలై) రూపం కల్పించాడు. యూదులు, రోమ్‌సైనికులు అతనే ఈసా మసీహ్ అనుకొని పట్టుకెళ్ళి సిలువ వేశారు. ఈవిధంగా ఆ వ్యక్తిని చంపి, సిగ్గుఎగ్గూ లేకుండా "మేము దైవప్రవక్త మసీహ్ ఇబ్నె మర్యంని సంహరించాం" అని చెప్పుకున్నారు మహాగర్వంగా. (ఖుర్ఆన్-4:156)

ఈ సంఘటన జరిగిన అనేక సంవత్సరాలకు ఈసా (అలై)ను విశ్వసించి క్రైస్తవులైన వారు దీన్నిగురించి ఎన్నో భేదాభిప్రాయాలకు గురయ్యారు. యూదులు, రోమ్‌సైనికులు కలసి సిలువవేసిన వ్యక్తి మసీహ్ కాదని, మసీహ్ రూపంలో వున్న వేరొక వ్యక్తి అని, మసీహ్ వారి తెలివిమాలినతనం పట్ల నవ్వుతూ అక్కడే ఓచోట నిల్చున్నాడని కొందరు అభిప్రాయపడ్డారు. సిలువపై ఎక్కించబడినవాడు మసీహ్‌యే కాని, ఆయన సిలువ మీద మరణించలేదని, సిలువ నుండి దించిన తర్వాత ఆయన బ్రతికే వున్నాడని మరికొందరు భావించారు. కాదు ఆయన సిలువపైనే చనిపోయాడని, ఆ తర్వాత ఆయన బ్రతికి దాదాపు పదిమంది శిష్యుల్ని కలుసుకొని మాట్లాడాడని ఇంకొందరి కథనం. ఆయన చనిపోయిన తరువాత తిరిగి బ్రతికాడని, అప్పుడు సశరీరంగా పైకి ఎత్తుకోబడ్డాడని మరికొందరి నమ్మకం.

ఈసా (అలై) సజీవంగా, సశరీరంగా పైకి ఎత్తుకోబడ్డారన్న ఈ నమ్మకమే ఆయనకు దైవత్వాన్ని ఆపాదించింది. దేవుడు దివ్యసందేశాన్ని ప్రవక్తలకు చేరవేసే దైవదూతను "పరిశుద్ధాత్మ" అని ఖుర్ఆన్‌లో ప్రస్తావిస్తే, క్రైస్తవులు 'అది దేవుని పరిశుద్ధాత్మ అని, ఆ పరిశుద్ధాత్మ మసీహ్‌లో అంతర్లీనమై పోయిందని' భావించారు. యూదమతంలో మానవుల్ని దేవుని కుమారులుగా పిలిచే సంప్రదాయం వుంది. ఆ సంప్రదాయానికి ప్రభావితులైన క్రైస్తవులు మసీహ్ (అలై)ని దేవుని ఏకైక కుమారునిగా చేశారు.

ఇలా వారు దేవుడు ఒక్కడేనని నమ్ముతూనే ముగ్గురు దేవుళ్ళను సృష్టించుకున్నారు. దేవకుమారునిగా కల్పించబడిన ఈసా మసీహ్ మానవుల పాపాలకు ప్రాయశ్చిత్తంగా



సిలువపై బలైపోయారని, అందువల్ల మానవులు ఎలాంటి ఎన్ని పాపాలు చేసినా ఏసు ప్రభువుని విశ్వసిస్తే చాలు, మోక్షం లభిస్తుందని ఓ గొప్ప మతసిద్ధాంతాన్ని ఉనికిలోకి తెచ్చారు. ఈ సిద్ధాంతాన్ని కనిపెట్టి ప్రచారం చేసిన ఘనత సెయింట్ పాల్ (పౌలస్)కు దక్కుతుంది. ఈ సిద్ధాంతానికి ప్రారంభంలో కొన్ని సమస్యలు, అభ్యంతరాలు ఎదురైనా ఆ తరువాత క్రమేణా ఇది క్రైస్తవజగత్తులో బాగా ప్రాచుర్యం పొందింది.

# 23. లుఖ్మాన్ (అలైహి)

"దేవుని పట్ల కృతజ్ఞుడయి ఉండమని చెబుతూ మేము లుఖ్మాన్‌కు వివేకాన్ని ప్రసాదించాము. ఎవరైనా (దేవునికి) కృతజ్ఞత చూపితే, ఆ కృతజ్ఞత అతనికే ప్రయోజనం చేకూర్చుతుంది. దీనికి భిన్నంగా కృతఘ్నుడైపోతే, దేవునికి కలిగే నష్టమేమీ లేదు. ఆయన నిరపేక్షాపరుడు, స్వతహాగా ప్రశంసనీయుడు. లుఖ్మాన్ తన కుమారునికి హితోపదేశం చేసిన సందర్భం గుర్తుకుతెచ్చుకో. అతను తన కుమారునితో 'బాబూ! దేవునికి (ఆయన దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకు. దేవునికి సాటి కల్పించడం ఘోరమైన పాపం, దారుణమైన అన్యాయం' అన్నాడు." (ఖుర్ఆన్-31:12,13)

"(లుఖ్మాన్ తన కుమారునికిలా ఉపదేశించాడు:) "కుమారా! ఏదైనా బండరాయిలో గాని, ఆకాశంలోగాని, భూమిపైగాని, లేదా మరెక్కడైనా సరే ఆవగింజంత వస్తువు దాగివున్నా దేవుడు దాన్ని బయటికి తీయగలడు. ఆయనెంతో సూక్ష్మగ్రాహి, సర్వజ్ఞాని. కుమారా! నీవు ప్రార్థనా (నమాజ్)వ్యవస్థ నెలకొల్పు. (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాల నుండి వారించు. కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవెంతో ధైర్య సాహసాలతో కూడిన విషయాలు. జనమ్ముందు గర్వంతో మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసిపడేవాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు. నీ నడవడికలో మధ్యేమార్గం అవలంబించు. నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాలకంటే గాడిదస్వరం అత్యంత కఠోరమైనది." (ఖుర్ఆన్-31:16-19)

హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) అరబ్‌జగత్తులో అత్యంత వివేకవంతుడైన వ్యక్తిగా ప్రసిద్ధిచెందారు. ఈయన మాతృభూమి, జాతీయతలను గురించి పండితులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు ఈయన నీగ్రో జాతీయుడని, మరికొందరు సూడాన్ దేశస్థుడని అంటారు. ఏమైనప్పటికి ఈయన అరేబియాలో తన నీతినడవడికలు, వివేకవంతమైన మాటలతో ఎంతో వినుతికెక్కారు.

హజ్రత్ లుఖ్మాన్ (అలై)ని కొందరు "మీకీ విజ్ఞతా వివేచనాలు, భావ చైతన్యాలు ఎలా లభించాయి?" అని అడిగితే "నీతినిజాయితీలు అవలంబించడం, పనికిమాలిన మాటలు మానేసి మౌనం పాటించడంవల్ల లభించాయి" అని ఆయన జవాబిమిచ్చారు.

ఆయన బుద్ధికుశలత గురించి ఓ సంఘటన ప్రచారంలో వుంది. హజ్రత్ లుఖ్మాన్ (అలైహి) బానిసగా ఉన్నరోజుల్లో ఓసారి ఆయన్ని ఆయన యజమాని పిలిచి "ఒక మేకను కోసి అందులో నుంచి అతిశ్రేష్ఠమైన రెండు అవయవాలు నా దగ్గరకు తీసుకురా" అనంటే, ఆయన మేకమాంసం నుండి హృదయం, నాలుక తెచ్చిస్తారు.

మరోసందర్భంలో యజమాని "ఓ మేకను కోసి అందులో నుంచి అతినీచమైన రెండు అవయవాలు తీసుకురా" అనంటే, హజ్రత్ లుఖ్మాన్ (అలై) మళ్ళీ హృదయాన్ని, నాలుకనే తెచ్చిస్తారు. యజమాని ఆశ్చర్యపోయి "అతి శ్రేష్ఠమైనవి, అతి నీచమైనవి కూడా ఈ రెండేనా!" అనడిగాడు. దానికి లుఖ్మాన్ (అలై) సమాధానమిస్తూ "హృదయం, నాలుక సవ్యంగా, సక్రమంగా వుంటే ఇవి అన్నిటికంటే శ్రేష్ఠమైనవి. ఒకవేళ అవి చెడిపోతే వాటికి మించిన క్షుద్రవస్తువులు మరేమీ వుండవు" అనిచెప్పారు. (మౌలానా సలాహుద్దీన్ యూసుఫ్ గారి ఖుర్ఆన్ వ్యాఖ్యానం నుండి.)

## 24. జుల్ఖర్నైన్ (అలై), యాజూజ్-మాజూజ్ తెగలు

"మేము జుల్ఖర్నైన్‌కు ప్రపంచంలో రాజ్యాధికారమిచ్చాం. అన్నిరకాల ఒనరులు, సాధన సంపత్తులు అనుగ్రహించాం. అతను (పశ్చిమదేశాల పర్యటనకోసం) ప్రయాణసామగ్రి ఏర్పాటు చేసుకున్నాడు. సూర్యాస్తమయమయ్యే హద్దుకు చేరుకొని సూర్యుడు బురదనీటిలో అస్తమించడం చూశాడు. అతనికక్కడ ఒక జాతి కన్పించింది. అప్పుడు మేమతనితో "జుల్ఖర్నైన్! నీవు వారికి బాధ కలిగించనూవచ్చు; మేలు చేకూర్చనూవచ్చు. అంతా నీఇష్టం' అన్నాం. దానికి జుల్ఖర్నైన్ 'వారిలో దౌర్జన్యానికి పాల్పడినవాడ్ని నేను శిక్షిస్తా. తర్వాత అతను తన ప్రభువు వైపు మరలించబడినప్పుడు అతడ్ని ఆయన మరింత కఠినంగా శిక్షిస్తాడు. వారిలో సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేసేవానికి మంచి ప్రతిఫలం లభిస్తుంది. నేనతని పట్ల మృదువుగా వ్యవహరిస్తాను' అని అన్నాడు." (ఖుర్ఆన్-18:84-88)

"ఆ తరువాత అతను (మరోదిక్కు పర్యటనకు) సిద్ధమయ్యాడు. అతను (ప్రయాణం చేస్తూ) సూర్యోదయమయ్యే హద్దుకు చేరుకున్నాడు. అక్కడ ఒక జాతిని చూశాడు. ఆ జాతిపై సూర్యుడు ఉదయిస్తుంటే అది ఎండనుండి కాపాడుకోవడానికి మేము ఎలాంటి సౌకర్యం కల్పించ లేదు. ఇదీ వారి పరిస్థితి. జుల్ఖర్నైన్ విషయాలన్నీ మాకు తెలుసు. ఆతర్వాత అతను (వేరొకదిక్కు పర్యటనకు) సమాయత్తమయ్యాడు. అతను (ప్రయాణం చేస్తూ) చివరికి రెండుకొండల మధ్యకు చేరుకున్నాడు. అక్కడ అతనికొక జాతి కన్పించింది. ఆ జాతిప్రజలు అతి కష్టంమీద (అతని) మాట గ్రహిస్తారు." (ఖుర్ఆన్-18:89-93)

"వారతనితో 'జుల్ఖర్నైన్! ఈ భూభాగంపై యాజూజ్, మాజూజ్ (అనే ఆటవిక జాతు) లు విధ్వంసకాండ సాగిస్తున్నాయి. మరి నీవు మాకు, వారికి మధ్య ఒక అడ్డుగోడ నిర్మిం చగలవా? అందుకు మేమేదైనా నీకు పన్ను చెల్లించాలా?' అని అన్నారు." (ఖు-18:94)

"దానికతను సమాధానమిస్తూ 'నాకు నాప్రభువు ఇచ్చిన (సంప)దే ఎంతో ఉంది. మీరు శారీరక శ్రమతో నాకు సహాయపడండి చాలు. నేను మీకూ వారికీ మధ్య అడ్డుగోడ నిర్మిస్తాను. నాక్కాస్త ఉక్కు పలకలు తెచ్చిపెట్టండి' అని అన్నాడు."

"(గోడనిర్మాణం ప్రారంభమై శరవేగంతో సాగిపోతోంది.) అతను రెండు కొండల మధ్య ఉన్న ఖాళీస్థలాన్ని పూరించాడు. అప్పుడు కొందరు అగ్ని రాజెయ్యండని అన్నారు. చివరికి (ఉక్కుగోడ) అగ్నిగోళంలా ఎర్రగా మారిపోయింది. అప్పుడు జుల్ఖర్నైన్ 'దీనిపై నేనిప్పుడు కరిగిన రాగి కుమ్మరిస్తా తీసుకురండి' అన్నాడు." (ఖుర్ఆన్-18:95,96)



"(ఇలా గోడనిర్మాణం పూర్తయింది) దాంతో వారికా గోడ ఎక్కివచ్చే శక్తి లేకుండా పోయింది. దానికి కన్నం వేయడంకూడా సాధ్యంకాదు. జుల్ఖర్నైన్ ఇలా అన్నాడు: 'ఇది నా ప్రభువు అనుగ్రహం. అయితే నాప్రభువు వాగ్దానం నెరవేరే సమయం వచ్చినప్పుడు ఆయన దీన్ని నేలమట్టంచేస్తాడు. నాప్రభువు వాగ్దానం నిజమైనది." (ఖుర్ఆన్-18:97,98)

## 25. ఉజైర్ (అలైహి)

"ఒక వ్యక్తి ఉదంతం గురించి ఆలోచించావా? అతను ఒక గ్రామం మీదుగా ప్రయాణం చేయసాగాడు. ఆ గ్రామం ఇండ్లకప్పులు కూలిపోయి సర్వనాశనమైఉంది. అతను (ఆశ్చర్యంతో చూస్తూ) 'చచ్చిపోయిన ఈ ఊరిజనాన్ని దేవుడు మళ్ళీ ఎలా బ్రతికిస్తాడో!' అనుకున్నాడు. అప్పుడు దేవుడు (వెంటనే) అతని ప్రాణంతీశాడు. ఆ విధంగా అతను (నిర్జీవ స్థితిలో) వందేళ్ళపాటు పడివున్నాడు. ఆతర్వాత దేవుడు అతనికి మళ్ళీ ప్రాణంపోసి లేపాడు. అప్పుడతనితో 'నీవీ స్థితిలో ఎంతకాలం ఉన్నావో చెప్పగలవా?" అనడిగాడు. దానికా వ్యక్తి 'ఒక రోజో లేక అంతకంటే తక్కువ కాలమో ఉన్నాననుకుంటాను' అన్నాడు."

"అప్పుడు దేవుడు ఇలా చెప్పాడు: 'కాదు, నీవు వందేళ్ళు (ఇలా) ఉన్నావు. సరే, నీవు వెంటతెచ్చుకున్న అన్నపానీయాల వైపు చూడు, (ఇన్నేళ్ళు గడచినా) అవి ఏమాత్రం చెడి పోలేదు. నీ గాడిద వైపు కూడా ఓసారి చూడు (దాని ఎముకలు సయితం ఎలా జీర్ణమయి పోయాయో). మేము నీ ఉదంతం ద్వారా ప్రజలకు గుణపాఠం గరపడానికే ఇలా చేశాము. ఈ ఎముకలగూడు సరిచేసి దానిపై తిరిగి మాంసం సృష్టించి ఎలా లేపుతామో చూడు.' ఈవిధంగా అతను యదార్థం కళ్ళారా చూసి 'దేవుడు ప్రతిపనీ చేయగల సమర్థుడు, సర్వశక్తిమంతుడనీ నాకు తెలుసు' అన్నాడు." (ఖుర్ఆన్-2:259)

## 26. ముగ్గురు ప్రవక్తలు, ఒక విశ్వాసి

"దైవప్రవక్తలు వచ్చిన ఒక పట్టణానికి చెందిన ప్రజలగాథ విన్పించు వారికి. మేమా పట్టణప్రజల దగ్గరకు ఇద్దరు ప్రవక్తలను పంపాము. వారా ఇద్దరినీ తిరస్కరించారు. తర్వాత ఆ ఇద్దరికి మద్దతుగా మేము మరోప్రవక్తను పంపాము. ఆ ముగ్గురు 'మేము మీ దగ్గరకు దైవప్రవక్తలుగా పంపబడ్డాం' అన్నారు." (ఖుర్ఆన్-36:12-14)

"దానికి వారు 'మీరు మాలాంటి మానవమాత్రులే తప్ప మరేమీకాదు. కరుణామయు డైన దేవుడు ఏదీ పంపలేదు. మీరు చెబుతున్నదంతా బూటకం' అన్నారు. 'మా ప్రభువుకు తెలుసు. మేము నిజంగానే దైవప్రవక్తలుగా నియమితులై మీ దగ్గరకు పంపబడ్డాం. ఎలాంటి అరమరికలు లేకుండా దైవసందేశం అందజేయడమే మాపని. అంతకుమించి మరోబాధ్యత మాపై లేదు' అన్నారు దైవప్రవక్తలు." (ఖుర్ఆన్-36:15,16,17)

"మేము మిమ్మల్ని మా పాలిట అపశకునంగా భావిస్తున్నాము. మీరు (ఈ ప్రచారం) మానుకోకపోతే మేము మిమ్మల్ని రాళ్ళతో కొట్టి చంపేస్తాం. మా నుండి మీరు దుర్భరశిక్ష చవిచూడవలసి వస్తుంది' అన్నారు పట్టణవాసులు బెదిరిస్తూ. 'మీ అపశకునం మిమ్మల్నే చుట్టుకొనిఉంది. మేము మీకు హితబోధచేస్తున్నామనేనా మీరీమాటలు అంటున్నది? మీరసలు హద్దుమీరిపోయారు' అన్నారు దైవప్రవక్తలు." (ఖుర్ఆన్-36:19)

“దూరాన పట్నంలో ఓమూల నుండి ఒకతను పరుగెత్తుకుంటూ వచ్చి ఇలాఅన్నాడు: ‘నా జాతిప్రజలారా! దైవప్రవక్తల మాటవిని వారిని అనుసరించండి. మీనుండి ఎలాంటి ప్రతిఫలం ఆశించని ఈ సన్మార్గగాముల్ని అనుసరించండి. నన్ను సృష్టించినవాడ్ని నేనెందుకు ఆరాధించను? మీరంతా చివరికి ఆయన దగ్గరికే పోవలసిఉంది. అలాంటి దేవుడ్ని వదలి నేను ఇతరుల్నిదైవాలుగా చేసుకోవాలా? కరుణామయుడైన ఆ దేవుడు నాకేదైనా నష్టం కలిగించదలిస్తే ఈ దైవాల సిఫారసు నాకేమాత్రం పనికి రాదు. దేవుని పట్టునుండి అవి నన్ను విడిపించలేవు. ఒకవేళ నేనలా చేస్తే పూర్తిగా దారితప్పినట్లే. నేను మటుకు మీ ప్రభువును విశ్వసిస్తున్నాను. మీరు కూడా నామాట వినండి.” (ఖుర్ఆన్–36:20–25)

“(చివరికి వారు అతడ్ని అన్యాయంగా చంపి పొట్టన పెట్టుకున్నారు. అప్పుడతనికి) ‘స్వర్గంలో ప్రవేశించు’ అని చెప్పారు (దైవదూతలు). ఆ సందర్భంలో అతను ‘నా ప్రభువు ఏ విషయం కారణంగా నా పాపాలు మన్నించి నన్ను గౌరవనీయులలో చేర్చాడో నాజాతి ప్రజలకు తెలిస్తే ఎంతబాగుండు!’ అని అన్నాడు. ఆ తర్వాత మేమతని జాతిపై ఆకాశం నుండి ఎలాంటి సైన్యం దించలేదు. సైన్యాన్ని దించే అవసరంలేదు మాకు. ఒకే ఒక విస్ఫోటం! అంతే, తృటిలో వారంతా ఆరి (నాశనమై)పోయారు.” (ఖుర్ఆన్–36:26–30)

# 27. గుహ వాసులు

“మహాబిలం వాళ్ళను, శిలాశాసనం వాళ్ళను మా సూచలలో కొన్ని వింత సూచనలని భావిస్తున్నావా నీవు? ఆ యువకులు ఆశ్రయం పొందడానికి ఒక గుహలో ప్రవేశించి ‘ప్రభూ! మాపై నీ విశేషకారుణ్యం వర్షింపజెయ్యి. మా వ్యవహారం చక్కబెట్టు’ అని ప్రార్థించారు. అప్పుడు మేమా యువకుల్ని ఆగుహలో పరుండబెట్టి సంవత్సరాల తరబడి ప్రగాఢ నిద్రావస్థలో ఉంచాము. ఆ తరువాత వారిలో ఎవరు తమ నిద్రావస్థ కాలాన్ని కచ్చితంగా లెక్కగడ్తారో తెలుసుకోవడానికి మేము వారిని లేపాము.” (ఖుర్ఆన్–18:9–12)

“మేము వారి అసలుగాథ విన్పిస్తున్నాం: వారు కొందరు యువకులు. ఆ యువకులు తమ ప్రభువును విశ్వసించారు. మేము వారి మార్గం సుగమంచేశాం. వారు లేచినిలబడి ‘భూమ్యాకాశాల ప్రభువే మాప్రభువు. ఆయన్ని వదలి మేము మరే దైవాన్నీ ప్రార్థించము. ఒకవేళ మేమలా చేస్తే అది చాలా బుద్ధిహీనమైన పని అవుతుంది’ అని ప్రకటించారు. అప్పుడు మేము వారికి మరింత మనోబలం ప్రసాదించాము.” (ఖుర్ఆన్–18:13,14)

“(తరువాత వారిలా మాట్లాడుకున్నారు:) ‘మనజాతి ప్రజలు విశ్వప్రభువుని వదలి ఇతరులను ఆరాధ్యదైవాలుగా చేసుకున్నారు. అవి నిజంగా ఆరాధ్యదైవాలైతే అందుకు వారు సరైన ప్రమాణం ఎందుకు చూపరు? దేవుని మీద అబద్ధాలు మోపేవాడి కంటే పరమ దుర్మార్గుడు ఎవడైనా ఉంటాడా?” (ఖుర్ఆన్–18:15)

“సరే, మనమిప్పుడు వారితో, దేవుడ్ని కాదని వారు పూజిస్తున్న మిథ్యాదైవాలతో సంబంధాలు తెంచివేసుకున్నాం. (ఇక ఇక్కడుండటం మనకు మంచిది కాదు) పదండి, ఏదైనా గుహలోకి వెళ్ళి దాక్కుందాం. మన ప్రభువు మనపై తన కారుణ్యఛాయను విస్తృతం చేస్తాడు. మన పనులకు కావలసిన సౌలభ్యాలు సమకూర్చుతాడు.” (ఖుర్ఆన్–18:16)



“ప్రవక్తా! నీవు గనక ఆ గుహలో వారిని చూస్తే ఆ దృశ్యం నీకీ విధంగా కన్పిస్తుంది: సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు అతను వారి గుహ(ముఖద్వారం)వదలి కుడివైపుగా పైకి ఎక్కిపోతాడు. అస్తమిస్తున్నప్పుడు వారిని తప్పించి ఎడమవైపుగా క్రిందికి దిగిపోతాడు. (ఇలా ఆ గుహలోకి సూర్యకిరణాలు చొచ్చుకురాకుండా ఎల్లప్పుడూ చీకటిగానే ఉండేది.) వారా గుహలో ఒక సువిశాలస్థలంలో పడిఉన్నారు. ఇది దేవుని సూచనల్లో ఒక సూచన. దేవుడు ఎవరికి దారి చూపగోరుతాడో అతనే దారిలోకి వస్తాడు; ఎవరిని దారి తప్పించ దలచుకుంటాడో అతనికి ఏ మార్గదర్శీ, కార్యసాధకుడూ లభించడు.” (ఖుర్ఆన్–18:17)

“నీవు వారిని చూసి మేల్కొనివున్నారని భావిస్తావు. కాని వారు నిద్రపోతున్నారు. మేము వారిని కుడిప్రక్కకు, ఎడమప్రక్కకు తిరుగుతూ పడుకునేలా చేశాం. వారి కుక్క గుహ ముఖద్వారంలో ముందుకాళ్ళు చాచి కూర్చున్నది. నీవు గనక కాస్త ఆ గుహలోకి తొంగి చూశావంటే చాలు, గిర్రున వెనక్కితిరిగి పరుగు లంకించుకుంటావు. అక్కడి భయంకర దృశ్యానికి నీ గుండెలు తారెత్తిపోతాయి.” (ఖుర్ఆన్–18:18)

“వారు పరస్పరం చర్చించుకోవడానికి మేము వారిని తిరిగి అదేవిధంగా లేపి కూర్చోబెట్టాము. వారిలో ఒకడు ‘మనం ఈస్థితిలో ఎంత సేపున్నాం?’ అనడిగాడు. దానికి రెండోవాడు ‘బహుశా ఒకరోజో లేక అంతకంటే కొంచెం తక్కువ సేపో ఉండివుంటాం’ అన్నాడు. ఆతర్వాత వారిలో కొందరిలా అన్నారు: ‘మనమీ స్థితిలో ఎంతసేపున్నామో దేవునికే బాగాతెలుసు. సరే, ఇప్పుడు మనలో ఒకనికి ఒక వెండినాణెం ఇచ్చి నగరంలోకి పంపుదాం. అతను మనకు మంచి భోజనం ఎక్కడ దొరుకుతుందో చూసి తెస్తాడు. అయితే అతను జాగ్రత్తగా మసలుకోవాలి. మనం ఇక్కడ ఉన్నట్లు అతని అజాగ్రత్త వల్ల ఎవరికైనా తెలిస్తే ప్రమాదం ముంచుకొస్తుంది. విధివశాత్తు మనం వారి చేతుల్లో పడితే మాత్రం వదలరు. రాళ్ళతో కొట్టి చంపేస్తారు. లేదా బలవంతంగా మనల్ని తమ మతంలోకి లాక్కుంటారు. అలా జరిగితే మనమిక ఎన్నటికీ మోక్షం పొందలేము.” (ఖుర్ఆన్–18:19,20)

“ఇలా మేము వారి పరిస్థితి గురించి నగరవాసులకు తెలియజేశాం. దేవుని వాగ్దానం నిజమైనదని, ప్రళయం తప్పక వస్తుందని ప్రజలు తెలుసుకోవడానికే ఇలా చేశాం. (అయితే ఈ విషయం విస్మరించి) వారా సమయంలో గుహవాసుల విషయమై ఎలా వ్యవహరించాలన్న మాటపై వాదులాడుకోసాగారు. వారిలో (దైవధర్మం పట్ల సరైన అవగాహన కలిగిన) కొందరు ‘వారి (గుహ)మీద (స్మారక చిహ్నంగా) ఒక గోడ కట్టండి. వారి వ్యవహారం గురించి వారి ప్రభువుకే బాగా తెలుసు’ అన్నారు. అయితే వారి వ్యవహారంపై అధికారం కలిగివున్నవారు (అంటే ప్రభుత్వాధికారులు, క్రైస్తవ మతనాయకులు) ‘మేము వారిపై ప్రార్థనా మందిరం నిర్మిస్తాం’ అన్నారు.” (ఖుర్ఆన్–18:21)

“(కొంతకాలానికి యువకుల సంఖ్య, వారి నిద్రావస్థకాలం గురించి ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి.) కొందరు ‘వారు ముగ్గురు, నాలుగోది వారి కుక్క” అన్నారు. మరికొందరు ‘వారు అయిదుగురు, ఆరవది వారి కుక్క’ అన్నారు. ఇంకా కొందరు ‘వారు ఏడుగురు, ఎనిమిదోది వారి కుక్క’ అన్నారు. ఇవన్నీ వారి ఊహాగానాలు, వ్యర్థ ప్రేలాపనలు మాత్రమే. ‘వారెంతమందో నా ప్రభువుకే బాగా తెలుసు’ అని చెప్పు.”

"(నిద్రకాలం గురించి కొందరు) 'గుహలో వారు మూడొందల సంవత్సరాలు ఉన్నారు' (అన్నారు. మరికొందరు ఈసంఖ్యలో) తొమ్మిదేండ్లు (ముందుకు పోయారు). 'వారెంత కాలం (ఆ స్థితిలో) ఉన్నారో దేవునికే బాగాతెలుసు' అని చెప్పు." (ఖుర్ఆన్-18:25)

ఇది క్రీ.శ. 249-251 మధ్యకాలంలో రోమ్‌చక్రవర్తి సీజర్ డేసియస్ నిజధర్మం (ఇస్లాం) అవలంబించిన ఈసాప్రవక్త (అలై) అనుచరుల్ని వేధిస్తున్నప్పుడు జరిగిన సంఘటన. క్రైస్తవ పండితుడు జేమ్స్ సరూజి, ప్రముఖ చరిత్రకారుడు గిబ్బన్ చేసిన పరిశోధనల ప్రకారం వారక్కడ దాదాపు 196 సంవత్సరాలు నిద్రావస్థలో గడిపారు. తరువాత ఆ యువకులు క్రీ.శ. 445-446 మధ్యకాలంలో మేల్కొన్నారు. అప్పటికే ఆనాటి రోమ్‌పాలకుడైన సీజర్ థియోడోసిస్, అతని ప్రజలు క్రైస్తవులుగా మారివున్నారు. ఈ విచిత్ర సంఘటన చూసి ప్రజలు ఎంతో ప్రభావితులయ్యారు. ఆ యువకులు తిరిగి గుహలోకి ప్రవేశించడం, వారి ఆత్మలు అనంతవాయువుల్లో కలసిపోవడం జరిగింది.

## 28. తోట యజమానులు

"మేము పూర్వం ఓతోట యజమానులకు పరీక్ష పెట్టినట్లు (ఇప్పుడు మక్కా)వారికి పరీక్షపెట్టాం. ఆ తోటయజమానులు ప్రమాణంచేసి తాము (రేపు)ఉదయాన్నే తోటకెళ్ళి తప్పక పండ్లు కోస్తామని అన్నారు. వారు 'దేవుడు తలిస్తే (పండ్లు కోస్తాం)' అనలేదు. ఆరాత్రి వారు గాఢనిద్రలో ఉన్నప్పుడు నీప్రభువు నుండి వారి తోటపైకి విపత్తు వచ్చిపడి, దాన్ని పంటకోయబడిన పొలంలా ధ్వంసం చేసింది." (ఖుర్ఆన్-68:17-20)

"తెల్లవారగానే వారు ఉత్సాహంతో ఒకర్నొకరు కేకవేసి పిలుచుకుంటూ 'పండ్లు కోయాలనుకుంటే పెందలాడే తోటకు బయలుదేరండి' అన్నారు. ఇలా వారందరూ బయలుదేరారు. (దారిలో) మాట్లాడుకుంటూ 'ఈరోజు మన తోటలోకి పేదవాళ్ళెవరూ రాకుండా చూసుకోవాలి' అన్నారు. వారు ఎవరికీ చిల్లిగవ్వ కూడా ఇవ్వరాదని నిర్ణయించుకొని, తొందర తొందరగా వెళ్ళారు పెద్ద మొనగాళ్ళులా." (ఖుర్ఆన్-68:21-25)

"అయితే తోట వద్దకు చేరుకొని (నిర్భ్రాంతపోయి) చూస్తూ 'ఏమిటీ మనం దారి తప్పి వచ్చామా...? కాదుకాదు, మన దురదృష్టమే మన కొంపముంచింది' అన్నారు. వారందరిలో కాస్త మంచివాడు 'మీరు దేవుణ్ణి ఎందుకు స్మరించరని నేను చెప్పలేదా?' అన్నాడు. అప్పుడు వారు '(నిజం) మనప్రభువు ఎంతోపవిత్రుడు. మనమే దుర్మార్గులం' అన్నారు. ఆతర్వాత వారు ఒకర్నొకరు నిందించుకున్నారు. చివరికి ఇలా అన్నారు: 'అయ్యో! ఎంత దుర్గతి పట్టింది మనకు! నిజంగా మనం చాలాదుర్మార్గులై పోయాం. (ఇప్పుడైనా) మనం పశ్చాత్తాపంచెంది మన ప్రభువుని క్షమాపణ కోరుకుందాము. బహుశా మనప్రభువు (మనల్ని కనికరించి) ఇంతకంటే మంచితోట ప్రసాదించవచ్చు." (ఖుర్ఆన్-68:26-32)

"ఇలా ఉంటుంది (ఇహలోక) శిక్ష. పరలోక శిక్ష ఇంతకంటే తీవ్రంగా ఉంటుంది. వీరీ సత్యం తెలుసుకుంటే ఎంత బాగుండు! భయభక్తులుకలవారి కోసం వారిప్రభువు దగ్గర భోగభాగ్యాలతో కూడిన స్వర్గవనాలున్నాయి. మేము విధేయులైనవారిని, అపరాధులను ఒకే దృష్టితో ఎందుకు చూస్తాం?" (ఖుర్ఆన్-68:33-35)



## 29. అగడ్త బాధితులు

'గుంట'మనుషులు నాశనమయ్యారు. ఆగుంటలో ఇంధనంతో బాగా మండించిన అగ్ని ఉంది. వారా అగ్నిగుండం చుట్టూకూర్చొని, తాము విశ్వాసులపట్ల ఎలా ప్రవర్తిస్తున్నది చూస్తున్నారు. వారా విశ్వాసులపై అంతకసి పెంచుకోవడానికి కారణం వారు సర్వశక్తి మంతుడు, స్వతఃప్రశంసనీయుడైన దేవుణ్ణి విశ్వసించడం తప్ప మరేమీకాదు. (85:4-8)

రాజులు పెద్దపెద్ద గుంటలు త్రవ్వించి అగ్నిరాజేయించి, ఆ అగ్నిగుండాలలో తమ మతవిశ్వాసాలను స్వీకరించనివారిని విసిరి బాధించడం గురించి ప్రపంచంలో అనేక సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. వాటిలో రెండిటిని ఇక్కడ ఉదాహరిస్తున్నాను:

హజ్రత్ సుహైబ్ రూమి (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: ఒక రాజు ఆస్థానంలో ఒక తాంత్రికుడు ఉండేవాడు. అతను వృద్ధాప్యంలో రాజుతో "నా దగ్గర ఈ తాంత్రికవిద్య నేర్చుకోడానికి ఒక అబ్బాయిని నియమించండి" అని అన్నాడు. రాజు ఒక పిల్లవాణ్ణి నియమించాడు. ఆ అబ్బాయి విద్య నేర్చుకోవడానికి తాంత్రికుని దగ్గరకు రోజూ వస్తూపోతూ దారిలో ఒక సాధువు (క్రైస్తవ మతగురువు)ను కూడా కలుసుకుంటుండేవాడు. ఆ సాధువు మాటలతో ప్రభావితుడై అతని ధర్మం విశ్వసిస్తాడు. అంతేగాక, అతనిచ్చిన శిక్షణతో ఆ పిల్లవాడు మహిమాన్వితుడు కూడా అవుతాడు. దాంతో అతను అంధులకు చూపు, కుష్టురోగులకు స్వస్థత కలిగించేవాడు.

ఈ బాలుడు తన మతం వదలి, ఏకదైవవిశ్వాసం అవలంబించాడని రాజుకు తెలుస్తుంది. అప్పుడతను మొదట ఆ సాధువును చంపుతాడు. తర్వాత ఆ బాలుణ్ణి చంపడానికి ప్రయత్నిస్తాడు. కాని ఎన్ని రకాలుగా ప్రయత్నించినా ఆ బాలుడు చావడు. చివరికి ఆ అబ్బాయే రాజుకు సలహాఇస్తూ "నీవు నన్ను చంపాలనుకుంటే జనం ముందు ఈబాలుడి ప్రభువు పేరుతో చంపుతున్నానని చెప్పి నాపైకి బాణంవదులు. దాంతో నేను చనిపోతాను" అన్నాడు. రాజు అలా చేయగానే బాలుడు చనిపోతాడు. కాని ఆ మహిమ చూసిన ప్రజలు "మేమీ పిల్లవాడి ప్రభువును విశ్వసిస్తున్నాం" అని చాటారు. రాజు మనుషులు రాజుతో "మీరు దేన్నుండి తప్పించుకోదలిచారో అదే జరిగిందిప్పుడు. ప్రజలు మీ మతాన్ని వదలి ఈపిల్లవాడి మతాన్ని విశ్వసించారు" అన్నారు. రాజు దాంతో ఉగ్రుడైపోయాడు. అతను రహదారి పక్కన (పెద్దపెద్ద) గుంటలు త్రవ్వించి, అందులో అగ్ని రాజేయించాడు. కొత్తధర్మాన్ని వదలడానికి అంగీకరించని ప్రతివ్యక్తినీ ఆ అగ్నిగుండాల్లోకి విసిరి వేయించేవాడు. (ముస్లిం, నసాయి, తిర్మిజి, తిబ్రాని)

రెండవ సంఘటనను చరిత్రకారులు ఇబ్నెహిషామ్, ఇబ్నెఖుల్దూన్ ఇలా తెలిపారు:

యమన్‌రాజు తుబ్బాన్‌అసద్ ఓసారి యస్రిబ్(మదీనా)కు వెళ్ళి అక్కడి యూదులతో ప్రభావితుడయి యూదమతం స్వీకరిస్తాడు. ఆ తరువాత అతను తిరిగొచ్చి యమన్‌లో ఆ మతాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయిస్తాడు. అతని మరణానంతరం అతని కొడుకు జూనువాస్ అధికారపీఠం ఎక్కుతాడు. జూనువాస్ అధికారంలోకి రాగానే హద్దుమీరిన మత దురహంకారంతో క్రైస్తవమత కేంద్రమైన నజ్రాన్‌పై దాడిచేస్తాడు. అక్కడి క్రైస్తవులను

యూదమతం స్వీకరించమని వత్తిడి చేస్తాడు. దానికి వారు నిరాకరించడంతో దుర్భర హింసాకాండ జరుపుతాడు.

దీనికోసం జూనువాస్ పెద్ద పెద్ద అగడ్తలు త్రవ్వించి, అగ్ని రాజేయించి, ఆ అగ్నిగుండాలలో క్రైస్తవుల్ని విసిరివేయించాడు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, అన్న విచక్షణ లేకుండా యూదమతం నిరాకరించిన ప్రతి వ్యక్తినీ అగ్నిగుండాలలో విసరి వేయించాడు. ఈవిధంగా అతను నలభైవేల మందిని చంపివేయించినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటన క్రీ.శ. 523 అక్టోబర్‌లో జరిగింది.

ఈ సామూహిక హత్యాకాండ నుండి జూసాల్బాన్ అనే వ్యక్తి ఎలాగో తప్పించుకొని రోమ్ నగరానికి పారిపోతాడు. రోమ్‌చక్రవర్తికి ఈ హింసాకాండను గురించి వివరంగా తెలియజేస్తాడు. రోమ్ చక్రవర్తి ఒక నౌకాదళాన్ని అబిసీనియా రాజు దగ్గరకు పంపి, యమన్‌పై దాడిచేయమని ఆజ్ఞాపిస్తాడు. అబిసీనియా నుండి అర్యాత్ నాయకత్వంలో డెబ్బయివేల సైన్యం బయలుదేరి యమన్‌పై విరుచుకు పడుతుంది. ఈ యుద్ధంలో యమన్‌సైన్యం చిత్తుగా ఓడిపోతుంది. జూనువాస్ హతమార్చబడతాడు. ఇలా యమన్‌లో యూదులపాలన అంతమయి క్రైస్తవ పాలన ఏర్పడుతుంది.

# 30. మహాప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్ర

ఖుర్‌ఆన్ కథనం ప్రకారం ప్రతియుగంలో, ప్రతిజాతిలో దైవప్రవక్తలు ప్రభవించారు. అత్యధిక దైవప్రవక్తలు ఈజిప్టు, ఇరాఖ్, పాలస్తీనా, అరేబియా దేశాలలో ప్రభవించారు. దైవప్రవక్తలలో కొందరిపై దివి నుండి దైవగ్రంథాలు అవతరించాయి. జబ్బూర్, తౌరాత్, ఇంజీల్ వగైరా ఈ కోవకు చెందినవే. (ఇప్పుడివి బైబిల్‌గా రూపాంతరం చెందివున్నాయి.) ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడని మతగ్రంథాలు కూడా ప్రారంభకాలంలో దైవప్రోక్తగ్రంథాలే అయివుండవచ్చు. కాదని ఖండించడానికి ఆస్కారమేదీ కన్పించదు.

యావన్మంది దైవప్రవక్తలు ప్రజలకు బోధించిన సారాంశం ఒక్కటే. సృష్టికర్త, స్వామి, సర్వేశ్వరుడు, ప్రభువు, పోషకుడు, ఆపద్బాంధవుడైన దేవుడు మాత్రమే ఆరాధనకు అర్హుడు. ఆయన తప్ప మరోఆరాధ్యుడు లేడు; సమస్తజీవనరంగాల్లో ఆయన ఆజ్ఞల్నే శిరసావహించాలి; ఆయన దైవత్వంలో, శక్తిసామర్థ్యాలలో ఇతరుల్ని భాగస్వాములుగా చేయకూడదు. ఈ ప్రపంచం ఓ ప్రయాణమజిలి, పరీక్షావేదిక, తాత్కాలికాశ్రయం. మరణా నంతరం మానవుల కర్మలవిచారణ జరుగుతుంది. కర్మవిచారణ తర్వాత స్వర్గం లేదా నరకం రూపంలో అతనికి శాశ్వత ప్రతిఫలం లభిస్తుంది.

మానవులకు రుజుమార్గం తెలియజేయడానికి వచ్చిన 1,24,000 మంది దైవప్రవక్త లలో ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త. ఆయనపై అవతరించిన ఖుర్‌ఆన్ అంతిమ దైవగ్రంథం. ఆయన తర్వాత ప్రళయందాకా మరే దైవప్రవక్తా లేడు. ఆ మహనీయుని జీవితచరిత్రను గురించి వివరంగా తెలుసుకోదలచినవారు "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నుండి వెలువడిన "మహనీయ ముహమ్మద్ (స) ఆదర్శజీవితం" పుస్తకం చూడవచ్చు. ఇక్కడ ఆయన్ని గురించి సంక్షిప్తంగా పేర్కొంటున్నాము:



క్రీ.శ. 570 నాటి కాలం. యమన్‌రాజు అబ్రహా మక్కాపై దాడిచేసి కాబా ధ్వంసం చేయడానికి అరవై వేలమంది సైనికులతో వచ్చి పట్నం వెలుపల విడిదిచేశాడు. చర్చల సందర్భంగా కాబాధర్మకర్త అబ్దుల్ ముత్తలిబ్ కాబాలయాన్ని దాని ప్రభువే కాపాడుతాడని చెప్పారు. తర్వాత ఆయన అబ్రహా దాడినుంచి కాపాడుకోవడానికి పట్టణవాసులందర్నీ తీసుకొని పట్నం బయట కొండల్లో దాక్కున్నాడు. అబ్రహా దాడిచేయడానికి ముందుకు సాగగానే అతను కూర్చున్న మదపుటేనుగు ఒక్క అడుగు కూడా ముందుకు సాగనని మొరాయించింది. ఆ తర్వాత కాస్సేపటికే ఎక్కడ్నుంచో పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి అబ్రహా సైన్యంపై కంకర్రాళ్ళు కురిపించాయి. దాంతో వేలాది సైనికులతో పాటు రాజు అబ్రహా కూడా భయంకరమైన చావు చవిచూశాడు.

అబ్రహా చనిపోగానే సైఫ్ బిన్ జీయజన్ అనే అతను యమన్ రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఈ వార్తతో అబ్దుల్ ముత్తలిబ్ కొందరు పెద్దలతో యమన్ రాజధానికి వెళ్ళి అతడ్ని అభినందించాడు. క్రైస్తవ, యూద మతాలను బాగా అధ్యయనం చేసిన ఆరాజు మాట్లాడుతూ "యావత్‌అరేబియా ప్రజలతోపాటు అనేకజాతులు ఎదురు చూస్తున్న అంతిమ దైవప్రవక్త మీసంతతిలో ఉద్భవిస్తాడ"ని తెలియజేశాడు. ఈ సంఘటన జరిగిన ఏభై రోజులకు ముహమ్మద్ ప్రవక్త (స) జన్మించారు....

## (1) బాల ముహమ్మద్ (స) జీవితం

మక్కా పట్నంలోని ఖురైష్ జాతి అగ్రనాయకుడు, కాబా ధర్మకర్త అయిన అబ్దుల్ ముత్తలిబ్‌కు పదిమంది కొడుకులు. వారిలో చిన్న వాడయిన అబ్దుల్లాకు ఆమినాతో వివాహమయింది. అబ్దుల్లా వ్యాపార నిమిత్తం వాణిజ్య బృందంతో కలసి విదేశాలకు పోయి తిరుగుప్రయాణంలో మదీనాలో చనిపోయాడు. ఈలోగా ఆమినా పండంటి బిడ్డను కన్నది. ఆ బిడ్డే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స).

ఖురైష్ వంశంలో గొప్పింటి మహిళలు తమ చంటి పిల్లలకు స్వయంగా పాలివ్వరు. పట్నం చుట్టుపక్కల ఉన్న పల్లెటూళ్ళ నుంచి పిల్లల పోషణ భారం వహించే స్త్రీలు (ఆయాలు) వస్తుంటారు. వారు ఈ పిల్లల్ని తీసికెళ్ళి పల్లె వాతావరణంలో పెంచుతారు. రెండేళ్ళ తర్వాత ఆ పిల్లలను తిరిగి పట్నం తీసుకొచ్చి వారివారి తల్లులకు అప్పగిస్తారు. ఇదీ ఆనాటి ఆచారం. దానిప్రకారం బాలముహమ్మద్ (స) అయిదారేండ్లు ఓ పల్లెటూరి వాతావరణంలో ఆయా హలీమా ఇంట పెరిగి మక్కా తిరిగొచ్చారు. మక్కాలో తల్లి, తాతయ్య, ఇతర బంధువుల అనురాగంతో మరికొంత కాలం గడిచింది.

ఆ తర్వాత ఆమినా బాలముహమ్మద్ (స)ని తీసుకొని సేవకురాలు ఉమ్మెఈమన్ (బర్కా)తో కలసి మదీనా వెళ్ళారు. మదీనాలో పుట్టింటిబంధువుల మధ్య ఓ నెలరోజులు గడిపి మక్కా తిరుగుముఖం పట్టారు. కాని దారిలో ఒక చోట జబ్బుపడి ఆమినా కన్ను మూశారు. దాంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాలముహమ్మద్ (స)ని పరిచారిక సముదాయించి మక్కాకు తీసుకొచ్చింది. పరిస్థితి తెలుసుకున్న అబ్దుల్ ముత్తలిబ్ కుటుంబంపై మరోసారి విషాదఛాయలు అలుముకున్నాయి. మాతృమూర్తి మరణం తర్వాత బాలముహమ్మద్ (స) తాతయ్య అబ్దుల్‌ముత్తలిబ్ సంరక్షణలో పెరగసాగారు.

పుట్టక ముందే తండ్రి చనిపోయాడు. కాస్త స్పృహ వస్తుండగా ఏడేళ్ళ వయస్సులో తల్లి కూడా ఇహలోకం వీడిపోయింది. ఇలా పసితనంలోనే ముహమ్మద్ (స) అమ్మా, నాన్నల ప్రేమ కోల్పోయి అనాథ అయ్యారు. ఆ లోటును ఎలాగో కొంతవరకు తాతయ్య తీర్చగలుగుతున్నాడని అనుకుంటుంటే విధి ఈ అనాథబాలుడ్ని మరో అగ్నిపరీక్షకు గురి చేసింది. అబ్దుల్‌ముత్తలిబ్ మనవడ్ని తన సంరక్షణలోకి తీసుకొని ఒక సంవత్సరం గడిచిందో లేదో వ్యాధిగ్రస్తులై కొన్నాళ్ళలోనే ఇహలోకం వీడిపోయారు. ఆ తరువాత బాలముహమ్మద్ (స) పెదనాన్న అబూతాలిబ్ సంరక్షణలోకి వచ్చారు.

అరబ్బులు నిరాడంబర జీవులు. వారికి సభ్యతా సంస్కారాలంటే ఏమిటో తెలియదు. గొప్పింటి పిల్లలు కూడా అడవులకు వెళ్ళి పశువులు కాస్తుంటారు. అంచేత ముహమ్మద్ (స) కూడా మక్కాఅడవుల్లో మేకలు కాయడం మొదలెట్టారు. సభ్యతా సంస్కారాలు లేని అరబ్‌సమాజంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు, మద్యసేవనం, మగువ లోలత్వం మస్తుగా ఉండేవి. వీటికితోడు అరబ్బులు తెగవిద్వేషం, జాతీయ దురభిమానాలతో చీటికిమాటికి పరస్పరం కత్తులు దూసుకుంటూ ఏండ్లతరబడి యుద్ధాలు చేసుకునేవారు. ఇలాంటి సమాజంలో పిల్లలక్కూడా పెద్దల బుద్ధులే రావడం సహజం. కాని బాలముహమ్మద్ (స)పై ఈ చెడు సమాజంప్రభావం పడకుండా విధి ఆయన్ని ఏకాంత ప్రదేశాల్లో నోరులేని జీవాల మధ్య ప్రకృతిదృశ్యాల చాటున సుశిక్షణ ఇవ్వసాగింది.

ఆ మాటకు వస్తే స్వయంగా ముహమ్మద్ (స)కు కూడా అరబ్బుల జీవనవిధానం నచ్చలేదు. ఆయనకు ఆటపాటలు కూడా నచ్చేవి కాదు. కాలక్షేపం కథలు, పనికిమాలిన కబుర్లు, వ్యర్థమైన పనులకు ఆమడ దూరంలో ఉంటారు. ఆయనసలు తోటి పిల్లలతో ఎక్కువగా స్నేహం చేసేవారు కూడా కాదు. వారి ఆకతాయి చేష్టల్ని అసహ్యించుకునేవారు. నిరంతరం ఏదో ఆలోచిస్తూ ఉండటం ఆయన ప్రవృత్తిలో వేరుగొనిపోయింది. ముఖ్యంగా ప్రకృతిని అవలోకిస్తూ ఆధ్యాత్మిక చింతనలో ఆయన కాలం గడుపుతుంటారు.

చీటికిమాటికి కత్తులు దూసుకునే అరబ్బుల్లో ఓ సారి భయంకరమైన యుద్ధజ్వాలలు చెలరేగాయి. ఈ యుద్ధం ఏండ్ల తరబడి కొనసాగింది. యుద్ధం చివరి ఘట్టంలో నూనూగు మీసాల ముహమ్మద్ (స) కూడా పాల్గొన్నారు. అయితే ఆయన కత్తి పట్టి కదనరంగంలోకి దూకలేదు. ఆయన ఓగుట్ట చాటున నిల్చొని, శత్రుసైనికుల నుండి వచ్చిపడే బాణాలు సేకరించి తన చిన్నాన్న, పెదనాన్నలకు అందించేవారు. ఈ (ఫుజ్జార్)యుద్ధంలో ఉభయ పక్షాలకు తీవ్రమైన నష్టం జరిగింది. చివరికి ఉభయపక్షాలు రాజీఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం పట్ల ముహమ్మద్ (స) అందరికంటే ఎక్కువగా సంతోషం వెలిబుచ్చారు. విశ్వప్రభువు ఆయన ప్రార్థనను ఆలకించి యుద్ధాన్ని నిలుపదల చేశాడు.

ఓరోజు జుబైద్ పట్నం నుంచి ఒక వ్యాపారి ఒంటెమీద సరుకులు తీసుకొని మక్కా వచ్చి వ్యాపారం ప్రారంభించాడు. అప్పుడు ఆస్ బిన్ వాయిల్ అనే ఓ పురప్రముఖుడు ఆ సరుకుల్ని కొని పైకం ఎల్లుండి ఇస్తానని చెప్పాడు. కాని రెండుమూడు సార్లు తిప్పుకొని చివరికి "నీదగ్గర నేనసలు ఎలాంటి సరుకు కొనలేదు, వెళ్ళవయ్యా" అని దబాయించాడు. పాపం జుబైదీ వ్యాపారి లబోదిబో అంటూ, కొండెక్కి అన్యాయాన్ని అరికట్టి తనకు న్యాయం



చేకూర్చమని ఎలుగెత్తి అరిచాడు. ఈ కేకలు కొందరు ఖురైష్ నాయకులు విన్నారు. కాని ఆస్‌ని ఎదిరించడం ఒకరిద్దరి వల్ల సాధ్యం కాదు. అంచేత వారు హిల్ఫుల్‌ఫుజూల్ అనే పాత ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి నిర్ణయించారు.

ఆ ఒప్పందంలోని షరతులు ఇలా ఉన్నాయి: "మనలో ఏఒక్కడూ ఇతరుల హక్కు కొల్లగొట్టడు; మనం బలవంతుడి నుండి బలహీనుడి హక్కు, స్థానికుడి నుండి బాటసారి హక్కు ఇప్పిస్తాం; దౌర్జన్యపరుడికి వ్యతిరేకంగా పీడితునికి సహాయపడటం జరుగుతుంది." ఆ ఒప్పందం గురించిన సమావేశంలో పదహారేళ్ళ ముహమ్మద్ (స) కూడా పాల్గొన్నారు. తర్వాత వారంతా ఆస్ ఇంటికి వెళ్ళి జుబైదీ వ్యాపారికి రావలసిన బాకీ వసూలుచేశారు.

## (2) యువ ముహమ్మద్ (స) జీవితం

యువ ముహమ్మద్ (స) మేకలకాపరి నుంచి వర్తకునిస్థాయికి ఎదిగారు. ఇరవైఏళ్ళు నిండిన ఆ యువకుని హృదయంలో ఆధ్యాత్మిక చింతనతో పాటు ఇప్పుడు పేదజనోద్ధరణ భావన కూడా పరవళ్ళు తొక్కింది. హజ్‌సీజన్‌లో మక్కా దరిదాపుల్లోని ఉకాజ్‌ప్రాంతం రకరకాల దుకాణాలతో కళకళలాడేది. దేశం నలుమూలల నుండి వచ్చే విభిన్న వస్తువులు, సరుకులతో దుకాణాలు కిటకిటలాడి పోతాయి. వర్తకులు తమదుకాణాలను అలంకరించి కొనుగోలుదారుల్ని ఆకట్టుకుంటారు. కొందరు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటారు. మరికొందరు అప్పుగా సరుకులు అమ్మి వడ్డీ కూడా గుంజుతారు.

అయితే ముహమ్మద్ (స) మాత్రం తన దుకాణానికి వస్తున్న కొనుగోలుదారులకు సరుకులోని నాణ్యత, నాసిదనాలను గురించి చెబుతూ వాటి ప్రకారమే ధరలు నిర్ణయించి అమ్మేవారు. ఆయన నిజాయితీ చూసిన జనం అతని దుకాణంలోని వస్తువులు ఎగబడి కొనేవారు. అధికలాభాలకన్నా కొనుగోలుదారుల క్షేమాన్నే లక్ష్యంగా పెట్టుకున్న ముహమ్మద్ (స) అనతికాలంలోనే వాణిజ్యరంగంలో సత్యసంధుడు (సాదిఖ్)గా, నిజాయితీపరుడు (అమీన్)గా ఖ్యాతిగాంచారు. అదీగాక వెంటనే డబ్బుచెల్లించలేని పేదలకు ఆయన వడ్డీ లేకుండానే సరుకులు అప్పుగా ఇచ్చేవారు. అసలు చెల్లించలేనివారిని మాఫీ చేసేవారు. అంచేత ఆయన పేదలపాలిటపెన్నిధి అనికూడా పేరుపడ్డారు. పైగా వ్యాపారంలో వచ్చే లాభాన్ని ఆయన దరిద్రులకు, అనాథలకు, వితంతువులకు పంచిపెట్టేవారు.

ముహమ్మద్ (స) వ్యాపారంలో నిజాయితీపరుడుగా పేరుమోసినా, ఆర్థిక పరిస్థితి మాత్రం ఎలాంటి ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయింది. అంచేత అబూతాలిబ్ 24 ఏళ్ళ ముహమ్మద్ (స)ని ఖదీజా వ్యాపారంలో విక్రయఉద్యోగిగా కుదుర్చారు.

ఖదీజా గొప్ప శ్రీమంతురాలు. ఆమెవ్యాపారం యమన్, సిరియా, పాలస్తీనా మొదలైన దేశాలదాకా విస్తరించింది. ఆమె వితంతువు. వెంటవెంట జరిగిన కొన్ని సంఘటనలతో ఆమెకు వైవాహిక జీవితంపై విరక్తికల్గింది. అంచేత ఆమె వ్యాపారంలో వచ్చే ఆదాయంలో అత్యధిక భాగం పేదలు, అనాథలు, వితంతువుల కోసం వెచ్చిస్తూ ప్రజాసేవలో ప్రశాంత జీవితం గడపసాగారు. ఆమె ముహమ్మద్(స) సత్యసంధత, నిజాయతీలను గురించి ప్రజలనోట వినిఉండటంవల్ల అబూతాలిబ్ వచ్చి మాట్లాడగానే వివరాల్లోకి పోకుండా

ముహమ్మద్ (స)ని వ్యాపారంలో పెట్టుకోవడానికి అంగీకరించారు. ఆతర్వాత కొన్నాళ్ళకు ముహమ్మద్ (స) నాయకత్వంలో ఒక వాణిజ్యబృందం సిరియా బయలుదేరింది. అందులో ముహమ్మద్ (స)కు సహాయకారిగా ఖదీజా నమ్మినబంటు మైసరా కూడా ఉన్నాడు.

ఈ వాణిజ్యబృందం సిరియా పోయి బస్రాపట్నం సమీపంలో విడిదిచేసింది. అక్కడ ముహమ్మద్(స) ఎంతో అనుభవశాలిలా వ్యాపారంచేశారు. కొనుగోలు వర్తకులతో ఎంతో నేర్పుగా, నిజాయితీగా వ్యవహరించారు.

వర్తకబిడారాలు విడిదిచేసిన చోట మోడుబారిన ఓ చెట్టుంది. ఒకరోజు ముహమ్మద్ (స) ఆ చెట్టు కింద కూర్చున్నారు. కాస్సేపటికి ఆ చెట్టు చిగురించి పచ్చని ఆకులతో, రెమ్మలతో అలరారిపోయింది. దగ్గర్లో ఒక క్రైస్తవమఠంలో ఉంటున్న నస్తూర్ అనే సాధువు వచ్చి "మైసరా! నీవెంట వచ్చిన ఈ యువకుడెవరు? ఇతని వంశం ఏమిటి? ఇతని గుణగణాలు ఎలాంటివి?" అని అడిగాడు. వాటికి మైసరా వివరంగా సమాధానమిచ్చాడు. నస్తూర్ ఆ వివరాలు విని "అయితే మైసరా! నీవు వర్ణించిన ఈ సుగుణాలు, గుర్తులు ఉండి ఈ చెట్టు కింద ఆగిన వ్యక్తి గొప్ప దైవప్రవక్త అవుతాడు" అని అన్నాడు.

ఆ ఏడు ఖదీజా వాణిజ్య బిడారం అత్యధిక లాభాలతో సిరియా నుంచి మక్కాకు తిరిగొచ్చింది. మైసరా వచ్చీరాగానే ఖదీజాను కలుసుకొని, వ్యాపారంలో ముహమ్మద్(స) ప్రదర్శించిన నైపుణ్యం, తెలివితేటలను గురించి విశేషంగా వర్ణించి చెప్పాడు. అంతేగాక ఆయన్ని గురించి క్రైస్తవసాధువు నస్తూర్ చెప్పిన శుభవార్త కూడా తెలియజేశాడు.

ఆరోజు నుంచి ఖదీజా మనస్సు అప్రయత్నంగా ముహమ్మద్ (స)పై లగ్నమయింది. ఆమె ఇప్పుడు అహర్నిశలూ ఆయన్ని గురించే ఆలోచిస్తూ ఉండసాగారు. ఎవరితో ఏది మాట్లాడినా చివరికి ఆమె ముహమ్మద్ ప్రస్తావనే తెచ్చి ఆయన గుణగణాల్ని కొనియాడే వారు. ఎలాగైనా ఆయన్ని తన జీవితభాగస్వామిగా చేసుకోవాలని భావించారు. చివరికి పరిచారిక నఫీసా మధ్యవర్తిత్వంతో ముహమ్మద్(స), ఖదీజాల వివాహం జరిగిపోయింది.

పెళ్ళయిన రెండేళ్ళకు ఆ దంపతులకు పండంటి కొడుకు పుట్టాడు. పేరు ఖాసిం. ఆ పేరుతోనే ముహమ్మద్ (స) అబుల్‌ఖాసిం అని పిలువబడసాగారు. కాని ఖాసిం పుట్టిన ఆర్నెల్లకే ఇహలోకం నుండి శాశ్వతంగా నిష్క్రమించాడు. ఆ తర్వాత రెండున్నర సంవత్సరాలకు జైనబ్ అనే పాప పుట్టింది. ఆ తర్వాత రుఖియా, ఉమ్మెకుల్సూమ్ అనే మరో ఇద్దరు బాలికలు జన్మించారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు ముహమ్మద్ (స) జైద్ బిన్ హారిస్ అనే ఒక బానిసబాలుడ్ని చేరదీసి పెంపుడు కొడుకుగా చేసుకున్నారు.

ముప్ఫయి రెండేళ్ళ ముహమ్మద్ (స) ఆలోచనా సరళి క్రమక్రమంగా ఒక ప్రస్ఫుట రూపు దిద్దుకోసాగింది. సృష్టి రహస్యాలను అర్థం చేసుకోవడానికి, తన చుట్టూ ప్రబలివున్న వికృతప్రపంచాన్ని తీర్చిదిద్దడానికి నిరంతరం ఆలోచిస్తూనేఉన్నారు. మక్కాకు ఆరు మైళ్ళ దూరంలో ఉన్న 'హిరా' కొండగుహను తన తాత్వికచింతనకు అనువైన ప్రదేశంగా ఎన్నుకున్నారు. ఒక్కొక్కసారి రేయింబవళ్ళు అక్కడే దైవధ్యానంలో గడుపుతూ సత్యాన్వేషణలో నిమగ్నులై ఉండేవారు. పట్టణానికి తిరిగిరాగానే కాబా ప్రదక్షిణ చేసి ఆ తర్వాతే ఇంటికి పోయి భార్యాపిల్లల దగ్గర గడిపేవారు.



ఒకసారి మక్కా పట్నం వరదముంపుకు గురై కాబాలయం బాగా దెబ్బ తిన్నది. దాని గోడలు పూర్తిగా బీటలు వారాయి. అంచేత గోడలు పడగొట్టి కాబాను పునర్నించాలని పట్టణపెద్దలు నిర్ణయించి పని మొదలుపెట్టారు. పునర్నిర్మాణ పనిలో ముహమ్మద్, అబూతాలిబ్‌లు కూడా పాల్గొన్నారు. కాబాగోడలో తూర్పువైపున 'నల్లరాయి'ని అమర్చే సమయం వచ్చింది. ఈ రాయికి అరబ్బులు ఎంతో ప్రాముఖ్యం ఇస్తారు. హజ్ సందర్భం లో దీన్ని వారు ముద్దాడుతారు. కాబాప్రదక్షిణ ఈ రాయి దగ్గర్నుంచే ప్రారంభమవుతుంది.

అందువల్ల ఈ రాయిని ఎవరు గోడలో అమర్చాలి; ఈఘనత ఎవరికి దక్కాలి అనే సమస్య వచ్చింది. ప్రతిఒక్కరూ తనకే దాని పుణ్యం లభించాలని ఆశిస్తున్నారు. ప్రతి తెగా ఈ పుణ్యకార్యం చేసే హక్కు తనకే ఉందని భావిస్తోంది. దీనిపై పెద్ద వివాదం చెలరేగింది. అయిదు రోజులు గడచినా సమస్య కొలిక్కి రాలేదు. అప్పుడు అన్ని తెగల వారూ గౌరవించే అబూఉమయ్యా అనే వృద్ధుడు ముందుకు వచ్చి "ఈ సమస్యకు ఒక్కటే పరిష్కారం. సఫాద్వారం నుంచి మొట్టమొదట ఎవరు లోనికి ప్రవేశిస్తారో అతడ్ని మధ్యవర్తిగా స్వీకరించాలి. అతను ఎలా చెబితే అలా నడచుకోవాలి" అని అన్నాడు.

ఈ సలహా అందరికీ నచ్చింది. సరేనంటూ ఆ వ్యక్తి కోసం వారు ఎదురుచూడసాగారు. కాబా చుట్టూఉన్న నాలుగు ప్రహరీగోడలకు నాలుగు ముఖద్వారాలు ఉన్నాయి. అందులో సఫాద్వారం పట్నంవైపు గాకుండా దానికి అభిముఖంగా కొండల వైపుంది. అందరి దృష్టి సఫాద్వారం వైపు కేంద్రీకృతమయింది. కాస్సేపటికి ఆ ద్వారం గుండా ఓ అందమైన యువకుడు లోనికి ప్రవేశించాడు. అతడ్ని చూడగానే అందరూ సంతోషంతో ఎలుగెత్తి "అమీన్! ముహమ్మద్ అమీన్ చెప్పే తీర్పు మాకందరికీ సమ్మతమే" అని అరిచారు.

ఖురైష్ నాయకులు సమస్యను ఆయన ముందు ప్రస్తావించారు. ముహమ్మద్ (స) అంతావిని ఒక దుప్పటి తెప్పించారు. దాన్ని నేలమీద పరచి మధ్యలో 'నల్లరాయి'ని ఎత్తి పెట్టారు. దుప్పటి అంచుల్ని అన్ని వర్గాల నాయకులు పట్టుకొని ఆ శిల పెట్టవలసిన చోటికి ఎత్తిపట్టుకురమ్మని చెప్పారు. అలా అందరూకలసి తీసుకొచ్చిన తర్వాత ముహమ్మద్ (స) తన స్వహస్తాలతో ఆ రాయిని ఎత్తి దాని స్థానంలో అమర్చారు.

ఈ న్యాయనిర్ణయం, సమయస్ఫూర్తి చూసి అందరూ ఎంతో అబ్బురపడ్డారు. అమీన్ చూపిన ఉపాయంవల్ల అంతఃకలహం ఆరంభంలోనే అంతరించినందుకు అందరూ ఎంతో ఆనందించారు. ఆ తరువాత కాబా పునర్నిర్మాణం కొద్ది రోజుల్లోనే ముగిసింది.

మహనీయ ముహమ్మద్ (స) 37వ ఏట అడుగుపెట్టారు. అరేబియాపై కరువురక్కసి విరుచుకుపడింది. వ్యాపారలావాదేవీలు కుంటుపడిపోయాయి. గంపెడు పిల్లలతో సంసారం ఈదలేక సతమతమవుతున్న అబూతాలిబ్‌ని ఈ కరువు మరింత క్రుంగదీసింది. ముహమ్మద్ (స) ఆయన కష్టాలు చూసి అలీని తన సంరక్షణలోకి తీసుకున్నారు. ఆ కాలంలో అబ్దుల్లా అనే ఓ బాబు పుట్టాడు. కాని కొన్నాళ్ళకే చనిపోయాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకు ఫాతిమా అనే పాప పుట్టింది. ఆయన ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేశారు. ఇప్పుడు ఖదీజా ఇంట్లో చిన్నారి ఫాతిమా మాత్రమే మిగిలివుంది. ఆ పాపతో పాటు పదేళ్ళ అలి, నవయువకుడైన జైద్ కూడా ఉన్నారు.

# 3) దైవప్రవక్తగా ముహమ్మద్ (స)

ముహమ్మద్(స) ఏసత్యం కోసం ఏండ్లతరబడి నిరీక్షిస్తున్నారో ఆ సత్యం సమీపించింది. నలభై వసంతాలు నిండిన ఆయనజీవితంలో అదొక మైలురాయి. అందమైన ఈ ప్రపంచం మూన్నాళ్ళ ముచ్చటని, ఇక్కడి భోగభాగ్యాలు క్షణభంగురాలని ఆయన అప్పుడప్పుడు కంటున్న కలలు సూచించాయి. సకల చరాచరాలను, యావత్తు ప్రాణికోటిని సృష్టించిన శక్తిస్వరూపుడు మాత్రమే మానవులకు ఆరాధ్యదైవమని ఆయన అంతరంగంలో అనుక్షణం మెదులుతున్న ఆలోచనలు నిజరూపం ధరించే సమయం ఆసన్నమయింది.

అది రమజాన్ నెల. దైవకారుణ్యం ధరిత్రిపై వర్షించే పవిత్రమాసం. ఓరోజు సుప్రభాతం వేళ హిరాగుహలో హఠాత్తుగా ఓ అద్భుతదృశ్యం ప్రత్యక్షమైంది. ఒక అందమైన మనిషి వచ్చి 'చదువు' అన్నాడు. 'నాకు చదవడం రాదే!' అన్నారు ముహమ్మద్ (స) బెదురుచూపులతో. అప్పుడతను ముహమ్మద్ (స)ని గట్టిగా అదిమివదిలేస్తూ 'చదువు' అన్నాడు మళ్ళీ. 'నాకు చదవడం రాదు' తిరిగి అదే జవాబు. మళ్ళీ ఆ వ్యక్తి ఆయన్ని గట్టిగా అదిమివదిలేస్తూ 'చదువు' అన్నాడు. అప్పుడు ముహమ్మద్ (స) "ఏం చదవాలి?" అని అడిగారు.

"చదువు సృష్టికర్త అయిన (నీ) ప్రభువు పేరు స్మరించి. ఆయనే మానవుణ్ని గడ్డకట్టిన రక్తంతో సృజించాడు. చదువు, నీప్రభువు మహోన్నతుడు, ఎంతో ఉదారుడు. ఆయనే మానవునికి కలంద్వారా అతను ఎరగని జ్ఞానం నేర్పాడు" అన్నాడా వ్యక్తి. (ఖుర్ఆన్-96:1-5)

ముహమ్మద్ (స) అలాగే చదివి విన్పించారు. తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. అప్పుడు ముహమ్మద్ (స) గుహ నుండి చరచరా బయటికి వచ్చి తనకేదో పిశాచం ఆవహించిందని భ్రమపడి గబగబా గుట్టలు, మిట్టలు దాటుకుంటూ ఇంటి దారిపట్టారు. ఇంటికి చేరుకోగానే పడకపై వాలిపోయి 'దుప్పటి కప్పు, దుప్పటి కప్పు' అన్నారు గజగజ వణికిపోతూ. ఖదీజా భర్త పరిస్థితి చూసి కంగారుపడుతూ దుప్పటి తెచ్చి కప్పారు. పరిస్థితి కాస్త కుదుటపడిన తర్వాత ముహమ్మద్ (స) దుప్పటి తీసి లేచికూర్చున్నారు. అప్పుడు ఖదీజా "ఏమండీ, ఏం జరిగింది? ఒంట్లో బాగాలేదా?" అని అడిగారు.

"ఏమని చెప్పను ఖదీజా! ఎప్పుడూ జరగని ఓ వింత సంఘటన జరిగింది. నేను గుహలో కూర్చొనివుంటే తెల్లవస్త్రాలు ధరించిన ఒకతను వచ్చి చదవమని ఆజ్ఞాపించాడు. ఇలా మూడుసార్లు జరిగింది. చివరికి నేను అతను చెప్పినట్లు చదివాను. ఆ తర్వాత అతను వెళ్ళిపోయాడు. నాకు భయమేసి గుహనుండి గబగబా నడిచి ఇంటికొచ్చాను. ఖదీజా! ఏమయింది నాకు? ఇదంతా చూస్తుంటే నాకేదో ప్రాణాపాయం కలుగుతుందని భయంగా ఉంది" అంటూ ముహమ్మద్ (స) జరిగిన వృత్తాంతం భార్యకు తెలియజేశారు.

ఖదీజా ఈ సంఘటన విని భయపడలేదు. దాని వెనుకున్న మర్మాన్ని గ్రహించి భర్త వైపు ఎంతో గౌరవంగా చూస్తూ ఇలా అన్నారు: "భయపడకండి. శుభఘడియ వచ్చింది, సంతోషించండి. దైవసాక్షి! మీరు సత్యసంధులు, దయార్ద్రహృదయులు, నిజాయితీపరులు, పేదల పాలిట పెన్నిధి. మీరు అతిథులను సత్కరిస్తారు, మంచి పనులలో ప్రజలతో సహకరిస్తారు. అటువంటి వారైన మీకు దేవుడు ఎన్నటికీ ప్రాణాపాయం కలిగించడు."



అర్ధాంగి మాటలతో ముహమ్మద్ (స)కు కొంచెం ధైర్యం వచ్చింది. కలవరపాటు తగ్గిపోయింది. తన భర్త దైవప్రవక్త కాబోతున్నాడని గ్రహించిన ఖదీజా సంతోషంతో పొంగిపోయారు. ఏమైనప్పటికీ ఈ విషయాన్ని ధృవపరచుకోవడానికి అన్నయ్య వరఖా దగ్గరికెళ్ళి అడుగుదాం అనుకున్నారు ఆమె. ఈ విషయాన్నే ఆమె శ్రీవారికి చెప్పి ఆయన్ని తీసుకొని వరఖా దగ్గరకు వెళ్ళి ఆయనకు ఆ వింత సంఘటన గురించి చెప్పారు.

వరఖా బిన్ నౌఫల్ హజ్రత్ ఖదీజా పెదనాన్న కుమారుడు. వరసకు అన్నవుతాడు. వివిధమతాలు కాచి వడబోసిన ప్రముఖ మతపండితుడు. అతను విషయం విని ఇలా అన్నాడు: "నా ప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆ దేవుని సాక్షిగా చెబుతున్నాను. నీవు వర్ణించిన ఆ అద్భుతశక్తి ఎవరో కాదు. గతంలో మూసా ప్రవక్త (అలైహి) దగ్గరకు దైవసందేశం తెస్తూవుండిన జిబ్రీల్ దూతే ఆయన. దేవుడు నిన్ను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. నీవిప్పుడు దైవప్రవక్తవు. తౌరాత్, ఇంజీల్ గ్రంథాల్లో నీదౌత్యం గురించి భవిష్యత్ ప్రకటనలు ఉన్నాయి. నీ అనుచర సమాజం యావత్ ప్రపంచంలో వ్యాపిస్తుంది. అయితే ముహమ్మద్! నీవు దైవప్రవక్త అయినట్లు ప్రకటించావంటే లోకులు నిన్ను తిరస్కరిస్తారు. స్వస్థలం నుంచి నిన్ను వెళ్ళగొడ్తారు. చివరకు నీతో యుద్ధం చేయడానికైనా వెనుదీయరు."

"ఏమిటీ, ప్రజలు నన్ను ఇక్కడ్నుంచి వెళ్ళగొడ్తారా?" ముహమ్మద్ (స) ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అడిగారు. "ఔను నాయనా! గతంలో దైవప్రవక్తలు వచ్చినప్పుడల్లా వారి జాతిప్రజలు ఇలాగే ప్రవర్తించారు" అని అన్నాడు వరఖా ప్రేమతో దైవప్రవక్త (స) నుదుటిని చుంబిస్తూ. ఆ తరువాత ముహమ్మద్ (స) శ్రీమతితో పాటు అక్కడ్నుంచి లేచి భారంగా అడుగులేస్తూ ఇంటికి చేరుకున్నారు.

ఇప్పుడు ఆయన మెదడును అనేక ఆలోచనలు చుట్టుముట్టి తొలచివేయసాగాయి. "నా బలహీన భుజాలపై దౌత్యభారం వచ్చిపడింది. నేను ప్రజలను దేవునివైపు ఎలా పిలవాలి? వీరు సన్మార్గం తప్పి విగ్రహారాధనలో మునిగితేలుతున్నారే! నైతికంగా కూడా ఎంతో దిగజారిపోయారు. ఇలాంటి మూర్ఖజనాన్ని దారికి ఎలా తేవాలి?"

ఇలాంటి ఆలోచనలతో ముహమ్మద్ (స) తదుపరి కర్తవ్యం గురించి జిబ్రీల్ దూత (అలై) కోసం ఎదురుచూడసాగారు. కాని ఏడి ఆయన? మళ్ళీ ఎప్పుడు కన్పిస్తాడు?? "ఎన్ని రోజులీ నిరీక్షణ? తనను గురించి దైవప్రవక్తని చెప్పిన ఆ దైవదూత ఎప్పుడొస్తాడు? వరఖా తనకు దైవసందేశవాహకుడని చెప్పిన ఆ దైవదూత మళ్ళీ ఎందుకు రాలేదు? ఇప్పుడేం చేయాలి? ముహమ్మద్ (స) హృదయంలో తుఫానుహోరు మొదలైంది. ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడే ఆయన ముఖపద్మం విచారగ్రస్తమైంది. ఖదీజా కూడా లోలోన బాధపడసాగారు. ఆమె దుఃఖాన్ని తమాయించుకొని భర్తకు ధైర్యం చెప్పేవారు.

ఒకరోజు ముహమ్మద్ (స) ఏమీతోచక కొండల మీద ఒంటరిగా తిరగసాగారు. కాని దైవదూత జాడేలేదు. చివరికి ఆయన ఓ కొండచరియ ఎక్కి కిందికి దూకి ఆత్మహత్య చేసుకుందామనుకున్నారు. అంతలో జిబ్రీల్ (అలైహి) ప్రత్యక్షమై "ముహమ్మద్! నీవు నిస్సందేహంగా దైవప్రవక్తవే" అని చెప్పి ఓదార్చి వెళ్ళిపోయారు. దాంతో దైవప్రవక్త (స)కు మనశ్శాంతి కలిగింది. ఆయన సంతోషంతో తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు.

కాని కొన్నాళ్ళకు తిరిగి అదే పరిస్థితి! ఎన్ని రోజులు గడచినా దైవదూత జాడలేదు. ముహమ్మద్ (స) మళ్ళీ కొండచరియపై కెళ్ళి జీవితం చాలిద్దామని ప్రయత్నించారు. అదే సమయంలో దైవదూత మళ్ళీ ప్రత్యక్షమవడం, ఆయన్ని ఓదార్చడం జరిగిపోయాయి. ఆ తరువాత మామూలే! దైవసందేశం చాలా రోజులదాకా రాలేదు. ఈ విధంగా తొలి దివ్యావిష్కృతి తరువాత ఆర్నెల్లు గడచిపోయాయి. ఒకరోజు ఆయన ఎక్కడికో పోతుంటే హఠాత్తుగా ఆకాశం నుంచి వింత శబ్దంతో మాటలు విన్పించాయి. తలపైకెత్తి చూశారు. ఆశ్చర్యం! జిబ్రీల్ దూత ప్రత్యక్షమయ్యాడు. ఈసారి ఆయన తన అసలు స్వరూపంతో భూమ్యాకాశాల మధ్య శూన్యప్రదేశంలో ఓ కుర్చీ మీద కూర్చొని ఉన్నాడు.

ఆయన్ని చూసి ముహమ్మద్ (స) మనస్సు కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. కాని మరుక్షణంలోనే దైవదూతఅసలురూపం చూసి నిలువునా కంపించిపోయారు. అదే స్థితిలో పరుగువేగంతో నడచి ఇంటికి చేరుకున్నారు. “ఖదీజా! నాకు దుప్పటి కప్పు, దుప్పటి కప్పు” అన్నారు వణికిపోతూ. విషయం గ్రహించిన ఖదీజా వెంటనే దుప్పటి తెచ్చి కప్పారు. ఆ తరువాత కాస్సేపటికే దైవదూత ప్రత్యక్షమయి ఇలా దైవసందేశం విన్పించాడు:

“దుప్పటి కప్పుకొని పడుకున్నవాడా! లే, లేచి (ప్రజలను) హెచ్చరించు. నీ ప్రభువు ఔన్నత్యాన్ని చాటిచెప్పు. నీ దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకో. అపవిత్రత, అపరిశుభ్రతలకు దూరంగా మసలుకో. ఏ మేలయినా సరే ప్రాపంచిక ప్రయోజనాలు ఆశించి చేయకు. (కష్టమొచ్చినప్పుడు) నీ ప్రభువు కోసం సహనం వహించు”. (ఖుర్ఆన్–74:1–7)

ఇప్పుడు దైవప్రవక్త (స) మనస్సు కుదుటపడింది. ఒకరోజు ఆయన మక్కా శివార్లలో దైవదూత కోసం నిరీక్షించసాగారు. కాస్సేపటికి దైవదూత జిబ్రీల్ (అలై) ప్రత్యక్షమయ్యారు. ఆయన ఓ గుట్ట మీద గరికనేలను కాలితో తన్నగానే అక్కడ ఒక ఊట ఉబికొచ్చింది. ఆ నీటితో ఆయన ఉజూ చేసి, నమాజ్ చేయడానికి ముందు ఇలా పరిశుభ్రం కావాలని చెప్పారు. అది చూసి దైవప్రవక్త (స) అదేవిధంగా ఉజూచేశారు. ఆతర్వాత జిబ్రీల్ నమాజు చేసి చూపారు. అది చూసి దైవప్రవక్త (స) కూడా ఆయన చేసినట్లే నమాజు చేశారు.

ఆ తరువాత ఆయన ఇంటికొచ్చి అర్ధాంగి ఖదీజా (రజి) ఎదుట ఉజూ చేసి చూపారు. ఖదీజా (రజి) అదేవిధంగా ఉజూచేశారు. తర్వాత దైవప్రవక్త (స) నమాజు చేయగా ఆమె ఆయన్ని అనుసరించారు. ఖదీజా (రజి) ఇస్లాం స్వీకరించి ముస్లింగామారిన తొలి మనిషి. కొన్నాళ్ళకు అలి, జైద్‌లు కూడా దైవప్రవక్తను విశ్వసించి ఆయన్ని అనుసరించసాగారు.

దైవప్రవక్త (స) ఓరోజు భావి ప్రచారకార్యక్రమం గురించి ఆలోచిస్తూ ఉంటే ఆయన స్నేహితుడు అబూబకర్ వచ్చాడు. మిత్రులిద్దరూ కాస్సేపు అదీఇదీ మాట్లాడుకున్నారు. తరువాత దైవప్రవక్త (స) విషయం మార్చుతూ “అబూబకర్! నీవు నన్ను ఎలాంటి వాడని భావిస్తున్నావు?” అని అడిగారు. “ఏమిటి, ఈరోజు కొత్తగా మాట్లాడుతున్నావు!! నీ సంగతి నాకు తెలియనిదేముంది? నువ్వు ఎంతో మంచివాడవు, సత్యవంతుడవు, నిజాయితీ పరుడవు” అన్నాడు అబూబకర్. “సరే, ఒకవేళ నేను దైవప్రవక్తనని, నాపై దైవసందేశం అవతరిస్తోందని అంటే నువ్వు నమ్ముతావా?” అడిగారు దైవప్రవక్త (స) మళ్ళీ. “తప్పకుండా నమ్ముతాను. నీవు అబద్ధమాడినట్లు నేనింత వరకు వినలేదు” అన్నాడు అబూబకర్.



“అయితే విను. నేనిప్పుడు దేవుని తరఫున ప్రవక్తగా నియమించబడ్డాను. నాపై దైవ సందేశం అవతరిస్తున్నది. దాని ప్రకారం నీవు కూడా దైవేతర శక్తులన్నింటిని వదలిపెట్టి ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధించు. ఆయనే సర్వసృష్టికర్త. జీవన్మరణాలు ఆయన చేతిలోనే ఉన్నాయి” అన్నారు దైవప్రవక్త (స) “నిస్సందేహంగా నీవు దైవప్రవక్తవే. నేను సర్వసృష్టికర్త అయిన ఏకేశ్వరుడ్ని విశ్వసిస్తున్నాను” అన్నారు అబూబకర్ (రజి).

## (4) ప్రచార పర్వం ప్రారంభం

ఈ మాట విని దైవప్రవక్త (స) పరమానందభరితులయ్యారు. ఆరోజు నుండి ఆయన తన దగ్గరికొచ్చేవారికి కొత్త ధర్మం గురించి హితోపదేశం చేయడం ప్రారంభించారు. ఈవిధంగా దైవప్రవక్త (స) తన దగ్గరకు వచ్చే ప్రతి వ్యక్తి ముందూ తాను దైవప్రవక్తనని ప్రకటించి, హితోపదేశం చేస్తూ రహస్యంగా ధర్మప్రచారం చేయసాగారు. అదేవిధంగా హజ్రత్ అబూబకర్ (రజి) కూడా ప్రచారం ప్రారంభించారు.

ఓ రోజు ఉదయాన్నే ఖాలిద్ బిన్ సయీద్ అనే యువకుడు ఆందోళనపడుతూ అబూబకర్ (రజి) దగ్గరకు వచ్చి “రాత్రి నేనొక కలగన్నాను. ఇందులో తప్పకుండా ఏదో గూఢార్థం ఉంటుందని భావిస్తున్నాను. ఆ గూఢార్థం మీరు చెబుతారని వచ్చాను” అని అన్నాడు. “ఇంతకూ నువ్వు ఏం కలగన్నావో చెప్పు” అన్నారు అబూబకర్ (రజి).

“నేనొక అగ్నిగుండం అంచున నిలబడ్డాను. కాస్సేపటికి మానాన్న వచ్చి నన్ను ఆ అగ్నిగుండంలోకి నెట్టడానికి ప్రయత్నించాడు. నేను ఆయన పట్టునుండి విడిపించుకోడానికి ప్రయత్నిస్తుంటే ఆయన నన్ను మళ్ళీ అగ్నిలోకి తోసెయ్యడానికి ప్రయత్నించాడు. ఇలా మేమిద్దరం పెనుగులాడుతుంటే హఠాత్తుగా ఎవరో వచ్చి రెండు చేతులతో నా నడుం గట్టిగా పట్టుకొని నన్ను అగ్నిగుండంలో పడనీయకుండా మా నాన్న చెరనుండి లాగి విడిపించాడు. తర్వాత నేను వెనక్కి తిరిగిచూస్తే ముహమ్మద్ బిన్ అబ్దుల్లా కన్పించారు. అంతలో నాకు మెలుకువ వచ్చింది” అన్నాడు యువకుడు.

“ఖాలిద్! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి. కలలో నిన్ను రక్షించిన మనిషి ఇప్పుడు దైవప్రవక్త అయ్యారు. నువ్వు ఆయనకు విధేయుడై ఇస్లాం స్వీకరించు. తద్వారానే నువ్వు నరకాగ్ని నుండి రక్షించబడతావు” అన్నారు అబూబకర్ (రజి). అప్పుడు ఖాలిద్ దైవప్రవక్త (స) దగ్గరికెళ్లి ఆయనకు తన కల గురించి తెలియజేసి ఇస్లాం స్వీకరించాడు.

ఆ రోజుల్లోనే ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ అనే ఓ ధనికుడు వ్యాపార నిమిత్తం సిరియా పోయి మక్కా తిరిగొస్తున్నాడు. దారిలో ఓచోట రాత్రివేళ విడిదిచేసి నిద్రపోతుంటే “పడుకున్న వాడా! మేలుకో మక్కాలో అహ్మద్ బయల్పడ్డాడు” అని ధ్వని విన్పించింది. దాంతో ఉస్మాన్ చివాలున లేచి కూర్చున్నాడు. చూస్తే ఎవరూ కన్పించ లేదు. కాని ఆ పలుకులు మాత్రం అతని చెవుల్లో మాటిమాటికి ప్రతిధ్వనించసాగాయి.

ఉస్మాన్ వ్యాపారసామగ్రితో అక్కడ్నుంచి మళ్ళీ ప్రయాణం సాగించాడు. మక్కా పట్నం ఇంకా కొన్నిమైళ్ళ దూరంఉండగా ఆయన్ని తల్హా బిన్ ఉబైదుల్లా అనే ఓ మిత్రుడు కలిశాడు. అతను తన బస్రా పర్యటన విశేషాలు తెలియజేస్తూ ఇలా చెప్పాడు:

“నేను బస్రా గుండా వస్తుంటే ఒక సాధువు ఎదురై ‘మక్కా ప్రజలలో అహ్మద్ అవతరించాడా’ అని ప్రశ్నించాడు. నేను అహ్మద్ ఎవరన్నాను. దానికా సాధువు ‘అబ్దుల్లా బిన్ అబ్దుల్‌ముత్తలిబ్ కొడుకు. ఆయన అంతిమదైవప్రవక్త’ అని సమాధానమిచ్చాడు.”

అప్పుడు ఉస్మాన్ ఎడారిలో అర్ధరాత్రి తనకు ఎదురైన అనుభవం గురించి చెప్పాడు. ఆ తరువాత వారిద్దరు మక్కా చేరుకొని అబూబకర్ (రజి) ముందు తమ అనుభవాల్ని గురించి చెప్పుకున్నారు. అబూబకర్ (రజి) వారిద్దర్నీ దైవప్రవక్త (స) సన్నిధికి పిలిచికెళ్ళారు. అక్కడ తల్హా, ఉస్మాన్‌లు దైవప్రవక్త (స) హితోక్తులు విని ఇస్లాం స్వీకరించారు. ఈవిధంగా ఉస్మాన్ బిన్‌అఫ్ఫాన్, తల్హా బిన్‌ఉబైదుల్లా, జుబైర్ బిన్‌అవ్వామ్, అబ్దుర్రహ్మాన్ బిన్‌ఔఫ్, సాద్ బిన్ అబీవఖ్ఖాస్ తదితరులు ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత వీరంతా దైవప్రవక్త (స) సూచన ప్రకారం ఇస్లాం ప్రచారం రహస్యంగా చేయడం ప్రారంభించారు. మరికొన్నాళ్లకు అబూఉబైదా బిన్‌జిరాహ్, అర్ఖం, అబూసల్మా అబ్దుల్ అసద్ బిన్ హిలాల్, ఉస్మాన్ బిన్ మజ్‌వూన్, ఖదామా బిన్‌మజ్‌వూన్, సయీద్ బిన్‌జైద్, ఫాతిమా బిన్త్ ఖత్తాబ్, అబ్దుల్లా బిన్‌మస్‌వూద్, జాఫర్ బిన్‌అబూతాలిబ్ మొదలైనవారు ఇస్లాం స్వీకరించారు.

అయితే ఇస్లాం ప్రచారం గురించి క్రమంగా బయటి ప్రజలక్కూడా తెలిసిపోయింది. దాంతో జనంలో కలకలం బయలుదేరింది. కొందరు దైవప్రవక్త (స)ను వింతగా చూడటం మొదలెట్టారు. మరికొందరు ముక్కుపుటాలు ఎగరేశారు. ఇంకొందరు హేళనచేశారు. ఇలా ఇస్లాం పరిధి క్రమంగా విస్తరిస్తూ పోతోంది. దాంతోపాటే ప్రజల్లో వ్యతిరేక పవనాలు ఉధృతం కాసాగాయి. ముస్లింలు తమ ఇండ్లలో కూడా రహస్యంగా నమాజు చేయడం కష్టమైపోయింది. వారు దైవప్రవక్త (స) ఇంటిని కేంద్రంగా చేసుకొని నమాజు చేద్దామంటే అక్కడ ఇరుగుపొరుగువాళ్ళ పోరు ఎక్కువైపోయింది. అందువల్ల వారు కొండల్లో, కోనల్లో రహస్యంగా నమాజు చేయడం ప్రారంభించారు.

ఇలా ముస్లింలు కొండ ప్రదేశంలో నమాజు చేస్తుంటే, ఓసారి అబూతాలిబ్ అటుగా వచ్చి “మీరు అవలంబించిన ఈ ధర్మం ఏమిటీ?” అని అడిగారు. “ఇది మన పితామహుడు ఇబ్రాహీం (అలైహి) అనుసరించిన ధర్మమే. దీన్ని ఇస్లాం అంటారు. ఇందులోని అంశమే ఈ నమాజు” అన్నారు మహనీయ ముహమ్మద్ (స).

“ఈ ప్రార్థన పద్ధతి ఎవరు నేర్పారు నీకు?” అని అడిగారు అబూతాలిబ్. “దైవదూత జిబ్రీల్ నేర్పాడు. పెదనాన్నా! క్రైస్తవ సాధువు బహీరా నాగురించి చెప్పిన భవిష్యత్ వాణి మీకు గుర్తుందనుకుంటాను” అన్నారు దైవప్రవక్త (స).

“ఆ.... గుర్తుంది.” అన్నారు అబూతాలిబ్ ముప్ఫయి ఏళ్ళ క్రితంనాటి సంఘటన జ్ఞాపకం చేసుకుంటూ. “దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించాడు. నేనిప్పుడు దైవప్రవక్తను. నాపై దైవసందేశం అవతరిస్తోంది” చెప్పారు దైవప్రవక్త (స).

“నీపై అవతరించిన దైవసందేశం ఏమిటీ?” అడిగారు అబూతాలిబ్. అప్పుడు దైవప్రవక్త (స) ఖుర్ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించారు. ఈ సూక్తులు అబూతాలిబ్‌ని ప్రభావితం చేశాయి. కాని హృదయకవాటాలు తెరచుకోలేదు.



కొన్నాళ్ళకు అర్ఖం (రజి) ముస్లింల సామూహిక నమాజు కోసం తన ఇంటిని కేటాయించారు. ఆ ఇల్లు సఫా కొండకు దిగువభాగంలో ఉంది. జనం రాకపోకలు అటువైపు అంతగా ఉండవు. అన్నివిధాలా సురక్షితమైన చోటది. ఆరోజు నుండి ముస్లింలు అర్ఖం(రజి) ఇంట్లో నిశ్చింతగా సామూహిక నమాజు చేయనారంభించారు.

ఇలా మూడేండ్ల పాటు రహస్యప్రచారం జరిగింది. ఆ తరువాత దైవప్రవక్త (స) దైవాజ్ఞ ప్రకారం ఓ రోజు బంధువుల్ని విందుకు పిలిచి, భోజనాలయ్యాక వారి ముందు దైవసందేశం ఉంచడానికి ప్రయత్నించారు. కాని వరుసకు చిన్నాయన అయిన అబూలహబ్ దైవప్రవక్త (స)ను తీవ్రంగా హెచ్చరిస్తూ ఆయన్ని మాట్లాడనీయకుండా చేశాడు.

కొన్నాళ్ళ తరువాత దైవప్రవక్త (స) మళ్ళీ విందు ఏర్పాటుచేసి బంధువుల్ని పిలిచారు. బంధువులంతా వచ్చి భోజనాలకు కూర్చున్నారు. భోజనాలు ముగిసిన వెంటనే దైవప్రవక్త (స) లేచి “అబ్బాస్ బాబాయీ! ప్రవక్త మేనత్త సఫియా! ముహమ్మద్ కూతురు ఫాతిమా! పెదనాన్న అబూతాలిబ్! మీరంతా నరకాగ్నినుండి తప్పించుకోండి. నేను మిమ్మల్ని దేవుని పట్టు నుండి ఏవిధంగానూ కాపాడలేను. కావాలంటే నా ఆస్తి నుండి మీరు కోరినవాటిని అడిగి తీసుకోవచ్చు. నేను మీకు అంతవరకే సహాయంచేయగలను. పరలోకంలో మాత్రం నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను” అంటూ ప్రసంగించారు.

అబూతాలిబ్ ఈ మాటలు విని “నేను తరతరాల నుంచి వస్తున్న మన పెద్దల మతాన్ని వదలి పెట్టలేను. అయితే నీవు దేవుడు ఆదేశించినదాన్ని నిరభ్యంతరంగా కొనసాగించు. నీకు నా మద్దతు పూర్తిగా ఉంటుంది” అన్నారు.

“నా ప్రియబంధువులారా! నాగురించి నాబాల్యం నుండీ మీకందరికీ తెలుసు. నేను ఎలాంటి పరిస్థితిలోనూ అబద్ధమాడనని మీకు తెలుసు. నేను దేవుని ప్రవక్తను. దేవుడు నన్ను తన ప్రవక్తగా నియమించి మీ దగ్గరకు పంపాడు. నేను మీ సహకారం కోరుతున్నాను. మరిఈ మహాకార్యంలో నాకు తోడ్పడేవాళ్ళు మీలో ఎవరైనా ఉన్నారా?” అంటూ దైవప్రవక్త (స) ఓసారి అందరినీ కలియజూశారు. కాని ఒక్కరూ పెదవి విప్పలేదు. అందరూ బెల్లం కొట్టిన రాళ్ళలా కళ్ళప్పగించి చూడసాగారు. కొందరు ఇవేవో పిచ్చివాడి పలుకులనుకొని ఆశ్చర్యంగా చూడసాగారు. మరికొందరు ముఖంతిప్పుకొని వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యారు.

అంతలో పన్నెండేళ్ళ అలి (రజి) లేచి “దైవప్రవక్తా! నేను మీకు తోడ్పడతాను. ఈ పనిలో మీకు సహాయం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను” అని అన్నారు. ఈమాటలు వినగానే సభికులంతా అలి (రజి) వైపు ఆశ్చర్యంతో చూడసాగారు. కొంతమంది “నిన్నగాక మొన్న కళ్ళుతెరచిన ఈ కుర్రకుంక ముహమ్మద్‌కు తోడ్పడతాడట!” అంటూ వెళ్ళిపోయారు.

దైవప్రవక్త (స) బంధువుల మూర్ఖత్వం, వ్యతిరేకతలను చూసి నిరాశచెందలేదు. బాలుడైనా అలి మాటలు ఆయనకు కొండంత ధైర్యం కలిగించాయి.

ఇలా దైవసందేశాన్ని బంధువులకు అందజేసే బాధ్యత ఎలాగో నెరవేరింది. ఇక దాన్ని బయటి జనానికి కూడా అందజేయవలసిఉంది. దాని కోసం దైవప్రవక్త (స) ఓ రోజు సఫాకొండపై ఎక్కి “ఖురైషీయులారా!” అంటూ ఓ పొలికేక పెట్టారు.

ఈ కేక విని జనం ఏదో ఆపద వచ్చిందని భయపడ్డారు. యుద్ధం తదితర ఆపదలకు సూచనగా కొండెక్కి కేకలు పెట్టడం ఆనాటి ఆచారం. అంచేత ఈ కేకలు విని అనేక మంది కొన్ని క్షణాల్లోనే సఫాకొండ దగ్గరకు చేరుకున్నారు.

"ఏవిటీ ముహమ్మద్! ఏమిటీ విశేషం?" అడిగాడు ఒకతను గుంపులోనుంచి. "ముందు నాకీ సంగతి చెప్పండి. ఈకొండ వెనుక నుంచి శత్రుసైన్యం మక్కాపై దాడిచేయడానికి వస్తోందని నేనంటే మీరు నమ్ముతారా?" అన్నారు ముహమ్మద్ (స). దానికి ప్రజలు "ఎందుకు నమ్మం, తప్పక నమ్ముతాం. నువ్వెప్పుడూ అబద్ధమాడలేదు. పైగా నీవు కొండపై నిలబడి దాని వెనుక వైపున్న దృశ్యం కూడా చూడగలుగుతున్నావు. మేము కొండ ముందు దిగువభాగాన నిల్చున్నాం. చెప్పు ఏమిటో ఆ విషయం" అని అన్నారు.

"అయితే ఆత్మీయులారా! నేను అతి భయంకరమైన ఒక శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. అది ముంచుకొస్తోంది. నేనిప్పుడు ఈ కొండకు ఆవల ఉన్నదంతా ఎలా చూస్తున్నానో అలాగే ఈ ప్రమాదాన్ని కూడా చూస్తున్నాను. సోదరులారా! దేవుని ఆగ్రహం నుండి తప్పించుకోండి. భయంకరమైన నరకాగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి. ప్రళయం రోజు దేవుడు ఆగ్రహించి మిమ్మల్ని నరకాగ్నిలో పడవేయదలిస్తే నేను మిమ్మల్ని ఏమాత్రం రక్షించలేను. నరకాగ్ని నుండి తప్పించుకోవాలంటే ఒకే ఒక మార్గం ఉంది. మీరంతా దేవుడు ఒక్కడే అని విశ్వసించండి. నన్ను ఆయన ప్రవక్తగా అంగీకరించండి" అంటూ దైవప్రవక్త (స) జనానికి హితోపదేశం చేశారు.

కాని ఈ మాటలు వినగానే అబులహబ్ కోపంతో కస్సుమన్నాడు. "నీ పాడుగాను, ఇందుకా నువ్వు మమ్మల్ని పిలిచింది!" అంటూ నానా మాటలతో అక్కసు వెళ్ళ బోసుకొని వెళ్ళిపోయాడు. ఆ తర్వాత జనం కూడా తలా ఒకవిధంగా వ్యాఖ్యానించుకుంటూ ఒక్కక్కరే జారుకున్నారు. చివరికి దైవప్రవక్త (స) ఒక్కరే ఏకాకి అయి కొండమీద నిల్చుండిపోయారు. దైవమార్గంలో ఇలాంటి అవరోధాలు సహజమే. అంచేత ఆయన అధైర్యం చెందలేదు. ఆశయసాధనలో ఒక్కొక్క అడుగేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

కాబాలయం కేవలం ఏకేశ్వరారాధన కోసం ఇబ్రాహీం ప్రవక్త, ఆయన కుమారుడు ఇస్మాయీల్ (అలైహి) కలసి నిర్మించిన దేవాలయం. కాని ప్రజలు ఈ వాస్తవాన్ని విస్మరించి అక్కడ విగ్రహాలు ప్రతిష్ఠించి పూజించసాగారు. ఇప్పుడు అంతిమ దైవప్రవక్తగా ముహమ్మద్ (స) దాన్ని ఏకేశ్వరాలయంగా పునరుద్ధరించడానికి నడుంబిగించారు. దాని కోసం ఆయన కాబాలయానికి వెళ్ళి నమాజ్ చేయడం ప్రారంభించారు. నమాజు ముగిసిన తరువాత అవకాశం లభిస్తే ప్రజలకు దైవసందేశం విన్పించడానికి కూడా ప్రయత్నించేవారు.

అయితే బహుదైవారాధకులు దాన్ని సహించేవారు కాదు. కొందరు దూషణలకు కూడా పాల్పడేవారు. చివరికి ఓరోజు వారు ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించి "అవకాశం లభించినప్పుడల్లా ముహమ్మద్(స)ని, ఆయన అనుచరుల్ని వేధించాల"ని తీర్మానించారు. మరుసటి రోజు నుంచే ఆ తీర్మానాన్ని అమలుపరచడం ప్రారంభించారు.

ఒకరోజు దైవప్రవక్త (స) కాబాలో ప్రార్థన (నమాజ్) చేస్తుంటే చూసి ఖురైషీయులు ముఖం చిట్లించుకున్నారు. అబుజహల్ అయితే భగ్గుమన్నాడు. అతను దిగ్గున లేచి



"ముహమ్మద్ ఇలా ప్రార్థన చేయడం చూస్తే నేనతని మెడ మీద కాలుపెట్టి తొక్కుతానని ప్రమాణం చేశాను. చూడండి నా తడాఖా!" అన్నాడు. అనడం ఏమిటీ, ఒక్క ఉదుటన ముందుకు పోయాడు. మరో రెండుఅంగలు వేసి తక్కున ఆగిపోయాడు. మరుక్షణం ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొని వెనక్కి జరుగుతూ రొప్పుతూ సహచరుల దగ్గరికి వచ్చాడు. సహచరులు అతని వాలకం చూసి నిర్ఘాంతపోయారు.

"అబూజహల్! ఏమయింది తిరిగొచ్చావు? పెద్ద కోతలు కోశావే ఏదో చేస్తానని" అన్నారు వారు అతడ్ని హేళనచేస్తూ. "చేసేవాడ్ని. కాని ముహమ్మద్‌కు, నాకు మధ్య అకస్మాత్తుగా పెద్ద అగ్నిగుండం ఏర్పడింది. రెక్కలతో కూడిన ఓ భయంకరమైన ఆకారం కూడా కన్పించింది" అన్నాడు అబూజహల్ చెమట తుడుచుకుంటూ.

ఈ సంఘటన గురించి దైవప్రవక్త (స) ఆతర్వాత తన అనుచరుల ముందు ప్రస్తావిస్తూ "అబూజహల్ గనక ఇంకాస్త ముందుకు వచ్చి ఉంటే దైవదూతలు అతడ్ని ముక్కలు ముక్కలుగా చీల్చి చెండాడేవారు" అని చెప్పారు.

## (5) భయప్రలోభాలు

ఓరోజు దైవప్రవక్త (స) కాబాప్రదక్షిణ చేసిన తర్వాత విగ్రహపూజ, బహుదైవారాధనల్లోని చెడుల్ని ఎత్తిచూపుతూ ఏకేశ్వరోపాసన గురించి వివరించడం ప్రారంభించారు. అప్పుడు ఉఖ్బా అనేవాడు తోకతొక్కిన పాములా లేచి దైవప్రవక్త (స)ను సమీపించాడు. ఆయన మెడలో తుండుగుడ్డ వేసి లాగుతూ గొంతు నులమడానికి ప్రయత్నించాడు.

అదే సమయంలో అబూబకర్ (రజి) యాదృచ్ఛికంగా అక్కడికొచ్చి మెరుపువేగంతో ఉఖ్బాపై లంఘించారు. అతడ్ని ఒక్క తోపుతో పక్కకు నెట్టివేశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) మెడలోని తుండుగుడ్డ తీసేస్తూ "ఏమిటి ఈ అన్యాయం? మీరు నా ప్రభువు అల్లాహ్ అన్నంత మాత్రానికే ఒక మనిషిని చంపడానికి ఒడిగట్టారా!" అన్నారు బాధాతప్త హృదయంతో. అప్పుడు ఖురైషీయులు పళ్ళు నూరుతూ ఒక్కసారిగా అబూబకర్ (రజి)పై విరుచుకుపడ్డారు. అబూబకర్ (రజి) కాస్సేపు పెనుగులాడారు. అంతలో జనసమూహం లోని కొందరు పుణ్యాత్ములు కలగజేసుకొని ఎలాగో ఆయన్ని విడిపించారు.

ఓరోజు ఖురైష్ నాయకులు అబుజహల్ ఇంట్లో సమావేశమై మాట్లాడుకుంటున్నారు. కాస్సేపటికి చినిగిన దుస్తులతో, తైలసంస్కారంలేని జుట్టుతో, బక్కచిక్కిన శరీరంతో ఉన్న ఒక పిల్లవాడు వచ్చాడు. అతను పరమ కర్కోటకుడైన అబూజహల్ సంరక్షణలో పెరుగుతున్న అనాథ బాలుడు. అతను అబూజహల్ దగ్గరకొచ్చి తన తండ్రి వదలిపోయిన ఆస్తిలో కొంత తనకివ్వమని ప్రాధేయపడ్డాడు. కాని ఆ దుర్మార్గుడు పిల్లవాడి వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అప్పుడు కొందరు "నీవు ముహమ్మద్ (స) దగ్గరికెళ్ళి ఫిర్యాదు చెయ్యి; అతను సిఫారసుచేసి అబూజహల్ నుంచి నీధనం ఇప్పిస్తాడు" అని చెప్పారు.

ఈ మాటలు విని ఆ అబ్బాయి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. అతనలా బయటికి వెళ్ళగానే సమావేశంలో కూర్చున్న ఖురైష్ నాయకులు పకపక నవ్వుకుంటూ, ఇక చూడండి తమాషా! అని చెప్పుకున్నారు పరస్పరం. ఆ పిల్లవాడు దైవప్రవక్త (స) దగ్గరికెళ్ళి తన

గోడు చెప్పుకొని, సహాయం చేయమని బ్రతిమాలాడు. దైవప్రవక్త (స) అప్పటికప్పుడు లేచి ఆ బాలుడ్ని వెంటబెట్టుకొని అబూజహల్ ఇంటికి వెళ్ళారు.

వెళ్ళి తలుపు తట్టగానే అబుజహల్ లేచి తలుపు తీశాడు. కాని గుమ్మం ముందు దైవప్రవక్త (స)ను చూడగానే క్షణంపాటు నివ్వెరపోయాడు. "అబుల్ హకమ్! ఈ అబ్బాయికి రావలసిన హక్కు ఇచ్చెయ్యి" అన్నారు దైవప్రవక్త (స). అబూజహల్ కిక్కురుమనకుండా వెంటనే మంత్రముగ్ధుడిలా లోపలికెళ్ళి ఆ బాలుడి పైకం తెచ్చి అతనికిచ్చి వేశాడు.

ఏదో పెద్ద రభస జరుగుతుందనుకున్న ఖురైష్ నాయకులు ఈ విచిత్ర వ్యవహారం చూసి ఆశ్చర్యపోయారు. "చివరికి నువ్వు కూడా నీ ధర్మాన్ని వదిలిపెట్టావన్న మాట!" అని అన్నారు వారు అబూజహల్‌ని ఎత్తిపొడుస్తూ.

"దైవసాక్షి! నేను నా ధర్మం వదలిపెట్ట లేదు. కాని ముహమ్మద్ (స)ని చూడగానే ఆయన కుడిఎడమల వైపు ఏవో రెండు భయంకరమైన ఆయుధాలు ఉన్నట్లు, నేనతని అభిమతానికి వ్యతిరేకంగా ఏమాత్రం ప్రవర్తించినా అవి నా దేహంలో దిగబడిపోతాయన్నట్లు అన్పించింది నాకప్పుడు" అన్నాడు అబూజహల్ చెమట తుడుచుకుంటూ.

వేరొకసారి దైవప్రవక్త (స) బహుదైవారాధకుల్ని చూసి ఇలా ఉపదేశించారు: "ఖురైష్ ప్రజలారా! మీరు మన తాత ఇబ్రాహీం (అలైహి) ధర్మాన్ని వదిలేసి ఎందుకూ పనికిరాని, ఎలాంటి సహాయం చేయలేని విగ్రహాలను పూజిస్తున్నారా? ఎంత శోచనీయం! యావత్తు సృష్టిలోనే మహోత్కృష్టుడైన మానవుడికి సృష్టిపూజ ఎంత అవమానకరమో ఆలోచించండి." దానికి వారు "మేము విగ్రహాలను లాంఛనప్రాయంగా మాత్రమే పూజిస్తున్నాం. నిజానికి మా ఆరాధన, అభిమానాల కేంద్రం అల్లాహ్ మాత్రమే. ఈ విగ్రహాలు ఆయన ప్రసన్నత, సాన్నిధ్యాలు పొందడానికి ఏర్పాటు చేసుకున్న సాధనాలు మాత్రమే" అని అన్నారు

"మీకు నిజంగా సర్వేశ్వరుడైన అల్లాహ్ మీద భక్తి ప్రేమలుంటే నామాట విని నన్ను అనుసరించండి, నేను మీకు సన్మార్గం చూపుతాను. అల్లాహ్ కూడా మిమ్మల్ని ప్రేమిస్తాడు" అంటూ దైవప్రవక్త (స) మరోసారి వాళ్ళను ఇస్లాం వైపు పిలిచారు. కాని ఆయన పలుకులు విని బహుదైవారాధకులు ఈసడించుకున్నారు.

సత్యసందేశాన్ని ప్రజలకు అందజేయాలన్న దైవాజ్ఞ ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఓరోజు కాబాలో నిలబడి 'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడ'ని బహిరంగంగా ప్రకటించారు. దాంతో బహుదైవారాధకులు ఆగ్రహోదగ్రులై 'అపచారం! అపచారం' అంటూ పెద్ద రభసచేస్తూ ఆయన్ని చుట్టుముట్టారు.

అంతలో హారిస్ (రజి) ఈగొడవ విని దైవప్రవక్త (స)ను రక్షించడానికి వచ్చారు. దాంతో బహుదైవారాధకులు మరింత రెచ్చిపోయి దైవప్రవక్తను వదలి ఖడ్గాలతో హారిస్ (రజి) మీద విరుచుకుపడ్డారు. కాస్సేపటికే హారిస్ (రజి) రక్తపుమడుగులో పడి కన్ను మూశారు. ధర్మరక్షణ కోసం జరిగిన కృషిలో ఇది మొట్టమొదటి ప్రాణత్యాగం.

ఖురైష్ నాయకులు ఓరోజు కాబాలయంలో సమావేశమై ఉత్బా బిన్ రబియాను రాయబారిగా దైవప్రవక్త (స) దగ్గరకు పంపారు. ఉత్బా కొంచెం దూరంలో కూర్చున్న



దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు: "నాయనా ముహమ్మద్! నీవు ఎంత గొప్పవంశానికి చెందినవాడవో నీకు తెలుసు. నీపట్ల మాకున్న గౌరవాభిమానాలు కూడా నీకు తెలుసు. కాని నువ్వేమో మన జాతిపైకి పెద్ద ఆపద తెచ్చిపెట్టావు. సంఘాన్ని చీల్చి గందరగోళం సృష్టించావు. వాళ్ళ మతాన్ని, దేవతలను తూలనాడుతున్నావు. అంచేత నామాట విను. నేను నీ ముందు కొన్ని విషయాలు ఉంచుతాను. వాటిలో ఏదైనా నీకు నచ్చవచ్చు. దాంతో నీవు చేసే ఈ పని మానేస్తే అందరూ సంతోషిస్తారు."

"చెప్పండి మీరు చెప్పదలచుకున్నదేమిటో, వింటాను" అన్నారు దైవప్రవక్త (స).

"మన జాతిని విచ్ఛిన్నం చేయడం వల్ల నీకు ఒరిగేదేమీ లేదు. నీకు ధనం కావాలంటే చెప్పు. ఇప్పుడే నీ ముందు ధనరాసులు తెచ్చి నీవు మా అందరికంటే గొప్ప ధనికుడయ్యేలా చేస్తాం. లేక నీవు మాఅందరికీ నాయకుడు కాదలిస్తే, మేమంతా నిన్ను మా నాయకునిగా ఎన్నుకుంటాం. అప్పుడు నీ ప్రమేయం లేకుండా మేము ఏ నిర్ణయమూ తీసుకోము. ఒకవేళ నీకేదైనా పిశాచం పట్టి పీడిస్తుందేమో చెప్పు. పేరు మోసిన భూతవైద్యుల్ని రప్పించి దాని పీడ వదిలిస్తాం. నీకు పూర్తిగా ఆరోగ్యం చేకూరేవరకు మేము ఎంత పైకం అయినా ఖర్చుపెడ్తాం" ఉత్బా ఏకధాటిగా చెప్పి ఊరుకున్నాడు.

"అబూవలీద్! అయిందా మీరు చెప్పటం? ఇంకేమైనా ఉందా?" అన్నారు దైవప్రవక్త. "లేదు, నేను చెప్పడం అయిపోయింది" అన్నాడు ఉత్బా. "ఇక నేను చెప్పేది కూడా కాస్త వినండి" అంటూ దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్‌లోని హామీమ్ సూరా పఠించారు.

ఉత్బా చేతులు వెనుకవైపు నేలమీద ఆనిచ్చి ఎంతో శ్రద్ధగా వినసాగాడు. ఆ సూరా పఠిస్తున్నప్పుడు కొన్ని చోట్ల విని హడలిపోయాడు. దైవప్రవక్త (సల్లం) 38వ సూక్తి వరకు పఠించి సజ్దా చేశారు. ఆ తరువాత- "అబూవలీద్! నా సమాధానం విన్నారుగా! ఇక మీ ఇష్టం. మీరేం చేయాలో నిర్ణయించుకోండి" అన్నారు.

ఉత్బా మారు మాట్లాడకుండా లేచి ఖురైషీయుల దగ్గరకెళ్ళాడు. కొంచెం దూరంలో ఉండగానే మిత్రులు అతని వాలకం చూసి పసికట్టారు. "అబూవలీద్! ఏం జరిగింది? త్వరగా చెప్పు" అన్నారు ఆత్రంగా అందరూ.

"దైవసాక్షిగా చెబుతున్నాను. నేను గొప్పగొప్ప కవుల కవితలు విన్నాను. మహా మాంత్రికులు చెప్పే మాటలు కూడా విన్నాను. కాని ముహమ్మద్ నోట వెలువడే వాణి వీటన్నిటికీ భిన్నంగా ఉంది. అలాంటి వాణి నేనింతవరకు వినలేదు. కాబట్టి సోదరులారా! నామాట వినండి. అతను చేస్తున్న పనిని చేసుకోనివ్వండి. అతని జోలికి పోకండి. ప్రజల మధ్య అతడ్ని వదిలేయండి. ప్రజలు అతనిపై విజయం సాధిస్తే మీ ఉద్దేశ్యం నెరవేరు తుంది. తోటిసోదరుని రక్తంతో చేతులు మలినం చేసుకునే పని మీకు తప్పుతుంది. ఒకవేళ అతనే వారిపై విజయం సాధిస్తే, అతని బలమే మీబలం; అతని గౌరవమే మీ గౌరవం. అంతకంటే మీకు కావాల్సిందేమిటీ?" అన్నాడు ఉత్బా అబూవలీద్.

"అబూవలీద్! చివరికి నువ్వు కూడా ముహమ్మద్ పన్నిన వలలో పడిపోయావా?" అన్నారు ఖురైషీయులు నిరాశానిస్పృహలతో. "నాకు తెలిసింది, అర్థమయింది చెప్పాను.

ఆపై మీ ఇష్టం ఏమయినా చేసుకోండి" అన్నాడు ఉత్బా నిర్మొహమాటంగా. ఖురైషీయులు ఈ మాటలు విని మండిపడుతూ లేచి వెళ్ళిపోయారు. ఉత్బా మీద వారు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయి కథ మళ్ళీ మొదటికి వచ్చింది.

ఇలా బహుదైవారాధకులు మహాప్రవక్త ముహమ్మద్ (స)ని రకరకాల ఎత్తుగడలతో భయప్రలోభాలకు గురిచేశారు. అబూతాలిబ్ దగ్గరకు పోయి ఈ కొత్త ఉద్యమాన్ని ఆపకపోతే తీవ్రమైన దుష్పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. అంచేత అబూ తాలిబ్ వారి వత్తిడికి గురై "ముహమ్మద్! నీ పెదనాన్నను చూసి అయినా జాలి పడవయ్యా! నేను మోయలేని భారం నాపై మోపకు బాబూ!" అన్నారు ఆవేదనా భరిత కంఠంతో.

దానికి దైవప్రవక్త (స) "పెదనాన్నా! దైవసాక్షి! వీరు నా కుడిచేతిలో సూర్యుణ్ణి, ఎడమచేతిలో చంద్రుణ్ణి తెచ్చిపెట్టి ఈ మహాకార్యం మానుకోమన్నా అది జరిగే పని కాదు. వినండి, ఈ మహాకార్యం పూర్తయినా పూర్తికావాలి. లేదా ఈ మార్గంలో నా ప్రాణమైనా పోవాలి" అని అన్నారు దృఢ సంకల్పంతో.

ముహమ్మద్ (స)లోని వజ్రసంకల్పం, అకుంఠిత కార్యదీక్ష గమనించిన అబూతాలిబ్ "సరే, అబ్బాయి! నీవు ప్రచారం చేయదలచుకుంది నిర్భయంగా ప్రచారం చేసుకో. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు నేను నీతోనే ఉంటాను" అని చెప్పారు. పెదనాన్న మాటలతో దైవప్రవక్త (స) హృదయం సంతోషంతో ఉప్పొంగింది.

అవిశ్వాసులు ఈసారి మరో ఎత్తుగడ వేశారు. దైవప్రవక్త (స) కుమార్తెల్ని వారి భర్తల నుండి శాశ్వతంగా వేరుచేసి కసి తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. వారు అబూలహబ్ దగ్గరకు పోయి అతని కోడళ్ళకు విడాకులిప్పించి పంపేయమని చెప్పారు.

అబూలహబ్ దైవప్రవక్త (స)కు స్వయాన పెదనాన్న అయినప్పటికీ ఇస్లాం ధర్మాన్ని తిరస్కరించి ఆయనపై కక్ష పెంచుకున్నాడు. అందువల్ల అవిశ్వాసుల ప్రతిపాదన వినగానే అతను తన కొడుకులు ఉత్బా, ఉతైబాలకు చెప్పి రుఖియా, ఉమ్మెకుల్సూమ్‌లకు విడాకులు ఇప్పించాడు. అంతటితో ఊరుకోకుండా వీలు చిక్కినప్పుడల్లా దైవప్రవక్త (స)ను వేధించడం మొదలెట్టాడు. అతని భార్య ఉమ్మెజమీల్ కూడా భర్తకు ఏమాత్రం తీసిపోలేదు. ఆమె దైవప్రవక్త (స) ఇంటి ముంగిట కసువు, ఇతర మాలిన్యాలు పోసేది. అప్పుడప్పుడు దైవప్రవక్త (స) నడిచే బాటలో ముండ్లకంప కూడా పడవేసేది.

దైవప్రవక్త (స) నివశిస్తున్న ఇంటికి పొరుగునే అబూలహబ్ ఇల్లు కూడా ఉంది. ఆ రెండిళ్ళను వేరుచేస్తూ మధ్యలో ఒక పిట్టగోడ మాత్రమే ఉంది. అందువల్ల అబూలహబ్, అతని భార్య ఉమ్మెజమీల్ వీలు చిక్కినప్పుడల్లా ఆయన్ని వేధించడానికి ప్రయత్నించేవారు. ఒకరోజు అబూలహబ్ ఇంటికి వస్తూ దారిపక్క పడివున్న మేక పేగులు తీసుకొచ్చి ఉమ్మె జమీల్ కిచ్చాడు. ఆమె అవకాశం చూసి ఆ ప్రేగుల్ని పిట్టగోడపై ఉంచి నక్కిచూడసాగింది. అప్పుడు దైవప్రవక్త (స) తమ ఇంటి ముంగిట నమాజ్ చేస్తున్నారు. ఆయన సజ్దాలోకి పోగానే ఉమ్మెజమీల్ ఆ మేకప్రేగుల్ని ఆయన మీదికి విసిరిపడేసింది. దాంతో ఆ ప్రేగు ల్లోని మలినమంతా దైవప్రవక్త (స) శిరస్సు, బట్టలపై పడి దుర్వాసన వెలువడింది.



దైవప్రవక్త (స) సజ్దా నుండి తలపైకెత్తి చూశారు. ఉమ్మెజమీల్, ఆమె భర్త అబూ లహబ్ విరగబడి నవ్వుతూ నిల్చున్నారు. అంతలో అర్ధాంగి ఖదీజా (రజి) లోపలి గది నుంచి బయటికి వచ్చారు. దైవప్రవక్త (స)పై పడిన ప్రేగులు, మలినం చూసి ఎంతో బాధపడ్డారు. వెంటనే వాటిని తుడిచి నీళ్ళతో కడిగారు. అవిశ్వాసులు ఎన్నెన్ని అకృత్యాలకు పాల్పడినా దైవప్రవక్త (స) చూస్తూ సహించడం తప్ప పల్లెత్తుమాట అనేవారుకాదు. కాకపోతే మితిమీరిన దౌర్జన్యాలతో విసుగెత్తి "ముత్తలిబ్ వంశీయులారా! మీ పొరుగువారి పట్ల ప్రవర్తించే తీరు ఇదేనా!" అని మాత్రం అనేవారు.

వరసకు పెదనాన్న అయిన అబూజహల్ కూడా దైవప్రవక్త (స)కు బద్ధవిరోధి అయ్యాడు. అతను దైవప్రవక్త (స)ను ఎప్పుడూ ఏదోవిధంగా వేధించడం, అల్లరి చేయడమే పనిగా పెట్టుకున్న పరమదుర్మార్గుడు. ఆయనపై దుష్ప్రచారం చేసేవాడు, నమాజ్ చేస్తుంటే గలాభాచేస్తాడు. దైవసందేశ ప్రచారం చేస్తుంటే రౌడీలను, అల్లరిమూకలను పిలిచి నానారభస చేయిస్తాడు. "ముహమ్మద్‌ని నామరూపాలు లేకుండా చేయండి, అప్పుడే మీకు శాంతి ఉంటుంది" అని జనంతో చెబుతుంటాడు.

## (6) అనుచరులపై అవిశ్వాసుల ఆగడాలు

అవిశ్వాసులు ఇస్లాం ప్రచారం నుండి దైవప్రవక్త (స)ను అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని అవేమీ ఫలించకపోవడంతో ఆయన అనుచరులపై దాడులు చేయడానికి పూనుకున్నారు. దాంతో ముస్లింలపై గొప్ప విపత్తు వచ్చిపడింది. ముఖ్యంగా పేదముస్లింలు దుర్భరదౌర్జన్యకాండకు గురయ్యారు. కొందరు వారిని కొరడాలతో కొట్టి హింసించారు. మరికొందరు వారి శరీరాలపై వాతలుపెట్టారు. ఇంకా కొంతమంది వారిని నీళ్ళలో ముంచి ఊపిరాడకుండా చేశారు. ఇక బానిసలుగా ఉన్న ముస్లింలపై జరుగుతున్న అఘాయిత్యాలైతే చెప్పనలవి కావు. గుక్కెడు మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా చీకటికొట్లలో బంధించి, తర్వాత మండుటెండలో కాలే ఇసుకతిన్నెల మీద ఈడ్చేవారు. అయితే సత్యధర్మాన్ని నమ్మి దాని ప్రకారం నడచుకునే దృఢమనస్కులు సహన స్థైర్యాలతో శత్రువుల దౌర్జన్యాలను తట్టుకుంటూ ఇస్లామీయ ఉద్యమంలో పురోగమించారు.

అటువంటి సాహసవంతులలో యాసిర్ (రజి), ఆయన అర్ధాంగి సుమయ్యా (రజి), తనయుడు అమ్మార్ (రజి) కూడా ఉన్నారు. నూతన ధర్మం విశ్వసించిన కారణంగా వారి బంధువులే వారికి పరమ శత్రువులుగా మారారు. వారు హజ్రత్ యాసిర్ (రజి)ను మిట్ట మధ్యాహ్నపు మండుటెండలో ఇసుక నేల మీద నగ్నంగా పడేసి కొరడాలతో వళ్ళు హూనం చేసేవారు. నిప్పుతో వాతలు పెట్టేవారు. మరొకప్పుడు ఆయన్ని నీళ్ళలో ముంచి ఊపిరాడకుండా అదిమి ఉంచేవారు.

ఆయన సతీమణి సుమయ్యా (రజి) అబూజహల్ ఇంట్లో బానిసగా ఉన్నారు. కేవలం ఇస్లాం స్వీకరించిన కారణంగా ఆ సాధ్వీమణిని అతను బాధించడం మొదలెట్టాడు. ఒకరోజు అనరాని మాటలు అంటూ చేతిలో వున్న ఈటెను ఎత్తి సుమయ్యా(రజి) మీదికి బలంగా విసిరాడు. ఆ దెబ్బకు ఆమె విలవిల్లాడుతూ నేలకొరిగారు. సత్యధర్మ పథంలో ప్రప్రథంగా రక్తం ధారపోసి అమరగతినొందిన అదృష్టం స్త్రీలలో ఆ ధీరవనితకే దక్కింది.

అమ్మార్ (రజి)ను కూడా అవిశ్వాసులు ఘోరంగా హింసించారు. వారాయనకు ఇనుప కవచం తొడిగించి నిప్పులు చెరిగే ఎండలో చాలాసేపు నిలబెట్టేవారు. మండుతున్న ఇసుకనేల మీద పడేసి స్పృహ తప్పేవరకు కొట్టేవారు. ఈవిధంగా ఆ దుర్మార్గులు హజ్రత్ అమ్మార్ (రజి)ని హింసిస్తూ, తాము చెప్పినట్లు ముహమ్మద్ (స)ని దూషించి తమ దేవతలను పొగడవలసిందిగా బలవంతం చేశారు. చివరికి అమ్మార్ (రజి) ఈ బాధలకు తాళలేక వారు పలకమన్న మాటలన్నీ పలికారు.

ఆ తరువాత ఆయన రోదిస్తూ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! నేను మిమ్మల్ని గురించి చెడుగా, వారి దేవతలను గురించి మంచిగా పలకనంతవరకు వారు నన్ను వదలిపెట్ట లేదు"అని చెప్పారు. దైవప్రవక్త (స) ఈమాట విని "అప్పుడు నీ హృదయ పరిస్థితి ఎలా ఉండింది?" అని అడిగారు. "నేనప్పుడు పూర్తి విశ్వాస (ఈమాన్) స్థితిలోనే ఉన్నాను" అన్నారు అమ్మార్ (రజి). "అయితే వారు మరెప్పుడైనా దౌర్జన్యంచేస్తే నీవు మళ్ళీ అలాంటి మాటలే పలుకు" అన్నారు దైవప్రవక్త (స).

అలాంటి సాహసవంతులలో ఖబ్బాబ్ (రజి) కూడా ఉన్నారు. ఈయన ఉమ్మెఅన్మార్ బానిస. ఉమ్మెఅన్మార్ ఇనుపకడ్డీ కాల్చి తరచుగా ఖబ్బాబ్ (రజి) తల మీద వాతలు పెట్టి బాధిస్తుండేది. ఒకసారి ఆమె బొగ్గులు కాల్చి వాటిపై ఖబ్బాబ్ (రజి)ని వెల్లకిలా పండబెట్టింది. ఆ వేడికి ఖబ్బాబ్ (రజి) శరీరం కాలి చిట్లిపోయింది. చివరికి చిట్లిన దేహం నుండి కారిన ద్రవంతోనే నిప్పులు చల్లారాయి.

ఇస్లాం ధర్మాన్ని విశ్వసించి అత్యంత కఠిన పరీక్షలలో నెగ్గిన అదృష్టవంతులలో బిలాల్ (రజి) కూడా ఒకరు. ఈయన ఉమయ్యా దగ్గర బానిసగా ఉన్నారు. ఇస్లాంని విశ్వసించినందువల్ల ఆయన్ని ఉమయ్యా రకరకాలుగా హింసించాడు. అప్పుడప్పుడు కూడూనీళ్ళూ ఇవ్వకుండా కడుపు మాడ్చేవాడు.

ఓరోజు మధ్యాహ్నం ఆ కిరాతకుడు హజ్రత్ బిలాల్ (రజి)ని కాళ్ళుచేతులు కట్టి మండుటెండలో ఇసుక మీద పండబెట్టించాడు. అక్కడే నిల్చున్న ఉమయ్యా స్నేహితులు బిలాల్(రజి) బాధపడుతుంటే వెకిలిగా నవ్వసాగారు. ఉమయ్యా అంతటితో కసితీరక ఓ బండరాయిని రొప్పుతూ తీసుకొచ్చి బిలాల్ (రజి) ఛాతీ మీద పెట్టి ఇలా అన్నాడు: "ఇప్పటికైనా మించిపోయిందిలేదు. ఇస్లాం విడిచిపెట్టి లాత్, ఉజ్జా విగ్రహాలను పూజించు. లేకపోతే నీ గతి ఇంతే. చచ్చేవరకు నిన్ను వదలిపెట్టను." అయితే బిలాల్ (రజి) ఆ బాధలోనే ఊపిరి బిగబట్టి 'అహద్! అహద్!!' (దేవుడొక్కడే, దేవుడొక్కడే) అని అన్నారు ఏమాత్రం సడలని విశ్వాసంతో.

తన అనుచరులపై సత్యతిరస్కారుల దౌర్జన్యాలు మితిమీరిపోవడం చూసి దైవప్రవక్త (స) తీవ్రఆందోళన చెందారు. అప్పుడాయన "దేవుని భూమి విశాలంగా ఉంది. మీరు దుర్మార్గులకు దూరంగా మరోప్రాంతానికి వెళ్ళిపోండి" అని చెప్పారు. "దైవప్రవక్తా! ఎక్కడికి వెళ్ళమంటారు? అదీ మీరే చెప్పండి" అన్నారు అనుచరులు. "అబిసీనియా వెళ్ళండి. అక్కడి రాజు నజాషీ (నీగస్) క్రైస్తవ మతస్థుడు, చాలా ధర్మాత్ముడు. మీకు ఏలోటూ రానివ్వడు" అన్నారు దైవప్రవక్త (స).



## (7) కొందరు ముస్లింల అబిసీనియా వలస

ప్రవక్త అనుమతి లభించగానే ముందుగా పదకొండు మంది పురుషులు, నలుగురు స్త్రీలు మక్కా నుండి బయలుదేరారు. వారిలో ఉస్మాన్ బిన్ అప్ఫాన్, ఆయన భార్య రుఖియా, హుజైఫా బిన్ ఉఖ్బా, ఉస్మాన్ బిన్ మజ్వూన్, అబ్దుల్లా బిన్ మస్వూద్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, జుబైర్ బిన్ అవ్వామ్, ముస్అబ్ బిన్ ఉమైర్, ఆమిర్ బిన్ రబియా, సుహైల్ బిన్ బైజా (రజి) ముఖ్యులు. ముస్లింలు ఆ తరువాత కూడా రహస్యంగా జట్లుజట్లుగా బయలుదేరి అబిసీనియా చేరుకున్నారు. ఒక జట్టుతో కలసి జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) కూడా అబిసీనియా చేరుకున్నారు. ఈవిధంగా మొత్తం ఎనభై మందికి పైగా ముస్లింలు చేరుకొని అబిసీనియాలో ప్రశాంతజీవితం గడపసాగారు.

ముస్లింలు మక్కా నుండి వెళ్ళిపోయారని తెలియగానే ఖురైషీయులు వారిని పట్టుకోవడానికి జిద్దా రేవుకు పరుగెత్తారు. కాని అప్పటికే ఓడ జిద్దానుండి వెళ్ళిపోయిందని తెలుసుకొని వారు హతాశులయ్యారు. అయితే ఆ తర్వాత వారు కాబాలో సమావేశమయి చర్చలు జరిపి ఇద్దరు ప్రతినిధుల్ని నజాషీ దగ్గరకు పంపారు. వారిద్దరు అబిసీనియా వెళ్ళి ముందుగా క్రైస్తవ మతపెద్దల్ని తమ వైపు తిప్పుకొని పని గడుపుకునేందుకు వారికి విలువైన కానుకలిచ్చారు. తరువాత వారు రాజు నజాషీ దగ్గరకెళ్ళి అతనికి కూడా విలువైన కానుకలు సమర్పించుకొని ఇలా విన్నవించుకున్నారు:

"మహారాజా! మా దేశం నుండి కొందరు నేరస్థులు పారిపోయి వచ్చి తమరి దగ్గర తలదాచుకున్నారని తెలిసింది. వారు మా సాంప్రదాయక మతం వదలి మతభ్రష్టులై పోయారు. మహారాజావారి మతమైన క్రైస్తవాన్ని కూడా వారు స్వీకరించ లేదు. మనకెవరికీ తెలియని ఓ కొత్తమతం లేవదీసి జాతి వినాశానికి పాల్పడ్డారు. అంచేత మా నాయకులు వీళ్ళను తీసుకురమ్మని మమ్మల్ని పంపారు. దయచేసి వీళ్ళను మాకు అప్పగించండి"

ముందే కానుకలు స్వీకరించిన క్రైస్తవ మతనాయకులు మక్కా అవిశ్వాసులకు వంతపాడారు. కాని రాజు ఆగ్రహంతో "వీల్లేదు. వారు మాఆశ్రయం కోరి, మాదగ్గర ఉండటానికి ఇష్టపడ్డారు. వాస్తవం ఏమిటో వారి నోటనే విందాం. వెంటనే వాళ్ళను మా సమక్షంలో ప్రవేశపెట్టండి" అని అన్నాడు. కాస్సేపటికి రాజభటులు వలసవచ్చిన ముస్లింలను దర్బారులో ప్రవేశపెట్టారు.

"మీరు మీ సాంప్రదాయక మతం వదిలేసి, ఇటు క్రైస్తవమతం కూడా కాదని ఏదో కొత్తమతం అవలంబించారని విన్నాం. ఏమిటా కొత్తమతం?" అడిగాడు రాజు. దానికి అబూతాలిబ్ కొడుకు జాఫర్ (రజి) ముస్లింల తరపున ఇలా సమాధానమిచ్చారు:

"రాజా! మేము పూర్వం అజ్ఞానులుగా ఉండి విగ్రహాలను పూజించేవాళ్ళం. చచ్చిన జీవాలను తినేవాళ్ళం. అశ్లీలతాఊబిలో దిగబడిఉన్నాం. నిరంతరం అంతఃకలహాలతో సతమతమై ఉండేవాళ్ళం. అలాంటి పరిస్థితిలో దేవుడు మాలో ఒక ప్రవక్తను ప్రభవింప జేశాడు. ఆయన ఎంతో గౌరవప్రదమైన వంశంలో జన్మించాడు. ఆయన సత్యసంధత, నిజాయితీలు మాకు మొదటి నుండీ తెలుసు. ఆయన మాకు దేవుని సందేశం బోధించాడు. 'మనమంతా ఏకైక దేవుడ్ని మాత్రమే ఆరాధించాలి. జీవంలేని విగ్రహాలను వదలిపెట్టాలి.

ఎల్లప్పుడూ సత్యమే పలకాలి. తోటిమానవుల కష్టాలలో పాలుపంచుకోవాలి. అశ్లీలతకు దూరంగాఉండాలి. అనాథలసొమ్ము తినకూడదు. శీలవతులపై అపనిందలు మోపరాదు. నమాజ్, దానధర్మాలు చేస్తుండాలి' అని బోధించాడు ఆయన. రాజా! మేము ఆయన్ని సత్యప్రవక్తగా విశ్వసించాం. ఆయన తెలిపిన ప్రతి విషయాన్నీ మేము స్వీకరించాం. ఈ కారణంగానే మాజాతి మాజీవితాలను దుర్భరం చేసింది. చివరకు మేము వారి దౌర్జన్యాలు భరించలేక ఇక్కడైనా కాస్త స్వేచ్ఛగా గడపవచ్చని మీ దేశానికి వచ్చి తలదాచుకున్నాం."

నజాషీ ఈ మాటలు విని "సరే, ఆయనపై అవతరించిన దైవవాణి మీ దగ్గర ఏమైనా ఉంటే పఠించండి, వింటాను" అన్నాడు. అప్పుడు జాఫర్ (రజి) 'మర్యం' అధ్యాయంలోని కొన్ని సూక్తులు పఠించారు. ఖుర్ఆన్ వాణి విని నజాషీ ఎంతో ప్రభావితుడై కంట తడిపెట్టాడు. పాదరీల కళ్ళు కూడా అప్రయత్నంగా అశ్రుపూరితాలయ్యాయి.

"దైవసాక్షి! ఈ వాణిలో సత్యతా పరిమళం తొంగిచూస్తోంది, ఈ వాణి, మూసా (అలైహి)పై అవతరించిన తౌరాత్‌వాణి ఒకే చెట్టుకొమ్మలుగా, ఒకే జ్యోతికిరణాలుగా గోచరిస్తున్నాయి" అన్నాడు నజాషీ కళ్ళు తుడుచుకుంటూ.

ఖురైష్ ప్రతినిధి అమ్ర్ బిన్ ఆస్ మాట్లాడుతూ "రాజా! ఈ ముస్లింలు ఏసుక్రీస్తును గురించి చెడ్డగా మాట్లాడుతారు. ఆ మహనీయుడ్ని వీరు దేవుని కుమారుడిగా ఒ ప్పుకోరు" అని అన్నాడు. నజాషీ రాజు జాఫర్ వైపు తిరిగి "ఏమిటీ ఇది నిజమా?" అని అడిగాడు.

"కాదు. వీళ్ళు పచ్చిఅబద్ధం చెబుతున్నారు. ఖుర్ఆన్ ప్రకారం 'ఈసా (అలైహి) దేవుని దాసుడు, ఆయన ప్రవక్త మాత్రమే. కాకాపోతే ఆయన మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ, దేవుని దగ్గర్నుండి (మర్యంకు) పంపబడిన ఒక ఆత్మ" (4:171). ఇదే మా విశ్వాసం" అన్నారు జాఫర్ (రజి) ఏమాత్రం సంకోచించకుండా.

"మీ విశ్వాసం సరైనదే. ఇంజీల్‌లో కూడా ఈభావమే ఉంది" అంటూ నజాషీ క్రిందికి వంగి నేల మీదున్న ఓచిన్న పుడక చేతిలోకి తీసుకొని చూపిస్తూ "దైవసాక్షి! మీరు పేర్కొన్న దానికంటే ఈసా (అలైహి) ఈ పుడకంత కూడా అధికంగా లేరు" అన్నాడు.

ఆ తరువాత నజాషీ ఖురైష్ ప్రతినిధుల వైపు తిరిగి "వీళ్ళను మీవెంట పంపించే ప్రసక్తి లేదు. ఇక మీరు వచ్చిన దారే వెళ్ళిపోవచ్చు" అన్నాడు. దాంతో ఖురైష్ ప్రతినిధులు బిక్కమొహం వేసుకొని రాజదర్బారు నుండి బయటికొచ్చి చక్కా మక్కా దారిపట్టారు.

అబిసీనియాకు వలసపోయిన ముస్లింల ద్వారా అక్కడి క్రైస్తవులకు ఇస్లాం గురించి తెలియగానే నిజానిజాలు నిర్ధారించుకోవడానికి వారొక ప్రతినిధివర్గాన్ని మక్కా పంపారు. ఆ ప్రతినిధులు మక్కా చేరుకొని దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు. దైవప్రవక్త (స) వాళ్ళను సాదరంగా ఆహ్వానించి ఖుర్ఆన్ సూక్తులు విన్పించారు. దివ్యవాణి వినగానే వారి హృదయాలు దైవభీతితో ద్రవించిపోయాయి. నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి. వెంటనే వారు సత్యధర్మం స్వీకరించి సంతోషంతో తిరుగు ప్రయాణమయ్యారు.

ఈ సంగతి తెలుసుకున్న అబూజహల్, అతని సహచరులు దారిలో వాళ్ళను అటకాయించి అనరానిమాటలు అన్నారు. కాని ప్రతినిధివర్గం సభ్యులు ఖురైషీయుల దూషణలు



పట్టించుకోకుండా "సోదరులారా! మీకు సలాం. మేము మీతో వాదించలేం. యదార్థం తెలిసి కూడా మేము శ్రేయోభాగ్యాలను వదలుకోలేము. మమ్మల్ని మాపద్ధతి ప్రకారం నడవనివ్వండి. మీరు మీపద్ధతి ప్రకారం నడుస్తూ ఉండండి" అని అన్నారు.

అబూజహల్ దైవప్రవక్త (స)ను వేధించడం మానలేదు. ఓరోజు దైవప్రవక్త (స) దారిన వెళ్తుంటే అబూజహల్ ఎదురై ఆయన్ని చూడగానే మండిపడుతూ అకారణంగా దూషిస్తూ మనసులోని అక్కసంతా వెళ్ళబోసుకున్నాడు. కారుణ్యమూర్తి (స) మటుకు పల్లెత్తి మాట అనలేదు. అసలతని వైపు కన్నెత్తి కూడా చూడలేదు. దాంతో అబూజహల్ మరింత రెచ్చిపోయి దారిపక్కనే ఉన్న కంకర్రాళ్ళు తీసుకొని ఆయన మీదికి విసిరికొట్టాడు. అయినా మహాప్రవక్త (స) అతని దౌర్జాన్యానికి ఏమాత్రం బాధపడలేదు. ఆయన సహనంతో అతడ్ని నుంచి తప్పించుకొని మౌనంగా వెళ్ళిపోయారు.

## (8) హమ్జా, ఉమర్‌ల ఇస్లాంస్వీకరణ

వీళ్ళిద్దరికి కొంచెం దూరంలో నిల్చున్న ఓ దాసి ఇదంతా గమనించి ఎంతో బాధ పడింది. ఆమె ఇదివరకే ఇస్లాంను విశ్వసించింది. ఈ విషయం తన యజమానికి తెలిస్తే అతను తనను చిత్రహింసలు పెట్టి చంపుతాడని భయపడి ఆమె ఇస్లాంపట్ల తన విశ్వాసాన్ని కొంతకాలంపాటు రహస్యంగా ఉంచవలసి వచ్చింది. దైవప్రవక్త (స)పై అకారణంగా అబూజహల్ చేసిన దౌర్జన్యం చూడగానే ఆ దాసిలోని విశ్వాసం ఉరకలు వేసింది. ఎలాగైనా ఆ దుర్మార్గుడి ఆట కట్టించాలని అనుకున్నది.

అలా ఆమె ఓ కొండ పక్కగా నడుస్తుంటే ఎదురుగా అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు హమ్జా రావడం కన్పించింది. అతని నడుముకు కరవాలం వ్రేలాడుతోంది. భుజానికి విల్లు, వీపు వెనుక అంబులపొది కూడా ఉన్నాయి. బంధుత్వం రీత్యా దైవప్రవక్త (సల్లం)కు పినతల్లి కుమారుడు అవుతాడు. పైగా ఇద్దరూ ఒకే స్త్రీ పాలు తాగి ఉన్నందున దైవప్రవక్త (స)కు స్తన్యసంబంధ సోదరుడు కూడా అవుతాడు.

దాసీ హమ్జాను చూడగానే "అబూఉమారా! మీలో ఆత్మాభిమానం మచ్చుకైనా లేదా? బనీమఖ్జూమ్ గూండాలు ముహమ్మద్ (స)ను విచ్చలవిడిగా హింసిస్తుంటే మీరు ఏమీ పట్టనట్లు ఉంటారేమిటీ?" అని అన్నది. నడుస్తున్న హమ్జా ఠక్కున ఆగి "అబ్దుల్లా దాసీ! ఏమిటీ నువ్వంటున్నది?" అని అడిగాడు అర్థంగాక ఆశ్చర్యంగా చూస్తూ.

"ఏమని చెప్పను? ఈరోజు మీ ముహమ్మద్‌కు ఏమైందో తెలుసా? ఆయన ఉదయం ఏదో పనిమీద వెళ్తుంటే, అబూజహల్ ఎక్కడ్నుంచో ఊడిపడ్డాడు. వచ్చిరాగానే నోటికొచ్చి నట్లు నానా తిట్లు తిట్టాడు. నేను సహించలేక పోయాను. సరే అంతటితో ఊరుకున్నాడా? పిడికెడు కంకర్రాళ్ళు తీసుకొని ఆయన ముఖం మీదికి విసిరికొట్టాడు" అన్నది దాసి.

"ఏమిటీ! నిజమా!! నువ్వు చూశావా?" అడిగాడు హమ్జా ఆశ్చర్యాగ్రహాలతో. "ఔను. నేను నా కళ్ళారా చూశాను. చెవులారా విన్నాను" అన్నది దాసీ.

"అయితే ఉండు, ఇప్పుడే ఆ దుర్మార్గుడి సంగతి తేల్చుకుంటాను" నిప్పులు కక్కుతూ, పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ కాబావైపు నడిచాడు హమ్జా. కాబాలో ఓమూల ఖురైష్

నాయకులు గుమికూడి ఇస్లాంకు వ్యతిరేకంగా మంతనాలు జరుపుతున్నారు. వారిలో అబూజహల్ కూడా ఉన్నాడు. హమ్జా కాబాలోకి ప్రవేశించి అబూజహల్ దగ్గరికి దూసుకుపోయాడు. భుజానికున్న ధనుస్సు చేతిలోకి తీసుకొని అతని మీద బలంగా కొట్టాడు.

అబూజహల్ తల పగిలిపోయింది. మొహమంతా రక్తసిక్తమైంది. క్షణంపాటు కళ్ళు బైర్లుకమ్మాయి. "దుర్మార్గుడా! ముహమ్మద్ ఎవరనుకున్నావ్? ఆయన నా అన్న కొడుకు. నీ తిట్లు దెబ్బలు తిన్నవాడు నా అన్న కొడుకని తెలియదా?" అన్నాడు హమ్జా గర్జిస్తూ.

"హమ్జా! ముహమ్మద్ మనల్ని మూర్ఖుల కింద జమకట్టాడు. నోటికొచ్చినట్లు మాట్లాడుతాడు. మన తాతముత్తాతల ఆచారాల మీద దాడిచేస్తున్నాడు. మన దేవతలను విమర్శిస్తున్నాడు. బానిసల్ని రెచ్చగొట్టి మతభ్రష్టుల్ని చేస్తున్నాడు" అన్నాడు అబూజహల్.

"మూర్ఖుడా! అల్లాహ్‌ను కాదని విగ్రహాలను పూజిస్తున్నావు కదూ! బాగా విను. నేను మా ముహమ్మద్ పక్షం వాడినే. ఆయనకే నా పూర్తిమద్దతు. ఇకనుంచి నేను ఇస్లాం కోసమే జీవిస్తాను; ఇస్లాం కోసమే మరణిస్తాను" అన్నాడు హమ్జా.

హమ్జా మాటలు విని అబూజహల్‌తో పాటు అక్కడున్న వారంతా విస్తుబోయారు. ఆ తర్వాత హమ్జా ఇస్లాం స్వీకరించాడు. హజ్రత్ హమ్జా (రజి) ఇస్లాం స్వీకరించడంతో అవిశ్వాసులు ఓ గొప్ప సాహసవంతుడ్ని, మహాయోధుడ్ని కోల్పోయారు.

అరబ్బులు స్వేచ్ఛాజీవులు. అక్కడ ప్రత్యేక శాసనమంటూ ఏదీ లేదు. మనస్సుకు నచ్చింది ఆచరిస్తారు. అంచేత దేశమంతటా త్రాగుడు, జూదం, వ్యభిచారం, కొట్లాటలతో కలుషితమైపోయింది. ప్రవక్త సందేశం ఈ చెడులన్నిటికీ వ్యతిరేకంగా ఓ అద్భుత నినాదం.

అంతేకాదు, బహుదైవారాధకులకు మక్కా గొప్ప సాంస్కృతిక, వాణిజ్య, మతపరమైన కేంద్రం కాబట్టి సుదూరప్రాంతాల నుంచి అనేకమంది యాత్రికులు ఇక్కడకు వస్తారు. ఖురైషీయులే కాబానిర్వాహకులైనందున వారికి యాత్రికుల నుండి అనేకరకాల కానుకల రూపంలో అపారసిరిసంపదలు లభిస్తాయి. ఇస్లాంవ్యాప్తి వారి మతవ్యాపారానికి, దుర్నడత దుర్వ్యసనాలకు పెద్ద గొడ్డలిపెట్టు. అందువల్ల అది రోజురోజుకు బలం పుంజుకుంటూ, నేల నాలుగు చెరగులా విస్తరిస్తుంటే వారు చూస్తూ ఎలా ఊరుకుంటారు?

వారిలో ఉమర్ బిన్ ఖత్తాబ్ కూడా ఉన్నాడు. ముస్లింలు మక్కా వదలి అబిసీనియా వెళ్ళిపోయారని విని అతను కూడా ఆగ్రహోదగ్రుడై పోయాడు. "దీనికంతటికీ మూలకారకుడైన ముహమ్మద్ అంతుచూస్తాను.జనాన్ని తప్పుదారి పట్టిస్తూ దేశంలో అశాంతి, అనైక్యతలు సృష్టిస్తున్నాడు. అలాంటివాడ్ని ఇక ఏమాత్రం సహించకూడదు. ఇప్పుడే పోయి అతని శిరస్సు ఖండిస్తాను" అంటూ కరవాలం తీసుకొని బయలుదేరాడు ఉమర్.

దారిలో నయీమ్ బిన్ అబ్దుల్లా (రజి) ఎదురై "ఉమర్! ఎక్కడికి మహా ఆర్భాటంగా పోతున్నావు?" అని అడిగాడు. నయీమ్ (రజి) ఇదివరకే ఇస్లాం స్వీకరించారు. అయితే ముస్లింలపై జరుగుతున్న దారుణాలు చూసి ఆయన తన విశ్వాసాన్ని ఇంకా ప్రజల ముందు బహిర్గతం చేయలేదు. కళ్ళలో నిప్పుసెగలు, నడుముకు ఖడ్గంతో వెళ్తున్న ఉమర్‌ని చూసి, ఇతను ఇస్లాంకు ఏదో కీడు తలపెట్టబోతున్నాడని ఆయన శంకించారు.



ఉమర్ పిడికిలి బిగిస్తూ "అదే, ఆ మతభ్రష్టుడి దగ్గరికి. మన దేవతలకు అపచారం తలపెట్టి సామాజికవ్యవస్థను సర్వనాశనం చేస్తున్న ముహమ్మద్ దగ్గరికి వెళ్తున్నా. ఈరోజు అతని రక్తం కళ్ళ చూడదలిచాను" అని అన్నాడు. "ఏమిటీ ముహమ్మద్‌ని చంపడానికి పోతున్నావా? ఆలోచించే నిర్ణయానికి వచ్చావా? అలాగైతే అబ్దెమునాఫ్ తెగవాళ్ళు నిన్ను వదులుతారనుకున్నావా? సరే, ముహమ్మద్ సంగతి తర్వాత చూద్దువుగాని ముందు నీ బావ, చెల్లెళ్ల సంగతి కనుక్కో. వారు ఇస్లాం స్వీకరించారు" అన్నారు ఆయన.

ఈ సంగతి విని ఉమర్ అదిరిపడ్డాడు. "ఆ... నా కుటుంబ సభ్యులే అంతగా బరి తెగించారా! అయితే ఇప్పుడే పోయి వారి ఆట కట్టిస్తానుండు" అంటూ ఉమర్ అక్కడ్నుంచి వెనక్కి తిరిగి సరాసరి చెల్లెలి ఇంటికి వెళ్ళి తలుపులు దబదబా తట్టాడు. ఈ శబ్దానికి ఇంట్లో వాళ్ళు భయపడ్డారు. "ఎవరండీ!" లోపలి నుంచే అడిగారు.

"ఉమర్ బిన్ ఖత్తాబ్" బయటి నుంచి సమాధానం వచ్చింది సింహగర్జనలా. ఉమర్ పేరు వినగానే ఖుర్‌ఆన్ విన్పిస్తున్న ఖబ్బాబ్ (రజి) వెంటనే పుస్తకం వదిలేసి ఒక్కఅంగలో పోయి లోపలగదిలో ఓ మూల దాక్కున్నారు. ఖుర్‌ఆన్ వింటున్న ఉమర్‌చెల్లెలు ఫాతిమా (రజి), ఆమె భర్త సయీద్ (రజి) కంగారుపడ్డారు. సయీద్ (రజి) అదురుతున్న గుండెతో మెల్లిగా తలుపు తెరిచారు. అంతే, ఉమర్ ఆకలిగొన్న పులిలా లోపలికి దూసుకొచ్చి "ఇప్పుడు నేను విన్న కంఠం ఎక్కడ్నుంచి వచ్చింది?" అని గర్జించాడు.

"అబ్బే... ఇక్కడ అలాంటిదేమీ లేదే!" నసిగారు ఫాతిమా, సయీద్‌లు భయపడుతూ. "దాచిపెట్టకండి. మీరు ఇస్లాం స్వీకరించిన సంగతి నాకు తెలియదనుకున్నారా?"అంటూ సయీద్ (రజి) మీదికి లంఘించాడు ఉమర్. పిడిగుద్దులతో ఆయన వళ్ళు హూనం చేయసాగాడు. ఫాతిమా (రజి) సహించలేక భర్తను విడిపించుకోవడానికి అడ్డం వచ్చారు. దాంతో ఉమర్ మరింత రెచ్చిపోయి బావను వదలి చెల్లెలిపై చేయిచేసుకున్నాడు.

ఫాతిమా చెంపలు కందిపోయి తల నుంచి రక్తం కారసాగింది. ఉమర్ ఇక తమను ప్రాణాలతో వదలిపెట్టడని భావించి "అన్నయ్యా! నువ్వు ఖత్తాబ్ కొడుకువైతే నేను ఖత్తాబ్ కూతుర్ని. నేను నీకేమీ తీసిపోను. ఔను మేము ఇస్లాం స్వీకరించాం. ఇస్లాం నుంచి ఒక్క అంగుళమైనా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు. నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అని అన్నారు.

చెల్లెలి మాటలు విని ఉమర్ చేయి అప్రయత్నంగా ఆగిపోయింది. ఆమె చెంపల మీదుగా కారుతున్న రక్తం అతని మనస్సును క్షణంలో మైనంలా కరిగించివేసింది. అంతలో అతని దృష్టి చెల్లెలి చేతిలో ఉన్న పుస్తకంపై పడింది.

"ఇదేనా మీరు చదువుతున్నది? ఏది ఓసారి ఇటివ్వు, నేనూ చూస్తాను" అన్నాడు ఉమర్ ప్రశాంతంగా. "ఇది నీ చేతికిస్తే మళ్ళీ మాకు లభిస్తుందో లేదో!" అన్నారు ఫాతిమా (రజి) భయమూ, అనుమానం మేళవించి చూస్తూ. "భయపడకు, తప్పకుండా తిరిగిస్తాను" అన్నాడు ఉమర్. "అయితే ముందు నువ్వు స్నానం చేసిరా" అన్నది చెల్లెలు.

ఉమర్ లోపలికి వెళ్ళి స్నానం చేసి వచ్చాడు. ఫాతిమా (రజి) ఖుర్‌ఆన్ అతని చేతికి అందించారు. ఉమర్ దాన్ని తెరచి చదవడం ప్రారంభించాడు. కొన్ని క్షణాల తర్వాత

అతని వాలకంలో మార్పు రాసాగింది. "ఎంత మంచి విషయాలు! ఎంత పవిత్రమైన వాణి ఇది!!" ఉమర్ నోట అప్రయత్నంగా వెలువడ్డాయీ మాటలు.

లోపల దాక్కున్న ఖబ్బాబ్ (రజి) వెంటనే బయటికొచ్చి "ఉమర్! దైవప్రవక్త నిన్నుగాని, అబూజహల్‌నిగాని ఇస్లాం ఆశ్రయంలోకి వచ్చేటట్లు చేయమని దైవాన్ని ప్రార్థించారు. ఆ ప్రార్థన బహుశా నీవిషయంలోనే దైవం అంగీకరించి ఉండవచ్చు. ఇక ఇస్లాం ధర్మాన్ని వదలిపెట్టకు" అని అన్నారు. "నేను ఇస్లాం స్వీకరించదలిచాను. నన్ను ముహమ్మద్ దగ్గరకు తీసికెళ్ళండి" అన్నాడు ఉమర్. ఈవిధంగా ఆయన ఇస్లాం స్వీకరించారు.

దైవప్రవక్త (స) ఉమర్ (రజి), హమ్జా (రజి)ల నాయకత్వంలో అనుచరుల్ని రెండు జట్లుగా విభజించి కాబా వంపించారు. వీరంతా కాబా వెళ్ళి నమాజ్ చేసి 'లాఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని నినదించారు. ఆరాత్రే ఉమర్ (రజి) తన విశ్వాసాన్ని ప్రకటిస్తూ అనేకమందిని ఇస్లాంవైపు పిలిచారు. దైవప్రవక్త (స) ఆయన చూపిన ధైర్యసాహాసాల్ని గురించి విని ఆయనకు 'ఫారూఖ్' అనే బిరుదు ప్రదానం చేశారు.

హజ్ సీజన్ వచ్చిందంటే చాలు, ఖురైష్ నాయకులకు కంపరమెత్తి పోతుంది. కారణం ముహమ్మద్ (స) బయట నుంచి వచ్చే వేలాది యాత్రికుల్ని కలుసుకొని వారికి నూతన ధర్మాన్ని నూరిపోస్తారని భయపడటమే. అందువల్ల ఓరోజు వారు సమావేశమై మరో పథకం గురించి చర్చలు జరిపారు. అప్పుడు వలీద్ బిన్ ముగైరా మాట్లాడుతూ "హజ్ దినాలు వస్తున్నాయి. బయట నుంచి అనేకమంది యాత్రికులు వస్తారు. మనమంతా తక్షణమే ఒక నిర్ణయానికి రావాలి. చెప్పండి ఏంచేద్దాం?" అని అన్నాడు.

అప్పుడు కొందరు "ముహమ్మద్ జోస్యం చెప్పేవాడని ప్రచారం చేద్దాం" అన్నారు. "వద్దు, మనం ఎంతో మంది జోస్యగాళ్ళను చూశాం. వారి మాటలకు, ముహమ్మద్ చెప్పే సూక్తులకు పోలికే లేదు" అన్నాడు వలీద్. "అయితే పిచ్చివాడు అందాం" మరికొందరి సలహా. "కాదు. పిచ్చివాడి మాటలు ఎలా ఉంటాయో అందరికీ తెలుసు. ఇతనిలో పిచ్చివాడి చేష్టలు మచ్చుకైనా లేవు" అన్నాడు వలీద్. "పోనీ కవి అందామా?" అన్నారు ఇంకొందరు. "అతను కవి కూడా కాదు. నేను కవితాజగత్తును అమూలాగ్రంగా వడపోశాను. అతని వాక్కులో కవిత్వం ఏమాత్రం గోచరించదు. మరేదైనా ఆలోచించండి" అన్నాడు వలీద్. "సరే, ముహమ్మద్ గొప్ప ఇంద్రజాలికుడంటేనో?" మరో సలహా. "ముహమ్మద్‌ని ఇంద్రజాలికుడని కూడా అనలేం. మనం ఎంతమంది ఇద్రజాలికుల్ని చూడలేదూ? కాని ఒక్కడైనా ముహమ్మద్ సూక్తి లాంటి మంత్రం చెప్పగలడా?" అన్నాడు వలీద్. "అయితే మరి ఏమని ప్రచారం చేద్దాం అతడ్ని గురించి?" అడిగారు కొందరు.

"దైవసాక్షి! అతని వాక్కులో అనిర్వచనీయమైన మాధుర్యం ఉంది. అది సుమధుర ఫలాలతో నిండి బలంగా, లోతుగా వేళ్ళూనిన మహావృక్షం లాంటిది. అందువల్ల మనం ఏది బొంకినా అందరికీ నమ్మకం కలిగించేదిగా ఉండాలి. ఇదో, ఇతను గొప్ప మాంత్రికుడు. ప్రతి ఒక్కరినీ ఇట్టే మంత్రముగ్ధుల్ని చేసే అద్భుతవాణి తెచ్చాడు. దాని ప్రభావంతో అతను తండ్రీకొడుకుల్లో, అన్నాచెల్లెళ్లో, భార్యాభర్తల్లో, ఒక కుటుంబానికి మరో కుటుంబా నికి మధ్య విభేదాలు సృష్టిస్తాడు అని ప్రచారం చేద్దాం" అన్నాడు వలీద్.



ఈ పథకం అందరికీ నచ్చింది. అందరూ అవకాశం కోసం ఎదురుచూడసాగారు. కాబాయాత్ర శుభతరుణం రానేవచ్చింది. దేశం నలుమూలల నుండి వేలాది మంది యాత్రికులు వచ్చారు. సమయం కోసం కాచుకొని ఉన్న ఖురైషీయులు అనుకున్న ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స)పై దుష్ప్రచారం ప్రారంభించారు:

"ముహమ్మద్ పెద్ద ఇంద్రజాలికుడు. అతని మాటలు ప్రతి ఒక్కర్నీ ఇట్టే ఆకట్టుకొని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. దాంతో తండ్రీకొడుకుల్లో, భార్యాభర్తల్లో, అన్నాచెల్లెల్లో పోట్లాటలు వస్తాయి. జాగ్రత్త అతని మాయదారి మాటల్లో పడకండి" అన్నాడు వలీద్. ఈ ప్రచారం యాత్రికుల్లో కార్చిచ్చులా వ్యాపించింది. అంచేత కొందరు ముహమ్మద్ (స)ను కలుసుకోవ డానికే భయపడ్డారు. మరికొందరు ఎందుకొచ్చిందిలే మనకు అనుకొని వెళ్ళిపోయారు. చాలామంది హజ్‌తర్వాత స్వస్థలంచేరుకొని తమ బంధుమిత్రులకు వింతగా చెప్పుకున్నారు.

ఇలా దైవప్రవక్త (స) పేరు దేశమంతా వ్యాపించింది. శత్రు దుష్ప్రచారం వల్ల ఒక్కోసారి ఇస్లామీయ ఉద్యమానికి ప్రయోజనం కూడా చేకూరుతుంది. దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఖురైష్ నేతలు ప్రారంభించిన ఈ కొత్తప్రచారం విని నిజానిజాలేమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో ఇతరఊళ్ళ నుంచి  కొందరు మక్కాకు బయలుదేరారు. అలా మక్కా వచ్చినవారిలో అనేకమంది ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (స)కు అనుచరులుగా మారారు. అవిశ్వాసుల కుట్ర బెడిసికొట్టింది. ఇస్లాంను తుడిచిపెట్టాలని ప్రయత్నిస్తే అది మరింత విస్తృతం కాసాగింది. దాంతో వారు జరిగిన పొరపాటు గ్రహించి తలలు బాదుకున్నారు.

దైవప్రవక్త (స) ఓరోజు పట్నంబయట బాటసారుల్ని కలుసుకోడానికి వెళ్ళారు. వెంట కొందరు అనుచరులున్నారు. అది పున్నమిరాత్రి. అప్పుడు కొందరు అవిశ్వాసులు వచ్చి "నువ్వు నిజంగా దైవప్రవక్తవైతే చంద్రుడ్ని రెండుఖండాలుగా చీల్చిచూపు" అన్నారు.

ఈ మాట విని దైవప్రవక్త (స) నింగి వైపు దృష్టిసారించారు. మిగిలినవాళ్ళు కూడా తలలుపెకెత్తి చంద్రుడి వైపు చూడసాగారు. హఠాత్తుగా చంద్రుడు రెండు ఖండాలుగా చీలిపోయాడు. చీలిన రెండవఖండం దూరంగా జరిగిఆగింది. ఇలా కొండకు ఇరు వైపులా రెండు అర్ధచంద్రులు దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పించాయి. ఆ తరువాత వెంటనే రెండు అర్ధచంద్రులు కలిసిపోయి పూర్ణ చంద్రుడయి పోవడంజరిగింది.

క్షణంపాటు కన్పించిన ఈ అపూర్వదృశ్యాన్ని అందరూ సంభ్రమాశ్చర్యాలతో చూశారు. అప్పుడు దైవప్రవక్త (స) " దీనికి మీరు సాక్షులుగా ఉండండి" అన్నారు అవిశ్వాసులతో. కాని సత్యతిరస్కారులు "ఇదంతా నువ్వు నీ మంత్రబలంతో చూపిన మాయ తప్ప మరేమీ కాదు. మేము నీ మాటలు నమ్మం" అన్నారు అవిశ్వాసులు.

## (9) సంఘబహిష్కరణ, తాయిఫ్ పర్యటన

ఇస్లాంవ్యతిరేక ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ఖురైషీయులు "ముహమ్మద్‌ని, ఆయన అనుచరుల్ని సంఘబహిష్కరణ చేద్దాం. ఇకనుంచి వాళ్ళతో ఎలాంటి సంబంధం పెట్టుకోకూడదు. వివాహాది శుభకార్యాలు, ఇచ్చిపుచ్చు కోవడాలు, వ్యాపారలావాదేవీలు నిషేధించాలి. వారికి ఎలాంటి సహాయం చేయకూడదు" అని నిర్ణయించుకున్నారు.

ఈ నిర్ణయాన్ని వెంటనే వ్రాతపూర్వకంగా ఓ ప్రకటన తయారుచేసి కాబాలో వ్రేలాడ కట్టారు. దాని షరతుల్ని అందరూ గౌరవించాలని, ముస్లింలను సంఘం నుంచి పూర్తిగా బహిష్కరించాలని ఆ ప్రకటనలో పేర్కొనబడింది.

అది నబవీశకం 7వ సంవత్సరం, ముహర్రంనెల. అబూతాలిబ్, తన సమస్త పరివారంతో 'షొబే అబితాలిబ్' అనే పర్వత లోయలో సాంఘిక నిర్బంధానికి లోనయ్యారు. ఎండనక, వాననక వారంతా ఇక అక్కడే గడపాలి. అలా ఎంతకాలం గడపాలో తెలియదు. అయితే హజ్‌యాత్రకు చెందిన నాలుగు పవిత్ర మాసాలలో మాత్రం వారిని బయటికి రానిచ్చేవారు. ఆ నాలుగు నెలల కాలంలోనే దైవసందేశహరుని(స)కి, ఆయన అనుచరులకు ఇస్లాం ప్రచారంచేయడానికి అవకాశం లభిస్తుంది. ఇలా ముస్లింలు మూడేండ్లు సాంఘిక నిర్బంధానికి గురై అష్టకష్టాలు పడ్డారు. తిండికి, బట్టకూ వారు అనుభవించని బాధలు లేవు.

చివరికి ఒక రోజు అబూతాలిబ్ కాబా దగ్గరకు వచ్చి "నేనిక్కడకు ముహమ్మద్ (స) చెప్పిన మాటను ధృవపరచుకోవడానికి వచ్చాను. ఈరోజు ఆయన ఒడంబడిక పత్రం చెదలు పట్టిపోయిందని తెలియజేశాడు. ఈమాట నిజమయితే మీరు బహిష్కరణ ఆంక్షలు ఎత్తివేయాల్సి ఉంటుంది" అని అన్నారు. "తప్పకుండా. ఒడంబడిక పత్రం చెదలు పడ్తే ఇక ఆంక్షల్ని కొనసాగించే ప్రశ్నే తలెత్తదు. కాని ముహమ్మద్ మాట అసత్యమని రుజువైతే?" అన్నాడు అబూసుఫ్యాన్. "ముహమ్మద్ (స) ఎన్నటికీ అసత్యమాడడు. ఒకవేళ ఈ మాట అబద్ధమని తేలితే నేను ముహమ్మద్‌ని మీకు అప్పగిస్తాను. మీఇష్టానుసారం అతని పట్ల మీరు ప్రవర్తించవచ్చు. నాకెలాంటి అభ్యంతరం లేదు" అన్నారు అబూతాలిబ్.

"సరే పదండి లోపలికెళ్ళి చూద్దాం ఈ తమాషా కూడా" అన్నాడు అబూసుఫ్యాన్. అందరూ కాబా గర్భగుడిలోకి ప్రవేశించారు. చూస్తే నిజంగానే ఒడంబడిక పత్రం చెదలు పట్టిపోయింది. ఒక్క అల్లాహ్ పేరు తప్ప మరేమీ లేదక్కడ. ఖురైషీయులు ఆశ్చర్యచకితులై పోయారు. ఒడంబడిక దానంతటదే రద్దయిపోయింది. దైవప్రవక్త(స), ఆయన అనుచరులు మూడేండ్ల తర్వాత స్వేచ్ఛాజీవులై షొబె అబీతాలిబ్ నుంచి బయటికి వచ్చారు. ధర్మప్రచారం మునుపటికంటే ఇప్పుడు మరింత ఉధృతంచేశారు.

అయితే ప్రవక్త పెదనాన్న అబూతాలిబ్ వ్యాధిగ్రస్తులై కోలుకోలేకపోయారు. దైవప్రవక్త (స) పరిపరి విధాల నచ్చజెపుతూ "పెదనాన్నా! సద్వచనం పఠించండి. పరలోకంలో మీ గురించి సిఫారసుచేసే అవకాశం ఇవ్వండి నాకు" అన్నారు. కాని అబూతాలిబ్‌కు ఇస్లాం స్వీకారభాగ్యం లభించలేదు."నాయనా! నీవు కోరినట్లు అనడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాని అబూతాలిబ్ చావుకుభయపడి ముహమ్మద్‌కు లొంగిపోయాడని జనం నన్ను ఎత్తిపొడుస్తారు. అంచేత నన్ను తాతముత్తాతల మతంలోనే ఉండనీ" అన్నారు ఆయన.

ఇలా అబూతాలిబ్ విశ్వప్రభువు అనుగ్రహానికి దూరమైపోయారు. చిన్ననాటి నుంచి ఎంతో గారాబంగా పెంచి పెద్దచేసి, శత్రువులనీడ సైతం తనపై పడనీయకుండా కంటికి రెప్పలా కాపాడిన పెదనాన్న ఈరోజు అవిశ్వాసస్థితిలోనే అంతిమయాత్ర చేయవలసి వస్తున్నందుకు దైవప్రవక్త (స) చాలా బాధపడ్డారు. చివరికి అబూతాలిబ్ దైవప్రవక్త (స)ను ఏకాకి చేసి శాశ్వతంగా ఇహలోకం వీడిపోయారు.



దైవప్రవక్త హృదయానికైన ఈ గాయం పూర్తిగా మానలేనాలేదు, దానిపై మరోగాయం! పతిసేవే పరమానందంగా భావించిన అర్ధాంగి ఖదీజా(రజి) కూడా కన్నుమూశారు.

అలాంటి పరిస్థితుల్లో ఇస్లామీయ ఉద్యమాన్ని అణచడానికి అవిశ్వాసులకు మరింత అవకాశం లభించింది. వారి కిరాతకచర్యలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. ఒక రోజు దైవప్రవక్త (స) ఇంటికి తిరిగొస్తుంటే దారిలో ఓ దుర్మార్గుడు ఆయన మీద మన్ను విసిరాడు. దైవప్రవక్త (స) అదే స్థితిలో ఇంటికి వచ్చారు. ఆయన గారాబాల కూతురు చిన్నారి ఫాతిమా (రజి) తండ్రి తల మీద మన్ను చూసి పరుగెత్తి నీళ్ళు తెచ్చి కడుగుతూ, కారణం అడిగారు. కారణం తెలుసుకున్న ఫాతిమా (రజి) కంట తడిపెట్టారు. పొర్లు కొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక తండ్రిని కావలించుకొని భోరున విలపించారు.

అబూతాలిబ్ చనిపోయాక కొన్నాళ్ళదాకా అబూజహల్ కిమ్మనకుండా ఉన్నాడు. తర్వాత అతను దైవప్రవక్త (స)ను మునుపటి కంటే ఎక్కువ వేధించడం ప్రారంభించాడు. అబూలహబ్ కూడా దైవప్రవక్త (స)ను బాధించడంలో హద్దుమీరి పోయాడు. అనుక్షణం ఆయన్ని వెన్నాడుతూ గూండాలను, అల్లరి మూకలను ఉసిగొల్పేవాడు.

దైవప్రవక్త (స)కు అవిశ్వాసుల వేధింపులతో పాటు, మరోవైపు ఒంటరిజీవితం కూడా ఆయన అంతరంగంలో ఆవేదనకు తావిచ్చింది. అమితంగా అభిమానించే అనుచరులున్నా, కన్నకొడుకుకన్నా మిన్నగా చూసుకున్న పెత్తండ్రి లేని వెలితి తీరుతుందా? కష్టసుఖాలలో చేదోడువాదోడుగా ఉండి ఇస్లామీయ ఉద్యమంలో పాలుపంచుకుంటూ వచ్చిన అర్ధాంగి కూడా పోయినప్పుడు మిత్రులఊరడింపు తన హృదయానికి ఏమేరకు చల్లదనం ఇస్తుంది? అయితే దైవప్రవక్త (స) పరిస్థితి చూసి ఖౌలా బిన్త్ హకీం (రజి) కరిగిపోయారు. ఆమె సహకారం, సంప్రదింపులతో అబూబకర్ (రజి) కుమార్తె ఆయిషా (రజి), జమ్అ కూతురు సౌదా (రజి) దైవప్రవక్త (స) వివాహబంధంలోకి వచ్చారు.

ఖురైషీయుల దౌర్జన్యాలు నానాటికి అధికమవుతున్నాయి. అదీగాక వారు ఇస్లాం పరిధిలోకి వచ్చే సూచనలు కనుచూపు మేరలో కానరావడం లేదు. అందువల్ల దైవప్రవక్త (స) పెంపుడు కొడుకు జైద్ బిన్ హారిస్ (రజి)ని వెంటబెట్టుకొని తాయిఫ్ పట్నానికి ప్రయాణమయ్యారు, అక్కడి ప్రజలైనా ఇస్లాం స్వీకరిస్తారేమోనన్న ఆశతో.

దారిలో ఆయన బనీబకర్ తెగవాళ్ళకు దైవసందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని చెప్పారు. కాని వాళ్ళు నిరాకరించడంతో ఖహ్తాన్ తెగ దగ్గరకు పోయి ధర్మబోధ చేశారు. వాళ్ళు కూడా అంతే. ఇక అక్కడ్నుంచి తాయిఫ్ చేరుకొని పురప్రముఖులైన అబ్దెయాలైల్‌ని, అతని సోదరులిద్దర్ని కలుసుకున్నారు. వారికి దైవసందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని అన్నారు. కాని ఈ ముగ్గురు మహాగర్విష్టులు. దైవప్రవక్త (స)తో దురుసుగా మాట్లాడారు. పైగా తమ బానిసలను, తుంటరి పిల్లలను దైవప్రవక్త (స) పైకి ఉసిగొల్పారు. దైవప్రవక్త (స) ఎక్కడికి పోతే అక్కడికెల్లా ఈ అల్లరిగుంపు వెంటపడి ఆయన్ని దుర్భాషలాడటం, రాళ్ళురువ్వడం చేసేది. జైద్ బిన్ హారిస్ (రజి) వీలైనంతవరకు దైవప్రవక్త (స)పై రాళ్ళు పడకుండా కాపాడేందుకు ప్రయత్నించారు. కాని ఆయన ఎంతవరకు కాపాడగలరు? ఆ కిరాతకులు విసిరిన రాళ్ళతో దైవప్రవక్త (స), జైద్ (రజి) ఇద్దరూ గాయపడ్డారు.

దైవప్రవక్త (స) ఇక భరించలేక జైద్ (రజి)ను పిలుచుకొని అక్కడ్నుంచి వడివడిగా వెళ్ళిపోయారు. కాని ఆ దుర్మార్గులు అంతటితో ఆయన్ని వదలిపెట్టలేదు. నోటికొచ్చినట్లు దూషిస్తూ, రాళ్ళు రువ్వుతూ పట్నం నుంచి మూడు మైళ్ళదాకా వెంబండించారు.

దైవప్రవక్త (స) దేహం రక్తసిక్తమై పోయింది. నిస్సత్తువగా నడుస్తూ వెళ్ళి ఓ పండ్లతోట నీడలో కూర్చున్నారు ఆయన. తాయిఫ్‌వాసుల పట్ల ఆయన నిరాశచెందారు. అప్రయత్నం గా ఆయన చూపులు నింగివైపు మరలాయి. చేతులు పైకెత్తారు. పెదవుల్లో చలనం ఏర్పడింది. "దేవా! దయాసాగరా! నీవు బలహీనుల స్వామివి. నాస్వామి కూడా నీవే. ప్రభూ! నన్ను ఎవరికి అప్పగించావు? నన్ను చూసి హేళనచేసేవారికి వశం చేశావా? లేక నన్ను లోబరుచుకునే శత్రువుకు నన్ను అప్పగించావా?....."

దేవుని దయాసాగరం పొంగిపొరలింది. తాయిఫ్ పట్టణానికి ఇరు వైపులా రెండు కొండలు ఉన్నాయి. ఆ కొండల పర్యవేక్షకుడైన దైవదూత వెంటనే ప్రత్యక్షమై "ముహమ్మద్! దేవుడు మీప్రార్థన ఆలకించాడు. మీకోసం ఆయన నన్ను పంపాడు. మీరాజ్ఞాపిస్తే తాయిఫ్ పట్టణానికి ఇరువైపులున్న రెండుకొండల్ని కలిపేసి పట్టణాన్ని నుగ్గునుగ్గు చేస్తాను; పట్నం వాసులు తృటిలో సర్వనాశనమవుతారు" అని అన్నాడు.

కాని విశ్వకారుణ్యమూర్తిగా ప్రభవించిన దైవప్రవక్త (స) దానికి అంగీకరించకుండ "వద్దు వద్దు. ఆ పని చేయకండి. ఈనాడు వీళ్ళు ఇస్లాం స్వీకరించకపోతే, రేపు వీరి సంతానమైనా స్వీకరించవచ్చని నాకు ఆశఉంది. అంచేత వీళ్ళను అంతమొందించడం నాకిష్టం లేదు" అని అన్నారు. ఈమాట విన్న తర్వాత దైవదూత అంతర్థానమయ్యాడు.

దైవప్రవక్త (స) అక్కడ్నుంచి జైద్ (రజి)ని తీసుకొని మక్కా తిరుగు ప్రయాణమయ్యారు. చాలా అలసిపోయి విశ్రాంతికోసం ఆ రాత్రి 'నఖ్లా' అనే ప్రదేశంలో ఆగారు. అది అర్థరాత్రి వేళ. దైవప్రవక్త (స) నమాజ్ చేయడం ప్రారంభించారు. మధురమైన కంఠంతో ఖుర్ఆన్ పఠించసాగారు. అప్పుడు జిన్నుల(భూతాల) సమూహం ఒకటి అటుగా వచ్చింది. ఖురాన్ పఠనం వారి చెవులకింపుగా, వింతగా తోచింది. దాంతో వారు ఆగి ఆ వాణిని శ్రద్ధగా ఆలకించారు. అది వారి మనోఫలకాలపై ముద్రించుకుపోయింది. వారు ఖుర్ఆన్ పఠనం విన్న తర్వాత అక్కడ్నుంచి వెళ్ళిపోయి తమ జాతివారికి ఈ సంగతి తెలియజేశారు.

దైవప్రవక్త (స) మక్కా సమీపానికి వచ్చి అవిశ్వాసుల ఆగడాల నుండి తప్పించుకోవ డానికి ముత్యిమ్ రక్షణలో పట్నంలో ప్రవేశించారు. ఆరోజు నుండి ఆయన ఖురైషీయుల నుండి దృష్టిమళ్ళించి ఇతర తెగలలో ధర్మప్రచారం ప్రారంభించారు. మక్కా చుట్టుపక్కల ప్రాంతాలలోని నివసిస్తున్న తెగల దగ్గరకు పోయివారికి దైవసందేశం అందజేయసాగారు.

## (10) గగన పర్యటన (మేరాజ్)

ఓరోజు అర్థరాత్రిన ఉమ్మెహానీ ఇంట్లో నిద్రపోతున్న దైవప్రవక్త (స) ఏదో అలికిడికి లేచారు. చూస్తే దైవదూత జిబ్రీల్ (అలై) ఇంటికప్పు చీల్చుకొని లోపలికి దిగివస్తున్నారు. ఆ దృశ్యం చూసి దైవప్రవక్త(స) నివ్వెరపోయారు. ఆయన ఆశ్చర్యం నుంచి తేరుకున్నారో లేదో జిబ్రీల్ (అలై) వచ్చి ఆయన చేయి పట్టుకొని కాబా వద్దకు తీసికెళ్ళారు. అక్కడ



దివి నుండి దిగిన 'బురాఖ్' అనే విచిత్ర శ్వేతజంతువు ఒకటి నిలబడిఉంది. దైవదూత జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (స)ను దానిపై ఎక్కించి సప్తాకాశాల పర్యటన చేయించారు. దైవప్రవక్త (స) ఈ పర్యటనలో స్వర్గనరకాలు, అక్కడి విశేషాలు చూసి మక్కాకు తిరిగొ చ్చారు. ఇంత సుదీర్ఘప్రయాణం చేసి ఎన్నో వింతలు, విశేషాలు చూసివచ్చినా మక్కాలో ఇంకా తెల్లవారలేదు. కనీసం తూర్పుదిక్కున ఉషోదయ సూచనలు కూడా కానరాలేదు.

తెల్లవారిన తరువాత ఆయన కాబాలయానికి వెళ్ళి రాత్రి జరిగిన అపూర్వ సంఘటన గురించి చెబితే అవిశ్వాసులు విరగబడి నవ్వారు. ఈ పర్యటనలో దైవప్రవక్త (స) తాను బైతిల్‌మఖ్దిస్‌ని కూడా చూశానని చెప్పారు. ఆయన ఇదివరకెప్పుడూ దాన్ని చూడలేదు. ఈసంగతి అవిశ్వాసులకు కూడా తెలుసు. అంచేత ఆయన అక్కడున్న ఒక్కొక్క వస్తువు రూపం, సైజు, రంగు గురించి పూసగుచ్చినట్లు చెబుతుంటే అంతా ఆశ్చర్యపోయారు.

కాని దైవప్రవక్త (స) చెబుతున్న విషయం పూర్తికాకముందే ఖురైష్ నాయకులు తల అడ్డంగా తిప్పుతూ "కాదు కాదు. ఈ విషయాలు నీకు ముందుగానే ఎవరో చెప్పారు. ఇదంతా నువ్వు, నీ సహచరులు కలసి పన్నిన పన్నాగం. ఈ నాటకం మా దగ్గర సాగదు. స్పష్టమైన సాక్ష్యం ద్వారా నిరూపిస్తే తప్ప నీ మాటలు నమ్మం" అని అన్నారు.

దైవప్రవక్త(స) ఈసారి మరింత వివరంగా చెప్పారు. దారిలో తాను ఏమేమి చూసింది, ఏఏ ఊళ్ళు దాటింది, ఏఏ వర్తకబృందాలు తారసపడింది, ఏఏ బిడారాల మీద ఏఏ సామగ్రి ఉంది, అవి మక్కా పట్నానికి ఇంకెంత దూరంలో ఉన్నాయో వివరంగా చెప్పారు. చివరికి వారి ఒంటెల రూపురేఖలు గురించి కూడా వర్ణించారు.

కానిఅప్పటికీ అవిశ్వాసులు నమ్మలేదు." ఈ వివరాలు చెప్పినంత మాత్రాన నిన్ను అప్పుడే ఎలానమ్మాలి? నువ్వు చెప్పే ఆ వర్తకుల్ని రానివ్వు. రాత్రి వారెక్కడున్నారో, వారు నిన్ను కళ్ళారా చూశారోలేదో వారినే అడిగి తెలుసుకుంటాం. నీవు చెప్పిన వర్తకసామగ్రిని మా కళ్ళతో చూసుకుంటేగాని మేము తృప్తిచెందం" అన్నారు వారు.

కొన్నాళ్ళ తరువాత దైవప్రవక్త (స) చెప్పిన వర్తక బిడారాలు వచ్చాయి. అవిశ్వాసులు వర్తకబిడారాల దగ్గరకు పరుగుపరుగున వచ్చి చూస్తే దైవప్రవక్త (స) చెప్పిన సామగ్రే ఉంది. ఒంటెల రూపు రేఖలు కూడా ఆయన వర్ణించినట్లే ఉన్నాయి. వర్తకులు కూడా ఆయన చెప్పినవారే. అవిశ్వాసులు నిశ్చేష్టులయి కొన్ని క్షణాలు తికమక పడ్డారు.

పట్నం తిరిగొచ్చిన ఆ వర్తకులు కూడా ప్రవక్త అనుచరుల నోట మేరాజ్ సంఘటన గురించి విన్నారు. వారిలో కొందరు తాము ఫలానారోజు అర్థరాత్రి ప్రయాణం చేస్తుంటే తమ మీదుగా ఆకాశంలో బర్‌బర్ అని శబ్దంచేస్తూ ఒక వింతవాహనం మెరుపులా దూసుకుపోయిందని, దాన్ని తాము కళ్ళారా చూశామని చెప్పారు. కాని ఈ అనుమాన రోగిష్టులు తోటి అవిశ్వాసులు చెప్పిన ఈ సాక్ష్యాన్ని కూడా నమ్మలేకపోయారు.

మదీనాలో ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య యుద్ధజ్వాలలు ప్రజ్వరిల్లుతున్న రోజులవి. రెండు పక్షాలు సాధ్యమైనంత ఎక్కువ సైనిక బలం సమీకరించుకునేందుకు అరేబియాలోని ఇతర తెగలను తమ పక్షంలో కలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఔస్ పక్షానికి చెందిన

ఓ ప్రతినిధివర్గం ఖురైషీయుల్ని తమ వైపుకు తిప్పుకోవడానికి మక్కా వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) ఆ ప్రతినిధివర్గాన్ని కలుసుకొని దైవవాణి విన్పించి ఇస్లాం స్వీకరించమని కోరారు. కాని సత్యధర్మం ప్రతినిధివర్గంలో అయాస్ అనే యువకుడ్ని మాత్రమే వరించింది.

దైవప్రవక్త (స) వివిధ ప్రాంతాల నుంచి కాబాయాత్ర కోసం వస్తున్న అనేక తెగల్ని కలుసుకొని ఇస్లాం సందేశం విన్పించారు. మరికొన్ని తెగల దగ్గరకు ఆయన స్వయంగా పోయి దైవసందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని అడిగారు. కాని అందరూ ఆయన మాటలు వినీ విననట్లు ఉండిపోయారు. "ముహమ్మద్‌కు సహాయపడితే మనం ఇతర తెగల క్రోధానికి గురికావలసి వస్తుంది. వాళ్ళు మన ప్రాంతానికి రారు. మనల్ని తమ ప్రాంతాలకు రానివ్వరు. మనకు వాళ్ళకు మధ్య ఉన్న వ్యాపారలావాదేవీలు, సామాజిక సాంస్కృతిక సంబంధాలు అన్నీ తెగిపోతాయి" అని భావించారు అనేకమంది.

అందువల్ల ఇస్లాం సత్యధర్మమని, దేవుడు ఆమోదించిన ఏకైక జీవన మార్గమని తెలిసికూడా దాన్ని విశ్వసించడానికి వెనుకంజ వేశారు. మరికొన్ని తెగలు పదవీ, అధికారాల వ్యామోహంతో నూతనధర్మం స్వీకరించడానికి ముందుకు రాలేకపోయాయి.

మక్కాలో దైవప్రవక్త (స) ప్రచారం గురించి మదీనా పరిసర ప్రాంతంలో నివసిస్తున్న గిఫ్ఫార్ తెగవాళ్ళకు కూడా తెలిసింది. ఆ తెగలో దారిదోపిడీని వృత్తిగా చేసుకొని జీవితం గడిపేవారే ఎక్కువమంది ఉన్నారు. అంచేత గిఫ్ఫారీతెగ దోపిడిచేసే తెగ అని పేరు పడింది. ఆ తెగనాయకుడు అబూజర్‌కు విగ్రహాలను పూజించడం సుతరామూ నచ్చేది కాదు. అతను నూతనధర్మం గురించి నిజానిజాలు తెలుసుకోడానికి మక్కా వెళ్ళి కాబాల యంలో బసచేశాడు. కాబాలో రెండుమూడు రోజులు గడిపి, చివరికి అలి (రజి) సహకారం తో దైవప్రవక్త (స)ను కలుసున్నాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూక్తులు పఠించారు. అబూజర్ ఆ సూక్తులు వినగానే "నేను అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను" అంటూ ఇస్లాం స్వీకరించాడు.

తరువాత ఆయన "దైవప్రవక్తా! నేను కాబా వెళ్ళి నలుగురి ముందు సద్వచనం (కలిమా) ప్రకటిస్తాను" అన్నారు. "అలా చేశావంటే ఖురైషీయులు నిన్ను ప్రాణాలతో వదలిపెట్టరు" అన్నారు దైవప్రవక్త(స). దానికి అబూజర్ (రజి) "నేను నా ప్రాణం గురించి భయపడను. ఖురైషీయుల ముందు సద్వచనం ప్రకటించి తీరుతాను" అని అన్నారు.

అనడం ఏమిటీ వెంటనే ఆయన కాబా వెళ్ళి "అల్లాహ్ తప్ప వేరేఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను"అని ఎలుగెత్తి చాటారు. అంతే, ఖురైషీయులు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. పిడిగుద్దులతో, తన్నులతో ఆయన్ని తీవ్రంగా కొట్టసాగారు. అంతలో ప్రవక్త పినతండ్రి అబ్బాస్ జోక్యం చేసుకుంటూ "అరెరె! ఇతడ్ని కొడ్తారేమిటీ! ఇతను గిఫ్ఫార్ తెగ మనిషయ్యా బాబూ! గిఫ్ఫార్‌తెగ ఉండే ప్రాంతం గుండానే మీ వర్తక బిడారాలు సిరియా నుంచి వస్తుంటాయి" అన్నారు.

ఈ మాట వినగానే ఖురైషీయులు అబూజర్ గిఫ్ఫారీ (రజి)ని కొట్టడం ఆపి పక్కకు తప్పుకున్నారు. అబూజర్ (రజి) రక్తసిక్త దేహంతో దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగిన



వృత్తాంతం తెలియజేశారు. అది విని దైవప్రవక్త (స) "నేను చెప్పలేదూ ఖురైషీయులు అంతపని చేస్తారని?" అని అన్నారు. "పరవాలేదు నేను వారి దెబ్బలకు భయపడేవాడ్ని కాను. రేపుకూడా వెళ్ళి వారిముందు సద్వచనం ప్రకటిస్తాను" అన్నారు అబూజర్ (రజి).

అన్నట్టే ఆయన రెండవరోజు కూడా కాబా వెళ్ళి అందరి ఎదుట సద్వచనం (కలిమా) ప్రకటించారు. అది వినగానే ఖురైషీయులు మళ్ళీ ఆయన మీద విరుచుకుపడి కొట్టారు. అయితే నిన్న అబ్బాస్ అన్న మాటలు గుర్తుకొచ్చి వదిలేశారు. అబూజర్ గిఫ్ఫారీ (రజి) రక్తసిక్త దేహంతో దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగిన సంగతి చెప్పారు. తరువాత ఆయన సెలవు తీసుకొని మదీనా వెళ్ళిపోయారు.

అబూజర్ (రజి) స్వస్థలం చేరుకోగానే తనతెగవాళ్ళను సమావేశపరిచి వారికి విషయం వివరించి ఇస్లాం స్వీకరించమని చెప్పారు. గిఫ్ఫార్‌తెగవాళ్ళు నాయకుని ఆజ్ఞ పాటిస్తూ వెంటనే ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. అబూజర్ (రజి), ఆయన అనుచరులు యథాప్రకారం దారిదోపిడీలు చేస్తునేఉన్నారు. దైవప్రవక్త (స) అప్పటివరకు అవతరించిన దైవాజ్ఞలు మాత్రమే తెలియజేసి దారిదోపిడి సంగతి ప్రస్తావించలేదు. అందువల్ల గిఫ్ఫార్ తెగవాళ్ళు బ్రతుకుతెరువు కోసం దారిదోపిడి మానుకోలేకపోయారు. అయితే బాటసారుల సొమ్ము దోచుకున్న తర్వాత ఇస్లాం స్వీకరిస్తే తాము దోచుకున్న సొమ్ము తిరిగిచ్చేస్తామని చెప్పేవారు. ఆవిధంగా వారు కొందరిని ముస్లింలుగా మార్చగలిగారు.

ఆరోజుల్లోనే యమన్‌లోని సుప్రసిద్ధ అజ్దితెగ నాయకుడు, ప్రఖ్యాత మాంత్రికుడయిన జిమాద్; దౌసీతెగ నాయకుడు, ప్రముఖమేధావి, కవి అయిన తుఫైల్ బిన్ అమ్ర్ కూడా ఇస్లాం స్వీకరించారు. ఆ నాయకుల ద్వారా వారితెగల ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించారు.

## (11) ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య చిచ్చు

మదీనాలో ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య చాలాకాలం నుంచి యుద్ధజ్వాలలు ప్రజ్వరిల్లు తుండేవి. పొరుగున ఉన్న యూదులు ఈ అగ్నికి ఆజ్యంపోసేవారు. వారు ఔస్, ఖజ్రజ్ తెగల మధ్య అపార్థాలు, విద్వేషాలు రేకెత్తించి, తమ జోలికిరాకుండా ఎల్లప్పుడూ వారిలో వారే కలహించుకునేలా చేశారు. దాంతో ఆ రెండుతెగలు ప్రతిచిన్న విషయానికి తగవులు పెట్టుకొని ఏండ్ల తరబడి సమరజ్వాలలు రగుల్చుకునేవారు. యూదులు అప్పటికీ తృప్తి చెందలేదు. ఔస్, ఖజ్రజ్‌లను మరింత బలహీనపరచి ఓడిన తెగతో విరోధం పెట్టుకొని, గెలిచిన తెగను ఉసిగొల్పేవారు. వ్యాపారాది ముఖ్య వ్యవహారాల్లో కీలకమైన పనులు తమ చేతుల్లో ఉంచుకొని, లాభాలు అంతగా ఉండని చిన్నచిన్న పనులు ఔస్, ఖజ్రజ్‌లకు వదలిపెట్టేవారు. ఇలా యూదులు వారిపై పెత్తనం చెలాయించసాగారు.

ఈ యూదులు మూసాప్రవక్త (అలై) అనుచరులు. అంచేత వారు తమ గొప్పతనాన్ని మహాగర్వంగా చెప్పుకునేవారు. ఔస్, ఖజ్రజ్‌లను నీచంగా చూస్తూ, వారి ఎదుట కర్మల పర్యవసానం గురించి భయంకరంగా చిత్రీకరించేవారు. అదీగాక అంతిమ దైవప్రవక్త గురించి తమ గ్రంథాల్లో ఉన్న భవిష్యత్ ప్రకటనలు విన్పిస్తూ "త్వరలోనే ఒక దైవప్రవక్త రాబోతున్నాడు. మేమంతా ఆయన పక్షం ఉంటాం. అప్పుడు మీకు ఎలాంటి గతి పడ్తుందో ఊహించుకోండి" అని చెప్పేవారు. ఈవిధంగా అనేక సంవత్సరాలు గడిచాయి.

ఔస్ ప్రతినిధివర్గం ఖురైషీయులను తమ పక్షంలోకి కలుపుకోవడానికి మక్కా వచ్చి నప్పుడు దైవప్రవక్త (స) ఔస్ వారికి దైవసందేశం అందజేశారు. ప్రతినిధివర్గంలోని ఆయాస్ బిన్ ముఆజ్ (రజ) అప్పటికప్పుడే ఇస్లాం స్వీకరించి ముస్లిం అయ్యారు. కాని మిగతా సభ్యులు దైవప్రవక్త (స)ను విశ్వసించడానికి ముందుకు రాలేదు. అప్పుడు వారికి యుద్ధం తప్ప మరోధ్యాస లేదు. కాని మదీనా తిరిగొచ్చిన తరువాత ప్రవక్తప్రవచనాలు వారి హృదయాలను ప్రభావితం చేశాయి. అయితే అవి ఒక రూపం దాల్చకముందే ఔస్, ఖజ్రజ్‌ల మధ్య మళ్ళీ యుద్ధ జ్వాలలు చెలరేగాయి. కొన్నిరోజుల్లోనే రణరంగం భీకరంగా మారింది. ఇక రెండుమూడు రోజుల్లో తమ సర్వస్వం యుద్ధాగ్నికి బలై, తాము కూడా భస్మీపటలం కాబోతున్న తరుణంలో అదృష్టం కలిసొచ్చి ఔస్‌తెగకు యూదులు తోడ్పడ్డారు. వారి సహాయంతో విజయం సాధించారు. యుద్ధజ్వాలలు చల్లారిపోయాయి.

అప్పుడు రెండుతెగల ప్రజలు తమ తమ పరిస్థితులపై దృష్టి సారించారు. ఎంతో ప్రాణనష్టం జరిగింది. అంతులేనిఆస్తులు యుద్ధాగ్నికి ఆహుతిఅయ్యాయి. మదీనాలో వారి పలుకుబడి తగ్గిపోయింది. తాము యూదులకు బానిసలైనట్లు భావించారు. చివరికి గెలిచిన తెగ కూడా యూదులకు లోకువయ్యింది. యుద్ధం వల్ల ఏతెగకూ లాభంకలగ లేదు. బయట ఉండి తమాషా చూసిన యూదులు మాత్రం ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకున్నారు. యుద్ధం తెచ్చిన భయంకర దుష్ఫలితాలతో రెండు తెగలకు కనువిప్పు కలిగింది. విడిపోయినందువల్ల జరిగిన నష్టం ఏమిటో అర్థమయింది. దాంతో "ఇకనుంచి మనమంతా కలసికట్టుగా ఉందాం. పరస్పరం సహాయసహకారాలు అందజేసుకుందాం" అని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు రెండు తెగల మధ్య ఒప్పందం జరిగింది. రెండు తెగలకు కలిపి ఒకే నాయకుడు ఉండాలని కూడా నిశ్చయించుకున్నారు.

అప్పుడు వారిదృష్టి ఖజ్రజ్ తెగకు చెందిన అబ్దుల్లా బిన్ ఉబై మీద పడింది. అతను ప్రజల్లో పలుకుబడి కలవాడు. అంచేత అతని నాయకత్వాన్ని అందరూ ఆమోదించారు. పట్టాభిషేకం సమయంలో విలువైన కిరీటంతో అతడ్ని సత్కరించి ఊరేగింపు తీయాలని కూడా అనుకున్నారు. కాని అంతలో పరిస్థితులు మారిపోయాయి. ఔస్, ఖజ్రజ్ తెగలకు వారనుకున్న దానికంటే ఎక్కువ గౌరవం, వైభవం వచ్చే ఏర్పాట్లు ఒనగూడనారంభించాయి. దైవకారుణ్యం దైవప్రవక్త రూపంలో అవతరించే శుభతరుణం ఆసన్నమయింది.

నబవీశకం 10వ ఏట మదీనా నుండి ఖజ్రజ్ తెగ మనుషులు ఆర్గురు కాబాయాత్ర నిమిత్తం మక్కాకు బయలుదేరారు. వారికి బనూనజ్జార్ తెగకు చెందిన ఇద్దరువ్యక్తులు తోడయ్యారు. అందరూ మక్కా సమీపంలోని అఖ్బా ప్రదేశానికి చేరుకొని మజిలీ చేశారు. ప్రజలకు దైవసందేశం అందజేయడానికి బయలుదేరిన దైవప్రవక్త (స)కు అఖ్బాలో వీరు తారసపడ్డారు. ఆయన వారికి ఇస్లాంపరిచయం చేసి, దేవుడు తననుప్రవక్తగా నియమించి తనకు దివ్యసందేశం అందజేస్తున్నాడని చెప్పి, కొన్ని ఖుర్ఆన్ సూక్తులు విన్పించారు.

దైవవాణి వారి హృదయవీణను మీటింది. "యూదులు త్వరలో ఒక ప్రవక్త ప్రభవించ బోతున్నాడని, ఆయన సహాయంతో మనల్ని అణచివేస్తామని భయపెడుతూ వచ్చారు. అలా వారు భయపెడ్తున్న ప్రవక్త నిస్సందేహంగా ఈయనే. దైవసాక్షి! ఇక వారు ప్రవక్త



పట్ల విశ్వాసంలో మనల్ని మించిపోలేరు" అన్నారు వారు అప్రయత్నంగా. తర్వాత వారు ఇస్లాంని విశ్వసిస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత వారు ఎంతో ఉత్సాహంతో హజ్‌చేసి మదీనా తిరుగు ప్రయాణమయ్యారు.

తర్వాత నబవీశకం 11వ ఏట హజ్‌దినాలు సమీపించగానే ఔస్, ఖజ్రజ్ తెగలకు చెందిన పన్నెండుమంది వ్యక్తులు మక్కా బయలుదేరి అఖ్బా ప్రదేశంలో విడిదిచేశారు. ఇక్కడే దైవప్రవక్త (స) వీళ్ళను కూడా కలుసుకొని ఖుర్ఆన్‌లోని కొన్ని సూక్తులు విన్పించి, వారిని ఇస్లాంవైపు పిలిచారు. వారు వెంటనే ఇస్లాం స్వీకరించారు. తర్వాత వారంతా ప్రమాణం చేసి ఇకముందు దైవానికి సాటికల్పించమని, దొంగతనానికి దూరంగా ఉంటా మని, వ్యభిచారం చేయమని, సంతానాన్ని చంపుకోమని, ఇతరుల మీద అపనిందలు మోపమని దైవప్రవక్త (స) ఎదుట శపథం చేశారు. దీన్ని "అఖ్బా శపథం-1" అంటారు.

హజ్ చేసిన తర్వాత వారు తిరిగి మదీనా బయలుదేరారు. మదీనా ప్రజలకు ఖుర్ఆన్ వాణి విన్పించడానికి, ఇస్లాం గురించి వివరించడానికి, దైవాజ్ఞలను నేర్పడానికి దైవప్రవక్త (స) వారివెంట ముస్అబ్ బిన్ ఉమైర్ (రజ)ని పంపారు. ముస్అబ్ (రజ) మదీనా చేరుకొని అసద్ బిన్ జరారా (రజ) ఇంట్లో విడిదిచేశారు. ఆ ఇంటినే ప్రచారకేంద్రంగా చేసుకొని పని ప్రారంభించారు. దాంతో మదీనాలో ఇస్లాం వేగంగా విస్తరించసాగింది. ఎంతోకాలం నుంచి సత్యపిపాసతో అలమటిస్తున్న మదీనావారికి ఇస్లాం శాంతి ప్రసాదిం చింది. ఖుర్ఆన్ సూక్తులు వినగానే పాషాణహృదయాలు సైతం మైనంలా కరిగిపోసాగాయి.

ఔస్‌తెగలో బనీఅబ్దుల్ అష్‌హల్, బనీజఫర్ అనే రెండు ఉప తెగలున్నాయి. సాద్ బిన్ ముఆజ్ బనీఅబ్దుల్ అష్‌హల్ ఉపతెగ నాయకుడేగాక, ఔస్‌తెగలోని ఉపతెగలన్నిటికీ అగ్రనాయకుడిగా ఉన్నాడు. ఉసయ్యిద్ బిన్ హుజైర్ జఫర్‌తెగకు నాయకుడిగా ఉన్నాడు. ముస్అబ్ (రజ) నేర్పుగా వారిద్దర్నీ ఇస్లాం స్వీకరించేలా చేశారు. దాంతో వారిద్దరి ద్వారా ఆ రెండు ఉపతెగల ప్రజలంతా ఇస్లాం స్వీకరించారు.

మదీనాప్రజల అదృష్టమే అదృష్టం! స్వజాతి ప్రజలే దైవప్రవక్త (స)ను అంతమొందించ డానికి పూనుకున్న క్లిష్టపరిస్థితిలో మదీనావాసులు ఇస్లాంజ్యోతిని నలుదిశలా ప్రసరింప జేస్తూ ఆయన కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయసాగారు. ఫలితంగా మక్కాలో ఏండ్ల తరబడి ప్రయత్నించినా జరగనంతటి ధర్మపరివర్తన మదీనాలో ఒక్క ఏడాదిలోనే జరిగి పోయింది. నబవిశకం 12వ ఏడు. ఓరోజు మదీనా నాయకులు సమావేశమై దైవప్రవక్త (స)కు పూర్తి సహాయసహకారాలు అందజేయాలని, ఆయన్ని శత్రువుల బారినుండి రక్షించ డానికి అవసరమైతే ప్రాణాలైనా అర్పించడానికి వెనుకాడరాదని నిశ్చయించుకున్నారు.

మదీనా ప్రజలకు ఇస్లాం శిక్షణ ఇవ్వడానికి నియమించబడిన ముస్అబ్ బిన్ ఉమైర్ (రజ) మక్కాకు తిరిగొచ్చారు. మదీనాప్రజలు ఇస్లాంపట్ల చూపుతున్న అసక్తి, ఆదరాభిమా నలు, ప్రవక్తను కాపాడడానికి వారు తీసుకున్న నిర్ణయాలు వగైరా విషయాలన్నీ ఆయన దైవప్రవక్త (స)కు తెలియజేశారు.

నబవీశకం 12వ ఏట చివరి నెల. హజ్ దినాలు సమీపించాయి. మదీనా నుంచి ఓ పెద్ద యాత్రికాబృందం మక్కా చేరుకుంది. అక్కడ ముస్లిం యాత్రికులు కాబాలో దైవప్రవక్త

(స)ను కలుసుకొని శపథం చేయడానికి అనువైన ప్రదేశం నిర్ణయించుకున్నారు. దాని ప్రకారం నిర్ణీత ప్రదేశంలో వారు ఇస్లాం కోసం, దైవప్రవక్త (స) కోసం ప్రాణత్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉంటామని దైవప్రవక్త (స) చేతిలో చేయివేసి ప్రమాణం చేశారు. ఆ తరువాత వారు ఖురైషీయుల కళ్ళుగప్పి మదీనా వెళ్ళిపోయారు.

## (12) మదీనా వలస, హత్యా ప్రయత్నం

అఖ్బా శపథానికి సంబంధించిన సంఘటన తర్వాత మక్కాలో ముస్లింలపై ఖురైషీయుల హింసాదౌర్జన్యాలు మరింత ఎక్కువైపోయాయి. అప్పుడు దైవప్రవక్త (స) ముస్లింలకు మదీనా వలసపొమ్మని అనుమతి ఇచ్చారు. ఈ అనుమతి లభించగానే నబవీశకం 13వ ఏట ముస్లింలు రహస్యంగా రాత్రివేళల్లో జట్లుజట్లుగా బయలుదేరి మదీనా దారిపట్టారు.

ఈవిధంగా కొందరు మక్కాలో తమ ఇండ్లు ఖాళీచేసి వెళ్ళిపోగానే ఖురైషీయులకు మళ్ళీ గుబులు పుట్టింది. ముస్లింలు ఇప్పుడు మదీనాని ధార్మిక కేంద్రంగా చేసుకొని అక్కడ్నుంచి తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తారని గ్రహించారు. అంతేకాదు, మదీనాలో ఇప్పటికే చాలామంది ముస్లింలయి పోయారని, మక్కా ముస్లింలు కూడా అక్కడకు చేరుకుంటే ఈ ఉద్యమం తమకు పెద్ద ప్రమాదం తెచ్చిపెడ్తుందని భావించారు. అందువల్ల ఖురైషీయులు మక్కా నుండి వెళ్తున్న ముస్లింలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు.

ప్రారంభంలో వారు మక్కానుండి వెళ్ళిపోయిన ముస్లింల ఖాళీఇండ్లను తగలబెట్టారు. కాని దానివల్ల ప్రయోజనం కన్పించక పోవడంతో వారు పట్నం వెలుపల అనేక చోట్ల కొందరిని కాపలా పెట్టించారు. రాత్రివేళ రహస్యంగా బయలుదేరే ముస్లింలను వారు అటకాయించి వారి సొమ్ముల్ని, సామగ్రిని లాక్కొని వేధించడం మొదలెట్టారు.

అవిశ్వాసులు ఎన్ని అవరోధాలు కలిగించినా అనేకమంది ముస్లింలు మక్కా నుండి మదీనా వెళ్ళిపోవడంలో సఫలీకృతులయ్యారు. హజ్రత్ ఉమర్ (రజి)) విశ్వాసులైన తన బంధుమిత్రులతో కలసి ఇరవై ఒంటెలపై బహిరంగంగానే మక్కా నుండి వెళ్ళిపోయారు. అవిశ్వాసులెవరూ ఆయన్ని అడ్డగించలేదు. ఈవిధంగా దాదాపు ముస్లింలంతా ఇళ్ళూ వాకిళ్ళూ వదలి మదీనా వెళ్ళిపోయారు. ఇక కొందరు మాత్రమే మక్కాలో మిగిలిపోయారు. వారిపై అవిశ్వాసుల దౌర్జన్యాలు మరింత అధికమైపోయాయి.

మదీనా వలసపోయిన తరువాత ముస్లింలకు ధర్మప్రచారం చేయడానికి మంచి అవకాశం లభించింది. జనం ఇస్లాంలోని మంచిని గమనించి దాని వైపు వేగంగా ఆకర్షించ బడుతున్నారు. ఇదంతా గమనించిన ఖురైషీయులు వణికిపోయారు. నలువైపుల నుంచి కష్టాల కారుమేఘాలు ముంచుకొస్తున్నాయని, తమకు ముస్లింలకు మధ్య భీకరయుద్ధం జరిగే సూచనలు కన్పిస్తున్నాయని భావించి హడలిపోయారు. దాంతో వారు 'దారున్నద్వా'లో సమావేశమై చర్చలు జరిపారు. అప్పుడు అబూజహల్ మాట్లాడుతూ ఇలా అన్నాడు:

"మనం ప్రతితెగ నుండి ధైర్యసాహసాలుగల ఒక్కొక్క యువకుడ్ని ఎన్నుకొని వారందరికీ తలా ఓఖడ్గం ఇవ్వాలి. అవకాశం చూసి అందరూ ఒకేసారి ముహమ్మద్‌పై విరుచుకుపడాలి. ఇలా అతని చరిత్ర సమాప్తమవుతుంది. మనకు శాశ్వతంగా మనశ్శాంతి లభిస్తుంది.



మన యువకులు అన్ని తెగలకు చెందినవారయినందున హత్యానేరం అందరి మీదా ఉంటుంది. హాషిం సంతతివాళ్ళు ఏకమై తెగలన్నిటిని ఎదిరించి పోరాడలేరు. చివరికి గత్యంతరంలేక రక్తపరిహారం క్రింద వంద ఒంటెలు తీసుకోవడానికి ఒప్పుకుంటారు."

ఈ అభిప్రాయంతో అందరూ ఏకీభవించి కార్యరంగంలోకి దిగారు. ఖురైషీయులు దైవప్రవక్త (స)ను అంతంచేయడానికి ఒక పథకం రూపొందించారు. తేదీ, సమయం కూడా నిర్ణయమైపోయింది. అయితే దైవప్రవక్త (స) వారి దురుద్దేశం పసిగట్టి అబూబకర్ (రజి)ని తీసుకొని రెండుమూడు రోజులు సౌర్ గుహలో దాక్కొని ఆ తరువాత మదీనా దారిపట్టాలని నిర్ణయించుకున్నారు.

సౌర్‌గుహ మక్కాకు దక్షిణదిశగా మూడు మైళ్ళ దూరాన యమన్‌కు పోయే దారిలో ఉంది. మదీనా ఉత్తరం వైపుంది. మక్కా వదలిన ముహమ్మద్ (స) మదీనా దారిపడ్తారని తలచి ప్రతివాడూ ఉత్తరం దిక్కుగా పరుగెడుతాడు. ఇలా దైవప్రవక్త తమను వెంబడించే వారికి తామెటుపోయిందో కూడా అర్థంకాని విధంగా పథకం రూపొందించారు.

ఖురైషీయుల నిర్ణీత తేదీ రానేవచ్చింది. నలువైపులా చీకటి తెరలు అలుముకున్నాయి. గాడాంధకారంలో మక్కానగరం మౌనముద్ర దాల్చింది. సత్యతిరస్కారులు కారుణ్యమూర్తి (స) ఇంటిని చుట్టుముట్టారు. స్త్రీలుండే ఇండ్లలో దౌర్జన్యంగా జొరబడటం బహుదైవారాధకులు కూడా తలవంపుగా భావించేవారు. అందువల్ల శత్రువులు బయటనే మాటువేసి ముహమ్మద్ (స) ఎప్పుడు బయటికి వస్తే అప్పుడు మూకుమ్మడిగా మీదపడి ఆయన్ని ముక్కలు ముక్కలుగా నరికివేద్దామని కాచుకొని కూర్చున్నారు.

అప్పుడు ఇంట్లో దైవప్రవక్త (స)తో పాటు అలి (రజి) కూడా ఉన్నారు. అన్ని విషయాలు అలి (రజి)కి వివరంగా చెబుతూ "అలీ! ఇదీ విషయం. జాగ్రత్తగా మసలుకోవాలి. తెల్లవారగానే మనింట్లో భద్రపరచిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకు ఇచ్చెయ్యి. ఆ తరువాత బయలుదేరి మదీనా వచ్చెయ్యి" అని అన్నారు.

ఏమిటా వస్తువులు? ఇతర ప్రజలతోపాటు బద్ధవిరోధులు సైతం తన వద్ద దాచుకున్న ధన కనక వస్తువులు. ముహమ్మద్ (స)ను దైవప్రవక్తగా అంగీకరించకపోయినా ఆయన విశ్వసనీయుడు, నిజాయితీపరుడు, సత్యసంధుడు అని శత్రువులు కూడా నమ్ముతారు. అంచేత వారు తమ విలువైన వస్తువుల్ని దైవప్రవక్త (స) దగ్గర భద్రపరచుకొని సేఫ్టీలాకర్‌లో దాచుకున్నట్లు గుండెలమీద చేయివేసుకొని మరీ తృప్తిచెందుతారు. ఇలా దాచబడిన వస్తువులు అనేకం ఉండటంవల్ల ఆయన అలి (రజి)ని తనవెంట తీసుకొనిపోకుండా ఎవరి వస్తువులు వారికి అప్పగించేవరకు మక్కాలోనే ఉండమని చెప్పారు.

తరువాత ఆయన బయటికి వచ్చి నేల మీది మన్ను కొంచెం చేతిలోకి తీసుకున్నారు. దాన్ని అవిశ్వాసులపై విసిరేసి ఖుర్‌ఆన్‌లోని యాసీన్ సూరా పఠిస్తూ వారి మధ్య నుంచే వెళ్ళిపోయారు. కాని అవిశ్వాసులెవరూ ఆయన్ని చూడలేకపోయారు.

అవిశ్వాసులు బయట దైవప్రవక్త (స) కోసం తెల్లవారేదాకా ఎదురుచూసి చివరికి తలుపు సందు గుండా లోపలికి తొంగిచూస్తే, అలి (రజి) దుప్పటి తొలగించుకుంటూ

పడక మీదనుంచి లేవడం కన్పించింది. శత్రువులు నిర్ఘాంతపోయారు. పథకం భగ్నం కావడంతో ఖురైషీయులు అలి (రజి) మీద విరుచుకుపడ్డారు. ఆయన్ని బయటికి ఈడ్చుకు పోయి ముహమ్మద్ (స) ఎక్కడకి పోయాడో చెప్పమంటూ అమానుషంగా కొట్టారు. కాని ఎంత కొట్టినా అలి (రజి) తనకేమీ తెలియదనే చెప్పారు. దాంతో అవిశ్వాసులు బుసలుకొడ్తూ అలి (రజి)ని కాబాలో నిర్బంధించి హింసించడం మొదలెట్టారు. ఆఖరికి కొందరు బంధువుల జోక్యంవల్ల అలి (రజి) ప్రాణం దక్కింది.

## (13) ప్రవక్త కోసం గాలింపు

మహాప్రవక్త ముహమ్మద్ (స) శత్రువుల కళ్ళుగప్పి నగరం నుంచి బయటపడ్డారు. కొంతదూరం నడచిన తర్వాత విడనాడని బంధమేదో పెనవేసుకోగా అప్రయత్నంగా వెనక్కి తిరిగిచూశారు. ఆకాశదీపాల క్రింద తన ప్రియనగరం ఎంతో శోభాయమానంగా కన్పించింది. ఒక్కసారిగా గతస్మృతులు గుర్తుకొచ్చి హృదయం ఇలా విలపించింది:

"మక్కా నగరమా! ప్రపంచనగరాలన్నిటిలో నీవే దేవునికి అత్యంత ప్రియమైనదానవు. నాక్కూడా నీవే నగరాలన్నిటి కంటే ఎక్కువ ప్రియమైనదానవు. బహుదైవారాధకులు బహిష్కరించకపోతే నేను నిన్ను ఎన్నటికీ వీడిపోయేవాడ్ని కాను."

స్వస్థలం ఎడబాటుతో పొరలివచ్చిన ఆవేదనను బలవంతంగా దిగమింగి కర్తవ్యోన్ముఖులయ్యారు దైవప్రవక్త (స). చీకటిలో చరచరా నడవసాగారు. కొంతదూరం పోయిన తర్వాత మరోదారి నుంచి ప్రియసహచరుడు అబూబకర్ (రజి) వచ్చి కలుసుకున్నారు. ఇద్దరూ వేగంగా అడుగులేస్తూ 'సౌర్' గుహకు చేరుకున్నారు. కాస్సేపటికి ఓ సాలెపురుగు వచ్చి గుహముఖంపై గూడుఅల్లింది. ఆతర్వాత ఎటు నుంచో రెండు పావురాళ్ళు వచ్చి గుహద్వారం ముందు కిచకిచమంటూ ఎగరసాగాయి.

అటు ఖురైషీయులు ఎలాగైనా దైవప్రవక్త (స)ను పట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వారికి అడుగుజాడల్ని గుర్తించే కుర్జ్ బిన్ అల్ఖమా దొరికాడు. మరునాడు మధ్యాహ్నం వారు ఈలలు, అరుపులతో కర్రలు, కటారులు తిప్పుకుంటూ కుర్జ్ వెంట వచ్చారు. కుర్జ్ జాగ్రత్తగా దారిలో పాదచిహ్నాలు చూసుకుంటూ కొండ మీదికి ఎక్కాడు. ఖురైషీయులు అతని వెనకాలగా నడుస్తున్నారు. కుర్జ్ కొండ మీదికి పోయి హఠాత్తుగా ఒకచోట ఆగాడు. తర్వాత ఎటుపోవాలో అర్థంగాక అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు. అతని వాలకం చూసి ఖురైషీయులకు ఆశ్చర్యం కలిగింది.

ఖురైషీయులు గుహవైపు వడివడిగా నడవసాగారు. వారిలో ఒక యువకుడు వేగంగా గుహవైపు పరుగెత్తాడు. కాని గుహ ఇంకా కొన్నిగజాల దూరముందేమో, ఆగిపోయాడు. రెండు క్షణాలు అయోమయంగా చూసి వెనక్కి మరిలాడు. వెనకాల అక్కడికి చేరుకున్న ఖురైషీయులు అతడ్ని ఆశ్చర్యంగా చూస్తూ "ఏమైంది వెనక్కి తిరిగావు గుహలోకి తొంగయినా చూడకుండా" అని అడిగారు.

"ఏం చెప్పను? బహుశా అప్పటికి ముహమ్మద్ పుట్టనైనా పుట్టిఉండడు. అప్పటి నుంచి గుహ మీద ఓ పెద్ద సాలెగూడు అల్లుకొని ఉంది. గుహ బయట రెండు పావురాళ్ళు



గుడ్లుపెట్టి ఎగురుతున్నాయి. దారిలో ఓ పెద్ద చెట్టు కూడా ఉంది. ఇక అలాంటి గుహలో మనుషులు ఉంటారని ఎలా అనుకోను?" అన్నాడా యువకుడు రొప్పుతూ. ఆ యువకుని మాటలు విని ఖురైష్ నాయకుల ముఖాలు జావగారి పోయాయి. చివరికి అందరూ నిస్సత్తువతో కాళ్ళీడ్చుకుంటూ ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు.

అవిశ్వాసులు తనను ఇంకా వెంటాడుతూ ఉండవచ్చని దైవప్రవక్త (స) మూడు రోజుల దాకా సౌర్‌గుహలోనే ఉండిపోయారు. మరునాడు సాయంత్రం అబూబకర్ (రజి) కొడుకు అబ్దుల్లా (రజి), ఆయన వెంట అస్మా (రజి), ఆమిర్‌లు వచ్చారు. వారి వెనకాల ఇబ్నెఅర్ఖత్ ఒంటెలను తోలుకొచ్చాడు. ఇబ్నెఅర్ఖత్ అబూబకర్ (రజి)కు ఎంతో నమ్మకస్తుడు. అందువల్ల అబూబకర్ (రజి) అతనికి కొంత పైకం ముట్టజెప్పి తమను నిర్జనప్రాంతం గుండా మదీనా తీసికెళ్ళటానికి మార్గదర్శిగా కుదుర్చుకున్నారు.

దైవప్రవక్త (స) ఒకఒంటె మీద, ఆయన సహచరుడు మరోఒంటె మీద కూర్చున్నారు. ఇబ్నెఅర్ఖత్ తన సొంత ఒంటె మీద కూర్చున్నాడు. అబూబకర్ (రజి) తన వెనుక సేవకుడు ఆమిర్‌ని కూర్చోబెట్టుకున్నారు. అలా ఈ నలుగురూ కలసి నబవీ శకం 14వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ ఒకటో తేదీ (క్రీ.శ. 16-9-622)న ఇబ్నెఅర్ఖత్ సారథ్యంలో నిర్మానుష్యంగా ఉన్న తీరప్రాంతం గుండా ప్రయాణమయ్యారు.

మక్కా అవిశ్వాసులు దైవప్రవక్త (స) కోసం వెతికి వెతికి వేసారిపోయారు. చివరికి ఆయన్ని పట్టితెచ్చినవారికి వంద ఒంటెల బహుమానం ఇస్తామని ప్రకటించారు. బహుమానం కోసం చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు. చివరికి సురాఖా బిన్ మాలిక్ అనే వ్యక్తి తాను తీరం వెంబడి ప్రయాణం చేస్తున్నట్లు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకొని గుర్రం ఎక్కి బయలుదేరాడు.

గుర్రం తీరప్రాంతంలో కొంతదూరం కూడా పరుగెత్తలేదు, అంతలో ఒక్క కుదుపు కుదిపేసింది. ఆ కుదుపుకు సురాఖా నేలకొరిగేవాడే కాని, కళ్ళెంగట్టిగా పట్టుకొని ఎలాగో గుర్రాన్ని అదుపులోకి తెచ్చుకున్నాడు. తర్వాత కళ్ళెం వదలగానే అది గాలిలో దూసుకుపోయింది. కొంతదూరం పరుగెత్తిన తరువాత మళ్ళీ అమాంతం కుదిపేసింది. సురాఖా అధైర్యం చెందలేదు. గుర్రాన్ని నేర్పుగా అదుపులోకి తెచ్చుకొని అదిలించాడు. ఈసారి అది మరింత శరవేగంతో పరుగుతీసింది. దాని వేగం చూస్తుంటే సురాఖాకు భయం, తత్తరపాటు కలిగాయి. అయినా పట్టుదలతో ప్రయాణం సాగించాడు.

ప్రవక్త (స) ప్రయాణం ఒక రాత్రి, ఒక పగలు నిరాటంకంగా సాగింది. శత్రువులెవరూ వెంటాడుతున్న సూచనలేమీ లేకపోవడంతో నిశ్చింతగా ప్రయాణిస్తున్నారు. మరుసటిరోజు సాయంత్రం ప్రవక్తబృందం ప్రయాణం కొనసాగించడానికి సిద్ధమయింది. అంతలో అబూబకర్(రజి) దృష్టి దక్షిణదిక్కు వైపుగా మళ్ళింది. ఎవరో ఒకతను గుర్రంమీద వేగంగా ఇటువైపే వస్తున్నాడు. దాంతో అబూబకర్ (రజి) గుండెలు దడదడ లాడిపోయాయి.

సురాఖా మరికాస్త దగ్గరయ్యాడు. గుర్రం మరింతవేగంగా పరుగెత్తసాగింది. కాస్సేపటికి ఒక్క పల్టీకొట్టింది. దాంతో గుర్రం ముందుకాళ్ళు మోకాళ్ళదాకా నేలలో కూరుకుపోయాయి. ఆ ఊపుకు సురాఖా ఇసుకలో బోర్లాపడ్డాడు. ఇప్పుడు సురాఖా ధైర్యం పూర్తిగా సన్నగిల్లింది.

అతనికి కనువిప్పు కలిగింది. ఆలోచిస్తే ఇవన్నీ అపశకునాలే అన్పించాయి. దాంతో అతను తాను చేయబోయే పని దేవునికి ఇష్టం లేదు కాబోలు అనుకున్నాడు. అంచేత సురాఖా అక్కడే ఆగి దైవప్రవక్త (స)ను, ఆయన సహచరుల్ని కేకవేసి "నేను మాలిక్ బిన్ జూషమ్ కొడుకు సురాఖాను. కొంచెం ఆగండి, మీతో మాట్లాడాలి. నేను మీకు ఎలాంటి హాని తలపెట్టను. నామాట నమ్మండి" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఈమాట విని సురాఖా కోసం దైవాన్ని ప్రార్థించారు. దాంతో ఇసుకలో కూరుకుపోయిన గుర్రం బయటపడింది. అతను దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చాడు. ఆయన ముఖం చూడగానే సురాఖా మనసులో ఆయనపట్ల ఎనలేని గౌరవభావం ఏర్పడింది. "దైవప్రవక్తా! ఖురైషీయులు మిమ్మల్ని పట్టితెచ్చేవారికి వంద ఒంటెలు బహుమానం ఇస్తామని ప్రకటించారు. ఆ బహుమానం కోసం అనేకమంది మిమ్మల్ని పట్టుకోవడానికి పట్నం నలుదిక్కులా పరుగెత్తారు. వందఒంటెల పేరాశ నన్ను కూడా వివశుడ్ని చేసింది. నన్ను క్షమించండి. నేనిప్పుడు మిమ్మల్ని వెంటాడేవాళ్ళను ఆపి వెనక్కిపంపిస్తాను. నాకో శాంతిపత్రం రాసివ్వండి చాలు" అన్నాడతను వినయంగా.

ఈమాటలు విని దైవప్రవక్త (స) అతను కోరినట్లు అబూబకర్ (రజి) చేత శాంతిపత్రం రాయించి ఇచ్చారు. సురాఖా దాన్ని తీసుకొని తిరిగి వెళ్ళిపోవడానికి గుర్రం ఎక్కాడు. అప్పుడు దైవప్రవక్త (స) "సురాఖా! నువ్వు కిస్రా (ఈరాన్ చక్రవర్తి) కంకణం ధరించినప్పుడు నీపరిస్థితి ఎలా ఉంటుందో!" అన్నారు సురాఖా వైపు చిరునవ్వుతో చూస్తూ.

"ఏమిటీ! నేను కిస్రా కంకణం ధరించడమా!!" అంటూ సురాఖా ఆశ్చర్యంతో దైవప్రవక్త (స) వైపు చూశాడు. "ఔను. నువ్వు ఈరాన్ చక్రవర్తి కంకణం ధరిస్తావు" అన్నారు దైవప్రవక్త (స) మళ్ళీ. "దైవప్రవక్తా! నాకు నమ్మకం ఉంది. మీమాట ఎన్నటికీ అసత్యం కాదు. ఇక నేను వెళ్తున్నాను" అంటూ సురాఖా గుర్రం అదిలించి మక్కా వైపు బయలుదేరాడు.

ఆ తరువాత దైవప్రవక్త (స), ఆయన అనుచరులు అనేక మజిలీలు దాటుకుంటూ 14వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ 8వ తేదీన ఖుబా గ్రామానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి మదీనా మూడు మైళ్ళే ఉంది. ఖుబావాసుల్లో అత్యధికమంది ఇదివరకే ముస్లింలై ఉన్నారు గనక, వారు దైవప్రవక్త (స)ను స్వాగతకుసుమాల్లో ముంచెత్తారు.

అటు మక్కాలో అలి (రజి) శత్రువుల బారినుండి బయటపడి ఎవరి వస్తువులు వారికి అప్పగించి మదీనా దారిపట్టారు. కాలినడకన గుట్టలు మిట్టలు దాటుకుంటూ ప్రయాణం చేసి చివరికి ఖుబా గ్రామం చేరుకున్నారు. దైవప్రవక్త (స) ఆయన్ని చూడగానే సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ ఆలింగనం చేసుకున్నారు. అలాగే సుహైబ్ రోమీ (రజి) కూడా మక్కా అవిశ్వాసుల నుండి తప్పించుకొని వచ్చి ఖుబా చేరుకున్నారు.

దైవప్రవక్త (స) ఖుబా గ్రామంలో పధ్నాలుగు రోజులు ఉండి, అక్కడ ఒక మసీదు కట్టించి, అక్కడి ముస్లింలకు తగిన శిక్షణ గరిపారు. ఆ తరువాత ఆయన ముఖ్య అనుచరులతో మదీనా నగరానికి బయలుదేరారు. దైవప్రవక్త (స) పట్నం వస్తున్నారని మదీనాప్రజలందరికీ తెలిసిపోయింది. ఇంకేముంది! ఆనందభరితమైన ఓ కలకలం బయలుదేరింది. అంతా అమిత సంతోషంతో ఎగిరి గంతులేశారు.



అది శుక్రవారం. దైవప్రవక్త (స) అనుచరులతో బనీసాలమ్ వాడలోకి వచ్చేటప్పటికి జుమానమాజ్ వేళయింది. అంతా కలిసి అక్కడ నమాజ్ చేశారు. తరువాత ఆయన బయలుదేరి తన మాతృమూర్తి వంశస్తులు నివసిస్తున్న ప్రదేశం మీద కాలు మోపారు. తన రక్తమాంసాల కోసం ఎగబడిన ఖురైషీయులకు వ్యతిరేకంగా తన కోసం ప్రాణ త్యాగమైనా చేయడానికి సిద్ధమైన ధర్మయోధుల పవిత్రనగరంలో అడుగుపెట్టారు. అదో అద్భుత సన్నివేశం. మదీనా చరిత్రలో కనీవినీ ఎరగని అపూర్వసంఘటన. ప్రతి కుంటుంబం దైవప్రవక్త (స)ను తన అతిథిగా చేసుకోవాలని ఉవ్విళ్ళూరింది. అయితే ఆ మహాభాగ్యం అబూఅయ్యూబ్ (రజి)కు దక్కింది.

కొన్నాళ్ళకు మదీనాలో ఒక మసీదు వెలిసింది. దాన్ని బంకమన్ను, పచ్చి ఇటుకలతో లేపారు. ఖర్జూరపు చెట్ల మ్రానులను దూలాలుగా ఉపయోగించారు. ఆకులతో కప్పు వేసి దాన్ని బంకమన్నుతో అలికారు. మసీదు నిర్మాణంలో అనుచరులతోపాటు దైవప్రవక్త (స) కూడా పాల్గొన్నారు. అనుచరులు దైవప్రవక్త (స) కోసం, ఆయన శ్రీమతుల కోసం కూడా మసీదు పక్కనే కొన్ని పూరిపాకలు నిర్మించారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) మక్కాలో ఉన్న తన కుటుంబసభ్యుల్ని, ఇతర బంధువుల్ని మదీనాకు పిలుచుకొని రావడానికి జైద్ బిన్ హారిస్ (రజి)ను, అబూరాఫె (రజి)ను మక్కా పంపించారు. వారిద్దరు మక్కా వెళ్ళి వారందర్నీ మదీనాకు పిలుచుకువచ్చారు.

దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తర్వాత ఇస్లాంస్వీకార వేగం మరింత పుంజుకుంది. అనేకమంది దైవప్రవక్త (స), ఆయన అనుచరుల ప్రచారం, సుగుణాలతో ప్రభావితులై ఇస్లాం స్వీకరించసాగారు. ఓరోజు మదీనా అన్సార్‌లు (ఆదుకున్నవారు), ముహాజిర్‌ల (వలసవచ్చినవారి) కలయికతో కళకళలాడిపోయింది. వారి మధ్య దైవప్రవక్త (స) నిలబడి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని గురించి బోధించారు. ఆ మహనీయుని నైతికశిక్షణ వల్ల అనుచరుల్లో ఇదివరకే చాలావరకు పరస్పరసోదరభావం పెనవేసుకున్నది. ఇప్పుడీ ప్రత్యేక సమావేశంలో బోధించే హితవులతో వారు మరింత ఉత్తేజితులయ్యారు.

ప్రసంగం ముగిసిన తరువాత కట్టుబట్టలతో మాత్రమే వచ్చిన ముహాజిర్‌ల వైపు చూపిస్తూ "ఇదిగో వీరు మీ సోదరులు" అని అన్సార్‌లకు గుర్తుచేశారు. ఆ తరువాత వరుసగా ఒక్కొక్క ముహాజిర్‌ను, ఒక్కొక్క అన్సార్‌ని పిలిచి "ఈరోజు నుంచి మీరిద్దరు పరస్పరం అన్నదమ్ములు" అని చెప్పారు. అన్సారులు పరమసంతోషంతో తమ ముహాజిర్ సోదరుల్ని గుండెలకు హత్తుకున్నారు.

ఆ తరువాత అన్సార్ ముస్లింలు తమతమ ధార్మిక సోదరుల్ని తమ ఇళ్ళకు తీసికెళ్ళి తమతో సమానంగా సకల సౌకర్యాలు కల్పించారు. ఉన్న ఆస్తిలో అర్థభాగం పంచిచ్చారు. తమకు చెందిన ప్రతివస్తువునీ రెండు సమానభాగాలుగా విభజించి ఇచ్చారు. ముహాజిర్ ముస్లింలు స్వతహాగా కష్టజీవులు. వారికిలా రోజుల తరబడి అన్సారుల ఆస్తులు హరిస్తూ కూర్చోవడం ఇష్టంలేదు. అంచేత కాస్త అవకాశం దొరగ్గానే కష్టపడి పనిచేయ నారంభించారు. కొందరు వ్యాపారం చేయడానికి, మరికొందరు అన్సారుల పొలాల్లో సేద్యం చేయడానికి, ఇంకొందరు ఇతర కాయకష్టం చేయడానికి పూనుకున్నారు.

## (14) యూదులు, కపటుల ఆగడాలు

మదీనాలో యూదులు కూడా చాలామంది ఉన్నారు. సిరియా వరకు వీరికి వర్తక సంబంధాలున్నాయి. మదీనాలో వీరే అందరికంటే ఎక్కువ ధనవంతులు. అందువల్ల వీరి అధికారమే చెలామణి అవుతోంది. ఇలాంటి వాతావరణంలో ప్రశాంతంగా మనుగడ సాగించాలంటే ఒక్కటే మార్గం ఉంది. యూదులతో సత్సంబంధాలు కలిగిఉండాలి. దైవప్రవక్త (స) వారితో స్నేహఒప్పందం చేసుకోవాలని భావించారు.

మదీనాలో ముస్లింలు, యూదులు స్వేచ్ఛగా ఉండాలి. ఒకరి మతాన్ని ఒకరు అవమాన పరచుకోకూడదు. ఒకరి ఆస్తులు మరొకరు దోచుకోరాదు. బయటి నుంచి ఎవరైనా శత్రువు వచ్చి పట్టణం మీద దాడిచేస్తే అందరూ ఏకమై ఎదుర్కోవాలి. యుద్ధంలో లభించే సమరసొత్తు సమానంగా పంచుకోవాలి. దైవప్రవక్త (స) ఒప్పందంలో ఈ విషయాల్ని ప్రతిపాదించినప్పుడు యూదులు సంతోషంగా అంగీకరించారు. అందరూ ఒకచోట గుమికూడి ఒప్పందం రాసుకున్నారు.

యూదుల్లో కొందరు నిజమైన దైవభీతి, మంచి నీతినడవడికలు కలవారు కూడా ఉన్నారు. అలాంటివారు దైవప్రవక్త (స) ముఖవర్చస్సు చూడగానే "ఈయన తప్పక దైవ ప్రవక్త అయివుంటాడు. మన గ్రంథాల్లో ఈయన్ని గురించే భవిష్యత్ ప్రకటనలు ఉన్నాయి. అంతిమ దైవసందేశహరుడు ఈయనే. మనం ఏ జీవనవిధానం మరచిపోయామో దాన్నే ఈయన ప్రచారం చేస్తున్నాడు" అని గ్రహించి విశ్వాసులైపోయారు.

అయితే యూదుల్లో అత్యధికమంది తమ మతానికి వ్యతిరేకంగా దైవప్రవక్త (స) బోధించే విషయాలు వినడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. ప్రారంభంలో వారు దైవప్రవక్త (స), ఆయన సహచరులు మదీనా వచ్చినందుకు సంతోషించారు. శాంతి ఒప్పందం చేసుకోవడానికి కూడా అంగీకరించారు. అయితే దానికి ఓ కారణం ఉంది. దైవప్రవక్త (స)ను తమలో కలుపుకోవాలని, తమ ఆచారవ్యవహారాల రంగులో ఆయన్ని రంగరిద్దామని అనుకున్నారు. ఈ విధంగా ముస్లింలను కూడా తమ వైపు సులభంగా తిప్పుకోవచ్చని తలచారు. అలా అయితే తమ మతం అరేబియాలో బాగా ప్రాచుర్యం పొంది మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లుతుందని భావించారు.

యూదులు ఎంతో కాలం నుంచి ఒక ప్రవక్త కోసం నిరీక్షిస్తున్నారు. ఆ ప్రవక్త ఏఏ ప్రాంతాల్లో ప్రభవిస్తాడని ఆశిస్తున్నారో ఆయా ప్రాంతాలకెళ్ళి నివశించసాగారు. రాబోయే ఆ ప్రవక్త తమ మతాన్నే అనుసరిస్తాడని ఊహించారు. ఆయన వచ్చిన తరువాత తమ మతం బలం పుంజుకుంటుందని, క్రైస్తవమతం నామరూపాల్లేకుండా పోతుందని కలలు గన్నారు. కాని ఇప్పుడు ముహమ్మద్ ప్రవక్త (స) వచ్చి తమ మతాన్ని గాకుండా అసలు ధర్మం ప్రకటిస్తూ, కొత్త విషయాలు బోధించసాగారు. మొదటినుంచీ తమ దగ్గరున్న మతవిషయాలు ప్రజలకు బోధిస్తుండేవారికి ఇవి కర్ణకఠోరంగా తోచాయి. అలాంటివారు దైవప్రవక్త (స)ను, ఆయన అనుచరుల్ని ఎలా సహిస్తారు? ఈవిధంగా యూదులు కట్టుకున్న పేకమేడలు నిలువునా కుప్పకూలి పోయాయి. దాంతో వారు ముస్లింల మధ్య అనుక్షణం ఆందోళనతో నివసించవలసి వచ్చింది.



మున్ముందు దైవప్రవక్త (స) తమ పాలిట పెన్నిధి అవుతారనుకుంటే, ఇప్పుడాయన వారి పక్కలో బల్లెంలా తయారవుతున్నారు. అందువల్ల యూదులు స్నేహఒప్పందాన్ని గాలికి వదిలేసి ఆయనకు, ఆయన అనుచరులకు బద్ధశత్రువులుగా మారారు.

యూదులు అల్లర్లు సృష్టించడంలో, తగాదాలు పెట్టడంలో సిద్ధహస్తులు. "ఇతరుల మధ్య చిచ్చుపెట్టండి, తమ పని నెరవేర్చుకోండి" అనేది వారి రాజనీతి. ఆ నీతినే వారు ఇక్కడా ప్రయోగించారు. వారు ముస్లింలలో విభేదాలు సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. అది ఫలించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ముహమ్మద్ (స) దైవప్రవక్త అని, ఆయన తెచ్చే దివ్యసందేశం మూసా (అలై) సందేశాన్ని పునరుజ్జీవింపజేసి ఆయన దౌత్యాన్ని పరిపూర్తిచేస్తుందని యూదులకు తెలుసు. అయినా వారు తల బిరుసుతో ఆయన బోధించే విషయాలు ఒక్కటీ వినకూడదని నిశ్చయించుకున్నారు.

వారు హద్దుమీరిన జాత్యహంకారంతో సత్యాన్ని నిరాకరించడమే గాక దైవప్రవక్త (స)కు బద్ధవిరోధులైపోయారు. వారు తమ పగ, విరోధ భావాలను ఇంకా బహిర్గతం చేయలేదు. దైవప్రవక్త (స) మదీనాలో ప్రముఖవ్యక్తిగా, ప్రజలకు ప్రియతమ నాయకునిగా రూపొందేవరకు యూదులు ప్రతీకారాగ్నిని తమ హృదయాల్లోనే అణచి పెట్టుకున్నారు. ఆతర్వాత కొన్నాళ్ళకు వారి హృదయాలు ప్రతీకారసెగలు కక్కనారంభించాయి. యూదుల్లో కొందరు దైవప్రవక్త (స) సందేశానికి ప్రభావితులైనవారున్నారు. అలాంటివారిలో హసీన్, అసద్‌లు ప్రముఖులు. వారిద్దరు ఇస్లాం స్వీకరించడంతో యూదులు విలవిల్లాడి పోయారు.

ఔస్, ఖజ్రజ్ తెగల్లో కొందరు చిత్తశుద్ధితో ఇస్లాం స్వీకరించలేదు. తమ జాతిప్రజలు ఇస్లాం పట్ల ఆకర్షితులై దాన్ని విశ్వసించారు గనక, వీరు కూడా గత్యంతరంలేక ఇస్లాం స్వీకరించారు. అయితే వీరు ఇస్లాం అన్నా, దైవప్రవక్త (స) అన్నా లోలోన మండిపడేవారు. అసలు ఇస్లాం స్వీకరించకుండా బహుదైవారాధకులుగానే ఉండిపోయినవారు కూడా మదీనాలో ఉన్నారు. వీరికి అబూఆమిర్ నాయకుడు.

అబూఆమిర్ ఔస్‌తెగ నాయకుల్లో అగ్రగణ్యుడు. అతని జాతి ప్రజలంతా అతడ్ని ఎంతో అభిమానించేవారు. కాని దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తర్వాత ఔస్, ఖజ్రజ్ తెగల్లో అత్యధికమంది ఇస్లాం స్వీకరించడంతో అతని అనుచరుల సంఖ్య బాగా తగ్గిపోయింది. దాంతో అతను కొందరు అనుచరులతో మక్కా వెళ్ళిపోయాడు. మక్కాలో అంతకుపూర్వం నుంచే ఇస్లాంకు వ్యతిరేకంగా విద్వేషాగ్ని రగులుతూ ఉంది. ఇప్పుడు అబూఆమిర్ వచ్చి ఆ అగ్నిపై ఆజ్యంపోసి దాన్ని మరింత రెచ్చగొట్టాడు.

దైవప్రవక్త (స) మక్కా వదలి మదీనాకు వలసపోయిన దగ్గర్నుంచి మక్కా ఖురైషీయులకు కంటికి నిద్రలేకుండా పోయింది. వారు కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబైని హెచ్చరిస్తూ ఇలా ఒక ఉత్తరం పంపారు: "మా దగ్గర్నుంచి పారిపోయి వచ్చిన మా మనిషిని మీరు అక్రమంగా మదీనాలో ఉంచుకున్నారు. ఇది మీకు శ్రేయస్కరం కాదు. మీరు పోరాడి అతడ్ని మీ నగరం నుంచి వెళ్ళగొట్టండి. మామాట మన్నించి మీరలా చేస్తే సరి, లేకపోతే సమస్త ఆయుధాలతో మేము మదీనాపై దాడిచేస్తాం. మిమ్మల్నందర్నీ వధించి, మీ స్త్రీలను బానిసలుగా చేసి తీసికెళ్తాం."

అవకాశం కోసం చూస్తున్న ఇబ్నెఉబైకి ఈ హెచ్చరిక కర్తవ్యం బోధించినట్లయింది. వెంటనే అతను బహుదైవారాధకులందర్నీ సమావేశపరచి ఆ లేఖను చదివి విన్పించాడు. తర్వాత వారిని రెచ్చగొడ్తూ ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధానికి పురిగొల్పసాగాడు. అయితే ఈ రహస్య సమావేశం జరుగుతుండగానే క్షణాలమీద ఈ విషయం దైవప్రవక్త (స)కు తెలిసిపోయింది. ఆయన వెంటనే అక్కడకు చేరుకొని ఇలా మాట్లాడారు:

“సోదరులారా! మక్కా ప్రజలు మిమ్మల్ని మోసగింపజూస్తున్నారు. మీరు వారి వలలో పడిపోతే చాలా నష్టపోతారు. అంచేత మీరు వారికి నిర్ద్వందంగా సమాధానమిచ్చి మాతో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండండి. ఇదే మీకు అన్నివిధాల మేలైన పని. ఆలోచించుకోండి. ఖురైషీయులు మదీనాపై దాడిచేస్తే వారిని ఓడించడం మనకే సులువు. ఎందుకంటే ఒడంబడిక ప్రకారం మీరూ, మేము ఏకమై వారికి ఎదురునిలుస్తాం. ఒకవేళ మీరు యుద్ధానికే తలపడితే చేజేతులా వినాశాన్ని కొనితెచ్చుకున్నట్లవుతుంది.”

బహుదైవారాధకులు దైవప్రవక్త (స) మాటల్లోని యదార్థం గ్రహించి ఒప్పందానికే కట్టుబడి ఉంటామని చెప్పారు. తరువాత వారంతా ఇబ్నెఉబై వైపు అసహ్యంగా చూసి వెళ్ళిపోయారు. ఇబ్నెఉబై నిర్ఘాంతపోయి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాడు.

## (15) సమర సన్నాహాలు

కపటుల నాయకుడు ఇబ్నెఉబయి ద్వారా తమ ఉద్దేశ్యం నెరవేరకపోవడంతో మక్కా ఖురైషీయులు చిన్నచిన్న దళాలను మదీనా పరిసరప్రాంతాలకు పంపి ముస్లింలను కవ్వించడం ప్రారంభించారు. ఒకసారి వారు మదీనా పశువుల కాపర్లపై దాడి చేసి వారి పశువుల్ని దోచుకుపోయారు. ఇలా మక్కాఅవిశ్వాసుల దౌర్జన్యాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయి. ముస్లింలపై కవ్వింపుచర్యల్ని మానుకోలేదు. అప్పుడు ఆత్మరక్షణ, ధర్మరక్షణల కోసం కత్తిపట్టి శత్రువులతో పోరాడటానికి దేవుని అనుమతి లభించింది. హిందూ పౌరాణిక భాషలో చెప్పాలంటే దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ఇవ్వబడిన అనుమతి ఇది.

చీకటిని పారదోలడానికి వెలుగును ప్రసరింపజేయవలసి ఉంటుంది. వెలుగును ప్రసరింపజేయనిదే చీకటి ఎన్నటికీ పోదు. అదేవిధంగా శాంతి స్థాపన కోసం అశాంతి, అరాచకాలను అంతమొందించవలసిన అవసరం కూడా ఉంది. అశాంతి, అరాచకాలను అంతమొందించడానికి పోరాటం (జిహాద్) ఒక్కటే శరణ్యం. దుష్టశిక్షణ జరగనిదే శిష్ట రక్షణ ఎన్నటికీ సాధ్యం కాదు. శిష్టరక్షణ మాత్రమే కాదు. శాంతి నిలయాలైన ఆరాధనా లయాల పరిరక్షణ కూడా సాధ్యం కాదు.

“(అన్యాయంగా) దాడికి పాల్పడినవారితో పోరాడేవారికి (ఆత్మరక్షణ పోరాటానికై) అనుమతి ఇవ్వబడుతోంది. కారణం వారు చాలా పీడించబడ్డారు. వారికి దేవుడు తప్పక సహాయం చేస్తాడు. వారు తమ ఇండ్ల నుంచి అన్యాయంగా వెడలగొట్టబడ్డారు. వారు “మా ప్రభువు అల్లాహ్” అన్నంత మాత్రానికే ఇలా జరిగింది. దేవుడు గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తుదముట్టించకపోతే, దేవుని పేరు అత్యధికంగా స్మరించబడే మఠాలు, మందిరాలు, చర్చీలు, మసీదులు, (ఇతర) ఆరాధనాలయాలు ధ్వంసం చేయబడే ప్రమాదం



ఉంటుంది. (కనుక) దేవుడు (తన ధర్మానికి) సహాయం చేసేవారిని తప్పక ఆదుకుంటాడు. దేవుడు ఎంతో బలాఢ్యుడు, సర్వశక్తిమంతుడు.” (ఖుర్ఆన్-22:39,40)

ఆ రోజుల్లోనే ఖురైష్ నాయకుల్లో ఒకడైన అబూసుఫ్యాన్ నాయకత్వంలో మక్కావారి వర్తకబిడారం ఒకటి పెద్దఎత్తున వ్యాపారసామగ్రితో సిరియా నుంచి బయలుదేరింది. అబూసుఫ్యాన్ వర్తకబిడారాన్ని ముస్లింలు అడ్డుకుంటారేమోనని భయపడి, సహాయం కోసం ఒక మనిషిని మక్కా పంపాడు. అతను మక్కా వచ్చి వర్తకబిడారం మీద ముస్లింలు దాడిచేయడానికి వస్తున్నారని, వెంటనే సహాయం చేయడానికి బయలు దేరాలని ఖురైష్ నాయకుల్ని ఉసిగొల్పాడు.

అప్పుడు మరో నాయకుడు అబూజహల్ వేయిమంది సైనికులతో మక్కా నుండి బయలుదేరాడు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) కూడా 312 మంది యోధులతో మదీనానుండి బయలుదేరారు. అబూసుఫ్యాన్ ముస్లింల దాడినుంచి తప్పించుకోడానికి మదీనా సమీపంనుండి వెళ్ళే సాధారణమార్గం తప్పించి వేరేమార్గం గుండా సురక్షితంగా మక్కా చేరుకున్నాడు. వర్తకబిడారం సురక్షితంగా మక్కా చేరుకున్నదని, సైన్యాన్నిక మక్కాకు తిప్పితీసికెళ్ళమని అతను అబూజహల్‌కు కబురు పంపాడు. కాని అబూజహల్ తన సైనికసంఖ్యను, ఆయుధశక్తిని చూసుకొని విర్రవీగుతూ అతని మాటలు ఖాతరు చేయకుండా ముందుకుసాగాడు. ముస్లింలు మక్కావారి వర్తకబిడారాన్ని అడ్డుకోవడానికి పాల్పడకపోయినా, మక్కాఖురైషీయులు ఇలా ముస్లింలపై దాడిచేసి ఇస్లాంను అంత మొందించాలన్న లక్ష్యంతో 1000మంది సైనికులతో మదీనాదిశగా బయలుదేరారు.

ఇలా మక్కా వైపునుండి ఉపద్రవం మెరుపువేగంతో ముంచుకొస్తోంది. మరోవైపు యూదులు కత్తులు నూరుతున్నారు. అంతకంటే ప్రమాదకరమైనవాళ్ళు ముస్లింలుగా నటిస్తున్న కపటులు. వీరు క్షణానికో రంగుమారుస్తూ చీడపురుగుల్లా అంతర్గతప్రమాదం తెచ్చిపెడ్తున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో ఖురైషీయులు మదీనాపై దాడిచేస్తే ప్రస్తుతం ఉన్న కొద్దిమంది ముస్లింలు అంతమయ్యే ప్రమాదముంది. ఒకవేళ వారు మదీనాపై దాడి చేయకుండా సైనిక బలప్రదర్శనతో తమ వాణిజ్యబృందాన్ని తప్పించి సురక్షితంగా తీసికెళ్ళినా, ముస్లింలు తమప్రత్యర్థుల్ని ఎదుర్కోలేని పిరికిపందలని దేశంలో అపహాస్యం పాలు కావలసివస్తుంది. వారి ప్రభావం పూర్తిగా అడుగంటిపోతుంది.

అక్కడితో విషయం ఆగిపోదు. మదీనా దరిదాపుల్లో ఉన్న తెగలన్నీ ఖురైషీయుల అండతో ముస్లింల మీద విజృంభిస్తాయి. మదీనాలోని బహుదైవారాధకులు, యూదులు, కపటముస్లింలు స్వైరవిహారం చేస్తారు. అప్పుడు ముస్లింలకు ఊపిరి పీల్చుకోవడం కూడా దుర్భరమవుతుంది. ఈ పరిస్థితిలో అటు వర్తకబృందాన్ని అడ్డుకోవడమో లేదా యుద్ధరంగంలోకి దిగి ఖురైషీయులతో ఢీకొనడమో చెయ్యాలి.

ఈ ఆలోచనతో దైవప్రవక్త (స) వెంటనే అనుచరుల్ని సమావేశపరచి యుద్ధం చేయవలసిన అవసరం గురించి వివరిస్తూ “మిత్రులారా! దైవనామం స్మరించి బయలు దేరండి. మనపై దేవుని కరుణాకటాక్షాలు ఎంతగానో ఉన్నాయి. ఆయన నాకు పెద్ద సమూహం గురించే వాగ్దానం చేశాడు. యుద్ధానికి సిద్ధంకండి” అని చెప్పారు.

జిహాద్ అనుమతి లభించగానే ముస్లింలు యుద్ధసన్నాహాలలో నిమగ్నులైపోయారు. కాని చాలీచాలని ఒనరులతో ఖురైషీయులతో తలపడటం అంటే మాటలా? సైనికులందరికీ కలిపి మూడు గుర్రాలు, డెబ్భయి ఒంటెలు మాత్రమే ఉన్నాయి. ఒక్కొక్క ఒంటె మీద ముగ్గురు నలుగురు చొప్పున కూర్చోవలసి వచ్చింది. అప్పటికీ వాహనాలు సరిపడక అనేకమంది కాలినడకన బయలుదేరారు. ఆయుధాలు కూడా అంతంత మాత్రమే ఉన్నాయి. పైగా అనేకమంది యోధులు కడుపునిండా తిండి లభించకపోవడంతో బక్క చిక్కిన శరీరాలతో కూడా ఉన్నారు. ఇలాంటి విపత్కర సమయంలో యుద్ధరంగంలో దిగటమంటే మృత్యువుని కొని తెచ్చుకోవడమే. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ధర్మరక్షణ కోసం ఖడ్గం చేపట్టడం తప్ప గత్యంతరం లేదు. అందువల్ల మహాప్రవక్త (స) దైవం మీద భారం వేసి రణరంగానికి బయలుదేరారు.

అటు మక్కా నుండి అబూజహల్ నాయకత్వంలో దాదాపు వేయిమంది అవిశ్వాసులు యుద్ధానికి బయలుదేరారు. వారికి వంద గుర్రాలు, ఏడువందల ఒంటెలు కూడా సమకూరాయి. కాల్బలసైనికులు ధగధగ మెరిసే ఉక్కు కవచాలు ధరించారు. సైనికుల్ని ఉద్రేకపరచడానికి పరుషపదాలతో పాటలుపాడే పడతులు కూడా వెంట ఉన్నారు. అత్యుత్సాహంతో రొమ్ములు విరుచుకొని సమరవాయిద్యాలతో, దిక్కులుపిక్కుటిల్లే నినాదాలతో అట్టహాసంగా బయలుదేరారు మక్కా బహుదైవారాధకులు. సారా సేవిస్తూ, ప్రతీకారంతో పళ్ళు నూరుతూ ఒక్కొక్క మజిలీ దాటుకుంటూ బదర్ ప్రాంతంలోని యుద్ధ రంగానికి చేరుకున్నారు.

బదర్‌లో ఖురైష్ సైనికులు ముందుగానే ఎత్తయిన కీలక ప్రదేశాలన్నీ ఆక్రమించుకొని ముస్లింల మీద విరుచుకుపడేందుకు సిద్ధమయ్యారు. ముస్లిం యోధులు వారికి దిగువభాగాన ఇసుక ప్రదేశంలో స్థావరం ఏర్పరచుకున్నారు. సంవత్సరాల తరబడి వర్షం కురవని ఆ ఎడారి ప్రాంతంలో ఆరోజు రాత్రి వర్షం కురిసింది. ముస్లిం సైనికులు వెంటనే లేచి నేలమీద చిన్నచిన్న మళ్ళు చేసి వర్షపు నీటిని ఆపుకున్నారు. ఇసుకనేల కావడం వల్ల పొడిపొడిగా ఉన్న ఇసుకంతా పేరుకొని సులభంగా తిరగడానికి నేల అనుకూలంగా మారింది. అటు ఖురైషీయులు శిబిరాలు వేసుకున్న మట్టి ప్రదేశం బురద బురదగా మారింది. వారు తమకు అనుకూలంగా ఉందనుకున్న గట్టినేల చివరకు ఇలా రోతగా తయారయింది. పైగా అది జారుతూ కాలుతీసి పెట్టాలంటే భయంగా ఉంది.

హిజ్రీ 2వ సంవత్సరం, రమజాన్ నెలలో విశ్వాసులు, అవిశ్వాసుల మధ్య సంకుల సమరం జరిగింది. మదీనా నుండి కొందరు బహుదైవారాధకులు యుద్ధంతీరు చూడటానికి యుద్ధమైదానికి వచ్చారు. వారు బదర్ కొండ మీద నిలబడి చూడసాగారు. కాస్సేపటికి ఆకాశంలో వారి పైనుండి ఒక మబ్బుతునక గుర్రాల సకిలింపులు, గిట్టల చప్పుళ్ళతో రివ్వున యుద్ధమైదానం వైపు దూసుకుపోయింది. అందులో నుండి "తొందరగా ముందుకు సాగండి" అనే ఓ కంఠస్వరం కూడా వారికి విన్పించింది.

ఈ విచిత్రధ్వనులు విని బహుదైవారాధకులు తీవ్రమైన భయంతో కంపించి పోయారు. వారిలోఒకడు ఆ భయంతోనే నిలువుగుడ్లు వేసి ఊపిరి విడిచాడు. ఆ తర్వాత మిగిలిన వాళ్ళు అక్కడ్నుంచి మదీనా వైపు పరుగెత్తారు.



ఉభయ పక్షాల మధ్య జరిగిన ఈ యుద్ధంలో విజయం ముస్లింలనే వరించింది. ధర్మం గెలిచింది. అధర్మం పలాయనం చిత్తగించింది. ఆయుధాలు పుష్కలంగాఉన్నా, అత్యధిక సైనికబలమున్నా అవిశ్వాసులు డెబ్భయి మందికి పైగానే వధించబడ్డారు. మరో డెబ్భయి మంది ఖైదీలుగా పట్టుబడ్డారు. కాని సరైన ఆయుధాలు, కావలసినన్ని ఒనరులు, తగిన సదుపాయాలు లేకపోయినా దైవంమీద చెక్కుచెదరని విశ్వాసంతో వచ్చిన ముస్లింయోధుల్లో పధ్నాలుగు మంది మాత్రమే వీరమరణం పొందారు.

ముస్లింలు ఖైదీలను తీసుకొని మదీనా తిరిగొచ్చారు. మరుసటిరోజు దైవప్రవక్త (స) ఆదేశం ప్రకారం యుద్ధ ఖైదీలను మస్జిదెనబవీ స్తంభాలకు కట్టివేశారు. అప్పటికి చీకటి పడటంతో కాపలాకోసం కొందరు సైనికులుండి మిగిలినవారంతా ఇండ్లకు వెళ్ళిపోయారు. దైవప్రవక్త (స) కూడా ఆ రాత్రి ఇషానమాజ్ ముగించుకొని నిద్రకు ఉపక్రమించారు.

## (16) యుద్ధఖైదీల సమస్య

నడిరేయి దాటింది. యుద్ధఖైదీలున్న చోటు నుంచి మూల్గుడు విన్పించడంతో నిద్ర పోతున్న దైవప్రవక్త (స) మేల్కొన్నారు. పోయిచూస్తే, బిగువుగా కట్టిన త్రాళ్ళవల్ల ఖైదీలు బాధతో మూల్గుతున్నారు. కారుణ్యమూర్తి (స) హృదయం కరిగిపోయింది. అలా బాధ పడుతున్నవారిలో ప్రవక్త పినతండ్రి అబ్బాస్ కూడా ఉన్నారు. సహజమైన బంధుప్రేమ పెల్లుబికింది. దైవప్రవక్త (స) పరిస్థితి అర్థంచేసుకున్న అనుచరులు వెంటనే అబ్బాస్ కట్లు వదులుచేశారు. అప్పుడు దైవప్రవక్త (స) అందరి కట్లు కూడా వదులుచేయమని అన్నారు. అనుచరులు ఖైదీలందరి కట్లు వదులుచేసి ప్రశాంతంగా పడుకోవడానికి వీలుకల్పించారు. దాంతో దైవప్రవక్త (స) హృదయం కుదుటపడింది.

తెల్లవారింది. దైవప్రవక్త (స) యోధుల్ని పిలిచి తాత్కాలికంగా ఖైదీలను తమ అధీనంలో ఉంచుకోమని చెప్పారు. యుద్ధఖైదీలు గెలిచినయోధుల అధీనంలో బానిసలుగా ఉండటమనేది పూర్వంనుంచీ వస్తున్న ఆచారం. అయితే ఖైదీలపట్ల సద్వర్తనంతో మెలగాలని దైవాదేశం. దానిప్రకారం ఇస్లాం పొడగిట్టని పరమ దుర్మార్గులైనా గతాన్ని త్రవ్వకుండా ఖైదీలపట్ల మృదువుగా వ్యవహరించాలని దైవప్రవక్త (స) అనుచరులకు హితవుచేశారు. వారికి ఆహార, వస్త్రాల లోటు రానీయకుండా చూడాలని, జబ్బుపడితే చికిత్స చేయించాలని, ఇతర ముఖ్యావసరాలు కూడా స్తోమతను బట్టి తీర్చాలని నొక్కిచెప్పారు. దైవప్రవక్త (స) ఆదేశాలు శిరసావహించడం కంటే ముస్లింలకు కావల్సిన పుణ్యం ఏముంటుంది?

ఖైదీలుగా పట్టుబడినవారిలో సుహైల్ బిన్ అహ్ కూడా ఉన్నాడు. అతను దైవప్రవక్త (స)కు బద్ధవిరోధి. అతని విషయంలో కొందరు "దైవప్రవక్తా! ఇతను గొప్ప వాగ్ధాటికల వక్త. ఇతను తనవాగ్ధాటితో మీకు వ్యతిరేకంగా ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు చేస్తూ జనాన్ని రెచ్చగొడ్తుండేవాడు. అంచేత ఇతని పళ్ళు రాలగొట్టండి" అని సలహా ఇచ్చారు.

కాని మానవాళిపై కరుణామృతం చిలికించడానికి ప్రభవించిన కారుణ్యమూర్తి (స) అలా చేయగలరా? "తప్పు. నేను దైవసందేశహరుణ్ణయి ఉండికూడా అతని పళ్ళు రాలగొడ్తే దేవుడు నా పళ్ళు రాలగొడ్తాడు" అని సమాధానమిచ్చారు ఆయన.

ఆ తరువాత కొన్నాళ్ళకు దైవప్రవక్త (స) యుద్ధఖైదీల సమస్యను గురించి చర్చించడానికి అనుచరులను సమావేశపరిచారు. ఖైదీలపై ఎలాంటి చర్య తీసుకోవాలో చెప్పమని వారి అభిప్రాయాలు అడిగారు. అప్పుడు ఉమర్ (రజి) ఇలా అన్నారు:

"వీరు దైవవిరోధులు. సత్యధర్మాన్ని అంతమొందించదలచుకున్న దుర్మార్గులు. మిమ్మల్ని అనేకసార్లు చంపడానికి ప్రయత్నించారు ఇలాంటి నీచుల్ని వదలి పెట్టకూడదు. వీరందర్నీ వధించాలి. మనలో ఎవరు ఏ ఖైదీల బంధువులో వారే ఆ ఖైదీలను వధించాలి. దానివల్ల మన హృదయంలో బంధుప్రేమ కంటే దేవుని, దైవప్రవక్తల ప్రేమే అధికమని, దైవధర్మం ముందు సమస్త బాంధవ్యాలు బలాదూర్ అని అవిశ్వాసులు తెలుసుకుంటారు."

తరువాత అబూబకర్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! నష్టపరిహారం తీసుకొని వదలిపెడ్తే మంచిదని నా అభిప్రాయం. ఇలా చేయడంవల్ల ఒకవైపు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద ముస్లింలకు ధనసహాయం అందించినట్లూ ఉంటుంది. మరోవైపు దైవానుగ్రహమైతే మనసు మారి ఖైదీలు ఇస్లాం స్వీకరించనూవచ్చు" అని అన్నారు.

ఇతర సహచరులు కూడా అనేకమంది తమ తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. కాని దైవప్రవక్త (స)కు అబూబకర్ (రజి) అభిప్రాయమే నచ్చింది. దాని ప్రకారమే అమలు జరపడానికి నిశ్చయించారు. ఈ నిర్ణయాన్ని ఖైదీల బంధువులకు తెలియజేశారు.

మక్కానుంచి ఖురైషీయులు తమ బంధువుల్ని విడిపించుకోవడానికి మదీనా వచ్చారు. దైవప్రవక్త (స) ఒక్కొక్క ఖైదీనుండి వేయి నుంచి నాలుగువేల దిర్హమ్‌లదాకా వారి వారి స్తోమతను బట్టి నష్టపరిహారం వసూలుచేసి బంధవిముక్తుల్ని గావించారు.

అయితే నష్టపరిహారం చెల్లించలేని పేద ఖైదీలు కొందరున్నారు. వారిని విడిపించడానికి ఏబంధువూ లేడు. కాని వారిలో చదవను, వ్రాయను వచ్చినవారు కూడా ఉన్నారు. అలాంటివారి బంధవిముక్తికి దైవప్రవక్త (స) మార్గాన్వేషణ చేశారు. ఒక్కొక్కడు పదేసి ముస్లిం బాలబాలికలకు చదవడం, వ్రాయడం నేర్పి విముక్తి పొందవచ్చని ప్రకటించారు. చదువురాని నిరుపేద ఖైదీలను నష్టపరిహారం లేకుండానే విడిచిపెట్టారు.

దైవప్రవక్త (స) ఖైదీలపట్ల కనబరచిన ఈ ఔదార్యం, సద్వ్యవర్తనలు చూసి అవిశ్వాసులు ఆశ్చర్యపోయారు. ఆయన ప్రత్యుపకార భావం కూడా ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది. గతంతో ఒకసారి ఆయన తాయిఫ్ నుండి మక్కా తిరిగొచ్చి నగరంలో ప్రవేశించబోతుంటే ఖురైషీయులు ఆయన్ని అడ్డగించ ప్రయత్నించారు. అప్పుడు ముత్యిమ్ బిన్‌అదీ దైవప్రవక్త (స)కు ఆశ్రయమిచ్చాడు. దైవప్రవక్త (స) ఆ విషయం గుర్తుచేస్తూ "ఇప్పటిదాకా ముత్యిమ్ బ్రతికివుండి, ఇక్కడ నిర్బంధించబడిన ఖైదీల విషయమై అతను నాతో మాట్లాడితే నేను ఖైదీలను నష్టపరిహారం తీసుకోకుండానే వదలిపెట్టేవాడ్ని" అని అన్నారు.

ఖైదీలలో దైవప్రవక్త (స) అల్లుడు అబుల్‌ఆస్ కూడా ఉన్నాడు. కాని అల్లుడని నష్టపరిహారం వసూలుచేయకుండా విడిచిపెట్టలేదు. ఇతర ఖైదీలకు మాదిరిగానే నష్టపరిహారం తెప్పించుకొని విడుదలకమ్మని చెప్పారు ఆయన. భర్తను విడిపించుకోవడానికి జైనబ్ (రజి) తన తల్లి ఖదీజా (రజి) నుంచి తనకు సంక్రమించిన కంఠహారాన్ని



మదీనాకు పంపించారు. కంఠహారం చూడగానే దైవప్రవక్త (స)కు గతస్మృతులు గుర్తుకొచ్చాయి. ఇహలోకం వీడిపోయిన తన అర్ధాంగిని తలచుకొని వ్యధచెందారు.

"కంఠహారం ఒక్కటే ఖదీజా జ్ఞాపకార్థంగా జైనబ్ దగ్గర మిగిలివుంది. మీకెవరికీ అభ్యంతరం లేకపోతే దీన్ని జైనబ్‌కు తిరిగి ఇచ్చివేద్దాం" అన్నారు ఆయన అనుచరులతో. తమ ప్రియతమ నాయకుడే అలా అన్నప్పుడు ఇక ఎవరికి అభ్యంతరం ఉంటుంది? అదీగాక ప్రవక్త ప్రసన్నత కన్నా కావలసిందేముంది? అంచేత అందరూ సంతోషంగా అంగీకరించారు. దైవప్రవక్త (స) విచారవదనం వికసించింది. కంఠహారాన్ని తన కుమార్తెకు తిప్పి పంపి అబుల్‌ఆస్‌ను విడుదల చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ప్రవక్త అనుచరులు ఆయన కుమార్తె జైనబ్ (రజి)ను మదీనాకు పిలుచుకొచ్చారు.

బదర్ యుద్ధంలో పరాజయం చవిచూసిన మక్కా ఖురైషీయులు అవమాన భారంతో బాగా క్రుంగిపోయారు. ఖురైషీయులు తమకు జరిగిన పరాభవాన్ని అంత తేలిగ్గా మరచిపోయే అభిమానహీనులు కాదు. వారి హృదయాల్లో ప్రతీకారసెగలు రగులుతున్నాయి. మరోసారి ముస్లింలపై దండెత్తి, వారిని అణచాలని నిశ్చయించుకున్నారు. ఈ లక్ష్యం నెరవేరేవరకు విశ్రాంతి తీసుకోకూడదని, కంటినిండా నిద్రపోకూడదని నిర్ణయించుకున్నారు పురుషులు. స్త్రీలు శిరోజాలు కత్తిరించుకొని ముస్లింలపై కసి తీర్చుకునేదాకా సువాసనల్ని ఉపయోగించమని, నగలు ధరించమని తమ ఇష్టదేవతల ముందు ప్రమాణంచేశారు.

బదర్ యుద్ధంలో అవిశ్వాసుల అంచనాలన్నీ తారుమారయ్యాయి. అంచేత ఈసారి భారీఎత్తున సైనికుల్ని, ఆయుధాల్ని సమీకరించాలని నిర్ణయించారు. ఇదంతా ఒక్కరోజులో జరిగే పనికాదు. పథకం కొంతకాలమైనా పడ్తుంది. కాని అబూసుఫ్యాన్ బుసలుకొడ్తున్న తన ప్రతీకార వాంఛను అదుపులో ఉంచలేకపోయాడు. యుద్ధసన్నాహాలు పూర్తికాకుండానే అతను రెండొందల మంది సైనికుల్ని తీసుకొని బయలుదేరాడు. మదీనా సమీపంలోని ఉరైజ్ అనే ప్రదేశానికి చేరుకోగానే ఓ అన్సార్‌ముస్లిం పొలంపనులు చేసుకుంటూ కన్పించాడు. వెంట ఒక కూలీవాడున్నాడు. అబూసుఫ్యాన్ వాళ్ళిద్దర్ని హతమార్చి అక్కడున్న రెండు ఇళ్ళను, ఖర్జూరపు తోటలను కాల్చి పారిపోయాడు.

ఈ సంగతి తెలిసిన వెంటనే దైవప్రవక్త (స) కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని అబూసుఫ్యాన్‌ని వెంటాడటానికి బయలుదేరారు. తమ వెనుక శరవేగంతో వస్తున్న ప్రమాదాన్ని అబూసుఫ్యాన్ సైనికులు గమనించారు. కాని వెనక్కివెళ్ళి ముస్లింలతో తలపడటానికి ధైర్యం చాల్లేదు. అదీగాక వీపు మీద బరువుతో నత్తనడక నడిచే ఈ ఒంటెలతో ప్రయాణం సాగిస్తే ముస్లింలకు చిక్కి బుగ్గిపాలయ్యే ప్రమాదం ఉంది. అంచేత ఒంటెల మీదున్న పిండిమూటలు జారవిడిచారు. బరువు తగ్గిన ఒంటెలతో వడివడిగా ప్రయాణం చేస్తూ ఎలాగో ముస్లిం సైనికుల నుండి తప్పించుకున్నారు.

ముస్లింలు తమకు భయపడి పిరికిపందలుగా పారిపోయిన శత్రుసైనికుల్ని వెంటాడలేదు. వారు జారవిడిచిన పిండి మూటల్ని మాత్రం తీసుకొని మదీనా తిరిగొచ్చారు. ఈ దండయాత్రను గజ్వె సవీఖ్ (పిండి దండయాత్ర) అంటారు.

## (17) వితంతు ఆదరణ, యూదుల బహిష్కరణ

మహాప్రవక్త (స) జీవితం నిరంతర సంఘర్షణలకు ప్రతీక. దైవసందేశ వ్యాప్తి కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు. దుష్టశక్తులతో పోరాటం కూడా జరిపారు. బదర్ యుద్ధం తరువాత ఏదో కాస్తంత విశ్రాంతి లభించిందంటే, యూదుల బెడద ఎక్కువయింది. ఈ పనులన్నింటినీ నెరవేరుస్తూ మధ్యలో ఎప్పుడైనా కాస్త విరామం లభిస్తే ఆ సమయంలో సైతం ఆయన ఉద్యమానికి సంబంధించిన ఇతర కార్యకలాపాల్లో నిమగ్నులయ్యేవారు. ముఖ్యంగా ముస్లింలను సంఘటితపరచడం, వారిని సుశిక్షితుల్ని చేయడం, బలహీనుల బాగోగుల్ని విచారించడం, వారి అవసరాలు తీర్చే ఏర్పాట్లుచెయ్యడం, అనుయాయులతో తన సంబంధాలను మరింత పటిష్ఠపరచుకోవడం పట్ల శ్రద్ధచూపేవారు ఆయన.

ఖదీజా (రజి) చనిపోయిన తర్వాత దైవప్రవక్త (స) యాభైఏళ్ళ సౌదా (రజి)ని మక్కాలో ఉన్నప్పుడే వివాహమాడారు. అబూబకర్(రజి) కుమార్తె ఆయిషా(రజి)ను కూడా మక్కాలో ఉన్నప్పుడే చేసుకున్నారు. ఆ తర్వాత అలి, ఫాతిమా(రజి)ల వివాహం జరిపించారు. ఆయన తన ముద్దుల కుమార్తె సంసారానికి ఒక మంచం, ఒక తోలుపరుపు, ఖర్జూరపు ఆకులతో నింపిన ఒక తలగడ, ఓచిన్న తోలుసంచి, రెండు మట్టికుండలు, రెండుతిరగళ్ళు ఇచ్చారు. అల్లుడి దగ్గర ఒక గొర్రెచర్మం, ఓ చినిగిన దుప్పటి మాత్రమే ఉన్నాయి. ఇవీ ఆ కొత్తదంపతుల కొత్తకాపురానికి సమకూరిన వస్తువులు. ఇవే వారి మొత్తం ఆస్తిపాస్తులు.

దైవప్రవక్త (స) బదర్‌యుద్ధం నుండి తిరిగిరాగానే కుమార్తె రుఖియా (రజి) మరణవార్త వినవలసి వచ్చింది. భార్య రుఖియా మరణంపట్ల ఉస్మాన్ (రజి) ఎంతో తల్లడిల్లి పోయారు. "దైవప్రవక్తా! మీతో ఏర్పడిన ఈ ప్రత్యేక సంబంధం ఇప్పుడు లేకుండాపోయింది" అన్నారు ఆయన. దైవప్రవక్త (స) ఉస్మాన్ (రజి) సుగుణసంపత్తితో ప్రభావితులయ్యారు. అంచేత ఆయన తన రెండోకుమార్తె ఉమ్మెకుల్సూమ్(రజి)ని ఉస్మాన్ (రజి)కిచ్చి వివాహం చేశారు.

బదర్ యుద్ధంలో ఉమర్ (రజి) అల్లుడు ఖునైస్ (రజి) గాయపడి ఆ తరువాత చనిపోయారు. అంచేత ఉమర్ (రజి) కుమార్తె హఫ్సా (రజి) దుస్థితి పట్ల చాలా విచారంగా ఉన్నారు. దైవప్రవక్త (స) ఆయన విచారాన్ని దూరంచేస్తూ హఫ్సా (రజి)ను వివాహమాడారు. ఇలా ఆయన తన అనుచరులతో సంబంధాలను పటిష్ఠపరచుకున్నారు.

ఆయన వితంతువుల్ని గురించి తన అనుచరుల్ని ఉపదేశిస్తూ "మీరు వితంతువుల శ్రేయస్సును దృష్టిలోపెట్టుకొని వారిపట్ల సానుభూతి చూపండి. వితంతుని వివాహమాడి ఆమెను, ఆమె పిల్లల్ని చేరదీయండి. మీరా విధంగా చేయకపోతే ఆమె దిక్కులేనిదై పోతుంది. ఆవిధంగా ఆమె అనేక కష్టాలకు గురవుతుంది" అని చెప్పారు.

ఖుజైమా (రజి) కుమార్తె జైనబ్ (రజి) ఎంతో సుగుణవతి. దానధర్మాలు చెయ్యడమంటే ఆమెకు ఎంతోఇష్టం. ఈ కారణంగా ఆమె జనంలో 'పేదల మాతృమూర్తి' అని పేరుపడ్డారు. బదర్‌యుద్ధంలో ఆమెభర్త అబ్దుల్లా బిన్ జహష్ (రజి) అమరగతులయ్యారు. ఆమె దీనావస్థ చూసి దైవప్రవక్త (స) ఆమెను కూడా వివాహమాడారు. ఇలా ఆయన వితంతువుల్ని వివాహమాడి వారికి సమాజంలో తగిన గౌరవప్రదమైన స్థానం కల్పించారు.



దైవప్రవక్త (స) మదీనా వచ్చిన తొలిరోజుల్లో యూదులు ఆయన ప్రతిపాదించిన శాంతిఒప్పందంతో ఏకీభవించి సంతోషంగానే ఉన్నారు. అయితే ఆయనకు తమ మత రంగు పూసి తమ జాతిప్రాభవాన్ని ద్విగుణీకృతం చేసుకోవాలన్న దుష్టపథకం ఎంతకూ నెరవేరనందున యూదులు మండిపోయారు. అప్పటినుంచి వారు దైవప్రవక్త (స)కు, సత్యధర్మానికి బద్ధశత్రువులుగా మారి అసహ్యంగా ప్రవర్తించసాగారు.

తాము ఎంతో భక్తిపరాయణులమని, తాము తప్ప మరెవరూ మోక్షానికి అర్హులు కారని డాంబికాలు పలికే ఈజాతిలోని పెద్దలు, పండితులు సైతం దైవప్రవక్త (స) దగ్గరికి వచ్చినప్పుడల్లా 'అస్సలాము అలైకుం' అనే పదాన్ని దాని అసలుభావం మారి చెడుభావం వచ్చే విధంగా కొంచెం వత్తి పలికేవారు. అలాగే ఇతర సంభాషణల్లోనూ కొన్నిటి ఉచ్చారణ తారుమారుచేసి సామాన్యజనానికి అర్థంకాని విధంగా తప్పుడు మాటలు పలికేవారు.

పైగా 'మీలో దేవునికి మంచి అప్పు ఇచ్చేవారెవరున్నారు?' అనే ఖురాన్‌వాక్యం విని 'ఓహో! దేవుడు ఇప్పుడు పేదవాడై తనదాసుల దగ్గర అప్పుఅడుక్కోవడం మొదలుపెట్టాడన్న మాట!!" అని దైవాన్ని కూడా ఎగతాళి చేసేవారు. ఖుర్‌ఆన్‌లోని ఈగ, దోమల దృష్టాంతాలు విని 'ముస్లింల దేవుడు చాలా వింత దేవుడు. దృష్టాంతం ఇవ్వడానికి ఆయనకు ఈగలు, దోమలు వంటి అల్పప్రాణులు తప్ప మరేమీ దొరకలేదు కాబోలు!" అని పరిహసించేవారు.

వారు జనబాహుళ్యంలో దైవప్రవక్త (స) పట్ల అనేక అనుమానాలు రేకెత్తించసాగారు. ముస్లింలకు వ్యతిరేకంగా బహుదైవారాధకుల్ని రెచ్చగొట్టసాగారు. ఒకసారి ఓ ముస్లింమహిళ నగ చేయించుకోవడానికి యూదస్వర్ణకారుని దుకాణానికి వెళ్ళింది. అక్కడ మరికొందరు యూదులున్నారు. వారికి ఏం దుర్బుద్ధి పుట్టిందోగాని ఆమెను ముఖం చూపించమని అడిగారు. దానికామె నిరాకరించడంతో ఓ కిరాతకుడు ఆమె వెనక్కిపోయి ఆమె పైవస్త్రానికి ఓ ముల్లు గుచ్చాడు. ఇది గమనించని ఆ మహిళ లేచి నిలబడగానే ఆమెవస్త్రం క్రిందకు జారింది. అది చూసి మిగిలిన యూదులంతా విరగబడి నవ్వారు. పాపం ఆ అమాయకురాలు ఈ అవమానం భరించలేక పెద్ద కేకపెట్టి భోరున ఏడ్వసాగింది.

ఆమె కేక విని సమీపంలోనే ఉన్న ఓ ముస్లిం పరుగెత్తుకొచ్చాడు. జరిగిన సంగతి తెలుసుకొని ఆగ్రహంతో ఆ యూదుడ్ని అమాంతం పైకెత్తి నేలకేసి విసిరికొట్టాడు. దానికి మిగిలిన యూదులు ఆగ్రహోదగ్రులయి ఒక్కసారిగా ఆ ముస్లింపై విరుచుకుపడి అతడ్ని హతమార్చివేశారు. అంతలో అక్కడ దరిదాపుల్లో ఉన్న దాదాపు పాతిక మంది ముస్లింలు పరుగెత్తుకొని వచ్చారు. మరో వైపునుంచి ఏడొందల మంది యూదులు ఆయుధాలు ధరించి వచ్చారు. అంతమంది యూదుల్ని చూసి ముస్లింలు భయపడలేదు. వెంటనే వారు వరల్లో నుంచి ఖడ్గాలు లాగి పోరాటానికి ఉపక్రమించారు.

పాతిక మంది ముస్లింలు ఏడొందలు మంది యూదులతో తలపడుతూ వీరోచితంగా పోరాడసాగారు. వారి ధైర్యసాహసాలు చూసి యూదులు ఆశ్చర్యపోయారు. ముస్లింలు చాలా సేపు పోరాడారు. చివరికి వారి సత్తువ క్రమంగా తగ్గిపోసాగింది. అప్పుడు యూదుల వెనుక వైపు నుంచి "అల్లాహుఅక్బర్" అనే నినాదాలు వినవచ్చాయి. వెనువెంటనే దైవప్రవక్త (స) నేతృత్వంలో దాదాపు మూడొందల మంది సాయుధ ముస్లింలు వచ్చిపడ్డారు.

పరిస్థితి ప్రమాదసూచిక దాటిందని గ్రహించిన దైవప్రవక్త (స) వారితో ఇలా అన్నారు: “యూద సోదరులారా! నేను దైవప్రవక్తనని మీకు బాగా తెలుసు. నామాట విని ఇస్లాం స్వీకరించండి. లేకుంటే చాలా నష్టపోతారు. బదర్ యుద్ధంలో బహుదైవారాధకులకు జరిగిన పర్యవసానం ఏమిటో మీరు చూశారుకదా! బాగా ఆలోచించుకోండి.” కాని యూదులు వైరోన్మాదంతో ఊగిపోతూ “ముహమ్మద్! మోసపోకు. వారు అనుభంలేని వారు. అలాంటివారిని ఓడించడం ఘనకార్యం అనుకుంటున్నావు కాబోలు. మాతో రంగంలోకి దిగు, యుద్ధం అంటే ఏమిటో తెలుస్తుంది” అని అన్నారు.

ఒప్పందం ఉల్లంఘనకు ఇంతకంటే ప్రబల నిదర్శనం మరేముంది? కయ్యానికి కాలుదువ్వే బహిరంగ ప్రకటన ఇది. దైవప్రవక్త (స) ఎంత నచ్చజెప్పినా వారు వినలేదు. చివరికి దైవప్రవక్త (స) వాళ్ళతో యుద్ధం చేయక తప్పలేదు. దైవప్రవక్త (స) ఆజ్ఞ కాగానే ముస్లింలు యూదుల సైన్యంలోకి దూసుకుపోయి తుఫానులా విరుచుకుపడ్డారు. యూదులు ముస్లింల ధాటికి నిలువలేక వెనుక్కి జరుగుతూ చివరికి తమ కోటలోకి దూరి తలుపులు మూసుకున్నారు.

దైవప్రవక్త (స) వారి కోటను ముట్టడించమని అనుచరుల్ని ఆదేశించారు. తక్షణమే అనుచరులు కోటను ముట్టడించారు. అంతేకాకుండా యూదులకు బయటినుంచి ఆహార పదార్థాలు కూడా సరఫరాకాకుండా అన్ని వైపుల నుంచి కోటను దిగ్బంధం చేశారు. ఆ విధంగా 15 రోజులు గడచిపోయాయి. అటు కోటలో ఆహారపదార్థాలు నిండుకోవడంతో యూదులు పస్తులతో అల్లాడి పోయారు. చివరికి వారు కోట తలుపులు తెరచి ముస్లింలకు లొంగిపోయారు. దైవప్రవక్త (స) వారందర్నీ ఖైదీలుగా పట్టుకొని తీసికెళ్ళారు.

ఆనాటి యుద్ధనీతి ప్రకారం యుద్ధ ఖైదీలందర్నీ వధించాలి. అయితే దైవప్రవక్త (స) తన అనుచరుల్ని సంప్రదించిన తరువాత ఆ యూదుల్ని మదీనా నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. దానిప్రకారం బనూఖైనుఖా యూదులు గత్యంతరంలేక మదీనా విడిచిపెట్టి సిరియా సరిహద్దులకు పోయి స్థిరపడ్డారు. ఈ సంఘటనతో అరేబియాలో ఇస్లాం ఔన్నత్యం ఇనుమడించింది. శక్తిమంతమైన అంతపెద్ద యూద తెగకు మదీనాలో నిలువ నీడలేకుండా పోయింది. దీన్నిబట్టి ముస్లింలు ఎంత బలపడ్డారో తెలుస్తోంది. ఈ ఆలోచనతో మదీనా దరిదాపుల్లో ఉన్న బనీనజీర్, బనీఖురైజా అనే మరో రెండు యూదతెగలు ముస్లింలకు భయపడి మౌనంగా ఉండిపోయాయి.

## (18) ఉహుద్ కొండల్లో సమరజ్వాలలు

యూదుల దుష్ప్రచారజాలంలో పడిన మక్కా ఖురైషీయులు ధుమధుమలాడుతూ యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. దైవప్రవక్త (స) పినతండ్రి అబ్బాస్ (రజి) ఇదివరకే ఇస్లాం స్వీకరించి ఉన్నారు. అయితే ఆయన ఇంకా మదీనాకు వలసపోకుండా మక్కాలోనే ఉన్నారు. బహుదైవారాధకుల హడావిడి చూసి వెంటనే ఆయన ఖురైషీయులు మదీనాపై దాడిచేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని, ఈసారి భారీఎత్తు ఆయుధాలు, వాహనాలతో సైనిక సమీకరణ జరుగుతోందని దైవప్రవక్త (స)కు సమాచారం పంపించారు.



ఖురైషీయుల యుద్ధసన్నాహాలు ముగిశాయి. ఉక్కు కవచాలు ధరించి రకరకాల ఆయుధాలు చేతబూనిన మూడు వేలమంది సిపాయీలతో సైన్యం సిద్ధమయింది. అబూసుఫ్యాన్ నాయకత్వంలో ఈ సైన్యం పెద్దపెట్టున కోలాహలంతో బయలుదేరింది.

దైవప్రవక్త (స) శత్రుసైన్యాన్ని గురించి సమాచారం తెలుసుకొని రావడానికి ఇద్దరు యోధుల్ని పంపారు. వారు పొయ్యొచ్చి “ఖురైష్‌సైన్యం మదీనాకు సమీపంగా వచ్చిందని, వారి ఒంటెలు గుర్రాలు మన పొలాలన్నిటిని మేసి ధ్వంసం చేశాయని తెలియజేశారు. మరునాడుదయం దైవప్రవక్త (స) అత్యవసర సమావేశం జరిపి అనుచరుల అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాత నగరం బయటికెళ్ళి యుద్ధంచేయాలని తీర్మానించారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) వేయిమంది యోధులతో బయలుదేరారు.

సైన్యంలో కపటవిశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబయి తన మూడొందల మంది అనుయాయులతో వచ్చిచేరాడు. అయితే రెండుమైళ్ళు పోయాక అతను నాటకం చాలించి తన అనుయాయుల్ని తీసుకొని సైన్యం నుంచి వేరైపోయాడు. కపటవిశ్వాసులు వెళ్ళిపోగా ఇక సైన్యంలో ఏడొందల మంది యోధులు మాత్రమే మిగిలారు. ఈ ఏడొందల మంది యోధులతో మూడువేలమంది శత్రుసైనికుల్ని ఎదుర్కోవడానికి మదీనా నుంచి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఉహద్ (కొండ) ప్రాంతానికి చేరుకున్నారు.

దైవప్రవక్త (స) తన యోధులను కొండ దిగువభాగాన శత్రుసేనలకు అభిముఖంగా నిలబెట్టి పంక్తుల్ని తీర్చిదిద్దారు. సైన్యాలకు తూర్పువైపు కొండల్లో ఓచిన్న సందు ఉంది. అటునుంచి శత్రువులు వచ్చి దాడిచేసే ప్రమాదం ఉంది. అంచేత దైవప్రవక్త (స) కీలకమైన ఆ ప్రదేశంలో ఏభైమంది విలుకాండ్రను ఉంచి వారికి తగిన ఆదేశాలిచ్చారు దైవప్రవక్త (స) ఆదేశాలు స్వీకరించి ఆ యాభైమంది విలుకాండ్రు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) నాయకత్వంలో ఆ కీలక ప్రదేశానికి వెళ్ళి నిలబడ్డారు.

హిజ్రీశకం 3వ ఏట, షవ్వాల్ నెలలో ధర్మాధర్మాల మధ్య, సత్యాసత్యాల మధ్య సంకుల సమరం ప్రారంభమయింది. కాస్సేపటికి సత్యతిరస్కారులు ముస్లింల ధాటికి నిలువలేక పలాయనం చిత్తగించారు. యుద్ధమైదానం ఖాళీ అయింది. అవిశ్వాసులు పారిపోయారో లేదో ముస్లింలు వారు వదలిపోయిన వస్తువులు సేకరించడం మొదలుపెట్టారు. అటు కీలకప్రదేశంలో స్థిరంగా నిలబడమని నియమించబడిన విలుకాండ్రు కూడా ఆ ప్రదేశం వదలిపెట్టి సమరసొత్తు సేకరించడానికి పరుగెత్తారు.

ఇలా ముస్లింలు సమరసొత్తు సేకరణలో మునిగిపోయిఉంటే అటు అవిశ్వాసులు పారిపోయినట్టే పారిపోయి కొండ వెనుకవైపు నుంచి కీలకప్రదేశం గుండా తిరిగొచ్చి ముస్లింలపై విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామానికి ముస్లింలు బిత్తరపోయారు. తమను తాము సంబాళించుకొని ఎదురుదాడి చేసేలోగానే అవిశ్వాసులు అనేకమంది ముస్లింలను వధించారు. మిగిలినవారు ప్రాణాలకు తెగించి హోరాహోరిగా పోరాడసాగారు.

ఆ సందర్భంలో దైవప్రవక్త (స) శత్రువులు తీసిన ఒక గోతిలో పడిపోయి స్వల్పంగా గాయపడ్డారు. మరొక వైపు అవిశ్వాసులు దైవప్రవక్త (స) వధించబడ్డారని పుకార్లు పుట్టించారు. దాంతో ముస్లింలలో ఒక్కసారిగా సమరోత్సాహం తగ్గిపోయింది. వారిలో కొందరు

నిరాశతో ఢీలాపడిపోయి యుద్ధం చేయకుండా పక్కకు తప్పుకున్నారు. మరికొందరు రణరంగం నుండి పారిపోవడానికి ప్రయత్నించారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) హతమార్చబడ్డారన్న వార్త నిజం కాదని తెలియడంతో ముస్లింయోధులు చల్లగా ఊపిరి పీల్చుకొని తిరిగి విజృంభించారు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఎలాగో మొత్తంమీద అంతిమవిజయం ముస్లింలనే వరించింది. అటు అవిశ్వాసులు విజయం సాధించలేకపోయినా ముస్లింలకు జరిగిన అపార నష్టం చూసి మీసాలు మెలేశారు. ఈ యుద్ధంలో దైవప్రవక్త(స) పినతండ్రి హమ్జా(రజి)ని అవిశ్వాసులు హతమార్చి ఆయన భౌతిక కాయాన్ని ముక్కలుముక్కలుగా ఖండించారు. ఈ భయానక దృశ్యం చూడగానే దైవప్రవక్త (స) కళ్ళలో గిర్రున నీళ్ళుతిరిగాయి.

ఈ యుద్ధంలో ఏవర్గానికీ స్పష్టమైన విజయం లభించలేదు. అయితే యావత్తు అరబ్ బహుదైవారాధకుల్లో ముస్లింలు ఓడిపోయారని, మక్కా ఖురైషీయులు ఘనవిజయం సాధించారని ప్రచారం జరిగింది. దాంతో కొన్నితెగలు మదీనాపై దాడిచేసి ముస్లింలను హతమార్చడానికి పూనుకున్నాయి. దైవప్రవక్త (స) శత్రువుల కార్యకలాపాలను గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ వాటి ప్రయత్నాలలో రెండిటిని భగ్నంచేశారు. ఆ తర్వాత అవిశ్వాసులు కుటపూరితమైన కార్యకలాపాలకు పూనుకున్నారు.

కొన్నాళ్ళకు హుజైల్ తెగకు సన్నిహితులైన అజల్, ఖారా తెగల వ్యక్తులు కొందరు మదీనా వచ్చి "ముహమ్మద్ గారూ! మా తెగవాళ్ళు ఇస్లాం వైపు ఆకర్షితులయ్యారు. వారికి ఇస్లాం గురించి వివరించి దాని ఆదేశాలేమిటో తెలియజేయాల్సిన అవసరముంది. ఉంది. అంచేత మీరు మా దగ్గరికి కొందరు బోధకులను పంపండి" అని మనవి చేశారు.

ఏతెగవాళ్ళయినా ఇస్లాం స్వీకరిస్తే వారికి ధర్మవిద్య బోధించేందుకు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని అక్కడికి పంపేవారు. అలాగే ఇప్పుడాయిన ఆరుగురు అనుచరుల్ని ఎంపికచేసి ఆ వ్యక్తుల వెంట పంపించారు. అయితే ఆ దుర్మార్గులు దారిలో మరికొన్ని తెగలతో కుమ్మక్కయి వాటిని ముస్లింల మీదికి ఉసిగొల్పారు. ఆ తెగలవారు ముస్లింలను చుట్టుముట్టినప్పుడు జరిగిన యుద్ధంలో నలుగురు ముస్లింలు పోరాడి వీరమరణం పొందారు. మిగిలిన ఇద్దరిని దుర్మార్గులు మక్కా తీసికెళ్ళి ఖురైషీయులకు అమ్మివేశారు. ఖురైషీయులు వారిద్దరిని చిత్రహింసలు పెట్టి దారుణంగా హతమార్చారు.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళకు బనీఆమిర్ తెగ నాయకుడు అబూబరా దైవప్రవక్త (స)ను కలుసుకొని "ముహమ్మద్ గారూ! మా తెగలో ఇస్లాం ప్రచారం చెయ్యడానికి మీ వాళ్ళను కొందర్ని పంపండి. వారి ప్రచారంవల్ల ఇస్లాం మరింత విస్తరించే అవకాశముంది" అని అన్నాడు. "కాని నజద్ విషయంలో నాకు అనుమానంగా ఉంది" అన్నారు దైవప్రవక్త (స). "అనుమానించకండి. వారు నా రక్షణలో ఉంటారు. మీరు నిస్సంకోచంగా పంపండి" అన్నాడు అబూబరా. అబూబరా రక్షణలో ఉండేవారెవరికీ ప్రమాదం ఉండదు. ఆ నమ్మకం తోనే దైవప్రవక్త (స) నలభై మంది అనుచరుల్ని నజద్‌కు పంపారు.

వీరు మదీనా నుండి బయలుదేరి బిర్‌మవూనా అనే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ బనీఆమిర్ తెగతోపాటు బనీసులైమ్ అనే మరో తెగ కూడా ఉంది. ముస్లింలు



ఒక ప్రతినిధి ద్వారా ఆ తెగ నాయకుడు ఆమిర్ ఇబ్నె తుఫైల్ దగ్గరకు ప్రవక్త సందేశాన్ని పంపించారు. కాని ఇబ్నెతుఫైల్ ప్రవక్త సందేశపత్రాన్ని అగౌరవపరచడమే గాకుండా సందేశపత్రం తెచ్చిన ప్రతినిధిని హతమార్చి మిగిలిన ముస్లింలపై బనీసులైంకు చెందిన ఉసయ్యా, రీల్, జక్వాన్ ఉపతెగలను ఉసిగొల్పాడు. ఆ దుర్మార్గులు పెద్ద గుంపుగా వచ్చి ముస్లింలపై విరుచుకుపడ్డారు. దాంతో ఇద్దరు తప్ప అందరూ అమరగతులయ్యారు.

ఆ ఇద్దరిలో ఒకతను తీవ్రంగా గాయపడటంతో చనిపోయి ఉంటాడని భావించి శత్రువులు ఆయన్ని వదలిపోయారు. రెండవ ముస్లిం అమ్ర్ బిన్ ఉమయ్యా (రజి)ని ఇబ్నెతుఫైల్ బంధించి తీసికెళ్ళాడు. తరువాత అతను తన తల్లి ఒక బానిసను విముక్తం చేస్తానని మొక్కుబడి చేసుకొని ఉండటంవల్ల ఆమె కోరికపై ఆయన్ని విడిచిపెట్టాడు. అమ్ర్ (రజి) మదీనా చేరుకొని జరిగిన సంఘటన దైవప్రవక్త (స)కు వివరించారు.

దైవప్రవక్త (స) ఈ సంగతి విని విచారం వ్యక్తపరుస్తూ "ఇదంతా అబూబరా పని. నేనందుకే ముందు మనవాళ్ళను పంపడానికి జంకాను" అన్నారు. తరువాత ఆయన తీవ్రమైన మనస్తాపంతో "దేవా! ఈ దుర్మార్గులపై ప్రతీకారం తీర్చుకో" అని ప్రార్థించారు. ఈ విధంగా ఆయన నెల రోజులదాకా ఆ దుర్మార్గుల్ని శపిస్తూ దైవాన్ని ప్రార్థించారు. సరిగ్గా ఒక నెల తరువాత ఆమిర్ బిన్ తుఫైల్ ప్లేగువ్యాధి సోకి చనిపోయాడు.

అమ్ర్ (రజి) తిరుగుప్రయాణంలో రాత్రివేళ శత్రుపక్షంవారనుకొని పొరపాటున ఇద్దరు మనుషుల్ని చంపారు. ఆయననోట ఈ సంగతి విని దైవప్రవక్త (స) విచారం వెలిబుచ్చుతూ "ఆ ఇద్దరు బనీసాద్ తెగ యూదులు. బనీసాద్ తెగవాళ్ళు కూడా మనతో స్నేహఒప్పందం చేసుకొనిఉన్నారు. ఇది తెలియక చేసిన తప్పు. అయినప్పటికీ మనం ఆ తెగవాళ్ళకు రక్తపరిహారం చెల్లించాలి. బనీసాద్ తెగ బనీనజీర్ తెగకు చెందిన ఉపతెగ. అంచేత మనం బనీనజీర్ తెగవాళ్ళతో సంప్రదించి రక్తపరిహారం చెల్లిద్దాం, పదండి" అన్నారు.

## (19) బనీనజీర్ యూదుల బహిష్కరణ

అయితే బనీనజీర్ తెగ యూదులు దైవప్రవక్త (స)ను ఎంతో గౌరవిస్తున్నట్లు నటిస్తూ, ఓ ఇంటిగోడపక్క కూర్చోబెట్టి తియ్యటిమాటల్లోకి దించి, ఇంటికప్పుపైనుంచి బండరాయి జారవిడిచి చంపడానికి ప్రయత్నించారు. సృష్టికర్త ఈ కుట సంగతి దైవప్రవక్త (స)కు తెలియజేసి, ఆయన్ని అక్కడ్నుంచి మెల్లిగా జారుకునేలా చేశాడు. మరునాడు దైవప్రవక్త (స) బనీనజీర్ యూదులకు అల్టిమేటం ఇస్తూ "మీరు ఒప్పందం ఉల్లంఘించారు. నన్నే అంతమొందించడానికి కుట పన్నారు. ఇక చాలు మీ మైత్రి. వెంటనే ఈప్రాంతం ఖాళీచేసి వెళ్ళిపోండి. పదిరోజులు గడువిస్తున్నాం. ఆ తర్వాత కూడా మీరీ ప్రాంతంలో ఉన్నారా.... మీకు వినాశం తప్పదు" అని హెచ్చరించారు.

ఈ అల్టిమేటం విని యూదులు నిలువునా కంపించి పోయారు. ఇక ఈ ప్రాంతంలో ఉండటం తమ ధనప్రాణాలకు క్షేమకరం కాదని గ్రహించి వారిలో అత్యధికులు వెళ్ళిపోవ డానికి సిద్ధమయ్యారు. అయితే వారు వేరేప్రాంతానికి వెళ్ళిపోవడానికి తీసుకున్న నిర్ణయం కపటవిశ్వాసి ఇబ్నెఉబైకు తెలిసి అతను వారికి ధైర్యంచెబుతూ ఇలా వార్త పంపాడు:

"మీరు వెళ్ళిపోకండి. ఇక్కడ మీ తోటలు, పొలాలు, మేడలు, కోటలు ఉన్నాయి. వీటన్నిటిని వదలి ఎక్కడికి వెళ్తారు? వద్దు. నాదగ్గర రెండువేల మంది సైనికులున్నారు. వారు మీకోసం ప్రాణాలు తెగించి పోరాడుతారు. మీరు మీ కోటలలో ఉండి తలుపులేసు కోండి. ఆ తర్వాత విషయాలు మేము చూసుకుంటాం. మీకెలాంటి ప్రమాదం లేదు."

బనీనజీర్ తెగనాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ ఈ హామీ మాటలు విని సంతోషంతో ఎగిరి గంతేశాడు. తన తెగకు కొండంత అండ దొరికిందని భావించి విర్రవీగాడు. అతను దైవప్రవక్త (స) ఇచ్చిన అల్టిమేటంను ఖాతరు చేయకుండా "మేమీ ప్రాంతాన్ని ఖాళీచేసి వెళ్ళిపోయే ప్రసక్తే లేదు. మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి" అని తెగేసి చెప్పాడు.

దైవప్రవక్త (స) ఇచ్చిన గడువు ముగిసింది. కాని బనీనజీర్ తెగవాళ్ళు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయలేదు. వారు తమ కోటలలో దాక్కొని తలుపులు మూసేసుకున్నారు. దృఢంగా ఉన్న తమ కోటల్ని, కపటవిశ్వాసుల అండదండల్ని చూసుకొని విర్రవీగారు.

హిజ్రీశకం 4వ సంవత్సరం రబీవుల్అవ్వల్ నెలలో దైవప్రవక్త (స) యుద్ధప్రకటన చేశారు. అప్పుడు ముస్లిం‌లు బనీనజీర్‌తెగ యూదుల కోటలను ముట్టడించి యుద్ధం ప్రారంభించారు. ఇలా అనేకరోజులు గడచిపోయాయి. దైవప్రవక్త (స) కోట వెలుపల దారిలో యుద్ధానికి అవరోధంగా ఉన్న ఖర్జూరపు చెట్లను నరికేయమని అనుచరుల్ని ఆదేశించారు. ఈ చెట్లవల్ల కోటలను ముట్టడించడం ముస్లింలకు కష్టమైపోయింది.

దైవప్రవక్త (స) ఆదేశం ప్రకారం అనుచరులు చెట్లను నరకడం ప్రారంభించారు. దాంతో ప్రమాదం ముంచుకొస్తోందని తలచి యూదులు బెంబేలెత్తిపోయారు. వారు ఇబ్నెఉబై మీద పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. అతను రాలేదు. అతని రెండువేల సైన్యమూ లేదు. నలువైపులా నిరాశా కారుమేఘాలు కమ్ముకున్నాయి. అయితే దైవప్రవక్త (స) కారుణ్యకడలిపై వారికి నమ్మకముంది. ఆ నమ్మకంతోనే వారు కాళ్ళబేరానికి వచ్చారు.

"సోదరా ముహమ్మద్! మమ్మల్ని కాపాడండి. మేము ఇక్కడ్నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాం" అన్నారు వారు. దానికి దైవప్రవక్త (స) "సరే, వెళ్ళిపోండి. ఆయుధాలు, ఇతర సామగ్రి ఇక్కడే వదలివెళ్ళాలి. ఒక ఒంటెపై ముగ్గురు మనుషులతో పాటు, ఎంత ఆహారధాన్యం తీసికెళ్ళగల్గితే అంత తీసికెళ్ళవచ్చు" అని చెప్పారు.

యూదులు ఈ షరతును ఒప్పుకున్నారు. ఒప్పుకోక ఏం చేస్తారు? స్నేహఒప్పందం ఉల్లంఘించి నమ్మకద్రోహానికి పాల్పడ్డారు!! కపటవిశ్వాసుల్ని నమ్ముకొని ఉన్నదంతా ఊడగొట్టుకున్నారు. ఇలా వారు బహిష్కృతులై మదీనా నుండి ఖైబర్ ప్రాంతానికి వెళ్ళి స్థిరపడి పోయారు. మరికొందరు సిరియా పరిసర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరచుకున్నారు.

ఖురైష్ సేనాపతి అబూసుఫ్యాన్ ఉహద్ యుద్ధం నుండి వెళ్ళిపోతూ "వచ్చే ఏడు మళ్ళీ బదర్‌లో మన ఉభయవర్గాల మధ్య పోటీ ఉంటుంద"ని ముస్లింలను హెచ్చరించి వెళ్ళిపోయాడు. ఇప్పుడా సమయం వచ్చింది. దైవప్రవక్త (స) అనుయాయుల్ని తీసుకొని బదర్ ప్రాంతానికి వెళ్ళారు. కాని అక్కడ ఖురైష్‌సైనికుల జాడేలేదు. ముస్లింలు అక్కడ ఎనిమిది రోజుల పాటు ఎదురుచూసి వారు రాకపోవడంతో మదీనా తిరిగొచ్చారు.



**ఉమ్మెసల్మా, జైనబ్ (రజి)ల వివాహం:** ఇప్పుడు మదీనాలో కాస్తంత ప్రశాంత వాతావరణం నెలకొన్నది. గతంలో సంభవించిన దుర్ఘటనల మూలంగా కలిగిన బాధలు మరచి నిశ్చింతగా జీవితం గడపసాగారు ముస్లింలు. సాధారణంగా ధార్మికులలో కొందరు ఆత్మవికాసం కోసం దాంపత్యసుఖం, ఇతర ప్రాపంచికసౌఖ్యాలు పరిత్యజించి శరీరాలను కృశింపజేసుకుంటారు. దేవుడు ఇలాంటి వైరాగ్య భావనలను ఖండించాడు.

ఆ తర్వాత దేవుడు మద్యం, జూదాలను కూడా నిషేధించాడు. ఈ ఆదేశంతో మద్యం పూర్తిగా నిషేధించబడిందని, ఇకనుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయరాదని దైవప్రవక్త (స) బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లిములంతా మద్యం మానుకున్నారు. మధుపాత్రలను నోటిదాకా తీసికెళ్ళినవాళ్ళు కూడా నిషేధప్రకటన వినగానే ఆ పాత్రలను దూరంగా విసిరికొట్టారు. ముస్లింలంతా తమతమ ఇండ్లలో ఉన్న మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు. ఆరోజు మదీనా వీధుల్లో మద్యం ఏరులై పారింది. సారాఅంగళ్ళు శాశ్వతంగా కనుమరుగయ్యాయి.

ఆ కాలంలోనే దైవప్రవక్త (స) ఉమ్మెసల్మా (రజి)ను వివాహమాడారు. ఉమ్మెసల్మా (రజి) మొదటి భర్త అబూసల్మా (రజి) ఉహద్‌యుద్ధంలో గాయపడ్డారు. తర్వాత బనీఅసద్ తెగతో జరిగిన యుద్ధంలో మళ్ళీ గాయపడి కొన్నాళ్ళకు ఆయన శాశ్వతంగా కన్నుమూశారు. భర్త మరణంతో ఉమ్మెసల్మా (రజి) కృంగిపోయారు. తండ్రినీడ కోల్పోయిన తన అనాథ పిల్లల దుస్థితి చూసి ఆమె భోరున విలపించారు. ఆ తర్వాత కొన్నాళ్ళకు దైవప్రవక్త (స) ఆమెను వివాహమాడి ఆమె పిల్లలను తన సంరక్షణలోకి తీసుకున్నారు.

దాదాపు అదే కాలంలో దైవప్రవక్త (స) జైనబ్ (రజి)ను కూడా వివాహం చేసుకున్నారు. ఈమె దైవప్రవక్త (స)కు స్వయాన మేనత్త కూతురవుతారు. జైనబ్ (రజి) వివాహం మొదట దైవప్రవక్త (స) పెంపుడుకొడుకు జైద్ (రజి)తో జరిగింది. అంతకు ముందు జైద్ (రజి) బానిసజీవితం గడిపారు. దైవప్రవక్త (స) ఆయన్ని చేరదీసి పెంచి పెద్దచేశారు. తర్వాత ఆయన కులం, గోత్రం, జాతి, తెగ అనే వివక్షల్ని, సాంఘిక అసమానతల్ని అంతమొందించ డానికి జైద్ (రజి) వివాహం జైనబ్ (రజి)తో జరిపించారు. అయితే కపట ముస్లింస్త్రీలు జైనబ్ (రజి) దగ్గరికెళ్ళి మాటిమాటికి నిమ్నోన్నతా భావాలు ఎత్తిచూపిస్తూ ఆమె హృదయాన్ని గాయపరిచేవారు. ఈ సూటిపోటి మాటల్ని జైనబ్ (రజి) వినీ విననట్లు మౌనంగా ఉండి పోయేవారు. పైగా ఆమె జైద్ (రజి)ని ప్రశంసించేవారు.

కపటముస్లిం స్త్రీల సంగతి విని జైద్ (రజి) చాలా బాధపడ్డారు. తన మూలంగా జైనబ్ (రజి) ఆ స్త్రీల సూటిపోటి మాటలు వినవలసి వస్తోంది. ఈ ఆపద నుండి ఆమె విముక్తిపొందాలంటే, తాను ఆమె నుండి విడిపోవడం ఒక్కటే మార్గమని భావించారు జైద్ (రజి). ఆ విషయాన్నే ఆయన జైనబ్ (రజి) ముందు ప్రస్తావించారు.

ఈమాట వినగానే జైనబ్ (రజి)కు కాళ్ళ క్రింద భూమి బ్రద్దలైనట్లు అన్పించింది. "నన్ను కనికరించండి. తొందరపడి అలా చేయకండి. అవన్నీ తాత్కాలికమైన ఉద్రేకపు మాటలు. వాటిని పట్టుకొని మీరంతగా బాధపడాల్సిన అవసరం లేదు. కొన్నాళ్ళకు అంతా సర్దుకుపోతుంది" అన్నారు ఆమె భర్తతో.

ఈ విషయం సమంజసంగా ఉన్నా, జైద్ (రజి) మానసికసంక్షోభం నుంచి బయటపడలేకపోయారు. తన కోరికను దైవప్రవక్త (స)కు కూడా తెలియజేశారు. దానికి దైవప్రవక్త (స) తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. కాని గాయపడిన జైద్ (రజి) హృదయం అంత తేలిగ్గా ఎలా మానుతుంది? కొన్నాళ్ళు ఎలాగో ఓర్పు వహించి ఆ తరువాత ఇక ఈ మానసిక సంక్షోభం భరించలేక ఆయన జైనబ్ (రజి)కు విడాకులు ఇచ్చేశారు. విడాకుల విషయం తెలియగానే జైనబ్ (రజి) తీవ్రంగా ఆవేదనచెందారు.

ఈ విషయం తెలిసి దైవప్రవక్త (స) చాలా బాధపడ్డారు. కాని చేసేదేముంది? జరగవలసింది జరిగిపోయింది. భర్త ఎడబాటుతో జైనబ్ (రజి) పరిస్థితి రోజురోజుకు దిగజారిపోసాగింది. ఇలాంటి పరిస్థితిలో ఆమె బాధ పోగొట్టి ఆమెకు తోడునీడగా నిలిచేదెవరు? దైవప్రవక్త (స) జైనబ్ (రజి) పరిస్థితి అర్థంచేసుకొని ఆమెను కూడా వివాహమాడదలిచారు. కాని ఎలా? జైద్ (రజి) తన పెంపుడుకొడుకు అయ్యాడే!

అరబ్బులు పెంపుడుకొడుకును కన్నకొడుకుగా భావిస్తారు అందువల్ల వారి దృష్టిలో పెంపుడుకొడుకు భార్యను వివాహమాడటం ఘోరమైన అపచారం. దైవప్రవక్త (స) ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో పడిపోయారు. అప్పుడీ విషయంలో దైవసందేశం వచ్చింది. ఈ దైవాజ్ఞ ప్రకారం దైవప్రవక్త (స) జైనబ్ (రజి)ని వివాహమాడారు. దాంతో జైనబ్ విషాదగాథ సుఖాంతమయింది. ఇతర స్త్రీల వివాహాలకు భిన్నంగా తన వివాహం స్వయంగా దేవుడే జరిపించాడన్న భావనతో ఆమె సంతోషంతో పొంగిపోయారు.

## (20) దూమతుల్ జందల్ దండయాత్ర

హిజ్రీశకం 5 సంవత్సరం, రబీవుల్అవ్వల్ నెలలో సిరియా సరిహద్దులోని దూమతుల్ జందల్ ప్రాంతపు క్రైస్తవరాజు అకీదర్ బిన్ మలిక్ మదీనా మీద దాడిచేయడానికి సన్నాహాలు చేస్తున్నాడని దైవప్రవక్త (స)కు తెలిసింది. అదీగాక ఆ రాజు ఆరబ్బు బాటసారులపై, వాణిజ్య బిడారాలపై దాడులు చేస్తూ దోచుకుంటున్నాడని కూడా తెలిసింది. అందువల్ల దైవప్రవక్త (స) అతడ్ని ఎదుర్కోవడానికి దూమతుల్ జందల్‌కు బయలుదేరారు.

ఈ దండయాత్ర గురించి శత్రువుకు తెలియకుండా ఉండేందుకు ఆయన రాత్రి వేళల్లో ప్రయాణంచేస్తూ కొన్నాళ్ళ తరువాత దూమతుల్‌జందల్ పట్నంలోకి ప్రవేశించారు. కాని అక్కడ చూస్తే పట్నం వీథులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. ఇండ్లు, దుకాణాలు కూడా ఖాళీగా పడిఉన్నాయి. ముస్లింలు పట్టణవీథుల్లో తిరుగుతూ తలుపులు బార్లా తెరచి ఖాళీగా ఉన్న ఇండ్ల వైపు విస్తుబోయి చూశారు. ఒకచోట ఒక ఇంటి కిటికీ నుంచి ఓ మనిషి తొంగిచూస్తుంటే వెంటనే ఓ సైనికుడు ఆ ఇంట్లో జొరబడి అతడ్ని బయటికి లాక్కొచ్చాడు. పాపం అతను ముస్లిం సైనికుల్ని చూసి గజగజ వణికిపోసాగాడు.

“భయపడకు. చెప్పు మీ రాజు ఎక్కడికి పోయాడు?” అనడిగారు దైవప్రవక్త (స). “ప్రభూ! మీరు వస్తున్నారని తెలిసి మా రాజు డెమాస్కస్‌కు పారిపోయాడు” అన్నాడా వ్యక్తి కొంచెం భయపడుతూనే. “అంటే మేం వస్తున్న సంగతి మీ రాజుకు ముందే తెలిసిందన్నమాట!” అన్నారు దైవప్రవక్త (స)



“ఆ... మీరు వస్తున్నట్లు గూఢచారులు కొన్నాళ్ళకు ముందే మా రాజుకు తెలియజేశారు. అంచేత ఆయన ముందుగా పట్టణాన్ని ఖాళీచేయించి ప్రజల్ని వేరేచోటికి పంపించాడు. నిన్న రాత్రి పశువుల కాపర్లు వచ్చి ముస్లింల చక్రవర్తి వస్తున్నాడని చెప్పగానే మా రాజు కూడా సైన్యాన్ని తీసుకొని డెమాస్కస్‌కు పారిపోయాడు” చెప్పాడా వ్యక్తి. “సరే, మేము నిన్ను విడిచిపెడ్తున్నాం. నీ ఇష్టమొచ్చిన చోటికి వెళ్ళవచ్చు” అన్నారు దైవప్రవక్త (స). ఈ మాట విని ఆ క్రైస్తవుడు సంతోషంతో దైవప్రవక్త (స)కు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు.

యూదులు, ఖురైషీయుల బెడద చాలా వరకు తగ్గిపోయింది. కాని మదీనా చుట్టుపక్కలున్న వివిధ తెగలు మాత్రం ముస్లింలపై కవ్వింపు చర్యలు ఇంకా మానుకోలేదు. దైవప్రవక్త (స) గూఢచారుల ద్వారా ఆ తెగలను ఓ కంట కనిపెడుతూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నారు. హిజ్రీ 5 వ సంవత్సరం, షాబాన్ మాసం. బనీముస్తలిఖ్ తెగవాళ్ళు మదీనాపై దాడిచేయడానికి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందింది. తక్షణమే దైవప్రవక్త (స) ముజాహిద్‌లను యుద్ధానికి సమాయత్తపరిచారు.

అక్కడ బనీముస్తలిఖ్ తెగవాళ్ళ యుద్ధసన్నాహాలు ఇంకా పూర్తికాలేదు, అంతలో ముస్లింయోధులు వచ్చిపడ్డారు. వారిని చూడగానే బనీముస్తలిఖ్ తెగకు మద్దతు ఇవ్వడానికి వచ్చిన ఇతర తెగలు ప్రాణభీతితో పారిపోయారు. బనీముస్తలిఖ్ తెగ సైనికులు కాస్సేపు ముస్లింలతో పెనుగులాడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పలాయనం చిత్తగించారు. ఈ యుద్ధంలో చావగా మిగిలిన బనీముస్తలిఖ్ తెగవాళ్ళు ఖైదీలుగా పట్టుబడ్డారు.

దైవప్రవక్త (స) యుద్ధరంగం నుంచి మదీనాకు తిరిగివచ్చాక సమరసొత్తును యోధులకు పంచారు. సమరసొత్తులో స్త్రీపురుష ఖైదీలు కూడా ఉన్నారు. యుద్ధఖైదీలలో బనీముస్తలిఖ్ తెగ నాయకుడు హారిస్ కుమార్తె జువైరియా కూడా ఉన్నది. ఈమె సాబిత్ బిన్ ఖైస్ (రజి) వాటాలోకి వచ్చింది. నిన్నటిదాకా స్వేచ్ఛావాయువుల్ని పీల్చుతూ కాలం గడిపిన జువైరియాకు ఇప్పుడిలా బానిసగా ఉండాలంటే మనసొప్పడం లేదు. యజమాని సాబిత్ (రజి)కు కొంత డబ్బిచ్చి బానిసబ్రతుకు నుండి బయటపడదామనుకొని ఆయన్ని అడిగింది. దానికాయన అంగీకరించారు. యజమాని తనకు స్వేచ్ఛనివ్వడానికైతే అంగీకరించాడు. మరి అందుకు ప్రతిఫలంగా డబ్బివ్వాలికదా! అదెలా లభిస్తుంది? ఈవిషయంలో ఆమె దైవప్రవక్త (స) సహాయం అర్థించడానికి వెళ్ళింది.

“అయ్యా! నేను హారిస్ కూతుర్ని. నేనిక్కడ ఎలాంటి ఆపదలో చిక్కుకున్నానో మీకు తెలుసు. నేను సాబిత్ (రజి) గారి వాటాలోకి వచ్చాను. ఆయన నాకు స్వేచ్ఛనివ్వడానికి ఒప్పుకున్నారు. నేను మీసహాయం కోసం వచ్చాను”అన్నదామె. “దానికంటే మంచి మార్గం మరొకటి చెప్పనా?” అన్నారు దైవప్రవక్త (స). ‘చెప్పండి’ అన్నది జువైరియా ఉత్సాహంతో.

“సాబిత్‌కు నువ్వు చెల్లించాల్సిన పైకం మొత్తం నేనే చెల్లిస్తాను. నిన్ను అనాథగా వదలిపెట్టకుండా వివాహం కూడా చేసుకుంటాను” అన్నారు దైవప్రవక్త (స). “మహాప్రసాదం! అంతకంటే అదృష్టం ఇంకేం కావాలి? నాకిది ఇష్టమే” అన్నది ఆమె విప్పారిన ముఖంతో.

అంతేకాదు, అప్పటికప్పుడు ఆమె సత్యధర్మాన్ని విశ్వసించి ముస్లింగా మారిపోవడం కూడా జరిగింది. దాంతో అమె అదృష్టతార మరింత ప్రకాశించింది. జువైరియా (రజి)

ఇప్పుడు సాధారణ ముస్లిం మహిళ కాదు. ఆమె దైవప్రవక్త (స) అర్ధాంగి. యావత్ ముస్లింసమాజానికే మాతృమూర్తి. ఈ శుభవార్త తెలిసి ముస్లింలు తమ దగ్గరున్న బనీముస్తలిఖ్ తెగ బానిసలందర్నీ బానిసత్వం నుండి విముక్తం చేశారు.

## (21) కందకం యుద్ధం

ముస్లింలు స్వల్పకాలంలో అనేకచోట్ల విజయపతాకాలు ఎగరవేయడంతో యావత్తు అరబ్ తెగలు నీరుగారిపోయాయి. మక్కా ఖురైషీయులకు ముస్లింలతో మళ్ళీ తలపడటానికి ధైర్యం చాలడంలేదు. అయితే కల్లోల స్వభావకులైన యూదులు రంగంలోకి దిగడంతో బహుదైవారాధకులకు ధైర్యం వచ్చింది.

బనూనజీర్‌తెగ యూదులు తమ అలజడుల మూలాన మదీనా నుంచి ఇదివరకే బహిష్కరించబడ్డారు. అప్పుడా తెగవాళ్ళు ఖైబర్‌కు పోయి స్థిరపడ్డారు. అయితే వారు తమకు జరిగిన పరాభవానికి ఉడికిపోతూ పగతీర్చుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. దాని కోసం వారు బహుదైవారాధకుల్ని పావులుగా వాడుకోవడానికి నిర్ణయించుకున్నారు. వారి నేతలు ఖురైషీయుల దగ్గరకు పోయి దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా బాగా నూరి పోశారు. దాంతో ఖురైషీయుల హృదయాలలో నూతన ఉత్తేజం ఉప్పొంగింది.

యూదులు అంతటితో ఊరుకోలేదు. వారు ఇతర తెగల దగ్గరకు కూడా పోయి విషబీజాలు నాటారు. ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలతో ప్రజలను రెచ్చగొట్టారు. గత్ఫాన్ తెగలోకి పోయి వారికి అనేకనేక ఆశలు చూపిస్తూ “మీరీ యుద్ధంలో మాతో సహకరిస్తే, మేము ఖైబర్‌లో పండే పంటలో సగం మీకిస్తాం” అన్నారు. అదేవిధంగా వారు బనీఅసద్, ఫజారా, ముర్రా తెగల దగ్గరికి కూడా పోయి తమ పథకాన్ని అమలుపరిచారు. వారందరికీ నూతనధర్మం వల్ల పొంచివున్న ప్రమాదం గురించి తీవ్రంగా హెచ్చరించారు.

ఇప్పుడు దైవప్రవక్త (స)కు వ్యతిరేకంగా మొత్తం అరేబియా ఒకటై పోయింది. సమస్త దుష్టశక్తులు సత్యజ్యోతిని ఆర్పడానికి సమాయత్తమయ్యాయి. భారీఎత్తున ఆయుధాలు, ఇతర అవసరాలు సమకూరాయి. కొద్దిరోజుల్లోనే బ్రహ్మాండమైన సైనికపటాలం తయారయింది. అరబ్ తెగలన్నీ ఏకమై మదీనాపై విరుచుకు పడనున్నాయని దైవప్రవక్త (స)కు సమాచారం అందింది. ఆయన తన ముఖ్యానుచరులందర్నీ సంప్రదించారు. అనుచరులంతా ముక్తకంఠంతో “ఈసారి బయటకి పోకుండా మదీనాలోనే ఉండి శత్రువుల్ని ఎదుర్కొందాం” అన్నారు. దానికి దైవప్రవక్త (స) అంగీకరించారు.

ఈరాన్ జాతీయుడైన సల్మాన్‌ఫార్సి (రజి) ఇలా అన్నారు: “ఎలాంటి భద్రతలేని బహిరంగ మైదానంలో దిగి యుద్ధం చేయడం మంచిది కాదు. ఏదైనా కీలక ప్రదేశంలో సైన్యాలను సమీకరించి చుట్టూ కందకం తవ్వితే బాగుంటుంది.”ఈ అభిప్రాయం దైవప్రవక్త (స)కు నచ్చింది. “నిజమే. ఇలా చేస్తేనే బాగుంటుంది. లేవండి, సాధ్యమైనంత త్వరగా ఈ పని ప్రారంభించాలి” అన్నారు ఆయన. తక్షణమే ముస్లింలు రంగంలోకి దిగారు.

దైవప్రవక్త (స) పట్టణం వెలుపలికి పోయి చుట్టూ పరిశీలించి ఖాళీగా ఉన్న వైపు అగడ్త త్రవ్వడం అవసరమని భావించారు. తరువాత ఆ ప్రదేశాన్ని పదేసి మందికి పదిపది



గజాల చొప్పున పంచిచ్చారు. వెంటనే త్రవ్వకం మొదలైంది. దైవప్రవక్త (స) కూడా త్రవ్వకంపనిలో పాల్గొన్నారు. అది శీతాకాలం. రాత్రివేళల్లో విపరీతమైన చలి. పైగా అనేక మంది అనుచరులు తిండిలేక మూడేసి రోజులు పస్తులు ఉండవలసి వచ్చింది. అలాంటి పరిస్థితిలో కూడా ముస్లింలు ఎంతో నిగ్రహంతో పని చురుగ్గా చేయసాగారు.

ఇలా అనుచరులు కందకం త్రవ్వుతుంటే అందులో ఓ పెద్ద బండరాయి అడ్డొచ్చింది. సల్మాన్‌ఫార్సి (రజి), ఆయన జట్టు సభ్యులు పలుగులతో దాన్ని కొట్టికొట్టి విసిగిపోయారు. ఆ రాయి కాస్త కూడా పగల్లేదు. చుట్టుపక్కల కందకం త్రవ్వుతున్న ఇతర సహచరులు కూడా వచ్చి తమ బలాలను ప్రదర్శించారు. కాని ఆ రాయి మాత్రం చెక్కు చెదరలేదు. ఈ విశేషం చూసి వారెంతో ఆశ్చర్యపోతూ విషయం దైవప్రవక్త (స) దృష్టికి తీసికెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (స) తాను చేస్తున్న పని వదిలేసి వచ్చి అగడ్తలోకి దిగి ‘బిస్మిల్లా’ అంటూ ఒకేఒక దెబ్బ వేశారు. ఆ దెబ్బకు రాయి మీద సన్నని పగులు ఏర్పడి, అందులో నుంచి ఓ కాంతిపుంజం వెలువడింది. వెంటనే దైవప్రవక్త (స) ‘అల్లాహుఅక్బర్’ అన్నారు. అనుచరుల నోట కూడా అప్రయత్నంగా అల్లాహుఅక్బర్ పలుకులు వెలువడ్డాయి.

దైవప్రవక్త (స) రాతిపై మరోదెబ్బ వేశారు. దాంతో రాయి మరికాస్త పగిలి అందులో నుంచి మళ్ళీ వెలుగు విరజిమ్మింది. ఆయన రాయిమీద ఇంకో దెబ్బవేశారు. దాంతో బండరాయి ముక్కలుముక్కలుగా పగిలి దేదీప్యమానమైన వెలుగు విరజిమ్మింది. క్షణంపాటు పరిసరాలన్నీ ప్రకాశించాయి. దైవప్రవక్త (స) ‘అల్లాహుఅక్బర్’ అన్నారు. అనుచరులు కూడా అదేవిధంగా నినదించారు.

“దైవప్రవక్తా! మీరా బండరాయి మీద పలుగుతో కొట్టినప్పుడు అందులో నుంచి వెలుగు కిరణాలు ప్రసరించాయేమిటీ?” అని అడిగారు కొందరు అనుచరులు. “నువ్వు కూడా ఆ వెలుగుని చూశావా?” దగ్గరే నిలబడివున్న సల్మాన్‌ఫార్సి (రజి)ని అడిగారు దైవప్రవక్త (స). “చూశాను దైవప్రవక్తా! నాతో పాటున్న ఇతర సహచరులు కూడా ఆ వెలుగుని చూశారు” అన్నారు సల్మాన్‌ఫార్సి (రజి).

“నేను మొట్టమొదట పలుగుతో ఆ రాయి మీద కొట్టినప్పుడు జిబ్రీల్ దూత ప్రత్యక్షమై నాకు యమన్ దేశపు తాళపుచెవులు ఇచ్చారు. రెండవసారి కొట్టినప్పుడు సిరియా దేశపు తాళపుచెవులు అప్పగించారు. మూడవసారి కొట్టినప్పుడు ఈరాన్ దేశపు తాళపుచెవులు ఇచ్చి ‘ఈ మూడు దేశాలు మీ అనుచర సముదాయం అధీనంలోకి వస్తాయి’ అన్నారు జిబ్రీల్ దూత” వివరించారు దైవప్రవక్త (స) చిరునవ్వుతో. ఈ శుభవార్త విని ముస్లింలు హర్షాతిరేకంతో మరోసారి ‘అల్లాహుఅక్బర్’ అంటూ నినదించారు. మొత్తంమీద త్రవ్వకం పని ఆరు రోజుల్లోనే పూర్తయింది. ఇప్పుడు మదీనా పట్టణానికి పూర్తి భద్రత ఏర్పడింది.

పట్టణం వెలుపల ఓ కొండ ఉంది. అది కందకానికి కేవలం ఆరు మైళ్ళ దూరంలో ఉంది. రెండిటి మధ్య విశాలమైన మైదానం ఉంది. దైవప్రవక్త (స) సైన్యాన్ని ఆ మైదానంలో మోహరింపజేశారు. అటు అబూసుఫ్యాన్ నాయకత్వంలో మక్కా సైనికదళాలు మదీనా పట్టణానికి సమీపంగా వచ్చి విడిదిచేశాయి. ఆ సైనికులు కందకం చూసి ఎంతో ఆశ్చర్యపోయి హతాశులయ్యారు.

ఇరుపక్షాల మధ్య పెద్ద కందకం ఉండటం వల్ల సైన్యాలు నేరుగా ఢీకొనడానికి వీలులేకుండా పోయింది. శత్రుసైనికులు ఏమీ పాలుపోక కోపంతో చిందులు తొక్కుతున్నారు. అశ్వరూఢులైన కొందరు కందకం దాటడానికి విఫలయత్నం చేశారు. ఇటు ముస్లిం లు ఎడతెరిపి లేకుండా బాణాలు కురిపించసాగారు. వీరి బాణాల ధాటికి శత్రువులు వెనక్కి తగ్గి అగడ్తకు ఆవల వైపునుంచి బాణాలు వదలడం మొదలెట్టారు.

చీకటిపడిన తర్వాత వారు తమ స్థావరాలకు వెళ్ళిపోయారు. మరునాడు కూడా మళ్ళీ కందకం దాటి రావడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. తమ పథకం తారుమారైందని భావించి దిక్కుతోచని స్థితిలో పడ్డారు ఖురైషీయులు. దానికి తోడు రాత్రి వేళల్లో విపరీతమైన ఈదురుగాలులు కూడా మొదలయ్యాయి. ఆపై ఎముకలు కొరికే చలి! నరాల్లోని రక్తం గడ్డ కట్టుకుపోతోంది. సైనిక పంక్తులు చెదరిపోతున్నాయి. దైవప్రవక్త (స)ను అంతమొందించి, సత్యధర్మాన్ని సమాధి చేయడానికి వచ్చిన బహుదైవారాధకులు చివరికిలా ఇరకాటంలో పడ్డారు. వారి సైనికులు ఢీలా పడిపోయారు. ఎవరి నోట విన్నా "ఇక ముహమ్మద్‌ని జయించడం మనవల్ల కానిపని" అన్న మాటలే విన్పించాయి.

బనూనజీర్ యూదతెగ నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ సైనికుల పరిస్థితి చూసి భయపడ్డాడు. వెంటనే అతను సేనాపతి అబూసుఫ్యాన్ దగ్గరికి వెళ్ళి "నాజాతి వాళ్ళయిన బనీఖురైజా యూదులు కూడా మీ పక్షాన ఉన్నారు. వారి శక్తి సామర్థ్యాలు మీకు తెలుసు. రంగంలో దిగితే విజయమో వీరస్వర్గమో అన్నదే వారి ధ్యేయం" అన్నాడతను. "అయితే ఇక ఆలస్యం ఎందుకూ? త్వరగా పోయి ముహమ్మద్‌తో చేసుకున్న స్నేహఒప్పందం తెంచెయ్యమని చెప్పిరా" అన్నాడు అబూసుఫ్యాన్.

హుయ్యి ఆ తర్వాత బనీఖురైజా యూద తెగవాళ్ళ దగ్గరకు పోయాడు. "చూశారా! మీకోసం నేను ఎలాంటి పేరుప్రతిష్ఠల మూట తెచ్చానో. బ్రహ్మాండమైన సైనికవాహిని! యావత్తు అరేబియా కదలి వచ్చింది. ఖురైష్, గత్ఫాన్... ఒకరేమిటి? సమస్త తెగలు వచ్చిపడ్డాయి. అంతా ముహమ్మద్ రక్తం కళ్ళ చూడటానికి తహతహలాడి పోతున్నారు" అన్నాడు హుయ్యి కోటలోకి ప్రవేశిస్తూ బనీఖురైజా నాయకుడు కాబ్‌తో.

హుయ్యి అతిశయోక్తులకు కాబ్ కొంచెం తికమక పడ్డాడు. "హుయ్యీ! నువ్వు నా పరువు తీయడానికి ప్రయత్నిస్తున్నావు. నేను ముహమ్మద్‌తో ఒడంబడిక చేసుకున్న సంగతి నీకు తెలుసు. ముహమ్మద్ ఎల్లప్పుడూ మాపట్ల నమ్మకంగానే ప్రవర్తించాడు. అలాంటి నిజాయితీపరుడికి వ్యతిరేకంగా నేనీ విశ్వాసఘాతుకానికి పాల్పడలేను" అన్నాడు కాబ్.

కాబ్ మాటలకు హుయ్యి ఏమాత్రం నిరాశపడలేదు. అతని అభిమానాన్ని మరింత రెచ్చగొట్టి చివరికి ఎలాగో ముస్లింలతో చేసుకున్న ఒప్పందం ఉల్లంఘించి, ఖురైష్ సైనికులకు దారిచ్చేందుకు ఒప్పించాడు. ఆ తర్వాత హుయ్యి విజయగర్వంతో అబూసుఫ్యాన్ దగ్గరికెళ్ళి ఈ వార్త విన్పించాడు. అబూసుఫ్యాన్ ముఖం చాటంత అయింది.

ముస్లింలు ఎడతెరిపిలేకుండా బాణాలతో పోరాడుతూనే ఉన్నారు. ఆహారపదార్థాలు కొరవడినా ఖాతరుచేయకుండా రణరంగంలో స్థిరంగానేఉన్నారు. సరిగ్గా అదే సమయంలో



బనీఖురైజా తెగయూదులు దైవప్రవక్త (స)తో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించిన వార్త ముస్లిం సైనికుల్లో దావానలంలా వ్యాపించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. యూదుల నమ్మక ద్రోహం వల్ల ఖురైషీయులకు దారి సుగమం అయింది. ఈదారి గుండా వారు మదీనాలోకి ఏ క్షణాన్నయినా ప్రవేశించే ప్రమాదం ఉంది.

అవి ముస్లింలకు కఠినాతి కఠినమైన రోజులు. ఆహారపదార్థాల కొరత తీవ్రంగా ఉంది. దానివల్ల ముస్లిం యోధులు కొందరు రెండేసి మూడేసి రోజులు పస్తులుండవలసి వస్తోంది. కందకం ఆవల శత్రువులు సందుదొరికితే దూకివచ్చి దాడిచేయడానికి కాచుకొని ఉన్నారు. అంచేత ముస్లిం యోధులు కళ్ళలో వత్తులు వేసుకొని అహర్నిశలూ కాపలా కాయవలసి వస్తోంది. వీటన్నిటికి తోడు ముస్లింసైన్యంలో కపటవిశ్వాసుల రూపంలో మరో ప్రమాదం పొంచిఉంది. ఈ దుర్మార్గులు దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "అయ్యా! మాఇళ్ళు భద్రంగా లేవు. మా భార్యాపిల్లలు అపాయకర స్థితిలో ఉన్నారు. నగరం పోవడానికి మాకు అనుమతివ్వండి" అంటూ సాకులు చెప్పారు. దైవప్రవక్త (స) వారి సాకులను గురించి ఆరాతీయకుండా ఇండ్లకు వెళ్ళిపోవడానికి అనుమతిచ్చారు.

సరిగ్గా అలాంటి సమయంలోనే విశ్వప్రభువు గత్ఫాన్ తెగ నాయకుడొకనికి ఇస్లాం స్వీకారభాగ్యం ప్రసాదించి రంగంలోకి దించాడు. గత్ఫాన్ తెగకు చెందిన నయీమ్ బిన్ మస్‌వూద్ అనే ఆ మనిషి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! అల్లాహ్ దయవల్ల నేను ముస్లిం అయ్యాను. అయితే నేను ఇస్లాం స్వీకరించిన సంగతి ఇంకా ఎవరికీ తెలియదు. అంచేత మీరు తలచుకున్న విధంగా నన్ను వినియోగించుకోండి. మీ ఆజ్ఞ శిరసావహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అన్నాడతను ఎంతో ఉత్సాహంతో.

"చాలా సంతోషం, నయీమ్! మీరొక్కరే కదా? ఈ పరిస్థితిలో మీకు తోచినట్లు చేసి ఈ ఆపద దూరంచేయండి. మీరేం చేయాలనుకున్నా దానికి నేను అనుమతిస్తున్నాను" అన్నారు దైవప్రవక్త (స). నయీమ్ బిన్ మస్‌వూద్ (రజి) ఆ తర్వాత దైవప్రవక్త (స) దగ్గర సెలవు తీసుకొని అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

నయీమ్ (రజి)కు బనూఖురైజా తెగలో మంచి పలుకుబడి ఉంది. అంచేత ఆయన ఆవాడలో అడుగుపెట్టగానే బనూఖురైజా పెద్దలు ఎదురెళ్ళి చిరునవ్వుతో స్వాగతమిచ్చారు. అతిథి గృహానికి తీసికెళ్ళి రాచమర్యాదలు చేశారు. నయీమ్ (రజి) కాస్సేపు దేశపరిస్థితుల్ని గురించి, వ్యాపారవ్యవహారాలను గురించి మాట్లాడి, ఆ తర్వాత ఇలా అన్నారు:

"మీరు ముహమ్మద్‌తో చేసుకున్న ఒప్పందం భంగపరచి ఖురైష్, గత్ఫాన్ తెగలతో చేతులు కలిపారని విన్నాను. కాని ఆ తెగలవాళ్ళు సుదీర్ఘముట్టడితో ఇప్పటికే బాగా అలసిపోయినట్లు కన్పిస్తున్నారు. మనం గెలిస్తే అంతకన్నా అదృష్టం మరొకటి ఉండదు. కాని దురదృష్టవశాత్తు ఓడిపోతే? అప్పుడేం చేస్తారు? ఖురైషీయులు మాత్రం చల్లగా జారుకుంటారు. మైదానంలో మీరు ఒంటరిగా మిగిలిపోతారు. చివరికి మీరొక్కరే ముస్లింలను ఎదుర్కోవలసి ఉంటుంది. అప్పుడు మీరు ఘోరమైన ప్రమాదంలో పడిపోతారు. ఇదివరకు బనూఖైనుఖా, బనూనజీర్ తెగలకు పట్టిన గతి మీకు తెలుసు. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి."

"అయితే ఇప్పుడేం చెయ్యమంటారు? మీరే ఉపాయం చెప్పండి" అన్నారు యూద నాయకులు. "ఇప్పుడీ ప్రమాదం నుండి బయటపడటానికి ఒకేఒక మార్గం ఉంది. మొదట వారి మనుషులు కొందరిని మీదగ్గర తాకట్టు పెట్టమనండి. ఆ తర్వాత వారితో చేరిపొండి. ఆ మనుషులు కూడా ప్రముఖ వ్యక్తులైఉండాలి. ఇలా అయితే మీకూ తృప్తి ఉంటుంది. వారూ ముహమ్మద్‌ని చంపేవరకు వెనక్కి తిరిగిపోయే మాటెత్తరు" అన్నారు నయీమ్.

ఈ సలహా విని యూదనేతలంతా సంతోషిస్తూ "చాలా బాగుంది మీ అభిప్రాయం. మీసలహా తప్పక పాటిస్తాం" అన్నారు. తరువాత నయీమ్ (రజి) అక్కడ్నుంచి బయలుదేరి ఖురైష్ నాయకుల దగ్గరకి వెళ్ళారు. నయీమ్ (రజి)ని చూడగానే వారంతా సాదరంగా ఆహ్వానించారు. కుశల ప్రశ్నలయ్యాక నయీమ్ (రజి) విషయాన్ని మెల్లగా బయటపెట్టారు.

"బనూఖురైజా తెగవాళ్ళు ముహమ్మద్ (స)తో చేసుకున్న ఒప్పందాన్ని భంగంచేసి పశ్చాత్తాపపడుతున్నారని విన్నాను" అన్నారు నయీమ్ (రజి). "నిజమా!?" అన్నారు ఖురైషీయులు నిర్ఘాంతపోయి చూస్తూ.

"కాని వారంతటితో ఊరుకోలేదు. ముహమ్మద్ తమతో పాత ఒప్పందానికి మళ్ళీ ఇష్టపడితే ఖురైష్, గత్ఫాన్ తెగలకు చెందిన కొందర్ని అప్పగిస్తామని, ఆయన వారిని వధించి పగతీర్చుకోవచ్చని ఆయన దగ్గరికి రాజీధోరణి వ్యక్తపరిచే విజ్ఞప్తి కూడా పంపుకున్నారట. ఆ మనుషులు కూడా సాధారణ మనుషులు కాదట! ప్రముఖ వ్యక్తుల్ని అప్పగిస్తారట!!" అన్నారు నయీమ్ (రజి) ఆఖరి బాణం సంధిస్తూ. "ఎంత దుర్మార్గులు! ఎంత నమ్మకద్రోహులు!! మీరే గనక ఈ సమయంలో ఈవార్త తెలియజేసి ఆదుకోకపోతే మేమెంతో ప్రమాదంలో పడేవాళ్ళం" అన్నారు ఖురైషీయులు.

తరువాత నయీమ్ (రజి) అక్కడ్నుంచి గత్ఫాన్ తెగవాళ్ళ దగ్గరికి పోయి ఖురైషీయుల దగ్గర ఏ మాటలైతే చెప్పారో అక్కడ కూడా ఆయన అవేమాటలు చెప్పారు. ఈ మాటలు విని గత్ఫాన్ తెగ నాయకులు కూడా యూదుల్ని అసహ్యించుకున్నారు. ఆ తరువాత నయీమ్ (రజి) విజయోత్సాహంతో దైవప్రవక్త (స) సన్నిధికి తిరిగొచ్చి తాను చేసివచ్చిన పనిని గురించి ఆయనకు నివేదిక సమర్పించారు.

నయీమ్ (రజి) మాటలకు అటు ఖురైష్ నాయకులు, ఇటు గత్ఫాన్ నాయకులు ఉభయులూ భయపడ్డారు. తక్షణమే ఉభయతెగల నాయకులు సమావేశమై చర్చల కోసం ఒక ప్రతినిధి వర్గాన్ని బనూఖురైజా యూదుల దగ్గరికి పంపించారు. అయితే చర్చలు ఘోరంగా విఫలమై నయీమ్ (రజి) పన్నిన యుద్ధతంత్రం వల్ల శత్రువుల ఐక్య సంఘటన నిట్టనిలువుగా చీలిపోయింది. ఈవార్త ముస్లింశిబిరంలో నిరాశానిస్పృహలు పటాపంచలు చేసి వెలుగురవ్వలు వెదజల్లింది.

మరునాడు దైవకారుణ్యం ధారాపాతంగా వర్షించింది. నలువైపుల నుంచి కారు మేఘాలు కమ్ముకున్నాయి. ఆ వెనువెంటనే ఉరుములు, మెరుపులతో పెనుతుఫాను మొదలైంది. వందలమైళ్ళ వేగంతో ఈదురుగాలులతో ఖర్జూరపుచెట్లు కూకటివేళ్ళతో సహా లేచి గాలిలో ఎగరసాగాయి. కందకం ఆవల ఉన్న శత్రుసైనికుల గుడారాలు తుఫాను తాకిడికి గాలిపటాల్లా ఎగిరిపోతున్నాయి. సామగ్రి చెల్లాచెదరయి పోయింది.



వారి నాయకుల వ్యూహం తారుమారయింది. సైనిక వ్యవస్థ అస్తవ్యస్తమయింది. ప్రకృతి విలయతాండవం చేస్తోంది. సైనికులు భయంతో పెడబొబ్బలు పెడ్తున్నారు. సేనాపతి అబూసుఫ్యాన్ తీవ్రమైన ఆందోళనతో ఇక ముస్లింలతో పోరి గెలవలేమని ఇక్కడుంటే తనకూ, తన సైన్యానికి సర్వనాశనం తప్పదని భావించాడు.

"ఖురైష్ సోదరులారా! ఇక మనమీ ప్రదేశంలో ఒక్కక్షణం కూడా ఉండలేం. చూడండి ప్రకృతి ఎలా భీకరరూపం దాల్చిందో! గుడారాలు ఎగిరి పోతున్నాయి. యూదులు మనల్ని మోసగించారు. పదండి, ప్రమాదం ముంచుకొస్తోంది. ఇదిగో నేను వెళ్తున్నాను" అంటూ అతను ఓ గుట్ట మీదనుంచి పొలికేకలు పెట్టి గుర్రం మీద పలాయనం చిత్తగించాడు.

ఆ తరువాత సైనికులు కూడా చేతికందిన సామాను తీసుకొని చీకటిలో తచ్చాడుతూనే బ్రతుకుజీవుడా అంటూ మక్కా దారిపట్టారు. ఖురైష్ సైనికుల్ని చూసి వారి మిత్రపక్షమైన గత్ఫాన్‌తెగ సైనికులు కూడా గత్యంతరం లేక గబగబా కాలికి బుద్ధిచెప్పారు.

తుఫాను ఉధృతం క్రమంగా తగ్గిపోయింది. మేఘాలు మెల్లమెల్లగా విడిపోయాయి. ప్రకృతి శాంతించింది. కాస్సేపటికి వాతావరణం యథాస్థితికి వచ్చింది. ఆ తరువాత ఉదయభానుడు ముసిముసి నవ్వులతో మేల్కొన్నాడు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంది. ప్రభాత సమయం ప్రార్థన ముగించుకున్న ముస్లింయోధులు కందకం కట్ట మీదికి వచ్చి సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు. కందకం ఆవల యుద్ధమైదానం నిర్మానుష్యంగా పడివుంది. దాంతో అంతా సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అన్నారు.

దైవప్రవక్త (స) ఆ నిర్జనప్రదేశం చూసి "ఇప్పుడిక ఖురైషీయులు మీ మీద ఎన్నటికీ దాడిచేయడానికి రాలేరు. మీరే వారిపై దాడిచేయడానికి వెళ్తారు" అన్నారు అనుచరులతో. శత్రువు పీడ విరగడైనందుకు విప్పారినముఖాలతో ముజాహిద్‌లు నగరానికి తిరిగి వచ్చారు. ఈసంఘటన హి.శ. 5వ యేట, జీఖాదానెలలో జరిగింది. 25 రోజులకు పైగా జరిగిన ఈ యుద్ధంలో పెద్దగా శ్రమ పడకుండానే ముస్లింలకు విజయం లభించింది.

## (22) బనీఖురైజా యూదుల దుర్గతి

దైవప్రవక్త (స) రణరంగం నుండి మధ్యాహ్నం వేళకు ఇంటికి చేరుకున్నారు. అదే సమయంలో దైవదూత జిబ్రీల్ (అలై) ప్రత్యక్షమై "బనూఖురైజా వ్యవహారం ఇంకా మిగిలిఉంది. వీళ్ళను కూడా ఇప్పుడే అణచి వేయాలి" అన్నారు. ఈఆజ్ఞ వినగానే దైవప్రవక్త (స) ఒక ప్రకటన చేస్తూ "దైవధర్మంలో స్థిరంగాఉన్న యోధులంతా బనీఖురైజావాడకు చేరుకొనంతవరకు ఈరోజు అసర్‌నమాజ్ చేయకూడద"ని చెప్పారు. తర్వాత ఆయన అలీ (రజి)కి ఒకచిన్న సైనిక దళాన్నిచ్చి పంపారు.

ఈ సైనికదళం యూదులవాడ సమీపానికి చేరుకుంది. దాన్ని చూడగానే యూదులు కోటగోడలు ఎక్కి, తమను బెదిరించడానికి మాత్రమే ఈ చిన్నదళం వస్తోందని తలచి, దైవప్రవక్త (స)ను, ముస్లింలను నానా దుర్భాషలాడటం మొదలెట్టారు. ఆ తరువాత కాస్సేపటికే దైవప్రవక్త (స) సారథ్యంలో భారీసైన్యం రావడంతో వారి గుండెలు గుభిల్లుమన్నాయి. వెంటనే వారు కోటద్వారాలు మూసుకున్నారు.

ఈ యూదులు అతిక్లిష్ట పరిస్థితుల్లో స్నేహఒప్పందానికి తిలోదకాలిచ్చి, విదేశీ శక్తులతో చేతులుకలిపారు. దైవప్రవక్త (స)ను, ఆయన అనుచరులను అంతమొందించడానికి కుట్రపన్నారు. అలాంటి విశ్వాసఘాతకులు, దేశద్రోహులను వదలిపెట్ట కూడదని భావించి ముస్లింలు కోటను ముట్టడించి యుద్ధం ప్రారంభించారు.

యూదులు కోటబురుజుల నుండి ముస్లింలను ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. కాని బయట నుంచి ముస్లింలు విడుస్తున్న బాణాల ధాటికి నిలువలేక ఆ ప్రయత్నం విరమించుకొని కోట లోపల దూరి కూర్చున్నారు. ముస్లింలు కూడా మొండికేసి అక్కడే రోజుల తరబడి యూదుల కోసం కాచుకొని కూర్చున్నారు. ఇలా ముట్టడి మూడువారాలు కొనసాగింది. యూదులు నిల్వచేసుకున్న ఆహార పదార్థాలు అయిపోవచ్చాయి. దాంతో వారి నాయకులు సమావేశమయి తీవ్రంగా సమాలోచనలు జరిపారు.

"మనం ముహమ్మద్‌తో చేసుకున్న ఒడంబడికను భంగంచేసి చాలా పొరపాటు చేశాం. పరిస్థితి చేజారిపోయింది. ఇప్పుడు మనకు ఒకేఒక మార్గం ఉంది. మనమంతా ఇస్లాం స్వీకరించి ముహమ్మద్‌కు లొంగిపోదాం. ఇలా చేస్తే మన ధన మాన ప్రాణాలకు ముప్పురాదు. ముస్లింలతో కలసిమెలసి ప్రశాంత జీవితం గడపవచ్చు" అన్నాడు వారి అగ్రనాయకుడు కాబ్. ఈ ప్రతిపాదన వినగానే యూదుల్లో పెద్ద కలకలం బయలుదేరింది.

"వీల్లేదు. వీల్లేదు. ముహమ్మద్‌కు లొంగిపోవడం కన్నా మనకు వేరే అవమానం మరొకటి ఉండదు. తౌరాత్ గ్రంథాన్ని మేము ఎన్నటికీ విడనాడము. ప్రాణాన్నయినా వదులుకుంటాం గాని, తౌరాత్‌ని వదలుకోము" తీవ్రంగా నిరాకరించారు అందరూ.

చివరికి కాబ్ "మనల్ని సిరియా పోవడానికి అనుమతించమని ముహమ్మద్‌ని అడుగుదాం. బనూ ఖైనుఖా, బనూనజీర్ తెగల విషయంలో ఇలాగే జరిగింది" అంటూ తుదినిర్ణయం తెలియపరిచాడు. ఈ నిర్ణయం అందరికీ నచ్చింది. వెంటనే ఓ ప్రతినిధి వర్గాన్ని దైవప్రవక్త (స)తో రాయబారం జరపడానికి పంపించారు. ఆ ప్రతినిధివర్గం దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి "అయ్యా! మా వల్ల పొరపాటు జరిగిపోయింది. దయచేసి మమ్మల్ని సిరియా వెళ్ళిపోవడానికి అనుమతించండి" అన్నది.

"మీకీ అనుమతి లభించదు. ఓ పని చేయండి. మీ పాత మిత్రపక్షమైన ఔస్ తెగలో ఎవరినైనా ఎన్నుకోండి. అతను ఏది నిర్ణయిస్తే దానికి మేము కట్టుబడి ఉంటాం. మీరూ దాన్ని సమ్మతించవలసి ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (స). అప్పుడు యూద ప్రతినిధులు సాద్ బిన్ ముఆజ్ (రజి)ను మధ్యవర్తిగా ఉండి ఈ సమస్యను పరిష్కరించమన్నారు.

సాద్ (రజి) యూదుల స్వభావం మొదటి నుంచీ బాగా ఎరిగిన వారైనందున తన నిర్ణయాన్ని తెలియజేస్తూ ఇలా అన్నారు: "బనీఖురైజా తెగ యూదులలో ఎవరెవరు యుద్ధం చేయగల శక్తిమంతులో వారంతా తక్షణమే వధించబడాలి. స్త్రీలు, పిల్లలను బందీలుగా చేసుకోవాలి. వారి ఆస్తిపాస్తులన్నీ ముస్లింలకు పంచబడాలి."

ఈ నిర్ణయం వినగానే యూదులు హతాశులయ్యారు. ఎవరి నోటా మాట పెగల్లేదు. అందరూ నిలువుగుడ్లు వేసి చూడసాగారు. తక్షణమే ముస్లింలు కొందరు పెద్ద పెద్ద



గోతులు తవ్వారు. పురుషులందర్నీ బంధించి గోతుల దగ్గరికి తీసికెళ్ళారు. అక్కడ వారిని వధించి గోతుల్లోకి త్రోసి పూడ్చిపెట్టారు.

స్నేహఒప్పందం భంగపరచి కయ్యానికికాలుదువ్విన శత్రువులకు ఇలాంటి శిక్షే విధించాలని యూదులధర్మశాస్త్రం కూడా ఇలా చెబుతోంది: "యుద్ధము చేయుటకు మీరొక పురము మీదికి సమీపించునప్పుడు సమాధానము నిమిత్తము రాయబారమును పంపవలెను. సమాధానమని అది నీకు ఉత్తరమిచ్చి గుమ్మములను తెరచిన యెడల దానిలో నున్న జనులందరు నీకు పన్ను చెల్లించి నీ దాసులగుదురు. అది మీతో సమాధానముపడక యుద్ధమే మంచిదని యెంచినయెడల దాని ముట్టడి చేయుడి. నీ దేవుడైన యెహోవా దానిని నీ చేతికప్పగించునప్పుడు దానిలోని మగవారినందరిని కత్తివాత హతము చేయవలెను. అయితే స్త్రీలను, చిన్నవారిని, పశువులను, ఆ పురములోనున్నది యావత్తును దాని కొల్లసొమ్మంతటిని నీవు తీసికొనవచ్చును. నీ దేవుడైన యెహోవా నీకిచ్చిన నీ శత్రువుల కొల్లసొమ్మును నీవు అనుభవించుదువు." (బైబిల్ పాతనిబంధన, ద్వితీయోపదేశ కాండము, 20వ అధ్యాయము:10-14)

హి.శ. 5ఏట జిల్‌హజ్ నెలలో తీరప్రాంతంలోని జహ్నియా తెగవాళ్ళు తిరుగుబాటుకు పాల్పడుతున్నారని తెలిసి దైవప్రవక్త (స) అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) నాయకత్వంలో 300 మంది యోధుల్ని సైపుల్‌బహర్ (తీరప్రాంతం) వైపు పంపించారు. ఈ ప్రయాణంలో ఆహారపదార్థాలు తరిగిపోయి యోధులు ఆకలితో బాధ పడ్డారు. కొన్నాళ్ళపాటు రోజుకు రెండుమూడు ఖర్జూరాలు తిని గడపవలసివచ్చింది. చివరికి ఖర్జూరాలు కూడా అయిపోతే చెట్లఆకులు తినవలసివచ్చింది. చివరికి ఒక రోజు తీరం మీదికి ఓ పెద్ద చేప వచ్చిపడింది. అప్పుడు యోధులు సంతోషంతో దాని మాంసం తిని బలం పుంజుకున్నారు.

ఆ ఏడే దైవప్రవక్త (స) నజద్ ప్రాంతానికి కూడా ఒక సైనిక దళం పంపారు. ఈ దళం హనీఫాతెగకు చెందిన యమామా ప్రాంతం నాయకుడు సుమామా బిన్ ఉసాల్‌ని ఖైదీగా పట్టుకున్నది. తర్వాత మదీనా తిరిగొచ్చి అతడ్ని మసీదులో స్తంభానికి కట్టివేశారు. కాస్సేపటికి దైవప్రవక్త (స) వచ్చి "సుమామా! మా గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగారు. దానికి సుమామా "మీరు నన్ను హతమార్చితే విలువైన రక్తంగల ఒక మనిషిని హతమార్చిన వారవుతారు. నాకు మేలుచేస్తే, చేసిన మేలు సదా గుర్తుంచుకునే ఒక వ్యక్తికి మేలు చేసినవారవుతారు. ఒకవేళ మీరు నాదగ్గర ధనం తీసుకోదలిస్తే నేను ఇవ్వడానికి సిద్ధంగాఉన్నాను, అడగండి ఎంతకావాలో" అని అన్నాడు.

దైవప్రవక్త (స) ఈ విధంగా మూడు రోజులు అడిగారు. అడిగిన ప్రతిసారీ అతను ఇలాగే సమాధానమిచ్చేవాడు. చివరికి దైవప్రవక్త (స) అతడ్ని విడిపించారు. సుమామా ఖైదు నుండి విడుదలకాగానే సమీపంలోని ఒయాసిస్సుకు వెళ్ళి స్నానం చేసివచ్చి దైవప్రవక్త (స) ముందు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. తరువాత ఆయన దైవప్రవక్త (స) అనుమతి తీసుకొని ఉమ్రా చేయడానికి మక్కా వెళ్ళారు.

మక్కాలో కాబాప్రదక్షిణ చేస్తుంటే ఖురైష్ నాయకులు ఆయన ధోరణి గమనించి "సుమామా! నువ్వు కూడా మతభ్రష్టుడైపోయావా?" అన్నారు. దానికి సుమామా (రజి)

"కాలేదు. నేనిప్పుడు ఇస్లాం స్వీకరించాను. వినండి. ఇకనుండి ముహమ్మద్ (స) అనుమతి లేకుండా మీకు యమామా నుండి ఒక్క గోధుమగింజ కూడా పంపడం జరగదు" అని అన్నారు. సుమామా (రజి) యమామా తిరిగొచ్చిన తర్వాత అలా చేసి చూపారు కూడా. దాంతో మక్కా ఖురైషీయులు దైవప్రవక్త (స) దగ్గరకొచ్చి "దయచేసి యమామా నుండి వచ్చే ధాన్యాన్ని మాకు సరాఫరాకాకుండా నిలుపుదల చేయించకండి" అని విన్న వించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "మక్కా ప్రజలకు యథాప్రకారం ధాన్యం సరఫరా కానివ్వు" అని సుమామా (రజి)ను ఆదేశించారు.

హిజ్రీశకం 6వ ఏట దైవప్రవక్త (స) ధర్మప్రచారం కోసం అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని దూమతుల్‌జందల్ చుట్టుపక్కలున్న గ్రామాలకు పంపారు. వారి నాయకుల్లో అసీగ్ బిన్ ఉమర్ కల్బీ క్రైస్తవ మతస్థుడు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) అక్కడకు వెళ్ళి ధర్మప్రచారం చేయగానే అసీగ్ ఎంతో ప్రభావితుడై ఇస్లాం స్వీకరించాడు. దాంతో ఆ గ్రామాల ప్రజలు కూడా అనేకమంది ఇస్లాం స్వీకరించారు.

## (23) హుదైబియా పయనం (హజ్‌యాత్ర)

మక్కా నుండి మదీనా వచ్చి ఆరేండ్లు కావస్తున్నా ముస్లింలు కాబా దర్శన భాగ్యానికి నోచుకోలేక పోయారు. ఒకరోజు రాత్రి దైవప్రవక్త (స) మక్కా నగరంలో ప్రవేశిస్తున్నట్లు, ఆయన చుట్టూ అనుచరులు మూగిఉన్నట్లు కలగన్నారు. తెల్లవారుజామున నమాజ్ తర్వాత ఆయన ఆ కలను గురించి ప్రస్తావిస్తూ "మీరు త్వరలోనే (కాబా) ప్రతిష్ఠాలయంలో ప్రవేశించబోతున్నారు. దైవచిత్తమైతే మీరు తప్పక ప్రవేశిస్తారు" అన్నారు. ఈ శుభవార్త విని అనుచరులు ఆనందపరవశులయ్యారు.

ఆ తర్వాత దైవప్రవక్త (స) కాబాయాత్ర ప్రకటన గావించారు. ప్రకటన వినగానే జనం ప్రయాణసన్నాహాలు ప్రారంభించారు. హిజ్రీ 6వ ఏట, జీఖాదా ఒకటోతేదీన దైవప్రవక్త (స) అనుచరుల్ని తీసుకొని బయలుదేరారు. దారిలో మరికొన్ని తెగలు వచ్చి కలిశాయి. ఆవిధంగా ఈ యాత్రికుల సంఖ్య 1400కు చేరింది. వీరంతా ఉమ్రా సంకల్పంతో మక్కా దారిపట్టారు. దైవప్రవక్త (స) వెంట ఆయన సతీమణి ఉమ్మెసల్మా (రజి) కూడా ఉన్నారు.

యాత్రికుల వెంట డెబ్బయి బలిపశువులు ఉన్నాయి. ఖడ్గాలు, ధనుర్బాణాలు తప్ప ఇతరత్రా ఆయుధాలు ఏమీ లేవు. ఖడ్గాలు కూడా వరల్లో ఉన్నాయి. దైవప్రవక్త (స) అలా ప్రయాణించి ఉస్ఫాన్ అనే ప్రాంతానికి చేరుకొని ఆగిపోయారు. అనుచరులు కూడా ఆగిపోయి గుడారాలు వేసుకున్నారు.

అటు ఖురైషీయులకు దైవప్రవక్త మక్కా వస్తున్నారని తెలియగానే గుండెలు పగిలి నంత పనయింది. తమతో యుద్ధాలు చేసిన ముహమ్మద్ (స) మళ్ళీ మక్కా ముఖం చూస్తారనుకోలేదు వారు. కాని ఇప్పుడెలా? వారికి సావకాశంగా ఆలోచించి తగినపథకం రూపొందించుకునేంత వ్యవధిలేదు. అయితే సైనికుల్ని మాత్రం ఆదరా బాదరాగా సమీక రించుకున్నారు. సైన్యాధికారులుగా ఖాలిద్, ఇక్రమాలు నియమితులయ్యారు. వీరిద్దరూ మక్కా దారిలో ఓచోట ముస్లింల కోసం మాటుకాచి కూర్చున్నారు.



మక్కాలో ఖురైషీయులు ఏం సన్నాహాలు చేస్తున్నారో ముస్లింలకు తెలియదు. వారు ఉస్ఫాన్‌లో ఉండగానే బనీఖుజాఅ తెగకు చెందిన బిషర్ బిన్‌సుఫ్యాన్ అనే వ్యక్తి వచ్చాడు. బనీఖుజాఅ తెగ ముస్లింల మిత్రపక్షం. అంచేత అతను ఖురైషీయుల్ని గురించి నిజమైన సమాచారమే చెబుతాడని వారిని గురించి అడిగారు. దానికి "ఖురైషీయులకు మీరు వస్తున్న సంగతి తెలిసిపోయింది. ఖాలిద్ బిన్ వలీద్ ఓపెద్ద సైనికదళం తీసుకొని, మీపై దాడిచేయడానికి దారిలో మాటుకాచి కూర్చున్నాడు" అని చెప్పాడు.

అప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని ఉద్దేశించి "మిత్రులారా! ఖురైషీయులు మీతో పోరాడటానికి బయలుదేరారు. మన ప్రయాణం ఈ దారినే సాగితే మనం వారితో ఢీకొనక తప్పదు. అప్పుడు ఘోర రక్తపాతం తప్పదు. ఇది నాకిష్టం లేదు. కనుక ఈమార్గం తప్పించి వేరే మార్గాన తీసుకొని పోయేవారు ఎవరైనా ఉన్నారా మీలో?" అని అడిగారు.

"దైవప్రవక్తా! నేను తీసికెళ్తాను వేరే మార్గం గుండా" అన్నాడు ఒకతను. "అయితే నువ్వు ముందు నడు. మేము నీ వెనకాల నడుస్తాం" అన్నారు దైవప్రవక్త (స). ఆ వ్యక్తి దైవప్రవక్త (స) ఒంటెముకుతాడు పట్టుకొని ముందుకుదారితీశాడు. పెద్దపెద్ద ఇసుక తిన్నెలతో కూడిన ఆ దారిగుండా ప్రయాణంచేసి మక్కా నుండి దాదాపు ఇరవై మైళ్ళ దూరంలో ఉన్న 'హుదైబియా' ప్రాంతానికి చేరుకున్నారు. హుదైబియా చేరుకోగానే దైవప్రవక్త (స) ఒంటె చతికిలబడింది. దాన్ని లేపడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదు.

ఒంటె ఇలా చతికిలబడి లేవకుండా మొరాయించడంలో ఏదో నిగూఢ రహస్యం ఉండవచ్చని భావించారు దైవప్రవక్త (స). అందువల్ల అక్కడే గుడారాలు వేసి ఆగిపొమ్మని ఆయన అనుచరుల్ని ఆదేశించారు. ఈ వింత చూసి అనుచరులకు ఆశ్చర్యం వేసింది. పైగా తాము విన్న శుభవార్తేమిటి? ఇప్పుడు మక్కా దరిదాపులకు వచ్చి అర్థాంతరంగా ఇక్కడ దిగబడిపోవడమేమిటి? అన్న ఆలోచనలతో వారు నిరుత్సాహానికి గురయ్యారు.

నమాజు వేళయింది. కాని ఉజూ చేయడానికి ఆ ప్రాంతంలో నీళ్ళే లేవు. తెచ్చుకున్న నీళ్ళు అయిపోయాయి. ఇప్పుడేం చేయాలని అనుచరులు దైవప్రవక్త (స)ని అడిగారు. దైవప్రవక్త (స) దగ్గరున్న కూజాలో కొంచెం నీళ్ళున్నాయి. అప్పుడు ఆయన ఆ కూజా మూతిపై చేతివ్రేళ్ళు పెట్టారు. వెంటనే ఆయన వ్రేళ్ళకొనల నుంచి నీటిధారలు పొంగి వచ్చాయి. దాంతో అనుచరులు సంతోషిస్తూ తమకు కావలసినన్ని నీళ్ళు వాడుకోవడమే గాకుండా, తమ తోలుతిత్తుల్ని కూడా నింపుకున్నారు.

కొన్నాళ్ళకు తోలుతిత్తుల్లోని నీళ్ళు కూడా అయిపోయి తిరిగి నీటికొరత ఏర్పడింది. అప్పుడు అనుచరులు మళ్ళీ దైవప్రవక్త (స) దృష్టికి ఈ సమస్య తీసికెళ్ళారు. ఆ ప్రదేశంలో హుదైబియా పేరుతో ఒక బావి ఉంది. కాని అందులో నీరు మాత్రం లేదు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఆ బావి దగ్గరికెళ్ళారు. ఆయన తన అంబులపొది నుండి ఒక బాణం తీసి, దాన్ని బావిలో పడవేయమని చెప్పి బరా బిన్ ఆజిబ్ (రజి)కు అందజేశారు. బరా (రజి) ఆ బాణం తీసుకొనిపోయి బావిలో పడవేశారు. దాంతో బావిలో ఒక్క సారిగా నీటి ఊట ఉబికింది. కొన్ని క్షణాల్లోనే బావి నీళ్ళతో నిండిపోయింది. ముస్లింలు పరమ సంతోషంతో ఆ నీటిని తనివితీరా త్రాగి స్నానాదులు ముగించుకున్నారు.

మక్కాలో ఖురైషీయులు ఖాలిద్ రాకకోసం ఎదురుచూస్తున్నారు. అంతలో ఖాలిద్ వచ్చి "మన పథకం తారుమారయింది. ముహమ్మద్, ఆయన అనుచరులు వేరే దారి గుండా వచ్చి హుదైబియాలో విడిదిచేశారు"అన్నాడు. ఈవార్త విని నాయకులంతా దిగ్భ్రాంతి చెందారు. తక్షణమే వారు దారున్నద్వాలో సమావేశమై ముహమ్మద్‌ని మక్కాలో అడుగు పెట్టనివ్వకూడదని నిర్ణయించుకున్నారు.

"బనీఖుజాఅ తెగ మనుషులు కొందరిని పంపుదాం. వారెళ్ళి ముహమ్మద్ కోరుతున్న దేమిటో తెలుసుకొని వస్తారు. దాన్ని బట్టి మనం నిర్ణయం తీసుకోవచ్చు" అన్నాడు ఒక నాయకుడు. "కాని ఖుజాఅ తెగవాళ్ళు ముస్లింల శ్రేయోభిలాషులు. అలాంటివారి వల్ల ప్రయోజనం కంటే ప్రమాదమే ఎక్కువ" అన్నాడు అబూసుఫ్యాన్. "నువ్వేమీ భయపడకు. వాళ్ళజుట్టు మనచేతిలో ఉంది. ద్రోహంచేస్తే మన పట్టునుండి తప్పించుకొని పారిపోలేరు" అన్నాడు ఓ తలపండిన నాయకుడు. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. రాయబారం కోసం ఓ ప్రతినిధి వర్గాన్ని పంపారు.

ఈ ప్రతినిధి వర్గం దైవప్రవక్త (స) సన్నిధికి పోయింది. ప్రతినిధివర్గం నాయకుడు బుదైల్ బిన్ వరఖా తన రాకకు కారణం చెప్పాడు. "బుదైల్! మీరు ఖురైషీయుల దగ్గరి కెళ్ళి, ముస్లింలు కాబాదర్శనం కోసం వచ్చారని, వారి హృదయాల్లో కాబా పట్ల గౌరవభావం ఉందని చెప్పండి. వారు ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా ఉంటే మేము ప్రశాంతంగా కాబాదర్శనం చేసుకొని వెళ్ళిపోతాం" అన్నారు దైవప్రవక్త (స).

ప్రతినిధి వర్గం మక్కా తిరిగొచ్చింది. బుదైల్ విషయాన్ని ఖురైషీయులకు వివరిస్తూ కాబాదర్శనం కోసం వస్తున్న ఈ యాత్రికుల్ని అడ్డుకోవడం భావ్యం కాదని సలహా ఇచ్చాడు. ఈమాట విని ఖురైషీయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. "ముహమ్మద్‌తో సంధి చేసుకోవాలి. ముస్లింలకు కాబాదర్శనం చేసుకోవడానికి అనుమతివ్వాలి" అన్నారు కొందరు. "వీల్లేదు. ముహమ్మద్ మక్కాలో అడుగుపెట్టడానికి వీల్లేదు" అన్నారు చాలామంది. "అయితే మరేం చేద్దాం?" అడిగారు కొందరు.

"హులైస్ బిన్ అల్ఖమాను పంపిద్దాం. అతని నాయకత్వంలోని అహాబీష్ తెగకున్న శౌర్యపరాక్రమాలు అందరికీ తెలుసు. అతని ద్వారా మన పని నెరవేరి, ముహమ్మద్ మదీనా తిరిగెళ్ళిపోతే మనకు శాంతి లభిస్తుంది. ఒకవేళ ముహమ్మద్ అతని ప్రతిపాదనను తిరస్కరిస్తే అతనికి ఆవేశం వస్తుంది. అప్పుడతను మనతో కలసి పోరాడుతాడు" అన్నాడు అబూసుఫ్యాన్. అప్పుడు ఖురైషీయులు హులైస్‌ని రాయబారిగా చేసి పంపించారు.

దైవప్రవక్త (స) దూరాన్నుంచే హులైస్ రాకను గమనించి అనుచరులతో ఇలా అన్నారు: "అదిగో హులైస్ వస్తున్నాడు. అతని తెగవాళ్ళు భయంకరమైన యోధులు. ఖుర్బానీ పశువుల్ని అతని ముందుకు తోలండి. వాటిని చూసి, మనం కాబాదర్శనం కోసం మాత్రమే వచ్చామని, వినాశంకోసం రాలేదని తెలుసుకుంటాడు."నాయకుడి ఆజ్ఞప్రకారం ముస్లింలు 'లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్' అంటూ పశువుల్ని హులైస్ ముందుకు తోలారు.

హులైస్ ఈ దృశ్యం చూశాడు. ఖుర్బానీ కోసం సాంప్రదాయకంగా తీర్చిదిద్దిన పశువుల గుంపు చూసి అతని కళ్ళు చెమర్చాయి. ఖురైషీయులు నిజంగానే ముస్లింలపై



అన్యాయానికి పాల్పడుతున్నారని గ్రహించాడు. అందువల్ల అతను దైవప్రవక్త (స)ను కలుసుకోకుండానే మక్కా వెళ్ళిపోయాడు.

ఖురైష్ నాయకులు అతని రాక కోసం వేయి కళ్ళతో ఎదురుచూడసాగారు. కాస్సేపటికి హులైస్ గంభీర వదనంతో వచ్చి వారి ఆశలను వమ్ముచేస్తూ ఇలా అన్నాడు: "దైవగృహాన్ని దర్శించుకోవడానికి వస్తున్న ఈభక్తుడ్ని మీరు అడ్డగింపజూస్తున్నారా? ఇలాంటి విషయంపై మేము మీతో ఒప్పందం చేసుకోలేదు. అరబ్ తెగలన్నీ కాబాదర్శనం చేసుకోవచ్చుగాని, ఒక్క అబ్దుల్‌ముత్తలిబ్ కొడుకే ఈభాగ్యానికి నోచుకోలేడా? ఒకవేళ మీరు ముహమ్మద్‌ను కాబా సందర్శించనీయకపోతే నా అధీనంలో ఉన్న తెగలన్నిటినీ తీసుకొని మీనుంచి వేరైపోతాను. అంతేకాదు, ముహమ్మద్ పక్షాన ఉండి మీ అంతుచూస్తాను."

సింహగర్జనల్లాంటి హులైస్ మాటలు వినగానే ఖురైష్‌నాయకులు నిర్ఘాంతపోయారు. పక్కకు పోయి "వీడేదో పిడుగులా ఉన్నాడు. ఘనకార్యం వెలగబెట్టి వస్తాడనుకుంటే చివరికి మనపాలిటే తలకొరివిలా తయారయ్యాడే! మనకు సహాయం చేయకపోతే పోనీ, కనీసం వీణ్ణి వదిలించుకొనైనా వదిలించుకుందాం" అనుకున్నారు. "చూడు తమ్ముడూ! ఇది మా సొంతవ్యవహారం. దీన్ని మాకే వదిలెయ్. అందరికీ ఆమోదయోగ్యమైన విషయ మేదో మేము చూసుకుంటాం" అన్నారు వారు. ఖురైషీయుల మాటలకు హులైస్ మెత్తబడి వారి వ్యవహారంలో తాను జోక్యం చేసుకోనని చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

ఖురైషీయులు ఈసారి ఉర్వా బిన్ మస్‌వూద్‌ని వాడుకోదలిచారు. ముస్లింల దగ్గరికి పోయిన ప్రతిరాయబారీ ఉత్తచేతులతో తిరిగిరావడం చూసి ఉర్వా మొదట ఖురైషీయుల మాటల్ని త్రోసిపుచ్చాడు. కాని ఖురైషీయులు జిడ్డులా పట్టుకొని వదలిపెట్టక పోవడంతో చివరికి ఒప్పుకున్నాడు. ఉర్వా దైవప్రవక్త (స) దగ్గరికి పోయి ఇలా అన్నాడు:

"ముహమ్మద్! మీరు మీస్వస్థలం మక్కాను జయించడానికి వచ్చారా? కాని అక్కడ ఖురైషీయులు మిమ్మల్ని మట్టుపెట్టేందుకు కాచుకొని ఉన్నారు. వారు మిమ్మల్ని ఎలాంటి పరిస్థితిలో కూడా మక్కాలో అడుగు పెట్టనీయమని ప్రతిన బూనారు. వారు తలచుకుంటే మీఆశాసౌధాలన్నీ ఒక్కదెబ్బతో కూలిపోతాయి. మీరే ఆలోచించుకోండి." అబూబకర్ (రజి) ఈమాటలు విని "ఇకచాలించు నీమాటలు. దైవం నీముఖం మాడ్చ! మేము మా నాయకుడ్ని అంత సులభంగా వదలు కుంటామనుకుంటున్నావా?" అన్నారు.

ఆ తర్వాత ఉర్వా దైవప్రవక్త (స)తో తన సంభాషణ కొనసాగించాడు. అతను చేతులు తిప్పితిప్పి మాట్లాడుతూ ఆ చేతుల్ని మాటిమాటికి దైవప్రవక్త (స) నోటి దగ్గరికి పోనిస్తున్నాడు. దైవప్రవక్త (స) వెనుక ఖడ్గం తీసుకొని ఆయనకు అంగరక్షకుడిగా నిలబడిఉన్న ముగీరా (రజి) దాన్ని సహించలేక కత్తిదూసి చూపిస్తూ "జాగ్రత్త! నీచేతుల్ని మరోసారి దైవప్రవక్త నోటి దగ్గరికి పోనిచ్చావో.... అవి మళ్ళీ తిరిగిరావు" అన్నారు ఉరిమిచూస్తూ.

ముహమ్మద్ (స)పట్ల ఆయన అనుచరులకున్న అచంచలవిశ్వాసం, అపార ప్రేమాభి మానాలు చూసి ఉర్వా ఆశ్చర్యపోయాడు. ముస్లింలు యుద్ధం చేయడానికి రాలేదని, రక్తపాతం వారి ఉద్దేశ్యం కాదని, కాబాదర్శనం కోసమే వచ్చారని గ్రహించాడు. అంచేత అతను ఖురైషీయుల గురించి ఇక పొగడటం మానేసి మక్కా తిరిగొచ్చాడు.

ఉర్వా తిరిగొచ్చి ఖురైష్‌నేతలతో ఇలా అన్నాడు: "మిత్రులారా! నేను కిస్రా (ఈరాన్) దర్బార్‌నీ చూశాను, ఖైసర్ (రోమ్) ఆస్థానం చూశాను. నజాషీ (అబిసీనియా) కొలువుని కూడా చూశాను. కాని దైవసాక్షి! ముహమ్మద్ పట్ల ఆయన అనుచరుల్లో ఉన్న గౌరవ విశ్వాసాలను నేను ఏ చక్రవర్తి అనుచరుల్లోనూ ఇంతవరకు చూడలేదు. ముహమ్మద్ ఉజూ చేస్తుంటే ఆయన అనుచరులు ఆ ఉజూనీటిని కూడా కింద పడనీకుండా పట్టుకొని ఎంతో పవిత్రంగా వాడుకుంటున్నారు. చివరికి ముహమ్మద్ తల నుండి ఓ వెంట్రుక ఊడినా దాన్ని వారు కళ్ళకద్దుకొని భద్రపరచుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎలాంటి కిష్టపరిస్థితులు ఎదురైనాసరే వారు తమ నాయకుడ్ని వదలుకోవడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. దీన్నిబట్టి మీరే ఆలోచించుకోండి."

ఇంత చెప్పినా ఖురైషీయులకు తలకెక్కలేదు. ఏమైనాసరే ముస్లింలను మక్కాలో ప్రవేశించనీయకూడదని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత వారు యాభైమంది విలుకాండ్రను రాత్రివేళ పోయి ముహమ్మద్ (స)పై ఆకస్మికదాడి చెయ్యమని పంపించారు. ఈ యాభై మంది రాత్రివేళలో హుదైబియా చేరుకున్నారు. కాని పథకం తల్లక్రిందులయింది. పాపం వారు ముస్లిం శిబిరాలపై నాలుగైదు బాణాలు వదిలారో లేదో తక్షణమే ముస్లింలు మేల్కొని వారిని బందీలుగా పట్టుకొని దైవప్రవక్త (స) ముందు ప్రవేశపెట్టారు.

"ఇంత ద్రోహానికి పాల్పడిన మీకు నేను ప్రాణభిక్ష ఎలా పెట్టాలి?" దైవప్రవక్త (స) వారి కళ్ళలోకి సూటిగాచూస్తూ అడిగారు. "అయ్యా! మాబుద్ధి గడ్డి తిన్నది. మమ్మల్ని కనికరించండి. మీ క్షమాగుణంపై మాకు నమ్మకం ఉంది. దయచేసి మమ్మల్ని నిరాశ పరచకండి" అని వేడుకున్నారు శత్రుసైనికులు. "సరే వెళ్ళండి, మిమ్మల్ని క్షమిస్తున్నాను. ముహమ్మద్ ఇక్కడికి రక్తపాతం జరపడానికి రాలేదని మీ జాతివాళ్ళకు చెప్పండి ఇప్పుడైనా వారికి స్పృహ వస్తుందేమో" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (స).

శత్రుసైనికులు బ్రతుకు జీవుడా అంటూ ముస్లింల పట్టు నుండి బయటపడ్డారు. అయితే ఇంతటి ఘోరమైన నేరాన్ని సైతం ముహమ్మద్ (స) క్షమించినందుకు వారు చాలా ఆశ్చర్యపోయారు. ఇక తమ జాతికి కీడు తప్పదనుకొని వారు మక్కా దారిపట్టారు. ఇలా కవ్వించి కయ్యం పెట్టుకోవాలన్న ఖురైషీయుల ఎత్తుగడ నీరుగారిపోయింది.

## (24) రిజ్వాన్ శపథం, హుదైబియా శాంతిఒప్పందం

దైవప్రవక్త (స) తాము కాబాదర్శనం నిమిత్తమే వచ్చామని ఖురైషీయులకు తెలియ జేయడానికి రాయబారిగా ఖరాష్ బిన్ ఉమయ్యా (రజి)ని పంపారు.

ఖరాష్ (రజి) ఒంటెఎక్కి మక్కా బయలుదేరి నేరుగా అబూసుఫ్యాన్ ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలో అబూసుఫ్యాన్ ఇంటి ఆవరణలో కూర్చొని ఉన్నాడు. ఆయనతో పాటు ఇక్రమా బిన్ అబూజహల్, ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్ వగైరా ప్రముఖులు ఉన్నారు. వారిలో ముస్లింల దగ్గరికి రాయబారిగా వెళ్ళివచ్చిన హులైస్ కూడా ఉన్నాడు.

"ఖురైషీయులారా! నేను దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రత్యేక దూతను. మేము మీతో యుద్ధం చేయడానికి రాలేదని, కాబాదర్శనం కోసమే వచ్చామని తెలియజేయడానికి



నేను మీ దగ్గరికి వచ్చాను. కనుక మీరు మమ్మల్ని కాబాదర్శనం చేసుకోనివ్వండి. మమ్మల్ని నిరోధించకండి" అన్నారు ఖరాష్ (రజి). "ఒకవేళ మేము మిమ్మల్ని కాబాదర్శనం చేసుకో నివ్వకుండా నిరోధిస్తే...?" అన్నాడు ఇక్రమా. "అప్పుడు మేము యుద్ధంచేసి మిమ్మల్నందర్నీ హతమార్చి కాబాదర్శనం చేసుకుంటాం" అన్నారు ఖరాష్ (రజి).

"ఓహో! నువ్వు మమ్మల్ని బెదిరించడానికి వచ్చావన్న మాట!! కాని నీ చావుబ్రతుకులు మా చేతిలో ఉన్న సంగతి మరచిపోతున్నావు సుమా!" అన్నాడు ఇక్రమా. "పొరపడుతున్నావు ఇక్రమా! ప్రతిఒక్కడి చావుబ్రతుకులు సకల సృష్టికర్త, సర్వలోక ప్రభువైన అల్లాహ్ చేతిలో ఉన్నాయి. ఆయన ఆజ్ఞ లేనిదే నువ్వేమీ చెయ్యలేవు" అన్నారు ఖరాష్ (రజి).

అల్లాహ్ పేరు వినగానే అవిశ్వాసులు మండిపడ్డారు. వెంటనే వారిలో కొందరు లేచి ఖరాష్ (రజి) ఒంటెను చంపేసి, ఆయన మీదికి లంఘించారు.

ఖరాష్ (రజి) ఆగ్రహోదగ్రులై చర్రున కత్తి దూసి వారిముందు నిలబడ్డారు."నీచులారా! మీరు చర్చలకు వచ్చిన రాయబారినే చంపడానికి సిద్ధమయ్యారా!! మీరంతగా యుద్ధ జ్వాలల కోసం వెంపర్లాడుతుంటే, మాతో పోరాడండి. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. నేను ఏప్రజల వైపున రాయబారిగా వచ్చానో వారుమీపై విరుచుకుపడి మిమ్మల్ని మట్టు పెడ్తారు. నాచావు మీ అందరిపాలిట మరణమృదంగం అవుతుంది" అన్నారాయన.

వరలేని ఖడ్గం చేతిలో పట్టుకొని కళ్ళలో నిప్పులు కురిపిస్తున్న ఖరాష్ (రజి)ని చూసి సత్యతిరస్కారులు వెనుకంజవేశారు. హులైస్‌కు కూడా ఖురైషీయుల వైఖరి నచ్చ లేదు. "ఖురైషీయులారా! ఏమిటి ఈ అన్యాయం? ఎంతటి పిరికిపంద జాతి కూడా రాయబారిని వధించదు. మీరితడ్ని చంపితే మీ జాతిమీద మాయనిమచ్చ ఏర్పడుతుంది. మీకు ధైర్యముంటే బయటికెళ్ళి ముస్లింలతో పోరాడండి" అన్నాడతను.

"నిజమే. రాయబారిగా వచ్చిన మనిషిని చంపితే మన జాతికి పెద్ద కళంకం వస్తుంది. ఖరాష్! నీవు వెళ్ళిపోయి, మేము ముస్లింలను ఎట్టి పరిస్థితిలోనూ మక్కాలో ప్రవేశించ నీయం అని మీ ప్రవక్తకు చెప్పెయ్యి" అన్నాడు ఇక్రమా. అప్పుడు ఖరాష్ (రజి) ఖడ్గం వరలోపెట్టేసి హుదైబియా చేరుకొని దైవప్రవక్త (స)కు విషయం తెలియజేశారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) తన అనుచరుల్ని సంప్రదించి చర్చలు జరపడానికి ఉస్మాన్ (రజి)ని పంపించారు. మక్కాలో ఉస్మాన్ (రజి) సోదరుడు ఒకాయన ఉన్నాడు. అతని మద్దతుతో ఉస్మాన్ (రజి) మక్కా వెళ్ళారు. అక్కడ ఖురైష్ నాయకుల్ని కలుసుకొని "మేము మీ ముందు రెండేరెండు విషయాలు ఉంచుతున్నాం. మమ్మల్ని కాబాప్రదక్షిణ చేసుకోనివ్వండి. దానికి మీరు ఒప్పుకోకపోతే యుద్ధానికి సిద్ధంకండి" అని అన్నారు.

దానికి ఖురైషీయులు "అలా కుదరదు. కావాలంటే నువ్వొక్కడివే కాబా ప్రదక్షిణ చేసుకో. అంతేగాని ఇతరుల ప్రస్తావన ఎత్తకు. వారు అటునుంచి అటే వెళ్ళిపోవాలి" అన్నారు. ఈమాట వినగానే ఉస్మాన్ ఆగ్రహంతో "ఏమిటీ? ముస్లింలు కాబాదర్శనానికి నోచుకోకుండా వెళ్ళిపోవాలా, నేనొక్కడ్ని మాత్రం కాబాప్రదక్షిణ చేసుకోవచ్చా? కాదు, ముస్లింలందరికీ కాబాప్రదక్షిణ చేసుకునే అవకాశం ఇవ్వాల్సిందే" అన్నారు.

ఖురైషీయులు అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. ఉస్మాన్ (రజి) కూడా పట్టు విడవకుండా కాబాదర్శనం చేసుకునే అవకాశం ముస్లింలందరికీ ఇవ్వాలన్నారు. ఇలా చర్చలు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. అదీగాక ఖురైషీయులు ఉస్మాన్ (రజి)ని మక్కా నుండి వెళ్ళనివ్వకుండా ఆపిఉంచారు. ఈలోగా ఉస్మాన్ (రజి)ని హత్యచేశారని పుకారు పుట్టింది. ఆయన తిరిగిరాకపోవడంతో ముస్లింలు ఈవార్త నిజమే ననుకున్నారు. దాంతో ముస్లింలలో పెద్ద కలకలం చెలరేగింది. వారు ఆగ్రహోదగ్రులైపోయారు.

"ఎంత ద్రోహానికి వడిగట్టారు వీరు! పైగా పవిత్రమాసంలో ఈ ఘాతుకచర్య!! వీరికి పవిత్రమాసం పట్లగాని, యాత్రికుల పట్లగాని గౌరవమే లేదు" అన్నారు దైవప్రవక్త (స). రాజనీతి ఉల్లంఘించి దౌత్యవేత్తను చంపడమంటే స్పష్టంగా యుద్ధ ప్రకటన చేయడమే. అంచేత వెంటనే దైవప్రవక్త (స) ప్రధాన అనుయాయుల్ని సమావేశపరిచారు.

"ఖురైషీయుల నుండి ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం మన విధి. ప్రతీకారం తీర్చుకోకుండా మనం ఇక్కడ్నుంచి ఒక్క అడుగ్గూడా వెనక్కి మరలకూడదు" అన్నారు ఆయన. ఈమాట చెప్పి ఆయన ఓ తుమ్మచెట్టు క్రిందకు పోయి కూర్చున్నారు. అనుచరులు కూడా అక్కడికెళ్ళి తమ ప్రియతమ నాయకుని చుట్టూ గుమికూడారు.

దైవప్రీతి కోసం. ధర్మ రక్షణ కోసం ఓ మహోద్యమానికి సిద్ధమయ్యారు. ధర్మపరిరక్షణ కోసం ముస్లింలు తమ సర్వస్వం త్యాగం చెయ్యడానికి ముందుకొచ్చారు. దైవప్రవక్త (స) చేయిజాపారు. అనుచరులు ఒక్కొక్కరే ముందుకొచ్చి ఆయన చేతిలో చేయివేసి శపథం చేశారు. ఇక విజయమో, వీరమరణమో తేల్చుకోవడమే తరువాయి పని!!

మక్కాలో ఖురైష్ నాయకులు మరోసారి సమావేశమయి ఓ నిర్ణయానికి వచ్చారు. "ఈసారి సుహైల్ బిన్ అమ్ర్‌ని పంపుదాం. అతను ముహమ్మద్ దగ్గరకు వెళ్ళి ఈ సంవత్సరం ముహమ్మద్, ఆయన అనుచరులు వెళ్ళిపోయి వచ్చేయేడు ఉమ్రా చెయ్యమని అయనకు నచ్చజెపుతాడు" అన్నారు ఖురైష్ నాయకులు.

ఆ తర్వాత వారు ఉస్మాన్ (రజి)ని పంపివేశారు. ఆయన హుదైబియాకు తిరిగొచ్చారు. ఆయన్ని చూడగానే ముస్లింలంతా తాము విన్నవార్త నిజంకాదని గ్రహించి చల్లగా ఊపిరి పీల్చుకున్నారు. అంతలో ఖురైషీయుల దౌత్యవేత్తగా సుహైల్ బిన్ అమ్ర్ కూడా అక్కడికి చేరుకున్నాడు. కాని ఇక్కడ ముస్లింలు పెద్దఎత్తున యుద్ధసన్నాహాలు చేయడంలో నిమగ్నులై ఉన్నారు. వారి యుద్ధసన్నాహాలు చూసి సుహైల్ భయపడ్డాడు. ఎలాగైనా ఈ యుద్ధాన్ని నిలుపుదల చేయించాలని తలచి దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళాడు.

"మహాశయా! నేను మీ దగ్గరకు చర్చలు జరపడానికి వచ్చాను. కాని ఇక్కడ చూస్తే మీ అనుచరులు యుద్ధసన్నాహాలు చేస్తున్నట్లు కన్పిస్తున్నారు. అక్కడేమో ఖురైషీయులు ఈ యేడు మిమ్మల్ని మక్కాలో ప్రవేశించనీయమని ప్రతిన బూనారు. నేను కొన్ని షరతులు తీసుకొచ్చాను. వీటిలో మన ఉభయపక్షాల శ్రేయస్సు ఉంది. వీటిని మీరు ఒప్పుకుంటే ఓ భయంకర యుద్ధాన్ని నివారించినవారవుతారు. అనేకమంది ప్రాణాలు దక్కుతాయి. అంతటి మహత్కార్యం సాధించిన ఘనత కూడా మీకు లభిస్తుంది" అన్నాడు సుహైల్.



"సరే, చెప్పండి. ఏమిటా షరతులు?" అడిగారు దైవప్రవక్త (స).

"❶ ఈ ఏడు ముస్లింలు మదీనా తిరిగివెళ్ళిపోయి వచ్చే ఏడు రావాలి. అయితే అప్పుడు మీరు మక్కాలో మూడ్రోజులు మాత్రమే ఉండాలి. వెంట ఒక్కొక్క ఖడ్గమే వరలో పెట్టుకొని తెచ్చుకోవాలి. ఇతర ఆయుధాలేమీ ఉండకూడదు" అన్నాడు సుహైల్.

"❷ మన ఉభయ పక్షాల మధ్య పదేళ్ళ వరకు యుద్ధంగాని, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఎలాంటి చర్యా తీసుకోవడంగాని జరగరాదు."

"❸ ఈ పదేళ్ళ కాలంలో ఖురైషీయుల ఏ మనిషయినా అతని సంరక్షకుని అనుమతి లేకుండా మీదగ్గరకు పారిపోయివస్తే అతడ్ని మాదగ్గరికి తిప్పిపంపాలి. ముస్లింలలో ఎవరైనా మదీనా నుండి మక్కా వస్తే మేమతడ్ని మీదగ్గరికి తిప్పిపంపడం జరగదు."

దైవప్రవక్త (సల్లం) క్షణంపాటు కళ్ళు మూసుకొని మౌనంగా ఉండిపోయారు. దైవ సందేశం అవతరించే సమయంలో ఆయన పరిస్థితి ఇలాగే మారుతుంది.

ఆయన అనుచరులు మాత్రం క్రూరమైన ఈ షరతులు విని ఆగ్రహంతో ఉడికి పోసాగారు. అయితే దైవప్రవక్త (స)ను చూసి ఆవేశాన్ని బలవంతంగా అణచుకున్నారు. దైవప్రవక్త (స) కళ్ళు తెరచి "సరే, చెప్పండి ఇంకా" అన్నారు.

"❹ ఈ పదేళ్ళ కాలంలో ఏ అరబ్బు తెగయినా తన ఇష్టమొచ్చిన పక్షంతో ఒప్పందం చేసుకోవచ్చు...ఇవీ ఖురైషీయుల షరతులు. ఇక మీరే ఆలోచించి నిర్ణయించుకోండి. మీ వివేచనా నిర్ణయాలపై మాకు పూర్తినమ్మకం ఉంది" అన్నాడు సుహైల్.

దైవప్రవక్త (స) ఈ షరతులన్నిటిని అంగీకరించి సంధిపత్రం రాయమని అలి (రజి)ని ఆదేశించారు. దైవప్రవక్త (స) తమ ఆశలకు భిన్నంగా ఇలాంటి షరతుల్ని ఆమోదిస్తారని ముస్లింలు ఊహించనైనా ఊహించలేకపోయారు. అంచేత వారు విస్తుపోయిచూస్తూ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తర్వాత వారిలో ఆవేశం, ఆత్మాభిమానాలు పెల్లుబికాయి.

ఉమర్ (రజి) ఆవేశం అణచుకోలేక దైవప్రవక్త (స) దగ్గరకు వెళ్ళి "ఏమిటీ, మీరు దైవప్రవక్త కాదా?!" అని అడిగారు. "అందులో సందేహం ఏముంది?" అన్నారు దైవప్రవక్త (స). "మనం ముస్లిములం కామా?!" అడిగారు ఉమర్ (రజి). "నిస్సందేహంగా మనం ముస్లిములమే" చెప్పారు దైవప్రవక్త (స). "వారు బహుదైవారాధకులు కాదా?!" అడిగారు ఉమర్ (రజి). "అందులో కూడా ఎలాంటి అనుమానం లేదు."

"అయితే మనం ధర్మంవిషయంలో ఈ అవమానం భరించవలసిన అగత్యం ఏమిటీ? ఈవిధంగా వారికి లోకువై సంధిచేసుకోవడం ఎందుకు?" అడిగారు ఉమర్ (రజి) "ఉమర్! ఆవేశపడకు. నేను దేవుని దాసుడ్ని. ఆయన సందేశహరుడ్ని. ఇది ఆయన నిర్ణయమే. ఆయన మనకు నష్టం వాటిల్లనివ్వడు" అన్నారు దైవప్రవక్త (స).

ఉమర్ (రజి) మనసు కుదుటపడ లేదు. అక్కడ్నుంచి లేచి అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఇలాగే ప్రశ్నించారు."ఉమర్! ఆందోళన చెందకు. ముహమ్మద్ (స) దేవుని సందేశహరుడు. ఆయన ఏది చేసినా దైవాజ్ఞ ప్రకారమే చేస్తారు. ఓపికపట్టు. దేవుడు

మనకే విజయం చేకూర్చుతాడని ఆశించు" అన్నారు అబూబకర్ (రజి). ఉమర్ (రజి) కకావికలమైన మనసుతో అక్కడ్నుంచి వెళ్ళారు.

దైవప్రవక్త (స) ఆదేశాన్ని శిరసావహిస్తూ అలి (రజి) సంధిపత్రం రాయడానికి సిద్ధమయ్యారు. "అలి! వ్రాయ్, కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో" అన్నారు దైవప్రవక్త (స). దానికి సుహైల్ ఆక్షేపిస్తూ "ఆగండి. అలాంటి పదాలు రాయడం మాకు అలవాటు లేదు. కరుణామయుడెవరో, కృపాసాగరుడెవరో మాకు తెలియదు. అల్లాహ్ పేరుతో అని మాత్రమే రాయండి" అని అన్నాడు.

"సరే అలాగే రాస్తాం.... అలి! వ్రాయ్... ఈ దిగువ విషయాలపై దైవప్రవక్త ముహమ్మద్, సుహైల్ బిన్ అమ్రతో సంధి చేసుకున్నాడు..." ఇలా అలి (రజి) రాయడం ప్రారంభించగానే సుహైల్ అలి చేయి పట్టుకుంటూ "ఇలా కాదు. ఖురైషీయులు మిమ్మల్ని దైవప్రవక్తని ఒప్పుకుంటే ఇక ఈ జగడం, ఒప్పందాలు దేనికి? మీరు మీతండ్రి పేరు మాత్రమే రాయించాలి" అన్నాడు సుహైల్.

"మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నేను మాత్రం దైవప్రవక్తనే" అంటూ...."అలి! వ్రాయ్... ఈ దిగువ షరతులపై అబ్దుల్లా కుమారుడు ముహమ్మద్, అమ్ర కొడుకు సుహైల్‌తో సంధి చేసుకున్నాడు అని వ్రాయ్" అన్నారు దైవప్రవక్త (స).

సంధిపత్రం రాయడం ఇంకా పూర్తికానేలేదు. అంతలో ఒక యువకుడు మక్కానుంచి పారిపోయి రొప్పుతూ ముస్లింల దగ్గరికి వచ్చాడు. కాళ్ళకు, చేతులకు సంకెళ్ళున్నాయి. వాడిపోయిన అతని ముఖంలో దైన్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది. ఈ పీడితుడు ఎవరో కాదు, సుహైల్ కొడుకే. పేరు అబూజందల్. ముస్లిం అయిన నేరానికి అతని జీవితం మక్కాలో దుర్భరమయింది. ఖురైషీయుల చేతుల్లో ఎన్ని బాధలు పడ్డాడో! వారి నుండి తప్పించుకోవడానికి మరెన్ని తిప్పలు పడవలసివచ్చిందో!!

అబూజందల్ (రజి)ని చూడగానే సుహైల్ కళ్ళు అగ్నికణాలయ్యాయి. అతను కొడుకు దగ్గరికి పోయి పళ్ళు పటపట నూరుతూ విసురుగా ఒక్క లెంపకాయ వేశాడు. "వీడు నాకొడుకు. నేను వీడి సంరక్షకుడ్ని. సంధిప్రకారం మాకు చెందిన ఏఒక్కరినీ నిరోధించడానికి మీకిప్పుడు అధికారం లేదు. వీడ్ని నాకప్పగించండి" అన్నాడతను.

"సంధిపత్రం రాయడం పూర్తికాలేదుకదా?" అన్నారు దైవప్రవక్త (స). "సంధిపత్రం రాయడం పూర్తికాకపోయినా సంధిషరతులు మన మధ్య ముందే నిర్ణయమై పోయాయి" అన్నాడు సుహైల్. "ఆవేశపడకండి. ఇతడ్ని మా దగ్గర వదలి పెట్టండి" అన్నారు దైవప్రవక్త.

"వీల్లేదు. అలాగైతే మాకీ ఒప్పందం అవసరమే లేదు" అన్నాడు సుహైల్ కటువుగా. దైవప్రవక్త(స) నచ్చజెప్పడానికి ఎంతో ప్రయత్నించారు. కాని సుహైల్ మొండికేశాడు.

కారుణ్యమూర్తి (స) హృదయం బాధగా మూల్గింది. కాసేపు తలవంచుకొని మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత అబూజందల్ (ర) వైపు తిరిగి "బాబూ! సహనం వహించు. దేవుడు తప్పకుండా ఏదో ఓ దారిని సుగమం చేస్తాడు. ఇప్పుడు ఒప్పందం జరిగిపోయింది. మనం వాగ్దానభంగం చేయలేము కదా!" అన్నారు దయార్ద్ర హృదయంతో.



సంధిపత్రం రాయడం పూర్తయింది. తర్వాత సుహైల్ కొడుకు మెడపట్టుకొని ఈడ్చు కుంటూ తీసికెళ్ళసాగాడు. ముస్లింలు కోపోద్రేకాలను బలవంతంగా దిగమింగి నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. ఒప్పందంలోని నాల్గవ షరతు ప్రకారం ఖుజాఅ తెగవాళ్ళు ముస్లింల పక్షంతో కలిశారు. బకర్ తెగ ఖురైషీయులతో చేతులు కలిపింది.

ఆతర్వాత అందరూ బలిపశువుల్ని జిబహ్‌చేసి మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. ప్రయాణం చాలా భారంగా సాగుతోంది. మదీనా నుండి బయలుదేరినప్పటి ఉత్సాహం తిరుగుప్రయాణంలో కన్పించలేదు. కాస్సేపటికి దైవప్రవక్త (స) పెదవులపై దరహాసం తొణికిసలాడింది. "ఉమర్! ఇప్పుడిప్పుడే నాపై ఖుర్‌ఆన్ అధ్యాయం ఒకటి అవతరించింది. సుమధుర వాణి! దాని ముందు ఎంత పెద్ద ప్రాపంచిక సంతోషమైనా బలాదూరే. ఇదిగో విను" అంటూ 'ఫతహ్' అధ్యాయం పఠించారు: ఈ సూక్తులు విని ముస్లింలు పరమ సంతోషంతో పొంగిపోయారు. ఇక ఉమర్ (రజి) ఆనందమయితే అవధులు దాటింది.

## (25) హుదైబియా ఒడంబడిక పరిణామాలు

ముస్లింలు మదీనా చేరుకున్నారు. వారు మదీనా తిరిగొచ్చారో లేదో ఖురైషీయులకు చెందిన అబూబసీర్ మక్కాలో బహుదైవారాధకుల చిత్రహింసలు భరించలేక మదీనా పారిపోయి వచ్చారు. అయితే కాస్సేపటికి మక్కా బహుదైవారాధకులకు చెందిన ఇద్దరు మనుషులు ఆయన్ని వెంబడిస్తూ మదీనా వచ్చారు. వారిద్దరి దగ్గర అబూబసీర్ (రజి) యజమాని దైవప్రవక్త (స) పేరిట రాసిన ఓలేఖ ఉంది. ఆ లేఖలో హుదైబియా ఒడంబడి కను ప్రస్తావిస్తూ అబూబసీర్ (రజి)ని అప్పగించమని కోరడం జరిగింది.

ఒకవైపు అసహాయ స్థితిలో ఉన్న అబూబసీర్ (రజి) దీన వదనం! మరోవైపు ఖురైషీయులతో చేసుకున్న శాంతిఒప్పందం!! దైవప్రవక్త (స) క్షణంపాటు ఆలోచించి "అబూబసీర్! ఖురైషీయులతో మనం ఒప్పందం చేసుకున్నాం. ఒప్పందాన్ని ఉల్లంఘించడం అధర్మం. అందువల్ల నీవు నీ తెగవాళ్ళ దగ్గరికి తిరిగివెళ్ళిపో" అన్నారు బాధగా.

ఇలా మహాప్రవక్త (స) గుండె దిటవుచేసుకొని ఆ అభాగ్యజీవిని ఖురైషీయులకు అప్పగించారు. ఖురైషీయులు అబూబసీర్ (రజి)ని బంధించి తమతో పాటు తీసికెళ్ళారు. ముస్లింలు ఏమీచేయలేక ఆ దీనుడి వైపు అసహాయంగా చూస్తూ కంటతడి పెట్టుకున్నారు.

"ఖురైష్ మనుషులిద్దరు అబూబసీర్(రజి)ని తీసుకొని జుల్‌హలీఫా ప్రదేశానికి చేరుకొని విశ్రాంతి తీసుకుందామని ఆగిపోయారు. వారిలో ఒకడితో అబూబసీర్ "నీఖడ్గం చాలా బాగుందే! ఏది చూద్దాం ఓసారి ఇటివ్వు" అన్నారు. అతను ఖడ్గం ఇచ్చాడు. వెంటనే అబూబసీర్ (రజి) దాంతో అతడ్ని ఒక్కదెబ్బతో కడతేర్చారు. ఈ హఠాత్పరిణామం చూసి రెండవవాడు పలాయనం చిత్తగించాడు. అతను మదీనా వెళ్ళి దైవప్రవక్త (స)తో "అయ్యో! మీమనిషి నాస్నేహితుడ్ని చంపేశాడు. నేనెలాగో తప్పించుకువచ్చాను." అని అన్నాడు.

అంతలో అబూబసీర్ (రజి) కూడా అక్కడికి చేరుకొని "దైవప్రవక్తా! మీరు నన్ను ఖురైషీయులకు అప్పగించి మీకర్తవ్యం నెరవేర్చుకున్నారు. ఇక మీపై ఎలాంటి బాధ్యత లేదు. నేను నా ఆత్మరక్షణ కోసం ఈపని చేశాను" అని చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

హుదైబియా ఒప్పందం ప్రకారం దైవప్రవక్త (స) మక్కానుండి పారిపోయివచ్చిన ముస్లిం పురుషుల్ని తిరిగి మక్కాకు తిప్పిపంపుతుండేవారు. ఇలా కొంతమంది ముస్లిం పురుషుల్ని తిప్పిపంపారు. ఆ తర్వాత ముస్లింస్త్రీలు మక్కా నుండి రావడం ప్రారంభించారు. మొట్టమొదట ఉమ్మెకుల్సూమ్ (రజి) మక్కానుండి పారిపోయి మదీనా వచ్చారు. వెంటనే ఆమె సోదరుడు వచ్చి ఒప్పందం ప్రకారం ఆమెను తమకు అప్పగించమని అడిగాడు.

దైవప్రవక్త(స) అందుకు నిరాకరిస్తూ "ఒప్పందంలోని షరతు పురుషుల విషయంలో ఉందిగాని, స్త్రీల విషయంలో లేద"ని అన్నారు. అప్పుడు మక్కా బహుదైవారాధకులు సంధిషరుతుల్లోని పదజాలం గమనించి జరిగిన పొరపాటుకు తలలు బాదుకున్నారు.

అబూబసీర్ (రజి) మదీనా నుంచి నేరుగా సముద్ర తీరానికి పోయి అమీస్ అనే చోట ఆగిపోయారు. వెంట తెచ్చుకున్న ఖర్జూరపండ్లతో, సముద్రపు చేపలతో క్షుద్బాధ తీర్చుకుంటూ అక్కడే కాలం గడపసాగారు. మక్కాలో ఖురైషీయుల హింసాదౌర్జన్యాలకు గురై అష్టకష్టాలు అనుభవిస్తున్న ఇతర ముస్లింలు ఈ సంగతి తెలుసుకొని ఒక్కొక్కరే రహస్యంగా అబూబసీర్ (రజి) దగ్గరికి చేరుకోసాగారు. అబూజందల్ (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు. ఇలా మక్కానుండి 70 మందికి పైగా ముస్లింలు పారిపోయివచ్చారు.

మక్కా నుంచి సిరియాకు పోయే, సిరియా నుండి తిరిగొచ్చే వర్తక బిడారాలన్నీ ఈ ప్రాంతం గుండానే వచ్చి పోవలసిఉంటుంది. అంచేత వారు ఇక్కడకు వచ్చే వాణిజ్య బృందాలపై గెరిల్లాదాడులు చేస్తూ వాటిని దోచుకోవడం ప్రారంభించారు. ఒకవేళ వారిలో ఎవరైనా ఇస్లాం స్వీకరిస్తే అలాంటివారికి వారి వ్యాపారసామగ్రి తిరిగిచ్చేవారు. ఈవిధంగా చివరికి ఈ పీడితముస్లింలే మక్కా ఖురైషీయులకు పెద్ద బెడదగా తయారయ్యారు.

ఈ పోరు పడలేక ఖురైషీయులు మదీనా వెళ్ళి దైవప్రవక్త (స) ముందు మొర పెట్టుకున్నారు. ఒప్పందంలో తాము విధించిన షరతుల్ని ఇప్పుడు తామే ఉపసంహరించు కుంటున్నామని, సముద్రతీరాన ఉన్న శరణార్థుల్ని మదీనా పిలిపించుకొని తమను ఇక్కట్ల నుంచి గట్టెక్కించమని వేడుకున్నారు ఖురైష్ నాయకులు.

దైవప్రవక్త (స) శత్రువుల అభ్యర్థనను మన్నించారు. ఆయన అబూబసీర్ (రజి) దగ్గరికి ఒక లేఖ పంపి అమీస్‌లోని శరణార్థుల్ని తీసుకొని మదీనా వచ్చేయమని ఆజ్ఞా పించారు. ఈలేఖ అబూబసీర్ (రజి) దగ్గరకు చేరుకునే సమయంలో ఆయన వ్యాధిగ్రస్తులై ఉన్నారు. అంచేత ఆయన అబూజందల్‌తో "నీవు వెంటనే మనవాళ్ళను తీసుకొని మదీనా వెళ్ళిపో" అని చెప్పారు. అబూజందల్ (రజి) అనుచరుల్ని తీసుకొని హిజ్రీశకం 7వ ఏట మదీనా చేరుకున్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకే అబూబసీర్ (రజి) చనిపోయారు.

ఇప్పుడు యావత్తు ముస్లింలు సంతోషంతో గడపసాగారు. మక్కా, మదీనాల మధ్య సురక్షితమైన రాకపోకలు ప్రారంభమయ్యాయి. దాంతో మక్కా ప్రజలు మదీనా వచ్చి తమ బంధుమిత్రుల్ని కలుసుకుని, వారితో లావాదేవీలు జరుపుకునే అవకాశం లభించింది. వారిలో అనేకమంది బహుదైవారాధకులు ముస్లింల జీవనసరళిని సమీపం నుంచి చూసి ప్రభావితులై ఇస్లాం స్వీకరించడం మొదలెట్టారు.



**రాజులకు ఇస్లాం ఆహ్వాన లేఖలు** : దైవప్రవక్త (స) ఈ అవకాశాన్ని వినియోగించు కుంటూ అరేబియా వెలుపలున్న అనేక రాజ్యాలకు దైవసందేశం పంపించారు. ఈరాన్, రోమ్‌లు ఆనాటి అగ్రరాజ్యాలు. దైవప్రవక్త (స) ఈరాన్‌చక్రవర్తి ఖుస్రోపర్వేజ్‌కు, రోమ్ చక్రవర్తి హెరాక్లియస్‌కు లేఖలు రాసి పంపించారు. అలాగే ఈజిప్టుచక్రవర్తి మఖూఖస్, హైరా చక్రవర్తి హారిస్‌గస్సానీ, యమన్‌రాజు హారిస్‌హుమైరీ, అబిసీనియారాజు నజాషీ, ఇతర రాజులు, సామంతులకు దైవసందేశం అందజేస్తూ లేఖలు పంపించారు.

ప్రవక్తలేఖ రోమ్‌చక్రవర్తికి జెరుసలేంలో ఉన్నప్పుడు అందింది. అప్పుడాయన దైవప్రవక్త (స) వివరాలు తెలుసుకోవడానికి అరబ్బు వర్తకుల్ని గురించి ఆరాతీశాడు. యాదృచ్ఛికంగా ఆ రోజుల్లో మక్కా నుండి అబూసుఫ్యాన్, మరికొందరు ఖురైషీయులు వ్యాపార నిమిత్తం బయలుదేరి జెరుసలేంకు వచ్చిఉన్నారు. రోమ్ చక్రవర్తి వెంటనే వాళ్ళను తన దర్బారుకు పిలిపించుకున్నాడు. అబూసుఫ్యాన్ ద్వారా వాస్తవ పరిస్థితి తెలుసుకొని ఇలా అన్నాడు:

"నువ్వు చెబుతున్న విషయాలు నిజమే అయితే ఆయన సామ్రాజ్యం ఈ ప్రాంతం (జెరూసలేం)వరకు విస్తరిస్తుంది. ఒక దైవప్రవక్త రానున్నాడని నాకు తెలుసు. కాని ఆయన అరేబియాలో పుట్టాడన్న సంగతి తెలియదు. నేను గనక అరేబియా వెళ్ళగలిగితే ఆయన్ని తప్పక కలుసుకుంటాను. ఒకవేళ నేనాయన దగ్గర ఉంటే ఆయన పాదాలు కడుగుతాను."

ఆ తరువాత రోమ్ చక్రవర్తి తన రాజ్యానికి చెందిన ఉన్నతాధికారుల్ని, ధర్మవేత్తల్ని, ప్రముఖుల్ని, ప్రజాప్రతినిధుల్ని తన దర్బారులో సమావేశపరిచాడు. ఎవరూ బయటికి పోకుండా తలుపుల్ని మూయించాడు. తరువాత సభికుల్ని ఉద్దేశించి "మీరు శ్రేయో సాఫల్యాలు కోరుకుంటున్నారా? మీరాజ్యం యధాతథంగా ఉండాలని కాంక్షిస్తున్నారా? అయితే మీరంతా ముహమ్మద్ ప్రవక్తను విశ్వసించండి" అన్నాడు.

సభికులు ఈచివరి వాక్యం వినగానే దిగ్గున లేచి తలుపుల వైపు దూసుకుపోయారు. కాని తలుపులు మూసిఉన్నాయి. చక్రవర్తి హెరాక్లియస్ సభికుల ఆగ్రహాన్ని చూసి నిరాశ చెందాడు. వెంటనే అతను వారిని పిలిపించి "నేను మిమ్మల్ని మీ మతంపట్ల మీకెంత దృఢవిశ్వాసం ఉందో పరీక్షించడానికి మాత్రమే ఈ మాటన్నాను. అందులో మీరు నెగ్గారు" అన్నాడు. అప్పుడు సభికులు శాంతించారు. సంతోషంతో వారతని ముందు మోకరిల్లారు. హెరాక్లియస్ పరలోకసాఫల్యం కాదని ప్రాపంచిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చాడు.

ఈరాన్ చక్రవర్తి దైవప్రవక్త (స) లేఖను చూడగానే మండిపడ్డాడు. ఆ లేఖలో ముందుగా తన పేరు ప్రస్తావించకుండా "కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో" అని రాయబడిన తీరే అతనికి నచ్చలేదు. అందువల్ల అతను కోపం పట్టలేక ఆ లేఖను ప్రవక్త దూత ఎదురుగానే చించిపారేశాడు. అంతటితో అతని కోపం తగ్గలేదు. ముహమ్మద్ (స) శిరస్సును ఖండించి తీసుకురమ్మని యమన్ గవర్నర్‌ని ఆదేశించాడు. ఈరాన్‌కు పోయిన ప్రత్యేకదూత తిరిగొచ్చి విషయం దైవప్రవక్త (స)కు విన్నవించాడు.

దైవప్రవక్త (స) ఈ సంఘటన గురించి విని "దేవుడు అతని సామ్రాజ్యాన్ని తునాతునక లుగా చేసి అతడ్ని అధికారభ్రష్టుడ్ని చేయుగాక" అని శపించారు. ఇలా శపించిన కొన్నాళ్ళకే ఈరాన్ చక్రవర్తి పర్వేజ్ హతమార్చబడ్డాడు. తరువాత అతని కొడుకు సింహాసనం ఎక్కాడు.

అప్పట్లో యమన్ కూడా ఈరాన్‌చక్రవర్తి అధీనంలో ఉండేది. ఈరాన్ సామ్రాజ్యం పతనమైపోతోందని, ఇక దాన్ని కాపాడటం ఎవరి తరమూకాదని యమన్ గవర్నర్ గ్రహించి ఇస్లాం స్వీకరించాడు. అలా అతను ఇస్లాంసామ్రాజ్యంలో యమన్‌గవర్నర్‌గా కొనసాగాడు. బహ్‌రైన్‌రాజు, అతని ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించి ముస్లింలుగా మారిపోయారు.

ఈజిప్టుచక్రవర్తి మఖూఖస్ ఇస్లాం స్వీకరించలేదు కాని, దైవప్రవక్త (స) లేఖను, రాయబారిని ఎంతో గౌరవించాడు. దైవప్రవక్త (స) కోసం విలువైన కానుకలిచ్చి పంపాడు.

అబిసీనియా రాజు నజాషీ ప్రవక్తలేఖను గౌరవిస్తూ "మీరు నిజంగా దేవుని సందేశ హరులే అని నేను సాక్ష్యమిస్తున్నాను" అని జవాబిచ్చాడు. ఆయన అంతకు ముందే అబిసీనియాకు వచ్చివున్న జాఫర్ (రజి) చేతిమీదుగా ఇస్లాం స్వీకరించారు. అబిసీనియాలో ఉన్న ముస్లిం కాందిశీకులలో ఉమ్మెహబీబా (రజి) కూడా ఉన్నారు. ఈమె అబూసుఫ్యాన్ కుమార్తె, అబ్దుల్లా బిన్ హజష్ భార్య. అయితే వీరిద్దరు అబిసీనియాకు వలస వచ్చిన తర్వాత అబ్దుల్లా మతభ్రష్టుడైపోయాడు. క్రైస్తవం స్వీకరించి కొన్నాళ్ళకు చనిపోయాడు.

భర్త చేసిన విశ్వాసఘాతుకం వల్ల ఉమ్మెహబీబా (రజి) అతనికి దూరమైపోవలసి వచ్చింది. ఆ విధంగా ఆమె దిక్కులేని అభాగినైపోయింది. దైవప్రవక్త (స) ఆమె పరిస్థితి తెలుసుకొని ఎంతో జాలిపడ్డారు. ఆయన నజాషీ రాజుకు మరోలేఖ రాశారు. తాను ఉమ్మెహబీబాను వివాహమాడదలిచానని, దీనికి ఆమె అంగీకరిస్తే రాజు స్వయంగా వకీలయి తనతో ఆమె వివాహం జరిపించాలని ఆ లేఖలో రాశారు. నజాషీ దైవప్రవక్త (స) అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఉమ్మెహబీబా (రజి)కు వివాహసందేశం అందజేశారు. ఈ శుభవార్త అందుకున్న ఉమ్మెహబీబా (రజి) సంతోషంతో ఈ వివాహసందేశాన్ని తక్షణమే అంగీకరించారు. అప్పుడు నజాషీ దైవప్రవక్త (స)తో ఆమె వివాహం జరిపించాడు.

దైవప్రవక్త(స), నజాషీకి రాసిన మొదటిలేఖలో ఇస్లాంసందేశంతో పాటు అబిసీనియా లోని ముస్లిం కాందిశీకుల్ని మదీనా పంపించమని ఆదేశించారు. వారి కోసం దైవప్రవక్త (స) రెండుఓడలు పంపించారు. వారంతా ఆ ఓడలలో అబిసీనియా (ఇథియోపియా) నుండి బయలుదేరి మదీనా చేరుకున్నారు. వారిలో ఉమ్మెహబీబా (రజి) కూడా ఉన్నారు.

## (26) ఖైబర్ దండయాత్ర

దైవప్రవక్త (స) హుదైబియా నుండి మదీనాకు తిరిగొచ్చిన మూడు నెలలకే 'ఖైబర్' యూదులు ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు చేస్తున్నారని వార్త వచ్చింది. ఖైబర్ మదీనా నుండి వందమైళ్ళ దూరంలో ఉన్న సారవంతమైన నేల. ఇక్కడ కొండల మధ్య ఉన్న ఏడు లోయల్లో అనేక నదులు, బావులతో పాటు ఖర్జూరం, ద్రాక్ష, నిమ్మ, అంజూరం వగైరా పండ్లతో కూడిన ఎన్నో తోటలున్నాయి. యూదులు పాలస్తీనా నుంచి బహిష్కరించబడిన తరువాత మొదటిసారిగా ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారు. ఖైబర్ సమీపంలోఉన్న ఫదక్, ఖురాలోయ, తైమా ప్రాంతాల్లో కూడా యూదులు నివసిస్తున్నారు. ఆ తర్వాత బనీనజీర్ తెగయూదులు కూడా మదీనా నుండి వచ్చి ఖైబర్‌లో నివాసం ఏర్పరచుకున్నారు.



ఈ యూదులు స్నేహఒప్పందం ఉల్లంఘించి ముస్లింలపై కాలుదువ్వడంతో దైవప్రవక్త (స) వారిని మదీనా నుండి బహిష్కరించారు. అప్పుడు వారు ఖైబర్‌కు వచ్చి నివశించసాగారు. కాని ఖైబర్‌లో కూడా ముస్లింవ్యతిరేక కార్యకలాపాలు మానుకోలేదు. అంచేత దైవప్రవక్త (స) ఖైబర్ యూదుల్ని ముట్టడించడానికి పూనుకున్నారు.

హిజ్రీశకం 7వ సంవత్సరం, ముహర్రం నెలలో దైవప్రవక్త (స) దాదాపు 1600 మంది యోధుల్ని తీసుకొని ఖైబర్‌కు బయలుదేరారు. నాలుగు రోజులు ప్రయాణం చేసి ఖైబర్, గత్ఫాన్ పట్టణాల మధ్య ఉన్న 'అజీ' లోయాకు చేరుకున్నారు. ఆరోజు రాత్రి ముస్లింలు అక్కడ స్నానాదులు ముగించుకొని హాయిగా నిద్రపోయారు. తెల్లవారుజామున నమాజు చేసి ఆయుధాలు ధరించి ఖైబర్‌కు బయలుదేరారు. పోగానే ఖైబర్ కోటలను చుట్టు ముట్టారు. ఇరుపక్షాల మధ్య కొన్నాళ్ళు తీవ్రంగా యుద్ధం జరిగింది.

యూదులు ముస్లింల ధాటికి నిలువలేక పోయారు. చివరికి వారు గత్యంతరంలేక కాళ్ళబేరానికి వచ్చారు. కనాన నాయకత్వాన ప్రతినిధివర్గం సంధికోసం దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చింది. సంప్రదింపుల తరువాత ఈక్రింది షరతులపై ఒప్పందం కుదిరింది. (1) యూదసైనికుల ప్రాణాలకు రక్షణ ఉంటుంది. (2) వారి భార్యాపిల్లల్ని విడిచిపెట్టడం జరుగుతుంది. (3) యూదులు తమ స్థిరచరాస్తుల్ని ముస్లింలకు అప్పగిస్తారు. (4) యూదులు తమ సేద్యభూములను ముస్లింలకు అప్పగించిన తర్వాత వారా భూములలో వ్యవసాయం చేస్తూ పండినపంటలో అర్ధభాగం తీసుకుంటారు.

ఈ యుద్ధంలో 93 మంది యూదులు చనిపోయారు. ముస్లింయోధుల్లో 15 మంది అమరగతులయ్యారు. అనేకమంది ఖైదీలు పట్టుబడ్డారు. ఈ ఖైదీలలో యూద నాయకుడు హుయ్యి బిన్ అఖ్తబ్ కూతురు సఫియా కూడా ఉంది. సమరసొత్తులో తౌరాత్ ప్రతులు కూడా అనేకం లభించాయి. కొందరు యూదులు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి తౌరాత్ ప్రతుల్ని తమకు ఇచ్చేయమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) వారి విన్నపం మన్నించి తౌరాత్ ప్రతుల్ని యూదులకు తిరిగిచ్చేశారు.

దైవప్రవక్త (స) సమరసొత్తును, ఖైదీలను యోధులకు పంచారు. రాకుమారి సఫియా హజ్రత్ వహ్యా (రజి) వాటాకు వచ్చింది. అయితే యూదుల్లో సఫియాకున్న గౌరవం, హోదా అంతస్తుల దృష్ట్యా ఆమెను దైవప్రవక్త (స) వహ్యా (రజి) నుండి కొని స్వేచ్ఛ ప్రసా దించారు. దాంతో సఫియా ప్రభావితురాలయి ఇస్లాం స్వీకరించింది.

తరువాత దైవప్రవక్త (స) ఖైబర్‌లో ముఆజ్ బిన్ జబల్ (రజి)ని తన ప్రతినిధిగా నియమిస్తూ యూదులపట్ల సత్ప్రవర్తన కలిగిఉండాలని, వారితో మతపరమైన వివాదాలకు దిగకూడదని ఉపదేశించారు. ఆ తరువాత ఆయన అనుచరుల్ని తీసుకొని ఖైబర్ నుండి బయలుదేరారు. ఖైబర్ నుండి ఫదక్ ప్రాంతానికి రాగానే అక్కడి యూదులు సంధి చేసుకోవడానికి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. తమ ఆస్తిపాస్తులు తీసుకొని తమకు ప్రాణభిక్ష పెట్టేచాలని వారు విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) వారి విన్నపం అంగీక రించారు. ఫదక్ యూదులతో యుద్ధం జరగనందున వారి స్థిరచరాస్తులు యోధులకు పంచకుండా ప్రభుత్వ ఆస్తులుగా పరిగణించబడ్డాయి.

ముస్లింలు అక్కడ్నుంచి ఖురాలోయకు చేరుకున్నారు. అక్కడి యూదులు ఎదురు తిరిగి ముస్లింలపై బాణాలు ఎక్కుపెట్టారు. అంచేత ముస్లింలు వారి కోటలు ముట్ట డించారు. చివరికి వారు కూడా ఖైబర్‌యూదుల్లాగా తమ పంటభూములు అప్పగించి వాటిని సాగుబడి చేసినందుకు తమకు అర్థపంట ఇచ్చే షరతుపై లొంగిపోయారు.

ఆ తరువాత ముస్లింలు అక్కడ్నుంచి తైమా అనే ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడి యూదులు కూడా ఖురాలోయ యూదుల మాదిరిగా సంధిచేసుకొని లొంగిపోయారు. ఆ తరువాత ముస్లింలు అక్కడ్నుంచి బయలుదేరి మదీనా దారిపట్టారు.

## (27) ప్రప్రథమ కాబా(ఉమ్రా)యాత్ర, దాని ప్రభావం

హుదైబియా రిజ్వాన్ శపథంలో పాల్గొన్నవారంతా కాబాయాత్రకు సిద్ధంకావాలని దైవప్రవక్త (స) ప్రకటనగావించారు. ఆ శుభఘడియల కోసమే ఎదురుచూస్తున్న ముస్లింలు ఈ ప్రకటన వినగానే రెట్టింపుఉత్సాహంతో మక్కా బయలుదేరడానికి సిద్ధమయ్యారు. గతసంవత్సరం 1400మంది మాత్రమే అయితే ఈ సంవత్సరం 2000మంది బయలు దేరారు. వారిలో దైవప్రవక్త (స) వందమంది సాయుధ అశ్వరూఢుల్ని ఎంపికచేసి వారికి ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి)ను సేనాపతిగా నియమించారు. శత్రువులు మోసానికి పాల్పడి దాడిచేస్తే వాళ్ళను ఎదుర్కోవడానికి ముందుజాగ్రత్తగా దైవప్రవక్త (స) ఈ సాయుధ అశ్వరూఢులను ఒకరోజు ముందుగానే పంపించారు.

ఈ యోధులు వెళ్ళిపోయాక మరునాడు దైవప్రవక్త(స) మిగతా అనుచరుల్ని తీసుకొని మదీనా నుండి బయలుదేరారు. వీరందరూ ప్రయాణఆయుధాల్ని మాత్రమే దగ్గర ఉంచు కున్నారు. దైవప్రవక్త (స) వస్తున్నారని వినగానే ఖురైషీయులు భయపడి ముక్రజ్ నాయ కత్వంలో ఒక ప్రతినిధివర్గాన్ని పంపించారు. ఈ ప్రతినిధివర్గం దైవప్రవక్త (స)ను కలుసుకొని విషయం తెలుసుకున్నది. ముక్రజ్ తన సహచరులతో మక్కా వెళ్ళి ముహమ్మద్ (స) ఒడంబడికను ఉల్లంఘించబోరని, ఆయన కాబాదర్శనార్థమే వస్తున్నారని, ఇక్కడికి ఆయుధాలను కూడా తీసుకురారని ఖురైష్ నాయకులకు తెలియజేశాడు.

అయితే ముస్లింలు మక్కాలో ప్రవేశిస్తుండగా వారిని తాము చూడలేమని బహుదైవా రాధకులు అన్నారు. అంచేత అందరూ నగరం బయటికి వెళ్ళి కొండలపై డేరాలు వేసుకున్నారు. దైవప్రవక్త(స) ముస్లింయోధుల్ని మక్కా వెలుపలే ఉండిపొమ్మని ఆదేశించి వారి మద్దతు కోసం మరో రెండొందల మంది ముజాహిద్‌లను ఉంచారు. ఆ తరువాత ఆయన మిగిలిన అనుచరుల్ని తీసుకొని మక్కా నగరానికి బయలుదేరారు.

అనుచరులు దైవప్రవక్త (స)ను తమ మధ్యలోకి తీసుకున్నారు. ఇబ్నెరవాహ (రజి) దైవప్రవక్త (స) కూర్చున్న ఒంటె ముకుతాడు పట్టుకొని ముందు ముందు నడవసాగారు. భక్తిపరాయణత ఉట్టిపడేలా దైవగృహం వైపు తరలివస్తున్న విశిష్ఠ యాత్రికావాహిని అది!

ఏ ప్రదేశం నుండి ఒక నిశీధి రాత్రిన ఒంటరిగా, రహస్యంగా పారిపోవలసివచ్చిందో ఆ ప్రదేశానికి ఇప్పుడు పట్టపగలు వేలాది అనుచరులతో వస్తున్నారు దైవప్రవక్త (స). ఒకనాడు బిక్కుబిక్కుమంటూ వందలాది శత్రువులను తప్పించుకొని పోవలసివచ్చిన



ముహమ్మద్ (స) ఈనాడు ధైర్యంగా, ఠీవిగా, రాజాధిరాజులా తిరిగివస్తున్నారు. అసూయ, ఆశ్చర్యాలతో అసహాయ స్థితిలో చూస్తుండిపోయారు ఈ సన్నివేశాన్ని వారు.

ఇలా ముస్లింలు నగరంలోకి ప్రవేశించి దైవగృహాన్ని కళ్ళారా తిలకించి ఆనందించారు. దైవప్రవక్త (స) 'హజరెఅస్వద్' (నల్లరాయి)ని ముద్దాడి ఏడుసార్లు కాబాప్రదక్షిణ చేశారు. తరువాత సఫా, మర్వా కొండల దగ్గరికెళ్ళి వాటి మధ్య ఏడుసార్లు తిరిగారు. మర్వా కొండ చేరువలో నిలబడి ఒక ఒంటెను బలిచ్చారు. ఆ తర్వాత క్షవరం చేయించుకున్నారు. అనుచరులు కూడా ఆయన్ని అనుసరిస్తూ 'ఉమ్రా' విధులు నెరవేర్చారు.

కొండలపై కట్టుకున్న గుడారాల నుండి ఖురైషీయులు ఈ సన్నివేశాన్ని సంభ్రమాశ్చ ర్యాలతో చూస్తూ "ముస్లింలు ఈనాడు ఎంత ఆనందంతో, భక్తిపారవశ్యంతో కాబాప్రదక్షిణ చేస్తున్నారు! దేవుని పట్ల, ఆయనప్రవక్త పట్ల ఎంత దృఢవిశ్వాసం ఉంది వీరి హృదయాల్లో!! అనుకున్నది సాధించేవరకు ఎన్ని త్యాగాలకైనా వెనకాడటం లేదంటే వీరు ఎంతటి వజ్ర సంకల్పులు!!" అని చెప్పుకున్నారు వారిలో కొందరు.

హుదైబియా ఒప్పందం ప్రకారం ముస్లింలు మక్కాలో మూడ్రోజులు మాత్రమే ఉండ వలసివుంది. ఆ మూడ్రోజులు ముగిశాయి. కనుక ఖురైష్ నాయకులు ఈ విషయం గుర్తుచేయడానికి సుహైల్‌ని, హువైతిబ్‌ని దైవప్రవక్త (స) దగ్గరికి పంపారు. వారిద్దరు వెళ్ళి "నిర్ణీతగడువు ముగిసింది. ఇక మీరు మక్కా ఖాళీచేసి వెళ్ళిపోవాలి" అన్నారు. "వెళ్ళిపోతాం. కాని నేనిక్కడ వివాహం చేసుకొని, ఆ తరువాత ఏర్పాటుచేసే విందు భోజనానికి మిమ్మల్ని ఆహ్వానించాలనుకుంటున్నాను" అన్నారు దైవప్రవక్త (స).

దానికి వారు "వద్దు. మీ విందుభోజనం వద్దు; మీరూ వద్దు. మీకిచ్చిన గడువు ముగిసింది. దయచేసి తక్షణమే ఇక్కడ్నుంచి వెళ్ళిపొండి" అన్నాడు వారిలోఒకడు. తరువాత దైవప్రవక్త (స) "ప్రియఅనుచరులారా! ఇక మనం ఇక్కడ నుండి వెంటనే బయలుదేరాలి" అని ప్రకటించారు. ఈ ప్రకటనతో ముస్లింలు ఆరోజు రాత్రే మదీనాకు తిరుగు ప్రయాణ మయ్యారు. ఖురైషీయులు మక్కా నుండి వెళ్ళిపోతున్న ముస్లింలను చూసి అసూయతో తల్లడిల్లి పోయారు. కొండలపై గుడారాలు పీకేసి ఉసూరుమంటూ నగరానికి తిరిగొచ్చారు. ఈ మూడు రోజులు వారికి మూడేండ్లు గడిచినట్లు అన్పించింది.

ముస్లింలు మక్కాలో మూడురోజులే ఉన్నా వారు వదలిపోయిన ప్రభావంమాత్రం ప్రజల ఆలోచనలకు పదునుపెట్టడం ప్రారంభించింది. అనేకమంది దైవప్రవక్త (స) ప్రచారం చేస్తున్న నూతనధర్మం గురించి పదేపదే ఆలోచిస్తున్నారు. ఖాలిద్ బిన్ వలీద్ ముస్లింలకు ఒకనాటి బద్ధశత్రువు. ఉహుద్ యుద్ధంలో ఖురైషీయుల హీరోగా వెలిగి పోయాడు. ఇస్లాం పేరెత్తితేనే మండిపడేవాడు. అలాంటి ఖాలిద్ కూడా ఇప్పుడు తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు. అంతలో ఒకతను గుర్రం దిగి ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ వచ్చాడు. "నేను మదీనా నుండి వస్తున్నాను. మీ అన్నయ్య వలీద్ బిన్ వలీద్ ఈ ఉత్తరం మీకివ్వమని నన్ను పంపించాడు" అంటూ ఆ మనిషి ఖాలిద్ చేతికి ఒక ఉత్తరం అందించి వెళ్ళిపోయాడు. ఖాలిద్ గబగబా ఆ ఉత్తరం తెరచి చదవడం ప్రారంభించాడు.....

ఈ ఉత్తరం మండుతున్న గాయానికి మందులా పనిచేసింది. "ఔను. ముహమ్మద్ (స) దైవప్రవక్తే. ఇందులో ఇక నాకెలాంటి సందేహంలేదు. ఆయన మాంత్రికుడు కానేకాదు. ఆయన ప్రచారంచేస్తున్న ధర్మమే సత్యధర్మం" అంతరాత్మ ఘోషతో అతని అంతరంగం దేదీప్యమానంగా వెలిగిపోయింది.

ఈ మాటలే అతనినోట కూడా వెలువడ్డాయి. "ఏమిటీ! ఖాలిదేనా ఈ మాటలు అంటున్నది!" మక్కాప్రజలు ముక్కుమీద వేలేసుకున్నారు. అతని మాటలు విన్న ఖురైషీయులకు వళ్ళు మండిపోయి నోటికొచ్చినట్లు తిట్టిపోశారు. ఇక అబూసుఫ్యాన్ అయితే చిందులు తొక్కుతూ ఖాలిద్‌ని చంపడానికి సిద్ధమయ్యాడు. అతని ఉగ్రరూపం చూసి ఇక్రమా విరగబడినవ్వుతూ "అబూసుఫ్యాన్! ఆగాగు. ఎందుకంత కోపం? ఇక్కడ ఖాలిద్ ఒక్కడే కాదు, ఇంకా చాలామంది ఉన్నారు ఇస్లాం వైపు మొగ్గినవారు. అప్పుడే ఏమైంది? ఈ ఏడు గడవని. ఈ నగరంలో బహుశా బహుదైవారాధకుడిగా ఒక్కడూ మిగలడనుకో" అని అన్నాడు. ఇక్రమా మాటలు విన్నాక అబూసుఫ్యాన్‌కు మతి పోయినంత పనయింది.

ఖాలిద్ ఒంటరివాడయ్యాడు. తన ఆలోచనలను సమర్థించే ఆప్తుల కోసం తహతహలాడిపోయాడు. చివరికి అతనొక్కడే మదీనా బయలుదేరాడు. అయితే అతను బయలుదేరే సమయానికి ఓ మిత్రుడు ఉస్మాన్ బిన్ తల్హా వచ్చాడు. అతను కూడా మదీనా బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అలా మిత్రులిద్దరూ ఓరోజు రహస్యంగా మదీనా దారిపట్టారు. ఖురైష్ నాయకుల్లో ఒకడైన అమ్ర్ బిన్ ఆస్ కూడా మదీనా బయలుదేరాడు. దారిలో ఒకచోట ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా కన్పించారు. ముగ్గురి మార్గం ఒకటే. లక్ష్యం ఒకటే. గమ్యం కూడా ఒకటే. ముగ్గురూ సంతోషంగా మదీనా బయలుదేరారు.

దైవప్రవక్త (స) మసీదులో కూర్చొని ధర్మబోధ చేయసాగారు. కాస్సేపటికి ఆయన ధర్మబోధను ఆపి "అనుచరులారా! మక్కా నగరం తనకు ప్రాణప్రదమైన తురుపు ముక్కల్ని మన వైపుకు విసిరింది. ఖాలిద్ బిన్ వలీద్, ఉస్మాన్ బిన్ తల్హా, అమ్ర్ బిన్ ఆస్ నగరంలో ప్రవేశించారు వెళ్ళి పిలుచురండి" అన్నారు. ఈ శుభవార్త వినగానే కొందరు అనుచరులు వారిని పిలుచుకు వచ్చారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఖాలిద్! ఏమిటి ఇలా వచ్చావు?" అని అడిగారు ప్రేమగా. "మేము ముగ్గురం ఇస్లాం స్వీకరించడానికి వచ్చాం" అన్నాడు ఖాలిద్ ముక్తసరిగా. ఆ తరువాత ఆ ముగ్గురూ సద్వచనం పఠించి ఇస్లాం స్వీకరించినట్లు ప్రకటించారు. దాంతో 'అల్లాహు అక్బర్' నినాదంతో మసీదు మార్మోగింది.

మహాప్రవక్త (స) మదీనా చుట్టుపట్ల ఉన్న తెగలకే గాక సుదూరప్రాంతాల్లో ఉండే తెగలక్కూడా దైవసందేశం అందేజేయడానికి ప్రచారబృందాలు పంపించారు. సిరియాలోని 'జాతుత్తలహ్' అనే ప్రాంతానికి ప్రవక్త అనుచరబృందం ఒకటి వెళ్ళింది. అయితే శత్రువులు వారందరినీ దారుణంగా హతమార్చారు. ఒకడు మాత్రమే ఎలాగో తప్పించుకోగలిగాడు.

బస్రాగవర్నర్ దగ్గరికి కూడా దైవప్రవక్త (స) హారిస్ బిన్ ఉమైర్ (రజి)ని పంపించారు. హారిస్ (రజి) ప్రయాణంచేస్తూ సిరియా సరిహద్దు సమీపంలోని మూతాప్రాంతానికి చేరుకున్నారు. మూతా రోమ్‌రాజ్యంలోని భూభాగమే. కాని మూతాగవర్నర్ షుర్జిల్ బిన్ అమ్ర్ దౌత్యనీతికి తిలోదకాలిచ్చి హారిస్ (రజి)ని బంధించి, ఆ తరువాత హతమార్చాడు.



ఈ రెండు దుర్ఘటనలు దైవప్రవక్త (స) హృదయాన్ని ఎంతగానో కలచివేశాయి. ధర్మప్రచారకులుగా, దౌత్యవేత్తలుగా పోయిన ముస్లింలను ఇలా దౌత్యనీతిని ఉల్లంఘించి హతమార్చడం మానవతకే కళంకం. ఆత్మాభిమానం ఉన్నవారు ఎవరూ ఈ అమానుషాన్ని సహించలేరు. ఈ విద్రోహుల్ని అలా వదలిపెడ్తే మరెన్ని ఘాతుకాలకయినా పాల్పడవచ్చు. అందువల్ల దైవప్రవక్త (స) తక్షణవే జైద్ బిన్ హారిస్ (రజి) నాయకత్వంలో 3000 మందితో కూడిన సైనికదళాన్ని పంపుతూ ముజాహిద్‌లను ఇలా ఆదేశించారు:

"ఒకవేళ జైద్ అమరగతుడయితే జాఫర్ సేనాపతి అవుతాడు. జాఫర్ అమరగతుడైతే అబ్దుల్లా బిన్ రవాహ సేనాని అవుతాడు. అబ్దుల్లా కూడా అమరగతుడైతే సైనికులు తాము కోరిన వ్యక్తిని సేనాపతిగా ఎన్నుకోవాలి...ఎల్లప్పుడూ దైవానికి భయపడుతూ ఆయనకు ఆగ్రహం కల్గించే పనులకు దూరంగాఉండాలి. దైవవిరోధులతో యుద్ధం చెయ్యండి. అయితే నీతీనిజాయితీలకు తిలోదకాలివ్వకండి. స్త్రీలను అగౌరవపరచకండి. వృద్ధుల జోలికిపోకండి. అనవసరంగా చెట్లను నరకకండి. ఇళ్ళను పడగొట్టవద్దు..."

ముజాహిద్‌లు హిజ్రీశకం 8వ సంవత్సరం, జమాదిల్‌అవ్వల్ నెలలో మదీనా నుండి బయలుదేరి కొన్నాళ్ళకు సిరియా సరిహద్దులు దాటి రోమ్‌సామ్రాజ్యంలో ప్రవేశించారు. రోమ్‌రాజ్యంలోని 'మూతా'ప్రాంతం పాలకుడు షుర్జిల్ ముస్లింల యుద్ధసన్నాహాలను గురించి ముందే తెలుసుకొని లక్షమంది సైనికుల్ని సమీకరించాడు. అదీగాక రోమ్ చక్రవర్తి తన సోదరుడికి లక్షమంది సైనికుల్నిచ్చి పంపించాడు.

సిరియాలో అడుగుపెట్టే వరకూ ముస్లింలకు ఈ విషయం తెలియదు. వారు లక్షమంది రోమ్ సైనికుల్ని చూసి నిర్ఘాంతపోయారు. ఇప్పుడేం చేయాలి? పరిస్థితి దైవప్రవక్త (స)కు తెలియజేయడమా? లేక పోరాడటమా? ముజాహిద్‌లు సందిగ్ధంలో పడిపోయారు. తర్వాత అబ్దుల్లా బిన్ రవాహ (రజి) ప్రసంగంతో ఉత్తేజితుడైన సేనాపతి జైద్ (రజి) ఒక చేతిలో పతాకం, మరొక చేతిలో ఈటె తీసుకొని నిలబడ్డారు. సేనాపతిలోని సమరోత్సాహం చూడగానే యోధులందరూ రోమ్‌సేనలతో ఢీకొనడానికి సిద్ధమయ్యారు.

ఆ తర్వాత జైద్ (రజి) తుఫానులా శత్రుసైన్యంలోకి దూసుకుపోయి అనేకమంది శత్రువుల్ని కూల్చివేశారు. కాని శత్రువులసంఖ్య ఎక్కువగా ఉండటంవల్ల జైద్ (రజి)పై నలువైపుల నుంచి బాణాలు ఎడతెరిపిలేకుండా వచ్చిపడ్డాయి. దాంతో ఆయన కుప్పకూలిపోయారు. తక్షణమే జాఫర్ (రజి) సమరధ్వజం ఎత్తుకొని శత్రువులపై విరుచుకుపడ్డారు. అయితే ఆయన కూడా వీరోచితంగా పోరాడి నేలకొరిగారు. వెంటనే ఇబ్నెరవాహ (రజి) పతాకం తీసుతీసుకొని రెండవచేతిలో ఉన్న ఖడ్గంతో శత్రువులపై లంఘించారు. ఆయన కూడా చాలా సేపటివరకు తీవ్రంగా పోరాడి చివరికి అమరగతులయ్యారు.

దైవప్రవక్త (స) నియమించిన ముగ్గురుసేనాపతులు అమరగతులు కాగానే యోధులు ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతిగా ఎన్నుకున్నారు. ఖాలిద్ (రజి) తక్షణమే సమరధ్వజం తీసుకొని శత్రుపక్షంలోకి దూసుకుపోయారు. చీకటిపడగానే ఆరోజు యుద్ధం ముగిసింది. మరుసటి రోజు సైనికపంక్తుల్ని పునర్వ్యవస్థీకరించి యుద్ధం ప్రారంభించారు. దాని వల్ల సమరస్వరూపం మారిపోయి ముస్లింలు విజయం సాధించారు.

## (28) ఖురైషీయుల పశ్చాత్తాపం, సత్యంరాకతో అసత్యం నిష్క్రమణ

హుదైబియాఒప్పందం జరిగిన తొలిరోజుల్లో ఖురైషీయులు, వారి మిత్రపక్షాలు సంధి షరతుల్ని గౌరవిస్తుండేవారు. తర్వాత ఉల్లంఘించడం ప్రారంభించారు. ఖురైషీయుల మిత్రపక్షమైన బకర్‌తెగ తన పాతశత్రువైన ఖుజాఅ తెగపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఒకరోజు రాత్రివేళ ఖురైషీయుల సహకారంతో ఆ తెగపై దాడిచేసింది. దాంతో ఖుజాఅ తెగవాళ్ళు భీతావహులై రక్షణ కోసం కాబాకు పారిపోయారు. శత్రువులు కాబా పవిత్రతను ఖాతరుచేయకుండా అక్కడా రక్తపాతం జరిపి అనేకమందిని ఊచకోతకోశారు. మిగిలిన వారు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వీలున్న వైపుకు పరుగెత్తారు.

ఈ హత్యాకాండ జరుగుతున్నప్పుడు కొందరు ఖుజాఅ తెగవాళ్ళు దైవప్రవక్త (స)ను పేరుపెట్టి పిలుస్తూ "మహానుభావా! దైవసందేశహరుడా!! మమ్మల్ని ఆదుకో. బకర్ తెగ మాపై దౌర్జన్యకాండకు పాల్పడింది. మమ్మల్ని కాపాడు" అని బిగ్గరగా కేక పెట్టారు. ఈ కేక వందలమైళ్ళ దూరంలోని మదీనానగరంలో ఉన్న దైవప్రవక్త (స) చెవులకు తాకింది. వెంటనే ఆయన 'లబ్బయిక్, లబ్బయిక్' (వస్తున్నా, వస్తున్నా) అని సమాధానమిచ్చారు.

సరిగ్గా అదే సమయంలో దౌర్జన్యకాండ జరుగుతున్న కాబాలో దైవప్రవక్త (స) పలికిన ఈ పలుకులు దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించాయి. దాంతో బకర్‌తెగవాళ్ళు భయపడి హత్యాకాండ ఆపి వెళ్ళిపోయారు. ఈ సంఘటన జరిగిన రెండుమూడు రోజుల తరువాత ఖుజాఅ తెగ నాయకులు కొందరు మదీనా చేరుకొని దైవప్రవక్త (స)కు తమ దయనీయ స్థితి విన్నవించుకున్నారు. దానికి దైవప్రవక్త (స) "అమ్! భయపడకండి. మీకు తప్పకుండా సహాయం లభిస్తుంది" అన్నారు. వారు సంతోషంతో మక్కా తిరుగు ప్రయాణమయ్యారు.

దైవప్రవక్త (స) ఖురైషీయుల ముందు మూడు షరతులు పెట్టి, వాటిలో ఒక దాన్ని అంగీకరింపజేయమని చెప్పి ఒక మనిషిని మక్కా పంపించారు. అతను మక్కా వెళ్ళి వారి ముందు ఈ మూడు షరతులు ఉంచారు: "ఖుజాఅతెగ మనుషులు ఎంతమంది వధించబడ్డారో వారి రక్త పరిహారం చెల్లించాలి లేదా బకర్‌తెగకు మీ సహాయసహకారాలు నిలిపివేయాలి లేదా హుదైబియా ఒప్పందం రద్దు చేసుకుంటున్నామని ప్రకటించాలి."

ఖురైషీయుల తరపున ఓ నాయకుడు "మేము మూడో షరతును అంగీకరిస్తున్నాం" అన్నాడు. మూడోషరతును అంగీకరించామని చెప్పారేగాని, ప్రవక్త ప్రతినిధి వెళ్ళిపోయాక చాలా పశ్చాత్తాపంచెందారు. వెంటనే వారు అబూసుఫ్యాన్‌ని మదీనా పంపారు.

అబూసుఫ్యాన్ మదీనా చేరుకొని నేరుగా దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళడానికి ముఖం చెల్లక తన కూతురు ఉమ్మెహబీబా-రజి (ప్రవక్త సతీమణి)ఇంటికి వెళ్ళాడు. ఆమెను మధ్యవర్తిగా పెట్టి దైవప్రవక్త (స)తో చర్చలు జరుపుదామనుకున్నాడు. కాని అక్కడ పని నెరవేరకపోవడంతో అబూబకర్ (రజి) దగ్గరికి వెళ్ళి ఆ తర్వాత ఉమర్ (రజి) దగ్గరికి వెళ్ళాడు. అక్కడా నిరాశ ఎదురుకావడంతో అలి (రజి) దగ్గరకు వెళ్ళి సలహా అడిగాడు.

దానికి అలి (రజి) "ఇప్పుడు నేనేం సలహాఇవ్వగలను? మీరు మాటతప్పారు. పరిస్థితి చేజారిపోయింది. అయితే ఓ పని చెయ్యి. మసీదుకెళ్ళి 'నేను హుదైబియా ఒప్పందాన్ని



పునరుద్ధరిస్తున్నాన'ని బిగ్గరగా చాటిచెప్పు. తరువాత మక్కా వెళ్ళిపో" అని చెప్పారు. అబూసుఫ్యాన్ మసీదుకెళ్ళి అలి (రజి) ఇచ్చిన సలహా ప్రకారమే 'నేను హుదైబియా ఒప్పందాన్ని పునరుద్ధరిస్తున్నాన'ని బిగ్గరగా చాటి మక్కా వెళ్ళిపోయాడు.

ఖురైష్ నాయకులు అబూసుఫ్యాన్ చెప్పిన మాటలు విని విరగబడినవ్వారు. అబూసుఫ్యాన్ బిత్తరపోయాడు. అంతలో వారి ముఖాలు గంభీరంగా మారిపోయాయి. "ఇదా నువ్వు మదీనా పోయి వెలగబెట్టిన ఘనకార్యం! ఈ మాటవింటే జనం నవ్విపోతారు. అలి నిన్ను ఆట పట్టించడానికే ఇలాంటి సలహా ఇచ్చాడు. ఆమాత్రం కూడా నువ్వు గ్రహించలేక పోయావే!!" అన్నారు. అబూసుఫ్యాన్ సిగ్గుతో తల వంచుకున్నాడు.

మక్కా బహుదైవారాధకులు హుదైబియా సంధిని భంగం చేసి ముస్లింల మిత్రపక్షమైన ఖుజాఅ తెగకు చెందిన అనేకమందిని వధించినందుకు తీవ్రంగా పశ్చాత్తాపపడ్డారు. ఈలోగా ఒప్పందం ఉల్లంఘించి రక్తపాతం జరిపినవారిపై తీసుకోవలసిన చర్యల్ని గురించి విశ్వప్రభువు నుండి ప్రకటన వెలువడింది. కాబా పవిత్రతను భంగపరచిన బహుదైవారాధకులు ఇక కాబామందిరానికి ధర్మకర్తలుగా కొనసాగడానికి ఎంతమాత్రం అర్హులు కారని కూడా ఆ ప్రకటనలో స్పష్టం చేయబడింది. తరువాత దైవప్రవక్త (స) ముస్లింలందరూ యుద్ధానికి సిద్ధం కావలసిందిగా ప్రకటన చేశారు.

దైవప్రవక్త (స) చేసిన ప్రకటన వినగానే ముజాహిద్‌లు ఎంతో ఉత్సాహంతో ప్రయాణ సన్నాహాలు చేశారు. అది హిజ్రీశకం 8వ ఏట రమజాన్ నెల దైవప్రవక్త (స) పదివేల మంది అనుచరులతో మదీనా నుండి బయలుదేరారు. దారిలో ప్రవక్త పినతండ్రి అబ్బాస్ (ర) కలుసుకున్నారు. ఆయన ఇస్లాం స్వీకరించి కుటుంబసమేతంగా మక్కా నుండి వస్తున్నారు. దైవప్రవక్త (స) అమితానందంతో పినతండ్రిని ఆలింగనం చేసుకున్నారు. ఆయన కుటుంబసభ్యుల్ని ఎంతో ఆదరించి మదీనా పంపివేశారు.

ముస్లింయోధులు మక్కాకు ఎనిమిది మైళ్ళ దూరంలోఉన్న 'ముర్రజ్జిహ్రాన్'లో విడిది చేసి శిబిరాలు వేసుకున్నారు. భోజనాలు చేసి విశ్రాంతి తీసుకున్నారు. సూర్యాస్తమయమై చీకటిపడగానే దైవప్రవక్త (స) ఆదేశంతో అనుచరులు అనేక అగ్నిమంటలు రాజేశారు.

అబ్బాస్ (రజి) ఓ కంచర గాడిద ఎక్కి గస్తీ చెయ్యడానికి బయలుదేరారు. కాస్సేపటికి ఆయన నిలబడిన గుట్టకు దగ్గర్లో ఇద్దరువ్యక్తులు మాట్లాడుకుంటున్నారు. అబ్బాస్ (రజి) చప్పుడు చెయ్యకుండా వారి సంభాషణను జాగ్రత్తగా వినసాగారు.

"చూశావా ఆ దృశ్యం? ఇలాంటి అగ్నిమంటల్ని, సైనికుల్ని నేను ఇదివరకెప్పుడూ చూడలేదు" అన్నాడు వారిలో ఒకడు. "ఇవి ఖుజాఅ తెగ రాజేసిన అగ్నిమంటలు కావచ్చు" అన్నాడు రెండోవాడు. "కాదు, కాదు. ఇది ఖుజాఅ తెగ రాజేసిన మంటలు కాజాలవు. ఒకేసారి ఇన్ని అగ్నిమంటలు! పైగా నురుగులు కక్కుతున్న ఇంత పెద్ద సైనికవాహిని!! కాదు. ఇవి ఖుజాఅ సేనలంటే నేను నమ్మలేను" అన్నాడు మొదటివాడు.

అబ్బాస్ (రజి) ఇక ఉండబట్టలేక 'అబూసుఫ్యాన్!' అని కేకవేశారు. "ఎవరూ? అబ్బాస్! నువ్వా!!" అడిగాడు అబూసుఫ్యాన్ బిత్తరపోతూ. "ఔను, నేనే అబ్బాస్‌ని. ఇవి ముహమ్మద్

(స) బిన్ అబ్దుల్లా అగ్నిమంటలు" అన్నారు అబ్బాస్ (రజి). "అబ్బాస్! నువ్వు ఇక్కడ.....? ఆశ్చర్యంగా ఉందే!" అన్నాడు అబూసుఫ్యాన్ అబ్బాస్ (రజి) దగ్గరికి వస్తూ.

"ఓరి పిచ్చివాడా! ఇంకా నీకు మత్తువదల్లేదా? ఇది దైవప్రవక్త సైన్యం. ఈ సైన్యం మక్కాలో ప్రవేశిస్తే ఖురైషీయులు రెచ్చిపోకమానరు. అప్పుడు వారికి సర్వనాశనం తప్పదు. చివరికి వారి విషాదగాథ వినేవారు కూడా ఎవరూ మిగలరు" అన్నారు అబ్బాస్ (రజి). "అబ్బాస్! నువ్వు చెబుతున్నది నిజమే. అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో చెప్పు" అన్నాడు అబూసుఫ్యాన్. "నావెంట నడు. దైవప్రవక్త (స) దగ్గరికి తీసికెళతాను. అక్కడ అన్ని విషయాలు మాట్లాడుకుందాం" అన్నారు అబ్బాస్ (రజి).

అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్‌ని తీసుకొని సైనికదళాల ప్రక్కనుంచి పోతుంటే ముజాహిద్‌లు అబూసుఫ్యాన్‌ని చూసి ఆశ్చర్యపోయారు. కాని వారిద్దరు ఎక్కిన వాహనం చూసి ఎవరూ నోరు మెదపలేక పోయారు. ఎందుకంటే అది దైవప్రవక్త (స) వాహనం.

మరునాడు అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్‌ని వెంటబెట్టుకొని దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చారు. "అబూసుఫ్యాన్! అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేడని నీకింకా నమ్మకం కలగలేదా?" అన్నారు దైవప్రవక్త (స). "దైవప్రవక్తా! మీరెంత ఉదారస్వభావులు! నాకిప్పుడు నమ్మకం కల్గింది. అల్లాహ్‌తప్ప మనో ఆరాధ్యదైవం ఉంటే ఆయన నాకు సహాయపడే వాడు" అన్నాడు అబూసుఫ్యాన్. "మరి నా దైవదౌత్యంపట్ల నీకింకా విశ్వాసం కలగలేదా?" అడిగారు దైవప్రవక్త (స). "మీరెంత దయార్ద్రహృదయులు! అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను"అన్నారు అబూసుఫ్యాన్(రజి).

ముజాహిద్‌లు నగరంలో ప్రవేశించడానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త (స) దృష్టి అబూసుఫ్యాన్ (రజి)పై పడింది. అబూసుఫ్యాన్ (రజి) తలదించుకొని ఉన్నారు. ఆయన ముఖం కళావిహీనమైఉంది. "అబూసుఫ్యాన్! ఏమిటీ అలా ఉన్నావు? అనడిగారు దైవప్రవక్త (స). "దైవప్రవక్తా! ఖురైషీయులు ఇప్పుడు మీస్వాధీనంలోకి రాబోతున్నారు. కాని మన సైన్యంలో కొందరు ప్రతీకారంతో వేగిపోతున్నారు. విజయం లభిస్తే దయచేసి శత్రువులు మనల్ని చూసి నవ్వడానికి ఆస్కారం ఇవ్వద్దని నేను మనవి చేసుకుంటున్నాను. వారి పట్ల మృదువుగా వ్యవహరించమని అభ్యర్థిస్తున్నాను" అన్నారు అబూసుఫ్యాన్ (రజి).

"లేదు అబూసుఫ్యాన్! నేనలా చేయను. నీవు నిశ్చింతగా ఉండు. నీ జాతి ప్రజల దగ్గరకెళ్ళి ఇలా ప్రకటించు- "ముహమ్మద్ ఒక మంచిసోదరుడిలా మక్కాలో ప్రవేశిస్తాడు. ఈరోజు విజేతలుగాని, పరాజితులుగాని ఎవరూ లేరు. ఈరోజు శాంతీసమైక్యతల రోజు. ప్రేమాసౌభ్రాతృత్వాల రోజు. సొంతఇండ్లలో ఉండి తలుపులు మూసుకునేవారికి, కాబాలో ప్రవేశించేవారికి, అబూసుఫ్యాన్ ఇంట్లో ఆశ్రయం పొందేవారికి రక్షణ ఉంది."

ఈ మాటలు విని అబూసుఫ్యాన్ (రజి) సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఆయన నగరంలోకి పరుగెత్తి ఈ శుభవార్త ప్రకటించారు. క్షణాల్లో ఈ శాంతిసందేశం నగర పౌరులందరికీ తెలిసిపోయింది. భయంతో దడదడలాడుతున్న గుండెలు కుదుట పడ్డాయి. దైవప్రవక్త (స) పదివేల మంది అనుచరులతో నగరంలో ప్రవేశించారు.



ఒకతను దైవప్రవక్త (స)తో మాట్లాడటానికి వచ్చి రెండుమూడు మాటలు మాట్లాడి వణికిపోసాగాడు. దైవప్రవక్త (స) అతనికి ధైర్యం చెబుతూ "భయపడకు. నేను చక్రవర్తిని కాను. ఎండిన మాంసపుముక్కలు తినే ఓ సామాన్య స్త్రీకి పుట్టినవాడ్ని" అని అన్నారు.

ముస్లింసేనలు శాంతియుతంగా మక్కాలో ప్రవేశించాయి. కత్తులు, ఈటెలకు పని తగల్లేదు. రక్తం ప్రవహించలేదు. ఒకచోట మాత్రం కాస్తంత అలజడి చెలరేగింది. ఖాలిద్ (రజి) ప్రవేశించిన ముఖద్వారం దగ్గర ఇక్రమా బిన్ అబూజహల్, సఫ్వాన్ బిన్ ఉమయ్యా లతోపాటు కొందరు బద్ధశత్రువులు ముజాహిద్‌లను అటకాయించి కయ్యానికి కాలు దువ్వారు. అంచేత వారితో పోరాడక తప్పలేదు. ఈ దాడిలో పదిమంది శత్రువులు, ఇద్దరు ముస్లింలు మరణించారు. ఈ దుర్ఘటన దైవప్రవక్త (స)కు తెలిసి ఖాలిద్ (ర)పట్ల ఆగ్రహం వ్యక్తపరిచారు. అయితే ఖాలిద్ (రజి) చివరిక్షణం వరకూ ప్రయత్నించారని, గత్యంతరంలేని పరిస్థితిలో శత్రువులపై కత్తిదూశారని కొందరు ముజాహిద్‌లు తెలిపారు. అప్పుడు దైవప్రవక్త (స) 'సరే, దేవుడు చేసిందేదో మనమంచికే చేశాడ'ని అన్నారు.

మక్కా విజేత నగరప్రవేశం చేశాడు. "అల్లాహుఅక్బర్" నినాదంతో నగరం ప్రతి ధ్వనించింది. దాంతో బహుదైవారాధకుల గుండెలు ఝల్లుమన్నాయి. ముస్లింలు తమ నాయకుడి కోసం ఒకచోట ప్రత్యేక కుటీరం నిర్మించారు. అందులో ఆయన బసచేశారు.

కాబాధర్మకర్త ఉస్మాన్ బిన్ తల్హా వచ్చి దైవప్రవక్త (స)కు వినయపూర్వకంగా నమస్క రించాడు. "రాజాధిరాజా! మక్కావిజేతా! స్వాగతం! ఇదిగో ప్రతిష్ఠాలయం తాళపుచెవులు తీసుకోండి. తరతరాల నుంచి మావంశంలో ఉంటున్న వీటిని ఈరోజు మీకు హస్తగతం చేస్తున్నాను" అంటూ అతను వణుకుతున్న చేతులతో కాబా తాళపుచెవుల్ని దైవప్రవక్త (స) చేతికి అందించాడు. దైవప్రవక్త (స) చిరునవ్వు నవ్వుతూ తాళపుచెవులు తీసుకున్నారు.

దైవప్రవక్త(స) ఓరోజు కాబాగృహానికి వెళ్ళి ఉస్మాన్‌ని తాళపుచెవులు ఇవ్వమని అడిగితే, అతను దురుసుగా సమాధానమిచ్చాడు. అప్పుడు దైవప్రవక్త (స) "ఉస్మాన్! గుర్తుంచుకో. నువ్వీ తాళపుచెవుల్ని ఏదో ఓరోజు నా చేతికి అందిస్తావు. అప్పుడు నేను తలచిన వారికి వీటిని ఇచ్చేస్తాను" అన్నారు. ఆ మాటకు ఉస్మాన్ "అలా జరిగితే ఆరోజు ఖురైషీయులకు వినాశం, అవమానం కలిగే దుర్దినం అవుతుంది" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "కాదు. ఆరోజు వారు శాంతియుతంగా, గౌరవప్రదంగా ఉంటారు" అని అన్నారు.

ఈ మాటలు ఉస్మాన్ బిన్ తల్హా (రజి) చెవుల్లో ఇప్పటికీ ప్రతిధ్వనిస్తున్నాయి. అతను ఆనాడే అనుకున్నాడు, ఆ మహనీయుడు అన్నట్లే జరుగుతుందని.

దైవప్రవక్త (స) కాబా తలుపులు తెరిపించి లోపలికి ప్రవేశించారు. ఆయన వెంట అనుచరులు కూడా ఉన్నారు. దైవప్రవక్త (స) లోపల ప్రవేశించగానే ఒంటె మీద కూర్చొని వుండే ఏడుసార్లు కాబా ప్రదక్షిణ చేశారు. కాబాలో 300 విగ్రహాలు ఉన్నాయి.

దైవప్రవక్త "సత్యం వచ్చేసింది. అసత్యం నిష్క్రమించింది. అసత్యం ఎప్పటికైనా నిష్క్రమించేదే" అన్న ఖుర్ఆన్‌సూక్తి పఠిస్తూ చేతిలోని బాణంకొనతో ఒక్కొక్క విగ్రహాన్ని పొడవడం ప్రారంభించారు. అలా పొడిచిన ప్రతి విగ్రహమూ ఒరిగి క్రింద పడిపోసాగింది.

లోపల గోడలపై ఇబ్రాహీం (అలై), ఇస్మాయిల్ (అలై)ల చిత్రాలు కూడా ఉన్నాయి. వారి చేతుల్లో శకునంచూసే బాణాలున్నాయి. ఉమర్ (రజి) ఆ చిత్రాలన్నిటిని తుడిచి వేశారు. అలా కాబా శుద్ధిఅయిన తర్వాత దైవప్రవక్త (స) ఇద్దరు అనుచరులతో గర్భగుడి లోకి వెళ్ళి నమాజ్ చేశారు. విశ్వప్రభువుకు కృతజ్ఞతలు సమర్పించి బయటికి వచ్చారు.

దైవప్రవక్త (స) కాబా నుంచి బయటికి వచ్చి "ఉస్మాన్ బిన్‌తల్హా ఏడి, ఎక్కడికెళ్ళాడు?" అని అడిగారు. వెంటనే కొందరు అనుచరులు వెళ్ళి ఉస్మాన్ బిన్ తల్హాని పిలుచుకొచ్చారు.

అప్పుడు దైవప్రవక్త (స) "ఉస్మాన్! ఇదిగో నీ తాళపుచెవులు. ఈరోజు సద్వర్తనం, నిజాయితీల దినం. ఈ తాళపు చెవులు ఈరోజు నుంచి ఇక ఎల్లప్పుడూ నీ కుటుంబంలోనే ఉంటాయి. దుర్మార్గులు తప్ప మరెవరూ వీటిని మీ దగ్గర్నుంచి లాక్కోలేరు" అన్నారు తాళపుచెవులు అతనికప్పగిస్తూ. ఉస్మాన్ సంతోషంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. అతని నోట అప్రయత్నంగా "అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన సందేశహరు డని నేను సాక్ష్యమిస్తున్నాను" అన్న మాటలు వెలువడ్డాయి.

## (29) సాధారణ క్షమాభిక్ష

కాబాప్రాంగణంలో వేలాది జనం గుమిగూడి ఉన్నారు. దైవప్రవక్త (స)ను, ఆయన అనుచరుల్ని ఎన్నో హింసలుపెట్టిన సత్యతిరస్కారులు వీరు. దైవప్రవక్త (స) తమ విష యంలో ఏం నిర్ణయం తీసుకుంటారోనని భయపడుతున్న బహుదైవారాధకులు వీరు.

దైవప్రవక్త (స) వారి ఎదుటకు వచ్చి ఇలా ప్రసంగించారు: "ప్రజలారా! అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు ఎవరూ సాటిలేరు. ఆయన తన దాసునికి సహాయంచేసి వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఇతర వర్గాలన్నిటినీ ఏకాకులుగా చేసివేశాడు. వినండి. గర్వకారణాలైన సమస్తవిషయాలు, పురాతన హత్యలు, హత్యా ప్రతీకారాలన్నీ ఇప్పుడు నా కాళ్ళ క్రింద నలిగిపోయాయి. కాబానిర్వహణ, యాత్రికులకు నీటిసరఫరా పనులు తప్ప అజ్ఞానకాలపు అహంభావాల్ని, కులగోత్రాల పట్ల గర్వపడటాన్ని దేవుడు నిషేధించాడు. మానవులంతా ఆదం సంతతే ఆదం మన్నుతో సృజించబడ్డారు."

ఇలా ప్రసంగించిన తరువాత ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తి పఠించారు: "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (49:13)

తరువాత ఆయన "ఖురైష్ ప్రజలారా! నేనీ రోజు మీపట్ల ఏ విధంగా ప్రవర్తిస్తానో మీకు తెలుసా?" అని అడిగారు. దానికి ప్రజలు "సద్వర్తనంతోనే ప్రవర్తిస్తారు. మీరు మా ఉత్తమ సోదరులు. ఉత్తమసోదరుని కుమారులు" అని అన్నారు కాస్తంత ధైర్యంచేసి ముక్తకంఠంతో. అప్పుడు దైవప్రవక్త (స) "సరే, వెళ్ళండి. ఈరోజు మీ మీద ఎలాంటి ఆరోపణ లేదు. మీరంతా స్వతంత్రులు" అన్నారు కారుణ్యమూర్తి (స).

అంతే, మక్కాప్రజలపై పూలవాన కురిసింది. కృతజ్ఞతాభావంతో వారికళ్ళు దైవప్రవక్త ఔదార్యాన్ని ప్రశంసించాయి. అజ్ఞానపు కారుమేఘాలన్నీ కనుమరుగైపోయాయి.



సత్యతేజస్సుతో వారి ఆంతర్యాలు ప్రకాశవంతమయ్యాయి. ఇలా జనం తమ హృదయాల్లో ఆధ్యాత్మికభాగ్యం నింపుకొని ఇండ్లకు వెళ్ళిపోయారు. వెళ్ళగానే తమ స్వహస్తాలతో తమ విగ్రహాలను ధ్వంసంచేశారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు.

దైవప్రవక్త (స)కు, నూతన ధర్మానికి బద్ధవిరోధులైనవారు సైతం ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (స) పినతండ్రి హమ్జా (రజి)ని హతమార్చిన వహ్షీ కూడా ఇస్లాం స్వీకరించాడు. దైవప్రవక్త (స) కుమార్తె జైనబ్ (రజి)ని కత్తితో బెదిరించి అనరానిమాటలతో అవమానించిన హబ్బార్ బిన్ అస్వద్ కూడా ఇస్లాం స్వీకరించాడు. ప్రవక్తపినతండ్రి హమ్జా(రజి) గుండెకాయ తీసి నమిలి మింగడానికి ప్రయత్నించిన హిందా కూడా ఇస్లాం స్వీకరించింది. ఈరోజు ప్రజలు కక్షలు, కార్పణ్యాలు విడనాడి మనస్ఫూర్తిగా సత్యధర్మానికి చేరువవుతున్నారు. దైవప్రవక్త (స) హృదయం విశ్వప్రభువు పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోయింది.

దైవప్రవక్త (స) బద్ధవిరోధుల్లో ఒకడైన సఫ్వాన్ బిన్ ఉమయ్యా మక్కా విజయం తరువాత ప్రాణభయంతో నగరం నుండి పారిపోసాగాడు. అప్పుడు దైవప్రవక్త (స) ఇచ్చిన రక్షణ హామీతో తిరిగొచ్చి కొన్నాళ్ళ తర్వాత ఇస్లాం స్వీకరించాడు.

అదేవిధంగా అబూజహల్ కొడుకు ఇక్రమా కూడా మక్కా విజయం తరువాత ప్రాణ భయంతో నగరం నుండి పారిపోయి జిద్దాలో ఓడ ఎక్కాడు. ప్రయాణీకులతో కిటకిట లాడుతున్న ఆ ఓడ నడిసముద్రంలోకి పోయిన తర్వాత తీవ్రమైన తుఫాను తాకిడికి గురైంది. దాంతో ప్రయాణీకులు ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతూ తమతమ ఇష్ట దేవతల్ని మొరపెట్టుకోవడం మొదలెట్టారు. అప్పుడు కొందరు అనుభవశాలురు లేచి "ఇది సృష్టికర్త, సర్వేశ్వరుడయిన దేవుడ్ని తప్ప మరెవరినీ వేడుకునే సమయం కాదు. ఆయన మాత్రమే తలచుకుంటే మనం ఈ ఆపద నుండి బయటపడగలం" అని అన్నారు.

ఈ మాటలు వినగానే ఇక్రమా కళ్ళపై వున్న అజ్ఞానపొరలు తొలగిపోయాయి. "ఏమిటీ!? ఇక్కడ దేవుడు తప్ప మరెవరూ సహాయం చేసేవారు లేరా? మరి ఈ విషయాన్నే కదా ఆ పుణ్యాత్ముడు ఇరవై ఏండ్ల నుంచి చెబుతూవస్తున్నది. మనం అనవ సరంగా ఆయనతో పోరాడుతున్నాం" అని మనసులో అనుకున్నాడు. ఆ తరువాత "ఈ తుఫాను నుంచి క్షేమంగా బయటపడితే నేను నేరుగా ముహమ్మద్ (స) దగ్గరకు పోయి ఆయన చేతిలో చేయివేసి కలుపుతాను" అని నిర్ణయించుకున్నాడు.

కాస్సేపటికి తుఫాను తగ్గిపోయింది. ఓడ అబిసీనియా రేవుకు చేరుకుంది. ప్రయాణీ కులు దైవానికి కృతజ్ఞతలు చెప్పి దిగిపోయారు. ఇక్రమా హృదయం కూడా దేవుని పట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. కొన్నాళ్ళకు అతను జిద్దాకు తిరిగొచ్చి, అక్కడ్నుంచి నేరుగా మదీనా చేరుకొని దైవప్రవక్త (స)ను కలుసుకొని ఇస్లాం స్వీకరించాడు.

మక్కాలో పనులన్నీ ముగిసేటప్పటికి 15 రోజులు గడచిపోయాయి. అయితే దైవప్రవక్త (స) మక్కా జయించారని, అత్యధికమంది ఖురైషీయులు ముస్లింలై పోయారని వినగానే ఖురైషీయుల ప్రత్యర్థితెగలు ఆందోళన చెందాయి. అలాంటి తెగలలో మక్కా, తాయిఫ్ పట్టణాల మధ్య నివసిస్తున్న హవాజిన్, సఖీఫ్ తెగలు ముఖ్యమైనవి. ఇప్పుడీ రెండు

తెగలు ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు చేస్తున్నాయని తెలిసింది. అంచేత హి.శ. 8వ ఏట షవ్వాల్ నెలలో దైవప్రవక్త (స) 14 వేలమంది యోధుల్ని తీసుకొని మక్కా నుండి బయలుదేరారు.

ముస్లింలు హునైన్ లోయలో ఓరాత్రి గడిపి మరునాడు తెల్లవారగానే బయలుదేరారు. సైన్యం హునైన్ లోయ దాటవలసిఉంది. లోయ చాలా ఇరుకుగా ఉన్నందున సైనికులు లోపలికి ప్రవేశించి జాగ్రత్తగా నడవసాగారు. ఆవిధంగా లోయలో కొంచెం దూరం నడచిన తరువాత హఠాత్తుగా సైనికుల్లో కలకలం మొదలయింది. పంక్తులు చిందరవందరయ్యాయి. సైనికులు భయాందోళనలతో ఎటుపడితే అటు పరుగెత్తసాగారు. పర్వతసానువులపై, కొండగుహల్లో నక్కిన హవాజిన్ సైనికులు క్రిందికి దిగివచ్చి ముస్లిం సైనికులపై బాణాలతో దాడిచేయడం మొదలెట్టారు.

ఖురైష్ ప్రజల్లో చాలామంది ఈ మధ్యనే ఇస్లాం స్వీకరించడం వల్ల దాని ఔన్నత్యం ఏమిటో వారింకా తెలుసుకోలేకపోయారు. సమరసొత్తు లభిస్తుందన్న ఆశతో మాత్రమే వచ్చారు. అలాంటివారే ఈ హఠాత్పరిణామానికి బిత్తరపోయి పారిపోసాగారు. ముహాజిర్, అన్సార్ ముస్లింలు మాత్రం దైవప్రవక్త (స)ను ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటూ, శత్రువులతో వీరోచితంగా పోరాడారు. ఇలా అంతిమవిజయం ముస్లింలకే లభించింది. శత్రుపక్షంలో డెబ్భయిమంది హతమయ్యారు. ముస్లింలలో ఆర్గురు అమరగతులయ్యారు.

హవాజిన్ తెగవాళ్ళు ముస్లింల చేతిలో చావుదెబ్బ తినడంతో వారి మిత్రపక్షమైన సఖీఫ్‌తెగ ప్రజలు తాయిఫ్‌కు పారిపోయారు. తాయిఫ్ పౌరులు వారి సానుభూతిపరులే. ఆ తర్వాత దైవప్రవక్త (స) యోధుల్ని తీసుకొని తాయెఫ్‌కు బయలుదేరారు. ఈ సంగతి ముందే తెలుసుకున్న సఖీఫ్‌తెగవాళ్ళు కోటలలో ప్రవేశించి తలుపులు మూసుకున్నారు.

ముస్లిం యోధులు తాయెఫ్ నగరాన్ని ముట్టడించారు. ఈ ముట్టడి దాదాపు నెల రోజులు కొనసాగింది. కాని ముస్లింలు నగరంలోకి ప్రవేశించలేకపోయారు. శత్రువులు కూడా కోటబురుజుల పైనుండి బాణాలు వదలడం తప్ప బయటికి రావడానికి సాహసించలేకపోయారు. చివరికి దైవప్రవక్త (స) యుద్ధం విరమించి వెళ్ళిపోయారు.

ఆ తరువాత దైవప్రవక్త (స) తాయెఫ్ నుండి జీరానాకు బయలుదేరారు. హవాజిన్ తెగతో యుద్ధంచేసి గెలుచుకున్న సమరసొత్తు జీరానాలోనే ఉంది. అందువల్ల ఆయన జీరానాకు చేరుకోగానే ఈ సమరసొత్తును ముజాహిద్‌లకు పంచడానికి పూనుకున్నారు.

ఈలోగా హవాజిన్ తెగవారు కొందరు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు. తర్వాత వారు ఖైదీలవిడుదలతో పాటు సామగ్రి వాపసుకై విజ్ఞప్తి చేశారు. అప్పుడు దైవప్రవక్త (స) అనుచరులతో సంప్రదించి ఆరువేల మంది యుద్ధఖైదీలను విడుదల చేశారు. తరువాత దైవప్రవక్త(స) మొత్తం సమరసొత్తు నుంచి ప్రభుత్వధనాగారం కోసం అయిదోవంతు తీసి మిగిలినదాన్ని ముజాహిద్‌లకు పంచారు. ఈపని ముగిసిన తరువాత ఆయన అనుచరుల్ని తీసుకొని మక్కా వెళ్ళి ఉమ్రా ఆచారం పాటించారు. ఆ తర్వాత మక్కావారికి ధర్మబోధ చేయడానికి ముఆజ్ బిన్ జబల్ (రజి)ని ఉంచి ముజాహిద్‌లను తీసుకొని మదీనా తిరుగు ప్రయాణమయ్యారు.



దైవప్రవక్త (స) మదీనా చేరుకున్న తర్వాత కూడా అనేకమంది ఆయన దగ్గరకు ఇస్లాం స్వీకరించడానికి రాసాగారు. దైవప్రవక్త (స) ప్రజలకు ధర్మబోధ చెయ్యడంలో నిమగ్నులై ఉన్నప్పటికీ, సత్యతిరస్కారుల చర్యల్ని ఓ కంట కనిపెడుతూనే ఉన్నారు. ఓసారి ముస్లింలు “తై” తెగవారితో పోరాడవలసివచ్చింది. ఆ పోరాటంలో తై తెగ చిత్తుగా ఓడిపోయింది. ఆ తెగనాయకుడు అద్దీ బిన్ హాతింతై ఇస్లాంకు బద్ధవిరోధి. కాని అతను ముస్లింలను ఎదుర్కోలేక భార్యాపిల్లల్ని తీసుకొని సిరియాకు పారిపోయాడు. ముస్లింలు సమరసొత్తును, యుద్ధ ఖైదీలను తీసుకొని మదీనా తిరిగొచ్చారు.

ఆ ఖైదీలలో అద్దీ సోదరి సఫ్ఫానా కూడా ఉంది. దైవప్రవక్త (స) ఆమె పరిస్థితి విని ఎంతో పైకమిచ్చి ఆమెను విడుదల చేశారు. సఫ్ఫానా సిరియా వెళ్ళి సోదరుడికి తానెలా బయటపడగలిగిందో వివరంగా చెప్పింది. దైవప్రవక్త (స) నిజాయితి, దాతృత్వాలను గురించి ప్రశంసిస్తూ “నువ్వు వెంటనే ఆయన దగ్గరికి వెళ్ళిరా. ఆయన నిజంగా దైవప్రవక్తే అయితే నీలాంటివాడ్ని ఆదరించడానికి వెనకాడడని నాకు నమ్మకం ఉంది. ఒకవేళ ఆయన చక్రవర్తి అయితే ఆయన దగ్గర నీకు విలువ ఉండకపోదు” అని అన్నది.

ఈమాట విన్న తర్వాత అద్దీ మరునాడు మదీనా బయలుదేరాడు. “దేవుడు అద్దీ బిన్ హాతిం చేతిని నా చేతిలోకి ఇస్తాడు” అని దైవప్రవక్త (స) తన సహచరులతో అన్నట్లు అద్దీకి సమాచారం అందింది. ఈ సంగతి కూడా అతడ్ని ప్రభావితం చేసి ఉండవచ్చు.

అద్దీ మదీనా చేరుకొని మసీదుకు వెళ్ళి దైవప్రవక్త (స)కు సలాం చేశాడు. దైవప్రవక్త (స) అతడ్ని చూసి “ఎవరు నాయనా నువ్వు?” అని అడిగారు. దానికి అద్దీ “నేను అద్దీనండీ! హాతింతై కొడుకుని” అని చెప్పాడు. “అద్దీ అంటే నువ్వేనా!” అంటూ దైవప్రవక్త (స) లేచి అద్దీచేతిని తన చేతిలోకి తీసుకొని అతడ్ని ఇంటికి పిలుచుకెళ్ళారు. ఆ తర్వాత దైవప్రవక్త కనబరచిన ఔదార్యం, సత్ప్రవర్తనలతో ప్రభావితుడై అద్దీ ఇస్లాం స్వీకరించాడు.

## (30) తబూక్ దండయాత్ర

దాదాపు యావత్తు అరేబియా ముస్లింల అధీనంలోకి వచ్చింది. ఇస్లాం వ్యతిరేకశక్తుల బలం తగ్గిపోయింది. అయితే అరేబియా ఉత్తర సరిహద్దులో ఉన్న సిరియా రోమన్ల అధీనంలో ఉన్నందున ఆ ప్రాంతపు సరిహద్దుల భద్రత కోసం మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవలసిన అవసరముంది. రోమ్ సైన్యాలు ఏ క్షణమైనా ఇస్లామీయ రాజ్యంపై దాడిచేసే ప్రమాదముందని ఆయనకు అనుమానంగా ఉంది.

ఈ అనుమానం కొన్నాళ్ళకే నిజమయింది. రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. తక్షణమే ఆయన శక్తికలవారంతా యుద్ధానికి సిద్ధం కావాలని ప్రకటన చేశారు. దైవప్రవక్త (స) ప్రకటన వినగానే ముస్లింలు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ఈ భారీదండయాత్ర కోసం అపారమైన ఆయుధాలు, ఆహారపదార్థాలు కావాలి కనుక దైవప్రవక్త (స) ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు.

దైవప్రవక్త (స) బోధతో ఉత్తేజితులైన ప్రజలు విశాలహృదయంతో భూరి విరాళాలు అందజేశారు. కొందరు ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న

వీరావేశంతో తమ శక్తికిమించిన విరాళాలు కూడా ఇచ్చారు. ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువుల్ని దైవప్రవక్త (స)కు అందజేశారు.

ఉమర్ (రజి) అబూబకర్ (రజి)ని మించిపోవాలని తన యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చారు. దైవప్రవక్త (స) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చావా లేదా?" అని అడిగారు. దానికి ఉమర్ "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను" అన్నారు. ఆ తరువాత అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (స) పాదాల చెంత పోశారు. దైవప్రవక్త (స) ఈ అసాధారణ దాతృత్వం చూసి "అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలిపెట్టావు?" అని అడిగారు. "భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు అబూబకర్ (రజి).

ఇది ధనికుల పరిస్థితి. మధ్యతరగతి ప్రజలు కూడా ఈమహాకార్యం కోసం శక్తివంచన లేకుండా తమకున్న దాంట్లోనే అత్యధికంగా విరాళాలు అందజేశారు. పేదవాళ్ళు కూడా తమ సంపాదనలో అంతోఇంతో తెచ్చి విరాళాలగుట్టలో పెట్టేశారు. ఇదీ దైవప్రవక్త (స) పట్ల ప్రేమాభిమానాలున్న అనుచరుల పరిస్థితి. కాని కపటులు యుద్ధప్రకటన వినగానే నెత్తిమీద పిడుగు పడినట్లు నిలువుగుడ్లు వేశారు. వీరు రకరకాల సాకులతో యుద్ధానికి బయలుదేరకపోగా బయలుదేరేవారిని కూడా ఆటంకపరచడానికి ప్రయత్నించారు.

దైవప్రవక్త (స) ప్రకటన విని సుదూరప్రాంతాల నుండికూడా ముజాహిద్‌లు మదీనా వచ్చారు. కొన్ని రోజుల్లోనే బ్రహ్మాండమైన సైన్యం తయారయింది. అబూబకర్ (రజి) సర్వసేనానిగా నియమించబడ్డారు. దాదాపు పురుషులంతా యుద్ధానికి వెళ్తున్నందున దైవప్రవక్త (స) మదీనా రక్షణ కోసం ముహమ్మద్ బిన్ మస్లిమా (రజి)ని గవర్నర్‌గా, ఆయనకు సహాయంగా అలి (రజి)ని నియమించారు.

అబూఆమిర్ అనే ఒక క్రైస్తవ సాధువు ముస్లింలకు, బహుదైవారాధకులకు మధ్య జరిగిన అనేక యుద్ధాలలో ప్రముఖపాత్ర వహించి దైవప్రవక్త (స)పై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నించాడు. కాని అరబ్ తెగలన్నీ ఏకమైనా ఇస్లాం అంతం కాకపోవడంతో అతను రోమ్ చక్రవర్తి వద్దకెళ్ళి ఇస్లాం వల్ల కలిగే ప్రమాదం గురించి హెచ్చరించాడు.

అబూఆమిర్ కార్యకలాపాలలో మదీనా కపటులు కూడా చేరిపోయారు. అతను ఇస్లాంకు వ్యతిరేకంగా రోమ్‌సైన్యాలను, ఉత్తర అరేబియాలోని క్రైస్తవరాజ్యాల సైన్యాలను కూడగట్టేందుకు ప్రయత్నించాడు. కపటులు అబూఆమిర్‌తో మంతనాలు రహస్య కార్యకలాపాలు సాగించడానికి మదీనాలో ఒక మసీదు నిర్మించారు. ఇస్లాం తెరచాటున ఇస్లాంవ్యతిరేక కార్యకలాపాలు సాగించడానికి మసీదు ఎంతో అనువైన కేంద్రం.

మదీనాలో ఇంతకుముందే రెండు మసీదులు ఉన్నాయి. ఇప్పుడు మూడవ మసీదు నిర్మించాల్సిన అవసరంలేదు. కాని కపటులు వర్షాకాలంలో, చలికాలంలో వృద్ధులు నమాజు కోసం అంతదూరం పోలేరన్న సాకు చెప్పి ఈ మూడవ మసీదు నిర్మించుకున్నారు. అంతటితో ఆగక వారు తమ మత ముసుగును మరింత పటిష్ఠపరచుకోవడానికి దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "తమరు ఓసారి ఈ (జిరార్) మసీదులో నమాజు చేయించి దీనికి ప్రారంభోత్సవం చేయండి" అన్నారు అతివినయం ఒలకబోస్తూ.



దైవప్రవక్త (స) దాన్ని దాటవేస్తూ "నేనిప్పుడు యుద్ధసన్నాహాలలో నిమగ్నమై ఉన్నాను. తబూక్ దండయాత్రకు వెళ్తున్నాను. తిరిగొచ్చాక దాని సంగతి చూస్తాను" అని అన్నారు.

హిజ్రీ 9వ ఏట రజబ్ నెలలో 30 వేలమంది యోధులతో సైనికవాహిని మదీనా నుండి కదిలింది. సుదీర్ఘప్రయాణం చేసిన తరువాత ముజాహిద్‌లు 'తబూక్' సమీపానికి చేరుకున్నారు. అయితే అక్కడకుపోగానే రోమన్లు కోటద్వారాలు మూసుకున్నారని తెలిసింది.

ఇప్పుడేం చెయ్యాలి? నగరంలోకి జొరబడి పోరాడటమా లేక తిరిగి వెళ్ళిపోవడమా? దైవప్రవక్త (స) ఆలోచనలో పడ్డారు. చివరికి నగరంలో ప్రవేశించకుండా బయటే ఉండిపోవాలని నిర్ణయం జరిగింది. దాని ప్రకారం ముజాహిద్‌లు నగరం వెలుపలే శిబిరాలు వేసుకున్నారు. రోమన్లు ముస్లింసైన్యాలను చూసి కోట బయటికి రావడానికే భయపడ్డారు. దైవప్రవక్త (స) తబూక్‌లోనే అనేక రోజులున్నారు. అయినా ఎలాంటి యుద్ధ సూచనలు కానరాలేదు. రోమన్లు ఎలాంటి కవ్వింపుచర్యలకు పాల్పడలేదు.

రోమన్లు ఇక ముస్లింలకు లొంగిపోయారని తలచి దైవప్రవక్త (స) నిశ్చింతగా ఉండిపోలేదు. ఆయన ఇరుగుపొరుగు రాజ్యాలతో, తెగలతో శాంతిఒప్పందాలు చేసుకుందామని తబూక్ నుండే అనేకరాజ్యాలకు లేఖలు రాశారు. ఆ రాజులు వచ్చి దైవప్రవక్త (స)తో శాంతిఒప్పందాలు చేసుకొని వెళ్ళిపోయారు. తబూక్ సమీపంలోని దూమతుల్ జందల్ ప్రాంతం రాజు అకీదర్ బిన్ అబ్దుల్ మలిక్ తిరుగుబాటువైఖరితో ఉన్నందున దైవప్రవక్త (స) ఓ సైనికదళం పంపి అతని పీచం అణచివేశారు. అప్పుడతను రాజీఒడంబడిక పత్రంతో పాటు రెండువేల ఒంటెలు, ఎనిమిదివందల గుర్రాలు, నాలుగువందల ఈటెలు, నాలుగువందల యుద్ధకవచాలు కానుకలుగా దైవప్రవక్త (స)కు పంపాడు.

ఈ వ్యవహారాలన్నీ ముగిసిన తర్వాత దైవప్రవక్త(స) మదీనా బయలుదేరవలసిందిగా ఆజ్ఞాపించారు. అప్పుడు ముజాహిద్‌లు మూటాముల్లెలు సర్దుకొని మదీనా తిరుగుముఖం పట్టారు. దైవప్రవక్త (స) సైన్యం తీసుకొని మదీనా సమీపంలోని ఓచోటికి రాగానే దేవుడు ఖుర్‌ఆన్‌లోని 'తౌబా సూరా'లోని కొన్ని సూక్తులు అవతరింపజేశాడు. వాటిలో కపటులు నిర్మించిన మసీదు ప్రస్తావన కూడా ఉంది. ఈ ఆదేశంతో దైవప్రవక్త (స) ఆ మసీదును పడగొట్టండని చెప్పి కొందరు అనుచరుల్ని ముందుగా మదీనా పంపించారు. వారు గుర్రాల మీద వేగంగా వెళ్ళి ఆ మసీదును నామరూపాల్లేకుండా నేలమట్టం చేశారు. ఆ తరువాత దైవప్రవక్త (స) తన అనుచరులతో మదీనా తిరిగొచ్చారు.

**తాయిఫ్ వాసుల ధర్మపరివర్తన :** తాయిఫ్‌లోని ఉండే సఖీఫ్ తెగ తిరుగుబాటుకు పాల్పడంతో దైవప్రవక్త (స) తాయిఫ్‌ను ముట్టడించి విజయం సాధించలేక మదీనా వెళ్ళి పోయిన సంఘటన గురించి గతపేజీలలో తెలుసుకున్నాం. సఖీఫ్‌తెగ అగ్రనాయకుల్లో ముఖ్యుడైన ఉర్వా ముట్టడి సమయంలో తాయిఫ్‌లో లేడు. తాయిఫ్ తిరిగొచ్చిన తరువాత దైవప్రవక్త (స) వచ్చిపోయారని తెలిసింది. వెంటనే అతను మదీనా వెళ్ళి దైవప్రవక్త (స)ను కలుసుకొని ఇస్లాం స్వీకరించాడు. తరువాత ఉర్వా (రజి) దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! నేనిప్పుడు మాపట్నానికి వెళ్ళి మా తెగవాళ్ళకు దైవ సందేశం అందజేసి ఇస్లాం స్వీకరించమని నచ్చజెబుతాను" అని అన్నారు.

తాయిఫ్ ప్రజలకు ఇస్లాం గురించి నచ్చజెప్పడం అంత తేలిక కాదు. వాళ్ళు ఎంత గర్విష్ఠులో దైవప్రవక్త (స)కు బాగా తెలుసు. అందుకే ఆయన ఉర్వా (రజి)ని వారిస్తూ- ''ఉర్వా! అలా చేశావంటే వారు నీకు బద్ధవిరోధులైపోతారు. నిన్ను వధించడానికైనా వెనుకాడరు'' అని ఆందోళన వెలిబుచ్చారు. దానికి ఉర్వా (రజి) ''దైవప్రవక్తా! ఆందోళన చెందకండి. అలా జరగదు. వారు నన్నెంతో గౌరవిస్తారు. తమ కొడుకులకంటే కూడా ఎక్కువ అభిమానిస్తారు. ప్రాణాలకన్నా మిన్నగా చూసుకుంటారు'' అని అన్నారు.

కాని ఆయన తాయిఫ్‌కు వెళ్ళిన తరువాత దైవప్రవక్త (స) అన్నట్లే జరిగింది. సఖీఫ్ తెగవాళ్ళు ఇస్లాంను పెద్ద విపత్తుగా తలిచారు. అందుకే వారు ఉర్వా (రజి)ను తమ జాతినాయకుడన్న గౌరవం కూడా లేకుండా హతమార్చారు. వారు ఇస్లాంవ్యాప్తిని అరికట్టేందుకే ఇలా చేశారు. కాని వారనుకున్నట్లు ఇస్లాంజ్యోతి క్షీణించలేదు. అది మరింత వెలిగిపోతూ నేలనలువైపులా కాంతి విరజిమ్మసాగింది. ఉర్వా(రజి) కొడుకు, పినతండ్రి కొడుకు హృదయాల్ని కూడా అది జ్యోతిర్మయం చేసింది. తక్షణమే వారు దైవప్రవక్త (స) సన్నిధికి పోయి ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత కొంతకాలనికే అనేక తెగల్లో ఇస్లాం ప్రభంజనం వీచసాగింది. ఇక సఖీఫ్ తెగ ఒక్కటే బహుదైవారాధనను అంటిపెట్టుకొని ఉంది.

సఖీఫ్ నాయకులు పరిస్థితి గమనించి ఇస్లాంని ఆశ్రయించడం తప్ప మార్గాంతరం లేదని భావించారు. ఇస్లామే నిజమైన ధర్మమని కూడా వారి అంతరాత్మలు ఘోషించాయి. అంచేత కొన్నాళ్ళకు వారు ఓ ప్రతినిధివర్గాన్ని మదీనా పంపి వారిద్వారా ఇస్లాం స్వీకరించారు.

దాంతో నిన్నటివరకు ధూపదీప నైవేద్యాలతో అట్టహాసంగా పూజలందుకున్న 'లాత్' దేవత, ఇతర చిల్లరమల్లర దేవతలు ఏ నైవేద్యానికీ నోచుకోలేక విలపించసాగాయి! వైభవమంతా కోల్పోయి దుమ్ము ధూళితో కొట్టుమిట్టాడ సాగాయి!! నిత్యం అసంఖ్యాక భక్తులకు వరాలిచ్చే ఈ దేవతలు ఈరోజు తమపై ఈగాలు వాలుతున్నా పారదోలలేని పరమ దయనీయస్థితిలో ఉండిపోయాయి!!! శతాబ్దాల తరబడిగా తిష్ఠవేసివున్న ఆ మిధ్యాదైవాలు కొన్నాళ్ళకు మందిరాల నుంచి కూడా తొలగించబడ్డాయి.

## (31) ప్రప్రథమ హజ్ (కాబా)యాత్ర, అసత్య ప్రవక్తలు

హిజ్రీశకం 9వ సంవత్సరంలో హజ్‌యాత్ర విధిగా చేయబడింది. హజ్ నెలలు కూడా సమీపించాయి. అయితే ఇస్లాం స్వీకరించడానికి అనేక తెగల ప్రతినిధి బృందాలు ఎడతెరిపి లేకుండా మదీనా వస్తుండటం వల్ల దైవప్రవక్త (స) ఆ ఏడు హజ్‌యాత్రకు బయలు దేరలేక అబూబకర్ (రజి)ని పంపడానికి నిర్ణయించారు. హజ్‌యాత్ర ప్రకటన వినగానే మదీనాలో అనేకమంది అబూబకర్ (రజి) నాయకత్వంలో మక్కా బయలుదేరారు.

అబూబకర్ (రజి) యాత్రికుల్ని తీసుకొని మక్కా వెళ్ళిపోయాక 'తౌబా'సూరాలోని మొదటి నలభైసూక్తులు అవతరించాయి. ఇవి మక్కా బహుదైవారాధకులకు, హజ్ ఆచారాలకు సంబంధించినవి కనుక వీటిని మక్కా ప్రజలకు అందజేయమని చెప్పి దైవప్రవక్త (స) అలీ (రజి)ని పంపించారు. అలీ(రజి) మదీనా నుండి బయలుదేరి దారిలో అబూబకర్ (రజి)ని కలుసుకొని దైవప్రవక్త (స) తనకు పురమాయించిన పని గురించి



తెలియజేశారు. 'మినా'లో అందరూ చేరిన తర్వాత అలి (రజి) ఖుర్ఆన్‌లోని తౌబాసూరాకు చెందిన మొదటి నలభై సూక్తులు పఠించి విన్పించారు.

హిజ్రీశకం 10వ సంవత్సరం. సత్యధర్మస్వీకార పర్వం వేగం పుంజుకుంది. ప్రజలు ఇస్లాం పట్ల ఆకర్షితులయి, దాని వివరాలు తెలుసుకోవడానికి తండోపతండలుగా మదీనా వస్తున్నారు. ఆయేడు రమజాన్ నెలలో గస్సాన్ ప్రాంతం నుండి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ప్రతినిధిబృందం మదీనా వచ్చింది. దైవప్రవక్త (స) వారికి హితోపదేశం చేయగానే వారు ముగ్గురూ ఇస్లాం స్వీకరించారు. తర్వాత వారు తమ ప్రాంతానికి తిరిగివెళ్ళి తమ జాతిప్రజలకు ఇస్లాం ధర్మం గురించి బోధించారు. కాని వారు ఇస్లాం స్వీకరించలేదు.

ఆజిద్ ప్రాంతం నుండి కూడా పదిమంది సభ్యులతో కూడిన ఒక ప్రతినిధి బృందం వచ్చి ఇస్లాం స్వీకరించింది. ఆ పదిమంది చేసిన ధర్మప్రచారంతో వారి (ఆజిద్) తెగ ప్రజలంతా ఇస్లాం స్వీకరించారు. అయితే ఈ కారణంగా జర్ష్ తెగకు, ఆజిద్ తెగకు మధ్య యుద్ధం జరిగింది. యుద్ధం జరగడానికి ముందు జర్ష్‌తెగ నాయకులు దైవప్రవక్త (స)ను గురించి వివరాలు తెలుసుకోవడానికి ఇద్దరు ప్రతినిధులను మదీనా పంపారు.

ఆ ఇద్దరు మదీనా చేరుకొని. దైవప్రవక్త (స)తో చర్చలు జరిపారు. ఆ సందర్భంలో దైవప్రవక్త (స) మాట్లాడుతూ ''ఇప్పుడు జర్ష్ తెగకు, ఆజిద్ తెగకు మధ్య యుద్ధం జరుగుతోంది. ఆ యుద్ధంలో జర్ష్‌తెగ ఓడిపోతుంది'' అని చెప్పారు. ఆ తరువాత వారు తమ ప్రాంతానికి తిరిగివెళ్ళి విచారిస్తే అదేరోజు తమ తెగవాళ్ళు చిత్తుగా ఓడిపోయారు. జర్ష్‌ఓటమి గురించి దైవప్రవక్త (స) చెప్పిన భవిష్యవాణిని వారు తమ తెగవాళ్ళకు తెలిపారు. అప్పుడు జర్ష్ తెగ ప్రజలు ఎంతో ప్రభావితులయి ఇస్లాం స్వీకరించారు.

అలాగే జారూద్ బిన్ అమ్ర్ నాయకత్వంలో అబ్దుల్‌ఖైస్ తెగకు చెందిన కొందరు క్రైస్తవ ప్రతినిధులు కూడా మదీనా వచ్చి ఇస్లాం స్వీకరించారు. తర్వాత వారు తమ ప్రాంతానికి వెళ్ళి ధర్మోపదేశం చేయగానే ఆ తెగవారంతా సంతోషంతో ఇస్లాం స్వీకరించారు.

యమామా నుండి బనీహనీఫా తెగ ప్రతినిధులు కూడా మదీనా వచ్చారు. వారు తమ సామగ్రి ఒకచోట దించి అక్కడ తమలోని ముసైలమా అనే వ్యక్తిని కాపలాఉంచారు. ఆ తర్వాత వారు నేరుగా దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (స) బనీహనీఫా తెగవాళ్ళ ప్రతినిధుల్ని ఎంతగానో గౌరవించి వారికి కొన్ని కానుకలు బహూకరించారు. ఆ సందర్భంలో వారు దైవప్రవక్త (స) ముందు ముసైలమా విషయాన్ని ప్రస్తావిస్తూ ''దైవప్రవక్తా! మా బృందంలో మరో మనిషి కూడా ఉన్నాడు. అతను మేము విడిది చేసిన చోట మా సామానుకు కాపలా ఉన్నాడు'' అని చెప్పారు.

''అయితే అతను మీ సామానుకు కాపలా కాస్తున్నందున అతని స్థానం మీలో ఏ ఒక్కరికన్నా తక్కువకాదు'' అంటూ దైవప్రవక్త (స) ముసైలమా వంతు కానుక కూడా వారికిచ్చారు. బనీహనీఫా ప్రతినిధులు యమామా తిరుగు ప్రయాణమయ్యారు. దారిలో వారు ముసైలమాతో అతడ్ని గురించి దైవప్రవక్త (స) అన్న మాటలను ప్రస్తావించారు. మదీనాలో ఉన్నప్పుడే ముసైలమా ప్రతినిధివర్గంసభ్యులతో పాటు ఇస్లాం స్వీకరించాడు.

అయితే యమామా తిరిగొచ్చిన కొన్నాళ్ళకే అతను మతభ్రష్టుడయ్యాడు. అంతేగాకుండా తాను కూడా ఓ దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడు.

ముసైలమా తన విషయంలో దైవప్రవక్త (స) చెప్పిన మాటలను ఆధారంగా చేసుకొని తనను గురించి ప్రచారం చేసుకోవడం ప్రారంభించాడు. అతను ఓ ఖుర్‌ఆన్‌ని కూడా కల్పించుకొని దాన్ని దైవగ్రంథంగా, తనను దైవప్రవక్తగా విశ్వసించమని ప్రజలకు చెప్పసాగాడు. ఆ విధంగా తన తెగలో కొందరు ప్రజలను ఆకట్టుకున్నాడు. అతను వారి కోసం అనేక అధర్మవిషయాల్ని ధర్మసమ్మతం చేశాడు.

ఒక రోజు అతను మహాప్రవక్త ముహమ్మద్‌కు (స)కు ఇలా ఒక లేఖ రాసి పంపించాడు: "దైవప్రవక్త ముహమ్మద్ పేరిట దైవప్రవక్త ముసైలమా రాసినలేఖ- మీపై శాంతి వర్షించు గాక! మొదట మీకు ఈ దైవదౌత్య మహాకార్యంలో ఎవరూ తోడు లేకపోయారు. ఇప్పుడు నేను మీకు తోడుగా ఈ మహాకార్యంలో భాగస్వామిగా నియమించబడ్డాను. కనుక అర్ధ భూమికి మేము వారసులం, మిగతా అర్ధభూమికి ఖురైషీయులు వారసులు. కాని ఖురైషీయులు మాపై దౌర్జన్యం చేస్తున్నారు. (వారికి మీరు కాస్త నచ్చజెప్పండి.)"

ఈ లేఖలోని విషయాలు వినగానే దైవప్రవక్త (స) ముఖం జేవురించింది. ఆ తరువాత ఆయన ముసైలమాకు ఇలా సమాధానం రాసి పంపించారు: "భూమి దేవునిది. ఆయన తన దాసుల్లో తానుతలచిన వారిని దానికి వారసులుగా చేస్తాడు."

అసత్య దైవదౌత్యం గురించిన ఈ ఉపద్రవం అంతటితో ఆగలేదు. 'సనా' ప్రాంతంలో అస్వద్ అనేవాడు, 'నజద్' ప్రాంతంలో తులైహ అనేవాడు కూడా తాము దైవప్రవక్తలం అని ప్రచారం చేయసాగారు. ఇలా ఈ దుర్మార్గులు అమాయకప్రజల్ని వంచించి తమ సామ్రాజ్యదాహం తీర్చుకోవడానికి పన్నాగాలు పన్నారు. నజద్‌లో ఇస్లాం స్వీకరించిన ప్రజలకు ఇస్లాంఆదేశాలను బోధించి వారిని సుశిక్షితుల్ని చేయవలసి ఉంది. ఈ పని కోసం దైవప్రవక్త (స) కొందరు అనుచరుల్ని నజద్‌పట్నానికి పంపించారు. అయితే దారిలో ఆమిర్ బిన్ తుఫైల్ అనే దుర్మార్గుడు కొందరు దుండగుల్ని వారిపైకి ఉసిగొల్పాడు. వారు దైవప్రవక్త (స) అనుచరుల్ని మోసగించి దారుణంగా హతమార్చారు.

ఆమిర్ అంతటితో తృప్తి చెందలేదు. ముస్లింలను మోసగించి, ఇస్లాంపై మరోసారి దెబ్బతీయడానికి అవకాశం కోసం ఎదురుచూడసాగాడు. ఒకసారి ఆమిర్ తెగ ప్రజలు కొందరు ఇస్లాం స్వీకరించడానికి మదీనావెళ్ళారు. ఆ బృందంలో ఆమిర్, అతని స్నేహితుడు అర్బద్ కూడా ఉన్నారు. మదీనాలో ఈ దుష్టద్వయం తప్ప అందరూ ఇస్లాం స్వీకరించారు. అయితే అక్కసు వెళ్ళబోసుకోవడానికి వచ్చిన ఈదుర్మార్గుల పన్నాగం పారలేదు. చివరికి ఆమిర్ చేసేదిలేక "ఈ లోయను సైనికులతో నింపి కడుపుమంట చల్లార్చుకొనిగాని నేను విశ్రాంతి తీసుకోను" అని గొణుగుకుంటూ వెళ్ళిపోయాడు.

దైవప్రవక్త(స) ఆ దుర్మార్గుడు పలికిన ఈమాటలు వినికూడా ఎలాంటి చర్య తీసుకో లేదు. 'దేవా! ఆమిర్ కీడు నుండి కాపాడు' అని మాత్రమే అన్నారు. ఆమిర్ స్వస్థలానికి చేరుకోకముందే దారిలో ప్లేగువ్యాధి సోకి అతని పరిస్థితి భయానకంగా మారింది. అతని



కంఠనాళాలు ఉబికి బయటికి వచ్చేశాయి. అతని సహచరులు అతడ్ని ఓ స్త్రీ ఇంటికి చేర్చారు. ప్లేగువ్యాధి ఆమిర్ రక్తాన్ని పూర్తిగా పీల్చివేసి అతని జీవనజ్యోతిని ఆర్పివేసింది. చలనం కోల్పోయిన అతని భౌతికకాయం దిక్కూమొక్కూ లేకుండా పడిపోయింది.

అర్బద్ ఈ భయానకదృశ్యం చూసికూడా గుణపాఠం నేర్చుకోలేదు. అతనింకా కడుపు మంటతో "ముహమ్మద్ (స) గనక నాచేతికి చిక్కితే అతని రక్తాన్ని పూర్తిగా పీల్చిగాని వదలిపెట్టను. అప్పుడే నాకు మనశ్శాంతి" అన్నాడు తన ప్రజలతో కుతకుతలాడుతూ.

అర్బద్‌కు తన ఒంటె ఒకదాన్ని అమ్మడానికి ఓరోజు ఎక్కడికో తీసికెళ్తున్నాడు. దారిలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమయింది. ఆ మరుక్షణమే పెళపెళ మంటూ పిడుగు పడింది అతని మీద. అంతే... ఆ దైవద్రోహి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

## (32) నజ్రాన్ క్రైస్తవులతో చర్చలు

అరేబియా అంతటా ఇస్లాం శరవేగంతో విస్తరిస్తోందని నజ్రాన్ క్రైస్తవులకు తెలిసింది. అప్పుడు వారు దైవప్రవక్త (స)ను కలుసుకొని ఆయన బోధించే ధర్మంగురించి తెలుసుకు రమ్మని ఓ ప్రతినిధివర్గాన్ని మదీనా పంపించారు. ఆ బృందంలో అరవైమంది క్రైస్తవులు ఉన్నారు. వారిలో అబ్దుల్‌మసీహ్, ఐహమ్, అబూహారిసా అనే ముగ్గురు ప్రముఖులున్నారు. వారు తమజాతిలో మంచి పలుకుబడి కలిగినవారు. ఈ ప్రతినిధివర్గానికి అబ్దుల్‌మసీహ్ నాయకుడు. ఐహమ్ అతని సలహాదారుడు. అబూహారిసా వారి మతగురువు. ఇతను క్రైస్తవ సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసివున్నాడు. ఈ కారణంగా రోమ్ చక్రవర్తులు అతడ్ని అమితంగా గౌరవించేవారు.

ఈ ప్రతినిధులు మదీనా చేరుకొని దైవప్రవక్త (స)ను కలుసుకున్నారు. దైవప్రవక్త (స) వారికి స్వాగతం చెప్పి సత్కరించారు. తరువాత ఆయన ఖుర్‌ఆన్ సూక్తులు విన్పించి వారిని ఇస్లాంవైపు ఆహ్వానించారు. వారడిగిన ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇచ్చారు. కాని వారు ఇస్లాం స్వీకరించడానికి ఏమాత్రం సుముఖంగా లేరు. ఉభయపక్షాల మధ్య చర్చలు జరిగాయి. కాని వారు ప్రవక్త సందేశాన్ని త్రోసిపుచ్చి వితండవాదానికి దిగారు.

దైవప్రవక్త(స) వారికిలా సవాలు విసిరారు: "సరే, మీవిశ్వాసాలే నిజమైనవి అనుకుంటే, ప్రమాణం చేద్దాంరండి. నాతోపాటు నాకుటుంబసభ్యులు కూడా ఉంటారు. మీరు కూడా మీ భార్యాపిల్లల్ని పిలుచుకోండి. ఉభయపక్షాలు కూర్చొని అసత్యవాదులపై దేవుని అభిశాపం(శిక్ష) పడుగాక అని చెబుదాం." క్రైస్తవులు ఈమాట విని మౌనం వహించారు. మరుసటిరోజు దైవప్రవక్త (స) తనకుటుంబం నుంచి అలి, ఫాతిమా, హసన్, హుసైన్ (రజి)లను తీసుకొచ్చి "రండి ప్రమాణం చేద్దాం. మనలో ఎవరు అసత్యవాదులైతే వారిపై దైవశిక్ష పడుగాకని నేను పలుకుతాను. దానికి మీరు తథాస్తు అని చెప్పాలి" అని అన్నారు.

క్రైస్తవులు దైవశాపం మాట విని కంపించిపోయారు. ఈ సవాలును ఎదుర్కోవడానికి సాహసిస్తే ఇక తాము దేవునిపట్టు నుండి బ్రతికిబయటపడలేమని భావించి "ముహమ్మద్ గారూ! మాక్కాస్త ఆలోచించుకోనివ్వండి. ఆ తరువాత మా నిర్ణయం మీకు తెలియజేస్తాం" అని అన్నారు వారు. అలా చెప్పి వారు లేచి దూరంపోయి సమాలోచనలు జరుపుకున్నారు.

"ఇప్పుడు మనం ఏం చేద్దాం చెప్పండి" అన్నారు క్రైస్తవులు తమ నాయకులతో. "సోదరులారా! ముహమ్మద్ సత్యప్రవక్త అని తెలుస్తూనే ఉంది. ఈసా (అలైహి)ని గురించి ఆయన చెప్పింది కూడా వాస్తవమే. అయితే గతంలో ఏప్రవక్తయినా తన జాతిని శపించి నప్పుడల్లా జరిగిన దుష్పరిణామాలు మీకు తెలియనివి కావు. ఆనాడు పిల్లలు, వృద్ధులు అందరూ సర్వనాశనమయ్యారు. ఒకవేళ ముహమ్మద్ సవాలును ఎదుర్కోవడానికి సాహసిస్తే మనకు కీడు మూడినట్లే. అలాగాకుండా మనం మన ధర్మంలోనే స్థిరంగాఉండి, మన ప్రవక్త విషయంలో మన విశ్వాసాలను కాపాడుకోదలచుకుంటే పదండి, ఆయనతో రాజీ కుదుర్చుకొని మన దారిన మనం వెళ్ళిపోదాం" అన్నాడు వారి నాయకుడు.

నాయకుని అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు. ఆ తరువాత క్రైస్తవ ప్రతినిధులు తమ నిర్ణయం తెలియజేస్తూ "మేము ఎట్టి పరిస్థితిలోనూ ప్రమాణం చేయడానికి సిద్ధంగా లేము" అన్నారు దైవప్రవక్త (స)తో. "ప్రమాణం చేయకపోతే అందరిలా మీరూ ఇస్లాం స్వీకరించండి" అన్నారు దైవప్రవక్త (స). "ఇది కూడా మాకు ఇష్టంలేదు" అన్నారు క్రైస్తవ ప్రతినిధులు. "అయితే మాకు జిజ్యా (భద్రతారుసుం) చెల్లించండి, లేదా మాతో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (స). "సరే, మేము మీకు జిజ్యా చెల్లిస్తుంటాము. మీరు మీ ధర్మంలో ఉండండి. మేము మా ధర్మంలోనే ఉంటాము" అన్నారు వారు.

అంతటితో చర్చలు ముగిశాయి. క్రైస్తవులు వెళ్ళిపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరులతో మాట్లాడుతూ "వీరు గనక ప్రమాణం చేసివుంటే, ఇక ప్రళయం దాకా ప్రపంచంలో ఒక్క క్రైస్తవుడు కూడా జీవించి ఉండేవాడుకాదు" అని అన్నారు.

కొన్నాళ్ళకు క్రైస్తవుల్లో ఒకతను ఇస్లాం స్వీకరించి ముస్లింగా మారాడు. తర్వాత అతను బఖరా, ఆలిఇమ్రాన్ సూరాలు నేర్చుకున్నాడు. దైవప్రవక్త (స) అతడ్ని ఖుర్ఆన్ సూక్తుల్ని గ్రంథస్థంచేసే పనికోసం నియమించారు. అయితే కొన్నాళ్ళ తర్వాత అతను మళ్ళీ క్రైస్తవుల్లో చేరిపోయి అదేస్థితిలో చనిపోయాడు. క్రైస్తవులు అతని భౌతికకాయాన్ని సమాధి చేశారు. మరునాడు చూస్తే అతని శవం సమాధిబయట పడిఉండటం కన్పించింది.

"ఇతను ముస్లింల దగ్గర్నుంచి పారిపోయి వచ్చాడు గనక, ముస్లింలే ఈ సమాధి తవ్వి శవాన్ని బయట పడేసిఉంటార"ని చెప్పుకున్నారా క్రైస్తవులు. అంచేత వారు మరోచోట మరింత లోతుగా సమాధితవ్వి ఆ శవాన్ని మళ్ళీ పూడ్చిపెట్టారు. కాని మరునాడు వచ్చిచూస్తే శవం మళ్ళీ సమాధి బయట పడివుండటం కనపడింది. దాంతో వారు ఇది మానవుల పనికాదని భావించి ఆ శవాన్ని అలాగే కాకులకు, గద్దలకు వదిలేసి వెళ్ళిపోయారు. కొన్నాళ్ళకు దాదాపు నజ్రాన్ క్రైస్తవులంతా ఇస్లాం స్వీకరించి ముస్లింలయి పోయారు. ఆ తర్వాత యమన్‌రాజు బాజన్‌తో సహా యమన్‌లోని తెగలన్నీ ఇస్లాం స్వీకరించాయి.

## (33) వీడ్కోలు కాబాయాత్ర, అనారోగ్య పరిస్థితి

హిజ్రీశకం పదో సంవత్సరం నడుస్తోంది.మహాప్రవక్త (స) హజ్ ఏర్పాట్లు చేసుకోవలసిందిగా అనుచరుల్ని ఆదేశించారు. మదీనాలో, దాని చుట్టుపక్కల గ్రామాల్లో ముస్లింలు హజ్‌సన్నాహాలు చేసుకున్నారు. దైవప్రవక్త (స) దాదాపు లక్ష మంది ముస్లింలు



వెంటరాగా మదీనా నుండి బయలుదేరారు. జుల్‌హలీఫా చేరుకోగానే దైవప్రవక్త (స) ఒక లుంగీ, ఒంటిపై మరో అంగవస్త్రం ధరించి హజ్‌దీక్ష బూనారు. అనుచరులు కూడా అలాగే చేశారు. "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ (హాజరయ్యాను ప్రభూ! నేను హాజరయ్యాను)" అని నినాదాలు చేస్తూ అక్కడ్నుంచి ముందుకు సాగారు యాత్రికులు.

సుర్ఫ్ అనే ప్రాంతానికి చేరుకున్నాక అక్కడ దైవప్రవక్త (స) "బలిపశువులు లేనివారు ఉమ్రా సంకల్పం మాత్రమే చెయ్యాల"ని ప్రకటన చేశారు. అక్కడ్నుంచి వారంతా జిల్‌హజ్ నెల నాల్గవ తేదీకల్లా మక్కా చేరుకున్నారు. మక్కాలో దైవప్రవక్త (స) సహచరులతో నరుగా కాబాలయానికి వెళ్ళి 'హజ్రెఅస్వద్' (నల్లరాయి)ని ముద్దాడి కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణ చేశారు. తరువాత "మఖామె ఇబ్రాహీం"లో నమాజ్ చేశారు. ఆతర్వాత దైవప్రవక్త (స) సఫా, మర్వా కొండల మధ్య తిరిగి 'సయీ' విధి నెరవేర్చారు. సహచరులంతా ఆయన్ని అనుసరించారు. తరువాత ఖుర్బానీ పశువులు లేనివారు దీక్ష విరమించాలని ఆజ్ఞయింది. ఖుర్బానీ పశువులు తీసుకురాని ముస్లింలు దీక్ష విరమించారు.

జిల్‌హజ్ తొమ్మిదో తేదీన యాత్రికులంతా అర్ఫాత్ మైదానంలో చేరారు. అక్కడ నిర్మించబడిన ఒక కుటీరంలో దైవప్రవక్త (స) మధ్యాహ్నందాకా విశ్రాంతి తీసుకున్నారు. తరువాత ఆయన అర్ఫాత్‌లో యాత్రికులందర్నీ సమావేశపరిచారు.

అది అరబ్‌చరిత్రలోనే అపూర్వ సమావేశం. దైవప్రవక్త(స) ఇలా ప్రసంగించారు: "నా ప్రియ సోదరులారా! నేను చెప్పేదంతా శ్రద్ధగా ఆలకించండి. వచ్చే ఏడు నేనిక్కడ మిమ్మల్ని కలుసుకుంటానో లేదో తెలియదు. దైవగ్రంథాన్ని, నా సంప్రదాయాల్ని దృఢంగా పట్టుకోండి. ప్రజల ధనమానప్రాణాల్ని గౌరవించాలి. దగా, మోసాలాకు పాల్పడకూడదు. రక్తపాతానికి, వడ్డీవ్యవహారాలకు దూరంగా ఉండాలి. ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే. తండ్రి ఒక్కడే. మీరంతా ఆదం (అలై) సంతానం. ఆదం (అలై) మట్టితో సృజించబడ్డారు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవునిదృష్టిలో అందరికంటే ఉత్తముడు. వినండి. అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి ఎలాంటి ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండటమే...."

ఇలా దైవప్రవక్త (స) ప్రజలకు హితబోధచేస్తూ ముస్లింలు పరస్పరం ఎలా మసలుకోవాలి; తోటిమానవులతో ఎలా వ్యవహరించాలి; వారి హక్కులు ఏమిటి వగైరా విషయాలు వివరంగా తెలియజేశారు. ముఖ్యంగా ఆయన జాతి, తెగ, వర్ణ, వర్గ వివక్షలను, నిమ్నోన్నతా భేదభావాలను నిరసిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వాలను గురించి నొక్కిచెప్పారు. చివర్లో ఆయన "ప్రజలారా! నేను మీకు దైవసందేశాన్ని అందజేశానా?" అని పలికినప్పుడు "అందజేశారు మీరు" అని లక్షమంది ప్రజలు ముక్తకంఠంతో అన్నారు. ఇది విని దైవప్రవక్త (స) "దేవా! దీనికి నీవే సాక్షివి" అని మూడుసార్లు అన్నారు.

యాత్రికులతో అర్ఫాత్ మైదానం నిండిపోయింది. దైవప్రవక్త (స) నేతృత్వంలో ముస్లింలు హజ్‌ధర్మాలు నిర్వహించడంలో నిమగ్నులయిపోయారు. ఆకాశ ద్వారం తెరచుకుంది. విశ్వప్రభువు కరుణామృతపు కడపటి బిందువులు జాలువారాయి:

"నేనీ రోజు మీకోసం మీధర్మాన్ని పరిపూర్ణం చేశాను. మీకోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీశ్రేయస్సు కోసం ఇస్లాంను మీజీవనధర్మంగా ఆమోదించాను." (ఖురాన్-5:4)

ఇది ఇస్లాం సౌధ నిర్మాణానికి సమకూర్చబడిన చివరి ఇటుక! మానవాళి జీవితనౌక సాఫీగా సాగడానికి అందజెయ్యబడిన అంతిమ తెరచాప!! ఖుర్ఆన్ రూపంలో అంతిమ దైవప్రవక్త (స) నోట వెలువడిన దివ్యసూక్తి!!!

ఈసూక్తి వినగానే అబూబకర్ (రజి) కళ్ళనుండి అశ్రువులు రాలాయి. దైవప్రవక్త (స) ఇహలోకానికి వచ్చిన పని ముగిసిందని, ఇక ఆయన తనువు చాలించే తరుణం ఆసన్న మయిందని గ్రహించారు. అర్ఫాత్‌లోని కార్యకలాపాలు పూర్తయిన తర్వాత దైవప్రవక్త (స) 'ముజ్దలఫా'కు బయలుదేరారు. ఆయన వెంట అనుచరవాహిని కూడా అర్ఫాత్ నుండి కదిలింది. అందరూ ఆ రాత్రి ముజ్దలపాలో గడిపారు. మరునాడుదయం 'మినా'కు పోయే దారిలో 'రమి' విధి నిర్వహించారు. ఆ తరువాత మినాలో ఒంటెలను బలిచేసి శిరోముండనం చేయించుకున్నారు. దాంతో హజ్ విధులు ముగిశాయి. హజ్ అనంతరం దైవప్రవక్త (స) అనుచరుల్ని తీసుకొని మదీనా వెళ్ళిపోయారు.

ఇప్పుడు దైవగృహం పూర్తిగా ఇస్లాం కేంద్రమయిపోయింది. ప్రపంచ మానవాళికి శాంతి నిలయమయింది. యావత్తు అరేబియా ఇస్లాం జ్యోతితో ప్రకాశవంతమయింది. సర్వత్రా సమానత్వం, సౌభ్రాతృత్వాలు, నీతీనిజాయితీలు వెల్లివిరిశాయి. సమస్త ప్రజల్లో సుగుణసంపత్తి, శాంతీ సౌభాగ్యాలు అలరారసాగాయి. మహాప్రవక్త ముహమ్మద్ (స) కేవలం ఇరవైమూడేండ్ల అతిస్వల్పకాలంలో అరబ్బుల్ని పరిపూర్ణ మానవులుగా తీర్చిదిద్దారు. వారి చీకటి బ్రతుకుల్లో జ్ఞానదీపికలు వెలిగించారు. నరకం అంచున నిల్చున్నవారిని స్వర్గం సమీపానికి తీసికెళ్ళారు.

దైవప్రవక్త (స) కాబాయాత్ర నుండి తిరిగొచ్చి మూణ్ణెల్లయినా కాలేదు వ్యాధిగ్రస్తుల య్యారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి దాడిచేసి ఆయన్ని బాధపెట్టసాగాయి. ఓరోజు రాత్రి దైవప్రవక్త (స) పడక మీద నుండి లేచి నగరం వెలుపలున్న "బఖీవుల్ పిర్ఖద్" శ్మశానం దగ్గరికి వెళ్ళారు. ఆయన వెంట అబూమవీహబా (రజి) మాత్రమే ఉన్నారు. అక్కడ దైవప్రవక్త (స) సమాధుల మధ్య నిలబడి సమాధుల్లో ఉన్న మృతుల మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించారు. ఆ తరువాత ఇంటికి తిరుగుముఖం పట్టారు.

ఆ రోజుల్లోనే సిరియా, పాలస్తీనాల్లో రోమన్లు అరేబియాపై దాడి చేయడానికి యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని తెలిసి వారిని ఎదుర్కోవడానికి దైవప్రవక్త (స) సఫర్ నెలలో పదిహేడేళ్ళ ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో ఓ పెద్ద సైనికదళాన్ని పంపారు.

ఈ సైనిక దళంలో అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లతో సహా ప్రముఖ సహాబీలంతా ఉన్నారు. అయితే కొందరు ఉసామా (రజి) నాయకత్వంలో యుద్ధానికి పోవడానికి సుముఖంగా లేరు. ఉసామా (రజి) తండ్రి జైద్ (రజి) స్వేచ్ఛపొందిన బానిస. అందువల్ల ఉసామా (రజి) బానిస యువకుడన్న భావన వారిలో ఉంది. పైగా ఆయన చాలా పిన్న వయస్కుడు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) మసీదుకెళ్ళి ఇలా ప్రసంగించారు:



"కొందరు ఉసామా (రజి) నాయకత్వాన్ని అంగీకరించకుండా ఏవేవో మాటలు అంటున్నారు. ఈరోజు వారు ఉసామా నాయకత్వం పట్ల అభ్యంతరం లేవదీస్తుంటే ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. వారు లోగడ అతని తండ్రి నాయకత్వం పట్ల కూడా అభ్యంతరం లేవదీశారు. కాని ఉసామా (రజి)లో సైన్యాధ్యక్ష హోదాకు కావలసిన యోగ్యతా అర్హతలు ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు."

ఈ ప్రసంగం వినగానే ఉసామా (రజి) నాయకత్వాన్ని ఆక్షేపిస్తూ ఆరోపణలు చేసిన వారు పశ్చాత్తాపంచెంది ఆయన నాయకత్వంలో యుద్ధానికి పోవడానికి సిద్ధమయ్యారు.

సైన్యంలో ఇంకా చేరవలసినవారు ఉండటంవల్ల ఉసామా (రజి) సైన్యాన్ని తీసుకొని మదీనాకు మూడుమైళ్ళ దూరంలో ఉన్న జురుఫ్ అనే ప్రదేశానికి చేరుకొని విడిదిచేశారు. అదీగాక దైవప్రవక్త (స) ఆరోగ్యం ఇంకా కుదుటపడలేదు. అంచేత అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు సేనాపతి అనుమతి తీసుకొని నగరానికి తిరిగొచ్చారు.

దైవప్రవక్త (స) సాధారణంగా ఒక్కోరోజు ఒక్కోభార్య దగ్గర గడుపుతుంటారు. ఇప్పుడలా వంతులవారిగా ఐదు రోజులు గడిపి వ్యాధి ఎక్కువకావడంతో ఆయన మైమూనా (రజి) ఇంట్లో ఉండి, ఇతర భార్యల్ని పిలిపించుకున్నారు. ఇకనుండి తాను ఆయిషా దగ్గర ఉండిపోవడానికి అనుమతివ్వమని అడిగారు. దానికి వారంతా సంతోషంగా ఒప్పుకున్నారు. అప్పుడు అలి (రజి), అబ్బాస్ (రజి)లు దైవప్రవక్త (స)ను ఆయిషా (రజి) ఇంటికి చేర్చారు.

దైవప్రవక్త (స) అనారోగ్యం సంగతి నగరమంతటా తెలిసిపోయింది. దాంతో ముస్లింలు ఆందోళన చెందారు. ఆరోగ్యం కుదుటపడే సూచనలులేవు. మందులు వాడినా ప్రయోజనంలేదు. వ్యాధి రోజురోజుకు ముదిరిపోసాగింది. ఓరోజు మగ్రిబ్ నమాజ్ చేయించడానికి అతికష్టం మీద మసీదుకు వెళ్ళారు. ఇంటికి తిరిగొచ్చిన తర్వాత జ్వరం తీవ్రమయింది.

ఇషా వేళ అయింది. ఆయన మసీదులో కూర్చున్న అనుచరుల్ని ఉద్దేశించి "నమాజ్ అయిందా?" అనడిగారు. "కాలేదు మీ కోసమే ఎదురుచూస్తున్నాం" అన్నారు అనుచరులు. ఆ తరువాత దైవప్రవక్త (స) నీళ్ళు తెప్పించి స్నానం చేశారు. లేచి నిలబడబోతే సొమ్మసిల్లి పడిపోయారు. కాస్సేపటికి స్పృహవచ్చింది. స్పృహరాగానే "నమాజ్ అయిందా?" అని అడిగారు ఆయన. "కాలేదు, మీ కోసమే ఎదురుచూస్తున్నాం" అన్నారు అనుచరులు.

దైవప్రవక్త (స) మళ్ళీ స్నానంచేసి లేవడానికి ప్రయత్నించారు. కాని ఈసారి కూడా ఆయన స్పృహతప్పారు. స్పృహ రాగానే "నమాజ్ అయిందా?" అని ప్రశ్నించారు. "లేదు, మీ కోసమే ఎదురుచూస్తున్నాం" అని సమాధానమిచ్చారు అనుచరులు. దైవప్రవక్త (స) మళ్ళీ స్నానంచేసి లేవడానికి ప్రయత్నిస్తే తిరిగి సొమ్మసిల్లారు. కాస్సేపటికి స్పృహ రావడంతో ఆయన మసీదుకు వస్తారేమోనని అనుచరులు భావించారు. కాని అలా జరగలేదు.

"అబూబకర్‌తో నమాజ్ చేయించమని చెప్పండి" అని ఆదేశించారు దైవప్రవక్త (స). అప్పుడు ఆయిషా (రజి) "దైవప్రవక్తా! ఆయన కంఠస్వరం చాలా చిన్నది. ఖుర్ఆన్ పఠిస్తూ ఆయన దుఃఖిస్తారు. ప్రజలు ఆయన కంఠస్వరం సరిగా వినలేరు" అన్నారు. "నమాజ్ చేయించమని అబూబకర్‌కు చెప్పండి" అన్నారాయన మళ్ళీ. ఆయిషా (రజి)

ప్రాధేయపడుతూ తిరిగి అవే మాటలు పలికారు. "అబూబకర్‌కు చెప్పండి నమాజ్ చేయించమని" అన్నారు మళ్ళీ దైవప్రవక్త (స) చిరుకోపంతో. అప్పుడు ఆయన ఆదేశాను సారమే అబూబకర్ (రజి) నమాజ్ చేయించారు.

ఆరోజు నుంచి ఆయనే నమాజ్ చేయించడం ప్రారంభించారు. అలా కొన్ని రోజులు గడిచాయి. దైవప్రవక్త (స) ఆరోగ్యం కాస్త కుదుటపడినట్లు అన్పించింది. అప్పుడాయన స్నానం చేసి బట్టలు తొడుక్కొని తలపాగ పెట్టుకున్నారు. అలి (రజి), ఫజల్ బిన్‌అబ్బాస్ (రజి)ల భుజాలపై చేతులు వేసి, కాళ్ళు ఈడుస్తూ అతికష్టంమీద మసీదుకు వెళ్ళారు.

అదే సమయంలో అబూబకర్ (రజి) జుహర్‌నమాజ్ చేయించడానికి ఇమాం స్థానం మీదికెళ్ళి నిల్చున్నారు. దైవప్రవక్త (స) వస్తున్నట్లు అలికిడి వినగానే ఆయన ఆ స్థానంనుండి తప్పుకోబోయారు. కాని దైవప్రవక్త (స) వారిస్తూ ఆయన పక్కన కూర్చున్నారు. నమాజ్ ముగిసింది. తర్వాత దైవప్రవక్త (స) శ్రోతలను ఉద్దేశించి ఓ చిన్న ప్రసంగం చేశారు:

"సోదరులారా! నేను చనిపోతానేమోనని మీరు ఆందోళనపడుతున్నట్లు నాకు తెలిసింది. కాని నాకు పూర్వం వచ్చిపోయిన దైవప్రవక్తలందరికీ మరణం తప్పలేదు. నేను కూడా వారిలో ఒక దైవప్రవక్తనే కదా! దేవుడు తన దాసుల్లో ఒకనికి, ఈ ప్రపంచలోనైనా ఉండ వచ్చుని లేదా తన అనుగ్రహఛాయలోకైనా రావచ్చుని అధికారం ఇచ్చాడు. అప్పుడా దాసుడు దేవుని అనుగ్రహఛాయలోకి వెళ్ళే విషయానికే ప్రాధాన్యం ఇచ్చాడు...."

"వినండి మొట్టమొదట హిజ్రత్ (వలస) చేసినవారి పట్ల ఎల్లప్పుడూ మంచిగా మసలుకోవాలి. ముహాజిర్లు పరస్పరం సద్వర్తనం కలిగిఉండాలి...."

"ముస్లింలారా! దేవుడు ధర్మసమ్మతం చేసినదాన్నే నేను ధర్మసమ్మతం చేశాను. సమాధులకు సాష్టాంగపడే జాతులపై దైవాగ్రహం విరుచుకుపడుగాక! "ముస్లింలారా! నేనెవరినైనా కొడితే వారు బదులు తీర్చుకోవచ్చు. ఇదిగో! నావీపు సిద్ధంగా ఉంది. నేనెవరినైనా ఏదైనా అంటే వారు కూడా నన్ను అదే మాట అనవచ్చు. నేనెవరి దగ్గరైనా ఏదైనా తీసుకుంటే వారిప్పుడు దాన్ని నన్నడిగి తీసుకోవచ్చు."

ఈ చివరి మాట వినగానే ఒకతను లేచి "దైవప్రవక్తా! మీరు నాకు మూడు దిర్హంలు బాకీ ఇవ్వాల్సి ఉంది" అన్నాడు. దైవప్రవక్త (స) అప్పటికప్పుడు మూడు దిర్హంలు తెప్పించి అతనికి ఇప్పించారు. తరువాత ఆయన ఇలా అన్నారు: "ప్రవక్త కూతురు ఫాతిమా! ప్రవక్త మేనత్త సఫియా! మీరు దైవప్రసన్నత కోసం (పరలోక) సామగ్రి సిద్ధం చేసుకోండి. నేను (మీ బంధువుగా) దేవుని దగ్గర మీకు ఏ విధంగానూ ఉపయోగపడలేను."

ప్రసంగం ముగిసింది. దైవప్రవక్త (స) దగ్గర బైతుల్‌మాల్ (ప్రజాధనాగారం)లో ఏడు దీనార్లు ఉన్నాయి. అవి గుర్తుకువచ్చి తాను చనిపోతే ఈ డబ్బు తనదగ్గరే ఉండిపోతుందే మోనని భయపడ్డారు. తక్షణమే ఆయన ఆ డబ్బు నిరుపేదలకు దానం చెయ్యమని అర్ధాంగి ఆయిషా (రజి)ను ఆదేశించారు.

ఓరోజు దైవప్రవక్త (స) పడక మీద ఉండే కిటికీ తెర పైకెత్తి మసీదులోకి తొంగిచూశారు. మసీదులో అనుచరులంతా ఫజర్ నమాజ్‌లో లీనమైఉన్నారు. చివరికి తాను ఆశించిన



సమాజం దేవునిపుడమిపై ఆవిర్భవించడంతో తనపై విశ్వప్రభువు మోపిన బాధ్యతలు తీరిపోయాయని ఆయన ఎంతో సంతోషించారు. అయితే మరో బాధ్యత మిగిలిఉంది.

"ఆయిషా! మీ నాన్నను, అన్నయ్యను పిలిపించు. ఖిలాఫత్ (దైవప్రాతినిధ్య పాలన) పదవి కోసం మీ నాన్న (అబూబకర్)ను నా వారసునిగా చేస్తూ వీలునామా వ్రాయిస్తాను" అన్నారు ఆయన. "వీలునామా రాయవలసిన అవసరమేముంది? ప్రజలు ఆయన్ని తప్ప మరొకరిని నాయకునిగా ఎన్నుకోరు" అన్నారు ఆయిషా (రజి).

ఈమాట విని దైవప్రవక్త (స) మౌనంగా ఉండిపోయారు. ఆయన ఆరోగ్యం ఇంకా కుదుటపడలేదు. పైగా అది మరింత క్షీణిస్తూ పోతోంది. అందువల్ల మరునాడు ఆయన వీలునామా రాయించడానికి కలం, సిరా, కాగితాలు తెప్పించారు. అప్పుడు ఉమర్ (రజి)తో పాటు మరికొందరు అనుచరులు అక్కడ ఉన్నారు. దైవప్రవక్త (స) పడుకొని బాధపడుతూనే వీలునామా రాయించడానికి ప్రయత్నించారు.

కాని ఉమర్ (రజి) "ఈ స్థితిలో దైవప్రవక్త (స)కు బాధ పెట్టడం మంచిదికాదు. మనకు ఖుర్‌ఆన్ చాలు" అన్నారు. "ఆయన అసలు ఏం రాయించదలచుకున్నారో అడిగితే బాగుంటుంది" అన్నారు మరికొందరు. ఈ మాటలు విని దైవప్రవక్త (స) ఎంతో నొచ్చుకున్నారు. ఆయన మరేమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు.

అప్పుడు కొందరు ముందుకు వచ్చి "దైవప్రవక్తా! ఇంతకూ మీరేమి రాయించ దలచుకున్నారో చెప్పండి" అని అడిగారు. దానికి ఆయన విసుగెత్తిపోయి "మీరంతా బయటికి వెళ్ళండి. నన్నిప్పుడున్న స్థితిలో వదలి వెళ్ళిపోండి" అన్నారు. బాధ కొంచెం తగ్గినట్లు అన్పించగానే ఆయన ముఖ్య అనుచరులను పిలిపించుకొని వారికి పరోపకారం, ప్రజలపట్ల సద్వర్తనం, నమాజ్ మొదలైన విషయాల్ని గురించి హితోపదేశం చేశారు.

## (34) పరలోక ప్రస్థానం

ఆ తరువాత దైవప్రవక్త (స) అర్ధాంగి ఆయిషా (రజి) వడిలో శిరస్సుపెట్టి పడుకున్నారు. ఆయన ఆరోగ్యం కాస్త కుదుటపడినట్లు అన్పించడంతో అబూబకర్ (రజి) అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయారు. నిజంగా అప్పుడాయన ముఖం పూర్ణచంద్రుడిలా వెలిగిపోసాగింది. కాని ఈ చంద్రకాంతి ఎంతోసేపు నిలువలేదు. కాస్సేపటికే ఆ ముఖారవిందం కాంతి విహీనమైపోయింది. దైవప్రవక్త (స) పక్కనున్న చన్నీళ్ళపాత్రలో చేయి ముంచి, ఆ తడిచేతిని ముఖం మీద రుద్దుకోవడం ప్రారంభించారు. ఇలా అనేకసార్లు చేశారు.

"దేవా! ప్రాణంతోడే ఈబాధను సులభతరం చెయ్యి" అన్నారాయన. ఫాతిమా (రజి) తండ్రి అనుభవిస్తున్న బాధ చూసి తల్లడిల్లిపోయారు. "అయ్యయ్యో! మా నాన్న ఎంత బాధపడుతున్నారు!!" అన్నారామె. "బాధపడకమ్మా! ఈరోజు తరువాత మీ నాన్నకు ఇక ఎన్నటికీ ఎలాంటి బాధ ఉండదు" అన్నారు దైవప్రవక్త (స) కూతుర్ని ఓదార్చుతూ.

దైవప్రవక్త (స) పరిస్థితి మరింత విషమించింది. ఆయాసం ఎక్కువయింది. ఊపిరి పీల్చుకోవడం కష్టమైపోయింది. పెదవులు మెల్లిగా కదిలాయి: "నమాజ్, నమాజ్.... బానిసలతో మంచిగా వ్యవహరించండి." ఆ తరువాత ఆయన చేయి పైకి లేచింది.

చూపుడువ్రేలితో సైగచేస్తూ "ఆ మహామిత్రుడు తప్ప ఇప్పుడిక ఎవరూలేరు" అన్నారు. దైవప్రవక్త (స) నోట ఈ పలుకులు వెలువడిన మరుక్షణమే ఆయన చేయి వ్రేలాడిపోయింది. కనుగుడ్లు నిలిచిపోయాయి. అశాశ్వతమైన మట్టిముద్దలో అరవై మూడేండ్లు కాపురముండిన ఓ దివ్యతేజం నేడు దైవ సన్నిధికేగింది.

దాంతో అనుచరుల గుండెలు పగిలిపోయాయి. మొత్తం ప్రపంచమే వారికి అంధకారమయినట్లు అనిపించింది. ఈ విషాదవార్త విన్న ప్రతి ముస్లిం ఎక్కడ నిల్చున్న వాడక్కడ నోరు తెరచి కొయ్యబారిపోయాడు. హిజ్రీశకం 11వ సంవత్సరం, రబీవుల్ అవ్వల్ మాసం 12వ తేది, సోమవారం విశ్వకారుణ్యమూర్తి (స) యావత్ ముస్లింజగత్తును శోకసముద్రంలో ముంచి తమ ప్రభువు సన్నిధికి వెళ్ళిపోయారు.

ఉమర్ (రజి) ఈవార్త వినగానే నిలువునా కంపించిపోయారు. ఆయన ఈ విషయాన్ని ఓ పట్టాన నమ్మలేకపోయారు. ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి దైవప్రవక్త (స) భౌతిక కాయంపై కప్పబడిన వస్త్రం తొలగించి చూశారు. ఆ ముఖం ఎలాంటి మార్పులేకుండా ఎప్పటిలాగానే విప్పారినపువ్వులా ఉంది. బహుశా వ్యాధితీవ్రత వల్ల స్పృహతప్పి ఉంటారని, కాస్సేపటికి స్పృహ రావచ్చని భావించారు ఆయన అయోమయంగా చూస్తూ.

ఆ తర్వాత ఆయన మసీదుకు వెళ్ళారు. మసీదు ఏడ్పులు, ఎక్కిళ్ళతో ప్రతిధ్వనిస్తోంది. అనుచరులు తమ ప్రియతమ నాయకుడ్ని తలచుకొని కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తున్నారు. ఉమర్ (రజి) వర నుంచి ఖడ్గం లాగి "ఖబర్దార్! ఎవరైనా దైవప్రవక్త (స) చనిపోయారని అంటే అతని తల ఎగిరిపోతుంది" అన్నారు కోపోద్రేకాలతో అటూ ఇటూ తిరుగుతూ.

ఈ విషాదవార్త అబూబకర్ (రజి) చెవిన పడగానే క్షణంపాటు ఆయన నోట మాట పెగల్లేదు. తర్వాత తేరుకొని ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి దుప్పటి తొలగించి ప్రవక్త (స) ముఖపద్మాన్ని తనివితీరా దర్శించారు. కళ్ళ నుండి అశృధారలు కారుతుండగా ఆయన ప్రవక్త (స) నుదుటిపై ముద్దాడారు. ఆతర్వాత ఆయన బయటికొచ్చి మసీదుకు వెళ్ళారు.

మసీదులో ఉమర్ (రజి) దైవప్రవక్త (స) బ్రతికే ఉన్నారని చెబుతూ ఉద్రేకంగా ప్రసంగిస్తున్నారు. అబూబకర్ (రజి) ఆయన్ని ఈ పరిస్థితిలో ఆపడం కష్టమని భావించి నిలబడిన చోటు నుంచే సోదరులారా! అంటూ మాట్లాడటం ప్రారంభించారు. అబూబకర్ (రజి) పలుకులు వినగానే జనమంతా ఒక్కసారిగా ఆయన వైపు దృష్టి మళ్ళించారు. దాంతో ఉమర్ (రజి) తన ప్రసంగాన్ని ఆపేయక తప్పలేదు. అబూబకర్ (రజి) కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖాన్ని దిగమింగి నిబ్బరంగా ఇలా ప్రసంగించారు:

"సోదరులారా! ఒకవేళ ఎవరైనా ముహమ్మద్ (స)ని ఆరాధిస్తుంటే ముహమ్మద్ (స) ఇహలోకం వీడిపోయారని తెలుసుకోవాలి. అల్లాహ్‌ని మాత్రమే ఆరాధించేవారికి అల్లాహ్ సజీవంగా ఉన్న సంగతి తెలిసిందే. నిత్యజీవుడు అల్లాహ్ మాత్రమే. ఆయనకు మరణమన్నదే లేదు. ఆయన మనకు ఇదివరకే దైవప్రవక్తను గురించి ఇలా వివరించాడు:

"ముహమ్మద్ (మానవమాత్రుడయిన) దైవప్రవక్త మాత్రమే. అతనికి పూర్వం కూడా అనేకమంది దైవప్రవక్తలు వచ్చిపోయారు. మరి ఇతనిప్పుడు చనిపోతే లేక చంపబడితే



మీరు (ధర్మపథం నుండి) వెనుదిరిగి పోతారా? గుర్తుంచుకోండి. అలా వెనుదిరిగి పోయేవాడు దేవునికి ఎలాంటి నష్టం కలిగించలేడు." (ఖుర్ఆన్–3:144)

అబూబకర్ (రజి) ప్రసంగంతో ముస్లింలకు కాస్త ఊరట చేకూరింది. ఉమర్ (రజి) ఈ ప్రసంగం వినగానే కళ్ళుతిరిగి క్రిందపడిపోయారు. తర్వాత స్పృహలోకి వచ్చి "దైవప్రవక్త (స) చనిపోయారనడంలో ఇక నాకెలాంటి సందేహం లేదు" అని భావించారు మనసులో. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) దైవప్రవక్త (స) భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిపేందుకు కావలసిన సామగ్రి సిద్ధం చేయడంలో నిమగ్నులైపోయారు.

## (35) ప్రవక్తవారసుడి ఎంపికలో తర్జనభర్జనలు

ఇదిలా ఉండగా మరొక చోట అన్సార్ ముస్లింలు ఖలీఫా పదవి కోసం తమలో ఒకర్ని నాయకుడిగా ఎన్నుకోవడానికి ఖజ్రజ్ తెగనాయకుడు సాద్ బిన్ ఉబాదా (రజి) ఇంటి దగ్గర 'సఖీఫా' (పందిరి) కింద సమావేశమయ్యారు. సాద్ (రజి) ఖిలాఫత్ పదవి అన్సార్‌ముస్లింల హక్కని నిరూపించడానికి ప్రయత్నించారు. అయితే అన్సారుల్లోనే ఒకతను అభ్యంతరం చెబుతూ "ముహాజిర్ ముస్లింలు బంధుత్వం ఆధారంతో ఖిలాఫత్ తమ హక్కని భావిస్తే వారికి మీరు ఏం సమాధానమిస్తారు?" అన్నాడు. మరొక అన్సారీ మాట్లాడుతూ "అందుకు వారు అంగీకరించకపోతే ఒక ఖలీఫాను మీరు ముహాజిర్లలో ఎన్నుకోండి, ఒక ఖలీఫాను మేము అన్సార్లలో ఎన్నుకుంటామని చెబుదాం" అని అన్నాడు. దానికి హజ్రత్ సాద్ (రజి) "ఇది చాలా బలహీనమైన విషయం" అన్నారు.

వేరొక అన్సారీ మాట్లాడుతూ "ముహాజిర్లు మన ఖలీఫాను అంగీకరించపోతే మనం వారిని ఖడ్గబలంతో మదీనా నుండి వెళ్ళగొడ్తాం" అన్నాడు. ఈమాట వినగానే సమావేశంలో పాల్గొన్న ముహాజిర్‌ముస్లింలు అన్సార్‌ముస్లింలకు వ్యతిరేకంగా తీవ్రంగా స్పందిస్తూ నిరసన వెలిబుచ్చారు. ఇలా అన్సార్, ముహాజిర్‌ముస్లింల మధ్య వాదోపవాదాలు, తర్జన భర్జనలు మొదలయ్యాయి. అప్పుడు పరిస్థితి విషమిస్తూ ఉండటం గమనించిన హజ్రత్ ముగీరా బిన్ షాబా (రజి) వెంటనే అక్కడ్నుంచి మస్జిదెనబవీ వైపు పరుగెత్తారు.

"అబూబకర్! ఉమర్!! పదండి, పదండి. సాద్ బిన్ ఉబాదా (రజి) ఇంటి దగ్గర అన్సారులంతా గుమిగూడి తమలో ఒకడ్ని ఖలీఫాగా ఎన్నుకోబోతున్నారు. త్వరగా పదండి. లేకపోతే పెద్ద ఉపద్రవం వచ్చి పడుతుంది" అన్నారాయన. తక్షణమే అబూబకర్ (రజి) అంత్యక్రియల కోసం అలి (రజి)ని, మరికొందరు సహాబీలను వదలిపెట్టి ఉమర్ (రజి)ని, అబూఉబైదా (రజి)లను వెంటబెట్టుకొని ఆ ప్రదేశానికి పరుగెత్తారు. చూస్తే అక్కడ అన్సార్ ముస్లింలకు, ముహజిర్ ముస్లింలకు మధ్య వాగ్వివాదం జరుగుతోంది. అబూబకర్ (రజి) వారికి సర్దిచెప్పిన తర్వాత "ముహాజిర్లు నాయకులౌతారు; అన్సార్లు మంత్రులౌతారు" అన్నారు. హుబాబ్ బిన్ మంజర్ అన్సారీ (రజి) మాట్లాడుతూ "కాని ఒక నాయకుడు మాలో, ఒక నాయకుడు మీలో ఉంటే బాగుంటుందని భావిస్తున్నాను" అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఆయనకు సమాధానమిస్తూ "దైవప్రవక్త (స) అన్సార్ల పట్ల సద్భావనతో మసలుకోవాలని ముహాజిర్లకు ఉపదేశించిన సంగతి మీకు తెలియనిదికాదు.

ఆయన ముహాజిర్ల పట్ల సద్భావనతో మెలగాలని అన్సార్లకు ఉపదేశించ లేదు. ఖిలాఫత్ పదవి ముహాజిర్లలో ఉంటుందనడానికి అన్సార్లపట్ల దైవప్రవక్త (స) ఇచ్చిన ఈ రాయితీయే ప్రబల నిదర్శనం" అని అన్నారు. హజ్రత్ హుబాబ్ (రజి) ఆయనకు అడ్డుతగులుతూ ఏదో చెప్పడానికి ప్రయత్నించారు. ఇలా వారిద్దరి మధ్య వాగ్వివాదాలు మొదలయ్యాయి. అప్పుడు హజ్రత్ అబూఉబైదా (రజి) వారిద్దరికి సర్దిచెప్పి వాగ్వివాదాలను ఆపుచేశారు.

అంతలో హజ్రత్ బషీర్ బిన్ నోమాన్ అన్సారీ (రజి) లేచి ఇలా అన్నారు:

"దైవప్రవక్త (స) ఖురైష్ తెగకు చెందినవారు. కనుక ఖిలాఫత్ పదవికి అందరికంటే ఖురైష్ తెగవారే ఎక్కువ అర్హులు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. మనం ఇస్లాం ధర్మానికి సహాయం చేసినవారు మాత్రమే. మన ఇస్లాం స్వీకరణ దైవప్రవక్త (స)కు సహాయం చేయడానికి నడుం బిగించడం కేవలం దైవప్రసన్నత పొందడానికి మాత్రమే. దాని ప్రతిఫలాన్ని మేము ఇహలోకంలో ఆశించడంలేదు. కనుక ఖిలాఫత్ వ్యవహారంలో మేము ముహాజిర్లతో జగడమాడ దలచుకోలేదు. నేను పిరికితనం వ్యక్తపరచడం లేదు. ఖిలాఫత్ పదవికి అర్హులైన వారితో ఖిలాఫత్ పదవి విషయంలో జగడమాడటం నాకిష్టం లేదు. హుబాబ్! ఇమామ్ (నాయకుడు) ఖురైష్ తెగకు చెందిన వాడవుతాడని దైవప్రవక్త (స) చెప్పిన విషయం నీకు తెలియదా?"

ఆయన మాటను కొందరు అన్సార్లు ధృవీకరించి సమర్థించారు. అప్పుడు హజ్రత్ హుబాబ్ (రజి) తన అభిప్రాయాన్ని ఉపసంహరించుకున్నారు. దాంతో సభికులపై క్షణం పాటు నిశ్శబ్దం ఆవరించింది.

ఆ తరువాత హజ్రత్ అబూబకర్ (రజి) మాట్లాడుతూ "మీరు ఉమర్ (రజి), అబూ ఉబైదా (రజి)లలో ఒకర్ని ఎన్నుకోండి" అన్నారు. వెంటనే వారిద్దరు లేచి "కాదు, కాదు. ముహాజిర్లలో అబూబకర్ (రజి) అందరికంటే శ్రేష్ఠుడు. ఈయన సౌర్‌గుహలో దైవప్రవక్త (స)కు తోడుగా ఉన్నారు. నమాజ్‌కు నాయకత్వం వహించడానికి దైవప్రవక్త (స) ఈయన్ని తన ప్రతినిధిగా నియమించారు. నమాజ్ ధార్మిక వ్యవహారాల్లో అన్నిటికంటే ఉన్నతమైనది. అలాంటి అబూబకర్ (రజి) ఉండగా మరొకరు ఖిలాఫత్ పదవికి అర్హులు కాలేరు."

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట చెప్పిన తరువాత ముందుకొచ్చి అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి బైత్ (ప్రమాణం) చేశారు. ఆ తరువాత అబూఉబైదా, బషీర్ (రజి)లు ప్రమాణం చేశారు. దాంతో మిగిలినవారు ఏకాభిప్రాయానికి వచ్చి అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి ప్రమాణం చేశారు. ఈసంగతి తెలిసిన ఇతర ముహాజిర్, అన్సార్ ముస్లింలంతా పరుగు పరుగున వచ్చి ప్రమాణం చేశారు. అలి (రజి), జుబైర్ (రజి), తల్హా(రజి)లు మాత్రం దైవప్రవక్త (స) అంత్యక్రియల సామగ్రి సిద్ధంచేయడంలో నిమగ్నులై ఉన్నందున ప్రమాణం చేయలేక పోయారు.

## (36) అంతిమ దర్శనం

ఇలా అందరూ ఏకగ్రీవంగా అబూబకర్ (రజి)ని ఖలీఫాగా ఎన్నుకున్నారు. దాంతో విభేదాలన్నీ తొలగిపోయి పెద్ద ప్రమాదం తప్పిపోయింది. మరునాడు మసీదులో 33వేల మంది ప్రజలు అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి ఆయన్ని ఖలీఫాగా ఆమోదించారు.



ఈపని కాగానే ప్రజలదృష్టి మళ్ళీ దైవప్రవక్త (స) భౌతికకాయం వైపు మరలింది. అంత్యక్రియల కోసం సన్నాహాలు ప్రారంభించారు. అలి (రజి), ఉసామా (రజి) కలసి దైవప్రవక్త (స) భౌతికకాయానికి స్నానంచేయించారు. మూడు వస్త్రాల్లో కఫన్ చుట్టబెట్టి వస్త్రసంస్కారం చేశారు. అంతిమదర్శనం కోసం అందరికీ అవకాశం ఇచ్చారు. జనాజా నమాజ్ ప్రారంభించారు. ఎవరి నేతృత్వం లేకుండానే ఎవరికివారే జనాజానమాజ్ చేశారు. ఈ విధంగా జనాజానమాజ్ కోసం దైవప్రవక్త (స) భౌతికకాయాన్ని రెండురోజుల దాకా ఖననం చేయకుండా ఉంచారు. ఆ తరువాత సమాధిచేశారు.

అంతిమ దైవప్రవక్త (స) అనేకమందికి అంతిమ దర్శనభాగ్యం కలిగించి అశాశ్వతమైన ఈ ప్రపంచం నుండి శాశ్వతంగా తెరమరుగైపోయారు. అయితే ఆ మానవమహోపకారి (స) చరిత్రలో చిరస్థాయిగా నిలచి తన పవిత్ర జీవితవిశేషాలతో, దివ్యబోధనలతో ప్రజల హృదయాల్లో నిత్యం జ్ఞానకాంతులు నింపుతున్నారు. తన అరవై మూడేండ్ల జీవితకాలంలోని అద్భుతమైన అసాధారణ ఘట్టాలను ప్రపంచమానవాళి ముందుంచి, ఈ లోకంలో మానవుడు ఎండాకాలంలో ప్రయాణంచేస్తూ ప్రయాణ బడలిక తీర్చుకోవడానికి మార్గ మధ్యలో చెట్లనీడన కూర్చుంటూ ప్రయాణం సాగించే బాటసారిలాంటి వాడని ఆయన స్పష్టం చేశారు. ❈❈❈❈❈

# 31. సన్మార్గ ప్రాతినిధ్యం (ఖిలాఫతె రాషిదా)

'ఖిలాఫతె రాషిదా' అంటే "సన్మార్గ ప్రాతినిధ్య పాలన" అని చెప్పవచ్చు. సన్మార్గ ప్రాతినిధ్య పాలన అంటే దైవప్రవక్త (సల్లం) ప్రతినిధిగా, రాజకీయ వారసుడిగా ఆయన బోధనల ప్రకారం ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిపాలన చేయడమే. ఆవిధంగా పరిపాలనచేసే ముస్లింను మాత్రమే సన్మార్గగామి అయిన ఖలీఫా అంటారు.

ఖలీఫా నిర్వహించవలసిన ప్రాథమిక బాధ్యతలు దైవప్రవక్త (స) హితోక్తుల వెలుగులో ఈవిధంగా ఉన్నాయి:

"మీరు తప్పనిసరిగా దైవగ్రంథాన్ని అనుసరించాలి. దైవగ్రంథాన్ని అనుసరించడం మీ విధి. అందులో దేవుడు ధర్మసమ్మతం చేసిన విషయాలను మీరు ధర్మసమ్మతం చేసుకోవాలి; దేవుడు నిషేధించినవాటిని మీరు నిషేధించుకోవాలి." (ముస్నద్అహ్మద్)

"నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలిపోతున్నాను. దైవగ్రంథం (దివ్యఖుర్ఆన్), దైవప్రవక్త సంప్రదాయం (హదీసు). ఈ రెండిటిని దృఢంగా పట్టుకొనివుంటే మీరు ఎన్నటికీ మార్గభ్రష్టులు కాలేరు." (ముఅత్తా, కన్జుల్‌ఉమ్మాల్)

"మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడైన సంరక్షకుడే. కనుక అతను తన సంరక్షణలో ఉండేవారిని గురించి ప్రశ్నించబడతాడు. పాలకుడు తన ప్రజలకు సంరక్షకుడు. అతను తన ప్రజల (బాగోగుల) విషయంలో బాధ్యుడవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది." (బుఖారి)

మహాప్రవక్త ముహమ్మద్ (స) కాబోయే తన రాజకీయ వారసుడ్ని గురించి ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. ఈ కారణంగా ముహాజిర్ ముస్లింలకు, అన్సార్ ముస్లింలకు మధ్య జరిగిన చర్చల్లో ఖలీఫా ముహాజిర్‌వ్యక్తి కావాలా లేక అన్సార్‌వ్యక్తి కావాలా అనే విషయమై తీవ్రమైన భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అయితే దైవప్రవక్త (స) తన జీవిత చరమదశలో, అనారోగ్య స్థితిలో 'నమాజ్ నాయకత్వం' వహించడానికి హజ్రత్ అబూబకర్ (రజి) పేరును ప్రతిపాదించారు. హజ్రత్ అబూబకర్ (రజి)కు లభించిన ఈ విశిష్ట ఔన్నత్యంతో పాటు, మరికొన్ని ఇతర విషయాల్లో దైవప్రవక్త (స) ద్వారా లభించిన ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకొని ముస్లింలు ఆయన్నే ప్రవక్త రాజకీయ వారసుడిగా, తొలి ఖలీఫాగా ఎన్నుకున్నారు.

ఇస్లాంలో మనిషి గౌరవం, ఔన్నత్యాలకు గీటురాయి దైవభీతి పరాయణత మాత్రమే. దేవుని దృష్టిలో జాతి, తెగ, వంశం, వర్ణం, దేశం, ప్రాంతం, భాష, ఐశ్వర్యం, పదవీ, హోదాలకు ఎలాంటి విలువ లేదు. దైవభీతి కలవారికే ఆయన దగ్గర విలువ ఉంటుంది.

సృష్టికర్త, విశ్వపాలకుడయిన దేవుడు ఇలా స్పష్టం చేశాడు : "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (ఖుర్ఆన్-49:13)

మహాప్రవక్త ముహమ్మద్ (స) ఈవిధంగా తెలియజేశారు : "ప్రజలారా! వినండి. మీప్రభువు ఒక్కడే. అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి, నల్లవాడిపై తెల్లవాడికి, తెల్లవాడిపై నల్లవాడికి దైవభీతిపరాయణత ప్రాతిపదికపై తప్ప ఎలాంటి ఘనతాఔన్నత్యాలు లేవు." (బైహఖి)

మరొక సందర్భంలో దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు : "ప్రజలారా! "మీరు దేవునికి భయపడుతుండాలని, మీకు నాయకుడిగా (లేక ఖలీఫాగా) నియమించబడే వాడు నీగ్రోజాతికి చెందిన బానిసయినా సరే, (అతను చెప్పినట్లు) విని విధేయత చూపాలని నేను మీకు ఉపదేశిస్తున్నాను." (అబూదావూద్, తిర్మిజి)

ఈ బోధనలే ముస్లింలలో ఏకాభిప్రాయం కుదిర్చి అబూబకర్ (రజి)ని తొలిఖలీఫాగా చేశాయి. దైవప్రవక్త (స) అరబ్ పెద్దలెవర్నీ కాదని నీగ్రోజాతి బానిసయిన బిలాల్ (రజి)ని ముఅజ్జిన్ (అజాన్ ప్రకటనకర్త)గా నియమించారు. మరోబానిస కుమారుడైన ఉసామా బిన్ జైద్(రజి)ని సర్వసేనానిగా నియమించారు. కాని ఆతర్వాత కొందరుముస్లింలు దైవప్రవక్త (స) చేసిన కొన్ని భవిష్యత్‌ప్రకటనలను ఆజ్ఞలుగా భావించి ఖలీఫా నియామకంలో భేదాభిప్రాయాలు సృష్టించుకున్నారు. ఆ భవిష్యత్ ప్రకటనలు ఇలా ఉన్నాయి:

(1) "నా తదనంతరం ఖిలాఫత్ వ్యవస్థ ముప్ఫయి సంవత్సరాల పాటు ఉంటుంది. ఆ తరువాత అది రాచరిక వ్యవస్థగా మారుతుంది." దాని ప్రకారం అబూబకర్ (రజి) ఖిలాఫత్ 2 ఏండ్లు, ఉమర్ (రజి) ఖిలాఫత్ 10 ఏండ్లు, ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ 12 ఏండ్లు, అలి (రజి) ఖిలాఫత్ 6 ఏండ్లు చొప్పున మొత్తం 30 ఏండ్లు అయింది.



(2) "ఇమామ్ (నాయకుడు) ఖురైష్ వంశస్థుడు అవుతాడు." తన తదనంతరం ఖురైష్ వంశస్థుడే తప్పకుండా ఖలీఫాగా ఎన్నుకోబడాలని దైవప్రవక్త (స) భావిస్తే ఆ విషయాన్ని ఆయన స్పష్టమైన పదజాలంతో ఆదేశించేవారు. కాని అలా చేయలేదు.

(3) తన రాజకీయ వారసుడు ముహాజిర్‌లలో ఒకడయి ఉంటాడని దివ్యసంకేతం ద్వారా తెలుసుకున్న దైవప్రవక్త (స) ముహాజిర్ ముస్లింలను సంబోధిస్తూ "ముహాజిర్ ప్రజలారా! మీరు అన్సార్ ప్రజల పట్ల సత్ప్రవర్తనతో మెలగండి" అని ఉపదేశించారు.

## (1) తొలి ఖలీఫాతో ప్రవక్తవారసుల విభేదం

ఖిలాఫత్ పదవి ఎన్నిక అత్యవసర సమయంలో అలి (రజి), జుబైర్ (రజి), తల్హా (రజి)లు ప్రవక్త భౌతికదేహ ఖననసామగ్రి సేకరణలో నిమగ్నులై ఉన్నందున వారిని 'బైత్' కోసం పిలవడం జరగలేదు. ఆ ముగ్గురు ఖిలాఫత్ పదవి ఎన్నిక సమయంలో తమను పిలువలేదన్న ఆరోపణతో నలభై రోజులదాకా బైత్ చేయలేదు.

ఓరోజు అలి (రజి) ఖలీఫా అబూబకర్ (రజి) దగ్గరకు వెళ్ళి "నేను మీ ఖిలాఫత్ అర్హతలకు వ్యతిరేకిని కాను. కాని నేను దైవప్రవక్త (స)కు అతిసన్నిహిత బంధువైనప్పటికీ నన్ను మీరు ఖిలాఫత్ ఎంపిక సంప్రదింపుల కోసం 'సఖీఫా బనూసాదా' (బనూసాదా పందిరి)కి పిలువలేదు. ఆరోజు అక్కడికి నన్ను మీరు పిలిపించుకొనివుంటే అందరికంటే ముందు నేనే మీ చేతిలో చేయివేసి బైత్ చేసివుండేవాడ్ని" అని అన్నారు.

దానికి ఖలీఫా అబూబకర్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "నా బంధువుల పట్ల సద్భావనతో మసలుకోవడం కంటే దైవప్రవక్త (స) బంధువుల పట్ల సద్భావనతో మసలుకోవడమే నాకెక్కువ ఇష్టం. నేనక్కడికి బైత్ చేయించుకునే ఉద్దేశ్యంతో పోలేదు. ముహాజిర్‌లు, అన్సార్‌ల మధ్య చెలరేగిన వివాదాన్ని పరిష్కరించడానికి వెళ్ళాను. అప్పుడది చాలా అవసరమయింది. వారప్పుడు కొట్టుకోవడానికి, చంపుకోవడానికి సిద్ధమయ్యారు. నాఅంతట నేను బైత్ కోసం ఎవరినీ అడగలేదు. సభికులే ఏకాభిప్రాయానికి వచ్చి నా చేతిలో చేయివేసి బైత్ చేశారు. ఒకవేళ నేనప్పుడు బైత్ చేయించుకునే పనిని వాయిదా వేసివుంటే ఆ తరువాత ఈ వివాదం మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉండేది. అదీగాక మీరా సమయంలో ఖనన సంస్కార కార్యంలో నిమగ్నమై ఉన్నారు. అలాంటప్పుడు నేను మిమ్మల్ని ఆ పని వదిలేసి రమ్మని ఎలా చెబుతాను?"

హజ్రత్ అలి (రజి) ఈ మాటలు విని తన ఆరోపణను ఉపసంహరించుకున్నారు. మరుసటి రోజు మస్జిదెనబవీలో జనసమూహం ముందు అబూబకర్ (రజి) చేతిలో చేయివేసి బైత్ (ప్రమాణం) చేశారు.

(తారీఖ్ఇస్లాం, మొదటిభాగం, పే. 278,279- మౌలానా అక్బర్‌షాహ్, నజీబాబాది)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) కుమార్తె ఫాతిమా (రజి) ఖలీఫా అబూబకర్ (రజి) దగ్గరకు ఒక వ్యక్తిని పంపించారు. మదీనా, ఫదక్‌లలో దేవుడు తన ప్రవక్త (స)కు ప్రత్యేకంగా ప్రసాదించిన ఆస్తుల్ని గురించి, ఖైబర్‌కు చెందిన ఖుమ్స్ ఆస్తులలో మిగిలిన ఆస్తుల్ని గురించి అబూబకర్ (రజి)ని అడిగి రమ్మని అతడ్ని

పంపారు. అబూబకర్ (రజి) ఈమాట విని ఇలా అన్నారు- "దైవప్రవక్త (స) తమకు వారసులెవరూ ఉండరని, తాము వదలివెళ్ళిన ఆస్తి దానం (సదఖా)గా పరిగణించబడు తుందని అన్నారు. అయితే దైవప్రవక్త (స) కుటుంబీకులు ఈ సంపదలో నుంచి తమ కనీసావసరాలు పొందవచ్చు. దైవప్రవక్త (స) నిర్ణయించిన దానాలు (సదఖాత్) ఆయన కాలంలో ఏ స్థితిలో ఉండేవో నేనా స్థితికి భిన్నంగా వాటిని మార్చలేను. వాటి విషయం లో దైవప్రవక్త (స) ఎలా ఆచరించేవారో నేనూ అదేవిధంగా ఆచరిస్తాను."

అబూబకర్ (రజి) ఈమాట చెప్పి ఫాతిమా (రజి)కు ఆ ఆస్తులనుంచి వాటా ఇవ్వ లేదు. అంచేత ఫాతిమా (రజి) అబూబకర్ (రజి)పై కోపం వచ్చి ఆయనతో మాట్లాడటం మానేశారు. ఇలా ఆమె చనిపోయేదాకా మాట్లాడలేదు. దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఫాతిమా (రజి) ఆర్నెల్లు మాత్రమే జీవించారు. ఆమె చనిపోయిన తరువాత ఆమె భర్త అలి (రజి) అదే రాత్రి ఆమెను ఖననం చేశారు. ఆమె చనిపోయిన సంగతి అబూబకర్ (రజి)కు తెలియజేయలేదు. ఆయన స్వయంగా ఆమె జనాజానమాజ్ చేశారు.

హజ్రత్ ఫాతిమా (రజి) జీవించి ఉన్నంత కాలం హజ్రత్ అలి (రజి)కి ప్రజలలో ఓ ప్రత్యేక హోదా, స్థానం ఉండేవి. ఫాతిమా (రజి) చనిపోయిన తరువాత ప్రజల దృష్టి అలి (రజి)పై నుండి తొలగిపోయింది. అందువల్ల ఆయన అబూబకర్ (రజి)తో రాజీపడదామని, ఆయన్ని ఖలీఫాగా అంగీకరించి ప్రమాణం (బైత్) చేద్దామని నిర్ణయించుకున్నారు. ఇలా నిర్ణయించుకొని ఓరోజు అబూబకర్ (రజి) దగ్గరకు ఒక సందేశం పంపారు. అందులో "మీరు ఓసారి మా ఇంటికి రండి. మీరు ఒక్కరే రావాలి. మీవెంట మరెవరూ ఉండకూడదు" అని ఉంది. హజ్రత్ ఉమర్ (రజి) ఈ సందేశం విని అబూబకర్ (రజి)తో "మీరాయన దగ్గరకు ఒంటరిగా వెళ్ళకండి" అన్నారు. "ఎందుకు, ఆయన నాకేదైనా కీడు తలపెడతాడని భావిస్తున్నావా నీవు? దైవసాక్షి! నేను తప్పకుండా ఆయన దగ్గరకు ఒంటరిగానే వెళ్తాను" అన్నారు అబూబకర్ (రజి). అలా చెప్పి ఆయన అలి (రజి) ఇంటికి వెళ్ళారు.

అలి (రజి) దైవస్తోత్రం చేసిన తర్వాత ఇలాఅన్నారు- "మీ విశిష్ఠత, ఔన్నత్యాలను గురించి, దేవుడు మీకు ప్రసాదించినదాన్ని గురించి మాకు తెలుసు. దేవుడు మీకు చేసిన మేలు పట్ల మాకెలాంటి అసూయలేదు. కాని మీరు ఖిలాఫత్ విషయంలో సర్వాధికారిగా వ్యవహరిస్తున్నారు. మేము దైవప్రవక్త (స) దగ్గరి బంధువులైనందున అందులో (సలహా సంప్రదింపుల్లో) మాక్కూడా భాగం ఉందని మేము భావిస్తున్నాము."

ఈమాటలు విన్న అబూబకర్ (రజి)కు కళ్ళు చెమర్చాయి. మనస్సు కాస్త కుదుట పడిన తరువాత ఇలా అన్నారు- "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! నా బంధువుల కంటే దైవప్రవక్త (స) బంధువులే నాకు ఎక్కువ ప్రియమైనవారు. ఈ ఆస్తుల వ్యవహారంలో మీకు-నాకు మధ్య విభేదాలు వచ్చాయి. నేను పుణ్యం, శ్రేయస్సులకు సంబంధించిన పద్ధతులకు వ్యతిరేకంగా ఏమాత్రం ప్రవర్తించ లేదు. ఈ ఆస్తుల విషయంలో దైవప్రవక్త (స) కాలంలో నేను ఏఏ పద్ధతుల్ని చూశానో అవన్నీ అవలంబించాను. వాటిలో నేను ఏ ఒక్కదాన్నీ వదలిపెట్ట లేదు."



ఆ తరువాత అలి (రజి) ఆయనతో "మేము మీ బైత్ కోసం సాయంత్రం వేళను నిర్ణయిస్తున్నాం" అన్నారు. అబూబకర్ (రజి) ఈమాట విని వెళ్ళిపోయి జుహర్ నమాజ్ తర్వాత మస్జిద్ వేదిక ఎక్కి దైవస్తోత్రం తర్వాత తాను అలి (రజి)ని కలుసుకున్న సంగతి ప్రస్తావించారు. ఆయన తన ఖిలాఫత్ గుర్తింపు ప్రమాణం (బైత్) చేయడంలో ఎందుకు వెనుకంజవేశారో, అందుకు ఆయన చెప్పిన కారణాలేమిటో వివరించారు. తర్వాత అలి (రజి) లేచి పాపమన్నింపు వేడుకోలు చేశారు. అబూబకర్ (రజి) విశిష్ఠత, ఔన్నత్యాలను అంగీకరించారు. ఆతర్వాత ఇలా అన్నారు- "నేనీ (బైత్) విషయంలో ఏదైనా చేస్తే దానికి కారణం అబూబకర్ పట్ల అసూయకాదు. నాకాయన పట్ల ఎలాంటి అసూయ లేదు. ఆయనకు దేవుడు ప్రసాదించిన హోదా, ఔన్నత్యం, విశిష్ఠతలను కూడా నేను నిరాకరించ లేను. కాకపోతే ఖిలాఫత్ వ్యవహారంలో మాక్కూడా భాగం ఉందని, అబూబకర్ (రజి) మమ్మల్ని సంప్రదించకుండా మా సలహాలు అడక్కుండా ఆయన ఒక్కరే ఈ బాధ్యతను నిర్వహిస్తున్నారని మాత్రమే మేము భావించాము. దీనివల్ల మాకు బాధ కలిగింది."

ఈ మాటలు విని ప్రజలంతా సంతోషం వ్యక్తపరిచారు. (ఎట్టకేలకు) మీరు సరైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు వారు. ఆ తర్వాత ప్రజలు అలి (రజి)కి దగ్గరయ్యారు. అలి (రజి) మంచి విషయం అవలంబించగానే వారు మళ్ళీ ఆయనకు చేరువయి ఆయన్ని అభిమానించసాగారు. (బుఖారి, ముస్లిం)

పై హదీసులో ఆరు నెలల దాకా హజ్రత్ అలి (రజి), అబూబకర్ (రజి) ఖిలాఫత్ కోసం 'బైత్' చేయలేదన్న భావాన్ని స్ఫురింపజేస్తున్న విషయం పట్ల పరిశోధకులు అను మానం వ్యక్తంచేశారు. ఆర్నెల్ల దాకా బైత్ చేయకపోవడం అలి (రజి) ఔన్నత్యానికి, ఇటు అబూబకర్ (రజి) సహనానికి పొసగని విషయమని వారు అభిప్రాయపడ్డారు.

సమతా సౌభ్రాతృత్వాలను బోధించే ఇస్లాంకు జాతీయదురభిమానం, బంధుప్రీతి కూడా అవరోధాలై నిలిచాయి. ముఖ్యంగా జాతీయదురభిమానం (అంటే తెగ లేక వంశ పరమైన దురభిమానం) ఆనాడు అరబ్బుల్లో తీవ్రంగా ఉండేది. ఈ కారణంగానే అన్సార్ ముస్లింలలో సాద్ బిన్ ఉబాదా (రజి), మరికొందరు అన్సార్లు ప్రారంభంలో అబూబకర్ (రజి) ఖిలాఫత్‌పదవిని ఆమోదించడానికి వెనుకంజవేశారు. అలాగే ఈ దురభిమానంతోనే అబూసుఫ్యాన్ (రజి) అబూబకర్ (రజి) ఖిలాఫత్‌ను అసహ్యించుకున్నారు. ఆయన అలి (రజి) దగ్గరకు వెళ్ళి "ఖురైషీయుల్లో అన్నిటికంటే చిన్న తెగకు చెందిన మనిషి ఖలీఫా ఎలా కాగాలిగాడు? నీవు (తిరుగుబాటుకు) సిద్ధమయితే నేను ఈ లోయను రౌతులతో, కాల్బలాలతో నింపివేస్తాను" అనిఅన్నారు. దానికి అలి (రజి) ఇచ్చిన జవాబు చూడండి:

"నీ పలుకులు ఇస్లాం, ఇస్లాం అనుచరుల పట్ల శత్రుభావానికి అద్దం పడ్తున్నాయి. నీవు రౌతులు, కాల్బలాలు తీసుకురావడం నేను సహించను. ముస్లింల ప్రాంతాలు, శరీరాలు ఒకరి నుండి మరొకరికి ఎంత దూరంగా ఉన్నా వారంతా పరస్పరం శ్రేయోభి లాషులు, ప్రేమమూర్తులు. కపటులు మాత్రమే ఒకర్నొకరు కాటేసుకునేవారు. మేము అబూబకర్‌ని ఖిలాఫత్ పదవికి అర్హుడని భావిస్తున్నాం. ఆయన ఖిలాఫత్‌పదవికి అర్హుడు కాకపోతే మేమెన్నటికీ ఆయన్నా పదవిలో నియమించే వాళ్ళంకాదు" అన్నారాయన.

## (2) అబూబకర్ (రజి) ఘనతా,ఔన్నత్యాలు

హజ్రత్ అబూబకర్ (రజి) ఖురైష్ ప్రజలందరిలో ఎంతో సద్గుణసంపన్నులు; అబద్ధానికి ఆమడ దూరంలో ఉండేవారు; మాటకు కట్టుబడి ఉండే వాగ్దానపాలకుడు; అజ్ఞాన కాలం నుంచే ఆయన మద్యపానాన్ని దరికి చేరనిచ్చేవారు కాదు. పురుషుల్లో అందరికంటే ముందు ఆయనే ఇస్లాం స్వీకరించారు. దైవప్రవక్త (స) ఇస్లాం వైపు పిలవగానే ఆయన ఎలాంటి తటపటాయింపు లేకుండా తక్షణమే 'సద్వచనం' పఠించారు. దైవప్రవక్త (స) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "నేను ఇస్లాం వైపు పిలిచినపుడు ఒక్క అబూబకర్ తప్ప ప్రతి మనిషీ ఇస్లాంస్వీకారంలో ఎంతో కొంత తటపటాయించాడు" అని అన్నారు.

అంతేకాదు, దైవప్రవక్త (స) చేసిన గగనపర్యటన (మేరాజ్) సంఘటన విన్నవారిలో అవిశ్వాసులతో పాటు కొందరు విశ్వాసులు కూడా సందిగ్ధంలో పడిపోయినప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) దాన్ని తీవ్రంగా సమర్థించారు. అప్పుడు దైవప్రవక్త (స) దివ్యసంకేతం పొంది ఆయనకు 'సిద్దీఖ్' (సత్యసంధుడు) అనే బిరుదు ప్రదానం చేశారు. ఈ కారణంగానే దైవప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలసపోతున్నప్పుడు అబూబకర్ (రజి)ని మాత్రమే తన వెంట తీసికెళ్ళారు. అప్పుడాయన దైవప్రవక్త (స)తో పాటు మూడు రోజుల పాటు సౌర్‌గుహలో దాక్కొని ఆయనకు సేవచేశారు. అంచేత ఆయన 'గుహమిత్రుడు' అని కూడా ముస్లిం సముదాయంలో ఖ్యాతిచెందారు.

ఒకసారి హజ్రత్ అలి (రజి) ప్రజలతో మాట్లాడుతూ "మీ దృష్టిలో అత్యంత ధైర్యశాలి ఎవర"ని అడిగారు. దానికి వారు మీరే అన్నారు. అలి (రజి) ఈమాట విని "నేను ఎల్లప్పుడూ నాతో సమాన ఉజ్జీతోనే పోరాడాను. ఇది ఏమంత సాహసం కాదు. అత్యంత సాహసవంతుడు ఎవరో చెప్పండి" అని అన్నారు. ప్రజలు తమకు తెలియదన్నారు. అప్పుడు అలి (రజి) ఇలా అన్నారు: "అబూబకర్ అందరికంటే అత్యంత సాహసవంతుడు. బదర్‌యుద్ధం సందర్భంగా మేము దైవప్రవక్త (స) కోసం ఓ ప్రత్యేక శిబిరం నెలగొల్పాము. అప్పుడు మాలో ఒకరు బహుదైవారాధకుల నుండి దైవప్రవక్త (స)ను కాపాడటానికి ఆయన దగ్గర ఎవరుంటారని అడిగాడు. దైవసాక్షి! మాలో ఏఒక్కరూ ఆ బాధ్యత తీసుకోవడానికి సాహసించలేక పోయారు. అప్పుడు అబూబకర్ (రజి) వరలేని ఖడ్గంతో నిలబడి ఒక్క శత్రువుని కూడా దగ్గరకు రాకుండా చేశారు....

...ఒకసారి మక్కాలో బహుదైవారాధకులు దైవప్రవక్త (స)ను పట్టుకొని ఈడుస్తూ 'నువ్వే కదూ దేవుడు ఒక్కడేనని చెబుతుండేవాడివి' అని అంటుంటే మాలో ఎవరూ వాళ్ళను ఎదిరించడానికి సాహసించలేక పోయారు. కాని అబూబకర్ (రజి) ఒక్కసారిగా అవిశ్వాసులపై లంఘించి కొడుతూ వారిని తొలిగిస్తూ 'ఏమిటీ, నాప్రభువు ఒక్క దేవుడే అన్నంత మాత్రానికే మీరీయన్ని హతమార్చడానికి పాల్పడ్డారా!' అని చెప్పసాగారు." అలి (రజి) ఈమాట చెప్పి కంటతడి పెట్టారు.

"ముహమ్మద్ (స) ఉమ్మత్‌లో అబూబకర్ (రజి) అందరికంటే శ్రేష్టుడు" అన్నారు అలి (రజి) అనేకసార్లు. ఒకసారి ఆయన ప్రజలతో "అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లకంటే నేను గొప్పని ఎవరైనా అంటే అతడ్ని నేను లాఠీతో కొడ్తాను" అని అన్నారు.



హజ్రత్ అలి (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అబూబకర్ (రజి)ను దేవుడు కరుణించుగాక. ఆయన తన కుమార్తెను నాకిచ్చి వివాహం చేశారు. నన్ను (మక్కా నుండి) మదీనాకు చేర్చారు. బిలాల్ (రజి)ను బానిసత్వం నుంచి విముక్తి కలిగించారు. ఉమర్ (రజి)ని దేవుడు కరుణించుగాక. యదార్థం ఎంత చేదయినప్పటికీ ఆయన యదార్థమే మాట్లాడేవారు. ఉస్మాన్ (రజి)ని దేవుడు కరుణించుగాక. ఆయన్ని చూసి దైవదూతలు సిగ్గుపడతారు. అలి (రజి)ని దేవుడు కరుణించుగాక. దేవా! అలి (రజి) ఎక్కడుంటే అక్కడ సత్యాన్ని అతనితో పాటు ఉంచు."

హజ్రత్ అబూబకర్ (రజి) దైవమార్గంలో తన సర్వస్వాన్ని ధారపోయడానికి సైతం వెనుదీయని గొప్ప దానశీలురు కూడా. ఇస్లాం స్వీకరించేనాటికి ఆయన దగ్గర నలభైవేల దిర్హంల పైకం ఉండేది. ఆ పైకాన్నంతా ధర్మవికాసం కోసం దైవప్రవక్త (స)కు సమర్పించుకున్నారు. దైవప్రవక్త (స) ఒకసారి అబూబకర్ (రజి) అసామాన్య దానశీలతను ప్రశంసిస్తూ "నేను అందరి ఉపకారాన్ని తీర్చాను. కాని అబూబకర్ ఉపకారం ఇంకా మిగిలివుంది. దానికి ప్రళయదినాన దేవుడు బదులు తీరుస్తాడు. అబూబకర్ ధనం వల్ల నాకెంత ప్రయోజనం చేకూరిందో ఇతరుల ధనంవల్ల నాకంత ప్రయోజనం చేకూరలేదు" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఒకసారి తబూక్ దండయాత్ర కోసం చందాల సేకరణ గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "నేనీ విషయంలో అబూబకర్‌ని మించిపోవాలని నిర్ణయించుకొని నా యావదాస్తిలో అర్ధభాగం తీసుకొని వచ్చాను. దైవప్రవక్త (స) అది చూసి 'భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చావా లేదా?' అని అడిగారు. దానికి నేను "వాళ్ళ కోసం సగం వదలిపెట్టాను' అన్నాను. ఆ తరువాత అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (స) పాదాలచెంత పోశారు. దైవప్రవక్త (స) నన్ను అడిగినట్లే 'అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలి పెట్టావు?' అని అడిగారు. దానికాయన 'భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు' అని అన్నారు. నేనీ అసాధారణ దాతృత్వం చూసి 'నేనిక ఎప్పుడూ ఏ విషయంలో కూడా అబూబకర్‌ని మించిపోలేను' అని భావించాను.

ఖుర్‌ఆన్, హదీసుల జ్ఞానం విషయానికి వస్తే అందరికంటే అబూబకర్ (రజి)కే ఎక్కువ ఉంది. జ్ఞాపకశక్తి కూడా ఆయనకే ఎక్కువ ఉంది. అందుకే దైవప్రవక్త (స) తన అనారోగ్యస్థితిలో నమాజీలకు నాయకత్వం (ఇమామత్) వహించడానికి అబూబకర్ (రజి)కే ప్రాధాన్యం ఇచ్చారు. ఖలీఫా పదవి కోసం ప్రజలు ఆయన్ని ఎన్నుకోవడంలో ఈ విషయమే ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంది. పోతే ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో సమస్యల్ని పరిష్కరించి సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన మంచికి సంబంధించిన ప్రతి విషయంలోనూ అందరికంటే ముందుండేవారు. అందుకే ముస్లిం సముదాయం ఆయనకు దైవప్రవక్తల తరువాత మానవోత్తముడని బిరుదిచ్చింది.

## (3) ప్రజాసేవా కార్యకలాపాలు

ఒకరోజు దైవప్రవక్త (స) తన అనుచరులతో మాట్లాడుతూ "ఈరోజు మీలో ఎవరైనా ఉపవాసం ఉన్నారా?" అనడిగారు. తరువాత ఆయన "ఈరోజు మీలో ఎవరైనా ఎవరి

జనాజా నమాజయినా చేశారా?" అనడిగారు మళ్ళీ. ఈ రెండు ప్రశ్నలకు ఎవరి నుండీ సమాధానం రాలేదు. చివరికి అబూబకర్ (రజి) "దైవప్రవక్తా! నేనీ రోజు ఉపవాసం ఉన్నాను; జనాజా నమాజ్ కూడా చేశాను" అని చెప్పారు.

అదేవిధంగా దైవప్రవక్త (స) మరికొన్ని విషయాలు అడుగుతూ "ఈరోజు మీలో ఎవరైనా ఏ పేదవాడికైనా అన్నదానం చేశారా? ఏ రోగినైనా పరామర్శించారా?" అనడిగారు. వీటికి కూడా అందరూ మౌనం వహించారు. అబూబకర్ (రజి) మాత్రమే "నేను చేశాను, నేను పరామర్శించాను" అని చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఒక్క రోజులో ఇన్ని పుణ్యకార్యాలు చేసినవాడు తప్పకుండా స్వర్గానికి పోతాడు" అని చెప్పారు.

మదీనా సమీపంలో అంధురాలైన ఓ వృద్ధ మహిళ ఉండేది. ఆమెకు వెనుకా ముందూ ఎవరూ లేరు. అందువల్ల హజ్రత్ ఉమర్ (రజి) ప్రతిరోజూ ఉదయాన్నే ఆమె పూరింటికి వెళ్ళి ఆమె పనులన్నీ చేసేవారు. అయితే కొన్నాళ్ళ నుంచి వచ్చి చూస్తుంటే తనకు ముందే ఎవరో వచ్చి ఆ పనులన్నీ చేసి పోతున్నట్లు అన్పించింది ఆయనకు. ఆ మనిషి ఎవరో తెలియక ఉమర్ (రజి) లోలోన మధనపడసాగారు.

ఒకరోజు ఉమర్ (రజి) ఉదయం కాస్త పెందలకడనే వెళ్ళి ఆ వృద్ధురాలి ఇంటి చూరు కింద దాగి గమనించడం మొదలెట్టారు. తరువాత కాస్సేపటికి ఒకతను వచ్చి ఆ ఇంట్లో ప్రవేశించి ఆమె పనులన్నీ చేసి వెళ్ళిపోయాడు. అతడ్ని చూసి ఉమర్ (రజి)కు చాలా ఆశ్చర్యం వేసింది. ఆ మనిషి ఎవరో కాదు, సాక్షాత్తు ఖలీఫా అబూబకరే (రజి)!

హజ్రత్ అబూబకర్ (రజి) ప్రభుత్వ ధనాగారాన్ని ప్రజల సొమ్ముగా భావించేవారు. ఈ భావనతో ఆయన ప్రజా అవసరాల కోసం మాత్రమే ఎంతో జాగ్రత్తగా ఖర్చుపెట్టేవారు. ఒకరోజు అబూబకర్ (రజి) శ్రీమతి ఆయన కోసం ఏదైనా తీపి పదార్థం వండటానికి తేనె కావాలని అడిగారు. దానికాయన "నాకొచ్చే జీతం డబ్బుతో తేనె కొనలేమని నీకు తెలుసు కదా! ఉండనీ, తేనె వద్దు గీనెవద్దు" అన్నారు. దాంతో పాపం శ్రీమతి మారు మాట్లాడకుండా నోరుమూసుకున్నారు.

అయితే ఆమె తన భర్తకు ఎలాగైనా ఓసారి తీపి పదార్థం తిన్పించాలన్న పట్టుదల మాత్రం వదల్లేదు. అందువల్ల ప్రభుత్వం నుండి లభించే కరువు భత్యంలో రోజూ కొంత మిగల్చి పొదుపు చేయడం ప్రారంభించారు. చివరికి ఒకరోజు పొదుపుచేసిన ఆ డబ్బుతో తేనె తెప్పించి తీపి పదార్థం తయారుచేశారు. ఆరోజు సాయంత్రం భర్త ఇంటికి రాగానే ఆయన ముందు ఈ తీపి వంటకం ఉంచారు.

హజ్రత్ అబూబకర్ (రజి) దాని వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఈ తీపి పదార్థం ఎక్కడ్నుంచి వచ్చింది?" అని అడిగారు. అప్పుడు ఆయన శ్రీమతి జరిగిన సంగతంతా వివరించారు. హజ్రత్ అబూబకర్ (రజి) ఆ సంగతి విని "మన రోజువారీ ఖర్చు నుండి నీవు ఇంత మిగుల్చుతున్నావు. అయినా మనకు ఎలాంటి లోటు రావడంలేదు. దీన్నిబట్టి నాకు అంత డబ్బు ఎక్కువ లభిస్తోందన్న మాట" అన్నారు. అనడమే కాదు. వెంటనే ఆయన ఆ మేరకు డబ్బు తన జీతం నుండి తగ్గింప జేయించారు.



హజ్రత్ అబూబకర్ (రజి) మొదటి భార్య పేరు ఖతైలా బిన్తె అబ్దుల్‌ఉజైరీ. ఆమె కడుపున అబ్దుల్లా (రజి), అస్మా (రజి) జన్మించారు. అయితే ఖతైలా నూతన ధర్మమైన ఇస్లాంను స్వీకరించడానికి నిరాకరించినందు వల్ల అబూబకర్ (రజి) ఆమెను విడాకులు ఇచ్చివేశారు. తర్వాత ఉమ్మెరూమాన్ (రజి)ని వివాహమాడారు. ఆమె ఇస్లాం స్వీకరించారు. ఆమె కడుపున అబ్దుర్రహ్మాన్ (రజి), ఆయిషా (రజి) జన్మించారు. అబూబకర్ (రజి) ఇస్లాం స్వీకరించిన తరువాత కూడా మరో ఇద్దర్ని వివాహమాడారు. వారిలో జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి) వితంతు భార్యయిన అస్మా బిన్తె అమీస్ (రజి) ఒకరు. ఆమె కడుపున ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) జన్మించారు. రెండవ స్త్రీ ఖజ్రజ్ తెగకు చెందిన హబీబా బిన్తె ఖారిజా (రజి). ఆమె కడుపున ఒక కుమార్తె ఉమ్మెకుల్సూమ్ (రజి) హజ్రత్ అబూబకర్ (రజి) మరణానంతరం జన్మించారు.

## (4) అబూబకర్ (రజి) ఖిలాఫత్ పాలన

దైవప్రవక్త (సల్లం) భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగిన తరువాత మరుసటి రోజు హజ్రత్ అబూబకర్ (రజి) మసీదులో వేదికపై కూర్చొని ఖిలాఫత్ కోసం ప్రజల నుండి 'బైత్' (ప్రమాణం) తీసుకున్నారు. అందరూ ఆయన ఖిలాఫత్ పదవిని అంగీకరిస్తూ ఆయన చేతిలో చేయివేసి ప్రమాణం చేశారు. ఆ తరువాత ఆయన లేచి ప్రజలను సంబోధిస్తూ ఈవిధంగా ప్రసంగించారు:

"ప్రజలారా! నేను మీ అందరికంటే ఎక్కువ శ్రేష్ఠుడ్ని కాకపోయినా మీరు ప్రభుత్వ నిర్వహణబాధ్యత నాకప్పగించారు. నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుడి సాక్షిగా చెబుతున్నాను. నేనీ పదవిని ఎన్నడూ కోరుకోలేదు. దాని కోసం నేను దైవాన్ని ప్రార్థించలేదు కూడా. ముస్లింలలో అరాచకం-విభేదాలు, అరేబియాలో మతభ్రష్టతలు తలెత్తే ప్రమాదం ఉన్నందునే ఇష్టం లేకపోయినా నేనీ బాధ్యత స్వీకరించవలసి వచ్చింది. ఈ పదవిలో నాకెలాంటి సుఖం లేదు. ఇదసలు నా బలహీన భుజస్కంధాలపై మోపబడిన పెనుభారం. ఇప్పటికైనా మించిపోలేదు, మీరు వేరొక మనిషిని ఎన్నుకోవచ్చు. నాకెలాంటి అభ్యంతరంలేదు. మీలో అందరికంటే ఎక్కువ బలవంతుడికి నేనతని హక్కు ఇప్పించ నంతవరకు అతను నాదృష్టిలో బలహీనుడే. అలాగే మీలో అందరికంటే ఎక్కువ బలహీను డికి నేనతని హక్కు ఇప్పించనంతవరకు అతను నాదృష్టిలో బలవంతుడే. ప్రజలారా! నా స్థాయి మీలో ఒక సాధారణ మనిషి స్థాయికంటే ఏమాత్రం ఎక్కువ కాదు. కాబట్టి నేను సన్మార్గంలో నడచినంత కాలం మీరు నాకు విధేయులై ఉండండి. ఒకవేళ నేను సన్మార్గం తప్పి నడవడం చూస్తే మీరు నన్ను సరిచేయండి. నేను దేవుడు, దైవప్రవక్త చూపిన మార్గంలో నడిచేవాడ్ని మాత్రమే, కొత్త మార్గాలు, పద్ధతులు కనిపెట్టేవాడ్ని కాను."

దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత అరబ్‌తెగల్లో జాతీయదురభిమానాలు తలెత్తాయి. వాటి ప్రభావం కొందరు ప్రవక్తఅనుచరులపై కూడా పడింది. ఈ దురభిమానం వల్లనే సాద్ బిన్ ఉబాదా (రజి)తో పాటు కొందరు అన్సార్‌లు అబూబకర్ (రజి) ఖిలాఫత్ కోసం ప్రారంభంలో 'బైత్' చేయడానికి వెనుకంజవేశారు. అలాగే అబూసుఫ్యాన్ (రజి) కూడా

ఈ దురభిమానం కారణంగానే అబూబకర్ (రజి) ఖిలాఫత్ పదవిని అసహ్యించుకుంటూ హజ్రత్ అలి (రజి) దగ్గరికెళ్ళి "ఖురైష్ తెగల్లో అన్నిటికంటే చాలా చిన్నతెగకు చెందిన మనిషి ఖలీఫా ఎలా అయ్యాడు? నీవు (ఆయనకు వ్యతిరేకంగా) లేవడానికి సిద్ధమైతే నేనీ లోయను కాల్బలగాలతో, అశ్వబలగాలతో నింపుతాను" అని అన్నారు.

దానికి అలి (రజి) తీవ్రంగా స్పందిస్తూ ఇలా అన్నారు: "నీ మాటల్లో ముస్లింలకు, ఇస్లాంకు వ్యతిరేకంగా విరోధభావం గోచరిస్తోంది. నువ్వీ లోయను కాల్బలగాలతో, అశ్వబలగాలతో నింపడాన్ని నేనేమాత్రం సహించను. ముస్లింలు పరస్పరం సోదరులు, శ్రేయోభిలాషులు. మేము అబూబకర్‌ని ఖిలాఫత్ పదవికి అర్హుడని భావిస్తున్నాం. అందుకాయన అర్హుడు కాకపోతే మేము ఎన్నటికీ ఆయనకా పదవి కట్టబెట్టము." (కన్జుల్అమ్మాల్)

ఖలీఫా అబూబకర్ (రజి) దేశ పరిపాలనా వ్యవహారాలను సజావుగా సాగించడానికి కొందరు ముఖ్య అనుచరులకు వాటి బాధ్యతలు అప్పగించారు. జాతీ నిజాయితీపరుడు (అమీనుల్‌మిల్లత్) అయిన అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి)ను ఆర్థికమంత్రిగా, కోశాధికారిగా నియమించారు; ఉమర్ ఫారూఖ్ (రజి)ను న్యాయశాఖ మంత్రిగా నియమించారు; అలి కరముల్లా వజ్హూ (రజి)ను సాధారణ పాలనావ్యవహారాల మంత్రిగా, ఉస్మాన్ గని (రజి)ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఒక సంవత్సరం తరువాత అబూఉబైదా (రజి)ను సేనాపతిగా నియమించి సిరియా పంపారు.

అదేవిధంగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు గవర్నర్లను కూడా నియమించారు. మక్కా, దాని పరిసర ప్రాంతాలకు ఇతాబ్ బిన్ ఉసయ్యిద్ (రజి)ను; తాయిఫ్‌కు ఉస్మాన్ బిన్ ఆస్ (రజి)ను, సనాకు మహాజర్ బిన్ ఉమయ్యా (రజి)ను, హజ్రెమౌత్‌కు జియాద్ బిన్ లబీద్ (రజి)ను, ఖౌలాన్‌కు లాయిలీ బిన్ ఉమయ్యా (రజి)ను, యమన్‌కు అబూ మూసా అష్అరీ (రజి)ను, జునద్‌కు ముఆజ్ బిన్ జబల్ (రజి)ను, బహ్రైన్‌కు ఇలాఅ బిన్ హజ్రమీ (రజి)ను, దూమతుల్ జందల్‌కు అయాజ్ బిన్ గనమ్ (రజి)ను, ఇరాఖ్‌కు ముస్నా బిన్ హారిస్ (రజి)ను గవర్నర్‌లుగా నియమించారు.

పోతే దేశరక్షణ కోసం దైవకరవాలం (సైఫుల్లా)గా బిరుదాంకితుడైన ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ను సర్వసేనానిగా నియమించారు. ఆయనతో పాటు వివిధ ప్రాంతాలకు వేరే సేనాపతులను నియమించారు. సిరియాలో రోమన్ల వైపునుండి ఎల్లప్పుడూ ప్రమాద సూచనలు కన్పిస్తున్నందువల్ల అక్కడ అబూఉబైదా (రజి)కు సహాయకారులుగా యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి), షర్జీల్ బిన్ హుస్నా (రజి)లను సేనాపతులుగా నియమించి పంపారు. సర్వసేనానితో పాటు, ఇతర సేనాపతులందరికీ ఎప్పటికప్పుడు ఖలీఫా అబూబకర్ (రజి) తగిన ఆదేశాలు జారీచేస్తుంటారు.

హజ్రత్ అబూబకర్ (రజి) గతంలో వస్త్రవ్యాపారం చేస్తుండేవారు. అందువల్ల ఆయన ఖలీఫాగా ఎన్నికయిన మరుసటి రోజు నుంచే యథాప్రకారం బట్టలమూట భజాన వేసుకొని బయలుదేరారు. దారిలో హజ్రత్ ఉమర్ (రజి) తారసపడి "మీరిప్పుడు ముస్లింలకు (దేశానికి) నాయకులయ్యారు. మీకీ పని శోభించదు" అన్నారు. దానికి అబూబకర్ (రజి) "మరి నేను నా భార్యాపిల్లల్ని ఎలా పోషించుకోవాలి?" అన్నారు. "ఆ



ఏర్పాటు (మన కోశాధికారి) అబూఉబైదా చేస్తారు, పదండి ఆయన దగ్గరకు" అన్నారు ఉమర్ (ర). చివరికి ముహాజిర్ ముస్లింలలో మధ్యతరగతి వ్యక్తి సంపాదనను దృష్టిలో పెట్టుకొని ఖలీఫాకు సంవత్సరానికి దాదాపు నాలుగువేల దిర్హమ్‌లు (ఈనాటి మన లెక్క ప్రకారం నెలకు సుమారు అయిదు వేల రూపాయలు) జీతం నిర్ణయించబడింది.

అయితే రెండేళ్ళ తరువాత మరణసమయం ఆసన్నమైనప్పుడు ఖలీఫా అబూబకర్ (రజి) వీలునామాలో "నేను వదలిన ఆస్తి నుండి ఎనిమిదివేలు దిర్హమ్‌లు తీసి ప్రభుత్వ ధనాగారానికి వాపసుచేయాల"ని రాశారు. తరువాత ఈపైకం ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు తీసుకురాబడినప్పుడు ఆయన "దేవుడు అబూబకర్ (రజి)పై కారుణ్యవర్షం కురిపించుగాక! ఆయన తన తర్వాత వచ్చేవారిని కష్టాల్లో పడవేశారు" అని అన్నారు.

## (5) రోమన్లపై ఉసామా (రజి) సైన్యం విజయం

దైవప్రవక్త (స) మరణానికి పూర్వం యమామాలో 'ముసైలమా', సనాలో 'అస్వద్', నజద్‌లో 'తులైహా' అనేవారు తమను ప్రవక్తలుగా ప్రకటించుకొని ఇస్లాంశిక్షణకు ఇంకా నోచుకోలేకపోయిన నవముస్లింలను లోబరచుకుంటున్న సంగతి మనం గత పేజీలలో తెలుసుకున్నాం. అస్వద్ దైవప్రవక్త (స) కాలంలోనే హతమార్చబడ్డాడు. దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత తులైహా, ముసైలమాల ఆగడాలు మితిమీరిపోయాయి. అనేకమంది నవముస్లింలు వారి మాయాజాలంలో పడి ఇస్లాంధర్మం వదలిపెట్టారు. మరికొన్ని ప్రాంతాల నుండి నవముస్లింలు మతభ్రష్టులైపోతున్నట్లు వార్తలు రాసాగాయి. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే ఈ ఉపద్రవానికి అడ్డుకట్ట వేయవలసి ఉంటుంది.

కాని దైవప్రవక్త (స) తన అనారోగ్యస్థితిలో సిరియా రోమన్ల నుండి పొంచివున్న ప్రమాదాన్ని నివారించడానికి 17ఏళ్ళ నవయువకుడయిన ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో ఓ భారీసైన్యాన్ని పంపాలని ఆదేశించారు. అయితే అప్పట్లో దైవప్రవక్త (స) ఆరోగ్యం మరింత క్షీణించడం, తర్వాత కొన్నాళ్ళలోనే ఆయన ఆత్మ అనంత వాయువుల్లో కలసిపోవడంతో సైన్యం మదీనా నుండి వెళ్ళలేకపోయింది. ఇప్పుడా సమయం వచ్చింది. కనుక ఖలీఫా అబూబకర్ (రజి) సైన్యాన్ని తీసుకొని బయలుదేరమని యువసేనాపతి ఉసామా (రజి)ను ఆదేశించారు.

ఈ ఆదేశం ప్రకారం హజ్రత్ ఉసామా (రజి) సైన్యం తీసుకొని బయలుదేరారు. పట్నం వెలుపల పూర్తి సైనికసమీకరణ జరిగింది. సైన్యంలో హజ్రత్ ఉమర్ (రజి)తో పాటు అనేకమంది అనుభవశాలురైన ప్రముఖ సహాబీలు ఉన్నారు. యువసేనాని ఉసామా(రజి) ఓసారి సైన్యాన్ని కలియజూసి "గొప్పగొప్ప వాళ్ళంతా సైన్యంలో ఉన్నారు. సైన్యం వెళ్ళిపోయిన తరువాత అవిశ్వాసులు మదీనా మీద దాడిచేసి మీపై, ప్రజలపై ఏదైనా ఆపద తెచ్చిపెడ్తారేమోనని నేను భయపడ్తున్నాను. అంచేత వాళ్ళను మీరు వెనక్కి పిలిపించుకోండి" అని ఖలీఫాకు లేఖ రాసి ఉమర్ (రజి) చేతికిచ్చి పంపారు. అప్పుడు అన్సార్ సైనికుల్లో కొందరు "సేనాపతిగా ఉసామా (రజి)కు బదులు ఆయనకంటే ఎక్కువ వయస్సున్న, గౌరవప్రదమైన వంశానికి చెందిన మరెవరినైనా నియమిస్తే బాగుంటుంది" అని ఖలీఫాకు మరొక లేఖ రాసి ఉమర్ (రజి) చేతికి అందించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ రెండు లేఖలు తీసుకొని ఖలీఫా అబూబకర్ (రజి) సన్నిధికి వెళ్ళారు. ఆయన సేనాపతి లేఖ చదివి "సైన్యంలో అందర్నీ భర్తీచేసి నగరంలో నేనొక్కడినే మిగిలిపోయి, క్రూరజంతువులు వచ్చి నన్ను చీల్చిచెండాడినా సరే, నేను సైన్యం నుండి ఏ ఒక్కర్నీ వెనక్కి పిలిపించుకోవడంగాని, ఈ దండయాత్రను వాయిదా వేయడంగాని జరగదు" అని అన్నారు. తరువాత అన్సార్ సైనికులు రాసిన లేఖ చదివి "వీళ్ళ హృదయాల్లో నుంచి జాత్యహంకారం ఇంకా పూర్తిగా సమసిపోలేదు,పద" అంటూ ఉమర్ (రజి)తో కలసి సైన్యం ఆగిన చోటుకు బయలుదేరారు.

సైన్యం బయలుదేరింది. యువసేనాని అశ్వరూఢుడై నడవసాగాడు. ఖలీఫా అతని గుర్రం పక్కనే పాదాచారి అయి నడవసాగాడు. యువసేనాని సిగ్గు పడిపోతూ "మీరైనా మరోగుర్రం ఎక్కండి లేదా నన్నయినా గుర్రం దిగి నడవనీయండి" అని విన్న వించుకున్నాడు ఖలీఫాతో. కాని ఖలీఫా ఈ విజ్ఞప్తిని సున్నితంగా తిరస్కరిస్తూ "నేను గుర్రం ఎక్కను; నీవు గుర్రం దిగనవసరమూ లేదు. దైవమార్గంలో కాస్తంత దూరం కాలినడకన నడిస్తే నాకొచ్చే నష్టం ఏమిటీ?" అని అన్నాడు.

ఈ అపూర్వ దృశ్యం చూసి, సమతాసౌభాగ్యం తొణికిసలాడే ఈ మాటలు విని సైనికులందరూ ఆశ్చర్యచకితులయ్యారు. వారిలో కొందరి హృదయాల్లో ఇంకా మిగిలి ఉన్న జాత్యహంకారం, వయోవివక్షలు పూర్తిగా అంతమై విధేయత, సమతా భావాలు చోటుచేసుకున్నాయి. ఖలీఫా అబూబకర్ (రజి) గుర్రం పక్కన కాలినడక నడుస్తూ యువ సేనాని ఉసామా (రజి)కు ఇలా హితోపదేశం చేశారు:

"ఉసామా! ఎట్టి పరిస్థితుల్లో కూడా (1) నమ్మకద్రోహానికి పాల్పడకూడదు. (2) అబద్ధమాడకూడదు. (3) వాగ్దానభంగం చేయకూడదు. (4) స్త్రీలు, పిల్లలు, వృద్ధుల్ని హతమార్చకూడదు. (5) పండ్ల చెట్లను నరకడంగాని, కాల్చివేయడంగాని చేయకూడదు. (6) తినడానికి తప్ప ఆవులు, ఒంటెలు, మేకలు మొదలైన పశువుల్ని చంపకూడదు. (7) ఏదైనా తెగ దగ్గరకు పోయినప్పుడు ముందుగా ఆ తెగప్రజలకు ఇస్లాం గురించి ఉపదేశించి దానివైపుకు పిలవాలి. (8) వారిలో ఎవరినైనా కలుసుకుంటే వారి హోదా అంతస్తుల్ని దృష్టిలో పెట్టుకోవాలి. (9) నీ ముందుకు ఆహారం వచ్చినప్పుడు దేవుని పేరు ప్రస్తావించి తినడం ప్రారంభించాలి. (10) యూదులు, క్రైస్తవుల్లో ప్రాపంచిక వ్యవ హారాలు వదిలేసి సన్యాసులై తమ మఠాలలో కూర్చుండిపోయినవారి జోలికి పోకూడదు. ఇక దైవప్రవక్త (స) చేయమని ఆదేశించిన పనుల్లో ఏఒక్క పనినైనా వదిలేయడంగాని లేదా అదనంగా చేర్చడంగాని ఏమాత్రం చేయకూడదు. దేవుని పేరుతో నడుం బిగించి దైవమార్గంలో సత్యతిరస్కారులతో పోరాడు."

ఖలీఫా సేనాపతి ఉసామా (రజి)కు ఇలా హితబోధ చేసిన తరువాత వెనుదిరిగి నగరానికి బయలుదేరారు. ఆ సమయంలో ఆయన "ఉసామా! నీవు అనుమతిస్తే నాకు సలహా, సహకారాలు అందజేయడానికి ఉమర్ (రజి) నాదగ్గర నగరంలో ఉండి పోతాడు" అని అన్నారు తిరుగులేని సామ్రాజ్యాధినేత అయివుండి కూడా తన క్రింది అధికారి అనుమతి కోరుతూ. దానికి సేనాని ఉసామా (రజి) సంతోషంగా అంగీక



రించారు. ఈ అనుమతి లభించగానే ఉమర్ ఫారూఖ్ (రజి) సైన్యం నుండి వేరయి ఖలీఫా అబూబకర్ (రజి)తో కలిసి నగరానికి వెళ్ళిపోయారు.

ఉసామా బిన్ జైద్ (రజి) నేతృత్వంలో ముస్లిం సేన బయలుదేరి దరూన్, బల్ఖాన్ లోయల్లో రోమన్ సైనికుల్ని ఢీకొన్నది. భీకరయుద్ధం జరిగింది. చివరికి రోమన్ సైనికులు ఘోరంగా పరాజితులై పారిపోయారు. ముస్లింయోధులు అపార సమరసొత్తు తీసుకొని విజయదరహాసంతో వెనుదిరిగారు.

## (6) మతభ్రష్టులపై సైనికచర్య

రోమన్లపై ముస్లింలు సాధించిన విజయవార్త విని అరేబియాలోని అవిశ్వాసులు, అసత్యప్రవక్తలు, మతభ్రష్టులు, జకాత్‌నిరాకరులు నీరుగారిపోయి మదీనాపై దాడి చేయడానికి సాహసించలేకపోయారు. అయితే జకాత్ చెల్లింపును నిరాకరించి మతభ్రష్టు లైపోయినవారు మాత్రం యుద్ధసన్నాహాలు చేస్తూ ఖలీఫాకు తీవ్రమైన హెచ్చరికలు పంపించారు.

ఈ హెచ్చరికలు వినగానే ఖలీఫా అబూబకర్ (రజి) జకాత్‌నిరాకరుల్ని అణచి వేయడానికి నిర్ణయించుకున్నారు. తరువాత ముఖ్యఅనుచరుల్ని సమావేశపరచి జకాత్ నిరాకరులపై తీసుకునే చర్య గురించి వారి అభిప్రాయాలు అడిగారు. అయితే హజ్రత్ ఉమర్ (రజి)తో సహా చాలామంది "అవిశ్వాసులు, బహుదైవారాధకుల మాదిరిగా జకాత్‌నిరాకరులకు వ్యతిరేకంగా యుద్ధం చేయడం సరికాద"ని అన్నారు.

అప్పుడు ఖలీఫా అబూబకర్ (రజి) ఇలా అన్నారు: "దైవసాక్షి! నమాజ్, జకాత్‌ల మధ్య విచక్షణ చేసే ప్రతివ్యక్తితో నేను యుద్ధం చేస్తాను. జకాత్ సంపదహక్కు. (అంటే సంపద కలిగినవారు దానిమీద పేదల ఆర్థికహక్కయిన జకాత్‌ని విధిగా చెల్లించాలి.) దైవసాక్షి! వారు గనక దైవప్రవక్త (స) కాలంలో ఇస్తూ ఉండిన సంపద నుండి ఒంటె తాడయినా సరే ఇవ్వడానికి నిరాకరిస్తే నేను వారితో తప్పకుండా పోరాడుతాను."

ఆ తరువాత హజ్రత్ ఉమర్ (రజి) మాట్లాడుతూ "దైవసాక్షి! దేవుడు సత్యావ గాహన కోసం అబూబకర్ హృదయకవాటాలు తెరిచాడు. అబూబకర్ దృక్పథమే సరైన దని నేను ఆ తరువాత గ్రహించాను" అని అన్నారు. (సహీహ్‌బుఖారి)

సమావేశం ముగిసిన తరువాత ఖలీఫా యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. మత భ్రష్టులకు చెందిన ఒక ప్రతినిధివర్గం మదీనా వచ్చి ఖలీఫాతో "మేము నమాజ్ చేస్తూనే ఉన్నాం. జకాత్ నుండి మాత్రం మమ్మల్ని మినహాయించండి" అని విన్నవించుకున్నది. ఖలీఫా వారికి పైన పేర్కొన్నట్లే చెప్పడంతో వారు నోరు మూసుకొని వెళ్ళిపోయారు.

ఖలీఫా తమకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు చేస్తున్నారని తెలియగానే మత భ్రష్టులు, జకాత్‌నిరాకరులు కూడా యుద్ధసన్నాహాలు ముమ్మరం చేశారు. ఇటు ఖలీఫా అబూబకర్ (రజి) వివిధ రాష్ట్రాల గవర్నర్లకు, ఇతర అధికారులకు యుద్ధం గురించి తగిన ఉత్తర్వులు జారీచేసి అలి, జుబైర్, తల్హా, అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)లను మదీనా చుట్టుప్రక్కల పర్యవేక్షణ కోసం పంపారు.

మతభ్రష్టులు, జకాత్‌నిరాకరులు ఏకమై దాడి చేయడానికి మదీనా సమీపానికి వచ్చారు. అప్పుడు అలి, జుబైర్, తల్హా, ఇబ్నెమస్‌వూద్ (రజి)లు మరికొందరు యోధులతో కలసి వారిని తరిమికొట్టారు. అయితే శత్రువులు రకరకాల వాయిద్యాలు వాయించుకుంటూ మరొక దారి గుండా పారిపోయారు. ఈ వాయిద్యాలకు ముస్లింల ఒంటెలు బెదిరిపోయి నగరంలోకి పరుగెత్తాయి.

ఖలీఫా అబూబకర్ (రజి) ఈ పరిస్థితి చూసి ఓ చిన్న సైనికదళం తీసికెళ్ళి శత్రువులపై విరుచుకుపడ్డారు. ఈ యుద్ధంలో శత్రువులు ఓడి పారిపోవడమేగాక వారిలో అనేకమంది నేలకొరిగి ప్రాణాలువిడిచారు. ఖలీఫా యుద్ధంలో లభించిన సమరసొత్తును మదీనాకు తరలించి శత్రువుల్ని చాలా దూరందాకా వెంబడించారు. అయితే మరొక వైపు శత్రువుల ఓపెద్ద గుంపు ముస్లింల కళ్ళుగప్పి వేరేదారి గుండా వచ్చి మదీనాపై దాడి చేసింది. కొందరు ముస్లింలను హతమార్చి సమరసొత్తును లాక్కొని వెళ్ళిపోయింది. ఖలీఫా అబూబకర్ (రజి) మదీనా తిరిగొచ్చిన తరువాత విషయం తెలుసుకొని ఎంతో విచారించారు. ముస్లింలలో ఎంతమంది అమరగతులయ్యారో అంతమంది శత్రువుల్ని హతమార్చేదాకా విశ్రమించనని శపథం చేశారు.

ఈలోగా రోమన్లపై యుద్ధం చేయడానికి పంపబడిన సేనాని ఉసామా (రజి) ఘనవిజయంతో, అపార సమరసొత్తుతో మదీనా తిరిగొచ్చారు. ఉసామా (రజి)ను, ఆయన సైన్యాన్ని విశ్రాంతి కోసం నగరంలో వదిలేసి ఖలీఫా ఓ చిన్న దళంతో వెళ్ళి శత్రువుల్ని తరిమిగొట్టి తిరిగొచ్చారు. తరువాత ఆయన మతభ్రష్టుల్ని, జకాత్‌నిరాకరుల్ని, ప్రాపంచిక వ్యామోహపరుల్ని సంబోధిస్తూ ఓ హెచ్చరిక లేఖ రాసి, దాని నకళ్ళు తీసి వివిధ ప్రాంతాలకు పంపించారు. ఆ తరువాత 11 సైనికదళాలను తయారుచేసి ప్రతి దళపతికి తగిన ఆదేశాలు ఇచ్చారు. వాటితో పాటు దళపతులందరికీ కలిపి ఒక సమిష్టి ఆజ్ఞావళి కూడా అందజేశారు. అందులో ఖలీఫా ఇలా పేర్కొన్నారు:

"ఈ లేఖ దైవప్రవక్త (స) ప్రతినిధి(ఖలీఫా) అబూబకర్ తరపున ఫలానా సేనాపతికి ఇవ్వబడుతోంది. అతనిప్పుడు ఇస్లామీయసైన్యం తీసుకొని మతభ్రష్టులతో పోరాడేందుకు పంపబడుతున్నాడు. ఈ సేనాపతి ప్రతి వ్యవహారంలోనూ రహస్యంగానూ, బహిరంగంగానూ దేవునికి భయపడతాడని అతని నుండి మేము అంగీకారం తీసుకున్నాము. దైవమార్గంలో మతభ్రష్టులతో యుద్ధం చేయాలని, దానికి ముందు దైవధర్మం గురించి హితోపదేశం చేసి వారిని ఇస్లాం వైపు పిలవాలని మేమతడ్ని ఆదేశించాము. వారు ఇస్లాం వైపు మరలివస్తే ఇక వారితో యుద్ధం చేయకూడదని, అందుకు అంగీకరించకపోతే ఇస్లాం వైపు మరలివచ్చేదాకా వారితో యుద్ధంచేయాలని కూడా మేమతడ్ని ఆజ్ఞాపించాము. ఇస్లాం వైపు మరలినవారికి వారి విధులు, బాధ్యతలు గుర్తుచేయబడతాయి. దానిప్రకారం (జకాత్) వసూలు చేయబడుతుంది. వారిహక్కులు వారికివ్వబడతాయి. శత్రువులతో పోరాడకుండా ముస్లింలను వారించడం జరుగుతోంది. అయితే దైవాజ్ఞలను తిరస్కరించినవారితో యుద్ధం చేయబడుతుంది. ఇస్లాం ఆహ్వానాన్ని అంగీకరించిన వారిని ఏపాపం ఎరగనివారుగా పరిగణించడం జరుగుతుంది. ఒకవేళ ఇస్లాంను



నోటితో అంగీకరించి మనసులో మరేదైనా విశ్వాసం కలిగినవారి కర్మల లెక్క గురించి దేవుడే చూసుకుంటాడు. (దానికి ఖలీఫా బాధ్యుడు కాదు.)

ఎవరైనా తిరస్కారులై యుద్ధానికి దిగినప్పుడు వారిపై ముస్లింలకు దేవుడు విజయం ప్రసాదిస్తే సమరసొత్తులో నాల్గు భాగాలు సైనికులకు పంచి ఐదవ భాగం మా దగ్గరకు పంపబడుతుంది. యోధులు అరాచకం, దుందుడుకు చర్యలకు పాల్పడకుండా వారిని వారించాలని, గూఢచర్య ఉపద్రవాలు రాకుండా ఉండేందుకు ఇతరుల్ని తన సైన్యంలో జొరబడనీయకూడదని కూడా మేము మా దళపతిని ఆదేశించాము. అంతేకాదు, తోటి ముస్లింలపట్ల సద్భావనతో మసలుకోవాలని, ప్రజలపట్ల మృదువుగా వ్యవహరించాలని కూడా మేము మా దళపతిని ఆదేశించాము."

ఈ పదకొండు సైనిక దళాలు హిజ్రీశకం 11వ ఏట జమాదివుల్‌అవ్వల్ మాసంలో మదీనా నుండి బయలుదేరి, తమతమ నిర్ణీత ప్రాంతాలకు పోయి, నిర్దేశిత విధుల నిర్వహణలో నిమగ్నులైపోయాయి.

## (7) అసత్యప్రవక్త తులైహా పర్యవసానం

తులైహా అసది అనే ఓ తాంత్రికుడు మొదట్లో ఇస్లాం స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరిపోయాడు. అయితే దైవప్రవక్త (స) జీవిత అంత్యకాలంలో మతభ్రష్టుడయిపోవడమే గాకుండా తననుతాను దైవప్రవక్తగా ప్రకటించుకొని అరాచకాలకు పాల్పడ్డాడు. అతడ్ని అణచడానికి హజ్రత్ జిరార్ బిన్ అజూర్ (రజి)ని పంపడం జరిగింది. అయితే వచ్చిన పని పూర్తికాక ముందే దైవప్రవక్త (స) మరణవార్త విని ఆయన మదీనా తిరిగొచ్చారు. అప్పుడు తులైహాకు తన సైనికబలాన్ని పెంచుకోవడానికి, మతభ్రష్టులైన తెగలను కలుపుకోవడానికి మంచిఅవకాశం లభించింది. వాటిలో 'తై'తెగ కూడా ఉంది.

ఖలీఫా అబూబకర్ (రజి) పంపిన 11 సైనిక దళాలలోని ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దళం తులైహా పీచం అణచడానికి బయలుదేరింది. అయితే ఖాలిద్ (రజి) మదీనా నుండి బయలుదేరక ముందే అద్దీ బిన్ హాతింతై (రజి) తన తెగవారిని కాపాడుకోవడానికి వాళ్ళ దగ్గరకు వెళ్ళారు. ఆయన తన తెగవారికి ఖాలిద్ సైన్యం వచ్చి దాడిచేయక ముందే అసత్యప్రవక్త తులైహా వర్గం వీడి రమ్మని నచ్చజెప్పారు. ఆయన చెప్పినట్టే వారు తులైహాను వదలివచ్చి ఇస్లాం ధర్మంలో స్థిరంగా ఉన్నారు. ఆ తరువాత ఖాలిద్ సైన్యం తమ ప్రాంతానికి రాగానే వారంతా ఆ సైన్యంలో చేరిపోయారు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) అక్కడ్నుంచి బజాఖా మైదానం చేరుకొని తులైహా సైన్యంపై విరుచుకుపడ్డారు. ఇరుపక్షాల మధ్య యుద్ధం భీకరంగా సాగింది. కాస్సేపటికి తులైహా సైన్యం తీవ్ర ఆందోళనకు గురయింది. ముస్లిం యోధులు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడసాగారు. అప్పుడు తులైహా ఓ దుప్పటి కప్పుకొని సైన్యం నుండి పక్కకు తొలగి దైవసందేశం అవతరణ కోసం ఎదురుచూస్తున్నట్లు నటించసాగాడు.

ఐనియా బిన్‌హసన్ అనే ఓదండనాయకుడు పరిస్థితి క్షణక్షణానికి విషమిస్తూపోవడంతో తులైహా వద్దకు పోయి "ఏదైనా దైవసందేశం అవతరించిందా" అనడిగాడు.

దానికి తులైహా లేదన్నాడు. కాస్సేపటి తర్వాత ఐనియా మళ్ళీవచ్చి "ఏదైనా దైవసందేశం అవతరించిందా" అనడిగాడు. తులైహా 'ఇంకా లేద'న్నాడు. ఐనియా తిరిగెళ్ళి తీవ్రంగా పోరాడసాగాడు. కాని తన సైన్యంలోనివారే నేలకొరుగుతున్నారు. అంచేత అతను మరొక సారి తులైహా దగ్గరకు వెళ్ళి "దైవసందేశం ఇంకా అవతరించిందా లేదా?" అనడిగాడు. దానికి తులైహా ఇలా అన్నాడు: "ఆ...జిబ్రీల్ (అలై) ఇప్పుడే నా దగ్గరకు వచ్చిపోయాడు. 'నీ అదృష్టంలో ఏం రాసివుందో అదే జరుగుతుంది' అన్నాడతను."

ఈమాట వినగానే ఐనియాకు ఒళ్ళు మండిపోయింది. దాంతో అతను సైనికుల్ని సంబోధిస్తూ "సోదరులారా! వినండి, తులైహా అబద్ధాలరాయుడు. నేను వెళ్ళిపోతున్నా" అంటూ గుర్రం మీద దౌడుతీశాడు. అతని మాటలు వినగానే మతభ్రష్టులు ఒక్కసారిగా యుద్ధరంగం నుండి పారిపోయారు. వారిలో అనేకమంది నేలకొరిగి ఊపిరి విడిచారు. అనేకమంది ముస్లింలకు పట్టుబడ్డారు. మిగిలినవారు తప్పు తెలుసుకొని తిరిగి ఇస్లాం స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరిపోయారు.

అసత్యప్రవక్త తులైహా సతీసమేతంగా గుర్రమెక్కి సిరియా దిశగా పారిపోయి ఖుజాఅ తెగలో నివశించసాగాడు. చివరికి తన తెగవారితోపాటు ఇతరతెగలన్నీ క్రమేణా ఇస్లాం స్వీకరించడంతో అతను కూడా ఇస్లాం స్వీకరించాడు. తరువాత రెండవ ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో మదీనా వచ్చి ఉమర్ (రజి) చేతిలో చేయివేసి 'బైత్' చేశాడు. ఐనియా పట్టుబడి సేనాపతి ఖాలిద్ (రజి) ముందుకు వచ్చాడు. ఖాలిద్ (రజి) అతడ్ని ఖలీఫా దగ్గరకు మదీనా పంపించారు. ఖలీఫా అబూబకర్ (రజి) అతనికి ఇస్లాం గురించి వివరిస్తూ హితోపదేశం చేశారు. అయితే ఐనియా తీవ్రంగా వ్యతిరేకిస్తూ దురుసుగా సమాధానమిచ్చాడు. అందువల్ల అతను హతమార్చబడ్డాడు.

ఇదిలా ఉంటే మరోవైపు ఇత్ఫాన్, సలీం, హవాజన్ తెగలు సల్మా బిన్త్ మాలిక్ అనే స్త్రీని నాయకురాలిగా ఎన్నుకొని ముస్లింలపై దాడిచేయడానికి సిద్ధమయ్యాయి. అంతలో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) వచ్చి సల్మాకు రక్షణకవచంగా ఉన్న వందమంది మతభ్రష్టుల్ని మట్టుబెట్టారు. సల్మా ఎక్కిన ఒంటె గాయపడి క్రిందపడిపోయింది. దాంతో సల్మా కూడా నేలకొరిగి ఊపిరివిడిచింది. నాయకురాలి దుర్గతి చూడగానే మతభ్రష్టులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుజీవుడా అంటూ పారిపోయారు.

బనూసలీంకు చెందిన ఫజాహ్ బిన్ అబ్దెయాలైల్ అనే ఓ నాయకుడు తన అనుచరులతో మదీనాలో ఖలీఫా అబూబకర్ (రజి) సన్నిధికి వచ్చి "నేను ముస్లింనయ్యాను. మీరు నాకు యుద్ధసామగ్రి ఇస్తే నేను మతభ్రష్టులతో యుద్ధంచేస్తాను" అని అన్నాడు. ఖలీఫా అలాగే అతనికి యుద్ధసామగ్రి ఇచ్చి పంపివేశారు. అయితే అతను మదీనా నుండి వెళ్ళిపోయి బనూసలీం, బనూహవాజన్ తెగల్లో ముస్లిములైనవారిపై తన అనుచరుల్ని ఉసిగొల్పాడు. ఖలీఫా ఆ దుర్మార్గుడు చేసిన మోసం సంగతి తెలుసుకోగానే అతని పీచం అణచడానికి అబ్దుల్లా బిన్ ఖైస్ (రజి)ను పంపారు. ఆయన మదీనా నుండి బయలుదేరి ఆ మోసగాళ్ళను దారిలోనే కలసి దాడిచేశారు. చివరికి ఆ దుర్మార్గుడు పట్టుబడి ఖలీఫా ఆదేశంతో హతమార్చబడ్డాడు.



## (8) అసత్యప్రవక్తలు సజాహ్, ముసైలమా

తుగ్లబ్ తెగకు చెందిన సజాహ్ బిన్త్ హరస్ అనే స్త్రీ తాను కూడా దైవప్రవక్తనని ప్రకటించుకుంది. ఆమె తన అనుచరులకు రోజా ఐదువేళల నమాజ్‌ను విధిగా చేసింది కాని, పందిమాంసం, మద్యపానం, వ్యభిచారం మాత్రం ధర్మసమ్మతం చేసింది. అంచేత అనేకమంది క్రైస్తవులు కూడా ఆమె మతంలోకి చేరిపోయారు. సజాహ్ దైవదౌత్య ప్రకటనను తుగ్లబ్‌తెగ నాయకుడు హుజైల్ బిన్ ఇమ్రాన్, బనీతుమర్ తెగనాయకుడు ఉఖ్బా బిన్ హిలాల్, బనీషైబాన్ తెగ నేత సలీల్ బిన్ ఖైస్ అంగీకరించి ఆమెకు వత్తాసు పలికారు. ఇలా సజాహ్ కొన్నాళ్ళలోనే ప్రజల్లో బాగా పలుకుబడి సంపాదించుకొని నాలుగువేల మంది సైనికులతో మదీనాపై దాడి చేయడానికి బయలుదేరింది.

కొంత దూరం పోయిన తరువాత ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఇస్లామీయ సైన్యంతో తన వైపుకే వస్తున్నారని, వేరొక వైపు నుండి అసత్యప్రవక్త ముసైలమా కూడా భారీ సైన్యంతో వస్తున్నాడని తెలిసి సజాహ్ కంగారుపడిపోయింది. ముసైలమా ప్రవక్త జీవిత కాలంలోనే తాను కూడా ప్రవక్తనని ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. అతనామెకు లేఖ రాస్తూ "మన దైవదౌత్య విభజన, మదీనాపై దాడి విషయంలో మాట్లాడుకుందాం ఇక్కడకు వచ్చేయి" అన్నాడు. ఆ తరువాత వారిరువురు ఒక ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం సజాహ్, ముసైలమా ప్రవక్తృత్వాన్ని అంగీకరించి అతడ్ని వివాహమాడింది. మూడురోజులు అతని స్థావరంలో గడిపి తన స్థావరానికి తిరిగొచ్చింది.

అయితే సైనికాధికారులు "మహర్ ఏది, మహర్ లేకుండా పెళ్ళి ఎలా జరుగుతుంద"ని అడిగారు. అంచేత ఆమె మళ్ళీ ముసైలమా దగ్గరకెళ్ళి మహర్ అడిగింది. దానికి ముసైలమా "నేను నీమహర్ క్రింద ఫజర్, ఇషా నమాజులు క్షమిస్తున్నా (అంటే నీ శిష్యులు ఫజర్, ఇషా నమాజులు చేయకపోయినా వారికి పుణ్యం లభిస్తుందని అర్థం). సజాహ్ ఈ 'మహర్' తీసుకొని తన స్థావరానికి తిరిగొచ్చింది. ఆమె సైనికులతో అక్కడ్నుంచి కొంత దూరం పోగానే ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైన్యం కన్పించింది. అంతే, సజాహ్ సైనికులు భీతావహులై తమ నాయకురాలిని వదిలేసి పిక్కబలంకొద్దీ పారిపోయారు. పాపం సజాహ్ కూడా చేసేదిలేక తనచుట్టూ ఉన్న కొద్దిమంది అనుచరులతో పారిపోయి తన తెగవారుండే ప్రాంతంలో అనామక జీవితం గడపసాగింది.

ఖాలిద్ (రజి) బనూతమీమ్ తెగవారుండే పాంతానికి వెళ్ళి దాడిచేశారు. అక్కడ ఇస్లాంలో స్థిరంగా ఉన్నవారి జోలికి పోకుండా, మతభ్రష్టులైనవారిని మాత్రమే పట్టుకొని హతమార్చారు. ఆ ప్రాంతం దరిదాపుల్లో బనూతమీమ్‌కు చెందిన మరికొన్ని ఉపతెగలు ఉన్నాయి. వారి నాయకుడైన మాలిక్ బిన్ నవీరా మతభ్రష్టుడై దైవప్రవక్త (స) మరణవార్త విని తెగ సంబరపడిపోయాడు. హజ్రత్ ఖాలిద్ (రజి) మాలిక్‌వాడలపై కూడా దాడి చేశారు. మాలిక్ పట్టుబడి వచ్చినప్పుడు అతను ఖాలిద్ (రజి)తో దైవప్రవక్త (స) గురించి "మీ నాయకుడు ఇలా అన్నాడు; మీ నాయకుడు అలా ఆదేశించాడు" అంటూ మాట్లాడాడు. ఖాలిద్ (రజి) ఈమాటలు విని "ఆయన నీకు నాయకుడు కాదా?" అని అడిగారు. దానికి మాలిక్ ఎలాంటి సమాధానం ఇవ్వలేదు.

తబ్రీ కథనం ప్రకారం ఆ సమయంలో ఖడ్గం పట్టుకొని నిల్చున్న జిరార్ బిన్ అజూర్ (రజి) ఖాలిద్ (రజి) సైగ చేయగానే ఒక్క వ్రేటుతో మాలిక్ శిరస్సు ఖండించారు. ఈ కథనానికి భిన్నంగా ఖాలిద్ (రజి) మరింత ఆరాతీయడానికి మాలిక్‌ను జిరార్ (రజి) కస్టడీలో ఉంచారని, అయితే రాత్రివేళ మాలిక్ మోసగించడానికి ప్రయత్నించి జిరార్ (రజి) చేతిలో వధించబడ్డాడని మరికొందరు చరిత్రకారులు రాశారు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైన్యంలోఉన్న హజ్రత్ అబూఖతాదా (రజి) ఈ వధను ఖండిస్తూ "మాలిక్‌వాడల నుంచి అజాన్ విన్పించింది గనక మాలిక్‌ను వధించకుండా ఉండవలసింద"ని అన్నారు. అనడమేగాక ఆయన సేనాపతి ఖాలిద్ (రజి) అనుమతి తీసుకోకుండా మదీనా వెళ్ళిపోయి, ఖాలిద్ (రజి) ముస్లింలను హతమార్చుతున్నాడని ఖలీఫాకు ఫిర్యాదు చేశారు. ఈమాట విని మదీనాలో కొందరు ముస్లింలు ఖాలిద్ (రజి) పట్ల ఆగ్రహం వెలిబుచ్చుతూ "ఖాలిద్‌ను సేనాపతి పదవి నుండి తొలగించి అతని నుండి రక్తపరిహారం వసూలుచేసి మాలిక్ వారసులకు ఇప్పించాలని అన్నారు.

ఖలీఫా అబూబకర్ (రజి) సమస్యను విభిన్న కోణాల నుంచి అధ్యయనం చేసిన తరువాత సైపుల్లా (దేవుని పులి)గా బిరుతాంకితుడైన ఖాలిద్ (రజి)ని సేనాపతి పదవిలో యధాతథంగా కొనసాగిస్తూ ప్రభుత్వ ఖజానా నుండి రక్తపరిహారం చెల్లించారు. మరోవైపు సేనాపతి అనుమతి లేకుండా సైన్యం వదలి వచ్చినందుకు అబూఖతాదా (రజి)కు చీవాట్లు పెట్టి యుద్ధరంగానికి తిరిగివెళ్ళమని ఆదేశించారు.

ఖలీఫా అబూబకర్ (రజి) అసత్యప్రవక్త ముసైలమాను అణచడానికి అబూజహల్ కుమారుడు ఇక్రమా (రజి)ను పంపించారు. తరువాత ఆయన సైన్యాన్ని బలోపేతం చేయడానికి షర్జీల్ బిన్ హుస్నా (రజి)ను పంపారు. అయితే షర్జీల్ (రజి) అక్కడకు చేరుకోకముందే ఇక్రామా (రజి) ముసైలమా సైన్యంతో ఢీకొని పరాజయంపాలయ్యారు. అంచేత ఖలీఫా ఆయన్ని వేరే ప్రాంతాలకు పంపించారు. ఈలోగా ఖాలిద్ బిన్ వలీద్ (రజి) బనూతమీమ్ ప్రాంతంలో విజయవంతంగా పని ముగించుకొని మదీనా తిరిగొచ్చారు. ఆ తరువాత కొన్నాళ్ళకు ఖలీఫా అసత్యప్రవక్త ముసైలమాను అణచడానికి ఖాలిద్ (రజి)కు ఓ పెద్ద సైన్యాన్నిచ్చి పంపారు.

ముసైలమా దగ్గర రబీఅ తెగకు చెందిన నలభై వేల మంది యోధులు గుమిగూడారు. ఖాలిద్ (రజి) దగ్గర పదమూడు వేలమంది యోధులు మాత్రమే ఉన్నారు. ముసైలమా 'తమీమ్' తెగవారిపై దాడిచేయడానికి అరవై మంది సైనికుల్ని పంపాడు. అయితే ఖాలిద్ సైనికులు ఈ అరవై మందిని మట్టుబెట్టి యమామా పట్నం దిశగా పురోగమించారు. ఖాలిద్‌సైన్యం సమీపించగానే ముసైలమా కొంతమంది శిష్యుల్ని తీసుకొని పట్నంవదలి దాని సమీపంలోని తోటలోకి పోయి తలదాచుకున్నాడు. విశాలమైన ఈతోట చుట్టూ కోటగోడలా దృఢంగా నిర్మించబడిన ప్రహరీ గోడ ఉంది.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) యమామా పట్నంలోకి ప్రవేశించగానే ముసైలమా సైన్యంతో భీకర పోరాటం ప్రారంభించారు. ముసైలమా సైనికులు ముస్లిం యోధుల



ముందు నిలువలేక పారిపోసాగారు. వారి నాయకుడు ఎలుగెత్తి "బనూహనీఫా తెగవారలారా! పారిపోకండి, తోటలోకి ప్రవేశించండి" అని అరిచాడు. దాంతో ముసైలమా సైనికులు పరుగుపరుగున తోటలోకి ప్రవేశించి తలుపులు మూసుకున్నారు. ఆ తర్వాత ఆ నాయకుడు ముస్లింలతో పోరాడుతూ మృత్యుకోరలకు చిక్కిపోయాడు.

ముస్లింయోధులు వీరోచితంగా పోరాడుతూ ముసైలమా సైనికుల్ని తోట సమీపానికి తరుముకుపోయారు. చివరికి వారు తోట గోడను అనేక చోట్ల పడగొట్టి లోపలికి జొరబడ్డారు. ముసైలమా సైనికాధికారుల్లో కొంతమంది పరిస్థితి క్షణక్షణానికి విషమిస్తూ ఉండటం చూసి "నీ దేవుడు నీకు చేసిన విజయ వాగ్దానం ఎప్పుడు నెరవేరుతుంది?" అని అడిగారు ముసైలమాను. దానికా అబద్ధాలమారి "ఇలాంటి విషయాల్ని గురించి మాట్లాడే సమయం కాదిది. ఇప్పుడు ప్రతిమనిషీ తన భార్యాపిల్లల కోసం తెగించి పోరాడాలి" అని సమాధానమిచ్చాడు.

తోటలో కూడా పరిస్థితి విషమించిపోవడంతో ముసైలమా గుర్రం దిగి మెల్లగా తోట నుండి బయటికి జారుకోవడానికి ప్రయత్నించాడు. అయితే తోట ద్వారం దగ్గర కాచుకొనివున్న ఓ ముస్లింయోధుడు (వహ్షీ-రజి) అతను దగ్గరికి రాగానే బలాన్నంతా కూడదీసుకొని బరిశె విసిరాడు. అది మెరుపులా దూసుకుపోయి ముసైలమా ధరించిన ఉక్కుకవచాన్ని సైతం రంధ్రం చేసి అతని గుండెలోకి చొచ్చుకుపోయింది. దాంతో ముసైలమా క్రిందపడి గిలగిల కొట్టుకుంటూ ఊపిరివిడిచాడు. ముసైలమా చావుతో అతని సైనికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వీలున్న దిశలకు పరుగెత్తారు.

ఈ (యమామా)యుద్ధం హిజ్రీశకం 11వ సంవత్సరం, జిల్‌హజ్జ నెలలో జరిగింది. శత్రుపక్షంలో 17వేల మంది సైనికులు మృత్యువాత పడ్డారు. ముస్లింలలో వేయిమందికి పైగా అమరగతులయ్యారు. అమరగతులైనవారిలో ఖుర్‌ఆన్ స్మర్తలు చాలామంది ఉన్నారు. క్షతగాత్రులకు తక్షణమే చికిత్స చేయవలసి ఉన్నందున సేనాపతి ఖాలిద్ (రజి) యమామా పట్టణాన్ని అదేరోజు ఆక్రమించుకో నవసరం లేదని భావించారు. ఆ పనిని మరునాడు ఉదయానికి వాయిదా వేశారు.

ఈ సంగతి తెలుసుకున్న ముజాఅ బిన్ మురారా అనే ఒక యుద్ధఖైదీ పట్నంలోని తన తెగవారిని కాపాడుకునే ఉద్దేశ్యంతో "మీరు అప్పుడే పూర్తి విజయం సాధించారని భావించకండి. పట్నంలో ఇంకా అనేకమంది వీర సిపాయీలున్నారు. వారు అన్ని విధాలా సాయుధులై కోట బురుజులపై మీకోసం కాచుకొనివుంటారు. మీరు నాక్కాస్త పట్నంలోకి పోవడానికి అనుమతిస్తే నేను వెళ్ళి వారికి నచ్చజెప్పి నిర్యుద్ధఒప్పందంతో పట్టణాన్ని మీకు హస్తగతమయ్యేలా చేస్తాను" అని అన్నాడు ఖాలిద్ (రజి)తో. దానికి ఖాలిద్ (రజి) సంతోషంతో ఒప్పుకొని అనుమతి ఇచ్చారు.

వెంటనే 'ముజాఅ బిన్ మురారా' పట్నంలోకి వెళ్ళి స్త్రీలందరికీ ఆయుధాలిచ్చి వారిని నగర ప్రహరీగోడలపై, బురుజులపై కూర్చోబెట్టి తగిన సూచనలిచ్చాడు. ఆ తరువాత సేనాపతి ఖాలిద్ (రజి) దగ్గరకు వచ్చి ఆయనతో కలసి పట్నం వైపు నడుస్తూ "మాజాతి కేవలం తమ ప్రాణాలరక్షణ కోసం ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా లేదు"

అన్నాడు. ఖాలిద్ (రజి) ఈమాట విని ఓసారి పట్నం ప్రహరీగోడల పైకి దృష్టిసారించాడు. చూస్తే ప్రహరీగోడలపై ఈటెలు, ఖడ్గాలు ధరించిన అనేకమంది సైనికులు కన్పించారు. అంచేత వీలైనంత త్వరగా క్షతగాత్రులకు చికిత్స చేయించి వచ్చిన పని ముగించుకొని వెళ్ళిపోవాలని నిశ్చయించుకొని ఇలా అన్నాడు:

"సరే, అయితే మేము సగం ధనసంపద, సగం తోటలు, సగం మంది ఖైదీలను వదలి వెళ్ళిపోతాం, సరేనా?" అని అన్నారు. దానికి ముజాఅ "అయితే నేను మరొక సారి నా జాతిప్రజల దగ్గరకెళ్ళి కనుక్కొని వస్తాను" అంటూ పట్నం వైపుకు దారితీశాడు. పట్నం నుండి తిరిగొచ్చి "నా జాతి దానిక్కూడా ఒప్పుకోవడం లేదు. వారు తమకు మూడొంతులు కావాలంటున్నారు" అన్నాడు. సేనాపతి ఖాలిద్ (రజి) అందుకు ఒప్పు కొని ఒడంబడిక పత్రం మీద సంతకం చేశారు.

ఆతర్వాత పట్నం ప్రధానద్వారం తెరచి లోపలికి ప్రవేశిస్తే లోపల ఖాలిద్ (రజి)కు స్త్రీలు, పిల్లలు తప్ప ఒక్క పురుషుడు కూడా కన్పించలేదు. దాంతో ఆయన ముఖం చిట్లించుకొని "నువ్వు మమ్మల్ని మోసగించావు" అన్నారు. దానికి ముజాఅ "నా జాతి సర్వనాశనమయింది. అందుకని దాన్ని ఎలాగైనా ఈ ఆపద నుండి కాస్తయినా కాపాడు కుందామని ఇలా చేశాను, నన్ను క్షమించండి" అని అన్నాడు.

సేనాపతి ఖాలిద్ (రజి) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. ఒప్పందాన్ని ఉల్లంఘించే ఆలోచన కూడా ఆయన మనసులోకి రాలేదు. అంతలో ఓ వార్తాహరుడు ఖలీఫా దగ్గర్నుండి "నీవు బనూహనీఫా తెగపై విజయం సాధిస్తే వారి పురుషుల్ని హత మార్చి, వారి స్త్రీలను, పిల్లలను యుద్ధఖైదీలుగా నీ అధీనంలోకి తీసుకో" అనే వార్తను తీసుకొచ్చాడు. అయితే అప్పటికే ఒడంబడిక పత్రంపై సంతకాలు జరిగిపోయినందున ఖాలిద్ (రజి) ఖలీఫా ఆదేశాన్ని పాటించలేకపోయారు.

ఈ యుద్ధం సందర్భంలో జరిగిన ఓ ఆసక్తికరమైన సంఘటనను పేర్కొనడం ఇక్కడ సమంజసంగా ఉంటుంది. ప్రవక్తప్రత్యక్ష అనుచరుల్లో ఒకరైన హజ్రత్ సాబిత్ బిన్‌ఖైస్ (రజి) కంఠస్వరం దైవప్రవక్త (స) కంఠస్వరం కంటే కొంచెం పెద్దది. ఖుర్‌ఆన్‌లో "విశ్వాసులారా! దేవుని సమక్షంలో, ఆయన ప్రవక్త సమక్షంలో మీరు మితిమీరిపోకండి. దేవునికి భయపడండి. దేవుడు సమస్తం వింటున్నాడు; సర్వం ఎరిగినవాడు. మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడుకున్నట్లు దైవప్రవక్త ముందు బిగ్గరగా మాట్లాడకండి. (దీనివల్ల) మీరు చేసుకున్న సత్కర్మలు మీ ఆలోచనకు సైతం తట్టని విధంగా నిష్ఫలం కావచ్చు." (49:1,2) అనే సూక్తులు అవతరించాయి. హజ్రత్ సాబిత్ ఈ సూక్తులు విని భయపడ్డారు.

ఆరోజు నుండి ఆయన తన కర్మలు నిష్ఫలమయ్యాయని, తనకు నరకం తప్పదని భావిస్తూ దైవప్రవక్త (స)ను కలుసుకోకుండా ముఖం చాటవేయసాగారు. కొన్నాళ్ళ తర్వాత దైవప్రవక్త (స) విషయం తెలుసుకొని "నీవు నరకవాసుల్లో కాదు, స్వర్గవాసుల్లో చేరుతావు" అనే శుభవార్త అందజేశారు ఆయనకు. హజ్రత్ సాబిత్ (రజి) అప్పటినుంచి దైవప్రవక్త (స) వెంట, ఆ తరువాత కూడా అనేక యుద్ధాల్లో ద్విగుణీకృత ఉత్సాహంతో పాల్గొంటూ అమరగతిభాగ్యం కోసం ఎదురుచూడసాగారు.



ఈ యుద్ధంలో శత్రువుల ముందు ముస్లింలు ఢీలా పడిపోయినప్పుడు సాబిత్ బిన్ ఖైస్ (రజి) తలకు కఫన్‌వస్త్రం చుట్టి తన కంచుకంఠంతో వారిలో పౌరుషాన్ని, సమరోత్సా హాన్ని రేకెత్తిస్తూ హృదయాలను ఉల్లాసపరిచే ఉపన్యాసం ఇచ్చారు. దాంతో ముస్లింలు నూతనుత్తేజంతో విజృంభించి విజయఢంకా మోగించారు. అయితే ఈ పోరాటంలో అమరగతులైనవారిలో సాబిత్ బిన్ ఖైస్ (రజి) కూడా చేరిపోయారు. ఎన్నో సంవత్సరాల నుంచి అమరగతిభాగ్యం కోసం తపిస్తున్న సాబిత్ (రజి)కు ఈ యుద్ధంలో తన కోరికను నెరవేర్చుకునే అవకాశం లభించింది.

యుద్ధమైదానంలో ఆయన భౌతికకాయం ఓచోట నిస్తేజంగా పడివుండటం గమ నించిన ఒక ముస్లిం సైనికుడు దగ్గరగా వచ్చి చూశాడు. హజ్రత్ సాద్ (రజి) శరీరంపై ఎంతో విలువైన కవచం ఉంది. దాన్ని ఆ సైనికుడు ఊడదీసి తీసుకొని మెల్లిగా అక్కడ్నుంచి జారుకున్నాడు. మరుసటిరోజు రాత్రి మరొక ముస్లింకు కలలో హజ్రత్ సాద్ (రజి) కన్పించి "నేను సాబిత్ బిన్ ఖైస్‌ని, నన్ను గుర్తుపట్టావా?" అని అడిగారు. ఆ వ్యక్తి గుర్తుపట్టాను అన్నాడు. అప్పుడు హజ్రత్ సాద్ (రజి) ఇలా అన్నారు:

"నేను నీకు ఓ ముఖ్యమైన విషయం ఉపదేశిస్తున్నాను. జాగ్రత్త! ఇది కలలో జరిగిన సంఘటన అని నిర్లక్ష్యం చేయకు. నిన్న నేను హతమార్చబడినపుడు ఒక ముస్లిం యోధుడు నా శవం పక్కగా పోతూ నేను ధరించిన కవచం నా శరీరం నుండి ఊడదీసి తీసికెళ్ళాడు. అతను ఈవిధంగా ఉంటాడు... యద్ధస్థావరానికి ఫలానా దిశలో ఉండే శబిరంలో ఉంటాడు. కనుక నీవు వెంటనే మన సేనాపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దగ్గరకు వెళ్ళి ఆ కవచం తెప్పించమని చెప్పు. మరొక విషయం కూడా నీకు ఉపదేశిస్తున్నాను విను. జాగ్రత్త! ఇది కలలో జరిగిన సంఘటన అని నిర్లక్ష్యం చేయకు. నీవు మదీనా చేరుకున్న తరువాత మన ఖలీఫాను కలుసుకొని సాబిత్ మీద ఇంత రుణభారం ఉందని, దాన్ని ఆయన బానిసలు నెరవేరుస్తారని, తర్వాత వారిని బాని సత్వం నుంచి విముక్తి కలిగించాలని ఆయనకు చెప్పు."

మరునాడు ఉదయం ఆ ముస్లిం సేనాపతి దగ్గరకు వెళ్ళి స్వప్నం సంగతి తెలియ జేశాడు. సేనాపతి ఖాలిద్ (రజి) వెంటనే ఒక సైనికుడ్ని పంపి ఆ కవచం తెప్పించారు. కొన్నాళ్ళకు సైన్యం మదీనా చేరుకున్న తరువాత ఆయన హజ్రత్ సాబిత్ బిన్ ఖైస్ (రజి) కలలో కన్పించి చెప్పిన వీలునామా సంగతి ఖలీఫా అబూబకర్ (రజి)కు తెలియజేశారు. ఖలీఫా ఆ వీలునామాను అమలుపరచారు.

సేనాపతి ఖాలిద్ (రజి) విజయం, సంధి వగైరా వివరాలతో పాటు బనూహనీఫా తెగవారు ఇస్లాం ఒడిలోకి తిరిగొచ్చిన విషయం కూడా పేర్కొంటూ లేఖ రాసి దాన్ని బనూహనీఫా తెగకు చెందిన ఓ ప్రతినిధివర్గానికిచ్చి మదీనా పంపించారు. ఖలీఫా అబూబకర్ (రజి) వారిని సాదరంగా ఆహ్వానించి, బాగా సత్కరించి పంపివేశారు.

**ఖుర్‌ఆన్ కూర్పు:** ఈ యుద్ధాలలో ఖుర్‌ఆన్ స్మర్తలు (హాఫిజ్‌లు) చాలామంది అమరగతులు కావడంతో ఖుర్‌ఆన్ పరిరక్షణకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయ వలసివచ్చింది. ఖుర్‌ఆన్‌కు చెందిన వివిధభాగాలు దైవప్రవక్త (స) అనుచరులు ఇంతకు

ముందే కాగితాలపై, చర్మపుపొరలపై, ఖర్జూరపుటాకులపై, నాపరాళ్ళపై వ్రాసి భద్రపర చుకున్నారు. వ్రాతపూర్వకమైన ఈ ఖుర్‌ఆన్ భాగాలన్నిటినీ ఖలీఫా అబూబకర్ (రజి) తెప్పించి గ్రంథరూపంలో కూర్చవలసిందిగా 'దివ్యావిష్కృతి రచయిత' హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి)ని ఆదేశించారు. పూర్తి ఖుర్‌ఆన్ చాలామంది హృదయాల్లో ఉన్నప్పటికీ గ్రంథానికి ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. జైద్ బిన్ సాబిత్ (రజి) కూడా హాఫిజే. ఆయన మస్జిదెనబవీలో ఓ ప్రకటన చేయడం ద్వారా ఖుర్‌ఆన్ విడిభాగాలు ఎవరెవరి దగ్గర ఉన్నాయో వాటన్నిటినీ సేకరించి గ్రంథంగా తయారుచేశారు. పూర్తి ఖుర్‌ఆన్‌ని గ్రంథం లో రాసిన తరువాత అనేకమంది హాఫిజ్‌ల సమక్షంలో పఠించి, అంతా సవ్యంగా ఉందని వారందరూ ధృవీకరించాక దాన్ని ఖలీఫాకు అప్పగించారు.

## (9) ఇతర ప్రాంతాల మతభ్రష్టులపై దాడులు

ఖలీఫా అబూబకర్ (రజి) వివిధ ప్రాంతాలకు పంపిన సైనికదళాలలో ఒక సైనిక దళం హజ్రత్ ఇబ్నెహజ్రమీ (రజి) నాయకత్వంలో బహ్‌రైన్‌కు బయలుదేరింది.

బహ్‌రైన్‌లో అబ్దుల్‌ఖైస్, బకర్ బిన్‌వాయిల్ తెగలున్నాయి. అబ్దుల్‌ఖైస్ తెగప్రజలు దైవప్రవక్త (స) కాలంలో ఇస్లాం స్వీకరించారు. కాని దైవప్రవక్త (స) మరణవార్త విని వారు ఇస్లాంవదలి మతభ్రష్టులైపోయారు. ఓరోజు వారినాయకుడు జారూద్ బిన్ మౌలా (రజి) తన తెగవారందర్నీ ఒకచోట సమావేశపరచి " మీనుండి నేనొక విషయం తెలుసు కోదలిచాను. అది తెలిసినవారు చెప్పాలి; తెలియనివారు మౌనంగా ఉండాలి" అన్నారు. ఆ తరువాత ఆయన "ముహమ్మద్ ప్రవక్త (స)కు పూర్వం కూడా దైవప్రవక్తలు వచ్చారా లేదా?"అని ప్రశ్నించారు. దానికి ప్రజలంతా వచ్చారన్నారు. "అయితే వారంతా సాధారణ మానవుల్లా జీవించి మరణించారా లేదా?" అని మళ్ళీ అడిగారు హజ్రత్ జారూద్ (రజి). దానికా తెగవాళ్ళు "ఆ...వారందరూ తమ జీవితాలు ముగించి మరణించారు" అన్నారు. అప్పుడు జారూద్ (రజి) "అదేవిధంగా ముహమ్మద్ ప్రవక్త (స) కూడా తన జీవితకాలం ముగించి చనిపోయారు. నేను అల్లాహ్ తప్ప మరేఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆ దేవుని దాసుడు, ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను" అని అన్నారు.

ఈ మాటలు ఆ తెగప్రజల్ని బాగా ప్రభావితంచేశాయి. దాంతో వారు పశ్చాత్తాపం చెంది ఇస్లాంధర్మంలో స్థిరంగా ఉండిపోయారు. ఈవిధంగా ఆ తెగవారు జారూద్ (రజి) సమయస్ఫూర్తి, విజ్ఞతా-వివేచనలతో మతభ్రష్ట శిక్ష నుండి తప్పించుకున్నారు. కాని బకర్ బిన్ వాయిల్ తెగప్రజలు మాత్రం మతభ్రష్టులైపోయి హుతమ్‌ని తమ నాయకుడిగా చేసుకున్నారు. హుతమ్ తన తెగవారిని తీసుకొని దండయాత్రకు బయలుదేరాడు. ఓచోట ఆగి కొంత మందిని అబ్దుల్‌ఖైస్ తెగప్రజలుండే ప్రాంతానికి పంపి, ఆ తెగవారిని మతభ్రష్టులు చేసి తీసుకురమ్మని ఆదేశించాడు. అయితే ఆ తెగవారు మతభ్రష్టులు కావడానికి నిరాకరించారు. ఆ తరువాత హుతమ్ ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోఉండే ముస్లింలను మతభ్రష్టులుగా మార్చడానికి, నిరాకరించిన వారితో యుద్ధం చేయడానికి ఓ పెద్ద సైనికదళం పంపాడు.



అలాంటి పరిస్థితుల్లో ఇబ్నెహజ్రమీ (రజి) సైన్యం మదీనా నుండి బయలుదేరి బహ్‌రైన్‌కు చేరుకుంది. సేనాపతి ఇబ్నెహజ్రమీ (రజి) ముందుగా బకర్ బిన్ వాయిల్ తెగవారిపై దాడి చేయమని అబ్దుల్‌ఖైస్ తెగ నాయకుడు జారూద్ (రజి)కు లేఖ రాశారు. ఈసంగతి తెలుసుకున్న ఆ చుట్టపక్కల ప్రాంతాల ముస్లింలందరూ ఇబ్నెహజ్రమీ (రజి) పతాకం క్రిందికి చేరుకున్నారు. మరోవైపు మతభ్రష్టులు, బహుదైవారాధకులంతా హుతమ్ పతాకం క్రిందికి చేరుకున్నారు. ఆ తర్వాత ఉభయపక్షాల మధ్య నెలరోజుల పాటు భీకర యుద్ధం జరిగింది. మతభ్రష్టుల నాయకుడు హుతమ్ నేలకొరిగి గుడ్లుతేలవేశాడు. అనేకమంది మృత్యువాత పడ్డారు. మిగిలినవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారి పోయారు. కొంతకాలానికి క్రమంగా వారంతా ఇస్లాం ఒడిలోకి వచ్చేశారు.

అమ్మాన్ ప్రాంతంలోని ముస్లింలు దైవప్రవక్త (స) మరణవార్త విన్న తరువాత మతభ్రష్టులై పోయారు. వారి నాయకుడు లఖీత్ బిన్ మాలిక్ తాను కూడా దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడు. ఖలీఫా అబూబకర్ (రజి) 'అమ్మాన్' వైపుకు హుజైఫా బిన్ ముహ్సన్ (రజి)ని, అర్ఫజా బిన్ హర్సమా (రజి)ను 'ముహ్రా' ప్రాంతానికి పంపారు. హజ్రత్ ఇక్రమా (రజి)ను యమామా వైపుకు ఇదివరకే పంపారు. ఖలీఫా ఆదేశంతో ఈ ముగ్గురు నేతలు అమ్మాన్ ఎడారిలో శిబిరాలు వేసుకొని యుద్ధసన్నాహాల్లో నిమగ్నులైపోయారు. లఖీత్ ముస్లింల యుద్ధసన్నాహాలను గురించి తెలుసుకొని వారిని ఎదుర్కోవడానికి పెద్దఎత్తున సైనిక సమీకరణ చేసి బయలుదేరాడు.

ఇరుపక్షాల మధ్య యుద్ధం మొదలైంది. ప్రారంభంలో మతభ్రష్టులదే పైచేయిగా కన్పించింది. ముస్లింలు వెనుకంజ వేయసాగారు. అయితే ఆ తర్వాత 'అల్లాహుఅక్బర్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ వారు మతభ్రష్టులపై విరుచుకుపడ్డారు. దాంతో శత్రువులు కాలికి బుద్ధి చెప్పవలసి వచ్చింది. ఈ యుద్ధంలో వారు పదివేల మంది నేల కొరిగి ఊపిరివిడిచారు. ముస్లింలు అపార సమరసొత్తుతో పాటు నాల్గువేల మంది ఖైదీలను తీసుకొని విజయదరహాసంతో మదీనాకు తిరిగొచ్చారు. హజ్రత్ ఇక్రామా (రజి) మాత్రం అక్కడ్నుంచి ముహ్రా ప్రాంతానికి బయలుదేరారు.

'ముహ్రా'లో అమ్మాన్‌వాసులతో పాటు వివిధతెగలకు చెందినవారున్నారు. వారంతా మతభ్రష్టులయి, రెండు వర్గాలుగా విడిపోయి అధికారం కోసం కీచులాడుకో సాగారు. అలాంటి పరిస్థితిలో ఇక్రమా (రజి) సైన్యం ముహ్రాలో ప్రవేశించింది. సేనాపతి ఇక్రమా (రజి) ముందుగా వారికి ఇస్లాం గురించి హితబోధ చేశారు. దాంతో ఒక వర్గం ఇస్లాం స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరిపోయింది. రెండవ వర్గం ఇస్లాంను తిరస్కరించి మతభ్రష్టులుగానే ఉండిపోయింది. హజ్రత్ ఇక్రమా (రజి) ఇస్లాం స్వీకరించిన వర్గాన్ని తన సైన్యంలో కలుపుకొని ఆ మతభ్రష్టులపై దాడిచేశారు. ఈ యుద్ధంలో మతభ్రష్టులు ఘోరంగా ఓడిపోయి పలాయనం చిత్తగించారు. వారిలో వారి నాయకుడితో పాటు అనేకమంది హతమార్చబడ్డారు. ముస్లింలు సాధించిన ఈ విజయంతో ఆ చుట్టుపక్కల ఉన్న తెగలలు ఎంతో ప్రభావితులై ఇస్లాం స్వీకరించాయి. ఆ తర్వాత సేనాపతి ఇక్రమా (రజి) ఖలీఫా ఆదేశంతో యమన్‌కు బయలుదేరారు.

యమన్‌లో 'అస్వద్' అనేవాడు తానూ దైవప్రవక్తనని ప్రకటించుకొని అరాచకం సృష్టిస్తూ చివరికి దైవప్రవక్త (స) కాలంలోనే హతమార్చబడిన సంగతి మనం గతపేజీల్లో తెలుసుకున్నాం. అప్పుడతని అనుచరులైన మతభ్రష్టులు ఇస్లాంలోకి తిరిగొచ్చారు. కాని దైవప్రవక్త (స) చనిపోగానే వారంతా మళ్ళీ మతభ్రష్టులై అరాచకానికి తెగబడ్డారు. ఖలీఫా వివిధ ప్రాంతాలకు పంపిన సైనికదళాలలో హజ్రత్ మహాజర్ బిన్ ఉమయ్యా (రజి) నాయకత్వంలో ఒక దళం అనేక అవాంతరాలు అధికమిస్తూ యమన్‌లోని నజ్రాన్‌కు చేరుకుంది. నజ్రాన్‌లో మతభ్రష్టులకు, ముస్లింలకు మధ్య భీకరయుద్ధం జరిగింది.

ఈ యుద్ధంలోనూ మతభ్రష్టులే పరాజయం పాలయ్యారు. వారిలో అనేకమంది హతమార్చబడటమో, ఖైదీలుగా పట్టుబడటమో జరిగింది. సేనాపతి మహాజర్ (రజి) ఖైదీలుగా పట్టుబడిన ఖైస్ బిన్ మక్షూ, అమ్ర్ బిన్ మాదీ అనే నాయకుల్ని మదీనాకు పంపివేశారు. వారు ఖలీఫా ముందు పశ్చాత్తాపంచెంది తిరిగి ఇస్లాం స్వీకరించారు. అప్పుడు ఖలీఫా వారిద్దర్ని బంధవిముక్తి చేసి యమన్‌కు తిప్పిపంపారు.

సేనాని మహాజర్ (రజి) నజ్రాన్ నుండి 'సనా'కు చేరుకొని అక్కడి మతభ్రష్టులపై నిర్విరామ దాడులుచేస్తూ వారిని అణచివేశారు. అంతలో ఇక్రమా (రజి) తనసైన్యంతో ముహ్రా నుండి 'సనా' చేరుకున్నారు. అక్కడ్నుంచి ఆ ఇద్దరు సేనాపతులు ఖలీఫా ఆదేశంతో తమతమ సేనలు తీసుకొని 'హిజర్' ప్రాంతం వైపు పురోగమించారు.

హిజర్‌లో 'అషాత్ బిన్ ఖైస్' అనేవాడు మతభ్రష్టులందర్నీ సమీకరించి యుద్ధ సన్నాహాలు చేయసాగాడు. ముందుగా హజ్రత్ మహాజర్ (రజి) వేగంగా పరుగెత్తే గుర్రాలపై కొందరు వీరాయోధుల్ని తీసుకొని శరవేగంతో హిజర్ చేరుకొని మతభ్రష్టులపై మెరుపుదాడి చేశారు. ఆ దాడికి మతభ్రష్టులు తాళలేక పారిపోయారు. వారి నాయకుడు అషాత్ కూడా పారిపోయి 'బహీజ్' కోటలో ఆశ్రయం పొందాడు. మహాజర్ (రజి) అతడ్ని, అతని అనుచరుల్ని వెంటాడుతూ పోయి ఆ కోటను దిగ్బంధించారు. అంతలో ఇక్రమా (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు. చివరికి కోటముట్టడితో అషాత్ నీరుగారిపోయి కాళ్ళబేరానికి వచ్చాడు. తన భార్యాపిల్లలతో పాటు మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కాపాడి విడుదల చేయమని మనవి చేసుకున్నాడు. దానికి మహాజర్ (రజి) సమ్మతించి ఆ తొమ్మిది మందిని విడుదలచేసి మిగిలిన మతభ్రష్టుల్ని ఖైదీలుగా చేసుకున్నారు.

అయితే అషాత్ విడుదలయ్యేవారిలో పొరపాటున తన పేరు పేర్కొనడం మరచిపోయాడు. అంచేత అతను కూడా ఖైదీగా పట్టుబడ్డాడు. కొందరు ముస్లిం యోధులు ఈ ఖైదీలందర్నీ మదీనా తీసికెళ్ళి ఖలీఫా ముందు ప్రవేశపెట్టారు. అప్పుడు అషాత్ తీవ్రంగా పశ్చాత్తాపం చెందుతూ, తాను మళ్ళీ ఇస్లాం స్వీకరిస్తున్నానని, తనను క్షమించమని మనవి చేసుకున్నాడు. ఖలీఫా అబూబకర్ (రజి) అతడ్ని క్షమించి విడుదల చేశారు. అతనితో పాటు ఖైదీలందర్నీ విడుదల చేశారు.

ఈవిధంగా ఖలీఫా అబూబకర్ (రజి) హిజ్రీశకం 11వ సంవత్సరాంతం మొదలు 12వ సంవత్సరం ప్రారంభం వరకు ఒకేఒక సంవత్సరంలో అరేబియాలోని మతభ్రష్ట



అరాచకాన్ని పూర్తిగా అంతమొందించారు. ఆయన సైన్యంలో ఖాలిద్ (రజి), ఇక్రమా (రజి), షుర్జీల్ (రజి), హుజైఫా (రజి) లాంటి హేమాహేమీలు ఉన్నారన్నది నిజమే. కాని అబూబకర్ (రజి) మదీనాలోనే కూర్చొని జకాత్ నిరాకరుల డిమాండ్లకు తలవొగ్గకుండా, ఆవేశపూరితుడైన ఉమర్ ఫారూఖ్ (రజి) వెలిబుచ్చిన తీవ్రమైన అభ్యంతరాలను సైతం ఖాతరు చేయకుండా, ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షిస్తూ, ఉసామా బిన్ జైద్ (రజి) సిరియా దండయాత్రను వాయిదా వేయకుండా, తాను పంపిన పదకొండు మంది సేనాపతులకు సందర్భోచితంగా తగిన ఆదేశాలు జారీచేస్తూ ఈ ఘనకార్యం సాధించగలిగారు. ఇదంతా మహాప్రవక్త ముహమ్మద్ (స) ఆయనకిచ్చిన శిక్షణామహత్యం మరి!

## (10) కరువుకాలంలో అపూర్వ ధనత్యాగం

ఒకసారి మదీనాలో కరువు వచ్చింది. జనం తిండి గింజల కోసం అల్లాడిపోసాగారు.

ఓరోజు ఖలీఫా అబూబకర్ (రజి) ప్రజలదుస్థితి చూసి "ఈరోజు సాయంత్రాని కల్లా దేవుడు మీ బాధ దూరం చేస్తాడు" అని జోస్యం చెప్పారు.

విచిత్రమేమిటంటే కాకతాళీయంగా అదే రోజు సాయంత్రం సిరియా నుంచి హజ్రత్ ఉస్మాన్ (రజి)కు చెందిన వాణిజ్యబిడారాలు మదీనా చేరుకున్నాయి. వేయి ఒంటెల మీద ధాన్యపు బస్తాలు కిటకిటలాడసాగాయి. సిరియా నుంచి ఉస్మాన్ (రజి) గారి సరుకు వచ్చిందని తెలియగానే మదీనాలోని పెద్దపెద్ద వర్తకులంతా బేరమాడటానికి మార్కెట్‌కు తరలి వచ్చేశారు.

ఉస్మాన్ (రజి) వర్తకుల్ని ఉద్దేశించి "సిరియా నుంచి దిగుమతి అయిన ఈ సరుకుపై మీరు నాకు ఎంత లాభం ఇవ్వగలరు?" అని అడిగారు.

"మీరు సరుకును పది రూపాయలకు కొంటే దానికి నేను పన్నెండు రూపాయలు ఇస్తాను" అన్నాడు ఒక వ్యాపారి.

"నాకు దానికంటే ఎక్కువ లాభం వస్తుంది" అన్నారు ఆయన.

"అట్లయితే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పదమూడు రూపాయలు ఇస్తాను" అన్నాడు మరో వ్యాపారి వేలంపాట పెంచుతూ.

"నాకు ఇంతకంటే ఎక్కువ లాభం వచ్చే అవకాశముంది."

"సరే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పధ్నాలుగు రూపాయలు ఇస్తాను, వదిలేయండి" అన్నాడు వేరొక వర్తకుడు.

"ఉహూ, ఆ లాభం నాకు చాలదు. నాకు దానికంటే కూడా ఎక్కువ లాభం వచ్చే అవకాశం ఉంది" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

"పోనీ, మరో రూపాయి పెంచుతున్నా, సరుకు వదిలేయండి."

"లాభం లేదు. నాకు ఇంతకంటే కూడ ఎక్కువ లాభం వచ్చే చాన్సుంది" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ.

"ఏమిటీ ఇంతకంటే ఎక్కువ లాభమా! ఎవరండీ మీకింత కంటే ఎక్కువ లాభం ఇస్తానంటున్నది?" అన్నారు వర్తకులంతా ఆశ్చర్యపోతూ.

"నాకు పది రూపాయల సరుకు మీద వంద రూపాయలు ధర లభిస్తుంది. మీరు ఇంతకంటే ఎక్కువ ధర పెట్టి ఈ సరుకు కొనగలరా?" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

అంటే పది రూపాయల పెట్టుబడికి తొంభయి రూపాయలు లాభం వస్తుందన్న మాట! ఈ మాటలు విన్న వర్తకులు నోరెల్లబెట్టి మరింత ఆశ్చర్యపోయారు.

"ఇది మరీ చోద్యంగా ఉంది. మేమ్మటుకు అంత ధర పెట్టలేమండీ!" అన్నారు వారు నిరాశతో డీలా పడిపోయి.

"అయితే వినండి. నేనీ మొత్తం సరుకును దైవమార్గంలో దానం చేస్తున్నాను. దీనికి మీరే సాక్షులు. దేవుడే నా పెట్టుబడిపై పదింతలు లాభం ప్రసాదించేవాడు" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

ఈ సంగతి వినగానే తిండిగింజల కోసం కటకటలాడుతున్న పేద ప్రజలు ఎంతో సంబరపడిపోయారు. సిరియా నుంచి వచ్చిన మొత్తం వేయిఒంటెల ఎత్తు ఆహారధాన్యాలు అప్పటికప్పుడు పేదలకు దానం చేశారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

అదే రోజు రాత్రి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఓ విచిత్రమైన కల గన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) జ్యోతిర్మయ దుస్తులు ధరించి టర్కీజాతి తెల్లగుర్రం ఎక్కి ఎక్కడికో బయలుదేరుతున్నట్లు ఆయన కలలో కన్పించారు.

అప్పుడాయన "దైవప్రవక్తా! మీరు హడావిడిగా ఎక్కడికి వెళ్తున్నారు? నా హృదయం మాత్రం మీ దర్శనం కోసం తహతహలాడుతోంది" అన్నారు.

"ఈరోజు ఉస్మాన్ (రజి) వేయి ఒంటెల ఆహారధాన్యాలు దానం చేశాడు కదా! ఆయన చేసిన ఈ దానాన్ని దేవుడు స్వీకరించి, దానికి ప్రతిఫలంగా ఒక స్వర్గకన్యతో ఆయన వివాహం జరిపిస్తున్నాడు. నేనా వివాహమహోత్సవంలో పాల్గొనడానికి వెళ్తున్నా" అన్నారు దైవప్రవక్త (స).

## (11) ఈరాన్, ఇరాఖ్‌ల వైపు పురోగమనం

సిరియాలో రోమన్ల కవ్వింపుచర్యలు, యమామా-నజద్ ప్రాంతాల్లో చెలరేగిన అరాచకం పూర్తిగా సమసిపోవడంతో ఖలీఫా అబూబకర్ (రజి) చల్లగా ఊపిరి పీల్చు కున్నారు. అయితే ఇరాఖ్, ఈరాన్‌ల నుండి ప్రమాదం ఇంకా పొంచివుంది. ఆ కాలంలో ఈ రెండు దేశాలు ఈరానీయుల అధీనంలో ఉండేవి.

క్రీస్తుశకానికి పూర్వం ఈరాన్ సామ్రాజ్యం రోమ్‌సముద్రం మొదలు నల్లసముద్రం, పార్శీజలసంధి, సింధూనది, కశ్మీర్, టిబెట్, అల్టాయి పర్వతాలు, కాస్పియన్ సముద్రం వరకు ఎంతో విశాలంగా ఉండేది. కయానీ వంశపాలన, రుస్తుమ్-జాబలిస్తాన్‌లు వంటి మల్లయోధుల ఘనకార్యాల కాలం ముగిసిన తర్వాత గ్రీక్ చక్రవర్తి అలెగ్జాండర్ ఈరాన్ సామ్రాజ్యాన్ని అస్తవ్యస్తం చేశాడు. దైవప్రవక్త (స)కు 400 ఏండ్లకు పూర్వం సాసాని వంశ



పాలన ప్రారంభమయింది. ఆ వంశ చక్రవర్తులు తాము కోల్పోయిన ప్రాంతాలన్నిటినీ తిరిగి స్వాధీనం చేసుకొని పార్శీజలసంధి మొదలు ఫిరాత్ నది, కాస్పియన్ సముద్రం, సింధూనదీ, జీలంనది మధ్యభాగం వరకూ సువిశాల సామ్రాజ్యం స్థాపించారు.

ఆ కాలంలో ఈరాన్ తరువాత రోమ్ శక్తిమంతమైన రాజ్యంగా ఉండేది. రోమ్ సామ్రాజ్యంలో ఆనాడు దాదాపు మొత్తం ఐరోపాఖండం, ఈజిప్టు, ఆసియామైనర్‌లు ఉండేవి. కొంతకాలం తరువాత రోమ్ సామ్రాజ్యం రెండు భాగాలుగా చీలిపోయింది. పశ్చిమభాగం సామ్రాజ్యానికి రోమ్ నగరమే రాజధానిగా ఉండేది. తూర్పుభాగం సామ్రాజ్యానికి కాన్స్టాంటినోపిల్ రాజధాని అయింది. ఆ రెండు సామ్రాజ్యాల చక్రవర్తులు "సీజర్" అనే పిలువబడేవారు. తూర్పుభాగం సామ్రాజ్యంలో ఈజిప్టు, అబిసీనియా, పాలస్తీనా, సిరియా, ఆసియామైనర్, బల్ఖాన్ దేశాలు ఉండేవి. తూర్పు రోమ్‌సామ్రాజ్యం శక్తి ముందు పశ్చిమ రోమ్‌సామ్రాజ్యం బలహీనంగా ఉండేది. ఆసియామైనర్, ఈరాఖ్ మైదానాల మధ్య పర్వతాలు, సముద్రాలు వంటి సహజసిద్ధమైన అడ్డంకులు లేనందున రోమ్,ఈరాన్ రాజ్యాల మధ్య తరచుగా ఘర్షణలు, యుద్ధాలు జరుగుతుండేవి.

దైవప్రవక్త (స) కాలంలో 'నౌషేర్వాన్ ఆదిల్ సాసాని' మనుమడు ఖుస్రూపర్వేజ్ ఈరాన్‌చక్రవర్తి అయ్యాడు. ఆ కాలంలోనే కాన్స్టాంటినోపిల్‌లో 'సీజర్ ఫొఖా'కు వ్యతిరేకం గా తిరుగుబాటు జరిగింది. ప్రజలు, ప్రజాప్రతినిధులు కలసి ఫొఖాను గద్దెదించి హత మార్చారు. అతని స్థానంలో ఈజిప్టుగవర్నర్ కుమారుడు హెర్క్యులస్‌ను కూర్చోబెట్టారు. అతను గద్దె ఎక్కగానే రోమ్‌రాజ్యంపై ఈరాన్‌దాడులు ప్రారంభమయ్యాయి. ఈ దాడులు ఏడేండ్లు కొనసాగాయి. చివరికి ఈరానీయులు సిరియా, పాలస్తీనాలను కూడా ఆక్ర మించుకున్నారు. రోమన్ల సిలువను కూడా స్వాధీనం చేసుకున్నారు.

మక్కాబహుదైవారాధకులు ఈరానీయులు సాధిస్తున్న ఈ విజయవార్తలు వింటూ తెగ సంబరపడిపోతూ "చూడండి ఈరాన్‌అగ్నిపూజారులు ఎలా విజయాలు సాధిస్తున్నారో! దైవప్రవక్తలను, దివ్యావిష్కృతి (వహీ)ని నమ్ముతున్న క్రైస్తవులు వారి ధాటికి నిలువలేక చిత్తు చిత్తుగా ఓడిపోతున్నారు. అదేవిధంగా అరబ్ విగ్రహారాధకులయిన మేము కూడా మీ ధర్మాన్ని నామరూపాల్లేకుండా తుడిచిపెడతాం" అని ముస్లింలను ఎద్దేవాచేశారు. అలాంటి పరిస్థితుల్లో (అంటే ముస్లింలు ఆర్థికంగా, సైనికంగా, సంఖ్యాపరంగా ఎంతో బలహీనంగా, అల్పసంఖ్యాకులుగా ఉండిన ఆనాటి పరిస్థితుల్లో రోమన్లు అనతి కాలంలోనే మళ్లీ విజృంభించి విజయం సాధిస్తారని, అది దేవుడు ప్రసాదించిన విజయం పట్ల ముస్లింలు ఆనందోత్సవాలు జరుపుకునే రోజవుతుందని క్రీ.శ. 615లో ఖుర్‌ఆన్ భవిష్యవాణి ప్రకటించింది.

ఆ తర్వాత ఈరానీయుల (పార్శీల)పై రోమన్ల విజయపరంపర ప్రారంభమైంది. ఇలా రోమన్లు క్రమంగా తాము కోల్పోయిన భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడ మేగాకుండా కొన్ని శత్రు భూభాగాలను కూడా ఆక్రమించుకొని విజయభేరి మోగించారు. సరిగ్గా ఆ రోజుల్లోనే ముస్లింలు బదర్ యుద్ధంలో మక్కా బహుదైవారాధకుల్ని ఓడించి విజయపతాకం ఎగరవేశారు. ఇలా ఖుర్‌ఆన్ భవిష్యవాణి నిజరూపం దాల్చింది.

పార్శీలకు, రోమన్లకు జరిగిన ఈ యుద్ధం తరువాత ఉభయపక్షాలు శాంతి ఒప్పందం చేసుకున్నాయి. దానిప్రకారం రోమన్లు ఆక్రమించుకున్న ఈరాన్ భూభాగాలను పార్శీలకు తిరిగి అప్పగించారు. పార్శీలు స్వాధీనం చేసుకున్న సిలువను రోమన్లకు అప్పగించారు. దాంతో హెర్క్యులస్ సంతోషిస్తూ బైతిల్‌మఖ్దిస్‌ను దర్శించుకోవడానికి వెళ్ళాడు. ఆ రోజుల్లోనే దైవప్రవక్త (స) వివిధ రాజులతో పాటు హెర్క్యులస్‌కు, ఖుస్రూ పర్వేజ్ కూడా ధర్మప్రచార లేఖలు పంపారు. హెర్క్యులస్ దైవప్రవక్త (స) లేఖను గౌరవించి, ఆయన ప్రతినిధిని ఆదరించాడు. కాని ఖుస్రూపర్వేజ్ దైవప్రవక్త (స) లేఖను చించిపారేయడమే గాకుండా ఆయన ప్రత్యేకదూతను అవమానపరచాడు. దైవప్రవక్త (స) ఈ విషయం తెలుసుకొని అతని రాజ్యం ముక్కచెక్కలవుతుందని శపించారు.

ఖుస్రూపర్వేజ్ అంతటితో ఆగకుండా ఆ అరబ్ ప్రవక్తను బంధించి తన దగ్గరకు తీసుకురమ్మని (మరొక ఉల్లేఖనం ప్రకారం ఆయన శిరస్సు ఖండించి తీసుకురమ్మని) తన యమన్ గవర్నర్ బాజాన్‌ని ఆదేశించాడు. దానికోసం బాజాన్ ఇద్దరు మనుషుల్ని మదీనాకు పంపాడు. ఆ ఇద్దరు మదీనా వెళ్ళి దైవప్రవక్త (స)కు తమ పాలకుల ఉద్దేశ్యం చెప్పారు. దానికి దైవప్రవక్త (స) "మీరు ఎవర్ని దైవంగా భావిస్తున్నారో అతడ్ని ఆ రాత్రి అతని కొడుకు హతమార్చాడు" అని అన్నారు. ఈవార్త విని ఆ ఇద్దరు దూతలు వెళ్ళి పోయి విచారిస్తే దైవప్రవక్త (స) చెప్పిన రాత్రే పర్వేజ్ కొడుకు తన తండ్రిని చంపి గద్దె ఎక్కాడు. అప్పుడు యమన్ గవర్నర్ బాజాన్ "ఈరాన్ సామ్రాజ్యం పతనమైపోతోందని, ఇక దాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదని గ్రహించి ఇస్లాం స్వీకరించాడు. ఆవిధంగా అతను ఇస్లాం సామ్రాజ్యంలో యమన్ గవర్నర్‌గా కొనసాగాడు.

ఖుస్రూపర్వేజ్ కొడుకు చక్రవర్తి అయిన కొన్నాళ్ళకే అతని మైనర్ కుమారుడ్ని గద్దె ఎక్కించడంజరిగింది. తర్వాత కొన్నాళ్ళకు సేనాపతి అతడ్ని చంపి అధికారం చేజిక్కించు కున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకు పాలకసభ్యులు అతడ్ని చంపి పర్వేజ్ కుమార్తె బోరాన్‌ని గద్దెనెక్కించారు. బోరాన్ పాలనాకాలంలోనే దైవప్రవక్త (స) ఇహలోకం వీడిపోయారు. ఆమె పాలన తరువాత అనేకమంది యువకులు, స్త్రీలు అధికారం చేపట్టారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఖలీఫా మతభ్రష్టుల్ని అణచేందుకు 11 సైనికదళాలను పంప డానికి ముందే "ముస్నా బిన్ హారిసా (రజి)" నాయకత్వంలో ఒక చిన్న సైనికదళాన్ని ఇరాఖ్‌కు పంపారు. ఇరాఖ్ పాలకుల్ని భయపెడుతూ వారిని మదీనా వైపు దృష్టి సారించకుండా ఉండేందుకు ఖలీఫా ఆ సైనికదళపతి ముస్నా (రజి)ను ఏఒక్క చోటా నిలకడగా యుద్ధం చేయకుండా గెరిల్లాపోరాటం జరుపుతుండాలని ఆదేశించారు. మతభ్రష్టుల ఉపద్రవం అంతమైన తరువాత ఖలీఫా ఆదేశంతో నజద్‌లో ఉన్న అయాజ్ బిన్ గనమ్ (రజి) ఎగువ ఇరాఖ్‌పై దాడులు ప్రారంభించారు. మరోవైపు యమామాలో ఉన్న ఖాలిద్ బిన్ వలీద్ (రజి), గెరిల్లాపోరాటం జరుపుతున్న ముస్నా బిన్ హారిసా (రజి) ఖలీఫా ఆదేశంతో తమతమ సైన్యాలు తీసుకొని 'అబ్లా' ప్రదేశంలో కలుసుకున్నారు.

ఆ ప్రదేశంలో గుమిగూడిన మొత్తం 18వేల మంది సైనికులకు ఖాలిద్ (రజి)ని సర్వ సేనానిగా చేసి "హజీర్" రాష్ట్రం వైపు పురోగమించారు. హజీర్ రాష్ట్ర గవర్నర్ 'హర్ముజ్'



పేరు వింటేనే ఆ కాలంలో అరబ్బులు హడలిపోయేవారు. ఖాలిద్ (రజి) ఇస్లాం ధర్మం గురించి హితోపదేశం చేస్తూ హర్ముజ్‌కు లేఖ రాశారు. ఈ లేఖ అందగానే హర్ముజ్ విషయం ఈరాన్ చక్రవర్తికి చేరవేసి, సైన్యం తీసుకొని ఖాలిద్ (రజి) సైన్యంతో తలపడ టానికి బయలుదేరాడు. ఈ రెండుసైన్యాలు ఒక ప్రదేశానికి చేరుకొని పరస్పరం కత్తులు దూసుకోవడానికి సిద్ధమయ్యాయి.

ఖాలిద్ (రజి) ముందుకువచ్చి తనతో మల్లయుద్ధానికి రమ్మని హర్ముజ్‌ని పిలిచారు. వెంటనే హర్ముజ్ ఖడ్గంతో దూసుకువచ్చి ఖాలిద్ (రజి)పై లంఘించాడు. ఖాలిద్ (రజి) మెరుపువేగంతో తప్పించుకొని కత్తి ఝుళిపించారు. కాస్సేపటికే ఆయన హర్ముజ్ కత్తి లాక్కొని కిందపడవేసి ఒక్క వేటుతో అతని శిరస్సు ఖండించారు. ఈరాన్ సైనికులు తమసేనాపతి పర్యవసానం చూడగానే సామూహిక దాడి ప్రారంభించారు. కాని కాస్సేపటికే వారు చిత్తుగా ఓడిపోయి పలాయనం చిత్తగించారు. వారిలో అనేకమంది నేలకొరిగి ఊపిరి విడిచారు; అనేకమంది యుద్ధఖైదీలుగా పట్టుబడ్డారు.

ఈరాన్‌సైన్యంలో ఒకదళం రణరంగం నుండి పారిపోకుండా ముస్లింలతో నిలకడ గా పోరాడేందుకు కాళ్ళకు గొలుసులు కట్టుకున్నది. అయినా ఆ సైనికులు గొలుసులు తెంచుకొని పారిపోవలసివచ్చింది. ఆ గొలుసుల కారణంగా ఈ యుద్ధం 'గొలుసుల యుద్ధం' (జాతిస్సలాసిల్) అని ఖ్యాతిచెందింది. ముస్లింలకు ఈ యుద్ధంలో అపార సమరసొత్తుతో పాటు లక్ష దీనార్లు విలువచేసే హర్ముజ్ కిరీటం కూడా లభించింది.

హర్ముజ్ పంపిన సమాచారం అందగానే ఈరాన్ చక్రవర్తి అతని సహాయం కోసం ఖారున్ నాయకత్వంలో ఓ పెద్ద సైనికదళం పంపించాడు. కాని ఆ సైన్యం హర్ముజ్ దగ్గరకు చేరుకోక ముందే అతను హతమార్చబడ్డాడు. దారిలో పారిపోతున్న హర్ముజ్ సైనికులు తారసపడ్డారు. ఖారున్ వారికి ధైర్యం చెప్పి, తన సైన్యంలో కలుపుకొని నదీ తీరానికి వెళ్ళి విడిదిచేశాడు. మరోవైపు నుండి ముస్లిం యోధులు చేరుకొని వారిపై మెరుపుదాడి చేశారు. ఈ యుద్ధంలోనూ ఈరాన్ సైన్యం ఘోరపరాజయం చవిచూసింది. ఖారున్‌తో పాటు ముప్ఫయి వేల మంది సైనికులు మృత్యువాత పడ్డారు. మిగిలినవారు ప్రాణభీతితో పారిపోయారు. అలా పారిపోతూ వారిలో అనేకమంది నదిలో మునిగి చని పోయారు. అనేకమంది ఖైదీలుగా పట్టుబడ్డారు.

ఆ తర్వాత ఖాలిద్ (రజి) ఆ ప్రాంతం ప్రజలను ఎలాంటి వత్తిడి, బలప్రయోగాలు చేయకుండానే రక్షణరుసుం (జిజ్యా) చెల్లించడానికి ఒప్పించి, ఆ రాష్ట్రానికి ముస్లిం పాలకుడ్ని నియమించారు. ముస్లింల పాలనలో అక్కడి ఈరానీయులు నరకం నుండి బయటపడి స్వర్గంలో ప్రవేశించిన అనుభూతితో సుఖంగా జీవించసాగారు.

హర్ముజ్-ఖారున్‌ల వధ, వారి సైన్యాల ఘోరపరాజయం గురించిన సమాచారం అందగానే ఈరాన్ చక్రవర్తి ప్రతీకారవాంఛతో ఉడికిపోతూ ప్రఖ్యాత సమరయోధులైన ఇంద్రజిగర్, బహ్మన్‌జాద్వియాలకు రెండు సైన్యాల్నిచ్చి పంపాడు. వీరిద్దరు దల్జా ప్రదే శంలో విడిదిచేసి ఖాలిద్ (రజి) సైన్యంతో తలపడేందుకు సమాయత్తమయ్యారు. ఈ

సంగతి తెలుసుకున్న ఖాలిద్ (రజి) ఆ ప్రదేశానికి చేరుకొని దాడిచేశారు. చివరికి ఈరాన్ సైన్యమే ఓటమి చవిచూసింది. వారిసేనాని ఇంద్రజిగర్ పారిపోతూ తీవ్రమైన దాహంతో మృత్యువాతపడ్డాడు. జాద్వియా పారిపోయి 'లైస్' ప్రదేశానికి చేరుకున్నాడు. పారిపోయిన సైనికులందరూ వెళ్ళి అతని సైన్యంలో చేరారు. ఆ సైన్యంలో అరబ్ క్రైస్తవులు కూడా ఉన్నారు. ఖాలిద్ (రజి) అక్కడక్కూడా చేరుకొని దాడిచేసి విజయం సాధించారు. ఇక్కడ దాదాపు డెబ్భయి వేలమంది ఈరాన్‌సైనికులు హతమయ్యారు.

లైస్ యుద్ధం ముగిసిన తరువాత సేనాపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) 'హైరా' పట్టణాన్ని ముట్టడించారు. ముట్టడి సుదీర్ఘకాలం సాగింది. దాంతో హైరావాసులు కాళ్ళ బేరానికి వచ్చారు. పట్టణం నాయకుడు 'అమ్ర్ బిన్ అబ్దుల్ మసీహ్' మరికొందరు ప్రముఖులతో వచ్చి ఏడాదికి లక్షాతొంభై వేల దిర్హాంలు రక్షణరుసుం (జిజ్యా) చెల్లించే షరతుపై ఖాలిద్ బిన్ వలీద్ (రజి)తో శాంతిఒప్పందం చేసుకున్నాడు. అప్పుడు ఖాలిద్ (రజి) మాట్లాడుతూ "ఒకవేళ మేము మిమ్మల్ని రక్షించలేని పరిస్థితిలో ఉంటే మీరు మాకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేదు" అని అన్నారు. ముస్లింలు ప్రదర్శించిన ఈ సత్ప్రవర్తన చూసి ఇతర ప్రాంతాల నాయకులు కూడా సంతోషంతో రక్షణ రుసుం చెల్లించే షరతుపై ఒప్పందాలు చేసుకున్నారు.

ఇదిలా ఉంటే అటు ఈరానీయులు 'అంబార్' పట్నంలో షేర్‌జాద్ నాయకత్వం లో భారీసైన్యం సమీకరించి ముస్లింలతో తలపడేందుకు ఉవ్విళ్ళూరుతున్నారని తెలిసి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) అక్కడికి చేరుకొని పట్టణాన్ని దిగ్బంధించారు. అయితే పట్నం ప్రహరీగోడ బయట ఓ మన్నుకోటలో దాక్కున్న ఈరానీయులు హఠాత్తుగా బాణాల వర్షం కురిపించారు. దాంతో వేయిమంది ముస్లింల కళ్ళు గాయమవడమో, దృష్టి పోవడమో జరిగింది. అయినప్పటికీ ముస్లింలు వెనుకంజవేయలేదు. సేనాపతి ఖాలిద్ (రజి) కొన్ని బలహీనఒంటెల్ని చంపి కందకంలో పడవేసి దానిపై నుంచి కందకాన్ని దాటి మన్ను కోటను ఆక్రమించుకున్నారు. ఆ తర్వాత పట్నం ప్రహరీగోడ దగ్గరకు చేరి భీకరయుద్ధం సాగించారు. ఈరాన్‌సేనాని ఓటమి సూచనలు కన్పించడంతో ఒప్పందం చేసుకోవడానికి ముందుకొచ్చాడు. అయితే ఈరాన్‌సేనాని, కొందరు అనుచరులతో మూడు రోజులకు సరిపడ ఆహారసామగ్రి మాత్రమే తీసుకొని పట్నం విడిచిపోవాలని ఖాలిద్ (రజి) షరతు విధించారు. దాని ప్రకారమే ఈరాన్‌సేనాని షేర్‌జాద్ పట్నం విడిచి వెళ్ళిపోయాడు.

ఆతర్వాత ఖాలిద్ (రజి) పట్నాన్ని స్వాధీనం చేసుకొని, అక్కడ జీర్‌ఖాన్ బిన్ బదర్ (రజి)ని పాలకుడిగా నియమించి 'ఐనుల్‌తమ్రీ' వైపు బయలుదేరారు. అక్కడ మిహ్రాన్ బిన్ బహ్రామ్ నాయకత్వంలోని 24 వేలమంది ఈరానీయులతో పోరాడి మరొక విజయం సాధించారు. గత పేజీలలో పేర్కొన్నట్లు హజ్రత్ అయాజ్ బిన్ గనమ్ (రజి) ఎగువ ఇరాఖ్‌లో అరబ్ బహుదైవారాధకుల్ని, క్రైస్తవ తెగల్ని అణచివేశారు. ఆ తరువాత ఆయన 'దూమతుల్‌జందల్' పాలకులతో పోరాడవలసివచ్చింది. దానికోసం ఆయన ఖాలిద్ (రజి) సహాయం కోరారు. అప్పుడు ఖాలిద్ (రజి) హైరాలో 'ఖాఖా బిన్ అమ్ర్' (రజి)ను తన ప్రతినిధిగా నియమించి దూమతుల్‌జందల్‌కు బయలుదేరారు. అక్కడ ఈ సేనాపతు



లిద్దరు చెరొక వైపునుంచి దూసుకొచ్చి క్రైస్తవ, బహుదైవారాధక సైనికులపై విరుచుకు పడ్డారు. ఇక్కడ కూడా ముస్లిం యోధులే విజయం సాధించారు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) హైరా నుండి దూమతుల్‌జందల్‌కు వెళ్ళిపోయారని తెలిసి ఈరానీయులు హైరాను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. పేరుమోసిన ఇద్దరు సేనాపతులు తమ సైన్యాలతో హైరాకు బయలుదేరారు.

ఈ సంగతి తెలుసుకున్న ఖాఖా బిన్ అమ్ర్ (రజి) హైరాలో ఉన్న తన సైన్యాన్ని రెండు దళాలుగా విభజించి ఒక దళాన్ని అబూలైలా (రజి) నాయకత్వంలో ఇచ్చి, రెండవ దళాన్ని తన అధీనంలో పెట్టుకొని హైరా నుండి బయలుదేరారు. ఇరు పక్షాలు హసీద్ అనే ప్రదేశంలో ఢీకొన్నాయి. భయంకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఈరాన్ సేనాపతులిద్దరితో పాటు వారిసైన్యంలోని సగానికి పైగా సైనికులు మృత్యువాత పడ్డారు. మిగిలిన సైనికులు పారిపోయి 'ఖనాఫస్' ప్రదేశంలో విడిదిచేసిన 'బహ్‌బూజాన్' సైన్యంలో చేరిపోయారు.

అయితే అబూలైలా (రజి) కూడా వారిని వెంబడిస్తూ ఖనాఫస్‌కు చేరుకున్నారు. ముస్లింసైన్యాన్ని చూడగానే ఈరాన్ సేనాపతి బహ్‌బూజాన్ ప్రాణభీతితో అక్కడ్నుంచి పారిపోయి 'ముజీఖ్' ప్రదేశానికి చేరుకున్నాడు. ముజీఖ్‌లో అరబ్ బహుదైవారాధకులు 'బుజైల్ బిన్ ఇమ్రాన్' నాయకత్వంలో ముస్లింలతో పోరాడేందుకు కాచుకొనివున్నారు. మరొక వైపు నుండి వారికి మద్దతుగా 'రబియా బిన్ బహీర్' కూడా తన సైన్యం తీసుకొని వచ్చాడు. ఇదిలా ఉంటే, అటు సేనాపతి ఖాలిద్ (రజి) దూమతుల్‌జందల్‌లో పని ముగించుకొని హైరాకు తిరిగొచ్చారు. ముజీఖ్‌లో శత్రుసైనికుల సమీకరణ గురించి వినగానే ఖాలిద్ (రజి) ఖాఖా బిన్ అమ్ర్ (రజి)కు, అబూలైలా (రజి)కు తగిన ఆదేశాలిచ్చి ముజీఖ్ వైపుకు బయలుదేరారు. ఈవిధంగా ఆ ముగ్గురు సేనాపతులు ఒకేరోజు, ఒకేసారి మూడు వేర్వేరు దిశల నుండి ముజీఖ్‌కు చేరుకొని మెరుపుదాడి చేశారు.

ఈ దాడికి బెంబేలెత్తిపోయిన శత్రుసేనాపతి బుజైల్ పలాయనం చిత్తగించాడు. ఇతర నాయకులు, సైనికులు వేలాదిమంది ముజాహిద్‌ల చేతుల్లో హతమయ్యారు. ఆ మృతుల్లో గత్యంతరంలేక శత్రుపక్షంలో చేరిన ఇద్దరు ముస్లింలు కూడా ఉన్నారు. ఖలీఫా అబూబకర్ (రజి) ఈ సంగతి తెలుసుకోగానే వారిద్దరి వారసులకు రక్తపరిహారం చెల్లించ డంతో పాటు, వారి సంతానం పట్ల సద్భావనతో మసలుకోవాలని ఆదేశించారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) ఇంతకుముందే మాలిక్ బిన్ నవీరా (రజి) హత్యవిషయంలో ఖాలిద్ (రజి) పట్ల ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పుడీ ఇద్దరు ముస్లింలు కూడా ఆ జాబితాలో చేరిపోవడంతో ఆయన ఖాలిద్ (రజి)పై మరింత ఆగ్రహంతో ఉడికిపోయారు. అయితే ఖలీఫా (రజి) మాత్రం ఖాలిద్ (రజి)ని పల్లెత్తి మాట కూడా అనలేదు. పైగా "ఏ మనిషి అయినా బహుదైవారాధకులతో కలసివుంటే అతనికి ఇదే గతి పడ్తుంది" అన్నారాయన.

సేనాపతి ఖాలిద్ (రజి) ముజీఖ్‌లో మాత్రమే గాక ఇరాఖ్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా శత్రుసేనలను ఓడించారు. పోతే రజాబ్, ఫిరాజ్ ప్రాంతాల్లో బనూతుగ్లబ్, బనూ

తమిర్, బనూఅయాద్ తెగలు ముస్లింలకు వ్యతిరేకంగా రోమన్ల సహాయం కోరడంతో రోమ్‌సైన్యం ఫిరాత్ నది దగ్గరకు వచ్చి విడిదిచేసింది. ఈ సంగతి తెలియగానే ఖాలిద్ (రజి) ఫిరాత్ నదికి ఈవల వైపున్న ఫిరాజ్ ప్రదేశానికి చేరుకున్నారు. ఆ తరువాత రోమ్ సైన్యం నది దాటి ముస్లింసైన్యం సమీపానికి చేరుకొని విడిది చేసింది.

మరునాడుదయం రోమ్ క్రైస్తవులకు, అరబ్ ముస్లింలకు మధ్య యుద్ధం ప్రారంభ మయింది. ముస్లిం సైనికులు విరామం లేకుండా అనేక యుద్ధాల్లో పాల్గొని బాగా అలసి పోయి వచ్చారు. క్రైస్తవ సైనికులు తాజాదనంతో ఉరకలువేస్తూ వచ్చారు. అదీగాక వారి సంఖ్య ముస్లింసైనికులకు ఎనిమిది రెట్లకు పైగా ఉంది. అయినప్పటికీ ముస్లిం యోధులు ప్రాణాలకు తెగించి సాయంత్రం దాకా వీరోచితంగా పోరాడి విజయం సాధించారు. రోమ్ సైనికులు యుద్ధమైదానంలో దాదాపు లక్ష శవాలు వదలిపెట్టి పారిపోయారు. ఈ యుద్ధం ముగిసిన తర్వాత ఖాలిద్ బిన్ వలీద్ (రజి) హిజ్రీశకం 12వ ఏట జీఖాద 25వ తేదీన తన సైన్యాన్ని షజర బిన్ అలాగర్ నాయకత్వంలో 'హైరా'కు పంపి హజ్ చేయడానికి మక్కా వెళ్లిపోయారు.

హజ్‌యాత్ర నుండి హైరాకు తిరిగొచ్చి సైన్యంలో కలసిపోయారు. కాని ఖాలిద్ (రజి) హజ్‌కు వెళ్ళివచ్చిన సంగతి సైన్యంలో ఎవరికీ తెలియదు. అయితే ఈ రహస్యం ఎలాగో బయటపడి మెల్లిగా ఖలీఫా అబూబకర్ (రజి) చెవులకు ప్రాకింది. ఆయన వెంటనే ఒక లేఖలో ఖాలిద్ (రజి)కు గట్టిగా తాకీదుచేస్తూ "ఇకముందు ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని తీవ్రంగా హెచ్చరించారు. ఆ సంవత్సరం ఖలీఫా అబూబకర్ (రజి) కూడా హజ్‌యాత్ర జరిపారు. ఖాలిద్ బిన్ వలీద్ (రజి) హైరాకు తిరిగొచ్చి దాని చుట్టుపక్కల ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఆతర్వాత ఆయన ఈరాన్ రాజధాని మదాయెన్‌పై దాడిచేయాలనుకుంటే దానికి ఖలీఫా అనుమతి లభించలేదు. ఏమయినప్పటికీ ఈరానీయుల నుండి ప్రమాదం చాలావరకు తగ్గిపోయింది. పోతే రోమన్ల బెడద మాత్రం ఇంకా మిగిలివుంది.

## (12) ఎర్మూక్‌లో సైనికసమీకరణ, అజ్నాదీన్ యుద్ధం

సిరియాలో రోమన్లతోపాటు గస్సానీలు కూడా ఇస్లాంకు ముప్పుగా తయారైఉన్నారు. దైవప్రవక్త (స) కాలంలో ధర్మప్రచార లేఖ తీసికెళ్ళిన ప్రవక్తప్రతినిధిని గస్సాని రాజు చంపాడు. దానివల్ల 'మూతా'యుద్ధం జరిగింది. తర్వాత మళ్ళీ రోమన్లు, గస్సానీలు కలసి మదీనాపై దాడిచేయడానికి పూనుకున్నారని విని దైవప్రవక్త (స) 'తబూక్'కు వెళ్ళారు. కాని అప్పుడు వారు ముస్లింలతో తలపడటానికి సాహసించలేకపోయారు. ఆతర్వాత మరొకసారి సిరియాసరిహద్దుల్లో యుద్ధసన్నాహాలు చేస్తున్నారని తెలిసి దైవప్రవక్త (స) ఉసామా బిన్ జైద్ (రజి) నాయకత్వంలో సైన్యాన్ని పంపారు. ఆ సైన్యం దైవప్రవక్త (స) నిర్యాణం తరువాత అబూబకర్ (రజి) పాలన ప్రారంభకాలంలో వెళ్ళి క్రైస్తవసైనికుల్ని పారద్రోలి తిరిగొచ్చిన సంగతి గతపేజీల్లో మనం తెలుసుకున్నాం. కాని సిరియాలో శత్రువుల బెడద పూర్తిగా అంతంకాలేదు. అరేబియా, ఈరాన్, ఇరాఖ్‌లలో మతభ్రష్టుల ఆగడాలు; సిరియా సరిహద్దుల్లో మరొకసారి చెలరేగిన లక్షమంది రోమన్‌సైనికుల ముప్పు అంతమైనప్పటికీ



రోమ్‌చక్రవర్తి నుండి ప్రమాదం పూర్తిగా తప్పిపోలేదు. అతను సరిహద్దు రక్షణవ్యవస్థలను పటిష్ఠపరడంలో నిమగ్నుడైపోయాడు.

ఖలీఫా అబూబకర్ (రజి) రోమన్ల వ్యవహారం పట్ల అజాగ్రత్తగా లేరు. అదీగాక ముస్లింసేనలు ఈరాన్‌రాజ్యంలో మతభ్రష్టుల్ని, తిరుగుబాటుదారుల్ని దారికితెచ్చే పనుల్లో నిమగ్నమైఉన్నందున రోమన్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ అరేబియాలో దూరి ముస్లింలపై దాడిచేసే ప్రమాదం కూడా లేకపోలేదు. అందువల్ల ఆయన వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని ముందుజాగ్రత్త చర్యగా ఖాలిద్ బిన్ సయీద్ (రజి)కు (ఖాలిద్ బిన్ వలీద్ కాదు) ఒక సైనికదళమిచ్చి సిరియా సరిహద్దు సమీపంలోని "తైమా" ప్రాంతానికి పంపారు. ఆ సందర్భంలో ఖలీఫా అబూబకర్ (రజి) "నా ఆజ్ఞ రానంతవరకు, రోమన్లు కయ్యానికి కాలుదువ్వనంతవరకు నీవు యుద్ధం చేయకూడద"ని ఆదేశించారు.

ముస్లింలు మతభ్రష్టులపై చేస్తున్న దాడుల్ని రోమ్‌చక్రవర్తి అరబ్బుల అంతర్యుద్ధం అని ఆ అంతర్యుద్ధాగ్నికి వారంతటవారే ఆహుతిఅవుతారని భావించాడు. అంచేత అతను ఆనాడు అరబ్బులకు వ్యతిరేకంగా ఎలాంటి సైనికచర్య తీసుకోలేదు. కాని అక్కడ (యమన్, హజ్రెమౌత్, అమ్మాన్‌లలో) ముస్లింలు తిరుగుబాటుదారుల్ని అణచి విజయ పతాకాలు ఎగరవేసిన సంగతి తెలియగానే రోమ్‌చక్రవర్తి ఖంగుతిన్నాడు. వెంటనే అతను సిరియా సరిహద్దుప్రాంతాల్లో ఉన్న అరబ్‌తెగలను కలుపుకొని ఇస్లాంకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన సైన్యాన్ని సమీకరించి పెద్దఎత్తున యుద్ధసన్నాహాలు ప్రారంభించాడు.

తైమాలో సరిహద్దు రక్షణబలగంతో విడిదిచేసివున్న ఖాలిద్ బిన్ సయీద్ (రజి) రోమన్ల యుద్ధసన్నాహాల్ని గురించి ఖలీఫాకు లేఖ రాస్తూ, తన తదుపరి కర్తవ్యం తెలియ జేయమని అడిగారు. దానికి జవాబుగా ఖలీఫా "ఇప్పుడు నీవు ముందుకు పురోగమించ వచ్చుని, అయితే సరిహద్దు దాటి సిరియాలోకి ప్రవేశించకూడదని" ఆదేశించారు.

అయితే ఖాలిద్ (రజి) అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఖలీఫా ఆదేశాన్ని ఖాతరుచేయ కుండా రోమ్‌సేనలపై దాడిచేసి, వారిని వెంబడిస్తూ దేశంలో జొరబడి ముందుకుసాగారు. రోమ్‌సైనికులు వెనుదిరిగి పారిపోవడం నిజానికి వారి సేనాని పన్నిన యుద్ధతంత్రం. తర్వాత రోమ్‌సైనికులు దారిమార్చి వేరొకవైపు నుంచి వచ్చి ముస్లింలను చుట్టుముట్టారు. ఈదాడిలో ఖాలిద్ కొడుకుతో పాటు అనేకమంది ముస్లింలు చనిపోయారు. కొడుకు మరణంతో తీవ్ర ఆవేదన చెందిన ఖాలిద్ (రజి) యుద్ధభూమి నుండి పారిపోయి మదీనా సమీపంలోని 'జుల్మర్వా' ప్రదేశానికి చేరుకొని ఊపిరి పీల్చుకున్నారు. ఖలీఫా అబూబకర్ (రజి)కు ఈ సంగతి తెలిసి ఎంతో విచారం వెలిబుచ్చారు. "జరిగిందేదో జరిగింది; ఇప్పుడు నీ స్థానాన్ని వదలిపెట్టకు" అని తాకీదుచేస్తూ లేఖ రాశారు. ఆ సందర్భంలో ఆయన కొందరు సహచరుల ముందు "ఆరోజు నేను ఖాలిద్ విషయంలో ఉమర్, అబూఉబైదా ల మాట వినివుంటే ఈరోజు ఈ దుస్థితి వచ్చేదికాదు" అన్నారు.

ఖలీఫా ఇలా అనడానికి కారణం ఉంది. ఖాలిద్ బిన్ సయీద్ (రజి) దైవప్రవక్త(స) కాలంలో యమన్‌లోని సేనకు సైన్యాధికారిగా నియమించబడ్డారు. హజ్రత్ అబూబకర్

(రజి) ఖిలాఫత్ బాధ్యతలు చేపట్టిన రెణ్ణెల తర్వాత ఖాలిద్(రజి) మదీనా వచ్చి అలి(రజి), ఉస్మాన్(రజి)ల ముందు ఆయన ఖిలాఫత్ పదవి పట్ల తన అయిష్టత వ్యక్తపరిచారు. అప్పుడు అలి (రజి) ఆయనపై మండిపడుతూ "నోరు మూసుకో, అబూబకర్ ఖిలాఫత్ సరైనదే" అన్నారు. ఈ సంగతి ఉమర్ (రజి)కు తెలిసి ఖలీఫా, ఖాలిద్(రజి)ని సిరియాలో సైన్యాధికారిగా నియమించినపుడు అభ్యంతరం చెబుతూ ఖాలిద్‌ని ఆ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఖలీఫా ఖాలిద్‌ను ఆ పదవి నుండి పూర్తిగా తొలగించకుండా ఆయన్ని సరిహద్దు రక్షణబలగానికి అధికారిగా మాత్రం ఉండనిచ్చారు.

ఖాలిద్ (రజి) లేఖ అందిన వెంటనే ఖలీఫా అబూబకర్ (రజి) సలహామండలిని సమావేశపరచి, సిరియా దండయాత్ర ప్రాముఖ్యాన్ని వివరిస్తూ సభ్యుల అభిప్రాయాలు అడిగారు. అప్పుడందరూ మీరెలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి మేమంతా కట్టుబడి ఉంటాం అన్నారు. ఆ తర్వాత ఖలీఫా దేశంలోని వివిధప్రాంతాల నాయకులకు, తెగలకు సిరియా దండయాత్రలో పాల్గొనాలని లేఖలు రాశారు. దాంతో అనేక తెగలు ఎంతో ఉత్సాహంతో మదీనాకు చేరుకున్నాయి. చూస్తుండగానే మదీనాలో ముప్ఫయివేల మందితో కూడిన ఓపెద్ద సైనికపటాలం తయారయింది. ఖలీఫా దాన్ని నాలుగుదళాలుగా విభజించి ఒకదళానికి అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను, రెండవదళానికి అబూఉబైదా (రజి)ను, మూడవదళానికి యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి)ను, నాల్గవ దళానికి షర్జీల్ బిన్ హస్నా (రజి)ను సేనాపతులుగా నియమించి పంపారు.

ఈ సైనికదళాలకు మొదట వేర్వేరు దారుల గుండా నిర్ణీత ప్రాంతాలకు చేరుకోవాలని ఆజ్ఞయింది. కాని రోమ్‌సైన్యం ముస్లిం సైనికసంఖ్యకు ఎనిమిది రెట్లు ఉండటం వల్ల ముస్లిందళాలు కూడా ఒకే దళంగా మారి ఎర్మూక్ సమీపంలో విడిదిచేయాలని ఖలీఫా ఆదేశించారు. దాని ప్రకారమే ముస్లింసైన్యం ఎర్మూక్ చేరుకుంది.

ఎర్మూక్ అనేది వివిధ పర్వతాల గుండా ప్రవహిస్తూ జోర్డాన్‌నదిలో కలసిపోయే ఓ నది. ఆ రెండు నదుల సంగమం నుంచి దాదాపు నలభై మైళ్ళ దూరంలో 'వాఖూసా' పేరుతో మూడువైపుల కొండలతో కూడిన సువిశాలమైన మైదానం ఉంది. నాల్గవ వైపు ఎర్మూక్ నది ఉంది. రోమ్‌చక్రవర్తి తన సైనికుల్ని ఆ మైదానంలోనే సమీకరించాడు. ముస్లింలు నదిదాటి వారికి అభిముఖంగా ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. అయితే రెండు నెలలదాకా చెదురుమదురు సంఘటనలు తప్ప యుద్ధం జరగలేదు.

ఖలీఫా ఎర్మూక్ పరిస్థితి తెలుసుకొని ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు లేఖ రాస్తూ "ఇరాఖ్‌లో నీస్థానంలో ముస్నా (రజి)ను నియమించి వెంటనే నీవు సిరియాకు బయలుదేరు" అని ఆజ్ఞాపించారు. ఈ ఆజ్ఞతో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) కొంతసైన్యంతో సిరియా బయలుదేరారు. దారిలో కొన్ని అడ్డంకుల్ని అధికమిస్తూ 'బస్రీ' పట్టణానికి చేరుకున్నారు. బస్రీని అంతకుముందే షర్జీల్ బిన్ హస్నా (రజి), యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి)లు చుట్టుముట్టిఉన్నారు. కాని దాన్ని స్వాధీనం చేసుకోలేకపోయారు. ఖాలిద్ (రజి) రాగానే మెరుపు దాడిచేసి బస్రీ పట్టణాన్ని స్వాధీనంచేసుకున్నారు. ఈ దాడితో అక్కడి రోమ్ సేనాపతి 'రోమనస్' పట్నం లోపలిభాగంలోకి దూరి దాక్కున్నాడు.



'వాఖది' అనే చరిత్రకారుడి కథనం ప్రకారం రోమ్ సైన్యాధికారి 'రోమనస్' ప్రాచీన మతగ్రంథాలు అధ్యయనం చేసిన పండితుడైనందున అతను "రోమన్ల పతనం ఒక ప్రవక్త చేతిలో తప్పద"ని భావిస్తుండేవాడు. ఈసంగతి అతని జాతిప్రజలకు తెలియడంతో వారతడ్ని చంపడానికి ప్రయత్నించారు. అప్పుడు రోమనస్ మార్గాంతరంలేక ప్రాణభీతితో ఒక సైనికదళానికి నాయకత్వం వహించి ముస్లింసైన్యానికి ఎదురునిలిచాడు. అయితే ఓటమి తర్వాత అతను ముస్లింగా మారి ఇస్లాం పరిరక్షణ కోసం గొప్పసేవ చేశాడు.

ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఆతర్వాత సిరియా సరిహద్దుల్లో ప్రవేశించి అక్కడి పరిస్థితి గమనించి "సమరవ్యూహంరీత్యా ఎర్మూక్(వాఖూసా)ను యుద్ధభూమిగా చేయడం సమంజసంకాదని, శత్రువుని ఎల్లప్పుడూ పారిపోవడానికి అవకాశం ఉండేలా రణరంగాన్ని ఎంపికచేసుకొని యుద్ధం చేయడమే తెలివైన పద్ధతి అని భావించారు. అందువల్ల ఆయన 'వాఖూసా'కు బదులు డెమాస్కస్ వైపుకు బయలుదేరారు.

ఎర్మూక్ (వాఖూసా)లో రెండు నెలలపాటు రోమ్ సేనలను నిలువరించిన ముస్లిం సేనలు అక్కడ్నుంచి వేరే చోటికి కదిలాయి. అప్పుడు రోమ్‌చక్రవర్తి తన సైనికుల్ని అక్కడ్నుంచి తీసి "అజ్నాదీన్"లో సమీకరింపజేశాడు. అదీగాక క్రైస్తవ మతపండితులు, పాదరీలు, బిషప్పులు రాజ్యమంతటా పర్యటించి ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేషాగ్ని రగిలించారు. దాంతో ఇతరప్రాంతాల నుండి కూడా అనేక సైనికదళాలు అజ్నాదీన్‌కు రాసాగాయి. ఖాలిద్ (రజి)కు ఈ యుద్ధసన్నాహాల సంగతి తెలియగానే ఆయన ఆ సమాచారాన్ని ఖలీఫాకు చేరవేసి డెమాస్కస్‌కు బదులు అజ్నాదీన్‌కు బయలుదేరారు.

ఈ సమాచారం అందగానే ఖలీఫా అప్పుడే తన సైనికకార్యకలాపాలు ముగించుకొచ్చిన ఇక్రమా (రజి)ను ఖాలిద్ (రజి) సహాయం కోసం సిరియా పంపారు. ఖాలిద్ బిన్ వలీద్ (రజి) వివిధప్రాంతాల్లో పనిచేస్తున్న ముస్లిం సైనికాధికారులంతా అజ్నాదీన్‌కు చేరుకోవాలని లేఖలు రాశారు. దాని ప్రకారం అబూఉబైదా (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి), యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి), షర్జీల్ బిన్ హస్నా (రజి) తదితర నాయకులు తమతమ సేనలు తీసుకొని అజ్నాదీన్‌కు చేరుకున్నారు. అప్పుడు ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైనిక పునర్వ్యవస్థీకరణ చేసి అందరికీ తగిన ఆదేశాలు ఇచ్చారు.

ముస్లింలు సిరియా చేరుకున్నప్పుడు ప్రారంభంలో వారు 30వేల మంది మాత్రమే ఉన్నారు. తరువాత మరికొందరు నవముస్లింలు వచ్చి చేరడంతో వారి సైనికసంఖ్య 46 వేలకు చేరింది. అటు రోమ్‌సైనికుల సంఖ్య 2లక్షల, 40వేలకు చేరుకున్నది. సేనాపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దైవప్రవక్త (సల్లం) సంప్రదాయాన్ని అనుసరించే ఉద్దేశ్యంతో జుహర్ నమాజ్ తరువాత యుద్ధం ప్రారంభిద్దామని భావించారు. కాని రోమ్ సైనికులు దానికి ముందే ముస్లింలపై హఠాత్తుగా దాడిచేసి యుద్ధం ప్రారంభించారు.

మొదట్లో రోమ్‌సైన్యం ఒక్కసారిగా బాణాలవర్షం కురిపించడంతో ముస్లిం గుర్రాలు బెదిరిపోయి సైనికపంక్తులు చెదరిపోయాయి. ఆ తరువాత ముస్లింలు స్థిరంగా నిలబడి పోరాడటంతో రోమ్‌సైన్యం వెనక్కితగ్గింది. అలా రోమ్‌సైనికులు వెనుకంజవేస్తూ చివరికి

పలాయనం చిత్తగించారు. వారి సేనాపతి థియోడురస్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని హమస్‌కు పారిపోయాడు. రోమ్ చక్రవర్తి అతని పిరికితనానికి మండిపడ్తూ అతడ్ని పదవి నుండి తీసేశాడు. చివరికి ఆ అవమానంతోనే అతడు చనిపోయాడు.

హిజ్రీశకం 13వ ఏట జమాదివుస్సాని నెలలో జరిగిన ఈయుద్ధంలో రోమన్లు మూడు వేలమంది హతమయ్యారు. ముస్లింలక్కూడా అపార నష్టం జరిగింది. సేనాపతి ఖాలిద్ (రజి) విజయానంతరం ఈ శుభవార్త ఖలీఫాకు తెలియజేశారు. ఖలీఫా అబూబకర్ (రజి) ఆ లేఖ చదివి పరమానందభరితులవుతూ దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నారు.

## (13) అబూబకర్ (రజి) నిర్యాణం, రాజకీయవారసుడి ఎంపిక

ఇబ్నెసాద్, హాకింల ఉల్లేఖనాల ప్రకారం ఒకసారి ఖలీఫా అబూబకర్ (రజి), ఆయన సహచరుడు హజ్రత్ ఇబ్నెకల్దా (హారిస్)-(రజి) ఎవరో కానుకగా పంపిన పాయసం (హరీరా) తినసాగారు. కాస్సేపటి తరువాత హారిస్ (రజి) తినడం మానేసి "ప్రవక్త ప్రతినిధీ! ఈ పాయసం తినకండి, ఇందులో విషం ఉంది. దీని ప్రభావం ఒక సంవత్సరం తర్వాత కన్పిస్తుంది. నేను, మీరు ఒకే రోజు చనిపోతాం" అని అన్నారు. చివరికి ఒక సంవత్సరం తరువాత ఆ ఇద్దరూ ఒకేరోజు చనిపోయారు.

హిజ్రీశకం 13వ ఏడు, జమాదివుస్సాని నెలారంభంలో ఖలీఫా అబూబకర్ (రజి) వ్యాధిగ్రస్తులయ్యారు. 15 రోజులపాటు తీవ్రమైన జ్వరంతో బాధపడ్డారు. దాంతో తనకిక అంతిమఘడియలు సమీపించాయని భావించారు. అప్పుడాయన తన ముఖ్య అనుచరులను ఒకరి తర్వాత మరొకరిని పిలిపించి, తన రాజకీయ వారసుడి విషయంలో ఉమర్ ఫారూఖ్ (రజి) పట్ల వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) తన అభిప్రాయం చెబుతూ "ఆయన చాలా మంచివాడనడంలో సందేహం లేదు. కాకపోతే ఆయన స్వభావంలో కాఠిన్యత, ఉద్రేకాలు ఉన్నాయి" అని అన్నారు. దానికి అబూబకర్ (రజి) "ఖలీఫా బాధ్యతాభారం మీద పడితే అవన్నీ వాటంతటవే అంతమైపోతాయి"అన్నారు. ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి) మాట్లాడుతూ "అతని బాహ్యాచరణకంటే అతని అంతర్గతం శ్రేష్ఠమైనద"ని చెప్పారు. తర్వాత ఉసయ్యిద్ బిన్ హుజైర్ (రజి) మాట్లాడుతూ "నేను మీ తరువాత ఉమర్‌ని అత్యంత శ్రేష్ఠుడని భావిస్తున్నాను. అతని బాహ్యాచరణ కంటే అతని అంతర్గతం శ్రేష్ఠమైనది. మీ తర్వాత ఖిలాఫత్‌పదవికి అతనే అందరికంటే ఎక్కువ అర్హుడు" అని అన్నారు. మరికొందరు కూడా ఉమర్ (రజి)కు అనుకూలంగా తమ అభిప్రాయాలు వ్యక్తపరిచారు.

అయితే తల్హా బిన్ అబ్దుల్లా (రజి) వారందరికీ భిన్నంగా మాట్లాడుతూ "ఉమర్ ఎలాంటి ఉద్రేక స్వభావియో మీకు తెలుసు. అయినప్పటికీ మీరతడ్ని మీ రాజకీయ వారసునిగా చేస్తున్నారు. రేపు మీప్రభువు అడిగితే ఏమని సమాధానమిస్తారు?" అని అడిగారు. దీనికి అబూబకర్ (రజి) తీవ్రంగా స్పందిస్తూ "ఏమిటీ నీవు నన్ను నా ప్రభువుని గురించి భయపెడ్తున్నావా! ఆయన నన్నడిగితే 'దేవా! నేను నీ దాసులపై అందరికంటే అత్యంత శ్రేష్ఠుడైన నీదాసుడ్ని ఖలీఫాగా నియమించాన'ని చెబుతాను" అని అన్నారు.



హజ్రత్ ఉమర్ (రజి) ఉద్రేకం, కాఠిన్యతలు దైవధర్మం విషయాల్లోనే వ్యక్తమవుతాయి. సత్యం, న్యాయం వ్యవహారాల్లో ఆయన అబూబకర్ (రజి)ని కూడా ఖాతరు చేయరు. ఉదాహరణకు- ఓసారి ఖలీఫా దగ్గరకు ఇద్దరు నవముస్లింలు వచ్చి తమ ప్రాంతంలో నిరుపయోగంగా పడివున్న ఒక బీడుభూమిని తమకివ్వమని అడిగారు. అప్పుడు ఖలీఫా వారికా భూమికి సంబంధించి పట్టా రాసిచ్చారు. దానిపై ఆమోదముద్ర కోసం వారు ప్రధాన కార్యదర్శి, న్యాయాధికారి అయిన ఉమర్ (రజి) దగ్గరికి వచ్చారు. ఉమర్ (రజి) పట్టా దస్తావీజును చూడగానే దాన్ని చించివేస్తూ "ఇస్లాం బలహీనంగా ఉన్న రోజుల్లో దైవప్రవక్త (స) మిమ్మల్ని ఇలా సంతోషపెడ్తుండేవారు. కాని ఇప్పుడు ఇస్లాం శక్తిమంతమైపోయింది. మీరు చేయదలచుకున్నది చేసుకోండి" అని అన్నారు.

దాంతో ఆ నవముస్లింలిద్దరూ కోపంతో ఊగిపోతూ అబూబకర్ (రజి) దగ్గరకు తిరిగొచ్చి "ఖలీఫా మీరా? ఉమరా?" అనడిగారు. దానికి అబూబకర్ (రజి) "ఉమర్ కోరుకుంటే ఆయనే ఖలీఫా అయ్యేవాడు" అన్నారు. అప్పుడు వారు "సరేలెండి, మరో దస్తావీజు రాసివ్వండి" అన్నారు. అబూబకర్ (రజి) నిరాకరిస్తూ "ఉమర్ రద్దు చేసినదాన్ని నేను పునరుద్ధరించలేను" అన్నారు.

ఇలా ఈ సంభాషణ సాగుతుండగానే ఉమర్(రజి) కూడా వచ్చి "మీరీ భూభాగాన్ని వీరిద్దరికి ఎలా ఇచ్చారు? ఇది మీ సొంతమా లేక ప్రజలదా?" అనడిగారు. అబూబకర్ (రజి) ప్రజలదే అన్నారు. "అలాంటప్పుడు దాన్ని వీళ్ళకు ఇవ్వడానికి మీకేం అధికారముంది?" అని ప్రశ్నించారు ఉమర్ (రజి). "ఆ సమయంలో నా ముందు ఉన్నవారితో సంప్రదించిన తర్వాతే వీరికిచ్చాను" అన్నారు అబూబకర్ (రజి). చివరికి ఆయన తన నిర్ణయాన్ని మార్చుకొని ఉమర్ (రజి) తీర్పునే అమలుపరిచారు.

ఉమర్ (రజి) తన నిర్ణయాన్ని సైతం ఖాతరుచేయని ఉద్రేకపరుడని తెలిసి కూడా అబూబకర్ (రజి) ఆయన్నే తన రాజకీయ వారసుడిగా నిర్ణయించారు. ఇలా అధికసంఖ్యాకులు ఉమర్ (రజి)కు అనుకూలంగా సమాధానమివ్వడంతో అబూబకర్ (రజి) ఉస్మాన్ గనీ (రజి)ని పిలిపించి ఉమర్ ఫారూఖ్ (రజి)ను తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తూ వీలునామా రాయించారు. దాన్ని ప్రజలకు చదివి విన్పించమని చెప్పి తన సతీమణి సహాయంతో అతికష్టమ్మీద ఇంట్లోనుంచి బయటికి వచ్చారు. చూస్తే ఇంటిముందు జనం కిటకిటలాడసాగారు. అప్పుడాయన వారితో ఇలా మాట్లాడారు:

"నా తదనంతరం నేను ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి)ని నా వారసుడిగా, ఖలీఫాగా నియమించాను. నేను నాబంధువుల్లో ఎవర్నీ ఖలీఫాగా చేయలేదు; నాసొంత నిర్ణయంతో కూడా ఈపని చేయలేదు. మంచిసలహాలు ఇవ్వగలవారితో సంప్రదించిన తరువాతే నేనీ నిర్ణయం తీసుకున్నాను. మరి మీకు ఉమర్ (రజి) ఖలీఫా కావడం ఇష్టమేనా?"

ప్రజలు ఈమాట విని "మాకిష్టమే. మీ ఎంపిక మాకిష్టమే" అన్నారు ముక్తకంఠంతో. తరువాత అబూబకర్ (రజి) "అయితే మీరు ఉమర్ (రజి)కు పూర్తిగా విధేయులై అతను చెప్పినట్లు నడచుకోవాలి" అన్నారు. దానికి ప్రజలు ముక్తకంఠంతో తమ అంగీకారం తెలిపారు. ఆ తరువాత ఆయన ఉమర్ (రజి)ని సంబోధిస్తూ ఇలా అన్నారు:

"ఉమర్! నేను నిన్ను దైవప్రవక్త (స) అనుచరులపై నా ప్రతినిధిగా నియమించా. కనుక నీవు ఎల్లప్పుడూ దేవునికి భయపడుతూ ఉండాలి. రాత్రివేళకు సంబంధించిన దేవుని హక్కులు కొన్ని ఉన్నాయి. వాటిని ఆయన పగటివేళ స్వీకరించడు. అలాగే పగటి వేళకు సంబంధించిన కొన్ని హక్కులున్నాయి. వాటిని ఆయన రాత్రివేళ స్వీకరించడు. విధిగా పాటించవలసిన (ఫరజ్) సత్కార్యాలను నిర్వహించనంతవరకు దేవుడు ఐచ్ఛిక (నఫిల్) సత్కార్యాలను ఆమోదించడు. ఉమర్! గుర్తుంచుకో. ప్రళయదినాన ఎవరి సత్కర్మలు బరువుగా ఉంటాయో వారికే మోక్షం లభిస్తుంది. సత్కర్మలు తక్కువగా ఉన్న వారు ఆపదల్లో చిక్కుకుంటారు. ఖుర్ఆన్ ప్రకారం నడచుకునే సదాచారులకే ముక్తి మార్గం లభిస్తుంది. ఉమర్! ఖురఆన్‌లో నరకవాసుల ప్రస్థావన వచ్చినపుడు నీవు 'దేవా! నన్ను నరకవాసుల్లో చేర్చకు' అని వేడుకో. స్వర్గవాసుల ప్రస్థావన వచ్చినపుడు 'దేవా! నన్ను స్వర్గవాసుల్లో చేర్చు' అని ప్రార్థించు. ఉమర్! నీవు నాయీ హితవచనాల ప్రకారం నడచుకుంటే నన్ను నీ దగ్గరే ఉండేటటువంటి అనుభూతి పొందగలుగుతావు."

హజ్రత్ అబూబకర్ (రజి) జీవిత చరమఘడియలు సమీపించాయి. ఇరాఖ్‌లోని హీరా నుండి ముస్నా బిన్ హారిసా (రజి) మదీనాకు తిరిగొచ్చి ఈరాన్ సేనాపతులు, మంత్రులు, సామంతరాజులు, వివిధ తెగల నాయకులు ముస్లింలకు వ్యతిరేకంగా ఏకమై భారీఎత్తు సైన్యంతో కయ్యానికి కాలుదువ్వుతున్నారని తెలిపారు. ఖలీఫా అబూబకర్ (రజి) ఓపిగ్గా ఈసంగతి విని ఉమర్ ఫారూఖ్ (రజి)తో "నీవు ముస్నా (రజి) సేనకు సహాయంగా తక్షణమే ఒక దళాన్ని తయారుచేసి పంపించు" అని చెప్పారు.

ఉమర్ (రజి) ఈమాట విన్న తర్వాత బయటికి వెళ్ళిపోయారు. అబూబకర్ (రజి) ఆ తర్వాత ఖలీఫాగా ఉమర్ (రజి) శ్రేయోసంక్షేమాల కోసం, ప్రజల శ్రేయస్సు-సద్వర్తనల కోసం దైవాన్ని కడుదీనంగా ప్రార్థించారు. ఈప్రార్థన ముగిసిపోగానే ఆయన ఆత్మ అనంత వాయువుల్లో కలసిపోయింది. హిజ్రీశకం 13వ సంవత్సరం, జమాదివుస్సాని 23వ తేదీన మగ్రిబ్, ఇషా వేళలమధ్య 63ఏండ్ల వయస్సులో ఆయన ఇహలోకం వీడిపోయారు. రెండేళ్ళ ఆర్నెల్లపాటు నిర్విరామంగా ఇస్లామీయ వెలుగురవ్వలు వెదజల్లిన ఓ నేలతార నింగికెగిసింది. యావత్తు ముస్లింజగత్తు కన్నీటిసంద్రంలో మునిగిపోయింది.

ఖలీఫా అబూబకర్ (రజి) మరణవార్త వినగానే అలి కరముల్లా వజ్‌హూ (రజి) భోరున విలపించారు. వెంటనే ఆయన ఇంటికి పరుగెత్తి విలపిస్తూనే ఆయన్ని పరిపరి విధాల ప్రశంసిస్తూ కన్నీటినివాళులు అర్పించారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ విషాదవార్త విని "మహానుభావా! నీవు నీ తదనంతరం ముస్లింసముదాయాన్ని దుర్భరమైన ఆపదల్లోకి నెట్టివేశావు. నేను నీ కాలిధూళి స్థాయికూడా చేరుకోలేని బలహీనుడ్ని. నేను ఏ విషయం లోనూ నీకు సమానంగా పనిచేయలేను. నాయీ బలహీన భుజస్కంధాలపై నేను మోయలేని (పరిపాలనా)భారం మోపివెళ్ళావు" అని అన్నారు శోకతప్త హృదయంతో.

ప్రాణం పోయిన రోజే ఇషానమాజ్ వేళకుముందు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) భౌతికకాయాన్ని ఖననం చేయడం జరిగింది. అనుచరులు ఆయన మృతి పట్ల కన్నీరు మున్నీరుగా దుఃఖిస్తూ తుదివీడ్కోలు పలికారు.



# 32. ఉమర్ (రజి) ఖిలాఫత్ పాలన

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) దైవప్రవక్త (స) అనుచరుల్లో అబూబకర్ సిద్దీఖ్ (రజి) తరువాత అత్యంత ప్రియమైన అనుచరుడిగా ఖ్యాతిచెందారు. 'ఫారూఖ్' అనేది దైవప్రవక్త (స) ఆయనకు ప్రదానం చేసిన బిరుదు. ఉమర్ ఫారూఖ్ (రజి) గుర్రపుస్వారీలో, మల్ల యుద్ధంలో ఆరితేరిన వీరుడు. మహనీయ ముహమ్మద్ (స)కు ప్రవక్త పదవి లభించే నాటికి ఖురైష్ తెగలో మొత్తం పదిహేడు మంది మాత్రమే చదవను, వ్రాయను తెలిసిన వారుండేవారు. వారిలో ఖత్తాబ్ కుమారుడు ఉమర్ ఫారూఖ్ (రజి) కూడా ఒకరు.

## (1) ఉమర్ (రజి) ఘనతా, ఔన్నత్యాలు

ఖురైషీలందరిల్లో ఉమర్ (రజి) గొప్ప సాహసవీరుడు. ఆయన ధైర్యానికి, పట్టుదలకు ప్రతీక; అనుకున్నది సాధించేవరకు విశ్రమించని ధీశాలి. ఇబ్నెసాద్(రజి) ప్రకారం "ఉమర్ (రజి) ముస్లింకాగానే ఇస్లాం బహిర్గతమయింది. మేము కాబా చుట్టు కూర్చోవడం, దాని ప్రదక్షిణ చేయడం, బహుదైవారాధకుల నుండి బదులు తీర్చుకోవడం, వారికి జవాబివ్వడం ప్రారంభించాం." ఇబ్నెఅబ్బాస్ (రజి) ప్రకారం, ఉమర్‌ఫారూఖ్ (రజి) ఇస్లాం స్వీకరించిన రోజు అవిశ్వాసులు "ముస్లింలు మన నుండి పూర్తి బదులు తీర్చుకున్నార"ని అన్నారు. హుజైఫా (రజి) ప్రకారం "ఉమర్ ఫారూఖ్ (రజి) ఇస్లాం స్వీకరించిన నాటినుంచి ఇస్లాం ఒక్కొక్క మెట్టు పైకెక్కిపోయే మనిషిలా అడుగడుగునా వృద్ధిచెందుతూపోయింది. అయితే ఆయన అమరగతి పొందినప్పటి నుంచి ఇస్లాం ప్రతి అడుగూ వెనక్కిపోతోంది."

ఇబ్నెఅసాకర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం అలి కరముల్లా వజ్‌హూ (రజి) ఇలా తెలిపారు: "(మాలో) ప్రతివ్యక్తీ 'హిజ్రత్' రహస్యంగా చేశాడు. అయితే ఉమర్ (రజి) హిజ్రత్ చేయ డానికి నిర్ణయించుకున్నప్పుడు ఆయన ఒక చేతిలో వరలేని ఖడ్గం, మరొక చేతిలో విల్లు, వీపుపై అంబులపొది తీసుకొని కాబాకు వెళ్ళి దాని చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ చేశారు. తరువాత 'మఖామె ఇబ్రాహీం' దగ్గర నిల్చొని రెండు రకాతులు నమాజ్ చేశారు. ఆ తరువాత ఖురైష్‌నాయకులు కూర్చున్న చోటికెళ్ళి, వారిని పేరు పేరున సంబోధిస్తూ 'నీ ముఖం మాడ! నువ్వు నీ తల్లిని తనయులులేనిదై చేయాలనుకుంటే, నీ భార్యని వితంతువు చేయదలిస్తే నన్ను ఎదిరించు' అని అన్నారు. ఈ మాటలు విన్న తర్వాత వారిలో ఎవరూ ఆయన్ని నిరోధించడానికి సాహసించలేకపోయారు."

దైవప్రవక్త (స) ఓరోజు ఉమర్ (రజి)తో మాట్లాడుతూ "దైవసాక్షిగా చెబుతున్నాను. నీవు ఏ దారిన నడిస్తే ఆ దారిన షైతాన్ ఏమాత్రం నడవలేడు; వాడా దారి తప్పించి వేరే దారిన నడుస్తాడు" అని అన్నారు. మరొక సందర్భంలో దైవప్రవక్త (స) మాట్లాడుతూ "నా తదనంతరం ఎవరైనా దైవప్రవక్త కాగలిగితే అతను ఉమర్ (రజి) మాత్రమే అవుతాడు" అని అన్నారు. ఇబ్నెమస్‌వూద్ (రజి) కథనం ప్రకారం ఉమర్ ఫారూఖ్ (రజి) గొప్పతనం నాలుగు విషయాల ద్వారా వ్యక్తమవుతుంది. (1) బదర్ యుద్ధఖైదీలను హతమార్చాలని ప్రతిపాదించారు ఆయన. తరువాత దానికి అనుకూలంగా 'లౌలా కితాబున్ మినల్లాహి' అనే దైవసూక్తి వెలువడింది. (8:68 సూక్తి చూడండి.) (2) విశ్వాసుల మాతృమూర్తులు

పరదా పాటిస్తే బాగుంటుందని అన్నారాయన. దానిపై పరదా సూక్తి అవతరించింది. (33:59 సూక్తి చూడండి.) అప్పుడు ఉమర్ (రజి)తో 'వహీ (దివ్యావిష్కృతి) మా ఇంట్లో అవతరిస్తుంది. అయితే దానికి ముందే నీకా విషయం మహిమాన్వితంగా తెలిసిపోతుంది' అని చెప్పబడింది. (3) దైవప్రవక్త (స) తరచుగా 'దేవా! ఉమర్ (రజి)ని ముస్లింగా చేసి ఇస్లాంకు సహాయం చెయ్యి' అని ప్రార్థించేవారు. (4) అబూబకర్ (రజి)ని ఖలీఫాగా అంగీకరిస్తూ ఉమర్ (రజి) అందరికంటే ముందు బైత్ (ప్రమాణం) చేశారు.

ముజాహిద్ (రజి) కథనం: "మేము తరచుగా 'ఉమర్ (రజి) ఖిలాఫత్ పాలనలో షైతానులు బంధించబడ్డారని, ఆయన మరణించిన తరువాత వారు బంధవిముక్తులయ్యారని' చెప్పుకునేవాళ్ళం." ఒకసారి అబూఉసామా (రజి) ఇలా అన్నారు: "అబూబకర్ (రజి), ఉమర్ (రజి)లు ఎవరో మీకు తెలుసా? వారిద్దరు ఇస్లాంకు తల్లిదండ్రుల్లాంటివారు."

హిజ్రీశకం 13వ ఏట, జమాదివుస్సాని మాసం 23వ తేదీన ఖలీఫా అబూబకర్ (రజి) నిర్యాణంచెందిన రోజే ముస్లింలంతా ఏకగ్రీవంగా ఉమర్ (రజి)ని ఖలీఫాగా ఆమోదిస్తూ 'బైత్' (ప్రమాణం) చేశారు. అప్పుడు రాజ్యంలోని వివిధప్రాంతాల నుండి అనేకమంది ప్రజాప్రతినిధులు వచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ దైవమార్గంలో పోరాటం కోసం వారిని ఉత్తేజపరిచారు. అయితే ఖాలిద్ బిన్ వలీద్ (రజి) లేకుండా ఇరాఖ్‌పై విజయం సాధించలేమన్న భావనతో ఎవరూ ఆయన ప్రసంగానికి స్పందించలేదు. ఈవిధంగా ఆయన మూడు రోజులు ప్రసంగించినా ఎవరూ నోరు విప్పలేదు. చివరికి నాల్గవ రోజు చేసిన ప్రసంగంతో శ్రోతల్లో స్పందన వచ్చింది.

వెంటనే ముస్నా బిన్ హారిసా (రజి) లేచి "సోదరులారా! మీరు ఈరానీయులకు భయపడనవసరం లేదు. వారు రణరంగంలో ఆరితేరిన మగధీరులు కారు. మనం ప్రతి యుద్ధంలోనూ వారిని ఓడించగలిగాం. ఈరాఖ్‌లో వారి సారవంతమైన అనేక ప్రాంతాల్ని మనం వశపరచుకున్నాం. ఇప్పుడు వారు మనకు అణగిపోయారు" అని చెప్పారు.

అప్పుడు సఖీఫ్ తెగ నాయకుడు హజ్రత్ అబూఉబైదా బిన్ మస్‌వూద్ ముందుకొచ్చి "నేనీ పని కోసం సిద్ధంగా ఉన్నాను" అన్నారు. ఆయన మాటలు వినగానే సభికులందరికీ ధైర్యం వచ్చి "మేము కూడా ఇరాఖ్ వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాం" అన్నారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) వారిలో వేయిమంది యోధుల్ని ఎంపికచేసి, వారికి అబూఉబైదాను సేనాపతిగా నియమించారు.

హజ్రత్ అబూఉబైదాకు దైవప్రవక్త (స) సహచరభాగ్యం లభించలేదు. అంటే ఆయన సహాబీ (ప్రవక్త ప్రత్యక్ష అనుచరుడు) కాదు. అందువల్ల కొందరికి ఆయన నాయకత్వం నచ్చలేదు. వారిలో ఒకతను "ఉమర్! సైన్యంలో వందలాది మంది సహాబీలు ఉన్నారు. వారికి సేనాపతి సహాబీ అయితేనే మంచిది" అని అన్నాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని సహాబీల వైపు చూస్తూ "మీకు సాహసం, స్థిరత్వాల కారణంగానే ఔన్నత్యభాగ్యం లభించింది. ఇప్పుడా భాగ్యం మీరు పోగొట్టుకున్నారు. శత్రువులతో పోరాడటానికి సాహసించలేనివారిని సైన్యాధికారులుగా నియ



మించడం ఎట్టి పరిస్థితిలో కూడా కుదరదు" అని అన్నారు. ఆ తర్వాత ఆయన అబూఉబైదా వైపుతిరిగి "నీవు వీళ్ళను గౌరవిస్తూ ఉండాలి. ప్రతి వ్యవహారంలోనూ వారి సలహాలు తీసుకోవాలి" అని ఉపదేశించి ఇరాఖ్‌కు పంపివేశారు.

దైవప్రవక్త (స) జీవిత చరమదశలో (యమన్‌లోని) నజ్రాన్‌లో ముస్లింలు మాత్రమే ఉండాలని, అక్కడున్న యూదుల్ని, క్రైస్తవుల్ని వేరే ప్రాంతానికి తరలించాలని అన్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) తన పాలనలో మతభ్రష్టుల బెడదను నిర్మూలించడంలో నిమగ్నులై ఉన్నందున ఆయనీ పని చేయలేకపోయారు. ఇప్పుడా బెడద తొలగిపోవడంతో ఖలీఫా ఉమర్ (రజి) ఆ పని కోసం లాయిలా బిన్ ఉమయ్యా (రజి)ను యమన్‌కు పంపించారు.

**నజ్రాన్ క్రైస్తవుల దేశబహిష్కరణ :** ఖలీఫా ఆజ్ఞ ప్రకారం లాయిలా బిన్ ఉమయ్యా (రజి) నజ్రాన్‌కు వెళ్ళి అక్కడి క్రైస్తవులతో ఇలా అన్నారు: "మీరీ దేశం వదలి వెళ్ళిపోవాలి. మీకు మేము అరేబియా బయట ఇక్కడి భూములకంటే సారవంతమైన, విశాలమైన భూములుండే సిరియాదేశం పోవడానికి అనుమతినిస్తున్నాం. మీ సిరిసంపదలు, శరీరాలు ఎలాంటి శ్రమకు, నష్టానికి గురికానియ్య దలచుకోలేదు మేము. అరేబియా ఇప్పుడు ముస్లింలకు మాత్రమే ప్రత్యేకించబడింది. మీరిక్కడ ఉండటం ఏమాత్రం కుదరదు."

నజ్రాన్ క్రైస్తవుల్ని అరేబియా నుండి వేరే ప్రాంతానికి పంపడానికి కారణం వారు వడ్డీవ్యాపారం మానుకుంటామని ముస్లింలతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అదీగాక ముస్లింలకు వ్యతిరేకంగా కవ్వింపుచర్యలకు పాల్పడుతున్న రోమన్లకు వారు లోలోన సహాయసహకారాలు అందజేస్తున్నారు.

## (2) డెమాస్కస్, బీరుత్, హమస్‌లలో విజయకేతనం

రోమ్‌సైనికులు అజ్నాదీన్‌లో పరాజయం చవిచూడగానే రోమ్‌చక్రవర్తి హెర్క్యులస్ తన సైనికుల్ని డెమాస్కస్‌లో సమీకరించి, వారికి సహాయపడేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూడా అనేక సైనికదళాలను పంపించాడు. అయితే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆదేశం ప్రకారం సేనాపతి అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోమ్‌సైనికుల్ని అడ్డుకోవడానికి డెమాస్కస్‌కు వచ్చే మార్గాలలో నాలుగు దళాలు ఉంచి, ఒక దళం తీసుకొని డెమాస్కస్‌కు చేరుకున్నారు. ఆయన దారిలో గౌతాప్రాంతాన్ని జయించి హిజ్రీశకం 13వ ఏట, రజబ్ నెలలో డెమాస్కస్ పట్టణాన్ని ముట్టడించారు.

రోమ్‌సైనికులు ముస్లిం యోధుల్ని చూడగానే కోట తలుపులు మూసుకొని బురుజుల పైనుండి రాళ్ళు విసరడం, బాణాలు విడువడం ప్రారంభించారు. ముస్లింలు వాటికి తగిన సమాధానమివ్వసాగారు. ఇలా ఈ ముట్టడి ఆర్నెల్లపాటు కొనసాగింది. హెర్క్యులస్ డెమాస్కస్‌లోని తన సైనికుల్ని ఆదుకోవడానికి ఇతర ప్రాంతాల నుండి పంపిన సైనికుల్ని ముస్లిం యోధులు అడ్డుకున్నారు. దాంతో డెమాస్కస్‌లోని రోమన్లు పూర్తిగా నిరాశచెంది కాళ్ళబేరానికి రావడానికి నిర్ణయించుకున్నారు. మరోవైపు సేనాపతి అబూఉబైదా (రజి) ముట్టడిని మరింత పొడిగించడం సమంజసం కాదని తలచి, రేపే పట్టణంపై మూకుమ్మడి దాడి చేయాలని సైనికుల్ని ఆదేశించారు. ఈ సంగతి తెలుసుకున్న పట్టణప్రముఖులు

కొందరు 'తూమా' ద్వారం వెలుపల ఉన్న దళపతి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దగ్గరకు వచ్చి తమకు ప్రాణరక్షణ హామీ ఇవ్వవలసిందిగా అర్థించారు. ఖాలిద్ (రజి) వారి విన్నపాన్ని స్వీకరించి ఈవిధంగా ప్రాణరక్షణ హామీపత్రం రాసిచ్చారు:

"ఖాలిద్ (రజి) డెమాస్కస్ వాసులకు ఈ క్రింది రాయితీలు ఇచ్చాడు- ఇస్లాం సైన్యం డెమాస్కస్‌లో ప్రవేశిస్తున్నప్పుడు నగరవాసుల ధనప్రాణాలకు రక్షణ ఉంటుంది. వారి చర్చీల జోలికి పోవడంగాని, డెమాస్కస్ పట్టణాన్ని ధ్వంసం చేయడంగాని, వారి ఇళ్ళను కూల్చివేయడంగాని జరగదు. ఇస్లాం సైన్యానికి చెందిన ఏ మనిషీ నగరవాసులకు చెందిన ఏ ఇంటినీ ఆక్రమించుకోవడం జరగదు. డెమాస్కస్ వాసులు జిజ్యా చెల్లిస్తున్నంత కాలం ముస్లింలుగాని, వారి ఖలీఫాగాని నగరవాసుల పట్ల మంచిగా తప్ప చెడుగా ప్రవర్తించరు."

ఈ హామీపత్రం రాసిచ్చిన తర్వాత ఆయన దాడిచేయకుండా నగరంలో ప్రవేశించారు. అయితే అదే సమయంలో వేరొక వైపు నుండి సర్వసేనాని అబూఉబైదా (రజి) అధీనంలోని సైనికదళం నిచ్చెనలు వేసి, కోటతలుపులు విరగ్గొట్టి, యుద్ధంచేస్తూ నగరంలో ప్రవేశించింది. నగరం మధ్యలో ఇద్దరు సేనాపతులు కలుసుకున్నారు. అప్పుడు అబూఉబైదా (రజి) "మేము ఖడ్గబలంతో నగరాన్ని జయించాం" అన్నారు. ఖాలిద్ (రజి) ఈమాట విని "మేము శాంతిఒప్పందం ద్వారా నగరాన్ని స్వాధీనం చేసుకున్నాం" అన్నారు.

అప్పుడు కొందరు సైనికులు మాట్లాడుతూ "ఖాలిద్ సర్వసేనాని కాదు గనక అతని ఒప్పందాన్ని ధర్మసమ్మతమైనదిగా భావించకూడదు" అన్నారు. ఈ అభిప్రాయాన్ని సర్వసేనాని అబూఉబైదా (రజి) నిరాకరిస్తూ "కాదు, ముస్లింలలో ఒక సాధారణ సైనికుడు సైతం శత్రువులతో ఒప్పందం చేసుకుంటే దాన్ని ముస్లింలందరూ సమ్మతించవలసి ఉంటుంది. కాబట్టి ఖాలిద్ చేసుకున్న ఒప్పందం ధర్మసమ్మతమైనదిగానే భావించబడుతుంది" అని అన్నారు. "అయితే నగరంలో అర్ధభాగం ఒప్పందం ద్వారా, మిగిలిన అర్ధభాగం ఖడ్గబలం ద్వారా జయించబడినట్లు పరిగణిద్దాం" అన్నాడు మరొక సైనికుడు. సేనాపతి అబూఉబైదా (రజి) దాన్ని కూడా నిరాకరిస్తూ "కాదు, మొత్తంనగరం ఖాలిద్ ఒప్పందం ప్రకారమే జయించ బడినట్లు పరిగణించబడుతుంది" అని అన్నారు.

చివరికి ఆ ఒప్పందం ప్రకారమే ఆచరించడం జరిగింది. ముస్లింలు నగరవాసులకు ఎలాంటి ఇక్కట్లకు, ఇబ్బందులకు గురిచేయలేదు. సేనాపతి అబూఉబైదా (రజి) డెమాస్కస్ పాలకుడిగా యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి)ని నియమించి, రోమ్‌సైనికుల్ని నగరం నుంచి తమ ఇష్టమొచ్చిన ప్రాంతానికి వెళ్ళిపోయేందుకు అనుమతించారు.

ఈ యుద్ధంలో కొందరు ముస్లింలు రోమన్లకు పట్టుబడ్డారు. వారిలో అబ్దుల్లా బిన్ హుజాఫా సెహ్మీ (రజి) కూడా ఉన్నారు. రోమ్‌సైనికులు వారందర్నీ తీసికెళ్ళి తమ చక్రవర్తి ముందు ప్రవేశపెట్టారు. చక్రవర్తి ఆయన్ని ఎగాదిగా చూసి "నువ్వు మామాట విని ఇస్లాం వదిలేసి క్రైస్తవం స్వీకరిస్తే మేము నిన్ను విడుదలచేయడమే గాక ఎంతో గౌరవమర్యాదలు జరుపుతాం" అని అన్నాడు. దానికి అబ్దుల్లా (రజి) అతనివైపు నిర్లక్ష్యంగా చూస్తూ "అలా ఎన్నటికీ జరగదు. దానికంటే మృత్యువే నాకు వేయి రెట్లు మంచిది" అని అన్నారు.



"చూస్తే నువ్వు చాలా తెలివిగలవాడిగా కన్పిస్తున్నావు. నువ్వు మామాట విని క్రైస్తవం స్వీకరిస్తే మేము నీకు మా పాలనాధికారంలో ఉన్నత స్థానం కల్పిస్తాం" అన్నాడు చక్రవర్తి.

సంకెళ్ళతో బంధించబడిన అబ్దుల్లా బిన్ హుజాఫా (రజి) ఓ చిరునవ్వు నవ్వి అంత లోనే గంభీరంగా మారిపోయి "దైవసాక్షిగా చెబుతున్నాను. నీవు నీ సామ్రాజ్యమంతా నాకు కట్టబెట్టినా సరే, నేను ముహమ్మద్ (స) ధర్మం నుండి ఒక్క క్షణమైనా వెనక్కి మరలే ప్రసక్తి లేదు" అని అన్నారు.

"అయితే నిన్ను పైకి పంపక తప్పదు" అన్నాడు చక్రవర్తి బెదిరిస్తూ.

దానికి అబ్దుల్లా బిన్‌హుజాఫా (రజి) "నీ ఇష్టమొచ్చినట్లు చేసుకో" అన్నారు నిర్లక్ష్యంగా.

అప్పుడు రోమ్‌చక్రవర్తి ఆయన్ని ఒక స్తంభానికి కట్టివేయించి ఆయన రెండు చేతుల వైపు బాణాలు విడువమని ఓ సైనికుడ్ని ఆదేశించాడు. శరాఘాతంతో ఒక చేయి తెగిపడిన తరువాత "ఇప్పటికైనా మించిపోయిందిలేదు; క్రైస్తవం స్వీకరించు, నిన్ను వదిలేస్తాం" అన్నాడు. దానికి అబ్దుల్లా (రజి) తీవ్రగా నిరాకరించారు.

అప్పుడు రోమ్‌చక్రవర్తి ఒక పెద్ద తొట్టి తెప్పించి, అందులో నూనె పోయించి, దాన్ని మండుతున్న పొయ్యి మీద పెట్టించాడు. తర్వాత ఓ ముస్లిం ఖైదీని అందులో పడవేయమని తన సైనికుల్ని ఆదేశించాడు. వారలా చేయగానే ఆ ముస్లింఖైదీ శరీరం పూర్తిగా కాలిపోయి ఎముకలు బయటికొచ్చాయి. అప్పుడు రోమ్‌చక్రవర్తి అబ్దుల్లా (రజి) వైపు తిరిగి ఇప్పుడైనా క్రైస్తవమతం స్వీకరిస్తావా? లేకుంటే నీకూ అదే గతిపడ్తుంది" అని అన్నాడు. దానికి అబ్దుల్లా (రజి) ఇంతకుముందు కంటే తీవ్రంగా నిరాకరించారు.

దాంత రోమ్‌చక్రవర్తి ఆగ్రహోదగ్రుడై "ఇతడ్ని కూడా ఆ మరుగుతున్న నూనెలో ఎత్తి పడేయండి" అని సైనికుల్ని ఆజ్ఞాపించాడు. వెంటనే సైనికులు అబ్దుల్లా (రజి)ను మరుగు తున్న నూనెతొట్టి వైపుకు లాక్కెళ్ళారు. అలా లాక్కెళ్తుంటే అబ్దుల్లా (రజి) అప్రయత్నంగా కంటతడి పెట్టారు. సైనికులు అది గమనించి "ఇతను ఏడుస్తున్నాడ"ని చక్రవర్తితో అన్నారు. చక్రవర్తి ఆశతో ఆయన్ని తన దగ్గరకు తీసుకురమ్మన్నాడు. సైనికులు అబ్దుల్లా (రజి)ను వెనక్కి తీసుకొచ్చి చక్రవర్తి ముందు నిలబెట్టారు. అప్పుడు చక్రవర్తి "ఇప్పుడు నువ్వు క్రైస్తవమతం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నావా?" అని అడిగాడు. దానికి అబ్దుల్లా (రజి) ఏమాత్రం సిద్ధంగా లేనంటూ మరొకసారి వ్యతిరేకించారు. "మరైతే ఎందుకు ఏడుస్తున్నావ"ని అడిగాడు చక్రవర్తి. దానికి అబ్దుల్లా బిన్ హుజాఫా (రజి) ఇలా సమాధానమిచ్చారు:

"నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. ఇప్పుడు మీరు నన్ను మరుగుతున్న ఈ నూనెలో పడవేస్తారు. క్షణంలో నాప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోతుంది. కాని నేను కోరుకునేది అది కాదు. నా దేహంలో ఎన్ని వెంట్రుకలున్నాయో అన్ని ప్రాణాలు గనక ఉంటే వాటన్నిటిని దైవమార్గంలో బలిచేయాలని ఉంది. కాని నా దేహంలో ఒక్క ప్రాణం మాత్రమే ఉందే! ఈ ఆలోచనే నన్ను కంటతడి పెట్టించింది."

రోమ్‌చక్రవర్తి ఆ మాటలకు దిమ్మెరపోయి చూస్తూ "అలాగానా! సరేపోనీ, ఓసారి నా నుదుటిని ముద్దాడగలవా? అలా చేస్తే నేను నిన్ను విడుదల చేస్తాను" అని అన్నాడు.

అబ్దుల్లా (రజి) ఈమాట విని "నాతో పాటు ఇతర ఖైదీల్ని కూడా విడిచిపెడ్తావా?" అనడిగారు. చక్రవర్తి "తప్పకుండా నీతోపాటు నీ సహఖైదీలందర్నీ వదిలేస్తాం" అన్నాడు.

అప్పుడు అబ్దుల్లా (రజి) ఓక్షణం ఆలోచించి చక్రవర్తి దగ్గరకు వెళ్ళి అతని నుదుటిని ముద్దాడారు. ఆ వెనువెంటనే రోమ్‌చక్రవర్తి ముస్లింఖైదీలందర్నీ విడుదలచేసి పంపేయమని సైనికుల్ని ఆదేశించాడు. సైనికులు ఆయన ఆజ్ఞను పాటించారు.

ఈవిధంగా అబ్దుల్లా (రజి) రోమన్ల కబంధహస్తాల నుండి విడుదలైన తరువాత మదీనా చేరుకొని ఖలీఫా ముందు ఈ ఉదంతం గురించి వివరించారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈ వృత్తాంతం విని పరమసంతోషంతో అబ్దుల్లా (రజి)ను ఆలింగనం చేసుకున్నారు. తరువాత "ఇప్పుడు ప్రతి ముస్లింకు అబ్దుల్లా బిన్ హుజాఫా నుదుటిని ముద్దాడే హక్కుంది. ఈ హక్కును ముందుగా నేనే వినియోగించుకుంటున్నాను" అంటూ ఉమర్ ఫారూఖ్ (రజి) అబ్దుల్లా (రజి) నుదుటిని ముద్దాడారు.

సిరియాలో ఆరు జిల్లాలు ఉన్నాయి. వాటిలో డెమాస్కస్, హమస్, జోర్డాన్, పాలస్తీనా జిల్లాలు ముఖ్యమైనవి. జోర్డాన్ జిల్లాకేంద్రం తబ్రియా. ఇది డెమాస్కస్ నుండి 32 మైళ్ళ దూరంలో ఉంది. తబ్రియాకు తూర్పువైపు 12 మైళ్ళ పొడవైన ఓ నది ఉంది. అక్కడ్నుంచి కొన్ని మైళ్ళ దూరంలో ఫహల్ పట్టణం ఉంది. ఫహల్‌లో, తబ్రియాకు దక్షిణ దిశగా 18 మైళ్ళ దూరంలో ఉన్న బైసాన్‌లో రోమ్‌సైనికులు గుమికూడారు.

ఫహల్‌లో సఖ్లార్ బిన్ మిఖ్రాఖ్ నాయకత్వంలో లక్షలాది రోమ్ సైనికులు ముస్లింలతో తలపడటానికి ఉవ్విళ్ళూరసాగారు. ముస్లింయోధులు డెమాస్కస్ నుండి ఫహల్‌కు చేరుకొని బాగా అలసిపోయి ఉండటంతో ఆరాత్రి వెంటనే నిద్రకు ఉపక్రమించారు. అయితే అర్ధరాత్రి వేళ వారు గాఢనిద్రలో ఉండగా రోమ్‌సైనికులు వారిపై మెరుపుదాడి చేశారు. ముస్లింలు వెంటనే తేరుకొని ప్రతిఘటించారు. ఈయుద్ధం అనేక రోజులపాటు రేయింబవళ్ళు ఎడతెరిపి లేకుండా సాగింది. చివరికి సేనాపతితో సహా ఎనభై వేల మంది రోమ్‌సైనికులు మృత్యువాతపడగా మిగిలిన సైనికులు ప్రాణభీతితో పారిపోయారు. ముస్లింయోధులు విజయ దరహాసంతో అక్కడ్నుంచి బైసాన్ వైపు పురోగమించారు.

"బైసాన్"లో రోమన్లు ముస్లింలను హఠాత్తుగా దాడిచేయకుండా నిలువరించడానికి చుట్టుపక్కలున్న నదులు-చెరువుల కట్టలు తెంచివేశారు. దాంతో ఆ ప్రాంతమంతా బురద మయమైపోయింది. కాని ఆ బురద ముస్లింయోధుల్ని బైసాన్‌కు చేరకుండా నిరోధించలేక పోయింది. వారు పట్టుదలతో ఇబ్బందుల్ని అధికమిస్తూ బైసాన్‌కు చేరుకున్నారు. రోమన్లు ముస్లింల సాహసం, స్థిరత్వాలను చూసి మొదట సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరిద్దామనుకున్నారు. భయప్రలోభాలతో వారిని లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. అయితే వారి ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో యుద్ధం అనివార్యమయింది.

ఇక్కడీ యుద్ధం జరుగుతుండగానే ఓరోమ్ సైనికాధికారి ఒకపెద్ద సైనికదళం తీసుకొని డెమాస్కస్‌పై దాడిచేయడానికి వెళ్ళాడు. అక్కడి ముస్లింలు వెంటనే అప్రమత్తులై రోమన్లపై కత్తులు దూశారు. బైసాన్‌లో అబూఉబైదా (రజి)కు ఈ సంగతి తెలియగానే ఖాలిద్ బిన్



వలీద్ (రజి)కు ఒక సైనికదళమిచ్చి డెమాస్కస్‌కు పంపారు. ఇలా డెమాస్కస్‌లో రోమ్ సైనికులు ఈరెండు ముస్లింసేనల మధ్య చిక్కుకొని తీవ్రంగా పెనుగులాడి కాస్సేపటికే ఘోరంగా నేలకొరిగారు. ఒక్కడూ బ్రతికి బట్టకట్టలేక పోయాడు.

బైసాన్‌లో రోమ్ సైనికులు మొదట్లో ముస్లింలను తీవ్రంగా ప్రతిఘటించారు. చివరికి చావుదెబ్బ తినడంతో కాళ్ళబేరానికి వచ్చారు. అప్పుడు అబూఉబైదా (రజి) వారి ఒప్పందాన్ని సమ్మతించి బైసాన్‌పౌరులపై జిజ్యా పన్ను విధించారు. పోతే "తబ్రియా" వాసులు బైసాన్ ప్రజల దుష్పర్యవసానం గురించి తెలుసుకొని తబ్రియాను ముస్లింలకు అప్పగించడానికి అంగీకరించారు. ఆ తర్వాత "బీరుత్" కూడా ముస్లింల కైవశమైపోయింది.

సిరియా, జోర్డాన్‌లకు చెందిన అత్యధిక ప్రాంతాలు ముస్లింల అధీనంలోకి వచ్చిన తరువాత ముస్లింలు సిరియా అంతర్భాగమైన హమస్ వైపు పురోగమించారు. హమస్‌లో రోమ్ చక్రవర్తి హెర్క్యులస్ పెద్దఎత్తున సైన్యాన్ని సమీకరించి ముస్లింలపై దాడి చేయడానికి తహతహలాడసాగాడు. అయితే ముస్లిం సేనలు హమస్ వైపుకు వస్తున్నాయని తెలియగానే హమస్‌లో విడిదిచేసిన రోమ్‌చక్రవర్తి అక్కడ్నుంచి వేరే ప్రాంతానికి తరలిపోయి తన సేనల్ని అప్రమత్తం చేశాడు. అయినప్పటికీ ముస్లింసేనలు క్రైస్తవసేనలను ప్రతిఘటిస్తూ అప్రతిహతంగా ముందుకుసాగి హమస్ పట్టణాన్ని దిగ్బంధించాయి. హమస్‌వాసుల్ని రక్షించడానికి రోమ్‌సైనికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో హమస్‌వాసులు ముస్లింలకు జిజ్యా చెల్లించి ఒప్పందం చేసుకున్నారు.

ఇదిలా ఉండగా అటు ఈరాన్, ఇరాఖ్‌లలో సేనాపతులు, మంత్రులు, సామంత రాజులు, వివిధ తెగల నాయకులు ముస్లింలకు వ్యతిరేకంగా ఏకమై కయ్యానికి కాలుదువ్వుతున్నారని మనం గత పేజీలలో తెలుసుకున్నాం. అంచేత హమస్ సైనిక కార్యకలాపాల్ని గురించి తెలుసుకునే ముందు ఈరాన్, ఇరాఖ్‌ల పరిస్థితుల్ని గురించి తెలుసుకుందాం.

## (3) బాఖ్షియా, బవీబ్ యుద్ధాలు

హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫా కాగానే ఇరాఖ్‌యోధులకు సేనాపతిగా ఉన్న ముస్నా బిన్ హారిసా (రజి)ను తొలగించి, ఆ స్థానంలో అబూఉబైదా బిన్ మస్‌వూద్ సఖఫీని సేనాపతిగా నియమించారని మనం గత పేజీలలో తెలుసుకున్నాం. అబూఉబైదా బిన్ మస్‌వూద్ ఇరాఖ్‌లో సేనాపతి బాధ్యతలు స్వీకరించి ఈరానీయులకు వ్యతిరేకంగా యుద్ధ పరంపర ప్రారంభించారు. ఆయన అనేక ప్రాంతాలు స్వాధీనం చేసుకుంటూ అప్రతిహతంగా ముందుకు పురోగమించారు. ఈరాన్‌సైనికులు ప్రతి యుద్ధంలోనూ ఓటమి చవిచూడసాగారు. చివరికి ఈరాన్ సైన్యాధ్యక్షుడు రుస్తుమ్ ప్రముఖ సైన్యాధికారి బహ్మన్‌జాద్వియాకు సైనికశిక్షణ ఇవ్వబడిన మూడువేల ఏనుగులతో సహా ఓ పెద్ద సైనికదళం ఇచ్చిపంపాడు. ఇతను లోగడ దల్జా, లైస్ యుద్ధాల్లో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) చేతిలో చావుదెబ్బ తిని పారిపోయిన సంగతి పాఠకులకు విదితమే.

బహ్మన్‌జాద్వియా అట్టహాసంగా బయలుదేరాడు. దారిలో తారసపడే అనేక పట్టణాల, గ్రామాల ప్రజల్ని ముస్లింలకు వ్యతిరేకంగా ఉసిగొల్పి వారిని సైన్యంలో భర్తీ చేసుకుంటూ ఫిరాత్ నదీతీరంలోని 'ఖస్‌నాతిఫ్' ప్రదేశానికి చేరుకున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న

ముస్లింసేనాపతి అబూఉబైదా బిన్ మస్ఊద్ ఫిరాత్‌నదికి ఆవల తీరంలోని 'మరూహా' ప్రదేశానికి చేరుకున్నారు. రెండుపక్షాల మధ్య నది ఉండటంవల్ల కొన్నాళ్ళు ఎవరూ దాడికి ఉపక్రమించలేక పోయారు. తర్వాత ఇరుపక్షాలు సంప్రదించుకొని నదిపై చెక్కలతో ఒక వంతెన ఏర్పాటు చేసుకున్నాయి. సంప్రదింపుల ప్రకారమే ముస్లింసేనాపతి సైన్యం తీసుకొని నది దాటి ఆవలకు చేరుకున్నాడు. ఆ తరువాత యుద్ధం మొదలైంది.

ఈరాన్ సేనాపతి ఏనుగుల పంక్తిని కాల్బలం ముందుంచి, ఏనుగులపై సుశిక్షితులైన విలుకాండ్రను కూర్చోబెట్టాడు. వారు వెంటనే ముస్లిం సైనికులపై బాణాల వర్షం కురిపించడం మొదలెట్టారు. ముస్లిం అశ్వరూఢులు వారిని ప్రతిఘటించడానికి ముందుకు పురోగమించగానే వారి గుర్రాలు శత్రువుల ఏనుగుల్ని చూసి బెదిరిపోయి అటూఇటూ పరుగెత్తసాగాయి. సేనాపతి అబూఉబైదా (రజి) ఈ పరిస్థితి చూసి గుర్రాలు దిగి కాలినడకన ముందుకుసాగి దాడిచేయమని సైనికుల్ని ఆదేశించారు.

తక్షణమే ముస్లింలు గుర్రాలు దిగి శత్రువుల్ని ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. అయితే ఏనుగులు ఘీంకరిస్తూ ముస్లిం సైనికులపై విరుచుకు పడటంతో వారి పంక్తులు చిందరవందరయ్యాయి. కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. సేనాపతి వారిని ధైర్యపరుస్తూ ఏనుగుల తొండాలను కోసేయండని ఆదేశించాడు. ముందుగా ఆయనే ఈ పనికి ఉపక్రమించాడు. ఈవిధంగా హజ్రత్ అబూఉబైదా అనేక ఏనుగుల తొండాలను, వాటి కాళ్ళను కోసి అనేకమంది శత్రు విలుకాండ్రను మట్టుబెట్టారు. ఆయన ప్రదర్శించిన ప్రతిభాపరాక్రమాలతో ఉత్తేజితులైన సైనికులు కూడా ఏనుగులపై దాడిచేయడం మొదలెట్టారు. అయితే కాస్సేపటికి పరిస్థితి ముస్లింలకు వ్యతిరేకంగా మారిపోయింది.

మంచి శిక్షణ ఇవ్వబడిన ఒక మదపుటేనుగు ఘీంకరిస్తూ అబూఉబైదాపై లంఘించింది. వెంటనే ఆయన దాని తొండాన్ని ఒక్కవ్రేటుతో తెగ్గోశారు. అయితే ఆ ఏనుగు మరింత రెచ్చిపోయి పెద్దపెట్టున ఘీంకరిస్తూ ముందుకురికి అబూఉబైదాను క్రింద పడవేసి ఆయన రొమ్ముమీద కాలుపెట్టి అదిమేసింది. దాంతో ఆయన అమరగతులై పోయారు. సేనాపతి అబూఉబైదా మృత్యువాత పడగానే ఆయన సోదరుడు హకమ్ ముందుకొచ్చి సైనిక ధ్వజం తన చేతిలోకి తీసుకున్నారు. కాని ఆయన్ని కూడా ఆ ఏనుగు క్రింద పడేసి తొక్కి మృత్యుకుహరంలోకి నెట్టివేసింది. ఆ తరువాత మరో ఆరుగురు సైనికాధికారులు ఒకరి తరువాత ఒకరు సైనికధ్వజం పట్టుకొని దాడి చేయడానికి ప్రయత్నిస్తే వారిని కూడా ఏనుగులు క్రిందపడేసి తొక్కి చంపివేశాయి.

ఆ తర్వాత ముస్నా బిన్ హారిసా (రజి) ధ్వజం చేతబూని శత్రువులపై విజృంభించారు. అయితే వరుసగా 8 మంది సైనికాధికారులు చనిపోవడం చూసిన అనేకమంది సైనికులు ఏనుగుల దాడులకు భయపడి వంతెన మీదుగా పారిపోవడం ప్రారంభించారు. అప్పుడు అబ్దుల్లా బిన్ ముర్సిద్ వంతెన చెక్కలు ఊడదీసి దాన్ని విరగ్గొట్టారు. దాంతో మరోప్రమాదం వచ్చిపడింది. పారిపోవడానికి ప్రయత్నించిన సైనికుల్లో చాలామంది విరిగిన వంతెన దాటలేక నదిలోపడి మునిగిపోసాగారు. ఈ పరిస్థితి గమనించిన ముస్నా (రజి) వంతెనను పునర్నిర్మించమని ఆదేశించారు. ఆ తరువాత మృత్యువాత పడగా మిగిలిన సైన్యాన్ని



క్రమబద్ధీకరించి శత్రుసైనికుల్ని ముందుకు పురోగమించకుండా ప్రతిఘటించడం ప్రారంభించారు. వేరొక వైపు ఆయన ముజాహిద్‌లకు తగిన ఆదేశాలిస్తూ "నేను శత్రువుల్ని అడ్డుకుంటాను, మీరు వంతెనదాటి వేగంగా ఆవల వైపుకు వెళ్ళిపోండి" అన్నారు.

ఈవిధంగా ముస్లింలు నది దాటి ఈరాన్ ఏనుగుల బారినుండి బ్రతుకు జీవుడా అంటూ బయటపడ్డారు. యుద్ధంలో పాల్గొన్న తొమ్మిది వేలమంది ముస్లింయోధుల్లో నాలుగు వేలమంది అమరగతులయ్యారు. అటు ఈరాన్ సైనికుల్లో ఆరువేల మంది చనిపోయారు. ఈరాన్ సేనాపతి బహ్మన్‌జాద్వియా గతంలో ముస్లింల చేతుల్లో చావుదెబ్బల చేదుఅనుభవం చవిచూశాడు. అంచేత అతను నదిదాటి పారిపోతున్న ముస్లింలను వెంబడించడానికి సాహసించలేకపోయాడు. ముస్లింలు ఈ యుద్ధంలో సైనికశిక్షణ పొందిన మదపుటేనుగుల కారణంగా ఇదివరకెన్నడూ లేనంత నష్టానికి గురికావలసి వచ్చింది. ఈ యుద్ధం హి.శ. 13వ సంవత్సరం, రమజాన్ నెలలో జరిగింది.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఇరాఖ్‌లో సేనాపతి అబూఉబైదా బిన్ మస్ఊద్ (రజి)తో పాటు అనేకమంది ముజాహిద్‌లు అమరగతులయ్యారని తెలుసుకొని ముస్నా బిన్ హారిసా (రజి)కు మద్దతుగా మరో పెద్ద సైనికదళాన్ని తయారుచేసి ఇరాఖ్‌కు పంపారు. అటు ముస్నా (రజి) కూడా ఈరానీయులకు వ్యతిరేకంగా ఇరాఖ్ అరబ్బుల్ని పురిగొల్పి తన సైన్యంలో భర్తీ చేసుకొని ఫిరాత్ నదీతీరంలోని 'బవీబ్' ప్రదేశంలో విడిది చేశారు. ఈ సంగతి తెలుసుకున్న ఈరాన్ సర్వసేనాని రుస్తుమ్ రక్షణమంత్రి మెహ్రాన్ హమ్దానీని సేనాపతిగా నియమించి పంపాడు. ఈరాన్ సైన్యం ముస్లిం సేనలకు అభిముఖంగా ఫిరాత్ నదికి ఆవల వైపు విడిది చేసింది. ఇరుపక్షాల సంప్రదింపుల ప్రకారం ఈసారి ఈరాన్ సైన్యం నది దాటి ముస్లింసైన్యం విడిదిచేసిన వైపుకు వచ్చింది.

ఆ తరువాత యుద్ధం మొదలయ్యింది. ఈసారి ముస్లింలు ప్రతీకారంతో ఉడికిపోతూ తీవ్రంగా విజృంభించారు. ఈరాన్ సైనికులు వారి ధాటికి నిలువలేక వెనుదిరిగి పారిపోవడం ప్రారంభించారు. వెంటనే ముస్లిం సేనాపతి ముస్నా (రజి) పరుగెత్తి నదీ మీదున్న తాత్కాలిక వంతెనను పడగొట్టారు. దాంతో ఈరాన్ సైనికుల్లో అత్యధికమంది ముస్లింల చేతుల్లో హతమవ్వడం, నదిలో పడి మునిగిపోవడం జరిగింది. వారి సేనాపతి మెహ్రాన్ హమ్దానీ రణరంగంలోనే నేలకొరిగి ఊపిరివిడిచాడు. హిజ్రీశకం 14వ ఏట రమజాన్ నెలలో జరిగిన ఈ యుద్ధంలో ప్రముఖ చరిత్రకారుడు ఇబ్నెఖుల్దూన్ ప్రకారం లక్ష మంది ఈరాన్ సైనికులు హతమయ్యారు. ముస్లిం సైనికుల్లో వందమంది మాత్రమే మృత్యువాత పడ్డారు.

సేనాపతి మెహ్రాన్‌తో పాటు లక్షమంది సైనికుల మృతి సంగతి విన్న ఈరాన్ దర్బార్ తీవ్రమైన విభ్రాంతికి గురయింది. ఈ యుద్ధంలో ముస్లింలు కేవలం వందమంది అయితే, ఈరాన్‌సైనికులు లక్షమంది చావడమా అంటూ ఈరాన్ ప్రజలు ఆశ్చర్యపోయి అరబ్బుల పేరు వింటేనే వణికిపోసాగారు. ఆరోజుల్లో ఈరాన్ పాలనావ్యవహారాలన్నీ రుస్తుం చేతుల్లోనే ఉండేవి. దేశానికి నామమాత్రపు సర్వాధికారిణిగా, మహారాణిగా రాజవంశానికి చెందిన ఒక స్త్రీ ఉండేది. ఘోరమైన ఈ ఓటమి సంగతి విన్న తరువాత ప్రజల్లో అనేకమంది "స్త్రీ పాలించే రాజ్యంలో సైన్యం యుద్ధంచేసి గెలవడం చాలాకష్టమే" అని చెప్పుకోసాగారు.

## (4) ఈరాన్ పాలకుల దగ్గరకు ముస్లింల రాయబారం

అందువల్ల దేశంలోని సామంతరాజులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చారు. దాని ప్రకారం అధికార సింహాసనం నుండి ఆ స్త్రీని దించి 21 సంవత్సరాల "యజ్దగిర్ద్" అనే ఓ నవయువకుడ్ని కూర్చోబెట్టారు. ఆ తరువాత వెంటనే ఈరానీయులంతా తమ అంతర్విభేదాలు మరచిపోయి ద్విగుణీకృత ఉత్సాహంతో యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. ముస్లింలు స్వాధీనం చేసుకున్న అనేక ప్రాంతాల్లో తిరుగుబాటు చర్యలు వెల్లువెత్తాయి.

ఖలీఫా ఉమర్ (రజి) ఇరాఖ్‌లో తలెత్తిన తిరుగుబాటు చర్యల సంగతి తెలుసుకోగానే యువకుల్లో సమరోత్సాహాన్ని రేకెత్తించి హజ్ చేయడానికి మక్కా వెళ్ళిపోయారు. మక్కానుండి రాగానే వివిధప్రాంతాల నుంచి వచ్చిన యువకిషోరాలతో మదీనా నిండిపోయింది. స్వయంగా ఖలీఫా సర్వసేనానిగా బాధ్యత చేపట్టి కదనరంగంలో దూకడానికి సిద్ధమయ్యారు. కాని ప్రముఖ సహాబీలందరూ ఖలీఫా రాజధాని వదలి యుద్ధరంగానికి బయలుదేరడం మంచిది కాదని చెప్పడంతో ఆయన ఆ పని విరమించుకొని సహచరుల సలహాతో సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి)ను సర్వసేనానిగా నియమించి పంపారు.

హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) నాలుగువేల మంది ముజాహిద్‌లను తీసుకొని బయలుదేరారు. ఆ తరువాత వెంటనే ఖలీఫా మరో నాలుగువేల మంది వీరసిపాయీలను ఆయనకు మద్దతుగా పంపారు. ఇలా సాద్(రజి) ఎనిమిది వేలమంది సైనికులతో ఇరాఖ్‌లో ప్రవేశించారు. ఇరాఖ్‌లో సేనాపతి ముస్నా (రజి) ఒక యుద్ధంలో తీవ్రంగా గాయపడి కొన్నాళ్ళకు చనిపోయారు. అప్పుడు ఆయన అధీనంలో ఉన్న ఎనిమిది వేలమంది సైనికులు కూడా సాద్ సైన్యంలో చేరిపోయారు. ఈవిధంగా సాద్ (రజి) పదహారు వేల మంది యోధులతో ఖలీఫా నిర్దేశించిన మార్గాల గుండా ముందుకు సాగారు. ఈ దండయాత్రలో మరిన్ని ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది యోధులు పాల్గొనడంతో సైనిక సంఖ్య ముప్ఫయి వేలకు పెరిగింది. నురుగులు కక్కే ఈ భారీ సైనికవాహినితో సేనాపతి సాద్ (రజి) 'ఖాదిసియా' ప్రదేశానికి చేరుకొని ఈరాన్ సైనికుల కోసం ఎదురుచూడసాగారు. కాని రెండు నెలలు గడచినా ఈరాన్ సైనికుల జాడ లేదు.

ఖాదిసియాలో అరబ్ సైనికులు విడిది చేశారని, ఫిరాత్, హిరాల మధ్య ప్రాంతాన్ని అరబ్బులు లూటీచేసి ధ్వంసం చేశారని రాజధానికి వార్తలు చేరడంతో ఈరాన్ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అనేకమంది ప్రజాప్రతినిధులు రాజదర్బారుకు వచ్చి తక్షణమే సైనికచర్యలు ప్రారంభించాలని, లేకుంటే తాము అరబ్బులకు విధేయులైపోతామని హెచ్చరించారు. యుద్ధతంత్రాల్లో ఎంతో అనుభవశాలి అయిన సేనాపతి రుస్తుమ్ వీలైనంత వరకు యుద్ధం చేయకుండా అరబ్బుల్ని వారి మానాన వదలిపెట్టడమే మంచిదని చక్రవర్తికి సలహా ఇచ్చాడు. చక్రవర్తి యజ్దగిర్ద్ దానికి అంగీకరించలేదు. అప్పుడు రుస్తుం విధిలేక సైన్యం తీసుకొని బయలుదేరి 'సాబాత్' ప్రదేశంలో విడిదిచేశాడు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది సైనికులు వచ్చి ఆయన సైన్యంలో చేరారు. ఈవిధంగా రుస్తుం చుట్టూ లక్షా యాభైవేల మంది సైనికులు చేరి సమరోత్సాహంతో ఊగిపోసాగారు.



అప్పుడు ముస్లిం సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఖలీఫా ఆదేశం ప్రకారం మాటకారి, వివేచనాపరులైన పద్నాలుగు మంది యోధుల్ని ఎంపిక చేసి రాయబారం కోసం ఈరాన్ చక్రవర్తి దగ్గరకు పంపించారు. ఈ దౌత్యప్రతినిధి వర్గం ఈరాన్ రాజధాని మదాయెన్‌కు చేరుకుంది. ముస్లిందౌత్యవేత్తలు వస్తున్నారని వినగానే చక్రవర్తి తన దర్బారును ఎంతో అట్టహాసంగా అలంకరింపజేశాడు. ముస్లిం దౌత్యవేత్తలు సాధారణ సైనిక దుస్తుల్లోనే రాజదర్బారులో ప్రవేశించారు. చక్రవర్తి యజ్దగిర్ద్ వారితో సాధారణ సంభాషణ తరువాత మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ ఇలా అన్నాడు:

"మాకు వ్యతిరేకంగా పోరాడేందుకు మీరెలా సాహసించగలిగారు? మీ (అరబ్)జాతి ప్రపంచంలో ఒక నీచమైన, తెలివిమాలిన జాతిగా భావించబడుతోందన్న విషయాన్ని మరచిపోయారా? మీలో ఎప్పుడైనా తిరుగుబాటు ధోరణి తలెత్తితే మా సామంతరాజులే మీ పీచం అణచి మిమ్మల్ని దారికి తెచ్చేవారన్న సంగతి కూడా మీరు మరిచిపోయారా?"

ప్రతినిధివర్గంలో ఒకరైన నోమాన్ (రజి) ఈ మాటలు విని ఇలా సమాధానమిచ్చారు: "మేము ప్రపంచం నుండి విగ్రహారాధన, బహుదైవారాధనలను అంతమొందించడానికి కృషిచేస్తున్నాం. ఇస్లాం స్వీకరణ ద్వారానే మానవుడు మానవత్వం, మోక్షం పొందగలడని మేము యావత్తు మానవాళికి తెలియజేస్తున్నాం. ఒకవేళ ఎవరైనా ఇస్లాం స్వీకరించడానికి నిరాకరిస్తే అతను ముస్లింల రక్షణలో ఆశ్రయం పొంది జిజ్యా (రక్షణ రుసుం) చెల్లించవలసి ఉంటుంది. దానికి భిన్నంగా ఎవరైనా ఇటు ఇస్లాం స్వీకరించకుండా, అటు జిజ్యా చెల్లించడానిక్కూడా నిరాకరిస్తే అలాంటి వారికి, మాకు మధ్య ఖడ్గమే తీర్పుచేస్తుంది."

చక్రవర్తి యజ్దగిర్ద్ ఈ మాటలు విని ఇలా అన్నాడు: "మీరసలు మూర్ఖులు, అడవి మనుషులు. మీ జనాభా కూడా చాలా తక్కువ. అంచేత మీరు మా దేశంలో ఏ భూభాగాన్ని కూడా ఆశించకండి. మేము మిమ్మల్ని కనికరించి అన్నవస్త్రాలు ప్రసాదిస్తాం. మీపై మృదు మనస్కుడైన పాలకుడ్ని నియమిస్తాం."

దౌత్యప్రతినిధి వర్గంలో మరొకరైన ఖైస్ బిన్ జిరారా (రజి) ఈ మాటలు వినగానే ముందుకొచ్చి ఇలా అన్నారు: "మీరు అరబ్బుల దుస్థితి గురించి చెప్పిన విషయాలన్నీ నిజమే. పైగా మేము అంతకంటే కూడా దిగజారి ఉండేవాళ్ళం. అయితే సృష్టికర్త, సర్వేశ్వరుడైన దేవుడు మాపై దయదలచి మాకు సరైన మార్గదర్శనం చేయడానికి దైవప్రవక్త (స)ను పంపాడు. ఆయన మాకు రుజుమార్గం చూపి సత్యవ్యతిరేక శక్తుల్ని అణచివేశాడు. ప్రపంచంలో మేము దుష్టశక్తులపై విజయ పరంపరలు సాధిస్తామని శుభవార్త తెలియజేశాడు. కనుక మీరు ఇస్లాం స్వీకరించండి, అందులోనే మీ శ్రేయస్సుంది. అదిష్టం లేకపోతే జిజ్యా చెల్లించండి. దానికీ అంగీకరించకపోతే యుద్ధానికి సిద్ధంకండి."

ఈరాన్ చక్రవర్తి ఈ మాటలు వినగానే క్షణం పాటు కోపోద్రేకాలతో ఊగిపోయాడు. అంతలోనే తమాయించుకొని "దౌత్యవేత్తల్ని చంపడం ధర్మసమ్మతమైఉంటే నేను మిమ్మల్ని ఇక్కడే ఈ క్షణంలోనే మట్టుపెట్టేవాడ్ని" అన్నాడు. తరువాత అతను తన సేవకుల్ని పిలిచి "మట్టితో నింపిన ఓ గంప తెచ్చి వీరి నాయకుడి నెత్తి మీద పెట్టండి; అదే స్థితిలో ఇతడ్ని నగరం నుండి బయటికి పంపివేయండి" అని అన్నాడు. ఆ తరువాత ముస్లిం దౌత్యవేత్తల్ని

ఉద్దేశించి "మా సేనాపతి అతిత్వరలోనే మిమ్మల్నందరినీ ఖాదిసియా కందకంలో పడవేసి సమాధిచేస్తాడు. అప్పుడు తెలుస్తుంది మీకు మా శక్తి ఏమిటో" అని అన్నాడు.

ఈలోగా సేవకులు మట్టి నింపిన గంప తెచ్చారు. వెంటనే ప్రతినిధి వర్గం నాయకుడు ఆసిమ్ బిన్ ఉమర్ (రజి) ముందుకొచ్చి "నేనే ప్రతినిధి వర్గం నాయకుడ్ని" అంటూ ఆ గంప తీసుకొని భుజమ్మీద పెట్టుకున్నారు. తరువాత ముస్లిం దౌత్యవేత్తలందరూ దర్బారు నుంచి బయటికి వచ్చి గుర్రాలెక్కి తమ శిబిరం చేరుకొని "మీకందరికీ శుభాభినందనలు. దేవుడు మనకు ఈరాన్‌మట్టి ప్రసాదించి ఆ దేశంలో మనకు విజయసంకేతం తెలియ జేశాడు" అన్నారు. ఈమాట విని సేనాపతి సాద్ (రజి) కూడా ఎంతో సంతోషించారు.

ముస్లిందౌత్యవేత్తలు రాజధాని నుండి వెళ్ళిపోగానే ఈరాన్‌పాలకులు సమరసన్నాహాలు ముమ్మరం చేశారు. కొన్నాళ్ళలోనే రుస్తుమ్ లక్షా ఎనభైవేల మంది సైనికులతో కూడిన బ్రహ్మాండమైన సైనికపటాలం తీసుకొని బయలుదేరాడు. అతనీ యుద్ధాన్ని వీలైనంతవరకు నివారించడానికి ప్రయత్నిస్తూ, దారిలో అనేకచోట్ల ఆగుతూ ఆర్నెల్ల దాకా ఖాదిసియా చేరుకోలేదు. చివరికి ఈరాన్ దర్బార్ నుండి వస్తున్న వత్తిళ్ళకు తలవొగ్గి రుస్తుం ఆర్నెల్ల తరువాత ఖాదిసియా చేరుకొని, సంప్రదింపుల కోసం తన దగ్గరకు ఎవరినైనా దౌత్యవేత్తగా పంపవలసిందిగా ముస్లిం సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)కు లేఖ రాశాడు.

అప్పుడు సేనాపతి సాద్ (రజి) దౌత్యవేత్తగా రబయి బిన్ ఆమిర్ (రజి)ని పంపారు. ఆ సందర్భంలో రుస్తుం తన దర్బార్‌ను అత్యంత ఖరీదైన వస్తువులతో ఎంతో అట్టహాసంగా రూపొందింపజేశాడు. ప్రత్యేకంగా తన కోసం ఒక ఎత్తయిన వేదిక, దానిపై సువర్ణ సింహాసనం పెట్టించుకున్నాడు. దానికి నలువైపులా పెద్దపెద్ద పట్టుదిండ్లు, రోమన్ తివాచీలు పరిపించాడు. దిండ్ల గలేబులు, షామియానాల అంచులకు ముత్యాలు పొదిగిన ఝాలర్లు కుట్టించాడు. హజ్రత్ రబయి బిన్ ఆమిర్ (రజి) సాధారణ సైనిక దుస్తుల్లోనే రుస్తుమ్ దర్బారులో ప్రవేశించి, గుర్రాన్ని తివాచీ మీదున్న ఓ పెద్ద దిండుకు కట్టివేశారు.

ఆ తరువాత ఆయన నేలపై పరచిన ఖరీదైన తివాచీని ఖడ్గంతో పొడిచి చించుతూ రుస్తుం కూర్చున్న సువర్ణ సింహాసనం దగ్గరకెళ్ళి అతని పక్కనే కూర్చున్నారు. ఈరాన్ సైనికులు తమ సేనాపతి పట్ల జరుగుతున్న ఈ అవమానాన్ని సహించలేక ముస్లిం దౌత్యవేత్త ఖడ్గాన్ని లాక్కొని, ఆయన్ని సింహాసనం పైనుంచి దించడానికి ప్రయత్నించారు. అప్పుడు రబయి బిన్ ఆమిర్ (రజి) వాళ్ళవైపు ఉరిమిచూస్తూ "నేనిక్కడికి నా అంతట నేను రాలేదు, మీరు పిలిపిస్తేనే వచ్చాను. ఒక మనిషి దేవుడయి కూర్చుంటే మిగిలినవాళ్ళు దాసులుగా అతని ముందు చేతులు కట్టుకొని నిలబడటం మా ధర్మంలో నిషిద్ధం" అని అన్నారు. అంతలో రుస్తుం తన సైనికుల్ని వారిస్తూ, అతన్నేమీ చేయకండి అన్నాడు.

తరువాత రబయి బిన్ ఆమిర్ (రజి) ఓ క్షణం ఆలోచించి సింహాసనం పైనుంచి లేచారు. కాస్త దూరం జరిగి ఖడ్గంతో నేల మీద పరచిన తివాచీని, పట్టుపరుపును చించి తీసేసి, కటికనేల మీద కూర్చున్నారు. ఆ తరువాత ఆయన రుస్తుమ్‌ని ఉద్దేశించి "మాకు మీ ఖరీదైన తివాచీలు, పట్టుపరుపులు కూడా అవసరం లేదు. మాకు దేవుడు ప్రసాదించిన ఈ మట్టిపరుపే చాలు" అని అన్నారు.



ఆ తరువాత రుస్తుమ్ దుబాసీ ద్వారా దౌత్యవేత్త రబయి (రజి)ని ఉద్దేశించి "ఈ యుద్ధం వెనుక మీ లక్ష్యం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

దానికి ముస్లిం దౌత్యవేత్త రబయి (రజి) ఇలా సమాధానమిచ్చారు: "మేము ప్రజల లోని సృష్టిపూజ మాన్పించి వారిని సృష్టికర్త ఆరాధన వైపు మళ్ళించాలని, ప్రపంచంలో అన్యాయం, అసత్యమతాలను రూపుమాపి న్యాయాన్ని, సత్యధర్మమైన ఇస్లాంను స్థాపించా లని భావిస్తున్నాం. ఎవరైనా ఇస్లాం స్వీకరించి నీతిన్యాయాలతో జీవించ దలచుకుంటే మేము వారిపట్ల సద్భావనతో వ్యవహరిస్తాం. దీనికి భిన్నంగా ఎవరైనా మా దారికి అడ్డం వస్తే మాత్రం మేము వారితో విజయం సాధించేవరకూ లేదా వీరమరణం పొందేవరకూ పోరాడుతాం. కనుక మీరు మాకు జిజ్యా చెల్లించడానికి అంగీకరిస్తే మేము మీ జోలికి రాము. ఎప్పుడైనా మీకు మా అవసరమొస్తే మేము మీకు సహాయం చేస్తాం."

రుస్తుమ్ ఈ మాటలు విని "నీవు ముస్లింల నాయకుడివా?" అని ప్రశ్నించాడు. దానికి రబయి (రజి) "లేదు. నేనొక సాధారణ సైనికుడ్ని. అయితే మాలో ప్రతి ఒక్కడికీ ప్రతి వ్యవహారంలోనూ నిర్ణయం తీసుకునే అధికారం ఉంది" అని అన్నారు.

ఈమాట విని రుస్తుమ్, అతనిసహచరులు ఆశ్చర్యపోయారు. తర్వాత రుస్తుం హజ్రత్ రబయి (రజి) దగ్గరున్న తుప్పుపట్టిన వర, మొనలేని ఈటె గురించి ప్రశ్నించడం, దానికి రబయి (రజి) తగిన సమాధానం ఇవ్వడంజరిగింది. చివర్లో రుస్తుం "సరే, మేము ఆలోచించి తగిన నిర్ణయం తీసుకుంటాం" అన్నాడు. ఆ తర్వాత హజ్రత్ రబయి (రజి) లేచి అక్కడ్నుంచి తిరిగొచ్చి సేనాపతి సాద్ బిన్ వఖ్ఖాస్ (రజి)కు విషయాలు వివరించారు.

మరునాడు రుస్తుమ్ "ఈరోజు కూడా మీ దౌత్యవేత్తను పంపండ"ని సాద్ (రజి)కు లేఖ పంపాడు. సేనాపతి హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఈసారి హుజైఫా బిన్ ముహ్సిన్ (రజి)ని పంపారు. ఆయన కూడా రబయి (రజి) లాగానే నేలపై పరచిన ఖరీదైన తివాచీలను, పట్టుపరుపుల్ని బరిశతో చించివేస్తూ, గుర్రం మీద కూర్చునే నేరుగా రుస్తుం సింహాసనం దగ్గరకు వెళ్ళారు.

రుస్తుమ్ కట్టలు తెంచుకొస్తున్న కోపాన్ని పళ్ళ కింద నొక్కిపట్టి "ఏమిటీ, ఈరోజు నిన్ను పంపారు? నిన్న వచ్చిన దౌత్యవేత్తను ఎందుకు పంపలేదు?" అని అడిగాడు.

దానికి హుజైఫా (రజి) ఇలా సమాధానమిచ్చారు: "మా నాయకుడు న్యాయంగా వ్యవహరిస్తాడు. మా అందర్నీ సమానంగా చూస్తాడు. సేవ చేయడానికి ప్రతి ఒక్కడికీ అవకాశం ఇస్తాడు. నిన్న అతని వంతు వచ్చింది, ఈరోజు నా వంతు వచ్చింది."

"సరే, మీరు మాకు ఎన్ని రోజులు గడువిస్తారు?" అడిగాడు రుస్తుం. "ఈరోజు నుండి మూడు రోజులు గడువిస్తున్నాం" చెప్పారు హుజైఫా (రజి).

రుస్తుమ్ ఈమాట విని మారుమాట్లాడలేదు. హుజైఫా (రజి) గుర్రాన్ని వెనక్కి మళ్ళించి తమ సైనికశిబిరానికి తిరిగొచ్చారు. మూడో రోజు కూడా రుస్తుమ్ దౌత్యవేత్తను పంపమని సాద్ (రజి) దగ్గరకు లేఖ పంపాడు. అప్పుడు సాద్ (రజి) ముగీరా బిన్ షాబా (రజి)ను పంపారు. రుస్తుం ముగీరా (రజి)కు నయానాభయానా నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తూ

"ఇప్పటికైనా మించిపోలేదు, మీరు యుద్ధంచేసే ఆలోచన మానుకొని మాదేశం నుండి వెళ్ళిపోతే మాకెలాంటి అభ్యంతరం లేదు. పైగా మేము మీకు మీరు కోరిన బహుమతి కూడా ఇస్తాం" అని అన్నాడు. ముగీరా (రజి) ఈమాటలకు తీవ్రంగా స్పందిస్తూ కరవాలంవర మీద చేయిపెట్టి "మీరు ఇస్లాం స్వీకరించడానికిగాని, జిజ్యా చెల్లించడానికిగాని ఒప్పుకోకపోతే సమస్యను ఈ ఖడ్గమే పరిష్కరిస్తుంది" అని కఠినంగా సమాధానమిచ్చారు.

దాంతో ఈరాన్ సేనాపతి రుస్తుమ్ ఫీంకరిస్తూ "ఇప్పుడిక నేను మీతో ఒప్పందం చేసుకునే ప్రసక్తే లేదు. మిమ్మల్నందర్నీ వధించితీరుతాను" అన్నాడు. దానికి ముస్లిం దౌత్యవేత్త హజ్రత్ ముగీరా (రజి) "సరే, మేమూ చూస్తాం ఎవరు ఎవర్ని వధిస్తారో" అంటూ లేచి తమ సైనికశిబిరానికి తిరిగొచ్చారు.

## (5) ఖాదిసియా యుద్ధం

ముస్లిం దౌత్యవేత్త ముగీరా (రజి) వెళ్ళిపోగానే రుస్తుం యుద్ధానికి సిద్ధంకండని సైనికుల్ని ఆదేశించాడు. అటు ముస్లింలు కూడా యుద్ధసన్నాహాలు ప్రారంభించారు.

రెండు సైన్యాల మధ్య ఒక నది అడ్డంగా ఉంది. మరుసటిరోజు రుస్తుం "నది దాటి ఇటువైపు మీరు వస్తారా లేక మమ్మల్ని అటువైపు రమ్మంటారా? అని అడుగుతూ ముస్లిం సేనాపతికి లేఖ పంపాడు. దానికి ముస్లిం సేనాపతి సాద్ (రజి) "మీరే నది దాటి ఇటువైపు రండి" అని సమాధానమిచ్చారు. దాని ప్రకారం ఈరాన్‌సైన్యం నదిదాటి ఈవల వైపుకు వచ్చింది. లక్షాఎనభైవేల మంది సైనికులు, వందలాది మదపుటేనుగులతో కూడిన ఈరాన్ సేనావాహిని ముప్ఫయివేల ముస్లిం సైన్యంపై కారాలు మిర్యాలు నూరసాగింది.

సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) సయాటికా వ్యాధితో బాధపడుతుండేవారు. దానికితోడు ఇప్పుడు ఆయన వంటిపై కురుపులు కూడా లేచాయి. దానివల్ల యుద్ధం చేసే పరిస్థితిలో లేరు. అంచేత ఆయన అక్కడున్న ఓ పురాతన భవనం కప్పు మీద కూర్చొని తన స్థానంలో ఖాలిద్ బిన్ అర్ఫతహ్ (రజి)ను యుద్ధభూమి సేనాపతిగా నియమించారు. అయితే యుద్ధవ్యూహాలు, రణరంగంలో మార్పులకు సంబంధించిన అధికారాలన్నీ తన అధీనంలోనే ఉంచుకున్నారు.

రెండు పక్షాలు ఒకదానికొకటి ఎదురెదురుగా నిలబడి యుద్ధానికి సిద్ధమయ్యాయి. మొదట ఈరాన్‌సైన్యం నుండి రత్నఖచితకిరీటం ధరించిన హుర్ముజ్ అనే ఓ రాకుమారుడు ముందుకొచ్చి సవాలు విసిరాడు. అతడ్ని ఎదుర్కోవడానికి ముస్లింసైన్యం నుండి గాలిబ్ బిన్ అబ్దుల్లా అసది (రజి) ముందుకొచ్చారు. ఆయన వచ్చిరాగానే హుర్ముజ్‌ను అమాంతం పట్టుకొని చేతులు కట్టివేసి, తీసికెళ్ళి సేనాపతి సాద్ (రజి)కు అప్పగించారు. ఆ తరువాత ఈరాన్‌సైన్యం నుండి ఓ ప్రముఖ పహిల్వాన్ గుర్రం మీద కూర్చొని వచ్చాడు. వెంటనే ముస్లింసైన్యం నుండి ఆసిమ్ (రజి) గుర్రం మీద మెరుపు వేగంతో దూసుకొచ్చి ఈరాన్ పహిల్వాన్‌ని అతని గుర్రం పైనుంచి లాగి తన గుర్రం మీద వేసుకొని తిరిగొచ్చారు.

క్షణంలో కోడిపిల్లను గ్రద్ద తన్నుకుపోయినట్లు జరిగిన ఈ సంఘటన చూసి ఈరాన్ సైనికులు బిత్తరపోయారు. అయినప్పటికీ రజిత గదాధారి అయిన మరో మల్లయోధుడు



తొడలు చరచుకుంటూ ముందుకొచ్చాడు. ఆ మరుక్షణమే ముస్లింల నుండి అమ్ర్ బిన్ మాద్ (రజి) సుడిగాలిలా దూసుకుపోయి ఈరాన్ మల్లయోధుడ్ని ఒడిసిపట్టుకొని తెచ్చారు.

ఈరాన్ సేనాపతి రుస్తుమ్ ఇక లాభం లేదనుకొని వెంటనే సామూహిక దాడి కోసం సైనికుల్ని ఆదేశించాడు. కాల్బలం పంక్తులకు ముందు ఏనుగుల పంక్తిని ఉంచి యుద్ధం ప్రారంభించాడు. మొదట్లో ఏనుగుల బీభత్సం వల్ల ముస్లిం సైనికులు కొందరు గాయపడి నప్పటికీ ఆ తర్వాత వారు ఖడ్గాలతో, బరిశెలతో ఏనుగులపై విరుచుకుపడ్డారు. దాంతో ఏనుగులు వెనుకంజ వేశాయి. ఇరుపక్షాలకు చెందిన కాల్బలం సైనికులు కలసిపోయి భీకరయుద్ధానికి దిగాయి. అప్పుడు ఏనుగులు మరోసారి ముస్లింలపై విరుచుకుపడి వారిని గాయపరచడం మొదలెట్టాయి. వెంటనే సేనాపతి ఆదేశంతో ముస్లిం విలుకాండ్రు ఏనుగుల మీద, ఏనుగులపై కూర్చున్న ఈరాన్ సైనికుల మీద బాణాల వర్షం కురిపించారు. ఆరోజు చీకటి పడగానే ఇరుపక్షాలు యుద్ధాన్ని మరుసటి రోజుకు వాయిదా వేశాయి.

మరునాడుదయం ముస్లింలు ఫజ్ర్‌నమాజ్ చేసిన తర్వాత నిన్న వీరమరణం పొందిన అయిదొందలు మంది యోధుల శవాలను ఖననం చేశారు. యుద్ధం ప్రారంభమవుతున్న తరుణంలో ఖాఖా బిన్ అమ్ర్ (రజి) వేయిమంది యోధులతో వచ్చి చేరారు. ఆ తరువాత సిరియా నుంచి విడతలవారిగా మరోఆరువేల సైన్యం వచ్చిచేరింది. మొదట ఈరాన్‌సైన్యం నుండి బహ్మన్ జాద్వియా మల్లయుద్ధం కోసం ముందుకొచ్చాడు. అతడ్ని ఎదుర్కోవడానికి ఖాఖా బిన్ అమ్ర్ (రజి) వచ్చి ఒక్క వ్రేటుతో జాద్వియాను కడతేర్చారు. ఆ తర్వాత కూడా ఈరాన్‌సైన్యం నుండి వరుసగా అనేకమంది మల్లయోధులు రంగంలోకి దిగి ముస్లింల చేతుల్లో హతమయ్యారు. ఆ తర్వాత సామూహిక యుద్ధం మొదలయింది.

ఆరోజు కూడా ఏనుగుల బీభత్సకాండ సాగింది. అయితే ముస్లింలు ఈసారి ఓ కొత్త పన్నాగం పన్నారు. ఒంటెలు ఏనుగుల్లా భయంకరంగా కన్పించడానికి ఉయ్యాలల్లాంటి వస్తువులు తయారుచేసి వాటి మూపురాల పైనుంచి వ్రేలాడదీశారు. ఈరాన్‌గుర్రాలు వాటిని చూసి బెదిరిపోయి అడ్డదిడ్డంగా పరుగెత్తసాగాయి. దాంతో ఈరానీయులు అనేక మంది గాయపడ్డారు. ముస్లింలు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ అనేకమందిని వధించారు. మూడోరోజు కూడా ఈరానీయులు ఏనుగుల పంక్తిని ముందుంచారు. అప్పుడు ఇద్దరు ముస్లింలు ఏనుగుల రాజయిన తెల్లఏనుగుపై దాడిచేసి చంపేశారు. ఆ తరువాత మరో ఏనుగుపై దాడిచేస్తే అది గాయపడి పారిపోయింది. శ్వేతగజరాజు నేలకొరగడం, మరోఏనుగు గాయపడి పారిపోవడం చూడగానే మిగిలిన ఏనుగులు కూడా భయపడి పరుగెత్తాయి. దాంతో అనేకమంది ఈరానీయులు వాటికాళ్ళ కింద పడి నలిగిపోయారు.

సంకుల సమరం జరుగుతున్న సమయంలో ప్రముఖ మల్లయోధుడు, కవి అయిన అబుల్‌మహ్జన్ నఖ్ఫీ(రజి) తీవ్రమైన వ్యసనానికి తట్టుకోలేక కాస్తంత మందు పుచ్చుకున్నారు. అప్పుడు సేనాపతి సాద్ (రజి) ఆయన్ని మందలిస్తూ చేతులకు బేడీలు వేసి గదిలో నిర్బంధించారు. ఆయన జైలుగది కిటికీల గుండా యుద్ధం జరుగుతున్న తీరును చూస్తూ సమరోత్సాహంతో చిందులు వేయసాగారు. చివరికి ఆయన తనను తాను నిగ్రహించుకోలేక సేనాపతి భార్య సల్మా (రజి) దగ్గరకు వెళ్ళి "అమ్మా! దయచేసి యుద్ధం చేయడానికి నా

చేతులకు కట్టిన బేడీలు విప్పదీయండి. యుద్ధంలో బ్రతికి బయటపడితే నేను తిరిగొచ్చి బేడీలు వేసుకుంటాను" అని బ్రతిమాలారు. కాని ఆమె అందుకు నిరాకరించారు.

దాంతో అబుల్‌మహ్జాన్ (రజి) నీరుగారిపోయి ఇలా ఓ కవిత పఠించారు: "రౌతులు ఈటెలు, ఖడ్గాలతో పోరాడుతుంటే నేనిక్కడ సంకెళ్ళతో బంధించబడి ఉన్నాను. ఇంతకంటే దౌర్భాగ్యం మరేముంటుంది? లేచి నిలబడాలనుకుంటే ఈ సంకెళ్ళు నన్ను నిలబడనివ్వడం లేదు. అరిచేవాడు అరిచి గీబెట్టినా తలుపులెవరూ తెరవడం లేదు."

సేనాపతి భార్య సల్మా (రజి) ఈ కవిత విని కరిగిపోయారు. వెంటనే ఆమె వచ్చి బేడీలు విప్పదీసి అబుల్‌మహ్జాన్ (రజి)కు విముక్తి కలిగించారు. అప్పుడు అబుల్‌మహ్జాన్ (రజి) ఎంతో ఆనందోత్సాహాలతో సేనాపతి అశ్వశాలలోని ఓ గుర్రానెక్కి, ఆయుధాలు ధరించి మెరుపుతీగలా కదనరంగంలోకి దూకారు. శత్రుసైనికులపై బెబ్బులిలా విరుచుపడి అనేకమందిని మట్టుబెడుతూ స్వైరవిహారం చేయసాగారు.

ఆ యుద్ధతీరును, పోరాటపటిమను చూస్తున్న ఇతర యోధులు ఆశ్చర్యపోతూ "ఎవరీ పరాక్రమశాలి?" అని చెప్పుకున్నారు. సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) కూడా ఆశ్చర్యపోతూ "ఈవిధంగా అబుల్‌మహ్జాన్ మాత్రమే పోరాడుతాడు. కాని అతడ్ని నేను బేడీలు వేసి బంధించి ఉంచానే!" అని మనసులో అనుకున్నారు. యుద్ధ తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టిన తరువాత సాయంత్రం సేనాపతి సాద్ (రజి) జైలుగదికి వచ్చి చూస్తే అబుల్‌మహ్జాన్ (రజి) చేతులకు బేడీలతో నిక్షేపంగా కూర్చొని ఉన్నారు. తరువాత ఆయన తన సతీమణి సల్మా (రజి) ద్వారా విషయం తెలుసుకొని, వెంటనే బేడీలు విప్పదీసి అబుల్‌మహ్జాన్ (రజి)ను విడుదల చేశారు.

"ముస్లింల శ్రేయస్సు కోసం ఇంతగా పాటుపడే త్యాగశీలికి నేను శిక్ష విధించలేను" అన్నారు సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి). "దైవసాక్షి! నేను కూడా ఇకముందు ఎన్నటికీ మద్యం జోలికి పోను" అన్నారు అబుల్‌మహ్జాన్ (రజి) కూడా.

ఆరోజు రాత్రి కూడా యుద్ధం కొనసాగింది. సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) విజయం కోసం దైవాన్ని ప్రార్థిస్తూ, యోధులకు ఎప్పటికప్పుడు తగిన ఆదేశాలు జారీచేస్తూ ఉన్నారు. రాత్రి మూడో జామున యుద్ధరంగంలో అరుపులు, కేకల మధ్య ఖాఖా బిన్ అమ్ర్ (రజి) కంచుకంఠం విన్పించింది. "వెంటనే అందరూ కలసి మూకుమ్మడి దాడి చేయండి. అదిగో అటుచూడండి, రుస్తుమ్ పారిపోతున్నాడు, పట్టుకోండి" అన్నారు ఆయన బిగ్గరగా. ఈ మాటలు సాద్ (రజి)కు ఎంతో తృప్తినిచ్చాయి. మరోవైపు ముస్లింలలో నూతనోత్సాహం పెల్లుబికింది.

ఈరాన్ సేనాపతి రుస్తుమ్ రత్నఖచిత సింహాసనంపై కూర్చొని సైనికులకు ఆజ్ఞలు జారీచేస్తున్నాడు. ముస్లిం యోధులు మాత్రం అప్రతిహతంగా దాడిచేస్తూ ముందుకు పురోగమిస్తున్నారు. అలా దాడిచేస్తూ దగ్గరకు రాగానే రుస్తుమ్ సింహాసనం నుంచి దిగ్గున లేచి ముస్లింలతో పోరాడటం మొదలెట్టాడు. అయితే కాస్సేపటికే గాయపడి, వెనుదిరిగి పరుగెత్తసాగాడు. అప్పుడు హిలాల్ బిన్ అల్ఖమా తన చేతిలోని బరిసెను బలంగా విసిరారు. దాంతో రుస్తుం నడుంవిరిగి నదిలో పడిపోయాడు. వెంటనే హిలాల్ (రజి) గుర్రం పైనుంచి



క్రిందికి దూకి, రుస్తుం కాళ్ళు పట్టుకొని బయటికి లాగి, ఒక్క వ్రేటుతో అతడ్ని కడతేర్చారు. ఆ తరువాత ఆయన రుస్తుం సింహాసనంపై కూర్చొని "దైవసాక్షిగా చెబుతున్నా వినండి, నేను రుస్తుమ్‌ని హతమార్చాను" అన్నారు బిగ్గరగా.

అంతే ఈమాట వినగానే ముస్లింలు 'అల్లాహుఅక్బర్' అంటూ పెద్దపెట్టున నినదించారు. వేరొకవైపు ఈరానీయులు ఈ నినాదం వినగానే గుండెలు బాదుకుంటూ బ్రతుకుజీవుడా అంటూ పిక్కబలంకొద్దీ పారిపోయారు. వారి సైన్యంలోని ముప్ఫయివేల మంది రౌతుల్లో ముప్ఫయి మంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మిగిలిన రౌతులంతా హతమార్చబడ్డారు. హిజ్రీశకం 14వ ఏట, ముహ్రం నెలలో జరిగిన ఈ యుద్ధంలో ముస్లింలు ఆరువేల మంది అమరగతులయ్యారు.

యుద్ధం ముగిసిన తరువాత సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఖలీఫాకు ఈ విజయ శుభవార్త తెలియజేయడానికి ఒక యోధుడ్ని మదీనాకు పంపించారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఖాదిసియా యుద్ధవార్తలు తెలుసుకోవడానికి అనుక్షణం ఎదురుచూస్తుండేవారు. జరిగిన సంఘటన క్షణాల్లో తెలుసుకోవడానికి ఆ కాలంలో టీవీలు, టెలిఫోన్లు లేవుకదా! ఖాదిసియా నుండి మదీనాకు వార్త చేరడానికి అనేక రోజులు పడ్తుంది. అయినప్పటికీ ఖాదిసియా నుండి ఈరోజు ఎవరైనా తిరిగొస్తారేమో, ఏదైనా శుభవార్త తెస్తారేమోనని ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతిరోజూ వేయి కళ్ళతో ఎదురు చూసేవారు. దాని కోసం ఆయన ప్రతిరోజూ మదీనా నగరం బయటికి వెళ్ళి గంటల తరబడి నిరీక్షిస్తుండేవారు.

అలా నిరీక్షిస్తుంటే ఓరోజు దూరాన్నుంచి దుమ్ములేపుకుంటే ఓ రౌతు వేగంగా పట్నం వైపే వస్తున్నట్లు కన్పించింది. ఇంకేముంది, ఖలీఫాగారికి ఆరాటం ఎక్కువైపోయింది. రౌతు మరికాస్త దగ్గరయ్యాడు. ఖలీఫాగారు పరుగువేగంతో ఎదురెళ్ళి "ఎక్కడ్నుంచి వస్తున్నావ"ని అడిగారు తహతహలాడుతూ. "ఖాదిసియా నుండి వస్తున్నా" అన్నాడు రౌతు. "అయితే ఖాదిసియా యుద్ధ పర్యవసానం ఏమిటీ?" అడిగారు ఉమర్ ఫారూఖ్ (రజి). "ఖాదిసియాయుద్ధంలో ముస్లింలు విజయం సాధించారు. ఈ శుభవార్త తెలియజేయడానికే మా సేనాపతి నన్నిక్కడకు పంపించారు" చెప్పాడు రౌతు తాపీగా.

ఈమాట వినగానే ఖలీఫాగారు రొట్టె విరిగి నేతిలో పడినట్లు పరమానందంతో పులకించిపోయారు. అంతటితో ఆయన రౌతును వదలిపెట్టలేదు. "బాబ్బాబ్బాబు! దాని విశేషాలేమిటో కాస్త వివరంగా చెప్పు నాయనా!" అంటూ ఒంటె అంబారీ పట్టుకొని, దాని పక్కనే పరుగెత్తసాగారు. రౌతు యుద్ధవిశేషాలు వివరిస్తూ వేగంగా మదీనా వైపు సాగుతున్నాడు. ఖలీఫాగారు అంబారీ పట్టుకొని, విజయవార్తలు వింటూ ఒంటె పక్కన పరుగిడుతూనే ఉన్నారు. ఆ విధంగా వారుభయులు పట్నంలో ప్రవేశించారు.

పట్నంలో ప్రవేశించగానే వాళ్ళకు ఎదురొస్తున్న ప్రతి మనిషీ "విశ్వాసుల నాయకా! అస్సలాము అలైకుం" అని చెప్పసాగాడు. పాపం అప్పుడు తెలిసింది రౌతుకు తనను యుద్ధవిశేషాలు అడుగుతున్నది సాక్షాత్తు ఖలీఫాగారేనని. వెంటనే ఆయన భయపడి ఒంటె

మీద నుంచి దిగబోయాడు. అయితే ఖలీఫా ఆయన్ని వారిస్తూ “వద్దు, నీవు నీ ఒంటెపైనే కూర్చొని యుద్ధవార్తలు వివరిస్తూ నడు” అన్నారు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి). అదే పరిస్థితిలో ఆ ఇద్దరూ ఖలీఫా ఇంటికి చేరుకున్నారు. ఆతర్వాత ఉమర్ (రజి) మస్జిదెనబవీలో ప్రజల్ని సమావేశపరచి, విజయ శుభవార్త తెలియజేసి ఇలా ప్రసంగించారు:

“సోదరులారా! మిమ్మల్ని బానిసలుగా చేసుకోవడానికి నేను రాజును కాను. నేను స్వతహాగా దేవుని బానిసను. కాకపోతే ఖిలాఫత్ పాలనాబాధ్యత నా భుజస్కంధాలపై పడింది. మీరు మీ ఇండ్లలో నిశ్చింతగా జీవితం గడిపేలా నేనీ బాధ్యత నిర్వహించగలిగితే అది నా అదృష్టమని భావిస్తున్నాను. ఒకవేళ మీరంతా మీమీ అవసరాలు తీర్చుకోవడానికి నా ఇంటి ముందు హాజరుకావాలని నేను కోరుకుంటే అది నా దౌర్భాగ్యమని తలుస్తాను. నేను మీకు నోటి ద్వారానే గాకుండా ఆచరణ ద్వారా కూడా హితోపదేశం చేస్తున్నాను.”

## (6) మదాయెన్‌లో విజయకేతనం

ఈరాన్ సైనికులు ఖాదిసియా నుండి పారిపోయి బాబిల్‌కు చేరుకున్నారు. వారి అధికారులు అక్కడ మరింత సైనిక సమీకరణ చేసి యుద్ధసన్నాహాలు చేయసాగారు. కాని అక్కడా వారికి చుక్కెదురు కావడంతో బాబిల్ నుంచి కొందరు ఈరాన్ రాజధాని మదాయెన్ వైపుకు, మరికొందరు అహ్వాజ్, నిహావంద్‌ల వైపుకు పారిపోయారు. అలా పారిపోతూ దారిలో, నదులపై నిర్మించబడిన వంతెనలను కూల్చివేస్తూ వెళ్ళిపోయారు.

సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) రెండు నెలల తరువాత ఖాదిసియా నుండి ఈరాన్ రాజధాని మదాయెన్ దిశగా దండయాత్ర సాగించారు. తనకు ముందు జహ్రా బిన్ హయాత్ (రజి)కు ఓ చిన్న దళమిచ్చి పంపారు. జహ్రా (రజి) కోసీ ప్రదేశానికి చేరుకొని విచారిస్తే అక్కడ ఈరాన్‌సేనలు కయ్యానికి కాలుదువ్వుతున్నట్లు తెలిసింది.

వారి నాయకుడు, ప్రముఖ మల్లయోధుడు షహర్‌యార్ ముస్లిం సైన్యం ముందుకు వచ్చి “మీ అందరిలో గొప్ప మల్లయోధుడు, యోధానయోధుడు ఎవరైనా ఉంటే నన్ను ఎదుర్కోవడానికి ముందుకు రావచ్చు” అని సవాలు విసిరాడు.

జహ్రా బిన్ హయాత్ (రజి) ఈమాట విని “నేనే నిన్ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాను. కాని నీ గర్వాన్ని అణచివేయడానికి నీకు పోటీగా ఒక సాధారణ బానిసను పంపిస్తున్నాను, ప్రతిఘటించు” అని అన్నారు.

తర్వాత ఆయన నాయిల్ బిన్ జాషుమ్ (రజి) అనే బానిసకు సైగచేశారు. నాయిల్ (రజి) వెంటనే రంగంలోకి దిగారు. ఈరాన్ మల్లయోధుడు షహర్‌యార్ వికటాట్టహాసం చేస్తూ నాయిల్ (రజి)పై ఒక్క ఉదుటున లంఘించి ఆయన్ని క్రింద పడవేసి రొమ్ముపై కూర్చున్నాడు. అయితే యాదృచ్ఛికంగా అతని కాలిబొటనవ్రేలు నాయిల్ (రజి) నోటి దగ్గరకు వచ్చింది. అప్పుడాయన అతని కాలి బొటనవ్రేలును గట్టిగా కొరికారు. దాంతో షహర్‌యార్ అబ్బా! అంటూ పట్టువిడిచి విలవిల్లాడి పోయాడు. వెంటనే నాయిల్ (రజి) లేచి అతని రొమ్ముపై కూర్చొని ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఖడ్గం తీసి ఒకే ఒక వ్రేటుతో అతడ్ని అంతమొందించారు.



ఈరాన్ సేనాని షహర్‌యార్ హతమవగానే అతని సైనికులు ప్రాణభీతితో పారిపోయారు. షహర్‌యార్ కవచం, ఖడ్గం, రత్నఖచిత కిరీటం, ఖరీదైన దుస్తులు సమస్తం నాయిల్ బిన్ జాషుమ్ (రజి)కు లభించాయి. అంతలో సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) కోసీకు చేరుకొని విజయవార్త, ఈరాన్‌సేనాని వధ సంగతి తెలుసుకున్నారు. ఆ తరువాత ఆయన షహర్‌యార్ దుస్తులు, కిరీటం, ఆయుధాలు ధరించి తన ముందు నడవమని నాయిల్ (రజి)ను ఆదేశించారు. నాయిల్ (రజి) అలాగే చేశారు. ముజాహిద్ లందరూ ఈ అపూర్వ దృశ్యాన్ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ దైవాన్ని స్తుతించారు.

ముస్లింసేనలు కోసీ నుంచి బయలుదేరి దారిలో అనేక ప్రాంతాల్లో ఎదురైన ఈరానీయుల్ని ఎదుర్కొంటూ ‘బహ్రెషేర్’కు చేరుకున్నాయి. ఇది రాజధాని మదాయెన్ సమీపంలో ఉంది. మదాయెన్ తర్వాత బహ్రెషేర్ ఈరాన్‌చక్రవర్తి భద్రత కోసం నిర్మించ బడిన పటిష్ఠమైన కోట, పట్నం. ముస్లిం సేనలు రాగానే బహ్రెషేర్‌ను ముట్టడించారు. ఈ ముట్టడి మూడునెలలు కొనసాగింది. చివరికి ఈరాన్‌సైనికులు గత్యంతరంలేక కోట బయటికి వచ్చి యుద్ధంచేశారు. కాని పరాజయంపాలై అనేకమంది హతమవ్వగా, మిగిలిన వారు పారిపోయారు. ముస్లింసైన్యం విజయదరహాసంతో కోటలో ప్రవేశించింది.

ముస్లిం సేనలు బహ్రెషేర్‌ను ఆక్రమించుకోగానే ఈరాన్‌చక్రవర్తి మదాయెన్ నుంచి ‘హల్వాన్’కు పారిపోయాడు. సేనాపతి సాద్ (రజి) వీలైనంత త్వరగా మదాయెన్‌ను వశపర చుకోవాలని భావించారు. కాని బహ్రెషేర్‌కు, మదాయెన్‌కు మధ్య భయంకరమైన దజ్లా నది ఉంది. ఈరాన్‌సైనికులు బహ్రెషేర్ నుంచి పారిపోతూ దజ్లా మీదున్న వంతెనను పూర్తిగా కూలగొట్టారు. దాంతో ముస్లింలకు నది దాటడం చాలా కష్టమైపోయింది.

ఏమైనప్పటికీ ముస్లింలు నది దాటడానికే నిర్ణయించుకున్నారు. సేనాపతి సాద్(రజి) ఆరొందల మంది విలుకాండ్రను నది గట్టుమీద నియమించారు. తర్వాత మిగతా సైన్యానికి తగిన ఆదేశాలిచ్చి నది దాటేందుకు సిద్ధపరిచారు. తర్వాత ఆయన దేవునిపై భారం వేసి, దైవనామాన్ని స్మరిస్తూ తాను కూర్చున్న గుర్రాన్ని నదిలోకి తోలారు. సేనాపతిని అనుసరిస్తూ సైనికులంతా ధైర్యంచేసి తమతమ గుర్రాలను నదిలోకి తోలారు. ఉవ్వెత్తున ఎగిసిపడు తున్న అలలతో పరవళ్ళు తొక్కుతున్న దజ్లానదిలో ఈ గుర్రాలన్నీ చిన్నచిన్న పడవల్లా, నీటిగుర్రాల మాదిరిగా ముందుకుసాగాయి. ఇలా నది మధ్యకు చేరుకోగానే నది ఆవల తీరంలో కాపుకాస్తున్న ఈరాన్‌విలుకాండ్రు లేచి బాణాలు ఎక్కుపెట్టనారంభించారు. వెంటనే నది ఈవల కూర్చున్న ముస్లిం విలుకాండ్రు వారిపై బలంగా బాణాలవర్షం కురిపించారు. దాంతో వారు అనేకమంది గాయపడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పారిపోయారు.

దారి సుగమం కావడంతో ముస్లిం యోధులు సునాయాసంగా నది దాటిపోయి ఈరాన్ సైనికుల్ని చీమల్లా నలిపివేశారు. బ్రతికి బయటపడినవారు పిక్కబలంకొద్దీ పారిపోయారు. ముస్లింలు నది దాటారని తెలియగానే నగరవాసులు రాచవాడలను లూటీ చేసి విలువైన వస్తువుల్ని అందినమటుకు దోచుకోసాగారు. అంతలో ముస్లిం యోధులు నగరంలో ప్రవేశించి దోపిడీగాండ్ర వెంటపడి వారు దోచుకున్న వస్తువుల్ని స్వాధీనం చేసు

కున్నారు. ఈరానీయుల నుండి సమరసొత్తుగా లభించిన అపార సిరిసంపదల్ని చూసిన సేనాపతి సాద్ (రజి) నోట అప్రయత్నంగా ఈ దైవసూక్తి వెలువడింది:

"వారు ఎన్నో పొలాలు, తోటలు, సెలయేళ్ళు, మేడలు వదలివెళ్ళారు. వారు రంగరంగ వైభవంతో అనుభవించిన ఎన్నో విలాసవస్తువులు వారి వెనుకే ఉండిపోయాయి. ఇదీ వారి పర్యవసానం. మేమా వస్తువులన్నిటికీ ఇతరుల్ని వారసులుగా చేశాం." (44:25-27)

ఈరాన్ రాజధాని మదాయెన్ తమ ఆక్రమణలోకి రావడంతో ముస్లింలు ఎంతో సంతోషించారు. ఆరోజు శుక్రవారం. సేనాపతి సాద్ (రజి), ఆయన సహచరులు రాజమహల్ లోనే జుమానమాజ్ చేశారు. రాజమహల్‌లో చక్రవర్తి కూర్చునే రత్నఖచిత సింహాసనంతో పాటు, ఎంతోవిలువైన అనేక వస్తువులు, దుస్తులు, ఆయుధాలు, కిరీటాలున్నాయి. వెండిబంగారాలు, వజ్రవైఢూర్యలతో కూడిన ఎన్నో విగ్రహాలు కూడా ఉన్నాయి. రాజమహల్ లోనే ఉన్న ఓ ప్రదర్శనశాలలో ఓడిపోయిన రాజులకు చెందిన ఖడ్గాలు, కవచాలు, కిరిటాలు, దుస్తులు ఈరాన్ విజయచిహ్నాలుగా భద్రపరచబడ్డాయి.

వాటన్నిటికంటే విలువైన మరొక వస్తువు ఉంది. అది ఈరాన్‌చక్రవర్తి ప్రత్యేక పరుపు. పది గజాల వెడల్పు, తొంభై గజాల పొడవైన ఈ పట్టుపాన్పు మీద వెండి, బంగారం, మణులు, ముత్యాలతో అల్లిన పువ్వులు, ఆకులు, లతలు, చెట్లు, సెలయేరుల చిత్రాలున్నాయి. ఈ సమరసొత్తులో సైనికుల భాగం పోగా మిగిలినదాన్ని సేనాపతి మదీనాకు పంపించారు.

మదీనాకు తీసుకురాబడిన ఈ అసాధారణ సమరసొత్తు చూసి ముస్లింలు నిర్ఘాంత పోయారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వీటన్నిటినీ ప్రజలకు పంచిచ్చారు. కోట్లాది రూపాయలు విలువచేసే చక్రవర్తి పట్టుపాన్పును పంచకూడదని అనేకమంది అభిప్రాయ పడ్డారు. కాని హజ్రత్ అలి (రజి) దాన్ని కూడా ముక్కలు చేసి పంచాలన్నారు. ఖలీఫా ఆయన అభిప్రాయాన్ని స్వీకరిస్తూ ఆ పట్టుపాన్పును కూడా ముక్కలు చేసి ప్రజలకు పంచారు. అలి (రజి) భాగానికి వచ్చిన ముక్క మరీఅంత విలువైనది కాదు. అయినా దాన్ని ఆయన ముప్ఫయివేల దీనార్లకు అమ్మివేశారు.

ముస్లింలు ఈరాన్ రాజధాని మదాయెన్‌ను వశపరచుకోక ముందే ఈరాన్‌చక్రవర్తి యజ్దగిర్ద్ మదాయెన్ నుంచి పారిపోయి 'హల్వాన్'లో ఆశ్రయం పొందిన సంగతి తెలిసిందే. హల్వాన్ సమీపంలో 'జలూలా' అనే మరో పట్నం ఉంది. అక్కడ ఈరాన్ సైనికాధికారులు పెద్దఎత్తున సైన్యాలను, ఆయుధాలను, ఆహారసామగ్రిని సమీకరించి, పట్నం కోట చుట్టూ కందకం తవ్వి ముళ్ళకంచెలు వేశారు. ముస్లింసేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఈ విషయం తెలుసుకొని జలూలాపై దాడిచేయడానికి హాషిమ్ బిన్ ఉతెబా (రజి)కు పన్నెండు వేల మంది సైనికుల్ని ఇచ్చి పంపారు. హాషిమ్ జలూలా చేరుకొని కోటను ముట్టడించారు. ముట్టడి అనేక నెలలు కొనసాగింది. కోటలో ఉన్న లక్షలాది మంది ఈరాన్‌సైనికులు తమసంఖ్యలో ముస్లింలు పదోవంతు కూడా లేరని తెలుసుకొని ప్రారంభంలో ఎంతో ఉత్సాహంతో పోరాడారు. కాని ఆ తరువాత క్రమంగా ఢీలాపడిపోయి లక్ష మంది సైనికుల్ని మృత్యుకుహరంలో పడవేసుకున్నారు.



అది హిజ్రీ 16వ శతాబ్దం. ముస్లింలు జలూలా కోట ఆక్రమించుకున్నారని తెలియగానే చక్రవర్తి యజ్దగిర్ద్ హల్వాన్ నుంచి "రే" వైపుకు పారిపోయాడు. అతను రాజధాని మదాయెన్ లోని ఖరీదైన అనేక వస్తువులతో పాటు అపార సిరిసంపదల్ని మదాయెన్ ఆక్రమణకు ముందే జలూలాకు తరలించాడు. ఇప్పుడా వస్తువులు, సిరిసంపదలన్నీ సమరసొత్తుగా ముస్లింలకు దక్కాయి. ముస్లిం సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఆ సమరసొత్తులో సైనికుల భాగం పోగా మిగతా సమరసొత్తును జియాద్ (రజి) ద్వారా మదీనాకు పంపివేశారు.

మస్జిదెనబవీ ఆవరణలో కనీవినీ ఎరగనంతటి అపార సమరసొత్తును, కళ్ళు జిగేల్ అన్పించే విలువైన వస్తువుల్ని చూసిన మదీనా ప్రజలు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కాని సువిశాల సామ్రాజ్యానికి అధినేత అయిన ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మాత్రం ఆ ధనరాసుల్ని చూసి కన్నీరు కార్చారు. ప్రజలు ఆయన్ని చూసి ఆశ్చర్యపోయారు. "ఏమిటీ, ఈయనగారు ఇంతపెద్ద ఎత్తున లభించిన ధనరాసుల్ని చూసి సంతోషించాల్సింది పోయి ఏడుస్తున్నారు?" అనుకున్నారు జనం ముక్కుమీద వేలేసుకొని.

ప్రముఖ సహాబీ హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు కూడా ఖలీఫా పరిస్థితి అర్థం కాలేదు. అందుకే ఆయన "విశ్వాసులనాయకా! ఎందుకిలా కంటతడి పెట్టుకున్నారు? ఇది సంతోషంతో దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకునే సమయంకదా!" అని అడిగారు. దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "దేవుడు ఏ జాతికి ప్రపంచ సిరిసంపదలు ప్రసాదిస్తాడో ఆ జాతిలో అసూయాద్వేషాలు జనిస్తాయి. దానివల్ల ఆజాతిలో చీలికలు ఏర్పడుతాయి. ఈ విషయమే నన్నిప్పుడు కంటతడి పెట్టించింది" అని అన్నారు.

ఆ సమరసొత్తులో చక్రవర్తి రత్నఖచిత కిరీటం, మణిమాణిక్యాలు పొదగబడిన అతని నడుంకట్టు, వెండి-బంగారు జల్తారు అల్లిన అతని దుస్తులు, వజ్ర కంకణాలు కూడా ఉన్నాయి. ఖలీఫా చేతిలోని ఖడ్గంతో వాటిని తిప్పిచూసి సురాఖా బిన్ మాలిక్ (రజి)ని పిలిపించారు. కాస్సేపటికి సురాఖా(రజి) వచ్చిన తరువాత ఖలీఫా ఉమర్ (రజి) ఆయనకు ఈరాన్‌చక్రవర్తి దుస్తులు ధరింపజేసి ఆయన తలమీద అతని కిరీటం పెట్టారు. తర్వాత ఆయన నడుముకు చక్రవర్తిఖడ్గం వ్రేలాడదీసి, చేతులకు అతని కంకణాలు తొడిగించారు. అప్పుడు ఇతర ముస్లింలు సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు.

ఆ తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సురాఖా బిన్ మాలిక్ (రజి) వైపు తిరిగి "వారెవా! ఒక సాధారణ పల్లెవాసి తలపై ఈరాన్‌చక్రవర్తి రత్నఖచిత కిరీటమా!! చేతులకు అతని వజ్రఖచిత కంకణాలా!!!" అని అన్నారు. మదీనాకు వలసపోతున్న దైవప్రవక్త (స)ను పట్టుకోవడానికి వచ్చిన సురాఖా (రజి)కు ఆనాడు ఆ మహనీయుడు చెప్పిన భవిష్యవాణి ఈనాడీ విధంగా నెరవేరింది.

## (7) 'ఉబులా'లో విజయం, బస్రా పట్టణ స్థాపనం

ఈరానీయులు ముస్లింల చేతిలో చావుదెబ్బ తింటున్నప్పటికీ వెంటనే వారికి తమ ప్రధాన సైనికస్థావరాల నుండి ధన, సైనిక సహాయం లభిస్తుండేది. దాంతో వారు రెచ్చిపోయి మళ్ళీమళ్ళీ దాడులకు పాల్పడసాగారు. అలాంటి సైనికస్థావరాల్లో ఉబులా ఒకటి.

ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈరాన్ సైన్యాలకు అందుతున్న ధన, సైనిక సహాయాన్ని అడ్డుకోవడానికి 'ఉబులా' పట్టణం వైపుకు ఒక సైనికదళాన్ని పంపడానికి నిశ్చయించుకున్నారు. అయితే మదీనాలో అప్పుడు సమరయోధులు చాలా తక్కువ మంది ఉన్నారు. అంచేత ఆయన తక్కువ మంది సైనికులతో వ్యూహాత్మకంగా పోరాడగలిగే సమర్థుడైన నాయకుడి కోసం అన్వేషించారు. చివరికి ఆయన దృష్టి హజ్రత్ ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) మీద పడింది. మరుసటి రోజు ఆయన ఉతెబా (రజి) నేతృత్వంలో మూడొందల మంది యోధులతో కూడిన ఒక సైనిక దళమిచ్చి ఉబలా వైపుకు పంపారు.

హజ్రత్ ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) ఆ కొద్దిపాటి సైన్యం తీసుకొని బయలుదేరారు. దారిలో ఖలీఫా పంపిన మరో మూడొందల మంది యోధులు కలిశారు. మొత్తం సైనిక దళంలో కొందరు స్త్రీలు కూడా ఉన్నారు. సైనికులు ఉబలా పట్టణానికి చేరుకోక ముందే ఆహారపదార్థాలు నిండుకోవడంతో ఒక ప్రదేశంలో విడిదిచేశారు. అందరూ ఆకలితో నకనక లాడసాగారు. ఆహారం కోసం అన్వేషిస్తే వారికి ఒకచోట ఏవో వస్తువులతో నిండిన రెండు బస్తాలు లభించాయి. వాటిలో ఒకదానిలో ఖర్జూరపండ్లున్నాయి. రెండవ దానిలో ఏవో ధాన్యం గింజలు ఉన్నాయి. ఒక సైనికుడు వాటిని చూసి "ఇందులో ఏదో విషమున్నట్లు అన్పిస్తోంది నాకు. శత్రువులు మనల్ని చంపడానికి పన్నిన పన్నాగం ఇది" అని అన్నాడు. అంచేత సైనికులు వాటిని వదలి ఖర్జూరపండ్ల మీద విరుచుకుపడ్డారు. కాని కొద్దిపాటి ఆ ఖర్జూరపండ్లతో వారి ఆకలి తీరలేదు.

యోధులు అర్థాకలితో బాధపడుతూ ఏం చెయ్యాలన్న ఆలోచనలో పడిపోయారు. అప్పుడు వారిలో ఒక మహిళ లేచి "విషం కలసిన పదార్థాన్ని వేడిచేస్తే దాని విషప్రభావం పోతుందని మా నాన్నగారు చెబితే విన్నాను" అని చెప్పింది. సైనికులు ఈమాట విని వెంటనే పొయ్యిరాజేసి ఆ ధాన్యాన్ని పొయ్యి మీద పెట్టి వండారు. కాస్సేపటికి ఆ ధాన్యం ఎరుపెక్కి, వాటిమీది పొట్టు పోయి తెల్లటి బియ్యపు గింజలు బయటికొచ్చాయి. కాస్సేపట్లో వరి అన్నం తయారైపోయింది. యోధులు సంతోషంతో దాన్ని కడుపునిండా తిని దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నారు.

ఆ తరువాత వారు దజ్లా నదీతీరాన వున్న ఉబలా పట్టణం సమీపానికి చేరుకున్నారు. ఆ పట్టణాన్ని ఈరానీయులు తమ ఆయుధగారాంగా చేసుకున్నారు. పట్టణం చుట్టూ వున్న ప్రహరీగోడ బురుజులపై వారి సైనికులు అహోరాత్రులు కాపలా కాస్తుంటారు. ఆరొందల మంది యోధులతో అనేక వేలమంది శత్రుసైనికులతో తలపడటం చాలా కష్టం. అంచేత సేనాపతి ఉతెబా బిన్ గజ్వాన్ (రజి) స్త్రీలను పురుష పంక్తులకు వెనుక ఉంచి "మేము పట్టణం సమీపించగానే మీరు మా వెనుక ఉవ్వెత్తున దుమ్ము-ధూళి లేపుతూ పరిసరాలు మసకబారేలా చేయండి" అని ఆదేశించారు.

ఈ ఆదేశం ప్రకారం పట్టణం దగ్గరకు రాగానే స్త్రీలు పెద్ద ఎత్తున దుమ్ము-ధూళి లేపుతూ, యుద్ధపతాకాలు ఊపుతూ దూసుకురాసాగారు. కోట బురుజులపై కాపలా కాస్తున్న ఈరానీయులు ఈ దృశ్యం చూసి తమ నాయకులకు సమాచారం అందజేశారు. అప్పుడా నాయకులు కోట తలుపులు తెరచి బయటికొచ్చి చూస్తే ఫ్రంట్‌లైన్ సైనికుల



వెనుక ఉవ్వెత్తున లేచిన దుమ్ముతప్ప మరేమీ కన్పించలేదు వారికి. దాంతో వారు శత్రువులు తమ కంటే అత్యధిక సంఖ్యలో ఉంటారని భావించి భయపడిపోయారు. వెంటనే ఈరానీ సైనికులు తమ దగ్గరున్న విలువైన సామగ్రి తీసుకొని నదీతీరం మీదున్న పడవల వైపుకు పరుగెత్తారు. బ్రతికుంటే బలుచాకైనా తినొచ్చని భావిస్తూ పడవల మీదెక్కి పారిపోయారు.

ముస్లింలు ఎలాంటి పోరాటం, ప్రతిఘటనలు లేకుండా ఉబలా పట్టణాన్ని సులభంగా స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా విజయ పతాకాలు ఎగరేశారు. ఈ దండయాత్రలో వారికి పెద్దఎత్తున సమరసొత్తు లభించింది. ఆ తరువాత సేనాపతి ఉతెబా (రజి) ఖలీఫా అనుమతి తీసుకొని అక్కడ ఓ అందమైన పట్టణాన్ని నెలకొల్పారు. దాని పేరే 'బస్రా'. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన్ని బస్రా గవర్నర్‌గా నియమించారు. అక్కడ ముస్లింలు సువిశాలమైన ఇండ్లలో నివశిస్తూ, ఇదివర కెన్నడూ ధరించని ఖరీదైన బట్టలు ధరిస్తూ, ఇంతకు ముందెన్నడూ తినని రుచికరమైన ఆహారపదార్థాలు తింటూ విలాసవంతమైన జీవితం గడపసాగారు.

కాని గవర్నర్ హజ్రత్ ఉతెబా (రజి) మాత్రం సాధారణ తిండి తింటూ, కంబళ్ళతో కట్టుకున్న ఓ చిన్న గుడారంలో ఉండసాగారు. ఆయనకు తన అనుచరుల విలాసజీవితం ఏమాత్రం నచ్చలేదు. అంచేత ఆయన ఓరోజు అందర్నీ మసీదులో సమావేశపరచి క్షణ భంగురం లాంటి ప్రాపంచిక జీవితంలోని తళుకుబెళుకులు చూసి మోసపోవద్దని, పరలోక జీవిత సౌఖ్యాల కోసం పాటుపడాలని ఉపదేశించారు.

ఆ తరువాత ఆయన తన స్థానంలో మరొకర్ని గవర్నంగా నియమించి మదీనా వెళ్ళి పోయారు. మదీనాలో ఖలీఫాను కలుసుకొని తన గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. కాని ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఆయన రాజీనామాను ఆమోదించకుండా తిరిగి ఆయన్ని బస్రా పంపివేశారు. హజ్రత్ ఉతెబా (రజి) తనకు గవర్నర్ పదవి ఇష్టం లేకున్నా ఖలీఫా ఆజ్ఞను శిరసావహిస్తూ బస్రా వెళ్ళడానికి సిద్ధమై ఒంటె ఎక్కారు. ఆ సమయంలో ఆయన "దేవా! నన్ను మళ్ళీ అక్కడికి తీసికెళ్ళకు. దేవా! నా మొరాలకించు" అని దుఆ చేశారు. ఆయన వేడుకోలును సృష్టికర్త స్వీకరించాడు. హజ్రత్ ఉతెబా (రజి) మదీనా నుండి కొన్ని మైళ్ళు పోయారో లేదో ఆయన ఒంటె కాలుజారి దబేలున క్రింద పడిపోయింది. దాంతో ఆయన కూడా కొద్ది దూరంలో పడిపోయి ఊపిరి విడిచారు.

## (8) ఎర్మూక్ యుద్ధం

ఇప్పుడు మనం ఒక సంవత్సరం వెనక్కిపోయి సిరియా పరిస్థితుల్ని తెలుసుకుందాం. ముస్లింల చేతిలో చావుదెబ్బలు తిన్న రోమ్‌సైనికులు డెమాస్కస్, హమస్‌ల నుండి పారిపోయి ఇన్తాకియా చేరుకున్నారు. అక్కడ చక్రవర్తి హెర్క్యులస్ ముందు హాజరయి, అరబ్బులు యావత్తు సిరియాను విచ్ఛిన్నం చేశారని, తాము వారిని ప్రతిఘటించలేక పోతున్నామని తమ గోడు చెప్పుకున్నారు. హెర్క్యులస్ ఈమాట విని "అరబ్బులు మీకంటే సంఖ్యలో, ఆయుధసంపత్తిలో, వాహనాలలో చాలా తక్కువగా ఉన్నారు కదా! అలాం టప్పుడు మీరు వారిని ఎందుకు ప్రతిఘటించలేకపోతున్నారు?" అని అడిగాడు. దానికి

రోమ్‌సైనికులు సిగ్గుతో తలలుదించుకొని మౌనంగా ఉండిపోయారు. అయితే వారిలో అనుభవశాలి అయిన ఒక వృద్ధసైనికుడు ఇలా అన్నాడు:

"మహారాజా! అరబ్బుల నీతినడవడికలు మా నీతినడవడికల కంటే ఎంతో బాగున్నాయి. వారు రాత్రివేళల్లో దైవారాధన చేస్తారు; పగటివేళల్లో ఉపవాసాలు ఉంటారు. ఎవరిపైనా దౌర్జన్యంచేయరు. పరస్పరం సోదరుల్లా మసలుకుంటారు, సమానత్వాన్ని పాటిస్తారు. కాని మా పరిస్థితి వారికి భిన్నంగా ఉంది. మేము మద్యానికి బానిసలైపోయాము; వ్యభిచారం చేస్తుంటాము. ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండము. ఇతరుల మీద దౌర్జన్యం చేస్తుంటాము. ఉన్నత నీతినడవడికల ఫలితంగా అరబ్బులు చేసే ప్రతి పనిలో ధైర్యం, స్థిరత్వాలు కన్పిస్తాయి. మాలో అలాంటి ధైర్యం, స్థిరత్వాలు లేవు."

ఈ మాటలు విన్న తరువాత రోమ్‌చక్రవర్తి ఢీలాపడిపోయి సిరియా వదలి వెళ్ళిపోదామని నిర్ణయించుకున్నాడు. కాని వివిధ పట్టణాల నుంచి క్రైస్తవులు తమను, తమమతాన్ని రక్షించాలంటూ తండోపతండలుగా రాజధానికి రావడంతో అతనికి రోషం పుట్టుకొచ్చింది. వెంటనే అతను ఇన్తాకియాలో సైన్యాలు సమీకరించాలని రాజ్యంలోని సేనాపతులందరికీ ఆదేశాలు జారీచేశాడు. ఈ ఆదేశంతో వివిధప్రాంతాల నుండి క్రైస్తవ సైనికదళాలు బయలుదేరి ఇన్తాకియాకు చేరడం ప్రారంభించాయి. కొన్ని రోజుల్లోనే ఈ సైనికసంఖ్య రెండు లక్షలు దాటింది.

'హమస్'లో విడిది చేసివున్న సేనాపతి అబూఉబైదా (రజి) గూఢచారుల ద్వారా ఈ సమాచారం తెలుసుకొని అత్యవసర సమావేశం జరిపారు. ఆ సమావేశంలో ప్రసంగిస్తూ "సోదరులారా! దేవుడు మనల్ని అనేకసార్లు పరీక్షించాడు. వాటిలో మనం నెగ్గాము. ఇప్పుడు శత్రువు సకలవిధాల సామగ్రితో మన ముందుకు వస్తున్నాడు. భూమి దద్దరిల్లిపోతోంది. ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలో చెప్పండి" అని సలహా అడిగారు ఆయన.

అప్పుడు యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి) లేచినిలబడి "నా అభిప్రాయం ప్రకారం స్త్రీలను, పిల్లలను పట్టణంలోనే ఉంచి మనం పట్టణం బయటికెళ్ళి పోరాడాలి. దాంతో పాటు మనకు సహాయపడేందుకు ఖాలిద్ బిన్ వలీద్ (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి)లను డెమాస్కస్, పాలస్తీనాల నుండి ఇక్కడకు పిలిపించాలి" అని అన్నారు.

షర్జీల్ బిన్ హస్నా (రజి) లేచి "ప్రతి ఒక్కరికీ తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వెలిబుచ్చే హక్కుండాలి. యజీద్ చిత్తశుద్ధితోనే తన అభిప్రాయం చెప్పివుండవచ్చు. కాని నేనతని అభిప్రాయంతో ఏకీభవించలేను. పట్టణంలో అత్యధికమంది క్రైస్తవులే ఉన్నారు. వారు మతదురభిమానంతో మన స్త్రీలను, పిల్లల్ని పట్టుకొని చంపేయవచ్చు లేదా రోమ్‌చక్రవర్తికి అప్పగించవచ్చు" అని అన్నారు.

దానికి సమాధానంగా సేనాపతి అబూఉబైదా (రజి) "అయితే మనం క్రైస్తవుల్ని పట్నం నుండి తీసివేద్దాము" అని అన్నారు. ఈమాట వినగానే షర్జీల్ బిన్ హస్నా (రజి) దిగ్గున లేచి "సేనాపతీ! క్రైస్తవుల్ని పట్టణం నుండి తీసివేసే అధికారం నీకు లేదు. వారిని మనం పట్టణంలో నిశ్చింతగా ఉండనిచ్చే షరతుపైనే ఒప్పందం చేసుకున్నాం. ఒప్పందాన్ని



ఉల్లంఘించడం అధర్మం" అని అన్నారు. అప్పుడు అబూఉబైదా (రజి) తప్పు ఒప్పుకొని తన అభిప్రాయాన్ని వెనక్కితీసుకున్నారు.

మరి ఈ సమస్యకు పరిష్కారం? కొందరు, హమస్‌లోనే ఉండి సైనికసహాయం కోసం ఎదురుచూడాలన్నారు. చివరికి అందరూ ఒక అభిప్రాయానికి వచ్చి "హమస్ నుండి డెమాస్కస్‌కు వెళ్ళిపోవాలని నిర్ణయించారు. డెమాస్కస్‌లో ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఉన్నారు. అరబ్ సరిహద్దులు కూడా దగ్గర్లోనే ఉన్నాయి. ఈ నిర్ణయం తీసుకున్న తరువాత సేనాపతి అబూఉబైదా (రజి) కోశాధికారి హబీబ్ బిన్ మస్లమా (రజి)తో ఇలా అన్నారు:

"మనం వారి ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పించే షరతుపైనే వారి నుండి జిజ్యా తీసుకున్నాం. కాని మనమిప్పుడు చాలా క్లిష్టపరిస్థితిలో చిక్కుకున్నాం; వారి రక్షణబాధ్యత తీసుకోలేము. అంచేత వారి దగ్గర్నుంచి మనం తీసుకున్న జిజ్యా వారికి తిరిగిచ్చెయ్యి."

ఈ ఆజ్ఞతో హబీబ్ (రజి) లక్షలాది దీనార్ల డబ్బు తీసుకొనివెళ్ళి హమస్‌వాసుల పెద్దలను సమావేశపరచారు. అప్పుడాయన "సోదరులారా! మేమిప్పుడు చాలా క్లిష్టపరిస్థితిలో పడిపోయాము. లక్షలాది రోమ్‌సైనికులతో తలపడవలసి వచ్చింది. ఈ పరిస్థితిలో మేము మీకు రక్షణ కల్పించలేము. కనుక మీకు రక్షణ కల్పించే షరతుపై మీనుండి తీసుకున్న జిజ్యాధనాన్ని మీకు తిరిగిచ్చేస్తున్నాం. మీపట్ల మా సత్సంబంధాలు యథాతథంగా కొనసాగుతాయి. మీ జిజ్యాధనం మీరు తీసుకోండి" అంటూ దాన్ని వారికి అప్పగించారు.

ఈ సంఘటనతో హమస్‌వాసులైన క్రైస్తవులు-యూదులు ఎంతో ప్రభావితులయ్యారు. క్రైస్తవులు కంటతడి పెడుతూ "దైవం మీకు విజయం చేకూర్చి రప్పించుగాక!" అన్నారు. యూదులు మరింత ప్రభావితులై "తౌరాత్ సాక్షి! మేము జీవించినంతకాలం హెర్క్యులస్ హమస్‌ను ఆక్రమించుకోలేడు" అన్నారు. ఇలా చెప్పిన తరువాత వారు పట్టణద్వారాలు మూసేసి కోట బురుజులపై తమ సైనికుల్ని కాపలా ఉంచారు.

ప్రఖ్యాత యూద పండితుడు జర్జి జైదాన్ 'ఇస్లామీయ సంస్కృతీ చరిత్ర' అనే తన గ్రంథంలో 'జిజ్యా'ను గురించి ఇలా పేర్కొన్నాడు: "ముస్లింలు యర్మూక్‌యుద్ధంలో శత్రువుల్ని ఎదుర్కోవలసిన పరిస్థితి రాకముందు హమస్ ముస్లింల అధీనంలోనే ఉండేది. అయితే వారు పరిస్థితి గమనించి హమస్‌వాసుల నుండి లోగడ వసూలుచేసిన జిజ్యా వారికి తిరిగిచ్చివేస్తూ- 'మేమిప్పుడు పెద్దసమస్య (యుద్ధం)లో చిక్కుకున్నాం. ఈ స్థితిలో మేము మీకు రక్షణ కల్పించలేం. అంచేత మీకిష్టమైన రీతిలో మీరంతట మీరే స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకోండి' అన్నారు. హమస్‌వాసులు ఈమాట విని 'మేమింతకు ముందు అనుభవించిన దౌర్జన్యాలకన్నా మీరాజ్యం, మీ న్యాయదృష్టే మాకెంతో ప్రియమైనవి. మేము మీతో కలసి హమస్‌ను హెర్క్యులస్ సేనల నుండి కాపాడుతాం' అని చెప్పారు."

హమస్‌వాసులైన ఈ క్రైస్తవులు, ముస్లింయోధులతో కలసి ఎవరితో పోరాడుతామని చెప్పారో వారూ క్రైస్తవులే. వారిపై వారిమతస్థులే దుర్భరదౌర్జన్యాలు జరిపారు. ముస్లింలు అలాంటి పీడితుల్ని కాపాడి ఆశ్రయం కల్పించారు. ఇప్పుడా ఆశ్రయం, రక్షణ కల్పించలేని స్థితిలో ఉన్నందున లోగడ వారి నుండి వసూలుచేసిన జిజ్యా (రక్షణరుసుం)

తిరిగివ్వడానికి సిద్ధమయ్యారు. ముస్లింల ఈ న్యాయదృక్పథమే హమస్ క్రైస్తవుల్ని ప్రభావితం చేసింది.

యూదపండితుడు జర్జిజైదాన్ జిజ్యా ముస్లిమేతరులపై విధించిన జరిమానా అని, ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందని భావించివుంటే ఇలా తన గ్రంథంలో ముస్లింల న్యాయదృష్టిని గురించి పేర్కొనేవాడేకాదు. సేనాపతి అబూఉబైదా (రజి) హమస్‌వాసుల పట్ల మాత్రమే ఇలా ప్రవర్తించలేదు. సిరియాలో తాము స్వాధీనం చేసుకున్న ప్రాంతాల ప్రజలందరికీ జిజ్యా తిరిగిచ్చేయమని అక్కడి తన సైనికాధికారుల్ని ఆదేశించారు.

ఆ తర్వాత ఆయన సైన్యం తీసుకొని డెమాస్కస్‌కు చేరుకొని పరిస్థితి వివరంగా తెలియజేస్తూ ఖలీఫాకు లేఖ రాశారు. అప్పుడు ఖలీఫా ఆయనకు సహాయంగా సయీద్ బిన్ ఆమిర్‌ని పంపించారు. అబూఉబైదా (రజి) సైన్యాధికారులతో సంప్రదించి డెమాస్కస్ నుండి బయలుదేరి, జోర్డాన్ సరిహద్దులోని ఎర్మూక్ నదీ సమీపానికి చేరుకున్నారు. ఈ ప్రదేశం యుద్ధం చేయడానికి ముస్లింలకు అనుకూలంగా ఉంది. వేరొకవైపు నుంచి అమ్ర్ బిన్ ఆస్ (రజి), సయీద్ బిన్ ఆమిర్‌లు కూడా అక్కడికి చేరుకున్నారు.

అటు దాదాపు రెండున్నర లక్షల మంది రోమన్‌లతో కూడిన మహా సైనికవాహిని పరవళ్ళు తొక్కుతూ ఎర్మూక్ వైపుకు పురోగమిస్తోంది. ఆ సైనికవాహిని ముందు క్రైస్తవ పండితులు, సాధువులు చేతుల్లో పెద్దపెద్ద సిలువలు తీసుకొని సైనికుల్ని ఉత్తేజపరుస్తూ నడుస్తున్నారు. ఇలా రోమ్‌సేనలు కూడా ఎర్మూక్ సమీపానికి చేరుకున్నాయి.

ఇరుపక్షాలు ఒకదానికొకటి ఎదురెదురుగా వచ్చి నిలబడ్డాయి. అప్పుడు రోమ్ సైన్యం నుండి బత్రీఖ్ అనే ఓ మల్లయోధుడు ఖడ్గం తీసుకొని గుర్రం మీద వచ్చి తనను ఎదుర్కొనే వీరుడు ఎవరైనా రావచ్చన్నాడు. వెంటనే ఖాలిద్ (రజి) ముందు వరుసలో ఉన్న ఖైస్ బిన్ హుబైరా వైపు సైగ చేశారు. ఖైస్ మెరుపు వేగంతో బత్రీఖ్‌పై లంఘించి ఖడ్గంతో అతని తలపై బలంగా ఒకేఒక వ్రేటు వేశారు. అంతే, బత్రీఖ్ గుర్రం పైనుంచి దబేలున క్రిందపడి రక్తపుమడుగులో కొట్టుమిట్టాడు. ఇటు ముస్లింయోధులు దిక్కులు పిక్కుటిల్లేలా "అల్లాహుఅక్బర్" అంటూ నినదించారు.

ఆ తర్వాత సామూహిక యుద్ధం మొదలయింది. కాస్సేపటికి యుద్ధం పరాకాష్ఠకు చేరుకుంది. మొదటిరోజు జరిగిన ఈ దాడిలో రోమన్లకు చెందిన ఫ్రంట్‌లైన్ సైనికులు ఓడిపోయి వెనుకంజవేయడంతో యుద్ధం రెండోరోజుకు వాయిదా పడింది.

ఆరోజు రోమ్‌సేనాపతి 'బాహాన్' సైన్యాధికారుల్ని సమావేశపరచి "అరబ్బులు సిరియా సిరుల కోసం వెంపర్లాడుతున్నారు. అంచేత మనం వారికి ధనాశ చూపి ఇక్కడ్నుంచి పంపివేద్దాం" అన్నాడు. దానికి అధికారులంతా అంగీకరించారు. మరుసటిరోజు అతను జార్జ్ అనే దౌత్యవేత్తను పంపుతూ "మీలో ఎవరినైనా ఉన్నతాధికారిని పంపండి, మేమతనితో ఒప్పందం గురించి మాట్లాడదలిచాము" అని చెప్పి పంపాడు.

జార్జ్ ముస్లింసైన్యం సమీపానికి చేరుకునే సమయానికి ముస్లిం యోధులు మగ్రిబ్ నమాజ్ చేయడంలో నిమగ్నులై ఉన్నారు. ముస్లింలు ఎంతో శ్రద్ధగా, ఏకాగ్రతతో నమాజ్



చేస్తుండటం చూసి జార్జ్ ఆశ్చర్యచకితుడైపోయాడు. నమాజ్ ముగిసిన తరువాత అతను సైన్యాధ్యక్షుడు అబూఉబైదా (రజి)ను కొన్ని ప్రశ్నలు అడిగాడు. వాటిలో ఒకటి "మీరు ఈసా (అలైహి) విషయంలో ఎలాంటి విశ్వాసం కలిగివున్నారు"నేది కూడా ఉంది. దానికి సమాధానంగా అబూఉబైదా (రజి) ఈ ఖుర్‌ఆన్ సూక్తులు పఠించారు:

"గ్రంథప్రజలారా! మీరు మీధర్మం విషయంలో అతిశయానికి పోయి హద్దులు మీర కండి. సత్యం తప్ప దేవునికి మరే విషయాన్నీ ఆపాదించకండి. మర్యం కుమారుడు ఈసా మసీహ్ దేవుని ప్రవక్తలలో ఒక ప్రవక్త తప్ప మరేమీకాదు. కాకపోతే ఆయన మర్యం దగ్గరకు దేవుడు పంపిన ఒక ఆజ్ఞ; దేవుని దగ్గరనుండి (మర్యంకు) పంపబడిన ఒక ఆత్మ మాత్రమే.... మసీహ్ తాను దేవుని దాసులలో ఒక దాసుణ్ణని చెప్పుకోవడానికి ఎన్నడూ సిగ్గుపడలేదు. అత్యంత సన్నిహితులైన దైవదూతలు కూడా దాన్ని సిగ్గుచేటుగా భావించలేదు." (4:171,172)

దుబాసి ఈ దైవసూక్తుల్ని అనువదించగానే జార్జ్ "నిస్సందేహంగా ఈసా గుణగణాలు ఇలాగే ఉన్నాయి. మీ ప్రవక్త సత్యప్రవక్త అనడంలో నాకెలాంటి అనుమానంలేదు" అన్నాడు అప్రయత్నంగా. అనడం ఏమిటీ అప్పటికప్పుడు సద్వచనం పఠించి ముస్లిం అయిపోయాడు. అప్పుడు ముస్లింలు సంతోషాతిశయంతో 'అల్లాహుఅక్బర్' అని నినదించారు.

మరునాడు ముస్లింల తరఫున ఖాలిద్ బిన్ వలీద్ (రజి) దౌత్యవేత్తగా రోమ్ శిబిరానికి వెళ్ళారు. రోమన్లు తమ హోదా వైభవాలు ప్రదర్శించడానికి తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. శిబిరానికి వచ్చే దారిలో ఇరు వైపులా ఆపాదమస్తకం ఉక్కుకవచాలు ధరించి అశ్వరూఢులైన సైనికుల్ని చాలా దూరం వరకు నియమించారు. అయితే ఖాలిద్ (రజి) ఆ సైనికుల వైపు ఓసారి నిర్లక్ష్యంగా, అసహ్యంగా చూసి వారి రెండు పంక్తుల మధ్య నుంచి గొర్రెల మందను చీల్చుతూ పోయే బెబ్బులిలా చరచర వెళ్ళిపోయారు.

రోమ్ శిబిరానికి చేరుకోగానే సేనాపతి బాహాన్ ఎంతో గౌరవమర్యాదలతో ఆయనకు స్వాగతం చెప్పి రత్నఖచిత సింహాసనంపై తన పక్కనే కూర్చోబెట్టాడు. తరువాత బాహాన్ దుబాసీ ద్వారా సాధరణ సంభాషణ జరిపాడు. ఆ తరువాత ప్రసంగధోరణిలో మాట్లాడాడు. ముందుగా ఈసా ప్రవక్త (అలైహి)ను ప్రశంసించాడు. తరువాత రోమ్‌చక్రవర్తిని ఆకాశానికి ఎత్తుతూ 'మా చక్రవర్తి యావన్మంది చక్రవర్తులకే చక్రవర్తి...' అన్నాడు. దుబాసీ ఆ మాటల్ని పూర్తిగా అనువదించక ముందే ఖాలిద్ (రజి) అతనికి అడ్డుతగులుతూ "మీ చక్రవర్తి అలాంటివాడే కావచ్చు. కాని మేము ఎన్నుకున్న నాయకుడి మనసులో తాను చక్రవర్తినన్న భావన ఏమాత్రం వచ్చినా మేమతడ్ని తక్షణమే పదవినుంచి తొలగిస్తాం" అని అన్నారు.

రోమ్‌సేనాపతి మళ్ళీ తన ఉపన్యాసం మొదలెట్టాడు. తమ సిరిసంపదలు, ధనరాసుల్ని గురించి గర్వంగా చెప్పి ఇలా అన్నాడు: "అరబ్బులారా! మా దేశానికి వచ్చి నివసిస్తున్న మీ జాతిప్రజల పట్ల మేము ఎల్లప్పుడూ సద్భావనతో ప్రవర్తించాం. దానికి అరబ్బులంతా మాకు కృతజ్ఞులై ఉంటారని ఆశించాం. కాని మా ఆశలకు భిన్నంగా మీరు మా దేశంపై దండెత్తడానికి వచ్చారు; మమ్మల్ని మాదేశం నుండి తరిమేద్దామని భావిస్తున్నారు. కాని మీకు తెలియదేదో, ఇలా అనేకజాతులు ప్రయత్నించి మాచేతుల్లో చావుదెబ్బ తిని పారిపోయాయి. యావత్ప్రపంచంలోనే పెద్ద మూర్ఖులు, దరిద్రులు, దేశదిమ్మరులైన మీరింతటి

దుస్సాహసానికి పాల్పడ్డారా! అయినా మేము మిమ్మల్ని క్షమిస్తున్నాం. పైగా మీరిక్కడ్నుంచి వెళ్ళిపోతే మేము మీకు బహుమతిగా మీ సేనాపతికి పదివేల దీనార్లు, దళపతులకు ఒక్కొక్కరికి వేయి దీనార్లు, సాధారణ సైనికులకు వందేసి దీనార్లు ఇస్తాం."

బాహాన్ ప్రసంగం అనంతరం ఖాలిద్ (రజి) లేచి దైవస్తుతి తర్వాత ఇలా అన్నారు: "నిజమే, మీరు ధనికులు, రాజ్యాధికారులే. మీ దేశంలోని అరబ్బుల పట్ల మీ ప్రవర్తన కూడా మాకు తెలియనిది కాదు. అయితే అది మీరు చేసిన మహోపకారమేమీ కాదు. అది మీ మతప్రచారంలోని ఓ భాగం తప్ప మరేమీ కాదు. దాని ప్రభావంతో వారు క్రైస్తవులుగా మారి ఈరోజు మాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఒకప్పుడు మేము అజ్ఞానులం, దరిద్రులం, దేశదిమ్మరులమే. మాలో బలవంతుడు బలహీనుడిపై దౌర్జన్యం చేసేవాడు. మా తెగలు అంతఃకలహాలతో సతమతమయ్యేవి. మేము విగ్రహాల్ని పూజించేవారం. అయితే సృష్టికర్త మమ్మల్ని కనికరించి మా అందరిలో ఉత్తముడు, ఉదారుడైన మనిషిని దైవప్రవక్తగా పంపి మాకు సన్మార్గం చూపాడు. ఆ ప్రవక్త మాకు భార్యాపిల్లలు, సహవర్తనులులేని ఏకేశ్వరుడ్ని మాత్రమే ఆరాధించాలని చెప్పాడు. అంతేకాదు, ఈ బోధనలు యావత్మానవాళికి అందజేయాలని కూడా మాకు హితోపదేశం చేశాడు. ఈ బోధనలు, విశ్వాసాలతో కూడిన ఇస్లాంధర్మాన్ని స్వీకరించేవారు ముస్లిములవుతారు. దాన్ని తిరస్కరించేవారు మాకు జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. అలాంటివారి ధనప్రాణాలకు మేము రక్షణహామీ ఇస్తాము. జిజ్యా చెల్లించడానిక్కూడా నిరాకరించేవారికి ఖడ్గమే సమాధానమిస్తుంది."

జిజ్యాపేరు వినగానే బాహాన్ వెటకారంగా నవ్వుతూ చేత్తో తనసైనికుల వైపు చూపుతూ "వీరు చచ్చినా మీకు జిజ్యా ఇవ్వరు. మేమసలు ఇతరుల నుండి జిజ్యా తీసుకుంటాం, మేము మాత్రం ఇతరులకు జిజ్యా ఇచ్చే ప్రసక్తే లేదు" అని అన్నాడు కఠినంగా. సమస్య సంప్రదింపులతో పరిష్కారమయ్యే సూచనలు కానరాకపోవడంతో ఖాలిద్ (రజి) అక్కడ్నుంచి లేచి తమ శిబిరానికి తిరిగొచ్చారు.

ఆ తరువాత మరునాడుదయం ఇరుపక్షాలు యుద్ధానికి సిద్ధమయ్యాయి. రెండున్నర లక్షల మంది రోమ్‌సైనికులు సకల విధాల ఆయుధాలతో, ద్విగుణీకృత ఉత్సాహంతో బయలుదేరారు. ముస్లింలు వారి సంఖ్యాబలం, సమరోత్సహం చూసి ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యం చూసి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సరిగ్గా ముప్పయి అయిదు వేలమంది కూడా లేని తమ సైన్యాన్ని ముప్పయిఆరు దళాలుగా విభజించి అత్యంత క్రమబద్ధంగా పునర్వ్యవస్థీకరించారు. ఆ తరువాత సంకులసమరం మొదలయింది.

ముస్లింయోధులు విజయమో వీరస్వర్గమో అంటూ సైనిక సంఖ్యాబలానికి అతీతంగా అత్యంత ధైర్యసాహసాలతో తమ ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించసాగారు. ఈ నిర్విరామ యుద్ధంలో ముస్లింలు జుహర్-అసర్ నమాజులు యుద్ధం చేస్తూనే సైగలతో నిర్వహించారు. అయినప్పటికీ కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. శత్రుసైనికులు అత్యధిక సంఖ్యలో గుట్టలు గుట్టలుగా నేలకొరిగి పోతున్నారు. చివరికి రోమ్ సైనికులు ముస్లింల ధాటికి నిలువలేక కాలికి బుద్ధిచెప్పారు. యుద్ధమేఘాలు మెల్లిగా విడిపోయాయి. ముస్లింలపై విజయభానుడు వెలిగిపోసాగాడు.



అయితే హారిస్ బిన్ హిషామ్ (రజి), అయాష్ బిన్ రబియా (రజి), ఇక్రమా (రజి) బిన్ అబూజహల్ యుద్ధమైదానంలో తీవ్రంగా గాయపడి చావుబ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడసాగారు. హారిస్ (రజి) తీవ్రమైన దాహంతో విలవిల్లాడుతూ మంచినీళ్ళు అడిగారు. వెంటనే ఒక యోధుడు మంచినీళ్ళు తెచ్చి హారిస్ (రజి) నోటికి అందించాడు. అప్పుడు ఇక్రమా (రజి) అతని వైపు ఆశగా చూశాడు. హారిస్(రజి) అది గమనించి ముందు ఇక్రమా (రజి)కు తాగించు అన్నట్లు ఆయన వైపు సైగచేశారు. ఆ యోధుడు నీళ్ళతిత్తి తీసికెళ్ళి ఇక్రమా (రజి) నోటికి అందించాడు. అప్పుడు అయాష్ (రజి) ఆ నీళ్ళతిత్తి వైపు ఆశగా చూశారు. ఇక్రమా (రజి) అది గమనించి ముందు అయాష్ (రజి)కు తాగించు అన్నట్లు ఆయన వైపు సైగచేశారు. నీళ్ళుతాగించే యోధుడు నీళ్ళు తీసికెళ్ళి అయాష్ (రజి) దగ్గరకు వచ్చాడు. కాని అప్పటికే అయాష్ (రజి) ప్రాణం అనంతవాయువుల్లో కలసిపోయింది. వెంటనే ఆ యోధుడు నీళ్ళు తీసుకొని నీటి కోసం తపిస్తున్న మిగిలిన ఇద్దరి దగ్గరకు వెళ్ళాడు. కాని అప్పటికే వారిద్దరు కూడా కన్నుమూశారు.

హిజ్రీశకం 15వ ఏట రజబ్ నెలలో జరిగిన ఈ భీకర సంగ్రమంలో రోమన్లు లక్ష మందికి పైగా హతమయ్యారు. ముస్లింలు మూడువేల మంది అమరగతులయ్యారు.

'ఇన్తాకియా'లో కూర్చొని ఎర్మూక్ యుద్ధపర్యవసానం కోసం ఎదురుచూస్తున్న రోమ్ చక్రవర్తి సీజర్‌కు రోమన్లు ఘోరంగా ఓడిపోయారని తెలియగానే తన కాళ్ళ కింది భూమి బ్రద్దలైనట్లు అదిరిపడ్డాడు. ఆ తరువాత వెంటనే ఇన్తాకియా నుండి కాన్స్టాంటినోపిల్‌కు బయలుదేరుతూ తీవ్రమైన నిరాశానిస్పృహలతో సిరియా వైపు తిరిగి ఆ దేశానికి శాశ్వతంగా వీడ్కోలు చెప్పాడు. అటు మదీనాలో అనేకరోజుల నుంచి నిద్ర కూడా పోకుండా ఎర్మూక్ వార్తలకోసం అనుక్షణం నిరీక్షిస్తున్న ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఎర్మూక్ శుభవార్త వినగానే సర్వేశ్వరునికి కృతజ్ఞతాపూర్వకంగా అప్పటికప్పుడు అప్రయత్నంగా సాష్టాంగపడ్డారు.

## (9) బైతిల్‌మఖ్దిస్‌లో విజయపతాకం

ఎర్మూక్ విజయం తరువాత ముస్లింలు సిరియాలో అనేక పట్టణాలు కైవశం చేసుకున్నారు. ఆ పట్టణాల్లో 'ఖన్సరీన్' ఒకటి. సేనాపతి అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) ఖన్సరీన్ నుండి హలబ్ వైపుకు పురోగమించారు. అయితే ఖన్సరీన్ వాసులు ఒప్పందం ఉల్లంఘించి తిరుగుబాటుకు పాల్పడ్డారని తెలియగానే అబూఉబైదా (రజి) అక్కడికి ఓ సైనికదళం పంపారు. దాంతో ఖన్సరీన్ వాసులు ముస్లింలకు భారీ జరిమాన చెల్లించి ఒప్పందాన్ని పునరుద్ధరించుకున్నారు. తర్వాత ముస్లింలు హలబ్‌ను ముట్టడించగానే హలబ్‌వాసులు కూడా జిజ్యా చెల్లించారు.

ముస్లింలు అంతకుముందే ఇన్తాకియాను ముట్టడించి ఒప్పందం ద్వారా వశపరచుకున్నారు. అయితే ఆ తరువాత ఇన్తాకియా వాసులు కూడా ఒప్పందం ఉల్లంఘించి తిరుగుబాటుకు పాల్పడ్డారు. అప్పుడు ముస్లింలు మరోమారు దాడిచేయడంతో దారికి వచ్చారు. రోమ్‌క్రైస్తవులు మాటిమాటికి ఒప్పందం ఉల్లంఘిస్తూ తిరుగుబాటుకు పాల్పడుతున్నారని, దానివల్ల మన సేనలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని సేనాపతి

ఖలీఫాకు లేఖ రాశారు. దానికి ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) "మనకు స్వాధీనమైన ముఖ్య పట్టణాల్లో ఒక్కొక్క సైనికదళాన్ని శాశ్వతప్రాతిపదికపై నియమించండి. ఆ సైనికులకు మనం కేంద్రీయ ధనాగారం నుండి జీతాలు ఇచ్చేద్దాము" అని ఆదేశించారు.

ముస్లింయోధులు ఇన్తాకియా ఆక్రమణ తర్వాత మరికొన్ని పట్టణాల్లో కూడా విజయ పతాకాలు ఎగరవేశారు. ఈవిధంగా ఫిరాత్ నది దాకా ఉన్న సిరియా పట్టణాలన్నీ ముస్లింల అధీనంలోకి వచ్చాయి. అప్పుడు సేనాపతి అబూఉబైదా (రజి) సంతృప్తిచెంది పాలస్తీనా వైపు దృష్టి సారించారు. ముందుగా ఆయన బైతిల్‌మఖ్దిస్ (జెరూసలేం) చుట్టు పక్కలున్న ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి కోసం అనేక యుద్ధాలు చేయవలసి వచ్చింది. తర్వాత అమ్ర్ బిన్ ఆస్ (రజి) నేతృత్వంలో ముస్లింలు బైతిల్‌మఖ్దిస్‌ను దిగ్బంధించారు. కొన్నాళ్ళకు సేనాపతి అబూఉబైదా (రజి) కూడా అక్కడికి చేరుకున్నారు. దాంతో ఈ ముట్టడి మరింత బిగుసుకుపోయింది. క్రైస్తవులు కోటతలుపులు మూసేసి తీవ్రంగా ప్రతిఘటించారు. కాని అందులో వారు విజయం సాధించలేక కాళ్ళబేరానికి వచ్చారు.

అయితే తమ మతాన్ని కాపాడుకోవడానికి, క్షేమంగా ప్రాణాలతో బయటపడటానికి వారు ప్రయత్నించారు. ముస్లింలు ఎప్పుడు ఎటువంటి పరిస్థితిలోనైనా, ఎలాంటి షరుతులతో కూడిన ఒడంబడికనైనా ఒప్పుకుంటారని రోమన్లు గ్రహించారు. అందువల్ల వారొక పథకం రూపొందించారు. దానిప్రకారం పట్టణం మరికొన్ని గంటల్లో ముస్లింల అధీనమయ్యే సూచనలు కన్పించగానే వారు జిజ్యా చెల్లించి ఒప్పందం చేసుకోవడానికి ముందుకొచ్చారు. అయితే అందుకు వారొక షరతు విధించారు. ఒప్పందం మీద స్వయంగా ఖలీఫా వచ్చి సంతకం చేయాలన్నదే ఆ షరతు. వీలైనంత వరకు రక్తపాతాన్ని అరికట్టాలన్నది ముస్లింల ధ్యేయం. అంచేత సేనాపతి అబూఉబైదా (రజి) ఆ షరతుతో పాటు ఒప్పందాన్ని అంగీకరించి, విషయం వివరంగా తెలియజేస్తూ ఖలీఫాకు లేఖ రాసి పంపారు.

ఈ లేఖ అందగానే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సలహామండలిని సమావేశపరచి సలహా అడిగారు. హజ్రత్ ఉస్మాన్‌గని (రజి) తన అభిప్రాయం తెలియజేస్తూ "క్రైస్తవులు తమ ప్రతిఘటనను కొనసాగించలేక లొంగిపోయారు. ఎలాంటి షరతులు లేకుండానే వారు తమ పట్టణాన్ని మనకు అప్పగిస్తారు. కనుక మీరు బైతిల్‌మఖ్దిస్‌కు వెళ్ళకండి" అని అన్నారు. హజ్రత్ అలి (రజి) మాత్రం "మీరు బైతిల్‌మఖ్దిస్‌కు వెళ్ళడమే మంచిద"ని సలహా ఇచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి)కు అలి (రజి) అభిప్రాయమే నచ్చింది.

హిజ్రీశకం 16వ ఏట, రజబ్ నెలలో హజ్రత్ ఉమర్ (రజి) మదీనాలో ఉస్మాన్‌గనీ (రజి)ని గవర్నర్‌గా నియమించి కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని బైతిల్‌మఖ్దిస్‌కు బయలుదేరారు. అది చరిత్రలో సువర్ణక్షరాలతో వ్రాయవలసిన ప్రయాణ సంఘటన. సువిశాల సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తిగా, శత్రువులకు సింహస్వప్నంగా భాసిల్లుతుండిన ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఎలాంటి అట్టహాసం, మందీమార్బలం, సైనికదళాలు లేకుండా సాదాసీదా దుస్తుల్లో ఒక సాధారణ పౌరుడిగా ప్రయాణమయ్యారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తనపర్యటన గురించి బైతిల్‌మఖ్దిస్, డెమాస్కస్‌లలో తన సైన్యాధికారులందరికీ తెలియజేశారు. కనుక ఖలీఫా బైతిల్‌మఖ్దిస్ సమీపంలోని



"జాబియా" అనే ప్రదేశానికి చేరుకొని విడిదిచేయగానే అబూఉబైదా, యజీద్ బిన్ అబూ సుఫ్యాన్, ఖాలిద్ బిన్ వలీద్ (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి) వగైరా సైన్యాధికారులు వచ్చి ఖలీఫాకు స్వాగతంచెప్పారు. ఖలీఫా పటాటోపంతోకూడిన వారి దుస్తులు చూసి ఆగ్రహోదగ్రులై "రెండేండ్లలోనే మీరు అరబ్బేతరుల అలవాట్లకు బానిసలై పోయారా?" అన్నారు. దానికి వారు "ఈ దుస్తుల వెనుక మా సమరసాహసం, ఇస్లామీయ నైతికతలు యధాతథంగా ఉన్నాయి. (వాటిని మేము విడనాడలేదు)" అన్నారు. ఖలీఫా (రజి) ఈ సమాధానం విని "అలాగైతే పరవాలేదు" అంటూ సంతృప్తిచెందారు.

ఆ తరువాత కాస్సేపటికి బైతిల్‌మఖ్దిస్ పట్టణపెద్దలు కూడా అక్కడికి చేరుకున్నారు. వారు ఎలాంటి రాచరికపు అట్టహాసం, కిరీటం లేకుండా సాధారణ పౌరదుస్తుల్లో ఉన్న ఖలీఫాను చూసి ఆశ్చర్యపోయారు. కుశలప్రశ్నలయ్యాక ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వారి ముందు ఈవిధంగా శాంతిఒప్పందం వ్రాయించారు:

"ఇది అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) ఉమర్ బిన్ ఖత్తాబ్ 'బైతిల్ మఖ్దిస్' క్రైస్తవులకు రాసిచ్చిన శాంతిఒప్పందం. వారి ప్రాణాలు, ఆస్తులు, చర్చీలు, సిలువలకు రక్షణహామీ ఇవ్వబడుతోంది. ఇక్కడ నివసించే ప్రతి మతస్థుడికీ రక్షణహామీ ఇవ్వబడుతోంది. వారి ఆరాధనాలయాలకు, సిలువలకు, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లంపజేయడం జరగదని హామీ ఇస్తున్నాను. వారి మతవ్యవహారాల్లో ఎలాంటి జోక్యం చేసుకోవడం జరగదని కూడా హామీ ఇస్తున్నాను. అయితే క్రైస్తవులతో పాటు ఇక్కడ యూదులు ఉండకూడదు. (వారిని బయటికి పంపివేయాలి.) రోమన్లలో ఎవరైనా నగరం విడిచి వెళ్ళదలచుకుంటే నిరభ్యంతరంగా వెళ్ళవచ్చు. ఇక్కడే ఉండదలచినవారు ఇక్కడి పౌరులతో పాటు మాకు జిజ్యా చెల్లించవలసి ఉంటుంది. ఈ ఒప్పందంలో వ్రాయబడిన విషయాలకు దేవుడు, దైవప్రవక్త (స), ఖలీఫాలు, ముస్లింలంతా బాధ్యులవుతారు. అయితే పట్టణవాసులు నిర్ణీత జిజ్యా చెల్లించడానికి నిరాకరించరాదు."

ఈ ఒప్పందం మీద ఖలీఫా సంతకం చేసిన తర్వాత ఖాలిద్ (రజి), అమ్ర్ బిన్ ఆస్ (రజి), అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ , మావిఆ బిన్ అబూసుఫ్యాన్ (రజి)లు సాక్షులుగా సంతకాలు చేశారు. ఆ వెనువెంటనే పట్టణవాసులు ముస్లింలకు జిజ్యా చెల్లించి పట్టణ ప్రధానద్వారం తెరిచారు. ఖలీఫా ఉమర్ (రజి), ఆయనసేవకుడు ఒంటెపై వంతులవారిగా కూర్చొని ప్రయాణంచేస్తూ నగరంలో ప్రవేశించే సమయానికి ఒంటెపై కూర్చునే వంతు సేవకునికి వచ్చింది. సేవకుడు ఎంత బ్రతిమాలినా ఉమర్ (రజి) వినకుండా అతడ్ని ఒంటెపై ఎక్కించి తాను ఒంటె ముకుతాడు పట్టుకొని కాలినడకనే నగరంలో ప్రవేశించారు.

"ముస్లింల చక్రవర్తి వస్తున్నాడు, పదండి చూద్దాం" అంటూ క్రైస్తవులు తండోపతండలుగా తమ ఇళ్ళలో నుంచి బయటికి వచ్చారు. వారు ఒంటె మీద కూర్చున్న ఖలీఫా సేవకుడిపై దృష్టి సారించారు. కాని స్థానిక ముస్లింలు ఒంటె ముకుతాడు పట్టుకొని కాలినడకన వస్తున్న ఖలీఫా దగ్గరకొచ్చి సలాంచేస్తుంటే "ఏమిటీ ఇతనా ముస్లింల చక్రవర్తి!" అంటూ క్రైస్తవులు ఆశ్చర్యచకితులై పోయారు. చినిగిన తలపాగా, అతుకుల చొక్కా ధరించిన ఆ మహా చక్రవర్తిని చూసి వారు నోరెల్లబెట్టారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన అనుచరులతో ముందుగా మస్జిదుల్‌అఖ్సాలో ప్రవేశించి 'ఇబ్రాహీం గూడు' దగ్గర దైవానికి కృతజ్ఞతగా సజ్దా చేశారు. ఆ తరువాత అక్కడి చర్చిలో తిరిగిచూశారు.

ఒకరోజు ఉమర్ ఫారూఖ్ (రజి) బిలాల్ (రజి)తో 'అజాన్ చెప్పు' అన్నారు. దానికాయన "దైవప్రవక్త (స) నిర్యాణం తర్వాత ఎవరడిగినా అజాన్ చెప్పనని నిర్ణయించుకున్నాను. కాని ఈరోజు మీఆజ్ఞ పాటిస్తున్నాను" అని ఆ తర్వాత అజాన్ చెప్పారు. బిలాల్ నోట అజాన్ వినగానే దైవప్రవక్త (స) కాలంనాటి మధురస్మృతులు గుర్తుకొచ్చి సహాబీలలో అప్రయత్నంగా దుఃఖం పొర్లుకొచ్చింది. చాలా సేపటిదాకా వారి కళ్ళు చిల్లులుపడిన నీటికడవలై పోయాయి.

బైతిల్‌మఖ్దిస్‌లో ఖలీఫాను కలసుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి సైనికాధికారులు, పాలనావ్యవహారాల అధికారులు వచ్చి ఉన్నందున ఖలీఫా ఉమర్ (రజి) కొన్నాళ్ళు బైతిల్ మఖ్దిస్‌లోనే ఉండి అధికారులకు తగిన ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. ఆ తరువాత ఆయన మదీనా తిరిగివెళ్ళిపోయారు.

"తక్రీత్"లో ఒక ఈరానీ సుబేదార్ ఉండేవాడు. అతను ఈరాన్ రాజధాని మదాయెన్ ముస్లింల కైవశమయిందని తెలిసి తమ పాత శత్రువులైన రోమన్ల సహాయం కోరాడు. అప్పుడు రోమ్ చక్రవర్తి ఆ సరిహద్దు సుబేదార్‌కు సహాయం చేయడానికి తక్రీత్‌కు తన సైన్యాన్ని పంపాడు. అంతేకాకుండా అయాద్, తుగ్లబ్, నమర్ వగైరా క్రైస్తవ అరబ్ తెగల్ని కూడా ముస్లింలకు వ్యతిరేకంగా పురిగొల్పి తక్రీత్‌కు పంపాడు. ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అయిదు వేల మందితో కూడిన ఒక సైనికదళాన్ని తక్రీత్‌కు పంపారు. ఈ సైన్యం వెళ్ళి తక్రీత్‌ను ముట్టడించింది. ఉభయపక్షాల మధ్య భీకరయుద్ధం జరిగింది. చివరికి రోమన్లు, ఈరానీయులు చావుదెబ్బ తిని పారిపోయారు.

అలాగే ఇరాఖ్-రోమ్ సరిహద్దుల్లో ఉన్న జజీరా పట్టణవాసులు "సిరియా తూర్పు పట్టణాల వైపు రక్షణబలగాలను పంపితే తామూ బలగాలతో కలసి ముస్లింలతో యుద్ధం చేస్తామ"ని హెర్క్యులస్‌కు లేఖ రాశారు. హెర్క్యులస్ దాన్ని అదృశ్య సహాయంగా భావించి వెంటనే ఆ పట్టణాల వైపుకు భారీసైన్యాలను పంపాడు. అప్పుడు ఖలీఫా జజీరావాసుల్ని జజీరా సరిహద్దులు దాటి బయటికి పోనివ్వకుండా అడ్డుకోవాలని సాద్ బిన్ అబీవఖ్ఖాస్‌కు, రోమ్‌సేనల్ని హమస్, ఖన్సరీన్‌ల వైపుకు పురోగమించకుండా నిరోధించాలని అబూఉబైదా (రజి)కు లేఖలు రాశారు. వారికి మద్దతుగా మరికొన్ని సైన్యాల్ని కూడా పంపించారు.

రోమ్‌సేనకు మద్దతుగా హమస్‌కు వెళ్ళిన జజీరావాసులు, జజీరా సరిహద్దుల్లోకి ముస్లింయోధులు ప్రవేశించారని తెలియగానే భయపడి జజీరాకు తిరిగొచ్చారు. ఆ తర్వాత హమస్‌లో తిష్ఠవేసిన రోమన్లపై ముస్లింలు విజృంభించారు. ముస్లింలు దాడి ప్రారంభించ గానే రోమన్ల మద్దతు కోసం వచ్చిన అరబ్ క్రైస్తవ తెగలు అక్కడ్నుంచి చల్లగా జారుకున్నాయి. దాంతో రోమన్లకు నడుం విరిగినంత పనయింది. వారు అరువుకు తెచ్చుకున్న రోషంతో తీవ్రంగా పెనుగులాడి చివరికి పలాయనం చిత్తగించారు. ఈవిధంగా హమస్‌ను ముస్లింలు తిరిగి స్వాధీనంచేసుకున్నారు. ఈ యుద్ధం హిజ్రీశకం 17వ యేట జరిగింది.



## (10) సర్వసేనాని ఖాలిద్ బిన్ వలీద్ (రజి) ఉద్వాసన

హజ్రత్ అబూబకర్ (రజి) పాలనాకాలంలో సర్వసేనానిగా నియమించబడి నిరంతరాయంగా ఆరేండ్ల పాటు శత్రువుల పాలిట సింహస్వప్నమై, ఓటమి ఎరగని యోధాన యోధుడిగా వెలుగొందిన ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సర్వసేనాని పదవి నుంచి తొలగించారు. దీనికి అనేక కారణాలున్నాయి.

ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) చాలాకాలం నుంచి ఖాలిద్(రజి) అనుసరిస్తున్న కొన్ని క్రమశిక్షణారాహిత్య చర్యల పట్ల కోపంగా ఉన్నారు. అయితే ఖిలాఫత్ ప్రారంభకాలంలోనే ఖాలిద్ (రజి)తో పెట్టుకోవడం బాగుండదని భావించి ఉదాసీనంగా వ్యవహరించారు. ఆ తరువాత పరిస్థితి హద్దుమీరిపోతోందని గ్రహించి ఆయన పదవిపై వ్రేటు వేశారు. ఇంతకు ఆ కారణాలేమిటో తెలుసుకుందాం.

ఖాలిద్ (రజి) సమరసొత్తు ఖర్చుకు సంబంధించిన దస్తావీజులు ఖలీఫాకు పంపించే వారు కాదు. దానిపై ఖలీఫా వార్నింగ్ ఇచ్చినప్పటికీ ఆయన దాన్ని ఖాతరు చేయలేదు. అందువల్ల ఖలీఫా ఆయన్ని సర్వసేనాని పదవి నుండి తొలగించినట్లు హాఫిజ్ ఇబ్నెహజర్ తన గ్రంథం 'కితాబుల్ అసాబా'లో పేర్కొన్నారు. అయితే ఖాలిద్ (రజి)ని ఖలీఫా పదవి నుండి పూర్తిగా తొలగించకుండా అబూఉబైదా (రజి) అధీనంలో ఉంచారని మరికొందరు చరిత్రకారుల ఉవాచ. (అల్లామా షిబ్లీనోమాని- అల్‌ఫారూఖ్)

ఆ తరువాత హిజ్రీశకం 17వ సంవత్సరంలో ఓ సంఘటన జరిగింది. ఓ కవి ఖాలిద్ (రజి)పై ప్రశంసల జల్లు కురిపించాడు. దానికి ఖాలిద్ (రజి) సంతోషించి ఆ కవికి బహుమానంగా పదివేల దిర్హాంలు ఇచ్చారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈ సంగతి తెలుసుకొని సేనాపతి అబూఉబైదా (రజి)కు ఒక లేఖ రాశారు. ఖాలిద్ (రజి) ఈ పైకం తన జేబు నుండి ఇచ్చివుంటే అది దుబారా ఖర్చు క్రిందికి వస్తుందని, ప్రభుత్వ ధనాగారం నుండి ఇచ్చివుంటే నమ్మకద్రోహం క్రిందికి వస్తుందని, ఇలా ఏవిధంగా ఇచ్చినా ఖాలిద్ (రజి) పదవీభ్రష్టతకు అర్హుడవుతాడని ఆయన ఈ ఉత్తరంలో పేర్కొన్నారు.

తరువాత ఖలీఫాప్రతినిధి ఒకతను ఖాలిద్ (రజి) దగ్గరకు చేరుకొని సైనికుల ముందు ఆయన్ని ఆ బహుమానం ఎక్కడ్నుంచి తీసిచ్చావని ప్రశ్నించాడు. ఖాలిద్ (రజి) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. ఖాలిద్ (రజి) తన తప్పు ఒప్పుకుంటే అతడ్ని క్షమించాలని ఖలీఫా తన ప్రతినిధిని ఆదేశించారు. అంచేత అతను పదవి నుండి తొలగింపు సూచనగా ఖాలిద్ (రజి) తలమీది టోపీ తీసివేశాడు. పైగా చేసిన తప్పుకు శిక్షగా ఆయన తలపాగా ఊడదీసి ఆయన మెడకేసి కట్టాడు. తరువాత ఖాలిద్ (రజి) ఆ బహుమానం తన సొంతడబ్బు నుండి ఇచ్చానని చెప్పగానే ప్రతినిధి ఆయన మెడకు కట్టిన తలపాగా తీసేశాడు.

ఈరాన్, రోమ్ చక్రవర్తుల గుండెల్లో దడ పుట్టిస్తూ, ముస్లిం యోధులకు తిరుగులేని హీరోగా వెలిగిపోతున్న ఖాలిద్ (రజి) దీన్ని సహచర సైనికులందరి ముందు తనకు జరిగిన అవమానమని భావించారా? లేదు, ఏమాత్రం అవమానకరమని భావించలేదు. ఒక సాధారణ సైనికుడిగా ఎంతో అణుకువతో ఖలీఫా ఆజ్ఞ ముందు తలవంచారు.

ఆ తర్వాత ఖాలిద్ (రజి) హమస్ చేరుకొని తన పదవీభ్రష్టత గురించి సైనికుల ముందు వాపోతూ "విశ్వాసులనాయకుడు నన్ను సిరియా సేనాపతిగా నియమించారు. కాని నేను యావత్ సిరియాను జయించాక ఆయన నన్ను పదవి నుండి తొలగించారు" అని అన్నారు. ఓ సైనికుడు ఈమాట వినగానే లేచి "నాయకా! నోరు మూసుకో. ఇలాంటి మాటల వల్ల అరాచకం రేకెత్తే ప్రమాదముంది" అన్నాడు. దానికి ఖాలిద్ (రజి) "ఉమర్ ఖలీఫాగా ఉన్నంతవరకూ అరాచకం రేకెత్తే ప్రసక్తే రాదు" అన్నారు.

ఖలీఫా ఉమర్ (రజి) వివరణ కోసం ఖాలిద్ (రజి)ని మదీనాకు పిలిపించారు. అప్పుడు ఖాలిద్ (రజి) ఖలీఫా సన్నిధికి వెళ్ళి "ఉమర్! దైవసాక్షి, మీరు నావిషయంలో న్యాయంగా వ్యవహరించలేదు" అన్నారు. దానికి ఖలీఫా "అసలు నీకంత డబ్బు ఎక్కడ్నుంచి వచ్చింద"ని అడిగారు. అప్పుడు ఖాలిద్ (రజి) సమరసొత్తు నుండి లభించిందని చెప్పి "ఇదిగో ఈ డబ్బు చూడండి. ఇందులో అరవై వేల దిర్హంలకంటే ఎక్కువ ఉంటే దాన్ని మీకప్పగిస్తాను" అని అన్నారు. లెక్కబెడితే ఇరవై వేలు అదనంగా ఉన్నట్లు తేలింది. అప్పుడా ఇరవై వేల దిర్హంలను ప్రభుత్వ ధనాగారంలో జమచేయడం జరిగింది.

ఆ తరువాత ఖలీఫా ఉమర్ (రజి) ఖాలిద్ (రజి)తో "ఖాలిద్! దైవసాక్షిగా చెబుతున్నాను. నేను నిన్ను అభిమానిస్తున్నాను; గౌరవిస్తున్నాను కూడా" అని చెప్పి రాజ్యంలోని పాలకు లందరికీ ఇలా ఓ లేఖ రాశారు: "నేను ఖాలిద్‌ని కోపంతో లేదా నమ్మకద్రోహం కారణంగా పదవి నుండి తొలగించలేదు. ప్రజలు అతని పట్ల అతిగా ఆకర్షితులవుతున్నారు. (అది వారిని వ్యక్తి ఆరాధన వైపుకు గొనిపోయే ప్రమాదం గోచరిస్తోంది నాకు.) అంచేత (ప్రజల్ని వ్యక్తిపూజ పాపం నుండి కాపాడి) ఏది జరిగినా దాన్ని దేవుడు మాత్రమే చేస్తాడని వారు గ్రహించేందుకు నేను ఖాలిద్‌ని పదవి నుండి తొలగించడం మంచిదని భావించాను."

## (11) ఈరాన్‌సేనాని హర్మ్‌జాన్ ఇస్లాంస్వీకరణ

చరిత్రప్రయాణంలో ఓ మూడేళ్ళు వెనక్కివెళ్ళి ఇరాఖ్‌లోని ఇతర భూభాగాల పరిస్థితి గురించి కూడ తెలుసుకుందాం. ఈరాన్ సేనాపతుల్లో హర్మ్‌జాన్ అనే వాడు ఖాదిసియా యుద్ధం నుండి పారిపోయి, అహ్వాజ్ రాష్ట్రరాజధాని ఖుజిస్తాన్‌కు చేరుకొని సైనికసమీకరణ లో నిమగ్నుడైపోయాడు. కొంతకాలానికి దాదాపు అహ్వాజ్ రాష్ట్రం మొత్తాన్ని వశపరచుకున్నాడు. కూఫా, బస్రాలలోని ముస్లింసేనలు దాడిచేయగానే హర్మ్‌జాన్ వాటిని ప్రతిఘటించలేక జిజ్యా షరతుపై ఒప్పందం చేసుకున్నాడు. అయితే కొన్నాళ్ళకు అతను తిరుగుబాటుచేసి, ముస్లింలచేతిలో చావుదెబ్బ తిని 'రామ్‌హర్మిజ్'కు పారిపోయాడు. అప్పుడతను ముస్లింల కాళ్ళావేళ్ళా పడి జిజ్యాచెల్లింపు షరతుపై ఒప్పందాన్ని పునరుద్ధరింపజేసుకున్నాడు.

ఆ రోజుల్లోనే ఈరాన్‌చక్రవర్తి యజ్దగిర్ద్ పెద్దఎత్తున సైనికసమీకరణ చేస్తున్నట్లు ఖలీఫాకు సమాచారం అందింది. అప్పుడాయన దాన్ని నివారించడానికి వివిధ దిశల్లో, వివిధమార్గాల్లో సైనికదళాలను నియమించమని సేనాపతి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)కు లేఖ రాశారు. సేనాపతి సాద్ (రజి) ఖలీఫా ఆజ్ఞను ప్రకారం ఒక సైనికదళాన్ని 'రామ్‌హర్మిజ్' సమీపంలో కూడా నియమించారు. ఆ సైనికదళాన్ని ఎదుర్కోవడానికి ఈరాన్‌సేనాని హర్మ్‌జాన్ సైన్యం తీసుకొని యుద్ధరంగంలోకి దిగాడు. కాని ముస్లింయోధులు అతడ్ని తరిమికొట్టి



రామ్‌హర్మిజ్‌ను కైవశం చేసుకున్నారు. అప్పుడు హర్మ్‌జాన్ 'తుస్తర్' పట్నానికి పారిపోయి మళ్ళీ సైన్యాన్ని సమీకరించి యుద్ధసన్నాహాలు చేయడం ప్రారంభించాడు.

ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ (రజి) బస్రా సైన్యాలకు అబూమూసా అష్అరీ (రజి)ని సేనాపతిగా నియమించి పంపారు. అబూమూసా (రజి) బస్రా వెళ్ళి యుద్ధపరంపర ప్రారంభించారు. ఈరాన్‌లో 'తుస్తర్' ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన అందమైన పట్టణం. ఇక్కడి రక్షణవ్యవస్థ కూడా ఎంతో పటిష్ఠంగా ఉండేది. దుజ్లానది నుండి ఆ పట్టణానికి, పట్టణం మధ్యలో ఉన్న బ్రహ్మాండమైన ఫౌంటెన్‌కు పటిష్ఠమైన భూగర్భసొరంగాల ద్వారా నీరు సరఫరా అవుతుంది. పట్టణం చుట్టూ అనేక బురుజులతో కూడిన దుర్భేద్యమైన ప్రహరీగోడ ఉంది. ఆ ప్రహరీగోడ బయట పట్టణం చుట్టూ ఎంతో లోతైన దాటవీలుకాని కందకం కూడా ఉంది. పట్టణం నలువైపులా వేలసంఖ్యలో కాకలుతీరిన సైనికులు రేయింబవళ్ళు కాపలా కాస్తుంటారు.

ముస్లింలు బస్రా నుండి తుస్తర్ చేరుకొని, కందకం బయట శిబిరాలు వేసుకొని పట్టణాన్ని దిగ్బంధించారు. ఇరుపక్షాల మధ్య పోరు మొదలయింది. ముస్లింలు తీవ్రంగా ప్రతిఘటించారు. కాని 18నెలలు గడచినా కందకం దాటలేకపోయారు. ఈ సుదీర్ఘకాలంలో వారు ఈరానీయుల నడుం విరగ్గొట్టినంత పనిచేశారు. ఎంతో ప్రఖ్యాతిగాంచిన వందమంది వీరాధివీరుల్ని హతమార్చారు. చివరికి ఈరానీయులు ముస్లింల ధాటికి నిలువలేక కందకం మీది వంతెన దాటి పట్టణంలోకి ప్రవేశించి కోట ద్వారాలు మూసుకున్నారు.

అప్పుడు ముస్లింయోధులు ఆ వంతెన దాటి కోటగోడ సమీపానికి చేరుకొని పోరాటం ప్రారంభించారు. ఈరాన్‌సైనికులు కోటబురుజులపై నుంచి ఎర్రగా కాలిన ఇనుప గొలుసులు వ్రేలాడదీసి బాణాల వర్షం కురిపించసాగారు. ముస్లింలలో ఎవరైనా కోట దగ్గరికెళ్ళి గోడ ఎక్కడానికి ప్రయత్నించినప్పుడల్లా ఈరానీయులు అతడ్ని కాలుతున్న ఇనుపగొలుసులతో పైకి లాగేవారు. ఈలోగానే ఆ ముస్లిం ప్రాణం గాలిలో కలసిపోయేది. అయినప్పటికీ ముస్లింలు ముట్టడిని కొనసాగించి పోరాడుతూనే ఉన్నారు.

ఓరోజు యుద్ధవిరామ సమయంలో సేనాపతి అబూమూసా (రజి) శత్రువులకు వ్యతిరేకంగా తమకు సహాయం చేయమని దైవాన్ని ప్రార్థించసాగారు. ఆ సమయంలో కోటబురుజు నుండి ఒక బాణం వచ్చి ఆయన ముందు పడింది. దానికి ఓ కాగితంచుట్ట కట్టబడివుంది. అబూమూసా (రజి) ఆత్రంగా లేచి ఆ బాణంకు కట్టబడిన కాగితంచుట్ట విప్పదీసి చూశారు. అందులో ఇలా రాయబడి ఉంది:

"ముస్లింలారా! నేను మీమీద పూర్తిగా విశ్వాసం ఉంచి నా భార్యాపిల్లలు, బంధు మిత్రుల ధనమానప్రాణాలకు రక్షణహామీ కోరుతున్నాను. దానికి ప్రతిఫలంగా నేను మీకు పట్నంలో ప్రవేశించడానికి ఓ రహస్యమార్గం చూపుతాను."

సేనాపతి అది చదివిన తర్వాత మరో కాగితంలో అతనికి రక్షణహామీ రాసి దాన్ని బాణానికి కట్టి కోటగోడ వైపుకు వదిలారు. దాన్ని ఆ ఈరానీ నాయకుడు చదువుకొని ముస్లింలు తమ వాగ్దానాన్ని ఎట్టి పరిస్థితిలో కూడా భంగపరచరన్న నమ్మకంతో అర్థరాత్రివేళ తమవాళ్ళ కంటపడకుండా సేనాపతి దగ్గరికొచ్చి ఇలా అన్నాడు:

“మేము మా జాతినాయకులకు చెందినవాళ్ళము. కాని హర్ముజాన్ మా అన్నను చంపి అతని ఆస్తిపాస్తుల్ని స్వాధీనం చేసుకున్నాడు. అతని భార్యాపిల్లలపై దుర్భర హింసా కాండ సాగించాడు. హర్ముజాన్ నా విషయంలో కూడా ప్రతీకారవాంఛతో పెట్రేగిపోతున్నాడు. కాబట్టి నేనా దుర్మార్గుడి దౌర్జన్యాలపై మీ న్యాయదృక్పథానికి, వాడి నమ్మకద్రోహంపై మీ నిజాయితీ-వాగ్దానాలకు అధికప్రాధాన్యత ఇస్తూ మీకొక రహస్యమార్గం చూపదలచు కున్నాను. మీరు నావెంట బుద్ధిశాలి, ధీశాలి, గజఈతగాడయిన ఓ యోధుడ్ని పంపండి. నేనతనికి పట్నంలోకి గొనిపోయే ఆ రహస్యమార్గం చూపిస్తాను.”

సేనాపతి అబూమూసా (రజి) ఈమాట విని ఇబ్నెసౌర్ (రజి) అనే వీరుడ్ని ఈరానీ వెంట పంపారు. ఆ ఈరానీ మార్గదర్శి ఇబ్నెసౌర్ (రజి)ని అదే రాత్రి కటికచీకటిలో ఓ సొరంగం వైపుకు తీసికెళ్ళాడు. అది నీళ్ళు ప్రవహించే ఎంతో అపాయకరమైన భూగర్భ సొరంగం. అది కొన్నిచోట్ల సన్నగా, మరికొన్నిచోట్ల వెడల్పుగా ఉండి అనేక మలుపులు తిరిగివుంది. ఇద్దరూ ఆ సొరంగం గుండా పట్నంలోకి ప్రవేశించి హర్ముజాన్ నిద్రిస్తున్న చోటుకు చేరుకున్నారు. హర్ముజాన్‌ని చూడగానే ఇబ్నెసౌర్ (రజి) చేయి అప్రయత్నంగా అంబులపొది మీదికి పోయింది. అయితే సేనాపతి ఆజ్ఞ గుర్తుకురాగానే ఆయన హర్ముజాన్ని వధించే పని విరమించుకున్నారు. ఆ తరువాత ఆయన సొరంగం గుండా శిబిరానికి చేరుకొని సేనాపతికి నివేదిక సమర్పించారు.

అప్పుడు సేనాపతి అబూమూసా (రజి) అత్యంత ప్రతిభాపరాక్రమాలతో పాటు బాగా ఈత వచ్చిన మూడొందల మంది వీరయోధుల్ని ఎంపికచేసి ఇబ్నెసౌర్ (రజి) నాయకత్వంలో వారిని సొరంగం వైపుకు పంపారు. వారు ఇబ్నెసౌర్ (రజి) సూచనల ప్రకారం పల్చటి దుస్తులు ధరించి, నడుములకు ఖడ్గాలు మాత్రమే కట్టుకున్నారు. ఇబ్నెసౌర్ (రజి) రాత్రి మూడో జామున చిమ్మచీకటిలో వాళ్ళను తీసుకొని సొరంగంలోకి దిగి ముందుకు సాగారు. దాదాపు రెండు గంటలపాటు ఒకరి వెనుక ఒకరు ఈదుకుంటూ, అనేక వడిదుడుకులకు గాయపడుతూ సొరంగం చివరికి చేరుకున్నారు. కాని బయటికొచ్చి చూస్తే ఎనభై మంది మాత్రమే సొరంగం నుండి ప్రాణాలతో బయటపడ్డారు. మిగిలిన రెండొందల ఇరవై మంది సొరంగంలో తీవ్రంగా గాయపడి ఊపిరి విడిచారు.

ఇబ్నెసౌర్ (రజి), మిగిలిన ఆయన అనుచరులు పట్టణంలో ప్రవేశించగానే వరల్లో నుంచి ఖడ్గాలు దూసి కాపలాదారులపై ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. కొన్ని క్షణాల్లోనే ఆ కాపలాదారులు నేలకొరిగి చలనరహితమైపోయారు. ఆ వెనువెంటనే ముస్లింయోధులు కోట తలుపులు తెరచి “అల్లాహుఅక్బర్” అంటూ బిగ్గరగా అరిచారు. కోట ద్వారం బయట కాచుకొనివున్న ముజాహిద్‌లు ప్రవాహంలా లోపలికి దూసుకువచ్చారు. ఈ అలికిడికి ఈరాన్ సైనికులు దిగ్గున లేచి ఆయుధాలు తీసుకొని పరుగులు పెట్టారు. భయంకర యుద్ధం మొదలయింది. ముస్లింలు ఈరానీయుల్ని ఊచకోత కోస్తూ కార్చిచ్చులా విరుచుకు పడ్డారు. ఈరాన్‌సైనికుల శవాలు గుట్టలు గుట్టలుగా పడిపోసాగాయి.

చివరికి ముస్లింలు ఈరాన్‌సైన్యం నడుం విరగ్గొట్టి తుస్తర్ పట్టణాన్ని వశపరచుకునే తరుణంలో హర్ముజాన్ మళ్ళీ కాళ్ళబేరానికి వచ్చాడు. తనను ఖలీఫా దగ్గరకు తీసికెళ్ళి



తన వ్యవహారాన్ని ఆయన నిర్ణయానికి వదిలేస్తే లొంగిపోతానని సేనాపతి అబూమూసా (రజి)కు మనవి చేసుకున్నాడు. దానికి అబూమూసా (రజి) అంగీకరించి కొందరు సైనికుల వెంట హర్ముజాన్‌ని మదీనా పంపివేశారు. హర్ముజాన్ మదీనా చేరుకోగానే ధగధగ మెరిసి పోయే చంద్రహారం, రత్నఖచిత కిరీటం, ఖరీదైన ఖడ్గం, వెండి-బంగారు జల్తారుతో కూడిన పట్టువస్త్రాలు ధరించి రాజఠీవి ఒలకబోయడానికి ప్రయత్నించాడు.

ముస్లింయోధులు హర్ముజాన్‌ని మస్జిదెనబవీ వైపుకు తీసికెళ్తుంటే రోమ్,ఈరాన్‌లు వంటి అగ్రరాజ్యాల్ని మట్టుపెడ్తున్న ముస్లించక్రవర్తి దర్బారు మరెంత వైభవంగా, అట్టహాసం గా ఉంటుందోనని భావించాడు. కాని మస్జిద్‌లో అలాంటి హోదా, అంతస్తులతో కూడిన చక్రవర్తి కానరాకపోవడంతో “ఏరి మీ ఖలీఫాగారు” అనిఅడిగాడు. ముస్లింలు చేత్తో సైగచేసి చూపించారు. హర్ముజాన్ అటువైపు తిరిగి సంభ్రమాశ్చ ర్యాలతో చూడసాగాడు. అతుకుల ముతకదుస్తులు ధరించి కటికనేల మీద పడుకొని కునికిపాట్లు పడుతున్న ఖలీఫాగారు ఈ అలికిడికి లేచికూర్చున్నారు. చూస్తే ఎదురుగా గొప్పసేనాపతి హోదావేషంలో ధగధగ మెరుస్తున్న ఓ భారీ సజీవవిగ్రహం కన్పించింది.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఓసారి హర్ముజాన్ వైపు ఎగాదిగా చూసి, అతడ్ని ఎంతో ఆశ్చర్యంగా చూస్తున్న ఇతర ముస్లింల వైపుకు తిరిగి “ఇహలోకంలోని ఈ ధగధగలు, తళుకుబెళుకులు క్షణభంగురాలు-మోసపూరితమైనవి మాత్రమే” అన్నారు. ఆ తరువాత ఆయన హర్ముజాన్ వైపు తిరిగి “నువ్వు అనేకసార్లు ఒప్పందం ఉల్లంఘించి మమ్మల్ని చికాకుపరచావు. అలాంటి నిన్ను సజీవంగా వదలిపెట్టకూడదు” అని అన్నారు.

హర్ముజాన్ అంతకుముందే ముస్లింల చేతిలో తనకు చావు తప్పదని గ్రహించాడు. అయినప్పటికీ అతను ఒకింత ధైర్యంతో “దేవుడు మావైపు ఉన్నంతకాలం మీరు మాకు బానిసలుగా ఉండేవారు. ఇప్పుడు దేవుడు మీవైపున్నాడు గనక మేము మీకు బానిసలమై పోయాము” అని చెప్పి కొంచెం మంచినీళ్ళు ఇప్పించండని అడిగాడు. ఒక ముస్లిం మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చాడు.

అప్పుడు హర్ముజాన్ మంచినీళ్ళ ముంత చేతిలో పట్టుకొని “నేనీ నీళ్ళు తాగకముందే మీరు నన్ను చంపుతారేమోనని భయపడుతున్నాను” అన్నాడు. దానికి ఉమర్ (రజి) “భయపడకు. నువ్వు మంచినీళ్ళు తాగనంతవరకూ నీకెలాంటి నష్టం జరగనివ్వం” అన్నారు. హర్ముజాన్ ఈమాట వినగానే నీళ్ళముంత నేలమీద జారవిడిచాడు. దాంతో ముంత పగిలిపోయి నీళ్ళు నేలలో ఇంకిపోయాయి. ఇలా ముంత పగిలిపోగానే హర్ముజాన్ “ఇప్పుడు మీరు నన్ను వధించలేరు. ఎందుకంటే మీరు నాకు రక్షణహామీ ఇచ్చారు” అన్నాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని “నువ్వు అబద్ధమాడుతున్నావు. మేము నీకు ఎలాంటి రక్షణహామీ ఇవ్వలేదు” అన్నారు. వెంటనే హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ముందుకొచ్చి “విశ్వాసుల నాయకా! హర్ముజాన్ నిజమే చెప్పాడు. నీళ్ళు తాగనంత వరకూ అతనికి ఎలాంటి నష్టం జరగనివ్వమని మీరిప్పుడే కదా చెప్పింది, మరచిపోయారా?” అని అన్నారు. ఆయన మాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) ఆశ్చర్యపోయారు. తరువాత ఆయన హర్ముజాన్‌తో “నువ్వు నన్ను మోసగించావు. కాని నేను నిన్ను మోసగించను.

నిన్ను వదలిపెడ్తున్నాను, వెళ్ళు" అని అన్నారు. ఈమాట వినగానే హర్ముజాన్ కలిమా (సద్వచనం) పఠించి ఇస్లాం స్వీకరిస్తున్నట్లు ప్రకటించాడు.

హర్ముజాన్ ఇస్లాంస్వీకార ప్రకటన వినగానే ముస్లింలు సంతోషాతిశయంతో 'అల్లాహు అక్బర్' అంటూ నినదించారు. ఇక ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఆనందమైతే అవధులు దాటింది. ఆ తరువాత ఆయన హర్ముజాన్‌ని మదీనాలో ఉండనిచ్చి ఏటా రెండువేల దిర్హాంలు జీతం మీద అతడ్ని సైనిక సలహాదారుడిగా నియమించారు.

ముస్లింలు తుస్తర్ పట్టణాన్ని జయించిన తర్వాత అక్కడ్నుంచి ఇరవైనాలుగు మైళ్ళ దూరంలో ఉన్న 'జందిసాబూర్' పట్టణానికి చేరుకొని దాన్ని ముట్టడించారు. పట్టణప్రజలు ముట్టడికి ముందే కోటతలుపులు మూసేశారు. ఇరుపక్షాల మధ్య యుద్ధం మొదలైంది. ఈ ముట్టడి చాలా రోజులు కొనసాగింది. ఓరోజు పట్టణప్రజలు కోట తలుపులు తెరచి బయట నిశ్చింతగా అటుఇటు తిరగసాగారు. ఇది చూసి ముస్లింలు ఆశ్చర్యపోతూ విషయం ఏమిటని విచారిస్తే పట్టణవాసులు విషయం తెలియజేస్తూ "మీరు మాకు రక్షణ ఇచ్చిన తర్వాత కూడా మేము నిశ్చింతగా తిరగరాదా?" అన్నారు.

ఈమాట విని ముస్లింలు మరింత ఆశ్చర్యపోయారు. ఎవరయ్యా! వీరికి రక్షణ ఇచ్చిందంటూ ఆరాతీశారు. అప్పుడు ఒక బానిస జిజ్యాషరతుపై వారికి రక్షణ ఒప్పందం రాసిచ్చాడని తెలిసింది. దీనిపై ముస్లింలలో భిన్నాభిప్రాయాలు కలిగాయి. కొందరు "ఈ ఒప్పందం రహస్యంగా, ఒక బానిస చేతిపై జరిగింది గనక దీనికి మనం కట్టుబడి ఉండనవసరంలేద"ని అన్నారు. సేనాపతి అబూమూసా (రజి) సమస్యపరిష్కారం కోసం ఖలీఫా దగ్గరకు ఒక సైనికుడ్ని మదీనా పంపారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) బానిస ఇచ్చిన రక్షణహామీని ఆమోదిస్తూ "శత్రువులతో ఏ ముస్లిం ఒప్పందం చేసినా అది మొత్తం ముస్లింసముదాయం తరపున చేసినట్లు పరిగణించబడుతుంది" అని చెప్పారు.

## (12) అహ్వాజ్‌లో జయకేతనం

ఈరాన్ పార్శీల నుండి ఇరాఖ్ అరబ్బులను వేరుచేస్తూ ఈరాన్ సరిహద్దు, బస్రాల మధ్య "అహ్వాజ్" అనే ఓ కీలక ప్రాంతం ఉంది. ఈ ప్రాంతం నుండి ఈరానీయులు ఇరాఖ్ అరబ్బులపై దాడులు చేసే ప్రమాదం ఉంది. అందువల్ల అహ్వాజ్‌ను ఇస్లామీయ రాజ్యపరిధిలోకి తీసుకునే ఉద్దేశ్యంతో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ దిశగా ఓ సైనిక దళం పంపడానికి నిశ్చయించుకున్నారు. అప్పుడాయన హజ్రత్ సల్మా బిన్ ఖైస్ (రజి) నాయకత్వంలో అహ్వాజ్ వైపు ఓ సైనికదళం పంపించారు.

'అహ్వాజ్' ఎంతో కఠినమైన కొండ ప్రాంతం. సల్మా బిన్ ఖైస్ (రజి) నేతృత్వంలోని ఈ సైన్యం మదీనా నుండి బయలుదేరి కొన్నాళ్ళకు అహ్వాజ్ భూభాగంలో ప్రవేశించింది. సైన్యం అహ్వాజ్‌లో ప్రవేశించి కొన్ని మైళ్ళు పురోగమించిందో లేదో అడుగడుగునా దుర్భరమైన దారి కష్టాలు ఎదురయ్యాయి. ఇరుకైన దారుల గుండా కొండలను ఎక్కుతూ, దిగుతూ నడవవలసి రావడంతో కొందరు యోధుల పాదాలు రక్తసిక్తం కూడా అయ్యాయి. ఈ కష్టాలకు తోడు తెచ్చుకున్న నీళ్ళు అయిపోవడం వల్ల నాలుకలు పిడచకట్టుకోసాగాయి.



సైనికులు దాహంతో ఆందోళన చెందసాగారు. ఈ కష్టాలు చాలవన్నట్లు చెట్లు, చామలు, పొదల్లో దాగిన తేళ్ళు, పాములు తమ భీకర రూపాలు ప్రదర్శిస్తూ సైనికుల్ని మరింత ఆందోళనకు గురిచేయసాగాయి.

అయితే సేనాపతి సల్మా బిన్ ఖైస్ (రజి) తన అనుచరుల ముందు మాటిమాటికి పరలోక విషయాలు ప్రస్తావిస్తూ, ప్రాపంచిక కష్టాల నుండి దృష్టి మరలించే ఆధ్యాత్మిక వికాసంతో కూడిన హితబోధ చేస్తూ వారిని ముందుకు పురోగమింపజేశారు. ఈవిధంగా సైన్యం నిర్ణీత ప్రదేశానికి చేరుకొని విడిదిచేసింది. సేనాపతి సల్మా (రజి) ముందుగా ఆహ్వాజ్ ప్రజలకు దైవధర్మాన్ని గురించి ఉపదేశిస్తూ ఇస్లాం స్వీకరించమని చెప్పారు. లేదా జిజ్యా చెల్లించాలని అన్నారు. కాని వారు ఇస్లాం స్వీకారాన్ని, జిజ్యా చెల్లింపును నిరాకరిస్తూ కయ్యానికి కాలుదువ్వారు. అప్పుడు ముస్లింలు గత్యంతరంలేక తమ వరల నుంచి ఖడ్గాలు బయటికి తీసి రంగంలోకి దిగారు. ఇరు పక్షాల మధ్య సమరజ్వాలలు ఎగిసిపడ్డాయి. హోరాహోరీ పోరాటం సాగింది. చివరికి శత్రుసైనికులు ముస్లింల ధాటికి నిలువలేక తమ శవాల గుట్టల మీదుగా పరుగెత్తుతూ పారిపోయారు.

ఈ యుద్ధంలో ముస్లింలకు సమరసొత్తుగా అపార సిరిసంపదలు లభించాయి. అందులో ఎంతో అందమైన, అత్యంత విలువైన ఒక ఆభరణం కూడా ఉంది. సేనాపతి సల్మా (రజి) అనుచరయోధుల్ని సంప్రదించి వారి అనుమతితో దాన్ని ఖలీఫాకు కానుకగా సమర్పించడానికి రాజధాని మదీనాకు పంపించారు. ఒక సైనికుడు ఓ చిన్న పెట్టెలో ఆ కానుక పెట్టుకొని, తన సేవకుడ్ని తీసుకొని రెండు ఒంటెల మీద బయలుదేరాడు. అతను బస్రా పట్టణం మీదుగా ప్రయాణించి మదీనా చేరుకున్నాడు.

ఆ సమయంలో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రజలకు భోజనం పెట్టే పనిలో నిమగ్నులై ఉన్నారు. ఆ పని ముగిసిన తరువాత ఆయన ఇంటికి చేరుకున్నారు. కానుక తెచ్చిన ఆ సైనికుడు, అతని సేవకుడు ఖలీఫా వెనకాల నడచి ఆయన ఇంటికి చేరుకొని లోపల ప్రవేశించడానికి అనుమతి అడిగాడు. అనుమతి లభించిన తరువాత లోపలికి ప్రవేశించి ఖలీఫాకు సలాం చేసి కూర్చున్నాడు. తరువాత అతను సల్మా బిన్ ఖైస్ (రజి) దగ్గర్నుండి ఒక సందేశం తెచ్చానని అన్నాడు. అదేమిటని అడిగినపుడు అతను అహ్వాజ్‌లో ముస్లింలు విజయం సాధించారని, ఆ ప్రాంతం ఇప్పుడు తమ అధీనంలో ఉందని తెలియజేశాడు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అతని చేతిలో ఉన్న పెట్టె చూసి అదేమిటని అడిగారు. దానికతను ఇలా సమాధానమిచ్చాడు :

"విశ్వాసుల నాయకా! దేవుడు మాకు విజయంతో పాటు అపార సమరసొత్తు ప్రసాదించాడు. అందులో ఎంతో విలువైన ఒక ఆభరణం లభించింది. మా సేనాపతి సైనికుల్ని సంప్రదించి దాన్ని మీకు కానుకగా సమర్పించడానికి నన్ను మీ దగ్గరకు పంపాడు. ఆ కానుకే ఈ పెట్టెలో వున్న వస్తువు." అంటూ ఆ సైనికుడు దాన్ని ఖలీఫా ముందుంచాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ పెట్టె తెరచి చూడగానే దిగ్గున లేచినిలబడి దాన్ని విసురుగా నేలకేసి కొట్టారు. పెట్టె క్రిందపడి పోగానే అందులోని ఆభరణంలో పొదగబడిన మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలు నేల మీద చెల్లచెదరుగా పడిపోయాయి. ఆ దృశ్యం

చూసి సైనికుడు నిలువెల్లా కంపించిపోయాడు. ఖలీఫా ఉమర్ (రజి) కళ్ళ నుంచి అగ్ని కణాలు వెలువడుతుండగా ఆయన వాటిని పోగుచెయ్యి అని ఆదేశించారు. ఆ సైనికుడు వెంటనే పెట్టెలో నుంచి క్రింద పడిపోయిన ఆ మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలను ఒక చోట పోగుచేశాడు. ఆ తర్వాత ఖలీఫా ఉమర్ (రజి) తన సేవకుడు ఎర్ఫాను "ఇతడ్ని బాగా కొట్టు" అని ఆజ్ఞాపించారు.

ఖలీఫా సేవకుడు ఎర్ఫా ఆ సైనికుడి దగ్గరకు వచ్చి అతడ్ని ఎడాపెడా వాయించడం ప్రారంభించాడు. ఆ దెబ్బలకు సైనికుడు క్రింద పడిపోయాడు. అయినా ఎర్ఫా అతడ్ని కొట్టడం మానేయలేదు. అప్పుడు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) "ఇక ఆపెయ్యి" అని ఎర్ఫాను ఆదేశించి, సైనికుడితో "లే, లేచి నిలబడు. నువ్వూ మంచివాడివి కాదు, మీ నాయకుడూ మంచివాడు కాదు" అని అన్నారు.

పాపం, అహ్వాజ్ నుంచి వచ్చిన ఆ సైనికుడు బిత్తరపోయి చూస్తూ "విశ్వాసులనాయకా! నేనిక వెళ్ళిపోతాను. మీ సేవకుడు మా ఒంటెలను స్వాధీనం చేసుకున్నాడు. దయచేసి అహ్వాజ్ వెళ్ళడానికి నాకోసం, నా సేవకుడి కోసం రెండు ఒంటెలు ఇప్పించండి" అని ప్రాధేయపడ్డాడు. ఖలీఫా ఒంటెల్ని తెచ్చివ్వమని తన సేవకుడ్ని ఆదేశించారు. ఆ తరువాత ఆయన సైనికుడి వైపు తిరిగి "వెంటనే నీవు అహ్వాజ్‌కు చేరుకొని, ఈ మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలను సమరసొత్తుగా సైనికులకు పంచివ్వాలని మీ సేనాపతికి చెప్పు" అని ఆదేశించారు. దానికా సైనికుడు "చిత్తం, తమరు చెప్పినట్లే చేస్తాను, ఇక నాకు సెలవు ఇప్పించండి" అన్నాడు జావగారిన ముఖంతో.

"ఒకమాట గుర్తుంచుకో. దైవసాక్షిగా చెబుతున్నాను, ఒకవేళ ఈ నవరత్నాల పంపిణీ జరగక ముందే సైనికులు తమకు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్ళిపోవడం జరిగితే మాత్రం నీకు, మీ నాయకుడికి కఠినమైన శిక్ష విధిస్తాను" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి).

ఆ తరువాత ఆ సైనికుడు, అతని సేవకుడు ఖలీఫా అనుమతి తీసుకొని అక్కడ్నుంచి బయలుదేరి అహ్వాజ్ దారిపట్టారు. అహ్వాజ్ చేరుకోగానే సేనాపతి సల్మా బిన్ ఖైస్ (రజి)కు జరిగిన వృత్తాంతం వివరించారు. సేనాపతి సల్మా (రజి) ఈ సంఘటన విని అప్పటికప్పుడు ఆ నవరత్నాలను సైనికులకు పంచివేశారు.

## (13) ప్లేగువ్యాధి, కరవుకాటకాలతో జనం విలవిల

హిజ్రీశకం 17వ సంవత్సరాంతంలో ఇరాఖ్, సిరియా, ఈజిప్టు దేశాల్లో ప్లేగు వ్యాధి వ్యాపించింది. ఇది 18వ ఏట ప్రారంభంలో ఉగ్రరూపం దాల్చి ప్రజల్లో కనీవినీ ఎరగని భయోత్పాతం సృష్టించింది. ఈ ప్లేగుమహమ్మారి నెలల తరబడి జనాన్ని పీల్చి పిప్పిచేస్తూ వేలాది మందిని పొట్టన పెట్టుకోసాగింది. అంచేత ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) పరిస్థితి సమీక్షించి తగిన ఏర్పాట్లుచేసే ఉద్దేశంతో కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని మదీనా నుండి బయలుదేరి సిరియాలోని 'సర్గ్' ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు స్వాగతం చెప్పడానికి సేనాపతి అబూఉబైదా (రజి), మరికొందరు సైనికాధికారులు వచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి) వారిని సంప్రదించి సలహాలు అడిగారు.



వారిలో అత్యధిక మంది ఇక్కడ్నుంచి ఇక ముందుకు సాగి ప్లేగుసోకిన ప్రాంతానికి వెళ్ళవద్దని సలహా ఇచ్చారు. వాళ్ళను మరికొందరు సమర్థిస్తూ "మీరిక్కడ ఆగడం ఏమాత్రం మంచిది కాద"ని చెప్పారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) దైవప్రవక్త (స) ప్రవచించిన ఒక హితోక్తిని గుర్తుచేస్తూ "ఏ ప్రాంతంలో అంటువ్యాధి వ్యాపిస్తే ఆ ప్రాంతానికి మీరు వెళ్ళకండి, ఒకవేళ యాదృచ్ఛికంగా అంటువ్యాధి వ్యాపించిన ప్రాంతానికి వెళ్ళడం జరిగితే అక్కడ్నుంచి మీరు పారిపోకండి" అని దైవప్రవక్త (స) తెలిపారని అన్నారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ మహితోక్తి వినగానే "మనం ఇక్కడ్నుంచి రేపే బయలుదేరాలి, సిద్ధంగా ఉండండి" అని వెంటవచ్చిన అనుచరుల్ని ఆదేశించారు. అయితే విధివ్రాత పట్ల అతిగా విశ్వాసం కలిగివున్న అబూఉబైదా (రజి) మాత్రం ఖలీఫా తిరుగు ప్రయాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఆయన కనుబొమలు చిట్లిస్తూ "ఉమర్! విధివ్రాత (అదృష్టం) నుండి పారి పోతున్నావా?" అనడిగారు. దానిని ఉమర్‌ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "ఔను, నేను విధివ్రాత నుండి పారిపోతున్నాను. కాని ఆ పారిపోవడం కూడా విధివ్రాత వైపుకే" అని అన్నారు. ఆ తరువాత ఆయన అంటువ్యాధి నివారణ కోసం వీలైనన్ని ఏర్పాట్లు చేసుకో వలసిందిగా అధికారులకు ఆదేశాలిచ్చి మదీనాకు తిరుగుప్రయాణమయ్యారు.

సేనాపతి హజ్రత్ అబూఉబైదా (రజి) తన సైన్యంతో ఒక ఎత్తయిన ప్రదేశంలో విడిదిచేశారు. ఆ తరువాత ఖలీఫా ఆజ్ఞతో ఆయన సైన్యాన్ని తీసుకొని కాస్తంత మంచి వాతావరణం ఉన్న 'జాబియా' ప్రాంతానికి వెళ్ళిపోయారు. కాని ఈ ప్రాంతానికి వచ్చిన కొన్నాళ్ళకే ఆయనకు ప్లేగువ్యాధి సోకింది. అది క్రమంగా తీవ్రమవుతూ ఉండటంతో ఆయన తన స్థానంలో ముఆజ్ బిన్ జబల్ (రజి)ని సేనాపతిగా నియమించారు. ఆ తరువాత ఆయన ఇహలోకం నుంచి శాశ్వతంగా వెళ్ళిపోయారు. మరికొన్నాళ్ళకు ముఆజ్ బిన్ జబల్ (రజి)పై కూడా ప్లేగురక్కసి విరుచుకుపడింది. ముఆజ్ (రజి)కు ముందు అది ఆయన కుమారునిపై విజృంభించి మృత్యుకుహరంలోకి నెట్టివేసింది. ఆ తరువాత ఆయన్ని కూడా మింగేసింది.

మరణానికి ముందు హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) తన స్థానంలో అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని సేనాపతిగా నియమించారు. ముఆజ్ బిన్ జబల్ (రజి) మరణం తరువాత హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) సైన్యం తీసుకొని కొండ చర్యలపైకి చేరుకున్నారు. సైన్యాన్ని చిన్నచిన్న దళాలుగా విభజించి కొండచర్యలపై ఉంచారు. హిజ్రీశకం 18వ సంవత్సరంలో కొన్ని నెలలు గడచిన తరువాత ప్లేగువ్యాది కాస్తంత తగ్గుముఖం పట్టింది. అయితే అప్పటికే ఈ మహమ్మారి ఇరవైఐదు వేలమంది ముస్లింలను బలితీసుకుంది. వేలాదిమంది పిల్లలు అనాథలయిపోయారు. వేలాదిమంది స్త్రీలు వితంతువులయ్యారు. సర్వత్రా విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్లేగువ్యాధి బారిన పడి చనిపోయినవారిలో అబూఉబైదా, ముఆజ్ బిన్ జబల్, యజీద్ బిన్ అబూసుఫ్యాన్, హారిస్ బిన్ హిషామ్, సుహైల్ బిన్ అమ్ర్, ఉతబా బిన్ సుహైల్ (రజి) వంటి అగ్రనాయకులతో పాటు అనేకమంది సైన్యాధికారులు ఉన్నారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఎప్పటికప్పుడు పరిస్థితులు తెలుసుకుంటూ తగిన సూచనలు ఇచ్చేవారు. యజీద్ బిన్ అబూసుఫ్యాన్ (రజి), ముఆజ్ బిన్ జబల్ (రజి)ల మరణవార్త విన్న తరువాత ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి)ని డెమాస్కస్ గవర్నర్‌గా, షర్జీల్ (రజి)ని జోర్డాన్ గవర్నర్‌గా నియమించారు.

ప్లేగు మహమ్మారి వల్ల ఇస్లామీయ విజయపరంపరలు ఆగిపోయాయి. దైవధర్మ విస్తరణ కార్యకలాపాలు కుంటుపడి పోయాయి. ముస్లింలు స్వయంగా ఆత్మరక్షణ ఏర్పాట్లలో పడిపోయారు. ప్లేగు కారణంగా ఇస్లామేతర రాజ్యాలు కూడా ముస్లింలపై దాడులు చేయలేకపోయాయి. ఆ రాజ్యాలలో కూడా ప్లేగు మహమ్మారితో వేలాదిమంది ప్రజలు మృత్యువాత పడ్డారు. సర్వత్రా హాహాకారాలు మిన్నుముట్టాయి. ఇలా యుద్ధ వాతవరణంలో కొన్ని నెలల పాటు ఒక విధమైన స్తబ్దత ఏర్పడింది.

ఆ తరువాత అదే సంవత్సరం అరేబియా భూభాగంలో తీవ్రమైన కరవు వచ్చిపడింది. వర్షాభావంతో పచ్చనిచెట్లు మలమల మాడిపోయాయి. కుంటలు, చెరువులు ఎండి పోయాయి. ప్రజలు తిండిగింజల కొరతతో తల్లడిల్లి పోయారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రజల్ని కరవురక్కసి కోరల నుండి కాపాడటానికి నిర్విరామంగా శ్రమిస్తూ వీలైనన్ని ఏర్పాట్లు చేశారు. ఆయన వివిధ రాష్ట్రాల గవర్నర్లకు లేఖలు రాసి సాధ్యమైనంత ఎక్కువగా ధాన్యం పంపవలసిందిగా ఆదేశించారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం మదీనాకు పెద్దఎత్తున ధాన్యం చేరింది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దాన్ని ఓ ఇంట్లో భద్రపరిచారు. తర్వాత తిండిగింజల లేమితో బాధపడుతున్న ప్రజల జాబితా ఒకటి తయారు చేయించి ఆ ధాన్యం కరవు బాధితులకు పంచిపెట్టారు. అదీగాక ప్రజలపై కరవురక్కసి తాండవిస్తున్నంత కాలం తాను పాలు, నెయ్యి ఉపయోగించనని కూడా ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతిజ్ఞ చేశారు. ఆయన సహచరులు కూడా అనేకమంది పాలు, నెయ్యి వాడకం మానేశారు. ఒకరోజు ఆయన ప్రజల్ని వెంటబెట్టుకొని మదీనా పట్టణం బయటికి వెళ్ళారు. అక్కడ 'ఇస్తిస్ఖా నమాజ్' చేసి వర్షం కోసం దైవాన్ని ప్రార్థించారు. ప్రార్థన ముగిసిందో లేదో చిటపట చినుకులతో వర్షం ప్రారంభమై కొన్ని క్షణాల్లోనే అది ఉధృతమై కుంభవృష్టిగా మారిపోయింది. ప్రజలు వర్షంలో తడిసి ఆనందంతో పులకించిపోయారు.

అటు సిరియాలో ప్లేగుమహమ్మారి కనుమరుగై కాస్తంత ప్రశాంత వాతావరణం నెలకొన్నది. అయితే విపరీతమైన ప్రాణనష్టం జరగడం వల్ల వితంతువులు, అనాథపిల్లలు కకావికలమై పోయారు. పాలనావ్యవస్థ కుంటుపడింది. అందువల్ల సిరియాలో పరిస్థితులు చక్కదిద్దే ఉద్దేశ్యంతో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని మదీనా నుండి సిరియాకు చేరుకున్నారు. సిరియాలోని అనేక జిల్లాలలో విస్తృతంగా పర్యటించి అక్కడి పాలకులకు, అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. సరిహద్దు రక్షణ సైనికులకు జీతాలు అందజేశారు. ప్లేగుతో మరణించినవారి వారసుల్ని ఓదార్చి వారికి అవసరమైన ధనసహాయం చేశారు. సరిహద్దుప్రాంతాల్లో శాశ్వత సైనికశిబిరాలు నెలకొల్పి రక్షణదళాలకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఆ తరువాత మదీనా తిరిగొచ్చారు.



## (14) నిహావంద్ యుద్ధం

మనం ఇప్పుడు మళ్ళీ ఈరాన్ వైపు దృష్టి సారిద్దాం. హిజ్రీశకం 18వ సంవత్సరం గడుస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్ని గురించి వివరించడానికి ముందు గతంలో జరిగిన కొన్ని చిన్నచిన్న సంఘటనలు గురించి తెలుసుకోవాల్సిన అవసరముంది. మనం గత పేజీలలో మదాయెన్, జలూలా పట్టణాలు ముస్లింల స్వాధీనమైపోయిన తరువాత ఈరాన్ చక్రవర్త యజ్దగిర్ద్ 'రే' ప్రాంతానికి పారిపోయాడని తెలుసుకున్నాం. అయితే 'రే' ప్రాంతం గవర్నర్ ఆబాన్ జాద్వియాలో అవిధేయతా పోకడలు గోచరించడంతో అతను 'రే' నుండి అస్ఫిహాన్‌కు వెళ్ళిపోయాడు. అక్కడ కొన్ని రోజులుండి కర్మాన్‌కు వెళ్ళిపోయాడు. అక్కడ్నుంచి కొన్నాళ్ళకు ఖురాసాన్ రాష్ట్రంలోని మరూ పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ ఒక అగ్నిగుండం రాజేసి, ముస్లింల యుద్ధపరంపర సరిహద్దు ప్రాంతాల వరకే సాగి, ఆ తరువాత ముందుకు పురోగమించదని భావించి నిశ్చింతగా ఉండసాగాడు.

అయితే అహ్వాజ్, ఖుజిస్తాన్ ప్రాంతాలు ముస్లింల కైవశం కావడం, యుద్ధతంత్రంలో దిట్టయిన హుర్ముజాన్ ముస్లింల చేతికి చిక్కి మదీనా వెళ్ళిపోవడం లాంటి సంఘటనలు విన్న తర్వాత యజ్దగిర్ద్ రోషంతో ఉడికిపోతూ మళ్ళీ సైనికసమీకరణ ప్రారంభించాడు. అతను చుట్టుపక్కలున్న వివిధప్రాంతాల పాలకులకు లేఖలు రాసి వాళ్ళను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు. దాంతో కొన్ని రోజుల్లోనే తబ్రిస్తాన్, జర్జాన్, ఖురాసాన్, అస్ఫిహాన్, హమ్దాన్, సింధ్ మొదలైన దేశాల, రాష్ట్రాల నుంచి వేలాది సైనికులు వచ్చి అతని పతాకం క్రిందికి చేరారు. ఇలా ఈ సైనికులసంఖ్య లక్షన్నరకు చేరింది. అప్పుడా సైన్యానికి అతను మర్వాన్‌రాజును సర్వసేనానిగా నియమించి నిహావంద్ ప్రాంతానికి పంపాడు.

అటు మదీనాలో ఈ సంగతి తెలియగానే ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) వెంటనే అప్రమత్తులై శత్రువుల్ని ఎదుర్కోవడానికి కూఫాసేనలకు నోమాన్ బిన్ ముఖ్రిన్ (రజి)ని సేనాపతిగా నియమించి తగిన ఆదేశాలిచ్చారు. నోమాన్ (రజి) కూఫాలోని సేనలన్నిటిని ఒకచోట సమీకరించి నిహావంద్ వైపుకు బయలుదేరారు. ముప్ఫయి వేలమందితో కూడిన ఈ సైన్యం నిహావంద్‌కు తొమ్మిదిమైళ్ళ దూరంలోని ఓ ప్రదేశానికి చేరుకొని విడిదిచేసింది. అటు ఈరాన్ సైన్యం అంతకుముందే నిహావంద్ పట్టణంలో ప్రవేశించి యుద్ధం చేయడానికి సిద్ధమైంది. మరునాడు ఈరానీయులు పట్నం బయటికి వచ్చి కత్తులు దూశారు.

ఇరుపక్షాల మధ్య సంకులసమరం మొదలయింది. అయితే రెండు రోజులు యుద్ధం జరిగినా ముస్లింలు ఈరానీయుల్ని ప్రతిఘటించలేకపోయారు. అప్పుడు ఈరాన్‌సైనికులు పట్టణం లోపలికి వెళ్ళి బయట ఇనుప సూదులతో కూడిన ముళ్ళకంచె పరిచారు. దాని వల్ల ముస్లింసేనలు ముందుకు వెళ్ళలేకపోయాయి. అప్పుడు సేనాపతి నోమాన్ (రజి) అనుచరుల్ని సంప్రదించి యుద్ధవ్యూహాన్ని మార్చారు. నిహావంద్ పట్టణానికి ఆరుమైళ్ళ దూరంలో కొండగుట్టలున్నాయి. వాటి వెనుక ఆయన సేనల్ని దాచి, ఖాఖా బిన్ అమ్ర్ నాయకత్వంలో ఒక చిన్న సైనికదళం పంపుతూ నిహావంద్ కోటపై దాడిచేయమని చెప్పారు. ఖాఖా తన సైన్యం తీసుకొని కోట సమీపానికి వెళ్ళారు. ఈరాన్ సైనికులు ఆ చిన్నసైన్యాన్ని చూసి ద్విగుణీకృత ఉత్సాహంతో దానిపై విజృంభించారు.

ఇక్కడ ఆసక్తికరమైన ఓ చిన్న సంఘటన గురించి తెలుసుకుందాం. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సేనాపతి నోమాన్ (రజి)కు మద్దతుగా సారియా (రజి) నేతృత్వంలో ఒక చిన్న సైనికదళమిచ్చి నిహావంద్ వైపుకు పంపించారు. అయితే దారిలో ఓచోట శత్రువులతో తీవ్రమైన ప్రతిఘటన ఎదురయింది. ముస్లింలు ఓటమి పాలయ్యే పరిస్థితిలో వారికి ఎక్కడ్నుంచో "సారియా! కొండ వైపుకు వెళ్ళు" అంటూ మూడుసార్లు ఓ అదృశ్యవాణి విన్పించింది. అప్పుడు దళపతి సారియా వెంటనే సైన్యాన్ని తీసుకొని కొండమీదికి చేరుకొని శత్రువులపై పునర్విజృంభించారు. దాంతో ఆయన విజయం సాధించారు.

సరిగ్గా అదేరోజు, అంటే శుక్రవారం రోజు మదీనాలో ఖలీఫా ఉమర్ (రజి) జుమా ప్రసంగంచేస్తూ హఠాత్తుగా "సారియా! కొండ వైపుకు వెళ్ళు" అంటూ మూడుసార్లు అన్నారు. ప్రజలు ఈమాట విని ఆశ్చర్యపోతూ "సారియా నిహావంద్ యుద్ధానికి వెళ్ళిపోయాడు కదా! ఇక్కడ మీరు సారియాను పిలుస్తున్నారేమిటీ?" అని అడిగారు. దానికి ఆయన సమాధానమిస్తూ "అప్పుడు నేను ముస్లింలు యుద్ధం చేస్తున్న దృశ్యం చూశాను. వారు కొండవైపుకు పోవడంలోనే వారి శ్రేయస్సుంది. అంచేత నా నోట అప్రయత్నంగా ఈ మాటలు వెలువడ్డాయి" అని అన్నారు. ఆ తరువాత నెలరోజులకు సారియా దగ్గర్నుంచి ఒక సైనికుడు మదీనా వచ్చి ఆరోజు జరిగిన సంఘటన ఖలీఫాకు వివరించాడు.

అదలా ఉంచితే, ఖాఖాసైన్యం కొత్తవ్యూహం ప్రకారం వెనక్కిజరుగుతూ కొండల దగ్గరకు చేరుకుంది. ఈరాన్‌సైన్యం ఇక విజయం తమదేనని భావిస్తూ మరింత ఉత్సాహంతో ముస్లింసేనను వెనక్కినెడ్తూ కొండగుట్టల్ని సమీపించింది. అప్పుడు కొండగుట్టల వెనుక మాటుకాసివున్న సేనాపతి నోమాన్ (రజి) తన అధీనంలోని పెద్దసైన్యంతో ఒక్కసారిగా ఈరాన్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. దాంతో ఈరానీయులు కంగారుపడ్తూ కాలికి బుద్ధి చెప్పారు. ముస్లింలు ఈరానీయుల వెంటబడి వారిని సొరకాయల్ని కోసినట్లు హతమార్చ నారంభించారు. యుద్ధమైదానం రక్తసిక్తమయి గుర్రాలు జారిపడేటంతగా జారుడుగా మారింది. అలాంటి పరిస్థితిలో సేనాపతి నోమాన్ (రజి) గాయపడి గుర్రం మీదనుంచి క్రింద పడి ఊపిరివిడిచారు. వెంటనే ఆయనతమ్ముడు నయీమ్ (రజి) తనఅన్న దుస్తులు ధరించి ధ్వజం తీసుకొని రంగంలోకి దూకారు. ముస్లింలు తమసేనాపతి నోమాన్ (రజి) అమరగతినొందినా అధైర్యం చెందకుండా శత్రువుల్ని చీల్చిచెండాడసాగారు.

దాంతో ఈరాన్ సైనికులు ముస్లింయోధుల ధాటికి తట్టుకోలేక యుద్ధమైదానంలో ముప్ఫయివేల శవాలను వదలిపెట్టి హమ్దాన్‌కు పారిపోయి కోటలో దూరి తలుపులు మూసుకున్నారు. అయితే ముస్లింయోధులు వారిని వదలిపెట్టకుండా తరుముకుంటూ హమ్దాన్ పట్టణానికి చేరుకొని కోటను ముట్టడించారు. ఈరాన్‌సైన్యం కాస్సేపు పెనుగులాడి చేతులెత్తేయడంతో ముస్లింలు హమ్దాన్‌ని సులభంగా కైవశం చేసుకున్నారు. సేనాపతి నోమాన్ (రజి) అమరగతి నొందిన తరువాత ఆయన స్థానంలో హుజైఫా బిన్ ఐమాన్ (రజి) సేనాపతి అయ్యారు. ఆయన నిహావంద్‌కు వెళ్ళి సమరసొత్తును సమీకరించి అక్కడ ఈరాన్ చక్రవర్తి రాజేసిన అగ్నిగుండం ఆర్పివేశారు. ఈరెండు యుద్ధాలు హిజ్రీశకం 21వ సంవత్సరంలో జరిగాయి.



## (15) ఈజిప్ట్, అలెగ్జాండరియాలలో విజయకేతనం

ఖలీఫా ఉమర్ (రజి) బైతిల్‌మఖ్దిస్ పర్యటనకు వచ్చినప్పుడు అక్కడిసేనాపతి అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టుపై దాడిచేయడానికి ఖలీఫా నుండి అనుమతి అడిగి తీసుకున్నారు. ఆనాడు ఈజిప్టు రోమ్‌చక్రవర్తి అధీనంలో ఉండేది. ఖలీఫా నుండి అనుమతి లభించిన తరువాత అమ్ర్ (రజి) నాలుగువేల మంది సైనికుల్ని తీసుకొని ఈజిప్టుకు బయలుదేరారు. ఆయన ఈజిప్టు సరిహద్దుల్లో ప్రవేశించి 'అరీష్' ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ్నుంచి 'ఫర్మా' పట్టణానికి చేరుకుంటే అక్కడ రోమ్‌సైనికుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురైంది. దాంతో నెలరోజుల పాటు యుద్ధం చేయవలసి వచ్చింది.

ఇరుపక్షాల మధ్య భీకరయుద్ధం జరిగింది. అందులో రోమ్‌సేనాని అర్తబూన్, అతని సైనికులు ఓటమిపాలై పలాయనం చిత్తగించారు. ముస్లింయోధులు ముందుకు సాగి "ఐన్‌షమ్స్" అనే పట్టణాన్ని ముట్టడించారు. ఈముట్టడి కొన్నిరోజులు కొనసాగింది. చివరికి ఐన్‌షమ్స్‌వాసులు జిజ్యా చెల్లించే షరతుపై ఒప్పందం చేసుకున్నారు. అయితే ముస్లిం సేనాపతి అమ్ర్ (రజి) తమకు పట్టుబడిన యుద్ధఖైదీలను విడిచిపెట్టడానికి అంగీకరించ లేదు. ఈ వ్యవహారం ఖలీఫా దృష్టికి రాగానే ఆయన యుద్ధఖైదీలను ఒడంబడికదారులకు అప్పగించాలని అమ్ర్ (రజి)ను ఆదేశించారు. అప్పుడాయన ఖైదీలను విడిచిపెట్టారు.

ఆతర్వాత అమ్ర్ బిన్ ఆస్ (రజి) 'ఫస్తాత్' ప్రాంతానికి చేరుకున్నారు. ఇది ఆ కాలంలో నైలు నదికి, ముఖ్తమ్ పర్వతానికి మధ్య పచ్చని పొలాలు, పచ్చికబీళ్ళతో కూడిన సువిశాలమైన ప్రాంతం. ఇక్కడ రోమ్ సైనికాధికారులు నివసిస్తుండిన ఓ పటిష్ఠమైన కోట ఉంది. ఓడల రాకపోకలకు వీలుగా నైలునది ఈ కోట ముఖద్వారానికి చేరువుగా ఉంది. ఈ విధంగా ఇది ప్రభుత్వ అవసరాలకు ఎంతో అనువైన ప్రాంతం. ముస్లిం సేనాపతి అమ్ర్ బిన్ ఆస్ (రజి) మొదట ఈ కోటను దిగ్బంధించారు. అయితే దానికి ముందు ఆయన ఓ రాయబారి ద్వారా ఈజిప్టురాజు మఖూఖస్ ఎదుట ఇస్లాంస్వీకరణ లేదా జిజ్యాచెల్లింపు లేదా యుద్ధం అనే మూడు షరతులు ఉంచారు. ఈజిప్టురాజు మొదటి రెండు షరతుల్ని నిరాకరించి యుద్ధం చేయడానికి సిద్ధమయ్యాడు.

కోట దుర్భేద్యంగా ఉండటం, ఇటు సైనికుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం వల్ల అమ్ర్ (రజి) తొందరపడి దాడిచేయడానికి ఉపక్రమించకుండా పరిస్థితి వివరిస్తూ ఖలీఫాకు లేఖ రాశారు. ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) వెంటనే జుబైర్ బిన్ అవామ్ (రజి), ఇబాదా బిన్ సామిత్ (రజి), మిఖ్దాద్ బిన్ ఉమర్ (రజి), సల్మా బిన్ ముఖల్లద్ (రజి) లాంటి హెమాహెమీల నాయకత్వంలో పదివేల మంది సైనికుల్ని ఈజిప్టుకు పంపారు. అప్పుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి)కు కొండంత బలం వచ్చింది. ఆయన ఆ నలుగురి శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా విధులు కేటాయించి రంగంలోకి దించారు.

ఈజిప్టురాజు మఖూఖస్ అంతకుముందే కోటలో దూరి తలుపులు మూసుకున్నాడు. ముస్లింలు కోటను ముట్టడించారు. అయితే కోట వెలుపల కోట చుట్టూ లోతైన కందకం కూడా ఉంది. అందువల్ల జుబైర్ బిన్ అవామ్ (రజి) గుర్రం ఎక్కి ఓసారి కందకం నలు

వైపులా తిరిగి చూసి అవసరమైన ప్రదేశాల్లో సైనికదళాలను నియమించారు. ఆ తరువాత వడిసెల్లాంటి పరికరాలతో రాళ్ళు విసరడం ప్రారంభించారు. ఈ విధంగా ఏడు నెలలు గడచినా సమస్య ఓ కొలిక్కి రాలేదు.

దాంతో జుబైర్ (రజి) "ఈరోజు నేను నా ముస్లింసోదరుల కోసం నా సర్వస్వం ధార పోస్తాను" అంటూ గుర్రంపై కందకం దాటి, నిచ్చెనవేసి కోటగోడపై ఎక్కారు. ఆయన్ని మరికొందరు యోధులు అనుసరించారు. ఇలా అందరూ కోటగోడ మీదెక్కి దిక్కులు పిక్కటిల్లేలా 'అల్లాహుఅక్బర్' అంటూ నినదించారు. దాంతో కోటరక్షణకు నియుక్తులైన క్రైస్తవులు బిత్తరపోయి ముస్లింలు కోటలో చొరబడ్డారనుకొని పారిపోయారు. అటు జుబైర్ (రజి) కోటగోడ పైనుంచి క్రిందికి దిగి కోట తలుపులు తెరిచారు. కోటతలుపులు తెరవగానే ముస్లింయోధులు ప్రవాహంలా ఒక్కసారిగా లోపలికి దూసుకొచ్చారు. దాంతో ఈజిప్టురాజు మఖూఖస్ కాళ్ళబేరానికి వచ్చి సంధికోసం మనవి చేసుకున్నాడు. ముస్లింసేనాపతి అతనికి, అతని ప్రజలకు రక్షణహామీ ఇచ్చారు. ఈవిధంగా 'ఫస్తాత్' ముస్లింల స్వాధీనంలోకి వచ్చింది. ఈ సంఘటన హిజ్రీశకం 20వ సంవత్సరంలో జరిగింది.

సేనాపతి అమ్ర్(రజి) ఫస్తాత్‌లో కొన్నాళ్ళు గడిపి ఆతర్వాత ఖలీఫా అనుమతితో హి.శ. 21వ ఏట "అలెగ్జాండరియా" వైపుకు పురోగమించారు. అయితే దారిలో రోమన్లు, ఖిబ్తీలు (ఈజిప్టు తెగవాళ్ళు) కలసి ముస్లింలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దాంతో భీకర యుద్ధం జరిగింది. అందులో వేలాదిమంది క్రైస్తవులు చనిపోయారు. ముస్లింలు విజయ దరహాసంతో ముందుకుసాగి అలెగ్జాడరియాను దిగ్బంధించారు. ఈజిప్టురాజు మఖూఖస్ ముస్లింలతో రాజీపడదామని తలచి, తరువాత రోమ్‌చక్రవర్తికి భయపడి తన నిర్ణయం మార్చుకున్నాడు. ఈలోగా రోమ్‌చక్రవర్తి హెర్క్యులస్ చనిపోవడం, అతని వారసుడిగా వయసులో, మేధాసామర్థ్యంలో బలహీనుడైన అతని మనుమడు రావడం జరిగాయి.

ఈజిప్టురాజు మఖూఖస్ సంఖ్యాధిక్యతతో ముస్లింలపై ప్రభావం వేయడానికి స్త్రీలతో పాటు పట్టణప్రజలందర్నీ ఆయుధాలతో కోటగోడపై ముస్లింలకు అభిముఖంగా కూర్చోబెట్టాడు. ముస్లిం సేనాపతి అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈ దృశ్యం చూసి "మఖూఖస్! కోటగోడపై గుంపుసమీకరణ ద్వారా నీ అంతరార్థం ఏమిటో నాకర్థమైపోయింది. కాని నీకు తెలియదేమో ఇప్పటిదాకా మేము సాధించిన విజయాలు సైనిక సంఖ్యాధిక్యతా కారణంగా సాధించలేదు. మీ చక్రవర్తి హెర్క్యులస్ మాముందుకు ఎంత అట్టహాసం వచ్చాడో, పర్యవసానం ఏమయిందో కూడా నీకు తెలియని విషయం కాదు" అంటూ ఓ లేఖ ద్వారా తెలియజేశారు. దానికి మఖూఖస్ "నిజమే. ఈ అరబ్బులే మా చక్రవర్తిని కాన్స్టాంటినోపిల్‌కు పారిపోయేదాకా వదలిపెట్టలేదు" అని సమాధానమిచ్చాడు.

అయితే రోమన్లు ఈ సమాధానం విని మఖూఖస్‌పై మండిపడ్డారు. ఆ తరువాత వారు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. అప్పుడు మఖూఖస్ తాను రోమన్ల నుండి విడి పోతున్నానని, అంచేత తన జాతి (ఖిబ్తీతెగ)వాళ్ళకు ఎలాంటి నష్టం వాటిల్లనివ్వకుండా రక్షణహామీ ఇవ్వాలని సేనాపతి అమ్ర్ (రజి)ని వేడుకొని ఆయన్నుంచి రక్షణహామీ పొందాడు.



తరువాత ముస్లింలకు, రోమన్లకు మధ్య యుద్ధం ప్రారంభమైనపుడు మఖూఖస్ జాతివాళ్ళు ముస్లింలకు ఎంతో సహాయం చేశారు. ముస్లింలు అలెగ్జాండరియాను ముట్టడించినపుడు వారికి ఆహారసామగ్రి, ఇతర వస్తువులు కూడా సరఫరా చేశారు.

ఒకరోజు భీకరయుద్ధం జరిగింది. ముస్లిం యోధులు కోటలోకి చొచ్చుకుపోయారు. అయితే రోమ్ సైనికులు ప్రాణాలకు తెగించి వారిని బయటకు పోయేలా చేసి కోట తలుపులు మూసివేశారు. కాని కాకతాళీయంగా కోటలో సేనాపతి అమ్ర్ (రజి)తో సహా నలుగురు ముస్లింలు చిక్కుకుపోయారు. రోమన్లు ఆ నలుగురిని బంధించడానికి ప్రయత్నిస్తే వారు తిరగబడి కత్తులు దూశారు. దాంతో రోమన్లు భయపడి "మన ఇరుపక్షాల నుండి ఒక్కొక్క మనిషిని పోటీకి దించుదాం. అందులో మా మనిషి హతమైతే మేము మిమ్మల్ని వదలిపెడ్తాం. మీ మనిషి హతమైతే మీరు ఆయుధాలు పడవేసి మాకు లొంగిపోవాలి" అని షరతుపెట్టారు. దానికి హజ్రత్ అమ్ర్ (రజి) అంగీకరించారు. అప్పుడు ఒక ముస్లిం యోధుడు ముందుకొచ్చాడు. రోమన్లలో ఓ ప్రఖ్యాత మల్లయోధుడు రంగంలోకి దిగాడు. కాస్సేపు ఇద్దరూ ఒకరిపైనొకరు కత్తులు దూసుకున్నారు. చివరికి రోమ్ యోధుడు రక్తపుమడుగులో పడి గిలగిల కొట్టుకొని ఊపిరి విడిచాడు. అప్పుడు షరతు ప్రకారం రోమన్లు ఆ నలుగురు ముస్లింలను విడిచిపెట్టారు.

అలెగ్జాండరియా ముట్టడి సుదీర్ఘకాలం కొనసాగుతుండటంతో సేనాపతి అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఆందోళన చెందసాగారు. ఈ విషయం తెలుసుకున్న ఖలీఫా ఉమర్ (రజి) "మీరక్కడ ఉంటూ బహుశా క్రైస్తవుల మాదిరిగా భోగలాలసులై పోయారనుకుంటున్నాను. నాయీ లేఖ అందిన వెంటనే సైనికులందర్నీ సమావేశపరచి జిహాద్ ప్రాముఖ్యం గురించి ఓ మంచిప్రసంగం చేయండి"అంటూ సేనాపతికి లేఖ రాసిపంపారు. ఆ ఉత్తరం అందగానే సేనాపతి అమ్ర్ (రజి) సైనికులందర్నీ సమావేశపరచి ఉపన్యాసం ఇచ్చారు. దాంతో సైనికుల్లో నూతనుత్తేజం జనించింది. మరుసటి రోజు అందరూ ఒక్కసారిగా మెరుపుదాడి చేశారు. దాంతో మొదటిదాడిలోనే రోమన్లు భీతావహులై పలాయనం చిత్తగించారు. ఇలా మూడునెలల ముట్టడి తరువాత కోట ముస్లింల స్వాధీనమైపోయింది.

ఆ సందర్భంలో ఈజిప్టురాజు మఖూఖస్ సేనాపతి అమ్ర్ బిన్ ఆస్ (రజి) సన్నిధికి వచ్చి, అలెగ్జాండరియా నుండి వెళ్ళిపోదలచినవారికి వెళ్ళిపోవడానికి, అలెగ్జాండరియాలోనే ఉండి పోదలచినవారికి ఉండిపోవడానికి అనుమతించమని అభ్యర్థించాడు. దానికి ముస్లిం సేనాపతి అమ్ర్ బిన్ ఆస్ (రజి) సంతోషంగా అనుమతించారు.

సేనాపతి అమ్ర్ ఈ శుభవార్త ఖలీఫాకు చేరవేసి అక్కడ్నుంచి ముందుకు సాగారు. అలెగ్జాండరియా స్వాధీనం కావడంతో ఈజిప్టులోని ఇతర ప్రాంతాల్లో కూడా విజయ కేతనాలు ఎగరవేయడం ముస్లింలకు చాలా సులభమైపోయింది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అలెగ్జాండరియా విజయవార్త విన్న తరువాత ఈజిప్టులోని తన సేనాపతులకు, ఇతర సైన్యాధికారులకు తగిన ఆదేశాలు జారీచేస్తూ, కొంత కాలంపాటు అలెగ్జాండరియాలోనే ఉండి తమకు స్వాధీనమైన ప్రాంతాల్లో పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని, సరిహద్దు భద్రతాదళాలను నియమించాలని ఆదేశించారు.

# (16) ఈరాన్‌పై సాధారణ దండయాత్రలు

ఈరాన్‌లో ఇప్పటివరకు జరిగిన ముస్లింల దండయాత్రలన్నీ ఇస్లామీయ సామ్రాజ్య సరిహద్దుల రక్షణ కోసం మాత్రమే జరిగాయి. ఇరాఖ్ ఆనాడు ఈరాన్‌రాజ్యం అంతర్భాగంగా ఉండేది. ఇరాఖ్‌లో అధికసంఖ్యాకులు అరబ్బులే అయినందున, అక్కడి ముస్లింలలో ఈరాన్ తిరుగుబాటు వైఖరిని రెచ్చగొడ్తున్నందున ఖలీఫా ఉమర్ (రజి) ఇరాఖ్‌ని ఇస్లామీయ సామ్రాజ్యం అంతర్భాగంగా పరిగణించి అక్కడ ఈరానీయులకు వ్యతిరేకంగా యుద్ధపరంపర సాగించవలసి వచ్చింది. అంతేకాని ఆయనకు ఇరాఖ్ సరిహద్దులు దాటి ఈరాన్‌ని కబళించాలన్న ఉద్దేశ్యం లేదు. ఈ ఉద్దేశ్యంతోనే ఆయన ఓ సారి "పార్శీలు (ఈరానీయులు) మనపై దాడిచేయకుండా, మనం వారిపై ఎదురుదాడికి దిగకుండా ఉండేలా వారికి, మనకు మధ్య ఓ అగ్నిపర్వతం ఉంటే ఎంత బాగుండు!" అని అన్నారు. దీన్నిబట్టి ఇస్లాం సామ్రాజ్యవిస్తరణ (Imperialism)కు వ్యతిరేకమని స్పష్టంగా తెలుస్తోంది.

అయితే ఈరానీయులు తాము కోల్పోయిన భూభాగాలు తిరిగి స్వాధీనం చేసుకోవాలన్న భావనతో, తమ మతాన్ని మింగేస్తున్న ఇస్లాంను తుడిచిపెట్టాలన్న దుర్బుద్ధితో ముస్లింలపై మాటిమాటికి దాడులకు పాల్పడుతున్నారు. అందువల్ల ముస్లింలు ఇరాఖ్ సరిహద్దులు దాటి ఈరాన్ రాజ్యంలోకి చొచ్చుకుపోవలసి వచ్చింది. ముస్లింల చేతుల్లో చావుదెబ్బలు తింటున్నా వారు మళ్ళీమళ్ళీ తోక జాడించడానికి కారణం ఏమిటీ? నడుం విరిగినంత ఎదురుదెబ్బలు తగులుతున్నా వారు ముస్లింలతో చేసుకున్న ఒప్పందాలు మాటిమాటికి ఎందుకు ఉల్లంఘిస్తున్నారు?

దీన్నిగురించే ఖలీఫా ఉమర్ (రజి) సేనాపతుల సమావేశంలో ఆందోళన వ్యక్తపరుస్తూ "మీరు బహుశా ఈరానీయుల పట్ల సత్ప్రవర్తనతో వ్యవహరించడంలేదు కాబోలు, అందుకే వారు మాటిమాటికి ఒప్పందం ఉల్లంఘిస్తూ తిరుగుబాటుకు పాల్పడుతున్నారు" అని అన్నారు. దానికి సేనాపతులు సమాధానమిస్తూ "అలాంటిదేమీ లేదు. మేము వారి పట్ల సద్భావనతోనే మసలుకుంటున్నాము. అసలువిషయం అదికాదు. ఈరాన్ చక్రవర్తి యజ్దగిర్ద్ ఈరాన్ సరిహద్దులు దాటి బయటికి పోనంతవరకూ ఈ అరాచకం సమసిపోదు. ఈరాన్‌లో తమ సామ్రాజ్యపీఠం వారసుడు ఉన్నంతవరకూ అతని పట్ల ఈరానీయులు ఆశలు వమ్ముకాలేవు" అని అన్నారు. ఈ సమాధానం విన్న తరువాతే ఖలీఫాఉమర్ (రజి) ఈరాన్‌లో సాధారణ దండయాత్రలు ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు.

ఈ నిర్ణయంతో ఈరాన్‌లో ఇస్లామీయ విజయపరంపర ప్రారంభమయింది. మొదట అస్ఫిహాన్‌లో అబ్దుల్లా బిన్‌అబ్దుల్లా జయకేతనం ఎగరవేశారు. తర్వాత "రే", ఆజర్‌బాయ్‌జాన్‌లలో నయీమ్ బిన్ ముఖర్రిన్ (రజి) భీకరపోరాటం తరువాత విజయఢంకా మోగించారు. "ఖౌమస్"ను, "జర్జాన్"ను సువైద్ బిన్ ముఖర్రిన్ సాధించారు. ఆ తరువాత తబ్రిస్తాన్ రాష్ట్రమంతా ముస్లింల అధీనంలోని వచ్చింది. "ఆర్మేనియా"లో బకైర్ విజయపతాకం ఎగరవేశారు. "బైజా"పట్టణాన్ని, "జర్జ్" ప్రాంతాన్ని అబ్దుర్రహ్మాన్ బిన్ రబియా స్వాధీనం చేసుకున్నారు. హిజ్రీశకం 23వ ఏట ఆసిమ్ బిన్ ఉమర్ "సీస్తాన్ ప్రాంతాన్ని, సుహైల్ బిన్ అద్ది "కర్మాన్" ప్రాంతాన్ని జయించారు.



హిజ్రీశకం 23వ సంవత్సరంలోనే హకమ్ బిన్ అమ్ర్ (రజి) 'మక్రాన్' (బెలూచిస్తాన్) దేశాన్ని జయించారు. ఈరాన్‌సామ్రాజ్యంలో మక్రాన్ దేశానికి సామంతరాజుగా ఉన్న రాజా రాసిల్ ఘోరపరాజయం పాలైపారిపోయాడు. వెంటనే హకమ్ బిన్‌అమ్ర్ (రజి) ఒక సైనికుడి ద్వారా ఈ శుభవార్తను ఖలీఫా ఉమర్ (రజి)కు తెలియజేశారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) "నువ్విప్పుడు ఎక్కడి వరకైతే చేరుకున్నావో అక్కడితో ఆగిపో. అక్కడ్నుంచి ముందుకు పురోగమించకు" అని హకమ్ (రజి)కు లేఖ రాసి పంపారు.

ఈ సాధారణ దండయాత్రలు ప్రారంభమైన తరువాత ఈరాన్ చక్రవర్తి యజ్దగిర్ద్ 'ఖురాసాన్' రాజధాని 'మరూ'కు పారిపోయి ఉండసాగాడు. ఖలీఫా ఆదేశంతో అహ్నఫ్ బిన్ ఖైస్ (రజి) ముందు 'హిరాత్'ను జయించి, ఆ తరువాత మరూ వైపు పురోగమించారు. దాంతో యజ్దగిర్ద్ మరూ నుంచి 'మర్వరూద్'కు పారిపోయాడు. అహ్నఫ్ (రజి) మరూను జయించి మర్వరూద్ వైపు పురోగమించారు. దాంతో యజ్దగిర్ద్ 'మర్వరూద్' నుంచి 'బలఖ్'కు పారిపోయి అక్కడ ఇతర రాజుల సహాయంతో పెద్దఎత్తున సైనికసమీకరణ చేసి యుద్ధసన్నాహాల్లో నిమగ్నుడైపోయాడు. ఇక్కడ పరిస్థితి తీవ్రంగా ఉండటంతో అహ్నఫ్ బిన్ ఖైస్ (రజి) ఖలీఫాకు లేఖ రాసి సహాయం కోరారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) ప్రతిభావంతులైన సేనాపతుల నేతృత్వంలో ఓ సైనికదళాన్ని బలఖ్ వైపుకు పంపించారు.

బలఖ్‌లో ఈరాన్ సైనికులకు, ముస్లిం యోధులకు మధ్య భీకరపోరాటం జరిగింది. చివరికి ఈరాన్ చక్రవర్తి యజ్దగిర్ద్ ఓటమిపాలై చైనా రాజున్న 'ఫర్గానా'కు పారిపోయాడు. హజ్రత్ అహ్నఫ్ (రజి) బలఖ్‌తో సహా మొత్తం ఖురాసాన్ రాష్ట్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ విజయవార్త తెలుసుకున్న తరువాత "నువ్విప్పుడు ఎక్కడి వరకైతే చేరుకున్నావో అక్కడితో ఆగిపో. అక్కడ్నుంచి ముందుకు వెళ్ళకు" అని అహ్నఫ్ (రజి)కు లేఖ రాసి పంపారు.

'ఫర్గానా'లో చైనారాజు 'ఖాఖాన్' ఈరాన్‌చక్రవర్తి యజ్దగిర్ద్‌ను గౌరవించి, అతనితో కలసి ఖురాసాన్‌కు బయలుదేరాడు. ముందేసుకున్న పథకం ప్రకారం ఖాఖాన్ 'మర్వరూద్' మీద దాడిచేశాడు. యజ్దగిర్ద్ 'మరూ'ను ముట్టడించాడు. మర్వరూద్‌లో అహ్నఫ్ (రజి) సమక్షంలో ఖాఖాన్ ఓడిపోయి ఫర్గానాకు పారిపోయాడు. ఖాఖాన్ ఓటమి సంగతి తెలుసుకున్న యజ్దగిర్ద్ ముట్టడి విరమించుకొని తన దగ్గరున్న మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలు, వెండిబంగారాలు తీసుకొని తుర్కిస్తాన్ దిశగా పారిపోయాడు. అయితే ఇలా ఈరాన్‌సంపదను యజ్దగిర్ద్ పరదేశానికి తీసికెళ్ళడం అతని సేనాపతులకు, దండనాయకులకు నచ్చలేదు. అంచేత వారతని దగ్గర్నుంచి విలువైన ఆ సంపదంతా గుంజుకున్నారు. దాంతో యజ్దగిర్ద్ వట్టిచేతులతో ఖాఖాన్ దగ్గరకు ఫర్గానా చేరుకున్నాడు.

మదీనాలో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ విజయవార్త వినగానే ప్రజలందర్నీ మస్జిదెనబవీలో సమావేశపరచి ఇలా ప్రసంగించారు:

"ఈరోజు అగ్నిపూజారుల ప్రభుత్వం అంతమైపోయింది. ఇప్పుడు వారు మనల్ని నష్టపరచడానికి తమ దేశంలో జానెడు భూభాగానికి కూడా యజమానులు కాలేరు.

ముస్లింలారా! దేవుడు మీ ఆచరణను, కర్మలను పరీక్షించేందుకే అగ్నిపూజారుల దేశానికి, వారి సిరిసంపదలకు మిమ్మల్ని యజమానులుగా చేశాడు. కనుక మీరు ఎట్టి పరిస్థితుల్లో కూడా మీ సదాచరణ, సత్కర్మల్లో మార్పు రానీయకూడదు. గుర్తుంచుకోండి! ఒకవేళ దురదృష్టవశాత్తు మీలో సదాచరణ మందగించడం ప్రారంభిస్తే మాత్రం దేవుడు మీనుండి కూడా ప్రభుత్వాన్ని లాగేసి ఇతర జాతులకు హస్తగతం చేస్తాడు.''

## (17) విషాద సంఘటన (నిర్యాణం)

హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రజి) హజ్‌యాత్ర సందర్భంగా జరిగిన ఒక సంఘటన ఇలా తెలియజేశారు : ''ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మినా నుండి అబ్తహ్ చేరుకొని అక్కడ ఒంటెను కూర్చోబెట్టి వెల్లకిలా పడుకున్నారు. తరువాత ఆయన చేతులు పైకెత్తి 'దేవా! నా వయస్సు పెరిగిపోయింది. నా శక్తి ఉడిగిపోయింది. నా పట్టు సడలి పోయింది. అంచేత నా బుద్ధి మందగించి, నేను విజ్ఞతావివేచనలు కోల్పోవక ముందే దేవా! నన్ను నీ వైపుకు లేపుకో' అని ప్రార్థించారు...'' (హాకిమ్)

కాబ్ అహ్‌బార్ అనే ఒకతను ఖలీఫా ఉమర్ (రజి)తో మాట్లాడుతూ ''తౌరాత్ ద్వారా నాకు మీరు అమరగతులవుతారని అన్పిస్తోంది'' అన్నాడు. ఉమర్ (రజి) ఈమాట విని ''అరేబియాలో ఉంటున్న నాకు అమరగతి మహాభాగ్యం ఎలా లభిస్తుంది?'' అని అన్నారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఒకరోజు దుఆ చేస్తూ ''దేవా! నీ మార్గంలో నాకు అమరగతి భాగ్యం ప్రసాదించు. నీ ప్రవక్త (స) నగరంలోనే నాకు మృత్యువు కలిగించు'' అని అన్నారు. (అస్లం-బుఖారి)

మాదాన్ బిన్ అబూతల్హా కథనం: హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఒకసారి ఉపన్యాసం ఇస్తూ ''నేనొక కల గన్నాను. ఆ కలలో ఓ కోడిపుంజు నన్ను ఒకటి లేక రెండు సార్లు పొడిచింది'' అని చెప్పారు. తరువాత ఆ కల గూఢార్థం తెలుపుతూ ఇలా అన్నారు- ''అంటే నా మరణకాలం సమీపించింది. జనం నా రాజకీయ వారసుడ్ని ప్రకటించమని అడుగుతున్నారు. కాని దేవుడు తన ధర్మాన్ని, ఖిలాఫత్ వ్యవస్థను వృధాచేయడు. ఒకవేళ మృత్యువు నాకు కొంచెం గడువిచ్చినా (నేను ప్రత్యేకంగా ఎవరి పేరునూ ప్రతిపాదించను.) దైవప్రవక్త (స) తన నిర్యాణ సమయంలో అభిమానించిన ఆ ఆరుగురు వ్యక్తుల సలహా సంప్రదింపులతోనే ఖలీఫా ఎంపిక జరుగుతుంది.'' (హాకిమ్)

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఏ నవయువకుడ్ని కూడా మదీనాలో ప్రవేశించడానికి అనుమతించేవారు కాదు. అయితే కూఫా గవర్నర్ ముగీరా బిన్ షాబా ఖలీఫాకు ఓసారి ఉత్తరం రాసి అందులో ''నా దగ్గర ఓ మంచి తెలివితేటలు గల యువకుడు ఉన్నాడు. అతనికి అనేక పనులు తెలుసు. అతని ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. అతను కంసలి, వడ్రంగి, డిజైన్ పనుల్లో నిపుణుడు. అంచేత అతనికి మదీనా రావడానికి అనుమతి ఇస్తే బాగుంటుంది'' అని విజ్ఞప్తి చేశారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పార్శీ బానిసయిన ఆ యువకుడికి మదీనా వచ్చి ఉండటానికి అనుమతి ఇచ్చారు. అతని పేరు ఫేరోజ్ అబూలూలూ.



ఓరోజు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) బజారున నడచిపోతుంటే 'ఫేరోజ్ అబూలూలూ' ఎదురొచ్చి ''నా యజమాని ముగీరా బిన్ షాబా నా దగ్గర జిజ్యా ఎక్కువ వసూలు చేస్తున్నాడు'' అని ఫిర్యాదు చేశాడు. ఎంత వసూలు చేస్తున్నాడని అడిగితే రోజుకు రెండు దిర్హమ్‌లని చెప్పాడు. ఖలీఫా ఈమాట విని 'నువ్వేం పని చేస్తావ'ని అడిగారు. దానికి ఫేరోజ్ ''వడ్రంగం, రాళ్ళ చెక్కుడు, రాతి కళాకృతుల పనులు చేస్తాన''ని చెప్పాడు. ''అయితే ఈ పనులు చేస్తున్నపుడు రెండు దిర్హాంలు ఎక్కువేమీ కాదు'' అన్నారు ఖలీఫా ఉమర్ (రజి). ఫేరోజ్ ఈమాట విని లోలోన రగిలిపోయాడు.

ఆ సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) ''నువ్వు గాలిబలంతో తిరిగే తిరగలి తయారు చేస్తావని విన్నాను. అలాంటి తిరగలి నాకొకటి తయారుచేసి ఇవ్వగలవా?'' అని అడిగారు. దానికి ఫెరోజ్ ''తప్పకుండా. నేను మీకు అత్భుతమైన తిరగలి తయారుచేసిస్తా. దాని తిరుగుడు శబ్దం తూర్పు-పడమర వాసులందరికీ విన్పిస్తుంది'' అని సమాధానమిచ్చాడు.

మరునాడు ఉదయం ప్రజలు ఫజర్ నమాజ్ చేయడానికి మస్జిదెనబవీలో సమావేశమయ్యారు. అందరూ నమాజ్ చేయడానికి పంక్తుల్లో నిల్చున్నారు. ఖలీఫా ఉమర్ (రజి) నమాజ్ చేయించడానికి ముందుకెళ్ళి ఇమామ్ స్థానంలో నిలబడ్డారు. ఫెరోజ్ కూడా వేషంమార్చి ముందు వరుసలో నిల్చున్నాడు. ''అల్లాహుఅక్బర్'' అంటూ నమాజ్ ప్రారంభం కాగానే ఫెరోజ్ ముందుకు దూసుకొచ్చి కత్తితో ఖలీఫా ఉమర్ (రజి)పై దాడిచేసి వెంటవెంటనే ఆరు పోట్లు పొడిచి పారిపోయాడు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తక్షణమే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని లాగి తన స్థానంలో నిలబెట్టారు. తరువాత పక్కకు జరిగి కుప్పకూలిపోయారు. అదే పరిస్థితిలో అబ్దుర్రహ్మాన్ (రజి) నమాజ్ చేయించారు. ఫెరోజ్ రక్తసిక్తమైన కత్తితో పారిపోతుంటే ప్రజలు అతడ్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. అయితే ఆ దుర్మార్గుడు తనను పట్టుకోవడానికి ప్రయత్నించినవారిలో అనేకమందిని గాయపరిచాడు. వారిలో ఆరుగురు ఆ తరువాత చనిపోయారు. చివరికి ఆ దుర్మార్గుడు ఎలాగో పట్టుబడగానే అదే కత్తితో పొడుచుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

నమాజ్ ముగిసిపోగానే ప్రజలు ఖలీఫాను ఎత్తుకొని ఆయన ఇంటికి చేర్చారు. అప్పటిదాకా ఆయన అపస్మారకస్థితిలోనే పడివున్నారు. స్పృహ రాగానే తనను హతమార్చిన వ్యక్తి ఎవరని అడిగారు. జనం ఫెరోజ్ అబూలూలు అని చెప్పారు. అప్పుడాయాన దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటూ ''దేవుని దయవల్ల నేను ముస్లిం అని చెప్పుకునే మనిషి చేతిలో హతమార్చబడలేదు'' అని అన్నారు ప్రశాంతహృదయంతో.

తరువాత ఆయన తన కుమారుడు అబ్దుల్లా (రజి)ను పిలిచి తన మీద ఎంత రుణ భారం ఉందని అడిగారు. దానికి అబ్దుల్లా లెక్కచూసి ఆరువేలు (దిర్హాంలు) అని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని ''మన దగ్గరున్న పైకంతో ఈఅప్పు పూర్తిగా తీర్చగల్గితే తీర్చండి. లేకుంటే బనీఅద్దీ తెగవారిని అడిగి తీసుకో'' అని చెప్పారు.

ప్రజలు వైద్యుని కోసం హడావిడి చేశారు. అప్పుడొక వైద్యుడు వచ్చి ఖర్జూరం-యవలతో చేసిన పానకం, పాలు తాగించాడు. కాని ఆ రెండు ద్రవపదార్థాలు గాయాల

నుండి బయటికి వచ్చేశాయి. అది చూసి వైద్యుడు పెదవి విరిచాడు. ప్రజలు కూడ ఆశాలు వదలుకొని "అబూబకర్ (రజి) తన వారసుడ్ని ఎలా ప్రకటించారో మీరు కూడా మీ రాజకీయ వారసుడెవరో ప్రకటించి వెళ్ళండి" అని అన్నారు.

అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) తన వారసుడి ఎంపిక కోసం అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని, సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)ని, జుబైర్ బిన్ అవామ్ (రజి)ని, తల్హా (రజి)ని, అలీ (రజి)ని, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి)ని పిలిపించారు. తల్హా (రజి) అప్పుడు నగరంలో లేనందున ఆయన తప్ప మిగిలిన అయిదుగురు వచ్చారు. ఉమర్ ఫారూఖ్ (రజి) వారైదుగురిని సంబోధిస్తూ "మీరు తల్హా కోసం మూడురోజులు ఎదురుచూడండి. ఈలోగా వస్తే అతడ్ని కూడా కలుపుకోండి. రాకపోతే మీరైదుగురే పరస్పరం సంప్రదించుకొని మీలో ఒకడ్ని ఖలీఫాగా ఎన్నుకోండి" అని చెప్పారు.

ఆ తర్వాత ఆయన తన కుమారుడు అబ్దుల్లా (రజి)ని పిలిచి "ఖిలాఫత్ విషయంలో ఏదైనా భేదాభిప్రాయం వస్తే, నీవు మెజార్టీ సభ్యులతో కలవాలి. ఒకవేళ రెండు పక్షాలు సమానసంఖ్యలో ఉంటే, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఏపక్షాన ఉంటే నువ్వా పక్షంలో చేరిపో" అని చెప్పారు. ఆ తరువాత ఆయన అబూతల్హా అన్సారి (రజి)ని, మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి)ని పిలిపించి "ఖలీఫా ఎన్నిక సంప్రదింపుల కోసం వారొక చోట సమావేశమైనప్పుడు సమావేశం ముగిసేదాకా మీరిద్దరు ద్వారం దగ్గర కాపలాకాస్తూ ఎవరినీ లోపలికి రానీయకూడదు" అని ఆదేశించారు. ఆ తరువాత ఉమర్ ఫారూఖ్ (రజి) ఎన్నికల సంఘం సభ్యులకు ఈవిధంగా ఉపదేశించారు:

"మీలో ఖలీఫాగా ఎన్నికయ్యే వ్యక్తికి నేనిలా ఉదేశిస్తున్నాను- అతను అన్సారుల హక్కుల పట్ల చాలా శ్రద్ధ వహిస్తుండాలి. అన్సారులు దైవప్రవక్త (స)కు సహాయం చేశారు. ముహాజిర్‌లకు తమ ఇండ్లలో చోటిచ్చారు. వారు మీ ఉపకారులు. వారికి అతను మేలు చేయాలి. వీలైనంతవరకు వారి తప్పులు, పొరపాట్లను ఉపేక్షించాలి. ఖలీఫాగా ఎన్నికయ్యే వ్యక్తి ముహాజిర్ల హక్కుల పట్ల కూడా శ్రద్ధ వహించాలి. ముహాజిర్లు ఇస్లాం సౌధానికి పునాదిరాళ్ళు వంటివారు. అలాగే అతను జిమ్మీల పట్ల సద్భావనంతో మసలుకోవాలి. వారి హక్కులు గౌరవించాలి. వారికి చేసిన వాగ్దానాలు పూర్తిగా నెరవేర్చాలి. వారిపై వారు మోయలేని భారాన్ని మోపకూడదు."

ఆ తరువాత ఉమర్ ఫారూఖ్ (రజి) తన కుమారుడు అబ్దుల్లా (రజి)ని పిలిచి "నువ్వు వెంటనే ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి 'తనను దైవప్రవక్త (స) సమాధి పక్కన ఖననం చేయడానికి అనుమతించవలసిందిగా ఉమర్ అర్థిస్తున్నాడని ఆమెకు చెప్పు" అని అన్నారు. అబ్దుల్లా (రజి) పరుగుపరుగున ప్రవక్తసతీమణి ఆయిషా (రజి) ఇంటికి వెళ్ళి ఆ విషయం ఆమెకు చెప్పారు. దానికామె సంతోషంగా అనుమతిచ్చారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) హిజ్రీశకం 23వ సంవత్సరం జిల్‌హజ్జ నెల, 27వ తేదీన గాయపడి మూడు రోజుల తరువాత, ముహర్రం 1వ తేదీన మృతిచెందారు. ఇలా పదేండ్ల ఆరునెలలు పరిపాలన చేసి తమ ప్రభువు సన్నిధికేగారు. అదే రోజు ఆయన్ని ఖననం చేయడంజరిగింది. దాంతో మదీనాపై దట్టమైన విషాదఛాయలు అలుముకున్నాయి.



**భార్యాపిల్లలు:** హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) మొదటి వివాహం అజ్ఞానకాలంలో జైనబ్ బిన్తె మజ్వూన్‌తో జరిగింది. ఆమెద్వారా ఆయనకు అబ్దుల్లా, అబ్దుర్రహ్మాన్, అక్బర్, హఫ్సా (రజి) జన్మించారు. జైనబ్ (రజి) మదీనాహిజ్రత్‌కు ముందే మక్కాలో చనిపోయారు. ఆ తరువాత ఉమర్ ఫారూఖ్ (రజి) అజ్ఞానకాలంలోనే మలీకా బిన్తె జరూల్‌ని వివాహమాడారు. ఆమె ద్వారా ఉబైదుల్లా (రజి) జన్మించారు. మలీకా ఇస్లాం స్వీకరించడానికి అంగీకరించక పోవడం వల్ల ఉమర్ ఫారూఖ్ (రజి) హిజ్రీ 6వ ఏట ఆమెకు విడాకులిచ్చారు. అజ్ఞానకాలంలోనే ఆయన ఖరీబా బిన్తె అబీఉమయ్యాని కూడ వివాహమాడారు. ఖరీబా కూడా ఇస్లాం స్వీకరించడానికి అంగీకరించక పోవడం వల్ల ఉమర్ ఫారూఖ్ (రజి) హిజ్రీ 6వ ఏట ఆమెక్కూడా విడాకులిచ్చారు. నాల్గవ వివాహం ఉమ్మెహకీం బిన్తె హరస్‌తో జరిగింది. ఆమె ద్వారా ఫాతిమా (రజి) జన్మించారు. అయిదో వివాహం హిజ్రీశకం 7వ ఏట జమీలా బిన్తె ఆసిమ్‌తో జరిగింది. ఆమె ద్వారా ఆసిమ్ (రజి) జన్మించారు. అయితే ఏదో కారణం చేత ఆమెకు కూడా విడాకులిచ్చారు. ఆరవ వివాహం హిజ్రీ 17వ ఏట హజ్రత్ అలి (రజి) కుమార్తె ఉమ్మెకుల్సూమ్‌తో జరిగింది. ఆమె ద్వారా రుఖియా, జైద్ జన్మించారు. ఏడవ వివాహం ఆతికా బిన్తె జైద్ బిన్ అమ్ర్‌తో జరిగింది.

## (18) ఫారూఖీ సంస్కరణలు

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన పాలనాకాలంలో అనేక కొత్త విషయాలు, సంస్కరణలు ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఆ మహనీయుని సమరవ్యూహాలు, పాలనా సౌలభ్యాలు ఆయన అసాధారణ పరిపాలనా దక్షతకు ప్రబల నిదర్శనాలని చెప్పవచ్చు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనా అంత్యకాలం నాటికి దాదాపు 22,51,030 చదరపు మైళ్ళ విస్తీర్ణంతో కూడిన భూభాగం ముస్లింల అధీనంలోకి వచ్చింది. అందులో అరేబియాతో పాటు ఇరాఖ్, జజీరా, ఖుజిస్తాన్, ఆర్మేనియా, ఆజర్‌బాయ్‌జాన్, పారసీకం(ఈరాన్), కర్మాన్, ఖురాసాన్, మక్రాన్ (బెలూచిస్తాన్), సిరియా, ఈజిప్టు మొదలైన దేశాలు కూడా ఉన్నాయి. ఇంతటి సువిశాల సామ్రాజ్యానికి నాయకత్వం వహించి ఎంతో సమర్థవంతంగా, నీతిన్యాయాలతో పాలించిన తీరు గమనిస్తే ఆనాడు ఈ మహాకార్యానికి ఉమర్ (రజి) మాత్రమే సమర్థుడని చరిత్రకారులు అంగీకరించక తప్పదు.

పోతే ఈ దేశాల కోసం వందలాది యుద్ధాలు చేయవలసివచ్చింది. కాని ఉమర్ ఫారూఖ్ (రజి) ఏయుద్ధంలో కూడా ప్రత్యక్షంగా పాల్గొనలేదు. ఆయన రాజధానిలో ఉండే ఎక్కడ ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సేనాపతులకు తగిన ఆదేశాలు జారీచేస్తుండేవారు. చివరికి ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో యుద్ధం చేయాలి; సైన్యాలను ఏ మార్గాన తీసికెళ్ళాలి అనే విషయాల్ని గురించి కూడా ఆయనే నిర్దేశించేవారు. ఆయా ప్రాంతాలు అధీనంలోకి వచ్చిన తరువాత అక్కడ తక్షణమే పాలనా ఏర్పాట్లు, శాంతిభద్రతల విషయంలో కూడా ఆయనే సముచిత జాగ్రత్తలు తీసుకొని, ఆయా పాలకులకు వాటి విషయమై ఉత్తర్వులు జారీచేసేవారు. అయితే ఏ యుద్ధంలోనూ ఉమర్ (రజి) ఇచ్చిన ఆదేశం తప్పయిందని లేదా నిరుపయోగమైందని రుజువుకాలేదు. అలాగే ఉమర్ (రజి) చేసిన ఏ పాలనా ఏర్పాటైనా నష్టం కలిగించిందని చెప్పలేము.

అంతేకాదు, సేనాపతులు, పాలనాధికారుల ఎంపిక విషయంలో కూడా ఉమర్(రజి) ఏనాడూ పొరపాటు పడలేదు. వారి శక్తిసామర్థ్యాలు, విజ్ఞతావివేచనలను అంచనా వేయడం లో ఆయనకు ఆయనే సాటి. వారి ఎంపికకు ఆయన వారి ధర్మపరాయణతను, నమాజ్-రోజాలను మాత్రమే గీటురాయిగా తీసుకోలేదు. ఎవరిలో ఎలాంటి శక్తిసామర్థ్యాలు ఉన్నాయి, ఎవరు ఏపనికి ఉపయోగపడతారు, ఎవరికి ఏపని మీద ఎక్కువ ఆసక్తి ఉంది అనే విషయాల్ని కూడ ఆయన పరిగణనలోకి తీసుకొని ఎంపిక చేసేవారు. దీన్నిబట్టి ఆయన మేధాశక్తి, విశ్లేషణాసామర్థ్యం, దూరదృష్టి ఎలాంటివో అంచనా వేయవచ్చు.

## ♦ పాలనా వ్యవస్థ

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా ప్రారంభకాలం వరకూ పరిపాలనా విభాగాలన్నీ విడివిడిగా కాకుండా అన్నీ కలిసే ఉండేవి. గవర్నర్‌గా నియమించబడిన వ్యక్తే యుద్ధరంగంలో సేనాపతిగా, న్యాయస్థానంలో ఖాజీ (జడ్జీ)గా, శిక్షాస్మృతి విభాగంలో రక్షకభటుడిగా వ్యవహరించేవాడు. ఆ తరువాత కొంతకాలానికి సభ్యతాసంస్కృతులు అభివృద్ధి చెందినకొద్దీ ఈ శాఖలన్నీ విడివిడిగా చేయబడ్డాయి. ఖలీఫా ఉమర్ (రజి) మొత్తం సామ్రాజ్యాన్ని 13 రాష్ట్రాలుగా విభజించి వాటి పాలన కోసం గవర్నర్లను నియమించారు. తిరిగి ఆ రాష్ట్రాలను జిల్లాలుగా విభజించి, వివిధరంగాలకు సంబంధించిన వేర్వేరుశాఖలకు వేర్వేరు పాలనాధికారులను నియమించారు. పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన ప్రతి విషయంలోనూ ఆయన సలహామండలిని సంప్రదించిన తరువాతే నిర్ణయాలు తీసుకునేవారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో అరబ్ ఇరాఖ్, అరబ్బేతర ఇరాఖ్, అల్జీరియా, ఈరాన్, ఆర్మీనియా, అజర్‌బాయిజాన్, సీస్తాన్, ఖురాసాన్, ఖజకిస్తాన్, కర్మాన్, మక్రాన్, బెలూచిస్తాన్‌లో కొంత భాగం, సింధ్‌లో కొంత భాగం (సముద్రతీర ప్రాంతాలైన దేబల్, థాన), సిరియా, పాలస్తీనా, ఈజిప్టు రాజ్యాలు ముస్లింల స్వాధీనంలోకి వచ్చాయి. వాటి విస్తీర్ణం 22,51,030 చదరపు మైళ్ళు.

రాష్ట్రాల పాలనా వ్యవస్థలను సరైన రీతిలో నిర్వహించడానికి హజ్రత్ ఉమర్ (రజి) ప్రతి రాష్ట్రంలో క్రింద పేర్కొన్న ఉన్నతాధికారులను నియమించారు.

1. వాలి (గవర్నర్) : ఇతను మొత్తం రాష్ట్రానికి ప్రధాన పాలకుడు. రాష్ట్ర పాలనా వ్యవస్థలో ఎక్కడ ఏ సమస్య ఏర్పడినా దానికి అతనే బాధ్యుడు.

2. కాతిబ్ (ప్రధాన కార్యదర్శి): రాష్ట్రంలో జరిగే ప్రభుత్వ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు వ్రాసి రాష్ట్ర గవర్నర్‌కు సమర్పిస్తూ ఉంటాడు.

3. కాతిబె దివాన్ (రక్షణశాఖ కార్యదర్శి) : సైన్యానికి కావలసిన అవసరాలన్నిటిని దృష్టిలో పెట్టుకొని వాటి వివరాలను సేకరించడం ఇతని బాధ్యత.

4. సాహిబె ఖిరాజ్ : (కలెక్టర్ లేక రెవెన్యూ అధికారి). జకాత్, జిజ్యా, పన్నుల వ్యవస్థను పర్యవేక్షిస్తూ వాటి జమా ఖర్చులు వ్రాయడం ఇతని పని.



5. సాహిబె బైతుల్‌మాల్ : (రాష్ట్ర కోశాధికారి). రాష్ట్ర ఆదాయ వ్యవయాలను పర్యవేక్షించడం, వాటి జమాఖర్చులు వ్రాయడం ఇతని బాధ్యతలు.

6. ఖాజిఉల్ ఖజాఅత్ : (ప్రధాన న్యాయమూర్తి). ప్రజల ఫిర్యాదులు స్వీకరించి ధర్మశాస్త్రం ప్రకారం విచారించి తీర్పులు చెప్పడం ఇతని బాధ్యత.

7. సాహిబె అహ్‌దాస్ : (రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి). రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడటం ఇతని బాధ్యత. దాంతోపాటు ప్రజల కార్యకలాపాలను కూడా ఓ కంట కనిపెట్టుండాలని అతనికి ప్రత్యేక ఆదేశాలివ్వబడ్డాయి. ఉదాహరణకు: వ్యాపారస్థులు తూనికల్లో, కొలతల్లో మోసం చేస్తున్నారేమో గమనించి, తగిన చర్యలు తీసుకోవాలి. ఎవరైనా రహదారుల్లో ఇల్లు కడ్తున్నాడా, పశువులపై మితిమీరిన బరువు మోపి వాటిని వేధిస్తున్నాడా, మద్యపానం బహిరంగంగా అమ్మబడుతుందా మొదలైన ప్రజాసంబంధ వ్యవహారాలు, ధర్మశాస్త్రవ్యతిరేక విషయాల్ని పర్యవేక్షిస్తుండాలి. హజ్రత్ ఉమర్ (రజి) కేవలం ఆజ్ఞలు జారీ చెయ్యడమే కాకుండ వాటిని సంబంధిత అధికారులు ఆచరణలో పెడ్తున్నారా లేదా అనే విషయాన్ని కూడా పర్యవేక్షించేవారు.

యుద్ధంలో పాల్గొన్నవారికి మొత్తం సమరసొత్తులో 4/5వ భాగం లభిస్తుంది. కాని యుద్ధంలో పాల్గొనకుండా ఇతర సేవలు అందజేసేవారికి సమరసొత్తు నుండి ప్రతిఫలం ముట్టజెప్పడం ధర్మసమ్మతం కాదు. అంచేత అలాంటివారికి ముఖ్యంగా సరిహద్దు భద్రతాదళాలకు ఖలీఫా ఉమర్ (రజి) ప్రభుత్వధనాగారం నుండి జీతాలు నిర్ణయించారు. ప్రారంభకాలంలో అత్యంత దైవభీతిపరులు, సదాచారులైన వారు తాము చేసిన సేవలకు ప్రభుత్వం నుండి ప్రతిఫలం పుచ్చుకోవడాన్ని తమ ధర్మపరాయణతకు వ్యతిరేకమని భావించేవారు. అయితే వారు ప్రజల నుండి పారితోషికాలు స్వీకరించడంలో ఎలాంటి తప్పులేదని తలచేవారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈ తప్పుడు భావనను అంతమొందిస్తూ అలాంటివారికి కూడా జీతాలు నిర్ణయించారు.

గవర్నర్లు, ప్రభుత్వాధికారుల అక్రమార్జనను అడ్డుకోవడానికి ఖలీఫా వారికి మంచి జీతాలు నిర్ణయించడంతో పాటు వారిని నియమించేటప్పుడు వారి దగ్గర ఏమేమి ఆస్తిపాస్తులున్నాయో వాటికి సంబంధించిన ఒక జాబితా తయారుచేసి ఉంచేవారు. ఎప్పుడైనా ఏఅధికారి ఆర్థికస్థితి అసాధారణంగా పెరిగిందని తెలిస్తే అతని నుండి వివరణ కోరడం జరుగుతుంది. వివరణ సరిగా లేదని తెలిస్తే అతను పదవి నుండి తొలగించబడేవాడు. అదనపు ఆదాయం ఉంటే అది ప్రభుత్వధనాగారంలో జమచేయబడుతుంది. గవర్నర్లు, అధికారులు ఎలాంటి నేరం చేసినా శిక్ష అనుభవించవలసిందే. ప్రజలపై దౌర్జన్యం చేస్తే వారు పీడితులకు నష్టపరిహారం చెల్లించడంద్వారా వారిని ఒప్పించవలసి ఉంటుంది.

## ♦ భూసంస్కరణలు

ఇరాఖ్, సిరియా, ఈజిప్టు దేశాలు ముస్లింల స్వాధీనంలోకి రాకముందు ఆనాటి పాలకులు ప్రజల మీద భారీఎత్తు శిస్తులు విధించి దౌర్జన్యంగా వసూలుచేసేవారు. ఆ దేశాలు ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఇతర

అనేక సంస్కరణలతో పాటు భూమిశిస్తు వ్యవహారాన్ని కూడా సంస్కరించి ప్రజల మీది పెనుభారం తగ్గించి వారికి న్యాయం చేకూర్చారు. ఆ సందర్భంలో ఎదురైన ఓ చట్టపరమైన చిక్కును కూడా ఆయన విడదీశారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ యా దేశాల సమరసొత్తులో కొంతభాగం భావితరాలకు ఉపయోగపడేలా చేయడానికి ప్రయత్నించారు. అయితే ముస్లింయోధులు యుద్ధం చేసి సాధించిన భూభాగాలలోని సమరసొత్తును (4/5 వాటాను) వారికే పంచివ్వాలని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), సల్మాన్ ఫార్సి (రజి), బిలాల్ (రజి), జుబైర్ (రజి) వగైరా ప్రముఖులు వాదించారు. అప్పుడు ఉమర్‌ఫారూఖ్ (రజి)కు ఖుర్‌ఆన్‌లోని "పోతే వీరందరి తర్వాత (ఇస్లాంలోకి) వచ్చిన-(వచ్చే) వారిక్కూడా (ఆ సంపదలో హక్కుంది)" (59:10) అనే సూక్తి గుర్తుకొచ్చింది. దాన్ని సభికుల దృష్టికి తీసుకురాగానే అందరూ ఆయన అభిప్రాయంతో ఏకీభవించారు.

అదీగాక దైవప్రవక్త (స) మక్కా జయించినప్పుడు ఆ ప్రాంతం స్థిరచరాస్తుల్ని మక్కాప్రజల అధీనంలోనే యధాతథంగా ఉంచారు. పోతే ఖైబర్ జయించబడినప్పుడు ఆయన ఆ ప్రాంతం ఆస్తుల్ని 36 భాగాలుగా విభజించి, వాటిలో 18 భాగాలు యోధులకు పంచి మిగిలిన 18 భాగాలను సామూహిక అవసరాల కోసం ఉంచారు. శత్రుదేశాలను ముస్లింలు యుద్ధంచేసి గెలిచినప్పుడు అక్కడి సమరసొత్తులో 1/5 భాగం ప్రభుత్వధనాగారానికి (8:41 సూక్తి చూడండి) పోగా, మిగతా 4/5 భాగం యోధులకు పంచబడాలన్నది దైవసూక్తి భావం. అయినప్పటికీ 4/5 భాగం పూర్తిగా యోధులకు తప్పనిసరిగా చెందాలని అర్థం కాదని పైన పేర్కొనబడినట్లు దైవప్రవక్త (స) ఆచరణను బట్టి అర్థమవుతోంది.

రోమన్లు సిరియా, ఈజిప్టు దేశాల్ని ఆక్రమించిన తరువాత అక్కడి సేద్యభూముల్ని రైతుల నుండి బలవంతంగా లాక్కొని తమ సైనికులకు, దర్బారీలకు, రాజవంశీయులకు, చర్చీలకు, జమీందారులకు కట్టబెట్టేవారు. దాంతో అసలు యజమానులైన రైతులు వారి కింద వ్యవసాయకూలీలుగా జీవితం గడపవలసి వచ్చేది. ఖలీఫా ఉమర్ (రజి) సిరియా, ఈజిప్టులు తమ స్వాధీనంలోకి వచ్చిన తరువాత ఆ రైతులకు వారి భూముల్ని తిరిగి ఇప్పించడమే గాకుండా, బయటి దేశాల నుండి వచ్చే అరబ్బులైనా, మరెవరైనా ఆ భూముల్లో సేద్యం చేయకూడదని కూడా శాసించారు. దీనివల్ల వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందసాగింది. మరోవైపు ఆ దేశాల రైతులు, ఇతర పౌరులు రోమన్లకు వ్యతిరేకంగా ముస్లింలకు మద్దతునివ్వడానికి సిద్ధమయ్యారు. అదేవిధంగా ఇరాఖ్, ఈరాన్లలో కూడా ఖలీఫా ఉమర్ (రజి) రైతుల కడుపులు కొట్టే రాక్షసచట్టాల్ని అంతమొందించి న్యాయవంతమైన భూసంస్కరణలు ప్రవేశపెట్టారు.

ఆయన వ్యవసాయాభివృద్ధి కోసం రైతులకు అనేక సదుపాయాలు కల్పించారు. భూములు సాగుబడి చేసే విషయంలో వారి సలహాలు తీసుకునేవారు. నీటి పారుదల కోసం వీలైన ప్రాంతాల్లో పెద్ద నదుల నుండి కాలువలు త్రవ్వించి, సుదూర ప్రాంతాలకు సైతం నీరందే ఏర్పాట్లు చేశారు. ఇన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ వెనుకటి ప్రభుత్వాలకంటె తక్కువ శిస్తు వేయడం జరిగింది. ఈ కారణంగానే వ్యవసాయదారులు



ఇస్లామీయ ప్రభుత్వానికి నిజమైన శ్రేయోభిలాషులయ్యారు. ఒకసారి సిరియాకు చెందిన ఒక రైతు వచ్చి "మీ సైన్యం నా పొలాల గుండా పోతూ మొత్తం పంటను సర్వనాశనం చేసిపోయింది" అని ఫిర్యాదు చేశాడు. హజ్రత్ ఉమర్ (రజి) వాస్తవం రాబట్టిన తరువాత నష్టపరిహారం క్రింద ఆ వ్యవసాయదారునికి పదివేల దిర్హములు డబ్బు ఇప్పించారు.

ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలంలో ఇరాఖ్, ఈరాన్, సిరియా, ఈజిప్టు దేశాల్లో ముస్లింలు చూపిన ఈ సానుభూతి, వారి న్యాయవైఖరులే వారి విజయాలకు కారణమయ్యాయి. ఈ వాస్తవాన్నే ఫ్రాన్స్‌కు చెందిన ఓ ప్రముఖ రచయిత తన అభిప్రాయాన్ని ఈవిధంగా వ్యక్తపరిచాడు:

"ఇస్లాం విజయాలకు రెవెన్యూ, శిస్తుల వ్యవహారం ఎంతగానో తోడ్పడ్డాయన్నది నగ్నసత్యం. రోమ్‌సామ్రాజ్యంలో దేశపౌరులు రోమన్లకు కఠినమైన శిస్తులు, పన్నులు చెల్లించవలసి వస్తుండేది. ఈ దౌర్జన్య విధానం ముస్లింల విజయాలను ఎంతో వేగవంతం చేసింది. ముస్లింల దాడుల్ని రోమన్లు మాత్రమే ఎదిరించారు గాని, దేశవాసులు కాదు. ఈజిప్టులోనైతే ఆ దేశవాసులైన ఖబ్తీతెగ రైతులు రోమన్లకు వ్యతిరేకంగా ముస్లింలకు సహాయం చేశారు. డెమాస్కస్, హమస్ పట్టణాల్లోని క్రైస్తవులు హెర్క్యులస్ సేనలకు వ్యతిరేకంగా తమ పట్టణ ముఖద్వారాలను మూసుకున్నారు. ఆ సందర్భంలో వారు ముస్లింలకు తమ మద్దతునిస్తూ 'నిర్దాక్షిణ్యమైన రోమన్ల ప్రభుత్వం కంటే మీ ప్రభుత్వమే మాకు బాగా నచ్చింది' అని అన్నారు." (అల్‌ఫారూఖ్)

## ♦ ప్రభుత్వ ధనాగారం (బైతుల్‌మాల్)

ఖలీఫా ఉమర్ (రజి) ప్రభుత్వ ధనాగారం విషయంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. ధనాగారంలో సంపద ఎక్కువగా పేరుకొని ఉండటాన్ని, విచ్చల విడిగా ఖర్చుపెట్టడాన్ని ఆయన సహించేవారు కాదు. కాబాలయంలో చాలా కాలం నుండి నిల్వవున్న వెండి, బంగారు రాసుల్ని త్వరగా బయటికి తీసి ప్రజలకు పంచాలని ఉత్తర్వు జారీచేశారు.

ఒకసారి మదీనాలో భారీఎత్తు సమరసొత్తు వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) సతీమణి, ఉమర్ ఫారూఖ్ (రజి) ముద్దుల కుమార్తె అయిన హజ్రత్ హఫ్సా (రజి) వచ్చి "విశ్వాసుల నాయకా! ఈ సమరసొత్తులో నా హక్కు కూడా ఉంది. నేను బంధువర్గం (జవిల్‌ఖుర్బా)కు చెందిన దాన్ని. నా హక్కు నాకు ఇప్పించండి" అని అన్నారు. దానికి ఖలీఫా ఉమర్ (రజి) సమాధానమిస్తూ "అమ్మా! నీ హక్కు ఏదైనా ఉంటే అది నా సొంత పైకం నుంచి తీసుకో. ఇది సమరసొత్తు (ఇందులో నీకెలాంటి హక్కు లేదు.) నువ్వు నీ తండ్రిని మోసగించజూస్తున్నావు" అని అన్నారు. హజ్రత్ హఫ్సా (రజి) ఈ సమాధానం విని బిక్కమొగం వేసుకొని వెళ్ళిపోయారు.

సిరియా ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత ముస్లింలకు, రోమన్లకు మధ్య స్నేహపూర్వకమైన ఉత్తరప్రత్యుత్తర సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ కాలంలో ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) అర్ధాంగి హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి) రోమ్ మహారాణికి అత్తరు నింపిన కొన్ని సీసాలు పంపించారు. దానికి సమాధానంగా రోమ్ మహారాణి ఆ

సీసాలలో మణిమాణిక్యాలు నింపి హజ్రత్ ఉమ్మెకుల్సూమ్ (రజి)కు పంపడం జరిగింది. ఈ విషయం తెలియగానే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఉమ్మెకుల్సూమ్ (రజి)తో మాట్లాడుతూ "అత్తరు నీదే కావచ్చు. కాని అత్తరు తీసికెళ్ళిన దూత ప్రభుత్వ సేవకుడు. అతని జీతభత్యాలు ప్రభుత్వ ఆదాయం నుండి చెల్లించడం జరిగింది. కాబట్టి ఆ మణి మాణిక్యాలు ప్రభుత్వానికి చెందుతాయి" అని చెప్పి వాటిని ప్రభుత్వధనాగారంలో జమ చేశారు. కాకపోతే అత్తరు ధర మాత్రం భార్యకు అందజేశారు. పాపం ఖలీఫాగారి భార్యామణి నోట మాట పెగలక నిశ్చేష్టురాలై చూడసాగింది.

ప్రభుత్వధనాగారంలోని ఏ వస్తువునైనా అనుమతి లేకుండా తీసుకోవడం సరికాదని హజ్రత్ ఉమర్ (రజి) తలచేవారు. అలాంటి విషయం ఏదైనా తన దృష్టికి వస్తే వెంటనే ఆయన దాన్ని నిరోధించేవారు. ఒకసారి ఆయన బజారున పోతుంటే ఒక బలిసిన ఒంటె అమ్మబడుతుండటం కన్పించింది. ఆయన ఆ ఒంటె ఎవరిదని అడిగితే మీ కుమారుడు అబ్దుల్లాది అని చెప్పారు జనం. అప్పుడాయన దగ్గరకు వెళ్ళి "ఈఒంటె లోగడ ఎక్కడుందేద"ని అడిగారు కొడుకును. దానికి అబ్దుల్లా "నేనీ ఒంటెను కొని సర్కారు పచ్చిక బయలులో వదిలాను. అక్కడిది బాగ మేసి బలిసింది. ఇప్పుడు నేను దీన్ని అమ్మకానికి పెట్టాను" అనిఅన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "ఈ ఒంటె సర్కారు పచ్చిక బయలులో మేసి బలిసింది కనుక, దీని కొన్నధర మాత్రమే తీసుకోవడానికి నీక్కు హక్కుంది. మిగిలిన పైకం సర్కారు ఖజానాలో జమచెయ్యి" అని చెప్పారు.

ఒకసారి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) జబ్బు పడ్డారు. దాని చికిత్స కోసం తేనె వాడమన్నారు కొందరు. కాని తేనె ఖలీఫా గారింట్లో లేదు. ప్రభుత్వ ధనాగారంలో ఉంది కాని, ప్రజల అనుమతి లేకుండా ఆయన తీసుకోలేరు. అంచేత ఆయన నమాజ్ వేళలో ప్రజలను సంబోధిస్తూ "ప్రభుత్వ ధనాగారం నుంచి కొంచెం తేనె తీసుకోవడానికి నాకు అనుమతిస్తారా?" అని అడిగారు. దానికి ప్రజలు సంతోషంగా అనుమతించారు.

సాధారణంగా ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వంటిపై చినిగిన, అతుకులు వేసిన దుస్తులే ఉండేవి. అవి కూడా ఒక జత బట్టలే. వాటినే ఉతుక్కొని తొడుక్కునేవారు. ఇంట్లో నెలల తరబడి రొట్టెలు తయారయ్యేవి కావు. వాటిక్కారణం సన్యాసిగా, సర్వసంగ పరిత్యాగిగా ఉండాలన్న ఉద్దేశం కాదు. ప్రజలందరితో పాటు తన వాటాకు అధిక ధనం వస్తే విశాలహృదయంతో దాన్ని ఖర్చు కూడా పెట్టేవారు. ఆయన హజ్రత్ అలి (రజి) కుమార్తె ఉమ్మెకుల్సూమ్ (రజి)ని వివాహమాడిన రోజుల్లో సమరసొత్తు నుండి తనవాటాకు పెద్ద మొత్తమే వచ్చింది. అప్పుడాయన ఉమ్మెకూల్సూమ్ (రజి) ఔన్నత్యం, ఆమె కుటుంబ గౌరవాన్ని దృష్టిలో పెట్టుకొని మహర్ కింద ఆమెకు నలభైవేల దిర్హంలు చెల్లించారు.

## ♦ న్యాయవ్యవస్థ

ఖలీఫా ఉమర్ (రజి) ఎవరినైనా న్యాయాధికారిగా నియమించే ముందు అతడ్ని పరీక్షించేవారు. ఖాజీ షరయి అనే న్యాయాధికారికి సంబంధించిన ఒక సంఘటన ఇలా ఉంది: తనకు నచ్చిన గుర్రమే కావాలన్న షరతుపై ఉమర్ ఫారూఖ్ (రజి) ఒక గుర్రం



కొన్నారు. పరీక్షించడానికి దానిపై ఎక్కి స్వారిచేశారు. కాని యాదృచ్ఛికంగా అది కాలుజారి పడి గాయపడింది. హజ్రత్ ఉమర్ (రజి) ఆ గుర్రాన్ని అమ్మినవాడికి తిరిగిచ్చేద్దాం అనుకున్నారు. కాని అతనా గుర్రాన్ని వాపసు తీసుకోవడానికి నిరాకరించాడు. తరువాత ఇద్దరూ కలిసి తీర్పు కోసం ఇరాఖ్‌కు చెందిన ఒక న్యాయాధికారి దగ్గరకు వెళ్ళారు.

ఆ న్యాయాధికారి కేసు విని "అమీరుల్ మోమినీన్! మీరు ఈ గుర్రాన్ని కొనాల్సిందే. లేదా మీరు తీసుకున్నప్పుడు గుర్రం ఏ విధంగా ఉండిందో అదే స్థితిలో దాన్ని ఇతనికి వాపసు చేయండి" అని ఏమాత్రం మొహమాటం లేకుండా తీర్పిచ్చాడు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ తీర్పు విని చాలా సంతోషించారు. తర్వాత ఆయన ఆ న్యాయాధికారిని కూఫా ప్రాంతపు ఖాజి (జడ్జి)గా నియమించారు.

ఖలీఫా ఉమర్ (రజి) న్యాయవ్యవస్థ సూత్రాలు పేర్కొంటూ బస్రా రాష్ట్రగవర్నర్ అబూమూసా అష్అరీ (రజి)కి ఓ చారిత్రక లేఖ రాశారు. దాని సారాంశం ఇలా ఉంది:

"ఫిర్యాదులను పరిష్కరించడం ఎంతో బాధ్యతతో కూడిన పని. ఏదైన ఫిర్యాదు మీకందితే, అందులోని ప్రతి మాటను క్షుణ్ణంగా పరిశీలించి, ఆలోచించి తీర్పివ్వండి, తీర్పు ఇచ్చాక దాని ప్రకారం అమలుచేయాలి. వాది, ప్రతివాదుల పట్ల ఒకేవిధంగా వ్యవహరించాలి. ఫిర్యాది నుండి సాక్ష్యం అడగాలి. 'దావా'ను నిరాకరించేవారి చేత ప్రమాణం చేయించండి. ముస్లింల మధ్య రాజీ కుదర్చడం గొప్ప సత్కార్యం. ఫిర్యాది తన 'దావా'ను నిరూపించుకోడానికి వ్యవధి అడిగితే ఇవ్వండి. సాక్ష్యం తెస్తే దాని ఆధారంగా తీర్పుచేయండి. ఫిర్యాది సాక్ష్యం సమర్పించకపోతే ఆ కేసు కొట్టివేయండి. ప్రతి ముస్లింని నిజం చెప్పేవాడని భావించండి. అయితే ఏదైన విషయంలో శిక్ష పడివుంటే లేదా తప్పుడు సాక్ష్యమిచ్చి ఉంటే అతని మాటలు నమ్మదగినవికావు. ముద్దాయి లేదా ఫిర్యాది పట్ల మీ హృదయంలో ఏమాత్రం కోపంగాని, విసుగుగాని ఉండరాదు. న్యాయశీలుడు దేవుని బహుమానానికి, పేరు ప్రతిష్ఠలకు హక్కుదారుడౌతాడు. నిష్కల్మషమైన మనస్సు కలవాడికి, ప్రజలకు మధ్య దేవుడే చాలు. కృత్రిమ నైతికతను ప్రదర్శించేవాడు ఎన్నటికీ దేవుని కారుణ్యానుగ్రహాలను ఆశించలేడు."

ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి), ఉబయ్యి బిన్ కాబ్ (రజి)ల మధ్య ఏదో విషయంలో గొడవ వచ్చింది. ఉబయ్యి బిన్ కాబ్ (రజి) ఈ వ్యవహారాన్ని హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) దగ్గరకు తీసికెళ్ళారు. ఖలీఫా ఉమర్ (రజి) ముద్దాయిగా హాజరయ్యారు. ఖలీఫా అయినందున ఆయన్ని హజ్రత్ జైద్ (రజి) ఎంతో గౌరవిస్తూ కూర్చోబెట్టదలిచారు. కాని ఉమర్ (రజి) అందుకు అభ్యంతరం తెలుపుతూ "జైద్! ఇది నీ మొదటి అన్యాయం" అన్నారు. అలా చెప్పిన తరువాత ఆయన వెళ్ళి ఉబయ్యి బిన్ కాబ్ ప్రక్కన కూర్చున్నారు. ఉబయ్యి బిన్ కాబ్ వద్ద ఎలాంటి సాక్ష్యం లేదు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన దావాను నిరాకరించారు. న్యాయశాస్త్రం ప్రకారం ఉబయ్యి బిన్ కాబ్ (రజి) ఖలీఫా ఉమర్ (రజి) చేత ప్రమాణం చేయించదలిచారు. కాని న్యాయాధికారి జైద్ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి) హోదాను దృష్టిలో ఉంచుకొని ఉబయ్యి బిన్ కాబ్ (రజి)తో "అమీరుల్ మోమినీన్‌కు ప్రమాణం నుంచి మినహాయింపు ఇవ్వండ"ని అన్నారు.

న్యాయమూర్తి జైద్ (రజి) ప్రదర్శించిన ఈ రెండవ పక్షపాతవైఖరి చూసి ఖలీఫా ఉమర్ (రజి) విచారం వ్యక్తపరుస్తూ "జైద్! న్యాయం చేసేటప్పుడు ధనికుడు-నిరుపేద, సాధారణవ్యక్తి-ఉమర్ (రజి) నీ దృష్టిలో సమానులు కానంతవరకు నీవు ఖాజీ పదవికి అర్హుడవని భావించలేము" అని అన్నారు.

## (19) ఇస్లాం సందేశ విస్తరణ

ఇస్లామీయ పోరాటాల లక్ష్యం రాజ్యవిస్తరణ ఎంతమాత్రం కాదు. హింసాదౌర్జన్యాలు, అన్యాయం-అక్రమాలను అంతమొందించి శాంతిభద్రతలు, నీతీన్యాయాలు నెలకొల్పడమే ఈ పోరాటాల ప్రధానలక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరితే ప్రకృతి సిద్ధమైన దైవధర్మం దానంతటదే మొగ్గతొడిగి మూడుపువ్వులు, ఆరుకాయలుగా విస్తరిస్తూపోతుంది. దౌర్జన్యం అంతరించగానే సత్యం బహిర్గతమవుతుంది. ఆ సత్యమే ఇస్లాం- దైవనిర్దేశిత ధర్మం. దౌర్జన్యం అంతరించినప్పుడు సత్యం ఎలా బహిర్గతమవుతుందో తెలుసుకుందాం.

సాధారణంగా జనసామాన్యం అన్యాయంగా ఇతరుల హక్కులు కొల్లగొట్టాలని, వారిపై దౌర్జన్యం చేసి విలాసజీవితం గడపాలని భావించరు. హింసాప్రవృత్తి కలవారు, దుర్మార్గులే దౌర్జన్యాలకు పాల్పడతారు. అయితే బలవంతుడైతే తన కండబలంతో, ఆయుధశక్తితో, మందీమార్బలంతో ఇతరుల్ని దోచుకుంటాడు. అలాంటి శక్తిసామర్థ్యాలు అంతగా లేనివాడు కుట్రలు, కుయుక్తులకు ఒడిగడ్తాడు.

ఇస్లాం అలాంటి దోపిడీగాండ్రను, దోపిడీవ్యవస్థను నిరోధించడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆ దుష్టశక్తులు దాన్ని అంతమొందించడానికో లేదా అప్రతిష్ఠ పాలుజేయడానికో రంగంలోకి దిగుతాయి. ఆనాడైనా, ఈనాడైనా లోకంలో జరుగుతున్నది ఇదే. అయితే శాంతివిఘాతకుల్ని, దోపిడీగాండ్రను ఎదుర్కొని హింసాదౌర్జన్యాల్ని అంతమొందించగల్గే, నీతీన్యాయాల్ని నెలగొల్పగల్గే అనుయాయులు ఇస్లాంకు లభించినపుడు జనసామాన్యం సహజంగానే ఇస్లాం వైపు ఆకర్షితులవుతారు. అంతిమదైవప్రవక్త ముహమ్మద్ (స) కాలంలో, ఆ తరువాత సన్మార్గగాములయిన ఖలీఫాల కాలంలో ఇస్లాంకు అలాంటి అనుచరులు లభించడం వల్లనే ప్రపంచంలో అది శరవేగంతో విస్తరించింది.

హి.శ. 11వ సంవత్సరాంతంలో 'జలూల' ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత అక్కడి పెద్ద పెద్ద భూస్వాములు, ధనికులు సంతోషంగా ఇస్లాం స్వీకరించారు. వారసలు జలూల పాలకుల దౌర్జన్యాలతో విసిగిపోయి, ముస్లింల సత్ప్రవర్తనతో ప్రభావితులై ఇస్లాం స్వీకరించారు. వారిలో ప్రజాబలంగల నాయకులు కూడా ఉన్నారు. అంచేత వారి ప్రజలు కూడా ఇస్లాం స్వీకరించారు. ఖాదిసియా యుద్ధం తరువాత ఈరాన్ చక్రవర్తి ఖుస్రూపర్వేజ్ శిక్షణ ఇచ్చిన ప్రత్యేక సైనికదళంలోని నాలుగువేల మంది సైనికులు ఇస్లాం స్వీకరించారు. ఆ తర్వాత కూడా వేలాది మంది ఈరాన్ సైనికులు ఇస్లాం స్వీకరించారు.

సయ్యా అనే ఒక ఈరాన్ సైన్యాధికారి ఓరోజు తన అనుచర సైనికుల్ని సమావేశపరచి "మన పెద్దలు మన దేశాన్ని అరబ్బులు జయిస్తారని చెబుతుండేవారు. ఆ భవిష్యవాణి ఇప్పుడు నిజమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. అంచేత మనమంతా ఇస్లాం స్వీకరించడం



లోనే మన శ్రేయస్సు ఉంది" అని అన్నాడు. ఈమాట విని అందరూ ఇస్లాం స్వీకరించి ముస్లిం సైన్యంలో చేరిపోయారు.

ఈజిప్టులోని కొన్ని ప్రాంతాలవారు తిరుగుబాటుచేసి చివరికి ఖైదీలుగా పట్టుబడ్డారు. అప్పుడు ఈజిప్టుగవర్నర్ అమ్ (రజి) వారిని బానిసలుగా అమ్మివేశారు. వారంతా అరేబియా నలువైపులా వ్యాపించారు. ఖలీఫాకు యుద్ధఖైదీలను బానిసలుగా అమ్మేయడం నచ్చలేదు. ఆయన వెంటనే ఆ బానిసలందరినీ సమీకరించి ఈజిప్టుకు తిప్పిపంపుతూ "వారందరూ తాము కోరుకుంటే ఇస్లాం స్వీకరించవచ్చు లేదా తమ మతంలోనే ఉండిపోవచ్చు" అని ఈజిప్టు గవర్నర్‌కు లేఖ రాశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ యుద్ధ ఖైదీలంతా క్రమక్రమంగా ఇస్లాం స్వీకరించారు. ఈజిప్టులోనే 'షిత' పట్టణాధికారి ముస్లింల స్థితిగతులు తెలుసుకొని ఇస్లాం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆ తరువాత ముస్లిం సైన్యం షిత పట్టణానికి సమీపంలోని ఒక ప్రదేశంలో విడిదిచేసిందని తెలుసుకొని, అతను రెండువేల మంది ప్రజలను తీసుకొని వెళ్ళి ఇస్లాం స్వీకరించాడు.

సిరియాలో కూడా జనం పెద్దఎత్తున ఇస్లాం స్వీకరించారు. వారి ధార్మికశిక్షణ కోసం గవర్నర్ మావియా విజ్ఞప్తిపై ఖలీఫా ముగ్గురు ధర్మవేత్తల్ని సిరియాకు పంపారు. వారిలో హజ్రత్ అబూదర్దా (రజి) ఒకరు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రారంభంలో అబూదర్దా (రజి)ను సిరియా గవర్నర్‌గా నియమించాలని ప్రయత్నించారు. దానికి ఆయన అంగీకరించకుండా ధర్మప్రచారకునిగా, బోధకునిగా మాత్రమే సిరియా వెళ్ళడానికి సిద్ధమయ్యారు. అప్పుడు ఖలీఫా ఆయన్ని ధర్మప్రచారకునిగా సిరియా పంపారు.

హజ్రత్ అబూదర్దా (రజి) సిరియా రాజధాని డెమాస్కస్‌కు చేరుకొని పరిస్థితి గమనిస్తే అక్కడి ముస్లింలు ప్రాపంచిక వ్యామోహంలో పడి విలాసవంతమైన జీవితం గడుపుతూ కన్పించారు. ఒకరోజు వారిని ఆయన మసీదులో సమావేశపరచి ఎంతో బాధాతప్త హృదయంతో హితబోధ చేశారు. ఐహికవ్యామోహంలో కూరుకుపోయి, సృష్టికర్తను విస్మరించి దైవశిక్షలకు గురయిన గత జాతుల చారిత్రక గాథలను విన్పించి హెచ్చరించారు. పరలోక దుష్పరిణామాలను గురించి భయపెట్టారు. రాతిగుండెలను సైతం కరిగించే ఆయన ప్రసంగం విని సభికులు పశ్చాత్తాపంతో కంటతడి పెట్టారు.

ఈవిధంగా అబూదర్దా (రజి) ప్రచారభేరి మోగించి ప్రజలను ఆకట్టుకోసాగారు. అంతేకాదు, విభిన్న మనస్తత్వం గలవారికి ఆయన సందర్భానుసారం సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ తగిన హితవులు కూడా గరుపుతుండే వారు. సిరియాలో ఆయన జీవనసరళి ఆయన నోట వెలువడే హితోక్తులకు సంపూర్ణ క్రియారూపంగా ఉండేది. ఆ విషయాన్ని ఖలీఫా ఉమర్ (రజి) కూడా తన పర్యటన సందర్భంలో ప్రత్యక్షంగా చూసుకున్నారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఇతర ప్రాంతాలక్కూడా ధార్మికశిక్షణ కోసం ధర్మవేత్తల్ని పంపారు. ఆయన ఇమాములకు, ముఅజ్జిన్‌లకు వేతనాలు నిర్ణయించి మసీదుల్లో ప్రత్యేకంగా ఖుర్ఆన్ బోధనాకార్యక్రమాల ఏర్పాటు కూడా చేశారు. అయితే ఇస్లాం సందేశ విస్తరణ ప్రచారం ద్వారా కాకుండా ముస్లింల నీతినడవడికల ద్వారానే ఎక్కువగా జరిగిందనే విషయం ఈనాటి ముస్లింలు గమనించాలి.

## (20) ఉమర్ (రజి) నైతిక జీవనసరళి

ఖలీఫా ప్రజల యోగక్షేమాలు, బాగోగులు చూసి తగిన చర్యలు తీసుకోవడానికి రాత్రివేళ నగరంలో గస్తీ తిరిగేవారు. ప్రజలకు ఏకాస్త కష్టం వచ్చినా ఆయన సహించేవారు కాదు. తక్షణమే తగిన చర్యలు తీసుకోనిదే ఆయన ఆ రాత్రి నిద్ర పోయేవారు కాదు. ప్రజాసేవలో అందరికంటే ముందుండేవారు. ఆయన ప్రజలందరికీ భావప్రకటన స్వేచ్ఛ ఇచ్చేవారు. వాస్తవికతకు, ధర్మశాస్త్రానికి అనుగుణంగా తనను ఓ సాధారణ పౌరుడు విమర్శించినా సరే ఆయన తన పొరపాటును ఉపసంహరించుకునేవారు.

అంతేకాదు, ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) చట్టాన్ని వర్తింపజేయడంలో, శిక్షలు విధించడంలో తనవారు, పరాయివారన్న వివక్ష ఏమాత్రం చూపేవారుకాదు. తప్పు చేస్తే తన కన్నకొడుకునైనా, రాష్ట్ర గవర్నరైనా వదలిపెట్టేవారు కాదు. ముస్లిమేతర పౌరుల హక్కుల పట్ల ఎంతో శ్రద్ధవహించేవారు.

### ♦ రాత్రివేళ గస్తీలో

(1) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) నగరంలో ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి మారువేషంలో ఓరోజు రాత్రి గస్తీ తిరుగుతూ ఓ పూరిపాక దగ్గరకు వచ్చారు. ఆ పూరిపాకాలో ఉంటున్న పౌరుడితో ఆయన మాట్లాడసాగారు. కాస్సేపటికి హఠాత్తుగా ఆ పూరిపాక నుంచి ఒక స్త్రీ ఏడ్పు వినవచ్చింది. ఉమర్ ఫారూఖ్ (రజి) పూరిపాక వైపు చూస్తూ "ఎవరామె ఏడుస్తోంది?" అనడిగారు. "ఆమె నా భార్యేనండీ! పురిటినొప్పులతో బాధ పడుతోంది" అన్నాడు గుడిసెవాసి.

'అయితే ఉండు, ఇప్పుడే వస్తాన'ంటూ ఉమర్ ఫారూఖ్ (రజి) పరుగు వేగంతో ఇంటికెళ్ళి తన భార్య ఉమ్మెకుల్సూమ్ (రజి)కు ఈ విషయం చెప్పారు. "అయ్యయ్యో ఎంత బాధపడుతుందో కదండీ! పదండి, నేను మీవెంట వస్తున్నా" అంటూ ఉమ్మె కుల్సూమ్ (రజి) దుప్పెట కప్పుకొని సిద్ధమయ్యారు. ఉమర్ ఫారూఖ్ (రజి) శ్రీమతిని వెంటబెట్టుకొని పూరిపాక దగ్గరకు చేరుకున్నారు. పోగానే శ్రీమతిని లోపలికి పంపించి ఆయన బయట గుడిసెవాసి దగ్గర కూర్చున్నారు.

కాస్సేపటికి ఉమ్మెకుల్సూమ్ (రజి) ఆ స్త్రీకి కాన్పు చేసి "అమీరుల్ మోమినీన్! మీ స్నేహితుడికి శుభాకాంక్షలు చెప్పండి, ఆయనకు కొడుకు పుట్టాడు" అని లోపలి నుంచి కేకవేసి చెప్పారు. నిరుపేద గుడిసెవాసి తన భార్యకు కాన్పుచేసిన స్త్రీ దేశాధినేత భార్య అని తెలియగానే బిత్తరపోయాడు.

(2) మరొకరోజు ఉమర్ (రజి) ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి రాత్రివేళ గస్తీ తిరుగుతుంటే ఒక ఇంటి నుంచి ఈ మాటలు విన్పించాయి:

"లేమ్మా! లేచి పాలలో కొంచెం నీళ్ళు కలుపు" అన్నది ఓ మహిళ. "అమ్మా! పాలలో నీళ్ళు కలపకూడదని మన ఖలీఫాగారు ప్రకటన చేయించిన సంగతి నీకు తెలియదా?" అన్నది ఒక బాలిక సమాధానంగా. "ఇక్కడ ఖలీఫా మనల్ని చూడటం లేదుకదా! ఖలీఫా మనుషులు కూడా లేరు. త్వరగా పాలలో నీళ్ళుకలుపు. ఇక్కడకొచ్చి ఎవరు చూడ



బోయారు?" అన్నది తల్లి. "అమ్మా! మనం ఇక్కడ పాలలో నీళ్ళు కలుపుతున్న సంగతి ఖలీఫాకు తెలియక పోవచ్చు. కాని దేవునికి తెలియదా? ఆయన ఎల్లవేళలా అందరినీ చూస్తున్నాడు. నేను మాత్రం పాలలో నీళ్ళు కలపలేను" అన్నదా బాలిక.

ఖలీఫా ఉమర్ఫారూఖ్ (రజి) ఈ సంభాషణ విని మౌనంగా వెళ్ళిపోయారు. మరునాడు ఉదయం తన కుమారుల్ని పిలిచి ఇలా అన్నారు: "నాయనలారా! నేను రాత్రి ఫలానా వీథిలోని ఓ పూరిపాకలో ఒక యువతి పలికిన మధురమైన మాటలు విన్నాను. ఆ యువతి ముఖారవిందమైతే చూడలేదుకాని, ఆమె నోట దైవభీతిపరాయణత జాలువారే పలుకులు మాత్రం విన్నాను. ఆమెను నా కోడలిగా మనింటికి తీసుకురావాలని భావిస్తున్నాను. దైవచిత్తమైతే ఆ అమ్మాయి ద్వారా మనకు ఓ శుభప్రదమైన చిరంజీవి కలగవచ్చు. దీనికి మీలో ఎవరు సిద్ధమవుతారో చెప్పండి." దానిని ఆసిమ్ (రజి) "నాన్నాగారూ! నేనిందుకు సిద్ధంగా ఉన్నాను" అన్నారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ పూరిపాక వైపు బయలుదేరారు.

ఖలీఫా తమ ఇంటివైపే రావడం చూసి ఆ వృద్ధమాత కంగారుపడిపోయింది. యువతి ఆమెకు ధైర్యంచెబుతూ ఓ మాసినచాప పరచింది. ఖలీఫా చాపపై కూర్చుంటూ "మీ అమ్మాయిని నా కోడలుగా చేసుకోదలిచాను. మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి" అన్నారు. యువతితల్లి ఖలీఫానోట ఈమాట వినగానే కొయ్యబారి క్షణంపాటు నోటమాట పెగల్లేదు. ఆ తర్వాత తేరుకొని "ఏమిటీ నేను కలగంటున్నానా?" అన్నది. దానికి ఖలీఫా ఉమర్ (రజి) "కలగాదు, నిజమే. నేను మీఅమ్మాయిని మాఅబ్బాయి ఆసిమ్కి ఇప్పించి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. మీ అభిప్రాయం చెప్పండి" అని అన్నారు. దానికి ఆ వృద్ధమాత "విశ్వాసులనాయకా! మీరెక్కడా, ఈ పూరిగుడిసెలో ఉంటున్న మేమెక్కడ!! మీరంతటి మీరొచ్చి అడుగుతుంటే అంతకంటే సౌభాగ్యం మాకు ఇంకేం కావాలి" అని అన్నది కనుగొలుకుల నుండి జాలువారుతున్న ఆనందభాష్పాలు తుడుచుకుంటూ.

ఆ తరువాత ఆసిమ్తో ఆ బాలిక వివాహం జరిగింది. ఆమె పవిత్రఉదరం నుంచి ఉమ్మెఆసిమ్ పుట్టింది. ఆమెకు జన్మించిన మహనీయుడే ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మాలై). ఆయన ఖలీఫాగా ఎన్నుకోబడి ఎంతో న్యాయంగా, నిజాయితీగా దేశాన్ని పాలించి ఐదవ శ్రేష్ఠఖలీఫాగా ఖ్యాతి చెందారు.

(3) ఖలీఫా ఉమర్ (రజి) ఓసారి అర్థరాత్రివేళ గస్తీ తిరుగుతుంటే ఒక వ్యక్తి తన ఇంట్లో ఏదోపాట పాడుతున్నాడు. ఆ పాట వినగానే ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. ఆయన వెంటనే అతని ఇంటిగోడెక్కి తొంగిచూస్తే మందూ, మగువా కన్పించాయి. ఆయన కోపంతో "ఓరి దైవవిరోధీ! నీవు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే ఆయన నీ గుట్టు రట్టుచేయడని భావించావా?" అని అరిచారు.

దానికా వ్యక్తి ఇలా అన్నాడు: "విశ్వాసుల నాయకా! తొందరపడకండి. నేను ఒక పాపం చేస్తే మీరు మూడుపాపాలు చేశారు. దేవుడు ఇతరుల రహస్యాలు కూపీ తీయడాన్ని నిషేధించాడు. కాని మీరా పని చేశారు. దేవుడు ఇండ్లలోకి ముఖద్వారం

గుండా ప్రవేశించమని ఆదేశిస్తే మీరు ప్రహరీ గోడెక్కి వచ్చారు. దేవుడు ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకూడదంటే, మీరు నా అనుమతి లేకుండానే నా ఇంట్లో ప్రవేశించారు." ఉమర్ (రజి) ఈమాట విని తప్పు ఒప్పుకున్నారు. అతనిపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కాకపోతే అతని చేత దుష్కార్యాలు మానేసి నీతిమార్గం అవలంబిస్తానన్న వాగ్దానం చేయించుకున్నారు.

(4) ఖలీఫా ఉమర్ (రజి) రోజులాగే ఆరోజు రాత్రి కూడా యధాప్రకారం ప్రజల మంచిసెబ్బరలు తెలుసుకోవడానికి రాజధాని నగరంలో గస్తీ తిరగసాగారు. అలా గస్తీ తిరుగుతుంటే ఒక చోట ఆయనకు ఓ స్త్రీ కంఠం వినవచ్చింది. ఆ కంఠస్వరంలో ఈ విధంగా ఒక విరహగేయం తొంగిచూసింది:

"ముద్దూముచ్చట్లతో నన్నానందపరిచే చెలికాడు లేకుండా పోయాడే!!
అయ్యో! ఈ విషయమే నన్ను రాత్రుళ్ళలో నిద్ర లేకుండా చేసింది.
దేవుని దగ్గర పట్టుబడిపోతానన్న భయమే గనక లేకపోయి ఉంటే,
ఈపాటికి ఈ మంచం పట్టెలు సయితం కదిలిపోయి ఉండేవి!!"

ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ గేయం విని చలించిపోయారు. ఆ యువతి భర్త జిహాద్ చేయడానికి వెళ్ళి చాలాకాలం గడిచింది. అందుకే ఆ కావ్యకన్యలో జాలువారిన ఈ విరహవేదన. ఖలీఫా ఉమర్ (రజి) మరునాడు కుమార్తె హఫ్సా (రజి) ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు విచారించిన తర్వాత "స్త్రీ తన భర్త ఎక్కడికైనా వెళ్ళిపోయినప్పుడు భర్త ఎడబాటును ఎంత కాలందాకా సహించ గల్గుతుంది?" అని అడిగారు.

హజ్రత్ హఫ్సా (రజి) తండ్రి నోట ఈమాట విని క్షణంపాటు సిగ్గుపడి పోయారు. తర్వాత ఆమె నేలచూపులు చూస్తూ "నాలుగు నెలలదాకా సహించగల్గుతుంది" అని చెప్పారు. ఖలీఫా ఉమర్ (రజి) ఆ తరువాత "ఏ సైనికుణ్ణయినా తన భార్య దగ్గరకు పోనీయకుండా నాలుగు నెలలకు మించి ఆపిఉంచకూడదు" అని ఉత్తర్వు జారీచేశారు.

(5) ఒకరోజు రాత్రివేళ గస్తీ తిరుగుతుంటే మదీనాపట్టణానికి మూడుమైళ్ళ దూరంలోని సరార్ అనే ప్రదేశంలో ఒక స్త్రీ ఏదో వండుతూ, ఆమె పక్కన ముగ్గురు పిల్లలు ఏడుస్తూ కన్పించారు. ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) ఆ స్త్రీ దగ్గరకు వెళ్ళి పరిస్థితి ఏమిటని అడిగారు. దానికామె సమాధానమిస్తూ "రెండ్రోజుల నుంచి పిల్లలకు తిండి దొరక్కపోవడం వల్ల ఆకలి బాధతో ఏడుస్తున్నారు. వీళ్ళను ఓదార్చడానికి నేను ఖాళీ కుండలో నీళ్ళు పోసి పొయ్యి మీద పెట్టాను" అని అన్నది.

ఈమాట వినగానే ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మదీనా వెళ్ళి ప్రభుత్వధనాగారం నుంచి సత్తుపిండి, నెయ్యి, ఖర్జూరపండ్లు ఓ గోతంలో వేసుకొని భుజానికి ఎత్తుకున్నారు. సేవకుడు అస్లం ఆ గోతం పట్టుకొని "నేను తీసుకొస్తాను, నా తల మీద పెట్టండి" అన్నాడు. దానికి హజ్రత్ ఉమర్ (రజి) "వద్దు, నువ్వు ప్రళయదినాన నా బరువు మోయ లేవు" అని చెప్పి బయలుదేరారు. ఆ స్త్రీ దగ్గరకు చేరుకొని గోతంలోని వస్తువులు తీసి ఆమె ముందుంచారు. ఆమె పిండి తీసుకొని పిసికి కుండలో పోసి పొయ్యిమీద పెట్టింది.



ఖలీఫాఉమర్ (రజి) పొయ్యిరాజేశారు. కాస్సేపటికి భోజనం తయారవగానే పిల్లలు ఆవురావురుమంటూ తిని సంతోషంతో గంతులేయసాగారు.

అప్పుడా స్త్రీ "దేవుడు నీకు దీని ప్రతిఫలం ప్రసాదించుగాక! నిజం చెప్పాలంటే విశ్వాసుల నాయకుడయ్యే యోగ్యత నీలో ఉంది, ఉమర్‌లో కాదు" అని అన్నది.

## ♦ పర్యటనల్లో ప్రజాసమస్యలపై ప్రత్యేక దృష్టి

(1) దైవప్రవక్త(స) కాలంలో సయీద్ బిన్ ఆమిర్ (రజి) ముస్లిం కాకముందు ప్రవక్త అనుచరుడు హజ్రత్ ఖబీబ్ బిన్ అదీ (రజి)ని అవిశ్వాసులు చిత్రహింసలు పెట్టి ఘోరాతి ఘోరంగా హతమార్చిన భయానక దృశ్యం చూసి తీవ్రమైన ప్రభావానికి గురయ్యారు. ఆనాటి నుంచి సయీద్ కళ్ళలో ఆ దృశ్యమే అనుక్షణం మెదలుతుండటంతో దాన్ని భరించలేక కొన్నాళ్ళ తరువాత ఆయన ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త (స) అనుచర సముదాయంలో చేరిపోయారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన పాలనాకాలంలో హజ్రత్ సయీద్ బిన్ ఆమిర్ (రజి)ని హమస్ గవర్నర్‌గా నియమించడానికి ప్రయత్నిస్తే మొదట్లో ఆయన దాన్ని తిరస్కరించారు.

ఆ సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) మాట్లాడుతూ "సయీద్! నేను మిమ్మల్ని హమస్ రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించదలిచాను" అని అన్నారు. దానికి సయీద్ (రజి) "ఉమర్! దయచేసి దేవుని కోసం మీరు నన్ను పరీక్షకు గురిచేయకండి" అన్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని కాస్తంత కోపంతో "మీరందరూ పరిపాలనా బాధ్యతల పెనుభారమంతా నా తలమీద మోపి మీరు మాత్రం ఈ బాధ్యతలకు దూరంగా ఉండదలిచారు. దైవసాక్షి! నేను మిమ్మల్ని ఎట్టి పరిస్థితిలోనూ వదలిపెట్టను" అని అన్నారు. అప్పుడు హజ్రత్ సయీద్ (రజి)కు గవర్నర్ బాధ్యతను స్వీకరించక తప్పలేదు. ఆ తర్వాత ఆయన హమస్‌కు వెళ్ళి ఆ రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేయనారంభించారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు హమస్ రాష్ట్రం నుండి ఒక ప్రతినిధి వర్గం మదీనా వచ్చి ఖలీఫాను కలుసుకున్నది. ఆ సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) వారితో మాట్లాడుతూ "మీ రాష్ట్రంలో నిరుపేదలు ఎవరెవరు ఎంతమంది ఉన్నారో వారందరి పేర్లు రాసి నాకివ్వండి, నేను వారి అవసరాలు నెరవేర్చడానికి తగిన ఏర్పాట్లు చేస్తాను" అని చెప్పారు. హమస్ ప్రతినిధులు ఈమాట విని ఖలీఫా దర్బారు నుంచి వెళ్ళిపోయి తమ రాష్ట్రంలోని నిరుపేదలకు సంబంధించిన ఓ పెద్ద జాబితా తయారుచేశారు. ఆ తరువాత వారా జాబితా తీసుకొని వచ్చి ఖలీఫాకు చూపించారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ జాబితాలోని మొట్టమొదటి పేరు చూసి ఖంగు తిన్నారు. ఆయన హమస్ ప్రతినిధుల వైపు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ "ఏమిటీ! సయీద్ బిన్ ఆమిర్!! ఎవరీ సయీద్ బిన్ ఆమిర్?" అని అడిగారు. దానికి ప్రతినిధివర్గం నాయకుడు "మా రాష్ట్ర గవర్నర్" అని సమాధానమిచ్చాడు.

"ఏమిటీ! మీ రాష్ట్ర గవర్నరా? మీ రాష్ట్ర గవర్నర్ అంత పేదవాడా?" అంటూ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మరింత ఆశ్చర్యపోయారు.

"ఔనండీ! మా రాష్ట్ర గవర్నరే. ఆయన మా రాష్ట్రంలో అందరికంటే చాలా పేదవాడు. దైవసాక్షిగా చెబుతున్నాం, ఆయన గారింట్లో ఒక్కోసారి రోజుల తరబడి పొయ్యి కూడా రాజేయబడదు" అన్నారు హమస్ ప్రతినిధులు విషయం మరింత వివరిస్తూ.

ఈమాట వినగానే హజ్రత్ ఉమర్‌ఫారూఖ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. ఆయన కళ్ళు చిల్లులు పడిన నీటికుండలై పోయాయి. చివరికి దుఃఖాన్ని ఎలాగో దిగమింగి లేచి లోపలి గదిలోకి పోయారు. కాస్సేపటి తరువాత ఆయన ఓ డబ్బుసంచి తీసుకొని వచ్చారు. దాన్ని ప్రతినిధి వర్గం నాయకునికి అందిస్తూ "ఇదిగో, ఇందులో వేయి దీనార్లు ఉన్నాయి. మీ గవర్నర్‌కు నా తరపున సలాం చెప్పి, ఈ పైకం ఆయనకు అప్పగించండి. వీటితో ఆయన తన అవసరాలు గడుపుకుంటారు" అని చెప్పారు.

ప్రతినిధివర్గం డబ్బుసంచి తీసుకొని హమస్ చేరుకున్నారు. దాన్ని గవర్నర్ ముందు పెడుతూ "మన ఖలీఫా గారు ఈ పైకం మీకు అప్పగించి మీ అవసరాలకు వాడుకోమని చెప్పారు" అని అన్నారు. గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) తన ముందు పెట్టిన డబ్బుసంచిని దూరంగా నెట్టివేసి "ఇన్నాలిల్లాహి వఇన్న ఇలైహి రాజివూన్" అన్నారు తనపై ఏదో పెద్ద ఆపద విరుచుపడినట్లు భావిస్తూ.

ప్రతినిధి వర్గం డబ్బుసంచి అప్పగించి వెళ్ళిపోయింది. ఆ తరువాత హజ్రత్ సయీద్ (రజి) భార్య తన భర్త మాటల ద్వారా ఏదో ఆపద వచ్చిపడిందని భావించి ఆందోళన పడుతూ ముందు గదిలోకి వచ్చింది.

"ఏమయిందండీ? మన ఖలీఫా గారు చనిపోయారా?" అని అడిగింది ఆమెగారు. దానికి సయీద్ (రజి) "చనిపోలేదు. కాని అంతకంటే పెద్ద ఆపదే వచ్చిపడింది" అన్నారు. ఆయన భార్య ఆశ్చర్యపోతూ "అంతకంటే పెద్ద ఆపద! ఏదైనా యుద్ధంలో ముస్లింలు ఓడిపోయారా?" అని అడిగారు. "లేదు, అంతకంటే కూడా పెద్ద ఆపద వచ్చిపడింది" అన్నారు సయీద్ (రజి). ఆయన భార్య ఈమాట విని మరింత ఆశ్చర్యపోతూ "ఏమిటీ! అంతకంటే పెద్ద ఆపద ఏమిటండీ?" అని అడిగింది విషయం అర్థంగాక.

"ఔను, అంతకంటే పెద్ద ఆపదే. మన పరలోకాన్ని పాడుచేయడానికి ప్రపంచం మన ఇంట్లోకి జొరబడింది" అన్నారు సయీద్ (రజి). ఆయన భార్యకు ఖలీఫా పంపిన పైకం సంగతి తెలియక "దానిదేముందండీ! ప్రపంచాన్ని వదిలించుకుంటే సరిపోలా?" అన్నది. అప్పుడు సయీద్ (రజి) "అయితే ఈ వ్యవహారంలో నువ్వు నాతో సహకరిస్తావా?" అని అడిగారు ఆయన. దానికి ఆయన భార్య "తప్పకుండా సహకరిస్తా. (నేను మీ అర్ధాంగిగా) మీ కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నా బాధ్యత" అని అన్నది.

ఆ తరువాత సయీద్ బిన్ ఆమిర్ (రజి) భార్య సహకారంతో ఆ పైకం మొత్తాన్ని చిన్నచిన్న సంచుల్లో సమానంగా విభజించి పెట్టారు. తరువాత పేదలను పిలిపించి ఆ సంచుల్ని వారందరికీ పంచివేశారు. అప్పుడాయన హృదయానికి ఊరట కలిగింది.

ఆ తరువాత కొన్నాళ్ళకు ఖలీఫా ఉమర్ (రజి) ప్రజల స్థితిగతులు తెలుసుకోవడానికి సిరియా పర్యటించారు. ఆ సందర్భంలో ఆయన హమస్‌కు చేరుకొని అక్కడి ప్రజలతో



"మీ కొత్త గవర్నర్ మీపట్ల ఎలా వ్యవహరిస్తున్నాడ"ని అడిగారు. దానికి వారు తమ గవర్నర్ సయీద్ బిన్ ఆమిర్ (రజి) మీద ఇలా నాలుగు ఆరోపణలు చేశారు:

"మా గవర్నర్ ఉదయం చాలా పొద్దెక్కేదాకా ఇంట్లోనుంచి బయటికిరారు" అన్నారు వారు. ఖలీఫా ఉమర్ (రజి) "ఈ ఆరోపణకు మీ సమాధానం ఏమిట"ని సయీద్ (రజి)ని ప్రశ్నించారు. దానికి గవర్నర్ సయీద్ (రజి) సమాధానమిస్తూ "ఇది నా వ్యక్తిగత విషయం. దీన్ని నేను బహిర్గతం చేయదలచుకోలేదు, అయినా తప్పడం లేదు. నా ఇంట్లో సేవకులు ఎవరూ లేరు. అంచేత ఉదయం పెందలిడే లేచి పిండి పిసికి అది నానేవరకు కాస్సేపు ఎదురుచూస్తాను. ఆ తరువాత దాన్ని రొట్టెలుగా చేస్తాను. ఆ తరువాత ఉజూచేసి ప్రజల అవసరాలు తీర్చడానికి బయటికి వస్తాను" అని చెప్పారు.

ఖలీఫా ఈమాట విన్న తరువాత "మీ రెండవ ఆరోపణ ఏమిట"ని అడిగారు. దానికి ప్రజలు "ఈయనగారు రాత్రివేళ ఎవరొచ్చి ఏమడిగినా సమాధానమే ఇవ్వరు" అని చెప్పారు. ఖలీఫా దీనికి మీ సమాధానం ఏమిటని అడిగితే గవర్నర్ సయీద్ (రజి) ఇలా చెప్పారు: "నేనీ విషయాన్ని కూడా బహిర్గతం చేయదలచుకోలేదు. కాని తప్పలేదు. నేను పగటివేళను ప్రజల కోసం, రాత్రివేళను నా ప్రభువు కోసం ప్రత్యేకించాను."

ఖలీఫా ప్రజలను, మీ మూడవ ఆరోపణ ఏమిటని అడిగారు. దానికి వారు " మా గవర్నర్‌గారు నెలలో ఒకరోజు పగలంతా ఇంట్లోనే ఉండిపోతారు, బయటికే రారు" అని ఆరోపించారు. ఖలీఫా దీనికి మీ సమాధానం ఏమిటని అడిగితే గవర్నర్ సయీద్ (రజి) ఇలా చెప్పారు: "నాదగ్గర ఒంటి మీదున్న ఈఒక్క జతబట్టలు తప్ప మరేమీ లేవు. వీటిని నేను నెలకొకసారి ఉతికి ఆరబెడ్తాను. అవి ఆరిన తరువాత తొడుక్కొని సాయంత్రం వేళ బయటికి వస్తాను."

ఖలీఫా ఈ సమాధానం విన్న తరువాత మీ నాల్గవ ఆరోపణ ఏమిటని ప్రజల్ని అడిగారు. దానికి వారు "ఈయన ఒక్కోసారి సొమ్మసిల్లి పోతారు. చుట్టపక్కల విషయాలేమీ గ్రహించలేరు" అని అన్నారు. ఖలీఫా దీనికి మీ వివరణ ఏమిటని అడిగితే సయీద్ (రజి) ఇలా చెప్పారు: "నేను ఇస్లాం స్వీకరించక పూర్వం మక్కా అవిశ్వాసులు ఖబీబ్ బిన్ అదీ (రజి)ని చిత్రహింసలు పెట్టి చంపినప్పుడు ఆ భయంకర దృశ్యం కళ్ళారా చూశాను. ఇస్లాం స్వీకరించిన తరువాత ఆ దృశ్యం నా మనోవీథిలో మెదలినప్పుడల్లా- 'అయ్యయ్యో! ఆ సమయంలో నేనేమీ చేయలేకపోయానే!! దేవుడు నన్ను ఎన్నటికీ క్షమించడు' అన్న ఆలోచన వస్తుంది. దాంతో నేను స్పృహతప్పుతాను."

ఉమర్ ఫారూఖ్ (రజి) ఇలా సయీద్ (రజి) పట్ల తనకున్న సద్భావనకు విఘాతం కల్గలేదని తెలుసుకొని తృప్తిగా నిట్టూర్పువిడిచి దైవానికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. ఆ తర్వాత ఆయన ఒకతని ద్వారా సయీద్ (రజి)కు వేయి దీనార్లు పంపించారు. అయితే సయీద్ (రజి) ఆ డబ్బును తన సొంతానికి వాడుకోకుండా పేదలకు దానంచేశారు.

(2) హమస్‌లో రాష్ట్రగవర్నర్ ఉమైర్ బిన్ సాద్ (రజి) పూర్తిగా ఒక సంవత్సరం పని చేశారు. కాని అప్పటినుంచి ఆయన ఖలీఫాకు ఉత్తరం రాయడంగాని, కేంద్ర ప్రభుత్వ

ధనాగారానికి రెవన్యూపైకం పంపడంగాని చేయలేదు. అందువల్ల ఖలీఫా ఉమర్ (రజి)కు ఆయనపై అనుమానం వచ్చి తన కార్యదర్శిని పిలిచి ఇలా ఆదేశించారు: "నా తరఫున హమస్ గవర్నర్‌కు ఇలా ఓ లేఖ రాసి పంపించు- 'విశ్వాసుల నాయకుని లేఖ అందగానే నీవు హమస్‌ను వదలిపెట్టి మదీనా వచ్చెయ్యి. వచ్చేటప్పుడు నీవు ఇప్పటిదాకా నీ రాష్ట్రంలో వసూలు చేసిన రెవెన్యూపైకం తీసుకొనిరా.'"

ఈ లేఖ అందగానే ఉమైర్ బిన్ సాద్ (రజి) రొట్టెలపాత్ర, నీళ్ళతిత్తి, ఓ ముంత భుజాన వేసుకొని, చేతిలో ఈటె తీసుకొని హమస్ నుంచి కాలినడకన బయలుదేరి మదీనా చేరుకున్నారు. సుదీర్ఘ ప్రయాణం, ఆకలిదప్పులతో ఆయన ముఖం బాగా వాడిపోయి, శిరోజాలు, గడ్డం చెరిగిపోయి దుమ్ము కొట్టుకొని ఉన్నాయి. ఖలీఫా ఉమర్ (రజి) ఆయన్ని చూడగానే నిర్ఘాంతపోయి చూస్తూ "ఉమైర్! ఏమిటీ వేషం, క్షేమంగానే ఉన్నావు కదూ?" అని అడిగారు. దానికి ఉమైర్ (రజి) "దేవుని దయవల్ల నేను క్షేమంగానే ఉన్నాను. మీ ఆజ్ఞ ప్రకారం నేను నా యావదాస్తి తీసుకొని వచ్చాను" అని అన్నారు.

"సరే, ఇంతకూ ఏం తెచ్చావు?" అడిగారు ఖలీఫా ఉమర్ (రజి). దానికి ఉమైర్ (రజి) "ఇదిగో ఇది నా రొట్టెలపాత్ర, ఇది నీళ్ళతిత్తి, ఇది నేను ఉజూ, స్నానం చేసుకునే ముంత. ఇవి తప్ప ఇతర ఐహికసంపదేదీ నాకవసరం లేదు" అన్నారు ఉమైర్ (రజి).

ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాటలు విని క్షణం పాటు నివ్వెరపోయారు. హజ్రత్ ఉమైర్ (రజి) అంతదూరం నుంచి కాలినడకన వచ్చారని తెలుసుకొని "స్వారీ కోసం ప్రభుత్వ ధనాగారం నుంచి గుర్రం ఏదీ లభించలేదా?" అని అడిగారు ఆయన. దానికి ఉమైర్ (రజి) "దానికోసం నేను కోశాధికారిని అడగలేదు. ఆయన కూడా నాకు ఎలాంటి వాహనం సమకూర్చలేదు" అని చెప్పారు. "సరే, నీవు కేంద్ర ధనాగారం కోసం తెచ్చిన పైకం ఎక్కడుంది?" అని అడిగారు ఖలీఫా. దానికి ఉమైర్ (రజి) తాను ఎలాంటి పైకం తీసుకురాలేదని చెప్పారు. ఎందుకని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు:

"నేను హమస్‌కు చేరుకోగానే అధికారుల్ని పిలిపించి వారికి శిస్తు వసూలుచేసే బాధ్యత అప్పగించాను. అలా వసూలయ్యే పైకాన్ని వారి సలహాలతోనే పేదలకు పంచిపెట్టుండేవాడ్ని." ఖలీఫా ఉమర్ (రజి) ఈ సమాధానం విని ప్రభుత్వకార్యదర్శిని పిలిచి "హమస్‌లో ఈయన గవర్నర్ పదవిని పునరుద్ధరిస్తూ ఉత్తర్వు జారీచెయ్యి" అన్నారు.

ఉమైర్ (రజి) ఈమాట విని "విశ్వాసులనాయకా! ఇప్పుడు నేనీ బాధ్యతాభారం మోయలేను" అంటూ తన అశక్తత వెలిబుచ్చారు. తర్వాత ఆయన ఖలీఫా అనుమతి తీసుకొని మదీనాశివార్లలో తన కుటుంబం నివసిస్తున్న గ్రామానికి వెళ్ళి ఉండసాగారు.

ఆ తరువాత కొన్నాళ్ళకు ఖలీఫా ఉమర్ (రజి) నమ్మకస్తుడైన హారిస్ (రజి)ని పిలిచి "నీవు ఉమైర్ ఇంటికెళ్ళి రెండుమూడు రోజులు ఆయనకు అతిథిగా ఉండి ఆయన ఆర్థిక పరిస్థితి గమనించు. ఆర్థికంగా ఆయన బాగుంటే వెంటనే వచ్చి నాకు తెలియజెయ్యి. ఒకవేళ ఆయన ఇంట్లో దారిద్ర్యం తాండవిస్తుంటే ఈ వంద దీనార్లు ఆయనకు ఇచ్చి వచ్చేసెయి" అన్నారు డబ్బుసంచి ఆయన చేతికి అందిస్తూ.



హారిస్ (రజి) మదీనా నుండి ఉమైర్ (రజి) ఇంటికి వెళ్ళి ఆయనకు అతిథిగా ఉండసాగారు. ఇలా ఆయన మూడురాత్రులు గడిపారు. ప్రతిరాత్రీ తినడానికి ఆయనకు ఉమైర్ గృహస్థులు ఒక రొట్టె ఇచ్చేవారు. మూడోరోజు ఉమైర్ (రజి) తెగమనిషి ఒకతను వచ్చి హారిస్ (రజి)తో "నీవు ఉమైర్ కుటుంబాన్ని తీవ్రమైన ఆందోళనకు గురిచేశావు. వీరి దగ్గర ఒకేఒక రొట్టె ఉంటుంది. అది నీకిచ్చి వారు పస్తులుంటున్నారు. కావాలంటే నీవు మాఇంటికొచ్చి ఉండు. అంతేగాని వీళ్ళను కష్టాల్లో పడవేయకు" అని అన్నాడు.

ఆ తరువాత హారిస్ (రజి) ఉమైర్ (రజి) దగ్గరకు వెళ్ళి ఖలీఫా ఇచ్చిపంపిన డబ్బు సంచి తీసిచూపిస్తూ "ఈ డబ్బు మీకోసం ఖలీఫా ఇచ్చారు, తీసుకోండి" అని అన్నారు. ఉమైర్ (రజి) దాన్ని చూడగానే "ఈ డబ్బు తీసికెళ్ళి ఖలీఫాకే తిరిగిచ్చెయి. ఆయనకు నా సలాం అందజేసి నాకీ పైకం అవసరం లేదని చెప్పు" అన్నారు.

ఉమైర్ (రజి) భార్య ఈ మాటలు విని "డబ్బు వాపసుచేయకండి. మీకవసరం లేకపోతే ఇక్కడ నిరుపేదలు, నిరాధారులు చాలామంది ఉన్నారు, వాళ్ళకు ఇచ్చేద్దాం" అని అన్నారు. హారిస్ (రజి) డబ్బుసంచి ఉమైర్ (రజి) ముందు వదిలేసి వెళ్ళిపోయారు. ఉమైర్ (రజి) ఆ రాత్రే ఆ డబ్బును చిన్నచిన్న సంచుల్లో పెట్టి వాటిని పేదలకు పంచారు.

హారిస్ (రజి) మదీనా తిరిగొచ్చి ఖలీఫాకు నివేదిక సమర్పించారు. ఉమైర్ (రజి) ఆ డబ్బు ఎలా వాడారని అడిగితే, హారిస్ (రజి) తనకు తెలియదని, అయితే ఆయన దాన్ని తన సొంతానికి వాడుకొని ఉండరని అన్నారు. ఖలీఫా ఈమాట విని ఒక ఉత్తరం రాసి ఉమైర్ (రజి)ని మదీనాకు రప్పించుకున్నారు.

అప్పుడాయన ఉమైర్ (రజి)ని "నువ్వా డబ్బును ఎలా వినియోగించావ"ని అడిగారు. దానికి ఉమైర్ (రజి) "మీరా డబ్బును నాకిచ్చేసిన తర్వాత ఇక దాని అవసరం మీకేమిటీ?" అని అన్నారు. "ఏమీ లేదు. ఏదో తెలుసుకోవాలని అడుగుతున్నాను, అంతే" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి). దానికి ఉమైర్ (రజి) సమాధానమిస్తూ "సంతానం, సిరిసంపదలు ఏవీ పనికిరాని రోజు ఆ డబ్బు నాకెంతో ఉపయోగపడుతుందన్న ఉద్దేశ్యంతో దాన్ని నేను పరలోకంలో జమచేశాను" అని అన్నారు.

ఈ సమాధానం వినగానే ఖలీఫా కండ్లు అశ్రుపూరితాలయ్యాయి. ఆ తరువాత ఆయన ఉమైర్ (రజి)కు ఒక బస్తా ధాన్యం, ఒక జత బట్టలు తెచ్చి ఇవ్వమని కోశాధికారిని ఆదేశించారు. ఉమైర్ (రజి) ఈమాట విని "నాకు ధాన్యం అవసరం లేదు. దేవుడు మాకు ఉపాధి ఏర్పాటు చేశాడు. కాకపోతే బట్టలు మాత్రం ఇప్పించండి. నా భార్య బట్టలు బాగా మాసి చీకిపోయాయి" అని అన్నారు. ఇదీ ఖలీఫా ఉమర్ (రజి), ఆయన గవర్నర్‌ల పరిస్థితి. ప్రజాసంక్షేమమే వారి ప్రధానోద్దేశ్యం.

(3) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన సిరియా పర్యటనలో డెమాస్కస్‌ను కూడ సందర్శించి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఓరోజు రాత్రివేళ ఆయన తన మిత్రుడు అబూదర్దా (రజి)ను కలుసుకోవడానికి ఆయన ఇంటికెళ్ళారు. లోపల చీకటిగా ఉంది. ఆ చీకటిలోనే ఇద్దరు కలుసుకొని మాట్లాడుకోసాగారు.

అదే సమయంలో ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తలగడదిండు కోసం తడుము తుంటే ఓ చిరిగిపోయిన కంబళీ చేతికి తగిలింది. ఆ తర్వాత పడక కోసం తడుముతుంటే ఇసుకలాంటి కంకర్రాళ్ళు చేతికి తగిలాయి. అక్కడే ఉన్న ఓ పల్చటి రగ్గు కూడా చేతికి తగిలింది. బహుశా ఈ రగ్గు చలికి కప్పుకునే దుప్పటి కాబోలు. కాని డెమాస్కస్‌లోని ఎముకలు కొరికే చలికి ఈ రగ్గు ఏమాత్రం పనికిరాదు.

దీన్నిబట్టి అబూదర్దా (రజి) ఎంత దారిద్ర్యంలో మగ్గుతుండేవారో అర్థమవుతుంది. అది గమనించిన ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) "దేవుడు మిమ్మల్ని కరుణించుగాక! మీ పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఈదుస్థితి నుండి బయటపడేందుకు నేను మీకు కొంత డబ్బు పంపిస్తాను" అని అన్నారు. దానికి అబూదర్దా (రజి) సమాధానమిస్తూ "మీ దగ్గర ప్రపంచసామగ్రి బాటసారి దగ్గరుండే సామగ్రిలా అవసరమైన మేరకే చాలా కొద్దిగా ఉండాల'ని దైవప్రవక్త (స) ప్రవచించిన హదీసు మీకు గుర్తులేదా?" అని అన్నారు.

"ఆ...గుర్తుంది" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి). "మరి ఆ మహానుభావుడు ఇహ లోకం వీడిపోయిన తర్వాత మనం చేస్తున్నదేమిటీ?" అడిగారు అబూదర్దా (రజి) కంట తడిపెడ్తూ. ఈమాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) కూడా భోరున విలపించారు. ఆ తర్వాత ఆయన సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

(4) ఖలీఫా సిరియా పర్యటన ముగించుకొని మదీనాకు తిరిగొస్తుంటే దారిలో ఓ ఇల్లు కన్పించింది. రాజధానికి చాలా దూరంలో ఉన్న ఆ ఇంటివారి పరిస్థితి ఎలావుందో తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. గుర్రం దిగి చూస్తే తలుపు దగ్గర ఓ ముసలమ్మ విచారంతో తల పట్టుకొని కూర్చున్నది. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆమెకు సలాం చేసి బాగున్నావమ్మా! అనడిగారు. ఆ తరువాత ఆయన మాటల సందర్భంలో "ఉమర్ పరిస్థితి ఏమిటో తెలుసుకున్నా వమ్మా!" అని అడిగారు.

దానికి ఆ ముసలమ్మ కస్సున లేచి "ఉమర్ (రజి)తో నాకేంటి పని? నా ఇబ్బందులు నాకున్నాయి. అయినా ఇప్పుడు ఉమర్ (రజి) సంగతి ఎందుకు? ఆయన సిరియా పర్యటన నుంచి తిరిగొస్తున్నాడని మాత్రం విన్నాను" అని అన్నది విసుక్కుంటూ.

"అమ్మా! ఉమర్ మాటెత్తితే ఎందుకు నీకింత కోపం?" అడిగారు ఉమర్ (రజి). దానికి ముసలమ్మ కనుబొమలు చిట్లిస్తూ "అదిగో మళ్ళీ ఉమర్ ప్రస్తావన తెస్తున్నావు! ఏం వెలగబెట్టాడేంటి ఆయన? నేనిక్కడ కడుపునిండా తిండి దొరక్క బతుకుబండి భారంగా ఈడుస్తుంటే ఉమర్ ఎప్పుడైనా నా గురించి పట్టించుకున్నాడా? నా దారిద్ర్యం చూసి జాలితో నాకేదైనా సహాయం చేశాడా? ప్రళయదినాన ఉమర్‌కు, నాకు మధ్య తీర్పు జరుగుతుంది. అప్పుడు ఉమర్ దేవుని ముందు ఏం సమాధానం చెప్పుకుంటాడో చూస్తా" అని అన్నది స్వరం కాస్త పెంచి.

ఖలీఫా ఉమర్ (రజి) ప్రళయదినం, తీర్పు మాటలు విని కాస్తంత కంగారుపడుతూ "అమ్మా! నువ్వెప్పుడైనా నీసంగతి ఉమర్ దగ్గరకు తీసికెళ్ళావా?" అని అడిగారు. దానికి ముసలమ్మ "నువ్వు భలేవాడివయ్యా! నేను నాగోడు గురించి ఉమర్ దగ్గరికెళ్ళి మొర



పెట్టుకోవాలా? నేనుండే ఈ ప్రదేశం ఆయన రాజ్యపరిధిలో లేదా? ఆయన రాజ్యపరిధి లోని ఈ ఇంటి పరిస్థితి గురించి తెలుసుకోవలసిన బాధ్యత లేదా ఆయనకు?" అని అన్నది మరింత ఉద్రేకంతో.

ఖలీఫా ఉమర్ (రజి) అనునయంగా మాట్లాడుతూ "అమ్మా! నగరానికి, జనసంచా రానికి చాలా దూరాన ఈ నిర్జన ప్రదేశంలో నివసిస్తుంటే, నీ పరిస్థితి ఉమర్‌కు ఎలా తెలుస్తుంది? కాస్త నువ్వే చెప్పు. నీదుస్థితి తెలిసికూడా పట్టించుకోకపోతే ఉమర్ నిజంగా పాపాత్ముడే అని చెప్పవచ్చు" అని అన్నారు.

దానికి వృద్ధురాలు ఇలా అన్నది: "బాబూ! చూస్తే నువ్వు చాలా బుద్ధిమంతుడిలా కన్పిస్తున్నావు. కాని ఇస్లామీయరాజ్యంలో ఉంటూ మరీఇంత అమాయకంగా మాట్లాడు తున్నావేంటీ? ఉమర్ ఇంత దూరంలో ఉన్న ప్రజల స్థితిగతులు తెలుసుకోలేకపోతే ఈ ప్రాంతాన్ని తన రాజ్యపరిధిలో ఎందుకు చేర్చుకున్నాడు? ఎక్కడదాక పరిస్థితులు తెలుసుకో గల్గుతాడో అక్కడ దాకే ఆయన తన సామ్రాజ్య సరిహద్దులు పరిమితం చేసుకోవాలి."

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వృద్ధురాలి మాటలు విని తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఆయన కళ్ళ నుంచి అశ్రుధారలు కట్టలు తెంచుకున్నాయి. కంఠం రుద్ధమై పోయింది. కాస్సేపటి తరువాత ఎలాగో నిలదొక్కుకొని "అమ్మా! నువ్ చెబుతున్నది నిజమే. ఇక నేను వెళ్ళొస్తా" అంటూ ఉమర్ (రజి) గుర్రమెక్కి బయలుదేరారు.

## ♦ భావప్రకటనా స్వేచ్ఛ

హజ్రత్ ఉమర్ (రజి) ప్రజలకు షరీఅత్ పరిధిలో పూర్తి భావప్రకటనా స్వేచ్ఛ ఇచ్చారు. చివరికి ఖలీఫాగా తన వ్యక్తిత్వంపై తీవ్ర విమర్శలు చేసినా దాన్ని కూడా సహించేవారు. పైగా అలాంటి విమర్శలు చేసినవారిని ఆయన ప్రోత్సహించారు కూడా.

(1) ఒకసారి ఉమర్ ఫారూఖ్ (రజి) మసీదులో ప్రసంగవేదికపై నిల్చొని ఉపన్యసిస్తూ "ఒకవేళ నేను ప్రాపంచిక వ్యామోహం వైపుకు మొగ్గితే మీరేం చేస్తారు?" అని ప్రశ్నించారు. అప్పుడొక మనిషి లేచి వర నుంచి ఖడ్గం లాగి "అప్పుడు మేము ఖడ్గంతో మీ శిరస్సు ఖండిస్తాం" అన్నాడు నిర్భయంగా. దానికి ఖలీఫా ఉమర్ (రజి) అతని వైపు ఉరిమిచూస్తూ "ఏమిటీ, (నా హోదా, స్థాయి తెలిసి కూడా) నా గురించేనా నువ్వీ మాటలు అంటున్నది?" అని అన్నారు. "ఔను, మీ గురించే నేనిలా మాట్లాడుతున్నాను" అన్నాడా వ్యక్తి అదురు బెదురు లేకుండా. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) 'అల్‌హమ్దులిల్లాహ్' అంటూ దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ "నేను వక్రమార్గాన నడిస్తే నన్ను సరైన గాడిలో పెట్టేవారు కూడా మన జాతిలో ఉన్నారు" అని అన్నారు.

(2) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) యువకులకు వివాహం కావడం కష్టమైపోయేలా మహర్ (వధువు హక్కు) హద్దూపద్దూ లేకుండా పెరిగిపోతుండటంతో ఆయన 'మహర్'పై పరిమితి విధించాలని నిర్ణయించుకున్నారు. అంచేత ఓసారి ఆయన జుమాప్రసంగం చేస్తూ వివాహంలో నాల్గొందల దిర్హంలకు మించి మహర్ చెల్లించడానికి అనుమతి ఇవ్వకూడదని ప్రతిపాదన చేశారు. వెంటనే ఒక స్త్రీ లేచి "అలా ఆదేశించే అధికారం

మీకు లేదు. ఖుర్‌ఆన్ మహర్‌గా ఎంత పెద్ద ధనరాసి ఇవ్వడానికైనా అనుమతిస్తుంటే దానికి హద్దు లేర్పరచేందుకు మధ్యలో మీరెవరు?" అని విమర్శించింది. ఖలీఫా ఉమర్ (రజి) తక్షణమే తన ప్రతిపాదన ఉపసంహరించుకున్నారు.

(3) మరొకసారి ఆయన్ని సల్మాన్ ఫార్సి (రజి) నిండుసభలో పట్టుకొని "అందరికీ లెక్క ప్రకారం ఒక్కొక్క దుప్పటే వచ్చింది కదా, మరి మీరు ఇంత పెద్ద చొక్కా ఎలా కుట్టించుకున్నారు? దానికి రెండు దుప్పట్లయితేగాని సరిపోదు" అని అడిగారు. ఉమర్ ఫారూఖ్ (రజి) భారీకాయంగల ఎత్తయిన మనిషి. అందువల్ల ఆయన చొక్కా కుట్టించు కోవడానికి తన భాగానికి వచ్చిన దుప్పటి సరిపడనందున తన కుమారుడు అబ్దుల్లా (రజి) వాటాకు వచ్చిన దుప్పటి అడిగితీసుకొని చొక్కా కుట్టించుకున్నారు. ఆ విషయమే ఆయన తన కుమారుని చేత చెప్పించారు.

(4) ఖలీఫా ఉమర్ (రజి) ఓరోజు తన సహచరులు కొందరిని వెంటబెట్టుకొని ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఒక వృద్ధమహిళ ఆయన్ని కలసి "మీతో మాట్లాడాలి, కాస్త ఆగండి" అన్నది. ఉమర్ (రజి) ఆమెకు సలాంచేసి, ఆగి ఆమె మాటలు వినడానికి సిద్ధమయ్యారు. అప్పుడా స్త్రీ ఇలా అన్నది:

"ఓహో ఉమర్! ఎంత మారిపోయావు!! ఒకప్పుడు నువ్వు ఉకాజ్ బజారులో తిరుగు తుంటే చూశాను. అప్పుడు నిన్ను జనం ఉమైర్ అని పిలిచేవారు. నువ్వు చేతిలో కర్ర తీసుకొని మేకలు కాస్తుండేవాడివి. తర్వాత ఎంతోకాలం గడవలేదు, జనం నిన్ను ఉమర్ అని పిలవడం ప్రారంభించారు. ఆతర్వాత కొంతకాలానికి (అంటే) ఇప్పుడు నువ్వు అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) అని పిలవబడుతున్నావు. ప్రజల విష యంలో కాస్త దేవునికి భయపడుతూ మసలుకో. ఒక విషయం గుర్తుంచుకో, దేవుని శిక్షకు భయపడేవానికి సుదూరవ్యక్తి కూడా దగ్గరి బంధువులా మారిపోతాడు. చావుకు భయపడేవాడు తాను కాపాడుకోవాలనుకున్న వస్తువునే పోగొట్టుకునే ప్రమాదం ఉంది."

ఉమర్ (రజి) వెంట ఉన్న ఒకతను ఆ స్త్రీ వైఖరి సహించలేక "నువ్వు మన అమీరుల్ మోమినీన్ (ఖలీఫా) ముందు హద్దుమీరి మాట్లాడుతున్నావు" అన్నాడు.

ఉమర్ ఫారూఖ్ (రజి) అతడ్ని వారిస్తూ "ఆమెను చెప్పనివ్వు. అసలీమె ఎవరో నీకు తెలుసా? ఈమె ఫిర్యాదుమాటలు సప్తాకాశాలపై ప్రతిధ్వనించాయి. దైవసాక్షి! ఈమె ఇలా నన్ను రాత్రిపొద్దు పోయేదాకా నిలబెట్టినాసరే నేను నిలబడతాను. కాకపోతే నమాజ్ వేళలప్పుడు మాత్రం నా అశక్తతను తెలుపుకుంటాను" అని అన్నారు. ఈ మహిళే హజ్రత్ ఖౌలా-రజి. (ఖతాదా, బైహఖి)

## ♦ చట్టం అందరికీ సమానమే

(1) ఓసారి ఇరాఖ్‌లోని ఒక పట్టణంపై ముస్లింల సుదీర్ఘముట్టడి సాగింది. అలాంటి పరిస్థితిలో ఓరోజు ముస్లిం సైన్యంలోని ఒక బానిస సైనికుడు తాను పట్టణవాసులకు రక్షణహామీ ఇస్తున్నట్లు ఒక కాగితంలో రాసి దాన్ని బాణం ద్వారా పట్నంలోకి విసురుతాడు. ఈ విషయం తెలియని ముస్లింయోధులు మరుసటి రోజు పట్టణంపై దాడిచేయడానికి



సిద్ధమవుతారు. అప్పుడు పట్టణవాసులు రక్షణహామీ పత్రం తీసుకొని బయటికి వచ్చి "ఒక ముస్లిం మాకు రక్షణహామీ పత్రం రాసిచ్చాడు కదా, ఇక మీరెందుకు మాపై దాడి చేయడానికి వచ్చారు?" అని అడుగుతారు.

ముస్లిం సేనాపతి అబూమూసా అష్‌అరీ (రజి) రక్షణహామీ పత్రం చూసి, ఒక బానిసయోధుడు రాసిచ్చిన హామీపత్రానికి ఎంత విలువుంటుందో, అతని రక్షణహామీని అమలుపరచవచ్చా లేదా అని ఆలోచనలో పడిపోయారు. ఆ విషయం గురించి ఖలీఫాకు లేఖరాస్తే దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) సమాధానమిస్తూ "బానిస ముస్లిం కూడా ఇతరముస్లింల వంటివాడే. ఇతరముస్లింల బాధ్యతలకు ఎంత విలువుంటుందో బానిసముస్లిం బాధ్యతకు కూడా అంతే విలువ ఉంటుంది. కనుక ఆ బానిససైనికుడు ఇచ్చిన రక్షణహామీని అమలుపరచాలి" అని ఆజ్ఞాపించారు.

(2) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) దగ్గర చాల ధనం పోగయిఉందని ఆరోపణ రావడంతో ఖలీఫా ఉమర్ (రజి) "గవర్నర్ పదవికి పూర్వం మీదగ్గర ఇంత ధనం ఉండేది కాదు, ఇప్పుడీ ధనం మీకు ఎక్కడ్నుంచి వచ్చింద"ని వివరణ కోరుతూ ఆయనకు లేఖ రాశారు. దానికి అమ్ర్ బిన్ ఆస్ (రజి) సమాధానమిస్తూ "నా రాష్ట్రం సారవంతమైన ప్రాంతం. అంచేత నాదగ్గర నాఖర్చులు పోను చాలా డబ్బు మిగులు తుంది" అని అన్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ సమాధానంతో సంతృప్తిచెందక విచారణ కోసం ముహమ్మద్ బిన్ మస్లమాకు సర్వాధికారలిచ్చి ఈజిప్టు పంపారు. ముహమ్మద్ (రజి) ఈజిప్టు వెళ్ళి అమ్ర్ బిన్ ఆస్ (రజి) గత ఆస్తి విలువెంతో, దానిపై ఎంత ఆదాయం వస్తుందో లెక్కకట్టి అదంతా పోగా మిగిలిన ధనాన్ని జప్తు చేసుకొని ప్రభుత్వ ధనాగారంలో జమచేశారు. ఎంతో విశాలమైన రాష్ట్రానికి గవర్నర్ అయిన అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇదంతా చూసి కూడా నోరు మెదపలేక పోయారు.

(3) ఓరోజు ఖలీఫా ఉమర్‌ఫారూఖ్ (రజి) బజారున నడచివెళ్తుంటే ఒకతను వచ్చి "ఉమర్! అధికారుల పని నిర్వహణ కోసం కొన్ని నిబంధనలు నిర్ణయించినంత మాత్రాన నీవు దైవశిక్ష నుండి తప్పించుకోగలవని భావిస్తున్నావా? దక్షిణ ఈజిప్టు పాలనాధికారి అయాజ్ బిన్ గనమ్ (ఖరీదైన) సన్నని బట్టలు ధరిస్తున్నాడు; ఇంటి ద్వారం దగ్గర ద్వారపాలకుడ్ని పెట్టుకున్నాడు"అని అన్నాడు. ఉమర్‌ఫారూఖ్ (రజి) ఈమాట విన్న తర్వాత ముహమ్మద్ బిన్ మస్లమాను పిలిచి "నీవు తక్షణమే ఈజిప్టుకు వెళ్ళి అయాజ్‌ని ఉన్న పళంగా పిలుచుకురా" అని ఆదేశించారు. ఈఆజ్ఞ ప్రకారం ముహమ్మద్ బిన్ మస్లమా ఈజిప్టుకు వెళ్ళిచూస్తే అయాజ్ సన్నటిబట్టలు ధరించడం, ఆయన ఇంటిముందు ద్వారపాలకుడు ఉండటం కన్పించాయి. ఆ తర్వాత ఆయన అయాజ్‌ని మదీనాకు పిలుచుకొచ్చారు.

అప్పుడు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అయాజ్ వంటిమీది ఖరీదైన సన్నబట్టలు తీసేసి ముతకబట్టలు ధరింపజేశారు. తరువాత ఓ మేకలమంద తెప్పించి "ఈ మేకలమందను అడవికి తోలుకెళ్ళి కాస్తుండు" అని ఆదేశించారు. పాపం అయాజ్ పరిస్థితి మింగలేక, కక్కలేక అన్నట్లయింది. ఆ అవమానం భరించలేక "ఇంతకంటే

చావడం మంచిది" అన్నారు గొణుక్కుంటూ. ఉమర్ ఫారూఖ్ (రజి) ఆయన వాలకం చూసి "మేకలు కాయడానికి ఎందుకు సిగ్గుపడుతున్నావు? మేకలు కాస్తుండటం వల్లనే కదా మీనాన్నకు గనమ్ అనే పేరు పడింది" అని అన్నారు. చివరికి అయాజ్ బిన్ గనమ్ పశ్చాత్తాపంతో దైవాన్ని క్షమాపణ వేడుకొని ఆరోజు నుంచి జీవితాంతం తన విధుల్ని సక్రమంగా నిర్వహించారు.

(4) బస్రా గవర్నర్ ముగీరా బిన్ షాబా (రజి)కు ఒక స్త్రీతో అక్రమసంబంధం ఏర్పడిందని ఖలీఫా దర్బారులో ఆరోపణ వచ్చింది. ఖలీఫా ఉమర్ (రజి) వెంటనే అబూమూసా అష్అరి (రజి)ని పిలిపించి "బస్రాలో షైతాన్ నివాసం ఏర్పరచుకున్నాడు. మీరక్కడికి వెళ్ళి పరిస్థితి పరిశీలించి సాక్షులతోసహా ముగీరాను మదీనా పంపండి"అని ఆదేశించారు. ఈ ఆజ్ఞ ప్రకారం ముగీరా (రజి) మదీనా పంపబడతారు. న్యాయస్థానంలో విచారణ ప్రారంభమవుతుంది. కాని నలుగురు సాక్షుల్లో ఒక సాక్షి తానా స్త్రీని సరిగ్గా చూడలేదని చెప్పడంతో నేరం రుజువుకాలేదు. దాంతో ఉమర్ (రజి) ముగీరా (రజి)ను విడుదల చేస్తారు. విడుదలచేస్తూ "సాక్ష్యం పూర్తయితే (నేరారోపణ నిజమని తేల్తే) నేను మీకు శిలాశిక్ష విధించి హతమార్చేవాడ్ని" అని అన్నారు.

ముగీరా (రజి) ప్రవక్త ముఖ్యఅనుచరుల్లో ఒకరు. రాజకీయంగా, యుద్ధ పరంగా ఇస్లాంకు గొప్ప సేవలు అందజేశారు. ఆనాటి అరేబియాలో నలుగురు ప్రముఖ యుద్ధ వ్యూహకర్తల్లో ఈయన ఒకరు. ఈవిధంగా ముగీరా గొప్ప ప్రజానాయకునిగా, యుద్ధతాంత్రికునిగా, బస్రారాష్ట్ర గవర్నర్‌గా పేరుగాంచారు. కాని అవేవీ ఇస్లామీయ న్యాయస్థానంలో ఆయనకు ఏమాత్రం ఉపయోగపడలేదు.

(5) ఈజిప్టుగవర్నర్ (అమ్ర్ బిన్ ఆస్) కొడుకు అబ్దుల్లా ఓసారి ఒక వ్యక్తిని అకారణంగా కొట్టాడు. ఈ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ (రజి) ఆ వ్యక్తి చేత అబ్దుల్లాను అదే విధంగా కొట్టించాలని ఆదేశించారు. ఈ ఆదేశం ప్రకారం ఆ వ్యక్తి అబ్దుల్లాపై కొరడా ఝుళిపించి ప్రతీకారం తీర్చుకున్నాడు. పాపం గవర్నర్ గారు హృదయాన్ని కలచివేసే ఆ దృశ్యాన్ని బిక్కమొగం వేసుకొని చూడటం తప్ప ఏమీ చేయలేక పోయారు.

(6) ఒకసారి ఖలీఫా (రజి) హజ్ సందర్భంలో గవర్నర్‌లందర్నీ మక్కా పిలిపించి ఇతర హాజీలతో పాటు సమావేశపరిచారు. అప్పుడు ఆయన ప్రజలను సంబోధిస్తూ "ఈ గవర్నర్ల ప్రవర్తన పట్ల మీకేదైనా అభ్యంతరాలుంటే నాముందు నిస్సంకోచంగా ఫిర్యాదు చేయవచ్చు" అని అన్నారు. అప్పుడా సమావేశం మొత్తంలో కేవలం ఒక్క మనిషి లేచి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)పై ఫిర్యాదుచేస్తూ "ఈయనగారు నన్ను అన్యాయంగా వంద కొరడాదెబ్బలు కొట్టించారు" అని అన్నాడు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "అయితే ఇతని దగ్గరకు వచ్చి ఆ దెబ్బలకు బదులుతీర్చుకో" అని అన్నారు.

ఖలీఫా ఆదేశం వినగానే గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) తన నిరసన వ్యక్తపరుస్తూ "గవర్నర్‌ల విషయంలో దయచేసి ఈ పద్ధతి అవలంబించకండి" అని అన్నారు. దానికి ఉమర్‌ఫారూఖ్ (రజి) "స్వయంగా దైవప్రవక్త (స) తన విషయంలోనూ ఇతరులకు



బదులుతీర్చుకునే అవకాశమిచ్చినట్లు నేను చూశాను" అని చెప్పి, దెబ్బలు తిన్న ఆ వ్యక్తిని ఉద్దేశించి 'బదులుతీర్చుకో' అని మరొకసారి ఆదేశించారు. చివరికి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఆ పీడితునికి ఒక దెబ్బకు రెండు వరహాలు చొప్పున మొత్తం రెండొందలు వరహాలు జరిమానా చెల్లించి తన వీపును కాపాడుకోవలసి వచ్చింది.

(7) ఖలీఫా కుమారుడు అబూసెహ్మా ఈజిప్టులో ఒకసారి (సహవాస దోషంతో) సారా తాగి సాధారణ నేరస్థుడిలా పట్టుబట్టారు. అప్పుడు ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అతనికి ఎనభై కొరడా దెబ్బలు కొట్టాలని ఈజిప్టు గవర్నర్‌ని ఆదేశించారు. కాని గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) నేరస్థుడు ఖలీఫా కుమారరత్నం అయినందున ఇతర నేరస్థులకు మాదిరి కఠినంగా కాకుండా కొరడా అంటీఅంటనట్లు ఎంతో తేలిగ్గా కొట్టించారు.

ఈ సంగతి తెలిసి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) వెంటనే అబూసెహ్మాను మదీనా పంపమని ఈజిప్టు గవర్నర్‌ను ఆదేశించారు. అబూసెహ్మా (రజి) మదీనా వచ్చిన తరువాత స్వయంగా ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) కన్నకొడుకని కూడా కనికరించకుండా ఆయన్ని ఇతర నేరస్థులను కొట్టినట్లే, కాదు అంతకన్నా గట్టిగానే కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక పాపం ఆ యువకుడు ప్రాణం వదిలాడు. ఆ తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) హృదయంలో సహజసిద్ధమైన పితృవాత్సల్యం అప్రయత్నంగా పెల్లుబికింది. అది కళ్ళ నుండి అశ్రుబిందువుల రూపంలో జాలువారింది.

## ♦ జిమ్మీల పట్ల సత్ప్రవర్తన

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ముస్లింలు అనేక దేశాలు జయించారు. కాని ఏ పరాజిత ప్రాంతంలోనూ ముస్లిమేతరుల ఆరాధనాలయాలను పడగొట్టడం జరగలేదని, వాటిని యధాతథంగా ఉంచడం జరిగిందని ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మలై) తన గ్రంథం 'కితాబుల్‌ఖిరాజ్'లో పేర్కొన్నారు.

(1) ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చే ప్రాంతాలలోని ముస్లిమేతరుల నుండి ఇస్లామీయ ప్రభుత్వం జిజ్యా (రక్షణరుసుం) వసూలుచేస్తుంది. దాంతోపాటు పంట పొలాలు, తోటలలో వచ్చే రాబడి నుండి శిస్తు వసూలుచేస్తుంది. ముస్లింల నుండి జకాత్ (పేదల ఆర్థికహక్కు)తో పాటు పొలాలు, తోటలలో వచ్చే రాబడి నుండి 'ఉష్ర్' వసూలు చేస్తుంది. ముస్లింల నుండి వసూలుచేసే ఈ జకాత్, ఉష్ర్‌ల రాబడి జిమ్మీల నుండి వసూలుచేసే జిజ్యా, శిస్తుల రాబడి కంటే అధికంగా ఉంటుంది. వృద్ధాప్యం, ఇతర బలహీనతల కారణంగా ఎలాంటి సంపాదన లేనివారు ముస్లిములైనా, ముస్లిమేతరులైనా అలాంటివారికి ప్రభుత్వ ధనాగారం నుండి పింఛన్ లభిస్తుంది.

జిమ్మీలకు ఇస్లామీయ ప్రభుత్వం రక్షణ కల్పించలేని పరిస్థితులు ఎదురైతే రక్షణ రుసుంగా వసూలుచేసిన జిజ్యా పైకాన్ని వారికి వాపసు ఇవ్వడం కూడా జరిగేది. ఎర్మూక్ యుద్ధ సమయంలో ముస్లింలు హమస్ పట్టణం వదలి వెళ్తున్నపుడు హమస్‌వాసులైన యూదులకు, క్రైస్తవులకు జిజ్యాపైకం వాపసుచేశారు. అప్పుడు హమస్‌వాసులు ముస్లింల సత్ప్రవర్తన పట్ల ఎంతో ప్రభావితులయ్యారు. యూదులు తౌరాత్ గ్రంథం చేతిలోకి

తీసుకొని "మేము జీవించి ఉన్నంతవరకు రోమన్లు ఈ పట్టణంలోకి అడుగుపెట్టలేరు" అని అన్నారు. క్రైస్తవులు కంట తడిపెడుతూ "దైవసాక్షిగా చెబుతున్నాం. రోమన్ల కంటే మీరే మాకు ఎక్కువ ప్రియమైన వాళ్ళు" అని అన్నారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో జిమ్మీలలో ఎవరైనా ఒక సంవత్సం పాటు ముస్లింలతో కలసి శత్రుసేనలతో యుద్ధం చేస్తే వారి నుండి జిజ్యా వసూలుచేయడం జరిగేది కాదు. ఒకవేళ జిమ్మీలు ముస్లింలలో అరాచకం, దౌర్జన్యాలకు పాల్పడితే వారిని వేరే ప్రాంతాలకు బహిష్కరించడం జరిగేది. అయితే అప్పుడు వారి స్థిరాస్తులకు ప్రభుత్వం డబ్బు చెల్లించి మరీ వారిని వేరే ప్రాంతాలకు పంపివేసేది.

(2) హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఒకసారి ఓ పెద్దమొత్తం జిజ్యాధనం వచ్చింది. ఉమర్ ఫారూఖ్ (రజి) అంత పెద్ద ధనరాసి చూసి వసూలు చేసితెచ్చిన వారితో "మీరు ప్రజలను నాశనం చేశారు" అన్నారు. దానికి జిజ్యా వసూలు చేసి తెచ్చినవారు "దైవసాక్షి! మేము జిమ్మీల పట్ల చాలా మృదువుగా వ్యవహరించి వసూలుచేశాం" అని చెప్పారు. హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) "వారిని కొట్టకుండా, నిర్బంధించకుండా వసూలుచేశారా?" అని అడిగారు. దానికి వారు "కొట్టకుండా, నిర్బంధించకుండానే వసూలుచేశాం" అన్నారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) దాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమచేయడానికి అనుమతించారు.

(3) ఖలీఫా ఉమర్ (రజి) దగ్గరికి ఇరాఖ్‌నుండి రెవెన్యూపైకం వచ్చినప్పుడు కూఫా నుండి పదిమంది, బస్రా నుండి పదిమంది ఉన్నతాధికారులు రాజధానికి వచ్చేవారు. వారు ఖలీఫా ముందు నాలుగుసార్లు దేవుని పేరుతో ప్రమాణంచేస్తూ "మేము ఏ ముస్లింపై, ఏ జిమ్మీ (ముస్లిమేతరుని)పై దౌర్జన్యం చేసి ఈ ధనం వసూలుచేయలేదు" అని చెప్పేవారు. (ఖిలాఫత్ ఓములూకియత్-కితాబుల్‌ఖిరాజ్)

(4) ఉమర్ (రజి) పాలనలో బకర్ బిన్ వాయిల్ తెగకు చెందిన ఒక ముస్లిం హైరా(ప్రాంతాని)కి చెందిన ఒక జిమ్మీని చంపాడు. అప్పుడు ఉమర్ (రజి) హంతకుడ్ని హతుని వారసులకు అప్పగించమని ఆదేశించారు. దాని ప్రకారం హంతకుడ్ని హతుని వారసులకు అప్పగిస్తే వారతడ్ని హతమార్చారు. (బుర్హాన్)

(5) ఖలీఫా ఉమర్ (రజి) జెరూసలేం వాసులకు రాసిచ్చిన ఒడంబడిక పత్రంలో విషయాలు ఇలా ఉన్నాయి: "వారికి, వారి ధనప్రాణాలకు, చర్చీలకు-సిలువలకు, వారి ఆరోగ్యవంతులకు-వ్యాధిగ్రస్తులకు రక్షణహామీ ఉంది. ఈ రక్షణహామీ ఏలియా సముదాయానికంతటికీ ఉంది. వారి చర్చీలను ముస్లింల ఇండ్లుగా మార్చేయడం లేదా ధ్వంసంచేయడం, వారి ఆవరణలను-భవనాలను తగ్గించడం, వారి సిలువలకు, ఆస్తి పాస్తులకు నష్టం కలిగించడం, మతవ్యవహారంలో వారిని బలవంతం చేయడం, వారికి ఏవిధమైన బాధా పెట్టడంజరగదని హామీ ఇస్తున్నాం." (కితాబుల్‌ఖిరాజ్)

(6) ఒకరోజు ఒక వృద్ధుడు వీధిలో బిక్షం అడుక్కుంటుంటే ఖలీఫా ఉమర్ (రజి) చూసి "ఎవరు నాయనా నువ్వు?" అని అడిగారు. దానికా వ్యక్తి "నేనొక యూదుడ్ని. జిజ్యా చెల్లించడానికి, తిండి-బట్ట కోసం బిక్షం అడుక్కుంటున్నాను" అని అన్నాడు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "తాతా! మేము నీకు న్యాయం చేకూర్చలేదు. యుక్తవయసులో ఉన్నప్పుడు మేము నీ నుండి జిజ్యా వసూలుచేశాము. కాని వృద్ధాప్యంలో నిన్నీ దుస్థితిలో వదిలేశాము" అని చెప్పి అతడ్ని చేయిపట్టుకొని తమ ఇంటికి పిలుచుకువెళ్ళారు. తన చేతులతో అతనికి అన్నం తినిపించారు. తరువాత "ఈ వృద్ధుడు, ఇలాంటి వృద్ధులందరి కనీసవసరాల కోసం తక్షణమే పింఛన్లు నిర్ణయిం చండి" అని కోశాధికారికి ఉత్తర్వు జారీచేశారు.



(7) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) తన అభిమతానికి వ్యతిరేకంగా తన ఇంటిని ఆక్రమించుకొని మస్జిద్‌లో కలిపేశాడని ఈజిప్టు నుంచి ఓ స్త్రీ ఖలీఫా ఉమర్ (రజి)కు ఫిర్యాదు చేసింది. ఖలీఫా ఉమర్ (రజి) వెంటనే ఈ ఆరోపణ గురించి సంజాయిషీ ఇవ్వాలని ఈజిప్టు గవర్నర్‌కు ఉత్తర్వు జారీచేశారు. దానికి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇలా సమాధానమిచ్చారు:

"(కొత్తగా ఇస్లాం స్వీకరించి ముస్లిములైపోయిన కారణంగా) భక్తుల సంఖ్య పెరిగిపోవడం వల్ల మస్జిద్‌ని విస్తరించవలసి వచ్చింది. మస్జిద్ విస్తరణ కోసం మస్జిద్‌కు ఆనుకొనివున్న ఆ స్త్రీ ఇంటిని స్వాధీనం చేసుకొని మస్జిద్‌లో కలిపేయవలసి వచ్చింది. ఇంటి ధర మార్కెట్‌ధర కంటే చాలా ఎక్కువ చెల్లించడానికి మేము ముందుకొచ్చినా ఆమె అందుకు అంగీకరించలేదు. అంచేత మేము విధిలేక ఆమె ఇంటిని బలవంతంగా పడగొట్టి మస్జిద్‌లో కలిపేయవలసి వచ్చింది. ఇంటి ధరను ప్రభుత్వధనాగారంలో జమచేశాము. ఆమె ఎప్పుడు కావాలంటే అప్పుడా పైకం ఆమె మా దగ్గర్నుండి తీసుకోవచ్చు."

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఇచ్చిన ఈ వివరణ సమంజసంగానే ఉంది. ఈనాటి చట్టాలు కూడా అందుకు అనుమతిస్తున్నాయి. ప్రజాహిత కార్యాల కోసం, ట్రాఫిక్ సౌలభ్యాల కోసం ఏవైనా ఇండ్లు, దుకాణాలు అడ్డుగా ఉంటే అలాంటి కట్టడాల యజమానులకు సముచిత ధర చెల్లించి వాటిని స్వాధీనం చేసుకొని పడగొట్టేందుకు ఈనాటి చట్టాలు అనుమతిస్తున్నాయి.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అందుకు ఏమాత్రం అంగీకరించలేదు. ఆ స్త్రీ ఇంటిని స్వాధీనం చేసుకొని మస్జిద్ విస్తరణలో భాగంగా నిర్మించబడిన నూతనభవనాన్ని వెంటనే పడగొట్టాలని, ఆమె ఇంటిని పూర్వం ఉన్న మాదిరిగా పునర్నిర్మించి ఆమెకు తిరిగి స్వాధీనం చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశంతో ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) మసీదు కొత్తకట్టడాన్ని పడగొట్టి ఆ స్థలంలో పూర్వమున్న మాదిరిగా ఇల్లు కట్టించి ఆమెకు స్వాధీనం చేశారు.

## ♦ మూఢనమ్మకాల ఖండన

(1) ఉమర్ ఫారూఖ్ (రజి) బహుదైవారాధన (షిర్క్)కు సంబంధించిన ఛాయను కూడా సహించేవారు కాదు. దైవప్రవక్త (స) ఓసారి మక్కా శివార్లలోని హుదైబియా

ప్రాంతంలో ఒక చెట్టు క్రింద నిల్చొని అనుచరుల్ని ధర్మపోరాటానికి ప్రేరేపిస్తూ వారి చేత శపథం చేయించారు. ప్రవక్తకాలంలో ఆ చెట్టుకు అంతకుమించి మరెలాంటి ప్రాముఖ్యం లేదు. కాని ఆతర్వాత ఉమర్ (రజి) పాలనాకాలంలో ప్రజలు దాన్ని పవిత్రమైన శుభవృక్షంగా భావించి సందర్శనం కోసం సుదూరప్రాంతాల నుంచి కూడా రావడం ప్రారంభించారు. ఉమర్ (రజి) ఈసంగతి విని ఎంతోఆందోళన వెలిబుచ్చారు. భవిష్యత్తులో ఈ వ్యాధి ముదిరి 'షిర్క్'కు దారి తీయవచ్చని భావించి, వెంటనే ఆయన కొందరు మనుషుల్ని పంపి ఆ చెట్టును కూకటివేళ్ళతో సహా నరికివేయించారు.

(2) మరొకసారి హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) కాబాయాత్ర చేసి తోటియాత్రికులతో కలసి మదీనా తిరిగి వస్తుంటే దారిలో ఒక మసీదు వచ్చింది. దాన్ని చూడగానే జనం ఎంతో ఉత్సాహంతో ఆ మసీదులో నమాజ్ చేయడానికి అటుగా పరుగెత్తారు. ఆ మసీదులో దైవప్రవక్త (స) ఓసారి నమాజ్ చేశారు. అంచేత ప్రజలు దానికి ఎంతో ప్రాముఖ్యం ఇవ్వసాగారు. అయితే ఉమర్ (రజి)కు ఈ వైఖరి కూడా నచ్చలేదు. ఆయన వారితో "గ్రంథప్రజలు తమ ప్రవక్తల సమాధుల్ని, వారి స్మారకచిహ్నాలను ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. కేవలం ఈ కారణంగానే వారు నాశనమయ్యారు. మీరు కూడా ఇలాంటి అవాంఛనీయ పనులకు పాల్పడి చేజేతులా నాశనం కొని తెచ్చుకోకండి" అని హెచ్చరించారు.

(3) పూర్వకాలంలో ఈజిప్టువాసులు (ఖబ్తీలు) నైలు నదిని దేవతగా నమ్మేవారు. వారు ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక నెలలో పన్నెండవ తేదీన ఒక కన్యను వధువుగా చేసి నైలునదిలో పడవేసేవారు. ఇలా ప్రతి సంవత్సరం ఒక కన్యను బలివ్వకపోతే నైలు నది ఆగ్రహించి నీటిని ఇవ్వడం మానేస్తుందని వారి నమ్మకం.

ఈజిప్టు ముస్లింల అధీనంలోకి వచ్చిన తరువాత ఆ ప్రత్యేక నెల రాగానే ఈజిప్టు వాసులు అక్కడి గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) దగ్గరికి వచ్చి నైలునదికి కన్యను బలివ్వడానికి అనుమతించమని అభ్యర్థించారు. అమ్ర్ బిన్ఆస్ (రజి) వారికి నచ్చజెబుతూ, ఇవన్నీ వట్టిమాటలని, ఇలా ఒక మనిషి ప్రాణాలు తీయడం ఇస్లాం అనుమతించదని చెప్పారు. ఈమాట విని ప్రజలు తిరిగి వెళ్ళిపోయారు.

కాని యాదృచ్ఛికంగా ఆ సంవత్సరం నైలు నది ఎండిపోయింది. నీరు రాలేదు. దాంతో ఆ ఏడు పొలాలు ఎండిపోయాయి. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. క్షామం వల్ల వారు స్వదేశం వదలిపోసాగారు. గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) జరిగినదంతా ఖలీఫా ఉమర్ (రజి)కు తెలియజేశారు. దానికి ఆయన ఇలా జవాబిచ్చారు: 'మీరు ఖబ్తీలతో నిజం పలికారు. నేనొక ఉత్తరం పంపుతున్నాను. మీరు దానిని నైలునదిలో పడేయండి." ఆ ఉత్తరంలో ఇలా వ్రాసి ఉంది:

"దేవుని దాసుడైన విశ్వాసుల నాయకుడు నైలునదికి వ్రాయడం: నైలునదీ! నీ ఇష్టప్రకారం పారుతుంటే పారడం మానెయ్యి వచ్చు. అలాకాకుండ దేవుని పట్ల విధేయత కలిగివుండి ఆయన ఆజ్ఞ ప్రకారం పారుతుంటే వెంటనే పారడం ప్రారంభించు."



ఈ ఉత్తరం నైలునదిలో పడవేయబడింది. దైవాజ్ఞ వల్ల మళ్ళీ నైలునది ప్రవహించడం ప్రారంభమయింది. మునుపెన్నడూ లేని విధంగా అందులో నీళ్ళు వచ్చాయి. ఆ తరువాత నైలు నది మరెప్పుడూ ఎండిపోలేదు.

## ♦ ఆర్థిక పరిస్థితి, నిరాడంబరత

(1) ఖలీఫా ఉమర్ (రజి) ఓ ప్రసంగంలో తనహోదాను గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "మీ (ప్రజా)ధనంతో నాసంబంధం ఒక అనాథధనంతో అతని సంరక్షకునికున్న సంబంధం వంటిదే. నేను స్థితిపరుడినైతే ఇందులో నుంచి చిల్లిగవ్వ కూడా తీసుకోను; పేదవాడినైతే నాసేవకు లభించేటంత ప్రతిఫలమే తీసుకుంటాను. మీ హక్కులు కొన్ని నాపై ఉన్నాయి. వాటిని గురించి మీరు నన్ను డిమాండ్ చేయవచ్చు. మీ ఆదాయం నుండి, 'ఫై'(సమరసొత్తు) రూపంలో దైవం మీకిచ్చిన సంపద నుండి (ప్రభుత్వ) రెవెన్యూ ఖాతాకు రావలసిన దానికంటే ఎక్కువ పన్నులు నేను వసూలు చేయను. ధర్మసమ్మతమైనంత పన్ను మాత్రమే రాబట్టడం నాబాధ్యత. నా చేతికొచ్చే ధనాన్ని నేను ధర్మసమ్మతంగా తప్ప మరేవిధంగాను ఖర్చుచేయకుండా ఉండేలా మీరు నన్ను అదుపులో ఉంచవచ్చు. ఇది నామీద మీకున్న హక్కు." (అల్‌జిహాద్ ఫిల్‌ఇస్లాం)

(2) ప్రభుత్వంలో పాలనాబాధ్యత ఇవ్వబడిన వ్యక్తికి ప్రభుత్వ ధనాగారం నుండి లభించే హక్కులు గురించి దైవప్రవక్త (స) ఇలా చెప్పారు: "మన ప్రభుత్వంలో ఏదైనా పదవి చేపట్టిన మనిషికి వివాహం కాకపోతే అతను (ప్రభుత్వ సొమ్ముతో) వివాహం చేసుకోవచ్చు; సేవకుడు లేకపోతే ఒక సేవకుడ్ని పెట్టుకోవచ్చు; ఇల్లు లేకపోతే ఒక ఇంటిని తీసుకోవచ్చు; వాహనం లేకపోతే ఒక వాహనం తీసుకోవచ్చు. అంతకుమించి మరేదైనా తీసుకుంటే అలాంటివాడు నమ్మకద్రోహి లేక దొంగగా పరిగణించబడతాడు."

ఈ విషయం గురించి స్వయంగా ఖలీఫా ఉమర్ (రజి) మాట్లాడుతూ "నా కోసం దేవుని ధనసంపద (ప్రభుత్వధనాగారం) నుండి వేసవికాలపు బట్టలు ఒకజత, శీతాకాలపు బట్టలు ఒకజత, నా భార్యాపిల్లల కోసం ఖురైషీయుల్లో ఒక సగటుమనిషికి సరిపడ ఉపాధి మాత్రమే తీసుకుంటాను. అంతకుమించి మరేమీ తీసుకోను" అని అన్నారు.

ఆయన ఓసారి ప్రసంగిస్తూ "మీ (ప్రజా)ధనంతో నా సంబంధం అనాథసొమ్ముతో అతని సంరక్షకుడికున్న సంబంధంలాంటిదే. నేను నిరాధారుడ్ని కాకపోతే (కనీసావసరాలు తీర్చుకోగలిగే వాణ్ణయితే) అందులోనుంచి ఏమీ తీసుకోను. నిరాధారుణ్ణయితే సముచిత రీతిలో మాత్రమే కొంత తీసుకుంటాను" అని అన్నారు.

(3) ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా బాధ్యత స్వీకరించిన ప్రారంభంలో చాలా కాలందాకా తన దగ్గరున్న సంపదతోనే ఎలాగో గడుపుకుంటూ బ్రతుకుబండి లాగుతుండేవారు. దానివల్ల ఆయన ఆర్థికపరిస్థితి క్రమంగా క్షీణిస్తూ చివరికి పస్తులు ఉండవలసివచ్చింది. అంచేత ఆయన ఓరోజు తన ముఖ్యఅనుచరుల్ని పిలిచి "నేను పాలనా వ్యవహారాల్లో లీనమైపోవడం వల్ల ఉపాధి గురించి పట్టించుకోలేక పోతున్నాను. నా ఉపాధి కోసం మీరేదైనా ఏర్పాటు చేయండి" అన్నారు. హజ్రత్ అలి (రజి) సలహాతో

ఆయనకు రోజుకు రెండుపూటల సాధారణ భోజనం, ఏడాదికి రెండుజతల బట్టలకు సరిపడ జీతం నిర్ణయించారు. తర్వాత కొంతకాలానికి అందరితోపాటు ఖలీఫా (రజి)కు కూడా ఏడాదికి ఐదువేల దిర్హాంల చొప్పున ఉపకారవేతనం నిర్ణయించడం జరిగింది.

(4) ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఈరాన్ నుండి ఉత్తరాఫ్రికా వరకూ ఇస్లాం విజయపతాకాలు రెపరెపలాడాయి. సమరసొత్తు, జకాత్, జిజ్యా రూపాల్లో ప్రతిఏడూ కోట్లాది దిర్హమ్‌లు ప్రభుత్వధనాగారంలోకి చేరుతుండేవి. అయినప్పటికీ ఆ మహాసామ్రాజ్యాన్ని ఏలే ఖలీఫా పరిస్థితి ఎంత దయనీయంగా ఉండేదో చూడండి:

ఆయన వంటిపై పదేసి అతుకులతో కూడిన ముతకబట్టలు, కాళ్ళకు చిరిగిన చెప్పులు, తలమీద చింపిరి తలపాగ మాత్రమే ఉండేవి. ఆ బట్టలు కూడా ఒక జతే ఉండేవి. వాటినే మాటిమాటికి ఉతికిఆరేసుకొని తొడుక్కునేవారు. హజ్రత్ ఉమర్ (రజి) చనిపోయేనాటికి ఆయన ఆస్తిలో ఒక ఇల్లు, అప్పులు మాత్రమే మిగిలాయి. అంచేత ఇల్లు అమ్మి అప్పులు తీర్చాలని ఆయన వారసులకు చెప్పి ఇహలోకం వీడిపోయారు. దాని ప్రకారం ఆయన వారసులు ఇంటిని అమ్మి అప్పు తీర్చవలసివచ్చింది.

## ♦ బాధ్యతాభావం, దైవభీతి

(1) ఖలీఫా ఉమర్ (రజి) పరిపాలనా వ్యవహారాలను ఎంత బాధ్యతాయుతంగా నిర్వహించేవారంటే, తన రాజ్యంలో ఏ ప్రాణికి ఏ నష్టం జరిగినా దానికి దేవుని ముందు తాను సమాధానం చెప్పుకోవలసి వస్తుందేమోనని ఎంతో భయపడుతుండేవారు. చివరికి "ఫిరాత్ నదీతీరాన ఒక మేకపిల్ల చచ్చిపోయినా దాన్ని గురించి దేవుడు నన్ను ప్రశ్నిస్తాడేమోనని నేను భయపడుతున్నాన"ని చెప్పేవారు ఆయన. ఒకరోజు ఆయన ఒంటెకు గాయమయితే ఆ గాయాన్ని కడుగుతూ "ప్రళయదినాన ఈ ఒంటెకు అయిన గాయం గురించి కూడా దేవుడు నన్ను ప్రశ్నిస్తాడేమోనని నాకు భయంగా ఉంది" అని అన్నారు.

(2) ఒక రోజు అహ్నాఫ్ బిన్ ఖైస్ (రజి) ఖలీఫాను కలుసుకోవడానికి వస్తే ఆయన కంగారుపడ్తూ అటూఇటూ పరుగెత్తుతూ కన్పించారు. ఆయన అహ్నాఫ్ (రజి)ని చూడగానే "ప్రభుత్వధనాగారానికి చెందిన ఒక ఒంటె ఎక్కడికో పారిపోయింది. రండి మీరు కూడా, ఇద్దరం కలసి వెతుకుదాం. ఒక ఒంటెలో ఎంతమంది పేదల హక్కుందో మీకు తెలుసు కదా!" అని అన్నారు. అహ్నాఫ్ (రజి) ఈమాట విని "దాని కోసం మీకెందుకండి ఈశ్రమ. ఎవరైనా ఒక బానిసను ఆజ్ఞాపిస్తే అతనే వెతికి తెస్తాడుకదా?" అని అన్నారు. దానికి ఖలీఫా ఉమర్ (రజి) "నాకంటే పెద్ద బానిస ఇంకెవరుంటారు?" అన్నారు.

(3) ఒకసారి ఖలీఫా ఉమర్ (రజి) సల్మాన్ ఫార్సీ (రజి)తో మాట్లాడుతూ "ఇంతకూ నేను ఖలీఫానా లేక రాజునా?" అని అడిగారు. దానికి సల్మాన్ (రజి) సమాధానమిస్తూ "మీరు గనక ప్రజల భూముల నుండి అధర్మంగా ఒక్క దిర్హం కూడా వసూలుచేస్తే, దాన్ని అధర్మంగా ఖర్చుచేస్తే మీరు రాజు అవుతారు. అలా చేయకపోతే మీరు ఖలీఫాగా ఉంటారు" అని అన్నారు. వేరొక సందర్భంలో ఖలీఫా ఉమర్ (రజి) ఒక సమావేశంలో మాట్లాడుతూ "నేను ఖలీఫానో రాజునో ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నాను. ఒకవేళ



నేను రాజునై పోతే, ఇది చాలా తీవ్రమైన విషయమవుతుంది" అని అన్నారు. అప్పుడా సమావేశంలో ఒకతను లేచి "విశ్వాసులనాయకా! ఈ రెండిటిలో చాల తేడా ఉంది. ఖలీఫా (ప్రభుత్వధనాగారం నుంచి) ధర్మసమ్మతంగా తప్ప ఏదీ తీసుకోడు; ధర్మసమ్మతంగా తప్ప ఏదీ ఖర్చుపెట్టడు. దేవుని దయవల్ల మీరు అలాంటివారే. ఇక రాజు విషయానికి వస్తే, అతను ప్రజలపై దౌర్జన్యం చేస్తాడు. ఒకరి నుండి హద్దుమీరినంత వసూలుచేస్తాడు; మరొకరికి హద్దుమీరినంత ఇస్తాడు" అని అన్నాడు.

(4) ఉమర్‌ఫారూఖ్ (రజి)కు ఏదైనా విషయంలో ఎవరిమీదైనా కోపం వస్తే మాత్రం అది చాలా తీవ్రంగా ఉంటుంది. అయితే ఆ సమయంలో ఎవరైనా ఆయన ముందు దేవుని ప్రస్తావన తెస్తే లేదా ఏదైనా ఖుర్‌ఆన్ సూక్తి పఠిస్తే ఆ కోపం ఒక్కసారిగా చల్లారిపోతుంది. ఒకసారి బిలాల్ (రజి) అస్లం (రజి)తో మాట్లాడుతూ "ఉమర్ (రజి) ఎలాంటి మనిషని అడిగారు. దానికి అస్లం (రజి) సమాధానమిస్తూ "ఉమర్ (రజి) మానవులందరిలోకెల్లా ఎంతో ఉత్తముడనడంలో ఎలాంటి సందేహంలేదు. కాని కోపం వస్తే మాత్రం అగ్నిపర్వతంలా విరుచుకుపడతాడు" అని అన్నారు. "ఆ సమయంలో నువ్వేదైనా ఖుర్‌ఆన్ సూక్తి పఠిస్తే చాలు, ఆయన కోపం చప్పున చల్లారిపోతుంది" అన్నారు బిలాల్ (రజి).

(5) ఒకసారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి)తో మాట్లాడుతూ "ప్రజలు మీకు చాలా భయపడుతున్నారు. మీవైపు సూటిగా చూడలేకపోతున్నారు. మీ ముందు పెదవి విప్పడానికే భయపడుతున్నారు" అని అన్నారు. ఖలీఫా ఉమర్ (రజి) ఈమాట విని "దైవసాక్షిగా చెబుతున్నాను. ప్రజలు నాకు ఎంతగా భయపడుతున్నారో నేను వారికి అంతకంటే ఎక్కువ భయపడుతున్నాను" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పరలోకంలో జరిగే కర్మవిచారణ గురించి ఎంతో భయపడుతుండేవారు. ఒకసారి ఆయన హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి)తో మాట్లాడుతూ "అబూమూసా! మనం ఇస్లాం స్వీకరించాం. హిజ్రత్ చేశాము. దైవప్రవక్త (స) సన్నిధిలో సదా ఉండేవాళ్ళము. వాటన్నిటి పుణ్యఫలంగా సరికిసరి అన్నట్లు మనం వదలిపెట్టబడతాము. మనకు పుణ్యఫలం వద్దు; యాతనా వద్దు. దీని పట్ల నీవు సంతృప్తి చెందుతావా?" అని అడిగారు. దానికి అబూమూసా "లేదు. నేనిందుకు అంగీకరించను. మనం అనేక పుణ్యకార్యాలు చేశాం. మనకు ఎన్నో ఆశలు ఉన్నాయి" అని అన్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. మనం ఏవిధమైన కర్మవిచారకు గురికాకుండా వదలిపెట్టబడితే చాలు. నేను మాత్రం ఇదే చాలనుకుంటున్నాను" అని అన్నారు.

ఒకసారి ఆయన దారిన నడుస్తూ నేల మీద పడివున్న ఓ పుడక తీసుకొని "నేను ఇలాంటి పుడకలా అయివుంటే ఎంత బాగుండేది! లేక నేనసలు పుట్టకుండా ఉంటే ఎంత బాగుండేది!" అని అన్నారు. మరొక సందర్భంలో ఆయన "ఒకవేళ అశరీరవాణి ఒక మనిషి తప్ప అందరూ స్వర్గానికి పోతారని ప్రకటిస్తే అప్పుడు నరకంలో పడిపోయే ఆ ఒక్క దురదృష్టవంతుడు నేనౌతానేమో అని భయపడుతున్నాను" అని అన్నారు.

ఒకసారి ఉమర్ ఫారూఖ్ ఇలా అన్నారు: "అయ్యయ్యో! నేను మానవుడ్ని కాకపోయి వుంటే ఎంత బాగుండేది. నేను మేకపోతునై ఉండి, ప్రజలు నన్ను బాగామేపి బలిసి పోయేలాచేసి, ఆ తర్వాత తమ బంధుమిత్రుల కోసం నన్ను జిబహ్ చేసి కొంత మాంసం వేయించి, మిగిలిన మాంసంతో ఖైమాఉండలు చేసి నన్ను తినేస్తే ఎంత బాగుండు! కాని అలా జరగలేదే! అయ్యయ్యో! నేను మానవుడ్ని కాకపోయివుంటే ఎంత బాగుండు!!"

ఓరోజు ఉమర్ ఫారూఖ్ (రజి) మస్జిద్‌లో ప్రసంగవేదికై నిల్చొని ఉపన్యసిస్తుంటే హజ్రత్ అలీ (రజి) పుత్రరత్నం (బాల) హుసైన్ (రజి) ఆయన దగ్గరకు పోయి "ఇది మానాన్న వేదిక. మానాన్న వేదిక పైనుండి దిగిపో" అని అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని "నిజమే, ఇది మీనాన్నగారి వేదికే, కాని నిన్నీ మాటకు పురిగొల్పినవాడి వేదిక మాత్రం కాదు" అని అన్నారు. దానిపై హజ్రత్ అలి (రజి) మాట్లాడుతూ "వీడికీ మాటలు ఎవరూ నేర్పలేదు" అన్నారు ఖలీఫా ఉమర్ (రజి)తో. తరువాత కొడుకు వైపు తిరిగి "ఒరెయ్ వెధవా! నిన్ను శిక్షిస్తా ఉండు" అన్నారు. అప్పుడు ఖలీఫా ఉమర్ (రజి) "సోదరా! ఎందుకు శిక్షిస్తావు? ఇతను నిజమే చెప్పాడు" అన్నారు హజ్రత్ అలీ (రజి)తో.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన మరణసమయం ఆసన్నమైనపుడు తన కుమారునికి ఇలా ఉపదేశించారు: "నా వస్త్రసంస్కారం విషయంలో (ఆర్భాటాలకు పోకుండా) మధ్యేమార్గం అవలంబించాలి. దేవుని సన్నిధిలో నాకు మేలు జరిగితే ఆయన నాకు ఇంతకంటే మంచి దుస్తులు ప్రసాదిస్తాడు. అలా కాకపోతే ఉన్న బట్టలు కూడా ఊడ బెరుక్కుంటాడు. నా సమాధి విషయంలో కూడా మధ్యేమార్గం అవలంబించాలి. దేవుని దృష్టిలో నేను విశాలమైన చోటుకు అర్హుడినైతే ఆయన నాకు నా కనుచూపు మేరంతటి విశాలమైన చోటు కల్పిస్తాడు. ఒకవేళ నేనందుకు అర్హుడ్ని కాకపోతే ఆయన నా సమాధిని నా పక్కటెములు ఒకవైపు నుండి మరొకవైపుకు వచ్చేటంత ఇరుకుగా చేస్తాడు. నా జనాజా (శవపేటిక) వెంట స్త్రీలు ఎవరూ రాకూడదు. సమస్త విషయాలు దేవునికే బాగా తెలుసు. అంచేత నాలో లేని గుణాలను గురించి ప్రస్తావించకూడదు.

జైద్ బిన్ అస్లం ద్వారా ఇబ్నెఅసాకర్ ఉల్లేఖనం: అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి)ని కలలో చూశారు. అప్పుడు అబ్దుల్లా ఆయన్ని "దేవుడు మీపట్ల ఎలా వ్యవహరించాడ"ని అడిగారు. దానికి ఉమర్ (రజి) "నేను చనిపోయి ఎంత కాలం అయింద"ని ప్రశ్నించారు. "దాదాపు పన్నెండు సంవత్సరాలు అయింద"ని చెప్పారాయన ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని "ఇప్పుడిప్పుడే నేను కర్మవిచారణ నుండి బయటపడ్డాను" అని అన్నారు.

సాలమ్ బిన్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం ఇబ్నెసాద్ ఉల్లేఖనం: ఒక అన్సార్ మనిషి తనకు కలలో ఉమర్ (రజి)ని చూపించమని దేవుడ్ని ప్రార్థించాడు. ఓ రోజురాత్రి ఆ అన్సారీ హజ్రత్ ఉమర్ (రజి) చనిపోయిన పదేళ్ళ తర్వాత కలలో ఆయన్ని చూశాడు. అప్పుడు ఉమర్‌ఫారూఖ్ (రజి) నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటున్నారు. అన్సారీ ఆయన్ని చూసి "విశ్వాసులనాయకా! ఇక్కడ మీ పరిస్థితి ఎలా ఉంది?" అని అడిగాడు. దానికాయన "దైవానుగ్రహంవల్ల ఇప్పుడిప్పుడే నేను కర్మవిచారణ నుండి బయటపడ్డాను. దైవానుగ్రహం గనక లేకపోయివుంటే నేను నాశనమయ్యేవాడ్ని" అని చెప్పారు.



## నిగర్వి-9

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా వ్యవహారాల్లో, సమరవ్యూహాల్లో, విద్యాజ్ఞానాల్లో, విజ్ఞతావివేచనల్లో, దైవభీతిపరాయణతలో, ప్రతిభాపరాక్రమాల్లో- ఒకటేమిటీ, ప్రతి విషయంలో, ప్రతి రంగంలోనూ అందరికంటే గొప్పవారని చెప్పవచ్చు. అయినప్పటికీ ఆయనలో అహంకారం మచ్చుకైనా కానరాదు.

(1) ఒకసారి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మసీదులో ఉపన్యాసమిస్తూ మధ్యలో హఠాత్తుగా టాపిక్ మార్చి "సోదరులారా! ఒకప్పుడు నేను ప్రజలకు నీళ్ళు సరఫరా చేస్తుండేవాడ్ని. దానికి ప్రతిఫలంగా వారు నాకు (కూలీగా) కొన్ని ఖర్జూరపండ్లు ఇస్తుండేవారు. నేను వాటినే తిని జీవితం గడుపుతుండేవాడ్ని" అని అన్నారు. అప్పుడు శ్రోతల్లో ఒకతను లేచి "విశ్వాసుల నాయకా! మీరిప్పుడు మీ ఉపన్యాసంలో ఆ విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఏమిటీ?" అని అడిగాడు. దానికి ఖలీఫా ఉమర్ (రజి) "నా హృదయంలో ఒక విధమైన గర్వం తొంగిచూసింది. దానికి విరుగుడుగా నేనలా చెప్పవలసి వచ్చింది" అని అన్నారు.

(2) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతి సంవత్సరం హజ్‌యాత్ర కోసం మక్కా వెళ్తుండేవారు. యధాప్రకారం ఓ సంవత్సరం మక్కా వెళ్ళి కాబాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటే దగ్గర్లో ఒక పల్లెటూరిబైతు ఎంతో శ్రద్ధాసక్తులతో చేస్తున్న దుఆ ఆయనకు వింతగా తోచింది. ఆ పల్లెవాసి "ఓ నా ప్రభువా! ఓ నా ప్రభువా!! నువ్వు నన్ను నీ అల్ప సంఖ్యాక దాసుల జాబితాలో చేర్చు" అని వేడుకుంటున్నాడు.

ఈ విచిత్ర వేడుకోలు విని ఉమర్ ఫారూఖ్ (రజి) ఆశ్చర్యపోయారు. ఆయన ఆ పల్లెవాసిని పిలిపించి "సోదరా! ఏమిటీ నువ్విలా దుఆ చేస్తున్నావు? ఇలాంటి విచిత్రమైన దుఆ నేనింతవరకు ఎవరి నోటా వినలేదే!" అని అడిగారు. దానికి ఆ గ్రామీణుడు "అయ్యా! తమరిక్కూడా ఆ దుఆ తెల్సు, నన్నెందుకు అడుగుతారు అనవసరంగా?" అన్నాడు. ఈమాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) మరింత ఆశ్చర్యపోయారు. "నాకేం తెలుసు? ఆ దుఆ ఏమిటో కాస్త నువ్వే చెప్పు వింటాను" అన్నారాయన. దానికి గ్రామీణుడు "ఎందుకు తెలియదు, మీకు నాకంటే బాగా తెల్సులెండి" అన్నాడు. ఈమాట విని ఉమర్ ఫారూఖ్ (రజి) ఇంకా ఆశ్యర్యపోతూ ఎలాగైనా ఆ దుఆ ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తితో "నువ్వు చెప్పేదేమిటో నాకేమీ అర్థం కావడంలేదు. బాబ్బాబు! ఆ దుఆ ఏమిటో కాస్త నువ్వే చెప్పి పుణ్యం కట్టుకో" అని అన్నారు.

అప్పుడా పల్లెటూరిబైతు "విశ్వాసులనాయకా! మీరు ఖుర్‌ఆన్ చదవలేదా? అందులో 'వఖలీలుమ్మిన్ ఇబాదియష్షకూర్' (నాకు కృతజ్ఞతులైన దాసులు చాలా తక్కువమంది ఉంటారు.) అనే సూక్తి చూడలేదా మీరు? నేను నా ప్రభువుని 'దేవా! నీకు కృతజ్ఞతులైన ఆ దాసుల జాబితాలో నన్ను కూడా చేర్చ'మని వేడుకుంటున్నా" అని అన్నాడు. ఖలీఫా ఉమర్ (రజి) ఈమాట విని ఎంతో ప్రభావితులయ్యారు. తరువాత ప్రజలవైపు తిరిగి "ప్రతి మనిషీ ఉమర్ కంటే ఎక్కువ తెలిసివాడే" అని అన్నారు.

## ♦ 'విశ్వాసుల నాయకుడు' బిరుదు కాదు

హజ్రత్‌ఉమర్ (రజి) పాలనాకాలం నుండి ఖలీఫాను విశ్వాసుల నాయకా (అమీరుల్ మోమినీన్) అని పిలిచే సంప్రదాయం ఏర్పడింది. నిజానికి విశ్వాసుల నాయకుడు అనేది బిరుదు కాదు. దాని వెనుక ఓ సంఘటన ఉంది. ఆ కాలంలో ఇది హోదా, ప్రజా సేవల వ్యక్తీకరణ కోసం వాడే పదం మాత్రమే. మక్కా విజయం తరువాత అవిశ్వాసులు దైవప్రవక్త (స)ను మక్కా నాయకుడు (అమీరుల్ మక్కా) అని పిలిచేవారు. అలాగే ఉమర్ (రజి) పాలనాకాలంలో ఇరాఖ్ గవర్నర్‌గా నియమించబడిన సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)ను ఇరాఖ్ ప్రజలు అమీరుల్ మోమినీన్ అని పిలిచేవారు.

ఒకసారి ఇరాఖ్‌రాజధాని కూఫా నుండి లబీద్ బిన్ రబీఆ, అద్దీ బిన్ హాతిం అనే ప్రజాప్రతినిధులు ఖలీఫాను కలుసుకోవడానికి మదీనా వచ్చారు. అప్పుడు వారు "మేము అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడి)ని కలుసుకోవడానికి వచ్చాము; ఆయనకీ సంగతి చెప్పి మాకు అనుమతి ఇప్పించండి" అని అన్నారు. అప్పుడు అక్కడే ఉన్న ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఖలీఫాను అదే పదంతో సంబోధిస్తూ, మిమ్మల్ని కలుసుకోవడానికి ఫలానావారు వచ్చారని తెలియజేశారు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఆశ్చర్యపోతూ ఈ కొత్త సంబోధనకు కారణం ఏమిటని అడిగారు. హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) విషయం వివరించారు. ఉమర్ ఫారూఖ్ (రజి)కు ఈ పదం నచ్చింది. ఆనాటి నుంచి ప్రజలు ఆయన్ని అమీరుల్ మోమినీన్ అని పిలవడం ప్రారంభించారు. ఆ తరువాత వచ్చిన ఖలీఫాలు కూడా అమీరుల్ మోమినీన్ అనే పిలవబడ్డారు.

## ♦ సూటిపోటి మాటలు, సహనం

అరబ్బులు జన్మతాః ఎవరికీ లొంగని స్వేచ్ఛాప్రియులు; ఏ ప్రభుత్వం పంచనా దాస్యం చేయడానికి ఇష్టపడని గట్టి ఆత్మాభిమానులు. అంచేత మక్కా విజయం తర్వాత ఇస్లాం స్వీకరించి దైవప్రవక్త శిక్షణకు అంతగా నోచుకోని ప్రముఖులు కొందరు ఒక మేకలకాపరి ఖలీఫా కావడమేమిటన్న భావనతో ఉమర్ (రజి) పాలన పట్ల గుర్రుగా ఉండేవారు. మరికొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సూటిపోటి మాటలతో ఉమర్ (రజి) మనస్సును గాయపరిచేవారు. ఆయన వాటన్నిటినీ సహించేవారు.

ఒకసారి ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని ఖలీఫా ఉమర్ (రజి) ప్రభుత్వ రాబడి గురించి లెక్క చూపమని వత్తిడి చేశారు. అప్పుడాయన కోపాన్ని దిగమింగుతూ "అజ్ఞానకాలంలో నా తండ్రి ఖరీదైన దుస్తులు ధరించి తిరుగుతుంటే (ఉమర్ తండ్రి) ఖత్తాబ్ నెత్తి మీద కట్టెల మోపు మోస్తూ తిరుగుతుండేవాడు. ఈరోజు అలాంటి ఖత్తాబ్ కొడుకు నా మీద పెత్తనం చెలాయిస్తున్నాడు. అంతా దైవలీల!" అని అన్నారు.

బనూహాషిం సంతతికి చెందిన నాయకులు ఉమర్ (రజి) పాలనను అసూయతో చూస్తూ "మేము ఉండగా తైమీ, అదీ్వ సంతతివాళ్ళు ఖిలాఫత్ కుర్చీని ఎలా ఆక్రమించుకున్నారు?" అని చెప్పుకునేవారు. హజ్రత్ అబూబకర్ (రజి) ఖలీఫా అయినప్పుడు హజ్రత్ అలీ (రజి)తో అబూసుఫ్యాన్ (రజి) అన్న మాటలు కూడా ఈ సందర్భంలో గమనార్హమైనవి.



31వ అధ్యాయం,1వ అంశం-'తొలి ఖలీఫాతో ప్రవక్త వారసుల విభేదం'లోని చివరి రెండు పేరాలు చూడండి.

ఉమర్ ఫారూఖ్ (రజి) సిరియా పర్యటనకు వెళ్ళినపుడు జరిగిన ఒక సమావేశంలో ప్రజలు ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని సేనాపతి పదవి నుండి తొలగించడానికి కారణం అడిగితే ఆయన కారణం చెప్పారు. అప్పుడొక వ్యక్తి లేచి కనుబొమలు చిట్లిస్తూ ఇలా అన్నాడు: "ఉమర్! దైవసాక్షిగా చెబుతున్నాను- నువ్వు ఖాలిద్ వ్యవహారంలో ఏమాత్రం న్యాయం చేయలేదు. దైవప్రవక్త (స) నియమించిన ప్రముఖుడ్ని పదవి నుండి తొలగించావు. దైవప్రవక్త (స) బయటికి లాగిన ఖడ్గాన్ని వరలోకి నెట్టివేశావు. నువ్వు బంధుత్వాన్ని తెంచివేశావు, నువ్వు నీ పినతండ్రి కుమారుడిపై ద్వేషం పెంచుకున్నావు." ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ మాటలు విని ఆ వ్యక్తిపై మండిపడలేదు. పైగా "నీ సోదరుడ్ని సమర్థించడంలో నీకు కోపం వచ్చింది, శాంతించు" అని మాత్రమే అన్నారు ప్రశాంతంగా.

ఒకసారి అబూసుఫ్యాన్ (రజి)తో పాటు కొందరు ఖురైష్ పెద్దలు ఖలీఫాను కలుసుకోవడానికి వచ్చారు. అదేసమయంలో ఒకప్పటి బానిసలైన సుహైబ్ రూమి (రజి), బిలాల్ (రజి), అమ్మార్ (రజి)లు కూడా వచ్చారు. వారంతా ఖలీఫా కార్యాలయం గది బయట కూర్చొని అనుమతి కోసం ఎదురుచూడసాగారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఇస్లాం ప్రారంభ కాలంలోనే ముస్లిములైపోయిన వారికి ప్రాధాన్యమిస్తూ ముందుగా బలహీనవర్గానికి చెందిన సుహైబ్, బిలాల్, అమ్మార్ (రజి)లనే లోపలికి పిలిపించుకున్నారు. అబూసుఫ్యాన్ (రజి)కు ఈ ధోరణి నచ్చలేదు. ఆయన తోటి ఖురైషీయులతో మాట్లాడుతూ "ఏమిటీ దైవలీల! బానిసలకైతే ఖలీఫా దర్బారులో ప్రవేశించడానికి అనుమతి లభించింది. మనం మాత్రం బయటే పడిగాపులు కాయవలసిన దుస్థితి ఏర్పడింది" అని అన్నారు.

ఆ ఖురైష్ పెద్దల్లో కొందరు సత్యప్రియులు కూడా ఉన్నారు. వారిలో ఒకతను మాట్లాడుతూ "సోదరులారా! నిజం చెప్పాలంటే ఉమర్‌ని కాదు, మనం మనల్నే నిందించుకోవాలి. ఇస్లాం అందర్నీ ఒకే విధంగా సంబోధిస్తూ పిలిచింది. కాని మనలో కొందరు ఆ పిలుపుకు వెంటనే స్పందించకుండా ముందుకు రావడంలో చాలా ఆలస్యం చేసి వెనకపడిపోయారు. అలాంటి వాళ్ళు ఈనాడు కూడా వెనుకనే ఉండవలసి వస్తుంది" అని అన్నాడు.

## ♦ బంధుప్రీతికి ఆమడ దూరం

(1) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) బంధుప్రీతికి ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉండేవారు. చివరికి ప్రజల ఉపకారవేతనం నిర్ణయించడంలో కూడా తన బంధువులపై ఇతరులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన ఉసామా బిన్ జైద్ (రజి)కు నిర్ణయించిన ఉపకారవేతనం కంటే తన కన్నకొడుకు అబ్దుల్లా (రజి)కు తక్కువ ఉపకారవేతనం నిర్ణయించారు. దానిపై అబ్దుల్లా (రజి) ఇలా ఎందుకు చేశారని అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త (స) నీకంటే ఉసామా (రజి)ను ఎక్కువగా ప్రేమించేవారు; ఆయన నీ తండ్రి కంటే ఉసామా (రజి) తండ్రి (జైద్)ని ఎక్కువగా అభిమానించేవారు." హజ్రత్ జైద్ (రజి) పూర్వం బానిసగా ఉండేవారు.

(2) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తన పరిపాలనా కాలమంతటిలో తన బంధువుల్లో ఏ ఒక్కరికీ ఎలాంటి పదవీ కట్టబెట్టలేదు. తన తెగవారి విషయానికి వస్తే, ఆ తెగకు చెందిన ఒకేఒక వ్యక్తికి మాత్రమే ఒక చిన్న పదవి ఇచ్చారు. తన తెగకు చెందిన నోమాన్ బిన్ అదీ (రజి)ని బస్రా పట్టణం సమీపంలోని మైసాన్ అనే ఓ చిన్న ప్రాంతానికి తహ్సీల్‌దారుగా నియమించారు. అదైనా కొంతకాలం వరకే; ఆ తరువాత ఆయన్నా పదవి నుంచి తొలగించారు.

నోమాన్ బిన్ అదీ (రజి) ఉమర్ ఫారూఖ్ (రజి) కంటే ముందు ఇస్లాం స్వీకరించారు. తండ్రితో పాటు ఆయన అబిసీనియాకు వలస కూడా పోయారు. ఖలీఫా ఉమర్ (రజి) నోమాన్ (రజి) చేసిన ధర్మత్యాగాలను దృష్టిలో పెట్టుకొని ఆయన్ని మైసాన్‌కు తహ్సీల్ దార్‌గా నియమించారు. ఆ బాధ్యతనిర్వహణ కోసం నోమాన్ (రజి) మైసాన్‌కు వెళ్ళినపుడు ఆయన భార్య ఏదో కారణం వల్ల ఆయన వెంట వెళ్ళలేదు. కొన్నాళ్ళకు నోమాన్ (రజి) భార్య ఎడబాటుతో బాధపడుతూ ఒక గేయం పాడారు. ఆ గేయంలో సారాయి ప్రస్తావన వచ్చింది. ఆ సంగతి తెలుసుకున్న ఖలీఫా ఉమర్ (రజి) ఆయన్నా పదవి నుంచి తొలగిస్తూ ఇకముందు ఆయనకు ఎలాంటి పదవి ఇవ్వకూడదని ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఒక్క విషయం తప్ప ఉమర్‌ఫారూఖ్ (రజి) తన బంధువుల్లోగాని, తెగవారిలోగాని మరెవ్వరికీ ఎలాంటి పదవులూ కట్టబెట్టలేదు.

(3) తెలుగుభాషలో బంధుప్రీతికి, బంధుప్రేమకు కొంచెం తేడా ఉంది. బంధుప్రేమలో ఎలాంటి తప్పులేదు. కాని బంధుప్రీతి అనేక అనర్థాలు తెచ్చిపెడ్తుంది. బంధుప్రేమ శృతిమించితే బంధుప్రీతిగా మారుతుంది. అరబీలోని "సిలారహ్మీ" అనే పదాన్ని ఇస్లాం ఎంతగానో ప్రోత్సహించింది. బంధువుల్ని అభిమానించడాన్ని, వారికి సహాయం చేయాడాన్ని ఇస్లాం గొప్ప పుణ్యకార్యంగా పరిగణించింది. ఉమర్‌ఫారూఖ్ (రజి) తరువాత ఖలీఫాగా ఎన్నికైన ఉస్మాన్ (రజి) సిలారహ్మీని బంధుప్రేమ భావంతోనే ప్రభుత్వ యంత్రాంగంలో తన బంధువులకు, తెగవాళ్ళకు అనేక పదవులు కట్టబెట్టారు. అయితే ఆయన కనబరచిన బంధుప్రేమ శృతిమించడంతో అది కాస్తా బంధుప్రీతిగా మారిపోయింది. చివరికి హద్దు మీరిన ఈ బంధుప్రీతే ఆయన మెడకు ఉరిత్రాడుగా మారింది.

(4) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) హజ్రత్ ఉస్మాన్ (రజి) విషయంలో ఈ ప్రమాదాన్ని పసిగట్టి ఒకసారి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)తో ఇలా అన్నారు: "ఒకవేళ ఉస్మాన్ (రజి)ని గనక నేను నా రాజకీయవారసుడిగా ప్రతిపాదిస్తే అతను (తన తెగ) బనూఉమయ్యా మనుషుల్ని ప్రజల మెడలపై కూర్చోబెడ్తాడు. వారు ప్రజల విషయంలో దైవధిక్కార వైఖరికి పాల్పడతారు. దైవసాక్షిగా చెబుతున్నాను. నేను ఉస్మాన్ (రజి)ని నా రాజకీయ వారసుడ్ని చేస్తే అతను ఇలాగే చేస్తాడు. ఒకవేళ ఉస్మాన్ (రజి) అలా చేస్తే వారు తప్పకుండా దుష్కార్యాలకు ఒడిగడ్తారు. దాంతో ప్రజలు అల్లర్లు లేవదీసి, ఆందోళనలు చేపట్టి చివరికి ఉస్మాన్ (రజి)ని అంతమొందిస్తారు." ఉమర్ ఫారూఖ్ (రజి) ఈ ప్రమాదానికి భయపడే ఒక ఎన్నికల సంఘాన్ని నియమించి దానికి తన రాజకీయవారసుడి బాధ్యత అప్పగించారు.



## ♦ ప్రజాసేవ

(1) హి.శ. 18వ ఏట అరేబియాలో తీవ్రమైన కరువు వచ్చింది. ప్రభుత్వధనాగారంలోని ధాన్యం, ధనరాసులు అయిపోయిన తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అరేబియా వెలుపల ఉన్న వివిధ రాష్ట్రాల గవర్నర్లలకు లేఖలు రాసి ధాన్యం పంపమని ఉత్తర్వులు జారీచేశారు. అప్పుడు సిరియా నుండి అబూఉబైదా (రజి) నాలుగు వేల ఒంటెల ధాన్యం పంపించారు. ఈజిప్టు నుండి అమ్ర్ బిన్ ఆస్ (రజి) సముద్రమార్గం గుండా ఇరవై ఓడల్లో దాదాపు అరవై వేల బస్తాల ధాన్యం పంపించారు. ఖలీఫా ఉమర్ (రజి) స్వయంగా మదీనా సమీపంలోని రేవు దగ్గరకు వెళ్ళి ధాన్యం దిగుమతి పనుల్ని పర్యవేక్షించారు. తరువాత ఒక రిజిష్టర్‌లో క్షుత్బాధితుల పేర్లు నమోదు చేయించి, ప్రజలకు టోకెన్లు అందజేసి ధాన్యం పంపిణీ చేయించారు. అంతేకాకుండా ప్రతిరోజూ వేలాది మంది క్షుత్బాధితుల కోసం అన్నం కూడా తయారుచేయించేవారు.

(2) సాధారణంగా అప్పనంగా లభించే ధనధాన్యాల వల్ల ప్రజలు బద్ధకస్తులయి కష్టపడి పనిచేయడం మానేస్తారు. అంచేత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సంపాదనా శక్తి లేని నిరుపేదలకు మాత్రమే ఉపకారవేతనాలు, ఇతర సహాయక వస్తువులు అందజేసేవారు. భిక్షాటనను వృత్తిగా చేసుకున్న యాచకులను ఆయన ఏమాత్రం ప్రోత్సహించేవారు కాదు. ఒకసారి ఓ యాచకుడు ఖలీఫా ఉమర్ (రజి) దగ్గరకు వచ్చి దేబరించాడు. చూస్తే అతని జోలె నిండా పిండి ఉంది. ఖలీఫాఉమర్ (రజి) కళ్ళెర్ర జేస్తూ ఆ జోలెను లాక్కొని అందులోని పిండి తీసి దగ్గర్లో ఉన్న ఒంటె ముందు విసిరి పడేశారు. తరువాత అతనితో "ఇప్పుడు అడుక్కో నీకేం కావాలో" అని అన్నారు. ఒక్కపూట కూడా తిండిలేని యాచకుల్ని మాత్రమే ఆయన కనికరించేవారు.

(3) ముఖ్యంగా ఏ పనీ చేయలేని వృద్ధులు, బలహీనులకు ఉపకార వేతనాలు మంజూరుచేయడమే గాకుండా వారిలో కొందరికి ఆయన స్వయంగా వెళ్ళి ఉపకార వేతనాలు అందజేసేవారు. యుద్ధరంగంలో ఉండే సమరయోధుల నుండి వచ్చే ఉత్తరాలు వారిండ్లకు వెళ్ళి వారి భార్యాపిల్లలకు అందజేసేవారు. వారినుండి ప్రత్యుత్తరాలు తీసుకొని సమరయోధులకు పంపేవారు. వారి కుటుంబాల్లో ఎవరైనా నిరక్షరాస్యులుంటే వారు వ్రాయమన్న విధంగా ఉత్తరాలు రాసిచ్చేవారు. వితంతువులకు నీళ్ళు మోసుకొచ్చి తెచ్చిచ్చేవారు.

(4) ఒకసారి ఓ బాటసారి బృందం వచ్చిందని తెలిసి హజ్రత్ ఉమర్ (రజి) దాని రక్షణ, ఇతర అవసరాల కోసం అక్కడికి చేరుకున్నారు. ఎవరు ఏ పరిస్థితిలో ఉన్నారో తెలుసుకోవడానికి బాటసారుల మధ్య తిరుగుతూ చూస్తుంటే ఒక స్త్రీ వడిలో పాలకోసం శిశువు ఏడుస్తూ కన్పించింది. ఖలీఫా ఉమర్ (రజి) ఆ స్త్రీ దగ్గరకు వెళ్ళి "పాపను సముదాయించు" అని చెప్పి వెళ్ళిపోయారు. కాస్సేపటి తరువాత ఆ పాప ఏడ్పు మళ్ళీ విన్పించింది. హజ్రత్ ఉమర్ (రజి) మళ్ళీ ఆమె దగ్గరకు వెళ్ళి "ఎంత దయలేని తల్లివమ్మ నువ్వు, పాపకు పాలివ్వకుండా ఏడ్పిస్తున్నావు!" అని అన్నారు కోపంతో.

దాంతో ఆస్త్రీ ముఖం చిట్లించి "ఎవరయ్యా బాబు, నువ్వు నావెంట పడ్డావు! నీకు అసలు విషయం తెలియదు. బిడ్డ తల్లిపాలు విడిచిపెట్టనంత వరకు అతనికి ఉపకార వేతనం మంజూరు చేయడం జరగదని ఖలీఫా ఆదేశించాడు. ఆ ఉపకారవేతనం కోసం నేనీ పాపకు పాలు మాన్పించడానికి ప్రయత్నిస్తున్నా" అని చెప్పింది. ఈమాట వినగానే ఖలీఫా ఉమర్ (రజి)కు కళ్ళనీళ్ళ పర్యంతమయింది. "అయ్యో ఉమర్! నువ్వు ఎంతమంది పసిపిల్లల్ని చంపి వారి ఉసురుపోసుకున్నావో కదా!!" అని భావిస్తూ వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆయన "ఏరోజు పిల్లవాడు పుడ్తాడో ఆరోజు నుంచే అతనికి ఉపకారవేతనం మంజూరుచేయడం జరుగుతుంది" అని ఓ బహిరంగ ప్రకటన చేయించారు.

(5) ఒకసారి ఓ గ్రామీణుడు వచ్చి "ఓ ఉమర్! ఎక్కడైనా ఆనందం ఉందంటే అది స్వర్గంలోనే. నా కుమార్తెలు ధరించడానికి బట్టలు ఇవ్వు. నువ్వీ పని చేయక తప్పదు" అన్నాడు కవితా ధోరణిలో. ఖలీఫా ఉమర్ (రజి) ఈమాట విని "నేనీ పని చేయకపోతే ఏమవుతుంది?" అని ప్రశ్నించారు. దానికా పల్లెవాసి "ప్రళయదినాన నా విషయంలో నిన్ను విచారించడం జరుగుతుంది. అప్పుడు నువ్వు బిత్తరపోతావు. చివరికి నువ్వు స్వర్గానికో లేదా నరకానికో పోవలసి ఉంటుంది" అని సమాధానమిచ్చాడు.

ఈమాట వినగానే ఉమర్ ఫారూఖ్ (రజి) కళ్ళు నీటికుండలై గడ్డాన్ని కూడా తడిపివేశాయి. దుఃఖాన్ని దిగమింగుతూ తన సేవకుడితో " ఇదిగో ఈ చొక్కా అతనికి ఇచ్చెయ్యి. ప్రస్తుతం నా దగ్గర ఇంతకంటే మరే వస్తువూ లేదు" అన్నారు. ఇలా చెప్పిన తరువాత ఆయన తన వంటి మీది చొక్కా తీసి ఆ పల్లెవాసికి అందజేయించారు.

(6) వేరొకసారి ఖలీఫా ఉమర్ (రజి) ప్రజలకు భోజనం పెట్టి పర్యవేక్షిస్తుంటే ఒకతను ఎడమచేత్తో తినసాగాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఎడమచేత్తో తినడానికి కారణం ఏమిటని అడిగితే, అతను మూతా యుద్ధంలో తన కుడిచేయి తెగిపోయిందని చెప్పాడు. ఈమాట వినగానే ఉమర్ ఫారూఖ్ (రజి)కు దుఃఖం పొర్లుకు వచ్చింది. ఆయన ఆ యోధుడి దగ్గరకు వెళ్ళి కూర్చొని "అయ్యయ్యో, నీకెంత ఆపద వచ్చిపడింది! ఇప్పుడు నీకెవరు ఉజూ చేయిస్తారు, ఎవరు తలంటు చేయిస్తారు, ఎవరు బట్టలు మార్చుతారు?" అంటూ విచారం వెలిబుచ్చారు. ఆ తరువాత ఆయన ఆ సమరయోధుడి సేవ కోసం ఒక నౌకర్ని నియమించి అతనికి కావలసిన వస్తువులన్నీ సమకూర్చారు.

(ప్రజాసేవకు సంబంధించిన మరో రెండు సంఘటనలు 18వ అధ్యాయం "ఉమర్ (రజి) నైతిక జీవనసరళి"లోని "రాత్రివేళ గస్తీలో" అనే అంశం చూడండి.)

## ♦ ధర్మావగాహన

ఉమర్‌ఫారూఖ్ (రజి) పరిపాలనాదక్షతతో పాటు, ధార్మికఆజ్ఞల అనువర్తన విషయంలో కూడా ఎంతో విజ్ఞతా వివేచనలతో వ్యవహరించేవారు. ఈ విషయంలో ప్రారంభం నుండి ప్రజల్లో రెండు దృక్పథాలు ఉంటున్నాయి. ఒకటి, ఇందులో బుద్ధి వివేచనలకు ఎలాంటి తావు లేదు. రెండు, ధర్మానికి సంబంధించిన ప్రతి ఆదేశం బుద్ధి వివేచనల సూత్రం మీదే ఆధారపడి ఉంది. ఈ రెండవ దృక్పథాన్ని "అస్రారుద్దీన్" విద్య అంటారు. అయితే



ఈ సూత్రాన్ని చాలా తక్కువమంది అంగీకరిస్తారు. దీనిక్కారణం- మొదటి దృక్పథానికి అనుకూలురైన అధికసంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం జఠిలమైన ఈ కళ సామాన్యప్రజల అవగాహనా పరిధికి వెలుపల ఉంది. అదీగాక ధర్మానికి సంబంధించిన ప్రతి విషయాన్నీ బుద్ధివివేచనల ప్రమేయం లేకుండా నోరుమూసుకొని అంగీకరించడంలోనే మనిషి ధర్మపరాయణత, ధార్మికశ్రేయస్సు ఇమిడి ఉన్నాయి.

(1) హజ్రత్ ఉమర్ (రజి) రెండవ దృక్పథానికి అనుకూలురు. నిజం చెప్పాలంటే "అస్రారుద్దీన్" విద్యకు ఆయనే పునాది వేశారని చెప్పవచ్చు. ధర్మానికి సంబంధించిన ఏదైనా విషయం బుద్ధివిజ్ఞతలకు వ్యతిరేకంగా ఉందనిపిస్తే ఆయన దాని పూర్వపరాలను గురించి ఆలోచించి తదనుగుణంగా నిర్ణయం తీసుకుంటారు.

ప్రయాణావస్థలో నాలుగు రకాతుల ఫరజ్ నమాజ్‌ని తగ్గించి రెండు రకాతులతో చేసే నమాజ్‌ని "ఖసర్" నమాజ్ అంటారు. దీని పూర్వపరాలు ఇలా ఉన్నాయి- ఇస్లాం ప్రారంభకాలంలో ప్రయాణమార్గాలు సురక్షితంగా ఉండేవికావు. మరొకవైపు ముస్లింలకు సత్యతిరస్కారుల బెడద కూడా ఉండేది. అంచేత నాలుగు రకాతుల నమాజ్‌ని రెండు రకాతులతో పూర్తిచేసుకోవాలని దైవాజ్ఞ అవతరించింది. అయితే మక్కావిజయంతో పాటు అరేబియాలోని అత్యధిక భూభాగం ముస్లింల స్వాధీనంలోకి వచ్చిన తరువాత ప్రయాణం ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షితమై పోయింది. హజ్రత్ ఉమర్ (రజి) దైవప్రవక్త (స) ముందు ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ, మనమిక నమాజ్‌లో ఖసర్ (తగ్గింపు) చేయ వలసిన అవసరమేమిటని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఇది దేవుని తరపున మనకు ప్రసాదించబడిన కానుక" అని సమాధానమిచ్చారు.

హజ్ నియమాల్లో "రమల్" అనే ఒక నియమం ఉంది. కాబాప్రదక్షిణ చేస్తున్నపుడు మొదటి మూడు చుట్లు భుజాలు ఎగరేస్తూ, ఠీవీ-దర్పం ప్రదర్శిస్తూ వేగంగా నడవడాన్ని "రమల్" అంటారు. ఇది ప్రవక్త సంప్రదాయం (సున్నత్). దీని పూర్వపరాలు ఇలా ఉన్నాయి- దైవప్రవక్త (స) హజ్‌యాత్ర కోసం మదీనా నుండి మక్కా వచ్చినపుడు మక్కా అవిశ్వాసులు ముస్లింలను విమర్శిస్తూ, ముస్లింలు ఇప్పుడు చాలా బలహీనులై పోయారని, కాబా ప్రదక్షిణ కూడా సరిగా చేయలేకపోతున్నారని నిందించారు. దైవప్రవక్త (స) ఈమాట విని అనుచరులకు 'రమల్' చేయమని ఆదేశించారు. ఆ తరువాత కాలంలో ఇదొక శాశ్వత సంప్రదాయమై పోయింది. కాని హజ్రత్ ఉమర్ (రజి) ఇప్పుడా పరిస్థితి లేదు గనక రమల్ చేయవలసిన అవసరం లేదంటారు. అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)తో ఒకతను, ప్రజలు రమల్‌ని సున్నత్ (సంప్రదాయం)గా భావిస్తున్నారని అంటే, ప్రజలు తప్పుగా భావిస్తున్నారని అన్నారాయన.

(2) ఓసారి అబీ బిన్ కాబ్ (రజి)ని కలుసుకోవడానికి అనేకమంది వచ్చారు. సమావేశం ముగించి బయలుదేరినపుడు వారాయన్ని సాగనంపడానికి ఆయన వెనకాల నడవసాగారు. అదే సమయంలో హజ్రత్ ఉమర్ (రజి) అటుగా వచ్చి చూసి కోపంతో అబీ బిన్ కాబ్ (రజి)పై కొరడా ఝుళిపించారు. అబీ (రజి) బిత్తరపోయి చూస్తూ "ఏమయిందిప్పుడు (నన్ను కొట్టారు)?" అని అడిగారు. దానికి ఉమర్ ఫారూఖ్ (రజి) "ఏమిటీ మీరు చేస్తున్నది?

(ఇది ప్రజల్లో అరాచకానికి, విధేయులకు అవమానానికి కారణమవుతుంది)" అని అన్నారు. ఇది నేటి స్వాములు, బాబాలు తమ భక్తులు-అభిమానులను తమ చుట్టూ చేర్చుకునే ధోరణి లాంటిదే. ఈ ధోరణి వ్యక్తిపూజకు దారితీసే ప్రమాదం ఉంది గనక హజ్రత్ ఉమర్ (రజి) దాన్ని మొగ్గలోనే త్రుంచివేయడానికి ప్రయత్నించారు.

ముస్లిమేతర రాజ్యాధిపతుల గుండెల్లో గుర్రాలు పరుగెత్తిస్తూ, అనేక ప్రాంతాలను జయిస్తూ అప్రతిహతంగా ముందుకు దూసుకువెళ్తున్న సర్వసేనాని ఖాలిద్ బిన్ వలీద్ (రజి)ని ఆ పదవి నుండి తొలగించడంలో కూడా ఖలీఫా ఉమర్ (రజి) ఉద్దేశ్యం ఇదే.

(3) ధర్మావగాహన (ఫిఖ్హ్) విద్యలో ఉమర్ ఫారూఖ్ (రజి)ని మించినవారెవరూ లేరని ప్రతీతి. ఈ విషయాన్ని ఆనాడు దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరులంతా అంగీకరిస్తారు. ముస్నద్‌దార్మి గ్రంథం ప్రకారం హుజైఫా బిన్ ఐమాన్ (రజి) ఇలా అన్నారు: "ఇమామ్ లేదా ఖుర్‌ఆన్ విద్య బాగా తెలిసిన వ్యక్తి మాత్రమే ధార్మిక తీర్పు(ఫత్వా)లు ఇవ్వగలడు." ప్రజలు ఈమాట విని అలాంటి వ్యక్తి ఎవరని అడిగారు. దానికి హుజైఫా (రజి) 'ఉమర్ బిన్ ఖత్తాబ్' అని సమాధానమిచ్చారు. అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ఇలా తెలిపారు: "అరబ్ ప్రజలందరి విద్యాజ్ఞానాలు ఒక (త్రాసు)పళ్ళెంలో పెట్టి, ఉమర్ (రజి) విద్యాజ్ఞానాలు రెండవ పళ్ళెంలో పెట్టి చూస్తే ఉమర్ (రజి) పళ్ళెమే బరువుగా ఉంటుంది." ఆయన మరొక సందర్భంలో "ఉమర్ (రజి) దగ్గర ఒక క్షణం కూర్చోవటం ఏడాది పాటు దైవారాధన కంటే మేలని నేను భావిస్తున్నాను" అని అభిప్రాయపడ్డారు.

ఓసారి ఆయన ప్రయాణం చేస్తూ ఒక చెరువు దగ్గరకు చేరుకొని ఆగిపోయారు. వెంట ఉన్న అమ్ర్ బిన్ ఆస్ (రజి) అక్కడున్న కొందరు వ్యక్తులతో "ఈ చెరువులో జంతువులు నీళ్ళు తాగవు కదా?" అని అడిగారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) ఆ వ్యక్తుల్ని చెప్పవద్దని వారించారు. వేరొకసారి రమజాన్‌లో ఆకాశం మేఘావృతమై ఉండటం వల్ల సూర్యుడు కన్పించలేదు. హజ్రత్ ఉమర్ (రజి) సూర్యాస్తమయిందని భావించి ఉపవాసవ్రతం విరమించారు. ఆ తరువాత మేఘాలు తొలగడంతో సూర్యుడు ప్రత్యక్షమయ్యాడు. దాంతో ప్రజలు 'అయ్యో ఇప్పుడెలా' అనే భావనతో సందిగ్ధంలో పడిపోయారు. అయితే ఉమర్ ఫారూఖ్ (రజి) వారి సందిగ్ధానికి తెరదించుతూ "విషయం అంత తీవ్రమైనది కాదు. మనం శాయాశక్తులా ప్రయత్నించాము" అని చెప్పారు.

సమరసొత్తు (ఖుమ్స్) స్వీకార అర్హులలో ఇలా అయిదు రకాలవారున్నారు. యుద్ధ భూమిలో శత్రువర్గం నుండి లభించిన సొత్తులో 4 భాగాలు సైనికులకు లభిస్తుంది. మిగిలిన ఒకభాగం ప్రభుత్వ ధనాగారానికి, (ప్రవక్త) బంధువులకు, అనాథలకు, నిరుపేదలకు, బాటసారులకు చెందుతుంది. (8:41 సూక్తి చూడండి). అయితే జకాత్ స్వీకార అర్హులకు మాదిరిగా సమరసొత్తు (ఖుమ్స్)లోని ఒక భాగం ఆ సూక్తిలో పేర్కొనబడిన అయిదు గ్రూపులకు తప్పనిసరిగా ఇవ్వాలని ఖుర్‌ఆన్‌లో ఎలాంటి ఆదేశం లేదు. అదీగాక అబూబకర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) "మా ప్రవక్తల సముదాయానికి వారసులు ఎవరూ ఉండరు. మేము ఏది వదలిపెట్టినా అది సదఖా అవుతుంది" అని అన్నారు. (ఇబ్నెఅసాకర్). ఈ హదీసు ప్రకారం తొలి ఖలీఫా అబూబకర్ (రజి), తరువాత



రెండవ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దైవప్రవక్త (స) వంశస్థుల్లో కొందరికి తప్ప ఇతరులకు సమరసొత్తులో ఎలాంటి వాటా మంజూరు చేయలేదు.

దైవప్రవక్త (స) తదనంతరం ఆ వాటా ఆస్తి ఆయన స్థానంలో వచ్చే ఇమామ్ లేక ఖలీఫాకు మాత్రమే దక్కాలన్నది హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) దృఢభిప్రాయం. ఈ దృక్పథాన్ని ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) స్వీకరించారు. పోతే యుద్ధం జరగకుండా శత్రువు రాజీఒప్పందానికి వచ్చి అప్పగించే పంటభూములు, ఇండ్లు, వగైరా స్థిర చరాస్తుల్ని 'ఫై' అంటారు. ఇందులో కూడా ప్రభుత్వభాగం పోగా మిగిలినది అనాథలకు, పేదలకు, బాటసారులకు చెందుతుంది (59:7). ఈ సూరాలోనే మరొక చోట "వీరందరి తర్వాత (ఇస్లాంలోకి) వచ్చిన (వచ్చే)వారి క్కూడా (ఆ సంపదలో హక్కుంది)" (59:10) అని ఉంది. హష్ర్ (59) సూరాలోని ఈ రెండు సూక్తులు ఉమర్ ఫారూఖ్ (రజి) అభిప్రాయానికి బలం చేకూర్చుతున్నాయి.

(4) ధార్మికవ్యవహారాల్లో ఉమర్ (రజి) ప్రవేశపెట్టిన కొత్త విషయాలు ఇలా ఉన్నాయి:- (1) ఖుర్‌ఆన్, హదీసుల్లో సమస్యకు స్పష్టమైన పరిష్కారం కన్పించనప్పుడు దాని కోసం ఆయన 'ఖ్యాస్' (ఊహాగానం) సూత్రాన్ని ప్రవేశపెట్టారు. (2) విధి (ఫర్జ్)గా ఆచరించవలసిన సత్కార్యాల సమస్య పరిష్కారం కోసం "ఔల్" సిద్ధాంతం కనిపెట్టారు. (3) ఫజర్ నమాజ్ వేళలో చెప్పే అజాన్ పదాల్లో "అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్" (నిద్ర కంటే నమాజ్ శ్రేష్ఠమైనది) అనే పదాలను చేర్చారు. (4) తరావీ నమాజ్ సామూహికంగా చేయడాన్ని ప్రవేశపెట్టారు. (5) ఒకేసారి ఇచ్చే మూడు తలాఖులను "బాయెన్ తలాఖ్"గా పరిగణించారు. (6) మద్యపానం శిక్షను ఎనభై కొరడాదెబ్బలుగా నిర్ణయించారు. (7) వక్ఫ్ఆస్తుల వ్యవస్థ కనిపెట్టారు. (8) జనాజానమాజ్‌లో నాలుగు తక్బీర్‌లు చెప్పే విషయమై సహాబీలలో ఏకాభిప్రాయం కుదిర్చారు. (9) మసీదుల్లో ధార్మిక ప్రసంగాల సంప్రదాయం ప్రవేశపెట్టారు. (10) ఇతరుల పరువుప్రతిష్ఠలపై బురదచల్లే మాటలు, పలుకులపై నిషేధం విధించి, దాని శిక్ష ప్రవేశపెట్టారు.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) తరువాయి కాలంలో ఇస్లామీయ ధార్మికకళ బాగా అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ఇమామ్ అబూహనీఫా, ఇమామ్ షాఫై, ఇమామ్ బుఖారి, ఇమామ్ గజాలి, రాజి (రహ్మలై) వగైరా ప్రముఖులు చేసిన సేవ మరువరానిది. కాని వారిలో ఏ ఒక్కరూ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రవేశపెట్టిన పద్ధతుల్లో, చేసిన సంస్కరణల్లో ఒక్కటీ అదనంగా చేర్చడంగాని, వ్యతిరేకించడంగాని చేయలేదు. ఆయన్ని గురించి స్వయంగా దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: "నా తదనంతరం ఎవరైనా దైవప్రవక్త అయ్యే అవకాశముంటే అతను ఉమర్ బిన్ ఖత్తాబ్ అవుతాడు." (తిర్మిజి). దీన్ని బట్టి ఉమర్ ఫారూఖ్ (రజి) ధర్మావగాహన శక్తి, నైతిక సామర్థ్యం, దూరదృష్టి ఎలాంటివో మనం ఊహించవచ్చు.

(5) హదీసు ప్రకటనలో జాగ్రత్తలు :- హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) హదీసులను ప్రకటించడంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. ప్రజలు ఖుర్‌ఆన్‌పై హదీసులకు ప్రాధాన్యత ఇవ్వకూడదన్నదే ఈ జాగ్రత్త వెనుక ఆయన ఉద్దేశ్యం. అందుకే ఆయన ద్వారా దెబ్బయి

హదీసులు మాత్రమే ఉల్లేఖించబడ్డాయి. అయితే ఆయన చేసిన ప్రసంగాలలో, వ్రాత పూర్వకమైన సూచనలు, ఉపదేశాల్లో దైవప్రవక్త (స) పేరు ప్రస్తావన లేకుండా ఎన్నో హదీసులు ఉన్నాయి. విషయం ఒకరి ద్వారా మరొకరికి, మరొకరి ద్వారా వేరొకరికి చేరుతున్నప్పుడు అందులో కొద్దిగొప్పా తగ్గింపు లేదా పొడిగింపు వచ్చే ప్రమాదం ఉండొచ్చు. అంచేత హదీసులు ఎక్కువగా ప్రకటించకూడదని ఆయన సహాబీలకు తాకీదు చేశారు. అదీగాక వారు హదీసులు ప్రకటించడంలో మునిగిపోయి ఖుర్ఆన్ అధ్యయనంలో ఏమరుపాటుకు గురైపోతారేమోనని కూడా ఆయన భయపడేవారు.

ప్రముఖ హదీసువేత్త అల్లామా జుహ్బి (రహ్మలై) "తజ్కిరతుల్ హుప్ఫాజ్"లో హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పరిస్థితి ప్రస్తావిస్తూ ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఆయన అదే గ్రంథంలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) విషయాన్ని ప్రస్తావిస్తూ, హదీసు ప్రకటనలో జాగ్రత్త వహించినవారిలో హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) మొట్టమొదటి వ్యక్తి అని పేర్కొన్నారు. అల్లామా జుహ్బీ (రహ్మలై) ప్రకారం హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) అయిదొందలు హదీసులు వ్రాసిపెట్టుకున్నారు. అయితే ఆ తరువాత ఆయన వాటిని కాల్చివేశారు. కారణం తాను ఒక మనిషిని "సిఖా" (నమ్మకస్థుడు) అని భావించి అతని నుండి హదీసుల్ని ఉల్లేఖించానని, కాని వాస్తవానికి అతను 'సిఖా' (నమ్మకస్థుడు) కాకపో వచ్చని హజ్రత్ అబూబకర్ (రజి) పేర్కొన్నారు.

## (21) ఇతరత్రా సంఘటనలు

**హిజ్రీ శకారంభం :** హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా కాలానికి పూర్వం సంవత్సరాలు లెక్కకట్టడానికి ఒక పద్ధతి అంటూ ఉండేదికాదు. ఏదో ఓ ప్రత్యేక చారిత్రక సంఘటన దగ్గర్నుంచి సంవత్సరం లెక్కకట్టేవారు. మాసాలు నిర్ణయమై ఉండేవికాని, శకం ప్రస్తావన ఉండేదికాదు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఖలీఫా అయిన తరువాత హిజ్రీశకం 16వ సంవత్సరంలో సంతకం కోసం ఆయన దగ్గరకు ఒక చెక్కు వచ్చింది. దానిపై తేదీ అన్న చోట షాబాన్ (నెల) అని మాత్రమే వ్రాసి ఉంది. హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి)కు అనుమానం వచ్చి "ఇది గడచిపోయిన సంవత్సరానికి చెందిన మాసమా లేక నడుస్తున్న సంవత్సరపు మాసమా? ఎలా తెలుసుకోవాలి?" అని ప్రశ్నించారు. వెంటనే ఆయన సలహా మండలి సభ్యులను సమావేశపరచి వారి ముందు ఈ సమస్య పెట్టారు. సభ్యులందరూ తేదీ, నెల, సంవత్సరం అన్నీ ఉండాలన్నారు. అయితే శకారంభం ఎప్పటి నుంచి లెక్కకట్టాలి అనే మరో సమస్య ఉంది. సభ్యులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాని హజ్రత్ అలి (రజి) ఇచ్చిన సలహా అందరికీ నచ్చింది. దైవప్రవక్త (సఅసం) మదీనాకు హిజ్రత్ (వలస) చేసి వచ్చినప్పటి నుండి సంవత్సరాల లెక్క ప్రారంభించాలని ఆయన అన్నారు. ఈ విధంగా హిజ్రీశకం ప్రారంభమయింది.

**పట్టణాభివృద్ధి :** ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఎన్నో పట్టణాలు స్థాపించ బడ్డాయి. ఆ పట్టణాలు ఈనాటికీ చరిత్రలో ఖ్యాతి గాంచాయి.



**బస్రా :** ఖలీఫా ఉమర్ (రజి) అనుమతితో ఉతబా బిన్ గజ్వాన్ ఈ పట్టణాన్ని స్థాపించారు. ప్రారంభంలో ఇక్కడ 800 మంది మాత్రమే జనం నివసిస్తుండేవారు. కాని కొంత కాలానికే ఈ పట్టణ జనసంఖ్య ఒకటిన్నర లక్షలకు పెరిగింది.

**కూఫ :** పూర్వం నోమాన్ బిన్ ముంజిర్ అనే రాజుకు ఇది రాజధానిగా ఉండేది. కాలక్రమేణ అది శిథిలావస్థకు చేరింది. హజ్రత్ సాఅద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) అనుమతితో ఈ పట్టణాన్ని అభివృద్ధిపరిచారు. ఆయన సూచనతో పట్టణం మెయిన్ రోడ్డులను నలభై బారలు వెడల్పు చేయబడ్డాయి. వాటికన్నా చిన్న రోడ్డులు ముప్ఫయి, వాటికన్నా చిన్నవి ఇరవై బారలు వెడల్పు చేయబడ్డాయి. జామియా మసీదు విశాలంగా నిర్మించబడింది. అందులో ఒకేసారి నలభై వేల మంది నమాజు చేయవచ్చు. ఈ పట్టణం ఉమర్ ఫారూఖ్ (రజి) కాలంలోనే అభివృద్ధి చెందింది. ఇమాం అబూహనీఫా (రహ్మలై) ఇక్కడి నివాసియే.

**ఫస్తాత్ :** నైలు నదికి ముఖ్తమ్ కొండకు మధ్య విశాలమైన మైదానం ఉండేది. హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టుపై దండెత్తినప్పుడు ఈ మైదానంలోనే ఆయన సైన్యం విడిది చేసింది. అప్పుడు యాధృచ్ఛికంగా ఒక పావురం వచ్చి ఆయన గుడారంలో గూడు కట్టుకుంది. సైన్యం ఆ మైదానం వదలి ముందుకు సాగినప్పుడు హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) పావురాయి గూడు పాడవకుండా ఉండేందుకు ఆ గుడారాన్ని అలాగే వదలిపెట్టి వెళ్ళారు. ఈజిప్టును జయించిన తర్వాత ఆయన ఆ ప్రదేశంలోనే ఒక పట్టణం నిర్మించారు. దానికి ఫస్తాత్ అని పేరుపెట్టారు. అరబ్బీలో ఫస్తాత్ అంటే గుడారం అన్నమాట. ఆ తరువాత ఆ పట్టణం అతి శీఘ్రంగా అభివృద్ధిచెంది ఈజిప్టు రాజధాని (కైరో)గా మారింది.

**మూసిల్ :** ప్రారంభంలో ఇదొక సాధారణ గ్రామంగా మాత్రమే ఉండేది. ఆ తరువాత ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దీన్ని బాగా అభివృద్ధి పరచి మహోన్నతంగా తీర్చిదిద్దారు. ఈ పట్టణం ప్రాక్పశ్చిమ దేశాలను కలుపుతుంది కనుక దీని పేరు మూసిల్ అని పెట్టబడింది.

**జీజా :** అలెగ్జాండరియాను జయించిన తర్వాత ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)కు ఒక అనుమానం వచ్చింది. రావి నది వైపు నుండి ఈ భూభాగంపై శత్రువులు దండెత్తే ప్రమాదం ఉందని భావించి ఆయన దాని రక్షణ కోసం కొందరు సైనికుల్ని నదీ తీరాన నియమించారు. సైనికులకు ఆ ప్రదేశం నచ్చినందున వారక్కడే స్థిరపడ్డారు. ఖలీఫా ఉమర్ (రజి) హిజ్రీశకం 21 లో అక్కడ ఒక కోట నిర్మించారు. అక్కడ కాలక్రమేణ ఒక పట్టణం ఉనికిలోకి వచ్చింది. దానికి జీజా అని పేరుపెట్టబడింది.

**న్యూస్ మీడియా :** ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా కాలంలో ఇస్లామియ సామ్రాజ్యం సుదూర ప్రాంతాలకు వ్యాపించింది. ముస్లిం సైన్యం రాజ్యమంతటా విస్తరించి ఉంది. రాజధాని మదీనా నగరం నుండి సైనికులు వేలమైళ్ళ దూరంలో ఉన్నప్పటికీ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ప్రతి సైనికదళం గురించి, దాని సేనాపతి గురించి పూర్తి

సమాచారం ఎప్పటికప్పుడు రాబట్టేవారు. ఏ సైనికపటాలం ఎప్పుడు ఎటువైపు పురోగమిస్తోంది, ఏం జరుగుతోంది, ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటోంది మొదలైన ప్రతి చిన్న విషయం కూడా ఆయనకు వెంటనే తెలిసేది. అలా లభించిన సమాచారాన్ని బట్టి ఆయన ఆ సైన్యానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవారు.

సమాచార సేకరణ కోసం ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) సైన్యంలో కొంతమంది సైనికుల్ని నియమించారు. వారు సమాచారం సేకరించి ప్రతిరోజూ ఖలీఫా దర్బారుకు వార్తలు పంపిస్తుంటారు. వార్తాసేకరణ ఏర్పాటుతో పాటు ఉమర్ ఫారూఖ్ (రజి) గూఢచార శాఖను కూడా నెలకొల్పారు. జోర్డాన్, పాలస్తీనా దేశాల్లో ఉండే సామిరీకులం యూదులను ప్రత్యేకంగా గూఢచార కార్యకలాపాల నిర్వహణ కోసం నియమించారు. ఈ పనికి ప్రతిఫలంగా వారికి ఆయన వ్యవసాయ భూములిచ్చారు. సవ్యమైన, సుస్థిరమైన పాలన సాగడానికి వీలుగా హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) యావత్తు ఇస్లామీయ రాజ్యంలో జరిగే విశేషాలు, స్థితిగతులను గురించి తెలుసుకునేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేశారు.

## (22) ఆయన అభిమతానికి అనుగుణంగా దివ్యావిష్కృతి

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) దైవశాసనాలను అర్థం చేసుకోవడంలో దిట్ట. కొన్ని సందర్భాలలో ఆయన అభిమతానికి అనుగుణంగా దైవసూక్తులు అవతరించేవి. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: "ఎప్పుడైనా ప్రజలు ఏదైనా విషయంలో (దైవప్రవక్త-స ముందు) తమతమ అభిప్రాయాలు వెలిబుచ్చేటప్పుడు ఉమర్ (రజి) కూడా తన అభి ప్రాయాన్ని వెలిబుచ్చేవారు. అయితే ఖుర్ఆన్ (సూక్తులు) ఉమర్ (రజి) అభిప్రాయం ప్రకారమే అవతరించేవి." (ఇబ్నెఅసాకర్)

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) అభిలాష, అభిమతాలకు అనుగుణంగా దాదాపు 21 సందర్భాలలో దివ్యఖుర్ఆన్ సూక్తులు అవతరించాయని జలాలుద్దీన్ అబ్దుర్రహ్మాన్ అల్‌సయూతి తన గ్రంథం "తారీఖుల్ ఖుల్ఫా"లో పేర్కొన్నారు. వాటి వివరాలు కొన్ని ఈవిధంగా ఉన్నాయి :-

1-దైవప్రవక్త (స) బదర్‌యుద్ధం కోసం సన్నాహాలు చేస్తున్నప్పుడు హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) తన అభిప్రాయం వెలిబుచ్చుతూ "మనం (మదీనా) బయటికెళ్ళి యుద్ధం చేయడం మంచిది" అన్నారు. దాని ప్రకారం ఖుర్ఆన్‌లో "నీ ప్రభువు నిన్ను ఇంటి నుండి (యుద్ధానికి) బయలు దేరతీసినప్పుడు, కొందరు విశ్వాసులకు ఇది నచ్చలేదు" (8:5) అనే సూక్తి అవతరించింది.

2-మహాప్రవక్త ముహమ్మద్ (స) బదర్ యుద్ధఖైదీల సమస్య విషయంలో అనుచరుల్ని సలహా అడిగినప్పుడు హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఇతరుల అభిప్రాయానికి భిన్నంగా ఆ ఖైదీలను హతమార్చాలని చెప్పారు. దాని ప్రకారం ఖుర్ఆన్‌లో "దేశంలో శత్రువుల్ని పూర్తిగా అణచివేయనంత వరకు ఖైదీలను తన అధీనంలో ఉంచుకోవడం ఏ దైవప్రవక్తకూ శోభించదు" (8:66) అనే సూక్తి అవతరించింది.



3-ఓసారి ఉమర్ ఫారూఖ్ (రజి) "దైవప్రవక్తా! మీ సహధర్మచారుణుల దగ్గరకు మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు కూడా వస్తుంటారు. అంచేత మీరు వారికి పరదా పాటించమని ఆదేశిస్తే ఎంత బాగుంటుంది!" అని అన్నారు. దానిపై ఖుర్ఆన్‌లో "ప్రవక్తా! నీ భార్యలకు, కుమార్తెలకు, (ఇతర) ముస్లింస్త్రీలకు వారు తమ పైటలను తమ (ముఖాల)పై కప్పుకోవాలని చెప్పు. ఇదే సరైన పద్ధతి. దీనివల్ల వారిని ఎవరైనా గుర్తించి వేధిస్తారనే భయముండదు. దేవుడు క్షమాశీలి, దయామయుడు" (33;59)

4-దైవప్రవక్త (స) భార్యల్లో కొందరు సవతి అసూయకు గురయి ముఠా కట్టారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) "ఆయన ప్రభువు సమీపంలోనే ఉన్నాడు. ఒకవేళ ఆయన మీకు విడాకులిస్తే దేవుడు ఆయనకు మీకంటే మంచి భార్యలను ప్రసాదిస్తాడు" అని అన్నారు. దానిపై ఖుర్ఆన్‌లో "ఒకవేళ దైవప్రవక్త మీకందరికీ విడాకులిస్తే, దేవుడు మీ స్థానంలో అతనికి మీకంటే శ్రేష్ఠమైన భార్యల్ని ప్రసాదిస్తాడు. వారు (మీకంటే) ఎంతో మంచి ముస్లింలుగా, విశ్వసనీయులుగా, వినయవతులుగా, క్షమాపణ కోరుకునేవారుగా, దైవారాధకులుగా, ఉపవాసకులుగా ఉంటారు. వారు భర్తవిహీనులూ కావచ్చు, లేదా కన్యలు కూడా కావచ్చు" (66:5) అనే సూక్తి అవతరించింది.

5-ఉమర్ ఫారూఖ్ (రజి) మద్యపానం అనర్థాలతో విసుగెత్తి ఓసారి "దేవా! సారాయి (నిషేధం) గురించి ఏదైనా ఆజ్ఞ జారీచెయ్యి" అని ప్రార్థించారు. దానిపై ఖుర్ఆన్‌లో అంచెలవారీగా ఇలా సూక్తులు వెలువడ్డాయి:- "విశ్వాసులారా! మీరు మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన దరిదాపులకు పోకండి. ప్రార్థనలో మీరు పఠిస్తున్నదేమిటో మీకు తెలుస్తున్నప్పుడే ప్రార్థన చేయాలి" (4:43); "విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం– ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థకమవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీమధ్య విరోధం, విద్వేషబీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి." (5:90,91) అనే సూక్తులు అవతరించాయి.

6-కపటముస్లిం అబ్దుల్లా బిన్ ఉబయి దైవప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) పాతివ్రత్యంపై నిందారోపణ చేసినప్పుడు దైవప్రవక్త (స) తన అనుచరుల్ని సలహాల కోసం సంప్రదించారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీ వివాహం (ఆయిషా-రజి.తో) ఎవరు జరిపించారు?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "దేవుడు జరిపించాడు" అని చెప్పారు. "అయితే దేనిలోనైనా ఏదైనా లోపం ఉంటే దేవుడు మీకు తెలియకుండా దాన్ని రహస్యంగా ఉంచాడా? దేవుడు పరిశుద్ధుడు. ఇది ఘోరమైన అపనింద మాత్రమే" అన్నారు ఉమర్ ఫారూఖ్ (రజి). దానిపై ఖుర్ఆన్‌లో "ఈసంగతి వినగానే 'ఇలాంటి మాటలు అనడం మనకు తగదు. దేవుడు పరిశుద్ధుడు. ఇది పచ్చిఅపనింద' అని మీరెందుకు అనలేదు? మీరు (నిజమైన) విశ్వాసులైతే ఇకముందు ఎన్నటికీ ఇలాంటి చేష్టలకు పాల్పడకూడదని దేవుడు మీకు ఉపదేశిస్తున్నాడు. ఆయన సర్వం తెలిసినవాడు, ఎంతో వివేకవంతుడు" (24:16-18) అనే సూక్తులు అవతరించాయి.

7-దైవప్రవక్త (స) కపటుల పాపమన్నింపు కోసం దేవుడ్ని ఎక్కువగా ప్రార్థిస్తుండేవారు. ఉమర్ ఫారూఖ్ (రజి)కు ఇది నచ్చలేదు. అంచేత ఆయన "వారి కోసం పాపమన్నింపు ప్రార్థన చేసినా, చేయకపోయినా ఒకటే" అన్నారు. దానిపై ఖుర్ఆన్‌లో "ప్రవక్తా! వారికోసం నీవు పాపమన్నింపు ప్రార్థన చేసినా, చేయకపోయినా ఒకటే. దేవుడు వారిని ఎన్నటికీ మన్నించడు. దుర్జనులకు దేవుడు సన్మార్గం చూపడు" (63:6) అనే సూక్తి అవతరించింది.

8-కపటుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై చనిపోయినపుడు దైవప్రవక్త (స) అతని జనాజానమాజ్ చేయడానికి సిద్ధమయ్యారు. అప్పుడు ఉమర్ ఫారూఖ్ (రజి) దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "దైవప్రవక్తా! మీగురించి ఎన్నో చెడ్డమాటలు పలికిన ఇలాంటి దైవవిరోధి కోసం జనాజా నమాజ్ చేయడానికి సిద్ధపడుతున్నారా?" అని అన్నారు. దానిపై ఖుర్ఆన్‌లో "ఇకముందు వారిలో ఎవరైనా చనిపోతే, నీవు వారికోసం శవప్రార్థన చేయకు; వారి సమాధుల వద్ద కూడా నిల్చోవద్దు. వారు దేవుడ్ని, ఆయన ప్రవక్తను తిరస్కరించారు. వారు చనిపోయినా దుర్మార్గస్థితిలోనే చనిపోతారు" (9:84) అనే సూక్తి అవతరించింది.

9-ఇస్లాంకు పూర్వం ఉపవాసవ్రతాలు పాటిస్తున్నపుడు రాత్రివేళలో (ఉపవాస విరమణ తరువాత) భార్యతో సంగమించడం అధర్మంగా ఉండేది. అయితే ఉమర్ ఫారూఖ్ (రజి) ఓరోజురాత్రి మేల్కొని తన అర్థాంగితో సంగమించారు. దానిపై ఖుర్ఆన్‌లో "ఉపవాస కాలం రాత్రివేళల్లో మీరు మీ భార్యల దగ్గరకు పోవడం ధర్మసమ్మతం చేయబడింది. వారు మీకు, మీరు వారికి దుస్తుల్లాంటివారు. మీరు (మీ భార్యల చెంతకు పోవడానికి సంకోచిస్తూ) ఆత్మద్రోహం చేసుకుంటున్న సంగతి దేవునికి తెలుసు. అందువల్ల ఆయన మిమ్మల్ని కనికరించి మీ పొరపాట్లు మన్నిస్తున్నాడు. ఇప్పుడిక మీరు మీభార్యలతో నిస్సంకోచంగా రాత్రులు గడపవచ్చు. దేవుడు మీకు ధర్మసమ్మతం చేసినదాన్ని (దాంపత్య సుఖాన్ని) అనుభవించండి" (2:187) అనే సూక్తి అవతరించింది.

10-ఒకసారి ఉమర్ (రజి) ఇంట్లో పడుకొని ఉంటే ఆయన సేవకుడు (అనుమతి లేకుండా) లోపలికి దూసుకొచ్చాడు. అప్పుడాయన "దేవా! అనుమతి లేకుండా ప్రవేశించడాన్ని నిషేధించు" అని దైవాన్ని ప్రార్థించారు. దానిపై ఖుర్ఆన్‌లో "విశ్వాసులారా! మీరు మీ ఇండ్లలోకి తప్ప ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా, వారికి సలాం చేయకుండా ప్రవేశించకండి. ఇది మీకెంతో మంచిపద్ధతి" (24:27) అనే సూక్తి అవతరించింది.

11-హజ్‌యాత్ర సందర్భంగా ఉమర్ ఫారూఖ్ (రజి) "దైవప్రవక్తా! మనం మఖామె ఇబ్రాహీంని నమాజ్ స్థలంగా చేసుకుంటే ఎంత బాగుంటుంది!" అని అన్నారు. దానిపై ఖుర్ఆన్‌లో "మేము కాబాలయాన్ని ప్రజల కోసం (ఆరాధనా) కేంద్రంగాను, శాంతి నిలయంగాను చేసి, ఇబ్రాహీం నిలబడిన చోటును ప్రార్థనా స్థలంగా చేసుకోవలసిందిగా ప్రజలను ఆదేశించాము." (2:125) అనే సూక్తి అవతరించింది.

12-ఒకసారి ఇద్దరు (ముస్లిం) వ్యక్తుల మధ్య ఏదో తగాదా వచ్చింది. అందువల్ల వారు తీర్పు కోసం దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి విషయం వివరిస్తూ తీర్పు చేయమని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (స) వ్యవహారం విన్న తరువాత వారిలో ఒకతనికి అనుకూలంగా తీర్పిచ్చారు. అయితే రెండవ వ్యక్తి తృప్తిచెందక ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు



వెళ్దాం పద అన్నాడు. ఇలా చెప్పి వారిద్దరు ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు వెళ్ళారు. తీర్పు తనకు అనుకూలంగా వచ్చిన వ్యక్తి మాట్లాడుతూ "దైవప్రవక్త (స) తీర్పు నాకు అనుకూలంగా ఇచ్చారు. కాని ఇతను దాంతో తృప్తిచెందకుండా ఉమర్ దగ్గరికి వెళ్దాం పద అని నన్నిక్కడకు పిలుచుకొచ్చాడు" అని చెప్పాడు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈమాట విని దాన్ని ధృవపరచుకోవడానికి "ఇది నిజమేనా?" అనడిగారు రెండవ వ్యక్తితో. అతను నిజమే అన్నాడు. అప్పుడు ఉమర్ (రజి) "అయితే ఉండు, ఇప్పుడే వస్తా"నంటూ ఇంట్లోకి పోయి చేతిలో ఖడ్గం తీసుకొని వచ్చారు. రాగానే 'ఉమర్ దగ్గరకు వెళ్దాం పద' అన్న వ్యక్తి శిరస్సును ఒక్క వ్రేటుతో ఖండించారు.

ఆ తర్వాత రెండవ వ్యక్తి దైవప్రవక్త (స) సన్నిధికి పోయి జరిగిన సంఘటన గురించి వివరిస్తూ "ఉమర్ (రజి) నా సహచరుడ్ని హతమార్చారు" అని చెప్పాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "ఇలా జరుగుతుందని నేననుకో లేదు. అయినా ఉమర్ ఒక విశ్వాసిని హతమార్చేటంతటి సాహసం చేస్తాడా!" అన్నారు ఆశ్చర్యపోతూ. అప్పుడు ఖుర్ఆన్‌లో ఈ సూక్తి అవతరించింది : "నీ ప్రభువు సాక్షి! వారు తమ వివాదాల పరిష్కారంకోసం నిన్ను న్యాయనిర్ణేతగా అంగీకరించి, వాటిపై నీవిచ్చే తీర్పుపట్ల ఏమాత్రం తటపటాయించకుండా ఆసాంతం స్వీకరించనంత వరకూ వారు నిజమైనవిశ్వాసులు కాలేరు." (4:65). ఈ సూక్తితో హజ్రత్ ఉమర్ (రజి) నేరారోపణ బంధం నుండి బయటపడ్డారు.

### నిరుపేద చక్రవర్తి (రాజర్షి)

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) రూపురేఖలు ఇతర సహాబీ (దైవప్రవక్త ప్రత్యక్ష అనుచరు)ల కంటే కాస్తంత అసాధారణంగా ఉంటాయని చెప్పవచ్చు. ముఖ్యంగా ఆయన చాలా పొడుగ్గా ఉంటారు. వేలాది మంది ప్రజల మధ్య నిలబడినా ఎత్తును బట్టి ఆయన్ని సులువుగా గుర్తించవచ్చు. ఆయనది భారీ కాయం, గంభీరమైన ముఖవర్చస్సు, రంగు ఎరుపు, గుబురు గడ్డం, పెద్దపెద్ద మీసాలు. చెంపలు కొంచెం లోపలికి పీక్కుపోయి ఉంటాయి. అయితే ఆయన ఒంటిపై పదేసి అతుకులు ఉండే ముతక చొక్కా, తలమీద చినిగిపోయిన తలపాగా ఉండేవి. ఆయినప్పటికీ ఆ రాజర్షిని చూస్తే సత్యతిరస్కారుల గుండెల్లో గుర్రాలు పరుగెత్తేవి.

ఓసారి దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు : "ఆకాశంలో ఉమర్‌ని గౌరవించని దైవదూత లేడు. భూలోకంలో ఉమర్‌కు భయపడని షైతాన్ లేడు." (ఇబ్నెఅసాకర్)

అంతేకాదు, ఎక్కడికి పోయినా ఈ రారాజుకు ఎలాంటి సెక్యూరిటీ లేదు; మందీ మార్బలం అసలే లేదు. సుదూర ప్రయాణంలో మాత్రం ఆయన వెంట ఒక సేవకుడు మాత్రం ఉండేవాడు. అలసిపోతే ఏచెట్టు నీడనో దుప్పటి పరచుకొని, తలకింద చేయి పెట్టుకొని కాస్తంత విశ్రాంతి తీసుకునేవారు. సువిశాల సామ్రాజ్యం ఏలే ముస్లిం చక్రవర్తి ఎంత ఠీవి-దర్పాలతో, మరెంత అట్టహాసంగా ఉంటాడోనని భావిస్తూ వచ్చే విదేశీ దౌత్యవేత్తలు ఆయన వాలకం, వస్త్రధారణ చూసి ముక్కు మీద వేలేసుకొని మరీ ఆశ్చర్యపోయేవారు.

## (23) ఉమర్ (రజి) సంస్కరణలు

ఉమర్ ఫారూఖ్ (రజి) తన పాలనాకాలంలో ఈ క్రింది విషయాల్ని కొత్తగా ప్రవేశపెట్టారు.

1. బైతుల్‌మాల్‌ను (ప్రభుత్వధనాగారాన్ని) శాశ్వతంగా నెలకొల్పారు.
2. న్యాయస్థానాలు స్థాపించారు. తీర్పులు చేయడానికి ఖాజీలను నియమించారు.
3. హిజ్రీశకం తేదీ, నెల, సంవత్సరాల లెక్క నిర్ణయించారు.
4. అమీరుల్ మోమినీన్ బిరుదు పొందారు.
5. సైనిక, రెవెన్యూ కార్యాలయాలను స్థాపించారు.
6. భూములను సర్వే చేయించారు, నీటి సౌకర్యం కోసం కాలువలు త్రవ్వించారు.
7. జనాభా గణాంక పద్ధతిని ప్రవేశపెట్టారు.
8. క్రొత్త క్రొత్త పట్టణాలను నిర్మించారు.
9. రాజ్యాన్ని 16 రాష్ట్రాలుగా విభజించి వాటి పాలనకై గవర్నర్లను నియామించారు.
10. జైళ్ళను నెలకొల్పారు. దేశ బహిష్కరణ శిక్ష ప్రవేశపెట్టారు.
11. పోలీసు శాఖను తెరిచారు.
12. నిరుపేద క్రైస్తవులు, యూదులకు పించన్లు మంజూరు చేశారు.
13. పాఠశాలలు స్థాపించారు.
14. తరావీ నమాజ్ సామూహిక పద్ధతి ప్రవేశపెట్టారు.
15. విదేశాల నుండి వచ్చే సరుకుపై సుంకం, వ్యాపారగుర్రాలపై జకాత్ ప్రవేశపెట్టారు.
16. వివిధ పట్టణాలలో అతిథి గృహాలను నిర్మింపజేశారు.
17. సైనిక స్థావరాలు, బ్యారక్స్ నిర్మింపజేశారు.
18. వార్తాహరులను నియమించారు.
19. ఫజ్ర్ అజాన్‌లో 'అస్సలాతు ఖైరుమ్మినన్నౌమ్' అనే వాక్యాన్ని అదనంగా చేర్చారు.
20. మసీదులో ఉపన్యాసం ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టారు.
21. మసీదుల్లో రాత్రిపూట దీపాలను వెలిగించే ఏర్పాటు చేయించారు.
22. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పద్ధతి ప్రవేశపెట్టారు.
23. ఉపాధ్యాయులకు, ఇమాములకు, ముఅజ్జిన్‌లకు జీతాలు నిర్ణయించారు.
24. మద్యపానం శిక్షను 40 నుండి 80 కొరడా దెబ్బలకు పెంచారు.
25. ఖుర్‌ఆన్ కూర్పు చేయించమని అబూబకర్ (రజి)కు పలుమార్లు చెప్పి చేయించారు.
26. కవులు తమ కవితల్లో ఎవరిని నిందించకూడదని, స్త్రీలను గురించి ప్రస్తావించకూడదని ఆంక్షలు విధించారు. వాటిని ఉల్లంఘించే వారికి శిక్ష విధించారు.



## (24) ఉమర్ ఫారూఖ్ (రజి) హితోక్తులు

- ఎవరైతే నమాజును కాపాడుకుంటాడో అతడు తన ధర్మాన్ని కాపాడుకున్నట్లే.
- పరలోకంలో గౌరవప్రదమైన జీవితం గడపదలచుకుంటే ఇహలోకంలో సత్కార్యాలు చేయండి.
- దేవునికి భయపడండి, ఆయనపైన్నే భారం వేయండి. ఇది చాలు ముస్లింలకు.
- అల్లాహ్ సన్నిధిలో మన సదాచరణలే మనకు పనికొస్తాయి. పేరు ప్రతిష్ఠలు, వంశ మర్యాదలు ఏవీ పనికిరావు.
- ఇతరుల తప్పులను క్షమించనివాడ్ని దేవుడు కూడా క్షమించడు.
- మనిషి పాటించే నమాజు, ఉపవాసాలను చూడకండి, అతని మాటలు, చేతలు మాత్రమే చూడండి.
- అత్యంత శ్రేష్ఠమైన సంపద ఆత్మసంతృప్తే.
- అతిథి సత్కారం మనిషి ఔన్నత్యాన్ని పెంచుతుంది.
- హద్దుమీరిన పరిహాసం వల్ల మనిషి గౌరవం తగ్గుతుంది.
- ఈ రోజు చేయవలసిన పనిని రేపటికి వాయిదా వేయకండి.
- వెనుకేసిన అడుగు ఇక ముందుకు సాగదు.
- చెడును గుర్తించండి, లేకుంటే ఆ చెడులో మీరూ కూరుకుపోవచ్చు.
- ఇతరుల తప్పులు ఎత్తిచూపే ముందు తమ తప్పులేమిటో చూసుకోవాలి.
- సహనం వహించండి, ప్రశాంత జీవితం గడుపుతారు.
- ఈర్ష్య పడకండి, దానివల్ల విరోధభావం జనిస్తుంది.
- నా లోపం ఏమిటో నాకు ఎత్తి చూపేవాడికి దైవం మేలుచేయుగాక!
- పశ్చాత్తాపంచెందేవారి సాంగత్యంలో కూర్చోండి. వారి హృదయాలు మెత్తబడిఉంటాయి.
- ఇతరుల కోసం తన పరలోక జీవితాన్ని నాశనం చేసుకునేవాడే అందరికంటే పెద్ద మూర్ఖుడు.
- పాపకార్యాలు తక్కువగా చేయండి, మరణబాధ తేలికవుతుంది.
- మరణించిన మీ తండ్రిగారి స్నేహితుల పట్ల సద్భావంతో మెలగండి; మీ జీవితం సార్థకం అవుతుంది.
- ఇతరుల విషయంలో అతి శ్రద్ధకు పోయి మిమ్మల్ని మీరు మరచిపోకండి.
- ఏ పాలకుని కారణంగా అతని ప్రజలు నీతి తప్పుతారో అతనికంటే నికృష్ట పాలకుడు మరొకడుండడు.

# 33. ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ పాలన

హజ్రత్ ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) ఇస్లాం స్వీకరించిన ప్రథమశ్రేణి ముస్లింలలో నాల్గవ వ్యక్తి. అంటే అబూబకర్, అలి, జైద్ (రజి)ల తరువాత ఇస్లాం స్వీకరించారు. రూపురేఖల్లో ఆయన కొంచెం దైవప్రవక్త (స)ను పోలివుంటారు. స్వర్గప్రవేశం చేస్తారని దైవప్రవక్త (స) శుభవార్త తెలిపిన పదిమందిలో హజ్రత్ ఉస్మాన్ (రజి) ఒకరు.

## (1) ఉస్మాన్ (రజి) ఘనతా ఔన్నత్యాలు

దైవప్రవక్త (స) మొదట్లో తన కుమార్తె హజ్రత్ రుఖియా (రజి)ను ఉస్మాన్ (రజి)కు ఇచ్చి పెళ్ళిచేశారు. అయితే ఆమె చనిపోవడం వల్ల తన రెండవ కుమార్తె ఉమ్మె కుల్సూమ్ (రజి) వివాహం కూడా ఆయనతోనే జరిపారు. అందువల్ల హజ్రత్ ఉస్మాన్ (రజి)కు 'జున్నూరైన్' అని పేరుపడ్డారు. కాని ఆ తరువాత కొన్నేళ్ళకు హి.శ. 9వ సంవత్సరంలో ఉమ్మెకుల్సూమ్ (రజి) కూడా చనిపోయారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఉస్మాన్ (రజి)కు పెళ్ళి చేయండి. నాకు మూడవ కుమార్తె ఉంటే ఆమెను కూడా ఉస్మాన్‌కు ఇచ్చి పెళ్ళి చేసేవాడ్ని. నేను ఉస్మాన్‌తో నా కుమార్తెల వివాహం దివ్యావిష్కృతి ద్వారా (దేవుని అనుమతితో) చేశాను" (తిబ్రాని). ఆయన మరోసందర్భంలో ఇలా అన్నారు: "ఒకవేళ నాకు నలభై మంది కుమార్తెలుంటే ఒకరి తర్వాత మరొకరు చొప్పున వారందరినీ ఉస్మాన్‌కు ఇచ్చి పెళ్ళిచేస్తాను" (ఇబ్నెఅసాకర్).

హజ్రత్ ఉస్మాన్ (రజి) ఎంతో బిడియస్థులు. దైవప్రవక్త (స)ను కలుసుకోవడానికి ఎంతోమంది వస్తుంటారు. కాని ఉస్మాన్ (రజి) రాగానే ఆయన సావధానమై మోకాళ్ళ మీది బట్టలు సరిచేసుకునేవారు. ఈ విషయాన్నే ప్రవక్తసతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ప్రస్తావిస్తూ "ఓసారి ఉస్మాన్ (మా ఇంటికి) వచ్చినపుడు (వెంటనే) దైవప్రవక్త (స) తమ బట్టలన్నీ సరిచేసుకున్నారు. తరువాత 'ఇతని పట్ల దైవదూతలు సైతం సిగ్గుపడుతుంటే నేనెలా సిగ్గు పడకుండా ఉంటాను?' అని అన్నారాయన. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఉస్మాన్ (రజి) గొప్ప ధనికులు కావడంతో పాటు మంచి దానశీలి కూడా. ఒకసారి దైవప్రవక్త (స) (మసీదులో ప్రసంగవేదికపై నిల్చొని సైన్యాన్ని సమాయత్తపరుస్తూ ఆర్థికసహాయం కోసం ప్రజలను ప్రోత్సాహపరుస్తున్నారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ (రజి) లేచి "దైవప్రవక్తా! నేను అవసరమైన సామగ్రితో పాటు వంద ఒంటెలను (దైవమార్గంలో) ఇస్తున్నాను" అని అన్నారు. దీనికి దైవప్రవక్త (స) స్పందించకుండా ప్రజలను మళ్ళీ ప్రోత్సాహపరచసాగారు. ఈసారి హజ్రత్ ఉస్మాన్ (రజి) "దైవప్రవక్తా! నేను రెండొందల ఒంటెలను ఇస్తున్నాను" అని అన్నారు. దానికీ దైవప్రవక్త (స) స్పందించకుండా ప్రజలను మళ్ళీ ప్రోత్సాహపరచసాగారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ (రజి) లేచి "దైవప్రవక్తా! నేను అవసరమైన సామగ్రితో పాటు మూడొందల ఒంటెల్ని (దైవమార్గంలో) ఇస్తున్నాను" అని అన్నారు. ఈమాట వినగానే దైవప్రవక్త (స) ప్రసంగవేదికపై నుండి దిగి "ఇప్పటి నుంచి ఉస్మాన్ ఐచ్ఛిక (నఫిల్) ఆరాధనలు చేయకపోయినా సరే ఇతనికి ఇదే (మూడొందల ఒంటెలదానమే) సరిపోతుంది" అని అన్నారు (తిర్మిజి).



(ఖలీఫా అబూబకర్ (రజి) పాలనాకాలంలో ఉస్మాన్ (రజి) చేసిన అపూర్వ దానం గురించి 31వ అధ్యాయం, 6వ అంశం చూడండి.)

## (2) అరాచకం, హత్య గురించిన భవిష్యవాణి

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం : "సమీప కాలంలో అరాచకం-అల్లకల్లోలాలు చెలరేగుతాయి. ఆ సందర్భంలో ఇతను (ఉస్మాన్) పీడితుడై హతమార్చబడతాడు" (తిర్మిజి); ముర్రా బిన్ కాబ్ (రజి) ఉల్లేఖనం : "సమీపకాలంలో అరాచకం-అల్లకల్లోలాలు చెలరేగుతాయి అన్నారు దైవప్రవక్త (స). అంతలో ఒకతను దుప్పటి కప్పుకొని మా సమీపం నుండి వెళ్ళిపోతుంటే దైవప్రవక్త (స) అతని వైపు చూపిస్తూ 'ఆరోజు సత్యం ఇతని పక్షాన ఉంటుంది' అన్నారు. ఈమాట వినగానే నేను అతని వైపు దూసుకుపోయి చూశాను. చూస్తే అతను ఉస్మాన్ (రజి). నేను దైవప్రవక్త (స) దగ్గరకు తిరిగొచ్చి 'అతడ్ని గురించేనా మీరు చెప్పేది?' అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) 'ఔను, అతడ్ని గురించే' అన్నారు." (ఇబ్నెమాజ)

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ప్రవచనం : "ఉస్మాన్! దేవుడు నీకు ఓ చొక్కా ధరింపజేస్తాడు. ఒకవేళ ఆ చొక్కాను కపట ముస్లింలు నీ నుండి తీసేయడానికి ప్రయత్నిస్తే నువ్వు మాత్రం (పరలోకంలో) నన్ను కలుసుకునే వరకు దాన్ని తీసేయకు." (తిర్మిజి, హాకిమ్); హజ్రత్ ఉస్మాన్ (రజి) దిగ్బంధించబడినప్పుడు ఇలా అన్నారు : "దైవప్రవక్త (స) నాచేత ఒక వాగ్దానం చేయించుకున్నారు. నేనా వాగ్దానంలో సహనంతో, స్థిరంగా ఉన్నాను." (తిర్మిజి)

## (3) ఖలీఫా ఎన్నిక

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) హత్యోదంతంలో తీవ్రంగా గాయపడినప్పుడు కొందరు ఆయన్ని తన రాజకీయ వారసుడిని ప్రతిపాదించమని అడిగారు. అప్పుడాయన ఇలా అన్నారు : "నేనొకవేళ అబూబకర్ (రజి) సంప్రదాయం ప్రకారం ఆచరించకుండా ఖలీఫా వారసుడిగా ఎవరి పేరునూ ప్రతిపాదించకపోతే అది నాకు ధర్మసమ్మతమే అవుతుంది. నా వారసుడిగా ఎవరి పేరునైనా ప్రతిపాదించదలచుకుంటే నేను అబూఉబైదా బిన్ జిరాహ్ (రజి) పేరును ప్రతిపాదించేవాడ్ని. కాని ఆయన నాకు ముందే చనిపోయారు. లేదా నేను అబూహుజైఫా బానిస సాలమ్ (రజి) పేరును ప్రతిపాదించేవాడ్ని. కాని ఆయన కూడా నాకు ముందే చనిపోయారు."

ఆ తరువాత ఆయన ఒక ఎన్నికల సంఘాన్ని నియమించారు. ఆ సంఘంలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి), జుబైర్ బిన్ అవామ్ (రజి), తల్హా (రజి), అలీ (రజి), ఉస్మాన్ బిన్ అప్ఫాన్ (రజి) సభ్యులుగా ఉన్నారు. హజ్రత్ తల్హా (రజి) ఆ సమయంలో మదీనాలో లేనందున ఆయన కోసం మూడు రోజులు ఎదురుచూడండని చెప్పారు. తర్వాత ఆయన తన కుమారుడు అబ్దుల్లా (రజి)ని పిలిచి "ఖిలాఫత్ విషయంలో ఏదైనా భేదాభిప్రాయం వస్తే, నీవు మెజార్టీ సభ్యులతో కలవాలి. ఒకవేళ రెండు పక్షాలు సమానసంఖ్యలో ఉంటే, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ ఏపక్షాన ఉంటే

నువ్వా పక్షంలో చేరిపో" అని చెప్పారు. ఆ తర్వాత ఆయన అబూతల్హా అన్సారి (రజి)ని, మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి)ని పిలిపించి "ఖలీఫా ఎన్నిక సంప్రదింపుల కోసం వారొక చోట సమావేశమైనప్పుడు సమావేశం ముగిసేదాకా మీరిద్దరు ద్వారం దగ్గర కాపలాకాస్తూ ఎవరినీ లోపలికి రానీయకూడదు" అని ఆదేశించారు.

ఫారూఖీ వీలునామా ప్రకారం మిఖ్దాద్ బిన్ అస్వద్ (రజి), అబూతల్హా అన్సారీ (రజి)లు ఉమర్ ఫారూఖ్ (రజి) ఖననం తరువాత కొత్త ఖలీఫా ఎన్నిక జరిగేవరకు హజ్రత్ సుహైబ్ (రజి)ని మూడు రోజుల పాటు తాత్కాలిక ఖలీఫాగా నియమించారు. తరువాత ఎన్నికల సంఘం సభ్యుల్ని తీసుకొని ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఇంటికి తీసికెళ్ళారు. అక్కడ ఒక గదిలో వారందర్నీ సమావేశపరచి తలుపులు మూసేసి, లోపలికి ఎవరినీ రానీయకుండా కాపలాకాస్తూ బయట కూర్చున్నారు.

సభ ప్రారంభమయింది. అందరికంటే ముందు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) లేచి నిలబడి ఇలా అన్నారు. " ఖిలాఫత్ ప్రాతినిధ్యం కోసం ప్రతిపాదించబడిన మీలో ఎవరు తనను తాను ఖిలాఫత్ పదవిని వదలుకోవడానికి సిద్ధమవుతారో చెప్పండి. ఆ సభ్యునికే మీలో నుండి ఖలీఫాను ఎన్నుకునే అధికారం ఉంటుంది." దీనికి ఎవరూ స్పందించకుండా అందరూ మౌనంగా ఉండిపోయారు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) "సరే, నేనే ఖిలాఫత్ పదవి ఆలోచన విరమించుకొని, ఖలీఫా ఎన్నిక పని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు. ఇతర సభ్యులందరూ ఈమాట విని "చాలా సంతోషం. మీరే మాలో ఉత్తముడని భావించిన సభ్యుడ్ని ఖలీఫాగా ఎన్నుకోండి. ఆ మేరకు మేము మీకు అధికారమిస్తున్నాం. మీ ఎంపికను మేము సమర్థిస్తాం; దాన్ని అమలుపరచడంలో మేము మీతో పూర్తిగా సహకరిస్తాం" అని అన్నారు. సమావేశం ముగిసింది.

ఖలీఫా ఎంపిక నిర్ణయం ప్రకటించడానికి ఇంకా మూడు రోజులు గడువుంది. ఈలోగా ఎన్నికల అధికారి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) సంఘంలోని ఇతర సభ్యులందరినీ విడివిడిగా కలుసుకొని, వారితో సుదీర్ఘ చర్చలు జరిపి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. మూడు రోజుల గడువులోని చివరిరోజు రాత్రి ఎన్నికల సంఘం మళ్ళీ సమావేశమయింది. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) సమావేశం నుండి సాద్ (రజి), జుబైర్ (రజి)లను కొంచెం దూరంతీసికెళ్ళి "ఈ మూడురోజులు నేను మన సభ్యులతో జరిపిన చర్చల్లో అలి(రజి), ఉస్మాన్(రజి) పేర్లు ప్రముఖంగా బహిర్గతమయ్యాయి. అలీ అభిప్రాయం అడిగితే ఆయన ఉస్మాన్(రజి) పేరు ప్రతిపాదించాడు. ఉస్మాన్ అభిప్రాయం అడిగితే ఆయన అలి (రజి) పేరు ప్రతిపాదించాడు. మీ ఉద్దేశ్యం ఏమిటో చెప్పండి" అని అన్నారు.

సాద్, జుబైర్ (రజి)లు ఈమాట విని "మీరు మానుండి 'బైత్' తీసుకోండి. మేము మిమ్మల్ని ఈఊబి నుండి బయటికి తీస్తాం" అన్నారు. దానికి అబ్దుర్రహ్మాన్ (రజి) "నేనెలా బైత్ తీసుకుంటాను? ఖిలాఫత్ పదవికి ప్రతిపాదించబడినవారి నుండి నేను తొలగిపోయాను కదా!" అన్నారు. తర్వాత ఆయన అలి, ఉస్మాన్ (రజి)లతో విడివిడిగా చర్చలు జరిపారు. అంతలో తెల్లవారిపోయింది. ఫజర్ నమాజ్ కోసం వచ్చిన వారితో మసీదు కిటకిటలాడుతోంది. జనం ఖలీఫాఎన్నిక ప్రకటన కోసం తీవ్రంగా ఎదురుచూస్తున్నారు.



నమాజ్ ముగిసింది. జనంలో ఆరాటం ఎక్కువైపోయింది. మరొకవైపు కొందరిలో గుసగుసలు మొదలయ్యాయి. హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) పక్కవారితో గుసగుసలాడుతూ "నేను ఖలీఫా పదవికి అందరికంటే అలి (రజి) యోగ్యుడని భావిస్తున్నాను" అని అన్నారు. ఇబ్నె అబీ సరా (రజి), అబ్దుల్లా బిన్ అబీ రబిఆ (రజి)లు మాట్లాడుతూ "మేము ఖలీఫా పదవికి ఉస్మాన్ (రజి) ఎక్కువ యోగ్యుడని భావిస్తున్నాం" అని అన్నారు. సాద్ బిన్ అబీ వఖ్కాస్ (రజి) ఈ గుసగుసలు విని అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) దగ్గర కెళ్ళి "ఆలస్యం ఎందుకు? మీరు తొందరగా ఖలీఫా ఎంపిక నిర్ణయం ప్రకటించండి. లేకుంటే జనంలో అల్లకల్లోలం చెలరేగే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) వెంటనే లేచి నిలబడి ప్రజలను సంబోధిస్తూ ఇలా అన్నారు : "నేను ఎలాంటి శక్తివంచన లేకుండా ప్రతి వర్గం అభిప్రాయం తెలుసుకోవడానికి కృషిచేశాను. దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరులు, సలహామండలి సభ్యులు, ఖలీఫా పదవికి ప్రతిపాదించబడినవారు అందరూ నా నిర్ణయాన్ని ఆమోదించారు. నేను ఉమర్ ఫారూఖ్ (రజి) రాజకీయ వారసుడిగా ఉస్మాన్ (రజి)ని నిర్ణయించాను. నా శక్తి సామర్థ్యాల మేరకు నేను సరైన నిర్ణయమే తీసుకున్నానని భావిస్తున్నాను."

ఈమాట చెప్పిన తరువాత ఆయన హజ్రత్ ఉస్మాన్ (రజి)ని దగ్గరకు పిలిచి "దేవుని ఆజ్ఞలు, దైవప్రవక్త (స) సంప్రదాయాలు, గత ఖలీఫాల ఆదర్శాల ప్రకారం ఖలీఫాగా నేను నా విధులు సక్రమంగా నిర్వహిస్తానని ప్రమాణం చెయ్యి" అని చెప్పారు. దాని ప్రకారమే ఉస్మాన్ (రజి) ప్రమాణం చేశారు. ఆ తరువాత అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) తన చేతిని ఉస్మాన్ (రజి) చేతిలో పెట్టి "బైత్" చేశారు. ఆ వెనువెంటనే ప్రవక్త అనుచరుల తోపాటు ఇతరులందరూ ఎంతో ఉత్సాహంతో బైత్ చేశారు.

హజ్రత్ తల్హా (రజి) ఆరోజు (హి.శ. 24, ముహర్రం ఒకటో తేదీ) వరకు మదీనా చేరుకోకపోవడం వల్ల సలహాసంప్రదింపుల్లో పాల్గొనలేక పోయారు. మరుసటి రోజు ఆయన మదీనా చేరుకొని బైత్ చేయడానికి సరాసరి ఉస్మాన్ (రజి) ఇంటికి వెళ్ళారు. కుశలప్రశ్నలయ్యాక ఖలీఫా ఉస్మాన్ (రజి) మాట్లాడుతూ "మీరు నగరంలో లేనప్పుడు నా ఎన్నిక జరిగింది. ఇప్పుడైనా మించిపోలేదు, మీరు ఖలీఫాగా ఉంటానంటే నేనీ పదవి నుండి తప్పుకుంటాను" అని అన్నారు. హజ్రత్ తల్హా (రజి) ఈమాట విని "నేను ముస్లింలలో అరాచకం రేకెత్తించదలచుకోలేదు. అందరూ మిమ్మల్ని ఖలీఫాగా ఆమోదించి బైత్చేశారు గనక నేను కూడా మిమ్మల్ని ఖలీఫాగా ఆమోదించి బైత్ చేస్తున్నాను" అంటూ ఉస్మాన్ (రజి) చేతిలో చేయి కలిపి బైత్ చేశారు.

బైత్ తరువాత ఖలీఫా ఉస్మాన్ (రజి) ప్రజలను సంబోధిస్తూ సత్కర్మల ఆవశ్యకత, ప్రాముఖ్యతలను గురించి వివరించారు. సిరిసంపదల ఆధిక్యత తెచ్చిపెట్టే ఏమరుపాటు, అనర్థాలను గురించి హెచ్చరించారు. ప్రతి విషయంలోనూ దైవప్రసన్నతను దృష్టిలో పెట్టుకోవాలని ఉపదేశించారు. ఆ తర్వాత ఆయన వివిధరాష్ట్రాల గవర్నర్లకు, అధికారులకు ఒకఉత్తర్వు జారీచేస్తూ 'వారు ఉమర్ (రజి) పాలనలో ఎలా బాధ్యతాయుతంగా, నిజాయితీగా తమ విధులు నిర్వహించారో ఇప్పుడూ అలా నిర్వహించాలని అన్నారు.

## 4) ఉస్మానీ దర్బారులో మొదటి దావా

ఉమర్ ఫారూఖ్ (రజి) హత్యకు కొన్నాళ్ళ ముందు మదీనాలో అబూలూలూ అనే ఒక ఈరానీజిమ్మీ ఖడ్గంతో హుర్ముజాన్ దగ్గరకొచ్చి ఏదో ముచ్చటించసాగాడు. ఈరాన్ సైన్యాధికారి అయిన హుర్ముజాన్ అనేకసార్లు వాగ్దానభంగానికి పాల్పడి, చివరికి పట్టుబడి ఖలీఫా ఉమర్ (రజి) ముందు ఇస్లాం స్వీకరించిన సంగతి గతపేజీల్లో పేర్కొనబడింది. ఆ సమయంలో అబూలూలూతో పాటు హైరా నివాసి జఫీనా అనే ఓ క్రైస్తవబానిస కూడా ఉన్నాడక్కడ. వారికి కొంచెందూరంలో నిల్చున్న అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) వారు ముగ్గురు గుసగుసలాడుకోవడం గమనించి వారివైపు నడిచారు.

అబూలూలూ ఆయన్ని తమ వైపు రావడం చూసి అక్కడ్నుంచి లేచి బయలుదేరాడు. అతనలా లేచేటప్పుడు అతని చేతిలోని ఖడ్గం జారి కిందపడింది. వెంటనే అతనా ఖడ్గం చేతిలోకి తీసుకొని ఆదరాబాదరాగా నడవసాగాడు. అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) ఆ దృశ్యాన్ని కూడా చూశారు. కాని అప్పుడు అబూలూలూ గురించి ఆయనకు ఎలాంటి అనుమానం కలగలేదు. కాని ఆ తరువాత అతను ఖలీఫా ఉమర్ (రజి)ని గాయపరచి పట్టుబడినప్పుడు అతని దగ్గరున్న ఖడ్గాన్ని ఆయన గుర్తించారు. ఈ విషయాన్ని ఆయన ఉమర్ ఫారూఖ్ (రజి) కుమారుడు ఉబైదుల్లా (రజి)కు వివరించారు.

ఉబైదుల్లా (రజి) అది వినగానే ప్రతీకారంతో ఉడికిపోతూ వెళ్ళి హుర్ముజాన్‌ని హతమార్చారు. హుర్ముజాన్ నెత్తురోడుతూ కింద పడిపోవడం చూడగానే సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఉబైదుల్లా (రజి)ను అరెస్టుచేయడానికి పరుగెత్తుకొచ్చారు. ఉబైదుల్లా (రజి) అంతటితో తృప్తిచెందక హైరానివాసి జఫీనాను కూడా చంపడానికి అతని వెంట పడ్డారు. అయితే దానికి ముందే హజ్రత్ సాద్ (రజి) ఉబైదుల్లా (రజి)ను అరెస్టుచేసి తాత్కాలిక ఖలీఫా సుహైబ్ (రజి) ముందు హాజరుపరిచారు. హజ్రత్ సుహైబ్ (రజి) ఉబైదుల్లా (రజి)ను కొత్త ఖలీఫా ఎన్నికయ్యే వరకు జైల్లో బంధించి పెట్టారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) ప్రజలచేత బైత్ చేయించుకొని ఖలీఫా అయిన తర్వాత వారి బాధ్యతల్ని గురించి ఉదేశించారు. ఆ తర్వాత ఆయన ముందు ఈ హత్య వ్యవహారం వచ్చింది. ఉబైదుల్లా బిన్‌ఉమర్ (రజి)ని విచారిస్తే తానే హుర్ముజాన్‌ని చంపినట్లు ఆయన అంగీకరించారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈమాట విని అనుచరుల్ని సలహా అడిగారు. హజ్రత్ అలి (రజి) దానికి ప్రతీకారంగా ఉబైదుల్లా (రజి)ను హతమార్చాలని సలహా ఇచ్చారు. కాని అమ్ర్ బిన్ ఆస్ (రజి) అలి (రజి) అభిప్రాయాన్ని ఖండిస్తూ ఇలా అన్నారు: "ఉబైదుల్లా (రజి)ను హతమార్చడం సమంజసం కాదు. ఆయన్ని హతమారిస్తే జనం ఏమనుకుంటారు? నిన్నగాక మొన్న తండ్రి హత్యకు గురయ్యాడు. ఈరోజు కొడుకుని హతమారుస్తున్నారు అని చెప్పుకోరా?" ఈ అభిప్రాయాన్ని ప్రజలు సమర్థించారు.

ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈ రెండు అభిప్రాయాలు విని సందిగ్ధంలో పడిపోయారు. ఆయన ఓ క్షణం ఆలోచించి "ఈ సంఘటన ఉమర్ (రజి) పాలనా కాలంలో జరగలేదు. నా పాలనాకాలంలో కూడా జరగలేదు. నేను ఖలీఫాగా ఎన్నిక కావడానికి ముందు జరిగిన సంఘటన ఇది. కాబట్టి నేనీ వ్యవహారానికి బాధ్యుడ్ని కాను" అని అన్నారు.



ఆ తరువాత ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈ సమస్యను సునాయాసంగా పరిష్కరించారు. ఆయన ఉబైదుల్లా (రజి)కు సంరక్షకుడిగా తయారై అతని తరపున తన దగ్గర్నుండి రక్తపరిహారం చెల్లించారు. ఈ పరిష్కారం సంగతి విని ప్రజలు సంతోషించారు. అటు ఉబైదుల్లా (రజి) ప్రాణం కూడా దక్కింది.

## 5) పదవుల ఉద్వాసన, కొత్త నియామకాలు

ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనలో వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా ఈ కింది వ్యక్తులు ఉండేవారు:- మక్కాలో నాఫె బిన్ అబ్దుల్ హిరాస్, తాయిఫ్‌లో సుఫ్యాన్ బిన్ అబ్దుల్లా సఖఫీ, యమన్‌లో యాలి బిన్ ఉమయ్యా, అమ్మాన్‌లో హుజైఫా బిన్ ముహ్‌సిన్, సిరియాలో ముఆవియా బిన్ అబూసుఫ్యాన్, ఈజిప్టులో అమ్ర్ బిన్ ఆస్, హమస్‌లో ఉమైర్ బిన్ సాద్, జోర్డాన్‌లో ఉమర్ బిన్ ఉతెబా, బస్రాలో అబూమూసా అష్అరీ, కూఫాలో ముగీరా బిన్ షాబా, బహ్రైన్‌లో ఉస్మాన్ బిన్ అబీవఖ్ఖాస్.

హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫా అయిన తరువాత మొట్టమొదట కూఫా గవర్నర్ పదవి నుండి ముగీరా బిన్ షాబా (రజి)ను తొలగించి ఆయన స్థానంలో సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి)ని నియమించారు. ప్రజలు ఈ ఉద్వాసన, నియామకాలకు కారణం అడిగితే ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ముగీరాను ఏతప్పు కారణంగా తొలగించ లేదు. ఉమర్ ఫారూఖ్ (రజి) సూచన మేరకే ఈ ఏర్పాటు జరిగింది. ఆయన ఈ విషయాన్ని ఓరోజు నా ముందు వ్యక్తపరిచారు."

ఖలీఫా ఉస్మాన్ (రజి) పాలన మొదటి సంవత్సరం (హి.శ.24)లో ఎలాంటి ముఖ్యమైన సంఘటనలు జరగలేదు. ఇక్కడ ఒక విషయం గమనార్హం. రోమ్ చక్రవర్తి హెర్క్యులస్ అలెగ్జాండరియా ముస్లింల స్వాధీనంలోకి పోయిన 7 నెలల తర్వాత చనిపోయాడు. అతని కుమారుడు ఖస్తన్తీన్ రోమ్‌సింహాసనం ఎక్కగానే కోల్పోయిన తమ భూభాగాలను తిరిగి స్వాధీనంచేసుకోవడానికి ఓ పెద్ద సైనికపటాలం తయారుచేసి అలెగ్జాండరియా వైపు పంపాడు. రోమ్‌సైన్యం సముద్రమార్గాన కాన్‌స్టాంటినోపిల్ నుంచి తీరప్రాంతానికి చేరుకొని అలెగ్జాండరియాలో ప్రవేశించింది. అయితే అక్కడి రాజ్యాధినేత మఖూఖస్ ముస్లింలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రోమన్లను అడ్డుకోవడానికి ప్రయత్నించాడు.

ఫస్తాత్ (కైరో)లో ఉన్న ముస్లిం యోధులు ఈ విషయం తెలుసుకొని అలెగ్జాండరియా వైపు బయలుదేరారు. అటు రోమ్ సైనికులు కూడా అలెగ్జాండరియా వదలిపెట్టి ఫస్తాత్ వైపు బయలుదేరారు. మార్గమధ్యలో రెండు సైన్యాలు ఢీకొన్నాయి. ఈ యుద్ధంలో రోమ్ సేనాపతి హతమయ్యాడు. ఆ సైన్యంలో అనేకమంది నేలకొరిగి ఊపిరి విడిచారు. మిగిలినవారు పిక్కబలం కొద్దీ కాన్‌స్టాంటినోపిల్‌కు పారిపోయారు. ఆ తరువాత ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) అలెగ్జాండరియాలో రోమ్‌సైన్యం వల్ల నష్టపోయిన జిమ్మీ ప్రజలకు నష్టపరిహారం చెల్లించారు. ఈ సంఘటన హి.శ. 25లో జరిగింది.

ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మరణవార్త వినగానే రోమ్‌తో పాటు అనేక శత్రు రాజ్యాలు తిరుగుబాటుకు పాల్పడ్డాయి. ఈరానీయులు తిరుగుబాటు బావుటా ఎత్తగానే

ఖలీఫా ఉస్మాన్ (రజి) హమ్దాన్, రే మొదలైన ఈరాన్ ప్రాంతాల వైపు సేనలను పంపి తిరుగుబాటును పూర్తిగా అణచివేశారు.

కూఫాలో సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) గవర్నర్‌గా పనిచేస్తున్న రోజుల్లోనే అక్కడ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) ప్రభుత్వధనాగారం కోశాధికారిగా పనిచేస్తుండేవారు. ఒక సారి సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఏదో అవసరం వచ్చి అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) దగ్గర కొంత అప్పు తీసుకున్నారు. కొన్నాళ్ళ తరువాత అబ్దుల్లా (రజి) బాకీ తిరిగివ్వమని అడిగితే సాద్ (రజి) ఇవ్వలేక పోయారు. దాన్ని గురించి వారిద్దరి మధ్య తగాదా వచ్చింది. ఈ తగాదా సంగతి మదీనాలో ఖలీఫా ఉస్మాన్ (రజి) దాకా చేరింది. అప్పుడాయన హి.శ. 25లో సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి)ని గవర్నర్ పదవి నుండి తొలగించి ఆ స్థానం లో తన క్షీరసంబంధ సోదరుడైన వలీద్ బిన్ ఉఖ్బా (రజి)ని నియమించారు. కూఫా రాష్ట్రంలోని అజర్‌బాయ్‌జాన్ ప్రాంతం రక్షణ కోసం నియమించబడిన భద్రతా దళాల అధికారి ఉతెబా బిన్ ఫర్ఖద్‌ని కూడా ఆ పదవి నుండి ఆయన తొలగించారు.

ఉతెబాను తొలగించగానే అజర్‌బైజాన్ వాసులు తిరుగుబాటుకు పాల్పడ్డారు. వెంటనే కూఫా కొత్తగవర్నర్ వలీద్ బిన్ ఉఖ్బా (రజి) అజర్‌బైజాన్‌పై సైనికచర్య తీసుకున్నారు. దాంతో ఆ ప్రాంతం ప్రజలు పాత షరతులపై తిరిగి ఒప్పందం చేసుకొని జిజ్యా చెల్లించడం ప్రారంభించారు. సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)ని గవర్నర్ పదవి నుండి తొలగించడం కూఫా ప్రజలకు ఏమాత్రం ఇష్టం లేకపోయింది. అదీగాక కొత్త గవర్నర్ వలీద్ బిన్ ఉఖ్బా (రజి) ప్రవర్తన కూడా వారికి నచ్చలేదు.

వలీద్ బిన్ ఉఖ్బా (రజి) అజర్‌బైజాన్ మీద సైనికచర్య ప్రారంభించిన రోజుల్లోనే డెమాస్కస్ (సిరియా) గవర్నర్ ముఆవియా (రజి) ఆర్మేనియా దిశగా హబీబ్ బిన్ మస్లమా (రజి)కు ఒక సైనిక దళమిచ్చి పంపారు. హబీబ్ (రజి) ఆర్మేనియాలోని అనేక పట్టణాలను, కోటలను స్వాధీనం చేసుకొని, రోమన్లను జిజ్యా చెల్లించేలా చేశారు. రోమన్ సైన్యాధికారి ఒకతను ఈ విషయం తెలుసుకొని వివిధ ప్రాంతాల నుండి ఎనభై వేల మంది సైనికుల్ని సమీకరించి హబీబ్ (రజి) సైన్యంపై దాడిచేయడానికి సిద్ధమయ్యాడు.

అప్పుడు హబీబ్ (రజి) డెమాస్కస్ గవర్నర్ ముఆవియా (రజి)కు లేఖ రాసి సహాయం కోరారు. ముఆవియా (రజి) ఖలీఫా ఉస్మాన్ (రజి)కు, ఆయన కూఫాగవర్నర్ వలీద్‌కు రాసిన లేఖలతో వలీద్ (రజి) తక్షణమే సల్మాన్ బిన్ రబియాకు ఎనిమిది వేల మంది సైనికులిచ్చి ఆర్మేనియాకు పంపారు. అప్పుడు హబీబ్ (రజి), సల్మాన్‌లు కలసి రోమన్లపై విరుచుకుపడి మొత్తం ఆర్మేనియా రాష్ట్రాన్ని కైవశం చేసుకున్నారు. ఆ తర్వాత సల్మాన్ కూఫాకు, హబీబ్ డెమాస్కస్‌కు చేరుకొని ఆయా గవర్నర్లకు తమ నివేదికలు సమర్పించారు.

డెమాస్కస్ గవర్నర్ ముఆవియా (రజి) ఈ నివేదిక అందిన తరువాత ఓ పెద్ద సైనిక పటాలం తీసుకొని వెళ్ళి రోమ్ రాజ్యంపై మెరుపుదాడి చేశారు. ఈ హఠాత్పరిణామంతో రోమ్‌సైనికులు భయకంపితులై ఇన్తాకియా, తర్సూస్ పట్టణాల మధ్య ఉన్న మొత్తం ప్రాంతాన్ని వదలిపెట్టి పిక్కబలం కొద్దీ పారిపోయారు. ముస్లింలు ఆ ప్రాంతంలోని కోటలనే సైనికస్థావరాలుగా చేసుకున్నారు. ఈ సంఘటనలన్నీ హి.శ. 25లో సంభవించాయి.



అబ్దుల్లా బిన్ సాద్ అల్‌మారూఫ్ (అబ్దుల్లా బిన్ అబీసరా) ఖలీఫా ఉస్మాన్ గని (రజి)కి క్షీరసంబంధ సోదరుడవుతారు. ఆయన దైవప్రవక్త (స) కాలంలో ఒకసారి మతభ్రష్టుడైపోయి, ఆ తర్వాత కొన్నాళ్ళకు పశ్చాత్తాపం చెంది మళ్ళీ ముస్లిం అయ్యారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను గవర్నర్ పదవి నుంచి తొలగించి సైన్యాధ్యక్షుడిగా మాత్రమే ఉంచారు. ఆయన స్థానంలో అబ్దుల్లా బిన్ సాద్ (రజి)ను గవర్నర్‌గా నియమించడమే గాకుండా ఆయనకు కోశాధికారి పదవి కూడా కట్టబెట్టారు. బహుశా ఈ మార్పు కారణంగా సైన్యాధికారుల్లో, పాలనాధికారుల్లో అనైక్యత, అంతఃకలహాలు జనించాయి. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు ఈసంగతి తెలిసి అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను సైన్యాధ్యక్షుడి పదవి నుండి కూడా తొలగించి, అబ్దుల్లా బిన్ సాద్ (రజి)కు ఈజిప్టు, అలెగ్జాండరియాల్లో పూర్తి అధికారాలు ఇచ్చారు.

అయితే అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఉద్వాసన ఈజిప్టు ప్రజల హృదయాలను బాగా కలచివేసింది. వారు అబ్దుల్లా బిన్ సాద్ (రజి)కు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. మరొక వైపు రోమ్ చక్రవర్తికి ఈజిప్టు పరిస్థితులు తెలిసి దాన్ని సువర్ణవకాశంగా భావిస్తూ అలెగ్జాండరియాపై దాడి చేయడానికి ఓ పెద్ద సైనికపటాలం పంపించాడు. కొద్దిపాటి ప్రతిఘటన తరువాత రోమన్లు అలెగ్జాండరియాను స్వాధీనం చేసుకున్నారు. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు ఈ సంగతి తెలియగానే ఆయన అమ్ర్ బిన్ ఆస్ (రజి)ను మళ్ళీ గవర్నర్‌గా నియమించి ఈజిప్టు పంపారు.

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టు వెళ్ళి గవర్నర్ బాధ్యతలు చేపట్టగానే మొట్ట మొదట అలెగ్జాండరియాపై దాడిచేసి అక్కడి రోమ్‌సైనికుల్ని తరిమికొట్టారు. తరువాత అక్కడ ఒక మసీదు నిర్మించారు. దాని పేరు మస్జిదుల్ రహ్మత్. అమ్ర్ బిన్ ఆస్ (రజి) రాష్ట్ర పరిస్థితుల్ని పూర్తిగా అదుపుచేసి, పరిపాలనా వ్యవహారాలను చక్కదిద్దిన తరువాత ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని గవర్నర్ పదవి నుండి మళ్ళీ తొలగించి ఆ స్థానంలో తిరిగి అబ్దుల్లా బిన్ సాద్ (రజి)నే నియమించారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈసారి జరిగిన తన ఉద్వాసనతో చాలా బాధపడ్డారు. అటు అబ్దుల్లా (రజి) కూడా ఈ పునరుద్వాసన, పునర్నియామకాల పట్ల కలతచెందారు.

## 6) ఆఫ్రికాలో విజయకేతనం

ఆ తరువాత అబ్దుల్లా బిన్ సాద్ (రజి) ఆఫ్రికాపై సైనికచర్య తీసుకోవడానికి ఖలీఫా అనుమతి తీసుకొని పదివేల మంది యోధులతో ఈజిప్టు నుండి బయలుదేరారు. ఆఫ్రికా ఆనాడు ఒక ఖండంగా ఉండటం మాత్రమే గాకుండా, అక్కడ ఆఫ్రికా పేరుతో ఒక రాష్ట్రం కూడా ఉండేది. అది తరాబ్లిస్, తంజాల మధ్య విస్తరించి ఉండేది. అయితే ఆఫ్రికా ఖండలోని ఈనాటి లిబియా, అల్జీరియా, టున్సియా, మొరాకో వగైరా ప్రాంతాల సముదాయాన్ని కూడా ఆనాడు ఆఫ్రికా రాష్ట్రం అనబడుతుండేది.

అబ్దుల్లా బిన్ సాద్ (రజి) ఆ 'రాష్ట్రం' సరిహద్దు భూస్వాముల్ని అణచివేస్తూ వెళ్ళి తరాబ్లిస్ సమీపానికి చేరుకున్నారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) మరింత సహాయం కోసం ఆయన దగ్గరకు ఒక సైనికదళం పంపారు. ఆ సైనికదళంలో అబ్దుల్లా బిన్ ఉమర్,

అబ్దుల్లా బిన్ అబ్బాస్, అబ్దుల్లా బిన్ జుబైర్, అమ్ర్ బిన్ ఆస్, హుసైన్ బిన్ అలి, ఇబ్నె జాఫర్ తదితర వీరయోధులు ఉన్నారు. ఈ రెండు సైన్యాలు కలసి తరాబ్లిస్ సమీపంలో రోమ్ సైన్యంతో ఢీకొని ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఆ తరువాత "ఆఫ్రికా రాష్ట్రం" వైపు పురోగమించాయి. ఆఫ్రికా రాజు జర్జీర్ ఆనాడు రోమ్ చక్రవర్తికి కప్పం కడుతూ అతని క్రింద సామంతరాజుగా ఉండేవాడు.

అతను తన వైపు ముస్లిం సేనలు వస్తున్నాయని తెలియగానే లక్షా ఇరవైవేల మంది సైనికులతో బయలుదేరి వెళ్ళి ముస్లింసైన్యం ముందు నిల్చున్నాడు. అబ్దుల్లా బిన్ సాద్ (రజి) మొదట శత్రుసైన్యానికి దైవసందేశం అందజేసి ఇస్లాం వైపు ఆహ్వానించారు. దానికి జర్జీర్ నిరాకరించడంతో ఆయన జిజ్యా (రక్షణరుసుం) చెల్లించమని అడిగారు. జర్జీర్ 'జిజ్యా' చెల్లించడానికి కూడా నిరాకరించాడు. అప్పుడు అబ్దుల్లా బిన్ సాద్ (రజి) యుద్ధభేరి మోగించి రంగంలోకి దిగారు. ఇరు పక్షాల మధ్య సంకులసమరం సాగింది. కాని జయాపజయాల జాడ కన్పించలేదు.

ఆఫ్రికా యుద్ధపర్యవసానం గురించిన సమాచారం మదీనా చేరడానికి చాలా కాలం పడ్తుంది. అదీగాక ఎంత కాలం ఎదురుచూసినా ఆఫ్రికా నుండి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఖలీఫా ఉస్మాన్ (రజి), అబ్దుర్రహ్మాన్ బిన్ జుబైర్ (రజి) నేతృత్వంలో ఒక సైనికదళం ఇచ్చి ఆఫ్రికా పంపారు. ఈ సైన్యం ఆఫ్రికా చేరుకొని సోదర సైన్యంతో చేరి పోయింది. దాంతో ముస్లింలు ద్విగుణీకృత ఉత్సాహంతో 'అల్లాహుఅక్బర్' అంటూ పెద్ద పెట్టున నినదిస్తూ రోమ్ సైనికులపై విరుచుకుపడ్డారు. ఈ హఠాత్పరిణామానికి రోమ్ సైనికులు బిత్తరపోయారు. అయితే సేనాపతి జర్జీర్ ప్రోత్సాహంతో వారు రణరంగం నుంచి పారిపోకుండా ధైర్యంతో ముస్లింలను ప్రతిఘటించారు. కాని ఆరోజు సూర్యాస్త మయందాకా ఎలాంటి ఫలితం లేకుండానే ఉభయపక్ష సైన్యాలు యుద్ధవిరమణ చేసి తమతమ శిబిరాల్లోకి వెళ్ళిపోయాయి.

మరునాడుదయం యుద్ధం మళ్ళీ మొదలయింది. అయితే అప్పుడు యుద్ధభూమిలో ఈజిప్టు గవర్నర్, సేనాపతి అయిన అబ్దుల్లా బిన్ సాద్ (రజి) కన్పించకపోవడంతో అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కారణం ఏమిటని అడిగారు. దానికి కొందరు "అబ్దుల్లా బిన్ సాద్ శిరస్సు ఖండించి తీసుకొచ్చే సైనికుడికి లక్ష దీనార్ల బహుమతి ఇస్తానని, దాంతో పాటు అతనికి తన కూతుర్ని ఇచ్చి పెళ్ళిచేస్తానని రోమ్‌సేనాని జర్జీర్ ప్రకటించాడు. అంచేత అబ్దుల్లా ప్రాణభీతితో ఈరోజు యుద్ధభూమికి రాలేదు"అని చెప్పారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈమాట విని అబ్దుల్లా బిన్ సాద్ (రజి) శిబిరానికి పోయి "నువ్వు కూడా జర్జీర్ శిరస్సు ఖండించి తెచ్చేవానికి సమరసొత్తు నుండి లక్ష దీనార్ల బహుమతి ఇస్తానని, అతనికి జర్జీర్ కూతురితో వివాహం జరిపిస్తానని ప్రకటన చేయించు" అని చెప్పారు.

అబ్దుల్లా బిన్ సాద్ (రజి) వెంటనే సైన్యంలో ఆ విధంగానే ప్రకటన చేయించారు. ఈ ప్రకటన జర్జీల్ చెవులక్కూడా సోకింది. దాంతో అతను కలవరపడుతూ చాకచక్యంతో వ్యవహరించసాగాడు. అంచేత ఆరోజు కూడా ఎలాంటి ఫలితం లేకుండానే యుద్ధం ముగిసింది. మరుసటిరోజు (మూడోరోజు) సర్వసేనాని అబ్దుల్లా బిన్ సాద్ (రజి) సలహా



మండలి నిర్ణయం ప్రకారం సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి సగం సైన్యాన్ని మాత్రమే యుద్ధరంగంలోకి దించారు. ఆరోజు కూడా ఇరుపక్షాల మధ్య హోరాహోరి పోరు సాగింది. కదనరంగం కత్తుల మెరుపులతో కదంతొక్కుతోంది. ప్రభాకరుడు తన ప్రతాపం ప్రదర్శించి పశ్చిమదిశగా పరుగెత్తసాగాడు. అంతలో ముందేసుకున్న పథకం ప్రకారం ముస్లిం శిబిరాల నుంచి వీరయోధులు రణరంగంలోకి దూసుకొచ్చి రోమన్లపై విరుచుకుపడ్డారు.

కొత్తగా ఎదురైన ఈ మెరుపుదాడులతో రోమన్లు కంగారుపడుతూ ప్రాణభయంతో పరుగులు పెట్టారు. వారిలో వేలాదిమంది నేలకొరిగి రక్తపుమడుగులకు అతుక్కుపోయారు. వారి సేనాపతి అత్యంత సాహసంతో ఎదురుదాడి చేశాడు కాని, చివరికి అతను కూడా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కత్తికి బలైపోయి నేలకొరిగాడు. ముస్లిం యోధులు మరునాడు విజయదరహాసంతో ముందుకు సాగి 'ఆఫ్రికా' రాజధాని సబీతలా పట్టణాన్ని ముట్ట డించారు. కొన్నాళ్ళ తరువాత దాన్ని కూడా స్వాధీనం చేసుకొని అపార సమరసొత్తును చేజిక్కించుకున్నారు. ఆ తరువాత ముందుకు సాగి 'జిమ్'కోటను దిగ్బంధించారు. ఆఫ్రికా సైనికులు ముస్లింల ధాటికి నిలువలేక పదిలక్షల దీనార్ల జిజ్యా షరతుపై రాజీ ఒప్పందం చేసుకున్నారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) మదీనా చేరుకొని ఖలీఫాకు ఈ విజయవార్త అందజేశారు. ఈజిప్టుగవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ (రజి) సంవత్సరం మూడు నెలల తర్వాత హి.శ. 27లో ఆఫ్రికా నుంచి ఈజిప్టుకు తిరిగొచ్చారు.

## 7) సైప్రస్, రోడిస్‌లలో విజయకేతనం

అయితే అదే సంవత్సరం ఆయన స్థానంలో ఈజిప్టు గవర్నర్‌గా అబ్దుల్లా బిన్ నాఫె నియమించబడ్డారు. ఈ మార్పు గురించి తెలిసి రోమ్ చక్రవర్తి మళ్ళీ యుద్ధ సన్నాహాలు ప్రారంభించాడు. హి.శ. 28లో ఒక సైనికపటాలాన్ని సముద్రమార్గాన ఆఫ్రికా పంపాడు. ఆ సైన్యం ఆఫ్రికా తీరం మీద దిగి, తమకు పూర్వం చెల్లిస్తుండిన కప్పం తిరిగి చెల్లించండని ఆఫ్రికా ప్రజలను డిమాండ్ చేసింది. కాని వారు కప్పం చెల్లించడానికి నిరాకరిస్తూ తమపై ముస్లింలు దాడిచేసినప్పుడు రోమ్‌చక్రవర్తి తమకు ఎలాంటి సహాయం చేయలేదని, అంచేత తామిప్పుడు ఆయనకు కప్పం చెల్లించవలసిన అవసరం లేదని అన్నారు. అప్పుడు రోమ్‌సైన్యం ఆఫ్రికన్లపై దాడిచేసి, అక్కడ విధ్వంసం సృష్టించి అలెగ్జాండరియా వైపు వెళ్ళిపోయింది. మరోవైపు రోమ్ చక్రవర్తి స్వయంగా ఆరొందల పడవల్లో సైన్యం తీసుకొని అలెగ్జాండరియా దిశగా బయలుదేరాడు. ఈసంగతి తెలిసి ఈజిప్టు గవర్నర్ అబ్దుల్లా బిన్ నాఫె రోమన్లను ప్రతిఘటించడానికి సైన్యాన్ని సమాయత్తపరిచారు. ఇరు పక్షాల మధ్య సమరజ్వాలలు ఎగిసిపడ్డాయి. చివరికి రోమ్ చక్రవర్తి, అతని సైనికులు ముస్లింయోధుల ధాటికి నిలువలేక అలెగ్జాండరియా వదలి సైప్రస్‌కు పారిపోయారు.

హజ్రత్ ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనా కాలం వరకు ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి) డెమాస్కస్-జోర్డాన్‌ల వరకు మాత్రమే గవర్నర్‌గా ఉండేవారు. ఉమర్ ఫారూఖ్ (రజి) నిర్యాణం తరువాత హమస్, ఖన్సరీన్ ప్రాంతాల గవర్నర్ ఉమైర్ బిన్ సయీద్ (రజి) తన పదవికి రాజీనామా ఇవ్వడంతో ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ రెండు ప్రాంతాలను కూడా ముఆవియా (రజి) అధీనం చేశారు. ఆ తరువాత పాలస్తీనా గవర్నర్ అబ్దుర్రహ్మాన్

బిన్ అల్ఖమా చనిపోవడంతో పాలస్తీనాను కూడా ముఆవియా (రజి) రాష్ట్రంలో కలిపేశారు. ఈవిధంగా ఆయన యావత్తు సిరియా ప్రాంతానికి తిరుగులేని అధినేత అయ్యారు.

ఆ తర్వాత ఈ అధినేత (అమీర్) ముఆవియా నౌకాయుద్ధం కోసం ఖలీఫా అనుమతి తీసుకొని, అబ్దుల్లా బిన్ ఖైస్ (రజి) నేతృత్వంలో ఓ పెద్ద సైన్యాన్ని సైప్రస్ దిశగా పంపారు. ఈ సైన్యంలో అబూజర్ గిఫ్ఫారి, అబూదర్దా, షద్దాద్ బిన్ ఔస్, ఇబాదా బిన్ సామిత్, ఆయన సతీమణి ఉమ్మెహరాం బిన్త్ మల్హాన్ (రజి) కూడా ఉన్నారు. వీరంతా పడవల్లో సైప్రస్‌కు బయలుదేరారు. మరోవైపు ఈజిప్టు నుండి కూడా ముస్లింయోధులు రోమ్ చక్రవర్తిని వెంటాడుతూ పడవల్లో సైప్రస్‌కు చేరుకున్నారు. అబ్దుల్లా బిన్ ఖైస్ (రజి) నాయకత్వంలో సిరియా నుండి బయలుదేరిన సైన్యం సైప్రస్ తీరం మీద దిగింది. ఆ సందర్భంలో ఉమ్మెహరాం ఎక్కిన గుర్రం బెదిరిపోయి పరుగెత్తింది. దాంతో ఉమ్మెహరాం (రజి) క్రిందపడి ప్రాణంవదిలారు. దైవప్రవక్త (స) సైప్రస్ ముస్లింల అధీనంలోకి వస్తుందని, (దానికి ముందు) ఉమ్మెహరాం (రజి) చనిపోతుందని భవిష్యవాణి ప్రకటించారు. దాని ప్రకారమే ఆమె గుర్రం మీద నుంచి పడి చనిపోయారు. ఆ తరువాత జరిగిన యుద్ధంలో రోమ్‌సైన్యం ఘోరంగా పరాజయం పాలై పారిపోయింది. రోమ్‌చక్రవర్తి ఖుస్తున్తినియా పారిపోయి అక్కడ చనిపోయాడని కొన్ని ఉల్లేఖనాలు పేర్కొన్నాయి. కాని ఖుస్తున్తినియా మాటిమాటికి ముస్లింల చేతిలో చావుదెబ్బలు తినడం చూసిన సైప్రస్ ప్రజలే అతడ్ని బాత్‌రూంలోకి వెళ్ళినపుడు హతమార్చారని మరికొన్ని ఉల్లేఖనాలు తెలుపుతున్నాయి. ఈవిధంగా సైప్రస్ సులువుగా ముస్లింల అధీనంలోకి వచ్చింది.

అమీర్ ముఆవియా (రజి) కూడా ఒక సైనికదళం తీసుకొని సైప్రస్‌కు చేరుకున్నారు. సైప్రస్‌లో పని ముగిసిన తరువాత 'రోడిస్'కు చేరుకొని యుద్ధం ప్రారంభించారు. రోడిస్ ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. కాని ముస్లింల ధాటికి నిలువలేక రోడిస్‌పై ఆశలు వదలుకున్నారు. ఆ విధంగా ముస్లింలు రోడిస్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఈ ద్వీపంలో ఒక పెద్ద రాగి విగ్రహం ఉంది. ఇది ఎంత పెద్ద విగ్రహం అంటే దాని రెండుకాళ్ళ మధ్య గుండా నౌకలు నడుస్తాయి. ముస్లింయోధులు ఆ విగ్రహాన్ని విరగ్గొట్టి ముక్కలు చేసి అలెగ్జాండరియా యోధుల ద్వారా అలెగ్జాండరియాకు పంపివేశారు. అక్కడ ఆ రాగిముక్కలను ఒక యూదుడు కొన్నాడు. సైప్రస్, రోడిస్‌ల విజయం తర్వాత అమీర్ ముఆవియా (రజి)కు మరింత ఖ్యాతి వచ్చింది. ఈ సంఘటనలన్నీ హి.శ. 28 చివర్లో లేక 29 ప్రారంభంలో సంభవించాయి.

## 8) ఈరాన్‌లో హోదాల మార్పుతో పార్శీల తిరుగుబాటు

హి.శ. 27లో బస్రా ప్రజలు తమ గవర్నర్ అబూమూసా అష్అరీ (రజి)పై ఖలీఫా ముందు ఆరోపణలు మోపడంతో ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని తొలగించి అక్కడ తన మామకొడుకు అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి)ని గవర్నర్‌గా నియమించారు. అంతేగాక ఉస్మాన్ బిన్‌ఆస్ సఖఫీ అధీనంలోని అమ్మాన్, బహ్రైన్‌ల సైనికదళాలను కూడా ఆయన అధీనంలో ఉంచారు. ఖురాసాన్‌లో గవర్నర్ ఉబైదుల్లా బిన్ మామ్మర్‌ని తొలగించి ఆయన స్థానంలో ఉమైర్ బిన్ ఉస్మాన్ బిన్ సాద్ (రజి)ని గవర్నర్‌గా నియమించారు.



ఉమైర్ బిన్ ఉస్మాన్ (రజి) ఖురాసాన్ చేరుకోగానే పాలనావ్యవస్థను పటిష్ఠవంతం చేసి ఫర్ఘానా వరకున్న ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. హి.శ. 27 చివర్లో ఖలీఫా ఆయన్ని తొలగించి ఇబ్నెఅహ్మర్‌ని ఖురాసాన్ గవర్నర్‌గా నియమించారు. కర్మాన్‌లో అబ్దుర్రహ్మాన్ బిన్ అబస్‌ని గవర్నర్‌గా నియమించారు. అయితే కొన్నాళ్ళ తరువాత ఆయన్ని తొలగించి అక్కడ ఆసిమ్ బిన్ అమ్ర్ (రజి)ని గవర్నర్‌గా నియమించారు.

అప్పుడు ఈరానీయులు త్వరత్వరగా జరిగిన ఈ మార్పుల్ని తమకు ఓ అదృశ్య సహాయంగా తలచి తిరుగుబాటు ధ్వజమెత్తి సైనికసన్నాహాలు ప్రారంభించారు. ఈరాన్ గవర్నర్ ఉబైదుల్లా బిన్ మామ్మర్ ఈ సంగతి తెలుసుకొని ఆ సైన్యంపై దాడిచేశారు. కాని ఈ యుద్ధంలో ఆయన అమరగతి చెందారు. ఆయన సైన్యం పారిపోయింది. వెంటనే బస్రా గవర్నర్ అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) హరమ్ బిన్ హయాన్‌ని జూర్ పట్నం ముట్టడి కోసం పంపి, తానొక సైనికదళంతో ఇస్తెఖర్‌కు వెళ్లి దాడిచేశారు. ఇరుపక్షాల మధ్య భీకరయుద్ధం జరిగింది. చివరికి ఈరానీయులు ముస్లింల ధాటికి నిలువలేక పారిపోయారు. ఇస్తెఖర్ పట్టణం ముస్లింల స్వాధీనమయింది.

హరమ్ బిన్ హయాన్ 'జూర్'పట్టణాన్ని దిగ్బంధించి అనేకరోజులు పోరాడారు. కాని ఫలితం కన్పించలేదు. ఆయన పగలల్లా ఉపవాసం ఉండి, రాత్రివేళ నమాజులో లీనమై పోయేవారు. చివరికి ఒకరోజు ఓ కుక్క చూపిన రహస్యమార్గం గుండా పట్టణంలోకి ప్రవేశించి, అక్కడి భద్రతా సైనికుల్ని హతమార్చి, పట్టణ ప్రధానద్వారం తెరిచారు. వెంటనే ద్వారం ముందు కాచుకొని వున్న ముస్లిం యోధులు ప్రవాహంలా లోపలికి జొరబడి ఎలాంటి రక్తపాతం లేకుండా సునాయాసంగా పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా ముస్లింలు పార్శీల తిరుగుబాటును అణచి ఇస్తఖర్, జూర్ పట్టణాలను స్వాధీనం చేసుకున్నారు.

## 9) ఖలీఫా హజ్‌లో జరిగిన సంఘటనలు

ఖలీఫా ఉస్మాన్ గని (రజి) హి.శ. 29లో కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని హజ్‌యాత్రకై మదీనా నుండి మక్కా వెళ్ళారు. మినా చేరుకొని శిబిరాలు వేసి యాత్రికులకు భోజన ఏర్పాటు చేయమని అనుచరుల్ని ఆదేశించారు. భోజనాలు అయిపోయిన తర్వాత ఆయన ముందు జహ్నియా తెగకు చెందిన ఒక స్త్రీ ప్రవేశపెట్టబడింది. ఆ స్త్రీ మొదటి భర్త చనిపోయిన తరువాత రెండవ పెళ్ళి చేసుకుంది. అయితే రెండవ పెళ్ళి జరిగిన ఆర్నెల్లకే ఆమె బిడ్డను కన్నది. అంచేత ఆమె వ్యభిచారానికి పాల్పడిందని చెబుతూ కొందరు ఆమెను ఖలీఫా ముందు ప్రవేశపెట్టారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆమెకు శిలా శిక్ష విధించారు. ఈ సంగతి హజ్రత్ అలీ (రజి)కి తెలిసి తక్షణమే ఆయన ఖలీఫా సన్నిధికి పరుగెత్తుకొచ్చి ఆ స్త్రీకి శిలాశిక్ష విధించడం సరికాదని చెప్పారు. అదెలా అని అడిగితే దానికాయన ఇలా సమాధానమిచ్చారు :

"ఖుర్ఆన్‌లో దేవుడు 'అతడ్ని గర్భంలో పెట్టుకొని మోయడానికి, ఆ తర్వాత పాలు మాన్పించడానికి ముప్ఫయి నెలలు పట్టింది' (46:15) అని ఉంది. ఖుర్ఆన్‌లోనే మరొక చోట 'తల్లులు తమ బిడ్డలకు గడువుకాలం పూర్తయ్యేవరకు పాలు పట్టదలచుకుంటే పూర్తిగా

రెండు సంవత్సరాలు పాలుపట్టాలి' (2:233) అని ఉంది. పాలుపట్టే గడువుకాలం రెండేళ్ళు అంటే ఇరవై నాలుగు నెలలు అన్నమాట. ముప్ఫయి నెలల్లో ఇరవై నాలుగు నెలలు తీసివేస్తే స్త్రీ గర్భం ధరించి బిడ్డను కనడానికి పట్టే కనీస కాలం ఆరు నెలలు అవుతుంది. కనుక ఈ స్త్రీ వ్యభిచారం చేసిందని గట్టిగా నిర్ధారించలేము."

ఖలీఫా ఉస్మాన్ గని (రజి) ఈ వివరణ వినగానే ఆ స్త్రీకి శిలాశిక్ష అమలుపరచకుండా ఆపవలసిందిగా చెప్పి ఒక మనిషిని పంపించారు. కాని ఆ మనిషి నిర్ణీత ప్రదేశం చేరుకోక ముందే ఆ స్త్రీకి శిలాశిక్ష అమలుపరచడం జరిగిపోయింది. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఈ సంఘటన వల్ల ఎంతో ఆవేదన చెందారు. హి.శ. 29లోనే మదీనాలోని మస్జిదెనబవి విస్తరణ జరిగింది. నూట అరవై గజాల పొడవు, నూట యాభై గజాల వెడల్పుతో విస్తరణ జరిగింది. రాతి స్తంభాలపై కప్పు నిర్మాణం జరిగింది.

## 10) వలీద్ బిన్ ఉఖ్బా ఉద్వాసన

ఖలీఫా ఉస్మాన్ గని (రజి) కూఫా గవర్నర్‌గా ఉండిన సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి)ను తొలగించి ఆయన స్థానంలో వలీద్ బిన్ ఉఖ్బాను నియమించిన సంగతి గత పేజీల్లో పేర్కొనబడింది. వలీద్ ఖలీఫా ఉస్మాన్ (రజి)కు సవతితల్లి సంబంధ సోదరుడవుతారు. దైవప్రవక్త (స) కాలంలో మక్కావిజయం తర్వాత ఇస్లాం స్వీకరించారు. బనీముస్తలిఖ్ తెగవాళ్ళు ఇస్లాం స్వీకరించిన తర్వాత దైవప్రవక్త (స) వారి నుండి జకాత్ తీసుకురావడానికి వలీద్ బిన్ ఉఖ్బాని పంపించారు. కాని వలీద్ ఆ ప్రాంతానికి చేరుకొని, ఏ కారణంతోనో భయపడి ఆ తెగవారిని కలవకుండానే మదీనా తిరిగొచ్చి, వారు జకాత్ చెల్లించడానికి నిరాకరించారని, తనను హతమార్చజూస్తున్నారని ఫిర్యాదు చేశారు.

దైవప్రవక్త (స) ఈసంగతి వినగానే ఆగ్రహోదగ్రులై ఆ తెగ పీచం అణచేందుకు ఓ సైనికదళం పంపడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఈలోగా బనీముస్తలిఖ్ తెగ నాయకుడు (విశ్వాసుల మాతృమూర్తి జువైరియా గారి తండ్రి హారిస్ బిన్ జిరార్) తన అనుచరులు కొందరితో మదీనా వచ్చారు. ఆయన దైవప్రవక్త (స)ను కలుసుకొని "దైవ సాక్షి! మేము వలీద్‌ని చూడనైనా చూడలేదు. అంచేత మేము జకాత్ చెల్లించడానికి నిరాకరించామన్న, ఆయన్ని చంపదలిచామన్న ప్రశ్నే తలెత్తదు. మేము ఇప్పటికీ ఇస్లాం ధర్మంలో స్థిరంగాఉన్నాం. జకాత్‌చెల్లింపును మేము నిరాకరించడంలేదు" అని అన్నారు. అప్పుడు ఖుర్ఆన్‌లో "విశ్వాసులారా! మీ దగ్గరకు ఎవరైనా దుర్జనుడు ఏదైనా (ముఖ్య) సమాచారం తీసుకొస్తే దాన్ని ఓసారి క్షుణ్ణంగా పరిశీలించండి. అలా చేయకుంటే మీరు ఏదైనా వర్గానికి పొరపాటున నష్టంకల్గించవచ్చు. ఆతర్వాత మీరు జరిగినదానికి విచారిస్తారు."(49:6) అనే సూక్తి అవతరించింది. ఇవీ ఆయన చరిత్ర పూర్వపరాలు.

కూఫాగవర్నర్‌గా వచ్చిన వలీద్ బిన్ ఉఖ్బాతో అబూజుబైదా అనే ఓ తాగుబోతు కవి చనువు పెంచుకొని ఎక్కువగా ఆయన సహచర్యంలోనే ఉండేవాడు. ఒకరోజు వలీద్ ఫజర్ నమాజ్‌లో నాలుగు రకాతులు పఠించి, వెనక్కితిరిగి నమాజీలతో "ఇంకా పఠించాలా?" అనడిగారు. ఈ సంఘటన ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమై విషయం మదీనా



దాకా చేరింది. ప్రజలు వలీద్‌పై మద్యం సేవించినట్లు ఖలీఫాకు ఫిర్యాదు చేశారు. అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) వలీద్‌ని మదీనా పిలిపించి విచారణ జరిపారు. విచారణలో వలీద్ మద్యం సేవించినట్లు రుజువయినందున ఆయనకు ఖలీఫా లాఠీ దెబ్బల శిక్ష వధించి గవర్నర్ పదవి నుండి తొలిగించారు. ఆయన స్థానంలో సయీద్ బిన్ ఆస్ (రజి)ని కూఫా గవర్నర్‌గా నియమించారు.

సయీద్ (రజి) కూఫా వెళ్ళి గవర్నర్ బాధ్యత చేపట్టగానే ముందుగా పాలనావ్యవస్థను పటిష్ఠపరిచారు. ఆ తరువాత ఆయన సైన్యం తీసుకొని వెళ్లి తబ్రిస్తాన్‌పై దాడి చేశారు. ఈ యుద్ధంలో తబ్రిస్తాన్‌తో పాటు జర్జాన్, ఇతర అనేక పట్టణాలు ముస్లింల స్వాధీనమయ్యాయి.

## 11) అబూజర్ గిఫ్ఫారీ (రజి) విచిత్రవాదన

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారీ (రజి) ఒకానొకప్పుడు దారులు కొడుతూ దోపిడీలు చేసే గిఫ్ఫార్ తెగ నాయకునిగా ఉండేవారు. ఆ తర్వాత ఆయన మక్కాలో దైవప్రవక్త (స)ను కలుసుకొని ఇస్లాం స్వీకరించారు. ఆయనతోపాటు ఆయన తెగవారంత ఇస్లాం స్వీకరించి ముస్లింలై పోయారు. హజ్రత్ అబూజర్ (రజి) దైవప్రవక్త (స)తో కలసి అనేక యుద్ధాల్లో పాల్గొన్నారు. అబూబకర్ (రజి), ఉమర్ ఫారూఖ్ (రజి)ల పాలనాకాలంలో కూడా ఆయన ఇస్లాంకు అనేక సేవలు చేశారు.

ఇప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) పాలనకాలంలో జకాత్ విషయమై అబూజర్ (రజి) ధోరణిలో కొంచెం మార్పువచ్చింది. ఆయన సిరియాలో గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) అధీనంలో ఉంటూ ఓ ఖుర్ఆన్‌సూక్తి విషయంలో ముఆవియా (రజి)తో తీవ్రంగా విభేదించారు. ఆ సూక్తి అనువాదం ఇలాఉంది : "వెండిబంగారాలు కూడబెట్టి వాటిని దైవమార్గంలో వినియోగించని పిసినారులకు దుర్భరయాతన కాచుకొని ఉందని శుభవార్త విన్పించు!" (9:34). ఆయన ఈ సూక్తి ఆధారంతో 'డబ్బును కూడబెట్టడం, దాన్ని పూర్తిగా దైవమార్గంలో ఖర్చు పెట్టకుండా ఉంచడం ఏమాత్రం ధర్మసమ్మతం కాదని అంటారు.

అమీర్ ముఆవియా (రజి) ఆయనకు నచ్చజెబుతూ "దైవమార్గంలో ఖర్చుపెట్టడం (ఇన్ఫాఖ్ ఫీ సబీలిల్లాహ్) అంటే జకాత్ చెల్లింపు అని అర్థం. ఏ పైకం నుంచి జకాత్ తీసి అర్హులకు చెల్లించడం జరుగుతుందో ఆ పైకాన్ని కూడబెట్టడం పాపం కాదు. ఒకవేళ జకాత్ చెల్లించిన తర్వాత కూడా డబ్బు కూడబెట్టడం పాపమయితే ఖుర్ఆన్‌లో వారసులకు ఆస్తిపంపిణీ వివరాల ప్రస్తావనే వచ్చేదికాదు" అని అన్నారు. కాని అబూజర్ గిఫ్ఫారీ (రజి) తన దృక్పథమే సరైనదని వాదించేవారు.

ప్రజలు ఈ వాదన సంగతి విని ఆయన్ని ఎగతాళి చేయసాగారు. ముఖ్యంగా నవ యువకులు ఆయన్ని అదేపనిగా ఆట పట్టించడం మొదలెట్టారు. అమీర్ ముఆవియా (రజి) అబూజర్ (రజి) వాదనతో విసిగిపోయి విషయాన్ని ఖలీఫాకు తెలియజేశారు. అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆయన్ని అత్యంత గౌరవమర్యాదలతో మదీనా పంపమని ఆదేశించారు. ఈ ఆదేశం ప్రకారం ముఆవియా (రజి) ఆయన్ని మదీనా పంపారు.

అయితే అబూజర్ గిఫ్ఫారీ (రజి) మదీనాలో కూడా తన దృక్పథాన్ని ప్రచారం చేయ నారంభించారు. ఇక్కడా యువకులు ఆయన్ని ఎగతాళి చేయడం మొదలెట్టారు. ఆ రోజుల్లోనే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) చనిపోయారు. దైవప్రవక్త (స) పదిమంది స్వర్గ వాసులవుతారని ప్రకటించిన జాబితాలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) కూడా ఉన్నారు. ఆయన చనిపోతూ తన వెనుక అపార ధనరాసులు వదలివెళ్ళారు. అప్పుడు కొందరు 'అపారసిరిసందలు వదలివెళ్ళిన అబ్దుర్రహ్మాన్ (రజి) సంగతేమిటని అడిగారు. దానికి అబూజర్ (రజి) ఆయనపై కూడా అదే 'ఫత్వా' (ధార్మికతీర్పు) జారీచేశారు.

ఉమర్‌ఫారూఖ్ (రజి) పాలనాకాలంలో ఇస్లాం స్వీకరించిన ప్రముఖ యూద పండితుడు కాబ్ అహ్‌బార్ (రహ్మ) ఈమాట విని అబూజర్ (రజి)ని విమర్శించారు. దాంతో అబూజర్ (రజి) చిర్రెత్తిపోయి "ఓరీ యూదుడా! ఈ సమస్యల్ని గురించి నీకేం తెలుసు?" అంటూ ఆయన్ని కొట్టడానికి లాఠీ పైకెత్తారు. పాపం కాబ్ కాలికి బుద్ధిచెప్పి ఖలీఫా ఉస్మాన్ (రజి) దర్బారు వైపు పరుగెత్తారు. అబూజర్ (రజి) కూడా లాఠీ తీసుకొని ఆయన వెంటపడ్డారు. ఖలీఫా సేవకులు ఎలాగో అతికష్టం మీద ఆయన్ని నిలువరించి కాబ్ అహ్‌బార్ (రహ్మ)ని కాపాడారు. అబూజర్(రజి) కోపం తగ్గిన తర్వాత ఖలీఫా సన్నిధికి పోయి "మన దగ్గరుండే ధనమంతా తప్పనిసరిగా దైవమార్గంలో ఖర్చుపెట్టాలన్నదే నా దృక్పథం. సిరియావాళ్ళు దీన్ని వ్యతిరేకిస్తూ నన్ను చికాగుపరిచారు. ఇక్కడ మదీనాలో కూడా జనం నన్ను వ్యతిరేకిస్తున్నారు. ఇప్పుడు మీరే చెప్పండి. ఇలాంటి పరిస్థితిలో నన్నేం చేయమంటారు? ఎక్కడికి వెళ్ళమంటారు?" అని అడిగారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) దానికి సమాధానమిస్తూ "మీరు మదీనా వెలుపల ఎక్కడికైనా వెళ్ళిఉండండి" అని సలహా ఇచ్చారు. అప్పుడు అబూజర్ గిఫ్ఫారీ (రజి) మదీనా నుండి మూడుమైళ్ళ దూరంలో ఉన్న రబ్జా అనే ఓ కుగ్రామానికి వెళ్ళి నివసించసాగారు.

## 12) దైవప్రవక్త (స) రాజముద్ర, ఖుర్‌ఆన్ కూర్పు

మహాప్రవక్త ముహమ్మద్ (స) దగ్గర అధికారిక లేఖలు, ఉత్తర్వుల మీద ముద్ర (సీలు) వేయడానికి ఒక ప్రత్యేకమైన ఉంగరం ఉండేది. దైవప్రవక్త (స) నిర్యాణం తరువాత ఆ ఉంగరం ఆయన సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) అధీనంలో ఉండేది. అబూబకర్ (రజి) ఖలీఫా అయిన తరువాత ఆమె దాన్ని ఆయనకు ఇచ్చివేశారు. అబూ బకర్ (రజి) తదనంతరం అది ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దగ్గరకు పోయింది. ఉమర్ ఫారూఖ్ (రజి)కు అంతిమఘడియలు సమీపించినపుడు ఆ ఉంగరాన్ని ఆయన తన కుమార్తె హఫ్సా(రజి)కు అప్పగిస్తూ, తాను నియమించిన ఎన్నికలసంఘం సభ్యులు ఖలీఫాగా ఎన్నుకునే వ్యక్తికి అప్పగించాలని చెప్పారు. దానిప్రకారం ఆ ఉంగరం ఇప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) చేతికి లభించింది.

అయితే హి.శ. 30లో ఆ ఉంగరం ఉస్మాన్ గని (రజి) వ్రేలి నుండి జారి ఒక బావిలో పడిపోయింది. దాన్ని తీయడానికి బావిలోని నీరంతటినీ తోడేసి వెతికారు. కాని ఉంగరం దొరకలేదు. దైవప్రవక్త (స) అధికారిక ముద్ర ఇలా అదృశ్యమైపోవడం పట్ల ఖలీఫా ఉస్మాన్ (రజి) ఎంతగానో విచారించారు. ఆనాటి నుంచి ఆయనపై ఆపదలు,



అరాచకాలు అవతరించడం మొదలయ్యాయి. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ ఉంగరం స్థానంలో అచ్చం అలాంటిదే మరోఉంగరం చేయించుకొని వ్రేలికి పెట్టుకున్నారు.

హి.శ. 30లోనే నమాజ్ చేసేవారి సంఖ్య బాగా పెరిగిపోయి జుమాప్రసంగం కోసం చెప్పే అజా అందరికీ విన్పించేది కాదు. అంచేత ఖలీఫా ఉస్మాన్ (రజి) జుమాప్రసంగం కోసం చెప్పే అజాన్‌కు ముందు ముఅజ్జిన్ ఎత్తయిన చోటుపై ఎక్కి మరొక అజాన్ బిగ్గరగా చెప్పాలని ఆదేశించారు. ఈవిధంగా శుక్రవారం నాడు రెండు సార్లు అజాన్ చెప్పే సంప్రదాయం ఏర్పడింది.

ఖుర్‌ఆన్ పారాయణం విషయంలో మాండలిక ఉచ్ఛారణలు హి.శ. 30 వరకు విభిన్న రకాలుగా ఉండేవి. ఇరాఖ్ ప్రజలు ఒక విధమైన ఉచ్ఛారణతో, సిరియా ప్రజలు మరొక విధమైన ఉచ్ఛారణతో ఖుర్‌ఆన్ పఠించేవారు. అలాగే బస్రా ప్రజల ఉచ్ఛారణ కూఫా ప్రజలకు ఉచ్ఛారణకు, కూఫా ప్రజల ఉచ్ఛారణ పార్శీ ప్రజల ఉచ్ఛారణకు భిన్నంగా ఉండేది. ఖుర్‌ఆన్ ఉచ్ఛారణలోని ఈ వైరుధ్యం గమనించిన హజ్రత్ హుజైఫా బిన్ యమాన్ (రజి) ప్రజలందరి కోసం ఒకే విధమైన ఉచ్ఛారణ ఉండేలా చేస్తే బాగుంటుందని భావించారు. ఈ అభిప్రాయం అందరికీ నచ్చింది.

అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) ఉమర్‌ఫారూఖ్ (రజి) కుమార్తె హజ్రత్ హఫ్సా (రజి) దగ్గరున్న ఖుర్‌ఆన్ ప్రతిని తెప్పించారు. ఇది అబూబకర్ (రజి) పాలనాకాలంలో జైద్ బిన్ సాబిత్ (రజి), మరికొందరు ప్రముఖ సహాబీల ఉచ్ఛారణతో తయారైన ప్రతి. ఈ ఖుర్‌ఆన్ ప్రతి నుండి నకళ్ళు తీసి ప్రచురించడానికి ఖలీఫా ఉస్మాన్ (రజి) సమర్థులు, యోగ్యులైన కొందరిని నియమించారు. ఇలా అనేకనకళ్ళు తయారైన తరువాత వాటిలో ఒక్కొక్క ప్రతిని ఒక్కొక్క ముఖ్యపట్టణానికి పంపుతూ ఇకనుంచి ఈ ప్రతి నుండే నకళ్ళు తీసి ప్రచురిస్తుండాలని, ఆయా పట్టణాలలో ఉన్న పాత ప్రతులన్నిటినీ కాల్చివేయాలని ఆయన ఉత్తర్వులు జారీచేశారు. రాజ్యమంతటా ఈ ఉత్తర్వును అమలుపరచడం జరిగింది. అప్పటినుండి ప్రపంచంలో ఈ ప్రతే కొనసాగుతోంది.

## 13) ఈరాన్ పరిస్థితి, చక్రవర్తి యజ్దగిర్ద్ హత్య

హి.శ. 31లో బస్రా గవర్నర్ అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) హజ్ నిమిత్తం మక్కా వెళ్ళి పోయారు. అప్పుడొక ఈరానీ నాయకుడు ఖారున్ వివిధ ప్రాంతాల నుండి నలభైవేల మంది సైనికుల్ని సమీకరించి తాము కోల్పోయిన భూభాగాలను తిరిగి ఆక్రమించుకోవ డానికి యుద్ధసన్నాహాలు చేశాడు. ఈ సంగతి తెలుసుకున్న అబ్దుల్లా బిన్ హాజిమ్ అనే ముస్లిం దండనాయకుడు బస్రా నుండి కేవలం నాలుగువేల మంది యోధుల్ని తీసుకొని బయలుదేరారు. ఆయన తన సైనికుల్ని ఈటెలకు గుడ్డపేలికలు చుట్టి వాటిని నూనెతో, కొవ్వుతో తడిపి సిద్ధంగా ఉంచుకోమని ఆదేశించారు. సైనికులు అలాగే చేశారు.

ఖారున్‌సైన్యం ముస్లింయోధుల్ని ఢీకొనడానికి దగ్గరగా వచ్చింది. అప్పుడు సూర్యుడు అస్తమించి చీకటి పడింది. వెంటనే అబ్దుల్లా బిన్ హాజిమ్ ఈటెలకు చుట్టిన గుడ్డపేలికలకు నిప్పుపెట్టి శత్రువులపై దాడిచేయమని ఆదేశించారు. యోధులు అలాగే

చేసి ఒక్కసారిగా శత్రువులపై విరుచుకుపడ్డారు. అనుకోని ఈ హఠాత్పరిణామంతో ఖారున్ సైనికులు బిత్తరపోయి పరుగు లంకించుకున్నారు. ముస్లింలు వారిలో అనేక మందిని హతమార్చి, అనేకమందిని యుద్ధఖైదీలుగా పట్టుకున్నారు.

ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలంలోనే అధికారం కోల్పోయిన ఈరాన్ చక్రవర్తి యజ్డ్‌గిర్ద్ తన వేలాదిమంది నమ్మినబంట్లను తీసుకొని రహస్యసంచారం చేయసాగాడు. అతని పరిస్థితి దయనీయంగా మారింది. ముస్లింలు ఎప్పుడు ఎటు నుంచి దాడిచేస్తారో నన్న భయంతో ఏఒక్క ప్రదేశంలోనూ నిలకడగా ఉండకుండా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఒకచోటునుంచి మరొకచోటుకు, మరొకచోటునుంచి వేరొకచోటుకు తిరగసాగాడు. యజ్డ్‌గిర్ద్ వెంటనున్న పార్శీలు తమ చక్రవర్తి అదృష్టతార ఎప్పుడో ఒకరోజు తిరిగి ఉదయించవచ్చన్న ఆశాతో అతనెక్కడికి పోయినా అతని వెన్నంటే ఉండసాగారు. ఈ కారణంగానే ఈరాన్‌లోని కొన్నిరాష్ట్రాల్లో అప్పుడప్పుడు పార్శీలు తిరుగుబాటుకు పాల్పడు తుండేవారు. అయితే ముస్లింలు వారిని వెంటనే అణచివేస్తుండేవారు. చివరికి హి.శ. 31లో యజ్డ్‌గిర్ద్ ఒకసారి ఓపెద్ద సైన్యంతో బలఖ్ పరిసర ప్రాంతంలోకి ప్రవేశించి అక్కడ కొన్ని పట్టణాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. కాని కొన్నాళ్ళలోనే ముస్లింయోధుల చేతిలో ఓటమి చవిచూసి పారిపోయాడు. ముస్లింలు వెంటపడటంతో అతను దాక్కునే ఉద్దేశ్యంతో నీటి తిరగలివాని ఇంటికెళ్ళి అతని శరణజొచ్చాడు. అయితే అక్కడా దురదృష్టం అతడ్ని వెన్నాడటం మానలేదు. యజ్డ్‌గిర్ద్ ధరించిన ఖరీదైన బట్టలు, ఆభరణాలు చూసి ఆ మనిషికి నోరూరింది. ఆరోజు రాత్రివేళ యజ్డ్‌గిర్ద్ గాఢనిద్రలో ఉన్నపుడు నీటి తిరగలివాడు అతడ్ని హత్యచేసి అతని వంటిపై ఉన్న ఉడుపులు, ఆభరణాలు తీసేసుకున్నాడు. తర్వాత అతని శవాన్ని ఓ కోనేరులోకి విసిరేశాడు. యజ్డ్‌గిర్ద్ మరణంతో ఈరాన్‌లో తిరుగుబాటులు, అరాచకాలు సమసిపోయాయి.

## 14) అరాచక ఆప్తమిత్రులు

కూఫాలో వలీద్ బిన్ ఉఖ్బాని తొలగించి అతని స్థానంలో సయీద్ బిన్ఆస్ (రజి)ని గవర్నర్‌గా నియమించిన విషయం గతపేజీల్లో పేర్కొనబడింది. సయీద్ (రజి) గవర్నర్ బాధ్యతలు చేపట్టిన తరువాత కూఫాప్రజల్ని సంతోషపెట్టడానికి తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకున్నారు. సయీద్ (రజి) అవలంబించిన ఈ వైఖరితో కొందరు వ్యక్తులు ఆయన దర్బారుకు వస్తూపోతూ ఆయన పట్ల చనువుగా మసలుకోసాగారు. అలాంటివారిలో మాలిక్ బిన్ హారిస్ (మాలిక్ అష్తర్), సాబిత్ బిన్ ఖైస్ హమ్దాని, అస్వద్ బిన్ యజీద్, అల్ఖమా బిన్ ఖైస్, జుందుబ్ బిన్ జహీర్, జుందుబ్ బిన్ కాబ్ అజ్దీ, ఉర్వా బిన్ జాద్, ఉర్వా బిన్ హాఖ్‌ఖజాయి, సాసా వజీద్, కమీల్ బిన్ జియాద్ మొదలైన వారున్నారు.

గవర్నర్ సయీద్ (రజి) ప్రతిరోజూ రాత్రివేళ తన సహచరులతో సమావేశమవుతూ పిచ్చాపాటి కబుర్లు చెప్పుకునేవారు. ఈ సమావేశాలకు పైన ప్రస్తావించబడిన వ్యక్తులు కూడా వస్తుండేవారు. ఈ సమావేశాల్లో అప్పుడప్పుడు పరిహాస పలుకులు కూడా ప్రస్తావనకు వస్తుండేవి. ఒకరోజు గవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి) నోట "ఈ ప్రాంతం ఖురైషీయుల బృందావనం" అనే మాట వెలువడింది. మాలిక్ బిన్ అష్తర్ ఈమాట



వినగానే కోపోద్రేకంతో "దేవుడు మా ఖడ్గాలతో విజయం చేకూర్చి ప్రసాదించిన ఈ భూభాగాన్ని నీవు నీజాతివాళ్ళ తోట అని భావిస్తున్నావా?" అన్నాడు. వెంటనే మరి కొందరు కూడా అతడ్ని సమర్థిస్తూ అలాంటి మాటలే బిగ్గరగా చెప్పసాగారు. ఇలా అరుపులు, కేకలతో సమావేశం రసాభాసం కావడం చూసిన అబ్దుర్రహ్మాన్ అసది వారితో అల్లరి చేయకండని చెప్పారు. అంతే, అల్లరిమూకలు ఒక్కసారిగా విరుచుకుపడి అబ్దుర్రహ్మాన్‌ని చితకబాదారు. దాంతో అతను స్పృహతప్పి పడిపోయాడు. ఈ దుర్ఘటన తరువాత గవర్నర్ సయీద్ (రజి) రాత్రిసమావేశాల్ని రద్దుచేసి లోపలికి ఎవర్నీ రానీయ వద్దని చెప్పి కొందరిని కాపలాదారులుగా నియమించారు.

కూఫాలో రాత్రి సమావేశాలు రద్దుకావడం పట్ల అనేకమంది ప్రజలు విచారం వ్యక్త పరిచారు. వారిలో కొందరు ఇద్దరు ముగ్గురు ఒకచోట కలిసినప్పుడల్లా గవర్నర్ సయీద్ (రజి)పై, ఖలీఫాఉస్మాన్ (రజి)పై ఆరోపణలు చేసేవారు. వారి చుట్టు కొందరు మూర్ఖులు గుమికూడి వారికి వత్తాసుపలికేవారు. ఈ అరాచకం, అల్లకల్లోలాలు క్రమంగా అధికమవుతుండటంతో గవర్నర్ సయీద్ (రజి) విషయం వివరిస్తూ ఖలీఫాకు లేఖ రాశారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ అల్లరిమూకను అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు సిరియా పంపివేయమని ఆదేశించారు. సయీద్ (రజి) అలాగే చేశారు.

అమీర్ ముఆవియా (రజి) ఆ అల్లరిమూకను దారికి తెచ్చేందుకు వారిపట్ల ఎంతో ప్రేమతో, మృదువుగా ప్రవర్తించారు. ఆ తర్వాత ఓరోజు ఆయన వారితో మాట్లాడుతూ "ఖురైషీయుల నాయకత్వాన్ని అంగీకరించండి. ముస్లింల ఐక్యతను చెడగొట్టకండి" అని చెప్పారు. కాని ముఆవియా (రజి) మృదుభాషణ, సానుభూతి వచనాలకు వారిలో ఒకడు కస్సుమంటూలేచి అనుచిత సమాధానమిచ్చాడు. దాంతో ఇక లాభంలేదని తలచి ఆయన ఖలీఫాకు లేఖ రాసి ఆయన ఆదేశంతో ఆ మిత్రమూకను హిమస్ గవర్నర్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఖాలిద్ దగ్గరకు పంపివేశారు. అబ్దుర్రహ్మాన్ వారిపట్ల కఠినంగా ప్రవర్తించడం ప్రారంభించారు. దాంతో కొన్నాళ్ళకు వారు తమ వాదనలు మానుకొని దారికి వచ్చారు. అప్పుడు ఖలీఫా వారిని కూఫాకు వెళ్ళిపోవడానికి అనుమతించారు.

## 15) సబాయీ అరాచకం ఆరంభం

సనా పట్టణంలో అబ్దుల్లా బిన్ సబా అనే ఓ యూదుడుండేవాడు. అతను ఉస్మాన్ (రజి) పాలనలో ముస్లింలకు అపార సిరిసందలు లభించడం, ఇప్పుడు ముస్లింలే ప్రపంచంలో విజేతజాతి అయిపోవడం చూసి అసూయాగ్నిలో పడి మండిపోయాడు. దాంతో అతను మదీనా వెళ్ళి తననుతాను ముస్లిం అని చెప్పుకొని ముస్లింలలో కలసి పోయాడు. అతను మదీనాలో ఉంటూ ముస్లింలలోని అంతర్గత, బాహ్య బలహీనతలను అధ్యయనంచేసి ఇస్లాంవ్యతిరేక పన్నాగాలు పన్నే పనుల్లో నిమగ్నుడైపోయాడు.

ఆరోజుల్లోనే బస్రాలో హకీం బిన్ జబలా అనే ఒక ముస్లిం ధనపిపాసి ఉండేవాడు. అతను యుద్ధసమయాల్లో వీలు చిక్కినప్పుడల్లా జిమ్మీలను (ఇస్లామీయరాజ్యంలోని ముస్లిమేతరుల్ని) దోచుకునేవాడు. అతనికీ పనిలో మరికొందరు తోడుదొంగలు దొరికారు. అతని దోపిడీ వార్తలు రాజధాని (మదీనా) వరకు ప్రాకాయి. ఖలీఫా హజ్రత్

ఉస్మాన్ (రజి) అతడ్ని పట్నం సరిహద్దులు దాటి పోనివ్వకుండా బస్రాలోనే నిర్బంధించి ఉంచమని బస్రా గవర్నర్‌కు ఉత్తర్వు జారీచేశారు. ఆవిధంగా హకీం బిన్ జబలా బస్రా పట్నంలోనే నిర్బంధానికి గురయి ఉండసాగాడు.

ముస్లింవేషంలో కుట్రలు పన్నుతున్న ఇబ్నెసబా ఈ సంగతి తెలుసుకొని బస్రా వెళ్ళి హకీం బిన్‌జబలా ఇంట్లో ఉండసాగాడు. ఇక్కడ తననుతాను ముస్లింల శ్రేయోభిలాషిగా, ప్రవక్తకుటుంబాభిమానిగా చెప్పుకుంటూ తన దుష్టపథకాన్ని అమలు చేయనారంభించాడు. మొదట అతను తన మాయమాటలతో హకీంని, అతని మిత్రమూకను బుట్టలో వేసుకున్నాడు. తర్వాత క్రమంగా అతని బాహ్యావతారం చూసి కొందరు అమాయకులు, మరికొందరు స్వార్థపరులు అతని వలలో పడిపోయారు.

వీరందరి సహకారంతో ఇబ్నెసబా తన దుష్టపథకానికి అనుగుణంగా ప్రజల హృదయాల్లో కల్లోలం రేకెత్తించే ఆలోచనలు, నమ్మకాలు నూరిపోయడం మొదలెట్టాడు. అతను ఒక్కోసారి "ముస్లింలు ఈసా (అలై) మళ్ళీ ప్రపంచంలోకి వస్తారని నమ్ముతారు. కాని ముహమ్మద్ (స) కూడా మళ్ళీ ప్రపంచంలోకి వస్తారనే విషయాన్ని నమ్మకపోవడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది" అని చెప్పేవాడు. ఖుర్‌ఆన్‌లోని "ఇన్నల్లజీ ఫరజ అలైకల్ ఖుర్‌ఆన లరద్దుక ఇలా మఆద్" (పవక్తా! నీపై ఈ ఖుర్‌ఆన్‌ని అవతరింపజేసిన దేవుడు నిన్ను తప్పకుండా అత్యంత శ్రేష్ఠమైన స్థానానికి చేర్చుతాడు-28:85) అనే సూక్తికి తప్పుడు వ్యాఖ్యానంచేస్తూ "ముహమ్మద్ (స) మళ్ళీ ప్రపంచంలోకి తప్పక వస్తార"నే విశ్వాసంపై ప్రజలను స్థిరంగాఉంచే ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.

దాంతో బుద్ధిహీనులు అనేకమంది అతని మాయాజాలంలో పడిపోయారు. ఆ తర్వాత అతను 'ప్రతి దైవప్రవక్తకూ ఒక ఖలీఫా (ప్రతినిధి), ఒక వారసుడు ఉంటాడు, హజ్రత్ అలి (రజి) ముహమ్మద్ (స)కు వారసుడు. ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త అయినట్లే హజ్రత్ అలి (రజి) అంతిమ వారసుడవుతారు' అనే విశ్వాసంపై ఆ బుద్ధిహీనుల్ని స్థిరంగాఉంచే పని ప్రారంభించాడు. ఈపని కాస్త వేడి పుంజుకోగానే "దైవప్రవక్త (స) తదనంతరం ప్రజలు హజ్రత్ అలి (రజి)ని వదిలేసి వేరే వ్యక్తిని ఖలీఫాగా చేసి పెద్ద తప్పు చేశారు. అంచేత ఇప్పుడు అందరూ హజ్రత్ అలీ (రజి)కి తమ సహాయసహకారాలు అందజేయాలి. ప్రస్తుత ఖలీఫాను హతమార్చిగాని, పదవీచ్యుతుడ్ని చేసిగాని హజ్రత్ అలీ (రజి)ని ఖలీఫాగా ఎన్నుకోవాలి" అని అతను ప్రచారం మొదలెట్టాడు.

ఈవిధంగా ఇబ్నెసబా తన దుష్టపథకాన్ని చాలా తెలివిగా అమలుపరుస్తూ ఒకవర్గం ముస్లింలకు హీరోగా తయారుకాసాగాడు. ఈ అరాచకం క్రమక్రమంగా విస్తరిస్తూ బస్రా గవర్నర్ కుర్చీకి తాకింది. వెంటనే బస్రా గవర్నర్ అతడ్ని పిలిపించి చీవాట్లుపెట్టాడు. దాంతో అతను బస్రాలో తన అనుచరమూకకు తగిన సూచనలిచ్చి బస్రా నుంచి కూఫా పట్నానికి వెళ్ళిపోయాడు. కూఫాలో కూడా అతను తన పైశాచిక కార్యకలాపాలు సాగించాడు. కూఫాలో అంతకుముందు నుంచే ఖలీఫాకు కొందరు ప్రత్యర్థులు తయారై వున్నారు. అందువల్ల ఇబ్నెసబాకు తన దుష్టపథకాన్ని ముందుకు తీసికెళ్ళేందుకు సువర్ణవకాశం లభించింది.



అతను కొద్ది కాలంలోనే తన ధర్మపరాయణత, తపోనిష్ఠల పగటివేషంతో కూఫా ప్రజల హృదయాల్ని చూరగొన్నాడు. జనం భక్తిశ్రద్ధలతో అతడ్ని ఎంతో గౌరవించేవారు. అయితే కూఫాగవర్నర్ కూడా ఇబ్నెసబా పైశాచికవిశ్వాసాల ప్రచారం గురించి వినగానే అతడ్ని పిలిపించి చీవాట్లుపెట్టాడు. కూఫాలోని కొందరు విజ్ఞులు, పెద్దలు కూడా అతడ్ని అనుమానాస్పదంగా చూడసాగారు. అంచేత అతను కూఫా కూడా వదలి సిరియా రాజధాని డెమాస్కస్‌కు వెళ్ళిపోయాడు. అతను బస్రాలో లాగే కూఫాలో కూడా తన అనుచరమూకకు సూచలిచ్చి వెళ్ళిపోయాడు. డెమాస్కస్‌లో తన పాచిక పారకపోవడంతో అక్కడ్నుంచి కూడా మూటాముల్లే సర్దుకొని వెళ్ళి ఈజిప్టు రాజధానిలో తిష్ఠవేశాడు.

ఇబ్నెసబా ఇక్కడ మరెంతో చాకచక్యంతో "ప్రవక్త కుటుంబాభిమానం, అలీ (రజి)కి మద్దతు" అనే తన స్వయంకృత విశ్వాసాల్ని ప్రజలమెదళ్ళలో జొప్పించడం ప్రారంభించాడు. దానికోసం ఈజిప్టులో అనేకచోట్ల రహస్యస్థావరాలు నెలకొల్పాడు. ఇక్కడ్నుంచి బస్రా, కూఫా పట్టణాల్లోని తన అనుచరగణంతో ఉత్తరప్రత్యుత్తారాలు జరిపేవాడు. అదిగాక హజ్రాత్ అలి, జుబైర్, తల్హా, ఆయిషా (రజి)ల పేర్లతో బస్రా, కూఫా, ఈజిప్టుల్లోని వారి అభిమానులకు ఉత్తరాలు రాసి పంపేవాడు. ఇలా బస్రా, కూఫా, ఈజిప్టుల నుంచి అక్కడి పాలకులు ప్రజలపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపిస్తూ మదీనా ప్రజలకు; మదీనా నుండి ఈజిప్టు, బస్రా, కూఫా ప్రజలకు ప్రారంభించిన ఉత్తరప్రత్యుత్తరాల పరంపర ఓ పెద్ద 'నెట్‌వర్క్'గా తయారైపోయింది.

ఈజిప్టుగవర్నర్‌కు ఆఫ్రికా, కాన్‌స్టాంటినోపిల్ వగైరా విదేశీసైన్యాల ఎడ తెరిపిలేని దాడుల్ని ప్రతిఘటించడంలో నిమగ్నమైపోవడంవల్ల దేశ అంతర్గతవ్యవహారాల్ని గురించి ఆలోచించడానికి తీరికే లభించేది కాదు. దానికి తోడు ఈజిప్టువాసుల్లో కొందరికి గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ వ్యవహారాలు నచ్చలేదు. ఈరెండు విషయాలు ఇబ్నెసబా పనిని మరింత సులువుచేశాయి.

ఇబ్నెసబా, అతని మిత్రమూకలు ప్రారంభించిన ఉత్తరప్రత్యుత్తరాల"నెట్‌వర్క్" ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపింది. ప్రతి రాష్ట్రంలోని ప్రజలు తమకంటే ఎక్కువ ఇతర రాష్ట్రాల ప్రజలపై దౌర్జన్యం జరుగుతోందని, ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ రాష్ట్రాల ప్రజలపై దౌర్జన్యపరులైన గవర్నర్‌లను బలవంతంగా రుద్దారని, వాళ్ళను పదవుల నుంచి తొలగించడానికి నిరాకరిస్తున్నారని భావించసాగారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి ఈజిప్ట్‌కు అమ్మార్ బిన్ యాసిర్ (రజి)ని, కూఫాకు ముహమ్మద్ బిన్ మస్లమాని పంపించారు. ఈజిప్టులో ఇబ్నెసబా అనుచరులు, అక్కడి గవర్నర్‌పట్ల అయిష్టంగా ఉన్నవారు అమ్మార్ (రజి)కు ఖలీఫా వైఖరి గురించి లేనిపోని మాటలుచెప్పి ఆయన్ని మదీనా పోనీయకుండా ఆపుకున్నారు. ముహమ్మద్ బిన్ మస్లమా కూఫాలో నానాటికి దిగజారుతున్న పరిస్థితుల్ని గురించి ఖలీఫాకు లేఖ రాశారు. ఆ రోజుల్లోనే కూఫాలోని ఖిలాఫత్ వ్యవస్థ మద్దతు దారులు, ప్రజాప్రతినిధులు, జనశ్రేయోభిలాషులైన కొందరు ప్రముఖులు రాష్ట్రంలో ఏర్పడిన అరాచక పరిస్థితి పట్ల విసుగెత్తి వేరే ప్రాంతాలకు తరలిపోయారు.

కూఫా గవర్నర్ హ్రజత్ సయీద్ బిన్ ఆస్ (రజి) రాష్ట్రంలో నానాటికి తీవ్రమవుతున్న తిరుగుబాటు, అల్లకల్లోల పరిస్థితి చూసి, తన స్థానంలో ఖాఖా బిన్ అమ్రని ఇన్‌చార్జ్ గవర్నర్‌గా నియమించి, రాష్ట్రపరిస్థితి గురించి వివరించడానికి మదీనా వెళ్ళారు. ఆయన మదీనా వెళ్ళిన తరువాత కూఫాలో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ప్రజలలో అనేకమంది ఖలీఫా ఉస్మాన్ (రజి)ని, ఆయన నియమించిన గవర్నర్‌లను దూషిస్తూ అల్లర్లు, అల్లకల్లోలాకు పాల్పడ్డారు.

ఇదిలా ఉంటే మరొకవైపు యజీద్ బిన్ ఖైస్ అనేవాడు కొందరు జనాన్ని వెంటేసు కొని హ్రజత్ ఉస్మాన్ (రజి)పై వత్తిడితెచ్చి ఆయన్ని ఖిలాఫత్ పదవి నుండి తొలిగించే ఉద్దేశంతో మదీనా బయలుదేరాడు. అతని దురుద్దేశం తెలుసుకున్న ఇన్‌చార్జ్ గవర్నర్ ఖాఖా బిన్ అమ్ర్ ఓ చిన్న సైనికదళంతో వెళ్ళి దారిలోనే అతడ్ని అణచి దారికి తీసు కొచ్చారు. కాని మరికొన్నాళ్ళలోనే డెమాస్కస్ నుండి మాలిక్ అష్ర్తా అనే ఓ తలబిరుసు ముస్లిం తన మిత్రమూకతో కూఫాకు వచ్చేశాడు. అతని రాకతో కూఫా అల్లరిమూకకు, యజీద్ బిన్ ఖైస్ అనుచరులకు మరింత ధైర్యం వచ్చింది. వారంతా ఖలీఫా ఉస్మాన్ (రజి)కు వ్యతిరేకంగా పెద్దఎత్తున తిరుగుబాటు బావుటా ఎగరవేసి కూఫా నుండి బయలుదేరారు. ఇన్‌చార్జ్ గవర్నర్ ఖాఖా ఆ గుంపును అడ్డుకోలేకపోయారు.

## 16) ఖలీఫాపై తిరుగుబాటు ప్రారంభం

ఆ సంవత్సరం ఖలీఫా ఉస్మాన్ గని (రజి) వివిధ రాష్ట్రాల గవర్నర్‌లకు, అధికారు లకు లేఖలు రాసి, హజ్ చేసిన తరువాత మదీనా వచ్చి తనను కలుసుకోవాలని ఆదేశించారు. ఈ ఆదేశం ప్రకారం వివిధ రాష్ట్రాల నుండి గవర్నర్లు, ఉన్నతాధికారులు హజ్‌యాత్ర అనంతరం మదీనా చేరుకున్నారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) వారందరినీ సమావేశపరచి "నాకు వ్యతిరేకంగా చెలరేగిన ఈ అరాచకం, అల్లకల్లోలాలకు కారణం ఏమిటో తెలియజేసి, ఇలాంటి పరిస్థితిలో నన్నేం చేయమంటారో చెప్పండి" అని సలహా అడిగారు.

అప్పుడు బస్రా గవర్నర్ అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) ఈమాట విని "నా దగ్గర ఈ సమస్యకు ఒకేఒక పరిష్కారం ఉంది. ఈ అల్లరిమూకను ఎల్లప్పుడూ జిహాద్‌లో లీనమై ఉండేలా చేయాలి. వీరు జిహాద్‌లో గనక నిమగ్నులైపోతే ఈ అల్లర్లు, అల్లకల్లోలాలు వాటంతటవే సమసిపోతాయి" అని చెప్పారు.

కూఫా గవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి) మాట్లాడుతూ "ఈ అల్లరి మూకల నాయకు లను ప్రతి చిన్న విషయంలోనూ చీవాట్లుపెట్టి తీవ్రంగా హెచ్చరిస్తూ వారిని చెల్లాచెదరు చేయాలి. అప్పుడు వారి శిష్యగణం కూడా వారిని వదిలేసి చెల్లాచెదరైపోతుంది" అని చెప్పారు. దానికి ఖలీఫా ఉస్మాన్ (రజి) "ఈ అభిప్రాయం బాగానే ఉందికాని, దాన్ని ఆచరణలో పెట్టడం అంతసులభంకాదు" అన్నారు. సిరియాగవర్నర్ అమీర్ ముఆవియా (రజి) ఈమాట విని "దాన్ని గురించి మీరు చింతించకండి. మేమంత మా రాష్ట్రాల్లో అల్లర్లు జరగనీయకుండా ఆ దుండగుల్ని పూర్తిగా తుడిచిపెడ్తాం" అని అన్నారు.



ఈజిప్టు గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ (రజి) మాట్లాడుతూ "వీరసలు ధనపిపాసులు. అంచేత మనం వీరిని ధనకనక వస్తువులతో మనవైపు తిప్పుకుందాం" అని అన్నారు. కొందరు ఉన్నతాధికారులు తమ అభిప్రాయం వెలిబుచ్చుతూ "ఇలాంటి అరాచకశక్తులు, తిరుగుబాటుదారుల పట్ల ఏమాత్రం మెతకవైఖరి ప్రదర్శించకూడదు. అసలు ఇలాంటి నేరస్థుల్ని వెతికి వెతికి హతమార్చాలి" అని చెప్పారు. దానికి హ్రజత్ ఉస్మాన్ (రజి) సమాధానమిస్తూ "నేను ఖుర్‌ఆన్, హదీసులు నిర్దేశించిన మేరకే వారికి శిక్షలు విధించ గలను. అంతకు మించి నేనేమీ చేయలేను సహనం వహించడం తప్ప" అని అన్నారు. ఆతర్వాత ఈ సమావేశం ఎలాంటి తీర్మానం చేయకుండానే ముగిసింది. గవర్నర్లు, అధికారులు తమతమ రాష్ట్రాలకు తిరుగుప్రయాణమయ్యారు.

కూఫా నుండి మదీనాకు బయలుదేరిన అల్లరిమూకలు దారిలో ఒకచోట మదీనా నుండి తిరిగొస్తున్న కూఫా గవర్నర్ సయీద్ బిన్ ఆస్ (రజి)ని అడ్డగించి, 'కూఫా గవర్నర్ గా అబూమూసా అష్అరీ (రజి)ని నియమించి పంపమని ఖలీఫాకు చెప్పాలంటూ ఆయన్ని బలవంతంగా వెనక్కి తిప్పిపంపింది. హ్రజత్ సయీద్ (రజి) గత్యంతరంలేక మదీనాకు తిరిగొచ్చి విషయం ఖలీఫాకు వివరించారు. ఖలీఫా వెంటనే అబూమూసా (రజి)ను కూఫా గవర్నర్‌గా నియమించి పంపారు. అబూమూసా (రజి) కూఫా చేరుకొని ప్రజలకు నచ్చజెప్పడంతో చాలామంది ఖలీఫాకు విధేయులై ఉంటామని ఒప్పుకున్నారు.

అయితే ఇబ్నెసబావర్గం 'ఉత్తరప్రత్యురాల నెట్‌వర్క్'ద్వారా తన తిరుగుబాటు కార్య కలాపాల్ని మరింత విస్తృతం, వేగవంతం చేసింది. అతని గూఢచారులు, అనుచరులు ఇస్లామీయ రాజ్యమంతటా వ్యాపించారు. వారు ఖలీఫా ఉస్మాన్ (రజి)కు, ఆయన గవర్నర్‌లకు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే పనులను ముమ్మరం చేశారు.

ఖలీఫా హ్రజత్ ఉస్మాన్ (రజి) పరిస్థితులు విషమిస్తూ పోవడం చూసి ప్రవక్త అనుచరుల్లో నమ్మకస్థులైన కొందరు ప్రముఖుల్ని ఎన్నుకొని రాజ్యంలోని మొత్తం గవర్నర్లపై వస్తున్న ఆరోపణల్ని గురించి నిజానిజాలేమిటో తెలుసుకొని రమ్మని పంపించారు. వారంతా వెళ్ళివచ్చి గవర్నర్‌లందరూ న్యాయంగా, నిజాయితీగానే ప్రజల్ని పాలిస్తున్నారని తెలియజేశారు.

జనంలో అనేకమంది హ్రజత్ ఉస్మాన్ (రజి) బంధుప్రేమ (సిలారహ్మి) 'బంధుప్రీతి' గా మారి హద్దుమీరిందని భావించసాగారు. అంచేత ఖలీఫా పిలిచిన ఒకసభలో వారాయనపై రకరకాల ఆరోపణలు చేశారు. ఖలీఫా వారికి తగిన సమాధానాలిచ్చి పంపివేశారు. కాని వారు ఖలీఫా సమాధానాలతో పూర్తిగా తృప్తిచెందలేదు.

హ్రజత్ ఉస్మాన్ (రజి)లోని బంధుప్రేమ, మృదుస్వభావాలు ఎరిగిన హ్రజత్ ఉమర్ (రజి) రాబోయే ప్రమాదాన్ని ముందే ఊహించి ఓసారి హ్రజత్ ఇబ్నెఅబ్బాస్ (రజి)తో ఇలా అన్నారు: " నేను గనక ఉస్మాన్‌ని (ఖలీఫా పదవికి) నా వారసునిగా ప్రతిపాదిస్తే ఆయన (తనతెగ) బనూఉమయ్యా వారిని ప్రజలపై బలవంతంగా రుద్దుతారు. వారు ప్రజల వ్యవహారాల్లో దైవాజ్ఞల్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడతారు. దైవసాక్షి! నేనిలా

చేస్తే ఉస్మాన్ (రజి) ఇలాగే వ్యవహరిస్తారు. ఒకవేళ ఆయన అలాచేస్తే వారు పాపాలకు పాల్పడతారు. దాంతో ప్రజలు అల్లర్లు లేవదీసి ఆయన్ని హతమారుస్తారు."

ఖలీఫా ఉమర్ (రజి) తన రాజకీయ వారసుని ఎంపిక కోసం ఎన్నికల సంఘాన్ని నియమించి, ఆ సంఘంలోని ప్రతిసభ్యుడ్ని "నా తర్వాత నీవు ఖలీఫా అయితే నీ తెగ వాళ్ళను ప్రజల మెడలపై కూర్చోబెట్టకూడదు సుమా!" అని హెచ్చరించారు. అంతేకాదు, ఖలీఫాగా ఎన్నికైన వ్యక్తి తన తెగవాళ్ళకు ఎలాంటి ప్రత్యేక రాయితీలు ఇవ్వకూడదనే విషయానికి కట్టుబడి ఉండాలని కూడా చెప్పారు. కాని ఉస్మాన్ (రజి) ఖలీఫా అయిన తర్వాత ఆ విషయాన్ని పాటించలేకపోయారు. ఆయన తన తెగవారైన బనూఉమయ్యా మనుషులు అనేకమందికి ప్రభుత్వంలో పెద్దపెద్ద హోదాలు ఇచ్చారు.

ఆయన ఓసారి బంధుప్రేమ(సిలారహ్మి) విషయమై మాట్లాడుతూ "ఉమర్ (రజి) దైవప్రసన్నత కోసం తన బంధువులకు ఏమీ ఇవ్వలేదు. నేను దైవప్రసన్నత కోసం నా బంధువులకు ఇస్తున్నాను" అనిఅన్నారు. (తబ్ఖాతె ఇబ్నెసాద్); వేరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "ప్రభుత్వ ధనాగారం విషయంలో అబూబకర్, ఉమర్ (రజి)లు తాము స్వయంగా దీనావస్థలో ఉండటాన్నేగాక తమబంధువుల్ని కూడా దీనావస్థలో ఉంచడాన్ని ఇష్టపడేవారు. కాని నాకు 'బంధుప్రేమ' అంటే ఇష్టం." (అత్తబరి)

ఖలీఫా ఉస్మాన్ (రజి) అవలంబించిన ఈ వైఖరి పర్యవసానంగానే ఉమర్ ఫారూఖ్ (రజి) ఆనాడు అనుమానించిన ప్రమాదం ఇప్పుడు ముంచుకొచ్చింది.

హజ్రత్ ఉస్మాన్ (రజి) సతీమణి హజ్రత్ నాయిలా (రజి) ప్రభుత్వ కార్యదర్శి మర్వాన్ విషయంలో తనభర్త ముందు ఇలాంటి అభిప్రాయమే వ్యక్తపరుస్తూ "మీరు గనక మర్వాన్ చెబుతున్నట్లు నడచుకుంటే అతను మిమ్మల్ని వధింపజేసిగాని వదలి పెట్టడు. అతనిలో దేవుని పట్ల భయమూ, భక్తీ ఏమాత్రం లేవు" అని అన్నారు.

ఓసారి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఖలీఫా ఉస్మాన్ (రజి)తో మాట్లాడుతూ "మీరు ప్రజల పట్ల మితిమీరిన మృదుత్వంతో వ్యవహరిస్తున్నారు. ఉమర్ ఫారూఖ్ (రజి) ఇలా వ్యవహరించేవారు కాదు. వేలమైళ్ళ దూరంలో ఉన్న గవర్నర్లు, అధికారులు ఆయన సన్నిధిలో బానిసలకంటే కూడా ఎక్కువ భయపడేవారు. ముస్లింలలో అనైక్యతాబీజాలు నాటేందుకు ప్రయత్నిస్తున్న అసాంఘికశక్తుల్ని గుర్తించి కూడా మీరు వారిని శిక్షించడం లేదు" అని అన్నారు. హజ్రత్ ఉస్మాన్(రజి) ఈమాట విని మౌనంగా ఉండిపోయారు. అల్లరిమూకపై ఎలాంటి చర్యా తీసుకోలేదు.

సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) పొంచివున్న ప్రమాదాన్ని పసిగట్టి 'ఖలీఫా భద్రత కోసం తాను సిరియా నుంచి బ్రహ్మాండమైన సైనిక పటాలాన్ని మదీనా పంపిస్తానని హజ్రత్ ఉస్మాన్ (రజి)కు విన్నవించుకున్నారు. కాని ఆయన అందుకు అంగీకరించ లేదు.

ఈజిప్టులో ఇబ్నెసబా తన దుష్టపథకానికి అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేసుకున్నాడు. అతని మాయాజాలంలో అమ్మార్ బిన్ యాసిర్ (రజి), వరఖా బిన్ రాఫె (రజి) లాంటి



సహాబీలు కూడా చిక్కుకున్నారు. ఇబ్నెసబా అసలులక్ష్యం గురించి ముస్లింవేషాల్లో ఉన్న అతని యూదసహచరులకు తప్ప మరెవరికీ తెలియదు. అతను ఖిలాఫత్ వ్యవస్థను తుదముట్టించడానికి అలీ(రజి)కి మద్దతు, ప్రవక్తకుటుంబాభిమానాల బూటకపు ప్రచారాన్ని ఓ సాధనంగా వాడుకుంటున్నాడు. అంచేత అతని ఉద్యమకారుల్లో కపట ముస్లింలు, స్వార్థపరులు, అజ్ఞానులు, అమాయకులు అనేకమంది చేరిపోయారు.

వేరొక వైపు (ఇబ్నెఅసాకర్ కథనం ప్రకారం) ఈజిప్టు గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ దౌర్జన్యాలు నానాటికి పెరిగిపోతుండటంతో ఈజిప్టు నుంచి కొందరు ప్రజాప్రతినిధులు మదీనా వెళ్ళి ఖలీఫాకు ఫిర్యాదుచేశారు. ఖలీఫా ఉస్మాన్ (రజి) ఆ గవర్నర్‌ని తీవ్రంగా మందలిస్తూ ఒక లేఖ రాసిపంపారు. కాని అబ్దుల్లా బిన్ సాద్ తనపై వచ్చిన ఆరోపణల్ని ఖండించారు. పైగా తనపై ఖలీఫాకు ఫిర్యాదుచేసిన వారిని నిర్దాక్షిణ్యంగా హత మార్చారు. అప్పుడు ఈజిప్టు నుంచి ఏడొందల మంది ప్రజలు మదీనా చేరుకొని అనేక మంది సహాబీల ముందు అబ్దుల్లా బిన్ సాద్ దౌర్జన్యం గురించి ఫిర్యాదుచేశారు.

దానిపై సహాబీలు వెంటనే స్పందిస్తూ అబ్దుల్లా బిన్ సాద్‌ను గవర్నర్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. హజ్రత్ అలి (రజి) కూడా పరిస్థితి తీవ్రతను వివరిస్తూ "ఈజిప్టుప్రజలు అబ్దుల్లా బిన్ సాద్‌ను తొలగించి వేరొకర్ని నియమించాలని పట్టుబడు తున్నారు" అని చెప్పారు. ఆరోజుల్లోనే ఇబ్నెసబా ఆజ్ఞ ప్రకారం దాదాపు మూడు వేలమంది తిరుగుబాటుదారులు హజ్‌సాకుతో వివిధప్రాంతాల నుంచి బయలుదేరి మదీనా సమీపానికి చేరుకున్నారు. అల్లరిమూకల ప్రతినిధులు మూడు గ్రూపులుగా తయారై నగరంలోకి ప్రవేశించారు.

వారు హజ్రాత్ అలి, జుబైర్, తల్హా (రజి)లను వేర్వేరుగా కలుసుకొని తాము ఉస్మాన్ (రజి)ని ఖలీఫాగా ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించమని చెబుతో "మేము మిమ్మల్ని ఖలీఫాగా అంగీకరిస్తూ 'బైత్' చేయడానికి సిద్ధంగా ఉన్నాం, మా నుండి బైత్ తీసుకోండి" అని అన్నారు. దానికి ఆ ముగ్గురు ప్రముఖులు కఠినంగా సమాధానమిస్తూ వారి 'బైత్'ని నిరాకరించారు. అప్పుడు ఈజిప్టు దుండగుల ప్రతినిధులు హజ్రత్ అలి (రజి)తో మాట్లాడుతూ "సరే మీరు మానుండి 'బైత్' తీసుకోకపోతే పోనివ్వండి. మా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ ప్రజలపై చాలా దౌర్జన్యం చేస్తున్నాడు. మేమతడ్ని గవర్నర్ పదవి నుండి తీసివేయించేదాకా మదీనా నుండి వెళ్ళం" అని అన్నాడు.

హజ్రత్ అలి (రజి) దుండగుల్లోని ఈ దుస్సాహసం చూసి పరిస్థితి చేయి దాటిపో తోందని గ్రహించారు. వెంటనే ఆయన కొందరు సహాబీలతో కలసి ఖలీఫా (రజి) దగ్గరకు వెళ్ళి పరిస్థితి వివరించారు. ఆ తర్వాత ఆయన "నగరం వెలుపల తిష్ఠవేసిన వేలాది మంది అల్లరిమూకలు నగరంలో ప్రవేశించక ముందే అబ్దుల్లా బిన్ సాద్‌ను గవర్నర్ పదవి నుండి తప్పించి ఈజిప్టు గవర్నర్‌గా మరొకర్ని నియమించి పంపండి" అని సలహా ఇచ్చారు. అప్పుడు ఖలీఫాఉస్మాన్(రజి) 'ఎవర్ని నియమించాల'ని అడిగితే 'ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)ని నియమించండ'ని చెప్పారు హజ్రత్ అలి (రజి).

ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) హజ్రత్ అలి (రజి) మద్దతుదారు. అయితే ఆయన ఇబ్నెసబా మాయాజాలంలో పడిపోయారు. ఈ సంగతి అలీ (రజి)కి తెలియదు. ఖలీఫా ఉస్మాన్ (రజి)కు అసలే తెలియదు. అందువల్ల ఆయన అలి (రజి) సలహా పాటిస్తూ ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)కు గవర్నర్‌పదవి నియామక పత్రం రాసిచ్చి ఈజిప్టు వైపు పంపించారు. ఆ తర్వాత హజ్రత్ అలి (రజి) ఈజిప్టుదుండగుల ప్రతినిధుల్ని కలసి విషయం తెలియజేస్తూ "ఇప్పుడు మీ కోరిక నెరవేరిందికదా! ఇక మదీనా నుండి వెళ్ళిపోండి" అని చెప్పి వారిని పంపివేశారు.

## 17) సబాయీదుండగులకు ఊతమిచ్చిన మర్వాన్ పాత్ర

ఆ తర్వాత ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) గవర్నర్ నియామకపత్రం తీసుకొని మదీనా నుండి ఈజిప్టుకు బయలుదేరారు. ఆయన వెంట అనేకమంది ముహాజిర్, అన్సార్ సహాబీలు (ప్రవక్త ప్రత్యక్షఅనుచరులు) కూడా బయలుదేరారు. దారిలో ఒకచోట ఒక నీగ్రోబానిస ఒంటెపై వేగంగా తమ వైపు రావడం చూసి అతడ్ని ఆపి విషయం ఏమిటని అడిగారు వారు. దానికా బానిస "నేను విశ్వాసుల నాయకుని బానిసను. ఆయన నన్ను ఈజిప్టు గవర్నర్‌కు ఒక సందేశం అందజేయడానికి పంపించారు" అని చెప్పాడు. అప్పుడు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) "దానికి సంబంధించిన లేఖ ఏదైనా ఉందా నీ దగ్గర?" అని అడిగారు. దానికతను లేదన్నాడు. కాని జనం అతని దగ్గరున్న నీళ్ళులేని ఒక తోలుతిత్తి లాక్కొని చించి దాన్నుండి లేఖ తీశారు. దాన్ని చదవగానే అందరికీ దిమ్మ తిరిగిపోయింది.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది: "నీ దగ్గరకు ముహమ్మద్ (బిన్ అబూబకర్), ఫలానా ఫలానా వ్యక్తులు చేరుకోగానే ఏదో ఒక సాకుతో వారందర్నీ హతమార్చు. అతని నియామకాన్ని తప్పుడు నియామకంగా భావించి నేను మరొక ఆజ్ఞ పంపే వరకు నీవు నీ పదవిలో కొనసాగు. ఎవరైనా నీ దౌర్జన్యం గురించిన ఫిర్యాదు నా దగ్గరకు తీసుకు రావడానికి ప్రయత్నిస్తే అలాంటివాళ్ళను కారాగారంలో బంధించిపెట్టు."

ఈ ఉత్తరంలో రాసిన విషయాలు వినగానే అందరూ కోపంతో బుసలుకొడ్తూ మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. మదీనా చేరుకొని తల్హా, జుబైర్, అలి (రజి) వగైరా ప్రముఖులకు ఆ లేఖ చూపించారు. వారీ లేఖ చదివి ఎంతో విచారం వెలిబుచ్చారు. అబ్దుల్లా బిన్ మస్‌వూద్, అబూజర్ గిఫ్ఫారీ, అమ్మార్ బిన్ యాసిర్ (రజి)లు ఇంతకు ముందు నుంచే ఖలీఫా ఉస్మాన్ (రజి) పట్ల గుర్రుగా ఉండేవారు. ఇప్పుడీ లేఖ వారి ఆగ్రహానికి ఆజ్యం పోసింది. ప్రవక్త అనుచరులంతా ఇండ్లకు వెళ్ళిపోయిన తరువాత వేలసంఖ్యలో ఉన్న దుండగులు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఒక్కసారిగా నగరంలోకి ప్రవేశించి ఖలీఫా ఇంటిని చుట్టుముట్టారు.

హజ్రత్ అలి (రజి) పరిస్థితులు విషమించడం గమనించి ఖలీఫా దగ్గరకు వెళ్లి "ఈ ఉత్తరం మీరు రాశారా?" అనడిగారు. దానికాయన దేవుని మీద ప్రమాణం చేసి తానీ ఉత్తరం రాయలేదని, రాయమని ఎవర్నీ ఆదేశించలేదని, అసలు తనకీ ఉత్తరం



సంగతే తెలియదని అన్నారు. ఆ తర్వాత ఆరాతీస్తే ఆ లేఖ ఖలీఫా కార్యదర్శి మర్వాన్ రాశాడని తెలిసింది. దాంతో కొందరికి ఖలీఫాపై అనుమానం కలిగింది. వారు మర్వాన్‌ని తమకు అప్పగించమని అడిగారు. అందుకు ఖలీఫా ఉస్మాన్ (రజి) నిరాకరించారు.

హజ్రత్ అలీ (రజి), మరికొందరు సహాబీలు దుండగులకు నచ్చజెప్పడానికి ఎంతో ప్రయత్నించారు. కాని వారు తమ మంకుపట్టు వదల్లేదు. తత్ఫలితంగా హజ్రత్ ఉస్మాన్ గని (రజి) నలభై రోజులపాటు నిర్బంధానికి గురయ్యారు. ఆరోజుల్లో ఆయన నమాజు కోసం ఇంటికి దగ్గర్లోనే వున్న మసీదుకు మాత్రమే పోయివస్తుండేవారు. చివరి మూడు రోజులు దుండగులు ఆయన్ని ఇంటి నుంచి గడప కూడా దాటనివ్వలేదు. ఇంటికి నీటిసరఫరా కూడా నిలిపివేశారు. అప్పుడు ఓ పొరుగింటి ముస్లిం రహస్యంగా నీళ్ళు సరఫరా చేస్తుండేవాడు. ఖలీఫా తన గవర్నర్ లందరికీ పరిస్థితులు వివరిస్తూ లేఖలు రాశారు. వెంటనే గవర్నర్లు తమతమ సైన్యాలు తీసుకొని మదీనా బయలుదేరారు. అయితే ఈ సైన్యాలు మదీనా చేరుకోక ముందే పరిస్థితి చేయిదాటి పోయింది.

యూదమతం నుండి ఇస్లాంలోకి మారిన అబ్దుల్లా బిన్‌సలాం (రజి) ఖలీఫా ఇంటిని దిగ్బంధించిన దుండగులతో ఇలా అన్నారు: "ఆయన్ని చంపకండి. దైవసాక్షి! మీలో ఎవరైనా ఆయన్ని చంపితే అతను కుష్టురోగి అవుతాడు. అతని కాళ్ళు, చేతులు ఉండవు. ఇప్పటిదాకా దేవుని ఖడ్గం వరలోనే ఉంది. మీరు గనక ఆయన్ని చంపితే దేవుడు ఆ ఖడ్గాన్ని బయటికి లాగుతాడు. ఇక ఎన్నటికీ అది వరలోకి పోదు. గుర్తుంచుకోండి. ఒక దైవప్రవక్త హత్యకు బదులు డెబ్బయిమంది మనుషులు హతమార్చబడతారు. ఒక ఖలీఫా హత్యకు బదులు ముప్పయిమంది మనుషులు హతమార్చబడతారు."

దుండగులకు, ఖలీఫా ప్రతినిధులకు మధ్య చర్చలు జరుగుతున్నప్పుడు మర్వాన్ అనేకసార్లు తన నోటిదురుసు, సూటిపోటి మాటలతో అలి(రజి), ఆయన సహచరుల మనస్సుల్ని నొప్పించాడు. అంచేత మదీనావాసులు దుండగుల్ని కలుసుకొని, మర్వాన్‌ని మదీనా నుండి తీసేసే విషయం మాట్లాడమని అడిగారు. మర్వాన్‌ని మదీనా నుండి తీసి దుండగులకు అప్పగించివుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో! అలా జరగలేదు.

సబాయీ దుండగులు మదీనాలో ప్రవేశించి ప్రజల పట్ల అనేక దుశ్చర్యలకు పాల్పడ్డారు. విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మెహబీబా (రజి)ని కించపరిచారు. దైవప్రవక్త (స) మరోసతీమణి ఆయిషా (రజి) మక్కాకు బయలుదేరినప్పుడు మదీనా వదలి ఎందుకు వెళ్తున్నారని అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ "ఈ పైశాచిక తుఫాన్‌లో నేను కూడా నన్ను కించపరచుకోవాలా" అని చెప్పి వెళ్ళిపోయారు.

## 18) ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య, కొత్తఖలీఫా ఎన్నిక

ఖలీఫా ఉస్మాన్ గని (రజి) తన వల్ల ఇతరులకు బాధ కలగకూడదన్న మనస్తత్వం గల మహామనీషి. ఆయన అనుక్షణం పరలోకభీతితో ప్రపంచకార్యాలు నిర్వహించే గొప్ప ధర్మపరాయణుడు. ఏదైనా సమావేశంలోగాని, బంతిభోజనంలోగాని ఆయన అందరితోపాటు కలసి కూర్చునేవారు. అందరినీ ఒకేవిధంగా గౌరవించేవారు. ఆయన

ఒకసారి తన బానిసతో "నేను నీ చెవి పట్టుకొని నీపై దౌర్జన్యం చేశాను. దానికి నా నుండి బదులుతీర్చుకో" అని అన్నారు. బానిస ఖలీఫా చెవి పట్టుకోవడానికి సంకోచించాడు. కాని "ఊ..పట్టుకో" అని రెండవసారి చెప్పిన తరువాత అతను సంకోచిస్తూనే ఖలీఫాగారి చెవి పట్టుకున్నాడు. అప్పుడు ఖలీఫా ఉస్మాన్ (రజి) బానిసతో "సోదరా! నా చెవి గట్టిగా పట్టుకొని మెలెయ్యి. పరలోక ప్రతీకారశిక్ష కంటే ఇహలోక ప్రతీకారశిక్షే చాలా తేలిగ్గా ఉంటుంది" అని అన్నారు.

హజ్రత్ ఉస్మాన్ గని (రజి) తానొక్కడి కోసం ముస్లింలు రక్తసిక్తమై పోకూడదని భావించారు. అంచేత తనరక్షణ కోసం దుండగులతో పోరాడి ప్రాణత్యాగం చేయడానికి సిద్ధపడిన సహాబీలను ఆయన వారించారు. అయినప్పటికీ వారిలో కొందరు ప్రముఖులు ఖలీఫాను కాపాడేందుకు శతవిధాల పోరాడారు. కాని అల్లరిమూకల ముందు వారి ప్రయత్నాలు ఫలించలేదు. వారిలో కొందరు దుండగులతో పోరాడుతూ అమరగతులైపోయారు. మరికొందరు సహాబీలు ఈ అరాచకం, అల్లకల్లోల పరిస్థితిలో తలదూర్చడం ఎందుకని తమతమ ఇండ్లలో కూర్చొని తలుపులు మూసుకున్నారు.

ఈజిప్టు మాజీగవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) మదీనాలో పరిస్థితులు విషమిస్తూ పోతుండటం చూసి తన కుమారులిద్దరు అబ్దుల్లా, ముహమ్మద్‌లను తీసుకొని పాలస్తీనా వెళ్ళిపోయారు. ఈజిప్టు ప్రస్తుత గవర్నర్ అబ్దుల్లా బిన్ సాద్ (రజి) మదీనాలో ఖలీఫా ఇంటిని దుండగులు దిగ్బంధించారని విని ఈజిప్టు నుంచి మదీనాకు బయలుదేరారు. కాని ఆయన మదీనా చేరుకోక ముందే పరిస్థితి చేయిదాటి పోయింది.

ప్రవక్త సతీమణి ఆయిషా సిద్దీఖా (రజి) హజ్‌యాత్రకు బయలుదేరుతూ సోదరుడు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)ని తనవెంట రమ్మని అన్నారు. కాని ఆ సోదరుడు తన సోదరి వెంట మక్కా వెళ్ళడానికి నిరాకరించి దుండగుల్లో కలసిపోయారు.

దుండగులు పొరుగింట్లోకి ప్రవేశించి, అక్కడ ఓ పిట్టగోడ దూకి ఖలీఫా ఇంట్లోకి జొరబడ్డారు. అందరికంటే ముందు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) లోపలికి ప్రవేశించి, ఖలీఫా ఉస్మాన్ (రజి) గడ్డం పట్టుకొని "పొడుగు గడ్డంవాడా! దేవుడు నిన్ను అవమానపరచుగాక" అన్నారు. దానికి ఖలీఫా ఉస్మాన్ (రజి) "నా పేరు పొడుగు గడ్డంవాడు కాదు. నేను విశ్వాసుల నాయకుడు ఉస్మాన్‌ని" అని అన్నారు. ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) మరింత రెచ్చిపోయి "ఈ ముసలితనంలో కూడా నీకు ఖిలాఫత్ పదవి కావాల్సివచ్చిందా!" అన్నారు గడ్డం పట్టుకొనివుండే. దానికి హజ్రత్ ఉస్మాన్ గని (రజి) సమాధానమిస్తూ "నీ తండ్రి బ్రతికివుంటే నాయీ వృద్ధాప్యాన్ని గౌరవించేవారు; నా గడ్డాన్ని ఈవిధంగా పట్టుకునేవారు కాదు" అని అన్నారు. ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) ఈమాట వినగానే ఖలీఫా గడ్డం వదిలేసి వెళ్ళిపోయారు.

అయితే ఆ తరువాత కొందరు సబాయీ దుండగులు కూడా పొరుగింటి పిట్టగోడ దూకి ఖలీఫా ఇంట్లోకి జొరబడ్డారు. అప్పుడు హజ్రత్ ఉస్మాన్ గని (రజి) ఖుర్‌ఆన్ పఠిస్తున్నారు. కనానా బిన్ బషీర్ అనే దుర్మార్గుడు లోపలికి రాగానే హజ్రత్ ఉస్మాన్ (రజి)పై ఖడ్గంతో వ్రేటువేశాడు. వాడు ఖడ్గం పైకెత్తగానే హజ్రత్ ఉస్మాన్ (రజి) అర్ధాంగి



నాయిలా (రజి) చేత్తో కత్తివ్రేటును నిరోధించడానికి ప్రయత్నించారు. దాంతో ఆమె చేతివ్రేళ్ళు తెగిపడ్డాయి. మరొకవ్రేటుతో 82ఏండ్ల ఖలీఫా ఉస్మాన్ (రజి) నేలకొరిగారు. అమ్ర్ బిన్ అమిఖ్ అనే మరొక దుర్మార్గుడు చలనం లేకుండా పడివున్న ఖలీఫా ఉస్మాన్ (రజి)ని బరిశతో తొమ్మిది సార్లు పొడిచాడు.

ఇంటికప్పుపై, ద్వారందగ్గర ఉన్నవారికి ఈ గొడవే తెలియదు. ఖలీఫా భార్య నాయిలా పెట్టిన అనేక కేకల తర్వాత వారు లోపలికివచ్చి చూశారు. అప్పటికే సబాయీ దుండగులు పని ముగించి అక్కడ్నుంచి జారుకున్నారు. వారిలో కొందరు దుండగుల్ని ఖలీఫా సేవకులు వెంటాడి హతమార్చారు. ఖలీఫాశ్రేయోభిలాషులు నిస్తేజంగా పడివున్న ఖలీఫా భౌతికకాయం చూసి "ఇన్నాలిల్లాహి వఇన్నాఇలైహి రాజివూన్" ('మేము దేవుని ఆస్తులం. దేవుని వైపుకే పోవలసిన వాళ్ళం')" అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయారు.

ఆ తరువాత కాస్సేపటికే ఇతర దుండగులు నలువైపుల నుంచి దూసుకువచ్చారు. వారు ఖలీఫా ఇంట్లోకి జొరబడి ఇంటిసామగ్రినంతటిని దోచుకున్నారు. చివరికి కట్టుబట్టలు కూడా వదలిపెట్టలేదు. ఖలీఫా హత్యవార్త నగరంలో కార్చిచ్చులా వ్యాపించింది. ఖలీఫాహత్య వార్త విన్న సహాబీలు శోకసముద్రంలో మునిగిపోయారు.

ఇలా యూదుల కుట్రతో హి.శ. 35వ ఏట జిల్హజ్ 18వ తేదీన 12ఏండ్ల ఉస్మానియా పరిపాలన అంతమైపోయింది. ఖలీఫా ఉస్మాన్ (రజి) భౌతికకాయం మూడు రోజుల దాకా ఖననం కాకుండా ఇంట్లోనే పడివుంది.

హజ్రత్ ఉస్మాన్ (రజి) అమరగతి అయ్యేనాటికి ఇస్లామీయ సామ్రాజ్యంలో వివిధ ప్రాంతాలకు ఈక్రింది వ్యక్తులు పాలకులుగా, గవర్నర్లుగా ఉన్నారు:- మక్కాలో అబ్దుల్లా బిన్ హజ్రమీ, తాయఫ్‌లో ఖాసిమ్ బిన్ రబియా సఖఫి, సనాలో యాలి బిన్ మైనా, నజద్‌లో అబ్దుల్లా బిన్ రబియా, బస్రాలో అబ్దుల్లా బిన్‌ఆమిల్, సిరియాలో ముఆవియా బిన్ అబూసుఫ్యాన్ (రజి), హమస్‌లో అబ్దుర్రహ్మాన్ బిన్ ఖాలిద్, ఖన్సరీన్‌లో హబీబ్ బిన్ మస్లమా, జోర్డాన్‌లో అబుల్ అవూర్ సల్మీ, బహ్రైన్‌లో అబ్దుల్లా బిన్ ఖైస్ ఫజారి, పాలస్తీనాలో ముఆవియా (రజి) తరఫున అల్ఖమా బిన్ హకీం కంది, కూఫాలో అబూమూసా అష్అరీ (రజి), ఖర్‌ఖైస్యాలో జరీర్ బిన్ అబ్దుల్లా, ఆజర్‌బైజాన్‌లో అషాత్ బిన్ ఖైస్, ఇస్ఫిహాన్‌లో సాయెబ్ బిన్ ఇఖ్రా. మదీనాలో కోశాధికారిగా ఉఖ్బా బిన్ అమ్ర్, న్యాయాధికారిగా జైద్ బిన్ సాబిత్ (రజి) నియమితులై ఉన్నారు.

ఈజిప్టులో కూర్చొని కథ నడిపిస్తున్న ముస్లింముఖ యూదుడు ఇబ్నెసబా ఖలీఫాహత్య తర్వాత అకస్మాత్తుగా మదీనాలో ప్రత్యక్షమయ్యాడు. ఆ తర్వాత జరగబోయే తతంగంలో అతను ప్రత్యక్షంగా నాయకపాత్ర వహించకుండా అల్లరిమూకల ద్వారా పనులు జరిపించడం మొదలెట్టాడు. అతను ప్రస్తుత మదీనా పరిస్థితుల్ని అధ్యయనం చేసి తన అనుయాయులకు కొత్తఖలీఫా ఎంపిక ప్రతిపాదన గురించి సూచించాడు. వెంటనే అతని అనుచరులు, తల్హా (రజి), జుబైర్ (రజి), అలీ (రజి)ల దగ్గరకు పోయి "ఖలీఫా పదవి స్వీకరించండి, మేము మీ చేతిలో 'బైత్' చేస్తాం" అని మనవిచేశారు. కాని ఆ ముగ్గురిలో ఎవరూ ఖలీఫాపదవి స్వీకరించడానికి అంగీకరించలేదు.

ఈ పాచిక పారకపోవడంతో ఇబ్నెసబా సూచనతోనే దుండగులు మదీనా పౌరుల్ని సంబోధిస్తూ 'రెండురోజుల్లో కొత్త ఖలీఫాను ఎన్నుకోవాలని; లేకుంటే అలి, తల్హా, జుబైర్ (రజి)లను చంపివేస్తామని నగరంలో దండోరా వేయించారు. దాంతో మదీనా ప్రజలు భయపడి ఆ ముగ్గురు సహాబీల దగ్గరికెళ్ళి సంప్రదించారు. కాని వారిలో ఎవరూ ఖలీఫా కావడానికి అంగీకరించ లేదు. చివరికి ఎలాగో ప్రజల వత్తిడి, అభిమానాలతో హజ్రత్ అలి (రజి) ఖలీఫా పదవి స్వీకరించడానికి అంగీకరించారు. అప్పుడు ప్రజలు తండోప తండలుగా వచ్చి ఆయన చేతిలో చేయివేసి బైత్ చేశారు. ఇబ్నెసబా అనుచరమూకలు కూడా బైత్ చేశాయి.

## 19) ఉస్మాన్ (రజి) పాలన ఒక్కచూపులో

పన్నెండేళ్ళ ఉస్మాన్ (రజి) పరిపాలనలో మొదటి ఆరు సంవత్సరాల్లో ముస్లింల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. అదీగాక ఆయన పాలనా కాలంలో అనేక ప్రాంతాలు ఇస్లామీయ రాజ్యపరిధిలోకి వచ్చాయి. సమరసొత్తు రూపేణ పెద్దఎత్తున సిరిసంపదలు, సారవంతమైన భూములు ముస్లింలకు లభించాయి. అయితే ఈ ఐశ్వర్యం దైవప్రవక్త (స) శిక్షణకు నోచుకోలేకపోయిన ముస్లింలకు మేలుకు బదులు కీడునే తెచ్చిపెట్టింది. వారు ప్రాపంచిక తళుకుబెళుకులకు ఆకర్షితులయ్యారు. సుందరమైన వారి సదాచరణ సౌధం క్రమంగా బీటలువారసాగింది.

దానికి తోడు హజ్రత్ ఉస్మాన్ (రజి) అవలంబించిన సిలారహ్మి (బంధుప్రేమ) పాలసి బెడిసికొట్టింది. పరిపాలనా వ్యవస్థలో ఆయన తన తెగ (బనూఉమయ్యా)కు చెందిన వ్యక్తుల్నే ఎక్కువగా నియమిస్తుండేవారు. ఇతర తెగలకు చెందిన వ్యక్తుల్లో పరిపాలనాదక్షతతో పాటు, దైవభీతి-ధర్మపరాయణతలు అత్యధికంగా ఉన్నప్పటికీ వారిని పదవుల నుండి తొలగించి దైవప్రవక్త (స) శిక్షణ, దైవభీతి-ధర్మపరాయణతలు అంతగా లేని బనూఉమయ్యా తెగవారికే పదవులు కట్టబెడ్తుండేవారు.

దాంతో హద్దుమీరిన ఈ బంధుప్రేమ నియామకాలను ప్రజలు బంధుప్రీతి నియామకాలుగా భావించి ఖలీఫా ఉస్మాన్ (రజి)ని అనుమానస్పదంగా చూడనారంభించారు. వారిలో అనేకమంది ఈ బంధుప్రేమ నియామకాల్ని గురించి ఆయన్ని విమర్శించడం ఆరంభించారు. ఆ పరిస్థితిని ముస్లింముఖ యూదుడైన ఇబ్నెసబా తనకు అనుకూలంగా మలచుకుంటూ ముస్లింలలో అనైక్యతా బీజాలు నాటడానికి, శ్రేయస్కరమైన ఖిలాఫత్ వ్యవస్థను నాశనం చేయడానికి కుట్రల పరంపర ప్రారంభించాడు.

తత్ఫలితంగా హజ్రత్ ఉస్మాన్ (రజి) తెగవారైన బనూఉమయ్యా ప్రజలను ఇతర తెగల ప్రజలు ద్వేషించసాగారు. ఈ అసూయాద్వేషాలు అరబ్బుల్లో క్రమక్రమంగా జాతీయదురభిమానాలకు తలుపులు తెరచింది. ముఖ్యంగా దైవప్రవక్త (స) తదనంతరం ఇస్లాం స్వీకరించిన అరబ్బుల్లో ఈ దురభిమాన భూతం ఒక్కసారిగా మేల్కొని జడలు విరబోసుకొని రక్తదాహంతో స్వైరవిహారం చేయడం మొదలెట్టింది. అంచేత అరబ్బుల్లోని ఈ జాతీయదురభిమాన భూతం పుట్టుపూర్వోత్తరాలను గురించి ఇక్కడ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.



**జాతీయ దురభిమానాలు:-** ఇస్లాంకు పూర్వం అరబ్‌తెగల మధ్య తీవ్రమైన జాతీయ దురభిమానం (National Prejudice)ఉండేది. అరబ్‌తెగలన్నిటిలో ఖురైష్‌తెగ పెద్దది; శక్తిమంతమైనది. దాని పెద్దరికాన్ని ఇతరతెగలు గౌరవించేవి. ఖురైష్‌తెగలో బనూహాషిం, బనూఉమయ్యా అనే ఉపతెగలుండేవి. ఈ రెండుతెగల మధ్య ఎల్లప్పుడూ వైరం కొన సాగుతుండేది. అంచేత ఇతరతెగలు కూడా ఈ రెండు ఖురైష్ తెగల ఆధిపత్యంలోనే విడిపోయిఉండేవి. ఇస్లాం ప్రాభవానికి చాలా ముందుకాలంలో బనూఉమయ్యా తెగ బనూహాషింతెగ కంటే ఎంతో బలీయంగా ఉండేది. కాని ఇస్లాంప్రాభవ సమీపకాలంలో బనూహాషింతెగ బలం పుంజుకొని పైచేయిగా తయారయింది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) బనూహాషింతెగలో పుట్టి ఇస్లాం ప్రచారశంఖారావం ప్రారంభించినపుడు అందరికంటే ఎక్కువ బనూఉమయ్యా తెగవారే ఆయన్ని వ్యతిరేకించారు. ఖుర్‌ఆన్ దైవవాణి అని తెలిసి కూడా వారాయనకు బద్ధశత్రువులైపోయారు.

ఈ సందర్భంలో గతంతో జరిగిన ఓ సంఘటన గురించి తెలుసుకుందాం. ఓసారి అబూజహల్, అఖ్నస్, అబూసుఫ్యాన్‌లు రాత్రివేళల్లో దైవప్రవక్త (స) ఇంటికెళ్ళి చూరు క్రింద నక్కికూర్చొని ఆయన పఠించిన ఖుర్‌ఆన్‌వాణి విన్నారు. ఆ తర్వాత అఖ్నస్, అబూ జహల్ అభిప్రాయం అడిగినప్పుడు అతనిలా అన్నాడు: "నీకు తెలుసుకదా! మనము, అబ్దుల్‌మునాఫ్ తెగవాళ్ళు పేరుప్రతిష్ఠల్లో ఎల్లప్పుడూ సమఉజ్జీలుగా ఉన్నాం. ఏ విషయంలోనూ మనం వారికి తీసిపోలేదు. ప్రతిరంగంలో మనం ఆ తెగకు సమాన ప్రతిపక్షంగానే ఉన్నాం. ఈనాడు వారు తమలో ఒక దైవప్రవక్త ఉన్నాడని, అతనికి దివి నుండి దైవసందేశం అవతరిస్తోందని చెబుతున్నారు. ఈ విషయంలో వాళ్ళను మనం ఎలా అధిగమించడం? నువ్వే చెప్పు. అంచేత దైవసాక్షిగా చెబుతున్నా. మనం అతడ్ని ప్రళయందాకా విశ్వసించకూడదు. అతని మాట ఒక్కటీ వినకూడదు."

దైవప్రవక్త (స) కాలంలో ప్రాంతీయ దురభిమానం (Regional Prejudice)కు సంబంధించిన ఓచిన్న సంఘటన, దాన్ని దైవప్రవక్త (స) మొగ్గలోనే త్రుంచివేసిన వైనం గురించి కూడా తెలుసుకోవడం ఇక్కడ సందర్భోచితంగా ఉంటుంది.

ముస్లింలు బనీముస్తలిఖ్ దండయాత్ర నుండి తిరిగొస్తూ దారిలో స్నానంచేసి బడలిక తీర్చుకోవడానికి ఓ బావి దగ్గర విడిదిచేశారు. అయితే హఠాత్తుగా ఇద్దరుముస్లింల మధ్య ఏదో కారణంగా తగాదా వచ్చి పరిస్థితి కొట్టుకునేదాకా పోయింది. అందులో ఒకడు సహాయంకోసం పూర్వం నుంచి మదీనాలో ఉంటున్న అన్సారులను ఎలుగెత్తి పిలిచాడు. రెండవమనిషి మక్కా నుండి మదీనాకు శరణార్థులుగా వచ్చిన ముహాజిర్లను సహాయం కోసం ఎలుగెత్తి పిలిచాడు. కపటముస్లిం నాయకుడు ఇబ్నెఉబై ఈగొడవ సంగతి తెలియగానే ముహాజిర్ ముస్లింలకు వ్యతిరేకంగా అన్సార్ ముస్లింలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించాడు. దాంతో ముహాజిర్‌ల తరపున కొందరు, అన్సార్‌ల తరపున కొందరు తగాదా స్థలానికి పరుగెత్తుకు వచ్చారు.

ఇలా ముస్లింలు రెండువర్గాలుగా చీలిపోయి పరస్పరం ఘర్షించుకుంటూ ఒకర్నొకరు చంపుకోవడానికి సిద్ధమయ్యారు. అంతలో దైవప్రవక్త (స) వచ్చి "ఏమిటీ అజ్ఞానపు పిలుపు?

మీరేమిటీ, ఈ అజ్ఞానపు పిలుపు ఇవ్వడమేమిటీ!" అని మందలించారు. అప్పుడు ఇరువర్గాల నుండి కొందరు పెద్దలు కలగజేసుకొని ఈ గొడవను అంతమొందించారు.

ప్రాంతీయదురభిమానమైనా, జాతీయదురభిమానమైనా, భాషాదురభిమానమైనా, మరెలాంటి దురభిమానమైనా ఇస్లాం ఏమాత్రం సహించదు. అది మానవుల్లో విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పదలిచింది. ఇస్లాం ఈ దురభిమానాలను అజ్ఞానం, మూఢత్వాలతో పోల్చింది. ఒకసారి ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) దురభిమానం గురించి ప్రస్తావిస్తూ "ఎవరైనా మూఢకాలంనాటి దురభిమానం మాదిరిగా ప్రజల్ని ప్రోత్సహిస్తే అతడ్ని హత మార్చడం తప్పనిసరి" అన్నారు. దైవప్రవక్త (స) కాలం నుండి ఉస్మాన్ (రజి) పాలనా ప్రారంభకాలం వరకు నామరూపాల్లేకుండా పోయిన జాతీయ, ప్రాంతీయ దురభిమానాలు ఆ తరువాయి కాలంలో ఖలీఫా బంధుప్రేమ నియామకాలతో, మర్వాన్ బిన్ హకం లాంటి దుర్మార్గపు అధికారులతో, ఇబ్నెసబా కుట్రలతో మళ్ళీ తలెత్తాయి.

ఖలీఫా ఉస్మాన్ (రజి) పరిపాలన చివరి కాలంలో ఇస్లామీయ రాజ్యమంతటా గవర్నర్లుగా, ఉన్నతాధికారులుగా బనూఉమయ్యా తెగ వ్యక్తులే అత్యధికంగా ఉన్నారు. వారీ అవకాశాన్ని వినియోగించుకుంటూ బనూహాషిం తెగవారిపై తమ ఆధిక్యతను తిరిగి సాధించుకోవడానికి ప్రయత్నించారు. ముస్లింలలో అనైక్యత, అంతఃకలహాల సెగలు రేకెత్తుతున్నప్పటికీ వారు విదేశీ దాడుల్ని అణచివేయడమే గాకుండ కొత్తగా మరిన్ని భూభాగాలను ఇస్లామీయ రాజ్యపరిధిలోకి తీసుకురాగలిగారు.

అయితే ఖిలాఫత్ వ్యవస్థను తుదముట్టించడానికి "అలీ(రజి)కి మద్దతు, ప్రవక్త కుటుంబాభిమానం" అనే సాకుతో ఇబ్నెసబా విసరిన దుష్ప్రచారజాలం నుండి మాత్రం ముస్లింలు బయటపడలేకపోయారు. పైపెచ్చు వాడి విషప్రచార ఊబిలో వారు నానాటికీ కూరుకుపోసాగారు. ఆ దుర్మార్గుడు హజ్రత్ అలి (రజి) పేరుతో కూఫా, బస్రా, ఈజిప్టు ప్రజలకు దొంగ ఉత్తరాలు రాస్తూ బనూహాషిం తెగవాళ్ళను బనూఉమయ్యా తెగవాళ్ళ పైకి ఉసిగొల్పసాగాడు. తత్ఫలితంగా ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్యచేయబడటమే గాకుండా ఖిలాఫత్ వ్యవస్థ పునాదులు కూడా కదలిపోయాయి.

హజ్రత్ ఉస్మాన్ (రజి) తన పరిపాలన చివరి రోజుల్లో ప్రజల అభీష్టం, దుండగుల డిమాండ్ ప్రకారం రాజకీయ సంస్కరణలు చేయడానికి సిద్ధమయ్యారు. కాని అప్పటికే పరిస్థితులు చేజారిపోయాయి. ఇతర సంస్కరణల విషయానికొస్తే ఖుర్ఆన్ పఠనం ఒకే విధమైన ఉచ్చారణ కలిగివుండేలా క్రోడీకరింపజేశారు. నమాజీల సంఖ్య పెరగడంతో మదీనాలోని 'మస్జిదె నబవీ'ని విస్తరింపజేశారు. ఈ రెండు అంశాలు వివరంగా దీనికి ముందు పేజీలలో పేర్కొనబడ్డాయి. ఉమర్ ఫారూఖ్ (రజి) పాలనాకాలం వరకు శుక్ర వారం (జుమా)నమాజ్ కోసం ఇమామ్ ప్రసంగం చేయడానికి ఉపన్యాసవేదిక పైకి వెళ్ళి నపుడు అజాన్ ఒకసారి మాత్రమే చెప్పడం జరుగుతుండేది. హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనాకాలంలో భక్తుల సంఖ్య పెరిగిపోవడం వల్ల జుమాప్రసంగానికి ముందు కూడా ఒక అజాన్ చెప్పాలని ఉత్తర్వు జారీచేశారు. దీంతో జుమా నమాజ్ కోసం రెండు సార్లు అజాన్ చెప్పే సంప్రదాయం ఏర్పడింది.



# 34. అలి (రజి) ఖిలాఫత్ పాలన

హజ్రత్ ఉస్మాన్ హత్య జరిగిన మూడు రోజుల్లోనే ఆయన స్థానంలో హజ్రత్ అలి (రజి) ఖలీఫాగా ఎన్నికయ్యారు. ఆయన ఖలీఫా అయిన తక్షణమే హజ్రత్ ఉస్మాన్ (రజి) భౌతికకాయానికి ఖననం చేయించే ఏర్పాటు చేశారు.

## 1) అలి (రజి) ఘనతాఔన్నత్యాలు

హజ్రత్ అలి (రజి) దైవప్రవక్త (స) పెదనాన్న అబూతాలిబ్ కుమారరత్నం. మక్కాలో ఓసారి కరువు వచ్చి అబూతాలిబ్‌కు కుటుంబం గడవడం కష్టమైపోయినప్పుడు దైవప్రవక్త (స) అయిదేండ్ల వయసున్న అలీ (రజి)ని తన సంరక్షణలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయన దైవప్రవక్త (స) సంరక్షణలోనే పెరిగి పెద్దవారయ్యారు. పదేళ్ళ వయస్సు లో ఇస్లాం స్వీకరించి ప్రప్రథమ విశ్వాసుల జాబితాలో చేరిపోయారు.

దైవప్రవక్త (స) తన ముద్దులకుమార్తె ఫాతిమా (రజి)ను అలీ (రజి)కి ఇచ్చి వివాహం చేశారు. ఒకరోజు అలి (రజి) ఏదో కారణంతో భార్యపై అలిగి ఇంటి నుంచి మసీదుకు వెళ్ళిపోయారు. ఈ సంగతి తెలిసి దైవప్రవక్త (స) మసీదుకు వెళ్ళి చూస్తే ఆయన నేల మీద దుమ్ము పూసుకొని నిద్రపోతూ కన్పించారు. దైవప్రవక్త (స) ఆయన బట్టలకు అంటుకున్న దుమ్ముదులుపుతూ "అబూతురాబ్ (మట్టివాడా)! లే" అని సంబోధించారు. ఆనాటి నుంచి ఆయనకు అబూతురాబ్ అని కూడా పేరుపడింది. ఎవరైనా అలి (రజి)ని అబూతురాబ్ అని పిలిస్తే ఆయన మహా సంతోష పడిపోయేవారు. హజ్రత్ అలీ (రజి)కి కుమారుడు హసన్ (రజి) పుట్టిన తర్వాత అబుల్‌హసన్ అనే పేరు కూడా పడింది.

ఆయన మదీనాకు వలసపోయిన తరువాత దైవప్రవక్త (స)తో పాటు తబూక్ దండయాత్ర తప్ప మిగతా యుద్ధాలన్నిటిలో పాల్గొన్నారు. హజ్రత్ అలి (రజి) తబూక్ దండయాత్రలో పాల్గొనలేకపోవడానికి కారణం ఆయన్ని దైవప్రవక్త (స) ఆ సమయంలో మదీనా రక్షణ కోసం నియమించడమే. అప్పుడు అలి (రజి) కాస్తంత నిరుత్సాహంతో "మీరు నన్ను స్త్రీలు, పిల్లలకు ఖలీఫా (ప్రతినిధి)గా చేసి వెళ్ళిపోతున్నారా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "(దివ్యదర్శనార్థం) మూసా (అలై) (సోదరుడు) హారూన్ (అలై)ను (ఇస్రాయీల్‌సంతతి ప్రజల రక్షణ కోసం) వదలిపోయి నట్లు నేను నిన్ను వదలివెళ్తున్నాను. ఈ విషయం నీకు సంతోషం కలిగించదా? కాకపోతే నా తదనంతరం మరే దైవప్రవక్తా ఉండడు" అని అన్నారు.

ముస్లింలు మక్కా నుండి మదీనాకు వలసవచ్చిన తర్వాత దైవప్రవక్త (స) ఒక్కొక్క ముహాజిర్ ముస్లింని ఒక్కొక్క అన్సార్ ముస్లింకు అప్పగిస్తూ "ఈరోజు నుండి మీరిద్దరు పరస్పరం అన్నదమ్ములై పోయారు అని చెప్పి మక్కా నుండి వలసవచ్చిన ముస్లింలకు, మదీనాలో నివసిస్తున్న అన్సార్ ముస్లింలకు మధ్య సోదరీకరణ చేశారు. అయితే హజ్రత్ అలీ (రజి)కు ఏ అన్సార్ ముస్లిం కూడా సోదరునిగా లభించలేదు. దాంతో ఆయన పుట్టెడు దుఃఖంతో దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "మీరు అందరి మధ్యా సోదరీకరణ నెలకొల్పారు. నేనొక్కడ్నే మిగిలిపోయాను" అని అన్నారు.

దానికి దైవప్రవక్త (స) "నువ్వు నా తమ్ముడివి" అన్నారు. హజ్రత్ అలి (రజి) ఈ మాట విని పరమానందభరితులయ్యారు.

దైవప్రవక్త (స) ఒకసారి "నేను విద్యాజ్ఞానాల పట్టణాన్ని, అలి (రజి) దాని ప్రధాన ద్వారం" అన్నారు. హజ్రత్ అలి (రజి) ధర్మావగాహనతో పాటు, వ్యవహారావగాహనలో కూడా అందెవేసిన చేయి. ఆయన ప్రత్యర్థులు సైతం ధార్మిక సమస్యల పరిష్కారం కోసం ఆయన్ని అడిగి తెలుసుకునేవారు. ఈ విషయానికి సంబంధించిన ఒక సంఘటనను ఇక్కడ పేర్కొనడం సందర్భోచితంగా ఉంటుంది.

ఒకసారి ఇద్దరు మిత్రులు భోజనం చేయడానికి కూర్చున్నారు. వారిలో ఒకడి దగ్గర అయిదు రొట్టెలు ఉన్నాయి. రెండోవాడి దగ్గర మూడు రొట్టెలు ఉన్నాయి. అంతలో మరొకడు ఆకలితో వారిద్దరి దగ్గరకు వచ్చాడు. మిత్రులిద్దరు అతడ్ని కూడా కలుపుకొని భోజనం చేశారు. మూడో వ్యక్తి భోజనం చేసి దానికి ప్రతిఫలంగా వారిద్దరికి కలిపి ఎనిమిది దిర్హంలు ఇచ్చి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయిన తరువాత మిత్రులిద్దరి మధ్య డబ్బు పంచుకోవడంలో తగాదా వచ్చింది. అయిదు రొట్టెలవాడు "నేను అయిదు దిర్హంలు తీసుకుంటాను. నీ దగ్గర మూడురొట్టెలు ఉండేవి గనక నీకు మూడుదిర్హంలు మాత్రమే లభిస్తాయి" అని అన్నాడు. అందుకు మూడు రొట్టెలవాడు అంగీకరించకుండా "నేను సగం డబ్బు తీసుకోనిదే నిన్ను వదలను" అని అన్నాడు.

చివరికి వారిద్దరు హజ్రత్ అలి (రజి) దగ్గరకు వెళ్ళి విషయం వివరిస్తూ తమ తగాదా తీర్చమని అడిగారు. వ్యవహారం గ్రహించిన అలి (రజి) మూడు రొట్టెలవాడితో "నీ రొట్టెలు తక్కువగా ఉండేవి. నీకు నీ మిత్రుడు ఇస్తానన్న మూడు దిర్హంలు కూడా ఎక్కువే. కాబట్టి మూడు దిర్హంలు తీసుకోవడానికి ఒప్పుకో" అని అన్నారు. కాని అతను అందుకు అంగీకరించకుండా "నా హక్కు నాకు పూర్తిగా లభించకపోతే నేనెలా మూడు దిర్హంలతో సంతృప్తిచెందాలి?" అని అడిగాడు. "అయితే నీ మిత్రుడికి ఏడు దిర్హంలు లభిస్తాయి. నీకు ఒక్క దిర్హం మాత్రమే లభిస్తుంది" అన్నారు హజ్రత్ అలి (రజి). మూడు రొట్టెలవాడు ఈమాట విని "అదెలా!?" అన్నాడు ఆశ్చర్యంతో నోరెల్లబెట్టి చూస్తూ. అప్పుడు హజ్రత్ అలి (రజి) ఇలా చెప్పారు:

"విను చెబుతా. మొత్తం ఎనిమిది రొట్టెలు ఉండేవి. వాటిని తిన్నవారు ముగ్గురు. ఎనిమిది రొట్టెల్ని యథాతథంగా ముగ్గురికి సమానంగా పంచడం సాధ్యంకాదు. అంచేత ఒక్కొక్క రొట్టెను మూడు సమభాగాల చొప్పున ఎనిమిది రొట్టెల్ని ఇరవైనాలుగు సమ భాగాలుగా చేసి, ముగ్గురూ సమానంగా తిన్నారనుకోండి. అంటే ముగ్గురిలో ప్రతివ్యక్తీ ఎనిమిది ముక్కలు తిన్నాడని భావించవలసి ఉంటుంది. నీ మూడు రొట్టెల తొమ్మిది ముక్కల్లో ఒక ముక్క మూడోవాడు తిన్నాడు. మిగిలిన ఎనిమిది ముక్కలు నువ్వు తిన్నావు. పోతే నీ మిత్రుడి అయిదు రొట్టెల పదిహేను ముక్కల్లో ఏడు ముక్కలు మూడోవాడు తిన్నాడు. ఆ పదిహేను ముక్కల్లో ఈ ఏడు ముక్కలు పోగా మిగిలిన ఎనిమిది ముక్కలు నీ మిత్రుడు తిన్నాడు. మూడోవాడు నీ రొట్టెల్లో ఒక ముక్క, నీ మిత్రుడి రొట్టెల్లో ఏడు ముక్కలు తిని ఎనిమిది దిర్హంలు ఇచ్చాడు. కాబట్టి నీకు ఒక



దిర్హం, నీ మిత్రుడికి ఏడు దిర్హంలు లభిస్తాయి." మూడు రొట్టెలవాడు ఈ తీర్పు విని "బాగుంది మీ తీర్పు. నేనిప్పుడు ఒప్పుకుంటాను" అని అన్నాడు.

మరొకసారి ఒకతను హజ్రత్ అలి (రజి) దగ్గరకు వచ్చి "ఫలానా మనిషి తన కలలో నా తల్లితో సంభోగించినట్లు చెబుతున్నాడు" అని ఫిర్యాదు చేశాడు. హజ్రత్ అలి (రజి) ఈమాట విని "అయితే ఆ కలగని దాన్ని గురించి చెబుతున్నవాడ్ని ఎండలో నిలబెట్టి అతని నీడపై కొరడాదెబ్బలు కొట్టు" అని చెప్పారు.

హజ్రత్ అలి (రజి) ప్రభుత్వ ధనాగారం విషయంలో ఎంతో జాగ్రత్త వహించేవారు. రాజు తలచుకుంటే ప్రభుత్వధనాగారం నుంచి తాను కోరినంత ధనం తీసుకొని విచ్చల విడిగా ఖర్చుపెట్టగలడు; భోగభాగ్యాలు అనుభవించగలడు. కాని శ్రేయస్కర ఖలీఫాల జీవితం దీనికి పూర్తిగా భిన్నమైనది. ఆయన తన జీతాన్ని పూర్వ ఖలీఫాలైన అబూబకర్ (రజి), ఉమర్ ఫారూఖ్ (రజి)లు తీసుకున్న జీతమంతే నిర్ణయించుకున్నారు.

ఈజీతం ఈనాటి ఓ సాధారణకార్మికుడి జీతం కంటేకూడా ఎంతో తక్కువ. అందుకే అలి (రజి) అతుకులు వేసిన ముతకబట్టలు మాత్రమే ధరించగలిగేవారు. ఒకసారి చలికాలంలో ఒకతను ఖలీఫా అలీ (రజి)ని కలుసుకోవడానికి వచ్చాడు. అప్పుడా రాజర్షి ఓ చింపిరిదుప్పటి కప్పుకొని చలికి గజగజవణికిపోతూ కూర్చున్నాడు. చరమ ఘడియల్లో ఆయన ఆస్తిని పరిశీలిస్తే ఏడొందలు దిర్హంలు మాత్రమే ఉన్నట్లు తేలింది. అదైనా ఆయన ఒక సేవకుడ్ని కొనడానికి ఒక్కొక్క పైసా కూడబెట్టిన డబ్బు మాత్రమే.

హజ్రత్ అలి(రజి) తనకు ఎలాంటి ఆర్థికఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వధనాగారం నుంచి ఒక్క దిర్హం కూడా తీసుకునేవారు కాదు. అంతేకాదు, ఆయన తన దగ్గరి బంధువులక్కూడా ప్రభుత్వధనాగారం నుండి ఆర్థికసహాయం చేసేవారు కాదు. ఒకసారి హజ్రత్ అలి (రజి) అన్న అఖీల్ (రజి) వచ్చి ప్రభుత్వధనాగారం నుంచి తనకు లక్ష దీనార్లు తీసివ్వమని అడిగారు. అందుకు అలి (రజి) నిరాకరిస్తూ "ఏమిటీ నీతమ్ముడు ప్రజలసొత్తు నీకిచ్చి నరకానికి పోవాలని నీవు కోరుకుంటున్నావా?" అని అన్నారు.

ఒకసారి ఇద్దరు వ్యక్తులు తమ సమస్యపరిష్కారం కోసం హజ్రత్ అలి(రజి) దగ్గరకు వచ్చారు. అప్పుడాయన ఒక పడిపోనున్న గోడ పక్కన కూర్చున్నారు. వారిద్దరిలో గోడ దుస్థితి గమనిస్తూ "ఈ గోడ పడిపోయేలా ఉంది" అన్నాడు. దానికి ఖలీఫా అలి (రజి) మీరు మీ సమస్య ఏమిటో చెప్పండి. దేవుడే నా రక్షకుడు. ఆయనే నన్ను కాపాడుతాడు" అని అన్నారు. వారిద్దరు వ్యక్తులు తమ సమస్య చెప్పడం, హజ్రత్ అలి (రజి) వారికి దాని పరిష్కారం తెలియజేయడం జరిగింది. ఆ తరువాత ఆయన అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయారు. ఆయన లేచివెళ్ళిన మరుక్షణమే ఆ గోడ దభేలున కూలిపోయింది.

ఓరోజు హజ్రత్ అలి (రజి) ఏదో విషయం మాట్లాడుతుంటే ఒకతను దాన్ని ఖండించాడు. అప్పుడు అలి (రజి) "నువ్వు గనక అబద్ధాలరాయుడవైతే నేను నిన్ను శపిస్తాను" అన్నారు. దానికా వ్యక్తి శపించండి అన్నాడు. అలి (రజి) "దేవుడు నీ కళ్ళు పోగొట్టుగాక" అని శపించారు. దాంతో అతను అక్కడ్నుంచి లేచాడో లేదో గుడ్డివాడైపోయాడు.

## 2) నివురుగప్పిన నిప్పు

ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య తరువాత అల్లరిమూకలు ఇంకా మదీనాలోనే తిష్ఠవేసి ఉన్నారు. వారిలో అత్యధికమంది అలీ (రజి)ని సమర్థించేవారున్నారు. మదీనా ప్రజల్లో కూడా అత్యధికమంది అలీ (రజి)ని సమర్థించేవారున్నారు. అందువల్ల బైత్ సమయంలో ముందుగా దుండగుల నాయకుడు మాలిక్ బిన్ అష్తర్ ముందుకొచ్చి అలి (రజి) చేతిలో చేయివేసి బైత్ (శపథం) చేశాడు. ఆ తరువాత అందరూ బైత్ చేశారు.

హజ్రత్ అలి (రజి) ఖిలాఫత్ ఎన్నిక అల్లర్లు, అలజడులు, విభేదాలు, వైషమ్యాలతో నిండిన విషపూరితమైన వాతావరణంలో జరిగింది. అంచేత ప్రముఖ సహాబీలలో అనేక మంది అలీ (రజి)తో 'బైత్' (శపథం) చేయడానికి రాలేదు. ముఖ్యంగా తల్హా (రజి), జుబైర్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) రాలేదు. వారు ప్రజల్లో బాగా పలుకుబడి ఉన్న సహాబీలు. అంచేత తల్హా, జుబైర్‌ల అభిప్రాయం కూడా తెలుసుకోవాలి కదా! అన్నారు అలి (రజి). కనుక మాలిక్ బిన్ అష్తర్, అతని అనుచరులు ఆ ఇద్దర్ని బలవంతంగా పిలుచుకొచ్చి అలి (రజి) ముందు ప్రవేశపెట్టారు. అలి (రజి) వారితో మాట్లాడుతూ "మీరిద్దరిలో ఎవరైనా ఖలీఫా కావాలని కోరుకుంటే నేనతడ్ని సమర్థిస్తూ బైత్ చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు.

అయితే తల్హా, జుబైర్ (రజి)లు ఖలీఫా పదవిని నిరాకరించారు. అప్పుడు దుండగుల్లో ఒకతను "మీకు ఖలీఫా కావడం ఇష్టం లేకపోతే అలి (రజి) ఖిలాఫత్‌ను సమర్థిస్తూ బైత్ చేయండి" అన్నాడు. ఈమాట విని వారిద్దరు ఆలోచనలో పడిపోయారు. మాలిక్ బిన్ అష్తర్ వారిద్దరు బైత్ చేయడానికి సందేహిస్తున్నారని భావించి వర నుంచి ఛర్రున కత్తిలాగి "ఉండండి, మీరిద్దరి కథ ఇప్పుడే ముగించివేస్తాను" అన్నాడు. దాంతో వారిద్దరు బైత్ చేశారు. ఆతర్వాత అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) కూడా బైత్ చేశారు. కొందరు ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తటస్థంగా ఉండిపోయారు. అలాంటి వారిలో ఉసామా బిన్ జైద్, ముహమ్మద్ బిన్ మస్లమా, హస్సాన్ బిన్ సాబిత్, కాబ్ బిన్ మాలిక్, అబూసయీద్ ఖుద్రీ, నోమాన్ బిన్ బషీర్, జైద్ బిన్ సాబిత్, ముగీరా బిన్ షాబా, అబ్దుల్లా బిన్ సలాం, వగైరా సహాబీలు కూడా ఉన్నారు.

హజ్రత్ అలి (రజి) మర్వాన్ బిన్ హకమ్ ఏమయ్యాడని అడిగితే అతను పత్తా లేకుండా పోయాడని తెలిసింది. తరువాత ఆయన హజ్రత్ ఉస్మాన్ (రజి) అర్ధాంగి నాయిలాను హంతకులు ఎవరని అడిగారు. కాని ఆమె వారి రూపురేఖలు మాత్రమే తెలిపి వారి పేర్లు చెప్పలేకపోయారు. హంతకుల్లో ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) కూడా ఉన్నాడా అని అడిగితే 'ఆయన ఉస్మాన్ (రజి) హత్యకు ముందే ఇక్కడ్నుంచి వెళ్ళిపోయారని చెప్పారు ఆమె.

పోతే బనూఉమయ్యా తెగకు చెందినవారు బైత్ నుండి తప్పించుకోవడానికి మదీనా వదలి సిరియాకు వెళ్ళిపోయారు. వారిలో కొందరు పోతూ పోతూ హజ్రత్ ఉస్మాన్ (రజి) రక్తసిక్తమైన చొక్కా, నాయిలా తెగిన చేతివ్రేళ్ళు కూడా తీసికెళ్ళారు. వారక్కడ అమీర్ ముఆవియా (రజి) ఆదేశంతో వాటిని రాజధాని డెమాస్కస్‌లోని జామియా మస్జిద్ ప్రసంగవేదికపై ఉంచి ప్రజలకు చూపిస్తూ హజ్రత్ అలీ (రజి)కి వ్యతిరేకంగా వారిని సంఘటిత పరచడం ప్రారంభించారు.



మరుసటి రోజు తల్హా (రజి), జుబైర్ (రజి)లు ఖలీఫా అలి (రజి) దగ్గరకు వచ్చి "మీరు ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకుంటారన్న షరతు పైన్నే మేము మీ ఖిలాఫత్‌ను సమర్థిస్తూ బైత్ చేశాం. మీరలా చేయకపోతే మా 'బైత్' రద్దయిపోతుంది" అని అన్నారు. దానికి అలి (రజి) సమాధానమిస్తూ "నేను ఉస్మాన్ (రజి) హంతకులకు తప్పకుండా తగిన శిక్ష విధించి పూర్తిన్యాయం చేకూర్చుతాను. అయితే అల్లరిమూకల రభస తగ్గిపోయి ఖిలాఫత్ వ్యవస్థ కాస్త పటిష్ఠమైన తరువాత ఆ విషయంపై దృష్టి సారిస్తాను. అప్పటిదాకా నేనేమీ చేయలేను" అని అన్నారు. తల్హా (రజి), జుబైర్ (రజి)లు ఈమాట విని వెళ్ళిపోయారు. ఇలా ఒక్క సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి), ఆ రాష్ట్రప్రజలు తప్ప మిగతా రాష్ట్రాలన్నీ దాదాపు అలి (రజి) ఖిలాఫత్ పాలనకు మద్దతు నిచ్చాయి.

బైత్ విషయంలో సిరియాప్రజల వైఖరి గురించి ఖాజీ అబూబకర్ ఇబ్నుల్‌అరబి తన గ్రంథం అహ్కాముల్ ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రస్తావించారు: "సిరియాప్రజలు బైత్ చేయడానికి ఒక షరతుపెడ్తూ, 'ముందు ఉస్మాన్ (రజి) హంతకుల్ని అరెస్టుచేసి వారికి ప్రతీకారశిక్ష (ఖిసాస్) విధించండి' అన్నారు. దానికి ఖలీఫా అలి (రజి) సమాధానమిస్తూ 'ముందు మీరు బైత్ చేయండి. తర్వాత ఆ హక్కు గురించి డిమాండ్ చేయండి, అది మీకు లభిస్తుంది' అని చెప్పారు. సిరియా ప్రజ(ప్రతినిధు)లు దాన్ని తిరస్కరిస్తూ 'మీరసలు బైత్ చేయించుకోవడానికి అర్హులే కారు. మేము మీ దగ్గర ఉదయం, సాయంత్రం ఉస్మాన్ (రజి) హంతకులు ఉండటం చూస్తున్నాం' అని అన్నారు. ఒకవేళ హజ్రత్ అలి(రజి) ఆ సమయంలో ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించడానికి ప్రయత్నిస్తే అనేకతెగలు హంతకులకు మద్దతు ఇవ్వడానికి సిద్ధమై పరిస్థితి మరో కూటమి (థర్డ్‌ఫ్రంట్) ఉనికికి తెర తీస్తుంది...." (అహ్కాముల్ ఖుర్‌ఆన్)

సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి), ఆయన అనుచరులు మొదట్లో ఉస్మాన్ (రజి) హంతకుల్ని పట్టుకొని శిక్ష విధిస్తే చాలు, తాము బైత్ చేస్తామని అన్నారు. కాని ఆతర్వాత అమీర్ ముఆవియా (రజి) హంతకుల్ని శిక్షించడానికి వారిని తనకు అప్పగించాలని సిరియాఅధినేత స్థాయిలో డిమాండ్ చేశారు. ఈవిధంగా ఆయన ఖలీఫా అలీ (రజి)కి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు.

మరోవైపు మదీనా ప్రజల హృదయాల్లో ఖలీఫా ఉస్మాన్ గని (రజి) పట్ల సానుభూతి, ఆయన హంతకుల పట్ల ద్వేషం తీవ్రస్థాయికి చేరాయి. జనం నలుగు రైదుగులు కలసిన చోటల్లా వాటిని గురించే గుసగుసలాడుకోసాగారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యకు ముందే పరిపాలనావ్యవస్థ అస్తవ్యస్తమైపోయి రాజధాని వాతావరణం చెడిపోయి ఉంది. ఇప్పుడు పరిస్థితి మరింత దిగజారిపోయి, ఎప్పుడు ఏమవుతుందో తెలియని విధంగా "నివురుగప్పిన నిప్పు"లా మారింది.

## 3) సిరియా గవర్నర్ తిరుగుబాటు

హజ్రత్ అలి (రజి) ఖలీఫా అయిన తర్వాత ఈ 'నివురుగప్పిన నిప్పు' మరో అరాచకానికి బీజం వేసింది. ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించే విషయంలో ఖిలాఫత్ వ్యవహారకర్తలు రెండువర్గాలుగా విడిపోయారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) వంశీయులు, ఆయన మద్దతుదారులు "బనూఉమయ్యా వర్గం"గా, హజ్రత్ అలి (రజి) వంశీయులు, ఆయన మద్దతుదారులు "బనూఅబ్బాసీ వర్గం"గా విడిపోయారు.

అంచేత హజ్రత్ అలి (రజి) ఖలీఫా కాగానే రాష్ట్రాల్లో బనూఉమయ్యా తెగ గవర్నర్‌లే ఎక్కువమంది ఉండటంవల్ల వారిని తొలగించి వేరే వ్యక్తుల్ని గవర్నర్‌లుగా నియమించే విషయంపై దృష్టిసారించారు. ఆయన బస్రా గవర్నర్‌గా ఉస్మాన్ బిన్ హునైఫ్ (రజి)ని, కూఫా గవర్నర్‌గా అమ్మారా బిన్ షిహాబ్‌ని, యమన్ గవర్నర్‌గా అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)ని, ఈజిప్టు గవర్నర్‌గా ఖైస్ బిన్ సాద్ (రజి)ని, సిరియా గవర్నర్‌గా సహెల్ బిన్ హునైఫ్ (రజి)ని నియమించి పంపారు. అయితే వారిలో బస్రా వెళ్ళిన అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) మాత్రమే ఆ రాష్ట్రాన్ని తన అధీనంలోకి తీసుకోగలిగారు. మిగిలిన అభ్యర్థులు ఆయా రాష్ట్రాల ప్రజలు తమకు మద్దతు ఇవ్వకపోవడంతో మదీనా తిరిగొచ్చారు. వారిలో ఇద్దరు మార్గమధ్యలోనే తీవ్రమైన ప్రతిఘటన ఎదురుకావడంతో వెనుదిరిగి వచ్చారు. హమ్దాన్ గవర్నర్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజి), కూఫా గవర్నర్ అబూ మూసా అష్అరీ (రజి)లు ఖలీఫా అలీ (రజి)కి తమ మద్దతు తెలిపారు.

ఆ తరువాత హజ్రత్ అలి (రజి) సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) పేర ఒక ఉత్తరం రాసి జరీర్ బిన్ అబ్దుల్లా ద్వారా డెమాస్కస్‌కు పంపారు. కాని అక్కడ్నుంచి మూడు నెలలదాకా ఎలాంటి జవాబు రాలేదు. తరువాత అమీర్ ముఆవియా (రజి) ఓ దూత ద్వారా ఒక సీల్డ్‌కవర్ పంపారు. ఆ కవర్ మీద "అలి నుండి ముఆవియాకు" అని రాయబడివుంది. అయితే హజ్రత్ అలి (రజి) దాన్ని తెరచి చూస్తే అందులో ఉత్తరం ఏదీ లేదు. ఖలీఫా అలి (రజి) ఆశ్చర్యపోయి చూస్తూ "ఇదేమిటీ" అన్నారు.

అప్పుడా దూత ఇలా అన్నాడు: "నా వెనుక డెమాస్కస్‌లో అరవై వేలమంది యోధులు ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి తహతహలాడుతున్నారు" అని అన్నాడు. "ఎవరి నుండి ప్రతీకారం తీర్చుకోదలిచార"అ అడిగితే "మీ మెడనరం నుండి" అన్నాడతను. (ఖిలాఫత్ వ ములూకియత్)

వేరొక చరిత్రగ్రంథం ప్రకారం ఉత్తరం తెచ్చిన దూత ఇలా అన్నాడు: "సిరియాలో ఎవరూ మీ (ఖిలాఫత్‌ను సమర్థిస్తూ) బైత్ చేయరు. అక్కడ అరవై వేలమంది ప్రజలు రక్తసిక్తమైన ఉస్మాన్ (రజి) చొక్కా చూసి ఏడుస్తున్నారు. ప్రజల భావోద్రేకాలను రెచ్చగొట్టే ఉద్దేశ్యంతో ఆ చొక్కాను డెమాస్కస్ జామియా మస్జిద్ ప్రసంగవేదిక మీద ఉంచారు." (అక్బర్ షా నజీబాబాది, తారీఖె ఇస్లాం)

హజ్రత్ అలి (రజి) మద్దతుదారుల్లో (బనూఅబ్బాసీ వర్గంలో) అత్యధిక మంది 'ముస్లింముఖయూదుడు' అబ్దుల్లా బిన్ సబా అనుచరులే ఉన్నారు. హజ్రత్ ఉస్మాన్



(రజి) హత్య తర్వాత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తిరుగుబాటుదారులు వెంటనే తమతమ ప్రాంతాలకు తిరిగివెళ్ళిపోవాలని హజ్రత్ అలి(రజి) ఆదేశించారు. కాని అబ్దుల్లా బిన్ సబా, అతని అనుచర మూకలు హజ్రత్ అలీ (రజి)కి మద్దతుదారులుగా నిలిచినప్పటికీ ఆయన ఆజ్ఞను త్రోసిపుచ్చి మదీనాలోనే తిష్ఠవేశారు.

అమీర్ ముఆవియా (రజి), ఆయన వర్గీయుల తిరుగుబాటు కార్యకలాపాల సంగతి తెలియగానే హజ్రత్ అలి(రజి) సిరియాపై దాడిచేయడానికి సన్నాహాలు ప్రారంభించారు. హజ్రత్ తల్హా(రజి), హజ్రత్ జుబైర్(రజి)లకు ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించడంలో అలి(రజి) చేస్తున్న జాప్యం ఏమాత్రం నచ్చలేదు. పైగా ఆయన సిరియాపై దాడిచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలా మదీనాలో యుద్ధవాతావరణం నెలకొనడం చూసి వారిద్దరు 'ఉమ్రా'చేసే నెపంతో మక్కా వెళ్ళిపోవడానికి అలి (రజి)ని అనుమతి అడిగారు. అలి (రజి) వారిని నిరోధించడం బాగుండదని భావించి అనుమతిచ్చారు. దాంతో తల్హా (రజి), జుబైర్ (రజి) మదీనా వదలి మక్కా వెళ్ళిపోయారు.

ఆ తర్వాత అలి (రజి) సిరియాపై దాడిచేయడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని ప్రకటించారు. సైనిక సమీకరణ కోసం వివిధ రాష్ట్రాల గవర్నర్లకు కూడా ఉత్తర్వులు జారీచేశారు. ఖాజీ అబూబకర్ "అహ్కాముల్‌ఖురాన్"లో ఈ క్రింది సూక్తిపై వ్యాఖ్యానిస్తూ "అలి (రజి) ఆ పరిస్థితిలో ఈసూక్తి ప్రకారమే ఆచరించారు..." అని పేర్కొన్నారు.

"విశ్వాసుల్లో రెండు వర్గాలు పరస్పరం జగడానికి దిగితే వారిమధ్య రాజీ కుదర్చండి. ఒకవేళ (రాజీయత్నం విఫలమై) ఆ రెండువర్గాల్లో ఒక వర్గం రెండో వర్గంపై దౌర్జన్యానికి పాల్పడితే, దౌర్జన్యానికి పాల్పడిన వర్గం దేవుని ఆజ్ఞ వైపు మరలివచ్చే దాకా దానితో పోరాడండి. అది దేవుని ఆజ్ఞ వైపు మరలివస్తే వాటి మధ్య న్యాయంగా రాజీ కుదర్చండి. న్యాయం చేయండి, న్యాయం చేసేవారిని దేవుడు ప్రేమిస్తాడు." (ఖుర్‌ఆన్-49:9)

ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఉస్మాన్ (రజి) హత్యకు ముందే మదీనాలో అరాచక పరిస్థితులతో విసుగెత్తి మక్కా వెళ్ళిపోయారు. అక్కడ హజ్ చేసిన తరువాత మదీనాకు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే దారిలో ఉస్మాన్ (రజి) హత్య వార్త, అలి (రజి) బైత్ సంగతి విని మక్కాకు తిరిగి వెళ్ళిపోయారు. ఆమె కూడా ఉస్మాన్ (రజి) హంతకుల్ని శిక్షించే విషయంలో హజ్రత్ అలి (రజి)కి వ్యతిరేకమైపోయారు. ఇప్పుడు తల్హా (రజి), జుబైర్ (రజి)లు కూడా మదీనా వదలి మక్కా చేరుకున్నారు.

హజ్రత్ ఆయిషా సిద్దీఖా (రజి) మార్గమధ్య నుండే తిరిగిరావడం చూసి మక్కా ప్రజలకు ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడా కలిగింది. వారామె కూర్చున్న ఒంటె చుట్టు గుమికూడి ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్యగావించబడ్డారన్న దుర్వార్త విని తీవ్ర విభ్రాంతికి గురయ్యారు. అప్పుడు హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు. "ఏపాపం ఎరగని ఉస్మాన్ (రజి)ని దుండగులు దారుణంగా హతమార్చారు. రక్తపాతం నిషేధించబడిన హజ్‌సీజన్‌లో ఘోరమైన రక్తపాతం జరిపారు. మదీనాపట్టణ పవిత్రను దిగజార్చారు. దైవసాక్షి! నేను ఉస్మాన్(రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకుంటాను."

హజ్రత్ ఆయిషా (రజి) మాటలు వినగానే మక్కా ప్రజల రక్తం ఉడికిపోయింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) చేత మక్కా గవర్నర్‌గా నియమించబడిన అబ్దుల్లా బిన్ ఆమిర్ హజ్రమీ (రజి) మరింత రెచ్చిపోతూ "ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి అందరికన్నా ముందు నేనుంటాను" అన్నారు. ఉస్మాన్ (రజి) హత్య తర్వాత అప్పుడే మక్కా చేరుకున్న బనూఉమయ్యా వర్గీయులు ఆయన మాటలు వినగానే "ఈ విషయంలో మేమంతా మీవెంట ఉంటాం" అన్నారు ముక్తకంఠంతో. వారిలో సయీద్ బిన్ ఆస్ (రజి), వలీద్ బిన్ ఉఖ్బా మొదలైన వారు కూడా చేరిపోయారు. బస్రాగవర్నర్ పదవి నుండి ఉద్వాసనకు గురైన అబ్దుల్లా బిన్ ఆమిర్ (రజి) కూడా మక్కా చేరుకున్నారు. ఆతర్వాత మదీనా నుండి మక్కా చేరుకున్న తల్హా (రజి), జుబైర్ (రజి), ముగీరా బిన్ షాబా (రజి) కూడా హజ్రత్ ఆయిషా (రజి)తో కలిసిపోయారు.

ఇంకేముంది! క్షణాల్లో మక్కా పరిస్థితి మారిపోయింది. మక్కా ప్రజలు ఉస్మాన్ (రజి) హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. దైవప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) నేతృత్వంలో అనేకమంది సహాబీలతో పాటు మూడువేల మంది సాయుధులు బస్రాకు బయలుదేరారు.

## 4) ఉష్ట్రయుద్ధం (జంగెజమల్)

మక్కాలో ఉన్న అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ద్వారా ఖలీఫా అలీ (రజి)కి ఈసంగతి తెలియగానే ఆయన సిరియాపై దాడి నిర్ణయం వాయిదావేసి, బస్రాకు బయలుదేరారు. కూఫా ప్రజలు కూడా ఆయన సైన్యంలో చేరారు.

హజ్రత్ ఆయిషా (రజి) సైన్యం బయలుదేరే సమయంలో మర్వాన్ బిన్ హకం వచ్చి సైన్యంలో చేరిపోయాడు. ఈ మర్వాన్ మరెవరో కాదు, ఖలీఫా ఉస్మాన్ (రజి) పేరు, రాజముద్రలతో ఈజిప్టుగవర్నర్‌కు దొంగఉత్తరం వ్రాసి సబాయీదుండగుల అరాచకపుఅగ్నికి ఆజ్యం పోసినవాడే ఈ దుర్మార్గుడు. ఖలీఫా కార్యదర్శిగా ఉంటూ తన నోటిదురుసు, దుష్ప్రవర్తనలతో మదీనాప్రజల ఛీత్కారానికి గురైనవాడే ఈ మర్వాన్.

సైన్యం కొన్ని మైళ్ళు ప్రయాణం చేసి "ఖాబ్" అనే సరస్సు దగ్గరకు చేరుకోగానే అక్కడ కొన్ని కుక్కలు మొరగడం మొదలెట్టాయి. హజ్రత్ ఆయిషా (రజి) ఆ సరస్సు పేరేమిటని అడిగారు. దానికి కొందరు అది 'ఖాబ్' సరస్సు అని చెప్పారు. ఈపేరు వినగానే ఆమె ఒంటెను ఆపుతూ "నన్ను వెనక్కి పంపండి"అన్నారు. ప్రజలు "ఎందుకు? ఏమయింది?" అని అడిగారు. దానికామె సమాధానమిస్తూ ఇలా చెప్పారు: "ఒకసారి దైవప్రవక్త (స) తమ భార్యల దగ్గర కూర్చొని మాట్లాడుతూ 'మీలో ఎవరిని చూసి ఖాబ్ కుక్కలు మొరుగుతాయో నాకు తెలిస్తే ఎంత బాగుండు!' అని అన్నారు. ఈమాట చెప్పి ఆమె ఒంటె మెడపై కొట్టి దాన్ని అక్కడే కూర్చోబెట్టారు. ఒక పగలు, ఒక రాత్రి అక్కడే ఉండిపోయారు. సైన్యం మొత్తం ఆమెతోపాటు అక్కడే ఆగిపోయింది.

ఆ సమయంలో కొందరు హజ్రత్ ఆయిషా(రజి) దగ్గరకొచ్చి "ఎవరో పొరపాటున ఇది 'ఖాబ్' సరస్సు అని చెప్పారు మీకు. ఇదసలు ఖాబ్ సరస్సు కాదు. ఖాబ్ సరస్సు



ఈ మార్గంలో రాదు" అని అన్నారు. ఆ తర్వాత తెల్లవారు జామున "అలి (రజి) సైన్యం మనకు దగ్గరగా వచ్చింది. లేవండి, త్వరగా బయలుదేరండి" అంటూ అకస్మాత్తుగా సైన్యంలో కలకలం చెలరేగింది. ఈమాట వినగానే సైనికులంతా బస్రా దిశగా బయలుదేరారు. హజ్రత్ ఆయిషా (రజి) కూడా వాళ్ళను అనుసరించారు.

చివరికి ఈసైన్యం బస్రా సమీపానికి చేరుకుంది. బస్రా సైనికులకు హజ్రత్ ఆయిషా (రజి) ప్రతినిధులకు మధ్య చర్చలు జరిగాయి. చర్చల సందర్భంలో బస్రా సైనికుల్లో తీవ్రవిభేదాలు వచ్చాయి. దాంతో సైన్యంలో ఒకవర్గం యుద్ధం చేయడానికి నిరాకరించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఆయిషా (రజి) సైన్యం యుద్ధంచేసి బస్రా పట్టణాన్ని సులభంగా స్వాధీనం చేసుకుంది.

అటు ఖలీఫా అలి (రజి) సైన్యం బస్రాకు కొన్ని మైళ్ళ దూరం వచ్చి విడిదిచేసింది. ఆ సైన్యంలో ముస్లింముఖ యూదుడు ఇబ్నెసబా, అతని మిత్రమూకలు కూడా చేరి వున్నారు. అలి (రజి) ప్రతినిధులకు, ఆయిషా ప్రతినిధులకు మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఉభయపక్షాలలోని ముస్లింసముదాయ శ్రేయోభిలాషులంతా యుద్ధనివారణ కోసమే కృషిచేశారు. యుద్ధం ప్రారంభానికి ముందు అలి (రజి) తన సైనికుల్లో ఇలా ఓ ప్రకటన చేయించారు: "పారిపోయేవాడ్ని వెంటాడకూడదు. గాయపడినవాడిపై దాడిచేయకూడదు. విజయం సాధిస్తే ప్రత్యర్థుల ఇండ్లలోకి జొరబడకూడదు."

ఆ తరువాత హజ్రత్ అలి (రజి) ప్రత్యర్థివర్గంలో ఉన్న జుబైర్ (రజి), తల్హా(రజి) లను పిలిపించి వారికి ప్రవక్త(స) హితోక్తులు గుర్తుచేస్తూ, యుద్ధం నుండి తొలిగి పొమ్మని చెప్పారు. ఆయన జుబైర్ (రజి)తో మాట్లాడుతూ "ఓసారి దైవప్రవక్త (స) మీ గురించి ఏమన్నారో గుర్తుచేసుకోండి. 'నువ్వు ఒకరితో పోరాడుతావని, అప్పుడు నీవు అతనిపై దౌర్జన్యం చేసినవాడవుతావని ఆయన చెప్పలేదా?" అని అన్నారు. హజ్రత్ జుబైర్ (రజి) ఈమాట వినగానే "నిజమే. ఈమాట నాకు ముందే చెప్పివుంటే నేనసలు మదీనా నుండి బయలుదేరేవాడ్ని కాను. ఇప్పుడు నేను దైవసాక్షిగా చెబుతున్నాను. నేను మీతో ఎన్నటికీ పోరాడను" అని చెప్పి వెనక్కి వెళ్ళిపోయారు.

తరువాత ఆయన తల్హా (రజి)తో మాట్లాడుతూ "అమ్మార్ బిన్ యాసిర్ (రజి) గురించి దైవప్రవక్త (స) 'నిన్ను ఓ తిరుగుబాటువర్గం వధిస్తుంద'ని భవిష్యత్‌వాణి పలికిన సంగతి మీకు తెలియదా?" అని అన్నారు. దానికి తల్హా (రజి) అలి (రజి) పక్షంలో నిల్చున్న అమ్మార్ (రజి)ని చూస్తూ "ఔనౌను. గుర్తొచ్చింది. నేనిప్పుడు మీతో ఎన్నటికీ పోరాడను" అని అన్నారు. ఆ తర్వాత ఆయన కూడా వెనక్కి వెళ్ళిపోయారు.

ఇలా వారిద్దరు పరిస్థితి అర్థం చేసుకున్నారు. హజ్రత్ జుబైర్ (రజి) యుద్ధమైదానం వదలి వేరే వైపుకు వెళ్ళిపోయారు. హజ్రత్ తల్హా (రజి) ఖడ్గం పారేసి ముందుపంక్తుల నుండి వెనుకపంక్తుల్లోకి పోయినిల్చున్నారు. అయితే అలి (రజి) పక్షంలో ఉన్న అమ్ర్ బిన్ జర్మూజ్ అనే ఓ దుర్మార్గుడు హజ్రత్ జుబైర్ (రజి)ని, ఆయిషా (రజి) పక్షంలో ఉన్న మర్వాన్ బిన్ హకమ్ అనే మరోదుర్మార్గుడు హజ్రత్ తల్హా(రజి)ని అన్యాయంగా పొట్టన బెట్టుకున్నారు. తరువాత జుబైర్ (రజి) హంతకుడు ఇబ్నెజర్మూజ్ సంతోషంతో భుజాలు

ఎగరేస్తూ బహుమానం పొందడానికి అలి (రజి) దగ్గరకు వస్తే, ఆయన మండిపడుతూ ఆ దుర్మార్గుడికి నరక దుర్వార్త విన్పించారు.

యుద్ధం నివారించడానికి హజ్రత్ అలి(రజి) సంధికోసం అనేకసార్లు ప్రయత్నించారు. చివరికి ఓరోజు సాయంత్రం రాజీ కుదిరింది. మరునాడు ఉదయం సంధిపత్రంపై సంతకాలు చేయవలసి ఉండింది. అయితే సంధిసంగతి తెలుసుకున్న 'సబాయీ దుండగులు' ఆందోళనచెందారు. ఈసంధి విజయవంతమైతే ముస్లింలంతా ఏకమై తమ భరతం పడ్తారని భావించి వణికిపోయారు. అంచేత వారా రాత్రంతా నిద్రపోకుండా రహస్యమంతనాలు జరిపారు. చివరికి నాయకుని ఆదేశం ప్రకారం కొందరు తెలతెల వారుతుండగా దొంగచాటుగా వెళ్ళి హజ్రత్ ఆయిషా (రజి) సైన్యంపై మెరుపుదాడి చేశారు. దాంతో ఆ సైనికులు తమపై అలి (రజి) సైనికులు దాడిచేశారని భావించి అరుపులు, కేకలతో అప్రమత్తులైపోయారు.

ఈ గందరగోళానికి అలి (రజి) లేచి విచారిస్తే, ఇబ్నెసబా అనుచరులు "తల్హా, జుబైర్‌లు మన సైన్యంపై దాడిచేశారని, మనవాళ్ళు గత్యంతరం లేక ఆత్మరక్షణ పోరాటానికి సిద్ధమయ్యారని" అబద్ధమాడారు. అలి (రజి) ఈ మాట వినగానే సైనికుల్ని సమాయత్తపరిచారు. కొన్నిక్షణాల్లోనే యుద్ధమైదానం వేడెక్కింది. కాని యుద్ధానికి దారితీసిన అసలు విషయం తెలియక ప్రతిమనిషీ ఎదుటి పక్షంవారినే దుర్మార్గులుగా భావించసాగాడు. హజ్రత్ ఆయిషా (రజి) ఒక అనుచరుడి సలహాతో ఒంటె మీద అంబారీలో కూర్చొని యుద్ధమైదానంలోకి ప్రవేశించారు. ఆమెను చూసి ఉభయపక్షాల యోధులు మరింత రెచ్చిపోయి పోరాటాన్ని ఉధృతం చేశారు.

ఖలీఫా అలి (రజి) పరిస్థితి తీవ్రతను గమనిస్తూ, హజ్రత్ ఆయిషా (రజి) కూర్చున్న ఒంటె కాలికి గురిపెట్టి బాణం వదలమని ఒక సైనికుడ్ని ఆదేశించారు. అతనలా బాణం వదలగానే ఒంటె దబేలున కూలిపోయి కూర్చున్నది. ఆ దృశ్యం చూడగానే ఒంటె చుట్టూ రక్షణవలయంగా నిలబడి పోరాడుతున్న ఆయిషా (రజి) సైనికులు భీతావహులై పారిపోయారు. చివరికి ఆయిషా (రజి) సైన్యం ప్రత్యర్థిసైన్యం ముందు నిలువలేక చేతులెత్తేసింది. ముస్లింముఖయూదుడైన ఇబ్నెసబా కుట్ర ఫలితంగా రెండు పక్షాలకు చెందిన పదివేల మందికిపైగా ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. హి.శ. 36లో జరిగిన ఈ యుద్ధాన్ని "ఉష్ట్రయుద్ధం" (జంగె జమల్) అంటారు.

యుద్ధం ముగిసిన వెంటనే ఖలీఫా అలి (రజి) యుద్ధంలో చనిపోయిన ఉభయ పక్షాల సైనికులకు జనాజానమాజ్ చేయించి ఖననం చేశారు. సమరసొత్తును బస్రా జామియామస్జిద్‌లో సమీకరించి ఎవరి వస్తువులు వారు వచ్చి తీసికెళ్ళమని ప్రకటన చేయించారు. ఇలా ఆయిషా (రజి) పక్షం సైనికులు యుద్ధమైదానంలో తాము పోగొట్టు కున్న వస్తువులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

ఆ సందర్భంలో హజ్రత్ తల్హా (రజి) కుమారుడు తనను కలుసుకోవడానికి వచ్చి నపుడు హజ్రత్ అలి (రజి) ఆయన్ని ఎంతో ప్రేమగా తన దగ్గర కూర్చోబెట్టుకొని సమర



సొత్తులోని ఆయన వస్తువుల్ని ఆయనకు తిరిగిచ్చేశారు. అప్పుడు ఆయన మాట్లాడుతూ "పరలోకంలో నాకు, మీ నాన్నకు మధ్య ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి ప్రకారమే వ్యవహారం వస్తుందని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు..."వారి హృదయాల్లో రాగద్వేషాలు ఏవైనా మిగిలివుంటే వాటిని మేము తీసేస్తాం. వారు పరస్పరం అన్నదమ్ముల్లా మారి ఆసనాల మీద ఎదురెదురుగా కూర్చుంటారు." (15:47)

ఆ తరువాత హజ్రత్ అలి (రజి) హజ్రత్ ఆయిషా (రజి) సన్నిధికి వెళ్ళి సలాంచేసి, ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ జరిగిన సంఘటన పట్ల విచారం వెలిబుచ్చారు. తరువాత హజ్రత్ అలి (రజి) హజ్రత్ ఆయిషా (రజి)ను ఎంతో గౌరవ మర్యాదలతో ఆమె సోదరుడు ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) రక్షణలో నలభై మంది స్త్రీల వెంట బస్రా నుండి పంపివేశారు.

హజ్రత్ ఆయిషా (రజి) బస్రా నుండి మక్కా చేరుకొని ఉష్ట్రయుద్ధానికి ముందు ఎదురైన పరిస్థితుల్ని గుర్తుకుతెచ్చుకొని బాధపడ్డారు. ఖాబ్ సరస్సు దగ్గర కుక్కలు మొరగడం, అలి (రజి) సైన్యంలో అమ్మార్ బిన్ యాసిర్ (రజి) ఉండటం మొదలైన విషయాలు ఆమె విజయానికి దుశ్శకునాలయ్యాయి. కాని అప్పుడామె వాటిని గురించి పట్టించుకోలేదు. పరాజయం తరువాత వాస్తవం వికృతనాట్యంచేస్తూ తన ముందు నిలబడగానే ఆమె తీవ్రంగా పశ్చాత్తాపం చెందారు.

ముఖ్యంగా ఖుర్‌ఆన్ పఠిస్తూ "మీరు మీ ఇండ్లలోనే ఆగిఉండండి." అనే సూక్తి (33:32) దగ్గరకు వచ్చినప్పుడల్లా ఆమె ఎంతో బాధపడిపోయేవారు. అబ్దుల్లా బిన్ హంబల్, ఇబ్నెమున్జిర్, ఇబ్నె అబీషైబా, ఇబ్నెసాద్ వంటి ప్రముఖులు తమ గ్రంథాల్లో మస్రూఖ్ కథనాన్ని ఉల్లేఖిస్తూ, హజ్రత్ ఆయిషా (రజి) ఖుర్‌ఆన్ పఠనం సందర్భంగా ఉష్ట్రయుద్ధంలో తనవల్ల జరిగిన పొరపాటు జ్ఞాపకమొచ్చి, ఈసూక్తి దగ్గరికి వచ్చేటప్పటికి అప్రయత్నంగా దుఃఖించేవారని, కన్నీటితో ఆమె ఓణి తడిసిపోయేదని వ్రాశారు.

ఈ యుద్ధంలో హజ్రత్ ఆయిషా (రజి) పక్షాన పోరాడినవారిలో బనూఉమయ్యా తెగవాళ్ళు కూడా ఉన్నారు. యుద్ధం ముగిసిన తర్వాత వారు సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు వెళ్ళిపోయారు. వారిలో మర్వాన్ బిన్ హకమ్, ఉత్బా బిన్ అబీ సుఫ్యాన్ వగైరా వ్యక్తులు కూడా ఉన్నారు.

## 5) సిఫ్ఫీన్, నహ్రెవాన్ యుద్ధాలు-మతవిభేదాలకు నాంది

సబాయీ దుండగులు సమరసొత్తు విషయంలో ఖలీఫా అలి (రజి)తో తీవ్రంగా విభేదిస్తూ న్యాయం చేయలేదన్న సాకుతో బస్రా నుంచి వేరేప్రాంతాలకు తరలిపోయారు. అంతటితో వారు తమ కుట్రల పరంపరకు తెరదించలేదు. వారు తమ దుష్టపథకంలోని ఒక భాగంగా ముస్లింలను రాజకీయపరంగా చీల్చి విజయం సాధించారు. ఇక రెండవ భాగమైన మతపరంగా ముస్లిం సముదాయాన్ని చీల్చే దిశగా పురోగమించారు.

సబాయీ దుండగులు బస్రా నుంచి బయలుదేరి ఈరాన్‌లోని వివిధ ప్రాంతాలకు చేరుకొని అక్కడి ప్రజల్ని ఖలీఫా అలీ (రజి)కి వ్యతిరేకంగా రెచ్చగొట్టడం ప్రారంభించారు.

ఈరాన్ తిరుగుబాటుదారుల్ని అణచడానికి అలి (రజి) అబ్దుర్రహ్మాన్ బిన్ జరూతాయీ నేతృత్వంలో ఒక సేనను పంపారు. ఆయన అమరగతికావడంతో రబై బిన్ కాస్ నేతృత్వంలో మరో సేన పంపారు. ఆ సేన తిరుగుబాటుదారుల్ని అణచి పారద్రోలింది.

ఖలీఫా అలి (రజి) రాజధానిని మదీనా నుండి కూఫాకు మార్చి, కేంద్రప్రభుత్వానికి అవిధేయుడైపోయిన అమీర్ ముఆవియా (రజి)ను దారికి తెచ్చేందుకు వివిధరాష్ట్రాల నుంచి నలభైవేల మంది సైనికుల్ని సమీకరించి సిరియా బయలుదేరారు. ఈరాన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సబాయీ దుండగులు కూడా ఇద్దరేసి ముగ్గురేసి చొప్పున వచ్చి అలి (రజి) సైన్యంలో చేరిపోయారు. అటు సిరియాగవర్నర్ ముఆవియా(రజి) ఉస్మాన్ (రజి) రక్తసిక్త దుస్తుల్ని, ఆయనభార్య తెగిన చేతివ్రేళ్ళను ప్రజల ముందు ప్రదర్శిస్తూ, వారిని తనకనుకూలంగా కూడగట్టి అరవైవేల మంది సైనికులతో బయలుదేరారు.

ఈజిప్టు మాజీగవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్య తర్వాత తన ఇద్దరు కుమారులతో కలసి మదీనా నుండి బైతిల్‌మఖ్దిస్‌కు వెళ్ళి ఉండసాగారు. ఇప్పుడు మారిన పరిస్థితుల్ని విశ్లేషించి సిరియాగవర్నర్ అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు చేరుకొని, ఆయనకు సైనికసలాహాదారుడిగా ఉండసాగారు.

ఈరెండు సైన్యాలు ఫురాత్‌నదికి పశ్చిమదిశలోని సిప్ఫీన్ ప్రాంతానికి వచ్చిఆగాయి. మొదట సంధికోసం రెండుమూడు సార్లు చర్చలుజరిగాయి. అవి విఫలం కావడంతో చిన్నచిన్న దళాలతో స్వల్పస్థాయి యుద్ధాలు జరిగాయి. తర్వాత మళ్ళీ చర్చలు జరిగాయి. అవీ ఫలించకపోవడంతో తీవ్రస్థాయి యుద్ధాలు జరిగాయి. ఇలా కొన్నినెలలు గడిచాయి. ఆ తర్వాత జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి.

అమీర్ ముఆవియా (రజి) ప్రతినిధివర్గం నాయకుడు హబీబ్ బిన్ మస్లమా ఖలీఫా అలి (రజి) దగ్గరకు వచ్చి "మీరు హజ్రత్ ఉస్మాన్ (రజి)ని హత్యచేయలేదని చెబితే, హత్యచేసినవాళ్ళను మాకు అప్పగించండి. మేము వాళ్ళను హతమార్చి హజ్రత్ ఉస్మాన్ (రజి) తరఫున ప్రతీకారం తీర్చుకుంటాం. ఆ తరువాత ముస్లింలు పరస్పరం సలహా సంప్రదింపులతో కొత్త ఖలీఫాను ఎన్నుకోవడానికి వీలుగా మీరు ఖిలాఫత్ పదవిని వదలి పెట్టండి" అని అన్నారు. సిరియా రాష్ట్రగవర్నర్ స్థాయిలో అమీర్ ముఆవియా (రజి) తరఫున వ్యక్తంచేయబడిన ఈ మాటలు ఖలీఫాపై తిరుగుబాటుకు ప్రబలనిదర్శనం.

ఇలా ఒక రాష్ట్రగవర్నర్ గతఖలీఫా హత్యకు ప్రతీకారం సాకుతో కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించడంతో హి.శ.37లో ఇరుపక్షాల మధ్య తీవ్రమైన యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఇరుపక్షాలలోఉన్న చాలామంది సత్యం ఏపక్షం వైపున్నదో అర్థం చేసుకోలేకపోయారు. అయితే అలి (రజి) పక్షంలోని 'అమ్మార్ బిన్ యాసిర్' (రజి) గురించి దైవప్రవక్త (స) "నిన్ను ఓ తిరుగుబాటు వర్గం వధిస్తుంద"ని భవిష్యత్‌వాణి పలికివున్నారు (బుఖారి, ముస్లిం). ఈ యుద్ధంలో అమ్మార్ (రజి) ముఆవియా వర్గంతో పోరాడుతూ వధించబడ్డారు. దాంతో సత్యం ఖలీఫా అలి (రజి) వర్గంవైపే ఉందని, ముఆవియా (రజి) వర్గంవైపు లేదని, అది తిరుగుబాటు వర్గమని స్పష్టమైపోయింది.



ఖలీఫా అలి (రజి) హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (రజి) అమరగతి సంగతి విని తీవ్రవిచారం వెలిబుచ్చారు. ఈ దుర్వార్త అమీర్ ముఆవియా (రజి) వర్గానికి తెలిసినపుడు అమ్ర్ బిన్ ఆస్ (రజి) కుమారుడు అబ్దుల్లా వెంటనే అమ్ర్ బిన్ ఆస్ (రజి), అమీర్ ముఆవియా (రజి)ల దగ్గరకు వెళ్ళి అమ్మార్ బిన్ యాసిర్ (రజి) విషయంలో దైవప్రవక్త (స) చెప్పిన ఈ భవిష్యవాణి వారికి గుర్తుచేశారు. దానిపై అమీర్ ముఆవియా (రజి) ప్రతికూలంగా స్పందిస్తూ "ఏమిటీ, మనం అమ్మార్‌ని హతమార్చామా? కాదు, ఆయన్ని రణరంగంలోకి తీసుకొచ్చినవారే హతమార్చారు" అని అన్నారు.

అమీర్ ముఆవియా (రజి) చేసిన ఈ వ్యాఖ్యానం సంగతి హజ్రత్ అలీ (రజి)కి తెలిసి "ఇలాంటి వ్యాఖ్యానంతో, హజ్రత్ హమ్జా (రజి)ను స్వయంగా దైవప్రవక్తే (స) హతమార్చారని చెప్పవచ్చు" అని అన్నారాయన. (షరా ఫిఖాఅక్బర్-ముల్లాఅలి ఖారి)

హజ్రత్ అమ్మార్ (రజి) అమరగతి నొందిన మరుసటిరోజు యుద్ధం పరాకాష్ఠకు చేరింది. ఖలీఫా అలి (రజి) పన్నెండువేల రౌతులతో కూడిన ఒక సైనికదళం తీసుకొని సమరజ్వాలలు రేకెత్తిస్తూ అమీర్ ముఆవియా (రజి) కూర్చున్న శిబిరం సమీపానికి చేరు కున్నారు. ఆయన ప్రత్యర్థులతో పోరాడుతూనే అమీర్ ముఆవియా (రజి)ను సంబోధిస్తూ "ముస్లింలను చంపించడం వల్ల ప్రయోజనం ఏమీలేదు. ధైర్యం ఉంటే నాతో పోటీకి దిగు. మనిద్దరిలో ఎవరు గెలిస్తే అతనే ఖలీఫా అవుతాడు" అని అన్నారు.

అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈమాట విని "విషయం సమంజసంగా ఉంది. ఆయన సవాలును స్వీకరించి మీరు పోటీకి దిగాలి" అన్నారు ముఆవియా (రజి)తో. కాని ముఆవియా (రజి) దానికి సమాధానమిస్తూ "అలీ (రజి)ని ఎదుర్కోవడానికి వచ్చే ఏ మనిషీ బ్రతికి బట్టకట్టలేడని నీకు తెలియదా?" అన్నారు. ఆ తర్వాత ఆయన నవ్వుతూ "నేనీ పోటీలో హతమార్చబడితే నా స్థానంలో నీవు సిరియా రాజ్యాధినేత అవుదామన్న ఉద్దేశ్యంతో నన్ను పోటీలో దిగమంటున్నావా?" అని అన్నారు. అంతేగాని హజ్రత్ అలి (రజి) ఛాలెంజ్‌కు వారిద్దరిలో ఎవరూ సమాధానం ఇవ్వలేదు.

ఈయుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన డెబ్భయి వేలమంది యోధులు నేలకొరిగారు. అనేక వేలమంది గాయపడ్డారు. ముఆవియా (రజి) సైన్యంలోనే అధిక ప్రాణనష్టం జరిగింది. ఆ సైన్యం పరాజయం పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. అంచేత హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) అమీర్ ముఆవియా (రజి)కు సలహా ఇస్తూ "ఇప్పుడు మన సైనికులు ఈటెలకు ఖుర్‌ఆన్ ప్రతులు కట్టి తీసికెళ్ళి 'ఈ ఖుర్‌ఆన్ మీకు మాకు మధ్య మధ్యవర్తి' అని చెప్పాలి. దీనివల్ల అలి (రజి) సైన్యంలో చీలికలు వస్తాయి. వారిలో కొందరు ఈ విషయాన్ని మనం ఒప్పుకుందాం అంటారు. మరికొందరు ఒప్పుకోకూడదంటారు. ఒకవేళ వారు ఒప్పుకుంటే మనకు కాస్త వ్యవధి లభిస్తుంది" అని చెప్పారు.

దానిప్రకారం ఆ సైనికులు తమనాయకుడి ఆదేశంతో ఈటెలకు ఖుర్‌ఆన్ ప్రతులు కట్టి "సోదరులారా! మీకు, మాకు మధ్య దైవగ్రంథం ఖుర్‌ఆనే మధ్యవర్తి. మనం దైవధర్మం కోసం యుద్ధం చేస్తున్నాం. కనుక మనమందరం దైవగ్రంథం తీర్పుని

శిరసావహిద్దాం. మేము ఖుర్‌ఆన్ తీర్పుని అంగీకరిస్తాం. సిరియా సైనికులు హతమైతే రోమన్లదాడుల్ని ఎవరు నిరోధిస్తారు? ఇరాఖ్ సైనికులు నాశనమైతే తూర్పురాజ్యాల నుండి ఎదురయ్యే దాడుల్ని ఎవరు అడ్డుకుంటారు?'' అని అన్నారు బిగ్గరగా.

ఈ మంత్రం హజ్రత్ అలి (రజి) సైనికులపై అమోఘంగా పనిచేసింది. వారీ మాటలు వింటూ ప్రత్యర్థి సైనికుల ఈటెలకు కట్టబడిన ఖుర్‌ఆన్ ప్రతుల్ని చూడగానే యుద్ధం ఆపేశారు. ఖలీఫా అలి (రజి), కొందరు సైనికాధికారులు ఎంత నచ్చజెప్పినా వారు సిరియా సైనికులతో యుద్ధం చేయడానికి అంగీకరించలేదు. అదను కోసం కాచుకొని వున్న సబాయీ దుండగులు యుద్ధవిరమణ ప్రచారం చేసి అనేకమంది సైనికుల్ని తమ వైపుకు తిప్పుకున్నారు. దాంతో సైనికులు ఖలీఫా అలి (రజి)పై తిరగబడి మాట్లాడారు. కొందరు ఆయన పట్ల చాలా దురుసుగా మాట్లాడారు. దాంతో అలి (రజి) ప్రత్యర్థి ప్రతిపాదన ముందు తలవంచక తప్పలేదు.

సమస్య పరిష్కారానికి ముఆవియా (రజి) తరపున అమ్ర్ బిన్‌ఆస్ (రజి), అలి(రజి) తరపున అబూమూసా (రజి)లు మధ్యవర్తులుగా నియమించబడ్డారు. వారు ఆర్నెల్లలో తాము తీసుకుబోయే నిర్ణయంపై ఇరుపక్షాల తరపున అంగీకారపత్రాలు తీసుకున్నారు. ఇలా ఒప్పందం జరిగిన తర్వాత ఇరుపక్షాల సైన్యాలు తమతమ ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యాయి. హి.శ. 37లో జరిగిన ఈ యుద్ధాన్ని "సిఫ్ఫీన్ యుద్ధం" అంటారు.

'సబాయీ దుండగులు' చర్చలు విఫలం చేయడానికి, రెండు సేనల మధ్య యుద్ధ జ్వాలలు రగిలించడానికి తమవంతు పాత్ర కూడా నిర్వహించారు. ఆ తరువాత వారు కూఫాకు తిరుగుప్రయాణంలో ఉభయపక్షాల మధ్య జరిగిన ఒప్పందాన్ని రద్దు చేయించడానికి ప్రయత్నించారు. వారు హజ్రత్ అలి (రజి) దగ్గరకు వచ్చి మనం వెనక్కి వెళ్ళిపోయి సిరియన్లపై దాడిచేయాలని అన్నారు. దానికి హజ్రత్ అలి (రజి) సమాధాన మిస్తూ "యుద్ధం జరుగుతున్నప్పుడు (మనం విజయం దిశగా పురోగమిస్తున్న దశలో) మీరు నా అభిప్రాయానికి వ్యతిరేకంగా యుద్ధం నిలిపివేయాలని నాపై ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు మీరే ఆ ఒప్పందానికి వ్యతిరేకంగా వెనక్కి వెళ్ళి సిరియన్లపై దాడిచేయాలని చెబుతున్నారు. సంధిపత్రం మీద సంతకాలు చేసిన తర్వాత దాన్ని ఎలా ఉల్లంఘిస్తాం. మనం రమజాన్‌నెల (ఆర్నెల్ల)వరకు వేచివుండాలి. అప్పటిదాకా ఒప్పందాన్ని ఉల్లం ఘించే ఆలోచనను కూడా మన మనసులోకి రానీయకూడదు'' అని అన్నారు.

సబాయీ దుండగులు అంతటితో ఊరుకోకుండా యుద్ధ సందర్భాల్లో తీసుకోబడిన నిర్ణయాల్ని మతపరంగా సందేహాస్పదం చేయడానిక్కూడా ప్రయత్నించారు. దాంతో అలి (రజి) సైనికుల్లో భిన్నస్వరాలు వ్యక్తమయ్యాయి. క్రమంగా ఈభిన్నస్వరాలు విభేదాలుగా, విభేదాలు విద్వేషాలుగా మారిపోయాయి. యుద్ధానికి పోయేటప్పుడు ఎంతో క్రమశిక్షణతో ఉండిన సైనికులు తిరుగుప్రయాణంలో మతపరమైన విభేదాలు, విద్వేషాలతో విభిన్న వర్గాలుగా చీలిపోయారు. సైన్యం కూఫా సమీపానికి చేరుకోగానే సైన్యంనుండి పన్నెండు వేలమంది మనుషులు వేరైపోయి హరూరా ప్రాంతానికి వెళ్ళిపోయారు.



ఇలా చీలినవారిలో రెండువర్గాలు ముఖ్యమైనవి. వాటిలోఒకటి "మన పనులన్నీ సలహాసంప్రదింపులతో, అధికసంఖ్యాకుల ఏకాభిప్రాయంతోనే జరగాలి. ఖలీఫా, నాయకుడు ఎవరూ ఉండరాదు. అలి, ముఆవియా ఇద్దరూ పాపాత్ములే'' అని భావిస్తోంది. ఈవర్గాన్ని 'ఖారిజీ వర్గం' అంటారు. సైన్యం నుండి వేరైపోయి హరూరాకు వెళ్ళిపోయింది ఈ వర్గమే. రెండోవర్గం హజ్రత్ అలీ (రజి)ని ఏ పాపం ఎరగని పరమ పవిత్రునిగా, ప్రియాతి ప్రియతమ నాయకునిగా భావిస్తోంది. ఖిలాఫత్ లేక నాయకత్వం హక్కు దైవప్రవక్త (స) తర్వాత అలీ (రజి)కి, ఆయన సంతతికి మాత్రమే ఉంటుందని అది నమ్ముతుంది. ఈ వర్గాన్ని 'షియావర్గం' అంటారు.

ఈ రెండు వర్గాలు తీవ్రమైన అతివాదం ఊబిలో కూరుకుపోయాయి. ఖారిజీ వర్గీయులు హజ్రత్ అలీ(రజి)కి బద్ధశత్రువులై, ఆ పుణ్యపురుషుడ్ని దూషించడానికి సైతం వెనుకాడేవారు కాదు. వారికి భిన్నంగా షియావర్గీయులు హజ్రత్ అలీ(రజి)కి వీరాభిమానులయి, ఆ దైవదాసుడ్ని దేవుని స్థాయికి చేర్చారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా(అలైహి) విషయంలో కూడా యూదులు, క్రైస్తవులు ఇలాంటి వైఖరే అవలం బించారు. యూదులు హజ్రత్ ఈసా(అలైహి)కు బద్ధశత్రువులై, ఆ పుణ్యపురుషుడ్ని చంపడానికి సైతం వెనుకాడ లేదు. వారికి భిన్నంగా క్రైస్తవులు హజ్రత్ ఈసా(అలైహి)కు వీరాభిమానులయి, ఆ దైవదాసుడ్ని దేవుని స్థాయికి చేర్చారు.

ఈ రెండువర్గాలో ఒకవర్గం దైవాగ్రహానికి గురయింది. రెండోవర్గం రుజుమార్గం తప్పింది. అందుకే మన సృష్టికర్త "దేవా! మాకు రుజుమార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారితప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులైనవారి మార్గమే మాకు చూపించు" అని వేడుకోవాలని ఖుర్‌ఆన్‌లో మానవులకు ఉపదేశిస్తున్నాడు.

కాని ఈనాడు సున్నీ ముస్లింలలో ఒక వర్గం షియాలకు తామేమీ తీసిపోమని, మహాప్రవక్త ముహమ్మద్ (స)ని దాదాపు దేవుని స్థాయికి చేర్చింది. ఆయన మానవ మాత్రుడు కాదని, అగోచరజ్ఞాని అని, ముస్లింలు ఎన్నిపాపాలు చేసినా ఆ మహనీయుని సిఫారసుతో నరకశిక్షకు గురికాకుండా నేరుగా స్వర్గానికి చేరుతామని ఆశలుపెట్టుకుంది. అదీగాక ఈవర్గం శుద్ధఏకదైవారాధకుల పట్ల ద్వేషం కూడా పెంచుకుంది.

హజ్రత్ అలి (రజి) తరపున ఈజిప్టులో ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) రాష్ట్ర గవర్నర్‌గా ఉండేవారు. కాని ఆయన తన రాష్ట్ర అంతర్గత సమస్యల వల్ల సిఫ్ఫీన్ యుద్ధంలో అలి (రజి) వర్గానికి ఎలాంటి సహాయసహకారాలు అందజేయలేకపోయారు. ఉస్మాన్ (రజి) హత్యతో ఆయన హంతకుల పట్ల పెల్లుబికిన ఆగ్రహావేశాలు ఈజిప్టు ప్రజలను కూడా ప్రభావితం చేశాయి. అంచేత అలాంటి ప్రజలు అలీ (రజి) వర్గీయు లైన గవర్నర్ ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)కు ఏమాత్రం సహకరించడంలేదు. పైపెచ్చు వారిలో కొందరు సిరియా గవర్నర్ అమీర్ ముఆవియా (రజి)కు ఉత్తరాలు రాస్తూ ఆయనకు తమ సహకారం అందించడానికి ప్రయత్నించారు. హజ్రత్ అలి (రజి) ఈ పరిస్థితి తెలుసుకొని సిఫ్ఫీన్ యుద్ధంలో తన ప్రతిభాపరాక్రమాలతో ప్రత్యర్థుల గుండెల్లో దడపుట్టించిన ''మాలిక్ బిన్ అష్తర్''ను ఈజిప్టుగవర్నర్‌గా నియమించి

పంపారు. అయితే యాదృచ్ఛికంగా ఆయన దారిలోనే చనిపోయాడు. ఈ సంగతి తెలుసుకున్న ముఆవియా (రజి) ఈజిప్టుపై దాడిచేయడానికి అమ్ర్ బిన్ ఆస్ (రజి)కు ఆరువేల మంది సైనికులిచ్చి పంపించారు.

ఈజిప్టు పరిణామాలను గురించి ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి) అలీ (రజి)కి లేఖ రాశారు. అప్పుడు అలి (రజి) ఆయన మద్దతుకోసం సైనికసమీకరణకు ప్రయత్నిస్తే రెండువేల మంది మాత్రమే ఈజిప్టు వెళ్ళడానిక సిద్ధమయ్యారు. ఆ రెండువేల మందే ఈజిప్టుకు చేరుకున్నారు. కాని యుద్ధంలో సేనాపతి హతమవ్వగానే వారు పిరికితనంతో పారిపోయారు. వేరొకవైపు ఈజిప్టు సైనికులు కూడా ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)ని వదిలేసి యుద్ధం నుండి పక్కకు తప్పుకున్నారు. దాంతో ఆయన ఏకాకి అయి యుద్ధ మైదానం వదలి జబలా బిన్ మస్రూఖ్ ఇంట్లో దాక్కున్నారు. కాని సిరియా సైనికులు ఆ ఇంటిని చుట్టుముట్టి ముహమ్మద్ బిన్ అబూబకర్ (రజి)ని పట్టుకున్నారు. తరువాత ఆయన్ని చంపి మృతపశువు చర్మంలో మూసేసి కాల్చివేశారు. అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఈజిప్టును స్వాధీనం చేసుకున్న తరువాత అక్కడి గవర్నర్‌గా నియమించబడ్డారు. ఈ సంఘటన హి.శ. 38వ సంవత్సరంలో జరిగింది.

సిఫ్ఫీన్ యుద్ధసమయంలో జరిగిన సంధి ప్రకారం రెండు పక్షాలు నియమించిన మధ్యవర్తులు ఆర్నెల్ల తరువాత రమజాన్ నెలలో ఖిలాఫత్ హక్కు విషయమై చర్చలు జరిపి ఒక నిర్ణయానికి వచ్చారు. కాని ప్రజల ముందు దాన్ని వ్యక్తపరచడంలో ఒక మధ్యవర్తి హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) మరొకసారి తన యుద్ధచాతుర్యం ప్రదర్శిస్తూ తన ప్రత్యర్థి మధ్యవర్తిని మోసగించడంతో మోసపోయిన మధ్యవర్తి తరపు ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వీలుచిక్కితే కాటువేయడానికి అలి(రజి) వర్గంలో కాచుకొనివున్న 'సబాయి దుండగులు' అలీ (రజి)తో "దేవుడ్ని వదలి మానవుల్ని న్యాయ నిర్ణేతలుగా అంగీకరించి మీరు అవిశ్వాసి అయిపోయార"ంటూ ఆయనకు ప్రత్యర్థులై కూఫా నుంచి 'నహ్రెవాన్'కు వెళ్ళిపోయారు.

ప్రారంభంలో హజ్రత్ అలీ(రజి)కి మద్దతుదారులుగా ప్రకటించుకొని, కుట్రలతో ముస్లింలలో విభేదాలు సృష్టించి, అరాచకం రేపి హజ్రత్ ఉస్మాన్ (రజి)ని పొట్టనబెట్టు కున్న సబాయిదుండగులు ఆ తరువాత రాజకీయంగా రెండువర్గాలుగా విడిపోయిన ముస్లింలలో యుద్ధజ్వాలలు రాజేసి, చివరికి అలీ(రజి)కి కూడా శత్రువులై పోయారు. పైగా తాము విభేదించిన విషయానికి మతరంగు పులిమి, తమతో విభేదించిన ముస్లిం లను అవిశ్వాసులుగా జమకట్టి హతమార్చడం ప్రారంభించారు.

హజ్రత్ అలి(రజి) ఈవార్త విని 40వేల సైన్యంతో నహ్రెవాన్‌కు వెళ్ళారు. అక్కడ ఆయన చేసిన హితోపదేశం, హెచ్చరికలతో 25 వేల మంది సబాయివర్గంసైనికుల్లో దాదాపు 17 వేలమంది పక్కకు తప్పుకున్నారు. వారిలో కొందరు హజ్రత్ అలి (రజి) వర్గంలో చేరిపోతే, మరికొందరు వేరే ప్రాంతాలకు వెళ్ళిపోయారు. 9 మంది మాత్రం ఎలాగో తప్పించుకున్నారు. మిగిలినవారు హజ్రత్ అలి (రజి) సైన్యంతో పోరాడి నేలకొరిగారు. ఈ యుద్ధాన్ని 'నహ్రెవాన్ యుద్ధం' అంటారు.



## 6) అలి (రజి) వర్గంలో అనాసక్తత, అంతర్విభేదాలు

నహ్రెవాన్ యుద్ధానికి ఎంతో ఉత్సాహంతో వెళ్ళిన అలి(రజి) సైనికులు సిరియాపై దాడిచేయడానికి పిలిస్తే అందుకు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. అందువల్ల ఖలీఫా అలి (రజి) సిరియాపై దాడిచేసే ప్రయత్నాన్ని విరమించుకోవలసి వచ్చింది. వారి అనాసక్తి, అంతర్విభేదాల వల్ల ఈజిప్టు, అరేబియాలు అలి(రజి) నుండి చేజారిపోయాయి. ఈరాన్, ఇరాఖ్‌లు మాత్రమే అలి (రజి) అధీనంలో మిగిలాయి. అవి కూడా పటిష్ఠంగా లేవు. ముఆవియా (రజి) వర్గంలో ఆయనకు సానుభూతిపరులైన అరబ్బులు అత్యధికంగా ఉంటే, అలి (రజి) వర్గంలో ఆయనపట్ల సానుభూతి లేని అరబ్బేతరులు అత్యధికంగా ఉన్నారు. అంచేత ఈ రెండువర్గాల మధ్య విద్వేషాగ్ని నిరంతరం మండుతుండేది.

ఈజిప్టు, యెమన్‌ల ఆక్రమణ తర్వాత అమీర్ ముఆవియా (రజి) తన రాజ్యంలోని మొత్తం రాష్ట్రాలప్రజల నుండి బైత్ (శపథం) తీసుకున్నారు. ఇలా ఆయన సర్వస్వతంత్రు డయి పూర్తి అధికారాలు చేజిక్కించుకోవడంతో పాలనావ్యవస్థ ఖిలాఫత్ వ్యవస్థ నుండి రాజరిక వ్యవస్థకు మారే ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. అందుకే హజ్రత్ సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) ఆయన్ని కలసుకోవడానికి వచ్చి "అస్సలాము అలైకుం మహారాజా!" అని సంబోధించారు. అప్పుడు అమీర్ ముఆవియా (రజి) "మీరు నన్ను విశ్వాసుల నాయకా అని సంబోధిస్తే ఏం కొంపలంటుకుంటాయి?" అని అడిగారు. దానికి హజ్రత్ సాద్ (రజి) తీవ్రంగా స్పందిస్తూ "దైవసాక్షిగా చెబుతున్నాను. మీకీ ప్రభుత్వం ఏవిధంగా లభించిందో ఆ విధంగా నాకు లభిస్తుంటే నేను దాన్ని ససేమిరా స్వీకరించను" అని అన్నారు. ఈ వాస్తవికత అమీర్ ముఆవియా (రజి)కు తెలియని విషయంకాదు. ఆయన స్వయంగా ఒకసారి "నేను ముస్లింలలో మొట్టమొదటి రాజును" అని అన్నారు.

ఈజిప్టు ఆక్రమణలోకి వచ్చిన తర్వాత ముఆవియా(రజి)కు మరింత ధైర్యంవచ్చింది. అంచేత ఆయన అలి(రజి) అధీనంలోని బస్రారాష్ట్రాన్ని కూడా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. దానికోసం ఆయన అబ్దుల్లా బిన్ హజ్రమీని పంపించారు. అయితే యుద్ధంలో అబ్దుల్లా హతమవడం. అతని సైన్యం పారిపోవడం జరిగింది. హి.శ. 39లో పార్శీలు ముస్లింలలోని ఈ అంతఃకలహాలు చూసి తిరుగుబాటు లేవదీసి ఈరాన్‌గవర్నర్ సుహైల్ బిన్ హునైఫ్‌ని తొలగించారు. అప్పుడు బస్రాగవర్నర్ ఇబ్నెఅబ్బాస్ (రజి) ఖలీఫా ఆజ్ఞతో జియాద్‌ను పంపి పార్శీల పీచం అణచివేశారు. ఇక్కడ ముస్లింలలో ఇలా అంతః కలహాలు సాగుతుంటే మరోవైపు రోమన్లు, క్రైస్తవులు ఈ అంతఃకలహాలతో తమ రాజ్య విస్తరణ ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నించారు. అలి (రజి) అధీనంలోని ఇరాఖ్‌పై దాడిచేస్తే, అలి(రజి) ప్రత్యర్థి ముఆవియా (రజి) తమతో సహకరిస్తారని లేదా కనీసం సంతోషిస్తారని వారు యుద్ధసన్నాహాలు ప్రారంభించారు.

ముఆవియా(రజి) ఈసంగతి వినగానే రోమ్ చక్రవర్తికి ఉత్తరం ద్వారా "నీవు గనక అలి(రజి) మీద దాడిచేయడానికొస్తే, నీపని పట్టడానికి అలి(రజి) సైన్యంలో అందరికంటే ముందుండే దండనాయకుడు ముఆవియయే అవుతాడ"ని తీవ్రంగా హెచ్చరించారు. ఈ హెచ్చరికతో రోమ్‌చక్రవర్తి తోకముడిచి యుద్ధనిర్ణయం మానుకున్నాడు.

హి.శ. 40వ సంవత్సరం ప్రారంభకాలం నాటికి సిరియాతో పాటు పాలస్తీనా, ఈజిప్టు, యమన్ మొదలైన ప్రాంతాలు అమీర్ ముఆవియా (రజి) రాజ్యపరిధిలోకి వచ్చేశాయి. మక్కా, మదీనాలను మాత్రం "ఫ్రీజోన్"లుగా వదిలేయడం జరిగింది. అంటే ఆ పట్టణాలలో ముఆవియా (రజి) పాలనగాని, అలి (రజి) పాలనగాని లేదన్నమాట. దానికి వారిద్దరు నేతలు సమ్మతించారు.

హి.శ. 40 ప్రారంభకాలంలోనే దురదృష్టకరమైన ఓ సంఘటన జరిగింది. బస్రాలో ఉంటున్న అబుల్అస్వద్ అనే వ్యక్తి బస్రాగవర్నర్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)పై ఒక అసత్యారోపణ చేస్తూ ఖలీఫా అలీ (రజి)కి ఉత్తరం రాశాడు. అందులో అతను "బస్రా గవర్నర్ మీ అనుమతి లేకుండా ప్రభుత్వధనాగారంలోని ధనాన్ని ఖర్చుచేశార"ని రాశాడు. దానికి హజ్రత్ అలి (రజి) ఆ వ్యక్తి పేరు ప్రస్తావించకుండా వివరణ అడిగితే, "అది తప్పుడు సమాచారం, నిరాధారమైన ఆరోపణ. నేను నా సొంతడబ్బు ఖర్చుచేశాను." అంటూ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉత్తరం రాశారు. కాని హజ్రత్ అలి (రజి) అంతటితో ఆ విషయాన్ని వదలకుండా "అది నీ సొంతడబ్బయితే దాన్ని ఎక్కడ్నుంచి ఎలా సంపాదించావు" అని మరో లేఖాస్త్రం సంధించారు. దాంతో అబ్దుల్లా బిన్ అబ్బాస్ నొచ్చుకుంటూ "నేనిలాంటి గవర్నర్ పదవిని అంటిపెట్టుకొని ఉండలేను. నేను దీన్ని వదిలేసి వెళ్తున్నాను. మీరు యోగ్యుడని తలచిన మరొక వ్యక్తిని గవర్నర్‌గా నియమించి పంపండి" అని ఉత్తరం రాసి బస్రా నుండి మక్కాకు వెళ్ళిపోయారు.

ఆ రోజుల్లోనే మరొక దుర్ఘటన జరిగింది. అలి(రజి) సోదరుడు అఖీల్(రజి) ప్రభుత్వ ధనాగారం నుంచి కొంత డబ్బివ్వమని అడిగితే అలి (రజి) అందుకు నిరాకరించారు. దాంతో అఖీల్ (రజి) తన సోదరుడు అలీ (రజి) మీద అలిగి ముఆవియా (రజి) దగ్గరికి డెమాస్కస్‌కు వెళ్ళిపోయారు. అప్పుడు అమీర్ ముఆవియా (రజి) పరమసంతోషంతో ఆయనకు స్వాగతం చెప్పి ఆర్థికంగా అనేక రాయితీలు కల్పించారు.

హజ్రత్ అలి (రజి) ఈ విషయం తెలుసుకొని ఎంతో బాధపడ్డారు. ఇక లాభంలేదనుకొని ఆయన సిరియాపై దాడిచేయడానికి మళ్ళీ నిర్ణయించుకున్నారు. దానికోసం ఆయన కూఫాప్రజల్ని యుద్ధంవైపు ప్రేరేపించారు. ఈసారి ఆయన ఇచ్చిన ప్రేరణతో అరవై వేలమంది హజ్రత్ అలీ (రజి)కి పూర్తిమద్దతు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. అప్పుడు హజ్రత్ అలి (రజి) సైనికసామగ్రి సమీకరించడంలో, సమర సన్నాహాలు చేయడంలో నిమగ్నులైపోయారు.

## 7) ముస్లిం రాజ్యాధినేతల హత్యకు కుట్ర

'నహ్రెవాన్'యుద్ధంలో తప్పించుకున్న 9మంది సబాయి దుండగులు ప్రతీకారంతో పెట్రేగిపోతూ అలి(రజి) ఖిలాఫత్‌వ్యవస్థను కూలద్రోయడానికి ప్రజలమద్దతు కోసం ఈరాన్,ఇరాఖ్, మక్కా,మదీనాలను పర్యటించారు. కాని వారికి ఎక్కడా ప్రజలమద్దతు లభించలేదు. చివరికి ఆ తొమ్మిది మంది (ఖారిజీ)దుండగుల్లో అబ్దుర్రహ్మాన్ బిన్ మల్జమ్ మురావి, బరక్ బిన్ అబ్దుల్లా తమీమి, అమ్ర్ బిన్ బకర్ తమీమి అనే ముగ్గురు



వ్యక్తులు మక్కాలో కూర్చొని చర్చలు జరిపారు. నహ్రెవాన్‌యుద్ధంలో తమ సహచరుల మృతిపట్ల విచారం వెలిబుచ్చుతూ ఓ భయంకరమైన నిర్ణయం తీసుకున్నారు.

ఆ నిర్ణయం ప్రకారం కూఫాలో ఖలీఫా అలీ (రజి)ని అబ్దుర్రహ్మాన్ బిన్ మల్జమ్ మురావి, డెమాస్కస్‌లో సిరియాగవర్నర్ అమీర్‌ముఆవియా (రజి)ని బరక్ బిన్ అబ్దుల్లా తమీమి, కైరోలో ఈజిప్టు గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని అమ్ర్ బిన్ బకర్ తమీమి ఒకేరోజు ఒకేసారి హతమార్చాలని తీర్మానించారు. దాని కోసం తేది, సమయం కూడా నిర్ణయించారు. హి.శ. 40వ సంవత్సరం, రమజాన్ నెల 16వ తేదీ ఫజర్ నమాజ్ సమయంలో ఈ దుష్టపథకాన్ని అమలుపరచాలని తీర్మానించి వారు తమతమ నిర్ణీత ప్రాంతాలకు వెళ్ళిపోయి సమయం కోసం ఎదురుచూడసాగారు.

ఆ సమయం వచ్చింది. రమజాన్ 16వ తేదీ, శుక్రవారం నాడు బరక్ బిన్ అబ్దుల్లా తమీమి డెమాస్కస్ జామియామస్జిద్‌లో ఫజర్‌నమాజ్ చేయిస్తున్న అమీర్ ముఆవియా (రజి)పై కత్తివ్రేటు వేసి పారిపోయాడు. అయితే అమీర్ ముఆవియా (రజి) చిన్న గాయంతో బ్రతికిపోయారు. హంతకుడు పట్టుబడి హతమార్చబడ్డాడు. అమీర్ ముఆవియా (రజి) ఆ తరువాత మసీదులో ఇమామత్ స్థానానికి సురక్షితమైన ఏర్పాట్లు చేయించారు. తన కోసం అంగరక్షకుల్ని కూడా నియమించుకున్నారు.

ఈజిప్టులో గవర్నర్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) జబ్బుపడటం వల్ల ఆరోజు తెల్లవారుజామున ఫజర్ నమాజ్ చేయించడానికి ఆయన తన స్థానంలో ఒక సైనికాధికారిని నియమించారు. దుండగుడు అమ్ర్ బిన్ బకర్ తమీమి ఆయన్నే అమ్ర్ బిన్ ఆస్ (రజి) అనుకొని హత్యచేసి పారిపోయాడు.

మూడో దుండగుడు అబ్దుర్రహ్మాన్ బిన్ మల్జమ్ కూఫా వెళ్ళిన తర్వాత అక్కడి ఖారిజీలను కలుసుకుంటూ తన దుష్టపథకాన్ని అమలుపరిచేందుకు ప్రయత్నించాడు. మొదట అతను షబీబ్ బిన్ షజరా అనే ఖారిజీని తన వైపుకు తిప్పుకున్నాడు. తర్వాత నహ్రెవాన్‌యుద్ధంలో చనిపోయిన ఖారిజీల బంధువుల ఇండ్లకు వస్తూపోతూ వారితో చనువు పెంచుకున్నాడు. వారిలో ఖతామ్ అనే ఓ అందాలరాసి ప్రేమలో పడ్డాడు. ఆమెను చేసుకునే ఉద్దేశ్యంతో తన మిత్రుడు షబీబ్‌ని రంగంలోని దించాడు. అయితే ఆమె కొన్ని షరతులు విధించింది. మూడువేల దిర్హంల డబ్బు, ఒక బానిస, ఖలీఫా అలి (రజి) శిరస్సు 'మహర్'గా ఇస్తే వివాహమాడతానని చెప్పింది. ఇబ్నెమల్జమ్ మూడవ షరతు మాత్రమే తీర్చుతానంటే ఆమె ఒప్పుకుంది. అదీగాక ఆమె ఈపని కోసం తన బంధువుల్లో వర్దాన్ అనే వ్యక్తిని కూడా ఇబ్నెమల్జమ్‌కు తోడుగా పంపింది.

హి.శ. 40, రమజాన్ 16వ తేదీ తెల్లవారుజామున ఇబ్నెమల్జమ్, షబీబ్, వర్దాన్‌లు కూఫా జామియామస్జిద్‌లో తలుపుచాటున నక్కికూర్చున్నారు. అలి(రజి) నమాజ్ వేళయింది రండిఅంటూ ప్రజల్ని పిలుస్తూ మసీదులో అడుగుపెట్టారు. తలుపుచాటున కాచుకొనివున్న ఆ దుండగుల్లో వర్దాన్ అనేవాడు వెంటనే అలి(రజి) మీద కత్తివ్రేటు వేశాడు. కాని అలి(రజి) కొంచెం ముందుకు నడవడంతో కత్తివ్రేటు వృధాపోయింది.

అయితే ఇబ్నెమల్జమ్ ఆ మరుక్షణమే అలి (రజి) వైపు దూసుకుపోయి కత్తివ్రేటు వేశాడు. దాంతో హ్జ్రత్ అలి (రజి) తీవ్రంగా గాయపడ్డారు.

ఆ దృశ్యం చూడగానే నమాజుకు వచ్చిన ప్రజలు షబీబ్, వర్దాన్‌లు పారిపోతుంటే వాళ్ళను పట్టుకోవడానికి పరుగెత్తారు. ఇబ్నెమల్జమ్ పారిపోకుండా మసీదులోనే మాయమయ్యాడు. ప్రజలు మసీదులో ఓ మూల దాక్కున్న ఇబ్నెమల్జమ్‌ను పట్టుకొని హ్జ్రత్ అలి (రజి) ముందు ప్రవేశపెట్టారు. ఖలీఫా అలి (రజి) "నేనీ గాయంతో చనిపోతే అతడ్ని వధించండి. బ్రతికుంటే నేతనికి సముచిత శిక్ష విధిస్తాను" అని అన్నారు. పారిపోయిన మిగతా ఇద్దరిలో వర్దాన్‌ని మాత్రమే ప్రజలు పట్టుకొని అక్కడికక్కడే హత మార్చారు. షబీబ్ వారికి అందకుండా ఎక్కడికో పారిపోయాడు.

కత్తివ్రేటు కణత మీద పడటంతో గాయం తీవ్రంగానే ఉంది. ఆరోజు ఎలాగో అలి (రజి) సజీవంగానే ఉన్నారు. కాని రెండవరోజు పరిస్థితి విషమించింది. ఆ పరిస్థితిలో జుందుబ్ బిన్ అబ్దుల్లా అనే వ్యక్తి వచ్చి "విశ్వాసులనాయకా! ఒకవేళ మీరు ఇహలోకం వీడిపోతే మేము మీ కుమారుడు హసన్ (రజి) చేతిలో 'బైత్' చేయమంటారా?" అని అడిగాడు. దానికి హ్జ్రత్ అలి (రజి) జవాబిస్తూ "దాన్ని గురించి నేనేమీ మాట్లాడను; మీరు ఎలా భావిస్తే అలా చేయండి" అని అన్నారు. ఆ తరువాత ఆయన కొడుకుల్ని పిలిచి కొన్ని హితోక్తులు ఉపదేశించారు. అంతే ఆ తరువాత "అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడ"నే సద్వచనం పఠిస్తూ శాశ్వతంగా కన్నుమూశారు.

ఇలా హ్జ్రత్ అలీ ముర్తుజా (రజి) ఆ గాయంతోనే 63 ఏండ్ల వయస్సులో, అయిదేండ్ల ఖిలాఫత్‌పాలన తరువాత హిజ్రీశకం 40వ సంవత్సరం రమజాన్ నెల 17వ తేదీన అమరగతులయ్యారు.

దైవప్రవక్త (స) సతీమణి హ్జ్రత్ ఆయిషా (రజి) ఖలీఫా అలి (రజి) అమరగతి అయిన సంగతి విని ఇలా అన్నారు: "ఇప్పుడు అరబ్బులు తాము తలచుకున్న ప్రతి పనీ నిస్సంకోచంగా చేసుకోవచ్చు. ఎందుకంటే అలి (రజి) నిర్యాణం తరువాత ప్రవక్త అనుచరులు (సహాబీలు) 'మంచిని ఆదేశించు, చెడుని అరికట్టు' అనే పని వదిలేసి బోధకులుగా, ఉపన్యాసకులుగా ప్రజలకు ధర్మోపదేశం చేస్తున్నారు. అలి (రజి) దైవ ప్రవక్తల మాదిరిగా ప్రజలను ఆజ్ఞాపించేవారు."

ఖలీఫా అలి(రజి) అమరగతి తర్వాత ప్రజలు హంతకుడు ఇబ్నెమల్జమ్‌ని తీసుకొచ్చి హసన్ (రజి) ముందు ప్రవేశపెట్టారు. హసన్ (రజి) హంతకుడ్ని ఒకేఒక వ్రేటుతో హత మార్చారు. ఆ తరువాత ఆయన తన తండ్రి భౌతికకాయాన్ని స్నానం, వస్త్రసంస్కారం, జనాజానమాజ్ అనంతరం ఖననం చేశారు. అయితే హ్జ్రత్ అలీ (రజి)ని ఎక్కడ సమాధి చేశారో తెలియదు. విభిన్న ఉల్లేఖనాల్లో విభిన్న ప్రదేశాల ప్రస్తావన ఉంది. ఒక ఉల్లేఖనం ప్రకారం ఇమామ్ హసన్ (రజి) అలి (రజి) భౌతికకాయాన్ని ఖారిజీలు కించ పరుస్తారేమోనన్న భయంతో ఎవరికీ తెలియకుండా ఓ రహస్యప్రదేశంలో సమాధి చేశారని తెలుస్తోంది. అలా చేయకపోతే షియాముస్లింలు హ్జ్రత్ అలి (రజి) సమాధిని దేవాలయంగా చేసుకొని ఆరాధించడం ప్రారంభించేవారు.



# 8) అలి (రజి) భార్యాపిల్లలు, ఆయన హితోక్తులు

హ్జ్రత్ అలి (రజి) విభిన్న కాలాల్లో తొమ్మిది మంది భార్యలను చేసుకున్నారు. వారిద్వారా పద్నాలుగు మంది మగసంతానం, పదిహేడు మంది ఆడసంతానం జన్మించారు. ఆయన మొట్టమొదట దైవప్రవక్త (స) చిన్నారి కూతురు హ్జ్రత్ ఫాతిమా (రజి)ను వివాహమాడారు. ఆమె ద్వారా హసన్, హుసైన్ (రజి) అనే ఇద్దరు కొడుకులు, జైనబ్, ఉమ్మెకుల్సూమ్ (రజి) అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు.

హ్జ్రత్ ఫాతిమా (రజి) చనిపోయిన తరువాత ఆయన ఉమ్ముల్‌బనీన్ బిన్తె హరాం కలాబియాను వివాహమాడారు. ఆమెద్వారా అబ్బాస్, జాఫర్, అబ్దుల్లా, ఉస్మాన్ అనే నలుగురు కొడుకులు కలిగారు. తరువాత ఐలీ బిన్తె మస్‌వూద్ బిన్ ఖాలిద్‌ని వివాహ మాడారు. ఆమె ద్వారా ఉబైదుల్లా, అబూబకర్‌లు జన్మించారు. నాలగవ వివాహం అస్మా బిన్తె అమీస్ (రజి)ని చేసుకున్నారు. ఆమె ద్వారా ముహమ్మదుల్ అస్గర్, యహ్యా రహ్మెహుల్లా పుట్టారు. ఐదవ వివాహం ఉమామా బిన్తె అబిల్ ఆస్‌ని చేసుకున్నారు. ఆమె ద్వారా ముహమ్మదుల్ అవస్త్ (రజి) అనే కొడుకు జన్మించాడు. ఆరవ వివాహం ఖౌలా బిన్తె జాఫర్‌ని చేసుకున్నారు. ఆమె ద్వారా ముహమ్మదుల్ అక్బర్ (రజి) జన్మించాడు. ఆయన్ని ముహమ్మద్ బిన్ అల్ హనఫియా (రజి) అని కూడా అంటారు. ఏడవ వివాహం సహిబా బిన్తె రబియాను చేసుకున్నారు. ఆమె ద్వారా ఉమ్ముల్ హసన్, జమిలతుల్ బరీ, ఉమ్నెకుల్సూమ్ సగ్రా అనే కుమార్తెలు జన్నించారు. ఎనిమిదో వివాహం ఉమ్మెసయీద్ బిన్తె ఉర్వా బిన్ మస్‌వూద్ సఖఫియాను చేసుకున్నారు. ఆమె ద్వారా ముగ్గురు కుమార్తెలు జన్మించారు. తొమ్మిదో వివాహం బిన్తె ఉమ్రా అల్‌ఖైస్ బిన్ అదీ కల్బీని చేసుకున్నారు. ఆమె ద్వారా ఒక అమ్మాయి మాత్రమే పుట్టి పిన్నవయస్సు లోనే చనిపోయింది.

**అలి (రజి) హితోక్తులు:** 1) ఆత్మసంతృప్తి కలిగినవాడే ప్రశాంతజీవితం గడుపుతాడు. 2) (ఖుర్‌ఆన్,హదీసులు) చదివి తదనుగుణంగా ఆచరిస్తూ జ్ఞానం, ఆచరణల మధ్య సమన్వయం పాటించేవాడే (నిజమైన) ధర్మవేత్త. 3) అడిగినప్పుడు (దానం) ఇవ్వడం అనేది ప్రసాదితం అనబడుతుంది. అడక్కుండా ఇస్తే అది దానశీలత అవుతుంది. 4) ఆరాధనలో బద్ధకం, కలిమిలో లేమి, రుచుల్లో తగ్గుదల కలగడం పాపాల పర్యవసానం (దైవశిక్ష). 5) మూర్ఖుడి (అహ్మఖ్)తో మైత్రి చేయకు; అతను నీకు ప్రయోజనం చేకూర్చాలనే భావిస్తాడు, కాని నష్టం కలిగిస్తాడు. 6) పాపానికి తప్ప మరే విషయానికీ భయపడకూడదు. (పాపభీతి ఉండాలి.) అలాగే దేవుని మీద తప్ప ఏమనిషి మీదా ఆశలు పెట్టుకోకు. 7) ఎవరికైనా ఏదైనా విషయం తెలియకపోతే దాన్ని నేర్చుకోవడానికి అతను ఏమాత్రం సిగ్గుపడకూడదు. 8) విశ్వాసం, సహనాల మధ్య శరీరం, శిరస్సుల మధ్య ఉండే సంబంధమే ఉంటుంది. కాబట్టి సహనం కోల్పోయితే విశ్వాసం కూడా కోల్పోయినట్లేనని భావించండి. శిరస్సే పోతుంటే ఇక శరీరం ఎలా మిగిలివుంటుంది? 9) దానిమ్మకాయను దాని గింజల మీద ఉండే పల్చటిపొరతో సహా తినాలి. ఎందుకంటే ఆ పొర పొట్టలోకి పోయి ఆహారాన్ని ఉడికిస్తుంది.

## 9) అలి (రజి) న్యాయదృక్పథం

ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం న్యాయనిర్ణయం చేయడంలో హజ్రత్ అలి (రజి) ఎంతో దూరదృష్టి, విశాల హృదయంగల నాయకులు. ఒకసారి అయిదుగురు ఖారిజీలు ఖలీఫా అలి (రజి) ముందు ప్రవేశపెట్టబడ్డారు. వారు అలీ (రజి)ని దూషిస్తున్నారని, వారిలో ఒకడు తాను అలీ (రజి)ని తప్పకుండా చంపుతానని బహిరంగంగా చెబుతున్నాడని వారి మీద ఆరోపించడం జరిగింది. అయితే హజ్రత్ అలి(రజి) ఆ ఖారిజీలపై ఎలాంటి చర్య తీసుకోకుండా వదిలేస్తూ తన మనుషులతో ఇలా అన్నారు: "వారి దూషణలకు సమాధానంగా కావాలంటే మీరు నోటితో ఇవ్వండి. అంతేగాని వారు క్రియాత్మకంగా తిరుగుబాటు చేష్టలకు పాల్పడనంతవరకూ కేవలం నోటిదురుసు కారణంతో వారిపై నేను ఎలాంటి చర్య తీసుకోలేను."

హజ్రత్ అలి (రజి) రాజధాని నుండి సిఫ్ఫీన్ యుద్ధానికి బయలుదేరుతూ యుద్ధకవచం కోసం వెతికితే అది కన్పించలేదు. యుద్ధం నుంచి తిరిగొచ్చినప్పుడు ఆ కవచం ఒక యూదుడి దగ్గర కన్పించింది. అలి (రజి) ఆ యూదుడ్ని తన కవచం గురించి అడిగితే అది తనదేనని, తన దగ్గర ఎప్పటినుంచో ఉందని అతను బుకాయించడానికి ప్రయత్నించాడు. యూదుడు అబద్ధమాడుతున్నట్లు అలి (రజి) గ్రహించారు. అయినప్పటికీ ఆయన తన ఖలీఫా పదవితో అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ఒక సాధారణ ముద్దాయి మాదిరిగా న్యాయస్థానానికి వెళ్ళి అతనిపై ఫిర్యాదు చేశారు.

న్యాయమూర్తి రాజ్యాధినేతను చూసి గౌరవిస్తూ లేచి నిల్చోలేదు, తిరుగులేని ఆయన అధికారానికి భయపడి కూడా ఆయనకు అనుకూలంగా తీర్పివ్వలేదు. సాధారణ ప్రజలను విచారించినట్లే ఖలీఫాను కూడా విచారిస్తూ "ఈ కవచం మీదేనని రుజువేమిటీ?" అని ప్రశ్నించాడు. అప్పుడు హజ్రత్ అలి (రజి) తన సేవకుడు ఖంబర్‌ని, తన కుమారుడు దైవప్రవక్త (స) మనవడైన ఇమామ్ హుసైన్ (రజి)ని సాక్షులుగా ప్రవేశపెట్టారు.

న్యాయమూర్తి ఆ సాక్షుల్ని చూసి "హుసైన్ (రజి) మీ కుమారుడే గనక ఆయన సాక్ష్యం నమ్మదగినది కాదు. తండ్రి అభియోగానికి కొడుకు సాక్ష్యాన్ని అంగీకరించ లేము" అంటూ ఖలీఫా సాక్ష్యాలను త్రోసిపుచ్చాడు. పాపం! ఖలీఫాగారి కేసు వీగిపోయింది. అయితే ఈ వ్యవహారం, న్యాయవైఖరి చూసిన ఆ యూదుడు ముందుకు వచ్చి బిగ్గరగా ఇలా అన్నాడు: "నేను అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ (స) ఆ దేవుని ప్రవక్త అని సాక్ష్యమిస్తున్నాను. ఏ ధర్మంలో ఇలాంటి న్యాయం ఉందో అదే సత్యధర్మం."

# 35. హసన్ (రజి) ఖిలాఫత్ పాలన

హసన్ బిన్ అలి బిన్ అబూతాలిబ్ (రజి) శ్రేయస్కర ఖలీఫాలందరిలో చివరి ఖలీఫా అని ధర్మవేత్తలు భావిస్తున్నారు. ఆయన హి.శ. 30లో జన్మించారు. ఆయన రూపురేఖలు చాలావరకు దైవప్రవక్త (స) రూపురేఖల్ని పోలివుంటాయి. దైవప్రవక్త (స) ఓసారి హసన్ (రజి)ని భుజం మీద కూర్చోబెట్టుకొని వెళ్తుంటే దారిలో ఒకతను ఎదురై "బాబూ! నీకెంత మంచి వాహనం దొరికింది!" అని అన్నాడు హసన్ (రజి)తో. అప్పుడు దైవప్రవక్త (స)



"(వాహనం మీద కూర్చున్న) రౌతు కూడా చాలా మంచివాడే" అన్నారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ప్రకారం ప్రవక్తకుటుంబంలో హసన్ చాలావరకు దైవప్రవక్త (స)ను పోలి వుంటారు. దైవప్రవక్త (స) అందరికంటే హసన్‌నే ఎక్కువగా ప్రేమించేవారు."

## 1) హసన్ (రజి) ఘనతా ఔన్నత్యాలు

హసన్ (రజి) ఎంతో మృదుస్వభావి, దానశీలి. అరాచకం, అల్లర్లు, అల్లకల్లోలాంటే ఆయనకు పరమఅసహ్యం. అలి బిన్ జైద్ కథనం ప్రకారం హసన్ (రజి) దైవమార్గంలో తన ఆస్తిలో సగం సగం చొప్పున మూడుసార్లు దానం చేశారు. చివరికి తన పాదరక్షల్లో ఒకటి ఉంచుకొని రెండవదాన్ని, మేజోళ్ళలో ఒకటి ఉంచుకొని రెండవదాన్ని దానం చేశారు. ఒకసారి హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) "నేను కలిమి కంటే లేమిని, ఆరోగ్యం కంటే వ్యాధిని ఎక్కువగా ఇష్టపడతాను" అని అన్నారు. ఈ విషయం హజ్రత్ హసన్ (రజి) ముందు ఎవరో ప్రస్తావిస్తే దానిపై ఆయన "దేవుడు అబూజర్‌ని కరుణించుగాక! నేను మాత్రం నన్ను పూర్తిగా దేవునికి అధీనంచేసి, ఏ విషయాన్నీ కోరకుండా ఉన్నాను. ఆయన తాను తలచుకున్నది చేస్తాడు. అందులో నేను జోక్యం చేసుకునేటంతటి దుస్సాహసానికి పాల్పడలేను" అని అన్నారు.

## 2) ఆరంభంలోనే అనైక్యత

హజ్రత్ అలి(రజి) అమరగతి తరువాత (కూఫా రాజధానిగా ఉండిన) ఇరాఖ్‌ప్రజలు ఆయన పెద్దకుమారుడు ఇమామ్ హసన్(రజి)ని ఖలీఫాగా ఎన్నుకోవడానికి బైత్ చేశారు. అప్పుడు అందరికంటే ముందు ఖైస్ బిన్ సాద్ బిన్ ఇబాద్ బైత్ చేశారు. ఆ తరువాత మిగిలినవారంతా చేశారు. హసన్ (రజి) బైత్ చేయించుకుంటున్నప్పుడు ప్రతి మనిషితో "నేను చెప్పినట్లు నడచుకోవాలి. నేను ఎవరితో యుద్ధం చేస్తానో మీరు కూడా వారితో యుద్ధం చేయాలి. నేను ఎవరితో రాజీపడతానో మీరు కూడా వారితో రాజీపడాలి" అని అన్నారు. కూఫా ప్రజలు ఈ మాటలు విని పరస్పరం గుసగులాడుకుంటూ "ఈయన గారు యుద్ధం చేసేలా కన్పించడం లేదు" అని చెప్పుకోసాగారు.

కొన్నాళ్ళకు సిరియా నుంచి అమీర్ ముఆవియా(రజి) అరవైవేల సైన్యంతో కూఫాపై దాడిచేయడానికి వస్తున్నారని తెలిసి ఖలీఫా హసన్ నలభై వేల సైన్యంతో కూఫా నుండి బయలుదేరారు. మార్గమధ్యలో ఓచోట ఆగి సైనికుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ "దైవసాక్షి! నాకు ఎవరిపట్లా ద్వేషం లేదు. నేను అనైక్యత, విరోధాల కంటే శాంతి, సంధి, సమైక్యతలే శ్రేష్ఠమైనవని భావిస్తున్నాను" అని అన్నారు.

సైన్యంలో ఉన్న సబాయీదుండగులు, ఖారిజీలు, కపటులు ఈమాటలు వినగానే హసన్ (రజి) ముఆవియా (రజి)తో సంధి చేసుకోదలిచారని, ఇలా ఆయన అవిశ్వాసి (కాఫిర్) అయిపోయారని ప్రచారం చేశారు. ఈ దుష్ప్రచారానికి ప్రభావితులైన అనేక మంది సైనికులు పెద్దఅలజడి రేపుతూ ఖలీఫా హసన్ (రజి)ని చుట్టుముట్టారు. ఆయన శిబిరం ధ్వంసంచేసి ఆయన చొక్కా లాగి చింపేశారు. అప్పుడు రబియా, హమ్దాన్ తెగల యోధులు ముందుకొచ్చి హసన్ (రజి)ని దుండగుల నుండి కాపాడారు. కాస్సేపటికి

ఈ అల్లరి సద్దుమణిగింది. తరువాత హసన్ (రజి) గుర్రమెక్కి రబియా, హమ్దాన్ తెగల సహకారంతో మదాయన్ పట్టణం దిశగా బయలుదేరారు.

అయితే మార్గమధ్యలో జిరా బిన్ ఖబీజా అనే ఓ ఖారిజీ దుండగుడు అదను చూసి హజ్రత్ హసన్ (రజి) మీద ఈటెతో వ్రేటువేశాడు. దాంతో హసన్ (రజి) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఇద్దరు యోధులు ఆ దుర్మార్గుడిపై దాడిచేసి అతడ్ని మట్టు పెట్టారు. ఆ తర్వాత సైనికులు హసన్ (రజి)ని మంచం మీద పడుకోబెట్టి మదాయన్ పట్టణంలోని స్వేతసౌధానికి చేర్చారు. అక్కడ ఆయనకు చికిత్స చేయించారు. కొన్ని రోజుల్లోనే గాయం మానిపోయి ఆయన ఆరోగ్యం కుదుటపడింది.

## 3) సంధి ద్వారానే శాంతి సాధ్యం

ఈ దండయాత్రలో ఖలీఫా హసన్ తన సొంత సైనికుల్లోనే చేదుఅనుభవం చవిచూసి తీవ్రంగా ఖంగుతిన్నారు. పరిస్థితి సమీక్షించిన తర్వాత ఆయన ఇరాఖ్‌ప్రజలు నిలకడలేని మనుషులని భావించి ముఆవియా (రజి)తో సంధి చేసుకోడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో అటు ముఆవియా (రజి) తరపున అబ్దుల్లా బిన్ ఆమిర్ సంధి ఉద్దేశ్యంతోనే ఓ సైనికదళంతో మదాయన్‌కు చేరుకున్నాడు. ఖలీఫా హసన్ (రజి) ఈ సంగతి తెలుసుకొని తాను ఖిలాఫత్ పదవి నుండి తప్పుకుంటానని అంగీకరిస్తూ కొన్ని షరతులతో సంధిచేసుకోవడానికి ముందుకొచ్చారు. ఆ విషయమే ఆయన తన ప్రతినిధివర్గం ద్వారా ముఆవియా (రజి) దౌత్యవేత్త అబ్దుల్లాకు తెలియ జేశారు. అబ్దుల్లా అమీర్ ముఆవియా (రజి) దగ్గరకెళ్ళి ఆయనకీ విషయం తెలియ జేశారు. అమీర్ ముఆవియా (రజి) సంధి సంగతి విని ఎంతో సంతోషించారు.

సంధి కోసం హజ్రత్ హసన్ (రజి) పెట్టిన షరతులు అంతగా తీవ్రమైనవి కావు. "అమీర్ ముఆవియా (రజి) ఖుర్ఆన్, హదీసుల ప్రకారం నడచుకోవాలి; శత్రుభావం, గత సంఘటనలు విస్మరించి తన బంధువులకు, తన వర్గం ప్రజలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోనని వాగ్దానం చేయాలి; తనకు ప్రతియేడూ లక్ష దిర్హంలు పైకం పంపాలి" అనేవే ఆ షరతులు. అమీర్ ముఆవియా (రజి) ఈ షరతులు విని, ఇవేకాదు ఇలాంటి మరెన్ని షరతులు పెట్టినా తనకు అంగీకారమేనని హజ్రత్ హసన్ (రజి)కు తెలియజేశారు. ఈవిధంగా ఇద్దరు అధినేతల మధ్య శాంతిఒప్పందం జరిగింది. దాంతో హసన్ (రజి) పాలనాకాలం ముగిసింది.

ఆ తరువాత అమీర్ ముఆవియా (రజి) సైన్యం తీసుకొని ఇరాఖ్‌ప్రజల చేత బైత్ (శపథం) చేయించడానికి కూఫా వచ్చారు. కూఫా జామియా మస్జిద్‌లో హజ్రత్ హసన్ (రజి)తో పాటు ప్రజలంతా అమీర్ ముఆవియా (రజి)ను ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేశారు. ఖైస్ బిన్ సాద్ (రజి), (ఇమామ్) హుసైన్ (రజి) మొదట్లో బైత్ చేయడానికి నిరాకరించినా ఆ తర్వాత బైత్ చేశారు. సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) కూడా బైత్‌చేశారు. దాంతో అమీర్ ముఆవియా (రజి) అవధులుదాటిన ఆనందంతో హసన్ (రజి)ని ప్రశంసల జడివానలో ముంచెత్తారు.



ఈ సంధి, బైత్ (శపథం)లు హజ్రత్ అలి (రజి) అమరగతి అయిన ఆర్నెల్ల తర్వాత హి.శ. 41వ ఏట జరిగాయి. ఈవిధంగా హజ్రత్ హసన్ (రజి) "నాయీ కుమారుడు నాయకుడు. దేవుడు ఇతనిద్వారా రెండు ముస్లింవర్గాల మధ్య సయోధ్య కుదురుస్తాడు" అనే దైవప్రవక్త (స) భవిష్యవాణిని నిజం చేశారు.

హజ్రత్ హసన్ (రజి) బైత్‌చేసిన తర్వాత కూఫానుంచి మదీనా వెళ్ళిపోయి నివశించ సాగారు. ఒప్పందంలోని ఒక షరతు ప్రకారం అమీర్ ముఆవియా (రజి) ప్రతి ఏడూ హజ్రత్ హసన్ (రజి)కు లక్ష దిర్హంలు ఉపకారవేతనంగా పంపించేవారు. అయితే ఒక సంవత్సరం పంపలేదు. దాంతో హజ్రత్ హసన్ (రజి) ఆర్థిక ఇబ్బందులకు గురై దిగాలు పడిపోయారు. ఒకరోజు ఆయన అమీర్ ముఆవియా (రజి)కు ఉపకారవేతనం సంగతి గుర్తుచేసేందుకు ఉత్తరం రాయడానికి కలం, సిరాబుడ్డి తెప్పించారు. కాని ఎందుకో ఉత్తరం రాయకుండా ఆగిపోయారు.

ఆరోజు రాత్రి ఆయన కలలో దైవప్రవక్త (స) కన్పించి "హసన్! ఎలా ఉన్నావ"ని అడిగారు. దానికి ఆయన "దేవుని దయవల్ల బాగున్నాను" అన్నారు. ఆ తర్వాత ఆయన తన ఆర్థిక ఇబ్బందుల్ని గురించి ఏకరువు పెట్టుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "దాని కోసం నువ్వీ రోజు నీలాంటి ఒక దాసుడ్ని అడగడానికి కలం, సిరాబుడ్డి తెప్పించావా!" అని అడిగారు. దానికి హసన్ (రజి) "ఔను దైవప్రవక్తా! తెప్పించాను. అలా కాకుంటే నేను మరేం చేయగలను?" అని అన్నారు. అప్పుడు దైవప్రవక్త (స) "ఈ 'దుఆ' చేస్తూ ఉండు" అని అన్నారు:

(దుఆ అనువాదం):- "దేవా! నేను నిన్ను మాత్రమే నమ్ముకునేలా, నీ మీదనే ఆశలు పెట్టుకునేలా నాకు సద్బుద్ధి ప్రసాదించు. నీ మీద తప్ప నేను మరెవరి మీదా ఆశలు పెట్టుకోకుండా చెయ్యి. దీనివల్ల నాశక్తి క్షీణించదు. నా సదాచరణ కూడా తగ్గదు. నేను అతని వైపు పూర్తిగా మొగ్గలేదు. నా అర్థింపు కూడా అతనిదాకా చేరలేదు. నా నోట కూడా అలాంటి పలుకులు వెలువడలేదు. కనుక సర్వలోక పోషకుడా! నీవు మొట్టమొదటి వ్యక్తికి, చిట్టచివరి వ్యక్తికి ప్రసాదించినదాన్ని నాక్కూడా ప్రసాదించు. అతనితో పాటు నన్ను కూడా తప్పకుండా ప్రత్యేకించు."

హజ్రత్ హసన్ (రజి) ఆరోజు నుండి ఈ దుఆ చేయడం ప్రారంభించారు. అలా ఒక వారం కూడా గడవలేదు, అమీర్ ముఆవియా (రజి) ఆయన దగ్గరకు పదిహేను లక్షల దిర్హంలు పంపించాడు. అప్పుడు హసన్ (రజి) దైవానికి కృతజ్ఞతలు సమర్పించు కుంటూ "దేవుడు తనను స్మరించేవారిని ఎన్నడూ మరచిపోడు, తనను అర్థించేవారిని ఆయన ఏమాత్రం నిరాశపరచడు" అని అన్నారు.

ఆరోజు రాత్రి ఆయన కలలోకి దైవప్రవక్త (స) మళ్ళీవచ్చి 'హసన్! ఎలా ఉన్నావ'ని అడిగారు. దానికి హసన్ (రజి) దేవుని దయవల్ల బాగున్నానని అన్నారు. ఆ తరువాత ఆయన జరిగిన సంఘటన వివరించారు. దానిపై దైవప్రవక్త (స) "కుమారా! సృష్టితాల మీద ఆశలు పెట్టుకోకుండా సృష్టికర్తను మాత్రమే అర్థించేవాడిపై దేవుని అనుగ్రహం ఇలాగే ఉంటుంది" అని అన్నారు.

హజ్రత్ హసన్ (రజి)కు భార్య జాదా బిన్తె అషాత్ బిన్ ఖైస్ విషమిచ్చి చంపింది. దాని పూర్వపరాలు ఇలా ఉన్నాయి: యజీద్ బిన్ ముఆవియా (రజి) రహస్యంగా ఒక మనిషి ద్వారా ఆమెకు విషం పంపి, ఈ విషమిచ్చి హసన్ (రజి)ని చంపితే నేను నిన్ను (నా పట్టపురాణిగా) చేసుకుంటానని చెప్పాడు. అతని ప్రలోభానికి లోబడి ఆమె తన భర్తకు విషమిచ్చి చంపింది. ఇలా హసన్ (రజి) చనిపోయాక ఆమె ఒక మనిషి ద్వారా యజీద్‌కు అతని వాగ్దానాన్ని గుర్తుచేసింది. అయితే యజీద్ ఆమెకు బుద్ధివచ్చేలా సమాధానమిస్తూ "నేను నిన్ను హసన్(రజి) వివాహబంధంలో ఉండటాన్నే చూడలేకపోయాను. అలాంటప్పుడు నేను నిన్ను ఎలా చేసుకుంటా(నని భావించావు నువ్వు)?"అని అన్నాడు. దాంతో ఆమె (పట్టపురాణి కావాలన్న) నిషా దిగిపోయింది.

హసన్ (రజి)కు విషమిచ్చినవారెవరో తెలుసుకోవడానికి తమ్ముడు హుసైన్ (రజి) ఎంత ప్రయత్నించినా ఆయన చెప్పలేదు. "ఎవరి మీదైనా నాకు అనుమానముంటే ఆ వ్యక్తిపై దేవుడే ప్రతీకారం తీర్చుకుంటాడు. అలాకాకుంటే నా కారణంగా మరొకరు ఎందుకు హతమార్చబడాలి?" అన్నారు ఆయన.

హజ్రత్ హసన్(రజి) చనిపోక ముందు తమ్ముడు హుసైన్ (రజి)ని పిలిచి "పరిస్థితి గమనిస్తే మన కుటుంబంలో ఖిలాఫత్, దైవదౌత్యం కలసివుండలేవని అర్థమయింది నాకు. అంచేత నీవు ఖిలాఫత్ జోలికి పోకు. మరొక విషయం గురించి కూడా నేను భయపడ్తున్నాను. కూఫాప్రజలు యుద్ధానికి ప్రేరేపిస్తూ ఇక్కడ్నుంచి నిన్ను తీసేయడానికి ప్రయత్నిస్తారు. నువ్వు వారి మాయాజాలంలో పడి కూఫాని వదలిపెట్టకు" అని చెప్పారు. ఆ తర్వాత ఆయన హి.శ. 50లో తన ప్రభువు సన్నిధికి వెళ్ళిపోయారు.

హజ్రత్ హసన్ (రజి) భౌతికకాయాన్ని ఆయన మాతృమూర్తి హజ్రత్ ఫాతిమా (రజి) సమాధి పక్కనే ఖననం చేయడం జరిగింది. హజ్రత్ హసన్ (రజి)కు తొమ్మిది మంది కుమారులు, ఆరుగురు కుమార్తెలు కలిగారు.

# 36. అమీర్ ముఆవియా (రజి) పరిపాలన

హజ్రత్ హసన్ (రజి) ఇరాఖ్‌ప్రజల చంచల స్వభావం వల్ల ఖిలాఫత్ పదవి నుండి తప్పుకోవడంతో ఇప్పుడు అమీర్ ముఆవియా (రజి) యావత్తు ఇస్లామీయ సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తి అయ్యారు. ఆయన ఖడ్గం మరింత మొనదేలి తిరుగుబాటుదారులకు తీవ్రమైన హెచ్చరికగా నిలచింది. ఖిలాఫత్ వ్యవస్థ సమాధిపై రాజరిక వ్యవస్థ పతాకం రెపరెపలాడటం ప్రారంభించింది.

వేరొకవైపు హజ్రత్ హసన్ (రజి), అమీర్ ముఆవియా (రజి)ల మధ్య జరిగిన సంధితో ముస్లింలలో విభేదాలు, అంతఃకలహాలు సృష్టిస్తూ నిరంతరం యుద్ధజ్వాలలు రగిల్చే (ఖారిజీలైన) సబాయీ దుండగులు ఎంతో నిరుత్సాహపడ్డారు. వారి కుట్రలకు బ్రేకుపడింది. ఆ తరువాత దాదాపు పదేళ్ళపాటు ముస్లింల అంతర్‌యుద్ధాలు ఆగిపోయాయి. అమీర్ ముఆవియా (రజి) ఖారిజీలందర్నీ దాదాపు పూర్తిగా అణచివేసి విదేశీరాజ్యాల ప్రమాదం వైపు దృష్టి కేంద్రీకరించారు.



## 1) ముఆవియా (రజి) పుట్టుపూర్వోత్తరాలు

"ఖరాయితీ హవాతిఫ్"లో హమీద్ బిన్ వహబ్ ఉల్లేఖనం ఈవిధంగా ఉంది:-

హిందా బిన్తె ఉత్బా మొదట్లో ఫాకా బిన్ ముగీరా దాంపత్యంలో ఉండేది. అతను ఓ భోజనశాల నిర్మించాడు. అక్కడికి ప్రజలు అనుమతి లేకుండానే వస్తూపోతుండేవారు. ఒకరోజు ఆ ఇంట్లో ఫాకా, హిందా మాత్రమే ఉన్నారు. కాస్సేపటికి ఫాకా ఏదో పనిమీద బయటికెళ్ళాడు. ఆతర్వాత రోజూ వస్తూపోతుండే ఒకతను వచ్చాడు. అతనా ఇంట్లో ఒక స్త్రీ ఒంటరిగా ఉండటం చూసి వెంటనే తిరిగెళ్ళిపోయాడు. అదే సమయంలో హిందా భర్త ఫాకా తిరిగొస్తూ బయటికి వెళ్తున్న వ్యక్తిని చూసి అనుమానంతో ఎవరా మనిషని అడిగాడు. దానికి హిందా తానా మనిషి ముఖం కూడా చూడలేదని, మీరు చెబితేనే తెలిసిందని అన్నది. అయినప్పటికీ అతను కోపంతో "వెళ్ళిపో ఇక్కడ్నుంచి" అన్నాడు.

అప్పుడామె తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళిపోయింది. ఈ సంఘటన ఆనోటా, ఈ నోటా ప్రాకి జనంలో గుసగుసలు మొదలయ్యాయి. ఓరోజు హిందా తండ్రి పిలిచి "అమ్మాయ్! నీగురించి జనం ఏవేవో చెప్పుకుంటున్నారు. అసలు ఏం జరిగిందో చెప్పు" అని అడిగాడు. ఒకవేళ నీ భర్త చెప్పింది నిజమే అయితే నేనతడ్ని ఒక మనిషి ద్వారా రహస్యంగా చంపిస్తాను. అతను చెప్పింది అబద్ధమైతే మనం యమన్ మాంత్రికుడి దగ్గరికెళ్ళి వాస్తవం తెలుసుకుందాం" అని అన్నాడు. దానికి హిందా ఎన్నెన్నో ఒట్లువేసి మరీ అతను తన మీద నిందారోపణ చేశాడని చెప్పింది.

ఆ తరువాత ఉత్బా కూతురు హిందాను, ఆమె చెలికత్తెల్ని, అల్లుడు ఫాకాను, తన తెగవాళ్ళు అనేకమందిని వెంటబెట్టుకొని యమన్‌కు చేరుకున్నాడు. దారిలో హిందా ముఖంలో భయచిహ్నాలు చూసి "ఏమిటమ్మా!నువ్వేదో భయపడ్తున్నట్లు కన్పిస్తున్నావు?" అని అడిగాడు ఉత్బా. దానికి హిందా "మాంత్రికులు చెప్పేమాటల్లో కొన్ని ఒక్కొక్కప్పుడు అబద్ధం కూడా అవుతాయని నేను భయపడుతున్నాను. ఒకవేళ నా విషయంలో అలా జరిగితే నేను సమాజంలో తలెత్తుకొని తిరగలేను నాన్నా!" అని అన్నది. ఉత్బా ఈమాట విని "అలా భయపడాల్సిన పనిలేదు. ముందుగా నేనతడ్ని పరీక్షిస్తాను" అని అన్నాడు. ఆ తర్వాత అతను అదోలా అరవగానే అతని గుర్రం తన మేఢ్రాన్ని బయటికి తీసింది. అప్పుడతను దాని మేఢ్రంలో గోధుమగింజ పెట్టేశాడు.

తెలతెలవారుతుండగా ఈ బాటసారుల బృందం మాంత్రికుడి దగ్గరకు చేరుకున్నది. మాంత్రికుడు వారిని ఎంతో సత్కరించి ఆతిథ్యమిచ్చాడు. ఆ తరువాత ఉత్బా తానొక పనిమీద వచ్చానని చెబుతూ "దానికి ముందు నేను నిన్ను పరీక్షించడానికి ఒక విషయం రహస్యంగా ఉంచాను, అదేమిటో చెప్పు" అని అన్నాడు. మాంత్రికుడు ఆ రహస్యాన్ని ఛేదిస్తూ "గుర్రం మేఢ్రంలో గోధుమగింజ పెట్టబడింది" అని అన్నాడు. అప్పుడు ఉత్బా "నువ్వు నిజం చెప్పావు. ఇక ఈ స్త్రీల సంగతి చూడు" అని అన్నాడు.

మాంత్రికుడు ఒక్కొక్క స్త్రీ దగ్గరికి వెళ్ళి లేచినిలబడు అన్నాడు. హిందా దగ్గరికెళ్ళి లేచినిలబడమని చెప్పిన తరువాత "నీ వల్ల ఏ పాపం జరగలేదు. నువ్వు వ్యభిచారానికి

కూడా పాల్పడలేదు. నీ కడుపున ఓ చక్రవర్తి పుడ్తాడు, అతని పేరు 'ముఆవియా' అవుతుంది" అని అన్నాడు. ఈమాట వినగానే ఫాకా, హిందా దగ్గరికి వచ్చి ఆమె చేయి పట్టుకుంటాడు. వెంటనే ఆమె అతని చేయి విదిలించివేస్తూ "దూరంగా ఉండు. అలాంటి చక్రవర్తి గనక నాకడుపున పుట్టేవాడైతే అతను నీద్వారా పుట్టడు" అని అన్నది. ఆ తరువాత కొన్నాళ్ళకు హిందా ఖురైష్ నాయకుడు అబూసుఫ్యాన్ (రజి)ని వివాహ మాడింది. ఆ దంపతులకు జన్మించిన వ్యక్తే అమీర్ ముఆవియా (రజి).

## 2) ముఆవియా (రజి) ఘనతా ఔన్నత్యాలు

మక్కావిజయం రోజు అమీర్ ముఆవియా (రజి) ఇరవైఅయిదు సంవత్సరాల వయసులో తన తండ్రి అబూసుఫ్యాన్ (రజి)తో పాటు దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు. హునైన్ యుద్ధంలో, తాయిఫ్ ముట్టడిలో పాల్గొన్నారు. ఆ తర్వాత దైవప్రవక్త (స) వెంట మక్కా వెళ్ళి ఉమ్రా ఆచారం పాటించి మదీనా వెళ్ళిపోయారు. మదీనాలో ఆయన్ని దైవప్రవక్త (స) దివ్యవిష్కృతి కార్యదర్శి (కాతిబెవహీ)గా నియమించారు. అంటే దివ్యావిష్కృతి అవతరించినప్పుడల్లా ఆయన అందులోని విషయాలు దైవ ప్రవక్త (స) నోట విని పుస్తకంలో వ్రాసి నమోదుచేసేవారు.

ఒకసారి ఎవరో అమీర్ ముఆవియా (రజి) వ్యక్తిత్వాన్ని గురించి అడిగినప్పుడు అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఇలా సమాధానమిచ్చారు: "ముఆవియా మృదుత్వం ఆయన ఆగ్రహానికి విషం లాంటిది. ఆయన దానశీలత నోళ్ళకు తాళం పెడ్తుంది. హృదయాల్ని కలపడం ఆయనకు బాగా తెలుసు. ఈ విషయాలే ఆయన ప్రభుత్వ పటిష్ఠతకు మూలకారణాలు." అమీర్ ముఆవియా (రజి) తన విజయానికి కారణాలు ఇలా తెలిపారు: "అలి (రజి) సమక్షంలో నాకు లభించిన విజయాలకు నాలుగు కారణా లున్నాయి. ఒకటి, నేను నా రహస్యాలను గుప్తంగా ఉంచుతాను. అలి (రజి) తన రహస్యాలను ప్రజల ముందు బహిర్గతం చేస్తారు. రెండు, నా దగ్గర విధేయత కలిగిన సైన్యం ఉంది. అలి (రజి) దగ్గర అవిధేయులైన సైనికులు ఉన్నారు. మూడు, నేను ఉష్ట్రయుద్ధంలో పరోక్షంగానైనా పాల్గొనలేదు. నాలుగు, నేను ఖురైషీయుల్లో పలుకుబడి కలిగినవాడ్ని, అలి (రజి) పట్ల ప్రజలు అయిష్టంగా ఉండేవారు."

## 3) ముఆవియా(రజి) పాలన ప్రారంభపరిస్థితి

అమీర్ ముఆవియా (రజి) ఖలీఫాగా, తిరుగులేని రాజ్యాధినేతగా అధికారం చేపట్టిన సమయంలో ఇస్లాం జగత్తులో విశ్వాసాలు, ఆచరణల రీత్యా మూడు రకాల ముస్లింలు ఉండేవారు. ఒకటి, షియావర్గం. వీరు హజ్రత్ అలీ(రజి), ఆయన సంతానం మాత్రమే ఖిలాఫత్‌కు హక్కుదారులని భావిస్తారు. ఈ వర్గం ప్రజలు ఈరాన్, ఇరాఖ్‌లలో అత్యధికంగా ఉన్నారు. ఈజిప్టులో కూడా చాలామంది ఉన్నారు. రెండు, ముఆవియా (రజి) లేదా బనూఉమయ్యా వర్గం. ఈవర్గం ప్రజలు సిరియాలో అత్యధికంగా ఉన్నారు. వీరు బనూఉమయ్యాకు చెందిన ఖలీఫా ఉస్మాన్ (రజి) హత్య తర్వాత బనూఉమయ్యా తెగవాళ్ళే ఖలీఫాలు కావడానికి అర్హులని భావిస్తారు. అందుకే వారు బనూఉమయ్యాకు



చెందిన అమీర్ ముఆవియా(రజి)కు తమ పూర్తి సహాయసహకారులు అందజేస్తున్నారు. మూడు, ఖారిజీ వర్గం. ఈ వర్గంవారు షియావర్గం ప్రజలను, బనూఉమయ్యా ప్రజలను అవిశ్వాసులుగా పరిగణించి వారికి వ్యతిరేకంగా రకరకాల కుట్రలతో ఇస్లాం జగత్తులో అరాచకం, అల్లకల్లోలాలు రేకెత్తిస్తుంటారు.

పైన పేర్కొన్న మూడువర్గాలే కాకుండా మరో వర్గం కూడా ఉంది. ఈ వర్గంవారు అల్లర్లు, అల్లకల్లోలాలకు దూరంగా మౌనజీవితం గడపదలిచారు. వారిలో సాధారణ ముస్లింలతోపాటు ప్రముఖ సహాబీలు ఉన్నారు. వీరు అత్యధికంగా మక్కా, మదీనాల్లో, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంటున్నారు.

ముఆవియా (రజి) హి.శ.41, రబీవుల్‌అవ్వల్ నెలలో ఖలీఫా పీఠం అధిరోహించ గానే మొదట ఆయనకు ఖారిజీల బెడద ఎదురైంది. ఆయన కూఫా జనసామాన్యం చేత సాధారణబైత్ తీసుకున్న తర్వాత అయిదు వేలమంది ఖారిజీలు ముఆవియా (రజి)కు వ్యతిరేకంగా యుద్ధంచేయడానికి కూఫా నుండి నఖ్లియా ప్రాంతానికి చేరుకున్నారు. అమీర్ ముఆవియా(రజి) కొందరు కూఫాప్రముఖుల సహకారంతో ఖారిజీలను మొదట నచ్చజెప్పాడానికి ప్రయత్నించారు. కాని ఆవిధంగా దారికి రాకపోవడంతో ఖడ్గానికి పనిజెప్పి వారి పీచం అణచివేశారు. కొందరు మాత్రమే తప్పించుకున్నారు.

**కొత్తగవర్నర్ల నియామకం:-** అమీర్ ముఆవియా (రజి) ఈజిప్టులో అమ్ర్ బిన్ ఆస్ (రజి)ని గవర్నర్‌గా ఇదివరకే నియమించి ఉన్నారు. ఇప్పుడు మక్కా గవర్నర్‌గా సయీద్ బిన్ ఆస్ (రజి)ని, మదీనాగవర్నర్‌గా మర్వాన్ బిన్ హకమ్‌ని నియమించారు. సయీద్, మర్వాన్‌లు ఆయన బంధువులే. అమీర్ ముఆవియా (రజి) కూఫా గవర్నర్‌గా ముగీరా బిన్ షాబా (రజి)ని నియమించి, వీలైనంతవరకు ఖారిజీల బెడద అంతమొందించాలని ఆదేశించారు. మిగతా రాష్ట్రాల గవర్నర్‌లకు, ఇతర అధికారులకు వారు తనకు విధేయు లయి, తన పేరుతో ప్రజల చేత బైత్ చేయించాలని ఉత్తర్వులు జారీచేశారు.

ఈరాన్‌లో అలి(రజి) తరపున గవర్నర్‌గా పరిపాలన చేస్తుండిన జియాద్ అలీవారసుల్లో ఎవరి చేతిలోనైనా బైత్ చేసి తన ప్రభుత్వానికి ఎసరు పెడ్తాడేమోనని ముఆవియా (రజి) భయపడసాగారు. అజ్ఞానకాలంలో ముఆవియా (రజి) తండ్రి అబూసుఫ్యాన్ (రజి) సుమయ్యా అనే బానిసమహిళతో వ్యభిచరించినందున జియాద్ పుట్టాడని చెబుతారు. జియాద్ పెద్దవాడైన తర్వాత అసాధారణ శక్తిసామర్థ్యాలు కల నాయకుడిగా పేరు గాంచాడు. అలీ (రజి)కి గొప్ప మద్దతుదారుడై ఎనలేని సేవలు చేశాడు.

హజ్రత్ అలి(రజి) అమరగతినొందిన తర్వాత అమీర్ ముఆవియా (రజి) జియాద్‌ని మచ్చిక చేసుకోవడానికి ప్రయత్నించారు. దాని కోసం ఆయన జియాద్ తన తండ్రికి పుట్టిన అక్రమసంతానమని కొందరు సాక్షుల ద్వారా నిరూపించుకున్నారు. దాని ప్రాతి పదికపైన్నే ఆయన జియాద్‌ని తన సోదరుడిగా, కుటుంబసభ్యుడిగా పరిగణించారు. ఇది నైతికంగా మాత్రమే గాకుండా చట్టపరంగా కూడా అధర్మచర్య అవుతుంది. కారణం దైవప్రవక్త (స) "పిల్లవాడు ఎవరి పడకపై పుడ్తాడో అతనివాడే అవుతాడు; వ్యభిచారికి శిలాశిక్ష ఉంటుంది" అని ప్రవచించారు. అందువల్లనే విశ్వాసుల మాతృమూర్తి, అబూ

సుఫ్యాన్ కుమార్తె అయిన హజ్రత్ ఉమ్మెహబీబా (రజి) జియాద్‌ని తన సోదరుడిగా అంగీకరించడానికి నిరాకరించి, అతని ముందు పరదా పాటించేవారు.

జియాద్ మొదట్లో ముఆవియా (రజి)ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేయడానికి ముందుకు రాలేదు. అప్పుడు ముఆవియా(రజి) కూఫా గవర్నర్ ముగీరా బిన్ షాబా (రజి)ను బస్రా పంపి ఆయనద్వారా జియాద్ తన సొంతతమ్ముడని, కుటుంబసభ్యుడని జియాద్‌కు నచ్చజెప్పించారు. ముగీరా (రజి) ఆవిధంగా నచ్చజెప్పి జియాద్‌ను అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు పిలుచుకొచ్చారు. అప్పుడు ముఆవియా (రజి) అతడ్ని తన సొంతతమ్ముడిగా అంగీకరిస్తూ ఎంతగానో ఆదరించి సత్కరించారు. అదీగాక ఆయన ప్రభుత్వదస్తావేజులన్నిటిలో అతని పేరు జియాద్ బిన్ అబూసుఫ్యాన్ అని రాయించారు. ఆతర్వాత జియాద్‌ని ప్రమోట్ చేసి బస్రా ప్రజలను దారికి తీసుకురావాలని చెప్పారు.

జియాద్ డెమాస్కస్ నుండి బస్రా చేరుకోగానే అక్కడ మార్షల్‌లా విధించి, ఎవరైనా రాత్రివేళ బహిరంగప్రదేశాల్లో కన్పిస్తే అతడ్ని ఎలాంటి విచారణ చేయకుండా హత మార్చడం జరుగుతుందని ప్రకటించాడు. అతనా ఉత్తర్వుని కఠినంగా అమలుపరిచాడు. దాంతో అమీర్ ముఆవియా (రజి) ఇకనుండి ఈరాన్, ఇరాఖ్‌లలో ఎలాంటి తిరుగు బాటులు తలెత్తవని తలచి సంతృప్తిచెందారు.

హి.శ.43లో ఈజిప్టుగవర్నర్ అమ్ర్ బిన్ ఆస్(రజి) చనిపోవడంతో ముఆవియా (రజి) ఆయన స్థానంలో ఆయనకుమారుడు అబ్దుల్లా బిన్ అమ్ర్‌ని గవర్నర్‌గా నియమించారు. హి.శ. 43లోనే బస్రాలో ఖారిజీలు తిరుగుబాటుకు పాల్పడటం, వారిని ముగీరా (రజి) అణచివేయడం జరిగింది. ఆ తరువాత ఈరాన్ సరిహద్దులోని కొన్ని ప్రాంతాలపై దాడిచేసి సరిహద్దుల్ని పటిష్ఠపరచడం జరిగింది.

అమీర్ ముఆవియా (రజి) రోమ్‌రాజ్యం వైపున్న తన రాజ్యసరిహద్దుల్ని పటిష్ఠపరచు కునేందుకు కాన్‌స్టాంటినోపిల్‌పై దాడిచేయడానికి నిర్ణయించుకున్నారు. దాని కోసం రాజ్యమంతటా ప్రకటన చేయించారు. గతంలో దైవప్రవక్త (స) భవిష్యత్ ప్రకటనచేస్తూ "నా అనుచర సముదాయంలో సీజర్‌పట్టణంపై దాడిచేసే మొట్టమొదటి సైన్యం(లోని సైనికుల) పాపాలు క్షమించబడతాయి" అని చెప్పివున్నారు. అంచేత కాన్‌స్టాంటినోపిల్‌పై దాడి ప్రకటన వినగానే సాధారణ ప్రజలతో పాటు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్‌జుబైర్ (రజి), అబ్దుల్లా బిన్‌అబ్బాస్ (రజి) హుసైన్ బిన్‌అలి (రజి), అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) వగైరా సహాబీలు ఎంతో ఆనందోత్సాహాలతో యుద్ధానికి బయలుదేరారు. అబూసుఫ్యాన్ కొడుకు యజీద్ కూడా ఈ సైన్యంలో ఒక దళపతిగా వెళ్ళాడు.

అబూసుఫ్యాన్ బిన్ ఔఫ్ నాయకత్వంలో బయలుదేరిన ఈ సైన్యం మొత్తం రెండు దళాలుగా విడిపోయి ఒకదళం భూమార్గాన, రెండవది సముద్రమార్గాన ప్రయాణించి రోమ్‌రాజ్యంలో ప్రవేశించి కాన్‌స్టాంటినోపిల్‌ని ముట్టడించింది. అయితే రాజధాని ప్రహరీగోడ చాలా దృఢంగా ఉండటం వల్ల ముస్లింలు విజయం సాధించలేకపోయారు. ఈ ముట్టడి కొంతకాలం పాటు సాగించి వెళ్ళిపోయారు. ముట్టడి సందర్భంగా కొందరు ముజాహిద్‌లతో పాటు అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) కూడా అమరగతులయ్యారు.



ముస్లింసైన్యం ముట్టడి వదలిపోవడంతో రోమన్లు అదే పదివేలని భావించి ఆనంద సాగరంలో తేలియాడారు. ముస్లింలు రాజధాని కాన్‌స్టాంటినోపిల్‌ని కొంతకాలం పాటు దిగ్బంధించడం ద్వారా రోమన్లను బెదరగొట్టి అటువైపున్న ఇస్లాం సామ్రాజ్య సరిహద్దుల్ని పటిష్ఠపరిచారు. హి.శ. 50లో ఆఫ్రికాలోని అల్జీరియా, సూడాన్, మరికొన్ని ఆటవిక జాతులుండే ప్రాంతాల్లో, భారతఉపఖండం-బెలుచిస్తాన్‌లోని కొన్నిప్రాంతాల్లో ముస్లింలు విజయపతాకాలు ఎగరవేశారు.

## 4) ముఆవియా (రజి) రాజకీయవారసుడిగా యజీద్

యుద్ధపరిస్థితుల నుండి కొంచెం స్థిమితం లభించిన తర్వాత అమీర్ ముఆవియా (రజి) తన రాజకీయ వారసుడ్ని గురించి ఆలోచించడం ప్రారంభించారు. ఆయన కూఫాగవర్నర్ పదవి నుండి ముగీరా బిన్ షాబా (రజి)ని తొలగించడానికి నిర్ణయించారు. ముగీరా (రజి)కు ఈ సంగతి తెలిసింది. వెంటనే ఆయన డెమాస్కస్‌కు వెళ్ళి యజీద్‌ని కలసి "ప్రవక్తఅనుచరుల్లోని గొప్పవాళ్ళు, ఖురైష్ పెద్దలంతా ఇహలోకం వీడిపోయారు. ఇలాంటి పరిస్థితిలో మీనాన్న తన రాజకీయ వారసుడిగా నీకోసం ప్రజల చేత బైత్ చేయించడానికి ఎందుకు వెనకాడుతున్నారో నాకర్థం కావడంలేదు" అని అన్నారు.

యజీద్ ఈసంగతి తన తండ్రి దగ్గర ప్రస్తావించాడు. ఆయన ముగీరా (రజి)ను పిలిపించి "నీవు యజీద్‌తో ఏమన్నావ"ని అడిగారు. దానికి ముగీరా (రజి) సమాధాన మిస్తూ "విశ్వాసులనాయకా! ఉస్మాన్(రజి) హత్యతర్వాత రాజ్యంలో ఎలాంటి విభేదాలు రేకెత్తాయో, ఎంతటి రక్తపాతం జరిగిందో మీకు తెలియని విషయం కాదు. కనుక మీరు మీ జీవితకాలంలోనే యజీద్‌ని మీ రాజకీయవారసుడిగా ప్రకటించి, ఆయన తరపున ప్రజలచేత బైత్ చేయిస్తే మంచిదని నా అభిప్రాయం. ఆ తర్వాత దురదృష్టవశాత్తు మీకేమైనా జరిగితే విభేదాలు తలెత్తే అవకాశముండదు" అని అన్నారు.

అమీర్ ముఆవియా (రజి) ఈమాట విని "ఈ బాధ్యత ఎవరు తీసుకుంటార"ని అడిగారు. దానికి హజ్రత్ ముగీరా (రజి) "కూఫా ప్రజల సంగతి నేను చూసుకుంటాను. బస్రా ప్రజల సంగతి జియాద్ చూసుకుంటాడు. ఆ తరువాత మిమ్మల్ని ఎదిరించేవారే ఉండరు" అని అన్నారు. హజ్రత్ ముగీరా (రజి) ఈమాట చెప్పి కూఫా వెళ్ళిపోయారు. కూఫాలో పదిమంది వ్యక్తులకు ముప్ఫయివేల దిర్హంలు డబ్బిచ్చి, "మీరందరూ ఓ ప్రతినిధివర్గంగా అమీర్ ముఆవియా (రజి) దగ్గరికెళ్ళి ఆయన రాజకీయవారసుడిగా యజీద్‌కు తమ మద్దతు తెలుపుతున్నామని చెప్పండి" అని ఉపదేశించారు.

ఇలా ఈ ప్రతినిధివర్గం ముగీరా (రజి) కుమారుడు మూసా బిన్ ముగీరా నాయ కత్వంలో డెమాస్కస్‌కు వెళ్ళి తన పని పూర్తిచేసింది. తరువాత అమీర్ ముఆవియా (రజి) మూసాను పిలిపించి "మీ నాన్న ఈ ప్రతినిధివర్గం సభ్యుల నుండి వారి ధర్మాన్ని ఎంతకు కొన్నార"ని అడిగారు. దానికి మూసా ముప్ఫయివేల దిర్హంలకు అని చెప్పాడు. అమీర్ ముఆవియా (రజి) ఈమాట విని "అందువల్లనే వారి ధర్మం వారి దృష్టిలో చాలా చౌకయిపోయింది" అన్నారు. ఆ తర్వాత ఆయన యజీద్ ఖిలాఫత్ విషయంలో బస్రాగవర్నర్ జియాద్‌ని కూడా సంప్రదించారు.

అప్పుడు జియాద్ తన సలహాదారుడు ఉబైద్ బిన్ కాబ్‌ని సంప్రదించాడు. ఉబైద్ ఇచ్చిన సలహా నచ్చడంతో జియాద్ డెమాస్కస్‌కు ఉబైద్‌నే పంపించాడు. ఉబైద్ డెమాస్కస్ చేరుకొని ముందుగా యజీద్‌ని కలుసుకొని, దుర్వ్యసనాలు మానేసి తనను సంస్కరించుకోవాలని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత అతను ముఆవియా (రజి)ను కలుసుకొని "మీరు మీ రాజకీయవారసుడి ఎంపిక విషయంలో తొందరపడకండి" అని చెప్పాడు. ఉబైద్ సలహాతో యజీద్ చాలావరకు తన దుర్వ్యసనాలు మానుకున్నాడు.

హజ్రత్ ముగీరా (రజి) తన ప్రతినిధివర్గం పని పూర్తిచేసుకొచ్చిన తర్వాత స్వయంగా డెమాస్కస్‌కు వెళ్ళి ముఆవియా (రజి)కు విషయం మరింత వివరంగా తెలియజేశారు. దాంతో ముఆవియా(రజి) ముగీరా(రజి)ను కూఫా వెళ్ళి పని ప్రారంభించమని ఆదేశించారు. ముగీరా(రజి) కూఫా తిరిగిరాగానే విషయం ఏమైందని అడిగారు కొందరు. దానికి ముగీరా (రజి) సమాధానమిస్తూ "నేను ముఆవియా (రజి)ను ప్రళయందాకా బయట పడలేనంతటి భయంకరమైన ఊబిలోకి దించి వచ్చాను" అని అన్నారు. ఏమైనప్పటికీ ముగీరా (రజి) ముఆవియా (రజి) రాజకీయ వారసుడి విషయంలో అవలంబించిన వైఖరివల్ల భవిష్యత్తులో ప్రజాభిప్రాయంతో పనిలేకుండా ముస్లింలలో తండ్రి తదనంతరం కొడుకు చక్రవర్తి అయ్యే సంప్రదాయం ఏర్పడింది.

అమీర్ ముఆవియా (రజి) మదీనాగవర్నర్ మర్వాన్ బిన్ హకంకు, బస్రాగవర్నర్ జియాద్‌కు కూడా ఉత్తరాలు రాసి యజీద్ ఖిలాఫత్ కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలని ఆదేశించారు. వెంటనే వాళ్ళిద్దరు ఆ పనికి శ్రీకారం చుట్టారు. హి.శ. 51లో కూఫా గవర్నర్ ముగీరా బిన్ షాబా (రజి) చనిపోయారు. అంచేత అమీర్ ముఆవియా (రజి) కూఫా రాష్ట్రాన్ని కూడా బస్రాగవర్నర్ జియాద్‌కు అధీనం చేశారు.

## 5) సయీద్ బిన్ జైద్, అబూహురైరా (రజి)

అమీర్ ముఆవియా (రజి) పాలనాకాలంలో హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి)కు ఎదురైన ఒక సంఘటన చాలా ఖ్యాతిచెందింది. దాన్ని కూడా ఇక్కడ పేర్కొనడం సమంజసంగా ఉంటుంది. సయీద్ బిన్ జైద్ (రజి) ఉమర్‌ఫారూఖ్ (రజి)కు బావ అవుతారు. అంతేగాక వరుసకు సోదరుడు (పినతండ్రి కుమారుడు) కూడా అవుతారు. ఆయన దైవప్రవక్త (స)తో కలసి బదర్‌యుద్ధం తప్ప అన్ని యుద్ధాల్లో పాల్గొన్నారు. బదర్ యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) ఆయనకు వేరే బాధ్యత అప్పగించారు. అంచేత సయీద్ (రజి) బదర్‌యుద్ధంలో పాల్గొనకపోయినా దైవప్రవక్త (రజి) ఆయన్ని బదర్ ముజాహిద్‌ల జాబితాలో చేర్చి, బదర్ సమరసొత్తులో ఆయన వాటా ఇచ్చారు.

ఒకరోజు కూఫా జామియామస్జిద్‌లో హజ్రత్ అలి(రజి) గురించి ఒకతను అభ్యంతరకరమైన మాటన్నాడు. హజ్రత్ సయీద్ (రజి) ఆమాట విని "అబూబకర్, ఉమర్, ఉస్మాన్, అలి, తల్హా, జుబైర్, అబూఉబైదా, సాద్ బిన్ అబీవఖ్ఖాస్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)- ఈ తొమ్మిదిమంది పదిమంది స్వర్గవాసులవుతారని చెప్పబడినవారిలోనివారు" అని అన్నారు. అప్పుడు మరొకవ్యక్తి ఈమాట విని "అయ్యా! మీరు చెప్పింది



బాగానే ఉంది కాని, ఆ పదవ స్వర్గవాసి ఎవరో చెప్పలేదేమిటీ? ఆయన పేరు కూడా చెప్పండి" అని అడిగాడు. సయీద్ (రజి) దానికి సమాధానం ఇవ్వకుండా మౌనంగా ఉండిపోయారు. అంచేత అతను ఆ పదవ స్వర్గవాసి ఎవరో చెప్పితీరాలని పట్టుబట్టాడు. దాంతో హజ్రత్ సయీద్ (రజి) ఇక చెప్పక తప్పదని భావించి, ఆ పదవ వ్యక్తి నేనే" అన్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకు ఆయన మదీనా వెళ్ళిపోయారు.

ఒకసారి మదీనాలో అర్వా బిన్తె ఉవైస్ అనే ఓ స్త్రీ ఒక స్థలం విషయంలో హజ్రత్ సయీద్ (రజి)పై న్యాయస్థానంలో అబద్ధపుదావా వేసింది. ఆమె తన స్థలంలో కొంత భాగాన్ని హజ్రత్ సయీద్ (రజి) ఆక్రమించుకున్నారని ఆరోపించింది. ఆమె ఇంతకు ముందే ఈ విషయాన్ని ప్రజల్లో తిరిగి ప్రచారం చేసింది. అంచేత గవర్నర్ మర్వాన్ నిజానిజాలు తెలుసుకోవడానికి కొంతమంది ప్రజలను హజ్రత్ సయీద్ (రజి) దగ్గరకు పంపాడు. ఈవిషయం హజ్రత్ సయీద్ (రజి) హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. ఆయన వారి ముందు దైవప్రవక్త (స) ప్రవచించిన ఈక్రింది హితోక్తిని ప్రస్తావించారు: "ఎవరైనా ఇతరుల స్థలంలో ఒక జానెడు స్థలం ఆక్రమించుకున్నా ప్రళయదినాన దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు."

ఈ హితోక్తి చెప్పిన తర్వాత హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) ఆ స్త్రీని శపిస్తూ "దేవా! ఆ స్త్రీ తనపై నేను దౌర్జన్యం చేశానని చెబుతోంది. ఆమె తన వాదనలో అబద్ధాలమారి అయితే ఆమెను గుడ్డిదాన్ని చేసి నేను ఆక్రమించానని పోట్లాడుతున్న స్థలంలోని బావిలో పడవెయ్యి" అనిఅన్నారు. ఇలా శపించిన కొన్నాళ్ళలోనే ఆ స్త్రీ కళ్ళు పోయాయి. దాంతో ప్రజలు హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) సత్యవంతులని, ఆ స్త్రీయే అబద్ధాల మారి అని తెలుసుకున్నారు. ఆ తరువాత మరికొన్నాళ్ళకు ఆ అంధురాలు తన స్థలంలో దేవులాడుతూ తిరుగుతూ అదే నూతిలో పడి చనిపోయింది.

హజ్రత్ సయీద్ బిన్ జైద్ (రజి) హి.శ. 51వ సంవత్సరంలో డెబ్బయి రెండేళ్ళ వయసులో ఇహలోకం వీడిపోయి తమ ప్రభువుని కలుసుకున్నారు.

**హజ్రత్ అబూహురైరా (రజి)** ప్రముఖ సహాబి. మర్వాన్ బిన్ హకంకు పూర్వం ఆయన మదీనా గవర్నర్‌గా ఉండేవారు. ఆరోజుల్లో ఆయన ఒకసారి తన ఇంటివారి కోసం కట్టెలమోపు మోసుకొని వెళ్తుంటే దారిలో సాలబా బిన్ మాలిక్ తారసపడ్డాడు. అప్పుడు అబూహురైరా(రజి) "మాలిక్ కుమారా! గవర్నర్‌కు దారివదలు" అన్నారు. దానికి ఇబ్నెమాలిక్ "దేవుడు మిమ్మల్ని కరుణించుగాక! గవర్నర్‌గారికి నడిచేందుకు ఈ స్థలమంతా సరిపోదా?" అనడిగాడు. అబూహురైరా (రజి) ఈమాట విని "గవర్నర్‌తో పాటు అతని భుజమ్మీద ఉన్న కట్టెలమోపు కోసం కూడా దారివ్వు" అని అన్నారు చిరునవ్వుతో.

హజ్రత్ అబూహురైరా మృదుస్వభావి; గొప్ప దానశీలి, దైవభీతి పరాయణులు. ఆయన పగలు ఉపవాసం ఉండేవారు; రాత్రివేళ దైవారాధనలో నిమగ్నులైపోయేవారు. ఆయన దగ్గర ఒక బానిసమహిళ ఉండేది. ఆమె ఒకసారి ఏదో అకృత్యానికి పాల్పడింది. అది అబూహురైరా (రజి)కు, ఆయన కుటుంబానికి ఎంతో బాధ కలిగించింది.

అప్పుడాయన మండిపడుతూ ఆమెని కొట్టడానికి కొరడా తీసుకున్నారు. కాని చేతిలోని కొరడా అవతల పారేసి ఇలా అన్నారు: "ప్రళయదినాన దేవుడు నాకు ప్రతీకారం చేస్తాడన్న భయం లేకపోయివుంటే నువ్వు చేసిన ఈ నిర్వాకానికి నేను నిన్ను తప్పకుండా శిక్షించేవాడ్ని. అయితే నేనిప్పుడు అందరికంటే నేనెక్కువ అగత్యపరుడయ్యే రోజు నన్నాదుకునే మహాశక్తిస్వరూపిడికి నిన్ను అమ్ముతున్నాను. దైవప్రసన్నత కోసం నేను నిన్ను బానిసత్వం నుండి విముక్తికలిగిస్తున్నాను, వెళ్ళిపో నీకిష్టమొచ్చిన చోటికి."

గవర్నర్ మర్వాన్ బిన్ హకం ఒకసారి ఆయనకు పారితోషికంగా వంద దీనార్లు పైకం పంపించాడు. అయితే మరుసటిరోజు అతను "మా సేవకుడు పొరపాటున ఆ పైకం మీకిచ్చాడు. అది వేరేవారి కోసం పంపించాను. అంచేత ఆ డబ్బు మాకు వాపసు చేయండి" అని సేవకుని ద్వారా చెప్పాడు. హజ్రత్ అబూహురైరా (రజి) ఈమాట విని కాస్తంత బాధపడుతూ "నేనా పైకాన్ని నిన్ననే దైవమార్గంలో దానం చేశాను. నా దగ్గర ఒక్క దీనార్ కూడా లేదిప్పుడు. ప్రభుత్వధనాగారం నుండి ప్రతినెలా నాకు లభించే ఉపకారవేతనం నుండి ఆ డబ్బు మినహాయించుకోండి" అని చెప్పిపంపారు. గవర్నర్ మర్వాన్ ఈ వివరణ విని తృప్తిగా నిట్టూర్పు విడిచారు. అతను అబూహురైరా (రజి)ను పరీక్షించదలిచాడు. ఆ పరీక్షలో ఆయన నెగ్గారు.

హజ్రత్ అబూహురైరా (రజి) మాతృసేవలో చాలా ప్రసిద్ధిచెందారు. ఆయన ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు అన్నిటికంటే ముందు తన తల్లి దగ్గరకు వెళ్ళి "అమ్మా! అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహి వబరకాతుహూ" (నీకు శాంతి కలుగుగాక, నీపై దేవుని కారుణ్యానుగ్రహాలు వర్షించుగాక) అని చెప్పేవారు. దానికి ఆయన మాతృమూర్తి కూడా అదేవిధంగా సమాధానమిచ్చేవారు. ఆ తర్వాత ఆయన "అమ్మా! నా చిన్నతనంలో నీవు నన్ను ఏవిధంగా పెంచిపోషించావో అదేవిధంగా దేవుడు నిన్ను కరుణించుగాక!" అని చెప్పేవారు. ఇది ఖుర్ఆన్‌లోని 17:24 సూక్తికి అద్దంపట్టే వచనం.

హజ్రత్ అబూహురైరా (రజి)కు చరమఘడియాలు సమీపించినప్పుడు గవర్నర్ మర్వాన్ ఆయన్ని పరామర్శించడానికి వచ్చాడు. హజ్రత్ అబూహురైరా (రజి) పరలోక విషయాల్ని తలచుకొని కంటతడి పెట్టుకున్నారు. మీరిలా దుఃఖించడానికి కారణం ఏమిటని అడిగితే ఆయనిలా సమాధానమిచ్చారు:

"నేను ప్రాపంచిక సంపద కోసం దుఃఖించడం లేదు. 'గమ్యం చాలా దూరంగా ఉంది; కాని ప్రయాణసామగ్రి నాదగ్గర చాలా తక్కువగా ఉందే' అన్నదే నా బాధ. నేను మార్గం కూడలిలో నిల్చున్నాను. ఇక్కడ్నుంచి చీలిపోయే రెండుదారుల్లో ఒకటి స్వర్గానికి పోతుంది. రెండోది నరకానికి చేర్చుతుంది. నేను స్వర్గానిక పోతానో లేక నరకానికి చేర్చబడతానో నాకేమాత్రం తెలియదు."

మర్వాన్ "అబూహురైరా! దేవుడు మీకు స్వస్థత చేకూర్చుగాక" అన్నాడు. అబూహురైరా (రజి) ఈమాట విని "దేవా! నేను నిన్ను కలసుకోవడాన్ని ఇష్టపడ్తున్నాను. నీవు కూడా నన్ను కలసుకోవడాన్ని ఇష్టపడు. దానికోసం తొందరచెయ్యి" అని ప్రార్థించారు. ఆతర్వాత కొన్ని క్షణాలకే ఆయన ప్రాణం అనంతవాయువుల్లో కలసిపోయింది.



## 6) హింసాదౌర్జన్యాల ప్రారంభం

కూఫాగవర్నర్ ముగీరా బిన్ షాబ (రజి) చనిపోవడంవల్ల అమీర్ ముఆవియా (రజి) కూఫారాష్ట్రాన్ని కూడా బస్రాగవర్నర్ జియాద్‌కు అధీనం చేశారని మనం గత పేజీల్లో తెలుసుకున్నాం. ఆ తరువాత జియాద్ బస్రాలో సమ్రా బిన్ జుందుబ్ (రజి)ని ఇన్చార్జ్ గవర్నర్‌గా నియమించి రెండువేల మంది సైనికుల్ని తీసుకొని కూఫా చేరుకున్నాడు. జియాద్ కూఫా జామియామస్జిద్‌లో ఉపన్యసించడం ప్రారంభించగానే తమ పాలకుల్ని కించపరచడానికి అలవడిన కూఫా ప్రజలు అతనిపై కంకరాళ్ళు విసరసాగారు. జియాద్ వెంటనే ఉపన్యాసం ముగించి ఎవరినీ బయటికి పోనీయకుండా మసీదును చుట్టుముట్టండని తన అనుచరుల్ని ఆదేశించాడు.

ఆ తరువాత జియాద్ మసీదు ద్వారం దగ్గర కుర్చీవేయించి కూర్చొని నలుగురేసి మనుషుల్ని పిలిచి తనపై కంకరాళ్ళు విసిరారా లేదా అని ప్రమాణం చేయించాడు. అప్పుడు 30మంది కంకరాళ్ళు విసిరారని తేలింది. వెంటనే అతను ఆ ముప్ఫయి మందిచేతుల్ని నరికించాడు. ఇలా అతను తలబిరుసు ప్రదర్శించిన మరికొందర్ని శిక్షించి కొన్నాళ్ళలోనే కూఫాప్రజల్ని దారికితెచ్చాడు. ఆనాటి నుంచి దేశంలో అమీర్ ముఆవియా (రజి) లక్ష్యానికి వ్యతిరేకంగా మాట్లాడేవారిపై దౌర్జన్యకాండ, మసీదుల్లో రాజ్యాధినేతల ప్రసంగాల సందర్భంగా హజ్రత్ అలి (రజి)పై శాపనార్థాలు మొదలయ్యాయి.

కూఫాలో ప్రముఖ సహాబీ హజ్రత్ హుజర్ బిన్ అదీ (రజి) కూడా నివశిస్తుండేవారు. ఆయన హజ్రత్ అలీ (రజి)పై జియాద్ పెడ్తున్న శాపనార్థాలు సహించలేక ఒకరోజు హజ్రత్ అలీ (రజి)ని ప్రశంసిస్తూ, అమీర్ ముఆవియా (రజి) వైఖరిని తప్పుబట్టారు. మరొకసారి ఆయన జుమానమాజ్ చాలా ఆలస్యంగా జరుగుతున్నందుకు గవర్నర్‌ని విమర్శించారు. దాంతో గవర్నర్ జియాద్ హజ్రత్ హుజర్ (రజి)తో సహా ఆయన సహచరులు కొందర్ని అరెస్టుచేసి ఉన్నవాటితో పాటు మరికొన్ని లేనిపోని ఆరోపణలు మోపి వారిని అమీర్ ముఆవియా (రజి) దగ్గరకు డెమాస్కస్‌కు పంపివేశాడు. అమీర్ ముఆవియా (రజి) హజ్రత్ హుజర్ (రజి)కు, ఆయన సహచరులు ఏడుగురికి మరణశిక్ష విధించి హతమార్చారు. అబ్దుర్రహ్మాన్ బిన్ హస్సాన్ అనే వ్యక్తిని బస్రా తిప్పి పంపుతూ, అతడ్ని ఘోరమైన రీతిలో చంపమని గవర్నర్ జియాద్‌ని ఆదేశించారు. జియాద్ ఆ వ్యక్తిని సజీవసమాధి చేశాడు.

హి.శ. 53లో జియాద్ అధికారదాహం మరింత పెరిగింది. అతను ఈరాన్, ఇరాఖ్‌లతోపాటు అరేబియాను కూడా తన అధీనం చేయమని అమీర్ ముఆవియా (రజి)ను అడిగాడు. దానికి ముఆవియా (రజి) అంగీకరించారు. ఈ సంగతి మక్కా, మదీనా వాసులకు తెలిసి తీవ్ర ఆందోళనచెందారు. వారు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) దగ్గరకు వెళ్ళి, తమను ఎలాగైనా జియాద్ కీడు నుండి కాపాడమని మనవి చేశారు. అప్పుడు అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కాబావైపు తిరిగి దైవాన్ని ప్రార్థించారు. తత్ఫలితంగా జియాద్ చేతిలో పుండు పడి కొన్నాళ్ళలోనే మృత్యువాత పడ్డాడు.

అమీర్ ముఆవియా (రజి) వివిధ రాష్ట్రాల నుండి ప్రజాప్రతినిధుల్ని పిలిపించి యజీద్ ఖిలాఫత్ వారసత్వం కోసం వారికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. ఒకరిద్దరు తప్ప అందరూ తమ మద్దతు తెలిపారు. చివరికి ఆ ఒకరిద్దరు కూడా ముఆవియాకు భయపడి మద్దతు ఇచ్చారు. పోతే మక్కా, మదీనా ప్రజల్లోనే ఆయన్ని వ్యతిరేకించేవారు ఉన్నారు. అందువల్ల ఆయన మొదట మదీనా గవర్నర్ మర్వాన్‌కు ఉత్తరాలు రాసి వారిని దారికి తీసుకురావాలని ఆదేశించారు.

మర్వాన్ ఓరోజు ప్రజల్ని మస్జిదెనబవీలో సమావేశపరచి అమీర్ ముఆవియా (రజి) తన రాజకీయవారసుడిగా యజీద్‌ను ఎంపికచేశారని, ఇది మంచి నిర్ణయమని, అబూబకర్ (రజి), ఉమర్(రజి)లు కూడా తమ రాజకీయవారసుల్ని నిర్ణయించారని అన్నాడు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) లేచి "అబద్ధం చెబుతున్నావు... వారు తమ సంతానంలో ఎవరినీ రాజకీయవారసులుగా నిర్ణయించలేదు" అని అన్నారు. వెంటనే మర్వాన్ "పట్టుకోండి అతడ్ని, ఖుర్‌ఆన్‌లో అతడ్ని గురించే 'మరొక వ్యక్తి తన తల్లిదండ్రుల్ని ఈసడించుకుంటూ "ఛీ! మీపోరు ఎక్కువైపోయింది. నేను చనిపోయాక (మళ్ళీ బ్రతికించి) సమాధి నుండి నన్ను లేపుతారని మీరు నన్ను బెదరగొడ్తున్నారా?' (46:17) అనే సూక్తి అవతరించింది" అని అన్నాడు.

ఈమాట వినగానే అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) పరుగెత్తిపోయి హజ్రత్ ఆయిషా (రజి) ఇంట్లో తలదాచుకున్నారు. విషయం తెలుసుకున్న హజ్రత్ ఆయిషా (రజి) "మర్వాన్ అబద్ధమాడాడు. ఈసూక్తి మా కుటుంబంలోని ఎవరి విషయంలోనూ అవతరించలేదు. ఇది మరొకరి విషయంలో అవతరించింది..." అని అన్నారు.

ఆ తర్వాత అమీర్ ముఆవియా (రజి) హజ్‌యాత్ర కోసం బయలుదేరి ముందుగా మదీనా చేరుకున్నారు. అక్కడ ఆయన అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి), హుసైన్ బిన్ అలీ (రజి)ల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో వారు మదీనా వదలి మక్కా వెళ్ళిపోయారు. తరువాత ఆయన మదీనా ప్రజలకు బహుమానాలు, పారితోషికాలిచ్చి వారిహృదయాల్ని చూరగొన్నారు. అంతేగాక మదీనావాసుల ఉపకార వేతనాలు పెంచమని, వారిలో అవసరమైనవారికి ప్రభుత్వ ధనాగారం నుండి రుణాలు ఇవ్వాలని, వాటిని తిరిగిచెల్లించాలని వత్తిడిచేయకూడదని మర్వాన్‌ని ఆదేశించారు. ఈవిధంగా ఆయన మదీనాప్రజల్ని తనకు అనుకూలంగా మలచుకొని అక్కడ్నుంచి మక్కా వెళ్ళిపోయారు.

అమీర్ ముఆవియా(రజి) మక్కా చేరుకొని మదీనా నుండి పారిపోయి మక్కా వచ్చిన నల్గురు సహాబీలను పిలిపించి వారితో యజీద్‌కోసం బైత్ విషయం మాట్లాడారు. కాని వారినుండి ఎలాంటి సకారాత్మక సమాధానం రాకపోవడంతో "ఇప్పటిదాకా నేను మీ ధోరణిని సహిస్తూవచ్చాను. ఇప్పుడు నేను దైవసాక్షిగా చెబుతున్నాను. మీలో ఎవరైనా నేను చెప్పబోయే విషయానికి వ్యతిరేకంగాగాని, అనుకూలంగాగాని ఒక్క మాట అన్నా, రెండోమాట అతని నోట వెలువడక ముందే అతనిపై కత్తివ్రేటు పడుతుందని తెలుసు



కోండి" అని హెచ్చరించారు. ఆ తరువాత అమీర్ ముఆవియా (రజి) ఆ నలుగురు సహాబీలను కాబాలయానికి తీసికెళ్ళి ప్రజల ముందు ఈవిధంగా ప్రకటించారు:

"చూడండి, ఈ నలుగురు ముస్లింలనాయకులు. ఎంతో శ్రేష్ఠులు. వారి సలహా లేకుండా ఏపని కూడా చేయలేము. వీరిప్పుడు యజీద్ రాజకీయవారసత్వాన్ని అంగీకరించారు; దాన్ని గురించి బైత్ కూడా చేశారు. కనుక మీరు కూడా బైత్ చేయండి."

ఈ ప్రకటన విన్న తరువాత మక్కాలో ఏ ఒక్కరూ అమీర్ ముఆవియా (రజి)కు వ్యతిరేకంగా మాట్లాడటానికి సాహసించలేదు. అందరూ బైత్ చేశారు.

జియాద్ మరణం తరువాత అమీర్ ముఆవియా (రజి) జియాద్ స్థానంలో అతని కొడుకు ఉబైదుల్లా బిన జియాద్‌ని ఈరాన్, ఇరాఖ్ ప్రాంతాలకు గవర్నర్‌గా నియమించారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) కుమారుడు సయీద్ బిన్ ఉస్మాన్ విజ్ఞప్తిపై అతనికి ఖురాసాన్ రాష్ట్రాన్ని ఇబ్నెజియాద్ అధీనం నుండి తీసిచ్చారు. జియాద్ మరణం, ఇబ్నె జియాద్ నియామకం తరువాత ఖారిజీలు, సబాయీదుండగులు మళ్ళీ తిరుగుబాటు లేవదీశారు. ఇబ్నెజియాద్ వారిని అణచివేసే పనుల్లో నిమగ్నుడైపోయాడు.

## 7) మృత్యుముఖంలో అమీర్ ముఆవియా (రజి)

హి.శ. 58లో మర్వాన్ కుట్ర ఫలితంగా విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) మరణించారని కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. వాస్తవం దేవునికే తెలుసు. హజ్రత్ ఆయిషా (రజి) సోదరుడు అబ్దుర్రహ్మాన్ బిన్ అబూబకర్ (రజి) కూడా హి.శ. 58లోనే చనిపోయారు. హజ్రత్ అబూహురైరా (రజి) నవతరం నాయకత్వం పట్ల విసిగిపోయి "దేవా! నేను యువకుల పరిపాలన కీడు నుండి, హి.శ. 60వ సంవత్సరం కీడు నుండి నీ శరణు కోరుతున్నాను" అని తరచుగా దైవాన్ని ప్రార్థిస్తుండేవారు. దేవుడు ఆయన ప్రార్థనను స్వీకరించాడు. దాంతో హజ్రత్ అబూహురైరా (రజి) హి.శ. 60వ సంవత్సరానికి ముందే చనిపోయారు.

ఆ తర్వాత హి.శ. 60లో అమీర్ ముఆవియా (రజి) వ్యాధిగ్రస్తులైపోయారు. ఆయన తనకు మరణకాలం సమీపించిందని గ్రహించి కొడుకు యజీద్‌ని పిలిపించి అతనితో ఇలా అన్నారు: "బాబూ! నాకిప్పుడు మరణసమయం సమీపించింది. అంచేత నేను నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నాను. వాటికి సమాధానం ఇవ్వు. నా తదనంతరం నీవు ప్రజల పట్ల ఎలా ప్రవర్తించాలనుకుంటున్నావు?"

యజీద్ ఈమాట విని "నేను దైవగ్రంథం, ప్రవక్త సంప్రదాయాల ప్రకారం నడచుకుంటాను" అని అన్నాడు. దానిపై అమీర్ ముఆవియా(రజి) "నువ్వు అబూబకర్ (రజి) సంప్రదాయం ప్రకారం కూడా నడచుకోవాలి. ఆయన మతభ్రష్టులపై యుద్ధం చేశారు; ఆయన చనిపోయే వరకూ ప్రజలు ఆయన పట్ల సంతోషంగా ఉన్నారు" అని చెప్పారు.

యజీద్ తల అడ్డంగా తిప్పుతూ "లేదు, నాకు దైవగ్రంథం, ప్రవక్త సంప్రదాయం చాలు" అన్నాడు. "నాయనా! ఉమర్ (రజి) సంప్రదాయాన్ని కూడా పాటించాలి నీవు. ఆయన సైన్యాన్ని శక్తిమంతం చేశారు. సమరసొత్తును సైన్యంలో పంచారు" అన్నారు

అమీర్ ముఆవియా(రజి). దానికీ యజీద్ తల అడ్డంగా తిప్పాడు. "పోనీ ఉస్మాన్ (రజి) సంప్రదాయాన్నయినా పాటిస్తావా?" అని అడిగారు ముఆవియా (రజి). దానికీ యజీద్ "లేదు, నాకు దైవగ్రంథం, ప్రవక్త సంప్రదాయం చాలు" అన్నాడు.

హజ్రత్ అమీర్ ముఆవియా (రజి) కొడుకు మొండివైఖరితో నిరాశచెంది ఇలా అన్నారు: "బాబూ! నీమాటల వల్ల నీవు నా ఉపదేశాల ప్రకారం నడచుకోవని నాకర్థమై పోయింది. యజీద్! నేను నిన్ను నా రాజకీయవారసుడిగా చేసిన నిర్ణయం పట్ల గర్వించకు. ప్రజలందరూ నీకు విధేయులై ఉంటామని ఒప్పుకున్నారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ప్రపంచవ్యవహారాల పట్ల విసిగెత్తిపోయారు. అంచేత ఆయన నుండి కూడా మనకెలాంటి ప్రమాదంలేదు. పోతే హుసైన్ బిన్ అలి(రజి), అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ల పట్లే జాగ్రత్త వహించాలి. కూఫాప్రజలు హుసైన్ (రజి)ని నీకు పోటీగా రంగం లోకి దించుతారు. అప్పుడు నీవు గనక ఆయన్ని లోబరచుకుంటే ఆయన్ని ఎంతమాత్రం హతమార్చకూడదు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పట్టుబడితే మాత్రం ఆయన్ని వధించాలి. మదీనావాసుల పట్ల ఎల్లప్పుడూ ఉపకారబుద్ధితో మసలుకోవాలి. సిరియాప్రజలు మన సహాయకులనే విషయాన్ని మరచిపోకుండా వారి మైత్రి మీద భరోసా ఉంచాలి."

యజీద్ ఈమాటలు విన్న తర్వాత మళ్ళీ నగరం బయట షికారుకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత అమీర్ ముఆవియా(రజి) పరిస్థితి క్షణక్షణానికి దిగజారిపోసాగింది. చివరికి హి.శ. 60వ సంవత్సరం రజబ్‌నెల 22వ తేదీన ఆయన డెబ్భయి ఏండ్ల వయస్సులో శాశ్వతంగా ఇహలోకం వీడిపోయారు.

## 8) ముఆవియా(రజి) పాలనపై సంక్షిప్తసమీక్ష

ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం దాదాపు ప్రపంచమంతటా రాజరిక వ్యవస్థ మాత్రమే ఉండేది. అరేబియాలాంటి కొన్ని ప్రాంతాల్లో తెగల వ్యవస్థ ఉన్నప్పటికీ మొత్తం మీద రాజరికవ్యవస్థే ఉండేది. ఆ వ్యవస్థలో రాజు చెప్పిందే శాసనం. ఆయన మాటకు తిరుగులేదు. అందుకే మన తెలుగునాట "రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా?" అనే సామెత పుట్టింది. ఆ వ్యవస్థలో న్యాయశీలుడైన రాజు ఉంటేనే ప్రజలు శాంతిసుఖాలతో జీవించగలుగుతారు.

ఈనాడు రాజరిక వ్యవస్థ స్థానంలో ప్రజాస్వామ్యం, సైనికపాలనలు వచ్చాయి. ఆనాడు రాజరికవ్యవస్థ విషయంలో "యథారాజా తథాప్రజా" అనే సామెత ఉంటే, ఈనాటి ప్రజాస్వామ్యంలో "యథాప్రజలు, తథామంత్రులు" అనే విషయాన్ని సామెతగా మార్చుకోవలసి వస్తుంది. అంచేత ఇలాంటి ప్రజాస్వామ్యం అల్పసంఖ్యాకులపై అధిక సంఖ్యాకుల అభిప్రాయాలను బలవంతంగా రుద్దడానికి, వారిపై దౌర్జన్యాలు జరగడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ బలప్రయోగాలు, దౌర్జన్యాలు చూసిన ఒక పాశ్చాత్య మేధావి "న్యాయశీలుడైన రాజు లేకపోబట్టే ఈ ప్రజాస్వామ్యం ఉనికిలోకి వచ్చింద"ని అన్నాడు. పోతే ఈనాటి సైనికపాలకులు ఆనాటి క్రూరరాజులకు తామేమీ తీసిపోమన్నట్లు వ్యవహ రిస్తున్న సంగతి కూడా మనకు తెలియనిది కాదు. ఆనాటి రాజరికవ్యవస్థకు ప్రతిరూపమే ఈనాటి సైనికపాలనావ్యవస్థ.



ఇస్లాం ప్రతిపాదించిన "ఖిలాఫత్‌వ్యవస్థ" వీటన్నిటికీ పూర్తి భిన్నమైన పాలనావ్యవస్థ. దీని రాజ్యాంగం ఖుర్‌ఆన్, హదీసులపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఖిలాఫత్ వ్యవస్థలో ప్రాంతీయ, జాతీయ, భాషా-తెగ-మతపరమైన దురభిమానాలకు తావుండదు. ఇది నీతి, నిజాయితీ, న్యాయాలతో కూడిన విశ్వమానవ సౌభ్రాతృత్వ వ్యవస్థ. దీనికి తొలి నలుగురు ఖలీఫాల పాలనలే నిలువుటద్దాలు.

ఇలాంటి సువ్యవస్థను ఇస్లాంవ్యతిరేక శక్తులు ఎలా సహించగలుగుతాయి? మూడవఖలీఫా హజ్రత్ ఉస్మాన్(రజి) పాలన ద్వితీయార్ధంలో ఆ దుష్టశక్తులు రంగంలోకి దిగి ముస్లింల మధ్య చిచ్చు రగిల్చాయి. దానికి హజ్రత్ ఉస్మాన్ (రజి) మృదుస్వభావం, ఆయన బంధుప్రేమ నియామకాలు, సరైన ఇస్లాంశిక్షణకు నోచుకోలేని నవముస్లింల ధోరణి తోడయి అగ్నికి ఆజ్యం పోసినట్లయింది పరిస్థితి. దాంతో ఖిలాఫత్‌సౌధానికి బీటలు వారాయి. అవి క్రమంగా విస్తరిస్తూ అమీర్ ముఆవియా (రజి) పరిపాలన నాటికి దాని పునాదులను కదిలించివేశాయి.

ఖిలాఫత్‌వ్యవస్థలో ఖలీఫా ప్రజల బైత్ (శపథం), మద్దతులతో రాజ్యాధికారం చేపట్ట వలసివుంటుంది. కాగా అమీర్ ముఆవియా (రజి) సిరియా రాష్ట్రగవర్నర్ స్థాయిలో హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యకు ప్రతీకారం సాకుతో కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు లేవదీసి సమరశంఖం పూరించారు. ఆనాడే రాజరికవ్యవస్థకు పునాదులు పడ్డాయి. తర్వాత హసన్ బిన్ అలి(రజి) ఖలీఫా అయిన ఆర్నెల్లకే తనవర్గంలో ఐక్యత లోపించడం వల్ల రెండుపక్షాల మధ్య సయోధ్య కుదిర్చి ఖిలాఫత్ పదవినుండి తప్పుకున్నారు. దాంతో ప్రజలు గత్యంతరంలేక అమీర్ ముఆవియా (రజి) చేతిలో బైత్ చేసి ఆయనకు పూర్తి అధికారాలు కట్టబెట్టారు. ఆ తర్వాత అమీర్ ముఆవియా (రజి) తన తనయుడ్ని తన రాజకీయవారసుడ్ని చేయడానికి భయప్రలోభాల ద్వారా ప్రజలమద్దతు సంపాదించారు. తనను వ్యతిరేకించిన కొందరిని ఖడ్గబలంతో కూడా ఆయన దారికి తెచ్చారు. దాంతో ఖిలఫత్ వ్యవస్థకు పూర్తిగా నూకలు చెల్లిపోయాయి.

అమీర్ ముఆవియా (రజి) కేంద్రప్రభుత్వంపై తిరగబడి తన రాష్ట్రాన్ని పటిష్ఠపరచు కోగానే ఆయన జీవనసరళి మారిపోయింది. ప్రజాసమస్యల్ని గురించి అంతగా పట్టించు కోకుండా జనసామాన్యానికి దూరంగా మసలుకుంటూ ఆత్మరక్షణ కోసం అంగరక్షకుల్ని, ఇంటి భద్రత కోసం ద్వారపాలకుల్ని నియమించుకున్నారు. ప్రభుత్వధనాగారాన్ని తన సొంత ధనాగారంగా భావించి అందులో నుంచి తనకు ఇష్టమైనవారికి ఇష్టమొచ్చినంత ఇచ్చేయడం ప్రారంభించారు. సమరసొత్తులో వెండిబంగారాలు తన సొంతానికి తీసుకొని మిగతా ధనాన్ని మాత్రమే షరీఅత్ (ధర్మశాస్త్రం) ప్రకారం వినియోగించేవారు.

అమీర్ ముఆవియా (రజి) పాలనాకాలంలోనే సద్విమర్శనా స్వేచ్ఛకు ఆటంకాలు మొదలయ్యాయి. ఆయన బలవంతంగా ప్రజల నోళ్ళు మూయించారు. సత్యప్రియులు తమ అంతరాత్మ ప్రబోధనను అంతరంగాల్లోనే అణచిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవేళ ఎవరైనా నిజంచెప్పే దుస్సాహసానికి వడిగట్టే ఇక అతను ప్రాణాల మీద ఆశలు వదలుకోవాల్సిందే. అంతేకాదు, రాజ్యాధినేత ప్రత్యర్థుల్ని ప్రశంసించినా ఈ శిక్ష తప్పదు.

అమీర్ ముఆవియా (రజి) పాలనాకాలంలోనే రాజ్యాధినేత తదనంతరం అతని కొడుకు అతని రాజకీయవారసుడయ్యే సంప్రదాయం ప్రారంభమైంది. తొలి నలుగురు శ్రేయస్కర ఖలీఫాల కాలంలో నింగిలోకి నిక్కుతూ చూస్తుండిన న్యాయవ్యవస్థ ఇప్పుడు నీరుగారిపోతూ చతికిలబడింది. అది పాలకుల స్వప్రయోజనాల పరిరక్షణకు పరిమితమై పోయింది. అలాగే శ్రేయస్కర ఖలీఫాల కాలంలో "ఫైనల్ అథారిటీగా భావించబడిన ఖుర్ఆన్, హదీసు ఆజ్ఞలు అమీర్ ముఆవియా(రజి) పాలనలో నమాజ్, రోజాలకు పరిమితమైపోయి రాజకీయరంగంలో నిర్లక్ష్యానికి గురైపోయాయి. సలహామండలి వ్యవస్థ కూడా ఇప్పుడు పాలకుల పాటలకు వంతపాడనారంభించింది. అందులో భజన రాయుళ్ళు, వందిమాగదులు చేరి దాని అంతరాత్మకు తూట్లు పొడిచారు.

ఇస్లాం కూకటివేళ్ళతో పెకలించివేసిన జాతీయ, ప్రాంతీయ దురభిమానాల రక్కసి ఇప్పుడు జడలు విరబూసుకొని కరాళనృత్యం చేయసాగింది. తత్ఫలితంగా అరబ్బులు, అరబ్బేతరుల మధ్య, బనూహాషిం, బనూఉమయ్యా తెగల మధ్య చిచ్చు రేగింది. వీటన్నిటి కంటే దారుణమైన విషయం ఒకటి ఉనికిలోకి వచ్చి సద్గుణసంపన్నుల హృద యాలను తీవ్రంగా గాయపరచింది. అదే జుమాప్రసంగాలలో హజ్రత్ అలి (రజి)పై దూషణల దుష్టసంప్రదాయం. ముఖ్యంగా ముఆవియా గవర్నర్ మర్వాన్ మదీనాలోని మస్జిదెనబవీలో దైవప్రవక్త (స) సమాధికి ఎదురుగా ప్రవక్త ప్రసంగవేదికపై నిల్చొని ఆయన అల్లుడు, ప్రియసోదరుడయిన అలీ (రజి)ని అనరాని మాటలతో దుర్భాషలాడే వాడు. మస్జిదెనబవీ సమీపంలో నివశిస్తున్న అలీ(రజి) కుటుంబసభ్యులు ఈ దూషణలు వింటూ కంటతడి పెట్టుకుంటూ ఎంత బాధపడేవారో ఊహించవచ్చు.

హజ్రత్ అలి (రజి) పాలనాకాలంలోనే ముఆవియా (రజి) యమన్ రాష్ట్రాన్ని ఆక్ర మించుకోడానికి బుసర్ బిన్ అబీఅర్తాత్‌కు సైన్యాన్నిచ్చి పంపారు. అతను యమన్‌లో గవర్నర్ ఉబైదుల్లా బిన్ అబ్బాస్ (రజి)ని ఓడించి ఆయన పిల్లలిద్దరిని నిర్దాక్షిణ్యంగా చంపాడు. ఆ భయానక దృశ్యం చూసిన పిల్లల తల్లి తల్లడిల్లిపోతూ పిచ్చిదైపోయింది.

బనీకనానా తెగకు చెందిన ఒక స్త్రీ ఆ ఘోరం చూసి నెత్తీనోరూ బాదుకుంటూ "నువ్వు పురుషులనైతే చంపేశావు. ఇప్పుడు అభం శుభం తెలియని ఈ పసిపిల్లల్ని ఎందుకు చంపావు? (ఇస్లాంకు పూర్వం) అజ్ఞానకాలంలో కూడా పసిపిల్లల్ని శత్రువులు హతమార్చేవారు కాదు. ఇబ్నెఅర్తాత్! గుర్తుంచుకో. పిల్లల్ని, వృద్ధుల్ని చంపనిదే స్థాపించ బడలేని ప్రభుత్వం ఒక ప్రభుత్వమేనా? అంతకంటే దుర్మార్గపు ప్రభుత్వం మరేదైనా ఉంటుందా?" అని అన్నది.

ఆతర్వాత ఆ దుర్మార్గుడ్ని ముఆవియా (రజి) హమ్దాన్‌పై దాడిచేయడానికి పంపిం చాడు. అక్కడికెళ్ళి ఆ కిరాతకుడు అంతకంటే ఘోరమైన నేరాలకు పాల్పడ్డాడు. వాడు ఇతర దౌర్జన్యాలతోపాటు ధర్మశాస్త్రాన్ని తుంగలోతొక్కి యుద్ధఖైదీలుగా పట్టుబడిన ముస్లింస్త్రీలను బానిసలుగా చేసుకున్నాడు. ఆ క్రూరుడు ఇన్ని దారుణాలకు ఒడిగట్టినా ముఆవియా(రజి) అతనిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. అంటే ఆయన ఎలాంటి హింసాదౌర్జన్యాలు చేయడానికైనా తన గవర్నర్లకు లైసెన్స్ ఇచ్చారన్న మాట!



# 37. యజీద్ పాలనా తీరు

యజీద్ అసలు పేరు అబూఖాలిద్. అతనికి షికార్లు చేయడమంటే మహాఇష్టం. అందుకే తండ్రి మరణావస్థలో ఉన్నా అతను రాజధాని బయట ఏ ప్రాంతంలోనో షికార్లు కొడ్తూ తిరగసాగాడు. అమీర్ ముఆవియా(రజి) అతడ్ని ఒక సేవకుడ్ని పంపి పిలిపించారు. అప్పుడు తండ్రి చేసిన ఉపదేశాల్లో ఒక్కటీ అతని చెవికెక్కలేదు. తండ్రి మరణసమయం లో కూడా లేకుండా తిరిగి షికారు కోసం వెళ్ళిపోయాడు. అంతేగాక తండ్రి మరణించిన అనేక రోజుల తరువాత రాజధానికి తిరిగొచ్చి పరిపాలనా పగ్గాలు చేపట్టాడు.

ముఆవియా(రజి) పాలనాకాలంలోనే ఆయనకు రాజకీయవారసుడైన యజీద్ పట్ల ప్రజలు మొదటి నుంచే అయిష్టంగా ఉన్నారు. ఇప్పుడు ఖిలాఫత్ పీఠం ఎక్కిన యజీద్ ముున్ముందు తమకు ఎన్నెన్నికష్టాలు తెచ్చిపెడతాడోనని వారు భయపడసాగారు. యజీద్ పరిపాలనాపగ్గాలు చేపట్టగానే తండ్రి హయాంలో చేయించుకున్న బైత్‌ను ధృవపరచు కోవడానికి వివిధరాష్ట్రాల గవర్నర్లకు లేఖలు వ్రాసి ప్రజలచేత బైత్ చేయించవలసిందిగా ఆదేశించాడు. అప్పుడు సిరియన్లు, మరికొన్నిరాష్ట్రాల ప్రజలు వెంటనే బైత్ చేశారు. మదీనాప్రజల విషయంలోనే కాస్తంత ఇబ్బంది ఎదురైంది. దైవప్రవక్త (స) ప్రత్యక్ష సహచరులైన హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), హజ్రత్ హుసైన్ బిన్ అలి (రజి) బైత్ చేయకుండా రాత్రివేళ రహస్యంగా మదీనా నుండి మక్కాకు పారిపోయారు.

కొన్నాళ్ళ తరువాత అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కూడా మదీనానుండి మక్కా వెళ్ళిపోయారు. యజీద్ మక్కాప్రజల చేత బైత్ చేయించుకోడానికి 'హారిస్ బిన్ హుర్'ని మక్కా పంపించాడు. అటు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), హుసైన్ బిన్ అలి (రజి) మక్కా రావడం చూడగానే మక్కాలో అబ్దుల్లా బిన్ సఫ్వాన్ అనే ఓ ప్రముఖుడు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) చేతిలో చేయికలిపి బైత్ చేశాడు. అతడ్ని చూసి ప్రజల్లో పలుకుబడి ఉన్న రెండువేల మంది పురప్రముఖులు కూడా ఇబ్నెజుబైర్ (రజి) చేతిలో బైత్ చేశారు. ఆ తరువాత ఇబ్నెజుబైర్ (రజి) శాంతిభద్రతల దృష్ట్యా అధికారం చేబట్టి హారిస్‌ని అరెస్టుచేసి ఒక ఇంట్లో నిర్బంధించారు.

మదీనాలో గవర్నర్ వలీద్ బిన్ ఉఖ్బా ఇబ్నెజుబైర్ (రజి), హుసైన్(రజి) పారిపోయిన తరువాత మిగిలిన మదీనావాసుల చేత బైత్ చేయించారు. అయితే ఆయన కార్యదర్శి మర్వాన్ ఇబ్నెజుబైర్ (రజి), హుసైన్ (రజి)లు మదీనా నుండి పారిపోయారని యజీద్‌కు తెలియజేశాడు. యజీద్ వెంటనే వలీద్ బిన్ ఉఖ్బాని తొలగించి అమ్ర్ బిన్ సయీద్ బిన్ ఆస్‌ని గవర్నర్‌గా నియమించాడు. అటు మక్కాలో గృహనిర్బంధానికి గురయిన హారిస్ బిన్ హుర్ మక్కాను ఇబ్నెజుబైర్ (రజి) స్వాధీనం చేసుకున్నారని తెలియజేస్తూ యజీద్‌కు రహస్యంగా లేఖ రాశాడు. దాంతో యజీద్, ఇబ్నెజుబైర్ (రజి)కు సంకెళ్ళు బిగించి తనవద్దకు పంపవలసిందిగా మదీనాగవర్నర్ అమ్ర్ బిన్‌సయీద్‌ని ఆదేశించాడు. అమ్ర్ వెంటనే మక్కాకు ఓ పెద్దసైన్యం పంపాడు. కాని ఆ సైన్యం ఇబ్నెజుబైర్ (రజి) చేతిలో చిత్తుగా ఓడిపోయింది. దాని సేనాని పట్టుబడి జైలుపాలయ్యాడు.

## 1) ముస్లిం బిన్ అఖీల్ హత్య

ఆ రోజుల్లోనే కూఫాప్రజలు హుసైన్ బిన్ అలి (ఇమామ్ హుసైన్)కు తమ మద్దతు ప్రకటిస్తూ ఉత్తరాల మీద ఉత్తరాలు రాయడం మొదలెట్టారు. "మిమ్మల్ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేయడానికి, మీకోసం ప్రాణాలు అర్పించడానికి లక్షమంది యోధులు సిద్ధంగాఉన్నార"ని మాటిమాటికి ఉత్తరాలు రాస్తున్నారు. దాంతో ఇమామ్ హుసైన్ (రజి) తన పినతండ్రి కుమారుడు 'ముస్లిం బిన్ అఖీల్ బిన్ అబూతాలిబ్'ని పిలిచి "నీవు నా ప్రత్యేకదూతగా కూఫా వెళ్ళి నా తరపున రహస్యంగా ప్రజలచేత బైత్ చేయించు. అయితే నేను కూఫా చేరుకోనంతవరకు యుద్ధం ప్రారంభించకు" అని చెప్పారు.

మరునాడు ముస్లిం బిన్ అఖీల్ (రజి) కూఫాకు బయలుదేరారు. ఆయన కూఫా చేరుకొని ముఖ్తార్ బిన్ ఉబైదా ఇంట్లో విడిదిచేసి రహస్యంగా ప్రజల చేత బైత్ చేయించడం ప్రారంభించారు. తరువాత ఆయన ఇమామ్ హుసైన్ (రజి)కు ఉత్తరం రాసి, కూఫాలో మొదటిరోజే పన్నెండు వేలమంది బైత్ చేశారని, మీరిక్కడకు వచ్చినప్పుడు బహిరంగంగా బైత్ చేయించడం మొదలెడితే లక్షలమంది ప్రజలు మీ పతాకం కిందికి చేరుతారని తెలియజేశారు.

ముస్లిం బిన్ అఖీల్ (రజి) మక్కానుంచి వచ్చి బైత్ చేయిస్తున్న సంగతి కూఫాలో క్రమంగా వ్యాపించింది. అప్పుడు అబ్దుల్లా బిన్ ముస్లిం హజ్రమీ అనేవాడు గవర్నర్ నోమాన్ బిన్ బషీర్‌కు ఈ సమాచారం అందజేసి, ముస్లింను వెంటనే అరెస్టుచేసి యజీద్ దగ్గరకు పంపాలని సలహా ఇచ్చాడు. కాని నోమాన్ దానికి అంగీకరించలేదు. అప్పుడు అబ్దుల్లా ఈ విషయాన్ని యజీద్‌కు చేరవేశాడు. యజీద్ తన సలహాదారుడ్ని సంప్రదించిన మీదట బస్రాగవర్నర్ ఉబైదుల్లా బిన్ జియాద్‌కు ఉత్తరం రాసి "కూఫాలో హుసైన్ (రజి) కోసం ముస్లిం ప్రజలచేత బైత్ చేయిస్తున్నాడు. నువ్వు వెంటనే కూఫా వెళ్ళి ముస్లింను హతమార్చు. బైత్ చేసినవారు తమ బైత్‌ని ఉపసంహరించుకోవడానికి నిరాకరిస్తే వాళ్ళను కూడా పైకి పంపించు" అని ఆదేశించాడు.

బస్రాలో కూడా హుసైన్ (రజి) దూత ఒకతను వచ్చి బైత్ చేయిస్తున్నాడని తెలియగానే బస్రాగవర్నర్ ఇబ్నెజియాద్ ఆ దూతను బంధించి, బైత్ విషయమై ప్రజల్ని తీవ్రంగా హెచ్చరిస్తూ వారిముందే అతడ్ని హతమార్చాడు. ఆ తరువాత బస్రాలో తన సోదరుడు ఉస్మాన్‌ని ఇన్చార్జ్‌గవర్నర్‌గా నియమించి సైన్యం తీసుకొని కూఫా వెళ్ళాడు. కూఫాలో ముస్లిం బిన్ అఖీల్ (రజి) ఇబ్నెజియాద్ వచ్చిన సంగతి తెలుసుకొని హాని బిన్ ఉర్వా ఇంట్లో దాక్కున్నారు. ఇబ్నెజియాద్ ఈ సంగతి తెలుసుకొని హానీని పిలిపించి అడిగితే అతను తనకు తెలియదన్నాడు. అంచేత ఇబ్నెజియాద్ అప్పటికప్పుడు హానీని పట్టుకొని బంధించాడు. అయితే ప్రజల్లో హానీ వధించబడ్డాడని పుకార్లు పుట్టాయి.

ఈ వదంతి సంగతి హానీ భార్యాపిల్లలకు తెలిసి వారు ఏడ్పులు పెడబొబ్బలు పెట్టసాగారు. వారింట్లో దాక్కున్న ముస్లిం బిన్ అఖీల్ (రజి) వెంటనే బయటికొచ్చి వరనుంచి ఖడ్గం తీస్తూ బైత్ చేసినవారిని పిలిచారు. అప్పటికి 18వేల మంది బైత్ చేసి ఉన్నారు. అయితే నాలుగువేల మందిమాత్రమే ఆయన చుట్టు గుమికూడారు. మిగిలిన



పధ్నాలుగు వేలమంది ఇమామ్ హుసైన్ మక్కా నుండి కూఫా రానంతవరకూ యుద్ధం చేయమని చెప్పి ముస్లింతో సహకరించడానికి తిరస్కరించారు.

అప్పుడు ముస్లిం బిన్ అఖీల్(రజి) మార్గాంతరంలేక ఆ నాలుగువేల మందినే తీసుకొని వెళ్ళి గవర్నర్ ఇంటిని ముట్టడించారు. గవర్నర్ రక్షణసైనికులు ఇంటికప్పుపై నుండి బాణాలు వదలడం ప్రారంభించారు. అదే సమయంలో ముస్లిం బిన్ అఖీల్ (రజి) సైనికుల బంధుమిత్రులు వచ్చి వారిని యుద్ధం నుండి వారించడానికి ప్రయత్నించారు. దాంతో చాలామంది యుద్ధం నుండి జారుకున్నారు. చివరికి ముస్లిం వెంట నలభై మంది మాత్రమే ఉండిపోయారు. అంచేత ఆయన అక్కడ్నుంచి పారిపోయి మరో మిత్రుని ఇంట్లో దాక్కున్నారు.

ఆ సంగతి తెలుసుకున్న ఇబ్నెజియాద్ అనుచరులు అక్కడికీ చేరుకున్నారు. ముస్లిం బిన్ అఖీల్ (రజి) వారొచ్చిన సంగతి విని బయటికొచ్చి కత్తి ఝుళిపించారు. అయితే ఆ దుర్మార్గులు కల్లబొల్లి మాటలు చెప్పి ఆయన్ని ఇబ్నె జియాద్ దగ్గరకు పిలిచికెళ్ళారు. ఇబ్నెజియాద్ ఆయన్ని హానీని బంధించిన గదిలోనే బంధించి ఉంచాడు. మరుసటిరోజు బైత్ చేసినవారిలో పదివేల మంది జనం కలసి ఇబ్నెజియాద్ ఇంటికెళ్ళారు. అతనుండే ఇంటిని చుట్టుముట్టి, ముస్లిం బిన్ అఖీల్ (రజి)ని వెంటనే వదలిపెట్టాలని, లేకుంటే యుద్ధంచేసి ఆయన్ని విడిపించుకొని వెళ్తామని హెచ్చరించారు.

అప్పుడు ఇబ్నెజియాద్ ముస్లిం(రజి)ని, హానీని ఇంటికప్పు పైకి తీసికెళ్ళి వారందరి ముందు వధించాలని తన మనుషుల్ని ఆదేశించాడు. వారావిధంగానే ఆ ఇద్దర్ని ఇంటికప్పు పైకి తీసికెళ్ళి దారుణంగా వధించారు. ఇబ్నెజియాద్ ఇంటిని ముట్టడించినవారు ఈ ఘోరం చూడగానే బిత్తరపోయి పరుగు లంకించుకున్నారు. ఆ తర్వాత ఇబ్నెజియాద్ వారిద్దరి తలలు నరికించి యజీద్ దగ్గరకు పంపించాడు.

కూఫాలో మొదటిరోజే పన్నెండు వేలమంది బైత్ చేశారని ముస్లిం రాసిన ఉత్తరం చదివి ఇమామ్ హుసైన్ (రజి) ఎంతో సంబరపడి కూఫా వెళ్ళడానికి గట్టిగా నిర్ణయించుకున్నారు. దానికోసం కొన్నాళ్ళలోనే ప్రయాణ ఏర్పాట్లు చేసుకొని తన కుటుంబసభ్యుల్ని తీసుకొని బయలుదేరడానికి సిద్ధమయ్యారు. అయితే కూఫాప్రజల పిరికితనం, నిలకడ లేని స్వభావం తెలిసినవారు హుసైన్ (రజి)ని మక్కా వదలిపోకుండా నిరోధించడానికి ఎంతో ప్రయత్నించారు. సహచర సహాబీలు, శ్రేయోభిలాషులైన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి), అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), అబ్దుర్రహ్మాన్ బిన్‌హారిస్ (రజి) ప్రభృతులు కూడా నచ్చజెప్పడానికి విశ్వప్రయత్నం చేశారు. కాని ఇమామ్ హుసైన్ (రజి) ఏఒక్కరి సలహా అంగీకరించకుండా కూఫా బయలుదేరారు.

దారిలో కూడా కొందరు శ్రేయోభిలాషులు ఆయన్ని వెనక్కి మరలించడానికి ప్రయత్నించారు. ఇమామ్ హుసైన్ (రజి) ముందు వారి ప్రయత్నాలు కూడా ఫలించలేదు. కూఫాలో ముస్లిం(రజి) రోజూ వేలాదిమంది ప్రజలచే బైత్ చేయిస్తుండవచ్చని భావిస్తూ ఆయన ఎంతో ఉత్సాహంతో ప్రయాణిస్తూ సాలబా ప్రాంతానికి చేరుకున్నారు.

## 2) ఇమామ్ హుసైన్ (రజి) హత్య

అయితే ఇమామ్ హుసైన్ (రజి), ఆయన బంధుమిత్రులు సాలబా ప్రాంతానికి చేరుకోగానే కూఫాలో ముస్లిం(రజి) హత్యచేయబడ్డారని, అక్కడిక హుసైన్ (రజి)ని సమర్థించేవారెవరూ లేరని తెలిసింది. ఈ దుర్వార్త వినగానే ఇమామ్ హుసైన్ (రజి)తో పాటు అందరూ తీవ్రమైన నిరాశతో సందిగ్ధావస్థలో పడిపోయారు. వారిలో కొందరు వెనక్కి వెళ్ళిపోదామన్నారు. మరికొందరు మాట్లాడుతూ “హుసైన్ (రజి) ముస్లిం (రజి) లాంటి వాడుకాదు. హుసైన్(రజి)ని చూడగానే కూఫాప్రజలు అమితోత్సాహంతో ఆయన చుట్టు గుమికూడుతారు. కనుక కూఫాకు వెళ్ళాల్సిందే” అని అన్నారు. ముస్లిం బిన్ అఖీల్ (రజి) కుమారులు కూడా తమ తండ్రిహత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి కూఫా వెళ్ళాల్సిందేనని పట్టుబట్టారు. దాంతో ఈ బృందం సాలబా నుంచి ముందుకు సాగింది.

యజీద్ అంతకుముందే ఇమామ్ హుసైన్ (రజి) మక్కా నుంచి బయలుదేరిన సంగతి తెలుసుకొని ఇబ్నెజియాద్‌కు ఉత్తరం రాసి అప్రమత్తం చేశాడు. ఇబ్నెజియాద్ తక్షణమే మక్కానుండి కూఫాకు చేరుకునే మార్గాలన్నిటిలో సైనికదళాలను నియమించి హుసైన్ (రజి)ని కూఫా చేరుకోకుండా అడ్డుకోవాలని సైనికుల్ని ఆజ్ఞాపించాడు.

దారిలో అనేకచోట్ల వివిధతెగలకు చెందినవారు వచ్చి హుసైన్ (రజి) బృందంలో చేరారు. కాని సాలబాలో ‘ముస్లిం’వధ దుర్వార్త విని క్రమంగా అనేక మంది బృందం వదలి వెళ్ళిపోయారు. చివరికి హుసైన్ (రజి) కుటుంబం, ఆయన తెగవారు కలసి మొత్తం ఎనభైమంది మాత్రమే మిగిలారు. ఆ ఎనభై మందితో కూడిన బృందం సాలబా నుండి షరాఫ్ ప్రాంతం వరకు ప్రయాణించేటప్పటికి దాని పరిస్థితి “వెనక నుయ్యి, ముందు గొయ్యి”లా మారింది. వారి ముందు హుర్ బిన్ యజీద్ తమీమి అనేవాడు వేయిమంది సైనికుల్ని తీసుకొని పెద్దపులిలా గాండ్రిస్తూ నిల్చున్నాడు. వెనక్కి వెళ్దామంటే వెనుక హుర్ సైన్యంలోని ఒకదళం వారి వెనుక వచ్చి బుసలుకొట్టసాగింది.

ఇమామ్ హుసైన్ (రజి) అప్పుడు ఉత్తర దిశగా ప్రయాణించి ఖాదిసియా సమీపానికి చేరుకున్నారు. కాని అక్కడికి చేరుకోగానే ఖాదిసియాలో అమ్ర్ బిన్ సాద్ ఓ పెద్ద సైన్యం తీసుకొని ఎదురుచూస్తున్నాడని, వెనక వైపున హుర్ సైన్యం తరుముకుంటూ వస్తోందని తెలిసింది. దాంతో హుసైన్(రజి) బృందం అక్కడ్నుంచి మరోదిశగా పదిమైళ్ళు నడచి కర్బలా ప్రాంతానికి చేరుకొని ఆగింది. మరోవైపు నుంచి అమ్ర్ బిన్ సాద్ కూడా సైన్యం తీసుకొని కర్బలా సమీపానికి చేరుకున్నాడు. అతను సైన్యం నుండి ఇమామ్ హుసైన్ (రజి) దగ్గరకు వచ్చి ఆయనతో ఇలా అన్నాడు:

“మీరు యజీద్ సమక్షంలో ఖిలాఫత్ పదవికి ఎక్కువ అర్హులని నాకు తెలుసు. కాని మీ కుటుంబంలో ఖిలాఫత్, ప్రభుత్వం రావడం దేవునికి ఆమోదయోగ్యంగా లేదు. అలి(రజి), హసన్(రజి)లకు ఎదురైన పరిస్థితుల్ని మీరు చూసివున్నారు. కనుక ఖిలాఫత్, రాజ్యాధికారాల ఆలోచన మీ మనసులో నుంచి తీసేసుకుంటే మీరిక్కడ్నుంచి సులభంగా బయటపడగలుగుతారు. లేకుంటే మీ ప్రాణానికి ముప్పు వాటిల్లుతుంది. మేము మిమ్మల్ని బంధించడానికి వచ్చాము.”



దానికి ఇమామ్ హుసైన్ (రజి) ఇలా సమాధానమిచ్చారు:

“నేను మీముందు మూడు విషయాలు ప్రతిపాదిస్తున్నాను. వాటిలో మీరు ఏదో ఒకదాన్ని అంగీకరించండి. ఒకటి, నేను ఎక్కడ్నుంచి వచ్చానో అక్కడికి నన్ను తిరిగి వెళ్ళిపోనివ్వండి. మక్కాలో నేను దైవారాధనలో లీనమైపోతాను. రెండు, నన్ను ఏదైనా సరిహద్దు ప్రాంతానికి వెళ్ళనివ్వండి. అక్కడ నేను అవిశ్వాసులతో పోరాడుతూ అమరగతుడ్ని అవుతాను. మూడు, మీరు నాకు దారి వదలితే నేను నేరుగా యజీద్ దగ్గరకు డెమాస్కస్ దిశగా వెళ్ళిపోతాను. ఒకవేళ నేను ఎటైనా పారిపోతానని అనుమానముంటే మీరు నా వెనకాల రావచ్చు. నేను యజీద్ దగ్గరకు వెళ్ళి నా సోదరుడు హసన్ (రజి) అమీర్ ముఆవియా (రజి)తో తన వ్యవహారం నిర్ణయించుకున్నట్లు నేను నేరుగా యజీత్‌తో నా వ్యవహారం నిర్ణయించుకుంటాను.”

అమ్ర్ ఈమాటలు విని ఎంతో సంతోషించాడు. అతను వెంటనే ఈ ప్రతిపాదనలను గురించి లేఖ ద్వారా సర్వసేనాని ఇబ్నెజియాద్‌కు తెలియజేశాడు. అయితే ఇబ్నెజియాద్ తన సైనికసలహాదారుడు షుమర్ ఇచ్చిన సలహాతో అమ్ర్ బిన్ సాద్‌ని యుద్ధరంగంలోకి దించాడు. ఆ తరువాత అతను షుమర్‌ని కూడా రణరంగానికి పంపించాడు. ఆరోజు సాయంత్రం షుమర్ ప్రత్యర్థివర్గానికి నీళ్ళు సరఫరా కాకుండా అడ్డుకోవడానికి ఫురాత్ నదీతీరం దగ్గర ఐదొందల మంది సైనికుల్ని కాపలా పెట్టాడు. యాదృచ్ఛికంగా ఆరోజు పగటిసమయంలో ఇమామ్ హుసైన్ (రజి) వర్గీయులు నది నుండి నీళ్ళు తెచ్చుకోలేదు. ఇప్పుడు శత్రువులు అడ్డుపడుతున్నారు. ఇమామ్ హుసైన్ (రజి) నీళ్ళు తీసుకురావడానికి యాభైమంది అనుచరుల్ని పంపిస్తే వారిని ఆ దుర్మార్గులు తరిమికొట్టారు.

ఇమామ్ హుసైన్ (రజి) శిబిరంలో ప్రజలు దాహంతో తల్లడిల్లిపోతున్నారు. ఇలా పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో రేపు ఉదయం యుద్ధంజరిగి తమ పురుషులు హతమవుతారని తలచి స్త్రీలు, పిల్లలు ఏడ్పు లంకించుకున్నారు. వెంటనే ఇమామ్ హుసైన్ (రజి) వచ్చి వారిని సముదాయిస్తూ, మీరిలా ఏడుస్తుంటే ప్రత్యర్థుల ముందు మనం అభాసుపాలు కావలసి వస్తుందని చెప్పారు. అప్పుడు వారు ఏడ్పులు మానేశారు. ఇమామ్ హుసైన్ (రజి) తాను అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) మాట వినకుండా స్త్రీలు, పిల్లల్ని తీసుకొచ్చి తప్పు చేశానని బాధపడ్డారు.

మరుసటిరోజు, అంటే హి.శ. 61, ముహరం 10వ తేదీన ఉదయాన్నే షుమర్, అమ్ర్ బిన్ సాద్‌లు సైన్యాన్ని సమాయత్తపరచి యుద్ధానికి సిద్ధమయ్యారు. ఇమామ్ హుసైన్ (రజి) కూడా తన సహచరులకు తగిన సూచనలిచ్చి, ఒంటెమీద ప్రత్యర్థి సైనికుల ముందుకు వచ్చారు. ఆ సమయంలో ఆయన వెంట ఒక ఉల్లేఖనం ప్రకారం 72మంది ఉన్నారని, మరొక ఉల్లేఖనం ప్రకారం 140మంది ఉన్నారని, వేరొక ఉల్లేఖనం ప్రకారం 240మంది మనుషులు ఉన్నారని తెలుస్తోంది. ఒకవేళ రెండొందల నలభై మంది యోధులు ఉన్నారని భావించినా ప్రత్యర్థివర్గంలోని వేలాది మంది సైనికుల సమక్షంలో ఈ రెండొందల నలభై మంది యోధులు ఏపాటికి వస్తారు? ఇమామ్ హుసైన్ (రజి) కూఫావాసుల్ని సంబోధిస్తూ ఇలా ప్రసంగించారు:

"కూఫావాసులారా! మీలో నన్నెరిగినవారు, ఎరగనివారు అందరూ తెలుసుకోండి. నేను దైవప్రవక్త (స) మనుమడ్ని, అలి (రజి)-ఫాతిమా (రజి) దంపతుల కుమారుడ్ని. జాఫర్ తయ్యార్ (రజి) నా పినతండ్రి. దైవప్రవక్త (స) నన్ను, నా సోదరుడు హసన్ (రజి)ని స్వర్గవాసుల యువనేతలని ప్రకటించారు. మీకు నామాటల మీద నమ్మకం లేకపోతే దైవప్రవక్త (స) సహాబీలలో కొందరు ఇప్పటికీ జీవించిఉన్నారు. వాళ్ళను అడిగి నా మాటల్ని ధృవపరచుకోవచ్చు."

"నేను ఏనాడూ వాగ్దానభంగానికి పాల్పడలేదు. ఏనాడూ నమాజ్ 'ఖజా' చేయలేదు. ఎప్పుడూ ఏ విశ్వాసినీ చంపడంగాని, బాధించడంగాని చేయలేదు. ఒకవేళ ఈసా ప్రవక్త (అలైహి) గాడిద కూడా బ్రతికివుంటే ప్రపంచ క్రైస్తవులందరూ ప్రళయందాకా ఆ గాడిదను పోషిస్తూ పరిరక్షిస్తూ ఉంటారు. కాని మీరెలాంటి ముస్లింలో అర్థంకావడం లేదు; దైవప్రవక్త (స) మనుమడ్నే మట్టుపెట్టడానికి సిద్ధమయ్యారు! మీలో దైవభీతిగాని, దైవప్రవక్త (స) పట్ల ప్రేమాభిమానాలుగాని ఏమాత్రం లేవు. నామీద ప్రతీకారం (ఖిసాస్) తీర్చుకోవడానికి నాజీవితంలో నేనింతవరకు ఏఒక్కడ్ని చంపలేదు. అలాంటప్పుడు మీరు నా రక్తాన్ని ఎలా ధర్మసమ్మతం చేసుకోదలిచారు?"

"నేను ప్రపంచ వ్యవహారాలకు దూరంగా మదీనాలో దైవప్రవక్త (స) పాదాల చెంత పడివున్నప్పుడు మీరు నన్ను అక్కడా ఉండనివ్వలేదు. తరువాత నేను మక్కాలో కాబా మందిరంలో దైవారాధనలో నిమగ్నుడైవుంటే అక్కడా మీరు నన్ను ప్రశాంతంగా ఉండ నివ్వలేదు. 'మేము నిన్ను ఖిలాఫత్‌కు హక్కుదారుడని భావిస్తున్నాం; నీ చేతిలో చేయి కలిపి బైత్ చేస్తాం ఇక్కడకు వచ్చేయి' అని ఉత్తరాల మీద ఉత్తరాలు రాశారు. తీరా ఇక్కడకొస్తే మీరు నాకు వ్యతిరేకులైపోయారు. సరే, ఇప్పుడైనా మీరు నాకు సహాయం చేయదలిస్తే, నేను మీనుండి ఒక్క విషయం మాత్రమే ఆశిస్తున్నాను. మీరు నన్ను వధించకుండా వదిలేస్తే నేను మక్కాకో, మదీనాకో వెళ్ళిపోయి దైవారాధనలో నా శేష జీవితం గడుపుతాను. మన ఉభయుల్లో ఎవరు సత్యవాదులో, ఎవరు దౌర్జన్యపరులో విశ్వప్రభువే ప్రళయదినాన పరిష్కరిస్తాడు."

ఈప్రసంగం విని కూఫాసైనికులంతా బెల్లంకొట్టిన రాళ్ళులా మౌనంగా ఉండి పోయారు. కాస్సేపటికి హుర్ బిన్ యజీద్ తమీమి అనే సైనికుడు మాత్రమే పశ్చాత్తాం చెందుతూ వచ్చి ఇమామ్ హుసైన్ (రజి) పక్షంలో చేరిపోయాడు. ఆ తరువాత ఇమామ్ హుసైన్ (రజి) ఒంటెను వదలి గుర్రం ఎక్కి సమరానికి సిద్ధమయ్యారు. అప్పుడు అమ్ర్ బిన్ సైద్ యుద్ధారంభానికి సూచనగా ప్రత్యర్థి సైన్యం మీదికి ఒక బాణం వదిలాడు. ఆ వెనువెంటనే అతని సైన్యం నుండి ఇద్దరు మల్లయోధులు రంకెలు వేస్తూ ముందు కొచ్చారు. వారిని ఎదుర్కోవడానికి హుసైన్(రజి) తరపున ఒక వీరుడు వచ్చి మెరుపులా లంఘించి ఆ ఇద్దర్నీ మట్టుపెట్టాడు. ఆవిధంగా యుద్ధపరంపర ప్రారంభమయింది.

ఇమామ్ హుసైన్(రజి) పక్షంనుండి ఒక్కొక్క యోధుడే ప్రత్యర్థిసైనికుల్లోకి దూసుకు పోయి అనేకమందికి మట్టికరిపిస్తూ చివరికి నేలకొరిగిపోయేవాడు. ఈవిధంగా ప్రతిపక్షం లోని అనేకమంది సైనికులు హతమయ్యారు. చివరికి ఇమామ్ హుసైన్ (రజి) వర్గంలో



ఆయన ఒక్కరే సమరయోధుడిగా రణరంగంలో మిగిలిపోయారు. కాగా ఆయన శిబిరం లో స్త్రీలు, జైనుల్‌అబిదీన్ అనే వ్యాధిగ్రస్తుడైన ఒక పిల్లవాడు మాత్రమే మిగిలారు. ఆ తరువాత ఇమామ్ హుసైన్ (రజి) ప్రత్యర్థి సైనికులపై తుఫానులా విరుచుకుపడి వారి తలలు ఖండిస్తూ, చేతులు నరుకుతూ అప్రతిహతంగా పోరాడసాగారు.

ఇమామ్ (రజి) ప్రతిభాపరాక్రమాలు, ధైర్యసాహసాలు చూడటానికి ఆయన వర్గంలో ఎవరూ లేరు. ప్రత్యర్థి వర్గంలోని సేనాపతులు అమ్ర్ బిన్ సాద్, షుమర్‌లు ఆయన ప్రతిభాపరాక్రమాలను సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ "మనం ఇంతవరకు ఇలాంటి వీరాధివీరుడ్ని, పరాక్రమశాలిని ఎన్నడూ చూడలేదు" అని చెప్పుకున్నారు. ఎడతెరిపి లేకుండా దేహంలో బాణాలు దిగబడుతున్నా, కత్తివ్రేటులు పడుతున్నా ఖాతరుచేయ కుండా ఆ వీరాధివీరుడు అతివేగంతో ఖడ్గం తిప్పుతూ శత్రువుల్ని మట్టుపెడ్తున్నాడు. కేవలం దైవప్రసన్నత కోసం, ధర్మపరిరక్షణ కోసం పోరాడుతూ శత్రువుల చక్రబంధంలో చిక్కుకొని చివరికి అరవై డెబ్బయి గాయాలతో ఆ దైవదాసుడు నేలకొరిగి అమరగతి భాగ్యానికి అర్హుడైపోయాడు.

ఇమామ్ హుసైన్ (రజి) ఇలా నేలకొరిగిపోగానే సర్వసేనాని ఇబ్నెజియాద్ ఆదేశంతో అతని సైనికులు ఆ మహనీయుడి శిరస్సు ఖండించి, ఆయన మొండెం మీద గుర్రాలు పరుగెత్తించారు. ఆయన సహచరుల శిరస్సుల్ని కూడా ఖండించారు. ఆ దుర్మార్గులు అంతటి తృప్తిచెందకుండా ఇమామ్ (రజి) శిబిరంలోకి జొరబడి స్త్రీలను వారి బురఖాలు లాగిపారేసి ఖైదీలుగా పట్టుకున్నారు.

ఇమామ్ కుమారరత్నం, పసిబాలుడు, రోగగ్రస్తుడైన అలి బిన్ హుసైన్ (జైనుల్ ఆబిదీన్)కు ఒకతను ధైర్యంచెప్పి రహస్యంగా తన ఇంటికి తీసికెళ్ళాడు. ఆయనకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ ఇంట్లో సకలసౌకర్యాలు కల్పించాడు. అంతేకాదు, ఆయన్ని మాటిమాటికి చూస్తూ కంటతడి పెట్టుకునేవాడు. అలి బిన్ హుసైన్ అతని పరిస్థితి చూసి, తన కోసం ఎవరిలోనైనా ప్రేమాభిమానాలు ఉన్నాయంటే అవి ఈ వ్యక్తిలోనే ఉన్నాయని భావించారు. అంతలో "అలి బిన్ హుసైన్‌ని పట్టుకొచ్చి తమకు అప్ప గించినవారికి మూడొందలు దిర్హంలు బహుమానాం ఇస్తామ"ని ఇబ్నెజియాద్ ప్రకటన చేయించాడు. ఈప్రకటన వినగానే ఆ వ్యక్తి అలి దగ్గరకు వచ్చి ఏకధాటిగా ఏడుస్తూ ఆయన చేతుల్ని మెడకేసికట్టాడు. ఆతర్వాత ఆయన్ని తీసికెళ్ళి ఇబ్నెజియాద్ సైనికులకు అప్పగించి ప్రకటిత బహుమానం పొందాడు. (తబ్ఖాత్, ఇబ్నెసాద్)

ఆ సమయంలో అలి బిన్ హుసైన్ మీద ఒక దుర్మార్గుడు ఖడ్గం ఎత్తాడు. అయితే మరొకడు వారించడంతో అతను ఖడ్గం దించేశాడు. తర్వాత వారు ఇమామ్ హుసైన్ (రజి)-ఆయన సహచరుల శిరస్సులను, యుద్ధఖైదీలను ఇబ్నెజియాద్ దగ్గరికి తీసికెళ్ళారు. అక్కడ్నుంచి కూఫాకు చేర్చి కూఫా వీధుల్లో ఊరేగించారు.

ఆతర్వాత ఇమామ్ (రజి) శిరస్సుని, యుద్ధఖైదీలను ఒక సైనికదళం పర్యవేక్షణలో యజీద్ దగ్గిరికి డెమాస్కస్‌కు పంపించారు. యజీద్ ఇమామ్ హుసైన్ (రజి) శిరస్సు చూసి కంటతడి పెట్టుకున్నాడని, సేనాపతి ఇబ్నెజియాద్‌ను శపించాడని, తాను యుద్ధ

భూమిలో ఇమామ్ హుసైన్ (రజి) సమక్షంలో ఉండివుంటే ఆయన్ని వధించేవాడ్ని కానని అన్నట్లు అనేక ఉల్లేఖనాల్లో ఉంది. అయితే హాఫిజ్ ఇబ్నెకసీర్ కథనం ప్రకారం ఇబ్నె జియాద్‌కు యజీద్ ఎలాంటి శిక్ష విధించలేదని, గవర్నర్-సేనాపతి పదవుల నుంచి తొల గించలేదని, కనీసం అతడ్ని మందలిస్తూ ఒక ఉత్తరమైనా రాయలేదని తెలుస్తోంది.

మక్కాలో అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కర్బలాయుద్ధంలో ఇమామ్ హుసైన్ (రజి) అమరగతి అయిన వార్త విని ఎంతో బాధపడ్డారు. ఆయన వెంటనే ప్రజలను సమావేశ పరచి ఇలా ప్రసగించారు: "సోదరులారా! ప్రపంచంలో ఇరాఖ్ ప్రజలంతటి దుర్జనులు మరెక్కడా లేరు. ఇరాఖ్‌ప్రజల్లో కూఫాప్రజలు మరింత చెడ్డవాళ్ళు. వారు ఉత్తరాల మీద ఉత్తరాలు రాసి హుసైన్ (రజి)ని పిలిపించుకున్నారు. ఆయన ఖిలాఫత్ పదవి కోసం వారు బైత్ కూడా చేశారు. కాని ఇబ్నెజియాద్ కూఫాకు రాగానే వారతని చుట్టూచేరి హుసైన్ (రజి)కు వ్యతిరేకులైపోయి సమస్తవిధాల ఖిలాఫత్‌కు అర్హుడైన ఆ దైవదాసుడ్ని ఏమాత్రం దైవభీతి లేకుండా దారుణంగా హతమార్చారు." ఇలా చెప్పి ఇబ్నెజుబైర్ (రజి) వలవల ఏడ్చారు.

అప్పుడు ప్రజలు "మేము మిమ్మల్ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేస్తాం, చేయి జాపండి" అన్నారు. ఈవిధంగా మక్కాప్రజలు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) చేతిలో చేయి కలిపి బైత్ చేశారు. ఈ సంగతి యజీద్‌కు తెలియగానే అతను ఇబ్నెజుబైర్ (రజి)ని బంధించి తీసుకురమ్మని మదీనాగవర్నర్‌కు లేఖ రాశాడు.

## 3) మక్కా, మదీనాలలో యజీద్‌సైన్యం ఘాతుకాలు

ఇదిలా ఉంటే అటు మదీనాప్రజలు కూడా అక్కడి గవర్నర్‌ని తొలగించి, అబ్దుల్లా బిన్ హన్జలాను నాయకుడిగా చేసుకొని తిరుగుబాటు లేవదీశారని తెలిసింది. అప్పుడు యజీద్ మదీనాప్రజల్ని దారికి తెచ్చేందుకు మొదట నోమాన్ బిన్ బషీర్‌ని పంపాడు. అతనివల్ల పని నెరవేరకపోవడంతో తర్వాత ముస్లిం బిన్ ఉఖ్బాని పంపాడు. ముస్లిం బిన్ ఉఖ్బా పన్నెండువేల సైన్యం తీసుకొని మదీనా వెళ్ళి యజీద్ ఆజ్ఞ ప్రకారం మదీనా వాసులకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తూ మూడు రోజులు నిరీక్షించాడు.

చివరికి మదీనావాసులు అందుకు నిరాకరించడంతో అతను మదీనాపై దాడిచేసి అక్కడి ప్రజల్ని అణచివేశాడు. ఆ తరువాత ఆ దుర్మార్గుడు యజీద్ ఆజ్ఞ మేరకే మూడు రోజులపాటు సామూహిక హత్యలకు, లూటీలకు, మానభంగాలకు పాల్పడ్డాడు. ఇమామ్ జుహ్రీ ఉల్లేఖనం ప్రకారం "ఈ ఘోరకృత్యాల్లో ఏడొందల మంది పురప్రముఖులు, పది వేలమంది సామాన్య ప్రజలు హతమార్చబడ్డారు. తరువాత ఆ పాశవిక సైనికులు ప్రజల ఇండ్లలోకి జొరబడి స్త్రీలపై మానభంగాలకు తెగబడ్డారు." హి.శ. 63, జిల్‌హజ్జ నెలలో సంభవించిన ఈ దుర్ఘటనను హర్రా యుద్ధం అంటారు.

అయితే మదీనాప్రజల పట్ల ఆ దుర్మార్గులు పాల్పడిన ఈ పైశాచికచర్యలు వారిని నరకాగ్నికి సమిధలుగా చేస్తాయని దైవప్రవక్త (స) ప్రవచించిన ఈక్రింది హితోక్తులు తెలిసిన వారెవరైనా చెబుతారు. దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు:



"మదీనా (ప్రజల) పట్ల ఎవరైనా సరే కీడు తలపెడ్తే దేవుడు అతడ్ని నరకాగ్నిలో పడేసి సీసంలా కరిగిస్తాడు." (బుఖారి, ముస్లిం)

"మదీనావాసుల్ని ఎవరైనా హింసాదౌర్జన్యాలతో భయకంపితులు చేస్తే దేవుడు అతడ్ని భయకంపితుడు చేస్తాడు. అతడ్ని దేవుడు, దైవదూతలు, యావత్తు మానవులు శపిస్తారు. ప్రళయదినాన దేవుడు అతడు చేసిన ఈ పాపానికి అతనినుండి ఎలాంటి పరిహారం స్వీకరించడు." (బుఖారి, ముస్లిం)

ముస్లిం బిన్ ఉఖ్బా ఆ తరువాత యజీద్ ఇచ్చిన ఆదేశంతోనే మదీనానుండి మక్కా బయలుదేరాడు. అయితే దారిలోనే మరణించాడు. అతను చనిపోగానే హుసైన్ బిన్ నమీర్ సేనాపతి బాధ్యతలు చేపట్టి మక్కా సమీపానికి చేరుకున్నాడు. అతను తన దూత ద్వారా "యజీద్‌కు విధేయత ప్రకటించు, లేకుంటే మక్కాపై దాడి జరుగుతుంది" అని ఇబ్నెజుబైర్ (రజి)ని హెచ్చరించాడు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అతని హెచ్చరికను ఖాతరుచేయకుండా యుద్ధానికి సమాయత్తమయ్యారు. హి.శ. 64లో ఇరుపక్షాల మధ్య సంకులసమరం మొదలయింది.

యజీద్ సేనాపతి హుసైన్ బిన్ నమీర్ మక్కానగరాన్ని దిగ్బంధించి కాబాపై రాళ్ళ వర్షం కురిపించాడు. కొవ్వు, గంధకాలతో కూడిన గోళాలు తయారుచేయించి కాబాపై విసిరాడు. దాంతో కాబా గిలాపు కాలిపోయింది. దాని గోడలు బీటలువారాయి. ఇలా మక్కాలో పవిత్ర కాబాకు అపచారం జరుగుతుంటే అటు డెమాస్కస్‌లో యజీద్ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ చివరికి మృత్యుఒడిలోకి పోయాడు. దాదాపు మూడున్నర ఏండ్ల పరిపాలన తరువాత 39ఏండ్ల వయస్సులో యజీద్ హి.శ. 64, రబీవుల్ అవ్వల్ నెలలో చనిపోయాడు.

హుసైన్ బిన్ నమీర్ యజీద్ మరణవార్త విని ముట్టడి ఎత్తేసి అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని కలసి ఆయన్ని సిరియా పిలుచుకెళ్ళి యావత్తు ఇస్లాంజగత్తుకు ఖలీఫా చేయాలని భావించాడు. కాని అందుకు ఇబ్నెజుబైర్ నిరాకరించడంతో అతను సైన్యం తీసుకొని మక్కా నుండి మదీనాకు వెళ్ళిపోయాడు. మదీనా చేరుకోగానే మదీనా ప్రజలు యజీద్ మరణవార్త విని బనూఉమయ్యా తెగవారికి వ్యతిరేకంగా మళ్ళీ తిరుగుబాటు లేవదీశారని తెలిసింది. అంచేత హుసైన్ బిన్ నమీర్ మదీనాలో ప్రవేశించకుండా నగరం బయట ఒక ప్రదేశంలో విడిదిచేశాడు. అప్పుడు బనూఉమయ్యా తెగవారు నగరం నుంచి అతని దగ్గరకు చేరుకొని తమను సిరియా తీసికెళ్ళమని అడిగారు.

హుసైన్ బిన్ నమీర్ ఆరోజురాత్రి అలి బిన్ హుసైన్ (జైనుల్‌ఆబిదీన్)ని వెతుకుతూ ఆయన దగ్గరకు చేరుకొని, తనతో పాటు సిరియా వస్తే సిరియాప్రజలు ఆయన ఖిలాఫత్ కోసం బైత్ చేస్తారని, ఇరాఖ్ ప్రజల్లా వారు మోసం చేయరని అన్నాడు. కాని అలి బిన్ హుసైన్ అతని ప్రతిపాదనను సున్నితంగా త్రోసిపుచ్చుతూ, తాను జీవితాంతం ఎవరి నుండీ బైత్ తీసుకోనని దేవుని ముందు ప్రతిజ్ఞ చేశానని, తనను వదిలేసి ఖిలాఫత్ కోసం మరొకరిని అన్వేషించమని అన్నారు. దాంతో హుసైన్ బిన్ నమీర్ నిరాశచెంది సైన్యం తీసుకొని సిరియా వెళ్ళిపోయాడు.

## 4) యజీద్‌పాలనలో విదేశీప్రాంతాల్లో విజయకేతనాలు

యజీద్ ఖిలాఫత్ పీఠం అధిరోహించగానే ఉఖ్బా బిన్ నాఫెని ఆఫ్రికా సేనాపతిగా నియమించి ఆఫ్రికా పంపించాడు. ఉఖ్బా ఆఫ్రికాలోని ఖైర్వాన్ చేరుకొని తనపై అమీర్ ముఆవియాకు చాడీలు చెప్పిన గవర్నర్ అబుల్‌మహాజర్‌ని పట్టుకొని జైల్లో వేశాడు. కొన్నాళ్ళకు అబుల్‌మహాజర్ జైల్లోనే చనిపోయాడు. చనిపోయే ముందు అతను మస్మికసీలా అనే బర్బరీతెగకు చెందిన నవముస్లిం పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాడు. కాని ఉఖ్బా దాన్ని గురించి పట్టించుకోలేదు.

ఆ తర్వాత ఉఖ్బా రాజధాని ఖైర్వాన్ రక్షణకోసం జుహైర్ బిన్ ఖైస్ నాయకత్వంలో కొంత సైన్యం ఉంచి ఓ పెద్దసైన్యంతో పశ్చిమదిశగా బయలుదేరాడు. బాగాన పట్నం లో రోమ్‌సైన్యంతో ఢీకొని విజయం సాధించాడు. బాగాన పట్నం ముస్లింల కైవశం అయింది. రోమన్లు ఇంకా క్రైస్తవమతంలో చేరని బర్బరీతెగ వాళ్ళను కలుపుకొని ముస్లిం లపై మరొకసారి కాలుదువ్వారు. అయినప్పటికీ ముస్లింయోధులు అత్యధిక సంఖ్యలో ఉన్న రోమన్లను మట్టికరిపించి తంజా పట్టణాన్ని స్వాధీనం చేసుకున్నారు.

అక్కడ్నుంచి వారు మొరాకో ప్రాంతాన్ని పూర్తిగా వశపరచుకొని అట్లాంటిక్ మహా సముద్రం వద్దకు చేరుకున్నారు. సేనాపతి ఉఖ్బా బిన్‌నాఫె తన గుర్రాన్ని సముద్రంలోకి తోలి "దేవా! నాదారిలో ఈ సముద్రం గనక అడ్డుగా లేకుండావుంటే భూమి ఎంత వరకైతే ఉంటుందో అక్కడిదాకా నేను నీమార్గంలో పోరాడుతూ వెళ్తాను" అని అన్నాడు. ఆ తరువాత ఉఖ్బా సముద్రతీరం వదలి ఖైర్వాన్‌కు తిరిగెళ్ళిపోవడానికి నిర్ణయించు కున్నాడు. ఇప్పుడు మొత్తం ఉత్తరాఫ్రికా ఇస్లామీయ సామ్రాజ్యపరిధిలోకి వచ్చింది.

సేనాపతి ఉఖ్బా తిరుగు ప్రయాణంలో సైన్యాన్ని అనేక దళాలుగా విభజించి తన అధీనంలో ఓ చిన్నదళాన్ని ఉంచుకొని ప్రయాణం సాగించాడు. ఈ ప్రయాణంలో కనుచూపుమేరలో ఎక్కడా నీటిసూచనలు కూడా లేని ప్రదేశం ఒకటి వచ్చింది. సైనికుల దగ్గరున్న నీళ్ళు అయిపోయాయి. దాంతో వారు దప్పికతో తల్లడిల్లిపోసాగారు. నాలుకలు పిడచకట్టుకుపోతున్నాయి. అప్పుడు ఉఖ్బా చేతులు జోడించి విశ్వప్రభువుని ప్రార్థించాడు. అంతలో ఆయన గుర్రం కాలిగిట్టతో నేలను గీకింది. ఆ మరుక్షణంలోనే నేల నుండి ఒక ఊటబావి వెలువడి నీళ్ళు పొంగివచ్చాయి. దాంతో సైనికులంతా పరమసంతోషం తో కడుపారా నీళ్ళు తాగి దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నారు. ఈ ఊటబావి మావుల్‌ఫెర్స్ పేరుతో ఈనాటికీ ప్రజలకు నీరు అందజేస్తోంది.

అక్కడ్నుంచి ఉఖ్బా సైనికదళం తీసుకొని హతూజా అనే ప్రదేశానికి చేరుకున్నాడు. అయితే అక్కడ రోమన్లు ముస్లింయోధులు చాలా తక్కువమంది ఉండటం చూసి వారిపై దాడిచేయదలిచారు. మరొకవైపు ఉఖ్బాసైన్యంలోని నవముస్లిం కసీలా రోమన్ల సైన్యంలో ఉన్న తన తెగవారైన బర్బరీల దగ్గరకు వెళ్ళి వారిని ముస్లింలపైకి ఉసి గొల్పాడు. దాంతో రోమన్లు మరింత బరితెగించి ముస్లింలపై విరుచుకుపడ్డారు. ముస్లిం యోధులు అనేకమంది శత్రువుల్ని సంహరిస్తూ ఒక్కొక్కరే నేలకొరిగిపోయారు. చివరికి సేనాపతి ఉఖ్బా కూడా నేలకొరిగి అమరగతి పొందాడు.



# 38. ఇస్లాం సామ్రాజ్యం ముక్కచెక్కల దిశగా

హి.శ. 64లో యజీద్ మరణించిన తర్వాత అతని ఇరవైఏళ్ళ కొడుకు ముఆవియా బిన్ యజీద్‌ని సిరియా ప్రజలు బలవంతంగా గద్దె నెక్కించారు. ధర్మపరాయణుడు, దైవభీతిపరుడైన ఆ యువకుడికి అధికారకాంక్ష ఏమాత్రం లేదు. పైగా అతను జబ్బుపడి కూడా ఉన్నాడు. అతను ఖిలాఫత్ పదవిలో రెండు మూడు నెలలు మాత్రమే ఉన్నాడు. తర్వాత వ్యాధి ముదిరిపోవడంతో చనిపోయాడు. ఆ రెండు మూడు నెలల్లో చెప్పుకోదగ్గ సంఘటనలు ఏవీ సంభవించలేదు.

ఆ తరువాత ఇస్లామీయసామ్రాజ్యం మరిన్ని అంతఃకలహాలతో ముక్కచెక్కల దిశగా సాగింది. నాల్గవ ఖలీఫా అలి (రజి) కాలంలోనే సిరియాగవర్నర్ అమీర్ ముఆవియా (రజి) హజ్రత్‌ఉస్మాన్(రజి) హత్యకు ప్రతీకారం నెపంతో కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు లేవదీసి తనరాష్ట్రాన్ని వేరుపరచుకున్నారు. యజీద్ పాలనాకాలంలో మక్కాప్రజలు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేయడం జరిగింది. ఆ తర్వాత క్రమంగా ఇరాఖ్, ఈజిప్టు మొదలైన ప్రాంతాలతో సహా ఇస్లామీయ సామ్రాజ్యంలోని దాదాపు యావత్తు ప్రాంతాలు ఇబ్నెజుబైర్ (రజి) అధికార పరిధిలోకి వచ్చాయి. సరిగ్గా అదే సమయంలో బనూఉమయ్యా తెగకు చెందిన మర్వాన్ బిన్ హకం రంగంలోకి దిగడంతో ఇబ్నెజుబైర్ (రజి)కు, ఆయన రాజ్యానికి గడ్డుకాలం ఎదురైంది.

డెమాస్కస్‌లో యజీద్ కుమారుడు ముఆవియా చనిపోయిన తరువాత యజీద్ రెండవ కుమారుడు ఖాలిద్‌ని ఖలీఫా చేయడానికి ప్రజలు ప్రయత్నించారు. అయితే అతను వయసులో చాలా చిన్నవాడైనందున ఒక షరతుపై మర్వాన్ బిన్ హకంని గద్దె ఎక్కించే నిర్ణయం జరిగింది. మర్వాన్ తదనంతరం యజీద్ రెండవ కొడుకు ఖాలిద్ బిన్ యజీద్‌ని, అతని తర్వాత అమ్ర్ బిన్ సయీద్‌ని ఖలీఫా చేయాలన్నదే ఆ షరతు. ఇలా సిరియాప్రజలు హి.శ. 64లో మర్వాన్‌ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్ చేశారు.

హి.శ. 64లో మర్వాన్ సిరియాలో అధికారం చేపట్టిన తర్వాత ఇస్లామీయ సామ్రా జ్యంలో ఎన్నోసంఘటనలు, పరిణామాలు సంభవించాయి. అవి ఓ క్రమపద్ధతిలో లేవు. అంచేత వివరాలు వదిలేసి తేదీలవారిగా వాటిని నేనిక్కడ సంక్షిప్తంగా పేర్కొంటున్నాను.

**(1)** సిరియాలో బనూఖైస్, బనూకలబ్ అనే రెండు శక్తిమంతమైన తెగలున్నాయి. ఈ తెగలు అజ్ఞానకాలంలో ఎల్లప్పుడూ పోట్లాడుకుంటూ ఉండేవి. ఇస్లాం ఆ జగడాన్ని అంతమొందించి వాటిని కలిపింది. అమీర్ ముఆవియా (రజి) తన పాలనాకాలంలో ఆ రెండు తెగలను మచ్చిక చేసుకున్నారు. ఆయన వాటిని తన గుప్పెట్లో పెట్టుకోవడా నికి తన కొడుకు యజీద్ వివాహం బనూకలబ్ తెగ అమ్మాయితో జరిపించాడు. బనూ ఖైస్‌తెగవారిని సంతోషపెట్టే చర్యలు కూడా తీసుకున్నారు. అయితే యజీద్ మరణా నంతరం ఈ రెండు తెగల మధ్య మళ్ళీ పోరు మొదలైంది. అంచేత మర్వాన్ ఖలీఫా పీఠం అధిరోహించగానే బనూకలబ్ తెగకు చెందిన పదమూడు వేల మంది సైనికుల్ని తీసుకొని బనూఖైస్ తెగపై దాడిచేశాడు. బనూఖైస్‌తెగ సైనికుల కంటే బనూకలబ్ తెగ

సైనికులు ఎంతో అధికంగా ఉన్నప్పటికీ ఇబ్నెజియాద్ పన్నాగంతో మర్వాన్ బనూకలబ్ తెగ మీద విజయం సాధించాడు. ఈ యుద్ధం హి.శ. 64లో జరిగింది.

**(2)** ఇమామ్ హుసైన్(రజి) హత్యకు ప్రతీకారం సాకుతో ముఖ్తార్ బిన్ అబూ ఉబైదా అనేవాడు కూడా రంగంలోకి దిగి తన బూటకపు మహిమలతో అరాచకాలకు తెగబడ్డాడు. కూఫా ప్రజలు అతని వలలో పడిపోయి యుద్ధానికి సమాయత్తమయ్యారు. అయితే కొందరు కూఫా ప్రముఖుల సహకారంతో కూఫాగవర్నర్ అబ్దుల్లా బిన్ యజీద్, ముఖ్తార్‌ని పట్టుకొని జైల్లో పడవేశాడు.

**(3)** ఇమామ్ హుసైన్(రజి) హత్యకు ప్రతీకారమనే ముఖ్తార్ ప్రకటనకు ప్రభావితులైన సులైమాన్ బిన్ సరద్, అతని అనుచరులు కూడా రంగంలోకి దిగారు. అసలు వీరే హుసైన్ (రజి) పట్ల నమ్మకద్రోహానికి పాల్పడి ఆయన్ని హత్యచేయించారు. ఆ తర్వాత వీరు పశ్చాత్తాపంచెంది హుసైన్ (రజి) హంతకుల్ని హతమార్చడానికి సిద్ధమయ్యారు. మొదట్లో వీరు హుసైన్(రజి) హత్యకు మూలకారకుడైన ఇబ్నెజియాద్‌ని చంపడానికి డెమాస్కస్‌కు బయలుదేరారు. కాని దారిలో ఇబ్నెజియాద్ పంపిన సైన్యంతో పోరాడి ఓడిపోయారు. హి.శ. 65లో జరిగిన ఈ యుద్ధాన్ని తవాబీన్‌యుద్ధం అంటారు.

**(4)** ఆ రోజుల్లోనే ఖారిజీలు కూడా బలంపుంజుకొని మళ్ళీ అరాచకాలకు తెగబడ్డారు. వారు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అధీనంలోని బస్రాసైనికులపై యుద్ధంచేసి విజయం సాధించారు. కాని ఆ తరువాత జరిగిన మరొక యుద్ధంలో ఖారిజీలు చిత్తుగా ఓడిపోయి కర్మాన్, ఇస్ఫహాన్‌ల దిశగా పారిపోయారు.

## 1) మర్వాన్ పర్యవసానం

**(5)** మర్వాన్ హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలం నుండే కుట్రలు పన్నడంలో ఆరితేరాడు. అతను బైత్ షరతుల్ని ఖాతరుచేయకుండా తన తర్వాత తన కొడుకులకు అధికారం కట్టబెట్టే ఉద్దేశంతో దుష్టపథకాలు మొదలెట్టాడు. మొదట అతను యజీద్ (వితంతు)భార్యను వివాహం చేసుకొని, ఇబ్నెజియాద్ సహకారంతో ఆమె తెగవారైన బనూకలబ్ ప్రజల మద్దతు సంపాదించడానికి ప్రయత్నించాడు. అందులో విజయం సాధించిన తరువాత ఖాలిద్ బిన్ యజీద్ బంధుమిత్రుల్ని తనవైపుకు తిప్పుకొని ఖాలిద్‌ని కించపరచడానికి, చంపడానికి కూడా కుట్రపన్నాడు. దాంతో ఖాలిద్ తీవ్రమనస్తాపానికి గురై తన తల్లితో, అంటే మర్వాన్ భార్యతో చెప్పుకున్నాడు. అప్పుడామె అతనికి ధైర్యం చెప్పి మర్వాన్‌ని చంపడానికి పన్నాగం పన్నింది. దానికోసం ఆమె తన చెలికత్తెల్ని ఒప్పించింది. పథకంప్రకారం ఓరోజు అర్ధరాత్రి మర్వాన్ గాఢనిద్రలో ఉన్నప్పుడు ఆ చెలికత్తెలు అతని నోట్లో గుడ్డలు కుక్కి గొంతుపిసికి చంపేశారు. ఈ సంఘటన హి.శ. 65లో జరిగింది. మర్వాన్ దాదాపు పదినెలలు రాజ్యమేలి 63 ఏండ్ల వయసులో చనిపోయాడు. మర్వాన్ చనిపోయిన రోజే సిరియా ప్రజలు అతని కుమారుడు అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ ఖిలాఫత్‌ని అంగీకరిస్తూ బైత్ చేశారు. అబ్దుల్‌మలిక్ ఖిలాఫత్ పీఠం ఎక్కగానే ఖాలిద్ బిన్ యజీద్ తల్లి ఉమ్మె ఖాలిద్‌ని ప్రతీకార శిక్ష (ఖిసాస్)గా హతమార్చాడు.



## 2) ముఖ్తార్ అరాచకాలు

**(6)** పైన (2)వ నెంబర్ పేరాలో ముఖ్తార్ బిన్ అబూఉబైదా జైలు పాలయ్యాడని పేర్కొనబడింది. అతను తవాబీన్ యుద్ధంలో ఇబ్నెజియాద్ సైన్యం చేత చావుదెబ్బలు తినివచ్చిన కూఫా సైనికులకు ధైర్యం చెబుతూ, తాను జైలు నుంచి బయటపడిన తర్వాత ఇమామ్ హుసైన్ (రజి) హంతకుల్లో ఒక్కడ్నీ వదలిపెట్టకుండా హతమార్చుతానని లేఖ ద్వారా తెలియజేశాడు. ఆ తరువాత అతను కల్లబొల్లి మాటలతో మక్కాలో ఉన్న అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) చేత సిఫారసు చేయించుకొని జైలు నుంచి బయటపడ్డాడు. తవాబీన్ యుద్ధవీరులు దాన్ని మహిమగా భావించి అతడ్ని ఎంతో గౌరవించసాగారు.

హి.శ. 66లో అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కూఫాగవర్నర్ అబ్దుల్లా బిన్ యజీద్‌ని తొలగించి అతని స్థానంలో అబ్దుల్లా బిన్ ముతీని నియమించారు. ఓరోజు కూఫా ప్రధాన రక్షకభటుడు, ముఖ్తార్ భక్తులసంఖ్య పెరుగుతున్న వైనం, అతని ప్రమాదకరమైన కార్యకలాపాలను గురించి గవర్నర్ ముందు ప్రస్తావించాడు. వెంటనే గవర్నర్ అతడ్ని పిలిపించి నిలదీయడానికి ప్రయత్నించాడు. కాని ముఖ్తార్ తనకేదో రోగమొచ్చి కదలలేని పరిస్థితిలో ఉన్నానని నాటకమాడి ముఖం చాటేశాడు.

ఆ తరువాత ముఖ్తార్ సైనికులు ఓరోజు రాత్రివేళ ముందేసుకున్న పథకం ప్రకారం గవర్నర్ భవనాన్ని ముట్టడించారు. కాని ప్రభుత్వ సైనికులు వారిని నిలువరించలేకపోయారు. దాంతో గవర్నర్ అబ్దుల్లా బిన్ ముతీ పారిపోయి హజ్రత్ అబూమూసా (రజి) ఇంట్లో దాక్కున్నాడు. ముఖ్తార్ సైనికులు గవర్నర్ భవనంపై దాడిచేసి అనేకమందిని హతమార్చి ప్రభుత్వధనాగారాన్ని దోచుకున్నారు. ముఖ్తార్ పారిపోయిన గవర్నర్ అబ్దుల్లా బిన్ ముతీ జాడ తెలుసుకొని అతనికి లక్ష దీనార్ల పైకం పంపుతూ ఈడబ్బు తీసుకొని మూడురోజుల్లో ఇక్కడుంచి మక్కా వెళ్ళిపోవాలని అల్టిమేటం ఇచ్చాడు. పాపం అబ్దుల్లా బిన్ ముతీ మక్కా వెళ్ళడానికి సిగ్గుపడి బస్రా వెళ్ళిపోయాడు.

ముఖ్తార్ ప్రవర్తనతో అసంతృప్తిచెందిన కొందరు అతనికి వ్యతిరేకులైపోయారు. అంచేత ముఖ్తార్ తన వీరభక్తుడైన సర్వసేనాని ఇబ్రాహీం చేత తనను వ్యతిరేకించిన వారందర్నీ హతమార్పించాడు. ఆనాడు కూఫావాసులపై ప్రళయం విరుచుకుపడింది. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు మృత్యువాత పడ్డారు. అంతటితో తృప్తిచెందక ఆ దుర్మార్గుడు ఇబ్నెజియ౦ాద్‌తోపాటు ఇమామ్ హుసైన్ (రజి) హత్యలో పాల్గొన్నవారి జాబిత తయారు చేయించి మరొకసారి నరసంహారం ప్రారంభించాడు. ప్రజలు ఇండ్ల నుంచి పట్టుబడుతూ వచ్చి మృత్యువాత పడేవారు. ఈ నరసంహారం అనేక రోజులు కొనసాగింది.

ముఖ్తార్ ఆతర్వాత ఇబ్నెజుబైర్ (రజి)కు "నేను మీ ఖిలాఫత్‌ని అంగీకరిస్తూ మీ పట్ల విధేయత ప్రకటిస్తున్నాను. నాకు కూఫాగవర్నర్ పదవి అప్పగించండి" అని లేఖ రాశాడు. ముఖ్తార్ స్వభావం గ్రహించిన ఇబ్నెజుబైర్ (రజి) అతడ్ని పరీక్షించడానికి అమ్ర్ బిన్ అబ్దుర్రహ్మాన్ బిన్ హరస్‌ను గవర్నర్‌గా నియమిస్తూ కూఫా పంపించారు. ఈసంగతి తెలుసుకున్న ముఖ్తార్ అతడ్ని అడ్డుకోవడానికి జాయెద్ బిన్ ఖుదామాకు అయిదొందల మంది సైనికుల్ని, డెబ్భయివేల దిర్హంల పైకాన్నిచ్చి పంపాడు. జాయెద్ దారిలో అమ్ర్

బిన్ అబ్దుర్రహ్మాన్‌ని అడ్డగించి, డబ్బుతో ప్రలోభపెట్టాడు. అప్పుడు అమ్ర్ అతని వెనుకున్న సైనికపటాలం చూసి భయపడి అతనిచ్చిన డబ్బు తీసుకొని బస్రా వెళ్ళిపోయాడు. ముఖ్తార్ కూఫా ఆక్రమించుకున్న తరువాత కొన్నాళ్ళకు తననుతాను దైవప్రవక్త అని కూడా ప్రకటించుకొని మరిన్ని అరాచకాలకు, అలజడులకు పాల్పడ్డాడు.

ముఖ్తార్ ఇమామ్ హుసైన్ (రజి) హత్యలో ప్రధాన నిందితుడైన ఇబ్నెజియాద్‌ని చంపడానికి సేనాపతి ఇబ్రాహీంని పంపించాడు. ఇబ్నెజియాద్ సిరియా రాజ్యాధినేత అబ్దుల్‌మలిక్ తరఫున మోసిల్ రాష్ట్రంలో గవర్నర్‌గా ఉన్నాడు. ఇబ్రాహీం సైన్యం తీసుకొని కూఫా నుండి బయలుదేరి మోసిల్ దిశగా ప్రయాణం సాగించాడు. ఈ సంగతి తెలుసుకున్న ఇబ్నెజియాద్ వెంటనే సైన్యం తీసుకొని మోసిల్ నుండి బయలుదేరాడు. రెండుసైన్యాలు ఖారిజ్ నదీతీరం సమీపానికి చేరుకొని ఢీకొన్నాయి. ఘోరరక్తపాతం జరిగింది. చివరికి ఈ యుద్ధంలో ఇబ్నెజియాద్, అతని సేనాపతి హుసైన్ బిన్ నమీర్ హతమార్చబడ్డారు. ఈ యుద్ధం హి.శ. 66లో జరిగింది.

కూఫారాష్ట్రం ముఖ్తార్ ఆక్రమణలోకి పోవడం, ఖారిజ్ యుద్ధంలో ఇబ్నెజియాద్ హతమవడం జరిగిన తరువాత అతని దృష్టి బస్రా రాష్ట్రంపై పడవచ్చున్న ఆలోచనతో అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) బస్రాలో హరస్ బిన్ రబియాను తొలగించి అతని స్థానంలో తన సోదరుడు ముస్అబ్ బిన్ జుబైర్ (రజి)ని గవర్నర్‌గా నియమించి పంపారు. కూఫా నుండి బస్రాకు చేరుకున్న ముఖ్తార్ పీడితులు అనేకమంది ముస్అబ్ (రజి)కు పూర్తి మద్దతునిస్తూ కూఫాపై దాడిచేయాలని సలహా ఇచ్చారు. ముఖ్తార్ పీడితుల్లో మరికొందరు మక్కా వెళ్ళి అబ్దుల్లా బిన్ జుబైర్(రజి) ముందు తమ గోడు వెలిబుచ్చుకున్నారు. అదీగాక ముఖ్తార్ తనను తాను దైవప్రవక్తనని ప్రకటించుకొని దేవుని వైపు నుండి దైవదూత జిబ్రీల్ (అలైహి) దివ్యావిష్కృతి ద్వారా తనకు దైవసందేశం అందజేస్తున్నాడని ప్రచారం చేసు కుంటున్నాడని కూడా వారు తెలియజేశారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈ విషయాలన్నీ విన్న తరువాత వెంటనే కూఫా మీద దాడిచేయాలని బస్రా రాష్ట్రగవర్నర్ ముస్అబ్ బిన్ జుబైర్ (రజి)కు, పార్శీగవర్నర్ ముహ్లబ్‌కు లేఖలు రాసి పంపారు.

ఈ లేఖలు అందగానే వారిద్దరు కూఫాకు కొందరు దూతలను పంపి ఇబ్నెజుబైర్ (రజి)పేర రహస్యంగా ప్రజలచేత బైత్ చేయించాలని చెప్పి సైనికసన్నాహాలు చేయడం లో నిమగ్నులయ్యారు. ఈ సంగతి తెలుసుకున్న ముఖ్తార్ తీవ్ర అందోళన చెందాడు. కారణం ఇబ్నెజియాద్‌పై యుద్ధం చేయడానికి మోసిల్ వైపు వెళ్ళిన తన సైన్యాధ్యక్షుడు ఇబ్రాహీం ఇంకా కూఫాకు చేరుకోలేదు. అయినప్పటికీ ముఖ్తార్ తన దగ్గరున్న సైన్యం తీసుకొని కూఫా నుండి బయలుదేరాడు. రెండుసైన్యాలు కూఫాకు కొన్నిమైళ్ళ దూరంలోని ఓ గ్రామం దగ్గర ఢీకొన్నాయి. చివరికి కూఫా సైనికులు పలాయనం చిత్తగించగానే ముఖ్తార్ ప్రాణభీతితో కూఫాకు పారిపోయి తనకోటలో దూరి తలుపులు బిగించుకున్నాడు. ఇబ్నెజుబైర్(రజి) సైనికులు కోటను ముట్టడించారు. ముట్టడి దీర్ఘకాలం కొనసాగి ఆహార పదార్థాలు నిండుకోవడంతో ముఖ్తార్ కోట నుంచి బయటికొచ్చి కత్తి ఝుళిపించాడు. ఇబ్నెజుబైర్ సైనికులు అతడి చుట్టుముట్టి శాశ్వతంగా మట్టుబెట్టారు.



ఆ తరువాత వారు కోటలో దిగ్బంధింతులైన ముఖ్తార్ సైనికులందర్నీ ఖైదీలుగా పట్టుకొని కూఫాలోని ఒక విశాలమైన మైదానంలో ఉంచారు. ఈ యుద్ధఖైదీలను వదిలే యాలా లేక హతమార్చాలా అనే ప్రశ్న వచ్చినప్పుడు ముఖ్తార్ వల్ల పీడించబడిన ప్రజ లంతా వారిని హతమార్చాలని ముక్తకంఠంతో చెప్పారు. వారి అభిప్రాయం ప్రకారమే ఆ యుద్ధఖైదీలందరూ హతమార్చబడ్డారు. ఈవిధంగా హి.శ. 67లో ముఖ్తార్ అరాచకం, అలజడులు అంతమైపోయాయి.

**(7)** ఈ యుద్ధంలో ప్రధానపాత్ర వహించిన బస్రాగవర్నర్ ముస్అబ్ బిన్ జుబైర్ (రజి) ఆ తర్వాత మోసిల్‌లో ముఖ్తార్‌చే గవర్నర్‌గా నియమించబడిన ఇబ్రాహీంకు లేఖ రాశారు. అందులో ఇబ్రాహీం, ఇబ్నెజుబైర్ (రజి)ని ఖలీఫాగా అంగీకరిస్తూ తనపట్ల విధేయత ప్రకటిస్తే మోసిల్‌తో పాటు సిరియాని కూడ అప్పగిస్తానని ఇబ్రాహీంకు తెలియజేశారు. అప్పుడు ఇబ్రాహీం కూఫా వచ్చి ముస్అబ్ (రజి)కు విధేయుడైపోయాడు. ముఖ్తార్ హతమార్చబడిన సంగతి తెలిసిన తర్వాత ఇబ్నెజుబైర్ (రజి) బస్రాగవర్నర్ ముస్అబ్ బిన్ జుబైర్ (రజి)కు హి.శ. 68లో కూఫా రాష్ట్రాన్ని కూడా స్వాధీనంచేశారు.

# 3) అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్

**(8)** మర్వాన్ తర్వాత యజీద్ రెండవకొడుకు ఖాలిద్‌ని, అతని తర్వాత అమ్ర్ బిన్ సయీద్‌ని ఖలీఫా చేయాలన్న షరతుపై సిరియాప్రజలు హి.శ. 64లో మర్వాన్‌ని ఖలీఫాగా అంగీకరిస్తూ బైత్‌చేశారు. అయితే మర్వాన్ ఆ షరతును తుంగలోతొక్కి తన కుమారుడు అబ్దుల్‌మలిక్‌ని తన రాజకీయవారసునిగా చేశాడు. మర్వాన్ హత్య తర్వాత ఖిలాఫత్ పీఠం అధిరోహించిన అబ్దుల్‌మలిక్ కూడా ఆ షరతును ఖాతరుచేయలేదు. అప్పుడు షరతులోని రెండవఅభ్యర్థి అమ్ర్ బిన్ సయీద్ రంగంలోకి దిగాడు.

ఇబ్నెజియాద్ యుద్ధంలో హతమార్చబడిన తరువాత అబ్దుల్‌మలిక్ సైన్యాన్ని సమా యత్తపరచి ఇరాఖ్‌పై దాడిచేయడానికి డెమాస్కస్ నుండి బయలుదేరాడు. అప్పుడతని వెంట అమ్ర్ బిన్ సయీద్ కూడా ఉన్నాడు. అబ్దుల్‌మలిక్ తన తదనంతరం అమ్ర్‌ని తన రాజకీయవారసుడిగా చేస్తానని వాగ్దానం చేసివున్నాడు. దారిలో అమ్ర్ ఆ విషయాన్ని గుర్తుచేసి "మీ తదనంతరం మీరు నన్ను మీ రాజకీయవారసుడిగా చేయండ"ని అన్నాడు. కాని అబ్దుల్‌మలిక్ తన వాగ్దానాన్ని భంగంచేసి అమ్ర్‌ని తన రాజకీయవారసుణ్ని చేయడా నికి నిరాకరించాడు. దాంతో అమ్ర్ బిన్ సయీద్ అవకాశం చూసి అతని సైన్యం నుండి తప్పుకొని డెమాస్కస్ దిశగా బయలుదేరాడు.

డెమాస్కస్‌కు చేరుకోగానే అతను అబ్దుల్‌మలిక్ ఇన్‌చార్జ్ గవర్నర్ అబ్దుర్రహ్మాన్‌ని తొలగించి డెమాస్కస్‌ని స్వాధీనంచేసుకొని, తాను ఖిలాఫత్ పీఠం అధిరోహించినట్లు బహి రంగ ప్రకటన చేయించాడు. ఆ తరువాత ప్రజల్ని సమావేశపరచి ప్రసంగిస్తూ వారికి ఎన్నో నోరూరించే వాగ్దానాలు చేశాడు.

ఈసంగతి తెలియగానే అబ్దుల్‌మలిక్ వెనక్కి తిరిగొచ్చి డెమాస్కస్‌ని ముట్టడించాడు. ఇద్దరు నాయకుల మధ్య మొదలైన ఈ యుద్ధం చాలా రోజులు కొనసాగింది. చివరికి

కొందరు పురప్రముఖుల జోక్యంతో వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం అమ్ర్ నగరం నుంచి బయటికొచ్చి డెమాస్కస్‌ను అబ్దుల్‌మలిక్‌కు అప్పగించాడు. అమ్ర్ ఎప్పటికైనా తనకు ప్రమాదకారిగా మారవచ్చన్న ఆలోచనతో అబ్దుల్‌మలిక్ ఓరోజు తనను ఓసారి దర్బారులో కలుసుకోవలసిందిగా అమ్ర్‌కు కబురుచేశాడు. కబురు అందగానే అమ్ర్ దర్బారుకు వచ్చాడు. అబ్దుల్‌మలిక్ అంతకు ముందే కొందరు మనుషుల్ని తయారుచేసి ఉంచాడు. అమ్ర్ వచ్చి కూర్చోగానే వారు ఒక్కసారిగా అమ్ర్ మీద విరుచుకుపడి అతని చేతులు విరిచి కట్టేశారు. ఆ తరువాత తీసికెళ్ళి కారాగారంలో పడవేశారు.

అమ్ర్ బిన్ సయీద్ సోదరుడు యహ్యాకు ఈసంగతి తెలియగానే అతను వేయి మంది సైనికులతో వచ్చి డెమాస్కస్‌ని ముట్టడించాడు. అప్పుడు అబ్దుల్‌మలిక్, అమ్ర్ శిరస్సు ఖండించి దాన్ని కోటగోడ పైనుంచి యహ్యా సైనికుల వైపు విసిరాడు. దాంతో పాటు డబ్బు, వరహాలు కూడా వారివైపు విసిరాడు. యహ్యా సైనికులు యహ్యా ఆదేశాన్ని పెడచెవిన పెట్టి డబ్బు, వరహాలు ఏరుకోవడానికి ఎగబడ్డారు. పాపం యహ్యా అసహాయ స్థితిలో ఒంటరిగా నిలబడ్డాడు. వెంటనే అబ్దుల్‌మలిక్ సైనికులు అతడ్ని పట్టుకొని బంధించారు. అతని కొడుకుల్ని కూడా పట్టుకొని జైల్లో పడవేశారు.

## 4) ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) పర్యవసానం

**(9)** హి.శ. 70లో ఈరాన్‌లో ఖారిజీలు మళ్ళీ బలం పుంజుకొని అరాచకాలకు తెగబడ్డారు. అంచేత ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) మోసిల్ గవర్నర్ ముహ్లబ్ బిన్ సఫరాను మోసిల్ నుంచి తొలగించి, పార్శీ ప్రాంతం పాలకునిగా నియమిస్తూ ఖార్జీల పీచం అణచడానికి బయలుదేరాలని ఆదేశించారు. దానిపై ముహ్లబ్ మాట్లాడుతూ "మోసిల్ వదలి పార్శీ ప్రాంతం వెళ్ళడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు. కాని మోసిల్ నుండి నన్ను వేరుచేయడం వల్ల మీరు ప్రమాదంలో పడిపోతారు. అబ్దుల్‌మలిక్ ఇరాఖ్‌లో మీకు వ్యతిరేకంగా కుట్రపన్ని రహస్యపథకాల వల విసిరి అవకాశం కోసం పొంచిచూస్తున్నాడు. నేనతని నక్కజిత్తుల స్వభావం పూర్తిగా గమనించాను" అని అన్నాడు.

ముస్‌అబ్(రజి) ఆ సలహా త్రోసిపుచ్చి ఖారిజీల అణచివేతకే ప్రాధాన్యమిచ్చారు. దాంతో ముహ్లబ్ 'మోసిల్'ని వదలిపెట్టి పార్శీప్రాంతానికి వెళ్ళిపోవలసివచ్చింది. ముస్‌అబ్ దగ్గర ముహ్లబ్, ఇబ్రాహీంలు అనుభవశాలురైన గొప్పసేనాపతులు. కాని ముస్‌అబ్ (రజి) ఆ ఇద్దరిలో ముహ్లబ్‌ని ఖారిజీల అణచివేత కోసం పంపారు. ద్వితీయశ్రేణి సేనాపతుల్లో అబ్దుల్లా బిన్‌హాజిమ్, ఇబాద్ బిన్‌హుసైన్‌లు ముఖ్యులు. అబ్దుల్లాని ఆయన ఖురాసాన్ పాలనాబాధ్యత అప్పగించి పంపివేశారు. ఇబాద్‌ని ముహ్లబ్‌కు సహాయకారిగా పంపారు. ఇలా ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) అత్యంత ప్రయోజకులైన యోధుల్ని తన నుండి వేరుచేసుకొని సుదూరప్రాంతాలకు పంపివేశారు. ఆయన దగ్గర ఇప్పుడు ఇబ్రాహీం బిన్ మాలిక్, అమ్ర్ బిన్ అబ్దుల్లా బిన్ మామ్మర్‌లు మాత్రమే సేనాపతులుగా ఉన్నారు.

అలాంటి పరిస్థితుల్లో అబ్దుల్‌మలిక్ ఖారిజీలను ప్రలోభాలతో తనవైపు తిప్పుకోవడానికి కొందరు మనుషుల్ని పార్శీ ప్రాంతానికి పంపాడు. మరికొందరిని కూఫా, బస్రాలకు పంపి తన కుట్రలు, కుయుక్తుల్ని ప్రారంభించాడు.



అబ్దుల్‌మలిక్ ఇరాఖ్‌లో అనేకమందిని తన వైపు తిప్పుకొని కూడగట్టడంలో చాలా వరకు సఫలమయ్యాడు. అయితే బస్రాలో అతని సేనాపతి ఖాలిద్ సాగిస్తున్న కార్యకలాపాల సంగతి బస్రాగవర్నర్ ఉమర్ బిన్ అబ్దుల్లా బిన్ మామ్మర్‌కు తెలిసి ఆయన ఖాలిద్ అనుచరులపై దాడిచేసి అతడ్ని బస్రా నుండి వెళ్ళగొట్టాడు. పరిస్థితుల తీవ్రతను గురించి తెలుసుకున్న ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) వెంటనే యుద్ధసన్నాహాలు ప్రారంభించారు. కాని బస్రా సైనికుల్లో కొందరు విద్రోహచర్యలకు పాల్పడ్డారు.

అటు అబ్దుల్‌మలిక్ పెద్దఎత్తున సైనికుల్ని సమీకరించి ఇరాఖ్ వైపు బయలుదేరాడు. ఆ సంగతి తెలుసుకున్న ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) కూడా అతడ్ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. కాని ఆయన దగ్గర సైనికసంఖ్య చాలా తక్కువగా ఉంది. అదీగాక యుద్ధానికి బయలుదేరిన తరువాత దారిలో అనేకమంది శత్రుసైనికుల్లో చేరిపోయారు. చివరికి ఒకచోట రెండుసైన్యాలు ఢీకొన్నాయి. పెద్దఎత్తున సమరజ్వాలలు ఎగిసిపడ్డాయి. ముస్‌అబ్ (రజి) సేనాపతి ఇబ్రాహీం శత్రువలయంలో చిక్కుకొని పోరాడుతూ నేలకొరిగిపోయాడు. దాంతో అబ్దుల్‌మలిక్ సైనికుల్లో సమరోత్సాహం ద్విగుణీకృతమయింది.

సేనాపతి ఇబ్రాహీం నేలకొరిగిపోగానే ముస్‌అబ్ (రజి) ఇతర దళపతుల్ని ముందుకు వెళ్ళి దాడిచేయమని ఆదేశించారు. కాని వారిలో ఒక్కడూ ముందడుగు వేయకుండా శిలాప్రతిమల్లా గుడ్లప్పగించి చూడసాగారు. కొందరు మాత్రమే శక్తివంచన లేకుండా పోరాడసాగారు. కూఫాప్రజలు ఇమామ్‌హుసైన్ (రజి) హత్య తర్వాత మరొకసారి వంచకులుగా, విద్రోహులుగా నిరూపించుకున్నారు. ముస్‌అబ్ (రజి) తన సైనికుల సహాయ నిరాకరణ ధోరణి చూసి విస్తుపోయారు. చివరికాయన ఆశ్చర్యం నుండి తేరుకొని నడుం బిగించి కత్తిఝుళిపిస్తూ కదనరంగంలోకి దూకారు. అప్పుడాయన వెంట ఏడుగురు యోధులుమాత్రమే ఉన్నారు. అయినప్పటికీ ఆయన ప్రాణాలకు తెగించి అప్రతిహతంగా దాడిచేస్తూ అనేకమంది శత్రువుల్ని నేలకూల్చారు. ఆ తరువాత ఆయన కూడా అనేక గాయాలతో నేలకూలి ఊపిరి విడిచారు. ఈ యుద్ధం హి.శ. 71లో జరిగింది.

ముస్‌అబ్ బిన్ జుబైర్ (రజి) నేలకొరగగానే అబ్దుల్‌మలిక్ సైనికులు ఆయన శిరస్సు ఖండించారు. ఆ శిరస్సు తీసికెళ్ళి కూఫా వీధుల్లో తిప్పారు. తరువాత సిరియా రాజధాని డెమాస్కస్‌కు తీసికెళ్ళి ఒక బహిరంగ ప్రదేశంలో వ్రేలాడదీశారు. ఆ తరువాత సిరియా పట్టణాల్లో తిప్పాలని నిర్ణయించారు. అప్పుడు అబ్దుల్‌మలిక్ భార్య ఆతికా బిన్త్ యజీద్ బిన్ ముఆవియా తీవ్రనిరశన వ్యక్తపరుస్తూ "ఇప్పటిదాకా నువ్వు చేసినదానితో కూడా నీ కళ్ళు చల్లబడలేదా? ఇప్పుడా శిరస్సును ప్రజల ముందు ప్రదర్శిస్తూ ఎందుకు తిప్పుతున్నావు?" అని అడిగింది అబ్దుల్‌మలిక్‌ని. అప్పుడతను ముస్‌అబ్ (రజి) శిరస్సు దించి స్నానం చేయించి సమాధి చేయించాడు.

యుద్ధం ముగిసిన వెంటనే అబ్దుల్‌మలిక్ కూఫా ఆక్రమించుకొని అక్కడి ప్రజల చేత ఖిలాఫత్ బైత్ చేయించుకున్నాడు. ఆ తరువాత ఫార్శీ, బస్రా, ఖురాసాన్, అహ్వాజ్ వగైరా రాష్ట్రాల పాలకులకు లేఖలు రాసి భయపెట్టి బైత్ చేయించుకున్నాడు. ఖురాసాన్ గవర్నర్ అబ్దుల్లా బిన్ హాజమ్ బైత్‌చేయడానికి నిరాకరిస్తే అతడ్ని హతమార్చాడు.

# 39. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఖిలాఫత్

అబ్దుల్లా బిన్ జుబైర్ బిన్ అవ్వామ్ (రజి) దైవప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు వలస వచ్చిన ఇరవై నెలల తర్వాత మదీనాలో జన్మించారు. ఆయన జన్మ పట్ల ముస్లింలలో సర్వత్రా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. కారణం ముహాజిర్ ముస్లింలు మదీనా వలస వచ్చి సంవత్సరం గడిచినా వారికి సంతానం కలగకపోవడంతో యూదులు తాము ముస్లింలకు పిల్లలు పుట్టకుండా చేతబడి చేశామని, ఇకముందు మదీనాలో ముస్లింలకు పిల్లలుపుట్టరని చెబుతుండేవారు. కాని దేవుడు వారి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాడు.

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) తండ్రి జుబైర్ (రజి) స్వర్గవాసులవుతారని దైవప్రవక్త (స) ప్రకటించిన పదిమంది సహాబీలలో ఒకరు. ఇబ్నెజుబైర్ (రజి) తల్లి హజ్రత్ అస్మా (రజి) మొదటి ఖలీఫా అబూబకర్ (రజి) కుమార్తె. ఇబ్నెజుబైర్ (రజి) నాయనమ్మ హజ్రత్ సఫియా (రజి). ఆమె దైవప్రవక్త (స) మేనత్త. ఇబ్నెజుబైర్ (రజి) పుట్టగానే దైవప్రవక్త (స) ఓ ఖర్జూరపండు నమిలి ఆయన నోట్లో పెట్టి అబ్దుల్లా అని పేరుపెట్టారు.

## 1) ఇబ్నెజుబైర్ (రజి) ఘనతా ఔన్నత్యాలు

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) నమాజ్, ఉపవాసాలు అత్యధికంగా పాటించేవారు. ఒక్కోసారి ఆయన రాత్రంతా నమాజ్‌లో నిలబడే (ఖ్యామ్) ఉండేవారు. అలాగే ఒక్కోసారి రాత్రంతా రుకూలో, మరొక్కసారి రాత్రంతా సజ్దా (సాష్టాంగప్రణామం)లో ఉండేవారు. ఆయన తన బంధువుల బాగోగుల విషయంలో ఎంతో శ్రద్ధ వహించేవారు. ఆయన వజ్ర సంకల్పుడు, దృఢచిత్తుడు; కష్టాలను ఎంతో సహనస్థయిర్యాలతో ఎదుర్కొనేవారు.

ముజాహిద్ కథనం ప్రకారం ప్రజలు కష్టతరమైన ఏ ఆరాధన చేయలేక చేతులెత్తాస్తారో, ఆ ఆరాధనను కూడా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) చేసేవారు. ఒకసారి మక్కాలో కుంభవృష్టి కురవడంతో కాబా నీటిలో దాదాపు మునిగిపోయింది. అలాంటి పరిస్థితిలో కూడా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఆ నీటిలో ఈదుతూ కాబాప్రదక్షిణ చేశారు.

హజ్రత్ ఇబ్నెజుబైర్ (రజి) అత్యంత పరాక్రమశాలి, ప్రతిభావంతులు. శత్రుసమూహంలోకి సుడిగాలిలా దూసుకుపోయి శవాలగుట్టలను పేర్చేవారు. ఆయన మంచి వక్త కూడా. ఆయన ప్రసంగం గలగల పారే సెలయేరులా సాగిపోతుంది. ఆయన నోట వెలువడే ఒక్కొక్క మాట కొండలను ఢీకొని ప్రతిధ్వనిస్తుంది. ఉమర్ బిన్ ఖైస్ కథనం ప్రకారం ఇబ్నెజుబైర్ దగ్గర విభిన్న భాషలు మాట్లాడే వందమంది బానిసలు ఉండేవారు. ఆయన వారిలో ప్రతి బానిసతో అతని భాషలోనే మాట్లాడేవారు.

ఒకరోజు అబ్దుల్లా అసది అనే ఒకతను ఇబ్నెజుబైర్ (రజి) సన్నిధికి వచ్చి "విశ్వాసుల నాయకా! నేను, మీరు ఫలానా పరంపర నుండి పరస్పరం బంధువులం" అని అన్నాడు. దానిపై ఇబ్నెజుబైర్ (రజి) మాట్లాడుతూ "నిజమే. కాని కాస్త ప్రశాంతంగా ఆలోచిస్తే మానవులంతా ఆదం (అలైహి), హవ్వా (అలైహి)ల సంతానం అయిన దృష్ట్యా పరస్పరం బంధువులవుతారని అర్థమవుతుంది" అని అన్నారు. అబ్దుల్లా అసది ఈమాట విని



"అయ్యా! నా దగ్గరున్న భత్యమంతా అయిపోయింది. ఖర్చుపెట్టుకోవడానికి నాదగ్గర చిల్లిగవ్వ కూడా లేదిప్పుడు" అని అన్నాడు. ఇబ్నెజుబైర్ (రజి) ఈమాట విని "నేను నీ భత్యానికి ఎలాంటి జామీను ఇవ్వలేదు" అన్నారు. "మహాశయా! నా ఒంటె చలితో చచ్చిపోతోంది" అన్నాడా వ్యక్తి. "అయితే నీ ఒంటెను ఏదైనా వేడి చోటుకు చేర్చి దాని మీద వెచ్చని దుప్పటి కప్పు" అన్నారు ఇబ్నెజుబైర్ (రజి).

పాపం అబ్దుల్లా అసది బిక్కమొగం వేసుకొని "నేను మీ దగ్గరకు మీ సలహాలు తీసుకోవడానికి రాలేదు; సహాయం అడగడానికి వచ్చాను. నన్ను మీదాకా చేర్చిన ఆ ఒంటెపై దేవుని అభిశాపం పడుగాక!" అన్నాడు కాస్తంత అసహనంతో. దానిపై ఇబ్నెజుబైర్ (రజి) "ఆ ఒంటెపై ఎక్కివచ్చిన రౌతును కూడా శపించు" అని అన్నారు.

## 2) రాజ్యపరిధిలో ఒడిదుడుకులు

మక్కాలో అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ప్రభుత్వం అమీర్ ముఆవియా (రజి) మరణానంతరం నుంచే ఏర్పడి కొనసాగుతోంది. యజీద్ బిన్ ముఆవియా పాలనాకాలంలో అతని సైనికులు మక్కాపై దాడులు చేసినప్పటికీ ఆరోజుల్లోనే యజీద్ చనిపోవడంతో ఈ దాడులు ఆగిపోయాయి. యజీద్ చనిపోయిన తరువాత ఇబ్నెజుబైర్ (రజి)కు అనేక రాష్ట్రాల నుండి ప్రజల మద్దతు లభించింది. అప్పుడు సిరియా రాష్ట్రం తప్ప మొత్తం ఇస్లామీయ సామ్రాజ్యానికి ఆయన ఏకైక ఖలీఫా అయ్యారు.

అయితే ఆ రోజుల్లోనే హి.శ. 64లో సిరియా ప్రజలు బనూఉమయ్యా తెగకు చెందిన మర్వాన్ బిన్ హకం ఖిలాఫత్‌ను అంగీకరిస్తూ బైత్ చేయడంతో ఇబ్నెజుబైర్ (రజి)కు, ఆయన రాజ్యానికి గడ్డుకాలం మొదలయింది. ఫలితంగా ఈజిప్టు ఆయన రాజ్యపరిధి నుండి వేరైపోయింది. హి.శ. 65లో మర్వాన్ హత్య తరువాత అతని కొడుకు అబ్దుల్‌మలిక్ సిరియాలో అధికారం చేపట్టగానే కూఫాని ఆక్రమించుకొని అక్కడి ప్రజల చేత ఖిలాఫత్ బైత్ చేయించుకున్నాడు. ఆ తరువాత పార్శీ, బస్రా, ఖురాసాన్, అహ్వాజ్ వగైరా రాష్ట్రాలు కూడా ఎన్నో ఒడిదుడుకులకు గురవుతూ క్రమంగా ఇబ్నెజుబైర్ (రజి) నుండి చేజారిపోయాయి.

## 3) ధర్మాత్ముడా? దౌర్జన్యపరుడా??

అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ ఇరాఖ్, ఈరాన్‌లపై పట్టుసాధించిన తరువాత మక్కాపై దృష్టి సారించాడు. బకర్ బిన్ అబ్దుల్లా మజ్ని ఉల్లేఖనం ప్రకారం యూదమతం నుండి ఇస్లాంలోకి మారిన యూసుఫ్ అనే ఒక ముస్లింకు అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ స్నేహితుడయ్యాడు. అతను గత దైవగ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన పండితుడు. ఒక రోజు అతను అబ్దుల్‌మలిక్ భుజం తట్టుతూ "నువ్వు రాజు అయినప్పుడు ముహమ్మద్ (స) అనుచరసముదాయం విషయంలో దేవునికి భయపడుతూ వ్యవహరించాలి సుమా" అని అన్నాడు. దానికి అబ్దుల్‌మలిక్ "ఇకచాలు ఊరుకో. నేనెక్కడా, రాజరికం ఎక్కడా!" అన్నాడు. "నేను నీకు మరొకసారి చెబుతున్నాను. ముస్లిం సముదాయం విషయంలో దేవునికి భయపడుతూ మసలుకోవాలి" అన్నాడు యూసుఫ్.

ఆ తరువాత యజీద్ తన సైన్యాన్ని మక్కాపై దాడిచేయడానికి పంపినపుడు అబ్దుల్‌మలిక్ తన స్నేహితుడు యూసుఫ్‌తో "దేవుడు నన్నెప్పుడూ పవిత్ర కాబాపై సైనిక చర్య తీసుకోనీయకుండా చేయుగాక!"అన్నాడు. అప్పుడు యూసుఫ్ మళ్ళీ అబ్దుల్‌మలిక్ భుజం తట్టుతూ "కంగారుపడకు, మక్కాపై దాడిచేయడానికి వెళ్ళే నీసైన్యం యజీద్ సైన్యంకంటే ఎంతో బలంగా ఉంటుంది" అని అన్నాడు.

యహ్యాగస్సాని కథనం: నేను మదీనాలో అబ్దుల్‌మలిక్‌ని కలసినపుడు అతను నన్ను "నువ్వు కూడా ఆ (యజీద్)సైన్యంలో చేరిపోయావా?" అనడిగాడు. నేను ఔనన్నాను. అప్పుడు అబ్దుల్‌మలిక్ ముఖం చిట్లించి ఇలా అన్నాడు: "నీ ఇల్లు పాడుగాను! నువ్వు ఎలాంటి మనిషిపై ఖడ్గం ఎత్తబోతున్నావో ఆలోచించావా? ఇస్లాం ఆవిర్భవించిన తర్వాత అతను మదీనాలో అందరికంటేముందు పుట్టాడు. అతను దైవప్రవక్త (స) ప్రియ అనుచరుడు. జాతిన్నతాఖీన్ (గా ప్రసిద్ధిచెందిన అస్మా) సుపుత్రుడు. నువ్వతని దగ్గరకు పగటివేళ వెళ్తే అతను ఉపవాసం ఉండటాన్ని చూస్తావు. రాత్రివేళ వెళ్తే అతను నమాజ్‌లో లీనమై ఉండటాన్ని గమనిస్తావు. ఒకవేళ యావన్మంది ప్రజలు అతడ్ని మూకుమ్మడిగా హతమార్చదలిస్తే దేవుడు వారందరినీ తలక్రిందులుచేసి నరకంలోకి పడేస్తాడు."

ఆ తర్వాత యహ్యాగస్సాని "అబ్దుల్‌మలిక్ ఖలీఫా అయిన తర్వాత ఆ మనిషి (ఇబ్నెజుబైర్) పైన్నే దాడిచేయడానికి సైన్యం పంపి హత్యచేయించాడు" అని అన్నారు.

## 4) కాబా పునర్నిర్మాణం, విధ్వంసం

అంతకుముందే యజీద్ పాలనలో అతని సైనికులు మక్కా పట్టణాన్ని దిగ్బంధించి కాబాను ధ్వంసం చేశారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కాస్త ప్రశాంత పరిస్థితి నెలకొన్న తర్వాత హి.శ. 64లో కాబా పునర్నిర్మాణం వైపు దృష్టి సారించారు. ఆయన ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) తీసిన పునదులపై కాబాను పునర్నిర్మించాలని సంకల్పించుకొని నగర ప్రముఖులతో సంప్రదింపులు జరిపారు. అయితే అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)తో సహా అనేకమంది ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. కొందరు మాత్రమే సమర్థించారు. ఇబ్నెజుబైర్ (రజి) తన ప్రతిపాదనను వ్యతిరేకించినవారికి నచ్చజెపుతూ కాబానిర్మాణం గురించి దైవప్రవక్త (స) చెప్పిన ఈ మాటలను గుర్తుచేశారు:

"దైవప్రవక్త (స) హజ్రత్ ఆయిషా (రజి)తో మాట్లాడుతూ 'ఆయిషా! నీకీ సంగతి తెలియదు. నీ జాతి (ఖురైష్) వాళ్ళు దైవమందిరాన్ని పూర్తిగా ఇబ్రాహీమి పునాదులపై నిర్మించలేక కొంతభాగం తగ్గించారు' అని అన్నారు. ఆయిషా (రజి) ఈమాట విని 'అలాగైతే మీరు ఇబ్రాహీమి పునాదుల ప్రకారం దాన్ని మళ్ళీ ఎందుకు నిర్మించలేదు?' అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ 'నీ జాతి (ఖురైష్) వాళ్ళు ఇప్పుడిప్పుడే (ఇస్లాం స్వీకరించి) ముస్లింలైపోయారు. వారు మార్గభ్రష్టులైపోతారన్న ప్రమాదం గనక లేకపోతే నేను అలాగే నిర్మించేవాడ్ని' అని అన్నారు." (సహీ బుఖారి)

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈవిధంగా నచ్చజెప్పి, చివరికి ఇబ్రాహీమి పునాదుల ప్రకారం పూర్వం ఖురైషీయులు వదలిన ఖాళీస్థలాన్ని (హతీంని) కాబా పరిధిలో చేర్చి పునర్నిర్మించారు. దానికి తూర్పు, పడమరల వైపున రెండుద్వారాలు కూడా నేలబారుగా



ఏర్పరిచారు. ప్రజలు అప్పట్నుంచి కాబాప్రదక్షిణ చేస్తూ దాని నాలుగు మూలలనూ చేత్తో తాకేవారు. అంతకుముందు ఖురైషీయుల నిర్మాణంలో కొంతభాగం ఖాళీగా వదిలేసి నందున దైవప్రవక్త (స) రెండు మూలలను మాత్రమే తాకేవారు. కొత్త నిర్మాణం తరువాత ప్రజలు కాబా సమగ్ర కట్టడం ప్రదక్షిణ చేశాక తూర్పు ద్వారం గుండా లోపలికి ప్రవేశించి పడమర ద్వారం గుండా బయటికి వచ్చేవారు. ఈవిధంగా చాలాకాలం జరిగింది.

అబ్దుల్‌మలిక్ మక్కాపై దాడిచేసే విషయమై సిరియా నేతలను సంప్రదించినపుడు వారు ఇబ్నెజుబైర్ (రజి)కు వ్యతిరేకంగా మక్కాపై దాడిచేయడానికి, కాబాపై రాళ్ళు రువ్వడానికి అంగీకరించలేదు. అప్పుడు అబ్దుల్‌మలిక్ డెమాస్కస్ నుండి కూఫా వెళ్ళి హజ్జాజ్ బిన్ యూసుఫ్ అనే సేనానికి ఆపని కోసం ఒప్పించాడు. అప్పుడు హజ్జాజ్ హి.శ. 72లో మూడువేల మంది సైనికుల్ని తీసుకొని కూఫా నుండి బయలుదేరి మక్కా సమీపానికి చేరుకున్నాడు. తర్వాత కొన్నాళ్ళకు అబ్దుల్‌మలిక్ మరో ఐదువేల మంది సైనికుల్ని మక్కాపంపాడు. వేరొకవైపు అబ్దుల్‌మలిక్ తరపున తారిఖ్ అనే మరో సేనాని మదీనా వెళ్ళి అక్కడ ఇబ్నెజుబైర్ గవర్నర్‌ని తొలగించి, సిరియన్ వ్యక్తిని గవర్నర్‌గా నియమించి, అయిదు వేలమంది సైనికులతో మక్కా చేరుకున్నాడు. దాంతో హజ్జాజ్ అహంకారంతో విర్రవీగుతూ మక్కాను ముట్టడించి రాళ్ళురువ్వడం ప్రారంభించాడు.

ఈముట్టడి నాలుగునెలలు కొనసాగింది. సుదీర్ఘముట్టడితో ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. పైగా హజ్‌దినాలు రావడంవల్ల బయటనుంచి వేలాదిమంది యాత్రికులు కూడా మక్కా చేరుకున్నారు. దాంతో నిత్యావసరవస్తువులకు తీవ్రమైన కొరత ఏర్పడింది. ఈ బాధలు భరించలేక అనేకమంది ప్రజలు మక్కా వదలిపోయారు. హజ్జాజ్ దౌర్జన్యాల వల్ల హజ్ కోసం బయటి నుంచి వచ్చిన యాత్రికులు సైతం హజ్ నియమాలు పూర్తిగా పాటించలేక పోయారు. ఆ సంవత్సరం హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కూడా హజ్ కోసం మదీనా నుండి మక్కా చేరుకున్నారు. ఆయన యాత్రికుల దయనీయ పరిస్థితి చూసి హజ్జాజ్‌తో "దైవదాసుడా! ప్రజలు హజ్ చేయడానికి సుదూరప్రాంతాల నుంచి వచ్చారు. వారికి కనీసం కాబాప్రదక్షిణ చేయడానికి, సఫా-మర్వాల మధ్య 'సయీ' చేయ డానికి అవకాశమిస్తూ హజ్‌దినాలు ముగిసేవరకైనా ఈ రాళ్ళురువ్వే చర్యలు ఆపెయ్యి" అని అన్నారు. అప్పుడు హజ్జాజ్ కాబా వైపు రాళ్ళురువ్వే పని నిలిపేశాడు.

హజ్ దినాలు పోగానే హజ్జాజ్ మక్కాపై రాళ్ళు, అగ్నిగోళాలతో తీవ్రమైన దాడులు ప్రారంభించాడు. ఆ సందర్భంలో ఓ పెద్దరాయి వచ్చి కాబా మీద పడింది. దాంతో కాబా కప్పు కూలిపోయింది. సరిగ్గా అదే సమయంలో ఆకాశం నుండి భయంకరమైన ఓ గర్జన విన్పించి, ఓ మెరుపు మెరిసింది. ఆ తర్వాత నింగి, నేల అంతా గాఢాంధకారం అలుముకుంది. ఈ పరిస్థితి చూసి హజ్జాజ్ సైనికులు భయపడి రాళ్ళురువ్వడం మానేశారు. వారిలో అనేకమంది చనిపోయారు కూడా. రెండవరోజు కూడా ఈ గర్జన, మెరుపులతో కూడిన వాతావరణం ఏర్పడింది. యాదృచ్ఛికంగా ఆరోజు ఇబ్నెజుబైర్ (రజి) సైనికుల్లో ఇద్దరు భయంతో చనిపోయారు. అప్పుడు హజ్జాజ్ సంతోషంతో భుజాలు ఎగరేస్తూ "ఈ గర్జన, మెరుపులు మన విజయానికి సంకేతం" అన్నాడు సైనికులతో.

హజ్జాజ్ సైనికులు అతని మాటలు విని నిజమేనని భావించి మళ్ళీ రాళ్ళురువ్వడం మొదలెట్టారు. ఇబ్నెజుబైర్ (రజి) సైనికులు శాయాశక్తుల వారిని ప్రతిఘటిస్తూనే ఉన్నారు. ఆ తర్వాత హజ్జాజ్ ఓ దుష్టపన్నాగం పన్నాడు. దానివల్ల ఇబ్నెజుబైర్ (రజి) సైన్యంలోని అనేకమంది ఆయన్ని వదిలేసి హజ్జాజ్ దగ్గరకు వెళ్ళిపోయారు. చివరికి ఇబ్నెజుబైర్ (రజి) కొడుకుల్లో కూడా ఇద్దరు హమ్జా, హబీబ్‌లు ఆయన్ని వదలి వెళ్ళిపోయారు. మూడవ కుమారుడు మాత్రమే చివరిదాకా తండ్రిని అంటిపెట్టుకొని ఉన్నాడు. ఇలా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని అనేకమంది వదలి వెళ్ళిపోయిన తరువాత ఆయన దగ్గర చాలా కొద్ది మంది మాత్రమే మిగిలారు.

అలాంటి పరిస్థితిలో హజ్జాజ్ ఒకసైనికుడి ద్వారా అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) దగ్గరకు ఒక ఉత్తరం పంపాడు. అందులో ఇలా ఉంది: "ఇప్పుడు మీ దగ్గర ఎలాంటి శక్తి లేదు. మీరు అన్నివిధాలా బలహీనమైపోయారు. కనుక మీరు మా రక్షణలోకి వచ్చేయండి. అందులోనే మీ శ్రేయస్సుంది. మీరు మా రక్షణలోకి వస్తే మీపట్ల మేము ఎంతో గౌరవ మర్యాదలతో వ్యవహరిస్తాం. మీరు కోరే ప్రతి కోరికా తీరుస్తాం. నేను మిమ్మల్ని వీలైనంత వరకు హత్యవ్యవహారానికి దూరంగా ఉంచాలని, శాంతీసుహృద్భావాల వైపు మరలించాలని విశ్వాసులనాయకుడు (అబ్దుల్‌మలిక్) నన్ను ఆదేశించాడు."

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈ ఉత్తరం చదివి తన మాతృమూర్తి అస్మా బిన్త్ అబూబకర్ (రజి) దగ్గరికెళ్ళి ఇలా అన్నారు: "అమ్మా! ఇప్పుడు నా దగ్గర అయిదుగురు యోధులు తప్ప ఎవరూ లేరు. ప్రజలు హుసైన్ బిన్ అలీ (రజి)ని మోసగించి వెళ్ళిపోయినట్లే నన్ను కూడా మోసగించి వెళ్ళిపోయారు. పోతే హుసైన్ (రజి) కొడుకులు జీవించి ఉన్నంతవరకూ తండ్రి దగ్గర ఖడ్గధారులై శత్రువులతో పోరాడారు. కాని నా కొడుకులు నన్ను వదిలేసి ఆ దుర్మార్గుడి పంచన చేరిపోయారు. ఇప్పుడు హజ్జాజ్ నన్ను కూడా తన రక్షణలోని రమ్మని, నేను కోరిందల్లా ఇస్తానని చెబుతున్నాడు. అంచేత నేను నీ ఆదేశం కోసం వచ్చాను. చెప్పమ్మా! ఇప్పుడు నన్నేం చేయమంటావు?"

అప్పుడా వీరమాత ఇలాఅన్నది: "నీ వ్యవహారం గురించి నీకే బాగాతెలుసు. సత్యం నీ పక్షాన ఉంటే, సత్యంవైపే నువ్వు ప్రజల్ని పిలిచేవాడివైతే ఆ పనిలోనే స్థిరంగా ఉండు. నీ స్నేహితులు దైవమార్గంలో పోరాడుతూ అమరగతులయ్యారు. కనుక నువ్వు కూడా ఆ బాటలోనే పురోగమిస్తూ అమరగతి భాగ్యం సాధించుకో. ఒకవేళ నువ్వు ఐహికభాగ్యాలు పొందాలని నిర్ణయించుకుంటే నీకంటే అసమర్థుడు, అయోగ్యుడు మరెవరూ ఉండరు. అప్పుడు నిన్ను నీవు మృత్యునోట అందించడమేగాక, నీ సహచరుల్ని కూడా మృత్యు కుహరంలోకి నెట్టినవాడవుతావు. కాబట్టి నువ్వు ఎట్టి పరిస్థితిలోనూ బనూఉమయ్యా వారికి లొంగకు. మరణం తన నిర్ణీత సమయంలో తప్పకుండా వస్తుంది. మగధీరుడిలా జీవించు, మగధీరుడిలా చచ్చిపో. ఇదే నీకు నా సలహా."

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) తల్లి మాటలు విన్న తరువాత ఆమె నుదుటిని ముద్దాడి "నా అభిప్రాయం కూడా ఇదేనమ్మా. నాకు ప్రాపంచిక వ్యామోహం, అధికార దాహం ఏ మాత్రం లేవు. ప్రజలు దైవాజ్ఞల్ని పాటించడం లేదని, నిషేధితాల వైపు మొగ్గుతున్నారని



మాత్రమే నేనీ పని చేస్తున్నాను. నీ మాటలు నాకు కొండంత ధైర్యానిచ్చాయి. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు నేను సత్యం కోసం పోరాడుతూనే ఉంటాను. అమ్మా! ఈరోజే నేను హతమార్చబడతానని నాకు అనుమానంగా ఉంది. కనుక నీవు బాధపడకు. నన్ను దేవునికి అప్పగించి సహనం వహించు."

హజ్రత్ అస్మా (రజి) ఈమాటలు విని "బాబూ! దేవుడు నీకు దాని ప్రతిఫలం ప్రసాదిస్తాడులే. నువ్వు దేవుని పేరు స్మరించి శత్రువులపై దాడిచెయ్యి" అని అన్నారు. ఆ తర్వాత ఆమె కొడుకుని కౌగిలించుకోవడానికి ముందుకొచ్చి అతని శరీరాన్ని తాకితే అతను కవచం ధరించినట్లు తెలిసింది. హజ్రత్ అస్మా (రజి) అధిక వృద్ధాప్యంవల్ల అంధురాలైపోయారు. కవచం చేతికి తగలగానే "నాయనా! నువ్వీ కవచం ఏ ఉద్దేశ్యంతో ధరించావు?" అని అడిగారు. దానికా సుపుత్రుడు "నీ సంతృప్తి కోసం ధరించాను" అన్నారు.

హజ్రత్ అస్మా (రజి) "తీసేయి నాయనా! కవచం తీసేసి పైజామా, పొడుగుచొక్క తొడుక్కో. దానివల్ల వేగంగా కదలడానికి, బలంగా దాడిచేయడానికి వీలుంటుంది" అని అన్నారు. అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) ఈమాట వినగానే కవచం తీసేసి పైజామా, పొడుగుచొక్కా ధరించారు. ఆ తర్వాత ఆయన తల్లి ఆశీర్వాదం తీసుకొని యుద్ధభూమికి బయలుదేరారు. సహచరుల దగ్గరికెళ్ళి వారికి తగిన సూచనలు ఇచ్చి శత్రుసమూహంలోకి సుడిగాలిలా దూసుకుపోయారు.

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) వారిలో అనేకమందిని మట్టుపెట్టి చివరికి తీవ్రమైన గాయాలతో నేలకొరిగారు. వెంటనే శత్రువులు ప్రాణంపోయిన ఆ పులిరాజు శిరస్సును ఖండించారు. ఈ దుర్ఘటన హి.శ. 73వ ఏట జమాదిస్సాని నెలలో సంభవించింది. ఇబ్నెజుబైర్ (రజి) హత్యతో హజ్జాజ్ బిన్ యూసుఫ్, అతని సైనికమూకలు తెగ సంబరపడిపోతూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. తరువాత ఆయన మొండాన్ని ఒకచోట కాకులకు, గద్దలకు వదిలేసి ఖండిత శిరస్సును కాబా గోడకు వ్రేలాడదీశారు.

హజ్రత్ అస్మా (రజి) ఈ విషాదవార్త విని పుత్రశోకాన్ని బలవంతంగా దిగమింగుతూ "ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్ ('మేము దేవుని ఆస్తులం. దేవుని వైపుకే పోవలసిన వాళ్ళం')" అని అన్నారు. ఆ తరువాత ఆమె కొడుకు భౌతికకాయాన్ని ఖననం చేసేందుకు అనుమతివ్వమని అడిగారు. దానికి హజ్జాజ్ నిరాకరించాడు. ఖలీఫా అబ్దుల్‌మలిక్‌కు ఈ విషయం తెలిసి హజ్జాజ్‌కు చీవాట్లుపెట్టాడు. అప్పుడు హజ్జాజ్ ఆ భౌతికకాయాన్ని హజ్రత్ అస్మా (రజి) కుటుంబానికి అప్పగించి ఖననం చేయించాడు.

ఆ తర్వాత హజ్జాజ్ మక్కాలో ప్రవేశించి కాబాలయంలో పడిన రాళ్ళు, రక్త బిందువుల్ని చూసినా చలించలేదు. అతను కాబా నూతననిర్మాణం గురించిన ఒక నివేదిక ఖలీఫా అబ్దుల్ మలిక్‌కు పంపించాడు. ఖలీఫా కాబాను విస్తరించి కట్టినంత మేరకు పడగొట్టి నిర్మించమని హజ్జాజ్‌ని ఆదేశించాడు. దానిప్రకారం హజ్జాజ్ కాబా గర్భగుడిని ప్రవక్త కాలంలో వున్నవిధంగా పునర్నిర్మించాడు. ఆ తర్వాత ఖలీఫా దృష్టికి ఆయిషా (రజి) ఉల్లేఖించిన ప్రవక్త ప్రవచనం రాగానే అతను పశ్చాత్తాపపడ్డాడు. కాని కాబాను దైవప్రవక్త (స) హితోక్తి ప్రకారం విస్తరించకుండా యథాతథంగా ఉంచాడు. (సహీముస్లిం)

## 5) సంక్షేమ రాజ్యం సమాప్తం

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అమరగతితో దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరుల (సహాబీల) పరిపాలనల కాలం ముగిసింది. రాజ్యాలు ఏలిన సహాబీలలో అబ్దుల్లా బిన్‌జుబైర్ (రజి) చివరి సహాబీ. మక్కా పట్టణాన్ని దేశరాజధానిగా చేసుకొని రాజ్యమేలిన మొట్టమొదటి ఖలీఫా, చిట్టచివరి ఖలీఫా ఆయనే. నాల్గవ ఖలీఫా హజ్రత్ అలి (రజి), ఆయన కుమారుడు హసన్ (రజి), ఆ తర్వాత అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ల పరిపాలనలు అనేక ఒడిదుడుకులకు గురవుతూ క్రమంగా ఒక్కొక్క ప్రాంతం వారి నుంచి చేజారిపోవడానికి; అమీర్ ముఆవియా (రజి) నుండి అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ వరకు బనూఉమయ్యా పాలకులు విజయాలు సాధించడానికి ముఖ్యంగా రెండు కారణాలు ఉన్నాయి.

ఒకటి- అలి బిన్ అబూతాలిబ్ (రజి), హసన్ బిన్ అలి (రజి), అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ల సైనికుల్లో అత్యధికమంది ముస్లింముఖయూదుడు ఇబ్నెసబా అనుచరులు, ఇస్లాంపేరుతో ఇస్లాంవ్యతిరేక మతవిశ్వాసాలు పుణికిపుచ్చుకున్న ఖారిజీలు, నిలకడలేని మనస్తత్వంగల ఇరాఖ్‌ప్రజలే ఉన్నారు. బనూఉమయ్యా పాలకుల సైనికుల్లో తమ నాయకుల పట్ల విధేయత, క్రమశిక్షణ కలిగిన వారు ఎక్కువమంది ఉన్నారు.

రెండు- అలి (రజి), హసన్ (రజి), ఇబ్నెజుబైర్ (రజి)లు దైవభీతి, ధర్మపరాయణతల దృష్ట్యా ప్రభుత్వధనాన్ని ప్రజల కోసం అక్రమంగా ఖర్చుపెట్టి వారిని తమకు అనుకూలంగా మలచుకోలేకపోయారు. బనూఉమయ్యా పాలకులు తమ సొంతానికే గాకుండా, ప్రజల్ని తమవైపుకు తిప్పుకోడానికి కూడా ప్రభుత్వ ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టేవారు. ముఖ్యమైన ఈ రెండుకారణాల వల్ల ఇబ్నెజుబైర్ (రజి) హత్య తరువాత యావత్తు ఇస్లామీయ సామ్రాజ్యం బనూఉమయ్యా తెగవారి అధీనంలోకి పోయింది.

## 6) అల్పసంఖ్యాకులే మోక్షానికి అర్హులు

దైవభీతి, ధర్మపరాయణత, నీతినిజాయితీలు కలవారిని షైతాన్ ఏమాత్రం సహించ లేడు. అందుకే అలాంటి పుణ్యపురుషులు లోకంలో చాలా తక్కువమంది ఉంటున్నారు. దైవాజ్ఞను ధిక్కరించి శాపగ్రస్తుడయిన షైతాన్ సృష్టికర్తకే ఇలా ఒక సవాలు విసిరాడు:- "ప్రభూ! నీవు నన్ను ఏవిధంగా దారి తప్పించావో అదేవిధంగా నేను భూలోకంలో మానవులకు ఎన్నెన్నో మనోహరమైన వస్తువుల్ని చూపి వారిని దారితప్పిస్తాను ' అన్నాడు ఇబ్లీస్ (షైతాన్)." (ఖుర్‌ఆన్-15:39,40). దానికి సృష్టికర్త 'నిన్ను అడ్డుకొని నా దాసుల్ని కాపాడుతాన'ని అనలేదు. దానికి బదులు "నా (ప్రియ)దాసులపై నీ అధికారం చెల్లదు. నీ అధికారం నిన్ను అనుసరించే భ్రష్టుల మీదనే చెల్లుతుంది. అలాంటివారందరికీ నరకమే (గతి, ఇది) మా వాగ్దానం' అన్నాడు దేవుడు." (ఖుర్‌ఆన్-15:42,43)

ఖలీఫా ఉమర్ (రజి) ఓసారి కాబాప్రదక్షిణ చేస్తుంటే ఒక పల్లెవాసి "ఓ నా ప్రభువా! నువ్వు నన్ను నీ అల్పసంఖ్యాక దాసుల జాబితాలో చేర్చు" అని వేడుకుంటున్నాడు. ఈ విచిత్ర వేడుకోలు విని ఉమర్ (రజి) ఆశ్చర్యపోయి "సోదరా! ఏమిటీ నువ్విలా దుఆ చేస్తున్నావు? ఇలాంటి విచిత్ర దుఆ నేనింతవరకు ఎవరి నోటా వినలేదే!" అని అడిగారు.



దానికి ఆ గ్రామీణుడు "అయ్యా! తమరిక్కూడా ఆ దుఆ తెల్సు, నన్నెందుకు అడుగుతారు అనవసరంగా?" అన్నాడు. ఈమాట విని ఉమర్ (రజి) మరింత ఆశ్చర్యపోతూ "బాబ్బాబు! ఆ దుఆ ఏమిటో కాస్త నువ్వే చెప్పి పుణ్యం కట్టుకో" అని అన్నారు.

అప్పుడా పల్లెవాసి "విశ్వాసులనాయకా! మీరు ఖుర్‌ఆన్ చదవలేదా? అందులో 'వఖలీలుమ్మిన్ ఇబాదియష్షకూర్' (నాకు కృతజ్ఞతులైన దాసులు చాలా తక్కువమంది ఉంటారు.) అనే ఖుర్‌ఆన్ సూక్తి చూడలేదా మీరు? నేను నా ప్రభువుని 'దేవా! నీకు కృతజ్ఞతులైన ఆ దాసుల జాబితాలో నన్ను కూడా చేర్చమని వేడుకుంటున్నా"అని అన్నాడు. ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) ఈమాట విని ఎంతో ప్రభావితులయ్యారు.

మానవుల్లో దుర్జనులే అత్యధికమంది ఉంటారు. సజ్జనులు బహు తక్కువమంది ఉంటారు. ఈ కారణంగానే నరకానికి అత్యధికమంది, స్వర్గానికి బహు తక్కువమంది పోతారు. అంతిమ దైవప్రవక్త (స) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇలా తెలిపారు:

"దేవుడు హజ్రత్ ఆదం (అలైహి)ని ఉద్దేశించి "ఓ ఆదం! అని పిలుస్తాడు. దానికి హజ్రత్ ఆదం (అలైహి) "ప్రభూ! నేను మీ సన్నిధిలోనే ఉన్నాను. ఆజ్ఞాపించండి, మీ ఆజ్ఞలకు బద్ధుణ్ణయి ఉన్నాను. మేలు, శ్రేష్ఠతలన్నీ మీ చేతిలోనే ఉన్నాయి" అని అంటారు. అప్పుడు విశ్వప్రభువైన దేవుడు "(నీ సంతానం నుంచి) నరకవాసుల్ని తీసెయ్యి" అని ఆజ్ఞాపిస్తాడు. హజ్రత్ ఆదం (అలైహి) "నరకవాసులు ఎంతమంది ఉన్నార"ని అడుగుతారు. దేవుడు "1000 మందికి 999 మంది నరకవాసులు ఉన్నారు" అంటాడు.

ఆదంసంతానం (మానవులు) ఈమాట వినగానే తీవ్రంగా ఆందోళన చెందుతారు. (అమితమైన దిగులు, భయాందోళనలతో) పిల్లలు సైతం వృద్ధులైపోతారు. గర్భిణీ స్త్రీలకు గర్భస్రావం అవుతుంది. జనం స్పృహలో ఉన్నప్పటికీ తీవ్రమైన నిస్పృహకు గురవుతారు. ఏమైనప్పటికీ దైవశిక్ష కఠినంగా ఉంటుంది." (మిష్కాత్)

అంటే వేయిమంది మానవుల్లో ఒకరు మాత్రమే స్వర్గానికి పోతారు. మిగిలిన 999 మంది నరకానికి పోతారు. దీనికి కారణం ఏమిటో ఖుర్‌ఆన్ ఇలా చెబుతోంది:

"మేము అనేకమంది మానవుల్ని, జిన్నుల్ని నరకం కోసమే పుట్టించాము. వారికి హృదయాలున్నాయిగాని, వాటితో అర్థం చేసుకోరు; కళ్ళున్నాయిగాని, వాటితో చూడరు; చెవులున్నాయిగాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు. వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు." (7:179)

హృదయముండి ఆలోచించనివారు, కళ్ళుండి చూడనివారు, చెవులుండి వినని వారు ఎవరూ ఉండరు. కాని ఖుర్‌ఆన్ ఇలా ఆరోపిస్తుందంటే కారణం, వారు పరలోక విషయంలో మాత్రమే ఇలా ప్రవర్తిస్తారు. విశ్వవ్యవస్థ వెనుక ఉన్న సృష్టికర్త హస్తాన్ని గురించి ప్రశాంతంగా ఆలోచించరు. సృష్టివ్యవస్థలో ఆయన ఏకత్వాన్ని, ఔన్నత్యాన్ని చాటుతున్న అసంఖ్యాక నిదర్శనాలను గమనించరు. దైవం, పరలోకం గురించిన సత్య వాక్కులు వీరి చెవులకెక్కవు. ఈవైఖరి కారణంగానే వారు మానవస్థాయి నుంచి దిగజారి పశువులకన్నా నికృష్టులయ్యారని ఖుర్‌ఆన్ అంటోంది. ఇలాంటివారికి ప్రపంచమే సర్వస్వం.

ఏవిధంగానైనా వీలైనన్ని ప్రాపంచికసుఖాలు జుర్రుకోవాలన్నదే వీరి ధ్యేయం. మంచి చెడులతో, ధర్మాధర్మాలతో వీరికి నిమిత్తం లేదు. వీరి దృష్టిలో దగా, మోసం, అవినీతి, అన్యాయం, అన్నీ ధర్మసమ్మతమే. నీటిబుడగలాంటి ఇహికజీవితం కోసం శాశ్వత పరలోక జీవితాన్ని విస్మరించడంకంటే మించిన ఆత్మవంచన మరేదైనా ఉందా?

వీరే లోకంలో అధికసంఖ్యాకులు. అధికసంఖ్యాకులే నాడు, నేడు అత్యధిక భూభాగాల్లో అధికారం చెలాయిస్తున్నారు. అధికసంఖ్యాకుల్ని గురించి ఖుర్‌ఆన్ ఏమంటుందో చూడండి: "ముహమ్మద్ (స)! నీవు భూవాసుల్లోని అధికసంఖ్యాకులు చెప్పే మాటలు గనక వింటే వారు నిన్ను దైవమార్గం నుండి తప్పిస్తారు. వారు కేవలం ఊహాలోకంలో విహరిస్తూ నిరాధారమైన విషయాలు అనుసరిస్తారు. నిజానికి ఎవరు నీప్రభువు మార్గం తప్పివున్నారో, ఎవరు సరైన మార్గంలో ఉన్నారో నీ ప్రభువుకు బాగా తెలుసు." (6:116,117)

# 40. అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ పాలన

అబ్దుల్‌మలిక్ ఖలీఫా కాకముందు ఎంతో ధర్మపరాయణుడిగా, పరమ నిష్ఠాగరిష్టుడిగా ఉండేవాడు. అంతేకాదు, ధర్మజ్ఞానంలో కూడా గొప్ప పండితుడిగా, ఫిఖ్హావేత్తగా ప్రసిద్ధిచెందాడు. ఉబాదా బిన్ ముస్నా ఓసారి అబ్దుల్లా బిన్‌ఉమర్ (రజి)తో మాట్లాడుతూ "మేము మీ తరువాత ధార్మిక సమస్యల్ని గురించి ఎవరిని అడిగి తెలుసుకోవాలి?" అని అడిగాడు. దానికి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) సమాధానమిస్తూ "మర్వాన్ కొడుకు (అబ్దుల్‌మలిక్) ధర్మవేత్త. అతడ్ని అడిగి తెలుసుకోండి" అని అన్నారు.

కాని అంత గొప్పపండితుడు, ఆరాధకుడు, ధర్మపరాయణుడు అయినప్పటికీ అతను మద్యం సేవించేవాడు. అతను తరచుగా ఉమ్మెదర్దా సహాబియా (రజి) దగ్గరకు వస్తుండేవాడు. ఓసారి  ఆమె అబ్దుల్‌మలిక్‌తో "నువ్వు ఆరాధకుడు అయివుండి కూడా త్రాగుబోతువయ్యావని విన్నాను నిజమేనా?" అనిఅడిగారు. దానికి అబ్దుల్‌మలిక్ "నేను రక్తపిపాసి కూడా అయ్యాను" అని సమాధానమిచ్చాడు.

ఒకసారి అఫ్‌జల్ అనే ఓ కవిపుంగవుడు అబ్దుల్‌మలిక్‌కు తన కవిత నొకదాన్ని ఇలా విన్పించాడు: "ప్రజలకు ప్రయోజనాలు చేకూరనంతవరకు అతను శత్రువుల పట్ల ప్రతీకారంతో ఉడికిపోతుంటాడు. శత్రువుల మీద విజయం సాధించినప్పుడు అతను మృదు హృదయుడు, ఉదారశీలుడు అవుతాడు." అబ్దుల్‌మలిక్ ఈ కవిత వినగానే సేవకుడ్ని పిలిచి "ఇతని చేయి పట్టుకొని కూర్చో. ఇతను మోయగలిగినంత ధనం ఇతనికిచ్చేయి" అన్నాడు. ఆ తరువాత అతను "ప్రతి జాతిలో ఒక కవి ఉంటాడు. బనూఉమయ్యాలో ఇతనే (గొప్ప) కవి" అన్నాడు.

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అమరగతి తరువాత అబ్దుల్‌మలిక్ పరమ కర్కోటకుడైన హజ్జాజ్‌ని మక్కా, మదీనా ప్రాంతాలకు గవర్నర్‌గా నియమించాడు. హజ్జాజ్ దైవప్రవక్త (స) ప్రత్యక్ష అనుచరులపై దుర్భర హింసాకాండ ప్రారంభించాడు. మక్కాలో సత్యవాది అయిన అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ని కాబాప్రదక్షిణ చేస్తున్న సందర్భంలో చంపించాడు. అనస్ బిన్ మాలిక్ (రజి) వగైరా సహాబీలకు కొరడాదెబ్బలు కొట్టించాడు.



హి.శ. 75లో అబ్దుల్‌మలిక్ ముహ్లబ్‌ను ఖాతరుచేయకుండా మరొకడ్ని సేనాపతిగా నియమించి పంపడంతో ముహ్లబ్ స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఖారిజీలపై యుద్ధం ప్రారంభించాడు. మరొకవైపు అబ్దుల్‌మలిక్ ఇరాఖ్ ప్రజల్ని దారికి తీసుకురావడానికి హజ్జాజ్‌ను హిజాజ్ నుండి తీసి ఇరాఖ్‌కు పంపివేశాడు. హజ్జాజ్ కూఫాలో తనను వ్యతిరేకిస్తున్న వారందర్నీ హతమార్చాడు. తర్వాత అతను తన కుమారుడు హఫ్స్‌ని ఖారిజీలపై యుద్ధం చేయడానికి పంపించాడు. హి.శ. 77లో ముహ్లబ్ ఖారిజీల పీచం అణచివేసి కూఫాలో హజ్జాజ్ దగ్గరకు వచ్చాడు. హజ్జాజ్ అతడ్ని ఎంతో అభినందించాడు.

అబ్దుల్‌మలిక్ ఖారిజీల వైపునుంచి కాస్తంత మనశ్శాంతి లభించిన తరువాత హి.శ. 78లో ఇరాఖ్‌తో పాటు ఖురాసాన్, సజిస్తాన్ ప్రాంతాల్ని కూడా హజ్జాజ్ రాజ్యపరిధిలోకి ఇచ్చాడు. హజ్జాజ్ సేనాపతి ముహ్లబ్‌ని ఖురాసాన్ పాలకుడిగా నియమించాడు. అతను ముహ్లబ్ కుమార్తెను వివాహమాడి సేనాపతి ముహ్లబ్‌తో తన సంబంధాన్ని మరింత పటిష్ఠపరచుకున్నాడు. ముహ్లబ్ ఖురాసాన్ సరిహద్దులు దాటి హిందూకుష్ వరకు, మరోవైపు తిర్మజ్, బుఖారా వరకు గల అనేక ప్రాంతాల్లో విజయపతాకాలు ఎగరవేశాడు. చివరికి హి.శ. 82లో జబ్బుపడి చనిపోయాడు. ఆ తర్వాత హజ్జాజ్ బిన్ యూసుఫ్‌కు, అబ్దుర్రహ్మాన్ బిన్ ముహమ్మద్‌కు మధ్య మనస్పర్థలు ఏర్పడి ఇద్దరు సేనాపతులు పరస్పరం యుద్ధపరంపర సాగించారు.

చివరికి ఒక యుద్ధంలో అబ్దుర్రహ్మాన్ ఘోరంగా ఓడిపోయి సింద్‌రాజు రుత్బీల్ దగ్గరికు వెళ్ళి అతని శరణుపొందాడు. అయితే హజ్జాజ్ ఈసంగతి తెలుసుకొని, అబ్దుర్రహ్మాన్ శిరస్సు ఖండించి తనదగ్గరకు పంపితే పదేండ్లపాటు జిజ్యా (రక్షణరుసుం) మాఫీచేస్తానని రుత్బీల్‌కు ఉత్తరం రాసిపంపాడు. రుత్బీల్ వెంటనే అబ్దుర్రహ్మాన్ తల నరికి హజ్జాజ్ దగ్గరికి పంపించాడు. ఈ సంఘటన హి.శ. 84లో జరిగింది.

వేరొకవైపు తిర్మజ్ రాష్ట్రగవర్నర్ మూసా బిన్ అబ్దుల్లా ఖలీఫా అబ్దుల్‌మలిక్‌తో విభేదించి స్వతంత్ర పాలకుడైపోయాడు. సింద్‌రాజు రుత్బీల్, హజ్జాజ్ ఉత్తరం చదివి అబ్దుర్రహ్మాన్‌ని హతమార్చగానే అబ్దుర్రహ్మాన్ అనుచరులు తిర్మజ్‌కు పారిపోయి మూసా బిన్ అబ్దుల్లా సైన్యంలో చేరిపోయారు. అటు హజ్జాజ్ తిర్మజ్ పట్నంపై దాడిచేయడానికి ముహ్లబ్ కొడుకు ముఫ్‌జల్‌కు ఓ పెద్ద సైన్యమిచ్చి పంపాడు. ముఫ్‌జల్ తిర్మజ్‌ని ముట్టడించి యుద్ధం చేశాడు. కాని మూసా బిన్ అబ్దుల్లా కోట నుండి బయటికి వచ్చి ముఫ్‌జల్ సైనికుల్ని తరిమి తరిమికొట్టాడు. ఆతర్వాత అతను తిర్మజ్‌కు తిరిగివస్తుంటే తురుష్కులు అడ్డంతగిలి యుద్ధంచేశారు. ఆ యుద్ధంలో ముఫ్‌జల్ తీవ్రంగా పోరాడి చివరికి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన హి.శ. 85లో సంభవించింది.

హి.శ. 85లోనే అబ్దుల్‌మలిక్ సోదరుడు అబ్దుల్‌అజీజ్ బిన్ మర్వాన్ ఈజిప్టులో చనిపోయాడు. అప్పుడు అబ్దుల్‌మలిక్ తన కుమారుడు అబ్దుల్లాను ఈజిప్టు గవర్నర్‌గా నియమించాడు. అబ్దుల్‌అజీజ్ చనిపోయిన తరువాత అబ్దుల్‌మలిక్ తన కుమారులు వలీద్‌ని, సులైమాన్‌ని తన రాజకీయవారసులుగా చేశాడు. ఆ తర్వాత అతను ఒక నెల రోజుల్లోనే వ్యాధిగ్రస్తుడై హి.శ. 86లో చనిపోయాడు.

# 41. వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన

వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ తండ్రి మరణానంతరం డెమాస్కస్‌లో ఖిలాఫత్ పీఠం ఎక్కాడు. వలీద్ ఎంతో అల్లారుముద్దుగా పెరగడం వల్ల అతనికి చదువుసంధ్యలు ఏ మాత్రం అబ్బలేదు. అయితే అతనికి మంచి విధేయులు, ప్రతిభావంతులైన సేనాపతులు లభించడం వల్ల అతని పాలనాకాలంలో అనేకదేశాలు, ప్రాంతాలు ఇస్లామీయ సామ్రాజ్య పరిధిలోకి వచ్చాయి. అదీగాక అతను ఎన్నో ప్రజాసంక్షేమ కార్యాలు కూడా సాధించాడు.

## 1) హజ్జాజ్ బిన్ యూసుఫ్ దౌర్జన్యాలు

అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ పాలనాకాలంలో హజ్జాజ్ బిన్ యూసుఫ్ ప్రముఖ సహాబీలు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి), అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)లను హతమార్చిన సంఘటనలు గతపేజీల్లో ప్రస్తావించబడ్డాయి. వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖలీఫా కాగానే హజ్జాజ్ ఖురాసాన్‌గవర్నర్ పదవినుండి యజీద్ బిన్ ముహ్లబ్‌ని, కర్మాన్‌గవర్నర్ పదవి నుండి హబీబ్ బిన్ ముహ్లబ్‌ని తొలగించి జైల్లో పడవేశాడు. అంతేగాక ముహ్లబ్ కుమారులందర్నీ కారాగారంలో బంధించాడు. అయితే వారంతా జైలునుంచి తప్పించు కొని వలీద్‌సోదరుడు సులైమాన్ దగ్గరకు వెళ్ళి ఆశ్రయం పొందారు. హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఇరాఖ్ ప్రజల్ని చాలా వేధించాడు. అంచేత వారిలో అనేకమంది ఇరాఖ్ నుండి పారిపోయి మక్కా, మదీనాలలో ఉండసాగారు. మక్కా, మదీనాల గవర్నర్ ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) వారికి రక్షణ కల్పించారు.

అయితే హజ్జాజ్ ఇరాఖ్ నుండి విద్రోహులు, కపటులు మాత్రమే మక్కా, మదీనాలకు పారిపోయారని, అలాంటివారిని ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) రక్షణ కల్పించారని, ఈ ధోరణి మన ప్రభుత్వానికి నష్టం కలిగిస్తుందని ఖలీఫాకు ఉత్తరం రాశాడు. దాంతో ఖలీఫా వలీద్ హి.శ. 93లో ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మ)ని గవర్నర్‌పదవి నుండి తొలగించి మక్కా, మదీనాలలో హజ్జాజ్ అనుచరులు ఖాలిద్‌ని, ఉస్మాన్‌ని నియమించాడు. ఖాలిద్ మక్కా వెళ్ళి అధికారం చేపట్టగానే ఇరాఖ్‌వాసుల్ని అక్కడ్నుంచి తీసివేశాడు. మక్కాలో వారికి ఇండ్లు అద్దెకిచ్చిన వారిని కూడా తీవ్రంగా మందలించాడు. ఇరాఖ్‌కు తిప్పిపంపినవారిలో కొందర్ని హజ్జాజ్ హతమార్చాడు.

ప్రముఖ సహాబీ హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి)ని హజ్జాజ్ కపటముస్లింల నాయకుడని చెప్పేవాడు. ఒకసారి ఆ దుర్మార్గుడు తనకు ఇబ్నెమస్‌వూద్ (రజి) గనక చిక్కితే అతని రక్తంతో భూమిదాహం తీర్చుతానని అన్నాడు. మస్జిద్‌లో తానొక మార్గం గుండా వెళ్ళమని ఆదేశించినపుడు ప్రజలు మరొక మార్గం గుండా బయటికి వెళ్తే వారిని హతమార్చడం తనకు ధర్మసమ్మతం అవుతుందని కూడా అన్నాడతను. అతని కాలంలో ఎలాంటి న్యాయవిచారణ లేకుండా హతమార్చబడినవారి సంఖ్య ఒకలక్షా ఇరవై వేలని తెలుస్తోంది. అతను మరణించినప్పుడు ఎలాంటి న్యాయవిచారణ లేకుండా జైళ్ళలో మగ్గుతుండిన అమాయకుల సంఖ్య ఎనభై వేలని కూడా చరిత్ర చెబుతోంది. ఈ హింసా దౌర్జన్యాలు ఏ మేరకు హద్దుమీరిపోయాయో వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలనాకాలంలో



హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) ఇలా తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు: "ఇరాఖ్‌లో హజ్జాజ్, సిరియాలో వలీద్, ఈజిప్టులో ఖుర్రద్ బిన్ షరీక్, మదీనాలో ఉస్మాన్ బిన్ హయ్యాన్, మక్కాలో ఖాలిద్ బిన్ అబ్దుల్లా...దేవా! నీ ప్రపంచం హింసా దౌర్జన్యాలతో నిండిపోయింది. అందరికీ సౌఖ్యం ప్రసాదించు."

## 2) 'ఖతీబా' విజయాలు

వలీద్ ఖలీఫాగా అధికారం చేపట్టిన తరువాత హజ్జాజ్ బిన్ యూసుఫ్ అధికారాల్ని యధాతథంగా కొనసాగించాడు. హజ్జాజ్ హి.శ. 86లో 'రే' గవర్నర్ ఖతీబా బిన్ ముస్లిం బాహిలీని ఖురాసాన్ గవర్నర్‌గా నియమించాడు. ఖతీబా ఖురాసాన్‌లో పాలనావ్యవస్థను పునర్వ్యవస్థీకరించి ఓ పెద్ద సైన్యం తీసుకొని తాల్ఖాన్ వైపు బయలుదేరాడు. అక్కడ తురుష్క చక్రవర్తి సగ్దాస్ మెడలువంచి విధేయత, జిజ్యాచెల్లింపు విషయంలో అతనితో రాజీఒప్పందం చేసుకున్నాడు. అదేవిధంగా తార్ఖాన్ చుట్టుపక్కల ప్రాంతాల రాజులను కూడా ఓడించి వారి చేత రాజీఒప్పందాలు చేయించుకున్నాడు.

హి.శ. 87లో ఖతీబా 'బుఖారా'పై దాడిచేశాడు. అక్కడ తురుష్కుల్ని ఓడించి అపార సమరసొత్తు సాధించాడు. హి.శ. 88లో సగద్, ఫర్గానా ప్రాంతాల ప్రజలు తిరుగుబాటు లేవదీశారు. చైనాచక్రవర్తి తన సోదరుడికి రెండులక్షల సైన్యమిచ్చి రంగంలోకి దించాడు. అయితే శత్రువులు ఖతీబా చేతిలో చావుదెబ్బలు తిని పారిపోయారు. ఖతీబా రాజ్యపరిధిలోని అనేక ప్రాంతాల రాజులు, సామంతులు ఎన్నోసార్లు తిరుగుబాటుకు పాల్పడ్డారు. అయితే ప్రతీసారీ పరాజయాన్నే చవిచూశారు. హి.శ. 92లో సజిస్తాన్ రాజు రుత్బీల్ కూడా తిరుబాటుచేశాడు. కాని ఖతీబా అతని పీచం అణచివేశాడు.

హి.శ. 93లో ఖతీబా ఖవారిజంపై కూడా విజయకేతనం ఎగరవేశాడు. ఖతీబా ఖవారిజంరాజ్యంపై దాడిచేస్తున్నప్పుడు సగత్‌వాసులు చైనాచక్రవర్తి ఖాఖాన్ సహాయంతో మరొకసారి తిరుగుబాటు లేవదీసి సమర్‌ఖంద్ కోటను ముట్టడించారు. ఖతీబా ఖవారిజాన్ని జయించిన వెంటనే సమర్‌ఖంద్‌కు బయలుదేరాడు. చైనాచక్రవర్తి పెద్ద ఎత్తున సైన్యాన్ని సమీకరించి యుద్ధం ప్రారంభించాడు. భీకరయుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతని కొడుకుతోసహా అనేకమంది సగత్‌వాసులైన తురుష్కులు హతమార్చబడ్డాడు. ఖతీబా వారి ప్రముఖ సైన్యాధికారుల్ని యుద్ధఖైదీలుగా పట్టుకొని హజ్జాజ్ దగ్గరకు పంపించాడు. ఆ యుద్ధఖైదీలలో ఒక మహిళాఖైదీ కూడా ఉంది. హజ్జాజ్ ఆమెను ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ దగ్గరకు పంపించాడు. వలీద్ ఆ స్త్రీని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె ద్వారా అతనికి యజీద్ అనే కొడుకు పుట్టాడు.

ఖతీబా మరికొన్నిచోట్ల చెలరేగిన తిరుగుబాటుల్ని అణచి ఖురాసాన్ రాజధాని మరుకు తిరిగొస్తుంటే హి.శ. 95లో హజ్జాజ్ చనిపోయాడని తెలిసింది. ఆతర్వాత అతను అనేక కోటల్ని జయించి మొత్తంతుర్కిస్తాన్‌ని ఇస్లామీయ సామ్రాజ్యపరిధిలోకి చేర్చాడు. ఖలీఫా వలీద్ సోదరుడు మస్లమా బిన్ అబ్దుల్‌మలిక్ కూడా గొప్ప సేనాపతే. అతను రోమ్‌రాజ్యంలోని అనేక కోటలను, తుర్కిస్తాన్‌లోని అనేక పట్టణాలను జయించాడు.

## 3) ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై)

ఈరాన్, ఇరాఖ్‌లతో కూడిన ఈరానీయుల సామ్రాజ్యం పతనమైన తర్వాత ఈరానీయుల్లో చాలామంది ఇస్లాం స్వీకరించి ముస్లింలతో కలసిమెలసి ప్రశాంతజీవితం గడుపుతుంటే, ఇస్లాం స్వీకరించని ఈరానీయులు సింధ్, చైనా, తుర్కిస్తాన్‌లకు పారిపోయి ఇస్లామీయ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నడం ప్రారంభించారు. ముస్లింలు తమ అంతర్గతకలహాల కారణంగా ఇస్లాంవ్యతిరేక శక్తుల్ని పూర్తిగా అణచలేకపోయారు. హి.శ. 94వరకు చైనా, తుర్కిస్తాన్ తిరుగుబాటుల్ని మాత్రమే అణచగలిగారు. సింధ్‌రాజు కవ్వింపు చర్యలకు తగినసమాధానం ఇచ్చే అవకాశం లభించలేదు. ఆ తరువాత జరిగిన పరిణామాలతో సింధ్‌రాజు మరింత పెట్రేగిపోయి పెద్దఎత్తున సైనికసమీకరణ చేసి యుద్ధానికి సమాయత్తపడసాగాడు. దాని పూర్వపరాలు ఇలా ఉన్నాయి:

దైవప్రవక్త (స) కాలంనుండే అరబ్బులు వ్యాపారనిమిత్తం శ్రీలంకకు పోతూ వస్తూ ఉండటం వల్ల అరబ్బులకు, సింహళీయులకు మధ్య స్నేహసంబంధాలు ఏర్పడ్డాయి. ఒకసారి అరబ్ (ముస్లిం) వ్యాపారస్థులు కొందరు ప్రయాణం చేస్తున్నప్పుడు శ్రీలంక సముద్రతీరం సమీపంలో వారి ఓడ మునిగిపోవడంవల్ల అందరూ మృత్యువాతపడ్డారు. దాంతో వారిభార్యలు, పిల్లలు వితంతువులు, అనాథలై పోయారు. అప్పుడు శ్రీలంకరాజు ఖలీఫా వలీద్, ఇరాఖ్‌గవర్నర్ హజ్జాజ్ బిన్ యూసుఫ్‌ల దృష్టి తన వైపుకు మళ్ళించి వారి మెప్పుపొందే ఉద్దేశ్యంతో ఆ వితంతువుల్ని, అనాథల్ని ఎంతో గౌరవమర్యాదలతో హజ్జాజ్ దగ్గరకు పంపే ఏర్పాట్లు చేశాడు. వారందర్నీ ఒక ఓడలో ఎక్కించి, మరొక ఓడలో వారి ఖలీఫాకోసం, గవర్నర్‌కోసం ఎన్నో విలువైన కానుకల్ని ఇచ్చి పంపాడు.

ఈ ఓడలు శ్రీలంక తీరంవెంబడి ప్రయాణిస్తూ పార్సీ జలసంధి గుండా ఈరాన్‌కు చేరుకోవలసి ఉండింది. కాని తుఫాను తాకిడికి ఇవి సింధ్ ఓడరేవు దీబల్ తీరానికి చేరుకున్నాయి. అక్కడ సింధ్‌సైనికులు ఆ పడవల్ని స్వాధీనంచేసుకొని, ప్రయాణీకుల్ని ఖైదీలుగా పట్టుకున్నారు. వారిలో జుబైర్ అనే యువకుడు జైలు నుండి ఎలాగో తప్పించుకొని ఇరాఖ్‌గవర్నర్ హజ్జాజ్‌కు ఫిర్యాదు చేయడానికి బస్రాకు బయలుదేరాడు...

హజ్జాజ్ అనుభవశాలి అయిన ఓ సేనాపతిని పంపమని తుర్కిస్తాన్ గవర్నర్ ఖతీబాను అడిగితే అతను పదిహేడళ్ళయినా నిండని ఓ నూనూగు మీసాల నవ యువకుడ్ని పంపాడు. ఇంతకు ముందెన్నడూ పరిచయంలేని ఆ యువకిషోరం సమర వ్యూహం గురించి మాట్లాడేతీరు, అతని అసాధారణ తెలివితేటల్ని గమనించిన హజ్జాజ్ ఎంతో ఆశ్చర్యపోయాడు. తర్వాత అతను తన సోదరుడు ఖాసిం కుమారుడని తెలుసుకొని "ఖాసిం నా సోదరుడని మీఅమ్మ నీకు తెలియజేయలేదా?" అనడిగాడు. తెలియజేసిందని చెప్పాడు ముహమ్మద్ (రహ్మలై). ఎప్పుడని అడిగితే "మీరు అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి)ని హతమార్చి మదీనాకు తిరిగొచ్చినప్పుడు తెలియజేసింద"ని చెప్పాడు.

అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) హత్య గురించిన మాట వినగానే హజ్జాజ్ ఉగ్రుడయి ఉరిమిచూశాడు. కాని ముహమ్మద్ బిన్ ఖాసిం మరోవైపు దృష్టి మరలించి ఉండటం చూసి కళ్ళు మూసుకొని ఓసారి గతంలోకి తొంగిచూశాడు....



...తీవ్రంగా గాయపడినప్పటికీ చిరునవ్వుతో నేలకొరిగిన అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) అమాయక ముఖం, కాబావిధ్వంసం, ప్రజలహాహాకారాలు, స్త్రీలు-పిల్లల ఏడ్పులు మొదలైన సంఘటనలు ఒక్కసారిగా అతని మెదడులో మెదిలాయి. ఆతర్వాత మదీనా తిరిగొచ్చి వ్యాధిగ్రస్తుడై తుదిఘడియలు లెక్కపెట్టుకుంటున్న సోదరుడు ఖాసింని పరామర్శించడానికి వస్తే అతను కళ్ళుమూసుకొని వేరేవైపుకు ముఖం తిప్పుకుంటూ "హజ్జాజ్ వెళ్ళిపో. నేను చనిపోతూ ఇబ్నెజుబైర్ (రజి) హంతకుడి ముఖం చూడదలచుకోలేదు"అని అన్నాడు. ఆ తర్వాత ఖాసిం చనిపోయాడు. అతని జనాజా దగ్గర ఓ పిల్లవాడ్ని చూసి హజ్జాజ్ ఆ పిల్లవాడ్ని ఎత్తుకొని గుండెలకు హత్తుకోవడానికి ప్రయత్నించాడు. కాని ఆ పిల్లవాడు అతని చేయి విదిలిస్తూ "వదలు నాచెయ్యి. మా నాన్నకు నువ్వంటే ఇష్టం లేదు. నన్ను ముట్టుకోకు" అని చెప్పి దూరంగా జరిగి నిల్చున్నాడు....

ఇలా గతసంఘటనలు హజ్జాజ్ మెదడును తొలిచివేయసాగాయి. కాస్సేపటికి అతని ఉగ్రరూపం గంభీరంగా మారిపోయింది. ప్రతీకారంతో కొలిమిలా మారివున్న అతని హృదయాన్ని పశ్చాత్తాపపు శీతలఛాయలు ముసురుకున్నాయి. కాఠిన్యం-కరకుదనాలు మైనంలా కరిగిపోయాయి. రక్తసంబంధంలోని సహజ ప్రేమాభిమానాలు పరవళ్ళుతొక్కాయి. దాంతో హజ్జాజ్ ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై)కు, అతని కుటుంబానికి చేరువయ్యాడు. అతను ముహమ్మద్ (రహ్మలై)ని తన అల్లుడిగా చేసుకొని బంధుత్వాన్ని మరింత పటిష్ఠపరచుకున్నాడు.

ఖలీఫా ఆదేశంతో అతను ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై)ని డెమాస్కస్‌కు పంపడానికి సిద్ధమవుతున్న సమయంలో సరాందీప్ (శ్రీలంక) నుండి జుబైర్ సింధ్‌రాజు దౌర్జన్యాల్ని గురించి వివరించడానికి వచ్చాడు. అతను సింధ్‌రాజు, అతని దీబల్ రాష్ట్ర గవర్నర్ తమ ఓడల్ని, విలువైన సామగ్రిని దోచుకొని, తమపై జరిపిన దౌర్జన్యాలను గురించి పూసగుచ్చినట్లు తెలియజేశాడు.

హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఈ వార్త విని క్షణంపాటు సందిగ్ధంలో పడిపోయి "ఇది సింధ్‌రాజు వైపున మనకు వ్యతిరేకంగా యుద్ధప్రకటన అయినప్పటికీ ప్రస్తుతపరిస్థితిలో మనం అతనిపై సైనికచర్య తీసుకోవడానికి మన దగ్గర తగిన సైనికసంఖ్యలేదు. నేను మక్రాన్ గవర్నర్‌కు సింధ్‌రాజు దగ్గరకెళ్ళి మాట్లాడమని ఉత్తరం రాస్తాను. సింద్‌రాజు తన తప్పు తెలుసుకొని మన ఖైదీలను విడిచిపెట్టవచ్చు" అని అన్నాడు.

దానికి జుబైర్ "సింధ్‌రాజు తన తప్పు ఒప్పుకునే రకం కాదు. ఇంతకు ముందు అబుల్‌హసన్ ఓడ కనపడకుండా పోయినప్పుడు మీరు మక్రాన్‌గవర్నర్‌ని సింధ్‌రాజు దగ్గరకు పంపారు. కాని సింధ్‌రాజు తనకేమీ తెలియదని బుకాయించిన సంగతి మీకు తెలిసిందే. అబుల్‌హసన్ ఓడను కూడా సింధ్‌సైనికులు దోచుకొనివుంటారు. అబుల్‌హసన్, అతని సహచరులు కొందరు ఇప్పటికీ సింధ్‌జైల్లో మగ్గుతున్నారు" అని అన్నాడు.

"ఏమైనప్పటికీ మన సైనికులు ఆఫ్రికా, తుర్కిస్తాన్, స్పెయిన్‌లలో విజయం సాధించనంతవరకు మన ఖలీఫా మనల్ని సింధ్‌పై సైనికచర్య తీసుకోవడానికి అనుమతించకపోవచ్చు" అన్నాడు హజ్జాజ్ బిన్ యూసుఫ్.

అప్పటిదాకా మౌనంగా ఉన్న ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై) "నేను మన ఖలీఫాకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాను. మీరు అనుమతిస్తే నేను ఈరోజే డెమాస్కస్‌కు బయలుదేరుతాను" అని అన్నాడు.

"కుమారా! నువ్వు పోగానే సైనిక శక్తిసార్థ్యాలతో కూడిన నీ సలహాలతో ఖలీఫాను అంత సులభంగా మెప్పించలేవు. నీలో పౌరుషం, పరాక్రమాలు ఉన్న విషయం నిజమే. కాని కేవలం పౌరుషం, పరాక్రమాల ప్రదర్శనతో శత్రువుల కోటలను మనం జయించ లేము. దానికోసం ఓపెద్ద సైనికపటాలాన్ని తయారుచేయవలసి ఉంటుంది. అమరగతి కాంక్షతో ప్రాణాలు పణంపెట్టి పోరాడగలిగే వీరయోధులు కావాలి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు మన దగ్గర" అన్నాడు హజ్జాజ్.

"మీరు వయసుమీరిన వారిపట్ల నిరాశచెందవచ్చు. కాని నేను యువకుల పట్ల నిరాశచెందడం లేదు. మీపట్ల, ఖలీఫాపట్ల ఉన్న విభేదంవల్ల తుర్కిస్తాన్, ఆఫ్రికాలకు వెళ్ళి యుద్ధం చేయడానికి ఇష్టపడని యువకులు మన స్త్రీలపై, పిల్లలపై సింధ్‌రాజు జరిపిన దౌర్జన్యాల గాథ విని తప్పకుండా ప్రభావితులై సింధ్ వెళ్ళడానికి సిద్ధమవుతారు. నేను ఆశాజీవిని. వేలాది మంది మన యువతలోని పౌరుషం, ఆత్మాభిమానాలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. మీరు ఏ ముస్లింయోధుల పట్ల నిరాశచెందారో వారు కూడా చావలేదు. కాకపోతే వారు నిద్రమత్తులో జోగుతున్నారు. మనజాతి అనాథపిల్లల మొర కునికిపాట్లు పడుతున్న ఆ యోధులకు తప్పకుండా ప్రళయశంఖారావంగా పరిణ మిస్తుంది" అన్నాడు ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై).

హజ్జాజ్ ఈమాటలు విని తీవ్రమైన ఆలోచనలో పడిపోయాడు. అప్పుడు జుబైర్ జేబు లోనుంచి రక్తాక్షరాలతో రాయబడిన ఓ తెల్లరుమాల్ తీసి హజ్జాజ్ ముందు పెడ్తూ "ఇది అబుల్‌హసన్ కూతురు నాహీద్ మీపేర రాసిన లేఖ. మీలో రక్తం పేరుకుపోయి ఉంటే ఈ లేఖ మీకివ్వాలని, లేకుంటే దాని అవసరం లేదని ఆమె చెప్పింది" అని అన్నాడు.

హజ్జాజ్ ఆ రుమాల్లో రక్తాక్షరాలతో గుండెలను పిండే విధంగా వ్రాయబడిన లేఖ చదవగానే అతని రక్తం ఉడికిపోయింది. కుడిచేయి పిడికిలి బిగుసుకు పోయింది. అతనా రుమాల్ ముహమ్మద్ బిన్ ఖాసింకు అందిస్తూ "నేనిప్పుడు సింధ్‌రాజుపై యుద్ధ ప్రకటన చేస్తున్నాను. నువ్వు వెంటనే డెమాస్కస్‌కు వెళ్ళి ఖలీఫాకు పరిస్థితి వివరించి ఆయన్ని సింధ్‌పై సైనికచర్య తీసుకోవడానికి ఒప్పించు. ఒకవేళ ఆయన అందుకు అంగీకరించకపోతే డెమాస్కస్ ప్రజల అభిప్రాయాన్ని మన లక్ష్యానికి అనుకూలంగా కూడ గట్టడానికి కృషిచెయ్యి. దాంతో ఖలీఫా సింధ్‌పై సైనికచర్య తీసుకోవడానికి తప్పకుండా అంగీకరిస్తాడని నేను ఆశిస్తున్నాను. ఇదిగో ఈ ఉత్తరం తీసికెళ్ళి ఖలీఫాకు అందజెయ్యి. జుబైర్‌ని కూడా వెంట తీసికెళ్ళు" అని అన్నాడు.

మరుసటి రోజు ముహమ్మద్ బిన్ ఖాసిం, జుబైర్‌లు డెమాస్కస్‌కు బయలుదేరారు. వారు బయలుదేరి వెళ్ళిన తరువాత హజ్జాజ్ ఒక వార్తాహరుని ద్వారా "నీ మనుషులు మా దేశానికి వస్తున్న ఓడల్ని దోచుకొని మా ప్రయాణీకుల్ని పట్టుకున్నారని తెలిసింది. కనుక ఆ దోపిడీగాండ్లకు తగినశిక్ష విధించి తక్షణమే మా ప్రయాణీకుల్ని మా దగ్గరకు



పంపించు" అని సింధ్‌రాజు దాహిర్‌కు ఉత్తరం రాసిపంపాడు. కాని సింధ్‌రాజు సైనికబలంతో విర్రవీగుతూ దానికి అనుచిత సమాధానమిచ్చాడు.

అప్పుడు హజ్జాజ్ మొదట అబ్దుల్లా అస్లమీకి ఆరువేల మంది సైనికుల్ని ఇచ్చి సింధ్‌కు పంపాడు. కాని ఆ యుద్ధంలో అబ్దుల్లా చనిపోయాడు. తర్వాత అతను బుదైల్ నాయకత్వంలో మరో ఆరువేల మంది సైనికుల్ని పంపాడు. బుదైల్ దీబల్‌కు చేరు కున్నాడో లేదో సింధ్‌సైన్యం అతనిపై విరుచుకుపడింది. బుదైల్ శత్రువుల్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ గుర్రం మీదనుండి పడిపోయి మరణించాడు. ఈ సంఘటనతో హజ్జాజ్ తానుపంపిన సైనికుల్లోని ఇరాఖీయులు సింధ్‌సైనికులతో లాలూచీ పడివుంటారన్న అనుమానంతో ఈసారి పదిహేడేండ్ల నవయువకుడైన ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మా) నాయకత్వంలో సిరియన్ సైనికుల్ని పంపడానికి నిర్ణయించుకున్నాడు.

అటు ముహమ్మద్ బిన్ ఖాసిం, జుబైర్‌లు డెమాస్కస్‌కు చేరుకొని హజ్జాజ్ రాసిచ్చిన లేఖ ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్‌కు అందించారు. జుబైర్ సింధ్‌రాజు దౌర్జన్యాల్ని గురించి తెలియజేశాడు. ఆ తరువాత ముహమ్మద్ బిన్ ఖాసిం హజ్జాజ్‌పేర నాహీద్ రాసిన రక్తాక్షరలేఖ చూపించాడు. వలీద్ ఆ లేఖ చదివి ఎంతో ప్రభావితుడయ్యాడు. దర్బారీలు, సైన్యాధికారులు కూడా ప్రభావితులయ్యారు. తర్వాత ఖలీఫా సైన్యాధికారు లతో మాట్లాడుతూ "మీరు డెమాస్కస్ ప్రజల్ని సింధ్‌పై దాడికి అనుకూలంగా కూడగట్ట గలిగితే నేను యుద్ధప్రకటన చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నాడు.

ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై) ఈమాట విని "మీరు అనుమతిస్తే నేనీ బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నాడు. "దానికి నా అనుమతి అవసరంలేదు. పోతే రేపు సాయుధపోరాటం పోటీలు ఉన్నాయి. ప్రజల్ని తమ వైపుకు తిప్పుకోవడానికి మీరిద్దరు ఈ పోటీల్లో పాల్గొంటే బాగుంటుంది" అన్నాడు ఖలీఫా వలీద్. ఈ పోటీలు తమకు మంచి అవకాశమని భావిస్తూ మిత్రులిద్దరూ దానికి తాము సిద్ధమే అన్నారు.

మరునాడుదయం నుంచే పోటీలు ప్రారంభమయ్యాయి. ఆ పోటీల్లో వలీద్ తర్వాత ఖలీఫాపదవిపై ఆశలుపెట్టుకున్న సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్, అతని ఆంతరంగిక కార్యదర్శి సాలెహ్ కూడా పాల్గొన్నారు. సులైమాన్ ఆత్మస్తుతిపరుడు, ప్రశంసల పిపాసి. అతని మిత్రుడు సాలెహ్ భజనరాయుడు. ఈ తమాషా చూడటానికి వేలాదిమంది జనం గుమిగూడారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. చివరిపోటీలో సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్, ముహమ్మద్ బిన్ ఖాసిం రంగంలోకి దిగారు. సులైమాన్ కవచం, శిరస్త్రాణం ధరించాడు. ముహమ్మద్ (రహ్మాలై) కవచం, శిరస్త్రాణం లేకుండా కళ్ళు తప్ప ముఖం కన్పించకుండా ఓ నల్లవస్త్రం మాత్రమే కప్పుకొని ముసుగువీరుడిలా వచ్చాడు. జనం ఆ ముసుగువీరుడెవరో తెలియక పోటీఫలితం ఎలా ఉంటుందోననుకుంటూ ఎంతో ఉత్కంఠతతో చూడసాగారు. ఇద్దరూ గుర్రాలపై ఎదురెదురుగా స్వారీచేస్తూ పరస్పరం ఈటెలు దూసుకున్నారు. కాస్సేపటికే సులైమాన్ చేతిలోని బరిశ ప్రత్యర్థిదెబ్బకు క్రింద పడిపోయింది. ఆ వెంటనే అతను కూడా గుర్రం మీద నుంచి క్రిందపడిపోతూ ఎలాగో నిలదొక్కుకున్నాడు. జనం సంతోషంతో చప్పట్లు చరిచారు.

తర్వాత ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మ) ముసుగు తీసివేయగానే యువప్రేక్షకుల్లో నూతనుత్సాహం పెల్లుబికింది. సులైమాన్ పరాజయ పరాభవంతో అక్కడ్నుంచి ముఖం చాటేశాడు. వేలాదిమంది యువకులు మిన్నుముట్టే నినాదాలతో ముహమ్మద్ చుట్టు గుమిగూడి అతడ్ని అభినందించారు. ముహమ్మద్ (రహ్మ) ఈ అవకాశం వినియోగించుకుంటూ ముస్లింలపై, ముఖ్యంగా వితంతువులు, అనాథలపై సింధ్ పాలకులు చేస్తున్న దౌర్జన్యాల్ని గురించి తెలుపుతూ, సింధ్‌పై దాడిచేయవలసిన అవసరాన్ని నొక్కిచెబుతూ హృదయాల్ని ఉద్రూతలూగించే ఓ ఉపన్యాసం ఇచ్చాడు.

ప్రజలు ఈ ఉపన్యాసం విని తీవ్రమైన భావోద్రేకాలతో ఊగిపోతూ "వెంటనే యుద్ధ ప్రకటన చేయండి; సింధ్‌పై దాడిచేయడానికి బయలుదేరండి" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోటీప్రదర్శన చూడటానికి వచ్చిన ఖలీఫా వలీద్ ఎంతో సంతోషిస్తూ యుద్ధప్రకటన చేశాడు. ఆరోజు రాత్రి ముహమ్మద్ బిన్ ఖాసిం నమాజ్ చేసిన తరువాత సింధ్ విజయం కోసం దైవాన్ని పరిపరివిధాల ప్రార్థించాడు. అతని మిత్రుడు జుబైర్ 'ఆమీన్' చెప్పాడు. చివర్లో మరొక వ్యక్తి కూడా జుబైర్‌తో గొంతుకలిపి ఆమీన్ అన్నాడు. మిత్రులిద్దరు ఆశ్చర్యంగా అతని వైపు చూడసాగారు.

ఆ వ్యక్తి దగ్గరకు జరిగి "నువ్వన్న మాట ముహమ్మద్ బిన్ ఖాసిం" అన్నాడు. దానికి ముహమ్మద్ (రహ్మలై) "ఔనండీ నేనే ముహమ్మద్ బిన్ ఖాసింని. మరి మీరూ?" అని అన్నాడు. దానికా వ్యక్తి "నేను ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్‌ని" అన్నాడు. "నేను మీగురించి విన్నాను. నన్ను దీవించండి. నాకేదైనా ఉపదేశించండి" అన్నాడు ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మలై). అప్పుడు ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) ఇలా ఉపదేశించారు:

"దైవం నీ సదాశయాలు నెరవేర్చుగాక! నువ్వు సింధ్‌లో సదుద్దేశ్యంతో యుద్ధం చేయడానికి వెళ్తుంటే అక్కడ నువ్వు నీ నిజాయితీ, నీతినడవడికల ద్వారా సింధ్‌ప్రజల్ని బానిసలుగా చేయడానికి కాదు, అధర్మసంకెళ్ళ నుండి విముక్తంచేసి శ్రేయస్కరమార్గం చూపడానికి వచ్చానని నిరూపించాలి. ఏకదైవారాధన పరిధిలో అడుగుపెట్టిన ప్రతి మనిషీ ప్రాపంచికబానిసత్వం నుండి బయటపడి స్వేచ్ఛాజీవిగా, నిజమైన దైవారాధకుడిగా జీవితం గడపగలడని, నిమ్నోన్నతా భేదభావాలు సమసిపోయి సంపూర్ణ మానవ సమానత్వం లభిస్తుందని వారికి తెలియజేయాలి. వారి ముందు నీవు ఇస్లాంలోని సమతాస్వాతంత్ర్యాలను సరైనరీతిలో చిత్రీకరించగలిగితే వారి హృదయాల్ని నీవు దైవ చిత్తమైతే తప్పకుండా జయించగలుగుతావు. దౌర్జన్యపరుడి చేతిలోని ఖడ్గం లాక్కో. కాని అతనిపై దౌర్జన్యం మాత్రం చేయకు. ఒకవేళ శత్రువు తీవ్రంగా గాయపడి ప్రాణభిక్ష అడిగితే అతని గాయాలకు చికిత్సచేసి అతను కోరిన చోటుకు సురక్షితంగా చేర్చు..."

ఫజర్‌నమాజ్ తరువాత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై), జుబైర్, ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) నుండి సెలవుతీసుకొని మస్జిద్ బయటికి వచ్చారు. బయట వేలాదిమంది యువకులు తమ యువనేత కోసం నిరీక్షించసాగారు. వారంతా ఆయుధాలు ధరించి అశ్వరూఢులై అతనివెంట డెమాస్కస్ నుండి బస్రాకు బయలుదేరారు. దారిలో అనేకమంది యువకులు ఆ సైన్యంలో చేరిపోయారు. బస్రా చేరిన



తరువాత కూడా కూఫా, దాని చుట్టుపక్కల ప్రాంతాల నుండి అనేకమంది యువకులు సైన్యంలో చేరిపోయారు. ఆ రోజుల్లోనే మక్రాన్‌గవర్నర్ ముహమ్మద్ బిన్‌హారూన్ నుంచి హజ్జాజ్ దగ్గరకు మరో దుర్వార్త వచ్చింది. ఉబైదుల్లా నాయకత్వంలో దీబల్‌కు పంపబడిన ఇరవైమంది ప్రతినిధుల వర్గంలో ఇద్దరు మాత్రమే ప్రాణాలు కాపాడుకొని మక్రాన్ చేరుకున్నారని, మిగిలిన ప్రతినిధులందర్నీ దీబల్ గవర్నర్ హతమార్చాడన్నదే ఆ దుర్వార్త. ఈ వార్త వినగానే బస్రాప్రజల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి.

ఆ తర్వాత ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మ) పన్నెండు వేలమంది సైనికులతో బస్రా నుండి బయలుదేరి మక్రాన్ చేరుకున్నాడు. అక్కడ్నుంచి లస్బేలా కొండప్రాంతం గుండా ప్రయాణిస్తుంటే అక్కడ దీబల్‌సైనికుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురైంది. భీమ్‌సింగ్ నాయకత్వంలో ఇరవై వేలమంది సైనికులతో పోరాడవలసివచ్చింది. ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మ) ఒక పెద్దదళాన్ని కొండ వెనుక ఉంచి, మిగతా సైనికులతో ముందుకు వెళ్ళి శత్రువులతో ఢీకొన్నాడు. చివరికి దీబల్ కోటను ముట్టడించాడు.

కోటలో శత్రుసైనికులు తక్కువమంది ఉండటం వల్ల వారు ముస్లింయోధుల్ని చూసి నేలమాళిగలోని ఓ సొరంగం గుండా పారిపోవడానికి ప్రయత్నించారు. కాని ఆ సొరంగం ఇరుకుగా ఉండటం వల్ల ఒకేసారి అందరూ పారిపోవడం సాధ్యంకాలేదు. అంచేత వారిలో కొందరు కోటతలుపులు తెరచి బయటికొచ్చి ముస్లింలతో తలపడటానికి సిద్ధమయ్యారు. కాని కాస్పేటికే వారు చేతులెత్తి లొంగిపోయారు. నేలమాళిగలో గుమికూడినవారు ఒకరికొకరు తోసుకుంటూ సొరంగంనుండి బయటపడలేక గావుకేకలు పెట్టసాగారు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) వారి అరుపులు విని అక్కడికెళ్ళి "మీరు పారిపోదలచుకుంటే కోట తలుపులు తెరిచేవున్నాయి, ఆయుధాలు పారేసి పారిపోవచ్చు. మాకెలాంటి అభ్యంతరంలేదు" అని అన్నాడు. అప్పుడు వారు ఆయుధాలు పారేసి ప్రధానద్వారం గుండా బయటికి వచ్చారు. ఇలా అందరూ బయటికొచ్చి ముస్లింలు తమపై ఎలాంటి చర్య తీసుకుంటారోనని భయపడుతూ నిల్చున్నారు.

ఒక నడికారు వ్యక్తి ప్రధానద్వారం నుండి బయటికొచ్చి మళ్ళీ ఎందుకో ద్వారం దగ్గరకు వెళ్ళిపోయాడు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) అతడ్ని చూసి "నీదేదైనా వస్తువు కోటలోపల ఉండిపోతే వెళ్ళి తీసుకోవచ్చు" అని అన్నాడు. ఆ వ్యక్తి ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) వైపు ఎగాదిగా చూసి "మీరేనా అరబ్ సైన్యానికి సేనాపతి?" అని అడిగాడు. దానికి ఆయన ఔనన్నాడు. ఈమాట విని ఆ వ్యక్తి "మీరు మమ్మల్ని శిక్షించకుండా మాపట్ల ఇలా ప్రవర్తించడానికి కారణమేమిటో తెలుసుకోవచ్చా?"అని అడిగాడు. దానికి ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) సమాధానమిస్తూ "మా ఉద్దేశ్యం శత్రువుల్ని హతమార్చడం కాదు, వారికి శ్రేయస్కర మార్గం చూపడమే మా లక్ష్యం" అని చెప్పాడు.

ఆ నడికారు వ్యక్తి ఈమాట విని "అదే నిజమైతే మిమ్మల్ని ఎవరూ జయించలేరు. మీరు మాఈ సైనికుల్ని మీ దయాదాక్షిణ్యాలకు అర్హులని భావిస్తుంటే, రేపు వీరు మీ పతాకం కిందకు చేరుకొని నేలకొరిగిన శత్రువుని కనికరించలేని మా గర్విష్ఠి రాజులపై తప్పకుండా యుద్ధం చేస్తారు" అని అన్నాడు.

ఆ తర్వాత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) కోటతలుపులు మూసేసి బురుజులపై కొందరు యోధుల్ని కాపలా ఉంచాడు. కోటకు వచ్చే దారిలో రెండువైపులా కొండల చాటున రెండు సైనికదళాలను ఉంచాడు. కాస్సేపటికి భీమ్‌సింగ్ తన సైనికుల్ని తీసుకొని కోట సమీపానికి వచ్చాడు. వెంటనే కొండల చాటున కాచుకొనివున్న ముస్లిం యోధులు రెండువైపుల నుంచి భీమ్‌సింగ్ సైన్యంపై హఠాత్తుగా విరుచుకుపడ్డారు. దాంతో శత్రుసైనికులు బిత్తరపోయి చెల్లచెదరైపోయారు. వారిలో అనేకమంది కాలికి బుద్ధిచెప్పారు. మిగిలిన సైన్యంతో భీమ్‌సింగ్ కోటవైపుకు దూసుకుపోయాడు. కాని కోట మీద పచ్చజెండా చూసి ఖంగుతిన్నాడు. అంతలోనే కోటబురుజులపై నుండి బాణాల వర్షం మొదలైంది. అయినప్పటికీ భీమ్‌సింగ్ ధైర్యంతో కోట సమీపానికి చేరుకున్నాడు. కాని క్షణాల్లో కోటతలుపులు తెరచుకోవడం, లోపలినుంచి ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) సైన్యం తీసుకొని భీమ్‌సింగ్‌సైన్యంపై విరుచుకుపడటం జరిగింది. భీమ్‌సింగ్‌తో సహా అనేకమంది శత్రుసైనికులు తీవ్రంగా గాయపడి పారిపోలేకపోయారు. కొందరు ఖైదీలుగా పట్టుబడ్డారు. మిగిలినవారు పలాయనం చిత్తగించారు.

ఆరోజు అర్ధరాత్రిదాకా ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) గాయపడిన తన అనుచరులకు చికిత్సచేయించడంలో, అమరగతులైనవారిని ఖననం చేయించడంలో నిమగ్నుడైపోయాడు. నిర్విరామపోరాటంతో ఆయన కూడా చాలా అలసిపోయాడు. కాని కోట బయట మైదానంలో గాయపడ్డ శత్రువుల అరుపులు, మూల్గులు ఆయన్ని విశ్రాంతి తీసుకోనివ్వలేదు. వెంటనే ఆయన ఓపెద్ద తోలుతిత్తిలో నీళ్ళు నింపుకొని వెళ్ళి దాహంతో అల్లాడిపోతున్న ఆ క్షతగాత్రులకు నీళ్ళు తాగించాడు. తరువాత వారి గాయాలకు మందుపూసి కట్లు కట్టాడు. అనుచరులు కూడా తమ నాయకుడ్ని అనుసరిస్తూ ఈ పనులు నిర్వహించారు. దాంతో శత్రువుల కళ్ళలో కృతజ్ఞతాభావం తొంగిచూసింది.

అదే సమయంలో సమీపంలోని ఓకొండ దిగువ నుండి మూల్గుడు విన్పించడంతో ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని వెళ్ళాడు. చూస్తే అక్కడ దీబల్ సేనాపతి భీమ్‌సింగ్ గాయపడి బాధతో మూల్గుతున్నాడు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) అతని శరీరంలో దిగబడిన బాణాలను తీసి, కవచం తొలిగించి గాయాలకు మందుపూసి కట్లు కట్టాడు. అతని చేయి పట్టుకొని లేపి కూర్చోబెట్టాడు. భీమ్‌సింగ్ బలహీన స్వరంతో మాట్లాడుతూ "మీకు శుభాభినందనలు, మీరే విజయం సాధించారు" అని అన్నాడు. ముహమ్మద్ (రహ్మ) శత్రుక్షతగాత్రులు పడుకోవటానికి కోట వెలుపల ఓపెద్ద గుడారం వేయించి, వారికోసం ఆహారపానీయాలు ఏర్పాటుచేశాడు. వారు తన వైపు అనుమానాస్పదంగా చూస్తుంటే ఆయన వారికి ధైర్యంచెబుతూ "భయపడకండి. మీరు మాదగ్గర బందీలుగా ఉన్నారని భావించకండి. స్వస్థత చేకూరగానే మీరు కోరుకున్న చోటికి నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు" అని అన్నాడు.

ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) అయిదో రోజు యథాప్రకారం ఇషానమాజ్ తర్వాత క్షతగాత్రుల్ని పరామర్శించడానికి వచ్చి భీమ్‌సింగ్ దగ్గరకు వెళ్ళారు. అతని నుదుటిపై చేయిపెట్టి "మీఆరోగ్యం చాలావరకు కుదుటపడింది. గాయాలబాధ కూడా తగ్గిపోయిం



దనుకుంటాను" అన్నాడు. భీమ్‌సింగ్ బలవంతపు చిరునవ్వుతో "ఇంకా లేదు" అన్నాడు.

"నేను రేపుదయం సైన్యం తీసుకొని ఇక్కడ్నుంచి బయలుదేరిపోతున్నాను. నేను మరికొన్ని రోజులు ఇక్కడే ఉండి మీకు సేవచేయాలనుకున్నాను. కాని పరిస్థితులు అందుకు సహకరించడం లేదు. అయితే మీ మంచిసెబ్బరలు చూడటానికి నేనీ కోటలో అయిదొందల మంది సైనికుల్ని వదలి వెళ్తున్నాను. గాయపడిన మీ సైనికులు చాలా వరకు కోలుకున్నారు. రేపు వారికి తాము కోరుకున్న చోటికి పోవడానికి అనుమతి లభిస్తుంది. మీకు గుర్రం మీద స్వారీచేయగలిగే శక్తి వచ్చేవరకు మీరిక్కడే మా అతిథిగా ఉండవచ్చు" అన్నాడు ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ). భీమ్‌సింగ్ ఈ మాటలు విని "మీరు యుద్ధఖైదీలందర్నీ విడుదల చేస్తారా?" అని అడిగాడు ఆశ్చర్యంగా చూస్తూ. దానికి ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) ఇలా సమాధానమిచ్చాడు:

"మా లక్ష్యం ప్రజల్ని ఖైదీలుగా చేసుకోవడం కాదు. వారిని క్రూరమైన పాలకుల నుండి విముక్తికలిగించి సమతా పునాదులపై నిర్మించబడిన ఓ సువ్యవస్థను వారికి పరిచయం చేయాలని మేము భావిస్తున్నాం. మీ సైనికులు మేము విదేశీ దురాక్రమణదారులని భావించి మాతో పోరాడటానికి వచ్చారు. కాని మేము మాదేశవిస్తరణ కోసమో, మాజాతి ప్రయోజనాల కోసమో ఇక్కడకు రాలేదని వారికి తెలియదు. మేము ఇతర జాతులపై అరబ్బులఆధిక్యత కోసంకూడా యుద్ధాలు చేయడంలేదు. మేము సింధ్‌రాజు కిరీటం లాక్కొని మా తల మీద పెట్టుకోవడానిక్కూడా రాలేదు. మేము దుర్మార్గుల్ని అణచి పీడితుల్ని ఆదుకోవడానికి మాత్రమే వచ్చాం. సింధ్‌రాజు మా ఓడలను దోచుకొని, మా స్త్రీలను, పిల్లల్ని నిర్బంధించాడు. సంప్రదింపుల కోసం వచ్చిన మా ప్రతినిధివర్గం సభ్యుల్ని దారుణంగా హతమార్చాడు. ఇప్పుడు విజయం సాధించిన తర్వాత మేము స్వయంగా దుర్మార్గులై దుర్మార్గుల్ని పీడితులుగా చేయాలని అనుకోవడంలేదు."

భీమ్‌సింగ్ ఓ నిమిషం ఆలోచించి "మీరు విడుదలచేసే మా సైనికులు మళ్ళీ సింధ్‌రాజు దగ్గరకు వెళ్ళిపోరని భావిస్తున్నారా? అలాగే నేను వెళ్ళి సింధ్‌సైన్యంలో చేరిపోతే మీకు ప్రమాదం ఉండదా?" అని అడిగాడు. దానికి ముస్లిం సేనాని సమాధానమిస్తూ "నేనేమీ చెప్పలేను. కాని మీగురించి, మీ సైన్యాన్ని గురించి నాకెలాంటి భయం లేదు. నాకు దైవానుగ్రహంపై నమ్మకం ఉంది" అని అన్నాడు. "నేనిప్పుడు పూర్తిగా కోలుకున్నాను. మీరు అనుమతిస్తే రేపే వెళ్ళిపోవాలనుకుంటున్నాను" అన్నాడు భీమ్‌సింగ్. దానికి ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) "నేను ముందే చెప్పాను. మీరు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు నిక్షేపంగా వెళ్ళిపోవచ్చు" అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు. భీమ్‌సింగ్ ఈమాట విని "నువ్వు మానవుడు కాదు. మానవుని అవతారంలో ఉన్న దేవుడివి" అనుకున్నాడు తనలో తాను.

మరుసటిరోజు ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) సైన్యం తీసుకొని వెళ్ళి దీబల్‌ని ముట్టడించాడు. ఈ ముట్టడి వారంరోజులు సాగింది. చివరికి దీబల్‌గవర్నర్ ముప్ఫయి వేలమంది సైనికుల్ని తీసుకొని కోట వెనుకద్వారం గుండా పారిపోయాడు. ముస్లింలు కోటను ఆక్రమించుకున్నారు. వారు తమ సేనాపతి ఆదేశంతో యుద్ధఖైదీలను వదలి

పెట్టారు. క్షతగాత్రుల గాయాలకు మందుపూసి కట్లు గట్టారు. ఇదంతా దీబల్ ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో చూడసాగారు.

ఆ తర్వాత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) సైన్యం తీసుకొని పట్టణంలో పర్యటించడానికి బయలుదేరారు. పదిహేడేండ్ల ముస్లింవిజేత ఊరేగింపును చూడటానికి దీబల్ ప్రజలు ముఖ్యంగా దీబల్‌గవర్నర్ పీడితులు ఎంతో ఉత్సాహంతో వీథుల్లోకి వచ్చారు. స్త్రీలు, పిల్లలు ఇండ్లకప్పుల పైకెక్కి చూడసాగారు. గత కొన్నినెలలు దీబల్ సైనికులు పట్టణప్రజలపై దుర్భర దౌర్జన్యకాండ జరిపారు. రాత్రివేళల్లో వారు తప్పతాగి ప్రజల ఇండ్లలో జొరబడి విలువైన వస్తువుల్ని దోచుకునేవారు. అడ్డం వచ్చినవారిని చితకబాదేవారు. స్త్రీలను మానభంగం చేసేవారు. దీనికి భిన్నంగా ఇప్పుడు శత్రుసైనికుల్ని క్షమించి వదిలేయడమేగాక గాయపడినవారికి చికిత్స కూడా చేసిన ముస్లింవిజేతను చూసి వారు ఎంతో ప్రభావితులైపోయారు. తమను ఆయన తమ దౌర్జన్యపాలకుల కబంధహస్తాల నుండి విముక్తి కలిగించడానికి వచ్చిన దేవత అని భావిస్తూ సంబరపడి పోసాగారు.

ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) దీబల్ నుండి నైర్వాన్‌కు బయలుదేరాడు. వేలాది మంది దీబల్‌ప్రజలు కన్నీటితో అతనికి వీడ్కోలు చెప్పారు. దీబల్‌సైన్యంలోని అయిదు వేలమంది సైనికులు అతని సైన్యంలో చేరి నైర్వాన్‌కు బయలుదేరారు.

నైర్వాన్‌లో సింధ్‌చక్రవర్తి దాహిర్ ముందు సేనాపతి ఓధేసింగ్, అతని కుమారుడు భీమ్‌సింగ్ తలవంచుకొని నిలబడ్డారు. భీమ్‌సింగ్ దీబల్‌లో ఓడిపోయినప్పటికీ ముస్లిం సేనాపతి తనపట్ల ప్రదర్శించిన సత్ప్రవర్తన, తనకు చేసిన సహాయం గురించి రాజా దాహిర్‌కు చెప్పినప్పుడు అతను మండిపడి భీమ్‌సింగ్‌ని, అతనితండ్రి ఓధేసింగ్‌ని జైల్లో పడవేశాడు. జైల్లో భీమ్‌సింగ్ శ్రీలంక నుండి ఖైదీగా వచ్చిన అబుల్‌హసన్‌ని కలుసుకున్నాడు. అబుల్‌హసన్ తన ఓడ ప్రమాదవశాత్తు మునగలేదని, ముంచివేయబడిందని తెలియజేశాడు. తరువాత వారిద్దరు జైలు నుండి ఎలాగో తప్పించుకొని బయటపడ్డారు. ఆ తర్వాత వారు ముహమ్మద్ బిన్ ఖాసిం సైన్యంలో చేరిపోతారు.

ముస్లింసేన నైరూన్‌పై దాడి చేయడానికి వస్తోందని తెలియగానే దాహిర్ చక్రవర్తి నైరూన్‌లో ఎనిమిదివేల మంది సైనికుల్ని ఉంచి భారీఎత్తు సైనిక సమీకరణ కోసం వేరే ప్రాంతానికి వెళ్ళి సన్నాహాలు ప్రారంభించాడు. అయితే ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) సైన్యం దానికి ముందే నైరూన్‌కు చేరుకొని పట్టణాన్ని ముట్టడించింది. నైరూన్ సైనికులు కోటతలుపులు తెరచి కాళ్ళబేరానికి వచ్చారు. నైరూన్ ముస్లింల స్వాధీనమైపోయింది. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) నైరూన్ సైనికుల పట్ల దీబల్ సైనికుల పట్ల ప్రవర్తించినట్టే మంచిగా ప్రవర్తించాడు. అక్కడ్నుంచి సయూన్ దిశగా వెళ్ళి దాన్ని కూడా జయించాడు. సయూన్ పాలకుడు బాజ్‌రాయ్ పారిపోయి సూస్తాన్ రాజు కాకా దగ్గర ఆశ్రయం పొందాడు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) సయూన్ నుండి సూస్తాన్ చేరుకొని యుద్ధం ప్రారంభించాడు. ఆ యుద్ధంలో సయూన్ పాలకుడు బాజ్‌రాయ్ హతమార్చబడతాడు. సూస్తాన్ పాలకుడు పట్టుబడతాడు. అతను నూనూగు మీసాల నవయువకుడైన ముస్లిం సేనాపతిని, తన పట్ల అతని సత్ప్రవర్తన చూసి ఆశ్చర్యపోతాడు.



చివరికి కాకా కూడా కొందరు సైనికులతో ముస్లిం సైన్యంలో చేరిపోయాడు. ఆ తర్వాత ముస్లింసేన బ్రహ్మనాబాద్ వైపు బయలుదేరింది. అయితే దానికి ముందు భయంకరమైన కెరటాలతో పరవళ్ళు తొక్కే సింధూనదిని దాటవలసి ఉంది. అది వేసవి కాలం. హిమాలయ పర్వతాలపై పేరుకున్న మంచు కరిగిపోయి సింధూనది మరింత ఉధృతంగా ప్రవహిస్తుంది. అప్పుడు దాన్ని దాటడం చాలా కష్టం. అయితే ముస్లింల విజయపరంపరలు, సింధ్‌ప్రజల పట్ల వారి సత్ప్రవర్తన గాథలు విన్న మత్స్యకారులు ఆ పనికోసం ముందుకు వచ్చారు. వారి సహాయసహకారాలతో ముస్లింయోధులు క్రీ.శ. 713లో సింధూనది దాటి బ్రహ్మనాబాద్ సమీపానికి చేరుకున్నారు.

దానికి ముందే సింధ్‌చక్రవర్తి దాహిర్ బ్రహ్మనాబాద్‌కు కొన్ని మైళ్ళ దూరంలో పెద్దఎత్తున సైనికసమీకరణ చేసి యుద్ధానికి సిద్ధమయ్యాడు. అంచేత ఇక్కడ ముస్లింలకు తీవ్రప్రతిఘటన ఎదురయింది. అయినప్పటికీ ఇక్కడ కూడా అంతిమ విజయం ముస్లింలనే వరించింది. వారిలో మూడువేల మందికి పైగా హతమవడమో, తీవ్రంగా గాయపడటమో జరిగింది. శత్రుసైనికుల్లో రాజా దాహిర్‌తో పాటు ముప్ఫయివేల మంది సైనికులు హతమయ్యారు. అయితే బ్రహ్మనాబాద్‌లో దాహిర్ కుమారుడు జైసింగ్ దాహిర్ చనిపోలేదని తప్పుడు ప్రచారంచేసి యాభై వేలమంది సైనికులతో యుద్ధం చేయడానికి సిద్ధమయ్యాడు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) ఈ సంగతి తెలుసుకొని బ్రహ్మనాబాద్ వైపు పురోగమించాడు. ఇరుపక్షాలు కోట వెలుపల ఢీకొన్నాయి. చివరికి జైసింగ్ ముస్లింలదాటికి తాళలేక ఇరవైవేల శవాలు వదలిపెట్టి పారిపోయాడు.

బ్రహ్మనాబాద్ ముస్లింల కైవశమయింది. రాజమహల్ ఆవరణలో ముస్లిం సేనాపతి చుట్టూ నగరప్రముఖులు, పురోహితులు అనేకమంది గుమిగూడి ముహమ్మద్ బిన్ ఖాసింకు జై అంటూ నినాదాలు చేయసాగారు. వారిలో కొందరు ఆయన పాదాలు చుంబించడానికి ప్రయత్నిస్తుంటే వారిని ఆయన వారించసాగారు. దాహిర్ చిన్న భార్య సింధ్ మహారాణి లాఢీ పైఅంతస్తు నుండి ఈ అసాధారణ దృశ్యాన్ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తోంది. ముస్లింల తరపున దాహిర్‌సైనికులతో పోరాడి విజయంసాధించిన భీమ్‌సింగ్ సింధ్‌రాణిని కలుసుకొని పరిస్థితి వివరించిన తర్వాత అరబ్‌ఖైదీలను గురించి అడిగాడు. వారంతా తన అధీనంలో క్షేమంగా ఉన్నారని ఆమె తెలిపింది. తరువాత ముహమ్మద్ బిన్ ఖాసిం, మరికొందరు నాయకుల ముందు ఆమె ఆ ఖైదీలను చూపింది. ఖైదీలు సైన్యంలోని తమ బంధుమిత్రుల్ని కలుసుకొని పరమానందభరితులైపోయారు.

సింధ్‌రాణి ముస్లింసేనాపతి అరూరాపై కూడా దాడిచేయబోతున్నాడని తెలుసుకొని తన కొడుకు ఫఫీని కాపాడమని వేడుకున్నది. “నేనక్కడికి వెళ్ళి అతడ్ని నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తాను. నన్నక్కడికి వెళ్ళడానికి అనుమతివ్వండి”అని విన్నవించుకుంది. సేనాపతి అందుకు అంగీకరించడమే గాకుండా బ్రహ్మనాబాద్‌కు చెందిన కొందరు నాయకుల్ని తోడిచ్చి మరీ ఆమెను అరూరాకు పంపించాడు. ఆమె అరూరకు చేరుకొని కొడుక్కు ఎంతగానే నచ్చజెప్పింది. కాని ఆ దుపుత్రుడు కన్నతల్లి మాటలు పెడచెవిన పెట్టి సవతి తల్లి మాటలు విని ముస్లింసైన్యాన్ని ప్రతిఘటించడానికే సిద్ధమయ్యాడు.

అంతలో మరోవైపు సింధ్‌రాణి ముస్లింసేనాపతితో ప్రత్యక్షసంభాషణ జరిపి మత భ్రష్టురాలై పోయిందని నగరపురోహితులు పుకారు పుట్టించారు. ఈ వదంతి కార్చిచ్చులా నగరంలో ప్రాకిపోయి సింధ్‌సైనికుల్ని బాగా రెచ్చగొట్టింది. దాంతో ఫఫీ పతాకం క్రింద దాదాపు పాతికవేల మంది సైనికులు చేరిపోయారు. కాని ముస్లిం సేనాని ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మ) వస్తున్నాడని తెలియగానే ఫఫీ సైన్యం నుండి అయిదువేల మంది భయపడి పారిపోయారు. ఆ తరువాత మరో మూడువేల మంది పారిపోయారు. దాంతో ఫఫీ 'కన్నతల్లి మాట వినకుండా సవతితల్లి మాటవిని దుస్సాహసానికి పాల్పడ్డానే!' అని పశ్చాత్తాపంతో బాధపడుతూ నగరం నుండి పారిపోయాడు.

ఈవిధంగా అరూరా ముస్లింలకు సులభంగా స్వాధీనమైపోయింది. వారి సేనాపతి అరూరా గవర్నర్‌గా సింధీ నవముస్లింని నియమించి ముల్తాన్ వైపు పురోగమించాడు. ముల్తాన్‌ముట్టడి సందర్భంలో హజ్జాజ్ బిన్ యూసుఫ్ చనిపోయాడన్న వార్త వచ్చింది. ముల్తాన్ కూడా కైవశం అయిన తర్వాత ముహమ్మద్ (రహ్మ) అరూరాకు తిరిగొచ్చాడు.

అరూరా చేరుకోగానే రాజా దాహిర్ కొడుకు జైసింగ్‌కు ఖనూజ్‌రాజు హరిచందర్ ఆశ్రయం ఇచ్చాడని, వారిద్దరు కలసి సింధ్‌పై దాడిచేయడానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. అంచేత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) వెంటనే బయలుదేరి ఖనూజ్‌పై దాడిచేశాడు. హిరిచందర్‌కు జైసింగ్ విదేశీ దురాక్రమణదారులు పదివేల మంది కంటే ఎక్కువలేరని చెప్పివున్నాడు. కాని ఇక్కడ చూస్తే ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ)కు జైకొట్టే సింధీలు అరబ్బుల కంటే మూడు నాలుగు రెట్లు ఎక్కువ మంది కన్పించారు. దాంతో హరిచందర్ జైసింగ్‌ని తిట్టిపోస్తూ పలాయనం చిత్తగించాడు. హరిచందర్ పారిపోవడంతో జైసింగ్ కూడా దిక్కుతోచక తోకముడిచి పారిపోయాడు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ) అక్కడ్నుంచి అరూరాకు తిరిగొచ్చాడు.

అరూరాకు చెందిన ఓ సుప్రసిద్ధ శిల్పి ఒక అందమైన పాలరాతి విగ్రహం తయారు చేసి ప్రదర్శన కోసం నగరం నడిబొడ్డులో ప్రతిష్ఠించాడు. దాన్ని చూడటానికి వేలాది మంది జనం గుమికూడారు. విగ్రహం పాదాలచెంత "మన దేశంలో సమత, న్యాయా లతో కూడిన ప్రభుత్వం నెలకొల్పిన దేవుడు" అనే అక్షరాలు చెక్కివున్నాయి. విగ్రహం మెడ నుండి కాళ్ళదాకా పూలమాలలతో అలంకరించబడింది. అరూరా పురప్రముఖుల్లో అనేకమంది ఆ విగ్రహాన్ని తమఇంట్లో ప్రతిష్ఠించుకునే ఉద్దేశంతో శిల్పికి కోరినంత ధర చెల్లించడానికి సిద్ధమయ్యారు. కాని పట్టణ పురోహితులంతా దాన్ని ఒక దేవాలయంలో ప్రతిష్ఠించాలని తీర్మానించారు. అందుకు శిల్పి సంతోషంగా ఒప్పుకున్నాడు. అప్పుడు జనం ఆ విగ్రహాన్ని ఓ బండిమీద నిలబెట్టి ఊరేగిస్తూ బయలుదేరారు.

ఆ విగ్రహం వెంట పూజారులు, పురోహితులు, ప్రజలు, పురప్రముఖులు మిన్ను ముట్టే హర్షధ్వానాలతో నడుస్తూ రాజమహల్ సమీపానికి వచ్చారు. భీమ్‌సింగ్ ఈ దృశ్యం చూడగానే ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మ) దగ్గరకు పరుగెత్తికెళ్ళి "ప్రజలు మీ విగ్రహాన్ని తయారుచేసి దేవాలయంలో ప్రతిష్ఠించడానికి తీసికెళ్తున్నారు" అని చెప్పాడు. ముహమ్మద్ బిన్‌ఖాసిం (రహ్మ) ఈమాట విని కంగారుపడుతూ రాజమహల్ నుంచి



బయటికి వచ్చాడు. ప్రజలు ఆయన్ని చూసి ఆగి మరింత ఉత్సాహంతో హర్షధ్వానాలు చేయసాగారు. వారిలో ఓ ధర్మకర్త ముందుకువచ్చి "ఈ ప్రజలు మిమ్మల్ని ఇంతకంటే ఎక్కువ గౌరవించలేరు..." అని అన్నాడు.

అప్పుడు ముహమ్మద్ (రహ్మ) తన పేరుతో చేసే వ్యక్తిపూజ, విగ్రహారాధనల నుండి వారిని వారించడానికి ఉపన్యాసం ఇచ్చారు. తర్వాత ఆయన విజ్ఞప్తితో శిల్పి ఆ విగ్రహాన్ని ముక్కలుముక్కలుగా విరగ్గొట్టాడు. ఆ ముక్కల్ని తీసుకొని దాచుకోవడానికి జనం వాటిపై ఎగబడ్డారు. ఆ తరువాత కొన్నాళ్ళకు ప్రజలు ఇస్లాం వైపు దృష్టి సారించారు. యావత్తు సింధ్‌లో వేలాది మంది ఇస్లాం స్వీకరించడం కూడా జరిగింది.

## 4) తారీఖ్ బిన్ జియాద్-స్పెయిన్

స్పెయిన్‌లో గాథ్ వంశానికిచెందిన మస్మీవటీజా పాలనలో పాదరీలు పెత్తందారులై ప్రజలపై, ముఖ్యంగా యూదులపై దౌర్జన్యం చేస్తుండేవారు. తమ పెత్తనాన్ని నిరోధిం చడానికి ప్రయత్నించిన వటీజాను వారు యూదుల శ్రేయోభిలాషి అన్న ఆరోపణ మోపి అధికారం నుంచి దించివేశారు. తర్వాత లర్జీఖ్‌ని గద్దెఎక్కించారు. వటీజా తన కూతుర్ని స్పెయిన్ సమీపంలోని సబత్‌కోట పాలకుడు కౌంట్‌జూలియన్ కిచ్చి పెళ్ళిచేశాడు. జూలియన్ గాథ్ సంప్రదాయం ప్రకారం తనకూతుర్ని లర్జీఖ్‌రాజు సంరక్షణలో ఇచ్చాడు. స్పెయిన్‌రాజు లర్జీఖ్ ఆ బాలిక పెరిగి పెద్దదయిన తర్వాత గాథ్ సంప్రదాయం ప్రకారం ఆమె తల్లిదండ్రులకు తిరిగి అప్పగించవలసి ఉంటుంది. కాని ఆ దుర్మార్గుడు ఆమెను మానభంగం చేశాడు. జూలియన్ ఈసంగతి తెలిసి తన కూతుర్ని చావుబతుకుల్లో ఉన్న ఆమెతల్లి చూడాలనుకుంటుందని చెప్పి ఆమెను తన పట్టణానికి తీసికెళ్ళాడు. తర్వాత కొందరు క్రైస్తవపెద్దల్ని వెంటబెట్టుకొని ఖైర్వాన్ (ఉత్తరాఫ్రికా) గవర్నర్ మూసా బిన్ నసీర్ దగ్గరకు వెళ్ళి ఆయన్ని స్పెయిన్‌పై దాడికి పురిగొల్పాడు.

అప్పుడు మూసా బిన్ నసీర్ ఖలీఫా అనుమతి తీసుకొని హి.శ. 92లో ముందుగా స్పెయిన్ సైనికశక్తి, ఇతర విషయాలు తెలుసుకొని రమ్మని చెప్పి అయిదొందల మంది సైనికుల్ని పంపించాడు. వారు స్పెయిన్ సరిహద్దు ప్రాంతాల్లో సాధారణ దాడులు చేసి తిరిగొచ్చారు. వారు తెచ్చిన నివేదిక ప్రకారం మూసా అక్కడి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలుసుకొని తన బర్బరీతెగ బానిస, తంజా పట్టణ పాలకుడు, మొరాకో సేనాపతి అయిన తారీఖ్ బిన్ జియాద్‌ని రంగంలోకి దించాడు. తారీఖ్ నాలుగు ఓడల్లో ఏడు వేలమంది సైనికుల్ని తీసుకొని బయలుదేరాడు.

స్పెయిన్ తీరం ఇంకా కొన్ని మైళ్ళదూరం ఉందనగా అతను ఒకవిధమైన మైకంతో నిద్రలోకి జారుకొని స్వప్నలోకంలో తేలియాడాడు. దైవప్రవక్త(స) కలలోకి వచ్చి "తారీఖ్! నువ్వు స్పెయిన్‌ని జయిస్తావు" అని అన్నారు. ఆ తర్వాత వెంటనే కల చెదరిపోయింది. ఈ కలతో స్పెయిన్ విజయం తథ్యం అని తారీఖ్‌కు గట్టి నమ్మకం ఏర్పడింది. కాస్సేప టికి ఓడలు స్పెయిన్ తీరానికి చేరుకున్నాయి. సైనికులంతా ఓడల్లో నుంచి దిగిన తర్వాత ఆ ఓడలను తగలబెట్టి సముద్రంలో ముంచి వేయండని తారీఖ్ ఆదేశించాడు. క్షణాల్లో ఓడలు తగలబడి సముద్రంలో మునిగిపోయాయి.

ఇప్పుడిక ముస్లింలు వెనక్కి వెళ్ళిపోయే ప్రసక్తే లేదు. విజయమో, వీరమరణమో తేల్చుకోవడం ఒక్కటే దారి. సేనాపతి తారీఖ్ బిన్ జియాద్ ఈ విషయాన్నే తన సైనికులకు చెబుతూ ఇలా అన్నాడు: "ఇక మనం వెనక్కి వెళ్ళిపోయే దారే లేదు. మన వెనుక సముద్రం ఉంది. ముందు శత్రుదేశం ఉంది. కనుక ప్రాణాలకు తెగించి అత్యంత ధైర్యసాహసాలతో స్పెయిన్‌పై దాడిచేసి శత్రుసైనికుల్ని వెనక్కినెట్టుతూ ముందుకు పురోగమించడమే మనకు మిగిలిన ఏకైకమార్గం. ప్రాణభీతి, పిరికితనాల పర్యవసానం సర్వనాశనం తప్ప మరేమీ ఉండదు."

విదేశీసైన్యం ఏదో తమ దేశంలో చొరబడిందని గూఢచారుల ద్వారా తెలియగానే స్పెయిన్ సేనాపతి తద్మీర్ ఓపెద్ద సైనికపటాలం తీసుకొని తారీఖ్ సైన్యాన్ని ప్రతిఘటించడానికి వచ్చాడు. కాని ఆ సుప్రసిద్ధ సేనాపతి ముస్లింయోధుల ముందు నిలువలేక కాస్సేపటికే పలాయనం చిత్తగించాడు. అతనొక సురక్షిత ప్రదేశానికి చేరుకొని రాజు లర్జీఖ్‌కు ఇలా ఉత్తం రాసి పంపాడు:

"మహారాజా! మన దేశంపై ఒక విచిత్రమైన జాతి దాడిచేసింది. నేను నా శాయాశక్తులా పోరాడాను. కాని వారిని ఎదుర్కోలేకపోయాను. కనుక వెంటనే మీరు ఓ భారీఎత్తు సైన్యాన్ని సమీకరించి తీసుకురావలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఈ దురాక్రమణదారులు ఎవరో, ఎక్కడ్నుంచి వచ్చారో, ఆకాశం నుండి ఊడిపడ్డారో, భూమి నుండి చీల్చుకొచ్చారో నాకైతే తెలియదు."

రాజు లర్జీఖ్ భయంకరమైన ఈ వార్త విని తక్షణమే ఖర్తబా పట్టణం చేరుకొని పెద్ద ఎత్తున సైనికసమీకరణ చేయడంలో నిమగ్నుడైపోయాడు. ఖర్తబా పట్నం కేంద్రీయ సైనికస్థావరం. ఇక్కడకు దేశంలోని వివిధప్రాంతాల నుంచి సైనికులు తరలివచ్చారు. ఈ విధంగా లర్జీఖ్ దాదాపు లక్ష మంది సైనికుల్ని సమీకరించి బయలుదేరాడు. అందులో పేరుమోసిన సైన్యాధికారులు, గొప్పగొప్ప మల్లయోధులు కూడా అనేకమంది ఉన్నారు. అదీగాక ప్రముఖ పాదరీలు, బిషప్పులు కూడా పాల్గొని తమ సైనికుల్లో సమరోత్సాహాన్ని రేకెత్తిస్తున్నారు. అటు తారీఖ్ అనేక ప్రాంతాలపై నిర్విరామంగా దాడులు చేస్తూ అప్రతిహతంగా పురోగమించసాగాడు.

హి.శ. 92వ సంవత్సరం రమజాన్‌నెలలో రెండు పక్షాలు ఢీకొన్నాయి. దానికి ముందే తారీఖ్ సైన్యానికి మద్దతుగా మూసా బిన్ నసీర్ ఆఫ్రికా నుంచి అయిదు వేలమంది సైనికుల్ని పంపించాడు. దీంతో ముస్లింయోధుల సంఖ్య పన్నెండువేలకు చేరింది. అటు రాజు లర్జీఖ్ నాయకత్వంలో లక్షమంది క్రైస్తవసైన్యం ఆపాదమస్తకం ఉక్కుకవచాలు ధరించి, అశ్వరూఢులై ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో, తీవ్రమైన ప్రతీకారంతో పెట్రేగిపోతూ వచ్చి ఎలాంటి వాహనాలులేని ముస్లిం సైన్యంపై విరుచుకుపడింది. కాస్సేపటికి సమరజ్వాలలు మింటికెగిసాయి. శవాలు గుట్టలుగుట్టలుగా పడిపోతున్నాయి. చివరికి లర్జీఖ్ దిక్కుతోచని స్థితిలో పడిపోయి బ్రతుకు జీవుడా అంటూ పలాయనం చిత్తగించాడు. తమ రాజు రంగం నుండి పారిపోవడం చూడగానే అతని సైనికులు కూడా ప్రాణాలు చేతబట్టుకొని కాలికి బుద్ధిచెప్పారు.



ముస్లింయోధులు విజయానందంతో దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నారు. వారందరికి యుద్ధమైదానంలో శత్రుసైనికుల గుర్రాలు, వారి మృతసైనికుల కవచాలు, శిరస్త్రాణాలు లభించాయి. తారీఖ్ ఈ విజయవార్తను వెంటనే ఖైర్వాన్ గవర్నర్ మూసా బిన్ నసీర్‌కు అందజేశాడు.

మూసా బిన్ నసీర్ ఈ శుభవార్త ఖలీఫా వలీద్‌కు తెలియజేసి, "నీవు ఏ ప్రాంతం దాకా పురోగమించావో ఆ ప్రాంతంలోనే ఆగిపో. నేను వచ్చేవరకు ముందుకు పురోగమించకు" అని ఆదేశిస్తూ తారీఖ్‌కు లేఖ రాసి పంపాడు. ఆ తరువాత అతను పద్దెనిమిది వేలమంది సైనికుల్ని తీసుకొని ఖైర్వాన్ నుండి బయలుదేరాడు. కాని తారీఖ్ తప్పనిసరి పరిస్థితుల్లో ఖర్తబా పట్టణాన్ని ముట్టడించి, ఆ తరువాత రాజధాని తైతలాపై దాడిచేయవలసివచ్చింది. తైతలా పట్టణాన్ని జయించిన తరువాత తారీఖ్‌కు అక్కడ ఇరవై అయిదు రత్నఖచిత కిరీటాలు లభించాయి. ప్రతి కిరీటం మీద ఆయా కాలానికి చెందిన రాజు పేరు లిఖించబడివుంది. అంటే అప్పటివరకు ఒకరి తర్వాత ఒకరు చొప్పున ఇరవై అయిదు మంది గాథ్‌వంశపు రాజులు స్పెయిన్‌ని పరిపాలించారన్న మాట.

తారీఖ్ బిన్‌జియాద్ స్పెయిన్‌లోని ఆక్రమిత ప్రాంతాలకు గవర్నర్‌గా కౌంట్‌జూలీన్‌ని నియమించి తైతలా నుంచి వేరే ప్రాంతం వైపు పురోగమించాడు. కొన్నాళ్ళకు మూసా బిన్ నసీర్ సైన్యం తీసుకొని స్పెయిన్ చేరుకున్నాడు. కౌంట్‌జూలీన్ అతనికి స్వాగతం చెప్పాడు. మూసా ఆ తర్వాత కౌంట్‌జూలీన్ సూచన ప్రకారం దాడులు చేస్తూ తైతలా చేరుకున్నాడు. మూసా వస్తున్న సంగతి తెలుసుకున్న తారీఖ్ కూడా తైతలా చేరుకున్నాడు. తారీఖ్ తన ఆజ్ఞ ధిక్కరించి ముందుకు పురోగమించినందుకు శిక్షగా అతడ్ని మూసా కొన్నాళ్ళపాటు జైల్లో నిర్బంధించి ఉంచాడు. ఆ తరువాత మూసా అతనికి బ్రహ్మాండమైన సైన్యం ఇచ్చి ముందుకు పంపి తాను అతని వెనకాలగా బయలుదేరాడు.

మూసా, తారీఖ్‌లు దాదాపు యావత్తు స్పెయిన్‌ని జయించి అక్కడి క్రైస్తవుల, యూదుల ధన మాన ప్రాణాలకు, వారి మతధర్మాలకు రక్షణహామీనిచ్చారు. ఆ తరువాత ఆ ఇద్దరు నాయకులు ఫ్రాన్స్ దిశగా పురోగమించారు. ఫ్రాన్స్‌లోని దక్షిణ ప్రాంతాన్ని జయించి చలితీవ్రత కారణంగా స్పెయిన్‌కు తిరిగొచ్చారు. ముస్లింయోధులకు ఫ్రాన్స్‌లో దారి దాదాపు సుగమం అయింది. అక్కడ్నుంచి ఇతర ఐరోపా దేశాలన్నిటినీ సులభంగా జయించవచ్చు. మూసా, తారీఖ్‌లు ఈ ఆలోచనలో ఉండగా, ఐరోపాను జయించే ఆలోచన మానేసి వెంటనే డెమాస్కస్‌కు వచ్చేయాలని అటు ఖలీఫా వలీద్ నుంచి పిడుగులాంటి ఆదేశం వచ్చింది.

ఈ ఆజ్ఞతో మూసా బిన్ నసీర్ స్పెయిన్ పరిపాలనను తన కుమారుడు అబ్దుల్ అజీజ్‌కు అప్పగించి, తారీఖ్ బిన్ జియాద్‌ని వెంటబెట్టుకొని సమరసొత్తు తీసుకొని స్పెయిన్ నుండి బయలుదేరాడు. అతను మొరాకో, ఖైర్వాన్‌ల గుండా ఆఫ్రికా వెళ్ళి అక్కడ్నుంచి డెమాస్కస్ సమీపానికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ మంచానపడి తుదిఘడియలు లెక్కపెట్టుకుంటున్నాడు. అందువల్ల వలీద్ సోదరుడు, ఖిలాఫత్ వారసుడయిన సులైమాన్ బిన్‌అబ్దుల్‌మలిక్ ఇక వలీద్ చనిపోయే

సమయం ఆసన్నమయిందని, తన అధికారపీఠం ఆరోహణా ఉత్సవం బ్రహ్మాండంగా జరుగుతుందని భావించాడు. ఆ నేపథ్యంలో అతను మూసా బిన్ నసీర్‌కు "నీవు అప్పుడే డెమాస్కస్‌లో ప్రవేశించకు" అని కబురుచేశాడు. కాని మూసా ఆ విషయాన్ని పట్టించుకోకుండా వలీద్‌కు స్పెయిన్ విజయవార్తతో పాటు తాను తెచ్చిన అపార సమర సొత్తు గురించి తెలియజేసి అతని ప్రసన్నత పొందాలన్న ఉత్సాహంతో నగరంలో ప్రవేశించాడు. కాని ఖలీఫా వలీద్ అప్పటికే కన్నుమూశాడు.

ఉన్నతాధికారులు కొత్తఖలీఫాను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ మూసాకు వ్యతిరేకంగా సులైమాన్‌కు బాగా నూరిపోశారు. అంతకుముందే మూసా తనమాట విన లేదన్న ఆగ్రహంతో ఉన్న సులైమాన్‌కు వారి మాటలు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. వలీద్ పదేండ్ల పాలన తర్వాత హి.శ. 96 జమాదిస్సాని మాసంలో చనిపోయాడు. ఆ తర్వాత అతని సోదరుడు సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖలీఫా అయ్యాడు.

## 5) వలీద్ ప్రజాసంక్షేమ కార్యాలు

ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ హి.శ. 87లో రాజధాని డెమాస్కస్‌లో జామియా మస్జిద్‌ని విస్తరించి పునర్నిర్మించాడు. అదే సంవత్సరం మదీనాలో అక్కడి గవర్నర్ ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ ఆధ్వర్యంలో మస్జిదెనబవీని కూడా విస్తరించి పునర్నిర్మించడం జరిగింది. వలీద్ తన పాలనాకాలంలో అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టాడు. ముఖ్యంగా రోడ్లు వేయించాడు; పట్టణాల్లో, గ్రామాల్లో పాఠశాలలు నెలకొల్పాడు; అతిథి గృహాలు నిర్మింపజేశాడు; బావులు తవ్వించాడు; అనాథశరణాలయాలు నెలకొల్పాడు. అంధులు, వికలాంగుల కోసం ప్రత్యేక సేవకుల్ని నియమించాడు. పిల్లలకు ఖత్నా చేయించేవాడు. జాతీయరహదారుల్లో బాటసారుల భద్రతకోసం తగిన ఏర్పాట్లు చేయించాడు; మదీనాలో మంచినీటి కొరత తీవ్రంగా ఉండేది, దాన్ని దూరంచేయడానికి వలీద్ ఒక కాలువ తవ్వించి తద్వారా నీరు సరఫరా చేయించాడు. ఉపాధ్యాయులకు, ధర్మవేత్తలకు జీతాలు, నిరుపేదలకు పించన్లు నిర్ణయించాడు. రాజ్యంలోని అనేక పట్టణాల్లో ఆసుపత్రులు కూడా స్థాపించాడు. ఏ పనీ చేయలేని వృద్ధులు, బలహీనులు ఎవరి ముందూ చేయిజాపని విధంగా తగిన ఆర్థికసౌకర్యాలు కల్పించాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అతని పాలనలో దాదాపు భిక్షాటన పూర్తిగా అంతమైపోయింది.

వలీద్ పాలనాకాలంలో అంతర్గత అరాచకం, అంతఃకలహాలకు సంబంధించి చెప్పుకోదగ్గ సంఘటనలు ఏమీ సంభవించలేదు. అంచేత సామ్రాజ్యం బయట అనేక ప్రాంతాల్లో విజయపరంపర నిరాఘాటంగా కొనసాగింది. అతని పాలనాకాలంలో సింధ్, తుర్కిస్తాన్, సమర్‌ఖంద్, బుఖారా, స్పెయిన్, ఆసియామైనర్‌కు చెందిన అనేక కోటలు, పట్టణాలు, కొన్ని దీవులు ఇస్లాం సామ్రాజ్యపరిధిలోకి వచ్చాయి. రెండవ ఖలీఫా ఉమర్ (రజి) తరువాత మరే ఖలీఫా కాలంలోనూ ఇన్ని దేశాల్లో విజయాలు లభించలేదు. మరోవైపు అతను ప్రజల సుఖసంతోషాలకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా దృష్టి కేంద్రీకరించి అనేక పనులు చేశాడు.



# 42. సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన

వలీద్ తన తమ్ముడు సులైమాన్‌కు బదులు తన కుమారుడ్ని రాజకీయ వారసుడ్ని చేయడానికి ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నం ఫలించకముందే అతను చనిపోయాడు. వలీద్ చనిపోయిన తర్వాత అతని తమ్ముడు సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ హి.శ. 96, జమాదిస్సాని నెలలో ఖలీఫా అయ్యాడు. వలీద్ తన కుమారుడ్ని రాజకీయ వారసుడ్ని చేయడానికి ప్రయత్నించినపుడు అతని ఉద్దేశ్యాన్ని సమర్థించినవారందరికీ సులైమాన్ ఇప్పుడు విరోధి అయ్యాడు. అలాంటి వారిలో ఇరాఖ్ గవర్నర్ హజ్జాజ్ బిన్ యూసుఫ్, సజిస్తాన్ (అఫ్గనిస్తాన్), తుర్కిస్తాన్, బుఖారా, సమర్‌ఖంద్‌ల విజేత ఖతీబా బిన్ ముస్లిం బాహిలి; స్పెయిన్‌విజేత మూసా బిన్ నసీర్ కూడా ఉన్నారు. హజ్జాజ్ సులైమాన్ ఖలీఫా కాకముందే చనిపోయాడు. అయితే సులైమాన్ పాపిష్ఠి కళ్ళు హజ్జాజ్ అల్లుడు సింధ్‌విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) మీద పడ్డాయి.

## 1) తుర్కిస్తాన్‌విజేత ఖతీబా బిన్ ముస్లిం హత్య

వలీద్ చనిపోయాడని, అతని స్థానంలో సులైమాన్ ఖలీఫా అయ్యాడని తెలియగానే ఖురాసాన్ (ప్రస్తుతఈరాన్) గవర్నర్ ఖతీబా బిన్ ముస్లిం తన సైనికుల్ని, సైన్యాధికారుల్ని సమావేశపరచి తామంతా సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని అన్నాడు. ఖతీబా సైన్యంలో బనూతమీమ్ తెగకు చెందిన సైనికులు అత్యధికమంది ఉన్నారు. వారి నాయకుడు 'వకీ'కి సేనాపతి ఖతీబా ధోరణి నచ్చలేదు. అది ఖిలాఫత్ పాలనలో అరాచకాన్ని సృష్టిస్తుందని భావించాడతను.

అంచేత అతను తన తెగవారిలో సులైమాన్ ఖిలాఫత్‌కు అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం ప్రారంభించాడు. క్రమేణ ఈవార్త సైన్యంలో పాకడంతో సైన్యంలోని తెగలంతా వకీ చుట్టు గుమికూడారు. ఖతీబా వారికి నచ్చజెప్పడానికి ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆ సైనికులు అతడ్ని దూషిస్తూ తూలనాడుతూ ఖడ్గాలతో విజృంభించారు. చివరికి వారు ఖతీబాను, అతని బంధువులు పదకొండు మందిని హతమార్చారు. ఆ తరువాత ఖతీబా శిరస్సును ఖండించి సులైమాన్ దగ్గరకు పంపించారు. ఖతీబా అత్యత ప్రతిభావంతుడైన సేనాపతి మాత్రమే గాక బనూఉమయ్యా తెగకు గట్టి సమర్థకుడు కూడా. కాని ముందుచూపు లేకుండా సులైమాన్ పాలనకు వ్యతిరేకిగా మారి తన సొంత సైనికుల చేతిలోనే హతమయ్యాడు.

## 2) సింధ్‌విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం హత్య

సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ రెండవ విరోధి హజ్జాజ్ బిన్ యూసుఫ్. అతను ఇదివరకే చనిపోయాడు. అయినప్పటికీ హజ్జాజ్ పట్ల చెలరేగుతున్న అతని ప్రతికార వాంఛ ఇంకా తగ్గలేదు. అది ఏ పాపం ఎరగని అతని అల్లుడి మీదికి మరలింది. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) హజ్జాజ్‌కు అల్లుడు కావడమే ఖలీఫా సులైమాన్ దృష్టిలో పెద్ద నేరమైపోయింది. అందువల్ల అతని హిట్‌లిస్ట్‌లోకి సింధ్‌విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) కూడా చేరిపోయాడు.

సింధ్‌లో అక్కడి ప్రజలు ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) నీతినడవడికలు, దయాగుణం చూసి అతనికి ఎలా నీరాజనం పడ్తున్నారో చూడండి. సింధ్‌రాజుల దౌర్జన్యాల నుండి తమను కాపాడటానికి దిగివచ్చిన అవతారపురుషుడని వారు భావిస్తున్నారు. అతను సింధ్ విజయం తర్వాత రాజస్తాన్ వైపు పురోగమించడానికి సిద్ధమయ్యాడు. ఓరోజు ఫజర్‌నమాజ్ తర్వాత అతను సైనికులముందు ఓ సుదీర్ఘ ప్రసంగం చేసి సింధ్‌రాజధాని అరూరా నుండి బయలుదేరడానికి ఉపక్రమించాడు. అరూరా పౌరులు ఆ యువసేనానికి భారమైన హృదయాలతో వీడ్కోలు చెబుతున్నారు. స్త్రీలు అతని విజయాన్ని కాంక్షిస్తూ సైనికుల మెడల్లో పూలదండలు వేస్తున్నారు. అంతలో అకస్మాత్తుగా దూరాన దుమ్ములేపుకుంటూ కొందరురౌతులు రావడం కన్పించింది. ఆ తరువాత కొన్ని క్షణాల్లోనే యాభైమంది సాయుధ అరబ్బులు ప్రత్యక్షమయ్యారు.

ఖలీఫా సులైమాన్ ప్రతీకారేచ్ఛతో ఉడికిపోతూ సింధ్ గవర్నర్‌గా యజీద్ బిన్ అబూకబ్షాను నియమించి "నువ్వు తక్షణమే సింధ్ వెళ్ళి ముహమ్మద్ బిన్ ఖాసింని బంధించి తీసుకురా" అని ఆదేశించాడు. యజీద్ యాభైమంది సైనికుల్ని తీసుకొని సింధ్‌కు బయలుదేరాడు. అతను యాభైమంది సైనికులతో ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై)ని మెడలువంచి తీసుకురాలేడని అందరికీ తెలుసు. సింధ్‌లో ముహమ్మద్ బిన్ ఖాసిం సైగ చేస్తే శత్రువులపై విరుచుకుపడే పన్నెండు వేలమంది అరబ్ సైనికులతో పాటు సింధ్‌వాసులైన నవముస్లిం సైనికులు, ముస్లిమేతర సైనికులు లక్షమంది ఉన్నారు. ఆ సంగతి యజీద్‌కు తెలుసు. ఏమైనప్పటికీ అతను అరూరా చేరుకొని తననుతాను పరిచయం చేసుకుంటూ ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మ)కు ఖలీఫా లేఖ అందించాడు.

ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) ఆ లేఖ చదువుకొని ఓ బలవంతపు చిరునవ్వు నవ్వాడు. ఆ తరువాత యజీజ్ బిన్ అబూకబ్షాతో "ఖలీఫా సులైమాన్ నాపట్ల ఇలాగే ప్రవర్తిస్తాడని నాకు తెలుసు. అయినప్పటికీ నేను ఖలీఫా ఆజ్ఞను శిరసావహిస్తూ సంకెళ్ళు ధరించడానికి సిద్ధంగా ఉన్నాను" అని అన్నాడు. సింధ్‌సేనాపతి భీమ్‌సింగ్ ఈ మాటలు వినగానే కంగారుపడుతూ "ఆ లేఖలో ఏముందో తెలుసుకోవడానికి మేమంతా ఆరాటపడుతున్నాం" అని అన్నాడు. అప్పుడు ముహమ్మద్ బిన్ ఖాసిం ఆ లేఖను భీమ్‌సింగ్‌కు అందించాడు. భీమ్‌సింగ్ దాన్ని ఆసాంతం చూసి ఆ తరువాత బిగ్గరగా చదివాడు. లేఖ సారాంశం వినగానే సింధ్‌ప్రజల్లో కలకలం మొదలయింది.

ఆరోజు సాయంత్రం అరూరా పట్టణంపై విషాదఛాయలు అలుముకున్నాయి. వేలాది మంది స్త్రీలు, పురుషులు రాజమందిరం ముందు గుమిగూడి తమ ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. మగ్రిబ్ నమాజ్ తరువాత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) సైన్యాధికారుల్ని సమావేశపరచి మాట్లాడుతూ "నేను ఖలీఫా ఆజ్ఞ శిరసావహిస్తూ రేపు ఉదయమే డెమాస్కస్‌కు బయలుదేరడానికి నిర్ణయించుకున్నాను" అని అన్నాడు.

భీమ్‌సింగ్ ముందుకువచ్చి ఇలా అన్నాడు: "మీరు మా హృదయాల్ని జయించిన రారాజు. మీరు ఆజ్ఞాపిస్తే మేము అగ్నిలో దూకడానికైనా సిద్ధమే. కాని మాకళ్ళ ముందు మా దేవుడి చేతులకు సంకెళ్ళు వేయడాన్ని మేము సహించలేము. మీపట్ల ఖలీఫాకు



సదుద్దేశమే ఉందని తెలియనంతవరకు మీరు ఎట్టి పరిస్థితిలోనూ సింధ్ వదలిపోకూడదని సింధ్ సైన్యాధికారులందరి ఏకాభిప్రాయం. మీ అరబ్ అనుచరసైనికులు మిమ్మల్ని వదలివెళ్ళినా మిమ్మల్ని కాపాడటానికి ఇక్కడ మేము లక్షమంది ఖడ్గధారులు ఉన్నాం. అంతేకాదు, సింధ్‌లోని ప్రతి బాలుడు, వృద్ధుడు సైతం సంకట సమయంలో మీకోసం ఎలాంటి త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉంటాడు. కనుక దేవుని కోసం మీరు ఇక్కడ్నుంచి వెళ్ళిపోకండి. సింధ్‌లో మాకు మీ అవసరం ఎంతో ఉంది."

ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) తన తిరుగులేని నిర్ణయాన్ని మరోసారి తెలియజేసి ఇలా అన్నాడు: "భీమ్‌సింగ్! నాపట్ల మీ ఆదరాభిమానాలకు నేను మీకు ఎన్ని సార్లు కృతజ్ఞతలు చెప్పుకున్నా తక్కువే. కాని నేను ఖలీఫాపై తిరుగుబాటు చేయడమంటే ఇస్లాంజగత్తును చీల్చి ముస్లింల సమైక్యతా సౌభ్రాతృత్వాలకు గండికొట్టడమే అవుతుంది. ఈపని నావల్ల కాదు. రేపుదయమే నేను బయలుదేరాలి. మీ హృదయాల్లో నాకు చోటు కల్పించడం కంటే ఇస్లాంకు చోటు కల్పించినప్పుడే నేనెక్కువ సంతోషిస్తాను. మీరు ఇస్లాంలోని సమతాసౌభ్రాతృత్వాలు వగైరా మంచివిషయాల్ని ఇదివరకే అంగీకరించారు. కనుక మీనోట ఇస్లాంస్వీకార ప్రకటన కూడ వింటే నాకెంతో ఆధ్యాత్మికానందం కలుగుతుంది."

భీమ్‌సింగ్ ఈ చివరిమాట వినగానే ఇస్లాంస్వీకార ప్రకటన చేశాడు. ఆ వెనువెంటనే అతడ్ని అనుసరిస్తూ ఇతర సైనికాధికారులు కూడా ఇస్లాంస్వీకార ప్రకటన చేశారు. ఈ అపూర్వ దృశ్యం చూసి ముహమ్మద్ బిన్ ఖాసిం స్థానంలో సింధ్ వైస్రాయ్‌గా వచ్చిన యజీద్ బిన్ అబూకబ్షా ఎంతో ప్రభావితుడయ్యాడు.

ఆరోజు ఇషానమాజ్ తరువాత అతను ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) దగ్గరకు వెళ్ళి "మీరు అప్పుడే సింధ్ వదలి వెళ్ళకండి. ఖలీఫా సులైమాన్ మీపట్ల ప్రతీకారంతో రెచ్చిపోతున్నాడు. అతను మీకు ఎలాంటి కీడు తలపెట్టడానికైనా వెనుకాడడు. నేను డెమాస్కస్‌కు వెళ్ళి, మీకోసం లక్షమంది సింధ్‌సైనికులు తమ చివరి రక్తపుబొట్టు ధార పోసేదాకా పోరాడటానికి సిద్ధంగా ఉన్నారని సులైమాన్‌కు తెలియజేస్తాను. దాంతో అతను తన దురుద్దేశ్యం మానుకుంటాడు" అని అన్నాడు.

ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మలై) దానికీ అంగీకరించలేదు. అప్పుడు యజీద్ ఇలా అన్నాడు: "అరూరా పురోహితులు నా దగ్గరకు వచ్చి తమ నుండి తమ దైవాన్ని వేరు చేయకండని బ్రతిమాలారు. నేను వారికి అలా జరగదని హామీ ఇచ్చాను. నేను ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) పేర ఒక లేఖ రాసి మీ మిత్రుడు జుబైర్‌కు ఇచ్చి మదీనా పంపాలని నిర్ణయించుకున్నాను. ఆయన చేసే సిఫారసును సులైమాన్ అంగీకరిస్తాడని నాకు పూర్తి నమ్మకం ఉంది."

దీనికి ముహమ్మద్ బిన్ ఖాసిం అంగీకరించాడు. దాంతో జుబైర్ ఆరోజు రాత్రే బయలుదేరాడు. మరునాడుదయం ముహమ్మద్(రహ్మ) గుర్రమెక్కి డెమాస్కస్‌కు వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. వేలాది ప్రజలు అతని చుట్టు గుమిగూడారు. వారిలో కొందరు అతని కాళ్ళు తాకడానికి ప్రయత్నిస్తుంటే యజీద్ వారిని వారించసాగాడు. గుర్రం నగర రోడ్లపై పరచిన పూలగుత్తుల్ని తొక్కుతూ ముందుకు సాగుతుంటే ప్రజలు ఖలీఫా ఖైదీకి

కన్నీటితో వీడ్కోలు చెబుతున్నారు. సింధ్‌ప్రజలు ఇదివరకెన్నడూ కనీవినీ ఎరగని ఈ అపూర్వ దృశ్యాన్ని కొందరు విశ్లేషకులు విస్తుబోయి చూడసాగారు.

అరవై మందితో కూడిన ఈ బృందంలో ఇరవై మంది ముహమ్మద్ బిన్ ఖాసిం, అతని అనుచరులు ఉన్నారు. వారిలో సింధ్ జైళ్ళ నుండి విడుదలయిన అబుల్‌హసన్ కుమార్తె నాహీద్, కుమారుడు ఖాలిద్ మొదలైనవారు కూడా ఉన్నారు. మిగిలిన నలభై మంది ఖలీఫా సైనికులు. మాలిక్ బిన్ యూసుఫ్ నాయకత్వంలో ఈ బృందం అరూరా నుండి బయలుదేరింది.

అటు అరూరా నుండి బయలుదేరిన జుబైర్ దారిలో ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి చివరికి ఎలాగో మదీనా చేరుకున్నాడు. అప్పుడే ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) జుహర్ నమాజ్ ముగించి మస్జిద్ నుంచి బయటికి వచ్చారు. చూస్తే ఎదురుగా వాడిన ముఖంతో ఒక రౌతు తనవైపే రావడం కన్పించింది. ఆ రౌతే జుబైర్. అతను గుర్రం దిగి జేబులో చేయిదూర్చి ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ వైపుకు రావడానికి రెండు మూడు అడుగులు వేశాడో లేదో స్పృహ తప్పి పడిపోయాడు. గుర్రం కూడా వీపు మీది భారం తొలగిపోగానే దబేలున కిందపడి ఊపిరి విడిచింది. ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ ఆదేశంతో ఒకతను తొందరగా నీళ్ళు తెచ్చి జుబైర్ ముఖమ్మీద చిలికించాడు. జుబైర్ స్పృహలోకి వచ్చి అతని చేతిలోని నీటితిత్తి లాక్కొని గటగట నీళ్ళు తాగసాగాడు. ఆ తరువాత అతని ముందు అన్నం ఉంచడం జరిగింది. అయితే జుబైర్ తనకిప్పుడు ఆకలిగా లేదని చెప్పి జేబులో చేయిదూర్చాడు. కాని జేబులో లేఖ చేతికి తగలకపోవడంతో అతను కంగారుపడుతూ మాటిమాటికి జేబులు తడిమిచూసుకోసాగాడు.

ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మా) అతని ఆందోళన దూరంచేస్తూ "కంగారుపడకు. నేను నీ ఉత్తరం తీసి చదివాను, విషయం తెలిసిందిలే" అని అన్నారు. "అయితే మీరు ముహమ్మద్‌ని కాపాడటానికి ఏదైనా చేస్తారా?" అడిగాడు జుబైర్ ఆశగా. దానికి ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) "నేనిప్పుడే డెమాస్కస్‌కు బయలుదేరుతున్నాను" అన్నారు. ఆ తరువాత ఆయన జుబైర్‌ను వెంట బెట్టుకొని డెమాస్కస్‌కు బయలుదేరారు.

సింధ్ నుండి బయలుదేరిన ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మా), అతని అనుచరులు ఈరాన్ భూభాగంలో ప్రవేశించారు. సింధ్‌విజేత వస్తున్నాడని తెలియగానే ఈరాన్‌లోని ప్రతి పట్నంలో, ప్రతి గ్రామంలో ప్రజలు తండోపతండలుగా ఆయన్ని స్వాగతించడానికి వీథుల్లోకి రాసాగారు. మాలిక్ బిన్ యూసుఫ్ అసాధారణమైన ఈ జననీరాజనం చూసి భయపడి ముహమ్మద్ బిన్ ఖాసింకు సంకెళ్ళు వేయకుండానే తీసుకువస్తున్నాడు.

ఈవార్తలు విన్న ఖలీఫా సులైమాన్ ప్రతీకారంతో పెట్రేగిపోతూ ముహమ్మద్ బిన్ ఖాసింని శిక్షించడానికి పరమదుర్మార్గుడైన సాలెహ్‌ను పంపాడు. సాలెహ్ బస్రా చేరుకొని చూస్తే అక్కడ వేలాది మంది ప్రజలు ముహమ్మద్ బిన్ ఖాసింకు స్వాగతం చెప్పడానికి తీవ్రంగా ఎదురుచూస్తుండటం కన్పించింది. ముహమ్మద్ బిన్ ఖాసింకు తన వల్ల ఏమాత్రం హాని కలిగినా బస్రాప్రజలు ఖలీఫాకు వ్యతిరేకంగా పెద్దఎత్తున తిరుగుబాటు లేవదీసే ప్రమాదముంది. అంచేత అతను ముహమ్మద్ బిన్ ఖాసింని బస్రాకు తీసుకు



రాకుండా బస్రా నుండి యాభై మైళ్ళ దూరాన ఉన్న వాసత్‌కు తీసికెళ్ళమని మాలిక్‌ని ఆదేశించి తాను వాసత్‌కు బయలుదేరాడు. వాసత్ ఖారిజీలకు నిలయం. అక్కడ ముహమ్మద్ బిన్ ఖాసింకు అనుకూలంగా గళమెత్తే వారెవరూ లేరు.

ఇస్లామీయ సామ్రాజ్య పటిష్ఠత, ముస్లింసముదాయ సమైక్యత, ఖలీఫాపట్ల విధేయ తల్ని గురించి ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై) భావాలతో, అతని సచ్ఛీలంతో మాలిక్ బిన్ యూసుఫ్ ఇంతకుముందే ప్రభావితుడై ఉన్నాడు. అంచేత అతను వాసత్‌కు పోయే దారిలో ఒకచోట ఆగి ముహమ్మద్ బిన్ ఖాసిం అనుచరుల్ని గౌరవప్రదంగా బస్రాకు పంపివేశాడు. ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై) ఖలీఫా ఆజ్ఞను త్రోసిపుచ్చి బస్రా వెళ్ళి పోవడానికి నిరాకరించినందున అతడ్ని వాసత్‌కు తీసికెళ్ళాడు. ఆ మరుసటిరోజు సాలెహ్ కూడా వాసత్‌కు చేరుకొని ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై)ని జైల్లో పడవేశాడు.

ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై), జుబైర్‌లు డెమాస్కస్ చేరుకొని ఖలీఫా సులైమాన్‌కు పరిస్థితి వివరించారు. యజీద్ బిన్ అబూకబ్షా రాసిన ఉత్తరం కూడా చూపించారు. ఖలీఫా తన నమ్మినబంటు యజీద్ సింధ్‌విజేత ముహమ్మద్ బిన్ ఖాసిం (రహ్మాలై) సుగుణసంపత్తి, వినయవిధేయల్ని గురించి రాసిన ప్రశంసా వాక్యాలు చదివి పశ్చాత్తాపం చెందాడు. కాని అప్పటికే సమయం మించిపోయింది. అంచేత ఖలీఫా తన అసహాయత వ్యక్తపరిచాడు. అయితే జుబైర్ కోరికపై ముహమ్మద్ బిన్ ఖాసింని గౌరవ ప్రదంగా డెమాస్కస్‌కు పంపమని ఖలీఫా ఆదేశిస్తూ సాలెహ్‌కు మరో లేఖ రాశాడు.

జుబైర్ ఆ లేఖ తీసుకొని వాసత్ చేరుకున్నాడు. కాని అతనికక్కడ కొందరు ఒక శవపేటిక ఎత్తుకొని వెళ్తుండటం కన్పించింది. అది ముహమ్మద్ బిన్ ఖాసిం శవమని తెలుసుకొని స్పృహతప్పి పడిపోయాడు. అతని మిత్రుడు ఖాలిద్ వెంటనే అతని ముఖం మీద నీళ్ళు చిలకించి స్పృహలోకి తెచ్చాడు. కాని జుబైర్, ముహమ్మద్ (రహ్మాలై) హత్య వార్త ఓ పట్టాన నమ్మలేక "ఖాలిద్! నేను డెమాస్కస్ నుండి ఒక సందేశం తెచ్చాను. ఇదిగో ఈ లేఖ సాలెహ్‌కు అందజేయి" అంటూ లేఖ తీసి ఖాలిద్‌కు ఇచ్చాడు. ఖాలిద్ దాన్ని నిర్లక్ష్యంగా చూసి పక్కన పడవేశాడు.

ఆ లేఖను ఓ యువకుడు చదివి "ముహమ్మద్ బిన్ ఖాసింని హతమార్చమని ఖలీఫా ఆజ్ఞాపించలేదు; సాలెహ్‌యే ఖలీఫా అభిమతానికి వ్యతిరేకంగా అతడ్ని హత మార్చాడు"అన్నాడు. ఈమాట యువకుల్లో ప్రతీకారచిచ్చు రేపింది. దాదాపు యాభైమంది యువకులు సాలెహ్ ఇంటి వైపుకు దూసుకెళ్ళి క్షణాల్లో అతడ్ని మట్టుబెట్టారు.

## 3) స్పెయిన్‌విజేత మూసా బిన్ నసీర్ పర్యవసానం

ఖైర్వాన్ (ఉత్తరాఫ్రికా) గవర్నర్ మూసా బిన్ నసీర్, అతని స్వేచ్ఛాయుత బానిస తారిఖ్ బిన్ జియాద్ స్పెయిన్ జయించిన తర్వాత ముందుకు యూరప్ వైపుకు పురోగమించడానికి నిర్ణయించుకున్న తరుణంలో ఖలీఫా వలీద్ వారిని వెనక్కి పిలిపించాడు. కాని మూసా స్పెయిన్ నుండి డెమాస్కస్ చేరుకునే సరికి వలీద్ చనిపోయాడు. సులైమాన్ తాను చెప్పేవరకు నగరంలో ప్రవేశించవద్దని మూసాను ఆదేశించినా అతను వినలేదు.

సులైమాన్‌కు తన పట్ల మూసా ప్రదర్శించిన ఈ వైఖరి నచ్చకపోవడంతో మూసా కూడా అతని హిట్‌లిస్ట్‌లో చేరిపోయాడు. గొప్ప ప్రతిభావంతుడైన సేనాపతి, స్పెయిన్ విజేత అయిన మూసా బిన్ నసీర్‌ని ఖలీఫా సులైమాన్ గౌరవించడానికి బదులు అతడ్ని జైల్లో పడవేసి అతని తాహతుకు మించిన నష్టపరిహారం (జరిమాన) విధించాడు. ఈ భారీ జరిమానా చెల్లించడానికి మూసా సిగ్గువిడిచి అరబ్ నాయకుల దగ్గర ముష్టెత్తు కోవలసి వచ్చింది. ఈ విధంగా అతని పేరుప్రతిష్ఠలు, గౌరవమర్యాదలు సమస్తం ఆనాడు అరబ్బుల ముందు మట్టిపాలైపోయాయి.

## 4) మస్లమా బిన్ అబ్దుల్‌మలిక్

వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలనాకాలంలోని సుప్రసిద్ధ సైన్యాధికారుల్లో మస్లమా బిన్ అబ్దుల్‌మలిక్ మాత్రమే ఖలీఫా సులైమాన్ ఆగ్రహానికి దూరంగా ఉండగలిగాడు. అతను సులైమాన్ తమ్ముడు మాత్రమే గాక, వలీద్ రాజకీయ వారసుడి ఎంపిక వ్యవహారంతో అతనికి ఎలాంటి సంబంధం లేదు. అందువల్ల సులైమాన్ అతడ్ని తన హిట్‌లిస్ట్‌లో చేర్చకుండా అతని హోదాలో యధాతథంగా కొనసాగనిచ్చాడు.

మస్లమా బిన్ అబ్దుల్‌మలిక్ హి.శ. 97లో రజాఖియా ప్రాంతం జయించాడు. హి.శ. 98లో అల్యూన్ అనే ఓ రోమ్ నాయకుడు కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని ఖలీఫా దర్బారుకు వచ్చి కాన్‌స్టాంటినోపిల్‌పై దాడిచేయమని ఖలీఫా సులైమాన్‌ని పురిగొల్పాడు. అప్పుడు సులైమాన్ తన కొడుకు దావూద్‌ని, సోదరుడు, సేనాపతి అయిన మస్లమాని పంపాడు. మస్లమా కాన్‌స్టాంటినోపిల్ వైపు బయలుదేరి దారిలో కొన్ని గ్రామాలపై దాడిచేసి పెద్దఎత్తున ధాన్యం సేకరించాడు. ఆ ధాన్యంతో వెళ్ళి కాన్‌స్టాంటి నోపిల్‌ని ముట్టడించాడు. ఆ తర్వాత సైనికుల కోసం వందలాది ఇండ్లు నిర్మింపజేశాడు. చుట్టుపక్క మైదానాల్లో పంట పండించేందుకు విత్తనాలు నాటింపజేశాడు. కొన్నాళ్ళలో పంట చేతికొచ్చింది. ఈవిధంగా సైనికులు ఎలాంటి ఆహారకొరత లేకుండా జీవిస్తూ ముట్టడి కొనసాగించారు.

దాంతో రోమన్లు భయపడి ముస్లిం సైన్యంతో కలసిపోయిన తమజాతి నాయకుడు అల్యూన్‌ని తమ వైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నించారు. ముస్లింలను ముట్టడి వదలి వెళ్ళిపోయేలా చేస్తే అల్యూన్‌కు అర్ధరాజ్యం ఇస్తామని ఆశ చూపిస్తూ అతని దగ్గరకు వారు రహస్యసందేశం పంపారు. అల్యూన్ దానికి అంగీకరించి ముస్లింలను పెడమార్గం పట్టించే ఎత్తుగడకు పాల్పడ్డాడు. "మీరు ధాన్యపుకుప్పల్ని, పంటపొలాలను తగలబెడ్తే ముస్లింలు ప్రాణాలకు తెగించి నిర్దయాత్మక దాడిచేయడానికి సిద్ధమయ్యారని రోమన్లు భావించి యుద్ధం చేయకుండానే నగరాన్ని మీకు సులభంగా హస్తగతం చేస్తార"ని అతను సేనాపతి మస్లమాకు చెప్పాడు. మస్లమా అతని మాయాజాలంలో పడిపోయి ధాన్యపుకుప్పల్ని, పంటపొలాల్ని తగలబెట్టించాడు. దాంతో రోమన్లకు సంతోషంతో పాటు కొండంత ధైర్యం వచ్చి ప్రతిఘటన కోసం సిద్ధమయ్యారు. ఇటు ముస్లింలు ఆహార కొరతతో తీవ్రంగా బాధపడసాగారు. మరొకవైపు శీతాకాలం రావడంతో ఖలీఫా డెమాస్కస్ నుండి సైన్యానికి ఆహారపదార్థాలు పంపలేకపోయాడు. రోమ్ రాజ్యంలోని సఖలియా



పట్టణ గవర్నర్ ముస్లింల ఈ పరిస్థితి గమనించి ఓ భారీసైన్యం తీసుకొని దాడిచేశాడు. అయితే సేనాపతి మస్లమా ఆ దాడిని తిప్పికొట్టి సఖలియా పట్టణాన్ని కైవశం చేసు కున్నాడు. దాంతో ఆహార కొరత తగ్గిపోయి ముస్లింలు సంతోషించారు.

## 5) రాజకీయ వారసుడి ఎంపిక

ఖలీఫా సులైమాన్ మొదట తన కొడుకు అయ్యూబ్‌ని తన రాజకీయవారసుడ్ని చేశాడు. కాని అయ్యూబ్ వ్యాధిగ్రస్తుడై చనిపోవడం వల్ల అతను రిజా బిన్ హయాత్‌తో తన కుమారుడు దావూద్‌ని తన రాజకీయవారసుడ్ని చేస్తానని అన్నాడు. రిజా ఈమాట విని "దావూద్ కాన్‌స్టాంటినోపిల్ ముట్టడిలో నిమగ్నుడై అవిశ్వాసులతో పోరాడుతున్నాడు. అతనిప్పుడు బ్రతికున్నాడో అమరగతినొందాడో దైవానికే తెలుసు. అంచేత నేనలాంటి వ్యక్తిని రాజకీయవారసుడిగా చేయమని మీకు సలహా ఇవ్వలేను"అని అన్నాడు. అయితే నేను నా చిన్నకొడుకుని నా రాజకీయవారసుడ్ని చేస్తాను" అన్నాడు సులైమాన్. దానికి రిజా "అతను మరీ చిన్నవాడు, ఖిలాఫత్ భారం మోయలేడు" అన్నాడు. "మరి నేనెవర్ని నా రాజకీయవారసుడ్ని చేయాలో నువ్వే చెప్పు" అన్నాడు సులైమాన్.

అప్పుడు రిజా "మీరు ప్రజల శ్రేయస్సు కోరుతుంటే మీ పినతండ్రి కుమారుడు ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మాలై)ని మీ రాజకీయవారసుడిగా చేయండి. అతను నా దృష్టిలో అందరికంటే శ్రేష్ఠుడు. అతని తదనంతరం యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్‌ని రాజకీయవారసుడ్ని చేసినట్లు వీలునామ వ్రాయండి. దానివల్ల మీసోదర కుమారులెవరూ ఉమర్‌ని వ్యతిరేకించరు" అని చెప్పాడు. ఈ సలహా నచ్చడంతో సులైమాన్ తన తక్షణ రాజకీయవారసుడిగా ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై)ని చేసినట్లు వీలునామా రాసి, దాన్ని ఓ కవర్‌లో పెట్టి సీలువేసి రిజా బిన్ హయాత్‌కు అప్పగిస్తూ "ఈ కవర్‌లోని ఆదేశంలో ఎవరి పేరుందో అతని కోసం ప్రజల చేత బైత్ చేయించు" అని చెప్పాడు.

రిజా బిన్ హయాత్ ఆ కవర్ తీసుకొని వెళ్ళి ప్రజల్ని సమావేశపరచి, ఖలీఫా ఆజ్ఞను విన్పించి ఈ కవర్‌లోని వ్యక్తి వారసత్వం కోసం బైత్ చేయండని అన్నాడు. ప్రజలు ఈ ఆజ్ఞ విని "ఆ కవర్‌లో ఎవరి పేరుందో చెప్పనంతవరకు మేము బైత్ చేయలేము" అని అన్నారు. రిజా ఈ సంగతి ఖలీఫాకు చేరవేస్తే, అతను "పోలీసుల్ని, పోలీసు ప్రధానా ధికారిని పిలిపించి, బైత్ చేయడానికి నిరాకరించేవారి తలలు ఎగిరిపోతాయని చెప్పు" అని అన్నాడు. ప్రజలు ఈ ఆజ్ఞ వినగానే భయపడి వెంటనే బైత్ చేశారు.

రిజా బైత్ (శపథం) తీసుకొని వస్తుంటే దారిలో హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్ ఎదురై "ఈ కవర్‌లో ఖలీఫా నాపేరు లేకుండా చేయలేదుకదా! ఒకవేళ అలా చేసివుంటే చెప్పు, నేను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటాను" అన్నాడు. దానికి రిజా "నాకు ఖలీఫా సీల్డుకవర్ ఇచ్చి ఇందులోని పేరును ఎవరికీ వెల్లడించవద్దని ఆదేశించారు. అంచేత నీకు నేనేమీ చెప్పలేను" అని అన్నాడు. రిజా అక్కడ్నుంచి ముందుకుసాగితే మరోచోట ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మా) ఎదురై "ఈ కవర్‌లో కొంపదీసి నా పేరయితే లేదు కదా! ఉంటే చెప్పు. నేనెలాగో తంటాలు పడి ఈ ఆపద నుండి బయటపడతాను" అని అన్నాడు. రిజా అతనిక్కూడా హిషామ్‌కు ఇచ్చిన సమాధానమే ఇచ్చి వెళ్ళిపోయాడు.

# 43. ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) ఖిలాఫత్

ఖలీఫా సులైమాన్ జిహాద్‌చేసే ఉద్దేశ్యంతో రాజధానిడెమాస్కస్ నుండి బయలుదేరి, సైన్యాన్ని కాన్‌స్టాంటినోపిల్‌కు పంపి, తాను వాబఖ్‌లో బసచేసి, యుద్ధ తీరుని గురించి తెలుసుకుంటూ సైన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయసాగాడు. అయితే కొన్నాళ్ళకు అకస్మాత్తుగా వ్యాధిగ్రస్తుడై హి.శ. 99లో చనిపోయాడు. సులైమాన్ చనిపోగానే అతని వీలునామా ప్రకారం ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) ఖలీఫా అయ్యారు.

ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) తండ్రి ఈజిప్టు గవర్నర్‌గా ఉన్న కాలంలో హి.శ. 62లో ఆయన జన్మించారు. ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ తల్లి రెండవ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) మనవరాలు. చిన్నతనంలో ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై)ని గుర్రం తన్నడం వల్ల ఆయన ముఖమ్మీద ఒక మచ్చ ఏర్పడింది. ఉమర్ ఫారూఖ్ (రజి) తరచుగా "నా సంతతిలో ఒకతని ముఖమ్మీద ఒక మచ్చ ఉంటుంది. అతను భూమిని న్యాయంతో నింపుతాడు" అని చెబుతుండేవారు. అందుకే ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్‌ని గుర్రం తన్నినపుడు ఆయన తండ్రి అబ్దుల్‌అజీజ్ ఆయన ముఖం నుండి కారుతుండిన రక్తం తుడుస్తూ "ఒకవేళ నువ్వా మచ్చ కలవాడివే అయితే నువ్వెంతో అదృష్టవంతుడివి" అని అన్నారు. ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్‌ని బాల్యంలోనే ఆయన తండ్రి విద్యాశిక్షణల కోసం మదీనా పంపించారు. అక్కడ ఆయన ప్రముఖధర్మవేత్తల సహచర్యంలో ధార్మిక విద్యనభ్యసించి ధర్మావగాహనలో గొప్ప పండితుడిగా ప్రసిద్ధిచెందారు.

ఆయన తండ్రి అబ్దుల్‌అజీజ్ చనిపోయిన తరువాత ఆయన్ని అప్పటి ఖలీఫా అబ్దుల్‌మలిక్ బిన్ మర్వాన్ డెమాస్కస్‌కు పిలిపించి ఆయనకు తన కూతురు ఫాతిమాని ఇచ్చి పెళ్ళిచేశాడు. అబ్దుల్‌మలిక్ మరణం తర్వాత ఖలీఫా అయిన వలీద్ బిన్ అబ్దుల్ మలిక్, ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్‌ని మదీనా గవర్నర్‌గా నియమించాడు. ఇలా ఆయన హి.శ. 86 నుండి 93 వరకు మదీనా గవర్నర్‌గా పనిచేశారు. గవర్నర్ కాగానే ఒక ధర్మవేత్తల కౌన్సిల్‌ని నియమించి వారి సలహాలతో ప్రభుత్వాన్ని నడిపేవారు. ఆయన పాలనాకాలంలో మదీనాప్రజలు ఎంతో సుఖశాంతులతో జీవితం గడిపారు.

ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) మదీనా గవర్నర్‌గా ఉన్న రోజుల్లోనే హి.శ. 93లో ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఆజ్ఞతో ఏ తప్పు చేయని ఒక అమాయకుడ్ని కారాగారంలో బంధించి చిత్రహింసలు పెట్టి చంపడం జరిగింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) కుమారుడు ఖుబైబ్‌ను కొరడాదెబ్బలు కొట్టడం, తీవ్రమైన చలికాలంలో ఆయన తల మీద చల్లటి నీరు కుమ్మరించడం మొదలైన పైశాచిక చర్యలతో ఆయన్ని హతమార్చడం జరిగింది. ఈ దౌర్జన్యం ఖలీఫా ఆదేశంతో ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ గవర్నర్ హోదాలో విధిలేక చేయించవలసి వచ్చింది. దాంతో ఆయన తీవ్రమైన మనో వేదన, దైవభీతులతో గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.

అదేసమయంలో ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ ద్రోహులకు, తిరుగుబాటుదారులకు ఆశ్రయమిస్తున్నాడని ఇరాఖ్ గవర్నర్ హజ్జాజ్ బిన్ యూసుఫ్ ఆరోపించడంతో ఖలీఫా వలీద్ ఆయన్ని గవర్నర్ పదవి నుండి తొలగించి డెమాస్కస్‌కు పిలిపించాడు. వలీద్



తన రాజకీయవారసుడిగా తన సోదరుడు సులైమాన్‌ని తప్పించి తన కొడుకుని చేయడా నికి నిర్ణయించుకున్నప్పుడు ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ అతని నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అంచేత వలీద్ ఆయనకు జైలుశిక్ష విధించాడు. మూడేళ్ళ తర్వాత ఆయనకు జైలు నుండి విముక్తి లభించింది. రాజకీయ వారసత్వం గురించిన వలీద్ నిర్ణయాన్ని ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మా) బాహాటంగా, బహిరంగంగా వ్యతిరేకించిన కారణంగానే సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ ఆయన పట్ల కృతజ్ఞుడయి ఖలీఫా కాగానే ఆయన్ని ప్రధానమంత్రిగా, ముఖ్యసలహాదారునిగా నియమించాడు. అంతేగాక అతను ఉమర్ (రహ్మాలై)ని తన రాజకీయవారసుడిగా కూడా నిర్ణయించాడు.

## 1) పరిపాలనా ప్రారంభకాలం

ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) తన ఖిలాఫత్ పదవి కోసం ప్రజల నుండి బైత్ (శపథం) తీసుకున్న తరువాత మొదటిసారిగా ఇలా ప్రసంగించారు:

"నేను ప్రభుత్వాన్ని నాకప్పగించమని ఎన్నడూ కోరలేదు. ఈ వ్యవహారంలో నా అభిప్రాయం కూడా ఎవరూ తీసుకోలేదు. ప్రజల్లో కూడా అభిప్రాయసేకరణ జరగలేదు. అయినప్పటికీ నామీద పరిపాలనాభాధ్యత మోపి నన్ను కఠినమైన పరీక్షకు గురిచేయడం జరిగింది. అంచేత నేను మీ మెడలో వేయబడిన నా బైత్(శపథం) గుదిబండను తీసి వేస్తున్నాను. ఇప్పుడు మీరు కోరుకున్న వ్యక్తిని ఖలీఫాగా ఎన్నుకోండి."

ఈ మాటలు వినగానే అక్కడ సమావేశమైన ప్రజలంతా "మేము మిమ్మల్నే ఇష్ట పడుతున్నాం. మీరు పరిపాలనా పగ్గాలు చేపట్టడం మాకందరికీ ఇష్టమే" అని అన్నారు ముక్తకంఠంతో. అప్పుడు ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మాలై) ఖిలాఫత్ పదవిని స్వీకరి స్తున్నట్లు ప్రకటించి మళ్ళీ ఇలా ప్రసంగించారు:

"మన ముస్లింసముదాయంలో తమ ప్రభువు విషయంలోగాని, తన ప్రవక్త (స) విషయంలోగాని, తమ ధర్మగ్రంథం విషయంలోగాని ఎలాంటి విభేదాలు లేవు. దిర్హమ్ దీనార్ల (సిరిసంపదల) విషయంలోనే విభేదాలు ఉన్నాయి. కనుక సోదరులారా! దైవ సాక్షిగా చెబుతున్నాను. నేను ఎవరికీ (ధనాన్ని) అధర్మపద్ధతితో ఇవ్వను; అలాగే నేను ఏ ఒక్కరీ ధర్మసమ్మతమైన హక్కును నిరోధించను. దేవుని పట్ల విధేయత కలిగివుండే నాయకుని పట్ల విధేయత కలిగివుండటం ప్రజల విధ్యుక్తధర్మం. దేవుని పట్ల విధేయత కలిగివుండనివానికి ఎవరూ విధేయత చూపనవసరం లేదు. నేను దేవుని పట్ల వినయ విధేయతలు కలిగివున్నంత వరకూ మీరు నాకు విధేయత చూపండి. నేను దేవునికి అవిధేయుణ్ణయిపోతే నాకు విధేయత చూపవలసిన భాధ్యత మీపై ఏమాత్రం లేదు."

ఆ తరువాత ఆయన సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ కోసం జనాజా నమాజ్ చేసి ఆయన భౌతికకాయాన్ని ఖననం చేశారు. ఇంటికి తిరిగొస్తున్నప్పుడు దారిలో ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ సేవకుడు ఆయన వాలకం చూసి "ఏమిటీ మీరు చాలా విచారంగా ఉన్నారు?" అనడిగాడు. దానికాయన "నామీద నేను మోయలేని భారం మోపబడింది. అంచేత అది నా కర్మపత్రంలో రాయబడి కర్మవిచారణ జరగకముందే నేను హక్కుదారు లకు వారి హక్కు ఇప్పించాలని భావిస్తున్నాను" అని అన్నారు.

ఆ తర్వాత ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) ఇంటికి తిరిగొచ్చి మరింత విచార గ్రస్తులైపోయారు. దుఃఖంతో ఆయన గడ్డం తడిసిపోయింది. ఆయన భార్య కంగారు పడుతూ "ఏమిటండీ కన్నీరు? ఏమయింది?" అని అడిగింది. దానికాయన "ఏమని చెప్పను ఫాతిమా! నామీద ముహమ్మద్ (స) అనుచరసముదాయం భారం మోపబడింది. పేదలు, వితంతువులు, అనాథలు, అంధులు, వికలాంగులు, బానిసలు, రోగులు, వృద్ధులు, పిల్లలు, మధ్యతరగతివారు మొదలైన ప్రజలందరి భారం నా నెత్తి మీద వచ్చి పడింది. రేపు ప్రళయదినాన వాళ్ళను గురించి నన్ను ప్రశ్నించినప్పుడు నేను సమాధానం చెప్పలేనేమో నన్న భయంతోనే నేను బాధపడుతున్నాను" అని అన్నారు.

## 2) రాజర్షిగా మారిన రారాజు

ఆ తరువాత ఆయన తన భార్యతో "నువ్వు వెంటనే నీ నగలన్నీ తీసి ప్రభుత్వధనాగారంలో జమచెయ్యి. అలా చెయ్యకపోతే నేను నీనుండి వేరుకావలసి వస్తుంది. నేను, ఈ నగలతో నువ్వు ఒక ఇంట్లో ఉండటం నాకేమాత్రం ఇష్టంలేదు" అని అన్నారు. అప్పుడు ఆయన భార్య ఏమాత్రం తటపటాయించకుండా తక్షణమే నగలన్నీ తీసేసి ప్రభుత్వధనాగారానికి పంపివేసింది. అంతేకాదు, వారసత్వంలో తనకు లభించిన ఆస్తిపాస్తులన్నీ ప్రభుత్వధనాగారంలో కలిపి రాజర్షిగా మారిపోయారు. ఖలీఫా కాకముందు ఆయన వేయి దిర్హాంల ఖరీదైనదుస్తులు ధరించేవారు. ఖలీఫా అయిన తర్వాత నాల్గు వందల దిర్హాంల దుస్తులతోనే సరిపెట్టుకోసాగారు. ధర్మసమ్మతంగా సంపాదించిన నాలుగొందల దీనార్ల వార్షికాదాయం గల ఆస్తి మాత్రమే ఉంచుకొని మిగిలిన నలభైవేల దీనార్ల వార్షికాదాయంగల ఆస్తులు ప్రభుత్వధనాగారంలో కలిపేశారు. ప్రభుత్వధనాగారం లోని ధనం ఏమాత్రం దుర్వినియోగం కానీయకుండా ప్రజాసంక్షేమ కార్యాల కోసమే ఖర్చుపెట్టడం ప్రారంభించారు.

ఆయన క్రూరులయిన గవర్నర్లను, అధికారులులందర్నీ ఉద్యోగాల నుంచి తొలగించి వారి స్థానాల్లో నిజాయితీపరులయిన పాలకుల్ని నియమించారు. ఖురాసాన్ గవర్నర్ యజీద్ బిన్ ముహ్లబ్ కూడా ఓసారి ప్రభుత్వధనాన్ని సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణ రావడంతో అతడ్ని రాజధానికి పిలిపించి నిలదీస్తూ, వెంటనే ఆ ధనాన్ని ప్రభుత్వధనాగారంలో జమచేయమని ఆదేశించారు. కాని యజీద్ కాకమ్మ కథలు చెబుతూ ఆ పైకాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమచేయడానికి అంగీకరించలేదు. అప్పుడు ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మ) యజీద్ని గవర్నర్పదవి నుండి తొలగించి అతని స్థానంలో జిరా బిన్ అబ్దుల్లా హిక్మీని ఖురాసాన్ గవర్నర్గా నియమించారు. ప్రజల నుండి అక్రమంగా వసూలుచేస్తున్న పన్నుల్ని నిలుపుదల చేశారు. చట్టవిరుద్ధంగా ఎవరినీ శిక్షించకూడదని, ఇస్లాం స్వీకరించిన ముస్లిమేతరుల నుండి జిజ్యా వసూలు చేయకూడదని గట్టిగా తాకీదుచేస్తూ పాలకులందరికీ ఉత్తర్వులు జారీచేశారు.

ఖురాసాన్ గవర్నర్ జిరాహ్ బిన్ అబ్దుల్లా ముస్లిమేతరుల (జిమ్మీల)లో ముస్లింలయిన వారి నుండి కూడా జిజ్యా వసూలు చేస్తున్నాడని ఆరోపణ వచ్చింది. ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) ఈ ఆరోపణ విని ఇస్లాం స్వీకరించి నమాజ్



చేసేవారి నుండి జిజ్యా వసూలుచేయకూడదని, తక్షణమే వారి నుండి జిజ్యావసూలు ఆపేయాలని ఆదేశించారు. ఈ ఆజ్ఞ అందగానే జిరా బిన్ అబ్దుల్లా నవముస్లింల నుండి జిజ్యా వసూలు చేయడం నిలుపుదల చేశాడు. తత్ఫలితంగా వేలాదిమంది జిమ్మీలు ఎంతో ఉత్సాహంతో ఇస్లాం స్వీకరించడం ప్రారంభించారు.

మస్లమా బిన్ అబ్దుల్మలిక్ కథనం : "నేను ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మ)ని పరామర్శించడానికి వెళ్ళినపుడు ఆయన ఓ మాసినచొక్కా ధరించివున్నారు. నేను నా సోదరితో (ఆయన భార్యతో) 'నువ్వాయాన చొక్కా ఉతకవా?' అని అడిగాను. దానికామె 'మాసినచొక్కా తీసి తొడుక్కోవడానికి ఆయన దగ్గర మరొక చొక్కా ఉంటే కదా!' అని అన్నది." ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) బానిస అబూఉమయ్యా ఓరోజు ఆయన అర్ధాంగి దగ్గరకు వెళ్ళి "నేను రోజూ మసూర్పప్పు తినలేక చస్తున్నా" అని అన్నాడు. దానికా సాధ్వీమణి, నీ యజమాని కూడా రోజూ ఇదే తింటున్నాడని అన్నది.

ఓరోజు ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) తన అర్ధాంగితో "ఈరోజు నాకెందుకో ద్రాక్షపండ్లు తినాలనిపిస్తోంది. నీ దగ్గర డబ్బేమైనా ఉంటే ఇవ్వు" అని అన్నారు. దానికామె "నా దగ్గర చిల్లిగవ్వ కూడా లేదు. మీరు ఖలీఫా అయివుండి కూడా ద్రాక్షపండ్లు కొని తినడానికి మీ దగ్గర కొన్ని కాసులు కూడా లేవు" అని అన్నారు. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ ఈమాట విని "రేపు నరకంలో బిగించబడిన సంకెళ్ళతో ఒరుపులు తినడం కంటే ద్రాక్షపండ్ల కోరికను మనసులోనే పెట్టుకొని (పరలోకానికి) వెళ్ళడం మంచిది" అని అన్నారు.

మరొకసారి ఆయనకు దానిమ్మపండు తినాలన్పించింది. ఆయన బంధువు ఒకరు ఈ సంగతి పసిగట్టి ఒక దానిమ్మపండు పంపించాడు. ఆయన ఆ బంధువును ఎంతో ప్రశంసిస్తూ తన సేవకుడితో "ఈ దానిమ్మపండు పంపినవానికి నా సలాం అందజెయ్యి. తరువాత ఈ దానిమ్మపండు అతనికి తిరిగిచ్చేసి, నీ కానుక అందిందని చెప్పు" అని అన్నారు. సేవకుడు ఆశ్చర్యపోతూ "విశ్వాసులనాయకా! ఇది మీ దగ్గరిబంధువు పంపిన కానుక. దీన్ని తీసుకోవడంలో తప్పేముంది? మన దైవప్రవక్త (స) కూడా కానుకలు స్వీకరించేవారు కదా!" అని అన్నాడు. దానికి ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) "నిజమే. దైవప్రవక్త (స) కోసం అది కానుకే. కాని నాకోసం ఇది లంచం అవుతుంది" అన్నారు.

రిజా బిన్ హయాత్ కథనం : "ఓరోజు రాత్రి నేను ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) దగ్గర కూర్చొని మాట్లాడుతుంటే దీపం (నూనె అయిపోయి) ఆరిపోయింది. అక్కడే సేవకుడు పడుకొని నిద్రపోతున్నాడు. నేను సేవకుడ్ని లేపుదామనుకుంటే ఆయన నన్ను వారించారు. అప్పుడు నేను స్వయంగా దీపం వెలిగిద్దామని లేచినిలబడ్డాను. కాని ఆయన దానికీ అంగీకరించకుండా, అతిథికి శ్రమ నివ్వడం భావ్యంకాదని చెప్పి స్వయంగా లేచి నూనెడబ్బా తీసుకొని ప్రమిదలో నూనె పోసి దీపం వెలిగించారు. ఆ తరువాత ఆయన నాతో మాట్లాడుతూ "నేను ఇదివరకటిలా ఇప్పుడు కూడా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్నే. లేచి దీపం వెలిగించినంత మాత్రాన నా హోదాకు వచ్చే నష్టమేమీ లేదు" అని అన్నారు.

ఉమర్ బిన్ మహాజిర్ కథనం : "ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మా) జీతం రోజుకు రెండు దిర్హంలుగా నిర్ణయించబడింది. ఓరోజు ఆయన తన బానిసకు నీళ్ళు కాగబెట్టమని చెప్పారు. అయితే ఆ బానిస రాజవంటశాలకు వెళ్ళి వేడి నీళ్ళు తెచ్చాడు. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మాలై) అది గమనించి ఆ వేడినీళ్ళకు ప్రతిఫలంగా ఒక దిర్హం విలువైన ఒంటచెరకును రాజవంటశాలకు పంపించారు. ఎవరైనా రాత్రివేళ వచ్చి సామ్రాజ్య వ్యవహారాలకు సంబంధించిన సంభాషణ జరుపుతున్నంత సేపు ఆయన ప్రభుత్వధనాగారానికి చెందిన దీపం వెలిగించేవారు. వారా సంభాషణ ముగించి మరేవైన మాటలు మొదలెడితే ఆయన ఆ దీపం ఆర్పి తన సొంతదీపం వెలిగించేవారు.

## 3) బంధువులే రాబందులైన వేళ

ఆ తరువాత ఆయన, రాజవంశీయులు, ప్రభుత్వాధికారులు ఎవరి హక్కయిన కొల్లగొట్టడం జరిగితే వారందరూ ఆయా వ్యక్తులపై ఫిర్యాదుచేస్తే తాను వారి హక్కుల్ని ఇప్పిస్తానని ఓ బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే బనూఉమయ్యా తెగవారి ఇండ్లపై విషాదఛాయాలు అలుముకున్నాయి. వారీ ఉత్తర్వుని ఉపసంహరింపజేయడానికి ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ మేనత్త ఫాతిమా బిన్తే మర్వాన్ దగ్గరకు తమ ప్రతినిధిగా పంపారు. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ మేనత్త ఫాతిమా బిన్తే మర్వాన్‌ని ఎంతో గౌరవించేవారు. అంచేత ఆమె సిఫారసుతో పని జరుగుతుందని ఆశించారు వారు.

కాని ఆయన ఆమెకు సమాధానమిస్తూ "రాజ్యాధినేత బంధువులే దౌర్జన్యం చేస్తున్నప్పుడు వారిని రాజ్యాధినేత నిరోధించకపోతే ఇక ఆ రాజ్యాధినేత ఇతరుల దౌర్జన్యాన్ని ఏం ముఖం పెట్టుకొని అడ్డుకుంటాడు?" అని అన్నారు. ఫాతిమా ఈమాట విని "నువ్వీ వైఖరి మార్చుకోకపోతే దాని దుష్పరిణామం తీవ్రంగా ఉంటుందని నీ వంశస్థులు నిన్ను హెచ్చరిస్తున్నారు" అని అన్నది. దానికి ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ "ప్రళయదిన భయం కంటే నాకు మరో విషయం గురించిన భయం ఎక్కువ ఉంటే దానివల్ల నాకు శాంతి లభించకుండా ఉండుగాకని నేను దైవాన్ని ప్రార్థిస్తున్నాను" అని అన్నారు. ఈమాట విని ఫాతిమా నిరాశతో వెళ్ళిపోయి "ఇదంతా మీరు చేసిన పనే. మీరు ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) కుటుంబానికి చెందిన స్త్రీని పెళ్ళిచేసి తెచ్చారు. చివరికి ఉమర్ (రహ్మాలై) తన ముత్తాత అడుగుజాడల్లో నడచుకోవడం ప్రారంభించాడు" అని అన్నది తన పరివారంతో.

ఉమర్ బిన్ అబ్దులఅజీజ్ (రహ్మాలై) బనూఉమయ్యా తెగ గతపాలకుల కాలంలో పేరుకుపోయిన చెడులన్నిటినీ సమూలంగా తుడిచిపెట్టి నిజమైన సంక్షేమరాజ్య స్థాపన కోసం నడుంబిగించారు. అనేక సంస్కరణలు చేపట్టారు. న్యాయస్థానాల్లో పాలకుల జోక్యానికి అడ్డుకట్టవేశారు. అంధవిశ్వాసాలను, మూఢసంప్రదాయాలను నిర్మూలించారు. బనూఉమయ్యా తెగవారి పాలనలో హజ్రత్ అలి (రజి)ని దుర్భాషలాడే, జుమాప్రసంగంలో ఆయన్ని శపించే దుష్టసంప్రదాయం ఉండేది. ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ అధికారపీఠం అధిరోహించగానే ఈ దుష్టసంప్రదాయాన్ని నిషేధించారు. రాచరిక వ్యవస్థ కారణంగా పుట్టుకొచ్చిన మద్యసేవనం, చిత్రలేఖనం, భోగలాలస వంటి నైతికరుగ్మతల్ని అరికట్టారు. విద్యావికాసం కోసం అనేక ఏర్పాట్లు చేశారు. ఖుర్ఆన్, హదీస్, ఫిఖ్హ్‌లవైపు



ప్రజల దృష్టి మళ్లించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన (తొలి నల్గురు) శ్రేష్ఠ ఖలీఫాలైన అబూబకర్, ఉమర్‌ఫారూఖ్ (రజి)ల నాటి స్వర్ణయుగాన్ని తలపింపజేశారు.

అయితే ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మాలై) నిషేధించిన చెడులు, పునఃప్రవేశ పెట్టిన ధర్మశాస్త్ర ఆదేశాలు బనూఉమయ్యా తెగవారి ఆగ్రహానికి గురయ్యాయి. అక్రమార్జనకు, భోగలాలసకు-విలాసజీవితానికి అలవడిన బనుఉమయ్యా ప్రజలు తమ జాగీర్లు, ఇతర ఆస్తులు కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక ఆ రాజర్షిపై నిప్పులు చెరిగారు. చివరికి వారు ఆ మహానుభావుడ్ని హతమార్చడానికి కుట్రపన్నారు. ఆయన్ని చంపడం ఏమంత కష్టసాధ్యమైన పని కూడా కాదు. ఆయన తన ప్రాణరక్షణ కోసం ఎలాంటి భద్రతావ్యవస్థగాని, అంగరక్షకులుగాని నియమించుకోలేదు. ఆహారపానీయాల విషయంలో కూడా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. అంచేత బనూఉమయ్యా ప్రజలు ఓ సులభమైన మార్గం ఎంచుకున్నారు. వారు ఖలీఫా దగ్గర పనిచేసే ఒక బానిసను మభ్యపెట్టి అతని ద్వారా అన్నంలో విషం కలిపిచ్చి ఆయన్ని హతమార్చారు.

ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మా) తనకు విషమివ్వబడిందని గ్రహించారు. ఆయన ఆ బానిసను పిలిచి, నిన్నే విషయం ఈ పనికి పురిగొల్పిందని అడిగారు. దానికా బానిస, తనకు వేయి దీనార్లు డబ్బిచ్చారని, బానిసత్వం నుండి విముక్తి కలిగిస్తారని చెప్పినందున తానీ పనికి పాల్పడ్డానని తెలియజేశాడు. ఉమర్ (రహ్మా) ఈమాట విని "నీ వైఖరి చాలా శోచనీయం. సరే ఆ డబ్బు ఇటు తీసుకురా" అన్నారు. బానిస ఆ డబ్బు తీసుకొచ్చాడు. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ ఆ డబ్బు తీసుకొని ప్రభుత్వ ధనాగారానికి పంపి "వెంటనే నువ్వు ఇక్కడ్నుంచి ఎటైనా పారిపో. మళ్ళీ నీ ముఖం ఇక్కడ ఎవరికీ చూపించకు" అని ఆదేశించారు. చివరికాయన ఆ విషబాధతోనే రెండున్నర సంవత్సరాల ఖిలాఫత్‌పాలన తర్వాత 39 ఏండ్ల వయస్సులో అంతిమశ్వాస వదిలారు.

## 4) మరణానంతర సంఘటనలు

ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మాలై)కు పదకొండుమంది కుమారులు కలిగారు. ఆయన తరువాత వచ్చిన హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్‌కు కూడా పదకొండు మందే కుమారులు. హిషామ్ వారసత్వపు ఆస్తి నుండి అతని కొడుకుల్లో ఒక్కొక్కరి వాటాకు పది లక్షల దిర్హంలు వచ్చాయి. కాగా ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మాలై) వారసత్వపు ఆస్తి నుండి ఆయన కొడుకుల్లో ఒక్కొక్కరి వాటాకు ఒక దీనార్ మాత్రమే వచ్చింది. ఆ తరువాత కాలచక్రం తెచ్చిన మార్పు చూడండి- ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ కుమారుల్లో ఒకతను ఓరోజు దైవమార్గంలో జరిగే పోరాటం కోసం వంద గుర్రాలు దానం చేశాడు. పోతే హిషామ్ కొడుకుల్లో ఒకతడ్ని ప్రజలు దానం తీసుకుంటూ ఉంటే చూశారు. అక్రమార్జనతో పోషించబడిన కొందరు ప్రజల పర్యవసానం ఇహలోకంలో ఇలా ఉంటుంది. మరి పరలోకంలో వారి పర్యవసానం మరెంత ఘోరంగా ఉంటుందో!!

మాలిక్ బిన్ దీనార్ (రహ్మాలై) ప్రకారం ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మాలై) ఖలీఫా అయినప్పుడు పశువులకాపర్లు ఆశ్చర్యపోతూ "ఖలీఫా ఎవరయ్యారండీ, ఇప్పుడు మా మేకలు తోడేళ్ళ బారిన పడకుండా క్షేమంగా ఉన్నాయి?" అని అడగసాగారు. మూసా

బిన్ అఈన్ కథనం: "మేము కర్మాన్‌లో మేకలు కాస్తుండేవాళ్ళం. తోడేళ్ళు మా మేకల మందల్లో తిరుగుతుండేవి కాని అవి మా మేకలకు ఎలాంటి నష్టం కలగ జేసేవికావు. కొంతకాలానికి ఓరోజు ఓ తోడేలు ఒక మేకను ఎత్తుకెళ్ళింది. అప్పుడు నేను నా తోటి కాపర్లతో 'ఈరోజు పుణ్యపురుడైన మన ఖలీఫా చనిపోయాడు' అని అన్నాను. ఆ తర్వాత విచారిస్తే అదేరోజు ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) చనిపోయినట్లు తెలిసింది.

గత వంద సంవత్సరాల నుంచి ఇస్లామీయ రాజ్యాలకు అన్నిటికంటే పెద్ద ప్రత్యర్థి రాజ్యం ఏదైనా ఉందంటే అది రోమ్‌రాజ్యమే. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) పాలనాకాలంలో కూడా రోమన్లతో ముస్లింల ప్రతిఘటనలు కొనసాగుతుండేవి. అయితే రోమ్ చక్రవర్తి సీజర్, ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) మరణవార్త విని ఎలా స్పందించాడో చూడండి: "ఒకవేళ ఎవరైనా సాధువు ప్రపంచాన్ని త్యజించి తన ఆశ్రమం తలుపులు మూసుకొని దైవారాధనలో నిమగ్నుడైపోతే నేనందుకు ఏమీ ఆశ్చర్యపోను. కాని తనపాదాల చెంత ప్రపంచరాజ్యాధికారం, భోగభాగ్యాలు ఉన్నా వాటన్నిటినీ త్రోసి పుచ్చి కటికపేదరికపు జీవితం గడిపిన వ్యక్తి పట్లే నాకు ఆశ్చర్యం కలుగుతోంది."

## 5) పరిపాలనా తీరుపై సంక్షిప్త సమీక్ష

ప్రప్రథమ ఖలీఫా అబూబకర్ (రజి) పరిపాలనా కాలం వలె ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) పరిపాలనా కాలం కూడా చాలా తక్కువ (రెండున్నర సంవత్సరాలు). అయితే అబూబకర్ (రజి) పాలనాకాలం ఎంత ప్రాముఖ్యమైనది, విలువైనదో ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) పాలనాకాలం కూడా అంతే ప్రాముఖ్యమైనది, విలువైనది. బనూఉమయ్యా పాలకులు ప్రజల్ని క్రమేణా ప్రపంచపూజారులుగా మార్చి పరలోకం పట్ల ఏమరుపాటుకు గురిచేశారు. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) ఖలీఫాగా అధికార పగ్గాలు చేపట్టిన కొన్నాళ్ళలోనే ఆ చెడులన్నిటినీ నిర్మూలించి ప్రజల్ని ఆధ్యాత్మికత, పుణ్యకార్యాల వైపు మరలించారు. ఆయన తన పరిపాలనా కాలమంతా అతుకుల బట్టలతో, చాలీచాలని సాధారణ తిండితో అత్యంత నిరాడంబరమైన జీవితం గడుపుతూ ప్రజల సంక్షేమం, సంతోషాల కోసం నిరంతరం పాటుపడుతూ రెండవ శ్రేష్ఠ ఖలీఫా ఉమర్ ఫారూఖ్ (రజి) పరిపాలనా తీరుని తలపింపజేశారు.

మస్లమా బిన్ అబ్దుల్‌మలిక్ రోమన్లకు వ్యతిరేకంగా చాలాకాలంనుండి పోరాడుతూ అలసిపోయాడు. అంచేత ఖలీఫా అతడ్ని, అతని సైన్యాన్ని వెనక్కి పిలిపించుకున్నారు. ఆజర్‌బాయ్‌జాన్‌పై శత్రువులు దాడిచేసి ముస్లింలను లూటీచేశారు. ఖలీఫా ఉమర్ (రహ్మ) ఇబ్నెహాతిం బాహ్లీకు సైన్యానిచ్చి అటు పంపారు. ఇబ్నెహాతిం శత్రువుల నడుం విరగ్గొట్టి ఇస్లామీయ ప్రాభవాన్ని తిరిగి నెలగొల్పాడు. సింధ్‌లో ఇస్లాం దశదిశలా విస్తరించింది. సింధ్‌రాజులతోపాటు సింధ్‌ప్రజలు వేలసంఖ్యలో ఇస్లాం స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరిపోయారు. ముస్లింలు ఫ్రాన్స్‌లో కూడా ప్రవేశించారు. ఆ కాలంలో ఫ్రాన్స్ అనేకరాష్ట్రాలుగా విడిపోయిఉంది. అక్కడి రాజులు అంతఃకలహాలతో సతమతమౌతున్నారు. ముస్లింలు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఫ్రాన్స్ మీద దాడిచేసి దక్షిణ ఫ్రాన్స్‌లోని అత్యధిక భూభాగాన్ని జయించారు.



సమర్‌ఖంద్ నుండి ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) దర్బారుకు ఓ ముస్లిమేతర ప్రతినిధివర్గం వచ్చి "సమర్‌ఖంద్‌లో మీ సేనాపతి ఖతీబా మమ్మల్ని మా పట్టణం నుండి బలవంతంగా ఖాళీచేయించి అక్కడ ముస్లింలను వసింపజేశాడ"ని ఆరోపించింది. ఖలీఫా ఈమాట విని సమర్‌ఖంద్ గవర్నర్‌కు ఖతీబా, సమర్‌ఖంద్ ప్రజల వ్యవహారాన్ని పరిష్కరించడానికి తక్షణమే ఒక స్పెషల్ కోర్టు నియమించి, దాని జడ్జీ ద్వారా విచారణ జరిపించాలని ఉత్తర్వు జారీచేశారు. దాని ప్రకారం ఆ జడ్జీ విచారణ జరిపి వెంటనే ముస్లింలు సమర్‌ఖంద్ ఖాళీచేసి వెళ్ళిపోవాలని తీర్పిచ్చాడు. అప్పుడు ముస్లింలు అక్కడ్నుంచి వెళ్ళిపోవడానికి నిర్ణయించుకున్నారు. జడ్జీగారు సేనాపతి ఖతీబాపై తీవ్రమైన పదజాలంతో ముస్లింసేనాపతి ఇస్లామీయ యుద్ధనీతిని తుంగలో తొక్కి అకస్మాత్తుగా సమర్‌ఖంద్ ప్రజలపై దాడిచేశాడని అన్నారు. సమర్‌ఖంద్ ప్రజలు ఈ తీర్పు విని ఆశ్చర్యపోయారు. ఇస్లామీయ చట్టం ఒక బలమైన సేనాపతిని సైతం లొంగదీసుకొని న్యాయం నెలగొల్పుతుందని భావిస్తూ సమర్‌ఖంద్‌లో ముస్లిం సైనికుల్ని తమతో కలసిమెలసి ఉండిపోనివ్వడానికే నిర్ణయించుకున్నారు.

ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మ) ముస్లిమేతర రాజుల దృష్టిలో రారాజులకు మించిన మహారాజు మాత్రమే కాదు, రాజర్షులకు మించిన మహారాజర్షి కూడా. ఆయన సామ్రాజ్యం సింధ్, పంజాబ్, బుఖారా, సమర్ఖంద్, తుర్కిస్తాన్, చైనాల నుండి మొరాకో, స్పెయిన్, ఫ్రాన్స్‌ల వరకూ విస్తరించింది. అంతటి విశాలమైన సామ్రాజ్యం అయినా ప్రతి చోటా ప్రజలు సుఖసంతోషాలతో జీవితంగడిపారు; నీతి-న్యాయాలు సర్వత్రా వర్ధిల్లాయి. అందుకే ఆ రాజర్షి మరణవార్తతో ముస్లింలపైనే కాదు, క్రైస్తవులు, యూదులపై కూడా విషాదఛాయలు అలుముకున్నాయి. సాధువులు, సన్యాసులు ఆ విషాదవార్త విని తమ ఆశ్రమాల నుండి బయటికొచ్చి తలలు బాదుకుంటూ "ఈరోజు న్యాయం ప్రపంచం నుండి కనుమరుగైపోయింది, న్యాయం కోసం పాటుపడి, దాని పరిరక్షించినవాడు ప్రపంచం నుండి శాశ్వతంగా వెళ్ళిపోయాడు" అని అన్నారు.

# 44. యజీద్ బిన్ అబ్దుల్మలిక్ పాలన

సులైమాన్ బిన్ అబ్దుల్‌మలిక్ వీలునామా ప్రకారం ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) తదనంతరం హి.శ. 101లో యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖిలాఫత్ సింహాసనం అధిరోహించాడు. అతను అధికారం చేపట్టిన నలభై రోజుల దాకా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) అడుగుజాడల్లోనే నడచుకుంటూ నీతి-న్యాయాలతో పరిపాలన సాగించాడు. ఆ తరువాత బనూఉమయ్యా తెగవారి కుట్రలకు బలయి నీతి-న్యాయాల్ని గోతిలో పూడ్చిపెట్టి ఇష్టారాజ్యం చేయనారంభించాడు. బనూఉమయ్యావంశస్థులు ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) పాలనలో కోల్పోయిన జాగీరులు, ఇతర ఆస్తులు మళ్ళీ పొందగలిగారు. ఉమర్ బిన్ అబ్దుల్అజీజ్ (రహ్మలై) పాలనకు పూర్వం ఉండిన చెడులన్నీ రాజ్యంలో మళ్ళీ చోటుచేసుకున్నాయి. అన్యాయాలు, అక్రమాలు ఇంతకు ముందుకంటే ఎక్కువైపోయాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రజలపై తలకు మించిన పన్నుల భారం పడింది. ఖలీఫా యజీద్ త్రాగుడుకు, ఇతర దుర్వ్యసనాలకు అలవాటుపడ్డాడు.

## 1) ముస్లింల శక్తికి మూలకారణం

హి.శ. రెండవ శతాబ్ది ప్రారంభకాలంలో జరిగిన ఓ సంఘటన. సజిస్తాన్ (అఫ్ఘనిస్తాన్) పాలకుడు రుత్బీల్ నుండి జిజ్యా వసూలుచేసి తీసుకురావడానికి ఖలీఫా యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఓ ప్రతినిధి వర్గాన్ని పంపించాడు. రుత్బీల్ ప్రతినిధివర్గం సభ్యుల్ని ఆపాద మస్తకం ఓసారి పరికించి చూసి "ప్రతి సంవత్సరం వస్తుండిన ఆ మనుషులు ఏరి? ఎక్కడికి పోయారు? పస్తులతో వారి కడుపులు లోపలికి పీక్కుపోయి ఉండేవి. వారి నుదుళ్ళ మీద నల్లని బొప్పులు కట్టివుండేవి. వారు ఖర్జూరపు చెప్పులు తొడుక్కునేవారు. ఏమయ్యారు వారు?" అని అడిగాడు.

దానికి ప్రతినిధివర్గం నాయకుడు సమాధానమిస్తూ "వారు కాలంతీరి వెళ్ళిపోయారు. ఇప్పుడు మేము వచ్చాం" అని అన్నాడు. రుత్బీల్ ఈమాట విని "మీ ముఖాలు వారి ముఖాల కంటే ఎక్కువ కళకళలాడుతున్నప్పటికీ వారు మీకంటే మంచి వాగ్దాన పాలకులు; మీకంటే ఎక్కువ శక్తిమంతులు" అని అన్నాడు. రుత్బీల్ ఈమాట చెప్పి ముస్లింలకు జిజ్యా చెల్లించడానికి నిరాకరించాడు. ఆనాటి నుంచి దాదాపు అర్ధశతాబ్ది వరకు ముస్లింలు ఎంత బెదిరించినా, పోరాడినా అతని నుండి ఒక్కపైసా కూడా జిజ్యా వసూలు చేయలేకపోయారు.

దైవప్రవక్త (స) నిర్యాణం జరిగి వందేళ్ళు గడిచాయి. ఆ కాలంలో తాబయీలు (ప్రవక్త ప్రత్యక్షఅనుచరుల్ని చూసినవారు), ఫిఖ్కావేత్తలు, ధర్మసంస్కర్తలు, ఇమాములు అనేకమంది ఉన్నారు. ముస్లింసముదాయం అత్యంత శక్తిమంతమైనజాతిగా విజయభేరి మోగిస్తూ అనేక ముస్లిమేతర రాజ్యాల సరిహద్దులు దాటుతోంది. సిరిసంపదల రీత్యా, వైభవోన్నతుల పరంగా ఆనాడు ముస్లింసముదాయానికి మించిన జాతి లేదు. ఎంతో క్రమశిక్షణ కలిగిన యోధులు కూడా ఉన్నారు. షరీఅత్ ఆజ్ఞల పాటింపు కూడా జరుగు తుండేది. అయినప్పటికీ పగలంతా ఉపవాసాలు పాటిస్తూ రాత్రిళ్ళు దైవారాధనలో గడుపుతుండే, తగిన ఒనరులు-సరైన ఆయుధాలులేని సహాబీలకు, ఈ ముస్లింలకు మధ్య విశ్వాసం-ఆచరణల రీత్యా భూమ్యాకాశాలంత తేడా ఉందని ఆనాడు వారితో పోరాడి పరీక్షించుకున్న ముస్లిమేతర రాజులు తెలుసుకున్నారు. అందుకే రుత్బీల్ ఆ తర్వాత వచ్చిన ముస్లింలకు జిజ్యా చెల్లించడానికి నిరాకరించాడు.

## 2) అబ్దుర్రహ్మాన్ బిన్ జహ్హాక్ పర్యవసానం

అబ్దుర్రహ్మాన్ బిన్ జహ్హాక్ అనే వ్యక్తి ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) పాలనా కాలం నుండి మదీనా గవర్నర్‌గా ఉంటున్నాడు. అతని పాలనా తీరు పట్ల మదీనా ప్రజలు అసంతృప్తిగా ఉండేవారు. అతనా హోదాలో మూడేండ్లు ఉన్నాడు. ఆ తరువాత అతనిలో ఇమామ్ హుసైన్ (రజి) మనుమరాలిని వివాహమాడాలన్న దుర్బుద్ధి పుట్టింది. దానికోసం అతను ఆ బాలిక తల్లి ఫాతిమా బిన్త్ హుసైన్ (రజి) దగ్గరకు ఒక సందేశం పంపాడు. అందుకామె నిరాకరించింది. దానిపై అతను మండిపడుతూ "నేను నీ కొడుకుపై మద్యసేవనం నేరం మోపి కొరడాదెబ్బలు కొట్టిస్తాను" అని బెదిరించాడు.



ఫాతిమా బిన్త్ హుసైన్ మదీనా గవర్నర్ తనను ఇలా బెదిరిస్తున్నాడని ఖలీఫా యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్‌కు ఫిర్యాదు చేసింది. యజీద్ ఆగ్రహోదగ్రుడై మదీనా గవర్నర్ అబ్దుర్రహ్మాన్ బిన్ జహ్హాక్‌ని తొలగించి అతని స్థానంలో అబ్దుల్‌వాహిద్ బిన్ అబ్దుల్లా ఖస్రీని నియమించాడు. ఆ మేరకతను తన స్వహస్తాలతో లేఖ రాసి అబ్దుల్‌వాహిద్‌కు అందిస్తూ "ఇబ్నెజహ్హాక్‌కు ఈ ఉత్తర్వు చూపి అతణ్ని పదవిభ్రష్టుణ్ని చెయ్యి. అంతేగాక అతనిపై నలభైవేల దీనార్లు జరిమానా విధించి, చిత్రహింసలతో అతని పెడబొబ్బలు నాకిక్కడ దాకా విన్పించేలా చెయ్యి" అని ఆదేశించాడు.

అబ్దుల్‌వాహిద్ ఈ ఉత్తర్వు తీసుకొని మదీనా వెళ్ళి ఇబ్నెజహ్హాక్‌కు అందించాడు. ఆ తర్వాత అతను మదీనా గవర్నర్‌గా చార్జ్ తీసుకొని ఖలీఫాఆజ్ఞ ప్రకారం ఇబ్నెజహ్హాక్‌ని చిత్రహింసలు పెట్టించి శిక్షించాడు. ఈ శిక్ష పట్ల మదీనా వాసులెవరూ ఇబ్నెజహ్హాక్‌పై ఏమాత్రం సానుభూతి వ్యక్తపరచలేదు. మదీనా ప్రజలు అబ్దుల్‌వాహిద్ ప్రవర్తన, పరిపా లన పట్ల సంతోషంగా ఉండసాగారు.

ఖలీఫా యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ వ్యాధిగ్రస్తుడై నాలుగేండ్ల పాలన తరువాత 38 ఏండ్ల వయస్సులో హి.శ. 105లో చనిపోయాడు. యజీద్ తరువాత అతని వీలునామా ప్రకారం అతని సోదరుడు హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖలీఫా అయ్యాడు.

# 45. హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన

హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖలీఫా అయిన తరువాత ఇరాఖ్ గవర్నర్ పదవి నుండి ఇబ్నెహుబైరాను తొలగించి ఖాలిద్ బిన్ అబ్దుల్లా ఖస్రీని నియమించాడు. తుర్కిస్తాన్ ప్రజలు చైనాచక్రవర్తి ఖాఖాన్ సహాయంతో వీలుచిక్కినప్పుడల్లా ముస్లింలపై దాడులు చేస్తూ ఇస్లామీయ రాజ్యంలో అరాచకానికి పాల్పడుతుండేవారు. ఖురాసాన్ (ఈరాన్) రాష్ట్రగవర్నర్ ముస్లిం బిన్ సయీద్ వారి దాడుల్ని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ఉండేవాడు.హి.శ. 106లో ఖలీఫా హిషామ్ ఖురాసాన్ గవర్నర్ పదవి నుండి ముస్లిం బిన్ సయీద్‌ని తొలగించి అతని స్థానంలో ఇరాఖ్ గవర్నర్‌గా ఖాలిద్ బిన్ అబ్దుల్లా సోదరుడు అసద్ బిన్ అబ్దుల్లాని నియమించాడు. అయితే ఖురాసాన్‌లో అసద్ బిన్ అబ్దుల్లా ప్రవర్తన పట్ల ఆరోపణలు రావడంతో ఖలీఫా హిషామ్ అతణ్ని తొలగించి అతని స్థానంలో అష్రస్ బిన్ అబ్దుల్లాసల్మీని నియమించమని ఇరాఖ్ గవర్నర్ ఖాలిద్‌ని ఆదేశించాడు. దాని ప్రకారం అష్రస్ ఖురాసాన్ గవర్నర్‌గా నియమితుడయ్యాడు.

అష్రస్ తన సత్ప్రవర్తనతో ఖురాసాన్ ప్రజల్ని ఆకట్టుకున్నాడు. హి.శ. 110లో అతను సమర్‌ఖంద్, మావరా ప్రాంతాల ప్రజలు తరచుగా తిరుగుబాటుకు పాల్పడుతుండటం వల్ల వారిని సన్మార్గం వైపుకు మళ్ళించడానికి అతను హి.శ. 110లో ఆ ప్రాంతాలకు అబూసైదాని, సాలిహ్ బిన్ జరీఫ్‌ని పంపాడు. వారిద్దరు వెళ్ళి ధర్మప్రచారం చేసిన కొన్నాళ్ళకే ఆ ప్రజలు వేలసంఖ్యలో ఇస్లాం స్వీకరించారు. వారి ఇస్లాంస్వీకరణతో జిజ్యా (రక్షణరుసుం) ద్వారా వస్తున్న ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది. ఆ సంగతి ఖురాసాన్ కోశాధికారి హసన్ బిన్ ఉమర్ గవర్నర్ అష్రస్‌కు తెలియజేశాడు.

## 1) ఖడ్గంతో ఇస్లాంవిస్తరణ కాదు, క్రూరుల అణచివేత

దానికి అష్రస్, వారినుండి బలవంతంగా నైనాసరే జిజ్యా వసూలుచెయ్యాలని కోశాధికారి హసన్‌ని ఆదేశించాడు. కాని హసన్ ఇస్లాం స్వీకరించిన ప్రజల నుండి జిజ్యా వసూలుచేయడం అధర్మం. అంచేత అతనలా చేయలేదు. దాంతో అష్రస్ కోశాధికారి పదవి నుండి అతణ్ణి తొలగించి హానీ ఇబ్నెహానీని నియమించాడు. అతనికి సమర్‌ఖంద్ పాలన, సేనాపతి పదవులు కూడా కట్టబెట్టాడు. హానీ సమర్‌ఖంద్ వచ్చి నవముస్లింల నుండి జిజ్యా వసూలుచేయనారంభించాడు. అప్పుడు సమర్‌ఖంద్‌లో ధర్మప్రచారంచేసి అక్కడి ప్రజల్ని ముస్లింలుగా మార్చిన అబూసైదా జిజ్యా చెల్లించవద్దని వారికి చెప్పి, హానీని కూడా ఆపని నుండి అడ్డుకున్నాడు. కాని ఖురాసాన్ గవర్నర్ ఆజ్ఞతో హానీ వారి నుండి జిజ్యా వసూలుచేయడానికే యత్నించాడు. దాంతో అబూసైదా ఆ నవముస్లింల సహకారంతో ప్రభుత్వంపై తిరుగుబాటు లేవదీశాడు. సమర్‌ఖంద్ ప్రభుత్వసైన్యం నుండి అనేకమంది ముస్లింయోధులు కూడా అబూసైదా సైన్యంలో చేరిపోయారు.

ఖురాసాన్ గవర్నర్ అష్రస్ ఈ పరిస్థితి గమనించి సమర్‌ఖంద్ పాలన నుండి హసన్ బిన్ ఉమర్‌ని తొలగించి మహ్‌షర్ బిన్ మజాహిమ్‌ని నియమించాడు. మహ్‌షర్ సమర్‌ఖంద్ చేరుకొని రాజీఒప్పందం సాకుతో అబూసైదాని, అతని అనుచర నాయకుల్ని పిలిపించి నిర్బంధించి అష్రస్ వద్దకు పంపాడు. అప్పుడా నవముస్లింలు అబూఫాతిమాని నాయకుడిగా చేసుకొని తిరిగి పోరాటానికి సిద్ధమయ్యారు. చివరికి ఆ నవముస్లింలకు జిజ్యా చెల్లింపు నుండి మినహాయింపు లభించింది. అయితే వారి సైనికశక్తి, ఐకమత్యం తగ్గిపోయిన తరువాత వారిపై దౌర్జన్యం మళ్ళీ మొదలయింది.

తత్ఫలితంగా ఆ నవముస్లింలంతా మతభ్రష్టులై తిరిగి తమ పాతమతంలోకి మారిపోయారు. అంతేగాక వారు చైనాచక్రవర్తి ఖాఖాన్ సహాయంతో పెద్దఎత్తున సైన్యాన్ని సమీకరించుకొని ముస్లింలపై దాడికి సిద్ధమయ్యారు. ఖురాసాన్ గవర్నర్ అష్రస్ నేతృత్వంలో ముస్లిం సైన్యం వారిని ఢీకొన్నది. ఉభయపక్షాల మధ్య తీవ్ర స్థాయిలో యుద్ధం జరిగింది. చివరికి ఒప్పందం ద్వారా ఈ సంకులసమరం ఆగిపోయింది.

ఇక్కడ ఒక విషయం గుర్తుచేయవలసిన అవసరం ఉంది. ఇస్లాం ఖడ్గం ద్వారా వ్యాపించిందని ఇస్లాంవ్యతిరేక శక్తులు దుష్ప్రచారం సాగిస్తున్నారు. కాని ఇక్కడ ఖడ్గం ఇస్లాంవ్యాప్తిని నిరోధించింది. ఇస్లాం ఖడ్గంద్వారా వ్యాపించిందనే విషయం సామ్రాజ్య వాదులు సృష్టించిన 'అపోహ' తప్ప మరేమీ కాదు.

“నీ ప్రభువు తలిస్తే భూవాసులంతా విశ్వసించేవారు. కాని నీవు ప్రజల్ని బలవంతంగా విశ్వాసులుగా మార్చదలిచావా? దైవాజ్ఞ లేనిదే ఏఒక్కడూ విశ్వసించలేడు” (10:99); “ధర్మస్వీకరణలో ఎలాంటి బలాత్కారం లేదు. సత్యం అసత్యం నుండి స్పష్టంగా వేరు చేయబడింది” (2:256) అని పేర్కొన్నది ఖుర్‌ఆన్.

ఇస్లామీయ ఖడ్గం దౌర్జన్యపరులైన రాజులు, భూస్వాముల్ని మాత్రమే దండించింది. ఇస్లాంలోని మానవతాదృక్పథం, నైతికవిలువలు, సమతా-స్వాతంత్ర్యాలతో పాటు ముస్లింల న్యాయవైఖరి, నీతినడవడికల ద్వారానే ప్రజలు ఇస్లాంకు చేరువైపోయారు.



ఇదిలాఉంటే అటు ముస్లిమేతరరాజ్యాల నుండి కూడా బనూఉమయ్యా ప్రభుత్వం తీవ్ర ప్రతిఘటనలు ఎదుర్కోవలసి వచ్చింది. ఇస్లామీయసామ్రాజ్య సరిహద్దుల్ని పరిరక్షించడానికి ముఖ్యంగా చైనా, తుర్కిస్తాన్, ఆర్మేనియా, అజర్‌బాయ్‌జాన్, స్పెయిన్, రోమ్ రాజ్యాలతో నిరంతరం యుద్ధాలు చేయవలసి వచ్చింది.

ఇబ్నెఅసాకర్ ఇబ్రాహీం బిన్ అబీఐలా కథనం : ఓసారి ఖలీఫా హిషామ్ నన్ను ఈజిప్టుగవర్నర్‌గా నియమించదలిచాడు. నేనందుకు (అంగీకరించలేదు.) తిరస్కరించాను. దానిపై అతను నావైపు ఉరిమి చూస్తూ “ఈ పదవి స్వీకరించడానికి ఒప్పుకో. లేకుంటే బలవంతంగానైనా నిన్ను ఒప్పించవలసి వస్తుంది” అని అన్నాడు. ఈమాట విని నేను మౌనంగా ఉండిపోయాను. అతని కోపం చల్లారిన తరువాత “మీరు అనుమతిస్తే నేనొక మాట చెప్పాలనుకుంటున్నాను” అని అన్నాను నేను. దానికతను సరే చెప్పు అన్నాడు. నేనప్పుడు ఇలా చెప్పాను : “దేవుడు తన గ్రంథంలో 'మేమీ (దైవప్రాతినిధ్య) బాధ్యతను మొదట్లో భూమ్యాకాశాల ముందు, పర్వతాల ముందు పెట్టాము. కాని అవి భయపడిపోయి ఈ బాధ్యతాభారం మోయడానికి సిద్ధపడలేదు' (33:72) అని అన్నాడు. వాటి నిరాకరణ పట్ల దేవుడే కోపగించుకోలేనప్పుడు మీరు నా నిరాకరణ పట్ల ఎందుకు కోపగించుకుంటున్నారు?” ఖలీఫా హిషామ్ ఈమాట విని నవ్వాడు. ఆ తరువాత అతను నన్ను క్షమించి వదిలేశాడు.

## 2) సింధ్ రాష్ట్రం పరిస్థితి

సింధ్‌లో అక్కడి గవర్నర్ జునైద్ బిన్ అబ్దుర్రహ్మాన్ రాజ్యాన్ని విస్తరింపజేస్తూ దాన్ని పటిష్ఠపరిచాడు. అయితే దాహిర్‌రాజు కొడుకు జైసింగ్ కొన్ని మతభ్రష్టతెగల సహాయంతో తిరుగుబాటు లేవదీశాడు. ముస్లింయోధులు జైసింగ్‌ని హతమార్చి తిరుగుబాటును అణచివేశారు. సింధ్‌లో జునైద్ గవర్నర్‌గా నాలుగేళ్ళ పాటు సుస్థిరపాలన సాగించాడు. తరువాత అతని వారసుడిగా వచ్చిన తమీమ్ అసమర్థుడిగా నిరూపించుకున్నాడు. అతని పాలనాకాలంలో తిరుగుబాటులు మళ్ళీ తలెత్తాయి. ముస్లింల నిర్మాణాత్మక కార్యకలాపాలు ఆగిపోయాయి. అంచేత ఖలీఫా అతణ్ణి తొలగించి హకమ్ బిన్ ఇవానాను సింధ్ గవర్నర్‌గా నియమించాడు. హకమ్ తిరుగుబాటుదారుల పీచంఅణచి రాష్ట్రాన్ని పటిష్ఠపరిచాడు. అదీగాక మహ్‌ఫూజా, మన్సూరా అనే రెండు పట్టణాల్ని నెలకొల్పాడు.

## 3) ఫ్రాన్స్‌లో ముస్లింల పురోగమనం

ఖలీఫా హిషామ్ కాలంలో ముస్లింలు ఫ్రాన్స్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో విజయపతాకాలు ఎగరవేశారు. ఫ్రాన్స్,స్పెయిన్‌ల మధ్యవున్న ప్రాంతానికి ఉస్మాన్ బిన్ అబీనాస సుబేదారుగా ఉండేవాడు. కాని పదవి కోల్పోవడం వల్ల, అరబ్బుదురభిమానం వల్ల ఇస్లామీయ సామ్రాజ్యానికి వ్యతిరేకిగా మారి ఫ్రాన్స్‌లోని ఎక్విటైన్ ప్రాంతం పాలకుడు (డ్యూక్)తో చేతులు కలిపాడు. అతని కూతుర్ని కూడా పెళ్ళిచేసుకున్నాడు. స్పెయిన్ గవర్నర్ అబ్దుర్రహ్మాన్ గాఫిఖి స్పెయిన్ పాలనావ్యవస్థను పటిష్ఠపరచి హి.శ 113లో ఫ్రాన్స్ వైపు పురోగమించాడు. దారిలో డ్యూక్ ఆఫ్ ఎక్విటైన్‌ని ఓడించి ఫ్రాన్స్‌లోని అనేక పట్టణాలను, ప్రాంతాలను కైవశం చేసుకున్నాడు.

అతివేగంగా వస్తున్న ఇస్లామీయ విజయపరంపర ప్రవాహం చూసి క్రైస్తవులు భీతావహులయ్యారు. ముస్లింలు ఫ్రాన్స్ పశ్చిమభూభాగాన్ని గనక ఆక్రమించుకుంటే ఆ తర్వాత మొత్తం యూరప్‌ని కబళించే ప్రమాదముందని, అప్పుడు ఏ శక్తీ వారిని అడ్డుకోజాలదని వారు భావించారు. అంచేత జర్మనీ ప్రధాని(సేనాపతి) చార్లెస్‌మార్టిల్ వివిధ రాజ్యాల నుండి సైన్యాల్ని సమీకరించి టూర్స్ అనే పట్టణం సమీపంలో ముస్లింసైన్యం మీద దాడిచేశాడు. అయితే ముస్లింయోధులు తీవ్రంగా ప్రతిఘటిస్తూ విజయానికి చేరువవుతున్న సమయంలో అరబ్బుల స్థావరం ప్రమాదంలో పడిపోయిందని ఎవరో వదంతి లేవదీశారు. దాంతో ముస్లిం సైనికులు తమ సైనికస్థావరం వైపు పరుగుతీశారు. తమ సేనాపతి ఎంత నచ్చజెప్పినా వారు వినకుండా అటువైపు పరుగెత్తారు. క్రైస్తవ సైనికులు ఈ పరిస్థితి చూసి యుద్ధమైదానంలో మిగిలివున్న ముస్లిం సైనికులపై పెద్దపెట్టున విరుచుకుపడ్డారు. దాంతో ముస్లింలు ఓటమి చవిచూడవలసివచ్చింది. గవర్నర్ సేనాపతి అబ్దుర్రహ్మాన్ తీవ్రంగా పోరాడుతూ అమరగతి పొందాడు.

ఖలీఫా హిషామ్ ఫ్రాన్స్‌లో ముస్లింసైనికుల ఓటమి, అనైక్యతల సంగతి వినగానే అబ్దుల్‌మలిక్ బిన్ ఖతన్‌ని స్పెయిన్ గవర్నర్‌గా నియమించి పంపుతూ ఇస్లామీయ వైభవాన్ని పునరిద్ధరించడానికి కృషిచేయాలని ఆదేశించాడు. అబ్దుల్‌మలిక్ వెళ్ళి మొదట ఉత్తర స్పెయిన్ తిరుగుబాటులను అణచివేసి, సైనికవ్యవస్థను పునర్వ్యవస్థీకరించాడు. తరువాత ఫ్రాన్స్‌లో ప్రవేశించి కొన్ని ప్రాంతాలను తిరిగి వశపరచుకున్నాడు. అయితే ఆక్రమిత ప్రాంతాల్లో అతను చేసిన దౌర్జన్యాల కారణంగా ఖలీఫా అతడ్ని తొలగించి ఉఖ్బాని స్పెయిన్ గవర్నర్‌గా నియమించాడు. ఉఖ్బా అక్కడ అయిదేండ్లు పరిపాలన చేసి, ఫ్రాన్స్‌పై అనేకసార్లు దాడులు నిర్వహించి ఇంతకుముందు కంటే ఎక్కువ విజయాలు సాధించాడు. ఫ్రాన్స్‌లో ముస్లింల పురోగతిని నిరోధించడానికి ఫ్రాన్స్ రాజులు అందమైన అనేక పట్టణాలను ధ్వంసం చేశారు.

## 4) ఆఫ్రికా పరిణామాలు

ఆ రోజుల్లోనే దురదృష్టవశాత్తు ఆఫ్రికాలో చెలరేగిన అరబ్బుల అంతఃకలహాల ప్రభావం స్పెయిన్ మీద కూడా పడింది. స్పెయిన్ మాజీగవర్నర్ అబ్దుల్‌మలిక్ బిన్ ఖతన్ కుట్రతో గవర్నర్ ఉఖ్బాని చంపించాడు. ఆ తరువాత అతను కూడా ఓ సైన్యాధికారి చేతిలో హతమార్చబడ్డాడు. ఆఫ్రికాలో బర్బరీ నవముస్లింలు తీవ్రమైన జాతీయ దురభిమానంతో అక్కడి అరబ్ ముస్లింలపై హింసాకాండ జరిపారు. అప్పుడు ఖలీఫా హిషామ్ ఆఫ్రికాగవర్నర్‌గా కుల్సూమ్ బిన్ అయాజ్‌ని నియమించి, అతనికి సహాయంగా ముప్ఫయి వేలమంది సైనికుల్ని పంపాడు. అయితే స్వభావరీత్యా భయంకరులైన బర్బరీలు యుద్ధంలో కుల్సూమ్‌ని, అతని ముఖ్య సైన్యాధికారుల్ని హతమార్చారు. దాంతో ఖలీఫా హిషామ్ ఆగ్రహోదగ్రుడై ఈజిప్టులో ఖబ్తీ తెగవారి పీచం అణచిన హన్జలా బిన్ సఫ్వాన్ కల్బీని ఆఫ్రికా గవర్నర్‌గా నియమించి పంపాడు. బర్బరీలు ముందుకు సాగి ఖైర్వాన్‌ని దిగ్బంధించారు. ఖైర్వాన్ కోటలో చిక్కుకున్న అరబ్‌యోధులు ఈ ముట్టడితో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అప్పుడు సమరవ్యూహంలో అనుభవశాలి



అయిన హన్జలా హృదయాల్ని ఉగ్రూతలూగించే తన ప్రసంగంతో వారిలో సమరోత్సాహం కలిగించాడు. దాంతో అరబ్‌యోధులు తమ శక్తినంతటినీ కూడదీసుకొని బర్బరీలపై విరుచుపడి విజయదుందుభి మోగించారు. ఆ యుద్ధంలో రెండులక్షల మంది బర్బరీలు హతమయ్యారు. ఆ తరువాత గవర్నర్ హన్జలా ఆఫ్రికాలోని వివిధప్రాంతాల పాలనా వ్యవస్థను చక్కబరచి, శాంతిభద్రతల్ని పునరుద్ధరించాడు.

## 5) జైద్ బిన్ అలి బిన్ హుసైన్ దండయాత్ర

హి.శ. 101వ సంవత్సరం నుండి అల్వీయులు, ఫాతిమీయులు, అబ్బాసీలతో కూడిన షియా వర్గీయులు బనూఉమయ్యా తెగ పాలనకు వ్యతిరేకంగా ఖురాసాన్ (ఈరాన్)లో రహస్యకార్య కలాపాలు ప్రారంభించాయి. అవకాశం కోసం ఎదురుచూస్తూ వారు హి.శ. 116లో ఇమామ్ రజా నాయకత్వంలో నలుపురంగు దుస్తులు ధరించి బలఖ్ వైపు పురోగమించారు. బనూఉమయ్యా పాలకుల బాధితుల్లో కూడా అనేకమంది వారికి తోడయ్యారు. హి.శ. 120 వరకు అనేక యుద్ధాలు జరిగాయి. కాని వారు తమ లక్ష్యంలో ఇంకా విజయం సాధించలేకపోయారు.

హి.శ. 122లో షియాలోని జైదియావర్గం ప్రజలు బనూఉమయ్యా పాలకులకు వ్యతిరేకంగా మరొకసారి రహస్యకార్యకలాపాలు ప్రారంభించారు. వారు ఇమామ్ హుసైన్ (రజి) మనవడు జైద్ బిన్ అలికి మద్దతు తెలుపుతూ కూఫాలో ఆయనకు లక్షమంది ప్రజలు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారని, పదిహేనువేల మంది బైత్ కూడా చేశారని నమ్మబలికారు. ఇలా ఆయన నేతృత్వంలో ఈ ఉద్యమం మొదలైంది. కొన్ని రోజుల్లోనే 15 వేలమంది ప్రజలు ఆయనచుట్టూ గుమికూడారు. జైద్ బిన్ అలి గొప్ప ధర్మవేత్త, దైవభీతిపరాయణుడు కూడా. ఆనాడు ఇమామ్ హమ్మామ్‌కు శిష్యుడిగా మాత్రమే ఉండిన అబూహనీఫా (రహ్మలై) కూడా ఆయన ద్వారా విద్యాప్రయోజనం పొందారు. అందువల్ల ఆయన ఆ ఉద్యమాన్ని సమర్థిస్తూ జైద్ బిన్ అలీకి తమ సహకారం అందజేయాలని ప్రజలను కోరారు. అదీగాక ఆయనకు ధనసహాయం కూడా చేశారు. అయితే కూఫాప్రజలు చివరి దాకా జైద్‌తో సహకరిస్తారని నమ్మలేక ఆయన ఈ ఉద్యమంలో క్రియాత్మకంగా పాల్గొనలేదు.

పోతే గత అనుభవాల ద్వారా కూఫాప్రజల మనస్తత్వం ఎరిగినవారు 'అప్పుడే తిరుగుబాటు చేయకూడదని, కొన్నాళ్ళు వేచిచూడాలని' జైద్ బిన్ అలీకి సలహా ఇచ్చారు. కాని జైద్ బిన్ అలి వారి సలహా త్రోసిపుచ్చి రణభేరి మోగించారు. అయితే గతంలో లాగే కూఫా ప్రజలు తమ పిరికితనం, చిత్తచాపల్యాలు ప్రదర్శించి జైద్ బిన్ అలీని నిలువునా ముంచారు. ఇరాఖ్ గవర్నర్ ఆ తిరుగుబాటును అణచడానికి ప్రయత్నించాడు. సరిగ్గా అదే సమయంలో జైద్ బిన్ అలీకి మద్దతిస్తున్న కూఫాసైనికులు తమ నాయకుడు జైద్ బిన్ అలీతో ఖిలాఫత్ హక్కుదారుల విషయమై పిడివాదానికి దిగారు. ఖుర్‌ఆన్, హదీసులతో పొసగని విషయంలో ఇలా పిడివాదంచేస్తూ వారు జైద్‌ని వీడిపోయారు. చివరికి జైద్ వెంట 218 మంది మాత్రమే మిగిలారు. వేలసంఖ్యలో ఉన్న ప్రభుత్వసైనికుల్ని ఈ 218మంది యోధులు ఎలా ఎదుర్కొని బట్టకట్టగలుగుతారు?

ఏమైనప్పటికీ విజయమో వీరమరణమో అన్నట్లు వారు తమ శక్తివంచన లేకుండా పోరాడి, అనేకసార్లు ప్రభుత్వసైన్యాన్ని వెనక్కి నెట్టి చివరికి నేలకొరిగారు. ఒక బాణం వచ్చి జైద్ బిన్ అలీ శరీరంలో కూడా దిగబడింది. దాంతో ఆయన కిందపడిపోయాడు. వెంటనే ప్రత్యర్థి సైనికులు వచ్చి ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తరువాత ఇరాఖ్ గవర్నర్ యూసుఫ్ ఆయన శిరస్సు ఖండింపజేసి ఖలీఫా హిషామ్ దగ్గరకు పంపాడు. ఖలీఫా ఆ శిరస్సుని డెమాస్కస్ పట్టణ ప్రధానద్వారానికి వ్రేలాడదీయించాడు. ఈవిధంగా నిలకడలేని మనస్తత్వం కలిగివుండటంతో పాటు పనికిమాలిన వాదనలకు అలవడిన కూఫాప్రజలు హజ్రత్ అలి (రజి), హసన్ (రజి), హుసైన్ (రజి)ల తరువాత ఇప్పుడు జైద్ బిన్ అలీకి కూడా వెన్నుపోటు పొడిచారు.

## 6) బనూఅబ్బాసీల రాజకీయ కార్యకలాపాలు

హాషిం సంతతిలోని అబ్బాసీవర్గం కూడా హి.శ.101 నుండే బనూఉమయ్యా పాలకులకు వ్యతిరేకంగా సమరశంఖారావం చేసింది. కర్బలా విషాదఘటన తర్వాత 'అహ్లెబైత్' (దైవప్రవక్త-స-కుటుంబం)లో ఇమామె హుసైన్ (రజి) కుమారుడు జైనుల్‌ఆబిదీన్ మాత్రమే బ్రతికి బయటపడ్డారు. అయితే ఆయన రాజకీయాలకు దూరంగా ఉండదలిచారు. అందువల్ల షియాలు హజ్రత్ అలి (రజి) రెండవభార్య (ఫాతిమేతర) కుమారుడు ముహమ్మద్ బిన్ హనీఫా నాయకత్వంలో తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించారు. అతని తర్వాత అతని కుమారుడు అబూహాషిమ్ అబ్దుల్లా షియా ఉద్యమానికి నాయకుడయ్యాడు. అయితే అబూహాషిం తన మరణసమయంలో తన రాజకీయ హక్కుల్ని అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) మనవడు ముహమ్మద్ బిన్ అలి బిన్ అబ్బాస్‌కు ధారాదత్తం చేశాడు. ఈ విధంగా బనూఉమయ్య వ్యతిరేకఉద్యమ నాయకత్వం బనూహాషిం నుండి బనూఅబ్బాస్ చేతిలోకి పోయింది.

ముహమ్మద్ పాలస్తీనాలోని హమీమా అనే కుగ్రామంలో కూర్చొని అందరికంటే ముందు తనసుతాను ఖిలాఫాత్ హక్కుదారునిగా ప్రకటించుకొని బనూఅబ్బాసీవర్గం అనుకూల ప్రచారం ప్రారంభించారు. దీని కోసం ఆయన వివిధ ప్రాంతాలకు తన అనుచరుల్ని పంపించారు. వారు బనూఉమయ్యా పాలకుల అన్యాయం, దౌర్జన్యాల్ని గురించి రహస్యప్రచారంచేస్తూ ముహమ్మద్ బిన్ అలీ ఖిలాఫత్ కోసం ప్రజల చేత బైత్ చేయించసాగారు. వారు అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకోవడానికి బనూఅబ్బాసీ పదానికి బదులు బనూహాషిమి పదం ఎక్కువగా ఉపయోగించేవారు. అంచేత వారి పిలుపుకు ప్రజల నుండి విశేషస్పందన వచ్చింది. ఇలా బనూఅబ్బాసీల రహస్యకార్యకలాపాలు ఇరాఖ్, ఖురాసాన్, మక్కా, మదీనా, యమన్, ఈజిప్టు మొదలైన ప్రాంతాల్లో విస్తృతంగా సాగింది. ప్రజల నుండి కూడా మంచిస్పందన వచ్చింది.

అయితే బనూఉమయ్యా పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న ఈ కార్యకలాపాల సంగతి ఖురాసాన్ గవర్నర్‌కు తెలిసిపోయింది. అతను హి.శ. 107లో ఒకసారి, హి.శ. 118లో మరోసారి ఆ కార్యకర్తల్ని హతమార్చాడు. చివరికి హి.శ. 124లో వేరొకసారి వారు పట్టుబడి చంపబడ్డారు. చివరికి వారి నాయకుడు ముహమ్మద్ బిన్ అలి బిన్ అబ్దుల్లా, అతని అనుచరులు కొందరు జైలుపాలై హి.శ. 125లో ఒక అంటువ్యాధి సోకడంతో జైల్లోనే చనిపోయారు. ఆయన తన మరణసమయంలో తన కుమారులు ఇబ్రాహీం, అబుల్‌అబ్బాస్, అబూజాఫర్‌లను వరుసగా తన వారసులుగా, ఉద్యమ నాయకులుగా ప్రకటించారు. దాని ప్రకారం మొదట ఇబ్రాహీం బిన్ ముహమ్మద్ నాయకుడై ఉద్యమ కార్యకలాపాలు కొనసాగించాడు. అతనికి అబూముస్లిం ఖురాసాని లాంటి అసాధారణ తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు గల అనుచరుడు దొరికాడు.



ఖలీఫా హిషామ్ తన తదనంతరం గత ఖలీఫా యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ రాసిన వీలునామా ప్రకారం వలీద్ బిన్ యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్‌ని ఖిలాఫత్ వారసుడిగా ప్రకటించవలసి ఉండింది. కాని వలీద్ పిన్నవయస్సు నుండే ఆకతాయిగా పెరిగాడు. భోగలాలస, స్త్రీలోలత్వం, మత్తుపానీయాలకు అలవడి విశృంఖుల జీవితం గడపాగాడు. అంచేత హిషామ్, వలీద్ బిన్ యజీద్‌ని తొలగించి తన కుమారుడ్ని ఖిలాఫత్ వారసుడిగా చేయాలనకున్నాడు. కాని దూరదృష్టి కొరవడిన మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు అందుకు అంగీకరించనందున ఖలీఫా హిషామ్ తన ఆశయాన్ని నెరవేర్చుకోలేక పోయాడు. చివరికి హి.శ. 125లో హిషామ్ బిన్ అబ్దుల్ మలిక్ దాదాపు పంథొమ్మిది సంవత్సరాల ఆర్నెల్ల పరిపాలన తరువాత రోగగ్రస్తుడై చనిపోయాడు.

# 46. వలీద్ బిన్ యజీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన

హిషామ్ తర్వాత వలీద్ బిన్ యజీద్ ఖలీఫా అయ్యాడు. వలీద్ అధికారం చేపట్టగానే తన ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోనారంభించాడు. వారిలోకొందర్ని చంపించాడు; కొందర్ని కొరడాదెబ్బలు కొట్టించాడు; మరికొందర్ని జైళ్లలో వేశాడు; ఇంకొందరి పింఛన్లు రద్దుచేశాడు. వలీద్ మొట్టమొదట తన వంశస్థుల్నే వేధించి తనకు శత్రువులుగా చేసుకున్నాడు. మదీనా గవర్నర్ హిషామ్ బిన్ ఇస్మాయీల్ కుమారుల్ని, ఇరాఖ్ మాజీగవర్నర్ ఖాలిద్ బిన్ అబ్దుల్లా ఖస్రీని అరెస్టు చేయించి ఇరాఖ్ గవర్నర్ యూసుఫ్ బిన్ ఉమర్ దగ్గరకు పంపాడు. ఆ దుర్మార్గుడు వారందర్నీ చిత్రహింసలు పెట్టి హతమార్చాడు.

వలీద్ బిన్ యజీద్ ఖిలాఫత్ పీఠం అధిరోహించిన మొదటి సంవత్సరం (హి.శ.125) లోనే తన కొడుకులు ఉస్మాన్‌ని, హకమ్‌ని తన రాజకీయవారసులుగా చేయడానికి ప్రజలచేత బైత్ చేయించుకున్నాడు. కాని ప్రజలు మనస్ఫూర్తిగా బైత్‌చేయలేదు. అంచేత వారి హృదయాలు అతని పట్ల మరింత ద్వేషంతో నిండిపోయాయి.

మరోవైపు వలీద్ బిన్ యజీద్ రాజ్యపాలన వ్యవహారాల్లో కూడా ఎవర్నీ సంప్రదించకుండా ఇష్టానుసారం కొన్ని రాష్ట్రాల గవర్నర్లను తీసేయడం, మరికొన్ని రాష్ట్రాల గవర్నర్లకు ఇతరప్రాంతాల్ని కట్టబెట్టడం చేస్తూ గవర్నర్లలో, ఉన్నతాధికారుల్లో అభద్రతా భావం కల్పించాడు. ఇలా అతను పరిపాలనా వ్యవహారాల్లో అతివేగంగా మార్పులు, చేర్పులు చేస్తూ మొత్తం సామ్రాజ్యవిచ్ఛిత్తికి దారి సుగమం చేయసాగాడు. వేరొకవైపు అతను మద్య సేవనం, వ్యభిచారం వంటి శిక్షార్హమైన నేరాలక్కూడా పాల్పడుతున్నాడు. ఈ అకృత్యాలు కుచేష్టలతో ప్రజలే కాకుండా ప్రభుత్వాదికారులు కూడా అసహ్యించుకోసాగారు.

మొన్నటిదాకా ఖిలాఫత్ పాలనల్లో ఖలీఫా, గవర్నర్, సేనాపతి, నగరపాలకుడు తదితర ఉన్నతాధికారులు మాత్రమే తాముండే పట్టణాల్లోని మసీదుల్లో నమాజీలకు నాయకత్వం (ఇమామత్) వహించడం జరుగుతుండేది. ఇప్పుడు వలీద్ వచ్చి పాలకుల నాయకత్వం నుండి నమాజ్‌నాయకత్వాన్ని వేరుచేసి నమాజ్ చేయించే ఇమాములకు జీతాలు నిర్ణయించాడు. ఆనాడు వలీద్ బిన్ యజీద్ ప్రవేశ పెట్టిన రాజకీయం నుండి మతాన్ని వేరుచేసే ఈ దుష్టసంప్రదాయం ముస్లిందేశాల్లో ఈనాటికీ కొనసాగుతోంది.

ఖలీఫా వలీద్ సాగిస్తున్న దౌర్జన్యాలు, అవకతవకల కారణంగా అతని వంశస్థులే అతనికి వ్యతిరేకులైపోయారు. ముఖ్యంగా వలీద్ బిన్ యజీద్ పినతండ్రి కుమారుడు యజీద్ బిన్ వలీద్ అతనికి బద్ధశత్రువైపోయి అతని అన్యాయాలు, అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం కూడగట్టడం ప్రారంభించాడు. దాంతో కొద్దికాలంలోనే అనేక మంది అతనికి మద్దతుదారులైపోయారు. వారిలో తన వంశస్థులేగాక సైనికాధికారులు, వివిధప్రాంతాల పాలకులు కూడా ఉన్నారు. ఫలితంగా సిరియాసైన్యంలోని అత్యధిక మంది సైనికులు అతని పతాకం కిందికి చేరిపోయారు.

యజీద్ బిన్ వలీద్ ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో చాలావరకు విజయం సాధించాడు. ఇలా బనూఉమయ్యా తెగవారు మొదటిసారిగా రెండు వర్గాలుగా చీలిపోయారు. యజీద్ బిన్ వలీద్ అన్నివిధాలా సంతృప్తి చెందిన తర్వాత హి.శ. 126, జమాదిస్సాని నెలలో తిరుగుబాటు లేవదీశాడు. ఆ నెలలో ఓరోజు రాత్రి ఇషానమాజ్ తరువాత రాజధాని డెమాస్కస్‌లో ప్రవేశించి మొదట నగర పోలీసు అధికారిని బంధించి ఆయుధగారాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత ప్రజలు తండోపతండలుగా వస్తూ అతని ఖిలాఫత్ కోసం బైత్ చేయడం ప్రారంభించాడు.

ఖలీఫా వలీద్ బిన్ యజీద్ దీనికిముందు తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ కుట్రలు, రహస్యకార్యకలాపాల సంగతి తెలుసుకోలేకపోయాడు. అంచేత ఇప్పుడీ హఠాత్ పరిణామం చూసి బిత్తరపోయాడు. అతను డెమాస్కస్ వదలిపెట్టి తనకు అనుకూలురైన సైనికుల్ని తీసుకొని హమస్‌కు పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని దారిలోనే నోమానీ ఖసర్ అనేచోట యజీద్ బిన్ వలీద్ అతడ్ని అడ్డుకొని దాడిచేశాడు. వలీద్ అనుచరులు తీవ్రంగా ప్రతిఘటించారు. కాని లాభం లేకపోయింది. దాంతో అతను పూర్తిగా నిరాశ చెంది, ఈరోజు నాపై కూడా ఉస్మాన్ గని (రజి)పై వచ్చిన ఆపదలాంటి ఆపదే వచ్చి పడిందంటూ ఖుర్‌ఆన్ తీసుకొని పఠించడానికి కూర్చున్నాడు.

అయితే యజీద్ బిన్ వలీద్ సైనికులు రాజమహల్ ప్రహరీగోడ దూకి లోపలికి ప్రవేశించి వలీద్‌ని హతమార్చారు. తర్వాత అతని తల నరికి యజీద్ ముందు పెట్టారు. యజీద్ ఆదేశం ప్రకారం అతని సైనికులు ఆ తలను వీథుల్లో తిప్పుతూ జనమ్ముందు ప్రదర్శించి వలీద్ సోదరుడు సులైమాన్ బిన్ యజీద్‌కు అప్పగించారు. ఈవిధంగా ఒక సంవత్సరం మూడు నెలల పాలన తరువాత హి.శ. 126, జమాదిస్సాని నెలలో వలీద్ బిన్ యజీద్ చరిత్ర సమాప్తమైపోయింది. ఈ సంఘటన తరువాత తీవ్రమైన అంతః కలహాలతో బనూఉమయ్యా తెగవారి పాలన క్రమంగా పతనావస్థ దిశగా సాగింది.



# 47. యజీద్ బిన్ వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన

వలీద్ బిన్ యజీద్ హత్య తర్వాత యజీద్ బిన్ వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖిలాఫత్ పదవి చేపట్టాడు. యజీద్ బిన్ వలీద్‌ని 'రెండవ యజీద్' అని కూడా అంటారు. ఖలీఫా కాగానే అతను ప్రజల్ని సమావేశపరచి ఇలా ప్రసంగించాడు: "వలీద్ తన మూఢ నమ్మకాలు, అకృత్యాల కారణంగా వధించబడ్డాడు. నేను ఇస్లాం హద్దులు పరిష్ఠపరచి, నీతి-న్యాయాలు నెలకొల్పనంతవరకు అనవసరంగా ఎవరికీ ఎలాంటి జాగీరు ఇవ్వను. ప్రతి మనిషికీ నేను సులభంగా అందుబాటులో ఉండేందుకు నాఇంటి దగ్గర ద్వారపాలకుల్ని పెట్టను. ఒకవేళ నేను తప్పుడుమార్గం అవలంబిస్తే మీరు నన్ను తొలగించవచ్చు." ఇలా ప్రసంగించిన తరువాత యజీద్ తన సోదరుడు ఇబ్రాహీం బిన్ వలీద్‌ని, అతని తరువాత అబ్దుల్‌అజీజ్ బిన్ హజ్జాజ్ బిన్ అబ్దుల్‌మలిక్‌ని తన రాజకీయవారసులుగా ప్రకటిస్తూ ప్రజల చేత బైత్ చేయించుకున్నాడు.

వలీద్ హత్యచేయబడ్డాడని తెలియగానే హమస్, జోర్డాన్ వాసులు తిరుగుబాటు లేవదీశారు. మరొకవైపు పాలస్తీనీయులు కూడా ఖలీఫాపై తిరగబడ్డారు. అయితే యజీద్ బిన్ వలీద్ వారందర్నీ ఎదుర్కొని తిరుగుబాటును అణచివేశాడు. కొన్నిరాష్ట్రాల గవర్నర్లను తొలగించి వారి స్థానాల్లో కొత్తగవర్నర్లను నియమించాడు. మొత్తం పాలనా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాడు. యజీద్ బిన్‌వలీద్ నీతినడవడికల దృష్ట్యా చెడ్డవాడేమీ కాదు. కాని అతని వయస్సు అతడ్ని అధికారంలో ఎక్కువ కాలం ఉండనివ్వలేదు. 35 ఏండ్లు వయసున్న యజీద్ బిన్ వలీద్ దాదాపు ఆర్నెల్లు మాత్రమే పరిపాలన చేసి హి.శ. 126, జిల్‌హజ్జ నెలలో ప్లేగువ్యాధికి గురయి చనిపోయాడు.

## ☸ ఇబ్రాహీం బిన్ వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన ☸

యజీద్ బిన్ వలీద్ మరణం తర్వాత అతని వీలునామా ప్రకారం ఇబ్రాహీం బిన్ వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ ఖలీఫా అయ్యాడు. అయితే అతని పాలనను వ్యతిరేకిస్తూ చాలామంది బైత్ చేయలేదు. అంచేత అనేక రాష్ట్రాల్లో తిరుగుబాటులు చెలరేగాయి. దాంతో ఇబ్రాహీం బిన్ వలీద్ గత్యంతరంలేక రెండు నెలలు మాత్రమే పరిపాలన చేసి ఖిలాఫత్ పదవి నుండి తొలగిపోవలసి వచ్చింది. అతని స్థానంలో మర్వాన్ బిన్ ముహమ్మద్ బిన్ మర్వాన్ ఖలీఫా అయ్యాడు.

# 48. మర్వాన్ బిన్ ముహమ్మద్ బిన్ మర్వాన్ పాలన

మర్వాన్ బిన్ ముహమ్మద్ బిన్ మర్వాన్ ఖలీఫా అయిన తరువాత డెమాస్కస్‌కు బదులు హిరాన్‌లో నివసించసాగాడు. పదవీచ్యుతుడైన ఖలీఫా ఇబ్రాహీం బిన్ వలీద్‌ని తన దగ్గరకు పిలిపించుకొని అతనికి పించన్ నిర్ణయించాడు. మర్వాన్ పాలనాకాలమంతా తిరుగుబాటుదారులతో నిరంతరం యుద్ధాలు చేయడంలోనే గడచిపోయింది.

అతను అధికారం చేపట్టిన (హి.శ. 126) సంవత్సరమే హమస్‌వాసులు మరికొన్ని అరబ్‌తెగల్ని కలుపుకొని తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. వారిని ఎలాగో అణచి

వేయడం జరిగిందనుకుంటే వేరొకవైపు గౌతాప్రాంతం ప్రజలు యజీద్ బిన్ ఖాలిద్ ఖస్రీ నాయకత్వంలో డెమాస్కస్‌పై దాడిచేశారు. మర్వాన్ ఆ తిరుగుబాటును కూడా అణచి వేశాడు. ఆ తరువాత సాబిత్ బిన్ నయీమ్ నాయకత్వంలో పాలస్తీనా వాసులు తబ్రియా పట్టణాన్ని ముట్టడించారు. ఖలీఫా మర్వాన్ ఆదేశంతో అబుల్‌విర్దా సైన్యం తీసుకొనివెళ్ళి తిరుగుబాటుదారులపై దాడిచేశాడు. అదేసమయంలో పట్నంలో దిగ్బంధానికి గురైన తబ్రియావాసులు బయటికి వచ్చి తిరుగుబాటుదారులపై విజృంభించారు. దాంతో తిరుగుబాటుదారులు పరాజయంపాలై పారిపోయారు. వారి సేనాపతి సాబిత్ బిన్ నయీమ్, అతని కుమారులు ముగ్గురు పట్టుబడి మర్వాన్ దగ్గరకు పంపబడ్డారు. మర్వాన్ వారందర్నీ కాళ్ళుచేతులు నరికించి ఉరికంబంపై ఎక్కించాడు.

ఖలీఫా మర్వాన్ బిన్ ముహమ్మద్ ఈ పరిణామాల తర్వాత కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్ లను మార్చి సైన్యాలను పునర్వ్యవస్థీకరించాడు. అయినా తిరుగుబాటు పర్వం తగ్గ లేదు. సిరియాప్రజలు సులైమాన్ బిన్ హిషామ్ నాయకత్వంలో రెండుసార్లు తిరుగు బాటుకు పాల్పడ్డారు. రెండవసారి ఖలీఫా హమస్‌పట్టణాన్ని ముట్టడించి దాదాపు పది నెలల పాటు పోరాడవలసి వచ్చింది. చివరికి హమస్‌వాసులు గత్యంతరంలేక రాజీకి వచ్చారు. ఆ తర్వాత ఖారిజీల బెడద నిర్మూలించడానికి అనేకసార్లు యుద్ధం చేయ వలసివచ్చింది. వారు ప్రతిసారీ ఓడిపోతున్నా తమ అరాచకపు చేష్టలు మానుకోలేదు.

కర్మాన్, మరూ, ఖురాసాన్ ప్రాంతాల్లో ముగ్గురు నాయకులు తమ విభిన్న లక్ష్యాల సాధనకోసం పరస్పరం కుట్రలకు దాడులకు పాల్పడి ఘోరంగా నష్టపోయారు. ఖారిజీలు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ జహ్హాక్ బిన్ ఖైస్ షైబానీ నాయకత్వంలో, తర్వాత సయీద్ బిన్ బహ్‌దిల్ నాయకత్వంలో, ఆ తరువాత షైబాన్ బిన్ అబ్దుల్‌అజీజ్ నాయకత్వంలో మళ్ళీ అరాచకాలకు తెగబడ్డారు. ఖలీఫా మర్వాన్ బిన్ ముహమ్మద్ ఖారిజీల తిరుగుబాటు చర్యల్ని తాత్కాలికంగా అణచివేశాడు.

ఖారిజీల బెడద తగ్గిందనుకుంటే మదీనా, యమన్, హజరెమౌత్‌లలో అబూహమ్జా ముఖ్తార్ నాయకత్వంలో తిరుగుబాటులు తలెత్తాయి. అతనికి హజరెమౌత్‌పాలకుడు అబ్దుల్లా బిన్‌యహ్యా మద్దతునిచ్చాడు. అయితే ఖలీఫా సైనికులు ఈ తిరుగుబాటును కూడా అణచి వారిద్దర్నీ హతమార్చారు. వేరొకవైపు బనూఉమయ్యా పాలనకు వ్యతిరే కంగా బనూఅబ్బాసీలు సాగిస్తున్న రహస్యకార్యకలాపాలు ఉధృతమయ్యాయి.

## 1. అల్వీయులపై అబ్బాసీల ముందంజ

బనూహాషిం (హాషింసంతతి)లో దైవప్రవక్త (స) తర్వాత అలీ బిన్‌అబూతాలిబ్ సంతతి నాయకులు, అబ్బాస్ బిన్ అబ్దుల్‌ముత్తలిబ్ సంతతి నాయకులే ప్రసిద్ధిచెందారు. ఈ రెండువర్గాల్లో అలీ బిన్‌అబూతాలిబ్ సంతతే షియావర్గంగా ఖ్యాతిచెందింది. అలి (రజి) మద్దతుదారుల్ని ప్రారంభంలో 'షీఆనె అలి' (అలీవర్గం) అనేవారు. తర్వాత కేవలం 'షిఆ' అని పిలవబడ్డారు. ఇమామ్ హుసైన్ (రజి) అమరగతి తర్వాత అల్వీయులు మూడు వర్గాలుగా విడిపోయి పనిచేయసాగారు. అయితే అనేకసార్లు ఎదురుదెబ్బలు తిన్నారు.



బనూఅబ్బాసీ వర్గం సామాన్యప్రజల్ని, (1) ముఖ్యంగా షియాలను ఆకట్టుకోవడానికి బనూహాషింపేరుతో బనూఉమయ్య పాలనకు వ్యతిరేకంగా చాలాకాలం నుండి రహస్య కార్యకలాపాలు సాగిస్తోంది. ఆ రెండువర్గాల లక్ష్యం ఒకటే అయినందున ఉభయ వర్గాలు కలిసే పనిచేయసాగాయి. అతని సైన్యానికి (2) అబూముస్లిం ఖురాసాని వంటి గొప్ప మేధాసంపన్నుడైన సేనాపతి లభించాడు. ఈ రెండు కారణాల వల్ల అబ్బాసీవర్గం ముందంజ వేసింది; షియావర్గం వెనకబడిపోయింది. అంచేత షియా వర్గంవారు తమ అభ్యర్థిని తెర మీదికి తీసుకురాలేక పోయారు.

## 2. అబూముస్లిం ఖురాసాని

అబూముస్లిం ఖురాసాని అధికసంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం పార్శీజాతి నవ ముస్లిం అని తెలుస్తోంది. బనూఅబ్బాసీ ఉద్యమ వ్యవస్థాపకుడు ఇమామ్ ముహమ్మద్ బిన్ అలి మరణం తర్వాత ఆయన కుమారుడు ఇమామ్ ఇబ్రాహీం ఉద్యమనాయకుడై అబూముస్లింని తన ప్రత్యేకదూతగా నియమించి ఖురాసాన్(ఈరాన్) రాష్ట్రానికి పంపాడు. ఖురాసాన్‌లోని బనూఅబ్బాసీ ప్రచారకులందరినీ అబూముస్లింకు విధేయులై అతను చెప్పినట్లు పనిచేయాలని ఆదేశించారు. అబూముస్లిం ఖురాసాన్ చేరుకొని పని ప్రారం భించగానే ఉద్యమకార్యకర్తల్లో నూతనుత్సాహం పెల్లుబికింది. అక్కడి ఈరానీప్రజలు అంతకుముందు నుంచే బనూఉమయ్యతెగ అరబ్బుపాలకుల పట్ల విసిగెత్తిపోయి ఉన్నారు. ఖురాసాన్‌లో పార్శీ మాట్లాడే ఈరానీయులే అధికసంఖ్యాకులుగా ఉన్నారు. అంచేత అబూముస్లిం అరబ్బులకు వ్యతిరేకంగా ఈరానీయుల్ని రెచ్చగొడుతూ వారిని బనూఅబ్బాసీ ఉద్యమం వైపుకు తిప్పుకున్నాడు.

ఖురాసాన్‌గవర్నర్ నసర్ బిన్‌సయ్యార్ ఖురాసాన్‌లో బనూఅబ్బాసీల ప్రభుత్వవ్యతిరేక కార్యకలాపాలు పెచ్చరిల్లిపోతుండటంతో ఖలీఫా మర్వాన్‌కు ఆ ప్రమాదాన్ని గురించి హెచ్చరిస్తూ సైనికసహాయం చేయమని అనేక ఉత్తరాలు రాశాడు. కాని ఖలీఫా ఖారిజీల తిరుగుబాటును, మరికొన్ని ఇతర తెగల తిరుగుబాటును అణచడంలో నిమగ్నుడై ఉన్నందున ఖురాసాన్ పరిణాల వైపు దృష్టిసారించలేక పోయాడు. దాంతో నసర్ బిన్ సయ్యార్ శక్తి క్షీణించసాగింది. అటు అబూముస్లిం శక్తి పెరగసాగింది. అబూముస్లిం అరబ్బులు-అరబ్బేతరుల సమస్య లేవనెత్తడం ద్వారా మాత్రమే ప్రయోజనం పొందడం గాక, అరబ్బులపై యమన్-ఈజిప్టు తెగలను ఉసిగొల్పి అంతర్‌యుద్ధం సృష్టించడం ద్వారా కూడా ప్రయోజనం పొందడానికి ప్రయత్నించాడు. ఈ విధంగా అతను నసర్ సైనికుల్ని చిత్తుగా ఓడించి ఖురాసాన్ రాష్ట్రాన్ని హస్తగతం చేసుకున్నాడు.

నసర్ ఘోరంగా పరాజితుడై ఖురాసాన్ నుండి 'రే'కు, అక్కడ్నుంచి హమ్దాన్ వైపుకు పారిపోయాడు. అయితే దారిలో ఒకచోట వ్యాధిగ్రస్తుడై హి.శ. 131లో చనిపోయాడు. చనిపోయే ముందు ఖలీఫా మర్వాన్‌కు ఇలా ఓ లేఖ రాసి పంపాడు: "బనూఅబ్బాసీల ఉపద్రవాన్ని నేను నిరోధించలేకపోయాను. ఈ ఉపద్రవానికి తక్షణమే అడ్డుకట్ట వేయ వలసిన అవసరముంది. లేకుంటే ఇది మరింత ఉధృతమై అతిత్వరలోనే యావత్తు సామ్రాజ్యాన్ని హస్తగతం చేసుకుంటుంది."

ఖలీఫా మర్వాన్ ఈఉత్తరం చదవడం ముగించాడో లేదో అతని గూఢచారి ఒకతను ఒక వార్తాహరుడ్ని పట్టుకొచ్చి ఖలీఫా ముందు నిలబెట్టాడు. అతను అబూముస్లిం రాసిన ఒక ఉత్తరం తీసుకొని ఇమామ్ ఇబ్రాహీం దగ్గరకు వెళ్తున్నాడు. ఖలీఫా ఆ వార్తాహరునికి లంచంగా ఓ పెద్ద మొత్తం ఇచ్చి "నువ్వీ ఉత్తరం తీసుకొని యథాప్రకారం ఇమామ్ ఇబ్రాహీం దగ్గరకు వెళ్ళు. దీనికి ఇబ్రాహీం ఏదైనా సమాధానం రాసిస్తే దాన్ని తీసుకొచ్చి నాకు చూపించు" అని అన్నాడు. వార్తాహరుడు అలాగే చేశాడు. ఇమామ్ ఇబ్రాహీం ఆ లేఖలో అబూముస్లింని సంబోధిస్తూ, ఉద్యమాన్ని మరింత తీవ్రంచేయాలని, భయ ప్రలోభాలతో శత్రువుల్ని అణచివేయాలని, ఖురాసాన్‌లోని అరబ్బులందరినీ హతమార్చాలని ఆదేశించాడు. అప్పుడు ఖలీఫా "బల్ఖా పాలకుడ్ని హమీమా పంపి అక్కడుండి చక్రం తిప్పుతున్న ఇమామ్ ఇబ్రాహీంని బంధించి తీసుకురమ్మని చెప్పు" అని డెమాస్కస్ గవర్నర్‌ని ఆదేశించాడు. దానిప్రకారం ఇమామ్ ఇబ్రాహీంని బంధించి తెచ్చి ఖలీఫా మర్వాన్ ముందు ప్రవేశపెట్టడం జరిగింది. ఖలీఫా ఆయన్ని జైల్లో వేయించాడు. కొంత కాలానికి ఒక అంటువ్యాధి ప్రబలడంతో ఆయన జైల్లోనే మరణించారు.

ఖురాసాన్‌గవర్నర్ నసర్ బిన్ సయ్యార్ పారిపోయిన తరువాత ఖురాసాన్‌లో అబూముస్లింకు ఇక ఎదురులేకుండా పోయింది. రబియా (అరబ్)తెగకు కర్మానీ నాయకుడు. అతని మరణానంతరం అతని కుమారులు అలి, ఉస్మాన్‌లను కూడా అబూముస్లిం కుట్రతో చంపించాడు. ఆ తరువాత అలీ్విషియా వర్గం అనుకూలుడైన ఖహ్తబాను ఇరాఖ్ దండయాత్ర కోసం పంపాడు. ఖహ్తబా రే, ఇస్ఫిహాన్, నిహావంద్‌లను జయిస్తూ చివరికి యుద్ధంలోనే గాయపడి చనిపోయాడు. చనిపోయే ముందు అతను తన కుమారుడు హసన్‌కు హితోపదేశం చేస్తూ కూఫాలో అలీ్విషియాల నాయకత్వం నెలకొనాలని, అబూసలమాను ఉద్యమనాయకుడిగా చేయాలని అన్నాడు.

ఖహ్తబా మరణం తరువాత అతని సైన్యం హసన్ బిన్ ఖహ్తబాను సేనాపతిగా ఎన్నుకుంది. హసన్ సైన్యం తీసుకొని కూఫాకు బయలుదేరాడు. కూఫాలో అలీ్విషియా వర్గం అనుకూలుడైన ముహమ్మద్ బిన్ ఖాలిద్ ఖస్రీ అలీ్విషియాలను సమావేశపరచి కూఫా రాజమహల్‌ను ఆక్రమించుకొని ఆ సమాచారం హసన్ బిన్ ఖహ్తబాకు పంపాడు. హసన్ కూఫా చేరుకొని ముహమ్మద్ బిన్ ఖాలిద్‌ని వెంటబెట్టుకొని అబూసలమా దగ్గరకు వెళ్ళాడు. అబూసలమాను ఉద్యమనాయకుడిగా ఎన్నుకొని అతని చేతిలో బైత్ చేశాడు. అబూసలమా అప్పుడు ముహమ్మద్ బిన్ ఖాలిద్‌ని కూఫా పాలకుడిగా నియమించి, దండయాత్రల కోసం హసన్ బిన్ ఖహ్తబాని వాసత్ ప్రాంతానికి, హమీద్ బిన్ ఖహ్తబాని మదాయన్ ప్రాంతానికి పంపించాడు.

ఇమామ్ ఇబ్రాహీం అరెస్టు కావడంతో ఆయన సోదరులు అబుల్‌అబ్బాస్ సఫా, అబూజాఫర్ మన్సూర్ హమీమా నుండి కూఫాకు పారిపోయారు. అబూముస్లింకు ఈ సంగతి తెలిసి కూఫా చేరుకున్నాడు. వెంటనే అతను అబుల్‌అబ్బాస్ చేతిలో బైత్‌చేసి ఆయన్ని ఇమామ్ ఇబ్రాహీం వారసుడిగా చేశాడు. బనూఅబ్బాసీలతో పాటు షియాలలో కూడా అత్యధికమంది అబుల్‌అబ్బాస్ కోసం బైత్ చేశారు. కూఫాలో ఇమామ్ ఇబ్రాహీం



ప్రతినిధిగా ఉన్న 'అబూసలమా' అలీ్విషియా వర్గం అనుకూలుడు. అతను కూఫాలో అలీ్విషియాల నాయకత్వం నెలకొల్పడానికి శాయాశక్తుల పనిచేస్తున్నాడు. అబుల్‌అబ్బాస్ కూఫాలో ప్రవేశించకముందే అబూసలమా తన అలీ్విషియా అనుచరులతో కలసి ఎదురేగి ఆయనకు స్వాగతం చెప్పాడు. కాని అతను అబుల్‌అబ్బాస్ కూఫా వచ్చిన సంగతి బనూఅబ్బాసీలకు తెలియకుండా కొన్నాళ్ళు రహస్యంగా ఉంచి ఇమామ్ జాఫర్ బిన్‌ఇమామ్ బాఖర్ బిన్‌ఇమామ్ బిన్ జైనుల్‌ఆబిదీన్‌ని కూఫా వచ్చి ఖలీఫాపదవి చేపట్టమని లేఖరాశాడు. కాని ఇమామ్ జాఫర్ అందుకు నిరాకరిస్తూ సమాధానమిచ్చారు. దాంతో అబూసలమా నిరాశచెందాడు. ఈలోగా కూఫాకు అబుల్‌అబ్బాస్ సఫా వచ్చారని తెలియగానే బనూఅబ్బాసీలు ఆయన చుట్టూ చేరసాగారు. అదీగాక అబూసలమా కూఫా పాలకుడై ఉండి కూడా ఇమామ్ అబుల్‌అబ్బాస్‌కు సరిగా ఆతిథ్యం ఇవ్వలేదన్న పుకారు విన్న అలీ్విషియాలలో కూడా అనేకమంది అబుల్‌అబ్బాస్‌కు చేరువయ్యారు. ఈవిధంగా అబుల్‌అబ్బాస్ సఫా కూఫాలో అత్యధికమంది ప్రజల సానుభూతి పొందగలిగాడు.

అబుల్‌అబ్బాస్ నాయకుడు కాగానే ఖురాసాన్‌లో బనూఅబ్బాసీ సందేశాన్ని వ్యతిరేకించే అరబ్బుల్ని హతమార్చమని అబూముస్లింని ఆదేశించాడు. ఇలా శత్రుబెడద చాలావరకు తగ్గిపోవడంతో అబుల్‌అబ్బాస్ హి.శ. 132, రబీవుల్‌అవ్వల్ నెలలో జుమానమాజ్ తర్వాత ప్రజలచేత ఖిలాఫత్ బైత్ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఆయన అబూసలమా శిబిరానికి వెళ్ళి ఆయన్ని కలుసుకున్నారు. అబ్బాసీల ఖిలాఫత్ పాలనకు వ్యతిరేకి అయిన అబూసలమా మార్గాంతరంలేక అబుల్‌అబ్బాస్ చేతిలో బైత్ చేశాడు.

అబుల్‌అబ్బాస్ ఖిలాఫత్ పీఠం అధిరోహించాడని తెలియగానే వివిధ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున తిరుగుబాటులు, అల్లర్లు చెలరేగాయి. ఆ తిరుగుబాటులు, అల్లర్లను అణచివేసి తన ఖిలాఫత్ పదవి పటిష్ఠత కోసం బైత్ తీసుకునే నిమిత్తం వివిధ ప్రాంతాలకు సైన్యాలను పంపించాడు. ఆ సందర్భంలో ఆయన తన పినతండ్రి అబ్దుల్లా బిన్ అలీని సేనాపతిగా చేసి డెమాస్కస్ వైపు పంపాడు.

## 3. మర్వాన్ మరణం

ఈ వార్తలు విని ఖలీఫా మర్వాన్ బిన్ ముహమ్మద్ లక్షా ఇరవైవేల సైన్యం తీసుకొని కూఫా వైపు పురోగమించాడు. కాని పరిస్థితి అప్పటికే చేయి దాటిపోయింది. కూఫా చేరకముందే దారిలో ఒకచోట రెండు సైన్యాలు ఢీకొన్నాయి. తీవ్రస్థాయిలో యుద్ధం జరిగింది. కాని అబ్దుల్లా బిన్ అలి సైన్యం ఓటమి దిశగా పోతున్న సమయంలో ఖలీఫాసైన్యంలో చీలిక ఏర్పడింది. అనేకమంది సైనికులు ఖలీఫాఆజ్ఞల్ని పాటించకుండా నిరుత్సాహంతో ఉండిపోయారు. అప్పుడు ఖలీఫా ధనాగారంలోని సిరిసంపదలన్నీ వారి ముందు కుప్పపోసి ఆశ చూపించాడు. సైనికులు ఆ ధనరాసిని చూసి దోచుకోవడానికి దానిపై ఎగబడ్డారు. దాంతో సైనికక్రమశిక్షణ అస్తవ్యస్తమైపోయింది. అదే సమయంలో అబ్దుల్లా బిన్ అలి సైన్యం దాన్ని సువర్ణవకాశంగా భావించి ఒక్కసారిగా ఖలీఫా సైన్యంపై విరుచుకుపడింది. ఈ మెరుపుదాడికి భయభ్రాంతులైన ఖలీఫాసైనికులు ధనరాసిని వదలిపెట్టి పలాయనం చిత్తగించారు.

పాపం ఖలీఫా మర్వాన్ కొందరు అనుచరులు మాత్రమే ఉండిపోయారు. అంచేత అతను వారిని తీసుకొని తక్షణమే యుద్ధరంగం నుండి తప్పుకొని మోసిల్‌కు పారిపోయాడు. మోసిల్ వాసులు పరాజితుడై పారిపోయివచ్చిన ఖలీఫాను ఆదరించకపోగా అపహాస్యం చేయనారంభించారు. దాంతో మర్వాన్ అక్కడ్నుంచి హిరాన్ దిశగా పరుగు తీశాడు. అప్పుడు హిరాన్ పాలకుడిగా అతని పినతండ్రి కుమారుడు అబాన్ బిన్ యజీద్ ఉండేవాడు. కాని హిరాన్‌లో ఖలీఫా ఇరవై రోజులు మాత్రమే ఉండగలిగాడు. అంతలో అబ్దుల్లా బిన్ అలి సైన్యం వస్తోందన్న వార్త విని అక్కడ్నుంచి హమస్ దిశగా పారిపోయాడు. అయితే హమస్ వాసులు ఖలీఫా వెంట కొద్దిమంది అనుచరులు మాత్రమే ఉండటం చూసి కత్తులు దూశారు. ఖలీఫా వారికి నచ్చజెప్పడానికి ఎంత ప్రయత్నించినా వారు వినకుండా దాడిచేసి అతడ్ని పారదోలారు.

చివరికి ఖలీఫా మర్వాన్ హమస్ నుండి డెమాస్కస్‌కు పారిపోయాడు. కాని అక్కడ కూడా తనకు భద్రత ఉండదని భావించి రాజకీయాలతో ప్రమేయం లేకుండా ప్రశాంత జీవితం గడిపే ఉద్దేశంతో పాలస్తీనా చేరుకున్నాడు.

అటు అబ్దుల్లా బిన్ అలి సైన్యం తీసుకొని హిరాన్ చేరుకునేటప్పటికి హిరాన్ పాలకుడు అబాన్ బిన్ యజీద్ నల్లదుస్తులు ధరించి నల్లజెండా పట్టుకొని అతనికి స్వాగతం చెప్పాడు. అంచేత అబ్దుల్లా అతనికి ప్రాణబిక్ష పెట్టి డెమాస్కస్ వైపు పురోగమించాడు. చివరికి అతను హి.శ. 132లో డెమాస్కస్‌ని కూడా జయించాడు. అయితే బనూఉమయ్యా పట్ల ప్రతీకారంతో ఉడికిపోతూ డెమాస్కస్ వీథుల్లో రక్తపుటేరులు ప్రవహింపజేశాడు. ఆ హత్యాకాండలో యాభై వేలమంది అమాయకులు అసువులు బాసారు. ఆ తర్వాత అబ్దుల్లా అక్కడ్నుంచి పాలస్తీనా వైపు బయలుదేరాడు. అయితే ఉద్యమనాయకుడు అబుల్‌అబ్బాస్ ఆదేశం ప్రకారం అబ్దుల్లా, ఖలీఫా మర్వాన్‌ను వెంటాడి పట్టుకోవడానికి తన సోదరుడు సాలిహ్ బిన్ అలీని పాలస్తీనా పంపాడు.

సాలిహ్ సైన్యం తీసుకొని పాలస్తీనా చేరుకున్నాడు. అయితే అంతకుముందే ఖలీఫా మర్వాన్ అతని రాక సంగతి తెలుసుకొని పాలస్తీనా నుండి అరీష్‌కు, అరీష్ నుండి నైలునదీ ప్రాంతానికి, అక్కడ్నుంచి (ఈజిప్టులోని) సయ్యీద్ ప్రాంతానికి పారిపోయాడు. సాలిహ్ సైన్యం అతడ్ని వెంటాడుతూ ఫిస్తాత్ (కైరో)కు చేరుకొని ఆగిపోయింది. చివరికి సాలిహ్ సైనికులు ఒకచోట ఖలీఫాసైనికులపై దాడిచేశారు. వారిలో కొందరు పట్టుబడ్డారు; మిగిలినవాళ్ళంతా పారిపోయారు. పట్టుబడినవారిని నిలదీస్తే వారు ఖలీఫా బౌసీర్ అనే కుగ్రామంలో తలదాచుకున్నాడని తెలియజేశారు. వెంటనే సాలిహ్‌సైనికులు ఆ గ్రామానికి చేరుకొని అదేరోజు రాత్రివేళ మర్వాన్ అతిథిగృహంపై మెరుపుదాడి చేశారు. దాంతో మర్వాన్ కంగారుపడుతూ బయటికి వచ్చాడు. అక్కడ అంతకుముందు నుంచే పొంచివున్న ఓ సైనికుడు వెంటనే బరిశతో మర్వాన్‌ని పొడిచి హతమార్చాడు. ఆ తర్వాత మర్వాన్ తల నరికి ఉద్యమనాయకుడు అబుల్‌అబ్బాస్ సఫా దగ్గరకు పంపబడింది. ఈ సంఘటన హి.శ.132, జిల్‌హజ్జ 28వ తేదీ (క్రీ.శ. 17-8-750)న జరిగింది. ఖలీఫా మర్వాన్ మరణంతో బనూఉమయ్యా పాలన అంతమైపోయింది.



బనూఉమయ్య సామ్రాజ్యం సింధ్ నుండి స్పెయిన్‌దాకా ఓ పెద్ద భూభాగంలో విస్తరించింది. ఆనాడు వారి సామ్రాజ్యం చూసినవారు ఇక ఏ శక్తీ దాన్ని ఎదిరించజాలదని భావించారు. కాని లోతుగా పరిశీలిస్తే వారి సామ్రాజ్య పునాదులు ఎంతో బలహీనంగా ఉండేవని తెలుస్తుంది. కారణం వారు భయప్రలోభాలు కుయుక్తులతో ప్రజల మెడలను మాత్రమే వంచగలిగారుగాని వారి హృదయాల్ని చూరగొనలేకపోయారు. అందుకే పూర్తిగా ఒక శతాబ్దం కూడా గడవకముందే వారి పరిపాలన కుప్పకూలిపోయింది. అప్పుడు బనూఉమయ్యా పాలకుల పట్ల సానుభూతి తెలిపేవారు కూడా లేకపోయారు.

# 49. అబుల్‌అబ్బాస్ సఫా పరిపాలన

ఇతని పూర్తిపేరు అబుల్‌అబ్బాస్ అబ్దుల్లా సఫా. ఇతను ఇమామ్ ఇబ్రాహీం మరణం తరువాత అతని వారసుడిగా ఎన్నికై ఖలీఫా అయ్యాడు. అబుల్‌అబ్బాస్ దైవప్రవక్త (స) పినతండ్రి హజ్రత్ అబ్బాస్ (రజ) సంతతికి చెందినవాడు. ఇతను, ఇతని బంధువులు అధికారం చేపట్టిన ప్రారంభంలో ప్రజలకు ఎన్నో నోరూరించే వాగ్దానాలు చేశారు. కాని ఆ తర్వాత కొన్నాళ్ళలోనే వారి వాగ్దానాలు వట్టి మోసపూరితాలని రుజువయ్యాయి.

## 1. పైకంతో ప్రత్యర్థులనోళ్ళు మూయించిన వైనం

అమీర్ ముఆవియా (రజ) ఖిలాఫత్ పదవి అల్వీషియాలలోకి పోకుండా తన ప్రభుత్వాన్ని పటిష్ఠపరచుకోవడానికి ప్రజాధనాన్ని ఎలా విచ్చలవిడిగా ఖర్చుపెట్టారో అలా అబుల్‌అబ్బాస్ సఫా కూడా ధనాన్ని ఖర్చుపెట్టి అల్వీయుల నోళ్ళు మూయించాడు. హి.శ. 131, జిల్‌హజ్జ నెలలో జరిగిన ఒక సమావేశంలో అబ్బాసీలు, అల్వీయులు కలసి అబ్దుల్లా బిన్ హసన్ మున్నా బిన్ అలి కుమారుడు ముహమ్మద్‌ని ఖిలాఫత్ పదవి కోసం ఎన్నుకున్నారు. అప్పుడు అబుల్‌అబ్బాస్ సోదరుడు అబూజాఫర్ మన్సూర్ కూడా ముహమ్మద్ చేతిలో బైత్ చేశాడు. కాని అబుల్‌అబ్బాస్ ఆ తరువాత అప్పటి ఏకగ్రీవ తీర్మానాన్ని తుంగలో తొక్కి ఖలీఫా అయ్యాడు. కూఫాలో అబుల్‌అబ్బాస్ ఖలీఫాగా నియమించబడినప్పుడు అబ్దుల్లా బిన్ హసన్ మున్నా, మరికొందరు అల్వీయులు కూఫా వచ్చి "ఇదేమిటీ? గతంలో చేయబడిన తీర్మానం ప్రకారం ఖిలాఫత్ మాహక్కు అయినప్పటికీ దాన్ని మీరెలా ఆక్రమించుకున్నార"ని అడిగాడు.

అప్పుడు అబుల్‌అబ్బాస్ సఫా వెంటనే పది లక్షల దిర్హంలు తెప్పించి అబ్దుల్లా బిన్ హసన్ మున్నా చేతిలో పెట్టి అతడ్ని శాంతింపజేశాడు. ఈవిధంగా అతను అల్వీయులందరికీ పెద్దఎత్తున బహుమానాలిచ్చి పంపించాడు. దాంతో అల్వీయుల్లో తిరుగుబాటు ఆలోచన పూర్తిగా సమసిపోయింది.

## 2. అనుమానితుల అంతం

అబ్బాసీల పాలనకు పునాదివేసిన అబూముస్లిం అబ్బాసీల పాలనను వ్యతిరేకించినవారినేగాక అనుమానమున్న వారిని కూడా హతమార్చాడు. వాసత్‌గవర్నర్‌గా ఉండిన యజీద్ బిన్ ఉమర్ హుబైరా ఖురాసాన్ వెళ్ళి సఫాతో రాజీఒప్పందం చేసుకొని అతని

ఖిలాఫత్ కోసం బైత్ చేయడానికి సిద్ధమయ్యాడు. అయినప్పటికీ అబూముస్లిం 'మనకు యజీద్ బిన్ ఉమర్ చాలా ప్రమాదకారి, అతడ్ని చంపెయ్యి' అని అబుల్‌అబ్బాస్‌కు లేఖ రాశాడు. అంచేత అబుల్‌అబ్బాస్ మోసంతో అతడ్ని చంపించాడు. అలాగే అబూ ముస్లిం బనూఅబ్బాసీలకు ప్రమాదకారులని భావించిన అనేకమందిని వెతికివెతికి సంహరించాడు. సఫా ఖలీఫా అయిన తర్వాత స్థిరచిత్తులుకాని కూఫాప్రజల్ని నమ్మలేక రాజధాని కూఫా నుండి ఇరాఖ్ ప్రాంతంలోని అన్బార్ ప్రదేశానికి మార్చాడు.

కూఫాలో అల్వీయుల అభిమాని అయిన అబూసలమా గత్యంతరంలేని పరిస్థితుల్లో అబుల్‌అబ్బాస్ సఫా చేతిలో బైత్‌చేశాడు. అయినా అబుల్‌అబ్బాస్ అతడ్ని అనుమాని స్తూనేవున్నాడు. అంచేత అతను అబూముస్లింని సలహా అడిగితే దానికి అబూముస్లిం జవాబిస్తూ "మనం ఇప్పుడు అబూసలమాను చంపితే అతని బంధువులు, అల్వీయులు కలసి తిరుగుబాటు లేవదీసే ప్రమాదముంది. అంచేత బయటి నుంచి ఎవరినైనా రప్పించి అతడ్ని చంపించు" అని చెప్పాడు. అప్పుడు అబుల్‌అబ్బాస్ బయటినుంచి మురాద్ అనే వ్యక్తిని రప్పించి అతనికీ పని అప్పగించాడు. అబూసలమా ఓరోజు రాత్రి వేళ కూఫావీథిలో నడచివెళ్తుంటే మురాద్ వెనకాలగా వచ్చి అతడ్ని హతమార్చి పారి పోయాడు. అయితే అబూసలమాను ఎవరో ఖారిజీ చంపాడని ప్రజలు భావించారు.

ఖురాసాన్‌కు చెందిని ప్రఖ్యాత ఫిఖ్హావేత్త ఇబ్రాహీం బిన్ మైమూన్‌ని కూడా అబ్బాసీ ప్రభుత్వం వదలిపెట్ట లేదు. అబ్బాసీల పాలన ఏర్పడిన తరువాత ఖుర్‌ఆన్, హదీసుల ప్రకారం చట్టాలను అమలుపరచడం జరుగుతుందని ఆయనకు భరోసా ఇవ్వడం జరిగింది. ఆ భరోసాతోనే ఆయన అబ్బాసీల ఉద్యమానికి మద్దతునిచ్చి ఎంతో శ్రమించి పని చేశాడు. అబ్బాసీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ విషయాన్ని గురించి అడిగితే ఆయన్ని అబూముస్లిం నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు.

## 3. అరబీ భాషాదురభిమానం

బనూఅబ్బాసీలు అధికారపీఠం ఎక్కిన తర్వాత తమ ప్రత్యర్థుల్ని తుదముట్టించడం లో బనూఉమయ్యా పాలకుల్ని మించిపోయారు. భాష, జాతీయ దురభిమానాలు వారి ప్రతీకారాగ్నికి ఆజ్యం పోశాయి. అబుల్‌అబ్బాస్ సోదరుడు ఇబ్రాహీం ఖురాసాన్‌లోని అరబ్బులందర్నీ చంపాలని తన చివరిలేఖలో ఈరాన్ జాతీయుడైన అబూముస్లింకు తాకీదు చేశాడు. అంచేత ఖురాసాన్‌లో అరబ్బులపై ఘోరమైన హత్యాకాండ విరుచుకు పడింది. వారిలో నవముస్లిం అరబ్బులు, అబ్బాసీ సానుభూతిపరులు కూడా ఉన్నారు. అయినా అరబీభాషా దురభిమానం రేకెత్తించిన నెత్తుటివెల్లువలో వారూ కొట్టుకు పోయారు. ఖురాసాన్ భాషా, సభ్యతా, సంస్కృతులను అరబీ భాషా, సభ్యతా, సంస్కృతు లుగా మార్చడంలో విజయదిశగా పురోగమిస్తున్న అరబ్ తెగలన్నిటినీ బనూఅబ్బాసీ నాయకులు నిర్దాక్షిణ్యంగా హతమార్చారు. దాంతో అప్పటిదాకా కొనఊపిరితో కొట్టు మిట్టాడుతుండిన ఈరానీ భాషా, సభ్యతా, సంస్కృతులు మళ్ళీ జీవంపోసుకొని నిలబడ గలిగాయి. ఆనాడు బనూఅబ్బాసీలపై ఇలా భాషా దురభిమానభూతం ఆవహించక పోయివుంటే ఈజిప్టు మాదిరిగా ఈరాన్ కూడా అరబ్ రాజ్యమైపోయి ఉండేది.



## 4. జాతీయ దురభిమానం

బనూఅబ్బాసీల ప్రధాన ప్రత్యర్థులు బనూఉమయ్యాలే. బనూఉమయ్యా ప్రజల్లో బనూఅబ్బాసీ ఉద్యమానికి చేయూతనిచ్చిన వాళ్ళు కూడా ఉన్నారు. కాని అబూముస్లిం ఖురాసాని వాళ్ళను కూడా వదల్లేదు. అతను బనూఅబ్బాసీల దర్బారులకు తరచుగా వచ్చే కవులకు, అభిమానులకు లంచాలు ఇచ్చి వారిద్వారా బనూఉమయ్యాలకు వ్యతిరేకంగా బనూఅబ్బాసీలను ఉసిగొల్పాడు. ఈవిధంగా కూడా బనూఉమయ్యా ప్రజల్లో అనేకమంది మృత్యువాత పడ్డారు.

ఖలీఫా అబుల్‌అబ్బాస్ పినతండ్రి అబ్దుల్లా బిన్ అలి సైన్యం తీసుకొని పాలస్తీనా లోని ఒక నదీతీరాన విడిదిచేసిన రోజుల్లో ఇలాంటిదే ఒక సంఘటన జరిగింది. అబ్దుల్లా బిన్ అలి తన సైన్యాధికారులతో కలసి సామూహిక భోజనం చేయడానికి ఉపక్ర మించాడు. వారిలో దాదాపు ఎనభై మంది బనూఉమయ్యా తెగవాళ్ళు కూడా ఉన్నారు. అంతలో షిబల్ బిన్‌అబ్దుల్లా అనే ఓ కవి వచ్చి కవితలు చెప్పనారంభించాడు. ఆ కవితల్లో బనూఅబ్బాసీలపై బనూఉమయ్యాల దౌర్జన్యాల ప్రస్తావన ఉంది. అబ్దుల్లా బిన్ అలి ఆ కవితలు వినగానే తన సైన్యంలోని బనూఉమయ్య తెగలవారినందర్నీ హత మార్చమని ఆజ్ఞాపించాడు. దాంతో అతని అంగరక్షకులు తక్షణమే తమ ఖడ్గాలకు పని చెప్పారు. ఆ ఎనభై మందిలో చాలామంది అప్పటికప్పుడే ప్రాణాలు వదిలారు. కొందరు తీవ్రంగా గాయపడి కొనవూపిరితో ఉన్నారు.

ఆ తరువాత ఆ మృతుల్ని, క్షతగాత్రుల్ని వరుసగా పేర్చి పండబెట్టి వారిపై డైనింగ్ క్లాత్ కప్పడం జరిగింది. వెంటనే డైనింగ్‌క్లాత్ మీద వివిధరకాలు వంటకాలు పెట్టి సేనాపతి అబ్దుల్లా బిన్ అలి, అతని అనుయాయులు భోజనంచేయడం మొదలెట్టారు. డైనింగ్‌క్లాత్ మీద కూర్చొని వీరు రకరకాల రుచులు ఆస్వాదిస్తూ పొట్టలు నింపు కుంటుంటే, దాని కింద అణగిపోయిన ఆ క్షతగాత్రులు తీవ్రమైన బాధతో మూల్గుతూ కొనవూపిరితో కొట్టుమిట్టాడసాగారు. చివరికి వారు కూడా ప్రాణాలు వదిలారు.

## 5. పరాకాష్ఠకు చేరిన ప్రతీకారం

ఆ తర్వాత అబ్దుల్లా బిన్ అలి, అతని అనుచరులు బనూఉమయ్యాతెగ ఖలీఫాల సమాధులను తవ్వే పని ప్రారంభించారు. అమీర్ ముఆవియా (రజి) సమాధి తవ్వితే అందులో ఏమీ లభించలేదు. ఖలీఫా అబ్దుల్‌మలిక్ సమాధిలో అతని పుర్రె మాత్రమే లభించింది. హిషామ్ బిన్ అబ్దుల్‌మలిక్ సమాధిలో ముక్కు తప్ప మిగతా శరీరమంతా బాగానే ఉంది. కొందరు ఖలీఫాల సమాధుల్లో చిన్నచిన్న బొమికలు మాత్రమే దొరికాయి. హిషామ్ శవాన్ని సమాధినుండి బయటికి తీసిన తర్వాత దాన్ని కొరడాతో కొట్టి, ఉరి కంపం ఎక్కించి, ఆ తర్వాత కాల్చి బూడిదను గాలిలోకి విసిరేయడం జరిగింది.

అబ్దుల్లా బిన్ అలి సోదరుడు సులైమాన్ బిన్ అలి బస్రాలో బనూఉమయ్యాకు చెందిన కొందరు వ్యక్తుల్ని హతమార్చి వారి శవాలను రహదారుల్లో పారేయించాడు. మరొక సోదరుడు దావూద్ మక్కా, మదీనా, యమన్‌లలో అనేకమందిని చంపించాడు.

బనూఉమయ్యాకు చెందినవారు ఎక్కడ కన్పించినా వారిని హతమార్చాలని రాష్ట్రాల గవర్నర్‌లకు, జిల్లాల అధికారులకు ఆదేశాలు పంపడం జరిగింది. దాంతో బనూఅబ్బాసీ అధికారులు బనూఉమయ్యావారిని వెతికివెతికి వేటాడి మరీ సంహరించారు. ఈవిధంగా బనూఅబ్బాసీల పాలనలో బనూఉమయ్యా ప్రజలపై ప్రళయం విరుచుకుపడింది. వారికి ఆశ్రయం పొందడానికి ఇస్లామీయరాజ్యంలో ఎక్కడా చోటు దొరకలేదు. వేలాది మంది మృత్యువాత పడ్డారు. ఈ సామూహిక హత్యాకాండలో బ్రతికి బయటపడినవారు వేషం, పేర్లు మార్చుకొని సింద్, పంజాబ్, కష్మీర్‌లకు పారిపోయారు. వీరంతా అరబ్ తెగలకు చెందినవారు. వీరి సంతతి ఇప్పటికీ మన దేశంలో ఉందని చెబుతారు చరిత్రకారులు. కాకపోతే వారు తమ భాష, అరబ్ సంతతిని మరచిపోయారు.

బనూఉమయ్యా పాలకులు జరిపిన సామూహిక హత్యాకాండలో అబ్దుర్రహ్మాన్ బిన్ ముఆవియా బిన్ హిషామ్ అనే బనూఉమయ్యా మనిషి ఒకతను వెంట్రుకవాసిలో తప్పించుకొని పారిపోయి ఈజిప్టు, ఖైర్వాన్‌ల మీదుగా స్పెయిన్ చేరుకున్నాడు. స్పెయిన్‌లో బనూఅబ్బాసీల ప్రభావం అంతగా లేదు. బనూఉమయ్యా అభిమానులే అత్యధిక మంది ఉన్నారు. అందువల్ల అబ్దుర్రహ్మాన్ స్పెయిన్ చేరుకోగానే వారందరినీ కూడగట్టి ఆ రాష్ట్రాన్ని సులభంగా స్వాధీనం చేసుకున్నాడు. తరువాత అతను స్పెయిన్‌లో తమ రాజ్యం వైపు బనూఅబ్బాసీలు కన్నెత్తి కూడా చూసే సాహసం చేయలేనంతటి పటిష్ఠమైన రాజ్యం నెలగొల్పాడు.

## 6. మోసిల్ ప్రజల సామూహిక హత్యలు

ఖలీఫా అబుల్‌అబ్బాస్ సఫా రాజ్యమంతటా తన దగ్గరి బంధువుల్నే గవర్నర్‌లుగా నియమించాడు. అతను తన బంధువు ముహమ్మద్ బిన్ సూల్‌ని మోసిల్ గవర్నర్‌గా నియమించి పంపితే మోసిల్ ప్రజలు అతడ్ని తిరస్కరించి వెనక్కి పంపివేశారు. అప్పుడు అబుల్‌అబ్బాస్ సఫా తన సోదరుడు యహ్యా నాయకత్వంలో పన్నెండు వేల మంది సైనికుల్ని పంపాడు. సేనాపతి యహ్యా మోసిల్ రాజమహల్‌లో విడిదిచేసిన తరువాత మోసిల్‌ప్రజల ప్రతినిధులైన పన్నెండుమంది నాయకుల్ని తియ్యటి మాటలతో పిలిపించి హత్య చేయించాడు. దాంతో మోసిల్ ప్రజలు ప్రతీకారేచ్ఛతో చెలరేగిపోతూ వరల్లో నుంచి ఖడ్గాలు బయటికి లాగారు. యహ్యా ఈ పరిస్థితి చూసి, జామియా మస్జిద్‌లో ప్రవేశించే వారికి రక్షణ ఇవ్వబడుతుందని ప్రకటన చేయించాడు. ప్రజలు ఈ ప్రకటన వినగానే జామియా మస్జిద్ వైపు పరుగెత్తారు.

దానికి ముందే యహ్యా మస్జిద్ ప్రధానద్వారం దగ్గర తన సైనికులు కొందరిని ఉంచాడు. వారు మస్జిద్‌లో ప్రవేశించేవారిని వరుసగా గుట్టుచప్పుడు గాకుండా మట్టుపెట్టడం మొదలెట్టారు. ఈ విధంగా ఆ కిరాతకుడు పదకొండు వేల మంది అమాయకుల్ని ఊచకోత కోయించాడు. అంతటితో తృప్తిచెంద లేదు. ఆ తరువాత పట్టణంలో సామూహిక హత్యాకాండ జరిపించాడు. స్త్రీలు, పిల్లల ఏడ్పులు, పెడబొబ్బలతో పట్టణం దద్దరిల్లి పోయింది. సేనాపతి యహ్యా వారి ఏడ్పులు సహించలేక మరుసటిరోజు ఉదయం స్త్రీలను, పిల్లలను కూడా హతమార్చమని తన అధికారులను



ఆదేశించాడు. ఈ ఆజ్ఞ వినగానే అతని సైనికమూకలు క్రూరజంతువుల్లా ఆ స్త్రీలపై, పిల్లలపై విరుచుకుపడి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. యహ్యాసైన్యంలో నాలుగు వేలమంది జుంగీతెగ సైనికులు కూడా ఉన్నారు. వారు వేలాదిమంది స్త్రీలను పట్టుకెళ్ళి మానభంగం కూడా చేశారు.

ఈ మారణకాండ మూడు రోజులపాటు సాగింది. నాల్గవరోజు సేనాపతి యహ్యా గుర్రమెక్కి పట్టణంలో జరుగుతున్న తమాషా చూడటానికి బయలుదేరాడు. అప్పుడు ఒక స్త్రీ ధైర్యంచేసి యహ్యా గుర్రం కళ్ళెం పట్టుకొని "నువ్వు బనూహాషిం సంతతివాడివి కావా? నువ్వు దైవప్రవక్త (స) పినతండ్రి సంతానం కావా? ముస్లిం స్త్రీలను జుంగీ సైనికులు బలవంతంగా పట్టుకెళ్ళి చెరచిన సంగతి నీకు తెలియదా?" అని అడిగింది. యహ్యా ఆ సమయంలో ఆమెకు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వెళ్ళిపోయాడు. అయితే మరుసటిరోజు అతను జుంగీసైనికుల్ని జీతాలు, బహుమానాలు ఇస్తానని పిలిపించి అందరినీ వధింపజేశాడు.

## 7. ఉపకారికి నపకారం

బనూఉమయ్యా పాలనను అంతమొందించి బనూఅబ్బాసీ పాలనకు దారి సుగమం చేయడంలో కీలకపాత్ర వహించిన అబూముస్లిం ఖురాసానీకి గడ్డుకాలం మొదలయింది. అతను సందర్భానుసారం అబుల్‌అబ్బాస్ సఫాకు తగిన సలహాలిస్తూ తిరుగుబాటుదారులకు అడ్డాగా మారివున్న ఖురాసాన్ రాష్ట్రాన్ని హద్దుమీరిన హింసా దౌర్జన్యాల ద్వారా స్వాధీనం చేసుకొని పటిష్ఠపరిచాడు. దాంతో అబుల్‌అబ్బాస్‌కు అతని అవసరం తీరిపోయింది. అదీగాక అబూముస్లిం ఖురాసాన్ రాష్ట్రంలో తిరుగులేని నాయకుడై తన ఆదేశాలను ఖాతరుచేయడంలేదని కూడా అతను గ్రహించాడు. అంచేత అబుల్‌అబ్బాస్ అతడ్ని ఎలాగైనా తనదారి నుండి తొలగించుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. అబూముస్లింని వీలు చిక్కితే హతమార్చవలసిందిగా అతను జియాద్ బిన్ సాలిహ్‌ను, సబా బిన్ నోమాన్‌ని చెప్పిపంపాడు. ఈ సంగతి ఎలాగో అబూముస్లింకు తెలిసిపోయింది. అబూముస్లిం వైపున బుఖారా, సమర్‌ఖంద్‌ల పాలకుడిగా నియుక్తుడైన జియాద్ ఇంతకుముందే బుఖారాలో తిరుగుబాటు లేవదీశాడు. అంచేత అబూముస్లిం మరూ నుండి బుఖారాకు బయలుదేరాడు. దారిలో ఆమద్ అనే ప్రదేశంలో జియాద్, సబాల ద్వారా అబుల్‌అబ్బాస్ పన్నిన కుట్ర సంగతి తెలిసి తనతో పాటే సైన్యంలో ఉన్న సబాను నిర్బంధంలోకి తీసుకొని హతమార్చమని అతను అక్కడి పాలకుడ్ని ఆదేశించాడు. ఆ తర్వాత అబూముస్లిం అక్కడ్నుంచి బుఖారాకు చేరుకున్నాడు. అబూముస్లిం బుఖారా వచ్చాడన్న సంగతి తెలియగానే జియాద్ భయపడి ఒక రైతు ఇంట్లో దాక్కున్నాడు. ఆ రైతు వెంటనే జియాద్‌ని చంపి శవాన్ని అబూముస్లింకు అప్పగించాడు.

అబూముస్లిం హజ్‌యాత్రకు వెళ్ళడానికి ఖలీఫా అబుల్‌అబ్బాస్‌ను అనుమతి అడిగాడు. అబుల్‌అబ్బాస్ అతనికి అనుమతిస్తూ తన వెంట అయిదొందల మంది కంటే ఎక్కువమందిని తీసికెళ్ళవద్దని ఆదేశించాడు. అబూముస్లిం తనకు విరోధులు ఉన్నారని అయిదొందలమంది చాలరని అన్నాడు. దానికి అబుల్‌అబ్బాస్ గరిష్ఠంగా

వేయిమందిని తీసికెళ్ళమని లేఖలో తెలియజేశాడు. అయితే అబూముస్లిం ఎనిమిది వేలమంది సైనికుల్ని వెంటబెట్టుకొని మరూ నుండి బయలుదేరాడు. ఆ ఎనిమిది వేల మందిలో ఏడువేల మందిని ఖురాసాన్ సరిహద్దు ప్రాంతంలో ఉంచి మిగిలిన వేయి మందిని తీసుకొని ఇరాఖ్‌లోని దేశరాజధాని అన్బార్‌కు చేరుకున్నాడు. అబుల్‌అబ్బాస్ అతనికి ఘనంగా స్వాగతించి సత్కరించాడు. ఆ సందర్భంలో అతను మాట్లాడుతూ "ఈ సంవత్సరం (నా సోదరుడు) అబూజాఫర్ మన్సూర్ హజ్‌యాత్ర జరపడానికి నిశ్చయించు కొని అనుమతి అడిగాడు. అంచేత నేనతడ్ని హజ్‌యాత్ర నాయకునిగా నియమించి మక్కా వెళ్ళడానికి అనుమతించాను. లేకుంటే నేను నిన్నే హజ్‌యాత్ర నాయకుడిగా నియమించేవాడ్ని" అని అన్నాడు. దాంతో హజ్‌యాత్ర నాయకుడవ్వాలన్న అబూముస్లిం కోరిక నెరవేరకుండా పోయింది.

ఆ తరువాత అబూముస్లిం, అబూజాఫర్ మన్సూర్ ఇద్దరూ కలసి తమ తమ సామగ్రి, మందీమార్బలంతో మక్కా బయలుదేరారు. అబూముస్లిం మక్కా, మదీనా ప్రజల్ని ఆకట్టుకోవడానికి తనవెంట తెచ్చుకున్న అపార ధనరాసులతో ప్రజాసంక్షేమ కార్యాలకు శ్రీకారం చుట్టాడు. దారి పొడుగూతూ ప్రతిస్టేజీ దగ్గర ప్రయాణీకుల సౌకర్యం కోసం ధర్మసత్రాలు కట్టించాడు; బావులు త్రవ్వించాడు; ప్రజలకు డబ్బు, వస్త్రాలు పంచిపెట్టాడు; బహుమానాలు అందజేశాడు. మక్కాలో కూడా పెద్ద ఎత్తున ఇలాంటి జనహిత కార్యాలు చేశాడు. దాంతో ప్రజలు అబూముస్లిం వైపు మొగ్గిపోయి మన్సూర్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

హజ్ విధి నెరవేరిన తరువాత అబూముస్లిం మక్కా నుండి మన్సూర్‌కు ముందే బయలుదేరాడు. మక్కా నుండి పదహారు మైళ్ళు ప్రయాణించాడో లేదో రాజధాని అన్బార్ నుండి ఖలీఫా అబుల్‌అబ్బాస్ మరణవార్త, మన్సూర్ ఖిలాఫత్ నియామకపు శుభవార్త తీసుకొని మన్సూర్ దగ్గరకు వెళ్తున్న ఒక వార్తాహరుడు తారసపడ్డాడు. అబూముస్లిం అతడ్ని రెండు రోజులు తన దగ్గర ఆపుకొని మూడోరోజు మన్సూర్ దగ్గరకు పంపించాడు. మన్సూర్ ఈ తాజా సమాచారం తెలుసుకోగానే మక్కా నుండి బయలు దేరాడు. అబూముస్లిం అతనికి ముందే ప్రయాణిస్తూ అన్బార్ చేరుకున్నాడు.

అబూముస్లింని, అబూజాఫర్ మన్సూర్‌ని హజ్‌యాత్రకు పంపిన తరువాత అబుల్ అబ్బాస్ వ్యాధిగ్రస్తుడయ్యాడు. ఆ వ్యాధితోనే అతను నాలుగేళ్ళ ఎనిమిది నెలల పాలన తరువాత హి.శ. 136, జిల్‌హజ్జా నెలలో మరణించాడు. మరణానికి ముందు అబుల్ అబ్బాస్ సఫా తన సోదరుడు అబూజాఫర్ మన్సూర్‌ని, అతని తరువాత ఈసా బిన్ మూసాని ఖిలాఫత్ వారసులుగా వీలునామా రాశాడు.

అయితే అబూముస్లిం ఈ సంగతి తెలుసుకొని కూడా మన్సూర్‌కు ముందే మక్కా నుండి బయలుదేరి రాజధానికి చేరుకున్నాడు. ఆ తరువాత మన్సూర్ రాజధానికి చేరుకొని ఖిలాఫత్ పీఠం అధిరోహించాడు. అబూముస్లిం బనూఅబ్బాసీల పాలనలో తన విలువ, ప్రాముఖ్యతలు తగ్గిపోతున్నాయని గ్రహించి అబుల్‌అబ్బాస్ సఫానే గాకుండా, అబూజాఫర్ మన్సూర్‌ని కూడా అనుమానిస్తూ స్వతంత్రంగా వ్యవహరించసాగాడు.



# 50. అబూజాఫర్ మన్సూర్ పరిపాలన

అబుల్‌అబ్బాస్ సఫా మరణం తరువాత అతని సోదరుడు అబూజాఫర్ మన్సూర్ హి.శ. 136లో ఖలీఫాపదవి చేపట్టాడు. అబుల్‌అబ్బాస్ సఫా తన పాలనాకాలంలోనే బనూఉమయ్యా నాయకుల్ని, వారి మద్దతుదారుల్ని తుదముట్టించడంతో మన్సూర్‌కు కాస్త ఊరట కలిగింది. అయితే అల్వీషియాల తిరుగుబాటు బెడద ఇంకా సమసిపోలేదు. బనూఅబ్బాసీలలో కూడా కొందరు తమనుతాము ఖిలాఫత్ హక్కుదారులుగా ప్రకటించు కొని అరాచకం సృష్టించారు. ముఖ్యంగా అబుల్‌అబ్బాస్ పినతండ్రి సిరియా గవర్నర్ అబ్దుల్లా బిన్ అలి రోమ్‌దండయాత్ర నుండి తిరిగొచ్చిన తర్వాత మన్సూర్ ఖిలాఫత్‌ను నిరాకరించి తనను తాను ఖిలాఫత్ హక్కుదారుడిగా ప్రకటించుకున్నాడు.

అతను ప్రజలను సమావేశపరచి "బనూఉమయ్యా ఖలీఫా మర్వాన్‌ని గనక నేను ఓడించగలిగితే అబుల్‌అబ్బాస్ సఫా తన తదనంతరం నేనే ఖలీఫా నౌతానని నాతో వాగ్దానం చేశాడు" అని అన్నాడు. ప్రజలు ఈమాట విని అబ్దుల్లా బిన్ అలి చేతిలో బైత్ చేశారు. అంచేత అబ్దుల్లా ప్రజలను కూడగట్టుకొని మన్సూర్‌కు వ్యతిరేకంగా యుద్ధభేరి మోగించాడు. డెమాస్కస్ వీథుల్లో నెత్తుటినదులు పారించిన అబ్దుల్లా బిన్ అలీని అణచి వేయడం మన్సూర్‌కు సాధ్యమయ్యే పని కాదు. అందువల్ల అతను తన ప్రత్యర్థి అబూ ముస్లిం సహాయం అర్థించక తప్పలేదు. అబూముస్లిం మొదట్లో అందుకు నిరాకరించి నప్పటికీ తరువాత మన్సూర్ సానుభూతి పొందడానికి అంగీకరించాడు.

కనుక అబూముస్లిం వెంటనే ఖురాసాన్ నుండి డెమాస్కస్ వైపుకు బయలుదేరాడు. అటు అబ్దుల్లా బిన్ అలి కూడా ఈ సంగతి తెలుసుకొని డెమాస్కస్ నుండి బయలు దేరాడు. దారిలో ఇరుపక్షాలు ఢీకొన్నాయి. అబ్దుల్లా సైన్యంలో అనేకమంది ఖురాసానీలు కూడా ఉన్నారు. అంచేత ఆ సైనికులు తనను వదలి అబూముస్లిం పతాకం కిందికి చేరిపోతారేమోనన్న అనుమానంతో అబ్దుల్లా వారందర్నీ చంపించాడు. అయితే దాని పర్యవసానంగా అతని సైన్యంలో క్రమశిక్షణ పోయింది. ఆ సైనికులు అబూముస్లిం ముందు నిలువలేకపోయారు. చివరికి అబ్దుల్లా బిన్ అలి కూడా ప్రాణభీతితో పారిపోయి తన సోదరుడు, బస్రాగవర్నర్ సులైమాన్ దగ్గరకెళ్ళి ఆశ్రయం పొందాడు.

సులైమాన్ ఖలీఫా మన్సూర్ నుండి అబ్దుల్లా ప్రాణరక్షణ వాగ్దానం తీసుకొని కొన్నాళ్ళ తరువాత ఖలీఫా దర్బార్‌కు పంపించాడు. అయితే ఖలీఫా మన్సూర్ వాగ్దానభంగం చేసి అబ్దుల్లా బిన్ అలీని ఉప్పుపునాదులపై ఒక ఇంటిని నిర్మింపజేసి అందులో నిర్బంధిం చాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకు హి.శ. 139లో వర్షం వచ్చి ఆ ఇల్లు కూలిపోవడం, అబ్దుల్లా దాని కప్పు కింది అణగి ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఆవిధంగా మన్సూర్ ఈ కొత్త ప్రత్యర్థిని తన దారి నుండి శాశ్వతంగా తొలగించుకున్నాడు.

అబూముస్లిం యుద్ధంలో అబ్దుల్లా బిన్ అలీని మట్టికరిపించిన తరువాత తనకు లభించిన విజయం, సమరసొత్తు గురించిన శుభవార్త మన్సూర్‌కు తెలియజేశాడు. మన్సూర్ వెంటనే సమరసొత్తు స్వాధీనం చేసుకోవడానికి తన మనిషిని పంపించాడు.

మన్సూర్ ప్రదర్శించిన ఈ వైఖరితో ఖంగుతిన్న అబూముస్లిం “చావడం, చంపడం కోసమైతే నన్ను ముందుకు పంపడం జరుగుతుంది. కాని సమరసొత్తు పొందడానికి స్వయంగా ఖలీఫా ముందుకు వస్తాడు” అని అన్నాడు.

## 1. అబూముస్లిం హత్య

ఖురాసాన్‌లో ఎంతో ప్రజాబలం ఉన్న అబూముస్లింని అక్కడ్నుంచి తప్పించడానికి మన్సూర్ మరొక వార్తహరుని ద్వారా “మేము నిన్ను ఖురాసాన్‌కు బదులు సిరియా, ఈజిప్టు రాష్ట్రాలకు పాలకునిగా నియమిస్తున్నాం. కనుక నీవు ఖురాసాన్‌కు వెళ్ళకుండా సిరియాలోనే ఉండిపో. ఈజిప్టులో నీవు కోరుకున్న మనిషిని గవర్నర్‌గా నియమించుకో వచ్చు”అని సందేశం పంపాడు. అబూముస్లిం ఈ సందేశం విని మరింత మండిపడ్డాడు. ఖలీఫా మన్సూర్ తనను అడ్డు తొలగించుకోవడానికి కుట్ర పన్నుతున్నాడని గ్రహించి అతను వెంటనే సిరియా నుండి ఖురాసాన్‌కు బయలుదేరాడు.

మన్సూర్ ఈ విషయం వినగానే కొంతసైన్యం తీసుకొని మదాయిన్‌కు చేరుకొని అబూముస్లింకు తన దగ్గరకు రమ్మని కబురుచేశాడు. దానికి అబూముస్లిం నిరాకరిస్తూ “నేను దూరాన వుండే మీకు విధేయుణ్ణయి ఉంటాను. మీ శత్రులనందరినీ  అణచి వేశాను. ఇక మీకు నా అవసరం ఏదీ లేదు. నన్ను నా మానాన వదిలేయండి. ఒకవేళ మీరు నా వెంటపడితే మాత్రం నేను చేతులుముడిచి కూర్చోలేను” అని లేఖ రాశాడు. మన్సూర్ ఈ లేఖ చదివి ఎంతో మృదువుగా, ప్రేమాభిమానాలు ఉట్టిపడేలా లేఖ రాసి తన దగ్గరకు వచ్చేయమని అన్నాడు. అయినప్పటికీ అబూముస్లిం ఖలీఫా దగ్గరకు వెళ్ళ లేదు. మరొక వైపు మన్సూర్ పట్టువీడకుండా అబూదావూద్ ఖాలిద్ బిన్ ఇబ్రాహీంకు ఖురాసాన్ గవర్నర్‌పదవి ఆశచూపి పంపించాడు. అబూదావూద్ నచ్చజెప్పడంతో అబూ ముస్లిం ఖలీఫా దగ్గరకు వెళ్ళడానికి అంగీకరించాడు.

అయితే ముందుజాగ్రత్త కోసం అతను మొదట తన నమ్మకస్తుడైన అబూఇస్‌హాఖ్‌ని పంపాడు. అబూఇస్‌హాఖ్ ఖలీఫా దగ్గరికి చేరుకోగానే ఖలీఫా తన మందీమార్బలంతో అతడ్ని ఘనంగా స్వాగతించి సత్కరించాడు. అదీగాక అబూముస్లింని ఖురాసాన్‌కు పోనీయకుండా తన దగ్గరకు వచ్చేలా ఒప్పించగలిగితే ఖురాసాన్ గవర్నర్‌గా నియమిస్తానని చెప్పి అతను అబూఇస్‌హాఖ్‌ని కూడా వలలో వేసుకున్నాడు. అబూఇస్‌హాఖ్ పదవి ఆశతో అబూముస్లిం దగ్గరకు తిరిగెళ్ళి అతడ్ని ఖలీఫా దగ్గరకు వెళ్ళడానికి ఒప్పించాడు. అప్పుడు అబూముస్లిం మూడువేలమంది సైనికుల్ని తీసుకొని మదాయిన్ చేరుకున్నాడు. మన్సూర్ మరింత గౌరవమర్యాదలతో అతడ్ని స్వాగతించి సత్కరించాడు. మరునాడు అబూముస్లిం అతిథిగృహం నుండి ఖలీఫా దర్బారులో ప్రవేశించాడు. ఖలీఫా మన్సూర్ నిర్ణీతపథకం ప్రకారం కొందరు సాయుధవ్యక్తుల్ని తెరచాటున ఉంచి అబూముస్లింతో మాట్లాడటం ప్రారంభించాడు. అలా మాట్లడుతూ కాస్సేపటికి చప్పట్లు చరిచాడు. అంతే మరుక్షణం తెరచాటున మాటుకాసివున్న సాయుధవ్యక్తులు ముందుకు దూసుకొచ్చి అబూముస్లింపై విరుచుకుపడ్డారు. అబ్బాసీలకు ఎంతో మేలుచేసిన అబూముస్లిం హి.శ. 137లో రక్తపు మడుగులో పడి గిలగిల కొట్టుకొని ఊపిరివిడిచాడు.



## 2. వివిధ ప్రాంతాల్లో తిరుగుబాటులు

అబూముస్లిం హత్యవార్త వినగానే ఖురాసాన్‌లో తిరుగుబాటు చెలరేగింది. అయితే ఖలీఫా వెంటనే ఖురాసాన్ నాయకులకు ధనకనక వస్తువులిచ్చి నోళ్ళు మూయించాడు. ఆ తర్వాత కొన్నాళ్ళకు ఖురాసాన్ గవర్నర్ అబ్దుల్‌జబ్బార్ ఖలీఫా నియమించిన కొందరు ఉన్నతాధికారుల్ని చంపించాడు. ఈసంగతి తెలిసి ఖలీఫా ఉగ్రుడయ్యాడు. కాని ఖురాసాన్ ప్రజలకు భయపడి అతను అబ్దుల్‌జబ్బార్‌ని పదవి నుండి తీసేయలేదు. కుట్రలు, కుయుక్తుల్లో ఆరితేరిన ఖలీఫా మన్సూర్ కొన్నాళ్ళకు మాయమాటలతో మభ్యపెట్టి అబ్దుల్‌జబ్బార్‌ని కూడా తన దారినుండి తొలగించుకున్నాడు. మోసిల్, బహ్రైన్, హమ్దాన్, ఆఫ్రికాలలో కూడా తిరుగుబాటులు చెలరేగాయి. ఖలీఫా మన్సూర్ వాటిని కూడా తన రాజకీయ కుతంత్రాలతో అణచివేశాడు.

హి.శ.138లో సన్బాద్ అనే నాయకుని నేతృత్వంలో అగ్నిపూజారులు తిరుగుబాటు లేవదీసి ఖురాసాన్‌లోని అనేక భూభాగాలను ఆక్రమించుకున్నారు. వారిని అణచడానికి మన్సూర్ జమ్‌హూర్ అనే సేనాపతిని పంపాడు. అతను వెళ్ళి హమ్దాన్ ప్రాంతంలో ఆ విద్రోహుల్ని ఓడించి వారి తిరుగుబాటును అంతమొందించాడు. ఆ యుద్ధంలో అతనికి అపార సమరసొత్తు లభించింది. మన్సూర్ దాన్ని తెచ్చివ్వమని అడిగితే జమ్‌హూర్ అందుకు నిరాకరిస్తూ తిరగబడ్డాడు. అప్పుడు మన్సూర్ అతని పీచం అణచడానికి ఇబ్నె అషాత్‌ను పంపాడు. ఇబ్నెఅషాత్ వెళ్ళి అతడ్ని ఆజర్‌బైజాన్ వైపు తరిమికొట్టాడు.

హి.శ.141లో రావందియా అనే ఓ అరబ్బేతర మతవర్గం తిరుగుబాటు లేవదీసింది. ఈ మతస్థులు దేవుడు ఖలీఫా మన్సూర్‌లో అంతర్లీనమయ్యాడని, అవతార పురుషుడని నమ్ముతారు. అంచేత వారు మన్సూర్‌ని దేవునిగా భావించి అతడ్ని దర్శించుకునేవారు. వీరంతా రాజధానికి వచ్చి తమ మతవిశ్వాసాలను ప్రచారం చేయడం ప్రారంభించారు. ఖలీఫా ఈ అరాచకానికి అడ్డుకట్ట వేసేందుకు వారిలో రెండొందల మందిని పట్టుకొని జైల్లో వేయించాడు. దాంతో రావందియా మతస్థులు జైలు మీద దాడిచేసి తమ వాళ్ళను విడిపించుకున్నారు. ఆ తర్వాత వారు తాము సాక్షాత్తు దేవుడిగా నమ్ముతున్న ఖలీఫా మన్సూర్ మీదనే బుసలుకొడ్తూ అతని రాజమహల్‌ను ముట్టడించారు.

ఆ సమయంలో ఖలీఫా రక్షణకోసం తగినంత మంది సైనికులు లేకపోవడంతో పెద్దప్రమాదం వచ్చిపడింది. ఖలీఫా అంగరక్షకులు అల్లరిమూకను నిలువరించడానికి నానా తంటాలుపడుతున్న ఆ క్లిష్ట పరిస్థితిలో ఒక వీరుడు కొందరు అనుచరులతో వచ్చి తన అసామాన్య ప్రతిభాపరాక్రమాలతో శత్రువుల్ని తరిమికొట్టి ఖలీఫాను కాపాడాడు. ఆ వీరుడు ఎవరో కాదు, గతంలో ఒక పొరపాటు చేసి ఖలీఫాకు భయపడి కనపడకుండా పారిపోయిన మాన్ బిన్ జాయెదాయే. ఈసంగతి తెలుసుకున్న ఖలీఫా మన్సూర్ అతని గతతప్పుల్ని క్షమించడమేగాక అతడ్ని ఎంతో అభినందించి సేనాపతిగా నియమించాడు.

హి.శ. 150లో ఖురాసాన్‌కు చెందిన అస్తాజ్‌సీస్ అనే వాడు తనను దైవప్రవక్త అని ప్రకటించుకొని అరాచకానికి పాల్పడ్డాడు. అతడ్ని అణచడానికి మన్సూర్ భారీసైన్యం పంపాడు. ఆ సైన్యం అనేక నెలల తరబడి పోరాడి ఆ విద్రోహిని బంధించింది.

## 3. మదీనాలో ముహమ్మద్ నఫ్సజకియా తిరుగుబాటు

అలీవ్విషియాలలో ఇమామియా, జైదియా అనే వర్గాలు బనూఉమయ్యాలకు ఎంత వ్యతిరేకులో బనూఅబ్బాసీలకు కూడా అంతే వ్యతిరేకులు. వారిదృష్టిలో అలి(రజి)-ఫాతిమా(రజి)ల సంతానం మాత్రమే ఖిలాఫత్‌కు, నాయకత్వానికి అర్హులు. మన్సూర్ పాలనాకాలంలో ఇమామియా వర్గానికి ఇమామ్ జాఫర్‌సాదిఖ్ నాయకత్వం వహించే వారు. ఈయన సాధువు, తపస్వి లాంటి మనిషి. ఖిలాఫత్ పదవిని ఎన్నడూ కాంక్షించ లేదు. అదీగాక అబ్బాసీలకు వ్యతిరేకంగా ఎలాంటి అల్లర్లు రేకెత్తించవద్దని ఆయన తరచుగా తన అనుచరులకు హితవు చేస్తుండేవారు. పోతే జైదియా వర్గానికి ఇమామ్ ముహమ్మద్ బిన్ అబ్దుల్లా నాయకత్వం వహించేవారు. ఈయనలోని పవిత్రతా, ధర్మపరాయణతల దృష్ట్యా "నఫ్సజకియా" అనే బిరుదుతో ప్రసిద్ధిచెందారు. ఆయన మక్కా, మదీనాలలో తన ఖిలాఫత్ కోసం ప్రజలచేత రహస్యంగా బైత్ చేయించుకోవడం ప్రారంభించారు.

బనూఉమయ్యాల చివరి పాలకుడు మర్వాన్ కాలంలో బనూహాషింకు చెందిన అనేకమంది పెద్దలు మదీనాలో ఒక సమావేశం జరిపి అందులో ముహమ్మద్ నఫ్సజకియాను ఖలీఫాగా ఆమోదిస్తూ ఆయన చేతిలో బైత్ చేశారు. అలా బైత్ చేసినవారిలో అబుల్‌అబ్బాస్ సఫా, మన్సూర్ కూడా ఉన్నారు. అందువల్ల బనూఉమయ్యాల పాలన అంతమైన తరువాత అబుల్‌అబ్బాస్ సఫా తనను ఖలీఫాగా ప్రకటించుకోవడంతో నఫ్సజకియా అతని ఖిలాఫత్‌ని నిరాకరించి తన ఖిలాఫత్ స్థాపన కోసం ప్రయత్నాలు ఆరంభించారు. అయితే సఫా ఓ ఉత్తరం రాసి ఆయన వ్యతిరేకతకు తాత్కాలికంగా అడ్డుకట్ట వేశాడు. ఆ తర్వాత మన్సూర్ ఖలీఫా కాగానే నఫ్సజకియా తన ఉద్యమాన్ని మళ్ళీ మొదలెట్టారు. ఈ ఉద్యమంలో నఫ్సజకియా సోదరుడు ఇబ్రాహీం కూడా పాల్గొన్నాడు.

ఖలీఫా తనకు వ్యతిరేకంగా నఫ్సజకియా లేవదీసిన తిరుగుబాటును మొగ్గలోనే తుంచివేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. మదీనా గవర్నర్ జియాద్ బిన్ అబ్దుల్లాను తొలగించి అతని స్థానంలో ముహమ్మద్ బిన్ ఖాలిద్‌ని గవర్నర్‌గా నియమించాడు. అతని వల్ల ప్రయోజనం కన్పించకపోవడంతో అతడ్ని కూడా తొలగించి రబా బిన్ ఉస్మాన్‌ని గవర్నర్‌గా నియమించాడు. రబా రాజ్యమంతటా గూఢచారుల్ని నియమించి తీవ్రంగా ప్రయత్నించాడు. అయినా లాభం లేకపోయింది. నఫ్సజకియా, ఇబ్రాహీం సోదరులిద్దరూ ఏఒక్క చోటా నిలకడగా ఉండకుండా తరచుగా ప్రదేశాలు మారుతూ ఉద్యమాన్ని రహస్యంగా సాగిస్తున్నారు. అంచేత రబా విసిగిపోయి వారి బంధువులు పదమూడు మందిని అరెస్టుచేసి ఖలీఫా దగ్గరకు పంపించాడు. ఖలీఫా వారిపై దుర్భరదౌర్జన్యం జరిపించాడు. వారిలో కొందరు ప్రాణాలు కూడా వదిలారు.

నఫ్సజకియా ఈ హింసాకాండ సంగతి తెలుసుకొని తననుతాను బహిర్గతం చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడు. హి.శ.145లో రెండొందలమంది అనుచరులతో మదీనాలో ప్రవేశించాడు. మదీనా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. వారి సహకారంతో ఆయన గవర్నర్ రబాను అరెస్టుచేసి నగరాన్ని స్వాధీనం చేసుకున్నాడు. నిర్ణీత పథకం



ప్రకారం నఫ్సజకియా మదీనాలో ప్రవేశించే రోజునే ఇబ్రాహీం కూడా బస్రాలో తిరుగుబాటు లేవదీయవలసి ఉండింది. కాని ఇబ్రాహీం అప్పుడు జరబ్బు పడటంవల్ల ఆ పని జరగలేదు. ఖలీఫా మన్సూర్ మొదట భయప్రలోభాలతో నఫ్సజకియాను లొంగదీసుకోవాలని ప్రయత్నించాడు. చివరికి అతను ఖడ్గంతోనే ఆయన్ని తన దారినుండి తొలగించుకోవడానికి యుద్ధభేరి మోగించాడు.

కూఫా, ఖురాసాన్ ప్రజలకు విషయం తెలిస్తే వారు నఫ్సజకియాను ఆదుకోవడానికి మదీనా వైపు వచ్చే ప్రమాదముందని భావించి ఖలీఫా కూఫా, ఖురాసాన్‌ల నుండి మదీనా వచ్చే దారులన్నీ మూసేయించి అక్కడ కాపలాదారుల్ని నియమించాడు. ఆ తరువాత అతను తన సోదరుడు, రాజకీయవారసుడయిన ఈసా బిన్ మూసా నాయకత్వంలో ఓ పెద్ద సేనావాహినిని మదీనా పంపించాడు. అతను మొదట మదీనాప్రజల్ని భయపెట్టి వారిలో కొందరిని తన వైపుకు తిప్పుకున్నాడు. ఆ తరువాత నఫ్సజకియా ఖలీఫాకు విధేయత ప్రకటించినప్పటికీ సేనాపతి ఈసా దాన్ని అంగీకరించకుండా హి.శ. 145, రమజాన్ 14వ తేదీన నగరం ముట్టడించాడు. నఫ్సజకియా తన నాలుగొందల మంది అనుచరుల్ని తీసుకొని రంగంలోకి దిగారు. కాని అంతపెద్ద ప్రభుత్వసైన్యంతో ఈ చిన్నసైన్యం పోరాడి ప్రాణాలతో బయటపడుతుందా? అసాధ్యం. నఫ్సజకియాతో పాటు అతని వీరయోధులు తీవ్రంగా పోరాడి చివరికి అసువులు బాశారు.

## 4. ఖురాసాన్‌లో ఇబ్రాహీం తిరుగుబాటు

అటు ఇబ్రాహీం ఆరోగ్యవంతుడైన తర్వాత హిజ్రీశకం 145, రమజాన్ నెల ఒకటో తేదీన బస్రా నుండి తిరుగుబాటు ప్రారంభించాడు. బస్రా నుండి అహ్వాజ్ వరకున్న ప్రాంతాన్ని కైవశం చేసుకున్నాడు. కాని రమజాన్ మాసాంతంలో నఫ్సజకియా అమరగతి అయిన సంగతి తెలియగానే అతని సైన్యంలో ధైర్యం సన్నగిల్లింది. బస్రావాసులు మాత్రం ఇబ్రాహీంని ఖలీఫాగా ఎన్నుకొని మరింత ఉత్సాహంతో పోరాడటానికి ముందుకు వచ్చారు. అయితే కూఫాప్రజలు బస్రాకు బదులు కూఫాను రాజధానిగా చేసుకొని పోరాడాలని పట్టుబట్టారు. ఇబ్రాహీం వారి మాటలకు తలయొగ్గి లక్షమంది సైన్యంతో కూఫా దిశగా వెళ్ళిపోయాడు. ఖలీఫా మన్సూర్ తనకు వ్యతిరేకంగా ఇబ్రాహీం లేవదీసిన తిరుగుబాటు తుఫాన్‌తో బెంబేలెత్తిపోయి యాభైరోజుల పాటు వంటి మీది బట్టలు కూడ మార్చుకోలేక అనుక్షణం ఆజ్ఞలు జారీచేస్తూ సైనిక సమీకరణలో మునిగిపోయాడు. అతని ఆదేశంతో ఈసా బిన్ మూసా మదీనా నుండి కూఫాకు బయలుదేరాడు. చివరికి దారిలో ఒకచోట రెండుసైన్యాలు ఢీకొన్నాయి. ఈ యుద్ధంలో ఇబ్రాహీం సైన్యం విజయదిశగా పురోగమిస్తున్న తరుణంలో హఠాత్తుగా ఓ బాణం వచ్చి ఇబ్రాహీం గొంతులో దిగబడింది. వెంటనే అనుచరులు ఆయన్ని యుద్ధరంగం నుండి పక్కకు తీసికెళ్ళి పోయారు. అయితే సేనాపతిని యుద్ధరంగం నుండి పక్కకు తీసికెళ్ళగానే సైనికుల్లో ధైర్యం సన్నగిల్లింది. దాంతో వారు యుద్ధమైదానం వదలి పారిపోయారు. ఇబ్రాహీం ఆ గాయంతోనే హిజ్రీశకం 145, జీఖాదా నెలలో ప్రాణాలు వదిలాడు. ఖలీఫాసైనికులు ఆయన శిరస్సు ఖండించి ఖలీఫా దర్బారుకు పంపివేశారు.

ఈవిధంగా నఫ్సుజకియా, ఆయన సోదరుడు ఇబ్రాహీం లేవదీసిన తిరుగుబాటు ఉద్యమం అణగిపోయింది. ఈ సోదరులిద్దరి జ్ఞానం, పరాక్రమం, ధర్మపరాయణతల కారణంగా ధర్మవేత్తలు, ఫిఖ్హావేత్తలు వారిని ఎంతో గౌరవించేవారు. వారిలో కొందరు వారి తిరుగుబాటు ఉద్యమానికి మద్దతు కూడా ఇచ్చి ఖలీఫా ఆగ్రహానికి గురయ్యారు.

ముహమ్మద్ మెహ్ది నఫ్సుజకియా ఖిలాఫత్ కోసం బైత్ చేసే విషయంలో మదీనా ప్రజల్ని ప్రోత్సహించిన కారణంగా ఇమామ్ మాలిక్ (రహ్మలై)ని కొరడా దెబ్బలు కొట్టడం జరిగింది. అలాగే ఇరాఖ్‌లో ఇబ్రాహీం తిరుగుబాటును సమర్థిస్తూ ఫత్వా జారీచేసి నందుకు ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)ని ఖలీఫా మన్సూర్ అరెస్టు చేయించి బగ్దాద్‌లోని జైల్లో పడవేయించాడు. ఆ కాలంలో బగ్దాద్ నగర నిర్మాణం సాగుతుండేది. అప్పుడు జైల్లో శిక్షగా ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)కు ఇటుకలు లెక్కించే పని అప్పగించడం జరిగింది. ఒక ఉల్లేఖనం ప్రకారం ఖలీఫా న్యాయమూర్తి పదవీబాధ్యతలు అప్పగించదలిస్తే అందుకు అబూహనీఫా (రహ్మలై) నిరాకరించడం వల్ల ఆయన్ని తిరిగి జైల్లో వేసి ఇటుకలు లెక్కించే పని అప్పగించడం జరిగింది. ఈవిధంగా ఆయన శిక్ష అనుభవిస్తూ హి.శ. 150లో చనిపోయారు.

ఇమామ్‌మాలిక్, ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)లనే గాక నఫ్సుజకియా, ఇబ్రాహీంల తిరుగుబాటు ఉద్యమానికి మద్దతునిస్తూ ఫత్వాలు జారీచేసిన ఇబ్నెఅజలాన్, అబ్దుల్ హమీద్ బిన్ జాఫర్ వగైరా ఇతర అనేకమంది ధర్మవేత్తల్ని కూడా ఖలీఫా మన్సూర్ కఠిన శిక్షలతో రకరకాలుగా వేధించాడు. రాజరికవ్యవస్థలో పాలకులు తమ దారికి అడ్డొచ్చే వారినెవరినీ వదలిపెట్టరు. "రాజులు ఏదైనా రాజ్యంలో జొరబడితే దాన్ని సర్వనాశనం చేస్తారు. ఆ రాజ్యంలోని గౌరవనీయుల్ని పరాభవం చేస్తారు." (ఖుర్ఆన్- 27:34)

## 5. ఖిలాఫత్ ముఖానికి ఆధ్యాత్మిక ముసుగు

ఖలీఫా మన్సూర్ అలీ్వయలందరినీ (హసన్ సంతతినంతటిని) తుదముట్టించిన తర్వాత తన రక్తసిక్త ముఖానికి ఆధ్యాత్మిక రంగు పులుముకోవడానికి ప్రయత్నించాడు. "బనూఅబ్బాసీ ఖలీఫాలు ప్రాపంచిక చక్రవర్తులు మాత్రమే గాక ఆధ్యాత్మిక గురువులు కూడా" అంటూ అతను యావత్తు ముస్లింజగత్తులో ప్రచారం ప్రారంభించాడు. ఆ విషయాన్ని దృఢపరచుకోవడానికి మన్సూర్ స్వార్థపరులైన ధర్మవేత్తలు, ఫిఖ్హావేత్తల ద్వారా ఫత్వాలు కూడా జారీచేయించాడు. ఈ పథకం ప్రజల్లో బాగా పనిచేసింది.

ఆధ్యాత్మిక ముసుగు ధరించిన ఈ ఖిలాఫత్ ప్రచారం బనూఅబ్బాసీలకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. వారి పరిపాలనలు పటిష్ఠవంతమై శతాబ్దాల తరబడి విజయవంతంగా కొనసాగాయి. బనూఅబ్బాసీ రాజ్యంలో అంతర్భాగాలుగా లేకుండా స్వతంత్ర రాజ్యాలుగా వ్యవహరిస్తున్న ముస్లిం ప్రభుత్వాలన్నీ బనూఅబ్బాసీ పాలకుడ్నే తమ కేంద్ర బిందువుగా, ఖలీఫాగా అంగీరించేవి. చివరికి బనూఅబ్బాసీ రాజ్యపరిధులు బగ్దాద్‌కు పరిమితమైపోయినా ముస్లింజగత్తులోని స్వతంత్ర రాజ్యాలన్నీ బనూఅబ్బాసీ పాలకుడ్నే తమ ఖలీఫాగా అంగీకరించేవారు.



## 6. బగ్దాద్ నిర్మాణం

బనూఉమయ్యా పాలకుల కాలంలో సిరియాలోని డెమాస్కస్ దేశరాజధానిగా ఉండేది. తరువాత బనూఅబ్బాసీల పాలన ప్రారంభకాలంలో ఇరాఖ్‌లోని అన్బార్ పట్నం దేశరాజధాని అయింది. అయితే కొన్నాళ్ళకే అన్బార్‌కు కొన్ని మైళ్ళ దూరంలో ఒక రాజ మందిరంతో పాటు ప్రభుత్వాధికారుల కోసం కొన్ని ఇండ్లు కట్టించడం జరిగింది. ఆ ప్రదేశానికి హాష్మియా అని పేరుపెట్టి దాన్ని రాజధానిగా చేసుకున్నారు. ఆతర్వాత ఖలీఫా మన్సూర్ రాజధానిగా హాష్మియా తనకు అనుకూలించక పోవడంతో వేరే ప్రదేశంలో దజ్లా నదీ తీరం మీద ఒక నగరాన్ని నిర్మింపజేసి దానికి బగ్దాద్ అని పేరుపెట్టాడు. ఈ నగరనిర్మాణం హి.శ. 141లో ప్రారంభమై హి.శ. 149లో పూర్తయింది. అనాటి నుండి బనూఅబ్బాసీ పాలకులకు బగ్దాదే దేశరాజధానిగా కొనసాగింది.

అప్పటి నుంచి బగ్దాద్ విద్యాకళలకు నిలయమైపోయింది. ఆ కాలంలోనే ధర్మవేత్తలు ధార్మిక విద్యజ్ఞానాల్ని గ్రంథాల రూపంలో కూర్చే పని ప్రారంభించారు. మక్కాలో ఇబ్నెజరీజ్, మదీనాలో ఇమామ్ మాలిక్ (రహ్మలై), కూఫాలో సుఫ్యాన్ సూరి (రహ్మలై), హదీసు గ్రంథాలను వ్రాసే పని ప్రారంభించారు. ఇబ్నెఇస్హాఖ్ సమరయోధుల జీవిత గాథలపై, ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) ఫిఖ్హావిద్యపై గ్రంథరచనలు చేయించారు. ఫిఖ్హావిద్యపై అబూహనీఫా (రహ్మలై) సొంత రచన ఏదీ లేదు. ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) పర్యవేక్షణలో ఆయన శిష్యులు ఇమామ్ ముహమ్మద్, ఇమామ్ అబూయూసుఫ్‌లు ఖుర్ఆన్ సూక్తులు, హదీసు ఉల్లేఖనాలతో పాటు ఆయన ప్రవచనాలు నమోదుచేసి గ్రంథరచనలు చేశారు.

## 7. ఖిలాఫత్ వారసత్వం, మన్సూర్ మరణం

గత ఖలీఫా అబ్దుల్లాసఫా చనిపోయేముందు మన్సూర్‌ని తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తూ, మన్సూర్ తదనంతరం మన్సూర్ సోదరుడు ఈసా బిన్ మూసా అతని రాజకీయ వారసుడవుతాడని వీలునామా రాశాడు. నఫ్సుజకియా, ఇబ్రాహీంల తిరుగుబాటు ఉద్యమాన్ని అణచడంలో ఈసా కీలకపాత్ర వహించాడు. అయితే మన్సూర్ ఆ ఇద్దరు ఉద్యమనాయకుల ప్రమాదం తొలగి తనకు ఈసా అవసరం తీరిపోగానే అతని హోదా, ప్రాముఖ్యాలను తగ్గిస్తూ తన కొడుకు మెహ్దీని తెరపైకి తెచ్చాడు. మన్సూర్ తన కొడుకుని తన రాజకీయ వారసుడిగా చేసే విషయం ప్రస్తావించినపుడు దాన్ని ఈసా అంగీకరించలేదు. అంచేత మన్సూర్ అతడ్ని కూఫా గవర్నర్ పదవి నుండి తొలగించాడు. దాంతో ఈసా రాజకీయ శక్తి, పేరుప్రతిష్ఠలు మట్టిలో కలసిపోవడంతో అతను బగ్దాద్‌కు చాలా దూరంగా ఓ కుగ్రామంలో ఏకాంత జీవితం గడపసాగాడు.

ఈ విధంగా మన్సూర్ తన సోదరుడు ఈసాను నిస్సహాయుడిగా చేసి, డబ్బుతో భజనరాయుళ్ళను తయారుచేసి కొడుకు మహ్దీని తన రాజకీయవారసుడిగా వీలునామ రాసి ప్రజల చేత బైత్ చేయించుకున్నాడు. కాకపోతే ఈసా కంటితుడుపు కోసం మహ్ది తరువాత అతను ఖలీఫా అవుతాడని మాత్రం వీలునామాలో ఒక వాక్యం చేర్చాడు.

మన్సూర్ తన దారిలోని ఆటంకాలన్నిటినీ అధికమించి హి.శ.148 లోగా స్పెయిన్ తప్ప యావత్తు ముస్లింజగత్తులో తన పరిపాలనను పటిష్ఠపరచుకున్నాడు. హి.శ. 149లో బగ్దాద్ నగరనిర్మాణం కూడా పూర్తయింది. రాజ్యంలో అంతర్గత ఇబ్బందులు తొలగి కాస్త ప్రశాంతవాతావరణం నెలకొనగానే హి.శ. 149లో మాటిమాటికి చికాకు పరుస్తున్న రోమన్లను అణచడానికి అతను ఓ పెద్ద సైన్యాన్ని పంపాడు. ముస్లిం యోధులు రోమ్ సేనలను ముప్పతిప్పలు పెట్టి సరిహద్దు ఆవల చాలా దూరందాకా తరిమికొట్టారు.

హి.శ. 150లో ఖురాసాన్ రాష్ట్రంలో అస్తాద్‌సీస్ అనే వాడు తాను దైవప్రవక్తనని ప్రకటించుకొని వేలాదిమంది ప్రజల్ని తన వైపుకు తిప్పుకున్నాడు. వారి సహకారంతో ఖురాసాన్‌లోని అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. ఈ సంగతి తెలియగానే మన్సూర్ మొదట్లో అజషమ్ మర్వజీ నాయకత్వంలో మూడు వేలమంది సైనికుల్ని పంపించాడు. కాని ఆ యుద్ధంలో సేనాపతి అజషమ్ చంపబడ్డాడు. అతని సైనికులు పారిపోయారు. తరువాత హాజిమ్ బిన్ ఖుజైమా నాయకత్వంలో భారీఎత్తు సైన్యం పంపాడు. ఇరుపక్షాల మధ్య సంకులసమరం జరిగి 70 వేలమంది సైనికులు చనిపోయారు. సేనాపతి హాజిమ్ ఖైదీలుగా పట్టుబడిన 14 వేలమంది శత్రుసైనికుల్ని చంపించాడు. అస్తాద్‌సీస్ పారిపోయి ఓ కొండగుహలో ఆశ్రయం పొందాడు. మన్సూర్ సేనాపతి హాజిమ్ ఆ కొండగుహను ముట్టడించాడు. ఈ ముట్టడి సుదీర్ఘకాలం సాగింది. చివరికి అస్తాద్‌సీస్ లొంగిపోయాడు. అప్పుడు సేనాపతి అతడ్ని బంధించి ఖలీఫా దగ్గరకు పంపించాడు. అతని 30 వేలమంది సైనికుల్ని మాత్రం వదలిపెట్టాడు.

హి.శ. 153లో తన ప్రజలంతా పొడుగు టోపీలు ధరించాలని హుకుం జారీచేశాడు. హి.శ. 154లో సేనాపతి జఫర్ బిన్ ఆసిమ్ చేత రోమ్ మీద దాడిచేయించాడు. హి.శ. 155లో రోమ్ చక్రవర్తి ముస్లింల నిర్విరామదాడులతో విసిగిపోయి జిజ్యా చెల్లించడానికి అంగీకరిస్తూ ఒప్పందం చేసుకున్నాడు.

హి.శ. 158లో మన్సూర్ మక్కా గవర్నర్‌ని ఒక లేఖ ద్వారా సుఫ్యాన్ సూరి, ఇబాద్ బిన్ కసీర్‌లను అరెస్టుచేసి తన దగ్గరకు పంపమని ఆదేశించాడు. మక్కా ప్రజలు ఈ సంగతి విని, ఖలీఫా ఆ ధర్మవేత్తల్ని హతమారుస్తాడేమోనని ఆందోళన చెందారు. హజ్ దినాలు కూడా సమీపించాయి. మన్సూర్ హజ్‌యాత్ర జరపడానికి బగ్దాద్ నుండి బయలుదేరాడు. ఈ వార్త విని మక్కా ప్రజలు మరింత ఆందోళన చెందారు. మన్సూర్ మక్కా వచ్చి ఇంకా ఎవరెవరిని బంధించి వేధిస్తాడో, ఎవరెవరిని చంపిస్తాడోనని భయపడుతూ దైవసన్నిధిలో దుఆ చేశారు. దేవుడు వారి వేడుకోలును అంగీకరించాడు. మన్సూర్ మక్కా చేరుకోక ముందే దారిలోనే వ్యాధిగ్రస్తుడై అంతిమశ్వాస వదిలాడు. ఖలీఫా మన్సూర్ ఎన్నో ఎత్తుగడలతో, రక్తపాతాలతో, అల్వీయులు-అబ్బాసీల సమైక్యతను చెడగొట్టడం ద్వారా, ముస్లింలు అత్యధికసంఖ్యలో ఉన్న అరబ్ సైనికులపై పార్సీలు అత్యధికసంఖ్యలో ఉన్న ఈరానీలకు ప్రాముఖ్యమిచ్చి వారి హోదాలు పెంచడం ద్వారా తన రాజ్యాన్ని పటిష్ఠపరచుకొని దాదాపు 22 ఏండ్ల పాటు ఏకఛత్రాధిపత్యంగా పరిపాలన సాగించాడు.



## 8. మన్సూర్ స్వభావం, గుణగణాలు

మన్సూర్ చదువుకునే రోజుల్లో అతనికి అబ్దుర్రహ్మాన్ జియాద్ అనే ఒక స్నేహితుడు (క్లాస్‌మేట్) ఉండేవాడు. మన్సూర్ ఖలీఫా అయిన తర్వాత ఒకసారి అబ్దుర్రహ్మాన్ అతడ్ని కలుసుకునేందుకు రాజధానికి వచ్చాడు. ఆ సందర్భంలో మన్సూర్ మాట్లాడుతూ "బనూఉమయ్యా పాలన సమక్షంలో నా పాలన ఎలా ఉందని నువ్వు భావిస్తున్నావు?" అని అడిగాడు. దానికి అబ్దుర్రహ్మాన్ సమాధానమిస్తూ "నీ పాలనాకాలంలో ఎంత హింసా దౌర్జన్యాలు జరుగుతున్నాయో బనూఉమయ్యా పాలనాకాలంలో అంతటి హింసా దౌర్జన్యాలు జరగలేదు" అని చెప్పాడు. మన్సూర్ ఈమాట విని "ఏం చెయ్యమంటావు, నాకు మంచి సహాయకులు లభించడంలేదు" అన్నాడు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ "హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మలై) మాటల్లో చెప్పాలంటే 'ఏ వస్తువులు ఎక్కువగా అమ్ముడుపోతాయో ఆ వస్తువులే మార్కెట్‌లోకి ఎక్కువగా వస్తాయి. అలాగే రాజు మంచివాడైతే అతనికి మంచి వాళ్ళు దొరుకుతారు; రాజు చెడ్డవాడైతే అతనికి చెడ్డవాళ్ళే దొరుకుతారు" అని అన్నాడు. మన్సూర్ ఈమాట విని తల దించుకున్నాడు.

ఒకసారి మన్సూర్‌కు ఈగలు బాగా చికాకు పరిచాయి. ఈగల బెడద నుండి తప్పించుకునే ఉపాయం కన్పించకపోవడంతో అతను చిర్రెత్తిపోయాడు. అతను మిఖాతల్ బిన్ సులైమాన్ అనే ఓ మిత్రుడ్ని పిలిచి "దేవుడు ఈగలను ఎందుకు సృష్టించాడ"ని అడిగాడు. దానికి మిఖాతల్ "ఈగల ద్వారా దుర్మార్గులు, దౌర్జన్యపరులను కించపరచడానికి వాటిని సృష్టించాడు" అని సమాధానమిచ్చాడు.

మన్సూర్ ఎంతో ధైర్యసాహసాలు, క్రమశిక్షణ కలిగిన పరిపాలకుడు. ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎంతో నిబ్బరంతో, చాకచక్యంతో వాటిని అధికమించేవాడు. అతను అత్యంత స్థిరచిత్తుడు, శాశ్వతస్వభావం కలవాడు. ఎంత పెద్దప్రమాదం ఎదురైనా తన ధ్యేయపథంలో ఒక్క అడగ్గూడా వెనక్కి తగ్గేవాడుకాదు. గవర్నర్లు, ఇతర అధికారుల కార్యకలాపాలపై గూఢచారుల ద్వారా అనుక్షణం నిఘా పెట్టి గమనిస్తుండేవాడు. ఒకవేళ ఎవరి మీదయినా అనుమానం వస్తే వెంటనే అతడ్ని పదవి నుండి తొలగించేవాడు. మన్సూర్ ఉదయం నుండి మధ్యాహ్నం దాకా పరిపాలనా బాధ్యతలు నిర్వహించేవాడు. అసర్‌నమాజ్ తర్వాత తన భార్యాపిల్లల దగ్గర గడిపేవాడు. ఇషానమాజ్ తర్వాత గవర్నర్లు, ఇతర ఉన్నతాధికారుల నుండి వచ్చే ఉత్తరాలు చదివేవాడు. తర్వాత నిద్రపోయేవాడు. తెల్లవారుజామున లేచి ఫజర్ నమాజ్ చేయించేవాడు. ఆ తర్వాత ఆస్థానానికి వెళ్ళి తన పని ప్రారంభించేవాడు. ఇవీ అతని దినచర్యలు.

## 9. మన్సూర్ న్యాయవైఖరి

మన్సూర్ తాను అనుకున్న పని సాధించేవరకు వదలిపెట్టేవాడు కాదు. అయితే అతను న్యాయమూర్తుల తీర్పుల్ని తన అభిమతానికి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ వాటిని గౌరవించేవాడు. కరుడుగట్టిన రక్తపిపాసి కూడా ఒక్కోసారి తన అంతరాత్మ ప్రబోధనకు అనుకూలంగా వ్యవహరించేవాడు. మన్సూర్ కూడా అలాంటివాడే.

మన్సూర్ బస్రా ఖాజీ (న్యాయమూర్తి) సువార్ బిన్ అబ్దుల్లాకు ఒక లేఖ రాస్తూ "ఫలానా స్థలం వ్యవహారంలో ఫలానా సైన్యాధికారి, ఫలానా వర్తకుడు పోట్లాడుకుంటు న్నారు. మీరా స్థలాన్ని సైన్యాధికారికి ఇప్పించండి" అని ఆదేశించాడు. దానికి ఖాజీ "ఆ స్థలం వర్తకుడిది. అంచేత ఆ వర్తకుడికి వ్యతిరేకంగా ఎవరైనా సాక్ష్యం చెప్పనంతవరకూ నేనతని స్థలాన్ని సైన్యాధికారికి ఎలా ఇప్పించగలను?" అని సమాధానమిచ్చాడు. మన్సూర్ మరో లేఖలో "ఆ స్థలాన్ని తప్పకుండా సైన్యాధికారికే ఇప్పించండి" అంటూ ఖాజీని ఆదేశించాడు. కాని ఖాజీ "వర్తకుడికి వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యంలేకుండా ఆ స్థలాన్ని నేనతని దగ్గర్నుండి ఏ విధంగానూ తీసుకోలేను" అని అన్నాడు. మన్సూర్ ఈ సమాధానం విని "దేవ దేవ! నేను ప్రపంచాన్ని న్యాయంతో నింపివేశాను. చివరికి నా ఖాజీలు కూడా యదార్థ విషయంలో నాతో విభేదిస్తున్నారు" అని వ్యాఖ్యానించాడు.

ఒకతను ఏదో విషయంలో ఖాజీ సువార్ మీద మన్సూర్‌కు ఫిర్యాదు చేశాడు. మన్సూర్ ఖాజీని పిలిపించాడు. ఖాజీ వచ్చి మన్సూర్ ముందు కూర్చున్నాడు. అప్పుడు మన్సూర్‌కు తుమ్ము వచ్చింది. ఖాజీ మౌనంగా కూర్చున్నాడు. మన్సూర్ అతడ్ని "నేను తుమ్మినపుడు మీరు 'యర్రహ్మకుల్లాహ్' అని ఎందుకు అనలేదు?" అని అడిగాడు. "దానికి ముందు మీరెందుకు 'అల్‌హమ్దులిల్లాహ్' అనలేదూ" అని ప్రశ్నించాడు ఖాజీ. దానికి మన్సూర్ "నేను మనసులో అనుకున్నాను" అని చెప్పాడు. "నేను కూడా మనసులో అనుకున్నాను" అని చెప్పాడు ఖాజీ. మన్సూర్ ఈ సమాధానం విని "మీరు మీ పదవిలో కొనసాగండి. యదార్థానికి వ్యతిరేకంగా మీరు నాకు అనుకూలించకపోతే మరే విషయంలో మీరు నాకు అనుకూలిస్తారు?" అని అన్నాడు.

ఉమైర్ మదనీ కథనం : ఒకసారి ఖలీఫా మన్సూర్ మదీనా వచ్చాడు. ఆ రోజుల్లో ముహమ్మద్ బిన్ ఇమ్రాన్ అక్కడి ఖాజీగా ఉండేవారు. నేనాయన దగ్గర గుమస్తాగా పనిచేస్తుండేవాడ్ని. ఓసారి కొందరు పశుకాపార్లు ఖాజీగారి దగ్గరకు వచ్చి ఖలీఫా మీద ఫిర్యాదు చేశారు. అప్పుడు ఖాజీగారు "ఖలీఫాను ఇక్కడకు రమ్మని ఉత్తరం రాయి" అని అన్నారు నాతో. "నేనీ పని చేయలేను, నన్ను క్షమించండి" అన్నా నేను. "కాదు, నువ్వీ ఉత్తరం రాయాల్సిందే" అన్నారు ఖాజీగారు. దాంతో నేను ఇక తప్పదనుకొని లేఖ రాసి ముద్ర వేశాను. తరువాత ఖాజీగారు, ఈ ఉత్తరం తీసికెళ్ళే బాధ్యత కూడా నువ్వే నిర్వహించాలన్నారు. నేనా ఉత్తరం తీసికెళ్ళి రబీకు ఇచ్చాను. అతను దాన్ని ఖలీఫాకు అప్పగించాడు. ఖలీఫా దాన్ని చదువుకొని 'నేను న్యాయస్థానంలో హాజరవ్వాలి' అన్నాడు. ఆ తరువాత రబీ, ఖలీఫా ఇద్దరూ న్యాయస్థానానికి చేరుకున్నారు. వాళ్ళను చూసి ఖాజీ గౌరవసూచకంగా లేచి నిలబడలేదు. నిర్భయంగా ఖలీఫాకు వ్యతిరేకంగా తీర్పిచ్చారు. అప్పుడు మన్సూర్ "ఈ న్యాయం, ధర్మపరాయణతలకు దైవం మీకు మంచి ప్రతిఫలం ప్రసాదించుగాక. నేను మీకు బహుమానంగా పదివేల దీనార్లు బహుమానంగా ఇచ్చాను తీసుకోండి" అని అన్నాడు.

ఇబ్నెహర్మా అనే ఓ కవిపుంగవుడు ప్రతిరోజూ సారాయి పీకలదాకా తాగేవాడు. ఒక సారి అతను మన్సూర్ దగ్గరకు వచ్చి కవితారూపంలో ఇలా అన్నాడు: "ప్రశంసనీయుడి



కోసం సింహాసనం ఇరువైపులా రెండు దృష్టికోణాలున్నాయి. వాటిని పునరుక్తం (రిపీట్) చేసినప్పుడు వాటిలో శిక్ష, క్షమాపణ ఉంటాయి." ; "నీవు ఎవరికైతే భద్రతాహామీ ఇస్తావో అతను సురక్షితంగా ఉంటాడు. అలాగే నీవు ఎవరిని హతమార్చదలుస్తావో అతని తల్లి పుత్రవియోగంతో దుఃఖిస్తుంది."

మన్సూర్ ఈ కవితలు విని 'నీకేం కావాలో కోరుకో ఇస్తాన'న్నాడు. అప్పుడా తాగు బోతు కవి "నేను మద్యం మత్తులో ఉన్నపుడు నన్ను శిక్షించవద్దని మదీనా గవర్నర్‌కు ఉత్తరం రాయండి" అని అన్నాడు. కాని మన్సూర్ అందుకు నిరాకరిస్తూ "నేను దైవనిర్ణీత శిక్షల విషయంలో జోక్యం చేసుకోలేను" అని నిర్ద్వందంగా చెప్పేశాడు.

# 51. ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)

హనఫీఫిఖ్హా వ్యవస్థాపకుడు ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) అసలు పేరు నోమాన్ బిన్ సాబిత్. ఆయన పూర్వీకులు అఫ్గనిస్తాన్‌లోని కాబుల్ నివాసులు. ఆయన తాత జౌతా ఒక యుద్ధంలో ఖైదీగా పట్టుబడి కూఫాకు తీసుకురాబడ్డాడు. కూఫా వచ్చిన తర్వాత జౌతా, అతని కుటుంబం ముస్లిములైపోయి బనీ తైముల్లా సంరక్షణలో ఉండ సాగారు. వృత్తిరీత్యా జౌతా వ్యాపారస్తుడు. అతను నాల్గవ ఖలీఫా హజ్రత్ అలి (రజి)ని కలుసుకున్నారు. అప్పుడప్పుడు ఆయనకు పారితోషికాలు కూడా పంపిస్తుండేవాడు. జౌతా కుమారుడు, అంటే ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) తండ్రి సాబిత్ వృత్తి కూడా వ్యాపారమే. కూఫాలో ఆయనకు రొట్టెల దుకాణం ఉండేది.

ఇమామ్ అబూహనీఫా (రహ్మ) హి.శ. 80లో ఇరాఖ్‌రాజధాని కూఫాలో జన్మించారు. ఆయన తన జీవితంలోని 52 సంవత్సరాలు బనూఉమయ్యా పాలనలో, మిగిలిన 18 సంవత్సరాలు బనూఅబ్బాసీ పాలనలో గడిపారు. ఖలీఫా హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) పాలనాకాలంలో యుక్తవయస్సుకు చేరుకున్నారు. అప్పటికే ఆయన ఖుర్‌ఆన్, హదీస్, వ్యాకరణం, సాహిత్యం మొదలైన ఆనాటి విద్యలన్నీ అభ్యసించారు.

## 1. పూర్వాపరాలు

ఇస్లాం వ్యక్తిగత, సామూహిక, సామాజిక, ఆధ్యాత్మిక, ఆర్థిక, రాజకీయ రంగాలతో కూడిన సమగ్ర జీవనవ్యవస్థ. ఇలాంటి వ్యవస్థను ఆచరణలో ప్రపంచం తొలి నలుగురు ఖలీఫాల పాలనల్లో చూడగల్గింది. ఆ తర్వాత సమగ్రమైన ఇస్లామీయ వ్యవస్థలో పగులు ఏర్పడి, అందులో నుంచి రాజకీయరంగం క్రమంగా వేరైపోయింది. మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్య తర్వాత స్వార్థరాజకీయ ప్రయోజనాలు, సరైన ధార్మిక శిక్షణ కొరవడిన వ్యక్తులు, ఇస్లాంవ్యతిరేక శక్తుల కుట్రల ఫలితంగా రాజకీయ రంగం వేరుపడింది. శ్రేయస్కర ఖిలాఫత్ వ్యవస్థ క్రమేణా రాజరిక వ్యవస్థలోకి మారిపోయింది. అదీగాక ఇస్లామీయ విశ్వాసాల పరిధిలో ఇస్లాంవ్యతిరేక విశ్వాసాలు కూడా చోటుచేసుకో నారంభించాయి. అయితే కొందరు వ్యక్తుల్లో చోటుచేసుకున్న ఈ ఇస్లాంవ్యతిరేక విశ్వాసాలకు ముస్లిం జనసామాన్యం ఎల్లప్పుడూ దూరంగానే ఉంటూవచ్చింది.

ఏమైనప్పటికీ శ్రేయస్కర ఖిలాఫత్ నాయకత్వంతో కూడిన ఇస్లామీయ సమగ్ర నాయకత్వం నిట్టనిలువుగా చీలిపోయి, రాజకీయ నాయకత్వం వేరైపోయిందన్నది ఒక చారిత్రక యదార్థం. నిజమైన ఖిలాఫత్ వ్యవస్థ పతనమై రాజరిక వ్యవస్థ ఏర్పడటానికి దారితీసిన కారణాల వల్ల ముఖ్యంగా ముస్లిం సముదాయంలో మతవిభేదాలు చెల రేగాయి. ప్రారంభంలో ముస్లిం సముదాయం షియా, సున్నీలుగా చీలిపోయింది. ఖిలాఫత్‌కు నిజమైన వారసుడు హజ్రత్ అలి (రజి) మాత్రమే నన్న వాదనతో షియా వర్గం ఉనికిలోకి వచ్చింది. తరువాత షియాలో కూడా చీలికలు ఏర్పడ్డాయి. సిఫ్ఫీన్ యుద్ధకాలంలో అలీ (రజి)కి, అమీర్ ముఆవియా (రజి)కి మధ్య వచ్చిన వివాదం పరిష్కరించే సమయంలో షియాలకు పూర్తి వ్యతిరేకంగా ఖారిజీల పేరుతో మరొక వర్గం పుట్టుకొచ్చింది. ఆ ఇరుపక్షాల తరఫున నియమించబడిన ఇద్దరు మధ్యవర్తుల్లో అమీర్ ముఆవియా (రజి) తరఫు మధ్యవర్తి చేసిన ఒక మోసం కారణంగా హజ్రత్ అలి (రజి) సమర్థకుల్లో కొందరు "దేవుణ్ణి వదలి మానవుల్ని న్యాయనిర్ణేతలుగా అంగీకరించి మీరు అవిశ్వాసి (కాఫిర్) అయ్యార"ని అలీ (రజి)ని నిందిస్తూ వారు ఆయన పక్షం నుండి విడిపోయారు. (వివరాల కోసం 366వ పేజీ చూడండి)

షియా, ఖారిజీల తీవ్రవాదాల కారణంగా 'ముర్‌హిబా' అనే వేరొక వర్గం ఏర్పడింది. హజ్రత్ అలి (రజి), అమీర్ ముఆవియా (రజి)ల అంతర్యుద్ధాలను అరాచకం(ఫిత్నా) అని భావిస్తున్నప్పటికీ రెండు పక్షాల్లో ధర్మం దేని వైపున్నదో అర్థం చేసుకోలేక కొందరు తటస్థంగా ఉండిపోయారు. అంతటితో ఆగకుండా తమ మతవిశ్వాల్ని కూడా వేరుచేసు కున్నారు. ఇస్లాంకు సంబంధించిన విశ్వాసం (ఈమాన్) ఉంటే చాలు, దానికనుగుణమైన ఆచరణ లేకపోయినా, ఎలాంటి ఘోరపాపం చేసినా మనిషి ముక్తి పొందుతాడన్నది వారి నమ్మకం. తత్ఫలితంగా వారిలో అనేకమంది ఘోరమైన పాపాలకు, దారుణమైన నేరాలకు సైతం పాల్పడటానికి ఏమాత్రం వెనకాడలేదు.

ఈ మూడు వర్గాలకు భిన్నంగా ఇంకొక వర్గం కూడా పుట్టుకొచ్చింది. రాజ్యస్థాపనకు నాయకుని ఎంపిక విషయంలో వీరు ఓ ప్రత్యేక సిద్ధాంతాన్ని లేవదీశారు. అందరికీ ఆమోదయోగ్యుడైన వ్యక్తే నాయకుడు అవ్వాలని, బానిసను నాయకుడిగా ఎన్నుకుంటే మరీ మంచిదని, ప్రజలు తలచుకున్నప్పుడు అతడ్ని సులభంగా అధికారం నుండి దించ వచ్చుని కొందరు, దేశంలో రాజకీయ అస్థిరత ఏర్పడినపుడు నాయకుని ఎన్నిక సరి కాదని మరికొందరు, ముస్లిం సముదాయం నీతిన్యాయాలతో మనుగడ సాగిస్తుంటే అసలు నాయకుడి అవసరమే లేదని ఇంకొందరి సిద్ధాంతం. ఈ విధంగా ఈ నాలుగు వర్గాల్లోనూ మరికొన్ని ఉపవర్గాలు ఏర్పడ్డాయి. అయితే ముస్లిం సముదాయంలోని అధికసంఖ్యాకులు మాత్రం వీటికి కాస్త దూరంగానే ఉన్నారు. ఇలా ఇస్లామీయ ఏకైక సమగ్ర నాయకత్వం చీలిపోయింది.

అలాంటి పరిస్థితిలో ముస్లిం సముదాయంలోని పరమ ధర్మపరాయణులైన ఇమాములు, ధర్మవేత్తలు రంగంలోకి దిగి ధార్మిక నాయకత్వాన్ని తమ భుజస్కంధాల పైకి ఎత్తుకున్నారు. అలాంటి ఇమాముల్లో అబూహనీఫా (రహ్మ) ప్రముఖులు.



## 2. విద్యాభ్యాసం, ఫిఖ్హా కూర్పు

కూఫాలో హజ్రత్ అలి (రజి), ఇబ్నెమస్ఊద్ (రజి)ల ఆలోచనా దృక్పథంతో కూడిన పాఠశాలలో ఆయన విద్యాభ్యాసం ప్రారంభమయింది. ఆ ఇద్దరు మహనీయుల తర్వాత వారి శిష్యులు షురైహ్, అల్ఖమా, మస్రూఖ్ (రహ్మ)లు దాని ప్రధానోపాధ్యాయులు అయ్యారు. ఆ కాలం(హి.శ. 62-78)లో వారు ముగ్గురు యావత్తు ఇస్లాంజగత్తులో ప్రఖ్యాతిగాంచారు. ఆ తరువాత ఇబ్రాహీం నఖయి, ఆయన తరువాత హమ్మాద్ ఆ పాఠశాల ప్రధానాచార్యులు అయ్యారు. ఇమామ్ అబూహనీఫా (రహ్మ) 18 సంవత్సరాలు హమ్మాద్‌గారి శిష్యరికంలోనే విద్యాభ్యాసం చేశారు. అయితే ఆయన హమ్మాద్ గారి శిష్యరికంలో నేర్చుకున్న విద్యతోనే తృప్తిచెందలేదు. హజ్‌దినాల్లో మక్కా వెళ్ళి ఇతర ఉన్నత విద్యావంతుల దగ్గర కూడా జ్ఞానార్జన చేశారు. కూఫావిద్యాలయం ప్రధానా చార్యులు హమ్మాద్ చనిపోయిన తర్వాత హమ్మాద్‌గారి శిష్యులు ఇమామ్ అబూహనీఫా (రహ్మ)ను ఆయన వారసుడిగా, ప్రధానాచార్యుడిగా ఎన్నుకున్నారు. ఇలా ఆయన ఆ పాఠశాలలో 30 సంవత్సరాల పాటు పనిచేసి హనఫీ ఫిఖ్హాకు పునాదులు వేశారు.

ఆ 30 ఏళ్ళ కాలంలో ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) కొందరి కథనం ప్రకారం చట్టపరమైన 60 వేల సమస్యలకు సమాధానాలిచ్చారు. మరికొందరి కథనం ప్రకారం 83 వేల సమస్యలకు సమాధానలిచ్చారు. ఇవన్నీ ఆయన జీవితకాలంలోనే వివిధ శీర్షికల క్రింద కూర్చబడ్డాయి. ఇమామ్ (రహ్మలై) ఫిఖ్హాకూర్పు సందర్భంలో తన శిష్యుల్ని సమావేశపరచి, ఒక్కొక్క సమస్య గురించి వారి ముందు చర్చించి, వారి సలహాలను కూడా పరిగణనలోకి తీసుకొని మరీ అంతిమ నిర్ణయానికి వచ్చేవారు. ఆయన దగ్గర విద్య నేర్చుకున్న దాదాపు 800 మంది శిష్యుల్లో అత్యధికమంది ఇస్లాం జగత్తులోని వివిధ ప్రాంతాలకు చేరుకొని తమ విద్యాపాటవంతో ప్రజలను అమితంగా ఆకట్టు కున్నారు. ఇమామ్ శిష్యుల్లో 50 మంది ఆయన తదనంతరం బనూఅబ్బాసీ రాజ్యంలో ఖాజీ (న్యాయమూర్తు)లు అయ్యారు. ఆయన స్థాపించిన హనఫీ ఫిఖ్హా ఇస్లాంజగత్తు లోని అత్యధిక భూభాగంలో వ్యాపించింది.

హనఫీ ఫిఖ్హా కూర్పు జరిగిన తరువాత ప్రజలు, పాలకులు, న్యాయమూర్తులు, అందరూ మార్గాంతరంలేక దాని వైపే దృష్టి సారించారు. సుప్రసిద్ధ ఫిఖ్హావేత్త యహ్యా బిన్ ఆదమ్ దాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "అబూహనీఫా గారి ప్రవచనాల సమక్షంలో ఇతర ఫిఖ్హావేత్తల ప్రవచనాల బజారు చల్లబడి పోయింది. ఆయన కూర్చిన ఫిఖ్హావిద్యే వివిధ ప్రాంతాల్లో విస్తరించింది. దాని ఆధారంగానే ఖలీఫాలు, అధికారులు, ఇమాములు నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. ప్రజల వ్యవహారాలన్నీ దాని ప్రకారమే జరగసాగాయి. ఖలీఫా మామూన్ పాలనాకాలం నాటికి హనఫీఫిఖ్హా యావత్తు ఇస్లాం జగత్తులో విస్తరించి ప్రఖ్యాతి గాంచింది. అతని పాలనాకాలంలో అధికారులంతా హనఫీ ఫిఖ్హా ప్రకారమే నిర్ణయాలు తీసుకునేవారు. ఈ ఫిఖ్హాయే అబ్బాసీ, సల్జూఖీ, ఉస్మానీ, మొగల్ రాజ్యాల చట్టమై పోయింది. ఈనాడు చైనానుండి టర్కీదాకా కోట్లాది మంది ముస్లింలు హనఫీ ఫిఖ్హానే అనుసరిస్తున్నారు.

ఫిఖ్హాకూర్పులో తీసుకునే ఆధారాలు, రిఫరెన్సుల విషయమై ఇమామ్ అనుసరించిన విధానం ఆయన మాటల్లో ఈవిధంగా ఉంది: "నేను సమస్యపరిష్కారం కోసం దైవగ్రంథం (ఖుర్‌ఆన్)లో స్పష్టమైనఆజ్ఞ ఏదైనా లభిస్తే దాన్ని పట్టుకుంటాను. అందులో లభించకపోతే, నమ్మదగిన(సిఖా) ఉల్లేఖకులద్వారా ప్రసిద్ధిచెందిన ప్రవక్త సంప్రదాయాల (సున్నత్)ను, ఆయన సూచనల (ఆసార్)ను స్వీకరిస్తాను. దైవగ్రంథంలోనూ, ప్రవక్త (స) సంప్రదాయాల్లోనూ లభించకపోతే దైవప్రవక్త (స) అనుచరుల ప్రవచనాలను అనుసరిస్తాను. ఒకవేళ వారిలో భేదాభిప్రాయాలు ఉంటే, నేను తలచుకున్న ప్రవక్తఅనుచరుని ప్రవచనాన్ని స్వీకరిస్తాను. అంతేగాని వారందరినీ వదలిపెట్టి బయట మరెవరి మాటనూ స్వీకరించను... పోతే 'ఇజ్తెహాద్' (కృషి) చేసే హక్కు ఇతరులకున్నట్లు నాకూ ఉంది.

ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై)కు బలహీనమైన హదీసు లభించినాసరే దాని సమక్షంలో ఆయన ఊహాగానం (ఖ్యాస్)ను, స్వభిప్రాయాన్ని వదలిపెట్టేవారని ఇమామ్ శిష్యుల ఏకాభిప్రాయం. కాని ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ఖుర్‌ఆన్, హదీసులకు సంబంధించిన స్పష్టమైన ఆజ్ఞ (నస్) సమక్షంలో ఊహాగానం (ఖ్యాస్)కు, స్వభిప్రాయానికి ప్రాధాన్యత ఇస్తారని ఆయన ప్రత్యర్థులు ఆరోపించేవారు. దాన్ని ఆయన ఖండించారు కూడా. అయినప్పటికీ ప్రత్యర్థులు ఆ పాటనే పాడుతూవుండటం విచారకరం. చివరికి ఖలీఫా మన్సూర్ కూడా ఈ దుష్ప్రచారానికి గురయి ఇమామ్‌ని ప్రశ్నించాడు. ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) అతని ప్రశ్నకు ఇలా సమాధానమిచ్చారు:

"విశ్వాసుల నాయకా! మీరు విన్న మాట నిజంకాదు. నేను అన్నిటికంటే ముందు దైవగ్రంథం ప్రకారం నడచుకుంటాను. తరువాత దైవప్రవక్త (స) సంప్రదాయం (సున్నత్) ప్రకారం. ఆ తర్వాత శ్రేయస్కర ఖలీఫాలైన అబూబకర్, ఉమర్, ఉస్మాన్, అలి (రజి)ల నిర్ణయాలను, ఆతర్వాత మిగిలిన సహాబీల నిర్ణయాలను అనుసరిస్తాను. ఆ సహాబీలలో అభిప్రాయభేదాలుంటే నేను ఊహ (ఖ్యాస్) ద్వారా నిర్ణయం తీసుకుంటాను."

## 3. ఇమామ్ ధర్మపరాయణత

ఇమామ్ అబూహనీఫా (రహ్మా) ఉపాధి కోసం తన పూర్వీకుల్లా వ్యాపారాన్నే ఎంచుకున్నారు. కూఫాలో ఆయనకు వస్త్రవ్యాపారం ఉండేది. అది ఎంతో వృద్ధిచెందింది. ఆయనకు వస్త్రకర్మాగారం కూడా ఉండింది. అందులో తయారయ్యే వస్త్రాలు సుదూర ప్రాంతాల్లో కూడా అమ్ముడుపోయేవి. ఇమామ్ అబూహనీఫా (రహ్మా) ఎంతో నిజాయితీ, నమ్మకంగల వ్యాపారవేత్తగా ఖ్యాతిచెందారు. దాంతో ప్రజలు ఆయన దగ్గర లక్షలాది రూపాయలు దాచుకునేవారు. ఆయనగృహం ఓ పెద్దబ్యాంకులా తయారైంది. ఆయన చనిపోయేనాటికి ఆ బ్యాంకులో అయిదు కోట్ల దిర్హంలు జమఅయి ఉన్నాయి.

ఒకసారి ఇమామ్ సరుకు అమ్మడానికి తన భాగస్వామి నొకడ్ని పంపిస్తూ "ఇందులో ఉన్న నాణ్యతలేని సరుకు సంగతి కూడా కొనుగోలుదారునికి తెలియజేసి మరీ అమ్మాల"ని చెప్పారు. కాని అతని భాగస్వామి కొనుగోలుదారులకు ఆ విషయం చెప్పకుండా సరుకు అమ్మేశాడు. అంచేత ఇమామ్ సరుకు అమ్మకం ద్వారా వచ్చిన మొత్తం పైకం



(35,000/-దిర్హంలు) దానం చేశారు. సరుకు అమ్ముకోవడానికి ఇమామ్ దుకాణానికి వచ్చేవారిలో కొందరు తమ సరుకు ధర తక్కువగా చెప్పేవారు. అప్పుడు ఇమామ్ 'మీ సరుకు ఇంతకంటే ఎక్కువ ధర పలుకుతుంద'ని చెప్పి అంత ధర చెల్లించేవారు. ఫిఖ్హా కూర్పులో ఆర్థికరంగంలోని అనేక సమస్యల్ని కూడా ఎదుర్కోవలసి వచ్చింది. అందులో ఆయనకు తన వ్యాపార అనుభవం ఎంతో ఉపకరించింది.

ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ఎంత నిజాయితీకలవారో పైరెండు పేరాల ద్వారా తెలుస్తూనే ఉంది. ప్రఖ్యాత హదీసువేత్త అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మాలై) కథనం : "నేను ఇమామ్ అబూహనీఫాను మించిన ధర్మపరాయణుడు ఎవరినీ చూడలేదు. ఆయన ముందు ప్రపంచం, దాని సిరిసంపదలు ఉంచబడ్డాయి, కాని ఆయన వాటిని త్రోసిపుచ్చాడు. కొరడాతో వీపు చిట్లగొట్టినా ఆయన తన దృక్పథంలో స్థిరంగా ఉన్నారు. ఏ పదవీహోదాల కోసం ప్రజలు వెంపర్లాడుతారో వాటిని ఆయన ఎన్నడూ స్వీకరించలేదు." హసన్ బిన్ జియాద్ కథనం: "దైవసాక్షిగా చెబుతున్నాను. అబూహనీఫా ఎన్నడూ ఏ నాయకుడి నుండీ పారితోషికం స్వీకరించలేదు."

ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) గొప్ప దానశీలి కూడా. ఆయన తన వ్యాపారం వచ్చే లాభాల్లో అత్యధిక భాగం తన శిష్యులకు, ధర్మవేత్తలకు సహాయం చేయడానికి ప్రత్యేకించేవారు. సంవత్సరాంతంలో తన ఖర్చులు పోగా ఏదైనా మిగిలితే దాన్ని కూడా ఆయన శిష్యుల బాగోగుల కోసమే వినియోగించేవారు. పైగా, ఎవరికైనా ఆర్థిక సహాయం అందజేస్తున్నప్పుడు "నేను మీకు నా దగ్గర నుండి ఏమీ ఇవ్వడం లేదు. ఇది దైవానుగ్రహం. దీన్ని మీ కోసమే దేవుడు నాకు ప్రసాదించాడు" అని దానగ్రహీతతో చెప్పేవారు. తన శిష్యుల్లో అనేకమంది పోషణబాధ్యత ఆయనే నిర్వహించేవారు. సుప్రసిద్ధ శిష్యుడు ఇమామ్ అబూయూసుఫ్ (రహ్మాలై) కుటుంబం చాలా పేదకుటుంబం. అంచేత ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ఆయన పోషణబాధ్యతే గాకుండా ఆయన కుటుంబ పోషణబాధ్యత కూడా నిర్వహించేవారు.

## 4. ఇమామ్ ఆలోచనా దృక్పథం

ముస్లింసముదాయంలోని అధికసంఖ్యాకుల వర్గాన్ని ధార్మికపరిభాషలో "అహ్లెసున్నత్ వల్‌జమాఅత్" అంటారు. ఇస్లాంజగత్తులోని అధికసంఖ్యాక ముస్లింల (అహ్లెసున్నత్) ధార్మికవిశ్వాసాలు ఎల్లప్పుడూ ఖుర్‌ఆన్-హదీసుల పరిధిలోనే ఉంటున్నాయి. అయితే నాల్గవఖలీఫా కాలంలో ఇస్లామీయ జీవనవ్యవస్థ నుండి రాజకీయవ్యవస్థ వేరైపోయిన ఫలితంగా సమాజంలో అనేక చెడులు చోటుచేసుకున్నాయి. వాటి దుష్ప్రభావం మత విశ్వాసాలపై కూడా పడింది. ముఖ్యంగా షియా, ఖారిజా, ముర్జిబా, మోతజిలా వర్గాలు తమ కొత్తవిశ్వాసాలతో వాదిస్తూ జనసామాన్యంలో గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించాయి. ధర్మజ్ఞానంలో తలపండిన అనేకమంది పండితులు వాటికి ప్రతివాదనలతో సమాధానాలిచ్చేవారు. కాని ఆ సమాధానాలన్నీ అధికసంఖ్యాక ముస్లింల (అహ్లెసున్నత్) ధర్మశాస్త్రం(ఫిఖ్హా)గా నిర్దిష్టంగా, నిర్ద్వందంగా, వ్రాతపూర్వకంగా ఒక రూపు దిద్దుకోలేక పోయాయి. ఈ మహాకార్యం తొలిసారిగా ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) సాధించారు.

ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) సాధించిన ఈ మహాకార్యం పేరే "ఫిఖ్హ్అక్బర్." ఇలా ఆయన ఫిఖ్హ్అక్బర్ రచించి అధికసంఖ్యాక ముస్లింల (అహ్లెసున్నత్ వల్‌జమాఅత్) విశ్వాసాల్ని స్థిరపరిచారు. షియా, ఖారిజీ, ముర్జియా, మోతజిలా వర్గాలు లేవనెత్తిన వివాదాస్పదమైన ప్రశ్నలకు ఆయనీ పుస్తకంలో స్పష్టంగా సమాధానాలు ఇచ్చారు.

ఫిఖ్హ్అక్బర్ ద్వారా స్థిరపరచిన అహ్లెసున్నత్ విశ్వాసాల ప్రకారం శ్రేష్ఠ ఖలీఫాలైన హజ్రాత్ అబూబకర్ (రజి), ఉమర్ ఫారూఖ్ (రజి), ఉస్మాన్ గని (రజి), అలి ముర్తుజా (రజి) నల్గురూ సత్యం పక్షానే ఉన్నారు. వారు ఖలీఫాలైన వరుసక్రమం కూడా సరైనదే. ప్రవక్త ప్రత్యక్షఅనుచరుల (సహాబీల) విషయంలో ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) "మేము సహాబీలను గురించి మంచిగా తప్ప మరేవిధంగానూ ప్రస్తావించము" అని అన్నారు. 'అఖీదా తహావియా'లో దాని వివరణ ఇలా ఉంది: "మేము దైవప్రవక్త (సల్లం) ప్రత్యక్ష అనుచరులందర్నీ ప్రేమిస్తాము. వారిలో ఏఒక్కరి ప్రేమాభిమానాల విషయంలోనూ హద్దుమీరిపోము. అలాగే వారిలో ఎవరినీ కించపరిచే చేష్టలకు పాల్పడము..."

అయితే సహాబీల అంతర్‌యుద్ధాల విషయంలో ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) తన వ్యక్తిగత అభిప్రాయం వెల్లడించడంలో ఏమాత్రం వెనకాడలేదు. జమల్, సిఫ్ఫీన్ అంతర్‌యుద్ధాల్లో హజ్రత్ అలీ (రజి)కి వ్యతిరేకంగా పాల్గొన్న సహాబీల విషయంలో ఆయన స్పష్టంగా ఇలా వ్యాఖ్యానించారు: "హజ్రత్ అలీ (రజి)కి వ్యతిరేకంగా యుద్ధం చేసినవారి కంటే హజ్రత్ అలీ (రజి)యే ఎక్కువగా సత్యం పక్షాన ఉన్నారు."

ఇమామ్ (రహ్మలై) అభిప్రాయం ప్రకారం "నోటితో పలికి, హృదయపూర్వకంగా దాన్ని ధృవీకరించడాన్నే విశ్వాసం (ఈమాన్) అంటారు. విశ్వాసం వేరు, ఆచరణ వేరు. ఏ ముస్లిం అయినా ఎలాంటి పాపకార్యం చేసినప్పటికీ, అది అధర్మకార్యమేనని విశ్వసిస్తున్నంతవరకూ అతడ్ని అవిశ్వాసి(కాఫిర్) అని పరిగణించకూడదు. ఒక విశ్వాసి దుర్మార్గుడు (ఫాసిఖ్) కావచ్చు కాని, అవిశ్వాసి(కాఫిర్) కాలేడు. ముహమ్మద్ (సల్లం) అనుచర సముదాయంలోని పాపాత్ములంతా విశ్వాసులే, అవిశ్వాసులు కాదు. ఆచరణ వాస్తవానికి విశ్వాసం అంతర్భాగమనే, పాపకార్యం విశ్వాసరాహిత్యం పర్యవసానమేనన్న ఖారిజీల ఆలోచనావైఖరిని ఇమామ్ (రహ్మలై) తీవ్రంగా ఖండించారు.

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "వ్యభిచారి వ్యభిచారం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. తాగుబోతు మద్యం సేవిస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. దొంగ దొంగతనం చేస్తున్నప్పుడు విశ్వాసిగా ఉండడు. ఆ తర్వాత పశ్చాత్తాపంతో దేవుడ్ని క్షమాపణ చెప్పుకుంటే అది స్వీకరించబడుతుంది." (ముస్లిం)

పై హదీసుని బట్టి పాపం చేస్తున్నప్పుడు మాత్రమే మనిషిలో విశ్వాసం ఉండదని తెలుస్తోంది. అంతేగాని, పాపంవల్ల అతను కాఫిర్ అవుతాడని లేదు. పైగా పాపం చేసిన తర్వాత దేవుడ్ని క్షమాపణ చెప్పుకుంటే అది స్వీకరించబడుతుందని కూడా తెలుస్తోంది.

ఒకసారి కొందరు ఖారిజీలు ఇమామ్ దగ్గరకు వచ్చి "మస్జిద్ ద్వారం దగ్గర రెండు మృతదేహాలు ఉన్నాయి. ఒకటి సారాయి తాగి చనిపోయినవాడి శవం; రెండవది



వ్యభిచారంతో గర్భిణీ అయి, సిగ్గుతో ఆత్మహత్య చేసుకున్న స్త్రీ శవం" అని చెప్పారు. ఇమామ్ వారి మాటల అంతరార్థం గ్రహించి "వారిద్దరు ఏ మతానికి చెందినవారు? యూదమతానికి చెందినవారా?" అని అడిగారు. దానికి ఖారిజీలు కాదన్నారు. "మరి క్రైస్తవమతానికి చెందినవారా?" అనడిగారు ఇమామ్ (రహ్మలై). దానికీ వారు కాదన్నారు. "పోనీ, అగ్నిపూజారులా వారు?" ప్రశ్నించారు ఇమామ్ మళ్ళీ. దానికీ వారు కాదన్నారు. "మరే మతానికి చెందినవారు?" అనడిగారు ఇమామ్ (రహ్మ). దానికి ఖారిజీలు "వారు ఇస్లాం సద్వచనసాక్ష్యం ఇచ్చినవారి మతానికి చెందినవారు" అన్నారు. "అయితే ఇస్లాం పట్ల ఉండవలసిన విశ్వాసంలో వారివిశ్వాసం మూడోవంతు ఉంటుందా లేక నాల్గోవంతు ఉంటుందా లేక అయిదోవంతు ఉంటుందా?" అడిగారు ఇమామ్ (రహ్మలై). దానికి ఖారిజీలు "విశ్వాసం మూడోవంతు, నాల్గోవంతు, ఐదోవంతు అని ఉండదు" అని అన్నారు. "ఇంతకూ మీరు ఇస్లాం సద్వచనసాక్ష్యం విశ్వాసంలో ఎంత భాగమయి ఉంటుందని భావిస్తున్నారు?" అనడిగారు ఇమామ్ (రహ్మలై). దానికి వారు, అందులో పూర్తివిశ్వాసం ఉంటుందని చెప్పారు. ఇమామ్ ఈమాట వినగానే "మీరు స్వయంగా వారిని విశ్వాసులని అంగీకరిస్తున్నప్పుడు, ఇక మీరు నన్ను దేన్ని గురించి అడుగుతున్నారు?" అని అన్నారు. "వారు నరకవాసులవుతారా లేక స్వర్గవాసులవుతారా అని అడుగుతున్నాం" అన్నారు ఖారిజీలు. అప్పుడు ఇమామ్ (రహ్మలై) ఇలా చెప్పారు:

"ఘోరపాపాలు చేసినవారి విషయంలో ఇబ్రాహీం ప్రవక్త (అలైహి) ఏమన్నారో అదే నేను చెబుతాను. ఆయన ఇలా అన్నారు- 'ప్రభూ! నా విధానానికి వ్యతిరేకంగా నడిచే వారికి (నీవే దిక్కు.) నీవు క్షమించేవాడవు, కరుణించేవాడవు.' (ఖుర్ఆన్-14:36). అంతకంటే ఘోరమైన పాపాలు చేసినవారి గురించి మరొక దైవప్రవక్త ఈసా (అలైహి) ఇలా అన్నారు- 'ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీ దాసులే. ఒకవేళ క్షమిస్తే మీరు ఎంతో శక్తిమంతులు, మహా వివేకవంతులు.' (ఖుర్ఆన్-5:118). వేరొక దైవప్రవక్త నూహ్ (అలైహి) ఇలా అన్నారు- 'వారి లెక్కాపత్రం చూడటం నా ప్రభువు బాధ్యత. మీరు విషయం అర్థం చేసుకుంటే బాగుంటుంది. నేను విశ్వసించినవారిని నా దగ్గర్నుంచి వెళ్ళగొట్టలేను.' (ఖుర్ఆన్-26:113,114)." ఖారిజీలు ఈ సమాధానం విని తమ తప్పు అంగీకరించి వెళ్ళిపోయారు.

పాపంచేసే ముస్లింలను గురించి ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) తన దృక్పథాన్ని ఇలా తెలిపారు: "విశ్వాసికి పాపకార్యం నష్టదాయకం కాదని మేము చెప్పము. అదీగాక అలాంటి విశ్వాసి నరకానికి పోడని గాని, అతను ఎల్లప్పుడూ నరకంలోనే పడివుంటాడని గాని కూడా మేము చెప్పము" (ముల్లా అలిఖారి). "అలాగే ముర్జియా వర్గం అంటున్నట్లు 'మన పుణ్యకార్యాలు తప్పకుండా స్వీకరించబడతాయని, మన పాపకార్యాలు తప్పకుండా క్షమించబడతాయ'ని కూడా మేము చెప్పము" (ముల్లా అలిఖారి).

ఈవిధంగా ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) షియా, ఖారిజీ, ముర్జియా, మోతజిల వర్గాల అతివాదపు అభిప్రాయాల సమక్షంలో ముస్లిం సమాజాన్ని పరస్పరం విద్వేషం, వివాదాల ఊబి నుండి బయటపడవేసి, దాని ప్రజలను పాపకార్యాలకు పాల్పడే దుస్సా

హసం నుండి నిరోధించడానికి ఓ సమతుల్యమైన విశ్వాసాన్ని ప్రవేశపెట్టారు. విశ్వాసం (ఈమాన్)కు సంబంధించిన ఈ సిద్ధాంతం ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) కనిపెట్టిన కొత్త సిద్ధాంతం ఏమీ కాదు. ఇది దైవప్రవక్త (స) కాలం నుండీ ముస్లిం సముదాయం లోని అధికసంఖ్యాకులు అనుసరిస్తున్న పాత సిద్ధాంతమే. కాకపోతే ఇమామ్‌గారు దాన్ని గ్రంథరూపేణ ప్రజల ముందుంచారు. అదేవిధంగా రాజ్యాధినేతలు, గవర్నర్లు, సేనా పతులు, న్యాయమూర్తులు, ఇతర అధికారులు సరైన సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా ఆయన ఇస్లామీయ షరీఅత్ (ధర్మశాస్త్రం)కు సంబంధించిన చట్టాల విషయమై వారికి నిత్యజీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు తన శిష్యుల సలహా, సహకారా లతో సమాధానాలు ఇస్తూ సమగ్రమైన ఫిఖ్హా (ధర్మావగాహన)ను సంకలనం చేశారు. ఇది ఆయన ముస్లిం సముదాయానికి చేసిన అత్భుతమైన అపూర్వసేవ అని చెప్పవచ్చు.

## 5. మన్సూర్ పాలనార్హతను ప్రశ్నించిన ఇమామ్

ఖలీఫా మన్సూర్ ఒకసారి ఇమామ్ మాలిక్, ఇమామ్ ఇబ్నె అబీజిబ్, ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై)లను పిలిపించి ఇలా ప్రశ్నించాడు: "ఈ అనుచర సముదాయంలో దేవుడు నాకు ప్రసాదించిన ఈ ప్రభుత్వం గురించి మీ అభిప్రాయం ఏమిటీ? నేను దీనికి అర్హుడినా కానా?" ఇమామ్ మాలిక్ (రహ్మాలై) సమాధానమిస్తూ "మీరందుకు అర్హులు కాకపోతే దేవుడు మీకు దీన్ని అప్పగించేవాడే కాదు" అని అన్నారు.

ఇమామ్ ఇబ్నె అబీజిబ్ ఇలా సమాధానమిచ్చారు: "ఇహలోక రాజరికాన్ని దేవుడు తాను కోరిన వ్యక్తికి ప్రసాదిస్తాడు. కాని పరలోక రాజరికాన్ని దాన్ని కోరుకున్న వ్యక్తికి, తాను సద్బుద్ధి ప్రసాదించిన వ్యక్తికి మాత్రమే ఇస్తాడు. మీరు దేవునికి విధేయిస్తే ఆయన ప్రసాదించే సద్బుద్ధి మీకు చేరువవుతుంది. ఒకవేళ మీరు దేవునికి అవిధేయులైపోతే అది మీనుండి దూరమవుతుంది. నిజం చెప్పాలంటే ఖిలాఫత్ దైవభీతి పరాయణుల ఏకాభి ప్రాయంతోనే నెలకొంటుంది. మీకు, మీ సహాయకులకు ఆ సద్బుద్ధి లభించలేదు. మీరు సత్యానికి విముఖులై పోయారు. ఇప్పటికైనా మీరు దేవుణ్ని శాంతి కోరుకొని సదాచరణ ద్వారా ఆయన సాన్నిధ్యం పొందగలిగితే ఆ సద్బుద్ధి మీకు లభిస్తుంది."

ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ఇలా తెలియజేస్తున్నారు: "ఇబ్నె అబీజిబ్ ఇలా మాట్లాడుతున్నప్పుడు మన్సూర్ అతని శిరస్సు ఖండిస్తాడేమోనని, మా బట్టలపై రక్తం వచ్చిపడుతుందేమోనని భయపడి నేను, మాలిక్ బట్టలను దగ్గరకు లాకున్నాము."

ఆ తర్వాత మన్సూర్ ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) వైపు తిరిగి 'మీ అభిప్రాయం ఏమిట'ని అడిగాడు. దానికి ఇమామ్ ఇలా సమాధానం చెప్పారు:

"తన ధర్మంకోసం సత్యాన్వేషణ చేసేవాడు ఆగ్రహానికి ఆమడదూరంలో ఉంటాడు. మీరు మీ అంతరంగంలోకి తొంగిచూస్తే మీరు మమ్మల్ని దైవప్రసన్నత కోసం పిలిపించ లేదని, మేము మీకు భయపడి మీ అభిమతానికి అనుకూలంగా మాట్లాడేలా వత్తిడి చేయడానికి మాత్రమే పిలిపించారని మీకే తెలుస్తుంది. ఖిలాఫత్ అధికసంఖ్యాకుల అభి ప్రాయం, వారి సలహాలతో నెలకొంటుంది. కాని మీ ఖిలాఫత్ కోసం ధర్మపరాయణులు,



ధర్మవేత్తల్లో కనీసం ఇద్దరి ఏకాభిప్రాయం కూడా లేదు. అబూబకర్ (రజి) యమన్ ప్రజల 'బైత్' రానంతవరకూ ఆర్నెల్ల పాటు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు."

ఇలా చెప్పిన తర్వాత ఆ ముగ్గురు ఇమాములు అనుమతి తీసుకొని వెళ్ళిపోయారు. వారెళ్ళిపోయిన తర్వాత మన్సూర్ ఒక సైన్యాధికారికి మూడు డబ్బు సంచులిచ్చి "డబ్బు మాలిక్ స్వీకరిస్తే అతనికి ఇచ్చేయాలి. ఇబ్నె అబీజిబ్, అబూహనీఫా స్వీకరిస్తే మాత్రం వారిద్దరి తలలు నరికి తీసుకురావాలి" అని చెప్పి పంపాడు.

ఇమామ్ మాలిక్ (రహ్మాలై) తన ముందుకొచ్చిన పారితోషికాన్ని స్వీకరించారు. తరువాత సైన్యాధికారి ఇబ్నె అబీజిబ్ దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయన దాన్ని స్వీకరించ డానికి నిరాకరిస్తూ "ఇది ఖలీఫా కోసం కూడా ధర్మసమ్మతం కాదని భావిస్తున్నాను. నా కోసం ధర్మసమ్మతమని నేనెలా భావిస్తాను?" అని అన్నారు. ఆ తరువాత సైన్యాధికారి ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) వద్దకు వెళ్ళాడు. ఆయన కూడా పారితోషికం స్వీకరించ డానికి నిరాకరిస్తూ "నా తల నరికి పారేసినా సరే, నేనీ పైకాన్ని ముట్టుకోను" అన్నారు. ఖలీఫా మన్సూర్ సైన్యాధికారి ద్వారా ఈ విషయం తెలుసుకొని "ఈ నిరాపేక్షే వారిద్దరి ప్రాణాలు కాపాడింది" అని వ్యాఖ్యానించాడు.

## 6. నాయకత్వం (ఇమామత్) ధర్మాధర్మాలు

ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) దృష్టిలో ఇమాములు రెండు విధాలుగా ఉన్నారు. (1) నమాజీలకు నాయకత్వం వహించే ఇమామ్, (2) దేశానికి, ప్రాంతానికి, న్యాయ స్థానానికి నాయకత్వం వహించే ఖలీఫా, పాలకుడు, న్యాయమూర్తి; ధార్మిక తీర్పులు (ఫత్వాలు) జారీచేసే ముఫ్తీ. ఈ రెండు రకాల నాయకుల విషయంలో అబూహనీఫా (రహ్మాలై) దృక్పథం కూడా రెండు రకాలుగా ఉంది.

నమాజ్ చేయించే ఇమామ్ గురించి ఫిఖ్హాఅక్బర్‌లో ఆయన ఇలా అన్నారు: "విశ్వాసుల్లో ప్రతిమనిషి వెనుక నమాజ్ చేయడం ధర్మసమ్మతమే, అతను సజ్జనుడైనా, దుర్జనుడైనా సరే." (ముల్లా అలీ ఖారి).

అఖీదా తహావియాలో ఇమామ్ తహావి హనఫీ దృక్పథాన్ని ఇలా వివరించారు: "ముస్లింల నాయకుడు సజ్జనుడైనా, దుర్జనుడైనా అతని నాయకత్వంలో జిహాద్, హజ్ యాత్రలు ప్రళయందాకా కొనసాగుతాయి. ఈ విధుల్ని ఏ విషయం కూడా అధర్మం చేయలేవు; వాటిని నిరోధించనూ లేవు."

ఇమామ్‌గారి దృక్పథం రెండో రకం ప్రకారం దుర్మార్గుడు, దౌర్జన్యపరుడైన మనిషి ఖలీఫా లేక పాలకుడు లేక న్యాయమూర్తి లేక ముఫ్తీ కాలేడు. అయితే ఒకవేళ ఎవరైనా బలవంతంగా రాజ్యాధినేత అయి, అతను షరీఅత్ ప్రకారం ఏవైనా పనులు చేయిస్తే అవి ప్రజలకు ధర్మసమ్మతమే అవుతాయి. అతను నియమించిన జడ్జీ షరీఅత్ ప్రకారం ఏవైనా తీర్పులు చేస్తే అవి అమలవుతాయి.

యదార్థవాది లోకవిరోధి అయినట్లు ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) యదార్థం చెప్పి పాలకుల ఆగ్రహానికి గురై కఠిన శిక్షలు అనుభవించవలసి వచ్చింది.

హిజ్రీశకం 130లో బనూఉమయ్యా రాజ్యం పతనావస్థకు చేరుకున్నప్పుడు ఇరాఖ్ గవర్నర్ ఇబ్నెహుబైరా సుప్రసిద్ధ ఫిఖ్హావేత్తలకు పెద్దపెద్ద హోదాలిచ్చి వారి ద్వారా ప్రజా బాహుళ్యంలో తన పలుకుబడి పెంచుకోవాలని భావించాడు. అప్పుడతను ఇబ్నెఅబీ లైలా, దావూద్ బిన్ అబుల్‌హింద్, ఇబ్నె షుబ్రుమా వగైరా ఫిఖ్హావేత్తలను పిలిపించి వారికి తన ప్రభుత్వంలో మంచి హోదాలు ఇచ్చాడు. అలాగే ఇమామ్ అబూహనీఫాను పిలిపించి "నేను నా రాజముద్రను మీ చేతికి ఇస్తాను. మీరు ముద్ర వేయకుండా ఎలాంటి ఆజ్ఞా అమలు కాదు; మీరు ధృవీకరించనంతవరకూ ప్రభుత్వధనాగారం నుండి ఎలాంటి ధనమూ బయటికి పోదు" అంటూ ప్రలోభజాలం విసిరాడు. కాని ఇమామ్ ఆ బాధ్యత స్వీకరించడానికి ఒప్పుకోలేదు. దాంతో ఇబ్నెహుబైరా కళ్ళెర్రజేస్తూ ఆయన్ని జైల్లో పడేసి కొరడాతో కొట్టిస్తానని బెదిరించాడు.

అయినప్పటికీ ఇమామ్ (రహ్మా) ససేమిరా అన్నారు. ఇతర ఫిఖ్హావేత్తలు ఆయనకు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తూ "మిమ్మల్ని మీరు కనికరించుకోండి. మేమంతా గత్యంతరం లేక ఈ బాధ్యతలు స్వీకరించామే గాని, వీటి పట్ల మేము సంతోషంగా లేము. అంచేత మీరు కూడా ఒప్పుకోండి" అని బ్రతిమాలారు. అయినా ఆయన వినలేదు. గవర్నర్ ఇబ్నె హుబైరా ఆయనకు మరికొన్ని హోదాల ఎరచూపాడు. చివరికి కూఫా జడ్జీగా నియమిస్తూ ఆర్డర్ జారీచేసి "దైవసాక్షి! అబూహనీఫా ఈ బాధ్యత స్వీకరించడానికి నిరాకరిస్తే నేనతడ్ని కొరడాదెబ్బలు కొట్టిస్తాను"అని అన్నాడు. ఇమామ్ ఈ సంగతి విని "పరలోకయాతన కంటే ఇహలోక కొరడాశిక్షే నాకెంతో తేలిక. అంచేత నేను కూడా దైవసాక్షిగా చెబుతున్నా. అతను నన్ను హతమార్చినా సరే, నేను దాన్ని ఎన్నటికీ స్వీకరించను" అని అన్నారు.

ఇబ్నెహుబైరా ఇక లాభం లేదనుకొని ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై)ను జైల్లో వేసి 30 కొరడాదెబ్బలు కొట్టించాడు. మరో ఉల్లేఖనం ప్రకారం ప్రతిరోజూ పది కొరడాదెబ్బలు కొట్టించేవాడు. చివరికి ఆయన చనిపోయే పరిస్థితి వచ్చిందని సమాచారం అందగానే "ఆలోచించుకోవడానికి కొంత వ్యవధి కావాలని నన్నడగమనండి" అని ఆదేశించాడు. ఇమామ్ అబూహనీఫా (రహ్మాలై) ఈమాట తెలుసుకొని "నన్ను విడుదల చేయండి; నేనీ విషయంలో నా స్నేహితులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటాను" అని సమాధానం పంపారు. గవర్నర్ ఇబ్నెహుబైరా ఈ సమాధానం అందగానే ఇమామ్‌ను విడుదలచేశాడు. ఇమామ్ జైలు నుండి విడుదలకాగానే కూఫా నుండి మక్కా వెళ్ళిపోయారు. బనూ ఉమయ్యా పరిపాలన అంతమయ్యే వరకూ ఆయన మక్కాలోనే ఉండిపోయారు.

హి.శ.145లో జరిగిన నఫ్సుజకియా, ఇబ్రాహీంల తిరుగుబాటును ఇమామ్ సమర్థించి నందుకు ప్రజాబలం వల్ల మన్సూర్ శిక్షించలేక ఆయన పట్ల కసి పెంచుకున్నాడు. ఆ తర్వాత అతను ఇమామ్ ముందు చీఫ్‌జస్టిస్ పదవి ఎర విసిరాడు. అనేకసార్లు ఆయన్ని పిలిపించి పరిపరివిధాల ఒప్పించడానికి ప్రయత్నించాడు. కాని ఇమామ్ అతని మాయ దారి మాటలకు లొంగకుండా నిర్ద్వందంగా నిరాకరించారు. చివరికి ఆ దుర్మార్గుడు ఇమామ్‌ని జైల్లో వేసి రకరకాలుగా వేధించాడు; ఆకలిదప్పులతో బాధించాడు. అలా బాధలు అనుభవిస్తూ ఆయన హి.శ. 150లో జైల్లోనే అంతిమశ్వాస వదిలారు.



# 52. మెహ్ది బిన్ మన్సూర్ పరిపాలన

మన్సూర్ మరణానంతరం హిజ్రీశకం 158 జిల్‌హజ్జ నెలలో అతని కొడుకు మెహ్ది పరిపాలనా పగ్గాలు చేబట్టాడు. మన్సూర్ జీవితకాలంలో అతను సేనాపతిగా అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. నాలుగేండ్ల పాటు 'రే' ప్రాంతానికి గవర్నర్‌గా కూడా పని చేశాడు. మన్సూర్ తన ప్రత్యర్థుల్ని వారి మద్దతుదారుల్ని, అలి (రజి) సంతతి సమర్థకుల్ని పూర్తిగా అణచివేశాడు. వారిలో అనేకమందిని హతమార్చడమో, జైళ్ళలో పడవేయడమో చేశాడు. మహ్ది సింహాసనం అధిష్టించగానే జైళ్ళలో మగ్గుతుండిన వారందర్నీ విడుదల చేశాడు; వారి మీదుండిన ఆంక్షలన్నీ ఎత్తివేశాడు; జప్తుచేసిన వారి ఆస్తులన్నిటిని తిరిగి ఇచ్చివేశాడు. దాంతో ప్రజలు అతని దయార్ద్ర ప్రవర్తన పట్ల చాలా సంతోషించారు.

## 1. జందఖీల (చార్వాకుల) తిరుగుబాటు

మహ్ది పాలనాకాలంలో ఖురాసాన్ రాష్ట్రానికి చెందిన హకమ్ బిన్ హాకిమ్ అనేవాడు తనను తాను దేవుడని ప్రకటించుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవ దీశాడు. అతను గతంలో అబ్బాసీ ప్రభుత్వస్థాపనలో కీలకపాత్ర వహించిన అబూముస్లిం ఖురాసానికి కార్యదర్శిగా పనిచేశాడు. అతను కురూపి అయినందున ఎల్లప్పుడూ ముఖానికి ముసుగు ధరించివుంటాడు. అంచేత అతను "బుర్ఖయి" పేరుతో ప్రసిద్ధి చెందాడు. బుర్ఖయి పునర్జన్మ సిద్ధాంతాన్ని లేవదీసి, దేవుడు మొదట ఆదం (అలైహి) అవతారంలో జన్మించాడని, తరువాత నూహ్ (అలైహి) అవతారంలో, ఇలా ప్రవక్తలందరి అవతారాల్లో జన్మిస్తూ అబూసలీం అవతారంలో, చివరికిప్పుడు నా అవతారంలో పునర్జన్మ ఎత్తాడని ప్రచారం చేసుకున్నాడు. బుర్ఖయి మహిమలు, మ్యాజిక్కులు ప్రదర్శించడంలో ఆరితేరినవాడైనందున ఒకసారి అతను ఓ నూతిలో కృత్రిమ చంద్రుడ్ని సృష్టించాడు. దాని కాంతి అనేకమైళ్ళు విస్తరించింది. దాంతో పిచ్చిజనం అతడ్ని దేవుడిగా భావించి పిచ్చిపిచ్చిగా అభిమానించడం ప్రారంభించారు.

ఇలా బుర్ఖయి అభిమానులు వేలసంఖ్యలో పెరగడంతో అతను వారి సహకారంతో కొన్ని కోటలు వశపరచుకున్నాడు. ఖలీఫా మహ్ది మతవిషయంలో చాలా కఠినంగా వ్యవ హరించేవాడు. ఇప్పుడీ అరాచకాన్ని అంతమొందించడానికి అతను ఒకరి తర్వాత ఒకరు చొప్పున ఇద్దరు సేనాపతుల్ని పంపాడు. ఆ యుద్ధంలో బర్ఖయి అనుచరులు 30 వేలమంది మృత్యువాతపడ్డారు. బుర్ఖయి తప్పించుకునే దారిలేక తన భార్యాపిల్లలకు విషమిచ్చి చంపి తననుతాను కాల్చి చంపుకున్నాడు. ఆ తర్వాత మరికొందరు తిరుగు బాటులు లేవదీసి ప్రభుత్వసైన్యం చేతిలో చావుదెబ్బ తిన్నారు.

## 2. ప్రధానమంత్రిత్వ శాఖ

మహ్ది పాలనలో అబూఉబైదుల్లా మొదటి ప్రధానమంత్రిగా నియమించబడ్డాడు. అతను ఎంతో తెలివితేటలు గలవాడు; పాలనావ్యవస్థలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టాడు; ప్రభుత్వశాఖలన్నిటినీ పునర్వ్యవస్థీకరించాడు; రెవెన్యూచట్టం గురించి ఒక పుస్తకం కూడా రాశాడు. ఈ విషయంపై మొట్టమొదటి పుస్తకం ఇదే.

అబూఉబైదుల్లా ఇన్ని ప్రతిభాపాటవాలు, ఘనకార్యాలతో ఖలీఫా హృదయాన్ని మరింత చూరగొన్నాడు. అయితే దాంతో అతను గర్వపోతు అయ్యాడు. మన్సూర్ పాలనలో తనకు ఎన్మో మేళ్ళు చేసిన ప్రాణస్నేహితుడు రబీ బిన్ హాజిబ్‌ను సైతం ఖాతరు చేసేవాడు కాదు. అబూఉబైదుల్లా ప్రధానమంత్రి అయిన తరువాత రబీ బిన్ హాజిబ్ ఓసారి అతడ్ని కలుసుకోవడానికి వచ్చాడు. అప్పుడు అబూఉబైదుల్లా మరింత అహంకారంతో ప్రవర్తిస్తూ అతడ్ని అవమానించాడు. రబీ ఈ అవమానంతో అతని మీద కక్ష పెంచుకొని ప్రతీకారం కోసం ఎదురుచూడసాగాడు.

ఓరోజు అతను ఖలీఫా దర్బారుకు వెళ్ళి "అబూఉబైదుల్లా కొడుకు ముహమ్మద్ 'హాఫిజె ఖుర్‌ఆన్' అన్నారుగా, కాని అతను నాస్తికుల్లో చేరిపోయాడు" అని అన్నాడు. ఖలీఫా మహ్ది ఈమాట వినగానే అతడ్ని దర్బారుకు పిలిపించి "ఖుర్‌ఆన్ పఠించు" అని ఆదేశించాడు. కాని ముహమ్మద్ ఖుర్‌ఆన్‌ని తప్పుగా పఠించాడు. ఆ సమయంలో అబూఉబైదుల్లా కూడా అక్కడే ఉన్నాడు. మహ్ది భృకుటి ముడిచి "నీ కొడుకు హాఫిజె ఖుర్‌ఆన్ అన్నావుగా, ఇప్పుడు చూసుకున్నావుగా వీడి నిర్వాకం. ఇక లేచి నీ చేతులతోనే ఈ నాస్తికుడ్ని హతమార్చు" అని ఆదేశించాడు.

అబూఉబైదుల్లా ఈ మాట వినగానే వణికిపోయాడు. అలా వణుకుతూనే రాజాజ్ఞను శిరసావహించడానికి లేచినిలబడ్డాడు. కాని కళ్ళుతిరిగి కింద పడిపోయాడు. అప్పుడు ఖలీఫా సలహాదారుడొకడు "ఈ వృద్ధమంత్రిని కనికరించండి; ఇతడ్ని తన చేతులతో తన కొడుకుని హతమార్చమని వత్తిడి చేయకండి" అని మనవిచేశాడు. దానికి మహ్ది అంగీకరించి ముహమ్మద్‌ని తలారి చేత ఉరితీయించాడు.

ఈ సంఘటన తరువాత అబూఉబైదుల్లా మీద ఖలీఫా మనసులో అనుమానం తిష్ఠవేసింది. అతనిలో ఆ ద్వేషాగ్నిని రబీ బిన్ హాజిబ్ మరింత ఎగదోశాడు. చివరికి ఖలీఫా హి.శ. 161లో ప్రధానమంత్రి పదవి నుండి అబూఉబైదుల్లాని తొలగించి ఆ స్థానంలో యాఖూబ్ బిన్ దావూద్‌ని నియమించాడు.

యాఖూబ్, అతని సోదరుడు అలి బనూఉమయ్యా పాలనాకాలంలో ఖురాసాన్ గవర్నర్ నసర్ బిన్ సయ్యార్ ఆస్థానంలో కార్యదర్శులుగా పని చేస్తుండేవారు. బనీ అబ్బాసీ పాలన వచ్చిన తరువాత వారికి ఎలాంటి విలువ లేకుండా పోయింది. అంచేత ఆ కుటుంబం మన్సూర్ పాలనాకాలంలో నఫ్సజకియా, ఇబ్రాహీంల తిరుగుబాటుకు మద్దతుదారులై పోయారు. ఆ తిరుగుబాటు అణచివేయబడిన తరువాత యాఖూబ్, అలి జైలు పాలయ్యారు. మహ్ది ఖలీఫా అయిన తరువాత ఇతర ఖైదీలందరితో పాటు ఆఇద్దరు కూడా విడుదలయ్యారు. మహ్దీ తనకు అహ్లెబైత్ (అల్వీయుల) నుండి ఎప్పటికైనా ప్రమాదం ఉండవచ్చన్న ఆలోచనతో వారిని అరాచకానికి దూరంగా ఉంచేందుకు ఆ వర్గంలో మంచి పేరుపలుకుబడులుండే వ్యక్తి కోసం అన్వేషించసాగాడు. దాన్నిగురించి రబీ బిన్ హాజిబ్‌ని సలహా అడిగితే అతను యాఖూబ్ పేరు ప్రస్తావించాడు. మహ్ది యాఖూబ్‌ని పిలిపించి అల్వీయులను గురించి విచారించాడు. ఈ విచారణలో యాఖూబ్ ఇచ్చిన సమాధానంతో సంతృప్తిచెంది అతడ్ని తన సలహాదారుల్లో చేర్చు



కున్నాడు. అబూఉబైదుల్లాకు ఉద్వాసన చెప్పిన తరువాత ఖలీఫా మహ్ది అతని స్థానంలో యాఖూబ్‌ని ప్రధానమంత్రిగా నియమించాడు.

యాఖూబ్ కొన్నాళ్ళలోనే తన నీతినిజాయితీలతో ఖలీఫా విశ్వాసాన్ని పూర్తిగా చూరగొని అసాధారణమైన అధికారాలు సంపాదించగలిగాడు. దాంతో దర్బారీలు అతని పట్ల ద్వేషం పెంచుకొని ఖలీఫా దగ్గర అతని మీద లేనిపోని ఆరోపణలు చేస్తూ కుట్రలు పన్నసాగారు. యాఖూబ్ ఇప్పటికీ అల్వీయుల మద్దతుదారుడిగానే ఉన్నాడు. అంచేత అతను ప్రభుత్వయంత్రాంగాలోని కీలకహోదాలన్నీ అల్వీయులకే కట్టబెట్టాడు. ఈవిధంగా పరిపాలనాపగ్గాలు క్రియాత్మకంగా అల్వీయుల చేతికి లభించాయి. దానిపై బనూఅబ్బాసీ దర్బారీలు లోలోన ఉడికిపోతూ "యాఖూబ్ తన ఆచరణతీరుతో ఖిలాఫత్ వ్యవస్థను అల్వీయులకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నాడ"ని తీవ్రంగా ఆరోపించారు. ఖలీఫా మహ్ది ఈమాట విని ఆనాటి నుండి యాఖూబ్‌ని అనుమానాస్పదంగా చూడసాగాడు. ఆ రోజుల్లోనే తిరుగుబాటు కార్యకలాపాలకు పాల్పడుతున్న ఇస్‌హాఖ్ బిన్ ఫజల్‌ని ఈజిప్టు గవర్నర్‌గా నియమించమని యాఖూబ్ ఖలీఫాకు సిఫారసు చేశాడు. దాంతో అతనిపై ఖలీఫాకు అనుమానం మరింత ఎక్కువైపోయింది. అంచేత అతడ్ని పరీక్షించడానికి ఖలీఫా మహ్ది ఒక అల్వీవర్గం మనిషిని అరెస్టు చేయించి ప్రధాని యాఖూబ్ దగ్గరకు పంపి అతడ్ని హతమార్చమని ఆదేశించాడు.

యాఖూబ్ అతడ్ని వేరే చోటికి తీసికెళ్ళి హతమార్చడానికి సిద్ధమయ్యాడు. అయితే అల్వీయులు యాఖూబ్‌ని వారిస్తూ అతడ్ని చంపవద్దని అన్నారు. దాంతో యాఖూబ్ ఆ వ్యక్తిని రహస్యంగా మరోచోటికి తరలించి మహ్ది దగ్గరికి వెళ్ళి, మీ ఆదేశాన్ని శిరసావహించానని చెప్పాడు. కాని ఖలీఫా సేవిక ఒకామె ఖలీఫా మహ్దీకి అసలు విషయం తెలియజేసింది. వెంటనే ఖలీఫా ఆ అల్వీ మనిషిని మళ్ళీ అరెస్టు చేయించి యాఖూబ్ ముందు నిలబెట్టాడు. అది చూసి యాఖూబ్ నిలువునా కంపించిపోయాడు. వెంటనే అతను ఖలీఫా కాళ్ళ మీద పడి ప్రాణబిక్ష పెట్టమని ప్రాధేయపడ్డాడు. ఖలీఫా అతడ్ని చంపలేదు కాని జైల్లో పడేసి అతని ఆస్తిపాస్తులన్నీ జప్తు చేశాడు. అతను నియమించిన అధికారుల్ని పదవుల నుండి తొలగించాడు.

మహ్ది ఆ తరువాత యాఖూబ్ స్థానంలో నీషాపూర్ నివాసి ఫైజ్ బిన్ అబూసాలెహ్‌ని ప్రధానమంత్రిగా నియమించాడు. అతను క్రైస్తవమతం నుండి ఇస్లాంలోకి మారిన నవ ముస్లిం. అతను అసాధారణ తెలివితేటలుగల వ్యక్తి. అతని సలహాసూచనలతో మహ్ది రాజ్యంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. అప్పట్నుంచి మహ్ది తన దృష్టిని పూర్తిగా ప్రజాసంక్షేమ కార్యాలపై కేంద్రీకరించాడు. అంచేత ప్రజలు సుఖసంతోషాలతో శాంతియుతమైన జీవితం గడపసాగారు.

## 3. ప్రజాసంక్షేమ కార్యాలు

ఖలీఫా మహ్ది అధికార విభజన జరిపి పాలనావ్యవస్థను పునర్వ్యవస్థీకరించాడు. మక్కా, మదీనా, యమన్, బగ్దాద్‌ల మధ్య వేగవంతమైన గుర్రాలు, ఒంటెల ద్వారా తపాలా వ్యవస్థను ప్రవేశపెట్టాడు. బాటసారుల సౌకర్యార్థం జాతీయరహదారుల పక్కన

అనేక చోట్ల బావులు తవ్వించి, ధర్మసత్రాలు కట్టించాడు. కుష్టురోగులు, పాండురోగుల్ని భిక్షాటన శ్రమకు లోనవకుండా వారికి పింఛన్లు మంజూరు చేశాడు. ఉపాధిమార్గాలు లేని ఖైదీల భార్యాపిల్లల కోసం కూడా పింఛన్లు మంజూరు చేశాడు. బస్రా జామియా మస్జిద్‌ని విస్తృతపరుస్తూ పునర్నిర్మించాడు. మక్కాలోని కాబామస్జిద్ చుట్టుపక్కల ఉన్న ఇండ్లను కొని దాన్ని విస్తరింపజేశాడు. రష్యా సరిహద్దుల్లో అనేక కోటలు నిర్మించాడు.

ఖలీఫామహ్దీ మతవిశ్వాసాల విషయంలో ఎన్నటికీ రాజీపడేవాడు కాదు. ముఖ్యంగా నాస్తికుల్ని, చార్వాకుల్ని అతను అసలు సహించేవాడు కాదు. వారిని అణచివేయడానికి, వారు వ్యాపింపజేసిన ఇస్లాంవ్యతిరేక విశ్వాసాలను సంస్కరించడానికి అతను గొప్పగొప్ప ధర్మవేత్తలు, ఫిఖ్హావేతల చేత అనేక పుస్తకాలు రాయించాడు.

## 4. న్యాయం, సమానత్వం

న్యాయం, సమానతలు పాటించడంలో మహ్దీ ప్రసిద్ధిచెందాడు. న్యాయమూర్తుల నోటీసుల్ని గౌరవిస్తూ సాధారణ నేరస్థుడిలా న్యాయస్థానానికి హాజరయ్యేవాడు. తీర్పులు తనకు వ్యతిరేకంగా వెలువడినా వాటిని గౌరవించేవాడు. ఓసారి ఒక ఆస్తి విషయంలో ఒకతను ఖలీఫాకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో ఫిర్యాదు చేశాడు. న్యాయమూర్తి ఆ వ్యక్తికి అనుకూలంగా తీర్పిచ్చాడు. ఖలీఫా మహ్దీ ఎలాంటి తటపటాయింపు లేకుండా ఆ ఆస్తిని ఫిర్యాదుదారునికి వాపసుచేశాడు. బనూఉమయ్యా పాలనల్లో ఖలీఫా రక్షణ కోసం మస్జిద్‌ల దగ్గర భద్రతాకట్టడాలు నిర్మించబడ్డాయి. మహ్దీ వాటిని ధ్వంసం చేయించి బానిస-యజమాని అనే తారతమ్యం లేకుండా సమానత్వాన్ని నెలకొల్పాడు.

మహ్దీ ఎప్పుడైనా బస్రా పర్యటనకు వస్తే అక్కడ అయిదు పూటలా నమాజ్ జామియా మస్జిద్‌లోనే చేయించేవాడు. ఒకసారి ఓ పల్లెవాసి నమాజ్ ముగిసిన తర్వాత వచ్చి "నేను జుహర్‌నమాజ్ మీ వెనుక చేయాలనుకున్నాను. కాని సాధ్యపడలేదు" అని అన్నాడు మహ్దీతో. ఆరోజు అసర్‌నమాజ్ చేయించడానికి మహ్దీ ఇమామ్ స్థానంలో నిల బడి, ఆ వ్యక్తి వచ్చేవరకు అఖామత్ చెప్పకండని ప్రజల్ని ఆదేశించాడు. అందరికంటే ముందు మహ్దీ ఒకసారి జుమా ప్రసంగం చేస్తూ "దేవుడు, ఆయన దూతలు దైవప్రవక్త (స)ను దీవిస్తున్నారు. (కనుక) విశ్వాసులారా! మీరు కూడా అతను శాంతీసౌభాగ్యాలతో వర్థిల్లాలని (దైవాన్ని) ప్రార్థించండి. (33:56)" అనే సూక్తి పఠించాడు. అప్పటినుంచి ఉప న్యాసకులు జుమాప్రసంగంలో ఈ సూక్తిని తప్పనిసరి అంశంగా చేర్చి పఠించసాగారు.

## 5. మహ్దీ మరణం, రాజకీయ వారసత్వం

ఖలీఫా మహ్దీ దాదాపు 11 ఏండ్ల పాలన తర్వాత హి.శ. 169లో చనిపోయాడు. చనిపోయే ముందు కొడుకులు హాదీని, హారూన్‌ని వరుసగా తన రాజకీయ వారసు లుగా ప్రకటించాడు. మహ్దీతండ్రి మన్సూర్ ఎంత కఠినాత్ముడో అతనికి భిన్నంగా మహ్దీ అంత మృదుమనస్కుడు. అందుకే అధికారపీఠం అలంకరించగానే మొట్టమొదట తండ్రి చెరసాలలో పెట్టిన ఖైదీలందర్నీ విడుదల చేశాడు. భోగలాలసుడైనప్పటికీ పరిపాలనా బాధ్యతల నిర్వహణలో ఏనాడూ అశ్రద్ధ, బద్ధకాలను దరికి చేరనివ్వ లేదు.



మహ్దీ మొదట తన పెద్దకొడుకు హాదీని మొదటి వారసుడిగా ప్రకటించాడు. కాని అనుభవంతో రెండవ కొడుకు హారూనే గొప్ప పరిపాలనాదక్షుడని భావించి అతని కోసం బైత్ చేయించడానికి ఒక దూతను జర్జాన్ ప్రాంతానికి పంపాడు. అయితే జర్జాన్‌లో తిరుగుబాటుదారులతో తలపడుతున్న హాదీ ఈమాట విని ఆ దూతను కొట్టి వెనక్కి పంపించాడు. ఖలీఫా మహ్దీ తాను పంపిన దూతను హాదీ కొట్టి పంపిన సంగతి తెలుసు కొని వెంటనే జర్జాన్‌కు బయలుదేరాడు. కాని దారిమధ్యలోనే జబ్బుపడి చనిపోయాడు.

## హాదీ బిన్ మహ్దీ పరిపాలన

హాదీ ఈ సమాచారం అందిన తరువాత జర్జాన్ నుండి బగ్దాద్‌కు చేరుకొని హి.శ. 169లో అధికారం చేపట్టాడు. అతని పాలనలో హుసైన్ బిన్ అలీ బిన్‌హసన్ నేతృత్వం లో అల్వీయులు మదీనాపై దాడిచేసి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత హుసైన్ తమ సంఘంలో చేరే బానిసలందర్నీ బానిసత్వం నుండి విముక్తి కల్గిస్తామని ప్రకటిం చాడు. దాంతో దేశంలోని బానిసలంతా హుసైన్ పతాకం కిందికి చేరారు. హుసైన్ మదీనాలో 21 రోజులు ప్రభుత్వం నడిపిన తరువాత అనుచరులతో కలసి హజ్ కోసం మక్కా బయలుదేరాడు. హాదీ అతడ్ని ఎదుర్కోవడానికి సైన్యం పంపాడు. అది దారిలోనే హుసైన్ సైన్యాన్ని ఢీకొన్నది. హుసైన్‌తో పాటు, అతని అనుచరులు అనేకమంది హత మార్చబడ్డారు. హుసైన్ పినతండ్రి కుమారుడు ఇద్రీస్ తప్పించుకొని ఈజిప్టు చేరు కున్నాడు. అక్కడ్నుంచి మొరాకోకు పారిపోయి అక్కడ ఓ స్వతంత్రరాజ్యానికి పునాదులు వేశాడు. హాదీ మోసిల్ నుండి బగ్దాద్‌కు తిరిగివస్తూ దారిలో వ్యాధిగ్రస్తుడై 15 నెలల పాలన తరువాత హి.శ.170 రబీవుల్‌అవ్వల్ నెలలో చనిపోయాడు.

# 53. హారూన్ రషీద్ పరిపాలన

హాదీ మరణానంతరం అతని సోదరుడు హారూన్ రషీద్ హి.శ. 170లో సింహాసనం అధిష్ఠించాడు. హారూన్ మహిళా యుద్ధఖైదీ, బర్‌బర్ ప్రాంతంలో నివశించే గాయకురాలు అయిన ఖైజ్రాన్ కుమారుడు. ఆమెకు హాదీ, హారూన్‌లు జన్మించిన తరువాత మహ్దీ ఆమెను బానిసత్వం నుండి విముక్తి కలిగించి పెళ్ళి చేసుకున్నాడు. మహ్దీ వీలునామా ప్రకారం తన రాజకీయవారసుడిగా హారూన్ కావలసి ఉండింది. కాని హాదీ ఖలీఫా అయిన తరువాత హారూన్‌ని కాదని తన కొడుకు జాఫర్‌ని రాజకీయ వారసుడిగా చేయడానికి ప్రయత్నించాడు. యహ్యా బిన్ ఖాలిద్ బర్మకీ అతని వారసుడిగా హారూన్‌ని చేయడానికి ఎంతగానో ప్రయత్నించాడు. కాని అతని ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి హాదీ ఆకస్మిక మరణం తరువాత హారూన్ ఖలీఫా అయ్యాడు.

యహ్యా బిన్ ఖాలిద్ బర్మకీకు హారూన్‌పై ప్రేమాభిమానలు కలగడానికి కారణం- హారూన్ తల్లి ఖైజ్రాన్ యహ్యా కుమారుడు ఫజల్‌కు, ఫజల్ తల్లి (యహ్యా భార్య) హారూన్‌కు పాలు తాగించారు. ఈ విధంగా హారూన్‌కు యహ్యా క్షీరసంబంధ తండ్రిగా, ఫజల్ క్షీరసంబంధ సోదరుడిగా మారారు. అదీగాక హారూన్‌కు యహ్యా బిన్ ఖాలిద్ బర్మకీ విద్యాశిక్షణలు గరిపిన గురువు కూడా అయ్యాడు.

## 1. బర్మకీ వంశం పుట్టుపూర్వోత్తరాలు

అందుకే హారూన్ గద్దె ఎక్కగానే యహ్యా బిన్ ఖాలిద్ "బర్మకీ"ని ప్రధానమంత్రిగా నియమించి అతనికి అసాధారణమైన అధికారాలు ఇచ్చాడు. యహ్యా ఈరానీ సంతతికి చెందిన వ్యక్తి. అతనిలో అరబ్‌సంతతికి వ్యతిరేకంగా జాతీయదురభిమానం తిష్ఠవేసు కొనివుంది. దానికి బనూఅబ్బాసీ పాలనకు దారిసుగమం చేసిన ఈరానీసంతతికి చెందిన అబూముస్లిం ఖురాసానీని అబ్బాసీ ఖలీఫా మన్సూర్ హతమార్చడం కూడా తోడయింది. అంచేత యహ్యా రాజ్యాధికారాన్ని ఎలాగైనా బనూఅబ్బాసీల నుండి తీసి ఈరానీసంతతికి కట్టబెట్టాలని నిర్ణయించుకున్నాడు. దానికోసం అతను ఖలీఫా హారూన్‌కు అత్యంత విధేయుడై మసలుకుంటూ, అసాధారణమైన దాతృత్వంతో ప్రజలను ఆకట్టుకుంటూ తన లక్ష్యసాధన కోసం లోలోన కృషి చేయసాగాడు.

ఈరాన్ అగ్నిపూజారుల (మజూసీల) ధర్మకర్తను "మగ్" అంటారు. యావత్తు ధర్మకర్తల నాయకుణ్ని (ప్రధాన ధర్మకర్తను) "బర్మగ్" అంటారు. హి.శ. 30లో వచ్చిన ఇస్లామీయ విప్లవంతో ఈరాన్ అగ్నిపూజారులు క్రమంగా ఇస్లాం స్వీకరించి ముస్లిములై పోయారు. అరబ్ విజేతలు బర్మగ్‌ని "బర్మక్" అని ఉచ్చరించేవారు. ముస్లింలు వచ్చి తమ మతాన్ని, సంస్కృతిని నాశనం చేశారన్న ఆగ్రహంతో బర్మక్ ఇస్లాం స్వీక రించలేదు. చైనా సరిహద్దుల్లో నివసించే మొగల్, తురుష్క తెగలు ముస్లింలకు జిజ్యా చెల్లించే షరతుపై ఒప్పందం చేసుకున్న తరువాత బలం పుంజుకొని బలఖ్ ప్రాంతం లోని ఈరాన్ అగ్నిపూజారులపై దాడులకు తెగబడ్డాయి. వారి మతచిహ్నాలను తుడిచి పెట్టి బర్మక్ వంశాన్ని అవమానపరిచాయి. అరబ్ ముస్లిం పాలకులు తమ అంతర్గత కలహాల కారణంగా మొగల్ తెగల దౌర్జన్యాల వైపు దృష్టి సారించలేక పోయారు.

ఖాలిద్, అతని కొడుకు యహ్యా బర్మక్ సంతతికి చెందినవారే. రాజకీయ కుట్రలు పన్నడంలో సిద్ధహస్తుడైన అబూముస్లిం ఖురాసాని, ఖాలిద్‌లోని అసామాన్య తెలివితేటల్ని చూసి అతనికి తనపంథాలో మంచిశిక్షణ ఇచ్చి గురువై పోయాడు. ఖాలిద్ అదే శిక్షణను తన కొడుకు యహ్యాకు నూరిపోశాడు. ఖలీఫా మన్సూర్ అబూముస్లింని చంపించినపుడు ఖాలిద్ తన ముఖంలో, మాటల్లో ఏవిధమైన ప్రభుత్వవ్యతిరేక హావభావాలను వ్యక్తం కానివ్వలేదు. అంతేకాదు, ఖలీఫాపట్ల వినయవిధేయతల్లో కూడా ఎలాంటి కొరత రానివ్వ లేదు. హి.శ. 163లో ఖాలిద్ చనిపోయేనాటికి యహ్యా వయస్సు 45, 50 ఏండ్ల మధ్య ఉండింది. ఖలీఫా మహ్దీకు ఖాలిద్, మహ్దీ కొడుకు హారూన్‌కు ఖాలిద్ కొడుకు యహ్యా విద్యాశిక్షణలు గరిపారు. అదీగాక యహ్యా బిన్ ఖాలిద్ హారూన్‌తో తన, తన కొడుకుల సంబంధాన్ని మరింత పరిష్ఠపరచడానికి గతపేరాలో పేర్కొన్నట్లు క్షీరసంబంధం ఉండనే వుంది. హారూన్ ఈ సంబంధం కారణంగానే యహ్యాని నాన్న అని, యహ్యా పెద్దకొడుకు ఫజల్‌ని అన్నయ్య అని పిలిచేవాడు.

యహ్యాకు నల్గురు కొడుకులు- ఫజల్, జాఫర్, మూసా, ముహమ్మద్. వారు కూడా తండ్రిలాగే మంచి తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు కలవాళ్ళు. యహ్యా వారిని తన లక్ష్య సాధనకోసం ఖలీఫాకు పూర్తి విధేయులై మసలుకునేలా తీర్చిదిద్దాడు. వేరొకవైపు యహ్యా



ఖలీఫా తల్లి ఖైజ్రాన్ సలహాలు తీసుకుంటూ ఆమె విశ్వాసాన్ని కూడా చూరగొన్నాడు. దాంతో హారూన్‌కు యహ్యా పట్ల అభిమానం, నమ్మకాలు మరింత పెరిగిపోయాయి. కొన్నాళ్ళకు హారూన్ తల్లి ఖైజ్రాన్ చనిపోయింది. దాంతో యహ్యా ఆడింది ఆట, పాడింది పాట అయిపోయింది. ప్రభుత్వంలోని కీలక హోదాలన్నిటినీ క్రమంగా తన బంధుమిత్రు లకు, తనకు అనుకూలురైన అరబ్బేతర ఈరానీయులకు కట్టబెట్టడం ప్రారంభించాడు.

## 2. అంతర్గత దాడులు

ఖలీఫా హారూన్ అల్వీయుల పట్ల సత్ప్రవర్తనతో మెలుగుతున్నప్పటికీ వారు అప్పు డప్పుడు తిరుగుబాటులు లేవదీస్తునే ఉన్నారు. మోసిల్‌ప్రాంతంలో యహ్యా బిన్ సాలెహ్ అనే అల్వీవర్గీయుడు తిరుగుబాటు లేవదీసినప్పుడు ఖలీఫా హారూన్ దాన్ని అణచడానికి ఫజల్ బిన్ యహ్యా బర్మకీని పంపాడు. కాని ఫజల్ ఖలీఫాకు నచ్చజెప్పి యహ్యాని చంపకుండా తన దగ్గర ఖైదీగా ఉంచుకున్నాడు.

హాదీ పాలనాకాలంలో అల్వీవర్గీయుడు ఇద్రీస్ ఒక యుద్ధం నుండి తప్పించుకొని మొరాకోకు పారిపోయి అక్కడ బర్బరీల సహకారంతో ఓ స్వతంత్రరాజ్యానికి పునాదులు వేశాడని గతపేజీల్లో పేర్కొన్నాం. ఇది అల్వీయులకు చెందిన మొట్టమొదటి ప్రభుత్వం. హారూన్ రషీద్ ఈ సంగతి తెలుసుకొని ఇద్రీస్‌ని అంతమొందించడానికి తన బానిస సులైమాన్ (షిమాఖ్)ని పంపాడు. సులైమాన్ మొరాకో వెళ్ళి ఇద్రీస్ చేతిలో బైత్ చేసి, హారూన్ చెడుల్ని ప్రస్తావించాడు. తర్వాత ఇద్రీస్ కొలువులో ఉండిపోయాడు. కొన్నాళ్ళకు అవకాశం చూసి హి.శ. 177లో విషం ద్వారా ఇద్రీస్‌ని చంపి బగ్దాద్‌కు తిరిగొచ్చాడు.

అయితే ఇద్రీస్ చనిపోయిన తరువాత అతని దాసీ ఒక పిల్లవాణ్ని కన్నది. బర్బరీలు ఆ పిల్లవాడిక్కూడా ఇద్రీసే అని పేరుపెట్టి అతణ్ని తమ నాయకుడిగా ఎన్నుకొని ఇద్రీసీ ప్రభుత్వాన్ని యథాప్రకారం నడపసాగారు.

హారూన్ రషీద్ కొడుకుల్లో అమీన్ అనే అబ్బాయి హారూన్ ప్రియసతీమణి అబ్బాసీ వంశస్థురాలైన జుబైదా కొడుకు. మామూన్ అనే అబ్బాయి హారూన్ రెండవభార్యఈరాన్ మజూసీ సంతతికి చెందిన మరాజిల్ కొడుకు. అంచేత జుబైదా తన కొడుకు అమీన్‌ని ఖలీఫా వారసుడిగా చేయాలని పట్టుబట్టింది. హారూన్ కూడా అమీన్నే తన రాజకీయ వారసుడిగా చేయాలని భావించాడు. కాని ఫజల్ బిన్ యహ్యా (బర్మకీ) ఖలీఫా వారసుడిగా మామూన్‌ని చేయాలని ప్రయత్నించాడు. ఈ కారణం వల్ల జుబైదా ఫజల్ బిన్ యహ్యా పట్ల ద్వేషం పెంచుకున్నది. చివరికి హారూన్ హి.శ. 175లో తన అయిదేళ్ళ కొడుకు అమీన్ ఖిలాఫత్ కోసం ప్రజల చేత బైత్ చేయించుకున్నాడు.

సిరియాలో రెండు తెగల మధ్య అంతఃకలహాలు చెలరేగడంతో ఈజిప్టు తెగలు కొన్ని సిరియా రాజధాని డెమాస్కస్‌పై అనేకసార్లు దాడులు చేసి ఖలీఫాను చికాకు పర్చాయి. అందువల్ల ఖలీఫా హారూన్ ఆ తిరుగుబాటును అంతమొందించడానికి హి.శ. 180లో జాఫర్ బిన్ యహ్యా (బర్మకీ)ని పంపించాడు. జాఫర్ సిరియా వెళ్ళి ఆ తిరుగుబాటును విజయవంతంగా అంతమొందించి బగ్దాద్‌కు తిరిగొచ్చాడు.

హి.శ. 177లో ఇతాఫ్ బిన్ సుఫ్యాన్ అజ్డి అనే ఓ తిరుబాటుదారుడు మోసిల్, దాని పరిసర ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. ఈ వార్త విని ఖలీఫా హారూన్ సైన్యం తీసుకొని మోసిల్‌కు బయలుదేరాడు. ఇతాఫ్ ఈ సంగతి తెలుసుకొని ఆర్మేనియా వైపు పారిపోయాడు. హారూన్ ఇతాఫ్ కోటలను ధ్వంసం చేయించి బగ్దాద్‌కు తిరిగొచ్చాడు.

సిరియా, ఈజిప్టు, మోసిల్ మొదలైన రాష్ట్రాల్లో తిరుగుబాటులు తలెత్తినపుడు ఖురాసాన్ రాష్ట్రంలో ఖారిజీలు మరొకసారి అరాచకాలకు తెగబడ్డారు. హుసైన్ అనే ఖారిజీ మతస్థుడు తిరుగుబాటు జెండా ఎగరవేసి అశాంతి సృష్టించాడు. అతను ప్రభుత్వ సైన్యాలతో అనేక సార్లు ఢీకొని విజయాలు సాధించాడు. చివరికి హి.శ. 178లో అతను హతమార్చబడటంతో ఖురాసాన్‌లో అరాచకానికి తెరపడింది. ఖురాసాన్‌లో మరికొందరు ఖారిజీలు కూడా నాలుగేళ్ళ పాటు అరాచకాలకు, లూటీలకు ఒడిగట్టారు. ఖురాసాన్ గవర్నర్ అలి బిన్ ఈసా ఎట్టకేలకు ఆ అరాచకాలను అంతమొందించి రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలగొల్పాడు.

## 3. విదేశీ శక్తులపై దాడులు

రోమ్ చక్రవర్తులు తరచుగా ఒప్పందాలు ఉల్లంఘిస్తూ ఖలీఫాకు తలనొప్పిగా పరిణమించారు. వారు అనేకసార్లు ఖలీఫా సైన్యాలతో తలపడి పరాజయం పాలయ్యేవారు. అయినా వారు ఒప్పందాలకు ఏనాడూ కట్టుబడి ఉండలేదు.

హి.శ. 183లో ఖాఖాన్ (చైనా)చక్రవర్తి ఖజర్ కుమార్తెను ఫజల్ బిన్ యహ్యా(బర్మకీ) వైపుకు పంపడం జరిగింది. అయితే దారిలో ఒకచోట ఆ అమ్మాయి కాకతాళీయంగా చనిపోయింది. దాంతో ఆ అమ్మాయిని తీసికెళ్ళినవారు వెనక్కి తిరిగొచ్చి, ముస్లింలు మోసం చేసి అమ్మాయిని చంపేశారని అమె తండ్రికి తెలియజేశారు. ఖాఖాన్ చక్రవర్తి ఈ సంగతి వినగానే అగ్గి మీద గుగ్గిలమై బ్రహ్మాండమైన సైనికవాహినితో ఇస్లామీయ సామ్రాజ్యంపై విరుచుకుపడ్డాడు. ఆర్మేనియా రాష్ట్రంలో అక్కడి గవర్నర్‌ని పారద్రోలి ముస్లింలను ఊచకోత కోశాడు. స్త్రీలు, పిల్లలతో సహా లక్షమంది ముస్లింలు మృత్యువాత పడ్డారు. అతని సైనికులు స్త్రీలను, పిల్లలను నిర్బంధించి వళ్ళు గగుర్పొడిచే చిత్రహింసలు పెట్టారు. ఖలీఫా హారూన్ వెంటనే ఆజర్‌బాయ్‌జాన్ రాష్ట్ర గవర్నర్ యజీద్ బిన్ మజీద్‌ని ఆర్మేనియాకు పంపాడు. మరోవైపు అతని సహాయం కోసం మరొక సేనాపతి ఖుజైమా బిన్ ఖాజిమ్‌ని కూడా పంపాడు. యజీద్, ఖుజైమా ఇద్దరు కలసి శత్రువులపై మెరుపుదాడి చేసి వారిని ఆర్మేనియా నుండి తరిమికొట్టారు.

## 4. యహ్యా(బర్మకి) కుటుంబంలో ఖిలాఫత్ అధికారాలు

యహ్యా బిన్ ఖాలిద్ (బర్మకీ) వృద్ధుడై బలహీన పడినపుడు ఖలీఫా హారూన్ యహ్యా పెద్దకొడుకు ఫజల్‌ని ప్రధానమంత్రిగా నియమించాడు; యహ్యా రెండవ కొడుకు జాఫర్‌ని తన ముఖ్య సలహాదారుడిగా నియమించుకున్నాడు. అంతేకాదు, అతడ్ని తన శ్రేయోభిలాషిగా, మంచి మిత్రుడిగా భావించి ఎల్లప్పుడూ తన వెంటే ఉంచుకునేవాడు. ఈ మైత్రితో హారూన్ అతడ్ని హి.శ. 176లో రాజమందిరాల వాడకు భద్రతాధికారిగా,



ఆ తరువాత ఈజిప్టు గవర్నర్‌గా నియమించాడు. జాఫర్ తన తరపున ఇమ్రాన్ బిన్ మెహ్రాన్‌ని ఈజిప్టు గవర్నర్‌గా చేసి పంపి, తను బగ్దాద్‌లోనే హారూన్ దగ్గర ఉండసాగాడు. హి.శ. 180లో సిరియాలో అరాచకం చెలరేగినప్పుడు దాన్ని జాఫరే తుద ముట్టించాడు. దాంతో హారూన్ అతడ్ని ఖురాసాన్ గవర్నర్‌గా నియమించాడు. ఆ తరువాత ఒక నెల క్కూడా తిరక్కముందే రాజధాని (బగ్దాద్) నగరానికి మేయర్‌గా, సిటీపోలీస్ కమీషనర్‌గా నియమించాడు. జాఫర్ ఈరెండు పదవుల్ని హర్సీమా బిన్ అయాన్‌కు అప్పగించి తను యథాప్రకారం ఖలీఫా దగ్గరే ఉండసాగాడు. చివరికి హారూన్ జాఫర్‌లోని అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలతో ప్రభావితుడై ఫజల్ స్థానంలో అతడ్ని ప్రధానమంత్రిగా నియమించాడు.

ఈవిధంగా జాఫర్ బిన్ యహ్యా యావత్తు హోదాలు, ప్రభుత్వశాఖలపై పెత్తనం చేసే సత్తా సంపాదించగలిగాడు. గవర్నర్లు, సేనాపతులు, ఇతర ఉన్నతాధికారుల ఉద్వాసనా నియామకాల అధికారాలు అతని గుప్పెట్లోకి వచ్చేశాయి. ప్రభుత్వధనాగారం కూడా అతని నియంత్రణలోకే వచ్చేసింది. చివరికి ఖలీఫా హారూన్ డబ్బు అవసరమొచ్చినపుడు జాఫర్‌నే అడిగి తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కమాటలో చెప్పాలంటే రాజ్యంలోని సర్వాధికారాలు జాఫర్ బిన్ యహ్యా చేతిలోకి పోయాయి. ఖలీఫా రాజముద్ర కూడా అతని చేతిలోకి వచ్చింది. దాంతో తండ్రీకొడుకులు తాము కోరుకున్న ఈరానీలకు, బంధువులకు పెద్దపెద్ద జాగీర్లు కట్టబెడుతూ జనసామాన్యాన్ని తమవైపు తిప్పుకోవడానికి ప్రభుత్వధనాగారంలోని ధనాన్ని విచ్చలవిడిగా దానంచేస్తూ ఇష్టారాజ్యం చేయడం ప్రారంభించారు. గవర్నర్లు, సేనాపతులు జాఫర్ కనుసన్నల్లోనే నడచుకునేవారు. కొద్ది కాలంలోనే బర్మకీ వంశం కీర్తిప్రతిష్ఠలు రాజ్యం దశదిశలా వ్యాపించాయి. ఖలీఫా హారూన్ రషీద్ నామమాత్రపు ఖలీఫాగా ఉండిపోయాడు.

బర్మకీలు మాత్రం ఎంతో హుందాగా, హద్దుమీరిన భోగభాగ్యాల్లో తేలియాడుతూ నివసించసాగారు. వారి వాడలు రాజవాడల కంటే మిన్నగా ఉండేవి. వారి కొలువులు ఖలీఫా కొలువుకన్నా ఎక్కువ కళాకాంతులు వెదజల్లుతూ మెరిసిపోతుండేవి. దేశంలోని అత్యధిక జాగీర్లు, స్థిరాస్తులు వారి సొంతమైపోయాయి. అందువల్ల వారి దగ్గర ఎంతో విలువైన మణిమాణిక్యాలు రాజులు సైతం ఈర్ష్య పడేటంతగా లెక్కలేనన్ని ఉండేవి. వారి ద్వారాలదగ్గర ఎల్లప్పుడూ పేదలు, అవసరార్థులు క్యూకట్టేవారు. కవులు, కళాకారులు, సాహితీవేత్తలు ఖలీఫా వైపుకంటే బర్మకీలవైపే ఎక్కువ మొగ్గుచూపేవారు.

బర్మకీలు అరబ్బేతర ఈరానీ సంతతికి చెందిన వారైనందున వారు యావత్తు ఇస్లామీయ సామ్రాజ్యంలో ఈరానీ సంస్కృతికి, ఫార్శీభాషకు పెద్దపీట వేసి వాటి అభ్యున్నతి కోసమే నిరంతరం కృషి చేసేవారు. పాలనావ్యవస్థలోని పెద్ద పెద్ద హోదాలన్నీ అరబ్బేతర ఈరానీయులకే కట్టబెట్టడం ప్రారంభించారు. ప్రభుత్వశాఖలన్నింటిలో ఎక్కడ చూసినా ఈరానీ సభ్యతాసంస్కృతులే కొట్టవచ్చినట్లు కన్పించేవి. చివరికి బర్మకీలు "ఈరానీ జాతీయ పండుగ"ను కూడా ఎంతో అట్టహాసంగా జరుపుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈరానీ సభ్యతాసంస్కృతుల తేజస్సు ముందు ఇస్లామీయ సభ్యతాసంస్కృతుల ప్రమిద మినుకు మినుకుమంటూ ఉండేది.

## 5. ఫజల్ బిన్‌రబీ, బర్మకీసంతతి మధ్య ప్రతీకారజ్వాలలు

ఖలీఫా మన్సూర్‌కు రబీ బిన్ యూనుస్ అనే ఒకతను భద్రతాదళాధికారిగా, గొప్ప విశ్వాసపాత్రుడిగా ఉండేవాడు. అతనే అబ్బాసీపాలన తిరుగుబాటుదారుడైన అబూ ముస్లిం ఖురాసానీని హతమార్చమని సలహా ఇచ్చాడు. అప్పటినుంచి బర్మకీ సంతతి ఈరానీయులు అతనిపై, అతని సంతానంపై కత్తిగట్టారు. ఖలీఫా మన్సూర్ మంత్రిపదవి నుండి ఖాలిద్ బిన్ బర్మకీని తొలగించి ఆ స్థానంలో రబీ బిన్ యూనుస్‌ని నియమించాడు. ఇది అరబ్బులకు వ్యతిరేకంగా అరబ్బేతర ఈరానీయులకు, ముఖ్యంగా బర్మకీలకు అగ్ని మీద ఆజ్యం పోసినట్లయింది. కాని రబీ హోదా అంచెలంచెలుగా పెరుగుతూ ఖలీఫా హాదీ పాలననాటికి ప్రధానమంత్రి హోదాకు ఎదిగింది. అందువల్ల బర్మకీలు రబీకి వ్యతిరేకంగా ఏమీ చేయలేక పోయారు. ఖలీఫా హాదీ, రబీ దాదాపు ఒకే కాలంలో చనిపోయారు. ఆ తరువాత హారూన్ రషీద్ ఖలీఫా కాగానే ఆ పదవిలో యహ్యా బిన్ ఖాలిద్ (బర్మకీ)ని కూర్చోబెట్టాడు. ఆ పదవిపై ఎంతో ఆశపెట్టుకున్న రబీ కొడుకు ఫజల్ బిన్ రబీ పూర్తిగా నిరాశచెందాడు. యహ్యా ప్రధాని అయిన తరువాత ఫజల్‌కు ఎలాంటి పదవి ఇవ్వలేదు. దాంతో అతను యహ్యా, అతని కొడుకులపై పగతీర్చుకోవడానికి సాకులు వెతకడం ప్రారంభించాడు. కాని అలాంటి సాకులేమీ దొరకలేదు.

హారూన్ ఫజల్‌కు అతని తండ్రి రబీ చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని ఏదైనా హోదా ఇద్దామనుకుంటే రబీపట్ల కసిపెంచుకున్న అతని భార్యామణి ఖ్జ్రాన్ అడ్డు తగిలింది. హి.శ. 174లో ఖ్జ్రాన్ చనిపోయిన తరువాత ఖలీఫా హారూన్ ఫజల్ బిన్ రబీకు చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ పదవి ఇచ్చాడు. దాంతో ఫజల్ ఔన్నత్యం పెరిగింది.

## 6. అలి బిన్ ఈసా, బర్మకీల పరస్పర వ్యతిరేక ఫిర్యాదులు

ఖలీఫా హారూన్ ఖార్జీల బెడదను నిర్మూలించే ఉద్దేశంతో మొదటిసారిగా ప్రధాని యహ్యా సలహా తీసుకోకుండా కఠినస్వభావి అయిన అలీ బిన్ ఈసాను ఖురాసాన్ గవర్నర్‌గా నియమించాడు. దాన్ని యహ్యా వ్యతిరేకించాడు. అంచేత రాజ్యమంతటా విస్తరించిన యహ్యా బంధుమిత్రులు నిత్యం ఏదో ఒక అరాచకానికి తెగబడ్తూ అలీ బిన్ ఈసాను ప్రశాంతంగా ఉండనివ్వలేదు. అలీ ఈ అరాచకాల వెనుక ఎవరి హస్తాలు ఉన్నాయో తెలుసుకొని యహ్యాపై ఖలీఫాకు ఫిర్యాదు చేశాడు. అలి చేసిన ఈ ఫిర్యాదు, అలీ నియామకం పట్ల యహ్యా నిరాకరణ కలసి హారూన్ మనసులో మొదటి సారిగా బర్మకీల పట్ల అనుమానం వచ్చింది. అలి ఫిర్యాదు సంగతి తెలుసుకున్న బర్మకీ వర్గం, అలీ బిన్ ఈసా ఖలీఫాకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రయత్నాలు చేస్తున్నాడని ప్రత్యేక దూత ద్వారా ఖలీఫాకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేయడం ప్రారంభించింది. ఖురాసాన్ అరాచకాల వెనుక యహ్యా బిన్ ఖాలిద్, అతని నలుగురు కొడుకుల హస్తాలున్నాయని అలి బిన్ ఈసా మరోసారి ఖలీఫాకు ఫిర్యాదు చేశాడు.

అప్పుడు ఖలీఫాహారూన్ ఖురాసాన్ రాష్ట్రానికి బయలుదేరి "రే" ప్రాంతానికి చేరుకున్నాడు. ఇది హి.శ. 186నాటి సంఘటన. ఈ సమాచారం అందగానే అలి ఎంతో వినయవిధేయతలతో ఖలీఫాను కలుసుకున్నాడు. ఆయనకు ఏకాంతంలో బర్మకీల



అరాచకాలను గురించి మరిన్ని వివరాలు తెలియజేస్తూ ఖురాసాన్ రాష్ట్రంలోనే గాక దానిచుట్టుపక్కల రాష్ట్రాల్లో కూడా బర్మకీలు వ్యాపించి అబూముస్లిం ఖురాసానీ హత్యకు ప్రతీకారం తీర్చుకోడానికి సన్నాహాలు పూర్తిచేసుకున్నారని తెలియజేశాడు. ఖలీఫా అతనికి ధైర్యంచెప్పి మరూ ప్రాంతానికి పంపించాడు. ఖలీఫా బర్మకీల పట్ల తన మనసులో చెలరేగుతున్న అనుమానాలను బర్మకీల ముందు ఏమాత్రం వ్యక్తం కానివ్వలేదు.

అల్వీవర్గానికి చెందిన నఫ్సజకియా సోదరుడు యహ్యా బిన్ అబ్దుల్లా హి.శ. 176లో తిరుగుబాటు లేవదీశాడు. దాన్ని అణచడానికి ఖలీఫా ఫజల్ బిన్ యహ్యాని పంపాడు. అతను అల్వీవర్గం సానుభూతిపరుడు. పైగా అతనే ఆ తిరుగుబాటుకు వ్యూహరచన చేసినవాడు. అంచేత ఫజల్ అతడ్ని చంపకుండా హారూన్ నుండి ప్రాణరక్షణ హామీ తీసుకొని తన అధీనంలో ఖైదీగా ఉంచుకున్నాడు. బర్మకీల పాత్రప్రత్యర్థి, ప్రస్తుత చీఫ్‌ఎకౌంట్స్ ఆఫీసర్ ఫజల్ బిన్ రబీ ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ, బర్మకీల సహాయసహకారాలతో యహ్యా బిన్ అబ్దుల్లా మళ్ళీ తిరుగుబాటు ప్రయత్నాలు చేస్తున్నాడని ఖలీఫాకు ఫిర్యాదు చేశాడు. దాన్ని మరికొందరు ధృవీకరించడం కూడా జరిగింది. ఖలీఫా హారూన్ ఈ సంగతి వినగానే కొందరు సైనికుల్ని పంపి యహ్యా బిన్ అబ్దుల్లాని అరెస్టు చేయించి ప్రధాని జాఫర్ బిన్ యహ్యా (బర్మకీ)కు అప్పగించాడు.

## 7. బర్మకీల దుర్గతి

మరికొన్నాళ్ళ తర్వాత ఫజల్ బిన్ రబీ ఖలీఫాను కలుసుకొని జాఫర్ బర్మకీ యహ్యా బిన్ అబ్దుల్లాని విడుదల చేశాడని ఫిర్యాదు చేశాడు. దాంతో ఖలీఫాహారూన్ జాఫర్ మీద మండిపడుతూ అతడ్ని పిలిపించాడు. అయితే ముఖంలో ఎలాంటి ఆగ్రహచిహ్నాలు వ్యక్తం కానివ్వకుండా యహ్యా ఎలా ఉన్నాడని మాత్రమే అడిగాడు. దానికి ప్రధాని జాఫర్ 'అతను యథాప్రకారం నాఅధీనంలో ఖైదీగా ఉన్నాడు' అని సమాధానమిచ్చాడు. "నువ్వు నిజమే చెబుతున్నావా?" అని మళ్ళీ అడిగాడు హారూన్. జాఫర్ ఈమాట విని ఉలిక్కిపడుతూ రహస్యం బయటపడిందని భావించాడు. అంచేత అతను మరింత జాగ్రత్త పడుతూ "యహ్యా నా అధీనంలో చాలా కాలందాకా ఉన్నాడు. ఇక అతని నుండి మనకు ఎలాంటి ప్రమాదం లేదని భావించి విడుదల చేశాను" అని చెప్పాడు.

హారూన్ తన మనసులోని అనుమానం, ఆగ్రహాలను ఏమాత్రం వ్యక్తం కానివ్వలేదు. ఒకవేళ ఆ సమయంలో ఆగ్రహం వ్యక్తపరచివుంటే పరిస్థితి చేయిదాటి పోయేది. బర్మకీలు తక్షణమే స్వీయరక్షణ ఏర్పాట్లు చేసుకునేవారు. ఖలీఫా హారూన్ వాళ్ళను అంత సులభంగా లొంగదీసుకోలేడు. బర్మకీలు ఇంతకుముందే అతని చుట్టూ ముళ్ళకంచె కట్టివున్నారు. దాన్ని ఛేదించి బయటపడటం అతనికి సాధ్యమయ్యేది కాదు. యహ్యా బిన్ ఖాలిద్ కొడుకులు-మనవళ్ళల్లో 25మంది ఖడ్గధారులు వివిధహోదాల్లో వివిధ సాకులతో రాజమహల్‌లో తిష్ఠవేసి ఉన్నారు. మరొకవైపు యావత్‌సామ్రాజ్య పాలనావ్యవస్థ తాళంచెవులు బర్మకీల చేతుల్లోనే ఉన్నాయి. సైన్యాలు, సేనాపతులు, ఇతర ఉన్నతాధికారులంతా వాళ్ళచే నియమించబడినవారే. ప్రభుత్వధనాగారం నుండి విచ్చలవిడిగా దానంచేసి ఆకట్టుకున్న ధర్మవేత్తలు, కవులు, కళాకారులు, ప్రజలు వారి

కనుసన్నల్లోనే ఉన్నారు. అంచేత హారూన్ ఎంతో జాగ్రత్తవహిస్తూ "నువ్వు యహ్యాని విడుదలచేసి మంచిపని చేశావు. నేనసలు యహ్యాని విడుదల చేయమని చెప్పడానికే నిన్ను పిలిపించాను" అన్నాడు పైకి గంభీరంగా. ప్రధాని జాఫర్ ఈమాట విని చల్లగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆరోజుల్లోనే ఒక సంఘటన జరిగింది. ప్రధాని జాఫర్ స్వగృహంలో జరిగిన ఒక విందులో ఉన్నతాధికారులు, ఈరాన్ జాతీయులు పాల్గొన్నారు. అప్పుడు ఒకతను మాట్లాడుతూ "అబూముస్లిం ఎంతటి సామర్థ్యంతో సామ్రాజ్యాన్ని ఒక వంశం నుండి మరొక వంశంలోకి మార్చగలిగాడు!" అని అన్నాడు. జాఫర్ ఈమాట విని "అబూముస్లిం ఆరులక్షల మందిని హతమార్చి సాధించిన ఈ పని ఘనకార్యమేమీ కాదు. ఘనకార్య మంటే సామ్రాజ్యం ఒకవంశం నుండి మరొక వంశంలోకి మారిపోయినా దాన్నిగురించి ఏ ఒక్కరికీ తెలియకూడదు. (ప్రభుత్వమార్పిడి అంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగి పోవాలి)" అని అన్నాడు.

ఆ విందులో పాల్గొన్న ఒకతను ఆ తర్వాత ఈ మాటల్ని తీసికెళ్ళి మెల్లిగా ఖలీఫా చెవిలో ఊదాడు. ఖలీఫా హారూన్ అది విని జాఫరే ఈ పని చేయజూస్తున్నాడని తలచి తక్షణమే క్రియారంగంలోకి దిగాడు. అయితే అతను బర్మకీలను తప్పుదారి పట్టించడానికి రాజకీయ వారసత్వపు నాటకం ప్రారంభించాడు. పెద్దకొడుకుని తన రాజకీయ వారసుడిగా చేసి, రాజ్యాన్ని ముగ్గురు కొడుకుల్లో విభజిస్తూ దస్తావీజు తయారు చేయించాడు. తర్వాత హజ్‌కోసం మక్కా వెళ్ళి దాన్ని కాబాగోడకు వ్రేలాడ దీయించాడు. మక్కాప్రజలకు డబ్బు పంచిపెట్టి అక్కడ్నుంచి మదీనా చేరుకొని మదీనా వాసులక్కూడా విస్తృతంగా డబ్బు పంచి, బహుమానాలు అందజేశాడు. ఆ తర్వాత తిరిగొచ్చి బగ్దాద్ సమీపంలోని అన్బార్‌కు చేరుకున్నాడు.

అక్కడ ఒకరోజు హి.శ. 187వ సంవత్సరం, ముహర్రమ్ ఆఖరి తేది అర్ధరాత్రి సమయంలో ఖలీఫా హారూన్‌రషీద్ తన నమ్మినబంటు మస్రూర్‌ని పిలిచి "నువ్వు వెంటనే నమ్మకస్తులైన కొందరు సైనికుల్ని తీసుకొని జాఫర్ శిబిరానికి వెళ్ళు. జాఫర్‌ని బయటికి పిలిచి అతని శిరస్సు ఖండించి తీసుకురా" అని ఆదేశించాడు. మస్రూర్ అలాగే చేశాడు. అదే రాత్రి హారూన్‌రషీద్ జాఫర్‌తండ్రి యహ్యాను, జాఫర్ సోదరుడు ఫజల్‌ని అరెస్టు చేయించి జైల్లో పడవేయించాడు. ఆ తరువాత వెంటనే జాఫర్, ఫజల్, యహ్యాల మొత్తం ఆస్తుల్ని ఏ ప్రాంతంలో ఉన్నాసరే జప్తుచేయాలని ఉన్నతాధికారుల్ని ఆదేశించాడు. ఆ తరువాత బర్మకీ వంశంలోని ప్రతి వ్యక్తినీ అరెస్టుచేసి జైళ్ళలో పడ వేయాలని పోలీసుఅధికారుల్ని ఆజ్ఞాపించాడు. ఆ తరువాత బర్మకీ వంశస్థులు నియమించిన గవర్నర్లు, ఇతర ఉన్నతాధికారులందర్నీ పదవుల నుండి తొలగించడం జరిగింది. ఈవిధంగా ఖలీఫా హారూన్ రషీద్ ఒకేఒక రాత్రి బర్మకీల ప్రమాదాన్ని అంతమొందించి మనశ్శాంతి పొందాడు. బర్మకీలలో ఏ ఒక్కరికీ తోకజాడించే అవకాశమే లభించలేదు. అదీగాక ఈ ఆకస్మిక సంఘటన పూర్వపరాలేమిటో ఎవరి చెవులక్కూడా తాకలేదు. అంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది.



యహ్యా బిన్ ఖాలిద్ సోదరుడు ముహమ్మద్ బిన్ ఖాలిద్ బర్మకీ ఖలీఫాకు ఎంతో విశ్వాసపాత్రుడిగా మెలిగాడు. బహుశా అతనే బర్మకీలను గురించిన రహస్యాలు ఖలీఫాకు చేరవేసి ఉంటాడు. అంచేత ఖలీఫా హారూన్ అతడ్ని అరెస్టు చేయలేదు. దీనికి భిన్నంగా ఖిలాఫత్ ప్రలోభం ఉచ్చులో పడిపోయి బర్మకీల కుట్రలో పాల్గొన్న హారూన్ వంశస్థుడు, వరుసకు హారూన్‌తాత అయిన అబ్దుల్ మలిక్ బిన్ సాలెహ్‌ని అరెస్టు చేయించి జైల్లో పడవేయించాడు. అబ్దుల్‌మలిక్ కుమారుడు అబ్దుర్రహ్మాన్ తన తండ్రికి వ్యతిరేకంగా సాక్ష్యం కూడా చెప్పాడు. ఈవిధంగా హారూన్‌రషీద్ తనవారు, పరాయివారు అన్న వివక్ష చూపకుండా కుట్రలో పాల్గొన్నవారందర్నీ మట్టుబెట్టి ఊపిరి పీల్చుకున్నాడు. యహ్యా బిన్ ఖాలిద్ హి.శ. 190లో, అతని కొడుకు ఫజల్ హి.శ. 193లో జైలు జీవితం గడుపుతుండే స్థితిలోనే ఇహలోకం వీడిపోయారు.

ఈ ఘోరపతనం తరువాత బర్మకీలు తమ సర్వస్వం కోల్పోయి దుర్భర జీవితం గడపసాగారు. వారిలో అనేకమంది తలదాచుకోవడానికి సొంత గూడులకు కూడా నోచుకోలేక పోయారు. వారి స్త్రీలకు చినిగిన బట్టలు ధరించి ముష్టెత్తు కోవలసిన దుర్గతి పట్టింది. రాజుల్ని తలదన్నిన రాజభోగాలు అనుభవిస్తూ యావత్తు సామ్రాజ్యాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకొని ద్వారపాలకుల నుండి గవర్నర్ల దాకా ప్రతి మనిషిపై పెత్తనం చెలాయించేవరకూ ఎదిగిన బర్మకీలు ఒక్కసారిగా అదఃపాతాళానికి దిగజారిన ఈ ఆకస్మిక పతనంలో కుట్రదారులకు ఎంతో గుణపాఠం ఉంది.

## 8. హారూన్ మీద దుష్ప్రచారం

బర్మకీలు తమను అబూతాలిబ్ సంతతివారమని, అహ్లెబైత్ (అలీవ్వర్గం) శ్రేయోభిలాషులమని చెప్పుకునేవారు. అందువల్లనే ఈనాటికీ షియామతస్థులు బర్మకీల హత్యా-వినాశాలపట్ల సంతాపం వెలిబుచ్చుతూ, హారూన్ రషీద్‌ని దౌర్జన్యపరుడిగా చిత్రిస్తున్నారు. నిజానికి బర్మకీలు ఇస్లాంవ్యాప్తి కోసం, ముస్లిం సముదాయ సంక్షేమం కోసం చేసిన ఘనకార్యాలేమీ లేవు. రాజులు, చక్రవర్తులు తమ రాజ్యాలను కాపాడుకోవడానికి శత్రువుల్ని అంతమొందించడం సహజమే. అదేవిధంగా హారూన్ కూడా తన శ్రేయోభిలాషులుగా నటిస్తూ తన రాజ్యాన్ని లాక్కోవడానికి కుట్రలు పన్నిన బర్మకీలను తుద ముట్టించాడు. సాధారణంగా రాజకీయాలంటేనే కుట్రలు-కుతంత్రాలకు మారుపేరు. అందుకే రాజకీయాల్లో నిత్యస్నేహితులు, నిత్య శత్రువులంటూ ఎవరూ ఉండరు. మిత్ర భేదం ఏనాటికైనా ప్రత్యర్థులకు వినాశాన్నే తెచ్చిపెడ్తుంది.

బర్మకీల పతనానికి కారణం కొందరు చరిత్రకారుల ప్రకారం బర్మకీల అధికారం, అభ్యున్నతుల్ని చూసి దర్బారీలు, బనూఅబ్బాసీ సంతతి ఉన్నతాధికారులు ఓర్వలేక మాటిమాటికి ఖలీఫా హారూన్ చెవి కొరికేవారు. నిత్యశంకితుడయిన హారూన్ వారి చాడీలు విని నిజమేనని భావించేవాడు. మరికొందరు చరిత్రకారుల కథనం ప్రకారం బర్మకీల పెద్ద ప్రత్యర్థి ఫజల్ బిన్ రబీ అలీవ్వర్గీయుడైన యహ్యా బిన్ అబ్దుల్లాను అడ్డం పెట్టుకొని ఖలీఫా హారూన్‌కు లేనిపోనిమాటలు చెప్పి తప్పుదారి పట్టించాడు. ఇంకొందరి కథనం ప్రకారం హారూన్ ప్రియసతీమణి జుబైదా తన కుమారుడ్ని రాజకీయవారసుడిగా

చేయడాన్ని ప్రధాని జాఫర్ బిన్ యహ్యా వ్యతిరేకించినందున జుబైదా అతనిపై కక్ష పెంచుకొని హారూన్‌కు నూరిపోసేది. హారూన్ పాలనా తీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసి నిష్పక్షపాతంగా విశ్లేషిస్తే బర్మకీల పతనానికి కారణం పై కారణాలేవీ కావని అర్థ మవు తుంది. ఈ కారణాలన్నిటికీ మించిన మరో దుష్ప్రచారం కూడా చరిత్రపుటలకు ఎక్కింది. అది జాఫర్ బిన్ యహ్యా, హారూన్ చెల్లెలు అబ్బాసియాల పెళ్ళి కట్టుకథ. ఖలీఫా హారూన్ ఒక మందుపార్టీలో పాల్గొని తన చెల్లెలు అబ్బాసియా పెళ్ళి జాఫర్ బిన్ యహ్యాతో జరిపించడానికి వారిద్దరిని ఎదురెదురుగా కూర్చోబెట్టి పెళ్ళిచూపులు జరిపించాడట! ఈఘటన చివరికి జాఫర్ బిన్‌యహ్యా మెడకు ఉరితాడుగా మారిందట!! ఈ కట్టుకథను ప్రముఖ చరిత్రకారుడు ఇబ్నెఖుల్దున్ కూడా ఖండించాడు.

ఒక సంవత్సరం హజ్‌యాత్ర, మరో సంవత్సరం జిహాద్ వంటి గొప్ప పుణ్యకార్యాలు నిర్వహించే ప్రముఖ ధర్మప్రియుడు, ప్రతిరోజూ క్రమం తప్పకుండా నమాజ్ చేసే దైవ భక్తుడు, దేశంలో శ్రేయస్కర ఖలీఫాల (ఖుల్ఫాయెరాషిదీన్) పాలన తరువాత ఇస్లామీయ షరీఅత్‌ను పునఃస్థాపించిన హారూన్ రషీద్‌ని చెల్లెల్ని తీసుకొని మందుపార్టీల్లో పాల్గొనే వాడిగా, పచ్చి తాగుబోతుగా చిత్రించడం ఎంతవరకు సమంజసం, సహేతుకం?

ఖలీఫా హారూన్ కొలువులో హకీం జిబ్రయీల్ అనే ఒక యూదువైద్యుడు ఉండేవాడు. ఖలీఫా భోజనం చేయడానికి ముందు హకీం జిబ్రయీల్ ఆ భోజనాన్ని పరీక్షించి, అందులో ఏదైనా నష్టం కలిగించే పదార్థం ఉంటే అతనా భోజనం నుండి ఖలీఫాను వారించేవాడు. ఒకసారి ఖలీఫా కోసం చేపకూర తీసుకురాబడింది. ఖలీఫా దాన్ని తినడా నికి సిద్ధమవుతుంటే హకీం అతడ్ని వారించి దాన్ని వంటగదికి తీసికెళ్ళమని సేవకుడికి చెప్పాడు. తర్వాత ఒక సేవకుడు ఆ చేపకూరను హకీం తింటుంటే చూసి ఆ విషయం ఖలీఫాకు చెప్పాడు. ఖలీఫా హారూన్ ఈ సంగతి విని పకపకా నవ్వాడు.

అయితే హకీం తాను చేపకూర తిన్న సంగతి ఖలీఫాకు తెలిసిపోయిందని గ్రహించి దాన్ని మూడు ప్లేట్లలో మూడు భాగాలుగా చేసిపెట్టాడు. ఒక ప్లేట్‌లో సాధారణంగా ఖలీఫా తినే ఆహారపదార్థాలతో పాటు చేపకూర ఉంచాడు. రెండవ ప్లేట్‌లో చేపకూరపై మంచునీరు పోశాడు. మూడవ ప్లేట్‌లో చేపకూర మీద సారాయి పోశాడు. ఆ మూడు ప్లేట్‌లను ఖలీఫా ముందు పెట్టి "ఇదిగో ఈ రెండు ప్లేట్‌లలో మీ భోజనం ఉంది; మూడవ ప్లేట్‌లో నాభోజనం ఉంది" అని చెప్పాడు. ఆతర్వాత కొన్ని గంటల్లోనే ఖలీఫా కోసం ఉంచిన రెండు ప్లేట్‌లలోని భోజనం కుళ్ళిపోయి కంపు కొట్టసాగింది. మూడవ ప్లేట్‌లోని చేపకూర నీరులా మారి సారాయిలో కలసిపోయింది. ఖలీఫా ఈ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. అప్పుడు హకీం ఇలా అన్నాడు : "నేను సారాయి తాగుతాను. అంచేత ఈ చేపకూర నాకెలాంటి నష్టం కలిగించదు. మీరు సారా తాగరు గనక ఈకూర మీకు నష్టం కల్గిస్తుందని తలచి నేను మిమ్మల్ని దాన్నుండి వారించాను."

ఈ సంఘటన ద్వారా కూడా ఖలీఫా హారూన్ మందుపార్టీలో పాల్గొన్నాడనేది కట్టుకథ అని స్పష్టంగా తెలుస్తోంది. సుప్రసిద్ధ చరిత్రకారులు ఈ సంఘటనను కూడా తమ చరిత్ర గ్రంథాల్లో పేర్కొన్నారు.



## 9. రోమన్ల ఒప్పందం ఉల్లంఘన

రోమ్ చక్రవర్తులు మాటిమాటికి ఒప్పందం ఉల్లంఘించేవారు. హి.శ. 187లో ఖలీఫా సైన్యం సనాన్ కోటను ముట్టడించి దాడిచేయగానే రోమన్లు చేతులెత్తేశారు. చివరికి వారు 320 మంది ముస్లిం ఖైదీలను వాపసుచేసి, జిజ్యా తిరిగిచెల్లించడానికి అంగీక రిస్తూ ఒప్పందం చేసుకున్నారు. ఆ రోజుల్లోనే రోమన్లు తమ రాణిని గద్దె దించి నఖ్ఫూర్ అనే వ్యక్తిని గద్దె ఎక్కించారు. నఖ్ఫూర్ సింహాసనం అధిరోహించగానే ఖలీఫా హారూన్‌కు లేఖ రాశాడు. "మా రాణి తన సహజ స్త్రీబలహీనత కారణంగా నీకు లొంగిపోయి జిజ్యా చెల్లించింది. ఇప్పటిదాకా నీవు ఆమె నుండి ఎంత జిజ్యా వసూలుచేశావో అదంతా వెంటనే తిరిగిచ్చేయి, లేకుంటే ఖడ్గం ద్వారా మేము దాన్ని సాధించుకుంటాం" అని హెచ్చరించాడు ఖలీఫాను రోమ్‌చక్రవర్తి ఆ లేఖలో.

ఖలీఫా హారూన్ అది చదివి ఆగ్రహోదగ్రుడైపోయాడు. రోమ్‌చక్రవర్తి లేఖ వెనుక వైపున అతనికి సమాధానం రాసి పంపి, ఆ వెనువెంటనే సైన్యం తీసుకొని రోమ్ దిశగా బయలుదేరాడు. రోమ్‌రాజ్యానికి చేరుకోగానే రాజధానిపై తుఫానులా విరుచుకుపడి దాన్ని చుట్టుముట్టాడు. ఈ ఆకస్మిక పరిణామానికి రోమ్‌చక్రవర్తి బిత్తరపోయాడు. తరువాత బిక్కమొగం వేసుకొని జిజ్యా తిరిగి చెల్లించడానికి అంగీకరించాడు. హారూన్ రోమ్ చక్రవర్తి చేత ఇదివరకటి కంటే అధిక జిజ్యా చెల్లించడానికి అంగీకరింపజేసి తిరుగు ప్రయాణమయ్యాడు.

అయితే శీతాకాలం చలితీవ్రత వల్ల ముస్లింసైన్యాలు వెంటనే దాడి చేయలేవన్న ధీమాతో రోమ్‌చక్రవర్తి ఒప్పందం ఉల్లంఘించి తిరుగుబాటు సన్నాహాలు ప్రారంభిం చాడు. ఖలీఫా హారూన్ ఈ సంగతి తెలుసుకోగానే దారిలో రఖాపట్టణం నుండే తిరిగొచ్చి రోమ్‌రాజ్యంలోని అనేక కోటలను ధ్వంసం చేస్తూ రోమ్‌చక్రవర్తి వద్దకు చేరుకున్నాడు. రోమ్‌చక్రవర్తి మళ్ళీ కాళ్ళబేరానికి వచ్చి, తప్పయిపోయింది క్షమించమని ప్రాధేయ పడ్డాడు. హారూన్ అప్పటికప్పుడు తనకు రావలసిన జిజ్యాపైకం మొత్తం వసూలుచేసి, రోమ్‌రాజ్యంలోని అనేక ప్రాంతాలపై పట్టుసాధించి బగ్దాద్‌కు తిరిగొచ్చాడు.

హి.శ. 188లో రోమ్ చక్రవర్తి మరొకసారి తిరుగుబాటుకు ఒడిగట్టాడు. అప్పుడు సేనాపతి ఇబ్రాహీం బిన్ జిబ్రయీల్ నేతృత్వంలో ముస్లింయోధులు రోమ్‌రాజ్యంపై దాడిచేశాయి. ఆ దాడిని ఎదుర్కోవడానికి స్వయంగా రోమ్‌చక్రవర్తి యుద్ధరంగంలోకి దిగాడు. కాని ముస్లిం యోధుల ధాటికి నిలువలేక పలాయనం చిత్తగించాడు. ముస్లిం యోధులు నలభై వేలమంది రోమ్ సైనికుల్ని మట్టుపెట్టి తిరిగొచ్చారు. ఇంత ప్రాణ నష్టం జరిగినా రోమ్‌చక్రవర్తి తన వెనుకటి గుణం మానుకోలేదు. అంచేత ఖలీఫా తన సైన్యాన్ని వివిధ సేనాపతుల్లో విభజించి విభిన్న దిశల నుండి ఒకేసారి రోమ్‌రాజ్యంపై దాడిచేశాడు. ఆ రాజ్యంలోని అనేక ప్రాంతాలను ఆక్రమించుకొని, వేలాది మంది శత్రు సైనికుల్ని నేలకూల్చి, పదిహేడు వేలమందిని ఖైదీలుగా పట్టుకున్నాడు. రోమ్ చక్రవర్తి గత్యంతరంలేక జిజ్యా చెల్లించడానికి ఒప్పుకొని యాభైవేల వరహాలు పంపుతూ రాజధాని ఖైదీలలో ఫలానా యువతితో తన కొడుకు పెళ్ళి నిర్ణయమైంది కనుక ఆమెను

విడుదలచేసి పంపవలసిందిగా పరిపరివిధాల ప్రాధేయపడ్డాడు. అతని విజ్ఞప్తిని ఖలీఫా హారూన్ దయార్ద్రహృదయంతో అంగీకరించి ఆ యువతిని విడుదలచేసి పంపివేశాడు. అదీగాక తమకు ఏటా మూడులక్షల వరహాలు జిజ్యాచెల్లించే షరతుపై తాము ఆక్రమించుకున్న రోమ్ భూభాగాలను కూడా వాపసుచేసి తిరిగొచ్చాడు.

## 10. హారూన్ మరణం, అతని ఘనతాఔన్నత్యాలు

ఖలీఫా హారూన్‌రషీద్ రోమన్లతో అవిశ్రాంత పోరాటాలు చేస్తున్న రోజుల్లో వ్యాధిగ్రస్తుడయిపోయాడు. అది క్రమంగా ముదిరిపోతూ చివరికి హి.శ. 193, జమాదిస్సాని నెలలో 23 ఏండ్ల పాలన తరువాత అతని మరణానికి కారణమయింది.

అబ్బాసీ వంశంలో హారూన్ రషీద్ చంద్రుడు లాంటివాడని ప్రతీతి. అతని పరిపాలన కాలం ఇస్లాంచరిత్రలో సువర్ణ అధ్యాయమని చెప్పవచ్చు. బనూఉమయ్యా పాలనాకాలంలో, తర్వాత బనూఅబ్బాసీల తొలినలుగురు ఖలీఫాలకాలంలో దేశరాజ్యాంగంగా షరీఅత్ నామమాత్రంగా ఉండేది. అధికారుల్లో విచ్చలవిడిగా అవినీతి సాగుతుండేది. ప్రభుత్వ ఖజానా నింపడానికి అక్రమపన్నులు వసూలు చేయబడుతుండేవి. హారూన్‌రషీద్ అధికారం చేపట్టగానే అవినీతి, అక్రమవసూళ్ళను అంతంచేసి స్వచ్ఛమైన షరీఅత్‌ను తిరిగి అమలుపరిచాడు. అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. అతను గొప్ప ప్రజాశ్రేయోభిలాషి. అనేక ప్రజాసంక్షేమకార్యాలు ప్రవేశపెట్టాడు. రాత్రివేళల్లో మారువేషంలో గస్తీ తిరుగుతూ ప్రజల మంచిసెబ్బరలు విచారించి తదనుగుణంగా చర్యలు తీసుకునేవాడు. నిరుపేదలు, వికలాంగులకు పింఛన్లు మంజూరుచేసేవాడు. బాటసారులకు ధర్మసత్రాలు, బావులు వగైరా సౌకర్యాలు కల్పించి, వారి భద్రతకోసం తగిన రక్షణఏర్పాట్లు చేశాడు. దోపిడీదొంగతనాలను పూర్తిగా అరికట్టాడు. ఈ విషయమై ప్రఖ్యాత కథల పుస్తకం "అలిఫ్‌లైలా"లో హారూన్ రషీద్ గురించి ఎన్నో కట్టుకథలు రాయబడ్డాయి.

హారూన్ గొప్ప దైవభక్తుడు, యోధానయోధుడే గాకుండా ప్రముఖ విద్యావేత్త కూడా. అతను సూఫీల సమావేశంలో కూర్చుంటే ఐహిక సుఖభోగాలను త్యజించిన గొప్ప సూఫీగా కన్పిస్తాడు. ఫిఖ్హావేత్తల సమావేశంలో కూర్చుంటే ఎంతో ఆరితేరిన ఫిఖ్హావేత్తలా అన్పిస్తాడు. హదీసువేత్తల సమావేశంలో కూర్చుంటే ప్రఖ్యాత హదీసువేత్తగా రాణిస్తాడు. హజ్, జిహాద్, దానధర్మాలంటే అతనికి ఎంతో ఇష్టం. ఎవరైనా నరకశిక్ష గురించి భయపెడుతూ హితోపదేశం చేస్తే అతను ఏకధాటిగా రోదించేవాడు.

ఒకరోజు ప్రఖ్యాత ధర్మవేత్త ఇబ్నెసమాక్, హారూన్ దర్బారులో కూర్చొని ఉన్నప్పుడు హారూన్ దాహంతో ఉండి నీళ్ళు తెప్పించుకొని తాగబోయాడు. కాని ఇబ్నెసమాక్ అతడ్ని వారిస్తూ "విశ్వాసులనాయకా! కొంచెం ఆగండి" అన్నాడు. హారూన్ నీళ్ళగ్లాసును చేతిలో పట్టుకొని తాగకుండా "చెప్పండి, ఏమిటి విషయం?" అని అడిగాడు. ఇబ్నెసమాక్ అతని వైపు సూటిగా చూస్తూ "తీవ్రంగా దప్పికయిన స్థితిలో మీకు నీళ్ళు లభించకపోతే ఒక గ్లాసెడు మంచినీళ్ళ కోసం మీరెంత ధనం ఖర్చుపెడతారు?" అని ప్రశ్నించారు. దానికి హారూన్ సమాధానమిస్తూ "దాని కోసం నా రాజ్యంలో అర్థభాగం అమ్ముతాను" అని అన్నాడు. "సరే, ఇప్పుడు తాగండి" అన్నారు ఇబ్నెసమాక్.



హారూన్ మంచినీళ్ళు తాగాడు. అప్పుడు ఇబ్నెసమాక్ మాట్లాడుతూ "విశ్వాసుల నాయకా! మీరిప్పుడు తాగిన నీళ్ళు కడుపులోనే ఉండిపోయి బయటికి రాలేకపోతే వాటిని బయటికి రప్పించడానికి మీరెంత ఖర్చుపెడతారు?" అనడిగాడు మళ్ళీ. హారూన్ జవాబిస్తూ "దాని కోసం అవసరమైతే నేను నా అర్థరాజ్యం అమ్ముతాను" అని అన్నాడు. ఇబ్నెసమాక్ ఈమాట విని "అంటే మీరు ఒకగ్లాసెడు మంచినీళ్ళు, దానికి సంబంధించిన మూత్రం విలువ మీ యావత్తుసామ్రాజ్యం విలువంత అన్నమాట. అంచేత ఈ సువిశాల సామ్రాజ్యం చూసుకొని మీరు మిడిసిపడకూడదు సుమా!" అని ఉపదేశించారు. హారూన్ రషీద్ ఈ ఉపదేశం విని చాలా సేపటిదాకా కంటతడి పెట్టుకున్నాడు.

## 11. విద్యాకళల అభివృద్ధి

హారూన్ రషీద్ పాలనలో బగ్దాద్‌నగరం ఖుర్ఆన్, హదీస్, వ్యాకరణం, గణితం, వైద్యం, అనువాదం మొదలైన విద్యాకళలకు ఆలవాలమై ఉండింది. బగ్దాద్‌లోని ప్రతి మసీదుకు అనుబంధంగా విద్యాలయాలు కూడా ఉండేవి. అక్కడ ఎంతో ప్రావీణ్యం కలిగిన పండితులు, విద్యావేత్తలు ఉపాధ్యాయులుగా పనిచేసేవారు. విద్యార్థులు ఇక్కడ విద్య నేర్చుకోవడానికి గర్వకారణంగా భావించి సుదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చేవారు. ఆనాడు బగ్దాద్‌లో పట్టా పుచ్చుకోననిదే యావత్తు ఇస్లామీయ జగత్తులో ఏ ఒక్కడూ ఏ రంగంలోనూ పరిపూర్ణ ప్రావీణ్యుడిగా భావించడం జరిగేదికాదు.

ఖాజీ ఫాజిలీ ప్రకారం చక్రవర్తుల్లో ఇద్దరు తప్ప ఎవరూ విద్యార్జన కోసం సుదూర ప్రయాణం చేయలేదు. వారిలో ఒకరు హారూన్ రషీద్. ఆయన తన కొడుకులు అమీన్, మామూన్‌లను వెంటబెట్టుకొని ఇమామ్ మాలిక్ రాసిన మువత్తా గ్రంథం చదవడానికి ఈజిప్టుకు వెళ్ళాడు. రెండవవ్యక్తి సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి. ఆయన కూడా ఇమామ్ మాలిక్ రాసిన మువత్తాగ్రంథం చదవడానికి అలెగ్జాండరియాకు వెళ్ళివచ్చాడు.

మన్సూర్ తన పాలనాకాలంలో ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)ను చీఫ్ జడ్జీగా నియమించదలిస్తే ఇమామ్ అతని స్వార్థలక్ష్యాలకు పావుగా మారకుండా అందుకు నిరాకరించారు. తత్ఫలితంగా ఆయన జైలుశిక్షకు గురై జైల్లోనే ఊపిరి విడిచారు.

ఆ తరువాత మన్సూర్ అబూహనీఫా (రహ్మలై) శిష్యుడు జఫర్ బిన్ ఉజైల్‌కు చీఫ్ జడ్జీగా నియమించజూస్తే ఆయన కూడా దాన్ని నిరాకరించి ప్రాణం కాపాడుకోవడానికి కనపడకుండా ఎటో వెళ్ళిపోయారు. అప్పటినుంచి హారూన్ రషీద్ పాలన ప్రారంభకాలం వరకు ప్రభుత్వవైఖరికి, హనఫీ ఆలోచనాదృక్పథం (School of thought)కు మధ్య సత్సంబంధాలు లేకుండా పోయాయి. మన్సూర్, ఆ తర్వాత మహ్దీ తమ పాలనాకాలాల్లో ఇమామ్‌మాలిక్ (రహ్మ) రాసిన 'మువత్తా' గ్రంథాన్నే దేశచట్టంగా ఆమోదించి అమలుపరిచారు. హారూన్‌రషీద్ కూడా మొదట్లో మువత్తానే దేశచట్టంగా అమలుపరచాలనుకున్నాడు. అయితే అది పరిపాలనా అవసరాలను పూర్తిగా నెరవేర్చలేకపోయింది. అదీగాక దేశంలోని అత్యధిక ప్రజానీకం హనఫీ దృక్పథం వైపే ఎక్కువ మొగ్గుచూపేవారు. చివరికి రాజ్యాంగపరమైన ఈ సమస్యను పరిష్కరించడానికి సృష్టికర్త ఇమామ్ అబూహనీఫా (రహ్మలై) అగ్రశిష్యుడు అబూయూసుఫ్ (రహ్మలై)ని రంగంలోకి దించాడు.

అబూయూసుఫ్ తల్లిదండ్రులు పేదవారైనందున ఇమామ్ అబూహనీఫాయే ఆయన పోషణబాధ్యత తీసుకొని చదువుసంధ్యలు నేర్పారు. అబూయూసుఫ్ కూడా తన గురువులాగే ప్రభుత్వం పట్ల సహాయనిరాకరణ వైఖరే అవలంబించారు. కాని దారిద్ర్యం ఆయన్ని అందులో నిలకడగా ఉంచలేదు. దారిద్ర్యబాధతో ఆయన చివరికి తన భార్య ఇంటి దూలాన్ని సైతం అమ్మవలసివచ్చింది. దానిపై అత్తగారు మండిపడుతూ ఆయన్ని తీవ్రంగా దుయ్యబట్టింది. అప్పుడాయన తన ఆత్మాభిమానం తీవ్రంగా దెబ్బతినడంతో సహించలేక ప్రభుత్వఉద్యోగం చేయడానికి నిర్ణయించుకున్నారు. ఆ తరువాత ఆయన బగ్దాద్ వెళ్ళి ఖలీఫా మెహ్దీని కలుసుకొని బగ్దాద్ ఖాజీగా ఉద్యోగం సంపాదించారు.

హారూన్ ఖలీఫా అయిన తర్వాత అబూయూసుఫ్‌లోని అసాధారణ విద్యాసామర్థ్యం, తెలివితేటల పట్ల ప్రభావితుడై ఆయన్ని యావత్తు సామ్రాజ్యానికి చీఫ్‌జస్టిస్‌గా నియమించాడు. అంతకుముందు ఏ ఖలీఫాకాలంలో కూడా చీఫ్‌జస్టిస్ పదవి ఉండేదికాదు. అయితే ఇది ఈనాటి చీఫ్‌జస్టిస్‌లాంటి పరిమిత అధికారాలుకల పదవికాదు. న్యాయ శాఖమంత్రి అధికారాలు కూడా ఇందులో ఉండేవి. అంతేకాదు, దేశవిదేశ వ్యవహారాల్లో చట్టపరమైన మార్గదర్శనంచేసే అధికారం కూడా ఖాజీ అబూయూసుఫ్‌కు ఉండేది.

అబూయూసుఫ్ ఖలీఫా ముఖస్తుతి చేసేవాడని ఓ నింద ఉంది. కాని ఆయన ఒక వ్యవహారంలో ఖలీఫా హోదీకి వ్యతిరేకంగా తీర్పిచ్చారు. హారూన్‌రషీద్ కాలంలో ఓ క్రైస్తవ వృద్ధుడు ఒక తోట విషయంలో ఖలీఫా మీద దావా వేశాడు. ఖాజీ అబూయూసుఫ్ ఖలీఫా వాదాన్ని త్రోసిపుచ్చి ఆ క్రైస్తవుడికే అనుకూలంగా తీర్పిచ్చారు.

హారూన్‌రషీద్ స్వభావంలో రెండువిభిన్న భావావేశాలు ఉండేవి. అతను ఆగ్రహంతో ఉన్నపుడు అందరికంటే ఎక్కువ దౌర్జన్యం చేస్తాడు; ఎవరైనా ధార్మిక ఉపదేశం చేస్తే అందరికన్నా ఎక్కువ రోదిస్తాడు. అంచేత అబూయూసుఫ్ అతనిలోని బలహీన స్వభావం జోలికి పోకుండా తన విద్యాజ్ఞానాలు, నీతినడవడికలతో అతడ్ని ఆకట్టుకోవడం ప్రారంభించారు. దాంతో చివరికి హారూన్‌రషీద్ "పరిపాలనా నిర్వహణ కోసం ఒక రాజ్యాంగ గ్రంథాన్ని సంకలనం చెయ్యండి" అని అబూయూసుఫ్‌ని అడిగాడు.

ఇలా ఖలీఫా తనంతటతాను ముందుకొచ్చి రాజ్యాంగాన్ని రచించమని అడగ్గానే అబూయూసుఫ్ (రహ్మలై) పరమసంతోషంతో పని మొదలెట్టారు. ఆ కృషి ఫలితంగా "కితాబుల్ ఖిరాజ్" అనే ఉద్గ్రంథం ఉనికిలోకి వచ్చింది. ఈ గ్రంథంలో పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన సమస్త విషయాలతో పాటు రాజ్యాధినేతలు, గవర్నర్లు, సేనాపతులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, పౌరుల బాధ్యతలు కూడా ఉన్నాయి.

హారూన్ రషీద్‌ని ఒకతను "మీరు అబూయూసుఫ్‌కు అంత గొప్ప హోదాఅంతస్తులు ఎందుకిచ్చారు?"అనడిగాడు. దానికి హారూన్ సమాధానమిస్తూ "నేనతని విద్యాజ్ఞానాలకు సంబంధించిన ఏ రంగాన్ని పరీక్షించినా అందులో అతను పరిపూర్ణుడిగా కన్పించాడు. దాంతోపాటు అతను ఓ సన్మార్గగామి, నీతినడవడికల్లో స్థిరచిత్తుడు. అతనిలాంటి వ్యక్తి మరెవరైనా ఉంటే తీసుకురా" అని అన్నాడు.



# 54. అమీన్ రషీద్ పరిపాలన

హారూన్‌రషీద్ వీలునామా ప్రకారం అతని కుమారుడు అమీన్‌రషీద్ హి.శ. 193లో ఖలీఫా అయ్యాడు. హారూన్ ఈ వీలునామాలో తన రెండవభార్య కుమారుడు మామూన్ రషీద్‌ని ఖురాసాన్, మరూ వగైరా తూర్పురాష్ట్రాలకు శాశ్వత పాలకుడిగా నియమిస్తూ మామూన్‌రషీద్‌ని అమీన్‌రషీద్ ఆ రాష్ట్రాల నుండి తొలగించకూడదని, అమీన్‌రషీద్‌కు మామూన్‌రషీద్ ఖిలాఫత్ పట్ల విధేయత కలిగివుండాలని ఉపదేశించాడు.

అమీన్, మామూన్ ఇద్దరూ దాదాపు సమవయస్కులే. అమీన్ బనూఅబ్బాసీ (హాష్మి) వంశస్థురాలైన జుబైదా కుమారుడు. అందువల్ల అతనికి రాజధాని బగ్దాద్‌లో అరబ్బులు తమ పూర్తిమద్దతు ఇచ్చేవారు. మామూన్ ఈరాన్‌మజూసీ సంతతికి చెందిన మరాజిల్ కుమారుడు. అందువల్ల అతనికి ఖురాసాన్, మరూ ప్రాంతాల్లో ఈరానీయులు తమ పూర్తిమద్దతు ఇచ్చేవారు. ఈవిధంగా ప్రజలు, సైనికాధికారుల్లో అత్యధిక మంది అరబ్బులు, అరబ్బేతర ఈరానీయులుగా విడిపోయి అమీన్, మామూన్‌లకు అనుకూలురైపోయారు. ముఖ్యంగా అమీన్, మామూన్‌ల సైనికాధికారుల్లో ఈ జాతీయ, ప్రాంతీయ అభిమానాల విభజనరేఖ స్పష్టంగా గోచరిస్తుంది.

ఖలీఫా హారూన్ రషీద్ తన ప్రథమ వారసుడిగా అమీన్‌ని చేసినప్పటికీ ఆ తరువాత కొంతకాలానికి అమీన్ కంటే మామూనే సమర్థుడని, ఖిలాఫత్ పదవికి అతనే ఎక్కువ అర్హుడని తెలుసుకున్నాడు. కాని అప్పటికే హారూన్‌కు చరమఘడియాలు సమీపించడం వల్ల మరణశాశనాన్ని మార్చలేకపోయాడు. అందువల్ల అమీన్ ఖలీఫాగా అధికారపీఠం అధిరోహించిన నాటి నుంచే రాజకీయ అలజడులు ప్రారంభమయ్యాయి.

మామూన్‌కు ఇద్దరు సమర్థకులైన సేనాపతులు లభించారు. వారు అమీన్ సేనలతో అనేకయుద్ధాలు చేసి అప్రతిహతంగా ముందుకు దూసుకుపోయారు. అమీన్‌సేనాపతులు పరాజయంపై పరాజయం చవిచూస్తూ పారిపోసాగారు.

అమీన్‌సైనికుల్లో అధికసంఖ్యాకులు ఫార్సీలు (ఈరానీయులు), మామూన్‌సైన్యంలో అధికసంఖ్యాకులు అరబ్బులు ఉన్నారు. ఈ రెండు పక్షాల్లోనూ భాషా, ప్రాంతీయ, సాంస్కృతిక దురభిమానాలు ఉన్నాయి. అవి ఎప్పుడో ఒకప్పుడు ప్రజ్వరిల్లే ప్రమాదం ఉంది. మామూన్ అధికసంఖ్యాక ఫార్సీప్రజలు ఉండే ఖురాసాన్, మరూ వగైరా తూర్పు రాష్ట్రాలకు స్వతంత్రపాలకుడిగా ఉన్నప్పటికీ, ఖలీఫా అమీన్ తనను ఎప్పటికైనా ఆ పదవి నుండి తొలగిస్తాడని భయపడుతుండేవాడు. అయినప్పటికీ అతను అమీన్ ఖిలాఫత్ పీఠం ఎక్కగానే అతనికి కానుకలు పంపుతూ, అభినందనలు తెలుపుతూ లేఖ రాసి పంపాడు. దానికిముందు మామూన్ తన రాష్ట్రాల ప్రజల శిస్తులు తగ్గించి, సైనికుల జీతాలు పెంచి వారందరినీ తనకు అనుకూలంగా మలచుకోవడానికి కృషిచేశాడు.

అటు అమీన్ సలహాదారులు అమీన్‌కు తప్పుడు సలహాలు ఇస్తూ రాజకీయ సంక్షోభానికి కారకులయ్యారు. వారిచ్చిన సలహా ప్రకారం అమీన్ ఖలీఫా కాగానే జజీరా పరిపాలన నుండి తన సోదరుడు మోతమన్‌ని తొలగించాడు. హారూన్ రషీద్ కాలంలో

మామూన్ వారసత్వాన్ని వ్యతిరేకిస్తూ అమీన్ వారసత్వాన్ని సమర్థించిన ఫజల్ బిన్ రబీ ఖలీఫా అమీన్‌ని తన బుట్టలో వేసుకోవడానికి హారూన్ రెండవ వారసుడైన మామూన్‌ని తొలగించి అమీన్ కుమారుడైన మూసా బిన్ అమీన్‌ని ఖిలాఫత్ వారసుడిగా చేయమని అమీన్‌కు సలహాఇచ్చాడు. అమీన్ దాని ప్రకారమే మార్పుచేశాడు. ఈరెండు మార్పులతో అమీన్, మామూన్‌ల మధ్య విభేదాల చిచ్చు రగిలింది. ఈ చిచ్చుని జాతీయ-ప్రాంతీయ దురభిమానాలతో పెట్రేగిపోతున్న సైన్యాధికారులు మరింత ఎగదోశారు.

దాంతో అన్నదమ్ముల మధ్య ఎడతెరిపిలేని యుద్ధాలు మొదలయ్యాయి. హి.శ. 195లో అమీన్ ఫజల్ బిన్ రబీ సలహాతో మామూన్‌కు వ్యతిరేకంగా సేనాపతి అలీ బిన్ ఈసాకు యాభై వేలతో కూడిన ఓ సైనికపటాలం ఇచ్చి ఖురాసాన్ రాష్ట్రానికి పంపాడు. ఆ సైన్యాన్ని ఎదుర్కోవడానికి మామూన్ తరపున నాల్గువేల మంది సైనికులతో తాహిర్ బిన్ హుసైన్ రంగంలోకి దిగాడు. ఇరుపక్షాల మధ్య భీకర పోరాటం మొదలయింది.

తాహిర్ సైనికుల్లో కొందరు, ఎటూ అలీ పక్షమే గెలుస్తుంది కనుక అలీ నుండి ప్రయోజనం పొందే దురాశతో తాహిర్‌ని వదలి అలీ సైన్యంలో చేరిపోయారు. అయితే అలి ఆ సైనికుల్ని బాగా చితకబాది పంపించాడు. దానివల్ల తాహిర్ సైనికుల్లో సమరో త్సాహం ద్విగుణీకృతమయింది. వారంతా ప్రాణాలకు తెగించి పోరాడారు. యుద్ధం తీవ్ర స్థాయికి చేరిన దశలో తాహిర్ సైనికుడు విడిచిన ఓ బాణం సేనాపతి అలీ బిన్ ఈసా గొంతులో దిగబడింది. దాంతో అలి దభేలున కింద పడిపోయి ఊపిరి విడిచాడు. తమ సేనాపతి పర్యవసానం చూసిన అలి సైనికులు పిరికిపందలై పారిపోయారు.

వెంటనే తాహిర్ సైనికులు అలి శిరస్సు ఖండించి మామూన్ సలహాదారుడు ఫజల్ బిన్ రబీ దగ్గరకు తీసికెళ్ళారు. ఫజల్ దాన్ని మామూన్‌కు చూపి విజయాభినందనలు తెలిపాడు. ఆ తరువాత అమీన్ సైన్యాలు మామూన్ సైన్యాలపై మరికొన్ని దాడులు చేసి పరాజయం పాలయ్యాయి. వేరొకవైపు అమీన్ గవర్నర్లలో అనేకమంది అమీన్ నుండి విడిపోయి మామూన్‌కు దగ్గరయ్యారు. దాంతో అమీన్‌రాజ్యం రోజురోజుకు బక్కచిక్కి పోతూ చివరికి బగ్దాద్‌కు, దాని పరిసరప్రాంతాలకు పరిమితమైపోయింది.

అలాంటి పరిస్థితిలో మామూన్ సేనాపతులు తాహిర్, హర్షిమా తమతమ సైన్యా లతో వెళ్ళి రెండువైపుల నుండి బగ్దాద్ నగరాన్ని ముట్టడించారు. ఏడాదికి పైగా సాగిన ఈ సుదీర్ఘముట్టడితో అమీన్ భయపడి హర్షిమా నుండి ప్రాణరక్షణ హామీ పొంది రాజమహల్ వెనుక ద్వారం గుండా బయటికి వచ్చి దజ్లానదిలో పడవ మీద ఎదురు చూస్తున్న హర్షిమా దగ్గరకు చేరుకున్నాడు.

అయితే హర్షిమా పడవలు కొద్దిదూరం ముందుకు సాగగానే తాహిర్ సైనికులు వచ్చి ఢీకొన్నారు. ఈ యుద్ధంలో తాహిర్ సైనికులు అమీన్‌ని పట్టుకెళ్ళి తాహిర్ ముందు ప్రవేశపెట్టారు. తాహిర్ అమీన్‌ని జైల్లో పడవేయించాడు. మరుసటిరోజు తాహిర్ ఆదేశం తో కొందరు సైనికులు జైల్లో ప్రవేశించి అమీన్‌ని హతమార్చారు. ఈవిధంగా అమీన్ పరిపాలన దాదాపు నాలుగేండ్ల ఎనిమిది నెలల పాటు ఎన్నో వడిదుడుకులకు లోనవుతూ హి.శ. 198 ముహర్రం నెలలో ముగిసిపోయింది.



# 55. మామూన్ రషీద్ పరిపాలన

అమీన్ హత్య తరువాత అతని సవతిసోదరుడు మామూన్ హి.శ. 198 ముహర్రం నెలలో ఖలీఫా అయ్యాడు. మామూన్ ఈరానీ సంతతికి చెందిన స్త్రీ కుమారుడైనందున హారూన్ అంత్యకాలంలో ఉండిన మామూన్ సేనాపతుల్లోని ఫజల్ బిన్ సహెల్‌ని ముఖ్యమంత్రిగా నియమించాడు. ఫజల్ కూడా ఈరానీ సంతతికి చెందినవాడే. హారూన్ తన పాలనాకాలంలో ఫజల్‌ని మామూన్ కార్యదర్శిగా నియమించాడు.

ఫజల్ తన (ఈరానీ)సంతతికే చెందిన స్త్రీకుమారుడైన మామూన్‌ని అమితంగా అభిమానించడమేగాక, అబ్బాసీసంతతి స్త్రీ కుమారుడైన అమిన్ పట్ల ద్వేషం పెంచు కున్నాడు. మామూన్ కూడా ఫజల్ బిన్ సహెల్‌ని తన శ్రేయోభిలాషిగా భావించి అతనికి విస్తృతమైన అధికారాలు ప్రసాదించాడు. దాంతో ఫజల్ ఖలీఫా మామూన్‌ని ఖురాసాన్ రాష్ట్రరాజధాని మరూని యావత్‌సామ్రాజ్య రాజధానిగా చేసుకుంటే మంచిదని సలహా ఇచ్చాడు. ఆ తర్వాత ఖురాసాన్ ప్రజల నుండి వసూలుచేసే శిస్తుల్లో 25% తగ్గించాడు. అంతేగాక పాలనావ్యవస్థలోని కీలకపదవులన్నీ ఈరానీ (మజూసీ)సంతతి వ్యక్తులకే కట్ట బెట్టసాగాడు. అది గమనించిన అరబ్బులు మామూన్ ముఖ్యమంత్రి ఫజల్ చేతిలో కీలుబొమ్మయి పోయాడని భావించి అలజడులు సృష్టించడానికి ప్రయత్నించారు. అంచేత మామూన్ తన పాలనాకాలమంతా అంతర్గత యుద్ధాలను, విదేశీదాడులను ఎదుర్కోవడంలోనే నిమగ్నుడై నిర్మాణాత్మక కార్యాల వైపు దృష్టి సారించలేకపోయాడు.

ఖలీఫా మామూన్ రాజకీయవ్యవహారాల్లో పూర్తిగా ఫజల్ మీద ఆధారపడుతూ రబ్బరుస్టాంపులా మారిపోయాడు. అతడ్ని ఏఅధికారయినా కలుసుకోవలంటే ముందుగా ముఖ్యమంత్రి ఫజల్ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ప్రముఖ సేనాపతుల్లో ఒకడైన హర్షిమా అతని అనుమతి తీసుకోకుండా ఖలీఫాను కలుసుకొని దేశంలో సాగు తున్న అలజడుల్ని గురించి అతనికి తెలియజేయడానికి ప్రయత్నించాడు. కాని ఫజల్ ఖలీఫా ముందు హర్షిమాపై లేనిపోని ఆరోపణలు మోపి అతడ్ని జైల్లో పడవేయించాడు. తరువాత అతడ్ని జైల్లో చంపించి జబ్బుపడి చనిపోయాడని ఖలీఫాకు చెప్పాడు.

ఖలీఫా మామూన్ అల్వీ వంశస్థుల్ని ఎంతో అభిమానించేవాడు. ఆ అభిమానంతో అతను అల్వీవంశస్థుడైన అలీరజా బిన్ మూసా కాజిమ్‌కు తన కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు. ఆమె చనిపోతే తన రెండవ కూతుర్ని కూడా ఇచ్చి పెళ్ళిచేశాడు. పైగా అలీరజాని తన రాజకీయ వారసుడిగా ప్రకటించాడు. అంచేత అలీరజా మాత్రమే ఖలీఫాకు వాస్తవ పరిస్థి తులు తెలియజేయగలడని భావించిన కొందరు మరూకు చేరుకొని అలీరజాను కలుసు కొని మాట్లాడారు. అలీరజా దేశపరిస్థితుల్ని గురించి ఖలీఫాకు వివరించాడు. ముఖ్యంగా ఇరాఖ్ అలజడులు, హర్షిమా హత్య గురించి తెలిపినపుడు మామూన్ అదిరిపడ్డాడు. తక్షణమే అతను ఖురాసాన్‌గవర్నర్‌గా ఫజల్ పినతండ్రి కుమారుడు గసాన్ బిన్ ఇబాద్‌ని నియమించి రాజధాని మరూ నుండి ఇరాఖ్‌కు బయలుదేరాడు.

అతనివెంట సైనికులతో పాటు ముఖ్యమంత్రి ఫజల్ బిన్ సహెల్ కూడా ఉన్నాడు. అందరూ దారిలో సర్ఖస్ అనే ప్రదేశంలో విడిదిచేశారు. ఓరోజు ఫజల్ స్నానం చేయ

డానికి బాత్‌రూంలోకి ప్రవేశించాడు. సరిగ్గా అదేసమయంలో నలుగురు అపరిచితులు బలవంతంగా బాత్‌రూంలోకి దూరి ఫజల్‌ని హతమార్చి పారిపోయారు. ఈ సంఘటన హి.శ. 203 షాబాన్ నెలలో సంభవించింది. ఇది ఖలీఫా మామూన్ పథకమే. అయితే దాన్ని కప్పిపుచ్చడానికి ఫజల్‌హంతకుల్ని పట్టితెచ్చినవారికి పదివేల దీనార్లు బహుమతిగా ఇస్తామని ప్రకటన చేయించి తద్వారా వచ్చిన హంతకుల్ని హతమార్పించాడు. ఆ తర్వాత ఫజల్ తమ్ముడు హసన్ బిన్ సహెల్‌కు ఒకలేఖ ద్వారా తన ప్రగాఢసంతాపం తెలిపి ఫజల్ స్థానంలో అతడ్ని ముఖ్యమంత్రిగా నియమించాడు. కొన్నాళ్ళ తర్వాత హసన్ కుమార్తె బూరాన్‌ని పెళ్ళాడి హసన్ హోదాను మరింత పెంచాడు.

ఖలీఫా మామూన్ బగ్దాద్ నుండి తూస్ పట్టణానికి చేరుకొని అక్కడ నెలరోజులు బసచేశాడు. ఆ రోజుల్లోనే తన అల్లుడు, రాజకీయ వారసుడైన అలీరజా యాదృచ్ఛికంగా చనిపోయాడు. అతని మరణం పట్ల మామూన్ తీవ్రంగా విచారిస్తూ అతని భౌతిక కాయాన్ని తన తండ్రి హారూన్ సమాధిలోనే పెట్టి సమాధిచేశాడు.

మరూనుండి బయలుదేరిన ఖలీఫా మామూన్ దారిలో అనేకప్రాంతాలు పర్యటిస్తూ వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటూ ఏడాదిన్నర తర్వాత హి.శ. 204 సఫర్ నెలలో బగ్దాద్ చేరుకున్నాడు. అతను బగ్దాద్ చేరుకోక ముందే అక్కడి పరిస్థితులు చక్కబడ్డాయి. బగ్దాద్‌నుండి ఇతర అనేకప్రాంతాలు పర్యటిస్తూ, అక్కడ నెలల తరబడి బసచేస్తూ వాస్తవ పరిస్థితులు తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరించాడు.

హి.శ. 205లో ఒకరోజు మామూన్ దగ్గరకు అతని సుప్రసిద్ధ సేనాపతి తాహిర్ బిన్ హుసైన్ వచ్చికూర్చున్నాడు. అతడ్ని చూడగానే మామూన్‌కు అతని సోదరుడు అమీన్ గుర్తుకొచ్చాడు. మరోసేనాపతి హర్సిమా ఇచ్చిన హామీతో అతనితో కలసి పారిపోతున్న అమీన్‌ని తాహిర్ బంధించి, జైల్లో వేసి హత్యచేయించిన సంగతి గుర్తుకొచ్చి మామూన్ కంటతడి పెట్టుకున్నాడు. తాహిర్ దానికి కారణం అడిగితే మామూన్ సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేశాడు. ఆ తర్వాత తాహిర్ ఎలాగో అసలు విషయం తెలుసుకొని, ఇక ఖలీఫా మామూన్ తనను బ్రతకనివ్వడని భావించి తీవ్ర ఆందోళనచెందాడు.

ఆ రోజుల్లోనే ఖురాసాన్ సరిహద్దుల్లో కొన్నితెగలు తిరుగుబాటు లేవదీశాయి. దాన్ని అణచడానికి తాహిర్ మాత్రమే సమర్థుడని అధికారులు చెప్పడంతో మామూన్ వెంటనే తాహిర్‌ని ఖురాసాన్ గవర్నర్‌గా నియమించి మరూకు పంపించాడు. పంపేటప్పుడు అతనికి లక్షదిర్హంల పైకం, ఒకబానిసను పారితోషికంగా ఇచ్చాడు. అయితే ఆ బానిసకు, ఒకవేళ తాహిర్ తనకు వ్యతిరేకంగా తిరుగుబాటుకుపాల్పడితే వెంటనే అతనికి విషమిచ్చి చంపెయ్యి అని రహస్యంగా చెప్పిపంపాడు.

తాహిర్ మరూ వెళ్ళి గవర్నర్ బాధ్యతలు చేపట్టి విదేశీశత్రుల్ని అణచివేసినప్పటికీ మామూన్ పట్ల ఏర్పడిన భయం పూర్తిగా తొలగిపోలేదు. అంచేత అతను మామూన్ నుండి వేరయి స్వతంత్రపాలకుడిగా వ్యవహరించే పనులు ప్రారంభించాడు. మామూన్ ఈసంగతి తెలుసుకొని తాహిర్ అరాచకాన్ని అంతమొందించడానికి ప్రధాని అహ్మద్ బిన్ అబీఖాలిద్‌ని మరూ వైపు పంపాడు. అయితే అహ్మద్ బగ్దాద్ నుండి బయలుదేరక



ముందే తాహిర్ చనిపోయాడన్న వార్త బగ్దాద్‌కు చేరింది. తాహిర్ జ్వరంతో బాధపడుతూ ఓరోజు చాలా సేపటిదాకా పడుకున్నాడు. సేవకులకు అనుమానం వచ్చి లోపలికి పోయిచూస్తే అతని మృతదేహం కన్పించింది. అంటే మామూన్ పంపిన బానిస తాహిర్ దురుద్దేశం గ్రహించగానే అతనికి విషమిచ్చి చంపేశాడన్న మాట. ఖలీఫా మామూన్ తాహిర్ మరణం తర్వాత అతనికొడుకు తల్హాని ఖురాసాన్‌గవర్నర్‌గా నియమించాడు.

అయినప్పటికీ అనేక రాష్ట్రాల్లో తిరుగుబాటులు తలెత్తడంవల్ల అనేకయుద్ధాలు చేయవలసివచ్చింది. మరొకవైపు రోమన్ల తిరుగుబాటుల్ని కూడా మాటిమాటికి అణచవలసివచ్చింది. ఈవిధంగా అతని పాలనంతా యుద్ధాల్లోనే గడచిపోయింది. చివరికి ఖలీఫా మామూన్ ఇరవై ఏళ్ళకు పైగా పరిపాలనచేసి హి.శ. 218, రజబ్ నెలలో వ్యాధిగ్రస్తుడై 48ఏళ్ళ వయస్సులో చనిపోయాడు.

మామూన్ చనిపోయే ముందు ప్రభుత్వాధికారుల్ని, ధర్మవేత్తల్ని పిలిపించి వారికి సముచిత సూచనలు చేశాడు. తరువాత తన రాజకీయ వారసుడైన తన సోదరుడు అబూఇస్‌హాఖ్ మోతసిమ్‌ని పిలిచి అతనికి కొన్ని విషయాలు ఉపదేశించాడు. ఆ తర్వాత ఖుర్‌ఆన్ పఠనంలో లీనమైపోయాడు. అప్పుడు "ఎవరి సామ్రాజ్యం ఎన్నటికీ పతనం కాదో ఆ ప్రభువా! తన సామ్రాజ్యం పతనమవుతున్నవాడ్ని కనికరించు" అని దైవాన్ని ప్రార్థించాడు. ఆతర్వాత మామూన్ ప్రాణం అనంతవాయువుల్లో కలసిపోయింది.

మామూన్ ఎల్లప్పుడూ యుద్ధాల్లో నిమగ్నుడై ఉంటున్నప్పటికీ విద్యాజ్ఞానాల అభివృద్ధి కోసం కూడా కృషిచేశాడు. కవులు, పండితులు, ధర్మవేత్తల సభలు నిర్వహించి అందులో తాను కూడా పాల్గొనేవాడు. ప్రపంచంలోని ప్రముఖ ముస్లిమేతర మేధావులు రాసిన గ్రంథాలను తెప్పించి పార్శీ, అరబీ భాషల్లో అనువదింపజేయించాడు.

అబూముహమ్మద్ యజీది కథనం: "నేను మామూన్‌కు చిన్నతనంలో చదువు నేర్పుతుండేవాడ్ని. ఒకసారి కొందరు సేవకులు నాదగ్గరకు వచ్చి 'ఈ అబ్బాయి మీరెళ్ళిపోయిన తర్వాత మమ్మల్ని కొడ్తూ పళ్ళికిలిస్తూ వేధిస్తుంటాడ'ని ఫిర్యాదుచేశారు. అంచేత నేనతడ్ని కొరడాతో ఏడుదెబ్బలు కొట్టాను. దాంతో మామూన్ ఏడుస్తూ కళ్ళు తుడుచుకొని వెళ్ళిపోతుంటే ప్రధాని జాఫర్‌బర్మకీ వచ్చేశాడు. నేనక్కడ్నుంచి బయటికి వెళ్ళిపోయాను. అతను మామూన్‌కు అవీ ఇవీ చెప్పి నవ్వించి వెళ్ళిపోయాడు. ఆతర్వాత నేను మామూన్ దగ్గరకు వచ్చి 'నువ్వు జాఫర్ ముందు నామీద ఫిర్యాదు చేస్తేవేమోనని నేను భయపడ్డాను' అని అన్నాను. మామూన్ ఈమాట విని 'నేను మీమీద మా నాన్న దగ్గర కూడా ఫిర్యాదుచేయను. మీరు నా మంచి కోసమే కొట్టారుకదా!' అని అన్నాడు.

తరచుగా మామూన్ బాత్‌రూంలో ఉన్నపుడు బయట సేవకులు అతనిపై లేనిపోని నిందలు మోపుతూ దూషించేవారు. అయితే మామూన్ ఈ మాటలు వినికూడా వారిని శిక్షించేవాడుకాదు. పైగా తానా తిట్లు విన్నసంగతి కూడా వారి దృష్టికి రానిచ్చేవాడుకాదు. "ఉత్తముడి లక్షణాల్లో ఒకటి- అతను తనకంటే బలవంతుడు చేసే దౌర్జన్యం పట్ల సహనం వహిస్తాడు; తనకంటే బలహీనుడిపై దౌర్జన్యం చేయడు" అని మామూన్ తరచుగా అంటుండేవాడు.

# 56. మోతసిమ్ బిల్లా పరిపాలన

మోతసిమ్ బిల్లా హి.శ. 180లో హారూన్‌రషీద్ మూడవభార్య బార్దాకు జన్మించాడు. మామూన్‌రషీద్ పాలనాకాలంలో అతను సిరియా, ఈజిప్టు రాష్ట్రాలకు గవర్నర్‌గా ఉండేవాడు. మామూన్ రోమన్లపై యుద్ధం చేసినపుడు మోతసిమ్ ఆ యుద్ధంలో అసామాన్య ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించాడు. దాంతో మామూన్ సంతోషించి తన కుమారుడు అబ్బాస్‌ని కాదని అతడ్ని తన రాజకీయవారసుడిగా చేశాడు. అంచేత అతను చనిపోయిన మరునాడు హి.శ. 210లో మోతసిమ్ అధికారపీఠం అధిరోహించాడు.

మామూన్ చనిపోయినపుడు అతని రాజకీయవారసుడి విషయమై సైనికుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలో మోతసిమ్ నమ్మినబంటు ఫజల్ బిన్ మర్వాన్ అనే క్రైస్తవుడు ముందుకొచ్చి మోతసిమ్ చేతిలో చేయి కలిపి బైత్ చేశాడు. అంచేత మోతసిమ్ అధికారం చేపట్టగానే అతడ్నే ప్రధానమంత్రిగా నియమించాడు.

మోతసిమ్ బిల్లాకు చదువుసంధ్యలు అంతగా అబ్బలేదు. కాకపోతే పండితుల ధార్మిక సమావేశాల్లో తరచుగా పాల్గొనేవాడు. మామూన్‌రషీద్ కాలంలో ఖుర్‌ఆన్ ఇతర సృష్టితాల మాదిరిగా సృష్టితమా కాదా అనే ఓ పనికిమాలిన సమస్య వచ్చిపడింది. మామూన్ అందులో చిక్కుకొని ఖుర్‌ఆన్ సృష్టితమే (ఖల్ఖె ఖుర్‌ఆన్) అనే విషయానికి అనుకూలుడైపోయాడు. అంతటితో తృప్తిచెందక దాన్ని వ్యతిరేకించిన పండితుల్ని, ధర్మవేత్తల్ని రకరకాలుగా వేధించాడు. మోతసిమ్ బిల్లా కూడా మామూన్ అడుగుజాడల్లో నడుస్తూ "ఖల్ఖె ఖుర్‌ఆన్" వ్యతిరేకుల్ని నిర్దాక్షిణ్యంగా హింసించాడు. సుప్రసిద్ధ ఫిఖ్హావేత్త ఇమామ్ అహ్మద్ బిన్‌హంబల్ (రహ్మలై) కూడా అతని హింసాదౌర్జన్యాలకు గురయ్యారు.

మోతసిమ్ బిల్లా ఖలీఫా అయిన తరువాత ఖురాసాన్‌లోని అలీవ్వర్గీయుల్లో మరొకసారి తిరుగుబాటు చిహ్నాలు బహిర్గతమయ్యాయి. వారు మదీనాలో రాజకీయాలకు దూరంగా ప్రశాంతజీవితం గడుపుతుండిన (ఇమామ్ హుసైన్-రజి సంతతికి చెందిన) ముహమ్మద్ బిన్ ఖాసింను తిరుగుబాటుకు పురిగొల్పారు. ఖురాసాన్‌లో ఆయనకు తమ మద్దతు తెలుపుతూ వేలాదిమంది ఈరానీయులు రహస్యంగా బైత్ కూడా చేశారు. దాంతో ముహమ్మద్ బిన్ ఖాసిం తిరుగుబాటు లేవదీశాడు. ఆ తిరుగుబాటును అణచడానికి ఖురాసాన్ గవర్నర్ అబ్దుల్లా బిన్ తాహిర్ సైన్యాన్ని పంపాడు. ఇరుపక్షాల మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. కాని ప్రతి యుద్ధంలోనూ ముహమ్మద్ బిన్ ఖాసిం ఓటమి చవిచూడవలసి వచ్చింది. చివరికి ప్రభుత్వసేనలకు పట్టుబడి హి.శ. 219లో జైలుపాలయ్యాడు. అయితే కొన్నాళ్ళలోనే అభిమానుల సహకారంతో రహస్యంగా జైలు నుండి బ్రతుకుజీవుడా అంటూ బయటపడ్డాడు.

మోతసిమ్ బిల్లా గత అబ్బాసీ ఖలీఫాల మాదిరిగా ఖురాసాన్ సైనికులపై పూర్తిగా ఆధారపడకుండా టర్కీబానిసల్ని చేరదీసి తన సైన్యంలో భర్తీచేసుకున్నాడు. అంతేగాక వారికి ఖురాసాన్ సైనికులకంటే ఎక్కువ జీతాలిచ్చి బాగా మచ్చిక చేసుకున్నాడు. దాంతో ఖురాసాన్‌సైన్యంలోని ఈరానీయులు-అరబ్బులకు, టర్కీసైనికులకు మధ్య పొట్లాటలు



మొదలయ్యాయి. ఖలీఫా మోతసిమ్ ఈ పరిస్థితి చూసి హి.శ. 220లో టర్కీ సైనికుల కోసం బగ్దాద్‌కు తొంభైమైళ్ళ దూరంలో ఒక సైనికస్థావరం, నివాసగృహాలు, జామియా మస్జిద్, ఒక రాజమందిరం నిర్మింపజేసి తాను కూడా అక్కడికెళ్ళి నివసించసాగాడు. చివరికి (సామరా అనబడే) ఆ ప్రదేశమే రాజధాని నగరమైపోయి టర్కీసైనికులకు మరింత బలం చేకూర్చింది.

హి.శ. 220లో ప్రధాని ఫజల్ బిన్ మర్వాన్ మీద ఒక అవినీతి ఆరోపణ వచ్చింది. ఖలీఫా మోతసిమ్ విచారణ జరిపిస్తే ఫజల్ పదిలక్షల దీనార్ల కుంభకోణానికి పాల్పడినట్లు తేలింది. అంచేత ఖలీఫా ఆ పైకాన్ని ఫజల్ ఆస్తుల నుండి వసూలుచేసి అతడ్ని ప్రధాని పదవి నుండి తొలగించి జైల్లో పడవేయించాడు. అతని స్థానంలో ముహమ్మద్ బిన్ అబ్దుల్‌మలిక్ బిన్ అబాన్‌ని ప్రధానిగా నియమించాడు.

ఈరాన్ ఉత్తరదిశగా ఆజర్‌బైజాన్ సరిహద్దు ప్రాంతంలో మజూసీ సంతతికి చెందిన బాబక్ ఖుర్మీ అనేవాడు ఓ కొత్తమతాన్ని సృష్టించి తన వేలాదిమంది అనుచరులతో హత్యలు లూటీలు చేస్తూ ఇస్లామీయ సామ్రాజ్యంలో అరాచకానికి పాల్పడుతుండేవాడు. మామూన్‌రషీద్ పాలన చివరికాలంలో అతను మరింత బలంపుంజుకొని ముస్లింలపై తెగబడ్డాడు. అంచేత ఖలీఫా మోతసిమ్ అతని పీచం అణచడానికి అబూసయీద్ ముహమ్మద్ బిన్ యూసుఫ్‌ని పంపించాడు. బాబక్ ఖుర్మీకి చెందిన ఓ సైనికదళం ఒక చోట లూటీలకు, హత్యలకు పాల్పడుతున్నాడని తెలియగానే అబూసయీద్ అక్కడికి చేరుకొని దాడిచేశాడు. ఆ యుద్ధంలో బాబక్ సైనికదళం చిత్తుగా ఓడిపోయింది. ఇది బాబక్ ఖుర్మీకి తగిలిన మొదటి ఎదురుదెబ్బ.

బాబక్ సేనాపతుల్లో ఇస్మత్ అనే వాడొకడు ఆజర్‌బైజాన్ రాష్ట్రంలోని ఓ ప్రాంతం పాలకుడి దగ్గరకెళ్ళి ఆశ్రయం పొందాడు. ముస్లింల సానుభూతిపరుడైన ఆ పాలకుడు ఇస్మత్ సైనికులకు బ్రహ్మాండమైన విందుభోజనం ఏర్పాటుచేసి, వారా రాత్రి బాగా మెక్కి నిద్రలోకి జారుకోగానే అందర్నీ ఊచకోత కోయించాడు. ఇస్మత్‌ని మాత్రం చంపకుండా బంధించి ఖలీఫా దగ్గరకు పంపించాడు. ఖలీఫా మోతసిమ్ బాబక్‌ఖుర్మీ కోటలు, సైనికస్థావరాల వివరాలను గురించి అడిగినప్పుడు ఇస్మత్ తనను ఖలీఫా విడుదలచేస్తాడన్న ఆశతో ఆ వివరాలన్నీ తెలియజేశాడు. ఖలీఫా ఆ వివరాలన్నీ రాబట్టిన తరువాత ఇస్మత్‌ని జైల్లోనే ఉంచి, బాబక్ అరాచకాన్ని శాశ్వతంగా అంతమొందించే ఉద్దేశ్యంతో టర్కీ జాతీయుడైన హైదర్ అఫ్షీన్ అనే నవముస్లిం సేనాపతిని పంపించాడు.

హైదర్ అఫ్షీన్ ఖలీఫా మామూన్ పాలనాకాలంలో మోతసిమ్ చేతిలో ఇస్లాం స్వీకరించాడు. అతని ప్రతిభాపరాక్రమాలను గమనించిన మోతసిమ్ ఖలీఫా పీఠం ఎక్కగానే అతడ్ని సైన్యాధ్యక్షుడిగా నియమించాడు. ఈ దండయాత్ర కోసం ఖలీఫా అతనికి సకల సౌకర్యాలతో పాటు పెద్దఎత్తున ధనసంపద కూడా ఇచ్చి పంపాడు. దాంతో హైదర్‌అఫ్షీన్ బ్రహ్మాండమైన సైనికపటాలంతో వెళ్ళి బాబక్‌ఖుర్మీ సైన్యంతో ఢీకొన్నాడు. హి.శ. 223లో జరిగిన ఈ యుద్ధంలో శత్రుసైన్యం పరాజయంపాలై, దాని అగ్రనాయకుడు బాబక్‌ఖుర్మీ ఖైదీగా పట్టుబడ్డాడు.

ఖలీఫా మోతసిమ్ ఈ విజయవార్త వినగానే సైన్యాధిపతి హైదర్అఫ్షీన్‌కు ఆజర్ బైజాన్ నుండి రాజధాని సామరా వరకు స్వాగత తోరణాలు కట్టించి, ఎంతో విలువైన బహుమతులు పంపాడు. అఫ్షీన్ తన దగ్గరకు చేరుకోగానే అతడ్ని గాఢంగా కౌగలించు కొని తన ముందు స్వర్ణపీఠం మీద కూర్చోబెట్టి అతని శిరస్సుపై రత్నఖచితకిరీటం పెట్టాడు. అంతేగాక అతనికి ఇరవైలక్షల దిర్హంలు, అతని సైన్యానికి పదిలక్షల దిర్హంలు బహుమతిగా ఇచ్చాడు. తరువాత బాబక్‌ఖుర్మీని, అతని సోదరుడ్ని హతమార్పించాడు.

ముస్లిం సైన్యాలు బాబక్ సేనలతో పోరాడటంలో మునిగివుండటం గమనించిన రోమ్‌చక్రవర్తి మరొకసారి ముస్లిం సామ్రాజ్యంపై దాడిచేయడానికి ఒడిగట్టాడు. అతను ఒక పట్టణంపై దాడిచేసి అనేకమంది ముస్లింలను హతమార్చడమో, ఖైదీలుగా పట్టుకో వడమో చేశాడు. అప్పటికి బాబక్ సేనలతో ముస్లింల యుద్ధం ముగిసింది. అంచేత ఖలీఫా మోతసిమ్ వెంటనే రోమ్‌సైన్యాలను అణచడానికి బయలుదేరాడు. ఆ యుద్ధం లో కూడా హైదర్ అఫ్షీన్ అసామాన్య ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించాడు.

టర్కీజాతి సేనాపతుల్లో అఫ్షీన్ తర్వాత అజీఫ్ గొప్ప సేనాపతి. అయితే ఖలీఫా మోతసిమ్ సైన్యాధిపతి అఫ్షీన్ ముందు అజీఫ్‌ని తరచుగా విమర్శించేవాడు. అజీఫ్ ఈ అవమానాన్ని భరించలేక ఖలీఫాకు వ్యతిరేకంగా కుట్రలు ప్రారంభించాడు. అతను రోమన్లతో జరిగిన యుద్ధం సందర్భంలో ఖలీఫా మామూన్‌రషీద్ కుమారుడు అబ్బాస్‌తో "మీరు మోతసిమ్ చేతిలో బైత్‌చేసి పొరపాటుచేశారు. ఆనాడు మీరు ఖలీఫా కాదలచు కొనివుంటే సేనాపతులంతా మీకు మద్దతునిచ్చేవారు. ఇప్పటికైనా మించిపోలేదు. మీరు మోతసిమ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీస్తే సేనాపతుల్ని రహస్యంగా మనకనుకూ లంగా మలచుకోవచ్చు. తరువాత ఒకేసారి మోతసిమ్‌ని, అఫ్షీన్‌ని హతమార్చి మిమ్మల్ని ఖలీఫాగా ప్రకటించడం సులభమైపోతుంది" అని అన్నాడు. ఇలా అజీఫ్ మాటిమాటికి చెబుతూ అబ్బాస్‌ని తిరుగుబాటు కుట్రకు పురిగొల్పసాగాడు.

యుద్ధరంగం నుండి తిరుగు ప్రయాణంలో ఈ కుట్ర సంగతి ఖలీఫా మోతసిమ్‌కు తెలిసిపోయింది. వెంటనే అతను అబ్బాస్‌ని, అజీఫ్‌ని, మరికొందరు సైన్యాధికారుల్ని పిలిపించి బంధించాడు. తరువాత మార్గమధ్యలో అబ్బాస్‌ని ఒక చాపలో చుట్టి కుట్టే శాడు. దాంతో అబ్బాస్ ఊపిరాడక కాస్సేపటికే ప్రాణం వదిలాడు. దారిలో మరొకచోట అజీఫ్‌ని కూడ చాపలోచుట్టి కుట్టేశాడు. దాంతో అతను కూడ ఊపిరాడక చనిపోయాడు. రాజధాని సామరా చేరుకున్న తరువాత మోతసిమ్ ఖలీఫా మామూన్ ఇతర కొడుకుల్ని ఒక ఇంట్లో బంధించి హతమార్పించాడు. ఇలా ఖలీఫా మోతసిమ్ అనుమానితులందర్నీ మట్టుబెట్టి తన దారి నుండి శాశ్వతంగా తొలగించుకున్నాడు.

బాబక్‌ఖుర్మీతో జరిగిన యుద్ధకాలం నుండి అఫ్షీన్‌కు ఖలీఫా సైనిక ఖర్చుల కోసం పెద్దఎత్తున ధనకనకవస్తువుల్ని పంపుతుండేవాడు. అయితే అఫ్షీన్ వాటిని సైనికుల కోసం చాలాతక్కువ ఖర్చుపెడ్తూ మిగిలినదంతా టర్కీలోని తన స్వస్థలం అష్రూసనాలో కొడుకు హసన్ దగ్గరకు రహస్యంగా చేరవేస్తుండేవాడు. ఇలా అతను తన స్వస్థలం లో పెద్దఎత్తున సంపద కూడబెట్టి స్వతంత్ర రాజ్యస్థాపన కోసం ప్రయత్నించసాగాడు.



సైనిక ఖర్చుల కోసం ఖలీఫా పంపుతున్న సంపదలో అత్యధిక భాగాన్ని అఫ్షీన్ తన స్వస్థలానికి చేరవేస్తున్న సంగతి ఖురసాన్ గవర్నర్ అబ్దుల్లా బిన్ తాహిర్‌కు తెలిపాడు. దానిపై ఖలీఫా అఫ్షీన్ నుండి ఎలాంటి వివరణ అడగలేదు. అటు అఫ్షీన్ తన సైనిక సామర్థ్యాన్ని గుర్తించిన ఖలీఫా తనకు ఖురాసాన్ గవర్నర్ పదవి కట్టబెడ్తాడని, తద్వారా తన స్వతంత్ర రాజ్యస్థాపనకు దారి మరింత సుగమం అవుతుందని ఎంతో ఆశిస్తూ బాబక్ యుద్ధరంగం నుండి రాజధానికి చేరుకున్నాడు. కాని ఖలీఫా అతని ఆశల్ని వమ్ము చేస్తూ అతడ్ని ఆర్మేనియా-ఆజర్‌బైజాన్ ప్రాంతాల గవర్నర్‌గా నియమించాడు. దాంతో అఫ్షీన్ నీరుగారిపోయి మరో కుట్రకు పాల్పడ్డాడు.

అతను ఖురాసాన్‌గవర్నర్ అబ్దుల్లా బిన్ తాహిర్‌కు వ్యతిరేకంగా జరూష్తి మతరక్షణ పేరుతో ఒక లేఖద్వారా తబ్రిస్తాన్ పాలకుడు మాజ్యార్‌ని పురిగొల్పాడు. మాజ్యార్ ఆ లేఖ చదివి సంబరపడిపోతూ హి.శ. 224లో తిరుగుబాటుకు శ్రీకారం చుట్టాడు. ఖురాసాన్ గవర్నర్ అబ్దుల్లా బిన్ తాహిర్ అతని తిరుగుబాటుసన్నాహాల సంగతి తెలుసు కొని తన పినతండ్రి హసన్ బిన్ హుసైన్ నాయకత్వంలో ఒక సైన్యాన్ని పంపించాడు. తిరుగుబాటు విషయాన్ని ఖలీఫాకు కూడా తెలియజేశాడు.

ఖలీఫా వెంటనే అబ్దులా సైన్యానికి మద్దతుగా వివిధ ప్రాంతాల నుండి సైనికుల్ని సమీకరించి పంపాడు. అఫ్షీన్‌ని మాత్రం అటువైపు వెళ్ళడానికి అనుమతించలేదు. ఫలితంగా సేనాపతి హసన్ బిన్ హుసైన్ తిరుగుబాటుదారుడు మాజ్యార్‌ని ఖైదీగా పట్టుకొని గవర్నర్ అబ్దుల్లా బిన్ తాహిర్ వద్దకు పంపాడు. అదీగాక మాజ్యార్ దగ్గర్నుండి అతడ్ని తిరుగుబాటుకు పురిగొల్పుతూ అఫ్షీన్ రాసిన ఉత్తరాలు కూడా తీసి పంపాడు. గవర్నర్ అబ్దుల్లా ఖురాసాన్ నుండి అఫ్షీన్‌ని, అతని దగ్గర దొరికిన ఉత్తరాలను ఖలీఫా దగ్గరకు పంపించాడు. ఖలీఫా మోతసిమ్ ఆ ఉత్తరాలను తన దగ్గరే భద్రపరచుకొని మాజ్యార్‌ని జైల్లో పడవేయించాడు; అఫ్షీన్‌ని ఇంకా ఏమీ అనలేదు.

మాజ్యార్ లేవదీసిన తబ్రిస్తాన్‌తిరుగుబాటు పూర్తిగా అణగకముందే మోసిల్ పరిసర ప్రాంతాల్లో జాఫర్ బిన్ ఫహర్ నాయకత్వంలో కుర్దులు తిరుగుబాటు లేవదీశారు. ఈ తిరుగుబాటు ప్రదేశం ఆజర్‌బైజాన్-ఆర్మేనియా సరిహద్దుల్లోనే ఉంది. అయినప్పటికీ ఖలీఫా మోతసిమ్ కుర్దుల తిరుగుబాటును అణచడానికి అఫ్షీన్‌కు బదులు అబ్దుల్లా బిన్ సయీద్ అనే సేనాపతిని పంపించాడు. అబ్దుల్లా బిన్ సయీద్ జాఫర్‌సైన్యంపై దాడులు ప్రారంభించాడు. ఈ యుద్ధం దీర్ఘకాలం సాగింది. తరువాత ఖలీఫా మరో సేనాపతి ఏతాఖ్ నాయకత్వంలో భారీసైన్యం పంపాడు. హి.శ. 225లో జరిగిన ఈ యుద్ధంలో కుర్దులు పరాజయంపాలై, వారి నాయకుడు జాఫర్ బిన్ ఫహర్ హతమార్చ బడ్డాడు. ఈ తిరుగుబాటు కూడా అఫ్షీన్ ప్రేరణతోనే జరిగివుంటుంది.

హైదర్‌అఫ్షీన్ తన స్థానంలో మన్కజూర్ అనే తన బంధువు ఒకడ్ని ఆజర్‌బైజాన్‌లో ఇన్చార్జ్ గవర్నర్‌గా నియమించి దేశరాజధాని సమరాలో ఉండసాగాడు. ఆజర్‌బైజాన్‌లోని ఒక గ్రామంలో మన్కజూర్‌కు బాబక్‌ఖుర్మీ దాచిన ఓ పెద్దఖజానా దొరికింది. దాన్ని అతను ఖలీఫాకు పంపకుండా సొంతం చేసుకున్నాడు. ఈ సంగతి ఖలీఫా ఒక గూఢచారి

ద్వారా తెలుసుకొని మన్కజూర్‌ని తొలగించి అతని స్థానంలో బగాకబీర్‌ని గవర్నర్‌గా నియమించి పంపాడు. అయితే మన్కజూర్ తిరుగుబాటుకు పాల్పడి బగాకబీర్‌తో యుద్ధానికి దిగాడు. ఆ యుద్ధంలో మన్కజూర్ పరాజితుడై ఆజర్‌బైజాన్‌లోనే ఓ కోటలో దూరి కూర్చున్నాడు. అయితే మన్కజూర్ అనుచరుల్లోనే ఒకతను అతడ్ని నిద్ర పోతున్నపుడు బంధించి బగాకబీర్ దగ్గరకు పంపాడు. బగాకబీర్ అతడ్ని రాజధాని సమరాకు తీసికెళ్ళి ఖలీఫాకు అప్పగించాడు. ఖలీఫా అతడ్ని జైల్లో పడవేయించాడు.

ఈ సంఘటలతో అఫ్షీన్ మీద ఖలీఫా అనుమానం మరింత బలపడింది. ఈ సంగతి అఫ్షీన్ కూడా గ్రహించి ప్రాణాలు కాపాడుకోవడానికి పారిపోయే ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆ రోజుల్లోనే అతను నమ్మకస్తుడైన తన సేవకుడిపై ఏదో విషయంలో మండిపడ్డాడు. దాంతో ఆ సేవకుడు సేనాపతి ఐతాఖ్ దగ్గరకు వెళ్ళి అఫ్షీన్ దురుద్దేశాల లన్నిటినీ బయటపెట్టాడు. ఐతాఖ్ తక్షణమే ఆ సేవకుడ్ని ఖలీఫా దగ్గరకు తీసికెళ్ళి అఫ్షీన్ పారిపోయే ప్రయత్నంలో ఉన్నాడని తెలియజేశాడు. ఖలీఫా మోతసిమ్ వెంటనే అఫ్షీన్‌ని పిలిపించి జైల్లో పడవేయించాడు. ఆ తరువాత అఫ్షీన్ కొడుకు హసన్‌ని కూడా ఏదో నెపంతో రాజధానికి రప్పించి జైల్లో పడవేయించాడు.

ఈవిధంగా ఖలీఫా మోతసిమ్ విద్రోహులందర్నీ లోబరచుకున్న తర్వాత విచారణ జరిపి వారిని శిక్షించడానికి ప్రధానమంత్రి, ప్రధానన్యాయమూర్తి, సేనాపతులు, కొందరు ఉన్నతాధికారులతో ఒక విచారణసంఘం నియమించాడు. ఆ సంఘం విచారణలో అఫ్షీన్, అతని సహచర ఖైదీలు దేశద్రోహానికి ఒడిగట్టడమే గాక అసలు వారు ముస్లింలు కాదని, ముస్లింవేషాల్లో కుట్రలు పన్నుతుండిన మజూసీ మతస్థులు (అగ్నిపూజరులు) అని తేలింది. పైగా వారు మసీదుల్ని, ఇమాముల్ని, ఖుర్‌ఆన్ గ్రంథాన్ని, మహాప్రవక్త ముహమ్మద్(స)ని అగౌరవపరిచేవారని కూడా బయటపడింది. దాంతో విచారణసంఘం మాజ్యార్‌కు నాలుగొందలు కొరడా దెబ్బల శిక్ష, అఫ్షీన్‌కు మరణశిక్ష విధించింది. మాజ్యార్ కొరడా దెబ్బలకు తాళలేక ఊపిరి వదిలాడు. అఫ్షీన్‌ని ఉరికంబం ఎక్కించి చంపేయడం జరిగింది. ఈ సంఘటన హి.శ. 226లో సంభవించింది.

ఖలీఫా మోతసిమ్ తన సామ్రాజ్యసరిహద్దుల్లో అశాంతి, అలజడులు అంతమైపోయా యని గ్రహించిన తర్వాత బనూఉమయ్యా పాలకుల నుండి స్పెయిన్‌ని హస్తగతం చేసుకోవడానికి యుద్ధసన్నాహాలు ప్రారంభించాడు. కాని ఆ రోజుల్లోనే పాలస్తీనాలో తననుతాను బనూఉమయ్యా తెగకు చెందినవాణ్ణని చెప్పుకునే అబూహరబ్ ఈమానీ అనే వాడొకడు ఒక సైనికుడ్ని హతమార్చి పాలకుల భయంతో కొండల్లోకి పారిపోయాడు. ఆతర్వాత ముఖానికి ముసుగు కట్టుకొని పల్లెప్రాంతాల్లో ధర్మోపదేశం చేస్తూ పర్యటనలు జరిపాడు. దాంతో లక్షమంది జనం అతనికి అనుచరులైపోయారు. వారంతా అతని మాటలగారడిలో పడి ఖలీఫాకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. అంచేత ఖలీఫా మోతసిమ్ ఆ తిరుగుబాటును అణచివేయడానికి పాలస్తీనా వైపు ఓ సైన్యాన్ని పంపాడు. కాని ఆపని పూర్తికాకముందే 17ఏళ్ళ పాలన తర్వాత హి.శ. 227లో జబ్బుపడి చనిపోయాడు. స్పెయిన్‌ని హస్తగతం చేసుకోవాలనుకున్న అతని కోరిక నెరవేరలేదు.



# 57. వాసిఖ్ బిల్లా పరిపాలన

ఖలీఫా మోతసిమ్ మరణానంతరం అతని కుమారుడు వాసిఖ్ బిల్లా హి.శ. 227లో ఖలీఫా అయ్యాడు. మోతసిమ్ కాలంలో టర్కీజాతి సేనాధిపతి అఫ్షీన్ చంపబడిన తర్వాత టర్కీజాతిసైనికులు కాస్తంత బాధపడ్డారు. అంచేత వారి ఊరడింపుకోసం వాసిఖ్ తన టర్కీబానిస అష్నాస్‌ను ఉపఖలీఫాగా నియమించి యావత్‌సామ్రాజ్యంలో పూర్తి అధికారాలిచ్చాడు. ప్రధాని ముహమ్మద్ బిన్ అబ్దుల్‌మలిక్‌కు నామమాత్రపు అధికారాలు ఉండేవి. అయితే అష్నాస్ అధికారాలు కొన్నాళ్ళు మాత్రమే కొనసాగాయి. ఖలీఫా విద్యా జ్ఞానాల సమావేశాల్లో గంటలసేపు గడిపేవాడు. ఆ సమావేశాల్లో బర్మకీలు, అఫ్షీన్‌ల విద్రోహచర్యల ప్రస్థావనలు కూడా వచ్చాయి. దాంతో ఖలీఫా ఖురాసాన్, టర్కీ నాయకుల మీద ఓ కన్నువేసి వారి అవినీతికార్యకలాపాలకు అడ్డుకట్ట వేశాడు. అలాంటి పరిస్థితుల్లో అష్నాస్ అధికారాలు తగ్గించాడు. అష్నాస్ హి.శ. 230లో చనిపోయాడు.

అరబ్బులు ఇస్లాంను ప్రపంచ దశదిశలా వ్యాపింపజేసి దాన్ని ఉన్నతశిఖరాలకు చేర్చిన మొట్టమొదటి ధార్మికసేవకులు. కాని బనూఅబ్బాసీ ఖలీఫాలు స్వయంగా అరబ్‌సంతతికి చెందినవారైనప్పటికీ అరబ్‌సంతతికి చెందిన బనూఉమయ్యా తెగవారి పరిపాలను అంతమొందించడానికి అరబ్బేతరులను (ఈరానీయుల్ని) తెరపైకి తెచ్చి వారిని అరబ్బుల మీదికి ఉసిగొల్పారు. ఈవిధంగా వారు అరబ్బుల పేరుప్రతిష్ఠలను క్రమంగా తగ్గించడానికి ప్రయత్నించారు. సైన్యంలో వారి హోదాలు తగ్గించారు. చివరికి వారిని సైన్యం నుండి పూర్తిగా తొలగించారు. దాంతో అరబ్‌యోధులు ఖలీఫా మోతసిమ్ పాలనాకాలంలో తమ సైనిక శక్తిసామర్థ్యాలను దుర్వినియోగపరుస్తూ లూటీలకు, హత్యలకు పాల్పడనారంభించారు.

మదీనా పరిసర ప్రాంతంలో ఉండే బనూసలీం తెగ అరబ్బులు బనూకనాన తెగ అరబ్బులపై దాడిచేసి వారి సిరిసంపదలు దోచుకున్నారు. దానిపై మదీనా గవర్నర్ ముహమ్మద్ బిన్ సాలెహ్ బనూసలీం తెగ దౌర్జన్యాన్ని అడ్డుకోవడానికి సైన్యాన్ని పంపితే అది ఆ తెగచేతిలో ఘోరంగా ఓడిపోయింది. దాంతో మక్కా, మదీనాల మధ్యప్రాంతాల్లో అశాంతి-అలజడులు చెలరేగి రాకపోకలు స్తంభించిపోయాయి. ఖలీఫావాసిఖ్ ఈ సంగతి తెలుసుకోగానే బగాకబీర్ అనే టర్కీజాతి సేనాపతికి టర్కీజాతి సైన్యానిచ్చి పంపాడు. బగాకబీర్ హి.శ. 209లో మదీనా చేరుకొని యుద్ధపరంపర ప్రారంభించాడు. బనూసలీం తెగకుచెందిన అనేకమంది అరబ్బుల్ని హతమార్చాడు. వేయిమందిని జైళ్ళలో వేశాడు.

ఆ తరువాత సేనాపతి బగాకబీర్ తన టర్కీజాతి సైనికులతో మదీనా పరిసర ప్రాంతాల్లోని అనేక అరబ్‌తెగలపై విరుచుకుపడి విధ్వంసం సృష్టించాడు; వేలాదిమందిని జైళ్ళలో కుక్కి వారిని కించపరుస్తూ యావత్తు అరబ్బుల్లో తీవ్రమైన భయోత్పాతం సృష్టిం చాడు. యమామా రాష్ట్రంలో సామూహిక హత్యాకాండకు పాల్పడి వేలాదిమందిని ఊచ కోత కోశాడు. ఈ విధంగా బగాకబీర్ రెండేళ్ళ పాటు తన టర్కీజాతి సైనికుల ద్వారా అరబ్బుల్లో అల్లకల్లోలం సృష్టిస్తూ వారిని అవమానపరుస్తూ అణచివేశాడు.

"ఖల్ఖ్‌ఖుర్‌ఆన్" విషయంలో వాసిఖ్ కూడా తండ్రి అడుగుజాడల్లో నడచుకుంటూ దాన్ని వ్యతిరేకించినవారిపై దుర్భరదౌర్జన్యం జరిపాడు. అదేదో పుణ్యకార్యమని భావించి గొప్పగొప్ప ధర్మవేత్తల్ని తన స్వహస్తాలతో చంపాడు. అబ్బాసీ వర్గానికి చెందిన హదీసువేత్త అహ్మద్ బిన్ నశర్ "ఖల్ఖ్‌ఖుర్‌ఆన్"కు వ్యతిరేకి. అంచేత ఒకవర్గం ప్రజలు అబ్బాసీ ఖిలాఫత్‌కు వ్యతిరేకంగా అహ్మద్ బిన్ నశర్ చేతిలో బైత్‌చేసి హి.శ. 231లో తిరుగుబాటు ఉద్యమం లేవదీశారు. బగ్దాద్ పోలీసులు వెంటనే అప్రమత్తులై అహ్మద్ బిన్ నశర్‌ను, అతని అనుచరుల్ని అరెస్టుచేశారు. అహ్మద్ బిన్ నశర్‌ను ఖలీఫా దగ్గరకు పంపించారు. ఖలీఫా వాసిఖ్ ఆగ్రహోదగ్రుడై ఆహ్మద్‌ను దారుణంగా హతమార్చి కసి తీర్చుకున్నాడు.

ఇలా అతను 'ఖల్ఖ్‌ఖుర్‌ఆన్' వ్యతిరేకులపై దౌర్జన్యకాండ జరుపుతూ చివరికి ఓ సంఘటనతో అతనా సమస్యని వదలిపెట్టాడు. ఆ సంఘటన ఇలా ఉంది: ఇమామ్ అబూదావూద్, నసాయి (రహ్మలై)ల గురువైన అబూఅబ్దుర్రహ్మాన్ అబ్దుల్లా బిన్ ముహమ్మద్ అజ్ది 'ఖల్ఖ్‌ఖుర్‌ఆన్' విషయాన్ని వ్యతిరేకించినందున ఖలీఫా వాసిఖ్ ఆయన్ని అరెస్టుచేయించి రాజదర్బారులో ఖాజీ అహ్మద్ బిన్ అబూదావూద్ ముందు ప్రవేశపెట్టించాడు. ఖాజి అహ్మద్ న్యాయమూర్తి మాత్రమే గాక, ప్రధానమంత్రి కూడా.

అబూఅబ్దుర్రహ్మాన్ అతడ్ని "ఖుర్‌ఆన్ సృష్టితం అనే విషయం దైవప్రవక్త (స)కు కూడా తెలుసా లేదా?" అని అడిగారు. దానికి ఖాజీ అహ్మద్ తెలుస"ని అన్నాడు. "అయితే ఖుర్‌ఆన్ సృష్టితమనే విశ్వాసం గురించి ఆయన తన శిష్యులకు భోధిస్తుండే వారా?" అంటూ అబూఅబ్దుర్రహ్మాన్ మరో ప్రశ్న అడిగారు. ఖాజీ అహ్మద్ ఈ ప్రశ్న విని కంగారుపడ్తూ "దైవప్రవక్త (స) దాన్ని గురించి ఎలాంటి ఆజ్ఞ ఇవ్వలేద"ని అన్నాడు. అప్పుడు అబూఅబ్దుర్రహ్మాన్ "దైవప్రవక్త (స) ఏవిశ్వాసం గురించి తెలిసి కూడా ప్రజలకు బోధ చేయలేదో, దాన్ని నమ్మించడానికి వారిని బలవంతం చేయలేదో, ఆ విషయాన్ని నమ్మించడానికి మీరు ప్రజలను ఎందుకు బలవంతం చేస్తున్నారు?" అని అడిగారు.

ఈమాట వినగానే ఖలీఫా వాసిఖ్ ఉలిక్కిపడి దర్బారు నుండి లేచి వెళ్ళిపోయాడు. అతను తన మహల్‌కు చేరుకొని మంచం మీద పడుకొని "అయ్యయ్యో! నేనెంత పొర బడ్డాను!! దైవప్రవక్త (స) మౌనంవహించిన వ్యవహారంలో నేను బలవంతం చేస్తున్నానే!" అంటూ పశ్చాత్తాపం చెందసాగాడు. ఆతర్వాత ఒక సేవకుడ్ని పిలిచి "అబూఅబ్దుర్రహ్మాన్‌ని వెంటనే విడుదలచేసి గౌరవప్రదంగా అతని సొంతూరుకు చేర్చండి. పారితోషికంగా మూడొందల దీనార్లు కూడా ఇచ్చి పంపండి" అని ఆజ్ఞాపించాడు.

హి.శ. 232లో ఖలీఫా వాసిఖ్ బిల్లా ఉబ్బురోగానికి గురయ్యాడు. ఆ తర్వాత తీవ్ర మైనజ్వరంతో చనిపోయాడు. అధికారులు, నాయకులు వాసిఖ్ మృతదేహాన్ని ఒంటరిగా వదలిపెట్టి అతని సోదరుడు జాఫర్ బిన్ మోతసిమ్ చేతిలో బైత్ చేయడంలో నిమగ్నులై పోయారు. అప్పుడు ఎక్కడ్నుంచో ఓ తోడేలు వచ్చి వాసిఖ్ రెండు కళ్ళు పీకి తినేసింది. ప్రజలు జాఫర్‌ని ఖలీఫాగా చేసి అతనికి 'ముతవక్కిల్ అలల్లాహ్' అనే బిరుదు ఇచ్చారు. ఆ తర్వాత వాసిఖ్ బిల్లా మృతదేహాన్ని ఖననం చేయడం జరిగింది. దాంతో అతని అయిదేళ్ళ తొమ్మిది నెలల పరిపాలన ముగిసిపోయింది.



# 58. ముతవక్కిల్ పరిపాలన

వాసిఖ్ బిల్లా మరణానంతరం అతని సోదరుడు ముతవక్కిల్ అలల్లాహ్ హి.శ. 232లో ఖిలాఫత్ అధికారం చేపట్టాడు. అధికారం చేపట్టిన నెలరోజుల్లోనే అతను ప్రధాని ముహమ్మద్ బిన్ అబ్దుల్‌మలిక్‌ని మంత్రిపదవి నుంచి తొలగించి జైల్లో పడవే యించాడు. వాసిఖ్‌పాలనాకాలంలో ప్రధాని ముహమ్మద్ చేసిన ఆరోపణతో ముత వక్కిల్‌ని వాసిఖ్ నిండుసభలో తలగొరిగించి అవమానపరిచాడు. అంచేత ముతవక్కిల్ ఖలీఫా కాగానే ముహమ్మద్‌ని జైల్లో వేయించి, అతని ఆస్తిపాస్తుల్ని జప్తుచేయించాడు.

హి.శ. 234లో ఖలీఫా ముతవక్కిల్ "హదీసు పునర్జీవం"పై దృష్టిసారించాడు. అతను హదీసువేత్తలందరినీ రాజధాని సామరాలో సమావేశపరచి, వారిని ఎంతో గౌరవించి, ఇకనుంచి వారంతా మసీదుల్లో స్వేచ్ఛగా ప్రజలకు హదీసుపాఠాలు చెప్పవచ్చని ప్రకటన చేశాడు. ఒకసారి ముతవక్కిల్ ధర్మవేత్తలను సమావేశపరిచాడు. వారిలో అహ్మద్ బిన్ మాదిల్ కూడా ఉన్నారు. ధర్మవేత్తలందరూ వచ్చి తమతమ కుర్చీలపై ఆశీనులయ్యారు. కాస్సేపటికి ముతవక్కిల్ సభాప్రాంగణంలోకి వచ్చాడు. అతడ్ని చూడగానే ధర్మవేత్త లందరూ గౌరవసూచకంగా లేచినిలబడ్డారు.

కాని అహ్మద్ బిన్ మాదిల్ మాత్రం లేచి నిలబడలేదు. ఖలీఫా తన మంత్రి ఉబైదుల్లాను "ఇతను బైత్ చేయలేదా?" అని అడిగాడు అహ్మద్ వైపు సైగచేస్తూ. దానికి మంత్రి "బైత్ చేశాడు. కాని అతనికి దృష్టి సరిగా లేదు" అని అన్నాడు. అహ్మద్ బిన్ మాదిల్ ఈమాట వినగానే "నా దృష్టి బాగానే ఉంది. నేను మిమ్మల్ని దైవశిక్ష నుండి కాపాడదలిచాను. 'ప్రజలు తనకు గౌరవసూచకంగా లేచినిలబడాలని ఆశించే వ్యక్తి తన నివాసం నరకంలో ఏర్పరచుకుంటాడ'ని హదీసులో ఉంది" అని చెప్పారు. ముతవక్కిల్ ఈమాట విని అహ్మద్‌ని ఏమీ అనకుండా వెళ్ళి ఆయన పక్కన కూర్చున్నాడు.

ఒకరోజు ఖలీఫా ముతవక్కిల్ 'యజీద్ ముహ్‌లబీ'తో ఇలా అన్నాడు: "సాధారణంగా ఖలీఫాలు ప్రజలపై తమ అధికార దర్పం ప్రదర్శించడానికి వారి పట్ల కఠినంగా వ్యవహ రిస్తుంటారు. కాని ప్రజలు నా ఖిలాఫత్ పాలనను సంతోషంగా అంగీకరించడానికి వీలుగా నేను వారి పట్ల మృదువుగా వ్యవహరిస్తాను."

ఖలీఫా సమాధిఆరాధనను అంతమొందించాడు. "ఖల్ఖ్‌ఖుర్‌ఆన్" (ఖుర్‌ఆన్ సృష్టితమా) అనే వివాదాస్పద ధార్మిక సమస్య గురించిన చర్చలు, వాదోపవాదాల సమావేశాలను ఖలీఫా ముతవక్కిల్ నిషేధించాడు. ఆ సమస్య కారణంగా జైళ్ళలో నిర్బంధించబడిన (మోతజిలావర్గ వ్యతిరేక) ప్రజలను విడుదల చేయించాడు.

హి.శ. 235లో బహుదైవారాధక జిమ్మీలు కొత్తగా ఆరాధనాలయాలను నిర్మించ కూడదని, క్రైస్తవజిమ్మీలు తమ ఊరేగింపుల్లో సిలువలు బయటికి తీయకూడదని శాసించాడు. హి.శ. 236లో ఇమామ్ హుసైన్ (రజి) సమాధిని సందర్శించడానికి వెళ్ళ కూడదని ప్రజలపై ఆంక్షలు విధించి, సమాధిచుట్టు కట్టిన ఇళ్ళను పడగొట్టించాడు. దాంతో షియామతస్థులు అతనికి బద్ధశత్రువులై పోయారు.

రోమన్లు ఇస్లామీయసామ్రాజ్యం ఉనికిలోకి వచ్చినప్పటి నుంచీ వీలుచిక్కినప్పుడల్లా యుద్ధఒడంబడికల్ని ఉల్లంఘిస్తూ ముస్లింరాజ్యాలపై తిరుగుబాటు దాడులకు పాల్పడు తుండేవారు. "అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు" అనేదే వారి సిద్ధాంతం. పట్టుబడితే కాళ్ళబేరానికి వస్తారు. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠమైన రక్షణఏర్పాట్లు లేకపోవడం చూడ గానే ముస్లిం జనావాసాలపై విధ్వంసం సృష్టిస్తారు. ఒకవేళ ఎప్పుడైనా తమది పైచేయి అయితే యుద్ధఖైదీలను ఊచకోతకోస్తారు. హి.శ. 241లో జరిగిన యుద్ధంలో ముస్లింలు ఖైదీలుగా పట్టుబడినప్పుడు రోమ్ మహారాణి నదూరా ఆ ఖైదీలను క్రైస్తవులుగా మార్చ డానికి ప్రయత్నించింది. క్రైస్తవులుగా మారడానికి నిరాకరించిన ముస్లింలను హత మార్పించింది. అనేకమంది ప్రాణభీతితో క్రైస్తవులుగా మారిపోయారు. ఆ తరువాత ఆమె ఖైదీలమార్పిడి గురించి ప్రతిపాదించి ముస్లిం ఖైదీలను విడుదల చేసింది.

ఆ తరువాత కూడా రోమన్లు తమ పాతఅలవాటును మానుకోలేదు. వారు యుద్ధ ఒడంబడికలను ఉల్లంఘిస్తూ వీలుచిక్కినప్పుడల్లా ముస్లిం జనావాసాలపై మెరుపు దాడులుచేస్తూ ఖలీఫా జీవించి ఉన్నంతకాలం విధ్వంసం సృష్టిస్తూనే పోయారు.

ఖలీఫా మోతసిమ్‌బిల్లా టర్కీజాతీయుడైన ఐతాఖ్‌లోని అసాధారణ శక్తిసామర్థ్యాలను చూసి అతనికి పాలనాయంత్రాంగంలో అత్యున్నత హోదాలు కల్పిస్తూ దేశ, విదేశ వ్యవ హారాల శాఖలను కూడా అప్పగించాడు. చివరికి ఐతాఖ్ సైన్యాధ్యక్షుడై ఖలీఫా ముత వక్కిల్‌ని సైతం ఖాతరుచేయకుండా వ్యవహరించసాగాడు. అంచేత ముతవక్కిల్ అతని పీడా వదిలించుకోడానికి ప్రయత్నించాడు. హి.శ. 234లో ఐతాఖ్ కాబాయాత్రకు వెళ్ళాడు. కాబాయాత్ర నుండి తిరుగుప్రయాణం చేస్తూ బగ్దాద్ సమీపానికి చేరుకున్నాడు. బగ్దాద్ పాలకుడు ఇస్‌హాఖ్ బిన్ ఇబ్రాహీం ఖలీఫాఆజ్ఞ ప్రకారం ఐతాఖ్‌ని విందు ఆహ్వానం సాకుతో బగ్దాద్‌కు పిలిపించాడు. అలా ఐతాఖ్ బగ్దాద్ చేరుకోగానే ఇస్‌హాఖ్ అతడ్ని అరెస్టుచేసి జైల్లో పడవేయించాడు. అతని కొడుకులు మన్సూర్, ముజప్ఫర్‌లను కూడా జైల్లో వేయించాడు. ఐతాఖ్ జైలుజీవితం గడుపుతూ చివరికి జైల్లోనే చనిపోయాడు.

ఖలీఫా ముతవక్కిల్ హి.శ. 235లో తన కుమారులు ముహమ్మద్ (మున్తసిర్ బిల్లా), తల్హా (మోతజిమ్ బిల్లా), ఇబ్రాహీం (ముస్తయీన్ బిల్లా)లను వరుసగా తన రాజకీయ వారసులుగా ప్రకటించి బైత్ చేయించుకున్నాడు. అయితే మున్తసిర్ ఖలీఫా వాసిఖ్, మోతసిమ్‌ల అడుగుజాడల్లో నడుస్తూ షియా మతవిశ్వాసాల వైపుకు మొగ్గాడు. అంచేత ఖల్ఖ్‌ఖుర్‌ఆన్, షిర్క్, బిద్‌అత్‌లకు వ్యతిరేకి; అహ్లెసున్నత్ ధర్మవేత్తల అభిమాని అయిన ఖలీఫా ముతవక్కిల్ తన మొదటి రాజకీయ వారసుడిగా మున్తసిర్‌ను బిల్లాను తొలగించి తన రెండవ కుమారుడు మోతజ్‌ని చేద్దామని నిర్ణయించుకున్నాడు.

అయితే మున్తసిర్ ఈ నిర్ణయం సంగతి తెలుసుకొని తండ్రికి విరోధి అయ్యాడు. ఆ రోజుల్లోనే ఖలీఫా ముతవక్కిల్ కొందరు టర్కీజాతి సేనాపతుల కొన్ని వ్యవహారాల పట్ల విసిగెత్తిపోయి వారి ఆస్తుల్ని జప్తు చేయించాడు. దాంతో టర్కీజాతి సైనికులు ఖలీఫా ముతవక్కిల్ పట్ల గుర్రుగా ఉన్నారు. అలాంటి పరిస్థితిలో మున్తసిర్ టర్కీజాతి



సైనికులతో కుమ్మక్కయి వారి ద్వారా హి.శ. 247లో కన్నతండ్రినే కడతేర్చాడు. ఖలీఫా ముతవక్కిల్ ఇలా దాదాపు 15ఏళ్ళు పరిపాలచేసి నలభైఏళ్ళ వయసులో చనిపోయాడు.

ముతవక్కిల్ పరిపాలనలో షియాలు తప్ప ప్రజలంతా సుఖసంతోషాలతో జీవితం గడిపారు. మస్జిదుల్లో ప్రజలు ఖుర్‌ఆన్, హదీసు బోధనలు స్వేచ్ఛగా వినగలిగేవారు, విన్పించగలిగేవారు. ముతవక్కిల్ ప్రభుత్వాధికారుల్లోని అవినీతిని కూడా పూర్తిగా అంతమొందించాడు. ఖలీఫా కార్యాలయంలో నజాహ్ బిన్ సల్మా అనే ఓ ఉన్నతాధికారి ఉండేవాడు. అతను అధికారదుర్వినియోగం చేస్తూ లంచగొండితనానికి పాల్పడసాగాడు. ఈ సంగతి తన దృష్టికి రాగానే ఖలీఫా ముతవక్కిల్ విచారణ జరిపించి అతడ్ని చితక బాదించాడు. ఆ దెబ్బలకు తాళలేక అతను క్రిందపడిపోయి ఊపిరి విడిచాడు.

ఖలీఫా ముతవక్కిల్ షాఫయిఫిఖ్హా అనుచరుడు. షాఫయి ఫిఖ్హాను అనుసరించిన మొట్టమొదటి ఖలీఫా ముతవక్కిలే. ముతవక్కిల్ హత్యచేయబడిన రెండునెలల తర్వాత 'అమ్ర్ షైబాన్'కు కలలో ముతవక్కిల్ కన్పించాడు. అప్పుడాయన "దేవుడు మీ పట్ల ఎలా వ్యవహరించాడ"ని అడిగారు. దానికి ముతవక్కిల్ "హదీసు పునరుజ్జీవం కోసం నేను చేసిన సేవకు ప్రతిఫలంగా ఆయన నా పాపాలు క్షమించాడు" అని సమాధానమి చ్చాడు. "సరే మీహంతకుల సంగతేమిట"ని అడిగారు అమ్ర్‌షైబాన్. దానికి ముతవక్కిల్ సమాధానమిస్తూ "నేను నా కొడుకు (మున్తసిర్) కోసం ఎదురుచూస్తున్నా. అతను ఇక్కడకు చేరుకోగానే నేనతని విషయమై దేవునికి ఫిర్యాదు చేస్తాను" అని అన్నాడు.

హిజ్రీశకం 240లో ఇంతకు పూర్వం ఎప్పుడూ కనీవినీ ఎరగని ప్రకృతి విపత్తు వచ్చి పడింది. ఆకాశం నుండి ఓ భయంకరమైన ధ్వని విన్పించింది. దాంతో అనేక మంది తీవ్రమైన భయాందోళనలతో మృత్యువాత పడ్డారు. ఇరాఖ్‌లో నిప్పుకోళ్ళంతటి పెద్దపెద్ద వడగండ్లు పడ్డాయి. పశ్చిమంలో పదమూడు గ్రామాలు భూమిలోకి క్రుంగిపోయాయి. హి.శ. 243లో ఉత్తరాఫ్రికా, ఖురాసాన్, తబ్రిస్తాన్, అస్ఫిహాన్‌లలో పెద్ద భూకంపం వచ్చింది. వేలాదిమంది జనం భూమిలోకి దిగబడి చనిపోయారు. ఆ భూకంపం వల్ల పెద్దపెద్ద కొండరాళ్ళు దొర్లిపడి అనేకమంది ప్రజలు మృతిచెందారు. ఈజిప్టులో అయిదేసి కిలోల బరువుగల పెద్దపెద్ద రాళ్ళు ఆకాశం నుండి రాలిపడ్డాయి.

అదే సంవత్సరం రమజాన్ నెలలో హలబ్ ప్రాంతంలో ఒక విచిత్రమైన పక్షి మానవ భాషలో మాట్లాడుతూ "ప్రజలారా! దేవునికి భయపడండి" అని అన్నది. ఈవిధంగా ఆ విచిత్ర పక్షి నలభై సార్లు పలికి అక్కడ్నుంచి ఎగిరిపోయింది. ఆ మరుసటి రోజూ కూడా ఇలాగే జరిగింది. హలబ్ వాసులు ఈ సమాచారాన్ని రాజధానికి చేరవేశాడు. ఆ సంఘటనను ధృవీకరిస్తూ అయిదొందల మంది ప్రజలు సాక్ష్యం కూడా చెప్పారు.

హి.శ. 245లో ప్రపంచంలోని ఓ పెద్దభూభాగంలో తీవ్రమైన భూకంపాలు వచ్చాయి. అనేక పట్టణాలు, కోటలు ధ్వంసమై పోయాయి. ఇంతాకియాలో ఒక కొండ విరిగి సముద్రంలో పడిపోయింది. మక్కాలో బావులు, కుంటలు అన్నీ ఎండిపోయాయి. జనం నీటికోసం విలవిల్లాడిపోయారు. ఆకాశం నుండి భయంకరమైన ధ్వనులు విన్పించాయి.

# 59. పతనదిశగా బనూఅబ్బాసీ ఖిలాఫత్

ఖలీఫా ముతవక్కిల్ పరిపాలన తరువాత అబ్బాసీ సంతతి ఖిలాఫత్ పాలన పతన దిశగా సాగింది. బనూఅబ్బాసీ ఖలీఫాలు తమ అధికారాన్ని పటిష్ఠం చేసుకోవడానికి ప్రారంభంలో మజూసీ(అగ్నిపూజారు)లను, ఆ తరువాత బర్మకీ సంతతివారిని మచ్చిక చేసుకున్నారు. వారి ద్వారా అరబ్బుల్ని వేధించి వారి ప్రభావాన్ని తగ్గించారు. వారు చాప క్రింద నీరులా వ్యాపిస్తూ ఖిలాఫత్ పీఠానికే ఎసరుపెట్టే స్థితికి చేరుకోవడంతో వారిని తుడిచిపెట్టి టర్కీసంతతి వారిని తెచ్చిపెట్టుకున్నారు. టర్కీసంతతివారు తమ నెత్తికెక్క డానికి ప్రయత్నిస్తున్నపుడు వారిని వదిలించుకోవడానికి షియాలను చేరదీశారు.

**1-మున్తసిర్‌బిల్లా పరిపాలన:-** ముతవక్కిల్ హత్య తరువాత అతని కొడుకు మున్తసిర్ టర్కీజాతిసైనికుల సహకారంతో హి.శ. 247లో ఖిలాఫత్‌పీఠం ఎక్కాడు. రాజ్యంలో టర్కీజాతిప్రజల శక్తి,అధికారాలు హద్దుమీరిపోవడంతో ఖలీఫా దానికి అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించాడు. అయితే ఖలీఫా ఉద్దేశం తెలుసుకున్న టర్కీజాతి సేనా పతులు అతని వ్యక్తిగతవైద్యునికి 30వేల దీనార్లు లంచమిచ్చి అతడ్ని చంపించారు. ఈవిధంగా మున్తసిర్‌బిల్లా సరిగ్గా ఆర్నెల్లు కూడా పరిపాలన చేయకుండానే మృత్యు కుహరంలోకి వెళ్ళిపోయాడు. పితృహంతకుడి పర్యవసానం ఇలాగే ఉంటుంది మరి!

మరణావస్థలో మున్తసిర్ తల్లిని తలచుకొని తీవ్రమైన పశ్చాత్తాపంతో కుమిలిపోతూ "అమ్మా! నా ఇహపరాలు రెండూ నష్టపోతున్నాయి. నేను నా తండ్రిహత్యకు కారణ మయ్యాను. ఇప్పుడు నేను ఆయన వెనకాలే వెళ్తున్నాను. కిస్రా (ఈరానీ) వంశంలో షేరూయ అనే రాజు తన తండ్రిని హతమార్చాడు. అతను కూడా కొన్ని నెలలకు మించి జీవించలేదు" అని వాపోయాడు.

**2-ముస్తయీన్‌బిల్లా పరిపాలన:-** ముతవక్కిల్ పెద్దకొడుకు మున్తసిర్‌బిల్లా హత్య తర్వాత మున్తసిర్ కొడుకు ముస్తయీన్ బిల్లా హి.శ. 248లో ఖలీఫా అయ్యాడు. అధికార పీఠం అధిరోహించగానే అతను టర్కీజాతి వ్యక్తులకు ప్రభుత్వంలో పెద్దపెద్ద పదవులు కట్టబెట్టాడు. దాంతో టర్కీజాతి అధికారులు ఆడిందిఆట, పాడిందిపాట అయి పోయింది. ఖలీఫా వారి చేతుల్లో కీలుబొమ్మగా మారిపోయాడు. టర్కీజాతి ప్రజలకు, స్థానికప్రజలకు మధ్య అంతర్యుద్ధాలు అధికమయ్యాయి. యావత్తుసామ్రాజ్యం అస్థిరతకు గురై అనేకరాష్ట్రాలు స్వతంత్రరాజ్యాలుగా ప్రకటించుకున్నాయి. ముస్తయీన్ టర్కీజాతి ప్రజల ప్రభావం ఎక్కువగా ఉన్న సమరా పట్టణాన్ని వదిలేసి బగ్దాద్‌ని రాజధానిగా చేసు కొని ఉండసాగాడు. స్థానికప్రజలు టర్కీజాతి సైనికుల్ని ఎదురించి ముతవక్కిల్ రెండవ కుమారుడు (రాజకీయవారసుడు) మోతజ్‌ని సమరాలో రెండవఖలీఫాగా చేశారు.

హి.శ.252 ముహర్రం నెలలో ముస్తయీన్ నిరాశచెంది, తాను ఖిలాఫత్‌పదవి నుండి తప్పుకొని మోతజ్‌ని ఖలీఫాగా అంగీకరిస్తున్నట్లు మోతజ్‌కు లేఖరాశాడు. అప్పుడు మోతజ్ బగ్దాద్ చేరుకొని ఖలీఫా ముస్తయీన్‌ని అదుపులోకి తీసుకొని వాసత్‌కు పంపివేశాడు. ముస్తయీన్ వాసత్‌లో తొమ్మిది నెలలపాటు ఒక అధికారి అధీనంలో ఉండి రాజధాని



సామరాకు తిరిగొచ్చాడు. అక్కడ కొత్తఖలీఫా మోతజ్‌బిల్లా కుట్రకు బలైపోయి హి.శ. 252 షవ్వాల్ నెలలో హత్యచేయబడ్డాడు.

**3-మోతజ్ బిల్లా పరిపాలన:-** మోతజ్‌బిల్లా 19ఏళ్ళ వయస్సులో టర్కీజాతి సైనికుల సహకారంతో ఖలీఫా అయ్యాడు. మోతజ్ ఖలీఫా కాగానే తన సోదరుడు మోయిద్‌ని రాజకీయవారసత్వం నుండి తొలగించి జైలుకు పంపి హత్యచేయించాడు. ఇరాఖ్‌అరబ్బులు, టర్కీజాతి సైనికుల మధ్య అంతర్యుద్ధాలు మొదలయ్యాయి. మరొక వైపు ఖారిజీలు, అల్వీయులు తిరుగుబాటు జండాలు ఎగరవేశారు. వేరొకవైపు టర్కీ జాతీయుడైన అహ్మద్ బిన్ తూలూన్ నాయకత్వంలో ఈజిప్టు స్వతంత్ర రాజ్యమై పోయింది. ఇలా ఖిలాఫత్ పాలన బలహీనమవడంతో అనేకప్రాంతాల్లో తిరుగుబాటులు, అంతర్యుద్ధాలు చెలరేగడం, స్వతంత్రరాజ్యాలు ఏర్పడటం మొదలైంది.

ప్రభుత్వధనాగారం టర్కీజాతి సేనాపతుల దోపిడీల వల్ల ఖాళీ అయిపోయింది. సైనికుల జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో టర్కీజాతి సైనికులు ఖలీఫా మోతజ్‌పై మండిపడుతూ తిరుగుబాటు లేవదీశారు. ఖలీఫా మోతజ్ తన తల్లి ఫత్‌హ్యా దగ్గరకు వెళ్ళి యాభైవేలు దీనార్లు ఇస్తే సైనికుల తిరుగుబాటు అంతమవుతుందని అన్నాడు. కాని ఆ దయలేని తల్లి కొడుక్కు ధనసహాయం చేయడానికి నిరాకరించింది. టర్కీసైనికులు కోపోద్రేకాలతో ఊగిపోతూ రాజమహల్‌లో జొరబడి మోతజ్‌ని బయటి కీడ్చి చితకబాదారు. తర్వాత ప్రధానన్యాయమూర్తి హుసైన్ బిన్ అబీషొరాబ్ పాలక వర్గంతో సంప్రదించి, మోతజ్‌ని ఖలీఫా పదవి నుండి తొలగించి కూడు, నీళ్ళు ఇవ్వ కుండా ఓ నేలమాళిగలో బంధించాడు. చివరికి మోతజ్‌బిల్లా అక్కడే ఆకలిదప్పులతో అలమటిస్తూ హి.శ. 255లో అంతిమశ్వాస వదిలాడు. ఫత్‌హ్యా కొడుకుచావుతో భయపడి సామరాకు పారిపోయి ఎక్కడో దాకున్నది.

**4-ముహ్తదీ బిల్లా పరిపాలన:-** మోతజ్‌బిల్లా హత్య తరువాత ప్రజలు అతని పినతండ్రి కుమారుడు ముహ్తదీబిల్లాని ఖిలాఫత్ పీఠం ఎక్కించారు. ముహ్తదీ సామ్రాజ్య ఉపాధ్యక్షుడిగా సాలెహ్ బిన్ వసీఫ్‌ని నియమించాడు. అప్పుడు మోతజ్ తల్లి ఫత్‌హ్యా సాలెహ్ రక్షణ కోరి బహిర్గతమయింది. సాలెహ్ ఆమె దగ్గరున్న ఆస్తిపాస్తుల్ని గురించి ఆరాతీస్తే ఒకకోటి మూడు లక్షల దీనార్లు రొఖ్ఖం, అంతకు మించి విలువగల రత్నాలు ఉన్నట్లు తేలింది. వెంటనే సాలెహ్ ఆ మొత్తం ఆస్తిని స్వాధీనం చేసుకొని "ఈ నీచురాలి దగ్గర కోట్లు ఉన్నప్పటికీ కొడుకు అడిగిన యాభైవేలు దీనార్లు ఇవ్వడానికి నిరాకరించి అతడ్ని చంపివేయించింది" అని అన్నాడు. ఆ తర్వాత సాలెహ్ ఆమెను మక్కాకు పంపి వేశాడు. ముహ్తదీ ఖలీఫాగా ఉన్నంతవరకూ ఆమె మక్కాలోనే ఉండిపోయింది. ఆ తర్వాత ఆమె సామరాకు తిరిగొచ్చి హి.శ. 264లో చనిపోయింది.

ఖలీఫా ముహ్తదీ తన తాతముత్తాతల మాదిరిగా కాకుండా ఎంతో నీతిమంతుడు, న్యాయశీలుడు, ధర్మాత్ముడు, జనశ్రేయాభిలాషి. కాని తన అభిరుచులకు అనుగుణమైన అభిమానులెవరూ అతనికి లభించలేదు. పరిపాలనా వ్యవస్థ బాగా దిగజారిపోయింది. ఇలాంటి పరిస్థితిలో నిజమైన ఖిలాఫత్ వ్యవస్థను తిరిగి స్థాపించడం చాలా కష్టం.

ఖలీఫా స్నేహితుడు హాషిం బిన్ ఖాసిం కథనం: "నేను ఓసారి రమజాన్‌లో సాయంత్రంవేళ ముహ్తదీ దగ్గర కూర్చొనివున్నాను. ఆ తర్వాత నేను వెళ్దామని లేచి నిల్చున్నాను. ముహ్తదీ నన్ను కూర్చోమన్నాడు. నేను కూర్చున్నాను. కాస్సేపటికి మేమిద్దరం ఇఫ్తార్ (ఉపవాసవిరమణ) చేసి నమాజు చేశాము. ముహ్తదీ భోజనం తీసుకురమ్మని సేవకుడ్ని పురమాయించాడు. సేవకుడు వెళ్ళి కొన్ని పల్చటి రొట్టెలు, ఒక గిన్నెలో ఉప్పు, మరొక గిన్నెలో పానకం, వేరొక గిన్నెలో జైతూన్ నూనె తీసుకొని వచ్చాడు.

నేను భోజనం ఇంకా వస్తుందని తలచి మెల్లగా తినసాగాను. ముహ్తదీ నావైపు చూస్తూ 'నువ్వీ రోజు ఉపవాసం ఉండలేదా?' అని అడిగాడు. నేను ఉన్నానన్నాను. 'రేపు ఉపవాసం ఉండవా?' అని అడిగితే నేను రమజాన్‌నెల కదా! ఉపవాసం ఎందు కుండను?' అని అన్నాను. 'అయితే కడుపునిండా తిను. ఇంకా భోజనం వస్తుందని ఆశించకు. మా దగ్గర ఇంతకంటె ఎక్కువ భోజనం లేదు' అన్నాడు ముహ్తది.

నేను ఆశ్చర్యపోతూ 'విశ్వాసులనాయకా! ఏమిటీ పరిస్థితి? దేవుడు మీకు సమస్తం ప్రసాదించాడు కదా!' అని అన్నాను. ముహ్తదీ ఈమాట విని 'నిజమే, దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు. కాని బనూఉమయ్యా తెగలో, తక్కువ తింటూ ప్రజల సుఖసంతోషాల కోసం ఎక్కువ పాటుపడే ఖలీఫాను నేను ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్‌ని మాత్రమే చూశాను. తర్వాత నేను నావంశం ఖలీఫాల జీవన స్థితిగతుల్ని పరిశీలిస్తే నాకు సిగ్గుచేటనిపిస్తుంది. మనం బనూహాషిం సంతతి వారైనప్పటికీ వారిలా కూడా లేము. అంచేత నువ్విప్పుడు చూస్తున్న విధానం అవలంబించాను నేను' అని అన్నాడు.

ముహ్తదీని టర్కీజాతి సైన్యాధికారులే గద్దెనెక్కించారు. వారిలో అందరికంటే సాలెహ్ బిన్ వసీఫ్ ఎక్కువ తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు కల సేనాపతి. ముహ్తదీ ఖలీఫా అయిన తర్వాతే సాలెహ్ అతని అనుమతి లేకుండా అహ్మద్ బిన్ ఇస్రాయీల్, జైద్ బిన్ మోతజ్‌బిల్లా, అబూనూహ్ లాంటి ప్రముఖుల్ని జైళ్ళలో వేయించి హతమార్చాడు. ముహ్తదీ ఈ సంగతి విని ఎంతో బాధపడ్డాడు. ఆ తర్వాత ఖలీఫా ముహ్తదీ రాజధాని సామరా నుండి బానిసమహిళలను, గాయకురాళ్లను తీసివేయించాడు. ఖలీఫా ముహ్తదీ అశ్లీలం, భోగలాలసలను అరికట్టాడు. నృత్యగానాలను నిషేధించాడు. పాలకులు, ప్రభుత్వాధికారుల్లోని అవినీతి, అన్యాయాలకు అడ్డుకట్టవేశాడు; సులైమాన్ బిన్ వహబ్‌ని ప్రధానమంత్రిగా నియమించాడు.

అయితే సాలెహ్ ఎంతో నేర్పుగా, చాకచక్యంతో సులైమాన్‌ని కూడా తన అదుపు లోకి తెచ్చుకొని అందరిపై పెత్తనం చెలాయించసాగాడు. టర్కీజాతి సైన్యంలో రెండు ముఠాలు ఏర్పడ్డాయి. ఒక ముఠాకు నాయకత్వం వహిస్తున్న మూసా బిన్ బగా తన ప్రత్యర్థి అయిన సాలెహ్‌ని హతమార్చాడు. ఇది ఖలీఫా ముహ్తదీకు నచ్చలేదు. అంచేత అతను మూసాను చంపించడానికి ప్రయత్నించాడు. కాని ఆ సంగతి తెలుసుకున్న మూసా సైనికులు ముహ్తదీని హతమార్చడానికి యుద్ధపరంపర ప్రారంభించారు. చివరికి వారు హి.శ. 256లో ఏడాదిపాటు పాలన చేసిన 38ఏళ్ళ ఖలీఫా ముహ్తదీని దారుణంగా హతమార్చారు. జనసామాన్యం అతని మరణవార్త విని గుండెలు బాదుకున్నారు.



**5-మోతమద్ అలల్లాహ్ పరిపాలన:-** ఖలీఫాముహ్తదీ హత్య తర్వాత టర్కీజాతి సైన్యాధికారులు జైల్లో మగ్గుతున్న ముతవక్కిల్‌కొడుకు మోతమద్ అలల్లాహ్ (అబుల్ అబ్బాస్ అహ్మద్)ని తీసుకొచ్చి ఖిలాఫత్ పీఠం ఎక్కించారు. మోతమద్ ఖలీఫా కాగానే హి.శ. 256లో ఇద్దరు అలీషియా నాయకులు తిరుగుబాటుజెండా ఎగరవేశారు. వారిని ప్రభుత్వ సేనలు ఎలాగో అణచివేశాయి. అయితే ఓ నక్లీ అలీషియా నాయకుడు జుంగీతెగ బానిసల్ని మచ్చిక చేసుకొని తిరుగుబాటు లేవదీశాడు. అతనికి ప్రభుత్వ సేనలకు మధ్య హి.శ. 270 వరకు అనేక యుద్ధాలు జరిగాయి. తాత్కాలికంగా జుంగీ సైన్యం ఓడిపోయినప్పటికీ వారి బెడద పూర్తిగా సమసిపోలేదు. మొత్తం సామ్రాజ్యంలో అనేకచోట్ల తిరుగుబాటులు రేకెత్తాయి. ఖారిజీమతస్థులు కూడా బలం పుంజుకొని మళ్ళీ విజృంభించారు. టర్కీజాతి సైనికుల చేతిలో కీలుబొమ్మగా మారిన ఖలీఫా మోతమద్ వారు చేసేది చూడటం తప్ప ఏమీ చేయలేక పోయేవాడు.

హి.శ. 278లో హమ్దాన్ ఉరఫ్ ఖరామతా అనే ఓ పచ్చి షియామతస్థుడు ఒక కొత్త మతాన్ని సృష్టించి మూఢనమ్మకాలతో, దురాచారాలతో గందరగోళానికి పాల్పడ్డాడు. మరొకవైపు రోమన్లు కూడా సరిహద్దు ప్రాంతాలపై అడపాదడపా దాడులుచేస్తూ ముస్లింలను చికాకు పరుస్తుండేవారు.

ఖలీఫా మోతసిమ్‌బిల్లా కాలం నుండి సామరా అబ్బాసీపాలకుల రాజధానిగా ఉండేది. ఇప్పుడు ఖలీఫా మోతమద్ అలల్లాహ్ టర్కీజాతి సైనికుల ప్రభావాన్ని తగ్గించ డానికి రాజధానిని సామరా నుండి బగ్దాద్‌కు మార్చాడు. దాంతో ఖలీఫా మీద టర్కీజాతి సైనికుల ప్రభావం ఒక్కసారిగా తగ్గిపోయింది. అయితే సామ్రాజ్యం బాగా అస్థిరతకు గురై అనేక రాష్ట్రాల గవర్నర్లు తమ రాష్ట్రాలను స్వతంత్రరాజ్యాలుగా ప్రకటించుకున్నారు. పాలకవర్గంలో ఐకమత్యం కొరవడి వైషమ్యాలు పెచ్చరిల్లిపోయాయి. ఖలీఫా పట్ల ప్రజల గౌరవభావం తగ్గిపోయింది. అలాంటి పరిస్థితిలో ఖలీఫా మోతమద్ హి.శ. 279లో వ్యాధి పీడితుడై మృత్యుకోరలకు చిక్కిపోయాడు.

**6-మోతజిద్ బిల్లా పరిపాలన:-** ఖలీఫా మోతమద్ మరణం తరువాత హి.శ. 279లో అతని అన్నకొడుకు మోతజిద్ బిల్లా ఖలీఫా అయ్యాడు. మోతజిద్ వ్యవహార దక్షకుడు, సాహసవంతుడు, న్యాయశీలుడు, ధర్మాత్ముడు. అధికారపీఠం అధిరోహించ గానే అతను మతపరమైన అరాచాకాలు, అంతఃకలహాలను అంతమొందించే ఉద్దేశంతో పుక్కిటిపురాణాలు, తలతోకలేని కాకమ్మకథలు, అర్థంపర్థంలేని తాత్విక విషయాలు, వాదోపవాదాల సమావేశాలను నిషేధించాడు. ప్రజలపై పన్నులభారం తగ్గించాడు. అన్యాయం, అక్రమాలను అరికట్టడానికి కృషిచేశాడు.

మోతజిద్ పాలనాకాలంలో షియావర్గాల తిరుగుబాటులు అధికమయ్యాయి. మరొకవైపు రోమన్లదాడులు కొనసాగుతూనే ఉండేవి. ఖలీఫా సదాశయాలు నెరవేరడానికి అతనికి పాలకవర్గంలో మంచివాళ్ళు లభించలేదు. అంచేత అతని పాలనాకాలం కూడా ఎక్కువగా అంతర్యుద్ధాల్లోనే గడచిపోయింది. చివరికి పదేళ్ళ పాలన తర్వాత మోతజిద్ వ్యాధిగ్రస్తుడై హి.శ. 289లో చనిపోయాడు.

**7-ముకఫ్ఫీబిల్లా పరిపాలన:-** ఖలీఫా మోతజిద్ బిల్లా మరణానంతరం అతని కొడుకు ముకఫ్ఫీ బిల్లా ఖలీఫా అయ్యాడు. ఇతని పాలనాకాలం కూడా అంతర్‌యుద్ధాలతో, రోమన్ల దాడులతో ముగిసిపోయింది. చివరికి ఆరున్నర సంవత్సరాల పరిపాలన తరువాత మకఫ్ఫీబిల్లా వ్యాధిగ్రస్తుడై హి.శ. 295లో ఇహలోకం వీడిపోయాడు.

**8-ముఖ్తదిర్ బిల్లా పరిపాలన:-** ఖలీఫా ముకఫ్ఫీబిల్లా చనిపోయాక అతని పదమూడేళ్ళ తమ్ముడు ముఖ్తదిర్‌బిల్లా ఖిలాఫత్ పీఠం ఎక్కాడు. అయితే పిన్న వయస్సు కారణంగా అతని పరిపాలన పాలకవర్గం సభ్యుల్లో చాలామందికి నచ్చలేదు. అంచేత వారు ముఖ్తదిర్‌ని తొలగించి ముహమ్మద్ బిన్ మోతజ్‌ని ఖలీఫా చేయడానికి ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలు సఫలం కాకముందే ముహమ్మద్ బిన్ మోతజ్ చనిపోయాడు. తర్వాత వారు అబుల్‌హుసైన్ బిన్ ముతవక్కిల్‌ని గద్దె ఎక్కించడానికి ప్రయత్నించారు. యాదృచ్ఛికంగా అతను కూడా మరణించాడు. కొన్నాళ్ళకు పాలకవర్గం సభ్యులు అబ్దుల్లా బిన్ మోతజ్‌ని తెరమీదికి తీసుకు రావడానికి నిర్ణయించుకున్నారు.

ఆ సమావేశంలో ప్రధానమంత్రి పాల్గొనలేదు. అతనికి అబ్దుల్లా బిన్ మోతజ్‌ని ఖలీఫా చేయడం ఇష్టంలేదు. అంచేత హి.శ. 296, రబీవుల్‌అవ్వల్ 20వ తేదీన పాలకవర్గంలోని కొందరు ప్రధానమంత్రిని హత్యచేశారు. ఆ మరుసటి రోజు వారు ముఖ్తదిర్‌ని తొలగించినట్లు ప్రకటించి అబ్దుల్లా బిన్ మోతజ్ చేతిలో బైత్ చేశారు. పధ్నాలుగేళ్ళ ఖలీఫా ముఖ్తదిర్ ఆ సమయంలో బంతాట ఆడుకుంటున్నాడు. తన ఉద్వాసన ప్రకటన వినగానే అతను రాజమహల్‌లోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాడు. అబ్దుల్లా బిన్ మోతజ్ ఖిలాఫత్ పీఠం మీద కూర్చోగానే, "ఖిలాఫత్ ఇచ్ఛ వదలి రాజమహల్ నుండి బయటికి వచ్చెయ్యి; అందులోనే నీ శ్రేయస్సుంది" అంటూ లేఖ రాసి ముఖ్తదిర్ వద్దకు పంపాడు. దానికి ముఖ్తదిర్ "నేను మీఆజ్ఞను శిరసావహిస్తున్నాను. అయితే సాయంత్రం దాకా నాకు గడువివ్వండి" అని సమాధానమిచ్చాడు.

ఆరోజు రాత్రి రాజమహల్లో మోనిస్ అనే బానిస తన సహచరబానిసలతో సంప్రదించి ముఖ్తదిర్‌కు ధైర్యంచెప్పి ధనుర్బాణాలతో పరిస్థితి ఎదుర్కోడానికి సిద్ధమయ్యాడు. మరునాడుదయం హుసైన్ బిన్ హమ్దాన్ రాజమహల్ ప్రధానద్వారం దగ్గరకు రాగానే ముఖ్తదిర్ బానిసలు బాణాలవర్షం కురిపించడం ప్రారంభించారు. సాయంత్రందాకా వారు హుసైన్‌పై, అతని సహచరులపై బాణాలు వదలుతూనే ఉన్నారు. ఈలోగా ముఖ్తదిర్‌కు బయట నుంచి మరికొందరు మద్దతుదారులు లభించారు. ఫలితంగా కొత్తఖలీఫా అబ్దుల్లా బిన్‌మోతజ్, తన నమ్మినబంట్లతో కలసి పత్తాలేకుండా పారిపోయాడు. తర్వాత అతను పట్టుబడి హతమార్చబడ్డాడు. మోనిస్‌బానిసను ఖలీఫా ముఖ్తదిర్ పోలీస్ ప్రధానాధికారిగా, ఖలీఫా వ్యక్తిగతకార్యదర్శిగా నియమించాడు. దాంతో మోనిస్ సైనికుల మీద గట్టిపట్టు సాధించాడు. పైగా వారిని కానుకలు, పారితోషికాలతో ఆకట్టుకున్నాడు.

**ఉబైదుల్లా మెహ్దీ, అబూతాహెర్ ఖర్మతీ:-** మజూసీసంతతికి చెందిన ఉబైదుల్లా మెహ్దీ అనే వాడొకడు తనను తాను అల్వీషియా వర్గీయుడని చెప్పుకొని ఆఫ్రికాలో అరాచకానికి తెగబడ్డాడు. ప్రముఖ చరిత్రకారుడు ఇబ్నె ఖల్దూన్ కూడా ఉబైదుల్లా మెహ్దీని



అల్వీషియా వర్గీయుడని నిరూపించడానికి ప్రయత్నిం చాడు. కాని అతని ప్రమాణాలు చాలా బలహీనమైనవి. ఉబైదుల్లా మెహ్దీ ఆఫ్రికాను ఆక్రమించుకొని తన మతప్రచారం ప్రారంభించాడు. దాన్ని వ్యతిరేకించినవారిపై దుర్భరదౌర్జన్యం చేశాడు. ఖలీఫా ముఖ్తదిర్ తన మోనిస్‌బానిసను ఆఫ్రికాపాలకుడిగా నియమించి పంపాడు. మోనిస్ ఆఫ్రికాలో ఉబైదుల్లా మెహ్దీ సేనలతో పోరాటం ప్రారంభించాడు.

హి.శ.311లో అబూతాహెర్ ఖర్మతి అనే ఓపచ్చి షియామతస్థుడు ఇరాఖ్‌లో తర్వాత అరేబియాఅంతటా అరాచకం, అల్లర్లు, లూటీలకు తెగబడ్డాడు. అతను బస్రాలో అక్కడి అబ్బాసీగవర్నర్‌ని హతమార్చి సామూహిక హత్యాకాండ జరిపాడు. హి.శ. 312లో మక్కా నుండి తిరిగొస్తున్న హాజీలను దోచుకున్నాడు. హి.శ. 313లో అబూతాహిర్ దుండగులకు భయపడి ప్రజలెవరూ హజ్‌యాత్ర జరపలేకపోయారు. హి.శ. 318లో అబూతాహెర్ మక్కా వెళ్ళి హజ్‌యాత్రికుల్ని దోచుకొని హత్యకాండ ప్రారంభించాడు. ఆ దుర్మార్గుడు కాబాలయంలో సైతం హాజీలను హతమార్చడానికి వెనుకాడలేదు. కాబాగోడ ఒకదాన్ని పడగ్గొట్టి హజ్రెఅస్వద్ (నల్లరాయి)ని పీకి ఒంటెలమీద బహ్రైన్ రాజధాని వైపుకు తీసికెళ్ళాడు. దారిలో హజ్రెఅస్వద్‌ని మోస్తున్న నలభై ఒంటెలు చచ్చిపోయాయి.

ఆఫ్రికా పాలకుడైన నఖిలీ షియామతస్థుడు ఉబైదుల్లా మెహ్దీ మక్కాలో అబూతాహిర్ చేసిన దౌర్జన్యం, లూటీల సంగతి విని అతడ్ని తీవ్రంగా మందలిస్తూ, మక్కాప్రజల నుండి దోచుకున్న సంపద వారికి తిరిగెచ్చెయ్యి అని లేఖ రాశాడు. అబూతాహిర్ మక్కా ప్రజల దోపిడిసొత్తులో సగం కాజేసి సగం మాత్రమే తిరిగిచ్చాడు. హజ్రెఅస్వద్‌ని మాత్రం తిరిగివ్వకుండా ఇరవైఏళ్ళ పాటు తన దగ్గరే ఉంచుకున్నాడు.

ఖలీఫా ముఖ్తదిర్ హి.శ. 317లో మోనిస్‌ని వ్యక్తిగత కార్యదర్శి పదవి నుండి తొలగించి దాన్ని హారూన్ బిన్ గరీబ్‌కు కట్టబెట్టడానికి ప్రయత్నించాడు. దాంతో సైన్యంలో మంచిపట్టున్న మోనిస్ ఖలీఫాముఖ్తదిర్‌ని బంధించి ఖాయిర్‌బిల్లాని గద్దె ఎక్కించడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆనాటి నుంచి మోనిస్ ఖలీఫా ముఖ్తదిర్ మీద కక్ష పెంచుకున్నాడు. హి.శ. 320లో అతను వాసిల్ ప్రాంతంపై దాడిచేసి అక్కడ ఖలీఫాచే నియమించిన పాలకుడ్ని తరిమేసి దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత బగ్దాద్, ఈజిప్టుల్లోని అతని అనుకూలసైనికులు కూడా అతని దగ్గరకు చేరుకున్నారు. ఆతర్వాత మోనిస్ సైన్యం తీసుకొని బగ్దాద్ మీద దాడిచేయడానికి వెళ్ళాడు. మోనిస్ సైనికులకు, ఖలీఫా సైనికులకు మధ్య సమరజ్వాలలు చెలరేగాయి. ఖలీఫా ముఖ్తదిర్ ఓ గుట్ట మీద నిల్చొని యుద్ధంతీరు చూడసాగాడు. బగ్దాద్ సైనికులు అపజయం పాలయ్యే పరిస్థితికి లోనయ్యారు. ఖలీఫాముఖ్తదిర్ గుట్టదిగి రాజమహల్ వైపుకు బయలుదేరాడు. కాని దారిలోనే మోనిస్‌సైనికుల్లో ఓ బర్బరీతెగ సైనికుడు ఖలీఫా పైకి బాణం వదిలాడు. దాంతో ఖలీఫా ముఖ్తదిర్ గుర్రం మీదనుంచి కింద పడిపోయాడు. వెంటనే ఆ బర్బరీ సైనికుడు ముఖ్తదిర్ తల నరికి, మొండేన్ని నగ్నంచేసి తలను బరిసెకు గుచ్చి మోనిస్ దగ్గరకు తీసికెళ్ళాడు. ఈవిధంగా ఖలీఫా ముఖ్తదిర్‌బిల్లా అంతర్యుద్ధాలతో సతమతమవుతూ 35ఏళ్ళు పరిపాలనచేసి, చివరికి తన సైనికుల చేతిలోనే హతమార్చబడ్డాడు.

**9-ఖాయిర్ బిల్లా పరిపాలన:-** హి.శ. 330లో ముఖ్తదిర్‌బిల్లా హత్య తరువాత అతని హంతకుడు మోనిస్, ఖాయిర్‌బిల్లాని ఖిలాఫత్ గద్దె ఎక్కించాడు. ఖాయిర్ గద్దె ఎక్కగానే అలి బిన్ మఖ్లాని ప్రధానిగా, అలి బిన్ బలీఖ్‌ని వ్యక్తిగతకార్యదర్శిగా నియమించాడు. ప్రధాని అలి బిన్ మఖ్లా ఖలీఫా ప్రధానసహచరుడు ముహమ్మద్ బిన్ యాఖూత్‌ని గురించి మోనిస్‌కు లేనిపోని మాటలు చెప్పి అతడ్ని తప్పుదోవ పట్టించాడు. దాంతో మోనిస్ ఖలీఫామహల్ దగ్గర తనవారిని పర్యవేక్షకులుగా నియమించి ఖలీఫా దగ్గరకు వచ్చిపోయేవారిని తనిఖీచేస్తుండాలని ఆదేశించాడు. అంచేత ఆ పర్యవేక్షకులు స్త్రీలను సైతం తనిఖీచేస్తూ అనుమతిలేకుండా ఎవరినీ ఖలీఫా దగ్గరకు పోనిచ్చేవారు కాదు. ఖలీఫా ఈ పరిస్థితి గమనించి తనను మోనిస్ గృహనిర్బంధం చేసి కీలుబొమ్మగా చేస్తున్నట్లు భావించాడు. అంచేత అతను కూడా కొందరు సైనికాధికారులతో కలసి మోనిస్‌కు వ్యతిరేకంగా కుట్రపన్నసాగాడు. అటు మోనిస్ కూడా ఖలీఫా ఖాయిర్‌ని గద్దె దించే ప్రయత్నాలు ప్రారంభించాడు. చివరికి ఖాయిరే తన ప్రయత్నంలో నెగ్గి మోనిస్‌ని అరెస్టుచేయించి హతమార్పించాడు. ఈ సంఘటన హి.శ. 301లో జరిగింది.

ఖాయిర్‌బిల్లా దౌర్జన్యపరుడు, చపలచిత్తుడు, తాగుబోతు, తొందరపాటు కలవాడు. అయితే అతను ప్రజలకోసం మద్యసేవనం, దాని అమ్మకాలను నిషేధించాడు. దాదాపు ఏడాదిన్నర పరిపాలన తరువాత హి.శ. 322, జమాదిస్సాని నెలలో కొందరు సైనికుల చేతిలో హత్యచేయబడ్డాడు.

**బోవియావైల్మి వంశపాలన** : చరిత్రలో అసాధారణ తెలివితేటలు, శక్తిసామర్థ్యాలతో పాటు నాయకత్వలక్షణాలు కలవారిలో అనేకమంది తమ శక్తియుక్తులతో అనేక యుద్ధాలు చేసి ప్రభుత్వాలను కూడా నెలకొల్పారు. కాని వారి చరిత్రల్లో మనకు గుణపాఠం కల్గించే సంఘటనలు అంతగా కన్పించవు. అంచేత నేనిక్కడ ఈ గ్రంథంలో అనేకమందిని వదిలేసి కొందరి చరిత్రలనే సంక్షిప్తంగా పేర్కొంటున్నాను. ఉదా:-

ఈరాన్‌లోని ఓ మారుమూల ప్రాంతంలో అబూషుజా బోవియా వైల్మి అనే ఒక నిరుపేద మత్స్యకారుడు ఉండేవాడు. ఒకరోజు అతను కలలో మూత్రవిసర్జన చేస్తుంటే పురుషాంగం నుండి ఓ అగ్నిజ్వాల వెలువడి, అది వ్యాపించి ప్రపంచమంతటా ప్రకాశవంతం చేసినట్లు చూశాడు. అతనా కలగూఢార్థం తెలుపుతూ "నా సంతానం చక్రవర్తి అయి ఆ అగ్నిజ్వాల కాంతి వ్యాపించిపోయినంత వరకు అతని ప్రభుత్వం నెలకొంటుంది" అని చెప్పాడు. ఆ తరువాత ఆ మత్స్యకారుడికి అలి, హసన్, అహ్మద్ అనే ముగ్గురు కొడుకులు కలిగారు. వారు దినదినాభివృద్ధి చెందుతూ ఇమాదుద్దౌలా, రుకునుద్దౌలా, మాజుద్దౌలా పేర్లతో రాజ్యాధినేతల స్థాయికి ఎదిగారు.

అలి తన సోదరుల సహకారంతో అనేక యుద్ధాలు చేసి యావత్తు పార్శీరాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ విధంగా అతను మొత్తం పారశీకాన్ని జయించి షీరాజ్ పట్టణం చేరుకున్నాడు. అప్పుడు సైనికులు తమకు రావలసిన జీతాలు ఇవ్వమని అడిగారు. కాని సైనికసంఖ్యకు తగినంత డబ్బులేక అలి దిగులుతో ఒక ఇంట్లో పడుకొని తీవ్రంగా ఆలోచించసాగాడు. అంతలో ఇంటికప్పు నుండి ఒక పాము దబేలున కింద పడిపోయింది. వెంటనే అతను ఇంటికప్పును పడగొట్టమని ఆదేశించాడు.



సైనికులు ఇంటికప్పు పడగొడ్తుంటే అక్కడ బంగారు ఆభరణాలతో నిండిన కొన్ని పెట్టెలు దొరికాయి. అలి ఆ సంపదనంతటినీ సైనికులకు పంచాడు. ఆతర్వాత అతను ఏదో బట్ట కుట్టించుకునే ఉద్దేశ్యంతో ఒక దర్జీని పిలిపించాడు. దర్జీ భయపడిపోయి సైనికులు తనను చంపుతారేమోని తలచి "నా దగ్గర మూసిన పెట్టెలు తప్ప మరేమీ లేవు. ఆ పెట్టెల్లో ఏమున్నాయో నేను వాటిని తెరచి చూడనైనా లేదు" అని అన్నాడు వణికిపోతూ. అలి బిన్ బోవియా పెట్టెల మాట వినగానే వాటిని తెప్పించి తెరచి చూశాడు. చూస్తే కళ్ళు జిగేల్‌మన్నాయి. వాటిలో మణిమాణిక్యాలు ఉన్నాయి.

ఆ రోజుల్లోనే కాకతాళీయంగా అతనికి సఫారియా పాలకులు కూడబెట్టిన 5లక్షల దీనార్ల సొత్తు కూడా దొరికింది. ఆ సందర్భంలోనే అలి గుర్రం మీద ఎక్కడికో పోతుంటే దారిలో ఒకచోట గుర్రంకాలు నేలలో దిగబడింది. ఆ ప్రదేశంలో సైనికుల చేత తవ్వించి చూస్తే ఓ పెద్ద నిధి బయల్పడింది. ఈవిధంగా అలి బిన్ బోవియాకు కోట్లాది దీనార్ల విలువగల ఖజాన సమకూరింది. దాంతో అతని సమరోత్సాహం రెట్టింపయింది.

**10-రాజి బిల్లా పరిపాలన:-** ఖలీఫా ముఖ్తదిర్‌బిల్లా కొడుకు రాజీబిల్లా హి.శ.322 జమాదిస్సాని నెలలో ఖిలాఫత్ పీఠం అధిరోహించాడు. రాజీబిల్లా రాజ్యపరిధి బగ్దాద్, దాని పరిసర గ్రామాలకు పరిమితమై పోయింది. ఇస్లామీయ సామ్రాజ్యంలోని మిగాతా రాష్ట్రాల్లో స్వతంత్ర ప్రతిపత్తి ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఏ రాష్ట్రం నుంచి కూడా రెవెన్యూ రావడం లేదు. ఆ రాష్ట్రాల ప్రభుత్వాల మెడలువంచి రెవెన్యూ వసూలుచేసే దమ్ము రాజీబిల్లాకు లేదు. అంచేత అతను కిందామీదా పడి ఎలాగో దాదాపు ఏడునెలల పాటు పరిపాలనా శకటాన్ని నెట్టుకొచ్చి హి.శ. 329లో వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు.

**11-ముత్తఖీ బిల్లా పరిపాలన:-** ఖలీఫా రాజీబిల్లా మరణానంతరం ముత్తఖీబిల్లా అధికారం చేపట్టాడు. బగ్దాద్ క్రమక్రమంగా శత్రుసేనలకు నిలయమై పోయింది. హి.శ.331, రమజాన్‌నెలలో తూజోన్ అనే ఒక నాయకుడు బగ్దాద్‌లో పట్టుసాధించి ఖలీఫాతో సహకరించసాగాడు. హి.శ. 332లో తూజోన్ బగ్దాద్ నుండి వాసత్‌కు వెళ్ళిపోయివున్న సమయంలో అబూజాఫర్ అనే ఓ శత్రుసైన్యం నాయకుడు బగ్దాద్‌లో ప్రవేశించాడు. ఖలీఫా ముత్తఖీబిల్లా అతనికి భయపడి బగ్దాద్ నుండి మోసిల్‌కు, అక్కడ్నుంచి హమ్దాన్‌కు పారిపోయాడు.

వాసత్‌కు వెళ్ళిన తూజోన్ అక్కడ్నుంచి బగ్దాద్‌కు తిరిగొచ్చి బగ్దాద్ పాలకుడిగా పాలన చేయసాగాడు. ఖలీఫా ముత్తఖీబిల్లా హి.శ. 332 సంవత్సరాంతం వరకు హమ్దాన్‌లోనే ఉండిపోయాడు. స్వీయభద్రత కోసం ఈజిప్టు, బగ్దాద్ పాలకులకు లేఖలు రాశాడు. చివరికి ముత్తఖీబిల్లా తన లేఖలకు సమాధానాలు రాగానే హి.శ. 333, ముహర్రం నెల్లో ఈజిప్టుకు పోకుండా హమ్దాన్ నుండి బగ్దాద్‌కు బయలుదేరాడు. బగ్దాద్ పాలకుడు తూజోన్ బగ్దాద్‌కు కొన్ని మైళ్ళ దూరంలోని సందియా అనే ప్రదేశానికి చేరుకొని ముత్తఖీబిల్లాకు ఘనంగా స్వాగతం చెప్పాడు. మరునాడు ఆ నమ్మకద్రోహి ముత్తఖీబిల్లా కళ్ళలో యాసిడ్ పోయించి అతడ్ని అంధుడిగా చేశాడు. తరువాత అతని స్థానంలో ఖలీఫా ముకఫ్ఫీబిల్లా కుమారుడు ముస్తకఫీ బిల్లాను ఖిలాఫత్ గద్దె ఎక్కించాడు.

**12-ముస్తక్ఫీబిల్లా పరిపాలన:-** ఇతను 41 ఏళ్ళ వయసులో ఖలీఫా అయ్యాడు. ముస్తక్ఫీ గద్దె ఎక్కగానే తూజోన్ చనిపోయాడు. అంచేత ఖలీఫా అతని స్థానంలో అబూ జాఫర్ ఇబ్నె షేర్‌జాద్‌ని సేనాపతిగా నియమించాడు. ఇబ్నెషేర్‌జాద్ అధికారాలన్నీ హస్తగతం చేసుకొని ప్రభుత్వధనాగారం ఖాళీచేశాడు. దాంతో పాలనావ్యవస్థ కుంటుపడి పోయింది. కొన్నాళ్ళకు బగ్దాద్ దొంగలకు, దోపిడీదారులకు నిలయమైపోయింది. ప్రజలు ఈ దోపిడీ బెడదలకు భయపడి బగ్దాద్ నుండి వేరే ప్రాంతాలకు తరలిపోసాగారు.

గతపేజీల్లో ఖాయిర్‌బిల్లా ఖిలాఫత్ సందర్భాన బోవియావంశ పరిపాలన గురించి పేర్కొనబడింది. బోవియా కుమారులు ముగ్గురిలో అలి (ఇమాముద్దౌలా) పారశీకాన్ని, హసన్ (రుకునుద్దౌలా) ఇస్ఫిహాన్-తబ్రిస్తాన్‌లని, అహ్మద్ (మాజుద్దౌలా) అహ్వాజ్‌ని హస్తగతంచేసుకొని పరిపాలించసాగారు. మాజుద్దౌలా బగ్దాద్‌లో ఇబ్నెషేర్‌జాద్ సృష్టించిన అరాచకం సంగతి తెలుసుకోగానే బగ్దాద్‌పై దాడిచేసి దాన్ని హస్తగతం చేసుకున్నాడు. సేనాపతి ఇబ్నెషేర్‌జాద్ మోసిల్‌కు పారిపోయాడు. ముస్తక్ఫీబిల్లా నామమాత్రపు ఖలీఫాగా ఉండిపోయాడు. మాజుద్దౌలా ఖలీఫాను కీలుబొమ్మగా చేసి ఇష్టారాజ్యం చేయసాగాడు.

కొన్నాళ్ళ తరువాత ఖలీఫా ఈ అరాచకాన్ని సహించలేక మాజుద్దౌలాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నడం ప్రారంభించాడు. అయితే అతని కుట్ర సంగతి మాజుద్దౌలాకు తెలిసిపోయింది. ఆ రోజుల్లోనే ఖురాసాన్ రాష్ట్ర దౌత్యవేత్త బగ్దాద్ వచ్చాడు. అప్పుడు జరిగిన ఒక సమావేశంలో మాజుద్దౌలా సైగతో అతని అనుచరులిద్దరు ఖలీఫా ముస్తక్ఫీబిల్లాని సింహాసనం నుండి లాగి బరబర ఈడుస్తూ మాజుద్దౌలా ముందు నిలబెట్టారు. తరువాత అతని కళ్ళు పీకి జైల్లో పడవేశారు. ఈ విధంగా ఖలీఫా ముస్తక్ఫీబిల్లా ఒక సంవత్సరం నాలుగు నెలలు నామమాత్రంగా పరిపాలనచేసి హి.శ. 334లో జైలుపాలయ్యాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు జైల్లోనే అవమానభారంతో క్రుంగిపోయి చనిపోయాడు.

**13-ముతీవుల్లా పరిపాలన:-** బోవియా సంతానం షియామతస్థుడైన అత్రూష్ చేతిలో ఇస్లాం స్వీకరించారు. కనుక వారంతా షియాలుగానే చరిత్రకెక్కారు. మాజుద్దౌలా పచ్చి షియామతస్థుడేగాక పచ్చి మతదురభిమాని కూడా. అంచేత అతను అలీవ్షియా మతస్థుడ్ని ఖిలాఫత్ పీఠం ఎక్కించదలిచాడు. కాని అతని రాజకీయ సలహాదారులు దేశపరిస్థితుల్ని, ప్రజల భావోద్రేకాలను దృష్టిలో పెట్టుకొని అబ్బాసీవంశానికి చెందిన వాడినే గద్దె ఎక్కించడం మంచిదని సలహా ఇచ్చారు. దాని ప్రకారం ముతీవుల్లా ఖలీఫా అయ్యాడు. ఏ విషయంలోనూ అధికారంలేని ఈ కీలుబొమ్మ ఖలీఫాగారి పొట్టపోషణ కోసం మాజుద్దౌలా రోజుకు వందదీనార్లు జీతం కూడా నిర్ణయించాడు.

హి.శ. 341లో ఒకతను హజ్రత్ అలి (రజి) ఆత్మ తనలో అంతర్లీనమైయిందని ప్రకటించుకున్నాడు. అతనిభార్య హజ్రత్ ఫాతిమా (రజి) ఆత్మ తనలో అంతర్లీనమైందని చెప్పుకున్నది. మరొకతను తనలో దైవదూత జిబ్రీల్ (అలై) ఆత్మ అంతర్లీనమైందని చెప్పుకున్నాడు. కొందరు వారికి వంతపాడుతూ అనుచరులైపోయారు. ప్రజలు వారి ధర్మ వ్యతిరేకకూతలు విని వారిని కొట్టనారంభించారు. అయితే అలీవ్షియా మతస్థుడైన మాజుద్దౌలా ప్రజల్ని వారిస్తూ వారిపట్ల గౌరవమర్యాదలతో మసలుకోవాలని ఆదేశించాడు.



హి.శ. 351, జిల్‌హజ్జ 18వ తేదీన మాజుద్దౌలా బగ్దాద్ జామియామస్జిద్ తలుపుపై హజ్రత్ ముఆవియా (రజి)ను గురించి దుర్భాషలో కారుకూతలు రాయించాడు. అదే సంవత్సరం అతను బగ్దాద్‌లో ఈద్‌ఖుమ్‌గదీర్ పేరుతో డప్పులు వాయిస్తూ, ఆనందోత్సాహాలతో పండుగ జరపాలని ఆదేశించాడు. ఆ తేదీనే తృతీయ శ్రేష్ఠఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) హత్యగావించబడ్డారన్న విషయం గమనార్హం. షియాముస్లింలు ఈనాటికీ ఈ పండుగను జరుపుకుంటూ, దానికి ఈదుల్‌అజ్హా (బక్రీద్) పండుగ కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

హి.శ. 352 ముహర్రం నెల ప్రారంభం కాగానే మాజుద్దౌలా ఇమామ్ హుసైన్ (రజి) అమరగతి పట్ల ప్రజలు నిరశన (నల్ల)దుస్తులు ధరించి, శోకతాపాలు వెలిబుచ్చాలని, స్త్రీలు తలవెంట్రుకలు విరబోసుకొని, ముఖాలకు నల్లరంగు పూసుకొని, బట్టలు చించుకొని, గుండెలు బాదుకుంటూ, ఏడ్పులు-పెడబొబ్బలు పెడ్తూ వీధుల్లో తిరగాలని ఆజ్ఞ జారీచేశాడు. హి.శ. 353లో కూడా ఇలాగే ఆజ్ఞ జారీచేశాడు. దాంతో షియాలకు, సున్నీలకు మధ్య పెద్దఎత్తున అల్లర్లుజరిగాయి. ఆనాడు మొదలైన ఈ మాతం (పెడబొబ్బల) పండుగ షియాలు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఇస్లాం పట్ల సదవగాహన లేని సున్నీలు కూడా సహవాసదోషంతో ఈ జాడ్యానికి గురయ్యారు.

హి.శ. 355లో మాజుద్దౌలా సముద్రమార్గాన ప్రయాణంచేసి అమ్మాన్‌పై దాడిచేసి అక్కడి ఖరామతా వర్గీయులను పారద్రోలి దాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ యుద్ధంలో వేలాదిమంది ఖరామతా వర్గీయులు హతమార్చబడ్డారు. వారికి చెందిన 89 నౌకలను మాజుద్దౌలా కాల్చివేశాడు. తర్వాత అతను అమ్మాన్ నుండి బగ్దాద్ చేరుకొని వ్యాధిగ్రస్తుడయ్యాడు. చివరికి 22ఏండ్లు పరిపాలన చేసి హి.శ. 356లో చనిపోయాడు.

మాజుద్దౌలా చనిపోతూ కొడుకు ఏజాజుద్దౌలాని తన రాజకీయవారసుడిగా చేశాడు. కొన్నాళ్ళ తర్వాత ఏజాజుద్దౌలా సోదరుల మధ్య అంతర్యుద్ధాలు చెలరేగాయి. మరోవైపు అహ్వాజ్‌లో ఏజాజుద్దౌలా సైనికులైన వైల్మీయులకు, టర్కీజాతి సైనికులకు మధ్య అల్లర్లు చెలరేగాయి. అప్పుడు వైల్మీ ప్రాంతంవాడైన ఏజాజుద్దౌలా టర్కీజాతి సైనికుల్ని కఠినంగా శిక్షించాడు. బగ్దాద్‌లో ఈ సంగతి తెలుసుకున్న టర్కీజాతీయుడైన సబక్తగీన్ గజ్నవీ అనే సున్నీముస్లిం సేనాపతి హి.శ. 363లో తిరుగుబాటు లేవదీసి ఏజాజుద్దౌలా ఇంటిని దోచుకొని అతని కుటుంబసభ్యుల్ని ఖైదీలుగాచేసి వాసత్ పంపివేశాడు. ఇలా బగ్దాద్‌లో సబక్తగీన్ పాలన ఏర్పడింది. ఆ తరువాత అతను ఖలీఫా ముతీవుల్లా చేత రాజీనామా చేయించి ముతీవుల్లా కొడుకు తాయివుల్లాని ఖిలాఫత్ పీఠం ఎక్కించాడు.

**14-తాయివుల్లా పరిపాలన :-** హి.శ. 363లో తాయివుల్లా ఖిలాఫత్ పీఠం ఎక్కిన నాటి నుండి హి.శ. 381 వరకు వివిధరాష్ట్రాల (టర్కీజాతి) సున్నీ పాలకులకు, వైల్మీజాతి షియా పాలకులకు మధ్య అంతర్‌యుద్ధాలు, షియా-సున్నీ ముస్లింల కలహాలు తప్ప పాతకులు గుణపాఠం నేర్చుకునే విశేష సంఘటనలేవీ సంభవించలేదు. చివరికి ఖలీఫా తాయివుల్లా ఈ కుట్రలకు బలైపోయి గృహనిర్బంధానికి గురయ్యాడు. హి.శ. 393 వరకు అదే పరిస్థితిలో ఉంటూ దిక్కులేని చావు చనిపోయాడు.

**15-ఖాదిర్ బిల్లా పరిపాలన :-** తాయివుల్లా ఉద్వాసన తరువాత హి.శ. 381లో ముఖ్తదిర్ కొడుకు ఖాదిర్‌బిల్లా ఖలీఫా అయ్యాడు. వైల్మీజాతి షియాముస్లిం పాలకులు తమ రాజకీయయుక్తి దృష్ట్యా అధికసంఖ్యాకులైన సున్నీముస్లిం ప్రజల ఆగ్రహనిరశన లను తగ్గించడానికి ఎల్లప్పుడూ బనుఅబ్బాసీ తెగకు చెందిన సున్నీముస్లింనే ఖిలాఫత్ పీఠం ఎక్కించేవారు. ఖాదిర్‌బిల్లా ధర్మవేత్త, ధర్మాత్ముడు, న్యాయశీలుడు, నిజాయితీ పరుడు. కాని ఖాదిర్‌బిల్లాకు విచ్చుకత్తుల్లాంటి వైల్మీజాతి షియా పెత్తందారులను ఎదిరించి తన సదాశయాల్ని నెరవేర్చుకునేటంతటి సాహసం లేదు. వారి చక్రబంధంలో అతను బెత్తంలేని పెత్తందారుడిగా మాత్రమే కొనసాగాడు. ఖాదిర్‌బిల్లా హి.శ. 381 నుండి 41 సంవత్సరాలపాటు ఖిలాఫత్ పాలనచేసి హి.శ. 422లో వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు. ఇతని పాలనాకాలం కూడా అంతర్‌యుద్ధాలతోనే గడచిపోయింది.

**16-ఖాయం బామురల్లా పరిపాలన :-** ఖాదిర్‌బిల్లా మరణానంతరం అతని కొడుకు ఖాయం బామురల్లా ఖలీఫా అయ్యాడు. ఇతను కూడా నీతిమంతుడు, న్యాయ శీలుడు, ధర్మాత్ముడు, దైవభక్తుడు. కాని షియా-సున్నీల మధ్య నిరంతరం అల్లర్లు, అంతర్‌యుద్ధాలు జరుగుతుండటం వల్ల ఖలీఫా నిస్సహాయుడై ఉండిపోయాడు. షియా మతస్థుడైన బసాసీరీకి, సున్నీ మతస్థుడైన తుగ్రల్‌బేగ్‌కు మధ్య నిర్విరామ యుద్ధాలు జరుగుతుండేవి. బసాసీరీ తన కుట్రలతో తుగ్రల్‌బేగ్ దృష్టిని వేరే ప్రాంతాలవైపు మళ్ళించి విజయం సాధించినప్పుడల్లా అతను ఆక్రమించిన ప్రాంతాల్లో పెద్దఎత్తున మతకల్లోలాలు సంభవించేవి. ఈ అల్లర్లలో సున్నీముస్లింలే తీవ్రంగా నష్టపోయేవారు.

వైల్మీప్రాంతం మత్యకారుడైన బోవియా సంతానం గురించి గతపేజీల్లో ప్రస్తావించ బడింది. షియామతస్థులైన వీరు అధికారం చేజిక్కించుకొని 125 ఏండ్లపాటు బగ్దాద్ ఖలీఫా, ఇరాఖ్, పార్సీ ప్రాంతాలపై పెత్తనం చెలాయిస్తూ సున్నీలపై దుర్భర దౌర్జన్యాలు జరిపారు. "అహ్లెబైత్" మీద వల్లమాలిన ప్రేమ వలకబోస్తున్న వీరు అలీషియాల శ్రేయస్సు కోసం ఒరగబెట్టిందేమీ లేదు. వారసలు బనూఅబ్బాసీ పరిపాలనను, అరబీ సంస్కృతిని అంతమొందించి తమ వంశపాలనను, మజూసీ సంస్కృతిని నెలకొల్పడానికి ప్రయత్నించారు. వారి పాలనాకాలమంతా షియా-సున్నీ మతకలహాలతో సాగిపోయింది. దైవధర్మంలో దారుణమైన దురాచారాలు ప్రవేశపెట్టి ఏకదైవారాధనా సిద్ధాంతానికి తూట్లు పొడిచారు; ప్రవక్తసంప్రదాయాల్ని మంట గలిపారు. చివరికి హి.శ. 447లో వారి పాలన ఖాయమ్ బామురల్లా ఖిలాఫత్ కాలంలో అంతమైపోయింది.

**సల్జూఖియా వంశపాలన:-** బోవియా వైల్మీ పాలన అంతమైన తరువాత దాని స్థానంలో సల్జూఖియా పాలన ఏర్పడింది. ఇక్కడ సల్జూఖియా పాలన ప్రారంభం గురించి ప్రస్తావించవలసిన అవసరముంది. తురుష్కులుగా పేరుపడిన టర్కీజాతి ప్రజలు చైనా సరిహద్దుల నుండి ఖవారిజం, షాష్, ఫర్గానా, బుఖారా, సమర్ఖంద్, తిర్మజ్ ప్రాంతాల వరకు వ్యాపించి ఉన్నారు. ముస్లింలు వారి నాయకుల్ని అణచివేసి సామంతరాజులుగా చేసుకున్నారు. అయితే తురుష్కుల్లో ముస్లింలు, చైనీయుల బారిన పడకుండా ఇంకా స్వేచ్ఛాజీవనం సాగిస్తున్న తెగలు కూడా కొన్ని ఉన్నాయి.



ఈ తెగలు హి.శ. 400లో కొండగుహల నుండి బయలెడి మావరాయిన్నహర్ ప్రాంతాలపై దాడులు చేయడం ప్రారంభించారు. అప్పటికి ఆ ప్రాంతాల తురుష్కులు ఇస్లాం స్వీకరించివున్నారు. అక్కడ అందరికంటే పెద్దనాయకుడు ఐలక్‌ఖాన్ పరిపాలన చేస్తుండేవాడు. ఇంకా ఇస్లాంపరిధిలోకి రాని ఈ ఆటవిక తురుష్కతెగలు దాడులుచేస్తూ హి.శ. 418 నాటికి ఆజర్‌బాయ్‌జాన్ దాకా చేరుకున్నారు. ఈ ఆటవిక తురుష్కతెగల్లో కొంచెం సభ్యతా-మంచితనాలు కలిగిన తెగ కూడా ఒకటుంది. అది హి.శ. 418లో తుర్కిస్తాన్ వైపు దృష్టిసారించి బుఖారా సమీపంలోని ఓ హరితప్రాంతానికి చేరుకొని నివ శించసాగింది. ఆ తెగ నాయకుని పేరే సల్జూఖ్.

సల్జూఖీయులు ఆ తరువాత ఖురాసాన్ రాష్ట్రాన్ని ఆక్రమించుకున్నారు. సుల్తాన్ మహ్మూద్ గజ్నవీ చనిపోయిన తరువాత అతని కొడుకులకు సల్జూఖీయుల్ని ఎదిరించే శక్తి లేకపోయింది. మరోవైపు బోవియా సంతతి పాలకులు అంతర్యుద్ధాల్లో మునిగితేలు తుండేవారు. అంచేత సల్జూఖీయులు దినదినాభివృద్ధి చెందసాగారు. బగ్దాద్‌లో ఖలీఫా పట్ల మాత్రం వారికి ఎంతో గౌరవం ఉండేది. అంతేగాకుండా వారు క్రమంగా ఇస్లాం స్వీకరించడం కూడా జరిగింది. అయితే వారు షియాలుగా మారలేదు. సల్జూఖియాల నాయకుడు తుగ్రల్‌బేగ్ ఖురాసాన్, ఆజర్‌బైజాన్, జజీరా మొదలైన ప్రాంతాల్ని జయిస్తూ బగ్దాద్ చేరుకొని అక్కడ్నుంచి బోవియావైల్మీ పాలకుల్ని తరిమికొట్టాడు. సున్నీమతస్థుడైన తుగ్రల్‌బేగ్ సాధించిన విజయాలతో ఖలీఫా ఖాయం బామురల్లాతో పాటు బోవియా బాధితులు ఎంతో సంతోషించారు. కాని ఖలీఫా నామమాత్రపు రాజ్యాధినేత మాత్రమే. తుగ్రల్‌బేగ్ క్రియాశీలక రాజ్యాధినేతగా కొనసాగాడు. ఈ విధంగా సల్జూఖియా వంశ పాలన ప్రారంభమయింది. తుగ్రల్‌బేగ్ హి.శ. 455లో చనిపోయాడు.

హి.శ. 462లో రోమ్‌చక్రవర్తి అర్మానూస్ రెండు లక్షల సైన్యంతో ఖిలాత్ రాష్ట్రంపై దాడిచేశాడు. అతని వెంట ఫ్రాన్స్, రష్యా దేశాల చక్రర్తులు కూడా ఉన్నారు. తుగ్రల్‌బేగ్ రాజకీయవారసుడు 'సుల్తాన్ అలప్ అర్సలాన్ సల్జూఖ్' కేవలం పదిహేను వేల మంది సైనికులతో రెండులక్షల సైన్యంతో ఢీకొని విజయం సాధించాడు. అతను రష్యాచక్రవర్తిని బంధించి అతని ముక్కు-చెవులు కోశాడు. రోమ్ చక్రవర్తి అర్మానూస్‌ని అదుపులోకి తీసుకొని విధేయతా ఖరార్‌నామా తీసుకొని వదలిపెట్టాడు.

హి.శ. 465లో అర్సలాన్ సైనికులు యూసుఫ్ ఖవారిజమీ అనే ఓ సామంతరాజును నేరస్థుడిగా దర్బారులో ప్రవేశపెట్టారు. అర్సలాన్, అతడ్ని వదలిపెట్టండి, తానతడ్ని బాణంవిడిచి చంపుతానని అన్నాడు. కాని యాదృచ్ఛికంగా బాణం కొద్దిలో గురితప్పింది. తక్షణమే యూసుఫ్ పరుగెత్తుకొచ్చి సుల్తాన్ అర్సలాన్‌పై బలంగా ఓ కత్తివేటు వేశాడు. దాంతో సుల్తాన్ తీవ్రంగా గాయపడ్డాడు. భద్రతా సైనికులు వెంటనే యూసుఫ్‌ని కడతేర్చారు కాని, సుల్తాన్ ఆ గాయంతోనే కొన్నాళ్ళకు చనిపోయాడు. సుల్తాన్ కొడుకు మలిక్‌షా అతని వారసుడయ్యాడు. ఆతర్వాత రెండేళ్ళకు హి.శ.467లో 45 ఏళ్ళ పాలన తర్వాత ఖలీఫా ఖాయమ్ బామురల్లా కూడా చనిపోయాడు. ఖలీఫాకొడుకు అంతకు ముందే చనిపోవడం వల్ల మనుమడు ముఖ్తదీ బామురల్లా ఖలీఫా అయ్యాడు.

**17-ముఖ్తదీ బామురల్లా పరిపాలన :-** ఇతను ఖిలాఫత్‌పీఠం ఎక్కగానే సంగీత వాయిద్యాలు, నృత్యగానాలను నిషేధించాడు. ఈ ఖలీఫా ధార్మికుడు, దైవభీతి పరాయణుడు, ఎంతో సాహసవంతుడు. హి.శ. 467లో డెమాస్కస్‌పై విజయపతాకం ఎగరవేసి ఆ తర్వాత క్రమంగా సిరియా రాష్ట్రాన్నంతటినీ స్వాధీనం చేసుకున్నాడు. ఇతని పాలనలో కూడా మలిక్‌షా నేతృత్వంలో ఇంటా, బయట అనేక యుద్ధాలు జరిగాయి. అయితే మలిక్‌షా అధికారగర్వంతో విర్రవీగుతూ "బగ్దాద్‌ని నేను నా రాజధానిగా చేసుకుంటాను, మీరు బగ్దాద్ వదలిపెట్టి ఎక్కడికైనా వెళ్ళిపొండని ఖలీఫాకు పోరుపెట్టాడు. ఖలీఫా తనకు ఎనిమిది రోజులు వ్యవధి ఇవ్వమని అడిగి తీసుకున్నాడు. ఆ వ్యవధిలో అతను రేయింబవళ్ళు మలిక్‌షాకు వ్యతిరేకంగా దైవాన్ని ప్రార్థించాడు. దాంతో మలిక్‌షా ఎనిమిది రోజులు పూర్తయ్యేలోపే హి.శ. 485లో మృత్యుకుహురంలోకి వెళ్ళిపోయాడు. ఆతర్వాత హి.శ. 487లో ఖలీఫా ముఖ్తదీ అకస్మాత్తుగా జబ్బుపడి చనిపోయాడు. ముఖ్తదీ మరణానంతరం అతని కొడుకు అబుల్‌అబ్బాస్ (ముస్తజహర్ బిల్లా) ఖలీఫా అయ్యాడు.

**18-ముస్తజహర్ బిల్లా పరిపాలన :-** ఇతని పాలనాకాలమంతా క్రియాశీలక పాలకుల మధ్య దాదాపు అంతర్‌యుద్ధాలు, అన్నదమ్ముల మధ్య సమరజాలలతోనే గడచిపోయింది. ప్రజాసంక్షేమం, ధర్మశ్రేయస్సుల కోసం జరిగిన ఘనకార్యాలేమీ లేవు. చివరికి హి.శ.512లో 24ఏళ్ళ పాలన తర్వాత ముస్తజహర్‌బిల్లా జబ్బుపడి చనిపోయాడు.

**19-ముస్తర్‌షిద్ బిల్లా పరిపాలన:-** ఆతర్వాత అతని కొడుకు ముస్తర్‌షిద్ బిల్లా ఖలీఫా అయ్యాడు. ఇతని హయాంలో క్రియాశీలక పాలకులైన సల్జూఖీసంతతి సోదరుల మధ్య ఎడతెగని అంతర్‌యుద్ధాలు జరిగాయి. వారిలో సుల్తాన్ మస్వూద్ ఇరాఖ్‌ని స్వాధీనం చేసుకొని ఖలీఫా ముస్తర్‌షిద్ బిల్లాపై పెత్తనం చెలాయించసాగాడు. దాంతో ఖలీఫా అతని ప్రభావం తగ్గించడానికి యుద్ధరంగంలోకి దిగాడు. కాని తన సైనికులు సహకరించకపోవడంతో ఖలీఫా ఓడిపోయాడు. సుల్తాన్‌మసూద్ అతడ్ని హమ్దాన్‌లోని ఓ కోటలో బంధించాడు. బగ్దాద్‌ప్రజలు ఈ వార్త విని నిరశన ప్రదర్శనలు నిర్వహించారు. ఆ కాలంలోనే అనేక రోజులపాటు భూప్రకంపనలు వచ్చాయి.

అప్పుడు మలిక్ సంజర్ సల్జూఖీ తన పినతండ్రి కుమారుడు సుల్తాన్ మసూద్‌కు లేఖ రాస్తూ "మాటిమాటికి భూప్రకంపనలు సంభవించడం, జనం మసీదులకు వెళ్ళలేకపోవడం వంటి సంఘటనలు మనకు అపశకునాలుగా కన్పిస్తున్నాయి; కనుక వెంటనే నీవు ఖలీఫా దగ్గరకు పోయి, క్షమాపణ చెప్పి అతడ్ని గౌరవమర్యాదలతో బగ్దాద్‌కు చేర్చు" అని ఆదేశించాడు. సుల్తాన్ మసూద్ అతనిఆదేశం ప్రకారం హమ్దాన్‌లో నిర్బంధించబడిన ఖలీఫా దగ్గరకు వెళ్ళాడు. సుల్తాన్‌తో పాటున్న సైనికుల్లో పదిహేడు మంది ఇస్లాంవ్యతిరేక వర్గానికి చెందినవారు కూడా ఉన్నారు. ఆ సంగతి సుల్తాన్ మసూద్‌కు తెలియదు. ఆ దుర్మార్గులు ఖలీఫా శిబిరంలోకి దూరి ఖలీఫాపై మెరుపుదాడి చేసి అతడ్ని దారుణంగా హతమార్చారు. ఆ సంగతి తెలియగానే ఇతర సైనికులు ఆ దుర్మార్గుల్ని పట్టుకొని చంపేశారు. హి.శ. 529లో జరిగిన ఈ దుర్ఘటనతో బగ్దాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.



**20-రాషిద్ బిల్లా పరిపాలన:-** ఖలీఫా ముస్తర్‌షిద్ మరణానంతరం అతని కొడుకు రాషిద్ బిల్లా ఖలీఫా అయ్యాడు. రాషిద్ ఖిలాఫత్ పీఠం అధిరోహించినప్పుడు ఉపరాజ్యాధినేత సుల్తాన్ మస్వూద్ రాజధాని బగ్దాద్‌లో లేడు. రాషిద్ ఖలీఫా కాగానే ప్రజలను దోచుకోవడం, వారిపై దౌర్జన్యానికి పాల్పడటం ప్రారంభించాడు. సుల్తాన్ మసూద్ బగ్దాద్‌కు తిరిగొస్తున్నాడని తెలియగానే ఖలీఫా రాషిద్‌బిల్లా భయపడి మోసిల్‌కు అక్కడ్నుంచి ఆజర్‌బైజాన్‌కు పారిపోయాడు. అక్కడ తన సైనికులకు పెద్దఎత్తున సిరి సంపదలు పంచిపెట్టాడు. వారి సహాయంతో ఆజర్‌బైజాన్ పట్టణాల్లో లూటీలు చేశాడు. అక్కడ్నుంచి హమ్దాన్‌కు చేరుకొని అక్కడా దోపిడీలు-దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడ్డాడు. ధర్మవేత్తల గడ్డాలను గొరిగించాడు. ఆతర్వాత అస్ఫిహాన్‌కు వెళ్ళి దాన్ని దిగ్బంధించాడు. ఈ ముట్టడి రోజుల్లోనే అతను జబ్బుపడ్డాడు. అప్పుడు కొందరు అరబ్బేతరులు వచ్చి అతడ్ని కత్తులతో దాడిచేసి శాశ్వతంగా కడతేర్చారు.

రాషిద్‌బిల్లా మరణానికి ముందే ఉపరాజ్యాధినేత సుల్తాన్ మసూద్ ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి ఖిలాఫత్ పదవి నుండి రాషిద్‌ని తొలగించాడు. రాషిద్ స్థానంలో అతని పినతండ్రి ముతకఫిల్ అమ్రుల్లాని ఖిలాఫత్ గద్దె ఎక్కించాడు. ఈవిధంగా రాషిద్ బిల్లా ఏడాది పాలన తర్వాత ఉద్వాసనకు గురై హి.శ. 532లో హత్యచేయబడ్డాడు.

**21-ముతకఫిల్ అమ్రుల్లా పరిపాలన:-** ఇతను హి.శ. 530 నుండి 555 వరకు పరిపాలన చేశాడు. ఇతని పాలనలో నిరంతర యుద్ధాలు, అశాంతి-అలజడులే కొనసాగాయి. సల్జూఖీ పాలకుల అంతర్‌యుద్ధాలతో ఇతను తన ఖిలాఫత్ వ్యవస్థను పటిష్ఠవంతం చేసుకోవడానికి ప్రయత్నించాడు. సుల్తాన్ మసూద్ చనిపోయిన తరువాత సల్జూఖీపాలకులు చాలావరకు బలహీనులయ్యారు. దాంతో వారి అధీనంలోని సామంత రాజులు స్వతంత్రరాజ్యాలు ఏర్పరచుకొని వేరుపడ్డారు. ముతకఫిల్ అమ్రుల్లా హి.శ. 555లో చనిపోయిన తర్వాత అతని కొడుకు ముస్తన్‌జద్ బిల్లా ఖలీఫా అయ్యాడు.

**22-ముస్తన్‌జద్ బిల్లా పరిపాలన:-** ఇతను హి.శ. 556 నుండి 560 వరకు జరిగిన అంతర్‌యుద్ధాలను అణచివేశాడు. హలబ్, సిరియా వగైరా రాష్ట్రాలను పాలిస్తున్న సల్జూఖీపాలకుడు మలికుల్‌ఆదిల్ సుల్తాన్ నూరుద్దీన్ మహ్మూద్‌జుంగీ, అతని సేనాపతి నజ్మొద్దీన్ అయ్యూబ్, అతని కొడుకు సలాహుద్దీన్, నజ్మొద్దీన్ సోదరుడు అసదుద్దీన్ షేర్‌కోహ్ మొదలైనవారు బగ్దాద్‌ఖలీఫాకు విశ్వాసపాత్రులుగా ఉండేవారు.

హి.శ. 563లో ఇబ్నెసవార్ అనేవాడు ఈజిప్టు చిట్టచివరి ఉబైదీ (ఫాతిమీన్‌షియా) పాలకుడు ఆజిద్‌ని ఓడించి ఈజిప్టును స్వాధీనం చేసుకున్నాడు. ఫ్రాన్స్‌పాలకులు సిరియా, ఈజిప్టు తీరప్రాంతాలపై దాడులుచేసి వాటిని ఆక్రమించుకున్న రోజులవి. అంచేత సుల్తాన్ నూరుద్దీన్ తన సేనాపతి అసదుద్దీన్ షేర్‌కోహ్‌కు రెండువేల సైన్యం ఇచ్చి ఈజిప్టు వైపు పంపాడు. అసదుద్దీన్ షేర్‌కోహ్, అతని పినతండ్రి కుమారుడు సలాహుద్దీన్ అయ్యూబీ ఈజిప్టును ఆక్రమించుకున్న ఇబ్నెసవార్‌ని హతమార్చి, అనేకయుద్ధాల తర్వాత ఫ్రాన్స్ సైనికుల్ని ఈజిప్టు నుంచి పూర్తిగా తరిమికొట్టారు; అక్కడి క్రైస్తవుల్ని కూడా బయటికి పంపివేశారు. ఉబైదీపాలకుడు ఆజిద్ ఈజిప్టును తిరిగి పాలించసాగాడు.

అయితే హి.శ. 564లో ఫ్రాన్స్ సైనికులు ఈజిప్టు మీద మళ్ళీ దాడిచేశారు. ఆజిద్ కోరికపై సుల్తాన్ నూరుద్దీన్ మళ్ళీ షేర్‌కోహ్‌ను, సలాహుద్దీన్‌ని ఈజిప్టు వైపు పంపాడు. ఈ సంగతి తెలియగానే ఫ్రాన్స్ సైనికులు బ్రతుకుజీవుడా అంటూ పారిపోయారు. ఈ విజయం తర్వాత ఆజిద్ గత్యంతరంలేక సున్నీమతస్థుడైన షేర్‌కోహ్‌ను మంత్రిగా నియమించుకున్నాడు. హి.శ. 565లో షేర్‌కోహ్ చనిపోవడంతో ఆజిద్ అతని పినతండ్రి కుమారుడు సలాహుద్దీన్ అయ్యూబీని మంత్రిగా నియమించాడు.

ఈవిధంగా సిరియా, ఈజిప్టుల్లో శత్రుబెడద చాలావరకు తగ్గిపోయింది. అటు ఇరాఖ్‌లో కూడా ఖలీఫా ముస్తన్‌జద్ బిల్లా తిరుగుబాటుల్ని అణచివేశాడు. ఆ కాలంలో జనం ఎలాంటి అశాంతీఅలజడులకు గురికాకుండా శాంతీసుఖాలతో జీవితం గడిపారు. హి.శ. 566లో ఖలీఫా ముస్తన్‌జద్ బిల్లా వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు.

**23-ముస్తజీ బామురల్లా పరిపాలన :-** ముస్తన్‌జద్ మరణానంతరం అతని కొడుకు ముస్తజీ బామురల్లా ఖలీఫా అయ్యాడు. ఖిలాఫత్ పీఠం అధిరోహించగానే ప్రజల పన్నులు, శిస్తులు మాఫీచేశాడు. ఈజిప్టులో ఉబైదీషియా వర్గానికి చెందిన ఆజిద్ ప్రభుత్వంలో సలాహుద్దీన్ అయూబీ మంత్రిగా నియమించబడగానే అక్కడ అయూబీ వంశపాలనకు అంకురార్పణ జరిగింది. హి.శ.567లో ఆజిద్ చనిపోవడంతో సలాహుద్దీన్ ఈజిప్టుకు స్వతంత్ర పాలకుడైపోయాడు. అయితే అతను బగ్దాద్ ఖలీఫాకు విశ్వాసపాత్రుడిగానే ఉండిపోయాడు. అప్పటినుండి ఖలీఫా ముస్తజీ ప్రభుత్వం శాంతీసుస్థిరతలతో సాగింది. బయట ఏ పాలకుడూ అతనికి వ్యతిరేకంగా తోకజాడించే సాహసం చేయలేకపోయేవాడు. హి.శ. 575లో ఖలీఫా ముస్తజీ బామురల్లా తొమ్మిద్దిన్నర సంవత్సరాల పాలన తర్వాత వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు.

**24-నాసిరుద్దీనుల్లా పరిపాలన :-** ముస్తజీ తదనంతరం అతని కొడుకు నాసిరుద్దీనుల్లా ఖిలాఫత్ పీఠం ఎక్కాడు. నాసిర్ పాలనలో తిరుగుబాటు పాలకుల్ని ఎదుర్కోవడానికి ఇతను హి.శ. 615వరకు అనేక యుద్ధాలు చేయవలసి వచ్చింది. హి.శ. 583లో ఈజిప్టుపాలకుడు సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి రోమన్ల నుండి అనేక పట్టణాలను వశపరచుకున్నాడు. అతని నేతృత్వంలో ముస్లింలు హి.శ. 589లో క్రైస్తవుల నుండి 91 ఏండ్ల తర్వాత బైతుల్‌మఖ్దిస్ (జెరూసలేం)ని వశపరచుకున్నారు వివరాలు ముందు రాబోతున్నాయి. హి.శ. 616లో చైనా-తుర్కిస్తాన్ సరిహద్దుల్లోని కొండప్రాంతాల నుండి తాతారీలు అనబడే ఆటవికతెగలు బయలెడి తుర్కిస్తాన్, మావరాన్నహర్, ఖురాసాన్ ప్రాంతాలపై దాడులకు తెగబడ్డాయి. వారి నాయకుడు చంగీజ్‌ఖాన్. వివరాలు ముందు రాబోతున్నాయి. నాసిర్ 47ఏళ్ళ పాలన తర్వాత హి.శ. 622లో జబ్బుపడి చనిపోయాడు.

**25-జాహిర్ బామరుల్లా పరిపాలన :-** నాసిర్ మరణానంతరం అతని కొడుకు జాహిర్ బామరుల్లా ఖిలాఫత్ పీఠం ఎక్కాడు. జాహిర్ ఖలీఫా కాగానే ప్రజల సుఖసంతోషాల వైపు దృష్టిసారించాడు. వారి పన్నులు, శిస్తులు మాఫీచేశాడు; రుణగ్రస్తుల రుణ భారాన్ని తొలగించాడు; గత ఖలీఫాలు జప్తుచేసిన ఆస్తుల్ని వాటి యజమానులకు తిరిగి ఇచ్చాడు; ధర్మవేత్తల్ని కానుకలతో ఎంతో ఆదరించాడు; తరతమ భేదం లేకుండా



న్యాయం పాటించాడు. ప్రజలు అతని పాలనలో సుఖసంతోషాలతో జీవించారు. కాని వయసు అతనికి పూర్తిగా అనుకూలించలేదు. కేవలం తొమ్మిద్దిన్నర నెలల పాలన తర్వాత హి.శ. 623లో ఈ న్యాయశీలుడు ఇహలోకం వీడిపోయాడు.

**26-ముస్తన్‌సర్ బిల్లా పరిపాలన :-** జాహిర్ మరణానంతరం అతని కొడుకు ముస్తన్‌సర్ బిల్లా ఖిలాఫత్ పదవి అలంకరించాడు. ఇతను కూడా తన తండ్రి లాగే నీతిన్యాయాలకు కట్టుబడి ఉండేందుకు కృషిచేశాడు. బగ్దాద్‌లో హి.శ. 625-631లో 'ముస్తన్‌సర్యా' పేరుతో ఓ గొప్ప ధార్మికవిద్యాలయం నెలగొల్పాడు. అందులో వివిధ శాఖలకు చెందిన అధ్యాపకుల్ని నియమించి, వారి ఆహారం తదితర ఏర్పాట్లు చేశాడు. ఆ విద్యాలయంలో ఒక గ్రంథాలయం కూడా ఏర్పాటుచేసి అందులో నూటరవై ఒంటెలపై ఎంతో విలువైన గ్రంథాలు మోసుకొచ్చి పెట్టించాడు. హి.శ. 628-630లో 'దారుల్‌అష్రఫియా' పేరుతో ప్రఖ్యాత హదీసు పరిశోధనాకేంద్రం కూడా నెలకొల్పబడింది.

ఖలీఫా ముస్తన్‌సర్ దేశంలో న్యాయం-ధర్మం, శాంతీ-సుస్థిరతల స్థాపన కోసం ఎంతగానో పోరాడాడు. కాని తురుష్కులు, తాతారీల వరుసదాడులతో ఈ లక్ష్యాలను పూర్తిగా సాధించలేకపోయాడు. సిరియా, ఈజిప్టులలో సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబీ సంతానం అంతఃకలహాలతో సతమతం కాసాగింది. మరొకవైపు తాతారీల బెడద నలు వైపుల నుండి కారుమబ్బుల్లా కమ్ముకొస్తోంది. అయితే తాతారీలు రాజ్యవిస్తరణ కాంక్షతో బగ్దాద్ వైపు దృష్టి సారించడానికి సాహసించేవారు కాదు. ఈ తాతారీ (మొగల్) జాతి ప్రజలు మతపరంగా సూర్యారాధకులు అయినప్పటికీ తమ ఆక్రమిత ప్రాంతాల్లోని ముస్లింల ధార్మిక వ్యవహారాలో వారు ఏమాత్రం జోక్యం చేసుకునేవారు కాదు.

అయితే అత్యంత ధైర్యశాలి, పరాక్రమశాలి అయిన ఖలీఫా సోదరుడు ఖఫాజీ అతి వేగంగా ముంచుకొస్తున్న తాతారీతుఫాన్‌ని చూస్తూ 'నేను గనక ఖలీఫానైతే ఈ తాతారీలను తరిమితరిమి కొట్టి వారిని నామరూపాల్లేకుండా చేస్తాను' అని చెబుతుండేవాడు. కాని అతను ఖలీఫా కాలేకపోయాడు. హి.శ. 641లో ఖలీఫా ముస్తన్సర్ చనిపోయినపుడు పాలనాధికారులు తమ స్వార్థప్రయోజనాల కోసం ధీశాలి, అన్నివిధాల యోగ్యుడయిన ఖఫాజీని వదలి మృదుమనస్కుడైన ఖలీఫాకొడుకుని గద్దెనెక్కించారు.

**27-ముస్తాసిమ్‌బిల్లా పాలన- బగ్దాద్‌వినాశం:-** ముస్తన్‌సర్ తదనంతరం అతని కొడుకు ముస్తాసిమ్ బిల్లా ఖిలాఫత్ గద్దె నెక్కాడు. అంతగా విజ్ఞతావివేచనలు, దూరదృష్టి లేని ముస్తాసిమ్ అధికారంలోకి రాగానే పచ్చి షియావర్గీయుడైన మవీదుద్దీన్ అల్ఖమీని ప్రధానమంత్రిగా నియమించాడు. అల్ఖమీకి సున్నీలంటే ఏ మాత్రం గిట్టేది కాదు. అతను ముందుగా తననుతాను పరమవిధేయుడిగా ప్రదర్శించుకుంటూ ఖలీఫాను తన చేతిలో కీలుబొమ్మగా మలచుకొని షియాలకు అనేక ప్రయోజనాలు చేకూర్చడం మొదలెట్టాడు. వైల్మీషియాల కాలంలో ఉండిన దురాచారాలను తిరిగి ప్రవేశపెట్టాడు. తత్ఫలితంగా గతంలో మాదిరిగా షియా-సున్నీల మధ్య అంతఃకలహాలు తలెత్తాయి. అతను ఇరాక్ నుంచి అబ్బాసీలను (అంటే సున్నీలను) పూర్తిగా తుడిచిపెట్టి అల్వీయుల (అంటే షియాల) పాలన నెలకొల్పడమే ధ్యేయంగా పెట్టుకొని పనిచేయసాగాడు.

బగ్దాద్‌లో విజ్ఞత, దూరదృష్టి కలవారు కూడా కొందరున్నారు. వారు అల్ఖమీ చేస్తున్న స్వామీవిద్రోహచర్యల్ని, ప్రభుత్వవ్యతిరేక కార్యకలాపాలను గురించి ఖలీఫాకు తెలియజేశారు. కాని బుద్ధిహీనుడైన ఖలీఫా ఆ సంగతి అల్ఖమీ ముందు ప్రస్తావించాడు. అల్ఖమీ తన అతివినయాన్ని వలకబోస్తూ 'వారసలు మీకేదో కీడు తలపెట్టేందుకు ప్రయత్నిస్తున్న అరాచకశక్తులు, సంఘవిద్రోహులు, వారి పట్ల మనం అప్రమత్తంగా ఉండాలి' అని అరిచాడు. ఖలీఫా ఈ మాటలు విని మెత్తబడ్డాడు. దాంతో అల్ఖమీ మరిన్ని అధికార సోపానాలు అధిరోహించి జాతిశ్రేయోభిలాషుల హితవచనాలు ఖలీఫాకు చేరకుండా తలుపులు మూయించాడు.

ఆ తరువాత ప్రధాని అల్ఖమీ ఖలీఫాను మద్యసేవనం, భోగలాలస, స్త్రీలోలత్వాల ఊబిలోకి దించి గుండెల మీద చేయివేసుకున్నాడు. కొన్నాళ్ళ తరువాత ఖలీఫా కొడుకు అబూబకర్ షియాల అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు బగ్దాద్‌లోని షియాల వాడపై దాడిచేసి బీభత్సం సృష్టించాడు. అల్ఖమీని కూడా తిట్టిపోశాడు. దాంతో అల్ఖమీ తెగ బాధ పడిపోతూ యువరాజు గురించి ఖలీఫాకు ఫిర్యాదుచేశాడు. కాని ఖలీఫాలోని పుత్రప్రేమ అల్ఖమీ కోరినట్లు యువరాజుపై ఎలాంటి చర్య తీసుకోనివ్వలేదు. దాంతో అల్ఖమీలోని విద్రోహరాక్షసి జడలు విప్పి చిందులాడింది. అతను సహనం కోల్పోయి తాతారీల అగ్రనేత చంగీజ్‌ఖాన్‌తో కుమ్మక్కయి రహస్యలేఖలు రాయడం మొదలెట్టాడు.

అల్ఖమీ నుండి మొదటి లేఖ అందినపుడు చంగీజ్‌ఖాన్ దాన్ని గురించి అంతగా పట్టించుకోలేదు. అల్ఖమీ మరోలేఖ పంపుతూ "నేనెలాంటి రక్తపాతానికి తావు లేకుండా బగ్దాద్‌ఖలీఫాను, ఇరాఖ్‌రాజ్యాన్ని మీకు సులభంగా స్వాధీనమయ్యేలా చేస్తాను. కనుక మీరు తక్షణమే సైనికచర్య తీసుకోండి" అని సలహా ఇచ్చాడు. దానికి చంగీజ్‌ఖాన్ అల్ఖమీదూత ద్వారా సమాధానమిస్తూ "నేను మీప్రధాని మాటల్ని ఎలా నమ్మాలి? దాని కోసం నాకేదైనా హామీ ఇవ్వాలి. అప్పుడే నేనేదైనా చేయగలను" అని అన్నాడు. కాని వాస్తవం చెప్పాలంటే అరబ్బుల ధైర్యసాహసాలు, బగ్దాద్‌యోధుల బలపరాక్రమాల ముందు తాతారీలు నీరుగారిపోయారు. సిరియాలో వారి సైన్యాలు అరబ్‌తెగల చేతిలో అనేకసార్లు చావుదెబ్బలు తినివున్నాయి. అంచేత అల్ఖమీ ఉత్తరాలు మొదట్లో చంగీజ్ ఖాన్‌ని సందిగ్ధంలో పడవేశాయి.

అల్ఖమీ తన దుష్టపథకాన్ని అమలుపరచడానికి చివరి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఓరోజు అతను ఖలీఫా దగ్గరికెళ్ళి, శిస్తువసూళ్ళ ద్వారా వస్తున్న ప్రభుత్వరాబడి తగ్గిపోయిందని, సైనికుల జీతభత్యాలు ఎక్కువగా ఉన్నాయని, కొంత సైన్యాన్ని తగ్గించడం మంచిదని సలహా ఇచ్చాడు. దానికి ముందుచూపు లేని ఖలీఫా వెంటనే సమ్మతించాడు, దాంతో అల్ఖమీ వేలమంది సైనికులకు ఉద్వాసన చెప్పాడు. అదీగాక కొన్నివేల మందిని ప్రాముఖ్యంలేని ప్రాంతాలకు పంపి, మరికొన్ని వేలమందిని ఉద్యోగాల నుండి తీసేసి, తాతారీలను నిరోధించడానికి సరిహద్దుప్రాంతాలకు పంపించానని ఖలీఫాకు అబద్ధం చెప్పాడు. అల్ఖమీ అప్పటికీ తృప్తిచెందక మరికొందరు సైనికుల్ని తొలగించి 'మీ జీతాలు ప్రజల నుండి వసూలుచేసుకోండ'ని అనుమతించాడు. దాంతో సైనికులు నగరపౌరుల ఇండ్లలోకి బలవంతంగా జొరబడి లూటీలకు తెగబడ్డారు.



# 60. చంగీజ్ ఖాన్-జలాలుద్దీన్ ఖవారిజమ్

టర్కీ-చైనా సరిహద్దుల్లోని మగూలిస్తాన్ రాజ్యంలో మొగల్‌తెగకు చెందిన చంగీజ్‌ఖాన్ హి.శ. 549లో జన్మించాడు. అతను పుట్టగానే అతని రెండుపిడికిళ్ళు మూసుకొని ఉన్నాయి. అతని తల్లి ఆ పిడికిళ్ళు తెరచి చూస్తే రెండు చేతుల్లో పేరుకున్న రక్తం కన్పించింది. దాన్ని బట్టి ఆమె ఈ పిల్లవాడు భవిష్యత్తులో పెద్ద రక్తపాతి అవుతాడని అన్నది. బాల్యదశ దాటి యౌవనంలో అడుగుపెట్టగానే అసాధారణ తెలివితేటలతో యుద్ధరంగంలో దూసుకుపోయాడు. మొగల్ తెగలుండే మగూలిస్తాన్ రాజ్యాన్ని పూర్తిగా తన అధీనంలోకి తెచ్చుకొని, తాతారీ తెగల వైపు దృష్టిసారించాడు. తాతారీల రాజు తననుతాను బలహీనుడిగా భావించి చంగీజ్‌ఖాన్‌తో తన కూతురిపెళ్ళి జరిపించి అతనితో ఒప్పందం చేసుకున్నాడు. కొంత కాలానికి తాతారీ రాజ్యం కూడా చంగీజ్‌ఖాన్ స్వాధీనంలోకి వచ్చింది.

ఆ కాలంలో ఈరాన్, ఖురాసాన్, అఫ్గనిస్తాన్, తుర్కిస్తాన్ దేశాల చక్రవర్తి సుల్తాన్ ముహమ్మద్ ఖవారిజమ్ ఆసియాఖండంలో అందరికంటే బలమైన ముస్లిం చక్రవర్తిగా ప్రసిద్ధి చెందాడు. అయితే అతను రాజ్యవిస్తరణ దాహంతో పెట్రేగిపోతూ బగ్దాద్ ఖిలాఫత్‌ను తుదముట్టించే కలలు కనసాగాడు. అతను బగ్దాద్‌పై దాడికి సన్నాహాలు చేస్తున్నాడని తెలియగానే అప్పటి ఖలీఫా నాసిరుద్దీనుల్లా రాయబారం కోసం ప్రఖ్యాత ధర్మవేత్త షేఖ్ సహర్‌వర్దీని పంపాడు. కాని సుల్తాన్ ముహమ్మద్ ఖవారిజం ఆయన హితోపదేశాన్ని పెడచెవినపెట్టి వెనక్కి పంపివేశాడు. తర్వాత సైన్యం తీసుకొని బగ్దాద్ వైపు బయలుదేరాడు. అయితే దారిలో తీవ్రమైన మంచు కురవడంతో సైన్యం ముందుకు పురోగమించలేకపోయింది. దాంతో సుల్తాన్ గత్యంతరంలేక దండయాత్రను మరుసటి సంవత్సరానికి వాయిదావేసి వెనక్కి తిరిగొచ్చాడు. ఓరోజు తాగిన మైకంలో తన రాజ్యంలోని సుప్రసిద్ధ ధర్మవేత్త షేఖ్ ముజద్దదీన్‌ని వధించమని తన సైనికుల్ని ఆదేశించాడు. ఆ విధంగా ఆ ధర్మవేత్త మృత్యువాత పడ్డాడు. మరునాడు మత్తువదలి స్పృహలోకి రాగానే సుల్తాన్ పశ్చాత్తాపం పడుతూ మరొక సుప్రసిద్ధ ధర్మవేత్త షేఖ్ నజ్మద్దీన్ కుబ్రా దగ్గరకు రక్తపరిహారం పంపించాడు. షేఖ్ నజ్మద్దీన్ దాన్ని తీసుకోవడానికి నిరాకరిస్తూ, అమరవీరుని రక్తపరిహారానికి బదులుగా వేలాదిమంది ముస్లింల తలలు ఖండించబడతాయని అన్నారు.

చంగీజ్‌ఖాన్ తన సువిశాల సామ్రాజ్యాన్ని పటిష్ఠపరచుకున్న తరువాత సుల్తాన్ ముహమ్మద్ ఖవారిజంతో స్నేహఒప్పందం చేసుకోవడానికి ఒక లేఖ రాసిచ్చి తన దౌత్యప్రతినిధుల్ని పంపాడు. ఆ లేఖలో అతను సుల్తాన్‌ని నువ్వు నా కొడుకు లాంటివాడని కూడా అన్నాడు. సుల్తాన్ ఖవారిజం స్నేహఒప్పందం మీద సంతకం అయితే చేశాడుగాని, లేఖలో చంగీజ్‌ఖాన్ తనను కొడుకు అనడం అతనికి నచ్చలేదు. ఒప్పందం ప్రకారం రెండు రాజ్యాల మధ్య వర్తకుల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

బగ్దాద్ ఖలీఫా నాసిరుద్దీనుల్లా ఈ ఒప్పందం సంగతి విని ఒకవ్యక్తి తల మీద ఓ రహస్యలేఖ రాయించి చంగీజ్‌ఖాన్ దగ్గరకు పంపించాడు. అందులో 'మీరు సుల్తాన్ ఖవారిజం రాజ్యంపై దాడిచేయండి, మీకు మా సహాయసహకారాలు ఉంటాయి' అని రాయించాడు. చంగీజ్‌ఖాన్ ఈ రహస్య శిరోలేఖ చదివి 'మేము సుల్తాన్ ఖవారిజంతో

ఒప్పందం చేసుకున్నాం. అంచేత మేమిప్పుడు సుల్తాన్ మీద దాడిచేయలేము' అని దౌత్యవేత్తకు చెప్పాడు. ఆ దౌత్యవేత్త వెళ్ళిపోయిన తరువాత చంగీజ్‌ఖాన్ ఖవారిజం చక్రవర్తితో తన స్నేహసంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవడానికి ఎంతో వాత్సల్యంతో అతనికి లేఖ రాశాడు. ఈ లేఖ తన దౌత్యవేత్తకు ఇచ్చి వ్యాపార నిమిత్తం తన రాజ్యానికి వచ్చిన నాలుగొందల యాభై మంది ముస్లింవర్తకుల వెంట పంపించాడు.

**1-సుల్తాన్ తలపొగరుతో ముస్లింల వినాశం! :-** కాని దారిలో సుల్తాన్ ముహమ్మద్ గవర్నర్ వర్తకబృందాన్ని అడ్డుకొని జైల్లో పడవేయించాడు. వర్తకబృందం తాము ముస్లిం లమని ఎంత మొత్తుకున్నా వినలేదు. పైగా అతను సుల్తాన్‌కు ఉత్తరం రాస్తూ, మగూలిస్తాన్ నుండి కొందరు గూఢచారులు వర్తకులవేషాల్లో మన రాజ్యంలో ప్రవేశించారని చెప్పి వీరిని ఏం చేయాలో ఆజ్ఞాపించండని అడిగాడు. ముందుచూపులేని సుల్తాన్ ముహమ్మద్ వారందర్నీ వధించమని ఆదేశించాడు. వెంటనే అతని గవర్నర్ వర్తకుల వ్యాపారసామగ్రిని జప్తుచేసుకొని వారిని నిర్దాక్షిణ్యంగా చంపించాడు. వారిలో ఒకతను ఎలాగో తప్పించుకొని చంగీజ్‌ఖాన్ దగ్గరకు చేరుకొని జరిగిన సంఘటన తెలియజేశాడు.

వెంటనే చంగీజ్‌ఖాన్ మరొక లేఖలో 'మీ గవర్నర్ బుద్ధిహీనతతో ప్రవర్తిస్తూ అమాయక వర్తకులను హతమార్చి ఘోరమైన నేరానికి పాల్పడ్డాడు. కాబట్టి అతడ్ని నాకు అప్పగించండి లేదా మీరే అతనికేదైనా కఠినశిక్ష విధించండి' అని రాసి ఒక దౌత్యవేత్త ద్వారా పంపించాడు. సుల్తాన్ ముహమ్మద్ ఖవారిజం ఆ లేఖ చదవగానే దాన్ని తెచ్చిన దూతను హతమార్చాడు. చంగీజ్‌ఖాన్ అప్పటికీ సంయమనం పాటిస్తూ వేరొక లేఖ రాసి పంపాడు. అందులో 'దౌత్యవేత్తలను హతమార్చడం రాజుల పని కాదు; వర్తకులను కాపాడటం రాజుల కర్తవ్యం. నా డిమాండ్లను మరొకసారి పరిశీలించి తగినచర్య తీసుకుంటారని భావిస్తున్నాను' అని రాసి మరొక దౌత్యవేత్తకు ఇచ్చి పంపాడు. సుల్తాన్ అతడ్ని కూడా హతమార్చాడు.

యాదృచ్ఛికంగా ఆ రోజుల్లోనే ఓ సరిహద్దుప్రాంతం పాలకుడిలో తిరుగుబాటు సూచనలు కన్పించడంతో చంగీజ్‌ఖాన్ అతని మెడలు వంచడానికి తన కుమారుడు జోజీఖాన్‌కు ఒక సైనికదళమిచ్చి పంపాడు. ఆ సైన్యాన్ని చూడగానే తిరుగుబాటుదారుడు పారిపోతూ ఖవారిజంరాజ్యంలోని ఓ ప్రాంతంలో ప్రవేశించాడు. జోజిఖాన్ అతడ్ని వెంటాడుతూ అక్కడికి చేరుకొని ఆ రాజద్రోహిని పట్టుకున్నాడు. అప్పుడు కాకతాళీయంగా సుల్తాన్ ఖవారిజం ఏదో పనిమీద ఆ ప్రాంతానికి వచ్చివున్నాడు. అతను జోజిఖాన్‌ని చూడగానే దాడిచేయడానికి సిద్ధమయ్యాడు. జోజిఖాన్ తాను ఒక తిరుగుబాటుదారుడ్ని పట్టుకోవడానికి వచ్చానని, ఆ పని నెరవేరిందిగనక తానిప్పుడు తన రాజ్యానికి వెళ్ళి పోతున్నానని, అంచేత తనపై దాడిచేయవద్దని ఉత్తరం రాశాడు. కాని సుల్తాన్ ఖవారిజం అదేమీ పట్టించుకోకుండా దాడికి దిగాడు. ఇరుపక్షాలు సాయంత్రందాకా పోరాడినా ఫలితం కన్పించలేదు. ఆ రాత్రి జోజీఖాన్ తన సైనికస్థావరాల్లో మంటలు రాజేసి, సైన్యం తీసుకొని చీకటిలో స్వదేశానికి చేరుకొని పరిస్థితులన్నీ చంగీజ్‌ఖాన్‌కు వివరించాడు.

ఆ రోజు నుండే ముస్లింల వినాశం ప్రారంభమయింది. హి.శ. 615లో చంగీజ్‌ఖాన్ నిప్పులు చెరుగుతూ ముస్లిం రాజ్యాలపై విరుచుకుపడ్డాడు. చంగీజ్‌ఖాన్ దండయాత్రల్ని



గురించి వినగానే సుల్తాన్ ముహమ్మద్ ఖవారిజం అతడ్ని ఎదుర్కోవడానికి నలువైపులా సైన్యాలను పంపి తాను కూడా ఒక సైనికదళం తీసుకొని సమర్‌ఖంద్ నుండి ఖురాసాన్ వైపు బయలుదేరాడు. కాని భారీసైన్యం ఉండి కూడా అతను చంగీజ్‌ఖాన్‌ని ఎదుర్కోలేక పిరికితనంతో వెనక్కి జరుగుతూ సమర్‌ఖంద్‌కు తిరిగొచ్చాడు. అక్కడ్నుంచి బలఖ్‌కు చేరుకొని తన ఖజానా, భార్యాపిల్లల్ని వేరే చోటికి తరలించాడు. ఆ తర్వాత తదుపరి కర్తవ్యాన్ని గురించి సేనాపతుల్ని సంప్రదించాడు. అతని ఏడుగురు కొడుకుల్లో జలాలుద్దీన్ అనే కొడుకు తన తండ్రిలో చోటుచేసుకున్న పిరికి, భయాందోళనలను గమనించి 'మీరు ఇరాఖ్‌కు వెళ్ళదలచుకుంటే సర్వసేనాని బాధ్యత నాకప్పగించి వెళ్ళిపొండి; నేను శత్రువుపై దాడిచేసి దైవచిత్తమైతే మన సామ్రాజ్య సరిహద్దులదాకా తరిమికొడ్తాను' అని అన్నాడు. కాని సుల్తాన్ ముహమ్మద్ అతని సలహాను త్రోసిపుచ్చి ముఖ్యపట్టణాలను కాపాడుకోవ డానికి మొత్తం సైన్యాన్ని చిన్నచిన్న దళాలుగా విభజించి హిరాత్ వైపు బయలుదేరాడు.

చంగీజ్‌ఖాన్ (తాతారీ) సైన్యాలు పట్నాలు, గ్రామాలను సర్వనాశనం చేస్తూ ముందుకు పురోగమిస్తున్నాయి. ప్రజలు భీతావహులయి ఇళ్ళూ వాకిళ్ళూ వదలి పిల్లాజెల్లతో వేరే ప్రాంతాలకు వలసపోతున్నారు. ఖౌఖంద్ గవర్నర్ తైమూర్‌ముల్క్ సైన్యాధికారులతో సంప్రదించి స్త్రీలు, పిల్లలు, వృద్ధులను నగరం నుండి తీసి సురక్షిత ప్రాంతాలకు తరలించ మని ఉత్తర్వులు జారీచేశాడు.

తాతారీలు ఖౌఖంద్‌రాష్ట్ర సరిహద్దులు దాటి లోపలికి చొచ్చుకు వచ్చారన్న వార్త నగరంలో కార్చిచ్చులా వ్యాపించింది. దాంతో జనసామాన్యం తమ భార్యాపిల్లలను తీసుకొని మంచు కురుస్తున్నా, ఈదురుగాలులు వీస్తున్నా లెక్కచేయకుండా వేరే ప్రాంతాలకు తరలిపోవడం ప్రారంభించారు.

ఎప్పటికప్పుడు పరిస్థితులు గమనిస్తూ కుట్రలు, కుయుక్తులతో యుద్ధం చేసే చంగీజ్‌ఖాన్‌కు ముహమ్మద్ షా సైనికవ్యూహాలు అనుకూలంగా మారాయి. అతని కొడుకు ఒకడి నాయకత్వంలో తాతారీలు సైహూ నది దాటి ఉతరార్‌పై మెరుపుదాడి చేశారు. నగరపాలకుడు తుదిశ్వాసదాకా పోరాడాడు. తాతారీలు కోటతలుపులు బద్దలుచేసి, కొద్ది సంఖ్యలో వున్న ముస్లింసేనలను సులభంగా హతమార్చారు. నగరపాలకుడు అలాంటి పరిస్థితిలో కూడా భయపడి పారిపోకుండా కోటబురుజు పైనుండి బాణాలు విడిచాడు. బాణాలు అయిపోయిన తర్వాత రాళ్ళు, ఇటుకలు విసురుతూ అనేకమంది తాతారీలను గాయపరిచాడు. చివరికి ప్రాణాలతో పట్టుబడి చంగీజ్‌ఖాన్ దగ్గరకు పంపబడ్డాడు. చంగీజ్ ఖాన్ అతని కళ్ళలో, చెవుల్లో కరిగించిన వెండి పోయించి హతమార్చాడు.

ఈవిధంగా తాతారీలు ఖవారిజం రాజ్యంలో విధ్వంసకాండ సృష్టిస్తూ బుఖారా పట్టణం చేరుకొని దాన్ని దిగ్బంధించారు. ముట్టడి అనేక రోజులు సాగింది. కాని నగరంలోకి ప్రవేశించలేక పోయారు. చివరికి ఓ ఆయుధ నిర్మాణ నిపుణుడి సలహాతో చంగీజ్‌ఖాన్ అగ్నిబాణాలు కురిపించమని సైనికుల్ని ఆదేశించాడు. సైనికులు వెంటనే నగరం మీద అగ్నిబాణాలు కురిపించడం ప్రారంభించారు. దాంతో నగరంలోని ఒక పేటలో అగ్ని మంటలు చెలరేగి చూస్తూవుండగానే అవి క్రమంగా నలువైపులా విస్తరించాయి. అప్పుడు

ముస్లిం యోధులు గత్యంతరంలేక కోట బయటికి వచ్చి ఎదురుదాడి ప్రారంభించారు. అయితే కోట బయటికి వచ్చిన ముస్లింయోధులు తమకు నాలుగు రెట్లు అధికసంఖ్యలో ఉన్న తాతారీ సైన్యం ధాటికి నిలువలేక పోయారు.

పరిస్థితి చేయిదాటి పోతుందని భావించిన నగర పాలకుడు, ఇతర ఉన్నతాధికారులు సంధి కోసం చంగీజ్‌ఖాన్ దగ్గరకు ఓ ప్రతినిధి వర్గం పంపడానికి నిశ్చయించారు. అప్పుడు గొప్ప ధర్మపరాయణుడిగా జనశ్రేయోభిలాషిగా ప్రసిద్ధిచెందిన ఇమామ్‌జాదా రుకునుద్దీన్ నగరపెద్దల సమావేశంలో ప్రసంగిస్తూ ఇలా అన్నాడు:

"మనం కనీసం ఆర్నెల్లదాకా పోరాడుతూ నగరాన్ని రక్షించుకోగలం. ఈలోగా సమర్‌ఖంద్ నుంచి మన సోదరసైనికులు వచ్చి మనల్ని ఆదుకుంటారని నాకు పూర్తి నమ్మకముంది. అప్పుడు చంగీజ్‌ఖాన్ కోట తలుపులు తెరిపించడానికి మనం పెట్టే ప్రతి షరతూ ఒప్పుకుంటాడు. అయితే తాతారీలు సంధికి కట్టుబడి ఉంటారని భావించడం కంటే మించిన ఆత్మవంచన మరేదీ లేదు. తాతారీ సైనికులు నగరంలో ప్రవేశిస్తే మాత్రం ఉతరార్, తాష్కంద్ ప్రజలకు పట్టిన దుర్గతే మనకూ పడ్తుంది."

ఇమామ్‌జాదా రుకునుద్దీన్ చేసిన ఈ ప్రసంగం నగర పెద్దల బుర్రలకు ఎక్కలేదు. వారు చంగీజ్‌ఖాన్ దగ్గరకు సంధి కోసం ప్రతినిధి బృందం పంపారు. ఆ ప్రతినిధి బృందం తిరిగొచ్చి, మన ధన మాన ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేదని, నగర నూతన పాలకుడు కూడా ముస్లిమే ఉంటాడని నగరవాసులకు శుభవార్త అందజేశారు. ఆ తరువాత నగర ద్వారాలు తెరిచారు. చంగీజ్‌ఖాన్, అతని సైనికులు నగరంలోకి ప్రవేశించారు.

చంగీజ్‌ఖాన్ నగరంలోని జామియా మసీదు మెట్ల దగ్గరకు చేరుకొని "ఇది మీ చక్రవర్తి గృహమా?" అని అడిగాడు జనంతో. దానికి ఓ నగరవాసి "కాదు, ఇది దైవగృహం" అని సమాధానమిచ్చాడు. చంగీజ్‌ఖాన్ మసీదులోకి ప్రవేశించి, నమాజ్ కోసం వచ్చినవారిని ఉద్దేశించి ఇలా అన్నాడు: "నా సైనికులు అలసిపోయారు. వీరికి విశ్రాంతి, ఆహారం కావాలి. దానికోసం మీ మీ ఇండ్ల తలుపులు తెరచిపెట్టండి. ఇలాంటి సువిశాల భవనాలు (అంటే మసీదులు) మా గుర్రాల కోసం ఖాళీ చేయండి. వాటికి దాణ, మేత తెచ్చిపెట్టండి. గుర్తుంచుకోండి. మీరు దైవాగ్రహానికి భయపడతారు కదూ? నేనిప్పుడు మీకోసం దైవాగ్రహమయి వచ్చాను." ఈ హెచ్చరిక నగరవాసులపై విరుచుకుపడబోతున్న మహోపద్రవానికి ఉపోద్ఘాతం మాత్రమే.

ఆ తరువాత తాతారీల దౌర్జన్యకాండ మొదలయింది. ఇండ్లలో స్త్రీలు, పసిపిల్లలను మాత్రమే ఉంచి పురుషుల్ని బయటికి పంపివేశారు. ముఖ్యంగా రాత్రివేళల్లో పురుషులకు తమ ఇండ్లలోకి ప్రవేశించే అనుమతి లేదు. వారు వీధుల్లో, చౌరాస్తాల్లో మాత్రమే అసహాయ స్థితిలో నిలబడి తమ ఇండ్ల నుంచి వెలువడుతున్న తాతారీల వికటాట్టహాసాలు, స్త్రీలు-పిల్లల ఏడ్పులు, పెడబొబ్బలు వింటున్నారు. ఎవరికైనా రోషం వచ్చి తమ ఇండ్లలోకి జొరబడటానికి ప్రయత్నిస్తే వెంటనే వారు తాతారీల రక్తదాహానికి బలైపోయేవారు.

ఇక ప్రభుత్వాధికారులు, ధనికుల పరిస్థితి అయితే అంతకంటే దారుణంగా ఉండేది. తాతారీలు వారి ఇండ్లలో జొరబడి స్త్రీలను మానభంగాలు చేయడంతోనే తృప్తిచెందక



పురుషులకు భయంకరమైన చిత్రహింసలు కూడా పెట్టేవారు. వారు నేలమాళిగల్లో దాచుకున్న నిధులు, సిరిసంపదలు వారి చేతనే గునపాలతో తవ్వించి బయటికి తీయించి స్వాధీనం చేసుకునేవారు.

ఈ విధంగా తాతారీలు వెండిబంగాలు తదితర చరాస్తులన్నీ స్వాధీనం చేసుకున్న తరువాత నగరవాసులందరినీ కొడ్తూ ఈడుస్తూ ఓ పెద్ద మైదానంలోకి తీసికెళ్ళారు. అక్కడ కొందరు తాతారీలు పురుషుల్ని నిరాయుధులు చేసి ఖడ్గాలతో వారిని చుట్టుముట్టి కాపలాకాస్తూ నిలబడ్డారు. మిగిలిన తాతారీలు ఒక్కసారిగా స్త్రీలపై పశువుల్లా విరుచుకు పడ్డారు. పురుషులు, పిల్లల ముందే వారు స్త్రీలపై సామూహిక మానభంగాలకు పాల్పడ నారంభించారు. స్త్రీలు, పిల్లల ఏడ్పులు అరణ్యరోదనలే అయ్యాయి.

ఇమామ్ రుకునుద్దీన్ ఈ దారుణాలు సహించలేక "పిరికిపందల్లారా! ఇంకా చూస్తున్నారా తమాషా!! కదలండి, దూకండి!!" అంటూ అరిచారు.

అంతే- 'అల్లాహుఅక్బర్' నినాదాలు మిన్నుముట్టాయి. ముస్లింలు మెరుపువేగంతో తాతారీలపై విరుచుకుపడ్డారు. రిక్తహస్తాలతో ఖడ్గధారుల్ని ఢీ కొన్నారు. తాతారీల ఖడ్గాలు, ఈటెలు లాక్కొని వారిని మట్టుపెట్టడం మొదలెట్టారు. స్త్రీలను మానభంగాలు చేస్తుండిన తాతారీ సైనికులకు కత్తులు తీసుకోవడానికి, గుర్రాలు ఎక్కడానికి అవకాశమే దొరకలేదు; కొన్ని క్షణాల్లోనే రెండువేల మందికి పైగా తాతారీలు నేలకొరిగి ఊపిరి విడిచారు.

దాంతో చంగీజ్‌ఖాన్ ఆగ్రహోదగ్రుడయి నగరవాసులందరినీ తుడిచి పెట్టమని సైనికుల్ని ఆదేశించాడు. తక్షణమే తాతారీ సైనికులు నగరవాసులపై విరుచుకుపడ్డారు. పసిపిల్లల్ని సైతం విడిచిపెట్టకుండా అందర్నీ ఊచకోతకోసి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. ఆ తరువాత శవాలగుట్టలు వదిలేసి సమర్‌ఖంద్ దిశగా వెళ్ళిపోయారు.

సమర్‌ఖంద్ ఎంతో పటిష్ఠమైన రక్షణఏర్పాట్లతో కూడిన నగరం. నగర రక్షణ కోసం అనుక్షణం కాపలాకాస్తుండే లక్షా పదివేలమంది సైనికులున్నారు. కాని సుల్తాన్ బుఖారాలో జరిగిన హత్యాకాండ సంగతి విని పూర్తిగా ఢీలా పడిపోయాడు. అతను సమర్‌ఖంద్ నాయకత్వాన్ని కొందరు అధికారులకు అప్పగించి బలఖ్ దిశగా వెళ్ళిపోయాడు.

సైన్యాలకు సరైన మార్గదర్శనం చేయగల ఇద్దరు నాయకులు అప్పుడు సమర్‌ఖంద్‌లో లేరు. వారిద్దరిలో ఒకరు సుల్తాన్ ముహమ్మద్‌షా కుమారుడు జలాలుద్దీన్. ఆ రోజుల్లో అతను ఖవారిజం రాజ్యంలోని ఇతర ప్రాంతాల్లో సైన్యాలను సమాయత్త పరుస్తున్నాడు. బుఖారాలో తాతారీల హత్యాకాండ గురించి విని తనను సమర్‌ఖంద్‌కు రావడానికి అనుమతించమని ఒక సైనికుడి ద్వారా తన తండ్రిని అడిగాడు. కాని సుల్తాన్ ముహమ్మద్ అందుకు నిరాకరిస్తూ "నువ్వు నాకంటే అనుభవశాలి కాదు, అవసరమొచ్చినపుడు పిలిపించుకుంటానులే" అని సమాధానమిచ్చాడు.

పోతే రెండవ నాయకుడు యుద్ధతంత్రాలు, ధైర్యసాహసాల్లో తుర్కిస్తాన్ ప్రజల మెప్పు పొందిన తైమూర్‌ముల్క్. అతని నాయకత్వంలో లక్షా పదివేల మంది ముజాహిద్‌లు తాతారీలను మట్టి కరిపించగలరని సమర్‌ఖంద్‌లోని పిల్లలు సైతం భావిస్తారు. కాని

సుల్తాన్ సమర్‌ఖంద్ నుంచి వెళ్ళిపోయిన తర్వాత అక్కడి సైనికులు పూర్తిగా నిరాశ చెందారు. అదీగాక వారి ఉన్నతాధికారుల్లో విభేదాలు కూడా వచ్చాయి.

ఆ తరువాత కొన్నాళ్ళలోనే తాతారీలు వచ్చి సమర్‌ఖంద్‌ని ముట్టడించారు. అప్పుడు ముస్లిం సైనికాధికారులు నగరం బయటికెళ్ళి తాతారీలను ఎదుర్కోవాలని నిర్ణయించారు. దాని ప్రకారం ముస్లింయోధులు నగరం బయటికొచ్చి తాతారీలతో తలపడ్డారు. తుర్కీ ముజాహిద్‌లు వీరోచితంగా పోరాడుతూ తాతారీలలో భీతావహం సృష్టించారు. అయితే మరికొన్ని గంటల్లోనే తాతారీలు పారిపోయే పరిస్థితి వస్తుందన్న సమయంలో స్వార్థపరులైన కొందరు సైనికాధికారులు ముప్ఫయి వేలమంది సైనికులతో వెళ్ళి తాతారీలలో కలసిపోయారు. దాంతో తాతారీలు సమర్‌ఖంద్‌లో విజయదుందుభి మోగించారు.

విజయం సాధించిన తరువాత చంగీజ్‌ఖాన్ మొదటి రోజు ఆ ముప్ఫయి వేల మంది ముస్లింవిద్రోహుల్ని గౌరవించి బాగా సత్కరించాడు. వారికి ధరించేందుకు తాతారీ సైనికదుస్తులు ఇప్పించాడు. అయితే నగరంలో సామూహిక హత్యాకాండ పర్వం ముగిసిన తర్వాత ఆ ముప్ఫయివేల మందిని వారి నాయకులతో సహా అర్ధరాత్రి నిద్రపోతున్న సమయంలో ఊచకోత కోయించాడు. విద్రోహుల్ని వాడుకున్న తరువాత వారిని మట్టు పెట్టడమే చంగీజ్‌ఖాన్ రాజనీతిగా ఉండేది.

సమర్‌ఖంద్ విజయం తర్వాత చంగీజ్‌ఖాన్ ఖవారిజంరాజు ముహమ్మద్‌ను వెంబడించి పట్టుకోవడానికి అనేక సైనికదళాలను నలుదిక్కులా పంపించాడు. ఖవారిజం రాజు ఈ సంగతి తెలుసుకొని నమ్మకస్తులయిన కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని ప్రాణభీతితో తాతారీల నుండి తప్పించుకుంటూ తిరగసాగాడు.

ఓరోజు సాయంత్రం అతను సముద్రతీరంలో ఓచోట విడిదిచేశాడు. అంతలో దూరాన దుమ్ములేస్తూ కన్పించింది. దాంతో సుల్తాన్ తాతారీలు వస్తున్నారేమోనని భయపడ్డాడు. అయితే ఒక సైనికుడు వచ్చి, అది ముస్లిం సైన్యం అన్నాడు. ముప్ఫయివేల మంది సైనికులతో కూడిన ఆ సైన్యం దగ్గరగా వచ్చి ఆగింది. వారిలో ఒక అశ్వరూఢుడు వేగంగా సుల్తాన్ ముందుకు వచ్చి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

సుల్తాన్ ముహమ్మద్‌షా తలపెకెత్తి అతని వైపు చూస్తూ "నాయనా జలాలుద్దీన్! గుర్రం మీద నుంచి దిగవా?" అన్నాడు. "లేదు. నేను చాలా దూరం పోవలసి ఉంది. మీరు నన్ను ఎందుకు పిలిపించారో తెలుసుకోవడానికి మాత్రమే నేనిక్కడకు వచ్చాను" అన్నాడు యువరాజు జలాలుద్దీన్ గంభీర వదనంతో.

"అయితే నువ్వు నాకు సహాయం చేయడానికి రాలేదా?"

"పాడుబడిన ఈ ప్రదేశంలో మీకొచ్చే ప్రమాదం ఏమిటీ? నేను మృత్యు అన్వేషణలో వెళ్తున్నాను. మృత్యువు నుండి పారిపోయేవారికి నేనేం సహాయం చేయగలుగుతాను?"

సుల్తాన్ ముందుకు వచ్చి జలాలుద్దీన్ గుర్రం కళ్ళెం పట్టుకొని "లేదు, లేదు. నేను నిన్ను వెళ్ళనివ్వను. యావత్ప్రపంచం నాకు విరోధి అయిపోయింది. ఇక నా చివరి ఆసరా నువ్వే. నన్నిలా ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతావా?" అని అన్నాడు దీనంగా.



"ప్రజలకు మీరేదైనా మంచి చేస్తే కదా వారు అభిమానంతో మీ చుట్టు చేరడానికి! మీ మూలంగానే మన ప్రజలు ఒక భయంకరమైన నీచ విరోధికి బానిసలయిపోయారు. మీరు కేవలం మీ ప్రాణాన్ని కాపాడుకోవడానికి యావత్ సామ్రాజ్యాన్ని తోడేళ్ళ మందకు అప్పగించారు. మీరు చేసిన తప్పులకు జాతి అంతా శిక్ష అనుభవిస్తోంది. నేనిప్పుడు మీ కోసం ఏమీ చేయలేను. నేనిక నుంచి నా తుదిశ్వాస దాకా తాతారీలతో పోరాడుతాను. ఇదే నా ప్రస్తుత కర్తవ్యం."

"జలాల్! తాతారీలతో యుద్ధం చేయడమనే ఆలోచన ఒక ఉన్మాదం తప్ప మరేమీ కాదు. నామాట విను. దేవుని కోసం నాతో సహకరించు. మనం ఈజిప్టుకో స్పెయిన్‌కో వెళ్ళి ప్రశాంతంగా బ్రతుకుదాం" అన్నాడు సుల్తాన్.

"నేను పిరికిపందల జీవితం గడిపేవారితో సహకరించడానికి బదులు వీరమరణం పొందడానికి ఉవ్విళ్ళూరే సాహసవీరులతో మాత్రమే సహకరించ దలిచాను" అంటూ జలాలుద్దీన్ పగ్గం లాగి గుర్రాన్ని వెనక్కి తిప్పాడు.

"జలాల్! ఆగు. నామాట విను. మనం తాతారీలతో పోరాడి గెలవలేము."

"నాకు మీ ఆదేశం కంటే దేవుని, దైవప్రవక్త (స) ఆదేశమే ముఖ్యం. మన ఉభయుల ఆశయాలు, మార్గాలు వేరైపోయాయి. ఖుదాహాఫిజ్" అంటూ జలాలుద్దీన్ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత సుల్తాన్ ముహమ్మద్‌షా కొందరు నమ్మినబంట్లను తీసుకొని అక్కడ్నుంచి తాతారీల బారినుండి తప్పించుకుంటూ పేరూ ఊరూ లేని ఓ చిన్న దీవికి చేరుకున్నాడు. అక్కడే బిక్కుబిక్కుమంటూ శేషజీవితం గడుపుతూ కొంత కాలానికి చనిపోయాడు.

తాతారీలు ఊళ్ళకు ఊళ్ళను తగలబెడ్తూ, భయంకరమైన విధ్వంసకాండలు, సామూహిక హత్యాకాండలు జరుపుతూ తిరుగుతున్నారు. దాంతో ముస్లిం జనసామాన్యం భీతావహులయి ఇళ్ళూ వాకిళ్ళూ వదలిపెట్టి గమ్యరహితంగా వెళ్ళిపోతున్నారు. మరోవైపు జలాలుద్దీన్ తాతారీల సంఖ్యాధిక్యతకు భయపడకుండా తన కొద్దిమంది సైనికులతోనే వారిని నీడలా వెన్నాడుతూ గెరిల్లా యుద్ధాలు చేయసాగాడు. ఎప్పుడు ఎటునుంచి దాడిచేసి మాయమవుతాడో తెలియదు. తాతారీ సైనికాధికారుల్ని చికాకుపరుస్తూ క్షణాల్లోనే వారి నుండి తప్పించుకొని పోయేవాడు. ఇలా జలాలుద్దీన్ కొద్దికాలంలోనే తన తండ్రి పాలనలో కోల్పోయిన కొన్ని పట్టణాలను స్వాధీనం చేసుకోగలిగాడు.

జలాలుద్దీన్ యుద్ధతంత్రాలు, వీరగాథలు విని ముస్లింలు అతనికి సన్నిహితం కాసాగారు. దారీతెన్నూ కానరాక తిరుగుతున్న ముస్లింశరణార్థులు జలాలుద్దీన్ కారణంగానే సురక్షితప్రాంతమైన మరూపట్టణానికి చేరుకొని ఊపిరి పీల్చుకున్నారు.

సుల్తాన్ జలాలుద్దీన్ అఫ్గానిస్తాన్ ఉత్తర సరిహద్దు ప్రాంతంలోని మరూ పట్టణం గవర్నర్‌కు ఓ ముఖ్యసమాచారం పంపిస్తూ "మీరు మరూ పట్టణాన్ని కనీసం నాలుగు వారాల పాటు పరిరక్షిస్తూ ఉండండి. ఈలోగా నేను బలఖ్, హిరాత్ వగైరా పట్టణాల నుంచి కొత్తసైన్యం సంఘటితపరచి మరూకు తీసుకొస్తాను" అని అందులో రాశాడు.

మరూ రక్షణకోసం తగినన్ని సైన్యాలు లేకపోయినా శరణార్థుల లక్షలాది ఖడ్గాలు ఉన్నాయి. బుఖారా, సమర్‌ఖందలలో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వము అని వారు నిర్ణయించుకున్నారు. దాని కోసం స్త్రీలు కూడా సిద్ధమయి ధనుర్బాణాల ప్రయోగాన్ని అభ్యసిస్తున్నారు. పిల్లలు ఇండ్లకప్పుల మీద రాళ్ళు సమీకరిస్తున్నారు. మసీదుల్లో ప్రతినమాజ్ తరువాత ప్రజలు జిహాద్ ప్రసంగం విని చివరి రక్తపుబొట్టు వరకు పోరాడుతూ మరూను కాపాడుకుంటామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు.

**2-ముస్లిం విద్రోహులు :-** చివరికి ఓరోజు చంగీజ్‌ఖాన్ కొడుకు తౌలాయిఖాన్ నాయకత్వంలో తాతారీసైన్యం మరూ సమీపానికొచ్చింది. మరూవాసులు కోటబురుజులపై ధనుర్బాణాలతో సిద్ధమైవున్నారు. అయితే కొందరు ద్రోహులు తాతారీసైన్యం వచ్చిందని వినగానే పట్నం వదలి తాతారీలతో చేతులుకలిపారు. బురుజులపై పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువమంది ఉన్నారని వారు తౌలాయికి తెలియజేశారు. తౌలాయిఖాన్ ఈ మాట విని వెంటనే దాడిచేయమని సైన్యాన్ని ఆదేశించాడు. తాతారీల దాడి మొదలైందో లేదో కోట బురుజుల పైనుండి వేలసంఖ్యలో రాళ్ళు,బాణాలు రయ్‌మంటూ తాతారీలపై వచ్చిపడ సాగాయి. కొన్ని క్షణాల్లోనే వేలాదిమంది తాతారీలు నేలకొరిగారు. దాంతో తౌలాయిఖాన్ బిత్తరపోయి సైన్యాన్ని వెనక్కి మళ్ళించి పట్టణానికి కొంచెందూరం వెళ్ళి ఆగిపోయాడు.

తాతారీలు అయిదు రోజులు పోరాడినా పట్టణాన్ని స్వాధీనం చేసుకోలేకపోయారు. సేనాపతి తౌలాయిఖాన్ సైనికశక్తితో ముస్లింలను ఓడించలేమని భావించి జిత్తులమారి తనానికి దిగాడు. తనతో చేతులు కలిపిన ముస్లింవిద్రోహుల్లో ఒకడ్ని రాయబారిగా చేసి నగరగవర్నర్ దగ్గరకు పంపాడు. తాము గవర్నర్‌ని కలుసుకొని కొన్ని విషయాల్లో సంతృప్తి కరమైన సమాధానాలు పొందిన తర్వాత పట్నం వదలి వెళ్ళిపోతామని చెప్పి పంపాడు.

తౌలాయిఖాన్ సందేశం విన్న కొందరు నగరపెద్దలు అతని దగ్గరకు గవర్నర్‌ని పంపడాన్ని వ్యతిరేకించారు. అయితే గవర్నర్ వారికి నచ్చజెబుతూ "తాతారీలు మహా అయితే నన్ను హతమారుస్తారు, అంతేగా. నేను తిరిగిరాకపోతే వారి దురుద్దేశం బయట పడుతుంది. జలాలుద్దీన్ సైన్యాలు ఇక్కడకు చేరుకునేదాకా తాతారీలతో నేను మంతనాలు జరపడానికి ప్రయత్నిస్తాను" అని అన్నాడు. ఆ తర్వాత అతను తౌలాయి దగ్గరకు వెళ్ళాడు. తౌలాయిఖాన్ అతడ్ని ఎంతో ఉత్సాహంతో స్వాగతించి గౌరవించాడు.

ఆ తరువాత అతను సంధి గురించి మాట్లాడుతూ "మీరు మా సేనల్ని వెంబడించరని వాగ్దానంచేస్తే , సుల్తాన్‌తో మా సంబంధాలు ఎలా వున్నా మరూ మీద మళ్ళీ దాడిచేయ మని మేము వాగ్దానం చేస్తాం. దీనికి ప్రతిఫలంగా మీరు మాకు మామూలు పరిహారం చెల్లించవలసి ఉంటుంది" అని అన్నాడు.

"అలాగే చెల్లిస్తాం. ప్రభుత్వధనాగారంలో పెద్ద మొత్తం లేనప్పటికీ ప్రజల నుండి వసూలుచేసయినా సరే నేను మీకు నిర్ణీత ధనం అందజేస్తాను."

"మీయీ నిర్ణయాన్ని మీ ప్రజలందరూ ఒప్పుకుంటారా?"

"తప్పకుండా. గవర్నర్‌గా నా ఆజ్ఞను వారు తప్పకుండా పాటిస్తారు."



"అది నిజమే కావచ్చు. కాని పరిహారం చెల్లించే బాధ్యతను మీరొక్కరే ఎందుకు నెత్తికెక్కించుకుంటారు? నగర ప్రముఖుల్ని కూడా ఇక్కడకు పిలిపించి వారి ముందు సంధిపత్రం రాసుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదుకదా! మీరు వాళ్ళను రమ్మని ఆదేశిస్తూ ఒక లేఖ రాసి పంపండి" అన్నాడు తౌలాయిఖాన్.

అప్పుడు గవర్నర్ పదిమంది పురప్రముఖుల పేర లేఖ రాసి పంపించాడు. గవర్నర్‌లేఖ చూడగానే ఆ పదిమంది పురప్రముఖులు ప్రజలు అభ్యంరం తెలిపినా ఖాతరుచేయకుండా తౌలాయిఖాన్ దగ్గరకు వెళ్ళిపోయారు. తౌలాయిఖాన్ వాళ్ళను కూడా స్వాగతించి ఎంతో గౌరవించాడు. అయితే పరిహారం సొమ్ము విషయంలో వారు "మా నగరవాసుల అభిప్రాయం తీసుకోకుండా మేము ఎలాంటి నిర్ణయం తీసుకోలేము" అని అన్నారు.

"అయితే ఓ పని చేయండి. మీరిప్పుడు వెళ్ళిపొండి, రేపు మళ్ళీ కలుసుకుందాం. రేపు మీరొచ్చేటప్పుడు ఇతర ప్రజాప్రతినిధుల్ని కూడా పిలుచుకువస్తే బాగుంటుంది. వారి అభిప్రాయం కూడా తీసుకొని సంధిపత్రం రాసుకోవచ్చు" అన్నాడు తౌలాయిఖాన్. ఆ తరువాత అతను గవర్నర్‌ని, అతని సహచారుల్ని గౌరవమర్యాదలతో పంపివేశాడు.

ఆరోజు రాత్రి నగరవాసులు, రేపు సంధిజరగ్గానే తాతారీలు వెళ్ళిపోతారన్న శుభవార్త విని పరమసంతోషంతో పండుగ జరుపుకున్నారు. కాని తాతారీల టక్కరిమాటలు ఎరిగిన శరణార్థులు నగరవాసులతో "తాతారీలు మీరు అనుకున్నంత తొందరగా వెళ్ళిపోరు. వారిపట్ల కాస్త అప్రమత్తంగా ఉండండి" అని హెచ్చరించారు. మరుసటి రోజు గవర్నర్ నలభై మంది పురప్రముఖుల్ని వెంటబెట్టుకొని తౌలాయిఖాన్ దగ్గరకు వెళ్ళాడు.

అప్పుడు తౌలాయిఖాన్ వారందరినీ రకరకాలుగా వేధించి, నగరంలోని ఇతర ప్రముఖవ్యక్తుల్ని కూడా లేఖలు రాసి ఇక్కడకు రప్పించాలని వత్తిడి చేశాడు. ఆవిధంగా మరో డెబ్బయి మంది పురప్రముఖులు తాతారీల స్థావరానికి చేరుకున్నారు. ఆరోజు సాయంత్రం తాతారీలు నగర గవర్నర్‌ని, నగర సేనాపతిని, మరో ముగ్గురు ఇతరుల్ని తప్ప మిగిలిన ప్రముఖులందరినీ క్రూరాతిక్రూరంగా హతమార్చారు.

ఆ తరువాత అదేరోజు రాత్రివేళ దాదాపు వంద మంది తాతారీలు గవర్నర్ సహచరుల దుస్తులు ధరించి గవర్నర్‌ని, సేనాపతిని, వారి సహచరులు ముగ్గురిని కత్తులతో బెదిరించి నగరం సమీపానికి తీసికెళ్ళారు. వారితో పాటు నగరవిద్రోహులు కూడా కొందరున్నారు. వారు గవర్నర్, సేనాపతులకు ఏభైఅరవై అడుగులు ముందు నడుస్తూ అరబీ, పార్సీ భాషల్లో బిగ్గరగా మాట్లాడుకో సాగారు. ఆవిధంగా వారు నగర ప్రధానద్వారం దగ్గరకు చేరుకొని, కోట బురుజులపై కూర్చున్న కాపలాదారులకు సంధి శుభవార్త చెబుతూ తలుపులు తెరవమని చెప్పారు.

కాపలాదారుల్లో ఒకతను బురుజు కన్నం గుండా వాళ్ళను ఓసారి చూసి తలుపులు తెరిచాడు. లోపల అనేకమంది నగరవాసులు గుమికూడి ఉన్నారు. తలుపులు తెరవగానే వారిలో ఒకతను బయటికి వస్తూ "మీరు చాలా ఆలస్యం చేశారు. సరే, ఏం వార్త తెచ్చారు? గవర్నర్ గారు ఏరి?" అని అడిగాడు.

తరువాత ఆ మనిషే అనుమానం వచ్చి చీకటిలో కళ్ళు చించుకొని చూస్తూ "ఎవరు మీరు? గవర్నర్‌గారు ఎక్కడున్నారు?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

నగరవిద్రోహుల్లో ఒకతను వచ్చి "ఆయన వెనుక వస్తున్నారు" అన్నాడు. అంతలో మరో అయిదారుగురు నగరవాసులు బయటికి వచ్చారు. గవర్నర్ పరుగెత్తుకుంటూ వచ్చి "తలుపులు మూసేసుకోండి. తాతారీలు వచ్చారు. తొందరగా..." అని అరిచాడు.

అంతలో ఒక తాతారీ సైనికుడి ఖడ్గం గవర్నర్ వీపు నుంచి పొట్ట బయటికి దూసుకు పోయింది. గవర్నర్ కుప్పకూలిపోయాడు. ఆ దృశ్యం చూడగానే మరో నాలుగైదు గొంతులు "తొందరగా తలుపులు మూసుకోండి, తాతారీల దాడి మొదలైంది" అని అరిచాయి. అంతే, అవే వారి చివరి పలుకులై పోయాయి. తాతారీలు వారిని కూడా మట్టుపెట్టారు. కాపలాదారులు చీకటిలో ఏం జరుగుతోందో త్వరగా తెలుసుకోలేక ముస్లిం దుస్తుల్లో ఉన్న ఓ తాతారీగుంపును లోపలికి రానిచ్చారు. ఆ తరువాత విషయం గ్రహించి ఆయుధాలు ఎక్కుపెట్టేలోగా తాతారీలు మరో ఏభై అరవై మంది ముస్లింలను హత మార్చారు. కాపలాదారులు వారిని అంతమొందించి తలుపులు మూసేయబోయారు. అంతలోనే అశ్వరూఢులైన తాతారీలు వేలాదిమంది కత్తులు ఝుళిపిస్తూ లోపలికి జొరబడ్డారు. దాంతో మరూవాసులపై ప్రళయం వచ్చిపడింది.

మరూ వీథులన్నీ తాతారీ సైనికులతో నిండిపోయాయి. వారు వీథుల్లో కన్పించిన జనాన్ని కడతేరుస్తూ తిరుగుతున్నారు. మరికొందరు ఇండ్లను తగల బెడ్తున్నారు. అగ్ని ప్రమాదం నుండి కాపాడుకోవడానికి ఇండ్ల నుండి బయటికి వచ్చేవారిని మట్టుబెడ్తున్నారు. స్త్రీలు, పిల్లలు ఏడ్పులు, పెడబొబ్బలు పెడ్తున్నారు. ఈ విధంగా అయిదు రోజుల పాటు ఈ ప్రళయం కొనసాగింది. అయినా తాతారీల రక్తదాహం తీరలేదు. ఆరవ రోజు నుంచి వారు హింసాకాండను మరింత ఉధృతం చేశారు.

తాతారీలు తమ విజయానికి చిహ్నంగా మరూ పట్టణంలో మానవ కపాలాలతో ఓ పెద్ద స్థూపం నిర్మించడం ప్రారంభించారు. దాని కోసం గత అయిదు రోజుల్లో హతమార్చ బడిన ప్రజల పుర్రెలు సరిపోలేదు. అందువల్ల వారు ఓ అగ్నిగుండం తయారుచేసి, అందులో ఇద్దరు ముగ్గురు చొప్పున కాళ్ళు చేతులు కట్టి విసిరిపడేయసాగారు. అంతేకాకుండా స్త్రీలను, పిల్లలను కూడా చిత్రహింసలు పెట్టి హతమార్చసాగారు. గర్భిణీస్త్రీల గర్భాలను ఈటెలతో పొడిచి పొడిచి ఆనందిస్తున్నారు.

ఒక తాతారీ సైనికుడు ముందుకొచ్చి ఓ పసివాడి తల మీద కాలుపెట్టి అదమడానికి ప్రయత్నించాడు. పిల్లవాడి తల్లి వెంటనే పిల్లవాడ్ని లాక్కొని అక్కున చేర్చుకుంది. దాంతో తాతారీ సైనికుడు రెచ్చిపోయి ఆ స్త్రీని పిల్లవాడితో సహా అగ్నిగుండలోకి నెట్టివేశాడు. మరో తాతారీసైనికుడు ఓ పదకొండేళ్ళ బాలికను అతిక్రూరంగా మానభంగం చేస్తుంటే ఆమె పదమూడేండ్ల సోదరుడు ఆ దారుణం చూడలేక ఆ దుర్మార్గుడిపై లంఘించి శాశ్వతంగా కడతేర్చాడు. ఆ తరువాత ఆ బాలుడ్ని తౌలాయిఖాన్ ముందు ప్రవేశపెట్టడం జరిగింది. తౌలాయిఖాన్ ఆ బాలుడి కళ్ళలోకి సూటిగా చూస్తూ "ఒక తాతారీ సైనికాధికారిని చంపినందుకు శిక్షేమిటో నీకు తెలుసా?" అని అడిగాడు.



బాలుడు ఎలాంటి అదురు బెదురు లేకుండా "తెలుసు. మీ న్యాయస్థానంలో దోషికీ, నిర్దోషికీ ఒకే శిక్ష విధిస్తారు" అని అన్నాడు.

"ఒకవేళ మేము నిన్ను మాతో పాటు తీసికెళ్తే నువ్వు పెద్దవాడయిన తరువాత సైనికుడు కావడం నీకిష్టమేనా?" అనడిగాడు తౌలాయిఖాన్.

"నువ్వు నీచుడవు. నేనీ ప్రదేశంలో చావడమే నాకిష్టం."

"కాని చావు అనేది ఎంతో బాధాకరమైన విషయం."

"అది పీడితునికి కాదు, దౌర్జన్యపరుడికి మాత్రమే బాధాకరమైన విషయం" అన్నాడు బాలుడు.

"ఈ కుర్రకుంకను నాముందు ఉరికంపం ఎక్కించండి" అని సైనికుల్ని ఆదేశించి "ఉరి ఎంత బాధాకరమైన విషయమో నీకు తెలుసా?" అన్నాడు తౌలాయిఖాన్ బాలుడితో.

"మీరు నన్ను ఉరి తీయవచ్చు కాని నా జాతిని ఉరి తీయలేరు. నా జాతితో జరిగే యుద్ధంలో మీ ఈటెలు విరిగిపోతాయి; మీ ఖడ్గాలు మొద్దుబారుతాయి; మీ రెక్కలు వేలాడిపోతాయి. మీరెంత ప్రయత్నించినా నాజాతిని తుడిచిపెట్టలేరు. నా జాతి నరనరాల్లో అమరగతి రక్తం ప్రవహిస్తూ ఉంటుంది" అన్నాడు బాలుడు జంకూగొంకూ లేకుండా.

ఆ తరువాత తౌలాయిఖాన్ ఆజ్ఞతో అతని సైనికులు ఆ బాలుడ్ని దారుణమైన చిత్రహింసలు పెట్టి చంపేశారు. అప్పుడు తౌలాయిఖాన్ తన సైనిక సలహాదారులతో మాట్లాడుతూ "ఏజాతి తల్లులు ఇలాంటి సాహసబాలల్ని కంటారో ఆ జాతి ప్రజలు ఎంతో కాలం బానిసలుగా ఉండలేరు. కనుక పిల్లలతో సహా నగరవాసులందరినీ వెతకి వెతకి హతమార్చండి" అని అన్నాడు.

ఈ ఆదేశంతో తాతారీ మూకలు విచ్చుకత్తులతో స్వైరవిహారం చేశారు. ప్రజల ఇండ్లలో జొరబడి వారిని బయటికీడ్చి మరీ చంపేశారు. వారు దాచుకున్న సిరిసంపదలన్నీ దోచు కున్నారు. నగరవిద్రోహులు ఇచ్చిన సమాచారం ప్రకారం తాతారీలు ధనికుల ఇండ్లలో జొరబడి వారిని రకరకాలుగా హింసించి వారు నేలలో పాతిపెట్టుకున్న ధనరాసుల్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత వారందరినీ క్రూరాతిక్రూరంగా హతమార్చారు.

ఈ దోపిడీలు, హత్యలు, మానభంగాల తర్వాత తాతారీలు మస్జిద్‌లకు, మదర్సాలకు నిప్పుపెట్టి నేలమట్టం చేశారు. వేలాది విలువైన గ్రంథాలు కాలి మసయిపోయాయి. నగరమంతా కుళ్ళిపోయిన మానవ కళేబరాలతో కంపుకొట్ట నారంభించింది. తాతారీలు ఆ దుర్వాసనకు తట్టుకోలేక భవననిర్మాణంలో, ఆయుధ తయారీలో నిష్ణాతులైన నాలుగొందల మంది సాంకేతిక నిపుణుల్ని, కొందరు అందమైన స్త్రీలను తీసుకొని మరూ నగరం వదలి వెళ్ళిపోయారు. మరూ నిజంగానే మరుభూమిగా మారిపోయింది.

**3-సుల్తాన్ జలాలుద్దీన్ వీరోచిత పోరాటం :-** సుల్తాన్ జలాలుద్దీన్ తన సైనికశక్తిని అంచనావేసుకొని చంగీజ్‌ఖాన్ మీద యుద్ధ ప్రకటన చేశాడు. అటు చంగీజ్‌ఖాన్ సుల్తాన్ జలాలుద్దీన్‌ని ఎదుర్కోడానికి భారీసైన్యం పంపించాడు. గజనీ నుండి కొన్నిమైళ్ళ దూరంలో

రెండు సైన్యాలు ఢీకొన్నాయి. మూడురోజుల పాటు హోరాహోరి యుద్ధం జరిగింది. చివరికి తాతారీ సేనలు చావుదెబ్బలు తిని పారిపోయాయి. సుల్తాన్ జలాలుద్దీన్ సేనలు సాధించిన ఘనవిజయం అఫ్గానిస్తాన్‌లో మారుమ్రోగింది. తాతారీల దౌర్జన్యాలకు భయపడి అణిగిపోయిన అనేకప్రాంతాల ముస్లింలు ఈ విజయంతో మళ్ళీ తలెత్తారు.

అయితే దురదృష్టవశాత్తు సమరసొత్తులో లభించిన ఒక అందమైన గుర్రం విషయంలో ఇద్దరు సేనాపతుల మధ్య తగాదా వచ్చింది. ఈ తగాదా చిలికి చిలికి గాలివానలా తయారవడం, దానిపై సుల్తాన్ ఇచ్చిన తీర్పు రుచించకపోవడంతో ఒకతను తన నలభై వేల సైన్యంతో సుల్తాన్‌ను వదలి ఇరాక్‌కు వెళ్ళిపోయాడు.

అయినా ఆ తర్వాత జరిగిన దాడులలో కూడా సుల్తాన్ సైన్యమే అనేక విజయాలు సాధించింది. అటు తాతారీలు సుల్తాన్‌ని పట్టుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. వారి సైనికసంఖ్య రోజురోజుకు పెరిగిపోవడంతో వారి ధాటికి ఆగలేక ముస్లింయోధులు మృత్యువాత పడుతున్నారు. సుల్తాన్ జలాలుద్దీన్ బగ్దాద్ ఖలీఫాకు తన స్నేహహస్తం అందజేస్తూ సైనికసహాయం కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి సుల్తాన్ జలాలుద్దీన్ కేవలం ఎనిమిదివేల సైనికులతో హోరాహోరీగా పోరాడుతూ తాతారీ సైన్యాలను వెనక్కి నెట్టి ఓ రోజు సింధూనదీ తీరాన ఓ కొండగుట్ట పైకి చేరుకున్నాడు.

సుల్తాన్ సైన్యాన్ని తాతారీలు మూడు వైపుల నుంచి చుట్టుముట్టి ఆకలిగొన్న పులుల్లా కాచుకొని ఉన్నారు. నాలుగో వైపు దాదాపు ముప్పయి అడుగుల దిగువ భాగాన సింధూ నది ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలతో ఉధృతంగా ప్రవహిస్తోంది. సుల్తాన్ సైన్యం చుట్టూ తాతారీల దిగ్బంధం క్షణక్షణానికి బిగుసుకుపోసాగింది.

ముస్లింయోధులు ప్రాణాలకు తెగించి ఎంత వీరోచితంగా పోరాడుతున్నా భారీఎత్తు సంఖ్యలో ఉప్పెనలా విరుచుకుపడిన తాతారీల ధాటికి ముస్లిం యోధులు నిలువలేక ఒక్కొక్కరే నేలకొరిగిపోతున్నారు.మూడు వైపుల నుంచి చుట్టుముట్టిన తాతారీలతో పోరాడి చావడమో, చంపడమో తప్ప మరోమార్గం లేకపోయింది వారికి. నాల్గో వైపు సింధూ నది అడ్డం ఉంది. ఇలా వారి పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారయింది.

సుల్తాన్ యుద్ధకవచం తీసిపారేసి, శిరస్త్రాణం చేతిలో పట్టుకొని గుర్రాన్ని ముందుకు అదిలించాడు. ఓ క్షణం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న అలలను చూసి, 'అల్లాహు అక్బర్' అంటూ గుర్రంతో సహా నదిలోకి దూకాడు. మిగిలిన యోధులు కూడా అతడ్ని అనుసరించారు. ముస్లింలు గుర్రాలతో సహా నదిలోకి దూకడంతో తాతారీలు తమ బాణాలను నది మీదికి ఎక్కుపెట్టారు. పైనుంచి వచ్చిపడుతున్న బాణాల దెబ్బలకు, ఇటు ఉధృతంగా ప్రవహిస్తున్న నదివేగానికి అనేకమంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. కొద్దిమంది మాత్రమే నది ఆవలకు క్షేమంగా చేరుకోగలిగారు.

అందరికంటే ముందు సుల్తాన్ ఒడ్డుకు చేరుకొని, తడిసిన బట్టలు విప్పి ఆరేసుకోవడానికి చెట్లమీద వేసుకున్నాడు. ఈటెను నేలలో పాతి దాని మొనపై శిరస్త్రాణం పెట్టాడు. తర్వాత ఓ రాతిబండపై కూర్చొని ఊపిరి పీల్చుకోసాగాడు. నది ఆవల నిల్చున్న చంగీజ్‌ఖాన్ అతని ధైర్యసాహసాలు చూసి ఎంతో ఆశ్చర్యపోతూ "ఇలాంటి మనిషి బ్రతికుంటే యావత్తు



తాతారీ-మొగల్ తెగలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టే ప్రమాదముంది. కనుక ఎలాగైనా ఇతడ్ని హతమార్చివేయాలి" అని భావించాడు. అతని సైనికులు సుల్తాన్‌ని సజీవంగా పట్టుకోవడానికి నదిలోకి దూకేందుకు ప్రయత్నించారు. కాని నది ఉగ్రరూపం చూసి భయపడి వెళ్ళిపోయారు. ఈ సంఘటన హి.శ. 620లో జరిగింది.

సుల్తాన్ జలాలుద్దీన్‌తో పాటు దాదాపు ఏడు వందల మంది సైనికులు క్షేమంగా నది ఒడ్డుకు చేరుకోగలిగారు. అయితే చంగీజ్‌ఖాన్ నది దిగువ భాగాన పది పన్నెండు మైళ్ళు నడచి అక్కడ కొన్ని పడవలు సేకరించాడు. ఆ పడవలలో మంచి అనుభవశాలురైన సైనికుల్ని పంపి సుల్తన్‌ని వెంబడించమని ఆజ్ఞాపించాడు.

తాతారీ సైనికులు పడవలలో నది దాటి ఆవలకు చేరుకున్నారు. అయితే సుల్తాన్ అప్పటికే అక్కడ్నుంచి ఎంతో దూరం ముందుకు వెళ్ళాడు. అంతకుముందు తాతారీల దాడితో ఎటుబడితే అటు పారిపోయిన అనేకమంది యోధులు ఇప్పుడు మళ్ళీ సుల్తాన్ దగ్గరకు చేరుకున్నారు. ఈవిధంగా సుల్తాన్ సైనికంగా కొంతవరకు కోలుకున్నాడు.

అయితే కొన్నాళ్ళ తర్వాత తాతారీలు నదిదాటి తనను వెంబడిస్తున్నారని తెలిసి ఢిల్లీకి పయనమయ్యాడు. తాతారీలు కొత్తప్రాంతంలో ఎదురైన అసాధారణమైన వేడి వాతావరణాన్ని తట్టుకోలేక సుల్తాన్‌ని ఎక్కువ దూరం వెంబడించలేకపోయారు. వారు ముల్తాన్, లాహోర్, షాపూర్ వగైరా కొన్ని ప్రాంతాల్లో విధ్వంసకాండ జరిపి, దొరికినంత దోచుకొని వెనక్కి వెళ్ళిపోయారు.

తిరుగు ప్రయాణంలో చంగీజ్‌ఖాన్ పెషావర్‌పై దాడిచేసి దాన్ని సర్వనాశనం చేశాడు. అక్కడ ఒక సైన్యాధికారి రక్షణలో ఉన్న సుల్తాన్ భార్యాపిల్లల్ని కూడా తాతారీలు పొట్టన బెట్టుకున్నారు. ఆ తర్వాత అఫ్గానిస్తాన్‌లోని మిగిలిన ప్రాంతాలను కూడా సర్వనాశనంచేస్తూ, జనాన్ని ఊచకోత కోస్తూ సమర్‌ఖంద్ దిశగా వెళ్ళిపోయారు తాతారీలు.

సుల్తాన్ జలాలుద్దీన్ తాతారీల బారినుండి బయటపడిన తరువాత సింధ్‌లో అతనికి వేలాదిమంది ఆత్మాహుతి యోధులు లభించారు. వారి సహకారంతో అనేక విజయాలు సాధించాడు. అతడ్ని బంధించడానికి బగ్దాద్ నుండి ఇద్దరు సేనాపతుల నాయకత్వంలో రెండుసైన్యాలు వచ్చాయి. సుల్తాన్ జలాలుద్దీన్ ఆ రెండు సైన్యాలను కూడా తరిమి కొట్టాడు. ఆ తర్వాత తబ్రేజ్‌ని ఆక్రమించుకొని, దాని చట్టుప్రక్కల ఉన్న అనేక ప్రాంతాలను తిరిగి వశపరచుకున్నాడు. ఈలోగా బగ్దాద్‌ఖలీఫా నాసిరుద్దీన్ (హి.శ.622లో) చనిపోయాడని, అతని స్థానంలో అతనికొడుకు జాహిర్ ఖలీఫా అయ్యాడని సమాచారం అందింది. అప్పుడు జలాలుద్దీన్ కొత్త ఖలీఫాకు ముంచుకొస్తున్న తాతారీల ప్రమాదం గురించి వివరించి సహాయం కోరడానికి బగ్దాద్ దిశగా బయలుదేరాడు.

అయితే సంవత్సరం తిరక్క ముందే హి.శ. 623లో జాహిర్‌షా కూడా చనిపోయి అతని కొడుకు ముస్తన్సర్ బగ్దాద్ ఖలీఫా అయ్యాడని తెలిసింది. సుల్తాన్ జలాలుద్దీన్ ఎన్నో ఆశలు పెట్టుకొని బగ్దాద్ సమీపానికి చేరుకున్నాడు. కాని బగ్దాద్ సైనికులు కత్తులు దూస్తూ వచ్చి అతనికి ఎదురుగా నిలబడ్డారు. దాంతో జలాలుద్దీన్ నిరుత్సాహపడ్డాడు. బగ్దాద్‌ఖలీఫాకు తనతండ్రి మీదున్న కసి ఇంకా తగ్గలేదని భావించి అతని సైన్యంతో

ఢీకొని తరిమేసి తబ్రేజ్‌కు తిరిగొచ్చాడు. తబ్రేజ్‌కు చేరుకోగానే తాతారీలు 'రే' వైపు పురోగమిస్తున్నారని తెలిసింది. అంచేత సుల్తాన్ జలాలుద్దీన్ సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి 'రే' ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ తాతారీసైన్యంతో తీవ్రంగా పోరాడాడు. కాని సుల్తాన్ తాతారీసైన్యం తన సైన్యం కంటే పదిరెట్లు అధికంగా ఉన్నందున దాన్ని ప్రతిఘటించలేక తీవ్రంగా పోరాడుతూనే తాతారీల దిగ్బంధం నుండి తప్పించుకొని పారిపోయాడు.

**4-ఇస్లాం గురించి చంగీజ్‌ఖాన్ పరిశోధన :-** చంగీజ్‌ఖాన్ ఏడేండ్ల యుద్ధకార్యకలాపాల తర్వాత హి.శ. 621లో స్వదేశం మగూలిస్తాన్‌కు తిరిగి చేరుకున్నాడు. తిరుగుప్రయాణం చేస్తూ దారిలో బుఖారా పట్టణంలో ఆగి "ముస్లింలలో ఇస్లాం గురించి అందరికంటే బాగా తెలిసిన పండితుడ్ని నా దగ్గరకు పిలుచుకురండి; నేనతడ్ని అడిగి అతని మతం గురించి వాస్తవం తెలుసుకోదలిచాను" అని అన్నాడు. వెంటనే అతని సహచరులు న్యాయమూర్తి ఖాజీ అష్రఫ్‌ను, ఓ సుప్రసిద్ధ ధర్మవేత్తను ఖాన్ దర్బారులో ప్రవేశపెట్టారు.

చంగీజ్‌ఖాన్ ఇస్లాం వాస్తవికతను గురించి అడిగినపుడు వారిద్దరు ధర్మవేత్తలు ముందుగా ఏకదైవారాధన విశ్వాసం గురించి వివరంగా తెలియజేశారు. చంగీజ్‌ఖాన్ దేవుని ఏకత్వం గురించి విని నేనీ విశ్వాసాన్ని అంగీకరిస్తున్నాను అన్నాడు. తరువాత ఆ ధర్మవేత్తలు దైవదౌత్యం (ప్రవక్తృత్వం) గురించి వివరించారు. చంగీజ్‌ఖాన్ అది విని "దేవుడు తన దాసులను సన్మార్గాన నడిపించడానికి ప్రపంచంలోకి తన దూతలను, ప్రతినిధుల్ని పంపుతాడనే విశ్వాసాన్ని కూడా నేను అంగీకరిస్తున్నాను" అని అన్నాడు. ఆ తరువాత ధర్మవేత్తలు రోజా ఐదుపూటల నమాజ్, రమజాన్ ఉపవాసాల విధుల్ని గురించి తెలియజేశారు. దానిపై చంగీజ్‌ఖాన్ "నిర్ణీత వేళల్లో దేవుడ్ని ఆరాధించడం, పదకొండు నెలల తరువాత ఒకనెల ఉపవాసం పాటించడం కూడా సమంజసమైన విషయాలే" అని అన్నాడు. ఆ తరువాత ధర్మవేత్తలు హజ్‌యాత్ర విధి గురించి ప్రస్తావించారు. దానికి చంగీజ్‌ఖాన్ "దాని అవసరాన్ని నేను అంగీకరించను" అన్నాడు.

ఈ సంభాషణ తర్వాత ఆ ధర్మవేత్తలు ఖాన్ దర్బారు నుండి వెళ్ళిపోయారు. దారిలో ఖాజీ అష్రఫ్ మాట్లాడుతూ "చంగీజ్‌ఖాన్ ముస్లిం అయ్యాడ"ని అన్నాడు. కాని రెండవ ధర్మవేత్త అతని అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ "లేదు, అతను ముస్లిం కాలేదు. అతను హజ్ విధిని నిరాకరించాడు. కనుక అతడ్ని ముస్లింగా పరిగణించలేము" అని అన్నాడు. చంగీజ్‌ఖాన్ ఇస్లాం గురించి తెలుసుకున్న తరువాత సమర్‌ఖంద్ చేరుకొని అక్కడి ముస్లింలపై వరాలవర్షం కురిపించి వెళ్ళిపోయాడు. "నెత్తుటి ఏరులు ప్రవహింపజేసి, లక్షలమంది అమాయకుల్ని పొట్టనబెట్టుకున్న ఆ చంగీజ్‌ఖానేనా ఈ మానవుడు!" అంటూ నగరవాసులు సంభ్రమాశ్చర్యాలతో కొయ్యబారి పోయారు.

**5-నిరాశానిస్పృహల్లో జలాలుద్దీన్ :-** సుల్తాన్ జలాలుద్దీన్ తమ దిగ్బంధం నుండి తప్పించుకొని పారిపోయినా తాతారీలు అతడ్ని వదలిపెట్టలేదు. వారు సుల్తాన్‌ని వెంబడిస్తూ గోబీఎడారి దాకా వెళ్ళారు. అప్పుడు వారి అధినాయకుడు చంగీజ్‌ఖాన్ చనిపోయాడని తెలిసింది. దాంతో తాతారీ యువరాజులు, సేనాపతులు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. దాంతో సుల్తాన్ జలాలుద్దీన్ కాస్తంత ఊపిరి పీల్చుకొని తబ్రేజ్‌కు తిరిగి చేరుకున్నాడు.



కొన్నాళ్ళ తరువాత తాతారీ సైన్యాలు మళ్ళీ సుల్తాన్ జలాలుద్దీన్‌ని వెంబడిస్తూ అస్ఫిహాన్‌కు చేరుకున్నారు. ఈ సమాచారం అందగానే సుల్తాన్ కూడా అస్ఫిహాన్‌కు చేరుకొని తాతారీలను ఢీకొని వారిని తరిమికొట్టాడు. తాతారీలు అప్పుడు అపజయం పాలైనప్పటికీ చేతులు ముడుచుకొని కూర్చోలేదు. కొన్నాళ్ళ తరువాత వారు భారీఎత్తు సైన్యంతో బయలుదేరారు. సుల్తాన్ జలాలుద్దీన్ ఈ సంగతి తెలుసుకొని తన ప్రతినిధుల ద్వారా బగ్దాద్‌ఖలీఫాతో పాటు వివిధ ముస్లిందేశాల పాలకులకు సైనికసహాయం కోరుతూ లేఖలు పంపాడు. వాటికి సమాధానాలు వచ్చే వరకూ తాతారీలను ప్రతిఘటిస్తూ తీవ్రంగా పోరాడుతూనే ఉన్నాడు. ముస్లింయోధులు నేలకొరిగిపోతూనే ఉన్నారు. కాని ఏ ఒక్క దేశాధినేత నుండి కూడా సుల్తాన్ జలాలుద్దీన్‌కు సహాయం అందలేదు. దాంతో సుల్తాన్ జలాలుద్దీన్ పూర్తిగా నిరాశచెంది ప్రతినిధులతో ఇలా అన్నాడు:

"నాకు తెలుసు ఇలా జరుగుతుందని. కాని శృతిమించిన నిరాశ మనిషిని ఆత్మవంచన వైపుకు తీసికెళ్తుంది. నేనసలు ఎడారిలో మంచినీళ్ళు తాగడానికి ప్రయత్నించాను. సరే, మన సైనికులందరి ముందూ ఈ లేఖ చదివి విన్పించండి. ఆ తర్వాత ఇండ్లకు తిరిగి వెళ్ళిపోదలచిన వారు నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చని చెప్పండి. నేను శక్తియుక్తులకు వ్యతిరేకంగా పోరాడగలను. నిరాశానిశ్పృహలకు వ్యతిరేకంగా కూడా పోరాడగలను. కాని దైవనిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడలేను. స్వయంగా మన జాతే ఏమరుపాటు నిద్ర నుండి మేల్కోదలచకపోతే నేనేం చేయగల్గుతాను? విధి కూడా వారిని బలవంతంగా ఎందుకు లేపి నిలబెడ్తుంది? విధినిర్ణయం ఎలా ఉందో అలాగే జరుగుతుంది. విధి ఎవరి కోసమూ తన నిర్ణయాన్ని మార్చుకోదు"

కొన్నాళ్ళ తరువాత సుల్తాన్ తన కొద్దిపాటి సైన్యం తీసుకొని ఆజర్ బాయ్‌జాన్ ప్రాంతంలోని ఓ పర్వత కోటకు చేరుకొని ఉండసాగాడు. తాతారీ సేనలు అతడ్ని వెంబడిస్తూ టెహ్రాన్ దాకా వచ్చేశారు. కాని అక్కడి పర్వతాలపై తీవ్రమైన చలితో కూడిన మంచు కురుస్తుండటం వల్ల తాతారీలు ముందుకు పురోగమించలేక పోయారు. సుల్తాన్‌తో పాటు వచ్చిన సైనికుల్లో అనేకమంది ఒక్కొక్కరే అతడ్ని వదలేసి వెళ్ళిపోయారు. దాదాపు నూటయాభై మంది మాత్రమే అతని దగ్గర ఉండిపోయారు. సుల్తాన్ ఇప్పుడు ప్రపంచ వ్యవహారాలతో విసుగెత్తిపోయి తన అత్యధిక సమయాన్ని ఒంటరిగా గడుపుతున్నాడు.

ఇలా సుల్తాన్ జలాలుద్దీన్ కొన్నాళ్ళు ఒంటరి జీవితం గడిపి ఓరోజు తీవ్రంగా మంచు కురుస్తున్నా ఖాతరు చేయకుండా గుర్రమెక్కి ముందుకుసాగాడు. క్షణంలో గుర్రం మంచు తుఫాన్‌లో దూసుకుపోయి కనుమరుగైపోయింది. ఆ తర్వాత ఆయన ఎక్కడికి పోయాడో, ఏ స్థితిలో ఉన్నాడో ఎవరికీ తెలియదు. అనేక సంవత్సరాలు గడచినా ఆయన జాడలేదు.

**6-ముస్లింల పట్ల చంగీజ్‌ఖాన్ వారసుల వైఖరి :-** చంగీజ్‌ఖాన్ హి.శ. 624లో చనిపోయిన తరువాత అతని స్థానంలో అతని పెద్దకొడుకు ఔక్తాయీఖాన్ చక్రవర్తి అయ్యాడు. అతను అధికార పీఠం అధిరోహించగానే ప్రజాసంక్షేమ కార్యాలపై ప్రత్యేక దృష్టి సారించాడు. ఔక్తాయిఖాన్ సౌశీల్యుడు, జనహితాభిలాషి, ముఖ్యంగా ముస్లింల పట్ల సానుభూతి కలవాడు, ఎల్లప్పుడూ వారి సుఖసంతోషాలు కోరుకునేవాడు.

మొగల్ రాజ్యాంగం ప్రకారం నీటిలో మునిగి స్నానం చేయడం ఘోరపాపం (నేరం). ఒకసారి ఔక్తాయిఖాన్, అతని తమ్ముడు చుగ్తాయిఖాన్ కలసి ఎక్కడికో వెళ్తూ నదిలో ఒక ముస్లిం స్నానం చేస్తుండటం చూశారు. వెంటనే చుగ్తాయిఖాన్ అతడ్ని హతమార్చే ఆదేశం జారీచేశాడు. ఔక్తాయిఖాన్ "అతడ్ని పట్టుకొని ప్రజాసమూహంలో చంపడం జరుగుతుంది" అని అన్నాడు. తరువాత అతను చుగ్తాయిఖాన్ నుండి వేరైపోయి ఒంటరిగా ఆ ముస్లిం ఖైదీని కలుసుకొని ఇలా చెప్పాడు: "నీ దగ్గర బంగారునాణాల సంచి ఉందని, దొంగల భయంతో నేను దాన్ని దాచడానికి నదిలో దిగానని చెప్పు." జనాన్ని సమీకరించి ఆ ముస్లింని వారిముందు ప్రవేశపెట్టినపుడు అతను ఔక్తాయిఖాన్ వివరించినట్లే చెప్పాడు. ఈమాట విన్న తరువాత ఆ బంగారునాణాల సంచిని వెతకడానికి కొందరిని నది దగ్గరకు పంపడం జరిగింది. ఔక్తాయిఖాన్ అంతకుముందే నదిలో ఓ బంగారునాణాల సంచిని రహస్యంగా పెట్టించాడు. అంచేత నదిలో వెతగ్గానే ఆ సంచి వారికి దొరికింది. ఈవిధంగా ముస్లింఖైదీ చెప్పిన మాట నిజమని తేలింది. అప్పుడు ఔక్తాయిఖాన్ ఆ ముస్లింకు ఆ వరహాల సంచినే గాకుండా బహుమానంగా అలాంటి మరికొన్ని సంచులు కూడా ఇచ్చి అతడ్ని విడుదల చేశాడు.

మరొకసారి ఒక వ్యక్తి ఔక్తాయిఖాన్ దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు: "నేను రాత్రి ఒక కల గన్నాను. ఆ కలలో నాకు చంగీజ్‌ఖాన్ కన్పించి 'ప్రపంచంలో ముస్లింలందరినీ నామరూపాల్లేకుండా తుడిచిపెట్టాలని, ఈ పనిలో ఏమాత్రం అశ్రద్ధ చేయకూడదని, ఈ విషయం నా కొడుకు ఔక్తాయిఖాన్‌కు తెలియజెయ్యాలని' నన్నాదేశించాడు. ఔక్తాయిఖాన్ ఈమాట విని "నీకు మొగల్ భాష తెలుసా?" అని అడిగాడు. అతను తెలియదన్నాడు. అప్పుడు ఔక్తాయిఖాన్ ఆ వ్యక్తి వైపు ఉరిమిచూస్తూ "చంగీజ్‌ఖాన్‌కు మొగల్ భాష తప్ప మరే భాషా తెలియదు. పార్శీభాష అసలే తెలియదు. మరి నువ్వు ఆయన భాషను ఎలా అర్థంచేసుకున్నావు?" అని నిలదీశాడు. ఈమాటలు విని ఆ పార్శీవ్యక్తి బిక్కమొగం వేసుకున్నాడు. వెంటనే ఔక్తాయిఖాన్ తన సేవకులతో "పేరూఊరూ లేని ఈ వెధవ చంగీజ్‌ఖాన్ మీదే అపనింద మోపుతున్నాడు. ఇతడ్ని తక్షణమే ఉరితీయండి" అని అన్నాడు. సేవకులు అప్పటికప్పుడు అతడ్ని ఈడ్చుకెళ్ళి ఉరికంబం మీద వ్రేలాడదీశారు.

చంగీజ్‌ఖాన్ కాలంలో ప్రపంచదేశాల నుండి లూటీచేసి తీసుకురాబడిన వజ్రవైఢూర్యాలతో పాటు భారీఎత్తు సిరిసంపదలతో రాజధాని ఖరాఖోరమ్ కిటకిటలాడుతుండేది. ఇప్పుడు ఔక్తాయిఖాన్ పాలనలో అతని దయార్ద్ర హృదయం, దాతృత్వాలు వాటిని తరగదీయసాగాయి. ఖురాసాన్ నుండి సిరియా వరకున్న దేశాల ప్రజలు అతని దాతృత్వ కథలు విని ఖరాఖోరమ్‌కు చేరుకొని మోయగలిగినంత ఐశ్వర్యంతో తిరిగివెళ్ళిపోసాగారు. తండ్రి హింసాదౌర్జన్యాలతో కూడబెట్టిన సంపదను తనయుడు దాన్ని విశాలహృదయంతో ప్రజలకు దానం చేశాడు. తత్ఫలితంగా మొదట్లో మొగల్-తాతారీల హింసాదౌర్జన్యాలతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇప్పుడు ఔక్తాయిఖాన్ దయాగుణం, దాతృత్వాల కారణంగా అతడ్ని అభిమానించడం ప్రారంభించారు. చంగీజ్‌ఖాన్ మొగల్ సామ్రాజ్యానికి పునాదులు వేసిన వ్యవస్థాపడయితే, ఔక్తాయిఖాన్ ఆ పునాదుల్ని పటిష్ఠపరచిన గొప్ప మొగల్ చక్రవర్తిగా ప్రసిద్ధిచెందాడు.



ఔక్తాయిఖాన్ చనిపోయిన తర్వాత అతని కొడుకు (చంగీజ్‌ఖాన్ మనవడు) కీవక్‌ఖాన్ అధికార పగ్గాలు చేపట్టాడు. అతని పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనడానికి వివిధ దేశాల అధినేతలను ఆహ్వానించడం జరిగింది. కనుక ఈరాన్, ఖురాసాన్, రోమ్, బగ్దాద్, సిరియా వగైరా దేశాల నుండి ప్రతినిధులు వచ్చారు. ఐరోపా క్రైస్తవరాజుల ప్రతినిధులు కూడా వచ్చారు. ముస్లిం ప్రతినిధుల విడిది కోసం రెండువేల శిబిరాలు వేయబడ్డాయి. ఆ తరువాత సమావేశం ప్రారంభమయింది. ఖాన్ బంధువులందరూ చక్రవర్తిగా కీవక్‌ఖాన్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అప్పుడు కీవక్‌ఖాన్ సోదరకుమారుడు మన్కూఖాన్ కీవక్‌ఖాన్ చేయి పట్టుకొని సింహాసనంపై కూర్చోబెట్టి అతని శిరస్సుకు రాజకిరీటం ధరింపజేశాడు.

కీవక్‌ఖాన్ భార్య క్రైస్తవమహిళ. అంచేత ఐరోపా క్రైస్తవ ప్రతినిధుల్ని బాగా సత్కరించడం జరిగింది. పిలవని పేరంటానికి వచ్చిన మతభ్రష్ట ప్రతినిధుల్ని అవమానకరంగా సభ నుండి బహిష్కరించడం జరిగింది. ముస్లిం ప్రతినిధుల్ని కూడా బాగా సత్కరించడం జరిగింది. కాని క్రైస్తవ ప్రతినిధులకు అది నచ్చలేదు. వారు కీవక్‌ఖాన్‌కు ముస్లింలను గురించి లేనిపోని పితుర్లు చెప్పి ఓరోజు ఎలాగో నచ్చజెప్పి, ప్రపంచ ముస్లింలందరినీ హతమార్చి వారిని నామరూపాల్లేకుండా తుడిచిపెట్టే విషయమై అతని నుండి ఒక ఉత్తర్వు సంపాదించారు. కీవక్‌ఖాన్ వారి మాటలగారడికి గురయి ముస్లింల సామూహిక హత్య గురించి ప్రకటనచేసి బయటికి వచ్చాడు. అంతే, అతని వేటకుక్కలే ఒక్కసారిగా అతనిపై విజృంభించి అతడ్ని తీవ్రంగా గాయపరిచాయి. ఈ సంఘటన తరువాత క్రైస్తవులు ముస్లిం వ్యతిరేకత గురించి నోరువిప్పడానికే సాహసించేవారు కాదు. ఆ తర్వాత కొన్నాళ్ళకు కీవక్‌ఖాన్ సమర్‌ఖంద్ వెళ్ళి ఆ గాయాలతోనే చనిపోయాడు.

కీవక్‌ఖాన్ మరణానంతరం మన్కూఖాన్ చక్రవర్తి అయ్యాడు. మన్కూఖాన్ కూడా ముస్లింల శ్రేయోభిలాషే. అతను ఏడేళ్ళు పాలించి హి.శ. 655లో చనిపోయాడు. అతని స్థానంలో అతని సోదరుడు ఖువైలాఖాన్ చక్రవర్తి అయ్యాడు. ఖువైలాఖాన్ సింహాసనం ఎక్కగానే తమ్ముడు హలాకూఖాన్‌కు జీహూన్ నది నుండి సిరియా దేశం వరకుగల ప్రాంతం పాలన, రక్షణ బాధ్యతలను అప్పగించాడు.

అంతకుముందు ఖువైలాఖాన్ సోదరుడు అర్తఖ్‌బోఖా తిరుగుబాటు చేసి కేంద్రీయ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించినపుడు ఇద్దరు అన్నదమ్ముల మధ్య నాలుగేళ్ళపాటు యుద్ధం జరిగింది. చివరికి అర్తఖ్‌బోఖా ఓడి జైలుపాలై, జైల్లోనే చనిపోయాడు. అయితే అతని తిరుగుబాటు ప్రభావం ఇతర యువరాజులు, సేనాపతులపై పడి క్రమంగా వారిలో చాలామంది తమతమ అధీనంలోని ప్రాంతాలకు స్వతంత్ర పాలకులైపోయారు. ఫలితంగా మొగల్ కేంద్రీయ ప్రభుత్వం, ఖరాఖోరం దర్బార్ గత ప్రాభవాన్ని కోల్పోయాయి. అయితే ఖువైలాఖాన్ చైనాపై కొన్నేళ్ళు దాడులు జరిపి మొత్తం దేశాన్ని వశపరచుకున్నాడు. ఆ తర్వాత చైనాలో ఖాన్‌బాలీగ్ పేరుతో ఓ కొత్త పట్టణాన్ని నెలకొల్పి రాజధాని ఖరాఖోరం నుంచి ఈ కొత్తపట్టణం ఖాన్‌బాలిగ్‌కు మార్చాడు. మరోవైపు చంగీజ్‌ఖాన్ కుటుంబంలోని అనేకమంది యువరాజులు, నాయకులు ఇస్లాం స్వీకరించారు. ఈవిధంగా మొగల్‌ప్రజల్లో ఇస్లాం వ్యాపించడం ప్రారంభమయింది.

**7-యూదులు, క్రైస్తవుల ఇస్లాంవ్యతిరేక కుట్రలు :-** ఖువైలాఖాన్ వివిధ మతాలు, జాతుల వ్యవహారాల నిర్వహణ కోసం నలుగురు మంత్రులను నియమించాడు. వారిలో ముస్లింల తరపున అమీర్‌అహ్మద్ బనాకతి కూడా ఉన్నాడు. ఖువైలాఖాన్ సామ్రాజ్యం చైనా నుండి ఐరోపా వరకు విస్తరించింది. ముస్లిం సామ్రాజ్యం చాలా బలహీనంగా ఉంది. అందువల్ల యూదులు, క్రైస్తవులు, అగ్నిపూజారులు మొగల్‌రాజుల కొలువుల్లో ప్రవేశం సంపాదించి వారిలో ఇస్లాం పట్ల, ముస్లింల పట్ల వెగటు, వ్యతిరేకతలు కలిగించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఒకసారి హలాకూఖాన్ కొడుకు అబాఖాన్ ఖురాసాన్ నుండి ఖువైలాఖాన్ దగ్గరకు ఒక లేఖ పంపాడు. అందులో ఇలా ఉంది:

"ముస్లింల మతగ్రంథం ఖుర్‌ఆన్‌లో 'బహుదైవారాధకులను ఎక్కడ ఎదురైతే అక్కడ వధించండి' (9:5) అని ఉందని నాకు యూదులు, అగ్నిపూజారులు చెప్పారు. దాన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటీ? ముస్లింల విశ్వాసం అదే అయితే ప్రపంచంలో వారి ఉనికి మనకు ఎప్పటికైనా ప్రమాదం తెచ్చిపెడ్తుంది."

ఖువైలాఖాన్ ఈ లేఖ చదివిన తర్వాత దగ్గర్లో ఉన్న కొందరు ముస్లిం పండితులను పిలిపించి "ఖుర్‌ఆన్‌లో ఇలాంటి ఆదేశం ఉందా?" అని ప్రశ్నించాడు. దానికి వారు ఉందని చెప్పారు. "అయితే మీరు మమ్మల్ని ఎందుకు చంపడం లేదు?" అని అడిగాడు ఖువైలాఖాన్. దానికి వారు "ఇప్పుడు మాకంతటి శక్తి లేదు. శక్తి సమకూరినప్పుడు మేము మిమ్మల్ని హతమారుస్తాం" అని చెప్పారు. ఖువైలాఖాన్ ఈమాట విని "మాకా శక్తి ఉంది కనుక మేము మిమ్మల్ని హతమారుస్తాం" అని చెప్పి వెంటనే ఆ పండితుల్ని వధింపజేశాడు. ఆ తరువాత "ముస్లింలు ఎక్కడ కన్పిస్తే అక్కడ చంపేయండి వారిని" అని ఉత్తర్వు జారీచేశాడు.

బద్రుద్దీన్ బైహఖి, హమీదుద్దీన్ సమర్‌ఖంది అనే ఇద్దరు సుప్రసిద్ధ ధర్మవేత్తలు ఈ ఉత్తర్వుసంగతి వినగానే ఖువైలాఖాన్‌ని కలుసుకొని "మీరు ముస్లింల సామూహికవధ గురించిన ఉత్తర్వు ఎందుకు జారీచేశారు?" అనడిగారు. దానికి ఖువైలాఖాన్ "ఫఖ్తులుల్ ముష్రికీన్ అర్థం ఏమిటీ?" అని ప్రశ్నించాడు. ఆ ధర్మవేత్తలు ఈమాట విని "ఈసూక్తి (శాంతి ఒడంబడిక ఉల్లంఘించిన) అరబ్ బహుదైవారాధకుల విషయంలో అవతరించింది. వారు ఎల్లప్పుడూ ముస్లింలను హతమార్చే ప్రయత్నంలో ఉండేవారు. అంచేత ముస్లింలు ఆత్మరక్షణ కోసం (రణరంగంలో) ఆ బహుదైవారాధకులు ఎక్కడ ఎదురైతే అక్కడ వారిని హతమార్చాలని దేవుడు ముస్లింలను ఆదేశించాడు. ఈ ఆదేశం మీకోసం కాదు. అదీగాక మీరు ఏకదైవారాధనా అనుకూలురు. మీరు జారీచేసే ప్రతి ఫర్మానా పై భాగంలో ఏకేశ్వరుని పేరు రాస్తారు" అని తెలియజేశారు. ఖువైలాఖాన్ ఈ వివరణ వినగానే ముస్లింల సామూహికవధ ఉత్తర్వు రద్దు చేసినట్లు మరొక ఉత్తర్వు జారీచేశాడు.

ఖువైలాఖాన్ 35 ఏళ్ళ పాలన తర్వాత చనిపోయాడు. అప్పుడు అతని మనవడు తైమూర్‌ఖాన్ చైనాలో అధికారపీఠం ఎక్కాడు. అతని కాలంలో పాలనావ్యవస్థ చాలావరకు కుప్పకూలిపోయింది. ఖురాసాన్, ఈరాన్‌లను పాలిస్తున్న (చంగీజ్‌ఖాన్ మనమడు) హలాకూఖాన్ బగ్దాద్ ఖలీఫా బలహీనతను గమనించి బగ్దాద్ వైపు దృష్టిసారించాడు.



అటు బగ్దాద్‌లో ప్రధాని అల్ఖమీ దుష్టచర్యల కారణంగా సైనికవ్యవస్థ అస్తవ్యస్థమయింది. ఆ తర్వాత పచ్చిషియా మతస్థుడైన అల్ఖమీ ఈ సమాచారాన్ని చంగీజ్‌ఖాన్ మనమడు హలాకూఖాన్‌కు అందజేసి బగ్దాద్‌పై దాడి చేయవలసిందిగా పురిగొల్పాడు. అదే సమయంలో అటు తాతారీల ఉప్పుతింటూ వారి అడుగులకు మడుగులొత్తే మరో పచ్చిషియా వర్గీయుడు నసీరుద్దీన్ తౌసీ కూడా బగ్దాద్‌పై దాడి చేయడానికి ఇదే మంచి సమయమంటూ హలాకూఖాన్‌ని మరింత ఎగదోశాడు.

పోతే బగ్దాద్‌లో అత్యధిక మంది ధర్మవేత్తలు అతివేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితుల్ని గమనించకుండా సంకుచిత దృష్టితో ధర్మంలోని అత్యల్ప విషయాలపై పరస్పరం వాదోపవాదాలు చేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. ముఖ్యంగా షియా-సున్నీల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. వీటికి తోడు ప్రభుత్వ ఉన్నతాధికారుల్లో అవినీతి, విద్రోహకార్యకలాపాలు మితిమీరిపోయాయి.

# 61. బగ్దాద్ వినాశం

ఖలీఫా ముస్తసిమ్ బిల్లా మందుమత్తులో మునిగితేలుతూ పూర్తిగా స్త్రీ లోలుడైపోయాడు. పరిపాలన వ్యవహారాల్లో పూర్తిగా ప్రధాని మీద ఆధారపడేవాడు. అల్ఖమీ ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారిపోయింది పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో ఓ రోజు హలాకూఖాన్ దాడిచేయడానికి బగ్దాద్ సమీపానికి వచ్చాడన్న పిడుగులాంటి వార్త విన్పించింది. అంతే ఖలీఫా అదిరిపడ్డాడు. అతని చేతిలోని మధుపాత్ర జారి కిందపడింది... తక్షణమే అతను ఎంతో పరాక్రమశాలి, అనుభవశాలి అయిన ఫతహుద్దీన్ నాయకత్వంలో పదివేలమంది అశ్వరూఢుల్ని పంపించాడు.

ఫతహుద్దీన్ నేతృత్వంలోని ఈ సైన్యం పెనుతుఫానులా దూసుకుపోయి తాతారీలపై విరుచుకుపడింది. దాంతో తాతారీలు మొదటి దాడిలోనే చిత్తుగా ఓడిపోయి పలాయనం చిత్తగించారు. సేనాపతి ఫతహుద్దీన్ వారిని వెంబడించకుండా అక్కడే ఆగిపోయి తదుపరి కర్తవ్యం కోసం నిరీక్షించాలని నిర్ణయించాడు. కాని అతని సహచర సైనికులు ఆ నిర్ణయాన్ని త్రోసిపుచ్చి తాతారీలను వెంబడించాలని పట్టుబట్టారు. ఫతహుద్దీన్ ఎంత నచ్చజెప్పినా వినలేదు. దాంతో ఫతహుద్దీన్ విధిలేక తాతారీసైన్యాన్ని వెంబడించాడు. ఫలితంగా ఓడి పారిపోతున్న తాతారీలు వెనక్కి తిరిగొచ్చి దాడిచేశారు. అదేసమయంలో కొండల్లో దాక్కున్న మరికొందరు తాతారీలు బయటికొచ్చి వెనుకనుంచి ముస్లింలపై మెరుపు దాడిచేశారు. దాంతో తాతారీసైనిక దళాల మధ్య చిక్కుకున్న ముస్లింయోధులు భయాందోళనలతో కాస్సేపు పెనుగులాడి బగ్దాద్ వైపు పారిపోయారు. సేనాపతి ఫతహుద్దీన్ హతమార్చబడ్డాడు.

ఖలీఫా ముస్తాసిమ్ ఈ వార్త విని "మన యోధులు ఓటమి పాలైనప్పటికీ దేవుని దయవల్ల హలాకూఖాన్ సైన్యం నడుం విరిగిందిలే" అన్నాడు తన తెలివిమాలినదనాన్ని బయటపెట్టుకుంటూ. కాని ఆ తర్వాత కొన్నాళ్ళకే హలాకూఖాన్ సుడిగాలిలా దూసుకు వచ్చి నగరాన్ని నలువైపుల నుంచి దిగ్బంధించాడు. ముస్లింయోధులు తీవ్రంగా ప్రతిఘటించారు. యాభైరోజులు దాకా వీరోచితంగా పోరాడుతూ తాతారీ సేనలను నగరంలో ప్రవేశించకుండా నిరోధించగలిగారు.

కాని అల్ఖమీ రహస్యంగా నగర పరిస్థితుల్ని ఎప్పుటికప్పుడు తాతారీలకు చేరవేస్తూ ముస్లిం యోధులను బలహీనపరచడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. వేరొక వైపు తాతారీల బూచి చూపుతూ ఖలీఫాను భయపెట్టాడు. "మీరు హలాకూఖాన్‌కు లొంగిపోతే అతను మీకు ప్రాణరక్షణ హామీనివ్వడమే గాకుండా మిమ్మల్ని యధాతథంగా బగ్దాద్ ఖలీఫాగా ఉండనిస్తాడని వాగ్దానం చేశాడని" చెప్పాడు. ఖలీఫా ముస్తసిమ్ బిల్లా ఇక చేసేదిలేక అల్ఖమీ చెప్పినట్లు హి.శ. 656లో తాతారీ చక్రవర్తికి లొంగిపోయాడు.

అంతేకాకుండా అల్ఖమీ ఇచ్చిన మరొక సలహా ప్రకారం ఖలీఫా నగరంలోని గొప్పగొప్ప ధర్మవేత్తలు, పాలనాధికారులు, సైన్యాధికారుల్ని హలాకూఖాన్ దగ్గర కుదువబెట్టి చేతులు దులుపుకున్నాడు. హలాకూఖాన్ నిరాయుధులుగా తన దగ్గరకు పంపబడిన ఆ ధర్మవేత్తలు, పాలనాధికారులు, సైన్యాధికారులందరినీ నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు. ఆ తరువాత హలాకూఖాన్ వత్తిడితో ఖలీఫా ముస్తాసిమ్ నగరపురులంతా నగరం బయటికి వచ్చేయాలని హుకుం జారీచేశాడు. దాంతో జనం కందకం దాటి తాతారీల ముందుకు వచ్చేశారు.

అంతే, బగ్దాద్ పౌరులపై కనీవినీ ఎరుగని మారణకాండ విరుచుకుపడింది. తాతారీ సైనికులు క్రూరమృగాల్లా విరుచుకుపడి వారందర్నీ సొరకాయలు కోసినట్లు ఊచకోత కోశారు. తర్వాత వారు నగరంలోకి జొరబడ్డారు. స్త్రీలు-పిల్లలు తలలపై ఖురాన్ ప్రతులు పెట్టుకొని ఏడ్పులు-పెడబొబ్బలు పెడ్తూ ఇండ్ల నుండి బయటికి వచ్చారు. హలాకుఖాన్ తన సైన్యానికి సామూహిక హత్యాకాండ ఆదేశం ఇచ్చాడు. ఈ ఆదేశం వినగానే తాతారీ సైనికులు స్త్రీలను, పసిపిల్లలను సైతం అతిపాశవికంగా హతమార్చడం మొదలెట్టారు. అమాయక ప్రజలను వెతికి వెతికి మరీ హతమార్చారు. నగరంలో, నగర పరిసర ప్రాంతాల్లో, ఇళ్ళల్లో, రహదారుల్లో, పొలాల్లో ఒక చోటేమిటి- ప్రతిచోటా శవాలు గుట్టలు గుట్టలుగా పడిపోయి రక్తపుటేరులు ప్రవహించాయి. మొత్తం ఒకకోటి ఆరు లక్షల మానవప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. వారి రక్తంతో దజ్లానది నీరు కూడా ఎరుపెక్కింది. 20లక్షల నగరజనాభాలో 4లక్షల మంది మాత్రం ఎలాగో బతికి బయటపడ్డారు.

హలాకూఖాన్ ఆ తరువాత ఖలీఫా ముస్తాసిమ్ బిల్లాను వెంటబెట్టుకొని నగరంలో ప్రవేశించి రాజమహల్‌లో సమావేశం జరిపాడు. ఖలీఫాను తన ముందుకు పిలిచి "మేము నీ అతిథులం. మరి మాకేదైనా ఆతిథ్యం ఇవ్వవా?" అని అడిగాడు. ఖలీఫా ఈమాట వినగానే వణికిపోయాడు. ఖజానా తాళపుచెవులు ఎక్కడున్నాయో కూడా మరచిపోయాడు. అంచేత తాళాలు పగలగొట్టి రెండువేల విలువైన దుస్తులు, వేయి దీనార్లు, బంగారు ఆభరణాలు హలాకూఖాన్ ముందు సమర్పించబడ్డాయి. వాటిని చూసి అతను "వీటిని నువ్వు ఇవ్వకపోయినా మాకు లభిస్తాయి. ఇవికాదు, నువ్వు ఎవరికీ తెలియజేయకుండా రహస్యంగా దాచిన సంపద ఎక్కడుందో చెప్పు"అని అన్నాడు. ఖలీఫా వెంటనే ఆ ప్రదేశం జాడ తెలియజేశాడు. అక్కడ నేలను త్రవ్విచూస్తే కళ్ళుజిగేల్ అన్పిస్తూ వేలాది మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలు బయల్పడ్డాయి.

ఆ తరువాత హలాకూఖాన్ ఖలీఫాను కూడూనీళ్ళూ ఇవ్వకుండా ఓ గదిలో బంధించి పెట్టాడు. పాపం, ఖలీఫాగారు ఆకలితో నకనకలాడుతూ అన్నం పెట్టమని ప్రాధేయపడ్డాడు.



అప్పుడు హలాకూఖాన్ "ఒక పళ్ళెంలో వజ్రవైఢూర్యాలు పెట్టి తీసికెళ్ళి అతనికి తినమని చెప్పు" అంటూ ఒక సేవకుడ్ని ఆదేశించాడు. ఆ సేవకుడు అలాగే చేశాడు. ఖలీఫా ఏడ్పుముఖం పెట్టుకొని "వీటిని నేనెలా తినాలి?" అని అన్నాడు. దానికి హలాకూఖాన్ ఇలా చెప్పిపంపాడు- "నీవు తినలేని వాటిని లక్షలాదిమంది ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎందుకు ఖర్చుపెట్టలేదు? నీ తరపున పోరాడి, మా దాడుల నుండి నీ దేశాన్ని రక్షించడానికి నీ సైనికులకు వాటిని ఎందుకు ఇవ్వలేదు?"

ఆ తరువాత హలాకూఖాన్ ఖలీఫాను హతమార్చే విషయమై తన సైనికసలహాదారులతో సంప్రదిస్తే అందరూ హతమార్చాలనే అన్నారు. కాని ఖలీఫా ప్రధాని అల్ఖమీ, నసీరుద్దీన్ తౌసీ మాట్లాడుతూ "ఇతను ముస్లింల ఖలీఫా, ఇతని రక్తంతో ఖడ్గాలను రక్తతర్పణం చేయకూడదు. ఇతడ్ని ఓ ఉన్నిరగ్గులో చుట్టబెట్టి కాళ్ళతో తన్ని చితగ్గొట్టాలి" అని అన్నాడు.

చివరికి ఖలీఫా ముస్తాసిమ్ బిల్లాను ఆ దుర్మార్గులు ఉన్ని రగ్గులో చుట్టి చితగ్గొట్టి ఏనుగు కాళ్ళక్రింద పడవేశారు. ఖలీఫా గావుకేకలు పెడ్తూ ఊపిరి విడుస్తుంటే అల్ఖమీ తాను అల్వీషియాల తరపున ఖలీఫా నుండి పగ తీర్చుకుంటున్నానన్న భావనతో తెగ సంబరపడి పోసాగాడు. ఇలా ఖలీఫా ముస్తాసిమ్ బిల్లా హత్యకు గురై కఫన్ వస్త్రాలక్కూడా నోచుకోలేక పోయాడు.

ఆ తరువాత హలాకూఖాన్ ఎంతో విలువైన, అరుదైన లక్షలాది గ్రంథాలున్న రాజగ్రంథాలయం వైపు దృష్టిసారించాడు. అతని ఆదేశంతో వాటన్నిటినీ దజ్లా నదిలో పారేయబడ్డాయి. ఇంతకుముందు బగ్దాద్ ప్రజల రక్తంతో ఎరుపెక్కిన దజ్లా నదీనీరు ఇప్పుడీ గ్రంథాల సిరాతో నల్లగా మారిపోయింది. తరువాత తాతారీలు రాజమహల్‌ని లూటీచేసి దాన్ని ధ్వంసంచేశారు. మానవతా గుండెల్ని పిండించే ఘోరాతిఘోరమైన ఈ దుర్ఘటన ఇదివరకెన్నడూ సంభవించలేదు; ఈనాటి వరకూ సంభవించలేదు.

ఖలీఫా హత్య తరువాత ప్రధాని అల్ఖమీ గంపెడు ఆశలతో హలాకూఖాన్ దగ్గరకు వచ్చి తోకాడిస్తూ, వంగివంగి నమస్కరిస్తూ మెలికలు తిరిగిపోసాగాడు. హలాకూఖాన్ అల్వీషియా వ్యక్తి నెవరినైనా ఖలీఫాగా నియమించి, తనను ఉపరాజ్యాధినేతగా చేస్తాడన్న కొండంత ఆశపెట్టుకున్నాడు. కాని హలాకూఖాన్ ఇరాఖ్ రాజ్యాధినేతగా తన జాతి మనిషిని నియమించడంతో అల్ఖమీ నీరుగారిపోయాడు. అయినా అతనిలో ఆశ చావలేదు. అంచేత అతివినయం వలకబోస్తూ స్తుతిగానం చేశాడు. అదీ ఫలించకపోవడంతో హలాకూఖాన్ కాళ్ళ ముందు సాగిలబడి పరిపరి విధాల ప్రాధేయపడ్డాడు. కాని హలాకూఖాన్ అతడ్ని ఛీత్కరించాడు. జాతి విద్రోహానికి పాల్పడి ఇంతటి మారణకాండకు బాధ్యుడైన అల్ఖమీకి రోజులు దగ్గరపడ్డాయి. చివరికి అతని పాపం పండి తాతారీల చెప్పులు శుభ్రంచేస్తూ తీవ్రమైన పశ్చాత్తాపంతో, తీరని దిగులుతో కుక్కచావు చచ్చాడు.

ఖలీఫా ముస్తాసిమ్ బిల్లా మరణం తరువాత మూడున్నర సంవత్సరాల వరకూ ప్రపంచంలో ఎక్కడా ఖిలాఫత్ పాలన లేకుండా పోయింది. ఆ తర్వాత ఈజిప్టుప్రజలు హి.శ. 659లో జైల్లో ఉన్న ముస్తాసిమ్ పినతండ్రి అబుల్‌ఖాసిం అహ్మద్‌ని కైరోకు తీసుకొచ్చి అతని చేతిలో బైత్ చేసి ఖిలాఫత్ గద్దె ఎక్కించారు.

# 62. స్పెయిన్‌లో ముస్లింల పాలన

స్పెయిన్‌విజేత మూసా బిన్ నసీర్ ఖలీఫాపిలుపుతో స్పెయిన్ నుండి డెమాస్కస్‌కు వెళ్ళిపోతూ కుమారుడు అబ్దుల్‌అజీజ్‌ని హి.శ. 96లో స్పెయిన్ పాలకుడిగా నియమించాడు. (434వ పేజీలో 41. ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్‌మలిక్ పాలన చూడండి.)

**1-అమీర్ అబ్దుల్‌అజీజ్ పరిపాలన:-** మూసా బిన్ నసీర్ వెళ్ళిపోయిన తర్వాత స్పెయిన్‌లో అనేకప్రాంతాల క్రైస్తవపాలకులు తిరుగుబాటులు లేవనెత్తారు. ముస్లింయోధుల సంఖ్య చాలాతక్కువగా ఉన్నప్పటికీ స్పెయిన్‌వాసుల సహకారంతో అబ్దుల్‌అజీజ్ ఆ తిరుగుబాటులను చాకచక్యంగా అణచివేశాడు. కారణం స్పెయిన్ వాసులు గత గాథ్ పరిపాలన కంటే ఇప్పటి ముస్లింల పరిపాలన ఎంతో శ్రేష్ఠమైనదని భావించడమే. ముస్లింలు వారికి పూర్తి మతస్వేచ్ఛ ప్రసాదించారు. ఇస్లామీయ ప్రభుత్వానికి సమస్యలు సృష్టించనంతవరకు ప్రాపంచిక వ్యవహారాల్లో కూడా వారికి పూర్తిస్వేచ్ఛ ఇవ్వబడింది. అదీగాక ఎవరైనా బానిస ఇస్లాం స్వీకరిస్తే అతను తన ముస్లిమేతర యజమాని బానిసత్వం నుండి స్వతంత్రుడైనట్లు పరిగణించబడుతుందని అమీర్ అబ్దుల్‌అజీజ్ ప్రకటించాడు. దాంతో వేలాదిమంది బానిసలు ఇస్లాం స్వీకరించి దౌర్జన్యపరులైన తమ యజమానుల కబంధహస్తాల నుండి విముక్తిపొందారు.

స్పెయిన్‌రాజు లర్జీఖ్ చనిపోయిన తరువాత అతని వితంతుభార్య ఐజీలూనాని అమీర్ అబ్దుల్‌అజీజ్ పెళ్ళిచేసుకొని ఆమెను క్రైస్తవమతంలోనే ఉండనిచ్చాడు. అతడ్ని చూసి మరికొందరు ముస్లింలు కూడా క్రైస్తవ స్త్రీలను వివాహమాడటం ప్రారంభించారు. ఆ తరువాత ముస్లింలు, క్రైస్తవులు ఎంతో అన్యోన్యంగా కలసిమెలసి జీవించసాగారు. అదీగాక అమీర్ అబ్దుల్‌అజీజ్ తన క్రైస్తవసతీమణి సిఫారసుతో క్రైస్తవులకు ప్రభుత్వంలో కీలకహోదాలు కూడా ఇచ్చాడు. ఇలా ఆమె పరిపాలనలో జోక్యంచేసుకోవడం అరబ్ ఉన్నతాధికారులకు నచ్చేదికాదు. అలాంటి పరిస్థితిలో ఖలీఫా సులైమాన్ బిన్ అబ్దుల్ మలిక్ మూసా బిన్ నసీర్‌కు విధించిన శిక్ష గురించి అమీర్ అబ్దుల్‌అజీజ్‌కు తెలిసింది. అతను తన తండ్రికి జరిగిన అన్యాయం గురించి ఖలీఫాపై మండిపడుతూ స్పెయిన్‌ని ఖలీఫా పాలన నుండి విడిపించుకోవడానికి పన్నాగం పన్నాడు.

అయితే ఈ సంగతి స్పెయిన్ అధికారుల ద్వారా ఖలీఫాకు తెలిసింది. అబ్దుల్‌అజీజ్ నిజంగా అలాంటి కుట్రకు పాల్పడుతుంటే వెంటనే అతడ్ని హతమార్చండని ఐదుగురు స్పెయిన్ అధికారుల్ని ఆదేశించాడు ఖలీఫా. ఆ ఐదుగురు ఉన్నతాధికారులు పరస్పరం సంప్రదించుకొని తృప్తిచెందిన తర్వాత హి.శ. 98లో అమీర్ అబ్దుల్‌అజీజ్‌ని అరెస్టుచేసి హతమార్చారు. ఆ తరువాత వారు అబ్దుల్‌అజీజ్ దగ్గరి బంధువైన అయ్యూబ్ బిన్ హబీబ్‌ని స్పెయిన్ రాజ్యాధినేతగా నియమించారు.

**2-అమీర్ అయ్యూబ్ బిన్ హబీబ్ పరిపాలన:-** అయ్యూబ్ అధికారపీఠం అధిరోహించగానే క్రైస్తవులు, యూదుల ప్రభావం ఎక్కువగా ఉన్న అష్బీలియా నుండి రాజధానిని ఖర్తబాకు మార్చాడు. ఆ తర్వాత ఆఫ్రికా, మొరాకోల నుండి బర్బరి, అరబ్



తెగల ముస్లింలను స్పెయిన్‌కు పిలిపించి వారికి పునరావాసం కల్పించాడు. ఈవిధంగా క్రైస్తవుల నుండి పొంచివుండే తిరుగుబాటు ప్రమాదాన్ని నివారించాడు. అదీగాక సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠమైన కోటలు నిర్మింపజేసి అక్కడ భద్రతాదళాలను నియమించాడు. ఆ తర్వాత అమీర్ అయ్యూబ్ దేశంలోని వివిధ పట్టణాలను, గ్రామాలను పర్యటించి ఆయా ప్రజల అవసరాలను గురించి తెలుసుకొని వాటిని నెరవేర్చాడు. దాంతో ప్రజలు అతని పరిపాలన పట్ల సంతోషంగా ఉండసాగారు.

కాని ఈవిధంగా అయ్యూబ్ ఆర్నెల్లు పాలన చేశాడో లేదో ఖైర్వాన్ రాష్ట్ర పాలకుడు ముహమ్మద్ బిన్ యజీద్ దగ్గర నుండి హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ (ఖలీఫా అనుమతితో) అయ్యూబ్ ఉద్వాసన ఆదేశం తీసుకొచ్చాడు. కారణం అయ్యూబ్ కూడా మూసా బిన్ నసీర్ బంధువే గనక అతను తన ధైర్యసాహసాలు, ప్రజాసంక్షేమ కార్యాలతో ఖిలాఫత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టవచ్చన్న అనుమానంతో ముహమ్మద్ బిన్ యజీద్ ఈ దుర్మార్గానికి పాల్పడ్డాడు. దాంతో అయ్యూబ్ గద్దె దిగవలసి వచ్చింది. అతని స్థానంలో హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ సఖఫీ స్పెయిన్ పాలకుడయ్యాడు.

**3-హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ సఖఫీ పరిపాలన:-** హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ అధికారం చేపట్టగానే గత ముగ్గురు పాలకుల కాలంలో నియమించబడిన ప్రభుత్వాధికారులందర్నీ అనుమానాస్పదంగా చూస్తూ వేధించడం ప్రారంభించాడు. అంతేకాదు. క్రైస్తవుల్ని, యూదుల్ని కూడా వేధించసాగాడు. ఈ వేధింపులు భరించలేక ఓ ప్రతినిధి వర్గం ఖైర్వాన్ వెళ్ళి అక్కడిపాలకుడు ముహమ్మద్ బిన్ యజీద్‌కు విషయం విన్నవించుకున్నది. కాని అతను దాన్ని గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. అంచేత ప్రతినిధివర్గం తమ కష్టాలను గురించి ఖలీఫాతో చెప్పుకోవడానికి డెమాస్కస్‌కు బయలుదేరింది.

ఆ కాలంలో ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మ) ఖలీఫాగా అధికారం చేపట్టివున్నారు. ప్రతినిధివర్గం ఆయనతో తమ పాలకుడు ప్రజలపై చేస్తున్న దౌర్జన్యాల్ని గురించి ఏకరవు పెట్టుకొని అతడ్ని తీసేసి మృదుమనస్కుడైన పాలకుడ్ని నియమించమని వేడుకుంది. ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్‌అజీజ్ (రహ్మ) వెంటనే హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్‌ని తొలగించి సమహ్ బిన్ మాలిక్‌ని స్పెయిన్ పాలకుడిగా నియమించి పంపారు. హరబ్ బిన్ అబ్దుర్రహ్మాన్ స్పెయిన్‌లో రెండేళ్ళ ఎనిమిది నెలలు మాత్రమే పాలనచేశాడు.

**4-సమహ్ బిన్ మాలిక్ పరిపాలన :-** సమహ్ బిన్ మాలిక్ స్పెయిన్ విజేత తారిఖ్ బిన్ జియాద్ అనుచర సైనికుడు మాత్రమే. అయితే అతనిలో పాలనాదక్షతతో పాటు ప్రజాసంక్షేమ కార్యాల పట్ల ఆసక్తి కూడా ఉంది. అంచేత అతను అధికారం చేపట్టగానే ముందుగా ప్రజాసంక్షేమ పనులపై దృష్టి సారించాడు. ఖలీఫా అనుమతితో స్పెయిన్‌లో ఏజాతి, ఏతెగ, ఏమత ప్రజలు ఎంతంత మంది ఉన్నారో తెలుసుకోడానికి జనాభాగణాంకం చేయించాడు. దాంతోపాటు ఏ పట్టణంలో, ఏ గ్రామంలో ఎంతంత మంది ఉన్నారో, ఎక్కడెక్కడ ఖనిజనిక్షేపాలు ఉన్నాయో, అక్కడి భౌగోళిక పరిస్థితులేమిటో తెలుసుకోవడానికి పూర్తి వివరాలతో కూడిన ఒక భౌగోళికపటం కూడా తయారు చేయించి ఖలీఫా సన్నిధికి పంపించాడు.

ఆ తర్వాత సమహ్ బిన్ మాలిక్ బర్బరీ తెగవాళ్ళను జనసంచారంలేని ప్రాంతాల్లో పునరావాసంకల్పించి వారిని వ్యవసాయంవైపు దృష్టిమళ్ళించాడు. వ్యాపారం, వ్యవసాయ రంగాల్లో అనేకసౌకర్యలు కల్పించాడు. జిజ్యా, ఉష్ర్, జకాత్, శిస్తుల్ని గురించి పటిష్ఠమైన చట్టం అమలుపరిచాడు. అనేకచోట్ల మసీదులు, నదులపై వంతెనలు నిర్మింపజేశాడు. ఈవిధంగా అమీర్ సమహ్ కొన్నాళ్ళలోనే అనేక జనసంక్షేమ కార్యాలు చేశాడు.

సమహ్ పాలనాకాలంలో ముస్లింలు మరొకసారి ఫ్రాన్స్‌పై దాడిచేశారు. దక్షిణ ప్రాంతంలో సైనికపరంగా పటిష్ఠమైన రెండు పట్టణాలున్నాయి. అమీర్ సమహ్ ఒక పట్టణం నార్బాన్ని సునాయాసంగా జయించి అపార సమరసొత్తుతో రెండవ పట్టణానికి వెళ్ళి దిగ్బంధించాడు. కొంతసైన్యం భద్రతకోసం నార్బాన్‌లో వదలి రావడంవల్ల ఇక్కడ సైనికసంఖ్య చాలాతక్కువగా ఉండింది. అయినా ముస్లింలు ప్రాణాలకు తెగించి పోరాడసాగారు. అంతలో డ్యూక్ ఆఫ్ అక్యుటీన్ అనే ఒకరాజు ఓపెద్ద సైనికవాహినితో వచ్చిచేరాడు. సమరజ్వాలలు మింటికెగిశాయి. శవాలు గుట్టలుగుట్టలుగా పడసాగాయి. ముస్లింలు తమ సర్వశక్తులు ఒడ్డి శత్రువుల్ని వెనక్కి నెట్టివేయసాగారు. అంతలో శత్రు సైన్యం నుండి ఒకబాణం వచ్చి అమీర్ సమహ్ గొంతులో దిగబడింది. అతను అక్కడి కక్కడే కూలబడి ఊపిరివిడిచాడు. తమ అధినాయకుడు అమరగతి నొందడంతో ముస్లింలు అధైర్యం చెందారు, సమరతీవ్రత మందగించింది. అదేసమయంలో శత్రువులు నలువైపుల నుండి ముస్లింలపై విరుచుకుపడి మైదానం రక్తసిక్తం చేయడం మొదలెట్టారు. ముస్లింలు వెంటనే అబ్దుర్రహ్మాన్ గాఫఖీని సేనాపతిగా ఎన్నుకొని నడుం బిగించారు. అబ్దుర్రహ్మాన్ ఎంతో చాకచక్యంతో పోరాడుతూ శత్రువుల చక్రబంధం నుండి బయటపడి వెనక్కి జరుగుతూ యుద్ధమైదానం వదలి స్పెయిన్‌కు తిరుగుముఖం పట్టాడు. శత్రువులు ముస్లింయోధుల్ని వెంబడించడానికి సాహసించలేక పోయారు.

ఈ యుద్ధం హి.శ. 102లో జరిగింది. అమీర్ సమహ్ మరణం తర్వాత ముస్లింలు అబ్దుర్రహ్మాన్ గాఫఖీని స్పెయిన్ పాలకుడిగా ఎన్నుకున్నారు. కాని కొన్నాళ్ళ తరువాత అబ్దుర్రహ్మాన్ సైనికుల అధికారాలు పెంచాడన్న ఆరోపణపై ఖలీఫా అతడ్ని తొలగించి అన్బసా బిన్ సహీంని స్పెయిన్ పాలకుడిగా నియమించాడు.

**5-అంతఃకలహాలు :-** ఫ్రాన్స్‌పై దాడులు జరుగుతున్న తరుణంలో జాతీయ, ప్రాంతీయాభిమానాలు హద్దుమీరడంతో ముస్లింలలో అంతఃకలహాలు మొదలయ్యాయి. మరోవైపు ఉద్వాసనకు గురైన ముస్లింపాలకుల్ని క్రైస్తవరాజులు రకరకాల ఎరలు వేస్తూ ఇస్లామీయ సామ్రాజ్యాన్ని అంతమొందించేందుకు ప్రయత్నించసాగారు. హి.శ.96లో మొట్టమొదటి పాలకుడైన అబ్దుల్‌అజీజ్ నుండి యూసుఫ్ వరకు 40ఏళ్ళలో 18మంది స్పెయిన్‌పాలకులు అయ్యారు. ఆతర్వాత అబ్దుర్రహ్మాన్ స్పెయిన్ పాలకుడయ్యాడు.

**6-అబ్దుర్రహ్మాన్ బిన్ ముఆవియా పరిపాలన :-** అబ్దుర్రహ్మాన్ అయిదేళ్ళ వయసులో ఉన్నపుడు అతనితండ్రి చనిపోయాడు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ తాత, ఆనాటి ఖలీఫా అయిన హిషామ్ బిన్‌అబ్దుల్‌మలిక్ తన మనవడ్ని సంరక్షణలోకి తీసుకొని ప్రత్యేక శిక్షణ ఇస్తూ తన రాజకీయవారసుడిగా చేయాలని భావించాడు. కాని అబ్దుర్రహ్మాన్



పన్నెండేండ్ల వయసులో ఉన్నపుడు హిషామ్ చనిపోయాడు. తరువాత అతని పినతండ్రి కుమారుడు వలీద్‌బిన్‌అబ్దుల్‌అజీజ్ ఖలీఫా అయ్యాడు. అబ్దుర్రహ్మాన్ రాచకుటుంబంలో పెరుగుతూ, దుర్గుణాలు, దురలవాట్లకు దూరంగాఉంటూ సకలవిధాల విద్యలు నేర్చుకున్నాడు. హి.శ. 134లో బనూఉమయ్యా ఖిలాఫత్ అంతమై బనూఅబ్బాసియా ఖిలాఫత్ ప్రారంభమయ్యేనాటికి అబ్దుర్రహ్మాన్ ఇరవై ఏళ్ళ వయసుకు చేరుకున్నాడు.

అబ్దుర్రహ్మాన్ బిన్ ముఆవియాకు ఫిరాత్ నదీతీరాన ఒక జాగీరు ఉండేది. బనూ అబ్బాసీసైన్యం రాజధాని డెమాస్కస్‌ను ఆక్రమించుకొని అక్కడ సామూహిక హత్యాకాండ జరిపినపుడు అబ్దుర్రహ్మాన్ డెమాస్కస్‌లో లేకుండా తన జాగీర్ ఉన్న ఊరికి వెళ్ళిపోయి ఉన్నాడు. బనూఉమయ్యా వారిని, వారి సానుభూతిప్రజల్ని బనూఅబ్బాసియా సైనికులు వెతికి వెతికి హతమార్చుతున్నారని తెలిసి అబ్దుర్రహ్మాన్ ఊరిబయట గుబురుచెట్ల మధ్య గుడారం వేసుకొని ఉండసాగాడు. అయితే ఒకరోజు అబ్బాసీ సైనికులు ఆ ఊరిపైకి వచ్చి పడ్డారని తెలియగానే అబ్దుర్రహ్మాన్ తన మూడేళ్ళ కొడుకుని తీసుకొని నదీ వైపు పరుగెత్తి, ఆవల ఒడ్డుకు చేరుకున్నాడు.

అబ్దుర్రహ్మాన్ అక్కడ్నుంచి దాక్కుంటూ, వేషం మార్చుకుంటూ ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి పాలస్తీనాకు చేరుకున్నాడు. కాకతాళీయంగా అక్కడ అతనికి తన తండ్రిబానిస అయిన బదర్ అనే వ్యక్తి కలిశాడు. అతను కూడా ప్రాణం కాపాడుకుంటూ రహస్యంగా ఆఫ్రికా దిశగా ప్రయాణిస్తున్నాడు. ఆతర్వాత ఇద్దరూ వర్తకులుగా వేషంమార్చి ఈజిప్టుకు, ఈజిప్టు నుండి ఆఫ్రికాకు చేరుకున్నారు. ఆఫ్రికా గవర్నర్ ఎంతో సంతోషిస్తూ అతనికి స్వాగతం చెప్పాడు. అయితే కొన్నాళ్ళ తరువాత అబ్దుర్రహ్మాన్ ఆఫ్రికాలో తన ప్రభుత్వ స్థాపన కోసం పావులు కదుపుతున్నాడని, మరొకవైపు అబ్బాసీల ఖిలాఫత్ పాలన స్థిరపడిందని ఆఫ్రికా గవర్నర్‌కు తెలిసింది. అంచేత అతను తన కుర్చీని కాపాడుకోవడానికి అబ్దుర్రహ్మాన్‌ని బంధించి అబ్బాసీ ఖలీఫా సఫా దగ్గరకు పంపివేయడానికి నిర్ణయించాడు. అబ్దుర్రహ్మాన్ ఈ సంగతి ఎలాగో తెలుసుకొని వెంటనే తన బానిస బదర్‌ని, కొడుకుని తీసుకొని రహస్యంగా ఎక్కడికో పారిపోయాడు.

ఆఫ్రికాగవర్నర్ అరెస్టువారెంట్ జారీచేసి, అబ్దుర్రహ్మాన్‌ని పట్టి తెచ్చినవారికి విలువైన బహుమతి ఇస్తామని ప్రకటించాడు. దాంతో అబ్దుర్రహ్మాన్‌ని పట్టుకోవడానికి అనేకమంది రంగంలోకి దిగారు. దానివల్ల అబ్దుర్రహ్మాన్ అనేక నెలలపాటు అడవుల్లో, కొండగుహల్లో దాక్కున్నాడు. మారువేషాల్లో తిరుగుతూ, దాక్కుంటూ, కూటికీ-గుడ్డకూ పరితపిస్తూ నాలుగైదేళ్ళు ఆఫ్రికాలోనే ఉండిపోయాడు. చివరికి బర్బరీజాతికి చెందిన బనూనఫూసా తెగ దగ్గరకు చేరుకున్నాడు. ఆ తెగవారు అబ్దుర్రహ్మాన్ తల్లి తమతెగకు చెందిన స్త్రీయేనని తెలుసుకొని అతనికి తమ మద్దతుతెలిపి అన్నివిధాల సహాయం అందజేయడానికి సిద్ధమయ్యారు. వారుండే సబతాప్రాంతం స్పెయిన్‌సరిహద్దుల్లోనే ఉండటంవల్ల అబ్దుర్రహ్మాన్‌కు స్పెయిన్ పరిస్థితులు బాగా తెలుసుకునే అవకాశం లభించింది.

కొన్నాళ్ళకు స్పెయిన్‌లో అశాంతి, అంతఃకలహాలు ఏర్పడ్డాయని, అక్కడి పాలకుడు యూసుఫ్ తిరుగుబాటుల్ని అణచడంలో మునిగిపోయి ఆందోళన చెందుతున్నాడని

అబ్దుర్రహ్మాన్‌కు తెలిసింది. దాంతో అతనికి ధైర్యం వచ్చి వెంటనే తన బానిస బదర్‌ని స్పెయిన్‌కు పంపించి, స్పెయిన్‌లోని బనూఉమయ్యా ఖిలాఫత్ పాలనలో పనిచేసిన నాయకుల పేర లేఖలు రాశాడు. దానికి మంచిస్పందన రావడంతో అతను తక్షణమే స్పెయిన్‌కు బయలుదేరాడు. స్పెయిన్ చేరుకోగానే అబ్దుర్రహ్మాన్‌కు బనూఉమయ్యా సానుకూలురంతా బ్రహ్మరథం పట్టి, అతని చేతిలో విధేయతా ప్రమాణం చేశారు. ఆ తర్వాత వారు చుట్టుపక్కల ఊళ్ళను ఆక్రమించుకోవడం ప్రారంభించారు.

ఈవిధంగా అబ్దుర్రహ్మాన్ అనేక ప్రాంతాలను ఆక్రమించుకుంటూ రాజధాని ఖర్తబాకు చేరుకొని దాన్నికూడా ఆక్రమించుకున్నాడు. స్పెయిన్ పాలకుడు యూసుఫ్ ఫహ్రి ఓటమి పాలై అమీర్ అబ్దుర్రహ్మాన్‌కు విధేయత ప్రకటించాడు. అయితే ఒప్పందం ప్రకారం అతను ఖర్తబా వదలి ఎటూ పోలేడు. అమీర్ అబ్దుర్రహ్మాన్ రెండేళ్ళపాటు తిరుగుబాటు దారుల పీచంఅణచి రాజ్యాన్ని సుస్థిరపరిచాడు. కాని తిరుగుబాటుదారులు తాత్కాలికం గా అణగివున్నా పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. కొన్నాళ్ళ తర్వాత యూసుఫ్ ఫహ్రి కొందరు అనుచరుల సహాయంతో ఖర్తబా నుండి తప్పించుకొని తిరుగుబాటుకు ఒడి గట్టాడు. ఆ తిరుగుబాటును అణచడానికి ప్రయత్నించినపుడు అతని సైన్యంలోని యమనీతెగవాళ్లు అమీర్అబ్దుర్రహ్మాన్ ప్రసన్నత పొందడానికి యూసుఫ్‌ని హతమార్చారు.

అమీర్ అబ్దుర్రహ్మాన్ హి.శ. 146లో తనను సర్వస్వతంత్ర పాలకుడిగా ప్రకటించు కున్నాడు. కొన్నాళ్ళ తర్వాత అప్పటి ఖలీఫా మన్సూర్ స్పెయిన్‌పై దాడిచేయించి అబ్దుర్ర హ్మాన్‌ని దారికి తీసుకురావడానికి ఆఫ్రికా సేనాపతి ఇలాఅ బిన్ మగీస్‌ని పంపించాడు. మరొకవైపు యూసుఫ్ ఫహ్రి బంధువు హాషిం ఫహ్రి, ఫహ్రీల తరపున ప్రతీకారం తీర్చుకోవ డానికి స్పెయిన్‌పై దాడిచేస్తే తామందుకు సహకరిస్తామని ఇలాఅ బిన్ మగీస్‌కు లేఖ రాశాడు. ఆ తర్వాత హి.శ. 146లో తిరుగుబాటు లేవదీసి ఉత్తర స్పెయిన్‌ని ఆక్రమించు కున్నాడు. అప్పుడు అమీర్ అబ్దుర్రహ్మాన్ ఆ తిరుగుబాటును అణచడానికి బయలుదేరి తైతలా కోటను ముట్టడించాడు. కాని ముట్టడి సుదీర్ఘకాలం సాగింది.

అంతలో ఆఫ్రికా నుంచి ఇలాఅ బిన్ మగీస్ ఖలీఫా ప్రతినిధిగా పెద్దసైన్యంతో స్పెయిన్ చేరుకున్నాడు. స్పెయిన్ ప్రజలు ఖలీఫా ప్రతినిధి వచ్చాడని వినగానే అతని పతాకం కిందికి చేరిపోతూ, అబ్దుర్రహ్మాన్‌ని రాజద్రోహిగా భావించసాగారు. ఈ సంగతి విని అబ్దుర్రహ్మాన్ తీవ్ర ఆందోళనచెందాడు. ఉత్తరస్పెయిన్ తిరుగుబాటుదారులు ఇంకా దారికి రాకముందే ఈ కొత్తశత్రువు దాపురించడం వల్ల అమీర్ అబ్దుర్రహ్మాన్, తైతలా ముట్టడి వదిలేసి అష్బీలియా సమీపంలోని ఖర్మూనా ప్రదేశానికి చేరుకున్నాడు. అటు ఖలీఫా ప్రతినిధి ఇలాఅ బిన్ మగీస్ కూడా ఖర్మూనాని సమీపించాడు.

అయితే అబ్దుర్రహ్మాన్ సైన్యంలోని అనేకమంది ఇబ్నెమగీస్‌ని చూడగానే అతని సైన్యంలో చేరిపోయారు. వేరొకవైపు తైతలా ముట్టడి తొలగిపోగానే అక్కడి తిరుగుబాటు సైన్యం నుండి కొంతసైన్యాన్ని ఖర్మూనాకు పంపించడం జరిగింది. ఇలాఅ బిన్ మగీస్ వెళ్ళగానే ఖర్మూనాకోటను ముట్టడించాడు. దాంతో అబ్దుర్రహ్మాన్ వేరే దారిలేక ఖర్మూనా కోటలో చిక్కుకొని ఉండవలసి వచ్చింది.



ఇలాఅ బిన్ మగీస్ కోట ముట్టడించి కొంతసైన్యాన్ని లూటీలు చేయడానికి వివిధ ప్రాంతాలకు పంపాడు. స్పెయిన్ బర్బరీ తెగవాళ్ళు, ఇతరులు ఈ పరిస్థితి చూసి వారు కూడా లూటీలకు తెగబడ్డారు. దాంతో దేశమంతటా లూటీలు, హత్యలు, విధ్వంసా లతో అట్టుడికిపోయింది. జనసామాన్యం అశాంతి-అలజడులతో వణికిపోసాగారు.

ఇటు అమీర్ అబ్దుర్రహ్మాన్, మిగిలిన అతని ఏడొందల మంది సైనికులు కోటలో రెండు నెలలదాకా దిగ్బంధించబడి ఉన్నారు. ఆహారసామగ్రి ఐపోవడం వల్ల సైనికులు ఆకలితో అలమటించసాగారు. వారిపై నిరాశానిస్పృహలు చుట్టుముట్టాయి. అలాంటి విపత్కర పరిస్థితిలో అబ్దుర్రహ్మాన్ వారిలో ధైర్యం కలిగిస్తూ "ఇప్పుడు మనమిలా ఆకలితో అలమటిస్తూ చావడం లేక శత్రువుల చేతిలో బంధించబడి చావడం కంటే పౌరుషంతో పోరాడి గౌరవప్రదమైన మరణాన్ని ఆహ్వానించడం ఎంతో మంచిది" అని అన్నాడు. నాయకుడి మాటలతో ఉత్తేజితులైన సైనికులు ఒకపెద్ద అగ్నిగుండం రాజేసి, అందులో తమ వరలన్నీ విసరి కాల్చివేశారు. అంటే ఇప్పుడిక శత్రువులతో పోరాడి చావడమో లేదా విజయం సాధించడమో జరగాలన్న మాట.

దిగ్బంధానికి గురైనవారి సంఖ్య చాలాతక్కువగా ఉన్నందున కోట బయట కాపలా దారులు, వీరు మనల్ని ఏం చేస్తార్లేనన్న ధైర్యంతో కాస్త అజాగ్రత్తగా ఉన్నారు. అప్పుడు అబ్దుర్రహ్మాన్ సైనికులు కోట తలుపులు తెరచి ఆకలిగొన్న పులుల్లా ఒక్కసారిగా శత్రువు లపై విరుచుకుపడి వారిని సొరకాయలు కోసినట్లు కోయడం ప్రారంభించారు. ఈ హఠా త్పరిణామంతో శత్రుసైనికులు నిర్ఘాంతపోయారు. వారు సంభాళించుకొని కత్తులుదూసే లోపే ఏడువేల శవాలు మొదలు నరికిన మ్రానుల్లా నేలమీద పడిపోయాయి. దాంతో వారు మరింత భయపడి శవాల మీదుగా పరుగిడుతూ బ్రతుకుజీవుడా అంటూ పారి పోయారు. ఈయుద్ధం హి.శ. 146లో జరిగింది. కాస్సేపట్లో అమీర్ అబ్దుర్రహ్మాన్ అధీనం నుండి పరాధీనమైపోయిన స్పెయిన్‌రాజ్యం తిరిగి అతని అధీనంలోకి వచ్చేసింది.

అమీర్ అబ్దుర్రహ్మాన్ ఆ తర్వాత తిరుగుబాటుదారులందరినీ అంతమొందించాడు. కాని ఆతర్వాత కూడా మరికొన్ని తిరుగుబాటులు తలెత్తాయి. అంచేత అబ్దుర్రహ్మాన్ నిరంతరం యుద్ధాలలో మునిగి ఉండవలసి వచ్చింది. బగ్దాద్ ఖలీఫా సైనికచర్య ద్వారా అబ్దుర్రహ్మాన్‌ని హతమార్చి స్పెయిన్‌ని స్వాధీనం చేసుకోవడానికి రెండు సార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. అబ్దుర్రహ్మాన్ నిరంతరం యుద్ధాలలో మునిగివుండటం వల్ల ఫ్రాన్స్ గురించి అంతగా పట్టించుకో లేకపోయాడు. ఫలితంగా నలభై ఏళ్ళకు పైగా ముస్లింల అధీనంలో ఉండిన దక్షిణఫ్రాన్స్ మళ్ళీ ఫ్రాన్స్ అధీనంలోకి పోయింది. దాంతో ఫ్రాన్స్ చక్రవర్తి స్పెయిన్‌ని ఆక్రమించుకునే దురాశతో పెద్దఎత్తున సైనికసమీకరణ చేసి సర్ఖస్తా పట్టణం చేరుకున్నాడు. అయితే సర్ఖస్తా పట్టణవాసులు సహకరించకుండా కోట తలుపులు మూసేయడంతో అతను వాపసు వెళ్ళిపోయాడు.

కాని సర్ఖస్తాలోనే కొందరు ద్రోహులు పట్టణాన్ని బలవంతంగా తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. అప్పుడు అమీర్ అబ్దుర్రహ్మాన్ రాజధాని ఖర్తబా నుండి సర్ఖస్తా చేరుకొని అక్కడి తిరుగుబాటుని అణచి ఫ్రాన్స్ వైపు బయలుదేరాడు. అతను దక్షిణఫ్రాన్స్‌కు

చేరుకోగానే ఫ్రాన్స్‌చక్రవర్తి భయపడి ఉత్తర ఫ్రాన్స్‌కు పారిపోయాడు. అమీర్ అబ్దుర్రహ్మాన్ దక్షిణఫ్రాన్స్‌లోని అర్ధభూభాగంలో విధ్వంసం సృష్టించి, అనేక కోటలు పడగొట్టి ఖుర్తబాకు తిరిగొచ్చాడు. కాని సర్ఖస్తాలో మళ్ళీ తిరుబాటుదారులు తలెత్తడంతో అబ్దుర్రహ్మాన్ హి.శ. 166లో సర్ఖస్తా చేరుకొని వారిలో అనేకమందిని శాశ్వతంగా కడతేర్చాడు.

ఫ్రాన్స్ చక్రవర్తి షార్లిమీన్ బగ్దాద్ ఖలీఫా (హారూన్‌రషీద్)కు స్నేహహస్తం అందించి, అతని సహాయంతో అమీర్ అబ్దుర్రహ్మాన్ అంతు చూద్దామనుకున్నాడు. బగ్దాద్ ఖలీఫా కూడా అబ్దుర్రహ్మాన్ మెడలువంచి స్పెయిన్‌ని తన సామ్రాజ్యపరిధిలోకి తెచ్చుకుందామని తలచాడు. కాని వారిద్దరి దురుద్దేశాలు నెరవేరలేదు. అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు అన్నట్లు ఫ్రాన్స్‌చక్రవర్తి తన దురుద్దేశం నెరవేరకపోవడంతో అమీర్ అబ్దుర్రహ్మాన్‌కు విలువైన కానుకలు పంపి స్నేహఒప్పందం చేసుకున్నాడు.

ఈ స్నేహఒప్పందం జరిగిన తర్వాత అమీర్ అబ్దుర్రహ్మాన్‌కు ఇక యుద్ధాల జోలికి పోవలసిన పనేమీ మిగల్లేదు. చాలావరకు తిరుగుబాటు ఉద్యమాలు చల్లారిపోయాయి. చివరికి అమీర్ అబ్దుర్రహ్మాన్ 33 సంవత్సరాల పరిపాలన తరువాత హి.శ. 172లో వ్యాధిగ్రస్తుడై 58 ఏళ్ళ వయసులో చనిపోయాడు.

అమీర్ అబ్దుర్రహ్మాన్ పాలనాకాలమంతా తిరుగుబాటుల్ని అణచడంలో, శత్రువుల్ని ఎదుర్కోవడంలో గడచిపోయినప్పటికీ అతను ప్రజాసంక్షేమకార్యాలను నిర్లక్ష్యం చేయలేదు. ముఖ్యంగా విద్యాకళల అభివృద్ధి కోసం అతను రాజ్యమంతటా పాఠశాలలను నెలకొల్పాడు. మసీదుల్ని కట్టించాడు. ఖుర్తబా జామియా మసీదు నిర్మాణ సందర్భంలో ఒక సాధారణ కార్మికుడిగా రాళ్ళు మోశాడు. రాజధాని ఖుర్తబాతో పాటు ముఖ్యపట్టణాల చుట్టూ పటిష్ఠమైన కోటలు నిర్మించాడు. రోడ్లు వేయించాడు. ప్రయాణీకుల సౌకర్యార్థం ధర్మసత్రాలు, వేగవంతమైన తపాలావ్యవస్థ ఏర్పాటుచేశాడు. లూటీలు, దోపిడీలను నిర్మూలించాడు. వ్యాధిగ్రస్తుల్ని పరామర్శించడానికి వెళ్ళేవాడు. సభలు-సమావేశాల్లో, బంధుమిత్రుల వివాహమహోత్సవాల్లో పాల్గొనేవాడు. పండితుల్ని, ధర్మవేత్తల్ని ఎంతగానో గౌరవించేవాడు. కొడుకులకు మంచి విద్యాశిక్షణలు ఇప్పించి వారిని ప్రభుత్వకార్యాలయాలకు, న్యాయస్థానాలు వెళ్ళి అక్కడివ్యవహారాలను పర్యవేక్షించాలని ఆదేశించాడు. అవసరార్థులు తన దగ్గరకు నేరుగావచ్చి చెప్పుకోడానికి వీలుగ ద్వారపాలకులు లేకుండా చేశాడు. అలాంటి వాళ్ళు ఎవరైనా భోజనసమయంలో వచ్చినపుడు అతను వారిని తన పక్కన కూర్చోబెట్టుకొని భోజనం చేయించేవాడు. మొత్తంమీద అమీర్‌అబ్దుర్రహ్మాన్ ఎంతో నేర్పు, చాతుర్యం, సమయస్ఫూర్తి, దీక్షాదక్షత గల పాలకుడిగా చరిత్రకెక్కాడు.

అమీర్ అబ్దుర్రహ్మాన్ చనిపోయేనాటికి 11మంది కొడుకుల్ని, 9మంది కూతుళ్ళను వదలిపెట్టాడు. వారిలో పెద్దకొడుకు సులైమాన్ కంటే రెండవ కొడుకు హిషామ్ ఎక్కువ సమర్థుడైనందున హిషామ్‌నే తన రాజకీయ వారసుడిగా ప్రకటించాడు.

**7-హిషామ్ బిన్ అబ్దుర్రహ్మాన్ పరిపాలన :-** హిషామ్ బిన్ అబ్దుర్రహ్మాన్ హి.శ. 172లో తన తండ్రి మరణానంతరం 32 ఏళ్ళ వయసులో రాజ్యాధినేత (సుల్తాన్)



అయ్యాడు. అతను తన తండ్రి చనిపోయేవరకు మరీదా పట్టణంలో గౌవర్నర్‌గా ఉండేవాడు. తండ్రి మరణవార్త విన్న తరువాత అతను అక్కడే పట్టాభిషిక్తుడయ్యాడు. అయితే అప్పుడు రాజధానిఖుర్తబాలో ఉన్న అతని సోదరుడు అబ్దుల్లా రాజమహల్‌ని, రాజధానిని ఆక్రమించుకున్నాడు. ఈసంగతి తెలియగానే హిషామ్ మరీదా నుండి ఖుర్తబాకు చేరుకొని సాధారణ దాడి ద్వారా రాజధానిని స్వాధీనంచేసుకొని అబ్దుల్లాను బంధించాడు. తరువాత అబ్దుల్లాను క్షమించి, అతడ్ని తన ముఖ్యసలహాదారుల్లో చేర్చుకున్నాడు.

కాని ఆతర్వాత కొన్నాళ్ళకు అబ్దుల్లా ఖుర్తబా నుండి పారిపోయి తైతలాలో గవర్నర్‌గా ఉన్న తన సోదరుడు సులైమాన్ దగ్గరకు చేరుకున్నాడు. అక్కడ వాళ్ళిద్దరు సుల్తాన్ హిషామ్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎగరవేశారు. తైతలా పట్నంలో సులైమాన్ మంత్రి గాలిబ్ సఖఫీ తిరుగుబాటు మంచిది కాదని ఆ ఇద్దరు అన్నదమ్ములకు నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. కాని వాళ్ళిద్దరు గాలిబ్ సలహాను తిరస్కరించడమే గాక అతడ్ని జైల్లో పడవేశారు. ఈ సంగతి తెలుసుకున్న సుల్తాన్ హిషామ్ మనకు ఎంతో విశ్వాసపాత్రుడైన వ్యక్తిని జైల్లో వేయడం మంచిదికాదని ఉత్తరం రాసిపంపితే సులైమాన్ జైలు నుండి గాలిబ్‌ని రప్పించి ఉత్తరం తెచ్చిన మనిషి ముందే అతడ్ని హతమార్చాడు.

దాంతో సుల్తాన్ హిషామ్ ఇక లాభం లేదని ఇరవై వేల సైన్యంతో వెళ్ళి తైతలాని ముట్టడించాడు. అప్పుడు సులైమాన్ కొంత సైన్యం తైతలా కోటలో ఉంచి మిగతా సైన్యం తీసుకొని ఖుర్తబాదిశగా వెళ్ళాడు. ఖుర్తబా సమీపంలో ఖుర్తబాగవర్నర్ అబ్దుల్ మలిక్ అతడ్ని ఢీకొని పారద్రోలాడు. సులైమాన్ ఓటమితో మర్సియా పారిపోయి దేశమంతటా లూటీలుచేస్తూ తిరగసాగాడు. చివరికి సుల్తాన్ తన సోదరులు సులైమాన్, అబ్దుల్లాలను క్షమించాడు. అంతేగాక, అబ్దుల్లాను తైతలా గవర్నర్‌గా నియమించాడు; సులైమాన్‌ని ఆఫ్రికా వెళ్ళిపోతానంటే పంపివేశాడు. కాని సులైమాన్ ఆఫ్రికా వెళ్ళి అక్కడ బనూఅబ్బాసీల ఏజంటుగా మారి స్పెయిన్‌లోని తనసోదరుడు అబ్దుల్లాతో, ఇతర విద్రోహులతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ తిరుగుబాటు చర్యలు ప్రారంభించాడు.

సుల్తాన్ హిషామ్ తన సోదరుల దుశ్చర్యల్ని తాత్కాలికంగా అణచిన తరువాత ఫ్రాన్స్‌పై దాడిచేసి దక్షిణ ఫ్రాన్స్‌తో పాటు బూనియా రాష్ట్రాన్ని కూడా తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఇలా తిరుగుబాటుల్ని అణచడానికి హిషామ్ అనేక యుద్ధాలు చేయవలసి వచ్చింది. చివరికి ఏడు సంవత్సరాల పాలన తరువాత నలభై ఏళ్ళ వయసులో హి.శ. 180లో చనిపోయాడు. పేదలు, వితంతువులు, అనాథల కోసం అతను ఎంతో కృషిచేశాడు. మసీదులు, రోడ్లు, వంతెనలు, ధర్మసత్రాలు నిర్మించాడు. రాత్రివేళల్లో గస్తీ తిరుగుతూ అవసరార్థులకు తగిన సహాయం చేసేవాడు. దొంగలు, దోపిడీదారులు, ఇతర నేరస్థుల నుండి వసూలుచేసే జరిమానా పైకాన్ని ప్రభుత్వ ధనాగారంలో జమ చేయకుండా ప్రజాసంక్షేమ కార్యాల కోసం వినియోగించేవాడు.

సుల్తాన్ హిషామ్ మొత్తంమీద ఎంతో నీతి, న్యాయం, నిజాయితీలతో పరిపాలన చేశాడు. ఓసారి సుల్తాన్ ఒక ఇల్లు కొనడానికి ఆ ఇంటి యజమానితో మాట్లాడసాగాడు. ఆ ఇంటి సమీపంలోని ఒక వ్యక్తి ఆ ఇంటిని కొనదలచినట్లు, అయితే దాన్ని సుల్తాన్

కొనబోతున్నాడని విని ఆ ఆలోచనను విరమించుకున్నాడు. సుల్తాన్ హిషామ్ ఈ సంగతి తెలుసుకొని ఆ ఇంటిని కొనడం మానుకున్నాడు.

హిషామ్ విద్యావ్యాప్తికోసం కూడా ఎంతో పాటుపడ్డాడు. పాఠశాలల్లో అరబీభాషను విధిగా ప్రవేశపెట్టాడు. తత్ఫలితంగా కొన్నాళ్ళలోనే స్పెయిన క్రైస్తవులు అరబీభాష నేర్చుకొని ఖుర్‌ఆన్ బోధనలు తెలుసుకునే స్థాయికి ఎదిగారు. అంతేకాదు ఇస్లాంలోని నీతి, నిజాయితీలు, మానవీయ విలువలతో ప్రభావితులై వారిలో అనేకమంది ధర్మ పరివర్తన కూడా చెందారు. క్రైస్తవులు ముస్లింలపట్ల ఎంతో సఖ్యతతో మెలగసాగారు.

సుల్తాన్ హిషామ్ తండ్రిని మించిన దైవభక్తుడిగా పేరుగాంచాడు. అతని పాలనలో ధర్మవేత్తలకు ఎంతో గౌరవాదరణలు లభించేవి. ప్రజల్లో వారిమాటలే చెల్లుబడిఅయ్యేవి. ఆ కాలంలో మదీనాలో ఇమామ్ మాలిక్ బిన్ అనస్ (రజి) గొప్ప దైవభక్తుడిగా, ఫిఖ్హా వేత్తగా ప్రసిద్ధిచెందారు. అంచేత స్పెయిన్ నుండి కొందరు మదీనా వెళ్ళి ఇమామ్ మాలిక్ (రహ్మలై) సన్నిధిలో కొంతకాలం గడిపి తిరిగొచ్చారు. ఇమామ్ సుల్తాన్ జీవిత విశేషాలను గురించి విని సంతోషం వ్యక్తపరుస్తూ "ఈనాడు ముస్లింల ఖలీఫా కావడానికి అర్హుడెవరైనా ఉన్నాడంటే అతను హిషామ్ బిన్ అబ్దుర్రహ్మాన్ మాత్రమే" అని అన్నారు.

ఇమామ్ మాలిక్ (రహ్మ) నోట వెలువడిన ఈ మాటలు బనూఅబ్బాసీ నాయకులకు ఆగ్రహం తెప్పించాయి. అంచేత వారి చేతుల్లో ఆయన అనేక వేధింపులకు గురికావలసి వచ్చింది. హిషామ్ పాలన ప్రారంభకాలంలో స్పెయిన్‌కు చెందిన సుప్రసిద్ధ ధర్మవేత్తలు ఈసా బిన్ దీనార్, సయీద్ బిన్ అబీహింద్, ఫర్వూన్ బిన్ అబ్బాస్‌లతో పాటు మరికొందరు ధర్మవేత్తలు హజ్‌యాత్ర ఉద్దేశంతో మక్కా చేరుకున్నారు. అక్కడ ఇమామ్ మాలిక్ (రహ్మలై)ని కలుసుకొని ఆయన మాటలు విని ఎంతో ప్రభావితులయ్యారు. తరువాత ఆయన సహచర్యంలో కొన్నాళ్ళు గడిపి స్పెయిన్‌కు తిరిగొచ్చారు.

స్పెయిన్‌కు తిరిగిరాగానే ఇమామ్‌మాలిక్ ధార్మికదృక్పథం, విశ్వాసాలను ప్రచారం చేయనారంభించారు. దాంతో అనేకమంది ధర్మవేత్తలతో పాటు స్పెయిన్ న్యాయమూర్తి అబూఅబ్దుల్లా జైద్ కూడా ఇమామ్‌మాలిక్ దృక్పథాన్ని మెచ్చుకున్నారు. సుల్తాన్ హిషామ్ వాళ్ళనే ఎక్కువగా గౌరవించేవాడు. అంచేత సుల్తాన్ హిషామ్ మాలిక్ ధార్మికదృక్పథాన్ని స్వీకరించడమేగాక దేశసంవిధానం కూడా మాలిక్‌దృక్పథం ప్రకారం మార్చి అమలు పరిచాడు. స్పెయిన్‌లో బనూఉమయ్యా పాలన ఏర్పడటానికి, అది 300 ఏండ్ల పాటు కొనసాగడానికి ప్రధానకారణం స్పెయిన్‌ప్రభుత్వ వ్యవస్థాపకుడు అమీర్ అబ్దుర్రహ్మాన్ తర్వాత సుల్తాన్ హిషామ్ సమర్థవంతమైన పరిపాలనే. కాని హిషామ్ ఏడు సంవత్సరాలు మాత్రమే పరిపాలన చేసి తనువు చాలించాడు. చనిపోయే ముందు కొడుకు హకమ్‌ని తన రాజకీయ వారసుడిగా ప్రకటించి ప్రజలచేత బైత్ చేయించాడు.

**8-హకమ్ బిన్ హిషామ్ పరిపాలన:-** హకమ్ తండ్రి మరణానంతరం హి.శ. 180లో అధికార పగ్గాలు చేపట్టాడు. హిషామ్ చనిపోయాడని వినగానే కుట్రదారులైన అతని సోదరులు సులైమాన్, అబ్దుల్లా మరొకసారి తిరుగుబాటుకు పాల్పడ్డారు. వారిద్దరు ఒకవైపు స్పెయిన్‌లోని తైతలాప్రాంతం క్రైస్తవుల్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టారు.



మరొకవైపు ఫ్రాన్స్ చక్రవర్తిని స్పెయిన్‌పై దాడిచేయమని ఉసిగొల్పారు. దాంతో ఫ్రాన్స్ చక్రవర్తి తన కొడుకు నేతృత్వంలో ఓపెద్ద సైన్యాన్నిచ్చి పంపాడు. ఆ సైన్యం స్పెయిన్‌లోకి జొరబడి అనేకపట్టణాలను ఆక్రమించుకోవడం ప్రారంభించింది. సుల్తాన్ హకమ్ ముందుగా ఫ్రాన్స్‌సైన్యం మీద దాడిచేసి దాన్ని తరిమిగొట్టాడు. ఆతర్వాత దేశఅంతర్గత తిరుగుబాటుని అణచివేశాడు. సులైమాన్ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అబ్దుల్లా లొంగిపోయి, ప్రాణరక్షణ హామీ తీసుకొని మొరాకో వెళ్ళిపోయాడు. హి.శ. 181లో మొదలైన ఈ రెండు అరాచకాలు హి.శ. 184లో అంతమైపోయాయి.

అయితే ఆ తరువాత కొన్నాళ్ళలోనే హి.శ. 185లో ఫ్రాన్స్ చక్రవర్తి నేతృత్వంలో వివిధ ప్రాంతాల క్రైస్తవసైన్యాలు ఉత్తర స్పెయిన్‌పై దాడికి తెగబడ్డాయి. వేరొకవైపు బగ్దాద్ ఖలీఫాగూఢచారులు స్పెయిన్‌లో రహస్యకార్యకలాపాలు సాగిస్తూ ప్రభుత్వఅధికారులను సుల్తాన్ హకమ్‌కు వ్యతిరేకంగా కూడగట్టడం ప్రారంభించారు. ఫలితంగా ఆ అధికారులు క్రైస్తవపాలకులతో కుమ్మక్కయి అరాచకం సృష్టించారు. ఈ అరాచకంలో ధర్మవేత్తలు కూడా తమ వంతు పాత్ర నిర్వహిస్తూ అగ్నికి ఆజ్యం పోశారు. దానికి ముందు మాలికీ దృక్పథం ధర్మవేత్తలు ప్రజల్లో మంచి పేరుప్రతిష్ఠలు సంపాదించి స్వతంత్ర ఆలోచనా పరుడైన సుల్తాన్ హకమ్‌పై తరచుగా విమర్శనాస్త్రాలు సంధిస్తుండేవారు. అంచేత హకమ్ ప్రజల్లో వారి ప్రభావాన్ని కొంతవరకు తగ్గించాడు. దాంతో ఆ ధర్మవేత్తలు అతనిపై కత్తి కట్టి అవకాశం కోసం ఎదురుచూడసాగారు. ఇప్పుడా అవకాశం లభించడంతో రంగంలోకి దిగి అరాచకాగ్నిని ఎగదోయడం ప్రారంభించారు.

అలాంటి పరిస్థితుల్లో సుల్తాన్ హకమ్ ముందుగా ఎంతోనేర్పుతో అంతర్గత అరాచక శక్తుల్ని అణచివేశాడు. మాలికీ దృక్పథం ధర్మవేత్తలు, వారి అభిమానుల్లో అత్యధికమంది (ఇరవై వేలమంది)ని దేశబహిష్కరణ చేసి ఆఫ్రికా పంపివేశాడు. ఆ తర్వాత ఫ్రాన్స్ సైన్యాల పీచం అణచడానికి మూడేండ్ల పాటు యుద్ధం చేయవలసి వచ్చింది. కాని సుల్తాన్, అతని సైన్యాధ్యక్షుడు హాజిబ్ అబ్దుల్‌కరీం స్పెయిన్ సరిహద్దుల్లోని గాత్‌మార్చ్, ఈస్టర్‌యాస్ అనే మరో రెండు క్రైస్తవ రాజ్యాల జోలికి పోకుండా జిజ్యావసూలుతో తృప్తి చెందారు. ఈ పొరపాటే ఆ తర్వాతి కాలంలో స్పెయిన్‌కు ప్రమాదం తెచ్చిపెట్టింది.

సుల్తాన్‌హకం పాలనాకాలంలోనే ఈస్టర్‌యాస్‌కు చెందిన ఓ క్రైస్తవమత నాయకుడు "ఈస్టర్‌యాస్ రాజ్యం-జలీఖియా రాష్ట్రం సరిహద్దులోని ఒక అడవిలో సెయింట్ జేమ్స్ ప్రవక్త సమాధి ఉందని, ఒక దైవదూత నాకా సమాధి ఉనికి తెలియజేశాడని" అన్నాడు. ఈస్టర్‌యాస్ రాజ్యపాలకుడు ఈ మాట విని అక్కడ ఒక చర్చీ నిర్మింపజేశాడు. ఈ సంగతి విని ఐరోపాకు చెందిన సుదూరప్రాంతాల నుండి కూడా వేలాదిమంది క్రైస్తవులు ఇక్కడికి రావడం ప్రారంభించారు. చివరికి ఇక్కడ ఓ పెద్ద పట్టణమే వెలసింది.

సుల్తాన్ సేనాపతి అబ్దుల్‌కరీం ఫ్రాన్స్‌దండయాత్ర నుండి హి.శ. 203లో విజయవంతంగా తిరిగొచ్చాడు. దేశ, విదేశ తిరుగుబాటులు చాలావరకు సద్దుమణగడంతో స్పెయిన్‌లో శాంతిభద్రతలు నెలకొన్నాయి. ప్రజలు సుఖసంతోషాలతో ఉండసాగారు. కాని ఆ తర్వాత కొంతకాలానికే భయంకరమైన కరవురక్కసి విరుచుకుపడింది. ప్రజలు

తిండిగింజల కోసం అల్లాడిపోసాగారు. మరొకవైపు లూటీలు, దొంగతనాలు ఎక్కువై పోయాయి. అలాంటి పరిస్థితిలో కూడా సుల్తాన్ హకమ్ ఎంతో సంయమనం పాటిస్తూ తగిన చర్యలు తీసుకున్నాడు. కరువుపీడితుల కోసం ఇతర ప్రాంతాల నుండి ధాన్యం తెప్పించి పంపిణీ చేయించాడు; లూటీలు అరికట్టడానికి అదనపు పోలీసు సిబ్బందిని నియమించాడు; అవసరార్థుల్ని ఆదుకోవడానికి ప్రత్యేక కేంద్రాలను నెలకొల్పాడు. ఈ సంక్షేమకార్యాలు చూసి ప్రజలు సుల్తాన్‌ని ఎంతగానో అభిమానించసాగారు.

సుల్తాన్ హకమ్ పాలనాకాలమంతా విదేసీదాడులు, అంతర్గత సమస్యలు-తిరుగు బాటులతో నిండిపోయింది. అయినప్పటికీ సుల్తాన్ జనసంక్షేమ కార్యాలను ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. చివరికి 27 సంవత్సరాల పాలన తరువాత హి.శ. 206లో 52 ఏళ్ళ వయసులో వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు. చనిపోయేముందు తన కొడుకు అబ్దుర్రహ్మాన్ సానిని తన రాజకీయవారసుడిగా నియమించాడు.

**9-అబ్దుర్రహ్మాన్ సాని పరిపాలన:-** అబ్దుర్రహ్మాన్ సాని తన తండ్రి మరణా నంతరం హి.శ. 206లో గద్దెనెక్కాడు. సుల్తాన్ హకం పినతండ్రి అబ్దుల్లా దేశబహిష్కర ణకు గురై హి.శ. 184లో మొరాకో వెళ్ళి ఉండసాగాడు. ఇప్పుడు సుల్తాన్ హకం చని పోయాడని వినగానే మొరాకో నుండి స్పెయిన్‌కు వచ్చి మరొకసారి తిరుగుబాటు జెండా ఎగరవేశాడు. అప్పటికి అబ్దుల్లా చాలా వృద్ధుడైపోయాడు. అయినా అధికార దాహం తీరలేదు. స్పెయిన్‌లో రాష్ట్రగవర్నర్లుగా ఉంటున్న తన ముగ్గురు కొడుకులు తన తిరుగుబాటు ఉద్యమానికి మద్దతిస్తారన్న గంపెడాశతో రంగంలోకి దిగాడు.

అయితే వెంటనే ప్రభుత్వసైనికులు దాడికి దిగడంతో అబ్దుల్లా పరాజితుడై పారి పోయాడు. అతని కొడుకులు ప్రభుత్వం పక్షానే ఉండి, అనవసరంగా అరాచకం సృష్టించి రాజ్యాధినేత కావాలన్న దురాలోచనను మానుకోండని తండ్రికి నచ్చజెప్పారు. దాంతో అబ్దుల్లా హతాశుడై తనను క్షమించమని సుల్తాన్ అబ్దుర్రహ్మాన్‌ని ప్రాధేయ పడ్డాడు. సుల్తాన్ అతడ్ని క్షమించడమే గాకుండా ముర్సియా రాష్ట్రానికి గవర్నర్‌గా నియ మించాడు. ఆ పదవిలో అబ్దుల్లా చనిపోయేదాకా కొనసాగాడు.

సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ గద్దెనెక్కిన మొదటి సంవత్సరమే (అంటే హి.శ.206 లోనే) సుప్రసిద్ధ సంగీతవిద్వాంసుడు, తత్వవేత్త, పరిశోధకుడయిన అలి బిన్ నాఫె సిరియా, ఇరాఖ్‌లలో తనకు సరైన గుర్తింపు లభించకపోవడంతో సుల్తాన్ హకమ్ ఆహ్వానంపై స్పెయిన్‌కు బయలుదేరాడు. అతను స్పెయిన్‌కు చేరుకోక ముందే సుల్తాన్ హకమ్ చనిపోవడం, అబ్దుర్రహ్మాన్ సాని గద్దెనెక్కడం జరిగాయి. అలి బిన్ నాఫె స్పెయిన్ చేరుకోగానే అతనికి రాజలాంఛనాలతో ఘనమైన స్వాగతం లభించింది.

అలి బిన్ నాఫె స్పెయిన్‌లో అనేక సామాజిక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. రుచి కరమైన వంటకాలు తయారుచేసే పద్ధతులు, అందమైన వస్త్రధారణ విధానాలు కనిపెట్టి ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాడు. అంతేకాదు, గొట్టాల ద్వారా నీరు సరఫరా అయ్యే మంచినీటి కుళాయిలు కనిపెట్టాడు. ఈనాడు పాశ్చాత్య ప్రపంచమంతటా కన్పిస్తున్న ముళ్ళగరిట వాడకం కూడా అతని మేధాజనితమే. అతను సంగీతవిద్యను



కూడా ప్రజలకు బాగా నూరిపోశాడు. ఇలా అలి బిన్ నాఫె సైనికవృత్తి-సాహసప్రవృత్తి గల స్పెయిన్ ముస్లింలను సుఖప్రియులుగా, సున్నిత మనస్కులుగా మార్చాడు.

ఆ తరువాత ముస్లింలలో క్రమంగా అంతర్గత కుమ్ములాటలు మొదలయ్యాయి. కొందరు అధికారుల్లో తిరుగుబాటు జ్వాలలు ప్రజ్వరిల్లాయి. అదను కోసం కాచుకొని ఉన్న క్రైస్తవ పాలకులు స్పెయిన్‌పై దాడులకు తెగబడ్డారు. స్పెయిన్‌లో క్రైస్తవులకు ముస్లింపాలకులు సంపూర్ణ మతస్వేచ్ఛ ఇచ్చారు. క్రైస్తవుల మతవ్యవహారాల్లో, తగాదాల్లో ముస్లింలు ఏమాత్రం తలదూర్చేవారు కాదు. చర్చీల నిర్వహణ ఖర్చులు స్వయంగా ప్రభుత్వమే భరిస్తుండేది. ముస్లిం పండుగల్లో క్రైస్తవులు, క్రైస్తవ పండుగల్లో ముస్లింలు సంతోషంగా పాల్గొనేవారు. అయినప్పటికీ క్రైస్తవ పాలకులు స్పెయిన్‌లో ముస్లింలను నామరూపాల్లేకుండా చేయడానికి కుట్రలు పన్నడం ప్రారంభించారు.

దాని ప్రకారం ఉత్తర స్పెయిన్‌కు చెందిన క్రైస్తవ మతనాయకులు తమ మతసేవ కోసం ప్రాణాలు సైతం అర్పించడానికి సిద్ధమయ్యేలా తమవారిని తయారుచేశారు. ఈ ఆత్మాహుతి కార్యకర్తలు పట్టణవీథుల్లో, జనసమూహాల్లో తిరుగుతూ మహాప్రవక్త ముహమ్మద్ (స)ను దూషిస్తూ, ఖుర్‌ఆన్‌ని కించపరుస్తూ ముస్లింలలో మతోద్రేకాన్ని రెచ్చ గొట్టేవారు. ఈ నోటిదురుసు కార్యకర్తల్ని మొదట అరెస్టుచేసి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టారు. కాని అక్కడా వారు తమనోళ్ళు పారేసుకున్నారు. అంచేత న్యాయమూర్తి వారికి మరణశిక్ష విధించాడు. ఈవిధంగా ఒకడు హతమార్చబడగానే మరొకడు నాయస్థానానికి వచ్చి దైవప్రవక్త (స)ను బహిరంగంగా దూషించేవాడు. న్యాయమూర్తి అతనిక్కూడా మరణశిక్ష విధించేవాడు. ఈవిధంగా ఈ ఆత్మాహుతి కార్యకర్తలు ఒకరి తరువాత ఒకరు చొప్పున అనేకమంది వచ్చి తమ నోటిదురుసుతో మరణశిక్షలకు గురయ్యారు. క్రైస్తవ మతపెద్దలు ఇలా మరణించినవారు దేవుని ప్రియభక్తులని, అమరవీరులని ప్రచారం చేసి, వారి సమాధుల్ని పుణ్యక్షేత్రాలుగా చేశారు. దాంతో ఆ సమాధుల్ని సందర్శించి పుణ్యం సంపాదించుకోడానికి సుదూరప్రాంతాల నుండి కూడా వేలాదిమంది అజ్ఞానులు రావడం మొదలెట్టారు. ఇలా ఈ కార్యకలాపాలు అనేక సంవత్సరాలు కొనసాగాయి. సుల్తాన్ అబ్దుర్రహ్మాన్‌కు ఈ మతోన్మాద ధోరణి పెద్ద తలనొప్పిగా మారింది.

చివరికి విజ్ఞతావివేచనలు గల కొందరు నాయాకులు ఓ గొప్పసదస్సు నిర్వహించి దేశంలోని ప్రముఖ పాదరీలందరినీ ఆహ్వానించారు. ఆ సదస్సులో "క్రైస్తవమతం దృష్ట్యా ముస్లింల ప్రవక్త (స)ను, వారి మతగ్రంథం ఖుర్‌ఆన్‌ని దూషించడం పుణ్యకార్యమా, కాదా? ఈవిధంగా హతమార్చబడుతున్నవారు అమరవీరులా, కాదా?" అనే సమస్యను లేవనెత్తారు. అప్పుడు పాదరీలంతా వీరావేశంతో ప్రసంగిస్తూ ఈ చేష్ట క్రైస్తవమతానికి పూర్తిగా వ్యతిరేకమని, ఇలా తమనుతాము ప్రమాదంలో పడవేసుకొని హత్యకు గురవడం పాపకార్యమని చెప్పారు. చివరికి ఆ విధంగానే తీర్మానించడం జరిగింది.

దాంతోపాటు మరొక విచిత్రతీర్మానం కూడా చేయబడింది. ఇప్పటివరకు హతమార్చ బడినవారు అమరగతులుగాను, ఇకముందు ఇలా హతమార్చబడేవారు ఘోరపాపానికి పాల్పడినవారుగాను, దుర్మార్గులుగాను భావించబడతారని తీర్మానం జరిగింది.

పాదరీల సదస్సులో జరిగిన ఈ తీర్మానాల పట్ల స్పెయిన్‌లోని మెజారిటీ క్రైస్తవులు ఎంతో ప్రభావితులై తమ ఆమోదం వ్యక్తపరిచారు. కాని ఉత్తరరాష్ట్రాల పాదరీలు మాత్రం సదస్సు తీర్మానాలను తుంగలోతొక్కి తమ దుశ్చర్యలను యధాతథంగా కొనసాగించారు. దాంతో ముస్లిం-క్రైస్తవుల మధ్య సాగుతున్న సత్సంబంధాలు బీటలు వారసాగాయి. ఈ పరిస్థితి సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సానీని బాగా చికాకు పర్చాయి.

సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ పాలనాకాలమంతా యుద్ధాలు, అంతఃకలహాలతో గడచినప్పటికీ అతను ప్రజాసంక్షేమాన్ని, విద్యాకళలను విస్మరించలేదు. అతను గొప్ప ధర్మవేత్త, ధర్మశాస్త్ర ప్రవీణుడు; దాదాపు ప్రతి ఊళ్ళో మసీదులు, మదర్సాలు నిర్మింపజేశాడు; రోడ్లు వేయించాడు; వ్యాపారులు, బాటసారుల కోసం వసతులు కల్పించాడు; వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి బంజరు భూములను సస్యశ్యామలం చేశాడు. చివరికి 21 సంవత్సరాల పాలన తర్వాత హి.శ. 238లో వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు. చనిపోయే ముందు కొడుకు ముహమ్మద్‌ని తన రాజకీయ వారసుడిగా చేశాడు.

**10-ముహమ్మద్ బిన్ అబ్దుర్రహ్మాన్ పరిపాలన:-** సుల్తాన్ ముహమ్మద్ తండ్రి మరణానంతరం హి.శ. 238లో అధికారపీఠం అధిరోహించాడు. ముందుగా అతను అసమర్థులు, అవినీతిపరులైన అధికారుల్ని తొలగించి వారిస్థానాల్లో ఇస్లామీయ ఆదేశాల్ని పాటించే నీతిమంతుల్ని, దైవభీతిపరుల్ని నియమించాడు. ప్రభుత్వయంత్రాంగంలో జరిగిన ఈ ప్రక్షాళన పట్ల ముస్లిం ధర్మవేత్తలు హర్షం వ్యక్తపరిచారు.

ఆ కాలంలోనే హజ్‌యాత్రికుల ద్వారా స్పెయిన్‌లో హంబలీ ఫిఖ్హా ప్రవేశించింది. ఆనాటి నుండి ఖర్తబాలో హంబలీ మౌల్వీలకు, మాలికీ మౌల్వీలకు మధ్య వాదోపవాదాలు మొదలైనాయి. దాంతో ముస్లింలు రెండువర్గాలుగా చీలి పరస్పరం కొట్టుకునే దాకాపోయారు. ఈ పరిస్థితి అంతర్‌యుద్ధాలకు దారితీసే ప్రమాదం ఉందని భావించిన సుల్తాన్ ముహమ్మద్ మౌల్వీల సభల్లో జోక్యంచేసుకొని ఆ ప్రమాదాన్ని నివారిస్తూ సైనిక భర్తీ నిర్ణయం తీసుకున్నాడు. ఆవిధంగా సుల్తాన్ కొన్నాళ్ళలోనే ఓ పెద్ద సైనికపటాలం తయారుచేసి ఉత్తర క్రైస్తవరాష్ట్రాలపై దాడులు చేయడానికి పంపించాడు.

ఆనాటి నుండి యుద్ధపరంపర మళ్ళీ మొదలయింది. ముస్లింలలో అంతఃకలహాలతోపాటు కొందరువిద్రోహులు కూడా పుట్టుకొచ్చారు. అదీగాక వారి మతపండితులు, ఫిఖ్హావేత్తలు మానవీయహక్కులకు వ్యతిరేకంగా కొన్ని ఫత్వాలు, శాసనాలు జారీచేశారు. వాటి కారణంగా క్రైస్తవపౌరుల హక్కులకు విఘాతం కల్గింది. దాంతో వారు అసంతృప్తికి లోనయ్యారు. మరొకవైపు ఈ ఫత్వాలు నవముస్లింలలో అపనమ్మకం కలిగించింది. దాంతో వారు ఇస్లాంను వదలి తిరిగి క్రైస్తవంలోకి చేరిపోసాగారు. ముస్లింలకు భిన్నంగా క్రైస్తవుల్లో ఐకమత్యంతోపాటు మతావేశం తీవ్రంగా ఉండేది. అందుకే ముస్లింల అధీనంలోని స్పెయిన్ రాజ్యపరిధి క్రమేణా కుంచించుకు పోసాగింది.

అంచేత సుల్తాన్ ముహమ్మద్ నిరంతరం యుద్ధవాతావరణంలో, సమరప్రమాదాల సుడిగుండంలో ఉంటూ క్షణంతీరిక లేకుండా దుష్టశక్తులతో పోరాడుతూ పరిపాలన



సాగించవలసి వచ్చింది. చివరికి 34 ఏళ్ళ పాలన తర్వాత 66 సంవత్సరాల వయసులో హి.శ.273లో కొడుకు మంజర్‌ని తన రాజకీయవారసుడిగా చేసి చనిపోయాడు.

**11-మంజర్ బిన్ ముహమ్మద్ పరిపాలన:-** సుల్తాన్ మంజర్ గద్దె నెక్కగానే ఉమర్ బిన్ హఫ్సూన్ అనే తిరుగుబాటుదారుడ్ని ఎదుర్కోవడానికి మూడు సార్లు ప్రయత్నించి విజయం సాధించాడు. కాని మూడుసార్లు కూడా ఉమర్ మోసంచేసి తప్పించుకున్నాడు. నాల్గవ సారి అతను తనకెక్కువ ప్రాబల్యం ఉన్న ప్రాంతంలోని కోటలో దూరి తలుపులు మూసుకున్నాడు. సుల్తాన్ మంజర్ కోటను ముట్టడించాడు. ఈ ముట్టడి సుదీర్ఘకాలం సాగింది. ఆ రోజుల్లోనే సుల్తాన్ మంజర్ వ్యాధిగ్రస్తుడై రెండేళ్ళ పాలన తర్వాత హి.శ. 275లో చనిపోయాడు. అతనికి సంతానం లేకపోవడంతో రాజ్యసలహా మండలి అతని సోదరుడు అబ్దుల్లాకు అధికారం కట్టబెట్టింది.

**12-అబ్దుల్లా బిన్ ముహమ్మద్ పరిపాలన:-** సుల్తాన్ అబ్దుల్లా గద్దె నెక్కగానే తిరుగుబాటుదారుడు ఉమర్ బిన్ హఫ్సూన్ ప్రభుత్వాన్ని అంగీకరించి పెద్ద తప్పు చేశాడు. అతను అధికారం చేపట్టేనాటికి హి.శ. 275లో బనూఉమయ్యావారి ప్రభుత్వం చాలా బలహీన పడిపోయింది. ప్రభుత్వ ధనాగారం చాలావరకు ఖాళీ అయిపోయింది. ప్రభుత్వఆదాయం గతంలో పదిలక్షల దీనార్లదాకా చేరుకోగా తర్వాత క్రమేణా తగ్గిపోతూ ఇప్పుడది లక్ష దీనార్లకు పడిపోయింది. దేశ,విదేశ శక్తులు క్రమంగా బలం పుంజుకుంటూ ఖర్తబా(రాజధాని) ప్రభుత్వాన్ని కాటేయడానికి కాచుకొని ఉన్నాయి.

అలాంటి పరిస్థితిలో సుల్తాన్ అబ్దుల్లా సహనం-సంయమనాలు పాటిస్తూ, విజ్ఞతా వివేచనాలతో వ్యవహరిస్తూ 14వేల మంది సైనికులతో 30వేలమంది సైనికులున్న ఉమర్ బిన్ హఫ్సూన్‌ని చిత్తుగా ఓడించి కొండల్లోకి తరిమిగొట్టాడు. అలాగే మరో తిరుగుబాటుదారుడ్ని కూడా మట్టికరిపించి రాజ్యాన్ని విస్తృతపరిచాడు. వేరొకవైపు క్రైస్తవరాజ్యాలతో శాంతిఒప్పందాలు చేసుకున్నాడు.

సుల్తాన్ అబ్దుల్లాకు కలిగిన పదకొండు మంది కొడుకుల్లో ముతరఫ్, ముహమ్మద్ అనేవాళ్ళు ఇతరులకంటే ఎక్కువ తెలివగలవాళ్ళు, రాజకీయవ్యవహారాల్లో జోక్యం చేసుకోగల సమర్థులు. అయితే వారిద్దరిలో విభేదాలు వచ్చాయి. దానికి తోడు దర్బారీలు కొందరు ఆ అన్నదమ్ముల మధ్య ఏర్పడిన చిచ్చును మరింత రగిలించడానికి ప్రయత్నించారు. ముతరఫ్ తన సోదరుడు ముహమ్మద్‌పై తీవ్రమైన ఆరోపణలు మోపుతూ తన తండ్రిచెవులు కొరకడం ప్రారంభించాడు. దీనికి కొందరు యువదర్బారీలు వంతపాడారు. దాంతో సుల్తాన్ అబ్దుల్లా కొడుకు ముహమ్మద్‌పై కారాలు-మిరియాలు నూరసాగాడు. ముహమ్మద్ అది భరించలేక ఖర్తబా నుండి పారిపోయి తిరుగుబాటుదారుడు ఉమర్ బిన్ హఫ్సూన్ దగ్గరకు చేరుకున్నాడు. అక్కడ కొన్నాళ్ళు ఉండి తప్పు తెలుసుకొని పశ్చాత్తాపంచెంది, ప్రాణరక్షణ హామీ కోరుతూ తండ్రి దగ్గరకు తిరిగొచ్చాడు.

అయితే ముతరఫ్ తన తండ్రి ముందు మళ్ళీ ముహమ్మద్‌పై ఆరోపణాస్త్రాలు సంధించడం మొదలెట్టాడు. దాంతో సుల్తాన్ అబ్దుల్లా, ముహమ్మద్‌ని రాజమహల్‌లోని

ఓచోట నిర్బంధంలో ఉంచాడు. కొన్నాళ్ళకు సుల్తాన్ అబ్దుల్లా ఏదో పని మీద రాజధాని వదలి వేరేప్రాంతానికి పోవలసివచ్చింది. అప్పుడు ముతరఫ్ రాజమహల్‌లో నిర్బంధానికి గురైవున్న ముహమ్మద్‌ని హతమార్చాడు. సుల్తాన్ ఈ సంగతి తెలుసుకొని చాలా బాధ పడ్డాడు. ఆ తర్వాత ముతరఫ్ వ్యక్తిగత కక్షతో ప్రధానమంత్రి అబ్దుల్‌మలిక్ బిన్ ఉమయ్యాని కూడా చంపేశాడు. అప్పుడు సుల్తాన్ అబ్దుల్లా ప్రతీకార శిక్షగా ముతరఫ్‌ని మరణశిక్ష విధించి వెంటనే దాన్ని అమలుపరిచాడు.

సుల్తాన్ అబ్దుల్లా 25 సంవత్సరాల పాలన తర్వాత వ్యాధిగ్రస్తుడై హి.శ. 300లో, 42 ఏండ్ల వయసులో చనిపోయాడు. ఇతని పాలనాకాలం కూడా అరాచకాలతో నిండి పోయింది. ఫిఖ్హావేత్తలు అంతగా ప్రాముఖ్యం లేని ధార్మికవిషయాల్లో వాదోపవాదాలు చేసుకుంటూ ప్రజల్లో అనైక్యత, అంతర్విభేదాలు సృష్టించడంలో తమ వంతు పాత్ర నిర్వహిస్తూనేఉన్నారు. అలాంటి పరిస్థితిలో సుల్తాన్ అబ్దుల్లా మనుమడు అబ్దుర్రహ్మాన్ బిన్ ముహమ్మద్ అధికారపగ్గాలు చేపట్టాడు.

**13-అబ్దుర్రహ్మాన్ సాలిస్ పరిపాలన :-** అబ్దుర్రహ్మాన్ సాలిస్ పేరుతో చరిత్ర కెక్కిన అబ్దుర్రహ్మాన్ బిన్ ముహమ్మద్ 21 సంవత్సరాల వయసులో అధికార సింహాసనం అధిష్ఠించాడు. విద్యాజ్ఞానార్జనలతో పాటు యుద్ధకళలో కూడా గొప్ప నైపుణ్యం సంపా దించిన ఈ యువ సుల్తాన్ తన సుగుణసంపత్తితో అనతికాలంలోనే తన బంధువులు, దర్బారీలు, ధర్మవేత్తలు, ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాడు. అతను అధికారం చేపట్టగానే మొట్టమొదట గత సుల్తానులు, ముఖ్యంగా సుల్తాన్ అబ్దుల్లా షరీఅత్ ఆజ్ఞ లకు వ్యతిరేకంగా ప్రజలపై విధించిన పన్నులభారాన్ని తొలగించాడు. దాంతో ప్రజల్లో అతని పేరుప్రతిష్ఠలు బాగా ఇనుమడించాయి. ఆ తర్వాత ఖర్తబా ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్న చిన్నచిన్న రాష్ట్రాల పాలకులు ఖర్తబా ప్రభు త్వానికి విధేయులైపోతే వారి గతపొరపాట్లను క్షమించడం జరుగుతుందని ప్రకటించాడు. ఈ ప్రకటన వినగానే వారంతా ఖర్తబా చేరుకొని తమ విధేయత ప్రకటించడమే గాక పన్నులు కూడా తిరిగి చెల్లించడం ప్రారంభించారు. దాని వల్ల ప్రభుత్వధనాగారంలో ఏర్పడిన లోటు చాలావరకు తీరిపోయింది.

సువిశాల ఇస్లామీయ సామ్రాజ్యం నుండి విడిపోయిన స్వతంత్ర రాజ్యాలన్నిటినీ సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ హి.శ. 310 నాటికల్లా అనేక యుద్ధాల ద్వారా అణచివేసి ఇస్లామీయ సామ్రాజ్యాన్ని విస్తృతపరిచాడు. ఆ తర్వాత చుట్టుపక్కలున్న క్రైస్తవరాజ్యాల ఆక్రమణలో ఉన్న ముస్లిం ప్రాంతాలను కూడా హి.శ. 315 కల్లా వశపరచుకున్నాడు. అటు క్రైస్తవ రాజ్యాలు అంతఃకలహాలతో సతమతమవడం గమనించిన సుల్తాన్ వాటి జోలికి పోకుండా తన దృష్టిని మొరాకో వైపు సారించాడు.

మొరాకోను అనేక ఏండ్ల నుంచి ఇద్రీస్ వంశస్థులు పరిపాలిస్తుండేవారు. కాని తరువాత ఉబైదీన్ కుటుంబం రంగంలోకి దిగడంతో మొరాకో రాజ్యం విచ్ఛిన్నమై చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయింది. ఆ రాజ్యాల ఇద్రీసీ పాలకులు ఉబైదీ పాలకుల దౌర్జన్యం పట్ల విసిగెత్తిపోయి సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్‌కు విధేయులైపోయారు.



సుల్తాన్ దాన్ని దైవసహాయంగా భావించి తక్షణమే సైన్యం తీసుకొని సముద్రమార్గం గుండా మొరాకో చేరుకొని ఉబైదీ సైన్యాన్ని పారదోలాడు. ఆ విధంగా హి.శ.322 నాటికి మొరాకో కూడా అతని సామ్రాజ్యంలో అంతర్భాగమైపోయింది.

ఆ కాలంలోనే క్రైస్తవపాలకులు తమ అంతఃకలహాలకు స్వస్తిచెప్పి సుల్తాన్ అబ్దు ర్రహ్మాన్ సాలిస్‌కు వ్యతిరేకంగా సర్‌ఖిస్తా రాష్ట్రగవర్నర్ ముహమ్మద్ బిన్ హిషామ్‌ని తిరుగుబాటుకు ప్రేరేపించారు. దాంతో ముహమ్మద్ క్రైస్తవసైన్యాల సహకారంతో తిరుగు బాటుజెండా ఎగరవేశాడు. సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ ఈ సంగతి తెలుసుకోగానే తిరుగు బాటును అణచడానికి బయలుదేరాడు. ఒకచోట రెండుసైన్యాల మధ్య సంకులసమరం జరిగింది. తిరుగుబాటుదారుడు ముహమ్మద్ బిన్ హిషామ్ ఓడిపోయి సుల్తాన్‌కు పట్టు బడ్డాడు. అతని సైన్యం బ్రతుకుజీవుడా అంటూ పారిపోయింది. ఆ తర్వాత సుల్తాన్ ఒక్కొక్క క్రైస్తవరాజ్యంపై వరుసగా దాడులుచేసి వాటి మెడలు వంచాడు.

అయితే ఆ తరువాత హి.శ. 327లో క్రైస్తవపాలకులు ఉమయ్యా బిన్ ఇస్‌హాఖ్ అనే మరో ముస్లింగవర్నర్‌ని తిరుగుబాటుకు ఉసిగొల్పారు. ఈసారి క్రైస్తవులు యుద్ధ వ్యూహం పకడ్బందీగా రచించి రంగంలోకి దిగారు. ఫ్రాన్స్ నుండి కూడా వేలసంఖ్యలో క్రైస్తవయోధులు స్పెయిన్‌కు చేరుకున్నారు. కొన్నాళ్ళలోనే బ్రహ్మాండమైన సైనికవాహిని తయారయింది. వారు సమూరా కోట చుట్టూ ఏడు ప్రహరీగోడలు కట్టారు. ప్రతి గోడ తరువాత ఓ లోతైన కందకం కూడా తవ్వారు.

ఈ తిరుగుబాటు సంగతి తెలియగానే సుల్తాన్ యాభైవేల మంది యోధులతో బయలుదేరాడు. హి.శ. 327లో సమూరాకోట ప్రహరీగోడల బయట యుద్ధం మొదల యింది. తిరుగుబాటుసైనికులు ముస్లింల ధాటికి నిలువలేక కోటలో దూరి తలుపులు మూసుకున్నారు. ముస్లింలు తీవ్రంగా పోరాడి మూడుగోడలు దాటి లోపలికి చొచ్చుకు పోయారు. కాని మూడవగోడ దాటి లోపల ప్రవేశించగానే రెండువైపుల దాక్కున్న శత్రు సైనికులు అకస్మాత్తుగా దాడిచేయనారంభించారు. ఈ హఠాత్పరిణామంతో కంగారుపడిన ముస్లింలు ముందుకూ పోలేక, వెనక్కీ జరగలేక నీటితో నిండిన కందకంలో పడి మునిగిపోయారు. సుల్తాన్ అబ్దుర్రహ్మాన్‌తో పాటు యాభైమంది మాత్రమే ఎలాగో ప్రాణాలతో బయటపడగలిగారు. మిగిలినవారంతా మృత్యువాత పడ్డారు. ముస్లింలు స్పెయిన్ భూభాగంపై అడుగుపెట్టినప్పటి నుండి ఈనాటివరకు వారి యోధులు ఏ యుద్ధంలో కూడా ఇంత పెద్దసంఖ్యలో మృత్యువాత పడలేదు. యాభైవేల మందిలో యాభైమంది మాత్రమే మృత్యుకోరల నుండి తప్పించుకున్నారు!

ఈ యుద్ధం తర్వాత తిరుగుబాటు గవర్నర్ ఉమయ్యా బిన్ ఇస్‌హాఖ్ యాభైవేల ముస్లిం మృతదేహాలను చూసి పశ్చాత్తాపం చెందాడు. అతని అంతరాత్మ "నువ్వు ఇస్లాం వ్యతిరేకశక్తులతో చేతులు కలిపి వేలాదిమంది తోటిముస్లింలను హతమార్చి ఘోరమైన పాపం చేశావ"ని అతడ్ని నిందించింది. అంచేత అతను తన తప్పు క్షమించమంటూ సుల్తాన్‌కు లేఖ రాశాడు. ఆతర్వాత అతను క్రైస్తవుల్ని వదలి ఖర్తబాకు వచ్చేశాడు. సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ ఖర్తబాకు రాగానే బ్రహ్మాండమైన సైన్యాలను తయారుచేసి, క్రైస్తవ

రాజ్యాలపైకి పంపించాడు. ఆ సైన్యాలు ఒప్పందం ఉల్లంఘించి దాడికి తెగబడిన క్రైస్తవ రాజ్యాల్లో నానాబీభత్సం సృష్టించి అపార సమరసొత్తుతో వెనక్కి మరలాయి.

హి.శ. 327లో అబ్బాసీ ఖలీఫా హత్యచేయబడ్డాడని, అబ్బాసీ ఖిలాఫత్ పాలన నామ మాత్రంగా మిగిలిపోయిందని, ఉబైదీ షియా వర్గీయులు తమను ఖిలాఫత్ వారసులుగా ప్రకటించుకున్నారని సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్‌కు సమాచారం అందింది. దాంతో తనకు అబ్బాసీవంశస్థుల నుండి ప్రమాదం తప్పిపోయినట్లు భావించి, రాజధాని ఖర్తబాని మరింత అందంగా తీర్చిదిద్ది దాని వైభవాన్ని ద్విగుణీకృతం చేసే పని వైపు దృష్టి సారించాడు. దాదాపు పదేళ్ళపాటు ఉత్తర క్రైస్తవరాజ్యాలపై దాడులుచేసి వాటి పీచం అణచి వేశాడు. మరోవైపు నౌకాబలగాన్ని పెంచడానికి పెద్దపెద్ద యుద్ధనౌకలను తయారు చేయించాడు. స్పెయిన్ వర్తకులు తమ సరుకులను సుదూరప్రాంతాలకు తీసికెళ్ళడానికి కావల్సిన సౌకర్యాలు కల్పించాడు. ఆరోజుల్లో సుల్తాన్ అబ్దుర్రహ్మాన్‌సాలిస్ కీర్తిప్రతిష్ఠలు యూరప్ అంతటా విస్తరించాయి. క్రైస్తవరాజ్యాలు అతని ప్రసన్నత పొంది శత్రువుల నుండి కాపాడుకోవడానికి పోటీపడుతూ ఖరీదైన కానుకలు, లేఖలు పంపేవి.

హి.శ. 339లో సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ తన కొడుకు హకమ్‌ని తన రాజకీయ వారసుడిగా చేశాడు. రెండవ కొడుకు అబ్దుల్లా నమాజ్, రోజాలపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించి తపస్విగా పేరుపడ్డాడు. అయితే అబ్దుల్‌బారి అనే ఓ ఫిఖ్హావేత్త అబ్దుల్లాలో అధికారకాంక్షను రేకెత్తించి సుల్తాన్ అబ్దుర్రహ్మాన్‌ని, అతని రాజకీయవారసుడు హకమ్‌ని హతమార్చే కుట్ర కోసం అతడ్ని ఒప్పించాడు. అయితే ఈ కుట్రవ్యవహారం ఎలాగో బయటపడింది. అప్పుడు సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ వెంటనే వారిద్దర్నీ జైల్లో పడ వేయించాడు. అదేరోజు అబ్దుల్లాను జైలు నుండి తీయించి చంపించాడు. జైల్లో పడివున్న ఆ ఫిఖ్హావేత్త ఈ సంగతి వినగానే పాపం అని తెలిసినా ప్రజల్లో అభాసుపాలు కాకూడదని అనుకున్నాడేమో ఆత్మహత్య చేసుకున్నాడు.

**భవననిర్మాణంలో సరిరారు నీకెవరు:-** స్పెయిన్ చక్రవర్తి అబ్దుర్రహ్మాన్ సాలిస్ భవననిర్మాణంలో భారతచక్రవర్తి షాజహాన్‌ని కూడా మించిపోయాడు. ఖర్తబాలోని జామియామస్జిద్ నిర్మాణం అబ్దుర్రహ్మాన్ అవ్వల్ పాలనలో ప్రారంభమై అతని కొడుకు హిషామ్ కాలంలో పూర్తయింది. అయితే ఆ తర్వాత కూడా ప్రతిసుల్తాన్ దానికి మెరుగులు దిద్ది దాని కళాకాంతులు మరింత పెంచడానికి ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెట్టాడు. ఇప్పుడు అబ్దుర్రహ్మాన్ కాలంలో అందర్నీతలదన్నే విధంగా దాని విస్తరణ, మెరుగుల పని జరిగింది. దాని వివరాలు ఇలా ఉన్నాయి:

ఆ మసీదు విస్తీర్ణం తూర్పు నుండి పడమర వరకు 500 అడుగుల పొడవుంది. ఇమామ్ నమాజ్ చేసే మిహ్రాబ్ 1417 పాలరాతి స్తంభాలతో నిర్మించబడింది. దాని సమీపంలోని ఎత్తయిన ప్రసంగవేదిక (మింబర్) నిర్మాణంలో స్వచ్ఛమైన ఏనుగుదంతాలతో పాటు, 36,000 వివిధ రంగులు, ఆకారాలతో కూడిన కర్రముక్కలు వాడటం జరిగింది. ఈ వేదిక తయారుకావడానికి ఏడేళ్ళు పట్టింది. అజాన్ చెప్పడానికి కట్టబడిన పాత స్థూపాన్ని పడగొట్టి 108 అడుగుల ఎత్తయిన కొత్త స్థూపం నిర్మించబడింది. దానిపై ఎక్క



డానికి, దిగడానికి 107 మెట్లతో కూడిన రెండు స్టయిర్‌కేసులు కట్టబడ్డాయి. వెలుగు కోసం మస్జిద్‌లో 10,000 వృక్షదీపాలు పెట్టబడ్డాయి. వాటిలో మూడు పెద్ద వృక్షదీపాలు వెండితో చేయబడ్డాయి. మిగిలిన వృక్షదీపాలు ఇత్తడితో చేయబడ్డాయి. మస్జిద్ నిర్వహణ కోసం 300 మంది ఉద్యోగులు నియమించబడ్డారు.

సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ భార్యలలో జహ్‌రా అనే ఒక క్రైస్తవ మహిళ కూడా ఉండేది. ఆ సతీమణి కోసం రాజధాని ఖర్తబాకు నాలుగు మైళ్ళ దూరంలోని కొండ దిగువన ఆహ్లాదకరమైన వాతావరణంలో బ్రహ్మాండమైన ఓ మహల్ నిర్మించబడింది. దాన్ని జహ్‌రామహల్ అంటారు. దానికి ఎత్తయిన, వివిధరకాల డిజైన్లతో కూడిన 15,000 తలుపులు ఉండేవి. మహల్ విస్తీర్ణం నాలుగు మైళ్ళు పొడవు, మూడు మైళ్ళు వెడల్పు కలిగివుంది. మహల్ నిర్మాణానికి 25 సంవత్సరాలు పట్టింది. నిర్మాణం కోసం రోజూ 10,000 మంది నిర్మాతలు, 4000 వేల ఒంటెలు, కంచరగాడిదలు పనిచేయవలసి వచ్చింది. ఈ మహల్లో పాలరాళ్ళతోపాటు ఇతర విలువైన రంగురాళ్ళతో కూడిన 4,316 బురుజులు, స్తంభాలు ఉండేవి. ఈ స్తంభాలలో కొన్నిటిని ఫ్రాన్స్, కాన్‌స్టాంటినోపిల్ రాజులు కానుకలుగా పంపించారు. మహల్ నిర్మాణం కోసం ఆ రాజులు సుప్రసిద్ధ ఇంజినీర్లను కూడా పంపించారు. మహల్లో వివిధరకాల వజ్రవైఢూర్యాలు, మణిమాణిక్యాలు, వెండిబంగారాలతో చేయబడిన 12 పశుపక్షుల ముఖాకృతులు కూడా పొదగబడ్డాయి. వాటి నోళ్ళనుంచి ఎడతెరిపి లేకుండా నీటిధారలు పారలుతుండేవి.

ఈ జహ్రామహల్‌లో ఖసరుల్‌ఖుల్ఫా అనే ఓ ప్రత్యేక మహల్ కూడా ఉండేది. దాని సీలింగ్ బంగారురేకులు, పాలరాళ్ళతో నిర్మించబడింది. దాని పైభాగం (కప్పు) కూడా వెండిబంగారాలతో నిర్మించబడింది. దాని మధ్య ఓ అందమైన ఫౌంటెన్ నిర్మించబడింది. ఫౌంటెన్ మధ్య గ్రీకుచక్రవర్తి కానుకగా పంపిన ఎంతో విలువైన మాణిక్యం పొదగబడింది. మహల్ చుట్టూ ఏనుగుదంతాలతో, పాలరాళ్ళతో, మెరుపులోహంతో చేయబడిన ద్వారాబంధాలలో ఎంతో అందమైన అద్దాలు బిగించబడ్డాయి. తలుపులు వివిధరకాల ఖరీదైన కలపతో చేయబడ్డాయి. తలుపులు తెరచినప్పుడు మహల్ సూర్యకిరణాలతో ఒక్కసారిగా ప్రకాశవంతమై చూసేవారికి కళ్ళు మిరుమిట్లు గొల్పుతాయి.

ఈ మహల్ పర్యవేక్షణ, నిర్వహణల కోసం 13,750 మంది ఉద్యోగులు, 13,382 మంది క్రైస్తవబానిసలు నియమించబడ్డారు. రాణివాసంలో సేవచేయడానికి ఎల్లప్పుడూ 6000 మంది స్త్రీలు సిద్ధంగా ఉండేవారు. ఈ మహల్‌లో ప్రత్యేకంగా నిర్మించబడిన సరస్సుల్లో ప్రతిరోజూ చేపలకు ఆహారంగా 12,000 రొట్టెలు వేయబడేవి. ఈ మహల్ అందచందాలను, వాటిమధ్య ఉండే మనోహరమైన ఉద్యానవనాలు, పూదోటలను చూడటానికి సుదూర ప్రాంతాలనుండి ఎంతోమంది పర్యాటకులు వస్తుండేవారు. హృదయాల్ని పులకరింపజేసే ఈ ప్రకృతిసౌందర్యాన్ని, కళ్ళుజిగేల్ అన్పించే మహల్ అందాల్ని ఆస్వాదించలేని మతదురభిమానులైన క్రైస్తవరాజులు ఖర్తబాను వశపరచుకున్న తర్వాత సామూహిక హత్యలతో తృప్తిచెందక ఈ మహల్‌ని కూడా సర్వనాశనం చేశారు.

**సుల్తాన్ పాలనపై సంక్షిప్తసమీక్ష :-** సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ పాలనా కాలం ఆనాడు యావత్ప్రపంచంలో స్వర్గయుగమని చెప్పవచ్చు. దేశంలో సర్వత్రా శాంతిభద్రతలు ఉండేవి. వ్యాపారం గణనీయంగా అభివృద్ధి చెందింది. స్పెయిన్ వర్తకులు ఆసియా-ఆఫ్రికాలకు చెందిన సుదూర ప్రాంతాల్లోనూ తమ వ్యాపారకేంద్రాలు నెలకొల్పుకున్నారు. నౌవికాశక్తిలో స్పెయిన్ ప్రజలతో ఆనాడు ఎవరూ పోటీపడలేరు. సుల్తాన్ పరిపాలన విషయమై మంత్రులు, అధికారులపై ఆధారపడకుండా ప్రతిచిన్న విషయాన్ని కూడా స్వయంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునేవాడు.

అతను సాధించిన ఘనకార్యాల్లో అన్నిటికంటే పెద్దది- అంతర్విభేదాలు, కలహాలతో ఎల్లప్పుడూ సతమతమవుతుండిన వివిధ ముస్లిం మతసంఘాలు, వర్గాలలో సమైక్యతా సోదరభావాలను నెలగొల్పాడు. ప్రతిసంఘానికి, ప్రతివర్గానికి దాని స్థాయిని బట్టి హక్కులు ఇవ్వబడ్డాయి. అబ్దుర్రహ్మాన్‌సాలిస్ పాలనలో ముస్లింలకు, ముస్లిమేతరులకు అందరికీ సమానహక్కులు ఉండేవి. మతదురభిమానాలు మచ్చుకైనా కనపడేవికావు. వ్యవసాయ రంగంలోనూ అనాడు స్పెయిన్ సాధించిన ప్రగతి మరే దేశం సాధించలేదు. దేశంలోని బంజరు భూములన్నీ సాగుబడిలోకి లేబడ్డాయి. ప్రజల సౌకర్యార్థం రోడ్లు, బావులు, సత్రాలు, అతిథిగృహాలు, ధర్మాసుపత్రులు, పాఠశాలలు, అనాథశరణాల యాలు ఎల్లడెల్లడలా నిర్మించబడ్డాయి. రాజధానితో పాటు ముఖ్యపట్టణాల్లో పైపుల ద్వారా మంచినీరు సరఫరా అవుతుండేది. విద్యాకళల్లో, సభ్యతానాగరికతల్లో ఆనాడు అన్ని దేశాలకంటే ముందు స్పెయిన్ పేరునే తీసుకోవలసివుంటుంది. దేశం మొత్తంలో కాకడా పెట్టి వెతికినా ఒక్క బిచ్చగాడు కూడా కన్పించేవాడు కాదు. దీన్నిబట్టి అనాటి స్పెయిన్ ప్రజలు ఎంతటి సుఖసంతోషాలతో జీవించేవారో అర్థం చేసుకోవచ్చు.

**14-హకమ్ బిన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ పరిపాలన:-** తండ్రి మరణానంతరం హకమ్ హి.శ. 350లో 48 ఏళ్ళ వయసులో సింహాసనం అధిష్టించాడు. అబ్దుర్రహ్మాన్ సాలిస్ చనిపోయి అతని స్థానంలో హకమ్ స్పెయిన్ పాలకుడయ్యాడని తెలియగానే అతను తండ్రి అంతటి సమర్థుడు కాకపోవచ్చన్న భావనతో కొందరు క్రైస్తవరాజులు తిరుగుబాటులు లేవదీశారు. అయితే హకమ్ వారి తిరుగుబాటు దాడుల్ని త్వరలోనే తిప్పికొట్టి వారి భావన తప్పని నిరూపించాడు. ఖస్తలా, బర్షలూనా, వగైరా ప్రాంతాల రాజులు ఈ పరాజయాలతో మళ్ళీ తిరుగుబాటులకు పాల్పడేందుకు సాహసం చేయలేకపోయారు.

సుల్తాన్ అబ్దుర్రహ్మాన్ సాలిస్ పాలనాకాలంలో మొదట లీవన్ ప్రాంతానికి అర్దూని పాలకుడిగా ఉండేవాడు. ఆ తర్వాత ఆ ప్రాంతం అర్దూనీ సోదరుడు షాంజాకు స్వాధీనం చేయబడింది. అంచేత అర్దూనీ ఐరవైమంది అనుచరుల్ని వెంటబెట్టుకొని ఆ ప్రాంతాన్ని తిరిగి తన అధీనంలోకి తీసుకోదలచి ఖలీఫా హకమ్‌ని అర్థించడానికి హి.శ. 355లో రాజధాని ఖర్తబాకు చేరుకున్నాడు. అర్దూనీ రాక సంగతి విని ఖలీఫా హకమ్ ఒక నాయ కుడ్ని అతడ్ని స్వాగతించడానికి పంపాడు. అర్దూనీ రాజధాని ఖర్తబాలో ప్రవేశించగానే ముందుగా అతను గుర్రం నుండి దిగి ఖలీఫా అబ్దుర్రహ్మాన్ సాలిస్ సమాధికి సాష్టాంగ



ప్రణామం చేశాడు. తరువాత ముందుకు సాగి ఖలీఫా దర్బారులో ప్రవేశించాడు. అయితే దర్బారు ఔన్నత్యం, వైభవాలు చూసి కుంచించుకుపోతూ తల మీది టోపీ తీసి ఏమీ పాలుపోక నిల్చున్నాడు. అనుచరులు ముందుకు నడవమని చేత్తో సైగచేశారు. దాంతో అతను దర్బారు ముందుకెళ్ళి అప్రయత్నంగా సాష్టాంగపడ్డాడు. ఆ తరువాత మోకాళ్ళ మీద నిలబడి కొంచెం ముందుకు సాగి మళ్ళీ సాష్టాంగపడ్డాడు.

ఇలా అర్దూనీ అడుగడుగునా సాష్టాంగపడుతూ తనకు కేటాయించిన కుర్చీ దగ్గరికి వెళ్ళి దానిపై కూర్చున్నాడు. ఏదో చెప్పాలనుకొని నసుగుతూ ఏమీ చెప్పలేకపోయాడు. ఖలీఫా అతని పరిస్థితి గమనించి "అర్దూన్! మేము నీ రాక పట్ల సంతోషిస్తున్నాము. భయపడకు. మేము నీ కోరిక నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాము" అని అన్నాడు.

అర్దూనీ ఈమాటలతో పులకించిపోతూ ఖలీఫా సింహాసనం ముందుకెళ్ళి మరొకసారి సాష్టాంగపడ్డాడు. తరువాత అత్యంత వినయంతో వంకర్లుపోతూ "మహాప్రభో! నేను ప్రభువులవారి ఓచిన్న బానిసను" అన్నాడు. ఖలీఫా అతని వినయవిధేయతలతో ప్రభావి తుడై "నువ్వు మా శ్రేయోభిలాషివి. నీ కోరికను మేము మన్నిస్తున్నాము. ఏం కావాలో కోరుకో" అన్నాడు. ఈ మాట వినగానే అర్దూనీ వేరొకసారి సాష్టాంగపడ్డాడు. అలా చాలా సేపటిదాకా సాష్టాంగప్రణామం చేసి "షాంజా నా పినతండ్రి కుమారుడు. అతను గత ఖలీఫాను పరిపరివిధాల వేడుకొని లీవన్ ప్రాంతాన్ని సంపాదించాడు. గత ఖలీఫా అతడ్ని లీవన్‌రాజుగా చేశారు. ప్రజలు అతని పట్ల సంతోషంగా లేకపోయినప్పటికీ నేను గత ఖలీఫాగారి నిర్ణయాన్ని ఏమాత్రం వ్యతిరేకించలేదు. తమరు దయచేసి నా రాజ్యాన్ని నాకు తిరిగిఇప్పిస్తారని ఎంతో ఆశతో మీ సన్నిధికి చేరుకున్నాను" అని అన్నాడు. ఖలీఫా ఈమాట విని "షాంజా కంటే నువ్వే ఎక్కువ అర్హుడవైతే ఆ రాజ్యం తప్పకుండా నీకే లభిస్తుంది" అన్నాడు. దాంతో అర్దూనీ సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఇంకొకసారి దబేలున క్రిందపడి సజ్దా చేశాడు. ఖలీఫా కొలువు ముగించి వెళ్ళిపోయాడు.

సజ్దా అనేది ఒక్క దేవునికి మాత్రమే చేయవలసిన ఆరాధన. దైవేతరులకు సజ్దా చేయడం నిషిద్ధం (హరాం) కాని ఖుర్‌ఆన్, హదీసుల్లో అపార ప్రావీణ్యం సంపాదించిన ఖలీఫా హకమ్ ఈ విషయాన్ని గ్రహించకపోవడం, గ్రహించినా పట్టించుకోకపోవడం ఎంతో విచారకరం. సమావేశంలో పాల్గొన్న ధర్మవేత్తలు, దర్బారీలు కూడా ఈ వాస్తవాన్ని గుర్తించలేదంటే నమ్మశక్యంగా లేదు. ఏమైనప్పటికీ 'అతివినయం ధూర్త లక్షణం.' ఈ ధూర్త లక్షణమే ఖలీఫా కొంప ముంచే మొదటి సంకేతం.

అర్దూనీ ఖలీఫా దగ్గర కొన్నాళ్ళు అతిథిగా ఉండి తన రాజ్యానికి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఇతర ప్రాంతాల రాజులు, ఫ్రాన్స్, ఇటలీ వగైరా యూరప్ దేశాల క్రైస్తవ చక్రవర్తులు కూడా వచ్చి ఖలీఫాకు విలువైన కానుకలు సమర్పించుకొని తమ వినయ విధేయతలు ప్రకటించుకున్నారు. ఖలీఫా హకమ్ పాలనలో ఏ ఒక్కరూ తోకజాడించే సాహసానికి పాల్పడలేకపోయారు. అయితే హకమ్ ఎంతో సమర్థుడైన తన సోదరుడు ముగీరాను కాదని తన పదకొండేళ్ళ కొడుకు హిషామ్‌ని రాజకీయవారసుడ్ని చేశాడు. ఇదే స్పెయిన్‌లో ముస్లింల పతనానికి సాకుగా మారింది.

ఖలీఫా హకమ్ తన పరిపాలన ప్రారంభకాలంలోనే తిరుగుబాటుదారుల పీచం అణచి అత్యంత సమర్థుడైన పాలకుడని నిరూపించుకున్నాడు. రాజ్యమంతటా శాంతి భద్రతలు నెలకొన్నాయి. వ్యాపారం, సిరిసంపదలు పరాకాష్ఠనందుకున్నాయి. విద్యాకళలు అత్యున్నత శిఖరాలకు చేరుకున్నాయి. అతను రచయితలను, ధర్మవేత్తలను ఎంతో గౌరవించేవాడు. ముఖ్యపట్టణాలన్ని చోట్లా గ్రంథాలయాలను స్థాపించాడు. స్వయంగా తన వ్యక్తిగత గ్రంథాలయంలో దాదాపు ఆరులక్షలు గ్రంథాలు ఉండేవి. వాటి విషయ సూచిక గ్రంథమే 24 సంపుటాలలో ఉండేదట!

ఖలీఫా హకమ్ ధర్మశాస్త్రంలో అత్యంత ప్రావీణ్యం సంపాదించిన గొప్పధర్మవేత్త, బుద్ధికుశలత కలిగిన చక్రవర్తి. అందుకే అతని ముందు ఇతర ధర్మవేత్తలు ప్రసంగించ డానికి భయపడేవారు. కాని అతను తన రాజకీయ వారసుడి ఎంపికలో పూర్తిగా విఫలు డయ్యాడు. అన్నివిధాలా సమర్థుడైన సోదరుడ్ని వదలి పదకొండేళ్ళ తన కొడుకుని రాజకీయ వారసుడిగా ప్రకటించాడు. పాపం పుత్రప్రేమ అతడ్ని వివశుడ్ని చేసింది కాబోలు. ఖలీఫా హకమ్ సాని హిజ్రీ 366లో చనిపోయిన తరువాత అతని కొడుకు హిషామ్ సాని గద్దెనెక్కాడు. ఆనాటి నుంచే స్పెయిన్‌లో ముస్లింల పాలన పతనావస్థలో పడిపోయి సామ్రాజ్యపరిధి క్రమంగా కుంచించుకు పోవడం ప్రారంభించింది.

**15-హిషామ్‌సాని బిన్ హకమ్‌సాని పాలన:-** ఖలీఫా హకమ్ చనిపోగానే పాలకవర్గం రెండు ముఠాలుగా చీలిపోయింది. అందులో సామ్రాజ్యశ్రేయస్సును కోరుకునే వర్గం మంచి పరిపాలనాదక్షుడైన హకమ్ సోదరుడు ముగీరాను గద్దెనెక్కించా లని ప్రయత్నించింది. కాని స్వార్థప్రయోజనాలను ఆశించిన రెండోవర్గం అధికారులు ముగీరాను కుట్రతో హతమార్చి పదకొండేళ్ళ హిషామ్‌నే అధికారపీఠం ఎక్కించారు. అప్పుడు మొదటివర్గం అధికారులు ఏపాపం ఎరగని ముగీరా అన్యాయంగా హతమార్చ బడ్డాడని చెబుతూ హిషామ్‌కు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు. దాంతో ప్రజల్లో తీవ్రమైన ఆందోళన, కోపోద్రేకాలు వెల్లువెత్తాయి. అయితే కొన్నాళ్ళలోనే అవి చల్లారి పోయాయి. వారి పన్నాగం పారలేదు.

ఖలీఫా హిషామ్ తల్లి మలికా సబాకు ప్రజల్లో, పాలకవర్గంలో మంచి పలుకుబడి, గౌరవాభిమానాలు ఉన్నాయి. అంచేత ఆమె పాలనావ్యవహారాల్లో కూడా జోక్యం చేసు కుంటుండేది. ఆమె తన ఆస్తిపాస్తుల వ్యవహారాలు చూడటానికి ముహమ్మద్ బిన్ అబీ ఆమిర్ అనే వ్యక్తిని నియమించుకుంది. అతను తన తెలివితేటలతో, కానుకలతో ఆమె ఆదరాభిమానాలను బాగా చూరగొన్నాడు. తర్వాత ఆమె అతడ్ని సర్వాధికారాలతో పెట్రేగి పోతున్న ప్రధాని జాఫర్‌కు, సేనాపతి గాలిబ్‌కు సలహాదారుడిగా నియమించింది. ఆ రోజుల్లోనే ఉత్తర రాజ్యాల క్రైస్తవులు కప్పం చెల్లించడానికి నిరాకరిస్తూ తిరుగుబాటు దాడులు ప్రారంభించినట్లు వార్తలు రావడంతో సేనాపతి గాలిబ్ వారిని అణచడానికి ముహమ్మద్ బిన్ అబీఆమిర్‌ని పంపాడు. ముహమ్మద్ సైన్యం తీసుకొని వెళ్ళి తిరుగు బాటు క్రైస్తవుల్ని అణచి విజయవంతంగా తిరిగొచ్చాడు. దాంతో ఖర్తబాలో అతని పేరు మార్మోగిపోయింది. నగరవాసులు అతనికి బ్రహ్మరథం పట్టారు.



ముహమ్మద్ బిన్ అబీఆమిర్ సేనాపతి గాలిబ్ విశ్వాసాన్ని మరింత చూరగొని ప్రధాని జాఫర్‌ని పదవీచ్యుతుడ్ని చేశాడు. తరువాత అతను తనకు నమ్మకస్తులైన కొత్తవాళ్ళతో సైనికభర్తీ ప్రారంభించాడు. అదీగాక గాలిబ్ కుమార్తెను వివాహమాడి అతని వైపు నుండి తనకు ఎలాంటి ప్రమాదం లేకుండా చేసుకున్నాడు. ఈవిధంగా ముహమ్మద్ బిన్ అబీఆమిర్ కొన్నాళ్ళలోనే సేనాపతి గాలిబ్‌ని కూడా తన దారి నుంచి తొలగించు కున్నాడు. ఖలీఫా హిషామ్‌కు రాజమహల్‌లో సకల సౌకర్యాలు కల్పించి గృహనిర్బంధా నికి గురిచేశాడు. తర్వాత క్రైస్తవరాజ్యాలపై నిర్విరామ దాడులుచేస్తూ విజయవంతంగా పరిపాలన సాగించాడు. చివరికి 27 ఏళ్ళ పాలన తర్వాత హి.శ. 394లో చనిపోయాడు.

ముహమ్మద్ బిన్ అబీఆమిర్ పాలనాకాలంలో ప్రజలు శాంతిసుఖాలతో జీవించారు. అదీగాక ఏ క్రైస్తవరాజ్యం కూడా అతనికి వ్యతిరేకంగా తోకజాడించడానికి సాహసించలేక పోయింది. ఖలీఫా హిషామ్ సాని పాలనాకాలంలో బనూఉమయ్యా తెగపాలన చాలా క్షీణదశలో ఉండింది. అలాంటి పరిస్థితిలో ముహమ్మద్ బిన్ అబీఆమిర్ స్పెయిన్‌లో ముస్లింలపాలనకు నూతన జవసత్వాలు ప్రసాదించాడని చెప్పవచ్చు. అయితే అతను చనిపోగానే బనూఉమయ్యా తెగవాళ్ళు తెగసంబరపడిపోతూ ఈవార్త ఖలీఫా హిషామ్ చెవిలో ఊదడానికి పరుగులు తీశారు. కాని హిషామ్ ముహమ్మద్ మరణవార్త విని ఎంతో విచారం వెలిబుచ్చాడు. తరువాత అతని పెద్ద కొడుకు అబ్దుల్ మలిక్‌ని ప్రధాన మంత్రిగా నియమించి సైఫుద్దౌలా అనే బిరుదు ఇచ్చాడు. అబ్దుల్‌మలిక్ సర్వాధికారయి తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పరిపాలనసాగించాడు. ఇలా ఆరేళ్ళ పాలన తర్వాత హి.శ. 399లో చనిపోయాడు.

అబ్దుల్‌మలిక్ చనిపోయిన తర్వాత అతని సోదరుడు అబ్దుర్రహ్మాన్ నాసిర్ ప్రధాని అయ్యాడు. నాసిర్ తనను ఖిలాఫత్ వారసుడిగా చేయమని ఖలీఫా హిషామ్‌పై వత్తిడి తెచ్చాడు. హిషామ్ నిస్సహాయుడై నాసిర్‌ని తన రాజకీయ వారసుడిగా నియమిస్తూ దస్తావీజులో సంతకం పెట్టాడు. ఆ తరువాత ఖర్తబా జామియా మస్జిద్‌లో దాన్ని బహి రంగంగా ప్రకటించడం జరిగింది. దాంతో స్పెయిన్‌లో బనూఉమయ్యా తెగపాలనకు చరమగీతం పాడినట్లయింది. అయితే ఈ ప్రకటన బనూఉమయ్యా తెగవాళ్ళలో కోపోద్రే కాలు రేపింది. వారు ప్రజల్ని రెచ్చగొట్టి వారి ద్వారా నాసిర్ సానుభూతిపరులైన సైనికాధికారులను చంపించారు. ఆ తర్వాత ఖలీఫా హిషామ్ సానీని తొలగించి అతని స్థానంలో ఖలీఫా అబ్దుర్రహ్మాన్ సాలిస్ ముదిమనవడు ముహమ్మద్ బిన్ హిషామ్‌ని అధికారపీఠం ఎక్కించి అతనికి మహ్దిబిల్లా అనే బిరుదు ఇచ్చారు. పిడుగులాంటి ఈవార్త వినగానే నాసిర్ యుద్ధం నుండి ఖర్తబా తిరిగొచ్చి కొత్తఖలీఫాపై తిరుగుబాటు చేశాడు. అప్పుడు సైనికులు రెండు వర్గాలుగా చీలిపోయి అంతర్గత యుద్ధానికి పాల్పడ్డారు. ఈ యుద్ధంలో ఖలీఫా మహ్ది మద్దతుదారుడైన ఒక సైనికుడు నాసిర్‌ని హతమార్చాడు. ఆ తర్వాత పరిపాలనపై క్రమంగా సైనికుల పెత్తనం అధికం కాసాగింది. అది కాస్తా అంతర్గత కుమ్ములాటలకు దారితీసి విదేశీ శత్రువుల కుట్రలకు దారి సుగమం చేసింది. ఖలీఫామహ్ది తన గద్దెను కాపాడుకోవడానికి క్రైస్తవరాజ్యాల సహాయం తీసుకొని ముస్లింల పాలనను పతనదిశగా తీసికెళ్ళాడు.

**16-పతనదిశగా ముస్లింలపాలన:-** ఖలీఫా మహ్దీ సైనికుల పెత్తనాన్ని బలహీన పరచడానికి వారిలో బర్బరీసైనికులు అతని నుండి వేరయిపోయి తిరుగుబాటు జెండా ఎగరవేశారు. ఈ విధంగా ముస్లింలు రెండు వర్గాలుగా చీలిపోయి తమ తమ ఉనికిని కాపాడుకోవడానికి క్రైస్తవుల సహాయం తీసుకొని పరస్పర యుద్ధాలకు పాల్పడ్డారు. దాంతో బనూఉమయ్యా తెగవ్యక్తి అయిన ముస్తయీన్ నాయకత్వంలో ఒకవర్గం సైనికులు రాజధాని ఖర్తబాను ఆక్రమించుకున్నారు. మహ్దీ పారిపోయి క్రైస్తవుల సహాయం తీసుకొని వచ్చి ఖర్తబాను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. సహాయం చేయడానికి వచ్చిన క్రైస్తవసైనికులు ఖర్తబాలో ముస్లింల వినాశానికే పాల్పడ్డారు. అటు ముస్తయీన్ సైన్యంలోని క్రైస్తవసైనికులు కూడా రాజ్యమంతటా అరాచకాలకు తెగబడ్డారు. చివరికి హి.శ. 403లో ముస్తయీన్ ఖర్తబా ఆక్రమించుకొని ఖలీఫా అయ్యాడు. కాని ముస్లింరాజ్యంలో క్రైస్తవుల అరాచకాలు తగ్గకపోగా ఇంకా అధికమయ్యాయి.

మరొకవైపు ముస్లింవర్గాల మధ్య అంతర్గత కుమ్ములాటలు కూడా పెచ్చరిల్లాయి. హి.శ. 407లో అలీ బిన్ హమూద్ వర్గం ముస్తయీన్‌ని హతమార్చి గద్దె నెక్కాడు. హి.శ. 428 నాటికి బనీఉమయ్యా తెగవారి పాలన పూర్తిగా అంతమైపోయింది. హి.శ. 447లో అంతర్‌యుద్ధాలతో సతమతమవుతున్న ముస్లింల పరిస్థితి గమనించిన కేస్టల్, లీవన్ ప్రాంతాల క్రైస్తవపాలకుడు ఒకటవ ఫెర్డినంద్ వారి రాజ్యాలపై దాడులు చేసి వారి మెడలు వంచాడు. హి.శ. 458లో ఒకటవ ఫెర్డినంద్ చనిపోయిన తరువాత గద్దెనెక్కిన అతని కొడుకు నాల్గవ అల్‌ఫాన్సూ హి.శ. 478లో ముస్లిం పట్టణాలపై విరుచుకుపడి వినాశానికి పాల్పడ్డాడు. మోతమద్ పాలనలోని ముస్లింరాజ్యంపై కూడా అతను కయ్యానికి కాలుదువ్వాడు. అప్పుడు మోతమద్ మొరాకో రాజు యూసుఫ్ బిన్ తాష్ఫీన్ సహాయం కోరాడు. యూసుఫ్ వెంటనే స్పెయిన్ చేరుకొని మోతమద్‌తో కలసి హి.శ. 480లో అల్‌ఫాన్సూతో యుద్ధం ప్రారంభించాడు. ఈ యుద్ధంలో క్రైస్తవసైనికులు అరవై వేల మంది ఉంటే, ముస్లింయోధులు ఇరవైవేల మందే ఉన్నారు. అయినప్పటికీ ముస్లింలు ఘనవిజయం సాధించారు. అల్‌ఫాన్సూ ముగ్గురు సైనికుల్ని మాత్రమే వెంటబెట్టుకొని పిక్కబలం కొద్దీ పారిపోయాడు. మిగిలిన సైనికులంతా యుద్ధమైదానంలోనే ప్రాణాలు కోల్పోయారు.

యుద్ధం ముగిసిన తర్వాత యూసుఫ్ బిన్ తాష్ఫీన్ మొరాకో తిరిగి వెళ్ళిపోయాడు. కాని మోతమద్ ఈ విజయం తర్వాతయినా గుణపాఠం నేర్చుకోలేదు. అంచేత యూసుఫ్ హి.శ. 484లో స్పెయిన్ రాజ్యాన్ని తన మొరాకో సామ్రాజ్యంలో కలుపుకొని మోతమద్‌ని కారాగారంలో బంధించాడు. దాంతో మోతమద్ పుట్టెడుదిగులుతో నాలుగేళ్ళ తర్వాత కారాగారంలోనే చనిపోయాడు. స్పెయిన్‌లోని ఇతర ముస్లింపాలకుల్లో ముతవక్కిల్ అనే పాలకుడు మొరాకోసామ్రాజ్య పరిధిలోని స్పెయిన్‌ప్రాంతాన్ని ఆక్రమించుకునే ఉద్దేశంతో క్రైస్తవులతో చేతులు కలపడానికి కుట్రలు పన్నడం ప్రారంభించారు. అందువల్ల యూసుఫ్ బిన్ తాష్ఫీన్ ముతవక్కిల్ పీచం అణచి అతడ్ని, అతని కొడుకుల్ని హతమార్చి ఇతర విద్రోహక పాలకులకు గుణపాఠం నేర్పాడు.



యూసుఫ్ బిన్ తాష్ఫీన్ స్పెయిన్‌లో క్రైస్తవులతో యుద్ధాలు చేయడానికి తన అన్న కొడుకు సైర్ బిన్ అబూబకర్‌ని సేనాపతిగా నియమించి పంపాడు. సైర్ క్రైస్తవులతో యుద్ధపరంపర ప్రారంభించి అనేక విజయాలతో ముందుకు సాగుతుంటే, స్పెయిన్‌లోని ముస్లిం పాలకులు సైర్‌కు సహాయపడకపోగా అతనికి వ్యతిరేకంగా క్రైస్తవులకు మద్దతు ఇవ్వసాగారు. అందువల్ల సైర్ ముస్లిం పాలకుల మెడలు వంచి స్పెయిన్‌లోని మొత్తం ముస్లిం రాజ్యాలను తన అధీనంలోకి తీసుకున్నాడు. ఈ విధంగా హి.శ. 485 నాటికి కొన్ని ఉత్తర సరిహద్దు ప్రాంతాలు మినహాయించి మొత్తం స్పెయిన్ యూసుఫ్ బిన్ తాష్ఫీన్ స్వాధీనంలోకి వచ్చింది. దాంతో ముస్లిం పాలకుల అంతర్గత కలహాలు అంతమైపోయాయి. ఒక సంవత్సరం క్రితం వరకు స్పెయిన్ ఇస్లామీయ సామ్రాజ్యం కుక్కలు చింపిన విస్తరిలా మారి అనేక రాజ్యాలుగా విడిపోయి అంతర్గత కలహాల కారణంగా క్రైస్తవుల స్వాధీనంలోకి పోయే దుస్థితిలో ఉండేది. మొరాకోరాజు యూసుఫ్ బిన్ తాష్ఫీన్ చేసిన సహాయంవల్ల ఇప్పుడా ప్రమాదం తప్పిపోయింది.

యూసుఫ్ బిన్ తాష్ఫీన్ ఆ తరువాత పదహేనేళ్ళు జీవించి హి.శ. 500లో చనిపోయాడు. తరువాత అతని కొడుకు అలి బిన్ యూసుఫ్ సింహాసనం అధిష్టించాడు. అతను తనతమ్ముడు తమీమ్ బిన్ యూసుఫ్‌ని స్పెయిన్‌లో తన రాజకీయ ప్రతినిధిగా నియమించాడు.

హి.శ. 515లో మొరాకోకు చెందిన ఇబ్నెతూమర్త్ అనే ఓ పండితశిఖామణి ఓసారి సుప్రసిద్ధ తత్వవేత్త ఇమాం గజాలీ(రహ్మాలై) ఉపదేశాలు వినడానికి ఆయన సభలో పాల్గొన్నాడు. ఆ సందర్భంలో ఒకతను ఇమాం గజాలీని సంబోధిస్తూ "మొరాకో రాజు అలీ బిన్ యూసుఫ్ మీ గ్రంథాలను కాల్చివేయమని ఉత్తర్వు జారీచేశాడ"ని అన్నాడు. ఇమామ్ గజాలీ(రహ్మాలై) ఈమాట విని "అయితే అతని సామ్రాజ్యం నాశమమవుతుంది. ఈ వినాశం ఇప్పుడీ సభలో కూర్చున్న ఆ మనిషి చేతిలో జరుగుతుంది" అని చెబుతూ ఇబ్నెతూమర్త్ వైపు సైగచేశారు. ఇబ్నెతూమర్త్ ఈమాట విని "అంధానుకరణ సమర్థకులు, ప్రగతిశీల విరోధులైన ఆ రాజ్యాధినేతలను నేను అంతమొందిస్తాను" అని నిర్ణయించుకున్నాడు. ఆనాటి నుంచి అతను అదే ప్రయత్నంలో ఉన్నాడు.

ఇబ్నెతూమర్త్ స్వస్థలానికి తిరిగొచ్చి ప్రజలకు హితబోధ చేసే పనిలో నిమగ్నుడైపోయాడు. అనేకమంది అతనికి శిష్యులైపోయారు. వారిలో బర్బరీతెగకు చెందిన అబ్దుల్ మోమిన్ అనే వ్యక్తి ప్రధాన శిష్యుడయ్యాడు. ఇబ్నెతూమర్త్ హితబోధ విని బర్బరీ తెగ ప్రజలు వేలసంఖ్యలో అతనికి శిష్యులైపోయారు. కొన్నాళ్ళ తరువాత ఇబ్నెతూమర్త్ తాను మహ్దిమౌవూద్ నని ప్రకటించుకున్నాడు. దాంతో అతని శిష్యగణం సంఖ్య మరింత పెరిగింది. అప్పుడతను అబ్దుల్‌మోమిన్‌ని సేనాపతిగా చేసి హి.శ. 517లో మొరాకో రాజ్యంపై యుద్ధం ప్రారంభించాడు. మొదటి దాడిలో అపజయం పాలైనప్పటికీ ఆ తర్వాత జరిగిన యుద్ధ పరంపరతో ఇబ్నెతూమర్త్ మొరాకోలోని అనేక ప్రాంతాలను కైవశం చేసుకోగలిగాడు. చివరికి హి.శ. 544లో అబ్దుర్రహ్మాన్‌ని తన వారసుడిగా చేసి చనిపోయాడు.

**16-మోహిదీన్ పరిపాలన:-** మొరాకో రాజు అలి బిన్ యూసుఫ్ హి.శ. 537లో చనిపోయాడు. అప్పటికే ఇబ్నెతూమర్త్ సేనాపతి అబ్దుల్‌మోమిన్ దాదాపు యావత్తు మొరాకోను తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత అతను స్పెయిన్ వైపు పురోగమించాడు. ఇబ్నెతూమర్త్ బోధనల సారాంశం పూర్తిగా ఏకదైవారాధనతో కూడివున్నది. అందువల్ల అతని శిష్యులు మోహిదీన్ (ఏకేశ్వర వాదులు)గా పేరుపడ్డారు.

అబ్దుల్‌మోమిన్ స్పెయిన్‌లో ఖర్తబాతో పాటు అనేక పట్టణాలను కైవశం చేసుకుంటూ అప్రతిహతంగా పురోగమించసాగాడు. హి.శ. 548లో అతను స్పెయిన్ దక్షిణ తీరంలో అల్‌ఫతహ్ పేరుతో ఒక పట్టణాన్ని నిర్మించాడు. దేశంలోని వివిధ ముస్లిం పాలకులు, గవర్నర్లు అక్కడకు చేరుకొని అబ్దుల్‌మోమిన్‌కు తమ విధేయత ప్రకటించారు. ఈవిధంగా స్పెయిన్ ముస్లిం రాజ్యాలన్నీ మరొకసారి ఒకే ఇస్లామీయ సామ్రాజ్యంగా ఏర్పడ్డాయి. హి.శ. 555లో అబ్దుల్‌మోమిన్ తన కొడుకు అబూసయీద్‌ని గర్నాత పట్టణానికి పాలకునిగా, యావత్తు స్పెయిన్‌కు వైస్రాయ్‌గా నియమించాడు. తరువాత చెలరేగిన ఒక తిరుగుబాటును అణచి హి.శ. 557నాటికి యావత్తు స్పెయిన్‌లో శాంతి భద్రతలు నెలకొల్పాడు. ఆ తర్వాత ఉత్తర క్రైస్తవ రాజ్యాలను జయిస్తూ ఐరోపా దేశాల్ని కైవశం చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దాని కోసం అబ్దుల్‌మోమిన్ ఆఫ్రికాలో మూడులక్షల మంది, స్పెయిన్‌లో రెండులక్షల మంది సైనికులతో మొత్తం ఐదు లక్షల మంది సైనికుల్ని సమీకరించాడు. ఈ భారీసైన్యం తీసుకొని క్రైస్తవులతో జిహాద్ చేయడానికి బయలుదేరడానికి సన్నాహాలు చేస్తున్న తరుణంలో అబ్దుల్‌మోమిన్ వ్యాధిగ్రస్తుడై హి.శ. 558లో చనిపోయాడు.

అబ్దుల్‌మోమిన్ చనిపోయిన తరువాత అతని కొడుకు అబూయాఖూబ్ యూసుఫ్ అధికారపగ్గాలు చేపట్టాడు. అయితే అబ్దుల్‌మోమిన్ చనిపోగానే స్పెయిన్‌లో క్రైస్తవులు మళ్ళీ తిరుగుబాటుకు పాల్పడ్డారు. వారికి కొందరు ముస్లింపాలకుల విద్రోహచర్యలు కూడా బలంచేకూర్చాయి. అబూయాఖూబ్ వారిని అణచడానికి ఎంతో ప్రయత్నించాడు. కాని ఆ పనిలో ఉండగానే అతను హి.శ. 580లో జబ్బుపడి చనిపోయాడు.

అబూయాఖూబ్ పాలనాకాలంలో మొరాకో నుండి తరాబిలస్ వరకు ఆఫ్రికా రాజ్యాలు, మొత్తం స్పెయిన్, సఖలియా దీవి, రోమ్‌సముద్రంలోని ఇతర దీవులు మోహిదీన్ సామ్రాజ్యంలో ఉండేవి. మోహిదీన్‌పాలకుడు ఆనాడు యావత్తు ప్రపంచంలో తిరుగులేని గొప్ప చక్రవర్తిగా ప్రసిద్ధిచెందాడు.

అబూయాఖూబ్ మరణానంతరం అతని కొడుకు అబూయూసుఫ్ మన్సూర్ అధికార పీఠం అధిరోహించాడు. అతను ఎంతో సహృదయుడు, ధర్మవేత్తలను గౌరవించేవాడు, ప్రగతిశీల దృక్పథం కలవాడు. అబూయూసుఫ్ కూడా తండ్రి గుణగణాలను పుణికి పుచ్చుకున్నాడు. హి.శ. 585లో తైతలా ప్రాంతం క్రైస్తవరాజు రెండవ అల్‌ఫాన్సూ అబూయూసుఫ్‌తో అయిదేండ్ల పాటు నిర్యుద్ధ ఒడంబడిక చేసుకొని తోటిక్రైస్తవ రాజ్యాలతో కుమ్మక్కయి సైనికసమీకరణలో నిమగ్నుడైపోయాడు. అయిదేళ్ళు ముగిసిపోగానే హి.శ. 591లో క్రైస్తవ రాజ్యాధినేతలు లక్షలాది సైనికులతో సమరశంఖం పూరించారు. ఆ



సైనికుల సమక్షంలో ముస్లింయోధుల సంఖ్య చాలా తక్కువ. అయినప్పటికీ యుద్ధ మైదానంలో క్రైస్తవులు లక్షా నలభైఆరు వేల మంది సైనికుల్ని మృత్యువాత పడవేసుకున్నారు. మరో ముప్ఫయి వేల మంది ఖైదీలుగా పట్టుబడ్డారు.

క్రైస్తవరాజు రెండవ అల్‌ఫాన్సూ తైతలాకు పారిపోయి మళ్ళీ యుద్ధసన్నాహాలు ప్రారంభించాడు. ఈ సమాచారం అందగానే అబూయూసుఫ్ మన్సూర్ తైతలా చేరుకొని కోటను ముట్టడించి దాని గోడలను ధ్వంసం చేశాడు. ఇంకాస్సేపట్లో తైతలా పట్టణం ముస్లింల స్వాధీనం అవుతుందనగా అల్‌ఫాన్సూ సిగ్గువిడిచి తన తల్లి, భార్య, కూతుళ్ళను మన్సూర్ దగ్గరకు పంపి కాళ్ళబేరానికి వచ్చాడు. అతని తల్లి మన్సూర్ సన్నిధికి వచ్చి తన కొడుకుని క్షమించమని కన్నీటిధారలతో మొరపెట్టుకున్నది. దాంతో మన్సూర్ కరిగిపోయి అల్‌ఫాన్సూను క్షమించి ఆ స్త్రీలను కానుకలతో సత్కరించి గౌరవప్రదంగా తిప్పి పంపాడు. ఆ తరువాత అతను హి.శ. 595లో చనిపోయాడు.

అబూయూసుఫ్ మన్సూర్ మరణానంతరం అతని కొడుకు అబూఅబ్దుల్లా ముహమ్మద్, నాసిరుద్దీనుల్లా బిరుదుతో గద్దె నెక్కాడు. అతను గద్దె నెక్కగానే క్రైస్తవ రాజ్యాలు మళ్ళీ తిరుగుబాటుకు వడిగట్టాయి. క్రైస్తవపాలకులు సిరియా, పాలస్తీనాల్లో సుల్తాన్ సలాహుద్దీన్ చేతిలో చావుదెబ్బలు తిని తీరని ప్రతీకారంతో స్పెయిన్, మొరాకో ముస్లిం సామ్రాజ్యంపై దండెత్తడానికి సన్నాహాలు ప్రారంభించారు. రోమ్‌దేశ పోప్‌తో పాటు అనేకమంది క్రైస్తవ మతపెద్దలు ఐరోపాలోని ప్రతి దేశంలో ముస్లింలకు వ్యతిరేకంగా తీవ్రమైన దుష్ప్రచారం చేసి లక్షలాది సైన్యాన్ని సమీకరించారు. మొరాకో రాజు నాసిరుద్దీనుల్లా దాన్ని ఎదుర్కోవడానికి దాదాపు ఆరు లక్షల మంది సైనికుల్ని సమీకరించాడు. కాని అతను సైనికులకు ఆర్థికప్రయోజనాలు చేకూర్చడంలో పిసినారితనం వహించాడు. అతని తండ్రి సైనికులకు నిర్ణీతజీతాలతో పాటు ప్రతి మూడు నెలలకొకసారి విలువైన కానుకలు కూడా ఇచ్చేవాడు. నాసిర్ ఆ కానుకల పందేరాన్ని నిలిపివేశాడు. దాంతో సైనికులు అసంతృప్తి, అసహనాలకు గురై విధినిర్వహణల్లో నిర్లక్ష్యవైఖరి అవలంబించారు. తత్ఫలితంగా హి.శ. 609లో క్రైస్తవులకు, ముస్లింలకు మధ్య జరిగిన ఈ యుద్ధంలో ముస్లింలు ఘోరంగా ఓడిపోయారు. ఆరులక్షల మంది సైనికుల్లో వేయి మంది మాత్రమే తమ నాయకుడ్ని కాపాడుకొని యుద్ధమైదానం నుండి బ్రతుకుజీవుడా అంటూ తిరిగొచ్చారు. ఆరులక్షల మందిలో మిగిలినవారంతా రణరంగంలో మృత్యువాత పడటమో లేదా క్రైస్తవులకు ఖైదీలుగా పట్టుబడటమో జరిగింది. ఖైదీలుగా పట్టుబడిన ముస్లింయోధుల్ని కూడా క్రైస్తవులు ఊచకోత కోసి తమ ప్రతీకారదాహం తీర్చుకున్నారు. అంతేకాదు, యుద్ధం ముగిసిన తరువాత వారు స్పెయిన్ పట్టణాల్లో లూటీలు జరిపి స్త్రీలు, పిల్లలు, వృద్ధులన్న విచక్షణ లేకుండా లక్షలాది ముస్లింలను హతమార్చారు. అనేక ఊళ్ళు శ్మశానవాటికలుగా మారిపోయాయి. నాసిరుద్దీనుల్లా యుద్ధం నుండి మొరాకోకు తిరిగొచ్చిన ఏడాదికే హి.శ. 610లో చనిపోయాడు.

నాసిర్ మరణానంతరం అతని కొడుకు యూసుఫ్ పదహారేళ్ళ వయస్సులో గద్దె నెక్కి పదేళ్ళ పాలన తర్వాత హి.శ. 620లో చనిపోయాడు. అతను చనిపోయేదాకా

మొరాకో నుండిబయట అడుగుపెట్టలేదు. ఫలితంగా స్పెయిన్ మళ్ళీ కుక్కలు చింపిన ఇస్తరిలా మారింది. యూసుఫ్ తదనంతరం అతని సోదరుడు అబ్దుల్ వాహిద్ మొరాకో రాజు అయ్యాడు. తొమ్మిది నెలల పాలన తరువాత పాలకవర్గం అతడ్ని తొలగించి హత మార్చారు. హి.శ. 668 నాటికి మొరాకోలో మోహిదీన్‌ల పాలన పూర్తిగా అంతమైపోయి మరీన్‌ల పాలన నెలకొన్నది.

మొరాకోలో మోహిదీన్‌ల పాలన అంతమయ్యేనాటికి స్పెయిన్‌లోని ఉత్తర భూ భాగానికి చెందిన అర్ధభాగం, దాదాపు పశ్చిమరాష్ట్రాలు మొత్తం క్రైస్తవుల స్వాధీనంలోకి పోయాయి. మిగిలిన భూభాగంలో పరిపాలన చేస్తున్న ముస్లింరాజుల్లో కూడా ఐకమత్యం కొరవడి అంతఃకలహాలతో సతమతంకాసాగారు. క్రైస్తవరాజులు ఆ పరిస్థితిని వాడుకొని ముస్లిం పాలకుల మధ్య ప్రజ్వరిల్లుతుండిన సమరాగ్నికి మరింత ఆజ్యం పోసేవారు. హి.శ. 636లో ఖస్తల ప్రాంతం క్రైస్తవ చక్రవర్తి మూడవ ఫర్డినంద్ ఖర్తబా పట్టణాన్ని జయించి దాని ఔన్నత్యం, వైభవాలను సర్వనాశనం చేస్తూ క్రైస్తవరాజ్యానికి పునాదులు వేశాడు. అప్పుడు ఆనాటి ముస్లింరాజ్య పాలకుడు ఇబ్నుల్‌అహ్మర్ మూడవ ఫర్డినంద్‌తో శాంతిఒప్పందం చేసుకొని గర్నాతా, మాలిఖా, లారిఖా, అల్మీరియా, జియాన్ మొదలైన ప్రాంతాలను కాపాడుకోసాగాడు. గర్నాతాను రాజధానిగా చేసుకొని ఓ సుదీర్ఘకాలందాకా తన సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. అయినప్పటికీ అతను క్రైస్తవుల దాడుల్ని ఎదుర్కోక తప్పలేదు. అలాంటి దాడి ఒకదాన్ని తిప్పికొట్టి గర్నాతాకు తిరిగొస్తుండగా దారిలో గుర్రానికి ఎదురాయి తగలడం వల్ల కిందపడి గాయపడ్డాడు కొన్నాళ్ళకు ఆ గాయంతోనే హి.శ. 671లో చనిపోయాడు.

ఇబ్నుల్ అహ్మర్ మరణానంతరం అతని కొడుకు అబూఅబ్దుల్లా ముహమ్మద్ గద్దె ఎక్కాడు. హి.శ. 672లో ఒకసారి, 673లో మరొకసారి గర్నాతా రాజ్యంపై క్రైస్తవులు దాడి చేసినప్పుడు ముహమ్మద్ మొరాకోరాజు సహాయంతో వారి దాడుల్ని తిప్పికొట్టాడు. ఆ తరువాత హి.శ. 695లో ఒకసారి, 699లో వేరొకసారి క్రైస్తవ దాడుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఈవిధంగా ముహమ్మద్ ఎప్పటికప్పుడు క్రైస్తవ దాడుల్ని తిప్పికొడుతూ 30 ఏళ్ళ పాటు పరిపాలన సాగించి హి.శ. 701లో చనిపోయాడు.

ఆ తర్వాత అతని కొడుకు ముహమ్మద్ మఖ్లూ అధికార పగ్గాలు చేపట్టాడు. అతను అధికారాంలోకి రాగానే మంత్రి ముహమ్మద్ బిన్ ముహమ్మద్ హకమ్‌కు రాజ్యాధికారా లన్నీ కట్టబెట్టాడు. ఈ మార్పుతో ప్రజలు మంత్రికి వ్యతిరేకులైపోయారు. వారు హి.శ. 708లో సుల్తాన్ ముహమ్మద్ మఖ్లూకు వ్యతిరేకంగా అతని సోదరుడు నసర్ బిన్ ముహమ్మద్‌ని రెచ్చగొట్టారు. మొదట వారు మంత్రి ఇంటిని లూటీ చేసి రాజమహల్‌పై దాడిచేశారు. తరువాత ముహమ్మద్ మఖ్లూని అరెస్టుచేసి పదవి నుండి తొలగించి నసర్ బిన్ ముహమ్మద్‌ని గద్దె నెక్కించారు. హి.శ. 709 నుండి క్రైస్తవరాజుల దాడులు మళ్ళీ మొదలయ్యాయి. మరొకవైపు అబూసయీద్ అనే ఓ ముస్లిం రాజు కూడా నసర్ బిన్ ముహమ్మద్‌కు వ్యతిరేకంగా దాడులుచేస్తూ అనేక ప్రాంతాలను కైవశం చేసుకున్నాడు. ఈవిధంగా గర్నాతారాజ్యం అంతర్‌యుద్ధాలతో రెండు ముక్కలై పోయింది.



హి.శ. 713లో అబూసయీద్ కొడుకు అబుల్‌వలీద్ గర్నాతా పట్టణంపై దాడి చేయ డానికి బయలుదేరాడు. సుల్తాన్ నసర్ అతడ్ని ఎదుర్కోవడానికి వెళ్ళి పరాజయంపాలై తిరిగొచ్చాడు. అతను గర్నాతా చేరుకొని శాంతిఒప్పందం కోసం ప్రయత్నించాడు. అయితే గర్నాతాప్రజలు కొందరు మాలిఖాకు తిరిగి వెళ్ళిపోయిన అబుల్‌వలీద్ దగ్గరకు చేరుకొని అతడ్ని గర్నాతాపై దాడిచేయడానికి పురిగొల్పారు. దాంతో అబుల్‌వలీద్ వెంటనే బయలుదేరి గర్నాతాపై దాడిచేశాడు. ఇరుపక్షాల మధ్య సమరజ్వాలలు మింటి కెగిశాయి. చివరికి అబుల్‌వలీద్ విజయం సాధించాడు. సుల్తాన్ నసర్ రాజమహల్‌లో బంది అయి అధికారపీఠం నుండి దిగిపోయి దాన్ని అబుల్‌వలీద్‌కు అప్పగిస్తూ దస్తావీజ్ రాసిచ్చాడు. అబుల్‌వలీద్ అధికారపీఠం అధిరోహించి సుల్తాన్ నసర్‌కు ఆష్ లోయకు వెళ్ళి ఉండేందుకు అనుమతిచ్చాడు.

అబుల్‌వలీద్ అధికారం చేపట్టగానే రాజ్యవ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించి పరిపాలన ప్రారంభించాడు. హి.శ. 716లో క్రైస్తవులు గర్నాతా సరిహద్దు ప్రాంతాలపై దాడులకు తెగబడ్డారు. సుల్తాన్ అబుల్‌వలీద్ వాటిని తిప్పికొట్టాడు. క్రైస్తవులు ఆ తర్వాత హి.శ. 719లో తమ పోరాటానికి మతరంగు పులిమి శిలువయుద్ధాలు మొదలు పెట్టారు. తైతలా పట్టణంలో రెండులక్షలకు పైగా సైన్యాన్ని సమీకరించారు. సైన్యంలో వివిధ యూరప్‌దేశాలకు చెందిన ఇరవైమంది రాజులు, పోప్‌తో పాటు అనేకమంది పాదరీలు పాల్గొన్నారు. లోగడ కనీవినీ ఎరగని ఈ భారీసైన్యం నురుగులు కక్కుతూ గర్నాతా దిశగా బయలుదేరింది. ఈ వార్తలు విని గర్నాతాప్రజలు తీవ్ర ఆందోళన చెందసాగారు.

సుల్తాన్ అబుల్‌వలీద్ నిరాశచెందకుండా దేవుని మీద భారంవేసి అయిదున్నర వేల మంది సైనికుల్ని మాత్రమే సమీకరించగలిగాడు. అందులో నాలుగు వేలు కాల్బలం, మిగతా వేయిన్నర అశ్వికదళం. ఆ తక్కువ సైన్యంతోనే సుల్తాన్ గర్నాతా నుండి బయలుదేరాడు. అతను ఒక దళపతి నాయకత్వంలో అయిదొందలమంది సైనికుల్ని ఇచ్చి ముందుగా పంపి తాను అయిదువేల మంది సైనికుల్ని తీసుకొని అతని వెనకాల బయలుదేరాడు. ఈ అయిదొందల మంది యోధులు క్రైస్తవులకు చెందిన పెట్రోల్ సైనికదళంతో తలపడి దాన్ని వెనక్కి నెట్టివేశారు. ఆతర్వాత సుల్తాన్ అల్‌బసీరా ప్రాంతం సమీపంలోని ఒక అడవిలో వేయిమంది అశ్వికదళం సైనికుల్ని దాచిపెట్టి అయిదొందల మంది సైనికుల్ని ముందుకు పంపాడు. వారిని 'మీరు క్రైస్తవసైన్యం ముందుకు పురోగమించి వారితో పోరాడుతూ వెనక్కి జరుగుతూ ఉండాలి. అల్‌బసీరా అడవి రాగానే అడవిలో దాక్కొని కాచుకొనివున్న మన సైనికులు శత్రువులపై మెరుపుదాడి చేస్తారు' అని ఆదేశించాడు.

హి.శ. 719లో ఈ అయిదొందల మంది ముస్లిం యోధులు క్రైస్తవసైన్యం ముందు కెళ్ళి దాంతో పోరాడుతూ వెనక్కి జరగసాగారు. క్రైస్తవులు ఆ కొద్దిమంది ముస్లింలను చూసి రెట్టింపు ఉత్సాహంతో పోరాడుతూ మరో ముస్లిందళం దాక్కున్న అడవి దగ్గరకు చేరుకున్నారు. అంతే, అడవిలో దాక్కున్న వేయిమంది ముస్లిం యోధులు ఒక్కసారిగా క్రైస్తవసైన్యంపై విజృంభించి ఊచకోత కోయడం మొదలెట్టారు. అదే సమయంలో

సుల్తాన్ అబుల్‌వలీద్ తన దగ్గర మిగిలివున్న మూడువందల మంది సైనికులతో వచ్చి మెరుపుదాడి చేశాడు. దాంతో లక్షల సంఖ్యలో ఉన్న క్రైస్తవసైన్యం దిమ్మతిరిగిపోయి వీలున్న వైపుకు పారిపోవడం మొదలెట్టారు. అల్‌బసీరా యుద్ధంగా ప్రసిద్ధిచెందిన ఈ యుద్ధంలో లక్షమంది క్రైస్తవులు మృత్యువాత పడగా మిగిలిన సైనికులు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని బ్రతుకుజీవుడా అంటూ పారిపోయారు. ఈ యుద్ధంలో ముస్లింలు పదముగ్గురు మంది మాత్రమే అమరగతులయ్యారు.

ఆ తరువాత సుల్తాన్ అబ్దుల్‌వలీద్ క్రైస్తవుల అభ్యర్థనపై వారితో ఒప్పందం చేసుకొని దేశ అంతర్గత వ్యవస్థను పటిష్ఠపరచడంలో నిమగ్నుడైపోయాడు. హి.శ. 725లో మర్తాష్ కోటను జయించి గర్నాతా తిరిగొచ్చాడు. అయితే సుల్తాన్ సోదర కుమారుడు మోసంచేసి అతడ్ని పొట్టన పెట్టుకున్నాడు. ఉన్నతాధికారులు వెంటనే ప్రతీకార శిక్షగా అతడ్ని హతమార్చి సుల్తాన్ అబుల్‌వలీద్ కొడుకు ముహమ్మద్‌ని గద్దె నెక్కించారు.

సుల్తాన్ ముహమ్మద్ అధికారం చేపట్టగానే అబుల్‌అలా ఉస్మాన్‌ని మంత్రిగా నియమించాడు. కాని అతను తన అధికారాన్ని పెంచుకుంటూ అధికారపీఠానికి ప్రమాదకారిగా మారే సూచనలు కన్పించడంతో సుల్తాన్ అతడ్ని హి.శ. 729లో హతమార్చాడు. హి.శ. 733లో సుల్తాన్ జబలుత్తారిఖ్ ప్రాంతాన్ని క్రైస్తవుల నుండి తిరిగి వశపరచుకోగలిగాడు. అయితే సుల్తాన్ ఆ విజయం నుండి గర్నాతాకు తిరిగొస్తుండగా దారిలో అబుల్‌అలా ఉస్మాన్ కొడుకులు, బంధువులు అవకాశం చూసి అతడ్ని హతమార్చారు.

సుల్తాన్ ముహమ్మద్ హత్య తరువాత అతని సోదరుడు యూసుఫ్ అధికారం చేబట్టాడు. సుల్తాన్ యూసుఫ్ తన అన్న హంతకుల నుండి ప్రతీకారం తీర్చుకొని ఎంతో సమర్థవంతంగా పరిపాలన చేయసాగాడు. హి.శ. 740లో క్రైస్తవులు మరొకసారి భారీ సైన్యాన్ని మోహరించి యుద్ధానికి దిగారు. గర్నాతాసుల్తాన్ యూసుఫ్ మొరాకో సుల్తాన్ అబుల్‌హసన్‌తో కలసి వారిని ప్రతిఘటించారు. కాని లక్షల సంఖ్యలో ఉన్న క్రైస్తవ సైన్యాన్ని ప్రతిఘటించలేక అనేకమంది యోధుల్ని బలిచేసుకున్నారు. అబుల్‌హసన్ మొరాకో పారిపోయాడు; యూసుఫ్ గర్నాత చేరుకొని ఊపిరి పీల్చుకున్నాడు.

హి.శ. 755లో సుల్తాన్ యూసుఫ్ క్రైస్తవుల నుండి ప్రతీకారం తీర్చుకోవడానికి యుద్ధసన్నాహాలు పూర్తిచేశాడు. అయితే పండుగరోజు యూసుఫ్ ఈద్‌నమాజ్ చేస్తుండగా సజ్దా స్థితిలో ఒక అనుమానాస్పద వ్యక్తి అతడ్ని హతమార్చాడు.

యూసుఫ్ మరణానంతరం అతని కొడుకు ముహమ్మద్ అధికారంలోకి వచ్చాడు. అయిదేళ్ళ పాలన తరువాత హి.శ. 760లో సుల్తాన్ ముహమ్మద్ ఏదో పని మీద జన్నతుల్‌అరీఫ్‌కు వెళ్ళిఉన్నాడు. ఆ సమయంలో అతని సవతి సోదరుడు ఇస్మాయీల్ గర్నాతాను ఆక్రమించుకున్నాడు. ఈ సంగతి తెలిసి సుల్తాన్ ముహమ్మద్ ఆష్ లోయకు వెళ్ళి అక్కడ్నుంచి మొరాకోరాజు అబూసాలమ్ పిలుపుపై మొరాకో చేరుకొని అతనికి అతిథిగా ఉండసాగాడు. అటు గర్నాతాలో సుల్తాన్‌ఇస్మాయీల్‌ని అతని సోదరుడు అబూయహ్యా అబ్దుల్లా హి.శ. 762లో చంపి అధికారం కైవశం చేసుకున్నాడు.



అటు ఆరవ ముహమ్మద్ హి.శ. 763లో గర్నాతా ఆక్రమించుకొని తనదైన శైలిలో పరిపాలన సాగిస్తూ క్రైస్తవదాడుల్ని ప్రతిఘటిస్తున్న రోజుల్లో ఖస్తలా క్రైస్తవరాజుకు అతని సోదరునికి మధ్య యుద్ధాలు చెలరేగాయి. మరొకవైపు మొరాకోరాజు అబూసాలమ్ మరణంతో అతని కొడుకుల్లో అంతర్‌యుద్ధాలు మొదలయ్యాడు. ఈ రెండు అంతర్ యుద్ధాల కారణంగా జబలుత్తారిఖ్ ప్రాంతాన్ని సులభంగా వశపరచుకొని నిర్భయంగా పరిపాలన చేయసాగాడు. చివరికి హి.శ. 793లో అతను చనిపోయాడు. అతని మరణానంతరం అతని కొడుకు రెండవ యూసుఫ్ అధికారం చేపట్టాడు. అయితే అతను అయిదేళ్ళ పాలన తరువాత హి.శ. 798లో చనిపోయాడు. రెండవ యూసుఫ్ మరణానంతరం ఏడవ ముహమ్మద్ అధికారంలోకి వచ్చాడు. హి.శ. 803లో క్రైస్తవులకు, ముస్లింలకు మధ్య భీకరయుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఫలితం ఎవరికీ దక్కలేదు. అంచేత ఉభయపక్షాల మధ్య ఎనిమిది నెలల నిర్యుద్ధ ఒడంబడిక జరిగింది. అయితే ఈ కాలపరిమితి ముగియకముందే సుల్తాన్ ముహమ్మద్ వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు. ఆ తరువాత అతని సోదరుడు మూడవ యూసుఫ్ గద్దె నెక్కాడు.

మూడవ యూసుఫ్ అధికారంలోకి వచ్చిన తరువాత ఖస్తల క్రైస్తవరాజు దగ్గరకు ఒక దూతను పంపి ఒప్పందం కాలపరిమితిని మరో రెండేళ్ళు పెంచుకున్నాడు. ఈ రెండేళ్ళ కాలపరిమితి ముగిసిన తరువాత మరికొంత గడువు పెంచమని ఆ రాజును కోరాడు. దానికా రాజు, మీ సుల్తాన్ మాకు కప్పం చెల్లించడానికి ఒప్పుకుంటే మీ విజ్ఞప్తిని మన్నిస్తాను అని సమాధానమిచ్చాడు. దాన్ని సుల్తాన్ దూత నిరాకరించాడు. దాంతో ఖస్తలా రాజు మండిపడుతూ సైన్యం తీసుకొని గర్నాతా రాజ్యంపై దాడిచేశాడు. తీవ్రంగా యుద్ధం జరిగింది. ఖస్తలా రాజు గర్నాతాలోని కొన్ని ప్రాంతాలు ఆక్రమించుకున్నాడు. ఈ యుద్ధం జరుగుతున్న రోజుల్లోనే మరొకవైపు మొరాకో రాకుమారుడు అబూసయీద్ నాయకత్వంలో ఒక సైన్యం జబలుత్తారిఖ్ మీద దాడిచేసింది. ఈసంగతి తెలిసి సుల్తాన్‌యూసుఫ్ తన తమ్ముడు అహ్మద్ నేతృత్వంలో ఒక సైనికదళం పంపాడు. అక్కడ ఇద్దరు రాకుమారుల మధ్య సంధి జరిగింది. అబూ సయీద్ ఆతర్వాత అహ్మద్ వెంట అతిథిగా గర్నాతా చేరుకున్నాడు.

అబూసయీద్ అన్న అయిన మొరాకోరాజు ఏవిధంగానైనా అబూసయీద్‌ని చంపెయ్యమని సుల్తాన్ యూసుఫ్‌కు ఓ రహస్యలేఖ రాశాడు. సుల్తాన్ యూసుఫ్ విషయం బయటపెట్టి ఆ లేఖను అబూసయీద్‌కు చూపిస్తూ 'నీ తమ్ముడు నిన్ను చంపించడానికే జబలుత్తారిఖ్ మీద దాడిచేయడానికి పంపించాడు' అని తెలియజేశాడు. అప్పుడు అబూసయీద్ స్పెయిన్‌లోనే యుద్ధసన్నాహాలు చేసుకొని హి.శ. 820లో ఓ శుభముహూర్తాన మొరాకోపై దాడిచేసి తన తమ్ముడ్ని తొలగించి అధికారపీఠం చేజిక్కించుకున్నాడు. ఈ విధంగా సుల్తాన్ యూసుఫ్ సహాయం చేసినందుకు అబూసయీద్ అతనికి ఎంతో కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. సుల్తాన్ యూసుఫ్ ఎంతో న్యాయశీలుడైన రాజు. క్రైస్తవులు కూడా తమ వివాదాలను సుల్తాన్ ముందుకు తెచ్చి పరిష్కరింపజేసుకునేవారు. హి.శ. 822లో యూసుఫ్ ఇహలోకం వీడిపోయాడు.

సుల్తాన్ యూసుఫ్ మరణానంతరం అతని కొడుకు ఎనిమిదవ ముహమ్మద్ గద్దె ఎక్కాడు. అయితే అతను అసమర్థులు, ఆకతాయిలను చేరదీసి ప్రజాసమస్యల్ని నిర్లక్ష్యం చేశాడు. దాంతో ప్రజలు అతని ధోరణి పట్ల తీవ్రమైన అసంతృప్తి వెలిబుచ్చారు. తొమ్మిదో ముహమ్మద్ దాన్ని వినియోగించుకుంటూ గర్నాతాను స్వాధీనం చేసుకున్నాడు. ఎనిమిదో ముహమ్మద్ గర్నాతా నుండి ట్యూనిస్ రాజు అబుల్‌ఫారస్ దగ్గరకు పారిపోయి అతని దగ్గర ఆశ్రయం పొందాడు.

తొమ్మిదవ ముహమ్మద్ అధికారపీఠం ఎక్కగానే పాలకవర్గాన్ని తన వైపుకు తిప్పు కున్నాడు. కాని సహృదయుడైన మంత్రి యూసుఫ్‌ని పదవీచ్యుడ్ని చేశాడు. దాంతో మంత్రి యూసుఫ్ పదిహేను వందలమంది అనుచరుల్ని వెంటబెట్టుకొని ముర్సియా పారిపోయి ఖస్తలా క్రైస్తవరాజు మస్మిజాన్‌తో సంబంధం పెట్టుకునే ప్రయత్నం చేశాడు. అతని సలహాతో సమర్థులైన కొందరు అనుచరుల్ని ట్యూనిస్ రాజు దగ్గరకు పంపి అతని సహాయం కోరాడు. ట్యూనిస్ రాజు అయిదొందల మంది రౌతుల్ని, అవసరమైన పైకాన్ని ఎనిమిదవ ముహమ్మద్‌కు ఇచ్చి తన ఓడల్లో ఎక్కించి స్పెయిన్‌కు పంపాడు.

ఎనిమిదవ ముహమ్మద్ స్పెయిన్ తీరం మీద దిగగానే మాజీమంత్రి యూసుఫ్ కృషితో అల్మీరియా రాష్ట్ర ప్రజలు అతనికి సహాయం చేయడానికి అంగీకరించారు. ఇలా ఎనిమిదవ ముహమ్మద్ సైన్యంతో వస్తున్నాడని తెలియగానే తొమ్మిదవ ముహమ్మద్ అతడ్ని ఎదుర్కోవడానికి సైన్యం పంపాడు. ఈ రెండు సైన్యాలు ఎదురెదురుగా వచ్చి నిలబడగానే మాజీమంత్రి యూసుఫ్ కృషితో తొమ్మిదవ ముహమ్మద్‌కు చెందిన అనేక మంది సైనికులు ఎనిమిదవ ముహమ్మద్‌కు చెందిన సైన్యంలో కలసిపోయారు. దాంతో మిగిలిన ప్రభుత్వ సైనికులు భయపడి గర్నాతాకు పారిపోయారు. వెంటనే ఎనిమిదవ ముహమ్మద్ సైన్యంతో వెళ్ళి గర్నాతాను జయించాడు. తర్వాత తొమ్మిదవ ముహమ్మద్ ని హతమార్చి అధికార పీఠం అధిరోహించాడు.

ఈవిధంగా ఎనిమిదవ ముహమ్మద్ రెండవసారి గర్నాతా రాజ్యాధినేత అయిన తర్వాత మంత్రి యూసుఫ్ సలహా మేరకు తన నడవడికను మార్చుకొని జనహృదయాల్ని చూరగొనడంలో నిమగ్నుడైపోయాడు. తర్వాత కొంతకాలానికి ముస్లింలకు, క్రైస్తవులకు మధ్య మళ్ళీ యుద్ధపరంపర మొదలయింది. ఇదిలా ఉంటే మరొకవైపు ఎనిమిదవ ముహమ్మద్‌కు బంధువైన యూసుఫ్ ఇబ్నుల్‌అహ్మర్ అనేవాడు గర్నాతాను ఆక్రమించు కోవడానికి ఖస్తలా క్రైస్తవరాజు సహాయం కోరాడు. ఆ రాజు వెంటనే అతని సహాయం కోసం తన సైన్యాన్ని పంపాడు. ఒకచోట ఇరుపక్షాల మధ్య సంకులసమరం జరిగింది. కాని జయాపజయాలు ఎవరికీ లభించకుండానే ఆ యుద్ధం ముగిసింది.

ఆ తరువాత యూసుఫ్ ఇబ్నుల్‌అహ్మర్ ఖస్తలా రాజు ఇచ్చిన సైన్యం తీసుకొని గర్నాతా సరిహద్దుల్లో అరాచకం సృష్టిస్తూ పురోగమించసాగాడు. సుల్తాన్ ఎనిమిదవ ముహమ్మద్ అతడ్ని ఎదుర్కోవడానికి మంత్రి యూసుఫ్‌ని పంపాడు. కాని హి.శ. 839లో ఇబ్నుల్‌అహ్మర్‌తో జరిగిన ఒక యుద్ధంలో మంత్రి యూసుఫ్ హతమయ్యాడు.



సహృదయుడైన మంత్రి యూసుఫ్ యుద్ధంలో చనిపోగానే గర్నాతా ప్రజల్లో సుల్తాన్‌కు వ్యతిరేకంగా తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాడు. దాంతో సుల్తాన్ ఎనిమిదవ ముహమ్మద్ భయపడి రాజమహల్లోని ధనరాసులు తీసుకొని గర్నాతా నుండి మాలిఖా వైపుకు పారిపోయాడు. ఆ తరువాత యూసుఫ్ ఇబ్నుల్‌అహ్మర్ వచ్చి గర్నాతా సుల్తాన్ అయ్యాడు. అధికారం చేపట్టగానే ఎనిమిదవ ముహమ్మద్‌ని బంధించడానికి మాలిఖా వైపుకు సైన్యం పంపే సన్నాహాలు చేయసాగాడు. కాని అకస్మాత్తుగా జబ్బుపడి (ఆర్నెల్ల పాలన తర్వాత) చనిపోయాడు.

యూసుఫ్ ఇబ్నుల్‌అహ్మర్ మరణవార్త వినగానే ఎనిమిదవ ముహమ్మద్ మాలిఖా నుండి గర్నాతా తిరిగొచ్చి మూడోసారి అధికారం చేబట్టాడు. కాని ముస్లింలలో అంతర్గత యుద్ధాలు మళ్ళీ మొదలయ్యాయి. సుల్తాన్ ముహమ్మద్ మరో బంధువు ఇబ్నె ఉస్మాన్ క్రైస్తవులతో కుమ్మక్కయి, ముస్లిం విద్రోహుల్ని చేరదీసి గర్నాతా రాజ్యాన్ని వశపరచు కున్నాడు. హి.శ. 859లో అతని సోదరుడు ఇబ్నె ఇస్మాయీల్ క్రైస్తవుల సహకారంతో ఇబ్నె ఉస్మాన్‌ని ఓడించి గర్నాతా రాజ్యాన్ని వశపరచుకున్నాడు. అతను క్రైస్తవరాజులతో ఓ సుదీర్ఘకాలం పోరాడుతూ హి.శ.870లో చనిపోయాడు. ఇబ్నెఇస్మాయీల్ మరణానంతరం అతని కొడుకు అబుల్‌హసన్ గర్నాతా సుల్తాన్ అయ్యాడు.

అబుల్‌హసన్ అధికారం చేపట్టిన తర్వాత క్రైస్తవులతో యుద్ధాలు కొనసాగాయి. కొన్నాళ్ళకు ఖస్తలా రాజు ఫర్డినంద్ అర్గూన్ రాకుమారి అజ్బేలాను వివాహమాడాడు. ఆ వివాహం తర్వాత అర్గూన్‌రాజ్యం ఖస్తలారాజ్యంలో విలీనమై సువిశాల క్రైస్తవ సామ్రాజ్యం గా మారింది. ఆ దంపతులు పచ్చి మతదురభిమానులు. వారు స్పెయిన్ నుండి ముస్లింలను పూర్తిగా తుడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారు.

అలాంటి పరిస్థితిలో సుల్తాన్ అబుల్‌హసన్ క్రైస్తవ చక్రవర్తి ఫర్డినంద్‌కు సంధి కోసం లేఖ రాశాడు. దానికి ఫర్డినంద్, తనకు కప్పం చెల్లించడానికి అంగీకరిస్తే సంధి చేసుకో డానికి సిద్ధంగా ఉంటానన్నాడు. దానిపై అబుల్‌హసన్ మండిపడుతూ, గర్నాతాలో బంగారునాణాలకు బదులు క్రైస్తవుల మెడలు నరకడానికి ఇనుపఖడ్గాలు తయారవు తున్నాయని సమాధానం ఇచ్చాడు. కొన్నాళ్ళకు ముస్లింలకు, క్రైస్తవులకు మధ్య కొన్ని చెదురుమదురు దాడుల తరువాత హి.శ. 887లో ఫర్డినంద్ భారీసైన్యంతో గర్నాతా దిశగా బయలుదేరాడు. ఈ సంగతి తెలియగానే సుల్తాన్ అబుల్‌హసన్ కూడా సైన్యం తీసుకొని బయలుదేరాడు. గర్నాతా సరిహద్దు ప్రాంతంలో ఉభయపక్షాలు ఢీకొన్నాయి. క్రైస్తవసేనలు చిత్తుగా ఓడిపోయి పలాయనం చిత్తగించాయి.

సుల్తాన్ అబుల్‌హసన్ శత్రుసైన్యాన్ని పారదోలి విజయదరహాసంతో గర్నాతాకు తిరిగొస్తుంటే దారిలో ఒక ఘోరమైన వార్త విన్పించింది. అబుల్‌హసన్ కొడుకు అబూ అబ్దుల్లా ముహమ్మద్ తండ్రిలేని సమయంచూసి గర్నాతాను వశపరచుకొని సింహాసనం అధిష్ఠించాడు. పాపం అబుల్‌హసన్ తనకొడుకు చేసిన ఈ నిర్వాకంతో మార్గాంతరంలేక మాలిఖా చేరుకొని ఉండసాగాడు.

ఇలా గర్నాతా రాజ్యంలోని పశ్చిమ భూభాగం మాత్రమే అబుల్‌హసన్ అధీనంలో మిగిలిఉండింది. సుల్తాన్ అబుల్‌హసన్ క్రైస్తవులతో పోరాడటానికి మాలిఖా నుండి బయలుదేరాడు. అటు సుల్తాన్ కొడుకు ముహమ్మద్ తన తండ్రి అధీనంలోని మిగతా భూభాగాన్ని కూడా హస్తగతం చేసుకోడానికి గర్నాతా నుండి సైన్యంతో బయలుదేరాడు. అబుల్‌హసన్ క్రైస్తవుల్ని ఓడించి తిరిగొస్తుంటే దారిలో కొడుకుసైన్యంతో తలపడవలసి వచ్చింది. ఆ సైన్యాన్ని కూడా తరిమికొట్టి మాలిఖాకు తిరిగొచ్చాడు. కాని అబుల్‌హసన్ మాలిఖాకు తిరిగిరాగానే అతనికి పక్షపాతం వచ్చింది. దాంతోపాటు అతని కంటిచూపు కూడా తగ్గిపోసాగింది.

అటు అబూఅబ్దుల్లా ముహమ్మద్ గర్నాతాలో సైన్యం సమీకరించి క్రైస్తవ ప్రాంతాల మీద దాడికి తెగబడ్డాడు. అక్కడి క్రైస్తవ సేనాని దారిలో ఒకచోట దాక్కొని అబూఅబ్దుల్లా సమరసొత్తుతో విజయవంతంగా తిరిగొస్తుంటే అతని సైన్యంపై మెరుపుదాడి చేసి ఊచ కోత కోశాడు. అబూఅబ్దుల్లాను బంధించి ఖస్తలా రాజు దగ్గరకు పంపాడు. గర్నాతా ప్రజలు ఈవార్త విని అబుల్‌హసన్ దగ్గరకు చేరుకొని, గర్నాతా వచ్చి దాన్ని కాపాడుకో మని మనవి చేశారు. కాని అబుల్‌హసన్ తన అనారోగ్య పరిస్థితి తెలిపి తాను గర్నాతా రాలేనని, తన స్థానంలో తన తమ్ముడు అబూఅబ్దుల్లా జగల్‌ని గర్నాతా పీఠం అధిరో హింపజేయమని చెప్పాడు.

ఈ ఆదేశం ప్రకారం అబూఅబ్దుల్లా జగల్ గర్నాతా వెళ్ళి అధికారపీఠం అధిష్టించాడు. ఆ తరువాత క్రైస్తవ సేనలు మాలిఖా కోటను ఆక్రమించుకొని బఖ్యాన్ కోటను ముట్ట డించి దాన్ని కూడా స్వాధీనం చేసుకున్నాయి. హి.శ. 890లో జగల్ సైన్యంపై క్రైస్తవులు దాడిచేశారు. అయితే జగల్‌సైన్యం శత్రుసేనల్ని మట్టికరిపించి పారదోలింది. ఈ పరాజ యంతో ఖస్తలారాజు ఫర్డినంద్ సాధారణ పరిస్థితిలో ముస్లింలతో పోరి గెలవలేమని భావించి కుయుక్తులకు దిగాడు. తనదగ్గర బందీగా ఉన్న అబుల్‌హసన్ కొడుకు అబూ అబ్దుల్లా ముహమ్మద్‌పై ఎంతో సానుభూతి కుమ్మరిస్తూ గర్నాతా సుల్తాన్ కావడానికి జగల్ కంటే నువ్వే ఎక్కువ అర్హుడని చెబుతూ అరచేతి వైకుంఠం చూపాడు.

అబూఅబ్దుల్లా ముహమ్మద్ ఆ క్రైస్తవరాజు సలహా పాటిస్తూ మాలిఖా వెళ్ళి అక్కడి ప్రజల్ని నచ్చజెప్పి తనకు అనుకూలంగా మలచుకున్నాడు. మాలిఖా ప్రజలు అతడ్ని సుల్తాన్‌గా అంగీకరించి రాజ్యవిస్తరణకై తెగబడ్డారు. గర్నాతాసుల్తాన్ జగల్ ఆ తిరుగు బాటును అణచడానికి బయలుదేరి విధిలేక లూషా ప్రాంతాన్ని అబూఅబ్దుల్లాకు హస్త గతం చేశాడు. అటు ఫర్డినంద్ సైన్యం తీసుకొని లూషా చేరుకున్నాడు. అతనికి అబూ అబ్దుల్లా స్వాగతంచెప్పి లూషా ప్రాంతాన్ని అతనికి అధీనం చేశాడు. హి.శ. 891లో మరి కొన్ని ప్రాంతాల్ని కూడా క్రైస్తవసైనికుల ద్వారా ఆక్రమించుకొని ఫర్డినంద్‌కు స్వాధీనం చేశాడు. ఈవిధంగా ఫర్డినంద్ తాను స్వయంగా స్వాధీనం చేసుకోలేని ముస్లిం ప్రాంతా లను అబూఅబ్దుల్లా ద్వారా స్వాధీనం చేసుకోగలిగాడు. ఇలా అనేక ప్రాంతాలు తమ నుండి చేజారిపోయిన తరువాత ముస్లింలు కళ్ళు తెరిచారు.



**17-వినాశం వైపుకు గర్నాతా :-** హి.శ. 892లో ఫర్డినంద్ భారీసైన్యంతో వెళ్ళి మాలిఖాపై దాడిచేశాడు. సుల్తాన్ జగల్ ఈదాడి సంగతి విని సైన్యం తీసుకొని మాలిఖా వైపు బయలుదేరాడు. అప్పుడు అబూఅబ్దుల్లా ముహమ్మద్ అవకాశం చూసి గర్నాతాను స్వాధీనం చేసుకున్నాడు. జగల్ గర్నాతాను అబూఅబ్దుల్లా స్వాధీనం చేసుకున్న సంగతి తెలుసుకోగానే వెనక్కి మరలి ఆష్‌లోయలో ఆగిపోయాడు. మాలిఖాప్రజలు ఫర్డినంద్ సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ మొరాకో, ట్యూనిస్, ఈజిప్టు, టర్కీ రాజుల సహాయం కోరుతూ లేఖలు రాశారు. కాని వారిలో ఏ ఒక్కరూ స్పెయిన్ ప్రజల్ని ఆదుకోవడానికి సైన్యాన్ని పంపలేదు. దాంతో వారు పూర్తిగా నిరాశచెంది మాలిఖా ప్రాంతాన్ని బేషరతుగా ఫర్డినంద్‌కు స్వాధీనంచేశారు.

ఫర్డినంద్ మాలిఖాను స్వాధీనం చేసుకోగానే ముస్లింలందర్నీ ఖైదీలుగా పట్టుకొని వారి ఆస్తిపాస్తులన్నీ జప్తుచేసుకోవాలని ఉత్తర్వుజారీచేశాడు. దాంతో క్రైస్తవులు పదిహేను వేలమంది ముస్లింలను బానిసలుగా చేసుకున్నారు. మిగిలిన ముస్లింలను కట్టుబట్ట లతో మాలిఖా నుంచి బహిష్కరించారు. వారిలో అనేకమంది ఆకలితో చనిపోయారు. బ్రతికి బయటపడినవారు ఆఫ్రికా చేరుకొని ఉండసాగారు. హి.శ. 895లో ఫర్డినంద్ మాలిఖా చుట్టుపక్కల పట్టణాలు, గ్రామాలను కూడా ఆక్రమించుకొని అక్కడి ముస్లిం లను ఊచకోత కోయడమో, స్పెయిన్ నుండి బహిష్కరించడమో చేశాడు. అలాగే అనేక ప్రాంతాల్లో హత్యా-అరాచకాలు సృష్టిస్తూ ఆష్‌లోయలోని సుల్తాన్ జగల్‌ని కలుసుకొని తనతో సహకరిస్తే గర్నాతాపాలనను తిరిగి ఇప్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి అతడ్ని బుట్టలో వేసుకున్నాడు. జగల్ వేరే దారిలేక ఆష్ లోయను ఫర్డినంద్‌కు అప్పగించి అతనితో చేతులుకలిపాడు. ఫర్డినంద్ జగల్ మద్దతుతో అల్‌మీరియాను సులభంగా ఆక్రమించుకున్నాడు. ఇప్పుడిక గర్నాతా, దాని పరిసరప్రాంతాలు మాత్రమే ముస్లింల పాలనలో మిగిలివున్నాయి.

జగల్ తన అధీనంలోని అనేక ప్రాంతాలను ఖస్తలా రాజు ఫర్డినంద్‌కు స్వాధీనంచేసి చేతులు దులుపుకున్నాడని తెలిసి సుల్తాన్ అబూఅబ్దుల్లా ఇక గర్నాతాకు తానే తిరుగు లేని సుల్తాన్నని, ఫర్డినంద్ గర్నాతాపై దాడిచేయడానికి సాహసించలేడని భావిస్తూ తెగ సంబరపడిపోతున్నాడు. అంతలో ఫర్డినంద్ ఒక లేఖలో “మీ బాబాయి తన ఆక్రమణలో ఉన్న భూభాగమంతా ఎలా నాకు స్వాధీనంచేశాడో అలాగే నీ ఆక్రమణలో ఉన్న గర్నాతా వగైరా భూభాగమంతా నాకు స్వాధీనం చెయ్యి. స్వాధీనం చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి” అని హెచ్చరించాడు. సుల్తాన్ అబూఅబ్దుల్లా గర్నాతా ప్రజాప్రతి నిధుల్ని పిలిపించి వారికీ లేఖవిషయాలు తెలిపి సలహా అడిగాడు. ప్రజాప్రతినిధులంతా ఫర్డినంద్‌కు ఎదురొడ్డి పోరాడాలని ముక్తకంఠంతో తమ అభిప్రాయం వ్యక్తపరిచారు.

ఇదిలా ఉంటే అటు ఫర్డినంద్ భారీసైన్యంతో వచ్చి గర్నాతాను ముట్టడించాడు. నగరపౌరులు ప్రాణాలకు తెగించి క్రైస్తవసైన్యాన్ని ప్రతిఘటించారు. దాంతో ఫర్డినంద్ ముట్టడి వదిలేసి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయాక సుల్తాన్ అబూఅబ్దుల్లా గర్నాతా వెలుపల క్రైస్తవులు ఆక్రమించుకున్న ప్రాంతాలన్నీ తిరిగి వశపరచుకున్నాడు.

ఆ సమయంలో యాదృచ్ఛికంగా బషారత్ ప్రాంతంలోని ఒక గ్రామంలో నివసిస్తున్న జగల్ సుల్తాన్ అబూఅబ్దుల్లా దూకుడు చూసి అక్కసుతో క్రైస్తవసైనికుల్ని సమీకరించి అతనిపై ఎదురుదాడికి దిగాడు. "అబూఅబ్దుల్లాను ఇలా వదిలేస్తే మరింత బలం పుంజుకొని మీకు లేనిపోని సమస్యలు సృష్టిస్తాడు. అంచేత అతని దూకుడుకు వెంటనే అడ్డుకట్ట వేయండి" అని అతను ఫర్డినంద్‌కు హెచ్చరిక లేఖ కూడా రాశాడు. ఈ లేఖ అందిన కొన్నాళ్ళకు ఫర్డినంద్ భారీసైన్యంతో గర్నాతా సమీపానికి చేరుకున్నాడు. గర్నాతా పరిసరప్రాంతాల్లో అరాచకం సృష్టించి, ఆష్ లోయకు వెళ్ళి అక్కడి ముస్లింలను ఊచ కోతకోశాడు. మిగిలినవారిని స్పెయిన్ నుండే బహిష్కరించాడు. అలాగే మరొక కోటను కూడా జయించి అక్కడ కూడా హత్యా, అరాచకాలు సృష్టించాడు ఆ తర్వాత సైన్యం తీసుకొని తిరిగి వెళ్ళిపోయాడు.

జగల్ గర్నాతా సుల్తాన్ అబూఅబ్దుల్లా పతనం చూస్తూ ఫర్డినంద్ ఇక తనను గర్నాతా సింహాసనంపై కూర్చోబెడ్తాడని మహా సంబరపడిపోసాగాడు. కాని ఫర్డినంద్ ఖస్తలా తిరిగి వెళ్ళిపోతూ జగల్‌ని పిలిచి "ఇప్పుడిక స్పెయిన్‌లో మాకు నీ అవసరం లేదు. నువ్వీ దేశం నుండి బయటికి ఎక్కడికైనా వెళ్ళదలచుకుంటే అలా వెళ్ళిపోవడానికి మేము నీకు అనుమతిస్తున్నాము. ఈమాత్రమైనా మేము నీకు మేలు చేస్తున్నందుకు సంతోషించి త్వరగా వెళ్ళిపో ఇక్కడ్నుంచి" అని హెచ్చరించాడు. ఈ హెచ్చరికతో జగల్ విద్వేషం, విద్రోహాల మత్తు వదిలింది. అతను స్పెయిన్ వదలి ఆఫ్రికా చేరుకొని ఒక చిన్న గ్రామంలో భారంగా బతుకుబండి లాగుతూ శేషజీవితం గడపసాగాడు.

స్పెయిన్‌లో అక్కడక్కడ మిగిలివున్న ముస్లింప్రాంతాలపై కూడా క్రైస్తవ సైనికులు హత్యా, అరాచకాలు సృష్టిస్తూ తిరగసాగారు. గర్నాతా ప్రజలు అడపా దడపా వస్తున్న ఇలాంటి దుర్వార్తలు వింటూ తీవ్ర ఆందోళన చెందసాగారు. చివరికి హి.శ. 896లో ఖస్తలా చక్రవర్తి ఫర్డినంద్ లక్షలాది సైనికులతో, కోటలను ఛేదించే క్షిపణులతో సతీ సమేతంగా గర్నాతా సమీపానికి చేరుకున్నాడు. ఆ ప్రాంతానికి చేరుకోగానే అక్కడి పచ్చని తోటలు, పొలాలు, జనావాసాలపై విరుచుకుపడి ఘోరమైన అరాచకాలకు తెగబడ్డాడు; నెత్తుటి నదులు ప్రవహింపజేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత అతను గర్నాతాకు చేరుకొని దాన్ని ముట్టడించాడు. ముస్లింలు కోటలో బందీలై నిరాశతో ఆత్మరక్షణ యుద్ధం ప్రారంభించారు. ప్రాణాలకు తెగించి పోరాడసాగారు. ఇలా ఈముట్టడి ఎనిమిది నెలలు కొనసాగింది. అంతలో శీతాకాలం మొదలయింది. కొండలపై మంచు పేరుకో వడం వల్ల దారులు మూసుకుపోయాయి. దాంతో నగరప్రజలకు ఆహారసరఫరా ఆగి పోయింది. జనం తల్లడిల్లి పోయారు.

హి.శ. 897లో గర్నాతాప్రజలు "ఆకలితో అలమటిస్తూ చావడంకన్నా చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతూ చావడమే మంచిది. అందుకు మేము సిద్ధంగా ఉన్నాం. కేవలం ఏడువేల మంది యోధులతో లక్షమంది క్రైస్తవుల్ని మట్టికరిపించిన తారిఖ్ బిన్ జియాద్ వీరోచితసంఘటనను మేము మరచిపోలేదు. మనం ఇప్పుడు ఇరవై వేలమంది ఉన్నాం. కనుక క్రైస్తవులకు భయపడాల్సిన అవసరం లేదు" అన్నారు సుల్తాన్‌తో.



ప్రజల భావోద్రేకాల్ని చూసిన సుల్తాన్ వెంటనే మంత్రులు, ఉన్నతాధికారులు, ధర్మవేత్తల్ని సమావేశపరచి వారి అభిప్రాయాలు అడిగాడు. అందరూ ఫర్డినంద్‌తో ఒప్పందం చేసుకోవడమే మంచిదని చెప్పారు. సేనాపతి మూసా బిన్‌అబీల్ మాత్రం 'మనం ప్రాణాలకు తెగించి పోరాడవలసిందే. జనాభిప్రాయం కూడా ఇదే' అన్నాడు. కాని సభికులెవరూ అతని అభిప్రాయాన్ని సమర్థించలేదు. కాని ఆత్మస్థైర్యం కోల్పోయిన సుల్తాన్ వెంటనే ఒప్పందం చేసుకోవడానికి మంత్రి అబుల్‌ఖాసింను రహస్యంగా ఫర్డినంద్ దగ్గరకు పంపాడు. అప్పటికే నిరాశానిస్పృహలతో ఊగిసలాడుతున్న క్రైస్తవ చక్రవర్తి ఫర్డినంద్ ముస్లింమంత్రి నోట ఒప్పందం మాట విని సంబరపడి పోయాడు. తక్షణమే ఒప్పందం విజ్ఞప్తిని అంగీకరించాడు.

అబుల్‌ఖాసిం ఒప్పందం విషయాన్ని ప్రజలకు తెలియనీయకుండా రహస్యంగా ఉంచడానికి ప్రయత్నించాడు. అర్ధరాత్రివేళ ఒప్పందం మీద ఉభయపక్షాల నాయకులు సంతకాలు చేశారు. ఒప్పందం షరతుల్లో ముస్లింల ధన ప్రాణాల రక్షణకు హామీషరతు కూడా ఉంది. చివరికి ఒప్పందం సంగతి ప్రజలకు తెలిసిపోయింది. దాంతో సర్వత్రా భయాందోళనల కమ్ముకున్నాయి. సుల్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు మిన్నుముట్టాయి.

ఇలా జనంలో తిరుగుబాటు సూచనలు కన్పించడంతో సుల్తాన్ నిర్ణీత గడువుకు ముందే గర్నాతా కోటను, రాజమహల్‌ని క్రైస్తవులకు అప్పగించాడు. రాజు ఫర్డినంద్ ఆదేశంతో ప్రధాన మతాచార్యుడు మంజూరా కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని నగరంలో ప్రవేశించి కోటబురుజుపై ఉన్న ఇస్లామీయ చిహ్నాన్ని తొలగించి శిలువను ప్రతిష్ఠించాడు. మతాచార్యుడు మంజూరా కోటలో ప్రవేశిస్తున్న సమయంలోనే సుల్తాన్ అబూఅబ్దుల్లా గుర్రాలపై యాభై మంది అనుచరుల్ని, కుటుంబాన్ని తీసుకొని కోట నుండి బయటికి వచ్చాడు. చక్రవర్తి ఫర్డినంద్ సైనికుల మధ్య భార్యామణి పక్కన నిలబడి కోటబురుజుపై ప్రతిష్ఠించబడుతున్న సిలువ వైపు చూడసాగాడు.

సుల్తాన్ అబూఅబ్దుల్లా ఫర్డినంద్‌కు ఎదురుగా పోయి నగర తాళపుచెవులు అతనికి అందజేస్తూ "బలవంతుడైన మహారాజా! మేము నీ ప్రజలము. ఈ నగరాన్ని, యావత్తు దేశాన్ని మేము నీకు అప్పగిస్తున్నాము. ఇదే దైవాభీష్టం. నీవు ఎల్లప్పుడూ ప్రజల పట్ల సద్వర్తనంతో, ఉదాత్తవైఖరితో మసలుకుంటావని మేము ఆశిస్తున్నాము" అని అన్నాడు. ఆ తరువాత వెంటనే ముందుకు సాగి తన సామగ్రి, బంధువులు విడిదిచేసివున్న అల్‌బషారత్ పట్నం వైపుకు బయలుదేరాడు.

అంతలో గర్నాతా కోటబురుజుపై వెండి సిలువ ప్రతిష్ఠించబడి సూర్యకిరణాలతో మెరిసిపోసాగింది. క్రైస్తవ చక్రవర్తి ఫర్డినంద్ సతీసమేతంగా రాజమహల్‌లో ప్రవేశించాడు. అటు మాజీసుల్తాన్ అబూఅబ్దుల్లా ఓ కొండశిఖరం పైకి చేరుకొని వెనక్కి తిరిగి గర్నాతా వైపు చూస్తూ తన గత వైభవాన్ని తలచుకుంటూ అప్రయత్నంగా కంట తడిపెట్టుకున్నాడు. అతని తల్లి అతడ్ని చూసి "నువ్వొక గొప్ప సమరయోధుడవై ఉండినప్పుడే దేశాన్ని కాపాడుకోలేకపోయావు. పోయిన వస్తువు కోసం ఇప్పుడు ఆడదానిలా ఏడిస్తే ఏం లాభం?" అని అన్నది.

సుల్తాన్ అబూఅబ్దుల్లాను క్రైస్తవులు అల్‌బషారత్‌లో కూడా ఉండనివ్వలేదు. కొంత డబ్బిచ్చి అతడ్ని మొరాకో పంపివేశారు. అప్పుడు అబూఅబ్దుల్లా మొరాకోరాజు దగ్గర ఉద్యోగిగా పనిచేస్తూ కొంతకాలానికి దిగులుతో చనిపోయాడు.

క్రైస్తవులు స్పెయిన్‌పై పూర్తిగా పట్టు సాధించిన వెంటనే మతపరమైన న్యాయస్థానాలు నెలకొల్పి, వేలాదిమంది ముస్లింలను అసత్యారోపణలతో పట్టుకొచ్చి, న్యాయస్థానాల్లో కల్లబొల్లి మాటలతో విచారణజరిపి మరణశిక్షలు విధించడం మొదలుపెట్టారు. మరికొందరిని విచారణ జరపకుండానే అగ్నిగుండాల్లో విసిరి హతమార్చారు.

హి.శ. 904లో దేశవ్యాప్తంగా ఓ సాధారణ ఉత్తర్వుజారీచేస్తూ ముస్లిం అని చెప్పబడే ప్రతి వ్యక్తీ తప్పనిసరిగా క్రైస్తవమతం స్వీకరించాలని, క్రైస్తవం స్వీకరించడానికి నిరాకరించేవాడ్ని ఎక్కడ చిక్కితే అక్కడ పట్టుకొని హతమార్చాలని ఆదేశించడం జరిగింది. దాంతో లక్షలాది ముస్లింలు భయాందోళనలకు గురయి ఇళ్ళు-వాకిళ్ళు వదలి కొండ గుహల్లోకి పారిపోయారు. అలా పారిపోలేకపోయిన ముస్లింలను, వారి పిల్లల్ని క్రైస్తవులు పట్టుకొని బలవంతంగా బాప్తిజం చేయించి తమ మతంలోకి లాక్కున్నారు. వీరిలో అత్యధికమంది బయట నుంచి వచ్చిన అరబ్బుల, బర్బరీల సంతానం కాదు. వారసలు ఇస్లాంలోని సత్యతను చూసి సంతోషంతో ముస్లింలయిన స్పెయిన్ జాతీయులే.

క్రైస్తవులు కొందరు ముస్లింలను ఆఫ్రికా వెళ్ళిపోవడానికి అనుమతిచ్చినట్లు నటించి వారిని ఓడల్లో ఎక్కించి తీసికెళ్ళి నడిసముద్రంలో ముంచివేశారు. ఆ అమాయకులతో పాటు వారు తీసికెళ్ళిన ఎంతో విలువైన గ్రంథాలు కూడా సముద్రంలో పడిపోయి కనుమరుగై పోయాయి. ఒక్కమాటలో చెప్పాలంటే స్పెయిన్‌లో క్రైస్తవులు తీవ్రమైన మతోన్మాదంతో ముస్లింలను వెతికి వెతికి పట్టుకొని హతమార్చారు. స్త్రీలు, వృద్ధులు, పిల్లల్ని సైతం హృదయవిదారకంగా ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతున్నా దయదలచకుండా పరమ నిర్దాక్షిణ్యంగా చంపేశారు.

కొండల్లోకి పారిపోయిన ముస్లింలలో కూడా కొందరు క్రైస్తవులకు పట్టుబడి హతమార్చబడ్డారు. మిగిలినవారిలో కొందరు తిండి దొరక్క మలమలమాడి చనిపోయారు. మరికొందరు అష్టకష్టాలు పడుతూ సిరియా చేరుకున్నారు. ఈవిధంగా కొన్నేళ్ళలోనే దేవుడ్ని, ఆయన ప్రవక్త (స)ను స్మరించే ఒక్క ముస్లిం కూడా స్పెయిన్‌లో లేకుండా పోయాడు. దీన్నిబట్టి ఆనాడు స్పెయిన్‌లో ఎంత పెద్దఎత్తున ఎంత ఘోరమైన సామూహిక హత్యాకాండలు జరిగాయో ఊహించవచ్చు. స్పెయిన్‌పాలన చివరిశతాబ్దాల కాలంలో ఇస్లాం బోధనలను నిర్లక్ష్యం చేసి అంతఃకలహాల్లో, విద్రోహచర్యల్లో మునిగి తేలుతుండిన ముస్లింల స్వయంకృతాపరాధం పర్యవసానమే ఈ వినాశం. ఖుర్‌ఆన్, హదీసులతో కూడిన ఇస్లాం సమస్తరంగాలను పరివేష్ఠించివున్న సమగ్ర జీవనవ్యవస్థ. అలాంటి మహత్తర జీవనవ్యవస్థ నుండి ప్రపంచవ్యవహారాలను వేరుచేసి ఖుర్‌ఆన్ బోధనలకు దూరమైనప్పుడల్లా ముస్లింలపై ఇలా దైవాగ్రహం విరుచుకుపడుతూనే ఉంటుంది. ఈనాడు కూడా అదే జరుగుతోంది. అయినప్పటికీ ముస్లింలు "గత చరిత్ర నుండి మేము గుణపాఠం నేర్చుకోము" అనే ధోరణిలోనే ఉన్నారు.



# 63. ఈజిప్టులో ఉబైదీ(న్)ల పరిపాలన

బనూఉమయ్యా వారి పాలన తరువాత బనూఅబ్బాసియా వారి ఖిలాఫత్ పాలన ప్రారంభంకాగానే అలీవ్షియాలు దాన్ని వ్యతిరేకించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. వారు అనేకసార్లు తిరుగుబాటులు చేయడం, వారిని బనూఅబ్బాసీలు అణచివేయడం జరిగింది. బనూఅబ్బాసీల సామ్రాజ్యం బలహీనమవడం ప్రారంభించగానే యూదులు, మజూసీలు (అగ్నిపూజారులు) తమనుతాము అలీవ్షియా ముస్లింలని చెప్పుకుంటూ ప్రయోజనం పొందడానికి ప్రయత్నించారు. హి.శ. మూడవ శతాబ్దం చివర్లో ముహమ్మద్ హబీబ్ అనేవాడు తనను ఇమామ్ జాఫర్ సాదిఖ్ (రహ్మాలై) కుమారుడు ఇస్మాయిల్ సంతానమని ప్రకటించుకొని సామ్రాజ్యం సంపాదించడానికి ప్రయత్నించాడు. అతను "అతిత్వరలో ఇమామ్ మహ్దీ ప్రభవించనున్నారని, ఆయన అలీవ్ఫాతిమి సంతానమై ఉంటారని ప్రచారం చేశాడు.

ఈ ప్రచారంతో ప్రభావితులై వేలాదిమంది హబీబ్‌కు అనుచరులైపోయారు. వారిలో అనేకమంది ప్రచారప్రసంగాల శిక్షణపొంది ఇస్లామీయ సామ్రాజ్యమంతటా విస్తరించారు. అలాంటి అనుచరులు, అభిమానుల్లో అబూఅబ్దుల్లా హసన్ బిన్ ముహమ్మద్ అనే వ్యక్తి చాలా ముఖ్యుడు. ముహమ్మద్ హబీబ్ అతనికి ప్రచారోపదేశం చేస్తూ "నా కుమారుడు ఉబైదుల్లాయే ఇమామ్ మహ్దీ" అని తెలియజేశాడు. ఈ ఉపదేశంతో అబూ అబ్దుల్లా ఉత్తేజితుడై సామ్రాజ్యమంతటా తిరిగి ప్రచారం చేశాడు. ఆ తరువాత యుద్ధ పరంపర ప్రారంభించి కొన్ని ప్రాంతాలను కైవశం చేసుకున్నాడు.

హి.శ. 290లో ముహమ్మద్ హబీబ్ చనిపోయాడు. ఆ సంగతి తెలుసుకున్న అబూ అబ్దుల్లా, (హబీబ్ కొడుకు) ఉబైదుల్లా మహ్దీ దగ్గరకు చేరుకొని "ఆఫ్రికాలో మీ రాజ్యం స్థాపించబడింది, అక్కడికి వెళ్ళి సింహాసనం అధిష్టించండి" అని అన్నాడు. ఈ శుభవార్త అందుకోగానే ఉబైదుల్లా, అతని కొడుకు అబుల్‌ఖాసిం, కొందరు అనుచరుల్ని వెంటబెట్టుకొని వెళ్ళి సింహాసనం అధిష్టించాడు. ఆ తరువాత రాజ్యవిస్తరణకై యుద్ధపరంపర మరింత ఉధృతమయింది. అబూఅబ్దుల్లా మహ్దీ ఉబైదుల్లాకు వీరాభిమాని. అయినప్పటికీ పాలనావ్యవహారాల్లో పెరుగుతున్న అతని పేరుప్రతిష్ఠల్ని ఉబైదుల్లా సహించలేక తన వీరాభిమాని, శ్రేయోభిలాషి అయిన అతడ్ని కుట్రతో చంపించాడు.

అబూఅబ్దుల్లా హతమార్చబడగానే దేశంలో తిరుగుబాటు సెగలు చెలరేగాయి. వాటిని ఉబైదుల్లా అణచడంతో పాటు షియామతప్రచారాన్ని కూడా నిలుపుదల చేశాడు. రాజ్యవిస్తరణ కృషి సందర్భంగా మొరాకో కూడా అతని రాజ్యపరిధిలోకి చేరింది. చివరికి ఉబైదుల్లా ఇరవైనాలుగు సంవత్సరాలు పరిపాలన సాగించి హి.శ. 322లో చనిపోయాడు. తరువాత అతని కొడుకు అబుల్‌ఖాసిం పరిపాలనా పగ్గాలు చేపట్టాడు. అతని పాలనాకాలంలో అబూయజీద్ అనే ఖార్జీమతస్థుడు ఉబైదుల్లాకు, అతని ఇస్మాయిలీ షియా మతస్థులకు వ్యతిరేకంగా ప్రచారంచేసి వేలాది అనుచరుల్ని సమీకరించి యుద్ధపరంపర ప్రారంభించాడు. హి.శ.334లో అబుల్‌ఖాసిం చనిపోయి అతని కొడుకు ఇస్మాయిల్ గద్దె నెక్కాడు. అతని పాలనాకాలంలోనే అబూయజీద్ అరాచకం అంతమైపోయింది.

ఇస్మాయిల్ ఉబైదీ ఇటలీ, జినివా వగైరా క్రైస్తవ రాజ్యాలపై కూడా దాడులు చేసి స్వాధీనం చేసుకున్నాడు. చివరికి అతను హి.శ. 341లో చనిపోయాడు. తరువాత అతని కొడుకు మాజ్ బిన్‌ఇస్మాయిల్ అధికారంలోకి వచ్చాడు. మాజ్ హి.శ.347లో స్పెయిన్‌పై దాడిచేసి అనేక ప్రాంతాలు వశపరచుకున్నాడు. మరోవైపు కాన్‌స్టాంటినోపిల్ రాజు సీజర్ మీద కూడా దాడులుచేసి కొన్ని ప్రాంతాలు కైవశం చేసుకున్నాడు. హి.శ. 355లో మాజ్‌ఉబైది సేనాపతి ఈజిప్టుపై కూడా దాడిచేసి దాన్ని వశపరచుకున్నాడు. ఆతర్వాత మాజ్‌ఉబైది హి.శ.363లో మొరాకో నుండి ఇజిప్టు రాజధాని కైరోకు వచ్చేశాడు.

సిరియా రాజధాని డెమాస్కస్ కూడా మాజ్ అధికారపరిధిలోకి వచ్చింది కాని, హి.శ. 365లో ఇజద్దౌలా బిన్‌బోయా సేవకుడు అఫ్‌గతీన్ దాన్ని ఆక్రమించుకున్నాడు. అప్పుడది బగ్దాద్‌ఖలీఫా రాజ్యపరిధిలోకి పోయింది. మాజ్ దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి బయలుదేరి మార్గమధ్యలోనే హి.శ. 365లో చనిపోయాడు. ఆ తరువాత అతని కొడుకు అజీజ్ బిన్ మాజ్ అతనికి వారసుడయ్యాడు. డెమాస్కస్ హి.శ. 385 వరకూ నిరంతరం సమరజ్వాలకు బలవుతూఉండింది. హి.శ. 386లో అజీజ్ బిన్‌మాజ్ కూడా డెమాస్కస్‌ని స్వాధీనం చేసుకోవడానికి బయలుదేరి మార్గమధ్యలోనే చనిపోయాడు.

అజీజ్ తర్వాత అతని కొడుకు అబూమన్సూర్ గద్దెనెక్కాడు. అతని హయాంలో డెమాస్కస్ కోసం అరబ్బులు, టర్కీయులు, ఈజిప్షియన్లు, సిరియన్లు, ఆఫ్రికన్ల మధ్య అంతర్యుద్ధాలు జరిగాయి. మరోవైపు స్పెయిన్‌లో మన్సూర్ బిన్ అబీఆమిర్ బనూ ఉమయ్యాతెగ రాకుమారుల్ని హతమార్చనారంభించినపుడు చివరి బగ్దాద్‌ఖలీఫా కొడుకు వలీద్ బిన్ హిషామ్ తప్పించుకొనిపోయి బనూఉమయ్యా ఖిలాఫత్‌కై ప్రచారంచేస్తూ అనేకదేశాలు తిరుగుతూ చివరికి ఈజిప్టు చేరుకున్నాడు. ఈజిప్టులో అతనికి వేలాదిమంది అనుచరులు లభించారు. దాంతో అతను ఈజిప్టు సుల్తాన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశాడు. ఇలా కొన్నేళ్ళపాటు యుద్ధపరంపర సాగింది. చివరికి హి.శ. 397లో సుల్తాన్ ఒక కుట్ర ద్వారా హిషామ్‌ను హతమార్చి ఈ అరాచకాన్ని అంతమొందించాడు.

సుల్తాన్ అబూమన్సూర్ ఉబైదీ షియామతస్థుడయినందున ఈజిప్టులోని అధిక సంఖ్యాక సున్నీమతస్థులు అతడ్ని ద్వేషిస్తుండేవారు. ఈ వాస్తవం తెలుసుకున్న తర్వాత సుల్తాన్ ఉబైదీ ప్రజల అభిమానం చూరగొనడానికి "మతవ్యవహారంలో ఎవరిపైనా ఎలాంటి వత్తిడి-బలాత్కారాలు ఉండవని, సున్నీమతం కోరుకునేవారు సున్నీమతం అవలంబించవచ్చని, షియామతం కోరుకునేవారు షియామతం అవలంబించవచ్చని" ఒక ఫర్మానా జారీచేశాడు. దీంతో ప్రజల్లో అతని పట్ల ద్వేషం చాలావరకు తగ్గిపోయింది. అయితే అతను హి.శ. 411లో ఇతర కారణాలవల్ల హత్యగావించబడ్డాడు. అబూమన్సూర్ హత్య తరువాత అతని కొడుకు అలి జాహిర్ గద్దె నెక్కాడు. సిరియా కోసం హి.శ.420లో అంతర్‌యుద్ధాలు మొదలయ్యాయి. హి.శ. 427లో జాహిర్ చనిపోయాడు.

జాహిర్ మరణానంతరం అతని కొడుకు ముస్తన్సర్ సింహాసనం ఎక్కాడు. ఇతని హయాంలో హి.శ.433లో సిరియా, డెమాస్కస్‌లను అరబ్ తెగలు ఆక్రమించుకున్నాయి. సిరియా కోసం అనేకసార్లు అంతర్‌యుద్ధాలు జరిగాయి. హి.శ. 487లో ముస్తన్సర్ చని



పోయాడు. అతని తరువాత అతని కొడుకు నజార్ గద్దె నెక్కాడు. కొన్నాళ్ళకు ముస్తన్సర్ మరొక కొడుకు అబుల్‌ఖాసిం గద్దెనెక్కి నజార్‌ని హతమార్చాడు.

సిరియా తాజుద్దౌలాతతిష్ అధీనంలోకి వచ్చింది. తాజుద్దౌలా మరణానంతరం అతని కొడుకులు విఖాఖ్, రిజ్వాన్‌ల మధ్య అంతర్‌యుద్ధాలు జరిగి విఖాఖ్ సిరియాను ఆక్రమించుకున్నాడు; రిజ్వాన్ హలబ్‌ను స్వాధీనం చేసుకున్నాడు. బైతుల్‌మఖ్దిస్‌లో విఖాఖ్ తరఫున సులైమాన్ బిన్ అర్తఖ్ గవర్నర్‌గా ఉండేవాడు. ఆనాడు క్రైస్తవులకు బైతుల్‌మఖ్దిస్‌లోని అఖ్సామస్జిద్ (సులైమాన్ ఆలయం) దర్శించుకోవడానికి, తమ ఊరే గింపులు, ఇతర మతాచారాలు పాటించుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉండేది. కాని వారీ స్వేచ్ఛలో హద్దుమీరడంతో ముస్లింలు వారిపై కొన్నిఆంక్షలు విధించడానికి యత్నించారు. దాంతో క్రైస్తవులు గగ్గోలుపెడ్తూ తమ నాయకుల దృష్టికి తీసికెళ్ళారు.

**బైతిల్‌మఖ్దిస్‌పై క్రైస్తవుల ఆక్రమణ:-** అప్పుడు క్రైస్తవమతాచార్యులు రంగంలోకి దిగి యావత్తు క్రైస్తవజగత్తులో ముస్లింలకు వ్యతిరేకంగా దుష్ప్రచారజ్వాలల్ని రగిల్చారు. పచ్చి ముస్లింవిద్వేషి అయిన పీటర్ అనే క్రైస్తవసాధువు మరింత ముందుకు పోయి ప్రధానమతాచార్యుడు పోప్ దగ్గరకు వెళ్ళి వలవల ఏడ్చాడు. తర్వాత పోప్ అనుమతి తీసుకొని ఇటలీ, ఫ్రాన్స్‌లకు చేరుకొని అక్కడ అనేకచోట్ల ఉద్రేకపూరితమైన ప్రసంగాలుచేస్తూ అవిశ్వాసుల నుండి మనం తక్షణమే మన పుణ్యక్షేత్రమైన జెరూసలేంని కాపాడుకోవాలని అన్నాడు. దాంతో ప్రజల్లో అపారమైనఉత్సాహం ఉబికి ఉన్మాద స్థాయికి చేరింది. ఆపై అగ్నిపై ఆజ్యం పోసినట్లు రోమ్‌దేశపోప్ అర్బన్ "మసీహ మతాన్ని ఆక్రమించుకున్న అవిశ్వాసులతో పోరాడండి. ఈ పోరాటంలో పాల్గొన్న ప్రతి మనిషి పాపాలను నేను క్షమిస్తాను. మీలో ఎవరైనా ఆ యుద్ధంలో హతమార్చబడితే అతనికి నేను స్వర్గంలో చోటుకల్పిస్తాను" అని ప్రకటించాడు. పోప్ ప్రకటన, పాదరీల ప్రసంగాలు విని ప్రజలు తండోపతండలుగా అమితోత్సాహంతో ఊగిపోతూ సైన్యంలో చేరిపోయారు.

హి.శ. 490లో ఐరోపా క్రైస్తవరాజులంతా ఏకమై భారీసైన్యంతో ముస్లింల నుండి బైతుల్‌మఖ్దిస్‌ని స్వాధీనం చేసుకోవడానికి పెద్దఎత్తున దాడులు ప్రారంభించారు. క్రైస్తవ సైనికులు మొదట ఇన్తాకియా, తరువాత ఇకా పట్టణాలను ఆక్రమించుకున్నారు. ఆ దాడుల్లో వేలాదిమంది ముస్లింయోధులు అమరగతులయ్యారు. ఇకాపట్నం ముట్టడి సమయంలోనే ఈజిప్టు సుల్తాన్‌కు చెందిన షియా సైనికులు బయలుదేరి బైతుల్‌మఖ్దిస్ (జెరూసలేం) మీద దాడిచేశారు. ఇలా ఒకే సమయంలో రెండు శత్రుసైన్యాలు దాడి చేయడంతో ముస్లింలకు తీవ్రనష్టం వాటిల్లింది.

బైతుల్‌మఖ్దిస్‌పై ఈజిప్టు షియాసైనికుల దాడి క్రైస్తవులకు ఎంతో ప్రయోజనం కలిగించింది. ఈజిప్టు షియాలు బైతుల్‌మఖ్దిస్‌ని ఆక్రమించుకున్నప్పటికీ ఎంతోకాలం దాన్ని తమ అధీనంలో ఉంచుకోలేకపోయారు. ఇకా పట్నం ఆక్రమణ తర్వాత క్రైస్తవులు హి.శ. 492లో బైతుల్‌మఖ్దిస్‌ని కూడా ముట్టడించారు. అక్కడి ముస్లింలు వారితో శాంతి ఒప్పందం చేసుకొని బైతుల్‌మఖ్దిస్‌ని వారికప్పగించారు. అయితే ఆతర్వాత క్రైస్తవులు ఒప్పందాన్ని తుంగలో తొక్కి ముస్లింలను ఊచకోత కోయడం ప్రారంభించారు.

ముస్లింలు తమ ప్రాణాలు కాపాడుకోడానికి మస్జిదుల్‌అక్సాలో ప్రవేశించి ఆశ్రయం పొందారు. కాని క్రైస్తవులు అక్కడా ఈ హత్యాకాండ సాగించారు. స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు అన్న విచక్షణ లేకుండా అందరినీ మట్టుపెట్టారు. కొందరి తలలు నరికితే మరికొందరి కాళ్ళుచేతులు నరికిచంపారు. ఇంకాకొందరిని అగ్నిగుండాల్లోకి త్రోసి హతమార్చారు. పసిపిల్లల్ని కాళ్ళుపట్టి గోడలకేసి విసిరి చంపారు. ఈవిధంగా క్రైస్తవులు అక్సామస్జిద్‌లో డెబ్బయి వేలమంది ముస్లింలను హతమార్చి తమ రక్తదాహం తీర్చు కున్నారు. విశాలమైన ఆ దైవగృహం నెత్తుటి చెరువులా మారింది. రక్తం గుర్రాల మోకాళ్ళ దాకా వచ్చింది. అందులో  మానవ తలలు, మొండేలు, ఇతర అవయవాలు తేలుతూ భయంకరంగా కన్పించేవి. మస్జిద్‌బయట రోడ్లపై తెగిన తలలు, అవయవాలు చిందర వందరగా పడ్డాయి. మొత్తం లక్షమందికి పైగా ముస్లింలు హతమార్చబడ్డారని ముస్లిం చరిత్రకారులు రాశారు. మానవత్వం సిగ్గుతో తలదించుకునే దారుణమైన ఈహత్యాకాండ గురించి క్రైస్తవచరిత్రకారులు కూడా తమ గ్రంథాల్లో ప్రస్తావించారు. అయితే వారీ హత్యా కాండను పవిత్ర సిలువయుద్ధంగా వర్ణిస్తూ ఎంతో గర్వపడుతూ ప్రస్తావించారు.

ఈ చిరుప్రళయం తరువాత ముస్లిం పాలకులు కళ్ళు తెరిచారు. ముఖ్యంగా బగ్దాద్ ఖలీఫాలు బైతిల్‌మఖ్దిస్‌ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించారు. కాని వారా ప్రయత్నంలో విజయం సాధించలేకపోయారు. ఆనాడు ఈజిప్టు షియాసైన్యం కంటే సిరియాలోని సల్జూఖీ సున్నీ సైన్యం ఎక్కువ శక్తిమంతమైనప్పటికీ సల్జూఖీ పాలకులు అంతర్యుద్ధాల్లో కూరుకుపోవడం వల్ల బైతిల్‌మఖ్దిస్ వైపు దృష్టి సారించలేక పోయారు.

హి.శ. 524లో హాఫిజ్ ఉబైదీ ఈజిప్టు సింహాసనం అధిష్టించాడు. అతని హయాంలో ప్రతి మంత్రీ పాలనాధికారాలన్నీ చేజిక్కించుకోవడానికి సుల్తాన్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నేవాడు. అంచేత హాఫిజ్ ఉబైదీ ఒకరి తర్వాత ఒకరు చొప్పున అనేకమంది మంత్రుల్ని హతమార్చాడు. ఆ తరువాత అతను తన కొడుకుని మంత్రిగా నియమించాడు. అతను కూడా తండ్రికి వ్యతిరేకంగా గద్దెనెక్కడానికి కుట్రపన్నాడు. చివరికి హాఫిజ్‌ఉబైదీ విసుగెత్తి రిజ్వాన్ అనే ఓ సున్నీముస్లింని మంత్రిగా నియమించాడు. అయితే షియాముస్లింల నుండి తీవ్రమైన వ్యతిరేకత రావడంవల్ల రిజ్వాన్  హి.శ. 543లో తన పదవికి రాజీనామా చేశాడు. ఆ తర్వాత హాఫిజ్ ఉబైదీ ఎవరినీ మంత్రిగా నియమించలేదు.

ఆ కాలంలో ఈజిప్టురాజధాని కుట్రలకు నిలయమైపోయింది. హి.శ.555లో సుల్తాన్ ఫాయజ్ ఉబైదీ ఆర్నెల్ల పరిపాలన చేసి చనిపోయాడు. తర్వాత ఆజిద్ ఉబైదీ అనే ఓ నవయువకుడు అధికారం చేపట్టాడు. మంత్రిసాలెహ్ హద్దుమీరిన అధికారాలు చెలా యించడంతో కొన్నాళ్ళకు అతను హత్యచేయబడ్డాడు. తర్వాత అతని కొడుకు ఆదిల్ మంత్రి అయ్యాడు. ఆదిల్ సాయిద్‌ప్రాంతం గవర్నర్ షాదిర్‌ని తొలగించి మరొకడ్ని నియమించాడు. షాదిర్ ఈ సంగతి తెలుసుకొని హి.శ. 558లో కైరోలో ఆదిల్‌ని చంపి మంత్రిహోదా పొందాడు. అయితే రాజమహల్ ప్రధాన ద్వారపాలకుడు జర్గామ్, షాదిర్‌ని కైరో నుంచి వెళ్ళగొట్టి మంత్రి అయ్యాడు. షాదిర్ సిరియా చేరుకొని అక్కడి పాలకుడు నూరుద్దీన్ మహ్మూద్ జుంగీని కలుసుకొని ఈజిప్టు పరిస్థితులు వివరించాడు.



# 64. సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి పాలన

షాదిర్ సిరియా పాలకుడు నూరుద్దీన్‌కు ఈజిప్టు పరిస్థితులు వివరిస్తూ తనను ఈజిప్టు మంత్రిగా పునర్నియమిస్తే సిరియాసైనికులకు ఈజిప్టులో జాగీర్లు ఇప్పిస్తానని, ఈజిప్టులో కొంత భూభాగం తమ ఆక్రమణలోకి వచ్చేలా చేస్తానని వాగ్దానం చేశాడు. సుల్తాన్ నూరుద్దీన్ ఈమాట విని సేనాపతి అసదుద్దీన్ షేర్‌కోహ్‌ని సైన్యమిచ్చి షాదిర్ వెంట ఈజిప్టు పంపాడు. అసదుద్దీన్ ఈజిప్టు సైన్యాన్ని ఓడించి కైరోలో ప్రవేశించాడు. దాంతో మంత్రి జర్గామ్ భయపడి పారిపోవడానికి ప్రయత్నించి హతమార్చబడ్డాడు. షాదిర్ మళ్ళీ ప్రధానమంత్రి అయ్యాడు. అయితే అతను తన వాగ్దానాన్ని భంగపరిచాడు. అసదుద్దీన్ చేసేదిలేక సైన్యం తీసుకొని తిరిగి సిరియా వెళ్ళిపోయాడు.

షాదిర్ వాగ్దానభంగానికి పాల్పడటమేగాక నూరిద్దీన్ జుంగీ పాలనకు వ్యతిరేకంగా క్రైస్తవులతో చేతులు కలపడానికి ప్రయత్నించాడు. అసదుద్దీన్ షేర్‌కోహ్ ఈ సంగతి తెలుసుకోగానే సుల్తాన్ నూరిద్దీన్ అనుమతి తీసుకొని ఈజిప్టుపై దాడిచేసి కొన్ని ప్రాంతా లను కైవశం చేసుకున్నాడు. అప్పుడు షాదిర్ క్రైస్తవసైనికుల సహకారంతో షేర్‌కోహ్ సైన్యంతో తలపడ్డాడు. అత్యధికసంఖ్యలో ఉన్న ఆ ఉమ్మడిసైన్యం ముందు రెండు వేలైనాలేని షేర్‌కోహ్ సైన్యం ఎదురెడ్డి పోరాడటం చాలాకష్టం. అయితే షేర్‌కోహ్ దేవునిపై భారంవేసి వీరోచితంగా పోరాడుతూ శత్రుసైన్యానికి మట్టి కరిపించాడు.

హి.శ. 562లో షాదిర్, నూరుద్దీన్‌జుంగీ పాలనను తుదముట్టించే ఉద్దేశంతో క్రైస్తవ సైన్యాన్ని ఆహ్వానించి కైరోలో చోటు కల్పించాడు. తరువాత క్రైస్తవసైన్యం షాదిర్ మెడకు గుదిబండగా తయారయింది. క్రైస్తవసైనికులు జెరూసలేం రాజుకు ఈజిప్టు ప్రభుత్వం ఏటా లక్ష దీనార్లు చెల్లించాలని షరతు విధించి కైరోలోనే తిష్ఠ వేశారు. తరువాత వారు ప్రభుత్వవ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మొదలెట్టారు. ఆ తరువాత రాజధాని కైరోని స్వాధీనం చేసుకోవడానికి మరో పెద్ద సైనికపటాలాన్ని కైరోకు రప్పించుకున్నారు.

ఈజిప్టు నామమాత్రపు రాజ్యాధినేతయిన సుల్తాన్ ఆజిద్ క్రైస్తవుల వ్యవహారం చూసి చింతిస్తూ ఈజిప్టు నుండి క్రైస్తవసైనికుల్ని తరిమేయడానికి తమకు సహాయం చేయవల సిందిగా సిరియా సుల్తాన్ నూరిద్దీన్‌కు లేఖ రాసి పంపాడు. సుల్తాన్ నూరిద్దీన్ వెంటనే తన సేనాపతి అసదుద్దీన్ షేర్‌కోహ్, అతని సోదర కుమారుడు సలాహుద్దీన్ అయ్యూబి, మరికొందరు సైన్యాధికారుల్ని ఈజిప్టుకు పంపాడు. వారంతా తమతమ సైన్యాల్ని తీసు కొని ఈజిప్టుకు వెళ్ళి అక్కడి క్రైస్తవసైనికుల్ని బయటికి తరిమికొట్టారు. తర్వాత షేర్‌కోహ్ సుల్తాన్‌ఆజిద్ కోరికపై షాదిర్‌ని హతమార్చాడు. దాంతో ఆజిద్ ఎంతో సంతోషించి షేర్‌కోహ్‌ని ప్రధానమంత్రిగా నియమించాడు. షేర్‌కోహ్ సుల్తాన్ నూరుద్దీన్ అనుమతి తీసుకొని ఈజిప్టులో ప్రధానిబాధ్యతలు నిర్వహించసాగాడు. ఆతర్వాత కొన్నాళ్ళకే షేర్‌కోహ్ హి.శ. 565లో చనిపోయాడు.

సుల్తాన్ ఆజిద్ ఆ తర్వాత షేర్‌కోహ్ సోదరకుమారుడు సలాహుద్దీన్ అయ్యూబీని ప్రధానమంత్రిగా నియమించి అతనికి సర్వాధికారాలు ఇచ్చాడు.

సిరియా, ఈజిప్టు రాజ్యాలు ఏకంకావడంతో ఇక తాము జెరూసలేం (బైతిల్‌మఖ్దిస్)ని కాపాడుకోవడం చాలా కష్టమని భావించి క్రైస్తవులు ఆందోళచెందారు. వెంటనే వారు కార్యాచరణకు సిద్ధమయ్యారు. స్పెయిన్ మొదలైన దేశాల నుండి సైనికుల్ని రప్పించి సిరియా తీరప్రాంతంలో సమీకరించి హి.శ.565లో దమియాత్ పట్నాన్ని ముట్టడించారు. ఈజిప్టులో షియాముస్లింలు సున్నీ మతస్థుడైన సలాహుద్దీన్ అయ్యూబి పట్ల గుర్రుగా ఉన్నారు. అందువల్ల సలాహుద్దీన్ కైరోలోనే ఉండి బహావుద్దీన్ నేతృత్వంలో ఓ సైనిక దళం దమియాత్‌కు పంపి అటు సుల్తాన్ నూరిద్దీన్‌కు పరిస్థితి తెలియజేశాడు. అంచేత అటు సుల్తాన్ నూరిద్దీన్ కూడా ఒక సైనికదళం పంపి తీరప్రాంతంలో తిష్ఠవేసిన క్రైస్తవ సైన్యంపై దాడిచేయించాడు. దాంతో క్రైస్తవసైనికులు యాభైరోజుల ముట్టడి తరువాత దమియాత్‌ని వదిలేసి వెళ్ళిపోయారు.

ఆ తరువాత సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి తన తండ్రి నజ్ముద్దీన్ అయ్యూబ్‌ని సిరియా నుండి ఈజిప్టుకు పిలిపించుకున్నాడు. ఈజిప్టు నామమాత్రపు చక్రవర్తి ఆజిద్ నజ్ముద్దీన్‌కు స్వాగతం చెప్పి గౌరవమర్యాదలు జరిపాడు. ఆజిద్ షియామతస్థుడైనప్పటికీ రాజ్యాధికారాలన్నీ సలాహుద్దీన్‌కు కట్టబెట్టి అతను చేసే పనులన్నిటినీ సమర్థించేవాడు. కాని ఈజిప్టులోని షియామతస్థులకు సలాహుద్దీన్ పనులు నచ్చేవికావు. సలాహుద్దీన్ కారణంగా ఈజిప్టులో షియామతం రోజురోజుకు క్షీణిస్తూ సున్నీమతం వృద్ధిచెందసాగింది.

అంచేత షియామతస్థులైన పాలనాధికారులంతా కలసి సలాహుద్దీన్‌కు వ్యతిరేకంగా కుట్రపన్నారు. వారు క్రైస్తవరాజులతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ వారి దౌత్యవేత్తను రహస్యంగా ఈజిప్టుకు పిలిపించుకొని చక్రవర్తి ఆజిద్‌ని తమ వైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నించారు. వారు క్రైస్తవరాజుకు రాసిన ఒక ఉత్తరం తీసికెళ్తున్న గూఢచారి దారిలో పట్టుబడి సలాహుద్దీన్ ముందు ప్రవేశపెట్టబడ్డాడు. అతని ద్వారా సలాహుద్దీన్ కుట్రదారులు ఎవరెవరో తెలుసుకొని రాజదర్బారులో వారి నేరాలు రుజువయిన తరువాత ఆ నేరస్థులందరినీ ఉరితీయించాడు.

ఈజిప్టుసైన్యంలో యాభై వేలతో కూడిన సూడానీసైనికులే అత్యధిక మంది ఉన్నారు. వారు కూడా షియామతస్థులైన కుట్రదారులకు కొమ్ముకాస్తుండేవారు. అదీగాక వారు టర్కీజాతి సైనికులక్కూడా వ్యతిరేకులే. అందువల్ల షియాకుట్రదారులు హతమార్చబడగానే వారు సలాహుద్దీన్‌కు, టర్కీజాతి సైనికులకు వ్యతిరేకంగా కత్తులు దూశారు. ఈ యుద్ధంలో సూడానీసైనికులు పరాజితులయ్యారు. వారిలో అనేకమంది హతమార్చబడ్డారు. మిగిలినవారు లొంగిపోయారు. వారి ఇళ్ళను టర్కీజాతి సైనికులు దోచుకున్నారు. అయితే సలాహుద్దీన్ సూడానీసైనికులకు రక్షణ కల్పించాడు. ఈవిధంగా హిజ్రీశకం 567నాటికి షియాల కుట్రలతో పాటు సూడానీసైనికుల బెడద దూరమైపోయింది. ఆ రోజుల్లోనే ఈజిప్టురాజు ఆజిద్ వ్యాధిగ్రస్తుడై కొన్నాళ్ళకు చనిపోయాడు. అతని మరణంతో ఈజిప్టులో ఉబైదీషియాల పాలన అంతమై అయ్యూబీల పాలనకు అంకురార్పణ జరిగింది. అంతేకాకుండా ఈజిప్టురాజ్యం అబ్బాసీల బగ్దాద్ ఖిలాఫత్ పాలనా పరిధిలోకి వచ్చింది. సలాహుద్దీన్ బగ్దాద్‌ఖలీఫా తరపున సామంతరాజయ్యాడు.



హిజ్రీశకం 569లో సిరియాలో సుల్తాన్ నూరుద్దీన్ జుంగీ చనిపోవడంతో సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి అక్కడ నూరుద్దీన్ కొడుకు మలిక్ సాలెహ్‌ను అధికారపీఠం మీద కూర్చోబెట్టాడు. ఆరోజు నుండి సిరియా కూడా సలాహుద్దీన్ ప్రభావం క్రిందికి వచ్చింది. అయితే క్రైస్తవరాజులు క్రమంగా విస్తరిస్తున్న సలాహుద్దీన్ ప్రభావాన్ని సహించలేక సిరియా, ఈజిప్టులపై దాడులకు తెగబడ్డారు. వేరొకవైపు ఖారిజీల నుండి పుట్టుకొచ్చిన ఫిదాయీన్ అనే ఆత్మాహుతిదళాలు కుట్రలతో, మారువేషాలలో వచ్చి ముస్లింనేతలను హతమార్చడం గొప్ప పుణ్యకార్యంగా భావించేవి. ఆ దుర్మార్గులు సుల్తాన్ సలాహుద్దీన్‌ని కూడా హతమార్చడానికి ప్రయత్నించారు. కాని దేవుడు అతడ్ని కాపాడాడు.

చివరికి సిరియా పాలనాధికారులంతా కలసి సలాహుద్దీన్‌ని సిరియా చక్రవర్తిగా ఆమోదించారు. అప్పటినుండి సలాహుద్దీన్ క్రైస్తవుల నుండి బైతిల్‌మఖ్దిస్‌ని ముస్లింల అధీనం చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ముస్లింలకు, క్రైస్తవులకు మధ్య శాంతిఒప్పందం జరిగిన రోజుల్లో హిజ్రీశకం 583లో ఒకసారి కొందరు పాలస్తీనా ముస్లింలు హజ్‌యాత్ర కోసం మక్కా దిశగా ప్రయాణమయ్యారు. అయితే ఆర్నెట్ అనే ఓ క్రైస్తవసేనాపతి శాంతిఒప్పందాన్ని తుంగలో తొక్కి వారిని అడ్డగించి ఖైదీలుగా పట్టుకున్నాడు. అదీగాక "మీ ప్రవక్తను ఇక్కడకొచ్చి మిమ్మల్ని కాపాడమని మొరపెట్టుకోండి" అంటూ మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పట్ల అపచారానికి పాల్పడ్డాడు.

సుల్తాన్ సలాహుద్దీన్ ఈసంగతి విని "నాకు ఆర్నెట్ చిక్కితే అతడ్ని నేను నా చేతులతో హతమారుస్తాను"అని అన్నాడు. ఆతర్వాత తమ హాజీలను వెంటనే విడుదల చేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసివస్తుందని క్రైస్తవుల్ని హెచ్చరించాడు. కాని క్రైస్తవులు హాజీలను విడుదలచేయడానికి నిరాకరించి యుద్ధానికి సిద్ధమయ్యారు. వారు తమసేనలను పాలస్తీనాలోని ఇకాపట్నం సమీపంలోని సెలయేరులున్న ఓ మైదానంలో సమీకరించారు. అటు సుల్తాన్ సలాహుద్దీన్ సైన్యం తీసుకొని ఆ ప్రదేశానికి కొద్దిదూరంలో ఉన్న హత్తీన్ అనే కొండప్రదేశానికి చేరుకున్నాడు.

లక్షల సంఖ్యలో వున్న క్రైస్తవసైన్యం నీటిసౌకర్యం వున్న కీలక ప్రదేశంలో ఆగి యుద్ధం కోసం వెంపర్లాడసాగింది. సుల్తాన్ ఇలాంటి పరిస్థితిలో యుద్ధం చేయడం సరికాదని, శత్రుసేనల్ని ఆ ప్రదేశం నుండి నీటిసౌకర్యంలేని వేరే ప్రదేశానికి తరలిపోయేలా చేయాలని భావించాడు. క్రైస్తవసైన్యం బసచేసిన ప్రదేశం నుండి కొన్ని మైళ్ళ దూరంలో వారి స్త్రీలు, పిల్లలు తలదాచుకున్న ఓ కోట ఉంది. సుల్తాన్ కొంతసైన్యం పంపి ఆ కోటను ముట్టడింపజేశాడు. క్రైస్తవసైన్యం ఆ ముట్టడి సంగతి విని తమ స్త్రీలను, పిల్లల్ని కాపాడుకోవడానికి అక్కడ్నుంచి మధ్యాహ్నంవేళ కోటవైపుకు పురోగమించింది. ఆ సైన్యానికి కోట దగ్గరకు చేరుకునేందుకు సుమారు 8 గంటల సమయం పడ్తుంది.

క్రైస్తవసైన్యం తన ప్రధాన స్థావరం నుండి బయలుదేరిన కాస్సేపటికే ముస్లిం యోధులు క్రైస్తవసైనికుల్ని అడుగడుగునా అడ్డుతగులుతూ, గెరిల్లా పోరాటం ద్వారా వారిని చికాకు పరచడం ప్రారంభించారు. దాంతో వారి ప్రయాణవేగం తగ్గిపోయింది. ఈవిధంగా క్రైస్తవసైనికులు ముస్లింయోధుల్ని ప్రతిఘటిస్తూ హత్తీన్ కొండపైకి చేరుకొని

చూస్తే నలువైపులా ముస్లింలే కన్పించారు. అంటే వారు ముస్లింల దిగ్బంధానికి గురై పోయారన్న మాట. ఇప్పుడిక వారు వెనక్కి మరలనూ లేరు, ముందుకు సాగనూ లేరు. అయినా వారు మరుసటి రోజు ముస్లింపంక్తుల్ని ఛేదించి బయటపడటానికి ఎంతో ప్రయత్నించారు. కాని ముస్లింలు బాణాలు సంధించి వారిని వెనక్కి నెట్టసాగారు.

హత్తీన్ కొండపై చుక్కనీరు కూడా లేకపోవడంతో క్రైస్తవసైనికులు దాహంతో తీవ్ర ఆందోళన చెందసాగారు. దానికి తోడు మరో విపత్తు వచ్చిపడింది. ముస్లింలు సుల్తాన్ ఆదేశంతో గాలి వీస్తున్నదిశ చూసి అక్కడి ఎండిన చెట్లు, గడ్డిపరకలపై కట్టెలు పడేసి నిప్పంటించారు. దాంతో పెద్దఎత్తున పొగ లేచి గాలివాటున క్రైస్తవసైనికుల వైపుకు పోయింది. అది నడిఎండాకాలం. వేడిగాలులజోరు. పైపెచ్చు పొగసెగలు. ఇక చూడండి. క్రైస్తవసైనికులు నాలుకలు పిడచకట్టుకుపోతున్న దాహంతో, పెటపెటలాడు తున్న ఎండ వేడిమితో, పొగసెగలతో దగ్గుతూ, కళ్ళు నులుముకుంటూ అసహాయ స్థితిలో బలవంతంగా పోరాడుతూ శవాలుగా పడిపోతున్నారు. మరికొందరు ముస్లింల చేతిలో చావడం అవమానకరంగా భావించి ఆత్మహత్యలకు పాల్పడసాగారు. వారి గుర్రాలు అనేకం దప్పికతో నేలకొరిగాయి.

ఈ యుద్ధం ముగిసే సమయానికి చూస్తే 30వేల క్రైస్తవశవాలు గుట్టలుగుట్టలుగా పడివున్నాయి. మరో 30వేలమంది క్రైస్తవసైనికులు ముస్లింలకు ఖైదీలుగా పట్టుబడ్డారు. ఓ పెద్ద సిలువ పట్టుకున్న ఒక పాదరీ కూడా సిలువతో సహా ఖైదీగా పట్టుబడ్డాడు. క్రైస్తవుల విశ్వాసం ప్రకారం ఈ సిలువపైనే ఈసాప్రవక్త (అలైహి) హతమార్చబడ్డారు. అందువల్ల క్రైస్తవసైనికులు దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించి ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారి సేనాపతి జెరూసలేంరాజు జాఫరీ, మరోసేనాని ఆర్నెట్ కూడా ఖైదీలుగా పట్టుబడ్డారు. హజ్‌యాత్రికుల్ని దోచుకొని నిర్బంధించిన ఆర్నెట్‌ని సుల్తాన్ తన శపథం ప్రకారం తన స్వహస్తాలతో వధించాడు. రాజు జాఫరీని ఇకముందు తనకు వ్యతిరేకంగా రణరంగంలోకి రాడన్న వాగ్దానం తీసుకొని వదలిపెట్టాడు.

హత్తీన్ సమర విజయంతో బైతిల్‌మఖ్దిస్ విజయానికి మార్గం సుగమం అయింది.

ఆ తర్వాత హిజ్రీశకం 588లో సలాహుద్దీన్ బైతిల్‌మఖ్దిస్‌ని జయించాడు. హత్తీన్ యుద్ధం తరువాత ఇకాతో పాటు మరికొన్ని పట్టణాలు, ప్రాంతాలు స్వాధీనం చేసుకున్న తరువాత సుల్తాన్ సలాహుద్దీన్ బైతిల్‌మఖ్దిస్‌పై దాడిచేయడానికి సన్నాహాలు చేస్తూ స్వచ్ఛంద ముస్లింసైనికుల భర్తీ కోసం ఓ ప్రకటన చేశాడు. దాంతో ఇంతకుముందే సుల్తాన్ విజయవార్తలు విన్న స్వచ్ఛంద యోధులు వివిధ ప్రాంతాల నుండి అమితోత్సా హంతో బయలుదేరి సుల్తాన్ సైన్యంలో చేరిపోయారు. అప్పుడు సుల్తాన్ సలాహుద్దీన్ హిజ్రీశకం 583, రజబ్‌నెల 15వ తేదీన నురుగులు కక్కే, ఉరుకులు పెట్టే ఈ సైనిక వాహిని తీసుకొని బైతిల్‌మఖ్దిస్ (జెరూసలేం) సమీపానికి చేరుకున్నాడు.

సుల్తాన్ సలాహుద్దీన్ భారీసైన్యంతో జెరూసలేం సమీపానికి వచ్చాడన్న వార్త వినగానే క్రైస్తవుల గుండెలు ఝల్లుమన్నాయి. వారి నేతలు సుల్తాన్‌ని బెదిరించడానికి ఆదరబాదరాగా నగరం వెలుపలికి వెళ్ళారు. సుల్తాన్ వారితో మాట్లాడుతూ "ఎలాంటి



రక్తపాతం జరగకుండా ఉండాలంటే మీరు తక్షణమే మాకు లొంగిపోయి నగరన్ని మాకు స్వాధీనం చేయండి"అని అన్నాడు. దానికా నేతలు అహంకారంతో ఊగిపోతూ గట్టిగా నిరాకరించారు. దాంతో సుల్తాన్ మార్గాంతరంలేక నగరాన్ని ముట్టడించి యుద్ధం చేయ వలసివచ్చింది. ఈ ముట్టడి ఐదురోజులు కొనసాగింది. ఆరవరోజు అరవై వేల మందికి పైగా ఉన్న క్రైస్తవసైనికులు ముస్లింయోధుల ధాటికి తాళలేక కాళ్ళబేరానికి వచ్చారు.

బైతిల్‌మఖ్దిస్ తమ అధీనంలోకి వచ్చిన తరువాత పురుషుల్లో సైనికులతో పాటు అందరూ ఒక్కొక్కరు పది దీనార్లు చొప్పున, స్త్రీలల్లో ఒక్కొక్కరు ఐదు దీనార్లు చొప్పున, పిల్లల్లో ఒక్కొక్కరు రెండు దీనార్లు చొప్పున పరిహారం చెల్లించాలని, వారు తమ వెంట తమ సామగ్రినంతా తీసికెళ్ళవచ్చని, పరిహారం చెల్లించలేనివారు తమ అధీనంలో ఖైదీలుగా ఉండిపోతారని షరతులతో ఒప్పందం జరిగింది. అయితే నగరం స్వాధీనం చేయడానికి ముందు క్రైస్తవులు అఖ్సామస్జిద్‌ని, సఖ్రగుమ్మటాన్ని ధ్వంసం చేయాలను కున్నారు. ఈసంగతి తెలిసి సుల్తాన్ దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చ రించాడు. దాంతో వారు ఆపని మానుకొని నగరాన్ని ముస్లింలకు స్వాధీనంచేశారు.

ఒప్పందం ప్రకారం పరిహారం చెల్లించిన క్రైస్తవులందర్నీ నగరం నుండి వెళ్ళిపోవ డానికి అనుమతి లభించింది. సైనికులంతా వెళ్ళిపోయిన తరువాత స్త్రీలు, పిల్లలు, వృద్ధులను సుల్తాన్ సైన్యం అన్తాకియాలోని క్రైస్తవుల కోటకు సురక్షితంగా చేర్చింది. అంతేకాదు, పరిహారం చెల్లించలేని పదివేల మంది క్రైస్తవపౌరుల తరఫున సుల్తాన్ తన జేబు నుండి పరిహారం చెల్లించి వారిని విడుదలచేయించాడు.

ఆ తరువాత వందలాది స్త్రీలు సుల్తాన్ దగ్గరకు వచ్చి "మీరు మమ్మల్ని, మా పిల్లల్ని విడుదల చేశారు. కాని హత్తీన్‌యుద్ధంలో మీకు పట్టుబడిన మా భర్తలు మీదగ్గర ఖైదీలుగా ఉన్నారు. దయచేసి వాళ్ళను కూడా విడుదలచేయండి, లేకుంటే మా జీవితాలు దుర్భరమవుతాయి. మమ్మల్ని కనికరించండి" అంటూ వలవల ఏడుస్తూ మొరపెట్టుకున్నారు. వారి మొర వినగానే సుల్తాన్ మనసు కరిగిపోయింది. వెంటనే అతను ఆ ఖైదీలందరినీ తన తరఫున పరిహారం చెల్లించి విడుదలచేయించాడు. పరిహారం చెల్లించలేని మరో నలభైవేల మంది క్రైస్తవుల్ని కూడా అనుచర సైనికులతో సంప్రదించి విడుదల చేయించాడు.

హి.శ. 490 నుండి 588 వరకు దాదాపు 98 సంవత్సరాలు బైతిల్‌మఖ్దిస్ క్రైస్తవుల అధీనంలో ఉండింది. దాన్ని క్రైస్తవులు స్వాధీనం చేసుకున్నపుడు వారక్కడి ముస్లింలను ఘోరాతిఘోరంగా ఊచకోతలు కోసి రక్తపుటేరులు ప్రవహింపజేశారు. కాని ముస్లింలు దాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నప్పుడు వారు ఏఒక్క క్రైస్తవపౌరుడికి కూడా ఎలాంటి నష్టం కలిగించలేదు.

జెరూసలేం నుండి బయలుదేరిన క్రైస్తవులు ఆశ్రయం కోసం అంతాకియా, ట్రిపోలి పట్టణాలకు చేరుకున్నారు. అయితే అక్కడి క్రైస్తవపాలకులు, అధికారులు వారిని తమ పట్టణాల్లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకున్నారు. పైగా ఆ అసహాయ కాందిశీకుల్ని దోచుకోవడానిక్కూడా పాల్పడ్డారు. స్వమతస్థులే తమ పట్ల ఇలా ప్రవర్తించడం చూసి

వారు ఆశ్చర్యపోయారు. తరువాత వారు ఆ పాలకులపై మండిపడుతూ నానా శాపనార్థాలు పెట్టారు. మరోవైపు వారు సుల్తాన్ సలాహుద్దీన్ సత్ప్రవర్తన, దయాగుణాల్ని ప్రశంసిస్తూ ఆయన క్షేమం కోసం దైవాన్ని ప్రార్థించారు. సుల్తాన్ సలాహుద్దీన్ సద్గుణసంపత్తిని పాశ్చాత్య చరిత్రకారులు కూడా పొగడకుండా ఉండలేకపోయారు. సుల్తాన్ సలాహుద్దీన్ అఖ్సామస్జిద్‌లో ప్రవేశించి అక్కడి క్రైస్తవచిహ్నాలను తొలగించి కృతజ్ఞతాప్రార్థన చేశాడు.

హత్తీన్‌యుద్ధంలో క్రైస్తవులు ఓడిపోయారని, ముస్లింలు బైతిల్‌మఖ్దిస్‌ని జయించారని వినగానే క్రైస్తవ ప్రధానమతాచార్యుడు పోప్ ఒక్కసారిగా ఢీలాపడిపోయి వణికిపోతూ గుండె ఆగి చనిపోయాడు. తరువాత అతని స్థానంలో మరో కొత్త పోప్ వచ్చాడు. ఈ కొత్త పోప్ బాధ్యత స్వీకరించగానే జెరూసలేం స్వాధీనం కోసం యావత్తు యూరప్‌లో సిలువయుద్ధ ప్రకటన చేయించాడు. వివిధ క్రైస్తవ పాలకులకు తమతమ సేనలను సమీకరించి బయలుదేరాలని లేఖలు రాయించి పంపాడు.

ఇంతకుముందే జెరూసలేం ముస్లింల కైవశం అయిందన్న వార్త యావత్తు క్రైస్తవ జగత్తులో ప్రతీకారజ్వాలలు రేపింది. ఇప్పుడు పోప్‌ప్రకటన, లేఖలతో ఫ్రాన్స్‌రాజు ఫిలిప్, ఇంగ్లాండ్‌రాజు లైన్‌హార్ట్ రిచర్డ్, జర్మనీరాజు ఫ్రెడరిక్, గ్రీక్‌రాజు, ఇతర చిన్నచిన్న రాజులు, భూస్వాములు ఏకమై ఓ పెద్ద సైన్యాన్ని తయారుచేసి ఇస్లాంను పూర్తిగా తుడిచిపెట్టే ఉద్దేశంతో కాన్స్టాంటినోపిల్‌కు చేరుకున్నారు.

బ్రహ్మాండమైన ఈ సేనావాహిని నురుగులు కక్కుతూ సిరియావైపు పురోగమించింది. ముందుగా జర్మనీ, గ్రీక్ సైన్యాలు బయలుదేరాయి. జర్మనీచక్రవర్తి పదిలక్షల సైన్యాన్ని సమీకరిస్తున్నాడని విని సుల్తాన్ విచారసముద్రంలో మునిగి సహాయం కోసం దేవుణ్ణి దీనంగా ప్రార్థించాడు. దేవుడు అతని ప్రార్థనను స్వీకరించాడు. సల్జూఖ్ ముస్లిం పాలకులు జర్మనీ, గ్రీక్ సైన్యాలను తీవ్రంగా ప్రతిఘటించారు. కాని భారీ క్రైస్తవసైన్యం ముందు నిలువలేక వెనక్కి తగ్గవలసివచ్చింది. ఆతర్వాత సుల్తాన్‌కు దేవుని అదృశ్య సహాయం లభించింది. జర్మన్‌చక్రవర్తి ఫ్రెడరిక్ ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి చనిపోయాడు. దాంతో జర్మన్-గ్రీక్ సైన్యాలు ధైర్యం కోల్పోయి వెనక్కిమరలి ముస్లింలతో పోరాడుతూ కాన్స్టాంటినోపిల్ దారిపట్టారు. ఫ్రెడరిక్ కొడుకు ఈ పోరాటంలో హతమార్చబడ్డాడు. అప్పుడు జర్మన్-గ్రీక్‌సైన్యాలు నాయకత్వం కొరవడటం వల్ల మరింత ధైర్యంకోల్పోయి తునాతునకలై పడుతూలేస్తూ కాన్స్టాంటినోపిల్‌కు పారిపోయాయి.

ఆ తరువాత ఫ్రాన్స్, బ్రిటన్, కాన్స్టాంటినోపిల్, మరికొన్ని ఇతర ప్రాంతాల సైన్యాలు కలసి ముస్లింలకు వ్యతిరేకంగా సిలువయుద్ధానికి సమాయత్తమయ్యాయి. ఇంగ్లాండ్ చక్రవర్తి లైన్‌హార్ట్ రిచర్డ్ నాయకత్వంలో ఈ సైన్యాలు బైతిల్‌మఖ్దిస్‌కు కొన్ని మైళ్ళ దూరంలోని అఖ్రా కోట దగ్గరకు చేరుకొని దాన్ని ముట్టడించారు. ఆ విషయం తెలియగానే సుల్తాన్ సలాహుద్దీన్ సైన్యం తీసుకొని అక్కడకు చేరుకున్నాడు. కాని లక్షల సంఖ్యలో ఉన్న క్రైస్తవసైన్యంతో పోరాడి గెలవడం చాలా కష్టమని భావించాడు సుల్తాన్. అంచేత ఈ ముట్టడి అనేక నెలలు కొనసాగింది. ముస్లింయోధులు బలహీన పడటం గమనించిన లైన్‌హార్ట్ రిచర్డ్ ముస్లింల ముందు మూడు షరతులు పెట్టాడు.



అతను తమకు అఖ్రా కోట స్వాధీనం చేయాలని, ముస్లింలు స్వాధీనం చేసుకున్న తమ మహాసిలువను తమకు తిరిగివ్వాలని, తమకు భారీఎత్తు కప్పం చెల్లించాలని డిమాండ్ చేశాడు. ఈ మూడు డిమాండ్లలో మహాసిలువను వాపసుచేయడం, భారీ కప్పం చెల్లించడం వెంటనే సాధ్యంకాదు. సుల్తాన్ అఖ్రా కోటను మాత్రమే అతనికి స్వాధీనం చేశాడు. ఆ కోటలో ముస్లిం స్త్రీలు, పిల్లలు, వృద్ధులు మాత్రమే తలదాచుకున్నారు. రిచర్డ్ వారికి ప్రాణరక్షణ హామీనిచ్చి బయటికి తీసుకొచ్చాడు. అయితే వారందరినీ ముస్లింయోధుల ముందే నిర్దాక్షిణ్యంగా హతమార్పించాడు.

ఈ దారుణం చూసిన సుల్తాన్ మూకుమ్మడి దాడిచేయమని తన సైన్యాన్ని ఆదేశించాడు. మరుక్షణమే ముస్లింలు ఒక్కసారిగా క్రైస్తవసైనికులపై ఆకలిగొన్న బెబ్బులుల్లా విరుచుకుపడ్డారు. సమరజ్వాలలు మింటికెగిశాయి. రక్తం కాలువలై పారింది. దాంతో బ్రిటన్‌చక్రవర్తి లైన్‌హార్ట్ రిచర్డ్ వెనక్కితగ్గాడు. ఆతర్వాత కూడా క్రైస్తవులు ముస్లింలతో ఏండ్ల తరబడి అనేక యుద్ధాలు చేశారు. కాని సుల్తాన్ సలాహుద్దీన్ వారిని బైతిల్‌మఖ్దిస దరిదాపులక్కూడా రానివ్వలేదు. కాకపోతే పుణ్యార్జన ఉద్దేశంతో బైతిల్‌ముఖ్దిస్‌ని దర్శించుకోవడానికి వచ్చే క్రైస్తవులకు మాత్రం అనుమతి ఇవ్వబడింది.

దాదాపు నాలుగేండ్ల పాటు జరిగిన ఈ యుద్ధపరంపర సందర్భంగా కొన్ని విచిత్ర సంఘటనలు కూడా సంభవించాయి. ఒక యుద్ధంలో రిచర్డ్ గుర్రం నేలకొరిగి చావడం వల్ల అతను నేల మీదే నడుస్తూ యుద్ధం చేయవలసి వచ్చింది. సుల్తాన్ సలాహుద్దీన్ ఆ క్రైస్తవచక్రవర్తి బాధ చూడలేక యుద్ధం ఆపి తన దగ్గరున్న ఓ మంచి గుర్రాన్ని ఎంపిక చేసి అతనికి ఇప్పించాడు. మరొకసారి రిచర్డ్ జబ్బుపడి ఎన్ని మందులు వాడినా కోలుకోలేని దుస్థితికి గురైనపుడు సుల్తాన్ సలాహుద్దీన్ అతని దగ్గరకు తన ప్రత్యేక వైద్యుణ్ణి పంపి చికిత్స చేయించాడు.

చివరికి బ్రిటన్‌చక్రవర్తి రిచర్డ్ సుల్తాన్ సలాహుద్దీన్‌తో చేస్తున్న యుద్ధాలతో విసిగిపోయి యుద్ధం నిలుపుదలచేసి వెళ్ళిపోయాడు. అయితే సముద్రంలో అతని నౌక మునిగిపోవడంతో అతను ఎలాగో ప్రాణాలతో బయటపడి ఆస్ట్రియా చేరుకున్నాడు. ఆస్ట్రియారాజు అతనికి బద్ధశత్రువు. అంచేత రిచర్డ్ ఆస్ట్రియా భూభాగంపై కాలు మోపగానే ఆరాజు అతణ్ణి నిర్బంధించి జైల్లో పడవేయించాడు. దాంతో లైన్‌హార్ట్ (పులిగుండె) రిచర్డ్ రెండేళ్ళపాటు ఆస్ట్రియా జైల్లో మగ్గిపోవలసి వచ్చింది. చివరికి ఇంగ్లాండ్ పాలకులు ప్రజల నుండి పెద్దఎత్తున పన్నులు వసూలుచేసి కోట్లాది రూపాయాలు నష్టపరిహారంగా ఆస్ట్రియారాజుకు చెల్లించి రిచర్డ్‌ని విడిపించుకున్నారు.

హి.శ. 589లో సుల్తాన్ సలాహుద్దీన్ వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు. అప్పుడు అతని దగ్గర కొన్నిదిర్హాంలు తప్ప అంత్యక్రియలకు కావలిస డబ్బు లేదు. అంచేత అనుచరులు చందాలు వేసుకొని సుల్తాన్ అంత్యక్రియలు జరిపారు. ఆ తరువాత సుల్తాన్ గుర్రాన్ని, పతాకాన్ని బగ్దాద్‌కు పంపివేయడం జరిగింది. బగ్దాద్‌లో బైతిల్‌మఖ్దిస్ విజేత సుల్తాన్ సలాహుద్దీన్ అయ్యూబి (రహ్మలై) మరణవార్త విని లక్షలాది ముస్లింలు భోరున విలపించారు, కన్నీళ్ళతో సౌశీల్యుడైన ఆ వీర సమరయోధుడికి శ్రద్ధాంజలి ఘటించారు.

సలాహుద్దీన్ (రహ్మలై) మరణానంతరం అతని కుమారుడు ఉస్మాన్ అధికారం చేపట్టాడు. ఇతను ఆరేండ్ల పాటు న్యాయంగా, నీతిమంతంగా పరిపాలన చేసి హి.శ. 595లో చనిపోయాడు. ఆ తరువాత ఉస్మాన్ కొడుకు మలిక్ మన్సూర్ గద్దెనెక్కాడు. కాని ఒక సంవత్సరం తర్వాత అతడ్ని అధికారపీఠం నుండి దించేయడం జరిగింది. తర్వాత సుల్తాన్ సలాహుద్దీన్ తమ్ముడు మలిక్ ఆదిల్ అధికారం చేపట్టాడు. ఇతనెంతో నీతినిజాయితీలతో పరిపాలనచేసి హి.శ. 635లో చనిపోయాడు. తరువాత అతని కొడుకు అబూబకర్ గద్దెనెక్కాడు. అయితే రెండేళ్ళ తర్వాత పాలనాధికారులు అతడ్ని తొలగించి అతని సోదరుడు మలిక్ సాలెహ్‌ను గద్దె నెక్కించారు. ఇతను పదేళ్ళ పరిపాలన చేసి చివరికి క్రైస్తవులతో జరిగిన ఒక యుద్ధంలో చనిపోయాడు. తరువాత హి.శ. 647లో మలిక్ మోజమ్ తౌరాన్ అధికారం చేపట్టాడు. కాని ఏడాది తిరక్క ముందే అతను హత్యగావించబడ్డాడు. తరువాత హి.శ. 648లో షజరతుల్‌బదర్ అనే రాణి గద్దెనెక్కింది. కొన్ని నెలల పాలన తర్వాత ఆమె కూడా గద్దె దిగిపోవలసి వచ్చింది. ఆ తర్వాత హి.శ. 648లో మలిక్ అష్రఫ్ అధికారం చేపట్టాడు. హి.శ. 652లో నాలుగేళ్ళ పాలన తర్వాత అతను కూడా ఉద్వాసనకు గురయ్యాడు. దాంతో కుర్ద్ జాతికి చెందిన అయ్యూబియా వంశపాలన అంతరించిపోయింది.

అయ్యూబియా వంశపాలన పతనమవుతున్న తరుణంలో రాజ్యాధికారాలన్నీ బానిస (సైనికు)ల చేతుల్లోకి పోయాయి. వారు తమలో యోగ్యుడు, సమర్థుడయిన ఒకడ్ని రాజ్యాధినేతగా ఎన్నుకొని పరిపాలన సాగిస్తుండేవారు. వారిని మమ్లూకియా రాజులు అంటారు. ఇలా ఈ మమ్లూకియా (బానిస) రాజులు ఈజిప్టులో అయ్యూబియా పాలన తరువాత 270 సంవత్సరాలపాటు హిజ్రీశకం 922వరకు పరిపాలన చేశారు. ఆ తర్వాత అక్కడ ఉస్మానియా వంశపాలన ప్రారంభమయింది.

# 65. ఉస్మానియా వంశపాలన

ఉస్మానియా పాలన ప్రారంభానికి ముందు దాని స్థాపనకు మూలకారణాలను గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. చంగీజ్‌ఖాన్ అరాచక తుఫాన్ ప్రపంచమంతటా విస్తరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రోజులవి. దానికి పూర్వం టర్కీజాతికి చెందిన కొన్ని అనాగరిక తెగలు ఖురాసాన్, ఈరాన్‌లలో ప్రవేశించి అక్కడి సల్జూఖియా రాజ్యంపై దాడిచేసి అక్కడి ప్రజల్లో తీవ్ర బీభత్సం సృష్టించాయి. అయితే ఆ తరువాత అక్కడ చంగీజ్‌ఖాన్ దాడులు ప్రారంభం కాగానే తురుష్కుల శక్తి క్రమంగా తగ్గిపోసాగింది. చంగీజ్‌ఖాన్ దాడులు తీవ్రం కావడంతో తురుష్క తెగల్లో కొన్ని ఈజిప్టుకు, కొన్ని సిరియాకు, మరికొన్ని ఆర్మేనియాకు పారిపోయి తలదాచుకున్నాయి.

ఆర్మేనియాకు చేరుకున్న తురుష్క తెగప్రజలు కొంతకాలం ఈరాన్‌లో నివశించడం వల్ల వారిలో సభ్యతాసంస్కృతులు అలవడ్డాయి. వారు సల్జూఖియా ప్రజల్లా స్వచ్ఛమైన ముస్లింలు. వారి నాయకుడు సులైమాన్‌ఖాన్ తన సత్ప్రవర్తనతో ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాడు. ఫలితంగా ఆర్మేనియా, ఆజర్‌బాయ్‌జాన్‌లలో దేశదిమ్మరులుగా తిరుగుతున్న అనేకమంది తురుష్కులు సులైమాన్ చుట్టూ గుమిగూడారు. ఎల్లడెల్లడలా



అరాచకం, అల్లకల్లోలాలు సాగుతున్న ఆ కాలంలో ప్రతి తెగ ఆత్మరక్షణకోసం సైనిక సంఖ్యను, ఆయుధశక్తిని పెంచుకోవలసివచ్చింది. సులైమాన్‌ఖాన్ ఆపనే చేశాడు.

దేశసరిహద్దుల్ని కాపాడుకోవడానికి నిరంతరం క్రైస్తవసేనలను ప్రతిఘటించే సల్జూఖీ రాజు అలావుద్దీన్‌పై హిజ్రీశకం 621లో చంగీజ్‌ఖాన్ సైన్యం దాడిచేసింది. ఇలా ఒక ముస్లిం రాజ్యంపై ముస్లిమేతర సైన్యం దాడిచేసిన సంగతి విని సులైమాన్ విచారం వెలిబుచ్చాడు. అంచేత అతను అలావుద్దీన్‌కు సహాయపడుతూ ఆ యుద్ధంలో పాల్గొని అమరగతిభాగ్యం పొందే ఉద్దేశంతో సైన్యం తీసుకొని బయలుదేరాడు.

ముందుగా సులైమాన్‌ఖాన్ తన కుమారుడు అర్తుగ్రల్‌కు 444 మంది సైనికుల్ని ఇచ్చిపంపాడు. చంగీజ్‌ఖాన్ సైన్యం, అలావుద్దీన్ సైన్యం మధ్య హోరాహోరి యుద్ధం జరుగుతున్న సమయంలో అర్తుగ్రల్ అక్కడకు చేరుకున్నాడు. ఆ రెండు పక్షాలలో ముస్లింసైన్యం ఏదో, ముస్లిమేతర సైన్యం ఏదో అతనికి తెలియరాలేదు. ఏమైనప్పటికీ అతను బలహీనసైన్యం వైపున పోరాడుదామని భావించి రంగంలోకిదిగాడు. అల్లావుద్దీన్ సైన్యం బాగా దెబ్బతిని పారిపోవడానికి సిద్ధపడుతున్న తరుణంలో అర్తుగ్రల్ సైన్యం చంగీజీసైన్యంపై తుఫానులా విరుచుకుపడింది. దాంతో చంగీజీసైన్యానికి నడుం విరిగి నంత పనయింది. అర్తుగ్రల్-అలావుద్దీన్ ఉమ్మడి సైన్యాన్ని ఎదుర్కోలేక చంగీజీసైన్యం వందలాది శవాలను వదలి పలాయనం చిత్తగించింది.

అలావుద్దీన్ సల్జూఖీ క్లిష్టపరిస్థితిలో తలవనితలంపుగా దైవకారుణ్యమై వచ్చి తనకు సహాయపడిన ఈ కొత్తసైనికుల్ని చూసి సంతోషంతో పొంగిపోయాడు. అతను సేనాపతి అర్తుగ్రల్‌ని గాఢంగా కౌగిలించుకున్నాడు. అంతలో సులైమాన్‌ఖాన్ కూడా తన అధీనం లోని సైన్యం తీసుకొని అక్కడికి చేరుకున్నాడు. సల్జూఖీ రాజు అలావుద్దీన్ వారిద్దరిని మరోసారి కౌగిలించుకొని అర్తుగ్రల్‌కు అంగూరా పట్నం సమీపంలోని జాగీరు ఇచ్చాడు. సులైమాన్‌ఖాన్‌ని తన సైన్యానికి సేనాపతిగా నియమించాడు. అర్తుగ్రల్‌కు లభించిన జాగీరు రోమ్ సరిహద్దు సమీపంలో ఉంది. అంచేత అర్తుగ్రల్ రోమన్ క్రైస్తవసైనికులతో పోరాడుతూ వారి అనేక ప్రాంతాలను కైవశం చేసుకున్నాడు. సేనాపతి సులైమాన్‌ఖాన్ కొన్నాళ్ళకు ఫిరాత్ నది దాటుతూ నదిలో మునిగి చనిపోయాడు. హిజ్రీశకం 634లో అలావుద్దీన్ సల్జూఖీ చనిపోయాడు. తరువాత అతని కొడుకు గియాసుద్దీన్ గద్దె నెక్కాడు.

**1-సుల్తాన్ ఉస్మాన్‌ఖాన్:-** హిజ్రీశకం 657లో అంగూరా జాగీర్‌దార్ అర్తుగ్రల్‌కు ఉస్మాన్ అనే కొడుకు పుట్టాడు. హిజ్రీశకం 687లో అర్తుగ్రల్ చనిపోయాడు. అప్పటికి ఉస్మాన్ ముప్పయి ఏళ్ళ యువకుడయ్యాడు. ఉస్మాన్ శక్తిసామర్థ్యాలు ఎరిగిన సల్జూఖీ రాజు గియాసుద్దీన్ ఉస్మాన్‌ఖాన్‌ని సైన్యాధ్యక్షుడిగా నియమించడమే గాకుండా అతనికి తన కూతుర్నిచ్చి పెళ్ళి కూడా చేశాడు. హిజ్రీశకం 699లో గియాసుద్దీన్ మొగల్‌సైనికుల దాడికి గురై హతమార్చబడ్డాడు. అతనికి ఉస్మాన్‌ఖాన్ భార్య అయిన ఒక కుమార్తె తప్ప కుమారులెవరూ లేరు. అంచేత పాలనాధికారులు ఉస్మాన్‌ఖాన్‌ని గద్దె నెక్కించారు.

ఉస్మాన్‌ఖాన్ అధికారపీఠం అధిరోహించగానే అతని చుట్టూ కుట్రదారులు కలుపు మొక్కల్లా పుట్టుకొచ్చారు. ఉస్మాన్‌ఖాన్ ధార్మికుడు, సద్గుణసంపన్నుడు మాత్రమే గాక

స్థిరచిత్తుడు, సాహసవంతుడు కూడా. అందువల్ల అతను ఎంతో మెలుకువతో, ధైర్యంతో ఎప్పటికప్పుడు కుట్రదారుల కుయుక్తులను అంతమొందిస్తుండేవాడు.

ఉస్మాన్‌ఖాన్ అధికారం చేపట్టిన ప్రారంభకాలంలోనే క్రైస్తవులు రాజధాని ఖౌనియాపై దాడిచేయడానికి సిద్ధమయ్యారు. వెంటనే ఉస్మాన్‌ఖాన్ సలహామండలిని సమావేశపరచి సంప్రదించినపుడు ఉస్మాన్‌ఖాన్ బంధువొకడు సలహాఇస్తూ "మనం ఇప్పుడు క్రైస్తవులతో యుద్ధానికి దిగడం మంచిదికాదు. వీలైనంతవరకు ఒప్పందం ద్వారా యుద్ధాన్ని నివారించాలి. ఒకవేళ యుద్ధం జరిగితే మొగల్‌సైన్యాలు, ఇతర తురుష్కసైన్యాలు క్రైస్తవసైన్యాలతో కుమ్మక్కయి మనపై విజృంభించవచ్చు. అప్పుడు మనం ఏకకాలంలో వారందరినీ ఎదుర్కోవడం చాలా కష్టం" అని అన్నాడు.

ఉస్మాన్ పిరికితనం నూరిపోసే ఈ మాటలు వినగానే ఆ బంధువుని అక్కడికక్కడే హతమార్చివేశాడు. దాంతో ఇతర కుట్రదారులు యుద్ధవ్యతిరేక సలహాలివ్వడానికి సాహసించలేకపోయారు. ఆ తరువాత ఉస్మాన్‌ఖాన్ సైన్యం తీసుకొని క్రైస్తవసైన్యాలపై విరుచుకుపడ్డాడు. ఈ యుద్ధంలో ఉస్మాన్ క్రైస్తవసైన్యాన్ని ఓడించడమే గాకుండా వారి ఖరాహిసార్ అనే పట్టణాన్ని ఆక్రమించుకోవడం కూడా జరిగింది. ఆ తరువాత ఆ పట్టణాన్ని రాజధానిగా మార్చాడు.

ఉస్మాన్‌ఖాన్ క్రైస్తవులతో తన యుద్ధపరంపరను అంతటితో ఆపకుండా దాన్ని ముందుకు తీసికెళ్ళాడు. ఒకదాని తర్వాత మరొకటి చొప్పున అనేక పట్టణాలను జయిస్తూ అప్రతిహతంగా ముందుకు దూసుకుపోసాగాడు. కాన్స్టాంటినోపిల్ రాజు సీజర్ ఉస్మాన్ విజయాలకు అడ్డుకట్ట వేయడానికి మొగల్ రాజులతో సంప్రదింపులు జరిపి వారిని తన వైపుకు తిప్పుకున్నాడు. ఫలితంగా ఉస్మాన్ క్రైస్తవులతో యుద్ధం సాగిస్తున్న సమయంలోనే మొగల్‌సైన్యాలు ఉస్మానియా సామ్రాజ్యంపై దాడులకు తెగబడ్డాయి. ఉస్మాన్‌ఖాన్ వెంటనే తన కొడుకు అర్ఖాన్‌కు ఒక సైనికదళమిచ్చి పంపాడు. అర్ఖాన్ మొగల్‌సైనికుల్ని చిత్తుగా ఓడించి విజయదరహాసంతో తండ్రి దగ్గరకు తిరిగొచ్చాడు.

ఆ తరువాత తండ్రీకొడుకులిద్దరూ క్రైస్తవసైన్యాలతో పోరాడుతూ వాటిని వెనక్కి నెట్టి వేయసాగారు. ఉస్మాన్‌ఖాన్ ఆసియామైనర్‌ని జయిస్తూ నల్లసముద్రం తీరానికి చేరుకున్నాడు. అటు కొడుకు అర్ఖాన్ క్రైస్తవసైన్యాలను పశ్చిమదిశకు పారదోలుతూ బరూసా పట్టణానికి చేరుకున్నాడు. ఉస్మాన్‌ఖాన్ ఆసియామైనర్‌ని జయించి నల్లసముద్రం తీరం నుండి రాజధాని ఖరాహిసార్‌కు తిరిగొచ్చిన తరువాత జబ్బుపడ్డాడు. అయితే బరూసా విజయం సంగతి వినగానే అక్కడికి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు.

ఆ సందర్భంలో అతను తన అనుచరసైనికులతో "ఒకవేళ నేను బరూసా చేరుకోక ముందే చనిపోవడం జరిగితే నా శవాన్ని బరూసా తీసికెళ్ళి ఖననం చేయాలి. బరూసాన్నే రాజధానిగా చేసుకొని అక్కడే ఉండాలని నా కొడుక్కు చెప్పండి" అని అన్నాడు. ఉస్మాన్‌ఖాన్ బరూసా చేరుకున్న అనేకరోజుల తర్వాత చనిపోయాడు. అతని వీలునామా ప్రకారం బరూసాలోనే అతని భౌతికకాయాన్ని సమాధిచేయడం జరిగింది. ఉస్మాన్‌ఖాన్ 27 ఏళ్ళ పాలన తర్వాత 69 ఏళ్ళ వయసులో చనిపోయాడు.



**2-సుల్తాన్ అర్ఖాన్:-** ఉస్మాన్‌ఖాన్ మరణానంతరం అతనికొడుకు అర్ఖాన్ అధికారం చేపట్టాడు. ఉస్మాన్ పెద్దకొడుకు అలావుద్దీన్ తండ్రి వీలునామాను గౌరవిస్తూ తమ్ముడి అధికారాన్ని సమర్థించాడు. తరువాత తమ్ముడి కోరికపై అతను మంత్రిపదవి చేపట్టి పాలనావ్యవహారాలను సవ్యంగా నిర్వహించసాగాడు. సుల్తాన్ అర్ఖాన్ అధికారం చేపట్టిన ఒక్క సంవత్సరంలోనే సామ్రాజ్యాన్ని మరింత విస్తృతపరచి సోదరుడు అలావుద్దీన్ సలహాతో రాజ్యాన్ని పటిష్ఠపరచగల సంవిధానాన్ని, చట్టాలను ప్రవేశపెట్టాడు.

అర్ఖాన్ ప్రారంభంలో తన సేనాపతులకు పెద్దపెద్ద జాగీర్లు ప్రదానంచేసి యుద్ధం చేయవలసి వచ్చినపుడు వారాంతా కేంద్రప్రభుత్వంతో సహకరిస్తూ తమతమ సేనలను తీసుకొని శత్రువులతో పోరాడేలా సైనికపాలసీ తయారుచేశాడు. అయితే ఈ పాలసీ ఎప్పటికైనా కేంద్రప్రభుత్వానికి ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని, అంచేత క్రైస్తవఖైదీలకు, క్రైస్తవ జిమ్మీలకు చెందిన నవయువకుల్ని దత్తత తీసుకొని వారికి మంచి విద్యా,సైనిక శిక్షణలు ఇప్పించి ఓ ప్రత్యేక సైనికదళం తయారుచేస్తే బాగుంటుందని మంత్రి అలావుద్దీన్ సలహా ఇచ్చాడు. దాంతో వేలాదిమంది నవముస్లిం యువకులతో కూడిన రాజరిక అంగరక్షక దళం ఉనికిలోకి వచ్చింది. దాన్ని "యంగ్‌చరీ"సైన్యం అంటారు. యంగ్‌చరీ సైనికులు సుల్తాన్ కుమారులుగా పరిగణించబడేవారు.

మరోవైపు మంత్రి అలావుద్దీన్ క్రైస్తవులకు ముస్లింలతో పాటు సమానహక్కులు కల్పించి చర్చీల నిర్వహణ కోసం వారికి జాగీర్లు కూడా ఇచ్చాడు. వ్యాపార సౌకర్యాలు కల్పించాడు. ఈ విధంగా మంత్రి ప్రజాసంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడంతో క్రైస్తవులు చాలా సంతోషించారు. వారికి ఇస్లాం గురించి ప్రశాంతంగా అధ్యయనం చేసే అవకాశం లభించడంతో వారిలో అనేకమంది సంతోషంగా ఇస్లాం స్వీకరించసాగారు. మంత్రి అలావుద్దీన్ భవననిర్మాణంపై కూడా దృష్టికేంద్రీకరించి పట్టణాలలో, పల్లెల్లో అనేక మస్జిద్‌లు, మదర్సాలు, అతిథిగృహాలు, రోడ్లు, బ్రిడ్జీలు నిర్మింపజేశాడు.

కాన్స్టాంట్‌నోపిల్ చక్రవర్తి సీజర్ సుల్తాన్ అర్ఖాన్‌తో స్నేహసంబంధాలు నెలకొల్పుకునే ఉద్దేశ్యంతో అతనికి తన కూతుర్నిచ్చి వివాహంచేశాడు. సుల్తాన్ అర్ఖాన్ 38 సంవత్సరాల పాలన తర్వాత హిజ్రీశకం 761లో 75 ఏళ్ళ వయసులో చనిపోయాడు. అతని పెద్ద కొడుకు అంతకుముందే గుర్రం మీద నుంచి పడి చనిపోవడం వల్ల చిన్న కొడుకు మురాద్‌ఖాన్‌ని తన రాజకీయవారసుడిగా చేశాడు.

**3-సుల్తాన్ మురాద్‌ఖాన్ అవ్వల్ :-** తండ్రి మరణానంతరం హిజ్రీశకం 761లో మురాద్‌ఖాన్ అధికారంలోకి వచ్చాడు. హిజ్రీశకం 762లో అతను సైన్యం తీసుకొని యూరప్‌లోని ఐడిరియానోపిల్ పట్టణాన్ని జయించాడు. దాన్నే దేశరాజధానిగా చేసుకున్నాడు. మురాద్‌ఖాన్ ఐరోపాలోని తమ పట్టణం ఐడిరాయానోపిల్‌ని జయించడమే గాక దాన్ని తన రాజధానిగా చేసుకోవడంతో ఐరోపాక్రైస్తవులు తీవ్ర ఆందోళనచెందారు. అంచేత వారు మురాద్‌ఖాన్‌కు వ్యతిరేకంగా మతయుద్ధం ప్రకటించి సైనికసమీకరణ ప్రారంభించారు. బల్గేరియా, సెర్బియా, రోమ్, హంగేరి, బోస్నియా రాజ్యాల నుండి లక్షలాది సైనికసమీకరణ జరిగింది. మురాద్‌ఖాన్ తన సేనాపతి లాలాషాహీన్‌కు

20వేల మంది సైనికుల్ని ఇచ్చి పంపాడు. ఇరుపక్షాలు ఒకచోట ఢీకొన్నాయి. అందులో క్రైస్తవసైన్యాలు చిత్తుగా ఓడిపోయి పలాయనం చిత్తగించాయి.

ఆ తరువాత మళ్ళీ హిజ్రీశకం 778లో క్రైస్తవులు పెద్దఎత్తున సైనికసమీకరణ చేస్తూ కయ్యానికి కాలుదువ్వారు. ఈ యుద్ధంలో క్రైస్తవసైన్యం ముస్లింసైన్యానికి ఆరు రెట్లు అధికంగా ఉన్నప్పటికీ పరాజయం పాలయింది. సెర్వియా రాజు మురాద్‌ఖాన్‌కు ఏటా పన్నెండు మణుగుల వెండి చెల్లిస్తానని, అవసరం వచ్చినపుడు వేయి మంది రౌతుల సైన్యం పంపి సహాయం చేస్తానని వాగ్దానంచేసి ప్రాణం కాపాడుకున్నాడు. బల్గేరియా రాజు మురాద్‌ఖాన్‌కు తన కూతుర్నిచ్చి వివాహం చేస్తానని, ఇకముందు తిరుగుబాటుచేయకుండా విధేయుణ్ణయి ఉంటానని వాగ్దానం చేశాడు. కాన్స్టాంట్‌నోపిల్ రాజు సీజర్ తన ముగ్గురు కుమార్తెలను మురాద్‌ఖాన్‌కు సమర్పించుకున్నాడు.

సీజర్ ఈ యుద్ధం తర్వాత సుల్తాన్ మురాద్‌ఖాన్‌ని యూరప్ నుండి వెళ్ళగొట్టడం సాధ్యంకాదని భావించి పూర్తిగా నిరాశచెందాడు. అయితే లోలోన మండిపోతూ కుట్రలకు పాల్పడసాగాడు. ఫలితంగా హిజ్రీశకం 791లో కాన్స్టాంటినోపిల్, సెర్వియా, బల్గేరియా, అల్బానియా, హంగేరి, పోలెండ్, జర్మనీ, ఆస్ట్రియా, ఇటలీ, బోస్నియా వగైరా యూరప్ రాజ్యాలన్నీ ఏకమై లక్షలాది సిలువసైనికులతో ముస్లింలపై విరుచుకు పడ్డాయి. చివరికి ఈ యుద్ధంలో కూడా సిలువసైనికులకు పరాజయ పరాభవం చవిచూడక తప్పలేదు. లక్షలాది క్రైస్తవసైనికులు మృత్యువాత పడ్డారు. వారి సేనాపతులు అనేకమంది యుద్ధఖైదీలుగా పట్టుబడ్డారు.

వారి సర్వసేనాని సెర్వియారాజు కూడా పట్టుబడ్డాడు. అతను ముస్లింయోధులతో తనను సుల్తాన్ దగ్గరకు తీసికెళ్ళమని, ఆయనతో ముఖ్యమైన విషయాలు మాట్లాడి ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నాడు. అంచేత ముస్లింలు అతడ్ని సుల్తాన్ ముందు ప్రవేశపెట్టారు. సుల్తాన్ ఇస్లాంస్వీకరణ సంగతి విని అతడ్ని దగ్గరకు రమ్మన్నాడు. సెర్వియా రాజు అతివినయం ఒలకబోస్తూ సుల్తాన్ దగ్గరకు వెళ్ళి అతని పాదాలపై శిరస్సు మోపాడు. సుల్తాన్, అతని అనుచరసైనికులు ఆ క్రైస్తవరాజు వినయ విధేయలు చూసి సంతోషిస్తున్న తరుణంలో అతను తల పైకెత్తి దుస్తుల్లో దాచుకున్న చురకత్తి బయటికి తీసి బలంగా సుల్తాన్ గుండెలో పొడిచాడు. ఆ మరుక్షణమే ముస్లిం యోధులు ఆ దుర్మార్గుడిపై లంఘించి అతడ్ని శాశ్వతంగా మట్టుబెట్టారు.

సుల్తాన్ మురాద్‌ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ గాయంతోనే అతను హిజ్రీశకం 792లో చనిపోయాడు. ఆ తరువాత అతని కొడుకు బాయజీద్ యల్దరమ్ అధికారపీఠం అధిరోహించాడు.

**4-సుల్తాన్ బాయజీద్ యల్దరమ్:-** హిజ్రీశకం 793లో ఐరోపా క్రైస్తవరాజ్యాలు ఉస్మానియా రాజ్యంపై మరొకసారి తిరుగుబాటుకు పాల్పడటంతో సుల్తాన్ బాయజీద్ ఖాన్ వాటిని అణచివేశాడు. అతను హిజ్రీశకం 795 నుండి 799 వరకు ఆసియామైనర్ లోని పాతరాజధాని ఐడిరియానోపిల్‌లో ఉండిపోయాడు. అయితే హిజ్రీశకం 799లో హంగేరీ రాజు సజ్మండ్ నేతృత్వంలో ఐరోపా క్రైస్తవబలగాలన్నీ ఏకమై ఉస్మానియా



సామ్రాజ్యాన్ని అంతమొందించడానికి సిద్ధమయ్యాయని సమాచారం అందడంతో అతను వెంటనే ఆసియామైనర్ నుండి బయలుదేరి ఐరోపా చేరుకున్నాడు.

అటు రోమన్ పోప్ తొమ్మిదవ యూనిఫస్, హంగేరిలో ప్రవేశించి ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొనే ప్రతి క్రైస్తవుడి పాపాలు క్షమించబడతాయని యావత్తు ఐరోపాదేశాల్లో ఒక ప్రకటన (ఫత్వా) జారీచేశాడు. దాంతో ఫ్రాన్స్, ఇంగ్లాండ్, ఆస్ట్రియా, ఇటలీ, జెరూసలేం, వాలీషియా, కాన్స్టాంటినోపిల్ వగైరా రాజ్యాలకు చెందిన సేనలన్నీ హంగేరీకి చేరుకున్నాయి. బ్రహ్మాండమైన ఈ సేనావాహిని హంగేరిరాజు నాయకత్వంలో నురుగులు కక్కుతూ ఉస్మానియా ఖిలాఫత్ సామ్రాజ్యంలో ప్రవేశించి ఆరాచకానికి తెగబడింది. అది అనేక పట్టణాలను, గ్రామాలను జయిస్తూ స్త్రీలు, పిల్లలు, వృద్ధులన్న విచక్షణ చేయకుండా అక్కడి ముస్లింపౌరుల్ని, కాపలాదారుల్ని ఊచకోతకోస్తూ అప్రతి హతంగా పురోగమించసాగింది.

అంతలో సుల్తాన్ బాయజీద్ యల్దరమ్ నలభై వేల యోధులతో క్రైస్తవసైన్యానికి సమీపంగా చేరుకున్నాడు. ఉభయసేనలకు మధ్య ఓ పెద్ద మిట్టప్రదేశం ఉండటంతో క్రైస్తవసైనికులు ముస్లింసైనికుల్ని చూడలేకపోయారు. సుల్తాన్ ఈ సౌకర్యాన్ని వినియో గించుకుంటూ అత్యధిక సంఖ్యలో ఉన్న శక్తిమంతమైన సుశిక్షిత సైనికుల్ని ఒక చోట సమీకరించి, మిగిలిన సాధారణ సైనికుల్ని చిన్నచిన్న దళాలుగా చేసి ముందుకు పంపాడు. క్రైస్తవసైన్యం వారిని చూడగానే తుఫానులా విరుచుపడి అంతమొందిస్తూ ముందుకు పురోగమించింది. ఆవిధంగా అది మిట్టప్రదేశం చేరుకోగానే అటు సుల్తాన్ బాయజీద్ నేతృత్వంలోని మిగిలిన యోధులు హఠాత్తుగా మెరుపుదాడులు ప్రారంభిం చారు. క్షణాల్లో యుద్ధం పరాకాష్ఠకు చేరుకుంది. అనుకోకుండా ఎదురైన ఈ దాడులతో క్రైస్తవసైనికులు బిత్తరపోయి ఢీలా పడిపోయారు. ముస్లింయోధులు ద్విగుణీకృత ఉత్సాహంతో శత్రుసైన్యంలోకి సుడిగాలిలా దూసుకుపోయి ఆకలిగొన్న బెబ్బులుల్లా వారిపై విరుచుకుపడ్డారు. వేలసంఖ్యలో శవాలు గుట్టలు గుట్టలుగా పడిపోయాయి. క్రైస్తవ సేనాపతి హంగేరి రాజు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బ్రతుకుజీవుడా అంటూ పారిపోయాడు. అనేక రాజ్యాలకు చెందిన యువరాజులు ఖైదీలుగా పట్టుబడ్డారు. కాన్స్టాంట్‌నోపిల్ రాజు సీజర్ కాళ్ళబేరానికి వచ్చి, సుల్తాన్‌కు విధేయుణ్ణయి ఉంటానని, ఏడాదికి పదివేలు డొకెట్లు కప్పంగా చెల్లించుకుంటానని, కాన్స్టాంటినోపిల్‌లో ముస్లింల కోసం ఒక మస్జిద్ నిర్మిస్తానని చెప్పి సుల్తాన్‌తో ఒప్పందం చేసుకున్నాడు. దాంతో సుల్తాన్ బాయజీద్ కాన్స్టాంట్‌నోపిల్‌ని వదలి వెళ్ళిపోయాడు.

అయితే ఆసియామైనర్‌లో చంగీజ్‌ఖాన్ సంతానం పరిపాలనలు బలహీనపడటంతో తైమూర్‌లంక్ రూపంలో మరో తుఫాన్‌దాడులకు మార్గం సుగమంఅయింది. కాన్స్టాంటి నోపిల్ రాజు సీజర్ ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడానికి సుల్తాన్ బాయజీద్‌కు వ్యతిరేకంగా తైమూర్‌లంక్‌కు ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలోని కొన్ని విషయాలు తైమూర్‌ని బాగా ప్రభావితం చేశాయి. మరోవైపు సుల్తాన్ బాయజీద్ యూరప్‌లో అనేక విజయాలు సాధిస్తూ అప్రతిహతంగా పురోగమిస్తున్నాడని కూడా

విన్నాడు. దాంతో అతను సుల్తాన్ బాయజీద్‌ని ఓడించి తానే ఏకైక ప్రపంచవిజేత కావాలన్న కోరికతో భారత్‌లో సాధిస్తున్న విజయాలను వదలిపెట్టి హరిద్వార్, పంజాబ్, సమర్‌ఖంద్‌ల మీదుగా ఆసియామైనర్ పశ్చిమ సరిహద్దుకు చేరుకొని ఆజర్‌బాయ్‌జాన్, ఆర్మేనియా ముస్లింరాజ్యాల్లో సామూహిక హత్యాకాండలకు తెగబడి భయోత్పాతం సృష్టించాడు. ఆజర్‌బాయ్‌జాన్ పాలకుడు ఖరాయూసుఫ్ సహాయం కోసం సుల్తాన్ బాయజీద్ దగ్గరకు చేరుకొని మొరపెట్టుకున్నాడు. అప్పుడు బాయజీద్ తన కొడుకు అర్తగ్రల్‌కు ఒక సైనికదళమిచ్చి సరిహద్దు వైపు పంపించాడు.

తైమూర్‌లంక్ సుల్తాన్ బాయజీద్ విషయంలో అనాలోచితంగా, అత్యుత్సాహంతో రంగంలోకి దిగలేదు. కవ్వింపు చర్యలకూ పాల్పడలేదు. అతను ఎంతో మెళుకువతో వ్యవహరిస్తూ మంచి అనుభవశాలురైన సైనికుల్ని సమీకరిస్తూ ఫకీర్లు, సాధువులు, సూఫీలు, ప్రచారమౌలీలు, వర్తకులు, పర్యాటకుల రూపాల్లో వేలసంఖ్యలో తన గూఢచారుల్ని ఉస్మానియా సామ్రాజ్యంలోకి, బాయజీద్ సైన్యంలోకి పంపాడు. అదీగాక తానే మొగల్‌ప్రజల నాయకుడని, మొగల్‌సైనికులు టర్కీజాతీయుడైన బాయజీద్‌తో సహకరించడం స్వజాతిపట్ల విద్రోహమవుతుందని, బాయజీద్ పిసినారితనంతో తన సైనికులకు చాలా తక్కువజీతాలు ఇస్తున్నాడని, తైమూర్ తన సైనికులకు విశాల హృదయంతో పెద్దజీతాలతో పాటు విజయం లభించినప్పుడల్లా పెద్దఎత్తున కానుకలు, పారితోషికాలు కూడా ఇస్తున్నాడని గూఢచారుల ద్వారా ప్రచారం కూడా చేయించాడు.

తైమూర్‌లంక్ ప్రచారం, పథకాలు తమ ప్రభావం చూపాయి. సుల్తాన్ బాయజీద్ సైన్యంలోని మొగల్‌సైనికుల్లో సమరోత్సాహం తగ్గిపోయింది. వారిలో అనేకమంది తైమూర్‌కు చేరువయ్యారు. తైమూర్ ఆజర్‌బాయ్‌జాన్‌లో విధ్వంసకాండ సృష్టించినపుడు అక్కడి పాలకుడు ఖరాయూసుఫ్ సహాయం కోసం బాయజీద్ దగ్గరకు చేరుకున్న సంగతి తెలిసిందే. అంచేత తైమూర్‌లంక్ సుల్తాన్ బాయజీద్‌కు ఒక లేఖ రాసిపంపుతూ అందులో 'మా విద్రోహి ఖరాయూసుఫ్ మీదగ్గర ఉన్నాడు. అతడ్ని వెంటనే మా దగ్గరకు పంపండి. పంపకపోతే మేము మీ సిరియాపై దాడిచేస్తాము' అని హెచ్చరించాడు. తర్వాత అతను సిరియాపై దాడులకు తెగబడ్డాడు.

ఈజిప్టులోని సుల్తాన్ బాయజీద్ సామంతరాజు ఫర్జ్ బిన్ బర్ఖూఖ్ వెంటనే తైమూర్‌ని అడ్డుకోవడానికి సిరియా చేరుకున్నాడు. సిరియా రాజధాని డెమాస్కస్‌లో ఉభయ సేనలకు మధ్య యుద్ధం జరిగింది. కాని ఈజిప్టు సైనికులు ఘోరంగా ఓడిపోయి పలాయనం చిత్తగించారు. ఆ తర్వాత తైమూర్‌లంక్ సిరియాలో సామూహిక హత్యాకాండలకు పాల్పడి ప్రజల్లో భయోత్పాతం సృష్టించాడు. ఆ తరువాత అతను బగ్దాద్‌లో కూడా బీభత్సం సృష్టించి ఆజర్‌బాయ్‌జాన్‌కు చేరుకున్నాడు. అక్కడ ఆహారసరఫరా, వార్తాసేకరణ, గూఢచార విభాగాలకు తగిన శిక్షణ, ఆదేశాలు ఇచ్చి, మరింత సైనిక సమీకరణ చేశాడు.

అది సుల్తాన్ బాయజీద్ ఖాన్ కాన్స్టాంటినోపిల్‌ని ముట్టడించి క్రైస్తవులతో యుద్ధం చేస్తున్న రోజులు. కాన్స్టాంటినోపిల్ రాజు సీజర్ తైమూర్‌లంక్‌తో కలసి కుట్రకు పాల్పడినందున సుల్తాన్ బాయజీద్ కాన్స్టాంటినోపిల్‌ని ముట్టడించవలసి వచ్చింది. అతను



విజయానికి చాలా చేరువలో ఉన్న తరుణంలో తైమూర్ సిరియాను జయించాడని, ఈజిప్టు సైనికులు ఓడి పారిపోయారని విని వెంటనే ఆజర్‌బాయ్‌జాన్ మాజీపాలకుడు ఖరాయూసుఫ్‌కు ఒక సైనికదళమిచ్చి సిరియా వైపు పంపించాడు. ఆ తరువాత అతను కాన్స్టాంటినోపిల్ ముట్టడిని ఎత్తివేసి తైమూర్‌లంక్‌ని ఎదుర్కోవడానికి సిద్ధమయ్యాడు. ఆ తరువాత అతను మరో దుర్వార్త విన్నాడు. తైమూర్ ఉస్మానియా సామ్రాజ్య సరిహద్దు పట్టణమయిన సీవాస్‌ని ధ్వంసం చేసి అక్కడున్న నాలుగువేల మంది భద్రతాసైనికుల్ని, తన కొడుకు అర్తగ్రల్‌ని హతమార్చిన దుర్వార్త అది.

ఈ దుర్వార్త విని సుల్తాన్ బాయజీద్ బాగా రెచ్చిపోయి వెంటనే యుద్ధానికి సమాయత్తమయ్యాడు. తైమూర్ కోరుకుంటున్నది కూడా అదే. బాయజీద్ వీలైనంత ఎక్కువ సైనికసమీకరణ చేసి సీవాస్ పట్టణం దిశగా బయలుదేరాడు. అతను సీవాస్ సమీపానికి చేరుకున్నాడని తెలియగానే తైమూర్‌లంక్ సీవాస్ నుండి చల్లగా జారుకొని అంగూరా దిశగా ప్రయాణమయ్యాడు. అంతకుముందే ఆ ప్రదేశానికి కొంత సైన్యం పంపి సమరసన్నాహాలు చేయించాడు. అంచేత అంగూరాకు చేరుకోగానే దాన్ని ముట్టడించాడు. బాయజీద్ సీవాస్‌లో నాలుగు లక్షలమంది సైనికుల్ని సమీకరించాడు. కాని తైమూర్ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడని తెలియగానే బాయజీద్ సైన్యం తీసుకొని అతివేగంగా 250మైళ్ళ దూరాన ఉన్న అంగూరా వైపు ప్రయాణమయ్యాడు. అంగూరాకు చేరుకునేటప్పటికి అతని దగ్గర లక్షాఇరవై వేలమంది సైనికులు మాత్రమే మిగిలిపోయారు. అదీగాక వారు అప్పటికే బాగా అలసిపోయారు. అయిదు లక్షలకు పైగా ఉన్న తైమూర్ సైన్యం సమరోత్సాహంతో ఊగిపోసాగింది. చివరికి ఉభయపక్షాలు ఢీకొనడంతో సమరజ్వాలలు మింటి కెగిశాయి.

ముస్లిముల్లో సమైక్యతాసోదరభావాలు కోరుకునే సుల్తాన్ బాయజీద్ లక్ష్యం ముస్లిం పాలకులతో కయ్యానికి దిగడంకాదు. ముస్లిమేతరులతో పోరాడుతూ యూరప్‌లో ఇస్లాంను వ్యాపింపజేయడమే అతని లక్ష్యం. కాని విశ్వవిజేత కావాలన్న ఉద్దేశ్యంతో తైమూర్‌లంక్ కయ్యానికి కాలుదువ్వడంతో బాయజీద్ అతడ్ని ఎదుర్కోవడానికి రంగంలోకి దిగవలసివచ్చింది. అయితే జిత్తులమారి తైమూర్‌కు అతని తొందరపాటు చర్యలు బాగా ఉపకరించాయి. ఈ యుద్ధంలో సుల్తాన్ బాయజీద్ ఘోరంగా పరాజితుడయి తైమూర్‌కు పట్టుబడ్డాడు. బాయజీద్ కొడుకు మూసా కూడా ఖైదీగా పట్టుబడ్డాడు.

తైమూర్‌లంక్ బోనులో పులిని బంధించినట్లు సుల్తాన్ బాయజీద్‌ని ఇనుపబోనులో బంధించి ప్రయాణంలో తన వెంట తిప్పుకోసాగాడు. ఇలా సుల్తాన్ బాయజీద్ ఎనిమిది నెలల పాటు తైమూర్‌లంక్ అధీనంలో అత్యంతవమానకరమైన జైలుశిక్ష అనుభవిస్తూ చివరికి కన్నుమూశాడు. అప్పుడు తైమూర్‌లంక్ జైల్లోనే మగ్గుతున్న బాయజీద్ కొడుకు మూసాని జైలు నుండి విడుదలచేసి "నీ తండ్రి భౌతికకాయాన్ని బరూసా తీసికెళ్ళి అంత్యక్రియలు జరుపుకో" అన్నాడు. ఆతర్వాత తైమూర్ కూడా ఎంతోకాలం జీవించలేదు. అతను సమర్‌ఖంద్ చేరుకొని చైనాపై దాడిచేసే ఉద్దేశ్యంతో బయలుదేరాడు. కాని దారిలోనే జబ్బుపడి చనిపోయాడు.

**5-సుల్తాన్ ముహమ్మద్ ఖాన్ అవ్వల్:-** సుల్తాన్ బాయజీద్ చనిపోయిన తర్వాత అతని కుమారుల మధ్య అంతర్యుయుద్ధాలు చెలరేగాయి. అంగూరా యుద్ధంలో బాయజీద్ తన ప్రత్యర్థికి ఖైదీగా పట్టుబడి చనిపోవడం, అతని కొడుకుల మధ్య అంతర్యుద్ధాలు మొదలవడం గమనించిన యూరప్ క్రైస్తవులు తాము కోల్పోయిన ప్రాంతాలను తిరిగి వశపరచుకోవడానికి ప్రయత్నించి విజయం సాధించారు.

సుల్తాన్ బాయజీద్ కొడుకుల్లో అనేకసార్లు అంతర్యుద్ధాలు జరిగాయి. చివరికి ఇద్దరు సోదరులు మాత్రం మిగిలారు. వారిలో మూసాకు ఉస్మానియా సామ్రాజ్యంలోని యూరప్ భూభాగం దక్కగా, ఆసియామైనర్ భూభాగానికి ముహమ్మద్ రాజ్యాధినేత అయ్యాడు. ఆ తర్వాత మూసా కాన్సాంటినోపిల్‌ను ముట్టడించాడు. అయితే కాన్సాంటినోపిల్ రాజు సీజర్ అంతకుముందే సుల్తాన్ ముహమ్మద్‌తో స్నేహఒప్పందం చేసుకొని ఉండటంవల్ల అతను వెంటనే ముహమ్మద్ ఖాన్ సహాయం అడిగాడు. అప్పుడు ముహమ్మద్ కాన్సాంటినోపిల్‌కు చేరుకొని సెర్వియా రాజు స్టీఫెన్‌కు లేఖరాసి మూసాకు వ్యతిరేకంగా దాడులు ప్రారంభిస్తే తాను సహాయం చేస్తానన్నాడు. వెంటనే స్టీఫెన్ యుద్ధ సన్నాహాలకు ఉపక్రమించాడు.

మూసా ఈ సంగతి తెలుసుకొని కాన్సాంటినోపిల్ ముట్టడి ఎత్తివేసి సెర్వియా వైపుకు పురోగమించాడు. అటువైపు నుండి ముహమ్మద్ కూడా సెర్వియా సరిహద్దుకు చేరుకున్నాడు. అక్కడ ఉభయపక్షాలు ఢీకొన్నాయి. అందులో మూసా హతమయ్యాడు. దాంతో బాయజీద్‌యల్దరమ్ కొడుకుల్లో ముహమ్మద్ మాత్రమే పరిపాలనా యోగ్యుడిగా మిగిలాడు. అంచేత ఇప్పుడు యావత్తు ఉస్మానియా సామ్రాజ్యానికి అతనే ఏకైక రాజ్యాధినేత అయ్యాడు. తరువాత అతను క్రైస్తవరాజులతో స్నేహసంబంధాలు పటిష్ట పరచుకొని యూరప్‌లోని సామ్రాజ్యమంతటా శాంతిభద్రతలు నెలకొల్పాడు. అయితే హిజ్రీశకం 820లో ఒకసారి, 824లో మరొకసారి ఆసియామైనర్‌లో తిరుగుబాటులు తలెత్తడంతో ముహమ్మద్ ఖాన్ అక్కడకు చేరుకొని వాటిని అణచివేశాడు. ఆ తర్వాత అతను కాన్సాంటినోపిల్ రాజుతో స్నేహఒప్పందాన్ని మరింత పటిష్ఠవంతం చేసుకోవడానికి బయలుదేరాడు. కాన్సాంటినోపిల్ రాజు సీజర్ అతనికి ఘనంగా స్వాగతించి సత్కరించాడు. స్నేహఒప్పందం పఠిష్టం చేసుకున్న తరువాత ముహమ్మద్‌ఖాన్ వెళ్ళిపోయాడు. తరువాత హిజ్రీశకం 825లో జబ్బుపడి చనిపోయాడు.

**6-సుల్తాన్ మురాద్‌ఖాన్ సాని :-** ముహమ్మద్‌ఖాన్ మరణానంతరం అతని 18ఏళ్ళ కొడుకు మురాద్‌ఖాన్ అధికారపీఠం అధిరోహించాడు. మురాద్‌ఖాన్ అధికారం చేపట్టగానే దేశంలో తిరుగుబాటులు తలెత్తాయి. కాన్సాంటినోపిల్ రాజు దగ్గర ముస్తఫా అనే ఓ మోసగాడు ఖైదీగా ఉండేవాడు. ఆ రాజు మురాద్‌ఖాన్‌కు వ్యతిరేకంగా నూరిపోసి ఓడలో అతనికి ఓ సైనికదళమిచ్చి ఉస్మానియా సామ్రాజ్యంలోకి పంపాడు. దాంతో ముస్తఫా అధికారవ్యామోహంతో దాడులుచేస్తూ అరాచకానికి పాల్పడ్డాడు. చివరికి అతను మురాద్‌ఖాన్ చేతిలో హతమార్చబడ్డాడు. ఆ తరువాత మురాద్‌ఖాన్ క్రైస్తవ చక్రవర్తి సీజర్‌కు గుణపాఠం చెప్పే ఉద్దేశ్యంతో హిజ్రీశకం 826లో ఇరవై వేలమంది సైనికులతో బయలుదేరి వెళ్ళి కాన్సాంటినోపిల్‌ని ముట్టడించాడు.



కాన్సాంటినోపిల్ రాజు సీజర్ తనదౌత్యవేత్తల ద్వారా మురాద్‌ఖాన్ ఆగ్రహాన్ని తగ్గించి సంబంధాలు మెరుగుపరచుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో అతను మురాద్‌ఖాన్ తమ్ముడు ముస్తఫాఖాన్‌ని రెచ్చగొట్టి మురాద్‌ఖాన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయించడానికి కుట్రపన్నాడు. అతని కుట్ర ఫలించింది. ఆసియామైనర్‌లో తిరుగుబాటులు చెలరేగడంతో మురాద్‌ఖాన్ సాని విజయానికి చేరువలో ఉన్నప్పటికీ హిజ్రీశకం 828లో కాన్సాంటినోపిల్ ముట్టడిని ఎత్తివేసి ముస్తఫాఖాన్ తిరుగుబాటును అణచడానికి వెళ్ళిపోయాడు. ముస్తఫా సైనికుల్లో అనేకమంది మురాద్‌ఖాన్‌ని చూడగానే ముస్తఫాని వదలి మురాద్‌ఖాన్ సైన్యంలో చేరిపోయారు. తర్వాత మురాద్‌ఖాన్ సైన్యం యుద్ధంచేసి ముస్తఫాఖాన్‌ని హతమార్చింది. ఆ తర్వాత మురాద్‌ఖాన్ యూరప్‌కు చేరుకొని కాన్సాంటినోపిల్ రాజు సీజర్ తనకు ఏటా ముప్ఫయివేల డాకెట్లు కప్పం చెల్లించే, కొన్ని కీలకప్రాంతాలను అప్పగించే షరతులపై ఒప్పందం చేసుకున్నాడు.

ఆ తరువాత కొన్నాళ్ళకు ఐరోపా క్రైస్తవరాజ్యాలు ఉస్మానియా సామ్రాజ్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటుకు పాల్పడ్డారు. ఆ యుద్ధాల్లో వేలది మంది ముస్లింయోధులు అమరగతులయ్యారు. మురాద్‌ఖాన్ ఆ తిరుగుబాటును అణచడానికి పూనుకున్నాడు. కాని తన పెద్దకొడుకు అలావుద్దీన్ చనిపోవడంతో అతనికి పరిపాలన పట్లే విరక్తి కల్గింది. అయితే గత యుద్ధాల్లో మురాద్‌ఖాన్ బావ ముహమ్మద్ క్రైస్తవసైన్యానికి పట్టుబడి జైలుపాలయ్యాడు. అతడ్ని విడుదల చేయించమని చెల్లెలు పట్టుబట్టడంతో మురాద్‌ఖాన్ హంగేరిరాజుతో సంప్రదించి కొన్ని షరతులతో ఒప్పందం చేసుకోవడం ద్వారా తన బావ ముహమ్మద్‌ని విడుదల చేయించాడు. ఆ తర్వాత అతను ఇంకా యౌవనంలో అడుగుపెట్టని తన రెండవ కుమారుడు ముహమ్మద్‌కు పాలనాబాధ్యత అప్పగించి తపస్వి (సాధు)జీవితం గడపనారంభించాడు.

అయితే క్రైస్తవరాజులు నెలరోజులు కూడా గడవకముందే పదేళ్ళఒప్పందాన్ని తుంగలో తొక్కి హిజ్రీశకం 848లో ఉస్మానియాసామ్రాజ్య సరిహద్దు భద్రతాదళాలపై దాడిచేశారు. ఆ తర్వాత అనేక ప్రాంతాలపై దాడులుచేస్తూ, సామూహిక హత్యాకాండలు జరుపుతూ అరాచకానికి తెగబడ్డారు. అంచేత మురాద్‌ఖాన్ సాని తపోనిష్ట వదలి మళ్ళీ ఖడ్గం చేపట్టవలసి వచ్చింది.

సుల్తాన్ మురాద్‌ఖాన్ సైన్యం తీసుకొని ఒడంబడికపత్రం ఈటెకు కట్టి చూపిస్తూ రణరంగంలోకి దిగాడు. క్రైస్తవరాజులు దానికి సమాధానం ఇవ్వకుండా మెరుపుదాడులకు పాల్పడి వందలాది ముస్లింయోధుల్ని హతమార్చారు. లక్షలసంఖ్యలో ఉన్న క్రైస్తవ సైన్యాలను ముస్లింలు ఎదుర్కోలేక వెనుకంజ వేయసాగారు. మురాద్‌ఖాన్ కూడా నిరుత్సాహపడ్డాడు. అంతలో హంగేరి రాజు లీడ్‌సలాస్ అహంకారంతో రొమ్ము విరుచుకుంటూ, సవాలుచేస్తూ ముందుకొచ్చాడు. మురాద్‌ఖాన్ తక్షణమే విల్లు ఎక్కుపెట్టి బాణం వదిలాడు. అది హంగేరి రాజు గుర్రానికి తగలడంతో గుర్రం గాయపడి నేల కొరగడం, దాంతోపాటు ఆ రాజు కిందపడిపోవడం, వెంటనే అక్కడే వున్న ఓ యంగ్‌చరీ ముస్లింయోధుడు అతని శిరస్సుఖండించి దాన్ని బరిసెమొనకు గుచ్చి చూపడం క్షణాల్లో జరిగిపోయాయి. ఆ దృశ్యం చూసిన క్రైస్తవసైనికులు భయాందోళనలతో వణకిపోయారు.

అంతేకాదు, వారి సమరోత్సాహం నీరుగారి పోయింది. ఆ వెనువెంటనే ముస్లిం యోధులు వారిపై విరుచుకుపడ్డారు. క్రైస్తవసైనికులు ఎంతో పెనుగులాడారు. కాని లాభం లేకపోయింది. చివరికి చేతులెత్తివేసి కాళ్ళకు బుద్ధిచెప్పారు. వారి సేనాపతి, పోప్ ప్రధాన ప్రతినిధి కార్డినల్ జూలియన్‌తో పాటు అనేకమంది దళపతులు, నాయకులు హతమార్చబడ్డారు. దాదాపు హంగేరి సైనికులంతా మృత్యువాత పడ్డారు.

బోస్నియా, సెర్వియా రాజ్యాలు తిరిగి ముస్లింల కైవశమయ్యాయి. శాంతిఒడం బడికను పదేళ్ళపాటు గౌరవిస్తామని ఎన్నో ప్రమాణాలు చేసిన క్రైస్తవనేతలు రెండునెలల లోపే దాన్ని దారుణంగా భగ్నపరచి చేజేతులా నాశనం కొనితెచ్చుకోవడంతో దాని ప్రభావం సెర్వియా, బోస్నియాలలోని క్రైస్తవులపై పడింది. ఫలితంగా వారిలో అనేక మంది స్వచ్ఛందంగా ఇస్లాం స్వీకరించి ముస్లింసముదాయంలో చేరిపోయారు.

మురాద్‌ఖాన్ సాని ఈ యుద్ధం తరువాత తిరిగి ఏకాంతకుహురంలోకి వెళ్ళిపోయి దైవారాధనలో లీనమైపోయాడు. అయితే నవయువకుడైన ముహమ్మద్ సాని రెండవ సారి అధికారపీఠం అధిరోహించగానే హిజ్రీశకం 849లో సైనికులు తమ జీతాలు పెంచమని డిమాండ్‌చేస్తూ తిరుగుబాటుకు పాల్పడ్డారు. దాంతో మురాద్‌ఖాన్ ఏకాంత కుహురం వదిలేసి రాజధానికి చేరుకోవలసి వచ్చింది. రాగానే పరిపాలనా పగ్గాలు చేపట్టి తన కొడుకు ముహమ్మద్‌ఖాన్ని ఆసియామైనర్‌కు వెళ్ళి అక్కడ కొన్నాళ్ళు ఉండి పరిపాలనా అనుభవం సంపాదించమని పంపించాడు.

ఆ తరువాత మురాద్‌ఖాన్ సైనికుల తిరుగుబాటు అణచివేసి, శాంతిభద్రతలను పునరుద్ధరించడంలో నిమగ్నుడైపోయాడు. ఇలా మూడోసారి పరిపాలనాపగ్గాలు చేపట్టిన తరువాత ఇక ఎన్నడూ ఏకాంతకుహురంలోకి వెళ్ళనని నిర్ణయించుకున్నాడు. హిజ్రీశకం 852లో క్రైస్తవులు ఏకమై మరొకసారి తిరుగుబాటుకు పాల్పడటంతో మురాద్‌ఖాన్ వారిని అణచడానికి మళ్ళీ రంగంలోకి దిగవలసి వచ్చింది. కసూవా అనే ప్రాంతంలో మూడు రోజులపాటు జరిగిన భీకరయుద్ధంలో క్రైస్తవసైన్యం చిత్తుగా ఓడిపోయి పలాయనం చిత్తగించింది. ఆ తరువాత సుల్తాన్ మురాద్‌ఖాన్ యూరప్‌లో అనేక ప్రాంతాలు జయించి ఉస్మానియా సామ్రాజ్యాన్ని మరింత విస్తృతపరిచాడు.

యంగ్‌చరీ నవముస్లిం సైనికుల్లో అల్బానియా రాష్ట్రానికి చెందిన జార్జ్ కస్ట్రాయెట్ (సికందర్‌బేగ్) అనే యువకుడ్ని సుల్తాన్ మురాద్‌ఖాన్ కన్నకొడుకులా చూసుకునేవాడు. అయితే అల్బానియా రాష్ట్రపాలకుడు, జార్జ్ కస్ట్రాయెట్ కన్నతండ్రి కూడా అయిన జాన్ కస్ట్రాయెట్ హిజ్రీశకం 836లో చనిపోయిన తరువాత హిజ్రీశకం 847లో క్రైస్తవసైనికులతో జరిగిన ఓ యుద్ధంలో టర్కీ ముస్లింయోధులు పరాజయం పాలైనపుడు జార్జ్‌కస్ట్రాయెట్ (సికందర్‌బేగ్) తన తాతముత్తాల దేశం అల్బానియాను ఖడ్గశక్తితో నైనా స్వాధీనం చేసుకో వాలని నిర్ణయించుకున్నాడు. దాంతో అతను వెంటనే సుల్తాన్ ప్రధానకార్యదర్శిని ఖడ్గం తో బెదిరించి అల్బానియారాష్ట్రపాలకుని పేర ఒక సిఫారసులేఖ రాయించుకొని, సుల్తాన్ కార్యదర్శిని హతమార్చాడు. తరువాత అతను అల్బానియా రాజధానికి చేరుకొని రాష్ట్ర పాలకునికి ఆలేఖ చూపించి అల్బానియాను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు.



ఈవిధంగా జార్జ్ కస్ట్రాయెట్ (సికందర్‌బేగ్) అల్బానియా రాష్ట్రాన్ని స్వాధీనం చేసుకొని ఓ బహిరంగ ప్రకటన చేస్తూ తాను ఇస్లాంధర్మాన్ని వదలేసి క్రైస్తవమతాన్ని స్వీకరిస్తున్నా నని, ఇకముందు తాను అల్బానియాను తురుష్కముస్లింల నుండి విముక్తం చేయ డానికి శాయాశక్తులా కృషిచేస్తానని ప్రజలకు తెలియజేశాడు. ఈ ప్రకటన వినగానే క్రైస్తవ పౌరులు ఆనందాతిశయంతో గంతులేశారు. ఆ వెనువెంటనే వారు తురుష్కులను ఊచకోతకోయనారంభించారు. ఇలా రాజధానిలోని ముస్లింలంతా హతమార్చబడ్డారు. ఆ తరువాత రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని ముస్లింలపై విరుచుకుపడ్డారు.

సుల్తాన్ మురాద్‌ఖాన్ సాని కొన్ని ఇతర కారణాలవల్ల అల్బానియా అరాచకంపై పూర్తిగా దృష్టి సారించలేకపోయాడు. అతను పంపిన సైన్యాలు జార్జ్ కస్ట్రాయెట్‌ని ఎదుర్కోలేక వెనక్కి తిరిగొచ్చాయి. మురాద్‌ఖాన్ జీవితంలో ఈ అరాచకం అణగిపోలేదు. సుల్తాన్ మురాద్‌ఖాన్ సాని 30 ఏళ్ళ పాలన తర్వాత హిజ్రీశకం 855లో చనిపోయాడు.

**7-సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సాని :-** మురాద్‌ఖాన్ మరణానంతరం అతని కొడుకు ముహమ్మద్‌ఖాన్ ఉస్మానియా సామ్రాజ్యానికి అధినేత అయ్యాడు. ముహమ్మద్ ఖాన్ కూడా తన తండ్రిలాగే జార్జ్ కస్ట్రాయెట్ పట్ల కఠినంగా వ్యవహరించకుండా ఎప్పటి కైనా దారికి వస్తాడని భావించి మృదువుగా హెచ్చరించాడు. కాని జార్జ్ కస్ట్రాయెట్ అతని హెచ్చరికను ఖాతరు చేయకుండా తన అరాచకాన్ని కొనసాగించాడు. అప్పుడు సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ రణరంగంలోకి దిగి అల్బానియాను స్వాధీనం చేసుకున్నాడు. జార్జ్ కస్ట్రాయెట్ వెనిస్ రాష్ట్రానికి పారిపోయి కొన్నాళ్ళకు అక్కడే మృత్యువాతపడ్డాడు.

సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ అధికారం చేపట్టగానే ఆసియామైనర్‌లో శాంతిభద్రతలు పటిష్ఠపరచి హంగేరి రాజుతో స్నేహఒప్పందం చేసుకున్నాడు. కాన్స్టాంటినోపిల్ కొత్త చక్రవర్తి తన అధీనంలో ఉన్న ఉస్మానియావంశానికి చెందిన అర్ఖాన్ అనే యువకుడ్ని అడ్డంపెట్టుకొని ముహమ్మద్‌ఖాన్‌ని బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించాడు. అంచేత ముహమ్మద్‌ఖాన్ కాన్స్టాంటినోపిల్‌పై దాడిచేయడానికి సన్నాహాలు చేశాడు.

అటు కాన్స్టాంటినోపిల్ రాజు సీజర్ కూడా ముహమ్మద్‌ఖాన్‌ని ఎదుర్కోవడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆ కాలంలో క్రైస్తవులు మతవిశ్వాసం రీత్యా రెండు వర్గాలుగా చీలి ఉండేవి. అందులో ఒక వర్గం రోమ్‌నగర పోప్‌ను తన మతాచార్యుడిగా అంగీకరించి రోమన్‌చర్చ్ అధీనంలో ఉండేది. రెండోవర్గం కాన్స్టాంటినోపిల్ ప్రధాన బిషప్‌ని తన మతనాయకునిగా అంగీకరించి గ్రీక్‌చర్చ్ అధీనంలో ఉండేది. కాన్స్టాంటి నోపిల్ రాజు సీజర్ ఇస్లాంకు వ్యతిరేకంగా ఈ రెండు వర్గాలను ఏకం చేయడంలో విజయం సాధించాడు. దాంతో బ్రహ్మాండమైన సిలువయుద్ధానికి సన్నాహాలు మొదల య్యాయి. వివిధదేశాల నుండి లక్షలాది సిలువయోధులు కాన్స్టాంటినోపిల్‌కు చేరుకున్నారు. వెనిస్, జెనివా దేశాల నుండి నౌకా బలగాలు కూడా కాన్స్టాంటినోపిల్‌కు చేరుకున్నాయి. అటు సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సాని కూడా వేలాది కాల్బలం, నౌకా బలగాలతో హిజ్రీశకం 857, రబీవుల్‌అవ్వల్ నెల 22వ తేదీన కాన్స్టాంటినోపిల్ సమీపా నికి చేరుకున్నాడు.

ఈ యుద్ధం కోసం కాన్స్టాంటినోపిల్ రాజు సీజర్ మితిమీరిన ఆహార పదార్థాలతో పాటు రకరకాల ఆయుధ సామగ్రి, ఫిరంగులు సేకరించుకున్నాడు. నగర ప్రహరీగోడను, కోటబురుజులను అవసరమైనపుడు మరమ్మత్తు చేసి మరింత పటిష్ఠపరచడానికి భవన నిర్మాణ ప్రవీణుల్ని, ఇతర సాంకేతిక నిపుణుల్ని కూడా ఏర్పాటు చేసుకున్నాడు. శత్రునౌకలు నగరం దగ్గరకు రాకుండా అడ్డుకోవడానికి నగరానికి ఒకవైపున్న సముద్రం లోని రేవులో ఓ లావుపాటి ఇనుపగొలుసు కట్టించాడు. శత్రునౌకలు వచ్చినపుడు ఆ ఇనుపగొలుసు సముద్రం ఉపరితలం వైపుకు లాగి కడ్తారు. సొంతనౌకలు వచ్చినపుడు సముద్రం లోపలకు జారిఉండేలా దాన్ని వదులు చేసి కడ్తారు. ఇలా క్రైస్తవులు ముందు జాగ్రత్త కోసం అనేక ఏర్పాట్లు చేసుకున్నారు.

ముస్లింలు కూడా అవసరమైన సామగ్రి, ఆయుధాలు సేకరించుకొని వచ్చారు. అదీగాక సుల్తాన్ సైనికులతో పాటు ధర్మవేత్తలు, సూఫీలు, ఖారీలను కూడా తెచ్చుకొని నగరాన్ని ముట్టడించాడు. అయితే క్రైస్తవుల ఓడల సమక్షంలో ముస్లింల నౌకలు చాలా చిన్నవి. బయటనుంచి వచ్చే క్రైస్తవఓడలు వీటిని సులభంగా త్రోసి ముందుకు వెళ్ళి పోయేయి. అవి గోల్డెన్‌రేవును సమీపంచగానే అక్కడి భద్రతాసైనికులు ఇనుపగొలుసుని వదులుచేసి సముద్రంలోకి జారవిడిచేవారు. తమ ఓడలు ముందుకు వెళ్ళిపోగానే ఇనుపగొలుసుని వారు మళ్ళీ ఉపరితలం వైపుకు లాగిపెట్టి ముస్లింనౌకలను రాకుండా అడ్డుకునేవారు. అంచేత ముట్టడి రెండు నెలలు సాగినా ఫలితం కన్పించలేదు.

ముస్లింలు కాన్స్టాంటినోపిల్‌ని జయిస్తారని దైవప్రవక్త (స) ఏనాడో ఇలా భవిష్యవాణి తెలిపారు: "మీరు తప్పకుండా కాన్స్టాంటినోపిల్‌ని జయిస్తారు. ఆ నాయకుడు ఎంత అద్భుతమైన నాయకుడు! ఆ సైన్యం ఎంత అద్భుతమైన సైన్యం!!" (మిష్కాత్)

తరువాత ఇప్పుడు సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సాని కాన్స్టాంటినోపిల్‌ని ముట్టడించి నపుడు దైవప్రవక్త (సల్లం) ప్రియ అనుచరుడు హజ్రత్ అబూఅయ్యూబ్ అన్సారీ (రజి) అతనికి కలలో కన్పించి కాన్స్టాంటినోపిల్ విజయశుభవార్త తెలియజేశారు. అందువల్ల ఇక ఎట్టి పరిస్థితిలోనూ అది ఆగే ప్రసక్తిలేదు.

14మైళ్ళు వ్యాసంతో కూడిన (కాన్స్టాంటినోపిల్) నగర ప్రహరీగోడ ఎంతో పటిష్ఠంగా ఉంది. దాని ముందు చాలా లోతైన కందకం కూడా ఉంది. ముస్లింలు తీరం మీద నుంచి తమ దగ్గరున్న ఆయుధాలతో ఎంత పోరాడినా ఆ ప్రహరిగోడకు కాస్తయినా నష్టం కలిగించలేకపోయారు. కాకపోతే అక్కడక్కడ కొన్ని రంధ్రాలు పడ్డాయి. కాని ముస్లింలు కందకం దాటి ఆ రంధ్రాల్లో దూరి లోపల ప్రవేశించడానికి ప్రయత్నించినప్పు డల్లా క్రైస్తవులు వారిపై నిప్పుదివిటీలు విసిరి వెనక్కి నెట్టివేసేవారు. దాంతో సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ దీర్ఘాలోచనలో పడ్డాడు. చివరికి అతని మెదడులో అసాధారణమైన ఓ విశేష సమరవ్యూహం మెదిలింది. వెంటనే అతను తీరం మీద గోల్డెన్‌హార్బర్ వరకు 7మైళ్ళ పొడవున కలప పలకలు పేర్చి వాటిపై నౌకలను ఎక్కించి లాగవలసిందిగా సైనికుల్ని ఆదేశించాడు. చరిత్రలో ఇదివరకు ఎప్పుడూ ఎవరూ ఇలాంటి వ్యూహరచన చేయలేదు. అందువల్ల ఈ ఆదేశం వినగానే యోధులంతా ఆశ్చర్యపోయారు.



ఆ తర్వాత వారు ఏడువందల నౌకల్లో 80 నౌకల్ని తీరం మీది కలప పలకలపైకి చేర్చారు. అక్కడ్నుంచి రాత్రివేళ పున్నమి వెన్నెల్లో రైలుపెట్టెల మాదిరిగా ఉన్న ఆ నౌకల్ని వేలమంది యోధులు అల్లాహుఅక్బర్ నినాదాలతో, బ్యాండుమేళాలతో ఏడుమైళ్ళ దూరాన వున్న గోల్డెన్‌రేవు దాకా తోసుకుంటూ దాన్ని తెల్లవారేలోపునే నగర ప్రహరీగోడ సమీపానికి చేర్చారు. నగర క్రైస్తవులు ఉదయం లేచిచూస్తే తమ ప్రహరీగోడ, కందకం ముందు తీరంమీద ముస్లింలనౌకలు కన్పించాయి. దాంతో వారు తీవ్ర ఆందోళన చెందారు. ఉదయం కాస్త పొద్దెక్కిన తరువాత ఆ నౌకల నుండి వెలువడుతున్న ఫిరంగి మోతలతో ఆ ప్రాంతం దద్దరిల్లసాగింది.

దానికి ముందు క్రైస్తవులు గోల్డెన్‌హార్బర్‌లో అటువైపున్న తమ ఓడలను ఇటువైపు తరలించడానికి ప్రయత్నించారు. కాని ముస్లింలు వివిధప్రదేశాల్లో ప్రతిష్ఠించిన ఫిరంగుల ద్వారా ఎగిసిపడిన అగ్నిజ్వాలల ధాటికి ఆ ఓడలు ముందుకు సాగలేకపోయాయి. అప్పుడు క్రైస్తవులు తమ పదాతిదళాల్లో ఓ పెద్ద సైనికదళాన్ని రేవు రెండవ కొనకు తరలించారు. అయితే ముస్లింయోధులు వారిపై బాణాలతో విరుచుకుపడ్డారు. దాంతో క్రైస్తవసైన్యం క్షణక్షణానికి బలహీనపడసాగింది.

అప్పుడు కాన్స్టాంటినోపిల్ రాజు సీజర్‌కు తన ఓటమి సూచనలు కనబడటంతో అతను సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్‌తో కాళ్ళబేరానికి వస్తూ నగరం ముట్టడి వదలి వెళ్ళిపోతే తాను సుల్తాన్‌కు అడిగినంత కప్పం చెల్లించుకుంటానని తన దూత ద్వారా సుల్తాన్‌కు లేఖరాసి పంపాడు. దానికి సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సమాధానమిస్తూ సీజర్ తనకు విధేయుడైపోతే తాను అతనికి గ్రీక్‌రాజ్యానికి చెందిన దక్షిణభూభాగం ఇవ్వబడు తుందని, తాను కాన్స్టాంటినోపిల్‌ని తన సామ్రాజ్యంలో కలపకుండా ఎట్టి పరిస్థితిలోనూ వదలిపెట్టేది లేదని తెలియజేశాడు.

సీజర్ అందుకు నిరాకరిస్తూ యుద్ధకార్యకలాపాలను ఉధృతం చేశాడు. కాన్స్టాంటి నోపిల్ ఉస్మానియాసామ్రాజ్యం మధ్య ఉంది. దాన్ని అలాగే క్రైస్తవుల అధీనంలో ఉంచితే ముస్లింలకు ఎప్పటికైనా ముప్పు వాటిల్లవచ్చని సుల్తాన్ భావించాడు. అదీగాక కాన్స్టాంటి నోపిల్ ఉస్మానియా సామ్రాజ్యానికి మంచి రాజధాని అవుతుందని కూడా అతను ఊహించాడు. అంచేత అతను రేపుదయమే ఒక్కసారిగా మూకుమ్మడి దాడిచేయాలని తన యోధుల్ని ఆదేశించాడు. ఈ ఆదేశం వినగానే ముస్లిం శిబిరంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. యోధులు అమరగతిభాగ్య దాహంతో గంతులేశారు.

మరునాడుదయం ముస్లింలంతా ఫజర్‌నమాజ్ చేసి సమరానికి సమాయత్తమ య్యారు. సుల్తాన్ కూడా నమాజ్ ముగించి ధర్మవేత్తలు, పుణ్యపురుషులను కలిసి తమ విజయం కోసం దైవాన్ని ప్రార్థించమని అన్నాడు. వారిలో సుల్తాన్‌కు అతి సన్నిహితుడైన ఓ ధర్మవేత్త ఆరోజు తనకోసం ఓ ప్రత్యేకగుడారం కట్టించుకొని బయట ఓ సెక్యూరిటీ గార్డ్‌ని కాపలాపెట్టుకొని లోపల కూర్చొని దైవారాధనలో లీనమైపోయాడు.

పొద్దెక్కిన తరువాత ఇరుపక్షాల మధ్య మరొకసారి సమరజ్వాలలు ఎగిసిపడ్డాయి. భీకరయుద్ధం మొదలైంది. ఉస్మానీ సైన్యంలోని కొందరు యోధులు కోటబురుజులు

ఎక్కడంలో విజయం సాధించారు. కోట లోపల నగరంలోని స్త్రీలు, పిల్లలు సైతం సీజర్, బిషప్పుల ప్రసంగాలతో ఉత్తేజితులై తమ వంతు పాత్ర నిర్వహించడానికి రంగం లోకి దిగి పోరాడసాగారు. అయితే నగరముట్టడి గంటగంటకు బిగుసుకుపోసాగడంతో క్రైస్తవులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ముస్లింయోధులు ప్రాణాలకు తెగించి ఎంత పోరాడుతున్నా కోటగోడలు దాటి నగరంలోకి ప్రవేశించలేక పోయారు. అప్పుడు సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ తన మంత్రిని శిబిరంలో ఒంటరిగా కూర్చొని దైవారాధనలో లీనమైపోయిన ధర్మవేత్త దగ్గరకు ఒక సందేశమిచ్చి పంపాడు.

ఆ సందేశం ఇలా ఉంది:- రెండుపక్షాలు కూడా ధైర్యసాహసాలతో పోరాడుతున్నాయి. ఇప్పుడు యుద్ధం భీకరరూపం దాల్చింది. క్రైస్తవుల సాహసం, తీవ్రప్రతిఘటనలు చూసి ముస్లింల ధైర్యం సన్నగిల్లుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. ఇది మనం దైవాన్ని వేడుకో వలసిన సమయం. ఈరోజు మనం నగరాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే ఇకముందు ఎప్పుడూ స్వాధీనం చేసుకోలేమేమో!

మంత్రి ఈ సందేశం తీసుకొని ధర్మవేత్త దైవారాధనలో లీనమైకూర్చున్న గుడారం దగ్గరకు చేరుకున్నాడు. కాని గుడారం కాపలాదారుడు అతడ్ని అడ్డుకున్నాడు. మంత్రి కాపలాదారుడ్ని తీవ్రంగా మందలించి గుడారంలోకి ప్రవేశించాడు. మంత్రి లోపలికి ప్రవేశించగానే ఆ ధర్మవేత్త సజ్దా నుండి తల పైకెత్తి మంత్రి వైపు చూస్తూ "కాన్స్టాంటి నోపిల్ నగరం జయించబడింది" అని అన్నాడు. ఆ విషయాన్ని మంత్రి ఓ పట్టాన నమ్మలేకపోయాడు. అతను గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. వెళ్ళిచూస్తే నగరకోట మీద నెలవంకపతాకం రెపరెపలాడుతూ కనపడింది.

మంత్రిని ధర్మవేత్త దగ్గరకు పంపిన తరువాత సుల్తాన్ ముందున్న కోటగోడ భాగం దానంతటదే హఠాత్తుగా విరిగి కందకంలో పడిపోయింది. దాంతో ముస్లింయోధులు సులభంగా కందకం దాటి నగరంలోకి ప్రవేశించగలిగారు. అదే సమయంలో మరోవైపు గోల్డెన్‌హార్బర్ సమీపంలోని ముస్లిం నావికాయోధులు ఒక బురుజును ఆక్రమించుకొని దానిపై నెలవంకపతాకం ఆవిష్కరించారు. బురుజుపై ఆ పతాకాన్ని, ప్రహరీగోడ భాగం విరిగిపడటాన్ని చూసిన సుల్తాన్‌ప్రత్యేకసైనికదళం ఒక్కసారిగా క్రైస్తవసైనికులపై విరుచు కుపడి ఊచకోత కోయడం ప్రారంభించింది. వేరొక వైపున ముస్లింయోధులు నలుదిశల నుండి కోటతలుపులు విరగ్గొడుతూ లోపలికి ప్రవేశించారు. చూస్తుండగానే క్రైస్తవ సైనికుల శవాలు గుట్టలుగుట్టలుగా పడిపోయాయి. దాంతో కాన్స్టాంటినోపిల్ ఇప్పుడు పూర్తిగా ముస్లింల స్వాధీనంలోకి వచ్చింది.

సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ నగరంలోని అయ్యసూఫియా చర్చిలో ప్రవేశించి విశ్వ ప్రభువు పట్ల కృతజ్ఞతగా సాష్టాంగప్రణామం చేశాడు. తరువాత అజాన్ చెప్పి సహచరు లతో కలసి జుహర్‌నమాజ్ చేశాడు. సూఫియాచర్చిలోని క్రైస్తవమత చిహ్నాలను పూర్తిగా తుడిచిపెట్టి దాన్ని మస్జిద్‌గా రూపొందించడం జరిగింది. ఆతర్వాత సుల్తాన్ ముహమ్మద్ ఖాన్ సాని హజ్రత్ అబూఅయ్యూబీ అన్సారీ (రజి) సమాధిని వెతికి అక్కడ ఓ అద్భుత మైన మస్జిద్‌ని కట్టించాడు.



సుల్తాన్ కాన్స్టాంటినోపిల్‌ని జయించిన తరువాత నగరప్రజలకు ధనమానప్రాణ రక్షణహామీనిచ్చాడు. తమకు సంతోషంగా విధేయులైనవారి స్థిరచరాస్తులకు ఎలాంటి నష్టం కలిగించడం జరగదని, సోఫియాచర్చి తప్ప మిగతా చర్చిలన్నీ క్రైస్తవుల అధీనం లోనే యథాతథంగా ఉంచబడతాయని ప్రకటించాడు. కాన్స్టాంటినోపిల్ ప్రధాన బిషప్‌ను పిలిపించి "మీరు యథాప్రకారం గ్రీకుచర్చి ప్రధానాచార్యులుగానే ఉండవచ్చని, మీ మతవ్యవహారాల్లో మేమెలాంటి జోక్యం చేసుకోమని శుభవార్త తెలియజేశాడు. సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ స్వయంగా గ్రీకుచర్చి సంరక్షణబాధ్యత తీసుకున్నాడు. బిషప్‌లు, పాదరీలకు క్రైస్తవరాజ్యంలో కూడా లభించని అధికారాలు ఇప్పుడు ముస్లిం రాజ్యంలో లభించాయి. చర్చిలనిర్వహణ ఖర్చుల కోసం పెద్దపెద్ద జాగీర్లు ఇవ్వబడ్డాయి. సుల్తాన్ యుద్ధఖైదీలను తన సైనికుల నుండి కొని విడుదల చేశాడు.

కాన్స్టాంటినోపిల్ పూర్వం క్రైస్తవచక్రవర్తి కాన్స్టాంటన్ పేరుతో ఉనికిలోకి వచ్చింది. సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సాని కాన్స్టాంటినోపిల్‌ని జయించిన తరువాత దాని పేరును మార్చి "ఇస్లాంబోల్" అని పెట్టాడు. అంటే ఇస్లాంను వ్యాపింపజేసే స్థలం అన్నమాట. కొన్నేళ్ళకు అది ఇంగ్లీష్ ఉచ్చారణతో "ఇస్టాంబుల్"గా మారి టర్కీరాజధాని అయ్యింది. ఉస్మానీఖిలాఫత్ పతనం తర్వాత (అంగూరా)"అంకారా" టర్కీరాజధాని అయ్యింది.

కాన్స్టాంటినోపిల్ విజయం చరిత్రలో గొప్ప ప్రపంచసంఘటనగా పేర్కొనబడింది. అందువల్ల కాన్స్టాంటినోపిల్ విజయంతో ఐరోపా చరిత్రకారుల పరిభాషలో మధ్యయుగం అంతరించి నవయుగం ప్రారంభమయింది.

సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ కాన్స్టాంటినోపిల్‌ని జయించాక శత్రువుల దాడుల నుండి ఉస్మానియాసామ్రాజ్య పరిరక్షణ కోసం అనేక యుద్ధాలు చేసి ఆయా ప్రాంతాలను కూడా స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. ముఖ్యంగా రోమ్ సముద్రంలోని గ్రీకు దక్షిణ భూభాగం, వెనిస్‌లోని కొంతభాగం, నల్లసముద్రం దక్షిణ తీరంలోని తరాబజూన్, సెర్బియా, బోస్నియా రాజ్యాలను జయించడం జరిగింది. హంగేరి రాజధాని బెల్‌గ్రేడ్‌పై కూడా దాడులు జరిగాయి కాని, అప్పుడు సుల్తాన్ తీవ్రంగా గాయపడటం వల్ల బెల్‌గ్రేడ్ ముట్టడి వదలి కాన్స్టాంటి నోపిల్‌కు తిరిగిరావలసి వచ్చింది.

అయితే అనారోగ్యం నుండి పూర్తిగా కోలుకున్న తర్వాత సుల్తాన్ బెల్‌గ్రేడ్ వైపు పోకుండా సుల్తాన్ బాయజీద్ యల్దరమ్ కలను నిజం చేయడానికి ఇటలీ వైపు దృష్టి సారించాడు. అతను తన సైన్యాధ్యక్షుడ్ని పంపి ఇటలీ ముఖద్వార పట్టణం టరాంటూని జయించాడు. తరువాత కొన్నాళ్ళకు ఇటలీ దేశాన్ని జయించి మొత్తం రోమ్‌సామ్రాజ్యాన్ని అంతమొందించేందుకు భారీఎత్తు సైన్యం సమీకరించాడు. అటు నాల్గవ పోప్ సిక్టస్, సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ ఇటలీ సరిహద్దులో ప్రవేశించగానే రోమ్‌నగరం నుండి పారిపోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అయితే విధి సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సమరోద్యమా నికి అంతటితో అడ్డుకట్ట వేసింది. సుల్తాన్ ఎంతో ఉత్సాహంతో సైన్యం తీసుకొని కాన్స్టాంటినోపిల్ నుండి బయలుదేరగానే జబ్బుపడ్డాడు. ఆ జబ్బు నుండి కోలుకోలేని పరిస్థితికి గురై 30 ఏళ్ళ పాలన తర్వాత హిజ్రీశకం 886లో తనువు చాలించాడు.

కాన్స్టాంటినోపిల్‌ని విజయం తర్వాత టర్కీసామ్రాజ్యం యావత్‌ముస్లింజగత్తులో అత్యంత శక్తిమంతమైన సామ్రాజ్యంగా గుర్తించబడింది. అంచేత ప్రపంచముస్లింలంతా ఇప్పుడు ముస్లింసముదాయ గౌరవప్రతిష్ఠల పరిరక్షణ కోసం ఖిలాఫత్ హోదాను బగ్దాద్ నుండి తీసి ఉస్మానియా తురుష్కులకు ఇవ్వాలని నిర్ణయించారు. కొన్నేళ్ళకు ఆనాటి ధర్మవేత్తలంతా ఈ మార్పును ఆమోదిస్తూ "ఇప్పుడు చైనా నుండి యూరప్ వరకు, ఉత్తరాఫ్రికా నుండి యమన్ వరకు ఉస్మానియా తురుష్కులు తప్ప ముస్లిమేతరుల బారినుండి ముస్లింల గౌరవప్రతిష్ఠలను కాపాడగలిగే ఏ శక్తీ లేనందున వారి ఖిలాఫత్ ధర్మసమ్మతమైనదిగా పరిగణించబడింద"ని ఫత్వా జారీచేశారు. దాంతో అప్పటి నుండి ఉస్మానియా పాలనావ్యవస్థ ఉస్మానియా ఖిలాఫత్ వ్యవస్థగా చరిత్రకెక్కింది.

సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ సాని మంచి పరిపాలనాదక్షుడు కావడంతో పాటు గొప్ప ధర్మవేత్త కూడా. అతను ఖుర్‌ఆన్, హదీస్, చరిత్ర, గణితం, సాహిత్యం, జీవశాస్త్రాల్లో గొప్ప ప్రావీణ్యం సంపాదించాడు. అంతేగాక అతను అరబీ, ఫార్సీ, టర్కీ, లాటిన్, గ్రీక్, బల్‌గేరియన్ వగైరా అనేకభాషలు ఏమాత్రం తడుముకోకుండా గడగడా మాట్లాడేవాడు.

సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ దేశచట్టాల రూపకల్పన వాటి అమలు కోసం మొట్ట మొదట ఖుర్‌ఆన్‌ని పరిశీలిస్తాడు. ఆ తరువాత నిరూపిత సున్నత్, సహీహదీస్‌లను పరిగణనలోకి తీసుకుంటాడు. ఆ తరువాతే ఫిఖ్హావేత్తల సహాయం కోరుతాడు. ఆ మూడు విడతల తరువాత నాల్గవ విడతగా సుల్తాన్ ఆదేశం అవుతుంది. ఒకవేళ సుల్తాన్ జారీచేసే ఆదేశం ఖుర్‌ఆన్, హదీసులకు వ్యతిరేకంగా ఉన్నపుడు ధర్మవేత్తలు అది తప్పని నిరూపిస్తే అతను వెంటనే తన ఆదేశాన్ని ఉపసంహరించుకునేవాడు.

సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ విద్యాజ్ఞానాల అభివృద్ధి కోసం రాజ్యమంతటా మదర్సాలు నెలకొల్పాడు. వాటి పాఠ్యప్రణాళికలు స్వయంగా అతనే రూపొందించి ప్రవేశపెట్టాడు. మదర్సాల నిర్వహణఖర్చులన్ని ప్రభుత్వమే భరించేది. ఈ మదర్సాలలో ధార్మికవిద్యతో పాటు ప్రపంచవ్యవహారాలకు సంబంధించిన విద్యాకళలు కూడా బోధించబడేవి.

సుల్తాన్ ధర్మవేత్తల్ని, సాహిత్యవేత్తలు, కళాకారుల్ని ఎంతో గౌరవించేవాడు. అయితే ధర్మవేత్తల రూపాల్లో ఉండే మూఢులు, స్వార్థపరుల్ని అసహ్యించుకునేవాడు. షరీఅత్ అమలులో తీవ్రవాదాన్ని సహించేవాడుకాదు. అంతగా ప్రాధాన్యంలేని అత్యల్ప విషయాలలో కఠినంగా వ్యవహరించే ధర్మవేత్తల్ని అతను పట్టించుకునేవాడు కాదు. రెండు విషయాల్లో ఏదో ఒకదాన్ని స్వీకరించే అనుమతి ఉన్నపుడు ఆ రెండిటిలో సులభమైన దాన్ని ఎంచుకునే దైవప్రవక్త (స) సంప్రదాయానికి కట్టుబడివుండే మనిషి అతను.

ఒకసారి సుల్తాన్ ఆస్థానానికి ఓ ప్రఖ్యాతచిత్రకారుడు వచ్చి తన ప్రతిభను ప్రదర్శించడానికి దర్బారుకు సంబంధించి అనేకచిత్రాలను తయారుచేశాడు. సుల్తాన్ అనుమతితో అతను ఆస్థానంలో వాటిని ప్రదర్శించాడు. సుల్తాన్ ఆ చిత్రాలను చూసి వాటిలో జరిగిన తప్పులను అతనికి ఎత్తిచూపాడు. ఈ వ్యవహారం చూసిన ఆనాటి సంకుచితదృష్టి గల ధర్మవేత్తలు పెద్దరాద్ధాంతం లేవదీస్తూ సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్‌పై కుఫర్‌ఫత్వా జారీచేశారు. ఇది ప్రతియుగంలో సద్గుణపాలకులకు ఎదురైన విషయమే.



**8-అన్నదమ్ముల మధ్య అంతర్యుద్ధాలు :-** సుల్తాన్ ముహమ్మద్‌ఖాన్ మరణ సమయంలో అతని ఇద్దరు కొడుకుల్లో 35ఏళ్ళ పెద్దకొడుకు బాయజీద్ ఆసియామైనర్ రాష్ట్రగవర్నర్‌గా, 22ఏళ్ళ చిన్నకొడుకు జమ్షీద్ కరీమియా రాష్ట్రగవర్నర్‌గా ఉండేవారు. సుల్తాన్ మరణసమయంలో ఆ ఇద్దరూ దేశరాజధాని కాన్స్టాంటినోపిల్‌లో లేరు. అప్పటి ప్రధానమంత్రి ముహమ్మద్ పాషా యువరాజు జమ్షీద్‌ని గద్దె నెక్కించదలచి అతనికి వెంటనే కాన్స్టాంటినోపిల్‌కు వచ్చేయమని రహస్యంగా లేఖ రాసిపంపాడు. కాని ఈ రహస్యం దాగలేదు. యంగ్‌చరీసైనికులు తక్షణమే తిరుగుబాటుచేసి ప్రధాని ముహమ్మద్ పాషాను హతమార్చారు. అతని స్థానంలో ఇస్‌హాఖ్ పాషాను ప్రధానిగా నియమించి, సుల్తాన్ ముహమ్మద్ చనిపోయాడని, అంచేత నీవు వెంటనే కాన్స్టాంటినోపిల్‌కు వచ్చెయ్యమని బాయజీద్‌కు కబురుపంపారు. బాయజీద్ ఈ కబురు అందగానే 4వేలసైనికులతో కాన్స్టాంటినోపిల్‌కు చేరుకొని అధికారపీఠం అధిరోహించాడు.

ఇటలీ ముఖద్వార పట్టణం టరాంటూని జయించి సుల్తాన్ ముహమ్మద్ కోసం ఎదురుచూస్తుండిన సేనాపతి అహ్మద్ ఖైదూఖ్ సుల్తాన్ మరణవార్త విని సైన్యాన్ని టరాంటూలోనే వదలి కాన్స్టాంటినోపిల్‌కు చేరుకున్నాడు. అటు ఇటలీలో క్రైస్తవులంతా ఏకమై శాంతిఒప్పందాన్ని తుంగలో తొక్కి టరాంటూలోని ముస్లింయోధులందరినీ దారుణంగా హతమార్చారు.

సుల్తాన్ మరణవార్త అతని చిన్నకొడుకు జమ్షీద్‌కు ఆలస్యంగా అందింది. దానికి ముందే పెద్దకొడుకు బాయజీద్ గద్దెనెక్కి కూర్చున్నాడు. అంచేత జమ్షీద్ ఆసియమైనర్‌లో కొన్ని పట్టణాలను ఆక్రమించుకుంటూ బరూసా పట్నం చేరుకొని తన అన్నకు ఇలా ఓ లేఖ రాసి పంపాడు: "సుల్తాన్ ముహమ్మద్ మిమ్మల్ని తన రాజకీయవారసుడిగా చేయలేదు. మొత్తం సామ్రాజ్యానికి అధినేత అయ్యే అధికారం మీకు ఎంతమాత్రం లేదు. అంచేత యూరప్‌లోని ఆక్రమిత ప్రాంతాలను మీరు ఏలుకోండి; ఆసియమైనర్‌లోని ఆక్రమిత ప్రాంతాలను నాకు వదిలెయ్యండి."

సుల్తాన్ బాయజీద్ ఈ ప్రతిపాదనను త్రోసిపుచ్చుతూ ఒక వరలో రెండు కత్తులు ఇమడవంటూ జవాబిచ్చాడు. దాంతో హి.శ. 886లో ఆ అన్నదమ్ముల మధ్య అంతర్యుద్ధాలు మొదలయ్యాయి. ఈ యుద్ధాల్లో తమ్ముడు జమ్షీద్ పరాజయంపాలై తల్లిని, భార్యను, కొందరు సైనికుల్ని తీసుకొని ఈజిప్టుకు పారిపోయాడు. ఈజిప్టు సుల్తాన్ అతడ్ని స్వాగతించి సత్కరించాడు. హిజ్రీశకం 887లో జమ్షీద్ తల్లిని, భార్యను ఈజిప్టులో వదలి ఈజిప్టుసుల్తాన్ సహాయంతో మరొకసారి బాయజీద్‌తో యుద్ధరంగంలోకి దిగాడు. కాని ఆ యుద్ధంలోనూ తురుష్కసైనికుల ద్రోహంవల్ల పరాజితుడయ్యాడు. దాంతో అతను ఈజిప్టుకు తిరిగివెళ్ళిపోవడానికి సిగ్గుపడి రూడిస్ ప్రాంతపు క్రైస్తవపాలకుని ఆశ్రయం కోరి అతని దగ్గరకు చేరుకున్నాడు. కాని జమ్షీద్ అక్కడ ఖైదీగా మారి అనేక కష్టాలకు గురయ్యాడు. క్రైస్తవపాలకులు జమ్షీద్‌ని అడ్డంపెట్టుకొని అతనితల్లిని, బాయజీద్‌ని డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేయసాగారు. చివరికి ఓ కుట్ర ద్వారా జమ్షీద్‌ని హతమార్చారు. జమ్షీద్ 13ఏళ్ళ నిర్బంధం తర్వాత హిజ్రీశకం 901లో కన్నుమూశాడు.

సుల్తాన్ బాయజీద్ సాని హిజ్రీశకం 886 నుండి 918 వరకు 32ఏళ్ళు పరిపాలన చేశాడు. అతను తన పాలనాకాలంలో నిరంతరం యుద్ధాలతోనే సతమతమయ్యాడు. సుగుణవంతుడు, అనుభవశాలి అయిన సేనాపతి అహ్మద్ ఖైదూఖ్ ఇచ్చే సలహాలు నచ్చక అతడ్ని చంపాలని భావించాడు. ఆ సంగతి తెలుసుకున్న సైనికులు తమ నాయకుడ్ని గనక చంపితే తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని సుల్తాన్‌ని హెచ్చరించారు. అయితే కొన్నాళ్ళకు సుల్తాన్ తన సైన్యాన్ని దాడిచేయడానికి ఓ ప్రాంతానికి పంపి కుట్రతో అహ్మద్ ఖైదూఖ్‌ని చంపించాడు. హిజ్రీశకం 905లో సుల్తాన్ బాయజీద్ నావికాదళం వెనిస్ నావికాదళంపై దాడిచేసి అనేక దీవుల్ని కైవశం చేసుకుంది. దాంతో క్రైస్తవులు ఏకమై ఉస్మానియా సామ్రాజ్యంపై మరొకసారి దాడులుచేశారు. అయినా వారు బాయజీద్ నావికాదళం ముందు నిలువలేక ఎంతో నష్టపోయారు.

సుల్తాన్ బాయజీద్‌సాని సైన్యం హంగేరి క్రైస్తవసైన్యంతో కూడా అనేకసార్లు యుద్ధం చేయవలసి వచ్చింది. ఒక యుద్ధంలో సుల్తాన్‌సేనాపతి మస్కీగాజీ ముస్తఫా, అతని సోదరుడు హంగేరిసైన్యానికి పట్టుబడిపోయారు. అప్పుడు హంగేరి సేనాపతి గాజీముస్తఫా చేత అతని సోదరుడ్ని బలవంతంగా ఇనుపకడ్డీతో పొడిచి పొడిచి నిప్పుకణాలపై పండబెట్టి చంపించాడు. దీన్నిబట్టి ప్రత్యర్థుల పట్ల క్రైస్తవుల చిత్రవధల దాహం ఎలాంటిదో స్పష్టమవుతోంది. అయితే మరొక యుద్ధంలో ఆ హంగేరీసేనాపతి ముస్లిం సైన్యానికి పట్టుబడినపుడు సేనాపతి మస్కీగాజీ ముస్తఫా అతడ్ని చిత్రహింసలకు గురి చేయకుండా ఒకేసారి హతమార్చాడు.

సుల్తాన్ బాయజీద్‌సానీకు ఎనిమిది మంది సంతానం కలిగారు. వారిలో ఐదుగురు చిన్నతనంలోనే చనిపోయారు. మిగిలిన ముగ్గురు ఖర్ఖాద్, అహ్మద్, సలీం పెరిగి పెద్దవారయ్యారు. వారిలో చిన్నవాడైన సలీం మిగతా సోదరులకన్నా ఎంతో ఉత్తముడు, ధీరుడు, శూరుడు. అయితే సుల్తాన్ బాయజీద్‌సాని తన రెండవకొడుకు అహ్మద్‌ని తన రాజకీయ వారసుడ్ని చేయడానికి నిర్ణయించుకున్నాడు. దాంతో తండ్రీ-కొడుకుల మధ్య, సోదరుల మధ్య పోరు మొదలయింది. యంగ్‌చరీ సైనికులు ఆ ముగ్గురు అన్నదమ్ముల్లో సలీంనే ఎక్కువగా అభిమానించేవారు. అంచేత వారు సుల్తాన్ బాయజీద్ సాని దగ్గరకు వెళ్ళి "మీరిప్పుడు చాలా వృద్ధులైపోయారు. పాలనావ్యవహారాలు నిర్వహించే స్థితిలో లేరు. అందువల్ల మా విన్నపం అంగీరించి రాకుమారుడు సలీంకు అవకాశం ఇవ్వండి" అని అన్నారు.

అప్పుడు బాయజీద్‌సాని "నేను మీవిన్నపం అంగీరిస్తూ సలీంకోసం అధికారం వదిలేస్తున్నాను" అంటూ అధికారపీఠం నుంచి దిగిపోయాడు. అప్పుడు రాకుమారుడు సలీం ముందుకు వెళ్ళి సింహాసనం అధిష్టించాడు. బాయజీద్ కొడుకు సలీంకు హితోపదేశం చేసి పల్లకీఎక్కి బయలుదేరాడు. సలీం నగరప్రధానద్వారం దాకా తండ్రి వెంట వెళ్ళాడు. బాయజీద్‌సాని తన శేషజీవితాన్ని డీమోటీకా పట్నంలో గడపదలచి ఆ దిశగా ప్రయాణం సాగించాడు. కాని గమ్యం చేరుకోకముందే దారిలోనే హిజ్రీశకం 910లో చనిపోయాడు. సలీం తండ్రికి వీడ్కోలు చెప్పివచ్చి కాన్స్టాంటినోపిల్‌లో సింహాసనం అధిష్టించాడు.



**9-సుల్తాన్ సలీం ఉస్మాని :-** సుల్తాన్ సలీం సైనికులు, ప్రజల అంగీకారంతో అధికారపగ్గాలు చేపట్టడంతో అతని సోదరులిద్దరు మనసులో ఇష్టం లేకపోయినా అతనికి తమ విధేయత ప్రకటించారు. అయితే వారిద్దరిలో అహ్మద్, అతని కొడుకు అలావుద్దీన్ లోలోన సలీంపై మండిపడుతూ యుద్ధసన్నాహాలు చేయసాగారు. ఈ సంగతి తెలుసుకున్న సలీం వెంటనే సైన్యం తీసుకొని ఆసియామైనర్‌లోని బరూసా చేరుకొని దాన్ని కైవశం చేసుకున్నాడు. ఆతర్వాత అలావుద్దీన్‌ని, అతని సోదరుడ్ని హతమార్చాడు. ఈ విషయం తెలియగానే అహ్మద్ సైన్యం తీసుకొని సలీంసైన్యాన్ని ఢీకొన్నాడు. కాని పరాజయంపాలై పారిపోయాడు. ఈ ఓటమి తర్వాత అహ్మద్ తన మరో ఇద్దరు కొడుకుల్ని రక్షణకోసం ఈరాన్‌చక్రవర్తి ఇస్మాయీల్ సఫవీ దగ్గరకు పంపించాడు.

సుల్తాన్ మరొక సోదరుడు ఖర్ఖాద్ తన తమ్ముడు అహ్మద్ ఓటమి సంగతి విని సుల్తాన్‌పై యుద్ధానికి సిద్ధమయ్యాడు. సుల్తాన్ సలీం పదివేల రౌతులతో వెళ్ళి ఖర్ఖాద్ ప్రాంతంపై మెరుపుదాడి చేశాడు. ఆ దాడిలో ఖర్ఖాద్ సుల్తాన్‌కు పట్టుబడి హతమార్చబడ్డాడు. ఉస్మానీ యువరాజులు ఇద్దరు ఈవిధంగా హతమార్చబడటంతో అహ్మద్‌కు ప్రజల సానుభూతి లభించే అవకాశం ఉంది. అందువల్ల అహ్మద్ మరొకసారి భారీసైనిక సమీకరణ చేసి సుల్తాన్ సలీంపై యుద్ధపరంపర ప్రారంభించాడు. కాని చివరికి అహ్మద్ కూడా పట్టుబడి ఒక సంవత్సరం తర్వాత హిజ్రీశకం 919లో హతమార్చబడ్డాడు.

ఆ తర్వాత సుల్తాన్ సలీం కయ్యానికి కాలుదువ్వుతున్న ఈరాన్‌చక్రవర్తి ఇస్మాయీల్ సఫవీతో పోరాడవలసి వచ్చింది. ఇస్మాయీల్ సఫవీ తననుతాను జాఫర్ సాదిఖ్ సంతానమని చెప్పుకునేవాడు. అంచేత ఈరాన్ (షియా)ప్రజలు అతడ్ని మరింత అభిమానించడం ప్రారంభించారు. సిరియా, ఆసియామైనర్లలో కూడా షియా-సున్నీల కలహాలు తక్కువేమీ లేవు. సుల్తాన్ బాయజీద్‌సాని పాలనాకాలంలో ఇస్మాయీల్ సఫవీ ఆసియామైనర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ రహస్యంగా షియా మతప్రచారం చేయిస్తూ జనాన్ని తనవైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నించాడు. అతని మతోన్మాద రాజకీయ కార్యకలాపాలకు బాయజీద్ అడ్డుకట్ట వేయలేకపోయాడు. ఇప్పుడు సుల్తాన్ సలీం ఆ పని కోసం రంగంలోకి దిగాడు. ముందుగా అతను సున్నీమతం వదలి షియామతంలోకి మారి ఇస్మాయీల్ సఫవీకి మద్దతిస్తున్న డెబ్భయి వేలమంది సాయుధుల్ని నిర్ణీత పథకంతో గూఢచారుల చేత రహస్యంగా ఒకేరోజు, ఒకే సమయంలో అందర్నీ చంపించాడు. ఆ తరువాత సుల్తాన్ ఈరాన్‌చక్రవర్తి ఇస్మాయిల్‌పై బహిరంగ యుద్ధానికి దిగాడు.

ఇస్మాయీల్ సఫవీ వంశావళి ఈవిధంగా ఉంది: ఇస్మాయీల్ బిన్ హైదర్ బిన్ జునైద్ బిన్ ఇబ్రాహీం బిన్ ఖాజాఅలి బిన్ సద్రుద్దీన్ బిన్ షేఖ్ సఫియుద్దీన్ బిన్ జిబ్రీల్. ఈ వంశంలో షేఖ్ సఫియుద్దీన్ పీర్‌మురీదీ (గురుశిష్య) వ్యవస్థ నెలకొల్పి పనిచేయనారంభించాడు. సఫియుద్దీన్ మరణానంతరం అతని కొడుకు సద్రుద్దీన్ పీర్‌మురీదీ పీఠం ఎక్కి ఆ వ్యవస్థను కొనసాగించాడు. ఆ రోజుల్లో తైమూర్‌లంక్ సద్రుద్దీన్ దగ్గరకు వచ్చి "మీకేదైనా అవసరమైతే లేదా నేను చేయవలసిన పని ఏదైనా వుంటే చెప్పండి దాన్ని నెరవేరుస్తాను" అని అన్నాడు. దానికి సద్రుద్దీన్ "అంగూరాయుద్ధంలో పట్టుబడిన

ఖైదీలందర్నీ విడుదల చేయండి" అని చెప్పాడు. అప్పుడు తైమూర్‌లంక్ తన అధీనంలోని తుర్కీ ఖైదీలందరినీ విడుదల చేశాడు. ఆ ఖైదీలంతా విడుదల కాగానే సద్రుద్దీన్ శిష్యగణంలో చేరిపోయి అతనికి సేవచేయడంలో నిమగ్నులైపోయారు.

సద్రుద్దీన్ మునిమనమడు జునైద్ కాలంలో ఈ శిష్యగణం సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. తరువాత కుర్దిస్తాన్ రాజు హసన్‌తవీల్, జునైద్‌ని చేరదీసి అతనికి తన చెల్లెల్ని ఇచ్చి పెళ్ళిచేశాడు. కొన్నాళ్ళకు జునైద్ రాజకీయ కారణాలతో తుర్కీసైనిక సంతానంతో కూడిన తన శిష్యగణాన్ని ఓ పెద్ద సైనికపటాలంగా మార్చి యుద్ధరంగంలోకి దిగాడు. ఆ యుద్ధాల్లో జునైద్ చనిపోయిన తరువాత అతని కొడుకు హైదర్ ఆ స్థానం అలంకరించాడు. కుర్దిస్తాన్‌రాజు హసన్ తవీల్ చుట్టుపక్కల ప్రాంతాల్ని జయించి యావత్తు ఈరాన్, ఇరాఖ్‌లకు గొప్పచక్రవర్తి అయ్యాడు. తర్వాత అతను తన మేనల్లుడు హైదర్‌కు తన కుమార్తెను ఇచ్చి పెళ్ళిచేశాడు.

ఆ దంపతులకు అలి, ఇబ్రాహీం, ఇస్మాయీల్ అనే ముగ్గురు కొడుకులు కలిగారు. ఒకయుద్ధంలో హైదర్ వధించబడ్డాడు. తరువాత మరో యుద్ధంలో హైదర్ కొడుకు అలీ కూడా వధించబడ్డాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు హైదర్ రెండో కొడుకు ఇబ్రాహీం చనిపోయాడు. మిగిలిన మూడో కొడుకు ఇస్మాయీల్ చుట్టూ వేలాది సాయుధ శిష్యగణం చేరింది. దాంతో ఇస్మాయీల్ తన సాయుధశిష్యగణంతో యుద్ధరంగంలోకి దిగి యావత్తు ఈరాన్, ఇరాఖ్, ఆజర్‌బాయ్‌జాన్ వగైరా ప్రాంతాల్ని కైవశం చేసుకున్నాడు. అంతేకాదు, పచ్చి షియామతస్థుడైన ఇస్మాయీల్ ఆ ప్రాంతాల్లోని సున్నీముస్లింలను వేధించి వారి మస్జిద్‌లను, సమాధుల్ని ధ్వంసం చేయించాడు.

ఇస్మాయీల్ తాతముత్తాతలు సున్నీమతస్థులే. కాని ఇస్మాయీల్ తాత జునైద్ రాజకీయ స్వప్రయోజనాల కోసం "అహ్లెబైత్", షియాలపై వల్లమాలిన ప్రేమ ఒలకబోయడంతో షియాముస్లింలు అతనికి చేరువై తమ సహాయసహకాలు అందజేయ సాగారు. ఇస్మాయీల్ సఫవీ మరింత ముందుకువెళ్ళి పచ్చి షియాముస్లింగా మారి కుట్రలు, కుతంత్రాల ద్వారా ఉస్మానియా సామ్రాజ్యంలో కూడా సున్నీముస్లింలను షియాలుగా మార్చి తన సామ్రాజ్యాన్ని మరింత విస్తృతపరచుకోవడానికి ప్రయత్నించాడు.

అందువల్లనే సుల్తాన్ సలీంఉస్మానీ ఇస్మాయీల్‌పై దాడికి దిగాడు. ముందుగా అతను ఇస్లాం వాస్తవికతను గురించి ఓ సుదీర్ఘలేఖ రాసి పంపుతూ రుజుమార్గం వైపు పిలిచాడు. దాన్ని ఇస్మాయీల్ తిరస్కరించడంతో యుద్ధభేరి మోగించాడు. సుల్తాన్ సలీం భారీసైన్యంతో ఈరాన్,ఇరాఖ్‌లపై విరుచుకుపడ్డాడు. అయితే దానికిముందే ఇస్మాయీల్ సఫవీ ఉస్మానీ సైనికులకు ఎలాంటి ఆహారం లభించనీయకుండా ఈరాన్, ఇరాఖ్‌లలోని పంటపొలాలను, వృక్షజాతిని ధ్వంసంచేయించి, ప్రజలను తాము మోయగలిగిన ధాన్యం, ఇతర విలువైన సామగ్రి తీసుకొని ఇండ్లు తగలబెట్టి వెళ్ళిపోవాలని ఆజ్ఞాపించి సుదూర ప్రాంతాలకు వెళ్ళిపోయాడు. అయినప్పటికీ సుల్తాన్ సలీం అతడ్ని వెంబడిస్తూ అతని సైన్యం దగ్గరకు చేరుకొని యుద్ధంచేశాడు. ఉభయపక్షాల మధ్య సమరజ్వాలలు మింటికెగిశాయి. షియాసైన్యం ఓటమి పాలైంది. ఇస్మాయీల్ పారిపోయాడు.



ఇస్మాయీల్ సఫవీ సైన్యం తీసుకొని తన సామ్రాజ్య రాజధాని తబ్రేజ్‌కు చేరుకొని ఊపిరి పీల్చుకున్నాడు. తబ్రేజ్‌లో కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకొని, సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి అక్కడ్నుంచి ముందుకు సాగాడు. సుల్తాన్ సలీం కూడా అతడ్ని వెంబడిస్తూ ప్రయాణం సాగించాడు. చివరికి తబ్రేజ్ నుండి నలభై మైళ్ళ దూరంలోని ఒక లోయలో ఇరుపక్షాలు ఢీకొన్నాయి. సైనికసంఖ్య దాదాపు ఇరువురికీ సమానంగా ఉంది. అయితే సుల్తాన్ సలీం సైన్యం అప్పటికే బాగా అలసిపోయింది. ఇస్మాయీల్ సైనికులు తాజాదనంతో, తామే శత్రుసైన్యాన్ని మట్టుపెట్టగలమన్న ధీమాతో ఉరకలువేయసాగారు.

ఆ కాలం నాటికి తుపాకులు, ఫిరంగులు వచ్చేశాయి. అవి సుల్తాన్ సలీం దగ్గర మాత్రమే ఉన్నాయి. ఇస్మాయీల్ సైన్యం ఇంకా ఖడ్గాలు, బాణాలతోనే పోరాడుతోంది. అంచేత ఇరుపక్షాల మధ్య సమరజ్వాలలు మింటికెగిసి నపుడు ఉస్మానీ సున్నీసైన్యం ముందు సఫవీ షియాసైన్యం నిలువలేకపోయింది. ఫలితంగా సఫవీ షియాసైన్యం చిత్తుగా ఓడిపోయింది. ఈరాన్ చక్రవర్తి ఇస్మాయీల్ సఫవీ తన ప్రియసతీమణిని కూడా వదలి బ్రతుకుజీవుడా అంటూ పలాయనం చిత్తగించాడు.

ఈ యుద్ధం జరిగిన కొన్నాళ్ళకు ఇస్మాయీల్ సఫవీ తన భార్యను తన దగ్గరకు పంపమని అర్థిస్తూ సుల్తాన్ సలీంకు లేఖ రాశాడు. సలీం తన భార్యను తన దగ్గరకు తప్పకుండా పంపుతాడని ఎంతో ఆశించాడు. కాని సుల్తాన్ సలీం అందుకు నిరాకరిస్తూ ఆ స్త్రీని తన సైన్యంలోని జాఫర్ చల్పీ అనే సైనికుడికి ఇచ్చి పెళ్ళిచేశాడు. ఈ సంగతి తెలుసుకున్న ఇస్మాయీల్ సఫవీ జీవితాంతం ఎంతో బాధపడ్డాడు.

అయితే ఇస్మాయీల్ సఫవీ పగతో పెట్రేగిపోతూ ఈజిప్టులోని మమ్లూకీ పాలకుల్ని సుల్తాన్ సలీంపైకి ఎగదోశాడు. మమ్లూకీ పాలకులు స్వచ్ఛమైన సున్నీముస్లింలు. అంచేత సుల్తాన్ సలీం వారి జోలికిపోయే ప్రసక్తే లేదు. అతను తన దృష్టిని ఎల్లప్పుడూ తన పూర్వీకుల మాదిరిగా యూరప్ క్రైస్తవరాజ్యాలపైనే సారించేవాడు. అక్కడ ఇస్లాంను విస్తరింపజేయాలన్నదే అతని ధ్యేయం. అందువల్ల తోటి సున్నీముస్లింలపై, వారి రాజ్యాలపై దాడులు చేయాలన్న ఆలోచన కూడా అతను తన మనసులోకి రానిచ్చేవాడు కాదు. కాని పచ్చిషియా మతస్థుడైన ఇస్మాయీల్ సఫవీ విషవలయంలో పడిపోయిన ఈజిప్టు మమ్లూకీ పాలకులు హిజ్రీశకం 922లో తనకు వ్యతిరేకంగా సిరియా సరిహద్దుల్లో సైన్యాలు మోహరింపజేసి యుద్ధసన్నాహాలు చేస్తున్నారని విని వారిని ఎదుర్కోవడానికి రంగంలోకి దిగవలసివచ్చింది.

ముందుగా అతను ఈజిప్టు సుల్తాన్ ఖాల్సూగాజీ దగ్గరకు ఒక దూతను పంపి "నువ్వు మాపట్ల విధేయత ప్రకటించి మాకు కప్పం చెల్లించడానికి ఒప్పుకో. లేకుంటే మేము దాడిచేసి నీ రాజ్యాన్ని హస్తగతం చేసుకుంటాం" అని హెచ్చరించాడు. కాని ఈజిప్టు రాజు ఈ హెచ్చరికను ఖాతరుచేయకుండా సుల్తాన్‌సలీం దూతను నిర్బంధించాడు. ఈ సంగతి తెలియగానే సుల్తాన్ సలీం సైన్యం తీసుకొని మమ్లూకీ సైన్యం సమీపానికి చేరుకున్నాడు. దాంతో మమ్లూకీ రాజు భయపడి సలీంఉస్మానీ దూతను విడుదలచేశాడు. అయితే సమయం మించిపోయింది. ఉస్మానీ సైన్యం మమ్లూకీ సైన్యాన్ని ఢీకొన్నది.

మమ్లూకీ యోధులు ప్రతిభాపరాక్రమాల్లో ఉస్మానీ యోధులకు ఏమాత్రం తీసిపోరు. కాని ఆ రోజుల్లో వారిలో అంతర్విభేదాలు జనించాయి. ఫలితంగా ఆ యుద్ధంలో వారి రాజు హతమార్చబడ్డాడు. దాంతో మమ్లూకీ సైనికులు పోరు ఆపి పారిపోయారు. సుల్తాన్ సలీం ముందుకు పురోగమించి సిరియా సరిహద్దులోని హలబ్ పట్టణాన్ని కైవశం చేసుకున్నాడు. మమ్లూకీ సైనికులు ఓటమి పాలైనప్పటికీ ధైర్యం వీడకుండా కొత్తరాజును ఎన్నుకొని మళ్ళీ రణరంగంలోకి దిగేందుకు ఈజిప్టు వెళ్ళిపోయారు.

మమ్లూకీ నేతలు కొత్తరాజును ఎన్నుకోవడానికి ఇరవైనల్గురు సభ్యులతో కూడిన ఓ ఎన్నికలసంఘం నియమించుకున్నారు. ఎన్నిక ప్రక్రియ రాజధాని కైరోలో జరుగుతుంది. దానికోసం ఎంపిక సభ్యులంతా నిర్ణీతతేదీన కైరోకు చేరుకోవలసి ఉంటుంది. ఈలోగా సుల్తాన్ సలీం సిరియాలోని అనేక పట్టణాలను వశపరచుకున్నాడు. అటు కైరోలో తూమాన్‌బె ఈజిప్టురాజుగా ఎన్నుకోబడ్డాడు. రాజుగా ఎన్నుకోబడిన వెంటనే అతను ఉస్మానియా సైన్యాన్ని నిరోధించడానికి ఈజిప్టు-సిరియా సరిహద్దు వైపు ఓ భారీ సైన్యం పంపి కైరో చుట్టూ కూడా సైన్యాన్ని మోహరింపజేయడంలో నిమగ్నుడైపోయాడు.

ఈజిప్టు సరిహద్దు దాటి వెళ్ళిన మమ్లూకీ సైన్యానికి, ఉస్మానీ సైన్యానికి మధ్య గాజాలో యుద్ధజ్వాలలు చెలరేగాయి. మమ్లూకీ యోధులు తమ ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శిస్తూ ప్రాణాలకుతెగించి తీవ్రంగాపోరాడారు. అయితే ఉస్మానీసైనికుల ఫిరంగులు, తుపాకుల ధాటికి గురైనా వెనుకంజ వేయకుండా పోరాడుతూ మృత్యువాతపడ్డారు. వారి దగ్గర ఎలాంటి తుపాకులు, ఫిరంగులు లేవు. వారసలు తుపాకుల్ని, ఫిరంగుల్ని ఉపయోగించడం పిరికితనానికి, నామర్దాకు చిహ్నమని; ఖడ్గాలు, బాణాలతో పోరాడటమే ధీరుల పురుష లక్షణమని భావించేవారు.

మమ్లూకీ రాజు ఖాల్జుగాజీ పాలనాకాలంలో ఒక ఆంగ్లేయుడు తుపాకి తీసుకొచ్చి ఆ రాజుతో "మీ సైనికులందరికీ తుపాకులు ఇవ్వండి, ఇవి మీకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతాయి" అని అన్నాడు. కాని రాజుతో పాటు పాలకమండలి సభ్యులంతా "యుద్ధంలో తుపాకీ వాడకం నామర్దా పని. దాన్ని మేము తాకడానికి కూడా ఇష్టపడం" అని అన్నారు. ఆంగ్లేయుడు ఈమాట విని "వినండి, ఏదో ఒకరోజు ఈ తుపాకీ కారణంగానే ఈజిప్టురాజ్యం మీ అధీనం నుండి చేజారిపోతుంది" అని హెచ్చరించాడు. ఆ తర్వాత తూమాన్‌బె పాలనాకాలంలో ఈ హెచ్చరిక నిజరూపం ధరించింది.

సుల్తాన్ సలీం కైరో సమీపించి ఫిరంగులు, తుపాకులతో సమరాగ్ని రాజేసి విజయ పతాకం ఎగరవేశాడు. అయితే కైరోనగరం చుట్టూ ప్రహరీగోడ లేనందున వేరే వైపు నుండి 800మంది మమ్లూకీయోధులు వచ్చి కైరోలోని ఉస్మానీసైనికుల్ని ఊచకోత కోశారు. అప్పుడు ఉస్మానీసైన్యం నగరంలో ప్రవేశించేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. కాని మమ్లూకీయోధులు వారిని గట్టిగా ప్రతిఘటించారు. ఇలా యుద్ధం ద్వారా వారిని లొంగదీసుకోవడం కష్టమని భావించి సుల్తాన్ సలీం తన సైన్యంలో ఉన్న మమ్లూకీ నమ్మకద్రోహి ఖైరీబే సలహాతో ప్రాణరక్షణ హామీ ద్వారా ఆ 800మంది యోధుల్ని తన దగ్గరకు రప్పించుకున్నాడు. తర్వాత ఖైరీబే సలహాతో సలీం వారందర్నీ చంపించాడు.



ఆ యుద్ధంలో మమ్లూకీ రాజు తూమాన్‌బే తప్పించుకుపోయి సైనికసమీకరణ చేశాడు. తప్పించుకున్న కొందరు మమ్లూకీసైనికులతో పాటు మరికొందరు అరబ్‌సైనికులను కూడగట్టి మళ్ళీ సుల్తాన్‌సలీం సైన్యంపై దాడులు చేయడం ప్రారంభించాడు. అంచేత సుల్తాన్ సలీం తూమాన్‌బే దగ్గరకు తన దౌత్యవేత్త ముస్తఫా పాషాను పంపి "నీవు గనక మాకు విధేయుడైపోతే నేను నిన్ను ఈజిప్టు చక్రవర్తిగా అంగీకరించి ఇక్కడ్నుంచి వెళ్ళిపోతాను. ఈదేశ పరిపాలనను నీకోసం వదిలేస్తాను" అని లేఖ రాసి పంపాడు. కాని మమ్లూకీసైనికులు సుల్తాన్‌దౌత్యవేత్తను, అతని అనుచరుల్ని ముక్కలు ముక్కలుగా నరికి చంపేశారు.

సుల్తాన్ సలీం ఈ విషాదవార్త వినగానే తన నిర్బంధంలో ఉన్న మూడువేల మంది యుద్ధఖైదీలను హతమార్పించి తూమాన్‌బే మెడలు వంచడానికి తుపాకులు, ఫిరంగులతో సహా భారీసైన్యాన్ని పంపించాడు. ఈజిప్టు సమీపంలోని అహ్రాం ప్రాంతంలో ఇరుపక్షాల మధ్య సమరజ్వాలలు మింటికెగిశాయి. అయితే యుద్ధం ప్రారంభంకాగానే తూమాన్‌బే సైన్యంలోని మమ్లూకీసైనికులు, అరబ్‌సైనికులు పాతకక్షలతో పరస్పరం నరుక్కోవడం మొదలెట్టారు. వేరొకవైపు ఉస్మానీ ఫిరంగుల ఫైరింగ్‌తో యుద్ధభూమి దద్దరిల్లసాగింది. దాంతో కాస్సేపట్లోనే తూమాన్‌బే సైన్యం సర్వనాశనమయింది.

అప్పుడు తూమాన్‌బే పారిపోయి తనకు బాగా సన్నిహితుడైన ఒక అరబ్ నాయకుడి దగ్గరకు చేరుకున్నాడు. కాని ఆ అరబ్ నాయకుడు మమ్లూకీరాజు తూమాన్‌బేని బంధించి సుల్తాన్‌సలీం దగ్గరకు పంపించాడు. సుల్తాన్ ఎంతో సంతోషంతో అతడ్ని స్వాగతించాడు. అతడ్ని మళ్ళీ ఈజిప్టు చక్రవర్తిగా నియమించి తన దేశానికి తిరిగివెళ్ళిపోవాలని సుల్తాన్ భావించాడు. కాని సుల్తాన్ ధోరణి చూసిన మమ్లూకీ విద్రోహులు ఖైరీబే, గజాలీబే భయపడి తూమాన్‌బేకు వ్యతిరేకంగా సుల్తాన్‌కు నూరిపోశారు. దాంతో సుల్తాన్‌సలీం వెంటనే తూమాన్‌బేని హతమార్పించాడు.

మమ్లూకీ రాజు తూమాన్‌బేని హతమార్పించిన తరువాత సుల్తాన్‌సలీంకు ఈజిప్టు తరపున నుండి ఎలాంటి ప్రమాదం లేకుండా పోయింది. కాని ఈజిప్టును జయించిన తరువాత దాన్ని తన అదుపులో ఉంచుకోవడం అంత తేలిక వ్యవహారం కాదు. అంచేత సుల్తాన్ సలీం తన తరపున మమ్లూకీల నాయకుడు గదార్ ఖైరీబేని ఈజిప్టు గవర్నర్‌గా నియమించి, గత పార్లమెంటరీ వ్యవస్థ మాదిరిగానే ఇరవైనాలుగు మంది సభ్యులతో కూడిన పార్లమెంట్ ద్వారా ఈజిప్టు రాజ్యాధినేతను ఎన్నుకోవచ్చని అనుమతిచ్చాడు. సలీం ఈజిప్టులోనే కొన్నాళ్ళు ఉండి అక్కడి పాలనావ్యవస్థను పటిష్ఠపరిచాడు.

ఆ తరువాత సుల్తాన్ సలీం అరేబియాను కూడా జయించాలని భావించాడు. అయితే అది భౌతికంగా కాదు, నైతికంగా జయించాలన్నది అతని ఉద్దేశ్యం. దానికోసం అతను అరబ్బులపై మేళ్ళవర్షం (ఉపకారాల జడివాన) కురిపించి వారి హృదయాలను చూరగొన్నాడు. అరబ్బులు ఇంతకుముందు వరకూ మమ్లూకీరాజును తమ రాజుగా భావిస్తుండేవారు. మమ్లూకీరాజ్యం పతనమైపోయిన తరువాత ఇప్పుడు సుల్తాన్ సలీంని తమ రాజుగా భావించసాగారు.

అరబ్బులు ఉస్మానీసుల్తాన్ తమపై కనబరచిన దయాదాక్షిణ్యాలతో ప్రభావితులై అతనికి తమ హార్ధికశుభాకాంక్షలు తెలుపుతూ లేఖలు రాసి పంపారు. అతనికి వారు "ఖాదిముల్ హరమీనుల్ షరీఫీన్"(కాబాలయ సేవకుడు) అనే బిరుదు కూడా ప్రదానం చేశారు. ఈజిప్టులో మమ్లూకీ రాజుల పంచన అబ్బాసీ ఖలీఫా కిరీటంలేని నామమాత్రపు ఖలీఫాగా ఎంతో హుందాగా ఉండేవాడు. అతనికి ఎలాంటి రాజ్యాధికారం లేకపోయినా ఈజిప్టు మమ్లూకీరాజులు, ఇతర రాజ్యాధినేతలు యూరప్‌లోని పోప్ మాదిరిగా అతడ్ని యావత్‌ప్రపంచ ముస్లింల మతనాయకుడిగా భావించి ఎంతో గౌరవించేవారు. సుల్తాన్ సలీం ఈజిప్టును జయించి, అరబ్బుల హృదయాలను చూరగొన్న తరువాత చివరి అబ్బాసీ ఖలీఫాను తన ఖిలాఫత్ హోదాను వదలుకోవడానికి ఒప్పించాడు. దాంతో నామ మాత్రపు ఖలీఫా మరుగున పడిపోయి క్రియాశీలక ఖలీఫా ముస్లింసముదాయం ముందు నిల్చున్నాడు.

ఈ పనులన్నీ ముగిసిన తరువాత సుల్తాన్ సలీం మందీమార్బలం తీసుకొని కైరో నుండి కాన్స్టాంటినోపిల్‌కు బయలుదేరాడు. కైరో నుండి కొన్ని మైళ్ళు ప్రయాణం చేసిన తర్వాత ప్రధానమంత్రి యూనుస్ సుల్తాన్‌సలీంతో మాట్లాడుతూ "మనమీ ప్రయాణంలో సగం సైన్యాన్ని నాశనంచేసి వెళ్తున్నాం. మనం ఇంత కష్టపడి విజయం సాధించిన తరువాత ఈజిప్టురాజ్యాన్ని తిరిగి వాళ్ళకే అప్పగించి వెళ్తున్నాం. ఈజిప్టుపై దాడిచేసి మనం ఏం సాధించామో నాకైతే అర్థంకావడం లేదు" అని అన్నాడు. సుల్తాన్ సలీం ఈ మాటలు వినగానే తన వెంట ప్రయాణిస్తున్న సాయుధ రౌతుల్ని సైగచేస్తూ ప్రధానిని హతమార్చమని అన్నాడు. మరుక్షణమే యూనుస్ తల తెగి కింద పడిపోయింది.

సుల్తాన్ సలీం తన మంత్రులు, అధికారుల విషయంలో మాత్రం చాలా కఠినంగా ప్రవర్తించేవాడు. వారు హద్దుమీరినపుడు వారిని హతమార్చడానికైనా వెనుకాడేవాడుకాదు. దానికి భిన్నంగా ధర్మవేత్తల విషయంలో తన కోపోద్రేకాలను బలవంతంగా దిగమింగి మృదువుగా వ్యవహరించేవాడు.

సుల్తాన్ సలీం ఈజిప్టు నుండి రాజధాని కాన్స్టాంటినోపిల్‌కు తిరిగొచ్చిన తరువాత తొందరపడి యూరప్ క్రైస్తవరాజ్యాలపై దాడులు ప్రారంభించలేదు. ముందుగా అతను ఆ రాజ్యాధినేతల తరఫున శాంతిఒప్పందాలు వస్తుంటే వాటిని అంగీకరించేవాడు. దాంతోపాటు పాలనావ్యవహారాలను పునర్వవస్థీకరిస్తూ సామ్రాజ్యాన్ని మరింత పటిష్ఠ పరిచాడు. అయితే క్రైస్తవరాజుల వాగ్దానభంగం-దౌర్జన్యాల ప్రవృత్తి ఎరిగిన సుల్తాన్ సలీం వేరొకవైపు యుద్ధసన్నాహాలు కూడా ప్రారంభించాడు. దానికోసం అతను అనేక యుద్ధనౌకలు, తుపాకుల కర్మగారాలు నెలకొల్పాడు. ఈవిధంగా ఏడువందల టన్నుల బరువు కలిగిన నూటయాభై ఓడలు, వంద చిన్న ఓడలు తయారయ్యాయి.

సుల్తాన్‌సలీం చేస్తున్న యుద్ధసన్నాహాలు ఎక్కడ దాడిచేయడానికో ఎవరికీ తెలియదు. కాని అతను హిజ్రీశకం 926లో ఏదో పనిమీద ఎడ్రియానోపిల్‌కు వెళ్ళడానికి కాన్స్టాంటినోపిల్ నుండి బయలుదేరాడు. కాని దారిలోనే వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు.

ఉస్మానియా ఖిలాఫత్ పాలానా పరంపరను ఇంతటితో ముగిస్తున్నాం.



# 66. భారత్‌లో ఇస్లాం ప్రవేశం

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు పూర్వం నుండే అరబ్బులు వ్యాపారనిమిత్తం పార్శీజలసంధి గుండా మల్బార్, శ్రీలంక వగైరా ప్రాంతాలకు వస్తూ పోతుండేవారు. దైవప్రవక్త (సల్లం) కాలంలో ముస్లింలయిన తరువాత వారు ఆయా భూభాగాల్లో వ్యాపారమే గాక ధర్మప్రచారం కూడా చేయడం ప్రారంభించారు. వారి నీతీనిజాయితీలతో పాటు ఇస్లాంలోని స్వచ్ఛమైన ఏకదైవారాధన, మానవసమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విషయాలు అక్కడి ప్రజల్ని ఆకట్టుకోవడం వల్ల వారిలో అనేకమంది ఇస్లాం స్వీకరించారు. అదీకాకుండా మనదేశ హిందూసమాజంలోని వర్ణాశ్రయం, అశ్పృస్యతలు కూడా శూద్రులను ఇస్లాంధర్మానికి చేరువచేశాయి. మల్బార్, శ్రీలంక రాజులు కూడా అరబ్‌ముస్లింల నీతినడవడికలతో ఎంతో ప్రభావితులయ్యారు.

దైవప్రవక్త (సల్లం) ఇహలోకం వీడిపోయిన ముప్ఫయి సంవత్సరాల తరువాత ఇస్లాం మొదటిసారిగా ముహమ్మద్ బిన్ ఖాసిం ద్వారా ఉత్తరభారత్ (సింధ్)లో ప్రవేశించింది. దైవప్రవక్త (స) కాలంనుండే అరబ్బులు వ్యాపారనిమిత్తం శ్రీలంకకు పోతూ వస్తూ ఉండటం వల్ల అరబ్బులకు, సింహళీయులకు మధ్య స్నేహసంబంధాలు ఏర్పడ్డాయి. ఒకసారి అరబ్ (ముస్లిం) వ్యాపారస్థులు కొందరు ప్రయాణం చేస్తున్నప్పుడు శ్రీలంక సముద్రతీరం సమీపంలో వారి ఓడ మునిగిపోవడంవల్ల అందరూ మృత్యువాతపడ్డారు. దాంతో వారిభార్యలు, పిల్లలు వితంతువులు, అనాథలై పోయారు. అప్పుడు శ్రీలంకరాజు ఖలీఫా వలీద్, ఇరాఖ్‌గవర్నర్ హజ్జాజ్ బిన్ యూసుఫ్‌ల దృష్టి తన వైపుకు మళ్ళించి వారి మెప్పుపొందే ఉద్దేశ్యంతో ఆ వితంతువుల్ని, అనాథల్ని ఎంతో గౌరవమర్యాదలతో హజ్జాజ్ దగ్గరకు పంపే ఏర్పాట్లు చేశాడు. వారందర్నీ ఒక ఓడలో ఎక్కించి, మరొక ఓడలో వారి ఖలీఫాకోసం, గవర్నర్‌కోసం ఎన్నో విలువైన కానుకలు ఇచ్చి పంపాడు.

ఈ ఓడలు శ్రీలంక తీరంవెంబడి ప్రయాణిస్తూ పార్శీ జలసంధి గుండా ఈరాన్‌కు చేరుకోవలసి ఉండింది. కాని తుఫాను తాకిడికి ఇవి సింధ్ ఓడరేవు దీబల్ తీరానికి చేరుకున్నాయి. అక్కడ సింధ్‌సైనికులు ఆ పడవల్ని స్వాధీనంచేసుకొని, ప్రయాణీకుల్ని ఖైదీలుగా పట్టుకున్నారు. ఆ ఖైదీలలోని అబుల్‌హసన్ కూతురు నాహిద్ ఇరాఖ్‌గవర్నర్ హజ్జాజ్ బిన్ యూసుఫ్ పేర ఓ తెల్లరుమాల్లో రక్తాక్షరాలతో గుండెలను పిండే విధంగా వ్రాయబడిన లేఖ పంపింది. ఆ లేఖ చూడగానే హజ్జాజ్ రక్తం ఉడికిపోయింది. అప్పుడు అతను క్రీ.శ. 711, నవంబర్‌లో తన అల్లుడైన ముహమ్మద్ బిన్ ఖాసింని సేనాపతిగా నియమించి సింధ్ వైపుకు పంపించాడు. సింధ్‌ప్రజలు అతని గుణగణాలు, నీతినడవడికలు చూసి ఎంతో ప్రభావితులయ్యారు. ఆ విధంగా ఇస్లాం మొదటిసారిగా ఉత్తరభారత్‌లో ప్రవేశించింది. (వివరాల కోసం 421-432 పేజీలు చూడండి.)

ఆ తరువాత కొత్తగా వచ్చిన ఖలీఫా ఆదేశంతో ముహమ్మద్ బిన్ ఖాసిం సింధ్‌ని వదలి వెళ్ళిపోతూ అక్కడ జునైద్ బిన్ అబ్దుర్రహ్మాన్‌ని గవర్నర్‌గా నియమిస్తాడు. (వివరాల కోసం 454వ పేజీ చూడండి.)

# 67. సుల్తాన్ మహ్మూద్ గజ్నవి

మహ్మూద్ గజ్నవి అఫ్గానిస్తాన్‌లోని గజనీప్రాంతం పాలకుడయిన సుబుక్తగీన్ గజ్నవీ కుమారుడు. సుబుక్తగీన్ ప్రారంభంలో ఒక సాధారణ నాయకుడు మాత్రమే. అతను అడవుల్లో వేటాడుతూ తన భార్యాపిల్లల్ని పోషించుకునేవాడు. ఒకసారి సుబుక్తగీన్ ఓ జింకపిల్లను పట్టుకొని వెళ్తుంటే దాని తల్లి పుత్రప్రేమతో వివశురాలై అతని వెనకాలగా నడిచింది. అది తన పిల్లను విచారవదనంతో చూస్తూ నడవసాగింది. అప్పుడు సుబుక్త గీన్ ఆ దృశ్యం చూసి చలించిపోయి జింకపిల్లను వదలిపెట్టాడు.

ఈ సంఘటన తరువాత ఓరోజు రాత్రి అతని కలలోకి దైవప్రవక్త (సల్లం) వచ్చి నువ్వు త్వరలో ఒక రాజ్యానికి అధినేత అవుతావని శుభవార్త తెలిపారు. దాంతోపాటు "రాజ్యాధికారం లభించిన తరువాత నువ్వు ప్రజల పట్ల కూడా ఇదేవిధంగా దయార్ద్ర హృదయంతో, సానుభూతితో వ్యవహరించాలి" అని ఆయన ఉపదేశించారు. దైవప్రవక్త (సల్లం) చెప్పిన శుభవార్త ప్రకారమే గజనీ రాజ్యాధినేత అలప్తగీన్ మరణానంతరం సుబుక్తగీన్ గజనీదేశ పాలకుడయ్యాడు.

సుబుక్తగీన్ తాను రాజ్యాధినేత కాక పూర్వం, ఆ తరువాత కూడా తన కుమారుడు మహ్మూద్ విద్యాశిక్షణల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండేవాడు. మహ్మూద్ చిన్న తనం నుండే ఎంతో ధైర్యసాహసాలతో పనులు చేసేవాడు. తండ్రితో కలసి యుద్ధాలలో పాల్గొనేవాడు. తండ్రి చనిపోయిన తరువాత రాజ్యాధికారం కోసం తన తమ్ముడితో యుద్ధం చేయవలసి వచ్చింది. ఆ యుద్ధంలో విజయం సాధించిన తరువాత తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకునే విషయంపై దృష్టి కేంద్రీకరించాడు. దాని కోసం అఫ్గాని స్తాన్, ఖురాసాన్, మధ్యాసియాలోనే ఎంతో అవకాశముంది. అయితే పంజాబ్ పాలకుడు జయపాల్ గజనీరాజ్యంలోని కొన్ని ప్రాంతాలపై దాడులుచేసి వాటిని ఆక్రమించు కున్నాడు. దాంతో సుల్తాన్ మహ్మూద్ దృష్టి సింధ్ వైపుకు మరలింది.

అప్పుడతను మొదటిసారిగా క్రీ.శ. 1011లో ఖైబర్ మీద దాడిచేసి దాన్ని ఆక్రమించు కున్నాడు. దాంతో సింధ్, పంజాబ్‌లలోకి ప్రవేశించే మార్గం సుగమం అయింది. ఆ తరువాత రెండవ సంవత్సరం పంజాబ్ పాలకుడు జయపాల్‌కు గుణపాఠం చెప్పడానికి యుద్ధరంగంలోకి దిగాడు. జయపాల్ లక్షమంది సైనికులతో, నలభై ఏనుగులతో పెషావర్‌లో మహ్మూద్ ముందుకు వచ్చాడు. మహ్మూద్ కొన్నివేల సైన్యంతో ఢీకొని విజయం సాధించడమే గాకుండా జయపాల్‌ని, అతని కొడుకుల్ని నిర్బంధంలోకి కూడా తీసుకున్నాడు. తర్వాత అతను నష్టపరిహారం తీసుకొని జయపాల్‌ని, అతని కొడుకుల్ని వదలి తన దేశానికి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మరొక రాజు గజనీరాజ్యంపై కవ్వింపు చర్యలకు పాల్పడటంతో మహ్మూద్ గజ్నవీ మూడవసారి దండయాత్ర చేసి ఆ రాజు పీచంఅణచి స్వదేశానికి తిరిగొచ్చాడు.

ఆ రోజుల్లో సింధ్‌లోని ముల్తాన్‌ప్రాంతం రాజుగా ఒక ముస్లిం ఉండేవాడు. అయితే అతను మతభ్రష్టుడై కవ్వింపుచర్యలకు ఒడిగట్టాడు. అంచేత మహ్మూద్ ముల్తాన్‌పై



దాడిచేసి ఆ మతభ్రష్టుడ్ని తొలగించి మరొక ముస్లింని పాలకుడిగా చేసి వెళ్ళిపోయాడు. కాని ఆ ముస్లిం కూడా కొన్నాళ్ళకు మతభ్రష్టుడైపోయాడు. ఆనాడు సింధ్‌ప్రాంతంలోని ముస్లింల ధార్మిక, నైతిక పరిస్థితులు చాలా బలహీనంగా ఉండేవి. మహ్మూద్ గజ్నవీ మరొకసారి ముల్తాన్‌పై దాడిచేసి అతని పీచం కూడా అణచి స్వదేశానికి వెళ్ళిపోయాడు.

ఈ విధంగా హిందూరాజులు మాటిమాటికి కవ్వింపుచర్యలకు పాల్పడటం వల్ల సుల్తాన్ మహ్మూద్ తన పూర్తి దృష్టిని భారత్ మీద కేంద్రీకరించి గజనీ నుండి పదిహేను వందల కిలోమీటర్ల దూరంలోని భారత్ రాజ్యాలపై పదిహేడు సార్లు దండయాత్రలు చేయవలసి వచ్చింది. గతంలో పంజాబ్ వరకే తన దాడులు పరిమితం చేసిన సుల్తాన్ మహ్మూద్ ఆ తర్వాత మరికొన్ని కారణాలతో నగర్‌కోట్, థానీసర్, మథురా, ఖనూజ్, గ్వాలియర్, కాలంజర్ వగైరా ప్రాంతాలపై సైనికచర్యలు జరిపి పెద్దఎత్తున సమరసొత్తు పొందగలిగాడు. చివరికి అతను సోమనాథ్‌దేవాలయం మీదికి దృష్టి సారించాడు.

ఆ కాలంలో హిందూరాజులు తమ స్వప్రయోజనాల కోసం పాలకవర్గం ప్రజలైన రాజపుత్రులు, జాట్లు, బ్రాహ్మణులు వగైరా అగ్రవర్ణాలతో కలసి దేవాలయాలను రాజకీయకేంద్రాలుగా చేసుకొని శూద్రులు, బౌద్ధులు, జైనులపై పెత్తనం చలాయిస్తుండే వారు. దేవాలయాలు ఆనాడు కేవలం ఆరాధనాలయాలుగా లేవు. అవి పూజాపునస్కా రాలకు, రాజకీయాలకు, సైనికపర్యవేక్షణకు, మతవ్యవహారాలకు ఆకర్షవంతమైన నిలయాలుగా ఉండేవి. ఈవిధంగా వారు ఎవరి మెడలనైనా సులభంగా వంచగలమని భావించేవారు. అందుకే వారు అనేకసార్లు గజనీరాజ్యంతో కయ్యానికి కాలుదువ్వారు. అదీగాక వారు తమ మధ్య పెద్దపెద్ద దేవతావిగ్రహాలు ఉన్నంతవరకూ విదేశీశక్తులేవీ తమను జయించలేవని గట్టిగా నమ్ముతుండేవారు. అందుకే మహ్మూద్‌గజ్నవీ వారి దాడుల్ని తిప్పికొట్టిన తర్వాత ముందుగా వారి దేవాలయాలపై విరుచుకుపడ్డాడు.

"తర్వాత ఇబ్రాహీం (ఆకాశంలోని) నక్షత్రాల వైపు చూసి 'నాకు వంట్లో బాగాలేదు' అన్నాడు. అందువల్ల వారతడ్ని వదలి (జాతరలో పాల్గొనడానికి) వెళ్ళిపోయారు. వారలా పోగానే ఇబ్రాహీం వారి దేవతలగుళ్ళోకి జొరబడి 'మీరు (ప్రసాదం) తినరేమిటీ? ఏమైంది మీకు కనీసం మాట్లాడనైనా మాట్లాడరు?' అన్నాడు. తర్వాత అతను ఆ విగ్రహాలపై విరుచుకుపడి కుడిచేత్తో వాటిని గట్టిగా బాది విరగ్గొట్టాడు." (ఖుర్‌ఆన్–37:88–93)

భారత్‌లోని హిందూదేవాలయాల్లో అన్నిటికంటే అతిపెద్దది, ముఖ్యమైనది సోమనాథ్ దేవాలయం. గుజరాత్ తీరప్రాంతంలో ఉన్న ఈ దేవాలయం మహిమలు, మహత్యాలకు ఎంతో ప్రసిద్ధిచెందింది. పౌర్ణమిరోజు సముద్రకెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతూ దాని నీరు వచ్చి దేవాలయం గోడకు తగులుతుంటుంది. అంచేత ప్రకృతిమహిమ తెలియని సామాన్య జనం, ఈ విగ్రహాన్ని పూజించడానికి సముద్రం కూడా వస్తుంటుందని నమ్మేవారు. అంచేత ఈ వింతను చూసి విగ్రహాన్ని దర్శించుకోవడానికి ప్రజలు తండోపతండలుగా వస్తుండే వారు. పోతే ఈ విగ్రహంలో రత్నాలు, మణిమాణిక్యాలతో కూడిన అపారధనరాసులు ఉండేవి. అందువల్ల రాజులు స్వయంగా దాన్ని పర్యవేక్షిస్తూ భద్రత కోసం అక్కడ ఎల్లప్పుడూ ఓ పెద్ద సైనికపటాలాన్ని కాపలా ఉంచేవారు.

క్రీ.శ. 1024లో సుల్తాన్ మహ్మూద్ గజనీ నుండి ముల్తాన్‌కు వచ్చి అక్కడ్నుంచి ఓ పెద్ద సైనికదళంతో గుజరాత్ చేరుకున్నాడు. అక్కడ సోమనాథ్ దేవాలయం భద్రత కోసం నియమించబడిన సైనికులు అతడ్ని తీవ్రంగా ప్రతిఘటించారు. అయితే వారు సుల్తాన్ మహ్మూద్ ముందు నిలువలేక పలాయనం చిత్తగించారు. ఆ తర్వాత మహ్మూద్‌గజ్నవీ దేవాలయంలోకి ప్రవేశించాడు. చూస్తే గర్భగుడిలో ఆవిగ్రహం శూన్యంలో వ్రేలాడబడివుంది. మహ్మూద్ ఆశ్చర్యపోయి కొందరు మేధావుల్ని సంప్రదించిన మీదట అసలువిషయం తెలిసింది. విగ్రహం చుట్టూవున్న నాలుగు గోడల్లో శక్తిమంతమైన మ్యాగ్నెట్లు అమర్చబడి ఉన్నాయని, దానిప్రభావంతో విగ్రహం శూన్యంలో నిలబడగలిగిందని, ఆ మ్యాగ్నెట్లు తొలిగిస్తే అది పడిపోతుందని వారు తెలియజేశారు.

అప్పుడు మహ్మూద్ గజ్నవీ ఆ గోడల్లోపల అమర్చబడిన మ్యాగ్నెట్లను తొలగింపజేశాడు. మ్యాగ్నెట్లు తీసేయగానే విగ్రహం దభీమంటూ కిందపడి పోయింది. మహ్మూద్ దాన్ని పగలగొట్టడానికి ప్రయత్నించినపుడు పూజారులు ఆయన్ని వారిస్తూ, తాము పెద్ద ఎత్తున వెండిబంగారాలు, కోట్లాది రూపాయలు సమర్పించుకుంటామని, దయచేసి విగ్రహాన్ని పగలగొట్టవద్దని వేడుకున్నారు. దానికి సుల్తాన్ మహ్మూద్ సమాధానమిస్తూ “నేను పరలోకంలో విశ్వప్రభువు ముందు విగ్రహవ్యాపారిగా కాకుండా విగ్రహధ్వంసకుడిగా నిలబడదలిచాను” అని అన్నాడు.

ఆ తరువాత గదతో విగ్రహాన్ని పగలగొట్టడం జరిగింది. అంతే, అందులోని కోట్లాది రూపాయలు విలువగల వేలాది మణిమాణిక్యాలు, వజ్రవైఢూర్యాలు బయటపడి కళ్ళు జిగేల్మన్పించాయి. చివరికి కోహినూర్‌వజ్రం కూడా అందులో నుంచి బయటపడిందని కొందరు చరిత్రకారుల కథనం. మహ్మూద్‌గజ్నవీ వాటిని స్వాధీనంచేసుకొని వెళ్ళిపోయాడు. అతను దండయాత్రల తరువాత తనవెంట అపారధనరాసులు, వేలాది యుద్ధఖైదీలు తీసుకువెళ్ళేవాడు. ఓసారి మహ్మూద్ వెంట రెండులక్షల మంది ఖైదీలు అఫ్గానిస్తాన్‌కు చేరుకున్నారు. అప్పుడు గజనీ భారతదేశ పట్టణమా అన్పించింది.

మహ్మూద్ గజ్నవీ కొన్ని వేలమంది సైనికులతో లక్షలాది హిందూసైనికులతో తలపడి ఎలా విజయాలు సాధించగలిగాడని కొందరి అనుమానం. గజనీ నుండి ఒకటి నుండి మూడు నెలలు పట్టే 1500 కిలోమీటర్ల సుదూరప్రాంతాలకు అతి వేగంగా ప్రయాణం చేసి దాడులుజరిపి, వివిధప్రాంతాల హిందూరాజులు ఏకమై ఉమ్మడిసైన్యంతో రాకముందే తిరిగి శరవేగంతో గజనీ చేరుకునేవాడు. ఈవిధంగా అతను తన 32 ఏళ్ళ పాలనాకాలంలో ఎనభైవేల కిలోమీటర్లు ప్రయాణంచేశాడు. పైగా అతనికి దైవసహాయం కూడాఉండేది. ఎప్పుడైనా తాను పరాజయంపాలయ్యే సూచనలు కన్పిస్తే గుర్రం మీది నుంచి దూకి సజ్దాలోకి పోయి దైవాన్ని దీనంగా ప్రార్థించేవాడు. దాంతో అతను విజయం సాధించేవాడు. ఓసారి ఓటమిసూచనలు కన్పించాయి. యుద్ధవిరమణ తర్వాత ఆరాత్రి నమాజ్ ముగించి సజ్దాలోకి పోయి సృష్టికర్తను దీనాతిదీనంగా వేడుకున్నాడు. ఉదయం లేచిచూస్తే యుద్ధరంగంలో ఒక్క హిందూసైనికుడు కూడా లేడు. దాంతో మహ్మూద్ గజ్నవీ చల్లగా ఊపిరి పీల్చుకొని దైవానికి కృతజ్ఞతలు చెల్లించుకున్నాడు.



మహ్మూద్ గజ్నవీ భారత్‌లో తాను సాధించిన విజయాలను గురించిన వివరాలు రాసి బగ్దాద్ ఖలీఫాకు తెలియజేశాడు. అప్పుడు ఖలీఫా వాటిని బగ్దాద్ జామియామస్జిద్‌లో చదివి ప్రజలకు విన్పించమని ఆదేశించాడు. ఆ ఘనకార్యాలు విన్న ప్రజలంతా మహ్మూద్‌గజ్నవీని ప్రశంసిస్తూ ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఆతర్వాత బగ్దాద్‌ఖలీఫా సుల్తాన్ మహ్మూద్‌కు ఓ ప్రత్యేక దూత ద్వారా ఒక విలువైన బహుమానం పంపి అతనికి ‘యమీనుద్దౌలా’ అనే బిరుదు ప్రదానం చేశాడు.

హిందువులు, ఆంగ్లేయులు రాసిన భారతచరిత్రలో మతదురభిమానంతో వాస్తవాల్ని వక్రీకరించి మహ్మూద్‌గజ్నవీని దోపిడీదారుడిగా, లూటీకోరుగా చిత్రించడం జరిగింది. కాని ప్రపంచ ముస్లింసముదాయం దృష్టిలో అతను అసమాన ప్రతిభాపాటవాలు, గొప్ప సమరవ్యూహాలు గల సేనానిగా, మంచి న్యాయశీలిగా, దయార్ద్రహృదయుడైన చక్రవర్తిగా గుర్తించబడ్డాడు. అతని న్యాయదృష్టి, దయార్ద్రతలను గురించి చరిత్రకారులు అనేక సంఘటనలు పేర్కొన్నారు. ఉదా.కు ఇక్కడ రెండు ఘటనలు పేర్కొనబడుతున్నాయి.

ఒకసారి ఓ వృద్ధురాలు రాజదర్బారుకు వచ్చి తన కొడుకు ఓ ప్రయాణబృందంతో కలసి వెళ్తుంటే దారిలో దోపిడీదొంగలు బాటసారుల సామగ్రినంతటినీ దోచుకోవడమే గాక తనకొడుకుని దారుణంగా చంపేశారని, కనుక ఆ దుర్మార్గుల్ని శిక్షించి ఇకముందు ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తగినచర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నది. సుల్తాన్ మహ్మూద్ ఈమాట విని “అమ్మా! నువ్వు ప్రస్తావించిన ఆ ప్రాంతం రాజధానికి చాలా దూరంగా ఉంది. అంత దూరప్రాంతాల్లో జరిగే దోపిడీలను నేనెలా అరికట్టగలుగుతాను?” అని అన్నాడు.

సుల్తాన్ సమాధానం విని వృద్ధురాలు ముఖం చిట్లిస్తూ “ఆ ప్రాంతాల్లో జరిగే దుర్ఘటలను అరికట్టలేకపోతే నువ్వు వాటిని జయించి నీ రాజ్యంలో ఎందుకు కలుపుకున్నావు!” అని ఎదురుప్రశ్న వేసింది.

వృద్ధురాలి మాట సముచితంగానే ఉంది. అందువల్ల పెద్దపెద్ద రాజుల గుండెల్లో దడ పుట్టించిన సుల్తాన్ మహ్మూద్ ఆ ముసలమ్మ ముందు పెంపుడుపిల్లిలా మారిపోయాడు. అతనామెకు వెంటనే లూటీఅయిన సామగ్రి నష్టపరిహారం చెల్లించి, దోపిడీ దొంగలను కఠినంగా శిక్షిస్తానని వాగ్దానం చేశాడు. ఆ తర్వాత అతను ప్రతి బాటసారుల బృందం భద్రత కోసం సైనికదళాలను పంపసాగాడు.

మరొకసారి ఒకతను వచ్చి ఒక ప్రభుత్వాధికారి తన భార్యను అశ్లీలచేష్టలతో వేధిస్తున్నాడని ఫిర్యాదుచేశాడు. అదేరోజు రాత్రివేళ సుల్తాన్ మహ్మూద్ సాయుధుడై ఆ వ్యక్తి ఇంటికి వెళ్ళి ఓ మూలలో నక్కి నిల్చున్నాడు. ఆ ప్రభుత్వాధికారి ఇంట్లో ప్రవేశించగానే సుల్తాన్ ఒక్కవ్రేటుతో అతని శిరస్సు ఖండించాడు. ఈసంఘటన తర్వాత ప్రభుత్వాధికారులెవరూ ప్రజలపై ఎలాంటిదౌర్జన్యం చేయడానికి సాహసించలేకపోయారు.

మహ్మూద్‌గజ్నవీ అపారసిరిసంపదలు సంపాదించాడు. అయితే మరణసమయంలో “నేను నాజీవితంలో ఎంతో సంపాదించాను. కాని నేనీరోజు వట్టిచేతులతో వెళ్తున్నాను. నా సంపాదనలో ఒక్కటీ నావెంట రావు నా కర్మలు తప్ప” అంటూ బాధపడ్డాడు.

# 68. ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మలై)

సుల్తాన్ మహ్మూద్‌గజ్నవీ దాడుల కారణంగా ఉత్తరభారత్‌తో వివిధ ముస్లింరాజ్యాల సంబంధాలకు దారి సుగమం అయింది. ఆయా రాజ్యాల నుండి మన దేశానికి రాకపోకలు ప్రారంభమయ్యాయి. అరేబియా, ఈరాన్, అఫ్ఘనిస్తాన్‌ల నుండి మన దేశానికి అనేకమంది మహాపురుషులు వచ్చి ఇక్కడి ప్రజల నీతినడవడికలను, ధార్మిక-ఆధ్యాత్మిక జీవితాలను సంస్కరించారు. అలాంటి మహనీయుల్లో ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మలై) ముఖ్యులు. ఆయన అఫ్ఘనిస్తాన్‌లోని సంజర్ పట్నం నివాసి.

ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మలై) పదహారేళ్ళ వయసులో ఉన్నపుడు ఆయన తండ్రిగారు చనిపోయారు. వారసత్వపు ఆస్తిగా ఆయనకు పండ్లతోట, ఓ తిరగలి లభించాయి. ఒకరోజు తోటకు నీళ్ళుపెడ్తుంటే తోట పక్కగా ఓ మహనీయుడు పోతుండటం చూసి ఆయన్ని స్వాగతిస్తూ తోటలోకి ఆహ్వానించారు. ఆయన్ని ఓచెట్టు నీడకింద కూర్చోబెట్టి తినడానికి ఆయన ముందు ద్రాక్షపండ్లు ఉంచారు. ఆ మహనీయుడు ద్రాక్షపండ్లు తిని ఎంతో సంతోషిస్తూ తన సంచిలో నుంచి ఓ ఎండినరొట్టె తీసిచ్చి ఆశీర్వదించారు. దాంతో ఖాజా మొయినుద్దీన్ ఆయన పట్ల ఎంతో ప్రభావితులై ఆ ఎండిన రొట్టెను దైవప్రసాదంగా భావించి పరమసంతోషంతో తిన్నారు.

ఆ తరువాత ఆయన తన తోటను, తిరగలిని అమ్మి ఆ డబ్బును పేదలకు దానం చేసి ధర్మవిద్య నేర్చుకోవడానికి సమర్‌ఖంద్, బుఖారాలకు బయలుదేరారు. బుఖారాలో ఏడెనిమిది సంవత్సరాలు ఉండి మౌలానా హుసాముద్దీన్ గారి దగ్గర ఖుర్‌ఆన్, హదీస్, ఫిఖ్హా విద్యలు నేర్చుకున్నారు. ఆయన సూఫీ తాత్త్వికచింతన వైపు ఎక్కువగా మొగ్గు చూపారు. అంచేత ఆయన ఎల్లప్పుడూ అలాంటి మహనీయుల సహచర్యంలో ఉండేందుకు ఎంతో ఇష్టపడేవారు. ఆ మహనీయుల అన్వేషణలో ఆయన అనేకప్రాంతాలు పర్యటించారు. చివరికి ఆయన ఇరాఖ్‌లోని షేఖ్ ఉస్మాన్ హారూనీ అనే ఓ గొప్ప మహనీయుడ్ని కలుసుకొని, అక్కడే కొన్నాళ్ళు ఉండిపోయారు ఆయన సేవలో.

ఈవిధంగా ఆయన తన గురువు దగ్గర ఇరవై ఏళ్ళు గడిపిన తరువాత మక్కా, మదీనాలు పర్యటించి అక్కడి పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నారు. ఆ తరువాత ఆయన మరికొందరు మహనీయులతో కలసి భారత్‌పర్యటన ఉద్దేశ్యంతో బయలుదేరారు. దారిలో వివిధ పట్టణాలు-గ్రామాలు పర్యటిస్తూ ఆయా ప్రాంతాల ప్రజలకు ధార్మికోపదేశం చేస్తూ ముల్తాన్, లాహోర్‌ల మీదుగా ఢిల్లీ చేరుకున్నారు. ఆయన చేసిన ధర్మప్రచారంతో వేలాది ముస్లిమేతరులు ఇస్లాం స్వీకరించారు.

ఖాజామొయినుద్దీన్ (రహ్మలై) స్థిరనివాసం కోసం అజ్మీర్‌ని ఎంచుకున్నారు. ఆ కాలంలో అజ్మీర్ పృథ్వీరాజ్ చౌహాన్ రాజ్యపరిధిలో ఉండేది. పృథ్వీరాజ్ మొదట్లో ఖాజా మొయినుద్దీన్ (రహ్మలై)ని గూఢచారి అనుకొని వేధించాడు. కాని తరువాత ఆయన సుగుణసంపత్తి, అమృతబోధనలను గమనించి తృప్తిచెందాడు. అయితే అజ్మీర్‌లో అనేకమంది ప్రజలు, చివరికి పృథ్వీరాజ్ ఆస్థానసభ్యులు సైతం ఆ మహనీయుని అమృత



బోధనలకు ప్రభావితులై ఆయనకు సన్నిహితులవడంతో పృథ్వీరాజ్ మళ్ళీ ఆయన్ని వేధించడం ప్రారంభించాడు. అతను ఇద్దరు సుప్రసిద్ధ మాంత్రికుల్ని ఖాజామొయినుద్దీన్ (రహ్మలై) దగ్గరకు పంపాడు. ఆ మాంత్రికులు తమ మంత్రబలంతో ఆయన్ని ఏదో చేయాలనుకున్నారు. కాని వారి మంత్రబలం ఆయనపై ఏమాత్రం పనిచేయలేదు. పైగా వారే ఆ మహనీయుని మహితోక్తులతో ప్రభావితులై ఇస్లాం స్వీకరించారు.

ఖాజా మొయినుద్దీన్ (రహ్మలై) పృథ్వీరాజ్‌ని కూడా ఇస్లాం వైపు ఆహ్వానించారు. కాని అతను ఇస్లాం స్వీకరించడానికి నిరాకరించాడు. ఖాజా మొయినుద్దీన్ (రహ్మలై) ఆచరణ విషయంలో ఎంతో నిష్టాగరిష్ఠులు. ఫర్జ్, సున్నత్, నఫిల్ నమాజులు, ఫర్జ్ రోజాలతో పాటు ఆయన ప్రవక్త సంప్రదాయాలను తూ.చా. తప్పకుండా పాటించేవారు. చివరికి ఆ పుణ్యపురుషుడు ఏనాడూ ఎడమచేత్తో మంచినీళ్ళు తాగడంగాని, మస్జిద్‌లో ప్రవేశించేటప్పుడు ముందు లోపల ఎడమకాలు పెట్టడంగాని చేయలేదు.

సుగుణసంపత్తిలో, నీతినడవడికల్లో ఆనాడు ఆయనకు ఆయనే సాటి. ఎవరైనా తనకు పెద్దనష్టం కలిగించి కూడా క్షమాపణ కోరితే వెంటనే ఆయన అతడ్ని క్షమించేవారు. ఓసారి ఒకతను ఆ మహనీయుడ్ని చంపడానికి ఆయన సభకు వచ్చికూర్చున్నాడు. అతడ్ని చూడగానే ఆయనకు అతని ఉద్దేశ్యం తెలిసిపోయింది. అంచేత ఆయన "నీవు ఏ ఉద్దేశ్యంతో వచ్చావో దాన్ని నెరవేర్చు" అన్నారు చిరునవ్వుతో. ఈమాట విని ఆ వ్యక్తి కంగారుపడి వణికిపోతూ కత్తి బయటికితీసి ఆయన ముందు పెట్టాడు. ఆయన "నిన్నీ పనికి పురిగొల్పిన మనిషి పేరును బయటపెట్టకు. ఎవరి రహస్యాన్నయినా బహిర్గతం చేయకుండా దాచి వుంచడమే మంచిది" అన్నారు. ఈమాట విని ఆ వ్యక్తి మరింత ప్రభావితుడై తక్షణమే సద్వచనం పఠించి ముస్లింగా మారిపోయాడు.

ఖాజా మొయినుద్దీన్ (రహ్మలై)గారి ఈ సుగుణసంపత్తే ఆనాటి చీకటిరోజుల్లో ఇక్కడ సత్యధర్మ కిరణాలను దశదిశలా ప్రసరింపజేసింది. ఆయన శిష్యుల్లో సుప్రసిద్ధ శిష్యులు అనేకమంది ఉన్నారు. వారిలో ఖుత్బుద్దీన్ బఖ్తియార్ ఎంతో ముఖ్యులు. ఖాజా మొయినుద్దీన్ (రహ్మలై) క్రీ.శ. 1235లో 94ఏళ్ళ వయసులో ఇహలోకం వీడిపోయారు. ఆయన భౌతికకాయాన్ని రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లో ఖననం చేయడం జరిగింది. ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మలై) సమాధి యావత్ భారత్‌లో ఎంతో ప్రసిద్ధిచెందింది. దాని దర్శనం కోసం దేశం నలుమూలల నుండి వేలాదిమంది ముస్లింలు, ముస్లిమేతరులు వచ్చి ఎంతో భక్తిశ్రద్ధలతో కానుకలు సమర్పించుకొని తమ కోరికలు తీర్చుకుంటారు. కాని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రవచించిన ఈ మహితోక్తులు గమనించండి:

"సమాధుల్ని సందర్శించే స్త్రీలను, వాటిపై ఆరాధనాలయాలు నిర్మించేవారిని, అక్కడ దీపాలంకరణ చేసేవారిని దేవుడు శపించాడు." (తిర్మిజి, అబూదావూద్)

"వారిలో ఎవరైనా సత్పురుషుడు చనిపోయాక వారతని సమాధిని ఆరాధనాలయంగా చేస్తారు. అతని చిత్రాలు (విగ్రహాలు) తయారుచేస్తారు. ప్రళయదినాన వీరు యావత్‌సృష్టిలో పరమ నికృష్టులవుతారు." (బుఖారి)

# 69. సుల్తాన్ ముహమ్మద్ గోరి

ముహమ్మద్ గోరి అఫ్గానిస్తాన్‌లోని గోర్ ప్రాంతం నివాసి. మహ్మూద్ గజ్నవీ మరణానంతరం వచ్చిన అతని రాజకీయ వారసుల అసమర్థత, బలహీనతల కారణంగా గజనీ రాజ్యంలోని భారత్ ఆక్రమిత ప్రాంతాలను పంజాబ్ పాలకుడు పృథ్వీరాజ్ చౌహాన్ తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఆ కారణాలే గజనీరాజ్యానికి ముహమ్మద్ గోరీని అధినేత చేశాయి. ఆనాటి భారత రాజుల్లో పృథ్వీరాజే బలవంతుడు. అజ్మీర్ కూడా అతని రాజ్యపరిధిలో ఉండింది. ఢిల్లీ, ఖనూజ్ వాటి చుట్టుపక్కల ప్రాంతాల పాలకుడైన అనంగ్‌పాల్ చనిపోయిన తరువాత అతని మనువళ్ళు పృథ్వీరాజ్, జయచందర్‌లు అతని రాజకీయ వారసులయ్యారు. పృథ్వీరాజ్ వాటాకు ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాలు లభించగా, జయచందర్‌కు ఖనూజ్, దాని పరిసర ప్రాంతాలు దక్కాయి. పృథ్వీరాజ్‌కు పంజాబ్, అజ్మీర్‌లతో పాటు ఇప్పుడు ఢిల్లీ ప్రాంతం లభించడంతో అతని రాజ్యపరిధి విస్తృతమయింది. దాంతో జయచందర్ పృథ్వీరాజ్ పట్ల ద్వేషం పెంచుకున్నాడు.

ఓసారి జయచందర్ తన కూతురు రాణీసంయుక్త వివాహం కోసం స్వయంవర సభ ఏర్పాటుచేసి రాజులందరినీ ఆహ్వానించాడు. ఆ సభకు పృథ్వీరాజ్ తప్ప రాజులంతా వచ్చారు. జయచందర్ ఈ సభకు పృథ్వీరాజ్ రానందున అతడ్ని కించపరచడానికి సభ ద్వారం దగ్గర అతని విగ్రహాన్ని తయారుచేయించి పెట్టించాడు. రాణీసంయుక్త పూలదండ తీసుకొని మెల్లిగా నడుస్తూ ఆ విగ్రహం దగ్గరకు చేరుకుంది. ఆమె పూలదండను ఆ విగ్రహం మెడలో వేయడానికి సిద్ధపడుతున్న తరుణంలో అక్కడే ఓచోట దాక్కున్న పృథ్వీరాజ్ హఠాత్తుగా ఆమెను ఎత్తుకొని గుర్రం మీద కూర్చోబెట్టుకొని శరవేగంతో వెళ్ళిపోయాడు. అంతకుముందు నుంచే పృథ్వీరాజ్ పట్ల ద్వేషంతో గుర్రుగా ఉన్న జయచందర్ ఈ సంఘటనతో తీవ్రమైన ప్రతీకారేచ్ఛతో ఊగిపోయాడు.

ఆ రోజుల్లోనే షిహాబుద్దీన్ ముహమ్మద్ గోరీ గజనీ రాజ్యాధిపతి అయ్యాడు. మహ్మూద్ గజ్నవీ కాలంలో గజనీ రాజ్యపరిధిలోకి వచ్చిన పంజాబ్ ప్రాంతాలను ఆ తరువాత పృథ్వీరాజ్ తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. అందువల్ల ముహమ్మద్‌గోరీ ఆ ప్రాంతాలను తనకు అప్పగించమని పృథ్వీరాజ్‌ని అడిగాడు. అందుకతను నిరాకరించడంతో ముహమ్మద్ గోరీ లాహోర్ నుండి బయలుదేరి భటండా కోటను ఆక్రమించుకున్నాడు. ఈ సంగతి తెలియగానే పృథ్వీరాజ్ రెండున్నర లక్షల సైన్యంతో ముహమ్మద్ గోరీ ముందుకు వచ్చాడు. అప్పుడు గోరీ దగ్గర మూడువేల మంది సైనికులు మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ అతను అధైర్యం చెందకుండా పృథ్వీరాజ్ సైన్యంతో ఢీకొన్నాడు. కాని అతను ఘోరంగా పరాజయంపాలై గాయాలతో పారిపోయాడు.

అయితే ముహమ్మద్‌గోరీ ప్రతీకారంతో ఉడికిపోతూ కొన్నాళ్ళ తర్వాత క్రీ.శ. 1192లో లక్షన్నర సైన్యాన్ని సమీకరించి పృథ్వీరాజ్‌తో తలపడ్డాడు. పృథ్వీరాజ్ మూడు లక్షల సైన్యంతో రణరంగంలోకి దిగాడు. ఇరుపక్షాల మధ్య సంకులసమరం జరిగింది. గోరీ సైన్యం పృథ్వీరాజ్ సైన్యం ధాటికి నిలువలేక వెనుకంజ వేసింది. పృథ్వీరాజ్ సైనికులు



ఇక విజయం తమదే నన్న ధీమాతో యుద్ధక్రమశిక్షణ ఉల్లంఘించి విజయనినాదాలతో వెనుతిరిగారు. సరిగ్గా అదేసమయంలో ముహమ్మద్‌గోరీ సైన్యం తిరిగొచ్చి మెరుపుదాడి చేసింది. దాంతో బిత్తరపోయిన పృథ్వీరాజ్ సైనికులు తమనుతాము సంబాళించుకునేలోగానే వారిలో అనేకమంది శవాలుగా మారి నేలకూలారు. ఆ శవాలగుట్టలో పృథ్వీరాజ్ చౌహాన్ కూడా చేరిపోయాడు.

ఆ తర్వాత ముహమ్మద్‌గోరీ ఢిల్లీ, అజ్మీర్ ప్రాంతాలను రెండు భాగాలుగా విభజించి వాటిని పృథ్వీరాజ్ కొడుకులిద్దరికి అప్పగించాడు. మిగిలిన భారత్ ఆక్రమిత ప్రాంతాలకు తన బానిస ఖుత్బుద్దీన్ ఐబక్‌ని పాలకుడిగా నియమించి గజనీకి వెళ్ళిపోయాడు.

సుల్తాన్ ముహమ్మద్‌గోరీ స్వదేశానికి వెళ్ళిన కొన్నాళ్ళకే పృథ్వీరాజ్ కుమారులు జయచందర్, మరికొందరు రాజుల సహాయంతో ఖుత్బుద్దీన్‌పై తిరుగుబాటు చేశారు. అందువల్ల ఖుత్బుద్దీన్ మార్గాంతరంలేక ఢిల్లీ, మీరట్‌లలో చెలరేగిన ఈ తిరుగుబాటును అణచివేసి తన రాజధానిని లాహోర్ నుండి ఢిల్లీకి మార్చాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు క్రీ.శ. 1206లో సుల్తాన్ ముహమ్మద్ గోరీ ఓ కుట్రకు గురయి హతమార్చబడ్డాడు.

**సుల్తాన్ ఖుత్బుద్దీన్ ఐబక్:-**ముహమ్మద్ గోరి చనిపోయిన తర్వాత ఖుత్బుద్దీన్ ఢిల్లీని శాశ్వత రాజధానిగా చేసుకొని ఉత్తరభారత్‌లో మొట్టమొదటి ముస్లింప్రభుత్వాన్ని నెలకొల్పాడు. అతను సర్వస్వతంత్ర పాలకుడు అయిన తరువాత తన రాజ్యాన్ని మరింత విస్తృతపరచి పరిపాలనా విధుల్ని సక్రమంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాడు. సుల్తాన్ ఖుత్బుద్దీన్ టర్కీసంతతికి చెందినవాడు. పిన్నవయసులోనే తల్లిదండ్రుల ప్రేమకు దూరమై బానిసగా మార్చబడ్డాడు. అయితే ఈ బానిసత్వం, తల్లిదండ్రుల ప్రేమకు దూరమవడం అతనికి మేలే చేకూర్చాయి. అతనికి ఇస్లాంలాంటి మహాభాగ్యం, ఢిల్లీ సామ్రాజ్యం లభించాయి.

ఖుత్బుద్దీన్‌ని మొదట నీషాపూర్ న్యాయమూర్తి ఫఖ్రుద్దీన్ అబ్దుల్‌అజీజ్ కొన్నారు. ఆయన అతడ్ని పెంచిపోషించి, విద్యాశిక్షణలు ఇప్పించారు. తర్వాత అతడ్ని ఓ వ్యాపారి కొని గజనీకి తీసుకొచ్చి సుల్తాన్ ముహమ్మద్‌గోరీకి అమ్మివేశాడు. ముహమ్మద్‌గోరీ అతనికి సైనికశిక్షణ ఇప్పించి పరిపాలనా దక్షుడిగా తీర్చిదిద్దాడు. ఆ విధంగా ఖుత్బుద్దీన్ క్రమక్రమంగా అభివృద్ధిసాధిస్తూ క్రీ.శ.1206నాటికి మొట్టమొదటి ఢిల్లీసుల్తాన్ అయ్యాడు.

సుల్తాన్ ఖుత్బుద్దీన్ ఐబక్ నిరుపేదలు, పీడితులకు విశాలహృదయంతో సహాయం చేసేవాడు. అతను చక్రవర్తి హోదాలో ఉన్నప్పటికీ ఏమాత్రం అహంకారాన్ని దరికి చేరనివ్వకుండా అతి నిరాడంబరంగా జీవితం గడిపేవాడు. అంతేకాదు, అతను రాచరిక గర్వం నుండి కాపాడుకునేందుకు అప్పుడప్పుడు బానిసదుస్తులు ధరించి అద్దం ముందు నిల్చొని తననుతాను సంబోధించుకుంటూ “ఖుత్బుద్దీన్! నువ్వు నీ గత బానిసజీవితం మరచిపోయి సృష్టికర్త, విశ్వప్రభువయిన దేవునికి విముఖుడైపోకు. ఏమరుపాటుకు గురై ఆయన ఆదేశాలను విస్మరించకు. ఓసారి నీ గతజీవితం గుర్తుకుతెచ్చుకో. ఆనాడు నువ్వు ఎలా బానిసగా ఉండేవాడివో ఇప్పుడు చక్రవర్తి అయిన తరువాత కూడా ఉభయలోక చక్రవర్తికి బానిసగా ఉండిపో” అని చెప్పుకునేవాడు.

# 70. సుల్తాన్ షమ్సుద్దీన్ అల్తమష్

క్రీ.శ. 12వ శతాబ్దం మధ్యకాలంనాటి మాట. ఒకరోజు బుఖారా పట్టణం కూడలిలో ఒక పిల్లవాడు నిల్చొని హృదయవిదారకంగా ఏడ్వసాగాడు. అప్పుడు అటువైపుగా పోతున్న ఓ తపస్వి ఆ పిల్లవాడ్ని చూసి అతని దగ్గరకు వెళ్ళి "బాబూ! ఎందుకు ఏడుస్తు న్నావ"ని అడిగాడు. దానికి పిల్లవాడు సమాధానమిస్తూ "నా యజమాని ద్రాక్షాపండ్లు తీసుకురమ్మని నాకు డబ్బులిచ్చాడు. కాని ఆ డబ్బులు దారిలో ఎక్కడో పోయాయి. ఇప్పుడు నేను వట్టిచేతులతో నా యజమాని దగ్గరకు పోతే ఆయన నన్ను చితగ్గొడ్తాడని భయపడ్తున్నాను" అని చెప్పాడు.

తపస్వి ఆ పిల్లవాడ్ని సముదాయిస్తూ "భయపడకు, నేను నీకా ద్రాక్షాపండ్లు కొని ఇస్తాలే. ఇంతకూ నువ్వు ఎవరు నాయనా! నీ తల్లిదండ్రులు ఎవరు?" అడి అడిగాడు.

దానికి పిల్లవాడు ఇలా చెప్పాడు: "నా పేరు షమ్సుద్దీన్. నేనొక గౌరవనీయ కుటుం బానికి చెందిన బాలుడ్ని. మా నాన్న మా తెగలో ఎంతో గౌరవప్రతిష్ఠలున్న మనిషి. మా బాబాయి కొడుకు నన్ను మోసంతో పిలిచికెళ్ళి ఒక వ్యాపారికి అమ్మివేశాడు. ఆ వ్యాపారి నన్ను బుఖారాకు తీసుకొచ్చి హాజీ జమాలుద్దీన్ గారికి అమ్మివేశాడు. ఇప్పుడు నేను ఆయన దగ్గరే బానిసగా ఉంటున్నా. ఆయన నన్ను మంచిగానే చూసుకుంటున్నారు."

తపస్వి ఈమాటలు విని, పిల్లవాడి రూపురేఖలు పరికించి చూస్తూ "ఈ అబ్బాయి చాలా తెలివైనవాడిలా ఉన్నాడు. భావిలో గొప్పవాడు కావచ్చు"అని భావించాడు. తర్వాత అతడ్ని ఒక దుకాణం దగ్గరకు తీసికెళ్ళి అతనికి ద్రాక్షాపండ్లు కొనిచ్చి ఇలా చెప్పాడు: "బాబూ! నీయీ బానిసత్వం భవిష్యత్తులో నీకెంతో మేలు చేకూర్చవచ్చు. నువ్వు పెద్ద వాడైన తర్వాత దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అలైహి)లా నువ్వు కూడా ఒక సామ్రాజ్యా నికి చక్రవర్తి అవుతావు. అయితే చక్రవర్తి అయిన తరువాత నువ్వు పేదలను, అవస రార్థులను మరచిపోకూడదు సుమా!"

తపస్వి చెప్పిన భవిష్యవాణి, ఆయన హితోపదేశం విన్న తర్వాత షమ్సుద్దీన్ ఆయన చెప్పినట్లే నడచుకుంటానని వాగ్దానంచేశాడు. హాజీ జమాలుద్దీన్ అతనికి మంచి విద్యా శిక్షణలు ఇప్పించాడు. పుణ్యపురుషుల సహచర్యంలో ఉంచి వారిద్వారా అతనికి దైవ ధర్మాన్ని, నీతినడవడికల్ని, సభ్యతాసంస్కృతుల్ని నేర్పించాడు. యుక్తవయస్సు వచ్చిన తర్వాత అతడ్ని సుల్తాన్ ఖుత్బుద్దీన్ దగ్గరకు తీసికెళ్ళి పరిచయం చేశాడు. ఖుత్బుద్దీన్ ఆ యువకుడి మాటలతీరును, వ్యక్తిత్వాన్ని పరిశీలించిన తర్వాత అతని పట్ల ఎంతో ప్రభావితుడై తక్షణమే షమ్సుద్దీన్ని భారీమూల్యం చెల్లించి కొన్నాడు.

షమ్సుద్దీన్ రాచకుటుంబానికి చేరువయిన తర్వాత అతనికి తన ప్రతిభాపరాక్రమాలు ప్రదర్శించడానికి మంచి అవకాశం లభించింది. కొన్నాళ్ళలోనే అతను అందరినీ ఎంతో ఆకట్టుకున్నాడు. సుల్తాన్ ఖుత్బుద్దీన్ అయితే అతడ్ని మరింత అభిమానించసాగాడు. చివరికి సుల్తాన్ అతనికి తన కూతుర్ని ఇచ్చి పెళ్ళిచేశాడు. దాంతో అతని అదృష్టతార మరింత మెరిసింది.



సుల్తాన్ ఖుత్బుద్దీన్ ఐబక్ క్రీ.శ. 1206లో ఉత్తరభారతానికి సర్వస్వతంత్ర పాలకుడైన తరువాత షమ్సుద్దీన్‌కు బదాయూన్ రాష్ట్రానికి సుబేదార్‌గా నియమించాడు. నాలుగేళ్ళ తరువాత సుల్తాన్ ఖుత్బుద్దీన్ చనిపోయాడు. అప్పుడతని స్థానంలో అతని పెంపుడు కొడుకు ఆరాంషాహ్ అధికార పీఠం అధిరోహించాడు. అయితే ఆరాంషాహ్ అసమర్థత వల్ల అతని సామ్రాజ్యం నుండి అనేక రాష్ట్రాలు విడిపోయాయి. అందువల్ల పాలకవర్గం లోని ఉన్నతాధికారులు కలసి సింహాసనం నుండి ఆరాంషాహ్‌ను దించి షమ్సుద్దీన్ అల్తమష్‌ను కూర్చోబెట్టారు.

షమ్సుద్దీన్ అధికారం చేపట్టగానే మాజీసుల్తాన్ ఆరాంషాహ్‌ను, కొందరు సుబే దార్లను ఎదుర్కో వలసివచ్చింది. ఒక్క సంవత్సరంలోనే ఆ తిరుగుబాటుదారులందర్నీ అణచివేశాడు. ఆ తరువాత మరో పదిహేనేండ్లలో సుల్తాన్ షమ్సుద్దీన్ బెంగాల్‌తో సహా మొత్తం ఉత్తరభారత్‌ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. దాంతో అతని కీర్తిప్రతిష్ఠలు బగ్దాద్‌దాకా వ్యాపించాయి. అప్పుడు బగ్దాద్ ఖలీఫా ముస్తన్సర్ ఓ ప్రత్యేకదూత ద్వారా అతడ్ని భారత చక్రవర్తిగా ఆమోదించాడు.

షమ్సుద్దీన్ అల్తమష్ అంతగొప్ప రాజ్యాధినేత అయినప్పటికీ అతనిలో అహంకారం మచ్చుకైనా లేదు. అదీగాక, అతను గొప్పదైవభక్తుడు, దయార్ద్రహృదయుడు, ధర్మాదేశాల అనుసరణలో ఏమాత్రం రాజీపడని పరమ నిష్ఠాగరిష్ఠుడు. తరచుగా పుణ్యపురుషుల, దైవప్రియుల సహచర్యంలో ఉంటాడు. అతను ఖాజా మొయినుద్దీన్ (రహ్మలై)గారి అత్యంత ప్రియశిష్యుడు బఖ్తియార్‌కాకి (రహ్మలై) సమావేశాల్లో కూడా పాల్గొనేవాడు. బఖ్తియార్ (రహ్మలై) తన మరణసమయంలో మాట్లాడుతూ "అసర్ నమాజులోని సున్నత్ రకాతులను ఏనాడూ ఖజా చేయని, ఎల్లప్పుడూ తక్బీర్‌ఊలాతో సహా పూర్తి సామూహికనమాజ్ చేసే, ఏనాడూ అధర్మకార్యాల జోలికిపోని వ్యక్తి మాత్రమే నా జనాజా నమాజ్ చేయాలి" అని చెప్పారు. ప్రజలు అలాంటి మనిషి కోసం అన్వేషిస్తే వారికి సుల్తాన్ షమ్సుద్దీన్ అల్తమష్ దొరికాడు. అప్పుడు బఖ్తియార్ (రహ్మలై) జనాజా నమాజ్‌ని సుల్తాన్ అల్తమష్ చేశాడు.

సుల్తాన్ అల్తమష్ తనకు గతంలో ఓ తపస్వి చేసిన హితోపదేశాన్ని జీవితాంతం మరచిపోలేదు. రాజ్యాధినేత అయిన తర్వాత దాదాపు ప్రతిరోజూ రాత్రివేళ మారువేషంలో నగరంలో పర్యటించి ప్రజల స్థితిగతులు తెలుసుకొని వారికి ధనసహాయం చేసేవాడు. పీడితులు, పేదలు, అవసరార్థులు తమ పరిస్థితులు చెప్పుకొని సహాయం పొందడానికి రాజదర్బారుకు నిర్భయంగా రావచ్చని బహిరంగ ప్రకటన చేయించాడు. దానికోసం ఆయన తన ఇంటి ముందు గొలుసుతో ఒక గంట వ్రేలాడదీశాడు. ఫిర్యాదు చేయ దలచుకున్న మనిషి ఆ గొలుసు లాగితే చాలు. వెంటనే సుల్తాన్ బయటికి వచ్చి అతనికి తగిన న్యాయం చేకూర్చుతాడు. పీడితుల ఆర్తనాదాలు విననివాడికి ప్రళయ దినాన ఎదురయ్యే పర్యవసానం గురించి తలచుకొని సుల్తాన్ అల్తమష్ భయంతో వణికిపోయేవాడు. ఇన్ని సుగుణాలు ఉన్నందునే సుల్తాన్ షమ్సుద్దీన్ అల్తమష్‌ని కొందరు పండితులు దైవప్రియుల జాబితాలో చేర్చారు.

# 71. సుల్తాన్ నాసిరుద్దీన్

సుల్తాన్ షమ్సుద్దీన్ అల్తమష్ మరణానంతరం అతని కొడుకులు, మనవళ్ళు, కొందరు ఇతరుల మధ్య అధికారపీఠం కోసం తీవ్రమైన సంఘర్షణ మొదలయింది. దాదాపు పదేళ్ళపాటు సాగిన ఈ అంతర్గతఘర్షణల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. అధికారపీఠం దావేదారుల్లో కూడా కొందరు హతమార్చబడ్డారు. అల్తమష్ కుమారుల్లో నాసిరుద్దీన్ ఎంతో సౌమ్యుడు, సుగుణవంతుడు, అధికారకాంక్ష లేనివాడు. అయినప్పటికీ ఈ రాజకీయ సంక్షోభం, అరాచకాల బారిన పడి అకారణంగా జైలుపాలయ్యాడు.

పాలకవర్గంలోని ఉన్నతాధికారులు అల్తమష్ అసమర్థవారసుల అంతర్‌యుద్ధాలతో విసిగిపోయి క్రీ.శ. 1246లో నాసిరుద్దీన్‌ని జైలు నుంచి విడుదలచేసి గద్దెనెక్కించారు. సౌశీల్యమూర్తి అయిన నాసిరుద్దీన్ అధికారపీఠం అధిరోహించడంతో ప్రజలు కూడా సంతోషించారు. అతనికి బాల్బన్ లాంటి సమర్థుడు, నిజాయితీపరుడయిన మంత్రి లభించాడు. బాల్బన్ మంత్రి కాగానే అసమర్థవారసుల తిరుగుబాటులు, అరాచకాలను తుదముట్టించాడు. అంతేకాకుండా మొగల్‌ముస్లిమేతర విదేశీదాడుల్ని కూడా అరికట్టి దేశంలో శాంతీసుస్థిరతలు నెలగొల్పాడు. బాల్బన్ తన కుమార్తె 'సలీమా'ను సుల్తాన్ నాసిరుద్దీన్‌కు ఇచ్చి పెళ్ళిచేశాడు.

నాసిరుద్దీన్ రాజ్యాధినేత అయిన తరువాత కూడా నిరాడంబర జీవితాన్నే గడిపాడు. తన హోదాఅంతస్తులతో అక్రమ ప్రయోజనాలు పొందడానికి ఏనాడూ ప్రయత్నించలేదు. దైవభీతి, భక్తిపరాయణత, నీతినడవడికల్లో అతను తన తండ్రిని కూడా మించిపోయాడు. అతని భార్య సలీమా కూడా ఎంతో గుణవతి, వినయవతి.

ఒకరోజు రాణీ సలీమా రొట్టెలు తయారుచేయసాగింది. పొయ్యిమీది పెనంలోని రొట్టె తీస్తుంటే ఆమె చేయి చర్రున కాలింది. దాంతో ఆమె "అయ్యోదేవుడా" అంటూ సుల్తాన్ నాసిరుద్దీన్ దగ్గరకు వచ్చింది. ఆ సమయంలో సుల్తాన్ కూర్చొని ఖుర్‌ఆన్ రాతపని చేస్తున్నాడు. ఖురఆన్ ప్రతులు వ్రాసి, వాటిని పుస్తకాలుగా తయారుచేసి అమ్ముకోవడమే అతని జీవనాధారం.

సుల్తాన్ తన భార్య పరిస్థితి చూడగానే కంగారుపడిపోతూ "ఏమయింది రాణీ? చేతికి ఏమయింది?" అని అడిగాడు.

దానికి ఆమె "ఏం చెప్పమంటారు రాజా! రొట్టె తయారుచేస్తుంటే చెయ్యి పెనంకు తగిలి కాలింది" అని చెప్పింది.

సుల్తాన్ వెంటనే లేచి గూడులో ఉన్న మందు తీసి గాయమయిన ఆమె చేతికి పూశాడు. దాంతో ఆమెకు కాస్తంత ఉపశమనం కలిగింది. రాణిగారి చెయ్యి ఇంటిపని చేయలేనంతగా కాలింది. వంటపనయితే అసలు చేయడం కుదరదు. అంచేత ఆమె ఆందోళనపడుతూ "ఇప్పుడెలాగండీ! ఇతర పనులు అలా ఉంచితే కనీసం వంటపని చేసేవారు కూడా లేరే!" అన్నది.



"నువ్వేమీ దిగులుపడకు. నీ చేతిగాయం మానేవరకు నేను వంటచేస్తాను." అన్నాడు సుల్తాన్ నాసిరుద్దీన్.

"మీకెందుకండీ ఆ శ్రమ! కొన్నాళ్ళ కోసం ఒక సేవికను పెట్టుకుందాం. నా గాయం మానిపోగానే ఆమెను పంపి ఇంటిపనులన్నీ నేనే చేసుకుంటాను" అన్నది రాణి.

సుల్తాన్ ఈమాట విని "రాణీ! నువ్వు చాలా అమాయకంగా మాట్లాడుతున్నావు. సేవకురాలిని పెట్టుకునేంత స్తోమత మనకెక్కడుంది? నా ఆదాయం కూడుగుడ్డలకు సరిపోతే అదే పదివేలనుకుంటున్నాను" అని అన్నాడు.

"మీరు రాజ్యాధినేత. ప్రభుత్వ ధనాగారం మీ అధీనంలోనే ఉంది. కొన్నాళ్ళ కోసం అందులో నుంచి ఓ సేవిక జీతండబ్బు తీసుకుంటే ఏం కొంపలంటుకుంటాయి?"

సుల్తాన్ రాణిగారి మాటలు ఓపిగ్గా విని "ప్రభుత్వధనాగారం నా దగ్గర అమానతుగా ఉంచబడిన ప్రజలసొత్తు. అందులో మన సొంతపనుల కోసం ఖర్చుపెట్టే అధికారం నాకు లేదు. దాన్ని ప్రజాసంక్షేమ కార్యాల కోసమే ఖర్చుచేయాలి. నేను దాని అమానతుదారుడ్ని మాత్రమే" అని అన్నాడు.

ఈ మాటలు విని పాపం రాణిగారు నోరుమూసుకొని దిగాలు పడిపోయింది. సుల్తాన్ ఆమెకు సహనోపదేశం చేశాడు. ఆ తరువాత రాణి అక్కడ్నుంచి లేచి ఇంటి పనుల్లో నిమగ్నురాలై పోయింది.

ఓసారి ఎవరో ఒక నాయకుడు సుల్తాన్‌ని కలుసుకోవడానికి వచ్చాడు. ఆ సందర్భంలో సుల్తాన్ తాను రాసిన ఒక పుస్తకం అతనికి చూపించాడు. ఆ నాయకుడు అందులో కొన్ని తప్పులున్నట్లు ఎత్తిచూపాడు. సుల్తాన్ అతను ఎత్తిచూపిన పదాల చుట్టు పెన్సిల్‌తో వృత్తాలు గీసిపెట్టాడు. అయితే ఆ నాయకుడు వెళ్ళిపోయిన తరువాత సుల్తాన్ ఆ వృత్తాలను చెరిపివేశాడు. సుల్తాన్ సహచరుడొకడు ఆ వృత్తాలను చెరిపివేయడానికి కారణం ఏమిటని అడిగాడు.

దానికి సుల్తాన్ ఇలా చెప్పాడు: "అసలివి తప్పులే కావు. అవి తప్పులని నా మిత్రుడు అపార్థం చేసుకున్నాడు. నేనతని మనస్సుని బాధపెట్టడం ఎందుకని ఆ సమయంలో అతను చెప్పిన పదాల చుట్టూ వృత్తాలు గీశాను. ఇప్పుడు నేను వాటిని చెరిపేశాను."

మరొకసారి సుల్తాన్ ఆస్థానంలో పనిచేసే ముహమ్మద్ అనే ఒక అధికారిని 'తాజుద్దీన్!' అని పిలిచాడు. అప్పుడా అధికారి తనపై సుల్తాన్‌కు కోపం వచ్చిందని భావించి భయంతో అనేక రోజులదాకా ఆస్థానానికి రాకుండా ముఖం చాటేశాడు. సుల్తాన్‌కు ఈ సంగతి తెలిసి ఒక సేసకుని ద్వారా "నేను దైవసాక్షిగా చెబుతున్నాను. ఆరోజు నిన్ను నీ పేరుపెట్టి పిలవడానికి నేను ఉజూతో లేను. ఉజూతో లేకుండా ముహమ్మద్ అనే పదాన్ని నా నోటితో ఉచ్చరించడం బాగుండదని భావించాను. అందుకే ఆరోజు నిన్నలా పిలిచాను" అని చెప్పి పంపించాడు.

ఈవిధంగా సుల్తాన్ నాసిరుద్దీన్ నీతినిజాయితీలతో ఇరవై ఏళ్ళు పరిపాలన చేసి క్రీ.శ. 1266లో చనిపోయాడు. అతను చనిపోయాక అతని మంత్రి బాల్బన్ గద్దెనెక్కాడు.

# 72. సుల్తాన్ బాల్బన్ పాలన

సుల్తాన్ బాల్బన్ అధికారం చేపట్టగానే అతనిలో అసాధారణమైన మార్పు వచ్చింది. ఇప్పుడతను సమర్థుడైన పాలకుడు మాత్రమే గాక గొప్ప దైవభక్తుడు, పరిపాలనా దక్షుడు, న్యాయశీలి కూడా అయ్యాడు. గవర్నర్లు, ఉన్నతాధికారుల కార్యకలాపాలను ఓ కంట కనిపెడ్తుండేవాడు. వారిలో ఎవరైనా అన్యాయానికి, అవినీతికి పాల్పడితే అతను ఎంతటి పెద్దహోదాలో ఉన్నప్పటికీ సుల్తాన్ బాల్బన్ అతడ్ని విడిచిపెట్టేవాడు కాదు.

ఒకసారి బదాయూన్ రాష్ట్రగవర్నర్ ఒక కార్యకర్తను పని సరిగా చేయలేదని చితగ్గొట్టాడు. దాంతో ఆ కార్యకర్త ఆ దెబ్బలకు తట్టుకోలేక ప్రాణం వదిలాడు. ఆ కార్యకర్త భార్య సుల్తాన్ ముందు ఫిర్యాదు చేసింది. అప్పుడు సుల్తాన్ బాల్బన్ వ్యవహారం పరిశోధించి నేరం రుజువైన తరువాత ఆ స్త్రీ ముందే ఆ గవర్నర్‌ని చావగొట్టించాడు. అంటే అతను చచ్చేవరకు కొట్టించాడన్న మాట. అంతేకాదు, గవర్నర్ వ్యవహారం తన దృష్టికి తీసుకురాని కారణంగా అక్కడి ఓ గూఢచారిని కూడా ఉరితీయించాడు.

ఈ సంఘటనతో ప్రభుత్వాధికారులు ప్రజలపై ఎలాంటి దౌర్జన్యం, అన్యాయాలకు పాల్పడకుండా వారి సంక్షేమం కోసం మరింత బాధ్యతాయుతంగా పనిచేయసాగారు. ఈవిధంగా సుల్తాన్ బాల్బన్ ఇరవై ఏళ్ళు పాలన చేసి క్రీ.శ. 1286లో చనిపోయాడు.

బాల్బన్‌కు ముహమ్మద్, బగ్రాఖాన్ అనే ఇద్దరు కొడుకులు ఉండేవారు. వారిద్దరిలో ముహమ్మద్ ప్రతిభాపరాక్రమాల్లో, గుణగణాల్లో ప్రసిద్ధిచెందాడు. అందుకే ఆ కొడుకంటే బాల్బన్‌కు ఎంతో ఇష్టం. సుల్తాన్ బాల్బన్ తన పరిపాలనా కాలంలో అతడ్ని పంజాబ్ గవర్నర్‌గా నియమించాడు. ముహమ్మద్ పన్నెండేళ్ళ పాటు మొగల్‌రాజుల విదేశీదాడుల్ని ఎంతో సమర్థవంతంగా ఎదుర్కొని రాష్ట్రసరిహద్దుల్ని కాపాడగలిగాడు. చివరికి వారితో పోరాడుతూనే అశువులు బాశాడు. ప్రఖ్యాత కవి, సూఫి అయిన అమీర్ ఖుస్రూ అతడ్ని ఎంతో అభిమానించేవాడు. అయితే అమీర్‌ఖుస్రూ కూడా మొగల్‌రాజులకు పట్టుబడి రెండేళ్ళపాటు బలఖ్ జైల్లో పడివుండవలసి వచ్చింది.

సుల్తాన్ బాల్బన్ కొడుకు మరణంతో దిగులేసుకొని మంచం పట్టాడు. చివరికి ఆ దిగులుతోనే తనువు చాలించాడు. అప్పుడు పాలకవర్గం అధికారులు బాల్బన్ రెండవ కొడుకు బగ్రాఖాన్ కుమారుడు కైఖబాద్‌ని గద్దె నెక్కించారు. బాల్బన్ తన మనవడు కైఖబాద్‌కు మంచి విద్యాశిక్షణలే గరిపాడు. కాని అతను అధికారంలోకి వచ్చిన కొన్నాళ్ళకే సహవాసదోషంతో తాగుడుకు, వ్యభిచారానికి బానిసయ్యాడు. దానివల్ల అతని ఆరోగ్యం క్రమంగా క్షీణించింది. పాలనావ్యవస్థ కూడా కుంటుపడిపోయింది. అంచేత పాలకవర్గం అధికారులు అతడ్ని జైల్లో పడవేసి అతని పసికొడుకుని గద్దెపై కూర్చోబెట్టారు.

బాల్బన్ కొడుకు ముహమ్మద్ చనిపోయిన తర్వాత పంజాబ్ గవర్నర్‌గా జలాలుద్దీన్ ఖిల్జీ నియమించబడ్డాడు. అతను బాల్బన్ మరణానంతరం దేశపాలనావ్యవస్థ కుంటుపడటం గమనించి సైన్యం తీసుకొని వెళ్ళి ఢిల్లీని ఆక్రమించుకున్నాడు. ఆ సందర్భంలోనే ఒక సైనికుడు రోగగ్రస్తుడైన కైఖబాద్‌ని హతమార్చాడు.



# 73. అలావుద్దీన్ ఖిల్జీ-ఖాజీ మొగీసుద్దీన్

జలాలుద్దీన్ ఖిల్జీ ఆరేండ్లు ఢిల్లీని పాలించాడు. తరువాత జలాలుద్దీన్ అల్లుడు అలావుద్దీన్ ఖిల్జీ అతడ్ని ఉపవాస స్థితిలో హతమార్చి అధికారం చేజిక్కించుకున్నాడు. ఆ దుర్మార్గుడు ఓ కొత్తమతాన్ని స్థాపించడానికి కూడా ప్రయత్నించాడు. అతను ఈ విషయాన్ని తన ఖాజీ (న్యాయమూర్తి)కి తెలియజేసి సలహా అడిగాడు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఈవిధంగా ఉంది:

సుల్తాన్:-ఖాజీగారూ! నేను మిమ్మల్ని కొన్ని సమస్యల్ని గురించి అడగదలిచాను.

ఖాజీ :- అంటే నా అంత్యకాలం సమీపించిందని తెలుస్తోంది. సమస్య అడిగేందుకు మీరెందుకు శ్రమతీసుకొని వచ్చారు? నా శిరస్సు ఖండించడానికి ఎవరికైనా ఆజ్ఞాపిస్తే సరిపోతుందిగదా! నేను సరైన సమాధానమిస్తే అది మీ అభిమతానికి వ్యతిరేకంగా ఉండవచ్చు. అప్పుడు నేనిచ్చే ఆ సమాధానమే నా చావుకు కారణమవుతుంది. ఒకవేళ నేను మీ అభిమతానికి అనుకూలంగా తప్పుడు సమాధానమిస్తే ఆ తరువాత మీరు విచారణ జరిపి వాస్తవం తెలుసుకొని తప్పుడు సమాధానం ఇచ్చిన నేరానికి నన్ను హత్య చేయిస్తారు. అంటే నేను సరైన సమాధానమిచ్చినా, తప్పుడు సమాధానమిచ్చినా నాకు చావు తప్పేలా లేదన్న మాట.

సుల్తాన్:-మీరు ధర్మశాస్త్రం ప్రకారం సమాధానం ఇవ్వండి. నన్ను నమ్మండి, సరైన సమాధానం ఇచ్చినందుకు మీకెలాంటి ముప్పు వాటిల్లదు. ధర్మశాస్త్రం ప్రకారం ఏ ముస్లిమేతరుణ్ణయినా జిమ్మీ అనవచ్చా?

ఖాజీ :- ముస్లిం పాలకుడు అడగ్గానే జిజ్యా చెల్లించే ముస్లిమేతరుల్ని ధర్మశాస్త్రం జిమ్మీలుగా పరిగణిస్తుంది.

సుల్తాన్:-లంచాలు తీసుకునే, అవినీతికి-కుంభకోణాలకు పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులకు హస్తఖండన శిక్ష విధించవచ్చా?

ఖాజీ :- హస్తఖండన శిక్ష విధించకూడదు. కాకపోతే వారికి బెత్తందెబ్బలు, జైలు నిర్బంధం వంటి తేలికపాటి శిక్షలు విధించవచ్చు.

సుల్తాన్:-నేను రాజ్యాధికారం చేపట్టకముందు దేవగిరి యుద్ధంలో నాకు లభించిన సమరసొత్తు నాదవుతుందా లేక ప్రభుత్వధనాగారానికి పోతుందా?

ఖాజీ :- ముస్లింల సైనికశక్తి ద్వారా లభించే ఏ సంపదయినా అది ప్రభుత్వధనాగారానికే చెందుతుంది. ఆ సమరసొత్తు అంతటికీ మీరు యజమాని కాలేరు. అందులో ఒక సాధారణ సైనికుడికి లభించేటంతటి సొత్తు మాత్రమే మీకు లభిస్తుంది.

సుల్తాన్:-నేను నా భార్యపిల్లల కోసం ప్రభుత్వధనాగారం నుండి ఎంత ధనం తీసుకోవచ్చు?

ఖాజీ :- మీరు శ్రేయస్కర ఖలీఫాలను అనుసరించదలిస్తే సాధారణ ముస్లింలకు లభించేటంతటి ధనం మాత్రమే మీరు తీసుకోగలరు. మధ్యేమార్గం అనుసరించదలిస్తే

రాజ్యాధినేతలకు సమానంగా తీసుకోవచ్చు. ఒకవేళ మీరు బలహీన ఉల్లేఖనాల సహాయం తీసుకోదలిస్తే రాజ్యాధినేతలకంటే కొంచెం ఎక్కువ తీసుకోవచ్చు. కాని భార్యాపిల్లల కోసం కోట్లాది రూపాయలు తీసుకొని ఖర్చుచేస్తే మాత్రం తీర్పుదినాన దేవుని ముందు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుంది.

సుల్తాన్:-సరే, తిరుగుబాటుదారులు, అరాచకశక్తులు, వ్యభిచారులు వగైరా నేరస్థులకు నేను విధిస్తున్న శిక్షలను గురించి మీ అభిప్రాయం ఏమిటీ?

ఖాజీ :- అవన్నీ ధర్మశాస్త్రం ఆజ్ఞలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

సుల్తాన్ ఈ సమాధానం వినగానే కోపోద్రేకాలతో ఊగిపోతూ రాజమందిరానికి వెళ్ళిపోయాడు. మరుసటిరోజు అతను ఖాజీగారిని పిలిపించాడు. ఈసారి సుల్తాన్ తనను తప్పకుండా హతమారుస్తాడని ఖాజీగారు భావించారు. అంచేత ఆయన తలకు కఫన్ వస్త్రం చుట్టుకొని దర్బారులో ప్రవేశించారు. అయితే ఇక్కడ చూస్తే పరిస్థితి స్వరూపమే పూర్తిగా మారిపోయింది. సుల్తాన్ ఖాజీగారిని పరమసంతోషంతో స్వాగతించి ఆయన యదార్థప్రియత్వానికి ఎంతగానో ప్రశంసించాడు.

అదేవిధంగా సుల్తాన్ అలావుద్దీన్ ఖిల్జీ ఇస్లాం కాదని ఓ కొత్తమతాన్ని స్థాపించాలన్న ఆలోచనలో ఉన్నపుడు ఢిల్లీ పోలీస్‌కమీషనర్ అలావుల్‌మలిక్ ఆ పాడుఆలోచనను అడ్డుకోవడానికి నిర్భయంగా అతనికిలా ఉపదేశం చేశాడు:

అలావుల్‌మలిక్:- దైవధర్మం, ధర్మశాస్త్రాల సంబంధం దైవప్రవక్తలతో ముడిపడి ఉంది. వాళ్ళను దివ్యావిష్కృతి మార్గదర్శనం చేస్తుంది. దైవదౌత్యం మహాప్రవక్త ముహమ్మద్ (స) ప్రాభవంతో అంతమైపోయింది. ఒకవేళ మీరిప్పుడు కొత్తమతాన్ని కనిపెడితే ప్రజలంతా మీకు వ్యతిరేకులై పోతారు. దేశంలో అరాచకం, అల్లకల్లోలాలు చెలరేగుతాయి. చంగీజ్‌ఖాన్, హలాకూఖాన్‌లు ఇస్లాంను తుడిచిపెట్టడానికి ప్రయత్నించారు. కాని వారా పని చేయలేకపోయారు. చివరికి వారు అదే ధర్మాన్ని స్వీకరించి ముస్లిం సముదాయంలో చేరిపోయారు.

ఢిల్లీ పోలీస్‌కమీషనర్ నిర్భయంగా చేసిన ఈ హితబోధ విని సుల్తాన్ అలావుద్దీన్ ఖిల్జీ ఎంతో ప్రభావితుడయ్యాడు. దాంతో కొత్తమతం స్థాపించాలన్న తన ఆలోచనను ఉపసంహరించుకున్నాడు. ఢిల్లీకి చెందిన ప్రముఖ దైవప్రియుడు ఖాజా నిజాముద్దీన్ ఔలియా (రహ్మాలై) ఆ రోజుల్లో జీవించేవున్నారు. ఆయన ఢిల్లీ పోలీస్ కమీషనర్ అలావుల్‌మలిక్ చేసిన ఈ హితబోధ సంగతి విని ఆయన్ని నిండు హృదయంతో ఆశీర్వదించారు.

సుల్తాన్ అలావుద్దీన్‌ఖిల్జీ అలెగ్జాండర్ లాగా అనేక భూభాగాలను ఆక్రమించి ప్రపంచ విజేత కావాలన్న అతని కోరికను కూడా ఢిల్లీ పోలీస్‌కమీషనర్ హితోపదేశంతో ఉపసంహరింపజేశాడు. సుల్తాన్ అలావుద్దీన్ ధర్మశాస్త్రానికి వ్యతిరేకంగా ఇలా ప్రవర్తించడానికి కారణం అజ్ఞానం, మూఢత్వాలే. అతనెంతో ప్రతిభాపరాక్రమాలు గల యోధుడు; మంచి పరిపాలనా దక్షుడు. మొగల్ ముస్లిమేతరుల దాడుల్ని సమర్థవంతంగా తిప్పికొట్టిన వీరాధివీరుడు.



సుల్తాన్ అలావుద్దీన్ తన ఇరవైఏళ్ళ పాలనాకాలంలో దేశంలోని అరాచకాన్ని పూర్తిగా నిర్మూలించాడు; దోపిడీదొంగతనాలు, లంచగొండితనం, కుంభకోణాలు మొదలైన నేరాలను తుదముట్టించి శాంతిభద్రతలు కాపాడాడు; ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ కోసం గూఢచారుల్ని నియమించాడు; నిత్యావసర వస్తువుల ధరలు నిర్ణయించి నల్ల బజారుకు అడ్డుకట్టవేశాడు; అనేకప్రాంతాలను జయించి సామ్రాజ్యాన్ని విస్తృతపరిచాడు. అయితే అతని చివరి రెండుమూడు సంవత్సరాలు బాధాకరంగా గడిచాయి. అత్యధిక శ్రమ అతని ఆరోగ్యాన్ని పాడుచేసింది. దాంతో అతను మంచాన పడ్డాడు. అప్పుడు అనేక చోట్ల తిరుగుబాటులు తలెత్తాయి. తిరుగుబాటు వార్తలు వినీవిని అతను మానసిక సంతులనం కోల్పోయి క్రీ.శ. 1310లో చనిపోయాడు. అతని మరణానంతరం దాయాదుల పోరుతో దేశం మళ్ళీ అరాచకం, అల్లకల్లోలాలతో నిండిపోయింది.

ప్రధానమంత్రి మలిక్‌కాఫూర్ పరిపాలనా పగ్గాలు తన చేతిలోకి తీసుకునే ఉద్దేశంతో ఓ ఆరేళ్ళ రాజవంశపు పిల్లవాడ్ని సింహాసనం మీద కూర్చోబెట్టాడు. ఆ తర్వాత పరిపాలనాపగ్గాలు చేతిలోకి తీసుకొని ఇష్టారాజ్యం చేయసాగాడు. పాలకవర్గంలోని ఉన్నతాధికారులు, ఇతర రాజవంశపు సభ్యులకు జైలుశిక్షలు విధించాడు. కొందరి కళ్ళు పీకి వేయించాడు. రాణిగారి ఆస్తిపాస్తుల్ని జప్తుచేసి జైల్లో పడవేయించాడు. అతని హద్దు మీరిన దౌర్జన్యాలతో జనం విసుగెత్తిపోయారు. పాలకవర్గం అధికారులు ఒకేఒక నెలలో అతడ్ని హతమార్చి అలావుద్దీన్ కొడుకు ముబారక్‌షాను గద్దె నెక్కించారు.

ముబారక్‌షా అధికారం చేపట్టగానే అవినీతిపరుడైన ఖుస్రూఖాన్ అనే ఒక ముస్లిమేతరుడ్ని ప్రధానమంత్రిగా నియమించాడు. ఆ దుర్మార్గుడు అతడ్ని మందు-మగువ మత్తులో పడవేసి పూర్తిగా అసమర్థుడ్ని చేశాడు. ఆ తరువాత పాలకవర్గంలోని కొందరు ఉన్నతాధికారుల్ని రాజధాని ఢిల్లీ నుండి సుదూరప్రదేశానికి పంపివేశాడు. మరికొందరిని చంపించాడు. అదీగాక ఓ మోసపుటెత్తుగడతో గుజరాత్‌సైనికుల సహాయంతో ముబారక్‌షాను చంపి అధికారపీఠం చేజిక్కించుకున్నాడు; రాజవంశపు స్త్రీలను అగౌరవపరిచాడు. చివరికి పంజాబ్‌రాష్ట్ర సుబేదార్ గాజీమలిక్ ఢిల్లీపై దాడిచేసి ఆ విద్రోహి, అతని సహచర మూకల దౌర్జన్యాల నుండి దేశానికి విముక్తి కలిగించాడు.

# 74. సుల్తాన్ గియాసుద్దీన్ తుగ్లఖ్ పాలన

ఆ తరువాత గాజీమలిక్ ఒక సభ ఏర్పాటుచేసి రాజ్యంలోని జనశ్రేయోభిలాషులైన నాయకులు, అధికారులందర్నీ పిలిపించాడు. వారి ముందు అలావుద్దీన్ ఖిల్జీ వంశస్థులందర్నీ ఖుస్రూఖాన్ అంతమొందింపజేసిన వైనం వివరిస్తూ ఇలాంటిపరిస్థితిలో పాలనా బాధ్యత ఎవరు తీసుకుంటారని అడిగాడు. అప్పుడు సభికులందరూ గాజీ మలిక్ పేరునే ప్రతిపాదించారు. కాని గాజీమలిక్ అందుకు నిరాకరిస్తూ ఇలా ప్రసంగించాడు:

“సోదరులారా! ఖుస్రూఖాన్ దౌర్జన్యగాథలు వినీవిని నాకు చిర్రెత్తిపోయింది. నేను దైవప్రసన్నత కోసం మూడు పనుల విషయంలో నిర్ణయం తీసుకున్నాను. (1) నేను భారత్‌భూభాగంలో ఇస్లాంధర్మాన్ని పునరుజ్జీవింపజేయదలిచాను. (2) ఈ దేశ పరిపాలనా

పగ్గాలను ఖుస్రూఖాన్ నుండి లాగి ఎవరైనా సమర్థుడికి అప్పగించాలని నిర్ణయించు కున్నాను. (3) రాజవంశాన్ని అతికిరాతకంగా నిర్మూలించిన విద్రోహుల్ని శాశ్వతంగా కడతేర్చి దేశాన్ని కాపాడాలని భావించాను. దేవుని దయవల్ల ఇప్పుడీ మూడు పనులు నెరవేరాయి. ఇకముందు కూడా దైవప్రసన్నత కోసమే నా ఖడ్గాన్ని ప్రయోగిస్తాను. నాకు ఎలాంటి అధికారకాంక్ష లేదు. నా సింహాసనం, కిరీటం నా ధనుర్బాణాలే. ఇవి చాలు నాకు. ఇక్కడ పెద్ద పెద్ద నాయకులు ఉన్నారు. వారిలో ఎవరినైనా ఎన్నుకోండి."

అయినప్పటికీ సభికులందరూ గాజీమలిక్‌నే కేంద్రబిందువుగా చేసుకొని అతడ్నే అధికారపీఠం అధిరోహించాలని పట్టుబట్టారు. అంచేత గాజీమలిక్ ఇష్టం లేకపోయినా సభికుల వత్తిడికి లొంగి గియాసుద్దీన్ తుగ్లఖ్ బిరుదుతో క్రీ.శ. 1320లో గద్దె నెక్కాడు.

సుల్తాన్ గియాసుద్దీన్ తుగ్లఖ్ సహజంగా సుగుణవంతుడు, గొప్ప దైవభక్తుడు, జనశ్రేయోభిలాషి. అతను ప్రతిభాపరాక్రమాలు గల వీరాధివీరుడు మాత్రమే గాకుండా మంచి పరిపాలనాదక్షుడు కూడా. అతని దృష్టి ఎల్లప్పుడూ ప్రజాసంక్షేమ కార్యాలపైనే ఉంటుంది. అందువల్ల పరిపాలనా పగ్గాలు చేపట్టగానే అతను అతిస్వల్ప కాలంలోనే ఎంతో నేర్పుతో సంఘవిద్రోహుల అరాచకం, అల్లకల్లోలాను అంతమొందించి దేశంలో శాంతిభద్రతలు పునరుద్ధరించాడు. మరోవైపు మొగల్ ముస్లిమేతరుల దాడుల్ని అరికట్టి దేశసరిహద్దుల్ని సురక్షితంగా ఉంచాడు. రాజ్యమంతటా నీతిన్యాయాలను నెలగొల్పాడు. ఆయన పాలనాకాలంలో ఆహారోత్పత్తులు కూడా పెరిగాయి. ప్రజలు సుఖసంతోషాలతో జీవించసాగారు. కాని ఇలా నాలుగేళ్ళు పాలన సాగిందేమో అకస్మాత్తుగా ఓ ప్రమాదం జరిగింది. ఇంటికప్పు కూలిపోవడంతో ఆ రాజర్షి తనువు చాలించి జనాన్ని శోకసముద్రం లో ముంచిపోయాడు. గియాసుద్దీన్ మరణానంతరం అతని కొడుకు ముహమ్మద్ తుగ్లఖ్ క్రీ.శ. 1325లో అధికారపగ్గాలు చేపట్టాడు.

# 75. సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ పాలన

ముహమ్మద్ తుగ్లఖ్ బహుముఖ ప్రవీణుడు. మంచి తెలివితేటలతో పాటు దూర దృష్టి కలవాడు; గొప్ప ధర్మవేత్త, అనేక కళలలో ఆరితేరినవాడు, వక్త, రచయిత, కవి, గొప్ప దానశీలుడు, దైవభీతిపరుడు, షరీఅత్ ఆజ్ఞల్ని తూ.చ. తప్పకుండా పాటించేవాడు, పేదలు-పీడితుల పెన్నిధి, వాగ్దానపాలకుడు, క్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వాడు, ఒక పని విషయంలో నిర్ణయం తీసుకున్న తరువాత దాన్ని పూర్తిచేయనంత వరకు వదలిపెట్టని స్థిరచిత్తుడు.

న్యాయవ్యవహారాల్లో సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ తన పదవీహోదాలను సైతం ఖాతరుచేయని గొప్ప న్యాయశీలుడు. ప్రజలు సుల్తాన్‌కు వ్యతిరేకంగా కూడా న్యాయ స్థానంలో ఫిర్యాదుచేయడానికి అనుమతి ఉండేది. ఓసారి ఒక ముస్లిమేతరుడు సుల్తాన్ తన సోదరుడ్ని ఏ కారణం లేకుండానే హతమార్పించాడని న్యాయస్థానంలో ఫిర్యాదు చేశాడు. దాంతో సుల్తాన్ సాధారణ నిందితుడిలా న్యాయస్థానానికి హాజరయ్యాడు. న్యాయమూర్తి కేసు విచారణ జరిపి తీర్పు ఇస్తూ "సుల్తాన్ నేరం రుజువయింది. కనుక



సుల్తాన్ హతుని వారసులకు రక్తపరిహారం చెల్లించి సయోధ్య చేసుకోవాలి; లేకుంటే సుల్తాన్‌కు ప్రతీకారశిక్ష విధించబడుతుంది" అని చెప్పాడు. అప్పుడు సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ హతుని వారసులకు రక్తపరిహారం చెల్లించి వారితో సయోధ్య చేసుకున్నాడు. ఈవిధంగా అతని ప్రాణం దక్కింది.

సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ కాలంలోనే ప్రఖ్యాత అరబ్ పర్యాటకుడు ఇబ్నెబతూత మన దేశంలో పర్యటించాడు. అతను ఢిల్లీ, దాని పరిసరప్రాంతాల్లో ఎనిమిదేళ్ళు నివసించాడు. అతను తన సఫర్‌నామా (ప్రయాణగ్రంథం)లో తాను కళ్ళారా చూసిన ఒక విచిత్ర సంఘటనను ఈ విధంగా పేర్కొన్నాడు:

"ఒకసారి సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ రాజధాని ఢిల్లీలో గస్తీ తిరుగుతున్నపుడు ఒకచోట ఓ పేదపిల్లవాడు నిల్చొని ఏడుస్తూ ఉండటం చూశాడు. ఆ పేదపిల్లవాడ్ని మరొక ధనికపిల్లవాడు దూషిస్తున్నాడు. ధనికపిల్లవాడు పేదపిల్లవాడ్ని కొట్టివుంటాడని సుల్తాన్ భావించాడు. నిజానికి పేదపిల్లవాడే ధనికపిల్లవాడ్ని కొట్టాడు. అయితే ధనికుడైన ప్రత్యర్థి తనను చితకబాదుతాడేమో నన్న భయంతో అతను ఏడ్వసాగాడు. కాని సుల్తాన్ అపార్థానికి గురయి బెత్తంతో ధనికపిల్లవాడ్ని చితకబాదాడు."

"ఆ తరువాత ధనికబాలుడు సుల్తాన్ తనను అన్యాయంగా బెత్తంతో కొట్టాడని అతనికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ జరిపిన తరువాత న్యాయమూర్తి సుల్తాన్‌కు వ్యతిరేకంగా తీర్పిచ్చాడు. అప్పుడు సుల్తాన్ ధనిక బాలుడ్ని దగ్గరకు పిలిచి అతని చేతికి బెత్తం ఇచ్చి తనను తిరిగి కొట్టి బదులు తీర్చుకో మని చెప్పాడు. ఆ బాలుడు సుల్తాన్‌ని కొట్టడానికి భయపడ్డాడు. సుల్తాన్ ప్రమాణంచేసి మరీ తనను కొట్టి బదులుతీర్చుకోమని ఆ బాలుడ్ని పురమాయించాడు. అప్పుడా బాలుడు న్యాయస్థానంలో సభికులందరూ చూస్తుండగా సుల్తాన్‌ని బెత్తంతో ఇరవైఒక్క సార్లు కొట్టాడు. ఇలా ఆ బాలుడికి బదులు తీర్చుకోవడానికి సుల్తాన్ మనస్ఫూర్తిగా అవకాశం కల్పించాడు."

సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్, ప్రజలు తమ ఫిర్యాదులు ఏమైనా ఉంటే వాటిని తన దృష్టికి తీసుకొస్తే వారికి న్యాయం చేకూర్చబడుతుందని బహిరంగ ప్రకటన చేయిం చాడు. దానికోసం అతను వారానికి రెండు రోజులు ప్రత్యేకించి, ఫిర్యాదుల పరిశీలనకై నలుగురు గుమస్తాలను నియమించాడు. వారు సోమ, గురువారాల్లో ఓ నిర్ణీత స్థలం లో కూర్చొని ప్రజల ఫిర్యాదుల్ని నమోదుచేసుకొని సుల్తాన్‌కు అందజేస్తారు. సుల్తాన్ వాటిని పరిశీలించి సంబంధిత వ్యక్తులకు న్యాయం చేకూర్చుతాడు.

నమాజ్ దైవధర్మానికి చెందిన అతిముఖ్యమైన అంశం. ఈ నమాజే దైవవిధేయతకు మనిషిని పురిగొల్పుతుంది; అశ్లీలం, చెడులకు దూరంగా ఉంచుతుంది. అందువల్ల సుల్తాన్ స్వతహాగా తాను నమాజ్‌ని క్రమం తప్పకుండా చేయడమే గాక ప్రజల్ని కూడా నియంత్రించాడు. నమాజ్ వేళల్లో ఎవరైనా నమాజ్ చేయకుండా బజార్లలో తిరుగుతుంటే అలాంటివారిని శిక్షించడం జరుగుతుందని ఆజ్ఞ జారీచేశాడు. తత్ఫలితంగా ముస్లిము లంతా పక్కా నమాజీలు అయ్యారు; మస్జిద్‌లు కిటకిటలాడసాగాయి.

సుల్తాన్ ముహమ్మద్ ధర్మవ్యాప్తి కోసం కూడా ఎంతో పాటుపడ్డాడు. అతని పాలనా కాలంలో ఉత్తరభారత్‌లో కొంతవరకైనా ఇస్లాం వ్యాపించింది. కాని దక్షిణభారత్‌లో ఇంకా ఇస్లాం కిరణాలు ప్రసరించలేదు. దానికోసం గతసుల్తాన్‌లు కృషిచేశారుగాని, రాజధాని ఢిల్లీ చాలాదూరం ఉండటంవల్ల దక్షిణభారత్‌లోని హిందూరాజులు కొన్నాళ్ళకే సర్వ స్వతంత్రులై ఇస్లాంవ్యాప్తికి అడ్డుగోడలై నిలిచేవారు. అంచేత సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ రాజధానిని ఢిల్లీ నుంచి దక్షిణభారత్‌లోని దేవగిరికి మార్చాడు. ఢిల్లీలోని ముస్లింలను, ముఖ్యంగా ధర్మవేత్తలను, సూఫీలను దేవగిరికి రప్పించాడు. దాంతో దక్షిణభారత్‌లో కూడా ఇస్లాం క్రమీణా వ్యాపించసాగింది.

ప్రాపంచిక పూజారులైన దర్మవేత్తలు, సూఫీల కారణంగా ముస్లింలలో రకరకాల బిదత్ (కొత్తపోకళ్ళు), ధర్మంలోలేని నూతనరివాజులు వచ్చిచేరాయి. సుల్తాన్ సంస్కరణ కోసం ఎంతగానో కృషిచేశాడు. కాని మూఢముస్లింలు సంస్కరణ ప్రయత్నాలకు అడుగడుగునా అడ్డుతగులుతో సుల్తాన్‌ని చికాకుపరిచారు. వారిలో అనేకమంది తిరుగు బాటుదారులతో చేతులు కలిపి ప్రతిఘటిస్తున్నప్పటికీ సుల్తాన్ ఏమాత్రం వెనుకంజ వేయకుండా తన బాధ్యతను నిర్వర్తిస్తూ ముందుకుసాగాడు. అలాంటి ఒక తిరుగు బాటును అణచడానికి గుజరాత్ వెళ్ళినపుడు జబ్బుపడ్డాడు. దాంతో సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ ఇరవై ఏడేళ్ళ పాలన తర్వాత క్రీ.శ. 1351లో చనిపోయాడు.

# 76. సుల్తాన్ ఫిరోజ్ తుగ్లఖ్ పాలన

సుల్తాన్ ముహమ్మద్ తుగ్లఖ్ మరణానంతరం అతని పినతండ్రి కుమారుడు ఫిరోజ్ తుగ్లఖ్ సింహాసనం అధిష్ఠించాడు. ఏడేళ్ళప్రాయంలో అనాథఅయితే అతడ్ని ముహమ్మద్ తుగ్లఖ్ తన సంరక్షణలోకి తీసుకొని విద్యాబుద్ధులు నేర్పించి మంచి శిక్షణ ఇచ్చాడు. ఫిరోజ్ కూడా గొప్ప దైవభక్తుడే. పాలకవర్గం సభ్యులు, ధర్మవేత్తలు ముహమ్మద్ తుగ్లఖ్ మరణశాసనం ప్రకారం ఫిరోజ్‌ని రాజ్యాధినేత చేయడానికి ప్రయత్నించినపుడు ఫిరోజ్ అందుకు నిరాకరిస్తూ తాను హజ్‌యాత్ర జరపడానికి నిర్ణయించుకున్నానని, అంచేత తనకు బదులు మరొక వ్యక్తిని సుల్తాన్‌గా నియమించుకోమని అన్నాడు. అయితే ఫిరోజ్ కంటే యోగ్యుడైన మనిషి లేనందున ధర్మవేత్తలు నచ్చజెప్పడంతో ఫిరోజ్ తప్పనిసరి పరిస్థితిలో పరిపాలనా పగ్గలు చేతిలోకి తీసుకున్నాడు.

సుల్తాన్ ఫిరోజ్ తుగ్లఖ్ ముహమ్మద్ తుగ్లఖ్ లాగే ఎంతో దైవభీతిపరుడు. షరీఅత్ ఆదేశాలను పూర్తిగా పాటించేవాడు. అంతేకాదు, అతను గొప్ప ప్రజాశ్రేయోభిలాషి కూడా. ఎల్లప్పుడూ ప్రజాసంక్షేమ కార్యాలపైనే దృష్టి కేంద్రీకరిస్తాడు. అతను ఎల్లడెల్లడలా బావులు తవ్వించాడు, కాలువలు తీయించాడు, రోడ్లు వేయించాడు, వంతెనలు కట్టించాడు, ఆసుపత్రులు నెలకొల్పాడు, పాఠశాలలు స్థాపించాడు. ఫిరోజ్ తుగ్లఖ్ ఇస్లాంవ్యాప్తి విషయంలో కూడా ఎంతో కృషిచేశాడు. ప్రతి వ్యవహారంలోనూ అతను ధర్మవేత్తల్ని సంప్రదించి వారి సలహాల ప్రకారం పని చేసేవాడు. ఈవిధంగా సుల్తాన్ ఫిరోజ్ తుగ్లఖ్ ముప్ఫయి ఎనిమిదేండ్లు పరిపాలన చేసి క్రీ.శ. 1387లో రోగగ్రస్తుడయి చనిపోయాడు.



# 77. తైమూర్ లంక్ విధ్వంసకాండ

పూర్వం ముస్లించక్రవర్తుల్లో తైమూర్‌లంక్ అనే ఓ క్రూరాతిక్రూరుడు ఉండేవాడు. అతను క్రీ.శ. 1336లో సమర్‌ఖంద్ సమీపంలోని ఒక గ్రామంలో పుట్టాడు. అతని తండ్రి తురుష్కజాతికి చెందిన బర్లాస్ తెగకు చెందినవాడు. తల్లి చంగీజ్‌ఖాన్ వంశానికి చెందిన స్త్రీ. తైమూర్‌లంక్ తనను మొగల్ వంశానికి చెందినవాణ్ణని గర్వంగా చెప్పుకునేవాడు. చంగీజ్‌ఖాన్, అతని వారసులు మొగల్‌సైనికుల సహాయంతో ఘోరమైన విధ్వంసకాండ జరిపి మధ్యాసియాలో ఓ పెద్ద సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. కాని తైమూర్ పుట్టిన తర్వాత చంగీజీవంశం పతనావస్థలో ఉండింది. తైమూర్ దాన్ని ఉపయోగించుకుంటూ 33ఏళ్ళ వయసులో సమర్‌ఖంద్ సింహాసనాన్ని ఆక్రమించుకున్నాడు.

ఆ తరువాత అతను ఓ భారీ సైనికపటాలం తయారుచేసుకొని మధ్యప్రాచ్యంలోని ముస్లిం రాజ్యాలపై విరుచుకుపడ్డాడు. ఆ రోజుల్లో ముస్లింరాజ్యాల పరిస్థితి చాలా అధ్వాన్నంగా తయారైవుంది. పాలకులు తమ బాధ్యతలు విస్మరించి భోగభాగ్యాల్లో మునిగి తేలుతుండేవారు. స్వార్థపరత్వం అనైక్యతా-అంతఃకలహాలకు తలుపులు తెరచింది. ఫలితంగా దైవాగ్రహం తైమూర్ రూపంలో వారి రాజ్యాలపై విరుచుకుపడింది. తైమూర్‌లంక్ సర్వత్రా విధ్వంసకాండ సృష్టించి, వారి సిరిసంపదల్ని దోచుకున్నాడు. వారి ఆకాశహర్మ్యాలను తగలబెట్టాడు. వారి ఇళ్ళు, కోటలను నేలమట్టం చేశాడు. లక్షల సంఖ్యలో అమాయకప్రజల్ని ఊచకోతకోశాడు. ఆ శవాలపుర్రెలతో మీనార్లు నిర్మించాడు.

తైమూర్‌లంక్ రోమ్‌సముద్రం సమీపందాకా తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకున్న తరువాత 69 ఏళ్ళ వయసులో భారతదేశం వైపు దృష్టిసారించాడు. భారత్‌పై మొగల్ పాలకుల దాడులు కొత్తేమీ కాదు. ఇంతకు పూర్వం కూడా ఇంకా ఇస్లాం స్వీకరించని చంగీజ్‌మొగల్ పాలకులు భారత్‌పై దాడులకు తెగబడ్డారు. అయితే అప్పటి భారత్ ముస్లింరాజులు వారిని ఎదుర్కొని తరిమేశారు. ఆవిధంగా ఆనాడు ఢిల్లీ సుల్తానులు మొగల్‌దాడుల నుండి భారత సరిహద్దుల్ని కాపాడారు. అయితే సుల్తాన్ ఫిరోజ్ తుగ్లఖ్ తదనంతరం వచ్చిన అతని అసమర్థ వారసులు అంతఃకలహాల్లో మునిగితేలసాగారు. తైమూర్ ఈ అవకాశం వినియోగించుకుంటూ భారత్‌పై దండయాత్రకు బయలుదేరాడు.

మొదట అతను అఫ్గాన్ రాజు మూసాఖాన్‌తో తలపడవలసి వచ్చింది. దానికోసం అతను ఒక సేనాపతిని పంపితే యుద్ధంలో ఆ సేనాపతి చంపబడగానే సైన్యం పారిపోయి తిరిగొచ్చింది. అప్పుడు తైమూర్‌లంక్ ఓ ఎత్తుగడ వేశాడు. చంపబడిన సేనాపతి సోదరుడు కూడా ఆ యుద్ధంలో పాల్గొన్నాడు. తైమూర్ అతడ్ని జైల్లో పడవేసి "మూసాఖాన్ నా మిత్రుడు, వారు నా అనుమతి లేకుండా అఫ్గాన్‌పై దాడిచేశారు. దాని ఫలితమే ఈ జైలుశిక్ష" అని ప్రచారం చేశాడు. మూసాఖాన్ ఈ ప్రచారం సంగతి విని మోసంలో పడిపోయాడు. అతను నిజంగా తైమూర్‌ని తన స్నేహితుడని భావించి అతడ్ని కలుసుకోవడానికి వచ్చాడు. అప్పుడు తైమూర్ మూసాఖాన్‌ని ఘనంగా స్వాగతించి, గుట్టుచప్పుడు కాకుండా హతమార్చి అతని కోటను ఆక్రమించుకున్నాడు. ఆ తరువాత తైమూర్ తన మనుమడు పీర్‌ముహమ్మదకు ముప్ఫయివేల సైన్యం ఇచ్చి పంపాడు.

పీర్ ముహమ్మద్ సైన్యం తీసుకొని సరిహద్దు ప్రాంతంలోని పఠాన్ ముస్లింలతో పోరాడుతూ ముల్తాన్‌కు చేరుకున్నాడు. అక్కడి పాలకుడ్ని ఓడించి ముల్తాన్ పట్టణాన్ని ఆక్రమించుకున్నాడు. పీర్‌ముహమ్మద్ వెళ్ళిపోయాక తైమూర్‌లంక్ లక్షమంది సైనికులతో ఖైబర్‌కనుమ గుండా పంజాబ్‌లోకి ప్రవేశించాడు. అక్కడ దోపిడీ, దౌర్జన్యాలు చేస్తూ లాహోర్‌కు చేరుకొని దాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

అటు ఢిల్లీరాజ్యానికి చెందిన కొందరు నమ్మకద్రోహులు తైమూర్ సన్నిధికి చేరుకొని అతనిపట్ల తమ విధేయత చాటుకున్నారు. తైమూర్ వారి సహకారంతో దోపిడీలు సాగిస్తూ ముల్తాన్‌కు చేరుకున్నాడు. ముల్తాన్‌లో మనుమడ్ని తీసుకొని లక్షాముప్ఫయివేల సైన్యంతో అనేక కోటలను నేలమట్టంచేస్తూ, జనావాసాలను ధ్వంసంచేస్తూ, హత్యా కాండలు సాగిస్తూ ఢిల్లీ సమీపానికి చేరుకున్నాడు. అతడ్ని ఎదుర్కోవడానికి యాభైవేల మంది సైనికులు ముందుకొచ్చారు. తైమూర్ యుద్ధానికి ముందు తన అధీనంలోని లక్షమంది ఖైదీలను ఢిల్లీసైనికుల ముందే నిర్దాక్షిణ్యంగా హతమార్పించాడు.

ఆ తర్వాత జరిగిన యుద్ధంలో ఢిల్లీసైన్యం ఘోరపరాజయం చవిచూసింది. ఢిల్లీ సుల్తాన్ మహ్మూద్ తుగ్లఖ్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గుజరాత్‌కు పారిపోయాడు. దాంతో తైమూర్‌లంక్ ఢిల్లీని ఆక్రమించుకున్నాడు. అతని సైన్యం విజయోత్సాహంతో నగరంలో ప్రవేశించి లూటీకి పాల్పడింది. ఆతర్వాత సామూహిక హత్యాకాండకు తెగబడి రక్తపుటేరులు ప్రవహింపజేసింది. ఇలా మొదటిసారిగా ఢిల్లీనగరం సర్వనాశనమయింది.

తైమూర్‌లంక్ పదిహేను రోజుల తర్వాత ఢిల్లీ నుండి బయలుదేరి మీరట్ చేరుకొని అక్కడి కోటను ధ్వంసంచేసి పట్టణాన్ని దోచుకున్నాడు. ఆతర్వాత సహారన్‌పూర్, బిజ్నూర్ జిల్లాలను జయించి దొరికినంత దోచుకొని, అనేకమందిని ఖైదీలుగా చేసుకొని జమ్మూకు చేరుకున్నాడు. ఈ దాడుల్లో అతను తనకు సహకరించిన ఖిజర్‌ఖాన్ అనే ఓ రాజద్రోహిని పంజాబ్ పాలకుడిగా నియమించి సమర్‌ఖండ్‌కు వెళ్ళిపోయాడు.

తైమూర్‌లంక్ ఢిల్లీలో ఉన్నపుడే కాన్స్టాంటినోపిల్ చక్రవర్తి సీజర్ ఉస్మానియా తురుష్క సామ్రాజ్యాధినేత బాయజీద్ యల్దరమ్‌కు వ్యతిరేకంగా తనకు సహాయం చేయమని అర్థిస్తూ తైమూర్‌కు లేఖ రాశాడు. ఆ లేఖలో అతను తైమూర్‌ని బాగా రెచ్చగొట్టాడు. దాంతో రెచ్చిపోయిన ఆ దుర్మార్గుడు ఉస్మానియా తురుష్క సామ్రాజ్యంపై తుఫానులా విరుచుకుపడి విధ్వంసకాండకు పాల్పడ్డాడు. అతను ముస్లిం అయివుండి కూడా ముస్లింరాజ్యాలపై భయంకరమైన దాడులకు తెగబడి వేలాదిమంది ముస్లింలను ఊచకోత కోయడమేగాక వారి స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టుకున్నాడు.

ఆనాడు బాయజీద్ కాన్స్టాంటినోపిల్‌ని ముట్టడించి యుద్ధం చేయడంలో నిమగ్నుడై ఉన్నాడు. అతను తైమూర్ విధ్వంసకాండ గురించి విని ముట్టడి వదలి ఆ దుర్మార్గుడ్ని ఎదుర్కోవడానికి బయలుదేరాడు. కాని జిత్తులమారి తైమూర్ సైనికస్థావరాలు మార్చుతూ బాయజీద్ సైన్యాన్ని వందలమైళ్ళు ప్రయాణించేలా చేసి చివరికి అలసి పోయిన ఆ సైన్యాన్ని ఓడించి, బాయజీద్‌ని ఎనిమిది నెలలపాటు బోనులో బంధించి బోనులోనే ఊపిరివిడిచేలా చేశాడు. (వివరాలకు 618-620 పేజీలు చూడండి.)



# 78. సయ్యిద్ వంశం పాలన

తైమూర్‌లంక్ దాడుల తరువాత ఉత్తరభారత్‌లో కరువురక్కసి విరుచుకుపడింది. దానికితోడు అంటువ్యాధులు వచ్చిపడ్డాయి. తైమూర్ విధ్వంసకాండ, కరువుకాటకాలు, అంటూవ్యాధులతో ప్రజలు అనేకమంది మృత్యువాత పడగా మిగిలినవారు విలవిల్లాడి పోయారు. తైమూర్ దాడులతో భయపడి గుజరాత్‌కు పారిపోయిన మహ్మూద్ తుగ్లఖ్ కొన్నాళ్ళకు ఢిల్లీ తిరిగొచ్చి తన గతప్రాభవాన్ని మళ్ళీ పొందాలనుకున్నాడు. కాని తన అసమర్ధనాయకులు, స్వార్థపరుల కారణంగా ఏమీ చేయలేకపోయాడు. చివరికి క్రీ.శ. 1412లో జబ్బుపడి చనిపోయాడు. దాంతో తుగ్లఖ్‌వంశం పాలన అంతమైపోయింది.

తైమూర్‌లంక్ భారత్ నుండి వెళ్ళిపోతూ మహ్మూద్ తుగ్లఖ్ విద్రోహి ఖిజర్‌ఖాన్‌ని పంజాబ్ పాలకుడిగా నియమించాడని మనం గత పేజీల్లో తెలుసుకున్నాం. మహ్మూద్ తుగ్లఖ్ చనిపోయాక ఖిజర్‌ఖాన్ ఢిల్లీ పీఠం ఆక్రమించుకొని తైమూర్ తరపున సామంత రాజుగా పాలన చేయసాగాడు. ఖిజర్‌ఖాన్ దేశంలో శాంతిభద్రతలు పునరుద్ధరించడానికి ప్రయత్నించాడు. కాని అందులో అతను సఫలం కాలేకపోయాడు. ఏడేళ్ళ తర్వాత క్రీ.శ. 1431లో అతని మరణానంతరం అతని కొడుకు ముబారక్‌షా గద్దెనెక్కాడు. అతను గద్దెనెక్కిన కొన్నాళ్ళకు తైమూర్‌తో సంబంధాలు తెంచివేసి దేశంలో శాంతిభద్రలను తిరిగి నెలగొల్పడానికి ప్రయత్నించాడు. అయినప్పటికీ అనేకప్రాంతాల్లో సుబేదారులు, జమీం దారులు అరాచకాలకు తెగబడుతూ అతడ్ని ప్రశాంతంగా ఉండనివ్వలేదు. మరొక వైపు పాలనాయంత్రాంగం అధికారుల అవినీతిచర్యల కారణంగా ప్రజల నుండి ఫిర్యాదుల వెల్లువ మొదలైంది. చివరికి సుల్తాన్ సమర్థుడైన కమాలుల్ మలిక్‌ని ప్రధానిగా నియమించడంతో అతని ద్వారా ఈ అరాచకం కొంతవరకు అణగిపోయింది.

క్రీ.శ. 1434లో సర్దారుల్‌మలిక్ అనే ఓ విద్రోహి సుల్తాన్ ముబారక్‌షాను కుట్రతో హతమార్చాడు. తర్వాత అతను ముబారక్‌షా అన్నకొడుకు ముహమ్మద్‌షాను నామ మాత్రపు సుల్తాన్‌గా గద్దెనెక్కించి పాలనాధికారాలన్నీ తన గుప్పెట్లోకి తీసుకున్నాడు. కొన్నాళ్ళకు అతను కూడా పాలకవర్గంలోని అనేకమంది ఉన్నతాధికారుల్ని, దేశశ్రేయోభి లాషుల్ని చంపడమో, జైల్లో పడవేయడమో చేశాడు. దాంతో ఢిల్లీవాసుల్లో పౌరుషం పురి విప్పింది. వారు సర్దారుల్‌మలిక్‌ని, అతని మిత్రమూకను హతమార్చి ముహమ్మద్‌షాకు పూర్తి అధికారాలు కట్టబెట్టారు. ముహమ్మద్‌షా మరణానంతరం అతని కొడుకు అలావుద్దీన్ (షాహ్‌ఆలమ్) పరిపాలనా పగ్గాలు చేపట్టాడు.

అయితే అలావుద్దీన్ అసమర్థత కారణంగా ఢిల్లీ చుట్టుపక్కల సుబేదారులు సర్వ స్వతంత్రులైపోయారు. దాంతో అతని పాలన ఢిల్లీకి, దాని పరిసరప్రాంతాలకు పరిమితమై పోయింది. చివరికతను పాలనావ్యవహారాలతో విసుగెత్తిపోయి క్రీ.శ. 1451లో ఢిల్లీపీఠాన్ని సర్‌హింద్ ప్రాంతం సుబేదార్ బహ్‌లూల్‌ఖాన్ లోదీకి అప్పగించి బదాయూన్‌కు శాశ్వతంగా వెళ్ళిపోయాడు. దాంతో సయ్యిద్‌వంశం పాలన అంతమైపోయి లోదీవంశం పాలన ప్రారంభమయింది.

# 79. లోదీ వంశం పాలన

బహ్‌లూల్ ఖాన్ అఫ్గాన్ జాతీయుడు. అఫ్గాన్ సరిహద్దు ప్రాంతంలోని సుప్రసిద్ధ లోదీ తెగతో అతనికి సంబంధం ఏర్పడింది. అందువల్ల అతను బహ్‌లూల్‌ఖాన్ లోదీ పేరుతో ఖ్యాతిచెందాడు. సుల్తాన్ ముహమ్మద్‌షా అతని శక్తిసామర్థ్యాలు గమనించి అతడ్ని తన కొడుకుగా చేసుకున్నాడు. ముహమ్మద్‌షా కన్నకొడుకు అలావుద్దీన్ అతడ్ని అన్నగా భావించేవాడు. అలావుద్దీన్ తిరుగుబాటుదారుల, విదేశీశక్తుల అరాచకాలతో విసుగుచెంది పరిపాలనాపగ్గాలు బహ్‌లులుల్‌ఖాన్‌కు అప్పగించగానే అతను అఫ్గాన్ సరిహద్దు ప్రాంతంలోని తన లోదీతెగ వారందర్నీ రప్పించుకొని వారికి సామ్రాజ్యంలోని ముఖ్యమైన బాధ్యలన్నిటినీ అప్పగించాడు. వారు ఎంతో బాధ్యతాయుతంగా, నిజాయితీగా వ్యవహరిస్తూ కొద్దికాలంలోనే అరాచకాలను అంతమొందించి శాంతిభద్రతలు పునరుద్ధరించగలిగారు.

దాంతో కుదించుకుపోయిన సామ్రాజ్యపరిధి విస్తృతమయింది. ఢిల్లీ ప్రాభవం తిరిగొచ్చింది. అయినప్పటికీ బహ్‌లూల్‌ఖాన్ ఏమాత్రం అహంకారానికి లోనుకాకుండా నిరాడంబర జీవితం గడిపాడు; నమాజ్, రోజా విధులు క్రమం తప్పకుండా పాటించేవాడు; ధర్మవేత్తలను, మహనీయుల్ని గౌరవించేవాడు. అంతేకాకుండా అతనెంతో దానశీలుడు, న్యాయప్రియుడు; జనశ్రేయోభిలాషి; పాలకవర్గంసభ్యులు, సుబేదార్ల పట్ల సత్ప్రవర్తనతో మసలుకునేవాడు. ఇన్ని సద్గుణాల కారణంగానే బహ్‌లూల్‌ఖాన్ తన పఠాన్ సర్దారులకు ఎంతో ప్రీతిపాత్రుడయ్యాడు. వారి సహాయసహకారాలతో అతను 38 సంవత్సరాల పాటు పరిపాలన చేసి ఢిల్లీ సామ్రాజ్య మృతదేహంలో తిరిగి జీవం పోశాడు.

**1-సుల్తాన్ సికందర్ లోదీ పాలన:-** బహ్‌లూల్ లోదీ తదనంతరం అతని చిన్నకొడుకు సికందర్‌లోదీ ఢిల్లీసింహాసనం అధిష్టించాడు. విద్యాజ్ఞానాలు, శక్తిసామర్థ్యాలు ధర్మపరాయణత, నీతినిజాయితీల దృష్ట్యా అయిదుగురు అన్నదమ్ముల్లో అందరికంటే చిన్నవాడైన సికందర్‌నే పాలకవర్గం రాజకీయవారసుడిగా ఎన్నుకుంది. అయితే సికందర్ పెద్దన్న బార్బక్ ఈ ఎన్నికతో విభేదించి సుల్తాన్‌కు ప్రత్యర్థిఅయి ముందుకొచ్చాడు. కాని యుద్ధంలో ఘోరపరాజయం చవిచూసి పారిపోయాడు. సికందర్ తన పెద్దన్నను పెద్ద మనసుతో క్షమించాడు. అయితే అతని అధీనంలోని జోన్పూర్ ప్రాంతాన్ని అతనికి తిరిగివ్వకుండా ఢిల్లీసామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

ఆ తరువాత హుసైన్‌షా అధీనంలోని బిహార్‌పై దాడిచేసి దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఢిల్లీసామ్రాజ్యం విస్తృతమవుతూ శక్తి పుంజుకోవడం గమనించిన బెంగాల్ పాలకుడు, సుల్తాన్ సికందర్‌తో స్నేహఒప్పందం చేసుకున్నాడు. ఆ తరువాత ధోల్పూర్, గ్వాలియర్, బీదర్ వగైరా ప్రాంతాలరాజులు కూడా సంతోషంగా అతనికి విధేయత ప్రకటించారు. ఈవిధంగా సికందర్‌లోది ఉత్తరభారత్‌లో శాంతిభద్రతలు పూర్తిగా నెలకొన్న తర్వాత దక్షిణభారత్ వైపు దృష్టిసారించాడు. దాని కోసం అతను ఆగ్రా సమీపంలో సికందర్ పేరుతో ఒక పట్టణాన్ని నెలకొల్పి రాజధానిని ఢిల్లీ నుండి అక్కడికి మార్చాడు.



సికందర్‌లోదీ 28 సంవత్సరాలు పరిపాలన చేశాడు. అతని పాలనలో సర్వత్రా శాంతిభద్రతలు నెలకొన్నాయి; ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు; వ్యవసాయోత్పత్తులు కూడా బాగా పెరిగాయి; అతను మార్కెట్ ధరలపై ఓ కన్నువేసి ఉంచేవాడు. అంచేత సాధారణ ఆదాయం కలవారు కూడా తమ నిత్యావసర వస్తువులు సులభంగా కొనుగోలు చేసేవారు. అతని పాలనలో అరబీ-ఫార్సీ భాషలకు, ధర్మవిద్యకు ఎంతో ఆదరణ లభించింది. సికందర్ అనేక ప్రజాసంక్షేమ కార్యాలు చేపట్టాడు. రోడ్లు నిర్మింపజేశాడు; ధర్మసత్రాలు కట్టించాడు; అనేక చోట్ల పోలీసుచౌకీలు ఏర్పాటుచేశాడు; మస్జిద్లు నిర్మింపజేశాడు; మదర్సాలు తెరిపించాడు.

సుల్తాన్ సికందర్ ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు వచ్చే అవకాశం లేకుండా ప్రభుత్వయంత్రాంగంలో అవినీతిని పూర్తిగా అంతమొందించాడు. సుల్తాన్ ఎంతో న్యాయశీలుడు, వ్యవహారదక్షుడు. గ్వాలియర్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ములు సుల్తాన్ సైన్యంలో భర్తీఅయ్యారు. ఓసారి వారికి సమరసొత్తులో రెండు రత్నాలు లభించాయి. వారిద్దరు చెరొక రత్నం పంచుకున్నారు. వారిలో తమ్ముడు తన రత్నం అమ్మి వ్యాపారం చేసే ఉద్దేశంతో ఉద్యోగం మానేసి ఇంటికి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు అన్న తన రత్నం తమ్ముడికి ఇస్తూ దాన్ని తన భార్యకు అప్పగించమని చెప్పాడు. అయితే తమ్ముడి సంకల్పం చెడిపోయింది. అతనా రత్నాన్ని వదినకు అప్పగించకుండా రెండురత్నాలను కూడా సొంతంచేసుకున్నాడు.

కొన్నాళ్ళ తరువాత అతని అన్న సెలవుల మీద ఇంటికి తిరిగొచ్చాడు. రత్నం సంగతి అడిగితే అతని భార్య తెల్లమొహం వేసింది. తమ్ముడ్ని అడిగితే, తాను ఎప్పుడో దాన్ని వదినెకు అందజేశానని అతను బుకాయించాడు. చివరికి వ్యవహారం ముదిరి కోర్టుకు పోయింది. రత్నం తస్కరించిన ఆ దుర్మార్గుడు ఇద్దరు అబద్ధసాక్షుల్ని పెట్టుకొని కోర్టులో తీర్పు తనకు అనుకూలంగా వచ్చేలా చేసుకున్నాడు. ఈ తీర్పు సంగతి విని అన్న భార్య ఎంతో బాధపడుతూ సుల్తాన్ దగ్గరకు పోయి ఫిర్యాదుచేసింది.

సుల్తాన్ సికందర్ ఆ ఇద్దరు సాక్షుల్ని పిలిపించి, మీరిద్దరు ఆ రత్నాన్ని చూశారా అని అడిగాడు. వారు చూశామని చెప్పారు. సుల్తాన్ వారిద్దరికి రెండు కొవ్వుముక్కలు ఇచ్చి, మీరిద్దరు వేర్వేరు చోట్లకు వెళ్ళి వీటితో ఆ రత్నం ఆకారం తయారుచేసి తీసుకు రండి అని ఆదేశించాడు. ఆ సాక్షులు అలాగే చేసి తీసుకొచ్చారు. చూస్తే ఆ రెండు ఆకారాలు విభిన్నంగా ఉన్నాయి. దాంతో వారిద్దరు అబద్ధసాక్షులని తేలిపోయింది. దాన్ని వారిద్దరు అంగీకరించారు. ఈ విధంగా తమ్ముడు తస్కరించిన రత్నం అన్నకు తిరిగి లభించింది. తమ్ముడికి, అబద్ధసాక్షులకు శిక్షలు పడ్డాయి.

**2-సుల్తాన్ ఇబ్రాహీంలోదీ పాలన:-** సికందర్‌లోదీ మరణానంతరం అతని కొడుకు ఇబ్రాహీంలోది సింహాసనం అధిష్టించాడు. ఇతను కూడా తండ్రి లాగే పరాక్రమశాలి, దృఢమనస్కుడు. కాని చాలా ఉద్రేకపరుడు. తండ్రి సికందర్ తన పాలకులు, నేతల పట్ల సోదరభావంతో మసలుకునేవాడు. ఇబ్రాహీం మాత్రం వారి పట్ల దురుసుగా ప్రవర్తించసాగాడు. అంచేత పాలనాధికారులు అతని దురుసువైఖరి పట్ల విసుగుచెంది

అతడ్ని గద్దె దించడానికి కుట్రపన్నారు. దానికోసం వారు అతని తమ్ముడ్ని అతని పైకి ఎగదోశారు. అయితే సుల్తాన్ ఇబ్రాహీం లోది ఆ కుట్రను తిప్పి కొట్టాడు. ఆ తరువాత అతను మరింత కఠినవైఖరి అవలంబించాడు. దానివల్ల సుబేదారులు మరింత పెచ్చరిల్లిపోయి కేంద్రసర్కార్ నుండి విడిపోయి స్వతంత్ర రాజ్యాలుగా ప్రకటించు కున్నారు. మరోవైపు పాలకవర్గంలో కొందరు రాజద్రోహులు, స్వార్థపరులు ఢిల్లీరాజ్యాన్నే తుదముట్టించడానికి ప్రయత్నించారు. వేరొకవైపు దోపిడీ దొంగలు స్వైరవిహారం చేయసాగారు. సర్వత్రా అరాచకం, అల్లర్లతో దేశం అట్టుడికి పోయింది.

ఆ రోజుల్లోనే తైమూర్‌లంక్ మనుమడి మనుమడు బాబర్ కాబూల్ రాజ్యాధినేత అయ్యాడు. సుల్తాన్ ఇబ్రాహీంలోదీ పినతండ్రి కుమారుడు అలావుద్దీన్ కాబూల్‌కు చేరు కొని ఢిల్లీరాజ్యంపై దాడిచేయమని బాబర్‌ని ఉసిగొల్పాడు. బాబర్ రెండుమూడు సార్లు దాడిచేసినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత పంజాబ్‌సుబేదార్ దౌలత్‌ఖాన్ ఇబ్రాహీం లోదీకి ద్రోహం తలపెడ్తూ అతనిపై దాడిచేయమని బాబర్‌ని ప్రేరేపించాడు. మరొకవైపు మేవాత్ రాజపుత్ర నాయకుడు రాణాసాంగా కూడా ఢిల్లీని కబళించే ఉద్దేశ్యంతో బాబర్‌ని రెచ్చగొట్టాడు. అప్పుడు బాబర్ ధైర్యంతో దౌలత్‌ఖాన్, రాణాసాంగాల సహకారంతో పోరుకు సిద్ధమయ్యాడు. క్రీ.శ. 1526లో పానిపట్టు వద్ద ఉభయపక్ష సైన్యాలు ఢీ కొన్నాయి. ఆ యుద్ధంలో సుల్తాన్ ఇబ్రాహీంలోది తన పదిహేను వేలమంది వీరసిపా యీలతో పాటు మృత్యువాత పడ్డాడు.

# 80. దక్షిణ భారత్ రాజ్యాల పరిస్థితి

తైమూర్‌లంక్ విధ్వంసకాండతో ఢిల్లీ వైభవం పూర్తిగా అంతరించిపోయింది. దాంతో అనేక సుబేదారులు స్వేచ్ఛాపాలకులై సర్వస్వతంత్ర రాజ్యాలు నెలకొల్పుకున్నారు. వాటిలో దక్షిణభారత్‌కు చెందిన బహ్మనీరాజ్యం, జోన్పూర్ తూర్పురాజ్యం, గుజరాత్, మాల్వా, బెంగాల్ రాజ్యాలు ముఖ్యమైనవి.

**1-బహ్మనీరాజ్యం:-** బహ్మనీరాజ్య స్థాపకుడు హసన్‌గాంగూ బహ్మన్. అతను క్రీ.శ. 1347లో బహ్మనీరాజ్యాన్ని స్థాపించి గుల్బర్గాను రాజధానిగా చేసుకున్నాడు. బహ్మనీ రాజ్యానికి, విజయనగర రాజులకు మధ్య ఎల్లప్పుడూ యుద్ధాలు జరుగుతుండేవి. బహ్మనీరాజ్యంలో ప్రధానమంత్రి మహ్మూద్ గవా చాలా ప్రసిద్ధిచెందాడు. అతను పాలనా దక్షుడు మాత్రమే గాక విశ్వాసపాత్రుడు, ప్రజాశ్రేయోభిలాషి, అత్యంత నిరాడంబరజీవి కూడా. చాప మీద పడుకునేవాడు; మట్టిపాత్రలో భోజనం చేసేవాడు; నిరుపేదలను ఆదుకునేవాడు. క్రీ.శ. 1524లో చివరి బహ్మనీరాజ్యాధినేత చనిపోగానే ఆ రాజ్యం ఐదు ముక్కలయింది. 1-అహ్మద్‌నగర్, 2-గోల్కొండ, 3-బీజాపూర్, 4-బీదర్, 5-బరార్. ఈ అయిదు రాజ్యాలు చాలా కాలందాకా స్వతంత్రరాజ్యాలుగా ఉండేవి. చివరికి మొగల్ చక్రవర్తి ఔరంగ్‌జేబ్ ఆ రాజ్యాలను తుదముట్టించి ఢిల్లీసామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

**2-జోన్పూర్‌రాజ్యం:-** సుల్తాన్ ఫిరోజ్‌తుగ్లఖ్ బెంగాల్ నుండి తిరిగొచ్చిన తర్వాత గోమతీతీరంలో జూనాపూర్ పేరుతో ఒక అందమైన పట్టణం స్థాపించాడు. ఆ పేరే



తర్వాత జోన్పూర్‌గా మారింది. తుగ్లఖ్‌రాజుల తూర్పురాష్ట్రానికి ఇదే రాజధానిగా ఉండేది. తైమూర్‌లంక్ దాడులతో ఢిల్లీసామ్రాజ్యం బలహీనమైపోయిన తరువాత క్రీ.శ. 1398లో ఇక్కడి సుబేదార్ ఖాజాజహాన్ స్వతంత్రపాలకుడైపోయాడు. జోన్పూర్‌పాలకుల్లో ఇబ్రాహీం షర్ఖీ చాలా ప్రసిద్ధిచెందాడు. ఇతని పాలనాకాలంలో జోన్పూర్ విద్యాకళలకు గొప్ప నిలయంగా మారింది. చివరికి క్రీ.శ. 1476లో సుల్తాన్ బహ్‌లూల్ లోది జోన్పూర్ చివరి రాజు హుసైన్‌షా షర్ఖీని ఓడించి జోన్పూర్‌ను తన ఢిల్లీసామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

**3-మాల్వారాజ్యం:-** సుల్తాన్ ఫిరోజ్‌తుగ్లఖ్ కాలంలో మాల్వా సుబేదార్ దిలావర్ ఖాన్ క్రీ.శ. 1401లో ఢిల్లీసామ్రాజ్యం నుండి విడిపోయి స్వతంత్ర మాల్వారాజ్యాన్ని స్థాపించాడు. మాల్వారాజ్యాధినేతల్లో సుల్తాన్ మహ్మూద్ ప్రసిద్ధిచెందాడు. ఇతను ఎంతో పరాక్రమశాలి, న్యాయప్రియుడు, పండితుడు. ఇతని పాలనాకాలంలో మాల్వా ఎంతో అభివృద్ధిచెందింది; ప్రజలు సుఖసంతోషాలతో జీవితం గడిపారు. చివరికి క్రీ.శ. 1531లో గుజరాత్ పాలకుడు బహాదూర్‌షా మాల్వాని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

**4-గుజరాత్ రాజ్యం:-** సుల్తాన్ ఫిరోజ్‌తుగ్లఖ్‌కు చెందిన జఫర్‌ఖాన్ అనే ఓ జాగీర్దార్ క్రీ.శ. 1401లో తనను స్వతంత్రపాలకుడిగా ప్రకటించుకున్నాడు. ఇక్కడి పాలకుల్లో అహ్మద్‌షా ఎంతో ప్రసిద్ధిచెందాడు. ఇతను కూడా గొప్ప పరాక్రమశాలి, న్యాయప్రియుడు, ఇస్లాం శ్రేయోభిలాషి. ఒకసారి అతని దగ్గరి బంధువుల్లో ఒకతను ఒక అమాయకుడ్ని చంపాడు. అప్పుడు అహ్మద్‌షా ఆ దుర్మార్గుడ్ని నడిబజారులో బహిరంగం గా ఉరిశిక్ష విధించాడు. ఫలితంగా అతని పాలనాకాలంలో ఏ ఒక్క ఉన్నతాధికారి కూడా పేదలపై, అమాయకులపై దౌర్జన్యంచేయడానికి సాహసించలేకపోయాడు. అహ్మదాబాద్ పట్టణాన్ని ఈ సుల్తానే స్థాపించాడు.

గుజరాత్ పాలకుల్లో మహ్మూద్ బేగ్రా కూడా ప్రసిద్ధిచెందాడు. ఇతను 52 ఏళ్ళ పాటు విజయవంతంగా పరిపాలన చేశాడు. ఇతను కూడా పరాక్రమశాలి, న్యాయ ప్రియుడు, దయార్ద్రహృదయుడు, ఇస్లాం శ్రేయోభిలాషి. క్రీ.శ. 1573లో అక్బర్ చక్రవర్తి గుజరాత్‌ని ఓడించి తన ఢిల్లీసామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

**5-బెంగాల్ రాజ్యం:-** సుల్తాన్ ఫిరోజ్‌తుగ్లఖ్ పాలనాకాలంలో బెంగాల్ సుబేదార్ ఖాజా షమ్సుద్దీన్ క్రీ.శ. 1354లో తిరుగుబాటుచేసి బెంగాల్‌ని స్వతంత్రరాజ్యంగా ప్రకటిం చుకున్నాడు. ఇక్కడి పాలకుల్లో హుసైన్‌షా, నుస్రత్‌షా ప్రసిద్ధిచెందారు. వీరెంతో ప్రజా శ్రేయోభిలాషులు. ఎన్నో జనసంక్షేమ పనులు చేశారు; బెంగాలీసాహిత్యానికి పెద్దపీటం వేశారు. క్రీ.శ.1576లో అక్బర్‌చక్రవర్తి బెంగాల్‌ని జయించి తనరాజ్యంలో కలుపుకున్నాడు.

**6-విజయనగర్ రాజ్యం:-** క్రీ.శ. 1336లో హరిహరరాయల్, బుక్కరాయల్ అనే ఇద్దరు అన్నదమ్ములు కలసి విజయనగర్ రాజ్యాన్ని స్థాపించారు. విజయనగర్ దక్షిణభారత్‌లో అందమైన పట్టణంగా ప్రసిద్ధిచెందింది. బహ్మనీరాజ్య సుల్తానులు ఎల్ల ప్పుడూ విజయనగర్ రాజులతో ఘర్షణ పడుతుండేవారు. చివరికి మొగల్ చక్రవర్తి ఔరంగ్‌జేబ్ బహ్మనీరాజ్యాలతో పాటు విజయనగర్ రాజ్యాన్ని కూడా జయించి తన ఢిల్లీ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

# 81. మహ్దియా ఉద్యమం

క్రీ.శ. 15వ శతాబ్దం మధ్యకాలంలో ఢిల్లీ ముస్లిం సామ్రాజ్యంగా రాజకీయంగా, నైతికంగా చాలా పతనావస్థకు చేరుకుంది. ధర్మవేత్తల పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని ఫిఖ్హా విషయాలపై వాదోపవాదాలు చేసు కుంటూ కాలం వెళ్ళబుచ్చసాగారు. సూఫీలు హైందవ తాత్వికచింతనలో పడిపోయి ఏకాంతకుహరాల్లో తాపస్విక జీవితం గడపసాగారు. రాజకీయ, సామాజిక సంస్కరణల్ని గురించి పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రజల పరిస్థితి అంతకంటే దిగజారిపోయింది. ధర్మవేత్తలు, ప్రజలు సంస్కరణ కోసం ఖుర్‌ఆన్-హదీసుల వైపు దృష్టి సారించడమే విస్మరించారు. వారిలో ప్రాపంచికవ్యామోహం గూడుకట్టుకుంది. సర్వత్రా అజ్ఞానచీకట్లు అలుముకున్నాయి. అలాంటి పరిస్థితిలో స్వచ్ఛమైన ఇస్లామీయ కరదీపికతో అజ్ఞాన కారుచీకట్లను తొలగించి వెలుగుబాట చూపిస్తూ ఒక ఉద్యమం ముందుకు వచ్చింది. అదే మహ్దియా ఉద్యమం. దాని వ్యవస్థాపకులు సయ్యిద్ ముహమ్మద్ జోన్పూరి.

సయ్యిద్ ముహమ్మద్ క్రీ.శ. 1423లో జోన్పూర్‌లో జన్మించారు. ఖుర్‌ఆన్, హదీసు విద్యల్లో మంచి ప్రావిణ్యం సంపాదించి యావత్తు ధర్మవేత్తల్లో అగ్రగణ్యులై పోయారు. ఆయన ప్రసంగం, హితోక్తులు ప్రతి మనిషినీ ఇట్టే ఆకట్టుకునేవి. దాంతో వేలాదిమంది ఆయనకు శిష్యులైపోయారు. చివరికి బీహార్‌లోని దానాపూర్ సుల్తాన్ హుసైన్ కూడా ఆయన శిష్యుల్లో చేరిపోయాడు. ఆ కాలంలో సుల్తాన్ హుసైన్ రాజకీయంగా ఎంతో బలహీనుడై ఉన్నందున రాజా దిల్పత్‌రాయ్‌కు లొంగిపోయి అతనికి కప్పం చెల్లిస్తూ సామంతరాజుగా ఉండేవాడు.

ఒకసారి సయ్యిద్ ముహమ్మద్ తనశిష్యులకు హితబోధచేస్తూ నిండుసభలో సుల్తాన్ హుసైన్‌ని పరుషవచనాలతో తీవ్రంగా విమర్శించారు. "దౌర్భాగ్యుడా! విశ్వప్రభువుని విస్మరించి ఒక విగ్రహారాధకుడికి ఊడిగం చేస్తున్నావా! ఈనాడు లోకంలో నిన్ను మించిన పాపాత్ముడు ఎవడూలేడు. బహూశా పరలోకతీర్పుదినాన నీ పర్యవసానం నరకవాసుల పర్యవసానంలా ఉంటుందేమోనని నేను భయపడుతున్నాను. నీ మూలాన ఇస్లాం అప్రతిష్ఠపాలవుతోంది. నీ పిరికితనంవల్ల అధర్మం అందలమెక్కుతోంది" అని అన్నారు. ఆయన తన ఇతర శిష్యుల్ని కూడా రాజ్యదుస్థితి పట్ల ఘాటుగా విమర్శించారు.

పౌరుషాన్ని రెచ్చగొట్టే ఈ హితబోధతో సుల్తాన్ హుసైన్ కళ్ళు తెరిచి రాజా దిల్పత్ రాయ్‌కు వ్యతిరేకంగా సమరభేరి మోగించాడు. ఆ సభలో పాల్గొన్న శిష్యులు కూడా అతని పతాకం కిందికి చేరి సమరోత్సాహంతో ఊగిపోయారు. దిల్పత్‌రాయ్ సైన్యం ముందు దిగదుడుపుగా ఉన్న ముస్లింసైన్యం మొదట ఓటమిదిశలో ఉన్నప్పటికీ ఆ తరువాత ముస్లింయోధులు ద్విగుణీకృత ఉత్సాహంతో విజృంభించారు. దాంతో దిల్పత్ రాయ్ సైన్యం వెనకడుగేసింది. సుల్తాన్ హుసైన్ ముందుకు లంఘించి దిల్పత్‌రాయ్‌ని ఒక్కవేటుతో హతమార్చాడు. ఈ దృశ్యం చూసి అతని సైన్యం చెల్లాచెదరై పిక్కబలం కొద్దీ పారిపోయింది. సుల్తాన్ హుసైన్ విజయానందంతో వెనుదిరిగాడు.



ఈ యుద్ధం తరువాత సయ్యిద్ ముహమ్మద్ జోన్పూరీపై ఒకవిధమైన ఆకర్షణశక్తి ఆవహించింది. ఆ పరిస్థితిలో ఆయన దాదాపు పన్నేండ్లపాటు ఉన్నారు. ఏడేండ్లు ఆయన అత్యధిక ఉపవాసాలు పాటిస్తూ దైవస్మరణలో నిమగ్నులై ఉండేవారు. ఆ కాలంలోనే ఆయన తాను మహ్దీ (అలైహి) అయ్యానని ప్రకటించారు. ఇక ఆయన శిష్యగణమైతే ఇస్లాం ప్రచారంతో పాటు తమ నాయకుడు ఇమామ్ మహ్దీ అయ్యారని కూడా ప్రచారం ప్రారంభించారు. దానివల్ల ఇస్లాం ప్రచారవేగం క్రమేణా ఆగిపోయింది.

ఇమామ్ ముహమ్మద్ జోన్పూరీ తనపై ఆవహించిన ఆకర్షణశక్తి తగ్గిన తరువాత చందేరీ, మాల్వా, జాపాయజ్, దౌలతాబాద్, అహ్మద్‌నగర్, బీదర్, గుల్బర్గ వంటి సుదూరప్రాంతాలు పర్యటించి అక్కడి ధర్మవేత్తలు, తత్వవేత్తలకు పరిస్థితుల సంస్కరణ గురించి హితోపదేశం చేశారు. అంతగా ప్రాముఖ్యంలేని ఫిఖ్హా విషయాల్ని పక్కనబెట్టి ఖుర్‌ఆన్-హదీసుల ఆచరణపై దృష్టికేంద్రీకరించాలని హితబోధ చేశారు.

అయితే వారిలో కొందరు మాత్రమే ఆయన హితోక్తులు అర్థం చేసుకున్నారు. అత్యధికమంది ఆయన్ని వ్యతిరేకించడమే గాక ఆయనపై లేనిపోని నిందలు మోపారు. దాంతో ఆయన క్రీ.శ. 1495లో హజ్‌యాత్ర కోసం మక్కా వెళ్ళిపోయారు. మక్కాలో ఉండగా ఆయన మరొకసారి తాను ఇమామ్ మహ్దీ అని ప్రకటించుకున్నారు. మక్కా నుండి అహ్మదాబాద్‌కు తిరిగొచ్చి ఒక సభలో మాట్లాడుతూ తాను ఇమామ్ మహ్దీ కాదన్నవాడు అవిశ్వాసి అని అన్నారు. ఈమాట జనంలో అరాచకానికి తెరలేపింది.

ఆ తర్వాత ఇమామ్ ముహమ్మద్ తన మూడొందలఅరవై మంది శిష్యులతో కలసి అహ్మదాబాద్ నుండి ఖంధార్ చేరుకున్నారు. అక్కడ కూడా ఆయన తన బోధనలతో జనాన్ని ఆకట్టుకోవడం ప్రారంభించారు. అయితే అక్కడా ధర్మవేత్తలు ఆయన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆయన మార్గంలో అనేక అవరోధాలు కల్పించారు. వాటన్నిటినీ ఆయన సహనంతో ఎదుర్కొన్నారు. ఖంధార్ నుండి ఖురాసాన్‌కు వెళ్తే అక్కడ కూడా ధర్మవేత్తల నుండి వ్యతిరేకత ఎదురైంది. వారాయన మీదికి ఖురాసాన్ రాజును ఉసిగొల్పారు.

రాజు తనమంత్రికి ఓ సైనికదళమిచ్చి పంపాడు. సైన్యాన్ని చూసి ఇమామ్ ముహమ్మద్, ఆయన శిష్యులు ఏమాత్రం బెదరలేదు. అప్పుడు మంత్రి చర్చల ద్వారా నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. అయినా లాభం లేకపోయింది. దాంతో అతను ఆయన మానాన ఆయన్ని వదిలేసి వెళ్ళిపోయాడు. ఇమామ్ తన ప్రచారాన్ని కొనసాగించారు. చివరికి క్రీ.శ. 1504లో ఆయన కాలధర్మం చెందారు. మరణానికి ముందు ఆయన తాను మహ్దీ కాదని తన మహ్దీవాదనను ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది.

ఈ విషయం ఇమామ్ మరణసమయంలో ఫరాలో ఉండిన ముగల్ అనే ఓ శిష్యుడు భారత్‌కు చేరవేశాడు. తత్ఫలితంగా మహ్దియా ఉద్యమానికి చెందిన కొందరు క్రియాశీలక కార్యకర్తలు కూడా పశ్చాత్తాపం చెంది తమ మహ్దీవిశ్వాసాన్ని వదలేశారు. ఆనాటి ప్రఖ్యాత చరిత్రకారుడు ముల్లా అబ్దుల్‌ఖాదర్ బదాయూని తన చరిత్రగ్రంథంలో ఈ సంఘటన పేర్కొన్నాడు. ఏమైనప్పటికీ ఇమామ్ ముహమ్మద్ జోన్పూరీ ఆనాటి చీకటిరోజుల్లో ఇస్లాం వెలుగురవ్వలు వెదజల్లారనే విషయాన్ని మనం విస్మరించలేము.

# 82. మొగల్‌రాజ్య స్థాపకుడు బాబర్

బాబర్ అసలుపేరు జహీరుద్దీన్. ప్రతిభాపరాక్రమాలు, ధైర్యసాహసాల దృష్ట్యా అతను బాబర్ (పులి) అని పిలువబడసాగాడు. బాబర్ క్రీ.శ. 1483లో జన్మించాడు. బాబర్ తనను తాను తురుష్కజాతీయుడిగా చెప్పుకునేవాడు. కాని భారతదేశంలో అతను మొగల్‌రాజ్య స్థాపకుడిగా ప్రసిద్ధిచెందాడు. బాబర్ తండ్రి ఉమర్‌షేఖ్ మిర్జా తుర్కిస్తాన్‌లోని ఫర్ఘానా ప్రాంతం పాలకుడు. బాబర్ పన్నెండేళ్ళ వయసులో ఉండగానే అతని తండ్రి చనిపోయాడు. దాంతో ఫర్ఘానా రాజ్యం ప్రమాదంలో పడిపోయింది. దాన్ని ఆక్రమించుకోవడానికి బాబర్ బంధువులే పొంచిచూడసాగారు. బాబర్ తన బామ్మ సలహాలతో శత్రువుల్ని ప్రతిఘటిస్తూ పాలనావిధులు నిర్వహించసాగాడు.

బాబర్ పాలనాబాధ్యతలు చేపట్టిన కొన్నాళ్ళకు సమర్‌ఖంద్‌పాలకుడు చనిపోయాడు. అప్పుడు సమర్‌ఖంద్‌ని ఆక్రమించుకోవడానికి అనేకమంది ప్రయత్నించారు. అయితే బాబర్ ఫర్ఘానా పాలనాబాధ్యతను తన మంత్రికి అప్పగించి సమర్‌ఖంద్‌పై దాడిచేసి దాన్ని స్వాధీనపరచుకున్నాడు. తరువాత బాబర్ సమర్‌ఖంద్‌లో కొన్నాళ్ళు ఉన్నాడో లేదో జబ్బుపడ్డాడు. రోజురోజుకు అతని ఆరోగ్యం క్షీణించసాగింది. బాబర్ అనారోగ్య పరిస్థితి తెలుసుకున్న అతని మంత్రి శత్రువులతో కుమ్మక్కై ఫర్ఘానా రాజ్యానికి ఎసరుపెట్టాడు. బాబర్ బామ్మ ఫర్ఘానా పరిస్థితులు వివరిస్తూ రాసిన లేఖ అందగానే బాబర్ సమర్‌ఖంద్ నుండి ఫర్ఘానా చేరుకున్నాడు. కాని అప్పటికే ఫర్ఘానా శత్రువుల ఆక్రమణలోకి పోయింది. మరోవైపు సమర్‌ఖంద్ కూడా చేజారిపోయింది. దాంతో బాబర్ దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. వరుసగా ఇరవై ఏళ్ళు పాటుపడినా ఫలితం కన్పించలేదు.

ఆ రోజుల్లోనే కాబుల్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఖుస్రూ అనేవాడు కాబుల్ పాలకుడ్ని హతమార్చి దాన్ని ఆక్రమించుకున్నాడు. అప్పుడు పాలకవర్గం సభ్యులు బాబర్ సహాయంతో కాబుల్‌ని ఖుస్రూ నుండి విడిపించుకున్నారు. ఆ విధంగా బాబర్ కాబుల్ పాలకుడయ్యాడు. తరువాత బాబర్ క్రమేణా గజనీ, ఖంధార్, హిరాత్ వగైరా ప్రాంతాల్ని ఆక్రమించుకున్నాడు. ఆ తర్వాత రాణా సంగ్రామ్‌సింగ్, కొందరు అఫ్ఘాన్ నాయకులు, రాకుమారుల సహాయంతో ఢిల్లీపై దాడిచేసి దాన్ని కూడా ఆక్రమించుకున్నాడు.

బాబర్‌కు పూర్వం భారత్‌పై దాడులు చేసి ఇక్కడి సిరిసంపదలు కొల్లగొట్టుకుపోయిన మొగల్‌చక్రవర్తుల్లా బాబర్ కూడా ఢిల్లీని జయించాక తన దేశానికి వెళ్ళిపోతాడని, తరువాత తాము పాలకులైపోవచ్చని భావించారు అతనికి సహాయం చేసినవాళ్ళు. కాని బాబర్ భారత్‌లో స్థిరనివాసం ఏర్పరచుకొని పరిపాలనచేసే ఉద్దేశంతో వచ్చాడు. దాంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. అప్పుడు వారు బాబర్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నడం ప్రారంభించారు. అయితే బాబర్ కొన్నాళ్ళలోనే వారి కుట్రలు వమ్ము చేసి కొడుకు హుమాయూన్ సహాయంతో జోన్పూర్‌దాకా శత్రువుల ఆటలు కట్టించాడు.

వేరొకవైపు రాణాసంగ్రామ్‌సింగ్ రాజపుత్రవంశానికి చెందిన అనేకరాజుల సహకారంతో 80వేల మంది రౌతులు, 500 ఏనుగులతో కూడిన భారీసైన్యం సమీకరించి బాబర్



ముందుకు వచ్చాడు. సుల్తాన్ సికందర్‌లోది కొడుకు మహ్మూద్, మరికొందరు ముస్లిం నాయకులు కూడా తమతమ సేనలను తీసుకొని రాణా సంగ్రామ్‌సింగ్‌తో చేతులుకలిపి ముందుకొచ్చారు. రాణా సంగ్రామ్‌సింగ్ గొప్ప సమరయోధుడిగా ఖ్యాతిచెందాడు. అలాంటి సేనాపతి నేతృత్వంలో నురుగులు కక్కుతున్న అంతపెద్ద సేనావాహినిని చూడగానే బాబర్ సైన్యంలోని స్థానికసైనికులు భయపడి ఒక్కొక్కరే యుద్ధరంగం నుండి మెల్లగా జారుకున్నారు. బాబర్ వెంట వచ్చిన పన్నెండువేల మంది తురుష్కసైనికులు కూడా ఆందోళన చెందసాగారు.

అయితే బాబర్ విశ్వప్రభువు సన్నిధిలో చేతులుజోడించి విలపిస్తూ సహాయం వేడుకొని సైనికులముందు ఉద్రేకపూరితమైన ఓ ప్రసంగం చేశాడు. దాంతో వారు నిరాశానిస్పృహలు పటాపంచలు చేసి సమరోత్సాహంతో ఊగిపోయారు. విజయమో, వీరమరణమో తేల్చుకుంటామని ఖుర్‌ఆన్‌ప్రతులు తీసుకొని ప్రమాణంచేశారు. ఆతర్వాత సమరజ్వాలలు మింటికెగిశాయి. ఫిరంగిమోతలు ప్రతిధ్వనించాయి. శత్రుపక్షంలో హాహాకారాలు మిన్నుముట్టాయి. శవాలు గుట్టలుగుట్టలుగా పడిపోయాయి. ఆ సైనికులు బ్రతుకుజీవుడా అంటూ కాళ్ళకు బుద్ధిచెప్పారు. వారి సేనాపతి రాణా సంగ్రామ్‌సింగ్ తీవ్రంగా గాయపడి సహచరుల సహాయంతో ఎలాగో ప్రాణాలతో బయటపడ్డాడు.

బాబర్ సైనికులు అత్యల్పసంఖ్యలో ఉన్నప్పటికీ వారు దైవసహాయంతో విజయం సాధించారు. ఈ యుద్ధంలో ప్రత్యర్థుల నడుములు విరిగిపోయాయి. రాజపుత్రుల ప్రాభవం అంతరించిపోయింది. అయితే ఆ తర్వాత కొన్నాళ్ళకు చందేరీరాజు మైదనీరాయ్ నాయకత్వంలో రాజపుత్రులు మరొకసారి బాబర్ ముందుకొచ్చారు. కాని బాబర్‌సైన్యం ముందు నిలువలేక పలాయనం చిత్తగించారు. అటు సుల్తాన్ మహ్మూద్‌లోది ఉత్తర బీహారకు చేరుకొని తన బావ, బెంగాల్ పాలకుడైన నుస్రత్‌షా సహాయంతో సైన్యాన్ని సమాయత్తపరచ నారంభించాడు. ఈ సమాచారం అందగానే బాబర్ చందేరీ నుండి బీహారకు చేరుకున్నాడు. ఘాఘరా, గంగా నదుల సంగమం దగ్గర ఇరుపక్షాలు ఢీకొన్నాయి. ఈ యుద్ధంలో మహ్మూద్‌లోది పరాజయంపాలై లొంగిపోయాడు. బెంగాల్ పాలకుడు నుస్రత్‌షా కూడా లొంగిపోయి బాబర్‌కు విధేయుడై పోయాడు.

ఈ యుద్ధం తరువాత బాబర్ అనారోగ్యం పాలయ్యాడు. అతను ఆగ్రాకు తిరిగొచ్చి అనేక నెలలు ఆగ్రలోనే జబ్బుతో ఉండిపోయాడు. ఆ రోజుల్లోనే తన ప్రియకుమారుడు హుమాయూన్ సంభల్‌లో జబ్బుపడి ఉన్నాడని బాబర్‌కు తెలిసింది. అంచేత అతను హుమాయూన్‌ని ఆగ్రాకు పిలిపించుకున్నాడు. కాని ఆగ్రా చేరుకున్న తరువాత అతని వ్యాధి మరింత ముదిరింది. బాబర్ కొడుకుఆరోగ్యం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. అయినా లాభంలేకపోయింది. చివరికి దైవసహాయం కోసం ప్రార్థన చేశాడు. "దేవా! నా కొడుక్కు ఆరోగ్యం చేకూర్చు. వాడికి బదులు నన్ను పైకితీసుకో" అంటూ దీనాతిదీనంగా వేడుకున్నాడు. సృష్టికర్త బాబర్ వేడుకోలు స్వీకరించాడు కాబోలు; ఆ రోజు నుండి హుమాయూన్ ఆరోగ్యం కుదుటపడటం మొదలయింది. మరోవైపు బాబర్ పరిస్థితి నానాటికి విషమించసాగింది. చివరికి అదే స్థితిలో క్రీ.శ. 1530లో చనిపోయాడు.

బాబర్ చనిపోయే ముందు తన కొడుకు హుమాయూన్‌కు ఇలా ఉపదేశించాడు:-

1-కుమారా! నీ హృదయంలో మతదురభిమానానికి ఏమాత్రం తావివ్వకు. ప్రజల మతపరమైన భావోద్రేలాను, వారి ఆరాధనారీతులను గౌరవించాలి. మతస్థులందరి పట్ల న్యాయంగా వ్యవహరిస్తూ ఉండాలి.

2-ముఖ్యంగా గోవధ నిషేధాన్ని పాటించు. దానివల్ల ప్రజల హృదయాల్లో నీకు చోటు లభిస్తుంది. ఈవిధంగా వారు మేలు, కృతజ్ఞతల సంకెళ్ళతో నీకు విధేయులై ఉంటారు.

3-నీవు ఏ ఒక్కరి ఆలయాన్ని ధ్వంసం చేయకూడదు. పాలకుడు, పాలితుల పట్ల సదా సత్సంబంధాలు ఉండి, దేశంలో శాంతిభద్రతలు కొనసాగాలంటే ప్రజలందరి పట్ల న్యాయంగా వ్యవహరించాలి.

4-ఇస్లాం వ్యాప్తి హింసాదౌర్జన్యాల ఖడ్గంతో కాకుండా ఆనందోపకారాల ఖడ్గంతో బాగా జరుగుతుంది.

5-షియాసున్నీల విభేదాల మూలంగా ఇస్లాం బలహీనమవుతుంది. అంచేత షియా సున్నీల విభేదాలను ఎల్లప్పుడూ విస్మరిస్తూ ఉండాలి.

**ఒక విచిత్ర సంఘటన:-** ఓరోజు ఉదయం ఆగ్రాలో రాజమహల్ సమీపంలోని రోడ్డుపై ఒక స్త్రీ తన పిల్లవాడ్ని దగ్గర్లో కూర్చోబెట్టి కసువు ఊడుస్తోంది. ఆమెకు కొంచెం దూరంలో ఒక సాయుధ రాజపుత్రుడు అటూఇటూ తిరుగుతూ సుల్తాన్ నుండి తనతండ్రి తరపున ప్రతీకారం తీర్చుకోవడానికి పొంచిచూస్తున్నాడు. అంతలో ఒక మదపుటేనుగు తప్పించుకొని ఘీంకరిస్తూ రోడ్డుపైకి వచ్చింది. జనం భయపడి పరుగెత్త సాగారు. ఏనుగు ఆ స్త్రీ వైపుకు రావడంతో ఆమె భయంతో "అయ్యో నా పిల్లోడు! నా పిల్లోడ్ని రక్షించండి!!" అంటూ గావుకేకలు పెట్టసాగింది.

ఆ కేక విని రాజపుత్రుడు ఆమెను రక్షించడానికి అటువైపు దృష్టిసారించాడు. కాని అంటరానితనం అతనికి అడ్డొచ్చింది. అగ్రకులస్థుడైన తాను నీచకులంస్త్రీ పిల్లవాడ్ని తాక కూడదుకదా అని భావించి ఆగిపోయాడు. ఆ పీడితురాలి ఆర్తనాదం సుల్తాన్ చెవిలో కూడా పడింది. తక్షణమే అతను ఒక గద తీసుకొని రాజమహల్ పైనుండి కిందికి దూకి ఏనుగు తలపై బలంగా ఒకేఒక దెబ్బవేశాడు. దాంతో ఏనుగు గీపెడ్తూ పారిపోయింది. సుల్తాన్ ఆ పిల్లవాడ్ని ఎత్తుకొని రాజమహల్లోకి వెళ్ళిపోయాడు.

రాజపుత్ర యువకుడు సుల్తాన్ పరాక్రమం, ప్రజాశ్రేయోభిలాషలు చూసి ఎంతో ప్రభావితుడయ్యాడు. వెంటనే అతను తన ఉద్దేశాన్ని మానుకొని వెళ్ళి సుల్తాన్‌కు లొంగి పోయాడు. సుల్తాన్ అతడ్ని క్షమించి అతని తండ్రి రాజ్యాన్ని తిరిగిచ్చివేశాడు. ఇది బాబర్ చక్రవర్తి జనశ్రేయోభిలాషకు సంబంధించిన ఓ విచిత్రసంఘటన.

బాబర్ పిన్నవయసులోనే తన సేవకుడి కొడుకు నదిలో పడిపోతే కాపాడాడు. సేవకుడు బాబర్‌ని షికారు కోసం ఓ నదీతీరం దగ్గరకు పిలుచుకెళ్ళాడు. సేవకుడి పిల్ల వాడు కూడా వెంట ఉన్నాడు. ఇద్దరు బాలురు నదిలో కాళ్ళు వదలి ఆడుకోసాగారు.



అప్పుడు సేవకుడి కొడుకు హఠాత్తుగా నదిలో జారిపడి ప్రవాహంలో కొట్టుకుపోసాగాడు. బాల బాబర్ దూరానవున్న సేవకుడ్ని కేకవేసి పిలిచి వెనకాముందూ ఆలోచించకుండా తక్షణమే నదిలోకి దూకాడు. అతను తన ప్రాణాన్ని సైతం ఖాతరుచేయకుండా నదిలో ఈదుతూపోయి సేవకుడి పిల్లవాడ్ని నీటిలో నుంచి పైకి తీసి పట్టుకున్నాడు. అంతలో సేవకుడు వచ్చి సహాయపడ్డాడు. ఆవిధంగా ఇద్దరు పిల్లలు నది నుండి క్షేమంగా బయటపడ్డారు.

బాబర్ అత్యంత పరాక్రమశాలి. సైనికసంఖ్య, ఇతర సామగ్రి చాలా తక్కువగా ఉన్నా విజయం అతడ్నే వరిస్తుంది. ఒక్కోరోజు గుర్రం మీద వంద మైళ్ళు కూడా ప్రయాణించగలడు. అయినా వేసారిపోడు. ఎంతపెద్ద నది అడ్డొచ్చినా అవలీలగా ఈది తీరానికి చేరుకుంటాడు. బలపరాక్రమాలతో పాటు బాబర్ గొప్ప ధర్మవేత్త, ప్రఖ్యాత రచయిత. తజక్‌బాబరీ పేరుతో అతను టర్కీభాషలో రచించిన పుస్తకం అనేకభాషల్లో అనువదించ బడింది. బాబర్ సమరప్రియుడు మాత్రమే కాదు, పీడిత-తాడిత ప్రజల పెన్నిధి కూడా. ఆపదలో ఉన్నవారిని ప్రాణాలకు తెగించి ఆదుకునే మనస్తత్వం అతనిది. దీనికి పైన పేర్కొన్న రెండు సంఘటనలే ప్రబల తార్కాణాలు.

బాబర్ గ్రంథప్రచురణ రంగంలో కూడా ప్రావీణ్యం సంపాదించాడు. తీరిక సమయంలో అతను అనేక ఖుర్‌ఆన్ ప్రతులు తయాలుచేసి మక్కా నగరానికి పంపించాడు.

మొదటిసారి జరిగిన యుద్ధంలో విజయం సాధించిన తర్వాత బాబర్‌లో విశ్వాసం, ఆచరణల పరంగా కొన్ని బలహీనతలు చోటుచేసుకున్నాయి. భోగభాగ్యాల వెంటపడి ధర్మపరాయణతను కాస్తంత నిర్లక్ష్యం చేశాడు. ఆ తరువాత ఎదురైన మరో యుద్ధంలో అతని స్థానికసైనికులు శత్రుబలగాలను చూసి భయపడి యుద్ధరంగం నుండి జారుకున్నారు. దాంతో బాబర్‌పై నిరాశచీకట్లు అలుముకున్నాయి. అప్పుడు అతని ప్రాపంచిక మైకం వదలిపోయింది. దేవుని సన్నిధిలో మోకరిల్లి తీవ్రంగా పశ్చాత్తాపం చెందుతూ హృదయపూర్వకంగా పాపమన్నింపు ప్రార్థనచేశాడు. ఆ తరువాత సాగిన జీవితంలో అతను నమాజ్, రోజా విధులు క్రమం తప్పకుండా పాటించాడు. ప్రతి శుక్రవారం ఉపవాసం విధిగా పాటించేవాడు.

బాబర్ భారతదేశంలో నాలుగేండ్లు మాత్రమే నివశించాడు. ఈ నాలుగేండ్లు కూడా యుద్ధాల్లోనే గడచిపోయింది. అతను తన ఇద్దరు ప్రత్యర్థులయిన లోదీసుల్తాన్‌లు, రాజపుత్రులను ఎలాగో తాత్కాలికంగా తనదారి నుంచి తొలగించుకున్నాడు. అయితే అఫ్గాన్ సర్దారులు ఖందార్‌ప్రాంతం కోల్పోయిన తర్వాత గుజరాత్, బిహార్ మొదలైన ప్రాంతాల్లో ఆశ్రయం పొంది మొగల్‌జాతిని భారత్ నుండి తీసేసే సన్నాహాలు ప్రారంభించారు. బాబర్‌కు ఇంకా అనేకమంది ప్రత్యర్థులున్నారు. కాని వారు కయ్యానికి కాలుదువ్వక ముందే బాబర్ ఇహలోకం వీడిపోయాడు. తరువాత ఆ ప్రత్యర్థుల్ని బాబర్ కొడుకు హుమాయూన్ ఎదుర్కోవలసివచ్చింది. బాబర్ మరణశాసనం ప్రకారం అతని భౌతిక కాయాన్ని కాబూల్‌కు పంపి ఖననం చేయడం జరిగింది.

# 83. హుమాయూన్ చక్రవర్తి

బాబర్ మరణానంతరం అతని కొడుకు హుమాయూన్ సింహాసనం అధిష్టించాడు. ఆనాడు రాజ్యమంతటా అశాంతి-అలజడులతో అట్టుడకసాగింది. నలువైపులా శత్రువులు పొంచికూర్చున్నారు. మరోవైపు హుమాయూన్ సోదరుడు హుమాయూన్‌కు పెద్ద తలనొప్పిగా మారాడు. బాబర్ అతణ్ని కాబుల్-ఖంధార్‌ల పాలకుడిగా నియమించాడు. హుమాయూన్ సింహాసనం అధిష్టించినపుడు అతను శుభాకాంక్షలు తెలిపే వంకతో సైన్యం తీసుకొనివచ్చి కుట్రతో పంజాబ్‌ని ఆక్రమించుకున్నాడు. హుమాయూన్ తన తండ్రి హితోపదేశాన్ని గౌరవిస్తూ పంజాబ్‌పై అతని ఆక్రమణను అంగీకరించాడు. వేరొక వైపు గుజరాత్ పాలకుడు బహాదుర్‌షా హుమాయూన్‌కు వ్యతిరేకంగా లోదీ సర్దారులకు, కొందరు విద్రోహులైన మొగల్‌సర్దారులకు ఆశ్రయమిచ్చి వారి కొమ్ముకాయసాగాడు.

గతంలో బాబర్‌ని భారత్‌పై దాడులకు పురమాయించిన ఇబ్రాహీంలోదీ పినతండ్రి అలావుద్దీన్ కూడా ఇప్పుడు బహాదుర్‌షా సహాయంతో మొగల్ పాలకుల్ని భారత్ నుండి తరిమేయడానికి ప్రయత్నిస్తున్నాడు. అతని కొడుకు తాతార్‌ఖాన్ ఒక సైన్యం తీసుకొని అగ్రా సమీపానికి చేరుకున్నాడు. అప్పటికి బహాదుర్‌షా మాల్వా, చిత్తోడ్‌లను జయించి తన రాజ్యాన్ని విస్తృతపరచుకున్నాడు. అయితే హుమాయూన్ అతనిపై దాడిచేసి గుజరాత్‌ని తిరిగి వశపరచుకున్నాడు. బహాదుర్‌షా పారిపోయి తాను పోర్చుగ్రీస్ వర్తకులకు ఇచ్చిన గోవాలో ఆశ్రయం పొందాడు. కాని పోర్చుగ్రీస్‌వర్తకులు ఆశ్రయమిచ్చిన తర్వాత మోసంతో అతణ్ని హతమార్చారు.

హుమాయూన్‌కు ఇలా ప్రత్యర్థుల్ని తుదముట్టించడానికి అయిదేళ్ళు పట్టింది. బీహార్ పాలకుడైన అఫ్ఘాన్ సంతతి షేర్‌ఖాన్ ఈ సుదీర్ఘకాలంలో హుమాయూన్ తన వైపు దృష్టిపెట్టక పోవడంతో బీహార్, బెంగాల్‌లను స్వాధీనం చేసుకొని మొగల్‌పాలకుల్ని తరిమేయడానికి పథకం రూపొందించాడు. ఈ సంగతి తెలుసుకున్న హుమాయూన్ గుజరాత్ పాలనను తన రెండవసోదరుడు అస్కరీకు అప్పగించి సైన్యంతో వెళ్ళి బెంగాల్‌పై దాడిచేశాడు. అయితే షేర్‌ఖాన్ తెలివిగా రణరంగం నుంచి తాత్కాలికంగా తప్పుకున్నాడు. మొగల్‌సైన్యం బెంగాల్ రాజధానిని స్వాధీనం చేసుకొని పట్టరాని ఆనందంతో విజయోత్సవంలో మునిగితేలసాగారు. అప్పుడు షేర్‌ఖాన్ తిరిగొచ్చి దారిలోని కోటలన్నీ ఆక్రమించుకొని మొగల్‌సైన్యాన్ని మట్టుపెట్టేందుకు పొంచికూర్చున్నాడు. మొగల్‌సైన్యం విజయోత్సవం తరువాత గుజరాత్‌కు తిరుగుప్రయాణమయింది. షేర్‌ఖాన్ దారిలో చూసా అనే చోట మొగల్‌సైన్యంపై మెరుపుదాడి చేశాడు. ఈ హఠాత్పరిణామానికి మొగల్‌సైన్యం బిత్తరబోయి తత్తరపాటుతో పారిపోయింది. హుమాయూన్ ఎలాగో పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు. క్రీ.శ. 1539లో జరిగిన ఈ యుద్ధంలో హుమాయూన్ గుజరాత్‌ని కూడా కోల్పోయాడు. హుమాయూన్ మూడవ సోదరుడు దూఆబా పాలకుడు కూడా విశ్వాసఘాతుకానికి పాల్పడ్డాడు. దాంతో హుమాయూన్ ఎక్కడా ఆశ్రయం దొరక్క కొన్నాళ్ళు కాలుకాలిన పిల్లిలా అటూఇటూ తిరిగి చివరికి ఈరాన్‌కు చేరుకున్నాడు. అటు భారత్ షేర్‌ఖాన్ (షేర్‌షా) స్వాధీనంలోకి పోయింది.



# 84. షేర్‌షాహ్ చక్రవర్తి

షేర్‌షాహ్ అసలు పేరు ఫరీద్. అతను గోరీపాలకుల్లో సూర్ తెగకు చెందినవాడు. అతని తాత గుర్రాల వ్యాపారంచేస్తూ భారత్‌కు వచ్చాడు. అయితే షేర్‌షా తండ్రి హసన్ ఖాన్ వ్యాపారం మానేసి సైనికవృత్తి చేపట్టాడు. సైనికసేవ చేసినందుకు హసన్‌ఖాన్‌కు సహ్రాస్రామ్ వంటి ఓ చిన్న జాగీరు లభించింది. షేర్‌షా అక్కడే క్రీ.శ. 1486లో పుట్టాడు. షేర్‌షా చిన్నతనం నుండే ఎంతో తెలివైన, చురుకైన బాలుడు. కాని తెలివిమాలిన ఆ తండ్రి కొడుకు విలువను గుర్తించలేకపోయాడు. అతను భారత్‌కు చెందిన ఒక బానిస మహిళను చేసుకొని ఆమె వలలో పడిపోయి కొడుకు విద్యాశిక్షణలను ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా అతను, అతని రెండోభార్య షేర్‌షాకు చీటికిమాటికి ఇబ్బందులకు గురిచేస్తూ అతని జీవితాన్ని దుర్భరం చేశారు. దాంతో షేర్‌షా ఇంటి నుంచి పారిపోయి జోన్పూర్‌లోని ధార్మికపాఠశాలలో విద్యాభ్యాసం ప్రారంభించాడు.

షేర్‌షా అనతికాలంలోనే ఖుర్‌ఆన్, హదీసులతో పాటు వివిధ కళల్లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. అతను ప్రత్యేకంగా చరిత్ర పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. ముఖ్యంగా జాతుల ఉత్థానపతనాలు, రాజ్యాల స్థితిగతుల్ని గురించి బాగా అధ్యయనం చేశాడు. షేర్‌షాలోని బాధ్యతాభావం, తెలివితేటలు గమనించిన జోన్పూర్ పాలకుడు అతణ్ని తన దగ్గర ఉద్యోగిగా చేర్చుకున్నాడు. పదేళ్ళ తరువాత షేర్‌షాతండ్రి కళ్ళు తెరచుకున్నాయి. రెండవభార్య వ్యామోహంలో చిక్కుకొని జాగీరు నిర్వహణను గాలికి వదిలేశాడు. పరిస్థితి చేయిదాటి పోవడంతో అతను జోన్పూర్ వెళ్ళి కొడుక్కు నచ్చజెప్పి పిలుచుకొచ్చి జాగీరు నిర్వహణ బాధ్యతను అతనికి అప్పగించాడు.

షేర్‌షా జాగీరునిర్వహణ బాధ్యత చేపట్టిన కొన్నాళ్ళలోనే అతని సత్‌ప్రవర్తన, సరైన ఏర్పాట్ల కారణంగా రైతులు అతని అధీనంలోకి వచ్చారు. దాంతో అతను ఓ చిన్న సైన్యాన్ని తయారుచేసి తలబిరుసు జమీందారుల్ని తనకు విధేయులుగా చేసుకున్నాడు. ఏడెనిమిదేండ్లలో జాగీరువ్యవస్థ అన్ని విధాలా బాగుపడింది. వ్యవసాయోత్పత్తి, రాబడి బాగా పెరిగిపోయాయి. దాంతో అందరూ సుఖసంతోషాలతో ఉండసాగారు.

షేర్‌షా తండ్రి వృద్ధుడైపోయాడు. సవతిసోదరులు షేర్‌షాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూ అతణ్ని స్వస్థలం నుండి వెళ్ళగొట్టడానికి యత్నించారు. జాగీర్‌లాంటి స్థిరాస్తికి అతుక్కుపోవడం షేర్‌షా ఆశయం కాదు. దానివల్ల గడించిన అనుభవంతో అభివృద్ధి మెట్లు ఎక్కడమే అతని అసలు లక్ష్యం. ఈ లక్ష్యసాధన కోసం అతను స్వస్థలం వదలి ఢిల్లీ చేరుకున్నాడు. అది ఇబ్రాహీంలోదీ పాలనాకాలం. ఇబ్రాహీం కఠినస్వభావంతో, పాలకవర్గం సభ్యుల అసంతృప్తితో దేశంలో అరాచక పరిస్థితి నెలకొన్నది. దుర్మార్గులు, దుండగులు లూటీలకు, అలజడులకు తెగబడ్డారు.

రాయ్‌సీన్‌కు చెందిన ప్రముఖ దోపిడీదొంగ పూరణ్‌మల్ అరాచకం-అల్లర్లలో అందరినీ మించిపోయాడు. వాడి దోపిడీలకు, అరాచకాలకు వేలాది కుటుంబాలు బలయ్యాయి. హిందూ-ముస్లింలకు చెందిన దాదాపు రెండువేల మంది స్త్రీలు

నాట్యకత్తెలుగా మారిపోయారు. అనేకమంది అతని దౌర్జన్యాలు భరించలేక ఢిల్లీ చేరుకొని చక్రవర్తికి మొరపెట్టుకున్నారు. కాని చక్రవర్తి ఇబ్రాహీంలోదీ వారి మొర వినీ విననట్లు ఉండిపోయాడు. ఈ పీడితుల బాధామయ గాధ పట్ల షేర్‌షా ఎంతో ప్రభావితు డయ్యాడు. దేవుడు తనకు అధికారం ఇస్తే ఆ దుండగులు, అరాచకశక్తుల నుండి ప్రతీకారం తీర్చుకుంటానని అన్నాడు అప్రయత్నంగా. ఆ సమయం కోసం వేచిచూడ సాగాడు. కాకతాళీయంగా ఆ రోజుల్లోనే ఇబ్రాహీంలోదీ హతమార్చబడ్డాడు; ఢిల్లీరాజ్యం బాబర్ అధీనంలోకి వచ్చింది.

కొన్నాళ్ళ తర్వాత షేర్‌షా బాబర్‌సైన్యంలో చేరి మొగల్‌సైనికుల ప్రవర్తనను గమ నించాడు. కాని వారి ప్రవర్తన నచ్చక ఆగ్రా నుండి బీహార్‌కు వెళ్ళిపోయాడు. బీహార్ పాలకుడు మహ్మూద్‌ఖాన్ లూహానీ షేర్‌షాని స్వాగతించి సత్కరించాడు. ఒకసారి షేర్‌షా లూహానీతో కలసి వేటకు వెళ్ళాడు. అప్పుడు యాదృచ్ఛికంగా ఒక పులి లూహానీ మీద దాడిచేసింది. వెంటనే షేర్‌షా ఖడ్గందూసి పులిపై లంఘించి దాన్ని రెండు ముక్కలుగా నరికేశాడు. షేర్‌షా ధైర్యసాహసాలు, ప్రతిభాపరాక్రమాలు చూసి ఎంతో ప్రభావితుడయిన లూహానీ అతనికి షేర్‌ఖాన్ అనే బిరుదిచ్చాడు. ఆరోజు నుండి షేర్‌షా పేరుప్రతిష్ఠలు మరింత ఇనుమడించాయి.

మహ్మూద్‌ఖాన్ లూహానీ మరణానంతరం అతని మైనర్ కొడుకు జలాలుద్దీన్ బీహార్ పాలకుడయ్యాడు. అయితే జలాలుద్దీన్ ఇంకా పిన్న వయస్కుడే అయినందున అతని తల్లి షేర్‌షా(షేర్‌ఖాన్)ని అతని సంరక్షకుడిగా నియమించి పరిపాలనా బాధ్యతల్ని అతనికి అప్పగించింది. దాంతో షేర్‌షా ఇప్పుడు క్రియాత్మకంగా సర్వాధికారి అయ్యాడు. ఆ తరువాత అతను తన సంతతి అఫ్గాన్ నేతల్లో ధైర్యస్థయిర్యాలు కలిగించి తన శక్తిని, రాజ్యాన్ని మరింత విస్తృతపరచుసాగాడు. ఆ రోజుల్లోనే బెంగాల్‌పాలకుడు నుస్రుత్‌షా చనిపోయాడు. దాంతో అతని వారసుల్లో అంతర్యుద్ధం మొదలయింది. షేర్‌షా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ రాజ్యాన్ని తూర్పుభారత్‌లో చాలా దూరం దాకా విస్తృతపరిచాడు.

జలాలుద్దీన్ యుక్తవయస్సుకు చేరుకున్నాడు. అతను పాలనావ్యవహారాల్లో షేర్‌షా చేసుకుంటున్న అసాధారణ జోక్యం సహించలేక సహాయం కోసం నుస్రుత్‌షా వారసుడు మహ్మూద్‌షా దగ్గరకు వెళ్ళాడు. ఇలా జలాలుద్దీన్ రాజధాని వదలి వెళ్ళిపోవడంతో షేర్‌షాకు దారి సుగమం అయింది. అతనిప్పుడు యావత్తు బీహార్‌కు సర్వాధికారి అయ్యాడు. మహ్మూద్‌షా బీహార్‌పై దాడిచేశాడు. కాని షేర్‌షా చేతిలో ఘోరపరాజయం పాలై బెంగాల్‌కు పారిపోయాడు. ఈ విజయంతో షేర్‌షాకు మరింత ధైర్యం వచ్చింది. దాంతో అతను క్రీ.శ. 1538లో బెంగాల్‌పై సైనికచర్య తీసుకొని దాన్ని కూడా తన రాజ్యంలో కలుపుకున్నాడు.

బెంగాల్ మాజీపాలకుడు మహ్మూద్‌షా గత్యంతరంలేక హుమాయూన్ సహాయం అర్థించాడు. అప్పుడు హుమాయూన్ సైన్యం తీసుకొని బెంగాల్ మీద దాడిచేశాడు. అపుడు షేర్‌షా దగ్గర తగినంత సైన్యం, ఒనరులు లేకపోవడంతో అతను మొగల్



సైన్యాన్ని ప్రతిఘటించకుండా దారివదలి పక్కకు తప్పుకున్నాడు. దాంతో మొగల్‌సైన్యం అప్రతిహతంగా ముందుకు దూసుకుపోయి రాజధాని గోడ్‌కు చేరుకుంది. ఈవిధంగా బెంగాల్, బీహార్ వంటి రెండు పెద్ద రాష్ట్రాలు సులభంగా స్వాధీనం కావడంతో మొగల్ సైనికులు హద్దుమీరిన విజయానందంతో చిందులేస్తూ పండగ జరుపుకోవడంలో లీనమైపోయారు. సరిగ్గా అదే సమయంలో షేర్‌షా తిరిగొచ్చి రహ్తాస్‌గఢ్ నుండి ఖనూజ్ వరకున్న కోటలన్నిటిని ఆక్రమించుకొని దారిలో మాటువేసి కూర్చున్నాడు.

ఇదిలా ఉంటే అటు బెంగాల్‌లో మొగల్‌సైన్యంలో మలేరియా వ్యాపించి అనేక మంది మృత్యువాత పడసాగారు. వేరొకవైపు రాజధానిలో హుమాయూన్ సోదరులు తిరుగుబాటు జండా ఎగరవేసి అరాచకం, అల్లర్లకు పాల్పడ్డారు. ఈ వార్తలు విని హుమాయూన్ విచారిస్తూ సైన్యం తీసుకొని తిరుగుప్రయాణమయ్యాడు. దారిలో అతని సైన్యం గంగాతీరప్రాంతం చూమా సమీపానికి చేరుకొని విడిది చేసింది. వెంటనే మాటువేసి కూర్చున్న షేర్‌షా హఠాత్తుగా మొగల్‌సైన్యంపై విరుచుకుపడ్డాడు. మొగల్‌సైన్యం షేర్‌షా సైన్యాన్ని ప్రతిఘటించలేక పారిపోవడానికి ప్రయత్నించింది. కాని దాని ముందు గంగానది పరవళ్ళు తొక్కసాగింది. వెనుకవైపున అఫ్గాన్ సైన్యం గాండ్రిస్తోంది. చివరికి మొగల్‌సైనికులు వేలాదిమంది దిక్కుతోచక గంగానదిలో దూకి మునిగిపోయారు.

హుమాయూన్ కూడా గంగానదిలో మునిగిపోతుంటే సమయానికి ఎవరో ఓ సత్పురుషుడు వచ్చి అతడ్ని కాపాడాడు. ఈవిధంగా హుమాయూన్ గంగానది నుండి బయటపడి పారిపోయి ఆగ్రా చేరుకున్నాడు. అయితే షేర్‌షా అతడ్ని వెంబడించాడు. హుమాయూన్ ఎలాగో తప్పించుకొని ఢిల్లీ చేరుకొని అక్కడ్నుంచి లాహోర్‌కు, లాహోర్ నుండి కాబూల్‌కు చేరుకొని చల్లగా ఊపిరి పీల్చుకున్నాడు. కాని కాబూల్‌లో అతనికి ఎలాంటి సహాయం లభించకపోవడంతో ఈరాన్‌కు వెళ్ళి అక్కడి షియాపాలకుల దగ్గర ఆశ్రయం పొందాడు.

షేర్‌షా ఇప్పుడు ఉత్తరభారత్‌లోని సువిశాల సామ్రాజ్యానికి తిరుగులేని చక్రవర్తి అయ్యాడు. అప్పుడు ముందుగా అతను దుర్మార్గులు, దోపిడీదారులు, దౌర్జన్యపరులు వగైరా అరాచకశక్తుల్ని అంతమొందించి కొన్నాళ్ళలోనే దేశంలో శాంతిభద్రతలు పునరుద్ధ రించాడు. తరువాత అతను తనకు వ్యతిరేకంగా మొగల్‌సైన్యానికి సహాయపడిన రాజ పుత్ర రాజులపై దాడులు చేసి వారిని దారికి తెచ్చుకున్నాడు. అయితే క్రీ.శ. 1545లో కాలంజర్‌పై సైనికచర్య సాగిస్తున్నపుడు యాదృచ్ఛికంగా ఓ అగ్నిప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో షేర్‌షా శరీరం బాగా కాలిపోయింది. ఆరోజు సాయంత్రానికల్లా కోటను తన సైనికులు జయించారని తెలుసుకొని షేర్‌షా 'అల్‌హమ్దులిల్లాహ్' అంటూ దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత మూడుసార్లు 'సత్యసాక్ష్య వచనం' పఠించి అంతిమశ్వాస విడిచాడు.

షేర్‌షా చక్రవర్తి రాజ్యవిస్తరణతో పాటు దాని పటిష్ఠత, క్రమశిక్షణలపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాడు. పాలనావ్యవహారాల నిర్వహణ కోసం మొత్తం రాజ్యాన్ని అనేక

పరగణాలుగా విభజించి విభిన్న పాలనాధికారుల్ని నియమించాడు. వ్యవసాయరంగంలో కూడా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. నేరాలను చాలావరకు అంతమొందించాడు. అన్యాయం, అవినీతి చర్యల్ని అరికట్టడానికి గూఢచారుల్ని నియమించాడు. ఇతని పాలనాకాలంలో రాజ్యమంతటా శాంతిభద్రతలు పునరుద్ధరించబడ్డాయి. ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు. షేర్‌షా నిరాడంబరమైన పవిత్ర జీవితం గడిపేవాడు. అతను తన అధికారులక్కూడా వాటిని గురించి ఉపదేశించేవాడు. ప్రజల విద్యాశిక్షణల కోసం అనేకచోట్ల పాఠశాలలను ఏర్పాటు చేశాడు. పేదవిద్యార్థులకు ఉపకార వేతనాలు లభింపజేశాడు.

షేర్‌షా పాలనలో బలవంతుడు-బలహీనుడు, ధనవంతుడు-పేదవాడు, తనవారు-పరాయివారు అన్న వివక్ష లేకుండా అందరికీ ఒకే విధమైన న్యాయం జరిగేలా చేశాడు. ఒకసారి షేర్‌షా కుమారుడు ఆదిల్‌ఖాన్ ఏనుగు మీద ఎక్కి ఒక వీథి గుండా వెళ్తుంటే ఒకచోట ఓ వైశ్యుడి భార్య తన ఇంటి స్నానందొడ్డిలో స్నానం చేయడం కన్పించింది. అప్పుడు ఆదిల్‌ఖాన్ ఆమెను ఎగాదిగా చూస్తూ ఆమె వైపుకు తమలపాకుకిళ్ళీ విసిరాడు. ఆ మహిళ ఈ అవమానాన్ని సహించలేక తన భర్త ద్వారా షేర్‌షాకు ఫిర్యాదు చేసింది. షేర్‌షా వెంటనే 'ఆ వైశ్యుడు కూడా రాకుమారుడి భార్య పట్ల అలాగే చేసి బదులు తీర్చుకోవాలి' అని ఉత్తర్వు జారీచేశాడు. ప్రజలు ఆ ఉత్తర్వుని ఉపసంహరించుకోమని సుల్తాన్‌ని ఎంతగానో బ్రతిమాలారు. కాని సుల్తాన్ అందుకు ఏమాత్రం అంగీకరించలేదు. చివరికి రాకుమారుడు ఆదిల్‌ఖాన్ ఆ వైశ్యుడికి క్షమాపణ చెప్పుకొని ఆ రొచ్చు నుండి బయటపడ్డాడు.

ఆ రోజుల్లో ఈరాన్‌లో సఫవీ తెగకు చెందిన షియామతస్థులు పరిపాలన చేస్తుండే వారు. షేర్‌షాతో జరిగిన యుద్ధంలో మొగల్‌చక్రవర్తి హుమాయూన్ ఓడిపోయిన తర్వాత ఈరాన్‌కు పారిపోయి అక్కడి షియాపాలకుల శరణుపొందాడు. వారి సహాయంతో భారత్ మీద మరోసారి దాడిచేయ దలిచాడు. ఈరాన్ షియాపాలకులు సున్నీ ప్రజల్ని వేధిస్తుండే వారు. హజ్‌యాత్రకు వెళ్ళే సున్నీలను కూడా వారు వేధిస్తుండేవారు.

ఆ కాలంలో కాబా ధర్మకర్తలుగా టర్కీజాతికి చెందిన ఉస్మానీ ఖలీఫాలు ఉండే వారు. ఈరాన్ షియాపాలకులు సున్నీ హాజీలను వేధించడాన్ని అరికట్టేందుకు షేర్‌షా చక్రవర్తి ఆగ్రాకు చెందిన సుప్రసిద్ధ హదీసువేత్త మౌలానా రఫీయుద్దీన్ షీరాజీని దౌత్యవేత్తగా నియమించి టర్కీ సుల్తాన్ (ఉస్మానీ ఖలీఫా) దగ్గరకు పంపించాడు. భారత్, టర్కీల వైపు నుండి ఈరానీయులను చుట్టుముట్టి వారి పీచం అణచాలన్నది అతని పథకం. కాని ఈ పథకం కార్యరూపం దాల్చకముందే షేర్‌షాను మృత్యువు కబళించింది.

షేర్‌షా తదనంతరం పాలకవర్గం అతని చిన్నకొడుకు జలాల్‌ఖాన్‌ని గద్దె నెక్కించింది. జలాల్‌ఖాన్ ఆ తర్వాత సలీంషాగా ప్రసిద్ధిచెందాడు. సలీంషా ప్రారంభంలో కొన్నాళ్ళపాటు తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ బాగానే పరిపాలన చేశాడు. కాని ఆ తర్వాత అధికార గర్వంతో పాలకవర్గం సభ్యులపై, సైనికులపై పనికిమాలిన ఆజ్ఞలతో వత్తిడిచేస్తూ



వేధించడం, అవమానించడం మొదలెట్టాడు. దాంతో అధికారులు, సైనికులు అతనికి వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగారు. హత్యాప్రయత్నం కూడా చేశారు. దాంతో సలీంషా మరింత పెచ్చరిల్లిపోయి వారిపట్ల చాలా కఠినంగా ప్రవర్తించసాగాడు. అనుభవశాలురైన ఉన్నతాధికారుల్ని హతమార్చాడు. వారి స్థానాల్లో అనుభవశూన్యులు, ముఖస్తుతి చేసే వారిని నియమించాడు. చివరికి క్రీ.శ. 1554లో సలీంషా చనిపోవడంతో పాలనావ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది.

సలీంషా తదనంతరం అతని యుక్తవయస్సుకు రాని కొడుకు ఫీరోజ్‌షాని గద్దె నెక్కించడం జరిగింది. కాని ఫీరోజ్‌షా గద్దెనెక్కిన మూడు రోజులకే అతని మేనమామ అతడ్ని హతమార్చడానికి ఖడ్గం తీసుకొని రాజమహల్లోకి ప్రవేశించాడు. అతని అసమర్థత, కుటిల మనస్తత్వం ఎరిగిన సుల్తాన్ సలీంషా అతనికి ఎలాంటి ఉన్నతహోదా ఇవ్వలేదు. కాని అతని సోదరి, అంటే సలీంషా భార్యామణి ఎంతగానో నచ్చజెప్పి అతనికి మంత్రి పదవి ఇప్పించింది. దానికి ప్రత్యుపకారంగా ఆ దుర్మార్గుడు తన సోదరి కళ్ళముందే ఆమె ఎంత బ్రతిమాలినా, కాళ్ళావేళ్ళా పడినా వినకుండా ఆమె కొడుకు ఫీరోజ్‌షాని దారుణంగా హతమార్చి అధికారం చేజిక్కించుకున్నాడు. తరువాత ఆదిల్‌షా బిరుదుతో పరిపాలన వెలగబెట్టాడు.

అతని పాలనలో హేమూ అనే ఓ మంత్రి ఉండేవాడు. అతను అఫ్గాన్ అధికారుల్ని చాలా నీచంగా చూస్తూ వారి పట్ల దురుసుగా ప్రవర్తించేవాడు. ఇలా మంత్రి హేమూ, సుల్తాన్ ఆదిల్‌షాల దుష్ప్రవర్తనతో పాలకవర్గం సభ్యులు, గవర్నర్లు విసుగెత్తిపోయి అనేకప్రాంతాల్లో తిరుగుబాటుకు పాల్పడ్డారు. మరోవైపు ఆదిల్‌షా బావ ఇబ్రాహీం సూరి, పంజాబ్‌గవర్నర్ అహ్మద్‌ఖాన్ (సికందర్‌షా)లు కూడా తిరుగుబాటు జెండాలు ఎగర వేశారు. దాంతో ఈ మూడు వర్గాల్లో అంతర్యుద్ధాలు మొదలయ్యాయి.

ఎప్పటినుంచో అదను కోసం ఎదురుచూస్తున్న మాజీ మొగల్‌చక్రవర్తి హుమాయూన్‌కు ఈ అంతర్యుద్ధాలు ఎంతో ప్రయోజనం చేకూర్చాయి. అతను ఈరాన్‌కు చెందిన షియాసైన్యం సహాయంతో రహతాస్‌నౌ కోటను, తరువాత మొత్తం పంజాబ్‌ను ఆక్రమించుకొని ఢిల్లీ వైపు పురోగమించాడు. ఇలా హుమాయూన్ పదిహేను సంవత్సరాలు పోరాడుతూ చివరికి ఢిల్లీ సింహాసనం స్వాధీనం చేసుకోగలిగాడు. కాని అతను సరిగ్గా ఆర్నెల్లు కూడా పరిపాలన సాగించలేక పోయాడు, మృత్యువు అతడ్ని కాటేసింది. అది మగ్రిబ్‌నమాజ్ వేళ. అజాన్ ప్రతిధ్వనించింది. వెంటనే హుమాయూన్ వేగంగా మెట్లు దిగసాగాడు. అంతే, కాలుజారి దభీమని మెట్ల పైనుండి కిందికి దొర్లిపడి ఊపిరి విడిచాడు.

హుమాయూన్ మరణానంతరం అతని పదమూడేళ్ళ కుమారుడు అక్బర్‌ని పాలక వర్గం గద్దె నెక్కించింది. అక్బర్ సంరక్షకుడిగా సేనాపతి, ప్రధాని అయిన బైరమ్‌ఖాన్ నియమించబడ్డాడు. ఈవిధంగా సూరీవంశ పాలన అంతమైపోయి ఇప్పుడు మొగల్ వంశపాలన భారత్‌లో మళ్ళీ నెలకొన్నది.

# 85. అక్బర్ చక్రవర్తి

అక్బర్ పూర్తిపేరు జలాలుద్దీన్ ముహమ్మద్ అక్బర్. అతను క్రీ.శ. 1541లో పుట్టాడు. అక్బర్ పుట్టినపుడు అతని తండ్రి హుమాయూన్‌ని షేర్‌షా పరాజయం పాల్జేసి దేశం నుండి వెళ్ళగొట్టాడు. హుమాయూన్ పరాజయపరాభవంతో, అసహాయస్థితిలో ఏఒక్క చోటా నీడ లభించక ఏండ్లతరబడి దేశదిమ్మరిలా తిరిగాడు. అంచేత అక్బర్‌కు ఎలాంటి విద్యాశిక్షణలు లభించక అజ్ఞానిలా ఉండిపోయాడు. అతను ప్రపంచంలోని అనేక ఎగుళ్ళు-దిగుళ్ళు చూశాడు. పదమూడేండ్ల వయసులో తండ్రినీడ కోల్పోయాడు. దాంతో అతనిపై పూర్తి అరాచకపరిస్థితితో కూడుకున్న రాజ్యనిర్వహణ భారం వచ్చిపడింది.

మొగల్ ప్రత్యర్థులైన అఫ్గాన్‌లు తాము కోల్పోయిన అధికారం తిరిగి చేజిక్కించుకునేందుకు దేశం నలుమూలలా అల్లర్లు, అలజడులు సృష్టించసాగారు. సూరీవంశం చివరి పాలనాకాలంలో చెలరేగిన అంతర్యుద్ధాలను ఆసరాగా చేసుకొని రాజపుత్రులు, ఇతర సామంతరాజులు అనేక చోట్ల స్వతంత్రరాజ్యాలుగా ప్రకటించుకున్నారు. అయితే అక్బర్ సంరక్షకుడు, ప్రధానమంత్రి అయిన బైరంఖాన్ ఎంతో నేర్పుతో ఈ అరాచకాలపై అదుపు సాధించి శాంతిభద్రతల్ని తిరిగి నెలకొల్పాడు.

హుమాయూన్ చనిపోయిన తరువాత ఆదిల్‌షా తన హిందూ ప్రధానమంత్రి హేమూకు ఓ భారీసైన్యం ఇచ్చి ఆగ్రా పంపాడు. హేమూ మొదట ఆగ్రాని, తరువాత ఢిల్లీని జయించి విక్రమాదిత్యుడిగా అవతారమెత్తి ఢిల్లీ పాలకుడిగా సింహాసనం అధిష్టించాడు. ఢిల్లీ పాలకుడు తర్దీబేగ్ ఓడిపోయి పంజాబ్‌కు పారిపోయాడు. అప్పుడు అక్బర్ ప్రధానమంత్రి బైరంఖాన్ కోపోద్రేకాలతో వివశుడై తర్దీబేగ్‌ని హతమార్చాడు. తరువాత హేమూని అణచడానికి బయలుదేరాడు. పానిపట్ మైదానంలో రెండు సైన్యాలు ఢీకొన్నాయి. హేమూ సైన్యంలోని అఫ్గాన్‌లు ముందునుంచే అతని దుష్ప్రవర్తనతో విసుగెత్తిపోయినందున వారీ యుద్ధంలో తమ సత్తా చాటలేకపోయారు. ఆ పరిస్థితిలో హేమూ కంటిలో ఒక బాణం వచ్చి దిగబడింది. దాంతో అతను స్పృహతప్పి పడిపోయాడు. సైనికులు నాయకుడి దుస్థితి చూసి యుద్ధరంగం వదలి పారిపోయారు. తర్వాత హేమూ పట్టుబడి హతమార్చబడ్డాడు.

ఈవిధంగా ఢిల్లీ, ఆగ్రాలు మళ్ళీ మొగల్‌పాలన కిందికి వచ్చాయి. ఈ యుద్ధంతో అఫ్గాన్‌ల ప్రభావం పూర్తిగా తగ్గిపోయింది. పంజాబ్ గవర్నర్ అహ్మద్‌ఖాన్ (సికందర్‌షా) కూడా నిరాశచెంది ఓటమిని అంగీకరిస్తూ మొగల్ పాలకులకు పాదాక్రాంతుడయ్యాడు. ప్రధాని బైరంఖాన్ అతడ్ని శిక్షించకుండా మంచిగా మసలుకుంటూ తూర్పుభూభాగంలోని కొన్ని జిల్లాలను అతనికి స్వాధీనం చేశాడు.

బైరంఖాన్ నాలుగేండ్ల పాటు అక్బర్ సంరక్షకుడిగా, ప్రధానమంత్రిగా ఉండి మొగల్ సామ్రాజ్యానికి విధేయుడిగా, శ్రేయోభిలాషిగా, ఎంతో నమ్మకస్తుడిగా సేవచేస్తూ అందరికీ తలలో నాలుకగా మసలుకున్నాడు. అతని కారణంగానే భారత్‌లో మళ్ళీ మొగల్‌రాజ్యం స్థాపించబడింది. మరొకవైపు అతను ప్రభుత్వాధికారుల్ని, గవర్నర్లను అదుపులో పెట్టి



దేశాన్ని క్రమశిక్షణారాహిత్యం నుండి కాపాడాడు. అక్బర్‌కు మంచి శిక్షణ కూడా ఇచ్చాడు. అయితే అధికారమత్తులో బైరంఖాన్ వల్ల కొన్ని తప్పులు కూడా జరిగాయి. వాటిలో కొన్ని అక్బర్‌కు కూడా నచ్చలేదు. ఉదాహరణకు అనేకమంది సర్దారులను కేవలం అనుమానం, తన దారిలో అడ్డంకులు కారణంగా కఠినశిక్షలు విధించాడు. అందువల్ల వారిలో అనేకమంది బైరంఖాన్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నసాగారు.

బైరంఖాన్ షియామతస్థుడయినందున షియాపండితుడైన గదాయీని మతవ్యవహారాల మంత్రి (షేఖుల్‌ఇస్లాం)గా నియమించాడు. కుట్రదారులు దీన్ని కూడా సాకుగా తీసుకొని అతనికి వ్యతిరేకంగా ప్రజల్లో దుష్ప్రచారం సాగించారు. అక్బర్ యుక్తవయస్కుడయ్యాడు. బైరంఖాన్ ప్రతి చిన్న వ్యవహారంలోనూ తలదూర్చుతూ నియంతగా ప్రవర్తించడం అక్బర్‌కు ఏమాత్రం నచ్చలేదు. అంచేత అతను కూడా కుట్రదారులతో చేతులు కలిపాడు. తన తల్లిని చూసే సాకుతో ఢిల్లీ వెళ్ళి అక్కణ్ణుంచే “ఈరోజు నుండి సామ్రాజ్య పరిపాలనా పగ్గాలు నేను నా చేతుల్లోకి తీసుకుంటున్నాను. ఇకనుండి నా ఆజ్ఞలు మాత్రమే అమలవుతాయి. కనుక మీరు హజ్ కోసం మక్కా వెళ్ళిపోవడం మంచిది” అంటూ బైరంఖాన్‌కు ఆజ్ఞ జారీచేశాడు.

బైరంఖాన్ తన అనుచరుల సలహాను వ్యతిరేకించి రాజాజ్ఞను శిరసావహిస్తూ మక్కా బయలుదేరాడు. అతనలా బయలుదేరి కొంచెందూరం వెళ్ళాడోలేదో అక్బర్ కుట్రదారుల సలహాతో బైరంఖాన్‌ని దేశబహిష్కరణ చేసే ఉద్దేశ్యంతో ఒక సైనికదళం పంపించాడు. బైరంఖాన్ ఆ సైన్యానికి వ్యతిరేకంగా తిరగబడ్డాడు. అక్బర్ ఈ సంగతి తెలుసుకొని మరో సైనికదళం తీసుకొని అక్కడికి చేరుకున్నాడు. బైరంఖాన్ గత్యంతరంలేక క్షమించమని ప్రాధేయపడ్డాడు. అక్బర్ అతడ్ని క్షమించి మక్కా వెళ్ళడానికి అనుమతించాడు. అయితే బైరంఖాన్ హజ్ సంకల్పంతో మక్కా వెళ్తుంటే గుజరాత్ సమీపంలో ఎవరో ఒ అపరిచిత శత్రువు అతడ్ని దారుణంగా హతమార్చాడు.

అక్బర్ పరిపాలనా పగ్గాలు చేతిలోకి తీసుకున్న తర్వాత పాలకవర్గం సభ్యుల్ని అదుపాజ్ఞల్లో ఉంచడమనే సమస్య ఇంకా మిగిలివుంది. పాలకవర్గంలో ఈరానీయులు అత్యధికసంఖ్యలో ఉన్నారు. తర్వాత ఉజ్బెకీయుల సంఖ్య ఉంది. ఈ రెండు ముఠాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉండేది. మరొకవైపు ఉజ్బెకీ, మొగల్‌సర్దారుల మధ్య కూడా విరోధం ఉండేది. మధ్యాసియాకు చెందిన ఈ రెండు యుద్ధప్రియ వర్గాల మధ్య నిత్యం సమరజ్వాలలు రగులుతుండేవి. అక్బర్ ఈరానీయుల వైపు మొగ్గడం ఉజ్బెకీయులకు నచ్చలేదు. క్రీ.శ. 1565లో ఉజ్బెకీ సేనాపతి అబ్దుల్లాఖాన్ నిర్విరామ కృషితో మాల్వాను జయించాడు. అంచేత అక్బర్ మాల్వా పాలకుడిగా అబ్దుల్లాఖాన్‌నే నియమించాడు.

కాని అతను సమరసొత్తును రాజధాని ఆగ్రాకు పంపకుండా తన దగ్గరే పెట్టుకున్నాడు. దానిపై అక్బర్ మండిపడుతూ అతడ్ని శిక్షించడానికి షికారు సాకుతో అకస్మాత్తుగా మాల్వా చేరుకున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న అబ్దుల్లాఖాన్ మాల్వా నుండి గుజరాత్‌కు పారిపోయాడు. దాంతో మొగల్‌వర్గీయులు ప్రతీకారం తీర్చుకోడానికి

ఉజ్బేకీయుల్ని తుడిచిపెట్ట జూస్తున్నారని జనంలో అపోహ చెలరేగింది. తత్ఫలితంగా ఉజ్బేకీయులు చావడమో చంపడమో తేల్చుకోవడానికి రంగంలోకి దిగారు. దాదాపు మూడేళ్ళ పాటు అల్లర్లు, అలజడులతో దేశం అట్టుడికి పోయింది. ఈ తిరుగుబాటు వర్గానికి జోన్పూర్ రాష్ట్ర గవర్నర్ ఖాన్‌జమాన్‌ఖాన్ నాయకత్వం వహించి అక్బర్‌ని తీవ్ర ఆందోళన పరిచాడు. అక్బర్ మొత్తంమీద అతని అనుచరుల్ని, ఇతర ఉజ్బేకీయులందర్నీ అతిదారుణంగా హతమార్పించి తిరుగుబాటును అణచివేశాడు.

అక్బర్ తన రాజ్యాన్ని పటిష్ఠపరచుకోవడానికి, దాన్ని మరింత విస్తృతపరచుకోవడానికి మంచీ-చెడు, ధర్మం-అధర్మం, న్యాయం-అన్యాయాలతో నిమిత్తం లేకుండా దేశ అధికసంఖ్యాకులైన హిందువులకు పెద్దపెద్ద పదవులు కట్టబెట్టాడు. వారితో సామాజిక సంబంధాలు పెట్టుకున్నాడు. వారి విశ్వాసం చూరగొనడానికి తన ధార్మిక విశ్వాసాలను దిగజార్చి హిందూవిశ్వాసాలకు, వారి ఆచారాలకు పెద్దపీట వేశాడు. వారి స్త్రీలను వివాహమాడాడు. మొట్టమొదట అతను క్రీ.శ. 1562లో జైపూర్‌రాజు బహారీమల్ కుమార్తెను వివాహమాడాడు. తరువాత అతని సోదరుడు భగవాన్‌దాస్‌కు, సోదరకుమారుడు మాన్‌సింగ్‌కు ముఖ్యమైన పదవులు ఇచ్చాడు. వారి సహకారంతో క్రమక్రమంగా రాజపుత్ర రాజులందర్నీ తన విధేయులుగా మార్చుకున్నాడు. ఒక్క చిత్తోడ్ రాజు ఔదేసింగ్ మాత్రం అక్బర్ వలలో పడలేదు. అంచేత అక్బర్ క్రీ.శ. 1567లో చిత్తోడ్‌పై దాడిచేసి దాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఔదేసింగ్ తప్పించుకొని కొండల్లోకి పారిపోయాడు. అక్కడ్నుంచి అప్పుడప్పుడు దాడులకు తెగబడుతుండేవాడు.

అక్బర్ రాజపుత్రుల సహకారంతో ఆ తర్వాత స్వతంత్ర ముస్లిం రాష్ట్రాలను జయించడానికి, తన ప్రత్యర్థులైన అఫ్ఘాన్, ఉజ్బేక్ తెగల జోరు తగ్గించడానికి పూనుకున్నాడు. అతను క్రీ.శ.1576లో గుజరాత్‌ని, బెంగాల్‌ని ఆక్రమించుకున్నాడు. ఇలా ఉత్తరభారత్‌కు చెందిన అనేక రాష్ట్రాలను, తర్వాత దక్కన్‌ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. తన సవతిసోదరుడు హకీంమిర్జా క్రీ.శ. 1585లో చనిపోగానే అక్బర్ కాబుల్‌ని ఆక్రమించి మాన్‌సింగ్‌ని దాని పాలకుడిగా నియమించాడు. అయితే అక్కడి అఫ్ఘాన్‌తెగలు అతడ్ని నిత్యం చికాకు పరుస్తుండేవారు. అక్బర్ క్రీ.శ. 1591లో కశ్మీర్‌ని, 1592లో ఖంధార్‌ని కూడా ఆక్రమించుకున్నాడు. రాజ్యవిస్తరణ తర్వాత పాలనావ్యవస్థను గతచక్రవర్తి షేర్‌షా నెలకొల్పిన ఏర్పాట్ల ప్రకారమే నిర్వహించాడు.

**1-అక్బర్ మతవిశ్వాసాలు:-** అక్బర్ చదువుసంధ్యలు లేని అజ్ఞాని అయినప్పటికీ మొదట్లో సామాన్యముస్లింల మాదిరిగా ఇస్లామీయవిశ్వాసాలే కలిగివుండేవాడు. సామూహిక నమాజ్ కూడా చేస్తుండేవాడు. అంతేకాదు, అజాన్ ఇచ్చేవాడు, నమాజీలకు నాయకత్వం వహించేవాడు, ఇమాములను, ధర్మవేత్తలను గౌరవించేవాడు. ముఖ్యంగా ప్రముఖ ధర్మవేత్త షేఖ్ అబ్దుల్‌నబీ పట్ల అమిత గౌరవభావం కలిగివుండేవాడు. తరచుగా ఆయన ఇంటికి వెళ్ళి ఆయన ధార్మిక బోధనలు వినేవాడు. ఖాజా మొయినుద్దీన్ చిష్తీ (రహ్మాలై), ఖాజా సలీంచిష్తీ (రహ్మాలై)ల పట్ల అపార భక్తివిశ్వాసాలు కలిగివుండేవాడు. భార్య గర్భవతి అయినపుడు శుభం కోసం ఖాజా సలీంచిష్తీ (రహ్మాలై) దర్గా దగ్గరకు



పంపించాడు. దేవుని దయవల్ల కొడుకు పుట్టే అది ఖాజా సలీంచిష్తీ (రహ్మాలై) ఆశీర్వాద ఫలితమేనని భావించి కొడుక్కు సలీం అని పేరు పెట్టుకున్నాడు.

ఆ తర్వాత అక్బర్ ఫతేపూర్‌సిక్రీ పేరుతో మతం చుట్టూ ఓ అందమైన పట్టణం నిర్మింపజేసి రాజధానిని ఆగ్రా నుండి అక్కడికి మార్చాడు. క్రీ.శ. 1575లో ఆ మఠానికి దగ్గర్లో బ్రహ్మాండమైన భవనం నిర్మింపజేసి దానికి ఆరాధనాలయం అని పేరుపెట్టాడు. ప్రతి శుక్రవారం నమాజ్ తర్వాత ఆ భవనంలో ధర్మవేత్తలు, తత్వవేత్తలు గుమికూడి మతవ్యవహారాలను గురించి ప్రత్యేక గోష్ఠి జరుపుకునేవారు.

అక్బర్ అధికారపీఠం అధిరోహించిన ఇరవై ఏళ్ళ దాకా అతని మతవిశ్వాసాల స్థితి ఇలాగే ఉండింది. ఆ తర్వాత అతని మతరంగు క్రమంగా వెలసిపోసాగింది. వివిధ మతాలకు చెందిన విభిన్న విశ్వాసాలు, ఆచారాల కలగూరగంపగా తయారయింది. ఆ కలగూరగంపలో ఇస్లాం చూచాయిగా కూడా కన్పించదు. దీనెఇలాహి పేరుతో ఓ కొత్త మతాన్ని సృష్టించి ప్రచారంచేశాడు. మతవ్యవహారంలో అక్బర్‌లో వచ్చిన ఈ అసాధారణ మార్పుకు నాలుగు ప్రధానకారణాలని చెప్పవచ్చు. 1-అక్బర్‌కు చదువుసంధ్యలు లేకపోవడంతో పాటు, అధికార గర్వం. 2-రాణివాసంలో ముస్లిమేతర రాణుల ప్రభావం, ఆస్థానంలో ముస్లిమేతర నాయకులు, దర్బారీల ప్రభావం. 3-షియామత సర్దారులు అత్యధికసంఖ్యలో ఉండటం, షియామత ప్రభంజనం. 4-ఐహిక వ్యామోహపరులైన ధర్మవేత్తల దుష్టనడవడికలు, వారి కుట్రలు-అరాచకాలు.

1-మొగల్ సర్దారులు ముస్లింసముదాయ సాంస్కృతిక కేంద్రాలు పతనావస్థలో ఉన్నప్పుడు ఇస్లాం స్వీకరించడంతో వారు ఇస్లాం స్పిరిట్‌ని జీర్ణించుకోలేక పోయారు. అలాంటి మొగల్ తెగకు చెందిన అక్బర్ చిన్నతనంలోనే నిలకడలేని జీవితం గడపడం, చదువుసంధ్యలు అబ్బకపోవడం, పదమూడేండ్ల వయస్సులో తండ్రినీడ కోల్పోవడం, ఆ వయసులోనే రాజ్యాధికార బాధ్యత మీద పడటం, ఆ తర్వాత అధికారగర్వం వగైరా కారణాలు అతడ్ని మూర్ఖత్వంలోకి నెట్టివేశాయి.

2-ముస్లిమేతర రాణులు, ముస్లిమేతర దర్బారీల వల్ల అక్బర్ తన ప్రత్యర్థులైన అఫ్ఘాన్‌లను, రాజపుత్ర తిరుగుబాటుదారుల్ని, స్వతంత్ర ముస్లిం రాష్ట్రాల పాలకుల్ని అణచివేయడంలో విజయమైతే సాధించగలిగాడు. కాని ఆ రాణుల్ని, దర్బారీలను సంతోషపెట్టడానికి అనేక హిందూఆచారాలను అవలంబించాడు. వాటి వ్యాప్తి కోసం తన ప్రభావపలుకుబడుల్ని వినియోగించాడు.

3-ఈరాన్‌కు చెందిన సఫవీసుల్తానులు షియావిశ్వాసాల్లో అతివాదానికి గురయ్యారు. అక్బర్‌తండ్రి హుమాయూన్ సైనికసహాయం కోసం ఈరాన్‌కు పారిపోయి అక్కడి అతివాద షియామతం వైపుకు మొగ్గాడు. అలాంటి తండ్రి నుండి వారసత్వం పుణికి పుచ్చుకున్న అక్బర్ సహజంగానే ఈరాన్ షియాలను చేరదీసి వారి మతప్రభావానికి గురైపోయాడు. దాంతో అతను తాత్కాలికవివాహం (ముతా)ను ధర్మసమ్మతం చేసుకోడం; ఇమామ్‌ను పాపరహితుడిగా, సమకాలిన ధర్మసంస్కర్తగా భావించడం; ప్రవక్త అనుచరుల్ని కించపరచే మాటలనడం, తనను వారికంటే అధికుడని భావించడం జరిగింది.

అక్బర్ వైఖరిలో తప్పుడుమార్పు రావడానికి ఆనాటి ధర్మవేత్తల నీతిరాహిత్యమైన ఆచరణే ప్రధానకారణం. ప్రారంభంలో అక్బర్ సరైన ఇస్లామీయ విశ్వాసాలు కలిగిన సాధారణముస్లింగా ఉండటమేగాక ధర్మవేత్తలు,తత్వవేత్తల పట్ల అపారమైన అభిమానం కూడా కలిగివుండేవాడు. అతను తనను సంస్కరించుకోవడానికి, ఇస్లాంను గురించి మరింతజ్ఞానం సంపాదించడానికి షేఖ్ అబ్దుల్నబీ శిష్యరికం కూడా చేశాడు.

ధర్మవేత్తలు, తత్వవేత్తల సహచరభాగ్యం పొంది ధర్మజ్ఞానం సంపాదించడానికి అక్బర్ ఫతేపూర్సిక్రీలో ఆరాధనాలయం పేరుతో భవనం కట్టించాడు. అక్కడ ప్రతి శుక్రవారం వందమందికి పైగా పండితులు సమావేశమై వివిధ అంశాలపై చర్చలు జరిపేవారు. వారు గనక తమ కర్తవ్యాన్ని గుర్తించి ఇస్లాంకు సరైన ప్రాతినిధ్యం వహించివుంటే అక్బర్ నిరక్షరాస్యుడైనప్పటికీ మార్గభ్రష్టుడై ధర్మవ్యతిరేక చేష్టలకు పాల్పడేవాడు కాదు. కాని ఆ ధర్మవేత్తలు, తత్వవేత్తల్లో అత్యధికమంది ఎదుటివారిపై తమ ఆధిక్యతను చాటుకునే ఉద్దేశంతో ధర్మంలో అంతగా ప్రాముఖ్యంలేని అత్యల్పవిషయాలపై వితండవాదాలకు దిగేవారు. పైగా తమ సత్తా చాటుకొని చక్రవర్తికి మరింత చేరువకావడానికి ఎదుటివారిపై దూషణలక్కూడా పాల్పడేవారు. సాధారణ భేదాభిప్రాయాల విషయంలో సైతం ఒకరిపై నొకరు కుఫ్ర్(అవిశ్వాస) ఫత్వాలు జారీచేసుకునేవారు.

గొంతులు చించుకొని చేసుకునే ఈ వాదోపవాదాలు విన్న నిరక్షరకుక్షి అయిన అక్బర్ ఇస్లాంలో ఏ సమస్యకూ సరైన పరిష్కారం లేదని భావించాడు. ఇలా మనశ్శాంతి కోల్పోయిన అక్బర్లో క్రమేణా ఇస్లాం పట్ల వ్యతిరేకభావం జనించింది. దానికి కొందరు భజనరాయిళ్ళు అతడ్ని మరింత ఉసిగొల్పి చక్రవర్తి చెప్పిందే సరైనధర్మం అని ప్రకటించారు. దాంతో అక్బర్ విభిన్న మతాలకు చెందిన విశ్వాసాలు, ఆచారాలతో కలగూరగంపలాంటి ఓ కొత్తమతానికి తెరలేపాడు. అదే 'దీనె ఇలాహి'. ఇస్లాంను పరిహరిస్తూ ఈ కొత్త మతాన్ని ప్రచారంచేస్తున్న అక్బర్ని సహృదయులైన ధర్మవేత్తలు తీవ్రంగా విమర్శించారు. అయితే వారిలో అనేకమందిని అక్బర్ నిర్దాక్షిణ్యంగా చంపించాడు.

అక్బర్ తన కొత్తమతం గురించి ఎంత ప్రచారం చేసుకున్నా అతని ప్రసన్నత కోసం 18మందిమాత్రమే దాన్ని స్వీకరించారు. ఆ మతంలో అతను హిందూఆచారాలు ఎన్ని ప్రవేశపెట్టినా హిందూనాయకుల్లో హాస్యగాడైన ఒక్క బీర్బల్ తప్ప ఎవరూ అందులో ప్రవేశించలేదు. అక్బర్ ఆస్థానంలో సుప్రసిద్ధ హిందూనాయకులైన భగవాన్దాస్, తోడర్మల్ అయితే బహిరంగంగా దీనెఇలాహీని వ్యతిరేకించారు. దీనెఇలాహి స్వీకరించమని అక్బర్ కోరినపుడు మరోప్రముఖ హిందూనాయకుడు మాన్సింగ్ దాన్ని వ్యతిరేకిస్తూ "నేను హిందువుని. ముస్లింని కమ్మంటారా? నేను అవలంబించడానికి మూడోమార్గం ఏమిటో నాకు తెలియదు" అని అన్నాడు.

దీనెఇలాహి స్థాపనకు అక్బర్ని ప్రేరేపించిన ప్రముఖుడు ముల్లాముబారక్, అతని ఇద్దరు కొడుకులు అబుల్ఫజల్, ఫైజీ. ఈ తండ్రీకొడుకులు ఒకానొకప్పుడు గొప్ప ధర్మవేత్తలుగా, దైవభక్తులుగా ప్రజల ప్రశంసలు అందుకున్నవారే. ఆ తరువాత కష్టాల నుండి గట్టెక్కడానికి అక్బర్ని ఆశ్రయించారు. ముల్లా రెండవకొడుకు ఫైజీ ధర్మవేత్త కావడంతో



పాటు గొప్ప పార్సీ కవి కూడా. అతనొకసారి అక్బర్ కొలువులో అతడ్ని పొగుడుతూ ఓ కవిత రాసి విన్పించాడు. దాంతో అక్బర్ అతని పట్ల ప్రసన్నుడై క్రీ.శ. 1566లో అతడ్ని తన ఆస్థానంలో చోటు కల్పించాడు. ఆ తర్వాత ఫైజీ తన పలుకుబడితో తన తండ్రి, సోదరుని కోసం దారి సుగమం చేశాడు. ఆ తర్వాత ఈ ముగ్గురు తమ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా కుట్రలు, కుయుక్తులు పన్నుతూ క్రమంగా అక్బర్కు బాగా చేరువై దీనెఇలాహీకి అంకురార్పణ చేయించారు.

క్రీ.శ. 1593లో ముల్లాముబారక్ చనిపోయాడు. తరువాత రెండేళ్ళకు అతని కొడుకు ఫైజీ కూడా సుదీర్ఘకాల వ్యాధిగ్రస్తుడై చనిపోయాడు. పోతే అబుల్ఫజల్ చక్రవర్తికి ముఖ్యసలహాదారుడయి అతని అధర్మచేష్టలకు వెన్నుదన్నుగా నిలిచాడు.

అయితే సన్మార్గగాములైన ధర్మవేత్తలు, దర్బారీ నాయకులు ఒకవైపు అక్బర్కు హితోపదేశం చేస్తూ జనసామాన్యాన్ని అతని అధర్మచేష్టలకు దూరంగా ఉంచడానికి కృషి చేశారు. వారి కృషితో అధికసంఖ్యాకులు అక్బర్ ఇస్లాంవ్యతిరేక చేష్టలకు గురికాకుండా ఉండగల్గారు. రాజమహల్లో, రాజదర్బారులో ముస్లిమేతరుల ప్రభావం శృతిమించడంతో ఖుత్బుద్దీన్ఖాన్ కోకో, షహ్నాజ్ఖాన్ కంబూ అనే ఇద్దరు దార్బారీలు ధైర్యంచేసి అక్బర్కు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. ఇబాదత్ఖాన సమావేశాల్లో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పట్ల కువిమర్శలు జరుగుతున్న సంగతి తెలియగానే యావద్దేశ ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమయింది. జోన్పూర్ ప్రధానఖాజి అక్బర్ ఇస్లాంవ్యతిరేక వైఖరితో విసిగిపోయి అతనికి వ్యతిరేకంగా జిహాద్చేయడం ముస్లింల విధి అని ఫత్వా జారీచేశాడు. దాన్ని బెంగాల్ ఖాజీ మాజల్ముల్క్, మరికొందరు నాయకులు సమర్థించారు. అక్బర్ ఆ మహనీయుల్ని ఓ మిషతో పిలిపించి హత్యచేయించాడు.

ఈ దుర్ఘటనతో దేశప్రజలు మరింత రెచ్చిపోయి నిరశన జ్వాలలు రగిలించారు. బెంగాల్, బీహార్లలో తిరుగుబాటు ఉద్యమాలు చెలరేగాయి. అక్బర్ చివరికాలంలో ఖాజా బాఖీబిల్లా (రహ్మాలై), షేఖ్ అబ్దుల్హఖ్ ముహద్దిస్ దహెల్వీ (రహ్మాలై), ముజద్దిద్ అలిఫ్సాని (రహ్మాలై)ల ప్రచారప్రభావంతో అనేకమంది నాయకులు, దర్బారీలు, జాగీర్దారులు పరిస్థితిని సంస్కరించేందుకు పూనుకున్నారు. రాకుమారుడు సలీం సానుభూతి కూడా వారికి తోడయింది. వారు మతపరమైన ఈ అరాచకానికి మూలకారకుడైన అబుల్ఫజల్ని అక్బర్ సన్నిహితుల నుండి వేరుచేయడానికి నిర్ణయించుకున్నారు.

ఆ రోజుల్లో అక్బర్ చక్రవర్తి దక్కన్ని జయించడానికి అబ్దుర్రహీం ఖాన్ఖానాన్ని సేనాపతిగా నియమించి పంపాడు. అబ్దుర్రహీం ఇంతకుముందు నుంచే అక్బర్ అరాచకాల పట్ల విసుగుచెంది ఉన్నాడు. పైగా అతను ఖాజా బాఖీబిల్లా (రహ్మాలై) శిష్యుడు కూడా. అతనీ దండయాత్రలో అబుల్ఫజల్ని తనకు సహాయకారిగా పంపమని అడిగాడు. దానికి అక్బర్ అంగీకరించాడు. అప్పుడు అబ్దుర్రహీం తన వెంట అబుల్ఫజల్ని దక్కన్కు తీసికెళ్ళి ఒకచోట గృహనిర్బంధం చేయించాడు. అబుల్ఫజల్ అతనిపై ఆరోపణ చేస్తూ అక్బర్కు ఎన్నో ఉత్తరాలు రాశాడు. కాని వాటిలో ఒక్కఉత్తరం కూడా అక్బర్కు చేరలేదు.

వేరొకవైపు రాకుమారుడు సలీం ఇలాహాబాద్‌లో తన తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశాడు. అందుకు అనేకమంది ధర్మవేత్తలు అతడ్ని సమర్థించారు. అప్పుడు అక్బర్ తన ప్రధానసలహాదారుడు అబుల్‌ఫజల్‌ని దక్కన్ నుండి పిలిపించాడు. రాజాజ్ఞ అందగానే సేనాపతి అబ్దుర్రహీం అబుల్‌ఫజల్‌ని విడుదలచేశాడు. అబుల్‌ఫజల్ తెగసంబరపడిపోతూ దక్కన్ నుండి బయలుదేరాడు. ఇంతకుముందే ఈ సంగతి తెలుసుకున్న రాకుమారుడు సలీం దారిదోపిళ్ళు చేస్తూ తిరుగుతున్న బుందేల్‌ఖండ్ రాకుమారుడు వీర్‌సింగ్‌కు అబుల్‌ఫజల్‌ని హతమార్చే పని అప్పగించాడు. అబుల్‌ఫజల్ గ్వాలియర్‌కు చేరుకున్నాడో లేదో వీర్‌సింగ్ దారికాచి క్రీ.శ. 1602లో అతడ్ని చంపేశాడు. దాంతో మతపరమైన అరాచకాలు చాలావరకు తగ్గుముఖం పట్టాయి. అయితే అబుల్ ఫజల్ హత్య పట్ల అక్బర్ ఎంతో బాధపడుతూ సుదీర్ఘకాలం విచారసముద్రంలో మునిగి పోయాడు. ఆ తర్వాత కూడా అక్బర్ మూడేండ్లు జీవించాడు.

అక్బర్ ముగ్గురు కొడుకుల్లో ఇద్దరు దానియాల్, మురాద్ అతని జీవితకాలంలోనే చనిపోయారు. మూడవ కొడుకు సలీం మాటిమాటికి తిరుగుబాటు చేస్తూ తండ్రికి పెద్ద తలనొప్పిగా తయారయ్యాడు. ప్రధాని మాన్‌సింగ్, మరికొందరు పాలకవర్గం సభ్యులు రాకుమారుడు సలీంకు బదులు సలీం కొడుకు, మాన్‌సింగ్ మేనల్లుడయిన ఖుస్రూని అక్బర్ రాజకీయ వారసుడిగా చేయజూశారు. కాని ఇస్లాంప్రియులు సలీంని రాజకీయ వారసుడిగా చేయడానికి ప్రయత్నించసాగారు. ఈ పరిస్థితి అక్బర్‌ని మరింత ఆందోళనకు గురిచేసింది. దాని ప్రభావం అతని ఆరోగ్యంపై పడి తీవ్రంగా రోగగ్రస్తుడయ్యాడు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణిస్తూపోవడంతో అక్బర్ జీవితం పట్ల పూర్తిగా నిరాశచెందాడు.

అప్పుడతని భార్యలు ఇలాహాబాద్ నుండి రాకుమారుడు సలీంని పిలిపించారు. వారతడ్ని చక్రవర్తికి క్షమాపణ చెప్పుకొమ్మని వత్తిడి చేశారు. సలీం కంట తడిపెడ్తూ క్షమాపణ చెప్పుకున్నాడు. అక్బర్ కొడుకుని కౌగలించుకొని క్షమించాడు. ఆ తరువాత క్రీ.శ. 1605లో అక్బర్ వ్యాధిగ్రస్త స్థితిలోనే చనిపోయాడు.

## 86. జహాంగీర్ చక్రవర్తి

అక్బర్ మరణసమయంలో అతని రాజకీయవారసత్వం అన్నిటికంటే పెద్ద సమస్య అయింది. ప్రధాని మాన్‌సింగ్, అతని తాబేదారులు సలీం కొడుకు ఖుస్రూని రాజకీయ వారసుడిగా చేయడానికి ప్రయత్నించారు. కాని షేఖ్ ఫరీద్ రంగంలోకి దిగి పాలకవర్గం లోని మెజారిటీసభ్యుల్ని తనవైపుకు తిప్పుకొని సలీం కోసం మార్గం సుగమం చేశారు. తరువాత వారంతా సలీం దగ్గరకు పోయి "మేమంతా మిమ్మల్ని రాజకీయవారసుడిగా ఎన్నుకున్నాము. అయితే మీరు చక్రవర్తి అయిన తరువాత ఇస్లామీయ ధర్మశాస్త్రాన్ని కాపాడుతానని, మీ కుమారుడు ఖుస్రూని, అతని సమర్థకుల్ని శిక్షించనని ప్రమాణం చేయాలి" అని అన్నారు. రాకుమారుడు సలీం అలాగే ప్రమాణం చేశాడు.

రాకుమారుడు సలీం తండ్రి మరణానంతరం జహాంగీర్ పేరుతో సింహాసనం అధిష్ఠించాడు. అధికారపగ్గాలు చేపట్టగానే అతను తన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాడు.



ఇస్లామీయ ధర్మశాస్త్రాన్ని కాపాడే దిశలో దీనెఇలాహి దురాచారాలను, అంధవిశ్వాసాలను నిర్మూలించే అనేక చర్యలు తీసుకున్నాడు. తన కొడుకు ఖుస్రూ, అతని సమర్థకులను శిక్షించకుండా వారి పట్ల దయార్ద్రహృదయంతో మసలుకున్నాడు. ప్రధాని మాన్‌సింగ్‌తో కూడా సంబంధాలు పటిష్ఠపరచుకున్నాడు.

అయితే కొడుకు ఖుస్రూ హృదయం నుండి తిరుగుబాటు ఆలోచనలు పూర్తిగా సమసిపోలేదు. అందువల్ల జహాంగీర్ కూడా అతని చేష్టల పట్ల అప్రమత్తంగానే ఉన్నాడు. ఖుస్రూ ఓరోజు ఆగ్రా నుండి పారిపోయాడు. దారిలో కొందరు సమర్థకులు లభించారు. వారి సహాయంతో అతను లూటీలు చేస్తూ పంజాబ్ చేరుకున్నాడు. పంజాబ్‌లో కొందరు సిక్కులను కూడగట్టుకొని లాహోర్ మీద దాడిచేశాడు. జహాంగీర్ వెంటనే తన నమ్మకస్తుడైన నాయకుడు షేఖ్ ఫరీద్‌కు ఒక సైనికదళమిచ్చి లాహోర్ దిశగా పంపించాడు. షేఖ్ ఫరీద్ ఎంతో చాకచక్యంతో ఖుస్రూ పథకాలన్నిటినీ వమ్ముచేసి అతడ్ని, అతని అనుచరుల్ని బంధించి తెచ్చాడు. జహాంగీర్ తిరుగుబాటుదారుల్ని కఠినశిక్షలు విధించి, ఖుస్రూని కారాగారంలో బంధించి పెట్టాడు.

బెంగాల్‌లో అఫ్గాన్‌ల జోరు పూర్తిగా తగ్గలేదు. వారు ఉస్మాన్‌ఖాన్ నేతృత్వంలో మరొకసారి తిరుగుబాటుకు పాల్పడ్డారు. బెంగాల్ సుబేదార్ ఇస్లాంఖాన్ క్రీ.శ. 1612లో జరిగిన ఆ యుద్ధంలో ఉస్మాన్‌ఖాన్‌ని చంపి తిరుగుబాటుదారుల పీచం అణచివేశాడు. అఫ్గాన్‌సైనికులు విధేయత ప్రకటించడంతో జహాంగీర్ వారిని క్షమించి తన సైన్యంలో భర్తీచేసుకున్నాడు. ఇలా మొగల్‌పాలకులకు అఫ్గాన్‌లబెడద శాశ్వతంగా సమసిపోయింది.

జహాంగీర్ జీవితభాస్వామినిగా వచ్చిన నూర్‌జహాన్ చక్రవర్తిని తన కొంగులో కట్టి పడేసి మొత్తం పాలనావ్యవస్థపై తిరుగులేని మహారాణిగా వెలుగొందసాగింది. జహాంగీర్ ఆమె అభిప్రాయానికి వ్యతిరేకంగా ఎలాంటి పనీ చేసేవాడు కాదు. పాలనావ్యవహారాలన్నీ ఆమె అభిమతం ప్రకారమే నిర్వహించబడేవి. నూర్‌జహాన్ అసలు పేరు మెహరున్నిసా. ఆమె ఈరానీ సంతతికి చెందిన స్త్రీ. ఆమె తండ్రి మిర్జా గియాస్ ఉపాధి అన్వేషణలో కుటుంబంతో ఈరాన్ వదలి భారత్‌కు వచ్చాడు. దారిలో మెహరున్నిసా (నూర్‌జహాన్) జన్మించింది. ఒక ఈరానీ వ్యాపారవేత్త సహాయంతో ఆమె తండ్రికి, సోదరుడికి అక్బర్ ప్రభుత్వంలో ఉద్యోగాలు లభించాయి. వారిద్దరు అసాధారణ తెలివితేటలు, శక్తిసామర్థ్యాలతో అక్బర్ కొలువులో మంచి స్థానాలు దక్కించుకున్నారు.

అప్పటికి మెహరున్నిసా యుక్తవయస్కురాలయింది. అప్పుడామె వివాహం ఒక ఈరానీయువకుడు అలీఖులీఖాన్‌తో జరిగింది. అలీఖులీ ఎంతో ధైర్యసాహసాలు కలవాడు. ఓసారి అతను ఒక పులితో పోరాడి దాన్ని ఖడ్గంతో చంపేశాడు. అప్పుడు రాకుమారుడు సలీం (జహాంగీర్) సంతోషించి అతడ్ని షేరొఫిగన్ అనే బిరుదుతో సత్కరించాడు. అక్బర్ చివరికాలంలో అలీఖులీని బర్ద్వాన్ ప్రాంతం పాలకుడిగా నియమించి బెంగాల్‌కు పంపాడు. అతని వెంట భార్య, ఒక చంటిపిల్ల కూడా వెళ్ళారు.

జహాంగీర్ పాలన ప్రారంభకాలంలో బెంగాల్‌లో తిరుగుబాటు జ్వాలలు చెలరేగినప్పుడు అలీఖులీ కూడా అనుమానితుల్లో చేరిపోయాడు. బెంగాల్‌గవర్నర్ ఖుత్బుద్దీన్

ఖాన్ వాస్తవం తెలుసుకోవడానికి అలీఖులీ ఇంటికి వెళ్ళాడు. ఆ సమయంలో అతను కొన్నిప్రశ్నలు అడుగుతూ దురుసుగా మాట్లాడాడు. దాంతో అలీఖులీ తోకతొక్కిన పాములా కస్సుమంటూ గవర్నర్ మీద విరుచుకుపడి అతడ్ని హతమార్చాడు. ఆ పెనుగులాటలో అలీఖులీ కూడా హతమార్చబడ్డాడు. మెహరున్నిసా (నూర్‌జహాన్) వితంతువై ఆగ్రా చేరుకుంది. ఆతర్వాత రెండేళ్ళకు జహాంగీర్ ఆమెను వివాహమాడాడు.

తిరుగుబాటు ఉద్యమాలు చల్లారిన తరువాత జహాంగీర్ రాజ్యవిస్తరణ వైపు దృష్టి సారించాడు. బర్ద్‌వాన్, కాంగ్డా ప్రాంతాలు అక్బర్ పాలనాకాలంలోనే ముస్లింల అధీనంలోకి వచ్చాయి. అయితే అక్బర్ తదనంతరం ఈ ప్రాంతాల రాజులు తిరుగుబాటుకు పాల్పడి కప్పం చెల్లించడానికి నిరాకరించారు. అంచేత జహాంగీర్ వారిద్దర్ని అణచడానికి తన కొడుకు ఖుస్రూని పంపాడు. ఖుస్రూ క్రీ.శ. 1614లో బర్ద్‌వాన్‌పై, 1620లో కాంగ్డాపై దాడుల చేసి వాటిని తిరిగిస్వాధీనం చేసుకున్నాడు.

అలాగే దక్షిణభారత్‌లోని అహ్మద్‌నగర్ రాష్ట్రం కూడా జహాంగీర్ పాలన ప్రారంభ కాలంలో మొగల్‌రాజుల నుండి చేజారిపోయింది. అక్కడ నిజాంషాహీ నాయకులు క్రమీణా బలం పుంజుకొని ఆ రాష్ట్రాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. మలిక్‌అంబర్ అనే ఒక నీగ్రోనాయకుడి నేతృత్వంలో నిజాంషాహీ సైన్యం మొగల్‌ఆక్రమిత ప్రాంతాలపై దాడులు చేయసాగింది. నిజాం సేనాపతి మలిక్‌అంబర్ మరాఠా రైతులకు గొరిల్లాయుద్ధ విధానం నేర్పి మొగల్‌పాలకుల్ని ముప్పతిప్పలు పెట్టాడు.

జహాంగీర్ చక్రవర్తి ఆ తిరుగుబాటును అణచడానికి ఒకరి తరువాత మరొకరు చొప్పున అనేకమంది సేనాపతుల్ని పంపించాడు. కాని ఏఒక్కరూ మలిక్‌అంబర్‌ని ఓడించలేకపోయారు. చివరికి జహాంగీర్ క్రీ.శ. 1617లో రాకుమారుడు ఖుర్రమ్‌కు భారీసైన్యం ఇచ్చి పంపించాడు. ఖుర్రం నిజాంసైనికులు, మరాఠీల ఉమ్మడి సైన్యాన్ని నలువైపుల నుండి దిగ్బంధించి మలిక్‌అంబర్‌ని కాళ్ళబేరానికి వచ్చేలా చేశాడు. మలిక్‌అంబర్ చనిపోయిన తరువాత నిజాంషాహీ నాయకులకు మొగల్‌పాలకుల్ని ఎదిరించే ధైర్యం లేకుండా పోయింది. అంచేత అహ్మద్‌నగర్ రాష్ట్రం క్రీ.శ. 1633లో పూర్తిగా మొగల్‌పాలన కిందికి వచ్చింది.

**1-పోర్చుగీస్ వాణిజ్యసంస్థలు:-** క్రీ.శ.1498లో పోర్చుగీస్‌కు చెందిన ప్రఖ్యాత పర్యాటకుడు వాస్కోడీగామా దక్షిణాఫ్రికాను చుట్టి భారత్‌కు చేరుకునే మార్గం కనుగొన్నాడు. ఆనాటి నుండి క్రమంగా పోర్చుగీస్ ప్రజలకు భారత్‌తో వ్యాపారసంబంధాలు ఏర్పడ్డాయి. వారు పశ్చిమ తీరప్రాంతాలైన గోవా, డయ్యు, డామన్‌లను ఆక్రమించుకొని వ్యాపారాభివృద్ధితో పాటు క్రైస్తవమత ప్రచారం, సముద్రంలో లూటీలు కూడా చేయనారంభించారు. వారు ముస్లింల పట్ల మతదురభిమానం కూడా పెంచుకున్నారు. చివరికి వారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) పట్ల అపచారానిక్కూడా పాల్పడ్డారు. దాంతో ముస్లింలలో ఆగ్రహజ్వాలలు చెలరేగాయి. ఇలా వారి దుశ్చేష్టలు హద్దుమీరడంతో జహాంగీర్ చక్రవర్తి క్రీ.శ. 1613లో వారి చర్చీలన్నిటిని మూయించి వారి మతకార్యకలాపాలపై ఆంక్షలు విధించాడు.



**2-ఈస్ట్‌ఇండియా కంపెనీ :-** పోర్చుగీసీయుల్ని చూసి బ్రిటిష్ ఆంగ్లేయులు కూడా భారత్‌తో వ్యాపారసంబంధాలు నెలకొల్పుకోడానికి క్రీ.శ. 1600లో యత్నించారు. కాని జహాంగీర్ అందుకు నిరాకరించడంతో వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. తిరిగి క్రీ.శ.1617లో ఆంగ్లేయులు ఇంగ్లాండ్‌రాజు నుండి ఒక సిఫారసు లేఖతో వచ్చి మరోసారి ప్రయత్నించారు. ఈసారి వారు జహాంగీర్ దర్బార్‌లో ప్రవేశించి ఆయనకు ఆ లేఖ అందించి ఖరీదైన పారితోషికాలు సమర్పించుకున్నారు. మరొకవైపు రాణి నూర్జహాన్‌ని కూడా సంతోషపరచి వ్యాపార అనుమతి పొందగలిగారు.

**3-నూర్జహాన్ కుట్రలు:-** రాకుమారుడు ఖుర్రం సాధించిన విజయాలతో జహాంగీర్ ఎంతో ప్రభావితుడై విజయోత్సవం జరిపాడు. అతనికి షాజహాన్ అనే బిరుదు ఇచ్చి అతని అధికారాలను పెంచాడు. క్రీ.శ. 1620లో జహాంగీర్ అనారోగ్యం పాలైనపుడు పాలకవర్గం షాజహాన్ (ఖుర్రం)ని జహాంగీర్ రాజకీయ వారసుడిగా చేయదలచుకున్నారు. కాని నూర్జహాన్‌కు అది ఇష్టం లేదు. జహాంగీర్ తదనంతరం పరిపాలనా పగ్గాలు తన చేతిలోనే ఉంచుకునే ఉద్దేశ్యంతో ఆమె తన అల్లుడు షహర్‌యార్‌ని రాజకీయవారసుడిగా చేయడానికి నిశ్చయించుకున్నది. కాని అసమర్థుడైన షహర్‌యార్‌ని రాజకీయవారసుడిగా తెరపైకి తీసుకురావడానికి ఆమెకు ధైర్యం చాల్లేదు. అంచేత ఆమె అవకాశం కోసం ఎదురుచూడసాగింది.

క్రీ.శ. 1622లో ఈరాన్ రాజు ఖంధార్‌పై దాడిచేయడానికి వచ్చాడు. నూర్జహాన్ దాన్ని సదవకాశంగా భావిస్తూ ఈరానీయుల్ని ఎదుర్కోవడానికి వెంటనే ఖంధార్‌కు చేరుకోవాలని దక్కన్‌లో ఉన్న షాజహాన్(ఖుర్రం)కు ఉత్తర్వు జారీచేసింది. ఈ ఉత్తర్వు అందగానే షాజహాన్ దక్కన్ నుండి బయలుదేరాడు. కొంత దూరం పోయాక నూర్జహాన్ కుట్ర సంగతి తెలిసి ఖంధార్ పోకుండా తాత్సారం చేయసాగాడు. ఇలా కొన్ని నెలలు గడిచిపోయాయి. ఈలోగా ఈరానీయులు ఖంధార్‌ని ఆక్రమించుకున్నారు.

అప్పుడు నూర్జహాన్‌కు షాజహాన్ గురించి జహాంగీర్ ముందు చాడీలు చెప్పేందుకు మరింత అవకాశం లభించింది. ఈ చాడీలు విని జహాంగీర్ షాజహాన్‌పై మండిపడుతూ అతడ్ని బంధించి తీసుకురావడానికి సైన్యం పంపాడు. షాజహాన్ తండ్రి ఆగ్రహానికి భయపడి నాలుగేళ్ళ పాటు రాజధానికి దూరంగా అటూ ఇటూ తిరిగాడు. చివరికి అతను తన కుమారులు ఔరంగజేబ్, దారాలను చక్రవర్తి దగ్గరకు పంపి క్షమాపణ చెప్పుకున్నాడు. కాని నూర్జహాన్ జహాంగీర్‌కు లేనిపోని మాటలు చెప్పి అతడ్ని కట్టిపడవేసింది. అయితే మరోవైపు రాణి నూర్జహాన్ సోదరుడు, ప్రధానమంత్రి, షాజహాన్‌కు పిల్లనిచ్చిన మామ అయిన ఆసిఫ్‌ఖాన్ ఆమె కుట్రను సాగనివ్వలేదు.

అప్పుడు నూర్జహాన్ ప్రధానమంత్రి ఆసిఫ్‌ఖాన్ అధికారాల్లో ముఖ్యాధికారాలు తీసి బెంగాల్ సుబేదార్ మహాబత్‌ఖాన్‌కు కట్టబెట్టింది. అయితే కొన్నాళ్ళకు మహాబత్‌ఖాన్ రాణిగారి కుత్సితబుద్ధి తెలుసుకొని ఆమెతో సహకరించడానికి నిరాకరించాడు. దాంతో ఆమె మహాబత్‌ఖాన్‌పై అనేక నిందారోపణలు మోపి అతనికి శిక్ష విధించదలచింది. కాని క్రీ.శ. 1626లో జహాంగీర్ కశ్మీర్ నుండి కాబుల్ పోవడానికి జీలంనది దాటుతున్నపుడు

మహాబత్‌ఖాన్ జహాంగీర్‌ని నిర్బంధంలోకి తీసుకున్నాడు. దాంతో నూర్జహాన్ గత్యంతరం లేక అతనికి లొంగిపోయింది. అనేక నెలల నిర్బంధం తర్వాత జహాంగీర్, నూర్జహాన్‌లు రాజీకివచ్చారు. అప్పుడు షాజహాన్ (ఖుర్రం)ని లొంగదీసుకోవడానికి మహాబత్‌ఖాన్‌కు ఒకసైన్యం ఇచ్చి పంపడంజరిగింది. కాని మహాబత్‌ఖాన్ దక్కన్ చేరుకొని రాకుమారుడు షాజహాన్‌తో చేతులు కలిపాడు.

జహాంగీర్ జబ్బుపడినపుడు వాతావరణమార్పు కోసం కశ్మీర్ కూడా వెళ్ళాడు. కాని వ్యాధి నుండి కోలుకోలేకపోయాడు. కశ్మీర్ నుండి తిరిగొస్తుంటే దారిలో వ్యాధి మరింత ముదిరిపోయి క్రీ.శ. 1627లో లాహార్ సమీపంలో చనిపోయాడు.

జహాంగీర్ ప్రజలకు న్యాయం చేయడంలో ప్రసిద్ధిచెందాడు. చట్టం దృష్టిలో తనవారు-పరాయివారు, ప్రజలు-పాలకులు అన్న వివక్ష చూపడం జరిగేది కాదు. నేరం రుజువైతే ఆనాడు కఠిన శిక్షలు విధించబడేవి. ఒకసారి రాణి నూర్‌జహాన్ దారినపోయే ఒక మనిషిని అన్యాయంగా హతమార్చింది. నూర్జహాన్‌ని జహాంగీర్ ఎంతగానో ప్రేమించేవాడు. అయినప్పటికీ జహాంగీర్ వెంటనే ఆమెను అరెస్టు చేయించి ప్రతీకారశిక్ష (ఖిసాస్) ఆదేశం జారీచేశాడు. దాంతో పాపం రాణిగారు నష్టపరిహారం చెల్లించి ప్రాణం కాపాడుకో వలసివచ్చింది.

జహాంగీర్ ధర్మవేత్తల్ని, తత్వవేత్తల్ని గౌరవించేవాడు. పేదలు, అనాథలు, వితంతువులకు విశాలహృదయంతో సహాయంచేసేవాడు. ఇన్ని సద్గుణాలు ఉన్నా అతనిలో అనేక లోపాలు కూడా ఉన్నాయి. దానిక్కారణం అతని చుట్టూవున్న పరిసరాలే. ఇస్లామేతర ప్రభావాలతో కలుషితమవుతున్న వాతావరణంలో కళ్ళుతెరిచాడు. పైగా ముస్లిమేతర తల్లి సంరక్షణలో పెరిగాడు. రాజదర్బారు అరాచకానికి, కుట్రలకు నిలయమైపోయింది. వీటన్నిటి కారణంగా జహాంగీర్‌లో అనేక బలహీనతలు చోటుచేసుకున్నాయి.

# 87. షాజహాన్ చక్రవర్తి

రాకుమారుడు ఖుర్రం అసలు పేరు షిహాబుద్దీన్. రణరంగంలో అతను సాధించిన ఘనవిజయాలను పురస్కరించుకొని జహాంగీర్ అతనికి షాజహాన్ అనే బిరుదుతో సత్కరించాడు. షాజహాన్ క్రీ.శ. 1592లో లాహోర్‌లో జన్మించాడు. అతను కూడా తన తండ్రి లాగే మార్వాడ్‌రాజు రాణా కుమార్తెకు పుట్టాడు. ఆమె అక్బర్ ఆస్థానంలో మంత్రిగా పని చేసిన మాన్‌సింగ్ సోదరి. అయితే రాజమహల్, దర్బార్‌ల ఇస్లామేతర వాతావరణం మారిపోయి ఇస్లామీయ వాతావరణం నెలకొంటున్న తరుణంలో షాజహాన్ కళ్ళు తెరిచాడు. దాని ప్రభావం షాజహాన్ మీద కూడా పడింది. దానికి తోడు అతనికి సరైన విద్యాశిక్షణలు కూడా లభించాయి.

ఇరవైఏళ్ళ వయస్సులో ప్రధాని ఆసిఫ్‌ఖాన్ కుమార్తె అర్జుమంద్‌బానూతో అతని పెళ్ళయింది. దేవుడామెకు శారీరకఅందంతోపాటు ఆత్మసౌందర్యం కూడా ప్రసాదించాడు. ఆమె కష్టసుఖాల్లో తన భర్తకు చేదోడువాదోడుగా ఉండేది. షాజహాన్ కూడా ఆమెను ఎంతగానో ప్రేమించేవాడు. ఆమె పేరు ఆ తర్వాత ముంతాజ్ మహల్ అయింది.



జహాంగీర్ రాజకీయవారసుడి ఎంపిక విషయంలో ఓ జఠిలసమస్య ఎదురయింది. నూర్జహాన్ తన అల్లుడ్ని వారసుడిగా చేయడానికి అనేక కుట్రలు పన్నింది. కాని అవేమీ ఫలించలేదు. ప్రజలు, పాలకవర్గం సభ్యులు షాజహాన్‌నే వారసుడిగా ఇష్టపడుతున్నారు. అంచేత ప్రధానమంత్రి ఆసిఫ్‌ఖాన్ క్షుణ్ణంగా ఆలోచించి క్రీ.శ. 1627లో షాజహాన్‌ని దక్కన్ నుంచి పిలిపించి సింహాసనంపై కూర్చోబెట్టాడు.

షాజహాన్ అధికారం చేపట్టగానే అక్బర్ ప్రవేశపెట్టిన ఇస్లాంవ్యతిరేక విధానాలు, ఆచారాలను సంస్కరించడానికి పూనుకున్నాడు. ప్రభుత్వకార్యకలాపాల్లో హిజ్రీశకం ప్రవేశపెట్టాడు. మానవులకు సాష్టాంగప్రణామం చేయడాన్ని నిషేధించాడు. న్యాయస్థానాల్లో షరీఅత్ ప్రకారం తీర్పులు వెలువడేలా చేశాడు. తిరుగుబాటుదారుల్ని దారి నుండి పూర్తిగా తొలగించడం జరిగింది.

క్రీ.శ. 1630లో దక్కన్, గుజరాత్‌లలో భయంకరమైన కరువు వచ్చింది. వేలాది మంది ప్రజలు ఆకలిదప్పులతో ప్రాణాలు కోల్పోయారు. షాజహాన్ తన రాజ్యంలోని కరువు విరుచుకుపడిన ప్రాంతాల్లో అనేకచోట్ల ఆహారశాలలు తెరిపించి ఆకలిగొన్న వారికి ఉచితంగా ఆహారం లభించేలా చేశాడు. పేదలకు విశాలహృదయంతో ధన సహాయం కూడా చేశాడు. ఆ ఒక్కసంవత్సరం కరువుకాలం తప్పించి అతని మిగతా పాలనాకాలమంతా ప్రజలు సుఖసంతోషాలతో గడిపారు.

కరువుకాలంలో షాజహాన్ దక్కన్‌లో సహాయక చర్యలు చేపట్టినపుడు భార్య ముంతాజ్ కూడా అందులో పాల్గొన్నది. దక్కన్‌లో ఉండగానే ఆమెకు ఒక అమ్మాయి పుట్టింది. అయితే కాన్పు సమయంలోనే ఆమె జబ్బుపడి కొన్నాళ్ళకు చనిపోయింది. ప్రియసతి మరణంతో షాజహాన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆమె భౌతికకాయాన్ని ఆగ్రాకు తీసుకొచ్చి ఖననం చేయడం జరిగింది. జహాంగీర్ తన ప్రేమకు చిహ్నంగా ఆమె సమాధిపై అద్భుతమైన భవనం నిర్మింపజేశాడు. దాని పేరే తాజ్‌మహల్.

అక్బర్ పాలనాకాలంలో పోర్చుగీస్ వర్తకులు భారత్‌లో ప్రవేశించి అక్రమవ్యాపారం చేయడానికి, ప్రజలపై దౌర్జన్యం చేయడానికి వారిని బలవంతంగా క్రైస్తవులుగా మార్చడానికి, అలా మారనివారిని విదేశాలకు అమ్మడానికి స్వేచ్ఛ లభించింది. ఆ తరువాత జహాంగీర్ కాలంలో కూడా ఈ పరిస్థితి దాదాపు కొనసాగింది. షాజహాన్ పాలనాకాలం నాటికి పోర్చుగీస్ వలసవాదులు ఆర్థికంగా, సైనికంగా బాగా బలం పుంజుకొని మరిన్ని అరాచకాలకు తెగబడ్డారు. చివరికి రాణి ముంతాజ్‌మహాల్ దాసీలలో ఇద్దరు దాసీలను వారు ఎత్తుకుపోయారు. దాంతో షాజహాన్ వారి అరాచకాలపై దృష్టి కేంద్రీకరించి తగిన చర్యలు తీసుకున్నాడు. క్రీ.శ. 1632లో బెంగాల్ సుబేదార్ మెరుపుదాడి చేసి వారి పీచం పూర్తిగా అణచివేశాడు.

అక్బర్ చక్రవర్తి కాలం నుండి దక్కన్‌లోని ముస్లింరాజ్యాలు మొగల్‌సామ్రాజ్యానికి ప్రమాదకరంగా ఉండేవి. గోల్కొండ, బీజాపూర్ ముస్లింపాలకులు మరాఠీల సహాయంతో మొగల్‌సామ్రాజ్య సరిహద్దు కోటలపై దాడులుచేస్తూ మొగల్‌పాలకుల్ని చికాగు పరుస్తుండేవారు. మరోవైపు అహ్మద్‌నగర్ పాలకుడు ఖాన్‌జహాన్ లోది కూడా వారితో

చేతులు కలపడంతో పరిస్థితి మరింత తీవ్రమయింది. అందువల్ల షాజహాన్ ఓ భారీసైన్యంతో వెళ్ళి దాడిచేశాడు. దాంతో ఖాన్‌జహాన్‌లోది అహ్మదనగర్ నుండి పారిపోయి కాలంజర్ సమీపంలోని ఓచోట మొగల్‌సైన్యానికి చిక్కి హతమార్చబడ్డాడు. క్రీ.శ. 1636 నాటికల్లా మిగిలిన రెండురాజ్యాలు బీజాపూర్, గోల్కొండ కూడా గత్యంతరం లేక మొగల్‌సామ్రాజ్య ఆధిపత్యానికి తలవంచి కప్పం చెల్లించడానికి అంగీకరించాయి. ఈవిధంగా షాజహాన్ దక్కన్ రాజ్యాలను వశపరచుకొని తన కుమారుడు ఔరంగ్‌జేబ్‌ని అక్కడి సుబేదార్‌గా నియమించి రాజధాని ఆగ్రాకు తిరిగొచ్చాడు.

# 88. ఔరంగ్‌జేబ్ చక్రవర్తి

ఔరంగ్‌జేబ్ పూర్తిపేరు మొహిద్దీన్ ఔరంగ్‌జేబ్ ఆలంగీర్. అతను షాజహాన్, ముంతాజ్‌మహల్ దంపతులకు క్రీ.శ. 1618లో సోదరులు దారా, షుజాల తరువాత జన్మించాడు. వివిధ విద్యాకళల్లో మంచిప్రావీణ్యం సంపాదించాడు; ధైర్యశాలి, శ్రమజీవి. ఇంకా పధ్నాలుగేండ్లు కూడా నిండని ఔరంగ్‌జేబ్ ఓ మదపుటేనుగుతో ఢీకొన వలసి వచ్చింది. యమునా నదీతీరంపై ఏనుగుల పందెం జరుగుతోంది. ఔరంగ్‌జేబ్ కూడా గుర్రమ్మీద కూర్చొని తమాషా చూడసాగాడు. కాస్సేపటికి ఒక మదపుటేనుగు ఔరంగ్‌జేబ్ వైపుకు దూసుకొచ్చింది. ఔరంగ్‌జేబ్ ఏమాత్రం భయపడకుండా ఖడ్గంతో దాని తొండం మీద బలంగా ఒక్క వ్రేటు వేశాడు. దాంతో అది రెచ్చిపోయి అతని గుర్రాన్ని గాయపరచి కింద పడవేసింది. ఔరంగ్‌జేబ్ వెంటనే గుర్రం నుండి వేరయి ఏనుగు ముందుకొచ్చి ఖడ్గం పైకెత్తాడు. అంతలో జనం వచ్చి ఆ ఏనుగును కొట్టి పారదోలారు.

షాజహాన్ ఔరంగ్‌జేబ్‌లోని అసాధారణ శక్తిసామర్థ్యాల్ని గమనించి 18ఏళ్ళ వయసులో అతనికి దక్కన్‌సుబేదార్‌గా నియమించాడు. దక్కన్ పాలనావ్యవహారం ముళ్ళకిరీటం లాంటిది. దక్కన్ విశాలమైనప్రాంతం, కఠినమార్గాలు, ఆదాయం తక్కువ, ఖర్చు ఎక్కువ, రాజధాని నుండి బహుదూరం, చక్రవర్తి వైపునుండి సహాయం తక్కువ- చీటికి మాటికి జోక్యం. దక్కన్ వ్యవహారంలో ఇన్ని ఇబ్బందులున్నా ఔరంగ్‌జేబ్ ఎంతో శ్రమకోర్చి అకుంఠితదీక్షతో పనిచేశాడు. ఫలితంగా కొన్నేండ్లలోనే పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. పాలనావ్యవహారాలు చక్కబడ్డాయి. ప్రజలు సుఖసంతోషాలతో జీవించసాగారు. ఇంత కష్టపడి పనిచేస్తే అతనికి లభించిందేమిటీ? అతని సంస్కరణా మార్గంలో చక్రవర్తి తరపున అడుగడుగునా అవరోధాలు; చివరికి క్రీ.శ. 1645లో పదవిభ్రష్టత్వం!

వీటన్నిటికి మూలకారణం షాజహాన్ పెద్దకొడుకు దారాషికూ ఔరంగ్‌జేబ్‌లోని అసాధారణ శక్తిసామర్థ్యాలు చూసి అతని పట్ల తీవ్రమైన అసూయాద్వేషాలు పెంచుకోవడమే. దాంతో అతను షాజహాన్ దగ్గర ఔరంగ్‌జేబ్ మీద లేనిపోని చాడీలు చెప్పి చక్రవర్తిని తన వైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నించేవాడు. అదీగాక దారా తన తాత అడుగుజాడల్లో నడచుకుంటూ దేశంలో ఇస్లాంవ్యతిరేక విశ్వాసాలు, విధానాలు తిరిగి ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నాడు. ఔరంగ్‌జేబ్ వాటిని పూర్తిగా అంతమొందించి దైవప్రవక్త (సల్లం) సంప్రదాయాలను పునర్జీవింప దలిచాడు.



దారా ఎల్లప్పుడూ తన తండ్రిని అంటిపెట్టుకొని ఉంటూ పాలనావ్యవహారాల్లో అసత్యాలు, అభూతకల్పనలతో అతనికి సలహాలిస్తూ ఉండేవాడు. అంచేత జహాంగీర్ తన కొడుకుల్లో దారానే ఎక్కువ అభిమానించేవాడు. దారాను పంజాబ్, కాబుల్ ప్రాంతాలకు సుబేదార్‌గా నియమిస్తే అతను రకరకాల సాకులు చెప్పి రాజధాని ఆగ్రాలోనే ఉండి ఔరంగ్‌జేబ్‌కు వ్యతిరేకంగా తండ్రికి నూరిపోస్తుండేవాడు. దాంతో తండ్రి షాజహాన్ ఔరంగ్‌జేబ్ పట్ల దురభిప్రాయం ఏర్పరచుకున్నాడు. అందుకే ఔరంగ్‌జేబ్ అతని ఆగ్రహానికి గురయి దక్కన్ సుబేదార్ పదవి నుండి తొలగించబడ్డాడు.

ఆరోజుల్లోనే బలఖ్, బదఖ్షాలలో శత్రుదాడుల్ని ఎదుర్కోవలసిరావడంతో షాజహాన్ తన కొడుకులు మురాద్, షుజాలను సేనాపతులుగా నియమించి పంపాడు. కాని వారిద్దరు అపజయంపాలై తిరిగొచ్చారు. అప్పుడు పెద్దకొడుకు దారా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ ఆ దాడుల్ని నిరోధించడానికి ఔరంగ్‌జేబ్‌ని పంపితే బాగుంటుందని తండ్రికి సలహా ఇచ్చాడు. తండ్రి ఆదేశం శిరసావహిస్తూ ఔరంగ్‌జేబ్ బయలుదేరి శత్రువుల్ని తరిమికొట్టి విజయవంతంగా తిరిగొచ్చాడు.

బలఖ్ ప్రాంతంలో సంకులసమరం జరుగుతున్న క్లిష్టపరిస్థితిలో ఒకసారి జుహర్ నమాజ్ వేళకాగానే ఔరంగ్‌జేబ్ నమాజ్ చేయడానికి సిద్ధమయ్యాడు. సైనికులు ఎంత వారించినా వినకుండా అతను గుర్రం మీద నుంచి దిగి రణరంగంలోనే ఒకవైపు నిలబడి నమాజ్‌లో లీనమైపోయాడు. సైనికులు కూడా అతని వెనుక నిల్చొని నమాజ్ చేయసాగారు. ఇలా ఔరంగ్‌జేబ్ నిశ్చింతగా, ఏకాగ్రతతో సామూహిక నమాజ్ చేశాడు. యుద్ధ సమయంలో యుద్ధాన్ని పక్కనబెట్టి నమాజ్ చేస్తున్న అతని ధైర్యాన్ని గమనించిన బలఖ్ పాలకుడు ఎంతో ప్రభావితుడై "ఇలాంటి మనిషితో యుద్ధం చేయడమంటే తనను తాను నాశనం కొనితెచ్చుకోవడమే" అని వ్యాఖ్యానించాడు. ఆ తర్వాత అతను యుద్ధం ఆపి ఔరంగ్‌జేబ్‌తో స్నేహఒప్పందం చేసుకొని వెళ్ళిపోయాడు.

ఈ యుద్ధపరంపర పూర్తిగా ముగిసిపోక ముందే ఈరానీయులు ఖంధార్‌ని ఆక్రమించుకున్నారు. మొగల్‌దృష్టిలో ఖంధార్ పట్నానికి ఎంతో ప్రాముఖ్యముంది. కారణం మధ్యాసియాకు చెందిన అనేక వాణిజ్యమార్గాలు ఈ పట్నం మీదుగానే సాగవలసి ఉంటుంది. అంచేత దాన్ని తిరిగి స్వాధీనంచేసుకోవడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఒకటిరెండు సార్లు ఔరంగ్‌జేబ్ కూడా ప్రయత్నించాడు. కాని దాన్ని జయించలేకపోయాడు. 1653లో ఖంధార్ పూర్తిగా ఈరానీయుల ఆక్రమణలోకి పోయింది.

ఔరంగ్‌జేబ్ దక్కన్‌సుబేదార్ పదవి నుండి ఉద్వాసనకు గురైన తరువాత అక్కడి పరిస్థితులు రోజురోజుకు దిగజారిపోసాగాయి. తొమ్మిదేళ్ళ కాలంలో అక్కడ ఒకరితర్వాత ఒకరు చొప్పున అనేకమంది సుబేదారులు నియమించబడ్డారు. కాని వారిలో ఒక్కడూ పాలనావ్యవస్థను చక్కబెట్టలేక పోయాడు. వ్యవసాయాభివృద్ధి, రైతుసంక్షేమం గురించి ఎవరూ దృష్టి సారించలేదు. దాంతో వ్యవసాయం కుంటుపడింది. వేలాదిమంది ప్రజలు పొట్ట చేత్తో పట్టుకొని వేరే ప్రాంతాలకు వలసపోయారు. గ్రామాలకు గ్రామాలు శ్మశానవాటికలుగా మారిపోయాయి. దుర్మార్గులు లూటీలకు తెగబడ్డారు. ప్రభుత్వ రాబడి బాగా

తగ్గిపోయింది. పాలనాయంత్రాంగంలో అవినీతి పేరుకుపోయింది. సామంతరాజులు కప్పం చెల్లించడానికి తాత్సారం చేయసాగారు.

ఈ దుస్థితి కారణంగా షాజహాన్ మళ్ళీ ఔరంగ్‌జేబ్‌ని దక్కన్ సుబేదార్‌గా నియమించి పంపాడు. ఔరంగ్‌జేబ్ దక్కన్ చేరుకోగానే మొట్టమొదట ప్రజాసంక్షేపంపై దృష్టి సారించాడు. ఉత్తరభారత్ నుండి ధాన్యం తెప్పించి కరువుప్రాంతాల్లో ధాన్యపుగిడ్డంగులు నెలకొల్పి ఆకలితో అలమటిస్తున్నవారికి ఆహారఏర్పాట్లు చేశాడు. పేదరైతులకు విత్తనాలు, పశువులు కొనుక్కోవడానికి ధనసహాయం చేశాడు. ప్రభుత్వయంత్రాంగంలో అవినీతిని అంతమొందించాడు. తత్ఫలితంగా ఏడాది తిరక్కముందే బీడుపడిన పంటభూములు సస్యశామలమయ్యాయి. పంటరాబడి ప్రకారం శిస్తులు నిర్ణయించడం జరిగింది. ఔరంగ్‌జేబ్ కప్పం చెల్లించడానికి తాత్సారం చేస్తున్న సామంతరాజులపై దాడిచేసి వారిని దారికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాడు.

అయితే అతని ప్రయత్నం సఫలం కాకముందే దారా, షాజహాన్‌లు మరొకసారి అడ్డుతగులుతూ ఒక ప్రత్యేకఆజ్ఞ ద్వారా అతని ప్రయత్నాన్ని వమ్ముచేశారు. ఔరంగ్‌జేబ్ విచారం, ఆగ్రహాలను బలవంతంగా దిగమింగుతూ తండ్రి ఆజ్ఞ ముందు తలవంచాడు. ఆరోజుల్లోనే షాజహాన్ జబ్బుపడ్డాడు. వ్యాధి క్రమంగా ముదిరిపోతూ అతను పడక మీద నుంచి లేవలేనంత పరిస్థితికి దారితీసింది. అందువల్ల దేశపాలనానిర్వహణ క్రియాత్మంగా దారా చేతిలోకి వచ్చింది. దాంతో పాలనావ్యవహారాలు అతను ఆడిందిఆటగా, పాడింది పాటగా మారాయి. దారా తప్పుడు చేష్టల కారణంగా అతని సోదరులు ముగ్గురు అతని పట్ల ఇంతకు ముందునుంచే అయిష్టంగా ఉన్నారు.

వేరొకవైపు ప్రజలకు షాజహాన్ దర్శనం లభించకపోవడంతో దేశం నలుమూలలా చక్రవర్తి చనిపోయాడన్న వదంతి వ్యాపించింది. అప్పటి బెంగాల్ సుబేదార్ షుజా ఈ వదంతి విని, దారా అధికారదాహంతో తండ్రికి విషమిచ్చి చంపివుంటాడని భావించాడు. అంచేత అతను దారాపై ప్రతీకారం తీర్చుకోవడానికి సైన్యం తీసుకొని బయలుదేరాడు. అయితే బనారస్ సమీపానికి చేరుకునేటప్పటికి దారా పెద్దకొడుకు సులైమాన్‌తో ఢీకొనవలసివచ్చింది. షుజా చిత్తుగా ఓడిపోయి బెంగాల్‌కు తిరిగొచ్చాడు.

దారా గుజరాత్ సుబేదార్ మురాద్‌ని ఆ పదవి నుండి తొలగిస్తూ బారార్ పేరును ప్రతిపాదించాడు. ఈ విధంగా దారా దక్కన్‌ఉత్తరప్రాంతం ఔరంగ్‌జేబ్ నుండి లాక్కొని అతనికి హస్తగతం చేయాలని భావించాడు. దారా తన నిర్ణయాన్ని ఖడ్గశక్తితో అమలు పరచేందుకు షాజహాన్ వద్దన్నా వినకుండా జస్వంత్‌సింగ్ నేతృత్వంలో సైన్యాన్ని పంపాడు. దాంతో గుజరాత్ సుబేదార్ మురాద్ గుజరాత్‌లో తాను స్వతంత్రరాజుగా ప్రకటించుకొని దారాతో యుద్ధం చేయడానికి సిద్ధమయ్యాడు. అయితే అతని దగ్గర సైన్యం తక్కువగా ఉంది. అంచేత అతను ఔరంగ్‌జేబ్ సహాయం కోరాడు.

కాని ఔరంగ్‌జేబ్ షాజహాన్ చనిపోయాడన్న వార్త నమ్మలేదు. అదీగాకుండా అతను తండ్రిపై తిరుగుబాటు చేయదలచుకోలేదు; అటు దారాతో కూడా పోరాడదలచుకోలేదు. అసలతను తండ్రి షాజహాన్‌ని కలుసుకొని అతడ్ని పరామర్శించాలని భావించాడు.



అలాగే సోదరుల వ్యవహారంలో దారా అవలంబించిన తప్పుడు వైఖరిని సంస్కరించదలిచాడు. అయితే ప్రభుత్వసైన్యం మాల్వా దాకా పురోగమించడంతో ఔరంగ్‌జేబ్‌కు దాన్ని ప్రతిఘటించడం తప్ప మరోమార్గం కన్పించలేదు. మురాద్ తనకు సహాయం చేయమని ఔరంగ్‌జేబ్‌ని అడుగుతూనే ఉన్నాడు. అప్పుడు ఇద్దరు కలసి దారా, అతని మిత్రమూకను అణచేందుకు ప్రయత్నించాలని, తరువాత మలాహోర్, కాబుల్, ముల్తాన్ వగైరా ఉత్తరరాష్ట్రాలు మురాద్‌కు స్వాధీనం చేయాలని, అందుకు మురాద్ ఎల్లప్పుడూ ఔరంగ్‌జేబ్‌కు విధేయుడై ఉంటాడని ఆ ఇద్దరు సోదరుల మధ్య ఒప్పందం జరిగింది.

ఆ తరువాత ఆ ఇద్దరు కలసి ప్రభుత్వసైన్యంతో ఢీకొని దాన్ని చిత్తుగా ఓడించారు. తరువాత వారిద్దరు ఆగ్రా సమీపానికి చేరుకోగానే అటునుంచి దారా సైన్యంతో వచ్చి కత్తిదూశాడు. కాస్సేపట్లలోనే ఇరుపక్షాల మధ్య సమరజ్వాలలు మింటికెగిశాయి. చివరికి దారా పరాజయంపాలై పారిపోయాడు. అతను తండ్రి ఆదేశాన్ని జవదాటి స్వంతసోదరుల పైన్నే కత్తిగట్టాడు. కాని ఘోరంగా ఓడిపోయాడు. ఔరంగ్‌జేబ్ విజయం పట్ల షాజహాన్ అతడ్ని అభినందించి అతనికి జ్ఞాపకార్థంగా తన ఖడ్గం ఇచ్చాడు. దానిమీద ఔరంగ్‌జేబ్‌కు బిరుదుగా “ఆలంగీర్” అని రాయబడి ఉంది.

దారా పారిపోయి ఆగ్రా చేరుకున్నాడు. కాని పరాజయపరాభవంతో తండ్రికి ముఖం చూపలేక భార్యాపిల్లల్ని, వజ్రవైఢూర్యాలను తీసుకొని ఢిల్లీ వైపు బయలుదేరాడు. అయితే అతను ఔరంగ్‌జేబ్‌కు భయపడి మొదట పంజాబ్‌కు, తరువాత గుజరాత్‌కు వెళ్ళాడు. ఔరంగ్‌జేబ్ సైన్యం అతడ్ని వెంటాడుతూ అజ్మీర్ సమీపంలో ఢీకొన్నది. అప్పుడు దారా పట్టుబడి ఢిల్లీకి తీసుకురాబడ్డాడు. అతని ఇస్లాంవ్యతిరేక విశ్వాసాలు, ఆచరణల కారణంగా ముగ్గురు సోదరులు, ధర్మవేత్తలు అతడ్ని ధర్మభ్రష్టుడిగా పరిగణించారు. అంచేత ధర్మవేత్తల ఫత్వా, న్యాయస్థానంతీర్పు ప్రకారం అతను హతమార్చబడ్డాడు.

చక్రవర్తి షాజహాన్ జబ్బుపడిన మొదటిరోజు (క్రీ.శ.16-9-1657) నుండే క్రియాత్మకంగా పెద్దకొడుకు దారా చేతుల్లో ఉద్వాసనకు గురయ్యాడు. షాజహాన్ వ్యాధిగ్రస్తుడైన కాలంలో దారా దేశపాలనా వ్యవహారాలన్నీ తన చేతిలోకి తీసుకొని ఇష్టారాజ్యం చేయసాగాడు. షాజహాన్ అభిమతానికి వ్యతిరేకంగా లేదా అతనిపై వత్తిడితెచ్చి అతని సంతకాలతో ఆదేశాలు అమలుపరచేవాడు. సమూగఢ్ యుద్ధంలో ఔరంగ్‌జేబ్ విజయం సాధించినపుడు షాజహాన్ కోట తాళపుచెవుల్ని అతని దగ్గరకు పంపించాడు. ఔరంగ్‌జేబ్ దళపతులు వారించినప్పటికీ వినకుండా తండ్రిని కలుసుకోవడానికి కోటకు వెళ్తున్నపుడు కోట బయట దారా పేరుతో చక్రవర్తిలేఖ ఒకటి పట్టుబడింది. అందులో “ఔరంగ్‌జేబ్‌ని హతమార్చాలి లేదా జైల్లో నిర్బంధించాలి” అని ఉంది. మరోవైపు దారాను ఢిల్లీలో ఉండి నిరీక్షించమని ఆ లేఖలో సూచించడం జరిగింది. అంచేత ఔరంగ్‌జేబ్ కోటను ముట్టడించాడు. అప్పుడతడ్ని హతమార్చడానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని తెలిసింది. కాని ఔరంగ్‌జేబ్ ఆ కుట్రను వమ్ముచేసి కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత అతను చక్రవర్తి షాజహాన్‌ని పదవి నుండి తొలగించి పరిపాలనా అధికారాలన్నిటిని తన చేతిలోకి తీసుకున్నాడు.

ఇప్పటిదాకా ఔరంగ్‌జేబ్‌తో సహకరిస్తుండిన మురాద్ షాజహాన్ సూచనతో, కొందరు పాలకవర్గం సభ్యులు రెచ్చగొట్టడంతో మారిపోయాడు. ఔరంగ్‌జేబ్ దారాను వెంటాడుతూ ఢిల్లీ వైపు పురోగమిస్తున్నప్పుడు మురాద్ సైన్యం తీసుకొని ఔరంగ్‌జేబ్‌ని చంపడానికి అతని వెనకాలగా బయలుదేరాడు. అయితే ఔరంగ్‌జేబ్ అతని దుష్టసంకల్పం గ్రహించి అతడ్ని పట్టుకెళ్ళి గ్వాలియర్ కోటలో బంధించాడు. ఒకసారి మురాద్ కోట నుండి పారిపోవడానికి ప్రయత్నించి పట్టుబడ్డాడు. గతంలో అతను ఒకవ్యక్తి తండ్రిని అన్యాయంగా చంపివున్నందున ఆ వ్యక్తి న్యాయస్థానంలో ప్రతీకారశిక్ష కోసం డిమాండ్ చేశాడు. అప్పుడు న్యాయస్థానం అతనికి మరణశిక్ష విధించి అమలుపరచింది.

అలాగే మరోసోదరుడు షుజా కూడా చేసినమేలు మరచి ఔరంగ్‌జేబ్‌పై కత్తికట్టాడు. అంచేత ఔరంగ్‌జేబ్ అతడ్ని కూడా అణచివేయడానికి ప్రయత్నించాడు. అయితే షుజా యుద్ధంలో చిత్తుగా ఓడిపోయి అరాకాన్ కొండల వైపుకు పారిపోయాడు. ఆ తరువాత అతని ఆచూకీ ఎవరికీ తెలియదు.

వ్యాధిగ్రస్తుడైన షాజహాన్ ఉద్వాసనకు గురైన తరువాత ఆగ్రా కోటలోనే తన చివరి రోజులు గడిపాడు. ఔరంగ్‌జేబ్ అతనికి గౌరవమర్యాదలు జరపడంలో, సుఖసౌఖ్యాలు సమకూర్చడంలో ఏమాత్రం కొరత చేయలేదు. కాని షాజహాన్ యోగ్యుడయిన తన సుపుత్రుడ్ని అభినందించడానికి బదులు ప్రతీకారంతో ఉడికిపోతూ అతడ్ని అధికారపీఠం నుండి దించడానికే విఫలయత్నం చేశాడు. చివరికి ఏడేళ్ళ పాటు నిర్బంధంలో ఉండి క్రీ.శ. 1666లో చనిపోయాడు. భవననిర్మాణాలు చేపట్టడమంటే షాజహాన్‌కు ఎంతో ఇష్టం. ఢిల్లీ జామియామస్జిద్, ఎర్రకోట, మోతీమస్జిద్, తాజ్‌మహల్ మొదలైన చారిత్రక కట్టడాలు అతను కట్టించినవే.

ఉత్తరభారత్‌లోని మేవాత్‌ప్రాంతంలో సత్నామీలు అనే ఓ సాధువులముఠా వ్యవసాయం చేస్తుండేది. క్రీ.శ.1672లో మొగల్‌ప్రభుత్వానికి చెందిన ఒక పోలీసుకు ఒక సత్నామీకి మధ్య తగాదా వచ్చింది. ఈ చిన్న సంఘటనే అల్లర్లకు కారణమైంది. సత్నామీ సాధువులు మేవాత్‌లోని మొగల్‌పోలీసులందర్నీ తరిమికొట్టి, దాని చుట్టుపక్కలున్న కొన్ని గ్రామాలను ఆక్రమించుకొని ఢిల్లీ వైపు పురోగమించారు. వారు చేతబడి చేస్తారని, అంచేత వారిపై ఎలాంటి ఆయుధాలు కూడా పనిచేయవని ప్రతీతి. అయితే ఔరంగ్‌జేబ్ ఆదేశంతో మొగల్‌సైనికులు తమ పతాకాలపై ఖుర్‌ఆన్‌సూక్తులు వ్రాసి యుద్ధం ప్రారంభించారు. దాంతో సత్నామీల చేతబడి ఏమాత్రం పనిచేయలేదు. వారిలో అనేకమంది యుద్ధభూమిలోనే ప్రాణాలు కోల్పోగా మిగిలినవారు పారిపోయారు.

జోడ్పూర్ రాజు జస్వంత్‌సింగ్ మొదట దారా పక్షంలో చేరి ఔరంగ్‌జేబ్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేశాడు. తర్వాత క్షమాపణ చెప్పుకొని ఔరంగ్‌జేబ్ పక్షపాతి అయ్యాడు. కాని ఖజ్వాహ యుద్ధంలో అతను వాగ్దానభంగం చేశాడు. అయినప్పటికీ ఔరంగ్‌జేబ్ అతడ్ని క్షమించడమేగాక మొదట అహ్మదాబాద్‌కు తరువాత కాబుల్‌కు గవర్నర్‌గా నియమించాడు. అక్కడే అతను క్రీ.శ. 1679లో చనిపోయాడు. అతనికి ఇద్దరుభార్యల ద్వారా ఇద్దరు కొడుకులు పుట్టారు. తండ్రి మరణానంతరం ఆ పిల్లల సంరక్షణ భాధ్యత



ఆనవాయితీ ప్రకారం ప్రభుత్వం తీసుకుంది. కాని రాజపుత్రులు ఆ పిల్లల్ని జోడ్పూర్‌కు ఎత్తుకెళ్ళారు. ఔరంగ్‌జేబ్ వారిని అణచడానికి తన రాజపుత్రరాణికి పుట్టిన కొడుకు అక్బర్‌ని పంపించాడు. అయితే రాజపుత్రులు అతడ్ని అధికారసింహాసనం ఆశ చూపి తండ్రిపై తిరుగుబాటుకు ప్రేరేపించారు.

ఔరంగ్‌జేబ్ తన కొడుకు అక్బర్‌ని అభినందిస్తూ "నువ్వు బాగా పనిచేసి రాజపుత్రుల్ని నీ స్వాధీనంలోకి తెచ్చుకున్నావు. శభాష్! ఇక వారు తప్పించుకోలేరులే" అని లేఖ రాసి పంపాడు. కాని ఆ ఉత్తరం కాస్తా రాజపుత్రుల చేతికి చిక్కింది. దాంతో వారు అక్బర్‌ని అనుమానించి అతనిపీడ వదిలించుకున్నారు. మరోవైపు అక్బర్ కూడా తండ్రికి భయపడి ఈరాన్‌కు పారిపోయాడు. చనిపోయే వరకూ ఈరాన్‌లోనే ఉండిపోయాడు. తర్వాత రాజపుత్రుల తిరుగుబాటు అణగిపోయింది.

క్రీ.శ. 1685లో ఈస్టిండియాకంపెనీ ఆంగ్లేయులు హజ్‌యాత్రికుల ఓడలపై దాడి చేసి వారిని దోచుకున్నారు. దాంతో ఔరంగ్‌జేబ్ ఆంగ్లేయులపై మండిపడుతూ వారి వాణిజ్య వ్యవహారాలపై ఆంక్షలు విధించి వారి సంస్థలు, కార్యాలయాలను జప్తు చేయించాడు. అప్పుడు తెల్లదొరలు కాళ్ళావేళ్ళా పడి, భారీ నష్టపరిహారం చెల్లించి చక్రవర్తి ఆగ్రహాన్ని చల్లార్చుకోవలసి వచ్చింది.

దక్కన్‌లో బీజాపూర్, గోల్కొండలకు చెందిన ముస్లిం రాష్ట్రాలు వీలుచిక్కినప్పుడల్లా తిరుగుబాటుకు పాల్పడుతూనే ఉన్నాయి. మరొకవైపు శివాజీ నాయకత్వంలో మరాఠీలు కూడా అరాచకానికి ఒడిగడ్తున్నారు. వారిని అణచడానికి ఔరంగ్‌జేబ్ సైన్యాలను పంపి అనేకసార్లు ప్రయత్నించాడు. కాని సుదీర్ఘప్రయాణం, కఠినమార్గాల కారణంగా వాటిపై పూర్తిఅదుపు సాధ్యంకాలేదు. చివరికి క్రీ.శ. 1681లో ఔరంగ్‌జేబ్ స్వయంగా ఈ పనికి ఉపక్రమించాడు. దాంతో మరాఠీలు అణగిపోయారు. బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు కూడా మొగల్‌సామ్రాజ్య పరిధిలోకి వచ్చాయి.

ఈవిధంగా ఔరంగ్‌జేబ్ పదిహేనులక్షల చదరపుమైళ్ళ విస్తీర్ణం, ఇరవైకోట్ల జనాభాతో కూడిన సువిశాల సామ్రాజ్యాన్ని ఔరంగ్‌జేబ్ దాదాపు అర్థశతాబ్దం వరకు తిరుగులేని చక్రవర్తిగా పరిపాలించి క్రీ.శ. 1707లో తనువు చాలించాడు.

ఔరంగ్‌జేబ్ ప్రత్యర్థుల ఆటలు కట్టించి రాజ్యాన్ని విస్తరింపజేయడంతో పాటు పాలనావ్యవహారాలు కట్టుదిట్టం చేయడం, అంధవిశ్వాసాలు-దురాచారాల సంస్కరణ, ప్రజాసంక్షేమం వగైరా పనులపై కూడా దృష్టి కేంద్రీకరించాడు. పాతరోడ్లు మరమ్మత్తు చేయించి కొత్తరోడ్లు వేయించాడు. షరీఅత్‌కు వ్యతిరేకమైన ఢెబ్భయి రకాల పన్నులు తీసివేయించి ప్రజలభారం తగ్గించాడు. పాలకులకు వంగివంగి సలాం చేయడం, పాదాభివందనం, నృత్యగాన కచేరీలు, జూదం-వ్యభిచారం, బానిసవ్యాపారం, సతీసహగమనం వగైరా చెడుల్ని, ప్రభుత్వయంత్రాంగంలో పేరుకుపోయిన అవినీతిని నిర్మూలించాడు. లూటీలు-దోపిడీలు అంతమొందించి శాంతిభద్రతల్ని కాపాడాడు. దాంతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించారు. ధర్మవేత్తల సహకారంతో "ఫతావాఆలంగీర్" గ్రంథాన్ని ఉనికిలోకి తెచ్చి న్యాయస్థానాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చాడు.

భారతదేశాన్ని పాలించిన ముస్లిం చక్రవర్తుల్లో ఔరంగ్‌జేబ్‌ను మించిన దైవభక్తుడు మరెవరూ లేరని చెప్పవచ్చు. ప్రతిరోజూ విధిగా చేసే ఐదు పూటల నమాజులతో పాటు అర్ధరాత్రి చేసే తహజ్జుద్ నమాజ్ కూడా అతను క్రమంతప్పకుండా చేసేవాడు. అలాగే విధిగా పాటించే రమజాన్‌నెల ఉపవాసాలతో పాటు ప్రతివారం గురు, శుక్రవారల్లో కూడా నఫిల్ ఉపవాసాలు పాటించేవాడు. రోజుకు మూడుగంటలు మాత్రమే నిద్రించే వాడు. మిగతా సమయమంతా పాలనావ్యవహారాలు, దైవారాధనల కోసం వినియోగించే వాడు. షరీఅత్ ఆజ్ఞల్ని స్వయంగా పాటించడంలో, వాటిని కచ్చితంగా అమలుజరప డంలో అతనికి అతనే సాటి. అరబీ, పార్సీ, టర్కీ, హిందీ భాషల్లో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. నడివయసులో మొత్తం ఖుర్‌ఆన్‌ని ఒక్క సంవత్సరంలో కంఠస్తం చేశాడు. న్యాయనిర్ణయంలో తనవారు-పరాయివారు, పేదలు-ధనికులు, ముస్లింలు-ముస్లిమేతరులు అన్న వివక్ష లేకుండా అందరికీ ఒకేవిధంగా న్యాయం చేసేవాడు.

ఔరంగ్‌జేబ్ పాలనాకాలంలో పంజాబ్ సుబేదార్‌కు ఒక దుర్బుద్ధి పుట్టింది. ఓసారి అతని దృష్టి ఓ కుమ్మరియువతిపై పడింది. ఆమెను చూడగానే అతని బుద్ధి చెడి పోయింది. అతనా యువతి తండ్రిని పిలిపించి తన దుష్టకోరిక తెలియజేస్తూ తాను సరిగ్గా నెలరోజుల తరువాత ఈ ప్రాంతానికి వస్తానని, అప్పుడు అమ్మాయిని సిద్ధంగా ఉంచి తనకప్పగించాలని ఆజ్ఞాపించాడు. ఆ కుమ్మరి ఎంతో ఆత్మాభిమానం కలవాడు. ఈమాట విని అతను ఆందోళన చెందాడు. అతని భార్య అతడ్ని ఓదారుస్తూ "డిల్లీ పాదుషా చాలా మంచివాడు, న్యాయశీలి, న్యాయం కోసం వచ్చినవారిని నిరాశపర్చడు. అంచేత మీరు అతని దగ్గరకు వెళ్ళి "మేము హిందువులం, కుమ్మరివాళ్ళమని, మీ సుబేదారు మా ధర్మాన్ని భ్రష్టుపట్టించి మా అమ్మాయిని తనింట్లో ఉంచుకోవాలని చూస్తున్నాడని, ఇది చాలా అన్యాయం, అధర్మం అని, తమను ఈ అన్యాయం నుండి కాపాడమని మొరపెట్టండి" అని నచ్చజెప్పి పంపించింది.

భార్య సలహా, ప్రోత్సాహాలతో ఆ కుమ్మరి డిల్లీకి వెళ్ళి, ఔరంగజేబును కలిసి, కన్నీళ్ళతో తన బాధను వెళ్ళబోసుకున్నాడు. ఇది వినగానే ఔరంగ్‌జేబ్ కళ్ళు జేవురించాయి. అతను కుమ్మరిని ఓదారుస్తూ "నువ్వేమీ బాధపడకు. ఆమె నీ బిడ్డ కాదు, మా బిడ్డ, ఇది నీ పరువు కాదు, మా పరువు. మేం మీకు తప్పకుండా న్యాయం చేసితీరుతాం. ఆ దుష్టుడు ఏ రోజు నీ ఇంటికి వస్తానని చెప్పిపోయాడో దానికి ముందే మేము నీ ఇంట్లో ఉంటాం. మీ పరువుప్రతిష్ఠల్ని కాపాడుతామని మరోసారి నీకు వాగ్దానం చేస్తున్నాం. ఇది మా కర్తవ్యం. కనుక నీవు నిశ్చింతగా ఉండు" అని చెప్పి అతడ్ని సాగనంపాడు. ఆ కుమ్మరి అమితానందంతో తిరుగుముఖం పట్టాడు.

తాను వాగ్దానం చేసిన ప్రకారం ఔరంగ్‌జేబ్ నిర్ణీతరోజు ఒంటరిగా ఆ కుమ్మరి ఇంటికి వెళ్ళాడు. తరువాత ఆ దుష్టుడు రాగానే ఔరంగ్‌జేబ్ తన స్వహస్తాలతో అతడ్ని కత్తిదూసి హతమార్చాడు. ఈ చారిత్రక సంఘటన ఔరంగ్‌జేబ్ న్యాయప్రియత్వాన్ని, కర్తవ్యపరాయణతను, ప్రజల పట్ల అతనికున్న బాధ్యతాభావాన్ని, ప్రేమాభిమానాలను చాటిచెప్పే ఓ మచ్చుతునక. (దావత్, త్రైదిన ఉర్దూపత్రిక: అక్టోబర్ 2, 1967)



ఒకసారి ఔరంగ్‌జేబ్ సైన్యం తీసుకొని బెంగాల్ వైపు బయలుదేరాడు. అతని సైన్యంలో హిందూరాజులు, వారి సైనికులు కూడా ఉన్నారు. దారిలో వారణాసి సమీపించగానే "ఇక్కడ ఒక రోజు ప్రయాణం ఆపితే తమ రాణులు గంగలో స్నానం చేసి విశ్వనాథుని దర్శించుకో గోరుతున్నారని హిందూరాజులు విన్నవించుకున్నారు. ఔరంగజేబు ఈ విన్నపాన్ని అంగీకరించాడు. అక్కడి నుండి వారణాసి ఐదుమైళ్ళ దూరంలో ఉంది. వెంటనే త్రోవ పొడవునా సైన్యం నియమించబడింది. రాణులు పల్లకీల్లో బయలుదేరారు. వారు గంగలో స్నానంచేసి విశ్వనాథుని దర్శించుకొని, తిరిగి వచ్చేశారు. అయితే కచ్ ప్రాంతానికి చెందిన రాణి తిరిగిరాలేదు. సైనికులు ఆమె కోసం నలువైపులా గాలించారు. కాని ఆమె జాడ తెలియరాలేదు. చివరికి ఈ విషయం ఔరంగ్‌జేబ్ దృష్టికి తీసుకురాబడింది.

ఈ సంగతి తెలియగానే ఔరంగ్‌జేబ్ ఉగ్రుడైపోతూ రాణి ఆచూకీ కోసం తన ఉన్నతాధికారుల్ని పంపించాడు. వారా ప్రాంతాన్నంతా వెతుకుతూ, వెతుకుతూ చివరికి విశ్వనాథ మందిరంలోకి ప్రవేశించారు. అక్కడ గోడలో అమర్చబడిన గణేశుని విగ్రహం ఆ సమయంలో కాస్త కదిలినట్లు కనబడింది. అధికారులకు అనుమానం వచ్చి ఆ విగ్రహాన్ని (బలంగా) అక్కడి నుండి తొలగించారు. విగ్రహం తొలగించగానే దాని క్రింద వారికి మెట్లు కనిపించాయి. వారా మెట్లు దిగి ఒక నేలమాళిగలో ప్రవేశించారు. అక్కడ రాణిని చూసి వారు నిర్ఘాంతపోయారు. ఆమె శీలాపహరణ జరిగింది. ఆమె భోరున విలపిస్తున్నది. ఈ నేలమాళిగ ప్రవేశం సరిగ్గా విశ్వనాథుని విగ్రహం క్రింద ఉంది. హిందూరాజులు దీన్ని తీవ్రంగా నిరసించారు. తమకు న్యాయం చేయాలని చక్రవర్తిపై ఒత్తిడితెచ్చారు. సమస్య చాలా గంభీరంగా మారింది. ఈ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేసినందున విగ్రహాన్ని వేరొక చోటికి తరలించి మందిరాన్ని ధ్వంసం చేయాలని, మహంతుని నిర్బంధంలోకి తీసుకొని శిక్షించాలని ఔరంగ్‌జేబ్ ఆదేశించాడు.

పై సంఘటనను డాక్టర్ పట్టాభి సీతారామయ్య గారు తన ప్రఖ్యాత గ్రంథం "The Feathers and Stones"లో పూర్తి సాక్ష్యాధారాలతో నిరూపించారు. అంతేగాక పాట్నా మ్యూజియం మాజీ కూరేటర్ అయిన డాక్టర్ పి.ఎల్. గుప్తా కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు.

గోల్కొండ ప్రభువు తానీషా పేరుతో ప్రఖ్యాతిగాంచాడు. అతను తన రాజ్యంలో శిస్తులయితే వసూలు చేసేవాడు, కాని కేంద్ర ప్రభుత్వం అయిన ఢిల్లీకి చిల్లిగవ్వ కూడా పంపించేవాడు కాదు. ఫలితంగా కొన్ని సంవత్సరాల్లోనే అతని దగ్గర కోట్ల ధనం పోగయి పోయింది. తానీషా ఈ ధనాన్నంతా భూమిలో పాతించి దానిపై జామె మస్జిద్‌ను కట్టించాడు. ఈ విషయం ఔరంగజేబుకు తెలియగానే అతను మస్జిద్‌ను పడగొట్టించి, దాని కింద పాతిపెట్టిన ఆ ధనాన్ని జప్తుచేసి, ప్రజాహిత కార్యాల్లో ఖర్చు పెట్టేశాడు.

పైన పేర్కొనబడిన రెండు సంఘటనలను బట్టి ఔరంగ్‌జేబ్ న్యాయనిర్ణయం చేయడంలో, స్వచ్ఛమైన తీర్పు ఇవ్వడంలో మస్జిద్, మందిర్‌ల భేదభావాన్ని ఏమాత్రం పాటించేవాడు కాదని స్పష్టంగా తెలుస్తోంది.

ఔరంగ్‌జేబ్ శ్రమజీవి. అతను ప్రభుత్వధనాగారం నుండి ఒక్క పైసా కూడా తన సొంతానికి తీసుకోకుండా కష్టపడి పనిచేసి సంపాదించుకునేవాడు. ముఖ్యంగా అతను టోపీలు కుట్టి, ఖుర్‌ఆన్ ప్రతులు రాసి, వాటిని అమ్మి ధర్మసమ్మతంగా సంపాదించి భార్యపిల్లల అవసరాలు తీర్చేవాడు. దానికి ఈ క్రింది ఉదంతమే ప్రబలనిదర్శనం.

నేటి నీతిరాహిత్య సమాజంలో ధర్మసంపాదన వల్ల మనిషి లక్షలు ఆర్జించలేకపోయినా అతని ముఖ్యావసరాలు తీరకపోవు. దేవుడు విశ్వప్రభువు, సృష్టికర్త, యజమాని మాత్రమే గాకుండా ఆయన మన పోషకుడు, ఉపాధిప్రదాత కూడా అన్న విషయాన్ని నిష్ఠాపరుడయిన ముస్లిం గట్టిగా నమ్ముతాడు. ధర్మసంపాదన వల్ల ఇహలోకంలో అధిక లాభాలు రాకపోయినా పరలోకంలో మటుకు తనకు గొప్ప ప్రతిఫలం లభిస్తుందని అతను విశ్వసిస్తాడు. అయితే ఒక్కొక్కసారి ఇహలోకంలో కూడా ధర్మసంపాదన వల్ల అనూహ్యమైన శుభాలు చేకూరుతాయి.

ఢిల్లీచక్రవర్తి దర్బారులో కొలువుతీరి కూర్చున్నాడు. కాస్సేపటికి ఎక్కడ్నుంచో ఆయన గురువుగారు ఒకాయన వచ్చాడు. గరువుగారిని చూడగానే చక్రవర్తి అమితమైన సంతోషంతో ఎదురేగి ఎంతో గౌరవమర్యాదలతో ఆయన్ని స్వాగతించి తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. యోగక్షేమాలు విచారించాడు. ఆ తరువాత కొన్నాళ్ళపాటు ఆయన్ని తన దగ్గర అతిథిగా పెట్టుకొని ఎంతో సేవ చేశాడు.

చక్రవర్తి దగ్గర ఆతిథ్యం ఇవ్వడానికి కొదవేముంటుంది? కాని గురువుగారు కొన్నాళ్ళ తర్వాత ఇంటికి వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు చక్రవర్తి గురువుగారి పట్ల ఎంతో వినయం చూపుతూ చిరుకానుకగా ఆయనకు ఓ పావలా నాణెం సమర్పించుకున్నాడు. ఆ చిరుకానుక చూసి దర్బారులో సభికులంతా ఆశ్యర్యపోయారు.

“ఏమిటీ! ఎంతో విశాలమైన సామ్రాజ్యాన్ని ఏలే మన చక్రవర్తి అంతపెద్ద గురువుగారికి కానుకగా ఓ పావలా బిళ్ళేనా ఇచ్చేది!! అని భావిస్తూ మంత్రులు, అధికారులు విస్తుబోయి చూడసాగారు. ఆవిధంగా చక్రవర్తి తన గురువుగారిని కించపరుస్తున్నాడని అనుకున్నారు వారు. కాని గురువుగారు అల్పసంతోషిలా ఆ పావలా కాసునే తీసుకొని సంతోషంతో పొంగిపోతూ మనసారా చక్రవర్తిని దీవించి మరీ వెళ్ళిపోయారు. ఇది చూసి సభాసదులు మరింత ఆశ్చర్యపోయారు.

“ఏమిటీ, నేను గురువుగారికి పావలా మాత్రమే ఇచ్చానని మీరు ఆశ్చర్యపోతున్నారా? మీకు వాస్తవం తెలియదు. అంచేత గురువుగారిని నేనేదో కించపరచానని మీరు భావిస్తున్నారు” అన్నాడు చక్రవర్తి. కాని అలా అన్నాడేగాని ఆ వాస్తవం ఆయన సభికులకు చెప్పలేదు. సభికులు కూడ కారణం అడగడానికి సాహసించలేదు.

కొన్నేళ్ళ తరువాత గురువుగారు గొప్ప ధనికుడయిపోయాడు. అనేక తోటలు, పొలాలు, పశువులకు ఆయన యజమాని అయ్యాడు. ప్రతిరోజూ వందలాది మంది జనానికి ఆతిథ్యం కూడా ఇవ్వసాగాడు. ఈ సంగతి చక్రవర్తికి తెలిసి చాలా సంతోషించాడు. గురువుగారు ఆస్తిపరుడయిన తరువాత ఓ రోజు మళ్ళీ చక్రవర్తిని కలుసుకోవడానికి వచ్చాడు. చక్రవర్తి యథాప్రకారం గురువుగారికి అత్యంత గౌరవమర్యాదలు జరిపాడు. అతిథిగా స్వీకరించి గొప్ప సేవలు చేయడం ప్రారంభించాడు.



ఓరోజు దర్బారులో గురువుగారు చక్రవర్తితో మాట్లాడుతూ ‘ఆ పావలా కాసు’ ప్రస్తావన తెచ్చారు. అప్పుడు గురువుగారు ఇలా అన్నాడు: “శిష్యా! ఆరోజు నీవు నాకిచ్చిన పావలాతోనే ఈరోజు నేనింత ధనికుణ్ణయ్యాను. ఆ పావలాతో నేనొక చిన్నవ్యాపారం మొదలెట్టాను. ఇంకేముంది, నావ్యాపారం క్రమంగా దినదినాభివృద్ధి చెందుతూ కొన్నేళ్ళకే నేను లక్షాధికారినయ్యాను. సరే, ఇంతకూ నీవు ఆ పావలాను ఎక్కడ్నుంచి తెచ్చిచ్చావు? దాని కథాకమామీషు ఏమైనా ఉందా?”

చక్రవర్తి ఈమాట విని కోశాధికారి వైపు తిరిగి “కోశాధికారీ! ఏదా పద్దులపుస్తకం, కాస్త ఇటు తీసుకురా” అని ఆజ్ఞాపించాడు. కోశాధికారి వెళ్ళి ఒక పెద్ద రిజిష్టర్ తెచ్చి చక్రవర్తికి అందించాడు. చక్రవర్తి రిజిష్టర్‌లో కొన్ని పేజీలు తిరిగేసి, ఓ చోట వేలుపెట్టి చూపిస్తూ “నీవు ఫలానా తారీఖున పావలా ఖర్చు పెట్టినట్లు రిజిష్టర్‌లో రాశావు. కాని ఆ డబ్బు ఏపద్దు కింద ఎందుకు ఖర్చుపెట్టావో చూపించలేదే?” అని అడిగాడు.

ఈ మాట వినగానే కోశాధికారికి వణుకు పుట్టింది. “క్షమించండి మహారాజా! పొరపాటయింది. మీరు అనుమతిస్తే ఆ పావలా సంగతి వివరిస్తాను” అన్నాడతను వినయంగా. దానికి చక్రవర్తి “అలాగే అనుమతిస్తున్నాము, చెప్పు” అన్నాడు. అప్పుడు కోశాధికారి ఇలా చెప్పడం ప్రారంభించాడు:

“మహారాజా! ఒకరోజు ఉదయం నుండి వర్షం ప్రారంభమయి రాత్రి పొద్దుపోయేదాకా కురిసింది. ఆ రాత్రి వర్షానికి మాఇల్లు కారడం మొదలెట్టింది. పైకెక్కి కన్నం పడినచోట చవుడు పోయమని నాభార్య చెప్పింది. కాని ఆ ముసురులో, ఎముకలు కొరికే ఆ చలిగాలిలో బయటికెళ్ళి మిద్దెపై ఎక్కడానికి నాకు ధైర్యం చాల్లేదు. ఏం చెయ్యాలో తోచక ఎవరైనా కూలివాడు వస్తే బాగుంటుందని ఆలోచిస్తూ కూర్చున్నా. అయినా ఇంత రాత్రివేళ ఈ వర్షంలో ఏ కూలివాడు వస్తాడు అనుకున్నాను.

“అంతలో బయట తలుపు తట్టిన చప్పుడయింది. నేను ఆదుర్దాగా ఎవరూ? అన్నాను. ‘కూలివాణ్ణయ్యా!’ అంటూ సమాధానమొచ్చింది. నేను సంతోషంతో తలుపు తెరచి కూలివాణ్ణి లోపలికి తీసికెళ్ళాను. అతనికి ఇల్లు కారుతున్న చోటు చూపించి మరమ్మత్తు చేయమని చెప్పాను. అతను వర్షంలో తడుస్తూ చవుడుగంప తీసుకొని మిద్దెపైకెక్కాడు. కాస్సేపటికి కారుతున్న చోట చవుడు పోసి సరిచేసి కిందికి దిగివచ్చాడు.

“అతని పరిస్థితి చూసి నాకు జాలివేసింది. తడిసి ముద్దయి చలికి గజగజ వణికిపోసాగాడు. చీకట్లో అతను ఎవరైందీ నేను గమనించలేకపోయాను. ఎవరైతేనేం, మొత్తానికి మమ్మల్ని ఆ రాత్రి ఆపద నుండి గట్టెక్కించాడు. నేను సంతోషిస్తూ అతనికి కూలి కింద పావలా ఇచ్చాను. ఆ డబ్బే మన పద్దుల పుస్తకంలో రాసిన ఈ పావలా.”

కోశాధికారి ఇలా వివరించిన తరువాత చక్రవర్తి ఏం చెబుతాడోనని ఆలోచిస్తూ గురువుగారు, సభాసదులు చక్రవర్తి వైపు దృష్టి మళ్ళించి తదేకంగా చూడసాగారు.

"గురువర్యా! ఆరోజు మా కోశాధికారి ఇంటిని మరమ్మత్తు చేసిన ఆ కూలివాడు నేనే" అన్నాడు చక్రవర్తి. ఈమాట వినగానే అందరూ నిర్ఘాంతపోయారు. "ఏమిటీ! మన చక్రవర్తి కూలిపని చెయ్యడమా!!" అంటూ సభాసదులు ఆశ్చర్యచకితులయ్యారు. చక్రవర్తి తన మాటను కొనసాగిస్తూ ఇలా అన్నాడు:

"గురువర్యా! ఆ రోజుల్లోనే మీరు రాజధానికొచ్చి నా దగ్గర అతిథిగా ఉండసాగారు. మీరు గురువులు, గౌరవనీయులు. అందుకని నేను నా స్వహస్తాలతో కష్టపడి సంపాదించిన డబ్బునే మీకు కానుకగా ఇద్దామని భావించాను. సమయం కోసం ఎదురుచూస్తూ ఆ రాత్రి కూలివాడి వేషంలో బయలుదేరాను.

"బజారులో నడుస్తూ మన కోశాధికారి ఇంటి ముందు నుంచి పోతుంటే అతని భార్య చెబుతున్న మాటలు నా చెవిలో పడ్డాయి. వెంటనే తలుపు తట్టి నన్ను నేను కూలివాణ్ణిగా చెప్పుకున్నాను. ఆరోజు అక్కడ సంపాదించిన ఆ పావలా కాసునే నేను మీకు కానుకగా సమర్పించుకున్నాను."

గురువుగారు ఈ మాటలు విని "నిజంగా ధర్మసంపాదనలో ఎంతో శుభం ఉంది" అంటూ వ్యాఖ్యానించారు.

ఇంతకూ కూలివాడిగా పావలా డబ్బు సంపాదించి తన గురువుకు కానుకగా ఇచ్చిన ఆ చక్రవర్తి ఎవరో ఈ మొత్తం సంఘటన సందర్భంగా నేను పేర్కొనలేదు. వినండి. ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని వారికి సహాయపడేందుకు కూలివాడి అవతారం ఎత్తిన ఆ చక్రవర్తి ఎవరో కాదు, ప్రఖ్యాత మొగల్ చక్రవర్తి ఔరంగ్‌జేబ్ ఆలమ్‌గీర్! ఆయన ఖుర్‌ఆన్ ప్రతులు రాసి, టోపీలు కుట్టి అమ్ముకుంటూ మనుగడ సాగించే వాడని చరిత్రకారులు రాసిన సంగతి చాలా మందికి తెలుసు.

దీన్నిబట్టి ధర్మసంపాదనకు ఇస్లాం ఎంత విలువ ఇచ్చిందో, దానివల్ల ఇహపర లోకాల్లో ఎన్ని శుభాలు చేకూరుతాయో ఊహించవచ్చు. అందుకే దైవప్రవక్త (సల్లం) ధర్మసంపాదన కోసం చేసేకృషికి, నీతినిజాయితీలలో చేసే వ్యాపారానికి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చారు. మిష్కాత్‌లోని ఒక హదీస్ ప్రకారం ఆయన ఇలా అన్నారు:

"లోకుల ముందు చేయిజాపకుండా ఉండే, భార్యాపిల్లల్ని పోషించే, పొరుగువారిని కనికరించే ఉద్దేశంతో ధర్మసమ్మతంగా ధనార్జన చేసిన వ్యక్తి ప్రళయదినాన దేవుణ్ని కలుసుకోవడానికి వెళ్ళేటప్పుడు అతని ముఖం పూర్ణచంద్రునిలా వెలిగిపోతుంది. దీనికి భిన్నంగా ధర్మసమ్మతంగా ధనార్జన చేసినప్పటికీ ఇతరులకంటే ఎక్కువ కూడబెట్టే, ఇతరులకంటే తాను గొప్ప ధనికుడ్నని పించుకునే, తనకంటే తక్కువ స్థితిపరుల్ని చూసి మిడిసిపడే ఉద్దేశం కలవాడైతే ప్రళయదినాన అలాంటి వ్యక్తిని దేవుడు ఆగ్రహిస్తాడు."

అంతేకాదు, నీతినిజాయితీలతో వ్యాపారం చేసే వర్తకుడ్ని దైవప్రవక్తలు, సత్యసంధులు, అమరగతుల సరసన నిలబెడ్తూ ఆయన "నీతిమంతుడైన వ్యాపారి అంతిమ (ప్రళయ) దినాన దైవప్రవక్తల, సత్యసంధుల, అమరగతుల సహచర్యంలో ఉంటాడు" అని ప్రవచించారు. (తిర్మిజి)



# 89. పతనదిశగా మొగల్‌పాలన

ఔరంగ్‌జేబ్ మరణానంతరం క్రీ.శ. 1707లో అతని పెద్ద కొడుకు బహద్దుర్‌షా-1 ఢిల్లీ సింహాసనం అధిష్టించాడు. అతడ్ని షహ్‌జాదా ముఅజ్జమ్ అని కూడా అంటారు. ఔరంగ్‌జేబ్ తర్వాత మొగల్‌సామ్రాజ్యం అతని ముగ్గురు కొడుకుల మధ్య మూడు ముక్కలై పోయింది. బహద్దుర్‌షా-1 అధికారం చేపట్టగానే అతనికి మరాఠాలు, రాజపుత్రులు, సిక్కుల తిరుగుబాటులు ఎదురయ్యాయి. క్రీ.శ. 1712లో బహద్దుర్‌షా-1 చనిపోయిన తర్వాత బలహీనపాలకుల కారణంగా మొగల్‌సామ్రాజ్యం అనైక్యతా అంతర్విభేదాలతో క్రమీణా బక్కచిక్కిపోతూ ఢిల్లీ, దాని పరిసరప్రాంతాలకు పరిమితమై పోయింది.

క్రీ.శ.1739లో ముహమ్మద్‌షా పాలనలోని మొగల్‌రాజ్యంపై అఫ్గాన్‌కు చెందిన నాదిర్‌షా దాడిచేశాడు. నాదిర్‌షా మరణానంతరం అతని సేనాపతి అహ్మద్‌షా అబ్దాలి మరొకసారి దాడిచేశాడు. దాంతో మొగల్‌రాజ్యం పూర్తిగా ఢిల్లీకి పరిమితమైపోయింది. మొగల్ చివరి చక్రవర్తి బహద్దుర్‌షా-2 క్రీ.శ. 1837 నుండి 1857 వరకు పాలన చేసి, భారత స్వాతంత్ర్యసమరం సందర్భంలో ఆంగ్లేయులకు పట్టుబడి రంగూన్(బర్మా)లో జైలుపాలయ్యాడు. దాంతో మొగల్‌పాలన అంతమైపోయింది.

| **మొగల్‌పాలకులు** | **వారి పాలనా కాలం** |
|---|---|
| ఔరంగ్‌జేబ్ ఆలంగీర్ | క్రీ.శ. 1658 నుండి 1707 వరకు |
| బహద్దుర్‌షా-1 | క్రీ.శ. 1707 నుండి 1712 వరకు |
| జహాన్‌దర్‌షా | క్రీ.శ. 1712 నుండి 1713 వరకు |
| ఫుర్రుఖ్‌సియార్ | క్రీ.శ. 1713 నుండి 1719 వరకు |
| రఫీవుల్ దర్జాత్ | క్రీ.శ. 1719 నుండి 1719 వరకు |
| రఫీవుద్ దౌలత్ | క్రీ.శ. 1719 నుండి 1719 వరకు |
| నికుసియార్ | క్రీ.శ. 1719 నుండి 1743 వరకు |
| ముహమ్మద్ ఇబ్రాహీం | క్రీ.శ. 1720 నుండి 1744 వరకు |
| ముహమ్మద్‌షా | క్రీ.శ. 1719-1720, 1720-1748 |
| అహ్మద్‌షా బహద్దుర్ | క్రీ.శ. 1748 నుండి 1754 వరకు |
| ఆలంగీర్-2 | క్రీ.శ. 1754 నుండి 1759 వరకు |
| షాజహాన్-2 | క్రీ.శ. 1759 నుండి 1772 వరకు |
| షాఆలం-2 | క్రీ.శ. 1759 నుండి 1806 వరకు |
| అక్బర్‌షా-2 | క్రీ.శ. 1806 నుండి 1837 వరకు |
| బహద్దుర్‌షా-2 | క్రీ.శ. 1837 నుండి 1857 వరకు |

క్రీ.శ. 1757నాటి ప్లాసీయుద్ధంలో ఈస్టిండియాకంపెనీ రాజవిద్రోహం ద్వారా మొగల్ సామ్రాజ్యంలోని బెంగాల్‌గవర్నర్ నవాబ్ సిరాజుద్దౌలాను ఓడించి బెంగాల్‌రాష్ట్రాన్ని ఆక్రమించుకుంది. యూరప్‌కు చెందిన డచ్, పోర్చుగీస్, ఫ్రెంచ్, బ్రిటిష్ కంపెనీలు

భారత్‌లో కాలనీలు స్థాపించుకోడానికి జరుగుతున్న పరస్పర సంఘర్షణల ప్రభావం ఆంగ్లేయులు ముస్లింపాలకుల్ని అణచడానికి చేస్తున్న యుద్ధాలపై కూడా పడసాగింది.

ప్లాసీయుద్ధంలో ఫ్రెంచ్‌కంపెనీ సిరాజుద్దౌలా పక్షంలో చేరింది. వారికి వ్యతిరేకంగా ఈస్టిండియా కంపెనీ ప్రత్యర్థిసైనికుల్లో రాజద్రోహుల్ని తయారుచేయడం, వెపన్‌టెక్నాలజీ ద్వారా ముస్లింలను ఓడించడమనే వ్యూహంతో ముందుకు సాగింది. దానికి చెందిన ఫోర్ట్‌విలియం కాలేజ్ చాలాకాలం నుండి ముస్లింలకు వ్యతిరేకంగా విచ్ఛినకర కార్యకలాపాలకు నిలయమైపోయింది. అంచేత నవాబ్ సిరాజుద్దౌలా ఆంగ్లేయులతో విసిగిపోయి ఫోర్ట్ విలియం కాలేజీని స్వాధీనం చేసుకొని వారి విచ్ఛినకర కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశాడు. దాంతో ఆంగ్లేయులు రెచ్చిపోయి సిరాజుద్దౌలాను తమ దారి నుండి శాశ్వతంగా తొలగించి బెంగాల్‌ని ఆక్రమించుకోవడానికి నిర్ణయించుకున్నారు.

ఈ నిర్ణయాన్ని అమలుజరపడానికి ఈస్టిండియాకంపెనీ ప్రఖ్యాత దోపిడీదొంగయిన రాబర్ట్ క్లయ్‌వుని తన కంపెనీలో ఉద్యోగిగా నియమించుకున్నది. ఈనాడు అతను లార్డ్ క్లయ్‌వు పేరుతో ప్రసిద్ధిచెందాడు. క్లయ్‌వు నాయకత్వంలో ఆంగ్లేయ సైనికులు నవాబ్ సిరాజుద్దౌలా ముందుకు వచ్చారు. ముస్లింసైనికులు, ఫ్రెంచ్‌సైనికుల ఉమ్మడిసైన్యం ముందు ఆంగ్లేయసైన్యం ఏమాత్రం నిలబడజాలదు. కాని ప్రధానమంత్రి, సేనాపతి అయిన మీర్‌జాఫర్ రాజద్రోహిగా మారిపోయాడు. అతను ఆంగ్లేయులతో చేతులు కలిపి సిరాజుద్దౌలా ప్రభుత్వాన్ని పడగొట్టడానికి కుట్రపన్నాడు.

ప్లాసీయుద్ధ సమయంలో మీర్‌జాఫర్ తన అధీనంలోని యాభైవేలమంది సైనికుల్లో నలభైఐదువేల మందిని తీసుకొని పక్కకు తొలిగాడు. అయినప్పటికీ మిగిలిన ఐదువేల మంది యోధులు తమ ఆర్టిలరీ సహాయంతో ఆంగ్లేయసైన్యాన్ని ప్రతిఘటించడానికే నిర్ణయించుకున్నారు. అయితే మీర్‌జాఫర్ అంతటితో ఆగకుండా ముస్లిం ఎమ్యునేషన్‌లో దాచిన గన్‌పౌడర్ మీద నీళ్ళుపోయించి దాన్ని చెడగొట్టాడు. దాంతో ముస్లింల దగ్గర ఆర్టిలరీ కూడా లేకుండా పోయింది. ఫలితంగా ముస్లింలు ఓడిపోయారు. సిరాజుద్దౌలా యుద్ధభూమి నుండి ప్రాణాలు దక్కించుకొని పారిపోయాడు. అయితే అతను పట్టుబడి జైలుపాలయ్యాడు. తరువాత ఆంగ్లేయుల దయాదాక్షిణ్యాలతో బెంగాల్‌గవర్నరయిన మీర్‌జాఫర్ నవాబ్ సిరాజుద్దౌలాను జైల్లో ఘోరంగా చంపించాడు.

క్రీ.శ. 1761లో పానిపట్‌యుద్ధం తరువాత మొగల్‌పాలకులు కొన్ని మిత్రపక్షాలను కలుపుకొని బెంగాల్‌ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి యుద్ధరంగంలోకి దిగారు. కాని వారు బక్సర్ దగ్గర ఆంగ్లేయుల చేతిలో ఘోరంగా ఓడిపోయారు. ఈ యుద్ధంలో ఆంగ్లేయులు రాజద్రోహి మీర్‌జాఫర్‌ని హతమార్చి బెంగాల్‌ని పూర్తిగా ఆక్రమించుకున్నారు.

ఈనాటి పరిస్థితుల దృష్ట్యా ప్లాసీయుద్ధాన్ని విశ్లేషిస్తే కొవర్ట్ ఆపరేషన్, ఇంటెల్లిజెన్స్ ఆపరేషన్, శబటైజ్ ద్వారా రిజీమ్‌ఛేంజ్ ప్లాన్‌ని వారు మొదటిసారిగా అమల్లోకి తెచ్చారని తెలుస్తుంది నేరుగా యుద్ధం చేయకుండా విద్రోహులతయారీ, కొవర్ట్ ఆపరేషన్‌ల ద్వారా లోఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్‌తో కూడా ముస్లింలను ఓడించవచ్చని వారు ఆనాడేకాదు, ఈనాడు కూడా అదే రాజనీతిని అనుసరిస్తున్నారు.



# 90. మైసూర్‌పులి టీపూసుల్తాన్

టీపూసుల్తాన్ అసలుపేరు ఫతహ్‌అలీ టీపూ. 20-11-1750లో జన్మించాడు. తండ్రి మైసూర్‌నవాబ్ హైదర్‌అలి. తల్లిపేరు ఫాతిమా. టీపూ చిన్నతనం నుండే ధైర్యస్థయిర్యాలకు, ప్రతిభాపరాక్రమాలకు ప్రతీకగా నిలిచాడు. అతను ఇస్లామీయ విద్యాకళలతోపాటు అరబీ, ఫార్సీ, ఉర్దూ, కన్నడం, తమిళం, ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషల్లో మంచి పట్టు సాధించాడు. హైదర్‌అలి అతనికి రణరంగంలో అవసరమైన యుద్ధకళలన్నీ నేర్పాడు.

క్రీ.శ. 1765లో టీపూసుల్తాన్ తండ్రి హైదర్‌అలీతో కలసి మల్బార్ మీద దాడిచేశాడు. అప్పుడతను కేవలం మూడువేలమంది సైనికులతో శత్రువుకు చెందిన ఓ భారీసైన్యాన్ని అదుపులోకి తీసుకున్నాడు. దాంతో హైదర్‌అలీ సంతోషించి అతడ్ని తన స్వీయ భద్రతా దళంలోకి చేర్చుకొని జాగీరు ఇచ్చాడు. 19-6-1767లో మద్రాస్, దాని పరిసరప్రాంతాలపై దాడులు చేస్తున్నపుడు ఆంగ్లేయులు మొదటిసారిగా హైదర్‌అలీపై దాడిచేశారు. అప్పుడు టీపూసుల్తాన్ అక్కడకు చేరుకొని తండ్రికి సహాయపడ్డాడు.

ఆంగ్లేయులు మంగళూర్‌ను ఆక్రమించుకున్నపుడు హైదర్‌అలి దాన్ని విడిపించడానికి టీపూసుల్తాన్‌ని పంపించాడు. టీపూసుల్తాన్ గతంలో తాను పట్టుకున్న ఇరవై వేల మంది యుద్ధఖైదీలను ఇరవై గ్రూపులుగాచేసి వారికి కట్టెతుపాకులిచ్చి ఆంగ్లేయసైన్యం ముందు నిలబెట్టాడు. తరువాత అతను స్వయంగా శత్రుసైన్యంపై విరుచుకుపడ్డాడు. దాంతో ఆంగ్లేయులు పరాజితులై పారిపోయారు. ఈ విజయం తర్వాత హైదర్‌అలీ మద్రాస్ వైపు పురోగమించాడు. చివరికి 4-4-1769లో మద్రాస్ (ప్రెసిడెన్సి) ఆంగ్లేయ ప్రభుత్వం కాళ్ళబేరానికి వచ్చి హైదర్‌అలీతో రాజీఒప్పందం చేసుకుంది.

తరంబక్‌రావ్ నాయకత్వంలో మరాఠాసైన్యం మైసూర్‌పై దాడిచేయడానికి వచ్చినపుడు హైదర్‌అలీ శ్రీరంగపట్నానికి పారిపోయాడు. ఆ సందర్భంలో టీపూసుల్తాన్ తండ్రి నుండి తప్పిపోయాడు. అతను మారువేషంలో శ్రీరంగపట్నం చేరుకొని తండ్రిని కలుసుకున్నాడు. క్రీ.శ. 1772లో పీష్వా మాధూరావ్ చనిపోయిన తర్వాత మరాఠీలు అంతర్గత ఘర్షణల్లో పడిపోయారు. హైదర్‌అలి ఆ అవకాశాన్ని వాడుకుంటూ తుంగభద్ర, కృష్ణా నదుల మధ్యఉన్న ఆక్రమితప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.

క్రీ.శ. 1780లో ఆంగ్లేయులతో మళ్ళీ యుద్ధం మొదలయింది. హైదర్‌అలి, టీపూ తొంభైవేల సైన్యం తీసుకొని కర్నాటక చేరుకున్నారు. ఆంగ్లేయ సేనాపతి హేకడ్‌మజ్ద్ కాంచీవరమ్ చేరుకొని ఆయుధాలు, ఆహారసామగ్రి తీసుకొస్తున్న కర్నల్ బైలీ కోసం ఎదురుచూడసాగాడు. ఆ సందర్భంలో టీపూసుల్తాన్ తండ్రి ఆదేశంతో కాంచీవరానికి పదిహేనుమైళ్ళ దూరంలో బైలీసైన్యంపై మెరుపుదాడి చేసి అతడ్ని ఖైదీగా పట్టుకున్నాడు.

ఆ తర్వాత ఆంగ్లేయసైన్యం మల్బార్‌తీరం చేరుకుందని తెలిసి టీపూసుల్తాన్ అటు వెళ్ళి పాల్ఘాట్‌ని ముట్టడించాడు. ఆంగ్లేయులు పాల్ఘాట్‌ని ఖాళీచేసి పూనానీకు వెళ్ళిపోయారని తెలిసి టీపూ పూనానీకి చేరుకొని దాన్ని కూడా ముట్టడించాడు. అతనింకా దాడి చేయకముందే అటు తండ్రి హైదర్‌అలీ చనిపోయిన విషాదవార్త వినవలసి

వచ్చింది. 7-12-1782లో ఈవార్త అందగానే టీపూసుల్తాన్ అక్కడ్నుంచి బయలుదేరి చిక్మూర్‌కు చేరుకున్నాడు. అదే నెల 26వ తేదీన అధికార సింహాసనం అధిష్ఠించాడు.

అప్పుడు మైసూర్‌సామ్రాజ్యం ఉత్తరంవైపు కృష్ణానదీ, దక్షిణంవైపు ట్రావంకూర్ రాష్ట్రం, తూర్పువైపు తూర్పురేవు, పశ్చిమాన సముద్రతీరం వరకు వ్యాపించి ఉంది. జనాభా, సారవంతమైన నేల, మంచిఏర్పాట్ల రీత్యా అది అద్భుతమైన రాజ్యం. అందుకే ఆంగ్లేయులే గాక పొరుగురాజ్యాలైన మరాఠా, గోల్కొండనిజాం రాజ్యాల కళ్ళు కూడా దానిపై పడ్డాయి. అయితే గోల్కొండ నవాబు, మరాఠీలు ముందుచూపు లేకుండా ఆంగ్లేయుల్ని సమర్థిస్తూ వారిద్వారా తమఆశయాలు నెరవేర్చుకోదలిచారు. కాని టీపూసుల్తాన్ మొదట ఫ్రెంచ్అధికారుల సహకారంతో సైనికపునర్వ్యవస్థీకరణ చేసి దేశంలో అందరికంటే ముందు సైనికులకు నెలవారీ జీతాలు నిర్ణయించాడు. అత్యంత క్రమశిక్షణతో కూడిన ప్రత్యేక సైనికదళాలను నియమించాడు. అంతేగాక ఆనాటి ఫ్రెంచ్ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అత్యాధునిక ఆయుధాలు కూడా తయారుచేయించాడు.

హైదర్‌అలీ కాలం నుండే మైసూర్‌కు నలువైపుల నుండి శత్రుప్రమాదం ఏర్పడింది. ఒకవైపు అహ్మద్‌షాఅబ్దాలి చేతిలో పరాజయంపాలైన మరాఠీలు ఉత్తరభారత్ నుండి దక్షిణభారత్‌కు వచ్చి మైసూర్ చుట్టుపక్కల చేరివున్నారు. మరొకవైపు గోల్కొండనిజాం ఆంగ్లేయుల పక్షంచేరి సమరోత్సాహంతో ఊగిపోసాగాడు. వేరొకవైపు మద్రాస్‌ప్రెసిడెన్సీ కూడా పొంచిచూడసాగింది. ఇలాంటి పరిస్థితుల్లో మైసూర్‌రాజ్యానికి, ఆంగ్లేయులకు మధ్య నాల్గు పెద్దయుద్ధాలు జరిగాయి. వీటిని "ఆంగ్లో మైసూరియన్ వార్స్" అంటారు.

వీటిలో మొదటి యుద్ధం 1766లో ప్రారంభమై మూడేండ్లపాటు సాగింది. ఇందులో మరాఠీలు, నిజాంసైన్యం, బ్రిటిష్‌సైన్యంతో కూడిన ఉమ్మడిసైన్యంతో హైదర్‌అలీ పోరాడి విజయం సాధించాడు. తరువాత బ్రిటిష్‌సైన్యానికి, హైదర్‌అలీకి మధ్య ఒక ఒప్పందం జరిగింది. దాని ప్రకారం అవసరం వచ్చినపుడు బ్రిటిష్‌సైన్యం హైదర్‌అలీకి సహాయంచేయాలి. కాని మరాఠీలు మైసూర్‌పై దాడిచేసినపుడు హైదర్‌అలీ ఆంగ్లేయుల సహాయం కోరితే వారందుకు నిరాకరించారు. హైదర్‌అలీ ఆంగ్లేయులపై నిప్పులు చెరుగుతూ మరాఠీలను ఎదుర్కొన్నాక మరొకసారి బ్రిటిష్‌సైన్యం భరతం పట్టానని నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయం రెండవ ఆంగ్లోమైసూరియన్ యుద్ధానికి దారితీసింది.

ఈ యుద్ధం 1780 నుండి 1784 వరకు సాగింది. అయితే యుద్ధం ప్రారంభం కావడానికి ముందే హైదర్‌అలీ చనిపోయాడు. అప్పుడు మైసూర్ సుల్తాన్‌గా, మైసూర్ పులిగా టీపూసుల్తాన్ ప్రపంచం ముందుకొచ్చాడు. అతని నేతృత్వంలో మైసూర్ ముస్లిం యోధులు బ్రిటిష్‌సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టి ఓడించారు. అలాగే ఉత్తరాన నిజాం నవాబు, మరాఠీల ఉమ్మడిసైన్యాన్ని కూడా టీపూసుల్తాన్ మట్టి కరిపించాడు.

అవి అమెరికాలో బ్రిటిష్‌పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యసమరం సాగుతున్న రోజులు. అమెరికాలో 13 కాలనీలు బ్రిటిష్‌పాలకుల ఆక్రమణలో ఉండేవి. అమెరికన్లు ఫ్రాన్స్ సహాయం కోరినపుడు ఫ్రాన్స్, దాని మిత్రపక్షాలు అమెరికా నుండి బ్రిటిష్‌పాలకుల్ని తరిమేయడానికి యుద్ధరంగంలోకి దిగాయి. దీన్ని ఫ్రెంచ్-బ్రిటిష్ గ్లోబల్‌వార్ అంటారు.



భారత్‌లో ఆంగ్లేయుల్ని తరిమేయడానికి హైదర్‌అలీ చేస్తున్న పోరాటాన్ని అమెరికాలోని ఫ్రాన్స్‌బలగాలు, దాని మిత్రపక్షాలు ఎంతో ఆసక్తితో గమనిస్తూ ఒక యుద్ధనౌకాదళానికి "యు.ఎస్.ఎస్. హైదర్‌అలీ" అని పేరుపెట్టుకున్నాయి.

క్రీ.శ. 1780లో టీపూసుల్తాన్ మూడువేలకు పైగా ఉన్న బ్రిటిష్‌సైన్యంతో పోరాడి తిరిగి కోలుకోలేనంతగా దానినడుం విరగ్గొట్టాడు. ఈస్టిండియాకంపెనీ భారత్‌లో స్థావరం ఏర్పరచుకున్నప్పటి నుండి ఇప్పటివరకు గత నూటయాభైఏళ్ళ సుదీర్ఘకాలంలో ఇంతటి ఘోరపరాజయం అది ఎన్నడూ చూడలేదు. అంతకుపూర్వం బక్సర్ (బెంగాల్)యుద్ధంలో ముగ్గురు ముస్లింసేనాపతుల్ని ఓడించిన బ్రిటిష్‌జనరల్ లార్డ్‌మన్రో ఇప్పుడు టీపూసుల్తాన్ ముందుకురాలేక ఆయుధాలు నీటిలో విసిరేసి పారిపోయాడు. చివరికి ఆంగ్లేయులు టీపూసుల్తాన్‌తో కడు అవమానకరమైన షరతులతో ఒప్పందం చేసుకొని క్రీ.శ. 1784లో రెండవ ఆంగ్లోమైసూరియన్ యుద్ధం ముగించారు.

టీపూసుల్తాన్ గోల్కొండ నిజాం, మరాఠీలను తన వైపుకు తిప్పుకోవడానికి ఎంతో ప్రయత్నించాడు. కాని అది ఫలించలేదు. క్రీ.శ.1787లో ఒక దాడి తర్వాత వారిద్దరు గత్యంతరంలేక టీపూసుల్తాన్‌తో ఒప్పందం చేసుకోవలసివచ్చింది. దాని ప్రకారం నిజాం, మరాఠీలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా టీపూసుల్తాన్‌కు సహాయం చేయాలి.

ఆ కాలంలోనే, (1784-88 మధ్యకాలంలో) టీపూసుల్తాన్ రాజ్యంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. పాలనవ్యవహారాలు పునర్వ్యవస్థీకరించాడు. కొత్తనాణాలు జారీ చేశాడు. కొత్త సంవిధానం అమల్లోకి తెచ్చాడు. దైవదౌత్యప్రారంభం నుండి మొదలయ్యే కొత్తక్యాలెండర్‌ని ఉనికిలోకి తెచ్చాడు. రాజ్యమంతటా పరిశ్రమలు స్థాపించాడు. అనేక చోట్ల డ్యాములు నిర్మింపజేశాడు; రోడ్లు వేయించాడు. శ్రీరంగపట్నంలో మస్జిదెఆలా కట్టించాడు. రైతులకు అనేకరాయితీలు కల్పించి వ్యవసాయరంగాన్ని అభివృద్ధిపరిచాడు. దాంతో ప్రజలు సుల్తాన్‌ని అభిమానిస్తూ సుఖసంతోషాలతో జీవించసాగారు.

మరొకవైపు టీపూసుల్తాన్ సరికొత్త మిలటరీ వెపన్ సిస్టం, మిలటరీ స్ట్రాటజీలు కనుగొని రాబోయే యావత్ప్రపంచ మిలటరీబ్యాటిల్‌ఫీల్డ్ చిత్రాన్ని పూర్తిగా మార్చివేశాడు. మిలటరీటెక్నాలజీని వినియోగించడంలో ఆనాడు టీపూసుల్తాన్ అందరికంటే ముందున్నాడు. అతను "ఫత్హుల్‌ముజాహిదీన్" పేరుతో మిలటరీ డాక్ట్రిన్‌కు సంబంధించి ఒక మ్యాన్యుల్ రాశాడు. అతను కనిపెట్టిన మైసూరియన్ రాకెట్ బ్యాటరీని ప్రపంచం మొదటిసారిగా రణరంగంలో చూసింది. రాకెట్ ఆర్టిలరీ బ్రాజెస్‌ని యుద్ధరంగంలో ప్రయోగించే శాస్త్రపరిజ్ఞానం అతని ఆవిష్కరణే. తర్వాత ఆంగ్లేయులు మైసూరియన్ రాకెట్‌ని తమ దేశానికి తీసికెళ్ళి దీర్ఘకాలపరిశోధన తర్వాత తమదైన రాకెట్ తయారు చేసి వాటర్లూయుద్ధంలో నెపోలియన్‌కు వ్యతిరేకంగా ఉపయోగించారు. మనదేశ న్యూక్లియర్ సైంటిస్ట్, మాజీరాష్ట్రపతి అయిన అబ్దుల్‌కలాం మిలటరీ రాకెట్ టెక్నాలజీని అందరికంటేముందు టీపూసుల్తాన్ ప్రపంచం ముందుకు తెచ్చాడని అన్నారు.

వేరొకవైపు టీపూసుల్తాన్ సూపర్‌పవర్ విదేశాలతో దౌత్య-వాణిజ్య సంబంధాలు కూడా నెలకొల్పుకున్నాడు. అతను చైనా నుండి సిల్క్‌టెక్నాలజీతో పాటు ఆయుధ-

మందుగుండు టెక్నాలజి సంపాదించాడు. మధ్యప్రాచ్యం, గల్ఫ్, ఆఫ్రికా, అఫ్గానిస్థాన్ రష్యా వగైరా దేశాలతో వాణిజ్యసంబంధాలు ఏర్పరచుకున్నాడు. తన గ్లోబల్ డిప్లొమేసి ప్రకారం ఆంగ్లేయులకు వ్యతిరేకంగా టర్కీసుల్తాన్ నుండి సైనికసహాయం కోసం కృషి చేశాడు. అఫ్గానిస్థాన్, ఈరాన్, ఫ్రాన్స్ పాలకులతో సంప్రదించి ఆంగ్లేయులకు వ్యతిరేకం గా గ్లోబల్, ప్రాంతీయ-వ్యూహాత్మక మిత్రపక్షం తయారుచేయడానికి ప్రయత్నించాడు. తర్వాత ఈ సంగతి తెలుసుకున్న ఆంగ్లేయులు ఖంగుతిని ఆత్మరక్షణలో పడిపోయారు.

క్రీ.శ.1789లో మూడవ ఆంగ్లోమైసూరియన్ వార్ ప్రారంభమవుతుంది. ఆంగ్లేయులు ముందుగా నిజాం, మరాఠీలతో చర్చలు జరిపి వారిని తమ వైపుకు తిప్పుకున్నారు. 1789లో వారు టీపూరాజ్యంలోని కొన్నిప్రాంతాలు ఆక్రమించుకొని కయ్యానికి కాలు దువ్వారు. ఆ తర్వాత 1790లో మైసూర్‌పై, 1791లో బెంగళూర్‌పై దాడిచేసి, తర్వాత శ్రీరంగపట్నాన్ని ముట్టడించారు. కాని అప్పుడు అంటువ్యాధి ప్రబలడంతో ముట్టడి వదలిపోయి 1792లో వారు మరోసారి శ్రీరంగపట్నాన్ని ముట్టడించారు.

చివరికి టీపూసుల్తాన్ మార్గాంతరంలేక ఆంగ్లేయులతో రాజీఒప్పందం చేసుకోవలసి వచ్చింది. అర్థరాజ్యం మిత్రపక్షం (నిజాం, మరాఠీలు, ఆంగ్లేయుల)కు అప్పగించాలని, భారీమొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని, ఒప్పందం షరతులు నెరవేరేదాకా సుల్తాన్ కొడుకులిద్దర్ని తమ దగ్గర తాకట్టు పెట్టాలని వారు దారుణమైన షరతులు విధించారు.

క్రీ.శ. 1798లో ఫ్రాన్స్‌లో నెపోలియన్ రాజ్యాధినేతగా, ప్రముఖవిజేతగా ప్రపంచం ముందుకు వచ్చాడు. టీపూసుల్తాన్ అతనితో సంబంధాలు ఏర్పరచుకొని ఇద్దరు కలసి ఆంగ్లేయుల్ని తరిమేయాలని పథకరచన జరిగింది. అప్పుడు నెపోలియన్ ఈజిప్టులో ఆంగ్లే యులకు వ్యతిరేకంగా పోరాడుతున్నాడు. అతను ఈ యుద్ధం ముగిసిన తరువాత ఈరాన్ మీదుగా భారత్‌కు చేరుకొని టీపూసుల్తాన్‌తో కలసి నిర్ణీత పథకాన్ని అమలు పరచాలని నిశ్చయించుకున్నాడు. కాని నెపోలియన్ ఆంగ్లేయుల చేతిలో ఘోరంగా ఓడిపోవడం వల్ల అతను భారత్‌కు చేరుకోలేకపోయాడు.

ఆ కాలంలోనే రష్యా, టర్కీల మధ్య యుద్ధం జరుగుతోంది. ఆంగ్లేయులు ఆ పరి స్థితిని వినియోగించుకుంటూ టర్కీని టీపూసుల్తాన్‌కు సహాయం చేయనీకుండా కట్టడి చేశారు. దాంతో టీపూసుల్తాన్ టర్కీ నుండి కూడా సహాయం పొందలేకపోయాడు. అమెరికా నుండి బ్రిటిష్‌పాలకుల్ని తరిమేయడానికి సాగుతున్న స్వాతంత్ర్యసమరంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ పాల్గొన్నది. అయితే చివర్లో ఫ్రెంచ్‌సైన్యానికి, బ్రిటిష్ సైన్యానికి మధ్య రాజీఒప్పందం కుదిరిందన్న వదంతి భారత్‌కు చేరడంతో టీపూసుల్తాన్ పక్షం వహించిన ఫ్రెంచిసైనికులు తమ సహాయాన్ని నిలుపుదల చేశారు.

అలాంటి పరిస్థితిలో కూడా టీపూసుల్తాన్ ఒకవైపు దేశంలో అనేకచోట్ల ప్రజాసంక్షేమ కార్యాలు కొనసాగిస్తూ మరొకవైపు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తన పోరాటాన్ని కొనసా గించాడు. కాని ప్రధాని మీర్‌సాదిఖ్, ఇతర మంత్రులు పూర్ణయ్య, రామకృష్ణ, ఖమ్రుద్దీన్ ఖాన్‌లు ఆంగ్లేయులతో లాలూచీపడి లోలోన కుట్రలు పన్నుతున్న సంగతి టీపూ తెల్సు కోలేకపోయాడు. ఫలితంగా శ్వేతశత్రువు కోటలో పాగా వేయడానికి సిద్ధమయ్యాడు.



క్రీ.శ. 1798 జులైలో ఆంగ్లేయులు హైదరాబాద్ నిజాం, మరాఠీలను కూడగట్టుకొని శ్రీరంగపట్నాన్ని ముట్టడించారు. 1799లో మరొకసారి ఘోరమైన షరతులు విధించి వాటిని 24గంటల్లో నెరవేర్చాలని అల్టిమేట్ జారీచేశారు. టీపూసుల్తాన్ దాన్ని తిరస్క రించడంతో వారు శ్రీరంగపట్నంకోటపై ఫిరంగులతో దాడి ప్రారంభించారు. అదే సమ యంలో ఆంగ్లేయులకు అమ్ముడుపోయిన ప్రధాని మీర్‌సాదిఖ్, అతని మిత్రమూక ముస్లింల మ్యాగ్‌జైన్‌లోని గన్‌పౌడర్‌లో నీళ్ళు పోయించి ఫిరంగులను నాశనంచేశారు. కోటగోడకు ఒకచోట ఫిరంగికాల్పులకు నెర్ర ఏర్పడటంతో సుల్తాన్ అక్కడ రక్షణ కోసం కొందరుయోధుల్ని నియమించాడు. అయితే మీర్‌సాదిఖ్ వారిని వచ్చి జీతాలు తీసు కోండని పిలిచాడు. దాంతో వారంతా ఆచోటు వదలి జీతాలు తీసుకోవడానికి వెళ్ళి పోయారు. వారలా వెళ్ళిపోగానే ఆంగ్లేయులు ఆ నెర్రలో నుంచి కోటలోకి ప్రవేశించి ఫైరింగ్ ప్రారంభించారు. అప్పుడు టీపూసుల్తాన్ కోటలో ఓచోట కూర్చొని భోజనం చేయడానికి ఉపక్రమించాడు. అంతలో ఆంగ్లేయులు కోటలో ప్రవేశించారన్న దుర్వార్త విని కోటతలుపుల వైపు దూసుకుపోయాడు. అయితే మీర్‌సాదిఖ్ వెంటనే కోటతలుపులు మూయించి బయటికి వెళ్ళిపోయాడు. అప్పుడొక ముస్లింవీరుడు విషయం గ్రహించి పరుగెత్తి ఆ దుర్మార్గుడి తల నరికేశాడు.

టీపూసుల్తాన్ ఆంగ్లేయసైనికుల దిగ్బంధంలో చిక్కుకొని విజయం గురించిన ఆశలు వదలుకున్నాడు. అయితే ప్రాణాలకు తెగించి వీరోచితంగా పోరాడుతూనే ఉన్నాడు. అప్పుడు కొందరు సహచరులు ఆంగ్లేయులకు లొంగిపోవడంలోనే మన శ్రేయస్సు ఉందన్నారు. కాని టీపూసుల్తాన్ వారి వైపు తీక్షణంగా చూస్తూ "వందేళ్ళ నక్క జీవితం కంటే ఒకరోజు పులిజీవితం ఎంతో శ్రేష్ఠమైనది" అన్నాడు. అతనలా పోరాడుతూ చివరికి తీవ్రమైన గాయాలతో నేలకొరిగి ఊపిరివిడిచాడు.

ఆ సమయంలో టీపూసుల్తాన్ కళ్ళు తెరవబడి ఉన్నాయి; పిడికిలిలో ఖడ్గం ఉంది; శరీరం వేడిగా ఉంది. భౌతికాయం చుట్టూ నిలబడిన ఆంగ్లేయసైనికులు, టీపూసుల్తాన్ లేచి తమల్ని మళ్ళీఊచకోత కోస్తాడేమోనని భయపడ్డారు. బ్రిటిష్‌సేనాని జనరల్ హేరిస్ టీపూసుల్తాన్ భౌతికకాయంపై నిలబడి 'ఇప్పుడు భారత్ తమదేశం' అన్నాడు.

టీపూ సుల్తాన్ ధైర్యస్థయిర్యాలకు ప్రతీకయిన పులిని ఆదర్శంగా తీసుకొని దాని బొమ్మను తన జెండా, సింహాసనం వగైరా అనేక వస్తువులపై చిత్రీకరింపజేశాడు. అదీగాక అతని మహల్‌లో కలపతో చేయబడిన మెకానికల్ టైగర్ ఉండేది, 'కీ' ఇస్తే అది గాండ్రిస్తూ నడుస్తుంది; దాని నుండి ఆంగ్లేయుల చావుకేకలు కూడా విన్పిస్తాయి. ఆంగ్లేయులు దాన్ని ఇంగ్లాండ్‌కు తీసికెళ్ళి 'టీపూస్ టైగర్' పేరుతో బ్రిటిష్‌మ్యూజియం లో ప్రదర్శన కోసం పెట్టుకున్నారు.

ప్రప్రథమ స్వాతంత్ర్యసమరయోధుడు, అత్యంతధీశాలి అయిన టీపూసుల్తాన్ భౌతిక కాయాన్ని శ్రీరంగపట్నంకు తీసుకొచ్చినపుడు యావత్‌పట్నం విషాదఛాయలతో మూగ బోయింది. అశేష ప్రజానీకం కన్నీటిధారలతో ఆ అమరవీరుడికి వీడ్కోలు పలికారు.

(ఇస్లాంచరిత్ర సమాప్తం)